



వేదాంగాలు


వ్యాకరణం

వాక్య పదీయము-2








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100061913

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

అనువాద వాఙ్మయము – 43
వ్యాకరణ శాస్త్రము

వాక్యపదీయము

ద్వితీయ భాగము

[పదకాండము]

మూలకర్త:
భర్తృహరి

అనువాదకులు:
శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రి, విద్యాప్రవీణ పి. ఓ. ఎల్.
శ్రీమాన్ శ్రీ భాష్యం అప్పలాచార్యులు, ఎం. ఏ.
డా. పుల్లెల శ్రీరామచంద్రుడు, ఎం. ఏ. పిహెచ్. డి.
శ్రీ అప్పల్ల సోమేశ్వరశర్మ, ఎం. ఏ.

పరిష్కర్త:
ఆచార్య గంటి జోగిసోమయాజి, ఎం.ఏ., ఎల్.టి., విద్వాన్, పి.ఓ.ఎల్.

తెలుగు అకాడమి
హైదరాబాదు
1980

విషయసూచిక

తృతీయకాండము (పదకాండము)

వాక్యపదీయము

ద్వితీయ భాగము

పదకాండము

వాక్యపదీయము

పదకాండము

జాతి సముద్దేశము-1

అవతారిక-వాక్యపదీయము ఎనిమిది *పదార్థములను విచారించుచున్నదని ప్రథమ కాండమున 24 - 25 శ్లోకములలో గ్రంథకర్తయే చూపెను.

వానిలో అర్థజ్ఞానము ధర్మము అనెడి ప్రయోజనరూపములగు రెండు పదార్థములు ప్రథమకాండమున నిరూపింపబడినవి.

లోకవ్యవహారమునకుపయోగించెడి వాక్యము — వాక్యార్థము అనెడి రెండు పదార్థములు ద్వితీయ కాండమున స్పష్టపరచబడినవి.

మిగిలిన నాలుగు పదార్థములను అనగా వద పదార్థములు కాక ప్రకృతి ప్రత యార్థములు, శబ్దార్థములకుగల యోగ్యత కార్యకారణభావము అనెడి రెండు సంబంధములు అనెడి నాలుగు పదార్థములను నిరూపించుటకు ఈ మూడవ కాండమారంభింపబడుచున్నది. కనుకనే దీనికి పదకాండమని పేరు కలిగినది. పదము, దానికి అవయవములగు ప్రకృతి ప్రత్యయములు వాని యర్థములు, వానికి గల సంబంధములు ఇచట విచారింపబడుచున్నవి,

అందు ముందుగా అఖండమగు వాక్యమునుండి పదములు కల్పింప బడినవి, అనగా వేరుచేసి చూపబడినవి, అని తలంచి పదములను మతభేదముచే జూపుచున్నాడు.

---

* 1. శబ్దము 2 విధములు —	1. ప్రకృతి ప్రత్యయములు
	2. పదవాక్యములు
2. అర్థము 2 విధములు —	1 ప్రకృతి ప్రత్యయార్థములు
	2 పదవాక్యార్థములు
3. శబ్దార్థములకుగల సంబంధము 2 విధములు	1 యోగ్యత
	2. కార్యకారణభావము
4. ప్రయోజనము 2 విధములు	1 అర్థజ్ఞానము
	2. ధర్మము
పదార్థములు	8

శ్లో॥ ద్విధాకైశ్చిత్పదం భిన్నం చతుర్ధా పఞ్చధాపివా।
అపోద్ధృత్యైవవాక్యేభ్యః ప్రకృతిప్రత్యయాదివత్ ॥ 1

కైశ్చిత్ = కొందరిచే, వాక్యేభ్యః వాక్యములనుండి, పదమ్ = పదము, (పదేభ్యః) = పదములనుండి, ప్రకృతి ప్రత్యయాదివత్ = ప్రకృతి ప్రత్యయము, ఆగమము, ఆదేశము మున్నగునవివలె, అపోద్ధృత్య + ఏవ = బుద్ధిపూర్వకముగ వెగలించి వేరుచేసియే, ద్విధా + వా = రెండువిధములుగానే, అనగా నామము (సుబంతము) ఆఖ్యాతము (క్రియా ప్రధానము) భిన్నమ్ = విభజింపబడినది.

కైశ్చిత్ = మరికొందరిచే, చతుర్ధా + వా = నాలుగు విధములుగానేఅనగా నామము ఆఖ్యాతము, ఉపసర్గము, నిపాతము, అను రీతిని నాలుగువిధములుగానే, భిన్నమ్ విభజింప బడినది.

కైశ్చిత్ = మరికొందరిచే, పఞ్చధా + అపి + వా = ఐదువిధములగానే అనగా నామము, ఆఖ్యాతము, ఉపసర్గము, నిపాతము, కర్మప్రవచనీయము అను రీతిని ఐదు విధములుగానే, భిన్నమ్ = విభజింపబడినది.

వాక్యమే అర్థబోధకము. అదినిరవయవము, దానిచే బోధింపబడెడి అర్థము కూడ నిరవయవమే. అనగా ఇది కర్త, ఇది కర్మ, ఇది విశేషణము, ఇది క్రియ అను విభాగములేదు. ఇది వైయాకరణుల ముఖ్యసిద్ధాంతము.

అట్టి వాక్యముకు వాక్యార్థముకు తెలిసికొనుట దుస్సాధము, మరియు వాక్యములకు అంతము లేనందున దానికి సాహిత్య సంపాదనము దుశ్శకము అని భావించి పాణిని, కాత్యాయన, పతంజలి మహర్షులు వాక్యములనుండి పదములను విభజించిరి. ఆపదములను గుర్తించుటలో అభిప్రాయభేదములు కలవు.

1. పదము రెండు విధములు—నామము,ఆఖ్యాతము. నిపాతలు నామార్థము నందు గలవిశేషమును ద్యోతనచేయుటచే నవియు నామపదములుగానే గుర్తింపబడును.స్వః (స్వర్గము) మున్నగునవి నామపదములె. హిరుక్ (వేరుగా, శీఘ్రముగా) మున్నగు శబ్దములు క్రియా ప్రధానకములు కనుక అవి ఆఖ్యాతపదములుగానే పరిగణింపబడుచున్నవి. ప్ర, పర, మున్నగు ఉపసర్గములును, కర్మప్రవచనీయములుగూడ క్రియా విశేషమును ప్రకాశింపచేయుటచే నవియు ఆఖ్యాతపదములే. కాగా వాక్యమునుండి పదవిభాగము చేయగా రెండు విధముల పదములు కాన్పించునని కొందరిఆశయము.

2. నామము, ఆఖ్యాతము స్వతంత్రపదములు. నిపాతములు, ఉపసర్గములు వానియర్థవిశేషమును ద్యోతనచేయును. అంతమాత్రాన అవి వానిలో అంతర్భూతములు కావు. కనుక అవి అనగా నిపాతము, ఉపసర్గము స్వతంత్రపదములే, అందుచే పదములు నాలుగు అనుటసమంజసము .కర్మప్రవచనియములు క్రియా విశేషమువలన కలిగిన సంబంధ

మును నియమించునవి కనుక అవి ఆఖ్యాతపదములుగానే గ్రహింపబడుచున్నవి అని కొందరి యాశయము.

3. నామము, ఆఖ్యాతము, నిపాతము ఉపసర్గము. ఇవి స్వతంత్రపదములు, కర్మప్రవచనీయములు సాక్షాత్తుగా క్రియను ప్రకాశింప చేయజాలవు. కాబట్టి అవి ఆఖ్యాత పదములుగా గ్రహింపబడక స్వతంత్రపదములుగానే స్వీకరింపబడుటయుక్తము. కాబట్టి పదము ఐదువిధములనుటయే యుక్తమనికొందరి యభిప్రాయము.

వాక్యమునుండి పదములుపవిభక్తములైనవి, అందులో "ప్రకృతి ప్రత్యయాదివత్" అనునది దృష్టాంతముగా జూపబడినది. వాక్యము అఖండము,పదములు కల్పితములని వాక్య వాదులు పలుకుదురు. పదము అఖండము, దానిలో ప్రకృతిప్రత్యయములు కల్పితములని పదవాదులు నుడివిరి. ఈ రెండువాదములు ద్వితీయ కాండమున చూపబడినవి. అంతతః పదాని కల్పితాని (పదములుకల్పితములు), వాక్యమేవ సత్యమ్ (వాక్యమేసత్యము)అని సిద్ధాంతముచేయబడినది. పదవాది మతమున ప్రకృతి ప్రత్యయములు కల్పితములగునట్లు మామతమున అనగా వాక్యమే వాచకము అను వారిమతమున పదములు కల్పితములు. వాక్యవాది పదమువరకే తన కల్పనను చూపును. ప్రకృతి ప్రత్యయకల్పనా ప్రసక్తి వాక్యవాదికిలేదు. కనుకనే అది దృష్టాంతముగా జూపబడినది.

విశేషాంశములు–

1. ఈకల్పన అర్థమును పురస్కరించుకొని చేయబడినది. ఆసందర్భమున సుబంత తిఙంత పదభేదము సహకరించదు. కనుకనే సుబంతము తిఙంతము అను రీతిని భేదముచూపక నామము ఆఖ్యాతము మున్నగు రీతిని పదవిభాగము చూపబడినది.
2. పైరీతిని పదములు కల్పితములు కాగ వానిద్వారా అఖండవాక్యము యొక్కస్వరూపము తెలియబడగలదు కాగా వాక్యవాక్యార్థములను తెలిసికొనుటకు పదపదార్థములు ఉపాయములు కాగలవు.

అవతారిక——అవయవములు లేక ఏకాకారముగానుండెడి వాక్యమును తెలిసి కొనుట సాధ్యము కానందున, దానిని తెలిసికొనుటకు ఉపాయములుగా పదములు విభజింప బడినవి. వాని ద్వారా వాక్యము తెలియబడగలదనే భావము మొదటి శ్లోకమున చూపబడినది. దానిని అపోద్ధారపద్ధతి యందురు. అట్లు పదముల యొక్కయపోద్ధారము అర్థమునుబట్టి చేయవలసి యున్నది. అట్లుకాకున్న ఒకనియమము లేకుండ నిరర్థకవిభాగము కూడ చేయ బడగలదు. కాబట్టి వాక్యమునుండి పదముల అపోద్ధారము అర్థములయొక్క అపోద్ధారముపై ఆధారపడి యున్నవి.

పైయభిప్రాయముతో అఖండమగు వాక్యార్థమునుండి పదార్థములు అపోద్ధృతము లగుచున్నవని నిరూపించుట కుపక్రమింప బడుచున్నది.

అందు పదార్థము 1. సిద్ధము 2. సాధ్యము అని రెండు విధములుగానున్నది. నామముయొక్కయర్థము సిద్ధపదార్థమనియు, ఆఖ్యాతముయొక్క యర్థము సాధ్యపదార్థ మనియు శాస్త్రజ్ఞులు తలంతురు. వానినే ద్రవ్యము, క్రియ అని వారువ్యవహరింతురు.

అందు ఎల్లశబ్దములు సిద్ధరూపమగు ద్రవ్యమునే బోధించును అని వ్యాడి* అను ఆచార్యుని మతము. అట్లుగాక ఎల్ల శబ్దములు జాతినేబోధించునని వాజప్యాయన అను ఆచార్యుని మతము అట్లుగాక ఉభయమును అనగా ద్రవ్యమును. జాతిని శబ్దము బోధించునని పాణిన్యాచార్యుని సిద్ధాంతము.

అందు ముందుగా వాజప్యాయనమునియొక్క మతమును ఆశ్రయించి ఎల్లశబ్దములకు జాతియే వాచ్యమగునని నిరూపించుటకు ఈసముద్దేశము నారంభించుచున్నాడు కనుకనే ఈ ప్రకరణమునకు, జాతిసముద్దేశః అని భర్తృహరి నామకరణము చేసెను. ఈమూడవ కాండమున 14 ప్రకరణములు కలవు. వానికి సముద్దేశములు అని గ్రంథకర్తయొక్క వాడుక. సమ్ + ఉత్ + దిశ ధాతువునకు కరణార్థమున 'ఘఞ్' ప్రత్యయము చేరగా, సముద్దేశ శబ్దము నిష్పన్నమగును సమ్యక్ ఉద్దిశ్యతే = ప్రతిపాద్యతే అనేన (లెస్సగా దీనిచే తెలియబడునది) అనువ్యుత్పత్తిని ఆశ్రయించగా లెస్సగా తెలిసికొనుటకు సాధనము అనగా ఉపకరించునది-సముద్దేశము అను అర్థము లభించును జాతిని లెస్సగా తెలిసికొనుట కుపకరించెడి ప్రకరణము-జాతిసముద్దేశము. ఇట్లే పై 13 సముద్దేశములకు అర్థము చెప్పనగును

శ్లో॥ పదార్థానామపోద్ధారే జాతిర్వా ద్రవ్యమేవవా।
పదార్థౌసర్వశబ్దానాం, నిత్యావేవోపవర్ణితౌ॥ 2

A పదార్థానామ్ = పదార్థములకు అనగా పదముచే బోధింపబడెడి అర్థములకు, అపోద్ధారే వాక్యార్థమునుండి వేరుపరుచుట జరగగా. అనగా అఖండమగు వాక్యార్థమునుండి పదార్థములకు విభజన జరుగగా, సర్వశబ్దానామ్ = ఎల్లశబ్దములకు, జాతిః + వా = జాతియే కాని, ద్రవ్యమ్ + ఏవ = ద్రవ్యమేకాని, వా = అట్లుగాక ఉభయముకాని, పదార్థౌ = పదముల యర్థములుగా, (స్యాతామ్) = కాగలవు

1. ఎల్లశబ్దములకు జాతియేవాచ్యమగునని వాజప్యాయనుని యాశయము ఘట, పట మున్నగు శబ్దములు ఘటత్వ, పటత్వ జాతులను, శుక్ల మున్నగు శబ్దములు శుక్లత్వమున్నగు గుణగతజాతులను, పచతి మున్నగు శబ్దములు పాకము మున్నగు క్రియలయందున్న జాతులను 'డిత్థ' మున్నగు శబ్దములు డిత్థత్వము మున్నగు జాతులను బోధింపగలవు. జాతి తనకు ఆశ్రయమగు ద్రవ్యమును ఆక్షేపించును. ద్రవ్యముమాత్రము వాచ్యముగాదు.

2. ఎల్లశబ్దములు ద్రవ్యమునే బోధించునని వ్యాడిమహర్షి యాశయము. ద్రవ్యమనగా నిర్గుణాద్వయబ్రహ్మమే, కాక ఘటము పటము మున్నగు వ్యక్తి. ఈరెండు విధములగు ద్రవ్యములు ఈమూడవకాండముననే 2,4 సముద్దేశములలో ద్రవ్యసముద్దేశము, అను పేర్లతోనే నిరూపింపబడుచున్నవి.

---

* ద్రవ్యాభిధానం వ్యాడిః, ఆకృతిం వాజప్యాయనః, అని మహాభాష్యకారుడు. స్వరూపాణామేకశేష ఏకవిభక్తౌ, 1,2,64 అనుసూత్రమును వ్యాఖ్యానించు సందర్భమునఇరువుర మతములను విపులముగ చర్చించి యున్నాడు.

3. జాతి, ద్రవ్యము రెండు కూడా శబ్దమునకు వాచ్యములుకాగలవని పాణిని దర్శనము అంగీకరించుచున్నది. ఆ రెంటిలో విశేషణవిశేష్యభావము అనియతముగానుండును.
B అట్టి ద్రవ్యజాతియు నిత్యౌ + ఏవ = నిత్యములనియే, ఉపవర్ణితౌ = వర్ణింపబడి నవి. అనగా కాత్యాయన పతంజలులచే నిర్ణయింపబడినవి.

జాతి నిత్యమని ఎల్లశాస్త్రములు అంగీకరించియున్నవి. బ్రహ్మయే ద్రవ్యమనెడి పక్షమున అది నిత్యమని ఉపనిషత్తులు ప్రబోధించుచునేయున్నవి. వ్యక్తి ద్రవ్యమనెడిపక్షమున వ్యక్తులకు ప్రవాహనిత్యతనుబట్టి నిత్యత్వములభించును. ఈయంశము పస్పశాహ్నికమున కాత్యాయనపతంజలులు విపులముగా చూపియున్నారు.

విశేషాంశములు—సర్వశబ్దానామ్ = ఎల్లశబ్దములకు అని చెప్పుటలో ఒక విశేషము కలదు. ఘట, పట, శుక్ల, పచతి, డిత్థ మున్నగు ప్రకృతిగానున్న శబ్దములు జాతిబోధకములే. వానికంటె ప్రవర్తించెడి విభక్తిప్రత్యయరూపములగు శబ్దములు కూడ కరణత్వ, ఏకత్వ, త్వ, కర్మత్వ, మున్నగు జాతులనేబోధించును. ఉపసర్గములు కూడ క్రియాత్వజాతినే ప్రకాశింపజేయును. ॥2॥

అవతారిక—అపోద్ధార పద్ధతిలో జాతిగాని ద్రవ్యముగాని పదార్థముకాగలదని మత భేదము నాశ్రయించి చూపబడినది. పదమును పరీక్షించుటకై ఈ కాండ మారంభింప బడినది. పదమును పరీక్షించుట అర్థముద్వారా జరుగును కాబట్టి అర్థ పరీక్ష అవసరమాయెను. అదియు వాక్యార్థమును తెలిసికొనుటకుపయోగపడుచున్నది.

పైచూపబడిన రెండు మతములలోను జాతి శక్తివాదమును ప్రస్తుతము విచారించుచున్నాడు ఈవాదమున శబ్దములు జాతినేబోధించును. అచట క్రియ సాధనముతో నన్వయింపవలెను సాధనము జాతికానేరదు. జాతికిఆశ్రయమగు వ్యక్తి సాధనముకాగలదు. కాని అచట ఒక దోషము ప్రసక్తమగుచున్నది. శబ్దముచే లభించినజాతిఆశ్రయముద్వారా వాక్యార్థ ఘటకమగును. అది శబ్దముచే లభించినదే కనుక వాక్యార్థము పరిపూర్ణమగుటవలన ప్రతినిధికి భంగముకలుగుచున్నది. శబ్దముచే బోధింపబడినది సంభవింపనపుడు దానికి బదులుగా దానితోసమానమగు అర్థమును గ్రహించుట ప్రతినిధి యనబడును ఉదా॥ దర్భైః ప్రస్తరితవ్యమ్, (అగ్నికి నాలుగు ప్రక్కల దర్భలుంచవలెను) అని శ్రుతిచెప్పినది. దర్భములు సంభవింపకపోయిన, వానికిబదులుగా శరములు అనగా రెల్లు ఉపయోగింతురు. అసంభవము కలిగినపుడే ప్రతినిధిని అపేక్షింపవలెను. జాతి వాచ్యమగుచో దానికి ఆశ్రయము ఆక్షిప్తమగుటచే అచట వాక్యార్థము సంభవింపగలదు. అసంభవము లేదు. అట్టి తరి ప్రతినిధికే భంగమువాటిల్లుచున్నది అను పూర్వపక్షమునకు సమాధానముచెప్పుచున్నాడు.

శ్లో॥ కేషాఞ్చిత్సాహచర్యేణ జాతిః శక్త్యుపలక్షణమ్।
ఖదిరాదిష్వశక్తేషు శక్తః ప్రతినిధీయతే॥ 3

కేషాఞ్చిత్ = కొందరియొక్క మతమున అనగా శబ్దములకు జాతియే వాచ్యమనెడి వారి మతమున, జాతిః = శబ్దములచే బోధింపబడిన జాతి, సాహచర్యేణ = సాహచర్యముచే,

అనగా అజాతి, కార్యమును కలిగించెడి శక్తియు ఒకే ద్రవ్యము నందుండును; అసాహచర్యముచే, శక్త్యుపలక్షణమ్ = శక్తికి ఉపలక్షణమగును. ఉపలక్షణమనగా ఉపాయము. శబ్దములచే బోధింపబడినది జాతియే అయినను అది ప్రధానముకాదు. అది ద్రవ్యగతమగు శక్తిని గ్రహించుటలో ఉపాయముకాగలదని భావము.

ఖదిరాదిషు = చంద్రకఱ్ఱ మొన్నగునవి, అశక్తేషు = సమర్థములుకాకయుండగా, శక్తః = కార్యమును కలిగించుటకు సమర్థమగునది, ప్రతినిధీయతే = ప్రతినిధిగా స్వీకరింపబడుచున్నది.

ఖాదిరేబధ్నాతి (చంద్రకఱ్ఱచే నిర్మింపబడిన యూపస్తంభమున పశువును కట్టవలెను) అని వేదము చెప్పుచున్నది. పశువు పారిపోకుండునట్లుచేయుటకై దానిని యూపస్తంభమున బంధింతురు. ఆస్తంభము చంద్రకఱ్ఱతో చేయవలెను. అచట ఖదిరత్వము ప్రధానము కాదు. అట్లుకాకున్న సన్నని చంద్ర గాని, దానిచేత బిఱరుగాని స్తంభముగా జేసిన, నది పశువుచేలాగివేయబడును. పశుబంధము నెరవేరదు. అందుచే ఖదిరత్వజాతి అప్రధానమే. శబ్దముచే బోధింపబడిన జాతి శక్తికి గుర్తుగా ఉపయోగపడును. కాగా బంధనమునకు సమర్థమగు కఱ్ఱతో స్తంభము చేయవలెనని భావము తేలుచున్నది. అట్టి సామర్థ్యమే ప్రధానము కనుక, అటువంటిది చంద్రకఱ్ఱ లభించిన దానినే యుపయోగింతురు. అట్టి చంద్రకఱ్ఱ లభింపనిచో ఆసామర్థ్యముకల మరియొక కఱ్ఱ ఖదిరము మున్నగునది గ్రహింపబడును.

కాబట్టి, జాతి శక్తివాదమునగూడ జాతియనునది శక్తికి ఉపలక్షణము కనుక ప్రతినిధి యుపపన్నము కాగలదు. ఈపక్షమున జాతి అప్రధానమే, ఉపలక్షితమగు శక్తియే ప్రధానము. ॥3॥

అవతారిక—ఎల్లశబ్దములు జాతినే బోధించును. అచట జాతి శక్తికి ఉపలక్షణము అనగా ఉపాయము. అను వారిమతమున పై రీతిని ప్రతినిధి ఉపపన్నము కాగలదు.

కాని ఆజాతియే ప్రధానము. శక్తికి ఉపలక్షణము కాదని కొందరు జాతిశక్తి వాదులభిప్రాయమును వ్యక్త పరుచుచున్నారు. వారి మతమున యథావిధిగా వాక్యార్థము లభించుచున్నందున ప్రతినిధి యెట్లు ఉపపన్నమగును? అను ప్రశ్నకు వారిమతమునగూడ ప్రతినిధికి భంగములేదని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అస్వాతన్త్ర్యఫలో బన్ధః ప్రమాణాదీవశిష్యతే।
అతోజాత్యభిధానేపి శక్తిహీనం నగృహ్యతే॥ 4

అస్వాతన్త్ర్యఫలః = స్వాతంత్ర్యము లేకపోవుటయే ప్రయోజనముగాగల, బన్ధః = బంధనము అనగా పశువును స్తంభమున బంధించుట, ప్రమాణాది + ఇవ = పశువునుచంపుట అవయవములను గ్రహించుట మున్నగునది వలె, శిష్యతే = వేదముచే విధింపబడుచున్నది.

51] అతః = ఈకారణమువలన, అనగా బంధనము వేదవిహితమగుటవలన, జాత్యభిధానే + అపి = ఖదిరాది శబ్దములచే ప్రధానముగా జాతిబోధింపబడినను, శక్తిహీనమ్ = కార్యమును కలిగించెడి సామర్థ్యము లేనిది, న + గృహ్యతే = స్వీకరింపబడదు.

ఇచట ప్రమాణశబ్దము ప్రత్యక్షాది ప్రమాణములను బోధింపదు మీఙ్ హింసాయామ్ అను హింసార్థక ధాతువునకు ల్యుట్ ప్రత్యయము ప్రవర్తింపగా ప్ర + అను ఉపసర్గము చేరగా హింసన ప్రారంభించుట అను అర్థము కలుగును.

పశుమాలభేత, (పశువును యజ్ఞము నిమిత్తమై చంపవలెను) హృదయేఽవద్యతి, (చంపినపశువుయొక్క హృదయమును ఖండింపవలెను) మున్నగు రీతిని హింసనము, హృదయమును ఖండించుట మున్నగునవి శాస్త్రమున విధింపబడినవి. అట్లే, ఖాదిరేబధ్నాతి, చంద్రకఱ్ఱచే చేయబడిన స్తంభమున పశువునుబంధింపవలెను అని శాస్త్రము చెప్పుచున్నది. స్తంభమున పశువును బంధించుటకు ప్రయోజనము ఏమనగా పశువునకు స్వాతంత్ర్యము లేక పోవుటయే. అనగా పశువుపారిపోకుండగానిలచుటయే. చంద్రకఱ్ఱ కదా అని పశువును కట్టుటకు ఉపయోగపడని దానిని స్తంభముగా చేయరాదు. శాస్త్రవిహితమగు బంధనమునకు అదియే ఫలము కనుక ఆఫలమును నిర్వహించుటకు ఒకవేళ చంద్రకఱ్ఱ సమర్థము కానిచో దానిని ఉపయోగింపక, అందుకుపయోగించెడి ఖదిరము మున్నగు మరియొకజాతికి చెందిన కఱ్ఱస్వీకరింపబడగలదు.

కాబట్టి జాతిప్రధానమైనను అజాతికిచెందిన కఱ్ఱ అసమర్థమగునపుడు అందుకు సమర్థమగు ఇతరజాతికిచెందిన కఱ్ఱ గ్రహింపబడును. కనుక ఈ పక్షమునగూడ ప్రతినిధి ఉపపన్నముకాగలదు. ॥4॥

అవతారిక—ఈపక్షముననే లింగముచే అనగా హేతువాదముచేగూడ ప్రతినిధికి ఆవశ్యకత కలుగునని నిరూపించుచున్నాడు.

శ్లో॥ సంశ్లేషమాత్రం బధ్నాతిర్యదిస్యాత్తు వివక్షతః,
శక్త్యాశ్రయేతతో లిఙ్గం ప్రమాణాద్యనుశాసనమ్॥ 5

బధ్నాతిః = బంధనము అనగా ఖాదిరేబధ్నాతి (చంద్రకఱ్ఱచే చేయబడిన యూప స్తంభమున పశువును బంధింపవలెను) అనువచనముచే చెప్పబడినబంధనము, సంశ్లేష మాత్రమ్ = స్తంభమునసంబంధించియుండుట మాత్రమే, వివక్షితః = చెప్పదగినదిగా, స్యాత్ + తు + యది = అయినట్లైన, తతః = సంశ్లేషము తరువాత చెప్పబడిన, ప్రమాణాద్యనుశాసనమ్ = చంపుట, అవయవములను గ్రహించుట మున్నగువానిని ఉపదేశించుట, శక్త్యాశ్రయే = శక్తికి ఆశ్రయమగు ఖదిర అనెడి కఱ్ఱయొక్క ఆశ్రయించుటయందు, అనగా అట్టి ఖదిరమును గ్రహించుటయందు, లిఙ్గమ్ = హేతువు (భవతి) అగుచున్నది.

ఖాదిరేబధ్నాతి అనువచనముచే బంధనము విధింపబడినది. అచట బంధనమనగా యూపస్తంభమునకు పశువు (మేక)ను స్పృశించుటమాత్రము, అనగా స్తంభమునకు మేకను తగిలేటట్లుచేయుటకాదు. అట్లైన బంధనము తరువాత, ఆపశువును చంపుట, దాని హృదయమునుండి మాంసము గ్రహించుట, ఇవియన్నియు శ్రుతిలో చెప్పబడియున్నవి కుదరవు. ఆపశువు సంబంధించి యున్నంతమాత్రాన చంపుట మున్నగునవి జరుగవు. అట్లైన చంద్రకఱ్ఱ చిన్నకొమ్మతో సంసర్గము చాలదు. అందు బంధనానంతరము చెప్పబడిన హననాదిక్రియాకలాపము యొక్క సామర్థ్యము వలన సమర్థమగు కఱ్ఱను గ్రహింపవలెనని లభించుచున్నది కాబట్టి బంధనానంతరము చెప్పబడిన హింసాకలాపమును హేతువుగా గ్రహించి హింసకు సమర్థమగు ఖదిరమును గ్రహింపవలెనని పర్యవసన్నమగుటచే ప్రతినిధి దీనివలన లభించుచున్నది.

విశేషాంశము—4వ శ్లోకమున జాతి అప్రధానమై శక్తికి ఉపాయమగుటచే ప్రతినిధి యుపపన్నమగుచున్నదని నిరూపింపబడినది. 5వ శ్లోకమున జాతిప్రధానమే, శక్తికి ఉపలక్షణము కాదని స్వీకరించినను లింగమువలన ప్రతినిధి సమర్థింప బడినది.

కాక బంధనము ప్రతినిధిలో హేతువని 4వ శ్లోకమున, బంధనము తరువాత చెప్పబడిన హింసాదికము ప్రతినిధిలో హేతువని 5వ శ్లోకమున చెప్పబడినది, కాగా రెండు శ్లోకములు అనుమాన ప్రమాణముచే ప్రతినిధి సమర్థకములని తెలుచున్నది.

కాక పదార్థసామర్థ్యము తరువాత వాక్యార్థ సామర్థ్యమువలన ప్రతినిధి సమర్థింపబడినదని 4వ శ్లోకమున, ప్రకరణ సామర్థ్యమువలన ప్రతినిధి సమర్థింపబడినదని 5వ శ్లోకమున భావము స్పష్టమగుచున్నది. ॥5॥

అవతారిక—పైరీతిని జాతి శక్తివాదమున ప్రతినిధి యుపపన్నమగుచున్నదని చూపబడినది.కాని శబ్దములు అర్థమును బోధించుటలో ప్రవృత్తి నిమిత్తము అపేక్షితమగుచున్నది.ఉదా॥ ఘటశబ్దము కలశమును బోధింపవలెనన్నచో దానియందున్న ఘటత్వజాతి ప్రవృత్తినిమిత్తమగుచున్నది.

ఎల్లశబ్దములకు జాతియే వాచ్యమగుచో ప్రవృత్తి నిమిత్తములేనందున శబ్దము బోధకముకానేరదు. జాతియందు మరియొకజాతిలేదుకదా॥ అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ స్వా జాతిః ప్రథమంశబ్దైః సర్వైరేవాభిధీయతే।
తతోఽర్థజాతి రూపేషు తదధ్యారోప కల్పనా॥ 6

A. సర్వైః + శబ్దైః + ఏవ = ఎల్లశబ్దములచేతనే, ప్రథమమ్ = ముందుగా, స్వా = ఆత్మీయమగు అనగా తనకు అసాధారణమగు, జాతిః = జాతి, అభిధీయతే = చెప్పబడుచున్నది.

శబ్దత్వమనెడిజాతి ఎల్లశబ్దములయందుకలదు. కనుక అదిసర్వశబ్దములకు సాధారణ మైనదే.అట్లుకాక ఘట,శబ్దమునందు ఘటశబ్దత్వమనెడి జాతి కలదు. అది కేవలము ఘటశబ్దము నందే యుండును. ఆజాతి ఘటశబ్దముచే బోధింపబడును అది దానికి ఆత్మీయమగు జాతి. అది శబ్దము అర్థమునుబోధించుటలోఅవినాభావి కనుక ప్రథమమ్, అని గ్రంథకర్త పలికెను. అంతియకాని పౌర్వాపర్యమున్నదని భావముకాదు.

విశేషాంశము—సర్వైః = ఎల్లశబ్దములచే, ఇచటసంజ్ఞా శబ్దములు. అవియేకాక ఘట పటాది శబ్దములుకూడా గ్రహింపబడును. అన్నిశబ్దములు తమయందున్న అసాధారణమగు ఘటశబ్దత్వము, గోశబ్దత్వము మున్నగు శబ్దగత జాతులను బోధించును.
B. తతః = తరువాత అనగా తన యందున్న శబ్దత్వజాతిని బోధించిన తరువాత, అర్థజాతి రూపేషు = ఆవు, కడవ మున్నగు అర్థములయందున్న గోత్వము ఘటత్వము మున్నగు జాతులయందు, తదధ్యారోపకల్పనా = శబ్దములయందున్న గోశబ్దత్వము ఘటశబ్దత్వము మున్నగు జాతులకు ఆరోపము కల్పితమగును.

గౌః అనునదిశబ్దము. దానిచేబోధింప బడునది ఆవు అనునది యర్థము. ఆ అర్థము నందు గోత్వజాతికలదు. శబ్దమునందు గోశబ్దత్వజాతి కలదు. ఆశబ్దమునందున్న గోశబ్దత్వ జాతిని అర్థగతమగు గోత్వజాతియందు ఆరోపింపగా, అదియే అనగా గోశబ్దత్వజాతియే ప్రవృత్తినిమిత్తముకాగలదు.

కాగా గోశబ్దము గోత్వజాతిని బోధించును. అచటగోశబ్దత్వము ఆరోపితమగుటచే నది ప్రవృత్తియగుచున్నది. ॥౬॥

అవతారిక—శబ్దగతమగు గోశబ్దత్వము మున్నగు అసాధారణమైన జాతి గోవు నందున్నగోత్వజాతితో నభేదమునుపొంది అది శబ్దప్రవృత్తికి నిమిత్తము కాగలదని ౭వ శ్లోకమునచూపబడినది.

కాని ఆ రెండుజాతులును ఒక స్థలమున లేవు. అర్థజాతి గోవ్యక్తియందున్నది. గోశబ్దమునందు గోశబ్దత్వజాతియున్నది. ఈ రీతిగా ఆ జాతులు వేరు వేరు చోటుల యందున్నందున ఆ రెంటికి అభేదవ్యవహారమెట్లు? అనుప్రశ్నకుచక్కని దృష్టాంతము చూపి సమాధానముచెప్పుచున్నాడు.

శ్లో॥ యథా రక్తేగుణే తత్త్వం కషాయే వ్యపదిశ్యతే।
సంయోగిసంనికర్షాచ్చ వస్త్రాదిష్వపిగృహ్యతే॥ 7
తథాశబ్దార్థసంబన్ధాచ్ఛబ్దే జాతిరవస్థితా।
వ్యపదేశేఽర్థజాతినాం జాతికార్యాయకల్పతే॥ 8

యథా = ఏరీతిగా, రక్తే = ఎరుపు అనే, గుణే = గుణమునందున్న, తత్త్వమ్ = రక్తత్వము అనుధర్మము, కషాయే = కషాయద్రవ్యమునందు అనగా లాక్షమున్నగుద్రవ్యమునందు

వ్యపదిశ్యతే = వ్యవహరింపబడుచున్నదో, సంయోగిసంనికర్షాత్ = లాక్షాద్రవ్యముతో సంయోగము కలవస్త్రము మున్నగువాని సంనికర్షమువలన, వస్త్రాదిషు + అపి = వస్త్రము మున్నగువానియందు గూడ, గృహ్యతే + చ = గ్రహింపబడుచున్నదో,

తథా = ఆరీతిగా శబ్దే = శబ్దమునందు, అవస్థితా = ఉన్నట్టి, జాతిః = జాతి అనగా గోశబ్దత్వము మున్నగుజాతి, శబ్దార్థసంబన్ధాత్ = శబ్దమునకు అర్థమునకు గల సంబంధమువలన, అర్థజాతీనామ్ = అర్థమునందుగల జాతులయొక్క, వ్యపదేశే = వ్యవహారము నందుఅనగా ఆ రెంటికి అభేదవ్యవహారమునందు, కల్పతే = సమర్థమగుచున్నది అంతియే కాదు. జాతికార్యాయ = జాతినిబట్టి కలిగెడి కార్యముకొరకుకూడ, కల్పతే = సమర్థమగు చున్నది.

కాక శబ్దగతమగు జాతి వ్యపదేశే = అభేదవ్యవహారముకలుగగా, జాతికార్యాయ = జాతిని బట్టికలిగెడి కార్యమునకు సమర్థమగుచున్నది.

రంగువేసిన వస్త్రమునందు ఎరుపుతనము కానవచ్చుచున్నది అది వస్త్రమునకు స్వాభావికముకాదు. లాక్షయందుగూడ ఆ ఎరుపుతనము స్వాభావికముకాదు.ఎరుపు అనుగుణము నందు రక్తత్వము సమవాయ సంబంధమున కలదు. అట్టిరక్తత్వము గుణమునకు ఆధారమగు లాక్షయందు భాసించును. అట్టిలాక్షతో సంయుక్తమగు అనగా కలిసియున్నవస్త్రమునందు కాన్పించును. కాగా రక్తగుణమునందు సమవేతమగురక్తత్వముపరంపరగా వస్త్రము నందు కాన్పించుచున్నది.

అట్లే గో శబ్దమునందున్న గో శబ్దత్వ జాతి శబ్దార్థములకుగల స్వాభావికమగు యోగ్యత అనెడి సంబంధమువలన అర్థగతమగుజాతితో ఐక్యమునుబొందగలదు.

స్వతః గోవునందుగల గోత్వము నందు మరియొకజాతిలేదు. కాని ఆజాతికిగూడ శబ్దగతమగు అసాధారణమగు జాతి సాహాయ్యము చేయగలదు.అందుచే పరంపరగా రక్తత్వము వస్త్రము మున్నగు దానియందు భాసించునట్లు శబ్దగతమగు జాతి శబ్దార్థములకు గలసంబంధము వలన అర్థజాతితో నైక్యమును పొందగలదు. ॥7,8॥

అవతారిక—శబ్దమునందుగల జాతి అర్థజాతి యందు ఆరోపింపబడినదై జాతి కార్యమునుకలిగింపగలదు (జాతికార్యాయకల్పతే) అని 8వ శ్లోకమున చెప్పబడినది. దానినే వివరించుచున్నాడు.

శ్లో॥ జాతి శబ్దైకశేషే సాజాతీనాం జాతిరిష్యతే।
శబ్దజాతయ ఇత్యత్ర తజ్జాతిః శబ్దజాతిషు ॥ 9

1. సా = అది అనగా శబ్దమునందున్నజాతి, జాతిశబ్దైకశేషే = జాతివాచకములగు గవాది శబ్దములకు ఏకశేషము, (ప్రసక్తే) = ప్రాప్తించు చుండగా (జాతికార్యాయ) = జాతినిమిత్తకమగు కార్యముకొరకు (కల్పతే) = సమర్థమగుచున్నది.

పదిఆవులను బోధింపవలచిన పది గోశబ్దములను ప్రయోగింపవలెను అట్లగుచో ఏకశేషముచే ఒకే గోశబ్దముచేసిగాని గావః అను ప్రయోగము లభించును. వైరీతిని ఏకశేషము చేయకపోయినను ఒకే శబ్దము ప్రయోగమును సిలుపగలదు. అది ఒక జాతికార్యము. 'గో' అను శబ్దమునందు గోశబ్దత్వమను జాతి యున్నది దానిని అర్థజాతులయందారోపింపగా అది వానితో నైక్యమునుపొంది దానియందున్న ఏకత్వమును బట్టిఏకగోశబ్దమును ప్రయోగింపునట్లు చేయును. కాగా ఆ జాతి యందున్న ఏకత్వమునుబట్టి అజాతి ఏకశబ్దప్రయోగమనెడి జాతికార్యమును సంపాదించును.

2. మరియొకజాతికార్యము.

సా = శబ్దగతమగుజాతి, జాతీనామ్ = జాతులకుగూడ, జాతిః = జాతిగా ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

ఇమాః జాతయః, (ఇవిజాతులు) గోత్వము, ఘటత్వము, పటత్వము మున్నగునవి జాతులు అనురీతిని ప్రయోగములుకలవు. ఇచట జాతయః అనుపదము అర్థబోధకము కావలెను, కాని యచట మరియొకజాతి లేనందున ప్రవృత్తి నిమిత్తము లేనందున బోధకము కానేరదు. శబ్దమునందుగల గోశబ్దత్వము అనుజాతి ఇమాజాతయః అనుచోట జాతులతో ఏకీభావముబొందగా దానిని బట్టి జాతయః అనుశబ్దము బోధకముకాగలదు.

3. మరియొక జాతికార్యము.

తజ్జాతిః = ఆజాతి అనగా శబ్దమునందుగల గో శబ్దత్వము మున్నగుజాతి, శబ్ద జాతయః + ఇతి + అత్ర = శబ్దజాతులు అను ప్రయోగమున, శబ్దజాతిషు = శబ్దజాతుల యందు జాతికార్యమునుకలిగించును. అనగా గోశబ్దత్వము, ఘటశబ్దత్వము, పటశబ్దత్వము మున్నగునవి వ్యక్తులవంటివి. వీనిని శబ్దజాతులు అని వ్యవహరింతురు. వీనియన్నిటి యందు శబ్దజాతయః, అనురీతిని ఒకేవిధమగు ప్రయోగమున్నది. అట్టి ఏకాకారప్రయోగము జాతి కార్యము. అది శబ్దజాతినిబట్టియే కలుగుచున్నది. ॥9॥

అవతారిక—ఎల్లశబ్దములయందు అసాధారణముగా వాచకమగు జాతియున్నది. దాని అదిశబ్దత్వమనెడిజాతులకంటె వేరుకాగలదు. అట్లే ఆజాతులకంటె వేరుగా మరియొకజాతి, మరియొకజాతియని యంగీకరించినచో అనవస్థాదోషము కలుగును అనుప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యా శబ్దజాతిశ్శబ్దేషు శబ్దేభ్యో భిన్నలక్షణా।
జాతిస్సా శబ్దజాతిత్వ మప్యతిక్రమ్య వర్తతే॥ 10

శబ్దేషు = శబ్దజాతి అనుశబ్దములయందు, యా = ఏ, శబ్దజాతిః = శబ్దత్వ జాతియో సా = ఆ, జాతిః = శబ్దేభ్యః = శబ్దజాతి అనుశబ్దములకంటె, భిన్నలక్షణా = విజాతీయమగు లక్షణముకలదై, శబ్దజాతిత్వమ్ + అపి = శబ్దజాతిత్వమును గూడ. అతిక్రమ్య = అతిక్ర మించి, వర్తతే = ఉన్నది.

పలువురు, శబ్దజాతి అను శబ్దమును ఉచ్చరింపగా. అది నానాత్వమును బొందును. అట్టివానియందు మరియొకజాతియుండును. అది శబ్దజాతియందున్న ధర్మము వంటిదికాదు. మరియేమనగా, వాచకములగు గోశబ్దత్వము, ఘటశబ్దత్వము మున్నగు జాతులకు చెందినది.

కాగా గోశబ్దత్వము మున్నగు శబ్దములవలె, శబ్దజాతయః అను శబ్దము కూడ ఎల్లజాతులను బోధింపగలదు. కనుక అనవస్థాదోషము వాటిల్లదు. ॥10॥

అవతారిక—ఇంతవరకు వైయాకరణుల సమయమును ఆశ్రయించి శబ్దము నందుగల అసాధారణమగు గోశబ్దత్వము మున్నగు జాతిని అర్థజాతులయందు అనగా గోవు మున్నగు వాని యందున్నగోత్వాదిజాతులయందు ఆరోపించి ఎల్లశబ్దములు జాతివాచకములే అను సిద్ధాంతమును నిరూపించెను.

ఇపుడు ఆరూపమును స్వీకరింపకపోయినను పైసిద్ధాంతము యుక్తముకాగలదని నిరూపించుచున్నాడు.

శ్లో॥ అర్థజాత్యభిధానేపి సర్వేజాత్యభిధాయినః।
వ్యాపారలక్షణా యస్మాత్పదార్థాః సమవస్థితాః॥ 11

A. అర్థజాత్యభిధానే + అపి, ఆవు మున్నగు వ్యక్తులయందున్న శుద్ధములగుజాతులనే బోధించినను. సర్వే = ఎల్లశబ్దములు అనగా జాతి, సామాన్య మున్నగు శబ్దములు, జాత్యభిధాయినః = జాతివాచకములే యగును.

జాతి అను శబ్దము జాతిని బోధించుటలో దానియందు మరియొకజాతియుండుటయే కారణము. జాతి మున్నగుశబ్దములు జాతివాచకములనుటలో ఎవరికిని విప్రతిపత్తిలేదు.

B. నిస్సామాన్యాని సామాన్యాని (జాతులు జాతిలేనివే అనగా జాతియందు మరియొక జాతియుండదు) అని తార్కికులు చెప్పుచుండగా జాతియందు జాతియున్నదనుట యెట్లుపొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

యస్మాత్ = ఎందువలననగా, వ్యాపారలక్షణాః = ప్రయోజనమే హేతువుగా గలవై అనగా ప్రయోజనముచేతనే గుర్తింపబడినవై, పదార్థాః = పదార్థములు, సమవస్థితాః = నియతమైన స్వరూపముకలవి, (భవన్తి) = అగుచున్నవి.

వైశేషికులు జాతియందు జాతిలేదు అని తలంతురుగాక, వైయాకరణులు మాత్రము జాతియందు జాతిని అంగీకరింతురు. అందుకు కారణము ప్రయోజనమే అనగా జాతిః,సామాన్యమ్ అను పదములు జాతిని నిమిత్తముగా గైకొనియే అర్థబోధకములగుచున్నవి.

నియతరూపమున గుణముకూడ ఏకాకారముగా అర్థబోధకమగుచో అదియు జాతియేకాగలదు.

అట్లే క్రియయు ఏకాకారముగా అర్థబోధకమగుచో నదియు జాతికాగలదు. కాబట్టి ఎల్లశబ్దములు జాతివాచకములు కాగలవు. ॥11॥

అవతారిక—అభిధావ్యాపారముచే శబ్దము నియతముగా జాతిబోధకముకాగలదను చున్నాడు.

శ్లో॥ జాతౌపదార్థేజాతిర్వావిశేషోవాపి జాతివత్,
శబ్దైరపేక్ష్యతేయస్మాదతస్తే జాతివాచినః॥ 12

యస్మాత్ = ఎందువలన, జాతౌ + పదార్థే = జాతియేశబ్దార్థము అను పక్షమున, జాతిః + వా = జాతికాని, విశేషః + వా = విశేషముగాని అనగా సంజ్ఞాశబ్దములచే బోధింపబడెడి వ్యక్తివిశేషముగాని, జాతివత్ = ప్రసిద్ధమగు జాతివలె, శబ్దైః + అపి = శబ్దములచే మాత్రము, అపేక్ష్యతే = బోధింపబడునదిగా అంగీకరింపబడుచున్నదో, అతః = ఈకారణమువలన, తే = ఆఎల్లశబ్దములు, జాతివాచినః = జాతిబోధకములే.

అర్థములను శబ్దములు బోధించును. అందు అర్థములయొక్క అసాధారణమగు రూపమున అవి బోధింపవు అట్లేజాతులకుగల పరస్పరభేదమునుగూడ శబ్దములు చెప్పవు. వ్యక్తులకు అభేదమును జూపి వానిని బోధవిషయములుగా అవి చేయును.

జాతియందు జాతియుండవచ్చును, లేకపోయిన లేకపోవచ్చును. కాని ఏకాకారమగు జ్ఞానముకలిగినచో నదియే జాతియని యంగీకరింపవలెను.

సంజ్ఞాశబ్దములచే బాల్యకౌమారాద్యవస్థలు భాసింపకపోయినను, నియతముగా ఒక వ్యక్తి విశేషము భాసించుచున్నందున సంజ్ఞాశబ్దములుకూడ జాతిశబ్దములేగాగలవు॥12॥

అవతారిక—జాతివాదిమతమున ఎల్లశబ్దములు జాతివాచకములే. విశేషమేమనగా కొన్నిశబ్దములు ప్రసిద్ధముగా జాతివాచకములు .కొన్నిశబ్దములు ఉపచారమువలన జాతివాచకములు. ఇట్లంగీకరించుట, నామతముననేకాదు. మరియేమనగా ఎల్లశబ్దములు ద్రవ్యవాచకములే యనియంగీకరించెడి ద్రవ్యవాదిమతమున కూడ నిట్లే. అనగా కొన్ని ప్రసిద్ధముగా ద్రవ్యబోధకములు, మరికొన్ని ఉపచారమువలన ద్రవ్యబోధకములు అను భావమును వ్యక్తపరచు చున్నాడు.

శ్లో॥ ద్రవ్యధర్మా పదార్థేతు ద్రవ్యేసర్వోఽర్థఉచ్యతే।
ద్రవ్యధర్మాశ్రయాద్ద్రవ్యమతః సర్వోఽర్థఇష్యతే॥ 13

ద్రవ్యే + పదార్థే + తు = ద్రవ్యమే పదార్థము అను మతమునగూడ, ద్రవ్యధర్మాశ్రయాత్ = ద్రవ్యముయొక్క ధర్మములకు ఆశ్రయమగుటవలన, ద్రవ్యధర్మా = ద్రవ్యముయొక్కధర్మము కలదియే, సర్వః + అర్థః = ఎల్లయర్థము, ఉచ్యతే = శబ్దముచే చెప్పబడు చున్నది.

ద్రవ్యమునకు ధర్మములు—ఇది, అది అను సర్వనామములచే పరామర్శింప బడుట, పరినిష్పన్నత అనగా పరిపూర్ణత, స్వాతంత్ర్యము, లింగసంఖ్యలతో సంబధము మున్నగునవి. ఈధర్మములు కలిగియుండుట వలన ఎల్లయర్థము ద్రవ్యమేకానగును.

అతః = ఈకారణమువలన, సర్వః అర్థః = ఎల్లయర్థము, ద్రవ్యమ్ = ద్రవ్య మనియే, ఇష్యతే = ద్రవ్యవాదిచే అంగీకరింపబడుచున్నది.

ద్రవ్యవాదిమతమున ఆఖ్యాతార్థముకూడ ద్రవ్యమే కాగలదు. ఈయర్థము 4వ సముద్దేశమున స్పష్టముకాగలదు. ॥13॥

అవతారిక—శబ్దముయొక్క వ్యాపారమునుబట్టి చూడగా జాతి ఎల్ల శబ్దములకు వాచ్యముకాగలదని చూపియున్నాడు.

ఇపుడు వైశేషికుల మార్గమును దృష్టిలోనుంచుకొనినను జాతి సార్వత్రికము, అదియే ఎల్లశబ్దములకు వాచ్యము. అన్నివ్యక్తులయందు సమానమగు ధర్మములు కానవచ్చు చున్నవి. కనుకనే జాతికి వైశేషికులు కూడ సామాన్యము అనియే నామకరణము చేసి యున్నారని చెప్పుచున్నాడు.

శ్లో॥ అనుప్రవృత్తిధర్మోవా జాతిస్స్యాత్సర్వజాతిషు।
వ్యావృత్తిధర్మసామాన్యం విశేషే జాతిరిష్యతే॥ 14

A. అనుప్రవృత్తిధర్మః + వా = ఎల్లవ్యక్తులయందు ఏకాకారమగు అనగా ఒకేరూపమున నున్న ధర్మమైన, సర్వజాతిషు = ఎల్లజాతులయందు, జాతిః = జాతికాగలదు అనగా జాతి వలన కలిగెడి కార్యము కలుగగలదు.

జాతియొక్క స్వభావమేమనగా—తనకు ఆశ్రయములగు ఎల్లవ్యక్తులయందు అనువర్తించుటయే. అనగా ఎల్లగోవ్యక్తులయందు గోత్వమను ధర్మముండుటయే. మరియు తనకు అనురూపమగు జ్ఞానమును కలిగించుటయు జాతియొక్క స్వభావము. దానిని బట్టియే, ద్రవ్యము ఆరూపముతో భాసించుచున్నది. మరియు తనకు అనుగుణమగుశబ్దముచే బోధింప బడుటయు జాతియొక్క స్వభావము. మరియు ప్రతివ్యక్తియందు సర్వాత్మనా అనగా సంపూర్ణముగా సమాప్తినిజెంది యుండుటయు జాతియొక్కస్వభావము. ఇవి యన్నియు జాతిస్వభావములుగా లోకసిద్ధములైయున్నవి.కాని ఇవియన్నియు జాతులుగా పరిగణింపబడవు. గోత్వము, ఘటత్వము, పటత్వము మున్నగునవే జాతులుగా లెక్కింపబడుచున్నవి. అట్లైనను పైఎల్లధర్మములు జాతినిబోలి ఎల్లజాతులను వ్యాపించియున్నవి. కనుక ఇవియు జాతులుగా అనగా అప్రధానములగు జాతులుగా పరిగణింపబడును. జాతితో సామ్యమువీనికికలదు గావున నివియు సామాన్యములుకాగలవు. జాతియందుమరియొక జాతిని అంగీకరించుటలో అనవస్థా దోషము బాధకము కాగలదు. కాని సాధారణ ధర్మరూపమగుజాతి, జాతియందుండుటలో దోషములేదు.

B. విశేష = విశేషమునందు అనగా *వైశేషికులంగీకరించిన విశేష మనెడి పదార్థము నందు, వ్యావృత్తి ధర్మసామాన్యమ్ = వ్యావృత్తిని అనగా భేదమును కలిగించెడి ధర్మ మనెడి సామాన్యము, జాతిః = జాతిగా, ఇష్యతే = అంగీకరింప బడుచున్నది.

వస్తువులకు పరస్పరము భేదము పరమాణువులనుబట్టి సిద్ధించును. ఆ పరమాణువులకు భేదమును జూపునవి విశేషములు. అచట జాతిలేదు. అట్లైన సంశయము నివర్తింపదు. మరియు అనవస్థాదోషము వాటిల్లును. ఇతరవస్తువులనుండి వ్యావృత్తిని కలిగించుట అనేధర్మము విశేషములయందున్నది. అది ఎల్ల విశేషములకు సామాన్యము కాగా విశేష ములయందు వ్యావృత్తిని కలిగించెడి సామాన్యము జాతిగా గ్రహింప బడగలదు.

ఇట్లే ప్రాగ్ భావము, ప్రధ్వంసా భావము, అత్యంతా భావము, అన్యోన్యా భావము అనెడి 4 విధములగు అభావముల యందు జాతి లేదు. జాతి యున్నచో అవి భావపదార్థములే కావలెను, కాని వానియందు అభవనాత్మకమగు ధర్మము సాధారణము కనుక అదియే వానికి జాతికాగలదు.

కాబట్టి ఎల్లశబ్దములు జాతివాచకములు కాగలవు. జాతిసార్వత్రికము కాగలదు.॥14॥

అవతారిక—జాతి సార్వత్రికమనుట పొసగదు. ఏలయన-ఆకాశమొక్కటియే కనుక దానియందు జాతి యుండనేరదు. అది నిత్యముకనుక అచట అవస్థాభేదముకూడ లేనందున జాతి యుండనేరదు. ఇట్లే కాలము ఒకటి, అదియు నిత్యమే. అచటను జాతి యుండ నేరదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ సంయోగి ధర్మభేదేన దేశేచ పరికల్పితే।
తేషు దేశేషుసామాన్య మాకాశస్యాపి విద్యతే॥ 15

సంయోగి ధర్మ భేదేన = ఆకాశముతో సంయోగము కల ఘటము, పటము మున్నగు వాని యొక్క ధర్మముల భేదముచే అనగా పరిమితత్వము అనుధర్మమును బట్టి, దేశే + చ = దేశమునుబట్టికూడ అనగా ఆకాశమునకు దేశభేదము, పరికల్పితే = కల్పింపబడగా, తేషు = ఆ, దేశేషు = ఆ ప్రదేశముల యందు అనగా కల్పితములగు ప్రదేశములను బట్టి, ఆకాశస్య + అపి = ఆకాశమునకు గూడ, సామాన్యమ్ = జాతి, విద్యతే = ఉన్నది.

---

* కడవకు వస్త్రమునకంటె భేదము ప్రత్యక్షముగా కానవచ్చుచున్నది. వస్త్రముల అవయవములు, ఆ అవయవముల యొక్క అవయవములు, మరియు వాని అవయవములు ఈ రీతిని పరంపర చూడగా పరమాణువులనుబట్టియే భేదము చెప్పవలెను. పరమాణువులకు పరస్పరము భేదమును కలిగించెడిది విశేషమను పదార్థము. అది నిత్యద్రవ్య ములయందుడును అది అనంతము. కణాదుడు ఈ పదార్థమును ప్రత్యేకముగా నిరూపించెను. అట్టి విశేషమను పదార్థమును బట్టియే ఆయన శాస్త్రమునకు "వైశేషిక" మని అసాధారణ వ్యవహారము లోకమున కలిగినది.

ఆకాశము నిజరూపమున ఒకటియే, దానికి నానాత్వములేదు. కాని మూర్తములగు ఘటము. పటము, మున్నగు ఎల్లవస్తువులకు ఆకాశము ఆధారమగు చున్నది. ఆకాశమనగా అవకాశమును ఇచ్చునది. ఘటాదులు అట్టివికావు. ఘటము మున్నగు వస్తువుల సంయోగము ఏదేశమున కలుగునో, ఆ ప్రదేశము వస్తుభేదముచే భిన్నము కాగలదు. కనుకనే ప్రతిదేశమున, ఈ ఆకాశము, ఈ ఆకాశము, అను ఏకాకార బుద్ధికలుగుచున్నది. కనుక ఆకాశమునకు కూడ జాతి సంభవించును.

అట్లే కాలమునకు గూడ. పర్వతములు. మనుష్యులు మున్నగు వస్తువుల భేదముచేత భేదముకలుగుగా అచటగూడ జాతి యుపపన్నమగు చున్నది.

సమవాయమునకు గూడ సంబంధిభేదముచే నానాత్వము కలుగగా అచటను జాతి యుండును.

ఆత్మకు దేహ భేదమున నానాత్వము లభింపగా అచట ఆత్మత్వజాతి యుండును.

కాగా ఈ శ్లోకమున ఆకాశస్య అను పదము కాలసమవాయాత్మలకు ఉపలక్షణముగా ప్రయుక్తమాయెను. ॥15॥

అవతారిక—ఆకాశమున ప్రదేశములు కల్పితములున్నవి. వానినిబట్టి దానికి నానాత్వ ముండుటచే అచట జాతి యుండవచ్చునని 15వ శ్లోకమున చెప్పబడినది.

అట్లుగాక ఆకాశమునకు ప్రదేశములు ముఖ్యములే యున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ అదేశానాం ఘటాదీనాం దేశాస్సంబన్ధినో యథా।
ఆకాశస్యా ప్యదేశస్య దేశాస్సంబన్ధిన స్తథా॥ 16

ఇచట దేశశబ్దమునకు అవయవమర్థము అదేశానామ్ = స్వతః అవయవములులేని, ఘటాదీనామ్ = కడవ మున్నగు వానికి, దేశాః = అవయవములుగా నున్నకపాలాదులు, యథా = ఏ రీతిగా, సంబన్ధినః = సంబంధులు అగుచున్నవో-ఘటము అవయవి, అది అవయవములు లేనిదే, దానికి ఆరంభకమగు కపాలములువేరే ఐనను సమవాయ సంబంధమున సంబంధులుగా గ్రహింప బడుచున్నవని భావము

తథా = అట్లే, అదేశస్య = అవయవములు లేని, ఆకాశస్య + అపి = ఆకాశమునకు గూడ, సంబన్ధినః = సంబంధించియున్న అనగా సంయోగమును సంబంధముగా చేసికొని యున్న ఘటపటాదులు, దేశాః = అవయవములుగా, (భవన్తి) అగుచున్నవి.

కడవ అనునది స్వతంత్రమగు వస్తువు. దానికి అవయవములు లేవు. కపాలములు ఘటమునకు ఆరంభకములు. అనగా కపాలములచే ఘటము తయారు అగును. అవి సమవాయ సంబంధమున ఘటముతో కలసి అవయవములుగా పరిగణింపబడుచున్నవి. అవి స్వతః భిన్న పదార్థములే.

అట్టే ఆకాశమునకు అవయవములు లేవు. కాని ఘటపటాదులుఆకాశముతో సంయోగ సంబంధమున కలసి యున్నవి. అందుచే అవి దానికి అవయవములుగా గుర్తింప బడగలవు. కాగా అట్టి అవయవములను బట్టి ఆకాశమునకు నానాత్వము లభించుటచే నచట జాతి యుండగలదు. ఆకాశమునకు ఘటాదులు అవయవములనుట గౌణము. ॥ 16 ॥

అవతారిక—ఆకాశమునకు ఘటపటాదులు అవయవములు. కాని అవి అవయవ ములనుట గౌణమని తేలినది. కాని ముఖ్యమగు అవయవములు దేనికైనను ఉన్నయెడల ఇట్టివి గౌణములగును. అందుచే ముఖ్యములగు అవయవములు ఏవో వానిని చూపవలెను. ముఖ్యమును బట్టికదా గౌణమగును. ముఖ్యమేలేనిచో ఇది గౌణము కాదు కదా? అను ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు.

శ్లో॥ భిన్నవస్త్వాశ్రయా బుద్ధిః సంయోగిష్వనువర్తతే।
సమవాయిషు భేదస్య గ్రహణం వినివర్తతే॥ 17

శ్లో॥ అతః సంయోగి దేశానాం గౌణత్వం పరికల్ప్యతే।
అవివేకాత్ప్రదేశేభ్యో ముఖ్యత్వం సమవాయినామ్॥ 18

సంయోగిషు = సంయుక్తములగు పదార్థములయందు, అనగాసంయోగ సంబంధమున కలసి యున్న ఘటపటాదుల యందు, భిన్నవస్త్వాశ్రయా = విభిన్నములగు అనగా వేరువేరుగానున్న వస్తువులు ఆశ్రయముగాగల, బుద్ధిః = బుద్ధి, అనువర్తతే = అనువర్తించుచున్నది.

వేరు వేరుగా అనగా స్వతః ఒకదానితో సంబంధములేకయున్న ఘటము, పటము మున్నగు వస్తువులకు సంయోగముకలుగును. ఇది ఘటము, ఇది పటము అని వేరు వేరుగానే బుద్ధి కలుగును. సమవాయిషు = సమవాయ సంబంధము కలవానియందు అనగా కపాలములు అవయవములు, వానియందు ఘటము సమవాయ సంబంధమున నుండును అట్టి వానియందు, భేదస్య = భేదము యొక్క అనగా ఇది కపాలము, ఇది ఘటము అనెడి భేదముయొక్క, గ్రహణమ్ = జ్ఞానము, వినివర్తతే = మరలుచున్నది. అవయవములు వేరు, అవయవి వేరు అని గ్రహించుట సాధ్యముకాదని భావము.

అతః = ఈ కారణమువలన అనగా ఘటపటాదులకు భేదము గ్రహింప బడుటవలన, సంయోగిదేశానామ్ = సంయోగ సంబంధముచేనున్న అవయవములకు అనగా ఆకాశమున సంయోగ సంగ సంబంధముచేనున్న ఘటము పటమున్నగు అవయవములకు, గౌణత్వమ్ = అప్రధానత్వము, పరికల్ప్యతే = కల్పింపబడుచున్నది. ఆకాశమువలె ఘటము పటము మున్నగునవి అవయవములు. అవి అచట సంయోగ సంబంధమున నున్నవి. ఆకాశము కంటే ఘటపటాదులు వేరుగా గ్రహింప బడుచున్నందున, అవయములు గౌణములని తేలుచున్నది.

సమవాయినామ్ = కపాలములయందు సమవాయసంబంధముననున్న ఘట ములకు, ప్రదేశేభ్యః = అవయవములగు కపాలములకంటె, అవివేకాత్ = భేదము గుర్తించుట సాధ్యపడనందున, ముఖ్యత్వమ్ = ముఖ్యత్వము లభించుచున్నది.

కపాలములు అవయవములు, ఘటము అవయవి. దారములు అవయవములు, వస్త్రము అవయవి. దీనికి సమవాయము సంబంధము. ఇచట అవయవములకు అవయవికి భేదము అనగా ఇవికపాలములు, ఇది ఘటము; ఇవి దారములు, ఇది వస్త్రము అని వేరుచేసి చూపుట సాధ్యముకాదు. కాబట్టి ఇచట అవయవములనుట ముఖ్యమే. ॥ 17,18 ॥

అవతారిక—వైశేషికులమతము నాశ్రయించి 14, 15, 16, 17, 18 శ్లోకములచే జాతి సార్వత్రికమనియు, అదియే ఎల్ల శబ్దములకు వాచ్యము కాగలదనియు నిరూపించెను.

ఇప్పుడు విజ్ఞానవాది మతమునాశ్రయించి జాతి సార్వత్రికమనియు అదియే ఎల్ల శబ్దములకు వాచ్యమనియు చూపుచున్నాడు.

**శ్లో॥ అనుప్రవృత్తిరూపాం యాంప్రఖ్యాతా మాకృతిం విదుః।
కేచిద్వ్యావృత్తిరూపాంతు ద్రవ్యత్వేన ప్రచక్షతే॥** 19

కేచిత్ = కొంతమంది, అనగా జ్ఞానము తప్పమరియొక పదార్థములేదు, బాహ్య ప్రపంచము శూన్యమే అను అభిప్రాయముకల విజ్ఞానవాదులు, యామ్ = ఏజాతిని, అనుప్రవృత్తి రూపామ్ = అనుగతమగు అనగా ఏకాకారమగు, ప్రఖ్యాతామ్ = బుద్ధిని, ఆకృతిమ్ = ఆకృతినిగా, విదుః = తెలిసికొనుచున్నారు. అదియే వ్యాపకము. ఎల్ల శబ్దములకు వాచ్యము.

వ్యావృత్తిరూపామ్ + తు = ఏకాకారముకాక విరూపమగుబుద్ధిని మాత్రము, ద్రవ్యత్వేన = ద్రవ్యరూపమున, అనగా ద్రవ్యమని, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

బుద్ధితప్ప మరియొక పదార్థములేదు. అవిద్యావశమున అదియే బాహ్యప్రపంచ రూపమున భాసించును. దృశ్యమునకు బుద్ధిస్థమునకు అభేదమును అంగీకరించుటచే ఆరెంటికి సామాన్యముండుటవలన ఏకాకారబుద్ధి కలుగును. శబ్దమునుచ్చరింపగా అట్టి ఆకారము కలిగిన బుద్ధి జనియించును. ఆ ఆకారమే శబ్దమునకు వాచ్యమగును. బుద్ధి వాచ్యము కాదు. ఆ ఆకారము బాహ్యముకావచ్చును. కాకపోవచ్చును. శబ్దవాచ్యమగుటలో క్షతిలేదు.

విభిన్నరూపమగు బుద్ధిలో భాసించినది ద్రవ్యముకాగలదు ఇదియే జాతికి వ్యక్తికి కల భేదము

కాగా విజ్ఞాన వాదమునగూడ ఆకృతి అనగా జాతిసార్వత్రికము, శబ్దవాచ్యము అని సిద్ధించుచున్నది. ॥19॥

అవతారిక—వస్తువులకు దేశమునుబట్టి కాలమునుబట్టియు భేదము సిద్ధించును, దేశకాలములను అపేక్షింపని యెడల వస్తువులు అభిన్నములే యగును. ఇట్లు వస్తువులకు అభేదము స్వాభావికమగుచుండగా, దానిని సమర్థించుటకై అతిరిక్తమగు జాతిని కల్పించుటకై ఇంతఏల ప్రయత్నింపవలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

**శ్లో॥ భిన్నా ఇతి పరోపాధిరభిన్నా ఇతి వాపునః।
భాతవ్యాను ప్రపఞ్చోఽయం సంసృష్టేష్వేవ జాయతే॥** 20

భిన్నాః = వస్తువులు భిన్నములు, అనగా అది ఇది ఒకటికాదు, వేరువస్తువులు, ఇతి = అను వాడుక, పరోపాధిః = ఇతరవస్తువులు ఆధారముగా గలది.

రెండువస్తువులు ఉన్ననాడే దానికంటె ఇది భిన్నమైనది అని లోకవ్యవహారము కలుగును. ఒకేవస్తువున్నచో పై వ్యవహారము జరగదు.

అర్థేి, అభిన్నాః = వస్తువులు భేదము లేనివి, ఇతి + వా + పునః = అనువ్యవహారము కూడ, పరోపాధిః = ఇతరవస్తువులు మూలముగా కలదియే.

వస్తువులు కొన్ని వేరుగా ఉన్ననాడే మరికొన్నిటి యందుగాని వానియందుగాని ఇవి అన్నియు ఒక్కటియే అను వ్యవహారము కలుగును. ఒకే వస్తువున్నచో పైవ్యవహారము కుదురదు.

భావాత్మసు = భావరూపములగు వస్తువులు, సంసృష్టేషు + ఏవ = పరస్పరము మిశ్రితములగునపుడే, అయమ్ = ఈ, ప్రపఞ్చః = ప్రపంచకము, జాయతే = కలుగుచున్నది.

ఉపాధులు అనగా నిమిత్తములు లేనిది కేవలమగు వస్తువులు లోకవ్యవహారమునకు ఉపయోగింపవు. దేశము, కాలము, ఘటము, పటము మున్నగు ఉపాధులను బట్టియే వ్యవహారము జరుగును. ఆస్థితి వస్తువులకు ఏకాకారబుద్ధి కలుగవలెనన్నచో సామాన్యమునే ఆశ్రయింపవలెను. ॥20॥

అవతారిక —పైయర్థమునే నిషేధరూపమున చూపుచున్నాడు

శ్లో॥ నైకత్వం, నాపి నానాత్వం, న సత్త్వం, నాపినాస్తితా।
ఆత్మతత్త్వేషు భావానామసంసృష్టేషు విద్యతే॥ 21

ఆత్మతత్త్వేషు = ఉపాధి లేని కేవలద్రవ్యములు, అసంసృష్టేషు = పరస్పరము కలియనిచో, భావానామ్ = వస్తువులకు, ఏకత్వమ్ = అభేదము, న + విద్యతే = ఉండదు. నానాత్వమ్ + అపి = భేదముకూడ, న + విద్యతే = ఉండదు. సత్త్వమ్ = ఉనికియు, న + విద్యతే = ఉండదు. నాస్తితా + అపి = లేమియు, న + విద్యతే = ఉండదు.

నిరుపాధికములగు వస్తువులకు ఏకత్వనానాత్వములు, ఉనికిలేములు సంభవింపవు. ॥21॥

అవతారిక —ఉపాధులనుఆశ్రయించి వానిమూలమున భేదమునుజూపి జాతి సార్వత్రికమని సిద్ధాంతము చూపబడినది. ఆ ఉపాధులు ద్రవ్యముకంటె భిన్నములే అని యింతవరకు చూపబడినది.

ఇపుడు ఆ ఉపాధులు ద్రవ్యముయొక్కశక్తి (వలన కలిగినవే) భూతములే, భిన్నములుకావనెడి అద్వైతదర్శనమును ఆశ్రయించి చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వశక్త్యాత్మభూతత్వమేకస్యైవేతి నిర్ణయః।
భావానామాత్మభేదస్య కల్పనా స్యాదనర్థికా॥ 22

సర్వశక్త్యాత్మభూతత్వమ్ = ఎల్లశక్తులకు ఆత్మరూపము అగుట, ఏకస్య + ఏవ = ఒకే పదార్థమునకు అనగా నిర్గుణ పరబ్రహ్మమునకే, ఇతి = అని, నిర్ణయః = శాస్త్రములుచేసిన నిర్ణయము.

లోకమున ఎన్నియో విలక్షణములగు కార్యములు కాన్పించుచున్నవి. వానికి కారణములు శక్తులు కావలెను ఆశక్తులన్నియు ఒక పరబ్రహ్మమునందే ఉన్నవి. కనుక శక్తులు భిన్నభిన్నములు కావచ్చును. వాని ఆశ్రయము మాత్రము ఒక పరబ్రహ్మమే.

భావానామ్ = పదార్థములకు, ఆత్మభేదస్య = స్వరూపభేదమునకు, కల్పనా = కల్పించుట, అనర్థికా = ప్రయోజనములేనిదే, స్యాత్ = కానగును.

అట్లుకాక ఉపాధులనుబట్టి ద్రవ్యములు నానాగా అంగీకరించిన, అట్టి కల్పనకు ప్రయోజనములేదు. కాన ఉపాధులన్నియు ఒకే బ్రహ్మమునందున్నవనుటయే లెస్స. ॥22॥

అవతారిక — ఉపాధులు పరబ్రహ్మముయొక్క శక్తిరూపములే అను అర్థమునే స్పష్టపరచుచున్నాడు.

శ్లో॥ తస్మాత్ ద్రవ్యాదయః సర్వాః శక్తయో భిన్నలక్షణాః।
సంసృష్టాః పురుషార్థస్య సాధికా న తు కేవలాః॥ 23

తస్మాత్ = పరబ్రహ్మమునుండి మాయావశమున వెలువడిన, లేక తస్మాత్ అను పంచమికి షష్ఠ్యర్థము చెప్పవలెను. తస్మాత్ = తస్య = బ్రహ్మమునకు సంబంధించియున్న, భిన్న లక్షణాః = విభిన్నములగు లక్షణములు గల అనగా వేరువేరు కార్యములను కలిగించెడి +ద్రవ్యాదయః = ద్రవ్యము మున్నగు, సర్వాః + శక్తయః = ఎల్లశక్తులు, సంసృష్టాః = పరస్పరము కలసియున్నవై, పురుషార్థస్య = పురుషుని లోకయాత్రకు,సాధికాః = సాధకము లగుచున్నవి, కేవలాః + తు = ఆశక్తులు పరస్పరము కలియకుండ ఒక్కొక్క శక్తియే, న = పురుషార్థమును సాధింపలేవు.

వైశేషికులు సామాన్యమును ఆత్మపదార్థము కంటె వేరుగా చూపిరి. వైయాకరణులు అట్లుకాక సామాన్యము బ్రహ్మముయొక్క శక్తిరూపమనియే భావించిరి. ఒక సామాన్యమేకాదు, ద్రవ్యము మున్నగు పదార్థములన్నియు బ్రహ్మముయొక్క శక్తులేయని

కణాదమహర్షి–ద్రవ్యము, గుణము, కర్మ, సామాన్యము, విశేషము, సమవాయము, అభావము అను ఏడుపదార్థములను చూపియున్నాడు. ఆయన ప్రత్యక్షము, అనుమానము అను రెండు స్వతంత్ర ప్రమాణములను అంగీకరించెను. శబ్దము, ఉపమానము అనునవి అనుమానాంతర్గతములని ఆయన తలంచెను.

ఈయంశము సంబంధసముద్దేశమున 12వ శ్లోకమున గూడ చూపబడును.

తలంచిరి. ఆ శక్తులు కార్యమునుబట్టి భిన్నములుగానున్నట్లు అనుమితములగుచున్నవి. అవి కలసియే లోకయాత్రను కలిగించును. ద్రవ్యము మున్నగు పదార్థములు వేరువేరుగా ఉన్నచో అవి వ్యవహారమును కలిగింపలేవు.

అందు శక్తులు ఉపాధులు, అవి బ్రహ్మకు ఆత్మభూతములే, దానికంటె భిన్నములు కావు. కావుననే అద్వైతవాదము సరియగుచున్నది.

సత్యభాగము జాతియనియు, అసత్యమగు భాగములు వ్యక్తులనియు విభాగము చేయనగును. ఈయర్థము ఈసముద్దేశముననే 32వ శ్లోకమున గ్రంథకర్త యే చెప్పగలడు॥23॥

అవతారిక — ద్రవ్యము మున్నగు శక్తులు అన్నియు కలసియే కార్యమును సాధించును అని యంగీకరించిన, వానికి ప్రత్యేకము ఆకార్యమును సాధించుట సంభవింపదని తేలినది. అట్టితరి ఆశక్తులకంటె వానియొక్క సంసర్గము వేరుగానున్నదని చెప్పవలయును, కాగా శక్తులు బ్రహ్మముకంటె వేరుగా లేకున్నను, వాని సంసర్గము అనునది వేరుగానున్నందున ద్వైతభావము ఏర్పడును. అద్వైతభావము నశింపవలెను అను ప్రశ్నకు చక్కని దృష్టాంతమ చూపి సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ యథైవచేన్ద్రియాదీనా మాత్మభూతాసమగ్రతా।
తథాసంబన్ధిసంబన్ధసంసర్గేఽపిప్రతీయతే॥ 24

యథా + ఏవ + చ = ఏరీతిగా, ఇన్ద్రియాదీనామ్ = ఇంద్రియములు మున్నగు వానియొక్క, సమగ్రతా = సంపూర్ణత్వము అనగా వానిప్రోగు, ఆత్మభూతా = ఇంద్రియాదులు రూపముగా కలదియో అనగా ఇంద్రియాదులకంటె వేరుకాక ఇంద్రియాదులుగానే గ్రహింపబడుచున్నదో,

తథా = ఆరీతిగా, సంబన్ధిసంబన్ధసంసర్గే + అపి = సంబంధితో అనగా శక్తులకు ఆధారమగు బ్రహ్మముతో ద్రవ్యాదిరూపమగు శక్తులకు కల సంబంధము వలన కలిగిన సంసర్గమునందు అనగా కలయిక యందు గూడ, ఆత్మభూతతా = బ్రహ్మరూపత్వము, ప్రతీయతే = తెలియబడుచున్నది.

తాత్పర్యము—కింటిచే ఘటాదులరూపము గ్రహింపబడుట లో 1 కన్ను 2 ఘటాదుల రూపము 3. వెలుతురు 4. మనస్సు ఇవియన్నియు కావలెను. వీనిలో ఏదిలేకున్నను రూపము ప్రత్యక్షముకాదు. కనుక వీని సముదాయము అపేక్షిత మగుచున్నది. కాని కన్ను మున్నగువానికంటె ఆసముదాయము వేరుకాదు. ఆసముదాయము, కన్ను మున్నగుననియు ఏకరూపములే, కనుకనే సామాగ్రినికలిగించునవి, సామాగ్రే శబ్దముచే గ్రహింపబడుచున్నవి

అట్లే బ్రహ్మమునందు ద్రవ్యము మున్నగు శక్తులున్నవి. ఆ శక్తుల సముదాయము లోకయాత్రను నడిపించుచున్నది. ఆసముదాయము శక్తులకంటె భిన్నముకాదు శక్తిరూపమే. శక్తి బ్రహ్మరూపమే

వివరణ— శక్తులకు సంబంధి బ్రహ్మము. దానితో ద్రవ్యాదులకు సంబంధము. దానివలన సంసర్గము ఏర్పడును. దానియందు శక్తుల ఆత్మరూపము భాసించును. కాగా, సంబంధి = బ్రహ్మము. దానితో ద్రవ్యాదులకు సంబంధము, దానివలనకలిగినది సంసర్గము = సముదాయము. దానియందు ఆత్మరూపత్వము ప్రతీయమానమగుచున్నది.

పాఠాంతరము— సంబద్ధి సంబన్ధసంసర్గః అని ప్రథమాంతపాఠము కానవచ్చు చున్నది.సంబంధి అనగా బ్రహ్మము. సంబంధశబ్దము సంబధ్యన్తేఇతి = (సంబంధింపబడునవి, అనువ్యుత్పత్తినిబట్టి సంబంధించునవి అనగా ద్రవ్యాది శక్తులు, వానియొక్క సంసర్గము అనగా కలయిక ఆత్మభూతమై తెలియబడుచున్నదని యర్థము ఎఱుగనగును. ॥24॥

అవతారిక—ఆయా దర్శనములను అనుసరించి జాతి సార్వత్రికము. అది ఎల్ల శబ్దములకు వాచ్యమగునని నిరూపించెను. 2వ శ్లోకమున ఆజాతి నిత్యమని నిర్ణయించెను.

జాతి నిత్యమనుటలో కొన్నికార్యములుకలుగు చున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ నతదు త్పద్యతేకిఞ్చి ద్యస్య జాతిర్నవిద్యతే।
ఆత్మాభి వ్యక్తయేజాతిః కారణానాం ప్రయోజికా॥ 25

A. యస్య = ఏవస్తువునకు, జాతిః = జాతి, న + విద్యతే = లేదో,తత్ = ఆవస్తువు, న + ఉత్పద్యతే = పుట్టనేరదు.

ఏవస్తువైనను పుట్టవలెనన్న, దానికి జాతి తప్పక ఉండవలెను. ఆజాతియేలేనిచో ఆ వస్తువు పుట్టుటకవకాశములేదు.

B. వస్తువులు పుట్టుటలో జాతి ఎట్లుసహకరించునో ఆసంగతి చెప్పుచున్నాడు.

జాతిః = జాతి, ఆత్మాభివ్యక్తయే = తనయొక్క-అనగా జాతియొక్క స్పష్టతకొరకు కారణానామ్ = వస్తువుయొక్క-పుట్టుకలో కారణములగువానికి, ప్రయోజికా = ప్రయోజిక'ము అనగా ప్రేరణచేయునది (భవతి) = అగుచున్నది.

ఘటమునందు ఘటత్వమను జాతికలదు. ఆజాతియే లేనిచో ఆ ఘటము పుట్టుటకేవీలులేదు. ఆజాతికి రూపములేదు. అది బయటకు స్పష్టముగా గోచరింపవలెనన్న వ్యక్తిద్వారా గోచరింపవలెను. ఘటముకంటికి కనబడగా దానియందున్న ఘటత్వజాతియు కనబడును. అందుకై ఆజాతి ఘటము ఉత్పన్నమగుటకు అవసరమగు కారణములను ప్రేరే పించును. జాతి ఎల్లప్పుడు సన్నిహితమైయుండును. కనుక ఆకారణములకు సహకరించ గలదు. వానివలన ఘటముజనింపగా ఘటత్వజాతి వ్యక్తమగును. కాగా జాతి వస్తువు పుట్టుటలో నిమిత్తకారణమగును. ఈ యంశమును 'వైశేషికులుకూడ అంగీకరింతురు.

జాతి ప్రయోజక కర్తయని గ్రంథకర్తయాశయము. వ్యక్తిలేనిదిజాతివ్యక్తము కాదు. తనఅభివ్యక్తికై జాతి వ్యక్తి జనియించుటకు కారణములకు తోడ్పడుచున్నది. ॥25॥

అవతారిక—ఘటత్వజాతి ఘటములయందుండును. అంతియేకాని ఘటమునకు కారణములగు మట్టి, పరమాణువులు, కుమ్మరి మున్నగు కారణములయందులేదు, కాగా కారణములయందు జాతి సన్నిహితముకానందున వానిని ఆజాతి యెట్లు ప్రేరిపింపగలదు? అను ప్రశ్నకుసమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కారణేషు పదంకృత్వా నిత్యానిత్యేషు జాతయః।
క్వచిత్కార్యేష్వభివ్యక్తిముపయాన్తి పునః పునః॥ 26

జాతయః = జాతులు, నిత్యానిత్యేషు = నిత్యములగు నట్టియు అనిత్యములగునట్టియు, కారణేషు = కారణములయందు, పదమ్ = అడుగును ,కృత్వా = చేసి,క్వచిత్ + కార్యేషు = కొన్ని కార్యముల యందు. అభివ్యక్తిమ్ = స్పష్టతను, పునఃపునః = మాటిమాటికి ఉపయాన్తి = పొందుచున్నవి.

వివరణ—ఘటము మున్నగుకార్యములకు పరమాణువులు కారణములు. అవి నిత్యములు. సాంఖ్యమతమున ప్రధానము అనగా అవ్యక్తము, మూలప్రకృతి, పురుషుడు కారణములు. అవియు నిత్యములే. కుమ్మరి చక్రము మున్నగునవి అనిత్యములగు కారణములు. ఇట్టికార్య మాత్రమున చూడనగును.

తాత్పర్యము—జాతులు సార్వత్రికములుకనుక కారణములయందుకూడ నుండును మరియు కార్యము జాతి రూపమున కారణముల యందు నిలుచును. అట్టితరి కారణములు కార్యమును కలిగించుటకు సిద్దముగా నుండగా వానిని జాతి ప్రేరేపించును. ఆ కార్యము నిష్పన్నముకాగా దానిని చూచునపుడెల్ల ఆజాతియచట స్పష్టతను పొందును.

విశేషాంశము—పైరీతినిఘటాదులయందు ఘటత్వజాతి అభివ్యక్తము కాగలదు. కాని వాయువునకు రూపము లేదు. అచట జాతిఅభివ్యక్తము కానేరదు. ఈ యభిప్రాయముతో క్వచిత్ అనుపదము ప్రయుక్తమాయెను. అనగా రూపవంతములగు కార్యములయందు జాతి వ్యక్తమగునని ఆశయము.

కార్యము నిష్పన్నము కాకమునుపు కూడ జాతి యున్నందున జాతినిత్యత్వము సిద్ధించుచున్నది అని యీగ్రంథమువలన లభించుచున్నది. ॥26॥

అవతారిక—ఎల్లశబ్దములుజాతినే బోధించునని యంగీకరించుట వలన కలిగెడి ఉపయోగములు జూపుచున్నాడు.

శ్లో॥ నిర్వర్త్యమానం యత్కర్మ జాతిస్తత్రాపిసాధనమ్।
స్వాశ్రయస్యాభి నిష్పత్తౌ సా క్రియాణాం ప్రయోజికా॥ 27

నిర్వర్త్యమానమ్* = నిర్వర్త్యము అనెడి, యత్ = ఏ, కర్మ = కర్మభేదమో, తత్ర + అపి =

---

* 1. నిర్వర్త్యము (తయారుచేయబడునది) 2. వికార్యము (వికారమునకుఅర్హమైనది) 3. ప్రాప్యము (క్రియలవలన ఏ విశేషరూపమును పొందనిది) అనురీతిని కర్మమూడు విధములుగా ఉన్నది. ఈయంశము సాధన సముద్దేశమున స్పష్టము కాగలదు-49వ శ్లోకము.

దానియందుగూడ, జాతిః = జాతి, సాధనమ్ = సాధనము అనగా కారకము, కాగలదు. సా = ఆజాతి, స్వాశ్రయస్య = తనకుఅనగా ఆజాతికి ఆశ్రయమగు ద్రవ్యముయొక్క పుట్టుక విషయమై, క్రియాణామ్ = క్రియలకు, ప్రయోజికా = ప్రేరేపించునది యగుచున్నది.

నిర్వర్త్యకర్మ : ఘటం కరోతి (కడవను తయారుచేయుచున్నాడు) మున్నగు లక్ష్యములలో కడవ మున్నగునవి. సిద్ధమగు వస్తువులు క్రియలలో సాధనమగును. ఇచట కడవ సిద్ధముగా లేదు కనుక అది ఎట్లు సాధనమగును? అని ప్రశ్నింపవచ్చును. ఇచట ద్రవ్యసాధనముకాదు. మరి యేమన జాతిసాధనము అది సిద్ధమే. అట్టిజాతి తాను అభివ్యక్తమగుటకు తనకు ఆశ్రయమగు ద్రవ్యముపుట్టుటకై క్రియలను ప్రేరేపించును. కాగా, జాతియే కారకము, నిష్పన్నమగు ద్రవ్యము కర్మకాగలదు. జాతి, ద్రవ్యము రెండు వేరువేరు పదార్థములుకావు. అవి అభిన్నములే కనుక ఘటము, కర్మకారకము అనువ్యవహారము కలుగ వచ్చును.

విశేషాంశము—వికార్యకర్మః : సువర్ణం కుణ్డలం కరోతి (బంగారమునుకుండలముగా చేయుచున్నాడు) సువర్ణము వికార్యము. (గ్రామం పశ్యతి) గ్రామమును చూచుచున్నాడు. ఇచట గ్రామము ప్రాప్యకర్మ, సువర్ణము, గ్రామము సిద్ధ వస్తువులేకాన ఇచటద్రవ్యములే సాధనములు కాగలవు. అందుచేనిర్వర్త్యకర్మయే జాతివాదమునకు ప్రయోజనము కాగలదు. ఈభావముతో నిర్వర్త్యమానమ్ అను పదము ప్రయుక్తమాయెను ॥27॥

అవతారిక—కార్యముజనియించుటలో జాతి కారణములను ప్రేరేపించునని చెప్పబడినది. కాగా జాతివాదమున క్రియలలో సాధనము జాతియే. ద్రవ్యముకాదని తేలినది. విధి వాక్యములు, నిషేధవాక్యములు కూడ జాతిని ఉద్దేశించియే చెప్పబడినవని నిరూపించుచున్నాడు.

శ్లో॥ విధౌవాప్రతిషేధేవా బ్రాహ్మణత్వాదిసాధకమ్।
వ్యక్త్యాశ్రితా శ్రితా జాతే స్సంఖ్యాజాతి ర్విశేషికా॥ 28

A. విధౌ = విధివాక్యమునగాని, ప్రతిషేధే + వా, ప్రతిషేధవాక్యమునగాని, బ్రాహ్మణత్వాది = బ్రాహ్మణత్వము మున్నగు జాతియే, సాధకమ్ = కారణమగుచున్నది.

శాస్త్రము మనుష్యుని అభిమతమగు ఒక క్రియయందు ప్రవర్తింపచేయును. అనిష్టజనకమగు క్రియనుండి నివర్తింపజేయును. వీనినే విధినిషేధములందురు. అవి జాతికే సంబంధించును, వ్యక్తికికాదు.

గామాలభేత (గోవును చంపి యజ్ఞ చేయవలెను) ఇది విధి. గౌర్న పదా స్ప్రష్టవ్యః (గోవును కాలితోతన్నరాదు) ఇది నిషేధము. ఈ రెండు జాతికే సంబంధించును. కాగా ఎల్ల గోవులు (ఏ గోవైనను) యజ్ఞమునకు అర్హములగును ఎల్లగోవులను కాలిచే తన్నకూడదు అను అర్థములభించును. ద్రవ్యమునకే ఈ విధినిషేధములు సంబంధించినచో ఏదోఒకగోవుతో యజ్ఞము చేయవలెను, ఏదో ఒకగోవును తన్నరాదు, అనియే లభించును. అది సమ్మతముకాదు కనుక జాతిపక్షమును ఆశ్రయించుటయే యుక్తము.

29]

B. జాతియే వాచ్యమను పక్షమున అగ్నిమాదధీత (అగ్ని ఆధానము చేయవలెను) మున్నగు వాక్యములలో ఏకత్వ సంఖ్య వివక్షితమగును. కనుకనే ఒకే అగ్నికి ఆధానము కలుగును అను అభిప్రాయమును సమన్వయ పరుచుచున్నాడు

వ్యక్త్యాశ్రితాశ్రితా = ఘటము, అగ్నిమున్నగు వ్యక్తిని ఆశ్రయించిన ఏకత్వ సంఖ్యను ఆశ్రయించినట్టి, సంఖ్యాజాతిః = ప్రత్యయార్థమగు సంఖ్యాగతమగుజాతి, జాతేః = ప్రకృత్యర్థమగుఘటత్వము అగ్నిత్వము మున్నగుజాతికి, విశేషికా = విశేషమును కలిగింపగలదు

జాతివాదమున శబ్దమునందలి ప్రకృతి జాతినే బోధించును. విభక్తి ప్రత్యయములు కూడ ఏకత్వ ద్విత్వాది సంఖ్యయందున్న జాతినే బోధించును. ప్రత్యయార్థమగుజాతి ఏకత్వద్విత్వములు మున్నగు సంఖ్యలయందు కలదు. ఆసంఖ్య వ్యక్తియందు కలదు. ఈ పరంపరచే ప్రత్యయార్థ జాతి వ్యక్తికిసంబంధించినది, ప్రకృత్యర్థ మగు జాతి సమవాయ సంబంధమున ఆ వ్యక్తియందు ఉన్నది. ఏకార్థసమవాయమును బట్టి ప్రత్యయార్థమగు జాతి ప్రకృత్యర్థమగు జాతినిసంబంధించును. ॥28॥

అవతారిక—ఎల్లశబ్దములకు జాతియే వాచ్యమగునని నియమము ఎట్లుచెప్పనగును?. జాతికి ఆశ్రయము వ్యక్తి. ఆవ్యక్తిని విడిచి జాతి ఉండనేరదు. వ్యక్తులతో మిశ్రితముగనే జాతి భాసించును అనుప్రశ్నకు యుక్తమగు దృష్టాంతమును జూపి సమాధానముచెప్పుచున్నాడు.

శ్లో॥ యథా జలాదిభిర్వ్యక్తం ముఖమేవాభిధీయతే।
తథాద్రవ్యైరభివ్యక్తా జాతిరేవాభిధీయతే॥ 29

యథా = ఎట్లు, జలాదిభిః = జలము, అద్దము మున్నగువానిచే, వ్యక్తమ్ = అభివ్యక్తి చేయబడిన అనగా స్పష్టముగాచేయబడిన, ముఖమ్ + ఏవ = ముఖమే, అభిధీయతే = చెప్పబడుచున్నదో,

తథా = అట్లే, ద్రవ్యైః = ద్రవ్యములచే, అభివ్యక్తా = స్పష్టపరచబడిన జాతిః + ఏవ = జాతియే, అభిధీయతే = శబ్దములచే చెప్పబడుచున్నది.

నీటిలోను, అద్దములోను ముఖము ప్రతిఫలించును. ఆ ప్రతిబింబము ఆధార మగు నీటిని, అద్దమును విడనాడకయే యుండును. కాని దానిని ముఖము అనుశబ్దముబోధించునపుడు ఆధారసంబంధములేని ప్రతిబింబమే శబ్దవాచ్యమగుచున్నది.

అట్లేజాతిని వ్యక్తులు స్పష్ట పరచును. వ్యక్తిని విడిచి జాతి యుండదు. కాని గోవు,ఘటము మున్నగు శబ్దములుమాత్రము ఆ జాతినే వ్యక్తులతో సంబంధములేక బోధింపగలవు.

విశేషాంశము—కన్ను మున్నగు ఇంద్రియముల వలన కలిగెడి ప్రత్యక్ష జ్ఞానమున, జాతివ్యక్తులు రెండు మిశ్రితములై భాసించును. సంకేతమును బట్టియే శబ్దమువలన జ్ఞానము కలుగుటచే అందు కేవలము జాతియే విషయముకాగలదు. ॥29॥

అవతారిక—ఎల్ల శబ్దములు జాతినే బోధించునని నియమము చేయబడినదికాగా శబ్దములవలనవ్యక్తులు భాసింపనందున అవి జాతి విశేషములను జ్ఞానమున విషయమగునట్లు ఎట్లు చేయగలవు? అట్లు కాకున్న ఎల్లశబ్దములనుండి కలిగెడి జ్ఞానములలో జాతి సామాన్యమే భాసింపవలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యథేన్ద్రియగతో భేద ఇన్ద్రియగ్రహణా దృతే।
ఇన్ద్రియార్థేష్వ దృష్టోఽపి జ్ఞాన భేదాయ కల్పతే॥ 30

శ్లో॥ తథాత్మరూప గ్రహణాత్కేషాఞ్చిద్వ్యక్తయోవినా।
సామాన్యజ్ఞానభేదానా ముపయాన్తినిమిత్తతామ్॥ 31

యథా = ఎట్లు, ఇన్ద్రియగ్రహణాత్ + ఋతే = ఇంద్రియముల స్వరూపము తెలియకున్నను, ఇన్ద్రియగతః = ఇంద్రియములందున్న, భేదః = భేదముఅనగా కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము, మున్నగు ఇంద్రియభేదము, అదృష్టః + అపి = దృష్టముకాకున్నను, ఇన్ద్రియార్థేషు ఇంద్రియములచే కలిగెడి అర్థములు విషయముగాగల, జ్ఞానభేదాయ = జ్ఞానములయొక్క భేదము కొరకు అనగా, చతురింద్రియములవలన జ్ఞానము, శ్రోత్రేంద్రియమువలన కలిగినజ్ఞానము, అను రీతిని కలిగెడి జ్ఞానభేదము కొరకు, కల్పతే = సమర్థమగుచున్నదో, తథా = అట్లే, వ్యక్తయః = వ్యక్తులు, ఆత్మరూప గ్రహణాత్ + వినా = తనయొక్కస్వరూపమును గ్రహింపకున్నను అనగా అవి శబ్దమున విషయములు కాకున్నను, కేషాంచిత్ = కొన్ని, సామాన్య జ్ఞాన భేదానామ్ = జాతి విషయకమగు జ్ఞానములయొక్క భేదములకు, నిమిత్తతామ్ = కారణత్వమును, ఉపయాన్తి = పొందుచున్నవి.

కన్ను, చెవి, ముక్కు మున్నగు ఇంద్రియములు నిత్య పరోక్షములు. అనగా అవిమనకు ఎన్నడు ప్రత్యక్షముకావు. కాని ఉన్నవనిమాత్రము అనుమాన ప్రమాణముచే నిశ్చితమగును. మరియు చక్షురింద్రియము వలన కలిగిన జ్ఞానము ఆ ఇంద్రియము యొక్క కార్యముకాదు. అట్లైనను వానివలన కలిగెడి జ్ఞానములు మాత్రము వేరు వేరుగా ఉన్నట్లువానివలన తెలియును.

అట్లే వ్యక్తులు జ్ఞానమున విషయములుకాక పోవచ్చును. జాతులే శబ్దమువలన తెలియ బడవచ్చును. కాని నిజమున ఆరెండింటికి సమవాయము సంబంధము కనుక ఆజాతులు స్వాశ్రయమగు వ్యక్తి విశేషములను తెలుప గలవు. కనుక శబ్దమును ఉచ్చరింపగా జాతియేజ్ఞానమున భాసించినను పైరీతిని వ్యక్తులనుగూడతెలుపుటచే జాతివిశేషము అనగా గోత్వము, ఘటత్వము మున్నగు కొన్ని జాతులే గవాది శబ్దములవలన భాసించును. జాతి సామాన్యము భాసింపదు. కాగాకొన్నివ్యక్తులే కొన్ని జాతులనే శబ్దమున భాసింపజేయగలవు, ॥30,31॥

అవతారిక—ఎల్ల ఉపాధులు పరబ్రహ్మముయొక్క శక్తిరూపములే అని 22వ శ్లోకముచే చెప్పబడినది. అట్టితరి జాతులు, వ్యక్తులు అను భేదమునకు కారణమేది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సత్యాసత్యౌ తు యౌ భాగౌ ప్రతిభావం వ్యవస్థితౌ।
సత్యం యత్తత్ర సాజాతిరసత్యా వ్యక్తయఃస్మృతాః॥ 32

ప్రతిభావమ్ = ప్రతిపదార్థమునందు, సత్యాసత్యౌ = సత్యము అసత్యముఅనెడి, యౌ = ఏ, భాగౌ = భాగములు, వ్యవస్థితౌ + తు = ఉన్నవనియే నిశ్చితమైనవో, తత్ర = అరెంటిలోను యత్ = ఏది, సత్యమ్ = సత్యమో, సా = అది, జాతిః = జాతియని, (స్మృతా) = చెప్ప బడుచున్నది. అసత్యాః = అసత్యభాగములు, వ్యక్తయః = వ్యక్తులుగా, స్మృతాః = చెప్పబడు చున్నవి. కాక స్మరింపబడుచున్నవి. అద్వైత తత్త్వము నెరింగినవారిచే సత్యభాగము జాతిరూప మనియు,అసత్యమగు భాగము వ్యక్తిరూపమనియు శ్రుతుల ప్రామాణ్యమును బట్టి నిరూపింప బడుచున్నదని భావము.

కడియము, కంకణము మున్నగు వస్తువులు మనకు కానవచ్చుచున్నవి. వానికి కారణమేది అని ఆలోచించిన బంగారమనితెలియును. అచట కడియము మున్నగునవి సత్యములు కావనియు బంగారమే సత్యమనితేలును. దానిని పరిశీలించిన తేజము సత్యమనియు, దానికి కారణమేమి? అని ఆలోచింపగా పరాప్రకృతి కారణమనితేలును అదియు ఎల్ల వికారములను అనుసరించి జ్ఞానా నందరూపమగు బ్రహ్మము.అదియే యాజాతిరూపము. దానికంటె ఇతరములగు అర్థములు అసత్యములు అవియేవ్యక్తులు.

పైరీతిని జాతి వ్యక్తివిభాగము జ్ఞాతముకాగలదు. ప్రతిభావమ్--ఇచ్చట భావశబ్దము పదార్థపరము. భావేభావే = ప్రతిభావమ్ అని వీప్సార్థమున నవ్యయీభావ సమాసము ఈశ్లోకము యొక్క అభిప్రాయము 2 వ సముద్దేశమున 11, 15 శ్లోకములలోవ్యక్తము కాగలదు. ॥32॥

అవతారిక—అద్వైత సిద్ధాంతముననుసరించి పరమార్థసత్యమగు సది జాతియే అదియే మహాసత్తయనబడుచున్నది. అది పరబ్రహ్మ స్వరూపము. అదియే గోత్వ, ఘటత్వ, పటత్వరూపమున వివర్తమగుచున్నది. దానినిబట్టి వ్యవహారము జరుగుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సంబంధిభేదా త్సైవ భిద్య మానా గవాదిషు।
జాతిరిత్యుచ్యతే తస్యాంసర్వే శబ్దావ్యవస్థితాః ।33।

సత్తా + ఏవ = ఆమహాసామాన్యమే, సంబంధిభేదాత్ = ఆశ్రయముల యొక్క భేదమువలన గవాదిషు = గోవు,అశ్వము = మున్నగువానియందు, భిద్యమానా = అరోపితమగు నానాత్వము కలదై, జాతిః + ఇతి = జాతియని = అనగా గోత్వజాతి ఘటత్వజాతిఅని,ఉచ్యతే = చెప్పబడు చున్నది. అనగా గోత్వాదికము అపరసామాన్యమగుచున్నదని.

తస్యామ్ = గవాది వ్యక్తులచే భిన్నమగు సత్తాజాతియందే, సర్వే + శబ్దాః = ఎల్ల శబ్దములు, వ్యవస్థితాః = నియతమగు రూపముతో నిలిచియున్నవి. సంకీర్ణముకాక ఆశబ్దములు నియతమగు జాతినే బోధించుచున్నవని భావము.

డిత్థ, దేవదత్త, మున్నగు సంజ్ఞాశబ్దములు కూడ జాతి వాచకములే కాగలవు, ఈ యభిప్రాయమునే "సర్వే" అనుపదము వ్యక్తపరచుచున్నది. ॥33॥

అవతారిక—ఎల్ల శబ్దములు జాతివాచకములే అను అర్థమునే విశదపరచుచున్నాడు.

శ్లో॥ తాం ప్రాతిపదికార్థం చ ధాత్వర్థం చ ప్రచక్షతే।
సా నిత్యా సా మహానాత్మా తామాహుస్త్వతలాదయః ॥34

1. తామ్ + చ = అట్టి సత్తనే,*ప్రాతిపదికార్థమ్ = ప్రాతిపదికములకు వాచ్యార్థమునుగా, ప్రచక్షతే = పెద్దలు చెప్పుచున్నారు

ఎల్లప్రాతిపదికములకు సత్తవాచ్యమగును కనుకనే (ప్రాతిపదికార్థః సత్తా) అని పెద్దలు నుడివిరి.

2 తాం + చ = ఆ సత్తనే, ధాత్వర్థమ్ = ధాతువులకు వాచ్యమును గాను, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

కారకములచే క్రియలు జనియించును. అట్టి విలక్షణములగు క్రియలయందు జాతి కలదు ఆ జాతిని ధాతువులు బోధించును.

3 సా = ఆ సత్త,నిత్యా = నిత్యమే,అ నిత్యము గాదు.ఆ సత్తకు ఉత్పత్తి వినాశములు లేవు. కనుక అది నిత్యమే.

4. సా = ఆ సత్త, మహాన్ = వ్యాపకమగు, ఆత్మా = పరమాత్మయే. దానియందే జన్మ మున్నగు ఆరు భావ వికారములు కలుగుచున్నవి

5. తామ్ = ఆ సత్తనే, త్వతలాదయః = త్వ,తల్ మున్నగు తద్ధిత ప్రత్యయములు, ఆహుః = చెప్పుచున్నవి

ఎల్ల శబ్దములకు సత్తవాచ్యమగును. అదియే ప్రవృత్తి నిమిత్తము. ఆ ప్రవృత్తి నిమిత్తమగు సత్తను త్వ, ప్రత్యయము, తల్ ప్రత్యయము చెప్పుచున్నవి—ఘటస్యభావః = 1. ఘటత్వమ్ 2 ఘటతా, గోః భావః = 1. గోత్వమ్ 2. గోతా

ఇట్లే ఇమనిచ్-పృథోః భావః-ప్రథిమా, యత్-స్తేనస్యభావః = స్తేయమ్.(దొంగవాని యొక్క భావము) మున్నగు ప్రత్యయములుకూడ భావరూపమగు సత్తనే బోధించును.

పై ప్రత్యయములు భావార్థమున విధింపబడినవి. భావ మనగా ప్రవృత్తి నిమిత్తము అది సత్తయే.

---

* 1. అర్థవదధాతురప్రత్యయః ప్రాతిపదికమ్ 1-2-45 ధాతువు, ప్రత్యయము, ప్రత్యయాంతము కాని అర్థవంతమగు శబ్దము ప్రాతిపదికము. కృత్తద్ధిత సమాసాశ్చ. 1-2-46కృదంతములు, తద్ధితాంతములు సమాసములు కూడ ప్రాతిపదిక సంజ్ఞకములు.

విశేషాంశము — ఈ కారికలో మహాన్ అను పదము కపిలసాంఖ్యమున నంగీకరింప బడిన మహత్ తత్త్వమును సూచించుచున్నది. ఆశాస్త్రమున బుద్ధికి మహత్ అని వ్యవహారము. అదియే ఎల్ల జగములకు కారణము. ఎల్లవికారములకు నిదానము. సత్త ఆట్టి మహత్తు కనుక ఇది వ్యాపకమనుట సమంజసమే ! ఆ యంశమును హేలారాజు వ్యక్తపరచెను. ॥ 34॥

అవతారిక — ఆ సత్తనే ప్రాతిపదికమునకు, ధాతువునకు వాచ్యమైన దానినిగా పెద్దలు చెప్పుచున్నారని 34 వ శ్లోకమున చెప్పబడినది.దానినే వ్యక్తపరచు చున్నాడు.

శ్లో॥ ప్రాప్తక్రమా విశేషేషు క్రియా సైవాభిధీయతే।
క్రమరూపస్య సంహారేతత్సత్త్వమితి కథ్యతే॥ 35

A. విశేషేషు = విశేషముల యందు, అనగా వండుట, నడచుట, చదువుట మున్నగు వ్యక్తి రూపమగు క్రియా విశేషములయందు, ప్రాప్తక్రమా = పొందబడిన క్రమము, అనగా పౌర్వాపర్యముకల, సా + ఏవ = ఆ జాతియే, క్రియా + ఇతి = క్రియ అని, అభిధీయతే = చెప్పబడుచున్నది. కారకముల కదలిక (కలయిక) వలన క్రియలు జనియించు చున్నవి. వాని యందు పౌర్వాపర్యము అనగా ముందు వెనుకలు వివక్షితములగుచో, అట్టి వ్యాపారముల మొత్తమును క్రియ అని యందురు.అట్టిపౌర్వాపర్యము జాతియందుకూడ కలుగును. పూర్వాపరభావము వివక్షితమగుచో ఆ సత్తాజాతియే క్రియ యగును. అదియే సాధ్యమని వ్యవహరింపబడును. ఇట్టి యర్థము ధాతువులకు వాచ్యమగును.క్రియావచనోధాతుః.

B. క్రమరూపస్య = క్రియలయందున్న క్రమమునకు, సంహారే = సంహారము కలుగగా అనగా అవివక్ష కలుగగా, తత్ = ఆ జాతియే, సత్త్వమ్ + ఇతి = సత్త్వము అనగా ద్రవ్యము, సిద్ధము అని, కథ్యతే = చెప్పబడుచున్నది.

క్రమమును వివక్షింపని యెడల ఆ జాతియే సిద్ధ పదార్థమగును. అట్టిసిద్ధపదార్థమే సత్త్వము. అది జాతియే. సత్త్వవాచినామ. నామవాచకము సత్త్వమును బోధించును

కాగా పదార్థము రెండు విధములు-1. సాధ్యము, 2. సిద్ధము. క్రియలకు పౌర్వాపర్యము వివక్షితమగుచో సాధ్యమనియు, దానిని వివక్షింపనిచో సిద్ధమనియు శాస్త్రములు చెప్పుచున్నవి. జాతియే వివక్షావశమున రెండు రూపములను ధరించు చున్నది. సాధ్యమగు అర్థమును చెప్పునది ధాతువు. సిద్ధమగు అర్థమును చెప్పునది. ప్రాతిపదికము. ॥ 35॥

అవతారిక — క్రియలన్నియు సత్తయొక్క వివర్తములే యను నర్థమున నిరుక్తకారుని సంవాదమును జూపుచునాడు.

శ్లో॥ సైవభావ వికారేషు షడవస్థాః ప్రపద్యతే ।
క్రమేణ శక్తిభిః స్వాభిరేవం ప్రత్యవభాసతే॥ 36

సా + ఏవ = ఆ సత్తయే, భావవికారేషు = సద్రూపమగు పదార్థముయొక్క వివర్తములలో, షట్ = ఆరు, అవస్థాః = అవస్థలను, ప్రపద్యతే = పొందుచున్నది. ఆ సత్తయే

స్వాభిః = స్వకీయములగు,శక్తిభిః = శక్తులచే, క్రమేణ = క్రమముగా, ఏవమ్ = ఈ రీతిగా అనగా జగద్రూపముగ, ప్రత్యవభాసతే = భాసించుచున్నది.

నిరుక్తమును* రచియించిన యాస్కుడు ఆరుభావవికారములు కలుగునని పలికెను. సద్రూపమగు బ్రహ్మయే ఆరు వివర్తములను బొందుచున్నది. సత్తు, సత్త అనునవి భిన్న పదార్థములుకావు ఆసత్తయే తనయందున్న శక్తులనుబట్టి క్రమరూపముగా భాసించు చున్నది.

1. పుట్టుట 2. ఉండుట 3. పరిణమించుట 4. వృద్ధిజెందుట 5. కృశించుట 6. నశించుట. ప్రతి వస్తువు ఈ క్రమమునకు బద్ధమయి యున్నది. అట్టి క్రమము సత్త యొక్క శక్తులవలననే కలుగుచున్నది.

విశేషాంశము– ఇచట వికారపదము వివర్తపదముకాగా అద్వైత మతమును వైయాకరణులు అశ్రయింతురని వ్యక్తము, అంతియేకాని సాంఖ్య మతము వంటి పరిణామ వాదులు వైయాకరణులు కారు. గ్రంథకర్త వివర్తవాదమునే పలుచోటులందునిరూపించియున్నాడు॥36॥

అవతారిక—సత్తయే తన శక్తులచే జన్మాదిరూపమున భాసించినపుడు జన్మాది రూపములన్నియు ఒకేసారి ఏల భాసింపవు ? క్రమరూపమున భానము ఎట్లు ? క్రిమ మనెడి క్రియావిశేషము లేదుకదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆత్మభూతః క్రియోప్యస్యా యత్రేదం కాలదర్శనమ్।
పౌర్వాపర్యాదిరూపేణ ప్రవిభక్తమివస్థితమ్ ॥ 37

క్రమః + అపి = పుట్టుక మున్నగువాని యొక్క క్రమముకూడ, అస్యాః = ఈ సత్తయొక్క, ఆత్మభూతః = ఆత్మరూపమైనదే, అనగా సత్తయొక్క శక్తులలోనున్నదే.

క్రియలు క్రమము కలవి. ఆ క్రమము వానికంటె భిన్నము కాదు.

యత్ర = ఏ క్రమమునందు,ఇదమ్ = ఈ,అనగా ప్రత్యక్షముగా కానవచ్చుచున్న, కాలదర్శనమ్ = పెద్దలచే చూడబడుచున్న కాలము,పౌర్వాపర్యాది రూపేణ = ముందు వెనుక అను రీతిని, ప్రవిభక్తమ్ + ఇవ = విభజింపబడినది వలె, స్థితమ్ = ఉన్నదో.

సత్తరూపమగు బ్రహ్మమునందు అనంతశక్తులు కలవు. వానిలో కాలశక్తి ఒకటి. వైశేషికులు చూపిన ప్రకారము కాలము ద్రవ్యము కానేరదు. ఆ కాలశక్తిచే జన్మాది క్రియలకు పౌర్వాపర్యము కలుగుచున్నది. ఈ యంశము మొదటి కాండమున మూడవ శ్లోకమున చూపబడినది. ఈ కాండమున తొమ్మిదవ సముద్దేశమున విపులముగా జూపబడగలదు.

అందుచే జన్మాదులు ఒకేసారి భాసింపవు. ॥ 37 ॥

---

* షడ్ భావ వికారా భవన్తీతి హస్మాహ భగవాన్ వార్ష్యాయణిః. 1.జాయతే 2. అస్తి 3.. విపరిణమతే 4. వర్ధతే 5. అపక్షయతే 6. వినశ్యతి. నిరుక్తము ప్రథమాధ్యాయము; 28, 29 .

అవతారిక—ఉత్పత్తి, నాశము అనునవి స్వతః లేనేలేవు. అట్టి స్థితిలో జన్మ నాశములు సత్తరూపములనుట యెట్లు? అను ప్రశ్నకు ముందుగా నాశము సత్తారూపమే అని చూపుచు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ తిరోభావాభ్యుపగమే భావానాం సైవ నాస్తితా।
లబ్ధక్రమే తిరోభావే నశ్యతీతి ప్రతీయతే॥ 38

భావానామ్ = పదార్థములకు, తిరోభావాభ్యుపగమే = తిరో భావమును (మఱుగు పడుటను) అంగీకరింపగా అనగా ఆ పదార్థములకు కారణములగు వస్తువులయందు శక్తిరూప మున మాత్రము స్థితిని అంగీకరించునప్పుడు, సా + ఏవ + ఆ బ్రహ్మ సత్తయే, నాస్తితా = నాశము, (ఇతి) = అని (కథ్యతే) = చెప్పబడుచున్నది. ఎల్ల పదార్థములు సత్తారూపములే, ఆసత్త కారణ వస్తువులయందు శక్తి రూపముననేయుండి, క్రమరహితముకాగా, నాశము అను నామపదముచే చెప్పబడుచున్నది. నాశమనగా అదియే. అంతియేకాని అభావరూపముకాదు.

తిరోభావే = కారణములయందున్న తిరోభవనము (అనగా సూక్ష్మరూపమున నుండుట), లబ్ధక్రమే = పొందబడిన క్రమముకలది కాగా, నశ్యతి + ఇతి = నశ్యతి అని తిఙంతపదముచే, ప్రతీయతే = తెలియబడుచున్నది.

ఆసత్తయే కారణముల యందుండి క్రమము లేక యుండగా, నాశము అను సిద్ధ రూపమున నామపదవాచ్యమగును. అచట క్రమము వివక్షితమగుచో నదియే సాధ్యరూపమున భాసించుటచే, నశ్యతి, అను క్రియా పదముచే బోధింపబడును క్రమము భాసించుటచే ఆ సత్త సాధ్యమగును, అదియేభేదము. నాశము సత్తారూపమే. ॥౩౮

అవతారిక—నాశము సత్తారూపమే అని ౩౮వ శ్లోకమున జూపి జన్మయు సత్తా రూపమే అని చూపుచున్నాడు.

శ్లో॥ పూర్వస్మాత్ప్రచ్యుతా ధర్మా దప్రాప్తా చోత్తరం పదమ్।
తదన్తరాలే భేదానా మాశ్రయా జ్జన్మ కథ్యతే॥ 39

పూర్వస్మాత్ = మొదటిదియగు, ధర్మాత్ = ధర్మమునుండి, అనగా కారణముల యందు శక్తిరూపమునుండుట యనెడి స్వభావమునుండి, ప్రచ్యుతా = జారినటువంటి అనగా కార్యోన్ముఖముగా నున్నట్టి, ఉత్తరమ్ = చివరిదియగు, పదమ్ = స్థానమును అనగా కార్య రూపమును, అప్రాప్తా + చ = పొందకయున్న, (సత్తా) = సత్తయే, తదన్తరాలే = ప్రథ మావస్థయొక్కయు, ఉత్తరావస్థయొక్కయు, మధ్యభాగమున కలిగెడి, భేదానామ్ = భేదము లకు, ఆశ్రయాత్ = ఆశ్రయమగుటవలన, జన్మ = పుట్టుక, ఇతి = అని, కథ్యతే = చెప్పబడుచున్నది. ఘటముపుట్టుచున్నది, అని లోకులు వ్యవహరింతురు, ఘటముసిద్ధమే యగుచో దానికిపుట్టుక యుండదు, ఆఘటము మట్టిరూపమున నుండగా అది కార్యోన్ముఖము కాగా అదిమొదలుకొని ఘటరూపము సిద్ధించువరకు మధ్యకాలమునకలిగెడి అవస్థలనుబట్టి సత్తయే జన్మ, అను భావమును బొందుచున్నది. కాగా జన్మయనునది కొత్తగాపుట్టుటకాదు,

కారణములయందు శక్తిరూపముననుండి క్రమముగా వ్యక్తమగుటయే, మరియొకధర్మమును బొందుటయే జన్మము.

కాబట్టి జన్మము కూడా సత్తారూపమే. ॥39

అవతారిక—సంబంధిభేదముచే సత్తకు భేదముకలుగును, దానివలన గోత్వము మున్నగు జాతిభేదముకలుగునని 39వ శ్లోకమున చెప్పబడినది. భేదకములగు సంబంధులను చూపుచున్నాడు.

శ్లో॥ ఆశ్రయః స్వాత్మమాత్రా వా భావా వా వ్యతిరేకిణః।
స్వశక్తయో వా సత్తాయా భేదదర్శనహేతవః॥ 40

ఆశ్రయః = ఆధారము అనగా గోవు, ఘటము మున్నగు వ్యక్తులు, స్వాత్మమాత్రాః + వా = తనకు ఆత్మీయములగు కల్పింపబడిన గోత్వము మున్నగు భాగములున్న, వ్యతిరేకిణః = వేరుగా ఉన్న, భావాః + వా = పదార్థములున్న అనగా దేశకాలాదులున్న, స్వశక్తయః + వా = తనశక్తులును, సత్తాయాః = బ్రహ్మసత్తకు, భేదహేతవః = భేదమునకు కారణము లగుచున్నవి.

1. ఆశ్రయః. క్రియ. ద్రవ్యము రెండుకూడా సత్తారూపములే కాని అవిద్యావశమున భేదము కల్పితమగును. ఆస్థితిలో ఆవు, కడవ మున్నగు ఆశ్రయముల వలన సత్త భిన్న మగుచున్నది గవాది భేదమున సత్త గోత్వ రూపమున, ఘటత్వరూపమున మారుచున్నది.

2. స్వాత్మమాత్రాః + మహా.సామాన్యము, వ్యాపకము, గోత్వము, మున్నగునవి వ్యాప్యములు. వీనినిబట్టి అది పరిచ్ఛిన్నము కాగలదు. ఆభాగములు ఆశ్రయమును బట్టియే భిన్నములగును.

3. భావాః. దేశమునుబట్టి సత్త భిన్నమగును. ఇది ఇచట ఇట్లున్నది. అచట అది అట్లున్నది అని లోకుల వ్యవహారము కలదు.

అట్లే నల్లకలువ రాత్రి వికసించును, పగటియందు ముకుళించును. దానిని బట్టి చూడగా కాలమునుబట్టి సత్త మారుచున్నట్లు స్పష్టమే.

ఇట్లే శక్తులను బట్టియు సత్త భిన్నమగును. ॥40॥

అవతారిక—జాతి అభివ్యక్తమగుటలో కొన్ని విశేషములను జూపుచున్నాడు.

శ్లో॥ పృథివ్యాదిష్వభివ్యక్తౌ న సంస్థాన మపేక్షతే।
అనుచ్ఛిన్నాఽఽశ్రయాజ్జాతి రనిత్యేఽప్యాశ్రయేస్థితా॥ 41

A. పృథివ్యాదిషు = భూమిమున్నగు వాని యందు అనగా భూమి, ఉదకము, తేజము మున్నగు వానియందు, అభివ్యక్తౌ = జాతి స్పష్టమగుటయందు, సంస్థానమ్ = అవయవములకూర్పును, న + అపేక్షతే = అపేక్షింపదు.

గోత్వము మనుష్యత్వము మున్నగు జాతులు ఆయాసంపూర్ణములగు వ్యక్తుల యందే భాసించును. ఏదో ఒక కొమ్ము డెక్క-గోరు మున్నగు చిన్న చిన్న అవయవము లున్నంత మాత్రాన ఆజాతులు వ్యక్తములు కావు.

భూమి ఉదకము మున్నగు వాని యందున్న భూమిత్వము ఉదకత్వము మున్నగు జాతులు అట్లుకాక ఒక చిన్న మట్టిబెడ్డ. గరిటెడునీరు ఉన్నను, కొండలు సముద్రములు మున్నగు పెద్ద వస్తువులున్నను అభివ్యక్తములగును.

B ఘటమునందు ఘటత్వజాతి యభివ్యక్తమగుచున్నది. కాని ఆశ్రయమగు ఘటము నశించగా ఆజాతియు నశింపవలెను. అట్టి తరి జాతి నిత్యముకాకపోవలెను. అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

జాతిః = జాతి, ఆశ్రయాత్ = ఆశ్రయము వలన, అనుచ్ఛిన్నా = నశింపనిదై, అనిత్యే + అపి అనిత్యమగునట్టి, ఆశ్రయే = ఆశ్రమునందు. స్థితా = ఉంటున్నది.

జాతి ఎల్లప్పుడును నశింపనిదే, తాను అభివ్యక్త మగుటకు మాత్రమే ఆశ్రయ మును అపేక్షించును. ఆశ్రయమునుబట్టియే జాతి స్వరూపమును బొందదు. ఆశ్రయము నశింపగా జాతియు నశింపవలెనని నియమము లేదు.

గుణములట్టివి కావు. ఆశ్రయమునశించిన, దానియందున్న గుణములు కూడా నశించును. ఒక ఘటము నశించినను మరికొన్ని ఘటములయందు ఘటత్వజాతి భాసించుచునే యున్నది. ॥41॥

అవతారిక —మహాప్రళయమున నిత్యవస్తువులుకూడ నశించును. అప్పుడు ఏ యాశ్రముకూడ నుండదు. అట్టి తరి జాతులు ఎచట నుండును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అనుచ్ఛేద్యాశ్రయామేకే సర్వాంజాతిం ప్రచక్షతే ।
న యౌగపద్యం ప్రలయే సర్వస్యేతి వ్యవస్థితాః॥ 42

ప్రలయే = ప్రళయమున, సర్వస్య = ఎల్ల ప్రపంచకమునకు, యౌగపద్యమ్ = ఒకేసారి సంభవించుట, న = లేదు, ఇతి = అని, వ్యవస్థితాః = నిశ్చయించిన, ఏకే = కొంతమంది అనగా పూర్వమీమాంసకులు, సర్వామ్ = ఎల్ల, జాతిమ్ = జాతిని, అనుచ్ఛేద్యాశ్రయామ్ = నాశము లేని ఆశ్రయము కలదానినిగా. ప్రచక్షతే = చెప్పుచున్నారు.

జైమిని మహర్షి పూర్వమీమాంసాశాస్త్రమును రచించెను. అందు మహాప్రళయ ముండదు, అది జరగబోదు అని సిద్ధాంతము చేయబడినది. కనుక వారి మతము చొప్పున ఎల్ల జగములు ఒకేసారి మహాప్రళయమున నశించుట కవకాశము లేదు. పరమాణువుల యందు జాతులు ఉండును. కాబట్టి ఏవోకొన్ని వ్యక్తులయందు జాతులు ఆశ్రయించి యుండగలవు. ॥42॥

అవతారిక—మహాప్రళయమును ఒప్పుకొన్నవారి మతమును జూచినను జాతుల కాశ్రియములుండగలవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రకృతౌప్రవిలీనేషు భేదేష్వేకత్వదర్శినామ్।
ద్రవ్యసత్త్వం ప్రపద్యన్తే స్వాశ్రయా ఏవజాతయః॥ 43

భేదేషు = ఘటము, పటము మున్నగువస్తుభేదములు, ప్రకృతౌ = ప్రకృతియందు, ప్రవిలీనేషు = లయమునుబొందగా, ఏకత్వినామ్ = ఏకత్వమునుఅంగీకరించువారి మతమున అనగా జగమునకు బ్రహ్మముతో ఏకత్వమును అభేదమును అంగీకరించిన అద్వైతుల మతమున, స్వాశ్రియాః,ఏవ = స్వీయమగు ఆశ్రియములు కలవిగానే, జాతయః = జాతులు, ద్రివ్యసత్త్వమ్ = ద్రవ్యమునందుండుటను, ప్రపద్యన్తే = పొందుచున్నవి.

వ్యాసమహర్షి ఉత్తరమీమాంసా శాస్త్రమును రచియించెను. అందు మహా ప్రళయము జరుగుననియు, అదిశాస్త్రసమ్మతమనియు సిద్ధాంతము చేయబడినది. పదార్థములన్నియు మహాప్రళయమున ఒకేసారి నశించును. నాశమనగా స్థూలరూపమున కానరాకుండుటయే. ఎల్లవస్తువులు ప్రకృతియందు సూక్ష్మరూపమున నిలుచును. సృష్టి ప్రారంభమున అవి మరల స్థూలరూపమున ఆవిర్భవించును.

కాగా అద్వైతవేదాంతము చొప్పునచూచినను ద్రవ్యరూపమగు బ్రహ్మమునే జాతులన్నియు ఆశ్రయించియుండును

విశేషాంశము—వైశేషికశాస్త్రజ్ఞులు ఇట్లు తలంచుచున్నారు ప్రళయము శాస్త్ర సమ్మతమే. కాని ఘటత్వము, పటత్వము మున్నగు జాతులు ఆశ్రియములులేకయే యుండగలవు. వానియొక్క అభివ్యక్తిమాత్రముకొరకే వ్యక్తుల అపేక్ష ॥43॥

అవతారిక—గోత్వజాతి ఎల్ల గోవులయందు ఉండును అని చెప్పబడినది. అట్లు కాక ఆజాతులు ఎల్లగోవులయందే అను నియమము లేక, ఎల్ల ప్రాణులయందు ఉండునని చెప్పుచున్నాడు

శ్లో॥ బ్రాహ్మణత్వాదయో భావాః సర్వప్రాణిష్వవస్థితాః।
అభివ్యక్తాః స్వకార్యాణాం సాధకా ఇత్యపి స్మృతిః॥ 44

బ్రాహ్మణత్వాదయః = బ్రాహ్మణత్వము మున్నగు, భావాః = జాతివిశేషములు, సర్వప్రాణిషు = ఎల్లప్రాణులయందు, అవస్థితాః = నిలిచియేయున్నవి.

బ్రాహ్మణత్వజాతి కేవలము బ్రాహ్మణ వ్యక్తులయందే కాక క్షత్రియాది ప్రాణులయందుగూడ కలదు

అభివ్యక్తాః = ఆయానియతములగు వ్యక్తులచే స్పష్టము చేయబడిన జాతులు, స్వకార్యాణామ్ = జాతివిశేషములకు సంబంధించిన కార్యములకు, సాధకాః = సాధకములు కాగలవు, ఇతి = అనియు. స్మృతిః = వృద్ధ పరంపర చెప్పుచున్నది.

గామాలభేత (గోవును చంపి యజ్ఞముచేయవలెను) మున్నగు వాక్యములలో గోశబ్దముఅశ్వత్వజాతిని బోధింపదు. నియతమగు జాతియే గోవుచే నభివ్యక్తమగును. కనుక గోత్వజాతియే భాసించును, అశ్వత్వజాతి భాసింపదు. కనుక జాతులు సార్వత్రికము లైనను నియతకార్యములు జరుగగలవు. ॥44॥

అవతారిక—జాతులు ప్రాణులయందేకాక అప్రాణులయందుగూడ ఉండును. కనుకనే అవి సార్వత్రికములనుట యుక్తమగుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ చిత్రాదిష్వప్యభివ్యక్తిర్జాతీనాం కైశ్చిదిష్యతే।
ప్రాణ్యాశ్రితాస్తు తాః ప్రాప్తౌ నిమిత్తం పుణ్యపాపయోః॥ 45

కైశ్చిత్ = కొందరిచే, చిత్రాదిషు + అపి = చిత్రములయందు బొమ్మలయందుగూడ జాతీనామ్ = జాతులకు, అభివ్యక్తిః = స్పష్టత, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

గోత్వజాతి ప్రాణులయందేకాక ఆవుయొక్క ఆకారముతోనున్న చిత్రమును జూచిన, ఒకబొమ్మనుజూచిన, వ్యక్తము కాగలదు. అనగా అచటను ఆ జాతి కలదని కొందరునమ్ముచున్నారు

తు = విశేషమేమనగా, ప్రాణ్యాశ్రితాః = ప్రాణులను ఆశ్రయించిన, తాః = ఆజాతులు, పుణ్యపాపయోః = పుణ్యపాపములయొక్క, ప్రాప్తౌ = పొందుటయందు, నిమిత్తమ్ = కారణము, (భవన్తి) = అగుచున్నవి.

గోవును చంపినపాపము. గోవునకు ఆహారము పెట్టినపుణ్యము అనిధర్మశాస్త్రము చెప్పుచున్నది. గోత్వజాతి ప్రాణులయందు అప్రాణులయందును ఉన్నను, ప్రాణులయందున్న జాతియే పుణ్యపాపములకు కారణము.

కాబట్టి లోకవ్యవహారము అసంకీర్ణముగానే జరుగును.

విశేషాంశము—అప్రాణులయందు ఆకారమాత్రమున్నను అచట గోత్వాదిజాతి ఉండనేరదు అచటజాతి సమవాయ సంబంధముననుండుట కవకాశము. ఈయర్థము కారికలో 'కైశ్చిత్' అనుపదము వ్యక్తపరుచు చున్నది. ఈ యంశమును హేలారాజు వ్యక్తపరచెను ॥45॥

అవతారిక—శబ్దములకు, అర్థములకు సంబంధమును ఎరుగని వానికి "గోత్వము అశ్వాదులనుండి వ్యావృత్తమై కేవలము గోవులయందే ఉన్నది" అను జ్ఞానము ఎట్లుకలుగును? గోవ్యక్తుల వలన నభివ్యక్తమగును అని యంగీకరించిన, అజ్ఞునకు కూడ ఆ జ్ఞానము కలుగ వలెను. కాని యట్లులేదు

ఇతరులు చెప్పగా ఆ జ్ఞానము కలుగును. అనినచో ఆ చెప్పినవారికి ఆ జ్ఞాన మెట్లుకలిగెను? అను ప్రశ్నకలుగును. అతనికిమరియొకడు చెప్పెను, అనిన అచటను

ఈ పరీశ్నకలుగును. చివరకు శబ్దార్థ సంబంధమును స్వయముగా ప్రత్యక్షముగా చూచిన పరమేశ్వరుడు చెప్పెనని యంగీకరింపవలెను

అట్లుకాకున్న అంధపరంపరగా ఈ శబ్దార్థ సంబంధమున్నదని చెప్పవలెను.

అందుచే పరమేశ్వరుడు ముందుగా చూచిమునులకు బోధించెననుటయుక్తము.

పై సిద్ధాంతమును స్పష్టపరుచుచు పరమేశ్వరుడున్నాడని శబ్దప్రమాణము చేతను అనుమాన ప్రమాణముచేతను చూపుచున్నాడు.

శ్లో॥ జ్ఞానమస్మద్విశిష్టానాం సర్వం సర్వేన్ద్రియం విదుః।
అభ్యాసాన్మణిరూప్యాది విశేషేష్వివ తద్విదామ్॥ 46

A. అస్మద్ = మనకంటె అనగా ఒకొక్క ఇంద్రియముచే ఒకొక్క అర్థమును గ్రహించెడి అస్మదాదులకంటె, విశిష్టానామ్ = ఉత్కృష్టమగు వారియొక్క, సర్వమ్ = ఎల్లవిధమగు, జ్ఞానమ్ = జ్ఞానము, సర్వేన్ద్రియమ్ = ఎల్లయింద్రియములకు సంబంధించునట్లుగా, విదుః = వేదవేత్తలు చెప్పుచున్నారు. మనము కంటితోరూపమును, చెవితో శబ్దమును, నాలుకతో రుచిని, ముక్కుతో గంధమును గ్రహించుచున్నాము. మన ఎల్లయింద్రియములు ఎల్ల అర్థములను గ్రహింపలేవు. ఋషులు అట్లుకాక అన్ని ఇంద్రియముల చేతను అన్నియర్థములను గ్రహింతురు. ఈ యర్థమును* శ్రుతి స్పష్టముగా చెప్పియున్నది. వారికి ఇంద్రియములతో ప్రసక్తిలేకుండ గనే జ్ఞానము కలుగును. వారే ఋషులు అట్టిఋషులనుబట్టియే వేరుగా పరమేశ్వరుడు న్నట్లు మనము విశ్వసింపవలెను. కాగా పరమేశ్వరుడు పదార్థములను జూచి ఋషులకు బోధింపగా వారిద్వారా అస్మదాదులకు అవి జ్ఞాతములగుచున్నవి. కనుక అంధపరంపరకాదు. ఈరీతిగా ఆగమ ప్రామాణ్యమునుబట్టి ఈశ్వరుడు సిద్ధించునని కారికా పూర్వార్ధము నిర్ణయించు చున్నది

B. అనుమాన ప్రమాణముచేగూడ ఈశ్వరసిద్ధికలుగునని చెప్పుచున్నాడు

అభ్యాసాత్ = అభ్యాసమువలన, మణి రూప్యాది విశేషేషు = మణులయొక్కయు, వెండియున్నగువానియొక్కయు విశేషములయందు, తద్విదామ్ + ఇవ = వానిపరిశీలనము కల వారికివలె యోగులకు జ్ఞానముమెండు.

మణులనుచూచువారికెల్ల వానిస్వరూపము తెలియదు. చాల సారులు పరిశీలనచేయగా చివరకువాని తత్త్వముతెలియును. రత్న పరీక్షయిట్టిదే. ఈ దృష్టాంతమును బట్టి యోగులు అభ్యాసముచేయగా విలక్షణమగు జ్ఞానము వారికికలుగును. ఈశ్వరుడు స్వతః జ్ఞానైశ్వర్య సంపద కలవాడు. ॥46॥

---

* శ్రుతిఇట్లున్నది—

"నేదానీ మిన్ద్రియైరేవ పశ్యన్తి, ఘ్రాణతః శబ్దం శృణోతి, పృష్ఠతో రూపాణి పశ్యతి, అఙ్గుళ్యగ్రేణ సర్వేన్ద్రియార్థానుపలభతే"

అవతారిక—ఋషులనుబట్టి పరమేశ్వరుడున్నాడనియు అనుమాన ప్రమాణముచే గూడ ఈశ్వర సిద్ధి కలుగుననియు చూపి ఈశ్వరుని వలన పరంపరగా అస్మదాదులకు ఆ జ్ఞానము కలుగగా,మన మూలమున ఇతరులకు ఆ జ్ఞానము కలుగ గలదు.కనుక అంధపరం పరకాదు. అందుచే బ్రాహ్మణత్వము గోత్వము మున్నగు జాతులున్నవనియే నమ్మవలెనని 45,46 శ్లోకములలో నిరూపింపబడినది. అట్టి జాతులకు'త్వాది'భావప్రత్యయములు చెప్పు నని 34 వ శ్లోకమున చెప్పబడినది. అచట సంశయము—

జాతిగన్ధత్వమ్ (జాజికాయ యొక్క పరిమళపు తనము), ఉత్పల గన్ధత్వమ్ (నల్ల కలువయొక్క పరిమళపు తనము),మల్లికా గన్ధత్వమ్(మల్లెయొక్క పరిమళపుతనము)మున్నగు స్థలములలో భావప్రత్యయము గంధసామాన్యమును బోధించునా ? కాక జాజి మున్నగు వానికి సంబంధించిన గంధవిశేషమును అనగా ఆ వ్యక్తికి సంబంధించిన గంధత్వ విశేషజాతిని బోధిం చునా ? అచట రెంటిని బోధించుటకవకాశమున్నది కదా! ఈ ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు.

శ్లో॥ జాత్యుత్పలాది గన్ధాదౌ భేదతత్త్వం యదాశ్రితమ్।
తద్భావ ప్రత్యయైర్లోకేఽ నిత్యత్వాన్నాభిధీయతే॥ 47

జాత్యుత్పలాది గన్ధాదౌ = జాజి, నల్లకలువ, పద్మము మున్నగు వానియందున్న గంధము రూపము మున్నగువానియందు, యత్ = ఏ. భేదతత్త్వ = భేదముయొక్క స్వరూపము. ఆశ్రితమ్ = శబ్దముచే చెప్పబడినదో,తత్ = అది, లోకే = లౌకికమగు శబ్దవ్యవహారము వివక్షా ధీనమగుచుండగా, భావప్రత్యయేన = త్వ-తల్ అను భావప్రత్యయముచే, అనిత్యత్వాత్ = అనిత్యమగుట వలన, న + అభిధీయతే = చెప్పబడదు.

జాత్యాః గన్ధః—జాతిగన్ధః అని సమాసము ముందుగా చేసి తరువాత భావప్రత్య యము చేయుటకలదు. జాతి గన్ధస్య భావః—జాతిగన్ధత్వమ్ ఇచట సమాసమున సంబంధము భాసించును. అదియే భావ ప్రత్యయముచే చెప్పబడును.

అట్లుకాక, గన్ధస్యభావః—గన్ధత్వమ్ అనురీతిని ముందుగనే భావప్రత్యయముచేసి దానితో జాత్యాః గన్ధత్వమ్—జాతిగన్ధత్వమ్ అను రీతిని సమాసము చేయుటయు కలదు. ఇది యంతయు శబ్దమును ప్రయోగించువాని యిచ్ఛపై ఆధారపడియున్నది. ఇట్టి స్థితిలో గన్ధ శబ్దము గంధసామాన్యమును బోధించును. జాతిశబ్ద సంబంధమున జాజియందున్న గంధము అని విశేష గంధముకూడ భాసించును. ఈ గంధవిశేషము జాజియందే యున్నది. మల్లికాదుల యందుండనేరదు. అది వ్యాపకము కానందున అనిత్యమేయగును. భావప్రత్యయముచే బోధింప బడు సామాన్యము నిత్యముకావలెను. కనుక గంధవిశేషజాతిని భావప్రత్యయము చెప్పజాలదు. గంధసామాన్య జాతినే బోధించును. ఆశ్రయభేదముచే గుణములు భిన్నములు కాగలవు.

కాబట్టి ముందుగా భావప్రత్యయముచేసి, దానితో సమాసముచేసిన విశేష జాతిభావ ప్రత్యయార్థము కానేరదు. సామాన్యజాతియే ఆ ప్రత్యయముచే బోధింపబడును. ముందుగా

సమాసము చేసి, తరువాత దానికంటె భావప్రత్యయముచేసిన, ఆ ప్రత్యయము సమాసమువలన భాసించిన సంబంధమును బోధించును, "కృత్తద్ధిత సమాసేభ్యః సంబన్ధాభిధానం భావప్రత్యయేన (కృదంతము కంటె తద్ధితాంతముకంటె సమాసముకంటెను ప్రవర్తించిన భావప్రత్యయము సంబంధమును బోధించును.) అని భర్తృహరియే వక్కాణించెను. ॥47॥

అవతారిక—గోత్వజాతిని గోశబ్దము, ఘటత్వజాతిని ఘటశబ్దము బోధించును కొన్నిజాతులను బోధించెడి శబ్దములు కానరావు. అచట విలక్షణమగు శబ్దము ప్రయోగింపబడు నని చెప్పుచున్నాడు.

శ్లో॥ అస్వశబ్దాభిధానాస్తు నరసింహాది జాతయః ।
సరూపావయవేవాన్యా తాసు శ్రుతి రవస్థితా॥ 48

నరసింహాదిజాతయః + తు = నరసింహము మున్నగు జాతులు మాత్రము, అస్వశబ్దాభిధానాః = స్వశబ్దము వాచకముగా కలవి కానేరవు. అనగా వానినిబోధించెడి శబ్దములు లేవనిభావము. తాసు = వానియందు అనగా నరసింహాది జాతులయందు, సరూపావయవా + ఇవ = సమానమగురూపములుకల అవయవములు కలదివలెనున్న, అన్యా = మరియొక, జాతిః = జాతి, అవస్థితా = ఉన్నది.

విష్ణువు నరసింహ రూపమును ధరియించెను. అందు నరత్వము సింహత్వము కూడ కానవచ్చుచున్నది. కాగా రెండు సమానములగు అవయవములు కలిగిన వేరుగా ఉన్న మరియొక జాతి అచటఉన్నది. దానిని చెప్పుటకు ప్రత్యేకించి ఒక శబ్దములేదు. ఏదో విలక్షణమగు'నరసింహ' అనుశబ్దము వాడబడుచున్నది.

ఇట్లే గౌరీఖర (ఒకజాతి అడవి కోతి)మున్నగు శబ్దముకూడ విలక్షణమగు రెండు సమానమగు అవయవములుకల విశిష్ట జాతివాచకము. ॥48॥

అవతారిక—ఇంతవరకు ఎల్లశబ్దములకు జాతియే వాచ్యమగునని నిర్ణయింపబడినది. ఇట్టి యర్థముద్వారా పదము పరీక్షింపబడినది. అర్థము లేనిది, ఇది పదము, అ అ అపోద్ధారము అనగా వాక్యమునుండి పదమును వేరుచేయుట సుశక్యముకాదు. పై యభిప్రాయముతో అర్థము చూపబడినది.

అందుప్రకృతిభాగము ప్రత్యయభాగముకూడ జాతులనే బోధించుననియు నిర్ణయింపబడినది. అనగా 'ఘటమ్' అను ద్వితీయైక వచనాంత శబ్దము వినబడుచున్నది. అచట ఘట, అనునది ప్రకృతి, అది ఘటత్వజాతిని బోధించును. అమ్, అనునది విభక్తి ప్రత్యయము, అదియు కర్మత్వ జాతిని ఏకత్వ సంఖ్యయందున్న ఏకత్వత్వ జాతిని బోధించునని సిద్ధాంతము చేయబడినది.

అచట ప్రకృత్యర్థమగు జాతికి ప్రత్యయార్థమగు జాతికి సమన్వయము అనగా పరస్పర సంబంధమును జూపుచున్నాడు.

49]

శ్లో॥ జాత్యవస్థా పరిచ్ఛేదే సంఖ్యా సంఖ్యాత్వమేవవా ।
విప్రకర్షేఽపి సంసర్గాదుపకారాయ కల్పతే ॥ 49

సంఖ్యా = ఏకత్వము మున్నగుసంఖ్య అనగా ప్రత్యయార్థముగా నున్న సంఖ్యా గత జాతిచే ఆక్షేపింపబడిన సంఖ్య, సంఖ్యాత్వమ్ + ఏవ + వా = అట్లుకాక ప్రత్యయమునకు వాచ్యార్థ మగు సంఖ్యా గతమగు ఏకత్వత్వము మున్నగు జాతిగాని,జాత్యవస్థాపరిచ్ఛేదే = జాతియొక్క అనగా ప్రకృత్యర్థమగు జాతికి అవస్థితి విషయమై అనగా ఆశ్రయముగా నున్న వ్యక్తుల యందు ఉనికి విషయమై పరిచ్ఛేదము చేయవలసి వచ్చినపుడు అనగా ఆ జాతికి ఆశ్రయము ఒకటియా? కాక అనేకమా? (ఆ శబ్దముచే బోధింపబడిన జాతి ఒక వ్యక్తియందే ఉన్నదా ? లేక రెండు మూడు నాలుగు వ్యక్తుల యందు ఉన్నదా?) అను సంశయము కలుగునపుడు, విప్రకర్షే + అపి = దూరముగా ఉన్నను అనగా ప్రకృత్యర్థ ప్రత్యయార్థములగు జాతులు వేరు వేరు వ్యక్తులయ దున్నను. స సర్గాత్ = సంబంధము వలన, ఉపకారాయ = పై సంశ యమును పోగొట్టి నిర్ణయ రూపమగు ఉపకారముకొరకు, కల్పతే = సమర్థమగుచున్నది.

ప్రత్యయార్థమగు సంఖ్య సమవాయ సంబంధమున ఘటవ్యక్తియందున్నది.ప్రకృ త్యర్థమగు ఘటత్వ జాతియు పై సంబంధమున అ వ్యక్తియందున్నది.కాగా ప్రత్యయమునకు వాచ్యమగు ఏకత్వత్వ జాతిచే నాక్షిప్తమగు ఏకత్వ సంఖ్య ఏకార్థ సమవాయమనే సంబంధమున ప్రకృత్యర్థజాతికి విశేషణమై నియమించగలదు అనగా జాతికి ఒక వ్యక్తియే ఆధారము అను నిశ్చితార్థమును కలిగించును.

కాక ప్రత్యయార్థమగు ఏకత్వత్వ సంఖ్యా జాతికి ఆశ్రయము ఏకత్వసంఖ్య, దానికి సమవాయమున ఆశ్రయము ఘటవ్యక్తి. ఘటత్వ జాతికి గూడ ఆ వ్యక్తియే ఆశ్రయము. కాగా స్వాశ్రయ సమవేత సమవాయమనే సంబంధముచే ఆశ్రయ నియమము కలుగును.

ఇట్లే పచతి, పచతః మున్నగు క్రియాపదములలో గూడధాతువు క్రియాత్వజాతిని, ప్రత్యయములు కర్తృత్వ జాతిని సంఖ్యాజాతిని బోధించును. అచటకూడ పై ప్రకారము ప్రత్యయార్థమగు జాతి పై సంబంధము వలన ప్రకృత్యర్థమగు క్రియాత్వజాతికి విశేషణము కాగలదు అచటను ఆశ్రయమగు క్రియ ఒకటియా? లేక రెండా? అను సంశయము లేక నిశ్చితార్థము కలుగును. ॥49॥

అవతారిక—జాతియే ఎల్ల శబ్దములకు వాచ్యమగును. అందును ప్రత్యయార్థ మగు ఏకత్వత్వము మున్నగు జాతులు ద్రవ్యముద్వారా ప్రకృత్యర్థమగు జాతితో సంబం ధించును. కనుక ప్రకృతి ప్రత్యయములు కలసి ప్రయోగింపబడగలవని యింతవరకు చూపబడినది.

ప్రకృతి ప్రత్యయములచే బోధింపబడిన అర్థములు పరస్పరము అన్వితములై వాక్యార్థమున కలసి యుండును. దానివలనమనుష్యులకు కొన్ని కర్మములయందు ప్రవర్తించుట నివర్తించుటయు జరుగును

కాని కొన్ని స్థలములలో ప్రత్యయముచే శాస్త్ర బలమువలన బోధింపబడిన అర్థము వాక్యార్థమున కానరాకున్నది. అచట ప్రత్యయార్థము భాసింపక ప్రకృత్యర్థము మాత్రమే భాసించుచున్నది. అట్లుజరుగుటయే లోకవ్యవహారమున కానవచ్చుచున్నది.

పైయర్థమునకుపపత్తియేది? అను ప్రశ్నకు సమాధానమును 50వ శ్లోకము మొదలు 92వ శ్లోకము వరకు విపులముగా చెప్పుచున్నాడు.

శ్లో॥ లక్షణా శబ్ద సంస్కారే వ్యాపారః కార్యసిద్ధయే।
సంఖ్యా కర్మాది శక్తీనాం శ్రుతిసామ్యేఽపి దృశ్యతే॥ 50

శబ్దసంస్కారే = శబ్దములకు కలిగెడి సంస్కారము విషయమున, అనగా ప్రయోగమున కానవచ్చెడి శబ్దములకు సాధుత్వమును జూపుటకై ప్రకృతుల కంటె ప్రత్యయములను జేర్చుట విషయమై, సంఖ్యాకర్మాది శక్తీనామ్ = ప్రత్యయార్థమగు ఏకత్వమమున్నగు సంఖ్యకు కర్మ, కరణము మున్నగు కారక శక్తులకు, శ్రుతిసామ్యే + అపి = వాచకమగు శబ్దము సమానముగానే యున్నను, కార్యసిద్ధయే = వాక్యార్థమనే కార్యముయొక్క సిద్ధికై. లక్షణా = ఉపలక్షణ రూపమగు అనగా అవివక్షారూపమగు అనగా సఖ్యాదులను విడనాడుట అను వ్యాపారః = వ్యాపారను అనగా ప్రయత్నము దృశ్యతే = చూడబడుచున్నది.

ప్రకృతి భాగము ద్రవ్యమును బోధించును. అందు ఏకత్వము, ద్విత్వము మున్నగు సంఖ్యభాసింపవలెనన్నచో ప్రత్యయమునుబట్టి సిద్ధించును, కాగా ప్రకృతిచే సామాన్య రూపముగా భాసించిన వ్యక్తికి పరిమితిని ప్రత్యయార్థసంఖ్య చేయును.

కాని కొన్నిస్థలములలో ప్రత్యయార్థమగు ఏకత్వసంఖ్య, అట్టి కర్మశక్తియు వివక్షితము కాకుండట సంభవించును. సంఖ్యాద్యర్థమును విడిచి ఇతరములగు అర్థములే, వాక్యార్థఘటకములగును. ఇదియే అవివక్ష, ఉదా–"గ్రహం సమ్మార్ష్టి" అను శ్రుతి వాక్యము కలదు. సోమయాగముచేయునపుడు సోమలతను చితుక కొట్టి దాని రసమును దీసి కొన్ని పాత్రలలో పోయుదురు. ఆ పాత్రలకే గ్రహ మని పరిభాష. వాటిని మట్టిచేతను కఱ్ఱ చేతను గూడ చేయుదురు. అట్టి పాత్రమును శుద్ధముగా జేయవలెనని శ్రుతివాక్యమునకర్థము. అచట గ్రహశబ్దముకంటె అమ్, ఏకవచన ప్రత్యయ మున్నందున దానిచే ఏకత్వసంఖ్య బోధింపబడును. ఆ సంఖ్యప్రకృత్యర్థమగు పాత్రకు విశేషణమై ఒక గ్రహమును పరిశుద్ధముగా అనగా అందుపై చిలికిన సోమరసమును తుడిచి నిర్మలముగా జేయవలెననెడి యర్థము, శబ్దమువలన లభించుచున్నది. కాని శ్రౌతసంప్రదాయమట్లులేదు. ఆ సోమయాగమున 10,15 గ్రహములు విధింపబడి యున్నవి. వానికి అన్నిటికి పారిశుద్ధ్యము కలుగవలెననియే వారి సంప్రదాయము. కాని శబ్దమువలన ఆ యర్థములభించలేదు. కనుక వాక్యార్థమునకును ఆగుణ్యము కలుగుటకై ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్యను విడనాడి కేవలము ప్రకృత్యర్థమునే గ్రహించి వాక్యార్థమునిర్ణయింపవలెను. దీనినే సంఖ్యను వివక్షింపకపోవుట, అనిశాస్త్రజ్ఞులు నిర్ణయించిరి.

ఇట్లే 'సక్తూన్ జుహోతి' అని మరియొక శ్రుతివాక్యము కలదు. సక్తూన్, అనునది ద్వితీయా బహువచనాంతము. ద్వితీయావిభక్తికి కర్మ శక్తి యర్థము. సక్తువులను

హోమముచేయవలెనని వాక్యార్థము చెప్పవలెను. కాని హోమమున సక్తువులు సాధనములే. కర్మకానేరవు. అందుచే ద్వితీయార్థమగు కర్మశక్తిని విడనాడి వాక్యార్థము చెప్పవలెను. సక్తూన్ = సక్తుభిః = సక్తువులతో హోమము చేయవలెనని శ్రౌత సంప్రదాయసిద్ధమగు వాక్యార్థము నిరాఘాటముగ సిద్ధించును.

కాగా పదములయర్థము వాక్యార్థముతో సరియగుచో నచట ప్రత్యయార్థము వివక్షితముకా నగును. వాక్యార్థముతో సరికానిచో నచట ప్రత్యయార్థము విడవబడును. వాక్యార్థమునకు అనుగుణమగునట్లు సమన్వయము చేయవలెను.

ఇచట లక్షణా, శబ్దమునకు అవివక్ష, యర్థము. ॥50॥

అవతారిక—లక్షణారూపమగు అనగా ప్రత్యయార్థమును వివక్షింపకుండుట అనెడి వ్యాపారమును ఎచట స్వీకరింపవలెను? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ న వినా సంఖ్యయా కశ్చిత్ సత్త్వభూతోఽర్థ ఉచ్యతే।
అతః సర్వస్య నిర్దేశః సంఖ్యా స్యాదవివక్షితా॥ 51

సంఖ్యయా + వినా = ఏకత్వము ద్విత్వము మున్నగు సంఖ్యలేనిది, సత్త్వభూతః = ద్రవ్యరూపమగు, కశ్చిత్ + అర్థః = ఏ యర్థముకూడ, న + ఉచ్యతే = శబ్దముచే చెప్పబడదు. పుంస్త్వము మున్నగు లింగము ఏకత్వము మున్నగు సంఖ్యయు అన్వయించుటకు అర్హమగు అర్థము సత్త్వ మనబడును. సత్త్వమనగానే లింగసంఖ్యలతో అవినాభావిగా నున్న యర్థమేయగును.

అతః = ఈకారణమువలన, సర్వస్య = సర్వమునకు అనగా సంఖ్యకు, దానికి ఆశ్రయమగు ద్రవ్యమునకు, నిర్దేశః = శబ్దముచే నిర్దేశము. (భవతి) = జరుగుచున్నది.

సంఖ్యలేనిది కేవలద్రవ్యమును శబ్దము చెప్పుటకు వీలులేదు కనుక సంఖ్యాబోధకముగా ప్రత్యయసహితముగనే ప్రకృతి ప్రయోగింపబడుచున్నది.

వానిలో, సంఖ్యా = ప్రత్యయార్థమగు ఏకత్వము మున్నగు సంఖ్య, అవివక్షితా = వివక్షింపబడనిది, స్యాత్ = కాగలదు.

సు, ఔ, జస్ మున్నగు ప్రత్యయములు సంఖ్యను బోధించును. ఆ ప్రత్యయములులేనిది కేవల ప్రకృతిని ప్రయోగింపరాదు. అందుకు ప్రత్యయమునుగూడ ప్రకృతి ప్రక్కన ప్రయోగింతురు. అంతమాత్రాన ప్రత్యయార్థము మాత్రము వివక్షితముకాదు. దాని యర్థమగు సంఖ్యను విడిచియే మిగిలిన అర్థములను గ్రహించివాక్యార్థము జూపవలెను ॥51॥

అవతారిక—సంఖ్యాఅవివక్షితమను పై చెప్పిన అర్థమున కొందరిభావమును వ్యక్తపరచుచున్నాడు.

శ్లో॥ ఏకత్వం వా బహుత్వం వా కేషాఞ్చిదవివక్షితమ్।
తద్ధి జాత్యభిధానాయ ద్విత్వం తు స్యాద్వివక్షితమ్॥ 52

A కేషాఞ్చిత్ = కొందరి, (మతే) = మతమున, ఏకత్వం + వా = ఏకత్వసంఖ్యయు బహుత్వం + వా = బహుత్వసంఖ్యయు, అవివక్షితమ్ = వివక్షితముకాదు, అనగా అదివాక్యార్థమున మిశ్రితము కాదు. దానినివిడచియే వాక్యార్థము నిర్ణయింపబడునని భావము. అందుకు కారణము చూపుచున్నాడు.

హి = ఏలయన, తత్ = అది అనగా ఏకత్వము బహుత్వము, జాత్యభిధానాయ = జాతిని బోధించుటకై (ప్రవర్తతే) = ప్రవర్తించుచున్నది.

జాతియందు స్వతః ఏకత్వమున్నది దానినే బోధించుటకై ఏకవచనప్రత్యయము ప్రవర్తించును. అందుచే 'నాంతరీయకము' కనుక, అనగా 'అది లేనిది యుండదు' కనుక ఏకవచనము శబ్దసాధుత్వము కొరకే ప్రవర్తించును. ఉదా॥ గౌర్నపదాస్ప్రష్టవ్యః (ఆవును పాదముతో తన్నరాదు) ఈ వాక్యము ఎల్లగోవులకు వర్తించును, ఏదోఒక గోవునకే సంబంధించునదికాదు.

బహుత్వము జాతియందు స్వతః లేదు, కాని పాణినిమహర్షి జాతిని బోధింప దలచినపుడు వైకల్పికముగా *బహువచనమును విధించియున్నాడు. అందుచేనచట బహువచనముకూడప్రవర్తించును. ఉదా॥ గౌఃపూజ్యా (గోవు పూజింపతగినది), గావః పూజ్యాః (ఆవులు పూజింపతగినవి). రెంటికి తాత్పర్యమొక్కటియే.

కనుక బహుత్వము వివక్షితముకాదు. ఉదా-'ఖలైఃనసంగచ్ఛేత' (ఖలులతో కలియరాదు). ఒకనితో, ఇద్దరితో పలువురతోగూడ కలియకూడదనియే దానిభావము. బహువచనమున్నదికదా యని ఒకనితో ఇద్దరితో కలియవలెనని భావము కాదు.

B. ద్విత్వం + తు = ప్రత్యయముచే బోధింపబడిన ద్విత్వసంఖ్య మాత్రము, వివక్షితమ్ = వివక్షితమగును, అనగా ప్రత్యయార్థమగు ద్విత్వమును కలిపియే వాక్యార్థము నిర్ణయింపవలెను. ఉదా॥ 'ఘటపటౌ' ఆనయ, (ఘటమును, పటమును తెమ్ము) అనువాక్యమున ద్విత్వముతోగూడిన రెండు వస్తువులును బోధవిషయములగును.

కాగా ఏకత్వబహుత్వములు జాతి ధర్మములుకాన వానిని విడిచియే వాక్యార్థము చూపవలెను. ద్విత్వము జాతి ధర్మము కానందున దానిని విడువకయే వాక్యార్థము చూపవలెను. ॥52॥

---

* జాత్యాఖ్యాయా మేకస్మిన్ బహువచనమన్యత రస్యామ్, (1-2-58.) జాతిని చెప్పదలచిన ఏకత్వమున బహువచనము వికల్పముగా కలుగునని సూత్రార్థము. బ్రాహ్మణాః పూజ్యాః, బ్రాహ్మణః పూజ్యః.

అవతారిక—కొన్ని చోటులందు ద్విత్వము కూడ వివక్షితము కానేరదని చెప్పు చున్నాడు.

శ్లో॥ ఏతౌ చేద్వ్యాధితౌ స్యాతాం దేయం స్యాదిదమౌషధమ్।
ఇత్యేవం లక్షణేఽర్థస్య ద్విత్వం స్యాదవివక్షితమ్॥ 53

ఏతౌ = వీరిద్దరు, వ్యాధితౌ = వ్యాధికలవారు, స్యాతామ్ = చేత్ = ఐనచో, ఇదమ్ = ఈ, ఔషధమ్ = ఔషధము, దేయమ్ = ఇయ్యతగినది, స్యాత్ = కాగలదు ఇతి + ఏవమ్ + లక్షణే = ఈరీతిగానున్న భవిష్యద్విషయముగల, అర్థస్య = అర్థమునకు సంభవము కలుగగా, ద్విత్వమ్ = ప్రత్యయార్థమగు ద్విత్వము, అవివక్షితమ్ = అవివక్షితమైనది, స్యాత్ = అగును.

వీరిరువురకు భావికాలమున వ్యాధి కలిగిన, వారికి ఈ ఔషధము ఇయ్య వలెనని ఒక వ్యక్తి సలహా ఇచ్చును. ఔషధము వ్యాధికి ప్రతీకారార్థమై వాడబడును ఇరువురకు వ్యాధి కలిగిన, ఇద్దరికి ఆమందు ఇత్తురు. వారిరువురిలో ఒకరికి వ్యాధి కలిగినను ఆ ఔషధము ఇచ్చెదరు. ఇద్దరికి ఒకే సారి వ్యాధి రాలేదని మాత్రము ఔషధము ఇచ్చుట మానరు.

కనుక ఏతౌ, అను పదమున ద్వివచన ప్రత్యయముచే బోధింపబడిన ద్విత్వము వివక్షితముకాదు.

విశేషాంశము—కొన్ని చోటుల యందు ద్విత్వము వివక్షితముకాగలదు. ఉదా॥ వృక్షౌ ఛేత్తవ్యౌ (ఈ రెండుచెట్లు ఛేదింపదగినవి) ఒకేసారిగాని క్రమముగా గాని రెంటిని ఛేదింపుమని దాని భావము. ఒకే చెట్టునుగాని, మూడు చెట్లను ఛేదింపుమని గాని భావము కాదు. ఛేదనము రెంటికి కలుగ వలెను. ఇచ్చట ప్రత్యయార్థమగు ద్విత్వము వివక్షితమే. ॥౫౩॥

అవతారిక—ప్రత్యయముచే చెప్పబడిన సంఖ్య కొన్ని చోటులందు వివక్షితమగును. కొన్ని చోటులందు వివక్షితము కాక పోవచ్చునని చూపి, ప్రాతిపదికముచే అనగా ఏక, ద్వి, త్రి మున్నగు ప్రాతిపదికములచే చెప్పబడిన సంఖ్య వివక్షితమే యగునని నిరూపించుచున్నాడు.

శ్లో॥ ఏకాది శబ్ద వాచ్యాయాః కర్మణ్య ఙ్గత్వమిష్యతే।
సంఖ్యాయాః. ఖనతి ద్వాభ్యామితి రూపాద్ధిసాఽఽశ్రితా॥ 54

1. ఏకాదిశబ్దవాచ్యాయాః = ఏక (ఒకటి) మున్నగు ప్రాతిపదికములకు వాచ్యమగునట్టి అనగా ఏక, ద్వి, త్రి, చతుర్, పఞ్చన్ మున్నగు ప్రాతిపదికములచే బోధింప బడిన, సంఖ్యాయాః = ఏకత్వము ద్విత్వము మున్నగుసంఖ్యకు, కర్మణి = వ్యాపారమునందు అనగా ఆ వాక్యములో నున్న పదముచే బోధింపబడిన క్రియ యందు, అఙ్గత్వమ్ = సాధనత్వము అనగా అచట అన్వయము, ఇష్యతే = స్వీకరింపబడుచున్నది.

సంఖ్య ప్రత్యయార్థమగుచోనది వివక్షితమును, అవివక్షితమును గూడ సందర్భమును బట్టి కాగలదు. ప్రాతిపదికము చేతనే సంఖ్య బోధింపబడిన, అది తప్పక వివక్షిత మగును అనగా అది వాక్యార్థముతో సంబంధించును.

2. ఇందులకుదాహరణము శ్లోకముననే చూపబడుచున్నది.

ఖనతి ద్వాభ్యామితి, ద్వాభ్యామ్ = రెండు మంత్రములచే అనగా రెండు మంత్రములనుచ్చరించుచు, ఖనతి = త్రవ్వుచున్నాడు, ఇతి = అని ఉదాహరణము. ఇది శ్రుతివాక్యము. ఇచట ద్విత్వము వివక్షితమగును

3. అట్లు వివక్షించుటలో కారణమును జూపుచున్నాడు.

హి = ఏలయన, సా = ఆసంఖ్య, రూపాత్ = ప్రాతిపదికములను, ఆశ్రితా = ఆశ్రయింపబడుచున్నది. అనగా లభించుచున్నది. ప్రాతిపదికముచే బోధింపబడిన సంఖ్య వివక్షితముగాకున్న ఆ శబ్దప్రయోగమే వ్యర్థమగును.

ఇచట రూపశబ్దమునకు ప్రాతిపదిక మర్థము.

యజ్ఞము చేయుటకు వేదిని నిర్మించెదరు. దానికై మట్టిని తెచ్చెదరు. మట్టిని త్రవ్వుట, దానిని స్పృశించుట, తెచ్చుట, ఈ పనులు చేయుటకు కొన్ని మంత్రములు చెప్పెదరు. ఆమంత్రము చెప్పుచు ఆపనులు చేయవలెనని వేదము* బోధించుచున్నది. రెండు మంత్రములు త్రవ్వునపుడు నాలుగు మంత్రములు మట్టిని తీయునపుడు, ఆరు మంత్రములు మట్టిని తెచ్చునపుడు చెప్పుట శ్రౌత సంప్రదాయము. ॥54॥

అవతారిక — "వ్యాపారః కార్యసిద్ధయే" అను 50 వ శ్లోకమున ఉపలక్షణమనే అనగా అవివక్ష అనే వ్యాపారము కార్యసిద్ధికై స్వీకరింపబడుచున్నదని చెప్పియున్నాడు. దానిని స్పష్టపరచుటకై ఈ గ్రంథము నారంభించుచున్నాడు.

అందుకు ఏకత్వబహుత్వములు విపక్షితములుకావనియు ద్విత్వము మాత్రము వివక్షితమగుననియు 53 వ శ్లోకమున చూపబడినది.

కాని కొన్ని చోటులయందు ప్రత్యయార్థమగు ఏకత్వము వివక్షితముకాగల దని చూపుచున్నాడు.

శ్లో॥ యజేత పశునేత్యత్ర సంస్కారస్యాపి సంభవే॥
యథా జాతిస్తథైకత్వం సాధనత్వేన గమ్యతే **55**

పశునా + యజేత, ఇతి + అత్ర = పశువుచే యాగము చేయవలెనని యర్థముకల పై వాక్యమున, సంస్కారస్య + సంస్కారార్థమై అనగా పశునా అనెడి శబ్దమునకు సాధుత్వ మును కలిగించుటకై, సంభవే + అపి = విభక్తి ప్రత్యయమునకు సంభవమున్నను అనగా పశు, అను ప్రాతిపధికము కంటె పరముగా ఉత్పత్తి యున్నను, జాతిః = ప్రకృత్యర్థమగు పశుత్వజాతి, యథా = ఎట్లో, తథా = అట్లే, ఏకత్వమ్ = విభక్తి ప్రత్యయమునకు వాచ్యమగు ఏకత్వ సంఖ్యయు. సాధనత్వేన = సాధన రూపమున అనగా యాగ క్రియకు అంగముగా. గమ్యతే = శబ్దముచే తెలియబడుచున్నది.

---

*ద్వాభ్యాంఖనతి, చతుర్భిరాదత్తే, షడ్భిర్హరతి . 2, 4, 6మంత్రముల నిర్ణయము శ్రౌతభాగము విపులముగా చూపియున్నది.

పశునాయజేత, అనునది వేద వాక్యము. పశుశబ్దముచే నిచట మేక చెప్పబడును. మేకచే యజ్ఞము చేయవలెనని దాని యర్థము.

"నకేవలా ప్రకృతిః ప్రయోక్తవ్యా" (ప్రత్యయము లేకుండ కేవల ప్రకృతి ప్రయోగింపరాదు) అని వైయాకరణులు నియమము చేసి యున్నందున 'పశు', అను ప్రాతిపదికమాత్రమును ప్రయోగింపరాదు. అందుకై 'పశు' అను ప్రాతిపదికము కంటె 'నా' అనుతృతీయా విభక్తి ప్రత్యయము ప్రయోగింపబడుచున్నది విభక్తి ప్రత్యయమును చేర్చుటకిదియే ప్రయోజనము. కాగా, సముదాయము పదము కనుక ప్రయోగార్హమగుచున్నది.

అందు 'పశు' అను ప్రకృతి పశుత్వ జాతిని, ప్రత్యయము ఏకత్వ సంఖ్యను బోధించుచున్నది. ఈరీతిగా పశుత్వజాతి శబ్ద వాచ్యమగుటచే నది యాగక్రియ కంగమగుచున్నది. పశుత్వ జాతికి చెందని వ్యక్తితో యాగము చేయరాదని తాత్పర్యము లభించుచున్నది.

అట్లే ప్రత్యయముచే బోధింపబడిన ఏకత్వసంఖ్యయు యాగ సాధనమే యగును. కనుకనే ఒక మేకను ఉపయోగించియే యాగము చేయవలెను. అనేక పశువులతో యాగము చేయరాదని పెద్దలు నుడివిరి. అట్లుకాకున్న అది అశాస్త్రీయమే యగుననియు వారు నిర్ణయించిరి.

కాగా పశునా, అను పదమునకు సాధుత్వమును సంపాదించుటకై ప్రాతిపదికము కంటె తృతీయా విభక్తి ప్రత్యయము పరముగా చేరినను దానిచే బోధింపబడిన ఏకత్వ సంఖ్య వివక్షితమై ప్రకృత్యర్థమగు జాతివలె నదియు యాగమునకంగమగుచున్నది. ఏకత్వ సంఖ్యను విడువక దానితోకలిపియే 'ఏకేన పశునా యాగం భావయేత్' అని వేదవాక్యమున కర్థము చెప్పుట శాస్త్ర సమ్మతము.

కాబట్టి బాధకములేనందున పై వాక్యమున ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్య వివక్షితమగును, అది ప్రకృత్యమునకు విశేషణమగును. బాధకమున్న చోటున ప్రత్యయార్థసంఖ్య అవివక్షితమగును అని కొందరి సిద్ధాంతము. ॥౬౬॥

అవతారిక — సాధుత్వ సంపాదనమే విభక్తి ప్రత్యయమునకు ప్రయోజనము, అంతకు తప్ప దానికి మరియొక ప్రయోజనము కల్పింపరాదని కొందరు శాస్త్రజ్ఞులు తలంచుచున్నారు.

అట్టితరి, పశునాయజేత, అనుచోట పశువునందు ఏకత్వ భావమెట్లు? అనగా ఒకే పశువుచే యాగము చేయవలె ననెడివాక్యార్థ మెట్లు లభించును? అను ప్రశ్నకు వారి మతము ననుసరించియే సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ లిఙ్గాత్తు స్యాద్ద్వితీయాదే స్తదేకత్వం వివక్షితమ్ ।
ఏకార్థవిషయత్వే చ తల్లిఙ్గం జాతిసంఖ్యయోః ॥ 56

A. తదేకత్వమ్ = ఆ పశువునందు ఏకత్వ సంఖ్య, ద్వితీయాదేః = మంత్రములలో పశువునకు విశేషణముగా నున్న, ద్వితీయ, తృతీయ, అను శబ్దప్రయోగ రూపమగు, లిఙ్గాత్ + తు = హేతువు వలననే, వివక్షితమగుచున్నది.

''ఆగ్నేయ మజ మగ్నిష్టోమ ఆలభేత'' (అగ్నిష్టోమయాగమున అగ్నిదేవతాకమగు మేకను చంపవలెను) అని యుపక్రమించి ''ఐన్ద్రాగ్నం ద్వితీయ ముక్థ్యే'' (ఉక్థ్య అను క్రతువునందు ఇంద్రాగ్ని దేవతాకమగు రెండవ పశువును చంపవలెను), ''ఐన్ద్రం వృష్ణిం తృతీయం షోడశిని'' (షోడశి అను క్రతువునందు ఇంద్రదేవతాకమగు తెల్లని మూడవ పశువును చంపవలెను) అని వాక్యములు చెప్పబడినవి. ఉత్తర వాక్యములలో 'ద్వితీయం, తృతీయమ్' అని చెప్పియుండుటచే పూర్వవాక్యమున పశువు ఒక్కటియేయని చెప్పవలసియున్నది. అట్లుకాక అజమ్, అనుచోట ఏకత్వమును గ్రహించినచో పూర్వ వాక్యమువలననే రెండు మూడు పశువులు అను అర్థము లభించుటచే మరల ఉత్తర వాక్యములలో 'ద్వితీయ, తృతీయ పదములు వ్యర్థములే యగును. కాబట్టి పై వాక్యములలోగల, ద్వితీయ, తృతీయ, అను పదముల ప్రయోగమనెడి హేతువునుబట్టి పూర్వవాక్యమున అర్థాత్తు ఒకే పశువు అను అర్థము లభించును.

కాగా ప్రత్యయార్థమగు ఏకత్వము వివక్షితము కాకపోయినను పై హేతువుచే ఏకత్వము లభించును.

B. తత్ = అదియే అనగా ఉత్తర వాక్యములలో ద్వితీయ-తృతీయ-అను శబ్దముల ప్రయోగమే, జాతి సంఖ్యయోః = జాతికి ఏకత్వసంఖ్యకు ఏకార్థ విషయత్వేచ = ఒక ఆశ్రయమునందు పరిసమాప్తమగుటయందు గూడ, లిఙ్గమ్ = కారణము-హేతువు కాగలదు.

ఏకత్వము గుణము. అది వ్యక్తియందు పరిపూర్ణముగనే యుండును. జాతి అనేక వ్యక్తులయందు సమవాయ సంబంధముననున్నను ఒకొక్క వ్యక్తియందు పరిపూర్ణముగానే యుండును. కొన్ని అవయవములను పురస్కరించుకొని 'అవయవశః' ఉండనేరదు. అట్లు కాకున్న ఒక వ్యక్తియందు కొంత జాతియే యున్నచో, రెండవది ఆ జాతికి చెందనందున ''ద్వితీయ, తృతీయ'' శబ్దముల ప్రయోగము సంగతము కాకపోయెడివి.

కాబట్టి ఏకత్వ సంఖ్యవలె, జాతియు ఒకొక్క వ్యక్తియందు పర్యాప్తమేయని లభించుచున్నది. ॥56॥

అవతారిక— ప్రత్యయార్థ సంఖ్య వివక్షితము కాగలదు అను 55 వ శ్లోకమున చెప్పబడిన అర్థమునే నిరూపించుచున్నాడు.

శ్లో॥ అన్యత్రా విహితస్యైవ స విధిః ప్రథమం పశోః ।
క్రియాయామఙ్గ భావశ్చ, తత్త్వేతస్మాద్వివక్షితమ్॥ 57

అన్యత్ర = మరియొక స్థలమున అనగా మరియొక వాక్యమునందు అవిహితస్య + ఏవ = విధింపబడనట్టియే, పశోః = పశువునకు, ప్రథమమ్ = ప్రాథమికమగు, సః + విధిః = ఆ విధి అనగా పశునాయజేత, అను వాక్యముచే విధానము.

క్రియాయామ్ = యాగ క్రియయందు, అఙ్గభావః + చ = పశువునకు అంగత్వము కూడ, ప్రథమమ్ + విధిః = ప్రాథమికమగు విధియే.

ఏతస్మాత్ = దీనివలన అనగా పైని చూపబడిన కారణద్వయము వలన, తత్ = అది అనగా ఏకత్వము, వివక్షితం + తు = వివక్షితమే యగును.

స్వర్గమును కోరువాడు యాగముచేయవలెనని వేరు వాక్యము వేదమునకలదు * ఆ వాక్యము యాగము చేయుమనియే చెప్పుచున్నది అందు ద్రవ్యమేదియో ఆ వాక్యము చెప్పదు ''పశునాయజేత'' అను వేదవాక్యము వాక్యాంతరముచే విధింపబడని పశువనెడి ద్రవ్యమును విధించుచున్నది. ఆ విధియు పశువుయాగమున కంగమేయని చెప్పుచున్నది.

కాగా వాక్యాంతరముచే లభింపని పశుద్రవ్యమును ఈ వాక్యమే విధించుటచేతను పశువు యాగమునకు అంగమని చెప్పుటచేతను 'పశునా' అను పదమున తృతీయా విభక్తిచే బోధింపబడెడి ఏకత్వ సంఖ్య †వివక్షితమేయగును, ప్రత్యయముచే బోధింపబడిన అర్థమును విడుచుటలో తగిన ప్రమాణము కానరానందున నదివివక్షితమే యగును. ॥57॥

అవతారిక— వాక్యాంతరముచే విధింపబడని పశువును విధించుటయు, ఆ పశువును యాగమునకు అంగముగా విధించుట అనెడి రెండు కారణములనుబట్టి, పశునా. అను పదమున ప్రత్యయార్థముగానున్న ఏకత్వసంఖ్య వివక్షితమగునని 57 వ శ్లోకమున చూపబడినది.

దానినిబట్టి చూడగా వాక్యాంతరముచే విధింపబడిన అర్థమునే మరల విధించిన, అందును ప్రధానముగా విధించిన, అచట ప్రత్యయార్థమగు సంఖ్య వివక్షితము కానేరదని లభించుచున్నది. ఇదియే "వ్యాపారః కార్యసిద్ధయే'' అని 50 వ శ్లోకమున చెప్పబడిన ఉపలక్షణమనే శబ్ద వ్యాపారము అని వ్యక్తపరచుచున్నాడు.

శ్లో॥ గ్రహాస్త్వన్యత్ర విహితా భిన్నసంఖ్యాః పృథక్ పృథక్।
ప్రాజాపత్యా నవేత్యేవమాదిభేదసమన్వితాః ॥ 58

శ్లో॥ అఙ్గత్వేనప్రతీతానాం సమ్మార్గే త్వఙ్గినాంపునః।
నిర్దేశం ప్రతి యా సంఖ్యా సా కథం స్యాద్వివక్షితా ॥ 59

---

* "జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత'' (జ్యోతిష్టోమనామకేన యాగేన స్వర్గం భావయేత్) అని వచనము. స్వర్గము కోరువాడు జ్యోతిష్టోమయాగము చేయవలెను.

† ఈ కారికచే లభించిన యర్థమునే ''యగు జాతి స్తథై కత్వం సాధనత్వేన గమ్యతే'' అని 65 కారికాగ్రంథము సూచించియున్నది.

A. పృథక్ + పృథక్ = వేరువేరుగా అనగా భిన్న భిన్నములగు ప్రకరణములలో, ప్రాజా పత్యా నవగ్రహాః + ఇతి + ఏవమాది భేద సమన్వితాః = ప్రాజాపత్యా నవగ్రాహాః, (ప్రజా పతి దేవతగాగల తొమ్మిది గ్రహములు) ఇట్టివి మొదలగుగాగల భేదముతోగూడినట్టియు, కనుకనే *భిన్న సంఖ్యాః = విభిన్నమగు సంఖ్య కలిగినట్టి, గ్రహాః + తు = గ్రహములు ఐతే, అనగా సోమరసమునుపోయుట కుపయోగించెడి పాత్రలు గ్రహములని శ్రౌత సంప్రదాయము వానిని మట్టితోగాని కఱ్ఱతోగాని చేయుదురు, అన్యత్ర = మరియొక వాక్యమునందు, విహితాః = విధింపబడియున్నవి, వేదమున వేరువేరు స్థలములలో 9, 10, 1, 1, మున్నగు రీతిని కొన్ని గ్రహములు విధింపబడినవి, వానికి వేరువేరు దేవతలుగూడ చూపబడినవి. అందు ''ప్రాజాపత్యానవ'' అను రీతిని కారికలో నొక వాక్యము చూపబడినది.

B. పై రీతిని లభించిన అర్థమును ప్రకృతమున జూపుచున్నాడు.

అఙ్గత్వేన = అప్రధానముగా, అనగా సమ్మార్జన క్రియలో (శుభ్రపరచుటలో) అప్ర ధానముగా, ప్రతీతానామ్ = తెలియబడుచున్నట్టియు, సోమరసమును ధరియించుటకు ఉప యోగపడుట వలన అప్రధానములుగా జ్ఞానవిషయము లగుచున్నవని భావము, సమ్మార్ష్టి + తు = శుభ్రపరచుటయందు మాత్రము, అఙ్గినామ్ = ప్రధానములేయగు గ్రహములకు పునః = మరల, నిర్దేశమ్ + ప్రతి = గ్రహశబ్దమును ఉచ్చరించుటను గురించి, అనగా ''ప్రాజా పత్యా నవగ్రాహాః'' మున్నగు క్రియా బోధకములలో గ్రహశబ్దమును చర్చించి మరల ''గ్రహం సమ్మార్ష్టి'' (గ్రహమును శుభ్రపరచవలెను) అను వాక్యమున మరల 'గ్రహ' అను శబ్దమును ఉచ్చరించుటను గురించి, యా = ఏ, సంఖ్యా = ఏకత్వమనే సంఖ్యయో, సా = ఆ ఏకత్వ సంఖ్య, కథమ్ = ఎట్లుగా, వివక్షితా = వివక్షింపబడినది, స్యాత్ = కాగలదు ? ఆ సంఖ్య వివక్షితము కానేరదని భావము.

గ్రహములు భిన్న భిన్న ప్రకరణములలో విధింపబడినవి, వానిని జ్ఞాపకము చేయుచు ''గ్రహం సమ్మార్ష్టి'' అను వాక్యము సమ్మార్జనమును అనగా శుభ్రపరచుటను విధించుచున్నది, గ్రహములలో సోమరసము పోయునపుడు వాని ప్రక్కలయందు ఆ రసము చిలుకగా వస్త్రముయొక్క అంచును పవిత్రముగాజుట్టి ఆ గ్రహములను తుడిచి శుభ్రపరచ వలెనని వేదము చెప్పినది. 'గ్రహం సమ్మార్ష్టి' అనునది క్రొత్తగా గ్రహమును విధించునది కాదు, ఆ వాక్యమున సమ్మార్జనము చెప్పబడినను గ్రహములే ప్రధానములగును. కాగా వాక్యాంతమున గ్రహములు విధింపబడినవి. సమ్మార్జనము విషయమై అవి ప్రధానములే యగు

---

* ''ప్రాజాపత్యా నవగ్రహాః'' ప్రజాపతి దేవతగాగలవి తొమ్మిది గ్రహములు, ''దశైతా నధ్వర్యుః ప్రాతస్సవనే గ్రహాన్ గృహ్ణాతి'' అధ్వర్యుడు ప్రాతస్సవనమున పది గ్రహములను గ్రహించుచున్నాడు. ''ఐన్ద్రవాయవం గ్రహం గృహ్ణాతి'' ఇంద్రవాయు దేవతాకమగు గ్రహ మును గ్రహించుచున్నాడు, ''మిత్రావరుణం గ్రహం గృహ్ణాతి''. మిత్రావరుణ దేవతాకమగు గ్రహమును గ్రహించుచున్నాడు, ఇన్నిటిని శుభ్రపరచవలెనని ''గ్రహం సమ్మార్ష్టి'' అని యున్నది.

చున్నవి. 'పశునాయజేత' అను వాక్యార్థముకంటె ఇది విలక్షణముగా నున్నది. కనుక 'గ్రహమ్' అను పదమున ద్వితీయా విభక్తికి అర్థముగా కాన్పించెడి ఏకత్వ సంఖ్య వివక్షితము కానేరదు. అందుచే పూర్వ వాక్యములలో ఎన్ని గ్రహములు చెప్పబడినవో, వానిని అన్నిటిని శుభ్రపరచవలెననియే వాక్యార్థము లభించును. అట్లుకాక ఏకత్వమును వివక్షించిన ఒక గ్రహమును శుభ్రపరచవలెనని యర్థము చెప్పవలెను. అట్లు చెప్పుట శ్రౌత సంప్రదాయము కాదు. 'పశునాయజేత' అను వాక్యమున 'పశునా' అను పదమున గల తృతీయా విభక్తికి అర్థమగు ఏకత్వమును విడువకయే దానితో కలిపియే వాక్యార్థము చెప్పవలెను. ఒకే పశువును సాధనముగా గైకొని యాగము చేయవలెను "గ్రహం సమ్మార్ష్టి" అను వాక్యమున 'గ్రహమ్' అను పదమున ద్వితీయా విభక్తికి అర్థముగానున్న ఏకత్వసంఖ్యను విడనాడియే వాక్యార్థము చెప్పవలెను. అన్ని గ్రహములను శుద్ధములుగా బాగుచేయవలెను. ''గ్రహ'' అను ప్రాతిపదికము యొక్క అర్థమే గ్రాహ్యమగును. ఇదియే అవివక్ష ఇదియే ఉపలక్షణము. దీనినే 'లక్షణా' అని 49వ శ్లోకమున భర్తృహరి చెప్పెను.

ఒక ప్రకరణమున ఎన్నియో వాక్యములుండును. అందు ప్రకరణార్థమునకు సరిపోవునట్లు వాక్యముల కర్థము నిర్ణీతమగును. అట్లుచేసిన వాక్యార్థమునుండి చేయబడిన పదార్థముల అపోద్ధారము, దానినిబట్టి జరిగెడి పదముల అపోద్ధారము యుక్తముగా నుండును. ॥58-59॥

అవతారిక— శబ్ద సంస్కారార్థమై విభక్తి ప్రత్యయములు ప్రాతిపదికముకంటె చేర్చబడుచున్నవి, అదియే వానికి ప్రయోజనము. ప్రత్యయార్థ సంఖ్య ఎల్ల చోటులయందు అవివక్షితమే యగును. సంఖ్యను గ్రహించి వాక్యార్థము చూపుటకు మరియొక యత్నము అనగా యుక్తి యుండవలెను. ప్రబలమగు యుక్తిచేతనే వ్యక్తియందు సంఖ్య భాసించునట్లు సమన్వయము చేయవలెను అని 51 వ (నవినాసంఖ్యయా కశ్చిత్) శ్లోకముచే చూపబడిన అర్థమునే ఏడు (60, 61, 62, 63, 64, 65, 66) శ్లోకములచే వ్యక్తపరచుచున్నాడు.

శ్లో॥ నాన్యత్ర విధిరస్తీతి సంస్కారో నాపి చాఙ్గితా ।
హేతుః సంఖ్యాఽవివక్షాయాం యత్నాత్సా హి వివక్షితా॥ 60

A. అన్యత్ర = మరియొక వాక్యమునందు, విధిః = విధానము, అస్తి = కలదు, కనుక (సః) = ఆ ఏకవచన ప్రయోగము, సంస్కారః = సంస్కారార్థమే అనగా పదత్వ సంపాదనమే దానికి ప్రయోజనము, ఇతి = అనునది, సంఖ్యాఽవివక్షాయామ్ = ప్రత్యయార్థమగు సంఖ్యను వివక్షింపకపోవుటయందు అనగా దానిని విడచుటయందు, న + హేతుః = కారణము కానేరదు. గ్రహములు మరియొక వాక్యమున చెప్పబడియున్నందున మరల ''గ్రహం సమ్మార్ష్టి'' అను వాక్యమున విధించుటచే సంఖ్య అవివక్షితము అనుట అయుక్తమని భావము, చ = మరియు అఙ్గితా + అపి = ప్రాధాన్యము కూడ, అనగా 'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున మార్జన సంస్కారము విషయమై గ్రహములకు గల ప్రాధాన్యము కూడ,

అవివక్షయందు, న = కారణము కానేరదు, గ్రహములను శుభ్రపరచవలెననెడి యర్థముకల "గ్రహం సమ్మార్ష్టి" అను వాక్యములో గ్రహములకు ప్రాధాన్యముండుటచే అచట ప్రత్యయార్థమగు సంఖ్య అవివక్షితమగు ననుటయు యుక్తము కాదని భావము.

B. ప్రాతిపదికార్థమగు వ్యక్తియందు సంఖ్య భాసించుట యెట్లు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

సా = ఆ సంఖ్య, అనగా ప్రకృత్యర్థమునందు భాసింపవలెననెడి ఏకత్వాది సంఖ్య, యత్నాత్ + హి = యత్నమువలననే అనగా సరియగు యుక్తివలననే, వివక్షితా = వివక్షితమగును.

తగిన యుక్తి యున్నచో సంఖ్య భాసించును, యుక్తి లేనిచో నచట సంఖ్య భాసింపదు.

*'గ్రహం సమ్మార్ష్టి' అనుచోట యుక్తిలేనందున సంఖ్య వివక్షితము కాదు, 'పశునా యజేత' అనుచోట యుక్తి యున్నందున సంఖ్య వివక్షితమగును. ॥60॥

అవతారిక— ప్రత్యయార్థమగు సంఖ్య అవివక్షితమేయగుట సార్వత్రికము, సంఖ్యను వివక్షించుట ప్రయత్నాధీనము. అనగా యుక్తినిబట్టి వివక్ష జరుగునని పై శ్లోకమున చెప్పబడినది. 'గ్రహం సమ్మార్ష్టి' (గ్రహమును శుద్ధిచేయవలెను) అనుచోట యత్నము లేనందున ద్వితీయా ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్య వివక్షితము కానేరదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సమ్మార్జనే విశేషశ్చ న గ్రహే క్వచిదాశ్రితః,
విహితాస్తే చ సంస్కార్యాః సర్వేషామాశ్రయస్తతః ॥ 61

సమ్మార్జనే = పారిశుద్ధ్యమును విధించెడి (గ్రహం సమ్మార్ష్టి) వాక్యమున, క్వచిత్ + గ్రహే = ఏ గ్రహమునందును, విశేషః = విశేషణము, న + ఆశ్రితః + చ = ఆశ్రయింపబడనే లేదు అనగా శబ్దముచే చెప్పబడనే లేదు.

గ్రహమును శుభ్రపరచవలెననియే ఆ వాక్యము చెప్పుచున్నది. అంతియేకాని ఇంద్రవాయుదేవతాకమగు గ్రహమును శుద్ధిచేయవలెననిగాని మిత్రావరుణ దేవతాకమనిగాని ప్రజాపతి దేవతాకమనిగాని విశేషించి గ్రహ నిర్దేశము చేయబడలేదు.

తే + చ = ఆ గ్రహములు కూడ, విహితాః = భిన్న భిన్న ప్రకరణములలో, 9, 10, 1, 1, అను రీతిని చాల గ్రహములు విధింపబడియున్నవి.

ఒకే గ్రహమును విధించియున్న, సందియమే లేదు, అట్లు చేయక చాల గ్రహములు విధింపబడి యున్నవి.

---

* 60 నుండి ఏడు శ్లోకములలో చూపబడిన భావము భర్తృహరి సిద్ధాంతము కాదు. ఇది కొందరి యభిప్రాయము. ఈ యంశము పైని వ్యక్తము కాగలదు.

సంస్కార్యాః = విధింపబడిన గ్రహములన్నియు సంస్కారమున కర్హములే.

అన్నియు సంస్కరింపబడియే "గ్రహైర్జుహోతి" (సంస్కరింపబడిన గ్రహములతో హోమము చేయవలెను) అని ఉత్తరత్ర ఉపయోగపడుచున్నవి.

తతః = ఆ కారణము వలన, సర్వేషామ్ = ఎల్ల గ్రహములకు, ఆశ్రయః = స్వీకారము, (భవతి) = కలుగుచున్నది.

కాబట్టి ప్రత్యయార్థమగు ఏకత్వమును విడనాడి భిన్న భిన్నములయిన చోటుల యందు ఎన్ని గ్రహములు విధింపబడినవో, వానినన్నిటిని శుభ్రపరచవలెననియే వాక్యార్థము చెప్పవలెను. యుక్తి లేనందున సంఖ్య వివక్షితము కానేరదు. ॥61॥

అవతారిక — యుక్తినిబట్టి సంఖ్య వివక్షితమగుననుటకు 'పశునా యజేత' అనునది యుదాహరణము కాగలదని చూపుచున్నాడు.

శ్లో॥ ప్రత్యాశ్రయం సమాప్తాయాం జాతౌ, వేకేనచేత్క్రియా ।
పశునా న ప్రకల్పేత, తత్స్యాదేవ ప్రకల్పనమ్ ॥ 62

A. జాతౌ = జాతి అనగా ప్రకృతమున పశుత్వజాతి, ప్రత్యాశ్రయమ్ = ప్రతి వ్యక్తియందు, సమాప్తాయామ్ = సమాప్తము కాగా అనగా పూర్తిగా నుండగా, (ద్వితీయః + పశుః) = రెండవ పశువు, (న + గృహ్యతే) = గ్రహింపబడదు.

'ప్రత్యాశ్రయమ్' వీప్సార్థమున నవ్యయీభావసమాసము.

జాతియనునది ఒక్కొక్క జాతియందు పరిపూర్ణముగ నుండునని 56 వ శ్లోకమున నిరూపింపబడినది. జాతికి ఆశ్రయములు చాల ఉండును. అన్నిటియందు మొత్తముపై జాతియుండదు. ఒక వ్యక్తియు ఆ జాతిని పూర్తిగా వ్యక్తపరచగలదు, రెండు మూడు పశువులున్నప్పుడే వానియందు పశుత్వజాతి యుండవలెనని నియమము లేదు.

కాగా 'పశునా యజేత' అను వాక్యమునందున్న 'పశునా' అను పదము పశుత్వ జాతి పూర్తిగా నున్న వ్యక్తినే బోధించుటచే అట్టి వ్యక్తినిబట్టి యాగక్రియ సంపూర్ణముగ జరుగుటచే, ఆ జాతికి చెందిన మరియొక వ్యక్తిని గ్రహింపనక్కరలేదు. అట్లు గ్రహించుట వ్యర్థమే. ఇదియే యుక్తి. దీనిచే ఏకత్వ సంఖ్య వివక్షితమైనందున ఒకే పశువు యాగమున కంగమని తేలుచున్నది.

B యాగమునకు అనేకములగు సాధనములుండును. యాగక్రియ ప్రధానము కనుక దానిని బట్టి అప్రధానమగు పశువునకు ఆవృత్తి జూపి మరియొక పశువును గూడ యాగమున కంగముగా గ్రహింపవచ్చును, అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

ఏకేన = ఒక, పశునా = పశువుచే, క్రియా = యాగక్రియ, న + ప్రకల్పేత +

[63

చేత్ = పూ ర్తికానిచో, అపుడు, తత్ = ఉపలక్షణము, ప్రకల్పనమ్ = కల్పింపబడినది, స్యాత్ + ఏవ = కా తగినదే.

ఒక పశువుచే యాగము పూ ర్తి కాకపోయినపుడు ప్రత్యయము ప్రకృతికి ఉప లక్షణమే, ప్రత్యయార్థమగు సంఖ్య వివక్షితముకాదని చెప్పుట పొసగును. కాని యట్లులేక ఒక పశువుచే గూడ యాగము పూర్ణమగుచునే యున్నది. పశువును చంపి దాని కొన్ని అవ యవములను గ్రహించి వానిచే హోమము చేయుదురు. ఒక పశువుయొక్క అవయవముల హోమముచే యాగము సంపూర్ణమగుటచే 'పశునాయజేత' అను వాక్యము యొక్క ప్రాబల్య మున ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్య వివక్షితమే యగును. కనుకనే రెండు మూడు పశువు లచే చేయు యాగము అశాస్త్రీయమని శాస్త్రజ్ఞులు నుడివిరి ॥62॥

అవతారిక— యాగము అధికమగు ఫలమును కలిగింపవలెనన్నచో దానికి అంగములు అధికముగా నుండవలెను. కనుకనే 'అఙ్గ భూయస్త్వాత్ఫల భూయ స్త్వ' (అవయవ ముల ఆధిక్యము వలన ఫల మధికమగును) అని పెద్దలు చెప్పుచున్నారు, అందుచే ఒకే పశువుచే గాక రెండు మూడు పశువులను గ్రహించి వానిచే యాగము చేయవలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకేనచేత్ప్రసిద్ధాయాం క్రియాయాం యదిసంభవాత్ ।
పశ్వ న్తరముపాదేయ ముపాదాన మనర్థకమ్ ॥ 63

ఏకేన = ఒక పశువుచే, క్రియాయామ్ = యాగక్రియ, ప్రసిద్ధాయామ్ + యది + చేత్ = చక్కగ సిద్ధించునన్నచో. సంభవాత్ = లాఘవము వలన, పశ్వ న్తరమ్ = యోగ్యమగు పశువు, ఉపాదేయమ్ = స్వీకరింపతగినదే.

దాని వ ననే యాగము సమా ప్తమగుటచే, ఉపాదానమ్ = మరియొక పశువును స్వీకరించుట, అనర్థకమ్ = నిష్ప్రయోజనమే యగును.

ఒక పశువును ఉపయోగించి యాగముచేయుట సంభవించునా? సంభవింపదా? అని విచారింపవలసి యున్నది, ఒక పశువుచే యాగము చేయబడదని చెప్పరాదు. 'పశునా' అని ఏకవచనాంత పదము వేదమున నున్నందున శాస్త్రవిరోధము వాటిల్లును. కనుక ఒక పశువును ఉపయోగించినను యజ్ఞము చేయతగినదేయనియే చెప్పవలెను. ఒక పశువుచే యాగము శాస్త్రప్రకారము సిద్ధింపగా యాగముచేయుట కధికారము కలవారు మరియొక పశువును అన్వేషింపరు గదా! అట్లైనవారలకు శ్రమయే అధికమైయుండును.

మరియు 'పశునా' అని వేదము స్పష్టముగా చెప్పుచుండగా, దానిని ఉల్లంఘించి అనేక పశువులతో యాగముచేసిన, అది అశాస్త్రీయమే యగును.

కనుక, అంగముల ఆధిక్యముచే ఫలము అధికమగును. అను న్యాయమున కిది విషయము కానేరదు.

జపహోమములు చేయువారు ఫలసిద్ధికై "బ్రాహ్మణాన్ భోజయేత్" (బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను) అను శాస్త్రమునను సరించి బ్రాహ్మణులకు భోజనము పెట్టెదరు, అచట బహువచనమును అనుసరించి ముగ్గురికి భోజనము పెట్టిన ఫలము లభించును. అధికమగు ఫలమును గోరువారు ముువ్వురుకాక వారికి లభించిన ఎంతో మందికి భోజనము పెట్టెదరు. ఎంత ఎక్కువమందికి భోజనము పెట్టునో, అంత యధికమగు ఫలము లభించును. అట్టి స్థలములు పై న్యాయమునకు విషయములు కాగలవు.

కాబట్టి ఒకే పశువుచే యాగము శాస్త్రోక్తప్రకారము సిద్ధించుచుండగా లాఘవము నపేక్షించి యాగముచేయువారు రెండవ పశువును స్వీకరింపరు. ఇదియే ఇచట యుక్తి ॥63॥

అవతారిక — ఒక పశువుచే యాగము సిద్ధించుచుండగా రెండవ పశువును స్వీకరించ నక్కరలేదు, అను అర్థమునే దృష్టాంతము చూపుచు సమర్థించుచున్నాడు.

శ్లో॥ యథై వాహితగర్భాయాం గర్భాధాన మనర్థకమ్ ।
తథై కేన ప్రసిద్ధాయాం పశ్వన్తర మనర్థకమ్ ॥ 64

ఆహిత గర్భాయామ్ = బీజరూపమున నుంచబడిన అనగా చిమ్మబడిన గర్భముకల అనగా తన్నిమిత్తమగు సంస్కారముకల స్త్రీయందు, గర్భాధానమ్ = గర్భము ధరించుటకు నిమిత్తమగు సంస్కారము, యథా = ఏ రీతిగా, అనర్థకమ్ + ఏవ = ప్రయోజనము లేనిదో,

తథా = ఆ రీతిగా, ఏకేన = ఒక పశువుచే, ప్రసిద్ధాయామ్ = యాగక్రియ సిద్ధించుచుండగా, పశ్వన్తరమ్ = మరియొక పశువును, అనర్థకమ్ = యాగార్థమై స్వీకరించుట నిష్ప్రయోజనమే.

యుక్తవయస్కురాలగు స్త్రీయందు సంతానము కలుగుటకై బీజావాపము చేయుదురు. అందుకు ముందుగా కొన్ని హోమములు చేయుదురు. కొన్ని మంత్రములు చెప్పుదురు దీనినే గర్భాధాన సంస్కారమందురు అట్టి సంస్కారము చేసినపిమ్మట బీజమునుంచుదురు. బీజావాపము జరిగిన తరువాత మరల సంస్కారము చేయరు. అట్లు చేయుటలో ప్రయోజనమేమియు లేదుకిదా !

అట్లే ఒక పశువును యాగార్థమై గ్రహించినచో, శాస్త్రమున చెప్పబడిన ప్రకారము దాని అవయవములను గ్రహించి యాగముచేసిన అది పూర్తియగుచుండగా, ఆ యాగమునకే మరియొక పశువును గ్రహించుట నిష్ప్రయోజనమే యగును. అంతియే కాదు, అది యాగాంతరమే యగును. శ్లోకమున గర్భాధాన శబ్దము తన్నిమిత్తమగు సంస్కారమును బోధించును. ॥64॥

అవతారిక — పై యర్థము 'ప్రథమాతిక్రమణే కారణాభావః' (ముందుగా నున్న దానిని త్రోసి పుచ్చుటలో కారణము లేదు, అనగా దానిని విడువరాదు) అను న్యాయము వలన లభించుచున్నదని కొందరు చెప్పిరి. వారి యాశయమును జూపుచున్నాడు.

[65

శ్లో॥ తావతార్థస్య సిద్ధత్వాదేకత్వస్యా వ్యతిక్రమమ్ ।
కేచి దిచ్ఛన్తి న త్వత్ర సంఖ్యాఙ్గత్వేన గృహ్యతే ॥ 65

A. తావతా = అంత పరిమితికల అనగా ఏకత్వ సంఖ్యకల పశువుచే, అర్థస్య = ప్రయోజనము అనగా యాగక్రియ, సిద్ధత్వాత్ = సంపూర్ణముగ జరుగుటవలన, కేచిత్ = కొంతమంది విమర్శకులు, ఏకత్వస్య = ఏకత్వ సంఖ్యకు, అవ్యతిక్రమమ్ = అత్యాగమును అనగా విడువకుండుటను, ఇచ్ఛన్తి = అంగీకరించుచున్నారు.

ప్రత్యయము సంస్కారార్థమే, 'పశునా' అను పదము పశువునందు సంఖ్యా సామాన్యమును బోధించును. కాని ద్విత్వము బహుత్వము మున్నగు అనేకత్వమునకు ఏకత్వమే మూలకారణము. అది లేనిది ద్విత్వాదికముండనేరదు, కనుక ప్రాథమికమగు ఏకత్వమును విడనాడుటలో కారణము లేనందున దానిని గ్రహింపవలెను. ఏకత్వముతో గూడిన పశువు యాగ సాధనమగుచునే యున్నది. అందుచే రెండవ పశువును గ్రహించుట వ్యర్థము. పై యుక్తిచే ఏకత్వము విడువబడక గ్రహింపబడుచున్నది.

B. అత్ర = పశునా యజేత అను వాక్యమున, సంఖ్యా = తృతీయా విభక్త్యర్థమగు ఏకత్వ సంఖ్య, అఙ్గత్వేన = యాగమునకు అంగముగా, న + గృహ్యతే = గ్రహింపబడదు.

64 వ శ్లోకమున లాఘవము యుక్తిగా జూపబడినది. ఇచట ఒక న్యాయము యుక్తిగా జూపబడినది. ॥65॥

అవతారిక— 1. లాఘవము 2. ప్రథమాతిక్రమణే కారణా భావము, అను రెండు యుక్తులనుబట్టి 'పశునా యజేత' అను స్థలమున ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్య వివక్షితమగునని నిరూపింపబడినది.

అట్లైన ద్వితీయమ్, తృతీయమ్, అనెడి పదముల ప్రయోగమనే లింగమువలన ఏకత్వ సంఖ్య వివక్షితమగు చున్నదనెడి 56 వ శ్లోకమున జూపబడిన సిద్ధాంత మసంగతమే కావలెను. ఆ సిద్ధాంతమును దూరము చేసినను ప్రకృతమగు యుక్తిచే సంఖ్యా వివక్ష సిద్ధించుచున్నది కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్వితీయాదిషు యల్లిఙ్గముక్తం న్యాయానువాది తత్ ।
న సంఖ్యాసాధనత్వేన జాతివత్తేన గమ్యతే ॥ 66

ద్వితీయాదిషు = ద్వితీయ మున్నగు పదములతో గూడిన *మంత్రములయందు, యత్ = ఏ, లిఙ్గమ్ = లింగమో, అనగా ద్వితీయమ్, తృతీయమ్, అని చెప్పుట వలన పశునా యజేత

---

* "ఉక్థ్యే ద్వితీయమ్" (ఉక్థ్య మనెడి క్రతువున రెండవ పశువును గ్రహింపవలెను) "ఐన్ద్రం వృష్ణిం తృతీయం షోడశిని" (షోడశి క్రతువున తెల్లని మూడవ పశువును గ్రహింపవలెను)

అనుచోట పశువు ఒక్కటియే అను లింగమో, తత్ = ఆ లింగము, న్యాయానువాది = పై చూపబడిన రెండు న్యాయములకు అనువాదరూపమే. నూతనముగా అర్థనిర్ణాయకము కాదని భావము.

లాఘవము ప్రథమాతిక్రమమున కారణాభావము అను న్యాయములవలన లభించిన అర్థమును వ్యక్తపరచునదే ఆ లింగము. అంతియేకాని అది వేరుగా అర్థమును నిర్ణయించు ప్రమాణము కాదు.

ఏలయన, తేన = ఆ న్యాయద్వయముచేత, జాతివత్ = పశుత్వజాతివలె, సంఖ్యా = ఏకత్వ సంఖ్య, సాధనత్వేన = యాగమునకు అంగముగా, న + గమ్యతే = శబ్దముచే బోధింపబడలేదు.

ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్య వివక్షితము కాకున్నను పై రెండు న్యాయములచే తమ సంఖ్య తెలియబడుచున్నది. అందుచే నది శాబ్దము కానేరదు.

జాతి యట్టిది కాదు. అది శబ్దముచేతనే యాగాంగముగా తెలియబడుచున్నది.

కాక, తేన = ద్వితీయ, తృతీయ అను లింగముచే, జాతివత్ = జాతివలె, సంఖ్యా = సంఖ్య, సాధనత్వేన = యాగాంగముగా, న + గమ్యతే = తెలియబడదు.

న్యాయముల వలననే ప్రకృతార్థము లభించుచున్నందున, ఆ లింగము కూడ సంఖ్య యాగాంగమని నిర్ణయింపజాలదు.

జాతివత్ అనునది వ్యతిరేక దృష్టాంతము జాతి యాగమున కంగమగునట్లు సంఖ్య యాగమున కంగము కానేరదని యర్థము ॥౬౬॥

అవతారిక — 60 వ శ్లోకము నుంచి ఏడు శ్లోకములచే యుక్తివలననే సంఖ్య వివక్షితమగునని కొందరి మతము చూపబడినది. ఇది మాత్రము (భర్తృహరికి) సమ్మతము కాదు. కనుకనే 65 వ శ్లోకమున 'కేచిదిచ్ఛన్తి' అని పరమతముగానే చూపబడినది.

పై యభిప్రాయముతో 67 68 శ్లోకములచే తన సిద్ధాంతమును వ్యక్తపరచు చున్నాడు.

శ్లో॥ అన్వయవ్యతిరేకాభ్యాం సంఖ్యాభ్యుపగమే సతి ।
యుక్తం యత్సాధనత్వం స్యాన్నత్వన్యార్థోపలక్షణమ్ ॥ 67

(విభక్తి ప్రత్యయస్య) విభక్తి ప్రత్యయమునకు, అనగా పశునా అనుచోట 'నా' అను తృతీయైక వచనమునకు అన్వయ వ్యతిరేకాభ్యామ్ = అన్వయ *వ్యతిరేకములచే, సంఖ్యాభ్యుప

* తత్సత్త్వే తత్సత్త్వమ్ అన్వయః, (అదియుండగా అది యుండట అన్వయము ? ఘట శబ్దమును వినగా కడవ అను అర్థము తెలియుట అన్వయము, 'తదభావే తదభావః' (అది లేనిచో అది లేకుండుట వ్యతిరేకము) ఘటశబ్దము వినబడకున్న కడవ అను అర్థము తెలియకుండుట వ్యతిరేకము.

గమే = సంఖ్యను బోధించుట, సతి = కలుగుచుండగా, సాధవత్వమ్ + (ఇతి) + యత్ = యాగమునకు అంగమగుట అనునది యేదో (తత్ + ఏవ) = అదియే, యుక్తమ్ = యుక్తమైనది, స్యాత్ = కాగలదు.

అన్యార్థోపలక్షణమ్ = మరియొక అర్థమునకు ఉపలక్షణమగుట, న + తు = కానేరదు.

పశుశబ్దము పశుత్వజాతిని బోధించునని అన్వయవ్యతిరేకములచే నిర్ణయింపవచ్చును, అట్లే, యా తృతీయా విభక్తికి ఏకత్వ సంఖ్య యర్థమని అన్వయ వ్యతిరేకముల వలన తెలియబడగలదు. ఏకవచనము వినబడుసరికి ఏకత్వ సంఖ్య భాసించును. పశుభ్యామ్, పశుభిః అనుచోట ఏకవచనము వినబడనందున ఏకత్వము భాసింపదు.

కాగా 'పశునా' అను పదము వలన పశుత్వజాతి ఏకత్వ సంఖ్య శబ్దతః లభించుచుండగా, ఆ రెంటిలో జాతి యాగాంగమనియు ఏకత్వసంఖ్య యాగాంగము కాదనియు చెప్పుట సరసము కాదు, రెండు కూడ శబ్దముయొక్క బలముచే లభించుచున్నవి గదా!

అట్లుకాక ప్రత్యయము ప్రకృతికి సాహాయ్యముగా చేర్చబడినది, దానికి వేరు అర్థము లేదు, అవి చెప్పుట యుక్తము కాదు. ॥67॥

అవతారిక— పై శ్లోకముయొక్క అర్థమునే బలపరచుచున్నాడు.

శ్లో॥ సాధనత్వే పదార్థస్య సామర్థ్యం న ప్రహీయతే ।
సంఖ్యా వ్యాపారధర్మోఽతస్తేన లిఙ్గేన గమ్యతే ॥ 68

పదార్థస్య = పదముయొక్క అర్థమునకు, అనగా పశునా అనే పదముచే బోధింపబడిన పశుత్వజాతి ఏకత్వసంఖ్య అనెడి సంపూర్ణమగు అర్థమునకు, సాధనత్వే = యాగాంగత్వము కలుగగా, (పదస్య) = పశునా అను పదముయొక్క, సామర్థ్యమ్ = సామర్థ్యము అనగా శక్తి, న + ప్రహీయతే = విడువబడదు.

ప్రత్యయార్థమగు సంఖ్య యాగమున కంగము కాకున్న దాని శక్తి విడువబడినదే కావలెను, అట్లు విడచుటకు తగిన కారణము కానరాదు

అంతః = ఈ కారణము వలన అనగా పదముచే బోధింపబడిన అర్థములన్నియు యాగాంగములగుట వలన, సంఖ్యా = ఏకత్వ సంఖ్య, వ్యాపార ధర్మః = క్రియయొక్క ధర్మము (ఇతి) = అని, తేన + లిఙ్గేన = సామర్థ్యమనే ఆ లింగముచే, గమ్యతే = తెలియబడుచున్నది.

కాక తేన + లిఙ్గేన = ద్వితీయమ్, తృతీయమ్ అను పదముల ప్రయోగమనెడి ఆ లింగముచే, తెలియబడుచున్నది.

అట్టి లింగము అనగా చిహ్నము హేతువు ఉన్నచో నచట సంఖ్య వివక్షితమగును.

కాగా అట్టి లింగము లేనిచో సంఖ్య వివక్షితము కానేరదని స్పష్టమగుచున్నది. ఉదా॥ గ్రహం సమ్మార్ష్టి.

కాగా ఈ శ్లోకము యొక్క ఉత్తరార్ధమునకు సంఖ్యాఽవ్యాపార ధర్మః, అని అకార ప్రశ్లేషము చూపి రెండవ యర్థము కూడ చెప్పవలెను.

లాఘవము మున్నగు యుక్తులవలన పై యర్థము లభింపదు.

67, 68 శ్లోకములు 'అన్యత్రావిహితస్యైవ' అను 57 వ శ్లోకము యొక్క యర్థమునే నిర్ణయించుచున్నవి. ఇదియే భర్తృహరి యొక్క సిద్ధాంతము. ॥68॥

అవతారిక — 'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున సమ్మార్జనము ప్రధానము అయినను ప్రయోజనమును బట్టి గ్రహములు ప్రధానములు. అందుచే ఉత్పత్తి వాక్యమును పురస్కరించుకొని ఏకత్వ సంఖ్య వివక్షితముకాదని 58, 59 శ్లోకములలో చూపబడినది.

ఇప్పుడు శబ్దమువలన గూడ గ్రహములకు ప్రాధాన్యమున్నదని 70 వ శ్లోకముచే చెప్పదలచి, ముందుగా ఒక న్యాయమును జూపుచున్నాడు.

శ్లో॥ అపూర్వస్య విధేయత్వా త్ప్రాధాన్యమవసీయతే ।
విహితస్య పరార్థత్వా చ్ఛేషభావః ప్రతీయతే ॥ 69

A. అపూర్వస్య = మరియొక దానివలన తెలియబడని యర్థమునకు, విధేయత్వాత్ = కొత్తగా బోధింపబడుటవలన, ప్రాధాన్యమ్ = ముఖ్యత్వము, అవసీయతే = నిశ్చయింపబడు చున్నది.

మరియొక వాక్యముచే విధింపబడని యర్థమును నూతనముగా విధించినచో ఆ యర్థము ప్రధానమని తెలియనగును, అట్టి స్థితిలో ప్రత్యయార్థమగు సంఖ్య వివక్షితము కాగలదు. ఇందుల కుదాహరణము 'పశునాయజేత' అనునది కాగలదు.

B. విహితస్య = మరియొక వాక్యముచే విధింపబడిన అర్థమునకు, పరార్థత్వాత్ = ఇతర వస్తువునకు ఉపకరించుటవలన అనగా అనువాదమగుట వలన, శేషభావః = శేషత్వము అనగా అప్రాధాన్యము, ప్రతీయతే = తెలియబడుచున్నది.

మరియొక వాక్యముచే విధింపబడిన అర్థమును మరల విధించిన అది అన్యార్థమని తెలియబడుటచే నది యప్రధానమగును. అట్టి చోటులయందున్న సంఖ్య వివక్షితము కాదు. ఇందుల కుదాహరణము "గ్రహం సమ్మార్ష్టి" అనునది కాగలదు. ॥69॥

అవతారిక — 69 వ శ్లోకము యొక్క యర్థమును ప్రకృతమున సమన్వయ పరచుచున్నాడు.

శ్లో॥ సమ్మార్గస్య విధేయత్వా దన్యత్ర విహితే గ్రహే ।
విధివాక్యే శ్రుతా సంఖ్యా లక్షణాయాం న బాధ్యతే ॥ 70

అన్యత్ర = మరియొక వాక్యమున, అనగా "ప్రాజాపత్యా నవగ్రహాః" (ప్రజాపతి దేవతగా గల తొమ్మిది గ్రహములు) మున్నగు వాక్యములయందు, గ్రహే = గ్రహము అనగా సోమరసము పోయుటకు ఉపయోగపడెడి పాత్రలు, విహితే = విధింపబడియుండగా, అనగా అచటనే నూతనముగా బోధింపబడి యుండగా, ఆ కారణము వలన, సమ్మార్గస్య = పరిశుభ్రత, విధేయత్వాత్ = విధింపబడుట వలన 'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున గ్రహమును ఉద్దేశించి సమ్మార్జనము విధింపబడుట వలన, విధివాక్యే = 'ప్రాజాపత్యా నవ గ్రహాః' మున్నగు ఉత్పత్తి వాక్యమున, శ్రుతా = వినబడుచున్న నవ, దశ మున్నగు శబ్దము లచే బోధింపబడుచున్న, సంఖ్యా = నవత్వ, దశత్వ సంఖ్య, న + బాధ్యతే = బాధింపబడదు. ప్రాజాపత్యాః నవగ్రహాః అను రీతిని ఉత్పత్తి వాక్యమున గ్రహములు ప్రధానముగా చెప్ప బడినవి. 'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున సమ్మార్జనము ప్రధానముగా చెప్పబడినది. ఉత్పత్తి వాక్యమున ఏ గ్రహములు చెప్పబడినవో, అవియే బుద్ధిలో నుండుటచే అనువాద వాక్యమున గూడ అవియే స్వీకరింపబడుచున్నవి.

కాబట్టి ఉత్పత్తి వాక్యమున నవ, దశ అను రీతిని సంఖ్యా విశేషము చెప్పబడి నందున దానికి అవిరోధముగా అనువాద వాక్యమున గ్రహసామాన్యమే గ్రహింపబడును. విభక్తి ప్రత్యయము సంస్కారార్థమే చేర్చబడినది.

58, 59 శ్లోకములలో 'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున సమ్మార్జనమునకు శాబ్ద ప్రాధాన్యమున్నను గ్రహములకు అర్థప్రాధాన్యము చూపబడినది. ఈ శ్లోకమున గ్రహ ములకు ఉత్పత్తి వాక్యమున శాబ్ద ప్రాధాన్యము కలదని చూపబడినది. 58, 59 శ్లోకముల కంటె 70 శ్లోకమున కిదియే విశేషము. ॥70॥

అవతారిక— 'పశునా యజేత' అను వాక్యమున గూడ యాగము ప్రధానము, పశువు అప్రధానము అని చెప్పవలెను. కాగా అప్రధానమగు పశువునకు విశేషణమగు ఏకత్వ సంఖ్య అవివక్షితమే కావలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ విధివాక్యాన్తరే సంఖ్యా పశోర్నాస్తి విరోధినీ ।
తస్మాత్సగుణ ఏవాసౌ సహైకత్వేన గమ్యతే ॥ 71

విధివాక్యాన్తరే = విధాయకమగు మరియొక వాక్యమున, విరోధినీ = ఏకత్వ సంఖ్యకు విరుద్ధ మగు, సంఖ్యా = సంఖ్య, న + అస్తి = లేదు.

'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున ఏకత్వ సంఖ్య గ్రహమునందు భాసించు చున్నది. దానికి విరుద్ధముగా నవ, దశ అను శబ్దములచే నవత్వ, దశత్వ సంఖ్యలు గ్రహ ములయందు ఉత్పత్తి వాక్యమున కనిపించుచున్నవి.

ఆ రీతిగా, 'పశునా యజేత అను వాక్యమున విరుద సంఖ్య కానరాదు. 'పశునా'

అను పదముచే పశువునందు ఏకత్వము భాసించుచున్నది. దానికి విరుద్ధముగా మరియొక సంఖ్య పశువునందు శబ్దముచే బోధింపబడి యుండలేదు.

తస్మాత్ = అందువలన, అసౌ = ఈ పశువు, సగుణః + ఏవ = పుంస్త్వము, పశుత్వము అనెడి గుణముంతో గూడినదే, ఏకత్వేన + సహ = ఏకత్వ సంఖ్యతో గూడ, గమ్యతే = యాగాంగముగా తెలియబడుచున్నది.

'పశునా' అను పదము పశుత్వము, పుంస్త్వముకల వ్యక్తిని బోధించును. అందుచే మగ పశువును ఉపయోగించియే యాగము చేయవలెను. స్త్రీ పశువు యాగమున నుపయోగింప రాదు. అట్లే ప్రత్యయార్థమగు ఏకత్వ సంఖ్యయు పశువునకు విశేషణమగుటచే అదియు యాగాంగము కాగలదు ॥71॥

అవతారిక — 50 వ శ్లోకమునుండి ఇంతవరకు 21 శ్లోకములలో సంఖ్య వివక్షితమా ? కాదా ? అని విచారింపబడినది.

ఇచట నుండి 80 వ శ్లోకము చివరి వరకు 9 శ్లోకములలో వ్యక్తియందున్న తెలుపు, ఎరుపు మున్నగు గుణము; పశుత్వము, అజత్వము మున్నగు జాతి; వివక్షితమగునా ? వివక్షితము కాదా ? అని విచారించుచున్నాడు.

శ్లో॥ నిర్జ్ఞాత ద్రవ్యసంబన్ధేయః కర్మణ్యుపదిశ్యతే ।
గుణస్తేనార్థితా తస్య ద్రవ్యేణేవ ప్రతీయతే ॥ 72

నిర్జ్ఞాత ద్రవ్యసంబన్ధే = స్పష్టముగాతెలియబడిన ద్రవ్యముయొక్క సంబంధముకల, కర్మణి = యాగము మున్నగు క్రియయందు, యః = ఏ, గుణః = గుణము అనగా తెలుపు నలుపు ఎరుపు మున్నగు గుణము, తేన = ఆ గుణముతో, ద్రవ్యేణ + ఇవ = ద్రవ్యముతోవలె, తస్య = ఆ క్రియకు, అర్థితా = ఆకాంక్ష, ప్రతీయతే = తెలియబడుచున్నది, శబ్దముచే బోధింప బడుచున్నది.

"వాయవ్యం శ్వేతం పశుమాలభేత" అని వేదవాక్యము కలదు. వాయువు దేవతగా గలిగినట్టియు తెల్లని పశువును అనగా మేకను స్పృశింపవలెను, కాక చంపవలెనని దాని యర్థము. అట్లే "గామభ్యాజ శుక్లామ్" అని మరియొక వాక్యము కలదు. (తెల్లని ఆవును బంధింపవలెను) ఆలంభకము, బంధనము అనునవి క్రియలు. వానిలో మేక, ఆవు ద్రవ్యములుగా స్పష్టముగా జెప్పబడినవి. ఆ ద్రవ్యములతోపాటు ఆ క్రియలకు (తెలుపు అను గుణముతో గూడ సంబంధము చెప్పబడినది. అందుచే క్రియకు ద్రవ్యముతో సంబంధము నియతమగు నట్లు గుణముతోగూడ సంబంధము నియతమే. ఆలభేత, అని ఆలంభనక్రియ వినుసరికి కమ్ ? అని (దేనిని) ఆకాంక్ష కలిగినట్లు, కింగుణకమ్ ? (ఏ గుణము కల దానిని) అనియు ఆకాంక్ష కలుగును. ద్రవ్యమునకువలె గుణమునకు కూడ యాగాది క్రియలలో ప్రాముఖ్యము

కాన్పించుచున్నది. విశేషమేమనగా— ముందుగా ద్రవ్యము, తరువాత గుణము ఆకాంక్షిత మగును. క్రియతో సాక్షాత్సంబంధము ద్రవ్యమునకే కదా ! యాగాది క్రియలు పూర్తి చెందవలెనన్న శాస్త్రవిహితమగు ద్రవ్యము గుణము రెండు అపేక్షితములే.

గవాది పదములు శక్తిచే ద్రవ్యబోధకము లనెడి సిద్ధాంతము నాశ్రయించి యీ శ్లోకము చెప్పబడినది. పై శబ్దములు జాతి బోధకములనెడి సిద్ధాంతము నాశ్రయించి 77 వ శ్లోకము చెప్పబడుచున్నది.

గుణ ద్రవ్యముల రెంటికి క్రియతో సంబంధము శ్రౌతమే. అనగా శబ్దసామర్థ్యము వలన కలుగునదియే యని యీ శ్లోకముయొక్క తాత్పర్యము. ॥72॥

అవతారిక— వాక్యార్థ నిర్ణయమునకై గుణ ద్రవ్యములకు కల పరస్పర సంబంధమును చూపుచున్నాడు.

శ్లో॥ కశ్చిదేవగుణో ద్రవ్యే యథాసామర్థ్యలక్షణః ।
ఆధారోఽపిగుణస్యైవం ప్రాప్తస్సామర్థ్యలక్షణః ॥ 73

ద్రవ్యే = ద్రవ్యమునందు, కశ్చిత్ + ఏవ + గుణః = ఏదో ఒక గుణము, సామర్థ్య లక్షణః = సామర్థ్యము చిహ్నముగాకలదై, అనగా గుణములేని ద్రవ్య ముండనేరదు అనెడి అనుపపత్తి మూలముగా కలదై, యథా = ఏ రీతిగా, (అస్తి) = ఉన్నదో, గుణములేని ద్రవ్య ముండుట యసంభవము కనుక ద్రవ్యమనుసరికి దానియందు ఏదో గుణము తప్పక యుండ గలదని యెట్లు తెలియబడుచున్నదో యని భావము.

ఏవమ్ = అట్లే, గుణస్య = గుణమునకు ఆధారః + అపి = ఆశ్రయము కూడ, సామర్థ్య లక్షణః = సామర్థ్యము చిహ్నముగా గలదియే. అనగా ఆధారములేనిది గుణము ఉండనేరదనెడి అనుపపత్తిని మూలముగా జేసికొనినదై, ప్రాప్తః = ప్రతీతి విషయమగు చున్నది. అనగా తెలియబడుచున్నది. ఎరుపు, తెలుపు మున్నగు గుణములు ఒక ద్రవ్యమును ఆధారముగా జేసికొనియే యుండును, అది వాని స్వభావము. కాగా గుణము అను సరికి దానికి ఏదో ఒక ఆధారమగు ద్రవ్యము తప్పక యుండునని తెలియబడుచున్నదని భావము.

ఉపపన్నము కాని యర్థమునకు ఉపపత్తిని కలిగించెడి అర్థమును కల్పించుట సామర్థ్యమనబడును. దీనినే అర్థాపత్తి ప్రమాణమందురు. అర్థస్య = ఉపపాదకమగు అర్థమునకు, ఆపత్తిః = కల్పన = అర్థాపత్తి. ఇది స్వతంత్రమగు ప్రమాణమని శాబ్దికులు తలంతురు.

గుణములేని ద్రవ్య ముండనేరదు కనుక ద్రవ్యమునకు ఏదో గుణమున్నదనియు, ఆధారములేనిది గుణములుండనేరవు కనక వానికి ఆధారముగా ద్రవ్యమున్నదనియు చెప్ప నక్కర లేకుండగనే తెలియబడగలదు.

ఆ గుణము తెలుపు, నలుపు అనిగాని, ఆ ద్రవ్యము ఆవు, మేక అనిగాని విశేష

రూపమున జ్ఞాతము కాకపోవచ్చును. కనుకనే శ్లోకమున-కశ్చిత్, ఏవ, అని చెప్పబడినది. ఆ ద్రవ్యము ఏ జాతికి చెందినది, అనియు గూడ తెలియనక్కరలేదు. కాబట్టి జాతిని అపేక్షింపకయే గుణద్రవ్యములు పరస్పరాపేక్ష కలిగియుండును. వానికి ఆధారాధేయ భావము నియతము.

అవి ఒకదానిని ఒకటి విడువకయే యుండుటచే వానికి సమవాయము సంబంధముగా తార్కికులచే నంగీకరింపబడుచున్నది ॥78॥

అవతారిక— గుణద్రవ్యములకు పరస్పరాకాంక్షామూలమున సామాన్య రూపముగా ఆధారాధేయభావము లభించునని 78 వ శ్లోకమున జూపి, ఆ రెండికి వాక్యార్థమునగల సంబంధమును ప్రదర్శించుచున్నాడు

శ్లో॥ తయోస్తు పృథగర్థిత్వే సంబన్ధోయః ప్రతీయతే।
న తస్మిన్నుపఘాతోఽస్తి కల్ప్యమన్యత్ర చాశ్రుతమ్॥ 74

పృథక్ = పరస్పరము, అర్థిత్వే = పై చెప్పిన ప్రకారము గుణద్రవ్యములకు ఆకాంక్షకలుగగ, తయోః + తు = వానికే అనగా శబ్దముచే బోధింపబడిన ఏకవాక్యోపాత్తములగు ఆ గుణద్రవ్యములకే, యః = ఏ, సంబన్ధః = సమన్వయము, ప్రతీయతే = తెలియబడుచున్నదో, తస్మిన్ = ఆ సమన్వయమునందు, ఉపఘాతః = బాధ, న + అస్తి = లేదు.

'శ్వేతం ఛాగమాలభేత' అను ఒకే వాక్యమున తెలుపు అను గుణము, మేక అను ద్రవ్యము రెండు బోధింపబడుచున్నవి వానికి పరస్పరము ఆకాంక్షయున్నది. కాబట్టి వానికి పరస్పరము అన్వయము చూపవలెను. తెల్లని మేకతో యాగము చేయవలెనని వాక్యార్థము లభించును. మేక ద్రవ్యము కనుక దానియందు తెలుపనే గుణముండవచ్చును. తెలుపు అనునది గుణము కనుక దానికి మేక ఆధారము కాగలదు. ఇట్లు సమన్వయము చేయుటలో బాధ యేమియు లేదు.

కాబట్టి గుణమును ద్రవ్యమును రెంటిని గ్రహించి సమన్వయము చేయవలెను. ఒక దానిని గూడ విడువనక్కరలేదు.

అన్యత్ర + చ = విడుచుటకు కారణమున్నప్పుడే, అశ్రుతమ్ = శబ్దమువలన లభింపనిది, కల్ప్యమ్ = కల్పింపతగినది యగును.

శబ్దముచే బోధింపబడిన యర్థములలో ఏదో ఒక దానిని విడువవలసిన పరిస్థితి కలిగినపుడు, ఆ వాక్యమున శబ్దముచే లభింపని యర్థమును కల్పించి సమన్వయము చేయవలెను ప్రకృతము దేనిని గూడ విడువవలసిన పరిస్థితిలేనందున శబ్దముచే లభించిన అర్థములను పురస్కరించుకొని సమన్వయము జరుగుచున్నందున అర్థాంతర కల్పన చేయనక్కరలేదు.

విశేషాంశము—— ఇచట 'కల్ప్యమన్యన్న చాశ్రుతమ్' అను పాఠాంతరము కలదు

అశ్రుతమ్ = శబ్దముచే లభింపని, అన్యత్ = మరియొక పదార్థమును, న + చ + కల్ప్యమ్ = కల్పింప నక్కరలేదు.

శబ్దముచే లభించిన అర్థములలో ఏదో ఒక దానిని విడచుటలో కారణము కానరానందున శబ్దబోధ్యములగు గుణద్రవ్యములకు రెంటికి పరస్పరము అన్వయము సంభవించుచున్నందున అప్రకృత కల్పన చేయనక్కరలేదు

ఈ పాఠమును ఆశ్రయించియే హేలారాజు వ్యాఖ్యానించెను ॥74॥

అవతారిక—— కారకములకు క్రియతో నన్వయము చెప్పవలెను ఆలభేత, అను పదము ఆలంభన క్రియను బోధించును. శ్వేతగుణము, ఛాగద్రవ్యము రెండు ఆ క్రియలో కారకములగును. కాగా ఆ రెంటికి పరస్పరము అన్వయము చేయక వానికి వేరువేరుగా క్రియాన్వయము చూపవలెను "శ్వేతమాలభేత, ఛాగమాలభేత". కాగా రెండు వాక్యములు స్పష్టముగా నున్నందున వాక్యభేదమనే దోషము ప్రసక్తమగుచున్నది అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియయా యోఽభిసంబన్ధః సశ్రుతిప్రాపిత స్తయోః ।
ఆశ్రయాశ్రయిణోర్వాక్యాన్నియ మ స్త్వవతిష్ఠతే ॥ 75

తయోః = ఆ గుణ ద్రవ్యములకు, క్రియయా = ఆలంభనము మున్నగు క్రియతో, యః = ఏ, అభిసంబన్ధః = అన్వయమో, సః = ఆ సంబంధము, శ్రుతిప్రాపితః = కారకవిభక్తిరూపమగు 'శ్రుతి' అను ప్రమాణముచే పొందింపబడు చున్నది, అనగా బోధింపబడుచున్నది.

ఒకే వాక్యమున గ్రహింపబడిన గుణ ద్రవ్యములకు క్రియతో అన్వయము 'శ్రుతి' అను ప్రమాణము వలన కలుగుచున్నది.

ఇచట ''క్రియాయాం యోఽభిసంబన్ధః స
శ్రుత్యా ప్రాపిత స్తయోః''

అను పాఠాంతరము కలదు అర్థములో భేదము కానరాదు.

ఆశ్రయాశ్రయిణోః = ఆశ్రయమునకు ఆశ్రయించిన దానికి అనగా ఆశ్రయమగు ద్రవ్యమునకు ఆశ్రయించియున్న గుణమునకును, నియమః + తు = నియమము మాత్రము అనగా మేక తెల్లనిదే. ఆ తెల్లనిది మేకయే, మేక నల్లగాగాని, పచ్చగాగాని, ఎఱ్ఱగాగాని యుండరాదు, తెల్లనిది గొఱ్ఱెగాని, గుఱ్ఱముగాని కాకూడదు అను నియమము, వాక్యాత్ = వాక్యరూపమగు ప్రమాణమువలన, అవతిష్ఠతే = కలుగుచున్నది

సమభివ్యాహారరూపమగు వాక్యమనెడి* ప్రమాణమువలన గుణ ద్రవ్యములకు పరస్పర సంబంధము, ఇతర వ్యావృత్తియు కలుగును ॥75॥

అవతారిక— జాతి, గుణము రెండు శబ్దబోధ్యములే కనుక ఆ రెండు కూడ శ్రుతి, వాక్యము అను రెండు ప్రమాణములచే క్రియాంగములు, పరస్పరము అన్వితములు కాగలవని యింతవరకు నిరూపింపబడినది.

దానిపై ఒక ప్రశ్న కలుగుచున్నది— తెల్లని మేకను ఉపయోగించి యాగము చేయవలెనని శ్రుతి చెప్పుచున్నది అచట మేక అను ద్రవ్యము తెలుపు అను గుణము రెండు ముఖ్యములే యగుచున్నవి.

కాని తెల్లని మేక లభింపనిచో యాగమున ఏది ద్రవ్యము కాగలదు ? నల్లని మేకను ఉపయోగింపవలెనా ? కాక తెల్లని గొఱ్ఱెను ఉపయోగింపవలెనా ? ఏదో ద్రవ్యమును గ్రహించి యాగము చేయక తప్పదుకదా ! దీనికి జాతిశక్తి వాదమున 77వ శ్లోకమున సమాధానము చెప్పుచు, ద్రవ్య వాదమున ఈ దోషము దుర్వారమేయని నిర్ణయించుచున్నాడు.

శ్లో॥ తత్ర ద్రవ్యగుణాభావే ప్రత్యేకం స్యాద్వికల్పనమ్ ।
శ్రుతి ప్రాప్తోపి సంబన్ధోబలవాన్ వాక్యలక్షణాత్ ॥ 76

A ద్రవ్య గుణాభావే = ద్రవ్యము, గుణము రెండు లేనపుడు అనగా తెల్లని మేక లభింపనపుడు, తత్ర = ఆ రెంటియందు, ప్రత్యేకమ్ = వేరువేరుగా, వికల్పనమ్ = వికల్పము, అనగా ద్రవ్యమునుగాని గుణమునుగాని గ్రహింపవచ్చుననెడి వికల్పము, స్యాత్ = కలుగుచున్నది.

తెల్లని మేకతో యాగము చేయుమని శ్రుతి చెప్పుచున్నది. అట్టి మేక దొరకనిచో తెల్లని గొఱ్ఱెనుగాని, నల్లని మేకనుగాని గ్రహించి యాగము చేయవచ్చునని భావము లభించు చున్నది

B 'శ్వేతం ఛాగమాలభేత' అను ఒకే వాక్యమున ద్రవ్య గుణములు గ్రహింపబడియున్నం దున ఆ రెంటికి సంబంధము కలుగుచుండగా వానికి వికల్ప ప్రసక్తి యెట్లు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు శ్రుతిప్రాప్తః = శ్రుతియనే ప్రమాణమువలన లభించిన, సంబన్ధః = సంబంధము, వాక్యలక్షణాత్ = వాక్యరూపమగు అనగా వాక్యమనే ప్రమాణము వలన కలిగెడి సంబంధము కంటె, బలవాన్ + హి = బలవంతమైనది కదా !

ద్రవ్య గుణములకు క్రియతో సంబంధము శ్రుతివలన లభించును. శ్వేతమ్ ఛాగమ్ అను ద్వితీయా శ్రుతి, లిఙ్ విభక్తి శ్రుతి, ఇందు కారణము.

---

* పూర్వమీమాంసా శాస్త్రమున వాక్యార్థనిర్ణయమునకు 1 శ్రుతి, 2 లింగము 3 వాక్యము, 4 ప్రకరణము, 5 స్థానము, 6. సమాఖ్య అను రీతిని ఆరు ప్రమాణములను ఆశ్రయించిరి.

ద్రవ్య గుణములు ఒక వాక్యమున పదబోధ్యములగుటచే వానికి సంబంధము వాక్య మూలకము. అంతకు తప్ప వానికి సంబంధము నిర్ణయించునది మరియొకటి లేదు.

వాక్య ప్రమాణముకంటె శ్రుతి ప్రమాణము ప్రబలము. ఇది *మీమాంసకుల నిర్ణయము. కాబట్టి శ్రుతినిబట్టి చూడగా పై వికల్పము ప్రసక్తమగుచున్నది. అట్టితరి ప్రతినిధి నియమము కలుగదు. ఈ యంశమును గుర్తింపవలెను.

ద్రవ్యము శబ్దముచే బోధింపబడుననెడి వ్యాడి మహర్షియొక్క మతమును దూషించుటకై ఈ శ్లోకము వ్రాయబడినది. ద్రవ్యవాదమున ద్రవ్యగుణములు సమకక్షములు కనుక పై రీతిని వికల్పము ప్రసక్తమగుచున్నది. వికల్పము శాస్త్ర సమ్మతము కాదు. తెల్లని మేక దొరకనిచో ఎరుపో నలుపో రంగుకల మేకనే ఉపయోగింపవలెను, అంతియేకాని గొఱ్ఱెను గాని మరియొక తెల్లని వస్తువునుగాని ఉపయోగింపరాదని శాస్త్రనిర్ణయము. ఆ నిర్ణయమునకు ద్రవ్యవాదమున భంగము వాటిల్లును.

కాబట్టి ఆ వాదము యుక్తము కాదు. ॥76॥

అవతారిక— పై శ్లోకమున ద్రవ్యవాదమున దోషము దుర్వారము కనుక అది అయుక్తమని నిరూపించి జాతి శక్తివాదమున సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యదాతు జాతిః శక్తిర్వా క్రియాం ప్రత్యుపదిశ్యతే ।
సామర్థ్యాత్సంనిధీయేతే తత్రద్రవ్యగుణౌతదా ॥ 77

యదా + తు = ఎప్పుడైతే, జాతిః = శబ్దముచే బోధింపబడిన జాతి, వా = కాక, శక్తిః = శ_, క్రియామ్ + ప్రతి = యాగాది క్రియను గురించి, ఉపదిశ్యతే = చెప్పబడుచున్నదో, తదా = అప్పుడు, ఆ పక్షమున, తత్ర = ఆ క్రియయందు, సామర్థ్యాత్ = సామర్థ్యము వలన అనగా అర్థాపత్తి ప్రమాణము వలన, ద్రవ్యగుణౌ = ద్రవ్యము గుణము, ఈ రెండు, సంనిధీయేతే = ఏకరూపముగనే సన్నిహితములుగా చేయబడుచున్నవి.

ఎల్ల శబ్దములకు జాతియే వాచ్యమగునని వాజిప్యాయనుని ఆశయము. అందు శక్తికి జాతి ఉపలక్షణము కాగలదని యీ సముద్దేశమున 8 వ శ్లోకమున చూపబడినది.

జాతిగాని శక్తిగాని యాగాది క్రియలకు సాధనము కాగలదు. ఆ రెండు కూడ ఆశ్రయములేనిది ఉండనేరవు కనుక అవి వానికి ఆధారమగు ద్రవ్యమును ఆక్షేపించును. ఆ

* "శ్రుతి లిఙ్గవాక్య ప్రకరణ స్థానసమాఖ్యానాం పారదౌర్బల్య మర్థవిప్రకర్షాత్" అని జైమిని సూత్రము.

ద్రవ్యము గుణమును ఆక్షేపించును అందుచే ద్రవ్యము గుణము కూడ అర్థాత్తు లభించును, ద్రవ్యము శబ్దముచే బోధింపబడదు.

ఈ పక్షమున 76 వ శ్లోకము యొక్క అవతారికలో చూపబడిన పూర్వపక్షమునకు సమాధానము లభించును.

ద్రవ్యవాదమున ఆ పూర్వపక్షమునకు సమాధానము చెప్పనలవికానందున అది దోషముగానే యుండును

పై మతభేదమును ఈ కారికలోనున్న 'తు' శబ్దము సూచించుచున్నది. ॥77॥

అవతారిక— పై శ్లోకముచే లభించిన అర్థమునకు ప్రయోజనము జూపుచున్నాడు.

శ్లో॥ జాతీనాంచ గుణానాంచ తుల్యేఽఙ్గత్వే క్రియాంప్రతి।
గుణాః ప్రతినిధీయన్తే ఛాగాదీనాం నజాతయః ॥ 78

జాతీనామ్ + చ = పశుత్వము ఛాగత్వము మున్నగు జాతులకును, గుణానామ్ + చ = తెలుపు నలుపు మున్నగు గుణములకును, క్రియామ్ + ప్రతి = ఆలంభనము యాగము మున్నగు క్రియనుగురించి, అఙ్గత్వే = సాధనముగా నుండుట, తుల్యే = సమానమే ఐనను, ఛాగాదీనామ్ = మేక మున్నగువానికి సంబంధించియున్న, గుణాః = తెలుపు మున్నగుణములు, ప్రతినిధీయన్తే = ప్రతినిధిగా చూడబడగలవు. అనగా తెలుపే అని నియమములేకుండ అట్టి మేక దొరకని పక్షమున నల్లని మేక కూడ యాగాంగముగా గ్రహింపబడునని భావము.

జాతయః = ఛాగత్వము మున్నగు జాతులు, న + ప్రతినిధీయన్తే = ప్రతినిధిగా చూడబడవు, అనగా గ్రహింపబడవు

తెల్లని మేక దొరకని పక్షమున మేక అను జాతికి ప్రాధాన్యమొసంగి తెల్లదనము లేకున్నను నల్లదనము కలిగిన మేకయే యాగాంగమగును.

కాగా జాతి, గుణము రెండుకూడ ద్రవ్యముద్వారా క్రియతో సంబంధించుటచే నవి రెండు ఏకరూపముగా నుండును. అచట జాతి ప్రధానముగాను, గుణములు అప్రధానములుగాను ఉండుటచే, వానిలో జాతియుక్తమగు నల్లని మేక గ్రహింపబడును, తెల్లని గొఱ్ఱె మున్నగునవి గ్రహింపబడవు ॥77॥

అవతారిక— 'శ్వేతం ఛాగమాలభేత' (తెల్లని మేకను చంపవలెను, దానితో యాగము చేయవలెను) అను వాక్యమున జాతిని తప్పక గ్రహింపవలెను. తెలుపు అను గుణము సంభవించిన గ్రహింపబడును, సంభవింపకపోయిన దానిని విడచి మరియొక గుణమును గ్రహింపవలెను. కాగా జాతికి ప్రతినిధి లేదు. మరియొక జాతిని గ్రహింపరాదు. గుణమునకు ప్రతినిధి యుండును, మరియొక గుణము కల మేకను గ్రహింపవచ్చును అని 77 వ

శ్లోకమున చెప్పబడినది. ఆ యర్థమును యుక్తి జూపి సమర్థించుచున్నాడు. అనగా జాతినే విడువరాదా, గుణమునే గ్రహింపరాదా ? అను ప్రశ్నకు యుక్తి జూపి సమర్థించుచున్నాడు.

శ్లో॥ వ్యక్తిశక్తేః సమాసన్నా జాతయోన తథా గుణాః ।
సాక్షాద్ద్రవ్యం క్రియాయోగి, గుణస్తస్మాద్వికల్ప్యతే ॥ 79

వ్యక్తి శక్తేః = శక్తమగు ద్రవ్యమునకు, జాతయః = జాతులు, సమాసన్నాః = దగ్గరగా నున్నవి, గుణాః = గుణములు, తథా = అట్టివి, అనగా ద్రవ్యమునకు దగ్గరగా నున్నవి, న = కానేరవు, ఏలయన, ద్రవ్యమ్ = ద్రవ్యము, సాక్షాత్ = సాక్షాత్తుగా, క్రియాయోగి = యాగాది క్రియలతో సంబంధించునది, తస్మాత్ = ఆ కారణము వలన, అనగా ద్రవ్యము సాక్షాత్తు క్రియతో సంబంధించును, గుణము దాని ద్వారా క్రియతో సంబంధించునను కారణము వలన, గుణః = గుణము, అనగా తెలుపు, నలుపు మున్నగుగుణము, వికల్ప్యతే = వికల్పమును జెందును అనగా గుణమే ప్రతినిధిగా గ్రహింపబడును.

ద్రవ్యమునందు జాతి, గుణములు కూడ సమవాయ సంబంధమున నుండును, కాని జాతి వ్యక్తిని ఎన్నడు విడనాడకయే యుండును, గుణము లట్టివి కావు, ద్రవ్యముండగనే దానియందున్న గుణములు నశించును, నూతనమగు గుణములు కలుగును.

కాబట్టి అవినాభావిగానున్న జాతికి ప్రతినిధి యుండదు. వచ్చుచు పోవుచు ఉండెడి గుణములకు ప్రతినిధి యుండును.

ద్రవ్యము సాక్షాత్తు క్రియతో సంబంధించును. దానిద్వారా జాతిగుణములు క్రియతో సంబంధించును. అందుచే వానిలో ద్రవ్యమునకు ఏది సన్నిహితము, ఏది దూరము అని విచారింపబడుచున్నది. అందు జాతి సన్నిహితము కనుక జాత్యంతరమునకు ప్రతినిధిత్వము లేకుండ ఆ జాతికి చెందిన వ్యక్తినే యాగాంగముగా గ్రహింపవలెను. గుణములు దూరము కనుక వానిని విడనాడి గుణాంతరయుక్తమగు మేకనే గ్రహింపవలెను. నల్లని మేక కూడ ఛాగత్వజాతికి చెందినదే.

ద్రవ్యమును అపేక్షింపక గుణమే సాక్షాత్తు క్రియతో సంబంధించిన, అప్పుడు పై విచారము. అనగా గుణములు ప్రతినిధిగా గ్రహింపబడునా ? లేక జాతులు ప్రతినిధిగా, గ్రహింపబడునా అను వికల్పమునకు తావు లేదు, కాని గుణము సాక్షాత్తు క్రియతో సంబంధింపదు.

కాగా జాతి పక్షమున పై సిద్ధాంతము ఉపపన్నమగుచున్నది, ద్రవ్యమ్మే శబ్దవాచ్యమను పక్షమున పై సిద్ధాంతము నిలువదు అని ఈ శ్లోకముయొక్క ముఖ్య తాత్పర్యము.

జాతి శక్తివాదము చాల ఉత్తమమైనదని బోధించుటకు ఈ విచారణము చేయబడినది. ॥79॥

అవతారిక — జాతి, గుణములలో దేనిని ముఖ్యముగా గ్రహింపవలెను అను విచారమున రెండును సమానములే కాన, వానిలో ఏదో ఒకదానిని ప్రతినిధిగా గ్రహింపవచ్చును. తెల్లని గొఱ్ఱెనుగాని, నల్లని మేకనుగాని గ్రహించి యాగము చేయవలెను. తెల్లని మేక దొరకిన, దానితో యాగము చేయవలెనని 76 వ శ్లోకమున చెప్పబడినది మతాంతరము, అనగా ఎల్ల శబ్దములకు ద్రవ్యమే వాచ్యమనెడి వ్యాడియొక్క మతమని చూపుచు ఈ విచారమును ముగించుచున్నాడు.

శ్లో॥ సామ్యే నాన్యతరాభావే వికల్పః కైశ్చిదిష్యతే ।
అతద్గుణోఽతశ్ఛాగః స్యాన్మేషో వా తద్గుణో భవేత్ ॥ 80

సామ్యేన = జాతి గుణములకు సామ్యముండుటచే, అన్యతరాభావే = జాతిగాని, గుణముగాని లేని పక్షమున, వికల్పః = అదిగాని, ఇదిగాని అను వికల్పము, కైశ్చిత్ = కొందరిచే, అనగా ఎల్ల శబ్దములకు ద్రవ్యమే వాచ్యమగునెడి వ్యాడి మతమును అనుసరించెడి వారిచే, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

ఆ వికల్పమునే జూపుచున్నాడు

అతః = ఈ కారణమువలన, అనగా రెండును సమములగుట వలన, అతద్గుణః = తెలుపు అనే గుణములేని, ఛాగః = మేక, స్యాత్ = యాగమునకు, అంగము కాగలదు, వా = కాక, తద్గుణః = తెలుపు అను గుణముకల, మేషః = గొఱ్ఱె, భవేత్ = యాగాంగమగును.

కైశ్చిత్, అని పలుకుటచే ఇది మతాంతరమని స్పష్టము

జాతి ద్రవ్యముపై ఆధారపడియున్నది, గుణము అట్టిదే, అవి స్వతంత్రములు కావు. ఈ సామ్యమునుబట్టి రెండు సమకక్షములు, కనుక తెల్లని మేక దొరకనపుడు, జాతికి ప్రాధాన్యమిచ్చి నల్లని మేకనుగాని, గుణమునకు ప్రాధాన్యమిచ్చి తెల్లని గొఱ్ఱెనుగాని గ్రహించి యాగము చేయవచ్చును.

వ్యాడిమతమున తెలుపు, నలుపు మున్నగు గుణములు కూడ విశేష్యత్వరూపమున వివక్షించిన ద్రవ్యమేయగుటచే పై రీతిని వికల్పము ప్రసక్తమగుచున్నది.

కాని యిది శిష్టసమ్మతము కాదు, జాతికి ప్రాముఖ్యమును జూపి నల్లని మేకను ప్రతినిధిగా గైకొనుటయే పతంజలి మున్నగువారికి సమ్మతము. ॥80॥

అవతారిక — 72 వ శ్లోకమునుండి ఇంతవరకు 9 శ్లోకములచే గుణము వివక్షితమగువా ? కాదా ? అని విచారణము జూపియున్నాడు, ఇది ప్రాసంగికము.

మరల సంఖ్యను వివక్షించుట గురించియే ప్రసంగించుచున్నాడు.

శ్లో॥ జాతే రాశ్రితసంఖ్యాయాః ప్రవృత్తి రుపలభ్యతే ।
సంఖ్యా విశేషముత్సృజ్య క్వచిత్సైవ ప్రవర్తతే ॥ 81

ఆశ్రిత సంఖ్యాయాః = ఆశ్రయింపబడిన సంఖ్యకల, జాతేః = జాతికి, ప్రవృత్తిః = క్రియా సంబంధము, ఉపలభ్యతే = శబ్దముచే తెలియబడుచున్నది.

'పశునాయజేత' మున్నగు వాక్యములలో పశుత్వజాతి, పశువునందున్న సంఖ్యయు యాగమున కంగములుగా శబ్దముచే బోధింపబడుచున్నవి.

సంఖ్యా విశేషమ్ = సంఖ్యలో విశేషమును, ఉత్సృజ్య = విడనాడి, క్వచిత్ = కొన్ని వాక్యములలో, సా + ఏవ = జాతి మాత్రమే, ప్రవర్తతే = యాగాంగమై యున్నది.

'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున గ్రహత్వజాతి ఏకత్వ సంఖ్యయు భాసించు చున్నను వానిలో సంఖ్య విడువబడి జాతిమాత్రమే సమ్మార్జనమున సంబంధించును. ॥81॥

అవతారిక — పై శ్లోకముయొక్క అర్థమునే స్పష్టపరచుచున్నాడు.

శ్లో॥ పరాఙ్గభూతం సామాన్యమ్ యుజ్యతే ద్రవ్యసంఖ్యయా ।
స్వార్థం ప్రవర్తమానం తు న సంఖ్యామవలమ్బతే॥ 82

పరాఙ్గభూతమ్ = మరియొక యర్థమున అప్రధానముగా నుండెడి, సామాన్యమ్ = జాతి, ద్రవ్య సంఖ్యయా = ద్రవ్యమునందున్న సంఖ్యతో, యుజ్యతే = కలసియున్నదియగును.

'పశునాయజేత' అను వాక్యమున యాగము ప్రధానము. దానియందు పశుత్వజాతి అప్రధానముగా నున్నందున పశుద్రవ్యమునందున్న ఏకత్వ సంఖ్యను గ్రహించును. ఒక పశువుచే యాగము చేయవలెనను వాక్యార్థము లభించును.

స్వార్థమ్ = తనయొక్క ఉపయోగమునకు, ప్రవర్తమానమ్ + తు = ప్రవర్తించిన సామాన్యము మాత్రము, సంఖ్యామ్ = ద్రవ్యమునందున్న సంఖ్యను, న + అవలమ్బతే = గ్రహింపదు.

"గ్రహం సమ్మార్ష్టి" అను వాక్యమున సమ్మార్జనము గ్రహముల పారిశుద్ధ్యము నకే కాన అచట సామాన్యము ప్రధానమగుటచే ఇచట ఏకత్వసంఖ్య ద్రవ్యమునందు వివక్షితము కానేరదు. ఉత్పత్తి వాక్యమున గల గ్రహములన్నిటికి సమ్మార్జనము సిద్ధించును.

ఇంతకు మునుపు ఈ విచారణ జరిగినది. అచట శబ్దమువలన కలిగిన జ్ఞానమును బట్టి గుణప్రధాన భావమును జూపి విచారణ చూపబడినది. ఇచట లోకమున నిజరూపమున గల గుణప్రధానమును జూపి విచారణ చేయబడుచున్నది. ॥82॥

అవతారిక — పై రెండు శ్లోకములయొక్క పూర్వార్ధములచే జూపబడిన అర్థము లకు ఉదాహరణము జూపుచున్నాడు.

శ్లో॥ యజేత పశునేత్యత్ర యజ్యర్థాయాం పశుశ్రుతౌ ।
కృత్స్నార్థైకేన పశునా ప్రధానం భవతి క్రియా ॥ 83

యజేత పశునా + ఇతి + అత్ర = పశునా యజేత, అను వాక్యమున, పశుశ్రుతౌ = శబ్దముచే బోధింపబడిన పశువు, యజ్ఞార్థాయామ్ = యాగార్థమైయుండగా, ప్రధానమ్ = ప్రధానమగు, క్రియా = యాగక్రియ, ఏకేన = ఒక, పశునా = పశువుచే, కృతార్థా = చేయబడిన ప్రయోజనము కలది, భవతి = అగుచున్నది.

పశునాయజేత, అను వాక్యముయొక్క అర్థమున యాగక్రియ ప్రధానము. అది సిద్ధించుటకై పశువు సాధనముగా నుండుటచే అప్రధానము. కాగా ప్రధానమగు క్రియ ఒక పశువును చంపి దాని యవయవములను శాస్త్రమున చెప్పబడిన ప్రకారము హోమము చేసిన సంపూర్ణముగ జరుగును. అందుచే మరియొక పశువును గ్రహింప నక్కరలేదు. అట్లు ప్రధానముగా నున్న యాగము అప్రధానమగు పశువునుబట్టి ఆవృత్తమగుచో అనగా మరియొక పశువును ఉపయోగించి చేయబడినచో అది యాగాంతరమే యగును. ప్రధానమును అప్రధానము అనువర్తించుట ధర్మము ఇచట అట్లుకాక అప్రధానమగు పశువును ప్రధానమగు యాగము అనువర్తించునట్లగుచున్నది. ॥83॥

అవతారిక— ఒక పశువుతోకాక అనేక పశువులతో యాగముచేసిన న్యాయమును అతిక్రమించుటయను దోషము కలుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ యావతాం సంభవో యస్య న కుర్యాత్తావతాం యది ।
ఆలమ్భనం, గుణైస్తేన ప్రధానం స్యాత్ప్రయోజితమ్ ॥ 84

యస్య = ఎవనికి అనగా యాగము చేయువానికి, యావతామ్ = ఎన్ని పశువులకు, సంభవః = సంభవమో, అనగా అతనికి ఎన్ని పశువులు లభించునో, సః = అతడు, తావతామ్ = అన్నిటికి, ఆలమ్భనమ్ = ఆలంభనమును అనగా హింసను, కుర్యాత్ + యది = చేసిన యెడల, తేన = ఆ చేయుటచే, గుణైః = అప్రధానములగు పశువులచే, ప్రధానమ్ = ప్రధానమగు ఆలంభనము, ప్రయోజితమ్ = ప్రేరేపింపబడినది అనగా అనుగ్రహింపబడినది, స్యాత్ = కాగలదు.

అప్రధానమగు పశువులనుబట్టి ప్రధానమునకు రూపము లభించుటచే దానికి ప్రాధాన్యమే సిద్ధింపనేరదు.

యాగమున ఆలంభనము చేయువానికి ఎన్ని పశువులు లభించునో, అన్నిటిని ఉపయోగించిన పై దోషము లగ్నమగుచున్నది.

కాగా అప్రధానము ప్రధానమును అనుసరించును, అను న్యాయమే లుప్తము కావలసి వచ్చును. కనుక అట్లు చేయరాదు. ఒకే పశువును ఉపయోగించి ఆలంభనము (యాగము) చేయవలెను. ॥84॥

అవతారిక— 81, 82 శ్లోకముల ఉత్తరార్ధముల యర్థములకు ఉదాహరణము చూపుచున్నాడు.

శ్లో॥ సంమృజ్యమానతన్త్రే తు గ్రహేయత్ర క్రియాశ్రుతిః ।
సంఖ్యావిశేషగ్రహణం నైవ తత్రాద్రియామహే ॥ 85

యత్ర = ఎచట, సంమృజ్య మానతన్త్రే = శుభ్రపరచబడు నట్టియు కనుకనే ప్రధానమగునట్టి' గ్రహే = గ్రహము (పాత్రము) విషయమున, క్రియాశ్రుతిః = క్రియయొక్క వినబడుట, (అస్తి) = కలదో, తత్ర + తు = అచట మాత్రము, సంఖ్యా విశేష గ్రహణమ్ = విశేష సంఖ్యయొక్క వివక్షను, న + ఏవ + ఆద్రియామహే = ఆదరింపనే ఆదరింపము. ఇచట తంత్ర శబ్దము ప్రధానార్థకము.

'గ్రహం సమ్మార్ష్టి' అను వాక్యమున శబ్ద వ్యాపారము వలన సమ్మార్జన క్రియ ప్రధానముగా భాసించును. కాని ఆ సమ్మార్జనము పాత్రలకు సంబంధించి యున్నందున యాగము చేయుటలో గ్రహములే ప్రధానములనక తప్పదు. ఈ రీతిగా చూచిన శాబ్ద ప్రాధాన్యము క్రియకున్నను ఆర్థ ప్రాధాన్యము గ్రహములకుండుటచే, నవియే వివక్షితము లగును. 'అమ్' అను విభక్తి ప్రత్యయముచే ఏకత్వసంఖ్య బోధింపబడుచున్నను అది వివక్షితము కానేరదు. ఉత్పత్తి వాక్యమున శ్రుతములగు ఎన్ని గ్రహములున్నవో, వాని కన్నిటికిని సమ్మార్జన క్రియ జరుగును. ॥85॥

అవతారిక— అప్రధానముగానున్న పదార్థమునను్న సంఖ్య వివక్షితము కాగలదు. ఇందుకుదాహరణము– 'పశునాయజేత' ప్రధానముగానున్న అర్థమునకల సంఖ్య వివక్షితము కానేరదు. ఇందుకుదాహరణము– "గ్రహం సమ్మార్ష్టి" అని చూపిన నిర్ణయమున పాణిని మహర్షియొక్క అనుమతిని జూపుచున్నాడు.

శ్లో॥ శిష్యమాణపరే వాక్యే యదేకగ్రహణం కృతమ్ ।
శేషే విశిష్టసంఖ్యేఽపి వ్యక్తం తల్లిఙ్గదర్శనమ్ ॥ 86

శిష్యమాణపరే = శేషింపబడునదియే ప్రధానముగాగల, అనగా అట్టి యర్థమును బోధించెడి, వాక్యే = వాక్యమున అనగా "సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ" (1-2.64) అను సూత్రమున విశిష్టసంఖ్యే = విశిష్టమగు సంఖ్య కలిగిన, అనగా విశేష సంఖ్యతో గూడిన, శేషే + అపి = శేషః అను శబ్దమున్నను, మరల, యత్ + ఏ, ఏకగ్రహణమ్ = 'ఏక' అను శబ్దము నుచ్చరింటుట, కృతమ్ = చేయబడినదో, అనగా పాణినిచే 'ఏక' అను శబ్దముచ్చరింపబడినదో, తత్ = ఆ 'ఏక' గ్రహణము, వ్యక్తమ్ = స్పష్టమగు, లిఙ్గదర్శనమ్ = హేతువు యొక్క కాన్పించుట, (భవతి) = అగుచున్నది. పై యర్థమున 'ఏక' అను శబ్దము హేతు వగుచున్నదని భావము.

86]

"సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ" (1-2.64) అని పాణిని ఏకశేష సూత్రమును రచియించెను, విభక్తి ప్రత్యయము చేర్చునపుడు మార్పులేక ఒకే విధముగానున్న ప్రాతిపదికములలో ఒకటి మిగులును అని సూత్రార్థము. రెండు కడవలను తెమ్ము, అను అర్థమును బోధింపదలచిన, రెండు ఘట శబ్దములను ప్రయోగింపవలె. 'ఘటఘటౌ' అని, మూడు కడవలు అను చెప్పదలచిన అవి మూడు కనుక మూడు ఘటశబ్దములను 'ఘటఘట ఘటాన్' అని ప్రయోగింపవలెను. కాని భాషలో అట్టి ప్రయోగములు లేవు. ఘటౌ, ఘటాన్, అనియే ప్రయోగములు కానవచ్చును. ఆ ప్రయోగముల యుపపత్తికై పై సూత్ర మారంభింపబడినది. రెండు మూడు ఘటశబ్దములు ఏకరూపముగానే యున్నవి, అనగా ఒకే విధమగు వర్ణముల ప్రోగు కలవి, (ఘట-ఘట) రెంటికి ఇట్లే మూడింటికి వర్ణములలో మార్పులేదు, కనుక అచట ఏకశేష కలుగును, అనగా ఒకటి మిగులును, మిగిలినవి లోపించును. 10 ఘటములను లేక 100 ఘటములను బోధింపదలచినను ఒకే ఘటశబ్దము ప్రయోగింపబడి ఆ ఎల్ల అర్థములను బోధింపగలదు. ఇదియే ఆ సూత్రమునకు ప్రయోజనము.

ఈ సూత్రమున 'ఏకశేషః' అను పదము 'ఒకటి శేషించునది' అను అర్థమును బోధించుచున్నది. 'శేషః' అనుచోట ఏకవచనము ఏకత్వసంఖ్యను చెప్పుటచే దానిని వివక్షింపగా, ఒకటి శేషించినది. అని యర్థము సిద్ధించుచుండగా మరల 'ఏక' అను శబ్దమును ప్రయోగింప నక్కరలేదు, ఈ రీతిగ 'ఏక' శబ్దము సూత్రమున లేకున్నను ఒకటి అను అర్థము లభించుచుండగా మరల 'ఏక' అను శబ్దమును ఉపయోగించుటచే పాణిని యొక్క అభిప్రాయమును ఈ రీతిగా ఊహింపవలసి యున్నది. "ఇచట ఏకత్వసంఖ్య వివక్షితము కాదు"– అట్లు కాకున్న ఆ శబ్దమును ప్రయోగించి యుండడుకదా !.

'శిష్యతే అసౌ' అను రీతిని శేషశబ్దము కర్మ ప్రత్యయాంతము, మిగులునది, శేషము. ఏకశేషమనునది సంస్కారము కనుక అప్రధానము. శేషించినది సంస్కరింపబడునది యగుటచే ప్రధానము. శేషించినది గ్రహమువంటిది, సంస్కారమగు ఏకశేషము సమ్మార్జనము వంటిది, కాగా ప్రధానమగుటచే 'గ్రహం సమ్మార్ష్టి' అనుచోట గ్రహమునందు ఏకత్వసంఖ్య వివక్షితము కాలేదు, అట్లే శేషించినది ప్రధానము కనుక దానియందు ఏకత్వసంఖ్య వివక్షితము కానేరదు, అందుచే 'శేషః' అన్నంత మాత్రాన ఒకటి శేషించునది, అను అర్థము లభింపదు, ఆ యర్థమును సంపాదించుటకై పాణిని మరల సూత్రమున 'ఏక' శబ్దమును ప్రయోగించెను. 'ఏక' శబ్దమును ప్రయోగించుటను హేతువుగా జూపి పాణినికి ప్రధానమగు అర్థమునగల సంఖ్య వివక్షితము కాదు అను భావమున్నట్లు అనుమాన ప్రమాణముచే నిశ్చయింప వచ్చును.

పై ప్రకారము ప్రధానమగు అర్థమున సంఖ్య వివక్షితము కాదు, అను భావము పాణినికి సమ్మతమని స్పష్టమగుటచే అప్రధానమగు అర్థమునగల సంఖ్య వివక్షితమగునని వేఱుగ చెప్పనక్కర లేకుండగనే తెలియవచ్చుచున్నది.* ॥86॥

* పర్వతో వహ్నిమాన్, ధూమాత్, యథామహానసః. ఈ యనుమాన ప్రమాణము ఎల్లరులకు తెలిసినదే. అట్లే "పాణినిః ప్రధానే సంఖ్యాన వివక్ష్యతే, ఇత్యాశయవాన్, సరూప సూత్రే ఏకశబ్ద గ్రహణాత్ యథా-గ్రహం సమ్మార్ష్టి అని అనుమానము చూపవచ్చును.

అవతారిక— సంఖ్యకు వివక్ష యుండుటకును లేకుండుటకును 'పశునాయజేత' 'గ్రహం సమ్మార్ష్టి' అను వేదమున కల వాక్యములు ఉదాహరణములుగా జూపబడినవి, వేద మననే కాక పాణిని వ్యాకరణ సూత్రములలో గూడ పై విచారణమునకు ఉదాహరణములు కలవు, అని చూపుచున్నాడు.

శ్లో॥ సమాసప్రత్యయవిధౌ యథా నిపతితా శ్రుతిః ।
గుణానాం పరతన్త్రాణాం న్యాయేనైవోపపద్యతే ॥ 87

సమాస ప్రత్యయ విధౌ = సమాస విధియందు అనగా 'సుప్ సుపా' అను సమాసమును విధించెడి వాక్యమునందు, ప్రత్యయమును విధించు 'జ్యాప్ప్రాతిపదికాత్' (4-1.1) అను విధి యందును, యథా = ఏ ప్రకారముగా, శ్రుతిః = శబ్దము, అనగా సుప్, సుపా, ప్రాతిపదికాత్ అను శబ్దము, నిపతితా = ఏకత్వసంఖ్య కలదై చెవికి గోచరమగుచున్నదో, (తథా) = ఆ ప్రకారముగా, గుణానాం + పరతన్త్రాణామ్ + (ఇతి) = అప్రధానములు పరాధీనములు, ప్రధాన మును అనుసరించియే యుండును అనెడి, న్యాయేన + ఏవ = న్యాయముచేతనే, ఉపపద్యతే = యుక్తమగుచున్నది, అనగా ఆ సంఖ్యతో గూడినదియే భాసించును.

'సహ సుపా' (2-1.4) అని పాణిని సూత్రించెను. ఇందు 'సుబామన్త్రితే పరాఙ్గ వత్స్వరే' (2-1.2) అను సూత్రమునుండి 'సుప్' అను పదము అనువృత్తమగును కాగా సుబం తము సుబంతముతో కలసి. సమాస సంజ్ఞకనుగునని సూత్రార్థము లభించును. ఇచట సమా సము విధేయము కనుక ప్రధానము, సమసించెడివి అవయవములుగా నున్న సుబంతములు అప్రధానములు, కాగా అప్రధానముగా నున్న అర్థమునందు కల సంఖ్య వివక్షితమగుననెడి న్యాయము చొప్పున ఏకత్వసంఖ్య వివక్షితమగును. యాగమువంటిది సమాస విధానము. పశువు వంటిది సమసించెడి సుబంతద్వయము.

ఏకత్వసంఖ్య వివక్షితమగుటచే రెండు సుబంతములకే సమాసము ప్రవర్తించును. బహుపదములకు సమాసము ప్రవర్తింపదు.

ద్వంద్వమున బహువ్రీహియందును 'అనేకమ్' అని ప్రత్యేకముగా చెప్పియున్నం దున ద్వంద్వ బహువ్రీహులు బహుపదములకు గూడ కలుగును.

ఇట్లే 'జ్యాప్ప్రాతిపదికాత్' (4-1.1) అను సూత్రమును పాణిని చూపెను. గౌరీ మున్నగు ఙ్యంతములకంటె, రమా మున్నగు ఆబంతములకంటె ప్రాతిపదికము కంటెను సుప్ ప్రత్యయము మున్నగునవి ప్రవర్తించునని దాని యర్థము. ఇచట ప్రత్యయ విధానము ప్రధానము అందు ప్రాతిపదికము గుణీభూతమగుచున్నది. ఈ రీతిగ ప్రాతిపదికము అప్ర ధానమగుటచే అచట ప్రత్యయార్థమగు ఏకత్వసంఖ్య వివక్షితమగును కనుక ప్రాతిపదిక ముల సముదాయముకంటె సుప్పు ప్రవర్తింపదు. ఒక ప్రాతిపదికముకంటెనే అది ప్రవర్తించును. ॥87॥

అవతారిక — అప్రధానమగు అర్థమునందున్న సంఖ్య వివక్షితమగునని యింత వరకు చూపబడినది, అట్టి సంఖ్య వివక్షితమేయగునని నియమము లేదు కొన్ని స్థలములలో సందర్భమునుబట్టి అవివక్షితము కూడ కాగలదని చూపుచున్నాడు.

శ్లో॥ గుణేఽపినాఙ్గీ క్రియతే ప్రధానాన్తర సిద్ధయే ।
సంఖ్యా కర్తాతథా కర్మణ్యవిశిష్టః ప్రతీయతే ॥ 88

ప్రధానాన్తర సిద్ధయే = మరియొక ప్రధానమగు అర్థమునకు గూడ కార్యసిద్ధికొరకు, గుణే + అపి = అప్రధానమగు అర్థమునందున్నను, సంఖ్యా = ఏకత్వము మున్నగు సంఖ్య, న + అఙ్గీక్రియతే = స్వీకరింపబడదు, అనగా వివక్షితము కాదు.

తథా = ఇట్లుండగా, కర్మణి = కర్మ సంజ్ఞా విషయమున అనగా "కర్తు రీప్సిత తమం కర్మ" (1-4.49) అను సూత్రము విషయమై, కర్తా = ఆ సూత్రమున చెప్పబడిన కర్త, అవిశిష్టః = సంఖ్యతో కూడి యుండకయే, అనగా సంఖ్యా సంబంధము లేకయే, ప్రతీయతే = తెలియబడును.

పాణిని "కర్తు రీప్సితతమం కర్మ" (1-4.49) అను సూత్రముచే కర్మసంజ్ఞను విధించెను. కర్తయందున్న క్రియతో సంబంధించియున్న కారకము కర్మ సంజ్ఞ కలదియగు నని సూత్రమున కర్థము.

'కర్తుః' అను పదము ఏకవచనాంతము. మరియు అది పుంలింగము. కర్మ సంజ్ఞ విధింపబడుటచే అది ప్రధానము. దానికి ఉపకరించుటచే కర్త అప్రధానము, కాగా అప్రధాన మగు అర్థమునగల సంఖ్య వివక్షితమగునని నియమము ప్రకారము ఇచట కర్తయందున్న సంఖ్య వివక్షితమగుచో ఒక కర్తయందున్న క్రియతో సంబంధించిన కారకమునకే కర్మ సంజ్ఞ కలుగవలెను. అట్టి యర్థము స్వీకరించిన ఇద్దరు ముగ్గురియందున్న క్రియలతో సంబం ధించిన కారకమునకు కర్మ సంజ్ఞ రాకపోయెడిని. అట్టి కారకమునకు కూడ ఆ సంజ్ఞ కలుగుట సమ్మతము. కనుక కర్తయందున్న సంఖ్యను వివక్ష చేయరాదు. అట్లే అచట పుంస్త్వము కూడ వివక్షితము కాదు. కాగా ఇద్దరు ముగ్గురు, కాక ఆడువాండ్రు వీరియందున్న క్రియతో సంబంధించియున్న కారకమునకు కూడ కర్మ సంజ్ఞ సిద్ధించును.

అట్లుకాక కర్తయొక్క సంఖ్యను వివక్షించిన ఒక కర్తకు సంబంధించినదియే కర్మ సంజ్ఞకమని సంకోచము కలుగును. అట్టి అప్రధానమును బట్టి ప్రధానము నియమిత మగును. కాగా ప్రధానమే అప్రధానమును అనసరించినట్లగును.

కాబట్టి సంఖ్య అవివక్షితమై రెండు మూడు కర్తృపదార్థములకు సంబంధించిన ప్రధానములకు గూడ కర్మ సంజ్ఞ కలుగును. ॥88॥

అవతారిక— పై యర్థమునే దృఢపరచుచున్నాడు.

శ్లో॥ యస్యాన్యస్య ప్రసక్తస్య నియమార్థా పునఃశ్రుతిః ।
నివృత్తౌ చరితార్థత్వాత్సంఖ్యా తత్రావివక్షితా ॥ 89

యస్య = దేనికి, పునః + శ్రుతిః = మరల చెప్పుట, అనగా సూత్రమున చెప్పకపోయినను సిద్ధించుచుండగా మరల చెప్పుట, అన్యస్య = ఇతరమగు దానికి, ప్రసక్తస్య = ప్రసక్తమగు కార్యమునకు, నివృత్తౌ = వారించుట విషయమై చరితార్థత్వాత్ = చూపబడిన ప్రయోజనము కలది యగుట వలన, నియమార్థా = నియమము ప్రయోజనముగా కలదియౌ, తత్ర = అచట, సంఖ్యా = ఏకత్వము మున్నగు సంఖ్య, అవివక్షితా = అవివక్షితమగును.

"కర్తు రీప్సితతమం కర్మ" (1-4.49) అను సూత్రమున కర్తుః, అను పదము కలదు. దానివలన కర్తకు ఈప్సితము కర్మ సంజ్ఞ కలదని యర్థము లభించును. కాని బాగుగ ఆలోచించిన 'కర్తుః' అను పదము సూత్రమునలేకున్నను ఆ యర్థము లభించును. ఎట్లన, 'ఈప్సితతమమ్' అనగా మిక్కిలి కోరబడినది యని యర్థము. కోరు వానిని వేరుగ చెప్పకున్నను అర్థాత్తు లభించును, ఆ కోరువాడు కర్తయే. ఈ రీతిగా కర్తుః అను పదము వ్యర్థమే యగుచున్నది. పై పద్ధతిలో కర్మకు కరణమునకు గూడ ఈప్సితతమమగునది కర్మ సంజ్ఞకము కావలెను. అది సమ్మతము కాదు, అందుచే 'కర్తుః' అను పదమువలన "కర్తకే ఈప్సితతమము కర్మయగును" అని నియమము సిద్ధించును. అట్టితరి కర్మాదులకు ఈప్సిత మగు దానికి కర్మ సంజ్ఞ వారింపబడును.

కాగా 'కర్తుః' అను పదము కారకాంతరమునే వారించుచున్నది. కర్త ఒకడా, కాక అనేకమా అను అర్థముతో ప్రసక్తిలేదు. కాబట్టి సంఖ్య *అవివక్షితమే యగును. ॥89॥

అవతారిక— 'ప్రాతిపదికాత్' అను స్థలమున ఏకత్వసంఖ్య వివక్షితమగును. అందుచే ఒకే ప్రాతిపదికము కంటె సుప్ ప్రత్యయము ప్రవర్తించును. అంతియేకాని 2.3 ప్రాతిపదికములకంటె విభక్తి ప్రత్యయము ప్రవర్తింపదని 87 వ శ్లోకమున చెప్పబడినది.

కాని మహాభాష్యకారుడు 'సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ' (1-2.64) అను సూత్రమును వ్యాఖ్యానించుచు ప్రాతిపదిక సముదాయము కంటెను విభక్తి ప్రత్యయము కలుగునని చెప్పెను.

కాగా పై భాష్యము విరోధించుచున్నది అను పూర్వపక్షమునకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సరూపసముదాయాత్తు విభక్తిర్యా విధీయతే ।
ఏకస్తత్రార్థవాన్ సిద్ధః సముదాయస్య వాచకః ॥ 90

---

* 89 వ శ్లోకార్థమునకు "శేషాత్కర్తరివరస్మైపదమ్" (1-3 78) మున్నగు చాల సూత్రములు ఉదాహరణములు కాగలవు. విశేషము నాకాంక్షించువారు మూలగ్రంథము చూతురుగాక. గ్రంథవిస్తర భీతిచే నిచట చూపలేదు

సరూప సముదాయాత్ + తు = సమానమగు అక్షరసామ్యముకల ప్రాతిపదికముల సమూహము కంటె, యా = ఏ, విభక్తిః + తు = విభక్తి ఐతే, విధీయతే = విధింపబడుచున్నదో, అనగా 3, 4 ప్రాతిపదికముల సముదాయము కంటె విభక్తి ప్రత్యయము భాష్యకారునిచే విధింపబడుచున్నదో, తత్ర = ఆ విభక్తి విషయమున, సముదాయస్య = 3, 4 ప్రాతిపదికములచే బోధింపబడెడి అర్థముల సమూహమునకు, వాచకః = బోధకమగునట్టియు, అర్థవాన్ = అర్థవంతమగు, ఏకః = ఒకటి అనగా 3, 4 ప్రాతిపదికముల సమూహ రూపమగు ఒక శబ్దము, సిద్ధః = సిద్ధించునది (భవతి) అగుచున్నది.

'ఘట' అనునది ఒక ప్రాతిపదికము. ఇట్టి 3, 4 ప్రాతిపదికములు కలిసియుండగా (ఘట-ఘట, ఘట) వీని సముదాయమునకు ప్రాతిపదిక సంజ్ఞ కలుగును. వేరువేరు 1, 2, 3, 4 ప్రాతిపదికములు అర్థవంతములే. వానిని ఏకముగాకలిపిన ఆ సముదాయము అర్థవంతమే. కాబట్టి సముదాయముకంటె విభక్తి ప్రత్యయము ప్రవర్తింపగలదు. ఈ యంశమును "సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ" (1-2.64) అను సూత్రమును వ్యాఖ్యానించు సందర్భమున *మహాభాష్యకారుడు స్పష్టపరచెను, కనుక పై భాష్యము విరోధింపదు. ॥90॥

అవతారిక— ప్రత్యయవిధియందు సమాసవిధియందును అప్రధానమగు అర్థమున గల సంఖ్య వివక్షితమగునని 87 వ శ్లోకమున నిరూపింపబడినది. అట్లు చేయుట చాల యుక్తము అట్లైన ప్రధానార్థమునకు భంగములేకుండగ ఎన్నియో కార్యములు సిద్ధింపగలవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రత్యయస్య ప్రధానస్య సమాసస్యాపి వా విధౌ ।
సిద్ధః సంఖ్యా వివక్షా యాం సర్వథానుగ్రహో గుణే॥ 91

ప్రత్యయస్య = ప్రత్యయముయొక్క అనగా సుప్పు మున్నగు ప్రత్యయముయొక్క, సమాసస్య + వా = సమాసముయొక్కయు, విధౌ = విధియందు అనగా వానిని విధించెడి "ఙ్యాప్ప్రాతిపదికాత్" (4-1.1). "సుప్ సుపా" (2-1.4) అను సూత్రములయందు, గుణే = అప్రధానమగు దానియందు, అనగా ప్రాతిపదికాత్, సుప్, సుపా అని వానియందు, సంఖ్యా వివక్షాయామ్ + అపి = ఏకత్వరూపమగు సంఖ్యను వివక్షించినను, సర్వథా = ఎల్లవిధముల, ప్రధానస్య = ప్రధానమగు దానియొక్క అనగా అట్టి ప్రత్యయముయొక్క సమాసముయొక్కయు, అనుగ్రహః = అనుగ్రహము అనగా ఆనుకూల్యము, సిద్ధః = సిద్ధించును.

'ప్రాతిపదికాత్' అనుచోట ఏకత్వము వివక్షితమగును, కాబట్టి ఒకే ప్రాతిపదికము

---

* "అథవాపునరస్తు ఏకవిభక్తా వేకశేషః" (కాక సముదాయముకంటె ఒక విభక్తి ప్రవర్తింపగా ఏకశేషము కలుగును) అని అచట వార్తికభాష్యములు కలవు. అచట 6 పక్షములు చూపబడినవి! వానిలో నిది ఒకటి.

కంటె ఒకే విభక్తి ప్రత్యయము ప్రవర్తించును. అంతియేకాని ఘట-పట మున్నగు ప్రాతి పదికముల సముదాయముకంటె ఒకే విభక్తి ప్రత్యయము ప్రవర్తింపదు.

కాని ఒకే రూపములుకల 3, 4 (ఘట-ఘట-ఘట-ఘట) ప్రాతిపదికముల సముదాయ మున్నచో ఆ సముదాయమునకు వేరుగా ఒక ప్రాతిపదిక సంజ్ఞ కలుగుటచే ఆ సముదాయము కంటె ఒకే విభక్తి ప్రత్యయము ప్రవర్తింపగలదు. ఇదియే సర్వథా అనుగ్రహము. అనగా వేరువేరు ప్రాతిపదికముల కంటెను, సరూపములగు ప్రాతిపదికముల సముదాయము కంటెను విభక్తి ప్రవర్తించును.

ఇట్లే 'సుప్ సుపా' అను సమాసవిధిలో ఏకత్వము వివక్షితమగును కాబట్టి రెండు సుబంతములకే సమాససంజ్ఞ కలుగును.

కాని ద్వంద్వసమాసము, బహువ్రీహి సమాసము కూడ ఆ సూత్రములలో 'అనేకమ్' అని ప్రత్యేకముగా చెప్పియుండుటచే బహుపదములకు గూడ ద్వంద్వబహువ్రీహి సమాసములు ప్రవర్తింపగలవు. ఇదియే సర్వథా అనుగ్రహము.

ప్రత్యయ విధానము, సమాస విధానము ప్రధానములు. ప్రాతిపదికాత్, సుబన్తమ్, సుబన్తేన అనునవి అప్రధానములు.

ఇంతటితో సంఖ్యా వివక్ష పూర్తి అయినది. ॥91॥

అవతారిక— ఎల్ల శబ్దములకు జాతియే వాచ్యమగునని యీ సముద్దేశమున ప్రతిజ్ఞ చేయబడినది.

అందు ప్రాతిపదికము ధాతువు కూడ జాతినే బోధించుననియు, విభక్తి ప్రత్యయము కూడ సంఖ్యాత్వజాతినే బోధించుననియు 49 వ శ్లోకము చివరివరకు నిరూపింపబడినది. ఇది అపోద్ధారపద్ధతికి ఉపయోగపడును.

ఆ సంఖ్యా ప్రసంగవశమున ప్రత్యయార్థమగు సంఖ్య వివక్షితము అవివక్షితము అను విషయము 50 వ శ్లోకమునుండి యింతవరకు ప్రదర్శింపబడినది.

పై యంశమును ముగించి, మరల జాతినిగురించి చెప్పదలచిన విశేషాంశములను జూపుచున్నాడు.

**శ్లో॥ అభేదరూపం సాదృశ్యమాత్మభూతాశ్చ శక్తయః ।
జాతి పర్యాయవాచిత్వ మేషామప్యుపవర్ణ్యతే ॥ 92**

అభేదరూపమ్ = వేరుకానట్టి, సాదృశ్యమ్ = సామ్యము, అనగా వ్యక్తులకు ఏకరూపమగు సామ్యము, ఆత్మభూతాః = వ్యక్తిరూపములేయగు, శక్తయః + చ = శక్తులు కూడ అనగా కార్యమును కలిగించెడి సామర్థ్యములు కూడ (జాతిః + ఇతి + వ్యపదిశ్యన్తే) = జాతి అని వ్యవహరింపబడుచున్నవి, అనగా పిలువబడుచున్నవి.

ఏషామ్ = సాదృశ్యము, శక్తి అను మున్నగువానికి, జాతిపర్యాయ వాచిత్వమ్ + అపి = జాతిని బోధించెడి శబ్దములకు పర్యాయ శబ్దత్వము కూడ, ఉపపద్యతే = అంగీకరింప బడుచున్నది.

కొందరు ప్రశ్నించెదరు— 'గోవ్యక్తు లన్నిటియందు గౌః, అను ఏకరూపమగు జ్ఞానము కలుగుటచే దాని బలమువలన గోత్వమనే జాతిని అంగీకరించుట అయుక్తము. ఏల యన ఏకరూపమగు సాదృశ్యము ఎల్లగోవులకు కలదు. అట్లే ఎల్లగోవులయందు కార్యమును కలిగించెడి శక్తులు కలవు. కాగా సాదృశ్యమునుబట్టిగాని, సామర్థ్యమునుబట్టిగాని ఏకరూప మగు జ్ఞానము కలుగవచ్చును. ఇట్లుండగ వేరుగ జాతిని స్వీకరింపనక్కరలేదు.

ఈ ప్రశ్న సత్యమే. సాదృశ్యము, శక్తి అనునవియు జాతిరూపములే. జాతి, ఆకృతి అను పర్యాయపదములున్నట్లు సాదృశ్యము, శక్తి అనునవియు పర్యాయపదములు కాగలవు.

సాదృశ్యము శక్తి మున్నగునవి జాతికంటె వేరుగా ఉన్నవా ? కాక ఏకరూపము లేనా ? అని శాస్త్రజ్ఞులు విచారింతురు. వారికి పట్టుదలయే మిగులును. ॥92॥

అవతారిక — జాతి సాదృశ్యరూపము కాదు. అది దానికంటె వేరుగానే యున్న దని వైశేషిక దర్శనము నాశ్రయించి సమర్థించుచున్నాడు

శ్లో॥ **దణ్డోపాదిత్సయా దణ్డం యద్యపి ప్రతిపద్యతే ।**
నతస్మాదేవ సామర్థ్యాత్స దణ్డీతి ప్రతీయతే ॥ 93

శ్లో॥ **నేచ్ఛానిమిత్తా దిచ్ఛావానితి జ్ఞానం ప్రవర్తతే ।**
తస్మాత్సత్యపి సామర్థ్యే బుద్ధిరర్థాన్తరాశ్రయా ॥ 94

యద్యపి = ఆలోచింపగా, దణ్డోపాదిత్సయా = దండమును (కఱ్ఱను) గ్రహింపవలెననెడి కోరికచే, దణ్డమ్ = దండమును, ప్రతిపద్యతే = పొందుచున్నాడు

(తథాపి) కాని, తస్మాత్ + ఏవ + సామర్థ్యాత్ = ఆ దండమునందు కార్యమును కలిగించుట యనే సామర్థ్యము వలననే, సః = అతడు అనగా దండమును ధరించినవాడు, దణ్డీ + ఇతి = దండము కలవాడని, న + ప్రతీయతే = తెలియబడడు.

ఇచ్ఛానిమిత్తాత్ = కోరికకు కారణమగుదానివలన, ఇచ్ఛావాన్ + ఇతి = కోరిక కలవాడనెడి, జ్ఞానమ్ = జ్ఞానము, న + ప్రవర్తతే = కలుగనేరదు.

తస్మాత్ = ఆ కారణమువలన అనగ ప్రకృత వ్యవహారము జరుగనేరదను కార ణము వలన, సామర్థ్యే = సామర్థ్యము, సతి + అపి = ప్రతి వ్యక్తియందు ఉన్నను, బుద్ధిః = ఎల్ల గోవులయందు, 'గౌః' అను ఏకాకారమగు జ్ఞానము, అర్థాన్తరాశ్రయా = మరియొక యర్థము ఆధారముగా అనగా నిమిత్తముగా గలదియే యగును. ఆ యర్థము జాతియేయని భావము.

ఎల్ల గోవ్యక్తులయందు 'గౌః గౌః' అను ఏకాకారముగు జ్ఞానము కలుగుచున్నది. ఆ జ్ఞానమునకు గోత్వమను జాతియే కారణమగును, యోగ్యమగు కారణముబట్టియే కార్యము కలుగును. అట్టి జ్ఞానము గోవులకున్న సామ్యమునుబట్టి కలుగనేరదు. అట్లైన, 'సదృశః' (ఈ వ్యక్తికి, ఆ వ్యక్తికి సమానమైనది) అనియే జ్ఞానము కలుగవలెను 'గౌః' అను ఏకాకారమగు జ్ఞానము కలుగనేరదు. అట్లే వానియందున్న సామర్థ్యమునుబట్టియు ఆ జ్ఞానము కలుగనేరదు. అట్లుకాకున్న 'సమర్థః' అను రీతినే జ్ఞానము కలుగవలెను. కారణమునుబట్టి కదా కార్యము కలుగును.

ఇందుకు దృష్టాంతము చూపబడినది. లోకమున దండము ధరియించువానిని 'దణ్డీ' అని వ్యవహరింతురు. అచట దండ సంబంధము కారణము. దండమునకు మనుష్యునకు సంబంధము సంయోగము దండ సంబంధము ఎవరికి కలుగుననగా దండమును గ్రహింపవలెననెడి కోరిక ఉన్నవారికి కలుగును. కాగా దండ సంబంధమునకు కోరిక కారణమగును. అట్టితరి అట్టి ఇచ్ఛనుబట్టి 'దణ్డీ' అను వ్యవహారము కలుగదు, సంబంధమువలననే పై వ్యవహారము కలుగును.

అట్లే దండమును గ్రహించెడి ఇచ్ఛకు కారణమేది ? అని ఆలోచించిన, ఆ దండమును ఎచట వినియోగించినపుడు అది సమర్థమై కార్యజనకమగునో, అచటకల సామర్థ్యము కారణమనవలెను. అట్టితరి ఆ సామర్థ్యమువలన, 'దణ్డీ' అను వ్యవహారము కలుగదు.

కాగా ఇచ్ఛకు ఏది నిమిత్తమో, దానినిబట్టి 'ఇచ్ఛ కలవాడు' అను వ్యవహారము కలుగదు.

ప్రకృతమున ఎల్లగోవులయందు 'గోత్వజ్ఞానము కలుగుటలో వానికిగల సాదృశ్యము సామర్థ్యము నిమిత్తము కావచ్చును. వానినిబట్టి మాత్రము 'గౌః' అను ఏకాకారమగు జ్ఞానము కలుగనేరదు. ఆ జ్ఞానము సామాన్యమునుబట్టియే కలుగును.

కాబట్టి సాదృశ్యముకంటె సామర్థ్యముకంటెను వేరుగా సామాన్యమును అనగా జాతిని అంగీకరింపవలెను ॥93-94॥

అవతారిక — అతిరిక్తమగు జాతిని అంగీకరింపనియెడల లోకమున శాబ్దవ్యవహారమునకు అనగా శబ్దమువలన కలిగెడి పరస్పరాభిప్రాయమును గుర్తించుటకు భంగమే కలుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ స్వభావోఽవ్యపదేశ్యో వా సామర్థ్యం వావతిష్ఠతే ।
సర్వస్యాన్తే యతస్తస్మాద్వ్యవహారో న కల్పతే ॥ 95

యతః = ఎందువలన, సర్వస్య = ఎల్ల పదార్థమునకు అనగా కారణముగా కల్పింపబడిన పదార్థ మాత్రమునకు, అన్తే = చివరయందు అనగా మూలకారణమునందు, స్వభావః + వా = స్వభావముగాని, సామర్థ్యమ్ + వా = సామర్థ్యముగాని, అవ్యపదేశ్యః = ఇది యిట్లు, అది ఆ రీతిగా ; అని విశేషించి చెప్పుటకు అలవికానిదై, అవతిష్ఠతే = ఉండునో,

తస్మాత్ = అందువలన, వ్యవహారః = శబ్దము వలన లోకులకు కలిగెడి వ్యవహారము అనగా పనులు చేసికొనుట, న + కల్పతే = కుదరదు, అనగా జరుగనేరదు.

మనుష్యుడు జీవించుటకు కారణము ఏది ? అని ప్రశ్నింపగా, అన్నము కారణమని చెప్పవచ్చును. దానికి కారణమెద్ది ? అని ప్రశ్నకు ఓషధులు అని చెప్పవచ్చును వానికి కారణమేది ? మరల ఆ కారణమునకు కారణమేది ? అను రీతిని ప్రశ్న పరంపర కలుగగా చివరకు మూలకారణము పరమాణువులు, ప్రధానము బ్రహ్మము అని చెప్పవలెను. దానివలన ఇది యెట్లు కలుగును అని ప్రశ్నింపగా అది దాని స్వభావమని చెప్పవలెను. నిజమున అది మనకు ప్రత్యక్షము కానందున దాని స్వభావము కూడ ప్రత్యక్షముకానందున, ఇది యిట్లు, అని స్పష్టముగా తెలియనేరదు. అట్లుకాక ఆ మూలకారణమునందు అనేక శక్తులున్నవని యంగీకరించిన, కారణము ప్రత్యక్షము కానందున దాని శక్తులు ప్రత్యక్షము కానందున అవియు స్పష్టముగా తెలియబడవు.

అట్టి తరి 'గామానయ' (ఆవును తెమ్ము) ఓదనం పచ (అన్నము వండుము) మున్నగు వాక్యములవలన నియతమగు అర్థము తెలియనందున లోక ప్రవృత్తియే జరుగక పోయెడిని. 'గామానయ' అని ప్రయోగింపగా స్వభావమును తెమ్ము, సామర్థ్యమును తెమ్ము అను రీతిని జ్ఞానము కలుగవలెను.

కాబట్టి సామర్థ్యము, సాదృశ్యము, స్వభావము వీని అన్నిటికంటె వేరుగ జాతులను స్వీకరింపవలెను. జాతులనుబట్టి శబ్దముల యర్థములు నియతముగా గ్రహింపబడగలవు. దానినిబట్టి లోకులు శబ్దములవలన సరియగు ప్రవృత్తి నివృత్తులను చేయగలరు. ॥౯౫॥

అవతారిక — కపిల సాంఖ్యమతమును అద్వైతమతమును ఆశ్రయించి వేరుగా జాతిని అంగీకరింపవలెనని చెప్పుచున్నాడు.

శ్లో॥ యదా భేదాన్ పరిత్యజ్య బుద్ధ్యైక ఇవ గృహ్యతే ।
వ్యక్త్యాత్మైవ తదా తత్ర బుద్ధిరేకా ప్రవర్తతే ॥ 96

యదా = ఎపుడు, భేదాన్ = ఎల్ల భేదములను, పరిత్యజ్య = విడనాడి, వ్యక్త్యాత్మా + ఏవ = వ్యక్తియొక్క స్వరూపమే, బుద్ధ్యా = బుద్ధిచే ఏకః + ఇవ = ఒకే వస్తువువలె, గృహ్యతే = గ్రహింపబడునో, తదా = అపుడు, తత్ర = ఆ వ్యక్తియొక్క రూపమునందు, అనగా దానిని ఘూత్రగా గ్రైకొని, ఏకా = ఏకాకారమగు, బుద్ధిః = బుద్ధి అనగా సామాన్య జ్ఞానము, ప్రవర్తతే = కలుగుచున్నది.

ప్రపంచకమునకు ప్రధానము అనగా మూల ప్రకృతి ఒక్కటియే కారణము. కాగా కార్యము ప్రపంచకము. కార్యమునకు కారణమునకు అభేదము. అనగా కారణముకంటె కార్యము భిన్నము కాదు. విశేషరూపమున వానికి భేదము కూడ కలదు. ఒకే వస్తువునకు అనేక రూపములతో స్థితి కలుగుటచే వానికి అభేదము కలుగును. అదియే సామాన్యము, భేద

మును వివక్షించిన అదియే విశేషము. ఎల్ల వస్తువులకు అభేదమును అంగీకరించిన అదియే మహా సామాన్యము. అవాంతరభేదమును అంగీకరించిన అదియే గోత్వము, ఘటత్వము అను రీతిని అపరసామాన్యము.

ఎల్ల వస్తువులు మూల ప్రకృతియొక్క పరిణామమే. అద్వైతమతమున అవి బ్రహ్మముయొక్క వివర్తములు.

కాగా భేదాఽభేద విచారముచేయక ఎల్లభేదములను విడనాడి కేవల వ్యక్తులనే ఏక బుద్ధికి విషయమగునట్లు చూచిన అందు విషయమగునది సామాన్యమే కావలెను.

కాబట్టి సాంఖ్యమతమును జూచిన, అద్వైతమతమును జూచిన సామాన్యము అనగా జాతి తప్పక అంగీకరింపవలెను. ॥96॥

అవతారిక— పాణిని మహర్షి "సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ" (1-2.64) అసూత్రముచే ఘటౌ, ఘటాః, మున్నగు స్థలములయందు ఏకిశేషమును విధించెను. ఎన్ని ఘట వ్యక్తులను బోధింపదలచెనో, అన్ని ఘట శబ్దములను ప్రయోగింపవలెను. కాని లోకమున అట్లులేక ఒకే ఘటశబ్దమును ప్రయోగించుట కానవచ్చుచున్నది. దానికి ఉపపత్తిని చూపుటకై ఏకశేషము ఆరంభింపబడినది. కాగా వ్యక్తి పక్షమున సూత్రము అవసరమగుచున్నది.

ఘటాది శబ్దములకు ఘటత్వము మున్నగు జాతియే వాచ్యమగును ఈ పక్షమున ఒకే ఘటశబ్దము జాతిని పురస్కరించుకొని ఎన్నియో ఘటములను బోధింపగలదు. కనుక ఏకశేష సూత్రము చెప్పనక్కర లేదు.

మహాభాష్యకారుడు జాతి పక్షమును ఆశ్రయించి పై పద్ధతిని ఏకశేష సూత్ర మక్కరలేదని సిద్ధాంతమును చూపెను

ఆ సిద్ధాంత పక్షమున బుద్ధికి ఘటముల సమూహము ఎట్లు విషయమగునో, ఆ యంశమును జూపుచున్నాడు.

శ్లో॥ భేదరూపై రనుస్యూతం యదైక మివమన్యతే ।
సమూహావగ్రహా బుద్ధిర్బహుభ్యో జాయతే తదా ॥ 97

బుద్ధిః = బుద్ధి, యదా = ఎప్పుడు, భేదరూపైః = భేదముకల రూపములతో అనగా భిన్న రూపములతో, అనుస్యూతమ్ = అనుసరింపబడియే యున్న సమూహమును, ఏకమ్ + ఇవ = ఒకే పదార్థమునుగా, మన్యతే = తలచునో, తదా = అపుడు, సమూహావగ్రహా = సమూహము ఆధారముగా గలదై, బహుభ్యః = బహు సంఖ్యాకములగు వ్యక్తులవలన, జాయతే = జనించుచున్నది.

శబ్దము నుచ్చరింపగా అర్థము బుద్ధికి విషయమగును, ఆ యర్థము భిన్నముగా నున్న వ్యక్తి, ఏకరూపముగానున్న జాతియు కాగలదు ఆ ఏకత్వము అనగా జాతియందున్న

ఏకత్వము భిన్నములగు వ్యక్తులతో సంవలితమేయగును. కాగా ఏకత్వము అప్రధానమై వ్యక్తులే ప్రధానములుగా నుండుటచే వాని సమూహము బుద్ధికి విషయమగును. కనుకనే "రామలక్ష్మణౌ" మున్నగు ఇతరేతరయోగ ద్వంద్వమున, ఘటౌ, ఘటాః మున్నగు ఏక శేషమున వచనభేదము కానవచ్చుచున్నది. సమాహార ద్వంద్వమున ఏకవచనమే యుండును.

కాబట్టి పై రీతిని ఏకశేష స్థలమున సమూహము విశేషముగా బుద్ధికి విషయమగు చున్నది. ॥97॥

అవతారిక — 'ఘటః, ఘటౌ, ఘటాః' మున్నగు శబ్దములవలన కలిగెడి జ్ఞాన మున జాతి భాసించిన ఏకత్వము నియతమగును. వ్యక్తులు భాసించిన వాని సమూహము భాసించును. ఈ రెండింటికంటె వేరు వస్తువు భాసింపనందున వ్యక్తులకు పరస్పరము భాసించు చున్న సాదృశ్యమును ఎట్లు ఉపపాదింపగలము ? అను ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు.

శ్లో॥ సకృత్ప్రవృత్తా వేకత్వ మా వృత్తౌ సదృశాత్మతామ్ ।
భిన్నాత్మకానాం వ్యక్తీనాం భేదాపోహాత్ప్రపద్యతే ॥ 98

(బుద్ధిః) = బుద్ధి, భిన్నాత్మకానామ్ = భిన్నమగు స్వరూపముకల, వ్యక్తీనామ్ = వ్యక్తులకు, సకృత్ = ఒకసారి, ప్రవృత్తౌ = ప్రవృత్తి కలుగగా, భేదాపోహాత్ = భేదము నశించుటవలన ఏకత్వమ్ = ఏకత్వమును, ప్రపద్యతే = పొందుచున్నది.

భేదము వ్యక్తులనుబట్టి కలుగును — వ్యక్తులను దూరము చేసి ఒకేసారి బుద్ధి ప్రవ ర్తించిన, దానియందు ఏకత్వము విషయమగును. ఆ ఏకత్వము జాతికి సంబంధించును. కాక సముదాయమునకు సంబంధించును. ఈ రీతిగా జాతి, సముదాయము ఉపపన్నములగుచున్నవి.

ఆవృత్తౌ = ఆవృత్తి కలుగగా, సదృశాత్మతామ్ = వ్యక్తులకు గల సాదృశ్యమును, ప్రపద్యతే = పొందుచున్నది.

ఆ బుద్ధియే పలుమారులు వ్యక్తులకు సంబంధించిన, ఆ వృత్తియనునది ఒకే ధర్మము కలవానికే కలుగుటచే వానికి సాదృశ్యము బుద్ధికి విషయమగును.

ఆ బుద్ధికి జాతి విషయము కాదు. జాతి నియతముగా అభేదమును ఆశ్రయించి యున్నది. సముదాయము కూడ ఆ బుద్ధికి విషయము కాదు. అది వ్యక్తుల అనావృత్తిని ఆధా రముగా జేసికొని యుండునుగదా !

గోవువంటిది గవయము అను జంతువు కలదు. ఆ రెంటికి ముందుగా భేద జ్ఞానము కలుగును. పిమ్మట ఆ రెంటికి అవయవముల సామ్యముండుటచే అభేదము భాసించును. దానిని బట్టి వానికి సాదృశ్యము బుద్ధిలో భాసించును. కాబట్టి, జాతి సముదాయము ఏకత్వమునుబట్టి, ఆవృత్తినిబట్టి సాదృశ్యము కూడ ఉపపన్నమగును. ॥98॥

అవతారిక— జాతియననది సాదృశ్యము శక్తి అను వానికంటె అభిన్నమే భిన్నము కాదు అను అవ్యతిరిక్తమగు జాతిని 92వ శ్లోకమున, 93వ శ్లోకమునుంచి వాని కంటె వ్యతిరిక్తమగు జాతిని నిరూపించియున్నాడు.

ప్రస్తుతము బౌద్ధ సిద్ధాంతమును అనుసరించి జాతి నిజరూపమున లేదు. అది కల్పితమే అని 99, 100, 101 మూడు శ్లోకములచే ప్రదర్శించుచున్నాడు.

శ్లో॥ అనుప్రవృత్తేతి యథాభిన్నా బుద్ధిః ప్రతీయతే ।
అర్థోవ్యావృత్త రూపోఽపితథా తత్త్వేన గృహ్యతే ॥ 99

బుద్ధిః = బుద్ధి అనగా జ్ఞానము, అనుప్రవృత్తా + ఇతి = ఎల్ల వ్యక్తులయందు అనుగతముగా నున్నదనెడి కారణమువలన, అభిన్నా = ఏకరూపమై, ప్రతీయతే = తెలియబడుచున్నదో, తథా = అట్లే, అర్థః = అర్థము అనగా ఆవు మున్నగు వ్యక్తి, వ్యావృత్తరూపః + అపి = విలక్షణమగు రూపము కలదియైనను, తత్త్వేన = అభేదరూపమున, గృహ్యతే = తెలియ బడుచున్నది.

ఎల్ల గోవ్యక్తులయందు 'గౌః, గౌః' అను ఏకాకారమగు జ్ఞానము కలుగుచున్నం దున, దానిని పురస్కరించుకొని వేరుగా జాతిని అంగీకరింపవలెనని కొందరు పలుకుదురు.

కాని యది యుక్తము కాదు. వ్యక్తులు వేరువేరుగా నున్నందున వానిని పురస్క రించుకొని కలిగెడి జ్ఞానములు కూడ భిన్నములే. ఎల్ల వ్యక్తులయందు అనుసరించియున్నం దున ఆ జ్ఞానము ఒక్కటియే యని లోకులు తలంచుచున్నారు.

అట్లే గోవ్యక్తులు తమ్ముబట్టియు, ఇతర వ్యక్తులనుబట్టియు భిన్నములే. అట్లైనను అవి యన్నియు ఏకరూపముగనే గుర్తింపబడుచున్నవి

కాగా జాతి యనునది వేరు పదార్థము లేదు. భ్రమ మూలమున కల్పింపబడు చున్నది. ॥99॥

అవతారిక— ఎల్ల గవాది వ్యక్తులకు సంబంధించి 'గౌః, గౌః' అను ఏ కాకారమగు జ్ఞానము కలుగుచున్నది అందు అనాది సిద్ధమగు భ్రమయే కారణమా? కాక బాహ్య ప్రపం చకమున ఆ జ్ఞానమునకు ఏదైన నిమిత్తమున్నదా? అను ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు

శ్లో॥ సరూపాణాం చ సర్వేషాం న భేదోపనివేశినః ।
విద్యన్తే వాచకాః శబ్దాః నాఽపి భేదోఽవధార్యతే 100

1. సరూపాణామ్ = సమానమగు రూపముకల, సర్వేషామ్ + చ = ఎల్ల వస్తువులకు గూడ, భేదః = భేదము, న + అవధార్యత్యే = నిర్ధారణచేసి గుర్తించుటకు వీలుపడదు.

ఎల్ల పదార్థములకు పరస్పరము భేదము* స్వాభావికము, ఒక వస్తువును పోలిన మరియొక వస్తువు ఉండదు. గోవునందిది గవయమను అను లోకం వాడుక యున్నది. కాని అది సత్యము కాదు. ఆ రెంటికికల భేదము గుర్తింపబడక పోవుటచే భ్రమ మూలమున వారలకు ఆ వాడుక కలిగినది. దీనిని 'ప్రఖ్యావ్యవహార' మందురు. అనగా రెంటికికల విశేషము తెలియబడనందున రెండికి సామ్యమున్నది అని భావించుట ప్రఖ్యయని వ్యవహారము. కాగా సాదృశ్యమనునది భ్రమమూలకమే.

2. భేదోపనివేశినః = వస్తువునందు కల అసాధారణమగు స్వరూపమున ఉన్న భేదమునకు దగ్గరగా నున్నట్టియు, వాచకాః = ఆ భేదమును బోధించెడి, శబ్దాః + అపి = శబ్దములు కూడ. న + విద్యన్తే = లేవు

ప్రతి వస్తువునందు అసాధారణమగు ధర్మము కలదు. కాని ఆ ధర్మమునకు సంబంధించిన బోధకమగు శబ్దములు లేవు. ఒక గోవునకు ఏదో ఒక విలక్షణమగు ధర్మముండును ఆ ధర్మము మరియొక గోవున కుండనేరదు. రెండవ దానియందు దానికే సంబంధించిన ధర్మముండును. ఇట్లే మరియొక గోవునకు అసాధారణమగు ధర్మముండును. కోట్లకొలది గోవులున్నను ప్రతి వ్యక్తికి ఇతర వ్యక్తికి లేని ఏదో అసాధారణ ధర్మముండును కాగా ఒక్కొక్క గోవ్యక్తిని బోధించెడి గోశబ్దములు కూడ వేరువేరుగానే యున్నవి. ఆ అసాధారణముగా నున్న ధర్మమును బోధించెడి శబ్దములు లేనేలేవు. ఆ ధర్మము శబ్దగోచరము కానేరదు

పై రీతిని ఆ ధర్మములకు వాచకములగు శబ్దములు లేనందున ఎల్లగోవులకు వాచకము ఒక్క శబ్దమే అని భ్రమయు కలుగుచున్నది కాగా ఎల్లగోవులను ఒకే శబ్దముచే వ్యవహరించుట 'ఉపాఖ్య' వ్యవహారమందురు

కాబట్టి వ్యక్తులకు కల భేదము గుర్తింపబడనందున భ్రమమూలకమగు ఏకరూపమగు జ్ఞానము కలుగుచున్నది. దీనిని 'ప్రఖ్య' వ్యవహారమందురు

వ్యక్తియందున్న విశేషములను బోధించెడి శబ్దములు లేనందున, అభిన్నమగు అనగా ఏకరూపమగు శబ్ద ప్రవృత్తి కలుగుచున్నది. దీనిని 'ఉపాఖ్య' వ్యవహారమందురు.

కాగా సామాన్యమనెడి బాహ్య వస్తువు లేనేలేదు ॥100॥

అవతారిక — పై శ్లోకమున కల 'సర్వేషామ్' (ఎల్ల పదార్థములకు) అను పదముయొక్క అర్థమును వివరించుచున్నాడు.

---

* 'సర్వం స్వలక్షణమ్' అని బుద్ధుని యుపదేశము, ఎల్లవస్తువులు తనకు తానే లక్షణము చిహ్నము, సరియగుట. తనకు సరియగు మరియొకటి లేనేలేదు

1. సర్వం స్వలక్షణమ్, 2. సర్వం దుఃఖమ్, 3. సర్వం క్షణికమ్, 4. సర్వం శూన్యమ్. ఈ నాలుగు బుద్ధుని ఉపదేశములు

శ్లో॥ జ్ఞానశబ్దార్థ విషయా విశేషా యే వ్యవస్థితాః ।
తేషాం దురవధారత్వాత్, జ్ఞానాద్యేకత్వ దర్శనమ్ ॥ 101

జ్ఞాన శబ్దార్థవిషయాః=జ్ఞానము, శబ్దము, అర్థము ఇవి విషయముగాగల అనగా వానియందున్న, యే = ఏ, విశేషాః = అసాధారణమగు ధర్మములు అనగా స్వరూపములు, వ్యవస్థితాః = నిశ్చితములై అనగా ప్రమాణసిద్ధములై యున్నవో, తేషామ్ = ఆ విశేషములు, దురవధారత్వాత్ = తెలిసికొనుటకు శక్యములు కానందున, జ్ఞానాద్యేకత్వదర్శనమ్ = జ్ఞానము మున్నగు వానికి ఏకత్వబుద్ధి కలుగుట జరుగుచున్నది.

ఘటము, పటము మున్నగు అర్థములు అనగా వస్తువులున్నవి వానిని బోధించెడి 'ఘటము, పటము' మున్నగు శబ్దములు కలవు. ఆ శబ్దముల వలన ఘటము మున్నగు అర్థములు విషయముగా గల జ్ఞానములు కలుగుచున్నవి.

జ్ఞానములు పరస్పరము భిన్నములు, ఒకదానిని పోలియున్నది మరియొకటి యుండదు 'ఘట'అను శబ్దము బహువిధమే. వానికి పోలిక లేదు. కోట్లకొలది ఘటవ్యక్తులుండవచ్చును. అవియు పరస్పరము భిన్నములే, వానికి ఏమియు పోలిక యుండనేరదు.

కాని జ్ఞానములకు, అట్లే శబ్దములకు, అట్లే అర్థములకు వానిలోనే వానికి కల భేదము సామాన్య ప్రజలచే గుర్తింపనలవి కానందున, ఎల్ల జ్ఞానములు ఏకరూపములే యని, ఎల్ల ఘట శబ్దములు ఏకరూపములే యని, ఎల్ల ఘటవ్యక్తులు ఏకరూపములే యనియు వివేకము లేని ప్రజలు భావించుచున్నారు

వివేకము కలవారికి మాత్రము జ్ఞాన శబ్దార్థములకు కల భేదము స్పష్టముగ గోచరించును. ॥101॥

అవతారిక— 99, 100, 101 మూడు శ్లోకములచే బౌద్ధమతము నాశ్రయించు స్వతః జాతి లేదనియు జ్ఞాన శబ్దార్థములకు ఏకత్వము లభింపదనియు, ఏకత్వము భ్రమ మూలకమనియు నిరూపించియున్నాడు

ప్రస్తుతము ఆ మతమును ఖండించుచున్నాడు.

శ్లో॥ జ్ఞానేష్వపియథాఽర్థేషు తథా సర్వేషు జాతయః ।
సంసర్గదర్శనే సన్తి, తాశ్చార్థస్య ప్రసాధికాః ॥ 102

సంసర్గ దర్శనే = సంసర్గ* సిద్ధాంతమున అనగా బ్రహ్మమునందు అనంతములగు భిన్న శక్తులు కలవు. అవి ప్రత్యేకము కార్యమును కలిగింపలేవు. అవి పరస్పరము కలసియే కార్య సాధకము లగును అను సిద్ధాంతమున, యథా = ఏ రీతిగా, అర్థేషు = కడవ మున్నగు

* ఈ సిద్ధాంతము ఈ సముద్దేశముననే 29 వ శ్లోకముచే నిరూపింపబడినది ఇది జాతి వాదమునకు మూలము

వస్తువులయందో, తథా = అట్లే, సర్వేషు = ఎల్ల విధములగు, జ్ఞానేషు + అపి = జ్ఞానము లందు కూడ, జాతయః = జాతులు, సన్తి = కలవు.

తాః + చ = ఆ జ్ఞాన జాతులే, అర్థస్య = బాహ్యమగు అర్థజాతికి, ప్రసాధికాః = నిశ్చాయకములు అనగా నిర్ణయమును కలిగించునవై (భవన్తి) = అగుచున్నవి.

ఎల్ల గోవ్యక్తులయందు 'గౌః, గౌః' అను రీతిని ఏకాకారమగు జ్ఞానము కలుగు చున్నది. అది సామాన్యమునుబట్టియే కలుగుచున్నది. దానిని కప్పిపుచ్చుట సాధ్యపడదు. గవాది వ్యక్తులయందు గోత్వము మున్నగు జాతులున్నవని చెప్పుటయే యుక్తము.

అట్లే జ్ఞానములందు కూడ సామాన్య విశేష భావముండుటచే నచట కూడ జాతు లను అంగీకరింపవలెను. ఆ జాతినిబట్టియే గోత్వాది జాతులున్నట్లు నిర్ణయింపబడును. జ్ఞాన మునకు ఏకరూపత్వము సిద్ధించినపుడే వ్యక్తులకు సామాన్యము సిద్ధించును.

అవాంతర భేదమున్నను ఏకరూపమగు జ్ఞానము కలిగిన అచట జాతిని అంగీక రింపవలెను. అట్టితరి ఆనంత్యము ప్రసక్తమైనను అది ప్రకృతమున దోషము కానేరదు.

మరియు విశేషరూపమున శబ్దము బోధకము కానేరదనుటయు యుక్తము కాదు. జాత్యుత్పలాదుల యందున్న గంధాదులవలె అట్టి ధర్మములుండుటలో విరోధము లేదు. ఈ యర్థము ఈ సముద్దేశముననే 47 వ శ్లోకమున విచారింపబడినది ॥102॥

అవతారిక— సంసర్గ దర్శనమునే మరియొక రీతిని చూపుచున్నాడు.

శ్లో॥ జ్ఞేయస్థమేవ సామాన్యం జ్ఞానానాముపకారకమ్।
న జాతు జ్ఞేయవత్ జ్ఞానం పరరూపేణ రూప్యతే ॥ 103

జ్ఞేయస్థమ్ + ఏవ = జ్ఞేయమగు ఘటాదులయందున్నట్టియే, సామాన్యమ్ = సామాన్యము అనగా జాతి, జ్ఞానానామ్ = జ్ఞానములకు అనగా జ్ఞానముల ఏకత్వమునకు, ఉపకారకమ్ = ఉపకరించునది యగును.

స్వతః జ్ఞానములందు జాతి యుండనేరదు, తెలియబడెడి ఘటాది వ్యక్తులయందు జాతి యున్నది. అదియే జ్ఞానములకు ఏకత్వమును సంపాదించును. అనగా వానియందున్న సామాన్యము జ్ఞానములయందుండును. జ్ఞానము స్వతః ఏకరూపమే.

జ్ఞానామ్ = జ్ఞానము, జ్ఞేయవత్ = జ్ఞేయమగు ఘటాదికమువలె, జాతు = ఎన్నడు కూడ, పరరూపేణ = ఇతరములగు పదార్థముల స్వరూపముచే, న + నిరూప్యతే = స్వరూప మును బొందింపబడునది కానేరదు.

ఘటత్వమనెడి ధర్మమునుబట్టి ఘట వ్యక్తి సిద్ధించును. ఆ రీతిగా జ్ఞానమనునది మరియొక దానినిబట్టి సిద్ధించునది కాదు. బాహ్య వస్తువులను పురస్కరించుకొనియే జ్ఞానము

కలుగును. కనుక జ్ఞానము పరాధీనము. స్వతః దానియందు నానాత్వము వైలక్షణ్యము కలుగదు. ఘటాది వ్యక్తినిబట్టి జ్ఞానముయొక్క ఆకారము నిష్పన్నమగును. అట్లే ఘట వ్యక్తి యందున్న ఘటత్వ జాతినిగూడ జ్ఞానము పొందగలదు.

కాబట్టి స్వతః జ్ఞానమునందు సామాన్యము లేకున్నను ఘటాదికమునందున్న జాతి జ్ఞానమునందుండును. కాగా బాహ్య పదార్థమే అందుకు కారణము కాగలదు. ॥103॥

అవతారిక — జ్ఞానము జ్ఞేయము కానందున అది యెన్నడు ఇతర వస్తువుయొక్క రూపముచే నిరూపింపబడదని చెప్పబడినది. కాని యది యెట్లు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ యథా జ్యోతిః ప్రకాశేన నాన్యేనాభిప్రకాశ్యతే ।
జ్ఞానాకార స్తథాన్యేన న జ్ఞానేనోపగృహ్యతే ॥ 104

యథా = ఏ రీతిగా, జ్యోతిః = తేజము, అన్యేన = మరియొక, ప్రకాశేన = తేజముచే, న + అభిప్రకాశ్యతే = ప్రకాశింప చేయబడదో,

తథా = ఆ రీతిగా, జ్ఞానాకారః = జ్ఞానము యొక్క ఆకారము, అన్యేన = మరియొక, జ్ఞానేన = జ్ఞానముచే, న + ఉపగృహ్యతే = గ్రహింపబడదు

ఘటము మున్నగు జడ పదార్థములను దీపము అనగా వెలుతురు ప్రకాశింప చేయును. ఆ వెలుతురు మరియొక వెలుతురును అపేక్షింపదు. అట్లుకాక తేజము మరియొక తేజముచేతనే ప్రకాశింపజేయబడిన అదియు జడమే కావలెను. కనుక తేజము స్వప్రకాశము ఇతరమును అపేక్షింపదు. అట్లే జ్ఞానముకూడ స్వప్రకాశమే. మరియొక జ్ఞానముచే గ్రహింప బడునది కాదు.

ఘటము మున్నగు వ్యక్తులకు ఘటత్వము మున్నగు జాతియొక్క అపేక్ష కలదు. జ్ఞానమునకు అట్టి యపేక్ష లేదు. కాబట్టి అర్థములయందున్న ఏకత్వము జాతినిబట్టి కలుగును. ఆ జాతియు వ్యక్తి ద్వారా జ్ఞానమునకు కలుగును.

జ్ఞానములు ఆకారము కలవి స్వప్రకాశములు. స్వతః అవి జాతి లేనివి.

విశేషాంశము — జ్ఞానమునకు జ్ఞేయమగు ఘటాదులయందున్న సామాన్యములే ఉపకారకములగును. కాని జ్ఞానమునకు ఆకారము లేదు జ్ఞానము స్వప్రకాశము కాదు అని వైశేషికులు తలంతురు

కాని వైయాకరణులు అట్లు భావింపరు. పై రీతిని జ్ఞానము స్వప్రకాశము, సాకారము, సామాన్యరహితమనియే తలంతురు.

వైశేషికమతము యుక్తము కాదు. ఈ యంశము 'జ్ఞానాకారః' అను పదముచే వ్యక్తమగుచున్నది హేలారాజు దీనిని స్పష్టపరచెను ॥104॥

అవతారిక — అయం ఘటః. (ఇది కడవ) అను శబ్దమువలన, ఇది కడవ అను జ్ఞానము కలుగుచున్నది. ఆ జ్ఞానములో ఘటము విషయమగుచున్నది.

అట్లే 'ఘట జ్ఞానమేతత్' అను శబ్దమువలన ఇది 'ఘట జ్ఞానము' అను జ్ఞానము కలుగుచున్నది. ఆ రెండవ జ్ఞానములో జ్ఞానము విషయము కాగలదు. రెంటికి భేదము ఏమియు లేదు కదా ః అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఘటజ్ఞానమితి జ్ఞానం ఘటజ్ఞాన విలక్షణమ్ ।
ఘట ఇత్యపి యత్ జ్ఞానం విషయోపనిపాతి తత్ ॥ 105

ఘట జ్ఞానమ్ + ఇతి = ఘట జ్ఞానము ఇది అనెడి, జ్ఞానమ్ = జ్ఞానము, ఘటజ్ఞాన విలక్షణమ్ = ఘటము అనెడి జ్ఞానముకంటె విజాతీయమైనదే.

'ఘటః' అను పదమువలన కలిగెడి 'ఘటము' అను జ్ఞానము వేరు. 'ఘటజ్ఞానమ్' అను పదమువలన కలిగెడి 'ఇది ఘట జ్ఞానము' అనునది విలక్షణమైనదే. రెండు ఏకరూపములు కావు.

ఇందుకు కారణము చెప్పుచున్నాడు

ఘటః + ఇతి + అపి = ఇది ఘటము అనెడి, యత్ + ఏ, జ్ఞానమ్ = జ్ఞానమో, తత్ = ఆ జ్ఞానము, విషయోపనిపాతి = ఘటము మున్నగు విషయమును అనుసరించి యున్నది.

'ఇది ఘటము' అను జ్ఞానము విషయమువలన కలుగుచున్నది. అనగా విషయముచే జనియించుచున్నది. 'ఇది ఘట జ్ఞానము' అను జ్ఞానము విషయమువలన జనింపలేదు. 'నేను ఇట్టి జ్ఞానము కలవాడను' అను రీతిని ఆ రెండవ జ్ఞానమున్నది

*కాబట్టి ఒక జ్ఞానము మరియొక జ్ఞానము ఎన్నడు గ్రహింపబడదు ॥105॥

అవతారిక — ఘటాదికము జ్ఞానములో విషయమగుచున్నది. గ్రాహకము జ్ఞానము. గ్రాహ్యము ఘటాదికము. జ్ఞానము గ్రాహ్యాకారముకంటె భిన్నము కాదు. ఇది ఘట జ్ఞానము అను జ్ఞానమున ఘటము కూడ సంబంధించి యున్నది కదా ః అందుచే 'ఇది ఘట జ్ఞానము' అను జ్ఞానము కూడ విషయమువలన జనియించినదే అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యతో విషయరూపేణ జ్ఞానరూపం న గృహ్యతే ।
అర్థరూపవివిక్తం చ స్వరూపం నావధార్యతే ॥ 106

* ఈ శ్లోకమునకు హేలారాజు మరియొక రీతిగా వ్యాఖ్య రచించెను విశేషము నపేక్షించువారు మూలము చూతురుగాక, గ్రంథ విస్తర భీతిచే నిచట చూపలేదు.

యతః = ఏల యనగా, జ్ఞానరూపమ్ = 'ఇది ఘట జ్ఞానము' అను జ్ఞానము, విషయరూపేణ = ఘటము మున్నగు విషయముల యొక్క స్వరూపముచే అనగా వానితో మిశ్రితమై, న + గృహ్యతే = గ్రహింపబడదు.

పై చూపబడిన జ్ఞానము విషయ జనితము కాదు.

అర్థరూప వివిక్తమ్ + చ = విషయము యొక్క రూపముతో వివిక్తమగు అనగా దాని రూపములేని, స్వరూపమ్ = జ్ఞానము యొక్క స్వరూపము, న + అవధార్యతే = నిశ్చయింపబడదు

విషయము లేనిది జ్ఞానముండనేరదు, కనుక ఘట జ్ఞానము, అని అనుచున్నారు. వస్తుతః ఆ జ్ఞానము విషయమువలన పుట్టునది కాదు. ॥106॥

జాతి సముద్దేశము ముగిసినది

ద్రవ్యసముద్దేశము–2

అవతారిక— ఎల్లశబ్దములకు జాతికాని, ద్రవ్యముకాని వాచ్యమగునని జాతిసముద్దేశమున రెండవశ్లోకముచే (జాతిర్వా, ద్రవ్యమేవవా) చెప్పి, ఆసముద్దేశమున వాజప్యాయన మహర్షి యొక్క మతమును నాశ్రయించి జాతియే ఎల్ల శబ్దములకు వాచ్యమగుననెడి పక్షమును నిరూపించెను.

ఈః సముద్దేశమున వ్యాడిమహర్షిమతము చొప్పున ద్రవ్యమే ఎల్ల శబ్దములకు వాచ్యమగుననెడి పక్షమును నిరూపించుచున్నాడు

శ్లో॥ ఆత్మావస్తు స్వభావశ్చ శరీరం తత్త్వమిత్యపి ।
ద్రవ్యమిత్యస్య పర్యాయా, స్తచ్చనిత్య మితిస్మృతమ్ ॥ 1

A. నిరూపింపదలచిన ద్రవ్యమును బోధించెడి పర్యాయశబ్దములను ముందుగా చూపుచున్నాడు.

ద్రవ్యమ్ + ఇతి + అస్య = ద్రవ్యమనెడి పదార్థమునకు, ఆత్మా = ఆత్మ శబ్దము, వస్తు = వస్తువు అనుశబ్దము. స్వభావః + చ = స్వభావము అనెడి శబ్దము, శరీరమ్ = శరీరము అను శబ్దము, తత్త్వమ్+ఇతి=తత్త్వము అనుశబ్దము, అపి=ఇవియే, పర్యాయాః పర్యాయములుగా, (సన్తి) = ఉన్నవి, వైయాకరణులు ఏయర్థమును ద్రవ్యముగా భావించిరో, ఆయర్థమును బోధించెడివి ఆత్మమున్నగు ౬ శబ్దములే కలవు. ఇవి తప్ప మరియేశబ్దము ఆద్రవ్యమును బోధింపజాలదని భావము.

ఘటః, పటః మున్నగుశబ్దములు జాతిమున్నగు ఉపాధుల ద్వారా బ్రహ్మరూపమగు ద్రవ్యమును బోధించును ఆత్మమున్నగు అయిదు శబ్దములు ఉపాధులనపేక్షింపకయే ద్రవ్యబోధకములగును.

ఒకే వ్యక్తిని బోధించెడి పలుశబ్దములు పర్యాయ శబ్దములనబడును. ఉదా-ఇన్ద్రః, మరుత్వాన్, మఘవా, పాకశాసనః, శక్రః. ఆ శబ్దముల వ్యుత్పత్తిమాత్రము వేరుగానుండును అట్లే ఆత్మాదిశబ్దములు ద్రవ్యబోధకములై పర్యాయములుగా గుర్తింపబడుచున్నవి.

ఒకే మతమును నాశ్రయించి పైశబ్దములు పర్యాయములుగా ఇచట చూపబడలేదు. వార్శనికులవిభిన్నములగు దృక్పథముల నాశ్రయించి పై శబ్దములు చూపబడినవి.

1. ఆత్మా-ఆప్నోతీతి ఆత్మా (అంతట వ్యాపించి యుండునది, ఆప్ల్ = వ్యాప్తౌ అనిధాతువు) అనువ్యుత్పత్తిచే ఆత్మశబ్దము సత్యజ్ఞానానందరూపమగు నిర్గుణ బ్రహ్మమును బోధించునని అద్వైత శాస్త్రజ్ఞులు విశ్వసింతురు. 'అయమాత్మాబ్రహ్మ' మున్నగు శ్రుతు లిందుకు ప్రమాణము.

2. వస్తు— వసతీతివస్తు (తనయొక్క అసాధారణమగు రూపముతోనుండునది) అనువ్యుత్పత్తిని బట్టి ద్రవ్యము స్వలక్షణమని బుద్ధమతానుయాయులు నమ్ముచున్నారు. "సర్వం స్వలక్షణమ్" (ఏ వస్తువైనను తనతో తానే సమానముగానుండును. తనతోసమానమగు ఇతర వస్తువులేదు) అని వారు భావింతురు. అట్టివస్తువే వ్యవహారమునకు సాధనము

3 స్వభావః- స్వస్యభావః (తనయొక్క భావము) స్వశబ్దమునకు తాను అని యర్థము. తాను అనగా సత్తయే. పూర్వాపరభావము లేకయున్నది సత్త. అదియే తన ప్రక్కనున్న ఉపాధుల భేదముచే భిన్నరూపమును దాల్చి ద్రవ్యమనబడుచున్నదని సత్తాఽద్వైతవాదుల యాశయము.

4. శరీరమ్— శీర్యతే ఇతి శరీరమ్ (నశించునది) అను అభిప్రాయముతో మనకు కానవచ్చెడి నశించు స్వభావము కల దేహము శరీరము. అందు చేతనుడగు పురుషుడు కలడు. అతడు శరీరి అని వ్యవహరింపబడుచున్నాడు పురుషుడు తప్ప మిగతా భాగమంతయు జడమే. అదియే శరీరము కాగా జడమగు శరీరమునకు చేతను డగు శరీరికి భేదము తెలియబడనందున శరీరమే ద్రవ్యము, అదియే ప్రధానమని సామాన్య ప్రజలు తలంచుచున్నారు. అదియే ద్రవ్యము, ఆత్మ అని వారి తలంపు.

5. తత్త్వమ్— తేషాంభావః తత్త్వమ్ (వాని యొక్క అనగా భూమి, నీరు, తేజము, వాయువు అనెడి నాల్గుభూతముల సమష్టి) అనువ్యుత్పత్తిని స్వీకరించి శరీరము ఇంద్రియములు విషయములు వీనియొక్క ప్రోగు ద్రవ్యమని చార్వాకులు నమ్మియున్నారు వీరిమతమున ఆకాశమనే ఐదవభూతములేదు.

పయిరీతిని దార్శనికుల దృక్పథములు విభిన్నములైనను వస్తుతః అన్నిశబ్దములు నిర్గుణాద్వితీయ బ్రహ్మమునే బోధించునని గ్రంథకర్తయొక్క ఆశయము.

B. తత్ = అది అనగా ద్రవ్యము, నిత్యం + చ = నిత్యమే, ఇతి = అని, స్మృతమ్ = స్మరింపబడినది, అనగా చెప్పబడినది. ఆ ద్రవ్యమునిత్యమే, అనిత్యముకాదని పెద్దలు చెప్పుచున్నారని భావము.

"సిద్ధేశబ్దార్థ సంబన్ధే" (శబ్దములు, వానిచే బోధింపబడెడి యర్థములు, ఆశబ్దార్థములకు గల సంబంధములు నిత్యములే) అని కాత్యాయనుడు సిద్ధాంతము చేసెను. ఇచట సిద్ధశబ్దమునకు నిత్యమనియర్థము. ఎల్ల శబ్దములు ద్రవ్యమునే బోధించును. ఆద్రవ్యము నిర్గుణ బ్రహ్మరూపము. కాబట్టి ద్రవ్యము నిత్యమనుట లెస్సయే ఈ యర్థమును మహాభాష్యకారుడు వ్యక్తపరచెను. శబ్దమునకు నిత్యత్వము మొదటి కాండమున చూపబడినది. ॥1॥

ఈ యంశము నిట గుర్తింపవలెను . ద్రవ్యము రెండువిధములుగా నున్నది (1) పారమార్థికము, (2) వ్యావహారికము. మొదటిది నిర్గుణ బ్రహ్మరూపము, అట్టి బ్రహ్మభావమే మోక్షము. రెండవది వ్యాకరణ శాస్త్రమున విధింపబడిన కొన్ని కార్యములు ప్రవర్తించుటకు ఉపయోగపడుచున్నది

ఈ రెండింటిలో పారమార్థిక ద్రవ్యము, ఈ సముద్దేశమున 18 శ్లోకములచే నిరూపింపబడుచున్నది. వ్యావహారిక ద్రవ్యము ఈ కాండముననే 4 వ సముద్దేశమున నిరూపింప బడుచున్నది. ఈ రెంటికి ద్రవ్యసముద్దేశ (భూయో ద్రవ్యసముద్దేశ) మనియే భర్తృహరి నామకరణము చేసియున్నాడు.

అవతారిక— దార్శనికుల విభిన్నములగు దృక్పధముల ఊతగాగైకొని ద్రవ్యపదార్థమును పలు విధములుగా నిర్దేశించి, ఇపుడు కేవలము తన సిద్ధాంతము నాశ్రయించి ద్రవ్యపదార్థమును నిరూపించుచున్నాడు.

శ్లో॥ సత్యంవస్తు తదాకారై రసత్యై రవధార్యతే ।
అసత్యోపాధిభిః శబ్దైః సత్యమేవాభిధీయతే ॥ 2

A సత్యమ్ = సత్యమగు, వస్తు = వస్తువు, తదాకారైః = సత్యమగు పదార్థము యొక్క ఆకారమువంటి ఆకారముకల, అసత్యైః = అసత్యములగు వస్తువులచే, అవధార్యతే = నిశ్చయింపబడు చున్నది

నిర్గుణబ్రహ్మమే సత్యము. అది జ్ఞానరూపము, ఆనందరూపము. దానిని నిజరూపమున తెలిసికొనుట సాధ్యముకాదు. అట్టి సత్యమగు వస్తువు మాయావశమున సగుణముగా భాసించును. ఈ రెండవ రూపము అసత్యమే. కాని సాధకుడు ముందుగా అసత్యమగు సగుణమునే ఉపాసింపవలెను అట్లు ఉపాసింపగా అవిద్య క్షీణింపగా సాధకుడు నిర్గుణ బ్రహ్మభావమును బొందును. కాగా అసత్యములగు కల్పితరూపములు ముందుగా భాసించును. వానిని ఊతగా గైకొని విచారణచేయగా సత్యవస్తువు గోచరించును. అట్టి సత్యవస్తువే ఇచట ద్రవ్యముగా గ్రంథకర్తచే గుర్తింపబడినది. ఈ యాశయము *మహాభాష్యకారుడు స్పష్టపరచి యున్నాడు

B పై యాశయమునే వ్యక్తపరచుచున్నాడు.

అసత్యోపాధిభిః = అసత్యములగు ఉపాధులతోగూడిన అర్థమును బోధించెడి, శబ్దైః = శబ్దములచే, సత్యమ్ + ఏవ = సత్యమగుపదార్థమే, అభిధీయతే = చెప్పబడుచున్నది. జాతి, గుణము, క్రియ మున్నగు ఉపాధులను విడనాడి శబ్దములచే శుద్ధమగు అర్థము బోధింపబడునని భావము.

ఎల్ల శబ్దములకు పరమార్థ సత్యమగు శుద్ధ ద్రవ్యమును బోధించుటయందే ముఖ్యతాత్పర్యము దానికి ఉపాయములుగా జాతి మున్నగునవి స్వీకరింపబడుచున్నవి. చివరకు వానిని పారద్రోలి శుద్ధ ద్రవ్యమునే బోధించును

---

* 'సిద్ధే శబ్దార్థ సంబన్ధే' అను వార్తికమును వ్యాఖ్యానించుచు 'ద్రవ్యం హి నిత్యమ్, ఆకృతి రనిత్యా' అని భాష్యకారుడు పలికెను 'అసత్యోపాధ్యవచ్ఛిన్నం బ్రహ్మతత్త్వ మిహ ద్రవ్య శబ్దవాచ్యమ్' అని కైయటుడు వ్యాఖ్యానించెను దీని భావము పై భాగమున నున్నదే

ఉపాధులు లేనిచో శబ్దము శుద్ధ ద్రవ్యమును బోధింపజాలదు. ఈ యభిప్రాయము సంబంధసముద్దేశమున 52, 53, 54 శ్లోకములలో స్పష్టము కాగలదు. ఉపాధులు శబ్దవాచ్యములు కావు, బోధవిషయములు కూడ కావు. ॥2॥

అవతారిక— జాతి, గుణము మున్నగు ఉపాధుల యందు శబ్దమునకు తాత్పర్యములేనియెడల అవి ఉపాధులేకానోపవు. శబ్దమునకు వాచ్యములుకానివి ఉపాధులు కానేరవుకదా ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అధ్రువేణ నిమిత్తేన దేవదత్తగృహం యథా ।
గృహీతం గృహశబ్దేన శుద్ధమేవాభి ధీయతే ॥ 3

యథా = ఏరీతిగా, దేవదత్తగృహమ్ = దేవదత్తునియిల్లు, అధ్రువేణ = అస్థిరమగు, నిమిత్తేన = నిమిత్తముచే, అనగా కాకము మున్నగు పదార్థముచే, గృహీతమ్ = తెలియబడినది అయినను, గృహశబ్దేన = గృహ అను శబ్దముచే, శుద్ధమ్ + ఏవ = శుద్ధమైనదే, అనగా కాకముయొక్క సంబంధము లేక కేవల గృహమే, అభిధీయతే = చెప్పబడుచున్నదో, (తథా) = అట్లే శబ్దముచే సత్యమగు పదార్థమే చెప్పబడునని 1 వ శ్లోకార్థముతో నన్వయము చూపవలె.

ఒక మనుష్యుడు గ్రామాంతరము వెడలి అచట 'దేవదత్తుని గృహమేది ?', అని అడుగగా 'అదిగో కాకి యున్నది దేవదత్తుని యిల్లు' అని గుర్తు చెప్పుదురు అచట కాకము ఉపాధి, అనగా దేవదత్తుని గృహమును తెలుసుకొనుటలో సహకరించినది. ఇతరుల గృహముల నుండి దేవదత్తుని ఇంటిని వేరుగా చూపు నిర్ణయమున కారణమైనది. ఇంతియేకాని గృహ శబ్దమునకు కాకము వాచ్యార్థము కాదు. కాకము యొక్క ప్రసక్తి లేకుండగనే గృహ శబ్దము శుద్ధమగు - అనగా కాక సంబంధములేని - ఇంటినే బోధించును.

ప్రకృతమున గూడ జాతి, గుణము, క్రియ, సంఖ్య మున్నగు ఉపాధులు ఘట శబ్దమునకు వాచ్యార్థములు కానేరవు. ఘటత్వజాతి నలుపు మున్నగు గుణములు, చలనము మున్నగు క్రియ, ఏకత్వము మున్నగు సంఖ్య, ఇవియన్నియు కాకమువలె ఇతరవస్తువుల కంటె ఘటమును వేరుచేసి ఆ వ్యక్తినే బోధ విషయముగా చేయగలవు

ఇట్టి దృష్టాంతములు చాల కలవు 'దేవదత్తుడు ఎవడు' ? అను ప్రశ్నకు, 'తెల్లని పంచ కట్టుకొన్నవాడు దేవదత్తుడు' అని గుర్తు చెప్పను. ఇచట వస్త్రము ఉపాధి. ॥3॥

అవతారిక— 'కాకవద్దేవదత్త గృహమ్' (కాకముకలది దేవదత్తుని యిల్లు) అనునది ప్రకృతమునకు దృష్టాంతము కానేరదు. ఏలయన— కాకము గృహముకంటె మిక్కిలి విజాతీయమగు వస్తువు. గృహముపై కాకము నిలిచియున్నను ఆ రెంటికి భేదము స్పష్టముగా భాసించును. వానిని వేరుచేయుట సుకరము, కాబట్టి కాకము గృహశబ్దమునకు వాచ్యార్థము కానేరదు. 'ఘటత్వజాతి' గుణము మున్నగునవి కాకమువంటివి కావు. వానిని ద్రవ్యముకంటె

వేరు చేయలేము. వానికి ద్రవ్యముతో భేదము తెలియబడదు. కాబట్టి జాత్యాదులు ఘటాది శబ్దములకు వాచ్యములే యగును. కనుక దృష్టాంతము సరిగా లేదు

ఈ యభిప్రాయముచే సరియగు మరియొక దృష్టాంతమును జూపుచున్నాడు.

శ్లో॥ సువర్ణాది యథాభిన్నం స్వైరాకారై రపాయిభిః ।
రుచకాద్యభిధానానాం శుద్ధమేవైతి వాచ్యతామ్ ॥ 4

స్వైః = తనకు అనగా బంగారమునకు సంబంధించినట్టియు, అపాయిభిః = విభాగము కలిగిన అనగా నియతముగా ఉండనట్టి, ఆకారైః = ఆకారములతో, భిన్నమ్ = వేరుగా ఉన్న, సువర్ణమ్ = బంగారము మున్నగు, శుద్ధమ్ + ఏవ = శుద్ధమగు వస్తువే, రుచకాద్యభిధానానామ్ = 'రుచక' మున్నగు శబ్దములకు (అనగా రుచక, కటక, కంకణ, కుండలాది శబ్దములకు) వాచ్యతామ్ = వాచ్యత్వమును, యథా = ఏ రీతిగా, ఏతి = పొందుచున్నదో, (తథా) = అట్లే శబ్దములచే శుద్ధమగు ద్రవ్యమే చెప్పబడునని రెండవ శ్లోకముతో నన్వయము చేయవలెను. రుచక మనగా ఒకానొక కంఠాభరణ విశేషము.

బంగారముతో కంకణము, కడియము, కుండలము, రుచకము మున్నగు నగలు చేయుదురు. వాని ఆకారములతో బంగారము వేరుగా నున్నదే. కాని కంకణాది శబ్దము మాత్రము ఆకార విశేషముతో సంబంధములేక కేవలమగు బంగారమునే బోధించును. ఆకారములు మార్పు చెందుటచే అనిత్యములే. అవి వేరుగాచేసి చూపుటకు సాధ్యపడవు. అవి కాకమువంటివి కావు. ఐనను వానితో సంబంధములేక కంకణాది శబ్దములు శుద్ధమగు బంగారమునే బోధించును.

ప్రకృతమున గూడ ప్రకృతి సంబంధమున ద్రవ్యము నానారూపములతో భాసించుచున్నను శుద్ధ బ్రహ్మతత్త్వమే శబ్దములచే బోధింపబడును.

విశేషాంశము— ఇచట శబ్దములు కేవలము ఉపాధులనే బోధించుననెడి ఆశయము నిరాకరింపబడుచున్నది. ఉపాధులు అప్రధానములుగా, ద్రవ్యము ప్రధానముగానుండి అవి శబ్దవాచ్యమనుటలో విప్రతిపత్తి లేదు ॥4॥

అవతారిక— బ్రహ్మము వ్యాపకము, అదియే ద్రవ్యరూపము. అట్టి ద్రవ్యము శబ్దార్థమని యంగీకరించిన ఎల్ల శబ్దములు ఎల్ల యర్థములను బోధింపవలెను. కాని యట్లు అనుభవము లేదు. ఘట శబ్దము కడవనే బోధించును. వస్త్రమును బోధింపదు. ఎల్ల శబ్దములకు బ్రహ్మరూపమగు ద్రవ్యమే వాచ్యమగుచో. అది సర్వసాధారణము కాన పై దోషము ప్రసక్తమగుచున్నది అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆకారైశ్చ వ్యవచ్ఛేదాత్ సార్వార్థ్య మవరుధ్యతే ।
యథైవ చక్షురాదీనాం సామర్థ్యం నాడికాదిభిః ॥ 5

ఆకారైః = ఆకారములచే, వ్యవచ్ఛేదాత్ = నియమింపబడి యున్నందున, సార్వార్థ్యమ్ + చ = సర్వార్థ బోధకత్వము మాత్రము అనగా ఎల్ల యర్థములను బోధించుట, అవరుధ్యతే = నివారింపబడుచున్నది.

ఎల్ల శబ్దములు ద్రవ్యబోధకములే. కాని అవిద్యావశమున ఆ ద్రవ్యము రూప విశేషముతో కలసియున్నదే బోధ విషయమగును. ఘటాకారమును ఊతగా గైకొనియున్న బ్రహ్మము ఘట శబ్దముచే బోధింపబడును. అట్లే పటాకారమును ఊతగా గైకొనియున్న బ్రహ్మమును పటశబ్దము బోధించును. ఈ కారణమువలన ఆ యా ఆకారములచే ద్రవ్యము నియమితమగునట్లుండుట వలన ఎల్ల శబ్దములు ఎల్ల యర్థములను బోధింపవు.

పై యర్థమున దృష్టాంతమును జూపుచున్నాడు. చక్షురాదీనామ్ = కన్ను మున్నగువానియొక్క, సామర్థ్యమ్ = శక్తి అనగా విషయమును గ్రహించుట అనే శక్తి, నాడికాదిభిః = గొట్టము మున్నగువానిచే, యథా + ఏవ = ఏ రీతిగా, అవరుధ్యతే = నిరోధింప బడుచున్నదో, నాడిక అనగా గొట్టము నేత్రము తనతో సంబంధించియున్న ఘటము మున్నగు విషయములన్నిటిని గ్రహింపగలదు. కాని మనము వెదురు గొట్టముతో, ఇనుప గొట్టముతో, మరియొక గొట్టముతో చూచిన ఆ కన్ను పరిమితమగు వస్తువునే గ్రహించును దగ్గరగానున్న ఎల్ల వస్తువులను గ్రహింపలేదు. గొట్టము ఇంద్రియము యొక్క శక్తిని నియమితమగునట్లు చేయుచున్నది.

ఇట్లే ఏకాగ్రత, రూపముయొక్క సౌందర్యము కూడ ఇంద్రియశక్తిని సార్వత్రికముకాకుండచేయును.

ఇట్లే అన్నిటిని గ్రహించెడి శక్తి కలిగిన మనస్సు అవధానదశలో ఇతర పదార్థము లను గ్రహింపజాలదు. ॥5॥

అవతారిక — కడవమున్నగు ఎల్లశబ్దములు ద్రవ్యబోధకములనియు, ఆ ద్రవ్యము సార్వత్రికమనియు ఇంతవరకు చెప్పబడినది. కాని అవయవముల కూర్పు అను అర్థము కల సంస్థానము, సన్నివేశము మున్నగు శబ్దములు ధర్మమును బోధించును. అవి పైచూపబడిన ద్రవ్యమును బోధింపవు. కాబట్టి ద్రవ్యపదార్థము సార్వత్రిక మనుటయెట్లు పొసగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ తేష్వాకారేషు యశ్శబ్ద స్తథా భూతేషు వర్తతే ।
తత్త్వాత్మకత్వా త్తేనాపి నిత్యమేవాభిధీయతే ॥ 6

తథాభూతేషు = అట్టి, అనగా ఉపాధి మాత్రమే స్వభావముగా గల, తేషు = ఆ, ఆకారేషు = ఆకారములయందు అనగా అవయవములకూర్పుల యందు, యః = ఏ, శబ్దః = సంస్థానము, సన్నివేశము మున్నగుశబ్దము, వర్తతే = ఉన్నదో. అనగా వానిని బోధించుచున్నదో, తేన + అపి = ఆ శబ్దముచేగూడ, తత్త్వాత్మకత్వాత్ = ద్రవ్యమే స్వరూపముగా గలదియగుటవలన,

7]
నిత్యమ్ + ఏవ = నిత్యమగు ద్రవ్యమే, అభిధీయతే=చెప్పబడుచున్నది. సంస్థాన, సన్నివేశాది శబ్దములు గూడ ద్రవ్యమునే బోధించునని భావము.

ఉపాధులు కల్పితములుకాన అనిత్యములే. వాని నిజరూపము ద్రవ్యమే. ద్రవ్యము మాత్రము ఉపాధి రూపముకాదు. ఉపాధులు మూలభూతమగు ద్రవ్యమునందు లయమును పొందగా (ఉపాధులు) వేరుగా లేనేలేవు ఉపాధులు నిష్కర్షచేయగా బ్రహ్మ సత్తను బట్టియే సద్రూపమున భాసించుచున్నవి.

కాబట్టి యెల్ల శబ్దములు ద్రవ్యబోధకములనుటయే లెస్స ॥6॥

అవతారిక— ఆకారములనిత్యములనియు, ద్రవ్యము నిత్యమనియు, శాస్త్రజ్ఞుల నిర్ణయము ధర్మములు కూడ మరియొక యవస్థయందు ధర్మిరూపములేయని యంగీకరించిన ధర్మములు కూడ నిత్యములేయగుటచే పైనిర్ణయమునకు భంగము వాటిల్లును అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నతత్త్వాతత్త్వయోర్భేద ఇతి వృద్ధేభ్య ఆగమః ।
అతత్త్వమితిమన్యన్తే తత్త్వమేవాఽవిచారితమ్ ॥ 7

తత్త్వాతత్త్వయోః = తత్త్వమునకును, అతత్త్వముకును అనగా సత్యపదార్థమునకు అసత్య పదార్థమునకును, భేదః = భేదము, న = లేదు, ఇతి = అని, వృద్ధేభ్యః = పెద్దలవలన, ఆగమః = పరంపరగా వచ్చెడివినికిడి.

అవిచారితమ్ = వారివారి జ్ఞానమునుబట్టి ప్రకాశించుచున్న, తత్త్వమ్ + ఏవ = సత్యపదార్థమునే, అతత్త్వమ్ + ఇతి = అసత్య పదార్థమని, మన్యన్తే = తత్త్వవేత్తలు తలంచుచున్నారు.

సత్యము, అసత్యము అనెడి రెండు పదార్థములు వేరుగా లేవు. పారమార్థిక తత్త్వ మొక్కటియే, అదియే పరబ్రహ్మము. అనాది సిద్ధమగు అవిద్యనుబట్టి ఆ సత్య పదార్థమే అసత్యమగు నానారూపములుగా భాసించుచున్నది. అంతియేకాని సత్యపదార్థము కంటె వేరుగా అసత్య పదార్థము నిలుచునదికాదు అవిద్య యున్నంతవరకు భేదము భాసించును. అవిద్య తొలగగా సత్యపదార్థమొక్కటియే యుండును.

సత్యపదార్థమే అవిద్యాదశలో అసత్యరూపమున కన్పించును. ఇది అద్వైత శాస్త్రజ్ఞుల విశ్వాసము. కాబట్టి ఉపాధులు వేరుగా సత్యరూపములై యుండునవికావు. ఈ యభిప్రాయముతోడనే మొదటి కాండమున, "సత్యా విశుద్ధిస్తత్రోక్తా'' (శ్లోకము-9) అని పరమ సిద్ధాంతము నిరూపింపబడినది. ప్రతివస్తువు అవిద్యామూలమున రూపాంతరమున భాసించు బ్రహ్మమే. ॥7॥

అవతారిక — పయిరీతిని పరబ్రహ్మమే ఆయారీతిని భాసించును, కాబట్టి ఆయా ఉపాధులను ముందుగా నిడికొని బ్రహ్మమే ఎల్ల శబ్దములకు విషయమగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ వికల్పరూపం భజతే తత్త్వమేవాఽవికల్పితమ్ ।
నచాత్రకాల భేదోఽస్తి, కాలభేదశ్చ గమ్యతే ॥ 8

అవికల్పితమ్ = వికల్పములకు తావులేని (అనగా ఆత్మ ఒకటియా, నానాత్వమా, నిత్యమా, అనిత్యమా మున్నగు వికల్పములకు తావులేని) తత్త్వమ్ + ఏవ = పరతత్త్వమే, వికల్ప రూపమ్ = విభిన్నములగు రూపములను, భజతే = పొందుచున్నది.

బ్రహ్మము నిజరూపమున ఒక్కటియే, అది నిత్యము, సత్యము. కాని అనాదిసిద్ధ మగు మాయనుబట్టి విచిత్రములగు రూపములను దాల్చునట్లు గాన్పించుచున్నది. అదియే అవిద్యాదశయందు జీవభావమును, దిక్శక్తిమూలమున దేశభేదమును పొంది అనేక రూపమున వివర్తమగుచున్నది.

అత్ర = ఈ శుద్ధద్రవ్యమునందు, కాల భేదః + చ = కాలభేదము కూడ, న + అస్తి = లేదు. అనివార్యమగు భూత భవిష్యద్వర్తమానరూపమగు కాలముకూడ ఈ పరతత్త్వ మునలేదని భావము.

కాలభేదః + చ = కాలము యొక్క భేదము కూడ, దృశ్యతే = చూడబడుచున్నది.

నిజరూపమున బ్రహ్మము కాలమునకు బద్ధముకాదు. కాని అవిద్యా శక్తి రూపమగు కాలము యొక్క ప్రభావముచే వ్యవహారదశలో కాల భేదము పరతత్త్వమున భాసించును. దానిని బట్టియే పుట్టుక మున్నగు ఆరు వివర్తములు బ్రహ్మము నందు కాన్పించుచున్నవి. దానివలననే జగము క్రమబద్ధమై జరుగు చున్నది.

కాబట్టి బ్రహ్మమే అవిద్యావశమున ఉపాధుల ద్వారా ఎల్ల శబ్దములకు విషయమగు చున్నది. ॥8॥

అవతారిక — ఉపాధులు స్వతః లేనేలేవు. కాని యవి ద్రవ్యమునందు భాసించు నని చెప్పుట పొసగదు లేని పదార్థములకు భానమసంభవముకదా ! అనుప్రశ్నకు సమాధాన ముగా విజ్ఞాన వాదిమతమునాశ్రయించి దృష్టాంతమును జూపుచున్నాడు.

శ్లో॥ యథా విషయధర్మాణాం జ్ఞానేఽత్యన్త మసంభవః ।
తదాత్మేవ చ తత్సిద్ధమత్యన్త మతదాత్మకమ్ ॥ 9

యథా = ఏరీతిగా, విషయధర్మాణామ్ = కడవమున్నగు వస్తువులకు సంబంధించిన (అనగా జడపదార్థములకు సంబంధించిన) తెలుపు, నలుపు మున్నగు ధర్మములకు, జ్ఞానే = శుద్ధమగు జ్ఞానమునందు, అత్యన్తమ్ = మిక్కిలి, అసంభవః = సంభవములేదు. జడములకు అజడము నకు ఏ యంశముచేతను సామ్యము లేదని భావము.

అతదాత్మకం + చ = జ్ఞ నరూపముకాకున్నను, తత్ = ఆజడవస్తువు, తదాత్మ + ఇవ = జ్ఞాన రూపమైనది వలె, సిద్ధమ్ = కాన్పించుచున్నదో,

ఈ శ్లోకార్ధమునకు పదియవ శ్లోకముయొక్క ఉత్తరార్ధముతో నన్వయము చూప వలెను.

విజ్ఞానవాదిమతమున జ్ఞానము తప్ప బాహ్యవస్తువులేనేలేదు. కడవ మున్నగు వస్తువులు, వానియందు కాన్పించు గుణములు అసత్యములే. ఐనను జడములు జ్ఞానరూపములవలె కాన్పించును. అట్లుభాసించుటకు అనాదియగు అవిద్యమే కారణము. అట్లే, లేని యుపాధులు అవిద్యా వశమున బ్రహ్మమున భాసింపగలవు. ॥9॥

అవతారిక — ప్రకృతార్థమునకు విజ్ఞానవాదిమతము ననుసరించి 9 వ శ్లోకమున దృష్టాంతము చూపబడినది.

ఇపుడు కపిలసాంఖ్యముననుసరించి పూర్వార్ధముచే దృష్టాంతము చూపుచున్నాడు.

శ్లో॥ తథా వికారరూపాణాం తత్త్వేఽత్యన్త మసంభవః ।
తదాత్మేవ చ తత్త్వమత్యన్త మతదాత్మకమ్ ॥ 10

(యథా + వా) = ఏరీతిగా. వికారరూపాణామ్ = బుద్ధి మున్నగు వికారములయొక్క పలు విధములగు రూపములకు, తత్త్వే = ప్రధానతత్త్వమున అనగా మూల ప్రకృతియందు, అత్యన్తమ్ = మిక్కిలి, అసంభవః = సంభవము లేదో, - తథా = ఆ రీతిగా, అత్యన్తమ్ = మిక్కిలి, అతదాత్మకమ్ = ఉపాధుల రూపము కానట్టి, తత్త్వమ్ = బ్రహ్మతత్త్వము, తదాత్మ + ఇవ + చ = ఉపాధుల యొక్క రూపముకలదివలె, (భాసతే) = భాసించును.

కపిలతంత్రమున 25 పదార్థములంగీకరింపబడినవి వానికి తత్త్వములని వారి వ్యవహారము. ఆ తత్త్వములలో మూలప్రకృతి యొకటి, దానివలననే పై వికారములు కలుగును. దానికి మాత్రము కారణము లేదు, అందుచే నది మూల ప్రకృతి యనబడును. దానినే ప్రధానము, అవ్యక్తము మున్నగు పదములచే వ్యవహరింతురు. దాని వికారములే బుద్ధిమున్నగునవి. బుద్ధికి 'మహత్తత్త్వ' మని వారి సంకేతము. వికారముకలుగుటకు కావలసిన శక్తులు ప్రధానమున కలవు. సత్త్వరజస్తమోగుణముల సామ్యావస్థయే 'మూల ప్రకృతి' యనబడును ఆ గుణముల వైషమ్యముచే రాపిడికలిగి ఎన్నియో వికారములు కలుగును. నిజమున ఆవికారములు మూల ప్రకృతికి లేవు. కాని అవిద్యావశమున నానావికారములుగా ఆ ప్రకృతియే కాన్పించును.

అట్లే పరబ్రహ్మము అవిద్యావశమున ఉపాధి రూపములతో కాన్పించును. ఎల్లదర్శనములలోను అవిద్యా సంబంధము కాన్పించుచునే యున్నది. ॥10॥

అవతారిక — అస్మదాదులకు కాన్పించు ఎల్ల ఆకారములు అసత్యములనియు, పరబ్రహ్మయే సత్యమనియు ఎట్లు తెలియనగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు.

శ్లో॥ సత్యమాకృతిసంహారే యదన్తే వ్యవతిష్ఠతే ।
తన్నిత్యం శబ్దవాచ్యం తచ్ఛబ్దతత్త్వం నభిద్యతే ॥ 11

ఆకృతిసంహారే = ఆకారములకు నాశముకలుగగా, అన్తే = చివరకు, యత్ = ఏది, అవతిష్ఠతే = మిగిలియుండునో, తత్ = అదియే, సత్యమ్ = పరమార్థసత్యము, నిత్యమ్ = పరమార్థనిత్యము, తత్ = అదియే, శబ్దవాచ్యమ్ = జాత్యాదిరూపమున ఎల్లశబ్దములకు వాచ్యమగును.

శబ్ద తత్త్వమే = శబ్దముల నిజరూపము అనగా పరావాగ్రూపమగుశబ్దము, న + భిద్యతే = వేరుకానేరదు, అనగా నిర్గుణ పరబ్రహ్మము కంటె వేరుకానేరదు.

ఔపనిషదులు ఏ తత్త్వమును సత్యజ్ఞానానందరూపమున భావింతురో, ఆ తత్త్వమే వైయాకరణుల ముఖ్యతత్త్వమని భావము

ఎల్ల వస్తువులను పరికించిన వానికి ఏదో మూలము కాన్పించును. దానికికూడ మరియొక మూల కారణము కాన్పించును. అట్లు పరిశీలింపగా చివరకు ఏది నియతమై భాసించునో అదియే సత్యము. అంతవరకు కాన్పించునవి వికారములే. అవి అసత్యములే. ఉదా-మనిష్యుని శరీరమునకు మూలము అన్నము, దానికి ఓషధులు, వానికి భూమి, దానికి ఉదకము, దానికి తేజము, దానికి వాయువు, దానికి ఆకాశము మూలము. ఆకాశమునకు కారణము ఏది అన్నచో పరమాత్మకారణమని చెప్పవలెను. దానికికారణమేమియు లేదు. అదియే చివరకు మిగిలినందున అదియే సత్యము.

ఇట్లే ప్రతి పదార్థమునను చూడనగును. పైరీతిని చూచిన ఉపాధు లసత్యములే. పరబ్రహ్మమే సత్యమని తెల్లమగును.

అట్టి పరబ్రహ్మమే జాతి మున్నగు ఉపాధులను ఊతగైకొని గుణరూపమును దాల్చి ఎల్ల శబ్దములచే బోధింప బడుచున్నది.

జ్ఞానమనునది పశ్యంతీ వాగ్రూపము. దానికిమూలము పరావాక్కు. అది నిర్గుణాద్వయ బ్రహ్మరూపము దానికంటె వేరుకాదు. ॥11॥

అవతారిక — ఉపాధి రూపముకాని పరతత్త్వము ఉపాధి రూపమున కాన్పించు చున్నదని 10 వ శ్లోకమున చెప్పబడినది. ఆ పరతత్త్వము ఉపాధి రూపము ఏలకాదో, ఆ యంశమును వివరించుచున్నాడు.

శ్లో॥ నతదస్తి, నతన్నాస్తి, నతదేకం, నతత్ పృథక్ ।
నసంసృష్టం, విభక్తంవా, వికృతం న చ, నాన్యథా ॥ 12

పరతత్త్వము ఎల్ల వ్యవహారములను అతిక్రమించి యున్నదనుటకు మూలము వ్యావహారిక దశలచట కానరాకుండుటయేనని నిరూపించుచున్నాడు.

తత్ = ఆపరతత్త్వము, అస్తి = ఉన్నదనుటకు, న = వీలుకాదు. సత్త అనునది ఒక ఉపాధి, అది ఘటము మున్నగు దానికి సంబంధించును కాన దానికి 'ఘటః అస్తి' అను వ్యవహారము కలుగును. పరబ్రహ్మమునకు సత్త అను ఉపాధిలేనందున నచట 'అస్తి' అనుట సాధ్యపడదు. వ్యవహారము ఆరోపముచే కలుగనేరదు.

తత్ = ఆతత్త్వము, న + అస్తి = లేదనుటయు, న = పొసగదు. పరతత్త్వము భావరూపమని శాస్త్రములు నిరూపించుచున్నందున, నచట అభావమును ఉపాధిగా జూపరాదు.

తత్ = ఆ తత్త్వము, ఏకమ్ = ఒక్కటియే, అని చెప్పుటయు, న = తగదు. నిరుపాధికమగు పరబ్రహ్మము అభిన్నము కనుక ఏకత్వసంఖ్య అచట ఉపాధి కానేరదు.

తత్ = ఆతత్త్వము, పృథక్ = భిన్నమనుటయు, న = యుక్తము కాదు పరబ్రహ్మము కంటె భిన్నమగు వస్తువు అసత్యమే కాన దానియందు భేదము వాటిల్లదు.

కనుకనే తత్ = అది, సంసృష్టమ్ = ఇతర వస్తువులతో కలసి యున్నదనుట, న = సరిపడదు విభక్తమ్ = వేరుగా నున్నదనుటయు, న = తగదు. దానికంటె వేరు వస్తువు ఉన్నదనుటయు న = తగదు. దానికంటె వేరు వస్తువు ఉన్నదనుటలో ప్రమాణము లేనందున ఆ పరబ్రహ్మము 'దీనితో కలిసియున్నది. దీనితో విభక్తమైనది' అనిచెప్పజాలము. సంసర్గము, విభాగము కూడ అచట ఉపాధులు కానేరవని భావము.

తత్ = అపరతత్త్వ రూపమగు ద్రవ్యము, వికృతమ్ = వికారమును బొందినదని యనుటయు, న=యుక్తముకాదు, అన్యథా=వికారమును పొందదు అనుటయు, న=సరికాదు

బ్రహ్మము రూపాంతరమున పరిణమించునది కాదు. పరిణామ వాదమును శాస్త్రజ్ఞులు దూషించియున్నారు. కాబట్టి, పరతత్త్వము వికారమును బొందునదికాదు వివర్తవాదమే శాస్త్ర సమ్మతము పరతత్త్వము అద్భుతమగు మాయా వృత్తిచే అనేకములగు రూపాంతరములుగా వివర్తమగుటవలన అది వికృతమనుటయు పొసగదు

కాబట్టి అస్తి, నాస్తి, ఏకమ్, అనేకమ్, సంసృష్టమ్, విభక్తమ్, వికృతమ్, అవికృతమ్ అను విభిన్నములగు వ్యవహారములకు గోచరింపనందున పరతత్త్వము ఉపాధి రూపము కాదని విస్పష్టము. ॥12॥

అవతారిక—— ఉపాధిరూపమునలేని బ్రహ్మరూపమగు ద్రవ్యమే అవిద్యాదశయందు ఉపాధిరూపముననే కాన్పించుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ తన్నాస్తి. విద్యతేతచ్చ, తదేకం తత్పృథక్పృథక్ ।
సంసృష్టంచ విభక్తంచ వికృతం తత్తదన్యథా ॥ 13

నిజరూపమున పరతత్త్వము వ్యవహారగోచరముకాదు. అనాదియగు మాయయొక్క సంబంధ మున విచిత్రరూపములతో గానవచ్చుచున్నది.

తత్ = ఆపరతత్త్వమే, న + అస్తి = లేదనియు, తత్ + చ = అదియే, విద్యతే= ఉన్నదనియు వ్యవహరింపబడుచున్నది.

ఉనికికి లేమికి గూడ ఆ పరతత్త్వమే మూలమగుచున్నది. విరుద్ధములగు సత్త్వా సత్త్వములనెడి ఉపాధులను అదియే సహించుచున్నది.

వ్యవహారదశయందే, తత్ = ఆ తత్త్వము, ఏకమ్ = ఒక్కటి యనియు, తత్ = అదియే, పృథక్ + పృథక్ = నానారూపమనియు వ్యవహరింపబడుచున్నది, ఏకత్వ నానా త్వములు పారమార్థికరూపమునలేవు, అవిద్యా దశయందు ఆతత్త్వమునందు భాసించుచున్నవి అదియే జాతిరూపమున వ్యక్తిరూపమున కాన్పించుచున్నది.

తత్ = ఆతత్త్వము, సంసృష్టం + చ = ఇతర వస్తువులతోసంబంధముకలదియు. విభక్తం + చ = విభాగము కలదియు అగుచున్నది

సంయోగ విభాగములనెడి ఉపాధులు అవిద్యాదశయందు తత్త్వమునందు గోచ రించుచున్నవి.

తత్ = ఆ తత్త్వము, వికృతమ్ = వికారములు కలదిగాను, తత్ = అదియే, అన్యథా = వికారములు లేనిదిగాను అగుచున్నది.

ఎల్ల వికారములతో పుట్టుచున్నట్లు కాన్పించును. అదియే ఆకాశరూపమున కూటస్థ ముగా ఎట్టి వికారము లేక భాసించును.

పరతత్త్వము యొక్క పారమార్థికరూపము 12 వ శ్లోకమున, అవిద్యాదశయందు గోచరించెడి వ్యావహారిక రూపము 13 వ శ్లోకమునను నిరూపింపబడినవి. ॥13॥

అవతారిక— ఎల్ల ప్రపంచకము బ్రహ్మమయమే కనుక విరుద్ధములగు వ్యవహా రములన్నియు ఆ పరబ్రహ్మమునందే లయమును బొందును. అవియన్నియు అవిద్యామూల మున పరబ్రహ్మమునందు భాసించుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్యశబ్దార్థ సంబన్ధ రూపమేకస్య దృశ్యతే ।
తద్ దృశ్యం దర్శనం ద్రష్టా దర్శనే చ ప్రయోజనమ్ ॥ 14

ఏకస్య = అద్వితీయమగు, తస్య = ఆబ్రహ్మ రూపమగు ద్రవ్యమునకు, శబ్దార్థ సంబన్ధ రూపమ్ = శబ్ద స్వరూపము, అర్థస్వరూపము, వానికి గల సంబంధ స్వరూపము, దృశ్యతే = చూడబడుచున్నవి.

బ్రహ్మమునందు ఎవ్విధమగు భేదమును లేదు. కాని దానియందు శబ్దశక్తి అర్థ శక్తియు సంసృష్టములై యున్నవై, అవియే శబ్దము అర్థము అను రెండు శాఖలుగా చీలికలై లోకమున వ్యవహారదశలో భిన్నరూపమున నలరారుచున్నవి. వానికి గల సంబంధము కూడ నట్టిదే.

మరియు, తత్ = ఆబ్రహ్మమే, దృశ్యమ్ = కంటికి కనబడెడి జడప్రపంచకము, అదియే ద్రష్టా = చూచెడి చేతనుడగుజీవుడు, అదియే, దర్శనమ్ = చూచుట యనెడిక్రియ, దర్శనే = క్రియావిషయకమగు, ప్రయోజనం + చ = ప్రయోజనము కూడ నగుచున్నది

జీవుడు చేతనుడు, అనగా జ్ఞానరూపుడు, అతడే భోక్త, కర్త అట్టిజీవుడు పర బ్రహ్మముయొక్క వివర్తమే జీవునకు జడప్రపంచక మంతయు భోగ్యము. అదియు పరబ్రహ్మము యొక్క వివర్తమే. చూచుటమున్నగు క్రియలు, వానిని ఆచరించుటవలన కలిగెడి ప్రయోజనములు బ్రహ్మము యొక్క వివర్తమే 30766

భోగ్యము, భోక్త, క్రియ, ఫలము ఇవియన్నియు పరస్పర విరుద్ధములైయున్నవి. ఇవి అవిద్యావశమున పరబ్రహ్మము యొక్క వివర్తములే కనుక, తత్త్వజ్ఞానము కలుగుటచే అవిద్యనివర్తింపగా అవియన్నియు పరతత్త్వమునందే లయమును బొందును. ॥14॥

అవతారిక — ఆకారము లసత్యములు పరబ్రహ్మ మొక్కటియే సత్యము అను అర్థము సిద్ధించుటకై వస్తువుల మూలకారణ మన్వేషింపగా చివరకు ఏది మిగిలియుండునో అదియే సత్యము అది పరబ్రహ్మమే అని 11 వ శ్లోకమున చెప్పబడినది. కాని అది యుక్తముకాదు ఏలయన-ప్రతివస్తువునకు కారణమన్వేషింపగా చివరకు ఏమియు మిగులదు. శూన్యమునుండియే ప్రపంచకమావిర్భవించును, అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ వికారాపగమే సత్యం సువర్ణం కుణ్డలే యథా ।
వికారాపగమే సత్యాం తథాహుః ప్రకృతిం పరామ్ ॥ 15

కుణ్డలే = కుండలము విషయమై, వికారాపగమే = వికారరూపము పోగా, యథా = ఏరీతిగా, సువర్ణమ్ = బంగారము, సత్యమ్ = నిజమైనదో, తథా = ఆ రీతిగా, వికారాపగమే = జీవుడు జడము మున్నగు వికారములు నశింపగా, పరామ్ = సర్వోత్తమమగు, ప్రకృతిమ్ = మూల పదార్థమును, సత్యామ్ = సత్యమైనదానిగా, ఆహుః = చెప్పుచున్నారు

బంగారముచే కడియము, కుండలము మున్నగువస్తువులను నిర్మించు చున్నారు. అవియన్నియు బంగారముయొక్క వికారములే. ఆ వికారములు నశింపగా చివరకు బంగారము ఒక్కటియే మిగిలియుండును. ఆ వికారములు పోగా అచట ఏదో ఒక వస్తువుకానవచ్చు చున్నది. అదిశూన్యము కాదు. అదియెల్లరుకు తెలిసినదే అదే విధముగా జీవుడు మున్నగు వికారములు పోగా చివరకు శూన్యము కానేరదు. చివరకు సద్రూపమగు ప్రకృతిమ మిగిలి యుండును. అదియే పరాప్రకృతి, అదియే నిర్గుణబ్రహ్మము.

అవతారిక — ఉపనిషదములలో ఆత్మశబ్దముచే చెప్పబడెడి పరబ్రహ్మమే ఇచట ద్రవ్యశబ్దార్థము. అదియే ఎల్ల శబ్దములకు వాచ్యము కాగలదని చెప్పుచున్నాడు.

**శ్లో॥ వాచ్యా సా సర్వశబ్దానాం, శబ్దాశ్చ న పృథక్తతః ।
అపృథక్త్వేచ సంబన్ధస్తయో ర్నానాత్మనోరివ ॥** 16

సా = ఆ పరాప్రకృతియే, సర్వశబ్దానామ్ = ఎల్ల శబ్దములకు, వాచ్యా = వాచ్యమగుచున్నది. శబ్దములు అట్టి ద్రవ్యమునే బోధించుచున్నవని భావము.

శబ్దాః + చ = శబ్దములు కూడ, తతః = ఆ బ్రహ్మ రూపమగు ద్రవ్యము కంటె, పృథక్ = వేరుగా, న = లేవు. ఈ యభిప్రాయమును "శబ్ద తత్త్వం యదక్షరమ్" అని గ్రంథ ప్రారంభముననే భర్తృహరి వ్యక్తపరచెను

తయోః = ఆ రెంటికి అనగా శబ్దమునకు ద్రవ్యమునకు, సంబన్ధః = సంబంధము అనగా వాచ్యవాచక భావమనెడి సంబంధము, నానాత్మనోః + ఇవ = వేరువేరుగా నుండెడి పదార్థములకు వలె, (ఘటతే) = కుదురును.

అవిద్యావశమున ఆయా ఉపాధులచే కల్పింపబడిన భేదమును అనుభవించి వ్యవహారము జరుగు చున్నది కాగా ఉపాధినిబట్టి బ్రహ్మమే నానా రూపమున కాన్పించుచున్నది కాబట్టి ఎల్లశబ్దములకు బ్రహ్మమే విషయమగును. ఉపాధులను విడనాడిన ఆ తత్త్వము శబ్దమునకు విషయము కాదు. ఆత్మ, బ్రహ్మ, తత్త్వము, మున్నగు శబ్దములు పరబ్రహ్మమునకు సన్నిహితములు, ఘటాది శబ్దములట్టివికావు.

ఘటము, పటము పరస్పరము భిన్నములు. కనుక వానికి సంయోగ సంబంధము కలుగును అట్లే శబ్దము, ద్రవ్యము ఈ రెండు ఏకరూపములైనను వానికి సంబంధము ఘటిల్లును. ॥16॥

అవతారిక — ఇదియంతయు ఇంద్రజాలమువలె కాన్పించుచున్నది ; ఘటపటాదులకు భేదము కంటికి ప్రత్యక్షముగా కాన్పించుచున్నది, అయినను వానికి భేదములేదనుట యెట్లు? అవి అసత్యములెట్లగును? బ్రహ్మముకంటికి కానరాదు. చెవికి వినబడదు. అట్టి బ్రహ్మమున్నట్లు ఎట్లు విశ్వసింతము ? అను ప్రశ్నకు స్వప్న దృష్టాంతముతో సమాధానము చెప్పుచున్నాడు.

**శ్లో॥ ఆత్మా పరః ప్రియో ద్వేష్యో వక్తా వాచ్యం ప్రయోజనమ్ ।
విరుద్ధాని యథైకస్య స్వప్నే రూపాణి చేతసః ॥** 17

**అజన్మని తథా నిత్యే పౌర్వాపర్యవివర్జితే ।
తత్త్వే జన్మాదిరూపత్వం విరుద్ధముపలభ్యతే ॥** 18

18]
యథా = ఏరీతిగా, స్వప్నే = స్వప్నమునందు, ఏకస్య + ఏవ = ఒక్కటియేయగు, చేతసః = మనస్సునకు, (1) ఆత్మా = తన వాడు, పరః = ఇతరుడు, (2) ప్రియః = ఇష్టుడు, ద్వేష్యః = శత్రువు, (3) వక్తా = మాటలాడువాడు, వాచ్యమ్ = చెప్పబడునది, (4) ప్రయోజనమ్ = ప్రయోజనము (ఇతి) = ఇటువంటి, విరుద్ధాని = పరస్పరము విరుద్ధములగు, రూపాణి = రూపములు, (ఉపలభ్యన్తే) = తెలియబడుచున్నవో ;

తథా = అట్లే, అజన్మని = పుట్టుకలేనట్టియు, కనుకనే, నిత్యే = పరమార్థనిత్యమగునట్టియు, కనుకనే, పౌర్వా పర్యవివర్జితే=పూర్వాపరభావములేనట్టి, తత్త్వే = పరబ్రహ్మమునందు, విరుద్ధమ్ = పరస్పరము విరుద్ధమగు, జన్మాది రూపత్వమ్ = పుట్టుక మున్నగు అనేక రూపములు కలిగియుండుట, ఉపలభ్యతే = చూపబడుచున్నది.

మేల్కొనియున్న యవస్థలో నేత్రము మున్నగు ఇంద్రియములు పనిచేసి విశ్రాంతిని అపేక్షించును. అవి మనస్సులోలయమును బొందును. దానినే నిద్రయందురు. అపుడు ఒక మనస్సే పని చేయును అదియే పలురూపములను దాల్చి సంచరించును. తనలో సూక్ష్మరూపముగా ఉన్నపదార్థములను జీవునకు జూపును. అదియే స్వప్నము. ఆస్థితిలో ఒకడు తనతో సఖ్యము చేసినట్లు, మరియొకడు ద్వేషించినట్లు, జీవుడు చూచును. ఇట్టి ఎన్నియో విరుద్ధములగు రూపములు జీవునకు కాన్పించును. మనస్సు ఒక్కటియే జీవునకు విభిన్నరూపములతో గోచరించును. అట్టి స్వాప్నిక పదార్థములు మేల్కొనగా కానరావు.

అట్లే పరబ్రహ్మమునందు జీవుడు భోక్తగాను, ప్రపంచకము భోగ్యముగాను భాసించును. అవియన్నియు మాయావశమున భాసించుచున్నవి. అవియన్నియు బ్రహ్మసాక్షాత్కారము కలుగగా కానరావు. అవిద్య ఉన్నంతవరకు పుట్టుక మున్నగు విరుద్ధ భావములు కాన్పించును. బ్రహ్మమునందు అనాది యగు మాయ బహు విచిత్రములగు రూపములను భాసింపజేసి జగన్నాటకమును జూపుచున్నది. స్వప్నము కూడ మాయామాత్రమనియే అద్వైత వాదుల విశ్వాసము.

కాబట్టి వ్యవహారదశలో విరుద్ధములగు పదార్థములు వానిభేదము మనకు గోచరింపవచ్చును. పరమార్ధదశలో అవిఏమియు కానరావు. బ్రహ్మ యొక్కటియే మిగులును. అది సత్యము ॥17, 18॥

ద్రవ్య సముద్దేశము ముగిసినది

సంబంధ సముద్దేశము-3

అవతారిక — మొదటి సముద్దేశమున వాజప్యాయనముని యొక్క మతము నాశ్రయించి ఎల్ల శబ్దములకు జాతియే వాచ్యమనియు, రెండవ సముద్దేశమున వ్యాడిమహర్షి యొక్క మతము నాశ్రయించి ఎల్ల శబ్దములకు ద్రవ్యమే వాచ్యమనియు, అపోద్ధారమునకు ఉపయోగించెడి అర్థములు నిరూపింపబడినవి.

ఈ సముద్దేశమున శబ్దార్థములకు గల 1. యోగ్యత, 2. కార్యకారణ భావము అను రెండు సంబంధములు నిరూపింపబడుచున్నవి. శబ్దముచే నర్థము బోధింపబడుటలో సంబంధము హేతువు. అట్లు కాకున్న ఎల్ల శబ్దములు ఎల్ల యర్థములను బోధింపవలెను. అట్లు అనుభవము లేదు. కాబట్టి ముందుగా శబ్దార్థములకు సంబంధమున్నదనియు, అదియు స్వాభావికమే, కల్పితము కాదనియు చెప్పుచున్నాడు.

శ్లో॥ జ్ఞానం ప్రయోక్తుర్బాహ్యోఽర్థః స్వరూపం చ ప్రతీయతే ।
శబ్దైరుచ్చరితైస్తేషాం సంబన్ధోఽస్తీతి గమ్యతే ॥

ఉచ్చరితైః = ఉచ్చరింపబడిన, శబ్దైః = శబ్దములచే, ప్రయోక్తుః = శబ్దమును ప్రయోగించిన వానియొక్క, జ్ఞానమ్ = జ్ఞానము అనగా అభిప్రాయము, బాహ్యః = బాహ్య ప్రపంచకమున గల, అర్థః = ఘటము, పటము మున్నగు అర్థము, స్వరూపం + చ = శబ్ద స్వరూపము, ఈత్రయము, ప్రతీయతే = తెలియబడుచున్నది, అనగా శబ్దము నుచ్చరింపగా ప్రయోక్త యొక్క భావము, బాహ్యపదార్థము, ఆ శబ్దము ఈ మూడు కూడ భాసించునని భావము.

(అతః) = ఈ కారణమువలన, తేషామ్ = వానికి అనగా వక్తయొక్క జ్ఞానము నకు బాహ్యార్థమునకు శబ్ద స్వరూపమునకును, సంబన్ధః = సంబంధము, అస్తి = కలదు, ఇతి = అని, గమ్యతే = అనుమాన ప్రమాణముచే తెలియబడుచున్నది.

శబ్దముల నుచ్చరింపగా ఈ మూడు తెలియబడుచున్నవి. సంబంధమే లేనిచో అవి ఎట్లు తెలియబడగలవు. అవి తెలియబడుటవలన వానికి సంబంధము ఉన్నట్లు ఊహింప వచ్చును.

అందును శబ్దమునకు, అర్థమునకు యోగ్యత సంబంధము. ఈ అంశము 29వ శ్లోకమున వివరింపబడుచున్నది. వక్తయొక్క జ్ఞానమునకు, శబ్దమునకు కార్యకారణ భావము సంబంధము. ఈ యంశము 32వ శ్లోకమున స్పష్టము కాగలదు ॥1॥

అవతారిక—శబ్దముచే అర్థము బోధింపబడును. ఈ రెంటికి సంబంధము నిత్యము. బాహ్యార్థము అనగా లోకమున కంటికి కానవచ్చెడి అర్థముకాక, బుద్ధిచే కల్పింపబడిన అర్థము

శబ్దవాచ్యము. అనగా జ్ఞానరూపముగా ఉన్న అర్థమే శబ్దవాచ్యము. ఇట్టి యర్థము ఉపచార సత్తతో గూడిన యర్థమని యందురు. ఈ యంశము ఈ ప్రకరణముననే 39 వ శ్లోకము నుండి 50 వ శ్లోకము వరకు నిరూపింపబడుచున్నది. ఘటాది శబ్దములచే బోధింపబడునవి కడవ మున్నగు వ్యక్తులే కావు. ఆ శబ్దముగూడ అనగా ఘకార, అకార, టకార, అకారములు అను ఆనుపూర్వితో కూడిన శబ్దము కూడ బోధింపబడును. ఆ యర్థము మాత్రము ఔప చారికము గాదు. అది ముఖ్యమే. వ్యక్తిరూపమగు అర్థము అనిత్యము కనుక దానితో శబ్దము నకు సంబంధము నిత్యము కానేరదు. కనుక ఉపచారసత్తను అచట గ్రహింపవచ్చును. అట్లు కానిచో శబ్దము నియతముగా బోధింపజాలదు. శబ్ద వాచ్యమగు శబ్దము నియతమేకాన అచట సంబంధము నిత్యము కాగలదు. కనుక అచట సంబంధము ముఖ్యమే కాగలదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రతిపత్తిర్భ వత్యర్థే జ్ఞానేవాసంశయః క్వచిత్ ।
స్వరూపేషూప లబ్ధేషు వ్యభిచారో నవిద్యతే ॥ 2

అర్థే = అర్థమునందు, జ్ఞానే + వా = జ్ఞానమునందును, క్వచిత్ = ఏదో ఒక స్థలమున, సంశయః = సంశయ రూపమగు, ప్రతిపత్తిః = జ్ఞానము, భవేత్ = కలుగవచ్చును.

ఘటః అను శబ్దమువలన కడవ అను అర్థము తెలియబడుచున్నది. తద్విషయక మగు జ్ఞానము కలుగుచున్నది. అచట శక్తిజ్ఞానము లేనిచో అర్థము సంశయ విషయమగును. శక్తిజ్ఞాన మున్నను హరి మున్నగు నానార్థక శబ్దములలో అర్థము సంశయితమగును.

అట్టి అర్థము ననుసరించెడి జ్ఞానముకూడ సంశయరూపము కాగలదు.

క్వచిత్ = కొన్ని స్థలములలో అనగా శక్తిజ్ఞానము లేనిచోట, శక్తిజ్ఞాన మున్నను నానార్థక స్థలమునను సంశయము కలుగునని భావము.

హరి శబ్దమునకు = విష్ణువు, కప్ప, కోతి, పాము ఇవి యన్నియు వాచ్యార్థములే.

ఉపలబ్ధేషు = తెలియబడుచున్న, స్వరూపేషు = శబ్దస్వరూపముల విషయమై, వ్యభిచారః = వ్యభిచారము అనగా ఒకదానిని విడిచియుండుట, న + విద్యతే = లేదు.

శబ్దము తన రూపమునుకూడ బోధ విషయముగా చేయును. జ్ఞానమున ఆ శబ్దము కూడ భాసించును ఆ రీతిగా భాసించిన శబ్దమునకు, వాచకముగా ఉన్న శబ్దమునకు సంబం ధము నిత్యము. అర్థము విషయమున, జ్ఞానము విషయమున సంశయము కలుగునట్లు ఇచట సంశయము కలుగదు. సంశయమునకు అవకాశము లేదు

కాగా వ్యక్తిరూపమగు అర్థము నియతము కానందున అచట ఔపచారికమగు, అనగా బుద్ధికల్పితమగు, అర్థము శబ్దవాచ్యమని చెప్పవలెను. శబ్దము స్వరూపమును గూడ బోధించుటలో అనియమము లేక నియతమగు రూపమునే బోధించును కనుక అచట ఉపచార సత్త అక్కరలేదు. ముఖ్యమగు శబ్దమే విషయమగును.

ఇచట "స్వరూపేషు" అని బహువచనమున్నది. వాచక శబ్దముచే బోధింపబడునది ఒకటియే, కనుక బహువచన మెట్లు? అని ప్రశ్న కలదు.

సమాధానము— అర్థమును చెప్పుటకు నిమిత్తముగా ఉన్నది ఒకటి, ఆ శబ్దముచే బోధింపబడిన శబ్దము రెండవది. శబ్దార్థములకు సంబంధజ్ఞానము కలిగెడి అవస్థలో ప్రవృత్తి నిమిత్తముగా ఉన్నది మూడవది. ఈ యభిప్రాయముతో 'స్వరూపేషు' అని బహువచనము ప్రయుక్తమాయెను. ॥2॥

అవతారిక— శబ్దార్థములకు సంబంధము సహజమే అది కల్పితము కాదు, అని చెప్పబడినది. వానికి సంబంధమున్నట్లు ప్రమాణ మెద్ది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

**శ్లో॥ అస్యాయం వాచకోవాచ్య ఇతి షష్ఠ్యా ప్రతీయతే ।
యోగః శబ్దార్థ యోస్తత్త్వమప్యతో వ్యపదిశ్యతే ॥** 3

అస్య = దీనికి అనగా ఈ యర్థమునకు, అయమ్ = ఇది అనగా ఈ శబ్దము, వాచకః = బోధకము. అట్లే, అస్య = ఈ శబ్దమునకు, అయమ్ = ఈ అర్థము, వాచ్యః = బోధ్యము. ఇతి = ఇట్టి అనగా 'అస్య అయం వాచకః', 'అస్య అయం వాచ్యః' అనెడి ప్రామాణికుల వ్యవహారమున కాన్పించెడి, షష్ఠ్యా = షష్ఠీ విభక్తిచే, శబ్దార్థయోః = శబ్దమునకును, అర్థమునకును, యోగః = సంబంధము, ప్రతీయతే = తెలియబడుచున్నది.

షష్ఠీ విభక్తికి సంబంధము అర్థము. రాజ్ఞః పురుషః (రాజునకు సంబంధించిన నౌకరు) మున్నగు తావులందు ఆ యర్థము స్పష్టము. అట్లే అస్య అయం వాచకః, అస్య అయం వాచ్యః మున్నగు ప్రాజ్ఞుల వ్యవహారమున (స్య) షష్ఠీ విభక్తి కాన్పించుచున్నది. దానికి సంబంధము అర్థము. (1) అర్థము, (2) శబ్దము, ఈ రెంటికి సంబంధమున్నట్లు షష్ఠిచే తెలియబడుచున్నది. వానికి సంబంధమే లేనిచో షష్ఠీ విభక్తి ప్రయోగింపబడదు. పరస్పరము సంబంధము కలవానిని తెలుపునపుడే గదా షష్ఠీ ప్రత్యయము నుపయోగింతురు. ఉదా॥ 'దశరథస్య రామః'. సంబంధములేని ఘట, పటములను తెలుపునపుడు షష్ఠిని ప్రయోగింపరు కాబట్టి పై రీతిని షష్ఠీ విభక్తిచే శబ్దార్థములకు సంబంధమున్నదని మనము ఊహింపవలసి యున్నది. ఆ సంబంధము స్వాభావికమే.

అతః = ఈ కారణమువలన అనగా శబ్దార్థములకు స్వాభావికమగు సంబంధమున్నట్లు తెలియబడుచున్నందున, తత్త్వమ్ అపి = తాదాత్మ్యము కూడ అనగా శబ్దార్థములకు, తాదాత్మ్యము = అభేదము కూడ, వ్యపదిశ్యతే = వ్యవహరింపబడుచున్నది.

గౌః, అనునది శబ్దము, దానిచే బోధింపబడునది అర్థము. అది మనకు కంటికి కానవచ్చుచునే యున్నది. శబ్దము వేరు, అర్థము వేరు అని అస్మదాదులకు ప్రత్యక్షముగా తెలియుచున్నది కాని ఆ అర్థమును చూపవలసి వచ్చినప్పుడు, గౌరయమర్థః = (ఈ అర్థము

గోవు = గోశబ్దము) అను రీతిని శబ్దార్థములకు అభేదము సూచించెడి వాడుక కలదు. కాబట్టి వానికి తత్త్వమును అనగా తాదాత్మ్యమును, అభేదమును స్వీకరింపవలెను. ॥3॥

అవతారిక— "అస్య అయం వాచకః" మున్నగు వాక్యములలో సంబంధార్థక షష్ఠీ విభక్తి కానవచ్చుచున్నందున దానికి మరియొక విధముగ ఉపపత్తి చూపుటకు సాధ్య పడనందున, దాని బలమువలన శబ్దార్థములకు సంబంధమున్నదని అనుమాన ప్రమాణముచే ఊహింపవలెనని 3 వ శ్లోకమున చెప్పబడినది అట్లు ఏల చెప్పవలెను ? గంధము కలిగి యున్నది భూమి, అను రీతిని సంబంధమునకు అసాధారణమగు లక్షణ మేల చెప్పరాదు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నాఽభిధానం స్వధర్మేణ సంబన్ధస్యాస్తివాచకమ్ ।
అత్యన్త పరతన్త్రత్వాత్ రూపం నాస్యాపదిశ్యతే ॥ 4

A. స్వధర్మేణ = తనయొక్క అనగా సంబంధముయొక్క అసాధారణమగు ధర్మముచే, సంబన్ధస్య = సంబన్ధమునకు, వాచకమ్ = బోధకమగు అనగా సంబంధమును బోధించెడి, అభిధానమ్ = శబ్దము, న + అస్తి = లేదు. అనగా షష్ఠీ విభక్తి తప్ప మరియొక శబ్దము లేదు. భూమికి అసాధారణ ధర్మము గంధము. నీటికి చల్లదనము, తేజమునకు ఉష్ణత ఉన్నందున ఆ ధర్మములనుబట్టి ''గంధవతీ పృథివీ" మున్నగురీతిని వానికి లక్షణములు చెప్ప వచ్చును అచట అసాధారణ ధర్మ సహితములగు పృథివ్యాదులను బోధించెడి శబ్దములున్నవి. కాబట్టి అచట అట్లు చెప్పుటకు వీలున్నది. ఈ సంబంధమును దానియొక్క అసాధారణ గుణ ములతో కూడియున్నట్లు చెప్పెడి శబ్దము లేనందున దానికి విశిష్ట లక్షణము చెప్పజాలము.

B సంబంధమునకు ఏదో రూపమును కల్పించి దానికి అనుగుణముగా లక్షణము చెప్ప రాదా ! కేవలము అనుమానముపై ఆధారపడుట ఏల ? అను ప్రశ్నకు సమాధానము చెప్పు చున్నాడు

అత్యన్త పరతన్త్రత్వాత్ = మిక్కిలి పరాధీనమగుట వలన, అస్య = ఈ సంబం ధము యొక్క, రూపమ్ = రూపము, న + అపదిశ్యతే = చెప్పబడ నేరదు.

రెండు సంబంధులను బట్టియే సంబంధముండును. అందుచే సంబంధము పరా పేక్షమే. స్వతంత్రమగు పదార్థము కాదు. కనుక దానికి ఎట్టి రూపము కల్పించుట శక్యము కాదు.

రూపరసాదిగుణములు పరతంత్రములే. అవి ద్రవ్యమునందు ఆధారపడియున్నవి. ఐనను వానిని ద్రవ్యముతో వేరుచేసి శుక్లమ్, నీలమ్ (తెలుపు, నలుపు) అనురీతిని స్వతంత్ర పదార్థముగా జూపుటకు అవకాశమున్నది. కనుకనే వానిని బోధించెడి శబ్దములు కానవచ్చు చున్నవి. వానికి ప్రత్యేకము లక్షణములు చెప్పబడుచున్నవి. సంబంధము రూపాది గుణముల వంటిది కూడకాదు. ఇది ఎల్లప్పుడు నిత్యపరతంత్రమే ఈ యభిప్రాయమునే కారికలోనున్న "అత్యన్త" పదము వ్యక్తపరచుచున్నది.

కనుక సంబంధులకంటె వేరు చేసి సంబంధమును చూపుటసాధ్యముకాదు. ఇట్టిది ఏ శబ్దము చేతను చెప్పనలవికాదు కేవలము కార్యముచేతనే సంబంధమున్నదని యూహింప వలసి యున్నది. ॥4॥

అవతారిక—— సంబంధమును చెప్పెడి శబ్దములేదు. కాబట్టి కార్యమును బట్టి సంబంధమున్నదని యూహింపవలెను. అనగా అనుమానప్రమాణముచే సంబంధము సిద్ధించు నని 4 వ శ్లోకమున చెప్పబడినది. ఆ సంబంధమునకు అనుమాపకమగు కార్యమెద్ది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ ఉపకారః సయత్రాస్తి ధర్మస్తత్రానుగమ్యతే ।
శక్తీనామప్యసౌశక్తిర్గుణానామప్యసౌగుణః ॥ 5

యత్ర = ఎచట, ఉపకారః = ఉపకారము, అస్తి = కలదో, తత్ర = అచట, సః = ఆ, ధర్మః = ధర్మము అనగా సంబంధము, అనుగమ్యతే = అనుసరింపబడుచున్నది. అనగా అనుమాన ప్రమాణముచే తెలియ బడుచున్నది.

ఉపకార్యమునకు, ఉపకర్తకు సంబంధము కలియగా ఉపకారము కలుగును. శబ్దము ఉపకరించునది. అర్థము ఉపకార్యము. వానికి బోధ ఉపకారము అర్థబోధయనెడి ఉపకారము ఎచట కలుగు చున్నదో, అచట వానికి సంబంధమున్నదని నిశ్చయింపవచ్చును.

సంబంధమునకు ఏదో యొక సంబంధమును కల్పించి, దానిని సంబంధిగా పరిగ ణింపరాదు. అట్టి తరి ఆసంబంధమునకు గూడ మరియొక సంబంధము, దానికి గూడ మరి యొక సంబంధము కల్పింపవలెను. ఈ రీతిని అనవస్థాదోషము కలుగును.

కాబట్టి సంబంధము నిత్య పరతంత్రము, అది అనుమేయమే యని చెప్పవలెను.

శబ్దమునందు అర్థమును బోధించుట కనుగుణ మగు శక్తియున్నది ఆ శక్తియే సంబంధమనరాదా? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

అసౌ = ఈ సంబంధము, శక్తీనామ్ + అపి = కార్యమును కలిగించెడి శక్తులకు గూడ, శక్తిః = శక్తివంటిది. అనగా సహకరించునది.

శక్తియున్నంత మాత్రమున కార్యము కలుగదు. ఉదా:—దీపమునకు వస్తుప్రకాశ కత్వ శక్తియున్నది. కాని ఆదీపమునకు వస్తువుతో సంబంధమున్ననాడే ఆ వస్తువు ప్రకాశిత మగుచున్నది. ఎచటనో ఉన్నవస్తువు దేశాంతరమున నున్న దీపముచే ప్రకాశితము కాదు కదా!

ఏలయన—— అసౌ = ఈ సంబంధము, గుణానామ్ + అపి = రూపరసాదిగుణము లకు కూడ, గుణః = ఉపకారమే.

రూప, రస, గంధాదికములగు గుణములు, ద్రవ్యమును ఆశ్రయించుచున్న. అవి యట్లుండుటలో సంబంధమే కారణము.

అవతారిక — తార్కికులు సంయోగము, సమవాయము, అనెడి రెండు సంబంధముల నంగీకరించియున్నారు. అవియే శబ్దార్థములకు గూడ సంబంధములు కాగలవు.

ఈ రీతిని సరిపడుచుండగా అట్లు స్వీకరింపక, వానికంటె వేరుగ ఏదో మరియొక సంబంధమును ఏల స్వీకరింపవలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ తద్ధర్మణోస్తు తాచ్ఛబ్ద్యం సంయోగసమవాయయోః ।
తయోరప్యుపకారార్థా నియతా స్తదుపాధయః ॥ 6

A తద్ధర్మణోః = దానియొక్క ధర్మముకల, అనగా సంబంధమునకు పారతంత్ర్యమనెడి అసాధారణమగు ధర్మము కలదు అట్టిపారతంత్ర్యమనే ధర్మముకల, సంయోగసమవాయయోః + తు = సంయోగమునకు సమవాయమునకు , తాచ్ఛబ్ద్యం = ఆశబ్దముచే వాడుక, అనగాసంబంధ శబ్దముచే వ్యవహరించుట, (భవతి) = అగుచున్నది

రెండు ద్రవ్యములకు సంయోగము కలుగును. జాతి వ్యక్తులకు, గుణ, గుణవత్తులకు, క్రియా, క్రియావత్తులకు, అవయవ అవయవులకు సమవాయము సంబంధమగును. సంయోగము, సమవాయము రెండు కూడ ఇతర సాపేక్షములే. రెండు ద్రవ్యములు లేనిదే సంయోగముండనేరదు. జాతి, వ్యక్తిమున్నగునవి లేనిచో సమవాయముండనేరదు. ఈరీతిగా ఈ రెండు పరాధీనములే. సంబంధమనునదియు పరాపేక్షమే. ఈ సామ్యమును బట్టి ఈ రెంటిని సంబంధములుగా లోకులు భావించు చున్నారు.

B. నిజరూపమున సంయోగ సమవాయములు సంబంధములు కావు. వానికి కూడ కొన్ని ఉపాధులున్నవని చెప్పుచున్నాడు.

తయోః + అపి = ఆ సంయోగసమవాయములకుగూడ, ఉపకారార్థాః=ఉపకారము ప్రయోజనముగా గలిగినట్టియు, నియతాః = అసాధారణములగు, తదుపాధయః = ప్రసిద్ధములగు ఉపాధులు, (సన్తి) = కలవు.

"ఘటపటౌసంయుక్తౌ'' (కడవ, వస్త్రము, సంయుక్తములైయున్నవి) అనురీతిని కలిగెడి వ్యవహారమునకు నియామకమగు ఒక సంబంధముండవలెను. ఉపాధిని నియమించుటకై సంబంధముండవలెను.

పై పరాధీనత్వమనెడి సామ్యముండుటవలన ఇవియు సంబంధములుగా పరిగణింపబడుచున్నవి కాని అవియు కొన్నినియమములు కలిగియుండుటచే స్వతంత్ర పదార్థములే.

కాబట్టి సంయోగ సమవాయములు ముఖ్య సంబంధములుకానేరవు. గౌణ సంబంధములగును. ॥6॥

అవతారిక— సంయోగము ముఖ్య సంబంధము కానేరదు, దానికి కూడ కొన్ని ఉపాధులున్నవని 6వ శ్లోకమున చెప్పఁబడిన యర్థమునే వివరించుచున్నాడు

శ్లో॥ కాచిదేవ హి సావస్థా కార్యప్రసవసూచితా ।
కస్యచిత్కేనచిద్యస్యాం సంయోగ ఉపజాయతే ॥

కస్యచిత్ = ఏదో ఒకదానికి అనగా ఒక ద్రవ్యమునకు, కేనచిత్ = ఏదో ఒకదానితో అనగా మరియొక ద్రవ్యముతో, యస్యామ్ = ఏయవస్థయందు, సంయోగః = సంయోగము, ఉపజాయతే = కలుగుచున్నదో, కార్యప్రసవసూచితా = కార్యముయొక్క ఉత్పత్తిచేసూచింపబడిన, సా = ఆ యవస్థ, కాచిత్ + ఏవ + హి = ఏదో ఒకటియే కదా!

సంయోగము స్వతః సంబంధముకానేరదు దానికి కూడ కొన్ని యుపాధులున్నవి. ఎట్లనగా— రూపము, రసము మున్నగు *తార్కికులు చెప్పెడి 24 గుణములలో సంయోగ మొకటి ఇది ద్రవ్యములకే సంబంధించును. వస్త్రమనెడి కార్యము జనియించుటలో దారములు సమవాయి కారణము. దారముల సంయోగము అసమవాయి కారణము దారములున్నను వానికి సంయోగము లేనిచో వస్త్రము జనియింపనేరదు ఇట్లే ఏ ద్రవ్యము పుట్టవలెనన్నను అవయవముల సంయోగమపేక్షితమగుచున్నది. సావయవములగు ద్రవ్యములకు సంయోగము కలుగును. కాగా ద్రవ్యైక నియతత్వము అనగా ద్రవ్యములయందే నియతముగా నుండుట సంయోగమునకు ఉపాధి.

అట్లే సంయోగము గుణమగుటచే గుణత్వము కూడ ఉపాధికాగలదు ఇట్టియుపాధులున్నందున సంయోగము ఒకస్వతంత్రమగు పదార్థమే కావలెను. అట్లయినను ద్రవ్యపరతంత్రమగుటచే ఇదియు సంబంధముగా గుర్తింపబడుచున్నది. పారతంత్ర్యము సంబంధమునకు అసాధారణమగు రూపముకదా! అంతయేకాని పారతంత్ర్యము సంబంధము ఏకరూపముగాదు. గుణకర్మ సామాన్యములు పరాధీనములైనను అవి సంబంధములు కావు కదా! మరియు సంయోగము సార్వత్రికము కాదు. సంబంధము సార్వత్రికము. అనగా ద్రవ్యము, గుణము అనునియమము లేకుండగా పదార్థమాత్రమునకు యోజన చేసెడిది సంబంధము.

విశేషాంశము—(1) సంయోగము సార్వత్రికము కాదనెడి భావమును నిరూపించుటకై శ్లోకమున 'కస్యచిత్', 'కేనచిత్', 'కాచిత్' అను పదములు ప్రయోగింపబడినవి. అనగా సావయవములగు ద్రవ్యములకు సంయోగము కలుగును. దానివలన విశిష్టమగు ద్రవ్యము జనియించును

---

* రూపము, రసము, గంధము, స్పర్శ, సంఖ్య, పరిమాణము, పృథక్త్వము, సంయోగము, విభాగము, పరత్వము, అపరత్వము, గురుత్వము, ద్రవత్వము, స్నేహము, శబ్దము, బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము, ధర్మము, అధర్మము, సంస్కారము- ఈ రీతిగా తార్కికులు 24 గుణములను చూపియున్నారు ఇవి గుణ సముద్దేశమున మరల చూపబడగలవు

(2) సంయోగమును తప్పక స్వీకరింపవలెననెడి భావమును స్ఫురింపజేయుటకై కారికలో 'కార్యప్రసవసూచితా' అను పదము ప్రయోగింపబడినది. సంయోగమే లేనిచో వస్త్రము మున్నగు కార్యములు పుట్టకపోయెడివి వేరువేరుగా దారములున్ననువాని సంయోగము లేనిది వస్త్రము నిష్పన్నము కాదుకదా ః కాగా, సంయోగమనుమానప్రమాణగమ్యమగును ॥7॥

అవతారిక — సమవాయము సంబంధము కానేరదు. దానికి గూడ కొన్ని యుపాధులున్నవి అని 6 వ శ్లోకమున చెప్పబడినది ఆ యంశమునే నిరూపించుటకై సమవాయస్వరూపమును జూపుచున్నాడు

శ్లో॥ నిరాత్మకానా ముత్పత్తౌ నియమః క్వచిదేవయః ।
తేనైవాఽవ్యపవర్గశ్చ ప్రాప్త్యభేదే స యత్కృతః ॥ 8

ఆత్మాన్తరస్యయే నాత్మా తదాత్మేవావధార్యతే ।
యతశ్చైకస్య నానాత్వం తత్త్వం నాధ్యవసీయతే ॥ 9

తాం శక్తిం సమవాయాఖ్యాం శక్తీనాముపకారిణీమ్ ।
భేదాభేదావతిక్రాన్తా మన్యథైవ వ్యవస్థితామ్ ॥ 10

ధర్మః సర్వపదార్థానామతీతః సర్వలక్షణః ।
అనుగృహ్ణాతి సంబన్ధ ఇతి పూర్వేభ్య ఆగమః ॥ 11

1. నిరాత్మకానామ్ = స్వరూపములేని వస్తువులకు అనగా కారణ వ్యాపారము లేని సమయమున ఆ రూపములతో లేని వస్త్రమున్నగు వస్తువులకు, క్వచిత్, ఏవ = ఏదో ఒకచోటు నందే అనగా సర్వత్ర కాక నియమితమగు కారణమునందే, ఉత్పత్తౌ = పుట్టుక కలుగుట విషయమై, యః = ఏ, నియమః = నియమమో, దారముల వ్యాపారముచే వస్త్రము జనియించును. ఆ వ్యాపారమునకు ముందు వస్త్రము లేనేలేదు. అట్టి వస్త్రము దారముల యందే కలుగును. ఘటము కపాలములయందే కలుగును అట్టి ఏనియమమో ; మరియు, ప్రాప్త్యభేదే + అపి = 'ప్రాప్తి' అను అంశము సమానమే ఐనను, అనగా ఇంతకు మునుపు వస్తువులకు సంబంధము లేకున్నను ఇప్పుడు సంబంధము కలిగియుండుట సంయోగసమవాయములకు సమానమే ఐనను, తేన + ఏవ = అకారణముతోనే, అవ్యపవర్గః + చ = భేదము లేకుండుట అను ఏ నియమమో, కలయికలేని ఘటపటములకు సంయోగముకలుగును. అట్లే వస్త్రమను కార్యముతో ఇంతకుమునుపు సంబంధములేని దారములకు వస్త్రముతో సంబంధము కలుగును ఇట్టి సామ్యము సంయోగమునకు సమవాయమునకు ఉన్నను సంయుక్తములగు ఘటపటములు వేరుకాగలవు. వస్త్రముమాత్రము తనకు కారణములగు దారముల నుండి వేరు కానేరదు, ఎల్లకాలములందు కలసియే యుండును. అనగా కారణములగు దారములను విడనాడి వస్త్రముండనేరదు. సంయోగసమవాయముల కిదియే భేదము.

[63

సః = అట్టినియమము, యత్కృతః = దీనిచేకలుగుచున్నదో, ఇచట యచ్ఛబ్దార్థము సమవాయము. ఇంతకు ముందు లేని వస్త్రము సమవాయమును బట్టి దారములయందే పుట్టును. ఘటము కపాలముల యందే పుట్టును. ఇంతియే కాని ప్రతివస్తువు ప్రతికారణమునందు పుట్టదు. సమవాయమును బట్టియే కార్యమునకు కారణముతో అభేదము కలుగును.

పై రెండు విధములగు నియమము దేనివలన జరుగు చున్నదో, అది *సమవాయ మని భావము.

2. యేన = దేనిచే, ఆత్మా = ద్రవ్యము, ఆత్మాన్తరస్య = మరియొక ద్రవ్యమునకు, తదాత్మా + ఇవ = అదేస్వరూపము కలదివలె, అవధార్యతే = నిశ్చయింపబడుచున్నదో.

దారము లనెడి కారణద్రవ్యముచే వస్త్రమనెడి కార్యద్రవ్యము జనియించును. తరువాత ఇది కారణము, ఇది కార్యము అని వేరుగా చెప్పుటకు సాధ్యము కానందున రెండు ద్రవ్యములు ఒకే ద్రవ్యముగా నిశ్చయింపబడుచున్నవి. అట్టి నిశ్చయము సమవాయమువల ననే కలుగు చున్నది

పైసందర్భము బట్టి చూడగా ఒకదానిని ఒకటి విడనాడి యుండని పదార్థములకు సమవాయము సంబంధమని తేలుచున్నది— అవయవము, అవయవి (దారములు అవయవ ములు, వస్త్రము అవయవి) గుణములు గుణి, (తెలుపు నలుపు మున్నగునవి గుణములు, కడవ మున్నగునది గుణి) క్రియ, ద్రవ్యము (వండు మున్నగునది క్రియ, ఆపనిచేయువాడు ద్రవ్యము)

జాతి, ద్రవ్యము (ఘటత్వము మున్నగునది జాతి, కడవ మున్నగునది ద్రవ్యము) వీనిని 'అయుత సిద్ధము' లందురు. ఎన్నడు ఒకదానిని ఒకటి విడిచి ఉండనివని భావము. కాగా సమవాయమునకు అయుతసిద్ధత్వము ఉపాధి యని వ్యక్తమగుచున్నది.

3. యతః + చ = దేనివలన, ఏకస్య = ఒకే వస్తువునకు అనగా వస్త్రము మున్నగు అవయవి ద్రవ్యమునకు, నానాత్వమ్ = భేదము అనగా కారణములగు దారములు మున్నగు అవయవములకంటె అవయవికి భేదముగాని, తత్త్వమ్ = అభేదముగాని, న + అధ్యవసీయతే = నిశ్చయింపబడదో.

అవయవావయవులు, గుణగుణులు మున్నగు వానికి సమవాయము సంబంధము. అచట కార్యకారణములకు కొందరు భేదమును, మరికొందరు అభేదమును అంగీకరింతురు.

---

* అసత్కార్యవాదము నాశ్రయించి యీ రీతిగా సమవాయము నిరూపింపబడినది. కారణ వ్యాపారముకంటె పూర్వము కార్యము (అసత్) లేదు అని ఆ వాదముయొక్క యాశయము, దారముల వలన వస్త్రము నిష్పన్నమగును. ఇంతకుమునుపు లేని వస్త్రము దారముల నుండి పుట్టుచున్నది. ఈ యాశయముతో "నిరాత్మకానామ్" అని భర్తృహరి పలికెను సత్కార్యవాదమున కార్యము కారణ వ్యాపారముకంటె పూర్వము కూడ (సత్తే) ఉన్నదే కనుక అచట నియతముగనే కార్యము వ్యక్తమగును. ఆనియమము ప్రసక్తము కాదు. కనుక ఆ వాదమున ఈ గ్రంథము సమన్వయింపబడదు.

అట్టితరిని అచట కార్యకారణములకు భేదమే అనిగాని, అభేదమే అని గాని నిశ్చయింపజాలము.

4. శక్తీనామ్ + అపి = శక్తులకు గూడ, అనగా దారములు మున్నగుకారణ ద్రవ్యముల యందున్న కార్యాను కూలములగు శక్తులకు గూడ, ఉపకారిణీమ్ = ఉపకరించునట్టియు,

వస్త్రమునిష్పన్నమగుటకు కావలసిన సామర్థ్యము దారముల యందున్నది. ఆ సామర్థ్యము కార్యరూపము ధరియింపవలెనన్నచో సమవాయముండవలెను. అది లేనిది కార్యము జనియింపనేరదు

5. కనుకనే, శక్తిమ్ = శక్తిరూపముగా సున్నట్టియు,

విలక్షణములగు అవయవముల వలన విలక్షణమగు అవయవి జనియించుటలో శక్తిరూపమైనది సమవాయము.

6. కనుకనే, భేదా భేదౌ = భేదమును అభేదమును గూడ, అతిక్రాన్తామ్ = అతిక్రమించి యున్నట్టియు, శక్తులను వస్తువులతో వేరు చేసి భిన్నరూపమున గాని, వేరుచేయక అభిన్నరూపమున గాని చెప్పగలవి కాదు.

7. అన్యథా + ఏవ = రూపాంతరముననే, వ్యవస్థితామ్ = నిశ్చితమగునట్టి,

ఎల్లపదార్థములకంటె విలక్షణముగా సమవాయమున్నది. పదార్థములను కొన్నిటితో భిన్నరూపమున, కొన్నిటితో అభిన్నరూపమున గుర్తింపవచ్చును. సమవాయమట్టిదికాదు.

సమవాయాఖ్యామ్ = సమవాయమనే పేరుగలశక్తిని, సర్వపదార్థానామ్ = ఎల్ల పదార్థములకు, అతీతః = విలక్షణమగునట్టియు, ఏపదార్థమైనను శబ్దముచే బోధింపబడును, సంబంధము మాత్రము ఏశబ్దము చేతను బోధింపబడదని భావము.

కనుకనే, సర్వలక్షణః = ఎల్లవస్తువులచే గుర్తింపబడుచున్నట్టి

ఏవస్తువైనను కార్యమును జనియింపవలెనన్న, సంబంధమపేక్షిత మగును. అది లేనిది ఆకార్యమును కలిగింపలేదు. ఆ కార్యమును బట్టి సంబంధమున్నట్లు ఊహింపవచ్చును. కాగా అనుమాన ప్రమాణముచే సంబంధము తెలియబడుచున్నది.

సంబన్ధః = సంబంధమనెడి, ధర్మః = ధర్మము, అనుగృహ్ణాతి = అనుగ్రహించుచున్నది. అనగా అయుత సిద్ధమైనదానిగా నియమించుచున్నది. పారతంత్ర్యమనెడి సామ్యమునుబట్టి, సంబంధము అను వ్యవహారమును గూడ కలిగించుచున్నది. ఇతి = అని, పూర్వేభ్యః = ప్రాచీనుల నుండి వచ్చెడి, ఆగమః = శబ్దము, (శ్రూయతే) = వినబడుచున్నది. ఇట్టి ప్రయోజనమును కలిగించెడి సంబంధము స్వతంత్రమగుపదార్థమని పెద్దల వ్యవహారమువలన తెలియబడుచున్నదని భావము.

కాబట్టి సమవాయమునకు గూడ ఉపాధులుండుటవలన నదియు స్వతంత్రపదార్థమే యైనను పరాధీనత్వమనెడి సామ్యమును బట్టి అదియు సంబంధముగా గ్రహింపబడుచున్నది. ॥8, 9, 10, 11॥

అవతారిక— పరాధీనత్వమనెడి సామ్యమును బట్టియే సంయోగ సమవాయములు సంబంధములుగా గ్రహింపబడుచున్నవి. అంతియేకాని అవి స్వతః సంబంధములు గానేరవు. అవి స్వతంత్ర పదార్థములే అని యింతవరకు రూపింపబడినది. పైయర్థముననే తార్కికుల సంవాదమును జూపుచున్నాడు.

శ్లో॥ పదార్థీకృత ఏవాన్యైః సర్వత్రాభ్యుప గమ్యతే ।
సంబన్ధ, స్తేన శబ్దార్థః ప్రవిభక్తుం నశక్యతే ॥ 12

A. అన్యైః = ఇతరులచే అనగా *వైశేషికులచే, సంబన్ధః = సంబంధముగా స్వీకరింప బడుచున్న సంయోగము సమవాయము కూడ, సర్వత్ర = అంతట అనగా భిన్నాభిప్రాయము లేక ఏకగ్రీవముగా, పదార్థీకృతః + ఏవ = పదార్థముగానే నిరూపింపబడినదై, అభ్యుపగమ్యతే = అంగీకరింపబడుచున్నది.

తార్కికులు సమవాయమును ఆరవ పదార్థముగాను, సంయోగమును రెండవ పదార్థమగు గుణములలో నొకదానినిగాను పరిగణించియున్నారు. కాగా ప్రమాణ శాస్త్ర వేత్తలు గూడ మాయభిప్రాయముతో ఏకీభవించియున్నారని భావము.

B. తేన = దానిచే అనగా సంయోగముచేత, సమవాయము చేతను, శబ్దార్థః = శబ్దముయొక్క అర్థము, ప్రవిభక్తుమ్ = స్పష్టముగ విభజించి చూపుటకు, న + శక్యతే = వీలుపడదు.

శబ్దముచేనర్థము చెప్పబడును. అందు ఆ రెంటికి సంబంధముండవలెను. ఆ సంబంధము సంయోగముగాని, సమవాయముగాని, రెండుగని సరిపడవు. అందుకు వేరు సంబంధమును గ్రహింపవలెను.

విశేషాంశము— సర్వత్ర = అంతట అనగా ఏకగ్రీవముగా. కణాదశాస్త్రమేకాక గోతమతర్కము కూడ సంయోగి సమవాయములను పదార్థములుగానే స్వీకరించినది. కణాద-గోతమ శాస్త్రములకు కొన్నియంశములలో నభిప్రాయ భేదమున్నను ఈ యంశమున మాత్రము భేదాభిప్రాయములేదు. ॥12॥

అవతారిక— శబ్దార్థములకు సంయోగ సమవాయములు సంబంధములు కానేరవని యింతవరకు నిరూపింపబడినది.

---

* కణాద మహర్షి రచియించిన తర్కమును వైశేషిక శాస్త్రముగా శాస్త్రజ్ఞులు వ్యవహరించిరి. అది (1) ద్రవ్య, (2) గుణ, (3) కర్మ, (4) సామాన్య, (5) విశేష, (6) సమవాయ, (7) అభావములు అను రీతిని ఏడు పదార్థములను బోధించినది. దానిని 'సప్తపదార్థి' అనియు వ్యవహరింతురు. గుణ పదార్థములో సంయోగము చూపబడినది

ఒకవేళ అవియు సంబంధములు కావలెనన్నచో, ఈ రీతిగా సమన్వయము చేయ వలెనని మూడున్నర (13, 14, 15$\frac{1}{2}$) శ్లోకములచే చూపుచున్నాడు.

శ్లో॥ సమవాయః స్వ ఆధారః సాచజాతిః ప్రతీయతే ।
ఏకార్థ సమవాయాత్తు గుణాః స్వాధార ఏవతే ॥ 13

A. స్వః = స్వీయమగు గగన, ఆకాశ, మున్నగుశబ్దములకు స్వీయమగు, ఆధారః = ఆధారము అనగా ఆధారమగు ఆకాశము, సా = తనకు సంబంధించి యున్న, అనగా శబ్దముల యందున్న, జాతిః + చ = జాతియును అనగా శబ్దత్వ జాతియును, సమవాయాత్ = సమవాయ సంబంధము వలన, ప్రతీయతే = తెలియబడుచున్నది.

కణాదతర్కము తొమ్మిది* ద్రవ్యములను జూపియున్నది. వానిలో ఆకాశ మొకటి. ఆతర్కము చూపిన 24 గుణములలో శబ్దమొకటి. ద్రవ్యమునకు గుణమునకు సమవాయము సంబంధము. శబ్దము ఆకాశము యొక్కగుణము, "శబ్దగుణకమాకాశమ్" (శబ్ద మనెడి గుణము కలది ఆకాశము) అనితార్కికులు చెప్పుదురు. కాగా గగన, ఆకాశ, నభః, అన్తరిక్ష మున్నగు శబ్దములు వానికి సమవాయియగు ఆకాశమును సమవాయ సంబంధమును బట్టి బోధింపగలవు.

అట్లే శబ్దమునందు, శబ్దత్వ జాతి సమవేత మగును. అందుచే శబ్దము సమవాయ సంబంధముచే ఆ జాతిని బోధింపగలదు.

B. స్వాధారే + ఏవ = తనకు అనగా శబ్దమునకు ఆధారమగు ఆకాశముననే ఉన్న, తే = ప్రసిద్ధములగు, గుణాః = గుణములు అనగా మహత్త్వము మున్నగు గుణములు, ఏకార్థసమవాయాత్ + తు = ఒకే ఆకాశమనే అర్థము నందు సమవాయ సంబంధము వలననే, ప్రతీయన్తే = తెలియబడుచున్నవి.

మహత్త్వమ్ మున్నగు శబ్దములు, మహత్త్వము మున్నగు గుణములు గూడ ఆకాశమనే ద్రవ్యమునందు సమవాయ సంబంధముచే నున్నవి. ఆ సంబంధముచే అనగా ఏకార్థ సమవాయ సంబంధముచే మహత్త్వాది శబ్దములుమహత్త్వాది గుణములను బోధింపగలవు.

ఇట్లే ఆకాశమునకు అసాధారణములగు గర్జిత, కూజిత, మణిత, హేషితములు మున్నగుశబ్దములు కూడ ఏకార్థ సమవాయ సంబంధముచే ఉరుము మున్నగు అర్థములను బోధింపగలవు. ॥13॥

అవతారిక— మరికొన్నిశబ్దములకు అర్థముతో సమవాయము సంబంధముగా సంభవించునని చెప్పుచున్నాడు.

---

* (1) పృథివి, (2) అప్పు (ఉదకము), (3) తేజము, (4) వాయువు, (5) ఆకాశము, (6) కాలము, (7) దిక్కు, (8) ఆత్మ, (9) మనస్సు. ఈ తొమ్మిది ద్రవ్యములు.

శ్లో॥ ద్రవ్యత్వసత్తా సంయోగాః స్వాన్యాధారోపబన్ధనాః ।
తత్రప్రదేశ విభాగాశ్చ గుణాద్విత్వాదయశ్చయే ॥ 14

స్వాన్యాధారోపబన్ధనాః = స్వీయమగు శబ్దమునకు స్వీయమగు ఆకాశమనెడి ఆధారము. దాని కంటె ఇతరమగు పృథివి మున్నగు ఆధారమును ఆశ్రయముగా గల అనగా ఆకాశముచేత పృథివ్యాదులచేతను గూడ నియమింపబడు చున్న, ద్రవ్యత్వ సత్తాసంయోగాః = ద్రవ్యత్వము, సత్త, సంయోగము అనునవి, తత్రప్రదేశ విభాగాః+చ=ఆకాశము యొక్క అవాంతర ప్రదేశ ములు, దాని విభాగములు, చ = మరియు ద్విత్వాదయః = ద్విత్వము మున్నగు, యే = ఏ, గుణాః = గుణములో అనగా ద్విత్వ, పరిమాణ, సంయోగ విభాగములు మున్నగు గుణములో, (తే) = అవియు, (ఏకార్థ సమవాయాత్) = ఏకార్థ సమవాయమనే సంబంధము వలన, ప్రతీ యన్తే = తెలియబడు చున్నవి.

ద్రవ్యత్వమనే జాతి పృథివి మున్నగు తొమ్మిది ద్రవ్యములయందు ఉండును. సత్తాజాతి ద్రవ్య-గుణ-కర్మలయందుండును. సంయోగము ద్రవ్యములయందే ఉండును. ద్రవ్యత్వ-సత్తా, సంయోగ శబ్దములు ఆకాశమునందు సమవాయ సంబంధముచే నుండును సత్తాజాతి, సంయోగమనే గుణము కూడ ఆకాశమునందు సమవాయ సంబంధముచే నుండును. ద్రవ్యత్వము పృథివ్యాదుల యందు గూడ ఉండును కాగా స్వాశ్రయమునందు, ఇతరము లగు పృథివ్యాదులయందును ద్రవ్యత్వాదులుండును. అవి ఆకాశముచేత పృథివ్యాదులచేతను స్వాశ్రయముల యందు నియమింపబడియున్నవి. కాగా పైశబ్దములు ద్రవ్యత్వాదులను ఏకార్థ సమవాయమనే సంబంధముచే బోధింపగలవు.

అట్లే ఆకాశమునకు ఇతర పదార్థములతో సంబంధము కలుగగా కొన్ని ప్రదేశ ములు, విభాగములు కలుగును. అచటను ప్రదేశ-విభాగశబ్దములు ఆకాశమునందే ఉన్నవి. ప్రదేశాదులు అచటనే యున్నవి. కాగా పై శబ్దములు పై యర్థములను పై సంబంధముచే బోధింపగలము.

అట్లే ద్విత్వాది శబ్దములు ద్విత్వాది గుణములు ఆకాశమునందుండుటచే పై సంబం ధముచే ఆశబ్దములు వానిని చెప్పగలవు. ॥14॥

అవతారిక— అట్లే మరికొన్నిశబ్దములు అర్థములను బోధించుటలో సమవాయ సంయోగములు సంబంధములుగా సంభవించుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ కేచిత్స్వాశ్రయ సంయుక్తాః కేచిచ్చ సమవాయినః ।
సంయుక్తసమవేతేషు సమవేతా స్తథాపరే ॥ 15

1. కేచిత్ = కొన్నిశబ్దములు అనగా రథము, ఘటము మున్నగుశబ్దములు, స్వాశ్రయ సంయుక్తాః = తనకు ఆశ్రయమగు దానితో కలసియున్నవి.

రథ-ఘటాది శబ్దములు, రథము, ఘటము మున్నగు అర్థములను బోధింపవలెను. అచట స్వాశ్రయ సంయోగము సంబంధము. స్వ = రథాది శబ్దములు, వానికి ఆశ్రయము ఆకాశము, దానితో సంయోగము రథాదులకు కలదు. కాగా, స్వసమవాయి సంయోగము సంబంధము అనినను అదియే యర్థము.

2 కేచిత్ + చ = మరికొన్ని శబ్దములు అనగా ఘటరూపమ్ మున్నగు శబ్దములు, సమవాయినః = సమవాయము కలవై బోధకములగును.

ఘటరూపమ్ (కడవయొక్క తెలుపు నలుపు మున్నగురూపము) అను శబ్దమునకు ఆశ్రయము ఆకాశము. దానితో సంయుక్తము కడవ, దానియందు సమవేతము రూపము, కాగా స్వాశ్రయ సంయుక్త సమవాయము సంబంధము కాగలదు.

3. తథా = అట్లే, పరే = మరికొన్ని అనగా ఘటరూపత్వము మున్నగునవి, సంయుక్తసమవేతేషు = సంయుక్తమగు దానియందు సమవాయసంబంధమున నున్న వాని యందు, సమవేతాః = సమవాయ సంబంధముచే నున్నవై, బోధ్యములగుచున్నవి.

ఘటరూపత్వమ్ (కడవయొక్క రూపమునందున్న రూపత్వజాతి) ఇచట స్వాశ్రయ సంయుక్త సమవేత సమవాయము అను సంబంధము కలదు. స్వ = ఘటరూపత్వ శబ్దము. దానికి ఆశ్రయము ఆకాశము, దానితో సంయుక్తము కడవ, దానియందు సమవేతము రూపము దానియందు సమవాయమున నున్నది జాతి.

కాగా రథ ఘటాది శబ్దములు స్వాశ్రయ సంయోగ సంబంధమున, ఘటరూపాది శబ్దములు స్వాశ్రయ సంయుక్త సమవాయసంబంధమున, ఘటరూపత్వాది శబ్దములు స్వాశ్రయ సంయుక్త సమవేత సమవాయసంబంధమున అర్థబోధకములగుచున్నవి. ॥15॥

అవతారిక— మరికొన్ని శబ్దములకు అర్థములతోగల సంబంధములను జూపుచున్నాడు.

శ్లో॥ స్వాశ్రయేణతు సంయుక్తైః సంయుక్తం విభుగమ్యతే ।
సమవాయస్య సంబన్ధోనా పరస్తత్ర విద్యతే ॥ 16

A. విభు + తు = *విభువు అగు పదార్థము మాత్రము, స్వాశ్రయేణ = తనకు ఆశ్రయమగు దానితో అనగా దిక్కాలాత్మ శబ్దములకు ఆశ్రయమగు ఆకాశముతో, సంయుక్తైః = సంయుక్తములగు వానితో, సంయుక్తమ్ = కలసి యున్నదై, గమ్యతే = తెలియబడుచున్నది.

దిక్కు, కాల, ఆత్మ అను శబ్దములకు ఆశ్రయము ఆకాశము. ఆ యాకాశముతో భూమి, నీరు, తేజము మున్నగునవి కలసియున్నవి. వానితో దిక్కాలాత్మలు కలిసియున్నవి. కాగా స్వాశ్రయ సంయుక్త సంయోగము సంబంధము కాగలదు.

---

* ఎల్ల మూర్త ద్రవ్యములతో సంయోగము కలది 'విభువు' అని యనబడును. పరిచ్ఛిన్న మగు పరిమాణము కలది 'మూర్తము' అని యనబడును. కాక క్రియావత్తు మూర్త మనబడును.

B. పై రీతిని 8½ శ్లోకములచే శబ్దములకు అర్థములతో సంయోగ సమవాయములు సంబంధములు కాగలవని చూపబడినవి. కాని యట్లు చూపుట సరిపడదు. అట్లైన అవ్యాప్తి అనగా లక్షణము కొన్ని లక్ష్యములలో ప్రవర్తింపకుండుట అను దోషము కలుగునని చెప్పు చున్నాడు. సమవాయస్య = సమవాయమునకు, సంబన్ధః = సంబంధము, న = కుదరదు.

రథము మున్నగు శబ్దములు ద్రవ్య బోధకములు. వానికి ఆకాశము ద్వారా వాని యర్థములకు సంయోగమో, సమవాయమో రెండు కలిసియో సంబంధముగా చూపబడు చున్నది. 'సమవాయ' అను శబ్దము సమవాయమును చెప్పవలెను. అచట సంయోగము సంబంధముగా నుండనేరదు. సమవాయము ద్రవ్యము కానందున దానికి ఆకాశము ద్వారా సంయోగముండనేరదు. ద్రవ్యములకే సంయోగము కలుగును.

తత్ర = దానియందు అనగా సమవాయమునందు, అపరః = మరియొక, సమ వాయః = సమవాయము, న + విద్యతే = లేదు.

'సమవాయ' అను శబ్దమునకు దాని యర్థముతో సమవాయ సంబంధమును చూపుటకు వీలులేదు. సమవాయ మొక్కటియే (సమవాయస్తు ఏక ఏవ) అని తార్కికులు సిద్ధాంతము చేసియున్నారు. అట్టితరి మరియొక సమవాయ మెట్లుండును ?

కాబట్టి 'సమవాయ' అను శబ్దము సంయోగ సమవాయములను సంబంధములుగా గైకొని సమవాయమును బోధింపజాలదు. ॥16॥

అవతారిక — శబ్దార్థములకు సంయోగ సమవాయములు సంబంధములుగా నుండుట ఈ రీతిగా సంభవించునని 8½ శ్లోకములతో జూపి, 16వ శ్లోకముయొక్క ఉత్తరార్థముచే దానిని దూషించి, "తేన శబ్దార్థః ప్రవిభక్తుం నశక్యతే" (సంయోగముచేత సమ వాయము చేతను శబ్దార్థములు విభజింపబడవు) అను 12వ శ్లోకము యొక్క అర్థమునే విశదపరచుచున్నాడు.

శ్లో॥ సంబన్ధస్యావిశిష్టత్వాన్న చాత్రనియమో భవేత్ ।
తస్మాచ్ఛబ్దార్థయోర్నైవ సంబన్ధః పరికల్ప్యతే ॥ 17

A. సంబన్ధస్య = సంబంధము, అవిశిష్టత్వాత్ = విశిష్టరూపమున లేనందున అనగా సంబంధము విశేషరూపముగా లేకపోవుటవలన, అత్ర = ఇందు అనగా శబ్దముచే నర్థమును బోధించుట యందు, నియమః = నియమము, న + భవేత్ = కలుగకపోయెడిని.

ఈ శబ్దమునకు ఈ యర్థముతో ఇది సంబంధమని విశేషరూపముగా చెప్పలేనందున ఘట శబ్దముచే కడవయే బోధింపవలెను. పటము బోధింపబడదు అను నిశ్చయము లభింపదు. కాగా ఎల్ల శబ్దములు ఎల్ల యర్థములను బోధింపవలెను. అట్లు అనుభవము లేదు.

కాక, సంబన్ధస్య = సంబంధము, అవిశిష్టత్వాత్ = సమానమగుటవలన నియమము లేకపోయెడిని,

ఆకాశ శబ్దము స్వసమవాయ సంబంధమున ఆకాశమును బోధించునని యంగీక రించిన ఘట శబ్దమునకు ఆకాశముతో పై సంబంధముండుటవలన ఘటశబ్దము కూడ ఆకాశ మును బోధింపవలెను. ఇట్లే ఘటశబ్దము స్వాశ్రయ సంయోగ సంబంధమున (స్వ = ఘట శబ్దము. దానికి ఆశ్రయము ఆకాశము దాని సంయోగము ఘటమునకు కలదు) ఘటమును బోధించునని యంగీకరించిన అట్టి యాకాశము యొక్క సంయోగము పటమునకు గూడ నున్నందున ఘట శబ్దము పటమును గూడ బోధింపవలెను.

సంయోగ సమవాయములు ఎల్ల వస్తువులకు సమానములగుటంజేసి నియతమగు వాచ్యవాచక భావము ఏర్పడదు

B. తస్మాత్ = ఆ కారణమువలన, శబ్దార్థయోః = శబ్దమునకు అర్థమునకును, సంబన్ధః= సంబంధము అనగా సంయోగము సమవాయము అనే సంబంధము, న + ఏవ + కల్పతే = కుదరనేరదు.

సమవాయ శబ్దము సమవాయమును చెప్పుటకు సంబంధము లేనందున నచట అవ్యాప్తిదోషము, ఆకాశ-ఘటాది శబ్దములచే ఆకాశ-ఘటాదుల బోధింపవలసిన, నచట అతివ్యాప్తిదోషము కలుగుచున్నందున శబ్దార్థముల విషయమై పై రెండు సంబంధములు గ్రహింపరాదు. ॥17॥

అవతారిక— శబ్దార్థములకు సంయోగ సమవాయములు సంబంధములుగా పరిగ్రహింపబడవని నిరూపింపబడినది. కాని యందు చూపబడిన దోషము లౌకవిధముగ పరిహరింపవచ్చునేమోయని పరిహారోపాయమును జూపుచున్నాడు.

శ్లో॥ అదృష్టవృత్తి లాభేన యథాసంయోగ ఆత్మనః ।
క్వచిత్ స్వస్వామి భావాఖ్యోఽభేదేఽన్యత్రాపి సక్రమః ॥ 18

యథా = ఏ రీతిగా, ఆత్మనః = ఆత్మకు అనగా జీవునకు సంయోగే = సంయోగము, అభేదే = ఎల్ల ద్రవ్యములతో సమానమే ఐనను, అదృష్టవృత్తి లాభేన = అదృష్టముయొక్క అనగా ధర్మాధర్మములయొక్క ఫలమును కలిగించుటకై కలిగెడి వ్యాపారమును పొందుటచే, క్వచిత్ = ఏదో ఒకదాని యందే, స్వస్వామిభావాఖ్యః = స్వస్వామి భావమనెడి సంబంధము, (అస్తి) = కలుగునో ;

తథా = అట్లే, అభేదే = సంబంధభేదము లేకున్నను, అనగా 17వ శ్లోకమున చూపిన ప్రకారము సంబంధము అవిశిష్టమైనను, అన్యత్ర + అపి = శబ్దార్థముల విషయమున గూడ, సః + క్రమః = ఆ క్రమము అనగా నియమము, (అస్తి) = కలుగును.

జీవ పదార్థము ఎల్ల వస్తువులను వ్యాపించియుండును. అది వైశేషికతర్కము ప్రకారము ద్రవ్యము-శరీరము, గృహము, ఘటము, వృక్షము, తటస్థములగు నదీ పర్వ

తాదులు వీని యన్నిటితో ఆత్మ సంయుక్తమగును. అంత మాత్రాన ఎల్ల వస్తువులు తనవే యని, వానికి తాను స్వామియని మాత్రము భావింపదు. తాను చేసికొనిన పుణ్య పాపకర్మల ఫలితములగు ధర్మాధర్మములను ఏ కాలమున ఏ దేశమున ఏ రూపమున అనుభవింపవలసి యున్నదో, దానికి అనుగుణముగ జన్మను పొంది శరీరము ఆ ప్రాంతమున తనకు సంబంధించిన గృహాదులు తనకు సొత్తు అని భావించును.

అట్లే ఘటాది శబ్దములకు స్వాశ్రయ సంయోగము సంబంధము. అది ఎల్ల వస్తువులకు సమానమైనను అదృష్టవశమున ఘటాదులనే బోధించును. పటాదులను బోధింపదు.

అదృష్టమనగా ధర్మాధర్మములు. వాని ఫలమును జీవుడు అనుభవించుటకై కలిగెడి వృత్తి వ్యాపారము. దానిని పొందుట లాభము. అది యంతఃకరణ వ్యాపారము ద్వారా కలుగును.

విశేషాంశము— కాని ఈ సమాధానము బాగులేదు. అదృష్టమునకు కర్మ మూలము. దానివలన పుణ్యపాపములు, వానివలన ధర్మాధర్మములు కలుగును. అవి ఆత్మకు నియతమగు ఫలము నీయగలవు. శబ్దమునకు అట్టి కర్మ లేనందున పై దృష్టాంతమిచట అన్వయింపదు. ప్రయోగానుసారము నిర్ణయించిన, దానికి ఏదో శబ్దమునకు సహజ శక్తి యుండవలెను. ఈ యభిప్రాయమును హేలారాజు వక్కాణించి యున్నాడు. ॥18॥

అవతారిక— సమవాయము సంబంధము కానేరదు. కనుకనే దానిని చెప్పెడి శబ్దము లేదు. 'సమవాయ' అను శబ్దము కూడ దానిని బోధింపజాలదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రాప్తిం తు సమవాయాఖ్యాం వాచ్యధర్మాతివర్తినీమ్ ।
ప్రయోక్తా ప్రతిపత్తా వా న శబ్దైరనుగచ్ఛతి ॥ 19

ప్రయోక్తా = శబ్దములను ప్రయోగించువాడుగాని, ప్రతిపత్తా + వా = వానిని గ్రహించువాడుగాని, వాచ్యధర్మాతివర్తినీమ్ = శబ్దములచే బోధింపబడెడి అర్థములయొక్క ధర్మమును అతిక్రమించి యున్న, సమవాయాఖ్యామ్ = సమవాయమనే పేరుకల, ప్రాప్తిం+తు = సంబంధమును, శబ్దైః = శబ్దములచే, న + అనుగచ్ఛతి = తెలిసికొనుట లేదు.

మనుష్యుడు తన బుద్ధిలో నొక యర్థమును నిరూపించి దానికి అనుగుణమగు శబ్దమును ప్రయోగించును. అట్టి శబ్దమును వినువాడు ఆ శబ్దమును దానిచే బోధింపబడెడి యర్థమును గ్రహించును. ఇరువురు కూడ సమవాయమును శబ్దవాచ్యముగా గ్రహించి యుండ లేదు. అనగా ఘటము, పటము మున్నగు అర్థములను, 'ఘట', 'పట', మున్నగు శబ్దములచే బోధింపదలచినట్లు సమవాయమును ఏ శబ్దముచేతను బోధింపజాలకున్నారు. కారణమేమనగా— ఉపాధితో గూడియున్న అర్థమే శబ్దవాచ్యమగును. ఘటమునకు జాతి, నలుపు తెలుపు మున్నగువానికి గుణము, వంటవాడు పాఠకుడు మున్నగువానికి క్రియయు, ఉపాధులు కలవు.

వానినే ఆ శబ్దములకు ప్రవృత్తి నిమిత్తములందురు. అవియే వాచ్యధర్మములుగా పరిగణింప బడుచున్నవి. అట్టి ధర్మములు లేని యర్థమును శబ్దము బోధింపజాలదు. సమవాయమునందు ఏ ధర్మములు లేవని తార్కికుల నిర్ణయము. అట్లైతరి ఏ శబ్దము దానిని చెప్పగలదు?

ఒకవేళ సమవాయము స్వతంత్ర పదార్థమేయని యంగీకరించిన, దానికి కొన్ని ధర్మము లుండవలెను. అట్టితరి నది తార్కికులు చెప్పిన సమవాయము కానేరదు.

కాబట్టి సమవాయమును బోధించెడి శబ్దము లేదు అది అవాచ్యమే. ॥19॥

అవతారిక— 6 వ శ్లోకమునుండి యింతవరకు సంయోగ సమవాయములు సంబంధములు కానేరవనియు, అందును సమవాయము శబ్దమునకు వాచ్యము కానేరదనియు నిరూపించియున్నాడు.

ఇప్పుడు *నైయాయికుడు ఛలమునుపయోగించి సమవాయము శబ్దవాచ్యము కాగలదని 20 వ శ్లోకమునుండి 30 వ శ్లోకమువరకు నిరూపించుచున్నాడు.

శ్లో॥ అవాచ్యమితి యద్వాచ్యం తదవాచ్యతయా యదా।
అవాచ్యమిత్యవసీయేత వాచ్యమేవ తదాభవేత్ ॥ 20

అవాచ్యమ్ + ఇతి = 'అవాచ్య' అను శబ్దముచే, యత్ = ఏది, వాచ్యమ్ = చెప్పబడు చున్నదో, తత్ = అదే, యదా = ఎప్పుడు, అవాచ్యతయా = అవాచ్యత్వరూపమున, వాచ్యమ్ = వ్యవహరింపదగినది. ఇతి = అని, అవసీయేత = నిశ్చయింపబడినదైన యెడల, తదా = అపుడు, వాచ్యమ్ + ఏవ = వాచ్యమైనదే, అనగా శబ్దముచే బోధింపబడినదే, భవేత్ = కాగలదు.

సమవాయము అవాచ్యము అని చెప్పిన దాని యర్థమును పరిశీలింపగా అది శబ్ద వాచ్యమనియే తేలుచున్నది. అవాచ్యము అను శబ్దమునకు ఏదో అర్థము చెప్పవలెను. ఘట శబ్దమునకు ఘటత్వరూపమున ఘట మర్థమగునట్లు అవాచ్య శబ్దమునకు అవాచ్యత్వ రూపమున నొక యర్థము కాగలదు. కాగా సమవాయము అవాచ్యమనగా సమవాయము అవాచ్యత్వ రూపమున అవాచ్య శబ్దమునకు అర్థమని స్పష్టము కాగలదు.

---

* గోతమమహర్షిచే నిర్మింపబడినతర్కమునకు న్యాయశాస్త్రమనిపేరు. అందు (1) ప్రమాణము, (2) ప్రమేయము, (3) సంశయము, (4) ప్రయోజనము, (5) దృష్టాంతము, (6) సిద్ధాంతము, (7) అవయవము, (8) తర్కము, (9) నిర్ణయము, (10) వాదము, (11) జల్పము, (12) వితండము, (13) హేత్వాభాసము, (14) ఛలము, (15) జాతి, (16) నిగ్రహస్థానము అను 16 పదార్థములు నిరూపింపబడినవి వక్త యొక్క యభిప్రాయముతో పలికిన శబ్దమునకు అర్థాంతర కల్పనచేసి యాక్షేపించుట ఛలము. ఉదా. "నవకమ్బలోఽయం బ్రాహ్మణః" (ఈ బ్రాహ్మణుడు నూతనమగు కంబలము కలవాడు) ఇచట నవ శబ్దమునకు తొమ్మిది అని యర్థముచే, ఇతనికి ఒక కంబలమున్నది అట్టితరి 'నవకంబలః' అనుట యెట్లు? అని యాక్షేపించుట ఛలము.

కాగా సమవాయము అవాచ్యమను భావము సరియగునదే.

సమవాయము వాచ్యముకాదని సామాన్యముగా చెప్పగా, అచట ఛలమును ఉపయోగించి, సమవాయము అవాచ్యము, అను దానికి అర్థము ఇది అని ఆక్షేపించెను. అందుచే సమవాయము 'అవాచ్య' శబ్దమునకు వాచ్యము కాగలదు. ॥20॥

అవతారిక — పై రీతిని అంగీకరింపనియెడల, సమవాయము అవాచ్యము, అనెడి ప్రకృతార్థమే సిద్ధింపనేరదని చెప్పుచున్నాడు

శ్లో॥ అథాప్యవాచ్యమిత్యేవం న తద్వాచ్యం ప్రతీయతే ।
వివక్షితాఽస్యయాఽవస్థా నేయం నాధ్యవసీయతే ॥ 21

అథ + అపి = ఒక వేళ, అవాచ్యమ్ + ఇతి = అవాచ్యమ్ అను శబ్దముచే, ఏనమ్ = ఈ రీతిగా అనగా అవాచ్యత్వరూపముగా, తత్ = ఆ సమవాయము, వాచ్యమ్ = బోధింపబడినదై, న + ప్రతీయేత + (యది) = తెలియబడకపోయినదైన యెడల, అస్య = ఈ సమవాయమునకు, యా = ఏ, అవస్థా = అవస్థయో అనగా సమవాయమునకు శబ్దవాచ్యత్వము లేదనెడి ఏ నియమమో, సా + ఇయమ్ = ఆ యీ నియమము, న + అధ్యవసీయేత = నిశ్చితము కాకపోయెడిని.

అవాచ్యము అను శబ్దముచే అవాచ్యత్వరూపమున సమవాయము బోధింపబడని యెడల, సమవాయము శబ్దవాచ్యము కాదు అనెడి నియమము అయుక్తమే యగును. అవాచ్య శబ్దము అర్థబోధకమే కానందున పై నియమము ఎట్లు సిద్ధించును ? అవాచ్య శబ్దము బోధకమే కానిచో సమవాయము వాచ్యమనియే లభించుచున్నది. ఆ శబ్ద మర్థబోధకమగుచో నది అవాచ్యత్వరూపమున సమవాయబోధకమని తేలినందున ఆ రూపమున సమవాయము శబ్దవాచ్యమే యగుచున్నది. 'అవాచ్య' అనునదియు శబ్దమేకదా ! ॥21॥

అవతారిక — సమవాయము పారతంత్ర్య రూపమున వాచ్యము కాదనియే తాత్పర్యము. అంతియేకాని ఏ రూపమున గూడ అది వాచ్యముకాదని గ్రహింపరాదు. కాబట్టి ఛలమునకు తావు లేదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అథాన్యథా సర్వథా చ యస్యావాచ్యత్వముచ్యతే ।
తథాపినైవసావస్థా తైశ్శబ్దైః ప్రతిషిధ్యతే ॥ 22

అథ = అట్లుకాక, అన్యథా = ఏదో ఒక ధర్మరూపమున, సర్వథా + చ = ఎల్ల ధర్మరూపమునగాని, యస్య = దేనికి, అనగా ధర్మికి, అవాచ్యత్వమ్ = అవాచ్యత్వము, ఉచ్యతే = చెప్పబడుచున్నదో, తత్ర + అపి = అచటకూడ, సా + అవస్థా = ధర్మరూపమగు అవస్థ అనగా విశేషరూపమగు అవస్థ, తైః = ఆ, శబ్దైః = శబ్దములచే అనగా పారతంత్ర్యము, పరాధీనత్వము మున్నగు శబ్దములచే, న + ఏవ + ప్రతిషిధ్యతే = నిషేధింపబడదు.

సమవాయము వాచ్యముకాదు అనువాని యభిప్రాయమేమనగా— అది పరాధీనము కనుక పరాధీనత అను విశేషరూపమున వాచ్యముకాదని కాని దానియందు ఎన్ని ధర్మములు అనగా ఎన్ని విశేషణములున్నవో, అన్ని రూపములతో వాచ్యముకాదని భావము. ఇదియు సరికాదు. ఏలయన, ధర్మిని నిషేధించినగాని ధర్మములు నిషేధింపబడవు అందుచే సమవాయము, ఈ విశేషణముతో గూడినదై వాచ్యము కాదు అను రీతిని తత్తద్రూపమున వాచ్యముకాదనియే నిరూపింపవలెను. అపుడు సమవాయము వాచ్యముకాదనియే చెప్పవలెను. అట్టితరి అవాచ్య శబ్దమునకు వాచ్యము కాగలదు. కాబట్టి ఫలము నుపయోగించుటచే సమవాయము 'అవాచ్య' శబ్దమునకు వాచ్యమనుటలో దోషము లేదు. ॥22॥

అవతారిక— పై యర్థమునే యుక్తమగు దృష్టాంతముతో సమర్థించుచున్నాడు.

శ్లో॥ న హి సంశయరూపేర్థే శేషత్వేన వివక్షితే ।
అవ్యుదాసే స్వరూపస్య సంశయోఽన్యః ప్రవర్తతే ॥ 23

సంశయరూపే = సంశయరూపమగు జ్ఞానము, అర్థే = సంశయమున విషయమగు వస్తువునందు, శేషత్వేన = విశేషణముగా, వ్యవస్థితే = నిశ్చితము కాగా, స్వరూపస్య = సంశయజ్ఞానము యొక్క స్వరూపమునకు, అవ్యుదాసే = నాశము లేనపుడు, అనగా ఆ జ్ఞానము అట్లే యుండగా, అన్యః = మరియొక, సంశయః = సంశయము, అనగా సంశయజ్ఞానము విషయముగాగల సంశయము, న + ప్రవర్తతే = ప్రవర్తింపదుగదా !

రెండు వస్తువులకు ధర్మములు సమానముగా నుండగా విశేషధర్మములు తెలియబడ నపుడు *సంశయజ్ఞానము కలుగును. కనుచీకటిలో సన్నముగా పొడవుగా ఉన్న వస్తువును జూడగా 'ఇది రాయియా ? కాక మనుష్యుడా ? అను సంశయజ్ఞానము కలుగును. అట్లే కనుచీకటిలో వంకరగానున్న వస్తువును జూడగా త్రాడా ? కాక పామా ? అను సంశయజ్ఞానము కలుగును. వస్తువును ఆధారముగా గైకొనియే జ్ఞానముండును. విషయము లేనిది జ్ఞానముండదు. కనుక జ్ఞానము పరాధీనమే ! పై సంశయ జ్ఞానముండగా మరియొక సంశయము అనగా సంశయజ్ఞానము విషయముగాగల మరియొక సంశయజ్ఞానము కలుగదు. జ్ఞానములో విషయములగు రాయి మనుష్యుడు సంశయితములగును. అంతియేకాని ఆ జ్ఞానము కూడ సంశయితము కానేరదు. ఆ జ్ఞానము తనకంటె నితరములగు వస్తువులను సంశయగ్రస్తముగా జేయును. అది మాత్రము సంశయితము కాదు.

అట్లే 'అవాచ్య' అను శబ్దము తన్ను విడిచి ఇతర శబ్దములచే సమవాయము వాచ్యము కాదనియే చెప్పును. అవాచ్య శబ్దముచే గూడ వాచ్యము కాదని చెప్పదు.

'అవాచ్య' శబ్దము సంశయజ్ఞానము వంటిది. ఆ జ్ఞానము సంశయరూపము కానట్లు

---

* నైయాయికులు అంగీకరించిన 16 పదార్థములలో సంశయమొకటి. దీని వివరణము 20 శ్లోకము యొక్క 'ఫుట్‌నోట్'లో కలదు.

అవాచ్యశబ్దము వాచకము కాదని చెప్పదు. ఇతరములగు విషయములు సంశయ గ్రస్తము లగుసట్లు సమవాయము ఇతర శబ్దవాచ్యము కాదు. అవాచ్య శబ్దము కూడ వాచకమే కానిచో అది శబ్దమే కాకపోయెడిని, అది వాచకము కాసందున సమవాయము వాచ్యము కాదనెడి యర్థము లభింపనందున అర్థాత్ సమవాయము వాచ్యమనియే లభించును. ॥23॥

అవతారిక— పై యర్థమునే మరియొక దృష్టాంతముతో సమర్థించుచున్నాడు.

శ్లో॥ యదా చ నిర్ణయజ్ఞానే నిర్ణయత్వేన నిర్ణయః ।
ప్రక్రమ్యతే తదాజ్ఞానం స్వధర్మేణావ తిష్ఠతే ॥ 24

యదా + చ = ఏ సమయమున, నిర్ణయః = నిర్ణయము, నిర్ణయజ్ఞానే = నిర్ణయమును కలిగించెడి జ్ఞానమునందు, నిర్ణయత్వేన = నిర్ణయత్వ రూపమున, ప్రక్రమ్యతే = ఉపక్రమింపబడుచున్నదో, తదా = ఆ సమయముననే, జ్ఞానమ్ = జ్ఞానము అనగా నిర్ణయ జ్ఞానము, స్వధర్మేణ = జ్ఞానరూపముననే, అవతిష్ఠతే = నిలిచియుండును.

ఆత్మ నిత్యమా? కాక అనిత్యమా అని సంశయము కలుగగా, బాధకములగు యుక్తులను పారద్రోచి, సాధకములగు యుక్తులను జూపి ఒక పక్షమును స్థిరమైనదానినిగా ఒప్పించి తత్వమును ప్రదర్శించుట, *'నిర్ణయ' మనబడును.

నిర్ణయము జ్ఞానరూపము, అందు ఆత్మయొక్క నిత్యత, అనిత్యత అనునవి విషయములు. వాని నిర్ణయము నిర్ణయత్వరూపమున నుపక్రమింపబడినపుడు ఆ నిర్ణయ జ్ఞానము నిర్ణయరూపము కానేరదు ఆ జ్ఞానము మరియొక జ్ఞానమున విషయము కాదుకదా! జ్ఞానను ఎల్లపుడు విషయ పరతంత్రము, కాగా నిర్ణయజ్ఞానము జ్ఞానరూపమును విడనాడక తనకంటె అతిరిక్తమగు విషయమును నిర్ణయించును.

అవాచ్యశబ్దము కూడ నిర్ణయజ్ఞానమువలె నున్నది. అదియు తన్ను విడనాడి ఇతరములగు శబ్దములచే సమవాయము బోధింపబడదనియే చెప్పును. అంతియేకాని 'అవాచ్య' శబ్దముచే గూడ సమవాయము వాచ్యముకాదని చెప్పజాలదు. 'అవాచ్య' శబ్దముచే వాచ్యము కాదని చెప్పెడి మరియొక శబ్దము లేదుకదా!

కాగా సమవాయము అవాచ్యము అని పలుకగా ఇతరములగు శబ్దములకు వాచ్యము కాదనియే లభించును. 'అవాచ్య' శబ్దమునకు మాత్రము అవాచ్యత్వ రూపమున వాచ్యమనియే సిద్ధించును. ॥24॥

అవతారిక— పై యర్థమునే మరియొక దృష్టాంతముచే సమర్థించుచున్నాడు.

---

* నైయాయికులు అంగీకరించిన 16 పదార్థములలో 'నిర్ణయము' ఒకటి. ఆ పదార్థములు 20 వ శ్లోకము యొక్క 'ఫుట్ నోట్'లో చూపబడియున్నవి.

శ్లో॥ సర్వం మిథ్యా బ్రవీమీతి నైతద్వాక్యం వివక్ష్యతే ।
తస్య మిథ్యాభిధానే హి ప్రక్రాన్తోఽర్థో న గమ్యతే ॥ 25

సర్వం + మిథ్యా + బ్రవీమి = (నేను అంతయు మిథ్యయే పలుకుచున్నాను. అనగా నేను అంతయు అసత్యమే చెప్పుచున్నాను), ఇతి = అనెడి, ఏతత్ = ఈ, వాక్యమ్ = వాక్యము, న + వివక్ష్యతే = వివక్షింపబడదు అనగా ఈ వాక్యము కూడ మిథ్యయే యని గ్రహింపబడదు.

ఒక మనుష్యుడు 'నేను అన్నియు అసత్యములే పలుకుచున్నాను' అని ఏదో సందర్భమున పలుకును. నా మాటలను నమ్మవద్దు అని దాని భావము. సర్వం మిథ్యా బ్రవీమి, అనునదియు ఆయన వాక్యమే కనుక అదియు అసత్యమే అని మాత్రము ఎవరు భావింపరు. ఈ వాక్యము మాత్రము సత్యమునే బోధించును. ఇది తప్ప ఇతర వాక్యములు మిథ్య అని దాని భావమును లోకులు గుర్తింతురు.

అట్లుకాకున్న తస్య = అదియు అనగా 'సర్వం మిథ్యా బ్రవీమి' అనునదియు, మిథ్యాభిధానే = అసత్యమే అనిన యెడల, ప్రక్రాన్తః = ఉపక్రమింపబడిన, అర్థః = అర్థము, అనగా తాను చెప్పదలచిన అర్థమంతయు అసత్యమే అను భావము, న + గమ్యతే + హి = తెలియబడనేరదు కదా :

"నేను చెప్పిన మాటలన్నియు అసత్యములే, అవి నిశ్చితార్థమును బోధింపవు" అని ఒకడు పలుకును. ఇదియు అసత్యము అగుచో తాను ప్రతిపాదింపదలచిన అర్థము నిర్వహింపబడదు. కనుక 'సర్వం మిథ్యా బ్రవీమి' అను వాక్యము తప్ప ఇతరములగు వాక్యములు మిథ్యాబోధకములనియే లభించును. అట్లుకాకున్న ఇదియు మిథ్యయే యగుచో అసంబద్ధార్థమును బోధించును.

అట్లే 'సమవాయము అవాచ్యము' అనగా అవాచ్య శబ్దముకంటె ఇతరములగు శబ్దములకు సమవాయము వాచ్యము కాదనియే చెప్పవలెను. అవాచ్య శబ్దమునకు మాత్రము అది వాచ్యము కాగలదు. ఛలము నుపయోగించి నైయాయికుడు సమవాయము వాచ్యమే యని చూపుచున్నాడు. ॥25॥

అవతారిక— పై యర్థమున యుక్తిని జూపుచున్నాడు.

శ్లో॥ న చ వాచకరూపేణ ప్రవృత్తస్యాస్తి వాచ్యతా ।
ప్రతిపాద్యం న తత్తత్ర యేనాన్యత్ప్రతిపాద్యతే ॥ 26

చ = మరియు, వాచకరూపేణ = వాచక శబ్దరూపమున, ప్రవృత్తస్య = అర్థమును చెప్పుటకై ప్రవర్తించిన దానికి, వాచ్యతా = వాచ్యత్వము అనగా బోధింపబడుట, న + అస్తి = లేదు. యేన = దేనిచే, అన్యత్ = ఇతరమైనది, ప్రతిపాద్యతే = తెలుపబడుచున్నదో, తత్ = అదియే, తత్ర = అచట, ప్రతిపాద్యమ్ = తెలుపబడునది, న = కాదుకదా :

'అవాచ్య' అను శబ్దము వాచకముగా అనగా అర్థబోధకముగా గుర్తింపబడినది అర్థమునుబోధించుటలో ఆ శబ్దము కర్తగాను, బోధింపబడునది కర్మగాను నుండవలెను. ఒకే వస్తువు ఒకే అవస్థలో కర్తగాను, కర్మగాను ఉండనేరదు. వాచకము ఎప్పుడు పరతంత్రమే. వాచ్యమగునది స్వతంత్రమే. కాగా 'అవాచ్య' అను శబ్దముచే గూడ సమవాయము వాచ్యము కాదని భావింపరాదు.

ఘటః అను శబ్దము 'కడవ' అను అర్థమును బోధించుటకై ప్రవర్తించి తననే బోధింపనేరదు. సాధనము వేరు సాధ్యము వేరు.

'అవాచ్య' అను శబ్దము సమవాయము వాచ్యముకాదని చెప్పుటకు ఉపయోగపడు చున్నది. ఆ శబ్దము సాధనమగుచున్నది. అదియే వాచ్యకోటిలో అనగా సాధ్యరూపమున గ్రహింపబడదు కదా ! ॥26॥

అవతారిక — వాచకమగు శబ్దము విరోధముండుటచే వాచ్యము కాకపోవవచ్చును. కాని సమవాయము శబ్దమునకు వాచ్యము కాదు అను ప్రసంగమున అవాచ్య అను శబ్దము కూడ శబ్ద సామాన్యమున చేరియున్నందున దానికి గూడ సమవాయము వాచ్యము కానేరదు అను ప్రశ్నకు చక్కని దృష్టాంతమును జూపుచు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అసాధికా ప్రతిజ్ఞేతి నేయమేవాభిధీయతే ।
యథా, తథాస్య ధర్మోఽపినైవకశ్చిత్ప్రతీయతే ॥ 27

యథా = ఏ రీతిగా, *ప్రతిజ్ఞా = ప్రతిజ్ఞ అనగా ప్రతిజ్ఞా వాక్యము 'పర్వతో వహ్నిమాన్' మున్నగునది, అసాధికా = సాధ్యమును సాధించునది కాదు అనగా సాధనాంగము కానేరదు, ఇతి = అని చెప్పగా, ఇయమ్ + ఏవ = ఇదే అనగా 'ప్రతిజ్ఞా అసాధికా' అనునదియే, న + అభిధీయతే = చెప్పబడదో, తథా = ఆ రీతిగా, అస్య = దీనికి అనగా, అవాచ్య అను శబ్దమునకు, కశ్చిత్ =మరియొక, ధర్మః + అపి = ధర్మము కూడ అనగా మరియొక వ్యాపారము, న + ఏవ + ప్రతీయతే = తెలియబడుట లేదు.

---

* హేతువును జూపి దానితో సంబంధించియున్న అర్థమును గుర్తింతురు. అందు అయిదు అంశములు అపేక్షితములు (1) ప్రతిజ్ఞ (పర్వతము వహ్నిమత్తు), (2) హేతువు (పొగ యుండుట వలన), (3) దృష్టాంతము (వంట యింటివలె), (4) ఉపనయము (అట్లే ఇచట ఉన్నది), (5) నిగమనము, (కనుక ఇది వహ్నిమత్తే) వీనినే పంచావయవము లందురు ఈ 5 ను కలిపి న్యాయమందురు. దీనిని బోధించునది న్యాయశాస్త్రము. గౌతమ విరచితము దానిని అవలంబించినవారు నైయాయికులు.

బౌద్ధులు 5 ను ఆశ్రయింపక 1. హేతువు, 2. దృష్టాంతము అను రెంటినే న్యాయముగా గ్రహించిరి.

పూర్వ మీమాంసకులు మొదటి మూటినిగాని, చివరి మూటినిగాని స్వీకరింపవలెనని విశ్వసింతురు.

బౌద్ధులు (1) హేతువు, (2) దృష్టాంతము అను రెండు అవయవములనే గ్రహింతురు. ప్రతిజ్ఞను వారు సాధనాంగముగా గ్రహింపరు. వారి మతమిచట దృష్టాంతముగా జూపబడుచున్నది.

'ప్రతిజ్ఞా న సాధనాఙ్గమ్' అని బౌద్ధులు చెప్పుదురు. అట్టితరి ఇదియు ప్రతిజ్ఞా వాక్యమేకాన సాధనాంగము కానందున వారు అనుకొనిన యభిప్రాయము నెరవేరదు. అందుచే 'ప్రతిజ్ఞా న సాధనాఙ్గమ్' అను దానిని విడిచి ఇతరములగు పర్వతోవహ్నిమాన్ మున్నగు ప్రతిజ్ఞలు అర్థసాధకములు కావనియు, ఇది మాత్రము సాధనాంగమే అనియు అంగీకరింపవలెను.

అవాచ్య శబ్దము ప్రతిజ్ఞా వాక్యము వంటిది. సమవాయము అవాచ్యము అని చెప్పగా ఇతర శబ్దములకు వాచ్యము కాదనియే తెలియబడును. 'అవాచ్య' అను శబ్దమునకు గూడ వాచ్యము కాదని తెలియబడదు. ఏలయన— ఆ శబ్దమునందు అభిధా వ్యాపారము ఒక్కటియే యుండును. దానిచే ఆ శబ్దము అర్థమును బోధించును. శబ్దమునందు రెండు వ్యాపారములున్నచో ఒక వ్యాపారముచే సమవాయము ఇతర శబ్దములకు వాచ్యముకాదనియు, రెండవ వ్యాపారముచే అవాచ్యమునకు గూడ వాచ్యము కాదనియు తెలియబడగలదు. కాని యట్లు రెండు వ్యాపారములు లేవు.

కాగా 'ప్రతిజ్ఞా న సాధనాఙ్గమ్' అను బౌద్ధుల పద్ధతిలో ఈ వాక్యమును విడిచి ఇతరములగు ప్రతిజ్ఞా వాక్యములు సాధనాంగములు కావు. ఇది మాత్రము సాధనాంగమే అని చెప్పినట్లు సమవాయము అవాచ్యము. అనగా 'అవాచ్య' అను శబ్దమును విడిచి ఇతర శబ్దములకు వాచ్యము కాదనియే లభించును. అవాచ్య శబ్దమునకు గూడ వాచ్యము కాదని లభింపదు. ఇచట రెండు వ్యాపారములు శబ్దమునందు లేకుండుటయే కారణము. ॥27॥

అవతారిక— ఆ శబ్దమునందు రెండు వ్యాపారములను ఆశ్రయించి, అవాచ్య శబ్దమునకు కూడ సమవాయము వాచ్యము కాదని చెప్పరాదా? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

**శ్లో॥ వ్యాపారస్యాపరో యస్మాన్న వ్యాపారోఽస్తి కశ్చన ।
విరోధమనవస్థాం వా తస్మాత్సర్వత్ర నాశ్రయేత్ ॥** 28

యస్మాత్ = ఎందువలన, వ్యాపారస్య = వ్యాపారమునకు, అపరః = మరియొక, కశ్చన= ఎట్టి విధమగు, వ్యాపారః = వ్యాపారము, న + అస్తి = లేదో, తస్మాత్ = అందువలన, సర్వత్ర = ఎల్లచోటులయందు, విరోధమ్ = విరోధమును, అనవస్థాం + వా = అనవస్థా దోషమునుగాని, న + ఆశ్రయేత్ = ఆశ్రయింపరాదు.

'అవాచ్య' శబ్దమునందు రెండు వ్యాపారముల నాశ్రయించి, ఒక వ్యాపారముచే సమవాయము ఇతర శబ్దవాచ్యము కాదనియు, రెండవ వ్యాపారముచే అది అవాచ్య శబ్ద

వాచ్యము కూడ కాదనియు చెప్పరాదు. అట్లు కాకున్న అవాచ్య శబ్దమునకు సమవాయము వాచ్యము కాదు, అని చెప్పిన ఇతర శబ్దములకు వాచ్యము కాగలదని విరోధము వాటిల్లు చున్నది. అచట కూడ మరియొక వ్యాపారము నాశ్రయించి ఇతర శబ్దములకు వాచ్యము కాదని చెప్పిన మరల అవాచ్య శబ్దమునకు వాచ్యమను అర్థము లభించును. విరోధము కూడ వాటిల్లును. మరియొక వ్యాపారము నాశ్రయించిన అనవస్థాదోషము వాటిల్లును.

కాబట్టి 'సమవాయము అవాచ్యము' అను దానికి అభిప్రాయమేమనగా— ఇతరము లగు శబ్దములకు సమవాయము వాచ్యము కాదు. అవాచ్యత్వ రూపమున 'అవాచ్య' శబ్దము నకు వాచ్యము కాగలదు.

ఇందు సంశయజ్ఞానము, నిర్ణయజ్ఞానము 'సర్వం మిథ్యాబ్రవీమి', 'ప్రతిజ్ఞా న సాధనాఙ్గమ్' మున్నగునవి దృష్టాంతములు కాగలవు.

పై రీతిని సమవాయము 'అవాచ్య' శబ్దమునకు వాచ్యమగుటవలన 19 వ శ్లోక మున జూపబడిన అవ్యాప్తిదోషము, 17 వ శ్లోకమున జూపబడిన అతివ్యాప్తియు నివారింప బడ గలవు.

కాబట్టి సమవాయము శబ్దవాచ్యమే యగుటచే నదియు సంబంధము కానోపును.

దర్శనాంతరీయుల భావములను ఊతగా గైకొని శబ్దార్థములకు సంయోగ సమ వాయములు సంబంధములు కాగలవని ఛలము నుపయోగించి చూపబడినది. ॥28॥

అవతారిక— దర్శనాంతరీయుల ఆశయమును ఆశ్రయించి శబ్దార్థములకు సంయోగ సమవాయములు సంబంధములుగా సంభవించునా, సంభవింపవా? అని విపుల ముగా విమర్శించి, ఛలమును ఆశ్రయింపగా సమవాయము సంబంధము కాగలదని నిరూపించి ప్రస్తుతము వ్యాకరణ శాస్త్రము ననుసరించి శబ్దార్థములకు గల సంబంధమును చూపు చున్నాడు.

శ్లో॥ ఇన్ద్రియాణాం స్వవిషయేష్వనాదిర్యోగ్యతా యథా ।
అనాదిరర్థైః శబ్దానాం సంబన్ధో యోగ్యతా తథా ॥ 29

ఇన్ద్రియాణామ్ = కన్ను చెవి ముక్కు నాలుక మున్నగు ఇంద్రియములకు, స్వవిషయేషు = రూపము, శబ్దము, గంధము, రసము మున్నగునవి విషయములుగాగల జ్ఞానముల విషయమై అనగా అట్టి జ్ఞానమును కలిగించుట విషయమున, యథా = ఏ రీతిగా, అనాదిః = అనాది సిద్ధమగు అనగా, మనుష్యుని ప్రయత్నమక్కరలేకుండ స్వభావసిద్ధమగు, యోగ్యతా = యోగ్యత, (అస్తి) = కలదో, తథా = అట్లే, శబ్దానామ్ = ఘట, పట మున్నగు శబ్దములకు, అర్థైః = కడవ, వస్త్రము మున్నగు అర్థములతో, అనాదిః = స్వతస్సిద్ధమగు, యోగ్యతా = యోగ్యత, సంబంధమై, (అస్తి) = కలదు.

కన్ను, చెవి, ముక్కు మున్నగు ఇంద్రియముల వలన నలుపు, శబ్దము మున్నగు విషయములను గోచరించెడి జ్ఞానములు కలుగుచున్నవి. అందు మనుష్యుని ప్రయత్నమేమియు అపేక్షితము కాదు. అది ఇంద్రియములకు స్వభావ సిద్ధమగు శక్తియే. ఎంత ప్రయత్నము చేసినను కన్ను రుచిని, ముక్కు శబ్దమును, చెవి రుచిని గ్రహింపదుకదా :

అట్లే శబ్దముల నుచ్చరింపగా అర్థబోధ కలుగుచున్నది. అచట వేరు సంబంధము అపేక్షితము కాదు. వానికి అర్థబోధకత స్వాభావికము. ఘట శబ్దము నుచ్చరింపగా 'కడవ' అను అర్థము అవగతమగును. వస్త్రము అను అర్థము అవగతము కాదు. అందుచే ఇంద్రియములకు వలె శబ్దములకు అర్థములతో యోగ్యత అను సంబంధము స్వభావసిద్ధమై యున్నది అనియే మహాభాష్యకారుడు పస్పశాహ్నికమున నిర్ణయించెను.

విశేషమేమనగా ఇంద్రియము జ్ఞాతముకాకున్నను జ్ఞానమును కలిగించును. శబ్దము అట్టిది కాదు. అది జ్ఞాతమయియే అర్థబోధకమగును. ॥29॥

అవతారిక— అర్థమును తెలుపుటకై శబ్దము ప్రయోగింపబడుట వలన ఆ రెంటికి సంబంధమున్నదని నిశ్చయింపవచ్చును. అట్టితరి అపభ్రంశములవలనను అర్థబోధ కలుగుచున్నందున అచటకూడ సంబంధము కల్పితము కావలెను అను పూర్వపక్షమునకు రెండు విధములుగా సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అసాధురనుమానేన వాచకః కైశ్చిదిష్యతే ।
వాచకత్వా విశేషే వా నియమః పుణ్య పాపయోః ॥ 30

A. కైశ్చిత్ = కొందరిచే అనగా తార్కికులచే మీమాంసకుల చేతను ; అసాధుః = అపభ్రంశమగు శబ్దము, అనుమానేన = సాధు శబ్దముయొక్క స్మరణముచే ; వాచకః = అర్థబోధకమై ; ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

అసాధు శబ్దమునందు శక్తి లేదు. కాని దానివలన వర్ణముల సామ్యమునుబట్టి సాధు శబ్దము స్మరణకువచ్చి దానివలన బోధ కలుగును. ఉదా : గౌః (ఆవు) అనునది సాధు శబ్దము. గావీ, గోణీ మున్నగునవి అసాధు శబ్దమునకు అపభ్రంశములు. ఒక వ్యక్తి 'గావీ' అని ప్రయోగించిన దానివలన గోశబ్దము జ్ఞాపకమునకు వచ్చి అర్థమును బోధింపగలదు అని తార్కికులు, మీమాంసకులు భావింతురు.

B. వైయాకరణుల మతము ననుసరించి సమాధానము ఉత్తరార్ధముచే చెప్పుచున్నాడు.

వా = కాక ; వాచకత్వాఽవిశేషే = అర్థమును బోధించుటలో భేదము లేకున్నను అనగా సాధు శబ్దమువలన అసాధు శబ్దమువలనను అర్థబోధ కలుగుట సమానమైనను ; పుణ్యపాపయోః = పుణ్యపాపముల విషయమై, నియమః = నియమము, (క్రియతే) = శాస్త్రముచే చేయబడుచున్నది.

సాధు శబ్దములను ప్రయోగించుటవలన ధర్మము కలుగును. దానివలన పుణ్యము కలుగును. అసాధు శబ్దములను ప్రయోగించిన అధర్మము కలుగును. దానివలన పాపము కలుగును. కనుకనే మహాభాష్యకారుడు "సమానాయామర్థావగతౌ శబ్దైశ్చాపశబ్దైశ్చ శాస్త్రేణ ధర్మనియమః" అని పస్పశాహ్నికమున పలికెను. శబ్దములచేతను అపశబ్దములచేతను అర్థము తెలియుట సమానమే. కాని శాస్త్రము ధర్మమునుగూర్చి నియమమును జూపుచున్నదని దాని యర్థము ఈ యంశము మొదటికాండ యొక్క చివరను నిరూపించి యుంటిమి. ॥30॥

అవతారిక— శబ్దమునకు అర్థముతో సమవాయము సంబంధమను మతము యుక్తము కాదు. సమవాయమున మరియొక సమవాయము లేనందున సమవాయ శబ్దము సమవాయమును బోధింపజాలదని నిరూపించి శబ్దార్థములకు యోగ్యత సంబంధమనెడి వైయాకరణ సిద్ధాన్తమున పై దోషము లేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సమ్బన్ధశబ్దే సమ్బన్ధో యోగ్యతాం ప్రతి యోగ్యతా ।
సమయాద్యోగ్యతా సం విన్మాతా పుత్రాదియోగవత్ ॥ 31

A. ఇచట ''సంబంధ శబ్దః సంబంధం యోగ్యతాం ప్రతియోగ్యతామ్'' అని కారికా పూర్వార్ధ పాఠము కానవచ్చుచున్నది. ఆ పాఠము హేలారాజ టీకకు అనుగుణముగ నున్నది. సంబంధ శబ్దః = 'సంబంధః' అనెడి శబ్దము, యోగ్యతామ్ = యోగ్యత అనెడి ; సంబంధమ్ = సంబంధమును, యోగ్యతాం + ప్రతి = యోగ్యతచేతనే (ప్రతిపాదయతి) = చెప్పుచున్నది

శబ్దార్థములకు యోగ్యత సంబంధమని ఈ ప్రకరణముననే 29 వ శ్లోకముచే చెప్పబడినది. అట్టి సంబంధమును 'సంబన్ధః' అను శబ్దము చెప్పగలదు. సంబంధము అనునది పరాధీనముగాన దానికి కొన్ని యుపాధులు కలవు. అట్లు చెప్పుటలో యోగ్యతయే కారణము.

ఇట్లే 'సమవాయ' శబ్దము గూడ యోగ్యతను బట్టియే సమవాయమును చెప్పగలదు అట్లు కాకున్న ఆ శబ్దము సమవాయమును చెప్పజాలదు.

ఇట్లే ఘటాది పదములు గూడ యోగ్యతనుబట్టియే కడవ మున్నగు అర్థములను చెప్పగలవు.

కాగా యోగ్యతయే శబ్దార్థములకు సంబంధము. అది స్వాభావికమే.

యోగ్యతాం + ప్రతి = అనుచోట లక్షణార్థమున 'ప్రతి' శబ్దమునకు కర్మప్రవచనీయ సంజ్ఞ కలుగగా దాని యోగమున యోగ్యతా శబ్దముకంటె ద్వితీయ కలిగినది. యోగ్యతాం + ప్రతి = యోగ్యతయా = యోగ్యతచేయని యర్థము లభించును.

కాక -

'సంబన్ధ శబ్దే సంబన్ధో యోగ్యతాం ప్రతి యోగ్యతా' అనియే పాఠము. 'సంబన్ధ శబ్దే' అనుచోట సంబన్ధ శబ్దము అర్శ ఆద్యజంతము. కాగా సంబన్ధ శబ్దే అను దానికి,

'యోగ్యతా రూపమగు *సంబంధము కల శబ్దమునందు*' అనగా అట్టి 'ఘటః' 'పటః' మున్నగు శబ్దమునందున్న, యోగ్యతాం + ప్రతి = యోగ్యతా నిరూపకమగు అనగా యోగ్యతను నిర్ణయించెడి, సంబన్ధః = సంబంధము, యోగ్యతా = యోగ్యతకు ద్యోతకము, (భవతి) = అగుచున్నది.

ఈ ప్రకరణ ప్రారంభమున యోగ్యత సంబంధమని చెప్పియున్నందున ఇచట యోగ్యతా శబ్దము యోగ్యతా ద్యోతకమను అర్థమున ఉపయోగింపబడినది.

'సమ్బన్ధ శబ్దే' అనుచోట సంబంధ శబ్దము అర్శ ఆద్యజంతము అని చెప్ప నక్కర లేదు 'సమ్బన్ధి శబ్దే' అని కానవచ్చుచున్నదని కొందరి యాశయము.

కాక సంబన్ధ శబ్దే అనుచోట సప్తమికి వాచ్యవాచకభావ మర్థము. సమ్బన్ధ శబ్దే = సంబంధవాచ్యమగు అనగా సంబంధ అను శబ్దమునకు అర్థమగు సమ్బన్ధః = సంబంధము, యోగ్యతాం + ప్రతి = యోగ్యతా నిరూపకమగు, యోగ్యతా = యోగ్యతా స్వరూపమే.

ధనవాన్ ఇత్యాదులయందు, మతుప్ ప్రత్యయము 'కలది' అను నర్థమున విధింపబడినది. ఆప్రత్యయము లేనిచో కలవాడు అను అర్థము లభింపదు. కొన్ని శబ్దములకు 'మతుప్' కాక, 'కల' అర్థమున 'అచ్' ప్రత్యయము విధించబడినది. దీనిని, 'అర్శ ఆదిభ్యోఽచ్' (5-2-127) అని సూత్రకర్త చూపెను.

B. అట్టైన సంకేతమునకు ఉపయోగమెద్ది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

సమయాత్ = సంకేతమువలన అనగా 'అస్మాత్ శబ్దాత్ అయమర్థో బోద్ధవ్యః' (ఈ శబ్దమువలన ఈ యర్థము తెలియదగినది) మున్నగు సంకేతమువలన, మాతాపుత్రాది యోగవత్ = తల్లికి పుత్రునకుగల సంబంధము వలెను, యోగ్యతా సంవిత్ = యోగ్యతా స్వరూపమగు శబ్దార్థములకు గల సంబంధము తెలియనగును.

శబ్దార్థములకు గల సంబంధమును సంకేతము స్పష్టపరచును. అట్లు స్పష్టపరచుటయే సంకేతముయొక్క ఆవశ్యకత. సంకేతమే సంబంధము కానేరదు.

ఉదా :— అయ మస్యాః పుత్రః (ఇతడు ఈమె కొమరుడు) అను వ్యవహారము వలన తల్లికి కొమరునకు గల జన్యజనకభావము తెలియబడుచున్నది. వ్యవహారమే సంబంధము కాదు.

కాక—

సంబన్ధ శబ్దే = సంబన్ధ శబ్ద వాచ్యము, సంబన్ధః = సంబంధము (ఇతి) = అనెడి, యోగ్యతాం + ప్రతి = యోగ్యతాశబ్దవాచ్యము, యోగ్యతా = యోగ్యత, (ఇతి)=అనెడియు, సమయాత్ = వ్యవహారమువలన, మాతాపుత్రాదియోగవత్ = తల్లి, కొమరుని సంబంధము వలె, యోగ్యతాసంవిత్ = ప్రాథమిక శక్తిజ్ఞానము కలుగును.

సంబన్ధ శబ్దమునకు సంబంధమర్థము. యోగ్యతా శబ్దమునకు యోగ్యత అర్థము అని వ్యవహారము కలుగగా దానినిబట్టి ఘట శబ్దమునకు కడవ అర్థము. పట శబ్దమునకు వస్త్రు మర్థమని విశేషణ రూపమున తెలియగలదు. ॥31॥

అవతారిక— శబ్దార్థములకు 'యోగ్యత' అను సంబంధమును జూపి ఇపుడు వానికిగల కార్యకారణ భావమనెడి సంబంధమును జూపుచున్నాడు.

**శ్లో॥ శబ్దం కారణమర్థస్య సహి తేనోపజన్యతే ।
తథాచ బుద్ధి విషయా దర్థాచ్ఛబ్దః ప్రతీయతే ॥ 32**

A. శబ్దః = శబ్దము, అర్థస్య = అర్థజ్ఞానమునకు, కారణమ్ = కారణమగుచున్నది, సః = ఆ యర్థము, తేన = ఆ శబ్దముచే, ఉపజన్యతే + హి = కలిగింపబడుచున్నది కదా !

మాటాడువాని పెదవులు దంతములు మున్నగు అవయవముల కదలికచే శబ్దము పుట్టును. ఆ శబ్దము వినువాని చెవిలో ప్రవేశించి వాని బుద్ధికి లగ్నమగును చెవిలో పడునవి వర్ణములే. అవి యన్నియు కలసి బుద్ధిలో పదరూపమున వాక్యరూపమున నుండును. అట్టి శబ్దమువలన శ్రోతకు అర్థజ్ఞానము కలుగుచున్నది అంతకుముందులేని యభిప్రాయము శ్రోతకు ఆ శబ్దమువలననే కలుగుచున్నది. కాగా శబ్దము కారణము. అర్థము కార్యమని స్పష్టమగుచున్నది.

B. తథా + చ = అట్లే, బుద్ధి విషయాత్ = బుద్ధికి విషయమగు, అర్థాత్ = అర్థమువలన, శబ్దః = శబ్దము, ప్రతీయతే = పుట్టుచున్నట్లు తెలియబడుచున్నది.

మనుష్యుడు తన బుద్ధిలోనున్న భావమును ఇతరులకు చెప్పదలచి దానికి అనుగుణమగు శబ్దములను ప్రయోగించును. వక్తయొక్క బుద్ధిలో ముందు అర్థము భాసించును. దానిని అనుసరించి శబ్దములు జనియించును. దీనినిబట్టి చూడగా మాటాడువానియందు భాసించిన అర్థము కారణము. శబ్దము కార్యమని తేలుచున్నది.

కాబట్టి మాటాడు వక్తనుబట్టి చూచిన, అర్థము కారణము శబ్దము కార్యము అని ; శ్రోతనుబట్టి చూచిన, శబ్దము కారణము, అర్థము కార్యమనియు తెలియబడుచున్నది. పై రీతిని రెంటికి కార్య కారణ భావము సంబంధమని వైయాకరణులు తలంతురు. ॥32॥

అవతారిక— బుద్ధి పరికల్పితమగు అర్థమే శబ్దవాచ్యమగుచో 'ఓదనం భుఙ్క్తే' (అన్నము తినుచున్నాడు) అను లోకవ్యవహార మెట్లు పొసగును ? బుద్ధిచే కల్పింపబడిన అర్థము శబ్దముచే చెప్పబడినను దానిని పురస్కరించుకొని లోకవ్యవహారము జరుగనేరదు కదా ! తన బుద్ధిలో 'నాకు నాలుగు లక్షల రూపాయలు కలవు' అని భావింపవచ్చును. కాని అట్టి రూపాయలు అంగడిలో వస్తువులను కొనుటకు ఉపయోగపడవు కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ భోజనాద్యభిమన్యన్తే బుద్ధ్యర్థే యదసమ్భవి ।
బుద్ధ్యర్థాదేవ బుద్ధ్యర్థే జాతే తదపి దృశ్యతే ॥ 33

బుద్ధ్యర్థే = బుద్ధిచే కల్పింపబడిన అర్థము (శబ్దార్థే) = శబ్దవాచ్యమగుచో, యత్ = ఏ, భోజనాది = భోజనము మున్నగు దానిని, అసమ్భవి = జరుగుటకు సాధ్యము కాని దానినిగా, అభిమన్యన్తే = తలంచుచున్నారో అనగా బుద్ధిచేతనే సృజియింపబడిన అర్థమే శబ్దవాచ్యమగుననెడి వాదమున, భోజనముచేయుట, గ్రామముగూర్చి వెడలుట మున్నగు లోకవ్యవహారము సంభవింపదని తలంచెదరో, తత్ + అపి = అదియు అనగా భోజనాదికము గూడ, బుద్ధ్యర్థాత్ + ఏవ = బుద్ధిచే సిద్ధించిన అర్థము వలననే, బుద్ధ్యర్థే = బుద్ధిచే లభించిన అర్థము, జాతే = నిష్పన్నము కాగా అనగా సిద్ధము కాగా, దృశ్యతే = చూడబడుచున్నది. సంభవించుచునే యున్నదని భావము. ఏ వ్యవహారము సంభవింపదని తలంచుచున్నారో అదియు సంభవించుచునే యున్నదని భావము.

ఓదనము, భోజనముచేయుట రెండు కూడ బుద్ధి కల్పితములే కనుక అన్నము తినుచున్నాడు అనుట సమంజసము. "ఓదనం భుఙ్క్తే" ఇచట ఓదనము కారకము. భోజనము క్రియ. కారకము వలన క్రియ జనియించును. జనకమగు ఓదనము బుద్ధిచే కల్పింపబడగా అట్టి కారకముచే సాధ్యమగు భుజి క్రియయు బుద్ధిచే కల్పింపబడగలదు. అట్టి ఆ రెంటికి క్రియా కారకభావము చెప్పనగును.

మరియు బుద్ధిచే కల్పింపబడిన అర్థమునకు బాహ్య ప్రపంచమునగల పదార్థములకు అభేదాధ్యవసాయముచే లోకుల వ్యవహారములన్నియు సంగతములు కాగలవు. ॥౩౩॥

అవతారిక— మరియు బుద్ధి కల్పితమగు అర్థము శబ్దవాచ్యమనుట చాల యుక్తము. ఏలయన శబ్దార్థములకు సంబంధము నిత్యమని ప్రాజ్ఞులు నుడివియున్నారు ఆ యాశయము పై వాదముననే నిలబడును. అట్లు గాకున్న పై సిద్ధాన్తము అయుక్తమే కాగలదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అనిత్యేష్వపి నిత్యత్వమభిధేయాత్మనా స్థితమ్ ।
అనిత్యత్వం స్వశక్తిర్వా సా చ నిత్యాన్నభిద్యతే ॥ 34

A. అనిత్యేషు + అపి = అనిత్యములగు వ్యక్తులందు గూడ ; నిత్యత్వమ్ = నిత్యత్వము ; అభిధేయాత్మనా = శబ్దముచే బోధింపబడెడి అర్థరూపముచే అనగా బుద్ధి కల్పితమగు అర్థరూపమున ; స్థితమ్ = ఉన్నది.

'ఘటము' మున్నగు శబ్దములు కడవ మున్నగు అర్థములను బోధించును. శబ్దములకు అర్థములతో సంబంధము నిత్యమని భాష్యకారుడు నుడివెను కాని బాహ్య ప్రపంచకమున

కానవచ్చెడి కడవ మున్నగునవి అనిత్యములే. అట్టితరి వానికి శబ్దముతో సంబంధము నిత్యమగుట యెట్లు? కనుక బుద్ధి కల్పితమగు అర్థము నిత్యము. కాబట్టి భాష్యకారుని మాట ఉపపన్నమగుచున్నది. ఈ యంశమును ప్రథమకాండమున వివరముగ జూపి యుంటిమి.

B. కూటస్థ నిత్యతయు శబ్దార్థములకు కలుగుచున్నదని చెప్పుచున్నాడు.

అనిత్యత్వమ్=అనిత్యత్వమనునది ; స్వశక్తిః + వా=సోపాధికమగు బ్రహ్మము యొక్క శక్తిరూపమే, సా + చ = ఆ శక్తియు, నిత్యాత్ = పరమార్థ నిత్యమగు బ్రహ్మము కంటె ; న + భిద్యతే = వేరుకాదు.

శబ్దములు సాక్షాత్తుగా సత్యజ్ఞానానన్దరూపమగు నిర్గుణ బ్రహ్మమును బోధింపవు మాయా కల్పితములగు ఉపాధులతో గూడిన బ్రహ్మముయొక్క ఏకదేశమునో, దానిలోగూడ కొన్ని భాగములనో, బోధించును. కాగా అనిత్యములగు ఉపాధులతో గూడిన బ్రహ్మమును శబ్దములు బోధించుటచే బ్రహ్మమునందు అనిత్యత్వమనే ధర్మమున్నదని చెప్పక తీరదు. ఆ ధర్మము బ్రహ్మముయొక్క శక్తిరూపమే. ఆ శక్తి బ్రహ్మముకంటె వేరుకాదు. నిజరూపమున బ్రహ్మము నిత్యమేకాన శక్తియు నిత్యమేయగును. ఈ రీతిగ కూటస్థ నిత్యతగూడ శబ్దార్థములకు చెప్పవచ్చును. ॥34॥

అవతారిక— శబ్దమునకు అర్థముతో సంబంధము స్వాభావికమని అంగీకరించుటలో మతాంతరమును జూపుచున్నాడు.

శ్లో॥ శబ్దేనార్థస్య సంస్కారో దృష్టాఽదృష్ట ప్రయోజనః ।
క్రియతే, సోఽభి సంబన్ధ మన్తరేణ కథంభవేత్ ॥ 35

శబ్దేన = శబ్దముతో, అర్థస్య = అర్థమునకు, దృష్టాఽదృష్ట ప్రయోజనః = ప్రత్యక్షముగా కనబడునట్టియు, ప్రత్యక్షముగ కానరానట్టియు ప్రయోజనము కల, సంస్కారః = సంస్కారము, క్రియతే = చేయబడుచున్నది.

సః = ఆ సంస్కారము, అభిసంబన్ధమ్ + అన్తరేణ = స్వాభావికమగు సంబంధము లేనిది, కథమ్ = ఎట్లు, భవేత్ = కలుగగలదు ?

అధర్వవేదమున కొన్ని మంత్రములు గలవు. వానిని జపించిన తేలు, పాము మున్నగువాని విషము శాంతించును. అట్టి వానిని శాబరమంత్రము లందురు. వీనికి ప్రయోజనము మనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్నది.

అట్లే మంత్రములను జపించునపుడు 'హుం' 'ఫట్' 'హ్రాం' 'హ్రీం' అను రీతిని బీజాక్షరములను పలుకుదురు. వీనివలన ప్రత్యక్షముగా మనకు ప్రయోజనము కానరాదు. వీనికి ఏదో ఒక ప్రయోజనము కాలాంతరమున కలుగును దీనినే అదృష్ట ప్రయోజన మందురు.

శాబరమంత్రములకు, బీజాక్షరములకు ఏమియు అర్థముండనేరదు. కాని మంత్రము లుచ్చరింపగా ప్రయోజనము కలుగుచున్నది. శబ్దమునకు అర్థముతో సంబంధమే లేనిచో ఆ సంస్కారము ఎట్లు కలుగగలదు ? దానినిబట్టి శబ్దమున కర్థముతో సంబంధము స్వాభావిక మని నమ్మవచ్చును. ॥35॥

అవతారిక — 35 వ శ్లోకములో జూపబడిన అభిప్రాయము యుక్తము కాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ నాఽవశ్య మభిధేయేషు సంస్కారః స తథావిధః ।
దృశ్యతే న చ సంబన్ధ స్తథా భూతో వివక్షితః ॥ 36

అభిధేయేషు = అర్థముల విషయమై ; తథావిధః = అట్టి అనగా దృష్టాఽదృష్టరూపమగు ప్రయోజనము కల, సంస్కారః = సంస్కారము, అవశ్యమ్ = నియతముగా, న + దృశ్యతే = చూడబడుట లేదు ; చ = మరియు, తథాభూతః = అట్టి అనగా పై ప్రకారము ఊహింపబడినట్టి, సంబన్ధః = శబ్దార్థ సంబంధము, న + వివక్షితః = వివక్షితము కాదు.

శాబర మంత్రములలోను, బీజాక్షరములలోను ఏవో కొన్ని శక్తులుండవచ్చును. అట్టి సంస్కారము ఎల్ల యర్థములందు మనకు కానరాదు. మరియు మరియొక గతిలేని బీజాక్షరములను దృష్టాన్తముగా గైకొని శబ్దార్థములకు సంబంధము చెప్పదలచినది కూడ కానేరదు. మంత్రములయందు కానవచ్చెడి అర్థ సంబంధము వేరే యున్నది. ఘటాది శబ్దములకు అర్థముతోగల సంబంధము వేరేయున్నది. ॥36॥

అవతారిక — శబ్దముచే అర్థమునకు సంస్కారము కలుగుననెడి యాశయము 36 వ శ్లోకముచే ఖండింపబడినది. అట్టితరి శబ్దార్థములకు సంబంధమున్నట్లు ఎట్లు తెలియ నగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సతి ప్రత్యయ హేతుత్వం సంబన్ధ ఉపపద్యతే ।
శబ్దస్యార్థే యత, స్తస్మాత్సంబన్ధోఽస్తీతి గమ్యతే ॥ 37

యతః = ఏ కారణమువలన, శబ్దస్య = శబ్దమునకు, అర్థే = నియతమగు అర్థము విషయమై ప్రత్యయహేతుత్వమ్ = జ్ఞాన కారణత్వము, సంబన్ధే = సంబంధము, సతి = ఉండగా, అనగా ఉన్నప్పుడే, ఉపపద్యతే = యుక్తమగుచున్నదో, తస్మాత్ = ఆ కారణము వలన, సంబన్ధః (శబ్దార్థములకు) సంబంధము, అస్తి = కలదు, ఇతి = అని, గమ్యతే = తెలియ బడుచున్నది.

ఘటః అను శబ్దమువలన నియతముగా కడవ అను అర్థమే భాసించుచున్నది. నియమములేకుండ పటము, వృక్షము మున్నగు అర్థములు తెలియబడలేదు. ఇట్లే పటః అను శబ్ద ముచ్చరింపగా వస్త్రము అను అర్థమే నియతముగా జ్ఞాతమగుచున్నది. పై రీతిని శబ్దము

నియతార్థబోధకు కారణమని చెప్పక తప్పదు. శబ్దమునకు అర్థముతో సంబంధమే లేనిచో కారణత్వము కుదురదు. కాబట్టి దానికి ఉపపత్తి కలుగుటకై శబ్దార్థములకు సంబంధము స్వాభావికమైయున్నదని చెప్పక తీరదు.

కనుక శబ్దముచే అర్థమునకు సంస్కారము కలుగుననుట యుక్తము కాదు. శాబర మంత్రములలో ఆనుపూర్వీ విశేషమువలన కార్యము కలుగవచ్చును. ॥37॥

అవతారిక— శబ్దార్థములకు కల సంబంధము పురుష కల్పితము కానేరదని చెప్పుచున్నాడు.

శ్లో॥ నిత్యేఽనిత్యేపి బాహ్యార్థే పురుషేణ కథఞ్చన ।
సంబన్ధోఽకృత సంబన్ధైః శబ్దైః కర్తుం నశక్యతే ॥ 38

నిత్యే = నిత్యమగునట్టి అనగా ఘటత్వము మున్నగు జాతిరూపమున నిత్యమగునట్టి, అనిత్యే+అపి = అనిత్యము అగునట్టి అనగా ఘటము, పటము మున్నగు వ్యక్తిరూపమున అనిత్యమగునట్టి, బాహ్యార్థే = బాహ్య ప్రపంచమున కానవచ్చెడి అర్థమునందు, అకృతసంబన్ధైః = కృత్రిమము అగు సంబంధము కల ; శబ్దైః = ఘటః పటః మున్నగు శబ్దములచే, సంబన్ధః = సంబంధము, కథఞ్చన = ఎంత ప్రయత్నించినను ; కర్తుమ్ = కల్పించుటకు, న + శక్యతే = శక్యపడదు

ఘటః మున్నగు పదములు ఘటత్వమనెడి నిత్యమగు జాతిని, దానికి ఆశ్రయమగు అనిత్యమగు వ్యక్తినిగూడ బోధింపగలవు. ఆ శబ్దమునకు జాతితోగాని, వ్యక్తితోగాని సంబంధమును అస్మదాది, మనుష్యుడు కల్పింపలేడు. కాక 'పురుష' శబ్దము పరమపురుషపరమని భావించినను ఈశ్వరుడు కూడ సంబంధమును కల్పింపలేడు.

కాక శబ్దములు నిత్యములనెడి నిత్య శబ్ద వాదమునగాని, శబ్దము లనిత్యము లనెడి అనిత్య శబ్ద వాదమున (కార్య శబ్ద వాదమున) గాని బాహ్యార్థముతో శబ్దములకు సంబంధ కల్పన శక్యము గాదు.

శబ్దమునకు అర్థముతో సంబంధము స్వాభావికమే. పురుష కల్పితము కాదు. ఘట పటాది శబ్దములు ఎప్పటినుండియో లోకమున ఉన్నవి ఈనాటి పురుషులచే ఆ శబ్దములకు అర్థములతో సంబంధము ఎట్లు కల్పింపబడగలదు ?

మరియు అర్థములన్నియు మనకు ప్రత్యక్షము కానందున అర్థములతో సంబంధమును కల్పించుట అసాధ్యము. ఘటమునందున్న జాతినిబట్టి వ్యక్తితో సంబంధమును అనుమాన ప్రమాణముచే చూపరాదాయని ప్రశ్నింపవచ్చును. ఘటమునందు ఘటత్వజాతి ఒక్కటియే లేదు ద్రవ్యత్వము, పదార్థత్వము వస్తుత్వము మున్నగు ఎన్నియో ధర్మములు కలవు. నియత సంబంధము లేనందున అనుమానమునకు తావులేదు. బుద్ధిచే అర్థకల్పనచేసి శబ్దముల

చేతనే అర్థ సంబంధమును చూపవలెను. ఆ శబ్దమునకు అర్థముతో సంబంధము ఎట్లు అని ప్రశ్నింపగా మరియొక శబ్దముచే చెప్పవలెను. ఈ రీతిని ఎన్నియో శబ్దములను చూపిన అనవస్థా దోషము ప్రసక్తమగును. కనుకనే పరమపురుషుడు కూడ ఈ సంబంధమును కల్పింపజాలడు. శబ్దమునకు అర్థముతో సంబంధము స్వాభావికమని అంగీకరించి అనవస్థను వారింపవలెను. అట్టితరి ప్రతి శబ్దమునకు అర్థముతో స్వాభావిక సంబంధమున్నదని తేలుచున్నది. ॥38॥

అవతారిక— పదార్థముల ఉనికి రెండు విధములుగానున్నది. బాహ్య ప్రపంచకమున అస్మదాదుల దృష్టికి గోచరించెడి రూపము ఒకటి. అదియే క్రయ విక్రయాదులకు ఉపయోగపడుచున్నది. బుద్ధితో మనుష్యుడు కల్పించుకొనినది రెండవది. ఇది క్రయ విక్రయాదులకు ఉపయోగపడదు. కాని దీని ఉనికి చెడదు. బాహ్యరూపము నశించినను రెండవరూపముండగలదు. ఈ రెండవ రూపమునకుగల ఉనికిని ఉపచార సత్తయని శాస్త్రజ్ఞులు పేర్కొనియున్నారు. బుద్ధి కల్పితమగు ఉనికి. అని దాని భావము. శబ్దముచే అర్థమును బోధింపదలచినపుడు ఈ ఉపచారసత్తయే ఉపయోగపడును. బాహ్య సత్తనుబట్టి శాబ్దవ్యవహారము జరుగనేరదు ఇట్లంగీకరించుటచే గతించిన వస్తువులకు రాబోవు వస్తువులకుకూడ ఉపచారసత్త కలుగుటచేనవియు శబ్దవాచ్యములు కాగలవు. పై రీతిని సత్తకు ద్వైవిధ్య కల్పన భాష్యకారుడు జూపియున్నాడు. ''తదస్యాస్త్యస్మిన్నితిమతుప్'' (5-2-94) అని పాణిని సూత్రము. దీని యర్థము, 51 వ శ్లోకమున స్పష్టము కాగలదు. అందు అస్తి అని ప్రత్యేకించి చెప్పుటవలన బాహ్యసత్తనుబట్టియే మతుప్ ప్రత్యయము ప్రవర్తించును. ధనవాన్ = వర్తమాన కాలికమగు ధనము కలవాడు. గతించిన ధనమునుబట్టిగాని రాబోవు ధనమునుబట్టిగాని తద్ధితము ప్రవర్తింపనేరదు. ఉపచారసత్తనుబట్టి పదార్థము నిత్యము కాన ''శబ్దార్థములకు సంబంధమునిత్య''మను వైయాకరణుల సిద్ధాంతము సంగతమగుచున్నది. అట్లుకాకున్న పై సిద్ధాంతము నిలువజాలదు అని తలంచి గ్రంథకర్త ఔపచారికమగు సత్తను విపులముగా నిరూపించుచున్నాడు.

శ్లో॥ వ్యపదేశే పదార్థానా మన్యా సత్తౌపచారికీ ।
సర్వావస్థా సు సర్వేషా మాత్మరూపస్య దర్శికా ॥ 39

పదార్థానామ్ = పదార్థములయొక్క, అనగా ఘటము, పటము మున్నగు వస్తువులయొక్క, వ్యపదేశే = వ్యవహారము విషయమై, అనగా వానిని శబ్దముచే బోధించుట విషయమై, అన్యా = భిన్నమగు అనగా బాహ్యవస్తువులయొక్క ఉనికి కంటె వేరుగానున్న, ఔపచారికీ = కల్పింపబడినట్టి అనగా బుద్ధిచే నిర్మింపబడినట్టి, సత్తా = ఉనికి, సర్వేషామ్ = ఎల్లవస్తువుల యొక్క అనగా. ఘటము పటము మున్నగు భావ వస్తువులయొక్క, లేమి అనే అభావ పదార్థము యొక్కయు, ఆత్మరూపస్య = తన రూపమునకు, సర్వావస్థాసు = ఎల్లయవస్థల యందు అనగా కంటికి కానవచ్చుచున్న వర్తమానకాలమున భూతకాలమున భవిష్యత్కాలమున గూడ, దర్శికా = చూపుచున్నదై, అస్తి = కలదు.

బాహ్య ప్రపంచమున పదార్థములుండుట వాస్తవము. దానినిబట్టి బుద్ధిచే కల్పింపబడిన వస్తువుల ఉనికిగౌణము. కనుక బుద్ధి కల్పిత సత్త ఔపచారికమనబడుచున్నది. ఉపచారమనగా లక్షణ. దానిచే నిర్మింపబడినది ఔపచారికము.

పదార్థములు బాహ్య ప్రపంచమున ఉన్నను లేకున్నను వానిని ఉన్నట్లు చూపినది యీ సత్త, కనుక ''సర్వావస్థాసు'' అనుట సమంజసము.

ఘటము, పటము మున్నగు వస్తువులను భావ పదార్థములందురు. అతీతము, అభావము మున్నగు వానిని అభావ పదార్థములందురు. ఈ రెండు విధములగు పదార్థముల స్వరూపమును ఈ సత్త చూపగలదు.

అర్థములను శబ్దముచే బోధించుటకు ఉపచారసత్త సహకరించును. జ్ఞానరూపముగానున్న సత్త ఔపచారికసత్త. ఈ ఉపచారసత్తయొక్క స్వరూపము, అవశ్యకత, అందులకు ప్రమాణము 52 వ శ్లోకమువరకు చూపబడుచున్నది. ॥39॥

అవతారిక— ఔపచారికసత్తను ఆశ్రయించుట చాల అవసరమని నిరూపించుటకు ముందుగా యుక్తమగు దృష్టాంతముతో దాని స్వరూపమును జూపుచున్నాడు.

శ్లో॥ స్ఫటికాది యథాద్రవ్యం భిన్నరూపైరుపాశ్రయైః ।
స్వశక్తి యోగాత్సంబన్ధం తాద్రూప్యేణోపగచ్ఛతి ॥ 40

తద్వచ్ఛబ్దోఽపి సత్తాయామస్యాం పూర్వం వ్యవస్థితః ।
ధర్మైరుపైతి సంబన్ధమవిరోధి విరోధిభిః ॥ 41

స్ఫటికాది = స్ఫటికము మున్నగు, ద్రవ్యమ్ = వస్తువు, అవిరోధివిరోధిభిః = అవిరుద్ధమగునట్టియు, విరుద్ధమగునట్టియు (తెల్లని స్ఫటికమునకు మల్లెపూవు మున్నగు తెల్లని వస్తువులు విరోధులుకావు. స్ఫటికముయొక్క రూపమును మరుగుపెట్టునవి కావు. మంకెన పువ్వు మున్నగు ఎరుపు వస్తువులు విరోధులు. అవి స్ఫటికముయొక్క రూపమును మార్పు చేయగలవని భావము.) కనుకనే. భిన్నరూపైః = విలక్షణమగు రూపముకల; ఉపాశ్రయైః= దగ్గర ఉండెడి వస్తువులతో; స్వశక్తియోగాత్ = స్వ = తనయొక్క అనగా స్ఫటికముయొక్క స్వచ్ఛత అనెడి శక్తి సంబంధమువలన; తాద్రూప్యేణ = తాద్రూప్యమనెడి; సంబన్ధమ్ = సంబంధమును, యథా = ఎట్లు; ఉపగచ్ఛతి = పొందుచున్నదో,

తద్వత్ = అట్లే, శబ్దః + అపి = శబ్దముకూడ, అస్యామ్ = ఈ (అనగా బుద్ధిచే) కల్పితమగు; సత్తాయామ్ = సత్తయందు, ఔపచారికసత్తయందు, పూర్వమ్ = ముందుగా; వ్యవస్థితః = ఉన్నదై అనగా జ్ఞానరూపముగానున్న పదార్థముతో సంబంధముకలదై; అవిరోధి విరోధిభిః = అవిరుద్ధమగునట్టియు-విరుద్ధమగునట్టియు అనగా బాహ్య ప్రపంచకమున భావరూపమగునట్టియు అభావరూపముగనున్నట్టియు, ధర్మైః = ధర్మములతో, సంబంధమ్= వాచ్యవాచక భావమనెడి సంబంధమును. ఉపైతి = పొందుచున్నది.

సత్ = అనగా ఉన్నటువంటిది యని యర్థము. ఘటము, పటము మున్నగు వానిని బోధించును. సతః భావః = సత్తా, ఉనికి. బుద్ధిలో పదార్థములను భావించుట, ఉపచారసత్త. అనగా జ్ఞానరూపమున వస్తువులను గుర్తించుట.

ఇది నిర్మలమగు స్ఫటికమువంటిది. స్ఫటికములో దగ్గరనున్న వస్తువులన్నియు ప్రతిఫలించును. తెల్లని వస్తువులు స్ఫటికముతో కలిసియుండును. అనగా దానికి రూపము మారునట్లు చేయక ఐక్యమును బొందియే యుండును. ఎరుపు, నలుపు, పసుపు వస్తువులు స్ఫటికముయొక్క తెలుపుతనమును మరుగు పరచును.

అట్లే ఈ సత్తయు సత్పదార్థములగు ఘటాదులలోను, లేమితోనుగూడ కలిసి యుండును. ఎల్ల వస్తువులతోను ఈ సత్త సంబంధించుననెడి భావముతో ''అవిరోధి విరోధిభిః'' అని చెప్పబడినది.

శబ్దము ముందుగా బుద్ధికల్పిత సత్తతోగూడిన పదార్థమునే బోధించును.

ఈ సత్త చాలా అవసరమైనది. దీనిని ఆశ్రయింపనిచో ''ఘటః'' ''అస్తి'' అను ప్రయోగము కలుగనేరదు ఘటః అనుటచేతనే సత్త భాసించుటచే మరల అస్తి అనుట పునరుక్తమగును. అట్టి ఘటమునకు అభావముతో విరోధముండుటచే ''ఘటః నాస్తి'' అని నిషేధ ప్రయోగముకూడ అసంగతమేయగును.

తాద్రూప్యేణ అనుచోట అభేదార్థమున తృతీయావిభక్తి. ॥40, 41॥

అవతారిక— శబ్దములవలన కలిగెడి వ్యవహారమున ఉపచారసత్త ప్రముఖ పాత్రను వహించియున్నది. అనగా ప్రధానమగుచున్నది. అట్లుకాకున్న వాడుకలో "న" (లేదు) అనుటయే పొసగదు అని చెప్పుచు దానికి విరోధి వస్తువులతో సంబంధము కలుగు ననెడి 41 వ శ్లోకము యొక్క అర్థమును వివరించుచున్నాడు.

శ్లో॥ ఏవఞ్చ ప్రతిషేధ్యేషు ప్రతిషేధ ప్రక్లృప్తయే ।
ఆశ్రితేషూప చారేణ ప్రతిషేధః ప్రవర్తతే ॥ 42

ఏవం + చ = ఇట్లుండగా అనగా ఉపచారసత్తకు విరోధి వస్తువులతో గూడ సంబంధము కలుగుచుండగా, ప్రతిషేధ ప్రక్లృప్తయే = నిషేధము యొక్క ప్రసిద్ధికొరకు, ఉపచారేణ = కల్పనారూపముచే, ఆశ్రితేషు = గ్రహింపబడిన, ప్రతిషేధ్యేషు = నిషేధింపబడెడి వస్తువుల యందు, ప్రతిషేధః = 'న' అను నిషేధము, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నది.

లోకులు 'ఘటోనాస్తి', (కడవ లేదు) 'అబ్రాహ్మణః' (బ్రాహ్మణుడు కానివాడు) అను రీతిని 'న' శబ్దముచే లేమిని చూపుచున్నారు. ఘటము నిజరూపమున నున్నచో సత్తకు లేమి యసంభవము కనుక 'ఘటో న' అనుట పొసగదు. కడవ లేనియెడల లేమి సిద్ధమే కనుక ప్రత్యేకించి 'న' అని ప్రయోగము సరిపడదు. లేని దానిని గురించి 'న' అని చెప్ప

సక్కర లేదు గదా ! ఈ పద్ధతిని చూచిన లోకమున 'న' అనుటకు అవకాశమే లేదు. కనుక బాహ్య ప్రపంచమునగల పదార్థములను మనము గుర్తించి వానిని అనుసరించి శబ్దములను ప్రయోగించుట సరికాదు.

కాబట్టి ఉపచారమునే శరణముగా జూపవలెను. అనగా ప్రపంచమున ఉనికి లేములతో నిమిత్తమక్కరలేకుండ బుద్ధిచే పదార్థమును కల్పించి వ్యవహరింపవలెను. అట్టి పదార్థములు కల్పితమైయున్నందున వానికి విరోధి పదార్థములతోను, అవిరోధి పదార్థములతోను గూడ సంబంధము లభించును. కాన అట్టి పదార్థములయొక్క లేమిని తెలుపుటకై 'న' శబ్దము ప్రయోగార్హమగుచున్నది. అట్లు కాకున్న నిషేధమున కర్హమగు పదార్థములే లేనందున 'న' శబ్దమును ప్రయోగించుటకు తావే లేకపోయెడిని. ॥42॥

అవతారిక—— 42 వ శ్లోకమున విరోధి పదార్థములతో ఉపచారసత్తకు సంబంధమును జూపి దానితోనే అవిరోధి పదార్థములకు గూడ సంబంధము యుక్తమగుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆత్మలాభస్య జన్మాఖ్యా సత్తాలభ్యా చ లభ్యతే ।
యది సజ్జాయతే కస్మా, దథాసజ్జాయతే కథమ్ ॥ 43

ఆత్మలాభస్య = స్వరూపము యొక్క ప్రాప్తికి, జన్మాఖ్యా = జన్మ అను పేరు, స్వరూప ప్రాప్తిని జ[redacted] అని వ్యవహరింతురని భావము, అట్టి జన్మమునకు మూడు అర్థములు నియతములని [redacted]పుచున్నాడు.

సత్తా = ఉనికి, అనగా ఆ పని చేయువాని స్థితి. కర్తయని భావము. 2. లభ[redacted]= పొందబడునది. అనగా కర్మ. 3. లభ్యతే = పొందుట అనగా లాభము. 1. పొ[redacted] కర్త, 2. పొందబడు అర్థము కర్మ, 3. పొందుట అను క్రియ ఈ మూడు[redacted] అను కార్యము జరుగుటకు అపేక్షితమగుచున్నవని భావము. దీనినే జన్మ యం[redacted]న్మ, అనగా వస్తుస్వరూప ప్రాప్తి.

B [redacted]తయము సత్కార్యవాదమున కుదరదని చెప్పుచున్నాడు.

[redacted] = వస్తువు సత్తే; యది = అగుచో; అనగా కారణ వ్యాపారమునకు ము[redacted] కార్యము సద్రూపముగా ఉన్నదేయగుచో, కస్మాత్ = దేనివలన, జాయతే = పు[redacted] ఉన్నదానికి జన్మమనునది విరుద్ధముకదా !

[redacted]థ = అట్లుగాక, అసత్ = అసత్తేయగుచో, అనగా కారణ వ్యాపారమునకు వ[redacted]వులేనిదే యగుచో, కథమ్ = ఎట్లు, జాయతే = పుట్టగలదు ? లేనిది పుట్ట నే[redacted]

[redacted]సత్కార్యవాదమున ప్రత్యయార్థమగు కర్తయు, అసత్కార్యవాదమున ప్రకృ [redacted]దరదని తాత్పర్యము. ॥43॥

అవతారిక— పై శ్లోకార్థమునే దృష్టాన్తముతో నిరూపించుచున్నాడు.

శ్లో॥ సతో హి గన్తుర్గమనం సతి గమ్యే ప్రవర్తతే ।
గన్తృవచ్చేన్న జన్మార్థో నచేత్తద్వన్న జాయతే ॥ 44

గన్తుః = వెళ్ళువాడు ; సతః = ఉండగా, గమ్యే = పొందబడునది, స్థితే = ఉండగా, గమనమ్ =నడక ; ప్రవర్తతే + హి = జరుగునుకదా !

చైత్రః గ్రామం గచ్ఛతి. వెళ్ళువాడు చైత్రుడు. అట్టి కర్త సిద్ధముగానుండవలెను. వెళ్ళబడునది గ్రామము. అది కర్మ. అది సిద్ధముగా నుండవలెను. ఈ రీతిగా కర్తయు కర్మయు సిద్ధముగా నుండుటచే ఆ కారకములనుబట్టి గచ్ఛతి అను క్రియ జరుగును. దీనిని దృష్టాన్తముగా జూపియున్నాడు. దీని సామ్యము ''జాయతే'' అనుచోట లేదు. "అఙ్కురో జాయతే'' (మొలక పుట్టుచున్నది.) ఇచట నడకవంటిది జననక్రియ. గ్రామము వంటిది స్వరూప ప్రాప్తి. నడచెడి మనుష్యునివంటిది అంకురము. చైత్రుడు సిద్ధ వస్తువు. గ్రామము సిద్ధ వస్తువు. ఈ రెండు సిద్ధముగా నున్నందున గమనక్రియ జరుగగలదు. ప్రకృతమున గన్తృవత్ = నడచెడి చైత్రునివలె, చేత్ = ఉన్నచో, అనగా అంకురము సిద్ధముగా నున్నచో, జన్మార్థః = జన్మ (పుట్టుట) అను ధాత్వర్థము , న = లేదు అనగా ఉపపన్నము కాదు. సిద్ధమే కాన పుట్టుట ఎట్లు ? సిద్ధమగు పదార్థమునకు పుట్టుక ఉండదు కదా !

కాక తద్వత్ = దానివలె అనగా నడచెడి వానివలె ; న + చేత్ = లేనియెడల అంకురము లేనిదే యగుచో, గన్త సిద్ధము, అట్లు అంకురము సిద్ధముకాదు కనుక జన్మను బొందవచ్చునని భావము. న + జాయతే = పుట్టనేరదు. లేని వస్తువు ఎట్లు జనియింపగలదు ?

గన్తృ దృష్టాన్తము చొప్పున అంకురమున్నదని యంగీకరించిన సిద్ధమే కాన పుట్టుక జరుగదు. అంకురము గన్తవలె సిద్ధము కాదనిన లేనిదానికి పుట్టుక యెట్లు ? కాబట్టి బాహ్య వస్తువులను ఆధారముగా గ్రైకొనినచో శబ్దములు వాడుకలో సరిపడవు. ॥44॥

అవతారిక— బాహ్య పదార్థముల నాశ్రయించిన ''అఙ్కురో జాయతే'' మున్నగు శాబ్ద వ్యవహారము సంగతము కానేరదని చూపి ఉపచారసత్తను ఆశ్రయించిన ఏ విధమగు దోషము లేకుండ సరిపడునని చూపుచున్నాడు.

శ్లో॥ ఉపచర్య తు కర్తార మభిధానప్రవృత్తయే ।
పునశ్చకర్మ భావేన తాంక్రియాఞ్చ తదాశ్రయామ్ ॥ 45

శ్లో॥ అథోపచారసత్తైవం విధేయాస్తత్ర లాదయః ।
జన్మనా తు విరోధిత్వాత్ ముఖ్యా సత్తా న విద్యతే ॥ 46

అభిధాన ప్రవృత్తయే = శబ్దములయొక్క ప్రయోగముకొరకు, కర్తారమ్ = కర్తను ; పునః + చ = మరియు, కర్మ = కర్మను, చ = మరియు ; తదాశ్రయామ్ = కర్తృ కర్మలు

ఆశ్రయముగాకల; తాం + క్రియామ్ = ఆ క్రియను, భావేన = బుద్ధిచే; ఉపచర్య + తు = వివేచనము అనగా భేదము నాశ్రయించి, ఉపచారసత్తా = కల్పితమగు పదార్థముల యొక్క ఉనికి; అథ = అంగీకరింపవలెను.

ఏవమ్ = ఇట్లైన, తత్ర = పై రీతిని కల్పింపబడిన కర్తయందు, లాదయః = లకారము మున్నగునవి, విధేయాః = శాస్త్రముచే విధింపదగినవి. అనగా ''అఙ్కురో జాయతే'' అనుచోట కర్త్రర్థమున లకారము. జాయతే అను పదప్రయోగము. జాతవాన్ = అని కర్త్రర్థమున 'క్తవతు' ప్రత్యయము. జన్మ అఙ్కురస్య = అనుచోట కర్త్రర్థమున షష్ఠీ ప్రత్యయము వచ్చును.

కాక, తత్ర = కల్పితపదార్థమున, లాదయః = లకారాదులు, విధేయాః = విధింపదగినవి. కర్త్రర్థమున ప్రత్యయము క్రియను కల్పించుటచే ప్రకృతికి ధాతు సంజ్ఞయు, కర్మను కల్పించుటచే కర్మనుగా కర్తనుగా చూపుచు ''అఙ్కురః ఆత్మానం లభతే'' అను వాక్యము, అఙ్కురమ్ అనుచోట కర్మార్థమున ద్వితీయ, ఇవి యన్నియు సంపాదింపవలెను.

ముఖ్యా = ప్రధానమగు; సత్తా + తు = సత్త ఐన అనగా ఆరోపము నపేక్షింపక బాహ్య ప్రపంచమున ఉన్న వస్తువులయొక్క ఉనికి మాత్రము, జన్మనా = జన్మతో; విరోధిత్వాత్ = విరోధము కలది యగుటవలన అనగా విరుద్ధమగుటవలన, న + విద్యతే = ఉండనేరదు.

కనుక ఔపచారిక సత్తనే శాబ్ద వ్యవహారమునకు స్వీకరింపవలయును. ॥45,46॥

అవతారిక — బాహ్య సత్తనుబట్టి "అఙ్కురో జాయతే'' అను ప్రయోగము కుదరదు, ఆరోపిత సత్తనుబట్టియే కుదురునని ప్రదర్శించి, 'అఙ్కురః అస్తి' (అంకురమున్నది) అని జన్మ తరువాతను కలిగెడి అస్తిత్వము పురస్కరించుకొని యున్న ప్రయోగము కూడ బాహ్య సత్తను బట్టి కుదరదు, ఉపచారసత్తను బట్టియే కుదురునని చూపుచున్నాడు.

శ్లో॥ ఆత్మానమాత్మనా బిభ్ర దస్తీతి వ్యపదిశ్యతే ।
అన్తర్భావాచ్చ తేనాసౌ కర్మణా న సకర్మకః ॥ 47

A. ఆత్మానమ్ = తన్ను, ఆత్మనా = తనచేతనే, బిభ్రత్ = ధరించుచున్న (అఙ్కురః) = అంకురము మున్నగునది, అస్తి + ఇతి = అస్తి అను పదముచే; వ్యపదిశ్యతే = వ్యవహరింపబడుచున్నది.

లోకులు అఙ్కురః అస్తి = (మొలిక ఉన్నది.) ఘటః అస్తి = (కడవ ఉన్నది.) అను రీతిని, అస్తి పదమును ప్రయోగించుచున్నారు. 'అస్తి' అను పదమునకు తన రూపమును తానే ధరియించుచున్నది అని యర్థము. తన్ను ధరియించుటలో మరియొక కర్త లేదని చెప్పుటకు 'ఆత్మనా' అను పద ముపయుక్తమగుచున్నది.

ఇచట గూడ 1. ధరియించుట అను క్రియ, 2. ధరియించెడి కర్త, 3. ధరియింపబడెడి కర్మ, ఈ మూడును ఉండవలెను. కాని ఈ మూడు వేరువేరుగా భాసింపనందున బాహ్య పదార్థమును బట్టి పై ప్రయోగ ముపపన్నము కానేరదు ఉపచార సత్తను స్వీకరించిన పై వ్యవహారము సంగతము కాగలదు.

B. అస్తి అను దానికి తన్ను ధరియించుచున్నదని యర్థము చెప్పిన, (తన్ను) ఆత్మానమ్ అను కర్మనబట్టి 'అస్' ధాతువు 'గ్రామం గచ్ఛతి' అనుచోట 'గమ్' ధాతువువలె సకర్మకము కావలెను. అది స్వతః అకర్మకమే. అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అసౌ = ఈ అసధాతువు, అన్తర్భావాత్ = ధాత్వర్థమున ఇమిడియున్నందున ; తేన = ఆ, కర్మణా = ఆత్మానమ్ అను కర్మచే, సకర్మకః + చ = సకర్మకము మాత్రము ; న = కానేరదు.

తన్ను తనచే ధరియించినవాడు అను ఎల్ల యర్థము ధాతువునకే వాచ్యమగుచున్నది. కర్మగానున్న తన్ను అనునది ధాత్వర్థముకంటె వేరుగాలేదు. కనుక ఆ కర్మనుబట్టి ధాతువునకు సకర్మకత్వము చెప్పరాదు.

ఎచట ధాత్వర్థము కంటె వేరుగా కర్మ భాసించునో, అచట ఆ కర్మనుబట్టి ధాతువు సకర్మకమగును. ఉదా :– చైత్రః గ్రామం గచ్ఛతి. ఇచ్చట గ్రామము ధాత్వర్థము కాదు.

ఈ యభిప్రాయమును భర్తృహరి సాధన సముద్దేశమున 87 వ శ్లోకముచే చెప్పబోవు చున్నాడు.

ఈ శ్లోకములో రెండవ భాగము ప్రసంగవశమున చూపబడినది. ప్రకృతార్థము గాదు. ॥47॥

అవతారిక— "అఙ్కురో జాయతే" అను ప్రయోగము బాహ్య వస్తువును స్వీకరించినచో కర్త లేనందున కుదరదని చెప్పి, ఇపుడు ధాత్వర్థము కూడ లేనందున ఆ ప్రయోగము కుదరదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రాక్చ సత్తాఽభిసంబన్ధా న్ముఖ్యాసత్తా కథం భవేత్ ।
అసంశ్చనాస్తేః కర్తాస్యా, దుపచారస్తు పూర్వవత్ ॥ 48

సత్తాఽభిసంబన్ధాత్ = ఔపచారిక సత్తయొక్క సంబంధముకంటె, అనగా అట్టి సత్తతో పదార్థము సంబంధించుట కంటె, ప్రాక్ = పూర్వము, ముఖ్యా = ప్రధానమగు, సత్తా = బాహ్య పదార్థముల సత్త, కథమ్ = ఎట్లు, భవేత్ = కలుగును ?

బుద్ధి కల్పితమగు సత్తతో ముందుగ సంబంధించిన తరువాతయే పదార్థములకు బాహ్య సత్తతో సంబంధము కలుగును. అంతకుమునుపు ముఖ్యమగు సత్త ఉండనేరదు.

అర్థే అసన్ + చ = అసత్తు అగు అనగా లేని పదార్థము మాత్రము, అస్తేః = 'అస' ధాత్వర్థమునకు, కర్తా = కర్త అనగా ఆశ్రయము, న + స్యాత్ = ఉండనేరదు.

పూర్వవత్ = పూర్వము 45–46 శ్లోకములచే చెప్పినట్లు, ఉపచారః + తు = కల్పనామాత్రము (సమర్థః) = సమర్థము కాగలదు. అస్తి అను శబ్ద ప్రయోగమునకు అచట కర్త ఉపపన్నమగుటకు సరిపడి యుండును.

కాగా ఔపచారికమగు సత్తనుబట్టి అస్తి, నాస్తి, జాయతే అను ప్రయోగములు కుదురుచున్నవి. బాహ్య ప్రపంచమున గల పదార్థముల స్థితినిబట్టి ఎంత మాత్రము పై మూడు ప్రయోగములు కుదరవు. ॥48॥

అవతారిక — శబ్ద వ్యవహార మాత్రమున ఔపచారిక సత్తయే ఉపయోగించు చున్నదనియు, అది మహాభాష్యకార సమ్మతమనియు, నిరూపించుచు దాని స్వరూపమును వ్యక్తపరచుచున్నాడు.

శ్లో॥ తస్మాద్భిన్నేషు ధర్మేషు విరోధిష్వవిరోధినీమ్ ।
విరోధి ఖ్యాపనాయైవ శబ్దైస్తైస్తైరుపాశ్రితామ్ ॥ 49

శ్లో॥ అభిన్నకాలామర్థేషు భిన్నకాలేష్వవస్థితామ్ ।
ప్రవృత్తిహేతుం సర్వేషాం శబ్దానామౌపచారికీమ్ ॥ 50

శ్లో॥ ఏతాం సత్తాం పదార్థో హి న కశ్చిదతివర్తతే ।
సా చ సంప్రతి సత్తాయాః పృథక్ భాష్యే నిదర్శితా ॥ 51

తస్మాత్ = అందువలన అనగా బాహ్య సత్తను బట్టి, "అస్తి, జాయతే, నాస్తి మున్నగు ప్రయోగములు నిర్వహింపబడనందున, భిన్నేషు = విజాతీయములగునట్టియు, కనుకనే, విరోధిషు = విరోధకముకల, ధర్మేషు = ధర్మములయందు అనగా అస్తిత్వము, నాస్తిత్వము మున్నగువానియందు, అవిరోధినీమ్ = విరోధి కానట్టియు, విరోధిఖ్యాపనాయ + ఏవ = విరుద్ధమగు పదార్థములను చెప్పుటకొరకే; తైః + తైః = ఆయా, శబ్దైః = శబ్దములచే, ఉపాశ్రితామ్ = ఆశ్రయింపబడినట్టియు, అనగా ముందుగా శబ్దములచే బోధింపబడినట్టియు, అభిన్నకాలామ్ = భేదములేని అనగా ఏకాకారమగు కాలము కలిగినట్టియు అనగా ఎల్లకాల ముల యందును ఉండునట్టియు, భిన్నకాలేషు = భిన్నమగు కాలము కల, అనగా వేరు వేరు కాలములయందుండెడి, అర్థేషు = వ్యక్తులయందు, అవస్థితామ్ = ఉన్నటువంటి ; సర్వేషామ్ = ఎల్ల ; శబ్దానామ్ = శబ్దములయొక్క, ప్రవృత్తిహేతుమ్ = ప్రవృత్తికి కారణ మగునట్టి, ఏతాం = ఈ రూపముకల, ఔపచారికీం = బుద్ధిచే కల్పింపబడిన, సత్తామ్ = సత్తను (ఉనికిని) కశ్చిత్ + పదార్థః = ఏ వస్తువు, న + వ్యభిచరతి + హి = వ్యభిచరించు నది కాదు. అనగా దానిని విడిచియుండునది కాదుగదా ;

ఇట్టి సత్తను స్వీకరించుటలో మహాభాష్యము ప్రమాణమని చెప్పుచున్నాడు. సా= ఆ ఔపచారికమగు సత్త, సంప్రతి సత్తాయాః = సంప్రతిసత్తకంటె అనగా బాహ్య ప్రపంచమున కానవచ్చెడి సత్తకంటె; పృథక్ = వేరుగా, భాష్యే = మహాభాష్యమున; నిదర్శితా + చ = చూపబడియున్నది. కాగా పై విధముగా కల్పితసత్త భాష్య సమ్మతము.

''తదస్యాస్త్యస్మిన్నితి మతుప్" (5-2-94) అని పాణిని సూత్రించెను. ప్రథమాంతము కంటె 'అస్య' దీనికి ఉన్నది. దీనియందనెడి యర్థమున లోకానుసారము 'మతుప్' అను తద్ధిత ప్రత్యయము కలుగునని సూత్రార్థము ఉదా : గావః అస్యసన్తి-గోమాన్‌చైత్రః, గావః అస్మిన్‌సన్తి = గోమాన్ పర్వతః, ''సత్తాం పదార్థో న వ్యభిచరతి'' (వస్తువు సత్తను విడనాడి యుండదు) అను కారణమువలన సూత్రమున అస్తి అనుపదము వ్యర్థమని శంకించి ''సంప్రతి సత్తాయాం యథాస్యాత్, భూత భవిష్యత్సత్తాయాం మాభూత్ గావః అస్య ఆసన్, గావః అస్య భవితారః'' అని భాష్యకారుడు పలికెను. సంప్రతిసత్త అనగా వర్తమాన కాలికమగు ఉనికి, బాహ్యసత్త అని భావము. బాహ్య ప్రపంచమున ప్రత్యక్షముగా వస్తువున్నప్పుడు మతుప్ ప్రవర్తించును. ప్రస్తుత కాలమున వీనికి గోవులు కలవు గోమాన్. ఇతనికి మునుపు గోవులుండెడివి. ఇతనికి ఇటుపైని గోవులుండగలవు అనునర్థమున అనగా భూత భవిష్యత్సత్త యగుచో మతుప్‌రాదు అని భాష్యార్థము. ఇట్టి సత్త ఉపచారసత్తయనబడును ॥49, 50, 51॥

అవతారిక— లోకమున రూపముకలిగి భావ పదార్థములుగ పరిగణింపబడునవి ఘటపటాదులు కలవు. వీనినే సత్పదార్థములందురు. వీనికి వ్యతిరేకముగా లేమియు కలదు. దానిని అభావమందురు. భావ పదార్థములను తెలిపెడివి సన్, ఘటః, పటః మున్నగు శబ్దములు. అభావమును తెలిపెడివి అభావః, నాస్తి, అతీతః మున్నగు పదములు. ఈ రెండు విధములగు పదములు విలక్షణములుగా కాన్పించుచున్నవి. బాగుగ ఆలోచించిచూచిన రెంటికి భేదములేదు. శబ్దములు నిజమున పరమార్థసత్యమగు బ్రహ్మ పదార్థమును బోధింపజాలవు. మాయావశమున కల్పితములగు అర్థములనే చెప్పుచున్నవి. కాగా లేని అర్థమునే ఘటాది శబ్దములు అర్థబోధనకై ఉపయోగింపబడుచున్నవి. అందుచే అభావాది శబ్దములుకూడ భావ వాచక శబ్దములవంటివే. కాబట్టి భావబోధకములగు ఘట గవాది శబ్దములకుబోలె అభావ బోధక శబ్దములకుగూడ అర్థముతో సంబంధము చెప్పతగునని వ్యక్తపరచుటకై ముందుగా శబ్దములు సంపూర్ణమగు అర్థమును బోధింపక ఏక దేశమగు అర్థమునే లేని యర్థమునే బోధించుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రదేశస్యైకదేశం వా పరతో వా నిరూపణమ్ ।
విపర్యయ మభావం వా వ్యవహారోఽనువర్తతే ॥ 52

ప్రదేశస్య = ఒక భాగమునకు సంబంధించినట్టి, ఏకదేశం + వా = దానిలో ఏదో ఒక భాగమునుగాని, పరతః = ఇతర వస్తువువలన, నిరూపణం + వా = రూపొందించుటనుగాని, విపర్యయం + వా = భ్రమరూపమగు దానినిగాని, అభావం + వా = లేమినిగాని, వ్యవ

హారం = శబ్దములవలన కలిగెడి పరస్పరాభిప్రాయ ప్రకటన, అనువర్తతే = అనువర్తించు చున్నది. అనగా అట్టి దానిని బట్టియే శాబ్దవ్యవహారము జరుగుచున్నది.

1 "ప్రదేశస్యైకదేశంవా"

నిర్గుణబ్రహ్మమేసత్యము. దానికంటె వేరు పదార్థములేదు. ఇదియే పరమ సిద్ధాన్తము. అట్టి బ్రహ్మపదార్థమును శబ్దము చెప్పజాలదు. కాని మాయా వశమున నిర్గుణ బ్రహ్మము జగద్రూపమున వివర్తమగుచున్నది. అందుచే ఘటాదికము ఆ బ్రహ్మముయొక్క రూపాంతరమే యగుటచేనట్టి ఘటాదికము ఈ శ్లోకమున ప్రదేశశబ్దముచే బోధింపబడుచున్నది. కాబట్టి బ్రహ్మపదార్థమున ప్రదేశమగు అనగా కల్పిత భాగమగు ఘటాదికమునే ఘటశబ్దము బోధించును మరియు ఆ ఘటమునుగూడ గుణక్రియాది సకల ధర్మ సహితముగా బోధింప జాలదు దానిలో ఏక దేశమగుజాతిని వ్యక్తిని బోధించును. నీలాది గుణములను చెప్పజాలదు.

2. "పరతోవానిరూపణమ్"

నిర్గుణమగు బ్రహ్మమే ద్రవ్యమనబడును. అట్టి ద్రవ్యమును ఏ శబ్దము బోధింప జాలదు దానికి ఘటత్వము గోత్వము మున్నగు జాత్యాదులతో సంబంధమును కల్పించి కల్పితరూపమును బుద్ధిచే భాసింపజేసి అట్టి దానిని శబ్దము బోధించునని చెప్పవలెను. ఈ సిద్ధాన్తమునగూడ శబ్దము అర్థమును ఇతరరూపముతోనే బోధించును. దీనిని సంసర్గ దర్శన మందురు

3. ''విపర్యయమ్''

జ్ఞానమే సత్యము అది తప్ప పదార్థములేదు అని నాస్తికదార్శనికులలో కొందరు భావింతురు. వీరిని ''విజ్ఞానవాదు''లని శాస్త్రజ్ఞులు వ్యవహరింతురు. విజ్ఞానవాది మతమున జ్ఞానముకంటె వేరుగ పదార్థము లేనందున ఘటఘటాదులు వేరుగ ఉన్నవని భావించుట భ్రమయే ఘటాది పదార్థములు లేనివే భాసించుచున్నవని తేలినది. అట్లు భాసించుటయే విపర్యయము విపర్యయమనగా భ్రమయే. కాగా వీతి మతమున పదార్థములు భ్రమ విషయములే శబ్ద వాచ్యములని తేలినది.

4. "అభావం + వా"

నాస్తికులలో 'మాధ్యమికు'లని పేరితో కొందరున్నారు. వీరు ''సర్వం శూన్యమ్'' ఎల్లయు శూన్యమని భావింతురు. వీరి మతమున ఘటాది పదార్థములు శూన్యములే శాబ్దవ్యవహార విషయములగుచున్నవి.

కాగా ఏ మతమును జూపినను శబ్దము యథార్థమగు వస్తువును చెప్పజాలదు. విచారణచేయకుండగనే ఈ శబ్దము ఈ యర్థమును బోధించునని గ్రహింపవలసియున్నది. అట్లు భావించుట అతీత, అభావ. నాస్తి మున్నగు పదములకు సమానమే. కాబట్టి భావవస్తు బోధక ఘటగవాది శబ్దములకు అభావబోధక శబ్దములకు సంబంధము అర్థములతో ఏక రూపమే ॥52॥

అవతారిక — పై యర్థమునే దృష్టాన్తముతో జూపుచున్నాడు.

శ్లో॥ యథేన్ద్రియస్య వైగుణ్యా త్స త్త్వాధ్యారోపవానివ ।
జాయతే ప్రత్యయోఽర్థేభ్య స్తథై వోద్దేశజామతిః ॥ 53

ఇన్ద్రియస్య = ఇంద్రియము యొక్క అనగా కన్ను చెవి మున్నగు ఇంద్రియముల యొక్క, వైగుణ్యాత్ = పోయిన గుణము కలది యగుట వలన అనగా దోషమువలన, సత్త్వాధ్యారోపవాన్ + ఇవ = ఉనికి యొక్క ఆ రూపముకలదివలెయున్న, ప్రత్యయః = జ్ఞానము, అర్థేభ్యః = విషయములవలన అనగా వస్తువులవలన, యథా = ఏ రీతిగా, జాయతే = కలుగుచున్నదో, తథా + ఏవ = అట్లే, ఉద్దేశజా = శబ్దమువలన కలిగెడి, మతిః = జ్ఞానము, జాయతే = కలుగుచున్నది. వస్తువు నిజరూపమునగాక కల్పిత రూపము తోనే శబ్దమువలన జ్ఞాతమగుచున్నదని భావము.

కన్ను వస్తువుయొక్క రూపమును గ్రహించును. ఇంద్రియమునకు ఏదైన దోషమున్న, దానివలన ద్రవ్యరూపము రూపాంతరముగా కానవచ్చును. శంఖము తెల్లనిది. పైత్యము అధికమైన 'కామిల' అను దోషము కంటికి కలిగిన శంఖముయొక్క తెలుపు తనము స్వస్వరూపమున కానరాక పచ్చగ కానవచ్చును. శంఖము పచ్చనిది అనియే జ్ఞానము కలుగును. అట్లే చెవి శబ్దమును గ్రహించును. దానికి దోషమున్నచో ఇతరునిచే నుచ్చరింప బడిన శబ్దము మరియొక శబ్దమువలె భాసించును. నాలుక దుష్టమగుచో మధుర పదార్థము చేదుగా భాసించును. అట్లే శబ్దముకూడ విగుణమగు ఇంద్రియమును బోలి అర్థమును నిజ రూపమునగాక కల్పితమగు రూపాంతరముకల దానినిగా బోధించును. వస్తువునందులేని రూపము నారోపింపగా అట్టి కల్పితరూపముకల అర్థమునే శబ్దము బోధించును

ఇంద్రియమునకు దోషములేనిచో యథాస్థితమగు రూపమునే ఇంద్రియము గ్రహి యించును. అందుచే విగుణమగు ఇంద్రియము దృష్టాన్తముగా జూపబడినది. శబ్దము ఎల్లప్పుడు అర్థమును నిజరూపముతో జూపక కల్పితమగు రూపముతోగూడిన దానినే బోధించును.

'ఉద్దిశ్యతే = ప్రతిపాద్యతే యేనసః ఉద్దేశః' దేనిచే అర్థమును తెలిసికొనునో అనగా తెలిసికొనుటకు సాధనమైనది శబ్దము. ఉద్దేశాత్ = శబ్దాత్, జాతాః ఉద్దేశజా = శబ్దమువలన కలిగెడిది. ॥53॥

అవతారిక — ఇంద్రియముయొక్క వైగుణ్యము మనకు ప్రత్యక్షముగా కాన వచ్చుచున్నది. కాని శబ్దమునకు వైగుణ్యము అనగా దోషము ఎట్టిదో మనకు తెలియదు. దానిని తెలిసికొనుట యెట్లు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అకృత్స్నె విషయాభాసం శబ్దః ప్రత్యయమాశ్రితః ।
అర్థమాహాత్మ్యరూపేణ స్వరూపేణాఽనిరూపితమ్ ॥ 54

శబ్దః = శబ్దము, అర్థమాహాత్మ్యరూపేణ = అర్థముయొక్క మహిమయే రూపముగాకల, స్వరూపేణ = స్వరూపముచే, అనగా నిజరూపముచే, అనిరూపితమ్ = నిరూపింపబడనట్టియు, అకృత్స్నవిషయాభాసమ్ = సంపూర్ణముకాని విషయముకల, (కనుకనే ఆరోపితమగు) ప్రత్యయమ్ = జ్ఞానమును, ఆశ్రితః = ఆశ్రయించియున్నది.

ఘటము, పటము మున్నగు వ్యక్తులను పరిశీలించిన అందుకంటికి కానవచ్చెడి ఆకారము, దానిని ఆశ్రయించియున్న ఘటత్వము పటత్వము మున్నగుజాతి, ఎరుపు తెలుపు మున్నగు రూపము, కదలిక, ఉండుట మున్నగు క్రియ, ఏకత్వము మున్నగుసంఖ్య, కర్తృత్వము మున్నగు కారకము, పుంస్త్వము మున్నగు లింగము, గంధము పరిమాణము పృథక్త్వము మున్నగు ఎన్నియో అర్థములు గోచరించును. ఇదియే ఘటాద్యర్థముననున్న మాహాత్మ్యము ఇన్ని అంశములు కలిగినదే ఆ యర్థము. అట్టి యర్థమును ''ఘటః'' అను ఒక శబ్దము చెప్పజాలదు. వానిని అన్నిటిని చెప్పవలెనన్న నీలః, చలః, ఏకః, కర్తా, పుమాన్ అను రీతిని ఎన్నియో శబ్దములను నుపయోగింపవలెను. అట్లే ఏ శబ్దమును చూచినను ఆ వ్యక్తికి సంబంధించియున్న గుణము లన్నిటిని చెప్పుట సంభవింపదు. అర్థమును ముందుగ బుద్ధితో భావించి దానికి అనుగుణమగు శబ్దమునుచూచి ప్రయోగింపవలెను బుద్ధిచే అర్థకల్పన లేని దానిని ఉన్నట్లు భావించియే జరుగును అందుకు మూలకారణము మాయ. అందుచే విచారించిచూచిన ఎల్ల యర్థములు ఇట్టివేయని భావించియే శబ్దప్రయోగము జరుగుచున్నది ఇదియే శబ్దముయొక్క దోషము. ఆ దోషముచే శబ్దము అర్థమును సంపూర్ణరూపముతో చూపలేదు. సంపూర్ణార్థమును బోధింపలేకపోవుటయే శబ్దవైగుణము

కాబట్టి భావరూపములగు అర్థములను బోధించు ఘట పటాది శబ్దములకు 'అతీత', 'అభావ' మున్నగు అభావ బోధక శబ్దములకు అర్థముతో సంబంధముకలుగుట ఏకరూపమే. శాబ్దవ్యవహారమంతయు యథార్థ విషయము కాదు. ॥54॥

అవతారిక— మాయాసంబంధము విడనాడి శుద్ధమగు పరమాత్మ స్వరూపమును ఆకలించియున్న జీవన్ముక్తులకు కలిగెడి శాబ్దవ్యవహారము యథార్థవిషయకమే యగును. కాబట్టి వారల ఉపదేశమువలన మనకు కూడ కలిగెడి శాబ్దవ్యవహారము సత్యరూపమే కానోపును. అట్టితరి శబ్దము అసంపూర్ణమగు అర్థమునే బోధించును. కాన భావబోధక శబ్దములు అతీత, అభావ మున్నగు శబ్దములు అర్థసంబంధ విషయమై ఏకరూపములే అని నిర్ధారణ ఎట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ రూపణ వ్యపదేశాభ్యాం లౌకికే వర్త్మని స్థితౌ ।
జ్ఞానం ప్రత్యభిలాపం చ సమానౌ బాలపణ్డితౌ ॥ 55

రూపణ వ్యపదేశాభ్యామ్ = బుద్ధిచే అర్థమును నిరూపించుటచే, అట్టి యర్థమును శబ్దముచే వ్యవహరించుటచేతను, లౌకికే = లోకవ్యవహారమునకు సంబంధించియున్న, వర్త్మని = మార్గమున, అనగా ఒకే మార్గాన, స్థితౌ = ఉన్నటువంటి, బాలపణ్డితౌ = ఆత్మతత్త్వము

తెలియనివాడు, ఆ తత్త్వమును తెలిసికొన్నవాడు-వీరిరువురు, జ్ఞానం + ప్రతి = ఇతరుల అభిప్రాయమును గుర్తించి బుద్ధితో అర్థమును నిర్మించుట గూర్చి అభిలాపం + చ = దానిని శబ్దముచే అనువదించుట గూర్చియు, సమౌ = సములే, వారిరువురకు లోకవ్యవహారమున తారతమ్యములేదని భావము.

ఇచట బాలశబ్దము చంటివాడు అనునర్థమును బోధింపదు. పరమాత్మతత్త్వము ఎరుగక శరీరేంద్రియాదులకు బద్ధుడైయున్న వ్యక్తిని బాలశబ్దము బోధించును. అట్లే పండిత శబ్దము గూడ తర్క-వ్యాకరణాది శాస్త్రముల నభ్యసించిన వ్యక్తిని బోధింపదు, చిత్తశుద్ధి కలిగి శ్రవణమననాదులచే మాయాసంబంధమును విడనాడి నిర్గుణ పరబ్రహ్మమును సాక్షాత్కరించుకొన్నను ప్రారబ్ధకర్మవశమున దేహమును విడనాడకయున్న జీవన్ముక్తుని బోధించును. అట్టివానిని స్థితప్రజ్ఞుడందురు.

బాలుడు పండితుడు కూడ లోకవ్యవహారము నడపుటలో సమానులే. ఇతరుల యభిప్రాయమును గుర్తించి దానికి అనుగుణమగు అర్థమును బుద్ధిచే నిరూపించుట, అనగా కల్పించుట, దానికి అనుగుణమగు శబ్దమును ప్రయోగించుట ఈ రెండుకూడ ఇరువురకు సమానమే. తత్త్వవేత్తయు ''బ్రహ్మసత్యం; జగన్మిథ్య'' అని గుర్తించినను ఆ దృష్టితో లోకమున సంచరింపడు. అస్మదాదులవలెనే మాట్లాడును. స్నానపానాదులు చేయును.

తత్త్వవేత్తయొక్క శాబ్దవ్యవహారము కూడ యథార్థవిషయకము కాదు. అదియు అస్మదాది వ్యవహారము వంటిదే. కాబట్టి శబ్దము అసంపూర్ణమగు అర్థమునే బోధించుననుట యుక్తమే ॥55॥

అవతారిక— వ్యవహారదశయందు బాలుడు, పండితుడు సమానమైనవారే యని 55 వ శ్లోకమున చెప్పబడినది. కాని పండితునకు కలిగిన జ్ఞానము స్వచ్ఛమని పెద్దలు చెప్పుదురు. అతనికి గూడ ప్రతివస్తువు తెలియబడియుండనందున దానితో గూడిన జ్ఞానమే పండితునిది. అట్టితరి ఆయన జ్ఞానము స్వచ్ఛమైనది అనుట ఎట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వార్థరూపతా శుద్ధిః జ్ఞానస్య నిరుపాశ్రయా ।
తతోఽప్యస్య పరాంశుద్ధి మేకే ప్రాహురరూపికామ్॥ 56

A. జ్ఞానస్య = జ్ఞానమునకు, నిరుపాశ్రయా = ఆశ్రయమును ఆపేక్షింపని అనగా ఇంద్రియ సంబంధమును అపేక్షింపకయున్న, సర్వార్థరూపతా = ఎల్ల యర్థములరూపము కలిగి యుండుట, శుద్ధిః = నైర్మల్యము, పరిశుభ్రత.

ప్రతివ్యక్తికి ఇంద్రియ సంబంధమువలన జ్ఞానము కలుగుచున్నది. అందుచే ఇంద్రియ దోషమువలన ఆ జ్ఞానముగూడ దోషసహితము కాగలదు. అస్మదాదులకు కలిగెడిది ఇట్టి జ్ఞానమే. అట్లుగాక ఇంద్రియ సంబంధమును అపేక్షింపకుండగనే పండితునకు జ్ఞానము

కలుగును. అది ఎల్లయర్థములకు సంబంధించియుండును అదియే జ్ఞానముయొక్క పారిశుద్ధ్యము. అస్మదాదులకు పరిమితమగు వస్తువులకు సంబంధించిన జ్ఞానమే కలుగును.

B. ఏకే = కొందరు తత్త్వవేత్తలు, అస్య = ఈ జ్ఞానమునకు, తతః + అపి = దానికంటె గూడను అనగా ఇంద్రియ సంబంధము లేకుండగనే కలిగెడి జ్ఞానమునకు గల పారిశుద్ధ్యము కంటె గూడ, అరూపికామ్ = రూపసంబంధములేని అనగా విషయసంబంధము లేనందున లోకవ్యవహారమునకు సంబంధింపనట్టి, కనుకనే, పరామ్ = ఉత్తమమగు, శుద్ధిమ్ = శుద్ధిని, ప్రాహుః = చెప్పుచున్నారు.

విషయసంబంధములేని జ్ఞానము ప్రశాంతము. ఆనందరూపము. స్వపరప్రకాశము గ్రాహ్యగ్రాహకములతో సంబంధములేనిది అదియే పరబ్రహ్మరూపము

పండితునకు ఇంద్రియసంబంధములేక జ్ఞానము కలుగును. బాలునకు ఇంద్రియముల సంబంధము లేనియెడల జ్ఞానము కలుగనేరదు.

మరియు విషయములతో కలసియున్న జ్ఞానమే బాలునకు కలుగును విషయముల సంపర్కములేక కేవల జ్ఞానము పండితునకు కలుగును. ఆ జ్ఞానము బ్రహ్మరూపము.

తత్త్వవేత్త వ్యవహారదశయందు అస్మదాదులవలె వ్యవహరించినను, ఆయన ఈ ప్రపంచకముతో సంబంధములేని బ్రహ్మజ్ఞానము కలవాడే. ఆ జ్ఞానము శుద్ధము. ॥56॥

అవతారిక — జ్ఞానము స్వతః పవిత్రమైనది అట్టి స్థితిలో దానికి అశుద్ధి ఎట్లు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ ఉపప్లవో హి జ్ఞానస్య బాహ్యాకారానుపాతితా ।
కాలుష్యమివ తత్రాస్య సంసర్గే వ్యతిభేదజమ్ ॥ 57

జ్ఞానస్య = జ్ఞానమునకు, బాహ్యాకారానుపాతితా = బాహ్యప్రపంచమున గల వస్తువుల ననుసరించుట ; ఉపప్లవః + హి = ఉపద్రవము కదా! అనగా జ్ఞానముయొక్క నైర్మల్యమునకు భంగము కలిగించును కదా!

తత్ర = బాహ్యవస్తువునందు, సంసర్గే = సంబంధము కలుగగా, అస్య = ఈ జ్ఞానమునకు, వ్యతిభేదజమ్ = అభేదమువలన కలిగెడి, కాలుష్యమ్ = కాలుష్యము, ఇవ = కలిగినట్లుండును

స్వచ్ఛమగు జ్ఞానమునకు బాహ్యవస్తువుతో సంపర్కము కలుగగా ఆ వస్తువు జ్ఞానమునందు ప్రతిబింబించును. అందుచే ఆ రెండు ఏకరూపముగనే కాన్పించును. ఈ కారణము వలన జ్ఞానమునకు స్వచ్ఛత యుండనేరదు. విషయసంబంధము తొలగిన జ్ఞానము నందు అశుద్ధి కానరాదు

స్వతః జ్ఞానము నిర్మలమే. పరిశుద్ధమే విషయసంబంధమున్నను మలినమైనది వలె కాన్పించును. ఈ యభిప్రాయము కారికలో 'ఇవ' శబ్దము వ్యక్తపరచుచున్నది. ॥57॥

అవతారిక— వ్యవహారదశలో జ్ఞానమునకువలె విషయమునకు గూడ అశుద్ధి కలుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ యథాచ జ్ఞాన మాలేఖా దశుద్ధౌ వ్యవతిష్ఠతే ।
తథోపాశ్రయవానర్థః స్వరూపాద్విప్రకృష్యతే ॥ 58

జ్ఞానమ్ = జ్ఞానము, యథా = ఏ రీతిగ, ఆలేఖాత్ = విషయసంపర్క వశమున, అశుద్ధౌ = అశుద్ధియందు అనగా పారిశుద్ధ్యము లేకపోవుటయందు, వ్యవతిష్ఠతే = ఉన్నదో, తథా = అట్లే, అర్థః + చ = ఘటము, పటము మున్నగు అర్థముగూడ, ఉపాశ్రయవాన్ = జాతిగుణము క్రియ మున్నగువానియొక్క సంబంధము కలదై, స్వరూపాత్ = నిజరూపమునుండి, విప్రకృష్యతే = వ్యవహితమగుచున్నది, అనగా దూరమగుచున్నది.

ఘటము మున్నగుపదార్థములు జాతి మున్నగు ఉపాధులతో కలిసియే లోక వ్యవహారమునకు శబ్దముచే బోధింపబడుటకు అర్హములగుచున్నవి. అట్లుకాకున్న అవి శబ్దవాచ్యములు కానేరవు వ్యవహారమునకు సమర్థములుగూడ కానేరవు. జాతి, గుణము మున్నగునవి సంబంధింపకుండుటయే ఘటాదుల నిజస్వరూపము. అదియే శుద్ధరూపము. జాత్యాదులు కలియుటవలన ఘటముయొక్క రూపము కలుషితమగుచున్నది. కాగా వ్యవహారదశయంతయు పదార్థముల పారిశుద్ధ్యమును గుర్తింపకయే జరుగుచున్నదని తెలుచున్నది. ఇందు 57 వ శ్లోకముచే జూపబడిన జ్ఞానముయొక్క కాలుష్యము దృష్టాంతముగా జూపబడినది.॥58॥

అవతారిక— పై చూపబడిన అర్థమును ప్రకృతమున సమన్వయించుచున్నాడు.

శ్లో॥ ఏవమర్థస్య శబ్దస్య జ్ఞానస్య చ విపర్యయే ।
భావాభావావభేదేన వ్యవహారానుపాతినౌ ॥ 59

ఏవమ్ = ఈ ప్రకారముగా అనగా 57, 58 వ శ్లోకములలో చెప్పిన ప్రకారముగా, అర్థస్య = ఘటము పటము మున్నగు అర్థమునకు, శబ్దస్య = అర్థమును బోధించెడి శబ్దమునకు, జ్ఞానస్య + చ = అవి విషయముగాకల జ్ఞానమునకును, విపర్యయే = వ్యత్యాసము అనగా నిజరూపము కలుషితమై రూపాంతరము (జాతే) = కలుగగా, కనుకనే భావాऽభావౌ = భావ పదార్థము అభావపదార్థము రెండుగూడ, అభేదేన = భేదములేకపోవుటచే అనగా సామ్యము కలవి యగుటచే వ్యవహారానుపాతినౌ = లోకవ్యవహారమును అనుసరించియే యున్నవి.

ఘటము మున్నగు వస్తువులు స్వతః శుద్ధములే కాని జాతి మున్నగు ధర్మముల సంపర్కమున అవి కలుషితములగుచున్నవి. ఆ ధర్మములు లేనిదే వస్తువులు వ్యవహారమునకు గాని, శబ్దముచే బోధింపబడుటకు గాని యోగ్యములు కానేరవు. అట్టి ధర్మములతో

గూడిన యర్థములను బోధించెడి శబ్దములు గూడ శుద్ధములు కానేరవు. అట్లే జ్ఞానముగూడ విషయసంబంధమున శుద్ధిని విడిచియున్నది.

పై రీతిని అర్థము శబ్దము జ్ఞానము ఈ మూడును స్వతః స్వచ్ఛములైనను ఇతర సంబంధవశమున అస్వచ్ఛములగుచున్నవని తేలినది.

లోకమున ఘటము పటము మున్నగునవి భావపదార్థములనియు, అభావమనునది వానికంటె వేరు పదార్థమనియు వాడుక గలదు. తార్కికులు గూడ ద్రవ్యగుణకర్మ సామాన్య విశేష సమవాయములనెడివి ఆరు భావపదార్థములనియు, అభావమనునది మరియొక విధమగు పదార్థమనియు విభజించియున్నారు.

కాని భావపదార్థము, అభావపదార్థము రెండు ఏకరూపములే యనవచ్చును. రెంటికి ఒక విచిత్రమగు సామ్యము కలదు. శుద్ధమగు ఘటాది వస్తువు వ్యవహారమునకు గాని శబ్దముచే బోధింపబడుటకుగాని అర్హము కానేరదని పలుమారులు చెప్పబడినది. జాతి మొదలగ ఇతర ధర్మములను పురస్కరించుకొనియే వస్తువులకు వ్యవహారము, శబ్దవాచ్యత్వము కలుగును అభావము గూడ అట్టిదే. అభావము అనినంత మాత్రమున మనకు జ్ఞానము కలుగదు. వ్యవహారము కూడ జరుగదు. అభావమునకు అనగా లేమికి ముందుగా ఘటాదులను చేర్చి 'ఘటముయొక్క అభావము', 'పటముయొక్క లేమి' అను రీతిని చెప్పిన అది తెలియబడును. అనగా ప్రతియోగియగు పదార్థములేనిదే అభావము వ్యవహారోపయోగి కానేరదు.

ఈ రీతిగా ఘటము మున్నగు భావవస్తువులు జాతి మున్నగు ఇతర ధర్మముల సాహాయ్యమును తీసికొనియే లోకవ్యవహారమునకు కారణములగుచున్నవి. అభావము కూడ ఘటము మున్నగు ఇతరవస్తువులను సాహాయ్యముగా గైకొనియే వ్యవహారవిషయమగుచున్నది. రెంటికి పరాపేక్షయున్నందున రెండు ఏకరూపములే యనవచ్చును. ఇతరాపేక్ష లేనిదే భావవస్తువుగాని అభావముగాని వ్యవహారగోచరము కానేరదుగదా. ॥59॥

అవతారిక— భావపదార్థముకంటె వేరుగా అభావమనెడి పదార్థమున్నదని తలంచి వ్యవహారదశలో రెండు పరాపేక్షములగుటచే నవి భిన్నములు కానేరవని ఇంతవరకు జూపియున్నాడు.

కాని భావపదార్థము ఒక్కటియే నిలిచెడిది. దానికంటె వేరుగా అభావపదార్థము సంభవింపదు అది యుండుటకు తావులేదని ఇపుడు చెప్పుచున్నాడు.

శ్లో॥ నాఽభావో జాయతే భావో నైతి భావోఽనుపాఖ్యతామ్ ।
ఏకస్మాదాత్మనోఽనన్యౌ భావాఽభావౌ వికల్పితౌ ॥ 60

A. అభావః = అభావము అనగా ప్రధ్వంసాభావము, భావః = భావమూలకమై అనగా భావవస్తువు కారణముగా గలదై. న + జాయతే = జన్మింపనేరదు. ఘటము, పటము మున్నగు భావవస్తువులను ఉపమర్దనముచేయగా అనగా వానిని పగులకొట్టిన దానిని ప్రధ్వంసాభావ

మందురు భావవస్తువుల నాశనమువలన ధ్వంస జన్మించునని తార్కికులు తలంతురు. కాగా ప్రధ్వంసాభావము భావవస్తునాశ మూలకమని భావింతురు. కాని అట్లు తలంపరాదు. భావము అభావము అనునవి పరస్పరము విరుద్ధములైనవి కదా!

అట్లే ఘటము, పటము మున్నగు భావవస్తువులు ప్రాగభావముయొక్క నాశనము వలన జన్మించునని వారు తలంతురు అదియు పొసగదు భావః = భావపదార్థము, అనుపాఖ్యతామ్ = అసత్ అను బుద్ధి విషయత్వమును అనగా అభావరూపమును, న + ఏతి = పొంద లేదు. అనగా తనకు కారణమునుగా గైకొనజాలదు. ప్రాగభావమును రద్దించగా భావము పుట్ట నేరదని భావము. కాన భావపదార్థోపమర్దముచే ధ్వంస పుట్టును అట్లే ప్రాగభావోపమర్దనము వలన ఘటాది భావవస్తువు జన్మించును అనుట సమంజసము కాదు.

B. ఏకస్మాత్ = అద్వితీయమగు, ఆత్మనః = పరమాత్మకంటె, అనన్యౌ = విభిన్నములు కాని అనగా వేరుగాలేని, భావాఽభావౌ = భావము అభావము అను రెండు, కల్పితౌ = వికల్పిత ములే, అనగా కల్పనా మూలకములే.

పరబ్రహ్మము ఒక్కటియే పరమార్థ సత్యము పరమార్థ నిత్యము. అది ఎన్నడు వ్యవహారవిషయము కానేరదు. కాని పరబ్రహ్మము నాశ్రయించియున్న అవిద్యనుబట్టి ఆ పరబ్రహ్మము వ్యవహారదశలో నానారూపములను దాల్చినట్లు అస్మదాదులకు గోచరించును. ఆ పరబ్రహ్మమే తన శక్తివిశేషము అగు కాలముయొక్క మహిమచే కాలభేదమును గూడ అనుసరించును. అస్మదాదులకు ఘటపటాదులు ప్రత్యక్షమగు అవస్థనుబట్టి ఘటపటాదులు భావరూపములనియు, అస్మదాదుల ఇంద్రియములకు గోచరించని వాని పూర్వావస్థ ప్రాగభావ మనియు, అస్మదాదుల దృష్టికి గోచరించని వాని యుత్తరావస్థ ప్రధ్వంసాభావమనియు ప్రాజ్ఞులు గుర్తించుచున్నారు. ఘటపటాది వస్తుజాతమంతయు బ్రహ్మముయొక్క వివర్తమే కదా! ॥60॥

పై యర్థమునే చూపుచున్నాడు.

యథాభావముపాశ్రిత్య తదాభావోఽనుగమ్యతే ।
తథాఽభావముపాశ్రిత్య తద్భావోఽప్యనుగమ్యతే ॥ 61

యథా = ఎట్లు, భావమ్ = భావమునకు, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, తదభావః = దానియొక్క అభావము, అనుగమ్యతే = అనుసరింపబడుచున్నదో, తథా = అట్లే, అభావమ్ = అభావమును ఉపాశ్రిత్య = ఆశ్రయించి, తద్భావః = దానియొక్క భావము, అపి = కూడ, అనుగమ్యతే = అనుసరింపబడును ॥61॥

అవతారిక— భావపదార్థముల సంస్కారము సుతరాం నివర్తింపగా అభావ మనెడి పదార్థము నిలబడియుండును. అభావమనునది ఎల్లశక్తులు లేనిది. కారణభేదముచే భావము, అభావము అనునవి రెండు పదార్థములు స్వతంత్రములై భాసించుచునే యున్నవి.

అవి సత్యములే. ఇట్లుండగా భావపదార్థము, అభావము అనునవి రెండుకూడ కల్పితములే సత్యములు కానేరవు అనుట పొసగదు, అను పూర్వపక్షమునకు సమాధానము అనగా సత్కార్యవాదమునగాని, అసత్కార్యవాదమునగాని పదార్థములకు కార్యకారణ భావము పొసగదు కనుక ద్వైతదర్శనములు నిలుచునవి కానందున అద్వైతశాస్త్రము చెప్పిన వివర్త వాదమే శరణమని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అభావస్యానుపాఖ్యత్వాత్కారణం న ప్రసాధకమ్ ।
సోపాఖ్యస్య తు భావస్య కారణం కిం కరిష్యతి ॥ 62

A. ముందుగ అసత్కార్యవాదమున కార్యకారణ భావము కుదురదని చెప్పుచున్నాడు.

అభావస్య = లేమి, అనుపాఖ్యత్వాత్ = సత్ (ఉన్నది) అను బుద్ధికి గోచరము కానందున, కారణమ్ = మట్టి మున్నగు కారణము, న + ప్రసాధకమ్ = కార్యజనకము కానేరదు.

ఒక వస్తువవలన మరియొక వస్తువు జనియించును. లేమినుండి ఏ వస్తువు పుట్ట నేరదు. కారణ వ్యాపారమునకు ముందు కార్యము లేదనెడివారి మతము చెప్పిన ఘటము మున్నగునవి అంతకుముందు లేవని చెప్పవలెను. అట్టితరి లేమి ఒక కార్యమును కలిగింపదు. కనుక మన్ను కారణము, కడవ కార్యమని చెప్పదగదు. లేమినుండియు కార్యము పుట్టగలదని అంగీకరించిన ఆవు కొమ్ములనుండియు పాలు పుట్టవలెను ఇసుకనుండియు నూనె ఉద్భవింప వలెను.

B. సత్కార్యవాదమున గూడ అనగా కారణ వ్యాపారమునకు ముందు కార్యము సూక్ష్మ రూపమున ఉన్నదియే అనెడివారి మతమున గూడ కార్యకారణ భావము సిద్ధింపదని చెప్పు చున్నాడు.

సోపాఖ్యస్య = సత్ (ఉన్నది) అనెడి బుద్ధికి విషయమగు, భావస్య = పదార్థము యొక్క, (స్వీకారే) తు = స్వీకారపక్షము నందైతే, అనగా సత్కార్యవాదమున అయితే, కారణమ్ = మట్టి మున్నగు కారణము, కిం కరిష్యతి = ఏమి చేయగలదు ?

కార్యముగా తలంపబడెడి ఘటాదికము సత్తేయగుచో మరల కారణము నిరుప యుక్తమే కదా ' లేని వస్తువును రూపొందించుటకు కదా కారణమపేక్షితమగుచున్నది. ఆ వస్తువు సత్తే అనగా సిద్ధమేయగుచో కారణాపేక్ష లేదు.

కనుక ఏ పక్షమునను కార్యకారణ భావము కుదరదు. కనుక అద్వైతశాస్త్రమునే సేవింపవలెను. అపుడు శబ్దము శుద్ధ బ్రహ్మపదార్థమును చెప్పజాలనందున కల్పితమగు అర్థ మునే బోధించుచున్నదని తప్పక అంగీకరింపవలయును కాబట్టి భావబోధకములుగా భావింప బడెడి ఘటపటాదులను చెప్పెడి శబ్దములు, లేమిని బోధించెడి అతీత, అభావము అను శబ్ద ములు రెండుకూడ సమానములే ॥62॥

అవతారిక— కనుక ప్రాగభావము, ప్రధ్వంసాభావము అనునవి వేరుగాలేవు. అవియు భావపదార్థము కూడ పరబ్రహ్మముయొక్క అవిద్యామూలకములగు అవస్థా భేదములే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్మాత్సర్వమభావోవా భావోవాసర్వమిష్యతే ।
నత్వవస్థాన్తరం కిఞ్చి దేకస్మాత్సత్యతః స్థితమ్ ॥ 63

తస్మాత్ = అందువలన అనగా అభావమునుండి భావముగాని, భావమునుండి అభావముగాని పుట్టుట సంభవింపనందున, సర్వమ్ = అంతయు అనగా పరబ్రహ్మముకంటె అతిరిక్తమగు ఎల్ల ప్రపంచకము, అభావః + వా = పరమార్థము కానేరదనియే, ఇష్యతే = అంగీకరింపబడు చున్నది. సర్వమ్ = ప్రపంచకమంతయు, భావః + వా = భావరూపమనియే, (ఇష్యతే) = అంగీకరింపబడుచున్నది. పరబ్రహ్మము సద్రూపము కనుక దాని వివర్తమగు ప్రపంచకము గూడ సత్తే. అనగా బ్రహ్మసత్తను బట్టి ప్రపంచకమునందు గూడ సత్తయే భాసించును. బ్రహ్మ సత్తకంటె వేరుగ సత్త లేదు. కాన అభావమనునది మాత్రము వేరుగా లేదు.

B. ఆ యంశమునే జూపుచున్నాడు

ఏకస్మాత్ = అద్వితీయమగు, సత్యతః = సత్యమగు పరబ్రహ్మముకంటె, స్థితమ్ = ఉన్నటువంటి, అవస్థాన్తరమ్ = మరియొక అవస్థ, న + తు + కిఞ్చిత్ = ఏమియు లేదు. ॥63॥

అవతారిక— అద్వితీయమగు పరబ్రహ్మమే పరమార్థ సత్యము. అది జ్ఞాన రూపము దానికి అవిద్యావశమున బహుభావము ఏర్పడినది దాని మూలమున దర్శన వికల్పములు ఏర్పడినవి. కాన వానియందు పెద్దలు అభిమానము వహించి సత్యపదార్థమును దూరము చేయరాదు అభిమానము మాత్రము దురాగ్రహ మూలకమే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్మాన్నాఽభావమిచ్ఛన్తియే లోకే భావవాదినః ।
అభావవాదినో వాపి నభావం తత్త్వలక్షణమ్ ॥ 64

A. తస్మాత్ = అందువలన అనగా పరబ్రహ్మమే సత్యము, ఇతరము కల్పితమని చెప్పుట వలన, లోకే = లోకమునందు యే = ఎవరు, భావవాదినః = పరబ్రహ్మమే సత్యమని నమ్మినవారో (తే) = అట్టి మహర్షులు, అభావమ్ = అభావమును, న + ఇచ్ఛన్తి = అంగీకరింపరు. ఘటాది పదార్థములకు ఆవిర్భావము జన్మము, తిరోభావము నాశము. అంతకు వేరుగా జన్మనాశములు లేవు. పదార్థముయొక్క పూర్వావస్థ ప్రాగభావము. దాని ఉత్తరావస్థ ధ్వంసము. ఎట్లనగా - ఘటమునకు మట్టిరూపముగా నుండుట ఘట ప్రాగభావము. ఘటమునకు కపాలావస్థ ధ్వంసము. పరమార్థ సత్యము బ్రహ్మమే అను నమ్మిక కల మహర్షులు భావపదార్థము కంటె వేరుగ అభావమును నంగీకరింపరు.

B. యే + అపి = ఎవరు, అభావవాదినః + వా = అభావవాదులే అనగా "సర్వం శూన్యం జగత్" ఎల్లజగము శూన్యమేయని భావింతురో వారు "తత్త్వలక్షణమ్" = సత్యస్వరూపమగు భావమ్ = భావశబ్ద వాచ్యమగు పరమాత్మను, న + ఇచ్ఛన్తి = అంగీకరింపరు ఎల్ల ప్రపంచము శూన్యరూపమే. దానికంటె వేరుగా భావపదార్థము లేదని చార్వాకాదులు విశ్వసింతురు.

ఇట్టి దర్శనభేదములు అవిద్యామూలకములే వ్యవహారమున మాత్రము ఎల్లరు ఎల్ల వాదముల అభిప్రాయములను గ్రహించియే యున్నారు. ॥64॥

అవతారిక— పై రీతిని అభావములేదని నిశ్చయింపబడినది. కాని అట్టి స్థితిలో ప్రపంచమున కానబడు భేదమంతటికిని కారణమేమియుండును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ అద్వయేచైవ సర్వస్మిన్ స్వభావాదేక లక్షణే ।
పరికల్పేషు మర్యాదా విచిత్రైవోపలభ్యతే ॥ 65

సర్వస్మిన్ = ఎల్ల ప్రపంచకము, స్వభావాత్ = స్వభావమువలన, ఏకలక్షణే = ఏకరూపమగునట్టి, అద్వయే + చ + ఏవ = అద్వితీయమే యగునట్టి పరబ్రహ్మమయమై యుండగా. పరికల్పేషు = వికల్పములయందు, మర్యాదా = వ్యవస్థ, విచిత్రా + ఏవ = అనేకరూపము కలదై, ఉపలభ్యతే = చూడబడుచున్నది.

పరబ్రహ్మమున స్వగతభేదముగాని, సజాతీయభేదముగాని, విజాతీయభేదముగాని లేదు. ప్రపంచకమంతయు అట్టి నిర్గుణ పరబ్రహ్మకంటె వేరుగాలేదు. అట్లైనను అనాదియగు మాయ ఆ పరబ్రహ్మమునందుండుటచే దానివలన బహుభావమును బ్రహ్మ పొందినట్లు కాన్పించును దానివలన ఎన్నియో విచిత్రములగు పదార్థములు విలక్షణములుగా గోచరించును. అందుచే ఘటాదికమగు భావపదార్థము అభావముగూడ అవిద్యాదశలో కానవచ్చుచున్నవి.॥65॥

అవతారిక— రూపము లేనట్టియు వ్యవహారమున కతీతమగునట్టి పరబ్రహ్మమునందు ఘటపటాది భావపదార్థము, అభావము కూడ మాయావశమున నెట్లు భావించును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ చతస్రోఽపి యథాఽవస్థా నిరుపాఖ్యే ప్రకల్పితాః ।
ఏవం ద్వైవిధ్యమప్యేతద్భావాఽభావవ్యపాశ్రయమ్ ॥ 66

నిరుపాఖ్యే = రూపరహితమగు అభావమునందు, చతస్రః = నాలుగు విధములగు, అవస్థా + అపి = అవస్థలు కూడ, అనగా ప్రాగభావము, ప్రధ్వంసాభావము, అన్యోన్యాభావము. అత్యంతాభావము అనెడి నాల్గు అవస్థలు యథా = ఏ రీతిగా ప్రకల్పితాః = నైయాయికులచే కల్పింపబడినవో,

ఏవమ్ = ఈ రీతిగానే, భావాఽభావవ్యపాశ్రయమ్ = భావము అభావము, అనే అర్థములు ఆశ్రయముగాగల, ఏతద్ + ద్వయమ్ + అపి = ఈ జంటయు (కల్పితమ్) = పరబ్రహ్మమునందు కల్పింపబడినది

అభావము నాల్గు విధములని తార్కికులు పలుకుదురు. అభావమనగా లేమి దానికి చాతుర్విధ్య మెట్లు ? అని ప్రశ్నించిన వస్తుతః ఏమియులేదు వాని వ్యవస్థ కుదురుటకై ఈ కల్పన చేయబడినదని వారు చెప్పుదురు

అట్లే పరబ్రహ్మమునందు అనంతశక్తి సహితమగు మాయవలన ఈ భావపదార్థము, అభావపదార్థము గూడ కల్పితము కావచ్చును. సర్వశక్తి శూన్యమగు అభావమునకే నాల్గు అవస్థలను కల్పింపగా, సర్వశక్తి సమన్వితమగు పరబ్రహ్మమునందు అవస్థాభేదము కల్పించుటలో నాశ్చర్యమేమి యున్నది ?

''చతస్రోహి'' అను పాఠాంతరము కలదు. ॥66॥

అవతారిక— యథార్థముగ చూచిన భావము, అభావముగూడ నిజరూపమును జూపజాలవు. అనగా విచారించి చూచిన అవి నిలుచునవి కానేరవని చెప్పుచున్నాడు.

శ్లో॥ అవిరోధీ విరోధీవా సన్నసన్వాపి తత్త్వతః ।
క్రమవా నక్రమోవాపి నాఽభావ ఉపపద్యతే ॥ 66

అభావః = అభావము అనగా లేమి, అవిరోధీ = భావపదార్థముతో విరోధములేనిది అనగా ఘటము మున్నగు వస్తువునకు సహకరించునది. న + కానేరదు. భావపదార్థము పుట్టుటకుగాని ఉండుటకుగాని అభావము సహకరింపనేరదని భావము. విరోధీ + వా = విరోధించునది, న + కానేరదు. అభావము భావపదార్థమును పాడుచేయనేరదని భావము.

అట్లే, తత్త్వతః = నిజరూపమున, అభావము, సన్ = సద్రూపమైనది అనగా ఉనికి కల వస్తువు కానేరదని భావము అసన్ + వా + అపి = అసద్రూపమైనదియు, న = కానేరదు. అభావమనునది విరుద్ధమైనందున భావరూపము కానేరదు. అభావమనునది స్వతః లేమియేగాన దానికి వేరుగ అసత్త్వముండనేరదు.

అట్లే అభావము, క్రమవాన్ = క్రమముకలది, న = కానేరదు. భావపదార్థమునకే క్రమము సంభవించును. అక్రమో + వా = క్రమములేనిది, న = కానేరదు. అక్రమమనగా యౌగపద్యము. అది ఇతర వస్తుసాపేక్షము. అభావము వస్తురూపము కానందున అక్రమము కూడ సంభవింపదు.

కాగా పై రీతిని చూచిన అభావము న + ఉపపద్యతే = ఉపపన్నము కాదు. యుక్తికి సరిపడదు. కాగా అభావమనునది లేదని చెప్పనగును.

ఇట్లే భావపదార్థముగూడ నిర్వచనమున కర్హము కాజాలదు. భావపదార్థము ఇతర

వస్తువులతో విరోధించునదిగాని, విరోధింపనిదిగాని స్వభావముచే నుండనేరదు. అట్లే స్వరూపమును ఇట్టి, సత్తుగాని అసత్తుగాని కానేరదు. మధ్యమావస్థయందే అనగా వర్తమానకాలముననే వస్తువు కానవచ్చుచున్నందున దానికి క్రమముగాని అక్రమముగాని కలుగనేరదు. ॥66॥

పై యభిప్రాయమునే జూపుచున్నాడు.

శ్లో॥ అవిరోధీ వా విరోధీ వా సన్నసన్వాపియుక్తితః ।
క్రమవానక్రమోవాపి నాభావ ఉపపద్యతే । 67

అభావః = అభావము, యుక్తితః = యుక్తివలన, అవిరోధీ = ఇతర వస్తువులతో విరోధింపనిది యనిగాని, విరోధీ + వా = విరోధించునదియనిగాని, సన్ + సద్రూపమనిగాని, అసన్ + వా + అపి = అసద్రూపమనిగాని, క్రమవాన్ = క్రిమముకలది యనిగాని, అక్రమః + వా + అపి = క్రమములేనిది యనిగాని న + ఉపపద్యతే = యుక్తము కానేరదు.

అభావము ఇట్టిదియని నిర్ధారణ చేయలేమని భావము. ॥67॥

పూనా యూనివర్సిటీలో శ్రీ కె. వి అభ్యంకర మహాశయుడు ప్రకటించిన వాక్యపదీయమున క్రింది మరియొక శ్లోకము కానవచ్చుచున్నది.

అవిరోధీ విరోధీ వా సన్నసన్నపి తత్త్వతః ।
క్రమవానక్రమోవాపి తేన భావో న విద్యతే ॥ 68

కాని హేలారాజు వేరు శ్లోకమును చూపకయే 66 వ శ్లోకమునకే అవతరణములోను వ్యాఖ్యానములోను పై శ్లోకార్థమును చూపియున్నాడు. ఈ భావమును అభ్యంకర పండితుడు వ్యక్తపరచి యున్నాడు. ॥68॥

భూతభవిష్యద్వర్తమాన రూపమున కాలము భిన్నముగానున్నదై పదార్థములన్నింటికి భేదమును కలిగించుచున్నదని చెప్పుచున్నారు. కాని అదియు పారమార్థికము కానేరదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అభావేత్రిషుకాలేషు భేదేష్వస్యాస్తి సంభవః ।
తస్మిన్నసతి భావేపి త్రైకాల్యం నావతిష్ఠతే ॥ 69

A. త్రిషుకాలేషు = త్రికాల నిమిత్తమగు, భేదస్య = భేదమునకు, అసతి = అసత్తు అగు, తస్మిన్ + అభావే = ఆ అభావమునందు, సంభవః = సంభవము అనగా ఒప్పుదల, న + అస్తి = కలుగనేరదు.

రూపవంతమగు ఘటము మున్నగు వస్తువులకు వర్తమానత్వవ్యవహారము కలుగును. అభావమునకు రూపము లేనందున అచట వర్తమానమనెడి కాలభేదము కలుగదు. వర్తమానత్వము కలదానికే భూతము, భవిష్యము అను వ్యవహారము కలుగును. కనుక అభావము

నకు భూతత్వము, భవిష్యత్త్వము కూడ కలుగనేరదు. కాగా అభావోఽస్తి (లేమియున్నది) అభావోఽభూత్ = (లేమి ఉండెడిది) అభావో భవిష్యతి (లేమి కలుగగలదు) అను రీతిని కాలత్రయ సంబంధము అభావమునకు కలుగనేరదు కాబట్టి కాలభేదమును పురస్కరించు కొని అభావమునకు భేదము సిద్ధింపదు.

B. భావే + అపి = భావపదార్థమునందు గూడ, త్రైకాల్యమ్ = త్రికాలముల వలన కలిగెడి ధర్మము, న + అవతిష్ఠతే = కలుగనేరదు.

అభావమునకే గాక భావపదార్థమునకు గూడ కాలత్రయముచే కల్పితమగు భేదము చెప్పనలవి కాదు. ఘటము మున్నగు వస్తువునకు వర్తమాన దశయందే స్థితి కలుగును దానికి పూర్వాపరభాగములు లేనందున కాలత్రయ వ్యవహారము కలుగదు. వస్తువుయొక్క పూర్వావస్థ, పరావస్థ అనునవి ఘటరూపములే. కనుక వస్తువు ఏకరూపమే యగును. అవస్థలు వేరు అగుచో వస్తువునకు నానాత్వమే లభించును కనుక భావ వస్తువునకు గూడ కాలమువలన కలిగెడి భేదము సిద్ధింపదు. కనుక భావాభావములు చెప్పనలవి కాదు. ॥69॥

అవతారిక — భావః, అభావః అను పదములకు వ్యుత్పత్తిజూపిన భావాభావములు నిర్ణయించి చూపవచ్చును. భవతీతి (పుట్టునది) భావః. అట్లే ఉనికి కలది భావః (భావము) అని చెప్పవచ్చును. న + భావః = అభావః (భావము కానిది). ఉనికి లేనిది అభావము అని నిర్వచనము చెప్పవచ్చును. కాగా భావాభావములు చెప్పనలవి కావని ఎట్లు చెప్పనగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ ఆత్మతత్త్వపరిత్యాగః పరతో నోపపద్యతే ।
ఆత్మతత్త్వం తు పరతః స్వతో వా నోపకల్పతే ॥ 70

ఆత్మతత్త్వ పరిత్యాగః = వస్తువుయొక్క స్వరూపమును విడచుట, పరతః = ఇతర వస్తువు వలన, న + ఉపపద్యతే = కుదురదు

ఘటము మున్నగు వస్తువులకు కారణసామగ్రి వలన నాశము లభింపదు. ఆ వస్తువు సద్రూపము కదా! సత్తునకు నాశమెట్లు? కాబట్టి భావము కానిది అభావము అని నిర్వచనము సరిపడదు

ఆత్మతత్త్వంతు = వస్తువుయొక్క స్వరూపమైతే, పరతః = ఇతర వస్తువువలన గాని, స్వతః = తనవలన గాని, న + ఉపకల్పతే = సిద్ధింపనేరదు.

పుట్టునది, ఉనికి కలది, భావము అని నిర్వచనము సరిపడదు. పుట్టుక అనగా లేనిది ఇపుడు కనిపించుచున్నదని యర్థము. రూపములేని దానికి కారణసామగ్రిచే ఉత్పత్తిని అంగీకరించిన నాశమునకు రూపము కల్పించినట్లు అగును. అట్టితరి అదియు లేమియేయగును. దానికి మరియొక రూపము కల్పింపవలెను. వస్తువు అభావమునుండియే జన్మింపనక్కర లేదు. స్వతః వస్తువుకదా! స్వతః వస్తువేయగుటచే దానికి ఇతర సంబంధము అనవసరమేయగును

కాబట్టి భావాభావముల నిర్వచనము సరిపడదు. ॥70॥

అవతారిక— భావాభావములు రెండు వేరు పదార్థములు కాకపోవచ్చును. రెండు కలసి ఒకే తత్త్వము కావచ్చును అను ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ తత్త్వే విరోధో, నానాత్వే ఉపకారో న కశ్చన ।
తత్త్వాన్యత్వపరిత్యాగే వ్యవహారో నివర్తతే ॥ 71

తత్త్వే = ఒకటియే తత్త్వమను పక్షమున, విరోధః = విరోధము వాటిల్లును. భావాభావములు రెండును చీకటి వెలుతురువలె విరుద్ధములు కదా ః

నానాత్వే = భావాభావములకు భేదమంగీకరించిన, కశ్చన = ఏమియు, ఉపకారః= ఉపకారము, న= జరుగదు. రెంటికి పరస్పరాపేక్ష లేనందున ఉపకార్యోపకారక భావ ముండదు.

తత్త్వాన్యత్వ పరిత్యాగే = భావాభావములకు ఏకత్వపక్షమును, నానాత్వ పక్షమును విడనాడిన, అనగా ఆ రెంటికి అభేదమునుగాని భేదమునుగాని అంగీకరింపనియెడల, వ్యవ హారః = వ్యవహారము, నివర్తతే = మరలిపోయెడిని రెండు పక్షములుకాక మూడవ పక్షము లేనందున లోకుల వ్యవహారమే విరుద్ధము కావలెను.

కాబట్టి భావాభావముల నిర్వచనము సుశకము కానందున బుద్ధి కల్పితమగు పదా ర్థములను బట్టియే లోకవ్యవహారము కలుగుచున్నదని అంగీకరింపవలెను. ॥71॥

అవతారిక— ప్రపంచమంతయు ఇట్టిదేయగుచో పరమార్థ సత్యమగునది యేదిః అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యత్ర ద్రష్టా చ దృశ్యం చ దర్శనం చ వికల్పితమ్ ।
తస్యైవార్థస్య సత్యత్వం శ్రితాస్త్రయ్యన్తవేదినః ॥ 72

త్రయ్యన్తవేదినః = ఉపనిషదముల తత్త్వమును గుర్తించినవారు, యత్ర = ఏ యర్థమున, ద్రష్టా + చ = చూచువాడు అనగా జీవుడు, దృశ్యం+చ = చూడబడెడి వస్తువు, దర్శనం+ చ = చూచుట, చేయుట మున్నగు క్రియలు, వానివలన కలిగెడి ప్రయోజనము, వికల్పితమ్ = ఆరోపింపబడినదో, తస్య = అట్టి అనగా ఉపనిషత్తులలో ప్రసిద్ధమగు, అర్థస్య + ఏవ = అర్థమునకే అనగా జ్ఞానరూపమగు నిర్గుణ బ్రహ్మమునకే, సత్యత్వమ్ = సత్యత్వమును, శ్రితాః = ఆశ్రయించియున్నారు.

త్రికాలములయందు ఏకరూపమగు జ్ఞానరూపము ఆనందరూపమునగు నిర్గుణ బ్రహ్మమే పరమార్థ సత్యమనియు, దానియందు మాయావశమున జీవభావము భోగ్య వస్తువులు, వ్యాపారములు, వానిఫలములు కల్పింపబడినవని అద్వైత వేదాంతులు విశ్వసింతురు.

ఋగ్, యజుస్సు, సామ అను మూడు వేదములకు 'త్రయి' అని పేరు. త్రయి యొక్క అంతము, చివరిభాగము త్రయ్యంతము. అనగా ఉపనిషత్తు. దాని తత్త్వము నెరింగిన వారు "త్రయ్యన్తవేదినః" కాక అంతమనగా నిశ్చయము, దానిని గుర్తించినవారు అని యర్థము. ॥72॥

అవతారిక — అట్టి పరబ్రహ్మమే సత్యపదార్థము. జగమంతయు మాయా కార్యము అనగా మాయావశమున బ్రహ్మమే జగత్తుగా వివర్తమగుచున్నది. కాగా అసత్య మగు పదార్థమును బట్టియే ఎల్ల శాబ్దవ్యవహారము జరుగుచున్నది. దాని మూలముననే భేదము భాసించుచున్నది అని బోధించుచున్నాడు.

శ్లో॥ సామాన్యం వా విశేషం వా యస్మాదాహుర్విశేషవత్ ।
శబ్దాస్తస్మాదసత్యేషు భేదేష్వేవ వ్యవస్థితాః ॥ 73

యస్మాత్ = ఏ కారణమువలన, శబ్దాః = శబ్దములు, సామాన్యం + వా = సామాన్యముగా కాన్పించెడి యర్థమునుగాని విశేషం + వా = విశేషముగా కాన్పించెడి యర్థమునుగాని, విశేషవత్ = విశేషమున కర్హమైన దానినిగానే, ఆహుః = చెప్పుచున్నవో, తస్మాత్ = ఆ కారణమువలన, అసత్యేషు = యథార్థముకాని, భేదేషు = భేదములయందే, వ్యవస్థితాః = చూప బడిన సంబంధము కలవిగానగుచున్నవి.

సత్ (ఉనికిగలది) జ్ఞేయమ్ (తెలుసుకొనదగినది) ప్రమేయమ్ (విషయము) మున్నగు పదములు సామాన్యముగా అనగా సర్వసాధారణముగానుండు అర్థములను బోధించు నని లోకము గుర్తించుచున్నది. కాని ఆ శబ్దములుగూడ విశేషార్థమునే బోధించుచున్నవి. 'సత్' అనునది శూన్యముకానిది యను విశేషమును, జ్ఞేయమ్ అనునది తెలియబడని దానికంటె విలక్షణమైనదని విశేషమును బోధించుచునే యున్నవి. ఘటః, పటః మున్నగు పదములు విశే షార్థ వాచకములని లోకులు గుర్తింతురు. అవి ఇంకను విశేషార్థమగు నల్లని కడవ, తెల్లని కడవ, తెల్లని పంచ అను రీతిని బోధించుచునే యున్నవి.

కాబట్టి శబ్దములు వ్యవహారదశలో అసత్యములగు భేదములనే బోధించుచున్నవి. భేదములేని సత్యమగు బ్రహ్మపదార్థమును ఎన్నడు బోధింపజాలవు. ॥73॥

అవతారిక — ఇంతవరకు రూపములేని అభావమునుద్దేశించి భావాఽభావములకు గల విరోధమును ప్రదర్శించి ఇపుడు వైశేషికమతము చొప్పున 'అభావ' మనెడి సప్తమ పదార్థమును గురించి ముచ్చటించుచున్నాడు.

శ్లో॥ నాఽభావస్య సద్భావే భావస్యాత్మా ప్రహీయతే ।
నవాఽభావస్య నాస్తిత్వే భావస్యాత్మా ప్రసూయతే ॥ 74

భావస్య = వస్తువుయొక్క, ఆత్మా = స్వరూపము, అభావస్య = అభావము యొక్క అనగా

ప్రధ్వంసాభావము యొక్క, సద్భావే = ఉనికి విషయమై అనగా ప్రధ్వంసాభావము సిద్ధించుటకై, న + ప్రహీయతే = నశింపదు. వస్తువు నశించుటవలననే ప్రధ్వంసాభావము కలుగుననెడి నియమము లేదు.

అట్లే, అభావస్య = అభావమునకు అనగా ప్రాగభావమునకు, నాస్తిత్వే = లేమి కలుగగా, భావస్య = వస్తువుయొక్క, ఆత్మా = స్వరూపము. న + ప్రసూయతే = పుట్టదు. ప్రాగభావము నశించిన తరువాత వస్తువు జనియించుననెడి నియమము లేదు.

వస్తునాశమువలన ప్రధ్వంసాభావము జనియించును. ప్రాగభావము నశించుట వలన వస్తువు జనియించునని చెప్పరాదు. వానికి పై రీతిని కార్యకారణ భావము లేదు. భావము కంటె అభావము అనునది వేరు పదార్థమే. కనుక 60 వ శ్లోకమున చూపబడిన వికల్పములకు తావు లేదు. ఇది కణాదముని రచియించిన వైశేషిక తర్కముయొక్క నిర్ణయము. వారు అభావమును పెద్దదిగా జేసి శాస్త్రమును పెంపొందించినారు. నవ్యతార్కికుల జీవితమంతయు అభావపదార్థముపై ఆధారపడియున్నది. ॥74॥

అవతారిక — పై యర్థముననే యుక్తమగు దృష్టాంతమును జూపుచున్నాడు.

శ్లో॥ న శాబలేయస్యాస్తిత్వం బాహులేయస్య బాధకమ్ ।
న శాబలేయో నాస్తీతి బాహులేయః ప్రకల్ప్యతే ॥ 75

శాబలేయము, బాహులేయము అను రెండు గోవ్యక్తులున్నవి అవిపరస్పరాపేక్ష లేక వేరు వేరుగా ఉత్పన్నమైనవే. ఇట్టి స్థితిలో శాబలేయస్య = శాబలేయము యొక్క, అస్తిత్వమ్ = ఉనికి, బాహులేయస్య = బాహులేయమునకు, న + బాధకమ్ = నిరోధకము కాదు శాబలేయ ముండగనే బాహులేయము కూడ ఉండగలదు. శాబలేయము నశించుట బాహులేయస్థితికి సంబంధించునది కాదు అట్లే ఘటవ్యక్తి యుండుట ప్రధ్వంసకు బాధకము గాదు. ఘటవ్యక్తి యుండగనే ప్రధ్వంస యుండవచ్చును. ఆ రెండు స్వతంత్రమగు పదార్థములు. వానికి పరస్పరాపేక్ష లేదు

అట్లే, శాబలేయః = శాబలేయుడు, న + అస్తి + ఇతి = లేడు అని అనగా ఆయన యొక్క లేమివలన బాహులేయః=బాహులేయుడు, న + ప్రకల్ప్యతే=పుట్టడు. శాబలేయుడు నశించుటవలన బాహులేయుడు పుట్టవలెనని నియమము సరిపడదు. అట్లే ప్రాగభావము నశించుట వలన ఘటము మున్నగు వస్తువు పుట్టుననుట అయుక్తము. ప్రాగభావము ఘటము స్వతంత్ర పదార్థములు. ॥75॥

అవతారిక — భావపదార్థముకంటె వేరుగ అభావమనెడి పదార్థమును అంగీకరింపవలెననెడి వైశేషిక మతమును 72-78 వ శ్లోకములచే జూపి యథార్థ మాలోచించిన నట్లు స్వీకరింపరాదని దానిని దూషించుచున్నాడు

శ్లో॥ అభావోయది వస్తుస్యాత్తత్రేయం స్యాద్విచారణా ।
తతశ్చ తదభావేఽపి స్యాద్విచార్యమిదం పునః ॥ 76

A. అభావః = అభావము, వస్తు = వస్తురూపమైనది, స్యాత్ + యది = అయిన ఎడల, తత్ర = అభావ విషయమున, ఇయమ్ = ఈ, విచారణా = విచారణ, స్యాత్ = కలుగును

ఆరు భావపదార్థములకంటె వేరుగా అభావమును స్వీకరింపరాదు. అభావము స్వీకరించిన కొంత ప్రశ్నింపవలసి యున్నది అభావముండగా దాని ప్రక్కన భావముండనేరదు. అభావము లేనిఎడల భావముండుననుటయు పొసగదు. అవి రెండు పరస్పరము విరుద్ధములు కదా! కాని అభావముండి అది నశింపగా భావము కలుగునని మాత్రము తార్కికులు చెప్పుదురు

B. తతశ్చ = అభావమనునది వస్తురూపమగుచో, తదభావే + అపి = దానియొక్క అభావమునందు గూడ, పునః = మరల, ఇదమ్ = ఈ యంశము, విచార్యమ్ = విచారింపదగినది, స్యాత్ = కాగలదు.

అభావము వస్తురూపమగుచో దానియందు గూడ మరియొక అభావమును స్వీకరింపవలెను. దానికి గూడ సన్నిధానమువలన భావముండనేరదు దానికి సాన్నిధ్యము లేనిఎడల భావమునకు ఉనికి యుండదని చెప్పవచ్చును. ఆ రెండవ యభావము గూడ వస్తువేయగుచో నచటను పై విచారణయే కలుగును. ఇట్లు ఎంత కల్పించినను అనవస్థ సంభవించును. ॥76॥

అవతారిక — భావపదార్థముల స్వరూపము చెడుటయే అభావమనెడి వారి యభిప్రాయమును దూషించుచున్నాడు.

శ్లో॥ అవస్తుతత్వాదతీతం యద్వ్యవహారస్య గోచరమ్ ।
తత్ర వస్తుగతో భేదో న నిర్వచనమర్హతి ॥ 77

అవస్తుతత్వాత్ = అభావము వస్తురూపము కానందున, వ్యవహారస్య = లోకవ్యవహారమునకు, గోచరమ్ = గోచరత్వము అనగా అందుబాటును, అతీతమ్ = అతిక్రమించిన, యత్ = ఏ అభావమో, తత్ర = అట్టి వస్తువుకాని అభావమునందు, వస్తుగతః = వస్తువునకు ధర్మమగు, భేదః = భేదము అనగా నానాత్వము, నిర్వచనమ్ = నిర్వచనము గూర్చి అనగా లక్షణము దెల్పి నిర్ణయించుటను గురించి, న + అర్హతి = తగదు.

అభావము వస్తురూపము కానందున నది లోకుల వ్యవహారమునకు తగదు. అట్టి స్థితిలో దానికి భేదమును అనగా 1. ప్రాగభావము. 2. ప్రధ్వంసాభావము. 3. అన్యోన్యాభావము. 4. అత్యంతాభావము అను రీతిని అభావము నాలుగు విధములు అను భేదమును జూపి వానికి లక్షణములు నిర్వచించుట అయుక్తము. ద్రవ్యము వస్తురూపముకాన దానిని 9 విధములుగా విభజింపవచ్చును. భేదము వస్తువునకు చెందియుండును అభావము వస్తురూపము కానందున దానికి లక్షణముచెప్పుట, దానిని విభజించుట పొసగదు. ॥77॥

అవతారిక— ఇంతకుముందు చూపియున్న కార్యకారణ భావ ముపపన్నము కాదనెడి భావమును స్పష్టపరచుచు వైయాకరణ మతమున వివర్తవాదమును సిద్ధాన్తముగ జూపుచున్నాడు.

శ్లో॥ అపదేఽర్థే పదన్యాసః కారణస్య న విద్యతే ।
అథ చ ప్రాగసద్భావః కారణే సతి దృశ్యతే ॥ 78

A. అపదే = స్థానముకాని, అర్థే = అర్థమునందు, అనగా లేనియర్థమునందు, కారణస్య = కారణమునకు, పదన్యాసః = వ్యవహారము, న + విద్యతే = కలుగనేరదు.

కారణమువలన కార్యము కలుగునని లోకులు విశ్వసింతురు. అందు రెండు వాదములు కలవు. 1. కారణము ప్రవర్తింపకమునుపు కార్యము లేదు కారణబలమువలన ఇంతకుముందు లేని కార్యము జనియించును దీనిని అసత్కార్య వాదమందురు. వీరిమతమున ఉత్పత్తికి ముందు వస్తువు లేనందున నట్టిదానిని అపదమందురు అనగా వస్తురూపమున కాక శూన్యరూపముగానున్న దానికి ఇది కారణమని చెప్పుట ఎట్లు ? కనుక అసత్కార్యవాదమున కారణమునకు కార్యమునకు సంబంధము కుదురునది కాదు.

2. కారణ వ్యాపారమునకు ముందుగూడ కార్యము సూక్ష్మముగానుండును. అదియే కారణ బలమువలన జనియించినట్లగపడును దీనిని సత్కార్యవాదమందురు. వీరి మతమున కార్యము సిద్ధమేకాన దానినిగూర్చి మరల కారణవ్యాపార మక్కరలేదు. వారి మతమునగూడ ఉత్పత్తికి పూర్వము కార్యము అపదమేయగును. లేనిదానికి కదా కారణాపేక్ష కలుగును. కనుక వీరి మతమున గూడ కార్యకారణ భావ ముపపన్నము కానేరదు

B అథ + చ = అట్లైనను, కారణే = ఏదో విలక్షణమగు కారణము, సతి = ఉండగా, ప్రాగసద్భావః = ఇంతకుముందు లేనియట్టి వస్తువు, దృశ్యతే = ప్రత్యక్షముగా జూడబడుచున్నది.

పై రీతిని వస్తువులకు కార్యకారణ భావము సత్కార్యవాదమున, అసత్కార్యవాదమున గూడ కుదరకున్నను ఏదో చెప్పుటకు శక్యముకాని కారణమువలన ఇంతకుమునుపు కానరాని వస్తువు కానవచ్చుచునే యున్నది. అట్లు జరుగుటనే వివర్తమందురు. బ్రహ్మపదార్థమే మాయా సహకారమున ఈ జగద్రూపమున వివర్తమగుచున్నదని అద్వైతశాస్త్రము యొక్క సిద్ధాన్త మిచట చూపబడినది. అది తప్ప మరియొకగతి లేదని భావము. ॥78॥

అవతారిక— మధ్యకాలమున వస్తువు కంటికి కానవచ్చుచున్నది. ఆ వస్తువునకు పూర్వావస్థ ప్రాగభావమనియు, ఉత్తరావస్థ ధ్వంసయనియు వ్యవహరింపబడుచున్నది. అంత మాత్రాన అది శూన్యరూపము కాదు. ఆ యవస్థయందున్న పదార్థమునకు మున్ను మున్నగునవి కారణము కానగును. కాగా 77 వ శ్లోకముచే కార్యకారణ భావము పొసగదనుట ఎట్లు ? పొసగును అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కాలస్య ప్రాగవస్థేతి వస్త్వాశ్రితమిదం పునః ।
ప్రాగవస్థేతి నహ్యేతద్ద్వయమప్యస్త్వవస్తుని ॥ 79

ఇదమ్ = ఇది అనగా వస్తువు జనియింపక మునుపున్న రూపము, కాలస్య = కాలమునకు సంబంధించిన, ప్రాక్ + అవస్థా = పూర్వకాలమునందున్న అవస్థ అనగా రూపాంతరము, ఇతి = అనుట, వస్త్వాశ్రితం + పునః = వస్తువు నాశ్రయించి యున్నది కదా ః

1. ప్రాక్ = పూర్వకాలమున, 2. అవస్థా = రూపాంతరము, ఇతి = అనెడి, ఏతత్ = ఈ, ద్వయమ్ = రెండును, అవస్తుని = వస్తువు కానిదానియందు, న + అస్తి + హి = ఉండనేరదు కదా ః

సద్రూపమగు పదార్థమునకు ప్రాగవస్థ అనగా పూర్వమునం దునికి అనుటయు, అట్లే ఉత్తరావస్థ అనగా ఉత్తరకాలమునందుండుట అనియు సంభవించును.

అభావము వస్తురూపము కాదు. కనుక దానికి ప్రాక్ అని యనుట, అవస్థ అనుటయు రెండుకూడ లభింపవు. ''కాతస్య ప్రాగవస్థా'' అని పాఠాంతరము. ॥79॥

అవతారిక—— అభావమనునది అసత్తే. కనుకనే అది రూపరహితము. కనుక అది శబ్దముచే బోధింపబడునది కాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ నచోర్ధ్వ మస్తినాస్తీతి వచనాయాఽనిబన్ధనమ్ ।
అలం స్యాదపదస్థానమేతద్వాచః ప్రచక్షతే ॥ 80

అనిబన్ధనమ్ = ఉపలబ్ధముకాని, ఏతత్ = ఈ అభావము, ఊర్ధ్వమ్ = వస్తువు నశించినతరువాత అస్తి = కలదు, న + అస్తి = లేదు, ఇతి = అని, వచనాయ = చెప్పుటకు, న + చ = లేదు, అనగా ఉపయోగింపదు.

ఉపలబ్ధమగు అనగా రూపముకల వస్తువు ఉన్నది, లేదు అను శబ్దముచే చెప్పుటకు వీలుపడును. అభావమనునది ఉపలబ్ధము కాదు. అందుచే అట్లు చెప్పుటకు అవకాశము చాలదు.

మరియు, ఏతత్ = ఈ అభావము. వాచః = శబ్దమునకు, అలమ్ = మిక్కిలి, అపదస్థానమ్ = వ్యవహార యోగ్యము కానేరదు. అనగా శబ్దముచే వ్యవహరించుటకు శక్యము గాదు.

తస్మాత్ = అందువలన అనగా ఉపలబ్ధము కానందున, శబ్దమునకు గోచరము కానందున, ప్రచక్షతే = చెప్పుచున్నారు. అనగా అభావము అసద్రూపము = అసత్యము అనియే ప్రాజ్ఞులు నుడువుచున్నారు.

కాగా 76 వ శ్లోకమున చెప్పిన ప్రకారము కారణమునకు అపదస్థితియే సంభవించి నందున కార్యకారణ భావ ముపపన్నము కానందున అద్వైతశాస్త్ర ప్రకారము వివర్తవాదము సిద్ధించును.

ఆ వాదమే వైయాకరణులు విశ్వసింతురు. కనుకనే భర్తృహరి గ్రంథమును 'వివర్తతేఽర్థభావేన' అని వివర్తవాదముతో నారంభించెను. ॥౮౦॥

అవతారిక— పదార్థమనునది మధ్యమావస్థయందే కేవలము కానవచ్చుచున్నది. దానికి పూర్వావస్థయు, పరావస్థయు లేనేలేదు అని చెప్పుచున్నాడు.

శ్లో॥ అత్యద్భుతా త్వియం వృత్తిః యదభాగం యదక్రమమ్ ।
భావానాం ప్రాగభూతానా మాత్మతత్త్వం ప్రకాశతే ॥ 81

యత్ = ఏది ; అభాగమ్ = అవయవములు లేనిదై, కనుకనే యత్ = ఏది, అక్రమమ్ = క్రమము లేనిదై, ప్రాక్ + అభూతానామ్ = ఇంతకుముందు లేనట్టి, భావానామ్ = పదార్థముల యొక్క, ఆత్మతత్త్వమ్ = ఆత్మస్వరూపము, ప్రకాశతే = ప్రకాశించుచున్నదో, ఇయమ్ = (అ) ఈ ; వృత్తిః = పదార్థముల యొక్క ప్రవృత్తి, అత్యద్భుతా = మిక్కిలి ఆశ్చర్యమయినది

పదార్థములకు అనగా మన్ను, కడవ మున్నగు వస్తువులకు కార్యకారణ భావము సరిపడదు. అట్లయినను ఏదో ఒక విలక్షణమగు కార్యవిశేష మహిమచే ఈ పదార్థము అంతయు ఇంతకుముందు లేనిదై అస్మదాదులకు ఈ రూపమున కానవచ్చుచున్నది. దానికి అవయవములు లేవు. కనుకనే దానికి క్రమము కూడ లేదు కేవలము కంటికి కానవచ్చు సమయముననే అనగా వర్తమాన కాలముననే కానవచ్చుచున్నది. కాబట్టి అవయవములు లేని, క్రమములేని సత్యజ్ఞానానందరూపమగు నిర్గుణ బ్రహ్మమే మాయాశక్తి సహకారమున జగద్రూపముగ వివర్తమగుచున్నది. ఇదియే అత్యద్భుతమగు పదార్థ ప్రవృత్తి. ॥81॥

అవతారిక— పదార్థములకు కార్యకారణ భావము సరిపడదు. భావము, అభావము అనెడి పదార్థములు వేరుగా లేవు అని యంగీకరించినచో లౌకికవ్యవహారమెట్లు జరుగుచున్నది ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ వికల్పోత్థాపితేనైవ సర్వోఽభావేన లౌకికః ।
ముఖ్యేనేవ పదార్థేన వ్యవహారో విధీయతే ॥ 82

లౌకికః = లోకులచే జరుపబడుచున్న, సర్వః = సమస్తమగు అనగా విధి నిషేధరూపమగు వ్యవహారః = వ్యవహారము అనగా ప్రజల పరస్పరాభిప్రాయ ప్రకాశనము, వికల్పోత్థాపితేన + ఏవ = కల్పనచే ఉత్పాదితమే యగునట్టి అనగా కల్పింపబడినట్టి, సత్యముకాదని భావము. కనుకనే ముఖ్యేన + ఇవ = ముఖ్యమైనదివలె కాన్పించుచున్న, పదార్థేన = పదార్థముచే, విధీయతే = నిర్వహింపబడుచున్నది.

జ్ఞానరూపమగు పరబ్రహ్మమే సత్యము. జగమంతయు అవిద్యా కల్పితము. ఆ స్థితిలో పదార్థజాతమును విచారించిన దాని నిజరూపము తేలదు. పదార్థములకు కార్యకారణ భావము సరిపడదు, లేని వస్తువునే ఉన్నట్లు అవిద్యావశమున భావించి వ్యవహారము లోకులు

చేయుచున్నారు. ఆ పదార్థము సత్యమైనవానివలె భాసించును. కొన్ని పనులయందు ప్రవర్తిం చుట, ఇష్టముకాని వానినుండి మరలుట, ఒకరి యభిప్రాయమును మరియొకరు గుర్తించుట ఇదియంతయు అవిద్యాదశయందే జరుగును. ఆ యవస్థలో ఆ పదార్థములు అవిచారిత రమ ణీయములే. వీనినే వ్యావహారిక పదార్థములందురు. అనగా ఎండమావులవలె శూన్యములు కావు. బ్రహ్మము బోలి పరమార్థ సత్యములు కావు. ॥82॥

అవతారిక— పరమార్థము ఆలోచించిన భేదమనునది వేరుగా పదార్థము లేదు. పరబ్రహ్మమే అవిద్యా సహకారమున ఇటుల కాన్పించుచున్నదని యని చెప్పుచున్నాడు.

శ్లో॥ భావశక్తిమతశ్చైనాం మన్యన్తే భావవాదినః ।
భావమేవక్రమం ప్రాహుః, న భావాదపరః క్రమః ॥ 83

అతః + చ = ఈ కారణమువలన అనగా బ్రహ్మమే సత్యము అగుటవలన, భావవాదినః = పరబ్రహ్మమే సత్యమని నమ్మినవారు, ఏనామ్ = ఈ లోకవ్యవహారమును, భావశక్తిమ్ = పరబ్రహ్మముయొక్క శక్తినిగానే, జీవగతమైనదనియే, మన్యన్తే = తలంచుచున్నారు.

పరబ్రహ్మమునందు అనాదిగా అవిద్య సంబంధించి యున్నందున, దాని ప్రభా వము వలననే భేదవ్యవహారమంతయు జరుగుచున్నదని వేదాంతులు విశ్వసింతురు.

క్రమమ్ = పదార్థములకుగల క్రమమునుగూడ, భావమ్ + ఏవ = పరబ్రహ్మము యొక్క శక్తి విశేషమగు కాలముచే కలిగిన దానినిగానే, ప్రాహుః = పలుకుచున్నారు.

ఈ పదార్థముముందు, ఈ పదార్థము వెనుక అనెడి క్రమముగూడ పరబ్రహ్మము యొక్క కాలమనెడి శక్తివలననే కలుగుచున్నదనియే వారు తలంచుచున్నారు.

భావాత్ = పరబ్రహ్మముకంటె, అపరః = వేరుగానున్న, క్రమః = క్రమమనునది న = లేదు.

ఆ క్రమమునకు హేతుహేతుమద్భావము కూడ చెప్పనలవి కాదు. ॥83॥

అవతారిక— క్రమముకంటె వేరుగ అనగా క్రమమునకు ప్రతికూలముగా యౌగ పద్యము (ఒకేసారి జరుగుట) ప్రత్యేకించి లేదు. అదియు అట్లు భాసించుట అవిద్యయొక్క ప్రభావమేయని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రమాన్న యౌగపద్యస్య కశ్చిద్భేదోఽస్తి తత్త్వతః ।
యథైవ భావాన్నాఽభావః కశ్చిదన్యోఽవసీయతే ॥ 84

తత్త్వతః = యథార్థముగ, క్రమాత్ = క్రమముకంటె, యౌగపద్యస్య = యౌగపద్యమునకు అనగా ఒకేసారి జరుగుట అను దానికి, కశ్చిత్ = ఏమియు, భేదః = భేదము, న + అస్తి = లేదు.

కొన్ని పనులు క్రమముగా జరుగుచున్నవని, కొన్ని ఒకే సమయమున జరుగుచున్నవని లోకులు భావింతురు. ఆలంకారికులు సంలక్ష్యక్రమ ధ్వని, అసంలక్ష్యక్రమ ధ్వని యని రెండు రకములుగా ధ్వనిని విభజింతురు. నిజముగ జూచిన క్రమమే యౌగపద్యముగా భాసించును. లోకులు మాత్రము వేరుగానున్నట్లు క్రమమునకు అది విరుద్ధముగా నున్నట్లు భావింతురు.

ఇందు పూర్వముచూపిన యర్థమునే దృష్టాన్తముగా జూపుచున్నాడు.

యథా + ఏవ = ఎట్లు, భావాత్ = భావపదార్థముకంటె, అన్యః = భిన్నమగు, కశ్చిత్ = ఎవ్విధమగు, అభావః = అభావము, న + అవసీయతే = నిశ్చయింపబడదో.

భావపదార్థముకంటె అభావమనునది వేరుగా పదార్థము కానేరదు. ఈ యంశము ఇంతకుముందు స్పష్టపరచబడి యున్నది. ॥84॥

అవతారిక— ఈ పని క్రమముగా చేయబడినది అనియు, ఈ పని క్రమమక్కర లేకుండ ఒకేసారిగా చేయబడినది అనియు లోకుల వ్యవహారము కలదు. దానినిబట్టి క్రమము కంటె యౌగపద్యమనునది వేరుగా ఉన్నదని తెలుచున్నది అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కాలస్యాప్యపరం కాలం నిర్దిశన్త్యేవ లౌకికాః ।
న చ నిర్దేశమాత్రేణ వ్యతిరేకోఽనుగమ్యతే ॥ 85

A. లౌకికాః = లోకమందలి ప్రజలు, కాలస్య + అపి = కాలమునకు గూడ, అపరమ్ = మరియొక, కాలమ్ = కాలమును, నిర్దిశన్తి + ఏవ = చూపుచునే యున్నారు.

అద్యతన కాలమని అందరు వ్యవహరింతురు. అద్య శబ్దమునకు ఈ రోజునందు అని యర్థము. 'అస్మిన్నహని' అని విగ్రహము. ఇదమ్ శబ్దముకంటె 'ద్య' తద్ధిత ప్రత్యయము ఇదం శబ్దమునకు 'అన్' ఆ దేశము ప్రవర్తింపగా 'అద్య' అను రూపమేర్పడును. అద్యభవః అను నర్థమున అద్యతనః అని శబ్దమేర్పడును. అద్య శబ్దమున కర్థమగు కాలమునకు మరియొక కాలమును జూపుచున్నారు.

B. నిర్దేశమాత్రేణ = చూపినంత మాత్రముచే, వ్యతిరేకః = భేదము, న + హి + అనుగమ్యతే = నిర్ణయింపబడదు కదా ! పదార్థముల నిజరూపము తెలియనందున లౌకికులు వారి వారి వ్యవహారమున కనుగుణముగా ప్రసంగింతురు. అంతమాత్రాన పదార్థములకు లేనిభేదము సిద్ధింపదు.

కనుక క్రమముగా, అక్రమముగా అని లోకులు వ్యవహరించిన మాత్రాన క్రమము కంటె వేరుగా యౌగపద్యము సిద్ధింపనేరదు. ॥85॥

అవతారిక— వెనుకటి అర్థమునే క్రింద వివరించుచున్నాడు.

శ్లో॥ ఆధారం కల్పయన్ బుద్ధ్యా నాఽభావే వ్యవతిష్ఠతే ।
అవస్తుష్వపి నోత్ప్రేక్షా కస్యచిత్ప్రతిబధ్యతే ॥ 86

A. (మనుష్యః) = మనుష్యుడు, బుద్ధ్యా = బుద్ధిచే, అభావే = అభావమునందు అనగా లేమి యందు, ఆధారమ్ = ఆధారశక్తిని, కల్పయన్ = కల్పించిన వాడైనను, న + వ్యవతిష్ఠతే = ఉండునట్లు చేయనేరడు.

సప్తమీ విభక్తికి ఆధారమర్థము. భూతలేఘటః (నేలపై కడవ యున్నది) నేల ఆధారము. కడవ ఆధేయము. సప్తమికి ఆధారశక్తి యర్థము. ఇట్టి ఆధారాధేయములు లోక మున ఎన్నియో గలవు. ఒక వస్తువు మరియొక వస్తువు నిలిచియుండుట కుపయోగపడును. దానినే ఆధారమందురు. వస్తువు కానట్టియు, ఎట్టి శక్తియులేని అభావమును అనగా లేమిని గూడ ఆధారముగా లోకులు చూపుచున్నారు. "శత్రోరభావే సుఖమ్" (శత్రువు యొక్క లేమి యందు సుఖము). "సుహృదభావే దుఃఖమ్" (స్నేహితుని లేమియందు దుఃఖము). సుఖదుఃఖము లకు అభావము ఆధారమని లోకులు తలచినట్లు కానవచ్చుచున్నది. అట్లు కాకున్న సప్తమీ విభక్తికి తావు కానరాదు. అట్లే ''రాగాది క్లేశనాశాదుత్సాహః'' (రాగము మున్నగు క్లేశముల యొక్క నాశమువలన ఉత్సాహము కలుగును). అను రీతిని అభావమునకు హేతుత్వమును గూడ లోకులు చూపుచున్నారు. ఇదియంతయు బుద్ధిచే కల్పింపబడినదియే. కడవను నేలపై ఉంచేటట్లు అభావముపై సుఖాదుల నుంచనేరరు కదా ః కాబట్టి లేని యర్థములను కల్పించియే లోకుల వ్యవహారము జరుగుచున్నదని చెప్పవలెను.

B. లేని యర్థములను మాత్రము ఎట్లుపయోగింప గలడు ః ఎట్లు ప్రసంగింపగలడు ః అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అవస్తుషు + అపి = లేని పదార్థముల విషయమై గూడ, కస్యచిత్ = ఎవని యొక్క, ఉత్ప్రేక్షా = ఊహ అనగా కల్పించుట, న + ప్రతిబధ్యతే = నిరోధింపబడదు.

ప్రపంచకమున పదార్థములకు ఒక స్థానమునందుండుట కవకాశము లేకపోవచ్చును. ఐనను ఊహారూపమున అచట పదార్థములున్నట్లు భావింపవచ్చును. అట్టి భావనను ఎవరును నిరోధింపలేరు. అది నిరోధింపబడదు. ఉదా : "అఙ్గుల్యగ్రే కరియూథశతమాస్తే" (వ్రేలి చివర నూరు ఏనుగుల గుంపు ఉన్నది.) అది కార్యరూపమును ధరియింపవలెనన్న కుదరదు. అట్లనుకొనుటలో ప్రమాదమేమియు లేదు. ॥86॥

అవతారిక— లోకమున వస్తురూపముగా కానవచ్చెడి అర్థములను బోధించెడి శబ్దములకువలె, అభావమును బోధించెడి శబ్దములకుగూడ అర్థములతో సంబంధము యుక్తమే అనెడి ప్రకరణార్థమును ముగించుచున్నాడు.

శ్లో॥ తస్మాచ్ఛక్తి విభాగేన విత్యస్సదసదాత్మకః ।
ఏకోఽర్థః శబ్దవాచ్యత్వే బహురూపః ప్రకాశతే ॥ 87

తస్మాత్ = ఆ కారణమువలన అనగా భావముకంటె అభావమనునది వేరుగ లేనందున, ఏకః = ఏకరూపమే యగునట్టి, కనుకనే నిత్యః = పరమార్థ నిత్యమగునట్టి, అర్థః = అర్థము అనగా బ్రహ్మను, శబ్దవాచ్యత్వే = శబ్దములచే బోధింపబడినపుడు, శక్తి విభాగేన = విభిన్నము లగు శక్తి భేదముచే, సదసదాత్మకః = భావాభావ రూపముకలదై, బహురూపః = అనేకము లగు రూపములుకలదై, అనగా క్రమము అక్రమము మున్నగు విచిత్రములగు రూపములుకలదై, ప్రకాశతే = (వ్యవహారదశయందు) భాసించుచున్నది.

నిర్గుణ బ్రహ్మము మాయా సహకారమున తత్తచ్ఛక్తి సమన్వితమై శబ్దములచే బోధింపబడుచున్నది. ఆ స్థితిలో శబ్దవిశేషముచే బోధింపబడెడి ఆ బ్రహ్మమే భావరూపమున అభావరూపమున తెలియబడుచున్నది. కాబట్టి భావపదార్థములను బోధించెడి 'ఘట', 'పట' మున్నగు శబ్దములకు అర్థములతో సంబంధమున్నట్లు, లేమిని చెప్పెడి అభావ, న, నిషేధ మున్నగు శబ్దములకు గూడ వాని యర్థములతో సంబంధము నిత్యముగా కలుగవచ్చును ॥87॥

అవతారిక — కల్పనచే పదార్థములు లోకవ్యవహారమునకు ఉపయోగపడుచున్న వని చెప్పబడినది. ఆ కల్పన ఎట్లు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ వ్యవహారశ్చ లోకస్య పదార్థైః పరికల్పితైః ।
శాస్త్రే పదార్థః కార్యార్థం లౌకికః ప్రవిభజ్యతే ॥ 88

కల్పితైః = కల్పింపబడిన అనగా నిజరూపమున లేకున్నను బుద్ధిచే నిరూపింపబడినట్టి, పదార్థైః = పదార్థములచే అనగా భావము, అభావము, కార్యకారణ భావము, క్రమము, అక్ర మము మున్నగు వస్తువులచే లోకస్య = లోకముయొక్క, వ్యవహారః = వ్యవహారము అనగా పరస్పరాభిప్రాయమును తెలిసికొనుట, ఇష్టమైన దానియందు ప్రవర్తించుట, ఇష్టముకాని దానియందు ప్రవర్తింపకుండుట మున్నగు నిత్యయాత్ర (ప్రవర్తతే) = జరుగుచున్నది.

లౌకికః = లోకమున ప్రసిద్ధముగానున్న, పదార్థః = పదార్థము అనగా ద్రవ్యము, గుణము, దిక్, క్రియ, సాధనము, కాలము, పురుషము, సంఖ్య, ఉపగ్రహము, లింగము అనెడి పదార్థము, శాస్త్రే = వ్యాకరణశాస్త్రమున, కార్యార్థమ్ = కార్యములు ప్రవర్తించుటకై, ప్రవిభజ్యతే = విభజింపబడుచున్నది. అనగా అఖండమగు వాక్యార్థమునుండి వేరుచేసి చూప బడుచున్నది.

పాణినీయము లోకసిద్ధములగు శబ్దములకే సంబంధించును. కాన లోకసిద్ధములగు పదార్థములను గ్రహించియే వ్యాకరణ సూత్రార్థము నిర్ణయించి దాని మూలముగ కార్యములను విధించి శబ్ద సాధుత్వమును జూపవలెను.

వాక్యార్థమఖండము. అయినను దానినుండి లోకప్రతీతినిబట్టి కొన్ని పదార్థములను కల్పనా మూలమున గ్రహించి క్రియావాచకము ధాతువు, సత్త్వవాచకము నామము అను రీతిని పదార్థకల్పన చేయబడుచున్నది ॥88॥

సంబంధసముద్దేశము ముగిసినది

భూయోద్రవ్యసముద్దేశము—4

అవతారిక— వ్యాకరణశాస్త్రమునందలి ప్రక్రియను నిర్వహించుటకై లోకసిద్ధములగు పదార్థములు విభజింపబడుచున్నవని సంబంధసముద్దేశమున చరమశ్లోకముచే జూపబడినది.

దానిని పురస్కరించుకొని 10 విధములగు* అపోద్ధార పదార్థములను జూపుటకై రెండు శ్లోకములచే భూమికను రచియించుచున్నాడు.

శ్లో॥ సంసర్గరూపా త్సం భూతాః సంవిద్రూపా దపోద్ధృతాః ।
శాస్త్రే విభక్తా వాక్యార్థా త్ప్రకృతి ప్రత్యయార్థవత్ । 1
నిమిత్తభూతాః సాధుత్వే శాస్త్రాదనుమితాత్మకాః ।
కేచిత్పదార్థా వక్ష్యన్తే సంక్షేపేణ యథాగమమ్ ॥ 2

సంసర్గరూపాత్ = సంసర్గమే స్వరూపముగా కలిగినట్టియు సంసర్గమనగా సంబంధము, సంవిద్రూపాత్ = అపోద్ధారబుద్ధియే స్వరూపముగాగల, వాక్యార్థాత్ = వాక్యార్థమునుండి, ప్రకృతి ప్రత్యయార్థవత్ = ప్రకృత్యర్థములు ప్రత్యయార్థములవలె, సంభూతాః = సంభవించుచున్నట్టియు, అపోద్ధృతాః = బుద్ధిచే వేరుగా చేయబడినట్టియు, సాధుత్వే = శబ్దముల సాధుత్వ విషయమై, నిమిత్తభూతాః = నిమిత్తములుగా నున్నట్టియు, కనుకనే శాస్త్రే = శాస్త్రమున అనగా వ్యాకరణ శాస్త్రమున, విభక్తాః = విశేషముగా విషయరూపమున గ్రహింపబడినట్టియు, శాస్త్రాత్ = వ్యాకరణ శాస్త్రమువలననే, అనుమితాత్మకాః = ఊహింపబడిన స్వరూపము కల, అనగా అనుమాన ప్రమాణముచే లభించిన స్వరూపముకల, కేచిత్ = కొన్ని, పదార్థాః = పదార్థములు అనగా 1. ద్రవ్యము, 2 గుణము, 3. దిక్కు, 4. సాధనము, 5. క్రియ, 6. కాలము, 7 సంఖ్య, 8. లింగము, 9. పురుషము, 10 ఉపగ్రహము అనెడి పది పదార్థములు, యథాగమమ్ = వ్యాకరణ శాస్త్రమర్యాదను అతిక్రమింపక, సంక్షేపేణ = సంక్షిప్తరూపమున, వక్ష్యన్తే = చెప్పబడబోవుచున్నవి, అనగా పై పది పదార్థములు పది ప్రకరణములలో నిరూపింపబడుచున్నవని భావము.

వాక్యమఖండము, దానికి అవయవములు లేవు. ఇది ప్రథమాంతము, ఇది ద్వితీయాంతము, ఇది క్రియాపదము అని వేరుచేసి చూపుట శక్యము కాదు. అట్లే వాక్యార్థము కూడ అఖండమే. ఇది కర్త, ఇది కర్మ, ఇది క్రియ అని విభజించుట కవకాశము లేదు.

---

* 1. ద్రవ్య. 2 గుణ. 3. దిక్, 4. సాధన, 5. క్రియ, 6. కాల, 7. సంఖ్యా, 8. లింగ, 9. పురుష, 10. ఉపగ్రహ. పచతి, పచతే అనుచోటునందు పరస్మైపదము వలన ఆత్మనేపదమువలన గోచరించెడి అర్థవిశేషమునకు 'ఉపగ్రహ' అని పేరు, ఇది పాణినికి ముందున్న వైయాకరణుల సంజ్ఞ.

కాని అఖండమగు వాక్యమును, అట్టి వాక్యార్థమును, తెలిసికొనుట సాధ్యము కానందున వానినుండి పదములు పదార్థములు వేరుగా చూపబడుచున్నవి. అవి బుద్ధిచే కల్పితము లగుచున్నవి. వీనిద్వారా వాక్యార్థము జ్ఞాతము కాగలదు.

పై రీతిని పదార్థముల విభజనము సహేతుకము. ఏలయన– వాక్యార్థమనునది సంసర్గరూపము. సంసర్గమనగా కలయిక. సంసర్గమనగానే అందు పదార్థములు సంసృష్టము లని అనగా కలసియున్నవని తెల్లము కనుకనే అవి సంభూతములు. అనగా వేరుచేసి చూపుట కర్హములై యున్నవి.

మరియు వాక్యార్థము అపోద్ధార బుద్ధియే రూపముగా కలది కనుకనే దానినుండి పై పదార్థములు అపోద్ధృతము లగుచున్నవి.

పై రీతిని పదార్థములను వేరుచేసి చూపుటకు ప్రయోజనమున్నది– వ్యాకరణమున గల సూత్రములయొక్క అర్థమును తెలిసికొనుటకు ఈ కల్పితములగు పదార్థములు ఉపయోగ పడుచున్నవి. సూత్రములలో 'ద్రవ్య, గుణ, కాల, పురుష, దిక్' మున్నగు పదములు వాడబడియున్నవి. ఆ పదముల యర్థము తెలియనిచో సంపూర్ణ సూత్రార్థము తెలియబడదు. పై ప్రయోజనము నపేక్షించి పై పదార్థములు పృథక్కృతములై చూపబడుచున్నవి.

శబ్దముల సాధుత్వమును చూపుటలో పై యర్థములు నిమిత్తములు. వాని మూలముననే 'ఈ శబ్దము సాధువు', ఈ శబ్దము సాధువుకాదు. అని తెలియబడుచున్నది. కనుకనే శాస్త్రమున నవి విభక్తము లగుచున్నవి.

ఇచట రెండు వాదములు కలవు : 1 పదము సత్యము, అదియే యర్థబోధకము. ప్రకృతి ప్రత్యయములు, వాని యర్థములు కల్పితములు. అవి యసత్యములు. 2. వాక్యమే సత్యము అదియే యర్థబోధకము పద పదార్థములు కల్పితములు. అవి యసత్యములు.

పదము సత్యమనువారి మతమున ప్రకృతి ప్రత్యయార్థములు కల్పితములగునట్లు, వాక్యము సత్యమనువారి మతమున పదార్థములు కల్పితములు. ఈ యభిప్రాయముతో ''ప్రకృతి ప్రత్యయార్థవత్'' అని భర్తృహరి పలికెను. వాక్యమే సత్యమను వాదమున ప్రకృతి ప్రత్యయ కల్పనకు తావులేదు అందుచే నది దృష్టాంతముగా జూపబడినది. సంశయము– వ్యాకరణ సూత్రాలలో ద్రవ్య, గుణ, దిక్, మున్నగు పది పదార్థములేకాక, ఇంకను మరికొన్ని పదార్థములుకూడ గ్రహింపబడియున్నవి. ''తస్యాఽపత్యమ్'' (4-1-92) (షష్ఠ్యంతము కంటె అపత్యార్థమున 'అణ్' ప్రత్యయము ప్రవర్తించును. ఉపగోరపత్యమ్ = ఔపగవః) 'సాఽస్యదేవతా' (4-2-24) (ప్రథమాంతముకంటె అస్యదేవతా అను నర్థమున 'అణ్' ప్రత్యయము ప్రవర్తించును. ''ఇన్ద్రః దేవతా అస్య = ఐన్ద్రమ్'') మున్నగు రీతిని అపత్యము, దేవత, పశువు మున్నగు చాల నర్థములు కలవు. వానిని గూడ చూపక ద్రవ్యము మున్నగు పది పదార్థములనే అపోద్ధార పద్ధతిలో ఏల భర్తృహరి చూపెను ?

సమాధానము— అపత్యమనగా సంతానము. ఇది ఎల్లరులకు తెలిసినదే ఇందు ఎవ్వరికి విప్రతిపత్తి లేదు. పశు - దేవతాద్యర్థములు కూడ అట్టివే. ఇట్టివి అన్నియు లోక ప్రసిద్ధములే, కనుక వాని స్వరూపమును ప్రత్యేకముగా చూపనవసరము లేదు. ద్రవ్యాది పదార్థము లట్టివి కావు. వాని స్వరూపమును వైశేషిక తంత్రము అనగా కణాదమహర్షి రచియించిన తర్కము వేరొక రీతిని నిర్ణయించియున్నది. ఆ నిర్ణయము ననుసరించిన, ద్రవ్యాది పదములతో గూడియున్న వ్యాకరణ సూత్రముల యర్థలక్ష్యముల సిద్ధికై ఉపయోగింపదు, ప్రతికూలించును. కాబట్టి తార్కికులు చూపిన ద్రవ్యాది పదార్థనిర్ణయమును విడనాడి, వ్యాకరణసూత్రముల యర్థము, లక్ష్యసిద్ధికై తోడ్పడునట్లు వ్యాకరణశాస్త్ర మాత్ర ప్రసిద్ధి ననుసరించి ద్రవ్యము మున్నగు పది పదార్థములకు లక్షణము చెప్పవలసి యున్నది.

ఆ పదార్థములకు లక్షణములు పాణినికాత్యాయనపతంజలులు కంఠతః చెప్పియుండలేదు. మరియేమనగా, వారు చూపిన వ్యవహారములను గుర్తించి వాని మూలమున ద్రవ్యాదులకు లక్షణము చెప్పవలసియున్నది. అనుమాన ప్రమాణముచే వానికి లక్షణములను తెలిసికొని సూత్రార్థనిర్ణయము చేయవలెను. వైశేషికులు చేసిన ద్రవ్యాది పదార్థముల నిర్ణయమును వ్యాకరణశాస్త్రమున నాదరింపరాదు. ఈ యభిప్రాయమును ''శాస్త్రాదనుమితాత్మకాః'' అను కారికాభాగము వ్యక్తపరచుచున్నది.

పాణిన్యాదుల పోకడలను ఆధారముగా గైకొని ద్రవ్యాది పదార్థముల నిర్ణయము ఆ యా ప్రకరణములలో వ్యక్తము కాగలదు.

వాజప్యాయన మతము ననుసరించి ఎల్ల శబ్దములకు జాతియే వాచ్యమగును అను భావముతో జాతిసముద్దేశము, వ్యాడిమతము ననుసరించి ఎల్ల శబ్దములకు ద్రవ్యమే వాచ్యమగు నను భావముతో ద్రవ్యసముద్దేశము, శబ్దార్థములకు గల సంబంధమును తెలుపుటకై సంబంధ సముద్దేశము చూపబడినవి. కాగా అవి మూడు సముద్దేశములు. ద్రవ్యము మున్నగు పది పదార్థములను నిరూపించునవి పది సముద్దేశములు, కాగా పదుమూడు సముద్దేశములు చూపబడినవి. ఇవి వ్యస్తములగు అనగా ప్రత్యేక పదములుగా నుండువాని యర్థములను విచారించి యున్నవి. సమస్త పదార్థములను విచారించుటకై చివరిదియగు వృత్తి సముద్దేశము చూపబడినది. సంకలనచేయగా ఈ పదకాండమున పదునాల్గు సముద్దేశములు భర్తృహరిచే చూపబడినవి. ॥1, 2॥

వ్యాకరణ శాస్త్రమునందలి సూత్రముల యర్థము లక్ష్యముల సిద్ధికై ఉపయోగపడునట్లు నిర్ణయము కలుగుటకై పది విధములగు పదార్థములను శాస్త్రమర్యాద నతిక్రమింపక చెప్పుచున్నానని 1, 2 శ్లోకములచే ప్రతిజ్ఞ చేయబడినది. ఆ పదింటిలోను ద్రవ్యము గుణ క్రియా సంఖ్యాదుల కాధారము కనుక ప్రధానమగుచున్నదనెడి యాశయముతో ముందుగా ద్రవ్య పదార్థమునకు లక్షణము దెలుపుచున్నాడు.

శ్లో॥ వస్తూపలక్షణం యత్ర సర్వనామ ప్రయుజ్యతే ।
ద్రవ్యమిత్యుచ్యతే సోఽర్థో, భేద్యత్వేన వివక్షితః ॥ 3

A. యత్ర = ఏ యర్థమునందు, వస్తూపలక్షణమ్ = వస్తువునకు ఉపలక్షణముగా నున్న అనగా గుర్తుగా ఉపయోగించెడి, సర్వనామ = సర్వనామ శబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడు చున్నదో, సః = ఆ, అర్థః = అర్థము, ద్రవ్యమ్ + ఇతి = ద్రవ్యమని ఉచ్యతే = చెప్పబడుచున్నది.

సర్వనామ శబ్దములు రెండు విధములుగా కానవచ్చుచున్నవి : 1. వస్తువు లన్నిటిని తెలుపునవి. సర్వ, విశ్వ, తత్, యత్, ఇదమ్, మున్నగునవి. ఈ శబ్దములచే వస్తు మాత్రమును మనము చూపగలము. 2. కొన్ని వస్తు విశేషమును బోధింపగలవు. ఏక (ఒకడు), అన్యతర మున్నగునవి. ఇద్దరిలో నొకడు అని అన్యతర శబ్దము నియమితమగు అర్థమునే చూపును. ఎల్ల వస్తువులు ఆ శబ్దముచే బోధింపబడవు.

ఈ రెండు విధములగు సర్వనామములలోను వస్తుమాత్రమును బోధించెడి ఇదమ్ (ఇది, వీడు), తత్ (అది, వాడు) మున్నగు శబ్దములచే బోధింపబడెడి అర్థము ద్రవ్యము కాగలదు ముందుగా ఒక అర్థమును బోధించి మరల దానినే పరామర్శించునపుడు ఆ యర్థమును బోధించెడి పదమునే వాడక దానికి బదులుగా 'ఇదమ్, తత్' అని సర్వనామములను ప్రయోగింతురు. అట్లుకాకున్నను నామవాచకమునకు ముందుగా సర్వనామమును ప్రయోగించి 'అయం ఘటః' (ఇది కడవ), 'సః పటః' (అది వస్త్రము) అను రీతిని వాడుకయు కలదు.

కాగా, సర్వనామ పరామర్శయోగ్యమగు అర్థము ద్రవ్యము అని ద్రవ్యలక్షణము తేలినది. నిరుక్తకారుడు కూడ 'అత ఇతియత్ ప్రతీయతే తద్ ద్రవ్యమ్' అని ద్రవ్యలక్షణమును జెప్పెను సర్వనామము వలన తెలియబడు నర్థము ద్రవ్యమని దాని భావము. 'అతః' అనునది ఇదం శబ్దముయొక్క రూపము.

వస్తువునందు గల విశేషధర్మము లన్నిటిని జూపి వానిని అనుసరించి వస్తువులకు లక్షణము చెప్పనలవి కాదు. వస్తు సామాన్యమునకు ద్రవ్యత్వము లభించుటకై ''సర్వనామ పరామర్శ యోగ్యం ద్రవ్యమ్'', అని భర్తృహరి చూపియున్నాడు.

B. విశేషాకారమున ద్రవ్యమును గుర్తించుటకై మరియొక ద్రవ్య లక్షణమును జూపు చున్నాడు.

(యద్వా) కాక, భేద్యత్వేన = విశేష్యత్వ రూపమున, వివక్షితః = వివక్షితమగు, అర్థః = అర్థము, ద్రవ్యమ్ = ద్రవ్యమనబడును.

శబ్దమును ప్రయోగింపగా అర్థము భాసించును. ఆ శబ్దముచే భాసించిన అర్థములలో ఏ యర్థము విశేష్యముగా నిశ్చితమగునో ఆ యర్థము ద్రవ్యమనబడును.

ఈ యర్థము విశేష్యమని నిర్ణయించుటలో వక్తయొక్క ఇచ్ఛయే నిమిత్తము. లోకముతో ప్రసక్తి లేదు ఏ యర్థము విశేష్యమని వక్త తలచునో ఆ యర్థము ద్రవ్యమనిపించుకొనును. లోకవ్యవహారమున వ్యక్తి విశేష్యమనియు దానియందున్న జాతి, గుణము, క్రియ మున్నగునవి విశేషణములనియు నిర్ణయము కలదు. జాతి మున్నగువానినే విశేష్యములుగా వివక్షించిన నవియు ద్రవ్యములే, ఈ లక్షణము చొప్పున కాగలవు. వివక్షనుబట్టి వస్తుమాత్రము ద్రవ్యము కాగలదు. ఈ యాశయముతోడనే ''వివక్షితః'' అని భర్తృహరి పలికెను.

'పచతి' మున్నగు తిఙంతముల వలన, క్రియ విశేష్యముగా భాసించుచున్నది. కనుక అట్టి క్రియ ద్రవ్యము కాగలదు. మొదటి లక్షణముచే గూడ 'కిం పచతి' అను రీతిని సర్వనామ పరామర్శయోగ్యమగుటం జేసి క్రియ ద్రవ్యము కాగలదు.

ఈ రీతిగా తిఙంతముచే బోధింపబడిన క్రియ ద్రవ్యమనుటలో సూత్రకారుని అనుమతి కానవచ్చుచున్నది. *పాణిని ధాత్వర్థముతో సమానాధికరణమగు అనగా ఏకరూపమగు 'యుష్మద్' శబ్దము ఉపపదముగా నుండగా మధ్యమ పురుషము, అట్టి అస్మద్ శబ్దము ఉపపదముగా నుండగా ఉత్తమ పురుషము ప్రవర్తించునని చెప్పెను. ఉదా : త్వం పచసి (నీవు వండుచున్నావు), అహం పచామి (నేను వండుచున్నాను). ధాతువు యుష్మదస్మచ్ఛబ్దములు ఒకే యర్థమును బోధింపవలయును. అపుడు పై రెండు పురుషములు ప్రవర్తింపగలవు. యుష్మదస్మచ్ఛబ్దములు ద్రవ్యబోధకములని ఎల్లరులకు తెల్లమే. అట్టి వానికి ధాత్వర్థముతో సామానాధికరణ్యముండవలెను. ధాత్వర్థక్రియ పై లక్షణము చొప్పున ద్రవ్యము కనుక పాణిని చూపిన పై వ్యవస్థ ఉపపన్నమగుచున్నది క్రియ ద్రవ్యముకానియెడల సామానాధికరణ్యము లేనందున పై నియమము కుదరదు.

ఇట్లే పాణినికాత్యాయన పతంజలులు ద్రవ్యమునందున్న గుణమును బోధించుటకై 'త్వ, తల్' అను భావ ప్రత్యయములను **విధించియున్నారు. ఘట స్వభావః = ఘటత్వమ్ విశేష్యముగా వివక్షితమగు అర్థము ద్రవ్యమను ఆశయము పాణిన్యాదులకు కలదని దీనివలన వ్యక్తమగుచున్నది. కనుకనే, శుక్ల స్వభావః = శుక్లత్వమ్, అను రీతిని గుణవాచకములుగా లోక ప్రసిద్ధములగు శుక్లాది శబ్దములకంటె పై ప్రత్యయములు ప్రవర్తించుచున్నవి అట్లు కాకున్న ద్రవ్యవాచకములకంటె విధింపబడిన త్వ - తల్ ప్రత్యయములు శుక్లాది శబ్దములకంటె ప్రవర్తించుట కవకాశము లేనందున సూత్రవార్తికభాష్యములు, అసంగతములే యగును.

---

* ''యుష్మద్యుపపదే సమానాధికరణే స్థానిన్యపి మధ్యమః'' (1-4-105) ''అస్మద్యుత్తమః'' (1-4-107) ''శేషే ప్రథమః' (1-4-108) అని పాణిని సూత్రములు.

** ''తస్య భావ స్త్వతలౌ'' (5-1-119) షష్ఠ్యంతముకంటె భావార్థమున త్వ, తల్, ప్రత్యయములు కలుగునని సూత్రార్థము. ''యస్య గుణస్య భావాత్ ద్రవ్యే శబ్దనివేశ స్తదభిధానే త్వతలౌ'' అని కాత్యాయనుని వార్తికము.

పై పోకడలను బట్టి ఈ కారికచే చూపబడిన ద్రవ్య లక్షణము మునిత్రయమునకు సమ్మతమేయని తెల్లము. ఈ కారణముచే అనుమాన ప్రమాణమువలన ద్రవ్యమునకు లక్షణము ఊహింపబడుచున్నది.

'గుణములకు ఆశ్రయము ద్రవ్యము, క్రియలకు ఆశ్రయము ద్రవ్యము' అని తార్కికులు ద్రవ్యలక్షణమును జూపెదరు. ఆ లక్షణమును గ్రహించిన ధాత్వర్థ క్రియ, శుక్ల గుణము ద్రవ్యములు కానందున పై వ్యాకరణ సూత్ర ప్రణాలిక సరిపడదు. కాబట్టి వారు చూపిన ద్రవ్యలక్షణమును గ్రహింపక ఈ శ్లోకముచే చూపబడిన ద్రవ్యలక్షణమును గ్రహింపవలెనని తేలుచున్నది.

ఈ యంశమును గుర్తింపవలెను— ''విప్రతిషిద్ధం చానధికరణవాచి'' అను (2-4-13) సూత్రముచే ద్వంద్వసమాసమునకు వికల్పముగా ఏకవద్భావము విధింపబడు చున్నది. ఉదా: శీతంచ ఉష్ణంచ = 1. శీతోష్ణమ్, 2. శీతోష్ణే, (చల్లతనము, వేడితనము). అధికరణమనగా ద్రవ్యము, కాగా ద్రవ్యవాచకములకు పై కార్యము ప్రవర్తింపదు. ఉదా: శీతోష్ణే ఉదకే స్తః (చల్లతనము, వేడిమికల నీళ్ళు ఉన్నవి) ఈ సూత్రమున మాత్రము తార్కికులు చెప్పిన ద్రవ్యలక్షణమునే గ్రహింపవలెను. ''వస్తూప లక్షణమ్'' ఇత్యాదికమగు ప్రకృత శ్లోకముచే చూపబడిన ద్రవ్యమును గ్రహింపరాదు. అట్లు కాకున్న ప్రతి వస్తువు ఈ శ్లోకముచే ద్రవ్యమే యగుటంజేసి 'అనధికరణవాచి' అను నిషేధమునకు ఉదాహరణము కావలసియున్నందున ఏకవద్భావ విధానమునకు ఉదాహరణమే లభింపనందున సూత్రము వ్యర్థమే కావలెను.

భూయోద్రవ్యసముద్దేశము ముగిసినది

గుణ సముద్దేశము—5

అవతారిక— వ్యాకరణప్రక్రియ కనుగుణముగ ద్రవ్యమును నాల్గవ సముద్దేశమున నిరూపించి, ఇచట నిరూపింపదలచిన పది పదార్థములలో మొదటిదియగు వ్యాకరణ శాస్త్రమున గల కొన్ని చిహ్నములచే ఊహింపబడిన 'గుణ' పదార్థమును నిరూపించుచున్నాడు.

శ్లో॥ సంసర్గిభేదకం యద్యత్స వ్యాపారం ప్రతీయతే ।
గుణత్వం పరతన్త్రత్వాత్తస్య శాస్త్ర ఉదాహృతమ్ ॥ 1

యత్ + యత్ = ఏదేది, సంసర్గి = సంబంధము కలిగినదై, అనగా ఆధారముతో వేరు కాకుండ దానితో ఐక్యమును బొందినదై, భేదకమ్ = వేరుచేయుచున్నదై అనగా తనకు ఆధారమగు వస్తువును ఇతర వస్తువుకంటె వేరుచేయుచున్నదై, సవ్యాపారమ్ = ఇతర వ్యావృత్తి అనెడి వ్యాపారముతో గూడినదై, ప్రతీయతే = తెలియబడుచున్నదో, తస్య = దానికి, పరతన్త్రత్వాత్ = పరాధీనమనెడి కారణమువలన, గుణత్వమ్ = గుణత్వము అనగా గుణమనెడి పేరు, శాస్త్రే = వ్యాకరణ శాస్త్రమునందు, ఉదాహృతమ్ = ఉదాహరింపబడినది.

వ్యాకరణశాస్త్రమున కొన్ని సూత్రములలో 'గుణ' అను పదము ప్రయోగింపబడి యున్నది. అచట 'గుణ' శబ్దముచే ఈ శ్లోకమువలన గుర్తింపబడిన గుణమునే గ్రహించి సూత్రార్థము చెప్పవలెను అట్లుకాకున్న వైశేషికులు చూపెడి *రూపము, రసము మున్నగు గుణములను గ్రహింపవలెను. అట్టితరి లక్ష్యముల సిద్ధికై ఉపయోగించెడి సూత్రార్థము లభింపనేరదు.

లోకమున పరాధీనమగు వస్తువునకు గుణమని వ్యవహారము కలదు. అట్టి లోకసిద్ధమగు అర్థమును స్వీకరించి ఈ లక్షణము నిర్మింపబడినది. ఆశ్రయమును కలిసియుండి, ఇది ఇతరములకంటె వేరు అని యాశ్రయమును గుర్తింపచేయు పదార్థము గుణమనబడును. ఉదా : ఘటమునందు నలుపు, తెలుపు మున్నగు రూపములు కలవు. అవి కడవను విడనాడి యుండవు. పచ్చని కడవకంటె ఇవి భిన్నములు అను జ్ఞానమును కలిగించును. అట్లు చేయుటయే వాని వ్యాపారము. ఇంతవరకు నైయాయికులకు మనకును సమానమే, ఘటమునందు ఘటత్వమనెడి జాతి కలదని యెల్లరులు విశ్వసించినదే. అదియు పై యంశములు కలదియగుటచే 'గుణ' మనిపించుకొనును. అది ఘట వ్యక్తిని విడిచియుండదు. తనకు ఆశ్రయమగు ఘటమును అశ్వాదులకంటె వేరు చేయును తార్కికుల పద్ధతిలో ఇది గుణము కానేరదు

---

* రూప, రస, గంధ, స్పర్శ, సంఖ్యా, పరిమాణ పృథక్త్వ, సంయోగ, విభాగ, పరత్వ, అపరత్వ, గురుత్వ, ద్రవత్వ, స్నేహ, శబ్ద, బుద్ధి, సుఖ, దుఃఖ, ఇచ్ఛ, ద్వేష, ప్రయత్న, ధర్మ, అధర్మ, సంస్కార అను రీతిని వారు 24 గుణముల నంగీకరింతురు.

వారు రూప రసాదులలో దీనిని పేర్కొనలేదు. అదియు గుణమనుటలో మునిత్రయమువారి సమ్మతి కలదు.

''తస్యభావ స్త్వతలౌ'' (5-1-119) అను సూత్రముచే షష్ఠ్యంతము కంటె భావార్థమున త్వ, తల్ అను రెండు తద్ధితములు కలుగునని సూత్రార్థము. అచట భావ శబ్దార్థమును కాత్యాయనుడు ''యస్య గుణస్య భావాత్ ద్రవ్యే శబ్దనివేశః'' అని వివరించెను. ద్రవ్యమునందు ఏ గుణముండుటవలన శబ్దము ప్రవర్తించుచున్నదో, దానిని బోధించుటకై త్వ, తల్ కలుగునని వార్తికార్థము ఉదా: ఘటస్యభావః = ఘటత్వమ్, ఘటము ద్రవ్యము, దానియందు ఘటత్వమనెడి ధర్మముండుటచే దానిని నిమిత్తముగా గైకొని ఘటశబ్దము ప్రవృత్తమగుటం జేసి ఆ ఘటత్వమే త్వప్రత్యయార్థమగును. ఇచట గుణశబ్దముచే జాతిని గ్రహింపక తీరదు. ఇట్లే క్రియయు గుణము కాగలదు. ఉదా: పాచకస్యభావః = పాచకత్వమ్, పాకక్రియ, త్వ ప్రత్యయార్థము.

కాగా మునుల వ్యవహారముచే లభించిన గుణపదార్థము ఈ శ్లోకమున చూపబడినది

ఇట్లే ''సమర్థః పదవిధిః'' (2-1-1) అను సూత్రమున సమానాధికరణ శబ్దములు అసమర్థములగుటచే వానికి సమాసము సిద్ధింపకున్నది అను ప్రసంగమున వీరః పురుషః మున్నగు చోటులందు ''వీరత్వం గుణః, పురుషత్వం గుణః'' అని మహాభాష్యకారుడు పలికెను ఇదియు ప్రకృతార్థమునకు సాధకము కాగలదు.

కాగా ''సంసర్గి భేదకమ్'' అనుకారికచే గుర్తింపబడిన గుణమును గ్రహించి పై వ్యాకరణ కార్యములను సమర్థింపవలెను

ఏ వస్తువును చూచినను ఈ శ్లోకము ప్రకారము గుణము కాగలదు. కనుకనే 'యద్యత్' అని వీప్స చూపబడినది.

ఈ యంశము గుర్తింపవలెను: వ్యాకరణ సూత్రములలో కొన్ని చోటులందు మాత్రమే ఈ శ్లోకముచే గుర్తింపబడిన గుణమును గ్రహింపరాదు మరియొక విధముగ గుణ శబ్దార్థమును చూపవలెను.

"వోతో గుణవచనాత్" (4-1 44) వా, ఉతః, గుణవచనాత్, అని పదచ్ఛేదము గుణవచనమయి ఉకారాంతమగు ప్రాతిపదికము కంటె వికల్పముగా 'ఙీష్' ప్రత్యయము స్త్రీలింగమున ప్రవర్తించునని సూత్రార్థము ఉదా: పటు + ఈ = పట్వీ, పటుః; మృదు+ఈ=మృద్వీ, మృదుః, పటుత్వము, మృదుత్వముకల ఆడుది. ఈ ప్రత్యయము ప్రాతిపదికము కంటె ప్రవర్తించును. ఆ ప్రాతిపదికము గుణము అప్రధానముగా గల ద్రవ్యమును బోధింపవలెను. అట్టితరి 'సంసర్గి భేదకమ్' అను గుణమును ఇచట గ్రహింపరాదు. అట్లు కాకున్న 'ఆఖు' (ఎలుక) మున్నగు జాతిశబ్దముల కంటెను ఈ ప్రత్యయము ప్రవర్తించెడిని. అందుచే ఇచట గుణవచనమనునది విశిష్టమగు సంజ్ఞా శబ్దమని భాష్యకారుడు నిర్ణయించెను.

జాతి, సంజ్ఞ, అవ్యయ, కృదంత, తద్ధితాంత, సమస్త, సర్వనామ, సంఖ్యా వీని కంటె ఇతరమగు ప్రాతిపదికము గుణవచనము. ఇది *భాష్యకారుడు చేసిన సంజ్ఞ. గుణమ్ ఉక్తవాన్ (గుణ మప్రధానముగాగల ద్రవ్యమును బోధించునది) 'గుణవచనః' అను వ్యుత్పత్తి నాశ్రయింపవలెను

''సంఖ్యాయా గుణస్య నిమానే మయట్'' (5-2-47) అను పాణిని సూత్రమున గుణశబ్దము సమభాగము అను నర్థము కలది. ఈ శ్లోకముచే చెప్పబడిన గుణము కాదు 'గుణ వచన' సంజ్ఞయు కాదు. కొనుటకు సాధనమగు వస్తువు కొనబడెడి వస్తువు సమభాగముగా నున్నపుడు సంఖ్యావాచకమగు శబ్దముకంటె 'మయట్' తద్ధితము ప్రవర్తించునని సూత్రార్థము. ఉదా : ద్విమయమ్ ఉదశ్విత్ యవానామ్, (రెండు డొక్కుల యవధాన్యములకు రెండు డొక్కుల మజ్జిగ) ఉదకేన శ్వయతి (నీటిచే వృద్ధిజెందునది) అను వ్యుత్పత్తిచే ఉదశ్విత్ అనగా మజ్జిగ.

"గుణవచనేభ్యోమతుపో లుక్" (5-2-94) అను వార్తికమున శుక్ల, నీల మున్నగు రూపవిశేష బోధకములు గుణవచన శబ్దముచే గ్రహింపబడుచున్నవి. శుక్లమ్ అస్యాస్తి = (దీనికి శుక్లరూపమున్నది) అను నర్థమున 'మతుప్' ప్రత్యయము ప్రవర్తించి శుక్లవత్ అని యుండగా పై వార్తికముచే 'మతుప్' నకు లోపము కలుగును, శుక్లం వస్త్రమ్.

''తృతీయా తత్కృతార్థేన గుణవచనేన'' (2-1-30) "ప్రకారే గుణవచనస్య" (8-1-12) "పూరణగుణ" (2-2-11) "ఈషద్గుణవచనేన" (2-2-7) "అజాదీగుణ వచనా దేవ" (5-3-58) ఈ సూత్రవార్తికములలో గూడ "సంసర్గి భేదకమ్" అను శ్లోకమున చెప్ప బడిన గుణమును గ్రహింపరాదు. తార్కికులు చూపిన గుణములను లోకప్రసిద్ధమగు గుణము లను గ్రహించి సూత్రార్థ సమన్వయము చేయవలెను. ॥1॥

అవతారిక — వస్తువులలో నొకదానికంటె మరియొకదానికి ఉత్కర్షను వివక్షింపగా తర, తమ ప్రత్యయములు వ్యాకరణమున విధింపబడినవి శుక్లతరం వస్త్రమ్ (ఈ రెంటిలో ఈ వస్త్రము ఎక్కువ తెల్లనిది) ద్రవ్యమునకు స్వతః ఉత్కర్షాపకర్షలు ఉండవు. అది నిజరూపమున ఏకరూపముగానే యుండును అందుచే ఆ ద్రవ్యమునందుగల తెలుపు మున్నగు గుణముల ఉత్కర్షాపకర్షలను బట్టి ద్రవ్యమునకు ఉత్కర్షాపకర్షలు కలుగును. అనగా గుణమునందున్న వానిని ద్రవ్యమునం దారోపించిన, వాని మూలమున ద్రవ్యమునందు ఉత్కర్షాపకర్షములు భాసించును అని †మహాభాష్యకారుడు నిర్ణయించెను.

---

* ఈ యర్థము ''ఆకడారా దేకా సంజ్ఞా'' (1-4-1) అను సూత్రమునకు సంబంధించిన భాష్యమున కలదు. ఇది మొదలు ద్వితీయాంత భాగమునగల సంజ్ఞలలో ఒకదానికి ఒకే సంజ్ఞ కలుగునని సూత్రార్థము

† ''అతిశాయనే తమ బిష్ఠనౌ'' (5-3-55) (న్యూనీకరణ రూపమగు అతిశాయనమున తమప్, ఇష్ఠన్ తద్ధితములు కలుగును.) ప్రాతిపదికార్థో వై ద్రవ్యమ్; న చ ద్రవ్యస్య ప్రకర్షాప కర్షౌ స్తః, ఏవం తర్హి గుణః ప్రాతిపదకార్థః, యస్యాస్తి ప్రకర్షః, తత్ప్రకర్షీ భవిష్యతి'' అని మహాభాష్యము.

కాని ద్రవ్యమునకు ఉత్కర్షాపకర్షములు స్వాభావికములు కావనియు, అవి గుణమునకే కలుగుననియు ఎట్లు తెలియనగును ? అవి ద్రవ్యమునకు ఏల యుండరాదు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ ద్రవ్యస్యాఽవ్యపదేశ్యస్య య ఉపాదీయతే గుణః ।
భేదకో వ్యపదేశాయ, తత్ప్రకర్షోఽభిధీయతే ॥ 2

అవ్యపదేశ్యస్య = వ్యవహరించుటకు అర్హముకాని అనగా శబ్దముచే చెప్పుటకు సాధ్యముకాని, ద్రవ్యస్య = ద్రవ్యమునకు, వ్యపదేశాయ = వ్యవహారము కొరకు, భేదకః = భేదమును కలిగించెడి, అనగా ఇతర వస్తువుకంటె వేరుపరచెడి, యః = ఏ, గుణః = గుణము అనగా జాతి, తెలుపు, నలుపు మున్నగు గుణము; వంట, చదువు మున్నగు క్రియ; దేవదత్త మున్నగు సంజ్ఞ అనెడి గుణము, ఉపాదీయతే = స్వీకరింపబడు చున్నదో అనగా శబ్దముచే బోధింపబడు చున్నదో, తత్ప్రకర్షః = ఆ గుణముయొక్క ఉత్కర్షము, అభిధీయతే = చెప్పబడుచున్నది. అనగా తర - తమ - ఇష్ఠన్, ఈయసున్ ప్రత్యయములచే బోధింపబడుచున్నది.

జాతి, గుణము, క్రియ మున్నగు ఉపాధులను వేరుచేసి వాని సంబంధములేక శుద్ధ ద్రవ్యము నిరూపించుట సాధ్యము కాదు. నిరుపాధికమగు ద్రవ్యము శుద్ధ బ్రహ్మరూపమే అట్టి ద్రవ్యమునందు ఉత్కర్షాపకర్షలు సంభవింపవు అట్టి ద్రవ్యము శబ్దవాచ్యము కానేరదు లోకవ్యవహారమునకు తగదు ఆ ద్రవ్యము శబ్దవాచ్యము కావలెనన్నచో జాత్యాదికమగు గుణములతో కలసియున్నదే కావలెను ద్రవ్యమునందు ఉత్కర్షాపకర్షములు కలుగవు అనుటలో "అవ్యపదేశ్యస్య" అను విశేషణము హేతురూపముగా చూపబడినది.

అందుచే గుణములయందున్న ఉత్కర్షాపకర్షలను పురస్కరించుకొని తరతమ ప్రత్యయములు ప్రవర్తించును. అందును ద్రవ్యమునందు పెక్కు గుణములున్నను ఏ గుణము శబ్దముచే గ్రహింపబడునో, ఆ గుణమునుబట్టి ప్రకర్షము చూపవలెను.

ఇచట గుణపదము 'సంసర్గి భేదకమ్' అనుకారికచే గుర్తింపబడిన గుణమునే బోధించును. ॥2॥

అవతారిక— ద్రవ్యమునకు స్వతః ఉత్కర్షాపకర్షలు సంభవింపవు. అందుచే దానియందున్న తెలుపు మున్నగు గుణముల ఉత్కర్షాపకర్షలను చూచి వాని ద్వారా ద్రవ్యమునకు ఉత్కర్షాపకర్షలు కలుగునని రెండవ శ్లోకమున జూపబడినది. శుక్లము మున్నగు గుణములనే ప్రధానములుగా వివక్షించిన నవియు ద్రవ్యములే యగును. అట్టితరి శుక్లాది శబ్దములకంటె 'తరప్' మున్నగు ఆతిశాయనిక ప్రత్యయములు ప్రవర్తింపనేరవు లోకమున మాత్రము 'శుక్లతరం రూపమ్ (ఈ తెలుపు ఉత్కృష్టమైనది) అను రీతిని ప్రయోగములు కానవచ్చుచున్నవి. వానిని ఎట్లు సమర్థింపవలెను ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వస్యైవ ప్రధానస్య న వినా భేదహేతునా ।
ప్రకర్షో విద్యతే, నాఽపి శబ్దస్యోపైతి వాచ్యతామ్ ॥ 3

ప్రధానస్య = ప్రధానమగు, సర్వస్య + ఏవ = ఎల్ల వస్తువునకు, భేదహేతునా + వినా = భేదమునకు కారణమగు గుణాదికము లేనిది, ఉత్కర్షః = ఉత్కర్షము, న + విద్యతే = ఉండనేరదు.

అట్లే, శబ్దస్య = శబ్దమునకు అనగా శుక్ల, నీల మున్నగు శబ్దమునకు, వాచ్యతామ్+ అపి = వాచ్యత్వమును గూడ, న + ఉపైతి = పొందనేరదు. ద్రవ్యము నిజరూపమున శబ్దముచే బోధింపబడదు అని భావము.

పటము మున్నగువానియందున్న తెలుపు మున్నగు గుణము ప్రధానముగా వివక్షితమగుచో నదియు ద్రవ్యమే యగును. 'భేద్యత్వేన వివక్షితః' (విశేష్యమున అనగా విశేష్యముగా వివక్షింపబడినది) అనికదా ద్రవ్యలక్షణము చూపబడినది. అట్టితరి శుక్లరూపమున గల భాసురత్వము మున్నగు గుణములను వివక్షించి వాని ఉత్కర్షాపకర్షలను పురస్కరించుకొని, 'శుక్లతరం రూపమ్' మున్నగు ప్రయోగములను సమర్థింపవలెను.

ఒకవేళ భాసురత్వమును గూడ ప్రధానముగా వివక్షించిన నదియు ద్రవ్యమే యగునని భావించిన, అట్టితరి దానియందున్న స్వచ్ఛత మున్నగు గుణములను గ్రహించి వానిని బోధించెడి శబ్దములకంటె తరబాదులను ప్రవర్తింపజేయవలెను.

ఇట్లు ఎంతవరకు మనము ఎల్ల వస్తువులను ప్రధానముగా భావించెదమో, అంతవరకు దానియందు విజాతీయమగు ధర్మములు లభించును కనుకనే కారికలో 'సర్వస్యైవ' అని సామాన్యముగా జూపబడినది. ఈ యర్థము మొదటి కాండమున (బ్రహ్మకాండము) *64 వ శ్లోకమున వివరింపబడియున్నది. ॥3॥

అవతారిక— "శుక్లతరం రూపమ్" (ఈ శుక్లరూపము మిక్కిలి ఉత్కృష్టము) మున్నగు ప్రయోగములు భాసురత్వాది గుణములనుబట్టి సమర్థించుట యుక్తము కాదు. శబ్దముచే బోధింపబడిన గుణముల తారతమ్యమును బట్టియే తరబాదులు ప్రవర్తించును. పై ప్రయోగములలో భాసురత్వాధికము శబ్దముచే బోధింపబడలేదు. అట్లు కాకున్న ఎన్నియో ధర్మములు ద్రవ్యమునందుండుటచే వానిలో నేధర్మమునుబట్టి తరతమ ప్రత్యయములు ప్రవర్తించునో నియమము లభింపదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ విద్యమానాః ప్రధానేషు న సర్వే భేదహేతవః,
విశేషశబ్దైరుచ్యన్తే వ్యావృత్తార్థాభిధాయిభిః ॥ 4

---

* "గుణః ప్రకర్షహేతుర్యః స్వాతన్త్ర్యేణోపదిశ్యతే, తస్యాశ్రిత గుణాదేవ ప్రకృష్టత్వం ప్రతీయతే" 1–64.

వ్యావృత్తార్థాభిధాయిభిః = ఇతరమగు వస్తువునుండి వేరుచేసెడి అర్థములను బోధించెడి, విశేష శబ్దైః = విశేష శబ్దములచే అనగా ఘటః, నీలః మున్నగు శబ్దములచే, ప్రధానేషు = ప్రధానములుగా వివక్షితములగు ఘటము, శుక్లము, భాసురము మున్నగు అర్థములయందు, విద్యమానాః = ఉన్నట్టియు, భేదహేతవః = ఇతర వస్తువును వేరుచేయుటకు కారణములగు, సర్వే = ఎల్ల ధర్మములు, న + ఉచ్యన్తే = చెప్పబడవు. వస్తువులయందున్న ఘటత్వము నలుపు, పెద్దతనము మున్నగు ధర్మములు ఒకే శబ్దముచే బోధింపబడవని భావము.

ఘటమునందు ఘటత్వము ద్రవ్యత్వము మున్నగు జాతి, నలుపు తెలుపు మున్నగు గుణము, చలనము మున్నగు క్రియ, అల్పత్వము మున్నగు పరిమాణము, ఏకత్వము మున్నగు సంఖ్య, కర్తృత్వము మున్నగు కారకము, ఇంకను ఇట్టి విశేషము లెన్నియో కలవు. అవియే ఘటవ్యక్తిని ఇతర వస్తువులనుండి వేరుచేయుచున్నవి. అన్ని విశేషములతో గూడియున్నట్లు ఘటమును బోధింపతలచిన అన్ని శబ్దములను ఉపయోగింపవలెను. అట్టి ఘటమును ఒకే శబ్దము బోధింపజాలదు

ఇట్లే 'శుక్ల' అను శబ్దముచే తెలుపు అను అర్థము బోధింపబడుచున్నది. కాని దానియందు గుణత్వము శుక్లత్వము మున్నగు జాతి, ఏకత్వము మున్నగు సంఖ్య, భాసురత్వము నిర్మలత్వము మున్నగు ఎన్నియో విశేషములు కలవు కాని వాని నన్నిటిని శుక్ల శబ్దము బోధింపజాలదు వానిని బోధింపదలచిన పెక్కు శబ్దములను ప్రయోగింపవలెను. కనుకనే అవి విశేష శబ్దములుగా గ్రహింపబడుచున్నవి. అట్లుకాక ఎల్ల విశేషములతో గూడిన ఘటాదులను ఒకే శబ్దము బోధించిన, నది సామాన్య శబ్దమే యగును కాని లోకమున నట్లు కానరాదు.

కాబట్టి ఏ విశేషమును బోధింపదలచెనో, ఆ విశేషమును ఆ శబ్దముచేతనే చూపవలెను. అట్టి శబ్దముచే లభించిన గుణములే ద్రవ్యమునందు ఉత్కర్షమును జూపగలవు

శుక్లతరం రూపమ్ మున్నగు ప్రయోగములలో గూడ భాసురత్వాది విశేష గుణములు గూడ శుక్ల శబ్దవాచ్యములే యగును. అట్లుకాక పై నియమమును అనుసరించి భాసురత్వాదులు శుక్ల శబ్ద వాచ్యములే కానిచో భేదక ధర్మము లేనందున నచట తరబాదులు ప్రవర్తింపక పోయెడివి.

కాబట్టి ప్రామాణికమగు ప్రయోగము యొక్క బలముచే నిచట మాత్రము విశేష ధర్మములు కూడ శుక్లాది శబ్దవాచ్యములనుటయే లెస్స. ॥4॥

అవతారిక — ద్రవ్యము నిజరూపమున శబ్దవాచ్యము కానేరదు. మరియు దానియందు ఉత్కర్షాపకర్షములు స్వతః సంభవింపవు. అందుచే దానియందున్న గుణములను గ్రహించి వానిద్వారా దానికి శబ్దవాచ్యత్వము, ఉత్కర్షాపకర్ష వ్యవహారము నిర్వహింపవలెనని ఇంతవరకు చూపబడినది.

కాని గుణముల సాహాయ్యము ద్రవ్యమునకు శబ్దవాచ్యత్వమును పొందుపరచుటక్తై

ఉపయోగపడుచున్నది అంతమాత్రముచే గుణముల సాహాయ్యము అనగా వాని బలము ఉపయోగింపబడి క్షీణించినందున, మరల గుణములు ద్రవ్య ప్రకర్షకు గూడ ఎట్లు సహకరింపగలవు ? అనగా గుణములు ద్రవ్యమునకు రెండు విధములగు ఉపకారములను ఎట్లు చేయగలవు ? ద్రవ్యము శబ్దముచే బోధింపబడుటకై గుణములు సహకరించినందున నవియే మరల ప్రకర్షకు కారణము లెట్లు కాగలవు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ వస్తూపలక్షణే తత్ర విశేషో వ్యాపృతోయది ।
ప్రకర్షో నియమాభావాత్స్యాద విజ్ఞాతహేతుకః ॥ 5

తత్ర = ఆ స్థలములలో అనగా 'శుక్లతరః పటః', 'శుక్లతరం రూపమ్' మున్నగు ప్రయోగములలో, విశేషః = విశేషము అనగా శుక్లరూపము భాసురత్వము మున్నగు విశేషము, వస్తూపలక్షణే = ద్రవ్యమాత్రమును శబ్దముచే బోధించుటయందే, వ్యాపృతః + యది = వ్యాపారము కలది యగుచో, అనగా అంతమాత్రమున గుణము చరితార్థమై ప్రకర్షాధాయకము కూడ కాకున్న, నియమాభావాత్ = నియమము లేనందున, ప్రకర్షః = ఉత్కర్షము, అవిజ్ఞాతహేతుకః = తెలియబడని హేతువు కలదై, స్యాత్ = కావచ్చును, ఏ గుణమునుబట్టి ఈ ప్రకర్షము కలుగుచున్నదో తెలియక పోయెడిని.

శుక్లాది గుణసంబంధము లేనిది పటము మున్నగు ద్రవ్యము శబ్దవాచ్యము కానేరదు. శబ్దముచే బోధింపబడుటకై గుణములు ద్రవ్యములతో సంబద్ధములగుచున్నవి. అంత మాత్రాన అవి ఉపయోగపడుటచే చరితార్థములు కావచ్చును కాని వాని యుపయోగము అంతమాత్రమే అని భావింపరాదు. అట్లైన ఉత్కర్షాపకర్షములు నిర్హేతుకములే కావలెను అట్లు లోకానుభవము లేదు. కాబట్టి గుణములు ద్రవ్యము శబ్దవాచ్యమగుటయందు తోడ్పడుచు ఆ ద్రవ్యమునందు ఇతర వస్తువుకంటె ఉత్కర్షాపకర్షములకు కారణములు కూడ కాగలవు. ॥5॥

అవతారిక — 'నికృష్ట తరః' (చాల నీచుడు), ప్రకృష్టతరః (మిక్కిలి ప్రకర్ష కలవాడు) అను ప్రయోగములు కానవచ్చుచున్నవి. కాని నికృష్టునియందు ఉత్కర్ష మెట్లు ? ప్రకర్షకల వానికి ఇంకను ప్రకర్ష ఎట్లు ? అట్టితరి అతిశాయనిక ప్రత్యయము లెట్లు ప్రవర్తింప గలవు ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వం చ సర్వతోఽవశ్యం నియమేన ప్రకృష్యతే ।
సంసర్గిణా నిమిత్తేన నికృష్టేనాధికేన వా ॥ 6

నికృష్టేన = తక్కువ యగునట్టి, వా = కాక, అధికేన = అధికమగునట్టి, సంసర్గిణా = సంబంధించియున్న, నిమిత్తేన = నిమిత్తముచే, సర్వం + చ = ఎల్ల వస్తువు, సర్వతః = ఎల్ల వస్తువులను బట్టి, నియమేన = నియతముగా, ప్రకృష్యతే = ప్రకర్షకలదిగా గ్రహింపబడుచున్నది.

ప్రతి వస్తువు సజాతీయ వస్తువునుబట్టి న్యూనాధిక భావమును బొందును. న్యూన

త్వమునసే మిక్కిలి న్యూనమగుచో నదియు తరబాది ప్రత్యయములను బొందును. దానికంటె తక్కువగానున్నది. లేదని యర్థము భాసించును. నీచులు ఒక తెగకు చెందినవారుందురు. వారిలో గూడ ఉచ్చ నీచభావము తప్పక యుండును. ఒకే విధమగు నీచత్వము ఎల్లరియందు ఉండదు. ఆ స్థితిలో నూటికి అరువదిపాళ్ళు మంచి గుణములు కలవాడొకడు, ఏబది పాళ్ళు మంచి గుణములు కలవాడు మరియొకడు అను రీతిని భేదము వారిలో నుండును. ఆ సంఘమున నూటికి నూరుపాళ్ళు చెడుగుణములు కలవాడు 'నికృష్ట తరః' అను పదముచే వాడబడును. నీచభావమున వానికంటె నీచుడు మరియొకండు లేడను భావము భాసించును. ఈ పద్ధతిలో నీచత్వమున ఆధిక్యముండుటచే నచట నట్టి ఉత్కర్షమును గ్రహించి తరతమ ప్రత్యయములు ప్రవర్తింప గలవు.

అట్లే ఉత్తములు ఒక తరగతికి చెందియుందురు. వారిలో నూటికి పదిపాళ్ళు చెడు గుణములు కలవాడొకడు, అయిదుపాళ్ళు చెడుగుణములు కలవాడు మరియొకడు, అను రీతిని తారతమ్యము నియతముగా నుండును. నూటికి నూరుపాళ్ళు మంచిగుణములు కలవాడు సర్వోత్తము డగును.

ఇట్లే ఏమియులేదను నర్థమును బోధించునపుడు 'న' శబ్దముకంటె తరబాదులు ప్రవర్తించును. 'నతరామ్'. 'న' శబ్దమునకు అభావమర్థము. అభావమనగా లేమి. ఆ లేమిలో గూడ ఏమియులేదనెడి స్థితిని పై శబ్దము సూచించును. లేమిలో పరమావధి ఉత్కర్షముగా భావింపగా తరబాదులు ప్రవర్తించును. ॥6॥

అవతారిక — గోతరా (ఈ రెండు గోవులలో ఈ గోవు ఉత్కృష్టమైనది) 'అశ్వతరః' (ఈ రెంటిలో ఈ యశ్వము ఉత్కృష్టమైనది) అను ప్రయోగములు కానవచ్చుచున్నవి. ఇచట ఉత్కర్షమునకు కారణమగు గుణము ఏదియు శబ్దవాచ్యమై లేదు. గోత్వము, అశ్వత్వము అను జాతులు మాత్రము భాసించుచున్నవి. అవి ఎల్ల వ్యక్తులకు సమానములే కాన, ప్రకర్షహేతువులు కానేరవు కాగా పై ప్రయోగముల కుపపత్తి యెట్లు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నాపేక్షతే నిమిత్తం చ ప్రకర్షే వ్యాపృతం యది ।
ద్రవ్యస్య స్యాదుపాదానం ప్రకర్షం ప్రత్యనర్థకమ్ ॥ 7

(ద్రవ్యమ్) = ద్రవ్యము, ప్రకర్షే = అతిశయము చూపదలచినపుడు, వ్యాపృతమ్ = వ్యాపారముతో గూడిన అనగా విశేషముగానున్న, నిమిత్తమ్ = నిమిత్తమును, న + అపేక్షతే + చేత్ = అపేక్షింపనిచో, ప్రకర్షం + ప్రతి = ఇతర వస్తువులకంటె తనయందున్న ఉత్కర్షమును గూర్చి అనగా దానిని వ్యక్తపరచుటకై, ద్రవ్యస్య = ద్రవ్యముయొక్క, ఉపాదానమ్ = స్వీకారము, అనర్థకమ్ = ప్రయోజనము లేనిది, స్యాత్ = కావలెను. నిరూపింపదలచిన అతిశయము వ్యక్తముకానందున 'గోతరా' అను ప్రయోగమే లేకపోయెడిని అని భావము,

జాతినిబట్టి అతిశయము లభింపదు. అది ఎల్ల వ్యక్తులకు సాధారణమేకదా ! పై ప్రయోగములు సార్వత్రికములై యున్నవి. ఉత్కర్షను సంపాదించెడి మరియొక గుణము ఆ శబ్దముచే చెప్పబడుట లేదు. అందుచే ఈ రీతిగా సమన్వయము చేయవలెను. ఆవులకు పాలు ఇచ్చుట స్వభావము. పాలు ఇచ్చుట అనే గుణమునుబట్టి ప్రకర్ష వివక్షితమగును. కాగా దోహన క్రియనుబట్టి, తరతమ భావము చెప్పనగును. ఈ రెండు ఆవులలో ఈ ఆవు అధికముగా పాలు ఇచ్చును అను అర్థమును వ్యక్తపరచుటకై 'గోతరా' అను శబ్దము ప్రయుక్తమగును.

వృషభములకు బరువుమోయుట, పొలము దున్నుట మున్నగు పనులు స్వాభావికములు. వానినిబట్టి ప్రకర్షము వివక్షితము కాగలదు. వృషభతరః.

అశ్వమునకు పరుగెత్తుట స్వాభావికము. దానినిబట్టి ప్రకర్షము వివక్షితము కానగును. అశ్వతరః.

పై ప్రయోగములలో గవాది శబ్దములకు గోత్వాది జాతియేకాక దోహనము, వాహనము, పలాయనము మున్నగు క్రియలు గూడ వాచ్యములే యగును వానినిబట్టి తర - తమ భావము గుర్తింపబడును. అట్లుకాకున్న గవాది శబ్దముల ప్రయోగము వ్యర్థమే యగును. ॥7॥

అవతారిక— ప్రకరణార్థమును ముగింపుచున్నాడు.

శ్లో॥ సవ్యాపారో గుణస్తస్మాత్స్వప్రకర్షనిబన్ధనః ।
ద్రవ్యాత్మానం భినత్త్యేవ స్వప్రకర్షే నివేశయన్ ॥ 8

తస్మాత్ = ఆ కారణమువలన, అనగా ద్రవ్యమునకు స్వతః ఉత్కర్షాపకర్షములు సంభవింప నందున, స్వప్రకర్షనిబన్ధనః = తనయొక్క అనగా గుణము యొక్క ఉత్కర్షము కారణముగా గల, కనుకనే సవ్యాపారః = వ్యాపారముతోగూడిన అనగా విశేషణముగానున్న, గుణః = గుణము (రూపము, భాసురత్వము, నైర్మల్యము, దోహనము, వాహనము పలాయనము మున్నగు) స్వప్రకర్షే = తనయొక్క అనగా ద్రవ్యముయొక్క ఉత్కర్షమునందు, ద్రవ్యాత్మానమ్ = ద్రవ్యస్వరూపమును, నివేశయన్ = ఉంచుచున్నదై, భినత్తి + ఏవ = ఇతర వస్తువునుండి తప్పక వేరుచేయగలదు.

గుణములకు ఉత్కర్షాపకర్షములు సంభవించును వానిని తనకు ఆశ్రయమగు ద్రవ్యమునకు సంబంధింపజేసి ఇతర వస్తువునుండి ఆ ద్రవ్యమును గుణములు వేరుచేయు చున్నవి.

అవతారిక— గుణములయందున్న ఉత్కర్షాపకర్షములు ద్రవ్యమున కెట్లు సంబంధించును ? అన్యధర్మము అన్యమునకు కలుగుట అసంభవము కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అరూపం పరరూపేణ ద్రవ్యమా[illegible]యతే యథా ।
అప్రకర్షం ప్రకర్షేణ గుణస్యాభ[illegible]క్ష్యతే తథా ॥ 9

యథా = ఏ రీతిగా, అరూపమ్ = రూపములేని అనగా స్వతః తన రూపము తప్ప మరియొక రూపములేని. ద్రవ్యమ్ = స్ఫటికము మున్నగు వస్తువు, పరరూపేణ = ఇతర వస్తువుయొక్క రూపముచే, ఆఖ్యాయతే = చెప్పబడుచున్నదో, మంకెనపూవుయొక్క ఎరుపుతనము స్ఫటికము నందు భాసింపగా, తెల్లగానున్న స్ఫటికము కూడ 'స్ఫటికము ఎఱ్ఱగానున్నద'ని చెప్పబడు చున్నదో యని భావము.

తథా = అట్లే, అప్రకర్షమ్ = స్వతః ఉత్కర్షాపకర్షములులేని, పటము మున్నగు ద్రవ్యము, గుణస్య = శుక్లరూపము మున్నగు గుణముయొక్క, ప్రకర్షేణ = ఉత్కర్షముచే, ఆవిశ్యతే = ఆవేశింపబడుచున్నది, అనగా ఆక్రమింపబడుచున్నది.

అన్యధర్మములు అన్యత్ర సంక్రమించుటలో సామీప్యము కారణము కాగలదు. తెల్లని స్ఫటికము దగ్గర ఎఱ్ఱ పూవు ఉన్నచో దాని ఎరుపుతనము స్ఫటికమునందు సంక్రమించును. అట్లే గుణములకు గుణములుకలవానికి భేదము గృహీతము కానందున గుణముల ధర్మములు ద్రవ్యమునకు సంక్రమింపగలవు.

కాక అరూపమ్ = రూపములేని నిర్గుణ పరబ్రహ్మము అనెడి, ద్రవ్యమ్ = ద్రవ్యము, పరరూపేణ = అనాది సిద్ధమగు మాయయొక్క సంబంధమువలన కలిగెడి రూపము మున్నగువాని సంబంధముచే యథా = ఏ రీతిగ, ఆఖ్యాయతే = వ్యవహరింపబడు చున్నదో అని దృష్టాంతవాక్యమున కర్థము చెప్పవలెను. ॥9॥

గుణసముద్దేశము ముగిసినది

దిక్సముద్దేశము—6

అవతారిక— ద్రవ్యము మున్నగు పది పదార్థములు మూడవ కాండమున నిరూపింపబడుచున్నవని ప్రతిజ్ఞచేసి ద్రవ్యమును గుణమును నిరూపించి, ఈ సముద్దేశమున దిక్కును నిర్ణయించుచున్నాడు. దిక్కునకు పరాధీనత్వము స్వాభావికము, అట్టి ధర్మము కలవియగుటచే సాధన క్రియాకాలములను గూడ పేర్కొనుచున్నాడు.

శ్లో॥ దిక్ సాధనం క్రియా కాల ఇతి వస్త్వభిధాయినః ।
శక్తిరూపం* పదార్థానా మత్యన్తమనవస్థితాః ॥ 1

1. దిక్, 2 సాధనమ్, (కర్త, కర్మ, కరణము మున్నగు కారకము), 3. క్రియా, 4. కాలః ఇతి = అనెడి ఈ నాల్గు శబ్దములు, పదార్థానామ్ = కడవ నేల, నీరు మున్నగు సిద్ధ స్వభావకములగు పదార్థములయొక్క అనగా వానియందు కల, శక్తిరూపమ్ = శక్తి స్వరూపమగు వస్తు = వస్తువును, అభిధాయినః = చెప్పు స్వభావము కలవి.

కాని, అత్యన్తమ్ = మిక్కిలి, అనవస్థితాః = నియతములై కానరావు, అనగా దిక్కు మున్నగు అర్థములు తార్కికులచే ఎట్లు నిర్వచింపబడినవో, అట్టి యర్థములతో ఈ శబ్దములకు సంబంధము కానరాకున్నది, అట్టి యర్థములను వ్యాకరణశాస్త్రమున సూత్రములలో నుపయోగింపబడిన దిగాదిశబ్దములు బోధింపలేదు. కాబట్టి అసాధారణములగు వీని యర్థములను జూపి తదనుసారముగా సరియగు లక్షణములను వివరించి సిద్ధాంతమును దెలుపవలెనని భావము.

దిక్కు మున్నగు నాలుగు పదార్థములును, భూమి మున్నగు స్వతంత్రపదార్థముల యందున్న శక్తిరూపములు, అనగా కార్యవిశేషమును కలిగించెడి సామర్థ్యవిశేషములు, దిగాదులు స్వతంత్ర వస్తువులు కానేరవు, పరాధీనత్వము శక్తికి అసాధారణమగు రూపము.

సూర్య సంయోగమునుబట్టి భూమి మున్నగు స్వతంత్ర పదార్థములయందు దిక్శక్తి అభివ్యక్తమగును. కనుక ఇది పరాధీనమే.

సాధనశబ్దము కర్త, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణ, హేతువులు అను కారకములను బోధించును. పదార్థముల శక్తియే కారకము. "శక్తిః కారకమ్" అని మహాభాష్యకారుని నిర్ణయము.

క్రియ ద్రవ్యములవలన జనియించును. ద్రవ్యాశ్రితమగుటచే నిదియు పరాధీనమే.

కాలము ఇతర వస్తువుల నాశ్రయించియే యున్నందున పరాధీనము.

---

* పాఠాంతరము — రూపే,

పై భావములు ఆ యా సముద్దేశములలో వ్యక్తమగును.

వైశేషికులు - క్రియ స్వతంత్ర పదార్థమనియు, దిక్కాలములు స్వతంత్ర ద్రవ్య రూపములనియు చెప్పుచు, వానికి ఏవో కొన్ని లక్షణములను జూపియున్నారు.

కాని యట్లు చెప్పుట పొసగదు. పై రీతిని దిగాదులు శక్తిరూపములు గదా ఈ యభిప్రాయముతో 'అత్యన్తమనవస్థితాః' అని భర్తృహరి పలికెను. వైశేషికులు చేసిన నిర్ణయమును స్వీకరించినచో వ్యాకరణ సూత్రముల యర్థము సరియగు మార్గాన లభింపదు. వ్యాకరణ సూత్రాలలో దిగాదిశబ్దము లుపయోగింపబడియున్నవి.

"దిక్శబ్దేభ్యః ... దిగ్దేశకాలేషు" (5-3-27) ఇత్యాది.

ప్రకృతకారికయందలి 'శక్తిరూపమ్' అనుదానికి బదులుగా 'శక్తిరూపే' అను సప్తమ్యంతపాఠమే తరచుగ కానవచ్చుచున్నది ఆ పాఠమున నీ రీతిగా సమన్వయము చేయ వలెను.

వస్త్వభిధాయినః = సిద్ధస్వభావమగు వస్తువులను బోధించు స్వభావముకల, దిక్, సాధనం, క్రియా, కాలః, ఇతి = దిక్ మున్నగు నాల్గు శబ్దములు అనగా వైశేషికుల మతము ననుసరించి స్వతంత్రపదార్థ బోధకములగు దిగాదిశబ్దములు, పదార్థానామ్ = పదార్థముల యొక్క అనగా వానియందున్న, శక్తిరూపే = శక్తి స్వరూపము విషయమై, అత్యన్తమ్ = మిక్కిలి, అనవస్థితాః = నియతరూపములై కాకున్నవి.

పెరవారు చెప్పిన అర్థములను దిగాదిశబ్దములు బోధింపజాలవు. వారి మతము చొప్పున నా శబ్దములు స్వతంత్ర పదార్థవాచకములు, నిజమున దిగాదులు శక్తిరూపములని భావము.

శక్తిరూపమ్, శక్తిరూపే, అను పాఠములలో సమన్వయభేదమే, తాత్పర్య భేదము లేదు. ॥1॥

అవతారిక— మొదటి శ్లోకమున దిక్కు సాధనము క్రియకాలము అనునవి శక్తి రూపములని చెప్పబడినది. వానిలో సాధనమునకు క్రియకు పాణిని వ్యాకరణమున గల హేతువులను జూచి లక్షణము చెప్పవలెను. అనుమాన ప్రమాణముచే వాని స్వరూపము నిర్ణ యింపవలెను ఆ యంశము సాధనక్రియా (7, 8) సముద్దేశములలో నిరూపింపబడును. దిక్కాలములలో కాలము యొక్క స్వరూపము 9 వ సముద్దేశమున చెప్పబడును. ప్రస్తుతము దిక్కునకు లక్షణము చెప్పుచున్నాడు.

శ్లో॥ వ్యతిరేకస్య యో హేతురవధి ప్రతిపాద్యయోః ।
ఋజ్వీత్యేవం యతోఽన్యేన వినా బుద్ధిః ప్రవర్తతే ॥ 2

కర్మణోజాతి భేదానా మభివ్యక్తిర్యదాశ్రయా ।
సాస్వైరుపాధిభిర్భిన్నా శక్తిర్దిగితి కథ్యతే ॥ 3

దిక్శక్తి నిజరూపమున ఒక్కటియే, కాని దగ్గరగానున్న వస్తువుల సంపర్కవశమున నది పది విధములుగా కానవచ్చుచున్నది. అది ప్రత్యక్షముగా కానరానందున యుక్తములగు హేతువులచే గుర్తింపబడుచున్నది. ప్రస్తుతము మూడు హేతువులచే దిక్శక్తికలదని నిరూపించుచున్నాడు.

1. అవధి ప్రతిపాద్యయోః = అవధికి అవధిమత్తునకు గల, వ్యతిరేకస్య = భేదమునకు అనగా ఆ రెంటికిగల సంబంధమునకు, యః = ఏది, హేతుః = కారణమో.

'వృక్షః పర్వతాత్ పూర్వః' (చెట్టు కొండకంటె ముందుగానున్నది) చెట్టు ఎచటనున్నది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుటకై దానికి దగ్గరగానున్న వస్తువులను హద్దుగా జూపి నిర్ణయించుట లోకసహజము. అట్టి చెట్టు ప్రతిపాద్యము, అనగా అదియే నిర్ణయింపదగినది. హద్దుగా చూపబడిన పర్వతము అవధి ప్రతిపాద్యమగు వృక్షము అవధిమత్తు అనగా అవధికలది. ఆ రెంటికి అవధ్యవధిమత్సంబంధము కలదని యెల్లరికిని తెల్లమే. ఈ సంబంధము కేవలము పర్వతమును వృక్షమును నిమిత్తముగా గైకొని లభించునది కాదు. పర్వతాదులయందుండెడి పర్వతత్వము మున్నగు జాతులనుబట్టియు ఆ సంబంధము చెప్పతగదు. ఇచట జాతి యనునది వివక్షితమే కాదుకదా! మరియొక నిమిత్తము చెప్పనలవి కానందున పరిశేషన్యాయముచే దిక్శక్తిని బట్టియే ఈ రెంటికి ఈ సంబంధము కలుగుచున్నదని చెప్పక తీరదు.

2. అన్యేన+వినా = మరియొకవస్తువు లేకున్నను, యతః = దేనివలన, ఋజు= తిన్నగా ఉన్నది, ఇతి + ఏవమ్ = ఈ రూపముతోనున్న, బుద్ధిః = జ్ఞానము, ప్రవర్తతే = కలుగుచున్నదో,

శ్లోకమున 'ఋజు' అనునది వక్రత్వము మున్నగువానికి గూడ ఉపలక్షణము. అనగా వానిని కూడ గ్రహింపవలెను

ఈ వెదురుకట్టె తిన్నగా ఉన్నది. ఇది వక్రముగా ఉన్నది అను రీతిని లోకుల వ్యవహారము కలదు అందు భూమి మున్నగు పదార్థముల సంబంధములేకయే అట్టి వాడుక కలుగుచున్నది అట్లు వ్యవహరించుటకు ఏదియో నిమిత్తముండవలెను. ఆ నిమిత్తమే దిక్కు కాగలదు ఒకే దిక్కువైపు పదార్థము ప్రసారము కలదియగుచో తిన్నగా ఉన్నదనియు, అట్లుకాక నానాదిక్కులవైపు ప్రసరించిన వంకరగా ఉన్నదనియు భావింపవచ్చును

3. కర్మణః = కర్మయొక్క అనగా ఎత్తుట, దించుట మున్నగు వ్యాపారముల యొక్క, జాతిభేదానామ్ = జాతులకు కల భేదములకు అనగా విభిన్నములగు కర్మ జాతులకు, అభివ్యక్తిః = స్పష్టత, యదాశ్రయా = ఏది ఆశ్రయముగా గలదియో.

కర్మ అనగా పని. దానియందు కర్మత్వజాతి కలదు. ఉత్క్షేపణము (ఎత్తుట), అవక్షేపణము (దించుట), ప్రసారణము (చాచుట), ఆకుంచనము (లాగుకొనుట) మున్నగు రీతిని ఆకర్మ పలు విధములుగా నున్నది. వీనియందును ఉత్క్షేపణత్వము మున్నగు జాతులు కలవు. ఈ వ్యాపారములు మనకు ప్రత్యక్ష సిద్ధములు. వీనియందు గల విభిన్నములగు జాతులకు వ్యంజకము దిక్శక్తి హస్తమును మీదుగా ఎత్తగా ఉత్క్షేపణమందురు. ఇట్టివి యన్నియు ఆ యా దిక్కులవైపు హస్తాదుల ప్రసారణముచే కలుగుచున్నవి.

కారికయందు 'కర్మణః' అనునది జాత్యేకవచనాంతము

సా = అట్టి, శక్తిః = శక్తి, స్వైః = తనకు సంబంధించిన, ఉపాధిభిః = ఉపాధులచే, భిన్నా = భిన్నమైనదై, దిక్ + ఇతి = దిక్కు అని, కథ్యతే = చెప్పబడుచున్నది.

ఉప + ఆ + దధాతి అనువ్యుత్పత్తిచే తనకు దగ్గరగానున్న దానికి తన గుణమును సంక్రమింపచేయునది, ఉపాధి యనబడును. ఉదా : ఎఱ్ఱని వస్తువు తనకు దగ్గరగా ఉన్న తెల్లని స్ఫటికమునకు తన ఎరుపుతనమును సంక్రమింపచేయు చున్నది కాగా ఎఱ్ఱని వస్తువు ఇచట ఉపాధి కాగలదు. అట్లే దిక్శక్తి నిజరూపమున ఒక్కటియే ఐనను సూర్యసంయోగము కల ప్రదేశములనెడి ఉపాధులచే పది విధములగు పరిణామములను జెందుచున్నది

మధ్యాహ్నకాలమున సూర్యబింబము ఉత్తర ముఖముగా నుండును. అట్టి సూర్యబింబమునకు అభిముఖముగాఉన్నది ఉత్తరము, ఉదయపర్వతమునకు సంబంధించినది తూర్పు, పశ్చిమ పర్వతమునకు సంబంధించినది పడమర, సూర్యబింబమునకు వెనుకభాగమున నున్నది దక్షిణము అను నామములు కలుగుచున్నవి. ఇట్లే ఈశాన్యము మున్నగు నాలుగు విదిక్కులు, ఊర్ధ్వము, అధరము అని రెండు, మొత్తము పది దిక్కులుగా దిక్శక్తి విభక్తమగుచున్నది. ॥2,3॥

అవతారిక — వస్తువులకు గల పరత్వాపరత్వములు దిక్శక్తివలననే కలుగుచున్నవని చెప్పుచున్నాడు

శ్లో॥ పరాఽపరత్వే మూర్తానాం దేశభేదనిబన్ధనే ।
తత ఏవ ప్రకల్ప్యేతే, క్రమరూపేతుకాలతః ॥ 4

A. మూర్తానామ్ = మూర్తములగు వస్తువులకు సంబంధించినట్టియు, దేశభేదనిబన్ధనే = దేశముయొక్క భేదము కారణముగాగల, పరత్వాపరత్వే = పరత్వము అపరత్వమును అనగా ముందువెనుక అనునవి, తతః + ఏవ = దానివలననే అనగా దిక్శక్తివలననే, ప్రకల్ప్యేతే = కలుగుచున్నవి

పరిమితమగు పరిమాణముకల వస్తువులు మూర్తములనబడును. అట్టి వస్తువులకు కలిగెడి పరత్వము అపరత్వము అనునవి భిన్నమగు దేశమునుబట్టి కలుగును. "ఈ పర్వతము ముందుగా ఉన్నది. దాని తరువాత వృక్షమున్నది" అను రీతిని వస్తువులు ముందు వెనుక

ఉన్నవని లోకులు వ్యవహరింతురు. ముందు వెనుక అని తెలిసికొనుటకు భూమియొక్క ప్రదేశము కారణమగుచున్నది భూప్రదేశమునకు పరత్వాపరత్వములు దిక్కువలన కలుగు చున్నవి. దిక్కునుబట్టి భూప్రదేశమునకు 'ఇది ముందు, ఇది వెనుక' అని వ్యవహారములు కలుగును. అట్టి దేశముయొక్క పరత్వాపరత్వములను బట్టి వృక్షము మున్నగు మూర్త వస్తువులకు పరత్వాపరత్వములు కలుగుచున్నవి.

B. క్రమరూపే = క్రమరూపములగు, పరత్వాపరత్వే + తు = పరత్వాపరత్వములు మాత్రము, కాలతః = కాలమువలన, ప్రకల్పేతే = కలుగుచున్నవి.

'ఇచట పూర్వము వృక్షముండెడిది, ఇపుడు గృహమున్నది' అను రీతిని పదార్థ ములకు క్రమము కలదు. ఇట్లే "ఈ కలాశాలలో పూర్వము సుబ్బారాయశాస్త్రి ఉండేవారు. ఇపుడు వేంకటశాస్త్రి ఉన్నారు" అనియు వాడుక కలదు. అది కాలము శక్తివలన కలుగు చున్నది. అది దిక్శక్తికృతము కాదు. కాలమునందు వస్తువుల శక్తులను ప్రతిబంధించుట వానిని కార్యోన్ముఖములుగా ప్రసరింపజేయుట అనెడి అసాధారణములగు రెండు శక్తులు కలవు. ఈ యంశము కాలసముద్దేశమున విపులముగా నిరూపింపబడును. అట్టి కాలముయొక్క శక్తులవలన పదార్థములకు క్రమరూపమగు పరత్వాపరత్వములు కలుగును

కాగా పరత్వము అపరత్వము అనునవి దేశమునుబట్టియు కాలమునుబట్టి కలుగును. దేశమువలన కలిగెడి పరత్వాపరత్వములకు దిక్శక్తి కారణమగుచున్నది. కనుక దిక్శక్తికి కాలశక్తికి సాంకర్యము లేదు. అవి వేరువేరు శక్తులే.

ఇట్టి పరత్వాపరత్వములు మూర్తములకే కలుగును అమూర్తములగు ఆకాశాదు లకు కలుగవు. ॥4॥

అవతారిక — అమూర్తములగు ఆకాశాదులకు గూడ కల్పితములగు పరత్వా పరత్వములు కలుగుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆకాశస్యప్రదేశేన భాగైశ్చాన్యైః పృథక్ పృథక్ ।
సా సంయోగ విభాగానా ముపాధిత్వాయ కల్పతే ॥ 5

ఆకాశస్య = ఆకాశమునకు, ప్రదేశేన = ఏకదేశమగుదానితో, అనగా ఆకసముతో కలిసి యున్న కడవ మున్నగువానితోను, అన్యైః = ఇతరములగు, భాగైః + చ = భాగములతోను అనగా ఘటాదులయొక్క అవయవములతోను, పృథక్ + పృథక్ = వేరువేరుగా, సంయోగ విభాగానామ్ = సంయోగములకును విభాగములకును, సా = ఆ దిక్శక్తి, ఉపాధిత్వాయ = నియమముకొరకు, కల్పతే = సమర్థమగుచున్నది.

ఆకాశము నిజరూపమున అవయవములులేనిది. కాని దానితో కలసియున్న ఘటాది ద్రవ్యముల సంపర్కవశమున దానికి అవయవములు కల్పితములగుచున్నవి. ఈ యభిప్రా యము జాతి సముద్దేశమున 15 వ శ్లోకమున వివరింపబడినది. కాగా అమూర్తమగు ఆకాశము

నకు కల్పితములగు అవయవములు కలవు. అట్లే ఘటాది పదార్థముల అవయవములతో గూడ ఆకాశమునకు సంయోగము కలుగును. వానితో దానికి విభాగము కూడ కలుగును ఈ రీతిగా కలిగెడి సంయోగ విభాగములు దిక్శక్తినిబట్టి కలుగుచున్నవి. ముందుగా ఉన్న ఆకాశముతో కలసియున్నది పూర్వము, అట్లుకానిది పరము అను రీతిగా లోకుల వ్యవహారము కలుగుచున్నది. కాగా అమూర్తమగు ఆకాశముతో కలిగెడి పూర్వ పరవ్యవహారమే ముందుగా కలుగును. దానినిబట్టి మూర్తములగు ఘటాదులకు పరత్వాపరత్వ వ్యవహారము కలుగును ॥౬॥

అవతారిక — దేశమునకు పూర్వాపరభావము దిక్శక్తివలన కలుగును. అని 4 వ శ్లోకమున చెప్పబడినది. దిక్కునకు ఆ శక్తి దేనివలన కలిగినది? అని ప్రశ్నింపగా మరియొక వస్తువువలన, దానికి మరియొక వస్తువువలన అని కల్పింపగా అనవస్థాదోషము కలుగును. ఆ దోషమును వారించుటకై దిక్కునకు ఆ శక్తి సహజము అని చెప్పిన, అట్టితరి దేశమునకే ఆ శక్తి సహజమని యేల చెప్పరాదు? వేరుగా దిక్కును స్వీకరింప నక్కరలేదు కదా? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ దిశా వ్యవస్థా దేశానాం దిగ్వ్యవస్థా న విద్యతే ।
శక్తయః ఖలు భావానా ముపకార ప్రభావితాః ॥ 6

దేశానామ్ = భూమి మున్నగు దేశములకు, వ్యవస్థా = అవధి అనగా ఈ ప్రదేశము ముందు ఈ ప్రదేశము వెనుక అను నియమము, దిశా = దిక్కుచే, (భవతి) = కలుగుచున్నది

దిగ్వ్యవస్థా = దిక్కులయొక్క వ్యవస్థ, న + విద్యతే = లేదు, అనగా మరియొక వస్తువువలన కలుగునది కాదు.

భావానామ్ = పదార్థములయొక్క, శక్తయః = శక్తులు, ఉపకార ప్రభావితాః = ఉపకారముచే కలుగుచున్నవై. (భవన్తి) = అగుచున్నవి.

దేశములకు కడవ మున్నగు పదార్థములను ధరియించుట, వానికి నాధారముగా నుండుట అనెడి స్వతంత్రమగు రూపమున్నది. అట్టి దేశములకు పూర్వాపర భావము కలుగవలెనన్న మరియొక నిమిత్త మపేక్షితమగుచున్నది. దిక్కు అట్టిది కాదు. దాని స్వభావము నిత్యపరతంత్రత. అట్లుకాక అచట మరియొక శక్తిని కల్పించిన నది శక్తిమంతము కావలెను. అట్టితరి దాని శక్తి స్వరూపమే భగ్నము కావలెను. సూర్య సంయోగము కూడ నిమిత్తము కానేరదు. అది, లేని పూర్వాపర భావమును కల్పింపనేరదు. అది దిక్శక్తియొక్క స్వభావమునే వ్యక్తపరచును. ॥6॥

అవతారిక — దిక్కు శక్తిరూపమే, కనుకనే అది యితర వస్తువుల కుపకరించుచున్నదని నిరూపించుచున్నాడు

శ్లో॥ ప్రత్యస్తరూపా భావేషు దిక్ పూర్వేత్యభిధీయతే ।
పూర్వబుద్ధిర్యతో దిక్ సా సమాఖ్యామాత్రమన్యథా ॥ 7

భావేషు = పదార్థములయందు, ప్రత్యస్తరూపా = ఉపాధిగా ఆరోపింపబడిన రూపముకల, దిక్ = దిక్కు, పూర్వా + ఇతి = పూర్వదిక్కు అని అభిధీయతే = వ్యవహరింపబడు చున్నది.

యతః = దేనివలన, పూర్వబుద్ధి = పూర్వబుద్ధి అనగా 'ఇది పూర్వము' ఇట్లే 'ఇది పరము' అనెడి బుద్ధి, కలుగుచున్నదో, సా = అదియే, దిక్ = ముఖ్యమగు దిక్కు, స్వతంత్రమైనదికాక పరోపాధికమగుటవలన శక్తిరూపముగా నున్న పై చూపబడినదియే ముఖ్యముగా దిక్శబ్దార్థము కానోపును.

అన్యథా = అట్లుకాకున్న అనగా పరోపాధికముకాక స్వాతంత్ర్యము కలదియగుచో, సమాఖ్యామాత్రమ్ = ఏదో పేరు మాత్రమే కావలెను, అర్థమును నపేక్షింపక కేవలము 'దిక్' అను నామమాత్రమే అది కావలెను. డిత్థ, డపిత్థ, అను రీతినివలె నిరర్థక శబ్దమే లోకులచే వాడబడుచుండవలెను, కాని అట్లు కానరాదు.

కాబట్టి దిక్కు స్వతంత్ర ప్రదార్థము కాదు. అది శక్తిరూపమే. ॥7॥

అవతారిక — లోకమున 'ఇది పూర్వము, ఇది పరము' అను వ్యవహారము కలుగుచున్నందున, దానిని సమర్థించుటకై వేరుగా దిక్శక్తిని అంగీకరింపవలెనని యింత వరకు చెప్పబడినది. కాని వేరుగా దిక్కును అంగీకరింపనక్కరలేదు. ఏలయన, మనుష్యుని ముఖమునకు ఎదురుగానున్నది పూర్వము, వెనుక భాగముననున్నది పశ్చిమము, కుడిచేతి వైపుననున్నది దక్షిణము, ఎడమచేతి వైపునున్నది ఉత్తరము అను రీతిని వ్యవహారము ఉపపన్నముకాగలదు. సామాన్య ప్రజలు ఇట్లే గుర్తించుచున్నారు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ స్వాఙ్గాద్ వ్యవస్థా యా లోకే న తస్యాం నియతా దిశః ।
ప్రత్యఙ్ముఖస్య యత్ పశ్చాత్తత్పురస్తాద్విపర్యయే ॥ 8

స్వాఙ్గాత్ = ముఖము మున్నగు తన అవయవములను అవధిగాజేసికొని, లోకే = లోకము నందు, యా = ఏ, వ్యవస్థా = వ్యవస్థయో అనగా తూర్పు పడమర అను నియమమో, తస్యామ్ = దానియందు అట్టి వ్యవస్థయందు, దిశః = దిక్కులు, నియతాః = ఏకరూపము లుగా నున్నవై, న = కానేరవు, ఇది తూర్పు, ఇది పశ్చిమము, అనునియతమగు దిక్కుల వ్యవస్థ సిద్ధింపదని భావము.

ఇందు కారణము చెప్పుచున్నాడు

ప్రత్యఙ్ముఖస్య = పశ్చిమమునందు ముఖముకలవానికి, యత్ = ఏది, పశ్చాత్= వెనుకభాగమున నున్నదో, అనగా పడమరయగుచున్నదో, తత్ = అది, విపర్యయే = మార్పుచెందగా మనుష్యుడు ముందుకు తిరుగగా, పురస్తాత్ = ఎదురుగానున్నది, (స్యాత్)= కాగలదు.

మనుష్యుడు ఒక వైపు ముఖముపెట్టుకొని యుండగా వెనుకభాగముననున్నది, 'పడమర' అని వ్యవహరింపరాదు. ఆ మనుష్యుడే అడ్డముగా తిరిగిన అతనికి ఆ వస్తువే పూర్వముగా నున్నట్లుండును. ఆ ప్రదేశమే మరియొకనికి దక్షిణము, మరియొకనికి ఉత్తరము కూడ కావలెను. కాని యట్లు కానరాదు

కాబట్టి పరత్వాపరత్వ వ్యవహారములనుబట్టి వేరుగా దిక్కును నంగీకరించుటయే సమంజసము. ॥8॥

అవతారిక— దిక్కును నిమిత్తముగా జేసికొని పరత్వాపరత్వ వ్యవహారము కలుగుచున్నదని ఇంతవరకు చెప్పియున్నాడు. దిక్కును అపేక్షింపకయే పూర్వ - పర - మున్నగు శబ్దములు రూఢినిబట్టి దేశవాచకములు కాగలవని ఇప్పుడు చెప్పుచున్నాడు.

శ్లో॥ దేశవ్యవస్థానియమో దిక్షు న వ్యవతిష్ఠతే ।
రూఢమప్యపరత్వేన పూర్వమిత్యభిధీయతే ॥ 9

దిక్షు = దిక్కుల విషయమై అనగా దిక్కులను నిమిత్తముగా గైకొని, దేశవ్యవస్థానియమః = దేశములయొక్క అనగా పూర్వదేశము దక్షిణాపథము, ఉత్తరాపథము మున్నగు దేశములకు కలిగెడి, వ్యవస్థయొక్క నియమము అనగా 'ఇది పరము, ఇది పూర్వము' అను నియత వ్యవహారము న + వ్యవతిష్ఠతే = నిశ్చితము కానేరదు.

అపరత్వేన = అపరదేశమునందున్నట్టుగా అనగా పశ్చిమదేశమునందున్నట్లుగా, రూఢమ్ + అపి = రూఢమైనదియు, పూర్వమ్ + ఇతి = పూర్వదేశమునకు సంబంధించి యున్నదని, అభిధీయతే = చెప్పబడుచున్నది.

'ఈ దేశము పూర్వము', 'ఈ పర్వతము పరము' అను వ్యవహారములలో దిక్కు నిమిత్తము కాదు, అచట పూర్వాదిశబ్దములు ఆ యా యర్థములయందు రూఢములే. *కనుకనే పూర్వదేశమునుండి దక్షిణాపథమునకు పయనముచేయు మనుష్యుని 'నీవు ఎచటనుండి వచ్చుచుంటివి?' అని ప్రశ్నించిన 'పూర్వదేశమునుండి వచ్చుచున్నాన'ని సమాధానము చెప్పును. అట్లే ఆ మనుష్యుడే తిరిగి వచ్చుచుండగా ప్రశ్నించిన 'దక్షిణాపథము నుండి వచ్చుచున్నాన'ని సమాధానము చెప్పును. ఇచట దిక్సంబంధములేకయే కేవలము పూర్వ - పర - అను రూఢపదములే దేశములయందు వాడబడుచున్నవి. దిక్కునుబట్టి ఆ మనుష్యుడు పడమరి దేశస్థుడే, అట్టితరి 'పూర్వదేశమునుండి వచ్చుచున్నాను' అను సమాధానము సరిపడదు.

---

* ఈ తొమ్మిదవ శ్లోకము "దిక్శబ్దేభ్యః సప్తమీ పఞ్చమీ ప్రథమాభ్యో దిగ్దేశకాలేష్వస్తాతిః" (5-3-27) అను పాణిని సూత్రమునందలి మహాభాష్యమును వ్యాఖ్యానించుచున్నది. దిక్శబ్దములు దిక్కును దేశమును కాలమును బోధించునపుడు వానికంటె 'అస్తాతి' అనుతద్ధిత ప్రత్యయమును పై సూత్రము విధించుచున్నది ఉదా పురస్తాత్, పరస్తాత్ అచట మహాభాష్యమిట్లున్నది "ఇహాకస్మాన్న భవతి ? పూర్వస్మిన్ దేశే వసతి ? నైష దేశః । దేశవిశేషణమేతత్"

కనుక ఇచట ఒక అవధిని అపేక్షింపకయే పూర్వాది శబ్దములు వాడబడుచున్నవి. అవధి అపేక్షింపనందున నిచట దిక్సంబంధములేదని తెల్లము. అట్టి శబ్దములచే జరిగెడి వ్యవహార మున దిక్కును నిమిత్తముగా గైకొని మరియొక రూపము కలిగిన కలుగవచ్చును ॥9॥

అవతారిక— పూర్వాది శబ్దములు రూఢములే, అవధి సాపేక్షములు కావని 9 వ శ్లోకమున నిరూపింపబడినది. ఆ యర్థమునే *"దక్షిణోత్తరాభ్యామతసుచ్" (5-3-28) అను పాణిని సూత్రమునందలి భాష్యమును జూపి సమర్థించుచున్నాడు.

శ్లో॥ అతోఽభాషితపుంస్కత్వాత్పుంవద్భావో న సిధ్యతి ।
అస్మిన్నర్థే న శబ్దేన ప్రసవః క్వచిదుచ్యతే ॥ 10

అతః = ఈ కారణమువలన అనగా 'పూర్వ, పర'మున్నగు శబ్దములు రూఢములు కనుక, అభాషిత పుంస్కత్వాత్ = భాషిత పుంస్కము కానందున, పుంవద్భావః = పుంవద్భావము అనగా పుంలింగరూపము, న + సిధ్యతి = సిద్ధింపదు, దక్షిణ ఉత్తర మున్నగు శబ్దములు భాషిత పుంస్కములు కానందున వానికి స్త్రీలింగరూపములలో పుంలింగరూపము రానేరదని భావము.

దక్షిణ, ఉత్తర మున్నగు శబ్దములు భాషిత పుంస్కములు కాకపోవుటలో కారణము చూపుచున్నాడు.

అస్మిన్ + అర్థే = ఈ యర్థమునందు అనగా పూర్వాది శబ్దములు రూఢినిబట్టి అర్థమును బోధించునపుడు పూర్వాది దిక్కులకు పై లక్షణము చెప్పునపుడు, శబ్దేన = శబ్దముచే అనగా పూర్వ దక్షిణ ఉత్తర మున్నగు శబ్దములచే, క్వచిత్ = ఎచటను, ప్రసవః = పుంస్త్వము. అనగా పుంలింగము, న + ఉచ్యతే = చెప్పబడదు.

కనుక దక్షిణాది శబ్దములు భాషిత పుంస్కములు కానందున వానికి పుంవద్భావము కలుగకపోయెడినియని భావము.

"దక్షిణోత్తరాభ్యామతసుచ్" (5-3-28) అను సూత్రముచే దక్షిణ, ఉత్తర అను శబ్దములకంటె 'అతసుచ్' ప్రత్యయము విధింపబడినది, దక్షిణ + అతసుచ్ = దక్షిణతః, ఇట్లే ఉత్తరతః.

1. ప్రశ్న— దక్షిణ, ఉత్తర అనునవి అకారాంతములు. వానికంటె 'తసుచ్' ప్రత్యయమును విధించినను పై రూపములు సిద్ధించును. పెచ్చుగ "యస్యేతిచ" అను

---

* దక్షిణ ఉత్తర అను శబ్దములకంటె 'అతసుచ్' అను తద్ధిత ప్రత్యయము ప్రవర్తించునని సూత్రార్థము. ప్రత్యయమున ఉకార – చ కారములు ఇత్సంజ్ఞకములు దక్షిణ + అతస్ 'యస్యేతిచ' (6-4-184) అను సూత్రముచే ప్రకృతిలోనున్న చివరి 'అ' కారము లోపింపగా దక్షిణ్ + అతస్ = దక్షిణతః, దక్షిణమునందు, దక్షిణమువలన, దక్షిణము అని యర్థము, ఇట్లే ఉత్తరతః

(6-4-184) సూత్రముచే 'అ' కారమునకు లోపము చేయనక్కరలేదు. కాగా ప్రత్యయము యొక్క మొదటి 'అ' కారమునకు ప్రయోజనము లేదు.

సమాధానము— దక్షిణా, ఉత్తరా అను స్త్రీ ప్రత్యయాంత శబ్దములకంటెను పై ప్రత్యయము ప్రవర్తించి 'దక్షిణతః, ఉత్తరతః' అను రూపముల సిద్ధికై ప్రత్యయము యొక్క మొదట 'అ'కారమావశ్యకమగుచున్నది. అకారమున్నచో 'యస్యేతిచ' అను సూత్రముచే ప్రకృతియొక్క చివరనున్న 'ఆ'కారము లోపింపగా పై రూపములు సిద్ధించును. అట్లు కాకున్న ఆకారము లోపింపక 'దక్షిణాతః', 'ఉత్తరాతః' అను రూపములుండవలెను. కాని అట్లు లేవు కాబట్టి ప్రత్యయమున అకారమావశ్యకమే.

2. ప్రశ్న— ప్రత్యయమున 'అ'కారము లేకున్నను దక్షిణా + తస్, ఉత్తరా + తస్' అను స్థితిలో *"తసిలాదిష్వాకృత్వసుచః" (6-3-35) అను సూత్రముచే దక్షిణా, ఉత్తరా అను స్త్రీలింగశబ్దములకు పుంవద్భావము అనగా పుంలింగరూపము ప్రవర్తింపగా పై రూపములు సిద్ధించుచున్నవి. కాబట్టి ప్రత్యయమున 'అ'కారము అక్కరలేదు

సమాధానము— పై సూత్రముచే **భాషితపుంస్కమగు స్త్రీ ప్రత్యయాంతమునకే పుంలింగరూపము విధింపబడినది దక్షిణ - ఉత్తర శబ్దములు భాషితపుంస్కములు కానందున పుంవద్భావము ప్రవర్తింపనేరదు. కాబట్టి పై రూపముల సిద్ధికై ప్రత్యయమున 'అ'కారమావశ్యకమే. పూర్వ పరదక్షిణ మున్నగు శబ్దములు దిక్కులను బోధించునపుడు అవి రూఢములే, అచట శబ్దమే ప్రవృత్తినిమిత్తము. ఆ శబ్దములు దేశకాలములను బోధించునపుడు అవధిని అపేక్షించును 'ఈ దేశము పూర్వము' అని పలుకగా నియతముగా 'ఇది దేనికంటె పూర్వము' అను రీతిని అవధి అపేక్షితమగుచున్నది. దీనినే వ్యవస్థయందురు. కాగా దక్షిణ - ఉత్తర శబ్దములు దిక్కును బోధించుటలో ఆ శబ్దములే ప్రవృత్తి నిమిత్తములు అవి దేశకాలములను బోధించుటలో అవధి ప్రవృత్తి నిమిత్తము. ఈ రీతిగా ప్రవృత్తి నిమిత్తము తుల్యము కానందున నివి భాషిత పుంస్కములు కానేరవని తెల్లమే. ఈ యర్థ

---

* తసిల్ మొదలుగాగల కృత్వసుచ్ వరకు ఉన్నతద్ధిత ప్రత్యయములు పరమగునపుడు (భాషిత పుంస్కమగు) స్త్రీలింగ శబ్దమునకు పుంవద్భావము కలుగునని సూత్రార్థము ఉదా 'పటు'శబ్దమునకు స్త్రీ ప్రత్యయాంతరూపము 'పట్వీ', దీనికి తరప్ ప్రత్యయముచేరగా పట్వీ + తర = పుంవద్భావముచే 'పటుతరా' అని యగును. పుంవద్భావమనగా పుంలింగ రూపము

** స్త్రీలింగ శబ్దములుగాని, నపుంసక శబ్దములుగాని ప్రవృత్తి నిమిత్తము ఏకరూపముగా నుండగా పుంలింగమును బోధించిన యెడల, వానిని భాషితపుంస్కము లందురు. భాషితః పుమాన్ యస్మిన్, తత్, భాషిత పుంస్కమ్ ఏ ప్రవృత్తి నిమిత్తమున పుంలింగము చెప్పబడునో అది భాషితపుంస్కమనబడును. భాషితపుంస్కమస్యాస్తీతి = భాషిత పుంస్కః, అట్టి భాషిత పుంస్కము కల శబ్దము భాషిత పుంస్కము. ఉదా మృదు, పటు, యువన్, మృదుత్వము, పటుత్వము, యౌవనము ప్రవృత్తి నిమిత్తములు, అవి ఉభయసాధారణములుగాన అట్టి వానిని భాషిత పుంస్కము లందురు. అట్టి వానికి పుంలింగ రూపము కలుగును.

మంతయు భాష్యమున కలదు. దక్షిణ - ఉత్తర శబ్దములు భాషితపుంస్కములు కానేర పని *మహాభాష్యకారుడు స్పష్టముగా వక్కాణించియున్నాడు. దిగ్వాచక శబ్దములు రూఢ ములై దిక్కులను బోధించుననియే ఆయన తాత్పర్యము అట్లు కాకున్న అవియు అవధి సాపేక్షములన్నచో, నవియు భాషితపుంస్కములే యగుచుండగా ఆ భాష్యము సంగతము కాకపోయెడిని. ॥10॥

అవతారిక— దిక్కులను చెప్పెడి దక్షిణా, ఉత్తరా మున్నగు శబ్దములు వ్యవస్థను బట్టి ప్రయుక్తములు కావనియు, దేశకాల బోధక దక్షిణాది శబ్దములు వ్యవస్థా మూలకములనియు వానికి భేదమును జూపి పుంవద్భావము రాదని 10 వ శ్లోకమున చూపబడినది. కాని ఉత్తరా, దక్షిణా మున్నగు దిక్శబ్దములు కూడ వ్యవస్థా మూలకములే ఉత్తరా అను శబ్దముయొక్క అర్థము తెలియగా 'దేనికంటె?' అను అవధి అపేక్షింపబడుచునే యున్నది. అందుచే పై శబ్దములకు ప్రవృత్తి నిమిత్తము సమానమే యగుచు, పుంబోధకము లగుట వలన పుంవద్రూపము సిద్ధింపగలదు.

1 ప్రశ్న— అట్టితరి దిక్శబ్దములు నిమిత్తముగాగల వ్యాకరణ సూత్రములచే విధింపబడిన "అతసుచ్" మున్నగు కార్యములే రాకపోయెడివి. అవి దిక్కులకు నామధేయ ములుగా ప్రయోగింపబడలేదు కదా!

సమాధానము- ఐనను దిక్కులయందు ప్రయోగింపబడియున్నందున అవి ప్రస్తుతము దేశకాల బోధకములైనను ఆ కార్యములు వానికి ప్రవర్తింపగలవు.

2 ప్రశ్న— అట్లైన 'ఈ దిక్కు రమణీయమైనది' అను లోకుల వ్యవహారమును బట్టి 'రమణీయా' మున్నగు శబ్దములకు గూడ దిక్శబ్ద ప్రయుక్తములగు కార్యములు ప్రవర్తించెడివి

పై ప్రశ్నకు మహాభాష్యకారుడు ఈ రీతిగ సమాధానము చెప్పెను. "దిశి దృష్టః శబ్దః = దిక్శబ్దః, దిశం యో న వ్యభిచరతి" అని దిక్కులకు నామధేయములుగా ఉపయోగింపబడిన శబ్దము దిక్శబ్దమనబడును. పూర్వ - పర - దక్షిణ మున్నగు శబ్దములు ప్రస్తుతము దేశ - కాలవాచకములుగా నున్నను అవి దిక్కులకు నామధేయములుగా నున్నందున వానిని గూడ దిక్శబ్దములనవచ్చును. రమణీయా మున్నగు శబ్దములు దిక్కులకు విశేషణములుగా ఉపయోగింపబడినను అవి పూర్వాది శబ్దములను బోలె దిక్కులకు నామధేయములు కావు.

ఈ రీతిగా చూపబడిన మహాభాష్యకారుని సిద్ధాంతమునే సమర్థించుచున్నాడు.

---

* 'నచైతౌ భాషిత పుంస్కౌ సమానాయామాకృతౌ యద్భాషిత పుంస్క మిత్యుచ్యతే ఆకృత్యన్తరే చ ఇమౌ భాషిత పుంస్కౌ' అని భాష్యము. 'అతసుచ్' ప్రత్యయమున 'అ'కారము గూర్చి ఇంకను భాష్య విచారణ కలదు. కాని ప్రకృతమున కవసరమగు భాష్యము మాత్రమే చూపబడినది.

శ్లో॥ దిక్శక్తేఽభిధానే తు నియతం దిశి దర్శనమ్ ।
పూర్వాదీనాం యథా షష్టేర్జీవితస్యావధారణే ॥ 11

పూర్వాదీనామ్ = పూర్వ - పర - దక్షిణ మున్నగు శబ్దములకు, దిక్శక్తేః = శక్తిరూపమగు దిక్కు యొక్క, అభిధానే + తు = అభిధానమునందే అనగా దిక్కును బోధించునపుడే, దిశి = దిక్కునందు, దర్శనమ్ = ప్రయోగము, జీవితస్య = జీవనము యొక్క, అవధారణే= నిశ్చయము విషయమై, షష్టేః + యథా = షష్టి శబ్దమునకువలె, నియతమ్ = నిశ్చితమైనది అనగా మార్పుచెందనది, (భవతి) = కలుగుచున్నది, రమణీయాది శబ్దముల ప్రయోగమట్టిది కాదని భావము.

పూర్వ - పర మున్నగు శబ్దములు ఇతరములగు నుపాధుల నపేక్షింపకయే రూఢిని బట్టి తూర్పు, పడమర మున్నగు దిక్కులను బోధించును ఆ శబ్దములే వ్యవస్థను అనగా అవధిని నిమిత్తముగా గైకొని దేశకాలములను బోధించును. కాగా దిక్కులను బోధించెడి పూర్వాది శబ్దములు రూఢములు. ఆ శబ్దములే దేశకాల వాచకములగుచో నైమిత్తికములు అట్టి రెండు విధములగు పూర్వాది శబ్దములు భిన్నములే వానికి ఐక్యము లేదు. రూఢి శబ్దములకు, నైమిత్తికములగు శబ్దములకు అభేదము చెప్పుట సాధ్యము కాదు కదా !

పై రీతి రెండు విధములగు పూర్వాది శబ్దములు భిన్నములే ఐనను రూపసామ్యమును బట్టి దేశకాల వాచకములగు పూర్వాది శబ్దములు కూడ దిక్శబ్దములుగానే గ్రహింపబడి వ్యాకరణ శాస్త్రమున చూపబడిన దిక్శబ్ద కార్యములను బొందగలవు రమణీయాది శబ్దము లట్టివి కానందున వానికి ఆ కార్యములు ప్రవర్తింపనేరవు. మరియు శబ్దముల ప్రయోగములు లోకమున కానబడియుండగా వానికి వ్యాకరణము ప్రక్రియా మార్గమును జూపగలదు. దిక్శబ్దములకు పర్యాయ పదములుగా రమణీయాది శబ్దములు లోకమున ప్రయోగింపబడి యుండ నందున వానికి దిక్శబ్ద కార్యములు ప్రవర్తింపవు.

రూపసామ్య మున్నంత మాత్రాన వానికి అభేద మెట్లు ? అను ప్రశ్నకు సమాధానముగా శాస్త్రసమ్మతమగు అర్థము దృష్టాంతముగా జూపబడినది. 'యథాషష్టేర్జీవితస్యావధారణే'. 'షష్టి' శబ్దమునకు 60 అని యర్థము. కాగా ఆ శబ్దము సంఖ్యావాచకము. అట్లైనను 'ఇతని జీవితము 60 సంవత్సరములు' అను అర్థమును వివక్షించునపుడు ఆ శబ్దము కాలవాచకమై రూపసామ్యమునుబట్టి కాలవాచక శబ్దములకంటె వచ్చెడి వ్యాకరణ విహితమగు ప్రత్యయములను బొందును. షష్టిం + భూతః = షష్టికః, (ఇతడు 60 సంవత్సరములు కలవాడు)

కాగా షష్టి శబ్దము బోలె పూర్వాది శబ్దములు దేశకాల వాచకములు కూడ దిక్శబ్ద కార్యములను పొందగలవు. "దిశం యో న వ్యభిచరతి" అను మహాభాష్యకారుని పలుకు చాల యుక్తముగా నున్నది. ॥11॥

అవతారిక — దిక్కువలన కలిగెడి మరియొక కార్యమును జూపుచున్నాడు.

శ్లో॥ ఛాయాఽఽతపాభ్యాం నగాదీనాం భాగభేదః ప్రకల్ప్యతే ।
అతద్ధర్మస్వభావేషు భాగభేదో న కల్ప్యతే ॥ 12

A. నగాదీనామ్ = పర్వతము మున్నగువానికి, ఛాయాఽఽతపాభ్యామ్ = నీడచేత, వెలుతురు చేత, భాగభేదః = అవయవముల యొక్క భేదము, ప్రకల్ప్యతే = కల్పితమగుచున్నది.

కొండ మున్నగు వస్తువులు నిజరూపమున ఒకటిగానే కానవచ్చును. కాని ఒకే పర్వతమున ఒక శిఖరమున సూర్యకిరణముల ప్రసారముచే వెలుతురు, అదే సమయమున మరియొక శిఖరమున సూర్యకిరణములు సోకక ఛాయయు అనగా నీడయు కనబడును. దానినిబట్టి చూడగా ఆ పర్వతమున భిన్నములగు అవయవములు అనగా పూర్వము పరము అను రీతిని భాగములున్నవని తెల్లము. అట్లుకాకున్న ఒకే పర్వతమునకు ఒకే సమయమున ఒకవైపు వెలుతురు, ఒకవైపు నీడయు కలుగనేరదు. పై రీతిని పరత్వాపరత్వ భేదము దిక్శక్తిచేతనే కలుగుచున్నదని చెప్పక తీరదు. దిక్శక్తియే లేనిచో పూర్వ - పర భావములే లేనందున పై వ్యవహారము ఉపపన్నము కానేరదు. కాబట్టి అట్టి అవయవ భేదముచే దానికి కారణమగు దిక్శక్తి అనుమితమగుచున్నదనుట లెస్స.

B. పై రీతిని అన్వయ ముఖమున దిక్శక్తిని సాధించి, వ్యతిరేకముఖమున దానినే చూపుచున్నాడు.

అతద్ధర్మ స్వభావేషు = పరత్వాపరత్వములనెడి దిక్శక్తియొక్క ధర్మము లేకపోవుటయే స్వభావముగాగల పదార్థములయందు అనగా అమూర్తములగు వానియందు, భాగభేదః = అవయవముల భేదము, న + కల్ప్యతే = కల్పితము కానేరదు.

ఆకసము మున్నగు అమూర్తములకు అవయవములు లేనందున అచట దిక్శక్తిచే అవయవములు అనుమితములు కానేరవు.

అమూర్తములయం దవయవకల్పన లేకుండుట, మూర్తములగు పర్వతాదులయం దవయవకల్పన ఉండుటయు ఈ రెండును దిక్శక్తికి అనుమాపకములు కాగలవు. అనగా వానిని హేతువులుగా గ్రహించి అనుమాన ప్రమాణముచే దిక్శక్తిని నంగీకరింపవలెను. ॥12॥

అవతారిక — కడవ మున్నగు మూర్త వస్తువులకు అవయవములు కానవచ్చుచున్నవి. అందొక విశేషము కలదు. ఆ వస్తువులకు అవయవములు సాక్షత్తు దిక్శక్తివలన కలుగవు. మరియేమన, దిక్కువలన అమూర్తములగు పరమాణువులకు అవయవములు కల్పితములగును. అట్టి వానివలన కడవ మున్నగు వానికి అవయవములు కల్పితములగుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ పరమాణోరభాగస్య దిశాభాగో విధీయతే ।
భాగప్రకల్పనాశక్తిం ప్రథమాం తాం ప్రచక్షతే ॥ 13

అభాగస్య = స్వతః అవయవములులేని, పరమాణోః = పరమాణువునకు, దిశా = దిక్శక్తిచే, భాగః = అవయవరూపమగు భాగము, విధీయతే = చేయబడుచున్నది, అనగా కల్పింపబడు చున్నది.

ప్రథమామ్ = మొదటిదియగు, భాగప్రకల్పనాశక్తిమ్ = అవయవకల్పకమగు శక్తిని, తామ్ = దిక్కునుగా, ప్రచక్షతే = శాస్త్రజ్ఞులు పలుకుచున్నారు.

పరమాణువునకు స్వతః అవయవములు లేవు. కాని దిక్కువలన దానికి 6 భాగములు కల్పితములగుచున్నవి. తూర్పు, పడమర, దక్షిణము, ఉత్తరము, ఊర్ధ్వము, అధో భాగము అను ఆరు దిక్కుల వశమున నిరవయవములగు పరమాణువులకు 6 భాగములున్నట్లు కానవచ్చును. అట్లే ప్రతి పరమాణువునకు 6 భాగములు కలుగును ఈ రీతిగా పరమాణువులు సావయవములు కనుక వానికి పరస్పరము సంయోగము కలుగును. ద్వ్యణుకాదిక్రమమున స్థూల పదార్థము జనియించుచున్నది కాబట్టి పరమాణువునకు భాగకల్పన దిక్శక్తినిబట్టియే కలుగుచున్నది.

పై రీతిని అమూర్తములగు పరమాణువులకు భాగములు ముందుగా కలుగగా వానిని బట్టియే మూర్తములగు కడవ పర్వతము మున్నగువానికి భాగములు కల్పితములగుచున్నవి.

కాగా ప్రాథమికావయవ కల్పన దిక్శక్తిచేతనే కలుగుచున్నది. ॥13॥

అవతారిక — కడవ మున్నగు పదార్థములు విలక్షణములగు అవయవముల సన్నివేశముకలవై జనియించుచున్నవి. అట్లుండుటలో దిక్కువలన కలిగెడి ఉపకారమేమి యున్నది? దిక్సంబంధ మక్కరలేకయే వస్తువులు ఆయా విశిష్టరూపమున నుండగలవు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ అదేశాశ్చాప్యభాగాశ్చ నిష్క్రమా నిరుపాశ్రయాః ।
భావాః, సంసర్గిరూపాత్తు శక్తిభేదః ప్రకల్ప్యతే ॥ 14

భావాః = పదార్థములు, అదేశాః + చ = దేశభేదము లేనివే, అనగా ఆకాశము మున్నగు విభు పదార్థములకు నిజరూపమున అవయవములు లేవని భావము.

అభాగాః + అపి + చ = (పదార్థములు) అవయవములు కలవికూడ కావు. అనగా భూమి మున్నగు పదార్థములకు గూడ వానికి ఆత్మరూపముననే యుండెడి అవయవములు లేవని భావము.

అట్టి రెండు విధములగు పదార్థములు, నిష్క్రమాః = క్రమము లేనివే. క్రమము భేదమునుబట్టి కలుగును. నిజరూపమున ఏ పదార్థమునకు గూడ అవయవములు లేమి చేతనున భేదము భాసింపదు. కాబట్టి వానికి క్రమము కూడ ఉండనేరదు.

ఆ పదార్థములు నిరుపాశ్రయాః = ఆశ్రయము లేనివి. అనగా ఉపాధి లేనివి.

సన్నిహితమగు వస్తువునకు రూపాంతరమును కల్పించునది ఉపాధి. దీనికి ఉదాహరణము 8 వ శ్లోకమున చూపబడినది. దానినే ఆశ్రయమందురు.

పదార్థముల స్వభావమిదియే— వానికి అవయవములు లేవు. కనుకనే వానికి క్రమము లేదు. వానికి ఉపాధియు లేదు.

ఇట్లున్నను సంసర్గిరూపభేదాత్ + తు = తనతో సంబంధము కల దేశముయొక్క రూపభేదము వలన మాత్రము, శక్తిభేదః = శక్తిభేదము, అనగా ఆధారము, అవయవి మున్నగు కార్యమునకు కారణమగు శక్తిభేదము, కల్పతే = కలుగుచున్నది.

పదార్థములకు తన దగ్గరగా ఉన్న ఇతర వస్తువుల సంపర్కవశమున నూతనమగు పరిణామవలు కలుగకపోవచ్చును. కాని తనకు సంబంధించియున్న దేశమువలన మాత్రము కొన్ని వ్యవహారములు కలుగవచ్చును. సూర్య సంయోగవశమున దిక్కునకు పది విధములగు నామములు కలుగునని 2, 3 శ్లోకములలో నిరూపింపబడినది. అందు ఏదో ఒక దిక్కుతో సంబంధము కలుగగా అది ఆధారమగుచున్నది. ఉదా. కపాలములు అధరమనెడి దిక్కుతో సంబంధించి ఘటమనెడి కార్యమునకు ఆధారములగును. దారములు వస్త్రమనెడి కార్యమునకు ఆధారములగుచున్నవి. అచటనే సమవాయవశమున అవయవముల భేదము భాసింపక విశిష్టమగు ఘటము, వస్త్రము, మున్నగు కార్యము జనియించును. తరువాత కడవయందు కపాలము అవయవములుగా, వస్త్రమున దారము అవయవములుగా, ఆకాశాదులకు ఘటాదులవలన భాగములు ఏర్పడుచున్నవి.

కాగా అవయవరహితములగు పదార్థములు దేశభేదమున ఆధారము కార్యము మున్నగు రూపములను బొందుచున్నట్లు దిక్కునుబట్టియు పదార్థములకు పూర్వత్వ పరత్వాదుల భేదముచే నానాత్వ వ్యవహారము కలుగును. అది దిక్కువలననే కలుగుచున్నది.

కాబట్టి దిక్సంబంధము లేనిచో ఘటపటాదులు ఆయా విశిష్టరూపమున నుండజాలవు. ॥14॥

అవతారిక— కడవ మున్నగు పదార్థములకు అవయవములున్నట్లు ఎల్లరికిని తెల్లమే. దేశ భేదముచే వానికి భేదము ప్రత్యక్ష సిద్ధమే వాని పరిమాణము కూడ అనుభవ సిద్ధమే. ఇట్లుండగా వానికి అవయవములు లేవు, వానికి క్రమము లేదు అనుట యెట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

**శ్లో॥ నిర్భాగాత్మకతా తుల్యాపరమాణోర్ఘటస్య చ ।
భాగః శక్త్యన్తరం తత్ర పరిమాణం చ యత్తయోః ॥** 15

పరమాణోః = పరమాణువునకు, ఘటస్య + చ = ఘటమునకును, నిర్భాగాత్మకతా = భాగములు లేకపోవుట అనగా నిజరూపమున ఎట్టి అవయవములు లేకపోవుట, తుల్యా = సమా

నమే, కడవ కంటికి కానవచ్చును. పరమాణువు కానరాదు. ఐనను నిజరూపమున అవయవములు లేకుండుట రెంటికి సమానమే యని భావము.

తత్ర = ఆ రెంటియందు, భాగః = భాగము అనగా అవయవము, శక్త్యన్తరమ్= శక్త్యంతరమే అనగా ఇతర శక్తుల ప్రభావమువలన కలిగినదే.

దిక్శక్తియొక్క ప్రభావముచే పౌర్వాపర్యము కలుగును. అనగా దారములు కారణములుగా నున్నందున పూర్వరూపము. వస్త్రము ఉత్తరరూపము. కపాలములు పూర్వరూపము. కడవ కార్యము కనక ఉత్తరరూపము అను భావభేదము కలుగును. తరువాత కార్యకారణములకు కల భేదము సమవాయవశమున కానరాక అవయవ కల్పన కలుగును. దారములు అవయవములుగా నున్నట్లు వాడుక కలుగును. కాగా భాగకల్పన ముఖ్యము కానేరదు. అది గౌణమే. అట్లుకాక కడవ మున్నగు వానికి భాగములు వాస్తములేయగుచో ఏకోఘటః (ఒక కడవ) అను రీతిని ఏకత్వ వ్యవహారము కలుగకపోయెడిని

చ = మరియు, తయోః = వానికి అనగా ఘటపరమాణువులకు, యత్ = ఏ, పరిమాణమ్ = పరిమాణమో, (తత్) = అదియు, శక్త్యన్తరమ్ = శక్త్యంతరమే, అనగా దిక్శక్తివలన కలిగినదే.

పరమాణువునకు ఘటమునకు పరిమాణమున భేదము కలదు. పరమాణువు అణురూపము, అంతకంటె తక్కువ పరిమాణము లేదు. కనుకనే అది పరమాణువని వ్యవహరింపబడుచున్నది. ఘట పరిమాణ మట్టిది కాదు. దానియందు మహత్త్వమున్నది. పై రీతిని వానికి భేదము ప్రత్యక్షముగా కానవచ్చుచుండగా ఆ రెంటికి తుల్యత్వ మెట్లు? అని ప్రశ్నింపరాదు. 'ఇది మహత్తు, ఇది అణువు' అను భేదమునకు దిక్శక్తియే కారణము ఆ శక్తి విశేషమే పరిమాణముగా గుర్తింపబడుచున్నది. అంతియేకాని అవయవ సంబంధ ముండుటచే 'కడవ మహత్తు' అనియు, అవయవ సంబంధము లేనందున 'పరమాణువు అణువు' అనియు వ్యవహరింపబడి యుండలేదు. అట్లనుట కవకాశము కూడ చాలదు.

ఉపాధి సంబంధము లేనిచో ఎల్ల వస్తువులు లోకవ్యవహారమునకు శబ్దముచే బోధింపబడుటకు అర్థములు కాక నిర్గుణ పరబ్రహ్మ రూపములే, అట్టివానికి ఉపాధి సంబంధమున పలు పరిణామములు కలుగును. ఆ యవస్థలో దిక్శక్తియు అవయవ కల్పనకు తోడ్పడుచున్నది. ॥15॥

అవతారిక— కడవ మున్నగు వస్తువులకు ఉపాధివశమున భేదము కానవచ్చుచుండగా 'వానికి అట్టి భేదము కలుగదు' అనుట యెట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ యతః ప్రకల్ప్యతే భేదో భేదస్తత్రాపి దృశ్యతే ।
అదృష్టోపరతిం భేదమతోఽయుక్తతరం విదుః ॥ 16

A యతః = దేనినుండి అనగా ఏ వస్తువునుండి, భేదః = భేదము అనగా మరియొక వస్తువునకు భేదము, ప్రకల్ప్యతే = కల్పితమగుచున్నదో, తత్ర + అపి = ఆ వస్తువునందును అనగా హద్దుగా జూపబడిన వస్తువునందును, భేదః = భేదము అనగా మరియొక వస్తువునుండి భేదము, దృశ్యతే = చూడబడుచునే యున్నది

'వస్త్రముకంటె ఘటము వేరు, ఇది ఎల్లరుకు తెల్లమే' ఇచట వస్త్రమును అవధిగా జూపి దానికంటె ఘటము వేరుగానున్నదని మనమెల్లరము భావింతుము. ఆ వస్త్రమునకు కూడ తన అవయవములగు దారములకంటె భేదము స్పష్టము. వానికి కూడ వాని అవయవములకంటె, వానికి కూడ వాని అవయవములకంటె భేదము కాన్పించును. ఈ రీతిగా చూచిన వస్త్రమునకు కారణములగు పృథివీ పరమాణువుల వరకు ఆలోచన జరుగును. అచటను దిక్కువలన కలిగెడి ఆరు భాగములున్నందున, వాని మూలమున పరమాణువునకు భేదము కలుగును వానికి దిక్కువలన, దిక్కునకు సూర్యసంయోగవశమున, దానికి మేరు పర్వతము యొక్క అవయవముల వలన, వానికి దిక్కువలన భేదము కలుగును.

B. పై రీతిని భేదము కలుగుట సమ్మతమే అని చెప్పరాదు. ఏలయన, అట్టితరి ఆ భేదమునకు నిలుకడ లేదు. మితి కలుగదు. అనవస్థాది దోషములు కలుగును. కనుక భేదము లేదనుటయే లెస్స. అది కుదురదు అనిచెప్పుచున్నాడు.

అతః = ఈ కారణము వలన, అనగా ఏ వస్తువును హద్దుగా జూపి మరియొక వస్తువునకు భేదము చూపుచున్నామో, ఆ వస్తువునకు గూడ మరియొక వస్తువువలన భేదము కాన్పించుచున్నందున, అదృష్టోపరతిమ్ = కానరాని నిలుకడ అనగా అంతముకల, భేదమ్= భేదమును, అయుక్తతరమ్ = మిక్కిలి అయుక్తమైనదానిగా, విదుః = తెలిసికొనుచున్నారు శాస్త్రము తెలిసినవారు భావింతురని భావము.

పదార్థములకు స్వతః భేదము సిద్ధింపదు. అంతియేకాదు. ఉపాధుల వలనను వానికి భేదము లభింపదు ఈ యభిప్రాయము కారికలో 'తర' ప్రత్యయముచే వ్యక్తమగుచున్నది.

కాబట్టి పదార్థముల నానాత్వము జ్ఞానరూపముననే కాన్పించును. నిజరూపమున వానికి భేదము లేదనియే ముఖ్య తాత్పర్యము. ఈ యర్థమునే 18 వ శ్లోకము వ్యక్తపరచుచున్నది. ॥16॥

అవతారిక — దిక్కు వ్యాపకమనియు అమూర్తమనియు చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వత్ర తస్యకార్యస్యదర్శనా ద్విభురిష్యతే ।
విభుత్వ మప్యేతదేవాహు, రన్యః కార్యవతాం విధిః ॥ 17

1. సర్వత్ర = ఎల్ల దేశములయందు, తస్య = ఆ, అనగా దిక్కువలన కలిగెడి, కార్యస్య= కార్యము అనగా పూర్వము పరము మున్నగు కార్యము, దర్శనాత్ = కనబడుటవలన. దిక్కు, విభుః = విభువుగా, ఇష్యతే = అంగీకరింపబడు చున్నది.

ఇది పూర్వము, ఇది పరము అనెడి కార్యములు ఎల్ల దేశములయందు కనబడు చున్నందున దిక్కు వ్యాపకమని తేలుచున్నది వ్యాపకమనగా అంతట వ్యాపించియున్నదని యర్థము

2. ఏతద్ + ఏవ = దీనినే, అనగా వ్యాపకత్వమునే ఎల్ల దేశములయందు కార్యమును కలిగించుటనే, విభుత్వమ్ + ఇతి = విభుత్వమని, ఆహుః = చెప్పుచున్నారు

పరిమితమగు పరిమాణము కలవి మూర్తములనబడును అట్టి ఎల్ల మూర్త ద్రవ్యములతో సంయుక్తమగుట విభుత్వమనబడునని తార్కికులు తలంతురు

పై కారణములచే దిక్కు వ్యాపకము కనుకనే విభువు అని యంగీకరింపవలెను.

3. కార్యవతామ్ = శరీరములకు అనగా మూర్తములకు, అన్యః = మరియొకటి యగు విభుత్వము, విధిః = సమ్మతము

మూర్తములు అవయవములచే విస్తృతమగు దేశమును వ్యాపించుటయే వానికి కల విభుత్వము. ॥17॥

అవతారిక — దిక్కునకు భేదము చెప్పనలవి కాదని 16 వ శ్లోకమున చెప్పబడిన యర్థమునే దృఢపరచుచున్నాడు.

శ్లో॥ చైతన్యవత్ స్థితా లోకే దిక్కాలపరికల్పనా ।
ప్రకృతిం ప్రాణినాం తాం హి కోఽన్యథా స్థాపయిష్యతి ॥ 18

A. లోకే = లోకమునందు, చైతన్యవత్ = ఆత్మవలె, దిక్కాల పరికల్పనా = దిక్కుయొక్క కాలముయొక్క కల్పన, స్థితా = రూఢమైయున్నది

ఆత్మ ఉన్నదని ఎల్ల శాస్త్రములు చెప్పుచున్నవి. అట్టి ఆత్మకు భేదము చెప్పుట అలవి కాదు. అట్లే దిక్కు కలదనుట ఎల్లరులకు సమ్మతమే. దానికి భేదము చెప్పుట సాధ్యము కాదు. కాలము కూడ ఇట్టిదే.

పదార్థము తెలియబడనిదై వ్యవహారమునకు సరిపడదు. ఆత్మ దిక్కు కాలము అనునవి కంటికి కానరాకున్నను వ్యవహారమున కుపకరించుటచే నవి లేవని చెప్పనలవి కాదు అవిలోక వ్యవహారమున రూఢములై యున్నవి

B. ప్రాణినామ్ = ప్రాణులకు, ప్రకృతిమ్ = స్వభావరూపమగు, తామ్ = ఆ దిక్కాల కల్పనను, కః = ఎవడు, అన్యథా = మరియొక విధముగా, స్థాపయిష్యతి = ఉంచగలడు అనగా మార్పుచేయ గలడు ? హి = ఇది ప్రసిద్ధమే కదా !

ప్రాణులకు ప్రాణమెట్టిదో దిక్కాలములు కూడ అట్టివే. వానిని విడిచినచో లోక వ్యవహారమే జరుగనేరదు. పండితుడు కూడ ఈ వ్యవస్థను మార్పుచేయలేడు. ॥18॥

అవతారిక— పండితుడు కూడ దిక్కాల వ్యవస్థను పూర్వుచేయజాలడు అను 18 వ శ్లోకము యొక్క అర్థమునే సమర్థించుచున్నాడు

శ్లో॥ సంకరో వ్యవహారాణాం ప్రకృతేః స్యాద్విపర్యయే ।
తస్మాత్త్యజన్నిమాన్ ధర్మాన్ పునరేవావలమ్బతే ॥ 19

A. ప్రకృతేః = స్వభావముగా నుండెడి పదార్థముయొక్క అనగా దిక్కాలముల యొక్క విపర్యయే = వైపరీత్యమున అనగా వానిని స్వీకరింపని యెడల, వ్యవహారాణామ్ = లోకులచే చేయబడుచున్న నియతములగు వ్యాపారములకు, సంకరః = సంకరము, స్యాత్ = కాగలదు.

'ప్రాఙ్ముఖః అన్నాని భుఞ్జీత' (తూర్పు ముఖముగానుండి అన్నము తినవలెను). 'అపరాహ్ణేశ్రాద్ధం కుర్యాత్' (అపరాహ్ణ కాలమున శ్రాద్ధము పెట్టవలెను) అనురీతిని దిక్కాలములను అనుసరించి ఎన్నియో లోకవ్యవహారములు అనాదిగా జరుగుచున్నవి దిక్కాలములను అంగీకరింపని యెడల పై వ్యవహారములు సంకీర్ణములు కావలెను.

B. తస్మాత్ = అందువలన, అనగా దిక్కాలములను విడనాడుట శక్యము కానందున ఇమాన్ = ఈ, భావాన్ = దిక్కు, కాలము మున్నగు పదార్థములను, త్యజన్ = విడచినవాడైనను అనగా శుష్క తర్కవాదముచే 'ఈ పదార్థములు నిరూపింప శక్యముకావు' అని విడిచినవాడైనను, పునః = మరల, అవలమ్బతే + ఏవ = పరిగ్రహించుచునే యున్నాడు. పండితుడు కూడ వ్యవహారదశలో దిక్కాలములను స్వీకరించుచునే యున్నాడని భావము.

పరమార్థదశలో ప్రపంచకము పూర్వాపరభావము లేనిదే ఐనను తత్త్వసాక్షాత్కారము కలుగువరకు వ్యవహారదశలో పెద్దలుచూపిన మార్గములను శ్రుతి స్మృతులు చూపిన ధర్మములను మనుష్యు లాచరింపక తప్పదు. తత్త్వసాక్షాత్కారము కలిగినను ప్రారబ్ధవశమున దేహములో నున్నంతవరకు జీవన్ముక్తుడు కూడ దిక్కాలముల ననుసరింపక తప్పదు. శుష్కతర్కము నుపయోగించి 'దిక్కాలములు లేవు' అని పలికినను వ్యవహారదశలో వానిని పరిగ్రహించుచునే యున్నాడు. ॥19॥

అవతారిక— నిర్గుణ పరబ్రహ్మమును అవిద్య, మాయ అను నామాంతరములు గల ప్రకృతి అనాదిగా అంటిపెట్టుకొని యున్నది. దాని శక్తియే కాలము. కాలమునకు గూడ విచిత్రములగు శక్తులు కలవు. ఈ యర్థము ఈ కాండమున కాలసముద్దేశమున (9) విపులముగా చూపబడగలదు. అట్లే దిక్కుకూడ తనకు ఉపాధిగా నున్న పదార్థముల సంబంధముచే భిన్న రూపములను దాల్చి ప్రపంచకమున పరత్వాపరత్వాది వ్యవహారములను కలుగచేయుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్యాస్తు శక్తేః పూర్వాదిర్భేదో భావాన్తరాశ్రయః ।
భిన్నాదిక్తేన భేదేన భేదాత్మైవోపకల్ప్యతే ॥ 20

తస్యాః = ఆ, శక్తేః = దిక్శక్తికి, పూర్వాదిః = పూర్వము మున్నగు అనగా ఇది పూర్వము ఇది పరము, ఇది దక్షిణము మున్నగు, భేదః + తు = భేదమైతే, భావాన్తరాశ్రయః = ఇతరములగు పదార్థములు నిమిత్తముగా గలదియే.

దిక్శక్తి నిజమున ఏకరూపముగనే ఉండును. దానికి నానాత్వము లేదు. కాని ఇతర పదార్థముల సంపర్కమనే నిమిత్తమునుబట్టి దిక్శక్తికి భేదము కలుగుచున్నది. ఈ యర్థము 3 వ శ్లోకమున చూపబడినదే, మరల ఇచట విశేషరూపమున భేదము చూపబడినది. కనుక పునరుక్తిదోషము వాటిల్లదు.

తేన = ఆ, భేదేన = భేదముచే అనగా ఇతర వస్తువుల సంపర్కముచే కలిగెడి భేదముచే, భేదాయ + ఏవ = భేదముకొరకే, ఉపకల్పతే = సమర్థమగుచున్నది.

వేరువేరు పదార్థములు భాసించునపుడే పూర్వత్వము పరత్వము అనెడి భేదము భాసించును. నిజరూపమున మాత్రము దిక్కు ఏకరూపమే. ॥20॥

అవతారిక — ఈ రీతిగా దిక్శక్తిని నిరూపించి, దిక్కును పురస్కరించుకొని కలిగెడి కార్యములను జూపుచున్నాడు.

శ్లో॥ అవధిత్వేన వాఽపేక్షా, యోగే దిగ్లక్షణో విధిః ।
పూర్వమస్యేతి షష్ఠ్యేవ దృష్టా ధర్మాన్తరాశ్రయే ॥ 21

1. అవధిత్వేన + వా = అవధిరూపముననే అనగా హద్దుగానే, అపేక్షా = అపేక్షించుట, (కార్యాయ + కల్పతే) = కార్యముకొరకు సమర్థమగుచున్నది.

లోకమున రెండు పదార్థములలో ఒకదానిని అవధిగ గ్రహించిన దాని మూలమున దిక్కును నిమిత్తముగా జేసికొని 'దీనికి ఇది ముందు, దీనికి ఇది వెనుక' అను రీతిని వ్యవహార రూపమగు కార్యము జరుగుచున్నది. ఇది లౌకిక కార్యము.

2. దిక్కునుబట్టి కలిగెడి శాస్త్రీయ కార్యమును జూపుచున్నాడు.

యోగే = అవధితో సంపర్కము వివక్షింపబడగా, దిగ్లక్షణః = దిక్శబ్దము నిమిత్తముగా గల, విధిః = పంచమీవిధి (భవతి) = కలుగును.

*"అన్యారాదితరర్తే దిక్శబ్దాఞ్చూత్తరపదా జాహియుక్తే" (2-3-29) అను సూత్రముచే పాణిని దిక్శబ్దయోగమున పంచమీ విభక్తిని విధించెను. ఉదా. "పూర్వో గ్రామాత్ వృక్షః" (వృక్షము గ్రామముకంటె ముందుగానున్నది) ఇది శాస్త్రీయ కార్యము.

---

* అన్య 'ఆరాత్' ఇతర, ఋతే (లేకున్న) దిక్శబ్ద, అఞ్చూత్తరపద (ప్రాక్ మున్నగునవి) ఆచ్ – ఆహ్ (ఇవితద్ధిత ప్రత్యయములు) వీనితో యోగముండగా పంచమీ విభక్తి కలుగునని సూత్రార్థము. అన్యః ఇతరః కృష్ణాత్, ఆరాత్ వనాత్ (దగ్గరకాక దూరము) ఋతేజలాత్, ప్రాక్ వనాత్, దక్షిణా గ్రామాత్, దక్షిణా హి గ్రామాత్ మున్నగునవి ఉదాహరణములు.

3. దిక్శబ్దయోగమున కొన్ని చోటులందు షష్ఠీవిభక్తి కానంబడియెడి, దానికి ఉపపత్తి చూపుచున్నాడు.

ధర్మాన్తరాశ్రయే = మరియొక ధర్మము అనగా అవయవత్వము అను ధర్మము ఆశ్రయముగాగల, యోగే = సంబంధము కలుగగా, పూర్వమ్ + అస్య = దానికి ముందు, ఇతి = అనురీతిని, షష్ఠీ + ఏవ = షష్ఠీ విభక్తియే, దృష్టా = చూడబడుచున్నది.

అవధికి అవధిమత్తునకు అవధ్యవధిమత్సంబంధమును వివక్షించిన పంచమీ విభక్తి కలుగును అచటనే అవయవావయవి భావసంబంధమును వివక్షించిన షష్ఠీవిభక్తి కలుగును. ఉదా. పూర్వం కాయస్య, (శరీరముయొక్క పూర్వభాగము) ॥21॥

అవతారిక — ఇది పూర్వము, ఇది పరము అను శాబ్దవ్యవహారమున పూర్వాపర భావము పూర్వాది దిక్కులను పురస్కరించుకొనియే జరుగుచున్నది ఇంతియే కాని మనుష్యుని అవయవములను బట్టి కాదు. కనుకనే సంకీర్ణముకాక నిశ్చితమగు వ్యవహారమే కలుగుచున్నదని చెప్పుచున్నాడు

శ్లో॥ పూర్వాదీనాం విపర్యాసో న దృష్టోఽవధ్యసఙ్కరే ।
ఋజ్వేతదస్యేత్యేతచ్చ లిఙ్గం నవ్యతికీర్యతే ॥ 22

1. అవధ్యసంకరే = అవధులకు సాంకర్యము లేనపుడు అనగా అవధులను అపేక్షింపనందున (అనగా అనిశ్చితము కానందున) పూర్వాదీనామ్ = పూర్వాదులకు అనగా పూర్వము పరము అను వానికి, విపర్యాసః = వ్యత్యాసము అనగా తారుమారు, న + దృష్టః = కానరాదు.

ఇది పూర్వము, ఇది పరము అను వాడుక దిక్కులనుబట్టియే జరుగుచున్నది. మరియొక హద్దును అపేక్షించి జరుగునది కాదు. కనుకనే 'ఇది పూర్వము' అని గ్రహింపగా అది పూర్వమే యగును ఏ వస్తువునుబట్టి ఏది పూర్వమగుచున్నదో, ఆ వస్తువునుబట్టియే అదియే పరము కానేరదుకదా ః అట్లుకాక అవధులనే ఊత గైకొనిన అవధులు నియతములు కానందున వ్యవహారము కూడ సంకీర్ణమే కావలెను. ఇట్లే శరీరావయవములను బట్టి చూచినను సంకీర్ణమే కావలెను

2 అస్య = దీనియొక్క అనగా వెదురు మున్నగుదాని యొక్క, ఏతత్ = ఇది, అనగా మూలము, ఋజు = తిన్ననిది, ఇతి = అనెడి, లిఙ్గం + చ = దిక్కుయొక్క చిహ్నము కూడ, న + వ్యతికీర్యతే = సంకీర్ణము కానేరదు.

ఇచటను అవధి యపేక్షితము కానందున వ్యవహారము సంకీర్ణము కానేరదు.

పై వ్యవహారములలో అవధి యపేక్షితమగుచో హద్దు నియతము కానందున 'ఇది పూర్వము, ఇది పరము' అను నియత వ్యవహారము కలుగకపోయెడిని. ॥22॥

అవతారిక— దిక్కు, కాలము, పర్వతములు, నదులు, పట్టణములు, అను రీతిని బాహ్య ప్రపంచకము కలదనెడి శాస్త్రజ్ఞుల మతము చొప్పున ఇంతవరకు దిక్కు నిరూపింప బడినది.

ఇపుడు విజ్ఞానవాది మతము నాశ్రయించి దిక్కు జ్ఞానరూపమే, దిక్కు అనునది వేరుగా లేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అన్తఃకరణధర్మో వా బహిరేవం ప్రకాశతే ।
అస్మాంత్వన్తర్బహిర్భావః ప్రక్రియాయాం న విద్యతే ॥ 23

A. అన్తఃకరణధర్మః + వా = జ్ఞానముయొక్క ధర్మమే, బహిః = బాహ్యరూపమున, ఏవమ్ = ఈ రీతిగా అనగా దిక్కు రూపమున, ప్రకాశతే = ప్రకాశించుచున్నది.

బాహ్య ప్రపంచకము వేరుగా లేదు. విజ్ఞానమే ప్రపంచరూపముగా భాసించు చున్నది. చైతన్యమే అవిద్యావశముచే దిగ్రూపముగ కానవచ్చుచున్నది.

అన్తఃకరణధర్మః — అన్తః = లోపలనున్న, కరణమ్ = వ్యాపారము, యస్య = దేనికో, తత్, అన్తఃకరణమ్, అను వ్యుత్పత్తిచే ఆ శబ్దము చైతన్యమును బోధించును.

B బాహ్యప్రపంచమే లేనిచో "బహిరేవం ప్రకాశతే" అనుట యెట్లు ? బాహ్యము లేనేలేదు కదా ! అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

అస్యామ్ = ఈ, ప్రక్రియాయామ్ = కల్పనయందు, అనగా విజ్ఞానమే బాహ్య వస్తురూపముగా భాసించుచున్నదనెడి కల్పనయందు, అన్తర్బహిర్భావః = లోపల యందుం డుట వెలుపలి యందుండుట, న + విద్యతే = లేదు.

విజ్ఞానవాది మతమున లేని పదార్థమే అవిద్యావశమున కానబడును. అది నిజ రూపమున విజ్ఞానరూపమే, కాగా బాహ్యపదార్థము లేనందున ఆంతరపదార్థము మాత్ర మెట్లుండును ? రెండు కూడ కల్పితములు. వ్యవహారమును అనుసరించి 'భాసించును' అని మాత్రము అందు గోచరించును

పూర్వత్వము పరత్వము అనునవి వస్తువులయందు ఆరోపింపబడును. అనాదియగు మిథ్యాభ్యాసవశమున చైతన్యమే దిగ్రూపముగా భాసించుచున్నది. కాగా బాహ్యరూపమయిన దిక్కు వేరుగా లేదు. ॥23॥

అవతారిక— దిక్కు బాహ్యపదార్థరూపమున లేదు. విజ్ఞానమే అవిద్యావశమున దిక్కువలె భాసించును. కనుక "దిక్కు ఒకటియా, కాక అనేకమా అనగా నానా" అను వికల్పములకు తావు లేదు. అట్లు వికల్పించుట నిష్ఫలమే, అని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకత్వమాసాం శక్తీనాం నానాత్వం వేతి కల్పనే ।
అవస్తుపతితే జ్ఞాత్వా సత్యతో న పరామృశేత్ ॥ 24

ఆసామ్ = ఈ, శక్తీనామ్ = శక్తులకు అనగా దిక్శక్తులకు, ఏకత్వమ్ + వా = ఏకత్వమా ? అనగా అన్ని దిక్కులయందున్న శక్తి ఏకరూపమా, నానాత్వమ్ + వా = భేదమా ? అనగా ఆ శక్తులు వేరువేరుగా ఉన్నవా ? ఇతి = అనెడి, కల్పనే = వికల్పనములను, అప్రస్తుపతితే = వస్తువుకాని దానియందు లగ్నమైనవని అనగా విచారించుటకు అవకాశము లేనివని, జ్ఞాత్వా = గుర్తించి, సత్యతః = పరమార్థరూపమున, న + పరామృశేత్ = విచారింపరాదు.

విజ్ఞానవాది మతమున చైతన్యము తప్ప వేరు పదార్థము లేదు కాగా దిక్కు అనెడి బాహ్య పదార్థము లేదు కాని ఆ చైతన్యము అవిద్యావశమున ఈ రూపముగా భాసించుచున్నది. ఇట్టి స్థితిలో దిక్కు ఒకటియా, లేక నాలుగా, లేక ఆరా, లేక పదియా అనెడి వికల్పములకు తావు లేదు.

కాబట్టి దిక్కుయొక్క స్వరూపమును యథార్థ బుద్ధితో విచారింపనవసరము లేదు. ॥24॥

అవతారిక— శాస్త్రములలో పదార్థములు లక్షణములతో నిరూపింపబడినవి. కాని అట్టి నిరూపణము అనవసరము. శాస్త్రవిచారణచే తేలిన రూపములతో పదార్థములు లోకమున కానరావు అని చెప్పుచున్నాడు.

శ్లో॥ వికల్పాతీతతత్త్వేషు సంకేతోపనిబన్ధనాః ।
భావేషు వ్యవహారా యే, లోకస్తత్రానుగమ్యతే ॥ 25

వికల్పాతీత తత్త్వేషు = వికల్పములను అనగా దిక్కు ఉన్నదా ? లేదా ? ఉన్నను అది ఒకటియా, అనేకమా, అది కేవలము శక్తి రూపమా, లేక ద్రవ్యరూపమా అను విభిన్నములగు అభిప్రాయములను అతిక్రమించి యున్న స్వభావముకల, భావేషు = పదార్థముల విషయమై, సంకేతోపనిబన్ధనాః = సంకేతము కారణముగాగల అనగా ప్రజలు కల్పించుకొనిన గుర్తులే మూలముగాగల, యే = ఏ, వ్యవహారాః = వ్యవహారములో అనగా పరస్పరాభిప్రాయమును గుర్తించి జరిగెడి నడవడికలో, తత్ర = అందు, లోకః = లోకము, అనుగమ్యతే = అనుసరింపబడుచున్నది, అనగా లోకము దానికి బద్ధమైనడచుచున్నది.

శాస్త్రకర్తలు ప్రతిశాస్త్రమున పదార్థములకు లక్షణములను దెలిపి పరిశోధించి యున్నారు. ఆ పరిశోధనములు పరస్పరము విరుద్ధములుగా నున్నవి.

దిక్కు, కాలము లేనేలేవు, ఒకవేళ ఉన్నను అవి ఆకాశమున అంతర్భూతములే అని కాపిల సాంఖ్యము చెప్పినది.

దిక్కు వేరుగలేదు. కాలము మాత్రము వేరుగా గలదని పాతంజలయోగము ప్రతిపాదించినది.

దిక్కాలములు స్వతంత్ర ద్రవ్యములని ప్రాచీన తార్కికులు నుడివిరి.

లవి ఈశ్వరునికంటె అతిరిక్తములు కావని నవీనతార్కికులు తలంచిరి

ఇట్లే బంగారము మట్టి వికారమని మాధ్వమతస్థులు తలంతురు అది తేజము యొక్క వికారమని వైశేషికులు విశ్వసింతురు.

నిజము చూచిన పదార్థము లిట్లు భిన్న భిన్న రూపములతో నుండనేరవు. వీరి యభిప్రాయములను అతిక్రమించియే పదార్థముండును. శాస్త్రవిచార మెట్లున్నను లోకులు వారి వారి పనులు జరుగుటకై 'ఇది తూర్పు, ఇది పడమర, ఇది బంగారము, దీని విలువ ఇంత, ఇది పర ద్రవ్యము, ఇది పుణ్యము ఇది పాపము' అని ఏవో కొన్ని కట్టుపాట్లు చేసియున్నారు వానిని అతిక్రమింపక నడచుచున్నారు.

దిక్కులు పదియని లోకులు విశ్వసింతురు. అదియే ఎల్ల వ్యవహారములకు మూల మగుచున్నది. విచారణచేసిన నియతమగు రూపములేక అందముగా కానరావు. అవిచారిత రమణీయమే ఈ లోకవ్యవహారము ॥25॥

అవతారిక— మరియు శాస్త్రకారులు చేసిన మార్గములను చూచిన, పదార్థముల భేదాభేదములు కూడ సిద్ధింపవు అనగా పదార్థ మొక్కటియే అనిగాని, ఆ పదార్థములు నానా రూపములు కలవియే అనిగాని నిర్ణయింప సాధ్యముకాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ నైకత్వమస్తి నానాత్వం వినైకత్వేన నేతరత్ ।
పరమార్థే తయోరేష భేదోఽత్యన్తం న విద్యతే ॥ 26

A. నానాత్వమ్ + వినా = అనేకత్వము లేనిది, ఏకత్వమ్ = ఏకత్వము, న = ఉండనేరదు, అట్లే, ఏకత్వేన + వినా = ఏకత్వము లేనిది, ఇతరత్ = ఇతరమైనది, అనగా నానాత్వము, న = ఉండనేరదు.

ఏకత్వము, నానాత్వము అనునవి పరస్పరాపేక్షములు. 3, 4, పదార్థములున్నచో, వానిలో 'ఇది ఒకటి' అని చెప్పవచ్చును. అట్లుకాకున్న 'ఒకటి' అని పలుకుటే పొసగదు, అట్లే ఒక వస్తువుండగా దాని ప్రక్కన మరికొన్ని వస్తువులు చేరగా రెండు, మూడు, నాలుగు అని వ్యవహరింతురు. కాగా పై వ్యవహారములు పరస్పరాశ్రయములు. ఒకదానిని మరియొకటి ఆశ్రయించియే యున్నవి. అట్టితరి వానికి అన్యోన్యాశ్రయమను దోషము ప్రసక్తమైనందున ఏకత్వముగాని అనేకత్వముగాని స్వతంత్రముగా సిద్ధింపదు

B. పరమార్థే = యథార్థమగు విచారణ చేయగా, తయోః = ఆ రెంటికి అనగా ఏకత్వ నానాత్వములకు, ఏషః = ఈ, భేదః = భేదము, అత్యన్తమ్ = ఏమియు, న + విద్యతే = లేదు.

పరమార్థమున జ్ఞానము తప్ప మరియొక వస్తువు లేదు. ఏకత్వ నానాత్వములు లేనేలేవు. పరమార్థమున ఏకత్వముగాని నానాత్వముగాని నిలువజాలవు.

కాని ఆ స్థితిని పొందువరకు లోకవ్యవహారము గజనిమీలికచే జరుగుచున్నది. ఏనుగు బలిష్ఠమగు జంతువు. అదియే కన్ను విప్పి సంచరించిన దానిని ఎవరు పట్టజాలరు. అది విశృంఖలముగా తిరిగిన లోకము పటాపంచలమగును. కాని అట్టి ఏనుగునకు మాంద్యము మెండు. అందుచే నది కన్ను తెరువకయే సంచరించును. అట్లే లోకము కూడ సంచరింప వలెను. పదార్థములను సమూలము పరీక్షించిన ఏదియు నిలువజాలదు.

కాబట్టి లోకుల వ్యవహారము చూచిన దిక్కు- అనుపది ఇతర వస్తువులకు సాహాయ్య మొనరించునట్లు కానవచ్చుచున్నందున నది శక్తిరూపమేయని తెల్లము. ॥26॥

అవతారిక — శక్తిమంతములగు ఘటపటాదులకు ఏకత్వ నానాత్వములు కలుగును. శక్తులకు మాత్రము ఏకత్వ నానాత్వ విచారమర్హముకాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ న శక్తీనాం తథా భేదో, యథా శక్తిమతాం స్థితిః ।
న చ లౌకికమేకత్వం తాసామాత్మను విద్యతే ॥ 27

A. యథా = ఏ రీతిగా, శక్తిమతామ్ = శక్తికలవానికి అనగా ఘటము, పటము మున్నగు స్వతంత్ర పదార్థములకు, స్థితిః = భేదరూపమున ఉనికియో, తథా=ఆ రీతిగా, శక్తీనామ్= శక్తులకు, భేదః = భేదము, న = లేదు.

కడవ మున్నగు పదార్థములు స్వతంత్రములు. అవి వేరుగానే సిద్ధించును. కాబట్టి ఘటపటాదులు పరస్పరము భిన్నములే. కాని వానియందున్న శక్తులకు వానితో భేదము సిద్ధింపదు అవి ఆశ్రయమును విడిచియుండునవి కావు. అవి అస్వతంత్రములు. కనుక ఆ శక్తులకు ఆశ్రయముతో భేదమున్నట్లు గుర్తింపలేము.

B తాసామ్ = ఆ శక్తులయొక్క, ఆత్మసు = స్వరూపములయందు, లౌకికమ్ = లోక సిద్ధమగు, ఏకత్వమ్ + చ = ఏకత్వము కూడ, న + విద్యతే = లేదు.

లోకమున కడవ ఒకటిగానే కానవచ్చుచున్నది. అది నిజరూపమున ఒకటియే అది ఎల్లరికి తెలిసినదే అట్టి ఏకత్వము కూడ దానియందున్న శక్తికి కానరాదు. ఏలయన- ఒకే కడవ కర్తగాను (కడవ ఉన్నది), కర్మగాను (కడవను చూడుము), కరణముగాను (కడవతో నీరు తెమ్ము), సంప్రదానముగాను (కడవకొరకు వెదలుము), అపాదానముగాను (కడవ నుండి నీరు తెమ్ము), అధికరణముగాను (కడవయందు నీరు ఉంచుము) లోక వ్యవ హారమున కానవచ్చుచున్నది. కడవ ఒక్కటియేకదా యని దానియందున్న శక్తియు ఒక్కటియే యగుచో పై రీతిని భిన్నకార్యములు సిద్ధింపవు కాగా లోక సాధారణముగానున్న ఏకత్వము శక్తికి కలుగదు

కాగా ద్రవ్యమును ఆశ్రయించియున్న శక్తులకు నానాత్వము కలుగును. ఆ శక్తులకు ద్రవ్యముతో అభేదమే లభించును. కనుకనే అవిద్యాశక్తి నిర్గుణ పరబ్రహ్మమునందున్నను అది బ్రహ్మముకంటె భిన్నము కాదు కనుకనే ఆ రెంటికి అభేదము లభించుటచే అద్వైత

వాదము బలిష్ఠమగుచున్నది అట్లు కాకున్న అవిద్యా శక్తి బ్రహ్మముకంటె భిన్నమగుచో ద్వైతవాదమే నిలిచెడిని ॥27॥

అవతారిక — దిక్కునకు ఏకత్వమే అనిగాని, నానాత్వమే అనిగాని చెప్పుటకు సాధ్యము కాదని 26 వ శ్లోకమున చెప్పబడినది. ఆ యర్థమునే సిద్ధాంతముగా జూపుచు, 'దిక్కు ఒక్కటియే' అనెడి తార్కికులవాద మయుక్తమని చెప్పుచున్నాడు.

శ్లో॥ నైకత్వం వ్యవతిష్ఠేత నానాత్వం చేన్నకల్పయేత్ ।
నానాత్వం చావహీయేత యద్యేకత్వం న కల్పయేత్ ॥ 28

నానాత్వమ్ = అనేకత్వమును, న + కల్పయేత్ + చేత్ = నిరూపింపని యెడల అనగా బుద్ధిచే అనేకత్వమును స్పష్టముగా నిరూపించినచో, ఏకత్వమ్ = ఏకత్వము, న + వ్యవతిష్ఠేత = స్థిరపడునది కాదు నానాత్వములేనిది ఏకత్వముండదు

అట్లే, ఏకత్వమ్ = ఏకత్వమును, న + కల్పయేత్ + యది = బుద్ధిచే నిరూపింపని యెడల, నానాత్వమ్ + చ = అనేకత్వము కూడ, అవహీయేత = నశింపవలసి యుండెడిది. అనగా స్వరూపమును పొందకపోయెడిని.

అంతరంగ బహిరంగములవలె ఏకత్వ నానాత్వములు పరస్పరాపేక్షములు. అవి ఒకదానిని విడిచి మరియొకటి యుండనేరవు.

కనుక దీని స్వరూప మెట్టిది ? అని విచారింపకయే పండితుడు, పామరుడు కూడ లోక వ్యవహారమును కొనసాగింపవలెను. అనాది సిద్ధమగు లోకవ్యవహారము దిక్కును ఆధారముగా గైకొనియే నడచుచున్నది. ॥28॥

దిక్ సముద్దేశము ముగిసినది

సాధన సముద్దేశము-7

అవతారిక— "దిక్ సాధనం క్రియాకాలః" అనుకారికలో చూపబడిన పదార్థ ముల క్రమమును అనుసరించి దిక్కు తరువాత నిర్దిష్టమగు 'సాధన'మును వివరించుచున్నాడు.

శ్లో॥ స్వాశ్రయే సమవేతానాం తద్వదేవాఽఽశ్రయాన్తరే ।
క్రియాణా మభినిష్పత్తౌ సామర్థ్యం సాధనం విదుః ॥ 1

స్వాశ్రయే = తనకు ఆశ్రయమగు దానియందు అనగా క్రియకు ఆధారమగు కర్తృ కర్మల యందు, తద్వత్ = అట్లే, ఆశ్రయాన్తరే + ఏవ = ఇతరమగు ఆధారమునందును, సమవేతా నామ్ = సమవేతములగు అనగా ఎన్నడు విడువక కలసియున్నట్టి, క్రియాణామ్ = పాకము, గమనము, అధ్యయనము మున్నగు వ్యాపారముల యొక్క, అభినిష్పత్తౌ = పుట్టుకయందు, సామర్థ్యమ్ = సామర్థ్యమును అనగా ద్రవ్యములయందున్న శక్తిని, సాధనమ్ = సాధన మునుగా, విదుః = భాష్యకారుడు మున్నగువారు గుర్తించుచున్నారు.

వివరణము— 1 ఈ ప్రకరణమున కర్మ, కరణము, కర్త, సంప్రదానము, అపాదానము, అధికరణము, శేషము, హేతువు అను కారకములు విచారింపబడుచున్నవి, కారకమునకు 'సాధనము' అనునది నామాంతరము, కరోతీతి = కారకమ్ = క్రియా నిష్పాద కము, సాధ్యతే అనేన ఇతి = సాధనమ్ = దీనిచే క్రియ సాధింపబడును. భాష్యకారుడు ఈ రెండు పదములను పర్యాయ శబ్దములుగా జూపియున్నాడు. దేనివలన క్రియ కలుగునో అది కారకము, అదియే సాధనము.

2. చైత్రః కాష్ఠైః స్థాల్యాం తణ్డులం పచతి (చైత్రుడు కట్టెలచే గిన్నెయందు బియ్యమును వంట చేయుచున్నాడు) మున్నగు వాక్యములలో ధాతువులచే పాకము మున్నగు క్రియలు బోధింపబడుచున్నవి. ఆ క్రియలు కర్తృ కర్మలయందే యుండును. అవి కరణము మున్నగు కారకములయందు ఉండవు. కాని కరణాది కారకములు గూడ పాకము మున్నగు క్రియలను కలిగించుచున్నవి కాగా చైత్రుడు, తండులము మున్నగు పదార్థములు తమయందున్న క్రియలను పుట్టించుటచే కర్తృకారకము, కర్మకారకము అగుచున్నవి. ఈ యర్థమును 'స్వాశ్రయే సమవేతానామ్' అను కారికా భాగము వివరించుచున్నది. దీనినిబట్టి కర్తృకారకము, కర్మకారకము సిద్ధించుచున్నవి. కర్తృ కర్మ కారకములయందున్న పాకాది క్రియలను కట్టెగిన్నె మున్నగు వస్తువులు పుట్టించుచున్నవి. అందుచే నా వస్తువులు కరణము, అధికరణము అనురీతిని కారకములగుచున్నవి. ఈ యర్థమును "ఆశ్రయాన్తరే సమవేతా నామ్" అను భాగము వివరించుచున్నది. కాష్ఠాదులందు పాకాది క్రియలు సమవేతములు కాకున్నను కాష్ఠాదులకంటె ఇతరములగు కర్తృ కర్మలయందున్న ఆ క్రియలను కలిగించు

టచే కాష్ఠాదులు కూడ సాధనములు కాగలవు. కాగా 'ఆశ్రయాన్తరే' అను పదమునకు కరణాదులకంటె భిన్నమగు ఆధారమునందు అనగా కర్తృ కర్మరూపమగు ఆధారమునందు అని యర్థము చెప్పవలెను. 'స్వాశ్రయే' అనుచోట స్వశబ్దార్థము క్రియ. ధాతువుచే బోధింపబడెడి క్రియ కర్తృ కర్మములందే యుండును. ఇతర కారకముల యందుండనేరదు. కనుకనే కర్తృ కర్మములయందే తిఙ్ ప్రత్యయములు జనియించును. కరణాది కారకములందు జనియింపవు. ఇది భాష్యకారాదుల నిర్ణయము. అందుచే 'స్వాశ్రయే', 'ఆశ్రయాన్తరే' అను రెండు పదములు భర్తృహరిచే ప్రయోగింపబడినవి.

తాత్పర్యము— 1 సాధ్యము 2. సిద్ధము అను రీతిని పదార్థములు రెండు విధములు. వానిలో సాధ్యము క్రియారూపము. ఉదా. యాగము, పాకము, గమనము, అధ్యయనము మున్నగునవి. అవి ఎప్పటికప్పటికే తయారుచేయబడును. ఘట పటాదుల బోలె స్థిరముగా నుండునవి కావు అవి నిష్పన్నములు కావలెనన్నచో నిష్పాదకము అపేక్షితమగుచున్నది. ఆ నిష్పాదకమే సిద్ధపదార్థము. అదియే కారకము, అదియే సాధనము. సాధ్యమగు క్రియకు సాధనమగు సిద్ధవస్తువునకు క్రియాకారక భావము సంబంధము. ఈ రీతిగా సాధనమువలన క్రియ జనియించుచున్నది. ఇచట సాధనము వస్తురూపము కాదు. వస్తువు యొక్క శక్తియే సాధనము.

విశేషాంశము— 1. చైత్రః తణ్డులం కాష్ఠైః స్థాల్యాం పచతి (చైత్రుడు బియ్యమును కట్టెలచే గిన్నెయందు వండుచున్నాడు) అనుచోట చైత్రుడు, బియ్యము మున్నగునవి కారకములు. బాగుగ పరిశీలించిన ఆ వస్తువులు కారకములు కానేరవు. ఏలయన క్రియాజనకము కారకము. వస్తువు నిజరూపమున క్రియను జనియింపచేయ నేరదు. దానియందున్న సామర్థ్యము అనగా శక్తి క్రియాజనకమగును. కాగా 'శక్తిఃకారకమ్' అను పక్షము సిద్ధాంతము కాగలదు. శక్తి ఆశ్రయమును విడనాడి యుండనేరదు. అందుచే లోకమున వస్తువులే కారకములని గుర్తింపబడుచున్నవి. ఈ పద్ధతిలో 'శక్తిమత్ కారకమ్' అను పక్షమునకు సంభవమున్నది. *భాష్యకారాదులు, శక్తియే కారకమను పక్షమును ఆదరించిరి.

**భాష్యకర్త మరికొన్ని స్థలములలో ద్రవ్యము కారకమని నుడివెను. శక్తికి శక్తిమత్తునకు అభేదమును వివక్షించుటచే ఆ భాష్యము సమన్వితము కాగలదు.

---

* "పరోక్షేలిట్" (3-2-115), 'అనభిహితే' (2-3-1), మున్నగు సూత్రములలో "గుణః సాధనమ్" అని పతంజలి పలికెను. ఇచట గుణశబ్దము శక్తిపరము. సాధనమనగా కారకము. "సప్తమీ పఞ్చమ్యౌ కారకమధ్యే" అను సూత్రమున కారకశబ్దము శక్తిపరము

** "ద్రవ్యం క్రియాభి నిర్వృత్తిం ప్రతిసాధనమ్", "సార్వధాతుకేయక్" (3-1-67). "సాధనం వై ద్రవ్యమ్"కిమేత్తిజవ్యయ... ,(5-3-55) "సాధనేఽయం భవన్ లిఙ్గ సంఖ్యాభ్యాం యోక్ష్యతే" "ఉపసర్గాచ్ఛన్దసిధాత్వర్థే" (5-1-118)

శక్తిః కారకమ్. అనునదియే సిద్ధాంతము. ఈ యభిప్రాయమును మనంబున నిడుకొనియే భర్తృహరి 'సామర్థ్యం సాధనం విదుః' అని ఒగ్గరగా పలికెను

2. పాకము, గమనము మున్నగు క్రియలు ప్రత్యేకము ఒకొక్కటియే ఐనను ప్రధాన క్రియకు ఉపకరించెడి పూత్కారము (ఊదుట) మున్నగు అవాంతర క్రియలు చాల కలవు. అట్టి అప్రధాన క్రియలను పురస్కరించుకొని కారికలో 'క్రియాణామ్' అను బహు వచనము ప్రయుక్తమాయెను. ॥1॥

అవతారిక— 'సామర్థ్యం సాధనం విదుః' అను వచనమువలన శక్తికారకము అని తెలియవచ్చుచున్నది. ద్రవ్యము కారకమని యేల చెప్పరాదు ? శక్తియే కారకమని యెట్లు నిశ్చితమగును ? అను ప్రశ్న సమాధానము చెప్పుచున్నాడు.

> శ్లో॥ శక్తిమాత్రా సమూహస్య విశ్వస్యాఽనేకధర్మణః ।
> సర్వదా సర్వథా భావాత్ క్వచిత్ కిఞ్చిద్వివక్ష్యతే ॥ 2

శక్తిమాత్రా సమూహస్య = శక్తులయొక్క భాగముల సముదాయ రూపమగునట్టియు, అనేక ధర్మణః = అనేకములగు ధర్మములు కల, విశ్వస్య = ఎల్లవస్తువు అనగా ఘటము, పటము మున్నగు ఎల్ల పదార్థము, సర్వదా = ఎల్లకాలమున, సర్వథా = ఎల్ల విధముల, భావాత్ = ఉండుటవలన, క్వచిత్ = ఒకొక్క సమయమున, కిఞ్చిత్ = ఒకొక్క శక్తియే, వివక్ష్యతే = వివక్షింపబడుచున్నది, ఇచట శబ్దప్రయోక్త కర్త.

అనంతములగు శక్తుల సమూహములే ఘటపటాది వస్తువులు. అట్టి వస్తువుల భాగములే శక్తులు. అవి విచిత్రములగు కార్యములను కలిగించుచున్నవి ఎట్లనగా— ఘటః అస్తి (కడవ ఉన్నది). ఘటమానయతి (కడవను తెచ్చుచున్నాడు), ఘటేన జలమాహరతి (కడవచే నీటిని తెచ్చుచున్నాడు), ఘటాయ ప్రయతతే (కడవకొరకు ప్రయత్నించు చున్నాడు, ఘటాత్ జలం స్రవతి (కడవనుండి నీరు కారుచున్నది), ఘటే జలం నిదధాతి (కడవయందు నీరు పోయుచున్నాడు). ఒకే ఘటము పై రీతిని భిన్నములగు విచిత్రములగు కార్యములను కలిగించుచున్నది. దీనినిబట్టి చూడగా ఒక వ్యక్తియందు అనేక విచిత్ర శక్తులున్నవని ఎల్లరు నమ్మక తప్పదు. శక్తులే కారకములనియు దీనివలననే తెలియుచున్నది. అట్లుకాక ఘట ద్రవ్యమే కారకమన్నచో, ఒక ద్రవ్యము ఇన్ని విచిత్ర కార్యములను కలిగింపనేరనందున పై వ్యవహారములు కుదురుపాటు నొందనేరవు. శక్తులే కారకమగుచో ఆ శక్తులు వివక్షనుబట్టి కర్త, కర్మము, కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము అను రీతిని విచిత్ర మగు కార్యములను చేయగలవు.

కాబట్టి శక్తిమత్తు అగు ద్రవ్యము కారకము కాదు. శక్తియే కారకమనుట లెస్స.॥2॥

అవతారిక— ద్రవ్యములగు ఘటపటాదులయందు శక్తులు సంభవించును. కనుక అచట వివక్షకు అవకాశమున్నది. కాని శక్తులుండుట కవకాశము లేనిస్థలములు కలవు.

అచట వివక్షమెట్లు సంభవించును? శక్తి మాదధాతి (శక్తిని కలిగించుచున్నది) ఇచట ఔషధము కర్త. చైత్రః శక్త్యాకరోతి (చైత్రుడు శక్తిచే చేయుచున్నాడు) శక్తేః వ్యపైతి (శక్తినుండి మరలుచున్నాడు) పై స్థలములలో శక్తికి కర్తృత్వాదికము అనుభవసిద్ధము, ఘటాదులయందు శక్తియున్నట్లు శక్తికి మరియొక శక్తి సంభవింపదు. అట్లుకాకున్న ఆ శక్తికి కూడ మరియొక శక్తి, దానికి మరియొక శక్తి అను రీతిని అనవస్థా దోషము ప్రసక్త మగును. మరియు వస్తురూపముకాని అభావమునకు గూడ కారకత్వము కానవచ్చుచున్నది. మైత్రః ధనవినాశం కరోతి (మైత్రుడు ధననాశమును చేయుచున్నాడు). ధనాభావేన యుక్తః (ధనము యొక్క లేమితో కూడియున్నవాడు), ఇచట లేమి కారకమని స్పష్టము. దానికి వేరుగ శక్తులుండుట అసంభవము కదా! కాబట్టి శక్తి కారకమను పక్షము ఎట్లు కుదురును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సాధనవ్యవహారశ్చ బుద్ధ్యవస్థానిబన్ధనః ।
సన్నసన్వాఽర్థరూపేషు భేదోబుద్ధ్యా ప్రకల్ప్యతే ॥ 3

A. బుద్ధ్యవస్థా నిబన్ధనః = బుద్ధిచే కల్పింపబడిన అర్థవిశేషములే కారణముగాగల, సాధన వ్యవహారః + చ = కర్త, కర్మ మున్నగు కారకవ్యవహారము, (సంభవతి) = కలుగగలదు.

బాహ్య ప్రపంచమున నున్న అర్థములనుబట్టి శాబ్దవ్యవహారము జరుగదు లోక మున అర్థమున్నను లేకున్నను శబ్దమువలన వ్యవహారము జరుగగలదు. అందు బుద్ధియే కారణము. బుద్ధిచే ఇది కర్త, ఇది కర్మ, దీనివలన ఈ కార్యము కలుగును అని నిరూపింపగా, అట్టి నిరూపితమగు అర్థమును బోధించుటకై శబ్దములు ఉపయోగపడుచున్నవి.

B. సన్ = లోకమున పదార్థమున్నను, అసన్ + వా = లేనిదియైనను, బుద్ధ్యా = బుద్ధిచే, అర్థరూపేషు = అర్థరూపములయందు, భేదః = భేదము, ప్రకల్ప్యతే = కల్పింపబడు చున్నది.

పై కారికాభాగము యొక్క అర్థమునే ఈ రెండవ భాగము వివరించుచున్నది. బుద్ధియే అర్థ నిర్ణయమును జేయును. అట్టి నిర్ణీతమగు అర్థము శబ్దబోధ్యమగును. బుద్ధి అర్థమును నిర్ణయింపనిచో లోకముననున్న యర్థమును శబ్దము బోధింపజాలదు.

కాగా శక్తి అభావము మున్నగునవి బుద్ధిచే ద్రవ్యరూపములుగా నిరూపింపబడగా వానికి శక్తి సంభవించును. ఆ స్థితిలో శక్త్యాకరోతి, ధననాశంకరోతి అను రీతిని కారకములు కాగలవు. అంతియేకాని అభావము శక్తియు స్వస్వరూపమున కారకములు కానేరవు. అట్లు కాకున్న అనవస్థా దోషము కలుగును.

కాబట్టి బుద్ధిచే నిర్మింపబడిన ద్రవ్యరూపములగు శక్తి మున్నగువానికి శక్త్యంత రము కలుగును.

విశేషము— ఈ కారికలో 'సన్' అనునది దృష్టాంతముగా జూపబడినది.

బాహ్యప్రపంచమున సత్తుగా ఉన్న వస్తువు బోలె లేని వస్తువుకూడ బుద్ధిచే నిర్మింపబడినదై శాబ్దవ్యవహారమునకు కారణము కాగలదు. ॥3॥

అవతారిక— పదార్థములు కారకములగుటలో లోకసిద్ధములగుటయే కారణము కాదు. లోకమున అవి లేకున్నను బుద్ధిచే భావింపబడిన పదార్థములే సాధనములు (కారకములు) కాగలవు అను పై చూపబడిన అర్థమునందు మహాభాష్యకారుని సమ్మతిని జూపుచున్నాడు.

శ్లో॥ బుద్ధ్యా సమాహితైకత్వాన్ పఞ్చాలాన్ కురుభిర్యదా ।
పునర్విభజతే వక్తా తదాఽపాయః ప్రతీయతే ॥ 4

వక్తా = మాటలాడువాడు, అనగా శబ్దమును ప్రయోగించువాడు, యదా = ఎప్పుడు, బుద్ధ్యా = బుద్ధిచే అనగా బుద్ధిపూర్వకముగా, కురుభిః = కురుదేశమునం దున్నవారితో, సమాహితైకత్వాన్ = కూర్చబడిన ఏకత్వముకల, పఞ్చాలాన్ = పంచాల దేశస్థులను, పునః = మరల, విభజతే = విభజించునో అనగా వేరు చేయునో, తదా = అపుడు, అపాయః = అపాయము అనగా రెండు వస్తువులు కల విభాగము, ప్రతీయతే = తెలియబడగలదు.

వివరణము— 'వృక్షాత్పర్ణం పతతి' (చెట్టునుండి ఆకు రాలుచున్నది) అను చోటున 'ధ్రువమపాయేఽపాదానమ్' (1-4-24). కలసియున్న రెండు వస్తువులకు విభాగము కలుగగా వానిలో స్థిరమగునది అపాదాన సంజ్ఞకమగును అను సూత్రముచే వృక్షమునకు అపాదాన సంజ్ఞ కలుగగా 'అపాదానే పఞ్చమీ' (2-3-28) అను సూత్రముచే వృక్షశబ్దముకంటె పంచమీ విభక్తి ప్రవర్తించుచున్నది. కురుభ్యః పఞ్చాలాః అభిరూపతరాః. (పంచాలదేశపువారు కురుదేశపువారి కంటె మిక్కిలి అందము కలవారు) అనుచోట కురు శబ్దముకంటె అపాదానార్థమున పంచమి సిద్ధింపకున్నది. ఏలయన, వృక్షమునకు పర్ణమునకు సంబంధమున్నట్లు కురుపంచాలులకు సంయోగ సంబంధము లేదు. అందుచే పాణిని 'పఞ్చమీ విభక్తే' (2-3-42) అను సూత్రముచే పంచమీ విభక్తిని విధించెను (భేదము భాసించునపుడు నిర్ధార్యమాణమునకు పంచమి కలుగును).

తాత్పర్యము— వృక్షమునకు పర్ణమునకువలె కురుపంచాలులకు సంయోగము దాని మూలమున ఏకత్వము లేకున్నను శబ్దములను ప్రయోగించువాడు తన బుద్ధిలో వారలకు ఏకత్వమును కల్పించుకొనును దాని మూలమున వారలకు సంయోగము ఏర్పడినట్లు వక్త భావించును. తరువాత వారలలో పంచాలదేశస్థులు అధికమగు సౌందర్యము కలవారని భావించి వారలను కురుదేశస్థులతో వేరుచేయును. కాగా బాహ్యప్రపంచమున వారలకు సంయోగము లేకున్నను బుద్ధి కల్పితమగు సంపర్కము దాని మూలమున విభాగము కలుగుటచే కురుదేశస్థులకు 'ధ్రువమపాయేఽపాదానమ్' అను సూత్రము చేతనే అపాదాన సంజ్ఞ పంచమియు సిద్ధించును. అందుచే 'పంచమీ విభక్తే' అను సూత్రము ఆరంభింప నక్కరలేదు. ఈయర్థమును భాష్యకారుడు వక్కాణించెను.

కాగా బుద్ధికల్పితములగు అర్థములను స్వీకరించి కారకములు ప్రవర్తింపగలవు అను నర్థము పై రీతిని భాష్య సమ్మతమే ॥4॥

అవతారిక— పై యర్థమున మరియొక భాష్యమును ప్రమాణముగా జూపుచున్నాడు.

శ్లో॥ శబ్దోపహితరూపాంశ్చ బుద్ధేర్విషయతాంగతాన్ ।
ప్రత్యక్షమివ కంసాదీన్ సాధనత్వేన మన్యతే ॥ 5

శబ్దోపహితరూపాన్ = శబ్దముచే కూర్చబడిన స్వరూపము కలిగినట్టియు, చ = కనుకనే, బుద్ధేః = బుద్ధికి, విషయతామ్ = విషయత్వమును, గతాన్ = పొందినట్టి, అనగా బుద్ధికి గోచరించిన, కంసాదీన్ = కంసుడు మున్నగువారిని, ప్రత్యక్షమ్ + ఇవ = ప్రత్యక్షమగు పదార్థమునువలె, సాధనత్వేన = సాధనమునుగా, అనగా ప్రత్యయము కలుగునపుడు ఉపయోగించెడి కారకమునుగా, మన్యతే = (భాష్యకర్త) తలంచుచున్నాడు.

వివరణము— 'హేతుమతిచ' (3-1-26). ప్రేరణార్థమున ధాతువుకంటె 'ణిచ్' ప్రత్యయము కలుగును అను సూత్రముచే పచ్ మున్నగు ధాతువులకంటె ణిచ్ ప్రత్యయము ప్రవర్తింపగా 'పాచయతి' మున్నగు రూపము లేర్పడును. కంసవధ శబ్దముకంటె ణిచ్ ప్రత్యయము చేరి కంసంఘాతయతి (కంసవధ పురాణము చెప్పుచున్నాడు) అను రూపమేర్పడవలెను కాని ఇచట కంసుడు, అతనిని చంపెడి కృష్ణుడు పురాణము చెప్పు సమయమున లేనందున ఆ యర్థములు ప్రత్యయోత్పత్తికి సాధనములు కానందున పై ప్రయోగము సూత్రముచే సిద్ధింపకున్నదని భావించి కాత్యాయనుడు "ఆఖ్యానాత్ కృతస్తదాచష్టే" (పురాణ ప్రసిద్ధమగు గాథను బోధించెడి కృదంతము కంటె 'చెప్పుచున్నాడు' అను అర్థమున ణిచ్ ప్రత్యయము కలుగును) అను వచనమును ఆరంభించెను. భాష్యకర్త ఆ వార్తికమును ప్రత్యాఖ్యానించెను. అనగా వార్తికము లేకున్నను సూత్రముచేతనే పై ప్రయోగము కుదురగలదు అని చెప్పెను.

తాత్పర్యము— పౌరాణికుడు పురాణము చెప్పునపుడు గతించిన కంసాదుల రూపమును గుణములను వారు చేసిన పనులను శబ్దములచే బోధించును. వినువారికి ఆ శబ్దములవలన కంసాదులు ఒక రూపమున బుద్ధిలో భాసించెదరు. కంసాదులు భీకరముగను క్రూర స్వభావము కలిగినట్లును వినువారు భావింతురు విశాల ఫాలము, బొద్దు మీసములు, ఆజానుబాహువులు మున్నగునవి అన్నియు సభ్యుల హృదయాలలో ప్రతిఫలించును అట్లే, పీతాంబరము, శంఖ చక్రాదులు ధరియించిన కృష్ణుడు శ్రోతల బుద్ధిలో భాసించును. పురాణము చెప్పు సమయమున కంసాదులు ప్రత్యక్షముగా కాన్పింపకున్నను పై రీతిని వారు శ్రోతలకు ప్రతిఫలించెదరు. కాగా బుద్ధిస్థుడగు కంసుని బుద్ధిస్థుడగు కృష్ణుడు చంపుచున్నట్లు భావింపగా సూత్రముచేతనే ణిచ్ ప్రత్యయము సిద్ధించును. కాబట్టి వేరు వార్తికము చేయనక్కరలేదు. ఇది యంతయు భాష్యకారుని నిర్ణయము.

కాగా బాహ్యపదార్థము లేకున్నను బుద్ధి పరికల్పితమగు పదార్థమునుబట్టి సాధన వ్యవహారము కలుగుచున్నదనుటలో భాష్యకారుని పై యత్నము ప్రమాణము కాగలదు.

విశేషము— మన్యతే = తలంచుచున్నాడు ఇచట భాష్యకర్తయగు పతంజలి కర్త.

ఈ ప్రయత్నమును గ్రహించియే నలధర్మరాజాదులు ఉత్తమ పరిపాలకులనియు, దుర్యోధనాదులు అధార్మికులనియు ఈ నాట ప్రజలు గుర్తించుచున్నారు. అట్లుకాకున్న నల ప్రభృతుల చరిత్రము మనకు అర్థము కాకపోయెడిని బుద్ధికల్పితమగు అర్థమునే శబ్దము బోధించును. అచట బుద్ధికల్పితమగు అర్థములే కారకములు కాగలవు ॥5॥

అవతారిక— సాధన వ్యవహారము బుద్ధికల్పితమనుటకు మరియొక ప్రయోజనము కూడ కలుగుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ బుద్ధిప్రవృత్తిరూపం చ సమారోప్యాభిధాతృభిః ।
అర్థేషు శక్తిభేదానాం క్రియతే పరికల్పనా ॥ 6

చ = మరియు, అభిధాతృభిః = శబ్దమును ప్రయోగించెడి వ్యవహర్తలచే, బుద్ధిప్రవృత్తిరూపమ్ = బుద్ధియొక్క, వ్యాపారము యొక్క అనగా 'ఇది యిట్లు' అనెడి నియతమగు ఆకారమును, అర్థేషు = బాహ్యములగు ఘటపటాద్యర్థములయందు, సమారోప్య = ఆరోపించి, శక్తిభేదానామ్ = కారక భేదములయొక్క, అనగా బుద్ధిస్థములగు కారకశక్తుల కంటె బాహ్యములగు కారకములు భిన్నములు అనెడి పరికల్పనా = విచిత్రమగు కల్పన, క్రియతే = చేయబడుచున్నది

శబ్దముల నుపయోగించెడి మనుష్యులు ముందుగ బుద్ధిచే నిర్మింపబడిన వస్తువులకే సాధ్యసాధనమును గ్రహించెదరు పిమ్మట అట్టి సాధ్యసాధన భావమును బాహ్యవస్తువుల యందు ఆరోపించెదరు. కాగా వస్తువులకు గల సాధ్యసాధన భావము రెండు విధములుగా గుర్తింపబడుచున్నది 1. బుద్ధికల్పితము, 2. దాని మూలమున కలిగెడి బాహ్య వస్తువులకు కలిగినది. పిమ్మట 'బుద్ధికల్పితము సాధ్యసాధన భావము' అను భావమును మరచి బాహ్య వస్తువులకు గల సాధ్యసాధనమే స్వాభావికమని భావించెదరు. శక్తి భేదమనగా బుద్ధిస్థములగు శక్తులకంటె బాహ్యములగు శక్తులు భిన్నములని భావము. ఉదా : కాష్ఠైఃపచతి, (కట్టెలతో వండుచున్నాడు) కట్టెలకు వంటకు సాధ్యసాధనము బుద్ధికల్పితము. దీనిని లోకమున గల కాష్ఠములకు, వంటకుకూడ సంబంధింపచేయగా వానికి ఆ సంబంధము కలుగు నట్లు మనము భావించుచున్నాము. ఈ రీతిగ బుద్ధిస్థ పదార్థ సంబంధమునకు బాహ్యస్థ పదార్థ సంబంధమునకు సంవాదము అనగా ఐక్యము దేనివలన కలుగునో, ఆ వాక్యము ప్రమాణము. దాని యర్థము వ్యవహారమున కుపకరించును ఆ రెంటికి సంవాదము లేనిచో ఆ వాక్యము ప్రమాణము కానేరదు. ఆ వాక్యమువలన కలిగెడి అర్థము వ్యవహారనుము

కలిగింపనేరదు. నిజముగ అది వాక్యము కూడ కానేరదు. ఉదా : పర్వతేన పచతి (కొండచే వండుచున్నాడు) అను రీతిని బుద్ధిలో ఎన్నియో అర్థములు భాసించును. కాని బాహ్యప్రపంచ మున కొండ పాకమునకు సాధనము కానందున అది విసంవాదియగుటచే అప్రమాణమే యగును.

కాబట్టి బుద్ధికల్పిత పదార్థజాతమంతయు ప్రమాణము కానేరదు. ఏది లోకదృష్ట మగు అర్థముతో సంవాదమును బొందునో అది ప్రమాణము విసంవాదియగుచో అప్ర మాణము. పై వ్యవస్థకు బుద్ధియొక్క కల్పనయే తోడ్పడుచున్నది. ॥6॥

అవతారిక— సాధ్యసాధన భావము బుద్ధి పరికల్పితమనుటకు మరియొక ప్రయో జనము కూడ కలదని చూపుచున్నారు.

శ్లో॥ వ్యక్తౌ పదార్థే శబ్దాదేర్జన్యమానస్య కర్మణః ।
సాధనత్వం తథాసిద్ధం బుద్ధిరూపప్రకల్పితమ్ ॥ 7

తథా = అట్లే, వ్యక్తౌ + పదార్థే = వ్యక్తియే శబ్దవాచ్యము అను పక్షమున ఘటః, పటః మున్నగు శబ్దములు కడవ మున్నగు వ్యక్తులనే బోధింపగలవు, జాతి బోధకములు కానేరవు అను పక్షమున, జన్యమానస్య = పుట్టుచున్న అనగా నిర్వర్త్యమగు, శబ్దాదేః = శబ్దము మున్నగు అనగా శబ్దం కరోతి, సంయోగం కరోతి మున్నగు ప్రయోగములలో నుండెడి శబ్దము సంయోగము మున్నగు, కర్మణః = కర్మకు, బుద్ధిరూప ప్రకల్పితమ్ = బుద్ధియొక్క ఆకారముచే కల్పింపబడిన, సాధనత్వమ్ = కారకత్వము, సిద్ధమ్ = సిద్ధించుచున్నది.

వివరణము— 1. ఘటః, పటః మున్నగు శబ్దములు ఘటత్వము, పటత్వము మున్నగు జాతులను బోధించును అను అభిప్రాయము జాతి సముద్దేశమున నిర్ణయింపబడినది ఆ పక్షమున ఘటత్వము మున్నగు జాతుల సంబంధము అతీతమగు ఘటవ్యక్తులకు రాబోవు ఘటవ్యక్తులకు సంబంధించియున్నందున భావి ఘటాదులు కూడ మనకు గోచరించును. కాబట్టి ఘటం కరోతి (కడవను చేయుచున్నాడు) మున్నగు చోటులయందు ఘటాదులకు కర్మ సంజ్ఞ సిద్ధించును. జాతి శక్తి పక్షము వాజప్యాయనమునికి సమ్మతము.

వ్యాడిమునియొక్క మతమున ఘటాది శబ్దములు జాతి బోధకములు కానేరవు. ద్రవ్యబోధకములు, అనగా ఘటాదిశబ్దములు వ్యక్తి వాచకములు. ఈ పక్షమున భావి వ్యక్తు లకు కర్మ సంజ్ఞ లభింపవలెనన్న బుద్ధిస్థములగు ఘటాదులకే సాధనత్వము అంగీకరింప వలెను.

2. నిర్వర్త్యము, వికార్యము, ప్రాప్యము అను రీతిని కర్మ మూడు విధములని ఈ ప్రకరణముననే భర్తృహరి చెప్పబోవుచున్నాడు. వానిలో నిర్వర్త్యమునకు సాధనత్వము బుద్ధియందున్న పదార్థమునుబట్టియే సిద్ధించును

తాత్పర్యము— శబ్దం కరోతి (ధ్వని చేయుచున్నాడు), సంయోగం కరోతి

(సంయోగమును కలిగించుచున్నాడు) మున్నగు చోటులయందు శబ్దము మున్నగునవి ఈ వాక్యమును ప్రయోగించు సమయమున సిద్ధముగాలేనందున వానికి కారకత్వము సిద్ధింప కున్నది. జాతి పక్షమును ఆశ్రయించిన, అది సిద్ధించును. కాని వ్యక్తి పక్షమున అది కుదురదు. అందుచే బుద్ధిస్థమగ శబ్దాదులను పురస్కరించుకొనియే వానికి సాధనత్వము చెప్ప వలెను. అందును నిర్వర్త్యము సాధనము కావలెనన్న బుద్ధిస్థ పదార్థమునకే అది సంభవించును.

కాబట్టి బుద్ధిస్థమగు పదార్థము సాధన వ్యవహారమునకు సమర్థమని చెప్పక తప్పదు.

విశేషాంశము— కారికలో 'జన్యమానస్య' అను పదముచే నిర్వర్త్య కర్మ గ్రహింపబడుచున్నది. అది పూర్వము సిద్ధముకానందున బుద్ధికల్పన అవసరమగుచున్నది. ఉదా : 'ఘటం కరోతి' (కడవను తయారుచేయుచున్నాడు).

వికార్యకర్మము సిద్ధవస్తువే యగును. ఉదా: కాష్ఠంభస్మకరోతి (కట్టెను భస్మముగా చేయుచున్నాడు). ఇచట కాష్ఠము వికార్యకర్మ, భస్మము నిర్వర్త్యకర్మ. ప్రాప్యకర్మయు సిద్ధముగనే యుండును. ఉదా : గ్రామం గచ్ఛతి (గ్రామమును గూర్చి వెళ్ళుచున్నాడు), ఆదిత్యం పశ్యతి (సూర్యుని చూచుచున్నాడు) 45, 46, 47, 48, 49, 50, 51 శ్లోకములచే ఈ ప్రకరణముననే వీనికి లక్షణము చెప్పబడుచున్నది ॥7॥

అవతారిక— బుద్ధికల్పితములగు పదార్థములకు సాధనత్వము యుక్తమగు చున్నదని యింతవరకు చూపియున్నాడు. ఇట్టి కల్పన కేవలము సాధనత్వమునకే కాక పదార్థ మాత్రమునకేయని భాష్య ప్రామాణ్యమున జూపుచున్నాడు.

శ్లో॥ స్వతన్త్రపరతన్త్రత్వే క్రమరూపం చ దర్శితమ్ ।
నిరీహేష్వపి భావేషుకల్పనోపనిబన్ధమ్ ॥ 8

నిరీహేషు + అపి = అచేతనములగు నట్టియు, భావేషు = పదార్థములయందు, స్వతన్త్రపర తన్త్రత్వే = కర్తృత్వము, కరణత్వాదికము, క్రమరూపమ్ + చ = క్రియారూపమును, కల్పనోపనిబన్ధనమ్ = బుద్ధిచే కృతమగు కల్పనయే కారణము కలదిగా, (భాష్యకార ప్రభృతిభిః = అద్వైత సిద్ధాంతమును అవలంబించినట్టి భాష్యకారుడు మున్నగువారిచే) దర్శితమ్ = చూపబడినది.

వివరణము— "ధాతోః కర్మణః సమానకర్తృకాదిచ్ఛాయాం వా" (3-1-7) అను సూత్రముచే (ధాతువుకంటె ఇచ్ఛార్థమున 'సన్' ప్రత్యయము కలుగును) 'జిగమిషితి' (వెళ్ళుటకు కోరుచున్నాడు : గన్తుమిచ్ఛతి) మున్నగునవి ఉదాహరణములు. ఇచ్ఛ అనగా కోరిక, అది చేతనధర్మము. అట్టితరి 'కూలంపిపతిషతి' (తటము అనగా ఒడ్డు పతనమును కోరుచున్నది : పతితుమిచ్ఛతి) మున్నగు ప్రయోగములు సిద్ధింపకున్నవి. అచేతనమగు ఒడ్డు మున్నగువానికి ఇచ్ఛ సంభవింపదుకదా ! పై ప్రయోగమును సిద్ధింపచేయుటకై "ఆశఙ్కా-

యాం సన్వక్తవ్యః" (సిద్ధముగానున్నది అను అర్థమున 'సన్' ప్రత్యయము చెప్పతగినది) అను వచనము ఆరంభింపబడినది. ఆ వచనము అక్కరలేదు, ప్రతిపదార్థము చేతనమే. కాబట్టి కూలమునకు ఇచ్ఛ, కర్తృత్వము మున్నగునవి అన్నియు సంభవింపగలవు అని కాత్యాయనుడు, పతంజలియు (సర్వస్యచేతనా వత్త్వాత్) నిర్ణయించిరి.

తాత్పర్యము— అద్వైత సిద్ధాంతమున ఆత్మకంటె ఇతరమగు వస్తుజాతము మిథ్య. అవిద్యాదశయందును సత్కార్యవాదమునగాని, అసత్కార్యవాదమునగాని కార్య కారణ భావము *కుదురదు. కాబట్టి లేనివస్తువులనే బుద్ధిబలముచే ఉన్నట్లు చూపి వానినే లోకులు వ్యవహరించుచున్నారు. కర్త, కర్మ మున్నగు కారకములలో కర్త స్వతంత్రమైనది. కర్మ, కరణము మున్నగునవి అస్వతంత్రములు, పాకము మున్నగు క్రియలు క్రమముకలవి. ఇవి యన్నియు బుద్ధికల్పితములే. కూలంపిపతిషతి మున్నగు ప్రయోగములు ఎన్నియో కల్పనామూలమున సిద్ధించుచున్నవి.

కాబట్టి క్రియాకారకములేకాక పదార్థములన్నియు బుద్ధికల్పితములే. కాత్యాయన పతంజలులు అద్వైత సిద్ధాంతమును అనుసరించినవారై పై సిద్ధాంతమును నిర్ణయించిరి.

శక్తి **అతిరిక్తమగు పదార్థము అనెడి పూర్వమీమాంసకుల మతము చొప్పున 'శక్తిః కారకమ్' అను పక్షము ఈ కారికయందు నిరూపింపబడినది. ॥8॥

అవతారిక— ఇటుపైని శక్తి §అతిరిక్తపదార్థము కాదు అనెడి వైశేషికుల మతమును ఆశ్రయించి కారకస్వరూపమును జూపుచున్నాడు.

శ్లో॥ శక్తయః శక్తిమన్తశ్చ సర్వేసంసర్గవాదినామ్ ।
భావాస్తేష్వస్వశబ్దేషు సాధనత్వం నిరూప్యతే ॥ 9

సంసర్గవాదినామ్ = వైశేషికుల (మతమున), సర్వే = ఎల్ల, భావాః = పదార్థములు, శక్తయః = శక్తిరూపములు, శక్తిమన్తః + చ = శక్తికలవియు, అనగా ఉభయరూపములుగా, (అఙ్గీక్రియన్తే) = అంగీకరింపబడుచున్నవి.

---

* ఈ యర్థము సంబంధ సముద్దేశమున 61 నుంచి 16 శ్లోకములచే గ్రంథకర్త నిర్ణయించెను. అందుచేతనే అద్వైతవాదము గ్రంథకర్త స్వమతముగా జూపుచున్నాడు

** పూర్వమీమాంసకులు ఆరు పదార్థములను అంగీకరించిరి 1. ద్రవ్యము, 2. గుణము, 3. కర్మము, 4 సామాన్యము, 5. శక్తి, 6. అభావము. వీరు ద్రవ్యముకంటె వేరుగా 'శక్తి'ని అంగీకరించుచున్నారు

§ వైశేషికులు అనగా కణాదమతము వారు ఏడు పదార్థములను ఒప్పిరి. 1. ద్రవ్యము, 2 గుణము, 3. కర్మ, 4. సామాన్యము, 5. విశేషము, 6. సమవాయము, 7. అభావము. వీరి మతమున శక్తి అతిరిక్తపదార్థము కాదు. ద్రవ్యముయొక్క స్వరూపము. సహకరించునవియు కూడ 'శక్తి' అనియే వీరు భావించుచున్నారు.

ఘటము నిష్పన్నముకావలెనన్న, మన్ను నీరు దండము మున్నగు వస్తువులు అపేక్షితములగుచున్నవి. వానిలో నీరు మున్నగునవి సహకారి కారణములు. ఇవి శక్తిరూపములు. మన్ను శక్తిమంతము ఇట్లే సహకారులకు గూడ ఉదకమునకు కారణమగు ద్వ్యణుకాదులు శక్తిరూపములు. వాని రూపము శక్తిమంతము. కాగా కారణము శక్తులుగాను, రూపాదులు శక్తిమత్తులుగాను ఉన్నందున పదార్థములన్నియు శక్తిరూపములు, శక్తిమంతములు కూడ కాగలవు. వీనికంటె వేరుగా శక్తియనునది అతీంద్రియ పదార్థము లేదు.

అస్వశబ్దేషు = స్వశబ్దముచే బోధింపబడని, తేషు = అట్టి శక్తిమంతములయందు, సాధనత్వమ్ = కారకత్వము, నిరూప్యతే = (శాస్త్రమున) చూపబడుచున్నది.

శక్తిమంతము సాధనము, ఆ సాధనత్వము అపాదాన, సంప్రదాన, కర్మ, కర్తృ, అధికరణ అను పదములచే ఎన్నడు బోధింపబడదు. పంచమి మున్నగు విభక్తి ప్రత్యయముల చేతనే ఆసాధన భావము బోధింపబడును.

కారికలో స్వశబ్దము అపాదానాది శబ్దపరము. ఘటము ధర్మి, దానియందున్న ఘటత్వము ధర్మము. ఈ ధర్మమునకు ధర్మికి సమవాయము సంబంధము. అట్టి సంబంధ వశమున ఆ రెంటికి అభేదము సిద్ధించును అని వైశేషికులు విశ్వసింతురు. సమవాయము సంబంధముగా లేకున్న పదార్థములకు గూడ మరియొక విధమగు సంయోగాది సంబంధమును వారు అంగీకరింతురు. సంబంధములేని పదార్థ ముండనేరదు కాబట్టి 'సంసర్గవాది' యనగా వైశేషిక మతానుయాయి. ॥9॥

అవతారిక— పదార్థమనగా ఏది ? దేనికి దేనియందు శక్తి ? అను ప్రశ్నకు ఉదాహరణ పూర్వకముగా సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఘటస్య దృశికర్మత్వే మహత్త్వాదీని సాధనమ్ ।
రూపస్యదృశికర్మత్వే రూపత్వాదీని సాధనమ్ ॥ 10

ఘటస్య = ఘటమునకు, దృశికర్మత్వే = దృశిధాతువునకు అర్థమగు దర్శన క్రియలో కర్మత్వము కలుగవలెనన్న, మహత్త్వాదీని = *మహత్వము. ద్వ్యణుకాదికము రూపము మున్నగునవి, సాధనమ్ = సాధనములగుచున్నవి.

రూపస్య = రూపమునకు, అనగా ఘటగతమగు రూపమునకు, దృశికర్మత్వే = దర్శనమున కర్మత్వము కలుగవలెనన్న, రూపత్వాదీని = **రూపత్వము మున్నగునవి, సాధనమ్ = సాధనములగుచున్నవి.

---

* కణాదుడు ఈ రీతిగ సూత్రించెను. "మహత్యనేక ద్రవ్యవత్త్వా ద్రూపాచ్చోపలబ్ధిః" (4–1–16).

** కాణాదసూత్ర మిట్లున్నది "అనేక ద్రవ్యసమవాయా ద్రూపవిశేషాచ్చ రూపోపలబ్ధిః" (4–1–8)

ఘటమునందు మహత్త్వమున్నగునవి సమవేతములై యున్నవి. కనుక అవి సాధనములు కాగలవు. అనగా శక్తిమంతములు కాగలవు. ఘటాదికము శక్తి కాగలదు. ఘటం పశ్యతి.

అట్లే ఘటమునందున్న రూపము ప్రత్యక్షము కావలెనన్న ఘటరూపం పశ్యతి, అనుచోట రూపమునందు సమవేతమగు రూపత్వాదికము సాధనము.

కాగా పదార్థములన్నియు శక్తులు, శక్తిమంతులు గూడ కాగలవు. ॥10॥

అవతారిక — రసము మున్నగునవి గూడ ఉభయరూపములు కాగలవని చెప్పుచున్నాడు.

శ్లో॥ స్వైః సామాన్యవిశేషైశ్చ శక్తిమన్తో రసాదయః ।
నియతగ్రహణా లోకే శక్తయస్తాస్తథాశ్రయైః ॥ 11

రసాదయః = రసము మున్నగునవి అనగా రసము, గంధము, స్పర్శ, శబ్దము మున్నగునవి, స్వైః = స్వరూపములచేతను, సామాన్య విశేషైః + చ = రసత్వము మున్నగు సామాన్యముల చేతను, తీపి పులుపు మున్నగు విశేషములచేతను, శక్తిమన్తః = శక్తిమంతములై, తథా = అట్లే, ఆశ్రయైః = ఆశ్రయములచే, రసాదులకు ఆశ్రయమగు ద్రవ్యములచే, రసత్వాదులకు ఆశ్రయములగు రసములచేతను, నియతగ్రహణాః = నియతమగు జ్ఞానమును కలిగించునవియై, లోకే = లోకమున, (దృశ్యన్తే) = చూడబడుచున్నవి.

రసం రసయతి, గన్ధం జిఘ్రతి, స్పర్శం స్పృశతి, శబ్దం శృణోతి మున్నగు ప్రయోగములలో గూడ రసాదులు శక్తులుగాను శక్తిమంతములుగాను గ్రహింపబడుచున్నవి.

ఘటము మున్నగు ద్రవ్యము ఘటరూపమున నీలం పశ్యతి అనుచోట గుణవిశిష్ట రూపమున, గచ్ఛతి అనుచోట క్రియా విశిష్టరూపమున గోచరించును కాగా ద్రవ్యము నియత రూపమునకాక అనియతరూపమున గోచరించును. రసాది గుణములు అట్లుకాక నియతరూపమున భాసించును. ॥11॥

అవతారిక — మరికొన్ని స్థలములలో సాధన భావమును జూపుచున్నాడు

శ్లో॥ ఇన్ద్రియార్థమనః కర్తృసంబన్ధః సాధనం క్వచిత్ ।
యద్యదా యదనుగ్రాహి తత్తదా తత్ర సాధనమ్ ॥ 12

A. క్వచిత్ = కొన్ని స్థలములలో, ఇన్ద్రియార్థమనః కర్తృ సంబన్ధః = ఇంద్రియము యొక్క, వస్తువుయొక్క, మనస్సు యొక్క, ఆత్మయొక్కయు సంయోగము, సాధనమ్ = సాధనమగును.

ఘటం పశ్యతి అనుచోట ఘట ప్రత్యక్షము కలుగవలెనన్న ఆత్మ, మనస్సు, ఇంద్రియము ఘటము, వీనికి సంయోగము కారణమగును.

సుఖదుఃఖాదుల ప్రత్యక్షమున ఆత్మ మనస్సంగమే కారణము. అందుచే 'క్వచిత్' అను పదము ప్రయుక్తమాయెను

B. వస్తువు శక్తి 'ద్రవ్య ప్రత్యక్షమున మహత్త్వాదులు సాధనము' అను రీతిని లెక్కించి చెప్పనక్కర లేదు సామాన్యరూపమున సాధనభావము చెప్పనగునని వ్యాప్తిని చూపుచున్నాడు.

యత్ = ఏది, యదా = ఏ కాలమున, యత్ = దేనిని, అనుగ్రాహి = అనుగ్రహించునో, తత్ = అది, తదా = ఆ కాలమున, తత్ర = దానియందు, సాధనమ్ = సాధనమగును.

ద్రవ్యము, గుణము, క్రియ అను నియమము లేదు. ఏది దేనికి సహకరించునో అది దానికి సాధనమగును. ఈ యర్థము 16, 17 కారికలలో స్పష్టము కాగలదు. ॥12॥

అవతారిక— సాధనము, కారకము అనునవి రెండు పర్యాయపదములు. అట్టి కారకము క్రియా మూలకము. అందుచేతనే కారకము క్రియయందే అన్వయించును క్రియలో అన్వయించెడి కారకము విలక్షణమైనది అనగా విభక్తి ప్రత్యయములచే బోధింపబడినదే నిజమగు కారకము కర్మ, అపాదానము మున్నగు శబ్దములచే బోధింపబడునది అట్టిది కాదు అని చూపుచున్నాడు.

శ్లో॥ స్వశబ్దైరభిధానే తు స ధర్మో నాభిధీయతే ।
విభక్త్యాదిభిరేవాసావుపకారః ప్రతీయతే ॥ 13

సః + అ, ధర్మః = శక్తిరూపమగు ధర్మము, స్వశబ్దైః = తన శబ్దములచే అనగా కర్మ కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము, కర్త అను శబ్దములచే, అభిధానే + తు = తెలుపబడినచో, న + అభిధీయతే = బోధింపబడదు.

ఉపకారః = క్రియకు ఉపకారకమగు, అసౌ = ఈ ధర్మము, విభక్త్యాదిభిః + ఏవ = విభక్తి ప్రత్యయములచే, అన్తరా, అన్తరేణ మున్నగు పదములచేతనే, ప్రతీయతే = తెలియబడుచున్నది. ఉపకారశబ్ద ఉపకారకపరము.

విభక్తి ప్రత్యయములు, అన్తరా, అన్తరేణ, వినా, నానా మున్నగు విభక్తి నిమిత్తములగు పదములచేతను క్రియాన్వయయోగ్యమగు అర్థము చెప్పబడును. ॥13॥

అవతారిక— క్రియలకు ఉపకారకమగు సాధన భావము ఎట్టిది? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నిమిత్తభావో భావానా ముపకారార్థ మాశ్రితః ।
నతి రావర్జనేత్యేవం సాధనత్వేన కల్ప్యతే ॥ 14

భావానామ్ = సాధ్యస్వభావకమగు క్రియలకు, ఉపకారార్థమ్ = ఉపకారము నిమిత్తమై, ఆశ్రితః = ఆశ్రయింపబడిన, నిమిత్తభావః = నిమిత్తత్వము, నతిః = నమనము అనగా ఉపకారము చేయుటకు ఆభిముఖ్యము, ఆవర్జనా = అంగభావమున తనను సమర్పించుట, ఇతి + ఏవమ్ = ఇట్టి శబ్దములచే బోధింపబడిన, సిద్ధః = సిద్ధ పదార్థము, సాధనమ్ = సాధనముగా, ఇష్యతే = సమ్మతమగుచున్నది.

సిద్ధపదార్థము సాధ్యమగు క్రియలకు సాధనమగును. ద్రవ్యముగాని గుణముగాని క్రియగాని ముందుగా నున్నచో సాధనము కాగలదు. ॥14॥

అవతారిక—— పై రీతిని మీమాంసకమతము చొప్పున, శక్తి ద్రవ్యముకంటె భిన్నమనియు, వైశేషికమతము చొప్పున శక్తి ద్రవ్యముకంటె వేరుకాదు, అభిన్నమే అనియు నిరూపించి వైయాకరణులకు ఆ యంశమున ఆగ్రహము లేదు అని చూపుచున్నాడు.

శ్లో॥ స తేభ్యోవ్యతిరిక్తో వా, తేషామాత్మైవ వా తథా ।
వ్యతిరేకముపాశ్రిత్య సాధనత్వేన కల్ప్యతే ॥ 15

సః = శక్తిరూపమగు ధర్మము, తేభ్యః = ఆ ద్రవ్యములకంటె, వ్యతిరిక్తః + వా = భిన్నమైనను కావచ్చును, తథా = అట్లే, తేషామ్ = ఆ ద్రవ్యములకు, ఆత్మైవ + వా = స్వరూపమైనను కావచ్చును.

శక్తి ద్రవ్యములకంటె భిన్నమన్నను, అభిన్నమన్నను మాకు ఆ వాదముతో ప్రసక్తిలేదు.

కాని, వ్యతిరేకమ్ = భేదమును. ఉపాశ్రిత్య = ఆశ్రయించి, సాధనత్వాయ = కారకమగుట కొరకు, కల్ప్యతే = సమర్థమగుచున్నది.

ఏది యెట్లున్నను లోకవ్యవహారము వ్యతిరేకపక్షమునే ఆదరించుచున్నది. ఉదా : ఘటస్య దృశిక్రియాయాం కర్మభావః. (ఘటము దృశి క్రియయందు కర్మయగుచున్నది) ఈ సిద్ధాంతమును బట్టియే 'శక్తిః కారకమ్' అను పక్షము వైయాకరణులు ఆశ్రయించిరి శక్తికి శక్తిమంతునకు అభేదమును వివక్షించి శాస్త్రమున వ్యవహారము జరుగుచున్నది. 'సప్తమీ పఞ్చమ్యౌ కారకమధ్యే' అను సూత్రము శక్తియే కారకమను పక్షమునకు సాధకమగుచున్నది. ॥15॥

అవతారిక—— 12 వ శ్లోకమున ఏది దేనికి తోడ్పడునో, అది దానికి సాధనము కాగలదని చెప్పెను. 'యద్యదా యదనుగ్రాహి తత్తదా తత్ర సాధనమ్' పై యర్థమునందు మహాభాష్యకారుని సమ్మతిని చూపుచున్నాడు.

శ్లో॥ సందర్శనం ప్రార్థనాయాం వ్యవసాయే త్వనన్తరా ।
వ్యవసాయస్తథారమ్భే సాధనత్వాయ కల్పతే ॥ 16

శ్లో॥ పూర్వస్మిన్ యా క్రియా సైవ పరస్మిన్ సాధనం మతా।
సందర్శనే తు చైతన్యం విశిష్టం సాధనం విదుః ॥ 17

వివరణము—"కర్మణా యమభిప్రైతి ససంప్రదానమ్" (1-4-32) అను సూత్రముచే పాణిని, (కర్త ఏ పదార్థమును కర్మతో సంబంధింపదలచెనో ఆ పదార్థము సంప్రదాన సంజ్ఞిక మగును) సంప్రదాన సంజ్ఞను విధించి, ఆ యర్థమున చతుర్థీ విభక్తిని విధించెను. ఉదా: బ్రాహ్మణాయ గాం దదాతి, ఇచట ఆవు కర్మ. దానితో బ్రాహ్మణుడు సంబంధింప తలచిన వాడు. ఆయనకు సంప్రదాన సంజ్ఞ కలుగును పై సూత్రము చొప్పున అకర్మకధాతువుల ప్రయోగమున 'పత్యే శేతే ప్రౌఢా' (ప్రౌఢయగు యువతి భర్తకొరకు శయనించుచున్నది) సంప్రదాన సంజ్ఞ సిద్ధింపకున్నది అని భావించి కాత్యాయనుడు 'క్రియాగ్రహణమ్' (కర్త క్రియతో ఏ పదార్థమును సంబంధింపచేయునో, అదియు సంప్రదానము) అను వార్తికమును ఆరంభించెను. తరువాత భాష్యకర్త పై సూత్రముచేతనే 'పత్యేశేతే' మున్నగుచోటులందు పత్యాదులకు సంప్రదాన సంజ్ఞ సిద్ధించును. కనుక వార్తికము వేరుగ చెప్పనక్కరలేదని సిద్ధాంతము జూపెను. కర్త తనయందున్న క్రియచే దేనిని అభిలషించునో అది కర్మయగును. కర్త అభిలషించునది ద్రవ్యము కావచ్చును, గుణము వచ్చును, క్రియయు కావచ్చును. పని చేయువాడు మనంబున ముందుగ ప్రయోజనమును భావించును. అట్టిది తనకు కావలెనని ప్రార్థించును. తరువాత దానిని నిశ్చయపరచును. తరువాత మానసికమగు యత్నము ఆయనకు కలుగును. తరువాత గమనము, శయనము మున్నగు శారీరకములగు బాహ్య క్రియలు కలుగును. కాగా మనస్సులో తెలిసికొనుట మున్నగు క్రియలు కలిగి వానివలన భౌతిక క్రియ కలుగును. ఇచట ముందుగా జరిగెడి క్రియవలన ఉత్తరక్రియ ఈప్సితమగు టచే నది కర్మ సంజ్ఞిక మగును. ఈ రీతిగా ఆరంభణ క్రియచే శయనక్రియ ఈప్సితమగుట వలన కర్మ సంజ్ఞికమగుచున్నది. ధాత్వర్థ శయనక్రియ కర్మయగుటచే దానిచే సంబంధింప దలచిన భర్తకు 'కర్మణా యమభిప్రైతి' అను పాణిని సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగును. ఈ యంశము *మహాభాష్యమున కలదు.

సందర్శనమ్ = ఫలవిషయకమగు సంకల్పము, ప్రార్థనాయామ్ = ఉపాయమునకు సంబంధించిన అభిలాషయందు, అనన్తరా = అవ్యవహితమగు అనగా ప్రార్థన, వ్యవసాయే + తు = దృఢమగు నిశ్చయమునందును, తథా = అట్లే, వ్యవసాయః = అట్టి నిశ్చయము, ఆరమ్భే = మానసిక ప్రవృత్తియందును, సాధనత్వాయ = సాధనత్వము కొరకు, కల్పతే = సమర్థమగుచున్నది, అనగా కారకమగుచున్నది.

---

* క్రియాపి కృత్రిమం కర్మ. క్రియాపి క్రియయా ఈప్సితాభవతి. కయా క్రియయా? సందర్శన క్రియయా, 'ప్రార్థన క్రియయా, అధ్యవస్యతి క్రియయా' "కర్తరి కర్మవ్యతిహారే"

ఇట్లే "కర్మణా యమభిప్రైతి ససంప్రదానమ్" (1-4-32) అను సూత్రమును వ్యాఖ్యానించు సందర్భమున భాష్యము కలదు. ఈ భాష్యమును భర్తృహరి ఈ సముద్దేశముననే సంప్రదాన ప్రకరణమున వివరించుచున్నాడు.

పూర్వస్మిన్ = పూర్వకాలమున, అనగా ముందుగ, యా + క్రియా = ఏ క్రియ కలుగునో, సా + ఏవ = ఆ క్రియయే, పరస్మిన్=ఉత్తర కాలమున జరిగెడి క్రియయందు, సాధనమ్ = కారకముగా, మతా = తలచబడుచున్నది.

సందర్శనే + తు = ఫలవిషయకమగు సంకల్పమున మాత్రము, విశిష్టమ్ = విశిష్టమగు అనగా మాయాసంవలితమగు. చైతన్యమ్ = జీవభావమును, సాధనమ్ = కారకముగా, విదుః = ప్రాజ్ఞులు తెలిసికొనుచున్నారు. అవిద్యా బద్ధుడగు జీవుడు సంకల్పమున సాధనమగునని భావము.

తాత్పర్యము— లోకులు పదార్థమును తెలిసికొని, దానిని కోరుచున్నారు తరువాత దానికి అనుగుణముగా ప్రయతి్నంతురు. ఇది ఎల్లరకు తెలిసినదే. జానాతి, ఇచ్ఛతి యతతే.

ముందుగా ఏ క్రియ ఉండునో, అది ఉత్తరకాలమున జరిగెడి క్రియకు సాధనము కాగలదు. కాగా సందర్శన ప్రార్థన వ్యవసాయములచే ఈప్సితమగుటచే ధాత్వర్థశయనాదులు కర్మసంజ్ఞకములగును. ఇది భాష్యకారుని నిర్ణయము.

కాబట్టి క్రియయు కర్మసంజ్ఞకమగునని భాష్యమువలన ఏది దేనికి ఉపకరించునో, అది దానికి సాధనమగుననుట చాల యుక్తముగా నున్నది. ॥16, 17॥

అవతారిక— "కారకే" (1-4-23) ఇది పాణిని సూత్రము ఇచట సప్తమి ప్రథమార్థకము ఇది సంజ్ఞా సూత్రము. పై సూత్రలలో నిది అనువృత్తమగును. స్వతంత్రము కారకసంజ్ఞ కలదియగును. అది కర్తృసంజ్ఞికమగును అని సూత్రార్థము లభించును

తరువాత కాత్యాయనుడు ఇట్లు ఆక్షేపించెను. "కారకమితి సంజ్ఞానిర్దేశశ్చేత్ సంజ్ఞినో నిర్దేశః" కారక మనునది సంజ్ఞావాచకమన్నచో సంజ్ఞిని ముందుగా చూపవలెను. అనగా సాధనము కారకసంజ్ఞకమగునని చెప్పవలెనని వార్తికమున కర్థము.

అట్లు వచనము వేరుగా చేయనక్కరలేదు. కారక. అనునది అన్వర్థసంజ్ఞ. అనగా కరోతీతి, కారకమ్ అను రీతిని అవయవార్థమును అనుసరించి యీ సంజ్ఞ చేయబడినది. కాబట్టి కారకం, అని చెప్పుటచేతనే క్రియను జనియింపజేయు సాధనము కారకసంజ్ఞికమగునని సూత్రార్థము లభించును. కాబట్టి వేరు వచనమక్కర లేదు. అని భాష్యకారుడు "అన్వర్థసంజ్ఞా యథావిజ్ఞాయేత, కరోతీతికారకమ్" అని పలికెను.

తరువాత దానిపై ఆక్షేపము కలిగెను. కరోతీతి కారకమ్ అని అన్వర్థమగుచో కారకశబ్దము కర్త అను అర్థముకలది యగును. అపుడు కారక కర్తృశబ్దములు పర్యాయములగును. అట్టితరి కర్తృత్వములేని కరణ - కర్మ - సంప్రదాన - అపాదానాధికరణములకు 'కారక' సంజ్ఞ లభింపకున్నది కరణాదులు కర్తలు కానేరవుకదా. "అన్వర్థమితిచే దకర్తరి కర్తృశబ్దానుపపత్తిః".

పై ఆక్షేపమునకు *భాష్యకారుడు సమాధానము చెప్పెను. ఆ భాష్యమును వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ నిష్పత్తిమాత్రే కర్తృత్వం సర్వత్రైవాస్తి కారకే ।
వ్యాపారభేదాపేక్షాయాం కరణత్వాదిసంభవః ॥ 18

A నిష్పత్తిమాత్రే = పాకము మున్నగు క్రియలయొక్క పుట్టుక విషయమున మాత్రము అనగా అవాంతర క్రియల ప్రసక్తి లేక పాకమాత్రము జరుగుటలో, సర్వత్ర = ఎల్ల కారకములయందును, కర్తృత్వమ్ = కర్తృత్వము, అస్తి + ఏవ = ఉన్నదే. సంశయింప వలదు.

తాత్పర్యము— పాకము మున్నగు క్రియలు జరుగవలెనన్న, అవి ఒక వస్తువు వలన జరుగునవి కావు. అనేక వస్తువులు అపేక్షితములగును. ఉదా : బియ్యము, కట్టెలు నీరు, గిన్నె, పొయ్యి, నిప్పు, అగ్ని వీనిని సమకూర్చెడి మనుష్యులు కావలెను. వీనిలో ఏ ఒక వస్తువు లేకున్నను వంట సిద్ధింపదు. ఇది ఎల్లరకు తెల్లమే. పాకము సిద్ధించుట విషయమై పై వస్తువు లన్నియు పనిచేయవలసినదే. గిన్నె పడకుండ ధరియించుట పొయ్యి యొక్క పని. బియ్యము జారకుండ ధరియించుట గిన్నెయొక్క వ్యాపారము మండుట కట్టెల పని. కాగా పాకము తయారుకావలెనన్న అన్నియు పనిచేయుటచే అన్నియు కర్తలు కాగలవు. ప్రధానము వంటకము. అది జరుగుటలో ఎల్లకారకములు స్వతంత్రములే. అవి అన్నియు కలసియే పాకమును కలిగించుచున్నవి కాబట్టి పాకము జరుగుటలో కారకములన్నియు కర్తలు కాగలవు

B. అట్టితరి కర్మ, కరణ, సంప్రదాన, పాదాన, అధికరణ రూపములగు కారకభేదములు ఎట్లు సిద్ధించును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

వ్యాపారభేదాపేక్షాయామ్ = అవాంతరములగు వ్యాపారముల వివక్షయందు, కరణత్వాదిసంభవః = కరణత్వము, కర్మత్వము, సంప్రదానత్వము, అపాదానత్వము, అధికరణత్వము అను కారకభేదములు సంభవించును.

తాత్పర్యము— కః ? కిమ్ ? కేన, కస్మిన్, కథమ్, కస్మై ? కస్మాత్, అనెడి విశేషజిజ్ఞాస కలుగగా పచధాతువువలన భాసించెడి జ్వలనము, ధారణము, అధిశ్రయణము, (పొయ్యిపై గిన్నె ఉంచుట) అవాంతర క్రియలనుబట్టి కరణాది విశేషసంజ్ఞలు కలుగుచున్నవి.

కాగా 'పాకము జరుగును' అను సామాన్య వివక్షలో అన్ని వస్తువులు కారకములు = కర్తలు కాగలవు. అచట ఏ వస్తువు ఎట్లు సహకరించినది ? అను విశేషజిజ్ఞాస

---

* "సిద్ధః కరణాధికరణయోః కర్తృభావః, కుతః? ప్రతికారకం క్రియాభేదాత్, పచాదీనాం హి ప్రతికారకం క్రియాభిద్యతే, కిమిదం ప్రతికారకమితి? కారకం కారకం ప్రతికారకమ్ సామాన్య భూతాక్రియావర్తతే" ఇది భాష్యము. దీని భావము తాత్పర్యమున స్పష్టము

కలుగగా అవాంతర వ్యాపారములను బట్టి కర్మ కరణాది విశేషసంజ్ఞలు కలుగును మండుట అనే వ్యాపారమునుబట్టి కట్టెలు కరణములగును. బియ్యమును ధరియించుటచే గిన్నె అధికరణ మగును. అట్టి గిన్నెను పడకుండ పట్టియుంచుటచే పొయ్యియు అధికరణమగును. ప్రధానమగు విక్లిప్తి అనగా బియ్యము మెత్తపడుటనుబట్టి బియ్యము కర్మయగును. వస్తుసామగ్రిని సమ కూర్చుటను బట్టి చైత్రాదులు ప్రత్యేకముగ కర్తలుగా పరిగణింపబడుచున్నారు.

కాగా పాకక్రియ నిష్పన్నమగుటలో అన్నియు కారకములే = కర్తలే, ఇట్టి కర్తృ త్వము వస్తు సామాన్యమునకు సిద్ధించును. అట్టి కర్తృత్వముండగా వ్యాపారవిశేష జిజ్ఞాస కలుగగా పై రీతిని కరణాది సంజ్ఞలు కలుగును. అందుచే 'కారకము కరణసంజ్ఞకమగును అను భాష్యకారీయ వ్యవహారము సంగతము కాగలదు. పనిచేయునది కారకము.

'కారకే' అను సూత్రమున వేరుగ సంజ్ఞను అనగా సాధనము కారకసంజ్ఞిక మగునని చెప్పనక్కరలేదు. 'కారక' అను మహాసంజ్ఞవలననే సాధనము కారక సంజ్ఞికమను అర్థము లభించును. ॥18॥

అవతారిక — పై యర్థమునకు చక్కని దృష్టాంతమును జూపుచున్నాడు.

శ్లో॥ పుత్రస్యజన్మని యథాపిత్రోః కర్తృత్వముచ్యతే ।
అయమస్యామియం త్వస్మాదితి భేదో వివక్షయా ॥ 19

పుత్రస్య = పుత్రునియొక్క, జన్మని = కనుటయందు అనగా పుత్రుని కనువిషయమున, పిత్రోః = తలిదండ్రులకు, కర్తృత్వమ్ = కర్తృత్వము, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

ఐనను, వివక్షయా = విశేషవివక్షచే, అనగా ఎవరు ఎట్లు కనిరి ? అను విశేష జిజ్ఞాస కలుగగా, అయమ్ = ఇతడు (తండ్రి), అస్యామ్ = ఈమెయందు (తల్లియందు), ఇతి = అనియు, ఇయం + తు = ఈమెయు, అస్మాత్ = ఇతనివలన, అనియు, భేదః = కారకభేదము, యథా = ఎట్ల కలుగుచున్నదో, (తథా + ప్రకృతేపి) = అట్లే ప్రకృతమున గూడ సమన్వయము చేయవలెను.

తాత్పర్యము—పితరౌ పుత్రం జనయతః (తలిదండ్రులు పుత్రుని కనుచున్నారు) అను వాడుక లోకసిద్ధము. సంతానమును కనుటలో ఉభయులు కర్తలే. ఇచట జనియించుట మాత్రమే ధాత్వర్థము. ఆ క్రియలో ఉభయులు కర్తలే. ఆ ధాత్వర్థమున విశేష వివక్షచేయగా పురుషుడు తన బీజమును స్త్రీయందు విడుచుచున్నాడు అనియు, స్త్రీ పురుషునివలన జారు చున్న బీజమును ధరియించుచున్నది అనియు వాడుక కలుగుచున్నది. ఆ స్థితిలో ఆడుదానికి అధికరణత్వము, మగవానికి అపాదానత్వము లభించుచున్నది. కాగా జని ధాత్వర్థమును సామాన్యరూపమున వివక్షించిన ఆలుమొగలకు కర్తృసంజ్ఞయు, విశేషరూపమున వివక్ష చేయగా, వారికి అధికరణాపాదానత్వములు కలుగుచున్నవి.

అట్లే ప్రకృతమున గూడ పచి ధాతువుయొక్క అర్థమును సామాన్యరూపమున గ్రహించినచో ఎల్లకారకములు కర్తలు కాగలవు. విశేషరూపమున, ధాత్వర్థమును జూచిన కరణాది విశేషసంజ్ఞలు కలుగగలవు. కర్తృకరణాదులు విరుద్ధములు కానోపవు ॥19॥

అవతారిక— ప్రధాన క్రియలో సామాన్య విశేషభావమును ఆశ్రయించి కారకం కరణమ్ (కర్త కరణమగును), కారకం కర్మ (కర్త కర్మయగును) మున్నగు వ్యవహారములు సంగతములు కాగలవని చెప్పిన భాష్యమును 19 వ శ్లోకముచే వ్యాఖ్యానించెను.

ఇప్పుడు క్రియావిశేషమును స్వీకరించినను పై వ్యవహారము లుపపన్నములగును. కాష్ఠము మున్నగునవి అప్రధాన క్రియనుబట్టి స్వతంత్రములై కర్తలు కాగలవు. అవి ప్రధాన క్రియనుబట్టి అస్వతంత్రములైనను, వానికిగల స్వాతంత్ర్యము చెడదు. అది అనువృత్తమగును. కాగా కరణత్వమున్నను కర్తృత్వము కూడ ఉండగలదు అను అర్థమును బోధించెడి *మహాభాష్యమును వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ గుణక్రియాణాం కర్తారః కర్త్రా న్యక్కృతశక్తయః ।
న్యక్తాయామపి సంపూర్ణైః స్వైర్వ్యాపారైః సమన్వితాః ॥ 20

శ్లో॥ కరణత్వాదిభిర్జ్ఞాతాః క్రియా భేదానుపాతిభిః ।
స్వాతన్త్ర్యముత్తరం లబ్ధ్వా ప్రధానే యాన్తి కర్తృతామ్ ॥ 21

గుణక్రియాయామ్ = అప్రధానమగు వ్యాపారమునందు, అనగా మండుట మున్నగు అప్రధానమగు పచ్యాద్యర్థవ్యాపారమున, కర్తారః = స్వతంత్రములగు కట్టెలు మున్నగునవి, కర్త్రా = కర్తచే అనగా చైత్రుడు మున్నగు ప్రధాన క్రియాకర్తచే, న్యక్కృతశక్తయః = తిరస్కరింపబడిన స్వాతంత్ర్యముకలవై, న్యక్తాయామ్ + అపి = స్వతంత్రత తిరస్కృతమైనను, సంపూర్ణైః = సంపూర్ణములగు, స్వైః = స్వీయములగు, వ్యాపారైః = మండుట మున్నగు వ్యాపారములచే, సమన్వితాః = కూడియున్నవై, అనగా వానితో విడవకయున్నవై, క్రియాభేదానుపాతిభిః = క్రియావిశేషమును అనుసరించి యుండెడి, కరణత్వాదిభిః = కరణత్వము కర్మత్వము, మున్నగువానిచే, జ్ఞాతాః = తెలియబడినవై, ఉత్తరమ్ = తరువాతను గూడ, అనగా చైత్రాదులచే ప్రేరణ చేయబడిన తరువాత కూడ, స్వాతన్త్ర్యమ్ = స్వతంత్రతను అనగా కర్తృత్వమును, లబ్ధ్వా = పొంది, ప్రధానే = ప్రధాన వ్యాపారమునందు, కర్తృతామ్ = కర్తృత్వమును, యాన్తి = పొందుచున్నవి.

---

* 'స్వతన్త్రపరతన్త్రత్వాత్తయోః పర్యాయేణ వచనమ్, వచనాశ్రయా చ సంజ్ఞా ... ప్రధానేన వ్యవాయే స్థాలీ పరతన్త్రా, వ్యవాయే స్వతన్త్రా. తద్యథా - అమాత్యానాం రాజ్ఞా సహసమవాయే పారతన్త్ర్యం, వ్యవాయే స్వాతన్త్ర్యమ్'. "కారకే" (1–4–23). ఇది మహాభాష్యము. దీని భావము తాత్పర్యమున వ్యక్తము కాగలదు.

తాత్పర్యము— చైత్రః తణ్డులం కాష్ఠైః పచతి. (చైత్రుడు బియ్యమును కఱ్ఱలచే అన్నమును తయారుచేయుచున్నాడు) ఇచట చైత్రుని వ్యాపారము ప్రధానము. మండుట మున్నగునవి అప్రధాన వ్యాపారములు. అప్రధాన వ్యాపారములలో కాష్ఠాదులు స్వతంత్రములే. అట్లుకాకున్న అవి మండుట మున్నగుపనులను చేయజాలవు. ప్రధానవ్యాపారమున కాష్ఠాదులు అస్వతంత్రములే. ఐనను తమకున్న స్వాతంత్ర్యమును గోల్పోవు. చైత్రాదులనుబట్టి అవి అట్లు భాసించుచున్నవి. కాగా తమయందున్న స్వతంత్రతను విడువకయే ప్రధానక్రియకు తోడ్పడుటచే కర్తృత్వము, కరణత్వము కూడ కాష్ఠాదులకు కలుగును ॥20, 21॥

అవతారిక— పై చూపిన యర్థమునకు దృష్టాంతమును జూపుచున్నాడు.

శ్లో॥ యథా రాజ్ఞా నియుక్తేషు యోద్ధృత్వం యోద్ధృషుస్థితమ్ ।
తేషు వృత్తౌ తు లభతే రాజా జయపరాజయౌ ॥ 22

శ్లో॥ తథా కర్త్రా నియుక్తేషు సర్వేష్వేకార్థకారిషు ।
కర్తృత్వం కరణాదిత్వైరుత్తరం న విరుధ్యతే ॥ 23

యథా = ఏ రీతిగ, రాజ్ఞా = ప్రభువుచే, నియుక్తేషు = ప్రేరితులగు, యోద్ధృషు = యుద్ధము చేయు భటులయందు, యోద్ధృత్వమ్ = యుద్ధముచేయుట, వ్యవస్థితమ్ = నిశ్చిమైయున్నదై, తేషు = ఆ యోద్ధలయందు, వృత్తౌ + తు = జరుగగా అనగా యుద్ధమనెడి క్రియ యుండగా, అనగా వారు యుద్ధముచేయగా, రాజా = ప్రభువు. జయపరాజయౌ = జయాపజయములను, లభతే = పొందుచున్నాడో,

తథా = అట్లే. కర్త్రా = కర్తచే, నియుక్తేషు = నియోగింపబడినట్టియు, అయినను, ఏకార్థకారిషు = పాకము మున్నగు ఒకే ప్రధానక్రియను కలిగించెడి, సర్వేషు = ఎల్లకారకములయందు, (స్థితమ్) = ఉన్నటువంటి, కర్తృత్వమ్ = కర్తృత్వము ఉత్తరమ్ = తరువాతి కాలమున కలిగెడి, కరణాదిత్వైః = కరణత్వము మున్నగువానితో, న + విరుధ్యతే = విరోధించునది కాదు.

తాత్పర్యము— ప్రభువు భటులను యుద్ధము మున్నగు పనులయందు నియోగించును. ఆ స్థితిలో భటులు అస్వతంత్రులే. తరువాత వారు చేసెడి యుద్ధము మున్నగు క్రియలలో స్వతంత్రులే. ఫలితము మాత్రము ప్రధానునకు చెందును భటులు స్వతంత్రులై పనిచేయనిచో ప్రభువునకు కార్యము లభింపదు.

అట్లే దేవదత్తుడు ప్రేరేపింపగా కాష్ఠాదులు పాకక్రియను కలిగించుచున్నవి. అవి ఆ స్థితిలో అప్రధానములే కాని ప్రేరణ తరువాత మండుట మున్నగు అవాంతర వ్యాపారములలో అవి స్వతంత్రములే. అట్లుకాకున్న పాకము నిష్పన్నము కాకపోయెడిని., కాబట్టి కర్తృత్వము, కరణత్వము విరుద్ధములు కావు ॥22, 23॥

అవతారిక — 'కరోతీతికారకమ్' అను రీతిని కారకసంజ్ఞ అన్వర్థమే అని సిద్ధాంతము చేయబడినది. అట్టితరి హేతువు కూడ క్రియానిర్వాహకమే యగుటంజేసి అదియు కరణసంజ్ఞకమగును. కాగా కరణార్థమున తృతీయావిభక్తి విధింపబడినది. అంత మాత్రమునసే హేత్వర్థమున గూడ తృతీయ సిద్ధించుచుండగా మరల 'హేతౌ' అను సూత్రముచే తృతీయా విధానము వ్యర్థము అను ప్రశ్న కలుగగా దానికి సమాధానముగా కరణత్వమునకు హేతుత్వమునకును భేదము జూపుచున్నాడు.

శ్లో॥ అనాశ్రితే తు వ్యాపారే నిమిత్తం హేతురిష్యతే ।
ఆశ్రితావధిభావం తు లక్షణే లక్షణం విదుః ॥ 24

A. వ్యాపారే = వ్యాపారము, అనాశ్రితే + తు = ఆశ్రయింపనిచో, నిమిత్తమ్ = నిమిత్తముగానున్న అర్థము హేతుః = హేతువుగా, విదుః = తెలిసికొనుచున్నారు.

వ్యాపారమును అపేక్షింపక యున్న కారణము హేతువని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఉదా : అధ్యయనేన వసతి. (చదువుచే అనగా చదువు నిమిత్తముగాజేసికొని ఉంటున్నాడు) అధ్యయనము హేతువు. నివాసము హేతుమత్తు. ఇచట వ్యాపారము అపేక్షితము కానందున కరణసంజ్ఞ కలుగదు. సంబంధముచే షష్ఠీవిభక్తి ప్రవర్తించుచుండగా దానికి అపవాదముగా హేతు తృతీయ ప్రవర్తించినది.

B 'అనుర్లక్షణే' (1-4-84) అను సూత్రమున హేతువునుగూడ లక్షణ శబ్దముచే స్వీకరించుచున్నందున లక్షణము హేతువు రెండు ఏకరూపములేకాన శాస్త్రమున వేరువేరుగా గ్రహించుట వ్యర్థము అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

తు = విశేషమేమనగా, అనగా హేతువునకు లక్షణమునకు భేదమేమనగా, లక్షణే = గుర్తింపబడెడి వస్తువును ప్రకాశింపచేయుటలో, (యత్) ఏది, ఆశ్రితావధిభావమ్ = పొందబడిన అవధిభావము అనగా హద్దు కలదియో, తత్ = దానిని, లక్షణమ్ = జ్ఞాపకమునుగా, విదుః = (శాస్త్రజ్ఞులు) గుర్తించుచున్నారు.

హేతువను పదార్థము కూడ ఒక హద్దును అపేక్షించిన లక్షణమనియు, అవధిభావము లేకున్నచో హేతువనియు పెద్దలు చెప్పుచున్నారు. ఉదా : అనువనమశనిర్గతః (వనమువద్ద పిడుగు పడినది) ఇచట వనము హద్దుగా గ్రహింపబడినది. కాబట్టి వనము లక్షణమగుచున్నది ॥24॥

అవతారిక — జనకత్వము సమానముగా నుండుటవలన 1. కారకము 2. హేతువు ఈ రెండు ఏకరూపములు కాకూడదా ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యాదివిషయో హేతుః, కారకం నియతక్రియమ్ ।
కర్తా కర్త్రన్తరాపేక్షః క్రియాయాం హేతురిష్యతే ॥ 25

A. ద్రవ్యాది విషయః = ద్రవ్యము మున్నగునవి అనగా ద్రవ్యము, గుణము, క్రియ విషయముగా గల యర్థము, హేతుః = హేతువు అగును.

ద్రవ్యమును, గుణమును, క్రియను కలిగించునది హేతువనబడును. ఉదా : దణ్డేన ఘటః (కడవ దండముచే జనియించును) దండము హేతువు. దండమునందు వ్యాపారమున్నను క్రియాజనకము కాక కడవయనెడి ద్రవ్యమును పుట్టించుచున్నందున హేతువగును కరణము కానేరదు. 'ధనేన కులమ్', 'విద్యయా యశః', 'శిల్పాభ్యాసేన నైపుణ్యమ్', 'అగ్నినా పాకః' మున్నగునవి ఉదాహరణములు కాగలవు.

నియత క్రియతమ్ = నియతమగు క్రియకలది, కారకమ్ = కారకమగును.

క్రియామాత్రమును కలిగించునది కరణసంజ్ఞికమగును. 'బాణేన హతః'.

B. వ్యాపారసహితమగు పదార్థమునకు శాస్త్రీయమగు హేతుత్వము కలుగునని చెప్పుచున్నాడు.

కర్తా = కర్త అనగా ప్రయోజక కర్త, కర్త్రన్తరాపేక్షః = మరియొక కర్తయొక్క అపేక్ష కలవాడై అనగా ప్రయోజ్యకర్త ద్వారా క్రియను జనియింపచేయు వాడై, క్రియాయామ్ = పాకము మున్నగు క్రియయందు, (ప్రయోజ్యకర్తారమ్ + ప్రేరయన్) = ప్రయోజ్యకర్తను ప్రేరేపించువాడై, హేతుః = 'హేతు' అను సంజ్ఞకలవాడుగా, ఇష్యతే = సమ్మతమగుచున్నాడు.

పచతి తణ్డులం చైత్రః (చైత్రుడు తండులమును పాకము చేయుచున్నాడు). పాచయతి తణ్డులం చైత్రేణ దేవదత్తః (అట్టి చైత్రునిచే దేవదత్తుడు పాకము చేయించుచున్నాడు) ఇచట దేవదత్తుడు ప్రయోజకకర్త. అతనికే "తత్ప్రయోజకో హేతుశ్చ" అను సూత్రముచే హేతుసంజ్ఞ కలుగును. ఈ హేతువు కారకవిశేషము, లౌకికమగు హేతువు కాదు. ॥25॥

అవతారిక— హేతువునకు కరణమునకు క్రియావిషయత్వము సమానమే. అట్లైనను ఆ రెంటికి వ్యత్యాసమున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియార్థైవ కరణం,తస్య దృష్టః ప్రతినిధిస్తథా ।
హేత్వర్థా తు క్రియా తస్మాన్న స ప్రతినిధీయతే ॥ 26

తథా = అట్లే, కరణమ్ = బాణము, కత్తి మున్నగు కరణము, క్రియార్థైవ = క్రియార్థమే, అనగా క్రియ జనియించుటకు ఉపయోగపడునదియే, తస్య = ఆ కరణము, ప్రతినిధిః = ప్రతినిధి, అనగా ఆ వస్తువు లభింపనపుడు మరియొక వస్తువును ఉపయోగించుట, దృష్టః = కనబడుచున్నది. అనగా శిష్టాచారముగా కానవచ్చుచున్నది.

రథేన గచ్ఛతి (రథముతో వెళ్లుచున్నాడు) ఇచట గమనము ప్రధానము దానికి సాధనము రథము. కనుకనే అది అప్రధానమగుచున్నది. ఒకవేళ రథము దొరకనిచో మరియొక సాధనమును ఉపయోగించుకొని పయనముచేయుట లోకానుభవ సిద్ధము. దీనినిబట్టి

చూడగా కరణమునకు ప్రతినిధిత్వము అనగా అది దొరకనిచో దానికి బదులుగా మరియొక దానిని వినియోగించుట కానవచ్చుచున్నది గమనము ప్రధానము. దానికి ప్రతినిధి యుండదు.

క్రియా + తు = క్రియయే, హేత్వర్థా = హేతువుకొరకు ఉపయోగపడుచున్నది అనగా హేతువు ప్రధానము. క్రియ అప్రధానముగా నుండునని భావము.

తస్మాత్ = ఆ కారణమువలన అనగా హేతువు ప్రధానమగుట వలన, సః = ఆ హేతువు, న + ప్రతినిధీయతే = ప్రతినిధిగా చూపబడదు.

అప్రధానమునకే ప్రతినిధి యుండును. ప్రధానమగు దానికి ప్రతినిధి యుండదు. ఉదా : అధ్యయనేన వసతి (చదువును హేతువు జేసికొనివసించుచున్నాడు) ఇచట అధ్యయనము ప్రధానము. దానిని సాధించుటకై గ్రామమున ఉండుట. కాబట్టి అధ్యయనేన వసతి. అనుచోట క్రియ అప్రధానమై అధ్యయనమనే హేతువు ప్రధానమైనది. అందుచే దానికి ప్రతినిధి యుండదు.

క్రియ ప్రధానమై సాధనము అప్రధానమగుచో అచట కరణ తృతీయ అనియు, క్రియ అప్రధానమై సాధనము ప్రధానమగుచో అచట హేతు తృతీయ అనియు వ్యవస్థ చేయదగును. ॥26॥

అవతారిక — హేతుత్వ - కరణత్వములకు గల భేదము ఇంతవరకు చూపి, హేత్వర్థ తృతీయకు తాదర్థ్య చతుర్థికి గల భేదమును జూపుచున్నాడు.

శ్లో॥ ప్రాతిలోమ్యానులోమ్యాభ్యాం హేతురర్థస్య సాధకః ।
తాదర్థ్యమానులోమ్యేన హేతుత్వానుగతం తు తత్ ॥ 27

A. ప్రాతిలోమ్యానులోమ్యాభ్యామ్ = ప్రాతికూల్యమున అనుకూల్యమున, అర్థస్య = అర్థమునకు, సాధకః = సాధకమగు వస్తువు, హేతుః = హేతువనబడును

ఒక వస్తువు మరియొక వస్తువునకు అనుకూల్యమునుగాని ప్రాతికూల్యమునుగాని కలిగించును. అట్టి యర్థము హేతువగును. ఉదా : ఉదకము సూర్యకిరణ సంపర్కమున తగ్గియున్నదై అంతకంటె గూడ స్వల్పాతి స్వల్పరూపమగు ఉదకమునకు అనుగుణమగును. దీనిని ప్రాతికూల్యమందురు. బీజము ఉదక. ఆతపాది సంబంధమున ఉబ్బి అంకురోత్పత్తికి సహకరించును. దీనిని ఆనుకూల్యమందురు.

పై రీతిని రెండు విధములుగా హేతువు కానవచ్చుచున్నది.

B. తాదర్థ్యము అట్టిది కాదు. అనుకూల్యమునే కలిగించుచుండునని చెప్పుచున్నాడు.

అనులోమ్యేన = అనుకూల్యమున, హేతుత్వానుగతమ్ = హేతువుయొక్క రూపముతో గూడినది, యత్ = ఏదియో, తత్ + తు = అదియే, తాదర్థ్యమ్ = తాదర్థ్యమని చెప్పబడుచున్నది.

హేతువు రెండు విధములుగా నున్నది. వానిలో ఆనుకూల్యమనే రూపము కల హేతువే తాదర్థ్యమనబడును, తస్మై = తయారుకాగల వస్తువునకు, ఇదమ్ = ఉపకరించునది = తదర్థమ్, దాని భావము - తాదర్థ్యము. ఉదా : కుణ్డలాయ హిరణ్యమ్. (కుండలములకు ఉపయోగపడెడి బంగారము). ॥27॥

అవతారిక — 24 వ కారికనుండి ఇంతవరకు కారకమునకు, హేతువునకు, లక్షణమునకు, తాదర్థ్యమునకు గల భేదమును జూపి, మరల కారక విచారమును ప్రస్తావించు చున్నాడు.

శ్లో॥ సర్వత్ర సహజా శక్తిర్యావద్ద్రవ్యమవస్థితా ।
క్రియాకాలే త్వభివ్యక్తిరాశ్రయా దుపకారిణీ ॥ 28

సర్వత్ర = అన్ని వస్తువులయందు అనగా అనిత్య పదార్థములయందు, శక్తిః = శక్తి, సహజా = కారణముతోపాటు పుట్టుక కలదియే, వస్తువు జనియించిన పిమ్మట దానియందు శక్తి జనియింపదు. కారణమువలన వస్తువు జనియించుటయే శక్తుల జనియించుటయు ఆ శక్తి, యావద్ద్రవ్యమ్ = ద్రవ్యమున్నంతవరకు, అవస్థితా = ఉండును. ఆశ్రయము లేనిది శక్తి ఉండనేరదు, కాబట్టి ఆశ్రయమున్నంతవరకు శక్తి యుండును, ఆశ్రయము నశించిన శక్తియు నశించును, నిత్య పదార్థములయందు, శక్తి స్వాభావికమే

ఉపకారికీ = ఉపకరించెడి అనగా కారణములు సిద్ధముగా నుండగా కార్యమును కలిగించెడి, ఆశ్రయాత్ = ఆధారమునుండి కలిగెడి, అభివ్యక్తిః = ఆవిర్భావము, క్రియా కాలే + తు = క్రియ జరిగెడి కాలముననే.

ద్రవ్యమునందు శక్తియున్నది. కాని ఆ శక్తి కారణముల సామగ్రి సిద్ధముగా నున్నచో ఆ ద్రవ్యమునుండి క్రియ కలుగు సమయముననే అభివ్యక్తమగును. అపుడే అది సాధనమని వ్యవహరింపబడును. అంతకుముందు సాధనమనబడదు. ॥28॥

అవతారిక — పై కారికార్థమునే సమర్థించుచున్నాడు

శ్లో॥ కుడ్యస్యావరణే శక్తి రస్యాదీనాం విదారణే ।
సర్వదా స తు సన్ ధర్మః క్రియాకాలే నిరూప్యతే ॥ 29

కుడ్యస్య = గోడకు, ఆవరణే = ఇతర వస్తువు కానరాకుండుట విషయముగాను, అస్యాదీనామ్ = కత్తి మున్నగువానికి, విదారణే = బద్దలుకొట్టుట విషయముగాను, శక్తిః = శక్తి, సర్వదా = ఎల్లకాలములయందు కూడ, అస్తి = ఉన్నది

సః + ధర్మః = శక్తిరూపమగు ఆ ధర్మము, క్రియాకాలే + తు = వ్యాపారము చేయు సమయముననే, నిరూప్యతే = నిరూపింపబడుచున్నది. అనగా వ్యక్తీకరింపబడుచున్నది.

ముఖ్యకారణమునుండి కారణమునకు శక్తులు సంక్రమించును ఆ శక్తులు ఆ ద్రవ్యమున్నంతవరకు తప్పక ఉండును. కాని ఆ ద్రవ్యము పనిచేయునపుడే ఆ శక్తులు వ్యక్తము లగును.

గోడ వస్తువు కానరాకుండ చేయగలదు అది మనము ఒక వస్తువును అన్వేషించునపుడే తెలియబడును. అట్లే కత్తి, గొడవలి మున్నగునవి ద్రవ్యమును రెండు ముక్కలుగా చేయగలవు. కాని విషయమున్నపుడే కదా ఆ పని చేయగలవు ॥29॥

అవతారిక— పై యర్థమునే ప్రమాణముచే నిరూపించుచున్నాడు.

శ్లో॥ స్వాఙ్గసంయోగినః పాశా దైత్యానాం వారుణా యథా ।
వ్యజ్యన్తే విజిగీషూణాం ద్రవ్యాణాం శక్తయ స్తథా ॥ 30

విజిగీషూణామ్ = పరులను జయించెడి ఇచ్ఛ కలిగిన, దైత్యానామ్ = రాక్షసులకు, వారుణాః = వరుణ దేవతాకములగు, పాశాః = పాశములు, స్వాఙ్గసంయోగినః = తమ అనగా రాక్షసుల హస్తములయందు ఎల్లపుడు శక్తిరూపమున ఉన్నవై, యథా = ఏ రీతిగా, వ్యజ్యన్తే = (పరసేనలను జయించు సమయమున) వ్యక్తములగుచున్నవో, తథా = అట్లే, ద్రవ్యాణామ్ = ద్రవ్యముల యొక్క, శక్తయః = శక్తులు కూడ, (కార్యముచేయు సమయమున), వ్యజ్యన్తే = వ్యక్తములు కాగలవు.

తాత్పర్యము— రాక్షసులకు వారుణ పాశములు ఎల్ల సమయములయందు ఇతరులకు కానరాకుండ శక్తిరూపమున ఉన్నవనియు, అవి శత్రువులను జయించువేళ బయట పడుననియు వేదము చెప్పుచున్నది. ద్రవ్యముల శక్తులుకూడ ఆపాశములవలె నున్నవై కార్య సమయమున వ్యక్తములగుచున్నవి. ॥30॥

అవతారిక— శస్త్రము మున్నగువానికి బద్దలుచేయుట విషయమై శక్తి యున్నదని చెప్పబడిన అర్థమును వ్యక్తపరచుచున్నాడు

శ్లో॥ తైక్ష్ణ్యగౌరవకాఠిన్య సంస్థానైః స్వైరసి ర్యదా ।
ఛేద్యం ప్రతి వ్యాప్రియతే శక్తిమాన్ గృహ్యతే తదా ॥ 31

అసిః = కత్తి, స్వైః = స్వీయమగు తైక్ష్ణ్య గౌరవకాఠిన్య సంస్థానైః = వాడిగా నుండుట, బరువుగానుండుట, గట్టిగానుండుట, ఆయా ఆకారములతో నుండుట అను ధర్మములచే, ఛేద్యమ్ + ప్రతి = నరకబడెడి వస్తువునుగురించి, యదా = ఎప్పుడు, వ్యాప్రియతే = వ్యాపారముకలది యగునో, తదా = అపుడు, శక్తిమాన్ = శక్తికలదిగా, గృహ్యతే = తెలియబడుచున్నది.

కత్తి, గొడ్డలి, రంపము, కొడవలి మున్నగునవి ఆయా ఆకారవిశేషములతో వాడిగాను, బరువుగాను, ఉండును. బరువుగాలేనిచో చెట్టను నరకుట జరుగదు. కాని అవి ఎల్లపు

డును శక్తిమంతములుగా లోకులచే గ్రహింపబడవు. కనుకనే వాటిని ఎచ్చటనో దాచి యుంచుదురు. అవసరమగునపుడు వానిని ఉపయోగించెదరు. అపుడే వానిని శక్తికలవాటినిగా లోకులు గుర్తించుచున్నారు. ॥31॥

అవతారిక— సాధనము విషయమున పక్షభేదములను జూపుచున్నాడు.

శ్లో॥ ప్రాఙ్నిమిత్తాన్తరోద్భూతం క్రియాయాః కైశ్చిదిష్యతే ।
సాధనం సహజం కైశ్చిత్ క్రియాన్యైః పూర్వమిష్యతే ॥ 32

1. కైశ్చిత్ = కొందరిచే, క్రియాయాః = క్రియకంటె, ప్రాక్ = ముందుగా, నిమిత్తాన్తరోద్భూతమ్ = నిమిత్తాంతరముచే జనియించినదానిగా, ఇష్యతే = ఇష్టపడుచున్నది.

శక్తి యున్నట్లు మనకు ముందు తెలియదు. వస్తువు జనియించినపిమ్మట శక్తులు ఊహింపబడుచున్నవి. సహకారి కారణముల ప్రోగువలన కార్యము జనియించును. వేరువేరు వస్తువులు కార్యజనకములు కానేరవు. కాగా ద్రవ్యముతోపాటు శక్తులు జనియించునవి కావు. మరి యేమన నిమిత్తాంతరమువలననే.

2. కైశ్చిత్ = కొందరిచే, సాధనమ్ = సాధనము, సహజమ్ = సహజముగా నున్నట్లు, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

శక్తి, శక్తిమత్తు రెండు వేరుకావు. ద్రవ్యమే సాధనము. కాగా అది సహజమేయని కొందరి భావము.

3. అన్యైః = మరి కొందరిచే, క్రియా = క్రియయే, పూర్వమ్ = ముందుగా, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

క్రియతోపాటు శక్తి జనియించునది కాదు. క్రియ సాధ్యము కాన దానికి ముందుగా సాధనముండవలెను. అపుడే రెంటికి సాధ్యసాధన భావము యుక్తమగుచున్నది. కాని అట్లు కాక క్రియయే పూర్వమని వీరి యాశయము. ॥32॥

అవతారిక— సాధనముకంటె ముందుగా క్రియ యుండునని కొందరి యాశయము. అది యెట్లు సంగతమగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రవృత్తిరేవ ప్రథమం క్వచిదప్యనపాశ్రయా ।
శక్తీరేకాధికరణే స్రోతోవదపకర్షతి ॥ 33

క్వచిత్ + అపి = ఒకదానియందు గూడ, అనపాశ్రయా = ఆశ్రయములేని అనగా కారణ వ్యాపారములను అపేక్షింపని, ప్రవృత్తిః + ఏవ = వ్యాపారమే, ప్రథమమ్ = ముందుగా ఏకాధికరణే = ఒకే ఆధారమునందు, శక్తీః = శక్తులను, స్రోతోవత్ = నదీ ప్రవాహము వలె, అపకర్షతి = వహించుచున్నది.

తాత్పర్యము— క్రియ నిత్యము. అది ఇతర హేతువులను అపేక్షింపక తనకు ఆధారమగు ద్రవ్యమునందు తనకు అనుకూలములగు శక్తులను ఆవిర్భవింపచేయును. నదీ ప్రవాహము గడ్డి, ఆకు, అలము మున్నగు వస్తువులను లాగుకొనిపోవును అట్లే క్రియయు శక్తులను ఆకర్షించును.

కాగా వీరి మతము చొప్పున క్రియ ముందుగా నుండును. ॥33॥

అవతారిక— మరికొన్ని మతముల నాశ్రయించి సాధన స్వరూపమును చూపుచున్నాడు.

శ్లో॥ అపూర్వం కాలశక్తిం వా క్రియాం వా కాలమేవ వా ।
తమేవంలక్షణం భావం కేచిదాహుః కథఞ్చన ॥ 34

1. కేచిత్ = కొంతమంది, ఏవం లక్షణమ్ = పై చూపబడిన స్వరూపముకల, తమ్ = ఆ, భావమ్ = సాధన పదార్థమును, అపూర్వమ్ = అపూర్వమునుగా, ఆహుః = పలుకుచున్నారు. ఇది మీమాంసకుల ఆశయము.

మనుష్యులు చేసెడి శుభాశుభ కర్మలవలన ఒక సంస్కారము కలుగును. అది కర్మల ఫలము లభించువరకు ఉండును. ఫలము రాగా నశించును. దీనిని అపూర్వమందురు. అదియే సాధనమని కొందరు విశ్వసించుచున్నారు.

2. మరికొందరు, కాలశక్తిం + వా = కాలముయొక్క శక్తినే, సాధనముగా పలికెదరు.

3 మరికొందరు, క్రియాం + వా = క్రియనే సాధనమని గ్రహించిరి. అదియే శక్తులను ప్రకాశింపచేయును.

4. మరికొందరు, కాలమ్ + ఏవ + వా = కాలమునే సాధనమునుగా తలంచెదరు. ॥34॥

అవతారిక— ద్రవ్యములయందున్న సామర్థ్యమనెడి శక్తియే సాధనమని చూపి ఆ సాధనము యొక్క సంఖ్యను చూపుచున్నాడు

శ్లో॥ నిత్యాః షట్ శక్తయో ఽన్యేషాం భేదాభేదసమన్వితాః ।
క్రియాసంసిద్ధయేఽర్థేషు జాతివత్సమవస్థితాః ॥ 35

అన్యేషామ్ = కొందరి (మతమున), అర్థేషు = ఘటము, పటము మున్నగు పదార్థములయందు భేదాభేదసమన్వితాః = భిన్నముగాను అభిన్నముగాను ఉన్నటువంటి, నిత్యాః = నిత్యములగు, షట్ = ఆరు, శక్తయః = కర్మ, కర్త, కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము అను ఆరు శక్తులు, క్రియా సంసిద్ధయే = నీటిని తీసికొనివచ్చుట మున్నగు క్రియల సిద్ధికొరకు, జాతివత్ = ఘటత్వము, పటత్వము మున్నగు జాతులువలె, సమవస్థితాః = నియతములై యున్నవి.

కర్తృత్వాది శక్తులు ఘటాదులకంటె వేరు కానేరవు. అట్లని అభిన్నములు కానేరవు జాతి యెట్లు నిత్యమై ఘటవ్యక్తియందు సమవేతమగునో, అట్లే ఈ శక్తులు కూడ నున్నవి. ఇవి ఆరు. ॥35॥

అవతారిక— ద్రవ్యములు ఎన్నియో సంఖ్యాపరిమితి లేకయున్నను, శక్తులు మాత్రము ఆరే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యాకారాదిభేదేన తా శ్చాపరిమితా ఇవ ।
దృశ్యన్తే, తత్త్వమాసాం తు షట్ శక్తీర్నాతివర్తతే ॥ 36

ద్రవ్యాకారాది భేదేన = ద్రవ్యముయొక్క ఆకారము మొదలయినవాని భేదముచే, తాః + చ = ఆ శక్తులు, అపరిమితాః + ఇవ = పరిమితి లేనివివలె, దృశ్యన్తే = చూడబడుచున్నవి.

కొడవలి ఒక విధముగా ఛేదనమునకు ఉపకరించును. కత్తి మరియొక విధముగా సహకరించును. అట్లే ఆ యా వస్తువుల ఆకారమునుబట్టియు వేరువేరు పనులు జరుగును. కాగా వాని శక్తులుకూడ విభిన్నములవలె కాన్పించుచున్నవి. అట్లే దేశకాలములచే గూడ భిన్నములగుచున్నవి.

కాని, ఆసామ్ = ఈ శక్తులయొక్క, తత్త్వమ్ = స్వరూపము, షట్ = ఆరు, శక్తీః = శక్తులను, న + అతివర్తతే = అతిక్రమించి యుండదు.

వేరుగా ఎన్నియో కాన్పించినను, అవి కర్తగానో కర్మగానో కాక మరియొక కారకరూపముగానో కాన్పించును ఈ యారు కాక మరియొకరూప ముండనేరదు. ॥36॥

అవతారిక— నిజరూపమున శక్తి ఒక్కటియే. అదియే నిమిత్తవశమున ఆరు రూపములుగా కాన్పించుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ నిమిత్తభేదాదేకైవ భిన్నా శక్తిః ప్రతీయతే ।
షోఢా, కర్తృత్వమేవాహు స్తత్ప్రవృత్తేర్నిబన్ధనమ్ ॥ 37

ఏకా + ఏవ = నిజరూపమున ఒక్కటియేయగు, శక్తిః = శక్తి, నిమిత్తభేదాత్ = కారణ భేదమువలన, షోఢా = ఆరు విధములుగా, భిన్నా = భిన్నమైనదిగా, ప్రతీయతే = తెలియ బడుచున్నది.

సామర్థ్యమనునది ఒక్కటియే, కాని నిమిత్తముల భేదమున ఆరు రూపములతో కాన్పించుచున్నది.

కర్తృత్వమ్ + ఏవ = కర్తృ శక్తినే, తత్ప్రవృత్తేః = ఆరు విధములగు ప్రవృత్తికి, నిబన్ధనమ్ = కారణముగా, ఆహుః = పలుకుచున్నారు.

కర్తృ శక్తియే కరణముగా, కర్మగా, సంప్రదానముగా, అపాదానముగా, అధికరణముగా పరిణమించుటకు కారణమని పెద్దలు వక్కాణించిరి. ॥37॥

అవతారిక— శక్తి ఒకటియా? కాక అనేకమా? అని విచారింపబడినది. ఇపుడు ఆ శక్తి ద్రవ్యరూపమా? కాక ద్రవ్యముకంటె వేరుగా నున్నదా? అని విచారించుచున్నాడు.

శ్లో॥ తత్త్వే వా వ్యతిరేకే వా వ్యతిరేకితదుచ్యతే।
శబ్దప్రమాణకోలోకః, సశాస్త్రేణానుగమ్యతే॥ 38

తత్త్వే + వా = శక్తికి ద్రవ్యముతో అభేదమున్నను, వ్యతిరేకే + వా = ద్రవ్యముతో భేదమున్నను ప్రయోజనమేమియు లేదు, కాని, తత్ = ఆ సాధనము, వ్యతిరేకి = భిన్నమేయని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

శక్తి ద్రవ్యరూపమే, కాక వేరుగానున్నది అని విచారణకు ఏమియు ప్రయోజనము లేదు. కాని ద్రవ్యముకంటె సాధనము భిన్నమేయనుట యుక్తము. ఏలయనగా—

లోకః = లోకము, శబ్దప్రమాణకః = శబ్దము ప్రమాణముగాగలది, (భవతి) = అగుచున్నది.

శబ్దము ఏమి చెప్పునో దానిని లోకము నమ్ముచున్నది. శక్తి ద్రవ్యముకంటె వేరు అని శబ్దము చెప్పుచున్నది.

సః = అట్టి లోకము, శాస్త్రేణ = శాస్త్రముచే, అనుగమ్యతే = అనుసరింపబడుచున్నది.

లోకమున ఏది ప్రసిద్ధమో దానినే శాస్త్రము బోధించుచున్నది.

కాగా శక్తి ద్రవ్యరూపము కాదు. ద్రవ్యముకంటె భిన్నమే అని వైయాకరణుల సిద్ధాంతము. ॥38॥

అవతారిక— పరమార్థ పర్యాలోచనలేనిదే ఏ పదార్థమును విమర్శించినను, తృప్తి కలదు. అను అభిప్రాయముతో గ్రంథకర్త పరమార్థమును చూపుచున్నాడు.

శ్లో॥ పరమార్థే తు నైకత్వం పృథక్త్వాద్భిన్నలక్షణమ్।
పృథక్త్వైకత్వరూపేణ తత్త్వమేవ ప్రకాశతే॥ 39

పరమార్థే + తు = పరమార్థమును చూచిన, ఏకత్వమ్ = అభేదము, పృథక్త్వాత్ = అనేకత్వము కంటె, భిన్నలక్షణమ్ = వేరుగానున్న రూపము కలది, న = కానేరదు.

తత్త్వమ్ + ఏవ = బ్రహ్మము ఒక్కటియే, పృథక్త్వైకత్వరూపేణ = భిన్నరూపమున అభిన్నరూపముననను, ప్రకాశతే = గోచరించుచున్నది.

తాత్పర్యము— పదార్థము బ్రహ్మము ఒక్కటియే. అదియే అజ్ఞానావస్థలో భిన్నరూపమున, జ్ఞానావస్థలో అభిన్నరూపమున గోచరించుచున్నది.

కాబట్టి ఏకత్వము నానాత్వము పరస్పరము విరుద్ధములు కావు ॥39॥

అవతారిక—— పై కారికార్థమునే వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ యత్ పృథక్త్వమసందిగ్ధం తదేకత్వాన్న భిద్యతే ।
యదేకత్వమసందిగ్ధం తత్ పృథక్త్వాన్న భిద్యతే ॥ 40

అసందిగ్ధమ్ = (యధార్థము తెలియబడుటచే) సందేహమునకు విషయముకాని, యత్ = ఏ, పృథక్త్వమ్ = నానాత్వమో, తత్ = అది, ఏకత్వాత్ = అభేదముతో, న + భిద్యతే = వేరు కానేరదు.

అట్లే, అసందిగ్ధమ్ = సందేహములేని అనగా భ్రమలేక గుర్తింపబడిన, యత్ = ఏ, ఏకత్వమ్ = ఏకత్వమో, తత్ = అది, పృథక్త్వాత్ = నానాత్వము కంటె, న + భిద్యతే = వేరు కానేరదు.

అజ్ఞానావస్థలో ఏకత్వ నానాత్వములు భిన్నములువలె తెలియబడును. జ్ఞానము కలుగగా భ్రమ ప్రమాదములు తొలగగా ఆ రెంటికి రూపము ఒక్కటియే ॥40॥

అవతారిక—— పరమావధిచే గుర్తింపబడినది చైతన్యమే అదియే అవిద్యాదశ యందు నానారూపములతో భాసించుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్యౌః క్షమా వాయురాదిత్యః సాగరాః సరితో దిశః ।
అన్తఃకరణతత్త్వస్య భాగా బహిరవస్థితాః ॥ 41

ద్యౌః = ఆకసము, క్షమా = నేల, వాయుః = గాలి, ఆదిత్యః = సూర్యుడు, సాగరాః = సముద్రములు, సరితః = నదులు, దిశః = దిక్కులు, ఇవి యన్నియు, అన్తఃకరణతత్త్వస్య = లోపలనున్న చైతన్యము యొక్క, భాగాః = అంశములే, బహిః = బాహ్యప్రపంచక మున, అవస్థితాః = నిలిచియున్నవి.

చైతన్యము ఒక్కటియే నిజమగు తత్త్వము. ఆ చైతన్యమే దేహములో సూక్ష్మ రూపమున నున్నది. దాని ప్రతిబింబములే భూమి, ఆకాశము మున్నగు బాహ్య పదార్థములు. అవి నిజరూపమున భూమ్యాదులు కావు అవియు చైతన్యరూపములే. ॥41॥

అవతారిక—— భూమి మున్నగునవేకాక కాలము కూడ పరమార్థరూపమున చైతన్యము యొక్క భాగమే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ కాలవిచ్ఛేదరూపేణ తదేవైకమవస్థితమ్ ।
సహ్యాపూర్వాపరోభాగః పరరూపేణ లక్ష్యతే ॥ 42

తత్ = ఆ, ఏకమ్ + ఏవ = బ్రహ్మతత్త్వమే, కాలవిచ్ఛేద రూపేణ = కాలమనెడి భేదముతో అవస్థితమ్ = వ్యవస్థితమై యున్నది.

బ్రహ్మమే కాలరూపమున కాన్పించుచున్నది.

అపూర్వాపరః = పౌర్వాపర్యము లేనట్టియు, కనుకనే అభాగః, అవయవములు లేని, సః = బ్రహ్మపదార్థము, పరరూపేణ = మాయావశమున, లక్ష్యతే + హి = నానా రూపమున కాన్పించుచున్నది గదా!

బ్రహ్మ పదార్థము స్వతః నిరవయవము. ఐనను మాయావశమున కాలరూపమున, జీవరూపమున కాన్పించుచున్నది.

కాగా పదార్థముల సామర్థ్యమే సాధనమని వైయాకరణుల మతము. ఆ సందర్భమున దర్శనాంతరీయుల మతములు కూడ చూపబడినవి.

1. విజ్ఞానవాదముచొప్పున బుద్ధి ప్రకల్పనయే సాధనము.
2. సంసర్గవాదమున సంసర్గివస్తువుల రూపమే సాధనము.
3. మీమాంసకమతమున అదృష్టమే సాధనము.
4 అద్వైతిమతమున బ్రహ్మముయొక్క కాలశక్తి సాధనము.
5. సాంఖ్యమతమున రాజసమగు ప్రవృత్తియే సాధనము.
6. కాలము ద్రవ్యమనెడివారి మతమున నిత్యమగు కాలము సాధనము.

ఇంతవరకు కారకవిచారము, దాని ప్రసంగమున హేతు - లక్షణ - కారకతాద్యర్థములకు గల పరస్పర భేదము, శక్తితోకూడి జనియించునదా? కాక కాలభేదమున జనియించునదా? అనియు, ఆ శక్తి ఒక్కటియా? కాక కర్మాదిభేదమున ఆరు విధములా? అనియు, ఆ శక్తి ద్రవ్యరూపమా? ద్రవ్యముకంటె వేరుగా నున్నదా? అనియు, ఆ ప్రసంగమున కొంచెము బ్రహ్మనిరూపణమును చేయబడినది ॥42॥

అవతారిక— ఇపుడు వైయాకరణమతమునే ప్రబోధించుచు శక్తి ద్రవ్యరూపము కాదు, ద్రవ్యముకంటె భిన్నమే అను మతము వైయాకరణ సమ్మతమని నిరూపించుచున్నాడు.

శ్లో॥ దృష్టోహ్య వ్యతిరేకేఽపి వ్యతిరేకోఽన్వయేఽసతి ।
వృక్షాద్యర్థాన్వయ, స్తస్మాద్విభక్త్యర్థోఽన్య ఇష్యతే ॥ 43

అవ్యతిరేకే + అపి = లేమిలేకున్నను అనగా వృక్ష అను ప్రాతిపదికము ఉన్నను, వ్యతిరేకః = భేదము అనగా ప్రత్యయార్థమునకల నానాత్వము, దృష్టః + హి = చూడబడుచున్నది కదా!

వృక్షమ్, వృక్షేణ, వృక్షాయ మున్నగు పదములలో వృక్ష అను ప్రకృతియొక్క అర్థము అంతట నున్నను, ప్రత్యయముల యర్థము మారియున్నది.

అన్వయే = నియతమగు సంబంధము, అసతి = లేకున్నను అనగా ప్రత్యయార్థము ఏకరూపమున లేకున్నను, వృక్షాద్యర్థాన్వయః = వృక్షము మున్నగు ప్రకృత్యర్థము ఏక రూపమున కానవచ్చుచున్నది.

తస్మాత్ = ఆ కారణములవలన, విభక్త్యర్థః = విభక్తి ప్రత్యయము యొక్క అర్థము, అన్యః = భిన్నమైనదే, అనగా ప్రకృత్యర్థమగు వృక్షాది ద్రవ్యములకంటె వేరుగా నున్నదనియే. ఇష్యతే = (వైయాకరణులచే) అంగీకరింపబడు చున్నది. శక్తి సాధనము, అది ద్రవ్యముకంటె భిన్నమే. ఇది భాష్యకారాది వైయాకరణుల ముఖ్య సిద్ధాంతము. ॥43॥

అవతారిక — ఇంతవరకు శక్తికారకము, అదియే సాధనము అను అర్థమును నిరూపించియున్నాడు.

వ్యాఖ్యాతమగు అర్థమును ఉపసంహరించుచు వ్యాఖ్యానింపతగిన అర్థమును సూచించుచున్నాడు

శ్లో॥ సామాన్యం కారకం తస్య సప్తాద్యా భేదయోనయః ।
షట్ కర్మాఖ్యాదిభేదేన శేషభేదస్తు సప్తమీ ॥ 44

A. ఇంతవరకు కారకమ్ = కారకము. సామాన్యమ్ = సామాన్యముగా (నిరూపితమ్) నిరూపింపబడినది, ద్రవ్యములయందున్న శక్తియే కార్యసాధనము, ద్రవ్యము శక్తిరూపము కానేరదు అని యింతవరకు కారకసామాన్యము చూపబడినది.

B. ఇటుపైని కారకభేదమును జూపుచున్నాడు.

(ఇదానీమ్) = ఇపుడు, తస్య = సామాన్యరూపముగా జూపబడిన కారకమునకు, ఆద్యాః = ప్రధానములగు, సప్త = ఏడు, భేదయోనయః = భేదములకు కారణములు, (కథ్యన్తే) = చెప్పబడుచున్నవి. కారకము ఏడు విధములుగా విభజింపబడుచున్నదని భావము

C. ఆ భేదములనే చెప్పుచున్నాడు.

కర్మాఖ్యాది భేదేన = కర్మాది వ్యపదేశముల భేదముచే, అనగా కర్మ, కరణము అనెడి పేర్ల భేదమున, షట్ = శక్తులు ఆరు, శేషభేదః + తు = సంబంధమను భేదము, సప్తమీ = ఏడవది

కర్మ, కరణము, కర్త, సంప్రదానము, అపాదానము, అధికరణము అనునవి ఆరు కారకభేదములు, సంబంధము ఏడవ కారక ప్రభేదము సంబంధము షష్ఠ్యర్థము, అదియు కారకమే అని భర్తృహరి సిద్ధాంతము. కర్మ ఏడు విధములు, సంప్రదానము మూడు విధములు అను రీతిని కారకములు అవాంతర భేదములచే పలు విధములు. కాని ప్రధాన భేదమును బట్టి 'సప్త' అని పలికెను.

ఇచట 'ఆద్య' శబ్దము లక్షణచే ప్రధానార్థకము. ॥44॥

అవతారిక — కారకము ఏడు విధములుగా నున్నదని చూపబడినది. వానిలో ముందుగ కర్మ కారకమును వ్యాఖ్యానించుచున్నాడు

శ్లో॥ నిర్వర్త్యం చ వికార్యం చ ప్రాప్యం చేతి త్రిధా మతమ్ ।
తత్రేప్సితతమం కర్మ, చతుర్ధాన్యత్తు కల్పితమ్ ॥ 45

A. తత్ర = దానియందు అనగా కారకములయందు, ఈప్సితతమమ్ = 'ఈప్సితతమ' అను పదముతో కలసియున్న సూత్రముచే లక్షితమగు అనగా "కర్తురీప్సితతమంకర్మ" (1-4-49) అను సూత్రముచే లక్షితమగు, కర్మ = కర్మ. 1 నిర్వర్త్యం + చ = నిర్వర్త్యమనియు, 2. వికార్యం + చ = వికార్యమనియు, 3. ప్రాప్యం + చ + ఇతి = ప్రాప్యమనియు, త్రిధా = మూడు ప్రకారములచే, మతమ్ = శాస్త్రసమ్మతమై యున్నది.

కర్త తనయందున్న క్రియచే ఏ పదార్థమును సంబంధింపచేయునో, అది కర్మ సంజ్ఞకమగునని "కర్తురీప్సితతమం కర్మ" అను సూత్రమున కర్థము. ఆ పదార్థము కారకము కావలెను. ఈ సూత్రముచే విధింపబడిన కర్మ మూడు విధములుగా జూపబడినది ఈ మూడింటికి 47 వ శ్లోకము దగ్గరనుండి లక్షణములు చూపబడగలవు

B అన్యత్ + తు = సూత్రాంతర నిర్దిష్టమగు కర్మమాత్రము, అనగా "కర్తురీప్సితతమం కర్మ" అను సూత్రము కాక ఇతరములగు "తథాయుక్తం చానీప్సితం" (1-4-50) మున్నగు సూత్రములచే గుర్తింపబడిన కర్మ, చతుర్థా = నాలుగు ప్రకారములుగా, కల్పితమ్ = శాస్త్రమున చూపబడినది.

'కర్తురీప్సితతమం' అను సూత్రముచే జూపబడిన కర్మ మూడు విధములు, ఇతర సూత్రములచే జూపబడిన కర్మ నాలుగు విధములు. కాగా కర్మ ఏడు విధములుగా విభక్తమగుచున్నది ॥45॥

అవతారిక — "చతుర్థాన్యత్తు కల్పితమ్" అనెడి కారికా భాగముచే జూపబడిన నాలుగు విధములగు కర్మలను వివరించుచున్నాడు.

శ్లో॥ ఔదాసీన్యేనయత్ప్రాప్యం యచ్చకర్తురనీప్సితమ్ ।
సంజ్ఞాన్తరై రనాఖ్యాతం యత్, యచ్చాప్యన్యపూర్వకమ్ ॥ 46

1. యత్ = ఏది, ఔదాసీన్యేన = ఉదాసీన భావముచే, ప్రాప్యమ్ = పొందబడినదియో, అనగా ఒక పని చేయునపుడు తప్పనిసరిగా మరియొక వస్తువు తనకు సంప్రాప్తించును. కాని అది తనకు కోరబడినది కాదు. అట్లని ద్వేష్యము కాదు ఉదా : గ్రామం గచ్ఛన్తృణం స్పృశతి (గ్రామమునకు బోవుచున్నవాడై గడ్డిని స్పృశించుచున్నాడు) ఇచట గ్రామము కర్తకు గమ్యము, కాని మార్గమధ్యమున తృణ మున్నందున దానిని తాకుచున్నాడు. అంతియే కాని తృణము గమ్యము కాదు. అట్లని తృణము ద్విష్టముకాదు.

2. చ = అట్లే, యత్ = ఏది, అనీప్సితమ్ = కర్తకు మిక్కిలి సమ్మతము కానిది, అనగా ద్వేషమునకు విషయమగునది.

తృణమువలె కాక కర్తకు సమ్మతము కానిది. ఇదియు కర్మయే. ఉదా : విషం భుఙ్క్తే (విషమును తినుచున్నాడు) సాంసారికములగు ఇక్కట్లు భరియింపజాలక విషమును త్రాగుచున్నాడు

1, 2, విధములగు కర్మలు "తథా యుక్తంచా నీప్సితమ్" (1-4-50) అను సూత్రముచే విధింపబడినవి

3. యత్ = ఏది, సంజ్ఞాన్తరైః = ఇతరములగు సంజ్ఞలచే, అనాఖ్యాతమ్ = వివక్షింపబడనిదో, అపాదానాది సంజ్ఞలు కలుగుచుండగా వానిని వివక్షింపక, కలిగిన కర్మ సంజ్ఞ.

అపాదానము, అధికరణము మున్నగు సంజ్ఞలు ప్రాప్తించుచుండగా వానిని విడనాడి చూపబడినదియు కర్మయగును. ఉదా : గాం దోగ్ధి పయః (ఆవును పాలు పితుకుచున్నాడు) ఇచట దోహన క్రియలో ఆవు అపాదానము కావలెను. ఆవునుండి పాలు తీయుదురుకదా ! అట్లైనను గోవునకు అపాదానత్వమును వివక్షచేయక కర్మత్వమును వివక్షింపగా తద్వాచకము కంటె ద్వితీయా విభక్తి కలిగినది. అట్లే వ్రజ మవరుణద్ధి గామ్ (గోవును పల్లెయందు నిరోధించుచున్నాడు) ఇచట నిరోధమునకు వ్రజము అధికరణము, కాగా సప్తమి ప్రవర్తింపవలెను. కాని అధికరణత్వమును వివక్షింపక కర్మత్వమును వివక్షించుటచే ద్వితీయ కలిగినది. ఈ కర్మసంజ్ఞ "అకథితంచ" (1-4-51) అను సూత్రముచే కలిగినది.

4 చ = మరియు, యత్ = ఏది, అన్యపూర్వకమ్ = ఇతరములగు సంజ్ఞలు పూర్వముగా కలదియో, అనగా సంప్రదానము మున్నగు సంజ్ఞలు ప్రాప్తించుచుండగా వానికి అపవాదముగా విధింపబడిన కర్మత్వము.

ఉదా : క్రూరమభిక్రుధ్యతి (క్రూరుని మిక్కిలి కోపగించుచున్నాడు) ఇచట క్రుధధాత్వర్థయోగమున క్రూరునకు "క్రుధద్రుహేర్ష్యాఽసూయార్థానాం యంప్రతికోపః" (1-4-37) అను సూత్రముచే సంప్రదాన సంజ్ఞ కలుగుచున్నది కాగా చతుర్థీ విభక్తి ప్రవర్తింపవలెను. కాని ఆ సంప్రదాన సంజ్ఞకు అపవాదముగా "క్రుధద్రుహోరుపసృష్టయోః కర్మ" (1-4-38) అను సూత్రముచే (ఉపసర్గతో కూడిన క్రుధ, ద్రుహధాతువుల సంబంధమున ఎవనిని కోపగించునో వానికి కర్మసంజ్ఞ కలుగును) కర్మసంజ్ఞ విధింపబడినది.

మరియు "దివః కర్మచ" (1-4-43) అను సూత్రముచే దివు (క్రీడ) ధాత్వర్థమున సాధకతమమునకు కర్మసంజ్ఞ, చ శబ్దముచే కరణసంజ్ఞయు కలుగును

అక్షైఃదీవ్యతి (పాచికలతో ఆడుచున్నాడు) అక్షాన్‌దీవ్యతి. ఇదియు ఈ ప్రభేదమునకు ఉదాహరణము కానోపును. ॥46॥

అవతారిక — "కర్తురీప్సితతమం కర్మ" అను సూత్రముచే లక్షితమగు కర్మ మూడు విధములుగా నున్నదని చెప్పబడినది ఆ మూడింటికి లౌకిక ప్రతీతినిబట్టి లక్షణములు $1\frac{1}{2}$ శ్లోకముచే చెప్పుచు ముందుగ నిర్వర్త్యమునకు లక్షణమును జూపుచున్నాడు.

శ్లో॥ సతీ వాఽవిద్యమానా వా ప్రకృతిః పరిణామినీ ।
యస్య నాశ్రీయతే, తస్య నిర్వర్త్యత్వం ప్రచక్షతే ॥ 47

యస్య = ఏ వస్తువునకు అనగా కర్మకు, సతీ + వా = ఉన్నటువంటి, పరిణామినీ = పరిణామమును చెందునట్టి, ప్రకృతిః = ప్రధాన కారణము, న + ఆశ్రీయతే = ఆశ్రయింప బడదో, వా = కాక, అవిద్యమానా = ప్రకృతి లేకయే యుండునో, తస్య = దానికి అనగా ఆ రెండు విధములగు కర్మత్వమునకు, నిర్వర్త్యమ్ = నిర్వర్త్యకర్మత్వమను, ప్రచక్షతే = (కర్మతత్త్వవేత్తలు) చెప్పుచున్నారు.

తాత్పర్యము— ఘటంకరోతి (కడవను తయారుచేయుచున్నాడు) మున్నగు చోటులయందు ఘటాదులు కర్మలగుచున్నవి. ఇచట ఘటమునకు ప్రధానకారణము మన్ను కలదు. కాని మట్టిని వివక్షింపనిచో, ఘటాదులు నిర్వర్త్యకర్మలగుచున్నవి.

సంయోగం కరోతి (సంయోగమును చేయుచున్నాడు) మున్నగు చోటులందు సంయోగాదులకు ప్రధాన కారణము లేదు. అట్టి కర్మలుకూడ నిర్వర్త్యకర్మలే యగును.

మృత్తు కారణము, ఘటము కార్యము, ఈ రెంటికి అభేదవివక్ష చేయనిచో ఘటాదికము నిర్వర్త్యము. సంయోగాదులకు కారణము లేనందున నవియు నిర్వర్త్యములే. ॥47॥

అవతారిక— లోకవ్యవహారమును బట్టియే వికార్యకర్మకు లక్షణము చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రకృతేస్తు వివక్షాయాం వికార్యమ్ ।

ప్రకృతేః = కారణమునకు, వివక్షాయాం + తు = వివక్ష చేసినచో, వికార్యమ్ = వికార్యకర్మనుగా, (ప్రచక్షతే) చెప్పుచున్నారు.

మృదం ఘటం కరోతి (మట్టిని ఘటముగా చేయుచున్నాడు) కడవకు కారణమగు మట్టిని గూడ వివక్షించిన, ఘటాదికము వికార్యమగును.

కాగా ప్రకృతిని వివక్షింపనిచో ఘటము మున్నగునవి నిర్వర్త్య కర్మలుగాను, ప్రకృతిని వివక్షించినచో అవియే వికార్యకర్మలుగాను లోకదృష్టి ననుసరించి చూపబడు చున్నవి. సంయోగాదులు ఎల్లపుడు నిర్వర్త్యములే.

అవతారిక— $1\frac{1}{2}$ శ్లోకముచే లౌకిక వ్యుత్పత్తినిబట్టి, నిర్వర్త్యవికార్య కర్మలకు లక్షణములను జూపి, ఇపుడు శాస్త్ర వ్యవహారమును ఆశ్రయించి వానికే లక్షణములను చెప్పుచున్నాడు.

శ్లో॥ .... కైశ్చిదన్యథా ।
నిర్వర్త్యం చ వికార్యం చ కర్మశాస్త్రే ప్రదర్శితమ్ ॥ 48

కైశ్చిత్ = కొందరిచే, అన్యథా = మరియొక విధముగా, అనగా కారణముయొక్క వివక్షతో అవివక్షతోను నిమిత్తము లేకయే, శాస్త్రే = శాస్త్రమార్గమున, నిర్వర్త్యం + చ = నిర్వర్త్యము, వికార్యం + చ = వికార్యము అగు, కర్మ = కర్మ లక్షణము, ప్రదర్శితమ్ = చూపబడినది.

కాక, శాస్త్రే = శాస్త్రమార్గమున, కైశ్చిత్ = కొందరిచే, నిర్వర్త్య = వికార్య కర్మలు, అన్యథా = మరియొక విధముగా, ప్రదర్శితమ్ = ప్రదర్శింపబడినది.

రెంటికి తాత్పర్యము సమానమే. ॥48॥

అవతారిక— శాస్త్రానుసారముగా నిర్వర్త్య వికార్యములకు లక్షణములను జూపుచున్నాడు.

శ్లో॥ యదసజ్జాయతే సద్వా జన్మనా యత్ప్రకాశతే ।
తన్నిర్వర్త్యం, వికార్యం తు ద్వేధా కర్మ వ్యవస్థితమ్ ॥ 49

వివరణము— కారణమువలన కార్యము కలుగుటలో శాస్త్రకారులలో అభిప్రాయభేదము కలదు. 1. ఇంతకుమునుపు అనగా కారణ వ్యాపారమునకు ముందుగా లేనియట్టి కార్యము కారణ వ్యాపారమువలన జనియించుచున్నది. దారములవలన వస్త్రము, మట్టివలన కడవ పుట్టుచున్నవి. కారణావస్థలో వస్త్రము మున్నగునవి లేవు. అవి ఇపుడు జనియించుచున్నవి. దీనిని అసత్కార్య వాదమందురు. అనగా అసత్ = ఇంతకుముందు లేని, కార్యము కలుగుచున్నది. ఈ పక్షమును తార్కికులు విశ్వసింతురు. 2. కార్యము కారణావస్థలో సూక్ష్మ రూపమున ఉన్నది. అంతియేకాని నూతనముగా కార్యము జనియింపలేదు. దీనిని సత్కార్య వాద మందురు. దీనిని సాంఖ్యులు నమ్మినారు. ఈ రెండువాదముల నాశ్రయించి ఇచట నిర్వర్త్యకర్మ చూపబడినది.

ప్రతిపదార్థము— A. యత్ = ఏది, అసత్ = లేనిదే, అనగా కారణవ్యాపారమునకు ముందుగా లేనిదే, జాయతే = జనియించుచున్నదో, ఇది అసత్కార్యవాదులగు నైయాయికుల మతము నాశ్రయించి చెప్పబడినది.

సత్ + వా = ఉన్నదేయగు, అనగా కారణవ్యాపారమునకు పూర్వముగూడ సూక్ష్మరూపమున కారణములయందున్నట్టి, యత్ = ఏది, జన్మనా = జన్మచే, ప్రకాశతే = ప్రకాశించుచున్నదో, ఇది సత్కార్యవాదులగు సాంఖ్యులమతము నాశ్రయించి చెప్పబడినది.

తత్ = అది, నిర్వర్త్యమ్ = నిర్వర్త్యకర్మయగును, నిర్వర్తింపతగిన కర్మయని భావము.

తాత్పర్యము— ఘటం కరోతి (కడవను తయారుచేయుచున్నాడు) లేనికడవ మనకు క్రొత్తగా జనియించుచున్నట్లు కానవచ్చుచున్నది. కాపిలమతము చొప్పున కారణరూప

మున ఉన్న కడవయే మనకు ఈ రూపమున గోచరించుచున్నదని మనము భావించుచున్నాము.
ఇట్లే కుండలం కరోతి మున్నగునవి ఉదాహరణములు కాగలవు.

B. వికార్యం + కర్మ + తు = వికార్యకర్మ, ద్వేధా = రెండు విధములుగా, వ్యవస్థితమ్ = నిశ్చితమైయున్నది. ॥49॥

అవతారిక— వికార్యకర్మ రెండు విధములుగా నిశ్చితమైయున్నదని చెప్పబడినది. దానినే వివరించుచున్నాడు.

శ్లో॥ ప్రకృత్యుచ్ఛేదసంభూతం కిఞ్చిత్కాష్ఠాది భస్మవత్ ।
కిఞ్చిద్ గుణాన్తరోత్పత్త్యా సువర్ణాది వికారవత్ ॥ 50

1. ప్రకృత్యుచ్ఛేద సంభూతమ్ = స్వరూపము యొక్క నాశనమును పొందిన కర్మ, కిఞ్చిత్ = ఒక విధమైనది, అనగా సంపూర్ణమగు స్వరూపమును గోల్పోయినది ఒక విధమగు వికార్యకర్మ. భూ (సత్తాయామ్) అను ధాతువుకంటె సంభూత శబ్దము నిష్పన్నము కాదు. మరి భూ (ప్రాప్తౌ) అను 'చురాది' ధాతువుకంటె ణిచ్ ప్రత్యయము ప్రవర్తించిన పక్షమున కర్త్రర్థము నక్త ప్రత్యయముచేయగా నిష్పన్నమాయెను. దీనికి ఉదాహరణము : కాష్ఠాది = కట్టె మున్నగునది. కాష్ఠం భస్మకరోతి (కట్టెను భస్మము చేయుచున్నాడు) ఇచట కాష్ఠము సంపూర్ణముగా నశించినది కాబట్టి ఇది వికార్యకర్మ. వికార్యమ్ = వికారమునకు అర్హమైనది. నికారము భస్మము. దానికి అర్హము కాష్ఠము. 'కాష్ఠాది' అను దానికి విశేషణము- భస్మవత్ = భస్మరూపము కలది, అనగా భస్మరూపమును ధరియించినది అని యర్థము. 'భస్మవత్' అనునది మత్వర్థీయాంతము. భస్మ అస్యాస్తీతి - భస్మవత్, వతి ప్రత్యయాంతము కానోపదు. ఈ విశేషణమువలన కాష్ఠం గృహ్ణాతి (కట్టెను పట్టుకొనుచున్నాడు) మున్నగు ప్రయోగములలో కాష్ఠము వికార్యకర్మ కానేరదు.

2. కిఞ్చిత్ = మరియొక విధమైనది, గుణాన్తరోత్పత్త్యా = (ద్రవ్యము నశింపక) ద్రవ్యమునందు మరియొక ఆకారము యొక్క పుట్టుకచే కలిగినది. ఇచట గుణశబ్దము అవయవసన్నివేశమును బోధించును ఉదాహరణము జూపుచున్నాడు సువర్ణాది=బంగారము మున్నగునది దానికి విశేషణము. వికారవత్ = వికారము కలది. సువర్ణం కుణ్డలంకరోతి (బంగారమును కుండలము చేయుచున్నాడు) ఇచట బంగారము వికార్యకర్మ, బంగారము నశింపకయే కుండలాకారమున మార్పు చెందినది. వికారవత్ ఇది మతుబంతము.

కాగా కాష్ఠం భస్మకరోతి అనుచోట కాష్ఠము స్వరూపమును విడనాడినది. అది ఒక విధమగు వికార్య కర్మ. సువర్ణం కుణ్డలం కరోతి. ఇచట సువర్ణము స్వరూపమును బోగొట్టుకొనకయే కుండల రూపమును ధరియించినది. ఇది రెండవ వికార్య కర్మ. భస్మ కుండలములు నిర్వర్త్య కర్మలే. ॥50॥

అవతారిక— పై రీతిని నిర్వర్త్య వికార్యకర్మలకు లక్షణములు దెలిపి ఇపుడు ప్రాప్యకర్మకు లక్షణము చూపుచున్నాడు.

శ్లో॥ క్రియాకృతవిశేషాణాం సిద్ధిర్యత్ర న గమ్యతే।
దర్శనాదనుమానాద్వా తత్ప్రాప్యమితి కథ్యతే॥ 51

యత్ర = ఏకర్మయందు, క్రియాకృతవిశేషాణామ్ = కర్తయందున్న వ్యాపారములచే జనియించిన విశేషముల యొక్క, సిద్ధిః = సిద్ధి అనగా రూపపరివర్తనము, దర్శనాత్ = ప్రత్యక్షము వలన, అనుమానాత్ + వా = అనుమాన ప్రమాణమువలనగాని, న + గమ్యతే = జ్ఞాతము కాదో, తత్ = అట్టి కర్మ, ప్రాప్యమ్ + ఇతి = ప్రాప్యమని, కథ్యతే = (పెద్దలచే) చెప్పబడుచున్నది

తాత్పర్యము— నిర్వర్త్యమున స్వరూపమును బొందుటయే మనకు ప్రత్యక్షముగా తెలియబడుచున్న విశేషము. ఉదా: కాష్ఠంభినత్తి (కట్టెను చీల్చుచున్నాడు) భేదన క్రియ వలన కట్టెయందు చీలిక అను విశేషము ప్రత్యక్ష సిద్ధము. తణ్డులంపచతి (బియ్యమును ఉడికించుచున్నాడు) పాకక్రియవలన బియ్యము మెత్తగ నగుచున్నది. మెత్తపడుటయే విశేషము అట్లే వికార్యకర్మయందు (కాష్ఠం భస్మకరోతి) రూపము మారిపోవుట ప్రత్యక్ష సిద్ధము.

(పుత్త్రః సుఖంకరోతి) ఒకనికి సుఖము కలిగిన, ఆయన ముఖ వికాసమును బట్టి సుఖము అనుమితమగును. అట్లే దుఃఖము కూడ ముఖమాలిన్యముచే ననుమితము కాగలదు.

పై రీతిని ప్రత్యక్షముగాగాని అనుమానమువలనగాని ఏ కర్మయందు మార్పు జ్ఞాతము కానేరదో, అది ప్రాప్యకర్మ యనబడును. ఉదా: ఆదిత్యం పశ్యతి (సూర్యుని చూచుచున్నాడు). మనము సూర్యుని చూచుటచే సూర్యునియందు ఎవ్విధమగు విశేషము కలుగలేదు. కలుగదు గ్రామం గచ్ఛతి (గ్రామముగూర్చి వెళ్ళుచున్నాడు) గమన క్రియవలన గ్రామమునకు ఎవ్విధమగు పరిణామము కానరాదు. ఘటం జానాతి (కడవను తెలిసికొనుచున్నాడు) ఇదియు అట్టిదే.

పై రీతిని జ్ఞాన - గమన - దర్శనాది క్రియలవలన ఘట - గ్రామ - సూర్యుల యందు విశేషము జ్ఞాతము కానందున అవి ప్రాప్యకర్మలనబడుచున్నవి.

జ్ఞానాది క్రియలకు విషయములగులంజేసి ఘటాదులకు కర్మసంజ్ఞ ప్రవర్తింపగలదు. ॥51॥

అవతారిక— ప్రాప్యకర్మను అంగీకరింపనక్కరలేదు. ఎల్లకర్మలయందు క్రియావిశేషము కావవచ్చుచునే యున్నది అని కొందరు భావించుచున్నారు. వారి యభిప్రాయమును జూపుచున్నాడు.

శ్లో॥ విశేషలాభః సర్వత్ర విద్యతే దర్శనాదిభిః ।
కేషాఞ్చిత్తదభివ్యక్తిసిద్ధి ర్దృష్టివిషాదిషు ॥ 52

కేషాఞ్చిత్ = కొందరి (మతమున), సర్వత్ర = ఎల్లచోటులందు అనగా ఎల్ల కర్మలయందు, దర్శనాదిభిః = దర్శనము, గమనము, జ్ఞానము మున్నగువానిచే, విశేషలాభః = క్రియవలన కలిగెడి వికారమును పొందుట, విద్యతే = ఉన్నది, ప్రతికర్మయందు వికారము కలుగుచునే యున్నది, కాని కొన్ని చోటులందు అతిసూక్ష్మతచే గోచరింపకపోవ వచ్చును.

లక్ష్యమును జూపుచున్నాడు. దృష్టి విషాదిషు = నేత్రమునందు విషముకల పాములు మున్నగువానియందు, తదభివ్యక్తిః = దానియొక్క స్పష్టత అనగా దర్శనమువలన క్రియావిశేషము కలుగుట స్పష్టము. కారికలో 'ఆది' పదముచే అయస్కాంతము (సూదంటు రాయి) మున్నగునవి గ్రహింపబడును.

తాత్పర్యము—— కొన్ని పాములకంటిలో అత్యుత్కటమగు విషముండును. అట్టి పాములు చూచిన గడ్డిలతలు మండును. అది ఎల్లరకును తెల్లమే. అట్లే అయస్కాంతము యొక్క సన్నిధానమున ఇనుము మున్నగునవి చలించును.

కాబట్టి ప్రతిపదార్థమునకు దర్శనాది క్రియలచే విశేషము కలుగుటచే ప్రాప్య కర్మ లేనేలేదు. ఇది కొందరి యభిప్రాయము.

దృష్టి విషాదిషు దృష్టౌ (కంటియందు) విషంయేషాం - తే దృష్టివిషాః = సర్పములు.

మనుష్యులలో గూడ కొందరు చూచిన అన్నము హితము కాకుండుట, నిదురపట్టుక పోవుట, కృశించుట అనే వికారములు కలుగును. దానినే ఈనాడు కూడ దృష్టిదోషముగా భావించుచున్నారు.

విశేషము—— ఈ కారికను భర్తృహరి తన సిద్ధాంతముగా జూపక పరమతముగా జూపెను. కనుకనే 'కేషాఞ్చిత్' అని భర్తృహరి పలికెను. ఏదో ఒక చోటున విశేష మున్నంత మాత్రాన సర్వత్ర ఉన్నదనుటయు పొసగదు

మరియు పాముల దృష్టియందు విషమున్నది. అపుడు తృణాదులయందు వికారము విషము యొక్క తేజస్సంయోగము వలన కలుగుచున్నది. కేవలము పాము చూచుట వలన కాదు

కాబట్టి నిర్వర్త్యవికార్యకర్మలకంటె వేరుగ ప్రాప్యకర్మ ఉన్నదనియే భర్తృహరి సిద్ధాంతము. ॥52॥

అవతారిక—— ప్రాప్యకర్మయందు క్రియాకృత విశేషమే లేనిచో నది క్రియా సిద్ధికి సహకరింపనందున సాధనమే కాకపోయెడిని. అట్టితరి అది కర్మయే కానేరదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆభాసోపగమో వ్యక్తిః సోఢత్వమితి కర్మణః ।
విశేషాః ప్రాప్యమాణస్య క్రియాసిద్ధౌ వ్యవస్థితాః ॥ 53

1. ఆభాసోపగమః = కంటికి కనబడుటకు యోగ్యమగు దేశమును పొందుట అనగా దూర మున ఉండక దగ్గరగా నుండుట, 2. వ్యక్తిః = స్పష్టత అనగా మంచు మున్నగు ఆవరణ ద్రవ్యములు లేక ద్రవ్యము గోచరించుట, 3. సోఢత్వమ్ = కనబడుటకు అర్హత, పిశా చము దగ్గరగా నున్నను, ఆవరణ లేకున్నను అస్మదాదులకు కానరాదు. అట్లుకాక దర్శనము నకు అర్హత యుండవలెను. ఇతి = అనెడి, విశేషాః = విశేషములు, ప్రాప్యమాణస్య + కర్మణః = ప్రాప్యకర్మకు, క్రియాసిద్ధౌ = దర్శనము మున్నగు క్రియ నిష్పన్నమగుటలో, వ్యవస్థితాః = కారణములుగా నున్నవి.

తాత్పర్యము— ఘటం పశ్యతి (కడవను చూచుచున్నాడు) ఇచట ఘటము ప్రాప్యకర్మ దర్శనక్రియ వలన కడవకు పరిణామము కలుగదు. 5, 6 గజముల దూరమున ఉన్ననాడే కడవ కంటికి కనబడును. అతిదూరమగుచో కానరాదు. దగ్గరగానున్నను మంచు గాని, గోడగాని అడ్డముగానున్నను కానరాదు. మరియు పిశాచము దగ్గరగానున్నను అడ్డు లేకున్నను మనకు కానరాదు. అందుచే దగ్గరగానుండుట, వ్యవధానములేక ఘటాదులు వ్యక్త మగుట, చూచుటకు అర్హమగు రూపముండుట, మున్నగునవి దర్శన కారణములు కాగలవు. అట్టి అవకాశమును కలిగియుండుటయే ఘటాదులు దర్శన క్రియలో సాధనభావమును బొందుట

నిర్వర్త్య వికార్యకర్మలయందువలె వస్తువునకు రూపపరిణామాదులు ఇచట అపే క్షితములు కావు

ఇట్లే గ్రామం గచ్ఛతి, మాతరం స్మరతి మున్నగు లక్ష్యములలో గూడ గ్రామా దులు ప్రాప్యకర్మలు అవి దర్శనక్రియకువలె గమనాది క్రియలకు గూడ కారణములు కాగలవు. ॥53॥

అవతారిక— ఇంతవరకు కర్మలక్షణమును, దాని విభాగమును చూపబడినది.

20 వ కారికలో (గుణక్రియాయాం కర్తారః) అప్రధాన క్రియలో కర్తగానున్నవి ప్రధాన క్రియలో కర్మలుకాగలవని చెప్పబడినది. కాని కర్త కర్మగానుండుట యెట్లు? అను సంశయమును పోగొట్టుచు కర్మ *కర్తృప్రక్రియకు మార్గమును జూపుచున్నాడు.

శ్లో॥ నిర్వర్త్యాదిషు తత్పూర్వమనుభూయ స్వతన్త్రతామ్ ।
కర్త్రన్తరాణాం వ్యాపారే కర్మ సంపద్యతే తతః ॥ 54

* చైత్రః పచతి తణ్డులమ్, ఇచట తండులము కర్మగానున్నది. చైత్రాదుల వ్యాపారము ధాత్వర్థముగా వివక్షచేయక తండులమునందున్న వ్యాపారమే ధాతువాచ్యముగా వివక్ష చేసిన తండులమే కర్త యగును. అపుడు ధాతువు అకర్మకమగును. కాని కర్మల కారము యొక్క రూపము కాన్పించును. పచ్యతే తణ్డులః, తండులము ఉడుకుచున్నది అని యర్థము.

నిర్వర్త్యాదిషు = నిర్వర్త్యము, వికార్యము ప్రాప్యము అనెడి, తత్ = ఆ కర్మ, ఇచట నిర్వర్త్యాదిషు అను పదమున సప్తమీ విభక్తి ప్రాతిపదికార్థమున కలిగినది. అందుచే కర్మకు అనగా తత్, అను దానికి సమానాధికరణ విశేషణమాయెను, పూర్వమ్ = ముందుగా అనగా నిర్వృత్తి, వికారము యోగ్యదేశమున ఉండుట అను క్రియలయందు, స్వతన్త్రతామ్ = కర్తృత్వమును, అనుభూయ = అనుభవించి, తతః = తరువాత, కర్త్రన్తరాణామ్ = చైత్రుడు మున్నగు కర్తలయొక్క, వ్యాపారే = వ్యాపారమున, కర్మ = కర్మసంజ్ఞ కలది, సంపద్యతే = కాగలదు

తాత్పర్యము— ఘటంకరోతి, ఇచట కడవ నిర్వర్త్య కర్మ. కడవ తయారగుచున్నది. ఇది ప్రథమావస్థ. చైత్రుడు తయారుచేయుచున్నాడు. ఇది రెండవ యవస్థ. మొదటి యవస్థలో కడవ స్వతంత్రము. కనుక అది కర్త యగును. ఇచట చైత్రుని వ్యాపారము ప్రేరణ. అనగా తయారుచేయుట వివక్షింపగా చైత్రుడు కర్త కాగలడు ఈ రెండవ యవస్థలో కడవ కర్మ కాగలదు. (1) తండులః నిర్వర్తతే, (2) తణ్డులం కరోతి.

ఇట్లే కాష్ఠంభస్మకరోతి. ఇచట కాష్ఠము వికార్యకర్మ. ఇచట కఱ్ఱ వికారమును బొందుచున్నదని ప్రథమావస్థ. కఱ్ఱను వికారమును బొందించుచున్నాడు. ఇది రెండవ యవస్థ. (1) కాష్ఠంవికురుతే, (2) కాష్ఠం భస్మకరోతి.

ఇట్లే ఘటం పశ్యతి. ఇచట ఘటము ప్రాప్యకర్మ, కడవ కంటికి కనబడుటకు యోగ్యమగు దేశమున ఉన్నది. ఇది ప్రథమావస్థ. అట్టిదానిని సాక్షాత్కారముగా జేసికొనుచున్నాడు. ఇది రెండవ యవస్థ.

భృత్యులు స్వతంత్రులే. రాజుగారి దగ్గర వారు అస్వతంత్రులే. అట్లే నిర్వృత్తి, వికారము, ఆభాసోపగమము అనగా కనబడుటకు యోగ్యమగు స్థలమున ఉండుట అనునవి అప్రధాన క్రియలు. వీనిలో ఘటాదులు కర్తలు. తరువాత చైత్రాది వ్యాపారము వివక్షించిన అదియే ప్రధాన వ్యాపారము. అచట ఘటాదులు కర్మలు కాగలవు. ॥54॥

అవతారిక— ముందు కర్తగానున్నది తరువాత కర్మయగును. అట్టితరి ఆ కర్మ మరల కర్త యెట్లు కాగలదు. అట్లుకాకున్న 'కర్మ కర్త' అను వ్యవహారము ఉపపన్నము కాజాలదు. కాని ఆ వ్యవహారము శాస్త్రసమ్మతము అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ తద్వ్యాపార వివేకేఽపి స్వవ్యాపారే వ్యవస్థితమ్ ।
కర్మోపదిష్టాన్ లభతే క్వచి చ్ఛాస్త్రాశ్రయాన్విధీన్ ॥ 55

తద్వ్యాపారవివేకే + పి = కర్తయొక్క వ్యాపారమును వేరుచేసినను, స్వవ్యాపారే = తన వ్యాపారమున అనగా అప్రధాన వ్యాపారమున, వ్యవస్థితమ్ = ఉన్నటువంటి, తండులాదికము, కర్మోపదిష్టాన్ = కర్మార్థమున విధింపబడినట్టియు, శాస్త్రాశ్రితాన్ = సూత్రము మూల

ముగా గల అనగా "కర్మ వత్కర్మణాతుల్య క్రియః" (3-1-87) అను సూత్రముచే లభించిన, విధీన్ = ఆత్మనే పదము మున్నగు కార్యములను. క్వచిత్ = కొన్ని స్థలములలో అనగా కర్మస్థ క్రియలుకల ధాతువులను ప్రయోగించినపుడు, లభతే = పొందుచున్నది, అనగా కర్తగానున్నను కర్మ నిమిత్తకమగు కార్యములను పొందుచున్నది

తాత్పర్యము—తణ్డులః విక్లిద్యతే. తండులము మెత్తపడుచున్నది ఇచట తండులము కర్త. తరువాత చైత్రుని ప్రేషణ అనగా తయారుచేయుటకు అనుకూలమగు వ్యాపారము వివక్షచేయగా చైత్రుడు కర్త కాగలడు. అపుడు తండులము కర్మయగుచున్నది మరల చైత్రుని వ్యాపారమును వివక్షింపనిచో మరల తండులము కర్త కాగలదు. ఇట్లు వివక్షచేయుటకు ప్రయోజనము కలదు. గిన్నె చాల చులకనగా నుండుటచే వంటకము అనాయాసముగా సిద్ధించుచున్నది అను భావము వ్యక్తమగును. చైత్రుని వ్యాపారము లేకున్నను నిమిత్తమాత్రమున ఆయన ఉన్నచో పాకము నిష్పన్నమగుచున్నది. కాగా క్రియాసౌకర్యము వ్యక్తమగును. ఈ స్థితిలో తండులము కర్తగానున్నను కర్మ ప్రత్యయము ప్రవర్తించునపుడు కలిగెడి కార్యములను పొందును. తిఙంతరూపము కర్మలకారముపలె భాసించును. అర్థము మాత్రము కర్తయే 'పచ్యతే తణ్డులః స్వయమేవ', తండులము తనంతటతానే ఉడుకుచున్నది అని దాని యర్థము. దీనినే కర్మకర్తృ ప్రయోగమందురు. ఇట్టి ప్రయోగములు తెనుగుభాషలో గూడ చాల కలవు. అన్నము ఉడుకుచున్నది, కఱ్ఱ బద్దలగుచున్నది, ఇల్లు పడుచున్నది.

ఏ కర్మయందు క్రియవలన విశేషము కాన్పించునో అట్టి కర్మ కర్తగా నున్నప్పుడే ఈ ప్రక్రియ జరుగును. అట్టి కర్మ నిర్వర్త్యము వికార్యము అగును. ప్రాప్యకర్మ కానేరదు. కనుక ఈ ప్రక్రియ ప్రవర్తింపదు.(ఆదిత్యం పశ్యతి, అని ఉదాహరణము)ఈ యభిప్రాయముతో 'క్వచిత్' అను పదము ప్రయుక్తమాయెను ఇట్లు చైత్రుని వ్యాపారము వివక్షచేయక తండులమునకు కర్తృత్వమును సంపాదించుట నివృత్తప్రేషణ పక్షమని శాస్త్రమున వ్యవహారము.॥౫౬॥

అవతారిక— చైత్రుని వ్యాపారము ప్రేషణము. దానిని వివక్ష చేయనపుడు, దాని మూలమున కలిగెడి కర్మత్వము తండులమునకు కలుగకపోవ వచ్చును. కాని తండులమునకు కర్తృత్వ మెట్లు? ప్రధానమగు చైత్ర వ్యాపారమునుబట్టి కదా తండులమునకు స్వీయ వ్యాపారము కలుగును; అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నివృత్తప్రేషణం కర్మ స్వక్రియావయవే స్థితమ్ ।
నివర్తమానే కర్మత్వే స్వే కర్తృత్వేఽవతిష్ఠతే ॥ 56

నివృత్త ప్రేషణమ్ = మరలిన ప్రేషణకల అనగా చైత్రుడు చేసెడి ప్రేషణ లేనియట్టి, కర్మ = కర్మగా భావింపబడుచున్న తండులాదికము, స్వక్రియావయవే = తన క్రియయొక్క అవయవమునందు, అనగా అప్రధాన క్రియయందు, అవస్థితమ్ = ఉన్నదై, కర్మత్వే = కర్మసంజ్ఞ, నివర్తమానే = మరలగా, స్వే = స్వీయమగు అనగా అప్రధాన క్రియవలన కలిగెడి, కర్తృత్వే = కర్తృత్వమున, అవతిష్ఠతే = ఉంటున్నది

తాత్పర్యము— పాకము మున్నగు క్రియలు సంపూర్ణముగా జరుగునట్లు చేయుటయే చైత్రుని వ్యాపారము దానినే ప్రేషణమందురు. దానిని పురస్కరించుకొని తండులము కర్మ. కట్టెలు కరణములు అగుచున్నవి. అట్టి ప్రేషణమును ధాతు వాచ్యముగా వివక్షచేయు నపుడు తండులము యొక్క వ్యాపారమే ప్రధాన ధాత్వర్థమగును ఆ స్థితిలో తండులము కర్త కాగలదు. పాకక్రియయందు కలిగెడి సౌకర్యమును అపేక్షించి పై ప్రక్రియ ఆశ్రయింపబడు చున్నది. ॥56॥

అవతారిక— చైత్రుని వ్యాపారము వివక్షితము కాగా దానియందు తండుల వ్యాపారము గుణీభూతమగుచున్నది. ఈ స్థితిలో 'చైత్రః తణ్డులంపచతి' అను రీతిని ప్రయోగముండును. ఇచట రెండు వ్యాపారములు భాసించుచున్నవి. ఈ ప్రయోగమున తండులము కర్మగా నున్నను, మరల చైత్రుని వ్యాపారమును వివక్షింపనియెడల తండులము కర్తగా నుండును. అనగా తండుల వ్యాపారము ఒక్కటియే ధాతువాచ్యమగుచున్నది.

ఇచట ఒక సంశయము. ఒకే ధాతువువలన విలక్షణమగు అర్థద్వయము ఎట్లు భాసించును? ఎచట ఒకే వ్యాపారము ధాతువాచ్యమో, ఎచట వ్యాపారద్వయము ధాతు వాచ్యమో; అని యెట్లు గుర్తింపనగును? కాబట్టి వ్యాపారము ధాతువునకు వాచ్యముకాక తిఙ్ ప్రత్యయమునకు వాచ్యమగును. అని స్వీకరించెడి జైమినీయుల మతము చాల యుక్తముగా కాన్పించుచున్నది.

పై సంశయమునకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ తాని ధాత్వన్తరాణ్యేవ పచి సిద్ధ్యతివద్ విదుః ।
భేదేఽపి తుల్యరూపత్వాత్ ఏకత్వపరికల్పనా ॥ 57

A. పచిసిద్ధ్యతివత్ = డుపచష్ (పాకే), షిధు (సంరాద్ధౌ) అనుధాతువులువలె, తాని = వ్యాపారద్వయము వాచ్యముగాగల ధాతురూపములును ఒకే వ్యాపారము వాచ్యముగాగల ధాతురూపములను, ధాత్వన్తరాణి + ఏవ = వేరువేరు ధాతువులను గానే, విదుః = కొందరు శాస్త్రజ్ఞులు గుర్తించుచున్నారు.

విక్లిత్తిమాత్రము వివక్షించి తణ్డులః పచ్యతే అనుచోట ధాత్వర్థము తెలుపునట్టి పచిధాతువు వేరు. అంతియేకాని ఒకే ధాతువునకు రెండు స్థలములలో రెండు అర్థములను చూపుట కాదు. ఎట్లనగా, పచధాతువు, షిధుధాతువు ఇంచుమించుగా ఏకార్థకములవలె భాసించును. 'సిధు' ధాతువు దివాదిగణమున పఠింపబడినది. దానికి విక్లిత్తి మాత్రము అర్థము. అట్లైనను మనకు రెండు వేరువేరు ధాతువులని స్పష్టమే. అట్లే చైత్రః పచతితణ్డులమ్, పచ్యతేతణ్డులః అను ప్రయోగద్వయమున కాన్పించెడివి వేరువేరు ధాతువులే. ఒకే ధాతువునకు వేరువేరు అర్థములు చెప్పుట కాదు.

B. అష్టైన ధాతుపాఠమున ఆ రెండు పచిధాతువులను వేరువేరుగా ఏల పఠింపలేదు ? అను ప్రశ్నకు సమాధానము.

భేదే + అపి = స్వతః ధాతువులకు భేదమున్నను, తుల్యరూపత్వాత్ = సమానమగు వర్ణానుపూర్వి కలిగియుండుటవలన, ఏకత్వ పరికల్పనా = రెంటికి ఏకత్వము కల్పితమగుచున్నది. రెంటికి రూపసామ్యముండుటచే రెంటికి అభేదమును ఆరోపించి. డుపచష్ (పాకే) అను రీతిని ధాతు పాఠమున చూపబడినది. ఒకేసారి ఉపదేశించిన ఫలభేదము లేదు కదా ! అట్లుకాక రూపభేదమున్నచో రెండు మూడు పర్యాయములు ధాతు పాఠమున ఉపదేశింప బడును. ఉదా : క్షి (క్షయే) భ్వాదిగణము క్షయతి, క్షి (నివాసగత్యోః) తుదాది గణము క్షియతి.

పచిధాతువునకు విక్లిత్తి అను వ్యాపారము అర్థము షిధు ధాతువునకు విక్లిత్తి మాత్రము అర్థము.

అర్థభేదముచే శబ్దము భిన్నమనెడి కొందరి ఆచార్యుల మతము ఇచట చూపబడినది. ॥57॥

అవతారిక— అట్లుకాక ఒకే శబ్దమునకు అనేకార్థములు కలుగునని కొందరి మతము. దానిని చూపుచున్నాడు.

శ్లో॥ ఏకదేశే సమూహే చ వ్యాపారాణాం పచాదయః ।
స్వభావతః ప్రవర్తన్తే తుల్యరూపసమన్వితాః ॥ 58

తుల్యరూప సమన్వితాః = సమానమగు స్వభావముతో గూడిన, పచాదయః = పచి మున్నగు ధాతువులు, వ్యాపారాణామ్ = వ్యాపారములయొక్క, ఏకదేశే = అవయవ క్రియయందును, సమూహే + చ = అవయవములతో గూడిన క్రియా సముదాయమునందును, స్వభావతః = స్వభావమువలన, ప్రవర్తన్తే = ప్రవర్తించుచున్నవి.

అర్థభేదముచే శబ్దము మార్పు చెందదు. శబ్దము స్వభావమున అనేకార్థములను బోధింపగలదు. ఈ సిద్ధాంతము "ఏకమాహు రనేకార్థం శబ్దమన్యే పరీక్షకాః" అను కారికచే ద్వితీయకాండమున చూపబడినది. ॥58॥

అవతారిక— ఇంతవరకు కర్మ కర్తృ ప్రక్రియ చూపబడినది. ఆ ప్రసంగమున "ణేరణౌయత్కర్మణౌ చే త్సకర్తాఽనాధ్యానే" (1-3-67) అను సూత్రముచే సాధింపబడిన ప్రయోగములు. "కర్మ వత్కర్మణా తుల్యక్రియః" (3-1-87) అను సూత్రముచే సిద్ధించుచుండగా 'ణేరణౌ' అను సూత్రము వేరుగ ఆరంభింపనక్కర లేదు అను అంశమును ముచ్చటించుచున్నాడు.

శ్లో॥ న్యగ్భావనా న్యగ్భవనం రుహౌ శుద్ధే ప్రతీయతే ।
న్యగ్భావనా న్యగ్భవనం ణ్యన్తేఽపి ప్రతిపద్యతే ॥ 59

శ్లో॥ అవస్థాం పఞ్చమీమాహుర్ణ్యన్తే తాం కర్మకర్తరి ।
నివృత్తప్రేషణాద్ధాతోః ప్రాకృతేఽర్థే ణిజుచ్యతే ॥ 60

వివరణము— ణేరణౌ (1-3-67) ఇత్యాది సూత్రము ఆత్మనేపదమును విధించుచున్నది. సూత్రార్థము: 1. ణిజంతముకంటె ఆత్మనేపదము ప్రవర్తించును. 2. అణ్యంతావస్థలో ఏ క్రియ భాసించినదో, ఆ క్రియయే ణ్యంతావస్థలో భాసింపవలెను. 3 అణ్యంతావస్థలో ఏది కర్మయో ణ్యంతావస్థలో అది కర్త కావలెను. 5. ఉత్కంఠా పూర్వకస్మృతి అర్థము కాకూడదు.

కాగా ఈ సూత్రమును నాల్గు వాక్యములుగా విభజించి వ్యాఖ్యానింపవలెను 1 ణేః, 2. అణౌ యత్కర్మణౌచేత్, 3. సకర్త్రా, 4 అనాధ్యానే మూడు వాక్యములు విధిబోధకములు, నాల్గవది నిషేధ వాక్యము.

అణ్యంతావస్థ యనగా ప్రేరణార్థమున ణిచ్ ప్రత్యయము చేయనిస్థితి. ఆ యవస్థలో ఏ క్రియ కాన్పించునో ఆ క్రియయే, ణిజంతమున కాన్పింపవలెను. ఇదియొక నియమము.

అణ్యంతావస్థలో ఏది కర్మయో, అది ణిజంతమున కర్త కావలెను. ఇది మరియొక నియమము.

ణిజంతముకంటె ఆత్మనేపదము ప్రవర్తించును. ఇది ముఖ్యముగ ప్రయోగమును చూపు స్థితి.

ఈ యవస్థలను దాటిన తరువాత ప్రయోగరూపము అందుబాటులో నుండును. ఈ యవస్థలు ప్రాసాదమును అధిష్ఠించుటకు ఏర్పాటుచేయబడిన సోపానములవంటివి. అనగా మెట్ల వంటివి

లోకమున ప్రసిద్ధమై ప్రయోగింపబడియున్న శబ్దరూపమునకు ప్రక్రియా మార్గమును వ్యాకరణము చూపును. అందుచే వ్యాకరణ శాస్త్రమునగల ప్రక్రియకు లోకప్రసిద్ధ రూపమును బోధించుటయే ప్రయోజనము.

మహాభాష్యకర్త ఎన్నియో ప్రక్రియా విశేషములను జూపెను. వానిని అన్నిటిని పరిశీలించి భర్తృహరి అస్మదాదులకు సూత్రవార్తిక భాష్యముల ఆశయమును తేటమాటలలో బోధించుచున్నాడు

ఉదాహరణరూపమును జూచుటకై దానికి ముందుగా కల్పింపబడిన అవస్థలను ముందుగా తెలిసికొనవలసి యున్నది.

1. ఆరోహన్తి హస్తినం హస్తిపకాః,

మావిటీళ్ళు ఏనుగును ఎక్కుటకు అనుగుణమగునట్లుగా దానిని వంగునట్లు చేయుచున్నారు. దీనినే న్యగ్భావన అని యందురు— న్యగ్భావనా—

2. ఆరోహతి హస్తీ

ఏనుగు మావటీళ్ళ ఎక్కుటకు అనుగుణమగునట్లు వంగుచున్నది. దీనిని —న్యగ్భవనమ్— అని యందురు ఇచట మావటీళ్ళ యొక్క ప్రయత్నము వివక్షితము కాదు. అందుచే ఈ ధాతువు అకర్మకిమాయెను. దీనినే ప్రేరణ నివర్తించిన రూపమందురు

3 ఆరోహయన్తి హస్తినం హస్తిపకాః

మరల మావటీళ్లు ప్రేరణాంశమును ధాత్వర్థముగా వివక్షింపగా ఈ ప్రయోగము సిద్ధించును. దీనికి ప్రథమావస్థలోనున్న అర్థమే చెప్పవలెను మావటీళ్ళు ఏనుగును వంగునట్లు చేయుచున్నారు

4. ఆరుహ్యతే హస్తీ స్వయమేవ

ఏనుగు తనంతట తానే వంగుచున్నది. ఈ యవస్థ కర్మ, కర్తవంటిది.

ప్రథమావస్థలో భాసించిన అర్థమే అనగా క్రియ, మూడవ యవస్థలో భాసించుచున్నది. అణ్యంతావస్థలోనున్న కర్మ ణ్యంతావస్థలో కర్త యగుచున్నది.

పై రీతిని నాలుగు అవస్థలు కలుగగా వీనిని సాధనముగా గైకొని అయిదవ అవస్థలో ఈ సూత్రముచే ఆత్మనే పదమును జూపవలెను. ఇందు మరల ణిజర్థమును వివక్షింపనందున ధాతువు అకర్మకమగును

5. ఆరోహయతే హస్తీ

ఏనుగు వంగుచున్నది. ఈ రూపము ఈ సూత్రమునకు ఉదాహరణము. దానిని చూపుటకై 4 అవస్థలు కల్పితమగుచున్నవి.

ప్రతిపదార్థము—శుద్ధౌ = శుద్ధమగు అనగా ణిజర్థమగు ప్రేరణ లేకుండ స్వార్థ మాత్రమును బోధించెడి, రుహౌ=రుహధాతువు ప్రయుక్తముకాగా, అనగా ఆరోహన్తి హస్తినం హస్తిపకాః అని ప్రయోగింపగా, న్యగ్భావనా = అధిష్ఠించుటకు యోగ్యమగునట్లు వంగునట్లు చేయుట, న్యగ్భవనమ్ = (ఆరోహతి హస్తీ) మావిటీళ్ల ప్రసక్తిలేకయే ఏనుగు వంగుట, ప్రతీయతే = భాసించుచున్నది

ణ్యన్తే + అపి = ణిజంతరూపమున గూడ, న్యగ్భావనా = న్యగ్భావనము, న్యగ్భవనమ్ = న్యగ్భవనమును, ప్రతిపద్యతే = తెలియబడుచున్నది

ప్రేరణాంశమును వివక్ష చేయకయున్న ఆరోహతి హస్తీ అను ప్రయోగమున ప్రేరణార్థమున ణిచ్ ప్రత్యయముచేయగా ఆరోహయన్తి హస్తిపకాః అను ప్రయోగము లభించును. ఈ వాక్యము ఆరోహన్తి హస్తినం హస్తిపకాః అను వాక్యముతో సమానార్థకము. ఆ వాక్యమున ణిజర్థమగు ప్రేరణ వివక్షితము కానిచో ఆరోహతి హస్తీ అను వాక్యముతో సమానార్థకమగు వాక్యము లభించును.

కర్మకర్త్రాది = కర్మ కర్తయందు అనగా కర్మను కర్తగా వివక్షచేయునపుడు, తామ్ = ఆ, అవస్థామ్ = అవస్థను, పఞ్చమీ = అయిదవ అవస్థగా, ణ్యన్తే = ణిజంతరూపమున, ఆహుః = (భాష్యకార లు) పలుకుచున్నారు.

B ప్రథమావస్థకు మూడవ యవస్థకు అర్థసామ్యమును జూపుచున్నాడు.

నివృత్తప్రేషణాత్ = విడువబడిన ప్రేషణ కల, ధాతోః = ధాతువుకంటె, ప్రాకృతే = స్వాభావికమగు అనగా శుద్ధ ధాతువుచే బోధింపబడెడి, అర్థే = అర్థమున, ణిచ్ = ణిచ్ ప్రత్యయము, ఉచ్యతే = ప్రయోగింపబడుచున్నది.

ఆరోహన్తి హస్తినం హస్తిపకాః

ఇచట మావటీల్ల ప్రసక్తిని విడనాడిన ఆరోహతిహస్తీ అను ప్రయోగముండును. ఇచట ధాతువును నివృత్తప్రేషణ అని యందురు. ఇట్టి ధాతువునకు ప్రేరణార్థమున ణిచ్ ప్రత్యయముచేరిన ఆరోహయన్తి హస్తినం హస్తిపకాః అను ప్రయోగము ఏర్పడును.॥59,60॥

అవతారిక— శుద్ధధాతువులకు ణిజంతధాతువులకు అర్థము సమానముగా నుండును అనుటలో దృష్టాంతము చూపుచున్నాడు.

శ్లో॥ బ్రవీతి పచతేరర్థం సిద్ధ్యతిర్న వినా ణిచమ్ ।
సణ్యన్తః పచతేరర్థే ప్రకృతేర్వ్యవతిష్ఠతే ॥ 61

సిద్ధ్యతి = సిధుధాతువు (సిద్ధ్యతి), ణిచం + వినా = ణిచ్ ప్రత్యయము లేనియెడల, పచతేః = పచధాతువుయొక్క, అర్థమ్ = అర్థమును, న + బ్రవీతి = చెప్పనేరదు.

సిధుధాతువునకు విక్లిత్తియే అర్థము. పచధాతువునకు విక్లిత్త్యనుకూల వ్యాపారము అర్థము. ఇచట రెండు సమానార్థకములు కావు.

కాని, ణ్యన్తః = ణిచ్ ప్రత్యయము అంతమునగల, సః = ఆ సిధుధాతువు, ప్రకృతేః = ప్రకృతి భూతమగు, పచతేః = పచిధాతువు యొక్క, అర్థే = అర్థమునందు, వ్యవతిష్ఠతే = నిలిచియున్నది.

తాత్పర్యము— ణిజంతమగు సిధుధాతువు శుద్ధమగు పచిధాతువుయొక్క అర్థమును బోధింపగలదు. సిధుధాతువును కేవలముగా ప్రయోగించిన అది పచిధాతు సమానార్థకము కాదు. సిధుధాతువునకు ణిచ్ ప్రత్యయము చేరగా 'సాధయతి' అను రూపము ఏర్పడును. ఆ ణిజంతము పచిధాతువుతో సమానార్థకము. సాధయతి = అన్నమును తయారు చేయుచున్నాడు. ॥61॥

అవతారి — పై రీతిని ప్రేషణాంశమునకు వివక్షచేయకుండుటచే కర్మ కర్త కాగలదని చూపియున్నాడు.

ఇపుడు ప్రేరణను ఆరోపించుటచే అనగా ప్రేషణాంశము లేకున్నను ఆరోపించుటచే కర్మ కర్త కాగలదని చూపుచున్నాడు.

శ్లో॥ కేషాఞ్చిద్దేవదత్తాదేః వ్యాపారో యః సకర్మకే ।
స వినా దేవదత్తాదేః కటాదిషు వివక్ష్యతే ॥ 62

కేషాఞ్చిత్ = కొందరి (మతమున), సకర్మకే = సకర్మక ధాత్వర్థమున, దేవదత్తాదేః = దేవదత్తుడు మున్నగువాని యొక్క, యః = ఏ, వ్యాపారః = వ్యాపారమో అనగా ప్రేషణ రూపమగు వ్యాపారమో, సః = ఆ వ్యాపారము, దేవదత్తాదేః + వినా = దేవదత్తుడు మున్నగు వారు లేకున్నను, కటాదిషు = చాప మున్నగువానియందు, వివక్ష్యతే = వివక్షింపబడుచున్నది.

తాత్పర్యము— దేవదత్తః కటం కరోతి (దేవదత్తుడు చాప తయారుచేయుచున్నాడు) ఇచట దేవదత్తుడు ప్రధాన కర్త, కటము కర్మ. దేవదత్తుని వ్యాపారమువలన కటము నిష్పన్నమగుచున్నది ఇచట దేవదత్తుని వ్యాపారమును కటమునందు ఆరోపించుటచే కటము కర్త యగుచున్నది. ఈ రీతిగా కర్మయగు కటము కర్తయగుచున్నది. దీనిని అధ్యారోపిత పక్షమందురు. 55, 56 కారికలో నివృత్తప్రేషణ పక్షము నాశ్రయించి కర్మ కర్త యగునని చూపబడినది ॥62॥

అవతారిక— పై కారికయొక్క అర్థమును ప్రకృతమున సమన్వయించుచున్నాడు.

శ్లో॥ నివృత్తప్రేషణం కర్మ స్వస్య కర్తుః ప్రయోజకమ్ ।
ప్రేషణాన్తరసంబన్ధే ణ్యన్తేలేనాభిధీయతే ॥ 63

నివృత్తప్రేషణమ్=అవివక్షితమగు ప్రేషణకల అనగా దేవదత్తాది వ్యాపారమును విడనాడిన, కర్మ = కర్మ, కటము మున్నగునది, స్వస్య = స్వీయమగు, కర్తుః = ప్రయోజక కర్తకు అనగా కటాదికమునకు, స్వతంత్రతను వివక్షచేయగా తనకు కలిగెడి ప్రయోజక కర్తృత్వమునకు, ప్రయోజకమ్ = కారణమగుచున్నదై, ప్రేషణాన్తర సంబన్ధే = దేవదత్తాదుల యొక్క ప్రేషణతో సంబంధము కలుగగా అనగా వారియందున్న ప్రేషణాంశమును ఆరోపింపగా, ణ్యన్తే = ణిజంతమున, లేన = లకారముచే, అభిధీయతే = చెప్పబడుచున్నది.

దేవదత్తః కటం కరోతి ఇచట దేవదత్తుని వ్యాపారము ప్రేషణ. దానిని వివక్షచేయక కటము స్వతంత్రమని వివక్షచేసి, దేవదత్తుని ప్రేషణాంశమును కటమునందు ఆరోపింపగా అది కర్త యగుచున్నది. అట్టి కర్మగానున్న కర్తను ణ్యంతధాతువుకంటె కలిగెడి లకారము బోధించుచున్నది. ఉదా : కారయతే కటః స్వయమేవ, కటము అనగా చాప తనంతట తానే తయారు అగుచున్నది ఇది కర్మ కర్త యనబడుచున్నది. కాని యిచట 'కర్మ వత్కర్మణాతుల్య క్రియః' అను సూత్రము ప్రవర్తింపదు. 'ణేరణౌ యత్కర్మణౌచేత్సకర్తాఽనాధ్యానే' (1-3-67) అను సూత్రముచే ఆత్మనే పదము ప్రవర్తించినది ॥63॥

అవతారిక— 59వ కారిక నుంచి 'ణేరణౌ యత్కర్మణౌ చేత్స కర్తాఽనాధ్యానే' అను సూత్రము యొక్క అర్థము విచారింపబడినది

మరల కర్మ కర్తృ ప్రక్రియగురించి ముచ్చటించుచున్నాడు.

శ్లో॥ సదృశాదిషు యత్కర్మ కర్తృత్వం ప్రతిపద్యతే ।
అపత్త్యాపాదనే తత్ర విషయత్వం ప్రతిక్రియే ॥ 64

వివరణము— తాదృశః (అట్టివాడు) సదృశః (సమానమైనవాడు) మున్నగు ప్రయోగములు "త్యదాదిషు దృశోఽనాలోచనేకఞ్చ" (3-2-60) అను సూత్రముచే సిద్ధించుచున్నవి. త్యద్, తద్, మద్, మున్నగు పదములు ఉపపదముగా నుండగా కంటికి కనబడుట అను అర్థము కానపుడు దృశ్ ధాతువునకు, కఞ్ (అ) ప్రత్యయము, క్విన్ (సర్వలోపి) ప్రత్యయము కలుగునని సూత్రార్థము. 'కఞ్' ప్రత్యయము చేరగా అజంతశబ్దము– తాదృశ, అనియు, క్విన్ చేరగా –తాదృక్– హలంత శబ్దము ఏర్పడును.

ఇచట ఈ రెండు కృత్ప్రత్యయములు ప్రవర్తించుచున్నవి. వానికి కర్త అర్థము కావలెను. కాని అట్లుకాకున్నది. తాదృశః అను పదమునకు అట్టివాడు అని యర్థము. అంతియే కాని, వానిని చూచువాడు అని యర్థము కాదు. అందుచే కృత్ప్రత్యయార్థము సరియగునది కాదనియు, అచట ఇవార్థమున అనగా సదృశార్థమున ఇచట తద్ధిత ప్రత్యయము చెప్పవలె ననియు *వార్తికకారుడు సిద్ధాంతమును ప్రబోధించెను. పాణిని సూత్రము సరిపడదని వార్తిక కారుని యాశయము.

తరువాత భాష్యకారుడు వార్తికమతము బాగులేదు. సూత్రము సరిగనున్నదని భావించెను. అచట కర్మ కర్త బోధింపబడుచున్నది –కర్మ కర్తృత్వాత్సిద్ధమ్– పై భాష్యమును వ్యాఖ్యానించుటకై ఈ కారిక వ్రాయబడినది

సదృశాదిషు = సదృశః, తాదృశః మున్నగు ప్రయోగములయందు, యత్ = ఏ, కర్మ కర్తృత్వమ్ = కర్మ కర్తృత్వము, ప్రతిపద్యతే = చెప్పబడుచున్నదో, తత్ర = అచట, విషయత్వం + ప్రతి = ఘటము మున్నగువాని విషయత్వము గురించి, అపత్త్యాపాదనే = 1. అపత్తి, 2. ఆపాదనము అనెడి, క్రియే = రెండు వ్యాపారములు, (వాచ్యే) = దృశి ధాతువునకు వాచ్యములగు చున్నవి

తాత్పర్యము— ఘటం పశ్యతి మున్నగు చోటులందు దృశిధాతువునకు రెండు వ్యాపారములు వాచ్యములుగా నున్నవి. 1. ఘటము ఇతరులకు గోచరించుటకు అనుకూలమగు పరిమితమగు రూపమును ధరియించుట, 2 అట్టి ఘటమును తన దృష్టికి గోచరింపచేసి కొనుట మొదటి వ్యాపారము ఘటమునందున్నది, రెండవది చైత్రాది నిష్ఠము. ఘట వ్యాపా

* "వార్తికములు. 1. కృదర్థానుపపత్తిస్తు, 2. ఇవార్థేచ అయంతద్ధితః" త్యదాదిషు దృశోఽనాలోచనే కఞ్చ (3-2-60) సూత్రమున ఇవి కలవు.

రము చైత్ర వ్యాపారమున అప్రధానమై భాసించుచున్నది. చైత్ర వ్యాపారము కూడ ధాత్వర్థ మగుచో చైత్రుడు కర్త, ఘటము కర్మయు అగుచున్నవి

తరువాత చైత్ర వ్యాపారము ధాతువాచ్యము కాదని వివక్షింపగా ఘట వ్యాపారమే ధాతు వాచ్యమగును అపుడు ఘటము కర్త కాగలదు. సూర్యరశ్మి అధికముగా నుండుటచే ఆవరణ వస్తువులు ఏమియు లేకపోవుటచే ఘటము అప్రయత్నముగా కంటికి కనబడుచున్న దని క్రియా సౌకర్యము లభించును కాబట్టి కర్మ కర్త తాదృశాది పదములలో కృత్రప్రత్య యమునకు అర్థము కాగలదు. ॥64॥

అవతారిక— 64 వ కారికలో చూపిన అర్థమునకు ఉపపత్తి లేదని చూపు చున్నాడు.

శ్లో॥ కుతశ్చిదాహృత్య పదమేవం చ పరికల్పనే ।
కర్మస్థ భావకత్వం స్యాద్దర్శనా ద్యభిధాయినామ్ ॥ 65

కుతశ్చితమ్ = ఎచ్చటనుండియో పదమ్ = విషయ మాపద్యమానమ్, అను పదమును, ఆహృత్య = గ్రహించి, ఏవం = పై ప్రకారము, పరికల్పనే + చ = దృశి ధాతువునకు వ్యాపార ద్వయమును వాచ్యముగా కల్పించినచో, దర్శనాద్యభిధాయినామ్ = దర్శనము, ఆసనము (ఉండుట) మున్నగు క్రియలను బోధించెడి దృశి, ఆస్ మున్నగు ధాతువులకు, కర్మస్థ భావకత్యమ్ = కర్మస్థ భావకత్వము అనగా క్రియవలన కర్మయందు విశేషము కలిగి యుండుట, స్యాత్ = కలుగవలెను. కాని అది శాస్త్ర విరుద్ధము, దృశి ప్రభృతులు కర్తృస్థ భావకములని శాస్త్ర సిద్ధాంతమని భావము.

తాత్పర్యము— దృశిధాతువునకు రెండు వ్యాపారములు వాచ్యములు కాగలవు. వానిలో ఘటముయొక్క వ్యాపారమే ధాత్వర్థముగా వివక్షించిన అది కర్త కాగలదని యంగీకరించిన, ఆ పద్ధతిలో క్రియవలన కర్మయందు విశేషము కలుగుటచే దృశి, ఆస్ మున్నగు ధాతువులు కూడ కర్మస్థ భావకములు కాగలవు. కాని అవి కర్తృభావకములు, అనగా క్రియచే కర్తయందే విశేషము కలిగియున్నవనెడి సిద్ధాంతము విరోధించును. కాబట్టి పై రీతిని సమన్వయము చేయరాదు ॥65॥

అవతారిక— కర్మస్థ భావకములు, కర్తృస్థ భావకములు అని ధాతువులు రెండు విధములు. అందు కర్మస్థ భావకములకే కర్మవద్భావము. కర్తృస్థ భావకములకు కర్మవద్భా వము ప్రవర్తింపదు దృశి ప్రభృతులు కర్తృస్థ భావకములు కనుక అచట కర్మవద్భావము ప్రవర్తింపదని చెప్పబడినది. కాని ఆ విభాగము ఎట్లు తెలియబడును? అను ప్రశ్నకు సమా ధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ విశేషదర్శనం యత్ర క్రియా తత్ర వ్యవస్థితా ।
క్రియా వ్యవస్థాత్వన్యేషాం శబ్దైరేవ ప్రకల్పితా ॥ 66

A. యత్ర = ఏ కర్మయందు, విశేషదర్శనమ్ = విశేషము కాన్పించునో తత్ర = అచట క్రియా = క్రియ వ్యవస్థితా = నిలిచియున్నది

క్రియవలన ఏ కర్మయందు భేదము కాన్పించునో, అది కర్మస్థ భావకము. ఉదా. 'కాష్ఠంఛినత్తి' కట్టను చీల్చుచున్నాడు. ఛేదన క్రియవలన కాష్ఠమునందు రూపము మారి యున్నది. కాన అది కర్మస్థభావకము. అచట 'కర్మవద్భావము' ప్రవర్తించును. ఛిద్యతే కాష్ఠం స్వయమేవ. ఘటం పశ్యతి. ఇచట దర్శన క్రియవలన ఘటమునందు విశేషము కాన్పించుట లేదు. కాబట్టి ఇది కర్తృస్థభావకము. ఇచట కర్మవద్భావము కలుగదు.

B. అన్యేషామ్ = మరికొందరి (మతమున), తు = మాత్రము, శబ్దైః + ఏవ = శబ్దముల చేతనే, క్రియావ్యవస్థా = క్రియయొక్క వ్యవస్థ, ప్రకల్పితా = చూపబడుచున్నది.

లోకమున శబ్దము ప్రయోగింపగా శ్రోతలు దాని యర్థమును విశదముగా గ్రహింతురు. వారి వ్యవహారము శబ్ద మూలకము. అట్టి లోకవ్యవహారమునే శాస్త్రము బోధించు చున్నది.

కాబట్టి శబ్దమువలననే ఇది కర్మస్థ భావకము. ఇది కర్తృస్థభావకము అని తెలియ బడ గలదు. ॥66॥

అవతారిక— ఇంతవరకు "కర్తురీప్సితతమం కర్మ" (1-4-49) అను ప్రథమ సూత్రముచే గుర్తింపబడిన కర్మకు 1. నిర్వర్త్యము 2. వికార్యము 3. ప్రాప్యము అను మూడు భేదములను జూపి, దాని ప్రసంగమున మతభేదముచే కర్మ కర్తను వ్యాఖ్యానించి కర్మస్థ భావకత్వమును కర్తృస్థ భావకత్వమును జూపెను.

ప్రస్తుతము ఇతర సూత్రములచే గుర్తింపబడిన కర్మలను వ్యాఖ్యానించుచున్నాడు. అందు "అకథితంచ" (1-4-51) అను సూత్రమున కాత్యాయనుడు "కాలభావాధ్వగన్తవ్యాః కర్మ సంజ్ఞా హ్యకర్మణాం దేశశ్చ" అను వార్తికమును రచియించెను. అకర్మకధాతువులతో యోగ మున్నపుడు దేశము, కాలము, భావము, నడవతగిన మార్గము, కర్మ సంజ్ఞ కలవియగు నని వార్తికమునకు అర్థము. ఉదా: కురూన్ స్వపితి (కురుదేశములయందు నిదురించు చున్నాడు), మాసమ్ ఆస్తే (నెల రోజులు ఉంటున్నాడు), గోదోహమాస్తే (ఆవుపాలు పితుకు వరకు ఉంటున్నాడు), ఒక క్రియవలన మరియొక క్రియను గుర్తించుట భావమనబడును. క్రోశమాస్తే (క్రోసు దూరమున ఉన్నది).

కాని పై వార్తికము ఆరంభింపనక్కరలేదు. కర్తురీప్సితతమం కర్మ (1-4-49) అను సూత్రముచేతనే దేశాదులకు కర్మ సంజ్ఞ కలుగగలదు అని భాష్యకారుడు పలికెను. ఆ భాష్యమును వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ కాలభావాధ్వదేశానా మన్తర్భూత క్రియాన్తరైః।
సర్వైరకర్మకైర్యోగే కర్మత్వముపజాయతే ॥ 67

అన్తర్భూత క్రియాన్తరైః = అంతర్గతముగా చేసికొనబడిన అనగా స్వార్థముగా జేసికొన బడిన వ్యాప్తి మున్నగు ఇతర క్రియలు కలిగిన, సర్వైః = ఎల్ల, అకర్మకైః = అకర్మక ధాతువులతో, యోగే = సంబంధమున, కాలభావాధ్వదేశానామ్ = కాలమునకు, భావమునకు మార్గమునకు, దేశమునకును, కర్మత్వమ్ = కర్మసంజ్ఞ, ఉపజాయతే = కలుగుచున్నది. కర్తు రీప్సితతమ్ అను ప్రథమ సూత్రముచేతనే కాలాదులకు కర్మసంజ్ఞ కలుగుచున్నందున వేరుగ వార్తికమారంభింప నక్కరలేదని భావము.

తాత్పర్యము— మాసమాస్తే మున్నగు చోటులందు ధాతువునకు ఉండుట మాత్రమే అర్థము కాదు. వ్యాపించుట కూడ అర్థము. కాగా ఉండుటచే వ్యాపించుట ధాత్వర్థ మగును. అపుడు వ్యాప్తి ఫలము కనుక అట్టి ఫలమునకు ఆశ్రయమగుటం జేసి మాసమునకు కర్మసంజ్ఞ కలుగుచున్నది. ఇట్లే పై ఉదాహరణములలో గూడ దేశాదులకు కర్మసంజ్ఞ సిద్ధించును.

'మాసమాస్తే దేవదత్తః' ఇచట ధాతువు అకర్మకము. ఐనను మాసము కర్మ కాగలదు ఇచట భావార్థమున లకారము చేరగా 'మాసమాస్యతే దేవదత్తేన' మున్నగు ప్రయో గములు కలుగుచున్నవి.

'సర్వైః' అనుటచే సకర్మక ధాతువుల యోగమునగూడ కాలాదులకు కర్మసంజ్ఞ కలుగునని తెలియవచ్చుచున్నది. మాసమోదనం పచతి (నెల రోజులు ఓదనమును వండు చున్నాడు) ఓదనము కర్మ. అది యుండగా ధాతువునకు వ్యాప్తికూడ అర్థముగా వివక్షింపగా వ్యాప్తిరూపమగు ఫలమునకు ఆశ్రయమగుటం జేసి మాసముకూడ కర్మ కాగలదు. రెండు కర్మలలోను మాసాది కర్మ బహిరంగము, అనగా ధాత్వర్థముతో ముందుగా సంబంధింపనిది. కనుక అది అప్రధానకర్మ. ఓదనాదికమగు ద్రవ్యరూపమగు కర్మ అంతరంగము. అనగా ధాత్వర్థముతో ముందుగా సంబంధించునది. కనుక అది ప్రధానకర్మ. అందుచే ఓదనాది కర్మను బోధించుచు పచ్యాదులకంటె కర్మ ప్రత్యయము ప్రవర్తించును. మాసాదులను బోధింపదు. కాగా మాసమోదనః పచ్యతే అను ప్రయోగము సిద్ధించుచున్నది. ॥67॥

అవతారిక— మాసమోదనం పచతి మున్నగు ప్రయోగములలో మాసము మున్నగునవి అప్రధానకర్మ యనియు, ఓదనాదికము ప్రధానకర్మ అనియు ఎట్లు నిర్ణయింప తగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆధారత్వమివ ప్రాప్తాస్తే పునర్ద్రవ్యకర్మసు ।
కాలాదయో భిన్నకక్ష్యం యాన్తి కర్మత్వముత్తరమ్ ॥ 68

తే = ఆ, కాలాదయః+పునః=కాలము మున్నగు మాత్రము అనగా కాలము, దేశము, భావము, మార్గము ఇవి మాత్రము, ద్రవ్యకర్మసు = ద్రవ్యరూపమగు కర్మల విషయమై, ఆధారత్వమ్ = ఆధారత్వమును, ప్రాప్తాః + ఇవ = పొందినట్లు ఉన్నవై, భిన్నకక్ష్యమ్ = వేరుగానున్న అవస్థ కలిగినట్టియు, కనుకనే, ఉత్తరమ్ = ఉత్తరకాలమున కలిగెడి, కర్మత్వమ్ = కర్మ సంజ్ఞను, యాన్తి = పొందుచున్నవి, కాక అధారత్వమ్ + ఇవ = ఆధార సంజ్ఞవలె.

తాత్పర్యము— ఏ పని జరుగవలెనన్న ఆ పని చేయువారికి కాలము మున్నగునవి ఆధారములగుచున్నవి. రాత్రౌ భుఙ్క్తే (రాత్రియందు తినుచున్నాడు). మరియు ఆధారసంజ్ఞ కర్తృ కర్మ వ్యవధానమున క్రియతో సంబంధించునపుడు కలుగును. అట్లే కాలాదులు కూడ ఓదనము మున్నగు ద్రవ్యముల ద్వారా క్రియతో సంబంధించును. పచతి అను క్రియతో పాకము చేయబడెడి తండులాదులు ముందుగా అన్వయించును. తరువాత ఆ పాకము చేయుటకు ఎంతకాలము కావలెను? అను సంశయము కలుగగా 2, 3 గంటల కాలమో, వంటనుబట్టి ఇంకను అధికమగుకాలమో అపేక్షితమై క్రియతో సంబంధించును.

అట్లే అధ్యేతి (చదువుచున్నాడు) అనగా చదుపబడెడి విద్యముందుగా సంబంధించును. చదువబడెడి విద్యను బట్టి 5-6 సంవత్సరములలో, కాక 12-15 సంవత్సరములో కాలము అపేక్షితమై సంబంధించును ముందుగా క్రియతో సంబంధించినది అంతరంగము కనుక ప్రధానకర్మ యనియు, తరువాతి కాలమున సంబంధించిన కాలాది కర్మలు బహిరంగములు కనుక అప్రధానకర్మలనియు వ్యవస్థ చేయనగును.

కాబట్టి మాసమోదనం పచతి అను స్థలమున ఓదనము ప్రధానకర్మయగుటచే ఆ కర్మయందు లకారము ప్రవర్తించును. కాలాదులు అప్రధానకర్మ కనుక అచట లకారము ప్రవర్తింపదు. మాసమోదనః పచ్యతే అనియే ప్రయోగముండును ॥68॥

అవతారిక— మాసమోదనం పచతి మున్నగు వాక్యములలో రెండు కర్మలు కలవు. ఆ రెండు ఏకరూపమగు కర్మలు కానోపవు. ధాతువునకు ఓదనమగు ద్రవ్యము ప్రాథమికమగు కర్మ కనుకనే అది ప్రధాన కర్మ. ఓదనము కర్మ సంజ్ఞకమైన పిమ్మట మాసము కర్మయగుచున్నది. కనుకనే అది అప్రధాన కర్మ యగుచున్నది. కాగా అవస్థాన భేదము ఈ రెంటికి కలదు. ఇదియే భిన్నకక్ష్య యనబడును. ఇట్టి అవస్థా భేదమున రెంటికి కర్మత్వము లభించుటవలన కలిగెడి ప్రయోజనము వ్యక్తపరచుచున్నాడు

శ్లో॥ అతస్తైః కర్మభిర్ధాతుర్యుక్తోఽద్రవ్యైరకర్మకః ।
లస్య కర్మణి భావే చ నిమిత్తత్వాయ కల్పతే ॥ 69

అతః = పై కారణమువలన, అకర్మకః = అకర్మకమగు, ధాతుః = ధాతువు అనగా స్వతః అకర్మకమగు ఆస్తే, శేతే మున్నగు ధాతువు, అద్రవ్యైః = ద్రవ్యములుకాని, కర్మభిః = కర్మలతో అనగా కాలము, దేశము మున్నగు కర్మలతో, యుక్తః = కలసినదై, కర్మణి = కర్మార్థమున, భావే + చ = భావార్థమునను, లస్య = లకారమునకు అనగా లకార, కృత్య, క్త, ఖలర్థ ప్రత్యయములు ప్రవర్తించుటకు, నిమిత్తత్వాయ = కారణత్వము కొరకు, కల్పతే = సమర్థమగుచున్నది.

తాత్పర్యము— మాసమోదనం పచతి మున్నగు వాక్యములలో రెండు కర్మలున్నందున వానిలో ఒకటి ప్రధానకర్మ, రెండవది అప్రధాన కర్మయు అగుచున్నవి. అట్లు

కాక ద్రవ్యకర్మ లేనిచోటునందు కాలాదులే కర్మలుగా నుండునపుడు ధాతువుకంటె కర్మార్థమున భావార్థమున గూడ లకారము, కృత్యప్రత్యయము, క్తప్రత్యయము, ఖలర్థప్రత్యయము, ప్రవర్తింపగలవు. ద్రవ్యరూపమగు కర్మ లేనందున ధాతువు అకర్మకమై భావార్థమున ప్రత్యయములను బొందగలదు. కాలాది కర్మనుబట్టి సకర్మకము కాన ధాతువు కర్మార్థమున గూడ ప్రత్యయములను పొందగలదు. ఉదా : మాసమాస్తే చైత్రః (చైత్రుడు మాసము ఉంటున్నాడు) దీనికి కర్మార్థమున ప్రత్యయములు కలుగును ఆస్యతే మాసః చైత్రేణ, కర్మార్థమున లకారము మాసః ఆసితవ్యః, కర్మార్థమున తవ్య ప్రత్యయము. ఆసితః మాసః కర్మార్థమున క్త ప్రత్యయము. మాసః స్వాసః కర్మార్థమున ఖల్ ప్రత్యయము. ఇట్లే అకర్మకమగుటచే మాసమాస్యతే చైత్రేణ. భావార్థమున లకారము, మాసమాసితో దేవదత్తః. కర్త్రర్థమున క్త ప్రత్యయము. కారికలో 'లస్య' అనునది ల, కృత్య, క్త ఖలర్థప్రత్యయములకు ఉపలక్షణము అనగా గుర్తు ॥69॥

అవతారిక— భిన్నకక్ష్యమగు అనగా అవస్థాభేదముచే గల్గెడి కర్మత్వము కాలాదులకే కాక ఇంకను మరికొన్నిటికి కూడ కలుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ సర్వం వాఽకథితం కర్మ భిన్నకక్ష్యం ప్రతీయతే ।
ధాత్వర్థోద్దేశభేదేన తన్నేప్సితతమం కిల ॥ 70

A. అకథితమ్ = 'అకథితంచ' (1-4-51) అను సూత్రముచే విధింపబడిన, సర్వం + వా = అంతయు, భిన్నకక్ష్యమ్ = కాలభేదముచే కల్గెడి, కర్మ = కర్మగానే, ప్రతీయతే = తెలియబడుచున్నది గాం దోగ్ధి పయః (ఆవును పాలు పితుకుచున్నాడు) మున్నగు ప్రయోగములలో గవాదులకు 'అకథితంచ' అను సూత్రముచే కర్మసంజ్ఞ విధింపబడినది. అదియు భిన్నకక్ష్యమగు కర్మయే యని భావము

B. ఇందు కారణము చూపుచున్నాడు.

ధాత్వర్థోద్దేశభేదేన = ధాత్వర్థముతో సంబంధించుటలో గల కాలభేదముచే, తత్ = అది, అనగా 'అకథితంచ' అను సూత్రముచే కలిగిన కర్మ, ఈప్సితతమమ్ = మిక్కిలి ఇష్టమగునది, అనగా ముందుగా ధాత్వర్థముతో సంబంధించునది. న + కిల = కానేరదు కదా।

తాత్పర్యము— గాం దోగ్ధి పయః, ఇచటను రెండు కర్మలు కలవు. వానిలో పయస్సు ముందుగా దుహ (పితుకుట) ధాత్వర్థముతో సంబంధించును కనుక అది ముఖ్యకర్మ అట్టి కర్మకు నిమిత్తము కనుక గోవు తరువాత ధాత్వర్థముతో సంబంధించుచున్నది. అందుచే గోవు అప్రధాన కర్మ యగును ఇట్లే బలిం యాచతే వసుధామ్ (బలిని భూమి యాచించుచున్నాడు) మున్నగు ఉదాహరణములలో గూడ అవస్థాభేదమును బట్టి వసుధ ప్రధానమనియు, బలి దానికి నిమిత్తముకాన అప్రధానకర్మ యనియు ఎఱుంగునది.

విశేషము— ప్రధానాప్రధానరూపమున రెండు విధములుగా కర్మలు ఉండ నేరవు అన్నియు ప్రధానకర్మలే కాగలవని 78 వ శ్లోకమున చూపఁబడుచున్నది. కనుక ఈ భేదము యుక్తము కాదు. ఈ యభిప్రాయము కారికలో 'కిల' అను పదము వ్యక్తపరచు చున్నది. ఇంతియేకాదు 78 వ శ్లోకమున గూడ ఒకే కర్మయని సిద్ధాంతము చేయబడు చున్నది ॥70॥

అవతారిక— క్రియతో ముందుగా సంబంధించినది ప్రధానమనియు, తరువాత క్రియతో సంబంధించునది అప్రధానమనియు చెప్పబడినది. అదియే 'భిన్నకక్ష్య' శబ్దముచే 68, 70 కారికలలో చూపబడినది.

కాని అట్లు చెప్పుట యుక్తము కాదు. ఏలయన— 'అకథితంచ' (1-4-51) అను సూత్రమున భాష్యకర్త అప్రధానకర్మతోనే ముందుగా ధాత్వర్థమునకు సంబంధము కలుగు నని "పూర్వం గుణకర్మణాభవతి యోగః" అని స్పష్టముగా చెప్పెను. కాగా గోవు ముందుగా సంబంధించుటచే నీవు చెప్పిన ప్రకారము అదియే ప్రధానకర్మ కావలెను అను ప్రశ్న కలు గగా ప్రధానాప్రధానభావమును మరియొక విధముగా జూపుచున్నాడు.

శ్లో॥ ప్రధానకర్మ కథితం యత్ క్రియాయాః ప్రయోజకమ్ ।
తత్సిద్ధయే క్రియాయుక్త మన్యత్త్వకథితం స్మృతమ్ ॥ 71

యత్ = ఏది, క్రియాయాః = దోహనము మున్నగు క్రియకు, ప్రయోజకమ్ = ముఖ్యముగా ప్రేరకమో, అనగా దేనిని ఉద్దేశించి క్రియ జరుగునో ఏది సిద్ధింపగా ఇతర కారకములు నిరుపయుక్తము లగునో, (తత్) అది, ప్రధానకర్మ = ప్రధానకర్మగా, కథితమ్ = చెప్ప బడు చున్నది.

తత్సిద్ధయే = అట్టి కర్మ సిద్ధించుటకై, క్రియాయుక్తమ్ = క్రియతో సంబంధిం చిన, అన్యత్ + తు = ఇతరమైనదియే, అకథితమ్ = అప్రధాన కర్మగా, స్మృతమ్ = చెప్ప బడు చున్నది.

తాత్పర్యము— ప్రధానాప్రధానభావమునుబట్టి కక్ష్యాభేదము లభించును. పాలును అపేక్షించియే దోహన క్రియ జరుగును. దానిని సాధించుటకే ఇతర కారకములు సిద్ధముచేయ బడు చున్నవి. పాలు సిద్ధింపగా గవాది కారకములు ఉపేక్షితములే యగుచున్నవి. కాబట్టి పయస్సు ప్రధానము. దానికి నిమిత్తముగా క్రియతో గోవు సంబంధించుచున్నది. కనుక గోవు రెండవ యవస్థలో కర్మయగుచున్నది గోవులేనిది పాలు లభ్యము కానందున గోవు ముందుగా ధాత్వర్థముతో సంబంధించుచున్నది. అంతమాత్రాన గోవు ప్రధానము కాదు. ఇచట అప్రధాన కర్మను బోధించు లకారాదులు ప్రవర్తించును. గౌ ర్దుహ్యతే పయః. ॥71॥

అవతారిక — 'అకథితంచ' (1-4-51) అను సూత్రమున *నీ, వహ, హృ, గత్యర్థక, ఈ ధాతువులను ద్వికర్మకములుగా జూడపలెనని భాష్యకర్త పలికెను. దానిని వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ దుహ్యాదివన్నయత్యాదౌ కర్మత్వ మకథాశ్రయమ్ ।
అఖ్యాతానుపయోగే తు నియమాచ్ఛేష ఇష్యతే ॥ 72

A. దుహ్యాదివత్ = దుహి మున్నగు ధాతువులతో సంబంధమునవలె, నయత్యాదౌ = నయతి మున్నగు ధాతుయోగమున గూడ, అకథాశ్రయమ్ = అవివక్షా మూలమున కలిగెడి, కర్మత్వమ్ = కర్మసంజ్ఞ, (ప్రవర్తతే) = కలుగుచున్నది

గాం దోగ్ధి పయః అనుచోట పయస్సు ముఖ్యకర్మ, గోవు గౌణకర్మ అట్లే, అజాం గ్రామం నయతి (మేకను గ్రామముగూర్చి తీసికొనివెళ్ళుచున్నాడు) అను చోటునందు అజము ప్రధాన కర్మ, గ్రామము అప్రధానకర్మ. విశేషమేమనగా ఇచట ప్రధానకర్మమును బోధించుచు లకారము ప్రవర్తించును. అజాగ్రామం నీయతే, జయతి, దణయతి మున్నగు ధాతువుల ప్రయోగమున గూడ గౌణ ముఖ్య కర్మలు సంభవించును.

B. భాష్యకారుడు 'దుహి, యాచ్, నీ, హృ. కృష్, వహి అను రీతిని పరిగణమును జూపియున్నాడు. అనగా దుహాది ధాతుయోగముననే పై రీతిని గౌణ ముఖ్యకర్మ విభాగము సంభవించును. వానికంటె భిన్నమగు ధాతువులతో సంబంధమున మాత్రము పై రీతిని కర్మ ద్వయము చూపరాదని భావము. అట్టి నియమమునకు ఫలము చూపుచున్నాడు.

అఖ్యాతానుపయోగే + తు = నియమ పూర్వకముగా విద్యను స్వీకరింపనపుడు, మాత్రము, నియమాత్ = దుహ్యాదియోగముననే అకథితకర్మ అను నియమమువలన, శేషః = శేషవిభక్తి అనగా షష్ఠీవిభక్తి ఇష్యతే = సమ్మతమగుచున్నది

దుహ్యాదియోగముననే అకథితకర్మ ప్రవర్తించును అను నియమమువలన 'నటస్య శృణోతి' (నటుని గానమును వినుచున్నాడు) మున్నగు చోటులయందు నియమపూర్వకముగా గల విద్య లేనిసమయమున షష్ఠీ విభక్తియే ప్రవర్తించినది. ॥72॥

అవతారిక — పై రీతిని ప్రధానకర్మ అప్రధానకర్మ చూపబడినవి

కాని రెండు విధములగు కర్మలు లేవు. అన్నియు ప్రధానకర్మలే అని కొందరు తలంచుచున్నారు. వారి మతమును జూపుచున్నాడు.

శ్లో॥ అన్తర్భూతణిజర్థానాం దుహ్యాదీనాం ణిజన్తవత్ ।
సిద్ధం పూర్వేణ కర్మత్వం, ణిజన్తం నియమస్తథా ॥ 73

---

* మహాభాష్య మిట్లున్నది :
"నీవహ్యోర్హరతేశ్చాపి గత్యర్థానాంతథైవచ ।
ద్వికర్మకేషు గ్రహణం ద్రష్టవ్యమితి నిశ్చయః" ॥

A. అన్తర్భూతణిజర్థానామ్ = ధాత్వర్థము యొక్క మధ్యయందున్న ణిజర్థము అనగా ప్రేరణకల అనగా పితుకటయేకాక పితికించుట అనెడి ప్రేరణకూడ అర్థముగాగల, దుహాదీనామ్ = 'దుహ, యాచ్, నీ, వహ మున్నగు ధాతువుల ప్రయోగమున, ణిజన్తవత్ = ణిజంతములకువలె, (గమయతి గ్రామం చైత్రం మైత్రః = మైత్రుడు చైత్రుని గ్రామము గూర్చి పంపుచున్నాడు), కర్మత్వమ్ = కర్మసంజ్ఞ అనగా ప్రయోజ్యునకు గూడ కర్మసంజ్ఞ, పూర్వేణ = పూర్వసూత్రము చేతనే అనగా 'కర్తురీప్సితతమం కర్మ' అను సూత్రముచేతనే, సిద్ధమ్ = సిద్ధించుచున్నది.

చైత్రః గ్రామం గచ్ఛతి (చైత్రుడు గ్రామముగురించి వెళ్లుచున్నాడు) ఈ ణిచ్ ప్రత్యయము చేరక శుద్ధ ధాతుప్రయోగము అనగా అణ్యంతావస్థ, తరువాత మైత్రుడు చైత్రుని వెళ్ళుమని ప్రేరేపింపగా ణిచ్ ప్రత్యయము చేరగా ణ్యంతావస్థ కలుగుచున్నది. కాగా ణిజంతమువలన రెండు వ్యాపారములు భాసించుచున్నవి 1. ప్రయోజకునిది, 2. ప్రయోజ్యునిది. ప్రయోజక వ్యాపారమునుబట్టి ప్రయోజ్యునకు కూడ కర్తురీప్సితతమ సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగుచున్నది.

అట్లే, గాందోగ్ధిపయః అను స్థలమునగూడ ణిచ్ ప్రత్యయము లేకున్నను దాని యర్థమగు ప్రేరణనుగూడ శుద్ధ దుహిధాతువునకు వాచ్యార్థముగా వివక్షింపగా దేవదత్తుడు ప్రయోజకుడు కాగలడు. అతని వ్యాపారమును బట్టి గోవుకూడ కర్మ కాగలదు. గోవు పాలు ఇచ్చుచున్నది. దేవదత్తుడు గోవుచే పాలు ఇప్పించుచున్నాడని వాక్యార్థము కలుగును. కాగా పయస్సునకు గోవునకుగూడ 'కర్తురీప్సితతమ' సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగుటచే రెండును ప్రధానకర్మలే కాగలవు. అప్రధానకర్మ లేనేలేదు.

B. 'గతిబుద్ధి ప్రత్యవసానార్థశబ్దకర్మా కర్మకాణామణికర్తా సణౌ' (1-4-52) అను సూత్రము గత్యాద్యర్థకధాతు యోగమున అణ్యంతావస్థలో నున్న కర్తకు ణ్యంతావస్థలో కర్మ సంజ్ఞను విధించుచున్నది. కాని పై పద్ధతిని 'కర్తురీప్సితతమ' సూత్రముచే సిద్ధించుచున్నందున గత్యాది సూత్రము— 'ణిజర్థముతో సంబంధించిన దానికి కర్మసంజ్ఞ ప్రవర్తించుట' గత్యాది ధాతుయోగముననే అని నియమమును బోధించుచున్నది ఆ నియమమును అనుసరించి పచ్యాదియోగమున ప్రయోజ్యునకు 'పాచయతి చైత్రేణ మైత్రః' మున్నగు చోటులందు కర్మసంజ్ఞ ప్రవర్తింపదు. అట్లే దుహ్యాదియోగమున గూడ పై నియమము చొప్పున గవాదులకు కర్మత్వము ప్రాప్తింపదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

తథా = అట్లే, నియమః = నియమము అనగా ''గతిబుద్ధీ'' త్యాదిసూత్రముచే లభించిన నియమము, ణిజన్తమ్ = ణిజంతము గురించియే, (ప్రవర్తతే) = ప్రవర్తించుచున్నది.

నియమము సజాతీయాపేక్షము కనుక ణిజంతమున కర్మసంజ్ఞ గత్యాది విషయకము అని నియమము లభించును. దుహ్యాదులు ప్రకృతమున ణిజంతములు కానందున పై నియమము ప్రవర్తింపదు. కాబట్టి 'కర్తురీప్సితతమ' సూత్రముచే గవాదులకు కర్మసంజ్ఞ కలుగగలదు. ॥73॥

అవతారిక— ''కర్తురీప్సితతమం కర్మ'' (1-4-49) అను సూత్రముచే కర్తకు ఈప్సితతమమయిన దానికి కర్మసంజ్ఞ విధింపబడుచున్నది. గాం దోగ్ధి పయః అను చోటున ఈప్సితతమము పయస్సు, గోవు ఈప్సితతమము కాదు ఇది ఎల్లరికి తెల్లమే. కాగా కర్తురీప్సితతమ సూత్రముచే గవాదులకు కూడ కర్మసంజ్ఞ కలుగుననుట ఎట్లు పొసగును? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కరణస్య స్వకక్ష్యాయాం న ప్రకర్షాశ్రయో యథా ।
కర్మణోఽపి స్వకక్ష్యాయాం న స్యా దతిశయ స్తథా ॥ 74

యథా = ఏ రీతిగా, కరణస్య = కరణమునకు, స్వకక్ష్యాయామ్ = తనయొక్క అనగా కరణత్వమునకు చెందిన వస్తువు యొక్క కక్ష్యయందు, (కరణములుగా ఏర్పడిన వస్తువుల యందు ఇది ముఖ్యము ఇది అముఖ్యము అను), ప్రకర్షాశ్రయః = ప్రకర్షను ఆశ్రయించుట, న = లేదో,

తథా = అట్లే, కర్మణః + అపి = కర్మకు గూడ, స్వకక్ష్యాయామ్ = తన కక్ష్య యందు, అతిశయః = అధికత అనగా ఈ వస్తువుకంటె ఇది ఈప్సితతమము అను అతిశయము, న + స్యాత్ = కలుగనేరదు.

తాత్పర్యము— ''సాధకతమం కరణమ్'' (1-4-42) అను సూత్రముచే క్రియ సిద్ధించుటలో మిక్కిలి ఉపకరించు కారకమునకు కరణసంజ్ఞ విధింపబడుచున్నది. సూత్రమున 'తమ' ప్రత్యయమువలన ప్రకర్ష లభించుచున్నది ఆ ప్రకర్ష ఇతర కారకములకంటె గ్రహింపబడుచున్నది అంతియేకాని ఒక క్రియకు ఎన్నియో సాధనములున్నపుడు వానిలో ప్రకర్ష వివక్షితము కాదు. కనుకనే 'అశ్వేనపథా దీపికయా వ్రజతి' (అశ్వము, మార్గము, దీపమును సాధనముగా జేసికొని వెళ్ళుచున్నాడు) మున్నగు చోటులయందు అశ్వాదులన్నియు కరణములగుచున్నవి. అట్లుకాకున్న అధికముగా ఉపకరించుటచే అశ్వమే కరణసంజ్ఞకము కావలెను.

అట్లే కర్మసంజ్ఞా సూత్రమున గూడ ఇతర కారకములకంటె ప్రకర్ష వివక్షితమగును. ఎన్నియో కర్మలు సంభవించునపుడు వానిలో ప్రకర్ష వివక్షితము కానేరదు.

కాబట్టి పయస్సునకు గవాదులకు గూడ కర్తురీప్సితతమ సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగును. అన్నియు ప్రధానకర్మలే కాగలవు అప్రధానకర్మ లేనే లేదు. ॥74॥

అవతారిక— 73-74 కారికలచే ఇతరుల మతము చూపబడినది. కాని అది యుక్తము కాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ కర్మణస్త్వాప్తు మిష్టత్వ ఆశ్రితేఽతిశయోయతః ।
ఆశ్రీయత్తే, తతోఽత్యన్తం భేదః పూర్వేణ కర్మణా ॥ 75

తు = కాని, యతః = ఎందువలన, కర్మణః = కర్మకు, ఆప్తుమ్ = సంబంధించుటకు,

ఆశ్రితే = సూత్రమైన ఆశ్రయింపబడిన, ఇష్టత్వే = ఇష్టత్వముస, అతిశయః = ఇతర పదార్థము కంటె ఆధిక్యము, ఆశ్రీయతే = (కర్మసంజ్ఞ ప్రవర్తించుట విషయమై) స్వీకరింపబడుచున్నదో,

తతః = ఆ కారణమువలన, పూర్వేణ = కర్తురీప్సితతమ సూత్రముచే కలిగెడి, కర్మణా = కర్మతో, (ద్వితీయస్య) = అకథిత సూత్రముచే విధింపబడిన కర్మకు, అత్యన్తమ్ = మిక్కిలి, భేదః = భేదము (అస్తి) కలదు.

తాత్పర్యము— కరణసంజ్ఞ కలుగుటలో కారకాంతరముల కంటె ప్రకర్ష వివక్షితమగును. తన కక్ష్యలో కాకపోవచ్చును. కర్మసంజ్ఞ అట్టిది కాదు. ఇచట కర్మలలో గూడ తారతమ్యము గ్రహింపబడును. కర్తకు ఈప్సితతమము కర్మ. ఇతర కారకములు ఈప్సితములు కావు క్రియకు అవి సహకరించును

కాబట్టి కర్తురీప్సితతమ సూత్రముచే పయస్సునకే కర్మసంజ్ఞ కలుగును. కనుక అదియే ప్రధానకర్మ. గవాదులకు అకథిత సూత్రముచే కర్మసంజ్ఞ కలుగును. కనుక అవి అప్రధాన కర్మలు. ॥75॥

అవతారిక— మరియు ణిజంతమునవలె దుహాదియోగమున గూడ రెంటికి, కర్తురీప్సితతమ సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగునని 73 వ శ్లోకమున చెప్పబడినది. అదియు అయుక్తమే అని చెప్పుచున్నాడు

శ్లో॥ ణిజన్తే చ యథా కర్తా సక్రియస్సన్ ప్రయుజ్యతే ।
నయత్యాదౌ తథా కర్తా నిష్క్రియోఽపి ప్రయుజ్యతే ॥ 76

చ = కాని, యథా = ఏ రీతిగా, ణిజన్తే = ప్రేరణార్థకమగు ణిజంతమున, కర్తా = ప్రయోజక కర్త, సక్రియః + సన్ = వ్యాపారము కలవాడుగానే, ప్రయుజ్యతే = ప్రేరేపింపబడుచున్నాడో,

తథా = అట్లే, నయత్యాదౌ = నయతి, దోగ్ధి మున్నగు చోటులందు, కర్తా = కర్త, నిష్క్రియః + అపి = వ్యాపారము లేనిది కూడ, ప్రయుజ్యతే = ప్రేరేపింపబడుచున్నది.

తాత్పర్యము— "గమయతి చైత్రం గ్రామం మైత్రః" మున్నగు ణిజంత స్థలమున రెండు ధాతువులు కలవు. 1 గమ్, 2. ణిజంతము. రెంటిచేతను రెండు క్రియలు బోధింపబడుచున్నందున గ్రామమునకు ప్రయోజ్యునకు గూడ 'కర్తురీప్సితతమ' సూత్రముచేతనే కర్మసంజ్ఞ కలుగవచ్చును.

దుహాది ధాతువు ఒక్కటియే. అది ఒక వ్యాపారమునే బోధించును. కాబట్టి రెండు వ్యాపారములు లేనందున రెంటికి 'కర్తురీప్సిత' సూత్రముచేతనే కర్మసంజ్ఞ లభింపదు.

ప్రేరణకూడ దుహిధాతువునకు వాచ్యమగుటచే రెండు వ్యాపారములను బట్టి

రెంటికి కర్మసంజ్ఞ కలుగునని శంకింపరాదు. ణిజంతమున ప్రయోజ్యునియందు వ్యాపారము నియతముగా నున్నందున దానిని అనుసరించి ప్రేరణ సంభవించును. కనుకనే ఆ కర్తకు హేతుసంజ్ఞ కూడ లభించుచున్నది. దుహాదులలో గవాదులయందు అట్టి వ్యాపారము లేదు ॥76॥

అవతారిక— గమయతి అను చోటునందు ణిజంతమునకు, గచ్ఛన్తం ప్రేరయతి (వెళ్ళుచున్న వానిని ప్రేరేపించుచున్నాడు) అను రీతిని వివరణము కానవచ్చుచున్నది. అట్లే గాందోగ్ధి పయః అను స్థలమునగూడ 'గౌః క్షరతి', 'క్షరన్తీం క్షారయతి' (ఆవు పాలు స్రవించుచున్నది. స్రవించుచున్న దానిని ప్రేరేపించుచున్నాడు) అను రీతిని వివరణము కానవచ్చుచున్నది. పై యర్థముయొక్క సామ్యమునుబట్టి దుహ్యాదులకు ణిజర్థమగు ప్రేరణ కూడ అర్థము (వాచ్యము) కాగలదు. కాబట్టి దుహ్యాదులకు కూడ రెండు వ్యాపారములు వాచ్యములుగా ఉన్నందున రెంటికి కర్తురీప్సిత సూత్రము చేతనే కర్మసంజ్ఞ కలుగవచ్చును. అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ భేదవాక్యం తు యత్ ణ్యన్తే 'నీ-దుహి'ప్రభృతౌ చ యత్ ।
శబ్దాన్తరత్వాన్నైవాఽస్తి సంస్పర్శస్తస్య ధాతునా ॥ 77

తు = కాని, ణ్యన్తే = గమయతి మున్నగు ణ్యంతమున, యత్ = ఏ, భేదవాక్యమ్ = భేదమును చూపెడి వాక్యమో అనగా వివరణ వాక్యమో, చ = అట్లే, నీ-దుహిప్రభృతౌ = నీ, దుహి-మున్నగు ధాతువులయందు, యత్ = ఏ భేదవాక్యమో, శబ్దాన్తరత్వాత్ = విభిన్నమగు అర్థముకలది యగుటవలన, తస్య = వివరణ వాక్యార్థమునకు, ధాతునా = ధాతువుతో అనగా గమి మున్నగు ణిజంత ధాతువుతోను, నీ, వహి మున్నగు ధాతువుతోను, సంస్పర్శః = సంబంధము, న + ఏవ + అస్తి = లేనేలేదు

తాత్పర్యము—'గమయతి చైత్రం మైత్రః' మున్నగువానికి 'గచ్ఛన్తం ప్రేరయతి' అను రీతిని వివరణము కలదని లోకులు భావించుచున్నారు. కాని యది బాగులేదు. ప్రయోజ్య కర్త చైత్రుడు. అతని వ్యాపారముమాత్రము భాసించుటచే అది వివరణమని భావము కలుగుచున్నది ణిజంతమున ప్రయోజ్యుడు 'చైత్రమ్' అను శబ్దముచే బోధింపబడుచున్నాడు. అట్లే దూరముకానందున దానికి ఇది వివరణవాక్యమని తలంచుచున్నారు.

అట్లే 'అజాం నయతి గ్రామం', 'గాందోగ్ధి పయః' మున్నగు వాక్యములకు గూడ యత్కించిత్ సామ్యమునుబట్టి అజా గచ్ఛతి, తాం గమయతి, (మేక నడచుచున్నది, దానిని ప్రేరేపించుచున్నాడు) అని వివరణముగా వాక్యమును ప్రయోగించుచున్నారు. అదియు భిన్నార్థకమే. నయతి, దోగ్ధి మున్నగునవి మిక్కిలి దూరమగుటచే అవి ణిజర్థమునుకూడ బోధింపజాలవు.

కాబట్టి దుహ్యాదులకు రెండు వ్యాపారములు వాచ్యములు కాజాలవు. ప్రథమ సూత్రముచే రెంటికి కర్మత్వము లభింపదు పయస్సునకు ప్రథమ సూత్రముచేత, గవాదులకు అకథిత సూత్రముచేతను కర్మసంజ్ఞ చెప్పవలెను. కాగా ''సర్వం చాకథితం కర్మ'' అను 70 కారికార్థమే యుక్తము. ॥77॥

అవతారిక — గాం దోగ్ధి పయః మున్నగు వాక్యములలో (ఆవును పాలు పితుకుచున్నాడు) పయస్సునకు ప్రథమ సూత్రముచే, గవాదులకు అకథిత సూత్రముచేతను కర్మ సంజ్ఞ చెప్పవలెనని 70 వ కారికలో చూపబడిన అర్థమును 77 వ కారికతో సమర్థించియున్నాడు.

ఇపుడు ముఖ్య సిద్ధాంతమును ప్రబోధించుచున్నాడు.

శ్లో॥ యథైవైకమపాదానం శాస్త్రే భేదేన దర్శితమ్ ।
తథైకమేవ కర్మాపి భేదేన ప్రతిపాదితమ్ ॥ 78

యథా = ఎట్లు, ఏకమ్ + ఏవ = ఒక్కటియే యగు అనగా ఒకే సూత్రముచే సిద్ధించిన, అపాదానమ్ = అపాదాన కారకము, శాస్త్రే = పాణినీయమున, భేదేన = వేరు వేరు సూత్రములచే, దర్శితమ్ = ప్రత్యేకముగ చూపబడినదో,

తథా = అట్లే, కర్మ + అపి = కర్మకారకము కూడ, ఏకమ్ + ఏవ = ఒకే సూత్రముచే లభించినదే అయినను, భేదేన = వేరు వేరు సూత్రములచే, శాస్త్రమున, ప్రతిపాదితమ్ = (మంద బుద్ధులకు సుగ్రహమగుటకు) విడదీసి చూపబడినది.

తాత్పర్యము— "ధ్రువమపాయేఽపాదానమ్" (1-4-24) అను సూత్రముచే కలిసియున్న వస్తువులకు విభాగము కలుగునపుడు స్థిరమగు పదార్థమునకు అపాదాన సంజ్ఞ చెప్పబడినది అచట పంచమీ విభక్తి విధింపబడినది. ఉదా : వృక్షాత్పర్ణం పతతి (చెట్టు నుండి ఆకు రాలుచున్నది)

తరువాత 'భీత్రార్థానాం భయహేతుః' (1-4-25) 'పరాజేరసోఢః' (1-4-26) 'జనికర్తుః ప్రకృతిః' (1-4-30) 'ఆఖ్యాతోపయోగే' (1-4-29) 'అన్తర్ధాయేనా దర్శనమిచ్ఛతి' (1-4-28) మున్నగు సూత్రములచే అపాదాన సంజ్ఞ విధింపబడినది. నిజముగ చూచిన "ధ్రువమపాయేఽపాదానమ్" అను ప్రథమ సూత్రముచేతనే 'చోరాద్బిభేతి' మున్నగు చోటులందు కూడ అపాదానసంజ్ఞ కలుగవచ్చును. ఐనను అంత నిగూఢ భావము ఎల్లరులకు తెలియబడుట దుస్సాధమని భావించి ఎల్లరులకు స్పష్టముగా తెలిసికొనుటకు వేరు వేరు సూత్రములు రచియింపబడినవి.

అట్లే 'కర్తురీప్సితతమమ్' అను ప్రథమ సూత్రముచేతనే విషంభుఙ్క్తే, గాందోగ్ధి పయః, చైత్రం గమయతి, మున్నగు చోటులయందు, విషము, గోవు, మున్నగువానికి కర్మత్వము లభింపగలదు. ఐనను ఎల్లరకు అందుబాటులో నుండవలెనని యెంచి వేరు వేరు సూత్రములు వ్రాయబడినవి.

'తణ్డులానోదనం' పచతి అను వాక్యమునకు బియ్యమును మెత్తపరచుచు అన్నమును తయారుచేయుచున్నాడు (తణ్డులాన్ విక్లేదయన్ ఓదనం నిర్వర్తయతి) అను అర్థమును భాష్యకారుడు చూపి పచిధాతువునకు విక్లేదనము, నిర్వర్తనము అను రెండు వ్యాపారములు

వాచ్యములగునని పలికెను— 'ద్వ్యర్థః పచిః'. ఆ మార్గాన దుహ్యాదులకు గూడ వ్యాపార ద్వయము వాచ్యము కాగలదు. ఎల్ల లక్ష్యములు పొందపడ గలవు. ఇదియే భాష్యకారాదుల నిర్ణయము ॥78॥

అవతారిక— నిర్వర్త్యము, వికార్యము, ప్రాప్యము అను రీతిని కర్మభేదము ఇంతకుముందు చూపబడియున్నది. అట్టితరి 'కర్మ ఒక్కటియే' అనుట ఎట్లు? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నిర్వర్త్యోవా వికార్యోవా ప్రాప్యోవా సాధనాశ్రయః ।
క్రియాణామేవ సాధ్యత్వాత్ సిద్ధరూపోఽభిధీయతే ॥ 79

క్రియాణామ్ + ఏవ = క్రియలకే, సాధ్యత్వాత్ = సాధ్యత్వ ముండుటవలన, నిర్వర్త్యః + వా = నిర్వర్త్యరూపముగానున్నదియు, వికార్యః + వా = వికార్య రూపమగునట్టియు, ప్రాప్యః + వా = ప్రాప్యరూపముగా నున్నదైన, సాధనాశ్రయః = సాధనమును ఆశ్రయించి నదై, సిద్ధరూపః=సిద్ధరూపముగా, అభిధీయతే=(నామ పదములచే) బోధింపబడు చున్నది.

తాత్పర్యము— పదార్థము రెండు విధములు. 1. సాధ్యము, 2. సిద్ధము. క్రియ సాధ్యమేయగును. నామ శబ్దార్థము సిద్ధరూపముననే భాసించును. వానిలో సిద్ధపదార్థము క్రియకు సాధనమగును. కాగా నిర్వర్త్యముకాని వికార్యముకాని ప్రాప్యముకాని ఏదియైనను సిద్ధపదార్థమే యగును. కనుక కర్మ ఒకటియే యనుట లెస్స కాని నిర్వృత్తి, వికారము, ప్రాప్తి అనునవి విలక్షణములగు క్రియలు. అవి తన రూపమును తన సాధనములయందు సంక్రమింపజేయును. అక్కారణమున నిర్వర్త్యము, వికార్యము, ప్రాప్యమనెడి కర్మభేదము కలుగుచున్నది. ॥79॥

అవతారిక— ఇంతటతో ద్వికర్మకధాతు విషయము ముగిసినది. విషం భక్షయతి (విషమును తినుచున్నాడు), చోరాన్ పశ్యతి (దొంగలను చూచుచున్నాడు) మున్నగు ప్రయోగములలో విషము మున్నగునవి కర్తకు ఈప్సితము లెట్లు కాగలవు? అట్టితరి విషము కర్మ యెట్లు కాగలదు అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అహితేషు యథా లౌల్యాత్ కర్తురిచ్ఛోపజాయతే ।
విషాదిషు భయాదిభ్యస్తథైవాసౌ ప్రవర్తతే ॥ 80

యథా = ఏ రీతిగా, అహితేషు = హితముకాని వస్తువులయందు, లౌల్యాత్ = జిహ్వా చాపల్యము వలన, కర్తుః = కర్తకు అనగా ప్రకృతమున రోగికి, ఇచ్ఛా = కోరిక, ఉపజాయతే= కలుగుచున్నదో ;

తథా + ఏవ = అట్లే, అసౌ = ఇతడు అనగా కర్త, విషాదిషు = విషము మున్నగు వానియందు, భయాదిభ్యః=భయము మున్నగువానివలన, ప్రవర్తతే = ప్రవర్తించుచున్నాడు.

తాత్పర్యము— రోగికి వైద్యుడు పథ్యము చెప్పును. వాతము, పిత్తము, కఫము ఇవి ప్రకోపింపకుండుటకై వానికి ఆహార నియమమును బోధించును. వైద్యుడు నిషేధించిన వస్తువులను భక్షించిన, రోగము అధికమగునని రోగికి తెలియును. కాని ఆహారనియమము లేనివాడు జిహ్వను నిరోధించుకొనలేక రోగవృద్ధిని జేయు వస్తువులయందు ఇచ్ఛను పొందును.

అట్లే ప్రభువువలన భయపడినవాడు ప్రభువు ఏమిచేయునో అని తలంచి అతని వలన బాధపడుట కంటె విషమును తినుటయే మేలు అని తలంచును. కాగా విషయమును పరిశోధించి దానివలన క్షేమమున్నదని భావించినవాడు ఈ వస్తువులను కోరడు. భయాదుల వలన గూడ వస్తువులయందు ఇచ్ఛ కలుగును

అట్లే దొంగ తన వస్తువులను అపహరించునేమో యని భీతిజెంది వాని నడవడిని గుర్తించుటకై చూచును. ॥80॥

అవతారిక— ధాతువునకు రెండు కర్మలు సంభవింపగా, ప్రాధాన్యమునుబట్టి ప్రధాన కర్మను బోధించుచు లకారాదులు ప్రవర్తించునని చెప్పబడినది

ఇపుడు ఒక వాక్యమున రెండు క్రియలున్నచో అచట ఆ రెండు క్రియలకు ఒకే కర్మ ఉన్నపుడు లకారముచే ఒక క్రియనుబట్టి కలిగెడి కర్మత్వము అభిహితమైనను రెండవ క్రియచే కలిగెడి కర్మత్వము అభిహితము కానందున, అచట ద్వితీయాదులు ప్రవర్తింప వలెను అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రధానేతరయోర్యత్ర ద్రవ్యస్య క్రియయోః పృథక్ ।
శక్తిర్గుణాశ్రయా తత్ర ప్రధానమనురుధ్యతే । 81

యత్ర = ఏ ప్రయోగమున, ప్రధానేతరయోః = ప్రధానము అప్రధానము అగు, క్రియయోః = రెండు క్రియలకు సంబంధించిన, ద్రవ్యస్య = ఒకే ద్రవ్యమునకు, పృథక్ = వేరుగా నున్న, శక్తిః = కర్తృత్వము కర్మత్వము మున్నగు కారకశక్తి (అస్తి) కలదో, తత్ర = ఆ ప్రయోగమున, గుణాశ్రయా = అప్రధానమగు క్రియనుబట్టి కలిగెడి శక్తి, ప్రధానమ్ = ప్రధానమగు క్రియవలన కలిగెడి కారకశక్తిని, అనురుధ్యతే = అనుసరించి యుండును. 81, 82 కారికలు "స్వాదుమి ణముల్" (3-4-26) అను సూత్రమునగల భాష్యమును వ్యాఖ్యానించుచున్నవి.

తాత్పర్యము— ఒక వాక్యమున నుండెడి పదములచే బోధింపబడెడి అర్థములకు పరస్పరము సమన్వయము కలుగును. అచట రెండు పదార్థములు విశేష్యములైన, కాక విశేషణములైన, వానికి సమన్వయము కలుగదు. ఒక పదార్థము విశేషణము, మరియొకటి విశేష్యము అగుచో, అట్టివానికి సమన్వయము కలుగును. ప్రకృతమున ఒకటి గుణమును రెండవది ప్రధానమును అగు రెండు క్రియలు ఒకే ప్రయోగమున సంభవింపగా ప్రధాన క్రియచే కలిగెడి కర్తృత్వ కర్మత్వములను బట్టియే విభక్తి ప్రవర్తించును. అప్రధాన క్రియను బట్టి విభక్తి స్వతంత్రముగా ప్రవర్తింపనేరదు, ॥81॥

అవతారిక— 81 వ కారికచే చూపబడిన అర్థమునే వివరించుచున్నాడు.

**శ్లో॥ ప్రధాన విషయాశక్తిః ప్రత్యయేనాభిధీయతే ।
యదా గుణే తదా తద్వదనుక్తాపి ప్రతీయతే ॥** 82

యదా = ఏ ప్రయోగమున, ప్రధానవిషయా = ప్రధానమగు ధాత్వర్థ క్రియ మూలముగాగల, శక్తిః = కర్మ, కర్త మున్నగు శక్తి, ప్రత్యయేన = లకారము మున్నగు ప్రత్యయముచే, అభిధీయతే = చెప్పబడునో, తదా = ఆ ప్రయోగమున, గుణే = అప్రధానమగు క్రియచే కలిగిన, శక్తిః = కర్మ, కర్త మున్నగు శక్తి, అనుక్తా + అపి = సాక్షాత్తు చెప్పబడక పోయినది అయినను, తద్వత్ = చెప్పబడినది వలె, ప్రతీయతే = తెలియబడగలదు. ॥82॥

అవతారిక— పై కారికార్థమునకు ఉదాహరణము జూపుచున్నాడు.

**శ్లో॥ పచావనుక్తం యత్కర్మ క్త్వాన్తే భావాభిదాయిని ।
భుజౌ శక్త్యన్తరేఽప్యుక్తే తత్తద్ధర్మః ప్రకాశతే ॥** 83

భావాభిధాయిని = భావమాత్రమును బోధించెడి, క్త్వాన్తే = క్త్వాప్రత్యయాంతమున, పచౌ = పచిధాతువుయొక్క అర్థమునకు సంబంధించిన, యత్ = ఏ, కర్మ = కర్మ, (అస్తి) కలదో, తత్ = ఆ కర్మ, భుజౌ = భుజిక్రియకు సంబంధించిన, శక్త్యన్తరే + అపి = కర్మ శక్తియు, ఉక్తే = లకారాదులచే చెప్పబడగా, తద్ధర్మః = దానియొక్క అనగా ప్రధాన కర్మయొక్క అభిహితత్వమనెడి ధర్మము కలదై, ప్రకాశతే = ప్రకాశించును.

తాత్పర్యము— చైత్రేణ ఓదనః పక్త్వా భుజ్యతే (చైత్రునిచే ఓదనము వండి భుజింపబడుచున్నది) ఈ ప్రయోగమున భుజిక్రియ ప్రధానము, పచిక్రియ అప్రధానము. ఈ రెంటిలోను ఓదనము ఒక్కటియే కర్మ. భుజిధాతువు కంటె కర్మార్థమున లకారము, పచిధాతువు కంటె భావార్థమున క్త్వాప్రత్యయము ప్రవర్తించినవి. తిఙ్ ప్రత్యయముచే ఓదనకర్మ అభిహితమాయెను. ఆ కర్మ పచిధాతువుకంటె కలిగిన క్త్వాప్రత్యయముచే అభిహితము కాలేదు. అట్లైనను ప్రధాన ప్రత్యయముచే ఓదనకర్మ అభిహితమగుటచే అప్రధాన క్రియా కర్మ ప్రత్యయముచే బోధింపబడకున్నను అభిహితమగునట్లుండుటచే ఓదనశబ్దము కంటె ద్వితీయా విభక్తి ప్రవర్తింపదు.

రెండు క్రియలకు వేరు వేరు కర్మ లుండుచోటున మాత్రము ఈ న్యాయము ప్రవర్తింపదు. ఉదా : ఓదనం భుక్త్వా గ్రామో గమ్యతే (అన్నమును తిని గ్రామము చైత్రునిచే వెళ్ళబడుచున్నది) ఇచట ఓదనము భుజిక్రియకు కర్మ, గమిక్రియకు గ్రామము కర్మ. గమి కర్మతిఙ్ ప్రత్యయముచే అభిహితమగుటచే దానికంటె ద్వితీయ రాకుండ ప్రథమ కలిగినది. భుజికర్మ అభిహితము కానందున దానికంటె ద్వితీయా విభక్తి కలిగినది

కాగా ప్రధానా ప్రధానక్రియలకు ఒకే కర్మ కలిగినచోటనే పై న్యాయము ప్రవర్తించును. ॥83॥

అవతారిక— పై యర్థమునకు మరియొక ఉదాహరణము జూపుచున్నాడు.

శ్లో॥ ఇషేశ్చ గమిసంస్పర్శాద్ గ్రామే యో లో విధీయతే ।
తత్రేషిణైవ నిర్భోగః క్రియతే గతికర్మణః ॥ 84

గ్రామే = గ్రామము మున్నగు కర్మయందు, యః = ఏ, లః = లకారము, విధీయతే = విధింపబడుచున్నదో, తత్ర = అట్టి, గతికర్మణః = గమ్యర్థ కర్మకు, ఇషేః = ఇషధాత్వర్థమునకు, గమిసంస్పర్శాత్ + చ = గమ్యర్థముతో సంబంధముండుట వలన, ఇషిణా + ఏవ = ఇషధాతువుకంటె ప్రవర్తించిన తిఙ్ ప్రత్యయముచేతనే, నిర్భోగః = చర్వణము అనగా అభిధానము, క్రియతే = చేయబడుచున్నది

తాత్పర్యము— చైత్రేణ గ్రామో గన్తు మిష్యతే (చైత్రునిచే గ్రామము వెళ్ళుటకు ఇచ్ఛగింపబడుచున్నది) ఇచట గ్రామము గమికర్మ, గ్రామము, గమనము రెండుకూడ ఇష ధాత్వర్థమునకు కర్మలు. ఇషధాతువు కంటె కర్మార్థమున లకారము కలుగుటచే ఆ లకారము చేతనే గమికర్మ యగు గ్రామముకూడ అభిహితమగును. కాగా గ్రామశబ్దము కంటె ద్వితీయా విభక్తి కలుగక ప్రథమా విభక్తియే కలిగినది. ॥84॥

అవతారిక— పై యర్థమున మతాంతరమును జూపుచున్నాడు.

శ్లో॥ పక్త్వాభుజ్యత ఇత్యత్ర కేషాఞ్చిన్న వ్యపేక్షతే ।
ఓదనం పచతిః, సోఽసావనుమానా త్ప్రతీయతే ॥ 85

కేషాఞ్చిత్ = కొందరి, (మతే) మతమున, 'పక్త్వాభుజ్యతే + ఇత్యత్ర' = పక్త్వాభుజ్యతే మున్నగు ప్రయోగమున, పచతిః = పచధాతువు అనగా పచ్యర్థము, ఓదనమ్ = ఓదనః అను ప్రథమాంతమును, న + అపేక్షతే = అపేక్షింపదు. అనగా ప్రథమాంతార్థము పక్త్వ అను 'క్త్వ' ప్రత్యయాంతార్థమున అన్వయింపదు. సః + అసౌ = ఆ ఈ ఓదన పదార్థము, అనుమానాత్ = అనుమాన ప్రమాణమువలన అనగా సామర్థ్యమువలన, ప్రతీయతే = తెలియబడుచున్నది.

'పక్త్వాఓదనః భుజ్యతే' మున్నగు వాక్యములలో ఓదన అను ప్రథమాంతము యొక్క అర్థము భుజ్యతే అను కర్మ తిఙంతార్థముతోనే అన్వయించును. అది పక్త్వ అను క్త్వాంతార్థముతో అన్వయింపదు. పచిధాతువు సకర్మకము కనుక అందు ప్రథమాంతార్థము అన్వయయోగ్యము కాదు. అట్లైనను ఏకవాక్యతా రూపమగు సామర్థ్యమును అనుసరించి మానసముగా ఓదనము సంబంధించును. అనగా అర్థాత్ సంబంధించును.

విశేషాంశము— అర్థాత్ లభించిన సంబంధము కంటె శబ్దమువలన కలిగెడి సంబంధము బలవత్తరము కనుక శాబ్దాన్వయము చెప్పుట సమంజసము. అట్లు చెప్పుటయే భాష్య సమ్మతము. కాగా ఈ కారికార్థము సిద్ధాంతము కాదు. ఈ యభిప్రాయముతోనే భర్తృహరి 'కేషాఞ్చిత్' అను పదమును ప్రయోగించెను. ॥85॥

అవతారిక — పై చూపబడిన న్యాయము కర్మ కారకమునకే కాదు. కారకాంతరములకు కూడ సమన్వితమగును అని చూపుచున్నాడు.

శ్లో॥ తత్రాభినివిశౌకర్మ య_త్తిజ_న్తేఽభిధీయతే ।
క్త్వా_న్తేఽధికరణత్వేఽపి న త_త్రేచ్ఛ_న్తి స_ప్తమీమ్ ॥ 86

తత్ర = గుణ ప్రధానములగు క్రియలను బోధించెడి ధాతువులున్న ప్రయోగమున, తిజన్తే = తిఙంతమగు, అభినివిశౌ = అభి + ని + విశి అను ధాతువు ప్రయుక్తము కాగా, యత్ + ఏ, కర్మ = కర్మకారకము, అభిధీయతే = (తిఙ్ ప్రత్యయముచే) చెప్పబడుచున్నదో, తత్ర = ఆ కర్మయందు, క్త్వాన్తే = క్త్వాప్రత్యయాంతము ప్రయుక్తముకాగా, అధికరణత్వే + అపి = అధికరణ కారకమునగూడ, సప్తమీమ్ = సప్తమీ విభక్తిని, న + ఇచ్ఛన్తి = (శాస్త్రజ్ఞులు) అంగీకరింపరు

తాత్పర్యము— చైత్రేణ భుక్త్వానగర మభినివిశ్యతే (చైత్రునిచే భుజించి నగరము ప్రవేశింపబడుచున్నది) ఇచట ప్రవేశమునకు నగరము అధికరణము. ఐనను "అభినివిశశ్చ" (1-4-47) అను సూత్రముచే నగరమునకు కర్మసంజ్ఞ చెప్పబడినది. ఆ కర్మను తిఙ్ ప్రత్యయము చెప్పుచున్నది. కాగా భుజక్రియకు కూడ ఆధారము నగరము. కాని దానినిబట్టి నగర శబ్దముకంటె అధికరణార్థమున సప్తమి ప్రవర్తింపదు. ప్రధాన క్రియావాచక ధాతువు కంటె ప్రాప్తించిన తిఙ్ చే కర్మత్వము అభిహితమగుటచే, అప్రధానమగు క్రియనుబట్టి కలిగిన అధికరణత్వము అభిహితము కాకున్నను పై న్యాయము చొప్పున అభిహితమే యగుచున్నది. ॥86॥

అవతారిక— గుడం భక్షయతి (బెల్లము తినుచున్నాడు) మున్నగు ప్రయోగములు లోక ప్రసిద్ధములు. కాని గుడము సిద్ధమగు పదార్థమే, దానికి భక్షణ క్రియవలన కలిగెడి విశేషము ఏమియు లేదు. కాబట్టి పై ప్రయోగములు ఎట్లు సంగతములగును ? అను ప్రశ్నకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యన్నిర్వృత్తాశ్రయం కర్మప్రాప్తేరప్రచితం పునః ।
భక్ష్యాది విషయాపత్త్యా భిద్యమానం తదీప్సితమ్ ॥ 87

యత్ = ఏ, కర్మ = కర్మ అనగా బెల్లము మున్నగు కర్మ, నిర్వృత్తాశ్రయమ్ = నిర్వర్తితము అనగా సిద్ధము, మరియు నిరాశ్రయము అనగా క్రియను ఆకాంక్షింపనదియు, అట్లే, ప్రాప్తేః = క్రియా సంబంధమువలన, అప్రచితం + పునః = విశేషములేని, తత్ = అట్టి కర్మ, భక్ష్యాది విషయాపత్త్యా = భక్షణము మున్నగు క్రియలకు విషయభావమును పొందుటచే, భిద్యమానమ్ = పరిణామమును బెందినదై, ఈప్సితమ్ = క్రియతో సంబంధించినది అగుచున్నది.

తాత్పర్యము— 'గుడం భక్షయతి' (బెల్లము తినిపించుచున్నది - అనగా రుచికర

మగుటచే అని భావము) మున్నగు చోటులందు గుడము మున్నగునది సిద్ధపదార్థము, కనుక నిర్వర్త్యకర్మ కానేరదు. మరియు క్రియను ఆకాంక్షించునదియు కాదు. కాబట్టి వికార్య కర్మము కానోపదు. మరియు క్రియా సంబంధమున ప్రచయమును బొందునదియు కాదు. కాన ప్రాప్యము కూడ కాజాలదు. అట్లైనను భక్షణక్రియకు విషయమగుచున్నది. అనగా గుడ భక్షణము ఈప్సితమగుటం జేసి దానిలో అంతర్గతమగు గుడము కూడ ఈప్సితమే యగు చున్నది. కాగా గుడాదులు ప్రాప్యకర్మలు కాగలవు.

విశేషాంశము— క్రియకు విషయభావమును బొందుటచే గుడాదులు కర్మలే యగుచో ఎల్ల ధాతువులకు విషయసంబంబంధ ముండుటవలన ఎల్లధాతువులు సకర్మకములే కావలెను అట్టితరి అకర్మకధాతువులే లేకపోయెడిని అని ప్రశ్నింపవచ్చును.

సమాధానము— బాహ్యకర్మలు లేని ధాతువులు అకర్మకములు కాగలవు. ఆస్తే (ఉంటున్నాడు) ఇచట ఉనికిని చేయుచున్నాడు అను రీతిని అర్థమును గ్రహించిన ఆ ధాతువు నకు బాహ్యకర్మ లేనందున అది అకర్మకమే కాగలదు. ॥౮౭॥

అవతారిక— బాహ్యకర్మ ఉన్నను దానిని వివక్షింపనిచో ఆ ధాతువుకూడ అకర్మకము కాగలదని చెప్పుచు ఆ ప్రసంగమున నాల్గు విధములుగా ధాతువులు అకర్మక ములు కాగలవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ధాతోరర్థాన్తరే వృత్తే ర్ధాత్వర్థేనోప సంగ్రహాత్ ।
ప్రసిద్ధే రవివక్షాతః కర్మణోఽకర్మికా క్రియా ॥ 88

క్రియా = ధాతువు, అకర్మికా = అకర్మకము (చతుర్భిః + ప్రకారైః) నాలుగు ప్రకారములచే కలుగును.

1. ధాతోః = ధాతువునకు, అర్థాన్తరే = మరియొక అర్థమున, వృత్తేః = ఉండుటవలన,

ధాతువునకు ఒక అర్థమునందు సకర్మకత్వము కలుగును - భారం వహతి (బరువు మోయుచున్నాడు) ఒక దేశమునుండి మరియొక దేశమునకు వస్తువులను పొందించుట వహ ధాతువునకు అర్థము. వహధాతువునకు పై యర్థము చెప్పక మరియొక యర్థమును జూపిన అపుడు వహధాతువు అకర్మకమగును - నదీ వహతి (నది పారుచున్నది)

2. ధాత్వర్థేన = ధాతువుయొక్క అర్థముచేతనే, ఉపసంగ్రహాత్ = కర్మను చేర్చియుండుట వలన,

దేనిని కర్మగా మనము తలంచుచున్నామో ఆ కర్మ ధాత్వర్థమున కలసియే యుండును. దానికంటె వేరుగా భాసింపదు. చైత్రః జీవతి (చైత్రుడు జీవించియున్నాడు) ప్రాణములను ధరియించుట జీవధాతువునకు అర్థము. ఇచట ప్రాణములు ధాత్వర్థమున అంత ర్గతములై యున్నవి కాబట్టి జీవధాతువు అకర్మకము.

3. ప్రసిద్ధేః = ప్రసిద్ధినిబట్టియు అకర్మకము కాగలదు.

వర్షతి (మేఘము వర్షించుచున్నది) ఇచట ఉదకమును వర్షించుటలో మేఘము కర్త యని ప్రసిద్ధము. అట్లే ఉదకమును వర్షించుటయు లోక ప్రసిద్ధమే. కాబట్టి మరల (ఉదకమ్) అని కర్మప్రయుక్తము కానక్కరలేదు. కనక ఇచట ఈ ధాతువు అకర్మకము.

4. కర్మణః = కర్మయొక్క, అవివక్షాతః = వివక్ష చేయకుండుటవలన,

కర్మయున్నను దానికి క్రియాకారక భావసంబంధమున అన్వయము చూపక సంబంధమాత్రమున అన్వయమును జూపిన నదియు అకర్మకమే. 'నసంశృణుతే' (వినడు) హితునివలన హితమును వినడు అని భావము.

విశేషాంశము— ఈ కారికలో అకర్మకత్వము లభించుటలో 4 మార్గాలు చూప బడినవి కాని వానిలో మూడవ భేదము 'ప్రసిద్ధేః' అనునది యుక్తము కాదు. మేఘో వర్షతి (మేఘము వర్షించుచున్నది) ఇచట జలము అను పదము లేకున్నను అన్వయబోధ కలుగు చున్నది. అందుచే 'జల' అను పదమును ప్రయోగింపలేదు. అంతమాత్రాన ధాతువు అకర్మ కము కానేరదు. మరియు భాష్యకర్త ఈ రీతిగ అకర్మకత్వమును ఎచటను చూపియుండ లేదు. మిగతా మూడు రీతులను ఆశ్రయించి అకర్మకత్వమును భాష్యకర్త చూపియున్నాడు ఈ యంశమును విపులముగా వైయాకరణ నాగేశుడు లఘు శబ్దేందుశేఖరమున ఆత్మనే పద ప్రకరణమున నిరూపించియున్నాడు. ॥88॥

అవతారిక— పై కారికచే నాల్గు ప్రకారములుగా ధాతువునకు అకర్మకత్వము సంభవించునని చెప్పబడినది. ఆ నాలుగే కాక మరియొక విధమున గూడ అకర్మకత్వము సంభవించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ భేదా య ఏతే చత్వారః సామాన్యేన ప్రదర్శితాః ।
తే నిమిత్తాదిభేదేన భిద్యన్తే బహుధా పునః ॥ 89

ఏతే = ఈ, యే = ఏ, చత్వారః = నాలుగు, భేదాః = సకర్మక ధాతువులు అకర్మకము లగుటకు కారణ భేదములు, సామాన్యేన = సామాన్యరూపమున, ప్రదర్శితాః = చూపబడినవో, తే = అవి, అనగా ఆ నాల్గు భేదములు, పునః = మరల, నిమిత్తాది భేదేన = నిమిత్తము మున్నగువాని భేదములచే, నిమిత్తమనగా సహాయము ఉపసర్గము. ఆది పదముచే దేశకాలా దులు గ్రాహ్యములు, బహుధా = పలు విధములుగా, భిద్యన్తే = భిన్నమగుచున్నవి.

తాత్పర్యము— 88 వ కారికచే అకర్మకత్వము నాల్గు ప్రకారములుగా జూపబడి నది. అంతియేకాక ఉపసర్గవశమున సకర్మకము అకర్మక ధాతువు కాగలదు. చరధాతువునకు సంచరించుట అర్థము గ్రామం చరతి (గ్రామముగూర్చి వెళ్ళుచున్నాడు) ఉత్ అనెడి ఉపసర్గ వశమున మీదుగ ప్రసరించుట అను అర్థము లభించును. అపుడు చరధాతువు అకర్మకము కాగలదు. ధూమ ఉచ్చరతి (పొగ మీదుగా పోవుచున్నది).

పరస్మైపదిధాతుపు సకర్మకమైనను ఆత్మనేపది యగునపుడు అకర్మకము కాగలదు. ఉదా: ఘటం జానాతి (కడవను తెలిసికొనుచున్నాడు) ఇచట సకర్మకము, 'సర్పిషోజానీతే' నేతిని ఉపాయముగా గైకొని ప్రవర్తించుచున్నాడు. ॥89॥

కరణాధికారము

అవతారిక— "స్వౌజసమౌట్ఛష్టాభ్యాం భిస్ఙేభ్యాం భ్యస్ ఙసిభ్యాం భ్యస్ ఙసో సాంఙ్యోస్సుప్" (4-1-2) అనునది స్వాదిప్రత్యయములను విధించిన సూత్రము. అందు సుఔజస్ అమనది ఒక త్రికము. దానికి ప్రథమ అని ప్రాచీనుల సంజ్ఞ. ఆ విధముగనే ద్వితీయా మున్నగునవియు శేషించిన ఆఱు త్రికములకును క్రమముగ సంజ్ఞలు. వానికి కర్త కర్మ కరణము మున్నగు కారకములు అర్థము. అందు ద్వితీయార్థమగు కర్మ కారకము విచారింపబడినది ఇక తృతీయార్థమును విచారింపవలె.

కర్తయు, కరణమును తృతీయ కర్థములు. కర్త షష్ఠికిగూడ నర్థమగుటచేత నది సాధారణము. కరణమొక్కటే తృతీయకే అర్థము. అందువలన కర్తకంటె కరణమునకు అధిక్యమును భావించి ముందు ఆ కరణము విచారింపబడుచున్నది.

"సాధకతమం కరణమ్" (1-4-42) అను సూత్రము కరణలక్షణ బోధకము. క్రియను సిద్ధింపజేయుటలో ఏయది మిక్కిలిగ నుపకరించునో అది కరణమని యర్థము. కారకములన్నియు క్రియాజనకములే గదా ఈ కరణ కారకమునకు గల సాధకతమత్వము ఎట్టిది? అది ప్రకృష్టోపకారక మెట్లగును? అని శంకించి, ఆ ప్రకర్షను వివరించుచున్నాడు

శ్లో॥ "క్రియాయాః పరినిష్పత్తిర్యద్వ్యాపారాదనన్తరమ్।
వివక్ష్యతే యదాయత్ర కరణం తత్తదాస్మృతమ్॥ 90

క్రియాయాః = క్రియయొక్క, పరినిష్పత్తి = సంపూర్ణమగు సిద్ధి, యద్వ్యాపారాత్ = ఏ కారక వ్యాపారముకంటె, అనన్తరం = అవ్యవహితోత్తరకాలమున = వెనువెంటనే, యదా, యత్ర = ఎపుడు, ఎచట, వివక్ష్యతే, తదా = జరుగునట్లు వక్తచే తలంపబడునో, అపుడు, తత్ర, తత్ = అచట అది, కరణమ్ = కరణము, స్మృతమ్ = (అగునని) తలంపబడినది.

తాత్పర్య విశేషాంశములు— క్రియా నిష్పత్తికి సాధనములన్నియు సన్నిహితములై యుపకరించును. అపుడు వానిలో దేని వ్యాపారమునకు వెంటనే ఆ క్రియ నిష్పన్నమయినట్లు వాక్యప్రయోక్త భావించునో అది సాధకతమము. అదియే దాని అతిశయము.

ఛేదనమను క్రియను జూతము. అచట కర్మ, కర్త, అధికరణము మున్నగునవి అన్నియు తమతమ వ్యాపారములను జేయుచున్నను, ఆ ఛేద్య వస్తువగు దానియందు అవయవ విశ్లేషమును చేయునది కొడవలియో కత్తియో అగును. అది పనిచేసిన తరువాతనేగదా ఛేదన క్రియ నిష్పన్నము. కావున నది, ప్రకృష్టోపకారకము. ఈ విధముగనే చూచుట అను క్రియకు

కన్ను ప్రకృష్టసాధనము. కారికలో, 'వివక్ష్యతే' = వివక్షింపబడుకో అని చెప్పబడినది. కర్త తన బుద్ధిలో దేనిని సాధకతమముగ భావించునో అదియే కరణమగునని దాని భావము.

వ్యాకరణశాస్త్రమున వివక్షోపారూఢమగునదియే అంగముగ గ్రహింపబడును దానికి బాహ్యసత్తతో బనిలేదు. అనగా నది మనస్సుననుండిన చాలును బయట నుండనక్కఱ లేదు. ఛేదన క్రియలో, ప్రకృష్టోపకారకము దాత్రమో చురకత్తియో అయినను, 'బలేన లునాతి' = బలముతో కోయుచున్నాడు అనియు నందురు. అనగా నట బలము ప్రకృష్టోపకారకముగా వివక్షింపబడినదనుట. దర్శనమునకు చక్షుస్సు ప్రకృష్టోపకారకము. అయినను, "ఆలోకేన పశ్యతి" = వెలుగుతో జూచుచున్నాడు అందురు. అదియు వివక్షామూలకమే. పాక క్రియకు స్థాలి, అధికరణముకాని, దానికి, కరణత్వమును వివక్షించి 'స్థాల్యాపచ్యతే' = గిన్నెతో వండబడుచున్నది అనియు నందురు. ఇతర కారకములగు స్థాల్యాదులకు వాస్తవ రూపమును, వివక్షితరూపమును వేరువేరుగానున్నను, కరణమున కొక్కటియే రూపము అది వివక్షాధీనము. సాధనముల వ్యవహారమంతయు బుద్ధ్యవస్థమూలముగాగలది అని "సాధన వ్యవహారశ్చ బుద్ధ్యవస్థానిబంధనః" అని మూడవకారికలో చెప్పియున్నను మరల ఇచ్చట "వివక్ష్యతే" అని చెప్పుట కరణకారకము ఎపుడును వివక్షాధీనమే. దానికి వాస్తవరూపము లేనేలేదు అని సూచించుటకే అని తాత్పర్యము. ॥90॥

అవతారిక — అనంతరకారికయు నీ విషయమునే తెలియజేయునది.

శ్లో॥ వస్తుత స్తదనిర్దేశ్యం న హి వస్తు వ్యవస్థితమ్ ।
స్థాల్యా పచ్యత ఇత్యేషా వివక్షాదృశ్యతే యతః ॥ 91

వస్తుతః = వస్తురూపమునుబట్టి, తత్ = ఆ, కరణము, అనిర్దేశ్యమ్ = నిర్దేశింపదగినది కాదు, వస్తు = కరణమను వస్తువు, వ్యవస్థితం న హి = నియతము కాదుగదా, యతః = ఎందు వలననగా, స్థాల్యాపచ్యతే = గిన్నెతో వండుచున్నది, ఇతిఏషా = అను, ఈ రూపమగు, వివక్షా = వక్తల ఇచ్ఛ, దృశ్యతే = కనబడుచున్నది గదా.

తాత్పర్య విశేషాంశములు — వంటకు గిన్నె ఆధారము. కనుక 'గిన్నెలో వండు చున్నాడు' అనవలసియున్నది కాని, దానిని వంటకు కరణమునుగా వివక్షించి 'గిన్నెతో' అనుటయు గలదు. వంటకు ప్రకృష్టోపకారకములు కట్టెలు. కావున 'కాష్ఠైఃపచతి' అనదగి యున్నది. ఆ కట్టెలు తడిగలవై త్వరగా వంటచేయుటకు ఉపయోగింపకున్నను, స్థాలి = గిన్నె, తన పలుచనితనమువలన క్రియాసిద్ధికి మిగుల ఉపయోగించునది అగుటయు కలదు కాగా వైవక్షికమైన కరణత్వము స్థాలికిని సంభవము. కనుకనే 'స్థాల్యాపచ్యతే' అను ప్రసిద్ధ వ్యవహారము, లోకమున నేర్పడియున్నదని భావము. ॥91॥

అవతారిక — క్రియాసిద్ధికి, కరణము ప్రకృష్టోపకారకమగుటవలననే ఆయా క్రియలను చేయువారు, తాముద్దేశించిన ఫలము సత్వరముగ సిద్ధించుటకై, ఆ కరణములకు సంస్కారవిశేషములను, భిన్న భిన్న వినియోగములను జేయుచుందురు.

శ్లో॥ కరణేషు తు సంస్కారమారభంతే పునః పునః ।
వినియోగవిశేషాంశ్చ ప్రధానస్య ప్రసిద్ధయే ॥ 92

ప్రధానస్య = క్రియయొక్క, ప్రసిద్ధయే = సంసిద్ధికై, కరణేషు, తు = కరణములందే, సంస్కారాన్ = సంస్కారములను, వినియోగవిశేషాన్ చ = వేరువేరు వినియోగములను, పునః పునః = మరల మరల, ఆరభన్తే = (ఫలమును గోరువారు) చేయుచుందురు.

తాత్పర్య విశేషాంశములు— క్రియాసిద్ధి ప్రధానము. దానికి ప్రకర్షవంతమయిన సాధనము కరణము. అందువలన, ఫలసిద్ధికై, ఆకరణమునకు తరచుగా సంస్కారములను పదును పట్టుట మున్నగువానిని చేయుచుండుట కనుచున్నాము. ఛేదనమునకు కరణము ఖడ్గము. దానికి ఉత్తేజనమును తఱచు చేయుదురుగదా వినియోగ విశేషములనగా, దానిని అనేక విధములుగా నుపయోగించుట. ఉద్యమనము = పైకెత్తుట, నిపాతనము = పడవేయుట మున్నగునవి యనుట. కట్టెలు వంటకు కరణములు వానికి సంస్కారము ఉపధానము. అనగా నవి చక్కగ మండునట్లు పేర్చుట. జారుచున్నవానిని ఎగద్రోయుచు సవరించుట వినియోగము. చూచుటకు కన్ను, కరణము. దానికి సంస్కారము కాటుకపెట్టుట. స్ఫుటముగ నగపడుటకు వలయు మందువంటిది. వినియోగము ప్రణిధానము. అనగా, నిలుకడతో చూచుట ॥92॥

అవతారిక— "అశ్వేన పథా దీపికయా యాతి" = దీపమును బుచ్చుకొని, గుఱ్ఱముమీద నెక్కి మార్గమున బోవుచున్నాడు. ఈ వాక్యమున, అశ్వము, పంథ, దీపిక మూడును కరణములు. వానిలో నుపకార ప్రకర్షను, ఎట్లు వివక్షింపవలెను? అనిన నీ క్రింది కారిక దానికి సమాధానము

శ్లో॥ స్వకక్ష్యాసు ప్రకర్షశ్చ కరణానాం నవిద్యతే ।
ఆశ్రితాతిశయత్వంతు పరతస్తత్ర లక్షణమ్ ॥ 93

కరణానాం = కరణకారకములకు, ప్రకర్షశ్చ = అతిశయము, అనునది, స్వకక్ష్యాసు = తమ కరణత్వావస్థలలో, నవిద్యతే = ఉండబోదు, తత్ర = అందు, ఆశ్రితాతిశయత్వంతు = ఉపకారాతిశయము, పరతః = ఇతర కారకములనుబట్టి, లక్షణమ్ = గ్రహింపదగినదగును.

తాత్పర్య విశేషాంశములు— సాధకతమమనగా, ఇతర సాధనములకంటె త్వరగా క్రియను నిష్పాదించునది అని యర్థముగాని సజాతీయములలోనే, అతిశయ విశేషము కలది అని గాదు. ప్రకృతోదాహరణమున జూడుడు. అశ్వము, దేశాంతరప్రాప్తికి, కర్త కంటె ప్రకర్షగల ఉపకారము. మార్గముగూడ, దొంగలు మున్నగు ఉపద్రవములు లేక యాన క్రియకు మిక్కిలి ఉపకరించునది. దీపము చీకటిని తొలగించి వెలుగునిచ్చును గాన అదియు, ఇతర కారకములకంటె మిక్కిలి ఉపకరించును. కావున, అశ్వము, పంథ, దీపము అను మూడు కరణములును ఏకకాలముననే యానక్రియాసిద్ధికి, ఇతర కారకములకంటె అతిశయిత

ముగ నుపకరించుట సంభవించుచున్నది గాన వానిలో నొకదానికంటె వేరొకదానికి ప్రకర్ష లేదు.

అవతారిక— కర్తతో ఇతర కారకములకు, స్పర్థయే అసంభవము. ఏలయన- కారకములనన్నిటిని వినియోగించువాడు కర్త పిమ్మట నవి తమ తమ వ్యాపారములందు ప్రవర్తించును. అట్టియెడ సాధకతమమగు నది కర్తృకారకము గావలెనుగాని కరణకారక మెట్లగును ? అను నా శంకకు సమాధానము.

శ్లో॥ స్వాతంత్ర్యేఽపిప్రయోక్తార ఆరాదేవోపకుర్వతే ।
కరణేన, హి సర్వేషాం వ్యాపారో వ్యవధీయతే ॥ 94

ప్రయోక్తారః = కర్తలు, స్వాతంత్ర్యే అపి = స్వతంత్రులైనను, ఆరాత్ ఏవ = దూరమున నుండియే, ఉపకుర్వతే = క్రియాసిద్ధిలో నుపకరించుచుందురు, సర్వేషాం = అన్ని కారక ముల, వ్యాపారః = వ్యాపారమును, కరణేన = కరణకారకము యొక్క వ్యాపారముచే, వ్యవధీయతేహి = వ్యవహితమగును గదా.

తాత్పర్య విశేషాంశములు— కరణమనగా క్రియాసిద్ధికి అవ్యవహిత పూర్వమగు ఉపకారకమని చెప్పబడినది. ఏ కారకము పనిచేసినవెంటనే క్రియ నిష్పన్నమగునో అది కరణము అని చెప్పబడిన తరువాత నిక కర్తకు కరణత్వమునకు ప్రసంగమేమి ? సాధనము లను పనిచేయించునది కర్తృకారకము. సాధనములు కర్తచే వినియోగింపబడి తమ తమ వ్యాపారములందు ప్రవర్తించిన పిదప క్రియ సిద్ధించును. కనుక కర్తృకారకములు క్రియా సిద్ధికి దూరమేగాని దగ్గఱ కావు. ఒక్క కరణమే క్రియా సిద్ధికి సన్నిహితము ఏ ఇతర కారకముల వ్యాపారములయినను కరణ వ్యాపారముచే వ్యవహితములు కాక తీరదు. కాబట్టి సాధకతమము అనదగిన కారకము కరణమేగాని కర్తృకారకము కానేరదని భావము. ॥94॥

అవతారిక— మఱియు ఇతర కారకములతో కర్త పోటీపడుటకు అవకాశమే లేదు.

శ్లో॥ క్రియాసిద్ధౌ ప్రకర్షో వా న్యగ్భావస్త్వేవ కర్తరి ।
సిద్ధౌ సత్యాం హి సామాన్యం సాధకత్వం ప్రకృష్యతే ॥ 95

వా (అథవా) = లేదా, క్రియాసిద్ధౌ = క్రియ సిద్ధించుట విషయమున, ప్రకర్షః = అతిశయ మున్నను, కర్తరితు = కర్తవిషయమున మట్టుకు, కరణస్య = కరణకారకమునకు, న్యగ్భావః ఏవ = అపకర్షమే, సామాన్యం = సాధారణమగు, సాధకత్వం = సాధనత్వము = కార కత్వము, సిద్ధౌ సత్యాం = క్రియాసిద్ధి కలిగిన తరువాత, ప్రకృష్యతే హి = అతిశయము కలది యగునది ;

తాత్పర్య విశేషాంశములు— కారకములు వ్యాపారములను నిర్వర్తించిన తరువాత క్రియ సిద్ధించును. ఆ విషయమున, ఇతర కారకములకంటె కరణము మిన్న. కర్త తన

వ్యాపారమునందు ప్రవర్తించు కాలములో, ఇతర కారకముల కే వ్యాపారమును లేనేలేదాయె. వానికి సాధనత్వము సిద్ధించుట కర్తృవ్యాపారమునకు తరువాత నవియు తమ వ్యాపారము లందు ప్రవర్తింపగా గలుగును. ఆ దశలోనే వానిలో ప్రకర్షాపకర్షలను గూర్చిన వివక్ష. అయ్యది, కరణమునకు, తనతో తుల్యకక్ష్యలోనిదైన అధికరణాదులతో సంభవింపవచ్చును కర్తతో గాదు. కర్త స్వామి. ఇతర కారకములు భృత్యప్రాయములు. కర్త స్వతంత్రుడు మాత్రమే. అవి స్వతంత్రములును కర్తకు పరతంత్రములును గూడ నగును. భృత్యుంతో స్వామికి స్పర్థయేమి? కరణమును కర్తకు పరతంత్రమే అయినను, సాధనాంతరముల దృష్టిచే సాధకతమముగా నోపును. కాబట్టి 'అస్వతంత్రమైనది ప్రకర్షగల సాధన మెట్లగును?' అను ప్రశ్న కవకాశము లేదు. ॥95॥

అవతారిక— కర్తకును కరణమునకును ఇట్లు రూపభేదము కలదని నిరూపించి తిరి గదా? అట్లైన, "అసిఃఛినత్తి" = 'కత్తి కోయుచున్నది' అని వ్యవహరింతురే? అది యెట్లు? కరణమగునది కర్త యెట్లగును? అనగా

శ్లో॥ అస్యాదీనాం తు కర్తృత్వే తైక్ష్ణ్యాది, కరణం విదుః ।
తైక్ష్ణ్యాదీనాం స్వతంత్రత్వే ద్వేధాత్మా వ్యవతిష్ఠతే ॥ 96

అసి ఆదీనాం = కత్తి మున్నగునవి, కర్తృత్వేతు = కర్తలయినపుడు, తైక్ష్ణ్యాది = వాని తీక్ష్ణత మొదలగుదానిని, కరణం = కరణమునుగా, విదుః = తలంతురు, తైక్ష్ణ్యాదీనాం = కత్తి పదును మున్నగునవి, స్వతంత్రత్వే = కర్తలుగా భావింపబడినపుడు, ఆత్మా = ఆ కరణ స్వరూపము, ద్వేధా = రెండుగా, వ్యవతిష్ఠతే = వ్యవస్థితమై యుండును.

తాత్పర్య విశేషాంశములు— చెట్టు నరకువాడు చేతనుడగు మనుష్యుడు. కాని వానితో బనిలేకయే మంచి పదనుగలదియగు కత్తియే ఆ పని చేసినపుడు, 'కత్తి తెగకోయు చున్నది' అందురు. అపుడు కత్తి కరణము కాదు. వేఱొకటి కరణము కావలెను అది యేమి? దాని తీక్ష్ణత్వమో, బరువో, కఠినత్వమో, దాని అవయవ సన్నివేశ విశేషమో, ఆ పనిని చేయుటచేత అవికరణములగును

ఇక ఆ తీక్ష్ణత మున్నగువానినే కర్తలుగా వివక్షించుననుకొనుడు. అపుడు అవి శబ్దభేదముచే రూపభేదమునంది కర్తలుగను కరణములుగను గూడ వ్యవహరించును. ఎట్లన? "తైక్ష్ణ్యం ఛినత్తి స్వసామర్థ్యేన" = 'కత్తి పదును తన శక్తిచేత వృక్షమును ఛేదించుచున్నది' అనిన ఛేదన క్రియలో కర్తయు కరణమును తీక్ష్ణతయే. అదియే సాధకతమము. తన శక్తి యనగా ఆ తీక్ష్ణతయే. కాని ఏ క్రియకైనను కరణముండి తీరును. ఇచట కరణాంతర మగ పడదు. అందువలన శబ్దభేదముచే రూపభేదము కల్పితము. ॥96॥

అవతారిక— కర్తయు కరణమును భిన్న భిన్నములని యుపపాదింపబడినది గదా. అపుడు "ఆకడారాదేకా సంజ్ఞా" (1-4-41) అను సూత్రములో "కరణం పరాణి"

అను వార్తికముచేత, 'కరణసంజ్ఞను, దానికి తరువాతి సంజ్ఞలు, బాధించును' అని, వానికి విప్రతిషేధముపపాదింపబడినదిగదా అది యెట్లు పొసగును? వానికి రూపభేద మున్నపుడు తుల్యబల విరోధమునకు ప్రసక్తి యుండదుగదా? అనిన—

శ్లో॥ ఆత్మభేదేపి సత్యేవమే కోఽర్థ స్తథాస్థితః।
తదాశ్రయత్వాద్భేదేఽపి కర్తృత్వం బాధకం తతః॥ 97

ఏవం = ఇట్టి వివక్షచేత, ఆత్మభేదే = స్వరూపభేదము, సతిఅపి = ఉన్నప్పటికిని, ఏకః = ఒక్కటియే అయిన, సః = ఆ, అర్థః = ద్రవ్యము, తదాశ్రయత్వాత్ = కల్పన నాశ్రయించిన దగుటవలన, తథాస్థితః = అట్లే ఉండినదగును, తతః = అందువలన, భేదేఽపి = వివక్ష వలన భేదమున్నను, కర్తృత్వం = కర్తృసంజ్ఞ, బాధకం, భవతి = కరణసంజ్ఞకు బాధకమగును.

తాత్పర్య విశేషాంశములు— కర్తృ శక్తికిని కరణ శక్తికిని ఆధారమగు, ఆ ఖడ్గమను ద్రవ్యము ఒక్కటియే. భేదము కల్పితము. కాల్పనికమగు భేదము వాస్తవికమగు ఏకత్వమును బోగొట్టదు. కారికలోనున్న 'తదాశ్రయత్వాత్' అను పదమునకు 'కల్పన నాశ్రయించిన దగుటవలన' అనియు జెప్పనగును. లేదా కర్తృకరణ సంజ్ఞలు రెండును, ఆ ఏకార్థమునే ఆశ్రయించినవగుట వలన ననియు వ్యాఖ్యానింపవచ్చును. కారక శక్తులు వేరయినను వాని కాధారమగు ద్రవ్య మొక్కటియే అగుటవలన, విప్రతిషేధ ముపపన్నము కావచ్చును.

శక్తి విశిష్టమగు ద్రవ్యమునకు కర్తృకరణాది సంజ్ఞలు. వానిలో కరణసంజ్ఞ పూర్వము. కర్తృసంజ్ఞ పరము. అష్టాధ్యాయీ సన్నివేశ మట్లున్నది. తుల్యబలములకు విరోధము కలిగినపుడు పరము పూర్వమును బాధించును. "అసిఃఛినత్తి" ఉదాహరణము. అసి, సాధకతమము దాని కొకానొకపుడు స్వాతంత్ర్యమును వివక్షింపవచ్చును. వక్త రెండు వివక్షలను జేసినపుడు రెండు సంజ్ఞ లేకకాలమున నుండుటకు వీలు కలుగదుగాన పరము పూర్వమును బాధింపగా, అసి కర్త అగుచున్నది అది దాని కారోపితము.

'ధనుషావిధ్యతి' = వింటితో గొట్టుచున్నాడు అందురు. వింటినుండి బాణములను వేసి, వానితో గొట్టుదురు అందువలన విల్లు అపాదానమును, బాణములు కరణములును. కాని వింటికే క్రియాసిద్ధిలో ఉపకార ప్రకర్ష వివక్షింపబడినది. అపాదాన సంజ్ఞను పరమైన కరణ సంజ్ఞ బాధించినది. [వింటితో గొట్టుచున్నాడు అనగా అమ్ములు లేకపోవుటచే వింటినే గ్రహించి దానితోనే గొట్టుచున్నాడనరాదా? ఆ యర్థము లేదా అని యడుగరాదు. ప్రకరణమును బట్టి ఆ యర్థము సరిపడదు.] ॥97॥

అవతారిక— కరణకారకము క్రియాసిద్ధికై చేయు నుపకారము, తాను సన్నిహితమై చేయునట్లు, అసన్నిహితమై కూడ చేయుట వ్యవహారమున కననగును.

శ్లో॥ యథాచ, సంనిధానేన కరణత్వం ప్రతీయతే ।
తథైవాసం నిధానేపి క్రియాసిద్ధేః ప్రతీయతే ॥ 98

యథాచ = ఏ విధముగను, సంనిధానేన = తన ఉనికిచే, కరణత్వం = కరణకారకత్వము, ప్రతీయతే = తెలియబడుచున్నదో, తథాఏవ = ఆ విధముగనే, అసంనిధానే అపి = తన సంనిధానము లేనపుడును, క్రియాసిద్ధేః = క్రియ సిద్ధించుటవలన, ప్రతీయతే = ఆ కరణత్వము తెలియవచ్చుచున్నది

తాత్పర్య విశేషాంశములు— "దాత్రేణ లునాతి" = కొడవలితో గోయుచున్నాడు అనునపుడు, కొడవలి అను, కరణము, తానుండి కోయుట అను క్రియను సిద్ధింపజేయుచున్నది. ''ధనాభావేన ముక్తః'' = డబ్బు లేమిచే విడువబడినాడు అనునపుడను ధనము విడిచిపెట్టబడుట అను క్రియ కుపకరించుచున్నదిగాని, అభావరూపమున నుపకరించుచున్నది. అనగా దాని అసంనిధానము కరణము లేని ధనముచే ముక్తి అనుట. ॥98॥

అవతారిక— ఈ విషయమున సూత్రకార మతసంవాదము జూపబడుచున్నది.

శ్లో॥ స్తోకస్యాభినిర్వృత్తేరనివృత్తేశ్చ తస్యవా ।
ప్రసిద్ధిం కరణత్వస్య స్తోకాదీనాం ప్రచక్షతే ॥ 99

స్తోకస్య = అల్పమైన దానియొక్క, అభినిర్వృత్తేః వా = సిద్ధివలనగాని, తస్య = ఆ అల్పముయొక్క, అనివృత్తేః వా = శేషమువలనగాని, స్తోకాదీనామ్ = స్తోక, అల్ప, మున్నగువానికి, కరణత్వస్య = కరణకారకత్వమునకు, ప్రసిద్ధిం = సంసిద్ధిని, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్య విశేషాంశములు— ''కరణేచ స్తోకాల్పకృచ్ఛ్ర కతిపయస్యా సత్త్వవచనస్య'' (2-3-33) అని సూత్రము స్తోక, అల్ప, కృచ్ఛ్ర, కతిపయ - అను నాలుగును ద్రవ్యవాచకములు కానపుడు కరణార్థమున పంచమీవిభక్తి ప్రత్యయములు వానికి వచ్చును. అవి, వికల్పముగాన తదభావమున, కరణార్థమున రాదగిన తృతీయయు ప్రవర్తించును' అని సూత్రార్థము. 'స్తోకాత్ముక్తః' 'స్తోకేనముక్తః' - అని యుదాహరణము. ఇట స్తోకాది శబ్దములు శుక్లాది శబ్దములవలె ధర్మమాత్రమును బోధించునవిగాన అద్రవ్యవచనములు. ఆ స్తోకము క్రమధర్మము, అనగా అల్పత్వము, విద్యమానమైగాని, అసంనిహితమయిగాని విమోచనక్రియలో నుపకరించును. ఒక వ్యక్తి, ఒకనికి తాను కొంత ఈయవలసియున్నది. అందు స్వల్పాంశమే సిద్ధమై వానికడ నున్నది వాడకించనుడు అంతకుమించి ఈయలేడు. అపుడాదాత, వానిని ఋణవిముక్తునిజేసిన, "సః స్తోకాన్ముక్తః" అనుచున్నారు ముక్తికి హేతువు అల్పత్వము. లేదా ఈయవలసిన దానిలో నధికభాగ మిచ్చివేసినాడు. ఇక శేషించినది అల్పము. ఆ అల్పత్వముచే విడచి పెట్టబడినాడనియు నర్థము కావచ్చును. ఆ అల్పము గూడ వానికడ నిపుడు లేదాయె.

ముందుచెప్పిన యర్థమున స్తోకము విద్యమానమై ముక్తికి కరణమయినది. రెండవ

యర్థమున నది అవిద్యమానమై ముక్తికి కరణమైనదనుట - ఇట్లే 'ఏకాన్నవింశతిః' అను పదమును జూడుడు. 'ఏకేన నవింశతిః' = ఒకదానిచే ఇరువది కాలేదు. పందొమ్మిది అని యర్థము. ఇట ఇరువది కాకుండుటకు, ఒకటి, అభావరూపమున కరణము. ॥99॥

అవతారిక—— సాధన వ్యవహారమంతయు వక్తల వివక్షనుబట్టి యుండునని తేలినది. కావున మనము క్రియాసిద్ధిలో దేనిని మిక్కిలి ఉపకరించునదిగా దలంతుమో అది కరణము కావచ్చునని చెప్పుచు, వివక్షా ప్రకారమును వివరించుచున్నాడు.

శ్లో॥ ధర్మాణాం తద్వతా భేదాదభేదాచ్చ విశిష్యతే ।
క్రియావధే రవచ్ఛేద విశేషాద్భిద్యతే యథా ॥ 100

అవధేః = అవధియొక్క, అవచ్ఛేద విశేషాత్ = భేద విశేషమువలన, క్రియా = క్రియ, యథా, భిద్యతే = ఎట్లు భేదించుచున్నదో, తథా = ఆ విధముగ, ధర్మాణాం = ఆశ్రయించి ఉన్న వానికి, తద్వతా = ఆ ఆశ్రయముతో, భేదాత్ = భేదమును భావించుటవలనను, అభేదాత్ చ = ఏకత్వమును వివక్షించుటవలనను, క్రియా విశిష్యతే = క్రియ మారుచుండును.

తాత్పర్య విశేషాంశములు—— ''దేవదత్తః కాష్ఠైః పచతి'' = దేవదత్తుడు కట్టెలతో వండుచున్నాడు' అను వాక్యములో, కట్టెలు వంటకు కరణములుగా చెప్పబడినవి. వంట చేయునది, ఆ కట్టెలయందుండు తేజస్సు. అగ్ని అనుట. కాని ఆశ్రితమునకు ఆశ్రయముతో అభేదమును వివక్షించి అట్టి ప్రయోగములు చేయబడుచున్నవి. దేవదత్తుడు, కట్టెలతో, చేయు వంట అని అపుడర్థము.

''ఏధాః పక్ష్యంతి తేజసా'' = కట్టెలు 'అగ్నితో వంటచేయును' అని ఇంకొక వాక్యము. ఇపుడు, కట్టెలు నిప్పుతోచేయు వంట వాక్యార్థము.

''తేజః పచతి ఔష్ణ్యేన'' = 'నిప్పు తన వేడితో వండుచున్నది' అనిన ఇపుడు, వంట అను ఆ క్రియ భేదించినది. ఔష్ణ్యము, అగ్నికంటె వేరుగా క్రియాసిద్ధికి ఉపకరించుట చేత సాధనభేదముచే క్రియాభేదము.

''గ్రామా దా గచ్ఛతి'' = ఊరినుండి వచ్చుచున్నాడు.

''గ్రామస్య సమీపాదాగచ్ఛతి'' ఊరుదగ్గఱనుండి వచ్చుచున్నాడు.

ఉభయత్ర క్రియ ఒకటియే. ఆగమనమే. కాని అవధులగు, గ్రామము తత్సమీపము అను వాని భేదమువలన దానికి భేదము వివక్షితము.

గ్రామమనగా, అడవులు, సీమలు, మున్నగువానితో గూడినదని యర్థమైనపుడు గ్రామ సమీపమునుండి వచ్చినను గ్రామమునుండి వచ్చినట్లే. గ్రామమనగా దాని సరిహద్దు వఱకు మాత్రమే అని యర్థమైన, గ్రామసీమ వేరుగాన అపుడు గ్రామ సమీపమునుండి వచ్చుచున్నాడందురు. అవధులు భేదించుటచే క్రియకు భేదము, అంతియ.

వివక్షితమైన కరణము, తృతీయా ప్రత్యయముచే చెప్పబడినట్లు, 'ల్యుట్' మున్నగు, ధాతు విహిత ప్రత్యయములచేత గూడ చెప్పబడుచుండును.

''పచనం ఏధః'' = వంటకు కరణమైన కట్టె. ''పచనం తేజః'' = వంటకు కరణమైన అగ్ని. ''పచనీ స్థాలీ'' = వంటచేయు గిన్నె. ''పచనం ఔష్ణ్యమ్'' = వంటకు కరణమైన వేడి. ఇట్టి ప్రయోగములు వివక్షనుబట్టి పలు రకములుగ భాషలోగలవు. ॥100॥

కర్త్రధికారము

అవతారిక— తృతీయావిభక్తికి కర్త, కరణము అర్థములు. అందు కరణము విచారింపబడినది. ఇక కర్త విచారింపబడును. ''స్వతంత్రః కర్తా'' (1-4-54) అనునది కర్తృసంజ్ఞా విధాయకము. స్వః = ఆత్మ, తంత్రం = ప్రధానము, యస్య సః = దేనికో అది అని విగ్రహము. క్రియను సాధించుటలో కర్త ప్రధానభూతుడు. కరణాది కారకములు కర్త వినియోగింపగా పనిచేయునవి. అది కర్తకు పరతంత్రములు. అయినను, తమతమ పనులలో తాము స్వతంత్రములే. కర్త ప్రేరించినను నవి పనిచేసిననేగదా క్రియ సిద్ధించునది ః అట్టియెడ కర్తకుగల అతిశయమేమి ? అను శంక కలుగును. దానికి సమాధానముగా నీ రెండు కారికలును అవతరించినవి.

శ్లో॥ ప్రాగన్యతః శక్తిలాభాత్, న్యగ్భావాపాదనాదపి ।
తదధీన ప్రవృత్తిత్వాత్, ప్రవృత్తానాం నివర్తనాత్ ॥ 101

శ్లో॥ అదృష్టత్వాత్ ప్రతినిధేః, ప్రవివేకే చ దర్శనాత్ ।
ఆరాదప్యుపకారిత్వే స్వాతంత్ర్యం కర్తురుచ్యతే ॥ 102

అన్యతః = ఇతర కారకములకంటె, ప్రాక్ = పూర్వము, శక్తిలాభాత్ = శక్తిని పొందుట వలనను, న్యగ్భావాపాదనాత్, అపి = వానికి పరాధీనత నాపాదించుటవలనను, తదధీన ప్రవృత్తిత్వాత్ = అవి తనకు పరతంత్రములై ప్రవర్తించుటవలనను, ప్రవృత్తానాం, నివర్తనాత్ = ప్రవర్తించినవానిని మరలించుటవలనను, ప్రతినిధేః = కర్తకు, బదులైనది, అదృష్టత్వాత్ = కనబడకుండుట వలనను, ప్రవివేకే = ఇతర కారకములు లేనపుడును, దర్శనాత్ చ = కర్త కనబడుటవలనను, ఆరాత్ = దూరముగ నుండి, ఉపకారిత్వే = ఉపకరించుట, సత్యపి = ఉన్నప్పటికిని, కర్తుః = కర్తకు, స్వాతంత్ర్యం = స్వతంత్రత, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— కర్త స్వతంత్రుడనుటకు ఆఱు కారణములిందు జూపబడినవి. కర్త, ఫలమును గోరి ఆయా కార్యములందు ప్రవర్తించును. ఆ శక్తి కర్తకు, ఇతర కారకము లన్నిటికంటె ముందు లభించును. అది మొదటి కారణము.

కర్త కరణాదికారకములకు న్యగ్భావమును ఆపాదించును. అనగా అవి తనకు వశవర్తులై ప్రవర్తించునట్లు చేసికొనును. అది రెండవ కారణము.

కరణాదులు కర్తకధీనములై తమతమ పనులందు ప్రవర్తించునుగాని స్వతంత్రములు గావు. ఇది మూడవ కారణము.

కర్త ఫలార్థిగాన ఫలము సిద్ధించిన తరువాత నాతడు తన వ్యాపారము నుండి విరమించును. కరణాదు లతిప్రవృత్తములైన, వానిని విరమింపజేయును. ఇది నాలుగవ కారణము. కరణాది కారకములకు ప్రతినిధి సంభవించును. ఖడ్గముగాని గొడ్డలిగాని పని చేయనపుడు, దానికి బదులుగ సాధనాంతరమును కర్త సంపాదించుకొనుట కలదు. ఆ విధముగ కర్తకు ప్రతినిధి యగుపడుట లేదు. ఇది అయిదవ కారణము. ప్రవివేకమనగా కారకాంతరములు లేనేలేకుండుట. ఏ కారకములును లేకున్నను కర్త మాత్ర ముండు క్రియలును గలవు. ఎట్లన— అస్తి, విద్యతే, భవతి అనునవి. ఉన్నాడు, అనగా ఎవరో ఒక కర్త ఆ క్రియ కాశ్రయమైనవాడు తప్పదు. ఇతర కారకములు లేవు ఇది ఆఱవ కారణము

'ఇచ్చట నున్నాడు' అనియో, 'ఇప్పుడున్నాడు' అనియో, దేశకాలములు అధికరణముగా ప్రతీయమానము లపుడుగూడ నగునుగదా యనిన, ఆ ప్రతీతి నాంతరీయకముగ నున్నను, శబ్దవ్యాపారము వలన వచ్చినది గాదు. ఈ హేతువులచే కర్తకు ప్రాధాన్యము. క్రియాసిద్ధికి కర్త వ్యాపారము దూరమే. అయినను కారకచక్రము నంతను త్రిప్పువా డాతడే యగుటచే నాతనికే స్వాతంత్ర్యము.

ఈ రెండు కారికలును, ''కారకే'' (1-8-28) అను సూత్రమునందు మహాభాష్యమున సంగ్రహరూపముగ జెప్పబడిన గ్రంథమునకు వ్యాఖ్యాన భూతములు. అట. "కింపునః ప్రధానమ్?" అని ప్రశ్నించి, 'కర్తా' అని సమాధానము చెప్పి, మరల, "కథం పునః జ్ఞాయతే కర్తా ప్రధానమితి? యత్ సర్వేషుకారకేషుసన్నిహితేష కర్తా ప్రవర్తయితా భవతి" అని వివరింపబడినది. కర్త ప్రధానమని ఎట్లు తెలియునన నితరకారకములను ప్రవర్తింపజేయుట కర్తపని గనుక యనిచెప్పుటవలన కారికోక్తములగు స్వాతంత్ర్య హేతువులందు గర్భితములై యున్నవి. ॥101, 102॥

అవతారిక— ఇతర కారకములను ప్రవర్తింపజేయుట మున్నగు ధర్మములు అచేతన పదార్థములకు సంభవింపవు గదా. వానికి కర్తృత్వమెట్లు? అనిన చెప్పుచున్నాడు.

శ్లో॥ ధర్మైరభ్యుదితైః శబ్దే నియమో న తు వస్తుని ।
కర్తుర్ధర్మ వివక్షాయాం శబ్దాత్ కర్తా ప్రతీయతే ॥ 103

అభ్యుదితైః = చెప్పబడిన, ధర్మైః = ధర్మములతో, నియమః = కూడియుండుట, అను నియమము, శబ్దే = శబ్దమునందుండదగిన, నియమః = నియమము మాత్రమే, వస్తుని తు న = వస్తువు విషయమున గాదు, కర్తుః = కర్తకు, ధర్మవివక్షాయాం = ఆ ధర్మములను

వివక్షించినపుడు, శబ్దాత్, కర్తా = శబ్దమువలననే ఆ ధర్మములుగల కర్త, ప్రతీయతే = తెలియబడును.

తాత్పర్య విశేషాంశములు— వెనుకటి కారికలలో, కర్తకుండదగినవిగా చెప్పబడిన ధర్మములు వాస్తవిక కర్తకు గాదు. శబ్దముచే అచట బోధింపఁబడిన కర్తకు మాత్రమే. అట్లు కానియెడల, ''అగ్నిర్దహతి'' = నిప్పు కాల్చుచున్నది. 'ఏధాః పచంతి' = కట్టెలు వండుచున్నవి, 'స్థాలీ పచతి' = గిన్నె వండుచున్నది. ఇట్టి వాక్యములందలి వాస్తవిక కర్త లచేతనము లగుటవలన వానికి కర్తృత్వము సిద్ధింపకపోవును ఈ ధర్మములను ప్రయోక్త ఏ పదార్థములకు వివక్షించిన నవి కర్తలగును. కరణమువలె కర్తృకారకము గూడ వక్తల వివక్షవలన నేర్పడునదియే. వ్యాకరణశాస్త్రమున శబ్దము ప్రతిపాదించిన అర్థమే అర్థము. అది వాస్తవికము కానక్కర లేదు. అచేతనమునకు కర్తృత్వము గూడ శబ్దబోధ్యమే గాన 'కర్తృత్వమున కచేతనమునం దారోపము' అని చెప్ప బనిలేదు. ॥103॥

అవతారిక— స్వాతంత్ర్యము వివక్షనుబట్టి యుండునని గ్రహించినపిదప, ''ఆత్మా ఆత్మానం ఆత్మనాహన్తి'' = 'తాను తన్ను తన చేతనే చంపుచున్నాడు' అను, ప్రయోగములవంటివి గూడ సుసమన్వితములగును. చూడుడు.

శ్లో॥ ఏకస్య బుద్ధ్యవస్థాభిః భేదే చ పరికల్పితే ।
కర్మత్వం, కరణత్వం, వా కర్తృత్వం వోపజాయతే ॥ 104

ఏకస్య = ఒకే పదార్థమునకు, బుద్ధి అవస్థాభిః = బుద్ధిలో కల్పించిన అవస్థలచేత, భేదే = భేదము, పరికల్పితే సతి = కల్పన చేయబడినపుడు, కర్తృత్వం = కర్తయగుట, కర్మత్వం వా = లేదా కర్మయగుట, కరణత్వం వా = కరణమగుటగాని, ఉపజాయతే = సంభవించును.

తాత్పర్య విశేషాంశములు— పై ప్రయోగమునందు ఆత్మ అనునది ఒకటియే మూడు కారకములుగ ప్రయోగింపబడియున్నది. ఒకే వస్తువునకు ఏకకాలమున అనేకరూపత సంభవింపదు. కావున వివక్షచేత రూపభేదమును కల్పించి దానిని ఘటింపజేయవలెను. మరియు ఆత్మ మూర్తిమంతమగు ద్రవ్యము కాదు దానికి శస్త్రవ్యాపారమువలన కలిగెడు వధ సంభవము కాదు. దానిని గూడ వివక్షచేతనే సంఘటింపజేయనగును.

వ్యాపరించు వస్తు వొకటి. ఆ వ్యాపారమువలన గలిగిన ఫలమును బొందునది, వేఱొకటి. ఆ క్రియ సిద్ధించుటకు మిక్కిలి ఉపకరించినది ఇంకొకటి. ఈ విధముగ కర్తృ, కర్మ, కరణములు లోకమున భిన్న భిన్నముగ నుండును. శాస్త్రమున, శబ్దము దేనిని ప్రతిపాదించిన నదియే శబ్దార్థము. అది వాస్తవికముగాబనిలేదు అని పూర్వ ముపపాదితము గదా కావున ఆత్మకే, హననవ్యాపారమును, దానివలన గలిగిన ప్రాణవియోగమును, ఆ క్రియ సిద్ధించుటలో ఉపకార ప్రకర్షమును వివక్షాధీనములై సిద్ధించినవి. ఈ విషయమునకు పోద్బలకమగు భాష్యగ్రంథమును జూచునది.

''కర్మవత్ కర్మణాతుల్య క్రియః'' (3-1-87) అని ఒక సూత్రము. ఆ సూత్రము కొన్ని ప్రయోగములలో కర్త కర్మవంటి దగునని కర్మవద్భావమును విధించునది. 'పచ్యతే ఓదనః' = అన్నమే వండుచున్నదని యర్థము. ఇట్టి ప్రయోగములు భాషలో గలవు. వానిని కర్మ కర్తృ ప్రయోగములందురు. వంట చేయువానికి మిగుల శ్రమను గలుగ నీయక అన్నము దానియంతట నదియే ఉడికి పోవుచున్నది అని సౌకర్యమును వివక్షించి అట్టి ప్రయోగములు చేయబడును. ఇట కర్మవద్భావము కర్మార్థమున లకారము సిద్ధించుటకు కర్మ వంటిది కర్త యగునను నతిదేశము లేనిచో నది సిద్ధింపదని సూత్రకారుని భావము. కాని ఈ అతిదేశముతో బనిలేదనియు, ''పచ్యతే ఓదనః స్వయమేవ'' అని 'ఆత్మనా' = తనచేతనే, అను నర్థముగల పదముగూడ ప్రయోగింపబడుచున్నదనియు, ఇట ఓదనమనునది స్వాభావిక కర్మయేగాన అతిదేశమువలన వచ్చినది గాదనియు, చెప్పి దానిని ప్రత్యాఖ్యానము చేసియుండెను. ''సిద్ధంతు ప్రాకృతకర్మత్వాత్'' ''ఆత్మ సంయోగే అకర్మకర్తుః కర్మ దర్శనాత్'' అను, అచటిగ్రంథమును జూచునది. పదార్థ మొక్కటియే అయినను బుద్ధిభేద కల్పనముచే దానికి భేదము సంభవమని స్పష్టముగదా ॥104॥

అవతారిక— "అంకురోజాయతే" = 'మొలక పుట్టుచున్నది' అందురు గదా. అచట పుట్టుట యనగా నేమి? పుట్టుచున్నదని చెప్పిన ఆ అంకుర మదివఱకున్నదా? లేనిదా? ''యది సత్ జాయతే కస్మాత్? అథాసజ్జాయతే కుతః? = ఉన్నదే పుట్టుచున్నది అనిన, ఇక దానికి ఉత్పత్తియేమి? లేనిదనిన, లేని దెట్లు పుట్టును? అని శంకించి, ''ఉప చర్యే తు కర్తారం'' ఇత్యాది కారికలచే, సంబంధ సముద్దేశమున అంకురమునకు ఔపచారిక మగు సత్తను ఆశ్రయించి, ఉత్పత్తి సాధింపబడినది. ఉపచారమనగా నారోపము. ఇపుడు, కర్తృత్వము వివక్షాకృతము అను నీ సిద్ధాంతమున నిక ఉపచారముతో బనిలేదని చెప్పబడు చున్నది.

శ్లో॥ ఉత్పత్తేః ప్రాగసద్భావో బుద్ధ్యవస్థా నిబంధనః ॥
అవిశిష్టః సతాన్యేన కర్తా భవతి జన్మనః ॥ 105

ఉత్పత్తేః = పుట్టుటకంటె, ప్రాక్ = ముందు, అసద్భావః = అంకురము లేకుండుట, బుద్ధ్య వస్థా నిబంధనః = బుద్ధియొక్క ఆవస్థ మూలముగాగలది, సః = ఆ అంకురము, సతా = విద్యమానమైన = సత్తైన, అన్యేన = ఇంకొక వస్తువుతో, అవిశిష్టః = తుల్యమైనదై, జన్మనః = ఉత్పత్తికి, కర్తా భవతి = ఆశ్రయమగుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— వివక్ష అనగా బుద్ధియొక్క ఒక అవస్థ. వస్తువుల ఉనికి గాని లేమి గాని వాక్యప్రయోక్తల బుద్ధ్యవస్థల నాశ్రయించి ఉండును. ఆ వివక్షను బట్టి, ఇతర క్రియల కర్తృత్వమువలె జని క్రియాశ్రయత్వము గూడ అంకురమునకు సంభ వించును. అంకురము పెరుగుచున్నది. అంకురము పుష్పించుచున్నది, అనునపుడు వర్ధన క్రియకును పుష్పించుట అను క్రియకును అంకురము కర్త అయినట్లే జనిక్రియకును కర్త

అగుట కూడ సంభవము. అచట దానికి సంనిధానము = సద్భావము వివక్షాప్రాపితము. బుద్ధిలో సత్తగల అంకురము బాహ్యరూపమును బొందుటయే జన్మ. ఒక రూపములో సత్త్వము. వేరొక రూపమున కర్తృత్వము. కావున నిది వాస్తవ వ్యవస్థ కాకున్నను, శబ్దప్రతి పాద్యము గావున ముఖ్యమేగాని ఆరోపితము గాదు. ॥105॥

అవతారిక— 'అంకురో జాయతే' అను, ప్రయోగమున కుపపత్తి వాస్తవరూపమున గూడ సంభవమే అని ఈ కారికలో జూపబడుచున్నది.

శ్లో॥ కారణం కార్యభావేన యదా వా వ్యవతిష్ఠతే ।
కార్యశబ్దం తదా లబ్ధ్వా కార్యత్వేనాథ జాయతే ॥ 106

వా = లేదా, యదా = ఎపుడు, కారణం = కారణమైనది, కార్యభావేన = కార్యముగా, వ్యవతిష్ఠతే = ఏర్పడుచున్నదో, తదా = అపుడు, కార్యశబ్దం = కార్యవాచకమగు శబ్దమును, లబ్ధ్వా = పొంది, అథ, కార్యత్వేన = పిమ్మట, కార్యరూపమున, జాయతే = జన్మనుబొందును.

తాత్పర్య విశేషాంశములు— కార్యము. పూర్వమున నున్నదియే అనునది సత్కార్య వాదము. లేనికార్యము అపూర్వముగ బుట్టును అనునది అసత్కార్యవాదము. రెండు పక్షములందును అంకురమున జన్మయనునది కుదురదుగాన బుద్ధ్యవస్థను బట్టి ఉపపత్తి చూపబడినది.

కార్యకారణములు అభిన్నములు. వస్తువు ప్రకృత్యవస్థలో కారణము. వికృత్యవస్థలో కార్యము. క్షీరం దధి సంపద్యతే = పాలు పెరుగగుచున్నది అనినట్లు బీజ మంకురమగుచున్న దందురు. అనగా, పుట్టుట యనగా నొక అవస్థలో నున్నది వేఱొక అవస్థను బొందుటయే. పూర్వావస్థ కారణావస్థ ఆ అవస్థలో కర్తృత్వమును ఉత్తరావస్థలో జన్మయును సంభవములే గాన ఆ ప్రయోగ ముపపన్నము. ॥106॥

అవతారిక— 'కారణముల ఉత్తరావస్థయే కార్యరూపము' అను స్వసిద్ధాంత మిందు జూపబడుచున్నది.

శ్లో॥ యథాహేః కుండలీభావో వ్యగ్రాణాం వా సమగ్రతా ।
తథైవ జన్మరూపత్వం సతామేకే ప్రచక్షతే ॥ 107

అహేః = పామునకు, కుండలీభావః యథా = కుటిలత్వమువలెను, వ్యగ్రాణాం = వేరు వేరుగా నున్న వేళ్ళకు, సమగ్రతా వా యథా = సంఘాత రూపమువలెను, తథా, ఏవ = అదే ప్రకారముగా, సతాం = ఉన్నవానికి, జన్మరూపత్వం = పుట్టుట అను దానిని, ఏకే = కొందరు ప్రచక్షతే = వర్ణింతురు.

తాత్పర్య విశేషాంశములు— జన్మ అనగా, ముందటి అవస్థలోనిది తరువాతి అవస్థను చేరుటయే కావున, కార్యమనునది అంతకు పూర్వమును నున్నదియే. అది అసత్తు

గాదు అను పక్షమునను, అంకురమునకు జని కర్తృత్వము సిద్ధించును. పాము ఒకపుడు దీర్ఘముగనున్నదియే వేఱొక యవస్థలో గుండ్రముగ చుట్టుకొని యుండును. విస్తృతములుగా నున్న చేతి వ్రేళ్ళు ముడిచినపుడు ముష్టి = పిడికిలి, అనబడును. కాగా కార్యకారణ భావ మనునది అవస్థాభేద మాత్రమే అని పర్యవసితము. ॥107॥

అవతారిక— 'కార్య కారణములు, భిన్న భిన్నములు' అను, మతమునందును అంకురమునకు జని కర్తృత్వము వాస్తవ రూపముననే ప్రతిపాదింపవచ్చునను చున్నాడు

శ్లో॥ విభక్తయోని యత్కార్యం కారణేభ్యః ప్రవర్తతే ।
స్వా జాతిర్వ్యక్తిరూపేణ తస్యాపి వ్యవతిష్ఠతే ॥ 108

విభక్తయోని = వేరు కారణముగలదై, యత్ = ఏ, కార్యం = కార్యము, కారణేభ్యః = అట్టి కారణములనుండి, ప్రవర్తతే = పుట్టునో, తస్యాపి = అట్టి ఆ కార్యమునకుగూడ, స్వా = తనదైన, జాతిః = జాతియే, వ్యక్తిరూపేణ = వ్యక్తిగా, వ్యవతిష్ఠతే = ఏర్పడుచుండును,

తాత్పర్య విశేషాంశములు— కార్యము, తానుద్భవించుటకు పూర్వము వ్యక్తిరూప మున లేకున్నను, జాతి రూపమున నుండనే యుండును. కాగా విద్యమానమైనది పుట్టినట్లే. జాతియే వ్యక్తిరూపమున పుట్టుచున్నదను వ్యవహారమును కలదుగాన జాతి రూపములో కర్తృత్వమును, వ్యక్తిరూపమున జన్యత్వమును సంభవములే. ఇట్లు, జాతి వ్యక్తులకు పూర్తి వ్యతిరేకము లేదుగాన 'బీజ మంకురోజాయతే' = విత్తు మొలకగా పుట్టుచున్నది' - అను సామా నాధికరణ్యమును ఉపపన్నము. ॥108॥

అవతారిక— 'శబ్దము బోధించిన యర్థమే పదార్థము. అది వస్తువుగా నుండ నక్కఱ లేదు, అను స్వసిద్ధాంత మీ కారికలో స్థిరపరుపబడుచున్నది.

శ్లో॥ భావేష్వేవ పదన్యాసః ప్రజ్ఞాయాః వాచ ఏవ వా ।
నాస్తీత్యప్యపదే నాస్తి న చాసత్ భిద్యతే సతః ॥ 109

ప్రజ్ఞాయాః = బుద్ధికిగాని, వాచః ఏవవా = శబ్దమునకుగాని, భావేషు ఏవ = ఆలంబనముల యందే, పదన్యాసః = కాలి ఊనిక, 'నాస్తి' ఇతి అపి = లేదు అను మాటగూడ, అపదే = ఆలంబన రహితమునందు, నాస్తి = వర్తింపదు, అసత్ చ = లేదు అనునదియు, సతః = ఉన్నదానికంటె, నభిద్యతే = భిన్నము కాదు.

తాత్పర్య విశేషాంశములు— జ్ఞానమునకుగాని శబ్దమునకుగాని ఏదేని ఆలంబన ముండి తీరవలెను. కావున ప్రతీయమానమగు ఆకారమే భావము. అదియే వానికి ఆలంబనము. ఆ విధముగనే 'లేదు' అనునపుడును, ఏది లేదు ? ఎపుడు లేదు ? ఎచట లేదు ? అను ప్రశ్నలు కలుగును. కావున అభావమునకును ఆలంబన మావశ్యకము. ఇతరులు కల్పించినది గాని స్వయముగ నుత్ప్రేక్షించినది గాని అగు ఆకారమును అవలంబించియే బుద్ధి శబ్దములు

ప్రవర్తించును. కావున వ్యవహారములో భావపదార్థములును, అభావపదార్థములును, ఆకారావలంబన విషయమున సమానములే. బాహ్య వస్తువుతో బనిలేదు. కావున అంకురము పుట్టుచున్నదను వ్యవహారము సూపపాదము. ॥109॥

అవతారిక — 'బుద్ధికిని, శబ్దమునకును విషయమగునది బయట లేకున్నను, ఉన్నదాని క్రిందనే పరిగణింపబడును. అంతకు కుంచిన సత్త యనునది లేదు, అని దృఢపరచుచున్నారు.

శ్లో॥ బుద్ధిశబ్దౌ ప్రవర్తేతే యథాభూతేషు వస్తుషు ।
తేషామన్యేన తత్త్వేన వ్యవహారో న విద్యతే ॥ 110

బుద్ధిశబ్దౌ = జ్ఞానమును శబ్దమును, యథా భూతేషు = విద్యమానములైన, వస్తుషు = వస్తువులందు, ప్రవర్తేతే = వర్తించుచుండును, తేషాం = ఆ వస్తువులకు, అన్యేన = వేఱొక = జ్ఞానశబ్దగోచరము కాని, తత్త్వేన = స్వరూపముతో, వ్యవహారః = వ్యవహరించుట యనునది, న విద్యతే = ఉండబోదు.

తాత్పర్య విశేషాంశములు— వ్యవహారమనగా శబ్ద ప్రయోగము. అది అర్థ ప్రతీతి పూర్వకము. పదార్థము మనస్సున భాసించిన పిమ్మట దానిని వ్యక్తము చేయుటకు శబ్దములను ప్రయోగింతురు. ఏ పదార్థమునైనను, దాని శబ్ద ప్రతీతులనుబట్టి నిర్ణయింపవలెను బుద్ధిలో భాసింపనిదియు, శబ్దబోధ్యము కానిదియునగు వేఱొక పదార్థమునుబట్టి, దీనిని లేదనుట యుక్తము గాదు.

పదార్థమును దేనిని గూడ ఉల్లేఖింపని జ్ఞానమే యుండదు. కనుక నవి జ్ఞానగోచరము లైనవనిన వానికి సత్త సిద్ధమే ఆ విధముగ నంకురమున కుత్పత్తిని నిరూపించి తరువాత జాయతే అను శబ్దముచే చెప్పుదురు. ఒక పదార్థమును, 'ఇది లేదు' అనిన నేమి యర్థము ? అయ్యది బాహ్యరూపమున, ఒక చోట, ఒక కాలమున లేకపోవచ్చును. కాని దేశాంతరమున, కాలాంతరముననను నది నానాకారములతో నుపలబ్ధమై భాసించుచునే యుండును. 'లేదు' అనిన ఇపుడిచట లేదనియే యర్థముగాని సర్వాత్మనా లేదని యర్థము గాదు.

అంకురము పుట్టుట యనగా దాని ఉత్పత్తికి కారణమగుట కదా ? కారణము కార్యమునకు ముందుండి తీరవలెను గదా. అట్లు లేని అంకురము కారణమెట్లగును ? అని గదా ఆక్షేపము. ఉత్పత్తి అను కార్యమునకు ముందు లేకున్నను, తజ్జాతీయములగు కార్యాంతరములకు ముందుండవచ్చును గాన, ఆ వాసననుబట్టి ప్రయోక్త బుద్ధిలో నది ఉత్పత్తికార్యమున కభిముఖముగా భాసించును అని సమాధానము. ॥110॥

అవతారిక— సంబంధ సముద్దేశములో చెప్పబడిన న్యాయమును అనుసరించి అద్వైత సిద్ధాంత ప్రకారము, ఉత్పత్తి వినాశముల కసంభవ ముపపాదింపబడుచున్నది.

శ్లో॥ ఆకాశస్య యథా భేదశ్ఛాయాయా యాశ్చలనం యథా ।
జన్మనాశావభేదేఽపి తథా కైశ్చిత్ ప్రకల్పితౌ ॥ 111

ఆకాశస్య = ఆకాశమునకు, భేదః = అనేకత్వము, యథా = ఏ ప్రకారము, కల్పితమో, ఛాయాయాః = నీడకు, చలనం = కదలిక, యథా = ఎట్లు, కల్పింపబడినదో, తథా = ఆ విధముగ, అభేదే సత్యపి = అభేదమే అన్నను, జన్మనాశౌ = పుట్టుకయు, నాశమును, కైశ్చిత్, ప్రకల్పితౌ = కొందరిచే కల్పింపబడినవి.

తాత్పర్య విశేషాంశములు— ఆకాశమంతయు నొక్కటియే. అనేకాకాశములు లేవు. కాని ఆకాశముతో నిత్య సంయుక్తములగు ఘటము, మఠము మున్నగువాని భేదమును ఆకాశమునం దారోపించి. ఇది ఘటాకాశము, ఇది మఠాకాశము అని వ్యవహరించుచున్నారు.

నీడ అనునది వెలుగుయొక్క లేమి. దానికి కదలిక యుండదు. కాని వెలుగును ఆవరించిన ద్రవ్యముయొక్క చలన క్రియనుబట్టి, నీడకు చలనమును వ్యవహరింతురు. ఆ విధముగనే అభిన్నము అద్వయమునగు తత్త్వమునకు, జన్మ, నాశము అనునవి సంభవింప కున్నను, అవిద్యమూలముగ, ప్రాతిభాసికములగు జన్మ నాశములు కొందఱు కల్పించిరి. అది కల్పన మాత్రమే. ఈ విషయము సవిస్తరముగ సంబంధ సముద్దేశమున విచారింపబడినది. కనుక భావము, అభావము, పుట్టుక, నాశము అను వ్యవహారములు విచారసహములు కావు అని భావము. ॥111॥

అవతారిక— వస్తువులకు నాశముగూడ కల్పితమే అను విషయము నుపపాదించు నదీ కారిక.

శ్లో॥ యథైవాకాశ నాస్తిత్వమసన్మూర్తి నిరూపితమ్ ।
తథైవ మూర్తినాస్తిత్వమసదాకాశ నిశ్రయమ్ ॥ 112

అసత్ = సత్తుకాని = లేని, ఆకాశనాస్తిత్వం = ఆకాశము యొక్క లేమి, యథా ఏవ = ఏ ప్రకారముగా, మూర్తినిరూపితం = మూర్తిమంతములగు ఘటాదులన నేర్పడినదో, తథైవ = ఆ ప్రకారముగనే, మూర్తినాస్తిత్వం = ఘటాదుల లేమి, అసత్ = లేనిది, ఆకాశ నిశ్రయమ్ = ఆకాశ కృతమయినది.

తాత్పర్య విశేషాంశములు— ఆకాశమంతట వ్యాపించియుండునది. అది ఎచటను లేకుండ నుండదు. ఘటము మున్నగు మూర్తిమంతములగు ద్రవ్యములున్న స్థలమున నది లేదందురు. అట్లే మూర్త ద్రవ్యములగు ఘటాదులును విద్యమానములే అయినను, వాని నడుమ నాకాశముండుటచేత నచట నవి-లేవని అందురు. పదార్థముల స్వభావము సత్త. అది తిరోహితమయినపుడు, దానికి నాశమును, అది ఆవిర్భూతమయినపుడు, దానికి జన్మను కల్పింతురు. సకల పదార్థములును నెపుడును నుండునవియే. అందువలన 'పుట్టుట' అనునది అర్థముగల మాట 'కాదు'. ॥112॥

అవతారిక— పదార్థములకు జన్మ వాస్తవమే. కల్పితము గాదు అను, మతమును గలదు. ఆ మతమున, 'జాయతే = పుట్టుచున్నది' అను ప్రయోగమును, ప్రకారాంతర మున, సమర్థింపబడును.

శ్లో॥ యథాతదర్థైర్వ్యాపారైః క్రియాత్మా వ్యపదిశ్యతే ।
అభేదగ్రహణాదేవ కార్యకారణయోః క్రమః ॥ 113

క్రియాత్మా = ప్రధాన క్రియ స్వరూపము, తదర్థైః = దానికి కారణములైన, వ్యాపారైః = వ్యాపారములచేత, యథా = ఏ ప్రకారముగా, వ్యపదిశ్యతే = వ్యవహరింపబడుచున్నదో, తథా = ఆ ప్రకారము, కార్యకారణయోః = కార్యకారణముల, క్రమః = క్రమము = ఆను పూర్వి, అభేదగ్రహణాదేవ = అభేదము నారోపించుటవలననే, గృహ్యతే = వ్యవహరింప బడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— కార్యకారణములకు అభేదము వాస్తవమని యొక పక్షము. అది ఆరోపితమని వేఱొక పక్షము. అంకురమునకు పుట్టుట అను దానిని రెండ పక్షము నాశ్రయించి ఇపుడు సమర్థించుచున్నారు. పచధాతువునకు విక్లిత్తి ప్రధానమగు నర్థము. దానికి సాధకములగు వ్యాపారము లనేకములు అనేక కారకములచే చేయబడును. అందు కర్తచేయు పనులు, అధిశ్రయణము, = పొయ్యిమీదగిన్నె పెట్టుట, ఉదకాసేచనము = గిన్నెలో నీళ్ళు పోయుట, తండులావపనము = బియ్యము ఎసటిలో పోయుట, ఏధోపకర్ష ణము = కట్టెల నెగద్రోసి మండించుట మున్నగునవి. వానినన్నింటిని పాకమనియే అందురు. అట్లే కట్టెలు చేయు పాకము, అన్న ముడుకునకును చక్కగ మండుట. పాకమనగా కర్మ యందుండు క్రియాఫలము మాత్రమే వ్యాపారములు తదర్థములు. అప్రధానములు. వాని యందు ప్రాధాన్యము నారోపించి అట్టి వ్యవహారములు నడచుచున్నవి. ఆ విధముగనే కారణము కార్యార్థమగుటచేత వాని కభేదమును వ్యవహరింతురు. అంకురము పుట్టుచున్నది అను ప్రయోగమున, కారణమైన బీజము కార్యమగు అంకురముగా నేర్పడుచున్నదని అర్థము. బీజమునకును అంకురమునకును అభేదారోపము వలన నిర్వాహము. ॥113॥

అవతారిక— కార్యకారణముల అభేదారోపమును బురస్కరించి, జన్మ కర్తృ త్వము సమర్థింపబడినది. ఆ కర్తృత్వము, కారణమునకా ? కార్యమునకా ? అని సంశయము. ఏలయన— కారణము పూర్వసిద్ధమే గదా. ఇక నది పుట్టుట యన నేమి ? ఈ ప్రశ్నలను మనస్సున నుంచికొని, ప్రయోగములను బట్టి కార్యకారణములకు రెండింటికిని పర్యాయముగా కర్తృత్వము గలదని చూపబడుచున్నది.

శ్లో॥ వికారో జన్మనః కర్తా వికృతిర్వేతి సంశయే ॥
ఛిద్యతే ప్రతిపత్తౄణాం దర్శనం లింగదర్శనైః ॥ 114

జన్మనః = జన్మకు, వికారః = వికృతివాచకము, కర్తా వా = కర్త అగునా ? ప్రకృతి ర్వా=

ప్రకృతి = కారణ వాచకమా ? ఇతి = అని, సంశయే = సందేహము కలిగినపుడు, లింగ దర్శనైః = హేతువు లగపడుటచేత, ప్రతిపత్తౄణాం = జ్ఞాతలయొక్క, దర్శనం = మతము, భిద్యతే = వేరు వేరగుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— "క్షీరం దధి సంపద్యతే" = పాలు, పెరుగు అగుచున్నది అని ప్రయోగము కలదు. క్షీరము ప్రకృతి, దధి వికృతి. ప్రకృతి ప్రధానము, వికృతి అంగము. 'సంపద్యతే' అని చెప్పబడిన సంపత్తికి ప్రకృతియే కర్త్రి ఇది సమానాధి కరణ ప్రయోగములందలి స్థితి.

ఇక 'బీజాదంకురో జాయతే' = విత్తునుండి మొలక మొలచుచున్నది అను ప్రయోగమున, ప్రకృతి వికృతులు వ్యధికరణములుగా నిర్దిష్టములు. అట నిస్సంశయముగ వికృతియే కర్త్రి. ప్రకృతి ఉత్పద్యమానమునకు కారణమగుట వలన అపాదానము. కారికలో ప్రతిపత్తలు అనగా— ప్రకృతి కర్త అనువారును, వికృతికర్త అను మఱికొందరును. జన్మ అనగా ఆత్మ లాభము. అనగా స్వరూప ప్రాప్తి. అదివఱకు లేనిదిగదా పొందవలసినది. అట్టిది వికృతియే గదా. దానికే జన్మ. కావున నదియే కర్త కాదగినదని, వికృతివాదుల భావము. ఇక ప్రకృతికి కర్తృత్వమను వారు, ఇట్లు తలంతురు. లేని వికృతి, ఆత్మలాభమున కున్ముఖము కాజాలదు. జన్మకు కర్తయగుట అనగా, స్వరూప ప్రాప్తికి ఔన్ముఖ్యము. అది దానికి అసంభవము ప్రకృతికి స్వరూపలాభము సిద్ధము. ఉత్తరావస్థను బొందుటయే దాని కాత్మలాభోన్ముఖత. అది దానికి సంభవము. కావున నదియే కర్త్రి యగుట యుక్తమని వారి వాదము ॥114॥

అవతారిక— పై రెండు మతములకును ప్రయోగ స్వభావమును బట్టి విషయ విభాగము జూపబడు చున్నది.

శ్లో॥ క్లృపి సంపద్యమానే యా చతుర్థీ సా వికారతః ।
సువర్ణపిండే ప్రకృతౌ వచనం కుండలాశ్రయమ్ ॥ 115

క్లృపి = క్లృపి అర్థముగల ధాతువులు ప్రయోగింపబడినపుడు, సంపద్యమానే = పరిణమించుదానిని బోధించు పదమునందు, యా చతుర్థీ = ఏ చతుర్థీ ప్రత్యయముకలదో, సా, వికారతః = అది వికృతిని బుట్టినది. సువర్ణపిండే = సువర్ణపిండము, ప్రకృతౌ సత్యామ్ = ప్రకృతి అయినపుడు, వచనం = వచనము, కుండలాశ్రయమ్ = వికృతినిబట్టి వచ్చినది.

తాత్పర్య విశేషాంశములు— ''భక్తిః జ్ఞానాయ కల్పతే'' = భక్తి జ్ఞానముగా పరిణమించుచున్నది అని యర్థము. క్లృప్తి, సంపత్తి మున్నగునవి క్లృప్తి అర్థముగా గలవి. ''యవాగూః మూత్రాయ సంపద్యతే'' = గంజి మూత్రముగా నగును అందురు. జ్ఞానమును మూత్రమును వికృతులు. పై ప్రయోగములలో వికృతి వాచకమునకు పరముగా చతుర్థి అగపడుట వలన, 'క్లృపి సంపద్యమానేచ'' అను వార్తికముచే చతుర్థి విధింపబడినది. వ్యాకరణ

స్మృతికి ప్రయోగము గదా మూలము. అందువలన క్లృప్తి, సంపత్తి అను క్రియల కర్తృత్వము వికృతికే అని స్పష్టము

'భక్తిః జ్ఞానం జాయతే' 'యవాగూః మూత్రం జాయతే' అను నట్టి ప్రయోగములును గలవు. అందు ప్రకృతి వికృతి వాచకములు సమానాధికరణములు. అట ప్రకృతికి, వికృతి ద్వారముగా క్రియతో నన్వయము. ప్రకృతి వికృతులకు భేదమును వివక్షించినపుడు, ''యవాగ్వాః మూత్రం జాయతే'' = 'గంజినుండి మూత్రము పుట్టును' అని ప్రయోగము. కాగా అభేద వివక్షలోనే చతుర్థి కవకాశము.

మహాభాష్యమున– ''పునరావృత్తః సువర్ణపిండః పునరపరయా ఆకృత్యాయుక్తః ఖదిరాంగార సవర్ణే కుండలే భవతః'' అని ప్రయోగము కలదు. సువర్ణపిండము ప్రకృతి. కుండలములు వికృతులు. వికృతి వచనమైన ద్వివచనమే 'భవతః' అను క్రియాపదమున నగపడుటవలన వికృతి అటకర్త యనుటకు లింగము (అనగా గుర్తు). ఇట్లు ప్రయోగభేదముచే ఉభయము కర్త కావచ్చునని భావము. ॥115॥

అవతారిక— ఇట్లే, విషయభేదమును బట్టి ప్రకృతి వికృతులకు కర్తృత్వముండునని ఊహించుటకును ప్రయోగరూప లింగము లగపడుచున్నవి.

శ్లో॥ వాక్యే సంపద్యతేః కర్తా సంఘః చ్వ్యన్తస్య కథ్యతే ।
వృత్తౌ సంఘీభవన్తీతి బ్రాహ్మణానాం స్వతంత్రతా ॥ 116

చ్వ్యన్తస్య = చ్విప్రత్యయాంతము యొక్క, వాక్యే = విగ్రహవాక్యమున, సంపద్యతేః = సంపద్ ధాతువునకు, సంఘః = సంఘము, కర్తా, కథ్యతే = కర్తగా చెప్పబడుచున్నది, వృత్తౌ = చ్విప్రత్యయాంత వృత్తిలో, 'సంఘీభవంతి' ఇతి = 'సంఘమగుచున్నారు' అని, బ్రాహ్మణానాం = బ్రాహ్మణులకు, స్వతంత్రతా = కర్తృత్వము, కథ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు—"కృభ్వస్తియోగే సంపద్య కర్తరి చ్విః" (5-4-50) అని సూత్రము. ఆ సూత్రమున 'అభూతతద్భావ ఇతి వక్తవ్యమ్' అని వార్తికము. 'కృ, భూ, అస్' అను ధాతువుల ప్రయోగమునందు, ప్రకృతి వికృతిగా మారిన వికార వాచకమునకు, అభూత తద్భావమను నర్థమున = అనగా అదివఱ కారూపమునలేని దారూపమున మారినదను నర్థమున 'చ్వి' అను తద్ధిత ప్రత్యయము వచ్చునని దాని యర్థము. ''అసంఘః సంఘః సంపద్యతే = సంఘీభవన్తి బ్రాహ్మణాః అని యుదాహరణము. విగ్రహవాక్యమున కర్త సంఘము. చ్విప్రత్యయాంత వృత్తిలో ప్రకృతి భూతులయిన బ్రాహ్మణుల బహుత్వమును సూచించు బహువచనము 'భవన్తి' అని యగపడుచున్నది. కావున నిట్లు ప్రయోగభేదముచే ప్రకృతి వికృతులకు కర్తృత్వము నిర్బాధమని యెఱుంగునది. ॥116॥

అవతారిక— ప్రకృతి వాచకము కర్తృపదమై యుండుననుటకు భాష్యోక్తమైన లింగము

శ్లో॥ అత్వం సంపద్యతే య_స్త్వం న తస్మిన్ యుష్మదాశ్రయా ।
ప్రకృతిః పురుషస్యా_స్తి ప్రాకృతస్స విధీయతే ॥ 117

అత్వమ్ = "నీవు కానివాడు, త్వం = నీవుగా, సంపద్యతే = మారుచున్నాడు, (కావున) త్వద్భవతి=నీ వగుచున్నాడు" ఇతి = అను, యః = ఏ వాక్యముకలదో, తస్మిన్ = అందు, పురుషస్య = పురుష ప్రత్యయమునకు, యుష్మదాశ్రయా = నీవు అను నర్థ మాశ్రయముగా గల, ప్రకృతిః = ప్రకృతి, న అస్తి = లేదు, ప్రాకృతః = ప్రకృతికి సంబంధించిన, సః = ఆ పురుష ప్రత్యయము, విధీయతే = విధింపబడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— 'నీవు కానివాడు నీవుగా నగుచున్నాడు' 'అత్వం త్వం సంపద్యతే = త్వద్భవతి' అని భాష్యకారుని ఉదాహరణము. ఇచట 'నీవు' వికృతి. దానినిబట్టి మధ్యమపురుష ప్రత్యయ ముండవలెను. కాని అది లేదు 'భవతి' అని 'త్వద్భ న్నుడు' అను ప్రకృతికి సంబంధించిన ప్రథమపురుష ప్రత్యయము అగపడుచున్నది. అందువలన ప్రకృతి వాచకమునకు క_ర్తృత్వమని నిశ్చితమగుచున్నది ॥117॥

అవతారిక— ఈ విధముగ ప్రయోగములుండుటచే, విషయభేదమునుబట్టి ప్రకృతి వికృతులు రెండును క_ర్తలుగా నుండదగునని ఉద్బోధింపబడినది. కాని దానికి ఉపప_త్తి యేమి ? అనిన చెప్పుచున్నాడు.

శ్లో॥ పూర్వామవస్థామజహత్ సంస్పృశన్ ధర్మము_త్తరమ్ ।
సంమూర్ఛిత ఇవార్థాత్మా జాయమానోఽభిధీయతే ॥ 118

పూర్వాం = మొదటిదైన, అవస్థాం = కారణావస్థను, అజహత్ = విడచిపెట్టనిది అగుచు, ఉ_త్తరం = తరువాతిది అగు, ధర్మం = అవస్థను, సంస్పృశన్ = పొందుచున్నదై, సంమూర్ఛితః ఇవ = వి_స్తరించునదివలె నుండు, అర్థాత్మా = పదార్థము = వస్తువు, జాయమానః = పుట్టుచున్నదిగా, అభిధీయతే = వ్యవహరింపబడు చున్నది.

తాత్పర్య విశేషాంశములు— ఒక పదార్థమును 'ఇది పుట్టుచున్నది' అనిన, అది అంతకు పూర్వమున నే విధముగను లేనిది ఉద్భవించినదని యర్థము గాదు. కారణావస్థను వదలిపెట్టకుండగ, ఉదాసీనముగను నుండకుండగ, తరువాతి అవస్థలను పొందుచు తన్ను వి_స్తరింపజేసికొనునట్లు ఆ వస్తువు, 'జాయతే' అని చెప్పదగినదిగా నేర్పడును కాబట్టి ప్రకృతియు ఉత్ప_త్తికి ఆశ్రయమగును. దాని వికారమును అగును అందువలననే ప్రకృతి వికృతులు సమానాధికరణములుగా వ్యవహరింపబడు చుండును. ॥118॥

అవతారిక— అట్లయిన నొకచో నొకటి క_ర్తయు వేఱొకచో నింకొకటి క_ర్తయు నేల కావలెను. సర్వత్ర ప్రకృతి వికృతులు రెండును క_ర్తలేల గాలేదు ? అను ప్రశ్నకు సమాధానము.

శ్లో॥ సవ్యాపారతరః కశ్చిత్ క్వచిత్ ధర్మః ప్రతీయతే ।
సంసృజ్యన్తేచ భావానాం భేదవత్యోఽపిశక్తయః ॥ 119

క్వచిత్ = ఒకచోట, కశ్చిత్, ధర్మః = ఒకానొక ధర్మము, సవ్యాపారతరః = మిక్కిలి పనిచేయునదిగ, ప్రతీయతే = తోచుచుండును, భావానాం = పదార్థములయొక్క, శక్తయః= శక్తులు, భేదవత్యః అపి = ఒకచో భిన్న భిన్నములైనను, సంసృజ్యన్తేచ = వేఱొకచో సంసృష్టములును నగును.

తాత్పర్య విశేషాంశములు— కర్త అనగా వ్యాపారాశ్రయము = వ్యాపరించునది. ప్రకృతి వికృతులు రెండును అభిన్నములనుటచే, ఆ వ్యాపారము వానికి రెండింటికిని తుల్యమే కాని కర్తృ ప్రత్యయమున నొకచో నొకదాని వ్యాపార మధికమగును. అయినను విషయ విశేషమునుబట్టి 'జాయతే' అనుచోట రెండింటికిని కర్తృత్వమున కుపపత్తి చూపబడినది. ఎందువలననగా— కారకశక్తులు, కొన్ని స్థలములందు భిన్న భిన్నములే అయినను నొకచో నవి కలిసిపోవుచుండును. లేదా అంతటను రెండును కర్తలే. కాని అందొకదానికి సాక్షాత్తుగను వేరొకదానికి సద్వారకముగను నది సిద్ధించును.

ప్రకృతియు వికృతియు ఏక విభక్త్యన్తములుగ నిర్దేశింపబడినవి గదా. అందొకటి జనికర్త అయిన, రెండవదియు తప్పక జనికర్త యగును. వానిలో నొకటి విధేయమును నింకొకటి అనువాద్యమును నగుటవలన ప్రధానమగు విధేయమునకు, ఆ వ్యాపార మధికము. అనువాద్యమున కది అల్పమైయుండును. అందువలననే కారికలో 'సవ్యాపారతరః' అని 'తరప్' ప్రత్యయము గ్రహింపబడినది. ॥119॥

అవతారిక— పదార్థముల శక్తులు భిన్న భిన్నములైనను నవి ఒకానొకచో సంసర్గము కలవియునగునని చెప్పబడినదిగదా. అపుడు, 'అత్వం త్వం సంపద్యసే' అను విగ్రహముగల 'త్వద్భవతి' అను, తద్ధితాంత వృత్తిలో ప్రథమ పురుష ప్రత్యయమే ఏల యుండవలెను యుష్మదర్థభిన్నము ప్రకృతి, యుష్మదర్థము వికృతి అయినను కర్తృశక్తులు సంసృష్టములును నగునుగదా ? వికృతిని బట్టి మధ్యమ పురుష ప్రత్యయమును రాదగునే ? అను శంకకు పరిహార మీ కారికలో గలదు.

శ్లో॥ విపరీతార్థ వృత్తిత్వం పురుషస్య విపర్యయే ।
గమ్యేత సాధనం హ్యత్ర సవ్యాపారం ప్రతీయతే ॥ 120

పురుషస్య = పురుష ప్రత్యయముయొక్క, విపర్యయే = మార్పు కలిగినయెడల, విపరీతార్థ మగు నర్థము, గమ్యేత = తోచెడిది, అత్ర = ఇచట = ఈ ప్రయోగమునందు, సాధనం = యుష్మదర్థమగు సాధనము, సవ్యాపారం = వ్యాపారము కలదిగా, ప్రతీయతే హి = 'సంపద్యసే' అనుటవలన తోచుచున్నది గదా ?

తాత్పర్య విశేషాంశములు— "అత్వం త్వం సంపద్యసే" = త్వద్భవసి = నీవు

కానివాడవు నీవుగా అగుచున్నావు' అని ఇట్లు నీవు అను దానినిబట్టి 'అగుచున్నావు' అని మధ్యమపురుష ప్రత్యయమునుచేసి ప్రయోగించినచో, అనుకొనిన అర్థము రాదు. అపుడు, విరుద్ధముగ, 'త్వం అత్వం సంపద్యసే' నీవు, నీవు కానివాడవుగా మారుచున్నావని యర్థ మగును. ఆ వాక్యప్రయోక్త యొక్క తాత్పర్యమది గాదు. నీవు కానివాడు, నీవుగా మారు చున్నాడు, అనియే వివక్షితార్థము అది సిద్ధించుటకై ప్రథమపురుష ప్రత్యయమే యుక్తము. ॥120॥

అవతారిక— పై కారికలో ప్రతిపాదించిన దానినే వ్యాఖ్యానించునది ఈ కారిక

శ్లో॥ త్వమన్యో భవసీత్యేషా తత్ర స్యాత్పరికల్పనా ।
రాజ్ఞి భృత్యత్వమాపన్నే యథా తద్వత్ గతిర్భవేత్ ॥ 121

త్వమ్ = నీవు. అన్యః = నీవు కానివాడవు, భవసి = అగుచున్నావు, ఇతి, ఏషా = అను, ఈ, పరికల్పనా = అర్థకల్పన, తత్ర, స్యాత్ = అచట, కలుగును, రాజ్ఞి = రాజు, భృత్యత్వం = భృత్యధర్మమును, ఆపన్నే, సతి = పొందినవాడైనపుడు, యథా = ఏ ప్రకారమో, తద్వత్ = ఆ ప్రకారముగా, గతిః, భవతే = అర్థప్రతీతి. కలుగును.

తాత్పర్య విశేషాంశములు— "రాజన్ అరాజా సంపద్యసే" అనిన, 'ఓ రాజా నీవు రాజు కానివాడవుగా మారుచున్నావు' అని యర్థము, అచట తిఙ్ ప్రత్యయపుగు 'సే' (వు) అనునది, నీవు అనునది ప్రకృతి అనియు, అది భృత్యుడుగా పరిణమించుట యను సంపత్తి క్రియకు కర్త అనియు తెలియజేయుచున్నది. రాజు కానివాడనగా భృత్యుడు. అది రాజ శబ్దార్థమునకు విరుద్ధము.

ఆ దృష్టాంతముగా 'త్వద్భవసి' అనిన అవస్థాంతరమును బొందినది యుష్మ దర్థమని నిశ్చితము అగుటవలన, 'నీవు కానివాడు నీ వగుచున్నాడు' అను వివక్షితార్థము సిద్ధించుటకు 'త్వద్భవతి' అని ప్రథమపురుష ప్రయోగ ముచితము. ఒకటి చెప్పదలంచిన వాడు వేఱొకదానిని చెప్పడుగదా!

అట్లయిన, "సువర్ణపిండః ఖదిరాంగార సవర్ణే కుండలేభవతః" అను భాష్య ప్రయోగమున గూడ, వికృతికి కర్తృత్వమును వివక్షించిన, 'కుండలములు సువర్ణ పిండముగ పరిణమించుచున్నవి' అని విపరీతార్థబోధ కలుగునా? అని శంకింపవచ్చును. కాని ఆ శంక అవిచారితరమణీయము. ఏలయన, అది చ్వి ప్రత్యయాంతము గాదు. చ్విప్రత్యయాంత వృత్తి విషయముననే కర్తకు వికారాంతరాదేశము. ప్రకృతి, వికృతిగా పరిణమించినపుడే చ్వి ప్రత్యయము. ప్రకృతి, స్వతః, సిద్ధమే. అది వికృతియొక్క రూపమును బొందినపుడు, దానికి కర్తృత్వము న్యాయ్యము. ఈ విషయమున యుక్త్యంతరమును గలదు. చ్వి ప్రత్య యాంతములకు క్రియాయోగమున 'గతి' అను సంజ్ఞను, "ఊర్యాదిచ్విడాచశ్చ" అను సూత్రము విధించుచున్నది. గతి సంజ్ఞకములు క్రియావిశేషణములు కావలెను. క్రియా విశేష

ణములకు కర్మత్వ మంగీకరింపబడినందున, వానికి కర్తృత్వము కుదురదు. కావున, ప్రకృతి వాచకమునకే, చ్వి ప్రత్యయాంతార్థ విశేషితమగు క్రియలో కర్తృత్వము న్యాయప్రాప్తము.

నూట అయిదవ కారికనుండి నూట ఇరువదియొకటవ కారిక (శ్లోకము) వఱకును విచారింపబడిన విషయ విశేషమంతయు ఆనుషంగికము (అందు, చివర కొంత గ్రంథము, అసమన్వితమును, అప్రస్తుతమునగుటచే పరిత్యక్తము.) ఇంతతో నది సమాప్తము. ॥121॥

అవతారిక — కర్తకు స్వాతంత్ర్యము లక్షణమని "స్వతంత్రః కర్తా" (1-4-54) అను సూత్రముచే తెలియబడినది ఆ స్వాతంత్ర్యమన నేమియో "ప్రాగన్యతః శక్తి లాభాత్" ఇత్యాది కారికలచే వ్యాఖ్యానించిరి. కర్త, ప్రయోజకకర్త అనియు, ప్రయోజ్యకర్త అనియు రెండు విధములు.

"పాచయత్యోదనం దేవదత్తేన యజ్ఞదత్తః" = యజ్ఞదత్తుడు దేవదత్తునిచే అన్నము వండించుచున్నాడు. యజ్ఞదత్తుడు, దేవదత్తుని అన్నము వండుటకు ప్రేరించినవాడు. కావున ప్రయోజకకర్త. దేవదత్తుడు ప్రేరితుడు. ప్రయోజ్యకర్త. 'దేవదత్తేన' అను పదము తృతీయాంతము. తృతీయకు కర్త అర్థము కర్త స్వతంత్రుడుగదా. యజ్ఞదత్తునిచే ప్రేరితుడై ప్రవర్తించిన దేవదత్తుడు స్వతంత్రు డెట్లగును? కరణాదికారకములవలె తానును నిపుడు పరాధీనుడు గదా. కర్తృసంజ్ఞ ఎట్లు? తృతీయ ఎట్లు? అని ఇపుడు విచారింపవలసి యున్నది. "స్వతంత్రః కర్తా" (1-4-54) అను సూత్రమున మహాభాష్యమునందు, "స్వతంత్రస్య కర్తృ సంజ్ఞాయాం హేతుమత్యుపసంఖ్యానమ్" "అస్వతంత్రత్వాత్" అను వార్తికము, ప్రయోజ్యకర్త ప్రయోజకాధీనుడు గాన స్వతంత్రుడు గాజాలడు. అందువలన వేఱుగా ప్రయోజ్యునకు కర్తృ సంజ్ఞను చెప్పవలసియుండునని ఆపాదించెను

ఈ శంకకు పరిహార వార్తికమును అచటనే కలదు. "నవా స్వాతంత్ర్యాత్" అని. 'ప్రయోజ్యునకు గూడ తన పనిలో స్వతంత్రత లేకపోలేదు. కావున వేఱుగా చెప్పనక్కర లేదు' అని తాత్పర్యము.

అట్లనిన, 'కరణాదికారకములు గూడ తమ తమ వ్యాపారములందు స్వతంత్రములే కావున వానికిని కర్తృసంజ్ఞ ప్రవర్తింపవలసి యుండునే' అను ప్రశ్నకు సంభవము కలదు. సత్యమే కాని వానికి వేఱు వేఱుగా నాయా సంజ్ఞలను పాణిని చెప్పియుండెను గదా. ప్రయోజ్యున కట్టి సంజ్ఞ వేరేదియు లేదాయె. కాబట్టి ఆ ప్రశ్న కవకాశము లేదు.

అటులైనను, కర్త సాంనిధ్యమున కరణాదికారకములకు స్వాతంత్ర్యము లేనట్లు, ప్రయోజక సన్నిధిలో ప్రయోజ్యునకును పారతంత్రమేగాని స్వతంత్రత ఎట్లు? అని శంకించి సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ సంభావనాత్ క్రియాసిద్ధౌ కర్తృత్వేన సమాశ్రితః ।
క్రియాయామాత్మ సాధ్యాయాం సాధనానాం ప్రయోజకః ॥ 122

శ్లో॥ ప్రయోగమాత్రే న్యగ్భావం స్వాతంత్ర్యాదేవ నిశ్రితః ।
అవిశిష్టో భవత్యన్యైః స్వతంత్రైః ముక్తసంశయైః ॥ 123

క్రియాసిద్ధౌ = క్రియ సిద్ధించుటలో, సంభావనాత్ = సామర్థ్యమును భావించుటవలన, కర్తృత్వేన = స్వతంత్రుడుగా, సమాశ్రితః = ఆశ్రయింపబడినవాడును, ఆత్మసాధ్యాయాం = తనచే సాధింపదగిన, క్రియాయాం = వ్యాపారములో, సాధనానాం = కరణాదికారకములకు, ప్రయోజకః = ప్రవర్తకుడును, స్వాతంత్ర్యాదేవ = స్వతంత్రుడగుట వలననే, ప్రయోగ మాత్రే = ప్రేరింపబడినంతనే, న్యగ్భావం = ప్రయోజకాధీనత్వమును, నిశ్రితః = పొందిన వాడును నగు ప్రయోజ్యుడు, ముక్తసంశయైః = సందేహప్రసక్తి యేదియు లేని, అన్యైః = ఇతరులగు, స్వతంత్రైః = స్వతంత్ర కర్తలతో, అవిశిష్టః, భవతి = తుల్యుడే అగును.

తాత్పర్య విశేషాంశములు— ఒక డొకనిని ఒక పనిలో నియోగించినపుడు, వాని కా పనిని నిర్వహించు శక్తి కలదని తెలిసికొనియే నియోగించును. నియోజ్యుడు, అసమర్థుడును, అలసుడును అని తెలిసినపుడు నియోగింపనే నియోగింపడు గదా. కావున, నియోజ్యుడును స్వతంత్రుడే.

ఒకడు తనకు నియోగింపబడిన పనిని చేయుచునే యుండును. అయినను, మాన కుండుటకును, త్వరగా నాత డా పనిని ముగించుటకును గూడ ప్రేరింతురు. అపుడాతడు, తన స్వతంత్రతచే, కరణాదికారకములను నియోగించి, ఆ పనిని నిర్వర్తించును. కనుకను నాతడు స్వతంత్రుడు.

మరియు నాతడు, ప్రయోజకుడు తన్ను ప్రేరించినపుడు, ఆతని ఆజ్ఞలకు లోబడి పనిచేయుట కంగీకరించుటయు స్వతంత్రుడు గనుకనే.

ప్రేరకుని ప్రేరణకు ఫలము క్రియాసిద్ధి. నియోజ్యుడు సాధనాంతరములను వినియోగించి, ఆ కార్యమును సాధించు స్వాతంత్ర్యమును కలిగియుండిననే ప్రేరణ సఫలమగును. కాగా, నియోగమునకును, స్వస్వాతంత్ర్యమునకును విరోధము లేదు. పైగా, తన వ్యాపారమున తనకు స్వాతంత్ర్యముండుట, తాను ప్రయోజకునకు పరతంత్రుడగుట కుపాయమే యగును కావున, ప్రయోజ్యుడగు కర్తయు, పరప్రేరితుడు కాని కర్తతో సమానుడే యని కారికల భావము.

ఈ సందర్భమున, మహాభాష్యమునందలి వార్తికములు, ప్రకృత విషయమును జక్కగ నుపపాదించినవి, భర్తృహరి ఈ కారికులకు, మూలములు. చూడుడు :

ఇతరథా హ్యకుర్వత్యపి కారయతీతి స్యాత్ ।
నాకుర్వతీతి చేత్ స్వతంత్రః ॥

ప్రయోజ్యుడు కూడ కరణాదికారకములనే వినియోగించి పనిచేయుచున్నాడు గదా. ఆత డే పనిని చేయనపుడు, దేవదత్తునిచే వండించుచున్నాడు అనరు. కావున నాతడు స్వతంత్రుడే అని వార్తికార్థము.

ఇటనొక ప్రశ్న కలుగును– ప్రయోజ్యుని ప్రేరించు ప్రయోజకునకు కర్త అను సంజ్ఞయును, హేతువు అను సంజ్ఞయును విహితములు కర్త అనగా స్వతంత్రుడు. ''స్వతంత్రః కర్తా''. స్వతంత్రములయిన వానిని ప్రేరించు వ్యక్తి యెల్ల హేతువయిన, కరణాదులను ప్రేరించు ప్రయోజ్యకర్తకును హేతుసంజ్ఞ కలుగవలసి యుండును. అపుడు ''హేతుమతిచ'' – అను సూత్రముచే ణిచ్ ప్రత్యయము రావలసియుండును. అది ఒక దోషము. ఇంకను నిట్టి దోషము లనేకములు కలవు. దీనికి సమాధానము ముఖ్యముగా నే మనిన, హేతు సంజ్ఞను విధించిన సూత్రమున, 'తత్ప్రయోజకః' అనుచో తత్ అను సర్వ నామ పూర్వ నిర్దిష్టమును పరామర్శించును. పూర్వ నిర్దిష్టము 'కర్తా' అను సంజ్ఞ కలది. స్వతంత్ర మాత్రము గాదు కరణాదులు కూడ ఏ పనిని చేయకుండిన నవి కారకముతే కావు. కావున వానికి స్వాతంత్ర్యము కారకసంజ్ఞ కుపయోగించునది మాత్రమే. కర్త స్వాతంత్ర్యము వంటిది కాదు. అంతకంటె నది నికృష్ట స్వాతంత్ర్యము. కావున వానికి 'కర్తా' అను సంజ్ఞ లేదు.

ప్రయోజ్యకర్త, తాను ప్రయోజకునిచే ప్రేరింపబడి పని చేసినను కరణాది కారకములకు తమ తమ పనులలో ప్రవర్తింపజేయుట అను స్వాతంత్ర్యమును కలిగియే యుండును. అది ప్రకృష్టము కర్తృసంజ్ఞకు సంపాదకము, అని భావము. ॥122, 123॥

అవతారిక— ప్రయోజ్యుడు ప్రయోజకుని ఆజ్ఞలకు తలయొగ్గి యుండును. ఆదియు స్వాతంత్ర్యమువలననే అని కారికలో, ''ప్రయోగిమాత్రేన్యగ్భావమ్'' ఇత్యాదిగా జెప్పియున్నారు బాగుగ విచారించిన, ఆ న్యగ్భావము గూడ నాతనికి లేదని దీనివలన దెలియును.

శ్లో॥ నిమిత్తేభ్యః ప్రవర్తన్తే సర్వ ఏవ స్వభూతయే ।
అభిప్రాయానురోధోఽపి, స్వార్థస్యైవ ప్రసిద్ధయే ॥ 124

సర్వేఏవ = ఎల్లవారును, స్వభూతయే = స్వార్థముకొఱకే, నిమిత్తేభ్యః = హేతువుల వలన, ప్రవర్తన్తే = ప్రవర్తింతురు, అభిప్రాయానురోధః అపి = ప్రేరకుని అభిప్రాయమును, ప్రేర్యు డనుసరించుటయు, స్వార్థస్య = తన ప్రయోజనము యొక్క, ప్రసిద్ధయే ఏవ = సిద్ధించుట కొఱకే అగుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— ప్రయోజనము నపేక్షించి ప్రవర్తించు ప్రతి వ్యక్తియు, తన ప్రవృత్తి పరాధీనమగుట కిచ్చగింపడు భృత్యులు మున్నగువారు ప్రభువుల ఆశయమును బట్టి వర్తించుచున్నారనిన నది స్వార్థసిద్ధి కుపాయమగునను తలంపు తోడనే. వీతరాగులు కారుణ్యమువలన చేయు పనులును వారికవి ఇష్టసాధనములగుటవలననే చేయుదురు 'ఈ పని నా కభీష్టమైన దానిని లభింపజేయును' = 'ఇదం మదిష్టసాధనమ్' – అను నభిప్రాయమే ఎల్లరను ప్రవర్తింపజేయునది.

''సర్వ ఇమే స్వభూత్యర్థం యతన్తే। నేహ కశ్చిత్ పరోఽనుగృహీతవ్య ఇతి''

అని మహాభాష్యము. 'ఎల్లరును తమ స్వార్థముకొఱకే ప్రవర్తింతురు, ఇతరుల నను గ్రహింప వలెనని ఎవరును పనిచేయరు' అని అర్థము.

ఒక ప్రశ్న— అట్లయిన 'ప్రయోజ్యుడు' అను పదమున కర్థమేమి? 'ప్రేరణా జన్య ప్రవృత్త్యాశ్రయుడు = ఒకరు ప్రేరింపగా ప్రవర్తించినవాడు' అని గదా. ఆతడును స్వప్రయోజనమునకు తానే ప్రవర్తించెననిన నట ప్రేరణ కుపయోగమేమి?— ఈ ప్రశ్నకు సమాధానము ''యదభిప్రాయేషు సజ్జతే'' అను వార్తికము. ప్రేరకుని అభిప్రాయమును గ్రహించి ప్రయోజ్యుడు దానిని నిర్వర్తించుటకు సిద్ధమగుటయే ప్రేరణకు ఫలమని తాత్పర్యము.

''హేతుమతిచ'' అను సూత్రమున, ఆ సూత్రముచే సిద్ధింపని ప్రయోగములు సిద్ధింపజేయుట కవతరించిన ఉపసంఖ్యాన వార్తికము లనేకములు పై అభిప్రాయముతోడనే మహాభాష్యకారుడు ప్రత్యాఖ్యానము చేసి యుండెను. అందు కొన్ని వార్తికములను జూతము.

ఒక బాటసారి ఉజ్జయినిలో బయలుదేరి ప్రయాణము సాగించుచున్నాడు సూర్యోదయ కాలమునకు మాహిష్మతీ నగరము చేరవలెనని ఆతని తలంపు. ఆ సంనివేశమును ఆశ్చర్యముతో జెప్పుచు నింకొకడు ''పథికః మాహిష్మత్యాం సూర్య ముద్గమయతి'' అని ప్రయోగించెను 'సూర్యుని ఉదయింపజేయుచున్నాడు' అని గదా యర్థము. సూర్యుడు తానే ఉదయించునుగాని ఈ పథికుని ప్రేరణచే కాదు. కాగా ప్రయోజకుని వ్యాపారము లేదు. అందువలన నట్టియెడ ణిచ్ ప్రత్యయము సిద్ధించుటకు, ''చిత్రీకరణే ప్రాపి'' అని యొక వార్తికము, ణిచ్ప్రత్యయోపసంఖ్యానము ఆవశ్యకమని చెప్పెను. ఆశ్చర్యమును గలుగ చేయుట గమ్యమయినపుడు ప్రాప్తి అను నర్థమున ణిచ్ప్రత్యయమును విధింపవలెనని యర్థము. 'సూర్యోద్గమన' అను కృదన్తము ప్రకృతి. ణిచ్ ప్రత్యయము కృత్ప్రత్యయమగు 'అన' అను దానికి లోపము. కర్మ కారకమయిన సూర్యునకు, 'సూర్యం' అని వేఱుపాటు మున్నగునవి విధేయములు అని తాత్పర్యము

కాని అచట గూడ పథికుని అభిప్రాయానుసారముగా సూర్యోదయము జరిగినది కాన పథికుడు హేతువే. పథికుడు తాను మాహిష్మతిని చేరునప్పటికి సూర్యోదయము కావలెనని సంకల్పించెను. అట్లే జరిగినది. అది కాక తాశీయమైనను పథికున కందు హేతుత్వము దేవదత్తుని, వంటకు ప్రేరించిన యజ్ఞదత్తుని హేతుత్వముతో తుల్యమే. కావున ''హేతుమతిచ'' (3-1-26) అను సూత్రముచేతనే ణిచ్చు సిద్ధింపవచ్చును అను నభిప్రాయముతో, ''న వా సామాన్య కృతత్వాత్ హేతుతో హ్యవిశిష్టమ్'' అని ప్రత్యాఖ్యానము చేయబడినది.

'కంసవధ' 'బలిబంధము' అనునవి ఉపాఖ్యానములు. వానిని జెప్పు కథకుని 'కంసం ఘాతయతి' 'బలిం బంధయతి' 'ఘాతయతి' అనగా చంపించు చున్నాడు, అనియు, 'బంధయతి' అనగా కట్టింపించుచున్నాడు అనియు ణిజన్తముల కర్థము. పై ప్రయోగములందా యర్థము కుదురదు. కావున నుపాఖ్యాన మావశ్యకమను నభిప్రాయముతో, ''ఆఖ్యానాత్

కృతః తదాచష్టే కృల్లుక్ ప్రకృతి - ప్రత్యాపత్తిః ప్రకృతి వచ్చకారకమ్'' - అను వార్తిక మవతారితము. 'సూర్య ముద్గమయతి' అను స్థలమున 'సూర్యోద్గమనము' అను కృదన్తము కంటె పరముగా ణిచ్చు విధింపబడిన సందర్భమునందలి ప్రక్రియ వంటి ప్రక్రియ ఇచ్చటను చూచుకొనవలెను. ఈ ఉపసంఖ్యానమును నిరాకృతము. హేతువు పూర్వోక్తమే.

కంసుడు చిరకాలమ క్రిందటనే హతుడు గదా బలి బంధనమును చిరప్రవృత్తమే 'సూర్య ముద్గమయతి' అనునట్లు అచట 'ఘాతయతి' 'బంధయతి' అను వర్తమానత ఎట్లు పొసగును అని యడుగవచ్చును - సమాధానము, వినుడు

శౌభికులు, అనగా, కంసబలివేషములను ధరింపించి వారిని తయారుచేసి వారిచే నాటకమును ప్రదర్శింపించు ఉపాధ్యాయులు, కంసుని, కృష్ణునిచే ప్రత్యక్షముగ చంపించుచున్నారు. బలిని బంధింపించుచున్నారు గదా. పురాణ ప్రవచనమైన, పౌరాణికుడు, తన ప్రవచన పాటవముచే ఆ పనులను ప్రత్యక్షముగ జరుగుచున్నట్లు చూపగలడు. కొందఱు కంసవధ నాటకమును జూచుటకు బోవుచున్నారు మరికొందఱు ముందుగా వెళ్ళి, తిరిగి వచ్చివేయు చుందురు. అపు డే మగుచున్నదని వారి నడిగిన, 'గచ్ఛ కంసో హన్యతే' అందురు ఏమగును ? అనిన 'కంసో ఘానిష్యతే' కంసుడు చంపబడునిక' అందురు. నాటకము సమాప్తమయిన తరువాత బోవు వారిని జూచి, 'కంసోహతః కింపశ్యసి' = కంసుడు చంపబడెనాయె ఇక నేమి చూతువు' అని ఇట్లు త్రికాల వ్యవహారమును గలదు గదా! ఇంత ఏల చిత్రకారుల చిత్రకర్మ కూడ కంసవధను ఇపుడు జరుగుచున్నదా, యనునట్లు భావింపజేయును. అది అంతయు కౌశల మూలకము.

'భిక్షా వాసయతి' అని అందురు ఆయూర నతడెందులకున్నాడు ? అని ప్రశ్నించిన 'భిక్ష ఆతనినచట వసింపజేయుచున్నది' అని సమాధానము. భిక్ష సమృద్ధముగా నట లభించుటచే నున్నాడు. కాగా అది నిమిత్తము. ప్రయోజకమనగా, చేతనమే కానక్కర లేదు. నిమిత్త మాత్రమును హేతువే. కనుకనే కారికలో 'నిమిత్తేభ్యః ప్రవర్తన్తే' అని కలదు.॥124॥

హేత్వధికారము

అవతారిక — కర్తయే, ప్రేరకుడైన, హేతువు అనబడునుగాన కర్తృ విచారము నకు తరువాత హేతువిచారము ప్రసక్తము

శ్లో॥ ప్రేషణాధ్యేషణే కుర్వం స్తత్సమర్థాని చాచరన్ ।
కర్తైవ విహితాం శాస్త్రే హేతుసంజ్ఞాం ప్రపద్యతే ॥ 125

ప్రేషణాధ్యేషణే = ఆజ్ఞాపన ప్రార్థనములను, కుర్వాన్ = చేయువాడును, తత్సమర్థాని = ప్రేరితునకు సహాయపడు పనులను, ఆచరన్‌చ = చేయువాడునునగు, కర్తాఏవ = కర్తయే, శాస్త్రే, విహితాం = శాస్త్రమున, విధింపబడిన, హేతుసంజ్ఞాం = 'హేతుః' అను సంజ్ఞను, ప్రపద్యతే = పొందుచున్నాడు

తాత్పర్య విశేషాంశములు— ఆజ్ఞా పురస్సరముగ తనకంటె తక్కువవానికి పనిని చెప్పుట ప్రేషణము. తనకంటె పెద్దలయిన అభ్యర్థితులను ప్రార్థించి పనులను చేయించుకొనుట అధ్యేషణము. తత్సమర్థాచరణ మనగా, ప్రయోజ్యుడు చేయవలసిన పని సఫలమగుటకు అనుకూలమగు పరిస్థితులను కల్పించుట. ఇదియే ముఖ్యమగు ప్రయోజక వ్యాపారము. 'భిక్షావాసయతి' అను స్థలమున భిక్షయొక్క వ్యాపరమఁదియే గదా. ప్రేషణా ధ్యేషణములు, దీని భేదములే. స్వాభిప్రాయ ప్రకాశనము ప్రయోజకుని పని. తదను విధానము-ప్రయోజ్యుని పని. కావున తత్సమర్థాచరణమే సర్వత్ర ప్రయోజకుని వ్యాపారము.

కర్తయే హేతుసంజ్ఞను బొందునని చెప్పుటవలన, కర్తృ సంజ్ఞకును హేతుసంజ్ఞ కును సమావేశము సూచితము. లేనిచో నిది ఏకసంజ్ఞాధికారమగుటచే కర్తృసంజ్ఞను హేతు సంజ్ఞ బాధింపవలసి వచ్చెడిది. హేతుసంజ్ఞను విధించిన ''తత్ప్రయోజకో హేతుశ్చ'' (1-4-55) అను సూత్రమునందు చకారమున కిదియే ప్రయోజనము. ఇది శాస్త్ర విహితమగు సంజ్ఞ. కావున హేతుపదము గల విధి సూత్రములందు దీనికే గ్రహణము. లోక ప్రసిద్ధమగు హేతువు ద్రవ్యగుణములకు కూడ హేతువగును. ఈ హేతువు క్రియామాత్ర విషయము. ఇది కారకము. ప్రేషణా ధ్యేషణాదులు దీని వ్యాపారములు ''హేతుమతిచ'' (3-1-26) ''భియో హేతుభయేషుక్'' (7-3-40) ఇత్యాది సూత్రములందు ఈ హేతువునకే గ్రహణము

కొన్ని స్థలములందు అనగా ''హేతౌ'' (2-3-23), ''లక్షణహేత్వోః క్రియాయాః'' (3-2-126) హేతుహేతుమతోర్లిఙ్'' (3-3-156), ''కృఞో హేతుతాచ్ఛీ ల్యానులోమ్యేషు'' (3-2-20) మున్నగువానిలో లౌకిక హేతువునకే గ్రహణమని ఆయా సూత్రార్థముల పరిశీలనము వలన తెలియనగును

ఒక ప్రశ్న— ''హేతుమతిచ'' (3-1-26) అను సూత్రము, ప్రయోజక వ్యాపా రములగు ప్రేషణాదులు వివక్షితము లగునపుడు ధాతువునకు ణిచ్ప్రత్యయమును విధించు చున్నది. ''ప్రైషాతిసర్గ ప్రాప్తకాలేషు కృత్యాశ్చ'' (3-3-163) అను సూత్రమును, విధ్యర్థమునందు కృత్య ప్రత్యయములతో బాటు 'చ' కారముచే 'లోట్' అను లకారమును గూడ విధించినది ప్రైష అనగా విధి అదియు ప్రయోజకుని వ్యాపారమే గదా. కాగా ''పృచ్ఛతు మా భవాన్'' = 'నీవు నన్ను అడుగవలెను' అను వాక్యమున ప్రకృత సూత్ర ముచే ణిచ్ ప్రత్యయమును వికల్పముగ నేల రాలేదు? ఇట విధి స్పష్టముగ నగపడు చున్నది గదా!

సమాధానము— ''అకర్తృత్వాత్'' అని భాష్యము. అడుగుచున్న వానిని ప్రేరించిన వాడు ప్రయోజకుడు. 'నన్నడుగుము' అని ప్రయోజకుడు చెప్పుటకు పూర్వము, ప్రష్ట, ప్రశ్న క్రియలో ప్రవర్తించి యుండలేదు కావున కర్తృత్వము లేదు. ఆతడు వ్యాపార వంతుడైన నాతని ప్రేరించునతడు హేతువగును గదా! కావున ణిజాపత్తికి అవకాశము లేదు.

మరల ప్రశ్న— వర్తమాన కాలమున, ప్రశ్నింపక ఉదాసీనుడుగా నుండ

వచ్చును. కాని భూతకాలమున ప్రశ్నించియుండెనేమో ? లేదా భావిలో ప్రశ్నించుననవచ్చును. కాన ప్రయోజ్యునకు కర్తృత్వము కలదన వచ్చునే అని—

సమాధానము— భూతభావి క్రియలతో బుద్ధి పరికల్పితమైన సంబంధము ప్రయోజ్యునకు చెప్పవచ్చుననుకొనుడు. వర్తమాన కాలమున క్రియా సంబంధ మెట్లు. ఇపుడాత డూరకినే యుండెను గదా. 'అడుగుము' అనకున్న నడుగబోడు గదా. కాగా వానికి కర్తృత్వము లేదు ప్రశ్నించుము = ప్రశ్నక్రియాకర్తవగుము. క్రొత్తగ కర్తృత్వము విధింపబడు చుండెనాయె. ఇది ణిజ్విషయము కాదు.

• క్రియావిశిష్టుడగు కర్తకు ప్రయోజకుడు ప్రేషణాదికమును జేసిన ఆ వ్యాపారము ణిచ్చుకు వాచ్యము. లోట్ప్రత్యయ విషయము వేరు. అచట కర్త, లకారమునకు వాచ్యుడు. ప్రైష, ద్యోత్యము మాత్రమే. వాచ్యము కాదు. దానికి వర్తమాన కాలికత్వ మక్కరలేదు కావున అపుడడుగని వానిని గూడ 'పృచ్ఛతు మా భవాన్' అని, లేదా 'అనుయుజ్క్తాం మా భవాన్' అనవచ్చును. అను యోగమనినను ప్రశ్నయే. ముఖ్యమైన భేద మిది. ఏమి ? ణిజర్థమగు ప్రైష ప్రయోజ్యధర్మము లోడర్థమగు ప్రైష ప్రయోక్త ధర్మము ॥125॥

అవతారిక— ఆ భేదమునే వివరించునది ఈ కారిక

శ్లో॥ ద్రవ్యమాత్రస్య తు ప్రైషే పృచ్ఛ్యాదేర్లో ద్విధీయతే ।
సక్రియస్య ప్రయోగస్తు యదా స విషయో ణిచః ॥ 126

ద్రవ్యమాత్రస్య = క్రియారహితమునకు, ప్రైషేతు = ప్రేరణము వివక్షితమైనపుడు, పృచ్ఛి ఆదేః = పృచ్ఛి మున్నగు ధాతువునకు, లోట్ = లోట్ అను లకారము, విధీయతే = విధింపబడు చున్నది, యదాతు = ఎపుడు అయిన, సక్రియస్య = క్రియావిశిష్ట కర్తకు, ప్రయోగః = ప్రేరణము వివక్షితమగునో, తదా సః = అపుడు, ఆ ప్రయోజ్యుడు, ణిచః = ణిచ్ప్రత్యయమునకు, విషయః = ప్రాప్తి స్థానము, భవతి = అగును.

తాత్పర్య విశేషాంశములు— ఒక డొకనిని 'నీవు నన్నడుగుము' అనినపుడు, ఆ అడుగవలసినవాడు, అంతకుముందా క్రియలో ప్రవర్తించి యుండలేదు. క్రియ లేనిచో కారకత్వమే లేదాయె. కర్తృత్వ మెట్లు లభించును ? లోట్ప్రత్యయ ఘటితములగు, 'పృచ్ఛతు' అనుయు 'జ్క్తామ్' అను పదములను ప్రయోగించిన నపుడు కర్తృత్వము కలుగును. అట విధి, ద్యోత్యము. కర్తయే వాచ్యుడు ఇది క్రియయందు ప్రవర్తింపని ద్రవ్య విషయము.

ఇక క్రియయందు ప్రవర్తించిన కర్తకు, ఆ క్రియను మానకుండుట ప్రేరణ చేయుటయు గలదు. ఆ ప్రేరణ వివక్షితమైనపుడు ణిచ్ప్రత్యయము విహితము. అది దానికి వాచకమే.

ఈ ప్రకారముగా, ణిచ్ లోట్ ప్రత్యయములకు విషయ విభాగము లౌకిక శబ్ద ప్రయోగములందు స్పష్టముగ నవధారితమై యున్నది. పృచ్ఛతు, మా, భవాన్, అను

లోడన్త స్థలమున ప్రయోజక కర్తను చెప్పు పదమేదియు లేదు. అచట ఉచ్చరించు వ్యక్తియే సామర్థ్యమువలన కర్తగా ప్రతీయమానుడగును.

ఇట్లు విషయభేదము స్ఫుటముగ నున్నను, శాస్త్రమున ఆ విభాగము చేయబడ లేనందున, 'మాభవాన్ పృచ్ఛతు' అను స్థలమున ణిచ్ప్రత్యయ మేల రాలేదను పూర్వ పక్షము, అదియు ప్రైషయే గదా అని సామాన్య దృష్టిలో చేయబడినది. అంతియ– ॥126॥

అవతారిక— ''యజ్ఞదత్తుడు దేవదత్తునిచేత అన్నమును వండించుచున్నాడు'' అను వాక్యమున యజ్ఞదత్తుడు ప్రేరకుడయిన కర్త హేతువు. దేవదత్తుడు ప్రయోజ్యుడు. కర్తకు ఈప్సితతమము కర్మ. అనగా, కర్త, తన క్రియచేత దేనిని సంబంధింపదలంచునో అది. యజ్ఞదత్తుడు, తన ప్రేషణ క్రియచే దేవదత్తుని గదా సంబంధింపదలచినది కాగా దేవ దత్తుడు కర్మ కావలెను. ద్వితీయాంతముగ నుండవలెను. 'దేవదత్తునిచేత' అని అచట కర్తృ తృతీయ అగపడుచున్నది. అది యెట్లుపపన్నమగును? అను శంకకీకారిక సమాధానము.

శ్లో॥ గుణక్రియాయాం స్వాతంత్ర్యాత్, ప్రేషణే కర్మతాంగతః ।
నియమాత్ కర్మసంజ్ఞాయాః స్వధర్మేణాభిధీయతే ॥ 127

గుణక్రియాయాం = అప్రధాన క్రియలో, స్వాతంత్ర్యాత్ = స్వతంత్రుడగుట వలన, ప్రేషణే = ప్రయోజక వ్యాపారమున, కర్మతాం = కర్మత్వమును, గతః అపి = పొంది యున్నవాడైనను, (ప్రయోజ్యః) = దేవదత్తుడు, కర్మ సంజ్ఞాయాః = కర్మ సంజ్ఞకు, నియమాత్ = నియమముండుట వలన, స్వధర్మేణ = తన ధర్మమగు కర్తృత్వముచేతనే, అభిధీయతే = చెప్పబడుచుండును.

తాత్పర్య విశేషాంశములు— ప్రయోజ్యుడు, ప్రయోజకుని, ఆజ్ఞాదులకు లోబడి నను తన స్వతంత్రతను కోల్పోవడు తన వ్యాపారమున తనకు స్వాతంత్ర్యముండును గాన కర్తృ సంజ్ఞకు భంగము లేదు. ణిజర్థ కర్తకు ఈప్సితతముడు గాన కర్మసంజ్ఞ ప్రాప్తించు చున్నది. అది గతి, బుద్ధి, ప్రత్యవసానము అర్థము గల ధాతువులును, శబ్దము కర్మగా గల ధాతువులును, అకర్మకములగు ధాతువులును, దీని అణ్యన్తావస్థయందు కర్తయగుదానికే అని నియమింపబడినది పచ్ ధాతువందు చేరలేదు కావున దేవదత్తునకు స్వస్వాతంత్ర్య ప్రయుక్త మగు కర్తృత్వమే నిలిచినది.

ఒక ప్రశ్న— ప్రయోజ్యుడైనపుడు గూడ స్వాతంత్ర్యమాతనికి నివర్తింపదనిన, కర్మ సంజ్ఞకంటె పరమైన కర్తృ సంజ్ఞయే ప్రాప్తించుచుండ, గతి బుద్ధీ త్యాది సూత్రము కర్మ సంజ్ఞా విధాయకమే కావలెనుగదా. నియామక మెట్లగును?

సమాధానము— ప్రయోజ్యకర్త వ్యాపారము ధాతువున కర్థము. ప్రయోజక కర్త వ్యాపారము ణిజర్థము. మొదటిది రెండవదానికి విశేషణము. కాగా అప్రధానము రెండవది ప్రధానము అందువలన కర్తృశక్తికంటె, కర్మశక్తి ప్రబలము. ఓదనము కర్మ

గదా. దానిని జూతము. కాని వ్యాపారము విక్లిత్తి అందది స్వతంత్రమే అయినను, విక్లేదనము = ఉడికించుట అను దేవదత్త వ్యాపారముచే ఈప్సితముగాన, దానికి కర్మ సంజ్ఞయే ప్రవర్తించినది.

కాగా, ప్రకృతమున కర్తృ సంజ్ఞతో విప్రతిషేధము లేదు. కర్మ సంజ్ఞ సిద్ధము కాబట్టి గత్యాది ధాతు విషయమున నియమము చేయబడినది. దాని ఫలితముగ, 'యజ్ఞదత్తః దేవదత్తం గ్రామం గమయతి' అని గత్యర్థధాతు ప్రయోగమున దేవదత్తునకు కర్మత్వమును, 'యజ్ఞదత్తః దేవదత్తేన, ఓదనం పాచయతి' అను, పచధాతు యోగమున దేవదత్తునకు కర్తృత్వమును ప్రయోగములందు ప్రసిద్ధములు ॥127॥

అవతారిక— కర్తకు ప్రేరకుడు హేతువు. ప్రయోజక మెల్ల హేతువనిన, కర్మ గూడ క్రియకు ప్రయోజకముగాన హేతు సంజ్ఞ కలదియగునా ? అనిన, కాదనుచున్నారు.

శ్లో॥ క్రియాయాః ప్రేరకం కర్మ హేతుః కర్తుః ప్రయోజకః ।
కర్మార్థా చ క్రియోత్పత్తిః సంస్కార ప్రతిపత్తిభిః ॥ 128

కర్మ = క్రియకు ఫలమైన కర్మ, క్రియాయాః = క్రియకు, ప్రేరకమ్ = ప్రయోజకము, హేతుః = హేతువనునది, కర్తుః = కర్తకు=క్రియాశ్రయునకు, ప్రయోజకః = ప్రేరకము. ఉత్పత్తి, సంస్కార, ప్రతిపత్తిభిః=నిర్వృత్తి, వికారము, ప్రాప్తి - అను వీనిచేత, క్రియా= క్రియ, కర్మార్థా చ = కర్మకొఱకైనది గదా :

తాత్పర్య విశేషాంశములు— ఫలమున కాశ్రయము కర్మ. కర్తయొక్క వ్యాపారమువలన గలిగిన ఫలము కర్మయందుండును. ఆ కర్మ నిర్వర్త్యము, వికార్యము, ప్రాప్యము - అని మూడు విధములు అని వెనుక జెప్పబడియున్నది. క్రియా ఫలమును, వ్యపదేశివద్భావముచేత శాస్త్రమున ఫలాశ్రయమగునుగాన కర్మ అనబడును. ఆ కర్మ స్వసిద్ధికై క్రియను ప్రేరించును.

ఇక హేతువనునది క్రియార్థమై, సాధనములను వినియోగించి క్రియను సాధింపుమని కర్తను ప్రోత్సహించును. అది సాక్షాత్తుగా క్రియా ప్రయోజకము గాదు. క్రియా పరిపోషమునకై ప్రవర్తించు కర్తకు ప్రయోజకము హేతువు.

ఈ విధముగ ప్రయోజకత్వ విషయమున హేతువునకును, కర్మకును స్వరూప భేదము స్పష్టముగ నగపడుచున్నది.

ఏయది దేనికొఱకై యేర్పడినదో, అయ్యది దానికి ప్రయోజకమందురు. క్రియ కర్మ కొఱకు. కావున కర్మ క్రియకు ప్రయోజకము.

ఇతర కారకములు స్వసిద్ధికై క్రియను ప్రేరింపవు. అవి క్రియార్థములు గాని, వాని కొఱకై క్రియ ప్రవర్తింపదు. ॥128॥

సంప్రదానాధికారము

అవతారిక— విభక్తుల ననుసరించి కారకముల విచారము చేయబడుచున్నది. అందు ద్వితీయార్థమగు కరణ కారకవిచారమును, తరువాత కర్తృ కారక విచారమును, ఆ ప్రసంగమున ప్రయోజక కర్తృ విచారమును, ముగించి, క్రమ ప్రాప్తమగు చతుర్థీ విభక్త్యర్థ సంప్రదాన విచార మిక చేయబడుచున్నది.

శ్లో॥ అనిరాకరణాత్ కర్తుః త్యాగాంగం కర్మణేప్సితమ్ ।
ప్రేరణానుమతిభ్యాం వా లభతే సంప్రదానతాం ॥ 129

కర్తుః = కర్తచేయు, త్యాగాంగం = దానమున నంగమైనదియు, కర్మణా = కర్మచే, ఈప్సితం = సంబంధించుటకు తలంపబడిన కారకము, అనిరాకరణాత్ = నిషేధింపకుండుట వలన, ప్రేరణానుమతిభ్యాం వా = ప్రేరించుట, అంగీకరించుట వలనగాని సంప్రదాన తాం = సంప్రదానమను పేరును, లభతే = పొందును

తాత్పర్యా విశేషాంశములు— ''ఉపాధ్యాయాయ గాం దదాతి, దేవదత్తః''. గోవు కర్మ. ఇచ్చుట క్రియ. శిష్యుడు కర్త. అతడుచేయు త్యాగములో అంగము ఉపాధ్యాయుడు. అంగమనగా, దాత హస్తము కూడ కావచ్చును కావున నది సంప్రదానము కాకుండుటకు, 'కర్మ సంబంధమును గలుగ చేయుటకు కర్తచే నుద్దేశింపబడినది' అనియు జెప్పబడినది. ఆ సంప్రదానము కారకము కావలెను. కారక మనగా క్రియా జనకము. దాని క్రియ ఇటనేమి? అనిన అది, నిరాకరింపకుండుట, ప్రేరించుట, లేదా అనుమతించుట, ఇందేదియైన నగును.

ఉపాధ్యాయుడు, శిష్యుడు తన కిచ్చిన గోవును వలదనకుండుటయే ఆతని వ్యాపారము. 'దేవతాభ్యో బలిం దదాతి' అనుచోట బలిదానము ననుమతించుట, సంప్రదాన వ్యాపారము. యాచించి దానమును బొందినపుడు ప్రేరణము, సంప్రదాన వ్యాపారము. ఈ విధముగ సంప్రదానము త్యాగమున కుపకారకమగుటవలన నది త్యాగాంగము.

ఇచట నొక ప్రశ్న— ''ముక్తయే హరింభజతి'' = మోక్షార్థము హరి భజనము అందురు. హరిసేవ ముక్త్యర్థముగాన నట ''తాదర్థ్యే చతుర్థీ వాచ్యా'' అను వార్తికముచే, చతుర్థీ ప్రత్యయము విధింపబడినది. ఆ విధముగనే దాన ముపాధ్యాయార్థము గాన ''ఉపాధ్యా యాయ గాం దదాతి శిష్యః'' అను, ప్రయోగమునందు గూడ, చతుర్థిపైవార్తికముచే సిద్ధింప వచ్చును గదా. సంప్రదాన సంజ్ఞ ఎందులకు? అని ప్రశ్న.

సమాధానము— ఇది న్యాయ్యమైన ఆక్షేపము గాదు. ఏలయన— దానక్రియ సంప్రదానార్థము గాదు. సంప్రదాన కారకము దాన క్రియార్థము. కారకములు క్రియార్థములు గదా! ఈయబడు గోవు ఉపాధ్యాయార్థమయినను నది వాక్యార్థము కాదు. వాక్యార్థము క్రియ అది సంప్రదానార్థము గాదు.

"రజకస్య వస్త్రం దదాతి" = చాకలికి బట్టలనిచ్చుట దానమేగాదు. దానమనగా, తన హక్కును వదలుకొని ఇతరుల కా వస్తువును సంక్రమింపజేయుట. అది అచ్చట లేదు. కనుక సంప్రదాన చతుర్థి లేదు. ధాతు వచట గౌణమగు నర్థము కలది

''ఘ్నతః పృష్ఠం దదాతి'' = కొట్టుచున్న వానికి వీపు నిచ్చుచున్నాడందురు. అచటను నంతియే.

ఇక ''అరోచకినే అన్నం దదాతి'' = అన్నమునందు రుచిలేని రోగికన్న మిచ్చు చున్నాడు అందురు. పరునకు తన వస్తువు నిచ్చుట, అది వాని కుపయోగింపవలెనను తలంపుతో గదా. అట్టి ఉపయోగము లేని దానము దానమే కాదు గాని, దేవునకు ఫలపుష్పాదులను సమర్పించువాడు, అవి దేవున కుపయోగింపవలెనను సంకల్పముతో నిచ్చునట్లు, రోగికి అన్నము సహింపవలెనను సంకల్పము, దాత కుండవచ్చును.

''న శూద్రాయ మతిం దద్యాత్'' = శూద్రునికొఱకు మతి నీయరాదు. మతి యన జ్ఞానము. అనగా తత్సాధనమగు శాస్త్రము. ఇచ్చుట అనగా నుపదేశించుట. ఇచట 'దా' ధాత్వర్థ మగు దానము, స్వస్వత్వ నివృత్తి పూర్వకముగ పరస్వత్వము నాపాదించుట యను ముఖ్యార్థమా ? లేక గౌణమా ? అని విచారింపవలసి యున్నది. ముఖ్యార్థమున కట సంభవము లేదు. తన హక్కును శాస్త్రమునందు వదలిపెట్టుట, శూద్రునకు సంప్రమింపజేయుట అనునది లేదుగదా. కావున నది గౌణమని కొందరందురు. దాన మచట ముఖ్యమే. గౌణము కాదు. గురువు, తన శాస్త్రజ్ఞాన సంతానమున నేకదేశమును శిష్యున కుపయోగింపవలెనను నుద్దేశము తోనే త్యజించును. కావున నది ముఖ్యమేయని మఱికొందరి భావము.

''వరాయ కన్యాం దదాతి పితా'' ఇట, తండ్రి తన కొమార్తెను దానము చేసి నపుడు జన్య జనక భావమను స్వత్వము నివర్తింపకున్నను, స్వస్వామి భావరూపమగు స్వత్వము నివర్తించును గాన 'దా' ధాత్వర్థము, ముఖ్యమే

''ఖండికోపాధ్యాయశ్శిష్యాయ చపేటాం దదాతి'' = ఖండికలనెడి వేదభాగము లను అధ్యయనము చేయించు నుపాధ్యాయుడు, తాను, ఉదాత్తము నుచ్చరించినచో, నను దాత్తము నుచ్చరించిన, శిష్యునికి చెంపదెబ్బ నిచ్చును. ఇచట 'స్వస్వత్వ నివృత్తి పూర్వక ముగ పరస్వత్వాపాదనము' అను ముఖ్యార్థమునకు సంభవము గలదాయని విచారించిన, ఆ చపేటము శిష్యున కుపకరించునది గాన, కలదనియే తేలును. చెంపకాయ శిష్యునకు ప్రతి కూల రూపము గదా. వానికి దాని యుపకారమేమి ? అనిన, ఆ చపేటమును వా డిపుడు సహించిన నది వానికి శాస్త్రాభ్యాస యోగ్యతను కలుగజేయును. దానివలన భావికాలమున వానికి ఫలావాప్తి కలుగునని భావము.

''మృజిరస్మైయ విశేషేణోపదిష్టః ప్రకృతి పాఠే'' అని వృద్ధి సూత్ర భాష్యమున ప్రయోగము. అందు 'అస్మై' అను చతుర్థి తాదర్థ్యమున చతుర్థి. ధాతు పాఠమునందు, 'మృజ్' అను ధాతువు, సాధు శబ్దములను దెలిసికొనగోరు జిజ్ఞాసువు కొఱకు, సామాన్య

రూపమున, అనగా సకల ప్రత్యయములకును ప్రకృతిగా నది యుండవలెనను తలంపుతో ఉపదేశింపబడినది. అందువలన నాతడు 'మృజ్' అను ధాతు మాత్రమునకు ప్రసంగము గలిగిన, 'మార్జ్' అను వృద్ధి ఘటితరూపము 'మార్జకః' మున్నగు స్థలముల సాధువగునని తాత్పర్యము. ॥129॥

అవతారిక — ప్రథమ సంప్రదానమును వెనుకటి కారికచే వ్యాఖ్యానించి ఉత్తర సంప్రదాన వివరణము నిక చేయుచున్నాడు.

శ్లో॥ హేతుత్వే, కర్మసంజ్ఞాయాం, శేషత్వే వాపి కారకమ్ ।
రుచ్యర్థాదిషు శాస్త్రేణ సంప్రదానాఖ్య ముచ్యతే ॥ 130

హేతుత్వే = హేతు సంజ్ఞగాని, కర్మ సంజ్ఞాయాం = కర్మసంజ్ఞ గాని, శేషత్వే వా అపి = కారక వ్యతిరిక్త సంబంధముగాని ప్రాప్తించినపుడు, కారకం = క్రియాజనక మగునది, రుచ్యర్థాదిషు = రుచధాతువు మున్నగువాని ప్రయోగమున, సంప్రదానాఖ్యం = సంప్రదాన మను సంజ్ఞ కలదిగా, శాస్త్రేణ = శాస్త్రముచేత, ఉచ్యతే = చెప్పబడుచున్నది

తాత్పర్య విశేషాంశములు — ప్రథమ సంప్రదాన మనగా ''కర్మణా య మభిప్రైతి స సంప్రదానమ్'' (1-4-32) అను సూత్రముచే విధింపబడినది. అది లౌకిక సంప్రదానము. ఉత్తర సంప్రదానమనగా ''రుచ్యర్థానాం ప్రీయ మాణః'' (1-4-33) మున్నగు సూత్రములచే విహితమైన సంజ్ఞ.

రుచి అర్థముగాగల ధాతువులు ప్రయోగింపబడినపుడు, ప్రీత్యాశ్రయమగు కారకము సంప్రదాన మగును అని ఆ సూత్రమున కర్థము. రుచి అనగా అభిలాష. దీప్తి కాదు ''దేవదత్తాయ రోచతే మోదకః'' = దేవదత్తునకు (కొఱకు) కుడుము రుచించుచున్నది అని యుదాహరణము. రుచించుట = ప్రీతికి విషయమగుట. దేవదత్తునకు కుడుము ఇష్టము దానియందు లౌల్యమువలన నది తనకు అభిలాష విషయమగు నట్లు చేసికొనును కాగా నాతనికి హేతుసంజ్ఞ ప్రాప్తించుచున్నది. సంప్రదాన సంజ్ఞ విధింపబడుచున్నది. కావున నీ సంజ్ఞ, సంజ్ఞాంతర ప్రాప్తి పూర్వకసంజ్ఞ. హేతుసంజ్ఞ వచ్చినయెడల ణిచ్ప్రత్యయము ప్రాప్తించెడిది. అది ఈ ప్రయోగమున ఇష్టము గాదు. కావున ప్రకృత ధాతువాచ్య రుచి క్రియలో మోదకము కర్త. దేవదత్తుని అభిలాషలో విషయము గదా మోదకము, కర్మ కావలదా ? అనవచ్చును గాని దేవదత్తు డిపుడు కర్తకు ప్రయోజకుడును గాడు, కర్తయు కాడు. కాగా మోదకము వానికి ఈప్సితతమము గాదు కర్తకు ఈప్సితతమము గదా కర్మ కావలెను.

ఇట్లు ప్రశ్నింపవచ్చును— కర్త కీప్సితమనగా కర్త అను సంజ్ఞ కలవానికి అని కాదు. క్రియలో స్వాతంత్ర్యము = వ్యాపారము కలవానికని యర్థము. దేవదత్తున కా స్వాతంత్ర్యమ ండును గదా అనిన,

సమాధానము— ఇచట శబ్దము = రుచధాతువు రుచి క్రియను బోధించుచున్నది. దాని కాశ్రయము మోదకముగాని, దేవదత్తుడు కాదు తమ తమ వ్యాపారములలో సకల కారకములును స్వతంత్రములే. కాని ఆ స్వతంత్రత శబ్దోపాత్తము కానిచో కర్త అను సంజ్ఞ కలుగదు. లేనిచో, కర్మ సంజ్ఞా సూత్రములో 'కర్తుః' అనుట వ్యర్థము. 'సార్థాద్ధీయతే పథికః' అను వాక్యమును జూడుడు. బాటసారుల గుంపునుండి ఒకడు విడివడినాడు. హీయతే అను పదము హాన క్రియను చెప్పుచున్నది విడుచుటలో కర్త సార్థము. పథికునకు కర్మత్వమును. అందువలన కర్మార్థమున లకారమును లభించినవి. గుంపును అపాదానముగ వివక్షించుటచే పంచమి. హానక్రియ అచట శబ్దోపాత్తము. ప్రకృతమున దేవదత్తుని క్రియకు శబ్దబోధ్యత లేదు గదా.

'దేవదత్తుని, మోదకము ప్రీతుని జేయుచున్నది' అని ఈ వాక్యమున కర్థమయిన యెడల అపుడు ఆ ధాతువు సకర్మకమగును దేవదత్తునకు కర్మసంజ్ఞ ప్రాప్తించును కావున సంప్రదాన సంజ్ఞ కర్మసంజ్ఞా ప్రాప్తి పూర్వకమపుడు కావచ్చును

''దేవదత్తాయ శ్లాఘతే జనః'' జనము, దేవదత్తుని గుణములను బొగడి తమ్ము నాతని కెఱుకపఱచు కొనుచున్నదని ఆ వాక్యమున కర్థము. ''శ్లాఘ హ్నుఙ్ స్థాశపాం జ్ఞీప్స్యమానః'' (1-4-34) అను సూత్రముచే సంప్రదాన సంజ్ఞ. దేవదత్తుడు గుణవంతుడగు టచే తన్ను జనము పొగడునట్లు చేసికొనుచున్నాడని భావము. కాన నాతనికి హేతుసంజ్ఞ ప్రాప్తింపగా సంప్రదాన సంజ్ఞ విధింపబడినదని కొందఱి మతము. అట్లు కాదు. సూత్రమున 'జ్ఞీప్స్యమానః' అను పదము కలదు. 'జ్ఞాపయితు మిష్యమాణః' = తెలియజేయుటకు కోర బడిన వాడని యర్థము. జ్ఞాపన క్రియా సంబంధమును గలుగజేయుట ఆతనికే గనుక కర్మ సంజ్ఞ ప్రాప్తింపగా 'సంప్రదాన సంజ్ఞావిధి' అని మఱికొందరు నందురు.

ఈ విధముగనే 'హ్నుతే' 'తిష్ఠతే' 'శపతే' అను ధాతువుల ప్రయోగము లందును యథాయోగముగ ఆ యా సంజ్ఞలకు ప్రాప్తిని జూడవచ్చును

శ్లాఘించి తన్ను దేవదత్తున కెఱుకపఱచుట— ఇతరులకు దెలియకుండగా తన్ను మఱుగుగా నెఱుకపఱచుకొనుట, స్వాభిప్రాయము నాతనికి బోధించుట కనుకూలమగు స్థితిని పరిగ్రహించి యుండుట, శపథమును బెట్టి తెలియచేయుటయు, యథాక్రమముగ నర్థములు

''దేవదత్తాయ శతం ధారయతి యజ్ఞదత్తః'' = దేవదత్తునకు యజ్ఞదత్తుడు నూఱు రూప్యములను బాకీపడి యున్నాడు. ''ధారేరుత్తమర్ణః'' (1-4-35) అను సూత్ర మిట సంప్రదాన సంజ్ఞను విధించునది. 'ధారి' అనగా ణిజన్తమయిన 'ధృఙ్' అవస్థానే అను ధాతువు. అది ప్రయోగింపబడి నపుడు ఉత్తమర్ణునకు సంప్రదాన సంజ్ఞ కలుగునని సూత్రా ర్థము. 'ధారయతి' అనగా ధరింపజేయుచున్నాడని గదా అర్థము. అధమర్ణుడైన యజ్ఞదత్తుడు నిలచియున్న బాకీని నిలిపియున్నాడు. ఆ ధారణమునకు ఉత్తమర్ణుడైన దేవదత్తుడు హేతువు. ఆత డిచ్చుటవలన గదా అది నిలిచినది. కాని ఆ దానక్రియ శబ్దోపాత్తము కాదు. అది దేవదత్త

సంబంధి. కనుక దేవదత్త శబ్దము సంబంధార్థక షష్ఠ్యంతము కావలసియుండ సంప్రదాన సంజ్ఞచే చతుర్థ్యన్తమయినది శేషత్వ ప్రాప్తి పూర్వక సంప్రదాన సంజ్ఞ కిది ఉదాహరణము

"పుష్పేభ్యః స్పృహయతి" అను ప్రయోగమున, "స్పృహేరీప్సితః" (1-4-36) అను సూత్రముచే పుష్పములకు సంప్రదానత్వము. పుష్పముల కీప్సితతమత్వమును వివక్షించిన, కర్మసంజ్ఞయే అగును "పుష్పాణి స్పృహయతి". పూవులకొఱ కాశపడుట మొదటి వాక్యమునను, పూవుల నపేక్షించుట రెండవ వాక్యమునను, అర్థములు.

"దేవదత్తాయ క్రుధ్యతి యజ్ఞదత్తః"
,, ద్రుహ్యతి ,,
, అసూయతి ,,
,, ఈర్ష్యతి ,, అని ప్రయోగములు కలవు

దేవదత్తుని ఉద్దేశించి యజ్ఞదత్తుడు, క్రోధ, ద్రోహ, అసూయా, ఈర్ష్యలను చిత్తవృత్తులను గలిగియున్నాడని అర్థము. చంపవలెనను చిత్తవృత్తి, అపకారమును చేయవలెనను తలంపు, ఉత్కర్షను సహింపకుండు మనస్తత్త్వము, గుణములను దోషములనుగా భావించుటయు, యథాక్రమముగ, క్రోధ, ద్రోహ, ఈర్ష్యా, అసూయలు పై ధాతువుల ప్రయోగమున కోపమున కుద్దేశ్యమగు వ్యక్తికి సంప్రదాన సంజ్ఞ, "క్రుధ ద్రుహేర్ష్యా సూయార్థానాం యంప్రతికోపః" (1-4-37) అను సూత్రముచే విధింపబడినది ఇవి సకర్మక ధాతువులగుటచే కర్మసంజ్ఞ ప్రసక్తము.

"దేవదత్తాయ రాధ్యతి గణకః" "దేవదత్తాయ ఈక్షతే గణకః" అని రెండు ప్రయోగములు. దేవదత్తుని శుభాశుభములను దైవజ్ఞుడు పర్యాలోచించుచున్నాడని అర్థము దేవదత్తుడు గణకుని అడుగగా నాతడు పర్యాలోచించుచున్నాడని భావము. కాన దేవదత్తుడు ప్రయోజకుడు హేతుసంజ్ఞ ప్రాప్తింప సంప్రదాన సంజ్ఞ విహితము. సూత్రము "రాధీక్ష్యో ర్యస్య విప్రశ్నః" (1-4-39) అనునది

"దేవదత్తాయ గాం ప్రతిశృణోతి" లేదా "ఆశృణోతి" దేవదత్తుడు యాచించి ప్రేరింపగా యజ్ఞదత్తు డాతనికి గోవు నిత్తునని వాగ్దానము చేయుచున్నాడని యర్థము హేతు సంజ్ఞ ప్రాప్తను. దానికి బాధకముగ సంప్రదాన సంజ్ఞ "ప్రత్యాఙ్భ్యాం శ్రువః పూర్వస్య కర్తా" (1-4-40) అని విధింపబడినది సూత్రమునందున్న, 'పూర్వస్య కర్తా' అను దానికి మొదటి వ్యాపారమగు యాచనకు ఆశ్రయమైనవాడు = అనగా దేవదత్తుడు అని భావము. యాచించి, అంగీకరించునట్లు చేసిన వ్యక్తి అనుట.

"హోత్రే అనుగృణాతి ప్రతిగృణాతి వా అధ్వర్యుః" అని యజ్ఞకర్మలందలి వ్యవహారము. హోత, అధ్వర్యువు, ఋత్విక్కులు. యజ్ఞమునందు, హోత ముందు కొన్ని స్తుతివచనములను పలుకును అధ్వర్యుడు అతని నభినందించుచు, ప్రోత్సాహజనకములయిన

శబ్దముల నుచ్చరించును శంసన వ్యాపార కర్త కిపుడు, కర్మసంజ్ఞ కపవాదముగ సంప్రదాన సంజ్ఞను, ''అనుప్రతిగృణశ్చ'' (1-4-41) అను సూత్రము విధించుచున్నది.

''పరిక్రయణే సంప్రదానమన్యతరస్యామ్'' (1-4-44) అను సూత్రము, సాధకతమమగు కరణమునకు, కొంత కాలము వేతనమిచ్చి ఉంచుకొనుట అను నర్థమునందు సంప్రదాన సంజ్ఞను విధించినది. 'శతేన పరిక్రీతః' లేదా 'శతాయ పరిక్రీతః అనుబ్రూహి' అని యుదాహరణము. నూఱు రూప్యములిచ్చి కొంతకాలమునకు స్వీకృతుడవై అనువచనము చేయుమని ఆ వాక్యమున కర్థము.

సామాన్యముగ ఈ సంప్రదానోదాహరణము లందంతటను, విశేషవివక్ష ఏదియు లేనపుడు క్రియాజనకత్వము అనుకారకత్వము సంభవింపనందున శేషత్వము ప్రాప్తించు చున్నది. కాని క్రియా నిమిత్తమగుటచే అంతమాత్రమును బుచ్చుకొని సంప్రదాన సంజ్ఞ చెప్పబడినది.

అపాదానాది విశేషములు వివక్షింపబడనపుడు ఆ కారకము ''అకథితంచ'' అని అకథితకర్మ అగునుగదా అని యడుగవచ్చును. కాని దుహ్, యాచ్, పచ్ మున్నగు కొన్ని పరిగణితధాతువుల అవివక్షిత కారకమే అకథిత కర్మ అని నిర్ణయింపబడినది. అందువలన కర్మసంజ్ఞా ప్రాప్తి కవకాశము లేదు

కారికలో 'రుచ్యర్థాదిషు' అని ఆదిపదముండుటవలన శ్లాఘ - హ్నుఙ్ స్థాది సూత్రముల ప్రమేయములు గూడ సోదాహరణముగ విచారింపబడినవని ఎఱుంగునది.

మఱియు, ''శాస్త్రేణ రుచ్యర్థాదిషు సంప్రదానాఖ్య ముచ్యతే'' అని కారికలో చెప్ప బడినది. ప్రథమ సంప్రదానము గూడ ''కర్మణా యమభిప్రైతి'' అను శాస్త్రము చేతనే విహితము గదా ? 'రుచ్యర్థాదిషు' 'శాస్త్రేణ' అనుటలో విశేషాభిప్రాయ మేమి ? అని ప్రశ్న.

సమాధానము— సంప్రదానము శాస్త్రీయమనియు, లౌకికమనియు ద్వివిధము ఆ పద మన్వర్థము. 'సంప్రదీయతే అస్మై' ఇతి సంప్రదానమ్ అని వ్యుత్పత్త్యర్థము వలన లభించుటచే, దాన క్రియాకర్మ సంబంధము కలదియే సంప్రదానమని తెలియవచ్చుచున్నది. ఇది లౌకికమయిన అర్థము. 'కర్మణా యమభి' ఇత్యాది సూత్రముచే చెప్పబడినది ఈ లౌకిక సంప్రదానము.

ఇక "రుచ్యర్థానాం ప్రీయమాణః" మున్నగు సూత్రముల యుదాహరణములందు ఆ అర్థమునకు సంభవము లేదు. శాస్త్రారంభ సామర్థ్యమువలన, శబ్దసంస్కార మాత్ర దృష్టితో, 'సంప్రదీయతేఽస్మై' = 'వీనికొఱకీయబడుచున్నది' అను నర్థము సంభవింప కున్నను అట సంప్రదాన సంజ్ఞ విధింపబడినది. అది శాస్త్రమాత్ర నియతము. ఆ అభిప్రాయ ముతోనే "శాస్త్రేణ రుచ్యర్థాదిషు" అని కారికలో భర్తృహరి నిర్దేశించి యుండెను. ॥130॥

అవతారిక— 'శ్రాద్ధమును గర్హించుచున్నాడు' అను నర్థమున "శ్రాద్ధాయ నిగర్హతే" అను ప్రయోగము కలదు. 'యుద్ధాయ సంనహ్యతే' = యుద్ధము విషయమున సంనాహపురస్సర నిశ్చయమును చేయుచున్నాడు యుద్ధమునకు సన్నద్ధుడగు చున్నాడని తాత్పర్యము. "పత్యేశేతే" = భర్తనుపసర్పించి శయనించు చున్నది. ఈ ప్రయోగములందు ఆయా క్రియల కర్మలతో సంబంధింపజేయుటకు తలంపబడినవి శ్రాద్ధముగాని, యుద్ధముగాని పతిగాని కావు. ఆ ధాతువు లకర్మకములు. అందువలన క్రియచే సంబంధించుటకు అభిప్రేత మైనది కూడ సంప్రదానమగునని చెప్పవలసి యుండునని, 'క్రియా గ్రహణం కర్తవ్యమ్' అను వార్తిక మవతరించినది. కాని అది ప్రత్యాఖ్యాతము.

భాష్యకారుని ఆశయమేమనగా, సూత్రమునందలి 'కర్మణా' అను పదమునకు 'క్రియచేత' అనిగూఢ అర్థము. లోకమున నట్టి వ్యవహారమున్నది. నీ వేపని చేయుదువు ? అనుటకు 'త్వం కిం కర్మకరిష్యసి' అందురు. సూత్రమునందలి కర్మ పదమునకు క్రియ అనియు, శాస్త్రీయమగు, 'కర్తురీప్సితతమం కర్మ' అను లక్షణముచే లక్షితమైనదియు అర్థము.

'అట్లు కాదు కృత్రిమము అకృత్రిమమును సంనిహితములయినపుడు కృత్రిమ మునే గ్రహింపవలెనని శాస్త్రము చెప్పుచున్నది. కావున, అకృత్రిమమయిన క్రియ గ్రహింప బడదు. అందువలన క్రియా గ్రహణమును ప్రత్యాఖ్యానము చేయుట కుదురదు' అనిన క్రియయు, కృత్రిమ కర్మ కావచ్చునని సమాధానము. 'కర్తకు క్రియచే ఈప్సితము గదా కర్మ. క్రియ, ఏ క్రియాంతరముచే ఆప్యమానమగును ?' అని మరల ఆక్షేపము.

సమాధానము— సందర్శనము, ప్రార్థనము. అధ్యవసాయము అనునవి, ప్రేక్షా పూర్వకారియగు = అనగా బుద్ధిపూర్వకముగ నాలోచించి ప్రవర్తించు, ప్రతి పురుషునకును ఆవశ్యకములు

ముందుగ తన బుద్ధిలో నొక విషయమును జూచును. అది సందర్శనము.

తరువాత దానిని, తనకది సిద్ధింపవలెనని కోరును అది ప్రార్థనము.

ఆ పిమ్మట దానిని సాధించి తీరవలెనని నిశ్చయించును. అది అధ్యవసాయము.

ఆ తరువాత తదర్థమై యత్నము, ఆ పనిని పూర్తిచేయుట. చివరకు ఫలప్రాప్తి ఇది లోకము నందలి ప్రక్రియ. కావున సందర్శనాది క్రియలచే సంబంధించుటకు ఈప్సితమగునది ప్రకృత ధాతువాచ్యమగు, గర్హణము, సంనాహము, శయనము మున్నగు క్రియ యగునుగాన నదియు కృత్రిమ కర్మయే. ఈ సందర్శనాదులు ఆ ధాతువున కర్థములు కాదేయనిన, అవియు ధాతు వాచ్య క్రియతో అభిన్నములుగ చెప్పబడును. ఆ క్రియలకు భేదము లేనియెడల క్రియాకారక భావ మెట్లు ? అని ప్రశ్న కలుగును. ఆ ప్రశ్నకు సమాధానముగ, భాష్యకారుని ప్రత్యా ఖ్యానమును సమర్థించుచు చెప్పుచున్నాడు.

శ్లో॥ భేదస్య చ వివక్షాయాం పూర్వాం పూర్వాం క్రియాం ప్రతి।
పరస్యాంగస్య కర్మత్వాత్ న క్రియాగ్రహణం కృతమ్॥ 131

కించ = మఱియు, భేదస్య = భేదముయొక్క, వివక్షాయాం = వివక్షలో, పూర్వాం పూర్వాం = ముందటి, ముందటి, క్రియాం ప్రతి = క్రియను గూర్చి, పరస్య=తరువాతి, అంగస్య= అంగము, కర్మత్వాత్ = కర్మ అగునుగాన, క్రియా గ్రహణమ్ = సూత్రమునందు క్రియా పదము, నకృతమ్ = గ్రహింపబడలేదు.

తాత్పర్య విశేషాంశములు— సందర్శనాది క్రియలు ప్రేక్షా పూర్వకారియగు ప్రతి వ్యక్తికిని ఆవశ్యకములుగాన నవి బుద్ధి సన్నిహితములయి యుండును. అవి ప్రధాన క్రియకంటె భిన్నములా? అభిన్నములా? అనిన నది వివక్షనుబట్టి యుండును

భేదమును వివక్షించినపుడు, ఇవి పూర్వాంగములును, ప్రధాన ధాత్వర్థము ఉత్తరాంగము నగునుగాన నది కర్మ కావచ్చును. కాబట్టి "కర్మణా యమభిప్రైతి" అను సూత్ర మున క్రియాగ్రహణ మక్కర లేదను తాత్పర్యముతో "క్రియాగ్రహణం కర్తవ్యమ్" అను వార్తికము ప్రత్యాఖ్యాతము. సందర్శనాదులు ధాతు వాచ్యములు కాకున్నను సామర్థ్య ప్రాప్తములు. శబ్దబోధ్యములు కానివి గూడ కారకత్వమునకు నిమిత్తములగునా? అనిన— 'సార్థాడ్డీయతే' అను వాక్యమున, సార్థము, అపాదానముగా శబ్దముచే చెప్పబడినను, ఆక్షేపము వలన లభ్యమయిన కర్తృత్వము పథికుని కర్మత్వమునకు నిమిత్తమైనది గదా.

అదియును గాక సందర్శనాదులకును ప్రధాన క్రియకును భేదమే వాస్తవము అవి ప్రధాన క్రియార్థములగుటచే తదభిన్నముగ = అదియు నివియు నొకటే యనునట్లు అను కొనుటయే తప్ప, వాని భేదము సర్వాత్మనా తిరోహితము గాదు. కాబట్టి క్రియకును కర్మత్వ ముపపన్నమే ॥131॥

అవతారిక— క్రియగూడ క్రియచే ఆప్యమానమైన, కర్మ కావచ్చునని చెప్ప బడినది. ''ఓదనం పచతి'' అను వాక్యమున, పచన క్రియగూడ సందర్శనము మున్నగు క్రియల సంబంధింపబడును గాన కర్మయగునా? అపు డా కర్మచేత అభిప్రేతమయిన ఓదనము గూడ సంప్రదాన మేలకాదు? అనిన చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాణాం సముదాయే తు యదైకత్వం వివక్షితమ్।
తదా కర్మ క్రియాయోగాత్ స్వాఖ్యయైవోప చర్యతే॥ 132

యదా తు = ఎపుడైతే, క్రియాణాం = క్రియల యొక్క, సముదాయే = మొత్తమునందు, ఏకత్వం = అభేదము, వివక్షితం = తలంపబడినదో, తదా = అపుడు, కర్మ = ఓదనాది కర్మ కారకము, క్రియాయోగాత్ = క్రియా సంబంధమువలన, స్వాఖ్యయా ఏవ = తన కర్మ సంజ్ఞచేతనే, ఉపచర్యతే = వ్యవహరింపబడును.

తాత్పర్య విశేషాంశములు— సందర్శనము మున్నగు క్రియలు, ఒకటి అంగము వేఱొకటి అంగి అను, భావములేక సమకక్ష్యలో సముచ్చితములై, వానిచే సాధింపదగిన ఫల మొకటియే యగుటవలన, అభిన్నములుగ ధాతువాచ్యము లయినపుడు, వానిలో నొకటి క్రియ, వేఱొకటి కారకము అను సంబంధము గోచరము గాదు. భేదమున్నపుడు గదా ఆ భావము కలుగునది ; అపుడు పచిక్రియ కర్మగాదు. కావున తద్వ్యక్తమగు నోదనము, కర్మ గనే వ్యవహరింపబడును గాని సంప్రదానముగ వ్యవహరింపబడదని భావము. ॥132॥

అవతారిక— భేద వివక్షలో సంప్రదాన వ్యవహారము కలుగునందురా ? అనిన—

శ్లో॥ భేదాభేద వివక్షాచ స్వభావేన వ్యవస్థితా ।
తస్మాద్గత్యర్థ కర్మత్వే వ్యభిచారో న దృశ్యతే ॥ 133

భేద, అభేదవివక్షా = భేదమును, అభేదమును వివక్షించుట, స్వభావేన = ప్రయోగ స్వభావ మును బట్టి, వ్యవస్థితా = నియతమైయుండును. తస్మాత్ = అందువలన, గత్యర్థ కర్మత్వే= గత్యర్థక ధాతువుల కర్మవిషయమున, వ్యభిచారః = అతి ప్రసంగము, న దృశ్యతే = ప్రయోగములం దగపడుట లేదు.

తాత్పర్య విశేషాంశములు— లోక ప్రసిద్ధములయిన ప్రయోగముల సాధుత్వా న్వాఖ్యానమునకు శాస్త్ర ముపాయము మాత్రమే వానిని ప్రయోగానుసారమే సంస్కరింప వలెను. అందువలన ఆ యా ప్రయోగసిద్ధిని బట్టి, సందర్శనాది క్రియలకు ప్రధాన క్రియతో భేదమునుగాని అభేదమునుగాని నియతముగనే వివక్షింపవలెను.

అది నియతము గనుకనే ''గత్యర్థ కిర్మణి ద్వితీయా చతుర్థ్యౌ చేష్టాయామనధ్వని'' (2-3-12) అను సూత్రమును రచింప బనిలేదనియు, అతి ప్రసంగము కలుగవనియు భాష్యమున నిర్ణయింపబడినది. భేద వివక్షలో గత్యర్థక ధాతువుల కర్మకు సంప్రదాన సంజ్ఞా చతుర్థీ ప్రత్యయములును, అభేద వివక్షలో కర్మసంజ్ఞా ద్వితీయలును సిద్ధించునని భావము. ॥133॥

అవతారిక— ప్రకృత విషయమును, ప్రమాణముచే దృఢపరచుచున్నాడు

శ్లో॥ వికల్పేనైవ సర్వత్ర సంజ్ఞే స్యాతాముభేయది ।
ఆరంభేణ న యోగస్య ప్రత్యాఖ్యానం సమం భవేత్ ॥ 134

సర్వత్ర = అంతటను, ఉభే = రెండు, సంజ్ఞే = సంజ్ఞలును, వికల్పేన = వికల్పముగా, స్యాతాం ఏవయది = ప్రవర్తించినయెడల. యోగస్య = 'గత్యర్థ కర్మణి' అను సూత్రము యొక్క, ప్రత్యాఖ్యానం = నిరాకరణము = అక్కరలేదనుట, ఆరంభేణ = సూత్రారంభ ముతో, సమం = తుల్యమైన ఫలము గలది, నభవేత్ = కాకపోవును.

తాత్పర్య విశేషాంశములు— భేదా భేదముల వివక్షకు నియతి తన మనస్సునందు

స్ఫురించుట చేతనే భాష్యకారుడు "గత్యర్థ కర్మణి" అను సూత్రమును ప్రత్యాఖ్యానము చేసెను. సూత్రారంభ ప్రత్యాఖ్యానములకు ఫలభేదముండిన ప్రత్యాఖ్యానము కుదురదు. గత్యర్థక ధాతువుల విషయమున, ప్రధాన ధాత్వర్థముతో సందర్శనాది క్రియలకు భేదవివక్షా పక్షమునందు వాని కర్మకు సంప్రదాన సంజ్ఞా చతుర్థులును, అభేద పక్షమున కర్మసంజ్ఞా నిబంధన ద్వితీయయు సిద్ధించునుగాన సూత్ర మనావశ్యకమని భావము.

ఆ వివక్షకు నియతి లేనిచో సకల ధాతు విషయమునను, కర్మసంజ్ఞా సంప్రదాన సంజ్ఞలు ప్రాప్తించుచుండ, గత్యర్థకముల కర్మకే ద్వితీయా చతుర్థులు సాధువులగునను నియమమును బోధించుటకు ఆ సూత్ర మావశ్యకమయ్యెడిది. అపుడు ఆరంభమునకును ప్రత్యాఖ్యానమునకును ఫలితములో భేదము ప్రాప్తమగును.

"శ్రాద్ధాయ నిగర్హతే" – ఇట భేద వివక్షయే.

'పచతోదనమ్' – ఇట నభేదమే. ఇవి గత్యర్థకములు గావు.

"మనసా పాటలిపుత్రం వ్రజతి" = పాటలిపుత్ర నగరమునకు మనస్సుతో బోవుచున్నాడు ఇట వ్రజ ధాతువు గత్యర్థకమే. సూత్ర పక్షమున, నీ గమనము చేష్టగాదు గాన చతుర్థి ప్రవర్తింపలేదు. సూత్రము లేనిపక్షమున, అభేదమే క్రియలకు వివక్షితముగాన సంప్రదానత్వము లేదనవలెను. "అధ్వానం గచ్ఛతి". ఇచటను నంతియ. సూత్రమున్న పక్షమున 'అధ్వనిన' అను ప్రతిషేధమువలన చతుర్థి రాలేదు.

'స్త్రియం గచ్ఛతి'=స్త్రీని పొందుచున్నాడు. "అజాంనయతి"=మేకను తీసికొని పోవుచున్నాడు. ఇట చతుర్థి ఏల రాలేదని శంకించి "సిద్ధంత్వ సంప్రాప్తవచనాత్" అని వార్తికకర్త సమాధానము చెప్పెను. సంప్రాప్తమనగా గమన క్రియయొక్క సంబంధము కలది. ఇచట స్త్రీ అట్టిది. స్త్రీని ఉద్దేశించి వెళ్ళుననిన, అపుడు స్త్రీ సంప్రాప్త గాదు. 'స్త్రియై గచ్ఛతి' అనవచ్చును. అట్లే, పాడుత్రోవను వదలి సన్మార్గమునకు పోదలంచిన వానిని 'ఉత్పథేన పథే గచ్ఛతి' అందురు. అట పంథ సంప్రాప్తము గాదు. 'పంథానం గచ్ఛతి' అనిన మార్గమున బోవుచున్నాడని యర్థము. పంథ సంప్రాప్తము. అసంప్రాప్త వచనము వలన, సూత్రమున "అనధ్వని" అను ప్రతిషేధముతో నిక బనిలేదని, 'అధ్వనశ్చాపవాదః' అని వార్తికకర్త సూచించినాడు. "ఆస్థిత ప్రతిషేధో వక్తవ్యః" అని భాష్యము. ఆస్థిత మనగా, గన్త అధిష్ఠించిన మార్గము. దానికే 'అనధ్వని' అను ప్రతిషేధమని భావము. ॥134॥

అవతారిక—— 'అనధ్వని' అను ప్రతిషేధము, ఆస్థితాధ్వరూప కర్మకు చతుర్థీ ప్రతిషేధమని చెప్పబడినది. ఆ ఆస్థితాధ్వ స్వరూపము వివరింపబడుచున్నది.

శ్లో॥ త్యాగరూపం ప్రహాతవ్యే, ప్రాప్యే సంసర్గ దర్శనమ్ ।
ఆస్థితం కర్మయత్తత్ర, ద్వైరూప్యం భజతే క్రియా ॥ 135

ప్రహాతవ్యే = విడువవలసిన భాగమున, త్యాగరూపం=హీనమైన రూపముగలది, ప్రాప్యే=

వెళ్ళవలసిన భాగమున, సంసర్గ దర్శనమ్ = సంబంధరూపమైనదియు, యత్ = ఏ, కర్మ తత్ = కర్మకలదో, అది, ఆస్థితమ్ = ఆస్థితమగు కర్మ అయినది, తత్ర=ఆ అధ్వయందు, క్రియా = గమన క్రియ, ద్వైరూప్యం = రెండు రూపములను, భజతే = పొందుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— ఆస్థితమనగా గమన క్రియచేత ఆక్రాన్తమయిన మార్గము. నడచుచున్న త్రోవ. ఇందు గమనక్రియ రెండు విధములు. అతిక్రమించిన భాగ మున నది హీనరూపము. ఆ క్రియలో కొంత తగ్గినదనుట. ఇంకను నడువవలసిన భాగమున నది సంసర్గరూపము. అనగా ఆ క్రియకు త్యాగమును, ఉపాదానమును రెండవయవములు. అట్టి గమి క్రియచే ఆక్రాన్తమైన అనగా ఆ విధముగ నడవబడుచున్న మార్గము కర్మ సంజ్ఞకు మాత్రమే విషయము. క్రియారూపమగు కర్మచే సంబంధింపబడునది కాదు. కావున సంప్రదాన సంజ్ఞకు విషయము కాదు. అధ్వ కాని కర్మ కది సంభవించును. కావున 'గ్రామాయ గచ్ఛతి' 'గ్రామం గచ్ఛతి' అనియు వ్యవహరింపవచ్చును.

నడచుచున్న మార్గము గాక, ఆక్రమింపబోనున్నది యైన నట ద్వితీయా చతుర్థులు రెండును సాధువులే అని చెప్పబడినది. ఉదాహరణము, "ఉత్పథేన పథే గచ్ఛతి" దీని యర్థము వివృతపూర్వము. ॥185॥

అపాదానాధికారము

అవతారిక— విభక్తుల విధాన క్రమము ననుసరించి, వాని యర్థసులు విచారింప బడు చున్నవి. అందు చతుర్థ్యర్థ విచారానంతరము, అవసర ప్రాప్తము గాన పంచమ్యర్థము విచారింపబడును.

శ్లో॥ నిర్దిష్ట విషయం కించిదుపాత్తవిషయం తథా ।
అపేక్షిత క్రియంచేతి త్రిధాపాదాన ముచ్యతే ॥ 136

కించిత్ = ఒకటి, నిర్దిష్టవిషయం = విషయనిర్దేశము గలది, తథా = ఆ విధముగ, కించిత్ = ఇంకొకటి, ఉపాత్తవిషయం = విషయోపాదానము గలది, కించిత్ = వేఱొకటి, అపేక్షిత క్రియంచ = క్రియయొక్క అపేక్ష గలది, ఇతి = అని, ఏవం = ఈ ప్రకారము, అపాదానం = అపాదానమను కారకము, త్రిధా = మూడు విధములుగా, ఉచ్యతే = చెప్పబడు చున్నది.

తాత్పర్య విశేషాంశములు— "ధ్రువమపాయే అపాదానమ్" (1-4-2) అను సూత్రము అపాదానమను సంజ్ఞను విధించినది. అపాయమనగా విశ్లేషము = విడివడుట. అది జరిగినపుడు, స్థిరముగ నిలిచి, ఆ విశ్లేషమున కారంభ స్థానమయినది అపాదానము. విశ్లేషమునకు కారణమైన క్రియ వేఱొక దానియందుండును. ఈ అపాదానమునకు 'అవధి' అనియు వ్యవహారము.

''గ్రామాదాగచ్ఛతి దేవదత్తః'' = దేవదత్తుడు ఊరినుండి వచ్చుచున్నాడు, అనిన, దేవదత్తునకు ఊరినుండి విశ్లేషము కలిగినది. ఆ విశ్లేషమున కాశ్రయము ఊరు. ఆ విశ్లేషము కలుగు పని చేసినవాడు దేవదత్తుడు. కాగా విశ్లేషమున కాశ్రయమై, దానికి హేతువయిన క్రియకు ఆశ్రయము కాని దెయ్యదియో అది అపాదానమని తేలినది.

ఇట నీ విశ్లేషమునకు సాధనములు రెండు. అందొకటి సంరబ్ధ సాధనము. అదియే విశ్లేషకారణమయిన క్రియను చేయునది కర్త అని అర్థము. రెండవది ఉదాసీన సాధనము ఆ పని చేయక, ఆ విభాగమున కవధిగ నుండుట మాత్రమే పనిగా గలది. అది గ్రామము.

ఇట్లు సంరబ్ధ, ఉదాసీన సాధన సాధ్యమయిన విశ్లేషము లేదా విభాగము లేదా అపాయము అనునది ఒకచో నిర్దేశింపదగి యుండును. అది నిర్దిష్టవిషయమయిన అపాదానము మొదటిది. 'గ్రామాదాగచ్ఛతి' అనుచోట గ్రామము. 'పర్వతాదవరోహతి' = కొండ నుండి దిగుచున్నాడు, అనుచోట పర్వతమును దాని కుదాహరణములు.

రెండవది ఉపాత్త విషయము. ఉదాహరణము– "వలాహకాత్ విద్యోతతే విద్యుత్" = మేఘము నుండి మెఱపు మెఱయుచున్నది, అనునది. ఇట వలాహకము ఉపాత్తవిషయ మగు అపాదానము. ఇచట క్రియలు రెండు. నిస్సరణము. విద్యోతనము. అందొకటి అంగము వేఱొకటి అంగి. నిస్సరణమంగముగా గల విద్యోతనముగాని, విద్యోతన మంగముగాగల నిస్సరణముగాని ధాతువున కర్థము. క్రియాంతరము అంగముగగాని అంగిగగాని గ్రహింపబడి యున్న స్థలమునందలి అపాదాన కారకము ఉపాత్త విషయము.

మేఘమునుండి మెఱపు మెఱయుచున్నదనిన మేఘము వేఱును, మెఱపు వేఱును అని స్ఫురించును. మేఘమనగా ధూమము, జ్యోతి, సలిలము, మరుత్తు – వీని సంనిపాతము= సమూహము. దానికిని దాని అవయవమునకును భేదమును భావించి, విభాగమును కల్పించుటచే దాని కవధి వలాహకము.

'మేఘమునుండి నిస్సరించి = బయలు వెడలి విద్యుత్తు మెఱయుచున్నది' అని గాని, 'విద్యుత్తు, మేఘముననుండి మెఱసి నిస్సరించుచున్నది' అనిగాని అర్థము. "కుసూలాత్ పచతి" ఇంకొక యుదాహరణము. కుసూలమునుండి వండుచున్నాడనిన నేమి యర్థము? కుసూలమనగా బౌణక లేదా గరిసె. ధాన్యము పోసి పెట్టుకొనునది. అందుండి తీసి వంట చేసికొనుచున్నాడనుట పచధాతువున కిచట ఆదానమంగముగాగల పాక మర్థముగాన నిదియును, ఉపాత్తవిషయమను అపాదానమునకు ఉదాహరణము.

ఇంకను నొక యుదాహరణము ''బ్రాహ్మణాచ్ఛంసీ'' అనునది. బ్రాహ్మణమను గ్రంథమునుండి గ్రహించి మంత్రములను పఠించుచున్నాడని అర్థము. గ్రహణ క్రియ అంగముగాగల శంసన క్రియ ప్రధానధాత్వర్థము. ''పంచమీ ప్రకరణే బ్రాహ్మణాచ్ఛంసిన ఉపసంఖ్యానమ్'' అను వార్తికముచే పంచమీ ప్రత్యయమునకు 'అలుక్'. ''అన్యార్థే చ'' అను వార్తికాంతరమును గలదు. ద్వితీయార్థమున నట పంచమి యనియు, బ్రాహ్మణములను

జెప్పుచున్నాడని యర్థమనియు ఆ వార్తికకారుని తాత్పర్యము. ఆ మతమున నిది యుదాహరణము కాదు.

అపేక్షిత క్రియమనునది మూడవ అపాదానము. వాక్యమున క్రియాపద ముచ్చరింపబడి యుండదు. అది అనుమితమగును. అట్టి అనుమిత క్రియకు ఆశ్రయమయిన ద్రవ్యమునకు అపాదాన సంజ్ఞ కలిగినచో, అది అపేక్షిత క్రియాపాదానము. ''మాధురాః పాటలిపుత్రకేభ్యః ఆఢ్యతరాః'' అను వాక్యమున 'పాటలిపుత్ర కేభ్యః' అనునది యుదాహరణము. మధురానగరము నందలివారు పాటలీపుత్ర వాసులకంటె మిక్కిలి సంపన్నులు. ఆఢ్యతరాః అనుచో తరప్ ప్రత్యయము ప్రకర్షను తెలియజేయును. దానివలన మాధురులకు వేరుపాటు గమ్యమగుచున్నది. పాటలిపుత్రకులనుండి అపకర్షింపబడిన మాధురులు' అని అనుమితమైన అపకర్షణ క్రియాపేక్షమైన అపాదానమనుట. అపకర్షణమనగా విభాగమే.

''వలాహకో విద్యోతతే'' = మేఘము మెఱయుచున్నది అనుచోట విద్యోతనమునకు నిస్సరణము అంగము కాదు. కాని పంచమీ ప్రయోగమున నిస్సరణ మంగముగాగల విద్యోతనము ధాత్వర్థము. ధాతువు లనేకార్థములుగదా. పంచమివలన విభాగము ప్రతీతము. నిస్సరణ మంగముగాగల విద్యోతనము ధాత్వర్థమని చెప్పిననే అది ఉపపన్నమగును. 'వలాహకాత్' 'కుసూలాత్' 'బ్రాహ్మణాత్' పంచమీ శ్రవణమువలన నట్లు చెప్పక తప్పదు ॥136॥

అవతారిక— అపాయమనగా గతి మాత్రము కాదు. గతిలో విశేషము.

శ్లో॥ సంయోగి భేదాద్భిన్నాత్మా గమిరేవ భ్రమిర్యథా ।
ధ్రువావధిరపాయోఽపి సమవేత స్తథాఽధ్రువే ॥ 137

భ్రమిః = తిరుగుట యనునది, యథా = ఏ విధముగా, సంయోగి భేదాత్ = ప్రదేశ భేదము వలన, భిన్నాత్మా = భిన్నరూపమయిన, గమిః ఏవ = గమనమే యగునో, తథా = ఆ విధముగ, అధ్రువే = చలమైన పదార్థమునందు, సమవేతః = సంబద్ధమై, ధ్రువావధిః = స్థిరమయిన అవధిగల, అపాయః అపి = అపాయమును, గతి విశేషమే.

తాత్పర్య విశేషాంశములు— గమనమనగా నొకచోటు వదలి పై చోటుతో సంయోగము భ్రమణమనగా తిరుగుట. అదియు అట్టిదే. అనగా దిగ్విశేషావచ్ఛేదమున గలుగు విభాగ సంయోగరూపమే. కాణాదులు, ఉత్క్షేపణ, అపక్షేపణ, ఆకుంచన, ప్రసారణ, గమనములు— అని క్రియలు అయిదు రకములని చెప్పి, భ్రమణము, రేచనము మున్నగు క్రియలు గమన విశేషములే కావున, వానికి గమనమునందే, అంతర్భావమనిరి ఆ విధముగనే అపాయము అనునదియు నొక గతి విశేషము. దీనిని సంభవింప జేయు క్రియ పర్ణమునందుండును. ఆ క్రియ లేనిది విశ్లేషమున కవధియగు వృక్షము. అది ఉదాసీన కారకమని చెప్పబడినది.

సంయోగ విభాగములు రెండును ద్వినిష్ఠములు ఒకదాని నుండి ఒకటి విడివడుట

విభాగము. ఒకదానితో నొకటి కలియుట సంయోగము. ఆ అపాయము లేదా విశ్లేషము కలిగి నపుడు స్థిరముగ నుండుటయే దాని కారకత్వము. స్థిరమనగా ఊయివలె కదలకుండ నుండు నది అని అర్థము కాదు. ॥187॥

అవతారిక — ఆ విషయమే యీ కారికలో నుపపాదింపబడుచున్నది.

శ్లో॥ ద్రవ్యస్వభావో న ధ్రౌవ్యమితి సూత్రే ప్రతీయతే।
అపాయవిషయం ధ్రౌవ్యం యత్తు తావత్ వివక్షితమ్॥ 138

సూత్రే = 'ధ్రువమపాయే' అను సూత్రమునందు, ధ్రౌవ్యం = స్థిరత్వమనగా, ద్రవ్య స్వభావః = స్వభావమైన నిశ్చలత, ఇతి = అని, న ప్రతీయతే = ప్రతీతము గాదు, అపాయ విషయం = విశ్లేషము కలుగవలసినపుడు, ధ్రౌవ్యం = ధ్రువత్వము = అవధిగానుండుట, యత్ తు = ఏది కలదో, తావత్ = అంతయే, వివక్షితమ్ = వివక్షింపబడినది.

తాత్పర్య విశేషాంశములు— లోకములో ధ్రువత్వమనగా 'ఇనుపగుండువలె కదలనిది' అను భావము ప్రసిద్ధము కాని 'ధ్రువమపాయే' అను సూత్రమున ఆ అర్థము కాదు తీసికొనవలసినది. విభాగము కలిగినపుడు, అది ఎచటనుండి కలుగుచున్నదో అది ధ్రువము అని మాత్రమే సూత్రకారుని తాత్పర్యము. కనుకనే, అవధిభూతములయినవి గతి యుక్తములైన వానికి అపాదాన సంజ్ఞ ఎట్లు సిద్ధించునని శంకించి, ఆ అస్థిరత్వముగాదిచట వివక్షింపబడినది అని మహాభాష్యమున శంకా పరిహారములు కలవు.

"గతియుక్తేష్వపాదానం సంజ్ఞా నోపపద్యతే అధ్రువత్వాత్
న వా, అధ్రౌవ్యస్య అవివక్షితత్వాత్" అని వార్తికములు.

"ధావతః అశ్వాత్ పతితః" = పరుగెత్తుచున్న గుఱ్ఱమునుండి పడినవాడు. "సార్థాత్ గచ్ఛతః హీనః" = నడచి వెళ్ళుచున్న బాటసారుల గుంపునుండి విడివడినవాడు అను వాక్యములందు అశ్వము పరుగెత్తుచున్నదైనను, సార్థము నడచుచున్నదైనను, ఆ విధమైన అస్థిరత ఇచట వివక్షింపబడదు. ఒక సంరబ్ధ సాధనమును, ఒక ఉదాసీన సాధన మును కలసి సాధించిన కార్యములో ఉదాసీనముగ నుండుట మాత్రమే ధ్రువత్వమని వాని భావము.

ఒక శంక— గ్రామా దా గచ్ఛతి పథా పర్వతమ్ = గ్రామమునుండి, త్రోవ వెంబడి కొండను జేరుచున్నాడు, అను వాక్యమున పంథయు, పర్వతమును, విశ్లేషము గ్రామమునుండి కలిగినపుడు ఉదాసీనములయి యున్నవి గదా వాని కేల అపాదాన సంజ్ఞ కలుగలేదు.

సమాధానము— కర్మ, కరణ సంజ్ఞలు, అపాదాన సంజ్ఞకంటె పరములగుటచేత నవి అపాదాన సంజ్ఞను బాధించును. "అపాదాన ముత్తరాణి కారకాణి బాధన్తే" అని వార్తి కము. అష్టాధ్యాయీ పాఠమునందు, మొట్టమొదటిది అపాదానము. ఇతర కారకములన్నియు **తరువాతివి.**

ధనుషావిధ్యతి = వింటితో గొట్టుచున్నాడందురు. వింటినుండి బాణమును దీసి కొట్టునుగదా. కాన విల్లు ఉపాదానము కాదగియున్నది. పరమైన కరణసంజ్ఞ దానిని బాధించి నది.

''గాందోగ్ధి'' = ఆవును పితుకుచున్నాడందురు. ఆవునుండి పాలను బితుకును కాన ఆవు అపాదానము కాదగియున్నను, కర్మసంజ్ఞ అష్టాధ్యాయీ సూత్ర పాఠక్రమములో పర మగుట వలన దానిని బాధించినది. ''కంసపాత్ర్యాం భుంక్తే''=కంచమునందు దినుచున్నాడు. కంచమునుండి అన్నమును దీసికొని తినుచున్నాడు అనుట కంచమపాదానము. దాని నధికరణ సంజ్ఞ బాధించినది

కాగా, ప్రకృతమున విశ్లేషమున కాశ్రయమైనది చలమైనను అచలమైనను ధ్రువమే విశ్లేషమునకు కారణమైన క్రియ దానియందు లేకుండుటయే దాని ధ్రువత్వమని భావము ॥138॥

అవతారిక — ప్రకృతాంశ వివరణ రూపమే ఈ కారిక

శ్లో॥ సరణే దేవదత్తస్య ధ్రౌవ్యం పాతే తు వాజినః ।
ఆవిష్టం యదపాయేన తస్యా ధ్రౌవ్యం ప్రచక్షతే ॥ 139

సరణే = శీఘ్రగతిలో, దేవదత్తస్య = దేవదత్తునకును, పాతేతు = పడుటలో, వాజినః ధ్రౌవ్యమ్ = అశ్వమునకును, ధ్రువత్వము, అపాయేన = విభాగ హేతువైన క్రియచే, యత్, ఆవిష్టం = ఏది ఆవేశింపబడినదో, తస్య, అధ్రౌవ్యం = దానికి, అధ్రువత్వమును, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్య విశేషాంశములు— ''ధావతః అశ్వాత్ పతితః దేవదత్తః'' ఇచట పరుగు సరణము. అది గుఱ్ఱము పని పరుగెత్తుచున్నదిగాన అధ్రువము. పడిన దేవదత్తుడు పరుగెత్త లేదు. కాన నాతనికి ధ్రువత్వమే పాతమనగా పతనము. అదియే ఉత్తరదేశ సంయోగము. అది కలుగుటకు పని చేయువాడు దేవదత్తుడు. పడినది అశ్వమునుండి కనుక అశ్వము పరుగెత్తుచున్నను, అది దేవదత్త వ్యాపారమున, ధ్రువమే. గుఱ్ఱము పరుగెత్తుచున్నను దేవదత్తుడు పరుగెత్తలేదుగాన అతనికిని ధ్రువత్వమే యున్నను, అతనికి అపాదాన సంజ్ఞ కలుగదు. ఏలయన- అవధిగా నాతడు నిర్దేశింపబడలేదు గదా. అపాయమనగా గతి మాత్రము కాదు ''గతిర్వినా త్వవధినానాపాయ ఇతి కథ్యతే'' అని ముందు చెప్పబడును. ''సరతో దేవదత్తాత్ ధావత్యశ్వః'' = ''పరుగెత్తుచున్న దేవదత్తుని వద్దనుండి అశ్వము పరుగిడు చున్నది'' అని వాక్యవిన్యాస మున్నదనుకొనుడు అపుడు దేవదత్తున కా సంజ్ఞ కలుగును.॥139॥

అవతారిక — ఇక నెచట రెండు పదార్థములును పరిస్పందములే, అనగా చలనముగలవియే అయినపుడు ధ్రువాధ్రువ విభాగము ఎట్లనిన—

శ్లో॥ ఉభావప్య ధ్రువౌ మేషౌ యద్యప్యుభయ కర్మజే ।
విభాగే ప్రవిభక్తేతు క్రియే తత్ర వివక్షితే ॥ 140

యద్యపి = విచారింపగా, ఉభయకర్మజే = రెండు క్రియలవలన కలిగిన, విభాగే = విశ్లేషము నందు, ఉభౌ అపి = క్రియాశ్రయములైన రెండు, మేషౌ = మేషములును, అధ్రువౌ = స్థిరములు కావనుకొనుడు, కింతు, తత్ర = కాని, అచట, క్రియే = విభాగ జనక క్రియలు, ప్రవిభక్తే = భిన్న భిన్నములుగనే, వివక్షితే = వివక్షింపబడును.

తాత్పర్య విశేషాంశములు— "స్థాణోః శ్యేనః అపసర్పతి" స్థాణువనగా బండ. లేదా కఱ్ఱదుంగ. దానినుండి డేగ తొలగుచున్నది ఇచట విభాగము శ్యేన వ్యాపారము వలన కలిగినది. కనుక స్థాణువు ధ్రువము.

"అపసర్పతో మేషాత్ మేషోపసర్పతి". రెండు గొఱ్ఱెలు ఢీకొనును. మరల నొకదాని నుండి మఱియొకటి దూరముగ తొలగి మరల ఢీకొనును. అచట కలుగు విభాగము రెండు గొఱ్ఱెల వ్యాపారము వలనను జరిగినది. కావున రెండును అధ్రువములే. కాని ఆ గొఱ్ఱెలు వేఱు. వాని వ్యాపారములును భిన్న భిన్నములు. దీని క్రియలో నది అవధి. దాని క్రియలో, ఇది అవధి. కనుక ధ్రువాధ్రువ విభాగ ముపపన్నము. ॥140॥

అవతారిక— అందువలన,

శ్లో॥ మేషాంతర క్రియాపేక్ష మవధిత్వం పృథక్ పృథక్ ।
మేషయోః స్వక్రియాపేక్షం కర్తృత్వం చ పృథక్పృథక్ ॥ 141

మేషయోః = రెండు గొఱ్ఱెలకును, మేషాంతర క్రియాపేక్షం = తమలో రెండవదాని క్రియను బట్టి, అవధిత్వం = అవధి అగుటయు, పృథక్ పృథక్ = వేఱు వేఱు, స్వక్రియాపేక్షం = తమతమ క్రియలనుబట్టి, కర్తృత్వంచ = కర్తలగుటయు, పృథక్ పృథక్ = వేఱువేఱుగనే సంభవము.

తాత్పర్య విశేషాంశములు— ఒక గొఱ్ఱెయందలి క్రియనుబట్టి విభాగము కలిగినపుడు రెండవది అవధి యగును. ఆ రెండవదాని క్రియవలన విశ్లేషము కలిగినపుడు మొదటిది అవధి యగును. ఆ విధముగనే తమ తమ వ్యాపారములకు తా మాశ్రయమగుట వలన, కర్తృత్వమును సిద్ధించును. ॥141॥

అవతారిక— మేషములకు పరస్పరము అవధి భావమును వివక్షింపక, వేఱొక దానిని విశ్లేషావధిగా గ్రహించినపుడు ఆ మేషములు కర్తలుగా మాత్రమే ఉండును.

శ్లో॥ అభేదేన క్రియైకా తు ద్విసాధ్యా చే ద్వివక్షితా ।
మేషావపాయే కర్తారౌ యద్యన్యో విద్యతేఽవధిః ॥ 142

ద్విసాధ్యా = రెండింటిచే సాధింపదగిన, ఏకాక్రియా = ఒక క్రియ, అభేదేన తు = ఏకముగనే కాని, వివక్షితా చేత్ = వివక్షింపబడినను, అన్యః = వేఱొకటి, అవధిః = అవధిగా, విద్యతే యది = ఉన్నయెడల, తదా మేషౌ = అపుడు మేషములు రెండును. అపాయే = విభాగములో, కర్తారౌ భవతః = కర్తలు అగును.

తాత్పర్య విశేషాంశములు— "మేషౌ అపసర్పతః" = గొఱ్ఱెలు రెండు తొలగు చున్నవి. ఈ వాక్యమున అపసర్పణమను క్రియ ఒకటియే. ఆ క్రియను జేయునవి రెండు. అపసర్పణమున కవధి వేఱొకటి అనగా పర్వతము. పర్వతము దగ్గరనుండి దూరముగ బోవుచున్నవి లేదా 'పరస్పరతః మేషౌ అపసర్పతః' = ఒకదాని నొకటి విడచి దూరముగ బోవుచున్నవి. అపుడు 'పరస్పరము' అవధి. అపసర్పణమను క్రియ ఇచట తిఙన్తపదముచే ఒకటిగనే చెప్పబడినది. కర్తలు వేఱు, అగుట వలన, క్రియకు భేదప్రతీతి. ॥142॥

అవతారిక— పై విషయమునకు భాష్య గ్రంథ సంవాదము జూపబడుచున్నది.

శ్లో॥ గతిర్వినాత్వవధినా నాపాయ ఇతి కథ్యతే ।
వృక్షస్య పర్ణం పతతీత్యేవం భాష్యే నిదర్శితమ్ ॥ 143

అవధినా వినా = అవధి లేకుండగ, గతిస్తు = గతి మాత్రము, అపాయః ఇతి = అపాయ శబ్దార్థమని, న గమ్యతే = తోచదు, "వృక్షస్య పర్ణం పతతి" = చెట్టుయొక్క ఆకు పడు చున్నది, ఇతి ఏవమ్ = అనియే, భాష్యే = మహా భాష్యమున, నిదర్శితమ్ = ఉదాహరింప బడినది.

తాత్పర్య విశేషాంశములు— "కారకే" (1-4-23) అను సూత్రమున మహా భాష్యములో నిట్లు ప్రశ్నోత్తరములు గలవు.

'కారకే' అను సప్తమి కేమి యర్థము? అని ప్రశ్న.

'ఇది ప్రథమకు బదులు సప్తమి. అందువలన "కారకమ్" అనియే సంజ్ఞాపదము' అని సమాధానము.

దేనికిది సంజ్ఞ? సంజ్ఞి నిర్దేశింపబడలేదే? కాబట్టి, 'సాధకమగునది' లేదా 'నిర్వ ర్తక మగునది' కారకమను సంజ్ఞ కలది అని, సంజ్ఞిని గూడ నిర్దేశింపవలెను. లేనిచో క్రియా జనకము కానిది కూడ కారకమను సంజ్ఞ కలది కావలసి వచ్చును. ఎట్లనగా—

"వృక్షస్య పర్ణం పతతి" = చెట్టు ఆకు రాలుచున్నది అందురు. ఈ వాక్యమున వృక్షము పర్ణమునకు విశేషణము. దానికి క్రియతో సంబంధము లేదు. కాగా క్రియాజనకము గాదు. సూత్రమున సంజ్ఞిని నిర్దేశింపనిచో నిట వృక్షమును అపాదానకారకము కావలసి వచ్చును అను నాశయముతో నిట్లు శంకింపబడినది.

వా॥ "కారక ఇతి సంజ్ఞా నిర్దేశశ్చేత్ సంజ్ఞినో నిర్దేశః"
"ఇతరథాహ్య నిష్టప్రసంగో గ్రామస్య సమీపాదాగచ్ఛతీత్యకారకస్య"
"అపాదానం చ వృక్షస్య పర్ణం పతతీతి"

ఇవి మూడును అచటి వార్తికములు.

ఇవి వార్త్తికములు గదా 'భాష్యే నిదర్శితమ్' అని కారికతో చెప్పబడినదేమి ? అని శంక కలుగవచ్చును. కాని భాష్యమనగా వార్త్తిక సహితమే అని తాత్పర్యము కానోపును.

వా॥ "న వా అపాయస్య అవివక్షితత్వాత్" అని పరిహార వార్త్తికము.

ఇట అపాయము వివక్షితము కాదు. సంబంధము వివక్షితము. అవధి సాపేక్షమగు గతియే అపాయముగా దీసికొనబడును. అవధిత్వమును వృక్షమునకు ప్రయోక్త భావించినచో నపుడు 'వృక్షాత్ పర్ణం పతతి' అనియే ప్రయోగించును. కాని అపుడు ఆ ప్రయోగమువలన, ఆ పర్ణము దేనిదో తెలియకపోవచ్చును. అది కంకపర్ణమా ? లేక కురరపర్ణమా పడినది ? అని శంక కలుగును. కంకము, కురరము అనునవి పక్షులు. కంకము = రాపులుగు. కురరము లకుముకి పిట్ట. వాని ఱెక్క చెట్టునుండి పడుచున్నదని యర్థము కావచ్చును. 'ఆ చెట్టు ఆకు' అని అర్థము కాకపోవును. కావున పర్ణమునకు విశేషణముగా వృక్షము భావింపబడినది. కనుకనే పర్ణము చెట్టును వదిలిపెట్టకుండగ కొమ్మ వంగి. నేలకు రాచుకొనినపుడు గూడ ఆ ప్రయోగము సంభవను

ఏతావతా తేలిన విషయము— 'సావధికమగు గతియే' అపాయమనబడును. శుద్ధ గతిమాత్ర మపాయము కాదు. విభాగపూర్వక సయోగము కలిగినపుడు అవధి యుండి తీరును. అదియే సూత్రమునందలి ధ్రువపదమున కర్థము. అది ఉదాసీనమైన కారకము.॥148॥

అవతారిక— "వలాహకాత్ విద్యోతతే విద్యుత్" = మేఘమునుండి మెఱపు మెఱయు చున్నది. "వలాహకే విద్యోతతే విద్యుత్" = మేఘమునందు, మెఱపు మెఱయు చున్నది. "వలాహకః విద్యోతతే" = మేఘము మెఱయుచున్నది.

అని మూడు విధములయిన ప్రయోగములును లోకమున గలవు. ఇందు, మొదటి వాక్యమున వలాహక మపాదానము. రెండవ వాక్యమున అధికరణము. మూడవ వాక్యమున నది కర్త. ఇట్లు మూడు శక్తులకు ఒకచో సమావేశ మెట్లు సంభవము ? తరువాతి సంజ్ఞలచే అపాదాన సంజ్ఞ బాధింపబడవలెను గదా ! "అపాదాన ముత్తరాణి" అనువార్త్తికము, విప్రతిషేధమును బోధించుచున్నది గదా యనిన—

శ్లో॥ భేదాభేదౌ పృథగ్భావః స్థితిశ్చేతి విరోధినః ।
యుగపన్న వివక్ష్యన్తే సర్వే ధర్మా వలాహకే ॥ 144

భేదాభేదౌ = భిన్నత్వ ఏకత్వములు, పృథగ్భావః = వేఱుపాటు, స్థితిః చ = సంయోగము. ఇతి = అని ఇట్లు, విరోధినః = విరుద్ధములయిన, సర్వే = అన్ని, ధర్మాః = ధర్మములును వలాహకే = మేఘమునందు, యుగపత్ = ఏకకాలముననే, న విక్ష్యన్తే = వివక్షింపబడవు.

తాత్పర్య విశేషాంశములు— ఏక కాలముననే భిన్న శక్తి యోగము, భావింప బడలేదు. మేఘమన పొగ, వెలుగు, నీరు, గాలి - అనువాని సంఘాతము. దాని ఒక అవ

యవము వెలుగు. అదియే మెఱయునది. దానిని సంఘాతము కంటె వేఱుగా తీసికొనిన, పృథగ్భావము. ఆ వేఱుపాటును వివక్షించినపుడు అదియే అపాయమనబడును గాన 'వలాహకాత్ విద్యోతతే విద్యుత్' అని వ్యవహారము. అపుడు వలాహకము ఉపాత్త విషయాపాదానము.

ఆ తేజస్సు అందుండి వేఱుపడినను, నిరాధారముగ నుండజాలదు గాన నది మేఘమునందే యుండునదిగా భావించినపుడు 'వలాహకే విద్యోతతే విద్యుత్' అందురు మేఘము జలపూర్ణము గదా. తేజస్సునకది ఆధార మెట్లగును? అని శంకింపవచ్చును గాని విద్యుత్తు రూపమగు అగ్నికి నీరే ఇంధనముగాన నది సంభవమే. ఈ విధముగ మేఘమునకును విద్యుత్తునకును భేద పక్షమున, మేఘమునకు అధికరణశక్తి, అపాదానశక్తి అని రెండు శక్తు లుద్భవించును. అపుడు తేజస్సు స్వతంత్రముగ ప్రకాశింపదు. దానికి కారణము, ఉదకముతో చేరి యుండుట, ధూమముచేత నావిలమగుటయు నగును.

ఇక 'వలాహకో విద్యోతతే' అను వాక్య సంనివేశమున, మేఘమునకు కర్తృ శక్తియే ఉద్భూతము = ప్రకటనము. మేఘము అతి స్వచ్ఛమగు ద్రవ్యము. అందుండు ఉదకము తేజస్సును ప్రకాశింపకుండ ప్రతిబంధింపదు. ప్రకాశించునది అవయవమే అయినను అవయవి ప్రకాశించునందురు. ఈ ఉపవనము చిగిర్చినదందుము. చిగిరించినవి చెట్లు. వనము వాని సమూహము.

ఇట్లు, వలాహకమునకు, పర్యాయముగనే, కర్తృ, అపాదాన, అధికరణ శక్తులు కలుగును గాని ఏకకాలమున గాదు. కావున భాష్య గ్రంథమున ప్రదర్శితమైన సమావేశము విరుద్ధము గాదు. ॥144॥

అవతారిక— "ధనుషా విధ్యతి" మున్నగు విప్రతిషేధోదాహరణములందు శక్తి ద్వయమునకును ఏకకాలమునందే సమావేశము వివక్షితమని చెప్పబడుచున్నది

శ్లో॥ ధనుషా విధ్యతీత్యత్ర వినాఽపాయ వివక్షయా ।
కరణత్వం యతోనాస్తి తస్మాత్తదుభయం సహ ॥ 145

'ధనుషావిధ్యతి' = 'వింటితో కొట్టుచున్నాడు' ఇత్యత్ర = అను నీ వాక్యమున, అపాయ వివక్షయా వినా = అవధిత్వ వివక్ష లేనిచో, కరణత్వం = సాధకతమత్వము, యతః నాస్తి = ఎందువలన నుండబోదో, తస్మాత్ = ఆ కారణమువలన, తత్ ఉభయం = ఆ కరణత్వ అవధిత్వములు, సహ = ఆ ద్రవ్యమున కలిసియే యుండును.

తాత్పర్య విశేషాంశములు— ధనుస్సు తననుండి వెలువడు బాణమునకు అవధి. కొట్టుటకు నిమిత్తము. కావున రెండు కారక శక్తులును దానికి ఉండును. ఆ శక్తుల కార్యములు పంచమీ తృతీయలు. అవి రెండును ఒక ప్రాతిపదికమునకు పరముగా సంభవింపవు శక్తులకు విరోధములేకున్నను వాని కార్యములకు విరోధముండుటవలన కార్యముఖముగా వానికి విరోధముండుటవలన, కరణసంజ్ఞ పరత్వమువలన అపాదాన సంజ్ఞను బాధించినది.

'కంసపాత్ర్యాం ఓదనం భుంక్తే' = కంచు కంచములో నన్నమును దినుచున్నాడు. ఇది భాష్యోదాహరణము. కారికోక్తోదాహరణము ఉపలక్షణమనుట కంచమున దినుట యన, అందున్న అన్నమును దినుటగదా. కంచ మన్నమున కాధారము. అందుండి తీసి అన్నమును దినునుగాన నది అపాదానమును నగును. అపాదానము కాకున్న ఆధారమును గాదు. ఏలయన ఏనుగు పర్ణపుటమునందున్న అన్నమును ఆ ఆకుదొప్ప తోడనే నోటిలో పడవేసికొనినపుడు పర్ణమునందు దినుచున్నదని వ్యవహరింపరు గదా. కావున అధికరణత్వ వివక్షకు అపాదానత్వ వివక్ష నిమిత్తము. కావున నేకకాలమున శక్తిద్వయ వివక్షయును, పరత్వమువలన అధికరణ సంజ్ఞ అపాదాన సంజ్ఞను బాధించుటయు, సుష్ఠు, ఉపపన్నములు.

''గాం దోగ్ధి'' అనునదియు నుదాహరణాంతరము = ఆవును బిదుకుచున్నాడనిన, అవునుండి పాలు తీయుచున్నాడని యర్థము గదా. పాలు గోవునుండి జారవలె. అది జరుగ నిచో పితుకుట కుదరదు. గోవునందున్న కర్మత్వ శక్తి అపాదాన శక్తితో కలిసి యుండు నదియే. కాని శక్తికార్యములయిన విభక్తుల విరోధ మూలముగ శక్తులకు ప్రబలదుర్బల భావ విచారము ప్రసక్తము.

''ధనుర్విధ్యతి''=విల్లు కొట్టుచున్నది అనియు నందురు. అచట విల్లు అపాదానము కాకున్న దానికి వ్యధనమునందు స్వాతంత్ర్యము కలుగదు. ఇచట కర్తృశక్తి అపాదానశక్తికి బాధకమైనది. ॥145॥

అవతారిక— రెండు కారకశక్తులు అవినాభావముగ ఒక ద్రవ్యమునందు కలసి యుండినపుడు, రెండు భిన్న సంజ్ఞలు ప్రాప్తించుటయు, కార్యముఖమున వానికి విరోధమును, పరత్వమువలన వ్యవస్థయు నింతవఱ కుపాదింపబడినవి. ఇక నా శక్తులకు భేదము లేదనియు నిందు ప్రతిపాదింపబడుచున్నది.

శ్లో॥ ఏకైవ సా సతీ శక్తిః ద్విరూపా వ్యవతిష్ఠతే।
నిమిత్తం సంజ్ఞయోస్తత్ర పరయా బాధ్యతేఽపరా ॥ 146

ద్విరూపా = రెండు పనులను జేయునదైన, సా, శక్తిః = ఆ శక్తి, ఏకా ఏవసతీ = ఒకటిగనే అగుచు, వ్యవతిష్ఠతే = వ్యవస్థితమై యున్నది, సంజ్ఞయోః = రెండు సంజ్ఞలకు, నిమిత్తం చ= కారణమును, భవతి = అగుచున్నది, తత్ర = అందు, పరయా = పరమున పఠింపబడిన సంజ్ఞచే, అపరా = పూర్వసంజ్ఞ, బాధ్యతే = బాధింపబడును

తాత్పర్య విశేషాంశములు— ద్రవ్యములందుండు శక్తి ఒక్కటియే. అది వేరు వేరు క్రియలను జేయును. ఆ శక్తియే అపాదాన, కరణ సంజ్ఞలకు నిమిత్తమును అగును. కాని సంజ్ఞా కార్యములగు భిన్న భిన్న ప్రత్యయములకు ఒక ప్రాతిపదికము కంటె పరముగ నుండుట అసంభవము గాన, ఆకడార సూత్రము, పూర్వసంజ్ఞ నుత్తరసంజ్ఞ బాధించునని చెప్పినది. "ధనుషా విధ్యతి" అను స్థలమున ధనుస్సునకు గల కరణశక్తి యందే, బాణ

నిస్సరణమున నవధిత్వము గూడ నంతర్భూతము. క్రియలు వేరయినంత మాత్రమున శక్తులును వేరు కానక్కఱలేదు. ఒకే శక్తి ప్రధానక్రియ అగు వ్యథనమును, అంగభూత క్రియయగు నిస్సరణమును చేయుటచే రెండు రూపములు కలదిగా భావింపబడుచున్నది శక్తుల కాశ్రయమగు ద్రవ్యమే ఆ పనులను జేయుననవచ్చును గదా శక్తులను కల్పింపనేల అనవచ్చును. కాని అది ద్రవ్యస్వభావము గాదు. ద్రవ్యము రెండు క్రియలను జేయజాలదు. శక్తి సామర్థ్యరూపము. అది అనేక కార్యములను సాధింపగలదు. శక్తుల స్వభావము వేరు శక్తిమంతముల స్వభావము వేరు అని దిక్సముద్దేశమున ప్రతిపాదింపబడినది. ॥146॥

అవతారిక— నిర్దిష్ట విషయము, ఉపాత్త విషయము, అపేక్షిత క్రియము - అనబడు మూడు అపాదానములును, "అపాదానే పంచమీ" (2-3-28) అను సూత్రమునకు విషయములు.

"పంచమీ విభక్తే" (2-3-42) అనునది వేఱొక పంచమీ విధాయకము. విభాగ ముతో గూడిన నిర్ధారణము గమ్యమైనపుడు పంచమిని విధించినది ఆ సూత్రము నిర్ధారణ మనగా సముదాయమునుండి ఏకదేశమునకు పృథక్కరణము వేఱు పరుపబడినది, సముదా యావయవము గాక భిన్నమే అయినపుడు పంచమీ ప్రత్యయము వచ్చునని యర్థము. ఆ సూత్రమున కుదాహరణములైన వానిలో అపాయము ఊహింపదగినదై యుండునుగాన నా సూత్రము అపేక్షిత క్రియమగు అపాదానము విషయముగాగలది. కావున నట పంచమిగూడ "అపాదానే పంచమీ" అను సూత్రముచేతనే సిద్ధింపవచ్చునని ఈ కారికలో నుపపాదింపబడు చున్నది.

శ్లో॥ నిర్ధారణే విభక్తో యో భీత్రాదీనాం చ యో విధిః ।
ఉపాత్తాపేక్షితాపాయః సో బుధప్రతిపత్తయే ॥ 147

విభక్తే = భేదముగల, నిర్ధారణే = పృథక్కరణమునందు, యః విధిః = ఏ పంచమీవిధి కలదో, భీత్రాదీనాంచ = భీత్రా మున్నగువాని భయహేతువునకు, యః విధిః = ఏ సంజ్ఞా విధి కలదో, ఉపాత్తాపేక్షితా పాయః = ఉపాత్త విషయము, అపేక్షిత క్రియమును అగు, సః విధిః = ఆ సంజ్ఞా విధానము, అబుధప్రతిపత్తయే = అబుధులకు తెలియుటకై, కృతః = చేయబడినది.

తాత్పర్య విశేషాంశములు— నిర్ధారణమను నర్థమున షష్ఠీ సప్తములు విధింప బడినవి. 'నృణాం ద్విజః శ్రేష్ఠః' లేదా 'నృషు ద్విజః శ్రేష్ఠః' ఉదాహరణము. ఈ షష్ఠీ సప్తముల కపవాదముగా "పంచమీ విభక్తే" (2-3-42) అను సూత్రము పంచమిని విధించి నది. "మాధురాః పాటలిపుత్రకేభ్యః ఆఢ్యతరాః" = 'మధురాపుర వాసులు పాటలీపుత్ర పౌరుల కంటె ధనికులు' అని యుదాహరణము. ఇచట పంచమి "అపాదానే పంచమీ" (2-3-28) అను సూత్రముచేతనే సిద్ధింపదా ? అపాదానమనగా విభాగమున కవధి అయినది

గదా ? నిర్ధారణ స్థలములం దెచ్చటనైనను నిర్ధారింపబడు వానికిని, పృథక్కరణమునకు అవధి అయినవానికిని భేదము తప్పదుగదా. అట్టియెడ, సూత్రమునందు 'విభక్తే' అను పదమున కేమి ప్రయోజనము ? అని విచారించిన, నిర్ధార్యమాణమునకు సర్వదా భేదమే ఎచట నుండునో అచట పంచమి వచ్చునని తెలియజేయుటకు గదా ? కాగా అచట గూడ అపాయము = విశ్లేషము అనుమితముగ నగును గాన నది అపేక్షిత క్రియమగు అపాదాన మగును. ఏతావతా అపాదానసంజ్ఞ వలననే పంచమి సిద్ధింపవచ్చును.

ఒక ప్రశ్న కలుగవచ్చును— విభాగము సంయోగ పూర్వకము గదా. చెట్టునందు సంయుక్తమైయున్న పర్ణమునకు తరువాత విభాగ మేర్పడును. ఇచట నట్టి సంయోగ పూర్వక విభాగమునకు సంభవ మేమి ? అని ఆ ప్రశ్న

సమాధానము— ప్రయోక్త బుద్ధిలో సంశ్లేష విశ్లేషములు సంభవింప వచ్చునని. అది ఎట్లనగా-

మాధురులకును పాటలిపుత్రకులకును ఆఢ్యత్వము తుల్యమని వక్త, తన బుద్ధిలో ముందు గ్రహించును. తరువాత, మాధురులకు అధికమైన ఆఢ్యత కలదని తెలిసికొని పాటలి పుత్రకుల నుండి వారిని వేరుపరచును. ఇట్లు బౌద్ధములగు సంశ్లేష విశ్లేషములు సంభవించును గాన అపాదాన పంచమియే సిద్ధించును. ఇయ్యది అపేక్షిత క్రియమను తృతీయాపాదానము.

బుద్ధి పరికల్పితమైన అపాయము గౌణము గదా ? గౌణ ముఖ్యములలో ముఖ్యము లందే ప్రవర్తించు అపాదానసంజ్ఞ అను నట్టి కార్యము గౌణార్థమున నెట్లు ప్రవర్తించును ? అని శంకింపవచ్చును. కాని కారకాధికారమునందు అట్టి అతిశయ విశేషము వివక్షింపబడదని "సాధక తమం కరణమ్" అను సూత్రమునందలి 'తమప్' గ్రహణము తెలియచేయుచున్నది గాన నా ప్రశ్న కవకాశము లేదు. గౌణాపాదానమునను పంచమి సిద్ధించును.

శ్లో॥ "బుద్ధ్యా సమీహితైకత్వాన్ పంచాలాన్ కురుభిర్యదా ।
పునర్విభజతే వక్తా తదాపాయః ప్రతీయతే" ॥

అని వెనుక చెప్పబడినది స్మరింపదగును.

కౌరవులను, పాంచాలురను ముందుగా వక్త తన బుద్ధిలో నొక్కటిగా భావించి, మరల విభజించినపుడు అపాయము ప్రతీతమగును అని శ్లోకమున కర్థము.

పైన వివరించిన ప్రకారము సామాన్య సూత్రముచేతనే పంచమి సిద్ధించినను మరల "పంచమీ విభక్తే" (2-3-42) అను సూత్రమును రచించుట, వాస్తవాపాయమే గ్రాహ్యముగాని బుద్ధి పరికల్పితాపాయము కాదు అని తలంచు అబుధులకొఱకిని యెఱుంగునది.

"భీత్రార్థానాం భయహేతుః" (1-4-25) అను సూత్ర విచారము.

భయము అర్థముగా గలవియు, రక్షించుట అను నర్థము గలవియు నగు ధాతువులు

ప్రయోగింపబడినపుడు భయకారణమైనది అపాదాన సంజ్ఞ కలది అగును' అని అర్థము. 'వృకేభ్యః భయమ్' 'చోరాద్బిభేతి' = తోడేళ్ళవలన భయము. దొంగవలన భయపడుచున్నాడు. ఈ ఉదాహరణములందును పూర్వసూత్రముచేతనే సిద్ధించునుగాన నీ సూత్రమునకును అబుధబోధనమే ఫలము.

వాక్యప్రయోక్త ప్రేక్షా పూర్వకారిగ నుండును. తన బుద్ధితో తాను ముందుగ పరిశీలించి ఆ యా కార్యములందు ప్రవర్తించును. కావున ఆతడు, తోడేళ్ళకు అగపడిన తన కనిష్టము కలుగునని తలంచును. అది తోడేళ్ళతో బుద్ధి పరికల్పితమగు సంశ్లేషము. తరువాత విశ్లేషము. భయమందుట యనగా భయపడి అటనుండి తొలగుట. అదియే అపాయము కావున వృకములకుపాత్తక్రియమగు నపాదానత్వము. 'ధ్రువమపాయే' అను సూత్రముచేతనే సంజ్ఞాసిద్ధి.

''చోరాత్ త్రాయతే'' = 'దొంగ వానినుండి కాపాడుచున్నాడు' అను నపుడును కాపాడుట యనగా అనర్థమును తొలగించుట. చోర సంబంధ మనర్థమని బుద్ధిలో దలంచి, మిత్రుడగువాడు. తన వానికి ఆ సంబంధము కలుగకుండ తప్పించుచున్నాడని అర్థము. కావున నిదియు పూర్వసూత్ర సాధ్యమే అబుధ ప్రతిపత్తియే ఫలము.

''పరాజేరసోఢః'' (1-4-26) అను సూత్రార్థ విచారము.

''అధ్యయనాత్పరాజయతే'' అధ్యయనమువలన పరాజితుడగుట యనగా, చదువు చదువుకొనుటకు బుద్ధి మాంద్యము మున్నగువానివలన క్లేశపడుట. అనగా ఖేదమునంది, అందుండి మరలుట అధ్యయనమునకు ప్రారంభించి, అది దుఃఖకరమును దుర్ధరమును, అనగా జ్ఞప్తియందుంచుకొనుటకు సాధ్యపడదనియు, గురువుల పరిచర్య శ్రమకరమనియు దలంచి ఖేదపడి నివర్తించుచున్నాడని తాత్పర్యము గాన, బౌద్ధములగు సంశ్లేష విశ్లేషములిచటను దుల్యములే.

''వారణార్థానామీప్సితః'' (1-4-27) సూత్ర విచారము.

వారించుట అర్థముగా గల ధాతువులు ప్రయోగింపబడినపుడు కర్తకు ఈప్సితమైన కారక మపాదానమని అర్థము

''యవేభ్యః గాం వారయతి దేవదత్తః'' = యవధాన్యపు చేనుతో బడనున్న ఆవును దేవదత్తుడు మరలించుచున్నాడని అర్థము.

ఈ సూత్రమును, సామాన్య సూత్రముచే గతార్థమే. ఎట్లన– 'ఈ గోవు యవల చేనులో బడిన సస్యవినాశమగును. రాజభయమును కలుగవచ్చును' అని విచారించి దానిని నివారించును గాన యవలతో బౌద్ధమగు సంశ్లేషమును తత్పూర్వకమగు విశ్లేషమును వారయితకు కలవని తాత్పర్యము.

''కూపాత్ అంధం వారయతి'' = నూతినుండి గుడ్డి వానిని వారించుచున్నాడు.

''అగ్నేర్మాణవకం వారయతి'' = 'నిప్పునుండి బాలుని వారించుచున్నాడు', అను నుదాహరణములందును, కూప సంప్రాప్తియు, అగ్నిస్పర్శయు అనిష్టహేతువులని బుద్ధిలో దలంచి దయతో మరలించుట తాత్పర్య విషయముగాన బౌద్ధ సంశ్లేష విశ్లేషములు ఇచటను గలవు.

''అంతర్ధౌ యేనాదర్శన మిచ్ఛతి'' (1-4-28) అంతర్ధియనగా అడ్డు. అది యున్నపుడు దాని చాటున దాగి, ఎవరు తన్ను జూడకుండుగాక యని కోరునో ఆ వ్యక్తికి అపాదానసంజ్ఞను విధించునది సూత్రము. ''ఉపాధ్యాయా దంతర్ధత్తే'' అంతర్ధాన మనగా నివృత్తిపూర్వక తిరోభవనము. తొలంగి మఱగుట

ఉపాధ్యాయుడు తన్ను జూచిన తిట్టుననియో కొట్టుననియో మనస్సులో దలంచి తప్పుకొనుచున్నాడు గాన బౌద్ధములగు సంశ్లేష విశ్లేషముల కివటను సంభవము గలదు. కనుక నిదియు పూర్వసూత్ర విషయమే.

''ఆఖ్యాతోపయోగే'' (1-4-29) అని సూత్రము ఉపయోగమున ఆఖ్యాతకు అపాదానమను సంజ్ఞ కలుగును. ఉపయోగమనగా నియమముతో విద్యను గ్రహించుట. నియమమన భిక్షాచరణము, స్థండిలశయనము మున్నగునవి. ఆఖ్యాత అనగా ఉపదేష్ట. ''ఉపాధ్యాయా దధీతే'' ''ఉపాధ్యాయా దాగమయతి విద్యామ్'' అని ఉదాహరణము.

ఈ సూత్రముతో బనిలేదు, ''ధ్రువమపాయే అపాదానమ్'' అను సామాన్య సూత్రముచేతనే సంజ్ఞ సిద్ధించునని భాష్యకారుని ఆశయము. అది ఎట్లన– ఉపాధ్యాయుని ముఖమునుండి వెలువడు శబ్దములు సంతత ప్రవాహరూపమున శిష్యునిలో ప్రవేశించుట అర్థముగాన ఆ శబ్దముల అపక్రమణమున కుపాధ్యాయు డవధి యగును

విద్యాగ్రహణము నియమపురస్సరము కానపు డీ సంజ్ఞ ప్రవర్తింపదు. పంచమి రాదు. శేషషష్ఠియే అట ప్రవర్తించును. నటుడు గాథలను వ్యాఖ్యానము చేయును. ఆ గాథలను భిక్షాచరణాది నియమములను పాటింపక వినుచుండు ననుకొనుడు. అపుడు 'నటస్య శృణోతి' అనియే యందురు. ఆ శ్రవణము నట సంబంధి మాత్రమే. నటాపాదానకము గాదు. అపాయ మట వివక్షింపబడదు అని భావము.

''శృంగాత్ శరః జాయతే''. ''జనికర్తుః ప్రకృతిః'' (1-4-30). కొమ్మునుండి బాణము తయారగుచున్నదని అర్థము కుండను మట్టితో జేసినట్లు, బాణములను కొమ్ముతో జేయుదురు. మట్టి, కుండ కుపాదాన కారణము. కొమ్ము శరమున కుపాదానము. ప్రకృతి అనగా ఉపాదాన కారణము. జనికర్త = పుట్టునది.

ఇదియు భాష్యమున ప్రత్యాఖ్యాతమైన సూత్రమే. లోకమున, ఏయది దేనినుండి పుట్టునో అది దానినుండి వెలువడునను మాటయేగదా ! ఆ నిస్సరణమున కది అవధి అగును. కనుక సామాన్య సూత్రమే అపాదానసంజ్ఞను సిద్ధింపజేయును.

"బ్రహ్మణః ప్రజాః ప్రజాయన్తే", "గోమయాత్ వృశ్చికః జాయతే" = 'బ్రహ్మ నుండి ప్రజ లుద్భవించుచున్నారు.', 'పేడలోనుండి తేలు పుట్టుచున్నది' - మున్నగు ప్రయోగము లందును నిదియే ప్రక్రియ.

తాంత్రికుల ప్రక్రియ దీనికి విరుద్ధము. వైశేషికులు, పరమాణువులందు, కార్యము సమవాయ సంబంధముచే సంబద్ధమై అచటనే పుట్టునందురు. అపుడు కారణమునుండి కార్యమునకు అపక్రమణము = నిస్సరణము లేదు.

సాంఖ్య దర్శనమున జన్మయనగా ఆవిర్భావము. తిరోభావము నాశము. అనగా కారణము కార్యరూపమున పరిణమించును. అంతియ. కారణమునుండి కార్యము పుట్టుట = బయలు వెడలుట అను మాట లేదు. ఆ ప్రక్రియ లీ శాస్త్రమున నాదరింపబడవు.

"భువః ప్రభవః" (1-4-31) అను సూత్రవిషయము. 'భూ' ధాత్వర్థమున కర్తకు ప్రభవమైనది అపాదానము. 'భూ' కర్త అనగా ప్రభవించునది. దానికి ప్రభవమన, నది మొదట ప్రకాశించిన స్థలము.

హిమవంతమున గంగ మొదట బయలుపడినది. అదియే ప్రథమ ప్రకాశము. దానికి స్థానము హిమవంతము. దాని కపాదానసంజ్ఞ. ఈ సూత్రమును ప్రత్యాఖ్యాతమే. గంగ ప్రవాహరూపము గదా! అది అచటనుండి ప్రసరించుచున్నదనియే యర్థము. కాగా ముఖ్యార్థమగు విశ్లేషమే అచట కలదని భావము.

"జుగుప్సా విరామ ప్రమాదార్థానా ముపసంఖ్యానమ్" ఇది (1-4-24) సూత్రము నందలి వార్తికము. అపాదాన సంజ్ఞా విధాయకమే. "అధర్మాత్ జుగుప్సతే" = అధర్మము నేవగించుకొనుచున్నాడని అర్థము. ఏవగింపునకు విషయ మధర్మము. కాని అపాదానసంజ్ఞచే అధర్మపదము పంచమ్యన్తము.

"అధర్మాద్విరమతి" = అధర్మము నాచరింపకుండుట విరమణము. 'ధర్మాత్ ప్రమాద్యతి' = ధర్మాచరణ విషయమున ప్రమత్తుడగుచున్నాడు— ఇవి ఉదాహరణములు.

ఈ వార్తికమును, భాష్యకారునిచే ప్రత్యాఖ్యాతమే. అధర్మము పరలోకమున దుఃఖమును కలుగజేయునది యని తెలిసికొని ఏవగింపుతో నందుండి తొలగుచున్నాడని తాత్పర్యము గాన అపాయము అచటను గలదు. కావున సామాన్య సూత్రముచేతనే సంజ్ఞ సిద్ధించును. ఇది ఆస్తికుని విషయము. నాస్తికుడును ముందుగ విచారించి, ధర్మమనునది ఏదియు లేనేలేదు. దాని నాచరింపవలసిన పనియు లేదని నిశ్చయించుకొనును గాన బౌద్ధములగు సంశ్లేష విశ్లేషములు అచటను సంభవించునని భావము.

ఈ విధముగ అపాదానసంజ్ఞా విధాయక సామాన్య సూత్రమగు "ధ్రువమపాయేఽపాదానమ్" అను నొక్క సూత్రముచేతనే సర్వత్ర అపాదానసంజ్ఞ సిద్ధించును గాన తరువాతి సూత్రము లెల్ల విస్తృతికొఱకు మాత్రమే అని స్పష్టము. లక్షణమును, ప్రపంచనమును, రెండును వ్యాకరణశాస్త్రమునకు కృత్యములుగాన నవియు పాణినిచే రచింపబడినవి. ॥147॥

అధికరణాధికారము

అవతారిక— విభక్తుల క్రమమును బట్టి పంచమ్యర్థ విచారానంతరము షష్ఠ్యర్థమును విచారింపవలసి యున్నది. కాని కారకముల క్రమము ననుసరించి అపాదాన విచారమునకు తరువాత అధికరణము, విచారింపబడు చున్నది.

శ్లో॥ కర్తృకర్మవ్యవహితామసాక్షాద్ధారయత్ క్రియామ్ ।
ఉపకుర్వత్ క్రియాసిద్ధౌ శాస్త్రేఽధికరణం స్మృతమ్ ॥ 148

కర్తృ కర్మ వ్యవహితాం = కర్తచేతను కర్మచేతను, వ్యవధానము గల, క్రియాం = క్రియను అసాక్షాత్ = పరంపరగా, ధారయత్ = ధరించుచున్నదై క్రియాసిద్ధౌ = క్రియ సిద్ధించుటలో, ఉపకుర్వత్ = ఉపకరించునది, అధికరణం = 'అధికరణము' అని, శాస్త్రే = శాస్త్రమునందు, స్మృతమ్ = చెప్పబడినది.

తాత్పర్య విశేషాంశములు— అధికరణమనగా ఆధారము = ఉనికి పట్టు. లోకములో అది ద్రవ్య గుణ క్రియలలో దేనికైనను ఆధారమై యుండును. శాస్త్రమునందు మాత్రము క్రియకు ఆధారమైనదియే అధికరణము క్రియకు సాక్షాత్ ఆధారములు కర్తయు కర్మయు. వాని కాధారము అధికరణము. కాగా కర్తృ కర్మల ద్వారా తన్నిష్ఠమగు క్రియకు ఆధారమగు కారక మధికరణము

"దేవదత్తః కటే ఆస్తే" = 'దేవదత్తుడు చాపమీద కూర్చొని యున్నాడు' చాప దేవదత్తుని తాను ధరించి ఆతని ఆసనము = ఉనికి అను క్రియ సిద్ధించుట కుపకరించుచున్నది

"దేవదత్తః స్థాల్యా మోదనం పచతి" = 'దేవదత్తుడు గిన్నెలో అన్నమును వండుచున్నాడు. విక్లితి = ఉడుకుట అనునది అన్నమునందుండు క్రియ. అన్నమున కాధారము స్థాలి. ఆధారమనునది లేనియెడల కర్తృ కర్మలు తమ పనిని చేయజాలవు. అధికరణము, వానిని ధరించి, వానిచేత తమ పనులను చేయించును. కాగా సాక్షాత్తుగా క్రియకు ఆధారములయిన వానికి కర్త కర్మ అను సంజ్ఞలును, పరంపరగ క్రియాధారమునకు అధికరణ సంజ్ఞయు ప్రవర్తించునని ఫలితము.

కారకములనగా క్రియ నుత్పాదించునవి అవి సాక్షాత్తుగనే క్రియాజనకములు కానక్కఱలేదు. ఎట్లైనను గావచ్చును.

కారికలో 'వ్యవహితాం' అను పదముచేత అధికరణము సాక్షాత్ క్రియాధారము కాదని సూచించి మరల 'అసాక్షాత్' అనుట ఎందులకు? అనిన, లోక ప్రయోగ రీతినిబట్టి గూడ ఆ పరంపర తెలియవచ్చు చున్నదని బోధించుటకు. 'నేలమీద పండుకొని యున్నాడు' 'గిన్నెలో అన్నము వండబడుచున్నది' అనిన పండుకొనుట అను క్రియయు, ఆ క్రియతో గూడిన కర్తయును, అట్లే, వంట అను క్రియ, వండబడునట్టి అన్నమను కర్మయును

తెలియవచ్చుచున్నవేగాని క్రియ మాత్రము కాదుగదా. కావున, అధికరణము క్రియా సిద్ధి కుపకరించుట సర్వథా సద్వారకమే. ॥148॥

అవతారిక— ఔపశ్లేషికము, అభివ్యాపకము, వైషయికము అని అధికరణము మూడు విధములు. కారికోక్తమగు లక్షణము మూడింటియందును అనుగతము అయి యున్నది అని చెప్పబడుచున్నది.

శ్లో॥ ఉపశ్లేషస్య చ భేద స్తిలాకాశకటాదిషు ।
ఉపకారాస్తు భిద్య న్తే సంయోగి సమవాయినామ్ ॥ 149

తిల ఆకాశ కటాదిషు = తిలలు, ఆకాశము, చాప మున్నగువానియందు, ఉపశ్లేషస్య = సంబంధమునకు, అభేదః చ = అభేదమే, సంయోగి సమవాయినాం = ఆ ధేయముతో సంయోగ సమవాయములు గల ఆధారముల, ఉపకారాః తు = క్రియోపకారములు మాత్రము, భిద్యన్తే = వేఱువేఱుగ నుండును.

తాత్పర్య విశేషాంశములు— ఆధారమునకును ఆధేయమునకును గల సంబంధము ఉపశ్లేషము. అది మూడు విధములయిన అధికరణములందును ఏకరూపమే. ఆధేయముతో సంయోగము గల ఆధారము సంయోగి సమవాయమను సంబంధముగలది సమవాయి. 'కటే ఆస్తే దేవదత్తః'. ఇచట దేవదత్తునకును కటమునకును సంబంధము సంయోగము. కటము సంయోగి. 'తిలేషు తైలమస్తి' తిలలకును తైలమునకును సంబంధము సమవాయము తిలలు సమవాయి అయిన ఆధారము.

కటమునందు దేవదత్తుని ఉనికి ఏకదేశముననే. తిలలయందు తైలము, తిలల సర్వావయవములను వ్యాపించి యున్నది. కావున తిలలు అభివ్యాపకాధారము.

'ఖే శకునయః' = ఆకాశమునందు పక్షులు ఎగురునందురు. ఆకాశము అంతయు అఖండము. అందు భాగములు లేవు. కనుక శకునుల కది ఔపశ్లేషికాధికరణమును గాదు. అభివ్యాపకమును గాదు. పక్షుల కాకాశము విషయము మాత్రమే. కనుక నది వైషయికాధారము.

"గురౌ వసతి" = గురువునందున్నాడు. అనగా గురువునకు అధీనుడై ఆయనయందాధారపడియున్నాడనుట. ఇట గురువు శిష్యునకు వైషయి కాధారము.

"యుద్ధే సంనహ్యతి" = యుద్ధము విషయమున సిద్ధపడుచున్నాడనిన, యుద్ధాభిసంధితో కవచధారణము మున్నగునవి చేయుచున్నాడు అని యర్థముగాన సంనాహమునకు యుద్ధము విషయము.

'జలే మత్స్యాః' = నీటిలో చేపలు. జలమున మత్స్యముల కాధారమగు ప్రదేశ ముండునుగాన జలము వైషయికము కాదు. ఔపశ్లేషికమే.

"గంగాయాం గావః" = గంగ యొద్దున నావులు మేయుచున్నవి ఇట గంగాతీర మునకును గోవులకును సంబంధము ఉపశ్లేషమే.

"శత్రోరభావే సుఖమ్" = శత్రువు అభావమున సుఖము కలదు. అభావమనగా లేకుండుట. అది అధికరణ మెట్లగును? లేమికి క్రియాజనకత్వమను కారకత్వ మెట్లు సంభము? అని శంక కలుగును. అది బుద్ధి పరికల్పితము వాస్తవము కాదని సమాధానము ॥149॥

అవతారిక — 'ఉపకారాస్తు భిద్యన్తే' అనిరి గదా ఆ ఉపకార భేదము లెవ్వి? అనగా—

శ్లో॥ అవినాశో గురుత్వస్య ప్రతిబంధే స్వతంత్రతా ।
దిగ్విశేషాదవచ్ఛేద ఇత్యాద్యా భేదహేతవః ॥ 150

అవినాశః = ఆధారము నశింపకుండుట, గురుత్వస్య = బరువుయొక్క, ప్రతిబంధే = ఆపుటలో, స్వతంత్రతా = కర్తృత్వమును, దిగ్విశేషాత్ = ఒక దిక్కునుండి, అవచ్ఛేదః = సంబంధ నిరాసమును, ఇత్యాద్యాః = ఈః మొదలగునవి, భేదహేతవః = ఉపకార భేదములకు హేతువులు.

తాత్పర్య విశేషాంశములు— తిలలు తైలమునకు చేయు నుపకారము, తాము నశింపకుండ నాధారమై నిలుచుట. అవి లేనిచో తైలము వికీర్ణమే నశించును గదా.

"పర్యం కే శేతే" = మంచమునందు పరుండి యున్నాడనిన, మంచము పండుకొనిన వాని బరువును ఆపి ఆతడు క్రింద పడకుండ జేయుచున్నదని యర్థము గాన నదియే పర్యంకము చేయు నుపకారము.

ఆకాశము శకుంతములకు చేయు నుపకారము, వానికి క్రింది దిక్కుతో సంబంధమును తొలగించి నిలుపుట

"శకటే గచ్ఛతి" = బండిలో పోవుచున్నాడు. బండి, వానికి దేశాంతర ప్రాప్తిని కలుగజేయుట దాని యుపకారము.

"గురౌ వసతి" గురువుచేయు నుపకారము శిష్యునకు సంస్కారము. "ఆదిత్యః ప్రాచ్యాముదేతి", "ప్రతీచ్యామస్తమేతి" = సూర్యుడు తూర్పున నుదయించును, పడమట నస్తమించును. దక్షిణస్యా మగస్త్య ఉదేతి, 'ఉత్తరస్యాం ధ్రువః' అను స్థలములందు, ఆధేయములకు ఆయా దిక్కులు తమ సంబంధమును గలుగజేయుటయే అవి చేయు నుపకారము ॥150॥

అవతారిక — మూర్తిమంతములైన వస్తువు లన్నియు ఒక ఆధారము నాశ్రయించి యుండును. ఆ ఆధారము కూడ మూర్తిగల వస్తువైన, దానికిని వేఱొక యాధారము కావలెను గదా. అది ఏది? అనిన—

శ్లో॥ ఆకాశమేవ కేషాంచిత్ దేశభేద ప్రకల్పనాత్ ।
ఆధారశక్తిః ప్రథమా సర్వసంయోగినాం మతా ॥ 151

కేషాంచిత్ = కొందఱి మతమున, ఆకాశమేవ = ఆకాశమే, దేశభేద ప్రకల్పనాత్ = ప్రదేశ భేద కల్పనవలన, సర్వసంయోగినామ్ = సంయోగి వస్తువుల కన్నిటికిని, ప్రథమా = ముఖ్యమగు, ఆధారశక్తిః = ఆధారరూపమగు శక్తిగా, మతా = సమ్మతమైనది

తాత్పర్య విశేషాంశములు— గ్రహములు, నక్షత్రములు, విమానములు-మున్నగు వానికి ఆకాశమే స్థానముగా ప్రసిద్ధము. రథములు బండ్లు మున్నగువానికి భూమి ఆధారమైనను, ఆ భూభాగమునకు గూడ ఆకాశమే ఆధారము. సంయోగి పదార్థము లనగా సంయోగ మను సంబంధముతో సంబద్ధములైనవి రథాదులకును భూమికిని సంబంధము సంయోగము.

మఱికొన్ని సమవాయి పదార్థములు అవయవములకును, అవయవికి సంబంధము సమవాయము. ఆ పదార్థములకు వాని అవయవములు ఆధారము ఆ అవయవములకు పరమాణువు లాధారము. వానికిని చివరకు ఆకాశమే అధికరణము. కావున ముఖ్యమగు నాధార శక్తి ఆకాశాశ్రయము. ఆకాశమంతయు నొక్కటియే అయినను, అందు వేరువేరు భాగములను కల్పించుటవలన, 'సకల పదార్థములకును నదియే ఆధారమైనచో, ఆ పదార్థములకు సాంకర్యము కలుగదా?' అను ప్రశ్న లేదు. కొందఱి మతమున ననుటవలన, అది లేదను వారును గలరని తెలియవచ్చుచున్నది. అది ప్రత్యక్షము కానందున లేనేలేదని వారందురు. శబ్దమను గుణమును బట్టి ఆకాశమను ద్రవ్యము కలదనిన యెడల, శబ్దము దాని గుణమనుట కేమి ప్రమాణమని వారడుగుదురు. ॥151॥

అవతారిక— వైశేషికులు, 'అనుమానము' అను ప్రమాణముచే ఆకాశమును సాధించియున్నారు. శబ్దమను గుణమునుబట్టి, గుణి యగు నాకాశము కలదని, వారి తాత్పర్యము. శబ్ద మాకాశ గుణమని యంగీకరింపకున్నను, ఆకాశమను పదార్థము కలదని నిరూపించుటకు లోక ప్రసిద్ధమైన లింగమును గూడ నిందు జూపుచున్నారు.

శ్లో॥ ఇదమత్రేతి భావానా మభావాన్న ప్రకల్పతే ।
వ్యపదేశ స్త మాకాశ నిమిత్తం సంప్రచక్షతే ॥ 152

ఇదం, అత్ర, ఇతి = ఇది, ఇట, అను, వ్యపదేశః = వ్యవహారము, భావానాం = పదార్థములకు, అభావాత్ = ఆధారశక్తి లేనందున, న ప్రకల్పతే = సిద్ధింపదు, తం = కావున, ఆ వ్యవహారమును, ఆకాశ నిమిత్తం = ఆకాశ మూలకమునుగా, సంప్రచక్షతే = చెప్పుదురు

తాత్పర్య విశేషాంశములు— ఆధారమను శక్తియే ఆకాశమనునది కలదని తెలియజేయును. 'ఈ నక్షత్ర మిచట నున్నది' అందురు. అపుడు 'ఇచట' అనునది ఒక వస్తువు కావలెను. అది పృథివిగాని, ఉదకముగాని, తేజస్సుగాని, వాయువుగాని కాదు. ఇక నేమగును? ఆకాశమే కావలె. అది ఏ వస్తువును గాదనిన శబ్ద వ్యవహారమే కుదురదు. ఒకానొక వస్తువును

ముందుగ నిరూపించి, తరువాత దానిని శబ్దముచే వ్యవహరింతురుగదా ః 'శబ్దము' అను ప్రమాణము నంగీకరించువారికి, శబ్దము చెప్పినదే అర్థము. 'ఇచట' – అను శబ్దము ఒక వస్తువును చెప్పును. అది లోకసిద్ధమగు ఆధారము కావలె. అది ఆకాశము

శబ్దము బోధించినది, ఆ వస్తువు అయినను, శబ్దము ప్రమాణమను వారి కది వస్తువే శత్రువు లేమిలో, సుఖముండుననిన, లేమి = లేకుండుట ఒక వస్తువు కాకున్నను శబ్దబోధ్యము గాన, ఆధారముగ గ్రహింపబడుచున్నది.

పరమార్థమును విచారించిన, లౌకిక పదార్థము లన్నియు లేనివే. బ్రహ్మ పదార్థ మొకటియే ఉండునది. లేనివానికి లక్షణములను కల్పించుట పరమార్థ దృష్టిలో విరుద్ధ ప్రక్రియయే యగును ॥152॥

అవతారిక— సకల పదార్థములకును ఆకాశ మాధారమని చెప్పబడినది. పదార్థ ములు కొన్ని స్థిరములు. కొన్ని సాధ్యములు. ద్రవ్యములును గుణములును సిద్ధ స్వభావ ములు. క్రియలకు స్వభావము సాధ్యత. సిద్ధ పదార్థముల కాకాశ మాధారము. సాధ్యములకు కాల మాధారము.

**శ్లో॥ కాలాత్ క్రియాః విభజ్యన్తే ఆకాశాత్ సర్వమూర్తయః ।
ఏతావాంశ్చైవభేదోఽయ మభేదోపనిబన్ధనః ॥ 153**

కాలాత్ = కాలమువలన, క్రియాః = క్రియలు, విభజ్యన్తే = విభజింపబడును, ఆకాశాత్ = ఆకాశమునుండి, సర్వమూర్తయః = మూర్తి మద్వస్తువు లన్నియు, విభజ్యన్తే = విభజింప బడు చున్నవి, భేదః చ = వానికి భేదమును, ఏతావాన్ ఏవ = ఇంత మాత్రమే, అయమ్ = ఈ భేదము, అభేదోప నిబన్ధనః = పరబ్రహ్మ కారణకము.

తాత్పర్య విశేషాంశములు— "ప్రతిబంధాభ్యనుజ్ఞాభ్యాం తేన విశ్వం విభజ్యతే" అని కాలోద్దేశమున చెప్పబడును. కాలము, పదార్థముల ఉత్పత్తి, స్థితి, వినాశములకు కారణము. అందు క్రియా రూపములగు పదార్థములకు తాను ఆధారమైయుండి వాని విభజిం చును. పదార్థము లన్నియు ఆకాశమునందు సయుక్తములయినను, భిన్న భిన్న ప్రదేశములం దుండుటచేత వానికి సాంకర్యము కలుగదు. ప్రపంచమంతయు, అభిన్నము. ఏకరూపము. అది పరమార్థము. అయినను వ్యవహారములో భేదమే అధికముగ భాసించును. కాని మొదటి అభేదము, తరువాతి భేదమునకు నిమిత్తము. కావున కాలాకాశముల భేదముగూడ పరబ్రహ్మ భేద నిమిత్తకమే. కాలాకాశములు పరబ్రహ్మ యొక్క శక్తులు అని బ్రహ్మకాండమున నిరూ పింపబడినది.

"ఉపాన్వధ్యాఙ్వసః" (1-4-48) అను సూత్రమున విచారము. ఉప, అను, అధి, ఆఙ్ – అను ఉపసర్గములు పూర్వమున గల 'వసనివాసే' అను ధాతువున కాధారమైనది కర్మసంజ్ఞ కలదగునని సూత్రార్థము. "వైకుంఠమధివసతి హరిః" = విష్ణువు వైకుంఠము

నధివసించియున్నాడు అనునది ఉదాహరణము. ఆ సూత్రమున "వసేరశ్యర్థస్య ప్రతిషేధః" అని వార్తికము. భోజనము చేయకుండుట అని అర్థమయినపుడు, 'ఉపవస్' అను ధాతువు నాధారమున కీ కర్మసంజ్ఞ ప్రవర్తింపదని వార్తికార్థము. "వనే ఉపవసతి". ఉపవసించుట యనగా భోజన నివృత్తితో గూడిన ఉనికిగాన, సూత్రముచే ప్రాప్తించు కర్మసంజ్ఞకు ప్రతిషేధ మావశ్యకమని వార్తికాశయము.

మహాభాష్యమున నీ వార్తికము ప్రత్యాఖ్యాతము. ఇట ఉపసర్గ విశిష్టమగు వస ధాతువునకు గాదు గ్రామ మధికరణము. కేవల వసధాత్వర్థమునకే అది అధికరణము. వనమున లేదా గ్రామమున వసించుచు, మూడు రాత్రులు ఉపవాసము చేయుచున్నాడని యర్థము. గ్రామేవసన్, త్రిరాత్ర ముపవసతి. ఇపుడు కర్మసంజ్ఞకు ప్రసక్తియే లేదని భాష్యకారుని ఆశయము.

ఉపవాసమనగా నొక కొంత కాలము ఆహారము మానియుండుట. ఆ కాలము అంతరంగమగు ముఖ్య కర్మ. ఉపవాసము చేయు వ్యక్తి తన కేదియు స్థానము లేకుండ నుండుట సంభవింపదు గాన నొక యాధారము నియతముగ నపేక్షితమగును. అది కేవల వసధాత్వర్థమున కాధరమేగాని, 'ఉపవస్' అను ధాత్వర్థమున కాధారము గాదని భావము.॥153॥

అవతారిక— 'తీర్థే ఉపవసతి'='పుణ్య తీర్థమున నుపవాసము చేయుచున్నాడు', అను నీ వాక్యమున, దేశ విశేషమున భోజన నివృత్తి వివక్షితము. కావున దేశవిశేష సంబంధ మా ధాతువునకు గలదు. అట కర్మసంజ్ఞ ఏల రాలేదు ? అనిన చెప్పుచున్నాడు.

శ్లో॥ యద్య ప్యుపవసిర్దేశ విశేష మనురుధ్యతే ।
శబ్దప్రవృత్తి ధర్మాత్తు కాలమేవావలంబతే ॥ 154

ఉపవసిః = ఉపపూర్వక వసధాతువు, యద్యపి = విచారింపగా, దేశవిశేషం = ప్రదేశ విశేషమునే, అనురుధ్యతే = సంబంధించు ననుకొనుడు, శబ్దప్రవృత్తి ధర్మాత్ తు = శబ్ద శక్తి స్వభావమును బట్టి మాత్రము, కాలం ఏవ = కాలమునే, అవలంబతే = ఆశ్రయించి యున్నది.

తాత్పర్య విశేషాంశములు— ఉపవాసముచేయుట పుణ్యతీర్థమునందు గాన ధాత్వ ర్థమునకు దేశముతో సంబంధము లేకపోలేదు గాని, అది శబ్ద శక్తివలన వచ్చినది గాదు. ఆ భోజన నివృత్తి ఇన్ని దినములని తెలియవలెను గాన కాలవిశేషము గూడ నందు గర్భితమై శబ్దముచే బోధింపబడును దేశ సంబంధము సామర్థ్యముచే ప్రాప్తము. నివసించుటకును దేశమునకును సంబంధము. ఉపవసించుట ప్రధానము. దాని కంగము వాసము. వాసమున కంగము దేశము. అది వాసము ద్వారమున భోజన నివృత్తికి అధికరణము.

కనుకనే మహాభాష్యమున "గ్రామేవసన్ త్రిరాత్ర ముపవసతి" అని ఉపవాస మంగముగా గల నివాసమునకు గ్రామముతో సంబంధము చూపబడినది గాని సాక్షాతుగా

ఉపవాసమున కా సంబంధము చూపబడలేదు. అందువలన గ్రామమునం దుపవాసమనగా, ఉపవాసమునకు గ్రామ మధికరణమని తాత్పర్యము గాదు. ఉపవాస క్రియ కంగమైన నివాసమున కధికరణమనుట. ॥154॥

అవతారిక— గ్రామమున నుపవసించుచున్నాడను చోట ప్రధాన క్రియ భోజన నివృత్తి. దానిలో కర్మ, కాలము. అది వాక్యమున ప్రయుక్తము కాకపోయినను, ప్రతీయమానము కావచ్చునని చెప్పుచున్నాడు.

శ్లో॥ వసతౌ వ ప్రయుక్తేఽపి దేశోఽధికరణం తతః ।
అప్రయుక్తం త్రిరాత్రాది కర్మచోపవసౌ స్మృతమ్ ॥ 155

అప్రయుక్తః అపి = వాక్య ప్రయుక్తము కానిదైనను, దేశః = ప్రదేశ వాచక పదము, వసతౌ = నివాస క్రియలో, అప్రయుక్తం = వాక్యమున ప్రయుక్తముకాని, త్రిరాత్రాది = మూడు రాత్రులు మున్నగునది, ఉపవసౌ = ఉపవాస క్రియలో, అధికరణమ్ = అధికరణమై యున్నది, తతః చ = అందువలననే, కర్మ = కర్మగా, స్మృతమ్ = తలంపబడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— "గ్రామే ఉపవసతి" లేదా "వనే ఉపవసతి" = ఒక గ్రామముననో వనముననో నివసించుచు మూడు రాత్రులు భోజనము మాని యున్నాడని మహాభాష్యమున నా వాక్యమున కర్థ వివరణము చేయబడినది. వాక్యమున ప్రయోగింపబడినది ఉపవాస క్రియ. నివాస క్రియ ఆక్షేప లభ్యము. దానికి గ్రామ మధికరణము. కారకములు, వాక్యములందు ప్రయోగింపబడని క్రియలను సామర్థ్యము వలన ఆకర్షించును.

'పిండీమ్' అని కారకము మాత్రమే వాక్య ప్రయుక్తము. అది భక్షణ క్రియ నాక్షేపించును. చిన్న పిండమును భక్షింపుమని యర్థము. ఆ విధముగనే క్రియ మాత్రము ప్రయుక్తమై కారకము ప్రయోగింపబడనపుడు, ఆ క్రియ కారకము నాక్షేపించుటయు గలదు. 'ప్రవిశ' – అనునది వాక్యము. అందు కర్మకారకము లేదు. వాక్యత్వసిద్ధికై, 'గృహమ్' అను కర్మవాచక శబ్దము ఆక్షేపింపబడును.

ప్రకృత వాక్యమున ఉపవాస క్రియ, కాలరూపమగు కర్మ నాక్షేపించును. అది అవశ్యకము. మూడు రాత్రులు భోజన నివృత్తి. గ్రామమునందు వాసము. కాలమునకు కర్మ సంజ్ఞ ప్రవర్తించినట్లు దేశమునకు గూడ ఆ సంజ్ఞ యేల రాలేదనిన, వాని అంతరంగ బహిరంగ భావము దానికి గారణము. 'భక్తుడు హరిని భజించుచున్నాడు' అను వాక్యమున, హరి గూడ తన వ్యాపారమున స్వతంత్రుడే అయినను అంతరంగమగు కర్మసంజ్ఞయే ప్రవర్తించినది గదా. సందర్శనాది క్రియలచే ఈప్సితతమమునకు కర్మసంజ్ఞ చరితార్థముగా వచ్చును గాన వైయర్థ్యము దాని కాపాదించుటకు వీలులేదు. కావున గ్రామ మధికరణమే.

'ఉపవసతి' అను పదమునకు వేఱు అర్థమును జెప్పిన, ''గ్రామముపవసతి'' అనియు నుండవచ్చును. ఉపవాసమనగా నొక విశిష్టమగు ఉనికి.

భోజన నివృత్తి అర్థమయినపుడు, క్రియకు సాక్షాదాధారము కాలము. అది ఈ సూత్రముచే కర్మ సంజ్ఞకము. దేశమగు గ్రామము వాసక్రియ ద్వారా ఆధారముగాని సాక్షాత్తుగా కాదు. అందువలన దానికి అధికరణ సంజ్ఞయే.

కొంద ఱిట్లందురు. ఉపవాసమనగా భోజన నివృత్తి గదా నివృత్తి అనగా మానుట. మానుట కొక ఆధారమేమి? అనగా స్థానమేమి? అని. అట్లనిన, కాలమునకు మాత్ర మాధారత ఎట్లు? అదియునుగాక, నివృత్తి రూప క్రియావాచకములకును ఆధార సంబంధ మగపడుచున్నది. "ష్ఠాగతినివృత్తౌ" అను ధాతువును జూతము. "గ్రామేతిష్ఠతి" అందురు. ఇచట గతి నివృత్తికి గ్రామ మాధారమైయుండె అట్లే "గ్రామే ఆస్తే" అందురు. ఆసన మనగా సర్వవ్యాపార నివృత్తి. ఏ క్రియయు చేయక ఉనికియు నొక క్రియయే ప్రకృతమున నది నియతకాలము భోజనము మానుట నియతకాల మనగా గొన్ని దినములు మాత్రము. కొన్ని దినములకు తరువాత భోజనము చేయుటకు సంకల్పించినాడని భావము. క్రియకు దేశముతోడను, కాలముతోడను గూడ సంబంధము కలదు. కాని అందు కాలసంబంధము నాంతరీయకము (= తప్పనిసరి) అది యున్నపుడే. ఆధారమునకు కర్మసంజ్ఞను విధించిన, "ఉపాన్వధ్యాఙ్వసః" (1-4-48) అను సూత్రము ప్రవర్తించునని పర్యవసితార్థము.॥155॥

శేషాధికారము

అవతారిక— కర్త, కర్మ, కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము, తృతీయా, ద్వితీయా, చతుర్థీ, పంచమీ, సప్తమీ విభక్తుల కర్థములు అవి విచారింపబడినవి. షష్ఠ్యర్థము గూడ నొక కారకభేదమే. అది ఏడవది. కర్మాదులకంటె వ్యతిరిక్తమగు స్వస్వామి భావము మున్నగు సంబంధమున "షష్ఠీశేషే" (2-3-50) అను సూత్రము షష్ఠీ ప్రత్యయమును విధించినది. అది శేష మెట్లగును? దానికి కారక రూపత ఎట్లు? అను విషయ మీ శేషాధికారమున విచారింపబడును.

శ్లో॥ సంబంధః కారకేభ్యోఽన్యః క్రియాకారక పూర్వకః ।
శ్రుతాయామ శ్రుతాయాం వా క్రియాయాం సోఽభిధీయతే ॥ 156

కారకేభ్యః = కారకముల కంటె, అన్యః = ఇతరమైనది, సంబంధః = సంబంధము, సః = 'శేషము' అను నా సంబంధము, క్రియాకారక పూర్వకః = క్రియ నిమిత్తముగా గల కారకత్వము పూర్వము గలది, క్రియాయాం = క్రియాపదము, శ్రుతాయాం = వాక్యమున వినబడినను, అశ్రుతాయాం వా = వినబడకున్నను, సః = ఆ సంబంధము, అభిధీయతే = షష్ఠిచే చెప్పబడును.

తాత్పర్య విశేషాంశములు— షష్ఠీ విభక్తి కర్థమగు శేషము, కర్మాదులకంటె వేరయిన దెట్లగును? "రాజ్ఞః పురుషః" = 'రాజుగారి మనిషి' అనగా రాజుగారాతనికి ధన

మిచ్చి తన మనిషిగా జేసికొన్నవాడని యర్థము గదా ! అపుడు రాజు కర్త. మనిషి సంప్రదానము. 'వృక్షస్య శాఖా' అనిన, చెట్టు అధికరణము. 'రాజ్ఞః వస్త్రమ్' అని రాజుగారు కొనుక్కొనిన బట్ట. ఏ వస్తువయినను ఒకరిసొత్తు గావలెననిన, క్రయా, పహార, యాచన, వినిమయముల వలన నగును. కావున కర్మ కరణాధికారములలో నేదియో యొకటి షష్ఠ్యర్థమై తీరును. కాగా నదికారకేతర మెట్లగును ? అని శంకించి, అవియున్నను వానిని వివక్షింపకుండుటయే శేషమగునని భాష్యమున చెప్పబడినది.

'రాజ్ఞః పురుషః' అను వాక్యమున క్రియావాచక పద మేదియు వినబడలేదు. కాని అచట, దానక్రియా నిమిత్తకమగు సంబంధము పూర్వముండి యుండును. అట్లే అవయవావయ విభావము, లేదా జన్యజనక సంబంధము ఏదియో సిద్ధపూర్వమై యుండును. ముందు ఉండిన ఆ క్రియాకారక సంబంధము తరువాత సంబంధ సామాన్యముగ ననువర్తించును.

రాజపురుషులకు గల కర్తృ సంప్రదాన భావము తరువాత సంబంధ సామానళీముగ భాసించుచున్నది. కనుక నిది సప్తమ కారక భేదము.

'రాజు పురుషున కిచ్చుచున్నాడు' అను వాక్యమున కర్థము వేరు. రాజు మనిషి ఈతడను వాక్యమున కర్థము వేరు. క్రియావాచక పదము ప్రయోగింపబడకున్నను నూహింపబడి ఆ సంబంధమునకు నిమిత్తమగును.

''గ్రామస్య సమీపాదాగచ్ఛతి'' = 'ఊరుదగ్గఱనుండి వచ్చుచున్నాడు' ఇట సంబంధము సమీప సమీపి భావము. సమీపమునకు గ్రామ మాశ్రయము. కావున నచటను క్రియాకారక పూర్వకత్వము గలదు.

'చెట్టుయొక్క ఆకు' అనిన ఆకునకు చెట్టు అధికరణము.

'నటస్య శృణోతి' అను వాక్యమున క్రియాపదము వినబడుచున్నది. అచట షష్ఠ్యర్థమగు సంబంధము క్రియాకారక సంబంధమే. క్రియాకారక పూర్వకమగు సంబంధము గాదు. 'నటునకు సంబంధించిన వినికిడి' అని యర్థము. అ సంబంధమును శేషమే. కారకము గాదు. నియమపూర్వక విద్యాభ్యాసము కాదుగదా ఈ శ్రవణము.

ఈ విధముగనే ''మాతుః స్మరతి'' = తల్లికి సంబంధించిన స్మరణ ''నమాషాణామశ్నీయాత్'' = మినుముల భక్షణమును చేయరాదు. ''సర్పిషోజానీతే'' = 'నేతిని ఉపాయముగ చేసికొని ప్రవర్తించుచున్నాడు'. సర్పిః = నెయ్యి. జానీతే = ప్రవర్తించుచున్నాడు. ప్రవర్తించుటలో నెయ్యి కరణము. ఆ కరణత్వమును కరణత్వ రూపమున వివక్షింపక, శేషము = సంబంధ సామాన్యముగా వివక్షించుటచే షష్ఠి ప్రయోగింపబడినది.

ఈ విధమగు ప్రయోగములు సంస్కృత భాషకసాధారణములై కానవచ్చుచున్నవి అట్టివి అనేకములు గలవు.

ప్రకృత సందర్భమున మహాభాష్యమునందు, రెండు ఆక్షేప వార్తికములు గలవు

(1) "షష్ఠీశేష ఇతిచే ద్విశేష్యే ప్రతిషేధః" (2) "తత్ర ప్రథమావిధిః"

షష్ఠికి సంబంధ మర్థము గదా. సంబంధ మనునది రెండు పదార్థములం దుండు నది సంబంధము గలవి సంబంధులు. రాజు ఒక సంబంధి. పురుష డొక సంబంధి. కాగా సంబంధి వాచక పదములు రెండింటికిని షష్ఠీ ప్రత్యయము కావలసియున్నది. కావున పురుష పదమున షష్ఠి రాదనియు, ప్రథమ వచ్చుననియు అపూర్వముగ విధింపవలసి యుండును అని శంకకు ఆశయము

సమాధానము— "ఉక్తం పూర్వేణ" = అని భాష్యమున చెప్పబడినది. "ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచనమాత్రే ప్రథమా" (2-3-46) అను సూత్రమున "పదసామానాధి కరణ్య ఉపసంఖ్యాన మధికత్వాత్" అని ఆక్షేపమును, "న వా వాక్యార్థత్వాత్" అని సమాధానమును నచట గలవు.

'రాజ్ఞః పురుషః' అను వాక్యమునందు పురుష శబ్దమున ప్రాతిపదికార్థ మాత్రమున ప్రథమ రాదగి యున్నది. అచట ప్రాతిపదికార్థమే కాక స్వత్వమను సంబంధము గూడ అధికముగ నున్నది గదా ! ప్రథమ ఎట్లు వచ్చినది ? అని ప్రశ్న. అది వాక్యమున కర్థము గాని పదార్థము గాదు పురుష పదమును సంస్కరించినపుడు, ప్రాతిపదికార్థ మొక్కటియే స్ఫురించును. దానినిబట్టి ప్రథమ ప్రవర్తించునది' అని సమాధానము. 'రాజ్ఞః' అను దానితో సంబంధము కలిగిన తరువాత పురుషునకు సంబంధిత్వ మవగతమగును. కావున పురుష పదమున ప్రథమ స్వార్థమాత్రమున సిద్ధించును. షష్ఠికి ప్రాప్తియు లేదు కావున, ప్రతిషేధమును, విధానమును నక్కరలేదు అని "ఉక్తం పూర్వేణ" అను భాష్య గ్రంథమునకు తాత్పర్యము.

ప్రాతిపదికార్థము కంటె నధికమైన అర్థము వాక్యార్థముగాని పదార్థము కాదంటిరి గదా ! అపుడు రాజ శబ్దమునగూడ ప్రథమయే ఏల రాలేదు ? అని ప్రశ్నింపవచ్చును. కాని విశేష్యమునందలి ఆధిక్యమే వాక్యార్థము. విశేష్యము ప్రధానము. విశేషణము దానికుపకారకము. కావున అప్రధానము. అది ప్రధానమున కుపకరించుట కర్హమైన మార్పును బొందును. ప్రధానము తన స్వరూపమును వదలి పెట్టదు. కావున ప్రధానమగు విశేష్యము నందలి అధికాంశమే వాక్యార్థమగును. కావున ప్రధాన వాచకముతో సమానాధికరణముగాని అప్రధాన వాచకము షష్ఠ్యంతముగనే యుండును. అది సమానాధికరణమైన నచటను ప్రథమయే వచ్చును. "వీరః పురుషః"=వీరుడగు పురుషుడు. అది పదార్థముల స్వభావము.॥156॥

అవతారిక— ఆ స్వభావమే ఇందు, వివరింపబడుచున్నది.

శ్లో॥ ద్విష్ఠోఽప్యసౌ పరార్థత్వాత్ గుణేషు వ్యతిరిచ్యతే ।
తత్రాభిధీయ మానః సన్ ప్రధానేఽప్యుపయుజ్యతే ॥ 157

అసౌ = ఈ సంబంధము, ద్వివ్యః అపి = రెండింటియందున్నదైనను, పరార్థత్వాత్ = ప్రధానార్థము లగుటవలన, గుణేషు = విశేషణములందే, వ్యతిరిచ్యతే=అధికమగుచున్నది, తత్ర= ఆ అప్రధానములందు, అభిధీయమానః సన్ = షష్ఠిచే చెప్పబడుచునే, ప్రధానే అపి = విశేష్యమందును, ఉపయుజ్యతే = ఉపయోగపడుచున్నది.

తాత్పర్య విశేషాంశములు— సంబంధమనునది ఒక్కటియే. కావున దానిని బోధించు షష్ఠీ ప్రత్యయమును నొక్కటియే ఉచితము రెండు షష్ఠులు ప్రయోగింపబడిన, రెండు సంబంధములు ప్రతీతములు కావలసియుండును. అట్లు లేదుగదా ! ఆ షష్ఠి విశేషణములైన శబ్దములందే వచ్చును వానిలో రూపమున మార్పును గలుగజేసి ఆధిక్యమును ప్రదర్శించును. ఇక విశేష్యము తనలో నెట్టి మార్పును లేకయే ఆ సంబంధము ననుభవించును. కనుకనే దానికి ప్రాధాన్యము. అందువలన విశేష్య వాచకమున ప్రాతిపదికార్థమాత్రమున ప్రథమయే వచ్చును. రాజపురుషుల విశేష్య భావవిశేషణ భావములు మారినపుడు, ''పురుషస్య రాజా'' = 'పురుషుని రాజు' అని వాక్యముండవచ్చును. ॥157॥

అవతారిక— షష్ఠ్యర్థమగు సంబంధ సామాన్యము క్రియాకారక సంబంధ పూర్వకమని చెప్పిరి. ఆ క్రియాకారక సంబంధము 'ఫలానిది' అని నిరూపించుటకు శక్యమగునా ? అనిన, 'కాదు దానికి నియమము లేదు' అనుచున్నారు.

శ్లో॥ నిమిత్త నియమః శబ్దాత్ సంబంధస్య న గృహ్యతే ।
కర్మ ప్రవచనీయైస్తు న విశేషే అవరుధ్యతే ॥ 158

సంబంధస్య = షష్ఠ్యర్థమగు సంబంధమునకు, నిమిత్త నియమః = నియతమగు నిమిత్తము, శబ్దాత్ = వినబడు శబ్దమువలన, న గృహ్యతే = గ్రహింపబడదు, కర్మ ప్రవచనీయైః తు= కర్మ ప్రవచనీయములను వానిచేనైన, సః = ఆ సంబంధము, విశేషే = 'అది ఇది' అని ఒక విశేషమునందు, అవరుధ్యతే = నిర్ణయింపబడి యుండును.

తాత్పర్య విశేషాంశములు— ''పితుః పుత్రః'' 'తండ్రియొక్క కొడుకు' ఇచట, 'యొక్క' శేష షష్ఠి. శేషము జన్యజనక భావనిమిత్తము

''పశోః పాదః'' 'పశువు యొక్క కాలు' ఇట సంబంధము అవయవావయవి భావ మూలకమని సంబంధిని బట్టి తెలియవచ్చును

'రాజ్ఞః పురుషః' అనుచోట ఆ విధముగ స్వస్వామి భావమునకు నిమిత్తమైన, నియతమైన సంబంధమేదియు తెలియరాదు. పురుషుడు రాజసంబంధి అగుటకు, యాచనయో, దానమో, ఇంక నేదియో నిమిత్తము కానోపును నియతి లేకపోవచ్చును నిమిత్తము తప్పదు.

అట్టి నిమిత్త నియమము కర్మ ప్రవచనీయముల ప్రయోగమున నగపడును.

ప్ర, పరా.— మున్నగు వానిలో గొన్నింటికి పాణిని, ఉపసర్గ సంజ్ఞ కపవాద

ముగ "కర్మ ప్రవచనీయము" అను సంజ్ఞను విధించియున్నాడు. "జపమను ప్రావర్షత్" "శాకల్యస్య సంహితామను ప్రావర్షత్" - మున్నగు వాక్యములలో 'అను' అనునది కర్మ ప్రవచనీయము.

జపము చేయుటవలనను, శాకల్య సంహితను బఠించుటవలనను వర్షము కురిసినది. ఎపుడు వర్షము కురిసినది ? అను ప్రశ్న కిది సమాధానము. "అనుర్లక్షణే" (1-4-83) అను సూత్రము, గతి సంజ్ఞకు బాధకముగ కర్మ ప్రవచనీయమను సంజ్ఞను 'అను' అనుదానికి విధించినది. తద్యోగమున ద్వితీయ. జపము చేసినట్లు తెలిసికొని ఆ వెంటనే వర్షము కురిసినట్లు తలంపబడుచున్నది. జపమునకును వర్షించుటకును సంబంధము, కారణ కార్య సంబంధము. వినుట లేదా తెలిసికొనుట అను క్రియవలన నది కలిగినదని 'అను' అను కర్మ ప్రయచనీయము తెలియచేయును.

కర్మ ప్రవచనీయముల స్వభావము క్రియోద్దేశమున నిట్లు వివరింపబడినది—

శ్లో॥ క్రియాయాః ద్యోతకో నాయం సంబంధస్య న వాచకః ।
నాపి క్రియాపదాక్షేపీ, సంబంధస్య తు భేదకః ॥

"ఇది క్రియకు ద్యోతకము కాదు. సంబంధమును చెప్పదు. క్రియాపదమును నిది ఆక్షేపింపదు. మఱేమగుననిన, సంబంధ విశేషమునకు ద్యోతకమగును" అని దాని యర్థము. 'క్రియాం ప్రోక్తవాన్' = కర్మ ప్రవచనీయః అని వ్యుత్పత్తి. ఇది ప్రకృత క్రియకు ద్యోతకము గాదు. కడచిన క్రియను ప్రకాశింపజేసినది. విభక్తికి ప్రత్యయమే సంబంధమును చెప్పును గాన నిది సంబంధవాచకమును గాదు. "ప్రాదేశం విలిఖతి" అని యొక వాక్యము. ప్రాదేశమనగా జానెడు స్థలము. దానిని కొలిచి గీత గీయుచున్నాడని అర్థము. ఇట 'వి' అనునది ఉపసర్గము కొలుచుట అను క్రియను ఇది ఆక్షేపించును. విలిఖతి = విమాయ లిఖతి' కర్మ ప్రవచనీయములు ఉపసర్గలు చేయు పనులను వేనిని చేయవు. విభక్త్యర్థ మిచట క్రియావిశేష జన్య సంబంధము' అని ప్రకాశింపజేయుట వాని పని.

"అధిబ్రహ్మదత్తే పంచాలాః" అని యొక వాక్యము. పంచాలదేశము బ్రహ్మదత్త మహారాజుది. ఆ స్వస్వామి భావమును 'అధి' అను కర్మ ప్రవచనీయము ప్రకాశింపజేయును. తద్యోగమున సప్తమి విహితము

"అభిమన్యురర్జునతః ప్రతి" = అభిమన్యుడు అర్జునునకు ప్రతినిధి. అనగా అర్జునుడు చేయు పనులను జేయుటచే నాతని అనుకరింపగలవాడని భావము. అనుకార్యానుకరణ భావ మిచట 'ప్రతి' అను దానిచే ప్రకాశింపజేయబడును. కావున నీ తీరుగ క్రియ ప్రకటముగాలేని స్థలములందు దానిని ప్రకాశింపజేయుట, కర్మ ప్రవచనీయముల కృత్యము. ॥158॥

అవతారిక— ఇక విచారాంతరము.

"షష్ఠీశేషే" (2-3-50) అను సూత్రముచే కారక ప్రాతిపదికార్థ వ్యతిరిక్తమగు

స్వస్వామిభావము మున్నగు సంబంధమున షష్ఠీ విభక్తి ప్రత్యయము విధింపబడినది గదా ! మరల కొన్ని సూత్రములందు, "కర్మణి శేషే" "కరణే శేషే" 'అధికరణే శేషే" అని, కర్మ, కరణము. అధికరణము, శేషములుగా వివక్షింపబడినపుడు షష్ఠీ విధానమున కుపపత్తి యేమి ? కర్మ కరణాదులు వేరును సంబంధము వేరును గదా ! కర్మత్వాదులను సంబంధ మాత్రముగ దలంచినపుడు అవి తిరోహితములే యగును గదా ! ఇది ప్రకృత విచార విషయము

శ్లో॥ సాధనై ర్వ్యపదిష్టే చ శ్రూయమాణక్రియే పునః ।
ప్రోక్తా ప్రతిపదం షష్ఠీ సమాసస్య నివృత్తయే ॥ 159

సాధనైః = కర్మాదికారకముల చేత, వ్యపదిష్టే = విశేషింపబడిన, శ్రూయమాణ క్రియే = క్రియాపద శ్రవణమున్న చోటులందు, పునః = మరల, షష్ఠీ = షష్ఠీ ప్రత్యయము, సమాసస్య = సమాసము యొక్క, నివృత్తయే = నివారణమునకై, ప్రతిపదం = ప్రత్యేక పదోచ్చారణ ముఖముగా, ప్రోక్తా = విధింపబడినదై, అస్తి = ఉన్నది.

తాత్పర్య విశేషాంశములు— "అధీగర్థ దయేశాం కర్మణి", "జ్ఞోఽవిదర్థస్య కరణే", "కృత్వోఽర్థ ప్రయోగే కాలేఽధికరణే" - ఇవి ద్వితీయాధ్యాయ తృతీయపాదమున (52-51-64) సూత్రములు. వీనిలో "కర్మణి, కరణే, అధికరణే" అనునవి, శేషమును విశేషించును. 'శేషేషష్ఠీ' అనగా సంబంధ రూపార్థమున షష్ఠి వచ్చునని యర్థము. ఏ సంబంధమున ? అని ప్రశ్నించిన, ఆ సంబంధము వెనుకటి అవస్థలగు కర్మత్వ కరణత్వాదుల రూపమున నున్న సంబంధమున నని తెలియజేయుట కవి విశేషణములు.

ఇక పునర్విధాన మెందులకను ప్రశ్నకు సమాధానము 'సమాస నిషేధమునకు' అని. అది నియమార్థము. ఆ నియమమునకు ఫలము అన్యనివృత్తి. షష్ఠియే ఉండుననిన దాని అభావముండదని యర్థము గదా. తదభావము సమాసమున గదా యుండునది. కాగా సమాసము రాదని ఫలితము. ॥159॥

అవతారిక— పైన చెప్పిన నియమ ఫలితమును వార్తిక కారుడు. "ప్రతిపద విధానాచ షష్ఠీ న సమస్యతే" అను వార్తికముచే బోధించెను.

శ్లో॥ నిష్ఠాయాం కర్మవిషయా షష్ఠీ న ప్రతిషిధ్యతే ॥
శేషలక్షణయా షష్ఠ్యా సమాసస్తత్ర నేష్యతే ॥ 160

నిష్ఠాయాం = నిష్ఠా ప్రత్యాయాంతములు పరమైనపుడు, కర్మవిషయా = కర్మార్థకమగు, షష్ఠీ = షష్ఠీ ప్రత్యయము, న ప్రతిషిధ్యతే = నిషేధింపబడదు, తత్ర = అచట, శేషలక్షణయా = 'షష్ఠీ శేషే' అని విహితమైన, షష్ఠ్యా, సమాసః = షష్ఠ్యంతముతో, సమాసము, న ఇష్యతే = సమ్మతము గాదు.

తాత్పర్య విశేషాంశములు— "మాతుః స్మృతమ్" = 'తల్లికి సంబంధించిన స్మృతి' అని యర్థము. కర్మ అగు మాత శేషముగ వివక్షింపబడుట వలన షష్ఠి. 'అధీక్' అను సోపసర్గ ధాతువునకు స్మరణ మర్థము. 'స్మృతమ్' అనునది భావార్థమున నిష్ఠా ప్రత్యయాంతము. క్త, క్తవతు అను ప్రత్యయములకు 'నిష్ఠ' అని సంజ్ఞ. కనుక నిష్ఠా ప్రత్యయాంతముతో నన్వయమున్నపుడు షష్ఠికి "నలోకావ్యయ నిష్ఠాఖలర్థతృనామ్" (2-3-69) సూత్రముచే నిషేధము ప్రాప్తించుచున్నది గాని, ఆ నిషేధము, "కర్తృ కర్మణోః కృతి" (2-3-65) అను సూత్రముచే విధింపబడిన షష్ఠికే. ఆ సూత్రమున 'శేషే' అను పద మనువర్తింపదు. 'షష్ఠ్యైవ న సమాసః' అను నియమమాషష్ఠికి లేదు కాబట్టి 'ధర్మానుస్మరణమ్', 'అర్థానుస్మరణమ్' మున్నగు సమాసములు సాధువులే.

'మాతుః స్మృతమ్' అను స్థలమున అధిగర్థ సూత్రముచే శేషషష్ఠి కాదే. "క్తస్య చ వర్తమానే" (2-3-67) అని గదా అచట షష్ఠి ? అని ప్రశ్న కవకాశము కలదుగాని అది భాష్యమున ప్రత్యాఖ్యాతము. కావున నది శేషత్వ వివక్షచే వచ్చిన షష్ఠియే. 'షష్ఠ్యైవ, న సమాసః' అను నియమమునకు విషయమే. 'స్మృ' ధాతువు సకర్మకమైనను అకర్మకవద్భావముచే భావార్థమున నిష్ఠా ప్రత్యయము సాధువు.

సమాస ప్రతిషేధమున కుదాహరణాంతరములు— "సర్పిషః జ్ఞానమ్", "మధునః జ్ఞానమ్" మున్నగునవి.

ఒక ప్రశ్న— 'మధునః జ్ఞానమ్' అను వాక్యమునకు మధు సంబంధి ప్రవృత్తి అని అర్థము. ఆ సంబంధము కరణత్వ పూర్వకము అని వాక్యమువలన తెలియును. 'మధుజ్ఞానమ్' అను సమాసమయిన సంబంధ సామాన్య జ్ఞానమేకాని, మధువు ప్రవృత్తిలో కరణము గాన నది కరణత్వరూపమని తెలియబడదు. ఇట్లు వృత్తి విగ్రహములకు సమానార్థకత్వము లేనందుననే సమాస ప్రతిషేధము సిద్ధించునుగదా. అనగా సామర్థ్యమువలన సమాసము రాదనవచ్చును గదా. ఈ యత్న మెందులకు ? అని ప్రశ్న.

సమాధానము— వాక్యమువలన నైనను, ఆ సంబంధము కరణత్వ పూర్వకమని శబ్దతః తెలియబడదు. అది అర్థ ప్రకరణాదులను బట్టి తెలియవలసినదే. కావున 'జ్ఞా' ధాతువున కచట ప్రవృత్తి అర్థమని ప్రకరణమువలన గృహీతమైనపుడు ప్రసక్తమగు సమాసమునకు ప్రతిషేధ మావశ్యకమని తాత్పర్యము. ॥160॥

అవతారిక— "షష్ఠీ శేషే" (2-3-51) అను సూత్రమున మహాభాష్యమునందు శంకా సమాధానము లిట్లున్నవి.

సంబంధమనునది ద్వినిష్ఠము గదా. దానిని తెలియజేయుటకు షష్ఠీ విభక్తి ప్రత్యయము ప్రయోగింపవలెను. అపుడు స్వామివాచకమగు రాజ శబ్దమునవలె స్వవాచకమగు పురుష శబ్దమునగూడ షష్ఠి ఏల లేదు ?

సమాధానము— 'ఒక షష్ఠియే ద్వినిష్ఠమగు సంబంధమును తెలియజేయును గాన పురుష శబ్దమున నది రాదు.

అట్లైన నిక 'పురుషస్య రాజా' అను ప్రయోగమే సంభవింపదా? ఏల సంభవింపదు? అపుడు రాజశబ్దము ప్రథమాంతమగును.

ఒకే వస్తువు ప్రధానమును, అప్రధానమును గూడ అగుట అసంభవము గాన "రాజ్ఞః పురుషస్య" అని ప్రయోగించుట సంభవింపదు కదా? అనిన విషయభేద మున్నపుడదియు సంభవమే, 'రాజుగారి పురుషుని ధనము' అని చెప్పదలంచుకొనిన నా ప్రయోగమును సుస్థమే. ఇది అచట గ్రంథము. దాని వ్యాఖ్యానరూపమే ఈ శ్లోకము.

శ్లో॥ అన్యేన వ్యపదిష్టస్య యస్యాన్యత్రోపజాయతే ।
వ్యతిరేకః స ధర్మౌ ద్వౌ లభతేవిషయాంతరే ॥ 161

అన్యేన = వేరొక విశేషణముచే, వ్యపదిష్టస్య = విశేష్యముగా నిర్దేశింపబడిన, యస్య = దేనికి, అన్యత్ర = ఇంకొక ప్రధానమునందు, వ్యతిరేకః = సంబంధము, ఉపజాయతే = ఏర్పడునో, సః = అది, విషయాంతరే=వేరు విషయమునందు, ద్వౌ, ధర్మౌ=అప్రధానత్వ ప్రధానత్వములను, లభతే = పొందును.

తాత్పర్య విశేషాంశములు— "రాజ్ఞః పురుషస్య కంబలః" - అని వాక్యము. రాజు పురుషునకు విశేషణము. పురుషుడు విశేష్యము. ఆ పురుషునకు కంబలము విశేష్యము. పురుషుడు విశేషణము ఇట్లు విషయభేదమునుబట్టి ఒకే వ్యక్తి విశేష్యమును విశేషణమును గావచ్చును. ఒక కాలమున పురుషుడు విశేష్యముగ నిర్దేశింపబడి, కాలాంతరమున, అనగా కంబలముతో సంబంధించినపుడు విశేషణమగుట విరుద్ధము కాదు, అని 'వ్యపదిష్టస్య' అను, భూతకాల నిర్దేశముచే సూచింపబడినది ॥161॥

అవతారిక— పై శ్లోకమునకు విశేష వివరణ రూప మీ క్రింది శ్లోకము.

శ్లో॥ ప్రాధాన్యం స్వగుణేలబ్ధ్వా, ప్రధానే యాతిశేషతామ్ ।
సహయోగే, స్వయోగేఽతః ప్రధానత్వం నహీయతే ॥ 162

స్వగుణే = తన విశేషణమున, ప్రాధాన్యం = విశేష్యత్వమును, లబ్ధ్వా = పొంది, ప్రధానే = ఇంకొక ప్రధానమున, స్వయోగే = తన సంబంధము కలిగినపుడు, శేషతాం = విశేషణత్వమును, యాతి = పొందును, సహయోగే, ఇవ = సహార్థక శబ్దముతో సంబంధమునందువలె, అతః = అందువలన, ప్రధానత్వం = ప్రాధాన్యము, స్వస్య = తనకు, నహీయతే = నివర్తింపదు.

తాత్పర్య విశేషాంశములు— రాజు విశేషణమైనపుడు పురుషునకు ప్రాధాన్యము, ముందే లభించియున్నది. పురుషుడు కంబలమునకు విశేషణమైనపుడు, తాను అప్రధానమైనను

రాజునుబట్టి నప్రాధాన్యము తనకు తొలగదు. గుణప్రధాన భావము, ఏకత్ర, విరుద్ధముగాని విషయములు వేరయినపుడు విరుద్ధము గాదు.

"పుత్రేణ సహ ఆగతః దేవదత్తః" దేవదత్తుడు పుత్రునితోగలసి వచ్చినాడు. వచ్చుట అను క్రియలో తండ్రి ప్రధానుడు. పుత్రుడు అప్రధానము. కనుక నచట "సహ యుక్తేఽప్రధానే" (2-3-19) అను సూత్రముచే తృతీయా విభక్తి ప్రత్యయము వచ్చినది. దేవదత్తునియొక్క పుత్రుడు అనునపుడు, పుత్రుడు "రాజ్ఞః పురుషః" అనుచో పురుషునివలె విశేష్యమే. ప్రధాన భూతుడే. కాని రాకలో, 'తండ్రితోగూడ' అనుటవలన నాతనికి అప్రాధాన్యము. ఆ విధముగనే "రాజ్ఞః పురుషస్య కంబలః" అనుచోట పురుషుడు రాజునకు విశేష్యమును, కంబలమునకు విశేషణమును నగుట విషయభేదముచేత నుపపన్నమే. ॥162॥

ప్రథమావిభక్తి విచారము

"ప్రాతిపదికార్థ, లింగ, పరిమాణ, వచనమాత్రే ప్రథమా" (2-3-46).

"సంబోధనేచ" (2-3-47) అను రెండు సూత్రములు ప్రథమా విధాయకములు. అందు సంబోధనమన నేమియో 163 వ కారికచే విచారింపబడినది. ప్రాతిపదికార్థ సూత్ర విచారమును భర్తృహరి చేయలేదు.

వ్యాఖ్యాతయగు హేలారాజు మహాభాష్యానుసారముగ నా సూత్రమును సమగ్రముగ విచారించెను. ఆ విచార మిందు పొందుపరుపబడుచున్నది.

ప్రాతిపదికము నుచ్చరించిన తోడనే మన మనమున నొక అర్థము నియతముగ నుపస్థితమగును. అదియే ప్రాతిపదికార్థము. ఆయా శబ్దముల ప్రవృత్తి నిమిత్తమును, దాని కాశ్రయమైనదియు ప్రాతిపదికార్థముగా గ్రహింపబడుచుండును.

ప్రథమ ప్రాతిపదికార్థమును మాత్రము బోధించును. కర్మాదులు ద్వితీయాది విభక్తులచే బోధింపబడును. 'ఉచ్చైః', 'నీచైః' మున్నగు నవ్యయములు లింగరహితములు. అచట ప్రథమ ప్రాతిపదికార్థబోధకము. ప్రథమా ప్రత్యయ మచట లోపించినది. వినబడుచున్న విసర్గము ప్రాతిపదికావయవమే. కృష్ణః॥ శ్రీః॥ జ్ఞానమ్॥ ఇవి నియతలింగములు. లింగ మచట ప్రాతిపదికార్థమున చేరినదే. అధికము గాదు. కాగా ప్రాతిపదికార్థముననే ప్రథమ.

తట శబ్దమునకు మూడు లింగములు నుండును. అందు ప్రాతిపదికార్థమే కాక లింగమును అధికముగా నున్నది. కావున నట లింగమాత్రాధిక్యమున ప్రథమ.

ద్రోణః॥ ఖారీ॥ ఆఢకమ్॥ వీనిలో పరిమాణము ప్రాతిపదికార్థముకంటె నధికము. కావున పరిమాణ మాత్రాధిక్యమున ప్రథమకవి యుదాహరణములు.

ఏకః॥ ద్వౌ॥ బహవః॥— ఇట వచనాధిక్యమున ప్రథమ. వచనమనగా సంఖ్య. అది ఏక, ద్వి, బహు— అను ప్రాతిపదికల అర్థమే అగుటచే, ప్రథమా ప్రత్యయములు.

ఉక్తార్థములు. అనగా వాని అర్థము ప్రాతిపదికముచేతనే చెప్పబడినది. "ఉక్తార్థా నామ ప్రయోగః" అని న్యాయము. వేని అర్థము శబ్దాంతరములచే, చెప్పబడునో వానికిక ప్రయోగ ముండదు అని ఆ న్యాయమున కర్థము గదా. ఇది ప్రథమావిధాయక సూత్ర ప్రమేయము.

కొందరీ సూత్రమును మార్చి "అభిహితే ప్రథమా" అని పఠింతురు కారకము అభిహితము అయినపుడు ప్రథమ వచ్చునని అర్థము.

'కర్త కరణము మున్నగునవి, తిఙ్, కృత్, తద్ధిత ప్రత్యయములచేతను, సమాసము చేతను చెప్పబడినపుడు' అని భావము.

(1) పచ్యతే ఓదనః = అన్నము వండబడుచున్నది.

(2) మాంసపచనః వహ్నిః = మాంసమును వండు సాధనము అగ్ని.

(3) గోఘ్నః అతిథిః = గోవును చంపుట కుద్దేశ్యభూతుడు (చుట్టము).

(4) ప్రస్కందనః స్తంభః = దీనినుండి జారుదురు గాన నీ స్తంభము ప్రస్కందనము

(5) ప్రాసాదో రాజభవనమ్ = దీనియందు కూరుచుందురుగాన నిది ప్రాసాదము.

(6) పచతి దేవదత్తః = దేవదత్తుడు వండుచున్నాడు.

ఈ ప్రయోగములందు, యథాక్రమముగ కర్మ, కరణము సంప్రదానము, అపాదానము, అధికరణము, కర్త - అను నారు కారకములును తిఙ్ కృత్ప్రత్యయములచే చెప్పబడినవి గాన నట ప్రథమా ప్రత్యయము వచ్చినది.

ఇట్లే, "కృతః కటః" = చాప అల్లబడినది. కృత్ప్రత్యయ మిట కర్మను చెప్పినది ఔపగవః = ఉపగు అను నాయన పుత్రుడు.

ఇట తద్ధిత ప్రత్యయము సంబంధమును చెప్పినది. కావున ప్రథమ. "చిత్రగుః" = చిత్ర వర్ణములయిన గోవులు కలవాడు. సమాస మిట సంబంధమును వచించినది.

రాజ్ఞః పురుషః = షష్ఠి, సంబంధమును బోధించినది గాన నిక పురుష పదమున ప్రథమయే వచ్చినది

మహాభాష్యమున నీ సందర్భమున నీ ప్రశ్నోత్తరములు గలవు.

"అభిహిత లక్షణాయా మనభిహితే ప్రథమావిధిః" అని వార్తికము. కర్మాది కారకము లభిహితములయినపుడు ప్రథమ వచ్చునని యర్థమయిన, ఏ కారకమును అభిహితము కాని స్థలమున ప్రథమ ప్రాప్తింపకపోవును. అపుడచట అపూర్వముగ ప్రథమను విధింపవలసి యుండును.

'వృక్షః', 'పర్వతః' అనుచో తిఙాదు లేవియు లేవుగాన అభిధానమునకు ప్రసంగమే లేదుగదా యని ప్రశ్న. దీనికి పరిహార మిట్లు కలదు.

''అ స్తిర్భవ న్తీ పరోఽ ప్రయుజ్యమానోప్యస్తి'' అని భాష్యము.

భవన్తీ అనునది లట్టను లకారమునకు పూర్వాచార్యుల సంజ్ఞ. అది పరముగాగల అస్తిః = అసభువి అను ధాతువు, ప్రథమ పురుష ప్రత్యయాంతము. వాక్యమునందు ప్రయోగింపబడ కున్నను. అస్తి = అధ్యాహృతమగును. అని అర్థము. క్రియాసంబంధములేని ఏ పదార్థమును వ్యవహారయోగ్యము గాదు గాన నంతటను అస్తి క్రియ సన్నిహితమయియే యుండును. 'వృక్షః' అనిన వెంటనే 'అస్తి' అనునది గూడ ఉన్నట్లే భావింపబడును. భావించుట ఏల 'అస్తి' అను శబ్దమునకే అధ్యాహారము. అందున్న తిఙ్ప్రత్యయముచే కర్త చెప్పబడినది గాన ప్రథమ సిద్ధమే యగును

ఒక పదమును ప్రయోగించుచున్నారనిన దాని అర్థము నిశ్చితమై యుండవలెను. ఏ పదార్థమును సత్త అనునది లేకుండ నుండదు.

''న సత్తాం పదార్థో వ్యభిచరతి'' = సత్త లేని పదార్థమున కునికి లేదు కనుక 'వృక్షః' అనిన 'అస్తి' అని కూడ చెప్పినట్లే. ''ప్రవృత్తిహేతుం సర్వేషాం శబ్దానా మౌపచారికీమ్। ఏతాం సత్తాం పదార్థో హి న కశ్చిదతివర్తతే'' అని సంబంధ సముద్దేశమున చెప్పబడిన దిట స్మరింపదగును

ఈ సందర్భమున వేరొక వాక్యము = వార్తికము, ''అభిహితా నభిహితే ప్రథమాభావః'' అనునది ''ప్రాసాదే ఆస్తే'' ''శయనే ఆస్తే'', అను వాక్యములలో ప్రాసాదశయన శబ్దములకు ప్రథమ ప్రాప్తించుచున్నది అది వారణీయము. ప్రాసాదశబ్దము అధికరణ 'ఘఞ'ంతము. 'ప్రసీదన్తి అస్యామ్'. శయన శబ్దము అధికరణ 'ల్యు' డంతము. 'శేరతే అస్యామ్'. అధికరణము 'కృత్ప్ర'త్యయములచే అభిహితము. అయినను 'ఆస్తే' అనుచోట తిఙ్ప్రత్యయముచే అభిహితము కాలేదు. కావున నది అభిహితా నభిహితము. అభిహితము కూడ నగుటచే ప్రథమకు ప్రాప్తి కలదని ఆక్షేపతాత్పర్యము.

ఈ ఆక్షేపమును పరిహరించుటకు, ''తిఙ్సమానాధికరణే ప్రథమా'' అని సూత్రన్యాసము మార్చబడును అపుడు 'ప్రాసాదే' 'శయనే' అనునవి తిఙ్ సమానాధికరణములు కావు గాన దోషము ప్రాప్తింపదు తిఙ్ ప్రత్యయము కర్తను బోధించును. కావున కర్త తిఙ్సమానాధికరణమగును గాని అధికరణము కాదని సమాధాన భావము. ఈ సందర్భమున నే వేఱొక ఆక్షేప వార్తికము ''శతృశానచోశ్చ నిమిత్త భావాత్ తిఙో భావస్తయోరపవాదత్వాత్'' అనునది.

''దేవదత్తః పచతి'' అను ప్రయోగము ఈ సూత్ర న్యాస పక్షమున లభింపదు. ఏలయన, వాక్యమున కన్వాఖ్యానమని యొక పక్షమును, పదములకు ప్రత్యేకముగ అన్వాఖ్యానమని వేఱొక పక్షమును శబ్ద శాస్త్రమున గలవు. అందు మొదటి పక్షమున ఆ వాక్యమిట్లు విభజించి సంస్కరింపబడును. దేవదత్త + పచ్ + ల్ అను స్థితిలో లకార స్థానమున తిఙ్ ప్రత్యయ ముత్పన్నము కాక పూర్వము దేవదత్తునకు తిఙ్ ప్రత్యయ సామానాధికర

ణ్యము లేదు గదా. కాగా, "లటః శతృశానచావ ప్రథమా సమానాధికరణే" (3-2-124) అను సూత్రముచే తిఙ్ప్రత్యయమున కపవాదములయిన శతృశానచ్ ప్రత్యయములు ప్రాప్తించుచున్నవి. లిఙ్ సామానాధికరణ్యము లేనందున ప్రథమ యుండదు. ద్వితీయాది ప్రత్యయము లన్నియు నుండును. కావున ఆ న్యాసమున నీ దోషముండుటచే, "ప్రాతిపది కార్థ లింగ పరిమాణ వచన మాత్రే ప్రథమా" అను పాణిని న్యాసమే సుస్థము.

అట విచారాంతరమును నిట్లు గలదు. ఆ సూత్రమున 'ప్రాతిపదిక' అను పదము లేకున్న నేమి? "అర్థలింగ పరిమాణ వచన మాత్రే ప్రథమా" అని సూత్రము చాలదా? స్వాది ప్రత్యయములు ప్రాతి పదికమునకు పరముగనే వచ్చును. 'స్వౌజసమౌట్' ఇత్యాది శాస్త్రముచే విధింపబడిన ప్రత్యయములకు, ఈ ప్రకరణము, 'అర్థమునందే' 'లింగమునందే' అని ఈ తీరున నియమమును బోధించును. అపు డర్థమనగా ప్రాతిపదికార్థమే గాని వేఱే మగును? అని శంక. కావున అర్థపదము చాలును 'ప్రాతిపదిక' అను దానితో పని లేదు అని భావము.

సమాధానమేమన— ఏకత్వాది సంఖ్యలు లేని 'ఉచ్చైః' 'నీచైః' మున్నగు అవ్యయముల అర్థమునను ప్రథమ సిద్ధించుటకు ప్రాతిపదిక పద మావశ్యకమని. అచట ప్రథమ లేకున్న నేమి? అందురేమో. అది లేకున్న సుబంతత్వము లేదు అది లేనిచో పదత్వము లేదు. పదము కానిది ప్రయోగార్హము కాదు. విశేష వివరణమునకు మహాభాష్య మును చూచునది.

లింగ పద గ్రహణమునకు ప్రయోజన విచారము

ద్రవ్యవాచక ప్రాతిపదికములకు లింగముగూడ ప్రాతిపదికార్థమే కదా! ఇక లింగ గ్రహణమునకు ప్రయోజనమేమి? అని శంక.

స్త్రీ॥ పుమాన్॥ నపుంసకమ్॥ - అను శబ్దములందు గూడ ప్రథమ సిద్ధించుటకు లింగ పద మావశ్యకము. అచట జాతి ద్రవ్యములను ప్రాతిపదికార్థము కంటె నధికముగ లింగ ముండుటవలన ప్రాతిపదికార్థ మాత్రమున విధింపబడిన ప్రథమ సిద్ధింపకపోవును అని సమాధానము.

మరల శంక— ఆ శబ్దములందు లింగముగూడ నియతోపస్థితి విషయమే కదా! లింగము లేకుండగ స్త్రీ॥ పుమాన్॥ నపుంసకమ్॥ - అను శబ్దములు లేవు గదా! కావున ప్రాతిపదికార్థముననే ప్రథమ సిద్ధించునే?

సమాధానము— సత్యమే. అనియత లింగములైన 'కుమారీ', 'తటః', 'కుణ్డమ్' మున్నగునవి లింగ గ్రహణ ప్రయోజనములు. అవి సర్వలింగము లగుటచే ఏ ఒక లింగమున కును ప్రాతిపదికము వలన నియతమగు నుపస్థితి కలుగదు గదా!

పరిమాణ గ్రహణ సార్థక్య విచారము

ప్రస్థః = కుంచము, ఖారీ = పుట్టి, ఆఢకః = తూము; ఇవి పరిచ్ఛేదకములు = కొలత పాత్రలు. ఆ కొలతగల వస్తువులతో అభేదముగ దీనికి వ్యవహార మగపడుచున్నది ''ప్రస్థః వ్రీహిః'' = కుంచము ధాన్యము. ఆ వడ్ల పరిమాణము కుంచమనుట. ప్రస్థ పరమున నున్న ప్రథమా విభక్తి ప్రత్యయమునకు పరిమాణము అర్థము దానితో కొలువబడునది వ్రీహి పరిమాణమునకును వ్రీహికిని మానమేయ భావము (= పరిచ్ఛేద్య పరిచ్ఛేదక భావము) సంబంధము. ప్రస్థమను పరిమాణముతో కొలచిన ధాన్యమని ఆ వాక్యమున కర్థము. ప్రస్థమును, ధాన్యమును అభిన్నములు కావు. కాని లోకమున అభేదమును వాని కారోపించి వ్యవహారము నడచుచున్నది. ఆ విషయమును వ్యక్తము చేయుటకు, పరిమాణ రూపార్థమున ప్రథమ ఈ సూత్రముచే విధింపబడినది.

ఈ ప్రథమా విధానము లేనిచో ''ప్రాస్థికో వ్రీహిః'' అని తద్ధితాంత పదముతో వ్యవహారమో, లేదా ''ప్రస్థము పరిమాణముగా గల వ్రీహి'' అని వాక్యము మాత్రమో ఉండదగును గాని ''ప్రస్థో వ్రీహిః'' అను వ్యవహారము లభింపదు

ఈ విషయము రాబోవు వృత్తి సముద్దేశమున 84 85 కారికలచే వివరింపబడినది

మానమేయాది సంబంధవిశేషేఽంగీకృతే తదా
ప్రస్థాదీనామసాధుత్వం తద్ధితేన వినా భవేత్ ।
తద్ధితో యోగభేదేన వాక్యం వా స్యాద్విభాషితమ్
పరిమాణాధికే తత్ర ప్రథమా శిష్యతే పునః ॥

అర్థము— ప్రస్థమునకును వ్రీహికిని మానమేయ భావమను సంబంధము నంగీకరించినపుడు తద్ధిత ప్రత్యయములేని ''ప్రస్థో వ్రీహిః'' ఇత్యాది ప్రయోగములసాధువులు కావలసి వచ్చును. అందువలన ''తదస్య పరిమాణమ్'' (5-1-57) అని సూత్రమును వేరు చేసి 'ఠ' గాది ప్రత్యయములను, మహావిభాషచేత వాక్యమునకు సాధుత్వమును బోధింపవలెను దానివలన, ''ప్రాస్థికః వ్రీహిః'' అనియు, ''ప్రస్థః పరిమాణమస్య వ్రీహేః'' అను వాక్య ప్రయోగమును సిద్ధించును ''ప్రస్థో వ్రీహిః'' అనునదియు సాధువగును. అంచులకై పరిమాణమున ప్రథమా విధానము.

వచన పదకృత్య విచారము

సూత్రమున వచన శబ్దమునకు సంఖ్య అర్థము. అది పూర్వాచార్య వ్యవహార సిద్ధము. ఏకః, ద్వౌ, బహవః - అను పదములందు, సంఖ్యను ప్రకృతియే చెప్పినను, విభక్తి సిద్ధించుట వచన పదకృత్యము.

మాత్ర పదమున కవధారణ మర్థము. అందువలన కర్మ కరణాద్యర్థములు ప్రాతి

పదికార్థము కంటె నధికముగ నున్నపుడు ఆయా విభక్తులే ప్రవర్తించును గాని ప్రథమ ప్రవర్తింపదు.

మహాభాష్యమున మాత్ర పదము ప్రత్యాఖ్యాతము. అతిరిక్తార్థము లున్నపుడు గూడ ప్రథమ ప్రాప్తింగిన, సంబోధనమను నర్థమున "సంబోధనేచ" (2-3-47) అను సూత్ర ముచే మరల ప్రథమా విధానము వ్యర్థమగును గదా ; కావున మాత్ర పదము లేకున్నను దోషము లేదని భావము.

అది 'మాత్రచ్' అను ప్రత్యయము కాదు. 'మాత్రా' అను 'టా' బంతము. 'మాత్ర' అనగా సంఖ్య. సంఖ్యా రూపార్థమున ప్రథమా విధానమున కా పదము సమాహార ద్వంద్వముచే నిర్దేశింపబడినది' అని కొందరందురు గాని ఆ ప్రయోజనము 'వచన' శబ్దము చేతనే సిద్ధించును. అట్లు కానిచో వచనపదమో మాత్రపదమో ఏదియో యొకటి అందు అనా వశ్యక మగును 'అన్యతరత్ శక్యమకర్తుమ్' అని భాష్యము

'పరిమాణ వచన' - అనునది ఒకటే పదము. వచన పదమువలన సకల పరిమాణ వచనములకును గ్రహణము సిద్ధించును. 'నిలువు' అను నర్థముగల 'పురుష' అను శబ్దము ఊర్ధ్వమాన వాచకము. "పురుషః పరిఖా" = 'నిలువు కందకము' అందురు. అచట పురుష పదమునకు ప్రథమాసిద్ధి ప్రయోజనమని కొందఱనిరి గాని, మాత్రపదమవధారణార్థక మనుటయే యుక్తమని భాష్యమతము.

"వీరః పురుషః" = 'వీరుడగు పురుషుడు'. ఇచట ప్రథమ ప్రాప్తింపదని ఆక్షే పము. ఏలయన— విశేషణ విశేష్య భావ మధికముగా నున్నదిగదా అని భావము. "పద సామానాధి కరణ్యే ఉపసంఖ్యా నమధికత్వాత్" అని ఆక్షేప వార్తికము. "నవా వాక్యార్థ త్వాత్" అని సమాధాన వార్తికము. 'విశేషణ విశేష్య పదములకు పరస్పరాన్వయమునకు పూర్వమే ప్రాతిపదికార్థ మాత్రమున ప్రథమ ప్రవర్తించును. పరస్పరాన్వయము కలిగిన తరువాత తెలియవచ్చు విశేషణ విశేష్య భావమను నధికాంశము వాక్యార్థముగాని పదార్థము గాదు' అని సమాధాన తాత్పర్యము.

'శుక్లః పటః' అనుచో శుక్ల శబ్దము గుణివాచకము. ప్రాతిపదికార్థముననే ప్రథమ "వింశతిః గావః" = ఇరువది గోవులు. 'ఇరువది' సంఖ్యేయ వాచకము. ప్రాతిపదికార్థము ననే ప్రథమ

ఇట్లు యథాన్యాసమువలననే అనగా "ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచనమాత్రే ప్రథమా" అను పాణిన్యాచార్యుని సూత్రమువలననే సకలేష్టసిద్ధి కలుగుచున్నదిగాన ఆ సూత్రము అవిభాజ్యమని హేలారాజు నిర్ధారణము.

అవతారిక— ''సంబోధ నేచ'' (2-3-47) అను సూత్రము సంబోధన మను నర్థమున ప్రథమా విభక్తిని విధించినది. ఆ సంబోధన మన నేమి? అది పదార్థమా లేక వాక్యార్థమా? అని విచారింపబడుచున్నది.

శ్లో॥ సిద్ధస్యాభి ముఖీభావమాత్రం సంబోధనం విదుః ।
ప్రాప్తాభిముఖ్యో హి అర్థాత్మా క్రియాసు వినియుజ్యతే ॥ 163

సంబోధనమ్ = సంబోధనమను పదార్థమును, సిద్ధస్య = సంబోధ్య రూపముతో పూర్వ సిద్ధమైన వ్యక్తియొక్క, అభిముఖీ భావమాత్రం, విదుః = అభిముఖుని జేసికొనుటనుగా, తెలిసికొనుచున్నారు, ప్రాప్తాభిముఖ్యః = పొందబడిన అభిముఖ్యము కలవాడై, అర్థాత్మా = అర్థముతో నిండిన స్వరూపము గలవాడగుచు, క్రియాసు వినియుజ్యతే హి = చేయవలసిన పనులందు, ప్రేరింపబడును గదా!

సంబోధనమనగా సమ్యక్ బోధనము గట్టిగా పిలచి తన వైపు త్రిప్పుకొని, తాను చెప్పు దానిని ఆ వ్యక్తి తెలిసికొని ప్రవర్తించునట్లు చేయుట సంబోధ్యునకు తన రూపము పూర్వసిద్ధమై యుండవలెను. 'రాజన్ ! యుధ్యస్వ' అని రాజుగా నంతకు పూర్వము సిద్ధమయిన వానికే యుద్ధము చేయుము అని చెప్పుట ఇంకను నాతనికి పట్టాభిషేకము లేనందున రాజు కానివాడైన, అపుడు సంబోధన విభక్తి ప్రయోగింపబడదు అపుడు ''రాజా భవ యుధ్యస్వ'' అనియే వాక్య సంనివేశముండును.

ఈ సంబోధనము, కర్మ, కరణము మున్నగు వానివంటి కారకము గాదు. అవి సాక్షాత్తుగా క్రియాజనకములు. సంబోధ్యుడగు వ్యక్తి ఆజ్ఞాపింపబడి, అభిముఖుడై కార్యము నందు ప్రవర్తించును గాన ఆతనికి పరంపరగ క్రియాజనకత్వముగాని సాక్షాత్కారకత్వము లేదు. 'అర్థాత్మ' అనగా ప్రయోక్త యొక్క ఆదేశమునకు అర్థమును బాగుగ గ్రహించిన వాడని యర్థము. అపుడే కదా ప్రవృత్తి ॥163॥

అవతారిక— సంబోధనమునకు పదార్థత్వమును స్థాపించుచున్నాడు.

శ్లో॥ సంబోధనం న వాక్యార్థ ఇతి వృద్ధేభ్య ఆగమః ।

సంబోధనం = సంబోధనము, వాక్యార్థః న ఇతి = వాక్యార్థము కాదని, వృద్ధేభ్యః = పెద్దల నుండి, ఆగమః = వచ్చిన సంప్రదాయము.

తాత్పర్య విశేషాంశములు— ఆగమ మనగా నిశ్చయ జ్ఞానమును గలుగజేయు ప్రమాణము. సంబోధన పదమునకును క్రియాకాంక్ష కలదనుకొనుడు. అయినను, ఇతర పదముల అపేక్ష లేకయే దాని సంబోధ్య స్వరూపము తెలియవచ్చును. కావున నది పదార్థమే గాని వాక్యార్థము గాదు కర్మ కరణాదులును పదముల అర్థములేగాని వాక్యార్థములు కావు. క్రియాపేక్ష ఉండవచ్చును. అంతమాత్రమున వాక్యార్థమన బనిలేదు. హేవృక్ష ! = ఓ వృక్షమా! అనిన నట ఒక పదమే వాక్యము. అపుడు సంబోధనము వాక్యార్థమనవచ్చును,

ప్రకృతవిషయ నిగమనము క్రింద చేయబడుచున్నది.

ఉద్దేశేన విభక్త్యర్థాః వాక్యార్థాత్ సమపోద్ధృతాః ॥ 164

ఉద్దేశేన = సంగ్రహరూపముగ, విభక్త్యర్థా = విభక్తుల అర్థములు, వాక్యార్థాత్ = అఖండ వాక్యార్థమునుండి, సమపోద్ధృతాః = విభజింపబడినవి.

తాత్పర్య విశేషాంశములు— ఉద్దేశమనగా సంక్షేప వచనము. దాని మూలముగ విభక్తుల అర్థములగు, కర్త, కర్మ మున్నగునవి, పారమార్థికమును, ఏకరూపమును అగు వాక్యార్థమునుండి వేరుచేసి బోధింపబడుచుండును. వాక్యమఖండము. దానినుండి పదములు అపోద్ధృతములు గదా. అట్లే అఖండ వాక్యార్థమునుండి పదార్థముల కపోద్ధారము. పదార్థము నుండి విభక్త్యర్థములకును ఉద్ధారము వాక్యార్థమే సత్యము. పదార్థములు కల్పితములే అని సిద్ధాంతము.

ఈ కారికార్థ భాగమునకు సమన్వయాంతరమును నిట్లు చేయుదురు. ఎట్లనగా– ఉద్దేశేన = వాక్యార్థావయవముతో గూడిన, వాక్యార్థాత్ = వాక్యైకదేశమగు పదార్థము నుండి, విభక్త్యర్థాః = విభక్తుల అర్థములు సమపోద్ధృతాః = తీయబడినవి అనియు నన్వ యింతురు. ॥164॥

అవతారిక— ప్రాతిపదికల కర్థములు ద్రవ్యము జాతి మున్నగునవి. విభక్తుల కర్థములు కారకములు. వృక్షః, వృక్షం, వృక్షేణ, వృక్షాయ – ఈ పదములలో ప్రకృతుల కర్థము వృక్ష మొకటియే కారకములు మాత్రము వేరువేరు దానివలన మనకు తెలియున దేమన, ప్రత్యయార్థము, ప్రకృత్యర్థము కంటె వేరయిన కారక శక్తిరూపమునది కల దనియు అది అపలపనీయము కాదనియు శ్లో॥ "దృష్టోహ్య వ్యతిరేకేపి వ్యతిరేకోన్వయేఽసతి" ॥ అని ఈ సాధన సముద్దేశముననే 43 వ కారికలో ఈ విషయము సాధింపబడి యున్నది. అది గమనింపదగినది. అందు శాస్త్రీయమగు లింగముగూడ కలదని ఈ కారికలో చెప్పబడుచున్నది.

శ్లో॥ విభక్త్యర్థేఽవ్యయీభావ వచనాదవ సీయతామ్ ।
అన్యో ద్రవ్యాత్ విభక్త్యర్థః సోఽవ్యయేనాభిధీయతే ॥ 165

విభక్త్యర్థః = విభక్తుల అర్థము, ద్రవ్యాత్ = ద్రవ్యముకంటె, అన్యః = వేరయినది, సః = అది, అవ్యయేన = అవ్యయముచేత, అభిధీయతే = చెప్పబడుచున్నది, ఇతి = అని, విభక్త్యర్థేఽవ్యయీభావ వచనాత్ = విభక్తి అర్థమునందు అవ్యయీభావ విధానమువలన, అవసీయతామ్ = నిశ్చయింపనగును.

తాత్పర్య విశేషాంశములు— "అవ్యయం విభక్తి సమీప ...... వచనేషు" (2-1-6) అను సూత్రము విభక్త్యర్థమును బోధించు అవ్యయమునకు సమర్థముతో సమాస

ము.ను విధించుచున్నది అది అవ్యయీభావ సమాసము. సమర్థమనగా ఏకార్థీభావమను సామర్థ్య మున కాశ్రయమైనది. 'వ్యపేక్ష' అను సామర్థ్యముగలది అనినను అనవచ్చును. 'అధిస్త్రి' = 'స్త్రీయందు' అని యర్థము ఇచట సప్తమీ విభక్త్యర్థమును 'అధి' అను నవ్యయము చెప్పును. విభక్త్యర్థము ద్రవ్యయే అయిన, అది ప్రాతిపదికము చేతనే చెప్పబడునుగాన ఇక అవ్యయము నకు ప్రయోగ ప్రసంగమే కలుగదుగాన సమాస విధానమే పొసగదు. కావున ప్రకృత్యర్థము వేరు ప్రత్యయార్థము వేరు అని పూర్వము అన్వయ ముఖమునను, వ్యతిరేక ముఖమునను సాధించిన విషయమున కీ సమాస విధానము ఉపోద్బలకము. అన్వయ వ్యతిరేకములు వెనుక వివరింపబడినవి.

ఇట నొక ఆక్షేపము— ప్రాతిపదికల కర్థము, జాతి, ఒకటియే అని ఒక పక్షము. జాతి ద్రవ్యములు రెండును నని వేరొక పక్షము జాతి ద్రవ్య, లింగములు మూడును ప్రాతిపదికార్థములని మూడవ పక్షము. ఆ మూటితోబాటు సంఖ్యయు ప్రాతిపది కార్థము. కావున చతుష్కము ప్రాతిపదికార్థమనియు, జాతి ద్రవ్యలింగ సంఖ్యా కారకములు అయిదును ప్రాతిపదికార్థములను నైదవ పక్షమును శాస్త్రమునందున్నవి.

అందు, పంచక పక్షమున, వాని మొత్తమును ప్రాతిపదికము బోధించినను విశేష మును తెలియచేయుటకు విభక్తుల ప్రయోగము ద్యోతకముగా నావశ్యకనుగుచున్నట్లే అవ్య యమునకు ప్రయోగ ముండవచ్చును గదా ! ద్యోతకము లనేకము లుండరాదను నియమము లేదే ? ఆ పక్షమున అవ్యయమునకు సమాస విధానము పై విషయమునకు ప్రోద్బలకమగు లింగ మెట్లగును ?

సమాధానము— సత్యమే. 'స్వార్థ ద్రవ్య లింగములు మూడు మాత్రమే ప్రాతి పదిక కర్థములు కారకము విభక్త్యర్థమే' అను పక్షముననే ఇది లింగమగునని తాత్పర్యము. కారకము గూడ ప్రాతిపదకార్థమే అను పక్షముననైనను నియతమగు కారక శక్తిని తెలియ జేయునది విభక్తి ప్రత్యయమే అనియు నభిప్రాయము. ॥165॥

అవతారిక— 'ద్రవ్యమే కారకము' అనుటకు లింగము లగుపడుచుండ, అదిగాక వేఱొకటి, శక్తి అనునది విభక్త్యర్థమనుట కుపపత్తి ఏమి ? ఆ లింగము లేమన– ''సమాన కర్తృకయోః పూర్వకాలే'' (3-4-21) అను సూత్రమును, ''హరతేః దృతినాథయోః పశౌ'' (3-2-25) అను సూత్రమును జూడుడు.

ఏక కర్తృకము లయిన క్రియలలో పూర్వకాల క్రియావాచి అగు ధాతువునకు 'క్త్వా' అను ప్రత్యయము వచ్చునని మొదటి సూత్రమున కర్థము. కర్త అను కారకము ద్రవ్యమయిన నది రెండు క్రియలకును నొక్కటియే యగుట సంభవము అట్లుకాక 'శక్తి' కారకమైన, క్రియలనుబట్టి శక్తులు భేదించును గాన ఏక కర్తృకత్వము ఘటింపదు కావున ద్రవ్యమే కారకమని తెలియవచ్చుచున్నది.

ఇక రెండవ సూత్రమున, పశువు కర్త అగునపుడు, నాథ శబ్ద ముపపదముగ నుండ 'హృ' ధాతువునకు 'ఇన్' అను ప్రత్యయము వచ్చునని చెప్పబడినది. 'నాథహారః' ఉదాహరణము. నాథ మనగా ముగుద్రాడు. దాని నీడ్చుకొని పోవు పశువని యర్థము. పశువు, శక్తి కాదే? అను శంకకు సమాధానము

శ్లో॥ ద్రవ్యంతు యద్యథాభూతం తదత్యం తంతథా భవేత్ ।
క్రియా భేదేఽపి తస్యాసౌ ద్రవ్యాత్మా నావహీయతే ॥ 166

ద్రవ్యంతు = ద్రవ్యమనునది, యత్ = ఏది, యథాభూతం = ఎట్లుండెనో, తత్, అత్యంతం = అది సర్వవిధముల, తథా భవేత్ = అట్లే ఉండును, క్రియాభేదే పి = క్రియలకు భేద మున్నను, తస్య = ఆ ద్రవ్యమునకు, అసౌ = ఈ, ద్రవ్యాత్మా = ద్రవ్యరూపము, న అవ హీయతే = తొలగదు.

తాత్పర్య విశేషాంశములు— శక్తియే కారకమని ఏల చెప్పవలెననిన, వృక్షము, వృక్షమును, వృక్షముచేత, వృక్షముకొఱకు - అని ఈ విధముగ నగపడుచున్న సాధన భేదమునకు కారణమును జెప్పవలెను గనుక. ద్రవ్యము సాధనమైన, అది ఏకరూపము ఏ అవస్థలో నైనను మారనిదిగాన అట్టి భేదము కుదరదు. శక్తులు భిన్న భిన్నములు కావచ్చును.

ద్రవ్యమునకైనను, క్రియల భేదమును బట్టి భేదమును చెప్పవచ్చును గదా! అనుటయు అసంగతము. క్రియ లనేకములు కావచ్చును. ద్రవ్యము మాత్రము ఒక్కటియే. అది ధ్రువము. సంబంధి భేదించినంత మాత్రమున, వస్తువునకు మార్పు రాదు అందువలన శక్తియే కారకమని యంగీకరింపక తప్పదని భావము ॥166॥

అవతారిక — శక్తియే కారకమను సిద్ధాన్తమున కీ కారిక నిగమనము.

శ్లో॥ తస్మాత్ యత్ కరణం ద్రవ్యం తత్కర్మ న పునర్భవేత్ ।
సర్వస్య చాన్యథాభావ స్తస్య ద్రవ్యాత్మనో భవేత్ ॥ 167

తస్మాత్ = ద్రవ్యమునకు మార్పు లేదు గనుకనే, యత్ ద్రవ్యం = ఏ ద్రవ్యము, కరణమ్ = కరణకారకమో, తత్ పునః = అది మరల, కర్మ న భవేత్ = కర్మ కాకపోవును, సర్వస్య = సమస్తమైన, ద్రవ్యాత్మనః = ద్రవ్య స్వభావమునకును, అన్యథాభావః చ = మార్పును, భవేత్ = కలుగును.

తాత్పర్య విశేషాంశములు— ఒక ద్రవ్యము కరణమని నిశ్చితమైన నికనది కర్మ కాదు కర్మగా అవధృతమైనది శేషము కాదు. 'అసినా ఛిన్నమ్' = 'కత్తితో ఛేదింప బడినది' అని నపుడు కరణమైన అసి, ''అసిమానయ'' = 'కత్తిని తెమ్ము' అను నపుడు కర్మ అయినది గదా! అనిన నట కరణత్వ శక్తియే మారినది. అసి, అసియే. దానికి మార్పులేదు. ద్రవ్యము మారుననిన, సకల ద్రవ్యములును వస్త్వన్తరములుగా మారిపోవు

నవకాశము ఏర్పడును అది అనుభవమునకు, దూరము. శక్తి కారకమనినపుడు క్రియలను బట్టి ఒకపుడది భేదించినను, శక్త్యాధారమగు ద్రవ్య మనువర్తించి యుండుటచే దానికి కర్మత్వాది శక్త్యంతర సంబంధము యుక్తమగును.

ద్రవ్యము సాధనమను పక్షమున నింకొక అనుపపత్తియు గలదు. "ప్రాసాదే ఆస్తే" = 'మేడలో నున్నాడు' "శయనే శేతే" = ప్రక్కపైన పరుండి యున్నాడు. ప్రాసాద శబ్దమున 'ఘఞ్' ప్రత్యయమును, శయన శబ్దమున ల్యుట్ప్రత్యయమును అధికరణార్థకములు అధికరణము వానిచే అభిహితమగుటచే సప్తమి ప్రాప్తింపలేదు. కాని, ఆసన శయన క్రియలు అధికరణ శక్తిని చెప్పలేదు గాన అధికరణ మనభిహితమే అని సమర్థింపబడినది. శక్తి కారకమనిన, క్రియ లనేకములయినపు డదియు భేదించును గాన, సదనమను, క్రియచే, నిరూపితమైన అధికరణ శక్తి అభిహితమైనను, ఆసనమను, క్రియనుబట్టిన ఆశక్తి అభిహితము కాలేదు గాన దోషము లేదని భావము. ద్రవ్యము కారకమనిన, దానికి భేదము లేదుగాన నట్టి సమర్థనమున కవకాశము కలుగదు.

సామర్థ్యములేని ఏ ద్రవ్యమును క్రియను సాధింపజాలదు గాన నదియే కారకము. సామర్థ్యమున కాధారమగుటచే ద్రవ్యమును సాధన మనవచ్చును గదా, అనరాదు. వంటకు దేవదత్తుడు కర్త అనిన, వాని కాధారమైన పీట కూడ కర్త అనము గదా ! కావున శక్తియే కారకము. శక్తిమత్తు కారకముగాదని భావము

"సమాన కర్తృకయోః" అను సూత్రమున కర్తృ శక్తుల కేకత్వమనియే అర్థము. 'పశువు కర్త అయినపుడు' = "పశౌ కర్తరి" అనగా, 'పశువు ద్రవ్యమయినపుడు, దానియందు గల కర్తృ శక్తి వాచ్యమైనపుడనియే అర్థము. లేదా 'కర్తృ శక్తికి పశువు ఆశ్రయమైనపుడు' అని వివక్షితము. పశువు ద్రవ్యము. కర్త శక్తిరూపము గదా, సామానాధికరణ్య మెట్లుపపన్నమగును ? అను ప్రశ్న కిక నవకాశము లేదు.

"కర్మణి ద్వితీయా" (2-3-2) అను సూత్రమునకు ఏకత్వ సంఖ్యతో గూడిన కర్మయందని అర్థము గదా ! కర్మ పదము శక్తి పరమైనపుడు శక్తికి ఏకత్వ సంఖ్యా విశిష్టత్వ మెట్లు ? అని శంకింప నక్కఅలేదు. శక్తికిని, సంఖ్యా సంబంధ ముపపన్నమే.

"దేవదత్తః పచతి" అనుచో లకారము కూడ కర్తృ శక్తినే బోధించును. దేవదత్తుడు ద్రవ్యము గదా !, సామానాధికరణ్య మెట్లు పొసగును ? అనిన, శక్తికిని ఏదేని ఆధార ముండవలెను. అది నిరాధారముగ నుండజాలదు గాన శక్తిచే అవిష్టమైన ద్రవ్యమే లకారమున కర్థము. అది సామాన్యముగ పాకకర్తను చెప్పును. ఇక ఆ పాకకర్త ఎవరు ? అనిన, పాకానుకూల క్రియకు ఆశ్రయమైన వ్యక్తి విశేషమును బోధించునది దేవదత్త పదము కాబట్టి సామానాధికరణ్య ముపపన్నము. ॥167॥

సాధన సముద్దేశము ముగిసినది

క్రియా సముద్దేశము–8

అవతారిక— కర్త, కర్మ, కరణము, మొదలగు సాధనములను విశదీకరించిన పిదప, సాధ్యమగు క్రియయొక్క స్వరూపమును శాస్త్రీయముగ ప్రతిపాదింపుచున్నాడు.

శ్లో॥ యావత్సిద్ధమసిద్ధం వా సాధ్యత్వేనాఽభిధీయతే ।
ఆశ్రిత క్రమరూపత్వాత్సా క్రియేత్యభిధీయతే ॥

సిద్ధమ్ = పూర్తి అయినదిగాని, (జరిగినది), వా = లేక, అసిద్ధమ్ = పూర్తి కానిదిగాని (జరుగుచున్నది - జరుగనున్నది), యావత్ =ఏది అంతయు, సాధ్యత్వేన=సాధింపదగినదిగా, అభిధీయతే = చెప్పబడునో, తత్ = అది, ఆశ్రిత క్రమరూపత్వాత్ = ఒక విధమైన వరుసను కలిగి యున్నందువలన, క్రియా + ఇతి = క్రియ అని, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— సాధ్యముగా సంకల్పింపబడునది అంతయు క్రియ అగును. క్రియకు తప్పక ఒక క్రమముండును. కాలముయొక్క సంబంధమును బట్టి ఆ క్రియ భూతమైనను వర్తమానమైనను భవిష్యమైనను కావచ్చును

వివరణము— "కృ" (చేయు) అను ధాతువునకు "య" అను ప్రత్యయమును (క్యచ్) చేర్పగా, "క్రియా" అను శబ్ద మేర్పడును. "ఒక వ్యాపారము" –లేక– "పని" అని దీనికి సామాన్యమైన అర్థము "వ్యాపారః, భావః, భావనా, ఉత్పాదనా" అను శబ్దములను క్రియా శబ్దమునకు సమానార్థకములుగా వాడుదురు. "సాధించుటకు (చేయుటకు - జరుగుటకు) అనువైన దానినిగ" దేనిని సంకల్పింతుమో అది అంతయు క్రియ అగును. అనగా ''కిమ్ - కరోతి ?'' (ఏమి చేయుచున్నాడు ?) అను ప్రశ్నకు సమాధానముగా చెప్పదగిన దంతయు (గచ్ఛతి = వెళ్ళుచున్నాడు, లిఖతి = వ్రాయుచున్నాడు, పచతి = వండుచున్నాడు మొదలగునది) క్రియ అనిపించుకొనును అట్టి దానిని జరిగినట్లును, జరుగుచున్నట్లును, జరుగనున్నట్లును కూడ చెప్పవచ్చును. అది కాలభేద మగును. వాస్తవముగ క్రియకు విస్పష్టమైన లక్షణమును చెప్పుట అతికష్టము అయినను ప్రతియొక క్రియకును ఒక ఫలము –లేక– ప్రయోజనమనునది ఉండును. ఆ ఫలమునుబట్టి దానికి కారణమైనది క్రియ అని ఊహింపవలయును. అనగా ఫలము సామాన్యముగా ప్రత్యక్షమే అగును. దీనినిబట్టి ప్రత్యక్షముకాని క్రియను అనుమానింపదగును (పొగనుబట్టి నిప్పును అనుమానించునట్లు). అట్టే ప్రతియొక క్రియకును ప్రారంభమునుండి ఫలము కలుగు వరకును నిర్దిష్టమైన కొన్ని అవాంతర క్రియలును వానికొక నియతమైన వరుసయు ఉండక తప్పదు. కాలముయొక్క సూక్ష్మ విభాగములైన క్షణములను (సెకనులు, నిమిషములు మొదలగునవి) బుద్ధిలో నుంచికొని, ఆ అవాంతర వ్యాపారములను వాని వరుసను పరికించినచో క్రియయొక్క స్వరూపము బోధపడును. క్రియకు క్షణములే ఆధారములు. వాని వలననే క్రియను తెలిసికొనుట కవకాశము కలుగును. ''క్షణాఽధారా క్రియా = క్రియ క్షణములే ఆధారముగా గలది'' అని నాగేశుడు చెప్పెను

విశేష విషయములు— (1) ''క్రియానామేయమత్యంతాఽ పరిదృష్టా న శక్యా పిండీభూతా నిదర్శయితుమ్'' ...... సాఽసావను మానగమ్యా'' అని పతంజలి ''భూవా దయో ధాతవః'' (1-3-1) అను సూత్రమున స్పష్టముగ చెప్పెను ''క్రియను విశదీకరిం చుట కష్టమనియు, అనుమాన ప్రమాణము మూలముగనే దానిని తెలియవలెననియును'' అతని భావము. కాగా సృష్టినిబట్టి స్రష్టను తెలిసికొనునట్లు, సిద్ధించిన ఫలమునుబట్టి దానికి హేతువగు క్రియను తెలిసికొనవలయును. అందువలననే ''ఫలానుమేయా క్రియా'' (క్రియ ఫలమునుబట్టి ఊహింపదగినది) అని నాగేశాదులు వ్యాఖ్యానించిరి.

(2) ''కారకాణాం ప్రవృత్తి విశేషః క్రియా'' అని మరియొక నిర్వచనమును గూడ పతంజలి చూపెను. ''కారకములైన ద్రవ్యములయొక్క వ్యాపారము క్రియ'' అని దీని భావము. సాధనమున్నను దాని వ్యాపారము లేనిచో ఫలము పుట్టదు. కాన ఆ వ్యాపా రము క్రియ అగును వీది ఎట్లయినను సాధనమైన ద్రవ్యముకన్న సాధ్యమైన క్రియ వేరని చెప్పక తప్పదు దానిని బుద్ధిబలమువలననే అవగతము చేసికొనవలయును.

(3) చలనాత్మకమైనది క్రియ అని సామాన్యముగా అనుకొందురు కాని అది సరి కాదు. చలనాత్మకమైనదియు కానిదియును (కేవలము ''ఉండుట'' మొదలగునది) క్రియయే కావచ్చును అట్లే కర్తయొక్కయు కర్మయొక్కయు వ్యాపారము మాత్రమే క్రియ యనుటయు సముచితము కాదు. వివక్షాధీనముగ ఎల్ల కారకముల వ్యాపారము కూడ క్రియ కావచ్చును కాగా ''సాధనముకన్న వేరై సాధ్యముగా సంభావింపబడునదంతయు క్రియయే'' అనియు. ''ద్రవ్యము సిద్ధము - క్రియ సాధ్యము'' అనునది సారాంశమనియును ఫలించును.

(4) క్రియ లనంతములు ప్రతియొక క్రియకును సంభవించు అవాంతర క్రియ లును అసంఖ్యాకములు. అట్లే అవాంతర ఫలములును ప్రధాన ఫలములును, గూడ భిన్న భిన్నముగా ఉండవచ్చును. ప్రారంభించిన లక్షణమునుండి ఫలము కలుగు క్షణమువరకును అవాంతర క్రియలకు నిర్దిష్టమైన వరుస ఉండును (''తొలుత ఇది - పిదప ఇది - దాని తరువాత ఇది'' అను తప్పనిసరియైన పద్ధతి). అది తారుమారయినచో అనుకొన్న ఫలము సిద్ధింపదు. వంట, నడక, భోజనము, (పచ్, గమ్, భుజ్) మొదలగు క్రియలను ఉదాహర ణముగా తీసికొని పై యంశములను సమన్వయము చేయదగును.

(5) క్రియను చెప్పునది ధాతువు. ఉదా : పచ్, గమ్ మొదలగునది. ధాతువునకు తిఙ్ ప్రత్యయములు చేరును. అవి కర్త, కర్మ, సంఖ్య, కాలము మొదలగు క్రియకు చెందు విశేషాంశములను సూచించును. ఉదా : ''పచతి'' వండుచున్నాడు. ఇచట వంట క్రియ. చేయువాడు కర్త. అతడు ఒకడే. కాలము వర్తమానము. కాలముయొక్క సంబంధమువలన సామాన్యముగా క్రియకు మూడు అవస్థలను చూపుచుందురు. (భూతము, వర్తమానము, భవిష్యము) ఇట్టి క్రియను పుట్టించునదియే కారకమగును. అవియు వివక్షాధీనమే (సంకల్ప మును బట్టి ఏ వస్తువైనను ఆ యా కారకముగా చూపవచ్చును). ॥1॥

అవతారిక— మీది క్రియా లక్షణమును ఉదాహరణ పూర్వకముగా విశదము చేయుచున్నాడు.

శ్లో॥ కార్యకారణ భావేన ధ్వనతీత్యాశ్రిత క్రమః ।
ధ్వనిః క్రమనివృత్తౌ తు ధ్వనిరిత్యేవ కథ్యతే ॥ 2

ధ్వనిః = ధ్వని, ఆశ్రితక్రమః = ఒక వరుసను ఆశ్రయించినదై కార్యకారణ భావేన = కార్య కారణ సంబంధముచే, ధ్వనతి + ఇతి = ''ధ్వనతి'' (మ్రోగుచున్నది) అని, (కథ్యతే = చెప్పబడును). క్రమనివృత్తౌ + తు = వరుస పోయినపుడయితే, ధ్వనిః + ఇతి + ఏవ = ''ధ్వనిః'' అనియే, కథ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ''ధ్వన్'' = మ్రోగుట. ఇదొక క్రియ. ఘంటను కారణముగను, ధ్వనిని కార్యముగను భావించి అందొక వరుసను (మ్రోతయొక్క అవయవము లొకదాని వెనుక వేరొకటి పుట్టుచున్నట్లు) చెప్పదలచినచో ''ధ్వనతి'' అని ప్రయోగింతుము. అట్టి వరుస లేనట్లుగను, మ్రోత సిద్ధముగనే ఉన్నట్లును చెప్పదలచినచో ''ధ్వనిః'' అనియే ప్రయోగింతుము. కాగా ''తి'' మొదలగు ప్రత్యయములుగల ధాతువు సాధ్యమైన క్రియను తెలుపుననియు, కృత్ ప్రత్యయములు (తిఙ్ ప్రత్యయములకన్నా వేరై ధాతువులకు చేరునవి) కలిసిన ధాతువు సిద్ధమైన వస్తువును తెలుపుననియును ఫలించును.

వివరణము— ''ఘంటా ధ్వనతి'' = గంట మ్రోగుచున్నది. ఇచట గంట కారణము. మ్రోత కార్యము. ఇట్టి కార్యకారణ భావమును చెప్పదలచి, ఒక క్రమములో మ్రోత జరుగుచున్నదని బోధించుటకై ఈ విధమైన ప్రయోగమును చేయవలెను. అట్లుగాక ''మ్రోత సిద్ధముగనున్నదే'' అను భావమును ప్రకటింపదలచినపుడు, ''ఘంటాయాః ధ్వనిః = గంటయొక్క మ్రోత'' అనియే ప్రయోగింపవలెను

విశేషము— ఒక క్రియకు సంబంధించిన అవాంతర క్రియలయొక్క క్రమమును ''పూర్వాఽపరీభావము'' (ఒకదాని వెనుక మరియొకటి జరుగుట) అని కూడ అందురు. ఇట్టి పూర్వాపరీభావమునే క్రియాపదము తెలుపును. పౌర్వాపర్యములేకుండ సిద్ధమైనదానిని ప్రాతిపదికము బోధించును. కావుననే ''ధ్వనిం కరోతి'' (ధ్వనిని చేయుచున్నాడు) అను ప్రయోగమందలి ధ్వని శబ్దము ''ధ్వని'' అను సిద్ధావస్థను బోధించునేగాని ''ధ్వనిచేయు'' అను సాధ్యావస్థను బోధింపదు. అచటి సాధ్యావస్థను ''కృ'' (చేయు) అను వేరొక ధాతువు ప్రతిపాదించుచున్నది గదా ! ॥2॥

అవతారిక— మరియొక ఉదాహరణమును చూపుచున్నాడు.

శ్లో॥ శ్వేతతే శ్వేత ఇత్యేతచ్ఛ్వేతత్వేన ప్రకాశతే ।
ఆశ్రితక్రమరూపత్వా దభిధానం ప్రవర్తతే ॥ 3

''శ్వేతః + శ్వేతతే + ఇతి'' = ''శ్వేతము శ్వేతముగుచున్నది'' అను, ఏతత్ = ఇది, (ఈ ప్రయోగము) ''శ్వేతత్వేన = తెల్లదనముచే, ప్రకాశతే = ప్రకాశించుచున్నది'' (అను భావమునందించును). ఆశ్రిత క్రమరూపత్వాత్ = క్రమమును అవలంబించినదగుట వలన, అభిధానమ్ = ''శ్వేతతే'' అను క్రియాపదముగ, ప్రవర్తతే = ప్రవర్తించును

తాత్పర్యము— ''శ్వేతః శ్వేతతే'' అను వచనమున్నది. ''తెలుపు తెల్లనగుచున్నది'' అని దీని భావము ఇచట ''శ్విత్'' అను ధాతువునకు ఒకానొక కృత్ప్రత్యయమును చేయగా ''శ్వేతః'' అను శబ్దము సిద్ధించి, ''తెలుపు'' అను గుణమును బోధించుచున్నది. అదే ధాతువునకు ''తిఙ్'' ప్రత్యయమును చేర్చినచో ''శ్వేతతే'' అను క్రియాపదము సిద్ధించి, ''తెల్లనగుచున్నది'' అను క్రియను బోధించుచున్నది. కాగా మూలమగు స్వరూప మొకటే అయినను (శ్విత్) సిద్ధావస్థను తెలుపుటకు ఒక రూపమును సాధ్యావస్థను తెలుపుటకు వేరొక రూపమును ఏర్పడుననియు, ఒక క్రమమును కలిగియుండునట్లు చూపుటయే సాధ్యావస్థ అనియును ఫలించును.

వివరణము— ''శ్వేతః'' అనునది సిద్ధము కావుననే ఈ ప్రయోగమున కర్త అయినది ''శ్వేతతే'' అనునది సాధ్యమైన క్రియను మాత్రమే తెలుపుచున్నది. అన్ని చోటులందును సిద్ధ సాధ్యభావమును ఇట్లే ఊహింపవనయును. ॥౩॥

అవతారిక— ''శబ్దముచే (తిఙంతమగు పదముచే) సాధ్యముగ చెప్పబడునదియు పౌర్వాపర్యరూపమైన క్రమము గలదియును అగు అంశము క్రియ'' అని పర్యవసించును క్రమమనునది కాలమునకు సంబంధించిన క్షణముల ప్రవాహ రూపము కాగా క్రియయొక్క అవయవములన్నియు ఏకకాలమున ఎన్నడును సంభవింపవు అయినపుడు ''ఈ క్రియ ఇది'' అని స్పష్టముగ పేర్కొనుట ఎట్లు ? - అను శంకకు సమాధానమును చూపుచున్నాడు.

శ్లో॥ గుణభూతైరవయవైః సమూహః క్రమజన్మనామ్ ।
బుద్ధ్యా ప్రకల్పితాఽభేదః క్రియేతి వ్యపదిశ్యతే ॥

బుద్ధ్యా = మనస్సుచే, గుణభూతైః = అప్రధానములైన, అవయవైః = అవయవములతో, ప్రకల్పితా భేదః = కల్పింపబడిన ఐక్యముగల, క్రమజన్మనామ్ = క్రమముగల క్షణముల యొక్క, సమూహః = సముదాయము, క్రియా + ఇతి = క్రియ అని, వ్యపదిశ్యతే = చెప్పబడును

తాత్పర్యము— ప్రతియొక క్రియకును ఒక ఫలము తప్పక ఉండును. దానిని బట్టియే క్రియను ఊహింతుము గదా ! ప్రారంభించిన క్షణమునుండి ఫలము కలుగు క్షణము వరకును క్రియకు ఎన్నో క్షణములుండును. ఒక నియతమైన వరుసలో ఒక్కొక క్షణమున ఒక్కొక అవాంతర క్రియ జరుగుచు చివరి క్షణమున అనుకొన్న ఫలము జనించును అది జనింపగానే ఆ క్రియ ఆగిపోవును. కాగా క్రమముగల క్షణముల సముదాయ మొకటియే

కావున దానినిబట్టి ఆ యా ఫలమునకు హేతువైన క్రియ ఒకటే అని వ్యవహరింపబడును. అవయవములను బట్టి ''క్రమము గలది'' అనియు, వాని సముదాయమును బట్టి ''ఒకటే'' అనియు క్రియను చెప్పుచుందురు ఇది మానసికమైన భావన

వివరణము— ''వంట'' అను క్రియను ఉదాహరణముగా తీసికొనవచ్చును. ఇచట వస్తువు ''ఉడుకుట'' ఫలము పొయ్యిపై పెట్టుట మొదటి క్షణమనియు పొయ్యినుండి దింపుట చివరి క్షణమనియును అనుకొన్నచో, మధ్యను లెక్కలేనన్ని క్షణము లుండును. ఆ యా క్షణములలో చిన్న చిన్న అవాంతర క్రియలును జరుగుచుండును. వీని మొత్తమునే ''వంట ' అందురు. మొత్తమును బట్టి ఏకత్వమును, అవయవములను బట్టి క్రమమును బుద్ధి యందు స్ఫురించుచుండును. ఈ తీరును బట్టియే క్రియ ఒకటే యనియు, ఒక్కొక క్రియను ఒక్కొక ధాతువు చెప్పుననియును అనుచుందురు. ఉదా . గమ్, పచ్, భుజ్ మొదలగునవి.

విశేషము— వాస్తవమున అవయవముల అమరికను మించి వేరుగ సముదాయ మన్నది ఉండదు. అయినను మొత్తమువలననే ఫలము పుట్టునుగాని ఏ ఒక అవయవము వలనను అది పుట్టదు. అందుచే సముదాయమును అవయవములను గూడ భావింపక తప్పదు. అట్లే క్రియావయవముల క్రమము కూడ అవ్యవధానముగనే ఉండవలెను. లేకున్నచో ఫలము జనింపదు. ''సముదాయము ప్రధానమనుటయు, అవయవములు అప్రధానములనుటయును'' (అప్రధానము లనగా సాయము చేయునవి) ఒక విధమైన కల్పనమే. ॥4॥

అవతారిక— ''సముదాయమే క్రియ'' అన్నచో ఏ ఒక అవయవమందును ''క్రియ'' అను వ్యవహారము కుదురకపోవును. కాగా గడచిన క్షణములను బట్టి ''భూతము'' (జరిగినది) అను వాడుకగాని, రానున్న క్షణముల ననుసరించి ''భవిష్యము'' (జరుగనున్నది) అను వాడుకగాని అనుపపన్నమయ్యెడిని - అను శంకకు సమాధానము చూపుచున్నాడు

**శ్లో॥ సమూహః స తథాభూతః ప్రతిభేదం సమూహిషు ।
సమాప్యతే తతో భేదే కాలభేదస్య సంభవః ॥** 5

తథాభూతః = ఆ విధముగానున్న (గుణభూతమై క్రమముగల అవయవములుగల), సః = ఆ, సమూహః = సముదాయము, సమూహిషు = అవయవములందు, ప్రతిభేదమ్ = ఒక్కొక దానియందును, సమాప్యతే = ఆరోపింపబడును, తతః = అందువలన, భేదే = భేదము సిద్ధింపగా, కాలభేదస్య = కాలముయొక్క భేదమునకు, సంభవః = అవకాశము, (భవతి = కలుగును).

తాత్పర్యము— క్రియయందలి ప్రతియొక అవయవమందును సముదాయ మారోపింప బడును. కావున భేదము సిద్ధించి, కాలభేదము కుదురును

వివరణము— పచి క్రియను (వంటను) ఉదాహరణముగా చూపసగును. గిన్నెను పొయ్యిమీద పెట్టుట, నిప్పును సరిచూచుట, కలియబెట్టుట మొదలగునవి అవయవములు

(వాని కాధారములైన క్షణములు కూడ అవయవములే). ''ఉడుకుట'' అను ఫలమును అను సంధానించి ''వంట'' అను మొత్తము క్రియను ప్రతియొక అవయవమందును ఆరోపింప వలెను (భావించుట). అనగా అవయవ క్రియయే సముదాయ క్రియ యనియు, అదియే ఫలమును కలిగించుననియును అనుకొనదగును. కాగా జరుగుచున్న అవయవమును బట్టి ''పచతి'' (వండుచున్నాడు', అని వర్తమాన కాలమును, జరిగిన దానినిబట్టి 'అపాక్షీత్'' (వండెను) అని భూతకాలమును, జరుగబోవు క్షణము ననుసరించి ''పక్ష్యతి'' (వండగలడు) అని భవిష్యత్కాలమును సిద్ధించును

విశేషము— మొదలుపెట్టిన క్షణమునుండి పూర్తియగు క్షణమువరకును ''వంట'' అను సముదాయము ప్రతియొక అవయవమందును భావనా గోచరమగుచుండును ఇట్టి రీతియే ఆరోపమునకు నిదానము ఆరోపింపబడు సముదాయమునందును పౌర్వాపర్యమున (క్రమము భావింపక తప్పదు అట్లు కాకున్న ఆరోపములేని అవయవముల విషయమున సాధ్యత్వము సంభవించుట కష్టమగును. ॥5॥

అవతారిక— సముదాయమును అవయవమం దారోపించి ప్రతియొక అవయవ మును ''క్రియయే'' అన్నచో, జరుగుచున్న అవయవమునుబట్టి అది ప్రత్యక్షమే యగును (కనబడునది) అయినపుడు ''క్రియ ప్రత్యక్షము కాదనియు, అది అనుమానముచేతనే తెలియ దగినదనియును'' భాష్యకారు డేలదుకనెను ; – అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రమాత్ సదసతాం తేషామాత్మానో న సమూహినామ్ ।
సద్వస్తు విషయైర్యాంతి సంబంధం చక్షురాదిభిః ॥ 6

క్రమాత్ = క్రమము ననుసరించి, సదసతామ్ = ఉన్నవియు లేనివియు అగుచుండు, తేషామ్ = ఆ, సమూహినామ్ = అవయవముల యొక్క, ఆత్మానః = స్వరూపములు, సద్వస్తు విషయైః = ఉన్న వస్తువులను గ్రహింపగలుగు, చక్షురాదిభిః = కన్ను మొదలగు ఇంద్రియ ములతో, సంబంధమ్ = సంబంధమును, న + యాంతి = పొందవు

తాత్పర్యము— మొత్తము క్రియకు సంబంధించిన క్షణములు (అవయవములు) ఒక వరుసను కలిగియుండును. అవన్నియు ఏకకాలమున ఉండవు. (ఒక క్షణమున్నపుడు మిగిలిన క్షణము లుండవు). కాగా ఆ క్షణములలో కొన్ని సతులును (ఉండునవి), మరికొన్ని అసతులును (లేనివి) కాక తప్పదు. కన్ను, చెవి మొదలగు ఇంద్రియములు ఉన్న వస్తువులనే గ్రహించునుగాని, లేని వానిని గ్రహింపజాలవు. అందుచే, క్రియ సంపూర్ణముగా ఎన్నడును, ప్రత్యక్షము కాదుగాన, ''అది అప్రత్యక్షము - అనుమాన గమ్యము'' అనుటలో అనౌచిత్యము లేదు.

వివరణము— ''క్రియా నామేయమత్యంతాఽపరిదృష్టా న శక్యా పిండీభూతా నిదర్శయితుమ్ ...... సాఽసావనుమాన గమ్యా'' అని ''భూవాదయో ధాతవః'' (1-3-1)

అను సూత్రమున పతంజలి చెప్పెను. ''క్రియను - ఇదమిత్థమ్'' - అని స్పష్టముగాను పూర్తిగాను చూపలేమనియు, ఫలమునుబట్టి దాని నూహింపవలెననియును'' అతని ఆశయము. సముదాయమును అవయవమం దారోపించినను, అచట కూడ క్రమమునే అవలంబింపవలయునుగాన, ''క్రియ ప్రత్యక్షమ''నుట శాస్త్రీయముగా కుదురదు.

అవతారిక— పై విషయమునే దృష్టాంతముతో విశదము చేయుచున్నాడు.

శ్లో॥ యథా గౌరితి సంఘాతః సర్వోనేంద్రియ గోచరః ।
భాగశస్తూప లబ్ధస్య బుద్ధౌ రూపం నిరూప్యతే ॥ 7

ఇంద్రియైరన్యథా ప్రాప్తౌ భేదాంశోపనిపాతిభిః ।
అలాతచక్రవద్రూపం క్రియాణాం పరికల్ప్యతే ॥ 8

గౌః + ఇతి = ''గౌః'' అను, సంఘాతః = వర్ణముల సముదాయము, సర్వః = అంతయు, ఇంద్రియ గోచరః = చెవికి విషయమై, న = కాదు, భాగశః = అవయవములుగా, ఉపలబ్ధస్య = పొందబడిన దానియొక్క, రూపమ్ + తు = స్వరూపమైతే, బుద్ధౌ = మనసునందు యథా = ఎట్లు, నిరూప్యతే = గ్రహింపబడునో, (తథా = అట్లు) భేదాంశోపనిపాతిభిః = అవయవములను గ్రహించు, ఇంద్రియైః = ఇంద్రియములచే, అన్యథా = వేరొక విధముగ, ప్రాప్తౌ = ప్రాప్తి కలుగగా క్రియాణామ్ = క్రియలయొక్క. రూపమ్ = స్వరూపము, అలాత చక్రవత్ = కొఱవిచక్రము (మండుచున్న కొఱవిని ఆ మంటతోనే త్రిప్పిన యెడల చూచువారికి కనుపట్టు చక్రము) వలె, పరికల్ప్యతే = కల్పింపబడును.

తాత్పర్యము— పదములను పలుకునపుడు వర్ణములన్నింటిని ఒకేసారి పలుకుటయు ఒకేసారి వినుటయును వాస్తవముగ సాధ్యము కాదు. ''ఒకదాని వెనుక మరియొకటి'' అను తీరే అచట కుదురును అయినను తుది క్షణమున మనసులో సముదాయ రూపమొకటి ఏర్పడును. దాని వలననే సముదాయమును ఒక్క మారుగానే గ్రహించినట్లు అనిపించి ప్రయోజనము సిద్ధించును. అట్లే క్రియయొక్క అవయవములే వరుసగ గ్రహింపబడినను చివరకు బుద్ధియందు మాత్రము సముదాయము స్ఫురించుచుండును. దానిని బట్టియే'' క్రియ ఒకటి'' అను భావము కలుగుచుండును. కొరవిచక్రము నుదాహరణముగా ఇచట తీసికొనవచ్చును. కొరవిని అతివేగముగ త్రిప్పునపుడు ఒక చక్రముగా కనిపించును. కాని అది సత్యము కాదు. ఒకే జ్వాల వేగవశమున చక్రాకారమును దాల్చును.

వివరణము— గౌః. ఇచట ''గ్ + ఔ + ః'' అను క్రమమున్నది. అట్లే ప్రతియొక శబ్దమునను వర్ణముల క్రమ ముండును. ఒక వర్ణమును పలుకు సమయమున ఇతరము లుండవు. అయినను సంస్కార వశమున చివరను సముదాయమే మనసులో గోచరించును. అట్లే క్రియాక్షణములలో ఒకటి ప్రత్యక్షమైనపుడు తక్కినవి ప్రత్యక్షము కాకున్నను మానసికమైన సముదాయ భావనవలన సముదాయమే ప్రత్యక్షమన్నట్లు తోచును. ''కాగా అలాత చక్రమువలె'' క్రియ ఒకటి అనుటయు అది ప్రత్యక్షమనుటయును ఒక విధమైన భ్రాంతియే

విశేషము— ఒక వ్యాపారమున కారకములు కూడ వేర్వేరుగ ఉండవచ్చును. అట్టిచోట్ల కారకముల భేదముచే వ్యాపారములును భిన్నా భిన్నములుగ అగపడవచ్చును. అయినను మీద చూపినట్లు ఆరోపితమైన ఏకత్వము ననుసరించి, వ్యాపారముల ఏకత్వమును భావించి, ''ఒక ధాతువు ఒకే క్రియను బోధించును'' అనుచుందురు. ॥8॥

అవతారిక— ఆ యా వర్తమానములగు క్షణములలో ప్రత్యక్షములగు అవయవ ములను ''ప్రత్యక్షముల''నుట కూడ సముచితము కాదని చెప్పుచున్నాడు

శ్లో॥ యథాచ భాగాః పచతేరుదకాఽసేచనాదయః ।
ఉదకాసే చ నాదీనాం జ్ఞేయా భాగా స్తథాఽపరే ॥ 9

పచతేః = వంట, అను క్రియకు, ఉదకాసేచనాదయః = నీటితో తడుపుట మొదలయిన, భాగాః = అవయవములు, యథా = ఏ విధముగ, (భవంతి = అగునో), తథా = ఆ విధముగ ఉదకాసేచనాదీనామ్ + చ = నీటితో తడపుట మొదలగు వానికి గూడ, అపరే = మరికొన్ని, భాగాః = అవయవములు, జ్ఞేయాః = తెలియదగినవి, (భవంతి = అగును).

తాత్పర్యము— బియ్యము కడుగుట, కుదుపుట, పొయ్యిపై పెట్టుట మొదలగు ఎన్నో అవయవములు వంట కుండును అట్లే సూక్ష్మముగ పరిశీలించినచో, ప్రతియొక అవయవ క్రియకును మరల మరికొన్ని అవయవము లుండును. వానిని గూడ సాధ్యములు గను స[క]మములుగను చూపవచ్చును ఇట్లు విభాగమును చేసికొనుచు పోయినచో అదెక్కడ ఆగునో చెప్పుట అసంభవమగును కావున ''క్రియ ప్రత్యక్షము కాదు'' అనుటయే యుక్తము.

వివరణము— ''సముదాయము కాకపోయినను, జరుగు క్షణమున ఆ యా అవ యవ క్రియ ప్రత్యక్షమే'' అని యనుటకు కూడ అవకాశములేదని ఈ కారిక చెప్పినది సముదాయమును ''పచతి'' మొదలగు పదములతో బోధించునట్లుగానే అవయవములను గూడ ''సించతి'' (తడుపుచున్నాడు) ''క్షాలయతి'' (కడుగుచున్నాడు) ''అధిశ్రయతి'' (గిన్నె పొయ్యిపై పెట్టుచున్నాడు) మొదలగు పదములతో బోధింతురు. అనగా ఆ యా ధాతువులను వాడి, ఆ యా అవయవ క్రియలను చెప్పుచుందురు. ఇట్లు ''సముదాయము - అవయవము'' అను విశ్లేషణమును. ''ఒక అవయవము ప్రత్యక్షమగు క్షణమున మిగిలినవి ప్రత్యక్షములు కావు'' అను అనుభవమును అనంతమనిపించును. అందువలన ''క్రియ ప్రత్యక్షము కాకుండ అనుమానగమ్యమే'' అనుటయే సమంజసము. ॥9॥

అవతారిక— ''క్రియ పూర్తియగు (ఫలము కలుగగానే ఆగిపోవు) క్షణము నందలి అవయవమును తీసికొని, దాని కవయవములు లేవనియు అది ప్రత్యక్షమే యనియును అనగూడదా ? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యశ్చాపకర్ష పర్యంతమను ప్రాప్తః ప్రతీయతే ।
తత్రైకస్మిన్ క్రియాశబ్దః కేవలే న ప్రయుజ్యతే ॥ 10

అపకర్ష పర్యంతమ్ = విభాగముయొక్క చివరను, అనుప్రాప్తః = పొందిన, యః = ఏ క్షణము, ప్రతీయతే = తెలియబడునో, కేవలే = కేవలము, ఏకస్మిన్ = ఒకటియైన, తత్ర + చ = ఆ క్షణమందు, క్రియాశబ్దః = ''క్రియా'' అను పదము, న + ప్రయుజ్యతే = ఉపయోగింపబడదు

తాత్పర్యము — అవయవముల విభాగమును చేసికొనుచు పోయినపుడు ప్రతియొక క్రియకును చివరి అవయవమన్నది ఒకటి ఉండవచ్చును. అది పరమాణువువలె భాగరహిత మనియును అనవచ్చును అయినను దానినిబట్టి క్రియ ప్రత్యక్షమనుటకు వీలులేదు. చివరి క్షణము భాగరహితమన్నచో దానిని ''క్రియ'' అనుటయే పొసగదు. సాధ్యమును సావయవ మును అగు దానినే ''క్రియ'' అను శబ్దము బోధించును అట్లు కాని విషయమున ఆ శబ్దమును వాడనే కూడదు.

వివరణము— ''క్రియా'' అను శబ్దము తెలియజేయు అర్థమును గూర్చి ఈ చర్చ జరుగుచున్నది. సాధ్యమై సక్రమమైన అంశమునే ఈ శబ్దము బోధించుననుట అతి ప్రసిద్ధము. అవయవములును పౌర్వాపర్యమును లేనిది క్రియయే కాదు. అట్టిది ఒక విధముగ సిద్ధావస్థయే యగును. కాగా ''క్రియా'' అను సామాన్య శబ్దముగాని పచ్, గమ్ మొదలగు విశేష శబ్దములుగాని బోధించు క్రియ ''సావయవమనియును అప్రత్యక్షమనియును'' పర్యవ సించును. ॥10॥

అవతారిక— చివరి క్షణము విషయమునగూడ క్రమమును కల్పించియే క్రియా శబ్దమును వాడదగుననుచున్నాడు.

శ్లో॥ పూర్వోత్తరైస్తదా భాగైః సమవస్థాపిత క్రమః ।
ఏకః సోఽప్యసదభ్యాసాదాఖ్యాతై రభిధీయతే ॥ 11

తదా = అప్పుడు, ఏకః + అపి = ఒకటి అయినను, సః = ఆ చివరి అవయవము, అసద భ్యాసాత్ = లేనివాని నారోపించుట వలన, పూర్వోత్తరైః = ముందు వెనుకలుగా ఉండు, భాగైః = అవయవములచే, సమవస్థాపిత క్రమః = నిశ్చయింపబడిన క్రమముగలదై, ఆఖ్యాతైః = క్రియా పదములచే, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— చివరి క్షణమునందు గూడ సాధ్యత్వమును క్రమమును ఆరో పించియే క్రియాపదమును వాడక తప్పదు. ఆ క్షణము కూడ సమూహమం దొక భాగమే గదా ! సమూహమును ప్రతియొక క్షణమునందును ఆరోపింతురని ఇదివరకే ప్రతిపాదింప బడినది కాగా ఆ యా అవయవము లా యా క్షణములందు ప్రత్యక్షమైనను సముదాయరూప మున క్రియ ఎన్నడును ప్రత్యక్షము కాదు ''క్రియా న శక్యాపిండీ భూతా నిదర్శయితుమ్'' (క్రియను ఒక ముద్దగా చూపుట అశక్యము) అన్న పతంజలి ఆశయ మిదియే. ॥11॥

అవతారిక— "సత్త" (ఉనికి) నిత్యము. అది సాధ్యమనుటకు వీలు పడదు. సాధ్యము కానపుడు అచట క్రమము కూడ ఉండదుగదా: అట్లయినపుడు "అస్తి" అను క్రియాపదముచే సత్తను బోధించుట ఎట్లు కుదురను ? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కాలానుపాతి యద్రూపం తదస్తీతి ప్రతీయతే ।
పరితస్తు పరిచ్ఛిన్నం భావ ఇత్యేవ కథ్యతే ॥ 12

యత్ = ఏ, రూపమ్ = స్వరూపము, కాలానుపాతి = కాలము ననుసరించునో (సంబంధించునో), తత్ = అది, అస్తి + ఇతి = "అస్తి" (ఉన్నది) అని, ప్రతీయతే = తెలియబడును, పరితః = అన్ని విధముల, పరిచ్ఛిన్నమ్ + తు = పూర్తి అయిన స్వరూపమైతే, భావః + ఇతి + ఏవ = "భావము" అనియే, కథ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— "సాధ్యముగను సక్రమముగను ఒక శబ్దము బోధించు స్థితి క్రియ" అని క్రియయొక్క లక్షణమును పరిష్కరించిరి. క్రియకును కాలమునకును సంబంధము గలదు కాలమువలననే క్రియ విభజింపబడును. కాగా "ఉనికి" కూడ (సత్త) సాధ్యముగను కాలమునకు సంబంధించునదిగను నిరూపింప శక్యమగుటచే (అదియు) క్రియ కావచ్చును ఆ ఉనికినే సిద్ధముగా చెప్పదలచినచో "భావము" అను పదమును వాడవలయును.

వివరణము— కాల విభాగమునకు లోబడి సాధ్యముగ చూపబడునదంతయు క్రియయే అగును. "అస్" అను ధాతువునకు "ఉనికి" అని యర్థము. దీనికి తిఙ్ ప్రత్యయములను చేర్చి వాడినచో పై క్రియాలక్షణము ఇచటను సరిపోవును. ఉదా: అస్తి = ఉంటున్నది (వర్తమానము). అభూత్ = ఉండెను (భూతము) భవిష్యతి = ఉండగలదు (భవిష్యము). సాధ్యమైన అంశమునకే కాలముతో సంబంధము కుదురును. సిద్ధమైన దానికి కాలసంబంధ మక్కరలేదు ఉదా. "ఘటః". ఇచట కాలవిశేషమేదియు తెలియదు కాగా సత్తను సిద్ధముగ చూపదలచినపుడు "భావః" అను పదమే సముచితమగును.

విశేషము— (1) కృ, (చేయు), భూ, (ఉండు), అస్, (ఉండు అను మూడు ధాతువులును క్రియా సామాన్యమును తెలుపును. పచ్, గమ్ మొదలగు ధాతువులన్నియు ఆ యా క్రియావిశేషములను తెలుపును కావున "కిమ్ కరోతి ?" (ఏమి చేయుచున్నాడు) అను ప్రశ్నకు "పచతి", "గచ్ఛతి" మొదలగు సమాధానములు వినబడుచుండును. కావుననే "కృ" ధాతువు నొక్కదానినే అవలంబించి క్రియా వ్యవహారమునంతను నడుపుకొన వీలున్నది ఉదా: "పాకం కరోతి", "గమనం కరోతి", "దర్శనం కరోతి" మొదలగునవి. భూ, అస్ అనునవి కూడ ఇంచుమించు ఇట్టితీరు గలవియే.

(2) అస్తి, అస్తే, (ఉంటున్నది) మొదలగు చోట్ల చలనము లేకున్నను "సత్త" క్రియయే అగును. కారకముల ప్రవృత్తి విశేషమే క్రియ అనియు, అట్టిది చలనరూపమైనను

కాకపోయినను బాధ లేదనియును వెనుక సూచింపబడెను (1 వ కారిక). కావున "పర్వతః - అస్తి", "పర్వతః - తిష్ఠతి" (కొండ ఉన్నది) మొదలగు ప్రయోగములలో కూడ "పర్వతము" మొదలగువానియం దొకానొక వ్యాపారము నూహించుకొనవలెను. ఎల్ల కారకముల ప్రవృత్తియు ఒకే విధముగ నుండవలయునను నిర్బంధము లేదుగదా ।

(8) క్రియను చెప్పు దాతువునకు తిఙ్ ప్రత్యయమును చేర్చునపుడే క్రియయొక్క ప్రాధాన్యమును సాధ్యావస్థయు విశదమగును ఉదా : పచతి, పపాచ, పక్ష్యతి మొదలగునవి. కాని అదే ధాతువునకు కృత్ప్రత్యయమును చేర్చినచో క్రియ అప్రధానమై సిద్ధావస్థయే బోధపడును ఉదా : పాకః (పచ్ + అ = వంట) మొదలగునవి. ఇచట ప్రత్యయము యొక్క అర్థమే ముఖ్యమై ధాతువుయొక్క యర్థము అప్రధానమగును. కాగా సత్తకు సిద్ధావస్థను చెప్పదలచినచో "భావః" అను రూప మేర్పడును (అస్ ⟶ భూ + అ = భావ) ॥12॥

అవతారిక—— పౌర్వాపర్యరూపమైన క్రియావయవముల క్రమమునకు సంబంధించిన ఆరోపమునకు గల ఒక విశేషమును చూపుచున్నాడు.

శ్లో॥ వ్యవహారస్య సిద్ధత్వాన్న చేయం గుణకల్పనా ।
ఉపచారో హి ముఖ్యస్య సంభవాదపదిశ్యతే ॥ 13

వ్యవహారస్య = క్రియయొక్క వ్యవహారము, సిద్ధత్వాత్ = లోకసిద్ధము అగుటవలన, ఇయమ్ = ఇది, గుణకల్పనా = ఒకదాని గుణమును వేరొక దానియందు కల్పించుట, న = కాదు, ముఖ్యస్య = ముఖ్యమైన వస్తువు, సంభవాత్ = ఉండుటవలన, ఉపచారః = ఆరోపము అపదిశ్యతే + హి = చెప్పబడును గదా ।

తాత్పర్యము—— క్రియయొక్క అవయవములందు పౌర్వాపర్యరూపమైన క్రమము నారోపించుట యనగా, అనుభవ సిద్ధముగానున్న విషయమును విశ్లేషించి విశదముచేయుటయే. అంతియగాని ముఖ్యమై వేరుగానుండు ఒకదానియొక్క ధర్మమును ముఖ్యము కాకుండ వేరొక వస్తువునం దారోపించుట మాత్రము కాదు.

వివరణము—— "గౌః - వాహీకః = వాహీకుడను వ్యక్తి గోవు. ఇచట మాంద్యము మొదలగు కొన్ని సమాన గుణములనుబట్టి గోశబ్దము వాహీకుని బోధించునదిగ వాడబడినది. అనగా గోత్వము వాహీకునియం దారోపింపబడినది. కావున ఇచటి గోశబ్దము, ముఖ్యమగు గోవును తెలుపకుండ వాహీకుని తెలుపును ఈ తీరును గుణవృత్తి యందురు ఇట్టి చోట్ల ముఖ్యమగు వస్తువు వేరుగా నుండును కాని క్రియ విషయమున ఈ తీరు సంభవింపదు అచట ముఖ్యమైనదనియు ముఖ్యముకానిదనియును విభాగము లేదు ఉన్నది క్రియా మాత్రమే దాని అవయవములందు క్రమమును ఊహింతురు. ఇది లోక సిద్ధము. ఇచటి ఆరోపమన్నది వాస్తవము కాదు. అదియొక విధమైన భావన. కాగా క్రియయొక్క ఏ యొక క్షణమైనను క్రమమును భావించుటవలన క్రియ యగును. కావుననే క్రియ విషయమున ఆరోపమునుబట్టి "అప్రాధాన్యము సంభవించును" అను శంక కవకాశమే లేదు. ॥13॥

అవతారిక— క్రియయొక్క ప్రతి అవయవమందును సమూహ మెంచబడునని ఇదివరకు ప్రతిపాదింపబడినది (౯వ కారిక). ఇపు డా విషయముననే మరియొక రీతిని చూపుచున్నాడు.

శ్లో॥ ఆహితోత్తర శక్తిత్వాత్ ప్రత్యేకం వా సమూహినః ।
అనేకరూపా లక్ష్యంతే క్రమవంత ఇవాఽక్రమాః ॥ 14

వా = లేక, అక్రమాః = క్రమములేని. సమూహినః = క్రియకు అవయవమైన క్షణములు, ఆహితోత్తర శక్తిత్వాత్ = తమతమ తరువాతి క్షణముల భేదమును క్రమమును ఆరోపించుట వలన, ప్రత్యేకమ్ = విడివిడిగా అనేకరూపాః = అనేక రూపములు గలవిగను, క్రమవంతః + ఇవ = క్రమముగలవి వలెను, లక్ష్యంతే = భావింపబడును.

తాత్పర్యము— క్రియకు అవయవములగు క్షణములందు ప్రత్యేకముగ క్రమ మన్నది యుండదు. అయినను ప్రతియొక ముందు క్షణమునందును తరువాతి క్షణముల సముదాయమందు గోచరించు క్రమమును భేదమును ఆరోపింపవలెను. అట్లు చేయుటవలన క్షణములన్నియు భిన్నములుగను, క్రమముగలవిగను స్ఫురించును.

వివరణము— క్రియా క్షణముల భేదమును, క్రమమును, భావించుట కేవలము మానస ప్రక్రియయే. దీనివలన ప్రతియొక క్షణము విషయమునను, సముదాయమును తెలుపు ఆ యా ధాతురూపమును (పచతి, మొదలగునవి) వాడుటయు కాలభేదము కుదురుటయును సిద్ధించును. "సమూహమునకు ప్రతియొక అవయవమందును ఆరోపము'' అని వెనుక చెప్ప బడినది. "ఉత్తర క్షణముల ధర్మము పూర్వక్షణములం దారోపింపబడున''ని యిచట చూప బడినది. "పూర్వక్షణముల స్వరూపము నుత్తరక్షణములం దారోపింపకుండుట'' ఇచటి విశేషము ఎట్లు చెప్పినను ప్రయోజనము సమానమే. ॥14॥

అవతారిక— "ఫలమును కలిగించునదియే ముఖ్యమైన క్రియ. మిగిలిన అవ యవము లన్నియును ఉపకారములు మాత్రమే'' అను వేరొక రీతిని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ అనంతరం ఫలం యస్యాః కల్పతే తాం క్రియాం విదుః ।
ప్రధాన భూతాం తాదర్థ్యాదన్యాసాం తు తదాఖ్యతా ॥ 15

యస్యాః = దేనియొక్క, అనంతరమ్ = తరువాత, ఫలమ్ = ఫలము, కల్పతే = పుట్టునో, తామ్ = దానిని, ప్రధాన భూతామ్ = ముఖ్యమైన, క్రియామ్ = క్రియనుగ, విదుః = తెలియు దురు, అన్యాసామ్ + తు = మిగిలిన వానికైతే, తాదర్థ్యాత్ = ఆ ఫలమునకు సాయము చేయుటవలన, తదాఖ్యతా = క్రియ అను పేరు, (భవతి = అగును).

తాత్పర్యము— ఫలము పుట్టుటకు సూటిగా ముందున్న వ్యాపారమే వాస్తవమై నట్టియు ముఖ్యమైనట్టియు క్రియ యగును. అంతకు ముందుండు వ్యాపారములన్నియు ముఖ్య

మైన క్రియకు —లేదా— ఫలమునకు సాయము చేయునవిగాన వానిని గూడ క్రియగనే సంభావింతురు.

వివరణము— 'పచి' క్రియ నుదాహరణముగా తీసికొనవచ్చును. "వస్తువు ఉడుకుట —లేక— మెత్తబడుట'' పాకమగును. ఇది పచి క్రియయొక్క ఫలము. పాకమునకు ముందుండు వ్యాపారమును "విచటనము'' అందురు. అనగా వస్తువులందలి సూక్ష్మ భాగములు విడిపోవుట. (దీని పిదపనే మెత్తబడుట సంభవించును) ఇట్టి విచటనమే ముఖ్యమైన క్రియ. దీనికి ముందుండు వ్యాపారము లన్నిటియందును ఇట్టి స్థితికి సాయపడుట ఉండునుగాన వానిని గూడ పచి క్రియగనే వ్యవహరింతురు. చలన రూపమైనను కాకున్నను ప్రతియొక క్రియయందును ఈ తీరును సూక్ష్మదృష్టితో పరిశీలింపవలెను.

విశేషము— కాగా మతభేదము వలన మూడు విధములైన క్రియా లక్షణములు సిద్ధించెను. (1) క్రియయొక్క ప్రతియొక అవయవమందును సమూహము నారోపించి క్రియను భావించుట. (2) ఉత్తరక్షణముల స్వరూపమును పూర్వక్షణములం దారోపించి క్రియను భావించుట. (3) ఫలమునకు ముందుండు క్రియయే ప్రధాన క్రియయని భావించుట మరియు, ధాతువులన్నియును సామాన్యముగ "కర్తకు సంబంధించినట్లుగనే'' వ్యాపారమును తొలుత బోధించును. వివక్షాధీనముగ మార్పులు అచటనచట జరుగును. ॥15॥

అవతారిక— సత్తకు (ఉనికి) సాధ్యత్వమును నిరూపించుచున్నాడు.

శ్లో॥ సత్సు ప్రత్యయరూపోఽసౌ భావో యావన్న జాయతే ।
తావత్పరేషాం రూపేణ సాధ్యః సన్నభిధీయతే । 16

అసౌ = ఈ, భావః = పదార్థము (వస్తువు), సత్సు = కారణములైనవి ఉండగా, ప్రత్యయ రూపః = స్పష్టమైన స్వరూపముగలదై, యావత్ = ఎంతవరకు, న + జాయతే=పుట్టదో, తావత్ = అంతవరకును, పరేషామ్ = (ఇతరములయిన) హేతువులయొక్క, రూపేణ = స్వరూపముతో (సూచింపబడినదై), సాధ్యః + సన్ = సాధ్యమైనదిగా, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— ఏ వస్తువునకైనను ముఖ్యహేతువైన మూలపదార్థ మొకటి యుండును. అదియే మరికొన్ని హేతువుల మూలమున స్పష్టమైన స్వరూప స్వభావములుగల ఒక వస్తువుగా ఏర్పడును. అనగా కారణమే కార్యరూపమును ధరించును. ఇట్లు కార్యరూపమును ధరించు సమయమున వస్తువు సాధ్యస్వభావమును స్వీకరించును. అపుడది "అస్తి'' అను క్రియాపదముచే బోధింపబడును.

వివరణము— కారణములు సిద్ధములుగా నుండును. కార్యము తన రూపమును ధరించు అవస్థకు రెండు భాగములుండును అందు మొదటి భాగము జన్మము. దీనిని ''జాయతే'' అను క్రియాపదము తెలుపును. రెండవ భాగము సత్త. దీనిని ''అస్తి'' అనునది

తెలుపును సిద్ధములైన కారణములను బట్టి కార్యమును కూడ సిద్ధముగ భావించి - దానినే కర్తగా చేసి, వా'స్తవ స్వరూపమును సాధ్యముగా భావించుటవలన సత్తకు సాధ్యత్వమును క్రమమును సంపాదింపవలెను ఉదా : "ఘటః - అస్తి". ఇచట మన్ను మూలకారణము. దండము, చక్రము మొదలగునవి ఇతర కారణములు. ఇవి సిద్ధములు. వీనినిబట్టి ఘటము తయారగుచున్న సమయముననే "ఘటః జాయతే" "ఘటః అస్తి" అని వ్యవహరింతురు. అనగా కారణముల వ్యాపారము నాశ్రయించి సత్తకు సాధ్యత్వమును భావింతురు. ॥16॥

అవతారిక— పైని చూపిన విధముగ భావింపనియెడల,

శ్లో॥ సిద్ధేతు సాధనాకాంక్షా కృతార్థత్వాన్నివర్తతే ।
న క్రియావాచినాం తస్మాత్ ప్రయోగస్తత్ర విద్యతే ॥ 17

సిద్ధే + తు = సిద్ధమైన విషయమున, కృతార్థత్వాత్ = ఫలము కలిగినందువలన, సాధనా కాంక్షా = సాధనముల కోరిక, నివర్తతే = మరలిపోవును, తస్మాత్ = అందువలన, తత్ర = అచట, క్రియావాచినామ్ = క్రియావాచకముల యొక్క, ప్రయోగః = ప్రయోగము, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— సత్తను సిద్ధముగనే భావించినచో సాధనముల ఆవశ్యకత —లేక— అపేక్ష యుండదుగాన, క్రియాపదమును వాడనక్కర లేదు. "భావః" అను కృదంతమునే వాడవలయును. ఉదా : "ఘటస్య భావః" (ఘటముయొక్క ఉనికి)

వివరణము— సిద్ధావస్థయనగా ఫలరూపమే అది యున్నపుడు సాధనము లక్కరలేదు. ॥17॥

అవతారిక— కాగా ప్రతియొక క్రియయు సాధ్యస్వభావము గలదియు క్రమము గలదియునని మరల చెప్పుచున్నాడు.

శ్లో॥ సచాఽపూర్వాపరీభూత ఏకత్వాదక్రమాత్మకః ।
పూర్వాపరాణాం ధర్మేణ తదర్థేనాను గమ్యతే ॥ 18

ఏకత్వాత్ = ఒకటి యగుటవలన, అపూర్వాపరీభూతః = పౌర్వాపర్యము లేనిదియు, అక్రమాత్మకః = క్రమము లేనిదియునగు, సః + చ = ఆ క్రియ (ప్రధాన క్రియ), తదర్థేన = దాని కుపయోగించు, పూర్వాపరాణామ్ = ముందు వెనుకలుగనున్న అవయవముల యొక్క, ధర్మేణ = స్వభావముచే, అనుగమ్యతే = అనుసరింపబడును.

తాత్పర్యము— ప్రధానమగు క్రియ (ఫలమునకు ముందుండునది) వాస్తవముగ ఒక్కటే. దానికి పౌర్వాపర్యముగాని, క్రమముగాని యుండదు. అయినను దానికి సాయపడు అప్రధానమైన క్రియలందలి పౌర్వాపర్యమును క్రమమును దానియం దారోపింపబడును,

వివరణము— ఫలము పుట్టుటకు అవ్యవహితముగ ముందుండు వ్యాపారమే ప్రధాన క్రియయనియు, దాని కుపకరించు మిగిలినవన్నియును అప్రదాన క్రియలనియును పర్యవసించును. ॥18॥

అవతారిక— ఫలమును బట్టియు అభేదమును చెప్పదగునని ప్రతిపాదింపు చున్నాడు.

**శ్లో॥ అసన్నివర్తతే తస్మాత్ యత్ సత్తదుపలభ్యతే ।
తయోః సదసతోశ్చాసా వాత్మైకక ఇవ గృహ్యతే ॥** 19

అసత్ = లేనిది, నివర్తతే = పోవును, యత్ = ఏది, సత్ = ఉన్నదో, తత్ = అది, ఉపలభ్యతే = గ్రహింపబడును, తస్మాత్ = అందువలన, సదసతోః = ఉన్నట్టియు లేనట్టియు, తయోః + చ = ఆ రెండింటి యొక్కయు, ఏకః = ఒకటియైన, ఆత్మా + ఇవ = ఆత్మవలె, అసౌ = ఇది (ఈ క్రియ), గృహ్యతే = స్వీకరింపబడును.

తాత్పర్యము— క్రియకు ఫలమొకటే యుండును. ఆ ఒక్క ఫలముకొరకే క్రియ యొక్క లక్షణములన్నియు (అవయవ క్రియలు) ప్రవర్తించును. అందు జరిగినది కనబడదు (అసత్తు). జరుగుచున్నది కనబడును (సత్తు). రెండును ఒకే స్వరూపము గలవి. అది ఆత్మ వంటిది. అవియే క్రియ అది ఒకటేయని భావింపదగును.

వివరణము— ఫల మొకటే కావునను, దానిని గూర్చియే క్రియా క్షణము లన్నియు ప్రవర్తించును కావునను అభేదమును భావించి, "క్రియ ఒకటే" అనుట సమంజస మని సారాంశము ప్రతియొక క్రియ విషయమునను ఈ తీరునంతను భావింపవలెను ॥19॥

అవతారిక— వ్యక్తి వాదము ననుసరించి యింతవరకును క్రియయొక్క లక్షణమును చూపి, ప్రకృతమును జాతివాదము ప్రకారము క్రియా లక్షణమును చూపుచున్నాడు.

**శ్లో॥ జాతిమన్యే క్రియామాహురనేక వ్యక్తివర్తినీమ్ ।
అసాధ్యా వ్యక్తిరూపేణ సాసాధ్యేవోప లభ్యతే ॥** 20

అనేక వ్యక్తివర్తినీమ్ = అనేకములగు వ్యక్తులందుండు, జాతిమ్ = జాతిని, క్రియామ్ = క్రియనుగ, అన్యే = కొందరు, ఆహుః = చెప్పుదురు, సా = ఆ క్రియాజాతి, అసాధ్యా = సాధ్యము కానిదైనను, వ్యక్తిరూపేణ = వ్యక్తియొక్క స్వరూపముచే, సాధ్యా + ఇవ = సాధ్యమైనట్లు, ఉపలభ్యతే = కనబడును.

తాత్పర్యము— ఎల్ల క్రియలందును గోచరించు ఒకానొక సామాన్య ధర్మమునే "క్రియ" యని కొందరు చెప్పుదురు వాస్తవమున అట్టి ధర్మము నిత్యమును అసాధ్యము నగును. అయినను వ్యక్తులనుబట్టి జాతికిని సాధ్యస్వభావమును స క్రమత్వమును ఆపాదింప వలెను.

వివరణము— సకల గోవులందును అనుస్యూతముగ అనుభూతమగు "గోత్వము" అనునది జాతి. ఏ గోవు కా గోవు వ్యక్తి. అట్లే ఎవరు వండినను, దేనిని వండినను ఎల్ల వంట లందును గోచరించు "వంట" అను సామాన్య ధర్మము "పాకజాతి" అగును. జాతి యనునది శాస్త్రీయముగ నిత్యమును అసాధ్యమునగు అంశము. అయినను జాతిని వ్యక్తముచేయు వ్యక్తు లను బట్టి సాధ్యత్వము మొదలగు ధర్మములను జాతియందును భావింపవలెను. ॥20॥

అవతారిక— "ఫలము పుట్టుటకు ముందు లక్షణమందున్న క్రియయే ముఖ్య క్రియ" అని వ్యక్తి వాదమున ప్రతిపాదింపబడెను (15 కారిక). అదే తీరును జాతి వాదమున గూడ చూపుచున్నాడు.

శ్లో॥ అంతే యా వా క్రియాభాగే జాతిః సైవ క్రియా స్మృతా ।
సావ్యక్తేరను నిష్పాదే జాయమానేవ గమ్యతే ॥ 21

వా = లేక, అంతే = చివరిదగు, క్రియాభాగే = క్రియా వ్యక్తియందు, యా = ఏ, జాతిః = జాతి గలదో, సా + ఏవ = అదియే, క్రియా = క్రియయని, స్మృతా = చెప్పబడెను, సా = అట్టి జాతి, వ్యక్తేః = వ్యక్తియొక్క, అనునిష్పాదే = పుట్టుకయందు, జాయమానా + ఇవ= పుట్టుచున్నది వలె, గమ్యతే = తెలియబడును.

తాత్పర్యము— ఏ క్రియా వ్యక్తియొక్క సమనంతరమున (వెన్వెంటనే) ఫలము పుట్టునో, అట్టి క్రియా వ్యక్తియందు గోచరించు జాతియే "క్రియా జాతి" అని చెప్పనగును ఇచట గూడ వ్యక్తియొక్క నిష్పత్తి ననుసరించి జాతికిని ఆధర్మ మంటగట్ట బడును.

వివరణము— వ్యక్తులవలననే జాతి అభివ్యక్తమగును. అంతియగాని జాతి యన్నది వేరుగ ఎన్నడు నుండదు కావున వ్యక్తులందుండు ధర్మములన జాతియం దారోపిం చుట జరుగుచుండును ఈ తీరునందు గూడ ముఖ్య క్రియకు ముందుండు క్రియా వ్యక్తులు తదర్థములగుట వలన (ఉపకారకములు) క్రియ లనిపించుకొనును. ॥21॥

అవతారిక— "జాతియే క్రియ" అని చూపి, జాతికన్నను విశాలమైన "సత్తయే" క్రియ యని ప్రకృతము చూపుచున్నాడు

శ్లో॥ స్వవ్యాపార విశిష్టానాం సత్తా వా కర్తృకర్మణామ్ ।
క్రియా-వ్యాపార భేదేషు సత్తా వా సమవాయినీ ॥ 22

వా = లేక, స్వవ్యాపార విశిష్టానామ్ = తమ తమ వ్యాపారములతో గూడిన, కర్తృ కర్మ ణామ్ = కర్తల యొక్కయు, కర్మల యొక్కయును, సత్తా = సత్తకాని, వా = లేక, వ్యాపార భేదేషు = ఆ యా వేర్వేరు వ్యాపారములందు, సమవాయినీ = తప్పక ఉండు, సత్తా = సత్తకాని, క్రియా = క్రియ, (భవతి = అగును).

తాత్పర్యము— "సత్ = ఉన్న వస్తువు", "సతః - భావః = సత్తా = ఉనికి", ఆ యా వ్యాపారములు గల కర్తృ కర్మాదుల సత్తగాని, ఆ యా వ్యాపారములందు నియత మైన సత్తగాని క్రియ యగును.

వివరణము— ఇది మిక్కిలి తాత్త్వికమైన నిర్వచనము. ఇటుపైని దీని వివరణమే విపులముగ జరుగును. సర్వకారణమును సర్వాకారమును నిత్యమునగు ఒక తత్త్వమును "సత్" అని నిర్దేశింతురు. దాని భావమే సత్త. దీనినే "మహాసత్త" అనియు, "మహా సామాన్యము" అనియు వ్యవహరింతురు. ఇదియే జగత్తుగా గోచరించును ప్రపంచముగా అనుభూతమగునదంతయు దీనియొక్క వివర్తము —లేక— వికారము. కాగా దేనికి లక్షణ మును చెప్పినను అది కృతకమును, పరిమితమును అగును. తాత్త్వికమైన సత్తయే అన్నిటికిని పరమ లక్షణమని ఫలించును. అందుచేతనే క్రియ యనగా సత్తయే అనియు, ఆ సత్త వ్యాపారముతో గూడిన కర్తృ కర్మల సత్త యనిగాని, వ్యాపారముల సత్త యనిగాని చెప్ప వచ్చుననియును పర్యవసించును. ॥22॥

అవతారిక— "ఫలము పుట్టుటకు ముందు క్షణమందున్న వ్యాపారమందలి సత్తయే క్రియ" అను తీరునుగూడ చూపుచున్నాడు.

**శ్లో॥ అంత్యేవాఽఽత్మని యా సత్తా సా క్రియా కైశ్చిదిష్యతే ।
భావ ఏవ హి ధాత్వర్థ ఇత్యవిచ్ఛిన్న ఆగమః ॥** 23

వా = లేక, అంత్యే = చివరిదగు, ఆత్మని = వ్యాపార భాగమందు, యా = ఏ, సత్తా = సత్త గలదో, సా = అది, క్రియా = క్రియ అని, కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = కోర బడుచున్నది, భావః + ఏవ = భావమే (సత్తయే), ధాత్వర్థః + ఇతి = ధాతువుయొక్క అర్థమని, అవిచ్ఛిన్నః = ఎడతెగని, ఆగమః + హి = సంప్రదాయము గదా ।

తాత్పర్యము— ఫలమునకు ముందుండు వ్యాపారముయొక్క సత్తయే క్రియ యని కొందరందురు, (అంతకుముందుండు వ్యాపారములందు తాదర్థ్యమువలన క్రియాత్వము సిద్ధించును) "సత్తయే ధాత్వర్థము" అనునది పరమ సంప్రదాయము.

వివరణము— ఏది ఎట్లయినను సత్తయే క్రియ. సత్తనే భావమనియు నందురు. "భావమే ధాతువుయొక్క సహజమైన యర్థమ"ని పతంజలి మొదలగు పెద్దలు నిర్ణయించిరి.

విశేషము— సత్తయొక్క వికారములే సృష్టియందంతటను గోచరించును. బాహ్య మగు భేదములవలన మహాసత్తకు నామరూప భేదము లేర్పడుచుండును అవియే శబ్దార్థముల వైచిత్ర్యముగా భాసించుచుండును. కావుననే "తాం ప్రాతిపదికార్థం చ ధాత్వర్థం చ ప్రచ క్షతే" (ఆ సత్తనే ప్రాతిపదికార్థమనియు, దాత్వర్థమనియును చెప్పుదురు) మొదలగు వచనము లచే "శబ్దార్థ ప్రపంచమంతయు సత్తామయమే" అని తాత్త్వికులు చెప్పుచుందురు. సామాన్య ముగా సత్త విషయములో చూపబడు సంబంధములును సంబంధులును సత్తయొక్క ప్రకాశ

షులే కాగా ఇట్టి వాదమును ''సత్తాఽద్వైతము'' అని యందురు. దీని ననుసరించియే ఈ ఘట్ట మంతయు సాగును. ॥23॥

అవతారిక— ''శబ్దమువలన తెలియు అర్థము బౌద్ధము'' అను పక్షమున క్రియ యొక్క స్వరూపమును విశదీకరింపుచున్నాడు.

శ్లో॥ బుద్ధిం తజ్జాతిమన్యేతు బుద్ధి సత్తామథాఽపరే ।
ప్రత్యస్తరూపాం భావేషు క్రియేతి ప్రతి జానతే ॥ 24

భావేషు = పదార్థములందు (వస్తువులందు), ప్రత్యస్తరూపామ్ = ఆరోపింపబడిన స్వరూపము గల, బుద్ధిమ్ = బుద్ధినిగాని, తజ్జాతిమ్ + తు = బుద్ధియందలి జాతినిగాని, అన్యే = కొందరు, క్రియా + ఇతి = క్రియయని, ప్రతిజానతే = తెలియుదురు, అథ = మరియు, అపరే = మరికొందరు, బుద్ధి సత్తామ్ = అట్టి బుద్ధియొక్క మహాసత్తను, క్రియా + ఇతి = క్రియయని, ప్రతిజానతే = తెలియుదురు.

తాత్పర్యము— బుద్ధియందేర్పడు వస్తువుల ఆకారము (చిత్రము) బుద్ధి యన బడును. (శబ్దమువలన తెలియు అర్థము మానసికమైన ఆ యా ఆకారమేయని శాబ్దికుల నిర్ణయము) కాగా బాహ్యమైన వస్తువులకును బౌద్ధమైన వానికిని అభేదమును కల్పించి, బౌద్ధమైన దియే క్రియ యనియు, అది వ్యక్తిగాని జాతిగాని కావచ్చుననియును కొందరు చెప్పుదురు. బుద్ధికిచెందు మహాసత్తయే క్రియయని మరికొందరు వ్యాఖ్యానింతురు.

వివరణము— పచ్, గమ్ మొదలగు ఆ యా ధాతువులవలన వంట, నడక మొదలగు క్రియల చిత్రములు మనసునం దేర్పడును. వానికిని బయట కనబడు వ్యాపారముల కును అభేద మనవలెను. అందుచే క్రియ మానసికమే యనియు, వ్యక్తిగాగాని జాతిగాగాని సత్తగాగాని దానిని భావింపవచ్చుననియును కొందరు చెప్పుదురు క్రియా ప్రపంచమంతయు మానసికమేయనుటయు, అందును సత్తయే క్రియ యనుటయును ఇచటి విశేషము. ॥24॥

అవతారిక— మహాసత్తయే క్రియయని సమర్థించుటకు ఉపపత్తిని చూపు చున్నాడు.

శ్లో॥ ఆవిర్భావతిరోభావౌ జన్మనాశౌ తథాఽపరైః ।
షట్సు భావవికారేషు కల్పితౌ వ్యావహారికౌ ॥ 25

షట్సు = ఆరయిన, భావవికారేషు = సత్తయొక్క వికారములందు, వ్యావహారికౌ = లోక మందలి వాడుకలో ప్రసిద్ధమైన, ఆవిర్భావతిరోభావౌ = ప్రకటమగుటయు కప్పబడుటయును, తథా = అట్లు, అపరైః = కొందరిచే, జన్మనాశౌ = పుట్టుటయును గిట్టుటయును, కల్పితౌ = కల్పింపబడినవి (ఆరోపింపబడినవి).

తాత్పర్యము— సత్త నిత్యము. ఎల్లపుడును ఏకరూపము. అయినను లోకవ్యవహారము నడచుటకై ఆ సత్తకు ఆరు వికారములను కల్పించిరి. అందును మిక్కిలి ముఖ్యమైనవి "ఆవిర్భావము - తిరోభావము" అనునవి రెండే. ఆవిర్భావమును జన్మయనియు తిరోభావమును నాశమనియును కొందరందురు. సత్తయొక్క తొలి వికార మావిర్భావము చివరి వికారము తిరోభావము. ఇదంతయు లౌకికమైన భావనయే

వివరణము— జాయతే (పుట్టుట), అస్తి (ఉండుట), విపరిణమతే (మార్పు చెందుట), వర్ధతే (పెరుగుట), అపక్షీయతే (క్షీణించుట), నశ్యతి (నశించుట) అనునవి ఆరు వికారములు వీనినే భావవికారము లందురు. ఇచట భావమనగా సత్తయని యర్థము. సృష్టి యందలి ప్రతియొక వస్తువునకును - మొత్తము సృష్టియంతకును - ఈ ఆరు అవస్థలును తప్పవు. వీని యన్నిటికిని మూలాధారము సనాతనమైన సత్తయే. అది నిర్వికారము కాగా వికారములు కల్పితములు.

సత్కార్యవాదమనియు, అసత్కార్యవాదమనియును, రెండు వాదములున్నవి. కార్యము కారణమందే ఉన్నదనియు, అది బయట పడినపుడు ''ఆవిర్భావము''నియు, మరుగైనపుడు ''తిరోభావము''నియును చెప్పుదురని సత్కార్యవాదము యొక్క సారము. కారణము వలన కార్యము క్రొత్తగా పుట్టుననియు క్రమముగ నశించుననియును, వీనిని ''జన్మనాశము'' లందురనియును అసత్కార్యవాదము యొక్క సారము.

విశేషము— మన్ను కారణము. కుండ కార్యము కుండ మట్టియందున్నదే యనుటయు, దాని రూపము బయటపడుటయు మరుగుపడుటయు మాత్రమే జరుగుననుట సత్కార్యవాదము. అంతకు ముందులేని కుండ క్రొత్తగా పుట్టుటయు గిట్టుటయును జరుగునన్నది అసత్కార్యవాదము. ఇట్టి వాదభేదమును బట్టి పై అవస్థలను సాంకేతికముగా ''ఆవిర్భావ తిరోభావములు'' అనిగాని, ''జన్మనాశములు'' అనిగాని చెప్పుదురు. ఏది ఎట్లయినను సత్తమాత్రము నిత్యమును నిర్వికారమునుగాన దాని విషయమున, ఈ వికారములన్నియు ఊహాలే యగునుగాని వాస్తవములు కావు. అయినను లోక వ్యవహారము కొరకు వీని నాశ్రయింపక తీరదు. ॥25॥

అవతారిక— అట్లు కల్పితములైన జన్మ నాశములే క్రియ యను వ్యవహారమును పొందునని చెప్పుచున్నాడు.

శ్లో॥ తాభ్యాం సర్వప్రవృత్తీ నామభేదే నోప సంగ్రహః ।
జన్మైవాఽశ్రిత సారూప్యం స్థితిరిత్యభిధీయతే ॥ 26

తాభ్యామ్ = ఆ జన్మ వినాశములు రెండింటితో, అభేదేన = అభేదముచే, సర్వప్రవృత్తీనామ్ = ఎల్ల వ్యాపారములకును, ఉపసంగ్రహః = సంగ్రహము, (భవతి = అగును), ఆశ్రితసారూప్యమ్ = సారూప్యము నాశ్రయించిన, జన్మ + ఏవ = జన్మయే, స్థితిః + ఇతి = స్థితియని, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— జన్మ, వినాశము అను రెండు ప్రవృత్తులందే ఎల్ల వ్యాపారము లును ఇమిడి పోవును అనగా వ్యాపారములన్నియు "ఈ రెండిటిలో ఒకదాని యొక్క సంతతియే" అని సూక్ష్మ పరిశీలనము వలన తెలియుచుండును. "స్థితి" (కదలక ఉండుట) అను వ్యాపారము కూడ జన్మయే అనదగును.

వివరణము— పుట్టుట, ఉండుట, మారుట, పెరుగుట, క్షీణించుట, నశించుట అను అరును భావవికారములు. ఇందు మొదటిదియు చివరిదియునగు "జన్మ నాశముల"ను నవియే ముఖ్యమైన వ్యాపారములు. మిగిలిన నాలుగును వీనికి సంబంధించినవియే ఆ యా అవస్థలను బట్టి "ఉండుట", మొదలుకొని "పెరుగుట" వరకును వేర్వేరు పేర్లను పొందును. అట్లే "క్షీణించుట" అన్నది నాశమునకు తొలిదశ యగును. ఇట్లు అతిసూక్ష్మముగ పరిశీ లించిన యెడల సృష్టియందలి వ్యాపారము లన్నియు జన్మయందో నాశమందో అంతర్భ వించును. ఏ వ్యాపారమైనను నిర్వికారమైన సత్తయం దారోపింపబడునదే యగును. ఇట్టి యారోపమును అభేదమును స్వీకరించినందువలన జన్మనాశములే క్రియా వ్యవహారము నంతను పొందును

"స్థితి" (స్థా = కదలకుండు) అను ఒక వ్యాపారమున్నది. అదియు వాస్తవముగ జన్మయేయని చెప్పదగును. కావున దానిని "తిష్ఠతి" అను క్రియాపదముతో బోధింపవచ్చును (జన్మకును స్థితికిని సాదృశ్యమును భావించినందువలన ఈ తీరు సిద్ధించును) ॥26॥

అవతారిక— "జన్మ నాశములు కూడ పరమార్థములు కావు సత్తయే పర మార్థము. అదియే ధాత్వర్థము" అని ప్రకటింపుచున్నాడు.

శ్లో॥ జాయమానాన్న జన్మాన్య ద్వినాశేఽప్యపదార్థతా ।
అతోభావ వికారేషు సత్తైకా వ్యవతిష్ఠతే ॥ 27

జాయమానాత్ = పుట్టు వస్తువుకన్న. అన్యత్ = వేరయిన, జన్మ = పుట్టుక, న = లేదు, వినాశే + అపి = నాశమందును, అపదార్థతా = పదార్థము కాకుండుట, (అస్తి = కలదు), అతః = ఇందువలన, భావవికారేషు = సత్తయొక్క వికారములందు, సత్తా = సత్త, ఏకా= ఒకటియే, వ్యవతిష్ఠతే = ఉండును.

తాత్పర్యము— పుట్టుట మొదలగునవి ధర్మములు. అవి ధర్మియందు (ధర్మము గల వస్తువు) ఆధారపడును. అనగా ధర్మి లేనిదే ధర్మములు భాసించుట కవకాశమే లేదు కాగా జన్మనాశములను ధర్మములు కూడ ధర్మినిబట్టియే వ్యవహారయోగ్యము లగును. ఎల్ల ధర్మములకును ధర్మిగా నుండునది ఒకటే యున్నది అదియే సత్త. అదియే అన్ని వ్యవహార ములకును మూలకారణము. అందువలన జన్మనాశములును కల్పితములే.

వివరణము— పుట్టుదానికన్న వేరుగ "పుట్టుట" అను ధర్మ ముండదు అట్లే నశించుదానికన్న వేరుగ "నాశమ"ునదియు నుండదు. సర్వమునకును మూలమగు "సత్త"

యను ధర్మనిబట్టి ఇట్టి వ్యవహారములన్నియును కుదురుచున్నవి. సర్వ వ్యాపకమును సనాతనమునగు ''మహాసత్త''కు వాస్తవమున ఎట్టి వికారములును లేవు (ఉన్నచో అది నిత్యము కానేరదు). కాగా విశ్లేషించి చూడగా చూడగా చివరకు మహాసత్తయే సకల వ్యాపారములకును ఆధారమని ఫలించును. అందుచే ''సత్తయే ధాతువుయొక్కయు ప్రాతిపదికము యొక్కయు అర్థమనియు, శబ్దార్థ ప్రపంచము సత్తయొక్క విలాసమే యనియును'' చెప్పుదురు. అయినను అట్టి సత్తనే క్రియాపదమును (జాయతే మొదలగునది) వాడి సాధ్యముగను, నామపదమును (ఘటః, పటః మొదలగుసవి) వాడి, సాధనముగను చూపుచుందురు. ॥27॥

అవతారిక — సత్తకు జన్మాది భేదములు లేకున్నను ''అవి ఉన్నట్లు'' లోకమున వ్యవహారము జరుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ పూర్వభాగస్తు యజ్జాతాత్తజ్జన్మ వ్యపదిశ్యతే ।
ఆశ్రితక్రమరూపేణ నిమిత్తత్వే వివక్షితే ॥ 28

జాతాత్ = పుట్టిన దానికి, పూర్వభాగః = ముందు అవస్థ, యత్ + తు = ఏదయితే కలదో, తత్ = అది, ఆశ్రిత క్రమరూపేణ = క్రమము నాశ్రయించుటచే, నిమిత్తత్వే = వ్యాపారము గలదిగ, వివక్షితే = చెప్పదలప బడినపుడు, జన్మ = జన్మగా, వ్యపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము — పుట్టినదానిని ''జాత'' అను నామ పదముతో వ్యవహరింతురు. ''జాత'' అను వ్యవహారమునకు ఏది హేతువగునో దానిని వ్యాపారముగ భావించి "జాయతే" (పుట్టుచున్నది) అను క్రియాపదముతో నిర్దేశింతురు.

వివరణము — "జాతః" అనునది పరినిష్ఠితమైన (పూర్తి అయిన) అవస్థను తెలుపును ఇందు మొదటిది సాధనావస్థ. రెండవది సాధ్యావస్థ (రెండును కల్పితములే) ॥28॥

అవతారిక — పై అంశమునే విశదీకరింపుచున్నాడు.

శ్లో॥ ఆఖ్యాత శబ్దైరర్థోఽసావేవం భూతోఽభిధీయతే ।
నామశబ్దాః ప్రవర్తంతే సంహరంత ఇవ క్రమమ్ ॥ 29

అసౌ = ఈ, అర్థః = విషయము, (జాతమునకు ముందు అవస్థ), ఏవం భూతః = ఇట్టిదిగా (క్రమము గలదిగ), ఆఖ్యాతశబ్దైః = తిజంత పదములచే (జాయతే మొదలగు వానిచే), అభిధీయతే = చెప్పబడును, నామశబ్దాః = నామములు (సుబంతములు), క్రమమ్ = క్రమమును, సంహరంతః + ఇవ = ఉపసంహరించునవి వలె, ప్రవర్తంతే = ప్రవర్తించును.

తాత్పర్యము — "జాయతే" మొదలగు తిజంతములు పుట్టిన వస్తువుయొక్క పూర్వావస్థను సాధ్యమగు రీతిని ప్రకటించును. "జాత" మొదలగు సుబంతములు అదే వస్తువుయొక్క సిద్ధావస్థను బోధించును.

వివరణము — క్రియాపదము క్రమమును సాధ్యభావమును సూచించుననియు, నామపదము క్రమము లేకపోవుటను సిద్ధభావమును సూచించుననియును సారాంశము.

అవతారిక — పూర్వభాగము జన్మమైనట్లు ఉత్తరభాగము వినాశమగునను కొందరి మతమును చూపుచున్నాడు.

శ్లో॥ ఫలం ఫలాపదేశో వా వస్తు వా తద్విరోధి యత్ ।
తదన్య ఏవ పూర్వేషాం నాశ ఇత్యపదిశ్యతే ॥ 30

ఫలమ్ = ఫలముగాని, వా = లేక, ఫలాపదేశః = ఫలముగా భావింపబడునదిగాని. వా = లేక, తద్విరోధి = నశించుదానికి విరుద్ధమైన, యత్ = ఏ, వస్తు = వస్తువుగలదో, తత్ = అదిగాని, అన్యః + ఏవ = వేరయినదియే. నాశః + ఇతి = వినాశమని, పూర్వేషామ్ = పూర్వుల మతమున, అపదిశ్యతే = చెప్పబడును

తాత్పర్యము — "నాశము లేక అభావము వేరొక పదార్థము" అని కొందరి మతము అది ఫలముగాని ఫలముగా భావింపబడు అంశముగాని పూర్తిగా విరుద్ధమైన వస్తువుగాని కావచ్చునని వారి ఆశయము. అట్టి నాశము ''నశ్యతి'' మొదలగు తిజంతములచే సాధ్యముగను, ''నాశః'' మొదలగు సుబంతములచే సిద్ధముగను తెలియజేయబడును.

వివరణము — గమనమునకు ఫలము అనుకొన్న ప్రదేశమును చేరుట దీనినే ''ఉత్తరదేశ సంయోగము'' అందురు. ఈ సంయోగము కలుగగనే గమన మాగిపోవును. అనగా అది నశించినట్లు లెక్క. ఇట్లే ఆ యా పనియొక్క ఫలము కలుగగానే ఆ పని నశించును అందుచే ఫలమునే నాశమని అనుకొనవచ్చును. ఇదియొక భావన. లేక— కుండను బ్రద్దలు కొట్టినచో ముక్కలగును. ఇట్లే ఆ యా వస్తువులు పాడయినపుడు వాని అవయవములు మిగులును. వానినే నాశమను పదార్థముగా ఊహింపనగును. ఇదొక భావన లేక— సుఖము కలుగగనే దుఃఖము పోవును. దుఃఖము కలుగగనే సుఖము పోవును. ఇట్లు ఒకటి యున్నపుడు దానికి విరుద్ధమైనది యుండదు. కాగా విరుద్ధమైన దానినే నాశమని (విరోధియగు దాని నాశము) చెప్పవచ్చును. ఇది వేరొక భావన. ఎట్లయినను నాశమన్నది ప్రత్యేకమైన ఒక పదార్థమని చెప్పవలెను. ఇది వస్తువుయొక్క చివరిదశను బోధించును. ''నశ్యతి'' అనునది నాశముయొక్క క్రియారూపము ''నాశః'' అనునది దానియొక్క ద్రవ్యరూపము. ॥30॥

అవతారిక — ''ఒక వస్తువును వేరొక వస్తువుయొక్క వినాశముగా గ్రహించు టెట్లు?''— అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నైవాస్తి నైవ నాస్తీతి వస్తునో గ్రహణాద్వినా ।
కల్పతే పరరూపేణ వస్త్వన్యదనుగమ్యతే ॥ 31

వస్తుః = ఒక వస్తువుయొక్క, గ్రహణాత్ = గ్రహణము, వినా = లేకుండ, అస్తి + ఇతి =

''అ స్తి'' అనునది (ఉన్నది - అని), న + ఏవ + కల్పతే = కుదురదు, న + అస్తి + ఇతి = ''నా స్తి'' అనునదియు (లేదు - అని), న + ఏవ + కల్పతే = కుదురదు, పరరూపేణ= వేరొక వస్తువుయొక్క రూపముచే, అన్యత్ = వేరొక. వస్తు = వస్తువు, అనుగమ్యతే = తెలియబడును.

తాత్పర్యము— ఒక వస్తువును బట్టియే వేరొక వస్తువుయొక్క ఉనికినిగాని లేమినిగాని చెప్పుటకు వీలు కలుగును ఇది వస్తుతత్త్వము. పూర్తిగా శూన్యరూపమైన అభావ మును ఎన్నడును ఏ విధముగను గ్రహింపజాలరు కావున ఒక వస్తువు వేరొక వస్తువు యొక్క అభావముగా నిర్దేశింపవచ్చును.

వివరణము— భావమనగా సత్త —లేక— ఉనికి దీనికి ప్రతిద్వంద్వి అభావము. దీనిని భావమును బట్టియే అనుసంధానము చేయవలెను అనగా భావముయొక్క స్వరూపమును విడిచినచో అభావముయొక్క స్వరూపము స్పష్టపడదు. ఉదా : ఘటమున్నది. దీని యభావ మును ఘటమును బట్టియే భావింపగలుగుదురు. అనగా ఘటాఽభావము ఘటరూపమే. ఇట్లే ప్రతియొక అభావమును ఆ యా భావరూపమే యగును. భావమునుగూడ వస్తువుయొక్క రూపమును బట్టియే గ్రహింతురు. రూపమును వేరుచేసి వేరుగా వస్తువుయొక్క భావమును గుర్తించుట అసంభవము. కాగా "అస్తి" యనుటకుగాని, "నాస్తి" యనుటకుగాని ఏదోయొకి వస్తురూపము మానసికముగనైనను ఉండక తప్పదు. కావుననే ఒక వస్తువు మరియొక దాని యొక్క అభావము కావచ్చును.

విశేషము— మహాసత్తకైనను కృతకమైన రూపములను (బాహ్య రూపములు) భావింపనిచో అది సర్వశూన్యమే యగును అట్టిది మనసునకుగాని వాక్కునకుగాని అందదు అట్లయినపుడు లోకవ్యవహారము నడువదు. అందుచే వస్తువుల రూపముల ననుసరించియే భావాఽభావములను తెలియక తప్పదు. ॥31॥

అవతారిక— శూన్యమైన తావున దట్టమైన చీకటియందు చేతితో తడవుచు— ''ఏమియు లేదు'' అను అభావమును అనుభవింతురు. అచట వస్తువుయొక్క ప్రసక్తి లేదు గదా ! అయినను అభావము వస్తురూప మెట్లగును ,— అను శంకను త్రోసి పుచ్చుచున్నాడు

శ్లో॥ భావాభావౌ ఘటాదీనామస్పృశన్నపి పాణినా ।
కశ్చిద్వేదాఽప్రకాశేఽపి ప్రకాశే తత ఏవ వా ॥ 32

ప్రకాశే = వెలుగునందును, వా = లేక. అప్రకాశే + అపి = చీకటియందును కూడ, కశ్చిత్ = ఒకానొకడు, పాణినా = చేతితో, అస్పృశన్ + అపి = తాకకున్నను, ఘటాదీనామ్ = ఘటము మొదలగు వానియొక్క, భావాఽభావౌ = భావాఽభావములను, తతః + ఏవ = ఆ వస్తువులను బట్టియే, వేద = తెలిసికొనును.

తాత్పర్యము— ఆ యా వస్తువులయొక్క స్వరూపములు వేరే ప్రమాణములచే

ముందుగనే నిశ్చితములై యుండును. గాఢాంధకారమున గూడ చేతితో తాకకున్నను ఆ యా నిశ్చితములైన వస్తువులను బట్టియే వానియొక్క భావమునుగాని అభావమునుగాని గ్రహింప వీలగును వెలుగు విషయమున వేరుగ చెప్పనక్కరలేదు. కావున ఒక వస్తువు వేరొక వస్తువు యొక్క అభావమగుటలో అనుపపత్తి లేదు.

వివరణము— వస్తువులయొక్క స్వరూప స్వభావములన్నియును ప్రమాణాంతరములచే గట్టిపడి మనసున హత్తుకొని యుండును. చికటిలో చేతికి తగులకుండుటచే ఆ యా వస్తువుల అభావమును వాని రూపమును బట్టియే భావింతుము. (ముందుగ తెలియని వస్తువైనచో దాని భావము విశదపడదు. అయినను ''ఏదో ఒక అకారమ''ను జ్ఞానము మాత్రము కలుగును అదియు దాని రూపమును బట్టియే గదా ! అందువలన భావము వస్తురూపమైనట్లు అభావము కూడ వస్తురూపమే యగును. ॥32॥

అవతారిక— వేరొక మతము ప్రకారము జన్మమును నాశమును విశదీకరింపుచున్నాడు.

శ్లో॥ వ్యాపి సౌక్ష్మ్యం క్వచిద్యాతి క్వచిత్సం హన్యతే పునః ।
అకుర్వాణోఽథవా కించిత్ స్వశక్త్యైవం ప్రకాశతే ॥ 33

వ్యాపి = అంతటను వ్యాపించియుండు తత్త్వము, క్వచిత్ = ఒకచోట, సౌక్ష్మ్యమ్ = సూక్ష్మమగుటను, యాతి = పొందును, పునః = మరియు, కృచిత్ = వేరొకచోట, సంహన్యతే = స్వరూపమును పొందును, అథవా = లేక, కించిత్ = ఏమియు, అకుర్వాణః = చేయనిదై, స్వశక్త్యా = తన శక్తిచే, ఏవమ్ = ఇట్లు, ప్రకాశతే = ప్రకాశించును.

తాత్పర్యము— ప్రధానమను తత్త్వమొకటి యున్నది. దానినే ''ప్రకృతి'' యనియు నందురు. అది సర్వవ్యాపకము. సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములు దాని స్వరూపము. ఒకప్పుడా ప్రకృతి సంకోచమును పొందును. ఈ అవస్థను ''నశ్యతి'' అను క్రియగను, ''నాశః'' అను ద్రవ్యముగను చెప్పుదురు. మరియొకప్పుడా ప్రకృతియే వికాసమును చెందును ఈ అవస్థను ''జాయతే'' అని క్రియగను, ''జాతః'' అని ద్రవ్యముగను వ్యవహరింతురు. ఈ సంకోచ వికాసములు అనెడు రెండు దశలును ప్రకృతియొక్క శక్తి విలాసములే.

వివరణము— ప్రకృతి సర్వశక్తి సంపన్నమనియును సర్వకారణమనియును సాంఖ్యు లందురు తదనుసారము జన్మనాశములనునవి ప్రకృతియొక్క అవస్థాభేదములే తప్ప వేరు అంశములు కావు. ॥33॥

అవతారిక— పరబ్రహ్మమే అజ్ఞానవశమున క్రియా సామాన్యముగను క్రియా విశేషముగను తోచునని వేరొక మతమును చూపుచున్నాడు.

శ్లో॥ సర్వరూపస్య తత్త్వస్య యత్ క్రమేణేవ దర్శనమ్।
భాగైరివ ప్రక్ల్పప్తిశ్చ తాం క్రియామపరే విదుః॥ 34

సర్వరూపస్య = ఎల్ల రూపములునుగల, తత్త్వస్య = పరబ్రహ్మముయొక్క, క్రమేణ + ఇవ = క్రమమున్నట్లుగ, దర్శనమ్ = కనబడుటయు, భాగైః + ఇవ = భాగములున్నట్లుగ, ప్రక్ల్పప్తిః + చ = కల్పనమును, యత్ = ఏది గలదో, తామ్ = దానిని. క్రియామ్ = క్రియనుగ, అపరే = మరికొందరు, విదుః = తెలియుదురు.

తాత్పర్యము— సర్వసృష్టికిని నిదానమగు తత్త్వమొకటే. దానినే "సత్తు" అనియు, "బ్రహ్మము" అనియు నందురు అది సర్వశక్తి సంపన్నము. కాలము, దిక్కు మొదలగునవి ఆ సత్తుయొక్క మహాశక్తులు అందు కాలమను శక్తివిబట్టి క్రమమును భాగములును తోచును ఇట్లు తోచు అంశమును క్రియ యందురు. దిక్కు, దేశము అను శక్తులను బట్టి సిద్ధరూపములు గోచరించును. వానిని ద్రవ్యములని చెప్పుదురు ఇదంతయు అజ్ఞాన విలసితము. వస్తుతత్త్వమున ఎట్టి భేదములును ఎట్టి వ్యవహారములును లేవు

వివరణము— ఇది బ్రహ్మాద్వైతమతము పరబ్రహ్మమే అజ్ఞానమువలన ప్రపంచముగ తోచుననియు, అది భ్రాంతియనియును, వాస్తవమున నామరూపములు లేవనియును దీని సారము. దీని ననుసరించి సాధ్యము, క్రమము, క్రియ. - సాధనము, అక్రమము, ద్రవ్యము మొదలగు వ్యవహారములన్నియును కేవలము భ్రాంతిజనితములని పర్యవసించును. పై కారిక పరిణామవాదమును చూపినది. ఒక వస్తువు వేరొక వస్తువుగా మారుట పరిణామమగును. ఉదా : పాలు పెరుగుగా మారుట. ప్రకృతియే ప్రపంచముగ మారుట "పరిణామ" మగును కాగా క్రియ యనునది ప్రకృతియొక్క పరిణామమని దీని ముందరి కారిక సూచించినది. ఈ కారిక వివర్తవాదమును విశదీకరించినది. భ్రాంతివలన ఒక వస్తువు వేరొక వస్తువుగా తోచుట "వివర్తమ"గును. ఉదా : చీకటిలో త్రాడు పాముగా తోచుట అట్లు బ్రహ్మమే ప్రపంచముగ తోచుట వివర్తమగును. కాగా "క్రియ" మొదలగు వ్యవహారములన్నియును బ్రహ్మ వివర్తములే యగును. ఇట్టి అద్వైత తత్త్వమే వైయాకరణులకు అభీష్టము. ॥34॥

అవతారిక— "సత్తయే సర్వ వ్యవహారములకును నిదాన"మని ఉపసంహరింపుచున్నాడు.

శ్లో॥ సత్తా స్వశక్తియోగేన సర్వరూపా వ్యవస్థితా।
సాధ్యా చ సాధనం చైవ ఫలం భోక్తా ఫలస్య చ॥ 35

సత్తా = సత్తయే, స్వశక్తియోగేన = తన శక్తుల సంబంధముచే, సర్వరూపా = సకలమైన రూపములును గలదిగ, వ్యవస్థితా = ఉన్నది. సాధ్యా + చ = సాధ్యమనియును, సాధనమ్ + చ + ఏవ = సాధనమనియును, ఫలమ్ = ఫలమనియును, ఫలస్య = ఫలముయొక్క, భోక్తా + చ = భోక్తయనియును, (కథ్యతే = చెప్పబడును).

తాత్పర్యము— సృష్టిలో కనబడు వస్తు సముదాయమునకును దానికి సంబంధించిన సకల వ్యవహారములకును మూలము సత్తయే. "సత్" (ఉన్నది) అను జ్ఞానమంతటను ఎడతెగక ఉండును. అది సర్వశక్తి సంపన్నము. ఆ శక్తులవలననే సత్త ఒకటియేయైనను వివిధములుగ భాసించును. సాధ్యము, (క్రియ), సాధనము (ద్రవ్యము), ఫలము, భోక్త (ఫలము ననుభవించువాడు) మొదలగునవన్నియును సత్తయొక్క ఔపాధిక భేదములే (ఆ యా దేశకాల పాత్రముల ననుసరించి ఏర్పడునవి. దేశకాలాదులును వాస్తవమున కల్పితములే).

వివరణము— వ్యావహారికముగ క్రియా లక్షణము నెన్ని విధములుగ చూపినను పారమార్థికముగ "సత్తయే క్రియ"యని ఇచటి తత్త్వము. క్రియ విషయముననే గాక మిగిలిన అన్ని విషయములందును గూడ పరమార్థ మిదియేయని, "తాం ప్రాతిపదికార్థం చ ధాత్వర్థం చ ప్రచక్షతే", "సైవ భావవికారేషు షడవస్థాః ప్రపద్యతే" (జాతి సముద్దేశము-35 కా) మొదలగు వచనములతో గ్రంథకర్త పెక్కుసారు లిదివరకే ప్రతిపాదించెను. బ్రహ్మాద్వైతమన్నను సత్తాద్వైతమన్నను, మరియే అద్వైతమన్నను తాత్పర్య మొకటే. "ఒకటియే అనేకముగ తోచును" అన్నది ఆ తాత్పర్యము. ॥35॥

అవతారిక— సాధన సముద్దేశమందు ఇదివరకు చూపిన క్రియా లక్షణమును గుర్తుచేయు చున్నాడు.

శ్లో॥ క్రియామన్యే తు మన్యంతే క్వచిదప్యన పాశ్రితామ్ ।
సాధనై కార్థకారిత్వే ప్రవృత్తిమనపాయి నీమ్ ॥ 36

అన్యే + తు = మరికొందరైతే, క్వచిత్ + అపి = ఎచటను, అనపాశ్రితామ్ = ఆధారపడనటువంటిన్ని, అనపాయినీమ్ = నాశములేని, సాధనైకార్థకారిత్వే = సాధనములతో కలిసి ఒక ఫలమును సాధించుట కుపయోగించు, ప్రవృత్తిమ్ = ప్రవృత్తిని (వ్యాపారమును), క్రియామ్ = క్రియనుగ, మన్యంతే = తలంతురు

తాత్పర్యము— నిత్యమైనట్టియు స్వతంత్రమైనట్టియు ఒక శక్తి సాధనముల ద్వారమున ఫలమును సాధించును. అది సాధనముల ప్రవృత్తిరూపమున గోచరించును.

వివరణము— "ప్రవృత్తిరేవ ప్రథమం క్వచిదప్య న పాశ్రితా" అను సాధన సముద్దేశమందలి కారిక (సాధన. 33. కా.) ప్రతిపాదించిన క్రియాలక్షణ మిచట పరామర్శింపబడెను. ॥36॥

అవతారిక— "నిత్యమైన శక్తి సాధ్యమెట్లగును?" అను శంకకు సమాధానము చూపుచున్నాడు.

శ్లో॥ సామాన్యభూతా సా పూర్వం భాగశః ప్రవిభజ్యతే ।
తతో వ్యాపారరూపేణ సాధ్యేవ వ్యవతిష్ఠతే ॥ 37

పూర్వమ్ = మొదట, సామాన్యభూతా = సామాన్యముగ నుండు, సా = ఆ శక్తి, భాగశః = భాగములుగ, ప్రవిభజ్యతే = విభజింపబడును. తతః = తరువాత, వ్యాపార రూపేణ = వ్యాపారముల స్వరూపముచే, సాధ్యాఇవ = సాధ్యమైనట్లుగ, వ్యవతిష్ఠతే = ఉండును (కనిపించును).

తాత్పర్యము— వాస్తవముగ శక్తి నిత్యమే సాధ్యము కాదు. ఎట్టి విభాగములును దానికి లేవు. అయినను ఆ శక్తి, సాధనములనుండి ప్రసరించునపుడు, సాధనముల భేదమును బట్టి భిన్నముగ (భేదములు గలదిగ) కనిపించును. కావుననే వ్యాపారముగ గోచరించినపుడు సాధ్యముగ కూడ భావింపబడును.

వివరణము— అవిభక్తమగు శక్తి సాధనముల భేదమును బట్టి విభక్తమైనట్లును సాధ్యమైనట్లును అనిపించును. తదనుసారమే వంట, నడక మొదలగు వ్యాపారములన్నియు వేర్వేరుగ తోచును కాగా సామాన్యావస్థయందు నిత్యమైన శక్తినే విశేషావస్థయందు "వ్యాపారమనియు సాధ్యమని"యును వ్యవహరింతురని ఫలించును. "కారకాణాం ప్రవృత్తి విశేషః క్రియా" (సాధనముల వ్యాపారమే క్రియ) అను పతంజలి వచనముయొక్క తాత్పర్యమిదియే.
॥37॥

అవతారిక— పై విషయముననే రెండు మతములను చూపుచున్నాడు.

శ్లో॥ ప్రకృతిః సాధనానాం సా ప్రథమం తచ్చ కారకమ్ ।
వ్యాపారాణాం తతోఽన్యత్వమపరైరుప వర్ణ్యతే ॥ 38

సా = నిత్యమైన ఆశక్తి, సాధనానామ్ = కారకములైన ద్రవ్యముల శక్తులకు, ప్రకృతిః = మూలము, తత్ + చ = అదియె, ప్రథమమ్ = మొదటిదగు, కారకమ్ = కారకము, (భవతి = అగును), తతః = ఆ శక్తికన్న, వ్యాపారాణామ్ = వ్యాపారములకు, అన్యత్వమ్ = భేదము, అపరైః = మరి కొందరిచే, ఉపవర్ణ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— సనాతనమైన శక్తియే సకల సాధనములకును ఆ యా శక్తిని ప్రసాదించును అది లేనిదే సాధనములకు శక్తియే ఉండదు కావున వాస్తవమైన కారక మా శక్తి యొకటే అయినను సాధనముల భేదము ననుసరించి దానికిని కొందరు భేదము నాపాదింతురు. "మూలమైన శక్తి వేరనియు దానివలన ప్రసరించు వ్యాపారములు వేరనియును" మరికొంద రందురు.

వివరణము— మూల భూతమగు శక్తి సామాన్యము. ద్రవ్యముల శక్తులు విశేషములు. "అవస్థనుబట్టి భేదముకాని వాస్తవమున రెండును ఒకటే" అని ఒక మతము. "రెండును వేర్వేరు" అని రెండవ మతము. ॥38॥

అవతారిక— కాగా "ఒకటే అయినను వేర్వేరుగ తోచు శక్తి క్రియ" అని తేలినది. అట్టి క్రియను ఆఖ్యాతము (తిఙ్ ప్రత్యయాంతము) బోధించునందురు. ఆఖ్యాతము

బోధించు అంశములు కారకము, సంఖ్య, కాలము, పురుషము మొదలగునవియు పెక్కు లున్నవి గదా! అయినపుడు "ఆఖ్యాతము క్రియనే తప్పక బోధించున"నుట ఎట్లు పొసగును అను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ బహూనాం సంభవేఽర్థానాం కేచిదేవోప కారిణః ।
సంసర్గే కశ్చిదేషాం తు ప్రాధాన్యేన ప్రతీయతే ॥ 39

బహూనామ్ = పెక్కు, అర్థానామ్ = అంశముల యొక్క, సంభవే = ఉనికియందు, సంసర్గే = సంబంధ మేర్పడగా, కేచిత్ + ఏవ = కొన్ని అంశములే, ఉపకారిణః = సాయము చేయు నవియై, (భవంతి = అగును), ఏషామ్ = వీనిలో, కశ్చిత్ + తు = ఒక అంశమైతే, ప్రాధాన్యేన = ముఖ్యముగా, ప్రతీయతే = తెలియబడును.

తాత్పర్యము— పెక్కు అంశము లొకచో కూడినపుడు వానికొక సంబంధమును చెప్పక తప్పదు. సంబంధము లేనిచో వాని సమావేశమునకు ప్రయోజనముండదు. అట్లు సంబంధము కుదిరినపుడు ఆ యంశములలో ఏదో ఒక అంశము మాత్రమే ఉపకారమును పొందునదియై ముఖ్యమగును. మిగిలినవన్నియు ముఖ్యమైన దానికి సాయముచేయుచు అప్రధానము లగును.

వివరణము— సంబంధమన్నది ఒకటి ఏర్పడినపుడు ఆ సంబంధమునకు లోనైన అంశము లన్నిటికిని సమప్రాధాన్య మెన్నడును కుదురదు ఒకటి ప్రధానమై మిగిలినవి అప్రధానమగుట సహజమైన విషయము. అందుచే ఆఖ్యాతము క్రియను ముఖ్యముగ తెలుపుటయు, కారకము మొదలగునవి అచట అప్రధానములగుటయును సంభవించును. ॥39॥

అవతారిక— మీది కారిక చెప్పిన యంశమునే ప్రకృతమున సమన్వయము చేయుచున్నాడు

శ్లో॥ సాధ్యత్వాత్తత్ర చాఖ్యాతై ర్వ్యాపారాః సిద్ధసాధనాః ।
ప్రాధాన్యేనాఽభిధీయంతే ఫలేనాఽపి ప్రవర్తితాః ॥ 40

తత్ర + చ = వానిలోనయితే, సిద్ధసాధనాః = సిద్ధమైన కారకములు గలవియు, ఫలేన + అపి = ఫలముచే గూడ, ప్రవర్తితాః = ప్రవర్తింపజేయ బడిన, వ్యాపారాః = క్రియలు, సాధ్యత్వాత్ = సాధ్యములగుట వలన, ఆఖ్యాతైః = తిఙంతములచే, ప్రాధాన్యేన = ముఖ్యముగా, అభిధీయంతే = చెప్పబడును.

తాత్పర్యము— తిఙంతమువలన క్రియ, కారకము, కాలము, సంఖ్య, పురుషము మొదలగు పెక్కు అంశములు తెలిసినను వానిలో క్రియయే ముఖ్యమగును మిగిలినవన్నియు ముఖ్యమైన క్రియకు సాయముచేయుచు అప్రధానములగును. ఫలము కూడ క్రియకు అంగముగానే భావింపబడును. అట్టి క్రియ ఏదయినను "ఒకటియే" అనుట తత్త్వము.

వివరణము — "పచతి" అను దాని నుదాహరణముగా తీసికొనవచ్చును ఇచట "వండువాడు", అను కర్తయు, "అతడొకడే" అను సంఖ్యయు, "వర్తమానము" అను కాలమును, "అతడు" అను పురుషమును, "వంట" అను క్రియయు ఒక పదమువలననే తెలియును. అయినను "వంట" అను క్రియయె ముఖ్యమని వైయాకరణుల సిద్ధాంతము. సాధింపదగిన పని "వంట"యె కావున అది ప్రధానమగుటయు, మిగిలినవి ఏదోయొక విధముగ వంట కుపకరించునవి గాన అప్రధానములగుటయును న్యాయమే యగును.

విశేషము — క్రియను నిర్వర్తించు కారకము సిద్ధముగనే యుండునుగాన అది సాధ్యము కానేరదు. సంఖ్యయు, పురుషమును కారకమునకు చెందునుగాని సాక్షాత్తుగ క్రియకు చెందవు. క్రియ జరుగు సమయము వెల్లడి అగుటయే కాలమగును. ఇట్లే యంశములన్నియును క్రియకు అంగములే యగును. క్రియయే లేకున్నచో ఇవన్నియు వ్యర్థములుగా భాసించును. అట్లే తిఙంతము ఫలమును గూడ అప్రధానముగనే బోధించును. వాస్తవమున ఏ క్రియ అయినను ఫలముకొరకే ప్రవర్తించినను, ఆ యా క్రియను చెప్పునపుడదియే ముఖ్యమగుట సమంజసము. క్రియవలననే ఫలము పుట్టుటయు, ఫలము నుద్దేశించి "ఇట్లు చేయుము" "అట్లు చేయుము" అని క్రియనే సూచించుటయును లోకమున అనుభవసిద్ధము. కాగా క్రియ ముఖ్యమగుటయు ఒకటే అగుటయును సిద్ధించును. కావుననే "ఏకా క్రియా" (క్రియ ఒకటే) అని శాస్త్రజ్ఞు లందురు ॥40॥

అవతారిక — క్రియ ఒకటియే అయినచో "పంచకృత్వః పచతి" (అయిదు మారులు వండుచున్నాడు) మొదలగు ప్రయోగము లెట్లు కుదురును ? - అను శంకకు సమాధానము చూపుచున్నాడు.

శ్లో॥ ఏకత్వావృత్తి భేదాభ్యాం భేదాభేద సమన్వయే ।
సంఖ్యాస్తత్రోపలభ్యంతే సంఖ్యేయావయవ క్రియాః ॥ 41

తత్ర = ఆ క్రియయందు, ఏకత్వా వృత్తి భేదాభ్యామ్ = "ఏకత్వము", "ఆవృత్తి" యను భేదముల వలన, భేదాభేద సమన్వయే = భేదమును అభేదమును గూడ సంభవింపగా, సంఖ్యేయావయవ క్రియాః = లెక్కింప వీలయిన అవయవ క్రియలుగల, సంఖ్యాః = సంఖ్యలు, ఉపలభ్యంతే = పొందబడును.

తాత్పర్యము — క్రియ ఒకటియే. అయినను దానికి ఆవృత్తిని (మరల మరల జరుగుట) చూపవచ్చును. ఇట్లు ఒకటియగుట వలన అభేదమును ఆవృత్తి కవకాశముండుట వలన భేదమును క్రియయందు భావించినచో, "పంచకృత్వః పచతి" మొదలగు ప్రయోగములు ఉపపన్నము లగును అనగా "పచతి" అను ఆఖ్యాతము క్రియయొక్క ఏకత్వమును "పంచకృత్వః" అను పదము దాని ఆవృత్తులకు చెందిన సంఖ్యాభేదమును తెలియజేయును.

వివరణము — విడిగా ఏ క్రియను తీసికొన్నను దానికి "ఫల మొకటే" అనియు

''కర్తయు ఒకడే'' అనియు భావించి ''క్రియ ఒకటి'' అని యనుచుందురు ఉదా ; వంట, నడక, వ్రాత మొదలగు క్రియ ''పచతి'' (వండుచున్నాడు), ''పచతః'' (ఇరువురు వండుచున్నారు), ''పచంతి'' (పలువురు వండుచున్నారు), మొదలగు చోట్ల తిఙ్ ప్రత్యయముల వలన తెలియు సంఖ్యాభేదము కర్తకు చెందునదేగాని క్రియకు చెందునది కాదు. కాగా ప్రవాహ రూపమైన క్రియ ఒకటిగానే కనబడును అయినను ఆవృత్తిని బట్టి క్రియయందు భేదము నూహింపవలెను. ఇట్లు భేదమును అభేదమును కూడ అవలంబించినందువలన ''పంచకృత్వః- పచతి – పచతః – పచంతి'' మొదలగు ప్రయోగములు కుదురును. వీనిలోని తిఙంతము క్రియకు చెందిన ఏకత్వమును, సంఖ్యావాచకము ఆవృత్తికి చెందిన సంఖ్యయొక్క భేదమును తెలియజేయును.

విశేషము— (1) మాటిమాటికిని ఒక పని జరుగుట ''ఆవృత్తి'' అగును. క్రియ యొక్క ఆవృత్తిని తెలియజేయునపుడు సంఖ్యావాచకమునకు కృత్వస్, స్ మొదలగు ప్రత్యయములు చేరును. ''పంచకృత్వః'' ''షట్ కృత్వః'', ''ద్విః'' (రెండు మారులు), ''త్రిః'' (మూడు మారులు) మొదలగునవి ఉదాహరణములు.

(2) ''పాకః, పాకౌ, పాకాః''. ఇచట ''పాక'' శబ్దము కృత్ప్రత్యయాంతము. వంటయొక్క సిద్ధావస్థను ఇది తెలియజేయును. కావున కారకముతోడి సంబంధముండదు. కావుననే దీనికి సంఖ్యాయోగము కుదురును (ఒక పాకము, రెండు పాకములు మొదలగు రీతి). ''సాధ్యమైన క్రియకు సంఖ్యాయోగము సహజము కాదు. సిద్ధమైన ద్రవ్యమున కది సహజము'' అనునది సారాంశము.

(3) తిఙ్ ప్రత్యయము సాధ్యావస్థను, కృత్ప్రత్యయము సిద్ధావస్థను బోధించుట రూఢము (ప్రసిద్ధము) ॥41॥

అవతారిక— ''పాకః'' మొదలగుచోట్ల ''పచ్యాది క్రియ సిద్ధముగనే ప్రతిపాదింప బడినచో పెక్కు చిక్కులు కలుగున''ని విశదీకరింపుచున్నాడు.

శ్లో॥ సిద్ధస్యార్థస్య పాకాదేః కథం సాధనయోగితా ।
సాధ్యత్వే వా తిఙంతేన కృతాం భేదోఽన కశ్చన ॥ 42

సిద్ధస్య = సిద్ధమైన, చేయ నావశ్యకత లేని) పాకాదేః = పాకము మొదలగు, అర్థస్య = విషయమునకు, సాధనయోగితా = కారకములతో సంబంధము, కథమ్ = ఎట్లు (భవతి = కలుగును), వా = లేక, సాధ్యత్వే = సాధ్యమైనచో, తిఙంతేన = తిఙంతముతో, కృతామ్ = కృదంతములకు, కశ్చన = ఏ విధమైన, భేదః = భేదము, న = లేకపోయెడిని.

తాత్పర్యము— సిద్ధమైన విషయమునకు కారకము లక్కరలేదు. సాధ్యమే అయినచో తిఙంత రూపమునకును కృదంత రూపమునకును భేదము లేకపోవును కావున ''పాకః'' మొదలగు కృదంతము సిద్ధావస్థను, ''పచతి'' మొదలగు తిఙంతము సాధ్యావస్థను తెలుపునని విభాగమును చేసికొనవలెను,

వివరణము— తి, తః, అంతి మొదలగునవి తిఙ్ ప్రత్యయములు ఇవి ధాతువులకు చేరి ఆ యా క్రియయొక్క సాధ్యావస్థను తెలుపునని ఇదివరకే ప్రతిపాదింపబడినది. 'తృ, తి, ఘఞ్ (అ)' మొదలగునవి కృత్ ప్రత్యయములు. ఇవియు ధాతువులకే సూటిగా చేరును. కర్త, కర్మ, భావము (కేవలము ధాతువుయొక్క అర్థము) మొదలగు అర్థములను ఇవి బోధించును. ఉదా: కర్తృ, కృతి, కారక మొదలగునవి. కాగా కృత్ప్రత్యయములు అంతమందు గల రూపములు సిద్ధమైన అర్థమునే తెలుపును. ఇట్లు తిఙంతములకును కృదంతములకును భేదము సిద్ధించును తిఙంతములు కూడ క్రియయొక్క సిద్ధావస్థనే తెలుపుచున్నచో ఇట్టి భేదము సిద్ధింపక పోవును క్రియ సిద్ధమైనపుడు దానిని సాధించుటకై వేరుగ కారకములును వ్యర్థములయ్యెడిని. ''దేవదత్తః పచతి'' అనునట్లు ''దేవదత్తః పాకః'' అను ప్రయోగము యొక్క వాడుకగాని అవసరముగాని లేదుగదా.

విశేషము— ''ఘఞ్'' అను ఒక కృత్ప్రత్యయ మున్నది. ఇది సామాన్యముగ భావార్థమున ప్రవర్తించును. పచ్ ధాతువున కీ ప్రత్యయము చేరినచో ''పాక'' అను రూపమగును. ''వంట'' అను క్రియా భావమే దీనివలన బోధపడును ఇట్టి కృదంతముల స్వభావమును స్పష్టపరచుటకు ఈ ఘట్ట మారంభింపబడినది. 'కృదంతములు క్రియయొక్క సిద్ధావస్థను తిఙంతములు క్రియయొక్క సాధ్యావస్థను బోధించుననుట'' ఇచటి సారము.

మరియు— ''కర్తృ కర్మణోః కృతి'' (2-3-65) అను సూత్ర మొకటియున్నది. ''కృత్ప్రత్యయాంతమును వాడినపుడు కర్తృవాచకమగు పదమునకును. కర్మవాచకమునకును షష్ఠి యగును'' అని దీని యర్థము. ''కృష్ణస్య కృతిః'' (కృష్ణుడు కర్తగాగల పని), ''జగతః కర్తా'' (జగమునకు కర్త, మొదలగునవి ఉదాహరణములు. ఈ సూత్రము ననుసరించి ''పాకః'' అను కృదంతమును వాడినచో కర్తృపదమునకు షష్ఠి రావలయును. (''దేవదత్తస్య పాకః'' మొదలగు రీతి). కాగా ''పాకః'' మొదలగు కృదంతములు సిద్ధావస్థను తెలుపునన్నచో, కారకముల సంబంధమే కుదురదుగాన, కృదంతయోగమున కర్తృ కర్మలకు షష్ఠిని విధించు ఈ సూత్రము అసంగతము కావలసి వచ్చును. ఇదొక చిక్కు. అట్లుగాక కృదంతము కూడ సాధ్యత్వమునే తెలుపునన్నచో కృత్తులకును తిఙ్లనకును భేదమే లేకపోయెడిని. ఇది వేరొక చిక్కు. (వీనిని పరిహరించు ఉపాయములు దిగువ కారికలలో చూపబడును). ॥42॥

అవతారిక— ''కర్తృ కర్మణోః కృతి'' (2-3-65) అను సూత్రమునకు తిఙంతము విషయము కానే కాదని ప్రతిపాదింపుచున్నాడు.

శ్లో॥ తత్ర కారకయోగయా యద్వ్యాఖ్యాతం నిబంధనమ్ ।
షష్ఠ్యాః సాలేన సంబంధే వ్యుదస్తా కర్తృ కర్మణోః ॥ 43

తత్ర = అచట, కారకయోగాయాః = కారకములకు ప్రవర్తించు, షష్ఠ్యాః = షష్ఠీ విభక్తికి, ఆఖ్యాతమ్ = తిఙ్ ప్రత్యయము (తిఙ్ ప్రత్యయాంతము), నిబంధనమ్ = నిమిత్తము,

యది = అగుసన్నచో, సా = ఆ షష్ఠి, లేన = లకారముతో, సంబంధే = సంబంధ మున్న పుడు. కర్తృ కర్మణోః = కర్తృ కర్మలకు, వ్యదస్తా = నిషేధింపబడినది.

తాత్పర్యము— "కర్తృ కర్మణోః కృతి" అను సూత్రము విధించు షష్ఠికి తిఙంతము నిమిత్తము కాదు. నిమిత్తమని యంగీకరించినను, లకారము యొక్క ఆదేశములను (తిఙ్ ప్రత్యయములను) వాడినపుడు ఆ షష్ఠి రాదని ప్రత్యేకముగ నిషేధమున్నది.

వివరణము— "ఆఖ్యాత" అను పదమును తిఙ్ ప్రత్యయమును బోధించునదిగా వాడుదురు. కొన్నిచోట్ల "తిఙంతము" అను నర్థమున గూడ దీనిని ప్రయోగింతురు పై సూత్రమున "కృతి" అని స్పష్టముగ నున్నందున తిఙంతము అచట నిమిత్తము కాదనియే తెలియును. నిమిత్తమని అంగీకరించినను "న లోకావ్యయనిష్ఠా ఖలర్థతృనామ్" (2-3-69) అను సూత్రము, తిఙంతముతో యోగ మున్నపుడు కర్తృ కర్మలకు షష్ఠి రాదని నిషేధించినది. కాగా "కృదంతముతో యోగ మున్నపుడు కర్తృ కర్మలకు షష్ఠిని విధించుట" వలన సిద్ధమైన పాకాదులకు సాధనయోగమును సూత్రకారు డంగీకరించినట్లు స్పష్టమగును కాని అది ప్రసిద్ధమైన యనుభవమునకు విరుద్ధము.

విశేషము— "లకారము యొక్క ఆదేశములను ఉ, ఉక మొదలగు కృత్ప్రత్యయములను వాడినపుడు కర్తృ కర్మలకు షష్ఠి రాదు" అని "న లోకావ్యయ" మొదలగు సూత్రమున కర్థము. తిఙ్ ప్రత్యయములును, శతృ, శానచ్ మొదలగు కొన్ని కృత్ప్రత్యయములును లకారము యొక్క ఆదేశములు. సిద్ధాంతమున ఇచట కూడ కృత్ప్రత్యయములే (శతృ, శానచ్ మొదలగునవి) లాదేశము లగును. అయినను తిఙ్లను గూడ లాదేశములుగా చెప్పనగును గాన అట్టి భావముతో ఈ కారిక బయలుదేరినది. ధాతు రూపముల ప్రక్రియలో మొట్టమొదట చూపబడు లట్, లిట్, లుట్ మొదలగునవి లకారము లనబడును. వానికి తిఙ్ ప్రత్యయము లాదేశములుగ చూపబడును. ॥43॥

అవతారిక— "పాకః" మొదలగుచోట్ల సాధ్యత్వము నంగీకరించి (పచ్యాది క్రియకు) కారకములతోడి సంబంధమును, సిద్ధత్వమును గూడ నంగీకరించి సంఖ్యాయోగమును (ఏకః, ద్వౌ మొదలగు సంఖ్యల సంబంధము) చెప్పగూడదా ? – అను శంకను త్రోసిపుచ్చుచున్నాడు.

శ్లో॥ ఏకాభిధాన ఏకోఽర్థో యుగపచ్చ ద్విధర్మభాక్ ।
న సంభవతి సిద్ధత్వే స సాధ్యః స్యాత్ కథం పునః ॥ 44

ఏకాభిధానః = ఒక శబ్దముచే బోధింపబడు, ఏకః = ఒక, అర్థః = అర్థము, యుగపత్ + చ = ఒకే సమయమున, ద్విధర్మభాక్ = రెండు ధర్మములు గలదై, న + సంభవతి = ఉండదు, సః = ఆ యర్థము, సిద్ధత్వే = సిద్ధమైనపుడు, పునః = మరల, సాధ్యః = సాధ్యమై, కథమ్ = ఎట్లు, స్యాత్ = అగును ?

తాత్పర్యము— ఒక శబ్దము తెలుపు అర్థమునకు ఒకే సమయమున రెండు ధర్మము లుండవు. సిద్ధమైన విషయము సాధ్యము కూడ ఎట్లగును ?

వివరణము— "పాకః" అను శబ్దము సిద్ధావస్థను మాత్రమే తెలుపును. "పచతి" అనునది సాధ్యావస్థను మాత్రమే తెలుపును కాగా "పాకః" మొదలగు కృదంతములలో అనుభూతమగు కారక సంబంధమును సంఖ్యా సంబంధమును (ఒకే సమయమున - దేవదత్తస్య - పాకః, పాకౌ, పాకాః మొదలగు ప్రయోగములు) ఉపపన్నము కాక తప్పదను పక్షమట్లే మిగిలినది. ॥44॥

అవతారిక— "పాకః" మొదలగుచోట్ల రెండు శబ్దములను కల్పించి, సిద్ధసాధ్య రూపమైన రెండర్థములను కూడ ఒకేసారి సంపాదింపవచ్చునని చెప్పుటకు ప్రారంభింపు చున్నాడు.

శ్లో॥ ఏతావత్ సాధనం సాధ్యమే తా వదితి కల్పనా ।
శాస్త్రఏవ న వాక్యేఽస్తి విభాగః పరమార్థతః ॥ 45

సాధనమ్ = సాధనము, ఏతావత్ = ఇంతటిది —లేక— ఇట్టిది, సాధ్యమ్ = సాధ్యము, ఏతావత్ = ఇట్టిది, ఇతి = అను, కల్పనా = కల్పనము, శాస్త్రే + ఏవ = వ్యాకరణశాస్త్రమందే, అస్తి = కలదు, పరమార్థతః = వాస్తవముగ, వాక్యే = వాక్యమందు, విభాగః = విభాగము, న + అస్తి = లేదు

తాత్పర్యము— ప్రక్రియకొరకు అపోద్ధారమును (విడమరచి చూపుట) అవలంబించి "ఇది సాధ్యము - ఇది సాధనము" అను విభాగమును వ్యాకరణము చూపును. అది వాస్తవము కాదు అఖండమగు వాక్యమే సత్యము.

వివరణము— "వాక్యము సత్యము. విభాగములన్నియు అసత్యములు" అనునది శబ్దశాస్త్ర రహస్యము. ఇది ఆయా సందర్భములలో తరచు గుర్తు చేయబడుచుండును. ప్రకృతమున - కల్పితమగు సాధ్యసాధన విభాగము నాశ్రయించినచో "పాకః" మొదలగు కృదంతములలో సిద్ధసాధ్య రూపములగు విరుద్ధార్థములు రెండును ఒకేసారిగ (ఒక శబ్దము వలననే) సిద్ధించుట కవకాశమున్నది ఉదా: "పాకః = పచ్ + అ". ఇచట ధాతువు సాధ్యమైన క్రియను, ప్రత్యయము సిద్ధమైన కారకమును (ద్రవ్యమును) బోధించును. ఇట్లు రెండవయవములను కల్పించి రెండర్థములను గూడ సంపాదింపవలెను. సహజమైన ఈ తీరునే శాస్త్రము కృతకముగ విశదీకరించునని ఫలించును. ॥45॥

అవతారిక— శాస్త్రముచేయు సాధ్యసాధన విభాగమును విశదీకరింపు చున్నాడు.

శ్లో॥ ఆఖ్యాత శబ్దే భాగాభ్యాం సాధ్యసాధన వర్తితా ।
ప్రకల్పితా యథా శాస్త్రే స ఘఞాదిష్వపి క్రమః ॥ 46

ఆఖ్యాతశబ్దే = తిఙంతమైన పదమందు, భాగాభ్యామ్ = అవయవములకు, సాధ్యసాధనవర్తితా = సాధ్యమును సాధనమును బోధించుట, శాస్త్రే = శాస్త్రమందు, యథా = ఎట్లు, కల్పితా = కల్పింపబడినదో, సః = ఆ, క్రమః = తీరు, ఘఞాదిషు + అపి = ఘఞ్ మొదలగు కృత్ప్రత్యయముల విషయమందును, (కల్పితః = కల్పింపబడినది .

తాత్పర్యము— ''పచతి'' మొదలగునవి తిఙంతములు. ఇచట ధాతువు సాధ్యమైన క్రియను బోధించుననియు, ప్రత్యయము కారకము మొదలగు వానిని బోధించుననియును శాస్త్రము చెప్పును ఇదే తీరును ''పాకః'' మొదలగు కృదంతరూపముల విషయములో గూడ అవలంబింపవలెను.

వివరణము— ధాతు భాగము అన్నిచోటులందును ఎల్లపుడును క్రియనే తెలుపును (ఉదా : పచతి, పచ్యతే, పాకః, పక్తా మొదలగునవి). ప్రత్యయభాగము కారకము, సంఖ్య, కాలమ మొదలగు అంశములను నియతముగ చెప్పును (ఉదా : తి, (కర్త) తే, (కర్మ) ఘఞ్ = అ, (భావము మొదలగునవి). కాగా ఒకే పదమున రెండు భాగములను కల్పించి రెండర్థములను సంపాదించుట శాస్త్రీయమైన కృత్యమే.

అవతారిక — ఇట్లుండ కృదంతములగు పదముల విభాగములో గల విశేషమును వక్కాణింపు చున్నాడు.

శ్లో॥ సాధ్యత్వేన క్రియా తత్ర ధాతురూప నిబంధనా ।
సత్త్వ భాగస్తు యస్తస్యాః స ఘఞాదినిబంధనః ॥ 47

తత్ర = అచట (కృదంతములయందు), క్రియా = క్రియ, సాధ్యత్వేన = సాధ్యముగా, ధాతురూప నిబంధనా = ధాతు భాగముచే తెలియబడునది, (భవతి = అగును), తస్యాః = ఆ క్రియయొక్క, యః = ఏ, సత్త్వభాగః + తు = సత్త్వభాగము గిలదో, సః = అది, ఘఞాదినిబంధనః = ఘఞ్ మొదలగు కృత్ప్రత్యయములచే తెలియబడునది (భవతి=అగును)

తాత్పర్యము— ''పాకః'' మొదలగు కృదంతములలోని ధాతుభాగము సాధ్యావస్థను తెలుపును కావున కారకములతో సంబంధము కుదురును. ఘఞ్ మొదలగు ప్రత్యయ భాగము క్రియకు సత్త్వభావమును ఆపాదించును. అనగా సిద్ధమైన ద్రవ్యరూపమును బోధించును. కావున లింగముతోను, సంఖ్యతోను సంబంధము కుదురును.

వివరణము— సత్త్వమనగా సిద్ధముగానున్న ద్రవ్యము. దానికి లింగ సంఖ్యా యోగము సహజము. ఇట్లు ''ఘఞ్'' మొదలగు భావార్థకమైన కృత్ప్రత్యయము సత్త్వమును చెప్పునని ఫలించును. కాగా తిఙ్ ప్రత్యయములకును కృత్ప్రత్యయములకును భేదము సిద్ధించినది. ''పాకః'' మొదలగు ఒకే పదము ఒకే సమయమున సిద్ధసాధ్యరూపమైన రెండర్థములను గూడ చెప్పుటలో బాధకము లేదనియును పర్యవసించినది

ఈ సందర్భమునందంతను అన్ని విషయములలోను "పచ్" ధాతువు ఉదాహరణముగా తీసికొనబడినది. దీని ననుసరించి "ప్రతియొక ధాతువునకును ఇదే తీరు" అని గ్రహింపవలెను. ॥47॥

అవతారిక — ఒక శబ్దమందలి భాగములు రెండర్థములను బోధించుటలో దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ బంధుతా భేదరూపేణ బంధుశబ్దే వ్యవస్థితా ।
సమూహః బంధ్వవస్థా తు ప్రత్యయేనాఽభిధీయతే ॥ 48

బంధుతా = బంధు సమూహము. భేదరూపేణ = భేదముతో, బంధుశబ్దే = "బంధు" అను శబ్దమందు, వ్యవస్థితా = ఉన్నది. సమూహః = సముదాయ రూపమైన, బంధ్వవస్థా + తు = బంధువుల స్థితియైతే, ప్రత్యయేన = ప్రత్యయముచే, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— "బంధుతా" అని ఒక పదమున్నది. "బంధు" అను శబ్దమునకు "త" అను తద్ధిత ప్రత్యయము చేరగా అది ఏర్పడినది. "బంధు సమూహము" అని యర్థము. ఇచట బంధు శబ్దము భేదముతో బంధు సముదాయమును తెలుపును. "త" అను ప్రత్యయము అభేదముతో బంధు సముదాయమును తెలుపును. కాగా ప్రకృతి ప్రత్యయములు రెండును రెండర్థములను చెప్పినట్లగును

వివరణము— "గ్రామ జన బంధుభ్యస్తల్" (4-2-43) అను సూత్రముచే బంధు శబ్దమునకు "సమూహము" అను అర్థమున "తల్" ప్రత్యయము విధింపబడినది "బంధూనామ్ - సమూహః = బంధుతా = బంధువుల సమూహము". "బంధవః" అన్నను "బంధుతా" అన్నను అర్థ మొకటే. అయినను బహువచనాంతమైన బంధుశబ్దము భేద ప్రధానమైన బంధు సముదాయమును బోధించును (బంధువులు). తద్ధితాంతమైన "బంధుతా" శబ్దము అభేద ప్రధానమైన బంధు సముదాయమును తెలుపును (ఒక బంధు సమూహము). ఇదియే భేదము. వాస్తవమున బంధువులకన్న వేరుగ సముదాయమన్నది ఉండదు గదా ! కాగా ప్రకృతి ప్రత్యయములు రెండును రెండర్థములను చెప్పుట ప్రసిద్ధమైనందున, "పాకః" మొదలగుచోట్ల అట్లు సిద్ధ సాధ్యరూపమైన రెండర్థములును వచ్చుటలో విప్రతిపత్తి లేదని సారము.

విశేషము— "వాని సమూహము" అను నర్థమున గ్రామ, జన, బంధు అను శబ్దములకు "తల్" (త) ప్రత్యయమగును అని పై సూత్రముయొక్క అర్థము. ఉదా : "గ్రామాణామ్ - సమూహః = గ్రామతా" మొదలగునవి. (బహువచనము "పెక్కు గ్రామములు" మొదలగు భావమును, "త" ప్రత్యయము "వాని గుంపు" అను భావమును కలుగజేయును). ॥48॥

అవతారిక— ఈ విధముగ "పాకః" మొదలగుచోట్ల శబ్దభేదము సిద్ధించును గాన (ప్రకృతి + ప్రత్యయము), విషయభేదము సిద్ధించుటలో బాధకము లేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ తత్రయం ప్రతి సాధ్యత్వమ సిద్ధా తం ప్రతిక్రియా ।
సిద్ధా తు యస్మిన్ సాధ్యత్వం న తమేవ పునః ప్రతి ॥ 49

తత్ర = అచట, యమ్ + ప్రతి = దేని నపేక్షించి, సాధ్యత్వమ్ = సాధ్యత్వము (ఆవశ్యకమగునో), తమ్ + ప్రతి = దానిని గురించి, క్రియా = క్రియ, అసిద్ధా = సిద్ధముకానిది, (భవతి = అగును), యస్మిన్ = ఏ విషయమున, క్రియా = క్రియ, సిద్ధా + తు = సిద్ధమగునో, తమ్ + ఏవ + ప్రతి = దానిని గూర్చియే, పునః = మరల, సాధ్యత్వమ్ = సాధ్యత్వము, న = కాదు

తాత్పర్యము— క్రియ సాధ్యమగునపుడు సాధనములను (కారకములను) అపేక్షించును. ఈ స్థితిలో క్రియ ఎన్నడును సిద్ధము కాదు. ఇట్టి సాధ్యమగు క్రియయే "పాకః" మొదలగు చోట్ల ధాతు భాగముచే బోధింపబడును సిద్ధమైన క్రియ కృత్ప్రత్యయమును అపేక్షించును ఈ స్థితిలో సాధనముల ఆవశ్యకత దాని కుండదు. లింగ సంఖ్యలు మాత్రమే దానికి సంబంధించును.

వివరణము— "పాకః" మొదలగు కృదంతములలో ధాతు భాగముయొక్క విషయము వేరు. (సాధ్యత్వమును సాధనాపేక్షయు). ప్రత్యయభాగము యొక్క విషయము వేరు. (సిద్ధత్వమును సాధనాపేక్ష తొలగుటయు) ॥49॥

అవతారిక— విషయము వేరైనపుడు అర్థమును బోధించుటలోని వైషమ్యము గూడ సమంజసమేయని ఒక దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ రాజ్ఞః పుత్రస్య నప్త్రేతి న రాజ్ఞి వ్యతిరిచ్యతే ।
పుత్ర స్యార్థః ప్రధానత్వం న చాస్య వినివర్తతే ॥ 50

"రాజ్ఞః - పుత్రస్య - నప్తా" + ఇతి = "రాజుయొక్క కుమారుని మునిమనుమడు" అను చోట, పుత్రస్య = పుత్ర శబ్దముయొక్క, అర్థః = అర్థము, రాజ్ఞి = రాజశబ్దము యొక్క అర్థము విషయమున, న + వ్యతిరిచ్యతే = వేరుగా ఉండదు (సంబంధింపకుండ విడిగా ఉండిపోదు), అస్య = దీనికి, (పుత్ర శబ్దార్థమునకు), ప్రధానత్వమ్ + చ = ప్రాముఖ్యము కూడ, న + వినివర్తతే = పోదు.

తాత్పర్యము— "రాజ్ఞః పుత్రస్య నప్తా శోభతే" అను వాక్యమున్నది. "రాజుగారి కుమారుని మునిమనుమడు ప్రకాశింపుచున్నాడు" అని యర్థము. ఇచట మునిమనుమడు ముఖ్యుడు వీనిని బట్టి కుమారుడు అముఖ్యుడగును అయినను "రాజుయొక్క కుమారుడు"

అను నర్థము అభీష్టముగాన, రాజసంబంధమును సూచించుటకు (రాజునుబట్టి) కుమారుడు కూడ ఒక విధముగ ముఖ్యుడే యగును. లోక వ్యవహారములో ఇట్లు ఒకే యర్థము ముఖ్య మగుటయు అముఖ్యమగుటయు అనుభవసిద్ధమై యున్నది. అట్లే ''పాకః'' మొదలగు స్థలము లలో రెండు భాగములవలన సిద్ధసాధ్య రూపమగు విరుద్ధార్థములు లభించుటలో దోషము లేదు. ॥50॥

అవతారిక— పై విషయముననే మరియొక దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ మృగోధావతి పశ్యేతి సాధ్యసాధన రూపతా ।
తథా విషయభేదేన సరణస్యోప పద్యతే ॥ 51

''మృగః + ధావతి + పశ్య'' + ఇతి = ''లేడి పరుగెత్తుచున్నది - చూడుము'' అను ప్రయో గమున, సరణస్య = పరుగెత్తుట, సాధ్యసాధన రూపతా = సాధ్యమును సాధనమును గూడ అగుట, తథా = ఆ విధముగ, విషయభేదేన = విషయముయొక్క భేదముచే, ఉపపద్యతే = కుదురును.

తాత్పర్యము— ''లేడి పరుగు పెట్టుచున్నది - చూడుము'' అనునది వాక్యము యొక్క స్వరూపము. ''లేడి పరుగును చూడుము'' అని దీనియొక్క భావము ఇచట ''పరు గెత్తుట'' అను క్రియకు కర్త లేడి. ''చూచుట'' అను క్రియకు కర్మ పరుగు. కాగా లేడి విషయమున ''పరుగు'' సాధ్యముగను (క్రియ), చూపు విషయమున ''పరుగు'' సాధనము గను (కర్మకారకము) అన్వయించును. ఇట్లు విషయభేదమువలన పరుగునకు సాధ్యత్వమును సాధనత్వమును ఒకే సమయమున సిద్ధించుచున్నది. ఈ విధముగనే ''పాకః'' మొదలగు కృదంతములలో ధాతు భాగముచే సాధ్యత్వమును ప్రత్యయ భాగముచే సిద్ధత్వమును తెలియుట విరుద్ధము కాదని ఎరుగునది.

వివరణము— ''ధావతి'' అనుచోట ''తి'' అను ప్రత్యయము కర్తను బోధిం చును. కావున ధావనమనునది సాధ్యమై లేడి కర్తయగును. లేడియే దర్శన క్రియకు కర్మ యైనచో ''మృగమ్'' అని ద్వితీయా విభక్తి రావలయును. అది అభీష్టము కాదు. అందుచే దర్శన క్రియకు ధావనమే కర్మయగును. అయినపుడది సిద్ధమని చెప్పక తప్పదు (కారక మెపుడును సిద్ధమే). ॥51॥

అవతారిక— కాగా పై ఘట్టమును ఉపసంహరింపు చున్నాడు

శ్లో॥ ల, కృత్య, క్త, ఖలర్థానాం తథాఽవ్యయ కృతామపి ।
రూఢి, నిష్ఠా, ఘఞాదీనాం ధాతుః సాధ్యస్య వాచకః ॥ 52

లకృత్య క్త ఖలర్థానామ్ = లకారములకు, కృత్య ప్రత్యయములకు, క్త ప్రత్యయములకును ఖలర్థ ప్రత్యయములకును సంబంధించినట్టియు, తథా = అట్లు, అవ్యయకృతామ్ + అపి = కృదంతములగు అవ్యయములకు సంబంధించినట్టియు, రూఢినిష్ఠాఘఞాదీనామ్ = క్తిన్ ప్రత్య

యము, క్త, క్తవతు ప్రత్యయములు, ఘఞ్ మొదలగు ప్రత్యయములు - వీనికి సంబంధించి నట్టి, ధాతుః = ధాతువు, సాధ్యస్య = సాధ్యమైన వ్యాపారమునకు, వాచకః = బోధకము (భవతి = అగును).

తాత్పర్యము— ధాతువున్నచో సాధ్యమైన క్రియ తెలియుటయు, లేనిచో అది తెలియకుండుటయును అనుభవ సిద్ధము కావున అన్వయ వ్యతిరేకములవలన అన్ని చోటు లందును ధాతువు సాధ్యావస్థనే బోధించునని చెప్పవలయును. కాగా లకారాదు లన్నింటను ధాతు భాగము సాధ్యవాచకమే యగును.

వివరణము— (1) ''ల'' = అనగా లట్, లిట్ మొదలగు లకారములు. వీనికే తిఙ్ ప్రత్యయము లాదేశము లగును ఉదా : పచతి, పచతః, పచంతి మొ॥

(2) కృత్య : తవ్య మొదలగు ప్రత్యయములు ఉదా : కర్తవ్యమ్, పఠితవ్యమ్ మొ॥

(3) క్త = ''త'' ప్రత్యయము. ఉదా : హసితమ్, జల్పితమ్, (నవ్వు, మాట) ఈ ప్రత్యయము భావార్థకము.

(4) ఖలర్థములు :— ''ఖల్'' (అ) అను ప్రత్యయముయొక్క అర్థమున వచ్చు ప్రత్యయములు. ఉదా : సులభః, దుర్లభః మొ॥

(5) అవ్యయకృత్తులు :— క్త్వా, తుమున్ మొదలగు ప్రత్యయములు. ఇవి అంత మందు గల శబ్దములు అవ్యయములగును. ఉదా . కృత్వా, గంతుమ్ మొ॥

(6) రూఢి .— ''క్తిన్'' అను భావార్థకమగు ప్రత్యయమునకు ఇది సూచకము. ఉదా : కృతిః, గతిః, మతిః మొ॥

(7) క్త ప్రత్యయము - క్తవతు ప్రత్యయము - ఈ రెండును ''నిష్ఠ'' అనిపించు కొనును ఉదా : పఠితమ్, పఠితవాన్, దృష్టమ్, దృష్టవాన్ మొ॥ (పైని చూపిన ''క్త'' ప్రత్యయము యొక్క స్వభావము కొంచెము భిన్నము).

(8) ఘఞాదులు :— ఘఞ్, ల్యుట్, అ, మొదలగు ప్రత్యయములు. ఉదా ; పాకః (ఘఞ్), పచనమ్ (ల్యుట్), ఇచ్ఛా (అ) మొదలగునవి.

ఈ స్థలము లన్నిటియందును ఆ యా ధాతువు సాధ్యమునే చెప్పును. కొన్నిచోట్ల ఆ యా కృత్ప్రత్యయములు మొత్తముపై సిద్ధావస్థను బోధించును. కొన్నిచోట్ల క్రియయే ముఖ్యమగును. (కృదంతములలోని సిద్ధసాధ్య విచారణ మింతతో ముగిసినది). ॥52॥

అవతారిక— పతంజలి ఒక సందర్భములో ''న తిఙంతేన ఉపమానమస్తి'' అని చెప్పెను. ''క్రియను ముఖ్యముగా బోధించు తిఙంతముతో (పచతి, కరోతి మొదలగునవి) ఉపమానము కుదురదు'' అని ఆ వచనముయొక్క భావము. ఆ యంశము నిటుపైని అయిదు కారికలతో విశదముచేయుటకు ప్రారంభింపుచున్నాడు.

శ్లో॥ సాధ్యస్యా పరినిష్పత్తేః సోఽయమిత్య నుపగ్రహః ।
తిఙంతై రంతరేణేవముపమానం తతో న తైః ॥ 53

సాధ్యస్య = సాధ్యమైన క్రియ, అపరినిష్పత్తేః = పూర్తి కానందున, తిఙంతైః = తిఙంతము లగు పదములచే, "సః + అయమ్ + ఇతి" = "అదే యిది" అను, అనుపగ్రహః = అస్వీకారము, (భవతి = అగును) తతః = అందువలన, ఇవమ్ = ఇవ శబ్దము, అంతరేణ = లేకుండ, తైః = ఆ తిఙంతములతో, ఉపమానమ్ = ఉపమానము, న = లేదు (కుదురదు).

తాత్పర్యము— తిఙంత మెల్లప్పుడును క్రియయొక్క సాధ్యావస్థనే (జరుగుస్థితి) బోధించును. సిద్ధమైన దాని నది బోధింపదు. ఉపమానమగుట సిద్ధమునకే చెల్లునుగాని సాధ్యమునకు చెల్లదు. కావున తిఙంతము బోధించు వ్యాపారము ఉపమానము కానేరదు. సాదృశ్యమును చెప్పు "ఇవ" (వలె) శబ్దమును ప్రయోగించునపుడు మాత్రము కొన్నిచోట్ల ఉపమాన భావ మొక విధముగ లభించును. ఇవ, శబ్దము లేనిచో అది ఏ విధముగను సంభవింపదు.

వివరణము— చంద్రః, సింహః మొదలగు సిద్ధమైన విషయములను ఉపమానములుగా స్వీకరింతురు. సిద్ధమైన వస్తువులు ఉపమానములగుట సహజము. ఉదా: "ముఖమ్ చంద్రః". "పురుషః సింహః" మొదలగునవి. ఇట్టిచోట్ల "అదేయిది" అను భావన కలిగి చివరకు "దానివంటిది యిది" అను సాదృశ్యభావన సిద్ధించును. కాని ఇట్టి స్థితి సాధ్యమైన క్రియకు కుదురదు. పచతి, గచ్ఛతి మొదలగు తిఙంతము లాయా క్రియ "ఇంకను జరుగుచున్నది" అనియే తెలుపును. అట్టి క్రియను ఉపమానముగా స్వీకరించుట అసంభవము. "దేవదత్తః పచతి ఇవ" (దేవదత్తుడు వండుచున్నాడు వలె) మొదలగు ప్రయోగములు సముచితములు కావు గదా!

అయితే ఒక విశేషము. "ఇవ" శబ్దము సాదృశ్యవాచకము. అది లేనపుడు తిఙంతములు (వాని యర్థములు) ఉపమానములు కానే కావు ఆ శబ్దమును ప్రయోగించినచో కొన్నిచోట్ల ఉపమాన భావమును ఎట్లో సాధింపనగును. ఉదా: "సః క్రందతి ఇవ గాయతి" (అతడు ఏడ్చుచున్నట్లు పాడుచున్నాడు) వాస్తవమున ఇచటగూడ తిఙంత ముపమానము కాదు. కర్తను బట్టియె ఉపమానోపమేయ భావమును సమర్థించుకొనవలెను. కాగా "పాడుచున్న అతడు ఏడ్చుచున్న వానివలె ఉన్నాడు" అను భావ మేర్పడును.

విశేషము— "ఇవ" శబ్దము ఉత్ప్రేక్షను గూడ బోధించును. తిఙంతము చెప్పు క్రియకు ఇవ శబ్దమును వాడి ఉత్ప్రేక్షను సంపాదింపవచ్చును. అందు బాధకము లేదు. ఉదా: "లింపతి ఇవ" = మై పూతయా అన్నట్లు, "వర్షతి ఇవ" = వర్షమో అన్నట్లు మొదలగునవి. ॥53॥

అవతారిక— "సాధనముల ద్వారమున క్రియకు ఉపమానోపమేయ భావమును సాధింపగూడదా?" అను శంకను వారింపుచున్నాడు.

శ్లో॥ సాధనత్వం ప్రసిద్ధం చ తిఙ్క్షు సంబంధినాం యతః ।
తేనాఽధ్యారోప ఏవ స్యాదుపమా తు న విద్యతే ॥ 54

తిఙ్క్షు = తిఙంతముల విషయములో, సంబంధినామ్ = సంబంధము గలవి, సాధనత్వమ్ = సాధనములగుట, యతః = ఎందువలన, ప్రసిద్ధమ్ + చ = ప్రసిద్ధమై యున్నదో, తేన = అందుచే, అధ్యారోపః + ఏవ = ఆరోపమే, స్యాత్ = అగును, ఉపమా + తు = ఉపమ అయితే, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— తిఙంతములు బోధించు క్రియతో సంబంధించునవి సాధనములే యగును. (క్రియ సాధ్యము. సాధ్యముతో సంబంధించునది సాధనమే గదా ?) అవి ఉపమేయ ములును క్రియ ఉపమానమును అగుట సంభవింపదు (సాధ్య ముపమానము కాదు). కాన ఆవశ్యకమగుచోట ఆరోపమును చెప్పుకొనవలయును గాని ఉపమానోపమేయ భావమును చెప్పరాదు. ఉదా : ''పర్వతః చలతి''. ఇచట చలన క్రియకు పర్వతము కర్త. వాస్తవ మున పర్వతము కదలదు. అయినను దానియందు కదలికను ఆరోపింపవలెను. అంతియకాని పర్వత ముపమేయమనియు, చలన ముపమానమనియును వ్యాఖ్యానింపకూడదు.

వివరణము— ''సాధనమును ఉపమేయముగను క్రియ నుపమానముగను చెప్ప రాదా ?'' అనునది శంకయొక్క సారము. ''క్రియతో సాక్షాత్తుగా సంబంధించు సాధనము నకు సాధనత్వమే ప్రసిద్ధముగాని ఔపమ్యము ప్రసిద్ధము కాదు'' అని సమాధానము యొక్క సారము. సాధ్యసాధన భావము వాస్తవము కానిచోట (''కొండ కదలుచున్నది'', ''ఆకాశము పడుచున్నది'' మొదలగునవి) ఆ యా క్రియను ఆ యా సాధనమం దారోపించుట సముచి తము. ॥54॥

అవతారిక— క్రియతో ఉపమానోపమేయ భావము కుదురకుండుటలో మరియొక హేతువును చూపుచున్నాడు.

శ్లో॥ న్యూనేషు చ సమాప్తార్థ ముపమానం విధీయతే ।
క్రియా చైవాశ్రయే సర్వా తత్ర తత్ర సమాప్యతే ॥ 55

న్యూనేషు = తక్కువైన వానియందు, సమాప్తార్థమ్ + చ = వ్యాపించిన గుణములు గలది, ఉపమానమ్ = ఉపమానముగ, విధీయతే = చెప్పబడును, క్రియా + చ = క్రియ అయితే, సర్వా + ఏవ = అంతయును, తత్ర + తత్ర = ఆ యా, ఆశ్రయే = ఆధారమందు, సమా ప్యతే = సమముగనే వ్యాపించియుండును.

తాత్పర్యము— అధికమైన గుణములు గలది ఉపమానమనియు, తక్కువ గుణ ములు గలది ఉపమేయమనియును ప్రసిద్ధము ఉదా : ''చంద్రః - ముఖమ్'' మొదలగునవి. క్రియకును సాధనమునకును ఇట్టి తీరు సంభవింపదు. అచట ''క్రియ ఎక్కువ, సాధనము తక్కువ'' అనుట కవకాశము లేదు. క్రియ తన కాధారమైన ఆ యా సాధనములందు సమము

గనే యుండునుగాని హెచ్చు తగ్గులతో నుండదు. (క్రియను ఎక్కువగను సాధనమును తక్కువగను నిరూపించుట అశక్యము). ॥55॥

అవతారిక— పై విషయమున ఒక దృష్టాంతమును చూపుచున్నాడు

శ్లో॥ యేనైవ హేతునా హంసః పతతీత్యభిధీయతే ।
ఆతౌ తస్య సమాప్తత్వాదుపమార్థో న విద్యతే ॥ 56

యేన = ఏ, హేతునా + ఏవ = హేతువుచే, ''హంసః + పతతి + ఇతి'' = ''హంస ఎగురు చున్నది'' అని, అభిధీయతే = చెప్పబడునో, తస్య = ఆ హేతువు, ఆతౌ = ఆతియను పక్షియందు, సమాప్తత్వాత్ = సమముగనే యున్నందువలన, ఉపమార్థః = ఉపమాన భావము, న + విద్యతే = ఉండదు (కుదురదు).

తాత్పర్యము— ''హంసః పతతి''. ఇచట ''ఎగురుట'' క్రియ దాని కాధార మైన సాధనము హంస (కర్త) ఇట్టి సందర్భమున సాధనము మారినను (ఆతిః పతతి, కాకః పతతి, పికః పతతి మొదలగునవి) అన్నిచోటులందును పతనమను క్రియ ఒకే విధమున కర్త నాశ్రయించి యుండును. అందు హెచ్చుతగ్గు లుండవు. కావున క్రియ కుపమానత్వము కుదురదు.

వివరణము— ''హంసః ఇవ కాకః పతతి'' (హంసవలె కాకి ఎగురుచున్నది) మొదలగు ప్రయోగములలో కర్తలకే (సిద్ధములు) ఉపమానోపమేయ భావముగాని క్రియకు కాదని తెలియునది. ॥56॥

అవతారిక— విజాతీయములగు (పరస్పరము విరుద్ధములు) క్రియలకు గూడ ఉపమానోపమేయ భావము సంభవింపదని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాణాం జాతి భిన్నానాం సాదృశ్యం నావధార్యతే ।
సిద్ధేశ్చ ప్రక్రమే సాధ్యముపమాతుం న శక్యతే ॥ 57

జాతి భిన్నానామ్ = జాతిచే వేరయిన, క్రియాణామ్ = క్రియలకు, సాదృశ్యమ్ = సాదృశ్యము న + అవధార్యతే = నిశ్చయింపబడదు, సిద్ధేః = ఒక క్రియ పూర్తియగుట యొక్క, ప్రక్రమే = ప్రారంభమున, సాధ్యమ్ = సాధ్యమైనది, ఉపమాతుమ్ = ఉపమించుటకు, న + శక్యతే = వీలు పడదు (సమర్థ్యము కాదు).

తాత్పర్యము— పచతి, గచ్ఛతి - తిష్ఠతి, ధావతి మొదలగునవి విజాతీయ క్రియలు. అనగా ఒకదానికొకటి పూర్తిగా వేరై, సాదృశ్యము లేనివి (పరస్పరము పోలిక లేనివి). సాదృశ్యము లేనపుడు ఉపమానోపమేయ భావము కుదరదు గదా : కావున విజాతీయ క్రియలకును ఔపమ్యమును చెప్పరాదు. మరియు ప్రారంభమునుండి పూర్తియగు వరకును ప్రతియొక క్రియయును సాధ్యమే యగును. అట్టి సాధ్యమైనది ఉపమానముగాని ఉపమేయము

గాని యగుట అసంభవమును అనుచితమును అగును. లోకమున సిద్ధములకే ఉపమానోప మేయ భావము ప్రసిద్ధము.

వివరణము— "తిఙంతముల విషయమున ఔపమ్యము కుదురదు" అను ఘట్ట మింతతో ముగిసినది. ॥57॥

అవతారిక— "పాకః" మొదలగు కృదంతములలో ధాతువు బోధించు క్రియ సాధ్యరూపమును, ఘఞ్ మొదలగు ప్రత్యయము చెప్పు క్రియ సిద్ధరూపమును అగును. అందు బాహ్యాభ్యంతర రూపమైన భేదము కలదు" అని పతంజలి యనెను. అట్టి భేదమును దృష్టాంత పూర్వకముగ ప్రతిపాదింపుచున్నాడు.

శ్లో॥ వనం వృక్షా ఇతి యథా భేదాఽభేదవ్య పాశ్రయాత్ ।
అర్థాత్మా భిద్యతే భావే స బాహ్యాభ్యంతరే క్రమః ॥ 58

భేదాఽభేదవ్య పాశ్రయాత్ = భేదమును, అభేదమును గూడ స్వీకరించుటవలన, వనమ్ + ఇతి = "వనము" అనియు, వృక్షాః + ఇతి = "వృక్షములు" అనియును, అర్థాత్మా = అర్థము యొక్క స్వరూపము, యథా = ఎట్లు, భిద్యతే = వేరగునో (మారునో), సః = ఆ, క్రమః = తీరు, బాహ్యాభ్యంతరే = వెలుపలిదియు లోపలిదియునగు, భావే = భావమందు, (భవతి = అగును)

తాత్పర్యము— "చెట్ల సముదాయ"మున్నది. "వనము" అను పదముతో దానికి సంబంధించిన అభేదమును చెప్పుదురు. ''చెట్లు'' అను పదముతో దానికే చెందు భేదమును తెలుపుదురు. అనగా ఒకే యర్థమును ఒక శబ్దముతో ఒక విధముగను వేరొక శబ్దముతో వేరొక విధముగను బోధించు అవకాశము గలదు. అట్లే ''పాకః'' మొదలగుచోట్ల ప్రకృతి యైన ధాతువుయొక్క (పచ్) అర్థమైన భావము ఆభ్యంతరమనియు (లోపలిది), ప్రత్యయ మైన ''ఘఞ్'' మొదలగు దానియొక్క అర్థమైన భావము బాహ్యమనియును (వెలుపలిది) వ్యవహరింపబడును.

వివరణము— ప్రకృతియైన ధాతువు బోధించు భావము సాధ్యమనియు, ఘఞాది ప్రత్యయము బోధించు భావము సిద్ధమనియును ఇదివరకే ప్రతిపాదింపబడెను. ఇచట మొదటి భావము ఆభ్యంతరమనియు, రెండవది బాహ్యమనియును వేరొక విశేషము చూపబడెను. కాగా ''భావము'' అను భావన ఒకటే అయినను వ్యవహారము ననుసరించి అందలి విశేషములను శాస్త్రము చెప్పునని ఫలించును.

విశేషము— ప్రకృతి బోధించు భావము అభేదరూపమనియు, ఘఞాది ప్రత్య యము బోధించు భావము భేదరూపమనియును ఇచటి తత్త్వము. కావుననే ధాతువు చెప్పు సాధ్యమైన భావమును చూపదలచినపుడు తిఙ్ ప్రత్యయములు ప్రవర్తించును. అచట కాలము, పురుషము అని వాని సంబంధము కుదురును. (ఉదా: పచతి - పచతః - పచంతి). లింగ

సంఖ్యల సంబంధము మాత్రము కుదురదు. ఘఞాది ప్రత్యయము బోధించు సిద్ధమైన భావమును చూపదలచినపుడు సుప్ ప్రత్యయములు చేరును. (ఉదా : పాకః, రాగః, గతిః, మతిః మొదలగునవి) అచట లింగ సంఖ్యల సంబంధము కుదురును. (ఉదా : పాకః, పాకౌ, పాకాః) కాలపురుష సంబంధము మాత్రము సంభవింపదు. భావార్థకములైన తి, త, అన, అక మొదలగు ప్రత్యయము లన్నింటియందును ఈ రీతిని అన్వయించుకొన వలెను. ॥58॥

అవతారిక— "భావే" (3-2-18) అను సూత్రమున్నది. "ఘఞ్" మొదలగు ప్రత్యయములు "భావము" అను నర్థమున ప్రవర్తించునని దీని అర్థము. ఇచట "లింగము"ను (భావః అని పులింగము) "సంఖ్య"యును (భావే అని ఏకవచనము) అవివక్షితము-అనగా - వాని పట్టింపు అనావశ్యకమని భాష్యకారుడనెను. ఆ సందర్భమును వ్యాఖ్యానించుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ సామాన్యే భావ ఇత్యత్ర యల్లింగముపలభ్యతే ।
భేదానామనుమేయత్వాన్న తత్తేషు వివక్ష్యతే ॥ 59

భావే + ఇతి = "భావే" అని, అత్ర = ఈ, సామాన్యే = సామాన్యమైన నిర్దేశమందు, యత్ = ఏ, లింగమ్ = లింగము, ఉపలభ్యతే = కనబడుచున్నదో, తత్ = ఆలింగము, భేదానామ్ = విశేషములు, అనుమేయత్వాత్ = ఊహింపదగినవి కనుక, తేషు = ఆ విశేషములందు, న + వివక్ష్యతే = వివక్షింపబడదు.

తాత్పర్యము— "భూ" ధాతువు క్రియా సామాన్యమును తెలుపును. దానికి భావార్థమున "ఘఞ్" (అ) ప్రత్యయము చేరగా "భావః" అను రూపమగును. ఇది ఏ ధాతువు యొక్క అర్థమునైనను సామాన్య రూపమున చూపించును. కాగా "భావే ఘఞ్" (భావార్థమున ఘఞ్ ప్రత్యయమగును) అనగానే "ఆయా ప్రత్యేకమైన ధాతువులకు ఆయా విశేషమైన వాని వాని భావమందే ప్రత్యయము ప్రవర్తించును" అని సమన్వయము చేసికొనవలయును. అంతియకాని అన్ని చోటులందును భావశబ్దము ననుసరించి పుంలింగమును ఏకవచనమును తప్పని సరియని భావింపగూడదు.

వివరణము— పచ్ అను ధాతువుయొక్క భావార్థక రూపము "పాకః" అని ఉండును. రంజ్ అను ధాతువున కిదే యర్థమున "రాగః" అని యగును. ఇట్లు ఆయా ధాతువుల భావమును (వ్యాపారము) "పాకే", "రాగే" మొదలగు ప్రత్యేకమైన పదములచే నిర్దేశించి ఘఞాది ప్రత్యయములను విధింప నక్కరలేదా ? - అనునది ఇచటి శంక. భూ ధాతువు క్రియా సామాన్యమును తెలుపునుగాన దాని రూపమునే స్వీకరించి (భావే) విశేషముల విషయమునను కార్యములను నిర్వహించుకొనవచ్చునని సమాధానము. అట్లే "తి", (గతిః, మతిః మొదలగునవి) "అ" (ఇచ్ఛా, ఈహా మొదలగునవి) మొదలగు కొన్ని భావార్థకములైన ప్రత్యయములు స్త్రీలింగమును సంపాదించును. "అన" (కరణమ్, గమనమ్ మొదలగు

నవి) మొదలగు ప్రత్యయములు నపుంసక లింగమును సంపాదించును. ఈ తీరుకు గూడ ఎట్టి ప్రతిబంధకమును లేదు. ''భావః'' అనునది పుంలింగముగాన ప్రత్యయాంతములన్నియు పుంలింగములు కావలయునను నిర్బంధము లేదు. (వచనము విషయమున గూడ ఇదే యుక్తి)

విశేషము— సామాన్యమందు విశేషములన్నియును అంతర్భవించి యుండును. ''గోవును పూజింపవలయును'' అనగా ''ఏదో ఒక గోవునే'' అని తాత్పర్యము కాదు. ''గోసామాన్యమును'' అనియే తాత్పర్యము. అందువలన ''భావే'' అను నిర్దేశము సామాన్యమని భావించుకొనవలయును. ॥59॥

అవతారిక— ''భావః'' అనుచోట స్పష్టముగనున్న పుంలింగమును విడుచుటలో యుక్తిని చూపుచున్నాడు.

శ్లో॥ నిర్దేశే చరితార్థత్వాల్లింగం భావేఽవివక్షితమ్ ।
ఉపమానవిధత్వాచ్చ భావాదన్యత్ పచాదిషు ॥ 60

నిర్దేశే = పదమును పలుకుటయందు, చరితార్థత్వాత్ = ఉపయోగించుటవలన, భావే = ''భావః'' అనుచోట, లింగమ్ = పుంలింగము, అవివక్షితమ్ = పట్టించుకొనదగినది కాదు, ఉపమానవిధత్వాత్ + చ = ఉపమానము వంటిదిగాన, పచాదిషు = పచ్, త్యజ్ మొదలగు ధాతువులలో, భావాత్ = భావముకన్న (''అగుట'' –లేక– ''ఉండుట'' - అను అర్థము కన్న), అన్యత్ = వేరయినదియే (ప్రత్యయము యొక్క అర్థమగును).

తాత్పర్యము— ''భూ'' ధాతువునకు ''ఘఞ్'' ప్రత్యయము చేరగా ''భావ'' అను రూప మేర్పడును. ప్రత్యయ మిచట భావార్థకము అనగా భూ ధాతువుయొక్క అర్థము (ఉండుట –లేక– అగుట) ఈ శబ్దముచే సిద్ధరూపముగ చూపబడును ఘఞ్ ప్రత్యయాంతమగు శబ్ద మెల్లపుడును పుంలింగముగనే యుండును. ఇట్టి ''భావ'' శబ్దము నుచ్చరించి సకల ధాతువులకును ''ఘఞ్'' ప్రత్యయము విధింపబడినది. భావశబ్దము పుంలింగముగాన దానిని పలికినపుడు ఆ లింగము తప్పనిసరి యగును. ఎట్టి లింగమును లేని ప్రాతిపదికమును పలుకరాదు. కాగా ఈ పుంలింగమన్నిట ననువర్తించునని అనుకొనగూడదు. పచ్ మొదలగు విశేష ధాతువుల విషయమున భావార్థమున ఘఞ్ ప్రత్యయమైనచో, పాకః, త్యాగః, రాగః మొదలగు పుంలింగ రూపములే ఏర్పడును. కాని అదే యర్థమున తి ప్రత్యయమైనచో పక్తిః, త్యక్తిః, రక్తిః అని స్త్రీలింగము వచ్చును. భూ ధాతువునకును తి ప్రత్యయమైనచో ''భూతిః'' అని స్త్రీలింగమే యగును

మరియు "భావే" అను నిర్దేశమును ఉపమానరూపమున గూడ వ్యాఖ్యానింప వచ్చును. (అనగా "భావే ఇవ = భావే" అని అనుకొనవలెను). భూ ధాతువునకు భావార్థమున "భావ" అనురూపమైనట్లు పచ్ మొదలగు విశేష ధాతువులకు "పాక" మొదలగు రూపము లగునని చెప్పుకొనినను బాధ లేదు. (''వంట'' మొదలగునవి ప్రత్యయము యొక్క అర్థము లగును).

వివరణము— ప్రత్యయమును విధించునపుడు అర్థమును చెప్పక తప్పదుగాన సామాన్యముగ ''భావే'' అని సూత్రకారు డుచ్చరించెను. అదియె ''తి'' మొదలగు ప్రత్యయములను విధించు సూత్రములతో సంబంధించును. కావున ఆ యా ప్రత్యయములు ''భావము'' అను సామాన్యార్థమున ప్రవర్తించును. విశేషధాతువులకు వేర్వేరు రూపము లగుటయు, ప్రత్యయమును బట్టి వాని లింగము మారుచుండుటయును సహజము. అది వేరు విషయము కాన ఆక్షేపణీయము కాదు. ॥60॥

అవతారిక— ఈ సందర్భముననే భాష్యకారుడు వేరొక యుక్తిని చూపెను ఆ యుక్తిని విశదీకరింపుచున్నాడు.

శ్లో॥ భవతౌ యత్పచాదీనాం తావదత్రోప దిశ్యతే ।
న చ లింగం పచాదీనాం భవతౌ సమవస్థితమ్ ॥ 61

పచాదీనామ్ = పచ్, త్యజ్ మొదలగు విశేష ధాతువులకు చెందు, యత్ = ఏ సామాన్యాంశము, భవతౌ = భావ అనుచోట గలదో, తావత్ = ఆ యంశము మాత్రమే, అత్ర = ఇచట (భావే అను సూత్రమున) ఉపదిశ్యతే = చెప్పబడును, పచాదీనామ్ = పచాదుల యొక్క, లింగమ్ + చ = లింగమైతే, భవతౌ = భూధాతువు యొక్క ''భావ'' అనుచోట, న + సమవస్థితమ్ = లేదు (ఉండదు).

తాత్పర్యము— ఎల్ల విశేష ధాతువులందును అవలంబింపదగు ''భావము'' అను సామాన్యాంశమును మాత్రమే (సిద్ధావస్థలో నుండు ఆ యా ధాతువుల అర్థము) ''భావే'' అనునది బోధించును. కావున విశేషముల లింగముల కిచట ప్రసక్తి లేదు. లింగమును సంఖ్యయు ఆ యా ప్రత్యయములను బట్టి ఆ యా స్థలములలో మారవచ్చును

వివరణము— ''భావము'' అనునది సామాన్యము. ''అది సకల విశేషములందును అనుసరింపదగినది'' అనియే తాత్పర్యము. సామాన్య నిర్దేశమున ఆవశ్యకమైన లింగముండక తప్పదు. విశేషముల లింగములకును దీనికిని ఎట్టి సంబంధమును లేదు. దేని లింగ సంఖ్యలు దానికి నియతములై యుండును.

విశేషము— అనంతములగు వ్యక్తులందుండు ఎల్ల ధర్మములను సామాన్యము చెప్పదు. అన్నిటియందును సమానముగ గోచరించు ఒకానొక ధర్మమును మాత్రమే అది బోధించును. ఉదా : గోత్వము, పటత్వము మొదలగునది. సామాన్యమును చెప్పు శబ్దమున కొక లింగముండుటయును తప్పదు. విశేషముల లింగములు వేరు కావచ్చును. ఒకచో కాకను పోవచ్చును. వానికిని సామాన్యమునకును ఈ యంశమున పొత్తు కుదురదు. ఉదా : ''గోత్వమ్''. ఇది నపుంసకము. ఏకవచనము. ''గౌః, గావౌ, గావః''. ఇచట గోశబ్దము పుంలింగము —లేక— స్త్రీలింగము. అన్ని వచనములు నుండును. ఇట్లే ''భావః'' అనునది సామాన్యముగాన దానికి నియతమైన పుంలింగమును ఏకవచనమును తప్పవు. విశేషములలో

"పాకః - పాకౌ - పాకాః, పక్తిః - పక్తీ - పక్తయః" మొదలగు రీతిని లింగ సంఖ్యలు యథావిధిగ ప్రవర్తించును.

"భావే" అను సామాన్య నిర్దేశమునకు విశేషములందు తాత్పర్యముగాన, అచటి లింగ సంఖ్యలు అవివక్షితములని మీది కారిక చెప్పినది. సామాన్యమునకు నియతమైన లింగ సంఖ్య లుండునుగాన "భావే" అనుచోట పుంలింగమును ఏకవచనమును తప్పవని ఈ కారిక స్పష్టపరచినది. ॥61॥

అవతారిక— విశేషములకు సంబంధించిన లింగ సంఖ్యలు సామాన్యమునకు సంబంధింపవని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ ఏకశ్చ సోఽర్థః సత్తాఖ్యః కథంచిత్ కైశ్చిదుచ్యతే ।
లింగాని చాస్య భిద్యంతే పచిరూపాది భేదవత్ ॥ 62

ఏకః = ఒకటే అయినట్టి, సత్తాఖ్యః = "సత్త" అను పేరుగల, సః = ఆ, అర్థః + చ = భావమను అంశము, కైశ్చిత్ = కొందరిచే, కథంచిత్ = ఆ యా విధముగ, ఉచ్యతే = చెప్పబడును, అస్య = దీనియొక్క, లింగాని + చ = లింగములైనచో, పచిరూపాదిభేదవత్ = పచ్, ధాతువుయొక్క రూపములు వేరయినట్లు, భిద్యంతే = వేరగుచుండును.

తాత్పర్యము— భావమనునది సకల ధాతువుల యొక్కయు అర్థములకు చెందు సిద్ధావస్థను బోధించును. అది సామాన్య ధర్మము. దానిని భావః, సత్తా, సామాన్యమ్ అని వేర్వేరు లింగములు గల శబ్దములతో బోధించుచుందురు. ఈ తీరు పచ్ ధాతువుయొక్క పాకః, పక్తిః, పచనమ్ మొదలగు రూపభేదములను చూపుటవంటిదే. అంత మాత్రమున సామాన్యము యొక్క లింగము విశేషములకుగాని, విశేషములయొక్క లింగము సామాన్యము నకుగాని నియామకము కాజాలదు

వివరణము— విశేషములను బట్టియే సామాన్యమును భావించి పేర్కొందురు. కాగా సామాన్యమనునది విశేష స్వరూపమే. అయినను సామాన్యము వ్యాపకమును (విశాల మైనది) విశేషము వ్యాప్యమును (సామాన్యములో ఇముడునది) అగుట (శాస్త్ర సంకేతాను సారము) తప్పదు. అందువలన సామాన్యమగు భావము వ్యాపకమును, విశేషములగు పాక, త్యాగరాగాదులు వ్యాప్యములును అగును. అందువలననే "భావరూపమైన సిద్ధావస్థను బోధించు టకు ఘఞాది ప్రత్యయములగును" అను అంశమునే "భావే" అను సూత్రము బోధించును. అంతియకాని ఆ శబ్దమునకు చెందిన పుంలింగమును ఏకవచనమును. విశేషములకు విధింపదు అనగా "ప్రత్యయముల యొక్క అర్థమునే సూత్రము సూచించును. ప్రత్యయాంతములగు శబ్దములకు లింగవచనములు వేర్వేరుగ నుండవచ్చును. అట్లుండుట ప్రత్యేక నియమముల వలన సిద్ధించును" అని సారాంశము.

విశేషము— సామాన్యమునకు విశేషములనన్నింటిని స్వీకరింపగల సామర్థ్య

ముండును. (విడివిడిగా కాని మొత్తముగా కాని), విశేషములకు సామాన్యమును స్వీకరించు సామర్థ్యముండదు. ఉదా : భవనమునకు (భూధాత్వర్థము) పాక త్యాగాదులన్నియు విశేషము లగును. అది వానిని గ్రహించును. కాని పాకాదులు భవనమును గ్రహింపజాలవు. (భవతి:— పాకః భవతిః, రాగః భవతి, త్యాగః భవతి మొదలగు రీతిని ప్రయోగింపనగును. కాని పచతి:— భావః పచతి, రాగః పచతి మొదలగు రీతిని ప్రయోగించుటకు వీలులేదు).

మరియొక విశేషము— సామాన్యమనునది ఎల్ల విశేషములందును సామాన్య రూపముగను, విశేషరూపముగను కూడ భాసింపుచుండును. ఉదా: "నల్లని గోవు". ఇచట గోత్వమను సామాన్యమును, "నల్లని ఒక ఆవు" అను విశేషమును గూడ నుండును ఈ విధముగనే భావమను సామాన్యము పాకాది విశేషము లన్నింటియందును సామాన్యము గను విశేషముగను కూడ గోచరించును అట్లు విశేషములు సామాన్యమునంతను స్ఫురింప జేయ జాలవు. ॥62॥

అవతారిక— "ఒకే యంశము సందర్భమును సంబంధమును అనుసరించి అనేక ముగ భాసించుననుట"లో దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ ఆచార్యో మాతులశ్చేతి యథైకో వ్యపదిశ్యతే ।
సంబంధి భేదాదర్థాత్మా న విధిః పక్తిభావయోః ॥ 63

ఏకః = ఒకటే అయిన, అర్థాత్మా = అర్థస్వరూపము (అర్థము = అంశము), సంబంధిభేదాత్ = సంబంధముగల వారి భేదమువలన, ఆచార్యః = ఆచార్యుడనియు, మాతులః + చ + ఇతి = మేనమామ అనియును, యథా = ఎట్లు, వ్యపదిశ్యతే = చెప్పబడునో, సః = అట్టి, విధిః = తీరు, పక్తి భావయోః = పాకమునకును భావమునకును, (భవతి = అగును).

తాత్పర్యము— ఒక వ్యక్తి ఉన్నాడు. అతడుపాధ్యాయుడు. అతనికి మేనల్లు డొక శిష్యుడు. ఎట్టి చుట్టరికమును లేని మరియొకడు వేరొక శిష్యుడు. మేనల్లుడైనవాడు రెండవవానితో "మేనమామకు నమస్కరింపుము" అనును. అతడుపాధ్యాయునికి నమస్కరించును. అట్లే రెండవవాడు "ఉపాధ్యాయునికి నమస్కరింపుము" అన్నపుడు మేనల్లుడు మేనమామకు నమస్కరించును. ఇది లోకపు తీరు. ఇచట ఒకే వ్యక్తి చుట్టరికమునుబట్టి ఒకనికి మేనమామయు, (గురువును) శిష్యత్వమును బట్టి వేరొకనికి గురువు మాత్రమును అగుచున్నాడు. ఇట్లే పాకము, భావము మొదలగు చోట్ల కూడ ఒకే అంశము సంబంధిభేదము వలన సామాన్యముగను విశేషముగను భాసించుటలో చిక్కేదియు లేదు.

వివరణము— భావమనునది పాకాదులను బట్టి సామాన్యము కావచ్చును. కాని భూధాతువు యొక్క అర్థమును మాత్రమే ఒకచో తీసికొన్న యెడల అపుడది విశేషమును కావచ్చును. అట్లే పాకమనునది భావమును బట్టి విశేషమగును. పాకమందలి విశేషములను చెప్పదలచినపుడు (మధురః పాకః, కటుః పాకః మొదలగునవి) వానినిబట్టి అది సామాన్యమే

యగును. అనగా వివక్షాధీనముగా ప్రతియొక అంశమును సామాన్యమును విశేషమును గూడ అగుట కవకాశమున్నది.

విశేషణము—"ఉపాధ్యాయస్య శిష్యో మాతులస్య భాగినేయమాహ । ఉపాధ్యాయం భవానభివాదయతామితి । స గత్వామాతులమభివాదయతే । తథామాతులస్య భాగినేయ ఉపాధ్యాయస్య శిష్యమాహ । మాతులం భవానభివాదయతామితి । స గత్వా ఉపాధ్యాయ మభివాదయతే ।" అనునవి పతంజలి యొక్క వచనములు. (సూ : 3-2-18) వాని భావము నిచట గ్రంథకర్త గ్రహించెను.

ఇట్లు 59 వ కారిక నుండి ఇంతవరకును అయిదు కారికలతో "భావే" (3-2-18) అను సూత్రము యొక్క భాష్యసారము విశదీకరింపబడినది.

ఈ సముద్దేశమున ప్రతియొక విషయమునను "పచ్" ధాతువు ఉదాహరణముగా చూపబడినది. దానిని బట్టి "సకల ధాతువుల తీరు నిదే"యని యూహింపవలయును.

1. క్రియ సాధ్యరూపము. తిజ్ ప్రత్యయములు ఆ విషయమును బోధించును. 2. క్రియయొక్క సిద్ధరూపము భావము. దీనిని కృత్తులు బోధించును. 3. క్రియావాచకము ధాతువు. 4. ధాతువులకు సూటిగా చేరు ప్రాథమిక ప్రత్యయములు తిఙ్లును కృత్తులును మాత్రమే అను నంశములు ఈ సముద్దేశము యొక్క పరమసారము.

క్రియా సముద్దేశము ముగిసినది

కాల సముద్దేశము - 9

అవతారిక— క్రియా సముద్దేశమున క్రియా స్వరూపమును నిరూపించి, ఇపుడు కాలము క్రియను పరిచ్ఛేదించును గాన దానిని నిరూపించుటకై మొదట దర్శనాంతర ప్రసిద్ధ మగు కాలస్వరూపమును ప్రతిపాదించుచున్నాడు.

శ్లో॥ వ్యాపారవ్యతిరేకేణ కాలమేకే ప్రచక్షతే ।
నిత్యమేకం విభుం ద్రవ్యం పరిమాణం క్రియావతామ్ ॥ 1

ఏకే = వైశేషికాగు లగు కొందరు దార్శనికులు, నిత్యం = నిత్యమైనదియు, ఏకం = ఒక్కటియు, విభు = సర్వ వ్యాప్తమును, క్రియావతాం = క్రియతో సంబంధించిన పదార్థములకు, పరిమాణం = జన్మాది క్రియలద్వారా పరిచ్ఛేదకమును అగు, కాలం = కాలమనెడు, ద్రవ్యం = ద్రవ్యమును, వ్యాపార వ్యతిరేకేణ = వ్యాపారముకంటె వేరుగా, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

తాత్పర్యము— వైశేషికులు మొదలగు కొందరు దార్శనికులు, నిత్యమైనదియు' ఒక్కటియు, సర్వవ్యాప్తమును, క్రియతో సంబంధించిన పదార్థములను 'ఇది దీనికంటె ముందు పుట్టినది, ఇది తరువాత పుట్టినది' ఇత్యాది విధముల జన్మాదులచే పరిచ్ఛేదించునదియు అగు కాలమనెడు ద్రవ్యమును క్రియకంటె వేరుగ అంగీకరింతురు.

విశేషము— కాలము క్రియకంటె భిన్నమైనది. ఇది క్రియతో సంబంధించిన పదార్థములను ఇది మొదట పుట్టినది, ఇది తరువాత పుట్టినది, ఇది ముందుగ నశించినది, ఇది తరువాత నశించినది ఇత్యాది విధమున పరిచ్ఛేదించునది ; అనగా వాటి యునికి మొదలగు వాటిని కొలచునది. ఇది వైశేషికుల సిద్ధాంతము. ॥1॥

అవతారిక— పరిచ్ఛేద్యము లగు (కొలవదగిన) పదార్థముల భేదమును బట్టి, కాలమునకును, ఇతర పరిచ్ఛేదకములకును, (కొలుచువాటికిని) గల భేదమును చెప్పుచున్నాడు.

శ్లో॥ దిష్టిప్రస్థ సువర్ణాది మూర్తిభేదాయ కల్పతే ।
క్రియాభేదాయ కాలస్తు, సంఖ్యా సర్వస్య భేదికా ॥ 2

దిష్టిప్రస్థ సువర్ణాది = దిష్టి, ప్రస్థము, సువర్ణము మొదలగునది, మూర్తిభేదాయ = సర్వ వ్యాప్తము కాని ద్రవ్యమునకు సంబంధించిన పరిమాణము యొక్క భేదమును ఏర్పరచుటకు, కల్పతే = సమర్థ మగుచున్నది, కాలః+తు = కాలమైతే ; క్రియా భేదాయ = క్రియ యందలి భేదమును ఏర్పరచుటకు, కల్పతే = సమర్థ మగుచున్నది, సంఖ్యా = సంఖ్య ; సర్వస్య అన్నిటికిని ; భేదికా = భేదమును ఏర్పరచునది.

తాత్పర్యము— దిష్టి, ప్రస్థము, సువర్ణము మొదలగునవి సర్వ వ్యాప్తము కాని ద్రవ్యము యొక్క పరిమాణము నందలి భేదములను చూపును. కాలము క్రియల యందలి భేదమును చూపును. సంఖ్య అన్నింటికిని సంబంధించిన భేదమును తెలుపును.

విశేషము— దిష్టి అనునది ఒక దైర్ఘ్య ప్రమాణము. వస్త్రాదులలోని ఒక కొస తీసికొని ఇది రెండు జానలున్నది, ఇది రెండు మూరలున్నది అని చెప్పుచుందుము. (అట్టిదే యిది) పొడుగు వెడల్పులు కొలుచునది దీనికి ప్రమాణము అని పేరు. ప్రస్థమనగా ధాన్యాదులను కొలచెడు కుంచము వంటి ప్రమాణము. దీనిచే ధాన్యాదుల పొడవు వెడల్పు ఎత్తులను మూడింటిని (వాటి ఘనపరిమాణమును) కొలుచుచుందుము. ధాన్యాదుల నలువైపులకు సంబంధించిన కొలతను చెప్పునవిగాన ఇవి పరిమాణములు. 'పరి' యనగా నలుమూలల యని యర్థము. సువర్ణ మనగా ఘనపదార్థములను తూచెడు ఒక ఉన్మానము బంగారము వెండి మొదలగు వాటిని త్రాసులో వేసి, దానిని ఎత్తి తూచుదుము గాన తులము, పలము మొదలగు వాటికి ఉన్మాన మని పేరు. ఈ ప్రమాణ - పరిమాణ - ఉన్మానములు మూడును పరిచ్ఛిన్నములగు (సర్వవ్యాప్తములు కాని) మూర్త ద్రవ్యముల పరిమాణమును తెలుపును. ఏతద్భిన్నమగు కాలము మాత్రము అమూర్తమగు క్రియను కొలుచును. ఉదా : సూర్యాది సంచార రూపమగు క్రియను మాసము, ఋతువు, సంవత్సరము మొదలగు కాలములచే కొలచుచుందుము. సంఖ్య మూర్తామూర్తములను, ప్రమాణములను, సంఖ్యను కూడ పరిచ్ఛేదించును. ఉదా : రెండు ఘటములు ; రెండు క్రియలు, మూడు జానలు, నాలుగు కుంచములు ; ఐదు తులములు ; రెండు ఇరవైలు మొ. ॥2॥

అవతారిక— ఇపుడు కాలము క్రియను ఎట్లు పరిచ్ఛేదించునో చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉత్పత్తౌ చ స్థితౌ చైవ వినాశే చాపి తద్వతామ్ ।
నిమిత్తం కాలమేవాహు ర్విభక్తే నాత్మనా స్థితమ్ ॥ 3

విభక్తేన = విభక్తమగు, ఆత్మనా = స్వరూపముతో, స్థితం = ఉన్న, కాలమేవ=కాలమునే, తద్వతాం = ఉత్పత్తి - స్థితి - వినాశములు గల పదార్థముల, ఉత్పత్తౌ = పుట్టుకయందును, స్థితౌ = ఉనికియందును, వినాశే చాపి = వినాశమునందును, నిమిత్తం = నిమిత్తమునుగా, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— వేరు వేరు స్వరూపములలో నున్న కాలమే పదార్థముల ఉత్పత్తికిని, స్థితికిని, నాశమునకును నిమిత్త మని చెప్పుదురు.

విశేషము — జనించుట, ఉండుట (స్థితి), వినాశము అనెడు క్రియలలో ఇతర క్రియ లన్నియు అంతర్గతములే. పదార్థము లన్నియు ఈ క్రియలలో నేదియో యొక క్రియతో సంబంధించి యుండును. కావున కాలము ఈ క్రియల ద్వారా సర్వపదార్థములకును నిమిత్త మని చెప్పుదురు. ఉదాహరణమునకు : కొన్ని పదార్థములు వసంతమున జనించును, కొన్ని నశించును, కొన్ని శరత్కాలమున జనించును, కొన్ని నశించును. ॥3॥

అవతారిక— పదార్థముల ఉత్పత్త్యాదులకు కాలమే నిమిత్తము గాన ప్రపంచ వ్యవహారమున కంతకును కాలమే కారణమని చెప్పుచున్నాడు

శ్లో॥ తమస్య లోకయన్త్రస్య సూత్రధారం ప్రచక్షతే ।
ప్రతిబంధాభ్యనుజ్ఞాభ్యాం తేన విశ్వం విభజ్యతే ॥ 4

తం = ఆ కాలమును, అస్య = ఈ, లోకయన్త్రస్య = లోకమనెడు యంత్రమునకు, సూత్రధారం = సూత్రధారునిగా, ప్రచక్షతే = చెప్పుదురు, తేన = ఆ కాలముచేత, ప్రతిబంధాభ్యనుజ్ఞాభ్యాం = ప్రతిబంధాభ్యనుజ్ఞల ద్వారా, విశ్వం = ప్రపంచము, విభజ్యతే = విభక్తమగుచున్నది.

తాత్పర్యము— లోకమనెడు యంత్రపురుషుని (బొమ్మను) నడిపెడు సూత్రధారుడు ఈ కాలమే. ప్రతిబంధాభ్యనుజ్ఞల ద్వారా ఈ కాలమే ప్రపంచమునందలి విభాగములను ఏర్పరచుచున్నది.

విశేషము— ప్రతిబంధము = ఉత్పత్త్యాదులు జరుగకుండునట్లు చేయుట అభ్యనుజ్ఞ = ఉత్పత్త్యాదులు జరుగునట్లు చేయుట. జంత్రపు బొమ్మకు తాళ్ళు కట్టి ఒక వ్యక్తి దానిని కదలునట్లును, నడచునట్లును చేయును. వానికి సూత్రధారుడని పేరు. ఈ జగద్యంత్రమునకు కాలము సూత్రధారుని వంటిది. ఈ కాలమే ఆ యా పదార్థముల ఉత్పత్త్యాదులను అడ్డగించుచు జరుపుచు, ఇది ముందు, ఇది వెనుక అనెడు విభాగమును ఏర్పరచుచున్నది ॥4॥

అవతారిక— ఈ విషయమునే స్పష్టీకరించుచున్నాడు.

శ్లో॥ యది న ప్రతిబధ్నీయాత్ ప్రతిబన్ధం చ నోత్సృజేత్ ।
అవస్థా వ్యతికీర్యేరన్ పౌర్వాపర్యవినాకృతాః ॥ 5

న ప్రతిబధ్నీయాద్యది = (కాలము ఉత్పత్త్యాదులను) అడ్డుకొనకున్నను, ప్రతిబంధం = ఆ అడ్డును, న + చ + ఉత్సృజేత్ (యది) = తొలగింపకున్నను, అవస్థాః = పదార్థముల అవస్థలు, పౌర్వాపర్య వినాకృతాః = పౌర్వాపర్య రహితములుగా చేయబడినవై, వ్యతికీర్యేరన్ = సంకీర్ణములై యుండెడివి.

విశేషము— ఒక బీజమునుండి మొదట అంకురము, తరువాత నాలము, పిమ్మట కాండము జనించుచున్నవి. అనగా అంకురము పుట్టు సమయమున నాలము పుట్టకుండగను, నాలము పుట్టు సమయమున కాండము పుట్టకుండగను కాలము అడ్డుకొనుచున్నది. కావుననే అంకురనాల - కాండాదుల ఉత్పత్తిలో నొక క్రమము (పౌర్వాపర్యము) కనబడుచున్నది. కాల మీ విధముగ అడ్డుకొనకున్నచో ఆ యా కారణములనుండి జనించు కార్యముల వివిధావస్థలలో సాంకర్యమేర్పడి యుండెడిది అనగా అంకుర - నాల - కాండాదులలో ఏది ముందో ఏది వెనుకనో తెలిసికొనుటకు అవకాశముండెడిది కాదు. ॥5॥

అవతారిక— కాలము ఒక్కటేయైనను ఉపాధి భేదముచే భిన్నముగ తోచుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్యాత్మా బహుధా భిన్నో భేదైర్ధర్మాన్తరాశ్రయైః ।
న హి భిన్నమభిన్నం వా వస్తు కించన విద్యతే ॥ 6

ధర్మాన్తరాశ్రయైః = ఇతర ధర్మములకు (క్రియలకు) సంబంధించిన, భేదైః = భేదములచే, తస్య = ఆ కాలముయొక్క, ఆత్మా = స్వరూపము, బహుధా = అనేక విధములుగా, భిన్నః = భిన్నమైనది, భిన్నం = భేదముగల, వా = లేక, అభిన్నం = భేదములేని, వస్తు = వస్తువు కించన = ఏదియు, న విద్యతే హి = లేదుకదా

తాత్పర్యము— కాల మొక్కటియే యైనను ఆ యా క్రియలకు సంబంధించిన భేదములచే భిన్నమువలె కనబడుచున్నది. (కాలమే కాదు), ఏ వస్తువైనను భేదము కలదని కాని, లేనిదని కాని చెప్పుటకు వీలులేదు.

విశేషము— సర్వవ్యాప్త మగు ఆకాశము ఒక్కటే యైనను కుండలో నున్న ఆకాశమును ఘటాకాశమనియు, చెంబులో నున్న ఆకాశమును కరకాశమనియు, ఇంటిలో నున్న ఆకాశమును గృహాకాశమనియు ఘటాద్యుపాధి భేదమును బట్టి వేరువేరుగ వ్యవహరించుచుందుము. అట్లే కాలమనునది ఒక్కటే యైనను సూర్యాద్యుదయాస్తమయాది క్రియా భేదమును బట్టి దినయామిన్యాది భేదముతో భిన్నరూపముల వ్యవహరించుచుందుము. కాలమునందే కాదు, ప్రపంచమునందలి ఏ విషయమునందును గూడ పూర్తిగ భేదమున్నదని గాని, భేదమసలే లేదని గాని చెప్పజాలము. దేవదత్తుడను వాడొకడు. వానిలో భేదమున్నదా లేదా యని విచారింపగా భేదము లేదని చెప్పుటకు వీలులేదు. నిన్నటి దేవదత్తుడు పూర్వకాలముతో సంబంధించినవాడు, ఇప్పటి దేవదత్తుడు ఈ కాలముతో సంబంధించినవాడు. ఈ కాలభేదమును బట్టి నిన్నటి దేవదత్తుడు వేరు నేటి దేవదత్తుడు వేరు అని చెప్పవలెను. అట్లని భేదమే గాని అభేదము లేదనుటకు గూడ వీలులేదు. ఈతడు నిన్న చూచిన దేవదత్తుడే అని ప్రత్యభిజ్ఞానము కలుగుచున్నది కదా ? కావున ఏ పదార్థమైనను భేదాభేదములచే అనిర్వచనీయమే యని అభిప్రాయము అట్లే కాలము కూడ. ॥6॥

అవతారిక— 'నహిభిన్న మభిన్నం వా' అను విషయమునే ఉదాహరణముతో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ నైకోఽస్తి నాప్యనేకోఽస్తి న శుక్లో నాపిచాసితః ।
ద్రవ్యాత్మా సతు సంసర్గాదేవం రూపః ప్రకాశతే ॥ 7

ఏకః = ఒక ద్రవ్యము, నాస్తి = లేదు, అనేకః అపి = అనేకము కూడ ; నాస్తి = లేదు, శుక్లః = తెల్లనిది, నాస్తి = లేదు, అసితః అపిచ = నల్లనిది కూడా, న = లేదు, తు = కాని,

సః = ఆ, ద్రవ్యాత్మా = ద్రవ్య స్వభావమే, సంసర్గాత్ = సంఖ్యా రూపాదులతో సంబంధము వలన, ఏవం రూపః = ఇట్టి రూపము కలదిగా, ప్రకాశతే = ప్రకాశించుచున్నది.

తాత్పర్యము— ఏకమనికాని అనేకమనికాని, తెల్లనిది అనిగాని నల్లనిది అనిగాని లేదు. ద్రవ్య స్వభావమే ఆ యా సంఖ్యాదులతో సంబంధించుట వలన వేరువేరు విధముల ప్రకాశించుచున్నది.

వివరణము— ద్రవ్యమునకు ఏ ఉపాధులతోడను సంబంధము లేకున్నచో లౌకిక వ్యవహారమే కుదురదు. అందు ద్రవ్యమునకే ఏకత్వాది సంఖ్యలతో సంబంధమును కూర్చి 'ఇది ఒక ద్రవ్యము ; ఇవి రెండు ద్రవ్యములు' అని వ్యవహరింతుము. శుక్ల కృష్ణరూపము లతో ద్రవ్యమునకు సమవాయ సంబంధము (విడదీయరాని సంబంధము) ఉండుటచే ''తెల్లని బట్ట, నల్లని బట్ట'' ఇత్యాది వ్యవహారము చేయుచుందుము. కావున ద్రవ్యములలో కనబడు ఆ యా భేదము లన్నియు ఉపాధి భేదకృతములే కాని సహజములు కావు. అట్లే ఉత్పత్త్యాది క్రియలను బట్టి కాలమునందు గూడ 'ఇది ఉత్పత్తి కాలము, ఇది స్థితి కాలము, ఇది వినాశ కాలము' మొదలగు వ్యవహారములు కల్పితము లగుచున్నవి. కావుననే దేవదత్తుని ఉత్పత్తి కాలము యజ్ఞ దత్తునకు స్థితికాలమగుచున్నది. అదియే విష్ణు మిత్రునకు వినాశకాలమగు చున్నది. ॥7॥

అవతారిక— ఉపాధిగత భేదములు కాలమునందు ఆరోపింపబడుచున్నవని చెప్పు చున్నాడు.

శ్లో॥ సంసర్గిణాం తు యే భేదా విశేషాస్తస్య తే మతాః ।
స భిన్నైస్తైర్వ్యవస్థానాం కాలో భేదాయ కల్పతే ॥ 8

సంసర్గిణాం = కాలముతో సంబంధించిన గ్రహసంచారాది క్రియల యొక్క, యే = ఏ, విశేషాః = విశేషములు కలవో, తే = అవి, తస్య = ఆ కాలము యొక్క, భేదాః = భేదము లుగా, మతాః = చెప్పబడుచున్నవి, సః = ఆ, కాలః = కాలము, తైః = ఆ క్రియా విశేష ములచేత, భిన్నైః = భిన్నమైనదై, వ్యవస్థానాం = అహోరాత్రాది వ్యవస్థలయొక్క, భేదాయ = భేదము కొరకు, కల్పతే = సమర్థమగుచున్నది (భేదములకు నిమిత్తమగుచున్నది).

తాత్పర్యము— సూర్యాది గ్రహ సంచార రూపమగు క్రియ కాలమునకు సంబం ధించినదై యుండుటచే ఆ క్రియయందలి విశేషములను కాలమునందు ఆరోపించుచుందురు. ఈ విధముగ ఆ యా క్రియలయందలి విశేషములను బట్టి కాలము పగలు, రాత్రి, మాసము మొదలగు విభిన్న వ్యవహారములకు కారణమగుచున్నది.

విశేషము— అహోరాత్ర - పక్ష - మాసాది వ్యవస్థలకు మూల కారణము సూర్యాది గ్రహ సంచారము. కాలమునందు ఆ వ్యవస్థలు పరమార్థతః లేవని తాత్పర్యము. ॥8॥

అవతారిక— ఈ విధముగ కాలము ఉపాధి భేదముచే భిన్నముగ కన్పట్టుచు పదార్థముల జన్మ స్థిత్యాదులకు నిమిత్తమగు చున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ విశిష్ట కాలసంబంధా ద్వృత్తిలాభః ప్రకల్పతే ।
శక్తీనాం సంప్రయోగస్మ* హేతుత్వే నావతిష్ఠతే ॥ 9

విశిష్ట కాల సంబంధాత్ = కాల విశేషము యొక్క సంబంధము వలన, వృత్తి లాభః = (సాధన శక్తుల) ప్రవృత్తి యొక్క లాభము, ప్రకల్పతే = ఏర్పడుచున్నది, సః = ఆ కాలము, శక్తీనాం = శక్తుల యొక్క, ప్రయోగస్య = ప్రయోగమునకు, హేతుత్వేన = హేతువుగా, అవతిష్ఠతే = నిలచుచున్నది. (* 'సప్రయోగస్య' అను పాఠము యుక్తమని తోచుచున్నది.)

తాత్పర్యము— వసంతాది కాల విశేష సంబంధముచే సాధన శక్తుల ప్రవృత్తి (పుష్ప ఫలాదుల ఉత్పత్తి మొదలగు ప్రవృత్తి) కనబడుచున్నది. కావున శక్తులు ప్రవర్తించుటకు ఆ కాలమే హేతువుగా ఉన్నది.

వివరణము— వసంతాది కాలములలో ఆ యా సాధన శక్తులు పనిచేయుచున్నవి దానిని బట్టి ఈ ప్రవృత్తికి కాలమే నిమిత్త కారణమని ఊహింపవలసి యున్నది. ఈ విధముగ కాల ప్రేరితములగు శక్తులు పదార్థములకు జన్మాది క్రియలను సాధించుచున్నవి. ॥9॥

అవతారిక— కారణములందలి శక్తులు కాలము అనుజ్ఞను పొందిన పిమ్మటనే పదార్థముల ఉత్పత్తి స్థిత్యాదులను కలిగింప సమర్థములగుచున్నవని చెప్పుచున్నాడు

శ్లో॥ జన్మాభివ్యక్తి నియమాః ప్రయోగోపనిబన్ధనాః ।
నిత్యాధీన స్థితిత్వాచ్చ స్థితిర్నియమ పూర్వికా ॥ 10

జన్మాభి వ్యక్తి నియమాః = పదార్థముల ఉత్పత్తియు, అభివ్యక్తియు, నియమమును, ప్రయోగోప నిబంధనాః = కాలముయొక్క ప్రేరణముపై ఆధారపడియున్నవి. నిత్యాధీన స్థితిత్వాత్ + చ = పదార్థములు ఎల్లపుడును కాలమునకు అధీనమైన స్థితి కలవగుటచే, స్థితిః = పదార్థముల స్థితి, నియమపూర్వికా = నియమము పూర్వమునందు కలది, అనగా ఒక నియమముతో కూడినది.

తాత్పర్యము— పదార్థముల ఉత్పత్తియు, స్పష్టరూపమున అభివ్యక్తియు, కొంత కాలము మాత్రమే ఉండుట యనెడు నియమమును, కాల ప్రేరణముపై ఆధారపడియున్నవి. పదార్థముల స్థితికూడ ఎల్లపుడును కాలముపైననే ఆధారపడియుండుటచే అది నియమపూర్వకమైనది.

విశేషము— ఉత్పన్నమై అభివ్యక్తమైన పదార్థము ఇంతకాలము మాత్రమే ఉండును అనెడు నియత కాలావస్థితి నియమము. 'ఉత్పత్తౌ చ స్థితౌ చ' ఇత్యాది తృతీయ కారికార్థమే ఇచట వివరింపబడినది. ॥10॥

అవతారిక— కాలకృతములగు మరికొన్ని భావవికారములు గూడ కలవని చెప్పు చున్నాడు.

శ్లో॥ స్థితస్యానుగ్రహస్తైస్తైర్ధర్మైః సంసర్గిభి స్తతః ।
ప్రతిబన్ధ స్తిరోభావః ప్రహాణమితి చాత్మనః ॥ 11

స్థితస్య = ఉత్పన్నమై స్థితమగు పదార్థమును, సంసర్గిభిః = దానితో సంబంధించు, తైస్తైః = ఆ యా, ధర్మైః = ధర్మములతో, అనుగ్రహః = అనుగ్రహించుట, తతః = అటుపిమ్మట, ఆత్మనః = ఆ పదార్థము యొక్క, ప్రతిబన్ధః = ప్రతిబంధము (స్వకార్యమును చేయుటకు సామర్థ్యము లేకుండ చేయుట), తిరోభావః = కనబడకుండునట్లు చేయుట, ప్రహాణం = వినాశము (ఇవి యన్నియు కాలకృతములే).

తాత్పర్యము— స్థితిని సంపాదించుకొనిన పదార్థమునకు ఆ యా ధర్మ విశేషములతో సంబంధమును ఏర్పరచుట, తరువాత ఆ పదార్థము తన కార్యము చేయజాలకుండునట్లు చేయుట, దానిని అదృశ్యముచేయుట, నశింపజేయుట ఇవి యన్నియు కాలకృతములే.

విశేషము— ఉత్పన్నమై స్థితిని సంపాదించుకొనిన భూత వృక్షాదులకు కాలమే పుష్ప ఫలాదులతో సంబంధ మేర్పరచుచున్నది. పిమ్మట కాలమే ఆ కార్యములు కలుగకుండ చేయుచున్నది. చివరకు ఆ కాలమే ఆ పదార్థమును అదృశ్యము చేయుచున్నది. ॥11॥

అవతారిక— పదార్థములకు సంబంధించిన ఆ యా క్రియలు ఒక క్రమము ననుసరించి కాలాధీనములై యుండును. అందుచే ఈ క్రియలనే కాలమని వ్యవహరించు చుందురు అని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రత్యవస్థం తు కాలస్య వ్యాపారోఽత్ర వ్యవస్థితః ।
కాల ఏవ హి విశ్వాత్మా వ్యాపార ఇతి కథ్యతే ॥ 12

అత్ర = ఈ ప్రపంచమున, ప్రత్యవస్థం = పదార్థములకు సంబంధించిన ప్రతి అవస్థయందును, కాలస్య = కాలము యొక్క, వ్యాపారః = వ్యాపారమే, వ్యవస్థితః = నియతరూపమున ఉన్నది, కాల ఏవ = కాలమే, విశ్వాత్మా హి = ప్రపంచమున కంతకును ఆత్మ కదా, వ్యాపారః ఇతి = వ్యాపారమని, కథ్యతే చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ఈ ప్రపంచమునందలి పదార్థములకు సంబంధించిన ప్రతి అవస్థ యందును కాలముయొక్క వ్యాపారమే నియతరూపమున ఉన్నది. ఈ విధముగ విశ్వమున కంతకును ఆత్మయైయున్న కాలమే వ్యాపారము అని చెప్పబడుచున్నది.

వివరణము— అనుగ్రహము (ఒక పని జరుగునట్లు చేయుట) నిగ్రహము (దానికి ప్రతిబంధము కలిగించుట) మొదలగు వాటిచే కాలమే పదార్థముల ఉత్పత్తి - వినాశాదికములగు అన్ని అవస్థలతోడను సంబంధించి యున్నది. కావున విశ్వమునందంతటను అనుస్యూత

ముగ నుండి ఆత్మవలె నున్నది. అందుచే అన్ని వ్యాపారములతో సంబంధించిన కాలమునే వ్యాపారమని యందురు. ॥12॥

అవతారిక— కాలము విశ్వాత్మ యను విషయమునే ప్రతిపాదించుచున్నాడు.

శ్లో॥ మూర్తీనాం తేన భిన్నానామాచయా పచయాః పృథక్ ।
లక్ష్యన్తే పరిణామేన సర్వాసాం భేదయోగినా ॥ 13

భేదయోగినా = ఆ యా పదార్థములకు సంబంధించిన క్రియా విశేషములచే నేర్పడిన భేదముతో కూడిన, తేన = ఆ కాలముచే చేయబడిన, పరిణామాత్ = పరిణామము వలన, భిన్నానామ్ = పరస్పర భిన్నములగు, సర్వాసాం = సమస్తమైన, మూర్తీనాం = మూర్త పదార్థముల యొక్క, ఆచయాపచయాః = వృద్ధి హ్రాసములు, పృథక్ = వేరువేరుగా, లక్ష్యన్తే = చూడబడుచున్నవి.

తాత్పర్యము— క్రియా భేదముతో సంబంధము కలిగియుండుటచే ఏర్పడిన భేదము గల ఆ కాలముచే కలిగిన పరిణామముచే భిన్నములగు అన్ని పదార్థముల యొక్కయు వృద్ధి హ్రాసములు వేరు వేరుగ చూపబడుచున్నవి.

వివరణము— కాలము అభిన్నమైనను పదార్థములకు సంబంధించిన క్రియలతో సంబంధమువలన భిన్నమువలె కన్పట్టుచున్నది. అట్టి కాలముచే కలిగిన పరిణామముచే ఆయా పదార్థముల వృద్ధి హ్రాసములు వేరు వేరుగ కన్పట్టుచున్నవి.

కాలకృతములగు జన్మ వినాశాదులు నిత్య పదార్థములందు ఉండవుగాన ఇచట అనిత్య పదార్థవాచకమగు 'మూర్తీనామ్' అను పదము ప్రయుక్తమైనది. ॥13॥

అవతారిక— సార్థకమగు పేరును బట్టియే కాలము విశ్వ వైచిత్ర్యమునకు కారణమని చెప్పవచ్చు నని చెప్పుచున్నాడు.

శ్లో॥ జలయంత్ర భ్రమావేశ సదృశీభిః ప్రవృత్తిభిః ।
స కలాః కలయన్ సర్వాః కాలాఖ్యాం లభతే విభుః ॥ 14

విభుః = వ్యాపకము, నిత్యము, సర్వస్వతంత్రమును అగు, సః = ఆ కాలము, జలయంత్ర భ్రమావేశ సదృశీభిః = జలయంత్రము యొక్క భ్రమణముచే కలిగిన క్షోభముతో సమానమైన, ప్రవృత్తిభిః = ఆ వృత్తులచే (మరల మరల వచ్చుచుండుటచే), సర్వాః = సమస్తమైన కలాః = పదార్థములను, కలయన్ = విసర్జించుచు, (పుట్టించుచు) కాలాఖ్యామ్ = కాలమనెడు పేరును, లభతే = పొందుచున్నది.

తాత్పర్యము— నిత్యమగు ఆ కాలము జలయంత్రము తిరుగునపుడు కలిగిన క్షోభముతో సమానములగు పరావర్తనములచే ఆ యా పదార్థముల కలనము (సృష్టి) చేయుటచే కాలమను అన్వర్థ నామధేయము పొందినది.

వివరణము — జలయంత్రమున కొన్ని ఘటములు అమర్చి ఉండును. ఆ యంత్రమును విశాలమగు నూతిలోనికి త్రిప్పుచుందురు. ఆ యంత్రము తిరుగునపుడు ఘటములన్నియు ఒకదాని తరువాత ఒకటి నీరు నింపుకొని పైకి వచ్చి నీటిని పైకి చిమ్ముచుండును. ఈ విధముగ కాలము కూడ వసంతాది రూపమున మరల మరల వచ్చుచు ఆ యా పదార్థములను సృష్టించుచుండును. ఇట్లు నిత్యమై, సర్వస్వతంత్రమై సమస్త పదార్థ కలనము (సృష్టి) చేయుచుండుటచే ఇది కాలమైనది.

విశ్వాత్మకమును, పరబ్రహ్మ పరదామధీయమును అగు సత్యపదార్థము ఒక్కటియే. అది నానావిధ కార్యములకు కారణమగుటచే దానిని సర్వశక్తి యందురు. అది చక్ర భ్రమణమున తిరుగుచున్న ఘటములవలె ఎల్లపుడును తిరుగుచుండెడు పదార్థములను సృజించును గాన 'కలయతి భూతానీతి కాలః' అను వ్యుత్పత్తిచే కాలమను పేరును వహించియున్నది అది విభువు - అనగా స్వతంత్రము కావుననే ''అధ్యాహ్తకలాం యస్య కాల శక్తి ముపాశ్రితాః'' (వాక్యపదీయము I. 3) అను కారికలో కాలము స్వాతంత్ర్య శక్తిరూపమైనదని చెప్పబడియున్నది. ఈ విషయము ''శక్త్యాత్మ దేవతా పక్షైర్భిన్నం కాలస్య దర్శనమ్'' అను కారికలో మున్ముందు (వాక్యపదీయము III. కాల. 62) స్పష్టము కాగలదు. ॥14॥

అవతారిక— కాలము మొదట ప్రతిబంధ రూప ప్రవృత్తిని చూపి తరువాత అనుజ్ఞా రూప ప్రవృత్తిని చూపుచుండును. ఈ విధముగ విశ్వమంతయు కాల పరతంత్రమని సోదాహరణముగ ప్రతిపాదించుచున్నాడు.

శ్లో॥ ప్రతిబద్ధాశ్చ యాస్తేన చిత్రా విశ్వస్య వృత్తయః ।
తాః స ఏవానుజానాతి యథా తన్తుః శకున్తికాః ॥ 15

తేన = ఆ కాలముచేత, విశ్వస్య = ప్రపంచముయొక్క, చిత్రాః = విచిత్రమైన, యాః = ఏ వృత్తయః = సాధన శక్తులు, ప్రతిబద్ధాః = నిరుద్ధములైనవో (కార్య జననమున అసమర్థములుగ చేయబడినవో), తాః = ఆ శక్తులను, స ఏవ = ఆ కాలమే, తంతుః = దారము, శకున్తికాః యథా = చిన్న పక్షులనువలె, అనుజానాతి = ఆవిర్భవించుటకు పిలుకల వాటినిగ కూడ చేయును.

తాత్పర్యము— కాలము ప్రపంచముయొక్క విచిత్రములగు సాధన శక్తులు, తమ కార్యములను ఆవిర్భవింప చేయజాలనట్లు చేయును. దారము చిన్న పక్షులను ప్రతిబద్ధము లగునట్లు చేసి మరల ఎగురునట్లు చేయు విధమున ఆ కాలమే మరల ఆ విశ్వ సాధన శక్తులను కార్యములు చేయునట్లు అనుమతించును.

విశేషము— కాలము హేమంతాది రూపమున నుండి, సాధన శక్తులు ఆ యా పుష్ప ఫలాదులను ఆవిర్భవింప చేయజాలనట్లు చేయును. ఆ కాలమే వసంతాది రూపమును పొంది ఆ ప్రతిబంధమును తొలగించుటతో సాధన శక్తులు తమ తమ కార్యములను చేయజాలు

చున్నవి. వేటగాండ్రు పెద్ద పక్షులను పట్టుకొనుటకై వాటికి ఎరగా చిన్న పక్షిని ఒక త్రాటికి గట్టి దానిని ఇటు అటు ఎగురునట్లు చేయుదురు. కాని ఆ త్రాడు లాగుచుండుటచే ఆ పక్షి స్వేచ్ఛగా ఎగిరి పోజాలదు. ఇట్లు సూత్రము ఆ చిన్ని పక్షుల గమనమునందు సంకోచ వికాసములు చేయుచుండును. ఈ విధముగనే పదార్థములన్నియు కాల సూత్రమున కట్టువడి ఉత్పత్తి వినాశరూపములగు సంకోచ వికాసముల కెల్లపుడును లోనగుచుండును. ॥15॥

అవతారిక— ఈ సంకోచ వికాసముల క్రమ మెట్లుండునో చెప్పుచున్నాడు.

శ్లో॥ విశిష్ట కాలసంబంధా ల్లబ్ధపాకాసు శక్తిషు ।
క్రియాభివ్యజ్యతే నిత్యా ప్రయోగాఖ్యేన కర్మణా ॥ 16

విశిష్ట కాలసంబంధాత్ = విశిష్టమగు కాలముయొక్క సంబంధమువలన, శక్తిషు = మూల కారణ గతములగు శక్తులు, లబ్ధ పాకాసు = పొందబడిన పరిపాకము కలవగుచుండగా, ప్రయోగాఖ్యేన = ప్రేరణా రూపమగు, కర్మణా = కర్మచే, నిత్యా = నిత్యమగు, క్రియా = క్రియ, అభివ్యజ్యతే = అభివ్యక్తమగును.

తాత్పర్యము— విశిష్ట కాలసంబంధముచేత కారణగతములగు కార్యజనన శక్తులు ఫలోన్ముఖములు కాగా, ప్రేరణా రూపమగు కర్మచే నిత్యమగు క్రియ అభివ్యక్తమగును.

వివరణము— ప్రపంచ సృష్టియంతయు ప్రాణుల సుఖదుఃఖభోగముల నిమిత్తము ఏర్పడుచుండును. కావున ప్రలయాంతమున ప్రాణుల అదృష్ట (కర్మ) వశముచే, జగమునకు మూలకారణములుగ వైశేషికాదులచే అంగీకృతములగు పరమాణువులందు గాని, సాంఖ్యాద్యంగీకృతములగు ప్రధానాదులందు గాని, కార్య జనకములగు శక్తులు ఫలోన్ముఖములగును. అపు డా మూలకారణములు పరస్పర సంశ్లేషము పొందుటకై ప్రేరణా రూపమగు ఒక కర్మవిశేషము కలుగును. దానిచే సర్వపదార్థ సంబంధమగు, క్రియ ప్రకటీకృతమగును. ఈ విధముగ సవ్యాపారము లగు కారణములు పరస్పర సంయోగము చెందును. ॥16॥

అవతారిక— ఇట్లు నిత్య క్రియ అభివ్యక్తమైన పిమ్మట ఏమి జరుగునో చెప్పుచున్నాడు.

శ్లో॥ జాతి ప్రయుక్తా తస్యాం తు ఫలవ్యక్తిః ప్రతీయతే ।
కుతోఽప్యద్భుతయా వృత్త్యా శక్తిభిః సా నియమ్యతే ॥ 17

తస్యాం = ఆ నిత్యమగు క్రియ అభివ్యక్తమైన దగుచుండగా, ఫలవ్యక్తిః + తు = ఫలవ్యక్తి, అనగా కార్యరూప వ్యక్తి, జాతి ప్రయుక్తా = జాతిచే ప్రేరితమైనదై, ప్రతీయతే = కాన వచ్చును, సా = ఆ ఫలవ్యక్తి, అద్భుతయా = ఆశ్చర్యకరమగు, కుతోఽపి = ఒకానొక, వృత్త్యా = వృత్తిచే (పద్ధతిచే), శక్తిభిః = కారణ శక్తులచేత, నియమ్యతే = నియమింపబడును.

తాత్పర్యము— ఆ నిత్య క్రియ అభివ్యక్తమైన పిమ్మట, జాతి ప్రేరితమై ఫల వ్యక్తి కలుగును. కారణ శక్తులు ఆ కార్యమును ఏదియో ఒకానొక అద్భుతమగు పద్ధతిచే నియమించును.

వివరణము— నియత జాతీయములగు పదార్థములు కలసినపుడే కారణములందు వ్యాపారము (క్రియ) జనించును గాన నిత్య క్రియకు జాతి ప్రయోజకము, అనగా ఆ క్రియ కలుగుటకు ప్రయోజక కారణము. ఈ విధముగ జాతి ప్రయుక్తమై ఆ నిత్య క్రియ కార్యాభి వ్యక్తికి హేతువగుచున్నది. ఉత్పత్తికి పూర్వము కార్యము సత్తు (ఉన్నది) అనిగాని అసత్తు (లేనిది) అనిగాని చెప్పజాలము, అది సత్తు అన్నచో ఉన్న దానిని పుట్టించుటకు కారణ ప్రవృత్తి వ్యర్థము కావలసి వచ్చును. అసత్తు అన్నచో - అనగా కారణ వ్యాపారముచే అంతకు పూర్వము లేని కార్యమే పుట్టుచున్నది అని యన్నచో, మట్టి, చక్రము, దండము మొదలగు కారణముల వలన అంతకు పూర్వము లేని ఘటము పుట్టినట్లు అంతకు పూర్వము లేని పటము ఏల జనింపరాదు - అను ప్రశ్న వచ్చును. కావున కార్యము సత్తు అనికాని అసత్తు అనికాని చెప్పుటకు వీలులేదు. కారణ శక్తులు అట్టి కార్యమునకు స్థితి కల్పించుచున్నవనిన ఇది ఎంతయు ఆశ్చర్యకరమగు విషయము. ఈ స్థితిని ఎట్లు కల్పించుచున్నవో చెప్పజాలము. కావుననే 'కుతోఽప్యద్భుతయా వృత్త్యా' అని చెప్పబడినది. ॥17॥

అవతారిక— అటు పిమ్మట ఏమి జరుగునో చెప్పుచున్నాడు.

శ్లో॥ తతస్తు సమవాయాఖ్యా శక్తిర్భేదస్య బాధికా ।
ఏకత్వమివ తా వ్యక్తీ రాపాదయతి కారణైః ॥ 18

తతః = కారణ శక్తులచే కార్యవ్యక్తులు నియమితములైన పిమ్మట, భేదస్య = భేదమును, బాధికా = బాధించు, సమవాయాఖ్యా = సమవాయమనెడు, శక్తిః = శక్తి, తాః = ఆ, వ్యక్తీః = కార్యరూప వ్యక్తులను, కారణైః = కారణములతో, ఏకత్వం = అభేదమును, ఆపాదయతీవ = పొందించుచున్నదా అన్నట్లు ఉన్నది.

తాత్పర్యము— అటుపిమ్మట భేదబాధకమగు సమవాయమనెడు శక్తి కార్యము లకు కారణములతో ఒకి విధమగు అభేదమును కల్పించును.

వివరణము— 'ఇహ తంతుషు పటః' - ''ఈ తంతువులలో పటము ఉన్నది'' ఇత్యాది ప్రతీతిని బట్టి కారణములగు తంతువులకును కార్యమగు పటమునకును ఒక విధమగు సంబంధమున్నట్లు తెలియుచున్నది. అది సమవాయ సంబంధము. ఈ సమవాయము గూడ పరతంత్రమే గాన శక్తిరూపమే. ఈ సమవాయశక్తి భేదమును బాధించు స్వభావము కలది గావున కార్యకారణముల నడుమ భేదము లేనట్లు చూపును.

కారణ వ్యతిరిక్తమగు కార్యము లేదని కొందరు దార్శనికుల యభిప్రాయము. కారణములగు తంత్వాది రూప అవయవములు భిన్నములుగ కనబడుచున్నవి. కార్యములగు

పటాద్యవయవులు అభిన్నములుగ (ఏకవస్తు రూపమున) కనబడుచున్నవి. కావున అవయవము లును అవయవులును అభిన్నములని చెప్పరాదని కొందరి యభిప్రాయము. ఈ అభిప్రాయ మును పురస్కరించుకొని 'ఏకత్వమివ' అని 'ఇవ' శబ్దము ప్రయోగింపబడినది ॥18॥

అవతారిక— ఈ విధముగ కారణశక్తులచే కార్యము ప్రతిష్ఠితమైన పిమ్మట ఏమి జరుగునో చెప్పుచున్నాడు.

శ్లో॥ అథాస్మాన్నియమాదూర్ధ్వం జాతయో యాః ప్రయోజికాః ।
తాః సర్వా వ్యక్తిమాయాన్తి స్వచ్ఛే చ్ఛాయా ఇవాంభసి ॥ 19

అథ = మరియు, అస్మాత్ = ఈ (కారణశక్తి కృతమగు), నియమాత్ = కార్యనియమము నకు, ఊర్ధ్వం = పిమ్మట, ప్రయోజికాః = క్రియా ప్రయోజకములగు, యాః = ఏ, జాతయః = జాతులు కలవో, తాః సర్వాః = అవి అన్నియు, స్వచ్ఛే = స్వచ్ఛమగు, అంభసి = ఉదకమునందు, ఛాయాః ఇవ = వృక్షాది ప్రతిబింబములువలె, వ్యక్తిం = కార్యవ్యక్తిని, ఆయాన్తి = పొందును.

తాత్పర్యము— కారణశక్తులు కార్యమును ఈ విధముగ తమలో నియమించిన పిమ్మట, క్రియా ప్రయోజకములగు జాతులన్నియు, స్వచ్ఛమగు ఉదకమును వృక్షాది ప్రతి బింబములు చేరినట్లు, ఆ వ్యక్తిని పోయి చేరును.

వివరణము— కారణశక్తులు తమవలన జనించిన కార్యమును తమలో నియ మించును. అనగా - జనించి, స్థితిని సంపాదించుకొనిన కార్యము, కారణ మెచట నుండునో అచటనే ఉండును గాని, మరియొక స్థానమున ఉండదు. కార్యమునకు, కారణ స్థితికంటె భిన్నమగు స్థితి లేదు. కారణములు కార్యమును నియమించుట యనగా ఇదియే. కార్య మీ విధముగ స్థితిని పొందిన వెనువెంటనే, ఆ క్షణముననే, తనకు కారణభూతములగు జాతులతో గూడ సంబంధమును పొందును. ఉదాహరణమునకు— ఘట రూపకార్యము పుట్టిన క్షణము ననే సత్త, ద్రవ్యత్వము, పృథివీత్వము మొదలగు జాతులు దానితో సంబంధించును. నిర్మల మగు జలమునందని వృక్షాది ప్రతిబింబము జలాభిన్నముగ భాసించునట్లు ఈ సత్తాది జాతులు గూడ కార్యాభిన్నములుగ భాసించును. ॥19॥

అవతారిక— పిమ్మట గుణములు జనించునని చెప్పుచున్నాడు,

శ్లో॥ కారణానువిధాయిత్వాదథ కారణ పూర్వకాః ।
గుణాస్తత్రోపలభ్యన్తే స్వజాతి వ్యక్తిహేతవః ॥ 20

అథ = అటుపిమ్మట, స్వజాతి వ్యక్తిహేతవః = తమ జాతులయొక్క (రూపత్వాది జాతుల యొక్క) అభివ్యక్తికి కారణ భూతములైన, గుణాః = రూపాది గుణములు, కారణాను విధా యిత్వాత్ = కారణమును అనుసరించున వగుటచే - అనగా కారణము జనించిన పిదప జనిం

చన వగుటచే, కారణ పూర్వకాః = కారణము పూర్వమునందు కలవగుచునే, తత్ర = ఆ కార్యమునందు, ఉపలభ్య న్తే = పొందబడుచున్నవి.

విశేషము— తంతు సంయోగమువలన పటము ఉత్పన్నమగుచున్నది. ఈ పటమునకు తంతువులు సమవాయి కారణము. తంతువుల సంయోగము అసమవాయి కారణము. ఈ విధముగ సమవాయికారణాసమవాయి కారణములను బట్టి ఉత్పన్నమగు పటరూప కార్యము ఉత్పన్నమైన వెంటనే ఒక క్షణకాలము పాటు ఏ గుణములు గాని, ఏ క్రియ గాని లేకుండ ఉండును "ఉత్పన్నం ద్రవ్యం క్షణమగుణం నిష్క్రియం చతిష్ఠతి" అని నైయాయిక సమయము. రెండవ క్షణమున ఈ ద్రవ్యమునందు రూపాదిగుణములు జనించును. ద్వితీయ క్షణమున జనించు ఈ రూపాది గుణములకు పటము సమవాయి కారణము. తంతువులకు చెందిన రూపాది గుణములు అసమవాయి కారణము. ఈ విధముగ ఉత్పన్నములగు రూపాది గుణములు తమ రూపత్వాది జాతులను అభివ్యంజింప చేయును.

అదృష్టవశముచేత పరమాణువులయందు క్రియ ఉత్పన్నమగును ; క్రియవలన విభాగము కలుగును. విభాగము వలన పూర్వ దేశముతో సంయోగము నశించును. పూర్వ సంయోగ నాశము వలన ఉత్తరదేశ సంయోగము ఏర్పడును. పిమ్మట ద్వ్యణుకాది క్రమమున పదార్థము లుత్పన్నమగును. భోగసాధనములగు ఇట్టి పదార్థముల సృష్టికంతకును క్రమాఖ్యమగు కాల శక్తియే కారణము అని ఈ శ్లోకముల తాత్పర్యము. ॥20॥

అవతారిక— ఇంతవరకును కాలము పదార్థముల జన్మమునకు ఏ విధముగ కారణమగుచున్నదో ప్రతిపాదించి పదార్థముల స్థితికి కూడ కాలమే కారణమని నిరూపించుచున్నాడు.

శ్లో॥ ఆశ్రయాణాం చ నిత్యత్వ మాశ్రితానాం చ నిత్యతా ।
తా వ్యక్తీరనుగృహ్ణాతి స్థితిస్తేన ప్రకల్పతే ॥ 21

ఆశ్రయాణాం = ఆశ్రయముల యొక్క, నిత్యత్వం చ = నిత్యత్వము, ఆశ్రితానాం = ఆశ్రయించిన వాటియొక్క, నిత్యతా చ = నిత్యత్వమూ, తాః = ఆ, వ్యక్తీః = వ్యక్తులను, అనుగృహ్ణాతి = అనుగ్రహించుచున్నది, తేన = దానిచేత, స్థితిః = పదార్థముల యొక్క స్థితి, ప్రకల్పతే = ఏర్పడుచున్నది.

తాత్పర్యము— ఆశ్రయముల యొక్క నిత్యత్వము, ఆశ్రయించి యున్న వాటి యొక్క నిత్యత్వము ఆ వ్యక్తులను అనుగ్రహించుచుండుటచే వాటి స్థితి సాధ్యమగుచున్నది.

వివరణము— కార్యవ్యక్తులకు కారణభూతములగు కొన్ని పరమాణ్వాదులు నిత్యములు. ఆ కారణములను ఆశ్రయించుకొని కార్యములుండును. కావున కార్యములకు ఆశ్రయములుగ నున్న ఆ పరమాణ్వాది కారణములు నశింపకుండ నుండుటచే ఈ కార్యములు ఉనికి సాధ్యమైనది. ఈ విధముగ కారణముల నిత్యత్వము (అనగా నిత్యమగు కారణములు) కార్య వ్యక్తులను అనుగ్రహించుచున్నది. ఇట్లే కార్య వ్యక్తులను ఆశ్రయించుకొని యున్న ఘటత్వాది

జాతులు కూడ నిత్యములు. ఆశ్రితములగు ఈ జాతుల నిత్యత్వము గూడ వ్యక్తులను అనుగ్రహించుచున్నది. అనగా ఆ వ్యక్తు లున్నంతకాలము ఆ యా జాతులతో సంబంధించి యుండుటకు వీలగుచున్నది. ఈ విధముగ ఆశ్రయములగు కారణముల నిత్యత్వము ఆశ్రితములగు జాత్యాదుల నిత్యత్వము అనుగ్రహించుటచే ఘటాది కార్యవ్యక్తుల యునికి (స్థితి) సాధ్యమైనది. అనగా కారణములు లేకపోయినచో కార్యములు నిరాధారములై నశించి యుండెడివి. జాతులు లేకపోయినను కార్యములను వ్యవహరించుట కుదరదు గాన అవి లేనివాటితో సమానమై యుండెడివి. ॥21॥

అవతారిక— ఈ విధముగ ఉత్పత్తివలె పదార్థముల స్థితి కూడ పరాధీనమైనదే యని చెప్పుచున్నాడు.

శ్లో॥ అనిత్యస్య యథోత్పాదే పారతంత్ర్యం తథా స్థితౌ ।
వినాశాయైవ తత్సృష్ట మస్వాధీనస్థితిం విదుః ॥ 22

అనిత్యస్య = అనిత్యమగు కార్యమునకు, ఉత్పాదే = ఉత్పత్తి విషయమున, యథా = ఎట్లు, పారతంత్ర్యం = పరాధీనత్వమో, స్థితౌ = స్థితియందు కూడా, తథా = అట్లే, తత్ = ఆ కార్యము, వినాశాయైవ = నశించుటకొరకు మాత్రమే, సృష్టం = సృష్టింపబడినదై యుండెడి (కావున) అస్వాధీన స్థితిం = స్వాధీనము కాని స్థితికల దానినిగా, విదుః = చెప్పుదురు.

తాత్పర్యము— అనిత్యమగు కార్య వ్యక్తి ఉత్పత్తి విషయమున ఎట్లు పరాధీనమో స్థితి విషయమున గూడ అట్లే పరాధీనము. కానిచో అది నశించుటకొరకు మాత్రమే సృష్టింపబడినదని చెప్పవలసి యుండును. కావున కార్య వ్యక్తి స్థితి విషయమున గూడ పరాధీనమే యని చెప్పుదురు.

వివరణము— కార్యమునకు కారణము అవష్టంభకముగ (ఆధారముగ) లేకున్నచో అది నిరాధారమై పుట్టిన వెంటనే నశించి యుండెడిది. అట్లైనచో ఆ వస్తువు ఏదియో యొక ప్రయోజనము నుద్దేశించి సృష్టింపబడినదని కాక నశించుటకు మాత్రమే సృష్టింపబడినదని చెప్పవలసి యుండును. కావున కార్యము స్థితి సమయమున గూడ పరాధీనమే యని వైశేషికాదులు చెప్పుదురు. ॥22॥

అవతారిక— ఉత్పన్నమగు భావము (ద్రవ్య వ్యక్తి) అర్థక్రియాకారికావలెనన్నచో (కొన్ని కార్యములను సాధింపవలెనన్నచో) దానికి స్థితిని అంగీకరింపవలెను అని చెప్పుట యుక్తము కాదు. ఆ కార్య వ్యక్తి అర్థ క్రియల నన్నింటిని క్రమముగ చేయునా ఒక్క మారుగ చేయునా? క్రమముగ చేయుచున్నది ఆ ఒక్క కార్యవ్యక్తియే అని చెప్పుటకు ప్రమాణము లేదు. అది అన్ని అర్థ క్రియలను ఒక్కమారుగ చేయుచున్నట్లు కానవచ్చుట లేదు. కావున ఉత్పన్నమగు కార్య వ్యక్తికి స్థితిని అంగీకరింప బనిలేదనియు, అది ఉత్పన్నమైన వెంటనే నశించుననియు ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ స్థితః సంసర్గిభిర్భావైః స క్రియాస్వను గృహ్యతే ;
నైషాం సత్తా మనుద్గృహ్య వృత్తిర్జన్మవతాం స్మృతా ॥ 23

స్థితః = స్థితమగు, సః = ఆ భావము (కార్యవ్యక్తి), సంసర్గిభిః = తనతో సంసర్గము కల, భావైః = భావములచేత, క్రియాసు = అర్థ క్రియల విషయమున, అనుగృహ్యతే = అనుగ్రహింపబడు చున్నది, జన్మవతాం = ఉత్పన్నములగు భావములకు, ఏషాం = సంసర్గము గల ఈ సహకారుల యొక్క, సత్తాం = స్థితిని, అనుద్గృహ్య = గ్రహింపకుండగా, వృత్తిః = వ్యాపారము, న స్మృతా = చెప్పబడలేదు (అంగీకరింప బడలేదు).

తాత్పర్యము— స్థితిని పొందిన ఆ భావము (పదార్థము) అర్థ క్రియాకరణము విషయమున తనతో సంబంధించు ఇతర భావములచే అనుగ్రహింపబడుచున్నది. వీటి సత్తను స్వీకరింపకుండగా ఉత్పన్నములగు భావపదార్థములు వ్యవహరింపజాలవు.

వివరణము— ఉత్పన్నమగు కార్య ద్రవ్యము స్థితిని పొంది క్రమముగా అర్థ క్రియాకారి యగును. ఇది క్రమముగ ఏల చేయవలయును ; ఒక్క మారుగనే ఏల చేయజాల కున్నది - అను ఆక్షేపము అయుక్తము. ఉత్పన్నమగు ఏ పదార్థమైనను అర్థ క్రియాకారి కావలె నన్నచో దానికి ఇతర భావముల సాహాయ్యము అవశ్యకము. ఆ యా భావములతో సంబంధమును బట్టి ఆ యా యర్థ క్రియలను క్రమముగ సాధించుచుండును. ఇతర భావ పదార్థముల సంసర్గ రూపమగు అనుగ్రహము లేనిచో ఏ కార్య వ్యక్తియు అర్థ క్రియాకారి కాజాలదు. అందుచే ఉత్పన్నమగు ప్రతి కార్య వ్యక్తియు స్థితిని పొందును అని అంగీకరించుటలో దోషము లేదు. అనగా ఆ యా భావముల సహకారము లభించినపుడు క్రమ నిష్పన్నములగు ఆ యా కార్యములను నిర్వహించుట 'స్థితి'కి లక్షణమని చెప్పినట్లైనది. ఈ స్థితికి కాలము హేతువు. ॥23॥

అవతారిక— ఇపుడు కాలమునకు గల ప్రతిబంధ రూప వృత్తిని చెప్పుచున్నాడు

శ్లో॥ జరాఖ్యా కాలశక్తిర్యా శక్త్యన్తర విరోధినీ ।
సా శక్తిం ప్రతి బధ్నాతి జాయన్తే చ విరోధినః ॥ 24

శక్త్యన్తర విరోధినీ = ఇతర శక్తులకు విరోధినియగు, జరాఖ్యా = జర (జీర్ణమగుట) అనెడు పేరుగల, యా = ఏ, కాలశక్తిః = కాలశక్తి కలదో, సా = అది, శక్తిం = శక్తిని, ప్రతి బధ్నాతి = ప్రతిబద్ధము చేయును (అడ్డుకొనును), విరోధినః చ = విరుద్ధ లక్షణములు కూడ, జాయన్తే = పుట్టును.

తాత్పర్యము— ఇతర శక్తుల నన్నింటిని ఎదుర్కొనెడు జర అనెడు కాల శక్తి, భావములందలి శక్తిని ప్రతిబంధించును. అపుడు కొన్ని విరుద్ధములగునవి పుట్టును.

విశేషము— కాలమునకు జర (దుర్బలమగునట్లు చేయుట) అనెడు ఒక శక్తి

కలదు. ఇది ప్రాణులను అప్రాణులను కూడ వశము చేసికొని వాటియందు అంతవరకును ఉన్న యౌవనాది శక్త్యంతరములను ఎదుర్కొని వాటికి (ప్రాణ్య ప్రాణిరూప కార్యవ్యక్తులకు) గల స్వకార్య కరణశక్తిని పోగొట్టును. అపుడు వాటియందు కార్యకరణ సామర్థ్యమునకు విరుద్ధములగు ప్రజ్ఞామాంద్యము, శుష్కించిపోవుట మొదలగు అవస్థా విశేషములు ఉత్పన్నమగును పీటిని బట్టి ఆ కార్యవ్యక్తుల ప్రధ్వంసము ఆసన్నమైనదని తెలియును.॥24॥

అవతారిక — ఈ విధముగ భావమును జర ఆక్రమింపగా—

శ్లో॥ ప్రయోజకాస్తు యే భావాః స్థితి భాగస్య హేతవః ।
తిరోభవన్తి తే సర్వే యత ఆత్మా ప్రహీయతే ॥ 25

స్థితి భాగస్య = కార్యవ్యక్తికి చెందిన స్థితి రూపాంశమునకు, హేతవః = హేతు భూతములును, ప్రయోజకాః = అర్థ క్రియాకరణ ప్రేరకములును అగు, యే = ఏ, భావాః = సంసర్గి పదార్థములు కలవో, తే సర్వే = అవి అన్నియు, తిరోభవన్తి = అంతర్హితము లగును, యతః = దేనివలన, ఆత్మా = ఆ కార్యవ్యక్తి యొక్క స్వరూపము, ప్రహీయతే = నశించునో.

తాత్పర్యము — కార్య వ్యక్తియొక్క స్థిత్యంశమునకు కారణ భూతములును, ప్రేరకములును అగు భావము లన్నియు అంతర్హితము లగును. దానితో ఆ కార్యవ్యక్తి యొక్క స్వరూపము క్షీణించును.

విశేషము — ఒక కార్యవ్యక్తి సహకారులగు ఇతర భావములతో సంబంధమును పొంది తన అర్థ క్రియలను చేయుచుండును. అదియే దాని స్థితి, అని 23 వ కారికలో చెప్పబడినది. ఈ విధముగ ఒక కార్యవ్యక్తి యొక్క స్థిత్యంశమునకు హేతు భూతములై, అది తన అర్థ క్రియలను చేయునట్లు ప్రేరకములగు సహకారి భావము లన్నియు, ఇంతవరకును ఈ కార్య వ్యక్తితో కలిసియున్నవే యైనను, కృతఘ్నములు వలె ఒకటొక్కటిగ దానిని విడిచిపోవును. అవి దూరముగ పోయినతోడనే ఈ కార్యవ్యక్తి తన స్వరూపమును కోల్పోయి నశించును ॥25॥

అవతారిక — కార్య వ్యక్తుల వినాశము పైన చెప్పిన విధముగ ఏర్పడుచున్నది. అంతియే కాని దీనిని వినాశకారణము నేమియు చేయుటలేదు అని చెప్పుచున్నాడు

శ్లో॥ యథైవాద్భుతయా వృత్త్యా నిష్క్రమం నిర్నిబన్ధనమ్ ।
అపదం జాయతే సర్వం తథాస్యాత్మా ప్రహీయతే ॥ 26

నిష్క్రమం = క్రమ రహితమును, నిర్నిబన్ధనమ్ = కారణ సంబంధము లేనిదియు, అపదం = స్థానము లేనిదియు అగు, సర్వం = సకల కార్యవ్యక్తియు, యథైవ = ఏ విధముగా, అద్భుతయా = ఆశ్చర్యకరమగు, వృత్త్యా = రీతిచే, జాయతే = పుట్టుచున్నదో, తథా = అట్లే, అస్య = ఈ కార్యవ్యక్తి యొక్క, ఆత్మా = స్వరూపము, ప్రహీయతే = నశించుచున్నది.

తాత్పర్యము— ప్రతి కార్యవ్యక్తియు, క్రమమేమియు లేనిదై, నిర్ణీతమగు కారణ సంబంధము గాని, స్థానము గాని లేనిదై ఏ విధముగ అత్యాశ్చర్యజనకమగు రీతిలో జనించు చున్నదో అట్లే నాశమును కూడ పొందుచున్నది.

విశేషము— ఒక కారణమునుండి కార్యము పుట్టుచున్నదని అనునపుడు ఉత్పత్తి పూర్వము ఆ కార్యము ఉండెనా (సత్) లేదా (అసత్) అను ప్రశ్న ఉదయించును. పూర్వమే ఉండెనన్నచో దానిని పుట్టించుటకై కరణ వ్యాపారము చేయ బనిలేదు. లేనిదే పుట్టుచున్నచో మృత్తునుండి అంతకుపూర్వము లేని ఘటము పుట్టినట్లు అంతకుపూర్వము లేని పటము కూడ ఏల పుట్టరాదు అను ప్రశ్న ఉదయించును. కావున ఉత్పత్తికి పూర్వము కార్యము సత్తు అని కాని అసత్తు అని కాని చెప్పజాలము. ఈ విధముగ కార్యముయొక్క స్వరూపమును గాని, ఉత్పత్తి క్రమమును గాని, కారణముతో దానికి గల సంబంధమును గాని సరిగా నిర్వచించుట కష్టమైన విషయము మనకు తెలియని ఆశ్చర్యకరమగు రీతిలో కార్య ప్రపంచమంతయు జనించుచున్నదని చెప్పవలెను దాని వినాశము కూడ ఇట్లే కాలాధీనమై వర్ణనాతీతమగు - రీతిలో జరుగుచున్నదని యభిప్రాయము. ॥26॥

అవతారిక— కాలము చేయు అనుజ్ఞా ప్రతిబంధములను బట్టి సృష్టి స్థితి వినాశాదులు ఏర్పడుచున్నవనియు, వీటి అన్నిటియందును సర్వాత్మకమగు కాలముయొక్క వ్యాపారమున్నదనియు "ప్రత్యవస్థం తు కాలస్య వ్యాపారోఽత్ర వ్యవస్థితః" ఇత్యాది కారికలచే ప్రతిపాదితమైనది. ఇపుడు కాలానుమానమునకు మరియొక హేతువును గూడ చెప్పచున్నాడు

శ్లో॥ క్రియయోరపవర్గిణోర్నానార్థ సమవేతయోః ।
సమ్బన్ధినా వినైకేన పరిచ్ఛేదః కథం భవేత్ ॥ 27

అపవర్గిణోః = ఫలప్రాప్తి పర్యంతము వ్యాపించి యున్నవియు, నానార్థ సమవేతయోః = అనేక పదార్థములతో సంబంధించి యున్నవియు అగు, క్రియయోః = రెండు క్రియలకు, ఏకేన = ఒక, సమ్బన్ధినావినా = సంబంధి లేకుండగ, పరిచ్ఛేదః = పరిచ్ఛేదము, కథం = ఎట్లు, భవేత్ = అగును?

తాత్పర్యము— అనేక పదార్థములతో సంబంధించినవై ఫలప్రాప్తివరకును వ్యాపించియున్న రెండు క్రియలకు, ఒక సంబంధి లేకున్నచో పరిచ్ఛేదము ఎట్లు అగును?

వివరణము— ఘటము తయారుచేయుటకు చాలసేపు పట్టినది; పటము నేయుటకు చాలసేపు పట్టినది అని వ్యవహారము లోకమున నున్నది. ఘటమును తయారుచేయుట అను క్రియ వాస్తవమున ఒక క్రియ కాదు. అనేక క్రియా సమాహారాత్మకమైనది. అనగా మట్టి తెచ్చుట, దానిని శుభ్రముచేయుట, చక్రముపైకి ఎక్కించుట, చక్రమును త్రిప్పుట మొదలగు ఎన్నియో క్రియలు ఘటమును తయారుచేయుట అను క్రియతో సంబంధించి దాని

యందు అంతర్గతములై యున్నవి. పట నిర్మాణాది క్రియలు కూడ ఇట్లే ఈ విధముగ ఘట పటాది నిర్మాణ రూప క్రియాంతర్గతములగు వివిధ క్రియలతో అనుస్యూతముగ సంబంధించు కాలమనెడు ఒకదానిని అంగీకరింపకున్నచో ఈ పని శీఘ్రముగ జరిగినది, ఈ పని ఆలస్యముగ జరిగినది అనెడు వ్యవహారము కుదరదు. అవాంతర క్రియ లన్నియు వేరు వేరు క్రియలు కావునను. అవి యన్నియు ఉత్తరక్షణ విధ్వంసులు కావునను, అవి వేటికవియే భిన్నములగుట వలనను ఈ ఘట నిర్మాణము శీఘ్రముగ జరిగినని గాని, ఈ ఘట నిర్మాణము ఆలస్యముగ జరిగినదని గాని చెప్పుటకు అవకాశముండదు. ఈ అవాంతర క్రియలతో అనుస్యూతముగ సంబంధించియున్న కాలమును అంగీకరించినచో ఆ కాలమును బట్టి ఈ పని శీఘ్రముగ జరిగినది, ఇది ఆలస్యముగ జరిగినది అని చెప్పుటకు అవకాశముండును గాన నిత్యమును, సర్వ క్రియాను స్యూతమును అగు కాలము ఉన్నదని అంగీకరింపవలెను. ఈ కాలము ఒక్కటే యైనను వివిధ పదార్థములతో సంబంధించిన క్రియల ప్రమాణమును తెలుపుచు ఈ పటము ఆలస్యముగ తయారయినది, ఈ ఘటము ఆలస్యముగ తయారైనది ఇత్యాది వ్యవహారమునకు నిమిత్తమగుచున్నది. ॥27॥

అవతారిక— కాలము ఏకమే అయినపుడు, ఆలస్యము, శీఘ్రత్వము మొదలగు పరస్పర విరుద్ధములగు ప్రతీతులు ఎట్లు కలుగుచున్నవి అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ యథా తులాయాం హస్తే వా నానాద్రవ్య వ్యవస్థితమ్ ।
గురుత్వం పరిమీయేత కాలాదేవం క్రియాగతిః ॥ 28

నానాద్రవ్య వ్యవస్థితమ్ = అనేక ద్రవ్యములలో నున్న, గురుత్వం = గురుత్వము, యథా = ఏ విధముగా, తులాయాం = త్రాసుయందు గాని, హస్తే వా = హస్తమునందు గాని, పరిమీయేత = తూచబడునో, ఏవం = ఈ విధముగనే, కాలాత్ = కాలమువలన, క్రియాగతిః = క్రియారీతి, కొలవబడుచున్నది.

తాత్పర్యము— అనేక ద్రవ్యములకు సంబంధించిన బరువులను త్రాసు కాని, హస్తము కాని తూచినట్లు కాలము క్రియాగత భేదములను కొలుచుచున్నది.

వివరణము— కొందరు వర్తకులు అభ్యాసాతిశయవశముచే తులాదండము లేకుండ తమ హస్తముచేతనే వస్తువుల బరువును తెలిసికొనగలరు గాన 'హస్తేవా' అని చెప్పబడినది.

అవతారిక — భేదరహితమగు కాలమే నిమేషాది వివిధ క్రియలను వెనుకకు విడిచి విడిచి 'సంవత్సరము' మొదలగు నామధేయములను పొందుచున్నది అని చెప్పుచున్నాడు.

శ్లో॥ జహాతి సహవృత్తాశ్చ క్రియాః స సమవస్థితాః ।
వ్రీహిర్యథోదకం తేన హాయనాఖ్యాం ప్రపద్యతే ॥ 29

వ్రీహిః = వరి అంకురము, ఉదకం యథా = ఉదకమునువలె, సః = ఆ కాలము, సహ వృత్తాః = సహకారులైన, క్రియాః = క్రియలను, సమవస్థితాః = సంప్రాప్తములై యున్న క్రియలను, జహాతి = విడచును, తేన = ఆ కారణముచే, హాయనాఖ్యాం = హాయనమను పేరును, ప్రపద్యతే = పొందుచున్నది.

తాత్పర్యము— వ్రీహ్యంకురము తనతో కలిసిఉన్న నీటిని విడిచి పైకి పోవునట్లు కాలము కూడ సంప్రాప్తమగు (జరుగుచున్న) క్రియలను, వాటికి సహకారులుగ నుండు క్రియలను వెనుకకు విడిచి తాను ముందు ముందుకు పోవుచుండును. కావుననే దీనికి 'హాయనము' అను పేరు వచ్చినది.

వివరణము— 'ఓహాక్ త్యాగే' అను ధాతువుకంటె వ్రీహి, కాలము అను నర్థమున 'ల్యుట్' ప్రత్యయము విధింపబడినది. దీనిచే 'హాయనః' అను రూపము సిద్ధించును. వరి లేక సంవత్సరము అని అర్థము. వరి అను నర్థమున "జహాతి ఉదకం" (ఉదకమును విడిచి పైకి వచ్చునది) అని విగ్రహము. సంవత్సర పక్షమున "జహాతి భావాన్" (పదార్థములను విడచునది) అని విగ్రహము. ఈ కారికను బట్టి "జహాతి భావగత క్రియాః" అని విగ్రహము చెప్పుకొనవలెను. కలిసిఉన్న జలము ఏ విధముగ వ్రీహులకు ఉపకరించునో అట్లే కాలము కూడ సహకారులగు క్రియలద్వారా భావములకు ఉపకరించుచున్నది. కావున కాలమునందలి భేదమంతయు ఉపాధికృతమే. వాస్తవమున కాలమనునది ఒక్కటియే.

అవతారిక— కాలము ఒక్కటే యైనచో దానికి క్రమరూపత్వ మెట్లు పొసగును - అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రతిబన్ధాభ్యనుజ్ఞాభ్యాం వృత్తిర్యా తస్య శాశ్వతీ ।
తయా విభజ్యమానోఽసౌ భజతే క్రమరూపతామ్ ॥ 30

ప్రతిబన్ధాభ్యనుజ్ఞాభ్యాం = సాధన శక్తులయొక్క ప్రతిబంధముచేతను అనుజ్ఞచేతను (ప్రతిబంధానుజ్ఞల ద్వారా), తస్య = ఆ కాలముయొక్క, యా = ఏ, శాశ్వతీ = శాశ్వతమైన, వృత్తిః = భావముల విషయమున ప్రవృత్తి గలదో, తయా = ఆ ప్రవృత్తిచే, విభజ్యమానః = విభజింపబడు చున్నదై, అసౌ = ఈ కాలము, క్రమరూపతాం = క్రమరూపత్వమును (క్రమమును), భజతే = పొందుచున్నది.

తాత్పర్యము— కాలము ఎల్లపుడును ప్రతిబంధానుజ్ఞల ద్వారా సర్వభావముల విషయమునను ప్రవర్తించుచున్నది. ఈ ప్రవృత్తిచే కాలము విభక్తమైనదివలె కనబడుచు క్రమరూపత్వమును పొందుచున్నది.

వివరణము— ఒక క్రియకు సంబంధించిన సాధనశక్తులు పనిచేయకుండ చేయుట ప్రతిబంధము. అవి పనిచేయునట్లు చేయుట అభ్యనుజ్ఞ. ఈ విధములగు ప్రతిబంధాభ్యనుజ్ఞల ద్వారా కాలము సర్వభావములతోడను సంబంధించుచున్నది. ఈ ప్రతిబంధాభ్యనుజ్ఞాక్రమ

మును బట్టి కాలమునందు క్రమమున్నట్లు తోచుచున్నది గాని వాస్తవమున దానియందు క్రమము లేదు. ఎల్లవేళల పరిణామమును చెందు భావములలో ఒకటి పుట్టుచుండును, మరి యొకటి నశించుచుండును. ఈ విధముగ ఆ యా క్రియల ద్వారా కార్యములకు చెందిన క్రమము కాలమునందు ఆరోపింపబడుచున్నది. ॥30॥

అవతారిక— సామ్య వైషమ్యాదులు కూడ కాలమునందు ఆరోపితములైనవే యని చెప్పుచున్నారు.

శ్లో॥ కర్తృభేదా త్తదర్థేషు ప్రకర్షాపచయౌ గతః ।
సమత్వం విషమత్వం వా స ఏకః ప్రతిపద్యతే ॥ 31

ఏకః = ఒక్కటైన (భేదరహితమైన), సః = ఆ కాలము, కర్తృభేదాత్ = ఆ యా కర్తల యొక్క భేదమువలన, తదర్థేషు = వారు చేయవలసిన ఆచారముల విషయమున, ప్రకర్షాపచయౌ = ఉత్కర్షాపకర్షములను, గతః = పొందినదై, సమత్వం = సమత్వమును కాని, విషమత్వం వా = విషమత్వమును కాని పొందుచున్నది.

తాత్పర్యము— కాలము ఒక్కటియేయైనను, కర్తల భేదము ననుసరించి ఆ యా ఆచారాదుల విషయమున నేర్పడిన ఉత్కర్షాపకర్షములను బట్టి సమత్వమును గాని, విషమత్వమును గాని పొందుచున్నది.

వివరణము— అనుష్ఠాత లగువారు శ్రుతి స్మృత్యాది విహితమగు ఆచారమును చక్కగ అనుష్ఠించునపుడు కాలము కృతయుగాది నామధేయములతో సమకాలము (మంచి కాలము) అని చెప్పబడుచున్నది. ఆ అనుష్ఠాతలు ధర్మ మార్గము నుల్లంఘించి యథేచ్ఛగ ప్రవర్తించునపుడు ఆ కాలమే కలియుగాది నామములతో విషమ కాలమని చెప్పబడుచున్నది ఈ విధముగ సామ్యవైషమ్యములు ధర్మాచరణమునందలి సామ్యవైషమ్యములను బట్టి వచ్చినవే కాని వాస్తవమున కాలమునందు లేవు. కాలము ఎప్పుడును ఏకవిధముగనే యుండును. ॥31॥

అవతారిక— కాలమునందు ఆరోపితమగు మరియొక విభాగమును గూడ చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాభేదాద్యథైకస్మిం స్తక్షాద్యాఖ్యా ప్రవర్తతే ।
క్రియాభేదా త్తథైకస్మి న్నృత్వాద్యాఖ్యోపజాయతే ॥ 32

యథా = ఏ విధముగా, ఏకస్మిన్ = ఒకే వ్యక్తియందు, క్రియాభేదాత్ = క్రియా భేదము వలన, తక్షాద్యాఖ్యా = 'వడ్రంగి' మొదలగు పేరు, ప్రవర్తతే = ప్రవర్తించునో, తథా = అట్లే, ఏకస్మిన్ = ఒకే కాలమునందు, క్రియాభేదాత్ = క్రియాభేదము వలన, ఏకస్మిన్ = ఒకే కాలమునందు, ఋత్వాద్యాఖ్యా = ఋతువులు మొదలగు పేరు, ఉపజాయతే = కలుగును.

తాత్పర్యము— (తాను చేయు) పనుల భేదమును పట్టి ఒకే వ్యక్తికి వడ్రంగి

మొదలగు పేర్లు వచ్చినట్లు ఒకే కాలమునకు క్రియాభేదముచే 'ఋతువు' మొదలగు పేర్లు వచ్చుచున్నవి.

వివరణము— ఒకే వ్యక్తికి కత్రపని చేయునపుడు వడ్రంగి యనియు, ఇనుప పనిముట్లు చేయునపుడు కమ్మరి యనియు పేర్లు పెట్టుచుందుము. అట్లే ఆ యా పుష్పవిశేషములను ఆవిర్భవింపచేయుట మొదలగు క్రియా భేదములను బట్టి ఒకే కాలమునకు వసంతర్త్వాది నామధేయములు కలుగుచుండును. 'ఋత్వాద్యాఖ్యా' అను పదమునందలి ఆది పదముచే, ఆ యా క్రియా భేదములచే నేర్పడు శుక్ల కృష్ణపక్ష వ్యవహారము, అహోరాత్రి వ్యవహారము, ప్రదోష ప్రత్యూష వ్యవహారము మొదలగునవి గ్రాహ్యములు. ॥32॥

అవతారిక— కాలమునందు భేదారోపణమునకు కారణాంతరమును గూడ చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆరమ్భశ్చ క్రియాచైవ నిష్ఠా చేత్యభిధీయతే ।
ధర్మాన్తరాణా మధ్యాసభేదాత్ సదసదాత్మనః ॥ 33

సదసదాత్మనః = సదాత్మకమును అసదాత్మకమును అగు పదార్థముయొక్క, ధర్మాన్తరాణాం = విలక్షణములగు భిన్న ధర్మములయొక్క, అధ్యాస భేదాత్ = ఆరోపణమువలన కలిగిన భేదమును బట్టి, ఆరంభశ్చ = ప్రారంభము, క్రియా = క్రియయు, నిష్ఠాచ ఇతి = నిష్ఠ అనియు, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— సదసదాత్మకమగు పదార్థమునకు గల విలక్షణములగు భిన్న ధర్మముల ఆరోపముచే నేర్పడిన భేదమువలన, ఆరంభమనియు, క్రియయనియు, నిష్ఠ యనియు చెప్పబడుచున్నది.

వివరణము— ఉత్పత్తికి పూర్వము పదార్థము అసదాత్మకము, ఉత్పత్త్యనంతరము సదాత్మకము. ఆ వస్తువును బుద్ధిచే ఏకరూపముగ గ్రహించి విలక్షణములగు ధర్మముల భేదమును బట్టి ఆరంభ కాలమనియు, క్రియా కాలమనియు, నిష్ఠా కాలమనియు వ్యవహరించుట జరుగుచున్నది. పదార్థ స్వరూపమును బుద్ధితో ఊహించుకొని యోగ్యములగు సాధనములను సమకూర్చుకొనుట ఆరంభకాలము. సమకూర్చుకొనిన సాధనములతో పనిచేయుట క్రియా కాలము. చేయవలసిన పని పూర్తియగుట నిష్ఠా కాలము. ఈ విధముగ ధర్మభేద కల్పనచే ఆరంభాది కాల విభాగము ఏర్పడుచున్నది. ॥33॥

అవతారిక— ఇట్టి కాల్పనికమగు విభాగము అన్ని పదార్థముల విషయమునను సమానమేయని చెప్పుచున్నాడు.

శ్లో॥ యావాంశ్చ ద్వ్యణుకాదీనాం తావాన్ హిమవతోఽప్యసౌ ।
సహ్యాత్మా కస్యచిద్వేత్తుం ప్రచేతుం వాపి శక్యతే ॥ 34

అసౌ = ఈ ఆరంభాది కాలము, ద్వ్యణుకాదినాం=ద్వ్యణుకము మొదలగు వాటి విషయమున, యావాన్ = ఎంతటిదో, హిమవతోపి = హిమవత్పర్వత విషయమునందు గూడ, తావాన్ = అంతటిదిగానే ఉండును, కస్యచిత్ = ఏ ఆరంభాది కాలము యొక్కయు, ఆత్మా = స్వరూపము, భేత్తుం = తగ్గించుటకు గాని, ప్రచేతుం వా = వృద్ధి పొందించుటకు గాని, న శక్యతే హి = శక్యము కాదు కదా ?

తాత్పర్యము — ద్వ్యణుకాదుల ఆరంభాది కాలములు ఎంత యుండునో హిమవత్పర్వ తారంభాది కాలములు కూడ అంతయే ఉండును. ఆరంభాది కాలముల స్వరూపము అవయవిని బట్టి పెరుగుట కాని తగ్గుట గాని ఉండదు కదా ?

వివరణము— రెండు అణువుల సంయోగముచే ఏర్పడినది ద్వ్యణుకము. ఇది అత్యల్ప ప్రమాణము. హిమవత్పర్వతము అత్యధిక ప్రమాణము. అత్యల్పాత్యధిక ప్రమాణములు గల కార్యములగు ఈ రెండు అవయవులకు సంబంధించిన ఆరంభాది కాలములు తుల్యములే. అనగా అవయవులను బట్టి వాటి ప్రమాణములను బట్టి ఆరంభాది కాలములలో ఎట్టి వైశిష్ట్యమును కలుగదు. వాటిలో ఏదైన వైశిష్టమున్నచో అందులకు కారణము వేరు. ॥34॥

అవతారిక— ఆరంభాది కాలములలో వైశిష్ట్య మేర్పడుటకు కారణమేదియో చెప్పుచున్నాడు.

శ్లో॥ అన్యైస్తు భాగై రన్యేషాం ప్రచయః పరికల్ప్యతే ।
శనై రిద మిదం క్షిప్రమితి తేన ప్రతీయతే ॥ 35

తు = కాని, అన్యేషాం = అల్ప పరిమాణ మహాపరిమాణము లగు భిన్నావయవులకు, అన్యైః = అవయవి వ్యతిరిక్తములైన, భాగైః = అవయవములచే, ప్రచయః = అభివృద్ధి, పరికల్ప్యతే = కల్పింపబడుచున్నది, తేన = దానిచేత, ఇదం = ఇది, శనైః = మందముగ జరుగుచున్నది, ఇదం = ఇది, క్షిప్రం = శీఘ్రముగ జరుగుచున్నది, ఇతి = అని, ప్రతీయతే = తోచుచున్నది.

తాత్పర్యము— అవయవులకు స్వవ్యతిరిక్తము లగు అవయవములచే వృద్ధి కలుగుచున్నది. దానిని బట్టి ఇది ఆలస్యముగ జరిగినది, ఇది శీఘ్రముగ జరిగినది అను ప్రతీతి కలుగుచున్నది.

వివరణము— అవయవములు అధిక సంఖ్యాకము లైనచో అవయవులకు వృద్ధి కలుగుచున్నది. అవి అల్ప సంఖ్యాకము లైనచో అపచయము (హ్రాసము) కలుగుచున్నది. ఈ విధముగ అధిక సంఖ్యాకములగు అవయవములు గల అవయవి ఆలస్యముగ తయారగుచున్నది. అల్ప సంఖ్యాకములగు అవయవములు గల అవయివి శీఘ్రముగ తయారగుచున్నది. ఇట్లు అవయవముల సంఖ్యాభేదమును బట్టి అవయవులకు సంబంధించిన ఆరంభాది కాలములలో వైలక్షణ్యము కనబడుచున్నది. ॥35॥

అవతారిక—— ఈ వస్తువు శీఘ్రముగ ఉత్పన్నమైనది, ఇది ఆలస్యముగ ఉత్పన్నమైనది అను వ్యవహారము వాస్తవమున అవయవితో సంబంధించు విభిన్నావయవముల సంఖ్యాల్పత్వాధిక్యములచే ఏర్పడినదే గాని శీఘ్రత్వ మందత్వములలో గోచరించు క్రమము వాస్తవమున అవయవియగు భావమున (పదార్థమున) లేదు అను విషయమునే విశదీకరించు చున్నాడు

శ్లో॥ అసతశ్చ క్రమోనాస్తి సహి భేత్తుం న శక్యతే ।
సతోఽపి చాత్మతత్త్వం యత్ తత్తథైవావతిష్ఠతే ॥ 36

అసతః + చ = అసత్తు అగు పదార్థమునకు, క్రమః = క్రమము, నాస్తి = లేదు, హి = ఎందువలన అనగా, సః = అసత్తు, భేత్తుం = పౌర్వాపర్యాది క్రమములచే విశేషించుటకు, న శక్యతే = శక్యము కాదు, సతోఽపి = సత్తు అగు పదార్థము యొక్క, యత్ = ఏ, ఆత్మతత్త్వం = ఆత్మ స్వరూపము కలదో, తత్ + చ = అదియు, తథైవ = ఆ విధముగనే అవతిష్ఠతే = ఉండును.

తాత్పర్యము—— అసత్ అగు భావమునకు క్రమము లేదు. ఏలయనగా అది భేదింప వీలు కానిది. సత్ అగు పదార్థము యొక్క స్వరూపము కూడ అట్లే - క్రమరహితముగ - నుండును

విశేషము—— అసత్ అనగా ఉత్పత్తికి పూర్వము లేని భావము (పదార్థము) దానికి ఒక స్వరూపమే లేదుగాన పౌర్వాపర్యమనెడు భేదమును పట్టి ఏర్పడు క్రమము దానికి సంభవింపదు. ఒక పదార్థము పుట్టిన పిమ్మట గూడ దాని స్వరూపమున పౌర్వాపర్య రహితముగనే ఉండును గాన దానియందు కూడ క్రమమును అంగీకరింప వీలులేదు కావున సద సత్పదార్థముల విషయమున గోచరించు క్రమము కేవలము బుద్ధి కల్పితమే కాని వాస్తవము కాదు. అనగా ఒక పదార్థము పుట్టుటకు పూర్వము క్రమము లేదు, పుట్టిన పిమ్మట గూడ క్రమము లేదు ఉత్పత్తికి పూర్వమును ఆ పదార్థ మొకటి ఉన్నదని బుద్ధిచే భావనచేసి అది ఉత్పన్నమైన తరువాత బుద్ధిలో ఉన్న ఆ పదార్థము ఈ పదార్థము కూడ ఒకటేయని అను కొని ఆ పదార్థమునందు ఒక విధమగు క్రమము ఆరోపింపబడుచున్నది గాని వాస్తవమున పదార్థమున అసదవస్థా - సదవస్థలు రెండింటి యందును క్రమము లేదని అభిప్రాయము ॥36॥

అవతారిక—— క్రియా భేదమును బట్టి కాలమునకు 'ఋతువు' మొదలగు పేర్లు ఏర్పడుటయే కాదు, భూతము, భవిష్యత్తు మొదలగు పేర్లు కూడ ఏర్పడుచున్నవి అని చెప్పు చున్నాడు

శ్లో॥ క్రియోపాధిశ్చ సన్ భూతభవిష్య ద్వర్తమానతాః ।
ఏకాదశభిరాకారై ర్విభక్తాః ప్రతిపద్యతే ॥ 37

క్రియోపాధిః + చ + సన్ = క్రియలు ఉపాధిగా కలదై, ఏకాదశభిః = పదకొండు, ఆకారైః = ఆకారములచే, విభక్తాః = విభక్తములగు, భూతభవిష్యద్వర్తమానతాః = భూతత్వమును, భవిష్యత్త్వమును, వర్తమానత్వమును, ప్రతిపద్యతే = పొందుచున్నది.

తాత్పర్యము— కాలము క్రియారూపములగు ఉపాధులను బట్టి పదకొండు అవాంతర భేదములు గల భూత - భవిష్యద్వర్తమాన నామధేయములను పొందుచున్నది.

వివరణము—ఒక క్రియ ఉత్పన్నమై నశించిపోయినపుడు అట్టి క్రియ ఉపాధిగా కల కాలము భూతకాలము. సాధనములన్నియు సమకూడి ఇక ఈ క్రియ జరుగవచ్చును అను పరిస్థితు లేర్పడినపుడు అట్టి క్రియ ఉపాధిగా కల కాలము భవిష్యత్కాలము. ప్రారంభమై సమాప్తిచెందని క్రియ ఉపాధిగాగల కాలము వర్తమానకాలము. ఈ భూతాదికాలములకు పదునొకండు అవాంతరభేదము లుండును. ॥37॥

అవతారిక— భూతాది కాలములకు గల పదకొండు భేదములను చెప్పుచున్నాడు.

శ్లో॥ భూతః పంచవిధస్తత్ర భవిష్యంశ్చ చతుర్విధః ।
వర్తమానో ద్విధాఖ్యాత ఇత్యేకాదశ కల్పనాః ॥ 38

తత్ర = వాటిలో, భూతః = భూతకాలము, పంచవిధః = ఐదు విధములైనది, భవిష్యన్ + చ = భవిష్యత్కాలము, చతుర్విధః = నాల్గు విధములైనది, వర్తమానః = వర్తమాన కాలము ద్విధా = రెండు విధములైనదిగా, ఆఖ్యాతః = చెప్పబడినది, ఇతి = ఈ విధముగా, ఏకాదశ = పదకొండు, కల్పనాః = భేదకల్పనలు ఉన్నవి.

తాత్పర్యము— భూతకాలము ఐదు విధములనియు, భవిష్యత్కాలము నాలుగు విధములనియు, వర్తమానకాలము రెండు విధములనియు చెప్పబడినది. ఈ విధముగ పదకొండు భేదములు కల్పింపబడుచున్నవి.

విశేషము— భూతకాలము ఐదు విధములు. సామాన్య భూతము మొదటిది. అద్యతన భూతము రెండవది. అనద్యతన భూతము మూడవది. అద్యతనానద్యతన సముదాయ రూప భూతము నాల్గవది. భవిష్యత్తు ఐనను భూతత్వాధ్యారోపముచే భూతకార్యములను పొందునది ఐదవది. ఇది గౌణభూతము. భవిష్యత్తు నాల్గు విధములు. సామాన్య భవిష్యత్తు మొదటిది. అద్యతన భవిష్యత్తు రెండవది. అనద్యతన భవిష్యత్తు మూడవది. అద్యతనానద్యతన సముదాయ రూప భవిష్యత్తు నాల్గవది. వర్తమానము రెండు విధములు. ముఖ్య వర్తమానము మొదటిది. వర్తమానమునకు సమీపముననున్న భూతము కాని భవిష్యత్తు కాని వర్తమానముగ వ్యవహరింపబడును ; అది రెండవది. ఈ విధముగ శాస్త్రకార్య ప్రవిభాగము నిమిత్తము కాలమునకు భేదములు కల్పితములై యున్నవి. వీటి సంఖ్య ఇంతయే యని నియమించుటకు గూడ వీలులేదు. అనంత క్రియాభేదమును బట్టి కాలభేదములను అసంఖ్యాకముగ కల్పింప

వచ్చును. గడచిన రాత్రి నాల్గవ జాము మొదలు ఈ రాత్రి మొదటి జాము వరకును గల కాలము అద్యతనము తద్భిన్నము అనద్యతనము. ॥38॥

అవతారిక— కడచిపోయిన క్రియను బట్టి కాలమునందు ఇది భూతకాలము అను వ్యవహారము కలుగుచున్నది అని చెప్పబడినది. ఎప్పుడో జరిగి ఇపుడు లేని క్రియ కాలము నందు భూతవ్యపదేశమును (భూతమను పేరును) ఎట్లు కల్పింపగల్గును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు

శ్లో॥ కాలేనిధాయ స్వంరూపం ప్రజ్ఞయా యన్నిగృహ్యతే ।
భావా స్తతోనివర్తన్తే తత్ర సంక్రాన్త శక్తయః ॥ 39

భావాః = పదార్థములు, స్వం = తమకు సంబంధించిన, యత్ = ఏ, రూపం = స్వరూపము, ప్రజ్ఞయా = బుద్ధిచే, నిగృహ్యతే = గ్రహింపబడునో, దానిని, కాలే = కాలమునందు, నిధాయ = ఉంచి, తత్ర = దానియందు, సంక్రాన్త శక్తయః = సంక్రమించిన శక్తులు కలవై, తతః = దానినుండి, నివర్తన్తే = మరలుచున్నవి.

తాత్పర్యము— పదార్థములు బుద్ధిచే గ్రహింపదగిన తమ స్వరూపమును కాలము నందు ఉంచి, ఆ కాలమునందు సంక్రమించిన శక్తులు కలవై, ఆ కాలమునుండి దూరమగు చున్నవి.

వివరణము— పదార్థములు క్రియచే నిష్పన్నమగుచున్నవి. క్రియతో సంబంధించు సమయమున అవి వర్తమానావస్థలో నున్నవని యర్థము వర్తమానావస్థలో నున్న ఆభావముల స్వరూపమును అపుడు బుద్ధి గ్రహించుచున్నది. ఈ విధముగ బుద్ధిచే గృహీత మగు తమ స్వరూపమును ఆభావములు స్థిరమును, సర్వాధారమును అగు కాలమునందు సమర్పించి తాము మాత్రము తొలగిపోవుచున్నవి అట్టి పరిస్థితిలో పూర్వాను భూతములగు ఈ పదార్థములను స్మరించుట మాత్రమే జరుగుచున్నది. ఈ విధముగ స్మరింపబడు చున్న పదార్థములతో సంబంధమును బట్టి కాలమునందు 'ఇది భూతకాలము' అను వ్యవహార మేర్పడుచున్నది. అనగా ఒక క్రియతో సంబంధించునదిగ ఒక సమయమున కనబడిన ఒక పదార్థము ఈ సమయమున ఆ క్రియతో సంబంధించినదిగ కనబడకున్నను, ఆ సమయమున (ఆ కాలమున) ఆ పదార్థము యొక్క సంస్కారము పడియుండుటచే, దాని స్మరణ మిపుడు ఏర్పడుచున్నది స్మృతి గోచరమగు ఆ పదార్థమును బట్టి ఆ కాలమునందు భూతకాలమనెడు వ్యవహారము సిద్ధించుచున్నది. దానిని బట్టి 'అభూత్ ఘటః' (ఘటము ఉండెను) ఇత్యాది ప్రతీతి కలుగుచున్నది ఈ విధముగ భూతాది వ్యపదేశమునకు ఘటాది పదార్థములు కారణము. ఘటాది పదార్థములే లేకున్నచో కాలమునందు భూతాది వ్యవహారమే లేకుండెడిది. ॥39॥

అవతారిక— పదార్థములు ఇంకను ఉత్పన్నములు కాని సమయమున వాటితో సంబంధము లేదు గాన వాటిని బట్టి కాలమునకు 'ఇది భవిష్యత్తు' అను వ్యవహారము ఎట్లు కలుగును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ భావినాంచైవ యద్రూపం తస్య చ ప్రతిబింబకమ్ ।
సునిర్మృష్ట ఇవాదర్శే కాలఏవోపపద్యతే ॥ 40

భావినాం = పుట్టబోవు పదార్థములయొక్క, యత్ = ఏ, రూపం = రూపము కలదో అదియు, తస్య = దానియొక్క, ప్రతిబింబకం చ = బుద్ధిలో నిశ్చితమగు ప్రతిబింబ రూపము, సునిర్మృష్టే = బాగుగా పరిశుద్ధముచేయబడిన, ఆదర్శే ఇవ = అద్దమునందువలె, కాలఏవ = కాలమునందే, ఉపపద్యతే = ఏర్పడుచున్నది.

తాత్పర్యము— పుట్టబోవు పదార్థముల ఏ బాహ్యరూపము కలదో అదియు, దాని ప్రతిబింబమూ ఈ రెండునూ బాగుగా శుద్ధముచేయబడిన అద్దమునందువలె కాలమునందే ఏర్పడుచున్నవి.

వివరణము— కారణములన్నియు సమకూడిన పిమ్మట ఇక ఈ పదార్థము తయారుకానున్నది అను ప్రతీతి కలుగును. ఇది భావిపదార్థము ఇట్టి పదార్థమునకు ఏర్పడనున్న బాహ్యరూపము బుద్ధియందు ప్రతిబింబించును ; అనగా బుద్ధిలో గోచరించును. రాబోవు బాహ్యరూపమునకును, బుద్ధిస్థమగు రూపమునకును ఐక్యమును కల్పించి వీటిని స్థిరరూపమగు కాలముతో సంబంధింపచేయుటచే, భావియగు ఈ పదార్థముతో సంబంధమును బట్టి కాలమునకు గూడ భావిత్వ మేర్పడుచున్నది. ఎప్పుడో పుట్టిన పదార్థముయొక్క శక్తిని కాలమునందు సంక్రమింప చేయుటచే ఆ కాలమునకు భూతత్వ వ్యపదేశము కలిగినట్లు రాబోవు పదార్థముయొక్క శక్తిని సంక్రమింపచేయుటచే కాలమునకు భవిష్యత్త్వము లభించుచున్నదని యభిప్రాయము. ॥40॥

అవతారిక— పదార్థములన్నియు ఈ విధముగ కాలమునందు సంక్రమించిన రూపముగలవై ఎల్లప్పుడును పరిణామమును చెందుచున్నవని చెప్పుచున్నాడు.

శ్లో॥ తృణపర్ణలతాదీని యథా స్రోతోఽనుకర్షతి ।
ప్రవర్తయతి కాలోఽపి మాత్రా మాత్రావతాం తథా ॥ 41

యథా = ఏ విధముగా, స్రోతః = ప్రవాహము, తృణపర్ణలతాదీని = గడ్డి, ఆకులు, లతలు మొదలగు వాటిని, అనుకర్షతి = లాగికొని పోవునో, తథా = అట్లే, కాలోఽపి = కాలము కూడా, మాత్రావతాం = పదార్థముల యొక్క, మాత్రాః = ధర్మములను, ప్రవర్తయతి = ప్రవర్తింపచేయు చున్నది.

తాత్పర్యము— ప్రవాహము తృణపర్ణ లతాదులను లాగికొని పోయినట్లు కాలము పదార్థముల ధర్మములను ప్రవర్తింపచేయు చున్నది

వివరణము— నదీ ప్రవాహము కొన్ని తృణాదులను వాటి చోటునుండి పెకలించి మరియొక చోటునకు తీసికొనిపోవును. కొన్నింటిని మరియొకచోట నాటుకొనునట్లు చేయును.

అట్లే కాలము పదార్థములను తనతో లాగికొని పోవుచుంచును; విడుచుచుండును; వాటి ధర్మములలో మార్పులు చేయుచుండును. ॥41॥

అవతారిక— ఈ విషయమునే మరియొక దృష్టాంతమును చూపి స్పష్టీకరించు చున్నాడు.

శ్లో॥ ఆవిశ్యేవానుసన్ధత్తే యథా గతిమతాం గతీః ।
వాయుస్తథైవ కాలాత్మా విధత్తే క్రమరూపతామ్ ॥ 42

వాయుః = ప్రాణవాయువు, యథా = ఏ విధముగా, ఆవిశ్య = అవయవములలో ప్రవేశించి (ఇచటనున్న 'ఇవ' శబ్దమునకు విశేషార్థమేమియు లేదు), గతిమతాం = ప్రాణుల యొక్క, గతీః = చేష్టలను, అనుసన్ధత్తే = సాధించునో, తథైవ = అట్లే, కాలాత్మా = సర్వాత్మ భూత మగు కాలము, క్రమరూపతాం = క్రమరూపత్వమును, విధత్తే = ఏర్పరచుచున్నది.

తాత్పర్యము— ప్రాణవాయువు ప్రాణుల అవయవ సంధులలో ప్రవేశించి వారి గమనాది చేష్టలను నడిపించినట్లు కాలము కూడ భావములలో ప్రవేశించి వాటిలో క్రమమును ఏర్పరచుచున్నది.

విశేషము— కాలము ఆయా సాధన శక్తులకు ప్రతిబంధ మేర్పరచి కొన్ని పదార్థములు అదృశ్యములగునట్లు చేయుచున్నది కొన్ని సాధన శక్తులు ప్రసరించునట్లు చేసి కొన్ని పదార్థములను ఆవిర్భవింప చేయుచున్నది. ఈ విధముగ కాలమే పదార్థములలో నున్న క్రమమునకు కారణమగుచున్నది. ॥42॥

అవతారిక— కాలము ఇంకను ఏ యే పనులకు కారణమగుచున్నదో చెప్పు చున్నాడు.

శ్లో॥ అయన ప్రవిభాగశ్చ గతిశ్చ జ్యోతిషాం ధ్రువా ।
నివృత్తి ప్రభవాశ్చైవ భూతానాం తన్నిబన్ధనాః ॥ 43

అయన ప్రవిభాగః చ = ఉత్తరాయణము దక్షిణాయనము అనెడు విభాగము, జ్యోతిషాం = నక్షత్రముల యొక్క, ధ్రువా = నిశ్చితరూపమగు, గతిః చ = గమనము, భూతానాం = (పృథివ్యాది) మహాభూతములయొక్క, నివృత్తి ప్రభవాః చ = ప్రలయోత్పత్తులును, తన్నిబన్ధనాః = ఆ కాలమును బట్టి జరుగుచున్నవి.

తాత్పర్యము— ఉత్తరాయణము దక్షిణాయనము అనెడు విభాగము, నిశ్చితరూప మున జరుగుచున్న నక్షత్రాది గమనము, మహాభూతముల ఉత్పత్తి ప్రలయములు ఇవన్నియు కాలమును బట్టి జరుగుచున్నవి. (ఈ విధముగ సర్వోపకారి యగుటచే కాలమునకు విశ్వాత్మ యని పేరు). ॥43॥

అవతారిక— నక్షత్రము లనెడు జ్యోతిస్సులు కూడ కాలవిభాగ రూపములే కాని కాలముకంటె భిన్నమగు తత్త్వము కాదని చెప్పుచున్నాడు

శ్లో॥ మాత్రాణాం పరిణామా యే కాలవృత్త్యను యాయినః ।
నక్షత్రాఖ్యా పృథక్ తేషు చిహ్నమాత్రం తు తారకాః ॥ 44

మాత్రాణాం = పదార్థములయొక్క, కాలవృత్త్యనుయాయినః = విశిష్టకాల సంబంధముచే ఏర్పడిన, యే = ఏ, పరిణామాః = పరిణామములు కలవో, అవి, పృథక్ = వేరు వేరుగా విభక్తములై నవై, నక్షత్రాఖ్యాః = నక్షత్రములనెడు పేర్లు కలవగుచున్నవి. తారకాః + తు = జ్యోతీరూపములగు నక్షత్రములై తే ; తేషు = ఆ పరిణామముల యందు, చిహ్నమాత్రం కేవలము చిహ్నములుగ మాత్రమే ఉన్నవి.

తాత్పర్యము— విశిష్ట కాల సంబంధముచే పదార్థముల కేర్పడిన పరిణామములు కృత్తికాది నక్షత్ర సంజ్ఞలను పొందుచున్నవి. జ్యోతిరూపమున నున్న తారకలు వాటికి చిహ్నము మాత్రమే.

వివరణము— ''ఈ రోజున పుష్య నక్షత్రము'' ''ఈ రోజున అశ్విని నక్షత్రము'' ఇత్యాది వ్యవహారము లున్నవి. అనగా చంద్రుడు ఆ రోజులలో పుష్య నక్షత్రము తోడను అశ్విని నక్షత్రముతోడను కలిసి యున్నాడని యర్థము కావుననే 'పుష్యేణ యుక్తం పౌషం అహః' ఇత్యాదులలో 'పుష్య నక్షత్రముతో గూడిన చంద్రుడు గల పగలు' ఇత్యాది విధమున అర్థములు చెప్పబడును. అట్లే 'తిష్యః మాణవకః' ''పునర్వసుః మాణవకః'' ఇత్యాది ప్రయోగములు కలవు. అనగా ''చంద్రుడు తిష్య నక్షత్రముతో కలిసియుండగా పుట్టిన పిల్లవాడు, పునర్వసులో నుండగా పుట్టిన పిల్లవాడు'' అని యర్థము. అనగా తిష్య పునర్వస్వాది శబ్దములు మాణవకరూప భావము యొక్క పరిణామమును - మాణవునకును ఒకానొక కాలవిశేషమున కలిగిన జన్మరూప పరిణామమును - బోధించుచున్నవి. ఈ విధముగ నక్షత్రములు భావపరిణామముగ నుండి కాలమునకు ఉపాధిగ అగుచున్నవి ఆకాశమున జ్యోతీరూపమున నున్న నక్షత్రములు ఆ పరిణామమునకే జ్ఞాపకములుగ నున్నవి. ఇట్లు నక్షత్రములు కాలోపాధులుగ నుండి కాలవిభాగ హేతువు లగుచున్నవి. (వాస్తవముగ ఆ నక్షత్రములతో చంద్రుడు కలిసియుండడు వానికిని చంద్రునికిని నడుమగల దూరము కోట్ల కొలది మైళ్ళు కాని అట్లు కలిసియున్నట్లు మనకు కనుపట్టుచుండును) ॥44॥

అవతారిక— జ్యోతీరూపము లగు చిహ్నములు నియతమగు కాలవిశేషమును సూచించినట్లు మరికొన్ని ఇతర వస్తువులు గూడ సూచించును అని చెప్పుచున్నాడు.

శ్లో॥ రుతైర్మృగ శకున్తానాం స్థావరాణాం చ వృత్తిభిః ।
ఛాయాది పరిణామైశ్చ ఋతుధామా నిరూప్యతే । 45

మృగశకున్తానాం = మృగములు పక్షులు మొదలగు వాటియొక్క, రుతైః = ధ్వనులచేతను,

స్థావరాణాం = స్థావరములగు వృక్షాదులయొక్క, వృత్తిభిః = పుష్పించుట మొదలగు ప్రవృత్తుల చేతను, ఛాయాది పరిణామైః + చ = నీడ మొదలగు వాటియొక్క పరిణామములచేతను, ఋతుధామా = ఋతు విశేషమునకు స్థానమగు కాలము, నిరూప్యతే = నిర్ధారణ చేయబడు చున్నది.

తాత్పర్యము— మృగ పక్ష్యాదుల ధ్వనులచేతను, వృక్షాదుల ప్రవృత్తిచేతను, ఛాయాదుల పరిణామములచేతను ఋతువిశేష స్థానమగు కాలము నిర్ధారణ చేయబడుచున్నది.

విశేషము— కాలమను పేరుగల బ్రహ్మయొక్క స్వాతంత్ర్య శక్తి వసంతాది భేదములచే భిన్నమైనదై ప్రకాశించుచున్నది కావున కాలము "ఋతవః ధామయస్య" (ఋతువులు దేనికి స్థానమో అది) అను నర్థమున "ఋతుధామా" యని చెప్పబడుచున్నది. ఇచట 'వసంతాది ఋతు విశేషము' అని యర్థము. అది పుంస్కోకిలాది రుతములచేతను, స్థావరము లగు మామిడి మొదలగునవి పుష్పించుట మొదలగు ప్రవృత్తులచేతను, సూర్యాది సంచార విశేషముచే కానవచ్చెడు నీడ, ఎండ మొదలగు వాటి భేదముచేతను నిర్ణయింపబడు చున్నది. ॥45॥

అవతారిక— ఇపుడు అద్వైత వాదమునందు గూడ కాలమునకు ఉపయోగమున్న దని చెప్పుచున్నాడు.

శ్లో॥ నిర్భాసోపగమో యోఽయం క్రమవానివ దృశ్యతే ।
అక్రమస్యాపి విశ్వస్య తత్ కాలస్య విచేష్టితమ్ ॥ 46

అక్రమస్యాపి = క్రమము లేనిదైనను, విశ్వస్య = ప్రపంచము యొక్క, యః = ఏ, అయం = ఈ, నిర్భాసోపగమః = (పయికి కనుపట్టు తోచుట), ఆభాసము క్రమవానివ = క్రమము కలదివలె, దృశ్యతే = కనబడుచున్నదో, తత్ = అది, కాలస్య = కాలముయొక్క విచేష్టితమ్ = చేష్ట.

తాత్పర్యము— ఈ విశ్వము క్రమరహితమైనది. ఐనను దాని ఆభాసము క్రమము కలది వలె కనబడుచున్నదనిన అది యంతయు కాలప్రభావమే.

వివరణము— ప్రపంచమంతయు బ్రహ్మ వివర్త రూపమైనది. దీనికి క్రమమను నది లేదు. అయినను దీనికొక క్రమమున్నట్లు కనబడుచున్నది. దానికి కారణము బ్రహ్మ శక్తి రూపము, కాలమను పేరుగలదియు అగు అవిద్యయే.

జగత్సృష్టి విషయమున పరిణామవాదము వివర్తవాదము అను రెండు వాదములు కలవు. బంగారము కుండలాది రూపమున మార్పు చెందుచున్నది. అట్లే మూల ప్రకృత్యాది కము జగదాకారమున పరిణతి చెందుచున్నది. ఇది పరిణామ వాదము. త్రాటిని చూచినపుడు భ్రాంతివశమున సర్పమను ప్రతీతి కలుగుచున్నది. ఆ భ్రాంతికి ప్రధాన కారణము రజ్జు స్వరూపా జ్ఞానము ఆ త్రాటిపై కనబడుచున్న సర్పము ఉన్నదని కాని లేదని కాని చెప్ప

వీలులేదు. ఉన్నదన్నచో తరువాత 'ఇది సర్పము కాదు' అను బాధ జ్ఞానము కలుగరాదు. కాని కలుగుచున్నది. లేదన్నచో దాని ప్రతీతియే కలుగకూడదు. కొన్ని క్షణములపాటైనను అది కలుగుచున్నది. కావున ఇది సదసద్రూపములచే అనిర్వాచ్యము. రజ్జువునందు సర్పము కనబడినట్లు బ్రహ్మమునందు జగత్తు కనబడుచున్నది. దీనికి వివర్తవాదమని పేరు జగత్తునందు లేని క్రమమును ఉన్నట్లు చూపుచున్నది గాన ఇది (క్రమావభాసము) కాలము చేయు మొదటి వ్యాపారము ॥46॥

అవతారిక— ఈ కాలభేదము ఔపాధికమని (ఇతర సన్నిధానము వలన కలిగినదే కాని వాస్తవము కాదని) చెప్పుచున్నాడు

శ్లో॥ దూరాన్తికవ్యవస్థాన మధ్వాధి కరణం యథా ।
చిరక్షిప్రవ్యవస్థానం కాలాధికరణం తథా ॥ 47

అధ్వాధికరణం = మార్గమునకు సంబంధించిన, దూరాన్తిక వ్యవస్థానం = దూరము సమీపము అనెడు వ్యవస్థ, యథా = ఎట్లో, కాలాధికరణం = కాలమునకు సంబంధించిన, చిరక్షిప్రవ్యవస్థానం = ఆలస్యము, శీఘ్రము అనెడు వ్యవస్థ కూడ, తథా = అట్లే.

తాత్పర్యము— మార్గమునకు సంబంధించిన 'దూరము', 'దగ్గర' అను వ్యవస్థ ఎట్లో, కాలమునకు సంబంధించిన 'ఆలస్యము', 'శీఘ్రము' అనెడు వ్యవస్థ కూడ అట్లే.

వివరణము— నడచెడు వాని గమనమునందలి భేదమును బట్టి ఈ మార్గము దూరము, ఈ మార్గము దగ్గర అనెడు వ్యవస్థ ఏర్పడుచున్నది అంతియే కాని దూరత్వము నికటత్వము అనెడు భేదము వాస్తవమున మార్గమునందు లేదు మందముగా నడచువానికి ఏది దూరమైనదిగ కనబడునో అదియే శీఘ్రముగ నడచువానికి దగ్గరగా కనబడును. అట్లే కాలము స్థిరమైనదే యైనను ఎక్కువగ అవిచ్ఛిన్నత్వముతో జరుగు క్రియ ఉపాధిగానున్నచో 'చిరము' (ఆలస్యము) అనియు, తక్కువ అవిచ్ఛిన్నత్వముతో జరుగు క్రియ ఉపాధిగానున్నచో ఆలస్య మనియు వ్యవహారము కలుగుచున్నది. ॥47॥

అవతారిక— కాలమునకు క్రియోపాధిని బట్టి భూత భవిష్యద్వర్తమాన భేదము కలుగునని వెనుక చెప్పబడినది. మరియొక విశేషమును కూడ చెప్పుటకొరకు ఆ విషయమునే మరల చెప్పుచున్నాడు.

శ్లో॥ తస్యాభిన్నస్య కాలస్య వ్యవహారే క్రియాకృతాః ।
భేదా ఇవ త్రయః సిద్ధా యాన్లోకో నాతివర్తతే ॥ 48

అభిన్నస్య = భేదరహితమగు, తస్య = ఆ, కాలస్య = కాలమునకు, వ్యవహారే = లోక వ్యవహారమునందు, క్రియాకృతాః = క్రియలచే నేర్పడిన, త్రయః = మూడు, భేదాః ఇవ = భేదములు వలె, సిద్ధాః = ప్రసిద్ధమైనవి, యాన్ = వేటిని, లోకః = లోకము, నాతివర్తతే = అతిక్రమింప జాలదో

తాత్పర్యము— భేదరహితమగు ఆ కాలమునకు, లౌకిక వ్యవహారమున క్రియలచే నేర్పడిన మూడు భేదములవలె ప్రసిద్ధమైనవి. ఆ భేదములను లోకము అతిక్రమింప జాలదు.

వివరణము— భూతము, వర్తమానము, భవిష్యత్తు అను భేదములు ఉన్నట్లు క్రియలను బట్టి తెలియుచున్నను ఆ భేదములు వాస్తవములు కావు కాన 'భేదా ఇవ' అని 'ఇవ' శబ్దము ప్రయోగింపబడినది. క్రియ ముగిసినచో భూతము, క్రియ సంభావితమైనచో భవిష్యత్తు. క్రియ క్షణ ప్రవాహ రూపమున జరుగుచున్నచో వర్తమానము. ॥48॥

అవతారిక— భూతము, భవిష్యత్తు, వర్తమానము అను మూడు విభిన్న కార్యములను బట్టి వాటి కారణమగు కాలమునందు గూడ భేదములను ఊహింప వచ్చును గదా? కాలమున యధార్థమగు భేదము లేదని ఎట్లు చెప్ప వీలగును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు

శ్లో॥ ఏకస్య శక్తయస్తిస్రః కాలస్య సమవస్థితాః ।
యత్సమ్బన్ధేన భావానాం దర్శనాదర్శనే సతామ్ ॥ 49

ఏకస్య = భేదరహితమగు, కాలస్య = కాలమునకు, తిస్రః = మూడు, శక్తయః = శక్తులు, సమవస్థితాః = ఉన్నవి, యత్సంబన్ధేన = ఏ శక్తుల సంబంధముచే, సతాం = సత్తులగు, భావానాం = పదార్థముల, దర్శనాదర్శనే = కనబడుట కనబడకుండుట ఏర్పడుచున్నవో.

తాత్పర్యము— ఒకే కాలమునకు మూడు శక్తులున్నవి. వాటిని బట్టి సత్తులగు కార్యములు కనబడుట కనబడకుండుట జరుగుచున్నవి.

విశేషము— కార్యములు అనేకములైనచో కారణములు గూడ అనేకము లుండవలెను అనెడు అనుమానము యుక్తము కాదు. కారణము ఒక్కటేయైనను దానికి విభిన్న శక్తు లుండుటచే విభిన్న కార్యములు చేయవచ్చును. ప్రకృతమున కాలమునకు మూడు శక్తులు కలవు. వర్తమాన శక్తి సంబంధముచే సత్తులగు భావములు వ్యక్తమగుచున్నవి. అతీత శక్తి సంబంధముచే సత్తులగు భావములు కనబడకుండ పోవుచున్నవి. అనాగత శక్తి సంబంధముచే సత్తులగు పదార్థములు అనభివ్యక్తములై యున్నవి. ఈ విధముగ శక్తి భేదము చేతనే కార్య భేదము ఉపపన్నమై యున్నదిగాన కారణభేదమును కల్పింప బనిలేదు. ॥49॥

అవతారిక— శక్తి విభాగముచే ఏర్పడెడు దర్శనాదర్శనములనే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ద్వాభ్యాం స కిల శక్తిభ్యాం భావానాం వరణాత్మకః ।
శక్తిస్తు వర్తమానాఖ్యా భావరూపప్రకాశినీ ॥ 50

సః = ఆ కాలము, ద్వాభ్యాం = రెండు, శక్తిభ్యాం = శక్తులచే భావానాం = పదార్థముల యొక్క, వరణాత్మకః = సంవరణమును (ఆచ్ఛాదనము) చేయు స్వరూపము కలది, వర్త

మానాఖ్యా = వర్తమాన మనెడు పేరుగల, శక్తిస్తు = శక్తియైతే, భావరూప ప్రకాశినీ = పదార్థముల రూపమును ప్రకాశింపచేయునది.

తాత్పర్యము— కాలము రెండు శక్తులచే భావములను అదృశ్యములుగ చేయును. వర్తమానమనెడు శక్తి మాత్రము పదార్థముల రూపమును ప్రకాశింపచేయును.

వివరణము— కాలము అతీత శక్తిచేతను అనాగత శక్తిచేతను, సత్తులగు పదార్థములు అదృశ్యము లగునట్లు చేయుచుండును. వర్తమాన శక్తిచే పదార్థముల స్వరూపమును ప్రకాశింపచేయును. ॥50॥

అవతారిక— అనాగత శక్తిచే ఆవృతములైన - అనగా భవిష్యత్కాల గోచరము లగు పదార్థములు తరువాత అభివ్యక్తములై వర్తమాన శక్తితో సంబంధించుట కానవచ్చుచున్నది. అతీత శక్తిచే ఆవృతములగు - భూతకాల గోచరములగు - పదార్థములు గూడ ఆ విధముగనే మరల ఆవిర్భూతములై వర్తమాన శక్తితో ఏల సంబంధించుట లేదు అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు

శ్లో॥ అనాగతా జన్మశక్తేః శక్తి ర ప్రతిబన్ధికా ।
అతీతాఖ్యా తు యా శక్తిస్తయా జన్మ విరుధ్యతే ॥ 51

అనాగతా శక్తిః = అనాగత శక్తి, జన్మశక్తేః = జన్మశక్తికి, అప్రతిబంధికా = ప్రతిబంధము చేయునది కాదు, తు = కాని, అతీతాఖ్యా = అతీతమను పేరుగల, యా = ఏ, శక్తిః = శక్తికలదో, తయా = దానితో, జన్మ = జన్మశక్తి, విరుధ్యతే = విరోధము కలదిగ నున్నది.

తాత్పర్యము— అనాగత శక్తి జన్మ శక్తికి ప్రతిబంధకము కాదు. కాని అతీత శక్తి జన్మ శక్తికి విరుద్ధమైనది. (కావున అనాగత శక్తిచే ఆవృతమగు పదార్థము కాలాంతరమున వర్తమాన శక్తితో సంబంధించి అభివ్యక్తిని పొందినను అతీతశక్తిచే ఆవృతమగునది మరల వర్తమాన శక్తితో సంబంధమును పొందజాలదు). ॥51॥

అవతారిక— శక్తులు శక్తమును (శక్తికల దానిని) ఆశ్రయించుకొని యుండును. ఆ శక్తమువలె శక్తులు కూడ ఎల్లవేళలు సన్నిహితములై యుండునుగాన ఆ శక్తుల సంబంధముచే భావములు ఒకే సమయమున కనుపట్టుచును కనుపట్టకుండను గూడ ఉండవలెను కదా అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ తమః ప్రకాశవత్త్వేతే త్రయోఽధ్వానో వ్యవస్థితాః ।
అక్రమాస్తేషు భావానాం క్రమః సముపలక్ష్యతే ॥ 52

అక్రమాః = క్రమరహితము లగు, ఏతే = ఈ, త్రయః = మూడు, అధ్వానః = మార్గములు (కాల విభాగములు), తమః ప్రకాశవత్ = చీకటి వెలుగువలె, (తమస్సు, సత్త్వము

అను గుణములు కూడ ధ్వనించుచున్నవి) వ్యవస్థితాః = ఉన్నవి, తేషు = వాటియందు, భావానాం = పదార్థములయొక్క, క్రమః = క్రమము, సముపలభ్యతే = చూడబడుచున్నది.

తాత్పర్యము— క్రమరహితములగు ఈ మూడు మార్గములును తమః ప్రకాశములవలె ఉన్నవి. వాటియందు పదార్థముల క్రమము చూడబడుచున్నది.

వివరణము— భూత భవిష్య ద్వర్తమానము లనెడు కాల విభాగములు మూడును మూడు మార్గములవలె నున్నవి గాన 'అధ్వానః' అని చెప్పబడినవి. మార్గములందు నడచెడు వారు గమనాగమనాదికము చేయునట్లు వివిధ పరిణామములకు లోనగుచున్న భావములు వీటియందు (భూతాది కాలములందు) గమనాగనములు చేయుచుండును అంతవరకును లేని ఒక వస్తువు పుట్టి, కొంతకాల ముండి మరల మరుగుపడి పోవుచున్నది. ఈ విధముగ పదార్థములన్నియు మొదట భవిష్యన్మార్గములో నుండి, వర్తమాన మార్గమును పొంది, చివరకు అతీత మార్గమున పడిపోవుచున్నవి. కాలాత్మయందు ఈ మూడు శక్తులును (భూత భవిష్యద్వర్తమాన శక్తులు) క్రమరహితముగనే ఉన్నను తమః ప్రకాశములవలె భావములకు దర్శనాదర్శనములను ఏర్పరచుచు సక్రమములవలె నున్నవి. తమస్సు ఒక పదార్థము అదృశ్యమగునట్లు చేయును. అట్లే భూత భవిష్యచ్ఛక్తులు భావములను అదృశ్యములుగ చేయుచున్నవి. ప్రకాశము పదార్థములు కనబడునట్లు చేయును. అట్లే వర్తమాన శక్తి భావములను కనబడునట్లు చేయుచున్నది. కావున ఈ మార్గత్రయము తమః ప్రకాశములవలె నున్నదని చెప్పబడినది. 'తమః ప్రకాశవత్' అను ఉపమానముచే సాంఖ్యాద్యంగీకృతములగు గుణత్రయములతో సామ్యము కూడ సూచింపబడుచున్నది. సత్త్వరజస్తమోగుణములు మూడును నిత్యములే కాన అవి సర్వదా ఉండునవే. అయినను ఆ మూడింటిలో ఒకటి ప్రధానముగను మిగిలిన రెండును దానికి అంగములుగను ఉండుటచే ప్రధానముగ నున్న గుణము తన కార్యములు చేయుచుండును అట్లే భూత భవిష్యద్వర్తమాన శక్తులు మూడును కాలమునందు నిత్యములై సర్వదా ఉన్నను అప్పుడప్పుడు తమతమ కార్యములను చేయుచుండును. ఈ విధముగ కాల భేదములు స్వశక్తి మాహాత్మ్యముచే భావభేదములందు క్రమమును కల్పించుచుండును అని ఈ కారిక యభిప్రాయము ॥52॥

అవతారిక— భూతాది శక్తులకు గల తమః ప్రకాశ రూపత్వమునే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ద్వౌతు తత్ర తమోరూపావేకస్యాలోకవత్ స్థితిః ।
అతీతమపి కేషాంచిత్ పునర్విపరివర్తతే ॥ 53

తత్ర = ఆ మార్గత్రయమునందు, ద్వౌతు = రెండు మార్గములైతే, తమోరూపౌ = తమః స్వభావములు, ఏకస్య = ఒక మార్గమునకు, ఆలోకవత్ = ప్రకాశమునకు వలె, స్థితిః = స్థితి (కలదు), కేషాంచిత్ = కొందరి మతమున, అతీతమపి = గడచిన పదార్థము కూడా, పునః = మరల, విపరివర్తతే = వచ్చుచుండును.

తాత్పర్యము— ఈ మార్గత్రయములో రెండు మార్గములు తమః స్వభావములు. ఒకటి ప్రకాశ స్వరూపము కొందరి మతము ప్రకారము అతీతము కూడా మరల వచ్చు చుండును.

విశేషము— సత్త్వరజస్తమోగుణ సాదృశ్యమునే మనస్సులో నుంచుకొని చెప్పు చున్నాడు. 'గురువరణకమేవ తమః' (తమో గుణము బరువైనది, అవరించే స్వభావము కలది) అను సాంఖ్య కారికానుసారముగా ఆవరించుట - పదార్థములు కనబడకుండ చేయుట - తమోగుణ స్వభావము. తమోగుణము వలె అతీతానాగత శక్తులు పదార్థమును కప్పివేయు చున్నవి గాన ఇవి తమః స్వభావములు. సత్త్వగుణము ప్రకాశ స్వభావము కలది. వస్తువులు ప్రకాశించు నట్లు చేయును సత్త్వగుణము వలె వర్తమాన శక్తిగూడ వస్తువులను ప్రకాశింప చేయును గాన ఇది ప్రకాశ స్వభావము, ''సత్త్వం లఘు ప్రకాశకమ్'' (సత్త్వము తేలిక యైనది, ప్రకాశింప చేయునది అని సాంఖ్య కారిక). రజోగుణము ప్రవృత్తి స్వభావము. దాని సంపర్కమువలననే సత్త్వతమోగుణములకు ప్రవర్తన శక్తి లభించుచున్నది. కాలమునందున్న ప్రవృత్తి సామాన్యము సర్వపదార్థ వ్యాపకము అనగా ప్రతిబంధాభ్యనుజ్ఞల ద్వారా కాలము సర్వపదార్థ ప్రేరణము చేయుచున్నది, అది రజః స్వభావము.

అతీత శక్తిచే ఆవృతములగు వస్తువులకు మరల వర్తమాన శక్తితో (జన్మ శక్తితో) సంబంధము కలుగదు ; ఏలయన అతీత శక్తి జన్మశక్తికి ప్రతిబంధకము అని 51 వ కారికలో చెప్పబడినది. కాని కొందరి మతము ప్రకారము అతీతాధ్వపతితమైనను జగత్తు కాలాంతరమున ఆవిర్భవించును. అనగా ఉత్పన్నములగు పదార్థములు ప్రలయమున అదృశ్య ములై మరల సృష్టి జరిగినపుడు ఆవిర్భవించుచుండును. ఈ మతము ప్రకారము అన్ని పదార్థములును మూడు మార్గములతో తప్పక సంబంధించును గాన వాటికి త్రివిధత్వము పూర్తిగ ఉపపన్నమగుచున్నది. జగత్తు మరల మరల ఆవృత్తి పొందుచున్నను అదే జగత్తు మరల రాదు. వెనుకనున్న జగత్తువంటి జగత్తు ఆవృత్త మగుచుండును. కావున అతీత శక్త్యా వృతములు మరల వర్తమాన శక్తికి విషయమగుట (మరల పుట్టుట) కుదురదు అనునది మొదట చెప్పిన మతము. రెండవ మతము ప్రకారము - ''నాభావో విద్యతే సతః'' (ఒక మారు స్థితిని పొందిన పదార్థమునకు అభావమనునది లేదు) అను గీతా వాక్యానుసారముగ ఒక పదార్థము కొంత కాలముపాటు తిరోభూతమైనను కాలాంతరమున అదియే ఆవిర్భవించును గాన అతీత శక్తి సంబంధము వర్తమాన శక్తికి ప్రతిబంధకము కాదు - అనగా భూత కాలము లోనికి పోయిన వస్తువు మరల వర్తమానములోనికి రావచ్చును. ॥53॥

అవతారిక— ధర్మములకును ధర్మికిని (పదార్థమునకును) ఒక విధమగు భేద మును అంగీకరించి స్థిరస్వభావమగు ధర్మి వర్తమానమైనను దాని ధర్మములు మాత్రము మార్గత్రయ గోచరములు అని చెప్పబడినది. అనగా ధర్మములు భూత భవిష్యద్వర్తమాన గోచరములైనను ధర్మి మాత్రము సర్వదా వర్తమానమే యని యర్థము. ఇపుడు ధర్మికిని ధర్మమునకును అభేదము నంగీకరించి ధర్మముల ద్వారా ధర్మికి భూతత్వ - భవిష్యత్త్వ -

వర్తమానత్వములు మూడును ఒక్క సమయముననే పొసగును అని భాష్యకారమతానుసారముగ చెప్పుచున్నాడు.

శ్లో॥ యుగపద్వర్తమానత్వం తద్ధర్మా ప్రతిపద్యతే ।
కేషాంచిద్వర్తమానత్వాచ్చైతి తద్వదతీతతామ్ ॥ 54

తద్ధర్మా = అతీతానాగత వర్తమాన రూపములైన ధర్మములు గల ధర్మి, కేషాంచిత్ = కొన్ని ధర్మములు, వర్తమానత్వాత్ = వర్తమానము లగుట వలన, (కనుపట్టు చుండుట వలన), యుగపత్ = ఒకే సమయమున, వర్తమానత్వం = వర్తమానత్వమును, ప్రతిపద్యతే = పొందుచున్నది, తద్వత్ = వర్తమానత్వమును వలె, అతీతతాంచ = అతీతత్వ (భూతత్వ) మును గూడ, ఏతి = పొందుచున్నది.

తాత్పర్యము— ఒక ధర్మి, దానికి సంబంధించిన కొన్ని ధర్మములు వర్తమానము లగుటచే, తాను కూడ వర్తమానత్వమును పొందుచున్నది. అట్లే అతీతత్వమును గూడ పొందుచున్నది.

విశేషము— ఒక ధర్మికి సంబంధించిన కొన్ని ధర్మములు అతీతములగును, కొన్ని అనాగతములుగ ఉండును. కొన్ని వర్తమానములుగ ఉండును. ఉన్న ధర్మములను బట్టి ధర్మి కూడ వర్తమానత్వమును పొందుచున్నది. పూర్వమునందుండిన (అతీతములగు) ధర్మములను బట్టి అతీతత్వమును పొందుచున్నది అనాగతములగు (రాబోవు) ధర్మములను బట్టి అనాగతత్వమును పొందుచున్నది. ఈ విధముగ స్థాయియగు పదార్థము సర్వదా వర్తమానమే యైనను ధర్మములకు గల త్రివిధత్వమును బట్టి త్రివిధమని (త్రిమార్గమని) చెప్పబడు చున్నది. ॥54॥

అవతారిక— పరస్పర విరుద్ధములగు అతీతత్వ వర్తమానత్వములు ఒక్కచోట ఎట్లు కలియును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ హేతూపకారాదాక్షిప్తో వర్తమానత్వ మాగతః ।
శాన్తహేతూపకారః సన్ పునర్నోపైతి దర్శనమ్ ॥ 55

హేతూపకారాత్ = హేతువులు ఉపకరించుట వలన, ఆక్షిప్తః = ఉత్పన్నమగు పదార్థము, వర్తమానత్వం = వర్తమానత్వమును, ఆగతః = పొందినదై (అగును), శాంతహేతూపకారః సన్ = ఆ కారణములు శమించుటవలన వానినుండి కలుగు సాయము లేకపోవుటచే, పునః = మరల, దర్శనం = దర్శనమును, నోపైతి = పొందుట లేదు.

తాత్పర్యము— కారణములయొక్క ఉపకారముచే జనించిన వస్తువు వర్తమానత్వమును పొందుచున్నది. కారణములు చేయు ఉపకారము తొలగగనే అదృశ్యమగును.

వివరణము— కారణములయందు చేష్టావిశేషము కలుగగనే కార్యము జనించి,

దృశ్యమగుచు అర్థక్రియలను (ఏవైన ప్రయోజనములను) సంపాదించును. అపుడు అది వర్తమానము అని చెప్పబడుచున్నది. కారణ వ్యాపారము శాంతింపగనే ఈ కార్యమునందలి అర్థక్రియా కారిత్వము పోవును అపుడు అదృశ్యమై అతీతమని చెప్పబడుచున్నది. కారణములు ఇంకను ఉపకారమునకై వ్యాపారము చేయని పరిస్థితులలో ఆ భావము అనాగతము అని చెప్పబడును. అపుడు కూడ దానికి అర్థక్రియా కారిత్వ ముండదు. ఈ విధము అర్థక్రియా కారిత్వము ఉండుట, లేకపోవుట అను విషయమును బట్టి ఒక పదార్థమును వర్తమాన పదార్థమనియు అతీత పదార్థమనియు, అనాగత పదార్థమనియు చెప్పుటలో దోషము లేదు ఆ పదార్థము గుణత్రయమయ మగుటవలనను, ఆ గుణత్రయము నిత్యమై సర్వపదార్థానుగతమై యుండుటవలనను అది (పదార్థము) ఎల్లపుడును సత్తుగనే ఉండును కావుననే ''తదేతత్ త్రైలోక్యం వ్యక్తేరపైతి, న సత్త్వాత్'' (ఈ మూడు లోకములును అభివ్యక్తములు కాకుండ ఉండవచ్చును కాని వాటికి అసత్త్వము మాత్రము ఎన్నడును లేదు) అని శాస్త్రకారులు చెప్పుదురు ॥౫౫॥

అవతారిక— అతీతమార్గమునందును, అనాగతమార్గమునందును గూడ భావము కనబడకుండుట సమానమే కావున కొందరు కాలమునకు ప్రతిబంధము, అభ్యనుజ్ఞ అనెడు రెండు శక్తులను మాత్రమే అంగీకరించిరి అని చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్వేఏవ కాలస్య విభోః కేషాంచిచ్ఛక్తివర్త్మనీ ।
కరోతి యాభ్యాం భావానా మున్మీలన నిమీలనే ॥ 56

కేషాంచిత్ = కొందరి మతమున, విభోః = సర్వసమర్థమగు, కాలస్య = కాలమునకు, ద్వే = రెండు, శక్తి వర్త్మనీ + ఏవ = శక్తి మార్గములు మాత్రమే ఉన్నవి, యాభ్యాం = వేటిచేత, భావానాం = పదార్థముల యొక్క, ఉన్మీలన నిమీలనీ = ఆవిర్భావతిరోభావములను, కరోతి = చేయుచున్నదో.

తాత్పర్యము— కొందరి మతము ప్రకారము, సర్వసమర్థమగు కాలమునకు రెండే శక్తులున్నవి వాటిచే అది పదార్థముల ఆవిర్భావతిరోభావములను చేయుచున్నది.

వివరణము— భావములు కనబడకుండునట్లు చేయు శక్తికి ప్రతిబంధ శక్తి యనియు, భావములు ప్రతిభాసించునట్లు చేయు శక్తికి అనుజ్ఞా శక్తి యనియు పేర్లు. ఈ ప్రతిబంధ శక్తిలో అతీతానాగత శక్తులు రెండును ఇమిడి యున్నవి. ॥౫౬॥

అవతారిక— అఖండమును భేదరహితమును అగు కాలము సహాయముతో ఒక వ్యవహారము జరుపుట శక్యము కాదు గాన క్రియ లనెడు ఉపాధులచే కాలమునందు భేదమును కల్పించి తద్ద్వారా వ్యవహారము జరుగునని చెప్పబడినది. కాని ఉపాధి భూతములగు ఆ క్రియల సహాయముచేతనే వ్యవహారమును జరుపుకొనుటకు వీలుండగా మరల అదృశ్యమగు కాలమనునది ఒకటి ఉన్నదని కల్పించుట ఎందులకు. కాలము లేనిచో వ్యవహారము జరుగదు

గాన ఎట్లైనను కాలమనునది ఒకటి ఉన్నదని అంగీకరించియే తీరవలెనని అన్నచో ఆ కాలమును మరియొక విధముగ గూడ కల్పింపవచ్చును గదా యని కొందరి అభిప్రాయము. దాని ప్రకారము చెప్పుచున్నాడు.

శ్లో॥ కలాభిః ప్రవిభక్తాభిః ప్రవిభక్తం స్వభావతః ।
కేచిద్బుద్ధ్యనుసంహారలక్షణం తం ప్రచక్షతే ॥ 57

కేచిత్ = కొందరు, తం = ఆ కాలమును, బుద్ధ్యనుసంహార లక్షణమ్ = బుద్ధిచే ఒక్క సముదాయముగ ఆకళించుకొనుటయే లక్షణముగా కల దానిని గాను, పృథగర్థాభిః = వేరు వేరు ప్రయోజనములు గల, కలాభిః = అంశములచేత, స్వభావతః = దాని స్వభావమును బట్టి, ప్రవిభక్తం = విభజింపబడిన దానిని గాను, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్యము— బుద్ధిచే అనేక క్రియలను ఒక్క సముదాయముగ గ్రహించుటయే కాలముయొక్క లక్షణమనియు, స్వభావముచే అది వేరు వేరు అంశములుగ విభక్తమై యుండు ననియు చెప్పుదురు.

విశేషము— కాలమనెడు బాహ్యమగు తత్త్వమేదియును లేదు. బుద్ధిచే ఒక్క సముదాయరూపమున గ్రహింపబడెడు వేరువేరు క్రియలే 'చిరము' 'శీఘ్రము' మొదలగు వ్యవహారములకును; పగలు, రాత్రి మొదలగు వ్యవహారములకును నిమిత్తముగ నున్నది. ఈ బుద్ధి సంకలనమే కాలతత్త్వము ఈ బుద్ధి సంకలన రూపములగు చిర - శీఘ్ర - దివసాది భేదములలో కూడ వేరువేరు ప్రయోజనముల ననుసరించి అంశములు కల్పింపబడుచున్నవి, ఈ విధముగ కాలము బౌద్ధమే (బుద్ధిస్థమే) కాని బాహ్యము కాదు అని కొందరు బౌద్ధాదుల అభిప్రాయము ॥57॥

అవతారిక— కాలము బాహ్యమని అంగీకరించినను, అంతరమే యని యంగీకరించినను మాకు విప్రతిపత్తి లేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ జ్ఞానానుగత శక్తిం వా బాహ్యం వా సత్యతః స్థితమ్ ।
కాలాత్మాన మనాశ్రిత్య వ్యవహర్తుం న శక్యతే ॥ 58

జ్ఞానాను గతశక్తిం వా = జ్ఞానమునందు సంబంధించిన శక్తి కలదైనను, సత్యతః = వాస్తవముగా, స్థితం = ఉన్న, బాహ్యం వా = బాహ్యమగునదైనను, కాలాత్మానం = కాలాత్మను అనాశ్రిత్య = ఆశ్రయింపకుండగా, వ్యవహర్తుం = వ్యవహారము నడుపుటకు, నశక్యతే = శక్యము కాదు.

తాత్పర్యము— జ్ఞానమునకు మాత్రమే సంబంధించిన శక్తి కలదైనను, వాస్తవమగు బాహ్యరూపముకలదైనను, కాలాత్మను ఆశ్రయింపకుండ లోకవ్యవహారము కుదరదు.

వివరణము— వివిధ క్రియా సముదాయమును బుద్ధిలో ఆకళించుకొనుటయే కాలముగాన అది కేవలము బౌద్ధమే కాని బాహ్యమగు కాలము లేదు అని చెప్పినను, అట్లుకాక

కాలమనెడు ఒక బాహ్యమును సత్యమును అగు ద్రవ్యపదార్థము ఉన్నది ; దానికి వర్తమానాది శక్తులు వేరువేరుగ నున్నవి, అని అంగీకరించినను మాకు విప్రతిపత్తి లేదు. అనగా ఇదియే కాలస్వరూపమని చెప్పుటలో మాకు ఆగ్రహము లేదు. దాని స్వరూపమేమైనను, కాలమనునది ఒకటి ఉన్నది అని మాత్రము అంగీకరించి తీరవలెను. దానిని అంగీకరింపకున్నచో ''ఒక వస్తువు ఉండెను, ఉన్నది, ఉండగలదు'' అనెడు వ్యవహారము కుదురదు. ఇట్టి శాబ్దవ్యవహార మున కంగమైన కాలమనునది ఉన్నది అని చెప్పుటయందే మాకు తాత్పర్యము అని భావము. ॥58॥

అవతారిక— కావుననే కాలము విషయమున అనేక మతభేదములు కానవచ్చు చున్నవి. కొందరి మతము ప్రకారము కాలము భావములకంటె వ్యతిరిక్తము కాదు అని చెప్పు చున్నాడు.

శ్లో॥ త్రిస్రో భావస్య భావస్య కేషాంచిత్ భావశక్తయః ।
తాభిః స్వశక్తిభిః సర్వం సదైవాస్తి చ నాస్తి చ ॥ 59

కేషాంచిత్ = కొందరి మతమున, భావస్య భావస్య = ప్రతిభావ పదార్థమునకును, త్రిసః = మూడు, భావశక్తయః = సత్త్వ రజస్తమోగుణముల శక్తులు, (కలవు), తాభిః = ఆ, స్వశక్తిభిః = తమయొక్క శక్తులచేత, సర్వం = ప్రతి భావమును, సదైవ = ఎల్లప్పుడును, అస్తి చ = ఉన్నది, నాస్తి చ = మరియు లేదు.

తాత్పర్యము— కొందరి మతము ప్రకారము ప్రతి భావమునందును సత్త్వ రజ స్తమోగుణముల శక్తు లుండును. ఆ స్వశక్తులచేత ప్రతి పదార్థమును సత్తుగను, అసత్తుగను కూడ అగుచున్నది

వివరణము— భావము లన్నియు ఎల్లప్పుడును పరిణామము బెందుచుండును. వాటిలో సత్త్వ రజస్తమోగుణముల శక్తులున్నవి గాన అవియే అతీతాదికాల భేదమును కలిగించుచున్నవి. భావములన్నియు గుణత్రయమయములే గావున ఆ గుణముల శక్తిత్రయ మును బట్టి - అనగా ఒక శక్తి ఉద్భవించుట మరియొక శక్తి ఉద్భవింపకుండుట అనెడు భేదమును బట్టి - సత్తులుగను అసత్తులుగను వ్యవహారగోచరము లగుచున్నవి. ॥59॥

అవతారిక— పై విషయమునే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ సత్త్వాదవ్యతిరేకేణ తాస్త్రిస్రోఽపి వ్యవస్థితాః ।
క్రమస్తాస్తదభేదాచ్చ సదసత్త్వం న భిద్యతే ॥ 60

తాః = ఆ, తిస్రః + అపి = మూడు శక్తులును, సత్త్వాత = భావముకంటె, అవ్యతిరేకేణ = భేదము లేకుండ, వ్యవస్థితాః = ఉన్నవి, తాః = ఆ శక్తులే, క్రమః = క్రమము, తద భేదాత్ + చ = ఆ శక్తులతో భావములకు గల అభేదమువలన, సదసత్త్వం = సత్త్వాసత్త్వ ములు, న భిద్యతే = భేదింపవు.

తాత్పర్యము— ఆ మూడు శక్తులును (వాని కాశ్రయమైన ద్రవ్యము) భావము కంటె భేదములేనివై ఉన్నవి. అవియే క్రమరూపమైనవి. వీటితో అభేదమువలన సత్త్వాసత్త్వములు భేదింపవు.

వివరణము— సత్త్వరజస్తమో గుణ శక్తులకును భావములకును భేదము లేదు. అతీతానాగత వర్తమాన శక్తులు కూడ సత్త్వరజస్తమోగుణ శక్తి రూపములే. అనగా అతీతాది శక్తులు కూడ భావాభిన్నములే. ఈ శక్తులే క్రమము. ఒక భావము వర్తమాన శక్తి సమన్వయముచే ఆవిర్భావమును పొందుచున్నది. అతీతానాగత శక్తి సమన్వయముచే తిరోభావమును పొందుచున్నది. అందుచే ఈ శక్తులే క్రమము. భావములకును శక్తులకును భేదము లేదని అంగీకరించినచో భావములవలె శక్తులు కూడ ఎల్లప్పుడును ఉండును గావున సత్త్వాసత్త్వములకు సంకరము కలుగును కదా యని ఆశంకింప బనిలేదు ఈ శక్తులకు విలక్షణములగు విచిత్ర వృత్తులు కలవు ఒక శక్తి (వర్తమాన శక్తి) భావము కనబడునట్లు చేయును మిగిలిన రెండును భావములు కనబడకుండునట్లు చేయును. ఈ దర్శనాదర్శనములను బట్టియే సదసత్త్వ వ్యవహార మేర్పడుచున్నది అతీతానాగతావస్థలో నున్న భావము కనబడుట లేదనియే చెప్పవలెను గాని ఆ భావము అసత్తు అని కూడ చెప్పరాదు ఆ అవస్థలలో కూడ భావము సత్తు అనియే అంగీకరింపవలెను. ''నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః'' (లేనిది పుట్టదు, ఉన్నది లేకుండ పోదు) అని కదా సిద్ధాంతము? కాని లోకమున అదృశ్యమైన దానినే అసత్తని వ్యవహరించుచుందురు కావున ఒక భావమునకు సత్త్వము అసత్త్వము అను భేదములు లేవు. దానికి ఎన్నడును సత్త్వమే కలదు. ॥60॥

అవతారిక— 'సదసత్త్వం న భిద్యతే' అను విషయమునే విశదీకరించుచున్నాడు

శ్లో॥ దర్శనాదర్శనే నైకం దృష్టాదృష్టం తదేవ తు।
ఆధ్వనామేకతా నాస్తి న చ కించిన్నివర్తతే॥ 61

దర్శనాదర్శనే = కనబడుట కనబడకుండుట అనునవి, ఏకం = ఒక్కటి (అభిన్నములు), న = కాదు, తు = కాని, దృష్టా దృష్టం = చూడబడినదియు చూడబడనిదియు నగు వస్తువు మాత్రము, తదేవ = అభిన్నమే, అధ్వనాం = మార్గములకు, ఏకతా = ఏకత్వము, నాస్తి = లేదు, కించిత్ = ఏదియు, న నివర్తతే = పూర్తిగా నశింపదు.

తాత్పర్యము— దర్శనాదర్శనములు రెండును ఒక్కటి కాదు. కాని దృష్టాదృష్టమగు భావము మాత్రము ఒక్కటే. మార్గములకు ఏకత్వము లేదు. ఏదియు పూర్తిగా నశింపదు.

వివరణము— దర్శనమనగా వర్తమాన శక్తిచే ప్రకాశించుట. అదర్శనమనగా అతీతానాగత శక్తులచే తిరోహితమగుట. ఈ దర్శనాదర్శనములలో ఒకదానితో నొకటికి పోటీ లేదు. కావున ఈ రెండును భిన్న కార్యములు. ఈ భిన్న కార్యములను బట్టి మార్గము

లకు (వర్తమాన శక్త్యాదులకు) గూడ భేదమే గాని అభేదము లేదు కావున సాంకర్యమునకు అవకాశము లేదు. కాని చూడబడినదియు, చూడబడనిదియు అగు వస్తువు మాత్రము ఒక్కటి దర్శనాదర్శన రూప ధర్మములు వచ్చుచు పోవుచు ఉన్నను ధర్మి మాత్రము మారుట లేదు కదా? కావున ఒక భావము దృశ్యమగునపుడు సత్తు అనియు, అదృశ్యమగునపుడు అసత్తు అనియు అనరాదు. సత్తు ఐనది పూర్తిగ నశించుట అనునది అసంభవము. సత్తు అగునదే తిరోభూతమైనపుడు అసత్తు అనుచుందురు. కావున సత్త్వమునకును అసత్త్వమునకును భేదము లేదు. ॥61॥

అవతారిక— కాలతత్త్వ విషయమున మరికొన్ని మతములను గూడ చెప్పి ఉపసంహరించు చున్నాడు.

శ్లో॥ శక్త్యాత్మ దేవతా పక్షై ర్భిన్నం కాలస్య దర్శనమ్ ।
ప్రథమం తదవిద్యాయాం యద్విద్యాయాం న విద్యతే ॥ 62

కాలస్య = కాలము యొక్క, దర్శనం = దర్శనము, శక్త్యాత్మ దేవతా పక్షైః = శక్తి, ఆత్మ, దేవత అనెడు పక్షములచేత, భిన్నమ్ = భిన్నముగ నున్నది, తత్ = కాలమునకు సంబంధించిన ఆదర్శనము, అవిద్యాయాం = అవిద్యావస్థయందు, ప్రథమం = మొదటిది, యత్ = ఏది, విద్యాయాం = విద్యావస్థ యందు, న విద్యతే = లేదో.

తాత్పర్యము— కాలమునకు సంబంధించిన దర్శనము శక్తి పక్షము, ఆత్మ పక్షము, దేవతా పక్షము అనెడు పక్షములచే భిన్నముగ నున్నది. కాలదర్శనము అవిద్యావస్థ లోని మొదటి భేదము అది విద్యావస్థలో లేదు.

వివరణము— కాలము విషయమున వేరువేరు మతము లున్నవి కాలమనునది బ్రహ్మయొక్క స్వాతంత్ర్య శక్తియని భర్తృహరి యభిప్రాయము. కాని కొందరు వ్యాఖ్యాతలు కాలమనునది బ్రహ్మశక్తి రూపమని కాక కారణ శక్తియని వ్యాఖ్యానించిరి బీజమునందు ఒక శక్తి యున్నది అది అంకుర జననమును అనుమతించుచున్నది, కాండ జననమును అడ్డుకొను చున్నది. ఇట్లే అంకురమునందలి శక్తి కాండ జననమును అనుమతించుచున్నది దాని తరువాత వచ్చెడు కార్యమును అడ్డుకొనుచున్నది. ఈ విధముగ బీజాంకురాది కారణములందు కానవచ్చు అనుజ్ఞా ప్రతిబంధ శక్తులే కాలము అని వీరి అభిప్రాయము ఆత్మయే - అనగా జీవుడే - కాలమని మరియొక మతము. కారణ పరంపరచే భావములు పుట్టుచున్నవి. పుట్టిన ఆ భావములు పరస్పర భిన్నములుగను, క్రమవంతములుగను కనబడుచున్నవి. క్రమరూపమగు ఈ కాల శక్తికి భావములే ఉపాధులు. ఇది చిత్స్వరూపుడగు జీవునియందున్నది. కావున జీవుడే కాలము. జీవుడు స్వాభాసమగు కాలము ననుసరించి భావములందును, భావము లోపల బట్టి కాలమునందును ఒక క్రమమున్నట్లు తెలిసికొనుచున్నాడు. ఈ విధముగ కాల భేదమును కల్పించుట వలన జీవుడే కాలము అని ఔపచారికముగ చెప్పబడుచున్నాడు. అవిద్యాశక్తి కాలశక్తిని సహాయముగగాని జీవునికొరకే నానావిధ భావములను సృష్టించు

చున్నది. జీవుని అదృష్టము ననుసరించియే ప్రతిబంధాభ్యనుజ్ఞా శక్తులు ప్రవర్తించుచుండును. కావున జీవుడే కాలము అని వీరి అభిప్రాయము మరికొందరి అభిప్రాయము ప్రకారము విగ్రహముతో కూడిన ఒక మహా ప్రభావశాలియగు దేవతయే కాలము. ఈ దేవత కూడ చిన్మాత్ర బ్రహ్మ శక్తియే గాన ఈ మతము సిద్ధాంత పక్షానుగుణముగ నున్నది.

ఈ విధముగ కాలదర్శనమున ఎన్నియో పక్షములున్నవి. కాని ఇది (కాలదర్శనము) సంసారహేతుభూతమగు అవిద్యలోని మొదటి మెట్టు సంసారము భేదదృష్టిమయము. భేదమనునది దేశమును బట్టియు కాలమును బట్టియు ఏర్పడును అందును కాల భేదము జగత్సృష్టిలో మొదటిది. బ్రహ్మతత్త్వమునందు క్రమము లేదు. కాలశక్తితో సహకృతమగు అవిద్యతోడ సంబంధముచే వివిధ భావరూపములలో వివర్తము హొందుచున్నది. కాలానువేధముచే కాలము యొక్క ప్రవేశముచే పదార్థములు క్రమముతో భాసించుట అనునది, అనాది సిద్ధమగు జీవాత్మకు కలుగుచున్నది. ఈ భేద జాలమంతయు అవిద్యామయము. విద్య ఆవిర్భవింపగనే భేద ప్రపంచమంతయు తొలగిపోవుటచే ఈ కాలము కూడ తొలగిపోవును. కావున కాలము, కాలమును గూర్చిన ఈ విచారము, ఇది యంతయు అవిద్యావస్థలోనే యుండునుగాని విద్యావస్థలో నుండదు. కావున కాలస్వరూపమునకు సంబంధించిన పక్షములలో ఏది యుక్తము ఏది అయుక్తము అనెడు విచారణమున కంతకును ప్రయాసమే ఫలము కాని మంచి ప్రయోజనమేదియు కానరాదు. వ్యవహార కాలమున పదార్థములలో నొక క్రమమున్నట్లు కనబడుచున్నది గాన దానికి హేతుభూతమగు కాలము అనునది ఒక్కటి ఉన్నదని అంగీకరించిన చాలును. ॥62॥

అవతారిక— ఇంతవరకును, జన్మగల వస్తువుల వ్యవహారము నిమిత్తమై కాలమును అంగీకరింపవలెనని చెప్పినట్లైనది కావున కాలకృతమగు భేదమేమైన ఉన్నచో అది అనిత్యములగు జన్య వస్తువులకే ఉండవలెను. అట్టి పరిస్థితులలో నిత్యములగు శబ్దములకు కాలకృతమగు హ్రస్వత్వాది భేదము ఎట్లు కలుగుచున్నది అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అభేదే యది కాలస్య హ్రస్వదీర్ఘ ప్లుతాదిషు ।
దృశ్యతే భేదనిర్భాసః స చిరక్షిప్ర బుద్ధివత్ ॥ 63

కాలస్య = కాలమునకు, అభేదే = భేదము లేకున్నను, హ్రస్వదీర్ఘ ప్లుతాదిషు = హ్రస్వదీర్ఘ ప్లుతాదులయందు, భేదనిర్భాసః = భేదావభాసము (భేదబుద్ధి), దృశ్యతే యది = చూడబడు చున్నచో, సః = అది, చిరక్షిప్రబుద్ధివత్ = 'చిరము' 'క్షిప్రము' అను బుద్ధివలె కలుగు చున్నది.

తాత్పర్యము— కాలభేద మేమియు లేకున్నను హ్రస్వదీర్ఘ ప్లుతాదులందు భేద మేమైన కనబడుచున్నచో అది 'చిరము' 'శీఘ్రము' ఇత్యాది బుద్ధులందు వలె కలుగుచున్నది అని చెప్పవలెను.

వివరణము— "ఈ కార్యము (వస్తువు) శీఘ్రముగ తయారైనది." "ఈ కార్యము ఆలస్యముగ తయారైనది" ఇత్యాది జ్ఞానములు కలుగుచున్నవి. ఒక అవయవి అల్పసంఖ్యాకములగు అవయవములచే తయారైనచో అది శీఘ్రముగ తయారైనదని అనుచున్నాము. ఒక అవయవి అధిక సంఖ్యాకములగు అవయవములతో తయారయినచో అది ఆలస్యముగ తయారయినదని అనుచున్నాము. ఈ విధముగ విషయమందలి భేదమును బట్టి ఏర్పడిన చిరత్వ క్షిప్రత్వములను కాలమునందు కల్పించుచున్నాము. (ఈ విషయము 35 వ కారికలో గూడ స్పష్టీకరింపబడినది). అట్లే శబ్దము నిత్యము గావున దానియందు కాలభేదము లేకున్నను హ్రస్వాదులందు కాలభేదము ఆరోపింపబడుచున్నది ఇది కాల్పనికమేకాని యథార్థము కాదు. ॥64॥

అవతారిక— హ్రస్వాదులందు కనబడు కాలభేదము కాల్పనికమే కాని వాస్తవము కాదు అని పై కారికలో చెప్పిన సమాధానమును ఆక్షేపించుచున్నాడు.

శ్లో॥ హ్రస్వదీర్ఘ ప్లుతావృత్త్యా నాలికా సలిలాదిషు ।
కథం ప్రచయయోగః స్యాత్ కల్పనా మాత్రహేతుకః ॥ 64

నాలికాసలిలాదిషు = గొట్టములోని నీళ్ళు మొదలైన వాటియందు, హ్రస్వదీర్ఘ ప్లుతావృత్త్యా= హ్రస్వదీర్ఘ ప్లుతముల ఆవృత్తిచేత, కల్పనా మాత్ర హేతుకః = కల్పనా మాత్రమే హేతువుగా గల, ప్రచయయోగః = ఆధిక్యము యొక్క సంబంధము, కథం = ఎట్లు, స్యాత్ = అగును?

తాత్పర్యము— హ్రస్వదీర్ఘ ప్లుతములను ఆవృత్తి చేసినపుడు, నాళికాసలిలాదులందు కల్పనామాత్రముచే ఆధిక్యము ఎట్లు కలుగును?

వివరణము— పూర్వము గడియారములు లేని రోజులలో కాలమును తెలిసికొనుటకై కొంత ప్రమాణముగల నీరు పట్టెడు కుండలను (ఘటికలను) గొట్టములను (నాళికలను) తయారుచేసి వాటికొక నిర్దిష్ట ప్రమాణము గల రంధ్రము చేసెడి వారు ఆ ఘటాదులనిండ నీరు నింపెడి వారు. ఆ రంధ్రముగుండా ఘటాదులలోని నీరు కారిపోవుటకు ఎంతకాలము పట్టునో ఆ కాలమును ఒక ప్రమాణముగ తీసికొనెడి వారు. ఆ కాలమునకు ఘటిక లేక నాళిక యని పేరు ఆ పద్ధతిని మనస్సులో నుంచుకొని ఆశంకించుచున్నాడు. హ్రస్వమును రెండు మూడు సార్లు ఉచ్చరించినపుడు నాళికనుండి కొంచెము ఉదకము స్రవించుచున్నది. దీర్ఘమును రెండు మూడు సార్లు ఉచ్చరించు సరికి అంతకంటె అధిక ప్రమాణముగల ఉదకము స్రవించుచున్నది ప్లుతమును రెండు మూడు సార్లు ఉచ్చరించినపుడు అంతకంటెను అధికమగు ఉదకము స్రవించుచున్నది. హ్రస్వాదులలోని కాలభేదము కేవలము కాల్పనికమే కాని సత్యము కాదన్నచో కాల్పనికమగు ఈ కాలమనెడు హేతువువలన సత్యమగు అల్ప - అధిక - అధికతర - జలస్రావము ఏల కలుగుచున్నది? అసత్యమగు వస్తువు అర్థక్రియాకారి కాజాలదు కదా? అసత్యమగు సర్పము కరచుటగాని, అది కరచినవాడు మరణించుటగాని కానవచ్చుట లేదు కదా? కావున కాలభేదము సత్యమేయని అంగీకరింపవలెను. సత్యమగు కాలభేదమును

బట్టి భిన్నభిన్న కాలములగుటచే హ్రస్వాది శబ్దములు కూడ నిత్యము కాజాలవు అని పూర్వ పక్షి అభిప్రాయము ॥64॥

అవతారిక— ఈ ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ అభివ్యక్తి నిమిత్తస్య ప్రచయేన ప్రచీయతే ।
అభిన్నమపి శబ్దస్య తత్త్వ మప్రచయాత్మకమ్ ॥ 65

అప్రచయాత్మకం = ప్రచయాపచయములు లేని ; శబ్దస్య = శబ్దముయొక్క, తత్త్వం = తత్త్వము, అభిన్నమపి = భేదరహితమైనదైనను, అభివ్యక్తినిమిత్తస్య = తన (శబ్దము యొక్క) అభివ్యక్తికి నిమిత్తమగు ధ్వనియొక్క, ప్రచయేన = ప్రచయముచేత, ప్రచీయతే = వృద్ధి పొందుచున్నది

తాత్పర్యము— ప్రచయములేని శబ్దతత్త్వము భేదరహితమైనదైనను అభివ్యక్తి నిమిత్తమగు ధ్వనియొక్క ప్రచయముచే ప్రచయమును పొందుచున్నది.

విశేషము— శబ్దము నిత్యము, భేదరహితము. దానికి ప్రచయాపచయములు లేవు. కాని ఈ శబ్దమును అభివ్యక్తము చేయు ధ్వని గ్రామముల ప్రచయాపచయములను బట్టి శబ్దమునందు కూడ వృద్ధిహ్రాసములున్నట్లు ప్రతీతి కలుగుచున్నది. ధ్వనులు శబ్దముతో పూర్తిగ సంమిళితములై తమలోనున్న కాలభేదములను ఆ శబ్దమునందు ప్రకాశింప చేయు చున్నవి. ఈ విధముగ శబ్దతత్త్వ జ్ఞానము అభివ్యంజకములగు ధ్వనులపై ఆధారపడియున్నది గాన అభివ్యంజకములగు ఆ ధ్వనుల ధర్మములు అభివ్యజ్యమగు శబ్దతత్త్వముపై గూడ ప్రసరించుటచే నాళికాదిజలస్రుతిలో భేధము కనబడుచున్నది. ॥65॥

అవతారిక— శబ్దతత్త్వము కేవలము హ్రస్వదీర్ఘాదులందే కాదు, పదవాక్య విషయము లన్నింటి యందును అభిన్నమే యని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏవం మాత్రాతురీయస్య భేదో దాశతయస్య వా
పరిమాణ వికల్పేన శబ్దాత్మని న విద్యతే ॥ 66

ఏవం = ఈ విధముగనే, మాత్రాతురీయస్య = మాత్రయొక్క నాల్గవ భాగము యొక్కకాని, దాశతయస్యవా = దాశతయమను వేదభాగము యొక్కకాని, శబ్దాత్మని = శబ్దతత్త్వము నందు, పరిమాణ వికల్పేన = ప్రమాణ భేదముచేత, భేదః = భేదము, న విద్యతే = లేదు.

తాత్పర్యము— ఇట్లే మాత్రా చతుర్థభాగము యొక్క శబ్దస్వరూపమునందు గాని, దాశతయమను వేదభాగము యొక్క శబ్దస్వరూపమునందు గాని పరిమాణభేదముచే భేదము లేదు.

వివరణము— మాత్రయొక్క చతుర్థ భాగము ఎక్కువగా, ప్రచితమగు ధ్వనిచే వ్యంజింపబడును. 64 ఋక్కులు గల ఒక వేద భాగమునకు 'దాశతయ'మని పేరు. ఇది

ఇంకను అధికమగు ప్రచయము గల ధ్వనిచే వ్యంగ్యము. ఈ రెండింటియందును ఉన్న శబ్ద తత్త్వము సమానమే. కాలభేదమేదైన నున్నచో అది కేవలము వ్యంజకములగు ధ్వనులకు సంబంధించినది. ఉదాహరణకు— ఏనుగును చూడగనే ఒక జ్ఞానము కలుగుచున్నది. మశక మును చూడగా ఒక జ్ఞానము కలుగుచున్నది. ఈ హస్తిమశక జ్ఞానములలో నున్న జ్ఞాన త్వాంశములో భేదమేమియు లేదు. అవి రెండును ఒక్కటే. కాని మొదటి జ్ఞానములో ఏనుగు యొక్క స్వరూపము, రెండవ జ్ఞానములో మశకము యొక్క స్వరూపము భాసించుటచే భిన్నములగు ఆ విషయములను బట్టి ఈ జ్ఞానములు గూడ భిన్నములైనట్లు భాసించుచున్నవి. వాస్తవమున ఆ రెండు జ్ఞానములందును భేదమేదియు లేదు. ఇట్లే స్ఫోటరూపమగు శబ్ద తత్త్వము పదములందుగాని, వాక్యములందుగాని అవి లక్షణమగనే ఉన్నను వ్యంజకములగు ధ్వనుల భేదమునుబట్టి విలక్షణమువలె కనబడుచున్నది. ॥66॥

అవతారిక— స్ఫోటరూపమగు శబ్దమునందు కాలకృతమగు భేదము లేకున్నను ధ్వనికృత కాలభేదము ననుసరించి హ్రస్వ - దీర్ఘ - ప్లుతభేదములు అంగీకరింపబడినవి. కావున హ్రస్వవర్ణమును ఉచ్చరించునపుడు శాస్త్రమున దీర్ఘ ప్లుతములను గ్రహింపకుండుట కును, దీర్ఘమును ఉచ్చరించినపుడు హ్రస్వ ప్లుతములను గ్రహింపకుండుటకును తపరకర ణము చేయబడ నని ''తపరస్తత్కాలస్య'' అను సూత్రము చెప్పుచున్నది. ఏదైన ఒక అచ్చును తపరముగ (అత్, ఇత్ ఇత్యాదిరూపమున) ఉచ్చరించినపుడు ఉచ్చరించిన అచ్చు నకు ఎంత కాలమున్నదో అంతకాలమే గల అచ్చు మాత్రమే గ్రహింపవలెను గాని తద్భిన్న కాలము కలదానిని గ్రహింపరాదు అని దాని యర్థము. ఇపుడు ప్రశ్న ఏమనగా - ఒక అచ్చు నకు హ్రస్వ - దీర్ఘ - ప్లుత భేదమున్నట్లు హ్రస్వాదులకు గూడ ప్రత్యేకముగ ద్రుత - మధ్య- విలంబిత వృత్తులుండును 'అ' అను ఒక హ్రస్వమునే అతి శీఘ్రముగ ఉచ్చరించినచో ద్రుత వృత్తి. చాల ఆలస్యముగ ఉచ్చరించినచో విలంబిత వృత్తి మధ్యరీతిలో ఉచ్చరించినచో మధ్య వృత్తి కావున ఈ వృత్తులను బట్టి ఏర్పడిన మూడేసి భేదములను గూడ హ్రస్వదీర్ఘ ప్లుతములకు అంగీకరించి, ఒక భేదమును ఉచ్చరించినపుడు మిగిలిన రెండింటిని గ్రహింప కుండుటకై తపరకరణాదులు చేయవలసి యుండునుగదా యని యాశంకించుకొని చెప్పు చున్నాడు.

శ్లో॥ అనునిష్పాదితత్త్వేన యేఽన్తరాల ఇవస్థితాః ।
శబ్దాస్తే ప్రతిపత్తౄణా ముపాయాః ప్రతిపత్తయే ॥ 67

అనునిష్పాదితత్త్వేన = ప్రాకృతధ్వనిని అనుసరించి ఏర్పడు స్వరూపముతో, అన్తరాలే = శ్రోత్రమధ్యమునందు, స్థితాః ఇవ = ఉన్నవి వలె భాసించు, యే = ఏ, శబ్దాః = వైకృత ధ్వనులు కలవో, తే = అవి, ప్రతిపత్తౄణాం = ద్రుతాది భేదమును గ్రహించెడి వారి యొక్క, ప్రతిపత్తయే = జ్ఞానమునకు, ఉపాయాః = ఉపాయములు.

తాత్పర్యము— ప్రాకృత ధ్వనులను అనుసరించి బయల్వెడలి శ్రోత్రాంతరము నందున్నట్లు తోచు, వైకృత ధ్వనులు ద్రుతాదివృత్తి భేదములను గ్రహింప చేయుచున్నవి.

విశేషము— ప్రాకృతధ్వని యనియు, వైకృతధ్వని యనియు ధ్వని రెండు విధములు. మొట్టమొదట బయల్వెడలు ధ్వని ప్రాకృతధ్వని. ఆ ప్రాకృతధ్వని లేనిచో స్ఫోటము సామాన్యరూపమున గాని విశేషరూపమున గాని భాసింపదు. ఈ ప్రాకృత ధ్వనినే స్ఫోటాభిన్నమని భావింతురు. ఇదియే హ్రస్వదీర్ఘ ప్లుతాది భేదవ్యవహారమునకు హేతువు. కావున వీటిలో ఒకదానిని గ్రహింపవలసి యున్నపుడు మిగిలిన రెంటింటిని గ్రహింపకుండుటకు తపరకరణ మావశ్యకము. ప్రాకృత ధ్వని స్ఫోటరూప శబ్దాభివ్యక్తిని చేసిన పిమ్మట గూడ అనువర్తించుచు, శ్రవణ కుహరమున శ్రూయమాణమై యుండునది వైకృత ధ్వని. ఈ వైకృత ధ్వనియే ద్రుత వృత్త్యాది భేదకారణము. దీనిచే స్ఫోటమునందు భేదము ఏర్పడదు. ఈ వైకృత ధ్వనిచే ఆ యా వర్ణముల ఉపలబ్ధిలో వృద్ధి కలిగినను హ్రస్వత్వాదులందు గూడ భేదము కనబడుట లేదు. ఈ హ్రస్వమునే అతడు ద్రుతముగ ఉచ్చరించినాడు, ఇతడు విలంబితముగ ఉచ్చరించినాడు, ఇత్యాది ప్రతీతిని బట్టి వాటి అభేదము తెలియుచున్నది ఈ విధముగ వైకృత ధ్వనులు శబ్దతత్త్వము కంటె బాహ్యములు. బాహ్యములగు వైకృత ధ్వనులచే నేర్పడిన ద్రుతత్వాదులచే శబ్దభేద మేర్పడదు గాన తపరకరణము అనావశ్యకమని భావము. ॥67॥

అవతారిక— ఇపుడు ప్రకృతమగు కాలమునకు సంబంధించిన భేదవ్యవహారము పరోపాధి కల్పితమే అను విషయమును వివరించుచున్నాడు.

శ్లో॥ విశిష్టమవధిం తం తముపాదాయ ప్రకల్పతే ।
కాలః కలావతామేకః క్షణమాసర్తు భేదవత్ ॥ 68

ఏకః = ఒక్క, కాలః = కాలమే, విశిష్టం = విశిష్టమగు, తంతం = ఆ యా, అవధిం = అవధిని, ఉపాదాయ = గ్రహించి, క్షణమాసర్తు భేదభాక్ = క్షణములు, మాసములు, ఋతువులు మొదలగు భేదములను పొందినదై, కలావతాం = సావయవములగు అనిత్య పదార్థముల యొక్క అవచ్ఛేదమునకు, ప్రకల్పతే = సమర్థమగుచున్నది.

తాత్పర్యము— కాలము ఒక్కటియే. అది ఆ యా విశిష్టావధులను గ్రహించి క్షణ – మాస – ఋత్వాది భేదములను పొందుచు సావయవములగు అనిత్య భావముల అవచ్ఛేదమును చేయుచున్నది.

వివరణము— విశిష్టమైన అవధి యనగా రెప్పపాటు వేయుట, చిటిక వేయుట మొదలగునది. ॥68॥

అవతారిక— అట్లైనను ఈ వ్యవస్థ భావములకు సంబంధించినది కాదు, బుద్ధికి సంబంధించినది అని చెప్పుచున్నాడు.

శ్లో॥ బుద్ధ్యవగ్రహభేదాచ్చ వ్యవహారాత్మని స్థితేః ।
తావానేవ క్షణః కాలః యుగమన్వన్తరాణి చ ॥ 69

బుద్ధ్యవగ్రహభేదాత్ + చ = సంకలనా రూపమున బుద్ధిచే గ్రహించుటలో గల భేదమును బట్టి, వ్యవహారాత్మని = వ్యవహారరూపమునందు, స్థితేః = ఉండుటవలన, తావాన్ = సంకలనా రూపమున బుద్ధిచే ఎంత గ్రహింపబడుచున్నదో అంత ప్రమాణము మాత్రమె గల, కాలః ఏవ = కాలమే, క్షణః = క్షణముగాని, యుగమన్వంతరాణివా = యుగమన్వంతరములు గాని అగుచున్నది.

తాత్పర్యము— సంకలనా రూపమున బుద్ధిచే గ్రహించుటలోని భేదమును బట్టి లోకవ్యవహారము జరుగుచుండును గాన, ఎంత ప్రమాణము గల కాలము బుద్ధ్యవగ్రహమునకు విషయమో అంత కాలము మాత్రమే క్షణముగ గాని మన్వంతరముగ గాని అగుచున్నది.

వివరణము— రెప్పపాటు ఎంతలో అగునో అంత కాలమును బుద్ధిచే ఆకలించుకొని దానిని నిమిషమనుచున్నాము. సూర్యోదయము మొదలు సూర్యాస్తమయము వరకును ఎంత ప్రమాణముండునో దానిని బుద్ధిచే ఆకలించుకొని పగలు అనుచున్నాము. ఈ విధముగ క్షణము మొదలు యుగములు, మన్వంతరములవరకును గల కాలము మనము బుద్ధితో ఆకలించుకొనుటను బట్టి ఏర్పడుచున్నది. ఈ విధముగి కాలము విషయమున బౌద్ధికమగు కల్పన చేయబడుచు వ్యవహార సాధనమగుచున్నది కాలము మాత్రము ఒక్కటే. ॥69॥

అవతారిక— నాళికలోని జలము స్రవించుటనుబట్టి క్షణాహోరాత్రాది వ్యవహారము కలుగుచున్నది గాన అదియే (నాళికాజల సృతియే) కాలమని అంగీకరింప వచ్చునుగదా ? మరల తద్భిన్నమగు కాలమును కల్పింపనేల, అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రతిబన్ధాభ్యనుజ్ఞాభ్యాం నాళికా వివరాశ్రితే ।
యదమ్భసి ప్రక్షరణం తత్కాలస్యైవ చేష్టితమ్ ॥ 70

నాళికావివరాశ్రితే = నాళికావివరమును ఆశ్రయించిన, అంభసి = ఉదకమునందు, ప్రతిబంధాభ్యనుజ్ఞాభ్యాం = ప్రతిబంధాభ్యనుజ్ఞలచే, యత్ = ఏ, ప్రక్షరణమ్ = స్రవించుట అనెడు క్రియ కనబడుచున్నదో, తత్ = అది, కాలస్యైవ = కాలము యొక్కయే, చేష్టితమ్ = చేష్ట.

తాత్పర్యము— నాళికా రంధ్రము వద్దనున్న జలమునందు ప్రతిబంధాభ్యనుజ్ఞలచే స్రవించుట అనునది కానవచ్చుచున్న దన్నచో అది కాలముయొక్క చేష్టయే.

వివరణము — ఘటోదరమున నున్న జలము ఛిద్రమునుండి స్రవించుచున్నపుడు ఆ జలములోని కొంత భాగమే స్రవించుట, మిగిలిన భాగము ఆ సమయమున స్రవింపకుండుట అనునది కాలమునకు గల ప్రతిబంధాభ్యనుజ్ఞా శక్తులను బట్టి జరుగుచున్నది. అట్లు కానిచో జలమంతయు ఒక్క మారుగా స్రవించియుండెడిది. క్రమముగ స్రవించుటను బట్టి

ఈ క్రమమునకు హేతువగు కాలవ్యాపార మొకటి యున్నదనియు, ఈ కాలము జలస్రవణ ముచే పరిచ్ఛేదింప (కొలప) బడునదే కాని, జలస్రవణమే కాలము కాదనియు స్పష్టమగు చున్నది. కావున జలస్రవణము కంటె భిన్నమును, జలస్రవణముచే పరిచ్ఛేద్యమును అగు కాలమును అంగీకరింపవలెనని తాత్పర్యము. ॥70॥

అవతారిక— కాలము ఏకరూపమే అయిన పక్షమున, ఘటచ్ఛిద్రము చిన్నదై నపుడును పెద్దదైనపుడును స్రవించెడు నీటివలన దాని భేదము ఎట్లు నిర్ణయింపబడును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ అల్పేమహతి వాచ్ఛిద్రే తత్సమ్బన్ధే న భిద్యతే ।
కాలస్య వృత్తిరాత్మాపి తమేవాస్యాను వర్తతే ॥ 71

ఛిద్రే = ఛిద్రము, అల్పే = చిన్నదైనను, మహతివా = గొప్పదైనను, తత్సమ్బన్ధే = జలము నకు దానితో సంబంధము ఏర్పడినపుడు, కాలస్య = కాలముయొక్క, వృత్తిః = ప్రవృత్తి, నభిద్యతే = భిన్నము కాదు, అస్య = ఈ కాలము యొక్క, ఆత్మాపి = స్వరూపము కూడా, తమేవ = ఆ ఛిద్ర సంబంధమునే, అనువర్తతే = అనుసరించును.

తాత్పర్యము— జలమునకు చిన్న ఛిద్రముతో సంబంధమున్నను పెద్ద ఛిద్ర ముతో సంబంధమున్నను ప్రతిబంధాభ్యనుజ్ఞా రూపమగు కాలవ్యాపారమునందు మార్పు ఉండదు. కాలము ఛిద్రసంబంధమునే అనువర్తించును.

వివరణము— కాలము ఘటఛిద్రమును అనువర్తించును గాన, ఛిద్రము అల్పమై నచో ప్రతిబంధాభ్యనుజ్ఞలు బహులముగా నుండునుగాన దీర్ఘకాలమనియు, ఛిద్రము పెద్దదై నచో ప్రతిబంధాభ్యనుజ్ఞలు అల్పముగా నుండును గాన అల్పకాలమనియు వ్యవహారము కలుగును. కాలము భేదరహితమైనను దానికి గల ఛిద్ర సంబంధమును బట్టి భేదము కల్పిత మగుచున్నది.

ఘటావయవములచే అడ్డుకొనబడిన జలము స్రవించుట లేదు ; ఛిద్రము విడిచిన జలము మాత్రము స్రవించుచున్నది ; ఈ విధముగ చెప్పుటకు వీలగునపుడు కాలమను దానిని అంగీకరించుట ఎందులకు అని ఆక్షేపింపరాదు. ఏలయన మూలభూతమగు కాలవ్యాపారమును పూర్తిగ త్రోసిపుచ్చుటకు వీలులేదు. కాలముచేయు ప్రతిబంధాభ్యనుజ్ఞలనే ఘటావయవచ్ఛిద్ర ములు గూడ కొనసాగునట్లు చేయుచున్నవని చెప్పవలెను. ఉదాహరణమునకు, బీజమునందు అంకురజననమును ప్రతిబంధించు శక్తియు, అనుమతించు శక్తియు ఉన్నది. ఈ శక్తులు కాల కృతములు. పౌణకలోనున్న బీజము అంకురమును పుట్టింపదు గాన కుసూలము అంకుర ప్రతిబంధ శక్తికి తోడ్పడుచున్నది. ఆ బీజమునే నేలపై చల్లినపుడు అంకురము వచ్చు చున్నది. కావున క్షేత్రము అంకురజననాభ్యనుజ్ఞా శక్తికి తోడ్పడుచున్నది. ఈ విధముగ ఆ యా కారణములును, కాలమును ఒకదానికొకటి తోడ్పడుచు కార్యములను పుట్టించుచున్నవి

లేదా నిరోధించుచున్నవి అని అంగీకరింపవలెను గాని ఒకదానిని అంగీకరించి మరియొక దానిని నిరాకరించుట యుక్తము కాదు. ॥71॥

అవతారిక — పెక్కులేల ? కాలాత్మ భేదరహితమైనను స్వశక్తి వైచిత్ర్యముచే అన్ని భావములందును భేదమును చూపుచున్నది అని చెప్పుచున్నాడు

శ్లో॥ ఆక్రీడ ఇవ కాలస్య దృశ్యతే యః స్వశక్తిభిః ।
బహురూపస్య భావేషు బహుధా తేనభిద్యతే ॥ 72

స్వశక్తిభిః = తన శక్తులచేత, బహురూపస్య = విభిన్న రూపములుగా ఉన్న, కాలస్య = కాలముయొక్క, యః = ఏ, భావేషు = పదార్థముల విషయమున, ఆక్రీడ ఇవ = ఆటవలె, దృశ్యతే = కనబడుచున్నదో, తేస = దానిచేత, బహుధా = అనేక విధములుగా, భిద్యతే = భిన్నముగ కనబడుచున్నది

తాత్పర్యము— స్వశక్తులచే బహురూపముల కానవచ్చు కాలము భావములనెడు ఆట వస్తువులతో ఆడుకొనుచున్నట్లున్నది. ఈ విధముగ వర్తమానాది వైచిత్ర్యము గల కాలముతో సంబంధించుటచే భావములు ఆవిర్భావతిరోభావములతో విభిన్న రీతుల కానవచ్చుచున్నవి. భావముల ఆవిర్భావతిరోభావములను బట్టి కాలము భిన్నరూపముల కనబడుచున్నది. ॥72॥

అవతారిక— పై విషయమునే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ త్వచిసారస్య వా వృద్ధిం తృణసారస్య వా దధత్ ।
తావత్తద్వృద్ధియోగేన కాలతత్త్వం వికల్పతే ॥ 73

త్వచిసారస్య = వెదురు మొక్కయొక్క కాని, తృణసారస్యవా = తాటిచెట్టు యొక్క కాని, వృద్ధిం = వృద్ధిని, దధత్ = చేయుచున్న, తావత్ = అంతే ప్రమాణముగల, కాలతత్త్వం = కాలతత్త్వము, తద్వృద్ధియోగేన = వాటియొక్క వృద్ధితోడి సంబంధముచేత, వికల్పతే = భిన్నమగుచున్నది.

తాత్పర్యము— వెదురు మొక్కకుగాని, తాటిచెట్టుకుగాని వృద్ధిని కలిగించుచు, అంతమాత్రమే ప్రమాణముగల వయస్సును, కాలతత్త్వము వాటియొక్క వృద్ధిని బట్టి వేరు వేరుగ కనబడుచున్నది.

విశేషము— కాలము వెదురు మొక్కకు ఆదినుండి ఫలోద్గమము వరకును వృద్ధిని కల్గించుచున్నది. తాలవృక్షమునకు అంతకంటె అధికమగు వృద్ధిని కల్గించుచున్నది. వెదురుమొక్క వృద్ధిపొందెడు కాలము అల్పము దానికంటె తాటిచెట్టు వృద్ధిచెందెడు కాలము అధికము. ఈ విధముగ కాలము వంశతాలవృక్షాది భావములతో ఆట వస్తువులతో ఆడు

కొన్నట్లు ఆడుకొనుచు, వాటి జన్మస్థితి వినాశాదులతో నేర్పడిన సంబంధమును బట్టి విభాగ మును పొందుచున్నది. ॥73॥

అవతారిక— ఆ యా వస్తువుల అవస్థా భేదమును బట్టి కాలభేదమని అంగీకరించి నచో, వాటి అవస్థా వినాశముచే కాలము గూడ నశించును గాన అది నిత్య మెట్లగును - అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ వ్యతిక్రమేఽపి మాత్రాణాం తస్య నాస్తి వ్యతిక్రమః ।
న గన్తృగతి భేదేన మార్గభేదోఽస్తి కశ్చన ॥ 74

మాత్రాణాం = భావములు, వ్యతిక్రమేఽపి = తొలగిపోయినను, తస్య = ఆ కాలమునకు, వ్యతిక్రమః = తొలగిపోవుట అనునది, నాస్తి = లేదు, గన్తృగతి భేదేన = నడచే వారి యొక్కయు వారి నడకల యొక్కయు భేదముచే, మార్గభేదః = మార్గమునందు భేదము, కశ్చన = ఏదియు, నాస్తి = లేదు

తాత్పర్యము— భావములును, వాటి యవస్థలును తొలగిపోవుచున్నను (మార్పు చెందుచున్నను), కాలమునకు వ్యతిక్రమము లేదు. నడచేవారియందును వారి నడకలయందును ఉన్న భేదమును బట్టి మార్గమున భేదమేదియు ఉండదు.

వివరణము— భావములకు కాలము ఆధారము. ఆ భావములుగాని, వాటి అవస్థలు గాని ఏమైన మార్పులు చెందినను ఆధారభూతమగు కాలమున భేదమేమియు ఏర్పడదు. ఉదాహరణమునకు— మార్గమునందు నడిచే వారి భేదమును బట్టియు, వారి నడకలలోని భేద మును బట్టియు భేదము చెందక, మార్గము మాత్రము ఒక్క రూపముననే యుండును, దాని యందు మార్పు ఏదియు రాదుకదా ? పుష్పోద్గమాది క్రియలు తొలగుటచే వసంతాది కాలము తొలగినదని వ్యవహరింతుమే గాని వాస్తవమున నిత్యమగు కాలమునకు ఆగమాపాయములేదని తాత్పర్యము ॥74॥

అవతారిక— ఈ విషయమునే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ఉదయాస్తమయావృత్త్యా జ్యోతిషాం లోకసిద్ధయా ।
కాలస్యావ్యతిపాతేఽపి తాద్ధర్మ్యమివ లక్ష్యతే ॥ 75

కాలస్య = కాలమునకు, అవ్యతిపాతేఽపి = గడచిపోవుట అనునది లేకపోయినను, లోక సిద్ధయా = లోక ప్రసిద్ధమగు, జ్యోతిషాం = సూర్యాది జ్యోతిస్సుల, ఉదయాస్తమయా వృత్త్యా = ఉదయాస్తమయముల ఆవృత్తిచే, తాద్ధర్మ్యం + ఇవ = ఆ జ్యోతిస్సుల ధర్మము కలిగియుండుట వలె, లక్ష్యతే = పొందబడుచున్నది (చూడబడుచున్నది).

తాత్పర్యము— కాలమునకు గడచిపోవుట అనునది లేకపోయినను లోకములో ప్రసిద్ధముగ నున్న సూర్యాది జ్యోతిస్సుల ఉదయాస్తమయములచే కాలమునకు గూడ ఆ ధర్మము లున్నట్లు తోచుచున్నది.

వివరణము— సూర్యుడు మొదల్గగు తేజస్సులు ఉదయించుచు అస్తమించుచు ఉండును ఆ సూర్యాదుల సంచారముచే కాలమునందు భేదము కల్పింపబడుచున్నది. ఈ కల్పనను బట్టి పగలు గడచినది, రాత్రి గడచినది, శిశిరము వెళ్ళిపోయినది, ఇత్యాది వ్యవహారములు కలుగుచున్నవి గాని వాస్తవమున కాలము గడచిపోవుటగాని, మరల వచ్చుటగాని సత్యములు కావు.

అవతారిక— జ్యోతిర్గమనమును బట్టి కాలమునందు భేదబుద్ధి ఏర్పడుచున్నది గాన ఆ జ్యోతిర్గమనమే కాలమని కొందరి మతమని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆదిత్యగ్రహనక్షత్ర పరిస్పన్ద మథాపరే ।
భిన్న మావృత్తిభేదేన కాలం కాలవిదో విదుః ॥ 76

అథ = ఇక, అపరే = మరికొందరు, కాలవిదః = కాలవేత్తలు, ఆవృత్తిభేదేన = ఆవృత్తి (మరల మరల వచ్చుట) భేదముచే, భిన్నం = భిన్నమైన, ఆదిత్యగ్రహనక్షత్ర పరిస్పన్దః = ఆదిత్యునియొక్కయు, గ్రహములయొక్కయు, నక్షత్రములయొక్కయు గమనమును, కాలం = కాలమునుగా, విదుః = తెలిసికొనుచున్నారు (చెప్పుచున్నారు).

తాత్పర్యము— మరల మరల తిరిగి వచ్చుచుండుటచే భిన్నముగ కనబడుచున్న ఆదిత్య - గ్రహ - నక్షత్రాదుల గమనమే కాలమని కొందరు కాలజ్ఞులు చెప్పుచున్నారు.

వివరణము— ఉదయము మొదలు అస్తమయమువరకును గల సూర్యసంచారము పగలు ; అస్తమయము మొదలు ఉదయము వరకును ఉన్నది రాత్రి. చంద్రుడు నక్షత్రముల నన్నింటిని దాటుట మాసము. బృహస్పతి ఒక రాశిలో సంచరించుకాలము సంవత్సరము. ఈ విధముగ జ్యోతిర్గమనమే యుగ - మన్వన్తర - కల్ప - మహాకల్పాది భేదభిన్నమగు కాలము. ॥76॥

అవతారిక— ఈ విధముగ సూర్యాదుల గమనక్రియ కాలమని ప్రసిద్ధిపొంది, అప్రసిద్ధమగు ఇతర క్రియల ప్రమాణమును తెల్పుచుండునని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాన్తర పరిచ్ఛేద ప్రవృత్తా యా క్రియాం ప్రతి ।
నిర్జ్ఞాత పరిమాణా సా కాలఇత్యభిధీయతే ॥ 77

నిర్జ్ఞాత పరిమాణా = తెలియబడిన పరిమాణము గల, యా = ఏ క్రియ, క్రియాన్తర పరిచ్ఛేద ప్రవృత్తా = మరియొక క్రియను కొలచుటకై ప్రవర్తించునో, సా = ఆ క్రియ, క్రియాం ప్రతి = పరిచ్ఛేద్యమగు ఆ క్రియను గూర్చి, కాలః ఇతి = కాలము అని, అభిధీయతే = చెప్పబడు చున్నది.

తాత్పర్యము— తెలియబడిన పరిమాణము గల ఏ క్రియ క్రియాంతరమును

కొలచుటకు ఉపయుక్తమగునో, ఆ క్రియ పరిచ్ఛేద్యమగు ఆ క్రియాంతరమును గూర్చి కాలమని చెప్పబడుచున్నది

వివరణము—— సూర్యాది గమనములకు దివసాది నామధేయము లున్నవి. ఈ దివసాదుల ప్రమాణ మెంత యుండునో అందరికిని తెలియును అట్లే ఆవునుండి పాలు పితుకుట అనునది ఒక క్రియ. దీని పరిమాణము కూడ ప్రసిద్ధముగ తెలియును. ప్రసిద్ధ ప్రమాణములగు ఈ సూర్య సంచార క్రియ (పగలు లేక రాత్రి) పాలు పితుకుట అను క్రియ, మొదలగు వాటిని బట్టి అప్రసిద్ధములగు క్రియల పరిమాణమును సూచించుటకు ప్రయత్నింతుము. ఉదాహరణమునకు— 'పగలంతా చదివినాడు', 'రాత్రి అంతా చదివినాడు' ఇత్యాది ప్రయోగములలో పగటి రాత్రుల (సూర్య సంచార క్రియల) పరిమాణమును బట్టి అధ్యయన క్రియా పరిమాణమును నిశ్చయించుచున్నాము. 'గోదోహమాస్తే' (పాలు పితికినంత సేపు ఉన్నాడు) ఇత్యాది ప్రయోగములలో గోదోహనము ఎంత సేపు జరుగునో మనకు తెలియును గాన దానిని బట్టి 'అసి' క్రియను (ఉండుటను) కొలుచుచున్నాము. ఈ విధముగ పై ఉదాహరణములలో అధ్యయన క్రియకు సూర్యసంచార క్రియ కాలము ; అసిక్రియకు గోదోహనము కాలము. ॥77॥

అవతారిక—— సూర్యాది సంచారమును, జలస్రుతిని గమనించువానికి కాలభేదము తెలిసినను, గదిలోపల నుండి అంతర్ముఖుడుగ నుండు వానికి కాలభేద మెట్లు తెలియును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ జ్ఞానే రూపస్య సంక్రాన్తి ర్జ్ఞానేనైవాను సంహృతిః ।
అతః క్రియాన్తరాభావే సా క్రియా కాల ఇష్యతే ॥ 78

జ్ఞానే = జ్ఞానమునందు రూపస్య = ప్రాణ ప్రవాహాది రూపమగు (శ్వాసము) యొక్క క్రియయొక్క, సంక్రాన్తిః = సంక్రమణము కలుగును, జ్ఞానేనైవ = జ్ఞానముచేతనే, అను సంహృతిః = సంకలనము జరుగును, అతః = ఆ కారణము వలన, క్రియాన్తరాభావే = మరియొక క్రియ ఏదియు లేనిచో, సా = ఆ, క్రియా = క్రియయే, కాలః = కాలము అని, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

తాత్పర్యము—— ఊపిరి పీల్చుట విడుచుట మొదలయిన క్రియలు ఆ అంతర్ముఖుని బుద్ధియందు సంక్రమించును. ఆ క్రియలను బుద్ధిచేతనే సంకలనము చేసికొనును ఈ విధముగ బాహ్యక్రియ ఏదియు లేనిచో, ఆ క్రియయే కాలమని అంగీకరింపబడును.

వివరణము—— గదిలో నున్న వ్యక్తి అంతర్ముఖుడైనను తన బుద్ధియందు సంక్రమించిన స్వరూపముగల ప్రాణ ప్రవాహాది క్రియలను గుర్తించును. ఈ విధముగ తన బుద్ధియందు నివిష్టములగు క్రియా క్షణముల నన్నింటిని బుద్ధ్యన్తరముచే సంకలనము చేసికొనును అనగా సముదాయ రూపమున గ్రహించును. ఈ అంతర క్రియల సహాయముతో అతను

బాహ్య క్రియలను పరిచ్ఛేదింప గలదు. ఈ విధముగ బాహ్య క్రియ లేవియు లేనపుడు బుద్ధి నివిష్టమగు ఇట్టి అంతర క్రియయే కాలముగ ఉపకరించును. ఇట్టి బుద్ధులు అధిక సంఖ్యాకము లుగ ఉదయించునపుడు చిరకాలత్వమును, అల్ప సంఖ్యాకములుగ ఉదయించునపుడు శీఘ్ర కాలత్వమును గ్రహించును కావుననే కొందరు యోగులు ప్రాణచారమును బట్టియు, మరి కొందరు ప్రాణక్షణములను లెక్కించుట చేతను పదార్థములను తెలిసికొందురు. ఒక గడియకు 360 ప్రాణ ప్రసారము లగుననియు, ఒక అహోరాత్ర రూపదివసమున 21600 ప్రాణ ప్రసారము లగుననియు చెప్పుదురు. ॥78॥

అవతారిక— లోకములో "భూతా సత్తా" (సత్త ఉండెడిది) అను ప్రయోగ మున్నది. క్రియాతిరిక్తమగు కాలమనునది లేదన్నచో సత్తా రూపమగు క్రియకు సత్తారూప మగు మరియొక క్రియతో సంబంధమున్నట్లు చెప్పుట అయుక్తముగాన ఈ ప్రయోగము ఎట్లు కుదురును అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ భూతో ఘట ఇతీయంచ సత్తాయా ఏవ భూతతా ।
భూతా సత్తేతి సత్తాయాః సత్తా భూతాభిధీయతే ॥ 79

'భూతః ఘటః' ఇతి = 'ఘటము ఉండెడిది' అనునపుడు గూడ, ఇయం = ఈ, భూతతా = భూతత్వము, సత్తాయాః ఏవ = సత్తకు సంబంధించినదే, 'భూతా సత్తా' ఇతి = సత్త ఉండె డిది అనునపుడు గూడ, సత్తాయాః = సత్తయొక్క, భూతా = పూర్వము ఉన్న, సత్తా = ఉనికి, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— 'భూతః ఘటః' ఇత్యాది ప్రయోగములలో గూడ సత్తయొక్క భూతత్వమే చెప్పబడుచున్నది. "భూతా సత్తా" అనునపుడు గూడ పూర్వముండెడి సత్త యొక్క సత్త చెప్పబడుచున్నది.

వివరణము— 'భూతః ఘటః' ఇత్యాది ప్రయోగములలో భూతత్వము ఘటము నకు సంబంధించినది కాదు ఘటము ద్రవ్యము గాన దానికి కాలముతో ప్రత్యక్ష సంబంధము కుదరదు సాధ్యస్వభావములగు (సాధింపవలసి యున్న) క్రియలకు కాలము ఆధారము గాన వాటికే కాలముతో ప్రత్యక్ష సంబంధ ముండును గాని ద్రవ్యముల కుండదు 'భూతః' అను పదమునందు 'భూ' ధాతువు 'క్త', ప్రత్యయము ఉన్నవి. భూధాతువు సత్త అను క్రియను బోధించును. 'క్త' ప్రత్యయము ఆ క్రియ పూర్వముండెడిదని బోధించును ఈ విధముగ 'భూతః' అను దానికి 'సత్త పూర్వమున ఉండెడిది' అని యర్థము. దీనిని బట్టి సత్తయొక్క భూతత్వమే బోధింపబడుచున్నదని తేలినది ఆ సత్త ఘటమునందు సమవాయా సంబంధ ముతో నున్నది గాన ఘటమునకు సత్త ద్వారా భూతత్వముతో పరంపరా సంబంధమేర్పడు చున్నది. అంతేకాని ఘటమునకు భూతత్వముతో ప్రత్యక్ష సంబంధము లేదు. ఇట్లే 'భూతా సత్తా' అనునపుడు గూడ ధాతువాచ్యమగు సత్త వేరు. అది క్రియారూపమైనది. 'సత్తా' శబ్ద

వాచ్యమగు సత్త వేరు ; అది ద్రవ్య తుల్యము. దీనికి కాలముతో ప్రత్యక్ష సంబంధము లేదు. ధాతువాచ్యమగు సత్తా ద్వారముననే దీనికి కాలసంబంధము. ఈ విధముగ 'భూతాసత్తా' ఇత్యాది ప్రయోగములు అదుష్టము లని యభిప్రాయము. ॥79॥

అవతారిక— ఇంతవరకును కాలస్వరూపమును గూర్చి విచారించి, ఇక శాస్త్రమునకు సంబంధించిన కాలభేదమును గూర్చి ప్రసంగించుచున్నాడు.

శ్లో॥ పరతో భిద్యతే సర్వమాత్మాతు న వికల్ప్యతే ।
పర్వతాది స్థితి స్తస్మాత్ పరరూపేణ భిద్యతే ॥ 80

సర్వం = ప్రతి పదార్థమూ, పరతః = ఇతర పదార్థమును బట్టి, భిద్యతే = భేదించును, ఆత్మా తు = దాని స్వరూపమైతే, న వికల్ప్యతే = భిన్నము కాదు, తస్మాత్ = ఆ కారణము వలన, పర్వతాది స్థితిః = పర్వతాదుల యొక్క స్థితి, పరరూపేణ = ఇతర పదార్థములకు సంబంధించిన రూపముచేత, భిద్యతే = భేదమును పొందుచున్నది.

తాత్పర్యము— ప్రతిపదార్థము ఇతర పదార్థములను బట్టి భేదమును పొందుచుండును గాని దాని స్వరూపమునందు భేదము ఉండదు. కావున పర్వతాదుల స్థితి కూడ పరరూపముచే భేదించును.

వివరణము— ఈ కారికయు, దీని తరువాత వచ్చు మరికొన్ని కారికలును, మహాభాష్యములో వర్తమాన కాలాదుల విషయమున వ్రాసిన కొన్ని విషయముల నాధారముగ చేసికొని వ్రాయబడినవి.

'వర్తమానే లట్' అను పాణిని సూత్రముచే వర్తమాన కాలమును సూచించుచు 'లట్' వచ్చునని చెప్పబడినది. ఈ ప్రసంగమున ''నిత్య ప్రవృత్తే చ కాలా విభాగాత్'' అను ఒక ఆక్షేప వార్తికములో వార్తిక కారుడు - 'పర్వతాః తిష్ఠన్తి' ''నద్యః ప్రవహన్తి'' ఇత్యాది స్థలములలో పర్వతములు ఎల్లవేళలను ఉన్నవి గావునను, అట్లే నదులు సర్వదా ప్రవహించుచునే యున్నవి గావునను, ఇచట వర్తమానమును అంగీకరింప వీలులేదు గాన ఈ సూత్రముచే లట్ వచ్చుటకు అవకాశము లేదు ; అందుచే 'పర్వతాః తిష్ఠన్తి' ఇత్యాది స్థలములలో 'లట్' వచ్చుటకై ప్రత్యేకముగ ఒక సూత్రమును విధించుకొనవలెను అని చెప్పెను వర్తమానమనగా ఇపుడున్నది. ఈ వర్తమానత్వము భూత భవిష్యత్త్వములకు విరోధి. నిత్యమైన పదార్థములు ఎల్లప్పుడును ప్రవర్తించుచున్నవే (ఉంటూన్నవే) గావున వాటియందు భూతత్వ భవిష్యత్త్వములు లేకుండుటచే వర్తమానత్వమే ఉండుటకు అవకాశము కలదు. ఇట్టి పరిస్థితులలో 'పర్వతాః తిష్ఠంతి' 'నద్యః ప్రవహన్తి' ఇత్యాది స్థలములందు వర్తమానత్వము లేదను ఆ శంకకు అవకాశము లేదుకదా అని శంకింపరాదు. ఏలయన— కాలముచే ఏ భావములకు ఉపకారము జరుగునో అట్టి భావముల విషయముననే భూతము, భవిష్యత్తు. వర్తమానము అనెడు కాలమునకు సంబంధించిన విభిన్న వ్యపదేశములు ప్రవర్తించును. ఈ భూతత్వాది

వ్యపదేశములు ప్రవర్తింపవలెనన్నచో ఆ భావములు జన్మవంతములై యుండవలెను. జన్మవంతములగు భావములు నియతావధిని పట్టి జన్మను స్వీకరించుటచే ఈ భూతాది వ్యపదేశములు ఉపపన్నము లగును. సాధనము లన్నియు సమకూడి యున్నపుడు ఉత్పత్త్యభిముఖము లైన వాటిని భవిష్యత్తులు ; ఉత్పన్నములైన తరువాత ఉన్నంతవరకును వర్తమానములు ; కొంతకాల ముండి నశించిపోవునవి భూతములు. ఈ విధముగ వర్తమానము అనెడు వ్యపదేశము భూత భవిష్యదవధులకు మధ్యనున్నట్లు స్పష్టము. కావున భూత భవిష్యత్త్వములు లేనిచోట వర్తమానత్వము కూడ ఉండుటకు అవకాశము లేదుగాన, భూత భవిష్యత్తులతో సంబంధము లేని నిత్య పదార్థముల విషయమున వర్తమానత్వ వ్యపదేశము అయుక్తము. కావున సర్వదా నిలిచియుండునవియు, సర్వదా ప్రవహించునవియు నగు పర్వతముల యెడను నదులతోను వర్తమానత్వము సంబంధింపదు గాన 'పర్వతాః తిష్ఠన్తి' 'నద్యః ప్రవహన్తి' ఇత్యాదులలో లట్టు వచ్చుటకై ప్రత్యేక నియమ మొకటి చెప్పవలసి యుండునని ఈ ఆక్షేప వార్తికము యొక్క అభిప్రాయము.

ఈ ఆక్షేపమునకు మహాభాష్యమునందు క్రింది విధముగ సమాధానము చెప్పబడినది. ''స్థాస్యన్తి పర్వతాః, తిష్ఠన్తి, అస్థుః'' (పర్వతములు నిలిచి ఉండగలవు, నిలిచి ఉన్నవి, నిలిచి ఉండెను) అనెడు ప్రయోగములు ఉన్నవి ఇట్టి ప్రయోగములను బట్టి పర్వతాదులకు భూత భవిష్యత్కాల సంబంధము గూడ ఉన్నట్లు తెలియుచున్నది. నిత్య స్థితములగు పర్వతాదుల స్థితియందు భేదమేదియు లేకున్నను ఇతర క్రియలకు గల భూత భవిష్యత్త్వాది సంబంధమును బట్టి ఈ స్థితియందు గూడ భేదము కల్పింపబడుచున్నది. ఈ విధముగ ''తస్థుః పర్వతాః'' (పర్వతములు నిలిచి ఉండెను) అనగా భూతకాలమునకు సంబంధించి రాజుల క్రియలు ఎపుడు జరుగుచుండెనో అపుడు పర్వతములు నిలిచి యుండెడివి అని యర్థము. ''తిష్ఠన్తి పర్వతాః'' అనగా ప్రస్తుతము పరిపాలించుచున్న రాజులు చేయుచున్న క్రియలు జరుగుచున్నపుడు పర్వతములు నిలిచి యున్నవి అని యర్థము 'స్థాస్యన్తి పర్వతాః' అను దానికి రాబోవు రాజులు ఏ పనులు చేయుచున్నారో ఆ పనులు జరగనున్న సమయమున పర్వతములు నిలిచి ఉండగలవు' అని యర్థము. ఈ విధముగ పర్వత స్థితియందు పరులగు రాజాదుల క్రియల భేదమును బట్టి భేదమును కల్పించుటచే భూతభవిష్యత్ భేదము కలుగవచ్చును. తద్భిన్నమగు వర్తమానత్వమును సూచించుటకై 'వర్తమానే లట్' అను సూత్రముచే విహితమగు లట్టు వచ్చుటకు బాధకము లేదుగాన ''పర్వతాః తిష్ఠన్తి'' ఇత్యాదులలో లట్టు వచ్చుటకై సూత్రాంతరమును రచింప బనిలేదు. ఈ విషయమునే ఈ కారిక చెప్పుచున్నది.

ఏ పదార్థమునకైనను దాని స్వరూపమునందు భేదమేమియు ఉండదు ; ఉపాధి భేదమును బట్టియే భేద మేర్పడుచుండును. కావున పర్వతాది నిత్య పదార్థముల స్థితియందు దాని స్వరూపమును బట్టి భేదమేమియు లేదు. దానియందు ఏదైన భేదము కనబడుచున్నదో అది పదార్థాంతరమునకు సంబంధించిన క్రియాంతరమును బట్టి ఏర్పడుచున్నది. పూర్వ

రాజులు ఏ క్రియలు చేయుచుండిరో ఆ సమయమునందలి పర్వతస్థితి వేరు ఈ కాలమున వారు ఏమి చేయుచున్నారో ఆ సమయమునందలి పర్వతస్థితి వేరు, రాబోవు రాజులు ఏ పనులు చేయనున్నారో ఆ సమయమునందలి పర్వత స్థితి వేరు అని అభిన్నమగు స్థితియందు భేదమును కల్పించి త్రికాల విషయకమగు గౌణ ప్రయోగము చేయవచ్చునని అభిప్రాయము. ॥80॥

అవతారిక— భూతములు, భవిష్యత్తులును, వర్తమానములును అగు రాజక్రియలతో సాహచర్యముచే పర్వతాది స్థితియందు భూత భవిష్యద్వర్తమానత్వము ఆరోపింపబడు చున్నదనియు, వాస్తవమున నిత్య పదార్థముల స్థిత్యాదులందు భేదము లేదనియు వెనుక చెప్పబడినది. పర్వతాదుల స్థితియందు గూడ వాస్తవమున భేదమున్నదనియు, కాని భూత భవిష్యద్వర్తమాన కాలిక స్థితు లన్నియు సజాతీయములగుటచే వాటియందలి భేదమును గ్రహింప శక్యము కాకున్నదనియు, విజాతీయములగు రాజక్రియాదులచే వీటి భేదము గ్రహింప బడు చున్నదనియు మతాంతరమును చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రసిద్ధ భేదా వ్యాపార విరూపావయవ క్రియాః ।
సాహచర్యేణ భిద్యన్తే సరూపావయవ క్రియాః ॥ 81

విరూపావయవ క్రియాః = విభిన్న స్వభావములతో గూడిన అవయవ క్రియలు గల, వ్యాపారాః = వ్యాపారములు, ప్రసిద్ధభేదాః = ప్రసిద్ధమైన కాలభేదము కలవి, సరూపావయవ క్రియాః = సజాతీయములగు అవయవములు గల వ్యాపారములు, సాహచర్యేణ = ఇతర క్రియా సాహచర్యముచే, భిద్యన్తే = భేదమును పొందుచున్నవి.

తాత్పర్యము— విజాతీయములగు అవయవ క్రియలు గల వ్యాపారములు ప్రసిద్ధ కాలభేదము కలవి. సజాతీయమైన అవయవ క్రియలు గల వ్యాపారములు ఇతర క్రియా సాహచర్యముచే భిన్నములుగ కనబడును

వివరణము— వండుట, బద్దలుకొట్టుట మొదలగు కొన్ని క్రియలు ఉన్నవి. వీటికి బియ్యము కడుగుట, గిన్నె పొయ్యిమీద పెట్టుట, మంట బెట్టుట, గొడ్డలి ఎత్తుట పడవేయుట మొదలగు వేరు అవాంతర క్రియలు అవయవములుగ నున్నవి. ఈ క్రియలలో నున్న అవాంతర క్రియ లన్నియు విజాతీయము లగుటచే ఇట్టి క్రియలలో గల భూత భవిషత్త్వాది కాలభేదము స్పష్టముగ తెలియును స్థితి మొదలగు క్రియలలో గూడ అవాంతర క్రియా రూపము లగు అవయవము లున్నవి. నిన్నటి స్థితి వేరు, ఇప్పటి స్థితి వేరు, రేపటి స్థితి వేరు దీనిలో ఆత్మభరణము (తన్ను తాను నింపుకొని మార్పులేకుండా ఉండుట) మొదలగునవి అవాంతర క్రియలు. ఈ అవాంతర క్రియలును స్థితి క్రియయు సజాతీయములగుటచే వీటి వీటి భేదమును గ్రహించుటకు శక్యము కాదు. వీటి భేదమును రాజాదులగు ఇతర పదార్థములకు సంబంధించిన క్రియలను బట్టి తెలిసికొనవలసి యున్నది. ఈ విధముగ అవాంతర క్రియల భేదము గ్రహింప వీలగుట, కాకపోవుట అను భేదమే తప్ప, పచ్యాది క్రియలందు

వలె స్థిత్యాది క్రియలందు గూడ కాలకృత భేద సంబంధమున్నది. పర్వతాది స్థితికి పరిచ్ఛే దకములు గాన రాజక్రియలు దానికి ఆధారములై, దాని కాలమని వ్యవహరింపబడుచున్నది. భాష్యములో చెప్పిన రాజక్రియ సూర్య సంచారాదులకు గూడ ఉపలక్షణము. సూర్య సంచా రాది క్రియల్ల భేదమును బట్టి పర్వతాదిస్థితి భేదము గ్రహింపబడుచున్నది కదా? ॥81॥

అవతారిక— 'వర్తమానే లట్' అను సూత్ర వ్యాఖ్యా ప్రసంగమునందలి ఆక్షేప వార్తికాన్తర తత్సమాధాన భాష్యార్థములను సంగ్రహించి రెండు కారికలు వ్రాయుచున్నాడు.

శ్లో॥ వ్యవధానమివోపైతి నివృత్త ఇవ దృశ్యతే ।
క్రియాసమూహో భుజ్యాదిరన్తరాల ప్రవృత్తిభిః ॥ 82

శ్లో॥ న చ విచ్ఛిన్నరూపోఽపి సోఽవిరామాన్నివర్తతే ।
సర్వైవ హి క్రియాన్యేన సఙ్కీర్ణేవోపలభ్యతే ॥ 83

భుజ్యాదిః = భోజనము చేయుట మొదలగు, క్రియా సమూహః = క్రియా సముదాయము, అన్తరాల ప్రవృత్తిభిః = మధ్యనున్న వ్యాపారముల చేత, వ్యవధానం = వ్యవధానమును, ఉపైతి + ఇవ = పొందుచున్నట్లు ఉండును, నివృత్తః ఇవ = పూర్తియై పోయినదివలె, దృశ్యతే = కనబడును.

సః = ఆ భుజ్యాది క్రియా సమూహము, విచ్ఛిన్నరూపోఽపి = (ఎడగలిగిన) విచ్ఛిన్నమైన రూపము కలదైనను, అవిరామాత్ = (సాగిపోవుట నుండి) అవిరామమునుండి, న నివర్తతే = నివర్తింపదు, సర్వా = సమస్తమైన, క్రియా = క్రియ, అన్యేన = మరియొక క్రియతో, సఙ్కీర్ణా + ఇవ = కలిసిపోయినది వలె, ఉపలభ్యతే హి = కనబడుచున్నది కదా.

తాత్పర్యము— భోజనాది క్రియా సమూహము, అవాంతర వ్యాపారములచే వ్యవ ధానము పొందినది వలె యగును. నివర్తించినట్లు కనబడును.

అది విచ్ఛిన్న రూపమైనను అవిరామము నుండి నివర్తింపదు. అన్ని క్రియలును క్రియాంతరములతో సంకరమును పొందినట్లు (కలిసిపోయినట్లు) కనబడుచుండును కదా?

విశేషము— "ఇహ అధీమహే" (ఇచట అధ్యయనము చేయుచున్నాము), "ఇహవసామః" (ఇచట నివసించుచున్నాము), "ఇహ పుష్యమిత్రం యాజయామః" (ఇచట పుష్యమిత్రునిచే యజ్ఞము చేయించుచున్నాము) ఇత్యాది ప్రయోగములు కలవు. ఇచట ప్రారం భింప బడిన అధ్యయన - నివాస - యాజన క్రియలు అసమాప్తములుగ నున్నవిగాన వర్తమాన కాలమును అంగీకరింప వీలులేదు. అనగా అధ్యయనాది క్రియలు చేయ ప్రారంభించినవాడు మధ్య మధ్య భోజన శయనాది క్రియ లెన్నియో చేయుచున్నాడు. ఆ సమయములలో వాడు అధ్యయనాదులు చేయుటలేదు కదా? కావున ఇచట వర్తమానత్వము లేదు. అందుచే ఇట్టి స్థలములలో 'వర్తమానే లట్' అను సూత్రము ప్రవర్తింపదు గాన ఇచట లట్ వచ్చుటకై

మరియొక సూత్రమును చెప్పవలెను అని వార్తికకారుడు "ప్రవృత్తస్యావిరామే శిష్యా భవన్త్య వర్తమానత్వాత్" అను వార్తికముచే ఆక్షేపణము చేసెను ఈ ఆక్షేపమునకు భాష్యకారులు 'న్యాయ్యాత్వారమ్భా నపవర్గాత్' 'అస్తి చ ముక్తసంశయే విరామః' అని సమాధానము చెప్పెను. అనగా— అధ్యయనాది క్రియలు వేదమును స్వాధీనముచేసికొనుట మొదలగు ఫలముల నుద్దేశించి ప్రారంభింపబడుచున్నవి. ఆ ఫలము లభించువరకును ఆ క్రియ జరుగుచునేయున్నట్లు భావింపవలెను గాన ఇది వర్తమాన కాలమే. అందుచే 'వర్తమానే లట్' అను సూత్రముచేతనే 'లట్టు' రావచ్చును. మధ్య మధ్య భోజనశయనాది క్రియలచే అధ్యయన క్రియకు అంతరాయము కలుగుచున్నది గాన ఇది వర్తమానము కాదను ఆక్షేపము యుక్తము కాదు 'రామః భుఙ్క్తే' (రాముడు భోజనము చేయుచున్నాడు) మొదలగు, వర్తమానత్వమున విప్రతిపత్తి లేని స్థలములలో గూడ, భోజన క్రియ అవిచ్ఛిన్నముగ జరుగుట లేదు. ఆ భోజనము చేయువాడు మధ్య మధ్య నీళ్ళు త్రాగుట, మాటలాడుట, నవ్వుట మొదలగు పనులు చేయుచున్నాడు ఈ క్రియాంతరములచే వ్యవధానమున్నను 'భుఙ్క్తే' ఇత్యాదులలో వర్తమానత్వమును అంగీకరించినట్లు అధీమహే, వసామః, యాజయామః ఇత్యాది స్థలములలో గూడ అంగీకరింప వచ్చును కదా యని భావము. ఈ విషయమునే పై కారికలు స్పష్టీకరించుచున్నవి.

ముందు వెనుకలనుండు అవయవముల (అవాంతర క్రియల) సముదాయమే భుజ్యాది క్రియలు. ఈ క్రియా సముదాయము నడుమ నవ్వుట, మాటలాడుట మొదలగు కొన్ని విజాతీయ క్రియలు ప్రవేశించుటతో భోజన క్రియాంతర్గత పూర్వాపర క్రియలకు వ్యవధానము ఏర్పడినట్లును, ఆ క్రియ అచట ఖండితమైపోయినట్లును కనబడుచున్నది. ఐనను ఫలప్రాప్తి వరకును భోజన క్రియాంతర్గతావాంతర క్రియలు అనువర్తించుచునే యున్నవి గాన, మధ్యవచ్చిన హసన - జల్పనాది క్రియలను బట్టి ఆ ప్రధాన క్రియ అక్కడ పూర్తియై పోయినదని భావింపరాదు.

అవాంతరములగు హసన జల్పనాది విజాతీయ క్రియలచే ఆ భోజన క్రియ విచ్ఛిన్నమైనను, ఆ క్రియకు విరామము మాత్రము కలుగదు. భోజనాది క్రియనే కాదు అన్ని క్రియలకును - ఉదాహరణమునకు హసన జల్పనాదికములకు గూడ - కండ్లు మూయుట తెరచుట, శ్వాస పీల్చుట విడచుట మొదలగు క్రియాంతరములచే విచ్ఛేదము కలుగుచునే యుండును. తావన్మాత్రముచే ఆ క్రియ విరతమైపోయినదనిగాని, దాని వర్తమానత్వమునకు భంగము వాటిల్లినదని గాని చెప్పుటకు వీలులేదు. ॥౮౩॥

అవతారిక— ఫలపర్యంతమును ప్రవర్తించు అవాంతర క్రియా సమూహమే ప్రధాన క్రియ. ఈ ప్రధాన క్రియకు సంబంధించిన అవాంతర క్రియల నడుమ విజాతీయములును, ఫలాంతర హేతు భూతములును అగు ఇతర క్రియలేమైన వచ్చినను ఆ ప్రధాన క్రియ యొక్క వర్తమానత్వమునకు భంగములేదని పై రెండు కారికలలో ప్రతిపాదింపబడినది. అవాంతర క్రియల మధ్య వచ్చిన ఆ క్రియాంతరము భిన్న జాతీయయని చెప్ప బనిలేదు.

అందుచే దానిచే వ్యవధానము ఏర్పడినను ప్రధాన క్రియకు వర్తమానత్వమును చెప్పవచ్చును అనెడు పక్షాంతరమును చూపుచున్నాడు.

శ్లో॥ తదన్తరాలదృష్టా వా సర్వైవావయవ క్రియా ।
సాదృశ్యాత్ సతి భేదేతు తదఙ్గత్వేన గృహ్యతే ॥ 84

వా = లేక, తదన్తరాల దృష్టా = భుజ్యాది క్రియా మధ్యమున చూడబడిన, సర్వైవ = హసిత జల్పితాది క్రియలన్నియు, సాదృశ్యాత్ = భోజనావయవములగు అవాంతర క్రియలతో సాదృశ్యముండుట వలన, అవయవ క్రియా = అవయవ క్రియలుగా గ్రహింపబడును, భేదే= భేదము, సతితు = ఉన్నను, ('తు' శబ్దమునకు 'అపి' అని అర్థము), తదఙ్గత్వేన = దానికి అంగముగా, గృహ్యతే = గ్రహింపబడును.

తాత్పర్యము— భోజనాది క్రియల మధ్య వచ్చు అన్ని క్రియలును సాదృశ్యమును బట్టి దాని అవయవములే. భేదము కనబడుచున్నను దానికి అంగములుగ గ్రహింపబడును

వివరణము— భోజనాది ప్రధాన క్రియలకు ఆచమనాది క్రియలు ఉపకారకములు. భోజనాదుల నడుమ వచ్చెడు క్రియలు, ఆచమనాదుల వలె భుజి క్రియకు ఉపకారకము లైనచో అవి భుజిక్రియావయవములుగ గ్రహింపబడును. హసిత - జల్పితాదులు లేకున్నను ఒకప్పుడు భోజన క్రియ జరుగుచున్నది. కావున దధ్యుపసేచనాది క్రియలకును ఈ హసిత - జల్పితాది క్రియలకును భేదమున్నది. ఐనను అవి (హసిత జల్పితాదులు) భుజి క్రియాంగములని చెప్పవచ్చును. సంతోషముగానున్న మిత్రులు మొదలగు వారు కలిసి భోజనము చేయుచున్నప్పుడు హసిత - జల్పితాదులు చేయుట స్వాభావికము కదా ? ఇద్దరు మోయ గలిగిన బరువును మోయుటకు మూడవవాడు కూడ రావచ్చును. మూడవవాడు రాకపోయినను పని జరుగును. కాని వాడు కూడ వచ్చినాడు. వచ్చిన పిమ్మట మొదటి ఇద్దరు ఏ విధముగ భారవహనాంగభూతులో మూడవవాడును అట్లే తదంగ భూతుడగుచున్నాడు. అట్లే జల్పిత హసితాదులు లేకుండ భోజనము చేయవచ్చును. ఐనను ఒక భుజి క్రియలో హసిత జల్పితాదులు గూడ నున్నచో వాటిని దాని కంగములుగ పరిగణించుటలో దోషము లేదు. ఈ విధముగ ప్రారంభించిన క్రియకు ఫలము లభించుటకు పూర్వము క్రియాంతరములతో వ్యవధాన మున్నను దాని వర్తమానత్వమునకు విఘాతము లేదు. ॥84॥

అవతారిక— ఇపుడు క్షణభంగవాదము ననుసరించి ఏ క్రియకును వర్తమానత్వమే అయుక్తమని ఆక్షేపించుచున్నాడు.

శ్లో॥ సదసద్వాపి వస్తు స్యాత్ తృతీయం నాస్తి కించన ।
తేన భూతభవిష్యన్తౌ ముక్త్వామధ్యం న విద్యతే ॥ 85

వస్తు = వస్తువు, సత్ = సత్తుగాని, అసద్వా + అపి = అసత్తుగాని, స్యాత్ = కావచ్చును,

తృతీయం = మూడవ విధమైనది, కిఞ్చన = ఏదియును, నాస్తి = లేదు, తేన = ఆ కారణము చేత, భూత భవిష్యన్తౌ = భూత భవిష్యత్తులను, ముక్త్వా = విడిచి, మధ్యం = మధ్యదైనది (వర్తమానమనునది), న విద్యతే = లేదు.

తాత్పర్యము— వస్తువు సత్తైనను కావలెను అసత్తైనను కావలెను. మూడవ రక మైనది ఏదియును లేదు. అందుచే భూత భవిష్యత్తులు తప్ప మధ్యయందు వర్తమానమనునది ఏదియు లేదు.

విశేషాంశము— సాధింపవలసిన పరిస్థితులలో నున్న దానికి క్రియ యనిపేరు. గడచిపోయిన క్షణము సత్తు. అది సిద్ధ స్వభావము కలది అనగా సిద్ధించిపోయినది. కావున ఆ క్షణమునకు సంబంధించిన క్రియ భూతక్రియ. రాబోవు క్షణము ఇంకను సత్తు కాదు. అది ఇంకను సిద్ధింపవలసి యున్నదిగాన అసత్తు. దానితో సంబంధింపనున్న క్రియ భవిష్య త్క్రియ ఈ విధముగ క్షణము సత్తైన కావలెను అసత్తైనను కావలెను. వాటికి సంబంధించిన క్రియ సత్తుగాను అసత్తుగాను ఉండును. సత్త్వాసత్త్వములు పరస్పర విరుద్ధములు గాన ఈ రెండును ఒక క్షణమునందు ఉండవు. కావున అట్టి క్షణముతో సంబంధించుటచే ఏర్పడిన వర్తమానత్వము కూడ క్రియయందు ఉండదు. ఏ క్రియయైనను ఒక్క క్షణమును మించి ఉండదు అని క్షణికవాదుల సిద్ధాంతము. ఒక క్షణములో ఒక క్రియ జరిగినదనగా అది క్షణాంతరములో నుండదు. అది జరిగిన వెంటనే భూతకాలముతో సంబంధించును. జరుగక మునుపు భవిష్యత్తుతో సంబంధించును. కావున వర్తమాన కాలమునది గాని, వర్తమాన కాలముతో సంబంధించిన క్రియ యనునదిగాని లేదు. ఈ విషయమే మహాభాష్యమున శ్లోక ద్వయముచే చెప్పబడినది—

> ''మీమాంసకో మన్యమానో యువా మేధావి సంమతః
> కాకం స్మేహానుపృచ్ఛతి కిం తే పతితలక్షణమ్
> అనాగతే న పతసి అతిక్రాన్తే చ కాక న
> యది సంప్రతి పతసి సర్వోలోకః పతత్యయమ్''

''హిమవానపి గచ్ఛతి''. యువకుడును, మేధావియునగు విమర్శకుడు కాకిని ప్రశ్నించు చున్నాడు. ''నీ పాతమునకు లక్షణమేమి ? ఓ కాకమా ? పాతక్రియ భావియైనచో నీవు ఎగురుట లేదు. అనగా భావియగు పతన క్రియ అసత్తుగాన అసత్తైన పాతక్రియతో నీకు సంబంధము కుదురదు. అందుచే 'త్వంపతసి' అనుట అసంబద్ధము. పతనము జరిగిపోయిన తరువాత గూడ ఆ పాతక్రియ అసత్తుగాన దానితో గూడ నీకు సంబంధము కుదరదు. అందుచే 'త్వంపతసి' అని అనుటకు వీలులేదు. వర్తమాన క్రియ అనునదియే లేదు. లేని వర్తమాన క్రియతో సంబంధమును కూర్చి 'త్వంపతసి' అని ప్రయోగించినచో 'పర్వతః పతతి' అని కూడ ప్రయోగించవచ్చును కదా ? 'హిమవాన్ గచ్ఛతి' అని ప్రయోగించ వచ్చును కదా ? కావున ''పతన క్రియ ఉన్నది'' అనుట అయుక్తమని యర్థము. ఈ విధముగ క్షణికవాదులు వర్తమాన కాలము లేదని చెప్పుదురు. ॥౮౬॥

అవతారిక— క్రియ సాధ్యమానావస్థలో నుండుటయే దాని సత్త్వము, అదియే దాని వర్తమానత్వము. అనగా క్రియ సాధింపబడుచున్న పరిస్థితిలో నున్నపుడు దానిని వర్తమానము అని చెప్పవచ్చును కదా యని ఆశంకించుకొని క్షణికవాది సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నిర్వృత్తిరూపమేకస్య భేదాభావాన్న కల్పతే ।
సదసద్వాపి తేనైకం క్రమరూపం కథం భవేత్ ॥ 86

ఏకస్య = ఒక పదార్థమునకు, భేదాభావాత్ = భేదము లేకపోవుట వలన, నిర్వృత్తిరూపం = నిష్పత్తిరూపము, న కల్పతే = కుదురదు, ఏకం = ఒక వస్తువు, సత్ = సత్తుగానైనను, అసద్వాపి = అసత్తుగానైనను, (ఉండవలెను), తేన = ఆ కారణముచేత, క్రమరూపం = క్రమరూపమైనదై, కథం = ఎట్లు, భవేత్ = అగును ?

తాత్పర్యము— ఒక వస్తువులో భేదము ఉండదుగాన దానికి నిష్పత్తిరూపము కుదరదు. అందుచే సత్తైనను, అసత్తైనను క్రమరూపమగు ఒక పదార్థము ఎట్లుండును ?

విశేషాంశము— పదార్థమునకు ఆది, మధ్యము, అంతము మొదలగు విభాగములు లేవు. కావున దానికి క్రియాలక్షణమగు క్రమరూపత్వము ఉండదు. ('నిర్వృత్తిరూపం' అనగా క్రమాత్మకమగు క్రియచే నిష్పన్నమగుట అని యర్థము). ఏలయనగా ఒక వస్తువు సత్తైన కావలెను లేదా అసత్తు అయినను కావలెను. అది సత్తు అయినచో దానికి మరల నిష్పాద్యమానత్వము (తయారుచేయబడు చుండుట) అనునది ఉండదు. అసత్తైనచో అపుడది క్రమాత్మకమగు క్రియతో సంబంధింప జాలదు గాన అపుడు గూడ దానికి నిష్పాద్యమానత్వము కుదురదు. మూడవరకమగు (సదసదుభయరూపమగు) పదార్థ మనునది లేదు. ఈ విధముగ తయారుచేయబడుచు ఉండుట అనునది వేరుగాన అది వర్తమాన మెట్లగును ? కావున క్రియ సాధ్యమానావస్థలో నుండుట వర్తమానత్వము అను పక్షము కూడ కుదురదు. ॥86॥

అవతారిక— పౌర్వాపర్యమును పొందిన (ముందు వెనుకలుగ నున్న) అనేక క్షణములకు క్రియయని పేరు. అట్టి క్రియకు ఫలోత్పత్తికి పూర్వము వర్తమానమని పేరు అని చెప్పెదము, అని ఆశంకించుకొని క్షణికవాది ఖండించుచున్నాడు.

శ్లో॥ బహూనాం చానవస్థానాదేకమేవోపలభ్యతే ।
యథోపలబ్ధిస్మరణం తత్ర చాప్యుపపద్యతే ॥ 87

అనవస్థానాత్ = ఒక్క కాలమున స్థితి లేకపోవుటవలన, బహూనాం = అనేకావయవములలో ఏకమేవ = ఒక్కటి మాత్రమే, ఉపలభ్యతే = పొందబడు చున్నది (తెలియబడు చున్నది), యథోపలబ్ధి = జ్ఞానమును అనుసరించి కలిగెడు, స్మరణం చ = స్మృతి కూడా, తత్ర = ఆ ఒక్క అవయవమునందే, ఉపపద్యతే = యుక్తమగును.

తాత్పర్యము— ఒక్క కాలమునందు స్థితిలేని అనేకమైన అవయవములలో ఒక్క దాని జ్ఞానము మాత్రమే కలుగును. స్మృతి అనుభవమును అనుసరించియే యుండును గాన అది గూడ ఒక్క అవయవమును గూర్చియే కలుగును.

విశేషాంశము— క్రమముగ పుట్టెడు అవయవము లన్నియు వేరువేరు కాలము లలో నుండును గాని ఒక్క కాలములో ఉండవు ఒక్కమారు, సన్నిహితమగు ఒక్క క్షణము యొక్క జ్ఞానము మాత్రమే కలుగునుగాని ఇతర క్షణముల జ్ఞానము కలుగదు. ఆ ఒక్క క్షణమున క్రమము లేదు. కావున క్రమికములగు అనేక క్షణములు వర్తమానకాలము అని చెప్పుట తగదు. ఒక్క కాలమున ఒక్క క్షణముయొక్క జ్ఞానము మాత్రమే కలిగినను, క్రమికములగు అనేక లక్షణములను ఒక్క మారుగ స్మరింపవచ్చును గదా ; దానిని పట్టి వర్తమాన వ్యవహారమును సమర్థించవచ్చును అనుటకు కూడ వీలులేదు. అనుభవ మెట్లు కలుగునో స్మరణము కూడ అట్లే కలుగును. అనుభవమునందు క్రమభాన మేదియు లేనపుడు స్మరణమునందు మాత్రము అది ఎట్లు ఉండును ? కావున సమాశ్రిత పౌర్వాపర్యములగు క్షణములే క్రియ యనియు దానికి ఫలోత్పత్తికి పూర్వము వర్తమాన సంజ్ఞ యనియు చెప్పిన మతము గూడ యుక్తము కాదు. ॥87॥

అవతారిక— అనేక క్షణములు ఒక క్రియ అనుట గూడ అయుక్తమే యని చెప్పుచున్నాడు.

శ్లో॥ సదసద్రూపమేకం స్యాత్ సర్వస్యైకత్వ కల్పనే ।
నిర్వృత్తిరూపం నిర్వృత్తేః సామాన్యమథవా భవేత్ ॥ 88

సర్వస్య = అన్నింటికిని, ఏకత్వ ప్రకల్పనే = ఏకత్వమును అంగీకరించినచో, ఏకం = ఒకటి, సదసద్రూపం = సదసదుభయ రూపమై, స్యాత్ = అగును, అథవా = లేక, నిర్వృత్తేః = సాధ్యస్వభావమగు క్రియ యొక్క, నిర్వృత్తిరూపం = నిష్పత్తి రూపమగు, సామాన్యం = సామాన్యము (జాతి), భవేత్ = అగును.

తాత్పర్యము— అన్ని క్షణములును కలిసి ఒక క్రియ యగును అని అంగీకరించినచో ఒకటి సదసదుభయరూపమని యంగీకరించి నట్లగును. లేదా క్రియ యొక్క నిష్పత్తిరూపమగు ఒక సామాన్యమును అంగీకరించి నట్లగును.

విశేషాంశము— అతీతములును అనాగతములును అగు సదసద్రూపములైన క్షణము లన్నియు కలిసి ఒక క్రియ యగును అని అంగీకరించినచో ఒక్కదానియందు పరస్పర విరుద్ధములగు సత్తులును అసత్తులును కలిసినట్లు అంగీకరించినట్లు అగును. ఇది అయుక్తము. లేదా భిన్నములగు అనేక పదార్థములకు ఏకత్వము కుదురదు గాన ఆ భిన్న పదార్థము లన్నింటితోడను అన్వయించు స్వభావము నొకదానిని అంగీకరించెదము అని చెప్పుట గూడ యుక్తము కాదు. ఆ పక్షమున సాధింపబడుచున్న క్రియకు గల నిష్పత్తి

యోగ్యత్వమనునది అన్ని క్షణములకును సంబంధించిన సామాన్యము అని చెప్పవలసి యుండును. అపుడు క్షణము లన్నింటికిని ప్రత్యేకముగ ఏకక్రియాత్మకత్వము చెప్పినట్లగును అపుడు ఒక క్షణమున కొక క్రియ చొప్పున అనేక క్రియలను అంగీకరించుటచే ఒక్క క్రియ సిద్ధింపదు. కావున క్రియలకు వర్తమానత్వము కుదురదు అని క్షణికవాది యభిప్రాయము.॥౮౮॥

అవతారిక— దీనికి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ కార్యోత్పత్తౌ సమర్థం వా స్వేనధర్మేణ తత్ తథా ।
ఆత్మతత్త్వేన గృహ్యేత సా చాస్మిన్ వర్తమానతా ॥ 89

వా = లేక (రాబోవు కారికలో మరియొక పక్షమును చెప్పనున్నాడు. అందుచే ఇచట 'వా' అని ప్రయోగించినాడు), కార్యోత్పత్తౌ = కార్యోత్పత్తియందు, సమర్థం = సమర్థమైన, తత్ = ఆ క్షణ సముదాయరూపము, స్వేన = తన సంబంధమైన, ధర్మేణ = క్రమాత్మక మగు ధర్మముతో కూడినదై, తథా = ఆ విధముగా, ఆత్మతత్త్వేన = తనయొక్క విద్యమానతా రూపమగు (ఉనికి యనెడు) తత్త్వముతో, గృహ్యేత = గ్రహింపబడును, సాచ = అదియే, అస్మిన్ = క్షణ సముదాయమునందు ఉన్న, వర్తమానతా = వర్తమానత్వము.

తాత్పర్యము— కార్యోత్పాదనమునందు సమర్థమగు ఆ క్షణ సమూహము తన ధర్మముతో కూడినదై ఆ విధముగ విద్యమానతారూపమగు ఆత్మతత్త్వముతో గ్రహింప బడును. క్షణ సమూహమునందున్న వర్తమానత్వ మనగా అదియే.

విశేషాంశము— నియతమగు క్రమముతో ఒక్క ఫలము నుద్దేశించి ప్రవర్తించు క్షణములకు క్రియయని పేరు. ఫలము ఒక్కటిగాన క్రియకు గూడ ఏకత్వము కల్పింప బడినది. ఈ విధముగ ఫలభేదమును బట్టి క్రియాభేద మేర్పడుచుండును. క్షణ సముదాయము నందలి కొన్ని క్షణములు సత్తువైనను మరికొన్ని అసత్తువైనను వర్తమానత్వమును అంగీక రింప వచ్చును. వర్తమాన మనగా సత్ అని యర్థము కాదు, ప్రారంభమై పూర్తి కాకుండుట అని దాని లక్షణము. ప్రారంభించినది మొదలు ఫలము పుట్టు వరకును ఎన్ని క్షణముల సముదాయము ప్రవర్తించునో ఆ సముదాయమున కంతకును వర్తమానమని పేరు. ఈ క్షణ సముదాయము క్రమరూపమున నుండి ఫలమువరకును వ్యాపించును. అపుడు ఈ క్షణ సముదాయమున్నది అను జ్ఞానము కలుగునుగాన ఈ విద్యమానతా జ్ఞానమునకే వర్తమానత యని పేరు. ఈ క్షణసముదాయము సదసద్రూపమైనను ఫలోత్పత్తివరకును ఒకదానితో నొకటి క్రమబద్ధముగ నున్న క్షణములన్నియు వాటి వాటి సమయములందు సన్నిహితములే కావున వర్తమానత్వమును పొందుచున్నవి. ఈ విషయమే భాష్యమునందు స్పష్టీకరింపబడినది.

"క్రియాప్రవృత్తౌ యో హేతుః తదర్థం యద్విచేష్టితమ్
తదపేక్ష్య ప్రయుఞ్జీత గచ్ఛతీత్య విచారయన్". (మహాభాష్యము)

దేవదత్తుడు గమనరూపక్రియయందు ప్రవర్తించుచున్నాడన్నచో అందులకు హేతువు అనగా

ప్రయోజనము దేశాంతర ప్రాప్తి. దానికొరకై ఆతడు చేయు గమనరూప చేష్ట ప్రత్యక్షముగ కనబడుచున్నది. కావున దాని సత్త్వమును గూర్చిన విప్రతిపత్తి లేదు. అందుచే 'గచ్ఛతి' అని వర్తమానార్థమున నిస్సంశయముగ ప్రయోగింపవచ్చును అనగా అనేక క్షణసముదాయాత్మకమగు క్రియా ప్రబంధము నంతను మనస్సులో ఏకీకరించి 'గచ్ఛతి' అని ప్రయోగింప వచ్చును అని దీని భావము. ॥89॥

అవతారిక— పక్షాంతరమును చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాప్రబన్ధరూపం యదధ్యాత్మం వినిగృహ్యతే ।
సఙ్క్రాన్త బిమ్బ మేకత్ర తా మాహుర్వర్తమానతామ్ ॥ 90

ఏకత్ర = ఒక్క జ్ఞానమునందు, సఙ్క్రాన్తబిమ్బం = సంక్రమించిన ఆకారము గల, క్రియా ప్రబన్ధ రూపం = క్రియా కలాపముల రూపము, అధ్యాత్మం = బుద్ధియందు, వినిగృహ్యతే ఇతియత్ = గ్రహింపబడుచున్నది అను మాట ఏది కలదో, తాం = దానిని, వర్తమానతాం= వర్తమానత్వమునుగా, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— ఒక్కచో సంక్రమించిన స్వరూపము గల క్రియా కలాపము నంతను బుద్ధిలో గ్రహించుటయే దానికి గల వర్తమానత్వమని కొందరు చెప్పుదురు.

విశేషాంశము— ఒక ఫలము నుద్దేశించి ప్రవర్తించిన క్షణసముదాయమంతయు ఒక్కటే అని వెనుక చెప్పబడినది. ఇపుడు - ఆ క్షణముల నన్నింటిని బుద్ధిచే ఒక్క సముదాయముగ సంకలనము చేయుటచే వాటికి ఏకత్వమని మతాంతరము చెప్పబడుచున్నది. విభిన్నావయవములు గల క్రియా కలాపమునంతను బుద్ధిలో ఒక్క సముదాయముగ ఆకళించుకొని అది యంతయు ఒక్కటేయనియు, అది వర్తమానమనియు వ్యవహరింతురు. క్రమముగ అనుభవగోచరమైన వాటిని గూడ ఒక్కమారుగ మనస్సులో ఆకళించుకొనవచ్చుననుట సర్వానుభవ సిద్ధము. అట్లు కానిచో నూరు, వెయ్యి మొదలగు వాటి మానసిక జ్ఞానమే కలుగుటకు అవకాశముండదు. ఈ విధముగ బుద్ధి గోచరమగు సముదాయమునకు బహీరూపత్వమును కల్పించి దానిని బాహ్యమగు ఒక వర్తమాన క్రియనుగ వ్యవహరించుచుందుము ఈ విధముగ వర్తమానము సిద్ధించినది. వర్తమానము సిద్ధించిననే భూత భవిష్యత్తులు గూడ సిద్ధించును. ఇట్లు క్రియా కాలత్రయ సంబద్ధమను విషయము నిర్వివాదము. ॥90॥

అవతారిక— క్రియాతి పత్తియందు, భూత భవిష్యదర్థము లందు, లృఙ్ విధింపబడినది. ఈ భూత భవిష్యత్త్వముల అనుపపత్తిని ఆశంకించుచున్నాడు.

శ్లో॥ క్రియాతిపత్తిరత్యన్తం క్రియానుత్పత్తి లక్షణా ।
న చ భూతమనుత్పన్నం న భవిష్యత్తథా విధమ్ ॥ 91

క్రియాతిపత్తిః = క్రియాతిపత్తి (క్రియ జరుగకుండుట) యనునది, అత్యన్తం = మిక్కిలి,

క్రియానుత్పత్తి లక్షణా = క్రియ ఉత్పన్నము కాకుండుట అను లక్షణము కలది, అనుత్ప న్నం = ఉత్పన్నము కానిది, భూతం = భూతము, న = కాదు, భవిష్యచ్చ = భవిష్యత్తు గూడ, తథా విధం = ఆ విధమైనది, న = కాదు

తాత్పర్యము— క్రియాతిపత్తి యనగా ఏ మాత్రమును క్రియ ఉత్పన్నము కాకుండుటయని యర్థము. ఉత్పన్నమే కానిది భూతము కాజాలదు. ఆ విధమైనది భవిష్యత్తు కూడ కాదు.

విశేషాంశము— "లిఙ్ నిమిత్తే లృఙ్ క్రియాతిపత్తౌ" అను సూత్రముచేతను, 'భూతే చ' అను సూత్రముచేతను లృఙ్ విధింపబడినది. క్రియాతిపత్తి యున్నపుడు, లిఙ్‌కు నిమిత్తమగు హేతు హేతుమద్భావాదికమునందు, భవిష్యదర్థమున 'లృఙ్' వచ్చునని మొదటి సూత్రమున కర్థము. పై పరిస్థితులందే భూతార్థమున లృఙ్ వచ్చునని రెండవ సూత్రమున కర్థము. ఏదియో ఒక ఏ లోపమువలన పని జరుగకపోవుట క్రియాతి పత్తి. "యది కమలక మాహ్వాస్యత్ న శకటం పర్యా భవిష్యత్" "అభోక్ష్యత భవాన్ ఘృతేన యది మత్సమీప మాగమిష్యత్" ఇత్యాదికములు ఉదాహరణము. 'కమలకుని పిలిచినట్లైతే బండి బోల్తా కొట్టు కుండేది'; 'నీవు నా వద్దకు వచ్చినట్లైతే నేతితో భోజనము చేసెడి వాడవు' అని యర్థము. ఈ ఉదాహరణములు భవిష్యత్కాల విషయకములు. భవిష్యత్తు అగు బోల్తా కొట్టకుండుట (అపర్యాభవము) నకు కమల కాహ్వానము హేతువు, అది హేతుమత్తు. ఈ విధముగ హేతు హేతుమత్తులగు భవిష్యత్కాల విషయకములైన ఆహ్వాన - అపర్యా భవనములు రెండును జరుగలేదని ఈ వాక్యమువలన తెలియుచున్నది. ఇట్టి స్థలములలో లృఙ్ వచ్చును. "దృష్టో మయా భవత్పుత్రోఽన్నార్థీ చంక్రమ్యమాణః, అపరశ్చ ద్విజో బ్రాహ్మణార్థీ, యది సతేన దృష్టోఽభవిష్యత్ తదా అభోక్ష్యత; నతు భుక్తవాన్; అన్యేన పథా సగతః" ఇత్యాది వాక్యములు రెండవ సూత్రమునకు ఉదాహరణములు. "అన్నముకొరకై అలమటలాడుచున్న నీ కుమారుని చూచితిని, (అన్నము పెట్టుటకై) బ్రాహ్మణుని కొరకు అన్వేషించుచున్న మరియొక ద్విజుని చూచితిని. ఆ ద్విజు డాతనిని చూచియున్నచో ఆతడు భుజించి యుండెడి వాడు, భుజించ లేదు ఆతడు మరొక మార్గమున పోయినాడు" అని దీని కర్థము. ఇచట హేతువు దర్శనము. హేతుమత్తు భోజనము. ఈ హేతు హేతుమత్తులు రెండును జరుగలేదని ప్రత్యక్షముగ చూచినవాడు చెప్పుచున్నాడు గాన ఇది భూతకాల విషయకమగు లృఙ్ ప్రయోగము. పూర్వ సూత్రోదాహరణమున హేతు హేతుమత్తులగు కమలకాహ్వాన శకటా పర్యాభవనముల నెరింగిన ఒక వక్త ఈ రెండును జరగలేదని (వాటి అతిపత్తిని) ప్రమా ణాంతరముచే తెలిసికొని పల్కిన వాక్యమది. అందుచే అది (లృఙ్) భవిష్యద్విషయకము. ఇట్టి లృఙ్ యొక్క ఉదాహరణ స్థలములలో భూతత్వ భవిష్యత్త్వములు అనుపపన్నములని ఈ కారిక ఆక్షేపించుచున్నది.

పై సూత్రములచే క్రియాతిపత్తి యందు లృఙ్ విధింపబడినది. క్రియాతిపత్తి యనగా క్రియ అత్యంతము పుట్టకుండుట. అట్టి పరిస్థితిలో భూతత్వముగాని భవిష్యత్త్వము

గాని ఎట్లు పొసగును? ఉత్పన్నమగు ఒక పదార్థము యొక్క సత్త తొలగిపోయినచో దానికి భూతమని పేరు. సమర్థములగు సాధనములు సన్నిహితములైనపుడు కార్యోత్పత్తికి ఎపుడు అవకాశమున్నట్లు తోచునో అపుడు భవిష్యత్తు అని పేరు. పుట్టుటకే అవకాశము లేని దానికి భూతత్వముగాని భవిష్యత్త్వముగాని ఎట్లు లభించును అని ఆక్షేపణమునందలి అభిప్రాయము. ॥91॥

అవతారిక— లృఙ్ స్థలములలోని భూతభవిష్యద్వ్యవహారమును సమర్థించుచున్నాడు.

శ్లో॥ ప్రాగ్విరుద్ధ క్రియోత్పాదా న్నిర్వృత్తే వా విరోధిని ।
వ్యాపారేఽవధిభేదేన విషయస్తత్ర భిద్యతే ॥ 92

విరుద్ధ క్రియోత్పాదాత్ = విరుద్ధమగు క్రియ ఉత్పన్నమగుట కంటె, ప్రాక్ = పూర్వము నందుగాని, వా = లేక, విరోధిని = విరోధియగు, వ్యాపారే = వ్యాపారము, నిర్వృత్తే = జరిగిపోయిన తరువాతగాని, అవధి భేదేన = అవధి భేదముచేత, తత్ర = ఆ లృఙ్ స్థలము నందు, విషయః = విషయము, భిద్యతే = భిన్నముగ కనబడుచున్నది.

తాత్పర్యము— విరుద్ధ క్రియ ఉత్పన్నమగుటకు పూర్వముగాని, విరోధియగు వ్యాపారము జరిగిపోయిన పిమ్మటగాని అవధి భేదమును బట్టి లృఙ్ స్థలములందు విషయము వేరుగా కనబడును.

వివరణము— 'యది కమలక మాహ్వాస్యత్ న శకటం పర్యాభవిష్యత్' అను ఉదాహరణమున— సమర్థసాధన భూతుడగు కమలకుని పిలుచుట బండి తలక్రిందు కాకుండుటకు నిమిత్తము. భవిష్యత్తగు (జరుగవలసియున్న) ఆ కమలకాహ్వానము జరుగలేదని చెప్పుచు వక్త పై వాక్యమును ప్రయోగించెను. కమలకుడు గ్రామాంతరమునకు పోయి యుండుటచే వానిని ఆహ్వానించుట జరుగలేదు. కావున వాని గ్రామాంతరగమనము అహ్వానమునకు విరోధి. బండి తలక్రిందు కాకుండవలెనన్నచో ఎక్కువ బరువు దానిపై వేయకుండవలెను. కావున గురుతరభారారోపము అపర్యాభవ విరోధి. విరోధి క్రియలగు ఈ గ్రామాన్తర గమన - గురుతరభారారోప క్రియలు జరుగక పూర్వము ముందుగ కమలకాహ్వానము, దాని పిమ్మట అపర్యాభవనము జరుగుటకు అవకాశముండెడిది. అపుడు అపర్యాభవనమునకు భవిష్యత్త్వముండును. ఈ విధముగ ఆహ్వాన - అపర్యాభవనములకు ఆవశ్యకములగు కాలములు భిన్నములు గాన దానిని బట్టి క్రియాతిపత్తికి (ఇచట అపర్యాభవనమునకు) విభక్తమగు భవిష్యత్తుతో సంబంధ మేర్పడుచున్నది. అనగా— కమలకాహ్వానము లేకపోవుటచే క్రియారూపమగు శకట పర్యాభవనము జరుగును. వాడు గ్రామాంతరమునకు పోవుటచే వాని నాహ్వానించుట జరుగబోదు. భవిష్యతు అగు (జరుగవలసి యున్న) కమల కాహ్వానము అసంభావ్యమగుటచే ఏర్పడిన క్రియాతిపత్తికి (అపర్యాభవనాభావమునకు) గూడ భవిష్యత్త్వము లభించును. సమర్థ సాధనాహ్వానము భవిష్యత్తు (జరుగగలదు) అన్నచో అపుడు అపర్యాభవన

క్రియ గూడ భవిష్యత్తు అగును (జరుగగలదు). క్రియ భవిష్యత్తు ఐనపుడు దాని అభావము గూడ భవిష్యత్తు అగుటలో అభ్యంతరముండదు. ఇట్లే 'భూతే చ' అను సూత్రమునకు ఉదాహరణమగు ''యదిసతేన దృష్టో భవిష్యత్ తదా అభోక్ష్యత, న తు భుక్తవాన్'' అనుచోట గూడ భోజన ప్రతిద్వంద్వి (విరోధి) యగు అభోజనరూప వ్యాపారము గడచిపోయినది గాన, అవధి భేదమును బట్టి క్రియాతిపత్తి కూడ అతీతవిషయముగ కనబడుటచే భూతమని వ్యవహారము యుక్తమే.

అవతారిక— కాల ప్రసంగముచే సూత్రాంతర నిర్దిష్ట కాలముకంటె భిన్నమగు కాలమున ప్రత్యయములను విధించిన ''ధాతు సమ్బన్ధే ప్రత్యయాః'' అను సూత్రమును విచారించుచున్నాడు.

శ్లో॥ వ్యభిచారే నిమిత్తస్య సాధుత్వం న ప్రకల్పతే ।
భావ్యాసేదితి సూత్రేణ తత్ కాలేఽన్యత్ర శిష్యతే ॥ 93

నిమిత్తస్య = నిమిత్తమగు కాలమునకు, వ్యభిచారే = (విహితమైన వానికంటె ఇతరమైన కాలమందు) వ్యభిచారము కలిగినపుడు, 'భావ్యాసీత్' ఇతి = 'భావి ఆసీత్' ఇత్యాదులకు, సాధుత్వం = సాధుత్వము, న ప్రకల్పతే=కుదురదు, తత్ = ఆ కారణము వలన, సూత్రేణ = 'ధాతు సమ్బన్ధే ప్రత్యయాః' అను సూత్రముచే. అన్యత్ర = మరియొక, కాలే = కాలమునందు, శిష్యతే = ప్రత్యయము విధింపబడుచున్నది.

తాత్పర్యము— నిమిత్తమగు కాలమునకు వ్యభిచారము వచ్చినపుడు ''భావి, (కృత్యమ్) ఆసీత్'' మొదలగు ప్రయోగములు సాధువులు కాజాలవు. కావున ''ధాతు సమ్బన్ధే ప్రత్యయాః'' అను సూత్రముచే మరియొక కాలమునందు గూడ ప్రత్యయము విధింపబడుచున్నది. [ఈ క్రింది ప్రయోగములలో రెండేసి క్రియలు ఒకటి ప్రధాన క్రియ రెండవది సహాయ క్రియయు గలవు. ఒకటి ఒక కాలమును రెండవది వేరొక కాలమును చూపుచున్నది.]

విశేషము— 'అగ్నిష్టోమయాజ్యస్య పుత్రో జనితా' (ఇతనికి అగ్నిష్టోమ యాగము చేసెడు పుత్రుడు కలుగగలడు), 'కృతః కటః శ్వోభవితా' (రేపు చాప చేయబడినదై యుండగలదు), 'భావికృత్యం ఆసీత్' (కావలసియున్న పని జరిగెను), ''వసన్ దదర్శ'' (నివసించుచు చూచెను) ఇత్యాది ప్రయోగములు కలవు. 'అగ్నిష్టోమ యాజీ' అను పదము ''అగ్నిష్టోమేన ఇష్టవాన్'' (అగ్నిష్టోమ మనెడు యాగము చేసినవాడు) అను నర్థమున ''కరణేయజః'' అను సూత్రముచే భూతార్థకమగు ణిని ప్రత్యయము చేర్చుటచే ఏర్పడినది. ఈ భూతార్థక ప్రత్యయాంత పదము 'జనితా' అనెడు భవిష్యదర్థక క్రియా పదముతో అన్వయించుచున్నది. ఇట్లే రెండవ ఉదాహరణమున భూతార్థక 'క్త' ప్రత్యయాంతమగు 'భూతః' అనునది 'భవితా' అను భవిష్యదర్థకముతో అన్వయించుచున్నది. మూడవ ఉదాహరణమున భవిష్యదర్థకమగు 'భావి' అనునది 'ఆసీత్' అను భూతార్థక పదముతో అన్వయించుచున్నది. వర్తమానార్థకమగు 'వసన్' అనునది 'దదర్శ' అనెడు భూతార్థక

పదముతో అన్వయించుచున్నది. ఈ విధముగ ఆయా సూత్రములచే భూతాద్యర్థములందు విహితములగు 'ణిని' ప్రత్యయాదులను చేర్చుటచే సిద్ధించిన 'అగ్నిష్టోమయాజీ' ఇత్యాది పదములు తమ కాలముకంటె భిన్నమగు కాలముతో సంబంధించినచో అవి సాధువులు కాజాలవు గాన, వాటికి సాధుత్వమును కల్పించుటకై 'ధాతు సంబంధే ప్రత్యయాః' (3-4-1) అను సూత్రము చెప్పబడినది. "ధాత్వర్థముతో సంబంధము ఏర్పడినపుడు, ఆయా ప్రత్యయములు ఏయే అర్థములందు విధింపబడినవో తద్భిన్నార్థములందు గూడ వచ్చును" అని దాని యర్థము దీనినిబట్టి 'అగ్నిష్టోమయాజీ' ఇత్యాది పదములకు, అవి ఏ ధాతువులతో సంబందించునో ఆ ధాతువుల కాలమును బట్టి కాలమును మార్చుకొని అర్థము చెప్పవలెను. పై ఉదాహరణమున 'అగ్నిష్టోమయాజీ' అను పదము 'జనితా' అను భవిష్యదర్థక దాతువుతో సంబంధించుచున్నది గాన దానికి 'అగ్నిష్టోమ యాగము చేయగల' (అగ్నిష్టోమేన యక్ష్యమాణః) అను నర్థము చెప్పవలెను. అనగా ఇచట ణిని ప్రత్యయము భూతార్థమునందు కాక భవిష్యదర్థమున వచ్చినదని యర్థము.

"ధాతు సమ్బన్ధే ప్రత్యయస్య యథాకాల విధానాత్ సిద్ధమ్" అను వార్తికము ఉదాహృత సూత్రమును ప్రత్యాఖ్యానము చేసినది. పదములకే శాస్త్రీయ సంస్కారము అను పక్షమున ఆయా సూత్రములచే ఆయా కాలాద్యర్థములందు విహితములగు ప్రత్యయములను బట్టియే ఆయా పదములు (అగ్నిష్టోమ యాజీ ఇత్యాది పదములు) సిద్ధించుచున్నవి గాన ఈ సూత్ర మనావశ్యకమని ఈ వార్తికము అభిప్రాయము. ॥93॥

అవతారిక— ఈ సూత్రమును ప్రత్యాఖ్యానము చేసినచో పై ఉదాహరణములలో అర్థ మెట్లు కుదురునని యాశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ స్వకాల ఏవ సాధుశ్చేత్ కాలభేదే గతిః కథమ్ ।
వాక్యార్థా దతదర్థేషు విశిష్టత్వం న సిధ్యతి ॥ 94

స్వకాల ఏవ = ఆ ప్రత్యయము ఏ కాలమునందు విధింపబడినదో ఆ కాలమునందు మాత్రమే సాధుః + చేత = సాధువైనచో, కాలభేదే = భిన్నకాలమగు పదముతో సంబంధ మేర్పడినపుడు, గతిః = మార్గము, కా = ఏది ? అతదర్థేషు = పదములు వాక్యార్థమునకు యోగ్యము కాని అర్థములు కలవగు చున్నపుడు, వాక్యార్థాత్ = వాక్యర్థము వలన, విశిష్టత్వం = విశిష్టత్వము, (అనగా వాక్యార్థమును విశేషించుట), న సిధ్యతి = సిద్దింపదు.

తాత్పర్యము— (ఆశంక) ఒక ప్రత్యయము ఏ కాలమునందు విధింపబడినదో ఆ కాలమునందు మాత్రమే సాధువైనచో, కాలభేదమును బోధించు పదముతో సంబంధ మేర్పడినపుడు సమన్వయము ఎట్లు కుదురును ? (సమాధానము) పదములు వాక్యార్థమునకు యోగ్యముకాని అర్థములు కలిగినపుడు వాటికి వాక్యార్థము వలన విశిష్టత్వము సిద్ధింపదు.

వివరణము— ఈ కారికలోని పూర్వార్థము ప్రశ్న రూపము. ఉత్తరార్థము తత్స

మాధాన రూపము. 'భావికార్యం ఆసీత్' ఇత్యాదులలోని 'భావి' మొదలగు శబ్దములకు స్వకాలమునందే - అనగా భవితాద్యర్థమునందే, శాస్త్రీయ సంస్కారము నంగీకరించి ఆ యర్థములందు మాత్రమే ఆ శబ్దములు సాధువులని యంగీకరించినచో 'ఆసీత్' ఇత్యాది విభిన్న కాలార్థక పదములతో సంబంధ మేర్పడినపుడు కాలాంతర ప్రతీతి ఎట్లు కలుగును అని సూత్ర ప్రత్యాఖ్యానపద వార్తికముపై ఆక్షేపము. ఈ ఆక్షేపమునకు సమాధానముగ "ఉపపదస్య తు కాలాన్యత్వమ్" అను వార్తికము చెప్పబడినది. పై ఉదాహరణములలో 'ఆసీత్' ఇత్యాది ధాత్వర్థములలో 'భావి' ఇత్యాది పదార్థములు విశేషణములుగ అన్వయించును కావున అవి ఉపపదములు. ఈ ఉపపదములు విశేష్యములగు ధాత్వర్థముల కాలమును గ్రహించును. ఉపపదము ప్రధానపదము యొక్క కాలమును స్వీకరించును అనునది వాక్యార్థ బలముచే సిద్ధించును. పద సంస్కార సమయమున వాక్యార్థము వేరు గాన అది పదార్థమునకు అంగము కాజాలదు. ఈ విషయమునే ఉత్తరార్థము చెప్పుచున్నది. వాక్యార్థమునకు అయోగ్యములగు అర్థములు గల పదములతో వాక్యార్థమునకు వైశిష్ట్యము కుదురదు. అందుచే ఏకవాక్యతా బలముచే విశేషణమునకు విశేష్యకాలముతో సంబంధ మేర్పడును, అనగా విశేష్యకాలమే విశేషణమునకు గూడ సంబంధించును. కావున ప్రత్యేకముగ సూత్రమును చెప్పపనిలేదు.॥94॥

అవతారిక — మీదు మిక్కిలి, సూత్రమును చెప్పినచో వివక్షితార్థ బోధ కూడ కలుగదని చెప్పుచున్నాడు.

శ్లో॥ తదర్థశ్చేదవయవో భావినో భూతతాగతిః ।
న స్యాదత్యన్త భూతత్వమేవైకం తత్ర సంభవేత్ ॥ 95

అవయవః = 'భావికార్యం ఆసీత్' ఇత్యాది వాక్యములలో విశేషణ భూతమగు 'భావి' మొదలగునది, (ఇచట 'భావి' అనునది 'కార్యం' అను దానికి విశేషణము), తదర్థశ్చేత్ = ప్రధానమగు ఆఖ్యాతముచే బోధింపబడు కాలమును బోధించినచో, భావినః = భావిగా నున్న దానికి, భూతతాగతిః = భూతత్వ జ్ఞానము, నస్యాత్ = ఉండదు, తత్ర = అచట, ఏకం = ఒక్క అత్యన్త భూతత్వమేవ = అత్యంత భూతత్వమే, సంభవేత్ = సంభవించును.

తాత్పర్యము— అవయవము కూడ ప్రధానమగు దాని కాలమునే బోధించినచో భావియే భూతమైనది అను జ్ఞానము కలుగదు. ఒక్క అత్యంత భూతత్వజ్ఞానము మాత్రమే కలుగును.

విశేషము— 'భావి కార్యం ఆసీత్' ఇత్యాది వాక్యములు ఒక అర్థ విశేషమును బోధింపవలె ననెడు అభిప్రాయముతో ప్రయోగింపబడుచున్నవి. 'ఏ కార్యము కొంత కాలము పాటు జరుగవలసినదిగా మాత్రముండెనో అది చివరికి జరిగినది' అని చెప్పుటకై వక్త ఇట్టి వాక్యమును ప్రయోగించును 'భావి' అనునది సహజముగ భవిషదర్థవాచకమై వాక్యార్థబలముచే భూతార్థమును చెప్పిన పక్షముననే ఇంత అర్థము ఆ వాక్యమువలన గ్రాహ్యమగును. సూత్రము ప్రకారము 'భావి' అను పదమునందలి ప్రత్యయము కూడ భూతార్థకమే యైనచో

'భూతం కార్యం ఆసీత్' అన్న విధమున జరిగిన పని తప్పక జరిగినది అని చెప్పినట్లు భూతత్వమునందే అవధారణమును చెప్ప నుద్దేశించినట్లగును. అది వక్తృవివక్షాను గుణము కాదు ॥96॥

అవతారిక — ఒక కాలమును బోధించుటకై నిష్పన్నమగు శబ్దము వాక్యార్థాను సారముగా కాలాంతరమును బోధించిన పక్షమున మొదటి (పూర్వ నిర్దిష్టమగు) కాలమును త్యజింపవలసి యుండును కదా యని ఆశంకించి అట్లు త్యజింప నవసరము లేదని చెప్పు చున్నాడు.

శ్లో॥ విశిష్టకాలతా పూర్వం తథాపి తు విశేషణే ।
ఆశ్రయాత్ సోఽన్తరంగత్వాత్ తత్ర సాధుర్భవిష్యతి ॥ 96

పూర్వం = పదాన్తర సంబంధమునకు పూర్వమే, (భావ్యాది శబ్దములకు), విశిష్టకాలతా = కాలవిశేష సంబంధ మున్నది, విశేషణే = అది మరియొకి పదమునకు విశేషణమైనపుడు, తథాపితు = ఆ విధముగ అన్యకాల విశిష్టత్వము సంభవించినను, సః = ఆ శబ్దము, ఆశ్రయాత్ = ముందుగనే ఆశ్రయించుట వలనను, అంతరంగత్వాత్ = ఆ కాలము అంతరంగ మగుట వలనను, తత్ర=ఆ మొదటి కాలమునందే (కాలార్థమునందే), సాధుః=సాధువై నద్ది, భవిష్యతి = కాగలదు.

తాత్పర్యము— 'భావి' మొదలగు శబ్దములకు పదాంతర సంబంధము కలుగక పూర్వమే కాలవిశేషముతో సంబంధ మేర్పడినది. తరువాత దానికి కాలాంతర సంబంధ మేర్పడినను మొదట ఆశ్రయింపబడిన కాలమే అంతరంగము. అందుచే ఆ కాలమును బట్టియే ఆ శబ్దమునకు సాధుత్వము లభించును.

వివరణము— 'భావి' అను పదమునకు వాక్యమునందు ఇతర పదములతో సంబంధము ఏర్పడుటకు ముందుగనే భవిష్యత్కాలముతో సంబంధ మేర్పడినది గాన ఆ కాలము అంతరంగము. వాక్యమునందు కాలాంతరముతో సంబంధ మేర్పడినను, వెనుకటి కాలమును పూర్తిగ విడువవలసిన పని లేదు. ఆ కాలమును బట్టి దీనికి సాధుత్వము లభించును అనగా 'భావి కార్యం ఆసీత్' 'సోమయాజీ అస్య పుత్రో జనితా' ఇత్యాదులలో 'భావి' 'సోమ యాజీ' ఇత్యాది పదములలోని భవిష్యత్త్వ భూతత్త్వచ్ఛాయ పూర్తిగా తొలగిపోదు. అది ఉండగనే కాలాంతరముతో సంబంధము ఏర్పడును. 'ఏ పని కావలసియుండెనో అది జరిగెను' 'ఈతనికి సోమయాగము చేసినవాడుగా కాబోవు కుమారుడు పుట్టును' అను నర్థము లందు రెండు కాలములఛాయలు ఉండుటచే ఒక వైశిష్ట్యమున్నది. అట్లు కాక సూత్రమును చెప్పి వాటి కాలమే పూర్తిగ మారిపోయి భావి అను దానికి 'అయిపోయినది' అనియు, 'సోమయాజీ' అను దానికి 'సోమయాగము చేయగలవాడు' అను నర్థములు చెప్పినచో ఈ వివక్షితార్థ ప్రతీతి కలుగదు ॥96॥

అవతారిక— కొందరు వార్తికాభిప్రాయమును అంగీకరించుచు, తదనుసారము గూడ సూత్రారంభము ఆవశ్యకమే యని చెప్పినారు. వారి మతమును చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆమిశ్ర ఏవ ప్రక్రాన్తః స పదార్థ స్తథావిధః ।
కేవలస్య విమిశ్రత్వం నిత్యేఽర్థే నోపపద్యతే ॥ 97

ఆమిశ్రః ఏవ = ఇతర పదార్థ మిశ్రమగు పదార్థమే, ప్రక్రాన్తః = అన్వాఖ్యానమునకై (వ్యాకరణ సంస్కారమునకై) ఉపక్రమింప బడినది, సః = ఆ, పదార్థః = పదార్థము, తథా విధః = ఇతర పదార్థ విమిశ్రమే, అర్థే = అర్థము, నిత్యే = నిత్యమైనపుడు, కేవలస్య = కేవలమగు పదార్థమునకు, విమిశ్రత్వం = మిశ్రత్వము, నోపపద్యతే = ఉపపన్నము కాదు.

తాత్పర్యము— ఇతర పదార్థ విశిష్టమగు పదార్థమే అన్వాఖ్యానమునకై ఉపక్రమింప బడినది గాన అది ఆ విధముగనే భాసించును. శబ్దార్థములకు సంబంధము నిత్యము గాన, కేవల పదార్థమునకు మిశ్రత్వము కుదురదు.

విశేషము— లోకవ్యవహారమునకై శబ్దములను ప్రయోగింతురు. ఆ విధముగ వ్యవహార ప్రయుక్తములగు శబ్దముల స్వరూపమునే వ్యాకరణము విశదీకరించును. వ్యవహారమున వాక్యమును ప్రయోగింతుము గాన వాక్యమే అన్వాఖ్యానాంగ మని అంగీకరింపవలెను. ఈ విధముగ వాక్యార్థమును దృష్టిలో నుంచుకొని చేసిన అన్వాఖ్యానమున ఇతర పదార్థములతో విశిష్టమగు పదార్థములకే స్థానము లభించును. ఇతర పదార్థ సమన్వయ నిరపేక్షముగ ముందుగ పదానుశాసనము చేసి పిమ్మట ఆ పదార్థమునకు ఇతర పదార్థ సంబంధ మేర్పడును, అని అన్నచో ఆ పదమునకు పూర్వమున్న అర్థముతో సంబంధము పోయి విశిష్టార్థముతో క్రొత్తగ సంబంధ మేర్పడినది గాన శబ్దార్థముల సంబంధము నిత్యము అను నియమమునకు విఘాతము కలుగును. కావున ఒక అర్థమున అన్వాఖ్యానము చేయగా వాక్యావస్థలో మరియొక అర్థముతో సంసర్గము కలుగునని చెప్పుట యుక్తము కాదు ॥97॥

అవతారిక— పై కారికలో సూచించిన కారణముచే "ధాతుసమ్బన్ధే ప్రత్యయః" అను పృథక్సూత్రారంభము ఆవశ్యకమే యని చెప్పుచున్నాడు.

శ్లో॥ శుద్ధే చ కాలే వ్యాఖ్యాతమామిశ్రే న ప్రసిధ్యతి ।
సాధుత్వమయథాకాలం తత్సూత్రేణోపదిశ్యతే ॥ 98

శుద్ధే = శుద్ధమైన, కాలే = కాలమునందు, వ్యాఖ్యాతం = చెప్పబడిన ప్రత్యయము, ఆమిశ్రే = సంసృష్టమగు కాలమునందు, న ప్రసిధ్యతి = సిద్ధించదు, తత్ = ఆ కారణమువలన, అయథాకాలం = పూర్వ విహితకాలముకంటె భిన్నమగు కాలమును అనుసరించి, సాధుత్వం = సాధుత్వము, సూత్రేణ = సూత్రముచేత, ఉపదిశ్యతే = ఉపదేశింపబడుచున్నది.

తాత్పర్యము— ఇతర కాలా మిశ్రమగు శుద్ధ కాలార్థమున విహితమగు ప్రత్యయము సంసృష్టకాలార్థమున సిద్ధింపదు. అందుచే పూర్వ విహిత శుద్ధ కాలభిన్న కాలమునందు గూడ ఆ పదమునకు సాధుత్వము లభించుటకై సూత్రము ఉపదిష్టమైనది

వివరణము— 'భావి' అను పదము 'భవిష్యతి గమ్యాదయః' అను సూత్రముచే ఇతర కాలములతో మిశ్రితము కాని శుద్ధ భవిష్యత్కాలార్థమున విధింపబడినది. ఈ పదము ఈ శుద్ధ భవిష్యదర్థమున ప్రయోగించిననే సాధువగును కాని భూతాది కాలమిశ్ర భవిష్యదర్థమున ప్రయోగించినచో సాధువు కాదు. అనగా— 'భావి కార్యం ఆసీత్' ఇత్యాది స్థలములలో (వార్తికకారాదు లంగీకరించినట్లు) వాక్యాన్వయ బలముచే భవిష్యత్కాలమునకు భూతకాల సంశ్లేషము కలుగుచున్నది గాన ఇది సాధువు కాదు అందుచే దానికి ఈ యర్థమునందు గూడ (భూత మిశ్ర భావ్యర్థమునందు గూడ) సాధుత్వము లభించుటకై ఈ సూత్ర మావశ్యకమని సూత్రకార సమర్థకుల అభిప్రాయము. ॥98॥

అవతారిక— ఇపుడు వార్తికకార మత సమర్థకుడు ఒక ఆక్షేపముచేసి, దానికి సూత్ర సమర్థకులు ఏ సమాధానము చెప్పుదురో ఆ సమాధానమును పురస్కరించుకొని సూత్రము అనావశ్యకమని సూచించుచున్నాడు. 'భావికార్యం ఆసీత్' ఇత్యాది స్థలములలో 'ఆసీత్' అను దానితో సంబంధించుటచే 'భావి' అనునది భూతకాల సంశ్లిష్ట భవిష్యత్కాలమును బోధించునని అంగీకరించి ఆ యర్థమును బోధించుటకై "ధాతుసమ్బన్ధే ప్రత్యయాః" అను సూత్రము రచింపబడినదని మీరు చెప్పుచున్నారు. వినిగమకము లేకపోవుటచే (ఇది ఇట్లే చెప్పవలెను అని నిర్ణయించుటకు తగు ప్రమాణమునకు వినిగమక మని పేరు) 'భావి' యను భవిష్యత్కాలార్థక శబ్ద సంబంధముచే 'ఆసీత్' అనునదియే భవిష్యత్కాల మిశ్ర భూతకాలార్థకమని ఏల యంగీకరింపరాదు అనునది ఆక్షేపము. ఈ ఆక్షేపమునకు క్రింది కారిక సమాధానము చెప్పుచున్నది. ఈ సమాధానమును బట్టియే సూత్రారంభమనావశ్యకమని తేలుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆఖ్యాతపదవాచ్యేఽర్థే నిర్వర్త్యత్వాత్ ప్రధానతా ।
విశేషణం తదాక్షేపాత్ తత్కాలే వ్యవతిష్ఠతే ॥ 99

ఆఖ్యాత పదవాచ్యే = ఆఖ్యాత పదముచే (తిఙంతముచే) చెప్పబడెడు, అర్థే = క్రియారూపమగు అర్థమునందు (అర్థమునకు), నిర్వర్త్యత్వాత్ = అది సాధ్యమైనదగుట వలన, ప్రధానతా = ప్రధానత్వము, విశేషణం = విశేషణము, తదాక్షేపాత్ = ఆఖ్యాత పదార్థముచే ఆక్షిప్తమగుటచే, తత్కాలే = ఆఖ్యాత వాచ్యకాలమునందు (కాలమును), వ్యవతిష్ఠతే = ఉండును (అనుసరించును).

తాత్పర్యము— తిఙంతము క్రియను బోధించును. ఆ క్రియ సాధింపవలసినది. కావున అది ప్రధానము. అదియే వాక్యార్థము గాన, వాక్యార్థమునందు అదియే ప్రధానము. నామపద బోధ్యమగు కారకము సిద్ధ స్వభావమై క్రియకు ఉపకరించును. కావున అది అప్ర

ధానము. అప్రధానములు ప్రధానమైన దానిని అనుసరించును గాని ప్రధానము అప్రధానమైన దానిని అనుసరింపదు. అందుచే 'ఆసీత్' అను ఆఖ్యాతార్థము అప్రధానమగు నామార్థమును అనుసరించి దాని కాలముతో మిశ్రితమగు కాలమును బోధించు ప్రసక్తి లేదు. ఈ విధముగ ఒక వాక్యమున గౌణప్రధానములు రెండును ఉన్నపుడు ప్రధానమును బట్టి గౌణము ప్రవర్తించును గాని గౌణమును బట్టి ప్రధానము ప్రవర్తింపదు అను న్యాయముచేతనే భావీత్యాది వాక్యములలో 'భావి' మొదలగు పదములు తమ కాలమును పరిత్యజింపకుండగనే ప్రధానాఖ్యాత కాలమును గ్రహించును అని చెప్పవచ్చును గాన సూత్రము ఉపదేశింప బనిలేదు. "కేవలస్య విమిశ్రత్వం నిత్యేఽర్థేనోపపద్యతే" అను ఆక్షేపము కూడ యుక్తముకాదు. పదార్థములన్నియు ఏదియో విధముగ ఇతర పదార్థములతో సంసృష్టము లగుచునే యుండును ఇక నేమనగా, పదాన్తర ప్రయోగము లేనపుడు ఆ సంబంధము సామాన్యరూపముననే ఉండును. అపుడు కేవల రూపమున నున్న ఆ పదము సామాన్యార్థమునే బోధించును. వాక్యమున పదాంతర సన్నిధాన మేర్పడినపుడు విశేషార్థమును బోధించును. అందుచే పదము కేవలముగ (పదాంతరా సంసృష్టముగ) నున్నపుడు దాని సాధుత్వమునకై ఒక శాస్త్రమును, పదాంతర సంసృష్టమై యున్నపుడు దాని సాధుత్వమునకై మరియొక శాస్త్రమును ఉపదేశించుట అనావశ్యకము. కావున ఒక అర్థమును త్యజించుట, మరియొక అర్థమును గ్రహించుట అనునది ఉండదు. ॥99॥

అవతారిక— పదము, వెనుక చెప్పినట్లు, సామాన్యార్థ బోధకమగునపుడు ఏర్పడిన వ్యాకరణ సంస్కారము ఆ పదము వ్యామిశ్రార్థ బోధకమగునపుడు గూడ అనువర్తించును. ఆ ప్రత్యయము ఆ కాలమునందే ప్రవర్తించును గాని ఇతర కాలముతో సంబంధించినపుడు రాకూడదని నిషేధము లేదుకదా ? అందుచే సూత్ర మనావశ్యకమని చెప్పుచున్నాడు.

**శ్లో॥ సమ్ప్రత్యయానుకారో వా శబ్దవ్యాపార ఏవ వా ।
అధ్యస్యతే విరుద్ధేఽర్థే న చ తేన విరుధ్యతే ॥ 100**

సమ్ప్రత్యయాను కారో వా = జ్ఞానాకారము గాని, శబ్దవ్యాపార ఏవ వా = శబ్దవ్యాపారము గాని, విరుద్ధే = విరుద్ధమగు, అర్థే = అర్థమునందు, అధ్యస్యతే = అధ్యసింపబడుచున్నది, తేన = అధ్యసింపబడుచున్న అర్థముతో, న చ విరుధ్యతే = విరోధమును పొందదు.

తాత్పర్యము— జ్ఞానాకారము గాని, శబ్దవ్యాపారము గాని విరుద్ధమగు అర్థమునందు అధ్యసింపబడును. దానితో విరోధమును కూడ పొందదు.

వివరణము— 'భావికార్యం ఆసీత్' ఇత్యాద్యుదాహరణములలోని 'భావి' మొదలగు పదములు తమ తమ స్వభావమును అనుసరించి కొన్ని అర్థములను బోధించును. కాలాంతరమున సాధుత్వమును అనుశాసించినంత మాత్రమున ఆ కాలాంతర రూపార్థ ప్రతీతి కలుగదు. కావున సూత్రారంభ మనావశ్యకము. ఇక వాక్యార్థ సమన్వయ మెట్లు కలుగుననగా— గుణప్రధాన భావము ననుసరించి ప్రధాన కాలానుసారముగ సమన్వయము చెప్పుకొనవలెను అని

వెనుక చెప్పబడినది మరియొక విధముగ గూడ సమాధానము చెప్పుకొనవచ్చును. ప్రత్యయములు కాలములతో పాటు ఆయా సంబంధములను గూడ బోధించును. సమన్వయము మాత్రము అధ్యారోపముచే ఏర్పడును. ఉదాహరణమునకు– ''అగ్నిష్టోమయాజీ అస్య పుత్రో జనితా'' అనుచోట ''అగ్నిష్టోమ యాజీ'' అనునది భూతకాల విశిష్టార్థమునే బోధించును. దీనికి 'జనితా' అను దానితో సంబంధమేర్పడినపుడు భూతకాలావచ్ఛిన్నమగు జ్ఞానాకారము అనుపపన్నము గాన స్వవిరుద్ధమగు ఆ భవిష్యత్కాలమున ఆరోపింపబడును. పుట్టబోవు వానికి సంబంధించిన భవిష్యత్కాలమునందు, జన్మ జరిగిన పిమ్మట అగ్నిష్టోమమును చేయుట, దాని సమాప్తి పీటిని మనసాభావించి ఇపుడే ఇది భూతకాలముగ చెప్పబడినది. ఇతనికి పుట్టబోవువాడు అగ్నిష్టోమయాగము చేయగలడు అనియే తాత్పర్యార్థము. ఈ పక్షమున భూతకాలా వచ్ఛిన్న జ్ఞానాకారమునకు భవిష్యత్కాలమున ఆరోపము. లేదా ''అగ్నిష్టోమ యాజీ'' అను శబ్దమునకు గల స్వార్థాభిధాన రూపమగు వ్యాపారము భవిష్యత్కాలమున అధ్యసింపబడును. ''ఎవడు పుట్టి, పెరిగి, 'అగ్నిష్టోమయాజీ' అను పేరు పొందగలడో అట్టి కుమారుడు పుట్టగలడు'' అని యర్థము. ఇది శబ్దవ్యాపారారోప పక్షము. ఈ విధముగ జ్ఞానాకారాధ్యాసమును గాని, శబ్దవ్యాపారా ధ్యాసమును గాని అంగీకరించినచో సమన్వయములో విరోధముండదు. ॥100॥

అవతారిక— ఈ విషయమునే ఉదాహరణముతో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ భూతం భవిష్యదిత్యేతౌ ప్రత్యయౌ వర్తమానతామ్ ।
అత్యజన్తౌ ప్రపద్యేతే విరుద్ధాశ్రయ రూపతామ్ ॥ 101

భూతం = భూతము, భవిష్యత్ = భవిష్యత్తు, ఇతి = అనెడు, ఏతౌ = ఈ, ప్రత్యయౌ = ప్రత్యయములు, వర్తమానతాం = వర్తమానత్వములను, అత్యజన్తౌ = విడువనివై, విరుద్ధాశ్రయ రూపతాం = విరుద్ధమగు ఆశ్రయము యొక్క రూపమును, ప్రపద్యేతే = పొందును.

తాత్పర్యము— భూతము, భవిష్యత్తు అనెడు రెండు జ్ఞానములును వర్తమానత్వమును విడువనివై విరుద్ధమగు ఆశ్రయముయొక్క రూపమును పొందును.

వివరణము— 'ఈ వస్తువు భూతము', 'ఈ వస్తువు భవిష్యత్తు' అను జ్ఞానములు కలుగుచున్నవి. ఇవి వర్తమాన కాలమునకు చెందినవి. అయినను ఈ జ్ఞానములు స్వకాల విరుద్ధములగు భూత భవిష్యత్కాలముల ఆకారమును ఎట్లు ధరించుచున్నవో అట్లే 'అగ్నిష్టోమ యాజీ' ఇత్యాద్యుదాహరణములలో గూడ స్వకాలమును విడువకుండగా కాలాంతరమునందు ఆరోపించుట విరుద్ధము గాదని యభిప్రాయము. ॥101॥

అవతారిక— ఇపుడు, కాల ప్రసంగముచే వర్తమానసారూప్యమును గూర్చి విచారించుచున్నాడు.

శ్లో॥ అధ్వనో వర్తమానస్య యః శేషో య ఉపక్రమః ।
తద్వర్తమానసామీప్యం శాస్త్రే భేదేన దర్శితమ్ ॥ 102

వర్తమానస్య = వర్తమానమగు, అధ్వనః = మార్గముయొక్క, యః = ఏ, శేషః = శేషము కలదో, యః = ఏ, ఉపక్రమః = ప్రారంభము కలదో, తత్ = అది, వర్తమాన సామీప్యం = వర్తమాన సామీప్యముగా, శాస్త్రే = శాస్త్రమునందు, భేదేన = భేదముతో, దర్శితమ్ = చూపబడినది.

తాత్పర్యము— వర్తమాన మార్గముయొక్క (వర్తమానము యొక్క) చివరి భాగమును (శేషము) ప్రారంభమును వర్తమాన సామీప్యమని శాస్త్రము చెప్పుచున్నది.

వివరణము— ఫలప్రాప్తి యగు వరకును విరమింపని క్రియాసాతత్యమునకు వర్తమాన మని పేరు. అది సమాప్తమైన తరువాత గూడ దాని సంస్కారము అనువర్తించు చుండును; అది వర్తమాన శేషము. ఈ శేషము భూతరూపము. వర్తమానము పూర్తియై పోయినది కదా? అట్లే వర్తమానము ప్రారంభము కాకపూర్వము మానస సంకల్పము కలుగును. అది, ఇంకను వర్తమాన క్రియ ప్రారంభము కాలేదు గాన, వర్తమాన భవిష్యద్రూపము. ఈ రెండును వర్తమానమునకు ముందును వెనుకను దగ్గరగనున్నవి. కావున ఈ రెండింటికిని శాస్త్రకారులు వర్తమాన సామీప్యమని పేరు పెట్టి, "వర్తమాన సామీప్యే వర్తమానవద్వా" అను సూత్రముచే వర్తమాన కార్యములు వికల్పముగ వచ్చునని చెప్పినారు. వర్తమాన సమీపమున నున్న భూత భవిష్యత్తులందు వర్తమానమునందు వలె ప్రత్యయములు వికల్పముగ వచ్చును, అని యర్థము. ఉదా. "కదా ఆగతోఽసి" (ఎప్పుడు వచ్చినావు?) 'అయమాగచ్ఛామి' (ఇదిగో వచ్చుచున్నాను), "కదా గమిష్యసి?" (ఎపుడు వెళ్ళెదవు?) 'ఏష గచ్ఛామి' (ఇదిగో వెళ్ళుచున్నాను). ఇచట మొదటి ఉదాహరణమున గమన క్రియ అపుడే పూర్తియగుటచే వర్తమాన సమీప భూతము. దానియందు వికల్పముగ 'ఆగచ్ఛామి' అను వర్తమానము ప్రయోగింపబడినది. రెండవ ఉదాహరణమున గమనము ప్రారంభము కాకున్నను గమన సంకల్పము ఉన్నది. అందుచే ఇది వర్తమాన సమీప భవిష్యత్తు. దీని యందు గూడ వికల్పముగ 'గచ్ఛామి' అను వర్తమాన ప్రయోగము వచ్చినది. ॥102॥

అవతారిక— ఇష్ట వస్తువిషయక మగు ప్రార్థనకు ఆశంసయని పేరు. ఈ ఆశంస అనునది జ్ఞానవిశేష రూపమైనది. అందుచే ఇది ఆ సమయమున నున్నదిగాన వర్తమానమే యగును. ఇట్టి పరిస్థితిలో భాష్యకారుడు "ఆశంసాయాం భూతవచ్చ" (3-3-132) అను సూత్రమున "ఆశంసా నామ భవిష్యత్కాలా" యని ఎట్లు చెప్పెను అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆశంసా వర్తమానాపి విషయేణ భవిష్యతా ।
భాష్యే భవిష్యత్కాలేతి కార్యార్థం వ్యపదిశ్యతే ॥ 103

ఆశంసా = ప్రార్థన, వర్తమానాపి = వర్తమానమైనను, భవిష్యతా = భవిష్యత్తైన, విషయేణ

విషయముచే, భాష్యే = భాష్యమునందు, భవిష్యత్కాలేతి = భవిష్యత్కాలమని, కార్యార్థం కార్యముకొరకై, వ్యపదిశ్యతే = ఆరోపముచే చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ప్రార్థన వర్తమానమే యైనను భవిష్యత్తు అగు విషయమును పురస్కరించుకొని భవిష్యత్కాలమునకు చెందినదని, కార్యార్థమై, భాష్యమునందు చెప్పబడినది.

వివరణము— 'ఆశంసాయాం భూతవచ్చ' (3-3-132) అను సూత్రముచే "భవిష్యత్కాలమున, ఆశంసార్థమునందు, భూతమునందువలెను వర్తమానమునందు వలెనే ప్రత్యయములు వచ్చును" అని విధింపబడినది. "ఉపాధ్యాయశ్చేదాగమత్, ఆగతః, ఆగచ్ఛతి, ఆగమిష్యతి, ఏతే వ్యాకరణ మధ్య గీష్మహి, ఏతే వ్యాకరణ మధీతవన్తః, అధీమహే, అధ్యేష్యామహే" (ఉపాధ్యాయుడు వచ్చినచో వ్యాకరణము అభ్యసించెదము) అని ఉదాహరణము. ఇచట ఆశంస (కోరిక) వర్తమాన కాలమున నున్నను ఇది భవిష్యత్కాలమునకు సంబంధించిన దగుటచే భవిష్యత్తని భాష్యకారులు చెప్పెను. "ఉపాధ్యాయశ్చేదాగ మిష్యతి తదావ్యాకరణ మధ్యేష్యామహే" అని భవిష్యత్కాలమునకు మాత్రమే అవకాశముండగా ఈ సూత్రము భవిష్యత్కాలమునందు వర్తమానత్వ భూతత్వములను అతిదేశించుచున్నది (ఆరోపించుచున్నది) దానినిబట్టి 'ఆగమత్' 'ఆగచ్ఛతి' 'అధ్యగీష్మహి' 'అధీమహే' ఇత్యాది భూత వర్తమాన ప్రయోగములకు గూడ వైకల్పికముగ అవకాశము లభించినది. ఈ విధముగ భూత ప్రత్యయ లక్షణమగు కార్యమును భవిష్యద్విషయమున అతిదేశించుటకై భాష్యకారుడు "ఆశంసా నామ భవిష్యత్కాలా" అని చెప్పెనని తాత్పర్యము. ॥103॥

అవతారిక— కోరబడెడు విషయము భవిష్యత్తునందున్నది గాన కోరిక (ఆశంస) కూడ భవిష్యత్తు అని భాష్యకారుని యభిప్రాయమని పై కారికలో చెప్పబడినది. ఆ పక్షమున చేయుటకు ఇచ్ఛయించుచున్నాడు (చికీర్షతి) ఇత్యాది స్థలములలో గూడ ఇచ్ఛ భవిష్య ద్విషయమునకు (జరుగబోవు చేయుటకు) సంబంధించినది గాన అదియు భవిష్యత్కాలమగును. అపుడు భవిష్యత్ప్రత్యయములే వచ్చునుగాని వర్తమాన ప్రత్యయములు వచ్చుటకు అవకాశము లేదు గాన వర్తమాన కాల ప్రత్యయములను అతిదేశింపవలసి యుండును కదా యని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఇచ్ఛా చికీర్షతీత్యత్ర స్వకాలమనురుధ్యతే ।
భవిష్యతి ప్రకృత్యర్థే తత్కాలం నానురుధ్యతే ॥ 104

చికీర్షతీత్యత్ర = 'చికీర్షతి' అనుచోట, ఇచ్ఛా = ఇచ్ఛ, స్వకాలం = తన కాలమును (వర్తమానమును), అనురుధ్యతే = అనుసరించును, ప్రకృత్యర్థే = ప్రకృత్యర్థము, భవిష్యతి = భవిష్యత్తు ఐనను, తత్కాలం = దానియొక్క కాలమును, నానురుధ్యతే = అనుసరింపదు.

తాత్పర్యము— 'చికీర్షతి' అనుచోట ఇచ్ఛ తన కాలమునే అనుసరించును. ప్రకృత్యర్థము భవిష్యత్తు ఐనను ఆ కాలమును అనుసరింపదు.

వివరణము— 'చికీర్షతి' అనునది 'కర్తుమ్ ఇచ్ఛతి' (చేయుటకు ఇచ్ఛగించుచున్నాడు) అను నర్థమున కృధాతువునకు 'సన్' ప్రత్యయమును చేర్చుటచే ఏర్పడినది. ప్రకృతియగు 'కృ' ధాతువునకు 'చేయుట' అర్థము. ప్రత్యయమగు 'సన్' కు 'ఇచ్ఛ' అర్థము ప్రకృత్యర్థము రాబోవునది గాన భవిష్యత్కాలమునకు సంబంధించినది. ప్రత్యయార్థము ఇపుడున్నది గాన వర్తమానము. ప్రకృతి ప్రత్యయార్థములలో ప్రత్యయార్థము ప్రధానము గావున ప్రత్యయార్థమగు ఇచ్ఛ వర్తమానమగుటచే క్రియ వర్తమానమునందే ప్రయుక్తమగును గాని అప్రధానమగు ప్రకృత్యర్థమును బట్టి భవిష్యత్కాలములో నుండుట గాని, తత్పరిహారార్థమై వర్తమానత్వాతిదేశము చేయవలసిన ఆవశ్యకత కాని లేదని తాత్పర్యము. ॥104॥

అవతారిక— చికీర్షతీత్యాదులలో ఇచ్ఛాకాలమగు వర్తమానమే అనువర్తించిన విధమున ఆశంసా స్థలమునందు ఆశంసాకాలమగు వర్తమానము ఎందుచే అనువర్తింపదు అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆశంస్యమాన తన్త్రత్వాదాశంసాయాం విపర్యయః ।
ప్రయోక్తృధర్మః శబ్దార్థే శబ్దై రేవానుషజ్యతే ॥ 105

ఆశంస్యమాన తంత్రత్వాత్ = అభిలషింపబడుచున్న దానిపై ఆధారపడిన దగుటచే, ఆశంసాయాం = ఆశంస విషయమున, విపర్యయః = విపర్యయము - అనగా ప్రార్థనయొక్క కాలమునకు కాక ప్రార్థింపబడుదాని కాలమునకే ప్రాధాన్యమనెడు విపర్యాసము, ప్రయోక్తృధర్మః = ప్రయోగించు వానియొక్క ధర్మము, శబ్దై రేవ = శబ్దములచేతనే, శబ్దార్థే = శబ్దార్థమునందు, అనుషజ్యతే = అనుషక్తమగుచున్నది.

తాత్పర్యము— ఆశంసింపబడుచున్న దానిపై ఆధారపడినదగుటచే, ఆశంస విషయమున వెనుక చెప్పినదానికంటె విపర్యాసము కనబడుచున్నది. ప్రయోక్త యొక్క ధర్మమును శబ్దార్థమునందు శబ్దములే అనుషక్తమగునట్లు చేయుచున్నవి.

విశేషము— 'చికీర్షతి' ఇత్యాది స్థలములలో ఇచ్ఛ ప్రత్యయార్థముగ నున్నట్లు 'ఉపాధ్యాయశ్చేదాగమత్' ఇత్యాద్యుదాహరణములందు గమ్యమానమగు ఆశంస ప్రత్యయార్థము కాదు. ఆశంసింపబడుచున్నదే ప్రత్యయార్థముగ నున్నది. ఇచట గమ్యమానమగు ఆశంస వాక్య ప్రయోక్తయొక్క ధర్మమేకాని శబ్దార్థము కాదు. 'ఉపాధ్యాయుడు వచ్చినచో చదువుకొందుము, అని చెప్పుటను బట్టి ఆ వాక్యమును ప్రయోగించువానికి ఆశంస (కోరిక) ఉన్నట్లు తెలియుచున్నది గాని ఆ కోరికను బోధించు పదమేదియు ఇచట లేదుగాన ఇది పదార్థము కాదు. ఉపాధ్యాయాగమన - వ్యాకరణాధ్యయనములే ప్రత్యయవాచ్యము లగుటచే ప్రధానములు గాన వాటి కాలముండుటయే యుక్తము.

అట్లైనచో శబ్దార్థమునే శబ్ద సంస్కారమునకు నిమిత్తముగ గ్రహింపవలెను గాని

ప్రయోక్తృధర్మమగు ఆశంసను శబ్ద సంస్కారమునకు (వ్యాకరణ కార్య ప్రవృత్తికి) నిమిత్తముగ గ్రహింపవచ్చునా యని ఆశంకించి, ఉత్తరార్ధమును చెప్పుచున్నాడు. ఆ శబ్దము ప్రయోగించుటచే ఆధర్మము ప్రయోక్తయందున్నట్లు గమ్యమగుచున్నది గాన శబ్దమే ప్రయోక్తయొక్క ధర్మమును ప్రయోజ్యమగు శబ్దముయొక్క అర్థమునందు ఆరోపించు చున్నది. ఈ విధముగ ప్రయోక్తృధర్మము గూడ పరోక్షరూపమున శబ్ద సంస్కారమునకు నిమిత్తము కావచ్చును. ॥105॥

అవతారిక— మహాభాష్యమునందు "అనిష్పన్నే నిష్పన్న శబ్దః శిష్యోఽనిష్పన్నత్వాత్" అను వార్తికమున్నది. కార్యము ఇంకను పూర్తికాకుండునపుడు, అది పూర్తి కాకుండుట వలన (అనిష్పన్నత్వాత్) భవిష్యత్కాల ప్రత్యయము రావలసియున్నను భూత ప్రత్యయము చెప్పవలెను అని దీని యర్థము. "దేవశ్చే ద్వృష్టో నిష్పన్నాః శాలయః" అనునది ఉదాహరణము. దేవుడు వర్షించి యున్నచో వరిధాన్యము నిష్పన్నమైనవి (నిష్పన్నమైనట్లే) అని యర్థము. వార్తికమునందలి 'అనిష్పన్నత్వాత్' అను దానికి హేతువులన్నియు సన్నద్ధములుగ నుండుటచే నిష్పత్త్యభిముఖమైన దగుటవలన అని యర్థము. నిష్పత్తి సంభావ్యమగుటచే భూతకాలమును ఔపచారిక రూపమున ప్రయోగింప నవసరము లేదు. ముఖ్యరూపముననే ప్రయోగింపవచ్చునని యభిప్రాయము. "దేవశ్చేద్ వృష్టః నిష్పన్నాః శాలయః" అనునది వర్షము కురిసిన తరువాత జనులనుకొనెడు మాట. "వర్షము కురిసినది కనుక ఇంక శాలులు (వరి పంటలు) నిష్పన్నములైనట్లే" అని తాత్పర్యము. ఈ వార్తికము అనావశ్యకమని మరియొక వార్తికము చెప్పుచున్నది. "సిద్ధంతు భవిష్యత్ప్రతిషేధాత్". దీనిపై భాష్యము - "సిద్ధమేతత్, కథమ్? భవిష్యత్ప్రతిషేధాత్, యల్లోకే భవిష్యద్వాచినః శబ్దస్య ప్రయోగం న మృష్యతి" కశ్చిదాహ - దేవశ్చేద్వృష్టః సంపత్స్యన్తే శాలయ ఇతి. స ఉచ్యతే మైవం వోచః, 'సమ్పన్నాః శాలయ' ఇత్యేవం బ్రూహి". "దేవుడు వర్షించి యున్నట్లైతే వరి సంపన్నము కాగలదు" అని ఎవ్వడైన భవిష్యత్కాలమును ప్రయోగించినచో ప్రక్కనున్నవారు అందులకు అంగీకరింపక 'సంపత్స్యన్తే' అని భవిష్యత్కాలమును ప్రయోగింపకుము, 'సంమ్పన్నాః శాలయః' అని భూతకాలమును ప్రయోగింపుము అని వాని మాటలు సరిచేయుదురు ఈ విధముగ భవిష్యత్ప్రతిషేధము చేతనే భూతకాలము సిద్ధించును గాన "అనిష్పన్నే..." ఇత్యాది వార్తిక పాఠము అనావశ్యకమని ఈ వార్తికమున కిర్థము ఈ వార్తికార్థము ఎట్లు ఉపపన్నమో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ అప్శాలి బీజసంయోగే వర్తతే నిష్పదిర్యదా ।
తత్రావయవ వృత్తిత్వాద్భవిష్యత్ ప్రతిషేధనమ్ ॥ 106

నిష్పదిః = నిస్ పూర్వక పద్ ధాతువు, యదా = ఎప్పుడు, అప్శాలి బీజసంయోగే = ఉదకము యొక్కయు శాలి బీజముల యొక్కయు సంయోగము అను నర్థమునందు, వర్తతే = ఉండునో (ఆ అర్థమును బోధించునో) అపుడు అవయవ వృత్తిత్వాత్ = అవయవమునందు

ఉండుట వలన, తత్ర = అచట, భవిష్యత్ప్రతిషేధనం = భవిష్యత్కాలము యొక్క నిషేధనము చేయబడుచున్నది.

తాత్పర్యము— నిస్ పూర్వక పద్ ధాతువు, అవయవార్థ మాత్రబోధకమై జలశాలి బీజముల సంయోగము అను నర్థమును బోధించునపుడు భవిష్యత్కాల ప్రయోగము నిషేధింపబడుచున్నది.

వివరణము— నిస్ పూర్వక పద్ ధాతువునకు సాధనములన్నియు సమకూరిన పిదప ఫలము సిద్ధించుట అనునది ముఖ్యార్థము ఈ ముఖ్యార్థములో జలము, వరి విత్తనములు కలియుట అనునది ఒక అంగము (అవయవము). ముందు జల - శాలిబీజములకు సంబంధమేర్పడిన పిమ్మట వరి పండుట అను ముఖ్య ఫలము కలుగును కదా. ఆరోపణముచే ఈ అవయవార్థమునే నిస్ పూర్వక పద్ ధాత్వర్థమునుగ గ్రహించినచో వర్షము కురిసిన వెంటనే ఆ అవయవార్థము (జలశాలి బీజసంయోగము) ఏర్పడినది గాన భవిష్యత్కాలమును ప్రయోగింప బనిలేదని దానిని నిషేధించుట యుక్తము. ఈ విధముగ అవయవార్థమునే ఔపచారికముగ నిష్పద్యర్థముగ స్వీకరించి భూతకాల ప్రయోగము చేయవచ్చును గాన భూతకాల ప్రయోగ విధాయక వార్తికము అనావశ్యకమని యభిప్రాయము. ॥106॥

అవతారిక— ఈ విధముగ గౌణార్థమును గ్రహించిన పక్షమున భూతకాలము యుక్తమైయైనను ముఖ్యార్థమును స్వీకరించిన పక్షమున (వరి పండుట అను అర్థమును అంగీకరించిన పక్షమున) భూతత్వ మెట్లు కుదురును అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఫలప్రసవరూపే తు నిష్పదౌ భూతకాలతా ।
ధర్మాన్తరేషు తద్రూపమధ్యస్య పరికల్ప్యతే ॥ 107

నిష్పదౌ = నిస్ పూర్వక పద్ ధాతువు, ఫలప్రసవరూపే = ఫలోత్పత్తియను అర్థము కలదని చెప్పినచో, ధర్మాన్తరేషు = ఇతర ధర్మములయందు, తద్రూపమ్ = ఫలనిష్పత్తిత్వరూపమును, అధ్యస్య = ఆరోపించి, భూతకాలతా = భూతకాలత్వము, పరికల్ప్యతే = కల్పింపబడుచున్నది.

తాత్పర్యము— 'నిష్పది'కి ఫలప్రసవమే ముఖ్యార్థమని యంగీకరించిన పక్షమున ధర్మాన్తరములయందు ఫలప్రసవ రూపత్వమును ఆరోపించి భూతకాలత్వము కల్పింపబడుచున్నది.

వివరణము— "సాధనములన్నియు సమకూరుటచే ఫలము జనించుట" అనునదియే 'నిష్పది'కి (నిస్ పూర్వక పద్ ధాతువునకు) అర్థము. ఆ అర్థము ఇంకను నిష్పన్నము కాదు గాన భూతకాలమును ప్రయోగించుటకు అవకాశము లేదు అని చెప్పినచో ఆరోపమును ఈ విధముగ చెప్పవలెను. జలబీజ సంయోగముచే కారణములయందు ఒక ధర్మాతిశయ

మేర్పడును. ఆ ధర్మాతిశయమునే కార్యనిష్పత్తి యని ఆరోపించుటచే భూతకాలమును ప్రయోగింప వచ్చును. పూర్వకారికలో 'నిష్పది'యందు 'జలశాలి బీజసంబంధము' అను నర్థమును ఆరోపించి తద్ద్వారా భూతకాలత్వము సమర్థింపబడినది. ఈ కారికలో జలబీజ సంయోగముచే కొన్ని కారణములయందు ఏర్పడిన ఒక విధమగు అతిశయమునే ఫలప్రసవరూప ముఖ్యార్థముగ భావించుటచే, అనగా ముఖ్యార్థత్వారోపణముచే, భూతకాలత్వము సమర్థింపబడినది

అవతారిక— మరియొక విధమగు ఉపచారమును చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉపయుక్తే నిమిత్తానాం వ్యాపారే ఫలసిద్ధయే ।
తత్రరూపం యదధ్యస్తం తత్కాలం తత్ ప్రతీయతే ॥ 108

ఫలసిద్ధయే = ఫలముయొక్క సిద్ధికొరకు, నిమిత్తానాం = నిమిత్తముల యొక్క, వ్యాపారే = వ్యాపారము, ఉపయుక్తే సతి = ఉపయోగింపబడిన దగుచుండగా, తత్ర = ఆ ఫలసిద్ధి యందు, యత్ = ఏ, రూపం = వ్యాపార రూపము, అధ్యస్తం = అధ్యసింపబడినదో, తత్ = ఆ ఫలము, తత్కాలం = ఆ వ్యాపారముయొక్క కాలము కలదిగా, ప్రతీయతే = తోచుచున్నది.

తాత్పర్యము— నిమిత్తముల వ్యాపారము ఫలసిద్ధికొరకై వినియుక్తమైన పిమ్మట ఆ ఫలసిద్ధియందు (ఫలమునందు) వ్యాపారరూపమును ఆరోపించుటచే, ఆ ఫలము, ఆ వ్యాపారమున కే కాలమో ఆ కాలము కలదిగా కనబడుచున్నది.

వివరణము— ఒక కార్యము సిద్ధింపవలెనన్నచో అనేక కారణముల సామగ్రి ఉండవలెను. ఆ కారణము లన్నియు ఫలజన్మ నిమిత్తమై వ్యాపారము చేయుచుండును. ఈ కారణముల వ్యాపారమే ఫలమని ఆరోపించుటచే ఈ వ్యాపారమునకును ఫలమునకును అభేద ప్రతీతి కలుగును. అందుచే కారణముల వ్యాపారము అతీతమైపోయినది గాన ఫలము కూడ అతీతమైనట్లు తోచును. పూర్వ కారికలో కారణ ధర్మములందు ఫలారోపము చెప్పబడినది. ఈ కారిక ఫలమునందు కారణ ధర్మారోపమును ప్రతిపాదించుచున్నది. ఈ విధముగ కారణ ధర్మములను ఫలమునందు ఆరోపించుటకు ప్రయోజన మేమనగా కారణములు సమర్థతరము లని చెప్పుటయే. ఈ విధముగ అతీతమగు వర్షముయొక్క కాలము కార్యమునందు (శాలి నిష్పత్తియందు) అధ్యసింపబడుటచే భూతకాల ప్రయోగము ఉపపన్నమగుచున్నది. కారణాంతరాపేక్ష లేదని చెప్పుట, ఈ విధమగు ప్రయోగములకు ప్రయోజనము. ॥108॥

అవతారిక— ఫల నిష్పత్తియనునది హేతువులవలన కలిగెడు ఉపకారముయొక్క సమాప్తిపై ఆధారపడియున్నది గాన ఆయా హేతూపకారములు నిష్పన్నము లగుటతో వివక్షానుసారముగా ఫలనిష్పత్తి వ్యవహారము కలుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ నిష్పత్తావవధిః కశ్చిత్ కశ్చిత్ ప్రతివివక్షితః ।
హేతుజన్మ వ్యపేక్షితః ఫలజన్మేతి చోచ్యతే ॥ 109

నిష్పత్తౌ = ఫలనిష్పత్తి విషయమున, కశ్చిత్ కశ్చిత్ = ఒక్కొక్క, అవధిః = అవధి, ప్రతి వివక్షితః = వివక్షితమగుచున్నది, హేతుజన్మ వ్యపేక్షాతః = కారణముల యొక్క జన్మను బట్టి, ఫలజన్మేతి చ = ఫలజన్మ అని కూడా, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ఫల నిష్పత్తి విషయమున వివక్షానుసారముగ ఒక్కొక అవధి అంగీకరింపబడును. హేతుజన్మను బట్టి ఫలజన్మయను వ్యవహారము వచ్చును.

విశేషాంశములు— ఒకడు శాల్యుత్పత్తి జలశాలి బీజసంబంధము మాత్రముపై ఆధారపడియున్నదని తలచును. మరియొకడు దాని తరువాత కలుగు ఆతపాదికృతమగు ఉపకారముపై ఆధారపడియున్నదని తలచును. ఈ విధముగ ఒక్కొక్కని భావనను బట్టి నిష్పత్తి హేతువు అనవస్థితముగ నున్నది. ఉత్పత్తి విషయమున ఈ కారణమువలన ఎక్కువ ఉపకారము జరుగుచున్నది అని చెప్పుటయే ఒక్కొక్కరు ఒక్కొక్క హేతువుపై నిష్పత్తి యాధారపడియున్నదని చెప్పుటకు కారణము. నిమిత్తాంతరములను లెక్కసేయక తాము అనుకొన్న నిమిత్తము జనింపగనే ఫలనిష్పత్తి యైనదని చెప్పుదురు. ఈ విధముగ హేతూప కార సమాప్తికిని ఫలనిష్పత్తికిని అభేదాధ్యవసాయమును బట్టియే హేతూపకార సమాప్తి కాలమును ఫలనిష్పత్తిపై ఆరోపించుట జరుగుచున్నదని యభిప్రాయము. ॥109॥

అవతారిక— కార్యము కారణములన్నియు సమకూడిన పిమ్మటనే సాధ్యమగును కాని ఏదియో ఒక కారణము సంపన్నమైనంత మాత్రమున ఎట్లు నిష్పన్నమగును అను ఆశంకకు సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ అబహిః సాధనాధీనా సిద్ధిర్యత్ర వివక్షితా ।
తత్ సాధనాన్తరాభావాత్ సిద్ధ మిత్యుపదిశ్యతే ॥ 110

యత్ర = ఏ కార్యము విషయమున, అబహిః సాధనాధీనా = బాహ్య సాధనములపై ఆధార పడి యుండని, సిద్ధిః = సిద్ధి, వివక్షితా = వివక్షితమైనదో, తత్ = అ కార్యము, సాధనాన్తరా భావాత్ = మరియొక సాధనము అక్కర లేకపోవుటచే, సిద్ధమితి = సిద్ధము అని, ఉప దిశ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ఏ కార్యముయొక్క సిద్ధి (సమకూడిన వానికంటె వేరయిన) బాహ్య సాధనములపై ఆధారపడియున్నది కాదని చెప్పుట వివక్షితమో, ఆ కార్యము సాధ నాంతరముల యపేక్ష లేకపోవుటచే సిద్ధమని చెప్పబడుచున్నది.

వివరణము— అంతరంగమగు ఒకానొక సాధనము సన్నిహితమైనపుడు బాహ్య సాధనాపేక్ష లేదని దానిని తిరస్కరించి, కార్యము అంతరంగ కారణము సహాయముచేతనే జరిగినదని లోకమున వ్యవహరించుచుందురు. ఈ లోక వ్యవహారము ననుసరించియే శాస్త్రీయ వ్యవస్థ యేర్పడుచున్నది ఈ విధముగ వివక్షానుసారముగ ఇట్టి విషయములలో కాలత్రయ సంబంధము కలుగుచుండును. ॥110॥

అవతారిక— ఇపు డీ చర్చను ముగించుచున్నాడు

శ్లో॥ తస్మాదవధి భేదేన సిద్ధా ముఖ్యైవ భూతతా ।
అనాగతత్వ మస్తిత్వం హేతుధర్మ వ్యపేక్షణే ॥ 111

తస్మాత్ = ఆ కారణమువలన, అవధి భేదేన = అవధి భూతమగు కారణముయొక్క భేదమును బట్టి, ముఖ్యైవ = ముఖ్యమేయైన, భూతతా = భూతత్వము, సిద్ధా = సిద్ధించును, హేతుధర్మ వ్యపేక్షణే = భిన్న హేతువుల వ్యాపారమును బట్టి చూచినపుడు, అనాగతత్వం = భవిష్య త్త్వము, అస్తిత్వం = వర్తమానత్వము కూడ ఉండును.

తాత్పర్యము— అందుచే, కారణభేదమును బట్టి ముఖ్యమగు భూతకాలమునే అంగీకరింపవచ్చును. ఇతర హేతువుల వ్యాపారములను గూడ అపేక్షించుటను బట్టి భావిత్వ వర్తమానత్వములు కూడ ఉండవచ్చును.

వివరణము— ఫలనిష్పత్తికి కారణము అవధి. దాని భేదమును బట్టి సమాప్తమైన ఆ కారణమునందు కార్యమును అధ్యసించ్చుటచే దాని భూతత్వము గూడ ముఖ్యమే. కారణము నందు కార్యమునే ఆరోపించుచున్నాము ; అంతియే కాని భూతకాలమును కార్యమునందు ఆరోపించుట లేదు. హేత్వంతరమునకు భావికార్య జనన వ్యాపారమున్నదని చెప్పవలసి వచ్చినచో అపుడు కార్యమునకు ముఖ్యరూపముననే భవిష్యత్త్వము లభించును. మరియొక హేతువునందు ప్రత్యాసన్న కార్యజనన వ్యాపారమున్నదని వివక్ష చేసినచో ఆ సమయమున కార్యమునకు ముఖ్యమగు వర్తమానత్వము లభించును. ఈ విధమున వివక్షానుసారముగ, వ్యవహారము ననుసరించి 'నిష్పన్నాః శాలయః', 'నిష్పద్యన్తే శాలయః' అను త్రివిధ ప్రయోగములును ఉండవచ్చును. ॥111॥

అవతారిక— ''అస్త్యర్థానాం భవన్త్యర్థే సర్వా విభక్తయః కర్తుర్విద్యమానత్వాత్'' అను వార్తికమున వార్తికకారుడు - అస్త్యర్థక ధాతువులకు, అనగా సత్తను బోధించు ధాతువులకు లట్ యొక్క అర్థమున (వర్తమానార్థమున) అన్ని లకారములును వచ్చును, ఏలయన ఆ ఉనికిలో కర్తయగునది నశింపకుండగ ఉంటూ ఉన్నది. ఒకడు కూపమును చూచినాడు. దాని కెపుడును అపాయము వచ్చినట్లు ఆతడు చూడలేదు. అందుచే ''కూపః అభూత్, కూపః అభవత్, కూపః బభూవ, కూపో భవిష్యతి, కూపో భవితా, కూపోఽస్తి'' అని అన్ని లకారములును వర్తమానకాలార్థమునే బోధించును అని చెప్పి, ''సిద్ధం తు యథా స్వకాలం సముచ్చారణాత్'' అను అనంతర వార్తికమున ఈ తిఙ్విభక్తు లన్నియు ప్రయోగానుసారముగ వాటి వాటి కాలమును బోధించుకొని ఒక్క వర్తమానార్థమును మాత్రమే కాదు అని ప్రతిపాదించినాడు. మొదటి వార్తికము ప్రకారము వర్తమానార్థమున లట్‌కు బదులు లఙ్ మొదలగు వాటిని ప్రయోగింపవచ్చును అని యన్నచో 'కూపః అస్తి' అనుటకు బదులు ''కూపః ఆసీత్'' అని ప్రయోగించెడివారు. ఆ విధముగ ప్రయోగించుట లేదు.

కావున ప్రయోగానుసారముగ ఆ యా లకారముల కాలమును గుర్తింపవలెనని నిషేధ వార్తి కాభిప్రాయము పైన చూపిన వార్తికాభిప్రాయమును వివరించుచున్నాడు.

శ్లో॥ సతామిన్ద్రియ సమ్బన్ధాత్ సైవసత్తా విశిష్యతే ।
భేదేన వ్యవహారో హి వస్త్వన్తర నిబన్ధనః ॥ 112

సతాం = వస్తువుల యొక్క, సా = ఆ, సత్తైవ = సత్తయే, ఇన్ద్రియ సంబంధాత్ = ఇంద్రియములతో సంబంధమువలన, విశిష్యతే = విశిష్ట రూపమున చూపబడుచున్నది, భేదేన = భేదముచేత, వ్యవహారః = వ్యవహారము, వస్త్వన్తర నిబన్ధనో హి = వస్త్వన్తరముపై ఆధార పడి యున్నది కదా ? ('ఇంద్రియ సన్నికర్షముపై ఆధారపడి యున్నదికదా' అని ప్రదీపో ద్ద్యోతమున నాగేశుడు వ్యాఖ్యానించెను).

తాత్పర్యము— సత్తులగు పదార్థముల సత్తయే ఇంద్రియ సంబంధముచే విశిష్ట రూపమున చూపబడుచున్నది. భేద వ్యవహారమంతయు ఇతర వస్తువులతో నేర్పడిన సంబంధముపై (ఇంద్రియ సన్నికర్షముపై) ఆధారపడినది కదా.

విశేషము— తనతో కలిసిన మరియొక పదార్థమునకు సంబంధించిన ధర్మములు తనపై ప్రసరించుటచే ఒక పదార్థమును గూర్చి వ్యవహరించుటకు అవకాశము లభించుచున్నది. కూపమునకు సత్త ఉన్నది. ఆ సత్తను గ్రహించినపుడు మాత్రమే శబ్ద ప్రయోగమునకు అవకాశమున్నది ఇంద్రియముల ద్వారా దానిని గ్రహింపకున్నచో ఆ కూపము అసత్తుతో సమానము గాన దానిని గూర్చిన శాబ్దవ్యవహారము కుదరదు కూపమునకు ఇంద్రియములతో సంబంధము కలుగగలదు అను స్థలములందు ఆ సత్త భవిష్యత్సత్త యని వ్యవహరింతుము. ఇంద్రియ కూప సన్నికర్షము జరిగిపోయిన యెడల ఆ సత్త భూతసత్త ; అది జరుగుచున్నపుడు వర్తమాన సత్త ఈ విధముగ ఇంద్రియ సన్నికర్షము నందలి భేదమును బట్టి కాల త్రయ వ్యవహారము కూడ ఉండవచ్చును. అందుచే ఏ లకార ముపయోగించినను అర్థము మాత్రము వర్తమానార్థమే అని చెప్పుట అయుక్తము. ॥112॥

అవతారిక— వర్తమాన విషయమున భూత భవిష్య ద్విభక్తులను ప్రయోగింప రాదని నట్లు వర్తమాన విభక్తిని గూడ భూత భవిష్య ద్విషయమున ప్రయోగింపరాదు కదా? కాని నిన్న కూపమును చూచినవాడు, లేదా రేపు చూడనున్నవాడు, ఇపుడు ఇంద్రియ సంయోగము లేకున్నను 'కూపః అస్తి' (నుయ్యి ఉన్నది) అని ప్రయోగించుచున్నాడు. ఈ 'అస్తి'కి భూతార్థమును గాని భావిష్యదర్థమును గాని చెప్పవలసి యున్నది ; అది ఎట్లు యుక్తమగును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ అస్తిత్వం వస్తుమాత్రస్య బుద్ధ్యా తు పరిగృహ్యతే ।
యః సమాసాదనాద్భేదః న తత్ర స వివక్షితః ॥ 113

వస్తు మాత్రస్య = ప్రతి వస్తువుయొక్కయు, అస్తిత్వం తు = అస్తిత్వమైతే, బుద్ధ్యా = బుద్ధి చేత, పరిగృహ్యతే = గ్రహింపబడుచున్నది, సమాసాదనాత్ = ఇంద్రియముల ద్వారా గ్రహించుట వలన ఏర్పడిన, యః = ఏ, భేదః = భేదము కలదో, సః = అది, తత్ర = అచట (ఆ సామాన్య సత్తా విషయమున), న వివక్షితః = వివక్షితము కాదు.

తాత్పర్యము— బుద్ధిచేత వస్తువుయొక్క సత్తమాత్రమే గ్రహింపబడుచున్నది. ఇచట, ఇంద్రియ సంబంధముచే నేర్పడిన భేదము వివక్షితము కాదు.

వివరణము— ఇంద్రియముతో వస్తువునకు సంబంధము కలుగుటచే నేర్పడు భూత భవిష్య ల్లక్షణమగు భేదమును వివక్షింపక, మనస్సుతో కూపమునందలి సత్తా మాత్ర మునే గ్రహించినపుడు 'కూపః అస్తి' అని సామాన్యరూపమున ప్రయోగము యుక్తమే.॥118॥

అవతారిక— వాస్తవమున సత్తకు ఔపాధిక భేదమును అంగీకరింప బనిలేదు. సత్తకు గల భేదము యథార్థమే అని చెప్పుచున్నాడు

శ్లో॥ యోగాద్వా స్త్రీత్వ పుంస్త్వాఖ్యాం న కించిదవతిష్ఠతే ।
స్వస్మిన్నాత్మని తత్రాన్యద్ భూతం భావి చ కథ్యతే ॥ 114

వా = లేదా, కించిత్ = ఏ వస్తువును, స్త్రీత్వ పుంస్త్వాఖ్యాం = అపచయోపచయములతో, యోగాత్ = సంబంధముండుట వలన, స్వస్మిన్ = తన సంబంధమగు, ఆత్మని = స్వరూపమునందు, న అవతిష్ఠతే = స్థిరముగ ఉండదు, తత్ర = దానియందు, అన్యత్ = భిన్నమైన స్వరూపమే, భూతం = భూతమనియు, భావిచ = భావియనియు, కథ్యతే = చెప్పబడు చున్నది.

తాత్పర్యము— ఏ వస్తువైనను సర్వదా ఉపచయాపచయములను (వృద్ధి హ్రాసములను) పొందుచుండును గాన ఒక్క స్వరూపముతో స్థిరముగా నుండదు. అందుచే వర్తమాన స్వరూపముకంటె భిన్నమైనది భూతస్వరూపము, దానికంటె భిన్నమైనది భావి స్వరూపము.

వివరణము— పుంస్త్వమనగా ఉపచయము (వృద్ధి); స్త్రీత్వమనగా అపచయము (హ్రాసము), ప్రతి వస్తువును ఉపచయాపచయములను పొందుచుండును. అందుచే ఒక్క క్షణమైనను అది స్వరూపముతో స్థిరముగ నుండజాలదు. కావున ఏ వస్తువునకైనను భూత స్వరూపము వేరు, వర్తమాన స్వరూపము వేరు. భవిష్యత్స్వరూపము వేరు. బుద్ధిచే రూప సామాన్యమును మాత్రము గ్రహించి ఆ వస్తువే ఇది అని అనుకొనుచుందుము. యథార్థముగ భేదమున్నను బుద్ధిచే అభేదమును కల్పించి 'కూపః అస్తి' ఇత్యాది సామాన్య వ్యవహారము చేయుచుందుము. ॥114॥

కాలసముద్దేశము ముగిసినది

పురుష సముద్దేశము

అవతారిక— 'తిఙ్' ప్రత్యయము క్రియను బోధించును. ఆ క్రియచే కాల-పురుష-ఉపగ్రహ-సంఖ్యలు అభివ్యక్తము లగును వాటిలో కాలస్వరూపమును పరీక్షించి ఇపుడు పురుషమును పరీక్షించుచున్నాడు.

శ్లో॥ ప్రత్యక్త్వా పరభావశ్చా ప్యుపాధీ కర్తృకర్మణోః ।
తయోః శ్రుతి విశేషేణ వాచకౌ మధ్యమోత్తమౌ ॥ 1

ప్రత్యక్త్వా = ప్రత్యక్త్వము (నేను, తాను అను జీవాత్మ భావము), పరభావశ్చాపి = పరత్వము (మధ్యమ పురుషత్వము), కర్తృ కర్మణోః = కర్తృ కర్మలకు, ఉపాధీ = ఉపాధులు, శ్రుతి విశేషేణ=శబ్ద విశేషముతో ఉపలక్షితములగు, మధ్యమోత్తమౌ=మధ్యమోత్తమములు, తయోః = ఆ ప్రత్యక్త్వ పరత్వములకు, వాచకౌ = వాచకములు.

తాత్పర్యము— ప్రత్యక్త్వము పరత్వము అను ఈ రెండును కర్తృ కర్మలకు ఉపాధులు. శబ్దవిశేషోప లక్షితము లగు మధ్యమోత్తమములు ఆ ప్రత్యక్త్వ పరత్వములను బోధించును.

విశేషాంశములు— ప్రతి = ప్రతి పురుషునియందును లేదా ప్రతి నియతమగు రీతిలో, అఞ్చతి = చేష్ట చేయుచున్నది కాబట్టి, 'ప్రత్యఙ్' అని చెప్పబడును. అనగా ప్రతి దేహమునందును నియతముగ నున్న అంతర్యామియగు జీవాత్మ. దానియొక్క ధర్మము ప్రత్యక్త్వము ఈ ప్రత్యక్త్వము ఉత్తమ పురుషముచే వాచ్యమగు అర్థము. 'అహం పచామి' ఇత్యాదులలో 'పచామి' మొదలగు ఆఖ్యాతములచే బోధింపబడు పచనాది క్రియ అహంకార ముతో సమానాశ్రయముగ ('అహం' అను పదముచేత ఏది బోధింపబడుచున్నదో దాని తోడనే క్రియ సంబంధించి యున్నది అని) బోధింపబడు చున్నది. ఇట్లు బోధింపబడుట ఉత్తమ పురుషమునకు విషయము. ఆత్మనేపదము, పరస్మైపదము అని రెండు విధములుగ నున్న స్వ (ఉత్తమపురుష) వాచకముల భేదమును బట్టి ఈ ఉత్తమ పురుషము అహంకారా శ్రయమగు ('నేను చేయుచున్నాను' అను ప్రతీతిని బట్టి) కర్తకును తిఙన్తవాచ్యమగు కర్మ కును ఉపాధిగ నున్నది. 'పచే', 'పచామి' ఇత్యాదులలో ఉత్తమ పురుషము కర్తకు ఉపాధి. ఇది కర్త్రుపాధియైనపుడు కొన్ని స్థలములలో కేవలము పరస్మైపదము చేతను, కొన్ని స్థలము లలో ఆత్మనే పదముచేతను, కొన్ని స్థలములలో రెండింటిచేతను ప్రతీతమగును. 'పచ్యే' (పచింపబడుచున్నాను) ఇత్యాది స్థలములలో ఇది అహంకారాశ్రయమగు కర్మకు ఉపాధి. కర్మణి ప్రయోగమున ఆత్మనేపదము మాత్రమే ఉండునుగాన కర్మోపాధియగు ఉత్తమ పురుషము ఆత్మనేపదము మాత్రముచేతనే గమ్యమగును. ఈ విధముగ కర్తృ కర్మాదులకు విశేషణముగ భాసించు దానికి పురుషమని పేరు. ఈ భాసించునది ప్రత్యక్తరూపమైనచో

ఉత్తమపురుషము, పరత్వమైనచో మధ్యమపురుషము. అనగా కర్తగాగాని, కర్మగాగాని భాసించునది తానైనచో (అహంకార సామానాధికరణ్య మున్నచో) ఉత్తమపురుషము, పరుడైనచో (పరభావ సామానాధికరణ్య మున్నచో) మధ్యమపురుషము. ఉత్తమపురుషము వలె కర్తృ కర్మోపాధిభూతమగు మధ్యమపురుషము గూడ ఆత్మనేపద పరస్మైపదములచే ప్రతీతమగును 'పచసి' 'పచసే' అనునది కర్త్రుపాధి మధ్యమపురుషమునకును, 'పచ్యసే' అనునది కర్మోపాధి మధ్యమపురుషమునకును ఉదాహరణము. ఈ విధముగ పరస్మైపదాత్మనే పదాస్త శబ్దోప లక్షితములగు ఉత్తమపురుష మధ్యమపురుషములు ప్రత్యక్త్వ పరత్వములను బోధించును. మధ్యమ పదవాచ్యమగునది ప్రశ్నించుట మొదలగు వాటికి యోగ్యముగ నుండును. 'నీవు వెళ్ళినావా ?' 'వచ్చినావా ?' ఇత్యాది విధముల ప్రశ్నించుటకు వీలుగా నుండవలెను. అనగా చేతన పదార్థముగ నుండవలెను. ఈ విధముగ కర్తృ కర్మ విశేషణమైన దానికి పురుషమని ప్రాచీనాచార్యుల వ్యవహారము. పాణినీయమున ప్రథమ - మధ్యమ - ఉత్తమ నామధేయములు మాత్రమే ఉన్నవిగాని 'పురుష' నామధేయము లేదు. ॥1॥

అవతారిక— ఉత్తమ పురుషము క్రియకు అహంకారముతో సామానాధికరణ్యమును తెలుపుననియు, మధ్యమపురుషము పరత్వముతో సామానాధికరణ్యమును తెలుపుననియు– అనగా క్రియ తనతో సంబంధించినదని చెప్పినపుడు ఉత్తమ పురుషమనియు, ఇతరునితో సంబంధించినట్లు చెప్పినపుడు మధ్యమపురుష మనియు వెనుక చెప్పబడినది. దీనినిబట్టి అహంకార పరభావములు చేతనముల విషయమముననే యుక్తములగును ; అచేతన విషయమున వీటికి ప్రయోగము ఉపపన్నము కాదని చెప్పినట్లైనది. అట్లైనచో ''శృణోత గ్రావాణః'' ((ఓ శిలలారా ! వినండి) మొదలగు అచేతన పదార్థములను సంబోధించు ప్రయోగములు ఎట్లు కుదురును, అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ సదసద్వాపి చైతన్య మేతాభ్యామేవ గమ్యతే ।
చైతన్య భాగే ప్రథమః పురుషో న తు వర్తతే ॥ 2

సత్ = వాస్తవమున ఉన్నదైనను, అసద్వాపి = ఆరోపితమైనదగుటచే వాస్తవమున లేనిదైనను, చైతన్యం = చైతన్యము, ఏతాభ్యామేవ = ఈ రెండింటిచేతనే, గమ్యతే = తెలియును, ప్రథమః పురుషస్తు = ప్రథమ పురుషమైతే, చైతన్యభాగే = చైతన్యాంశమున, న వర్తతే = ప్రవర్తింపదు.

తాత్పర్యము— ఈ రెండింటిచేతను, ఉన్నదైనను, లేనిదైనను చైతన్యమే గమ్యమగును. ప్రథమపురుషము మాత్రము చైతన్యాంశమున ప్రవర్తింపదు.

విశేషాంశములు— శబ్దమును ఉచ్చరించుటచే ఏ అర్థము బోధింపబడునో దానిని బట్టియే ఈ శాస్త్రమున, అన్వాఖ్యానము జరుగుచుండును. అందుచే శాబ్దమగు (శబ్దబోధ్యమగు) చైతన్యము అంతటను ఉన్నది. కాని పదాంతరములచే ఒక పదార్థము చైతన్యరహితమని తెలిసినచో అట్టి స్థలములలో చైతన్యము ఆరోపితము. కావున ''శృణోత గ్రావాణః'' ఇత్యా

దులలో చైతన్యము వాస్తవమున లేకపోయినను ఆరోపితముగ నున్నది. ఈ విధముగ ఉత్తమ మధ్యమపురుషములు చేతనపదార్థ మాత్ర బోధకములు. ప్రథమపురుషము మాత్రము అచేతన పదార్థ మాత్ర బోధకము. దీని స్థలమున చైతన్యారోపణము గూడ ఉండదు ॥2॥

అవతారిక— 'బుధ్యతే', 'జానాతి' 'చేతయతే' ఇత్యాది ప్రథమపురుష ప్రయోగ స్థలములలో గూడ చైతన్యోపాధి యగు కర్తయే తెలియుచున్నాడు 'తెలిసికొనుట' మొదలగు క్రియలను చేయు కర్త చేతనమే కదా? అందుచే "చైతన్యభాగే ప్రథమః పురుషో న తు వర్తతే" అని చెప్పుట అయుక్తము కదా, యని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ బుధిజానాతిచితిభిః ప్రథమే పురుషేసతి ।
సంజ్ఞానార్థైర్న చైతన్యస్యోపయోగః ప్రకాశ్యతే ॥ 3

ప్రథమే పురుషే సతి = ప్రథమ పురుషమును ప్రయోగించినపుడు, సంజ్ఞానార్థైః = చైతన్యార్థకము లగు, బుధిజానాతి చితిభిః = బుధ - జ్ఞా - చిత్ ధాతువులచే, చైతన్యస్య = చైతన్యము యొక్క, ఉపయోగః = ఉపయోగము, న ప్రకాశ్యతే = ప్రకాశింపబడుట లేదు.

తాత్పర్యము— చైతన్యార్థకములగు (జ్ఞానార్థకములగు) బుధ్, జ్ఞా, చిత్ ధాతువులు ప్రథమపురుషమును ప్రయోగించినపుడు చైతన్యోపయోగమును ప్రకాశింపచేయుట లేదు.

వివరణము— 'బుధ్యతే' (తెలిసికొనుచున్నాడు) ఇత్యాదులలో బుధ ధాతువు మొదలగు వాటికే చేతన ధర్మమగు జ్ఞానము అను అర్థమున్నది గాన చైతన్య ప్రకాశము కనబడుచున్నది గాని, ఇది (చైతన్య ప్రకాశము) ప్రథమపురుష ప్రయోగమువలన కాదు. జ్ఞానార్థములు కాని ధాతువులతో ప్రథమ పురుషమును ప్రయోగించినపుడు ఈ చైతన్య ప్రకాశము కానవచ్చుట లేదు కదా? ఉత్తమ మధ్యమపురుషములు మాత్రము అస్మద్యుష్మదర్థములతో సమానాధికరణములు కావున - అనగా 'అస్మద్యుత్తమః' (1-4-107) "యుష్మద్యుపపదే సమానాధికరణే స్థానిన్యపి మధ్యమః" (1-4-105) అను సూత్రములచే అస్మచ్ఛబ్ద యుష్మచ్ఛబ్దములను ప్రయోగించినపుడు గాని, వాటి యర్థము గమ్యమగునపుడుగాని, ఉత్తమ మధ్యమపురుషములను విధించుట వలన, ఈ రెండు పురుషములును చైతన్య వ్యాపారమును తప్పక ప్రకాశింపజేయును. ప్రథమపురుష ప్రయోగస్థలములలో మాత్రము ఎచటనైన చైతన్య వ్యాపారము కనబడినచో, అది ధాత్వర్థమగుటచే వచ్చినదే కాని ప్రథమ పురుషమును బట్టి ఏర్పడినది కాదు. అందుచే "చైతన్యభాగే ప్రథమః పురుషో న తు వర్తతే" అని చెప్పుట యుక్తమే అని భావము ॥3॥

అవతారిక— పరభావము (పరత్వము) బోధ్యమగునపుడు మధ్యమ పురుషము విధింపబడినది. ఈ విషయమున మతాంతరముచే ఒక విశేషమును చెప్పుచున్నాడు.

శ్లో॥ సమ్బోధనార్థః సర్వత్ర మధ్యమే కైశ్చిదిష్యతే ।
తథా సమ్బోధనే సర్వాం ప్రథమాం యుష్మదో విదుః ॥ 4

సర్వత్ర = సమస్తమైన, మధ్యమే = మధ్యమపురుష స్థలమునందును, కైశ్చిత్ = కొంతమంది చేత, సమ్బోధనార్థః=సంబోధన రూపార్థము, ఇష్యతే = అంగీకరింపబడును, తథా = అట్లే, యుష్మదః = యుష్మచ్ఛబ్దము యొక్క, సర్వాం = సమస్తమైన, ప్రథమాం = ప్రథమా విభక్తిని, సమ్బోధనే = సంబోధనము నందు, విదుః = అంగీకరించుచున్నారు.

తాత్పర్యము— కొందరు మధ్యమపురుష స్థలము లన్నింటియందును సంబోధ నార్థమునే అంగీకరింతురు. ఇట్లే యుష్మచ్ఛబ్ద ప్రథమారూపము లన్నింటిని సంబోధనము నందే అంగీకరింతురు.

వివరణము— 'గచ్ఛ' (వెళ్ళుము) 'భుఙ్క్ష్వ' (తినుము) ఇత్యాది స్థలములందు ఆజ్ఞ వివక్షితము గాన, (అట్టి స్థలములలో ఎదుటివానిని అభిముఖముగ చేసికొని అతనిని ఆజ్ఞాపింపవలసి యున్నదిగాన), సంబోధన ముండునని అందరును అంగీకరింతురు. అనగా 'త్వం గచ్ఛ' అను దానికి "ఓయీ, ఇటు చూడుము ; నీవు వెళ్ళుము" అన్నట్లు అర్థము చెప్పవలసి యుండును. ఆజ్ఞార్థకముల ప్రయోగమునందే కాక మధ్యమపురుష సామాన్యమున అనగా 'త్వం పచసి' ఇత్యాది స్థలములందు గూడ సంబోధనమున్నదని కొందరు అంగీక రింతురు. వీరి అభిప్రాయము ప్రకారము సంబోధనమనగా ఆభిముఖ్యమును మాత్రమును చేయుట. అందుచే యుష్మచ్ఛబ్ద ప్రథమా విభక్తి మూడు వచనములందును సంబోధనయే యని వీరి అభిప్రాయము.

అవతారిక— మధ్యమపురుషము, యుష్మచ్ఛబ్ద ప్రథమా విభక్తియు వెనుకటి కారికలో చెప్పిన విధమున సంబోధనార్థములైన పక్షమున "స్వాహేన్ద్రశత్రుః వర్ధస్వ" 'రాజాభవ యుధ్యస్వ' ఇత్యాది స్థలములలో 'వర్ధస్వ' 'యుధ్యస్వ' అను మధ్యమపురుష రూపములను ప్రయోగించుటచే అధ్యాహార్యమగు 'త్వం' అనునది సంబోధనము కావలెను. అపుడు దానితో 'ఇంద్ర శత్రుః' 'రాజా' అను పదములు సమానాధికరణములుగాన (అనగా 'త్వం' అను దానికి ఆ పదములు విశేషణములు గాన) ఇవి గూడ సంబోధనము లగును. అపుడు 'ఇంద్ర శత్రో' 'రాజన్' అని ప్రయోగింపవలెను గాని 'ఇంద్ర శత్రుః' 'రాజా' అని ప్రయోగింపరాదు కదా, యని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సమ్బోధనం నలోకేఽస్తి విధాతవ్యేన వస్తునా ।
స్వాహేన్ద్రశత్రుర్వర్ధస్వ యథా రాజా భవేతి చ ॥ 5

విధాతవ్యేన = విధింపదగిన, వస్తునా = వస్తువుతో, లోకే = లోకమునందు, సమ్బోధనం= సంబోధనము, నాస్తి=లేదు, యథా=ఎట్లనగా— "స్వాహేన్ద్రశత్రుః వర్ధస్వ"='సాహేన్ద్రశత్రుర్వర్ధస్వ' అనునదియు, 'రాజా భవ' ఇతి చ" = "రాజా భవ" అనునదియు ఉదా హరణములు.

తాత్పర్యము— "స్వాహేన్ద్రశత్రుర్వర్ధస్వ" "రాజాభవ" ఇత్యాదులందువలె విధింపదగిన వస్తువుతో లోకమునం దెక్కడను సంబోధనము ఉండదు.

విశేషము— ''సిద్ధస్యాభిముఖీ భావమాత్రం సమ్బోధనం విదుః'' (వాక్యప. III సా 168) అని చెప్పిన విధముగ సిద్ధమగు వానిని అభిముఖముగా చేసికొనుటకు సంబోధన మని పేరు. ఈ విధముగ సిద్ధమగు దాని విషయమున మాత్రమే సంబోధనముండును గాని సాధ్యమగు దాని విషయమున సంబోధన ముండదు ఉదాహరణమునకు— ఒకడు రాజ్యమును పొంది రాజుగానున్నచో ఆతనిని 'ఓ రాజా !' అని సంబోధింపవచ్చును. ఇంకను రాజు కాని వానిని 'ఓ రాజా !' అని సంబోధించుట ఎట్లు కుదురును ? పై ఉదాహరణములలో ''ఇంద్ర శత్రుత్వము' (ఇంద్రుని సంహరించే వాడగుట - ఇది యాగము పూర్తియైనచో తరువాత లభించునది), రాజత్వము (ఇది కూడ యుద్ధములో జయము లభించినచో లభించునది), అను నవి సాధ్యములే కాని సిద్ధములు కావు. అట్టి సాధ్యములగు వాటిని పురస్కరించుకొని సంబో ధనము కుదురదు. కావున శత్రు రాజపదములకు సంబోధన కార్యములు ('శత్రు' పదము నందలి 'ఉ' కారమునకు గుణము, రాజన్ - అంత్యనకారము లోపింపకుండుట అనునవి) కలుగవు.

అవతారిక— 'సమ్బోధనార్థః' ఇత్యాది కారికలో చెప్పిన విధముగ యుష్మచ్ఛబ్ద ప్రథమా విభక్తి సంబోధన విభక్తి గాన ఈ క్రింది శాస్త్ర కార్యము సిద్ధించునని చెప్పుచున్నాడు

శ్లో॥ యుష్మదః ప్రథమాన్తస్య పరశ్చేన్న పదాదసౌ ।
యుష్మదర్థస్య సిద్ధత్వాన్నియతా చాద్యుదాత్తతా ॥ 6.

యుష్మదర్థస్య = యుష్మచ్ఛబ్దార్థము, సిద్ధత్వాత్ = సిద్ధమైనదగుట వలన, అసౌ = ఇది (యుష్మచ్ఛబ్ద ప్రథమాంతము), పదాత్ = పదముకంటె, పరః = పరమైనది, న చేత్ = కాకున్నచో, యుష్మదః = యుష్మచ్ఛబ్దము యొక్క, ప్రథమాన్తస్య = ప్రథమాంతమునకు, ఆద్యుదాత్తతా = ఆద్యుదాత్తత్వము, నియతా = నియతముగ నుండును.

తాత్పర్యము— యుష్మచ్ఛబ్దార్థము సిద్ధము గాన, యుష్మచ్ఛబ్ద ప్రథమాంతము, పదముకంటె పరము కాకున్నచో, దానికి ఆద్యుదాత్తత్వము నియతముగ లభించును.

విశేషాంశము— ఆ మంత్రితము యొక్క (సంబోధన పదముయొక్క) ఆది ఉదాత్తము అగునని 'ఆమన్త్రితస్య చ' (8.1.198) అను సూత్రముచే విధింపబడినది. ''తథా సంబోధనే సర్వాం ప్రథమాం యుష్మదో విదుః'' అని పూర్వకారికలో చెప్పిన విధమున యుష్మచ్ఛబ్ద ప్రథమారూపము లన్నియు సంబోధమే గాన వాటి విషయమున ఈ సూత్రము ప్రవర్తించి ''త్వమగ్నే ప్రయాజానుయాజానాం పురస్తాత్'' ఇత్యాది వాక్యములలోని యుష్మ చ్ఛబ్దమునకు నియతముగ ఆద్యుదాత్తత్వము లభించుచున్నది. ఇది పదముకంటె పరమైనపుడు మాత్రము 'ఆమన్త్రితస్య చ' (8-1-19) అను మరియొక సూత్రముచే (పదముకంటె పర మును, పాదాదియందు లేనిదియు అగు ఆ మంత్రితమునకంతకును అనుదాత్తము వచ్చును అని దీని యర్థము) అనుదాత్తమగును. ''దేవీరాపః శుద్ధా యూయమ్'' ఇత్యాదులుదాహర ణము. ఇచట 'యూయం' అను యుష్మచ్ఛబ్ద ప్రథమా బహువాంచనాంతపదము ఆ మంత్రి

తము. ఇది పదముకంటె పరముగాన అనుదాత్తము వచ్చినది. సిద్ధమగునది సంబోధన విషయమగుటలో విప్రతి పత్తి లేదని సూచించుటకై 'యుష్మదర్థస్య సిద్ధత్వాత్' అని చెప్పబడినది. ఈ విధముగ యుష్మచ్ఛబ్ద ప్రథమారూపము లన్నియు సంబోధనములు గావున 'ఆమంత్రితస్య చ' అను మొదట చెప్పిన సూత్రమును అనుసరించి (ఆ పరము పదముకంటె పరము కానపుడు) నియతముగ ఆద్యుదాత్తము వచ్చుటకు అవకాశమున్నదని తాత్పర్యము.

అవతారిక — పైన చెప్పిన విధముగ పురుషప్రత్యయములు నియతార్థమును బోధించునని తేలినది. అట్లైనచో 'శాలాకికోఽస్మి' 'శాలాకికోఽసి' ఇత్యాది ప్రయోగములు కుదురవు. ఏలయన శలాకా శబ్దముకంటె శలాకలతో ఆడుచున్నాడు (శలాకాభిః దీవ్యతి - దీవ్యతి అనునది ప్రథమ పురుషములో నున్నది) అను అర్థమున "తేన దీవ్యతి, ఖనతి, జయతి, జితమ్" అను సూత్రముచే (4-4-2) ఠక్ ప్రత్యయము చేయగా 'శాలాకికః' అను రూపము నిష్పన్నమైనది. అనగా ఇచట 'దీవ్యతి' అని ప్రథమపురుషముచే అర్థము నిర్దేశింపబడునపుడు మాత్రమే తద్ధితవచ్చును. పై ఉదాహరణములలో ఉత్తమ - మధ్యమ విషయములలో ఇది వచ్చుటకు అవకాశము లేదు కదా యని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ గుణప్రధానతా భేదః పురుషాది విపర్యయః ।
నిర్దిష్టస్యాన్యథా శాస్త్రే నిత్యత్వాన్న విరుధ్యతే ॥ 7

నిత్యత్వాత్ = శబ్దము నిత్యమగుటవలన, శాస్త్రే = శాస్త్రమునందు, అన్యథా = మరియొక విధముగా, నిర్దిష్టస్య = నిర్దేశింపబడిన శబ్దమునకు, గుణ ప్రధానతా భేదః = గుణ ప్రధానతా భేదము, పురుషాది విపర్యయః = పురుషాదుల మార్పు, న విరుధ్యతే = విరుద్ధములు కావు.

తాత్పర్యము— శబ్దము నిత్యము. అందుచే శాస్త్రమునందు మరియొక విధముగ నిర్దిష్టమగు శబ్దమునకు. గుణ ప్రధానతా భేదముగాని, పురుషాదుల విపర్యయము గాని వచ్చినను అది విరుద్ధము కాదు.

విశేషము— శాస్త్రము నిత్యములగు శబ్దముల అన్వాఖ్యానము (ప్రకృతి ప్రత్యయాదుల విభాగముచే శబ్ద నిష్పాదనము అన్వాఖ్యానము) చేయునపుడు ఏదియో ఒక అర్థమును నిమిత్తముగ చూపవలెను గాన దానిని చూపుచు, దానికి ఆవశ్యకములగు ఏవియో పురుషాదులను కూడ చూపుచుండును. కాని చూపిన ఆ పురుషాదులే, అంతటను, ఆ అర్థమున భాసింపవలెనను నియమము లేదు. 'తేనదీవ్యతి...' ఇత్యాది లక్షణమున (శాస్త్రమున) ఆఖ్యాత ప్రధాన నిర్దేశము చేసినను తద్ధితాంతము సత్త్వ ప్రధానమగును. అనగా తద్ధితాంతమగు 'శాలాకికః' అను దానికి 'శలాకతో ఆడుచున్నాడు' అను నర్థము కాక "శలాకలతో ఆడెడు వాడు" అను నర్థము చెప్పుటచే ఈ శబ్దము సత్త్వ ప్రధానమైనది. కావుననే దీనికి లింగాదులతో సంబంధ మేర్పడినది. ఇట్లే లక్షణమునందు ఒక పురుషమును గ్రహించినను లక్ష్యమున పురుషాంతరాన్వయము కలుగుటలో దోషము లేదు.

అవతారిక — ఈ విషయమునే సమర్థించుటకు చెప్పుచున్నాడు.

శ్లో॥ యథానిర్దేశమర్థాః స్యుర్యేషాం శాస్త్రం విధాయకమ్ ।
కిఞ్చిత్ సామాన్యమాశ్రిత్య స్థితే తు ప్రతిపాదనమ్ ॥ 8

యేషాం = ఎవరి మతమునందు, శాస్త్రం = శాస్త్రము, విధాయకం = శబ్ద నిష్పాదకమో, వారి మతము ననుసరించి, అర్థాః = అర్థములు, యథా నిర్దేశం = శాస్త్ర నిర్దేశానుసారముగనే, స్యుః = అగును (కావలసి వచ్చును), స్థితే = ఒకానొక శబ్దస్వరూప ముండగా, కించిత్ = ఒకానొక, సామాన్యం = సామాన్య ధర్మమును, ఆశ్రిత్య = ఆశ్రయించి, ప్రతిపాదనం = శబ్దార్థ ప్రతిపాదనము, (చేయబడును).

తాత్పర్యము— శాస్త్రము శబ్దములను సృష్టించును అని అంగీకరించెడి వారి మతమున అర్థములు శాస్త్రములో నిర్దేశించిన విధముగ మాత్రమే ఉండునని చెప్పవలసి వచ్చును. (అది యుక్తము కాదు) ఉన్న శబ్దమునకు, ఏదియో ఒక సామాన్య ధర్మము నాశ్రయించి, అర్థ ప్రతిపాదనము చేయబడుచుండును.

వివరణము— శాస్త్రముచే శబ్దములు నిర్మింపబడును అని కొందరి అభిప్రాయము. అట్లైనచో శాస్త్రము ఏ పదమునకు ఏ అర్థమును నిర్దేశించినదో ఆ అర్థమే బోధింపబడును గాని మరియొక అర్థమును బోధించుటకు వీలుపడదు. అట్లైనచో 'శాలాకికః', 'ఆక్షికః' ఇత్యాది పదములకు 'శలాకలచే ఆడుచున్నాడు' 'అక్షములచే ఆడుచున్నాడు' ఇత్యాది విధముల ప్రథమపురుష సంబద్ధార్థమునే చెప్పవలసి యుండును అట్లైనచో వెనుక ఆశంకించిన విధమున 'శాలాకికోఽసి' 'శాలాకికోఽస్మి' ఇత్యాది ప్రయోగములు అయుక్తము లనవలసి వచ్చును. కావున శాస్త్రము నిత్యమగు శబ్దమునే సాధించుచు, ఏదియో ఒక సామాన్య ధర్మమును గ్రహించి అర్థ నిర్వచనము చేయుచుండునని చెప్పుట యుక్తము. ఇట్లు అంగీకరించిన పక్షమున 'శాలాకికః' ఇత్యాదులలో 'శలాకలచే ఆడుట' మొదలగు సామాన్యమునకే గ్రహణము గాని పురుషవిశేషము గాని, ఆఖ్యాతార్థత్వాదికము గాని వివక్షితము కాదు.

అవతారిక— ఈ విషయమున భాష్యకారదర్శితమగు దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ యోఽశ్వే యః పీఠ ఇత్యత్ర భూతయోరశ్వపీఠయోః ।
యథోపలక్షణార్థత్వం తథార్థేష్వనుశాసనమ్ ॥ 9

యః = ఎవడు, అశ్వే = అశ్వముపై నున్నాడో, యః = ఎవడు, పీఠే = పీఠమునందు ఉన్నాడో (అతడు దేవదత్తుడు), ఇత్యత్ర = ఇత్యాది స్థలములందు, భూతయోః = సిద్ధములై ఉన్న, అశ్వపీఠయోః = అశ్వపీఠములు, యథా = ఏ విధముగా, ఉపలక్షణార్థత్వం = ఉపలక్షణములుగ ఉపయోగించుచున్నవో, తథా = అట్లే, అర్థేషు = అర్థములయందు, అనుశాసనమ్ = శాస్త్రానుశాసనము (చేయబడును).

తాత్పర్యము— "అశ్వముపై ఎవ్వడున్నాడో, పీఠముపై ఎవ్వడున్నాడో అతడు దేవదత్తుడు" ఇత్యాది వాక్యములలో సిద్ధములగు అశ్వపీఠాదులు ఉపలక్షణములుగ నున్నట్లు శబ్దానుశాసనమునందు చూపబడు అర్థములు గూడ ఉపలక్షణార్థములే.

విశేషాంశము— ఒక్కచోట చాలామంది ఉన్నప్పుడు, వీరిలో దేవదత్తుడు ఎవరు, అని ఎవరైన ప్రశ్నింపగా, "అశ్వముపై నున్నవాడు దేవదత్తుడు" లేదా "పీటపై కూర్చున్న వాడు దేవదత్తుడు" అని సమాధానము చెప్పుదురు. ఇచట అశ్వమేదియో లేదా పీఠమేదియో చెప్పవలసిన పనిలేదు. అవి సిద్ధములై ప్రష్టకు తెలిసియే యున్నవి. దేవదత్తు డెవరో అనునది యే క్రొత్తగ చెప్పవలసిన విషయము గాన అది విధేయము దేవదత్తునికి గుర్తుగా (ఉపలక్షణముగ) అశ్వపీఠాదులు చెప్పబడుచున్నవి. అట్లే "తేన దీవ్యతి" - ఇత్యాది శాస్త్రముచే విహితములగు ప్రత్యయములకే ప్రాధాన్యము గాని అర్థములకు అంత ప్రాధాన్యము లేదు. అవి కేవలము ఉపలక్షణము మాత్రమే. కావున వాటి యర్థము అవియైన కావచ్చును లేదా వానికి ఇంచుమించుగా దగ్గరలోనున్న ఇతరములు అర్థము కావచ్చును ప్రత్యయాదులను విధించుటయే వ్యాకరణ శాస్త్రమునకు ప్రధానోద్దేశ్యము గాని అర్థ ప్రతిపాదనము కాదు.

పురుష సముద్దేశము ముగిసినది

సంఖ్యా సముద్దేశము

అవతారిక — ఇపుడు సంఖ్యను గూర్చి విచారించుచున్నాడు.

శ్లో॥ సంఖ్యావాన్ సత్త్వభూతోర్థః సర్వ ఏవాభిధీయతే ।
భేదాభేదవిభాగో హి లోకే సంఖ్యానిబన్ధనః ॥ 1

సత్త్వభూతః = ద్రవ్యస్వరూపమగు, సర్వః ఏవ = సమస్తమైన, అర్థః = పదార్థము, సంఖ్యావాన్ = సంఖ్య కలదిగా, అభిధీయతే = చెప్పబడుచున్నది, లోకే = లోకమునందు, భేదాభేద విభాగః = భేదము అభేదము అను వాని నుద్దేశించిన విభజనము, సంఖ్యా నిబన్ధనో హి = సంఖ్యనుబట్టి ఏర్పడునది కదా.

తాత్పర్యము— ద్రవ్యరూపమగు ప్రతి పదార్థము - అనగా ప్రతి ద్రవ్యము, సంఖ్య కలదిగా చెప్పబడినది. లోకమున భేదాభేద రూపమగు విభాగము సంఖ్యను బట్టియే ఏర్పడినది కదా ?

విశేషము— 'ఇది' 'అది' అని సర్వనామములచే నిర్దేశించుటకు యోగ్యమగు వస్తువులు పరస్పరము భిన్నములుగ నుండును ఈ వస్తువులలో నున్న భేదమును రెండు, మొదలగు సంఖ్యలచే, ఒక వస్తువునుండి మరియొక వస్తువును వేరుగ నుద్దేశించి చూప వీలగును. ఈవిధముగ అన్ని ద్రవ్యములును సంఖ్యలతో సంబంధించి యుండును. ఒకటి అను సంఖ్య అభేదమును, రెండు మొదలగు సంఖ్య లన్నియును భేదమును సూచించును

అవతారిక — వైశేషికాదులు సంఖ్య గుణమనియు, ద్రవ్యమును ఆశ్రయించి యుండుననియు అంగీకరించిరి. అసహాయమగు ద్రవ్యము (అనగా ఒక ద్రవ్యము ప్రక్క మరియొక ద్రవ్యము లేనిచో అది) ఏకత్వరూపమనియు, ఆ ద్రవ్యము సహాయమైనచో ద్విత్వాదికమనియు, అందుచే ద్రవ్య వ్యతిరిక్తమగు సంఖ్య అనునది స్వతంత్రముగ లేదనియు కొందరి యభిప్రాయము. ఏది ఎట్లున్నను శబ్దైక ప్రమాణము నాశ్రయించు వారికి పదార్థ విచారణము విషయమున అంత పట్టింపు లేదు. శాస్త్రకారులు లోక వ్యవహారానుసారముగ పదార్థ కల్పన చేసియున్నారు. వారు చేసిన కల్పన ననుసరించి పదార్థముల వ్యవస్థ చేయ వలసి యున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ స ధర్మో వ్యతిరిక్తో వా తేషామాత్మైవ వా తథా ।
భేదహేతుత్వ మాశ్రిత్య సంఖ్యేతి వ్యపదిశ్యతే ॥ 2

సః = ఆ, ధర్మః = సంఖ్యారూపమగు ధర్మము, వ్యతిరిక్తోవా = ద్రవ్యముకంటె భిన్నమైన దైనను, తథా = మరియు, తేషాం = ఆ ద్రవ్యముల యొక్క, ఆత్మైవవా = స్వరూపమే

యైనను, భేద హేతుత్వం = ఆ ద్రవ్యముల పరస్పర భేదమునకు హేతువగుటను, ఆశ్రిత్య= ఆధారముగ చేసికొని, సంఖ్యేతి = సంఖ్యయని, వ్యపదిశ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ఆ ధర్మము ద్రవ్యములకంటె భిన్నమైనను, ద్రవ్యస్వరూపమే యైనను, ద్రవ్యముల భేదమునకు హేతువగుటను బట్టి సంఖ్య అని చెప్పబడుచున్నది

వివరణము— ధర్మము ద్రవ్యములకంటె భిన్నమైన గుణమా లేక ద్రవ్యరూపమా అనెడు విచారము నిష్ప్రయోజనము ఒకటి, రెండు, మూడు మొదలగు భేద వ్యవహారము నకు హేతువగు ఒకానొక ధర్మమున్నట్లు శబ్దమువలన తెలియుచున్నది. భేదహేతువగు ఈ ధర్మమునకు 'సంచష్టే ఇతి సంఖ్యా' (స్పష్టముగ భేదమును చెప్పునది గావున సంఖ్య) అను సార్థకనామము వ్యవహారములో నున్నది

అవతారిక— సంఖ్య ద్రవ్యాశ్రితమైనచో గుణాదులలో గూడ (ఒక రూపము, రెండు రూపములు ఇత్యాది విధమున) సంఖ్యనుబట్టి వ్యవహారము ఎట్లు ఏర్పడుచున్నది అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ సమవేతా పరిచ్ఛేద్యే క్వచిదన్యత్ర సా స్థితా ।
ప్రకల్పయతి భావానాం సంఖ్యాభేదం తథాత్మనః ॥ 3

పరిచ్ఛేద్యే = పరిచ్ఛేద్యమగు దానియందు (ద్రవ్యమునందు), సమవేతా = సమవాయ సంబంధముతో నుండునదియు, క్వచిత్ = కొన్ని స్థలములందు, అన్యత్ర = పరిచ్ఛేద్యము కానిదాని యందు, స్థితా = ఉన్నదియు అగు, సా = ఆ, సంఖ్యా = సంఖ్య, భావానాం = భావముల కును, తథా = మరియు, ఆత్మనః = తనకును, భేదం = భేదమును, ప్రకల్పయతి = కల్పించును.

తాత్పర్యము— ఒకప్పుడు పరిచ్ఛేద్యమునందు సమవాయ సంబంధముతో నుండు నదియు, ఒకప్పుడు పరిచ్ఛేద్యము కాని దానితో సంబంధించునదియు అగు సంఖ్య భావముల కును తనకును గూడ భేదమును కల్పించును.

విశేషము— ద్రవ్యము పరిచ్ఛేద్యమగునపుడు, అనగా సంఖ్య ద్రవ్యమునందున్న భేదమును తెలుపునపుడు, అది (సంఖ్య) గుణముగాన ద్రవ్యమునందే సమవాయ సంబంధ ముతో నుండును ఈ సంఖ్య గుణములను గూడ పరిచ్ఛేదించును. అపుడు గుణములందు గుణాంతరము లుండవుగాన సంఖ్య ఆ గుణములందు కాక ఆ గుణములకు ఏ ద్రవ్యములు ఆశ్రయములో ఆ ద్రవ్యములందే సమవాయ సంబంధముతో నుండును. రూపాది గుణము లును సంఖ్యయు ఒకే ద్రవ్యమునందు సముదాయ సంబంధముతో నున్నవి గాన సంఖ్య గుణములను పరిచ్ఛేదింప గలుగుచున్నది. ఇట్లే సంఖ్య తన్ను (సంఖ్యను) గూడ పరిచ్ఛేదించు చున్నది. ఉదాహరణమునకు— శతం, శతే, శతాని ఇత్యాదులలో శత సంఖ్యను ఏకద్వి త్రిత్వాది సంఖ్యలు పరిచ్ఛేదించుచున్నవి. ఇట్టి స్థలములలో గూడ సంఖ్య ద్రవ్యసమవేతమై

యుండి, ద్రవ్య సమవేతములగు సంఖ్యాంతరములను పరిచ్ఛేదించుచున్నది. ఇట్లే 'పంచకర్మ జాతయః' 'ద్వేసామాన్యే' ఇత్యాది స్థలములలో పదార్థ సమవేతమగు సంఖ్య, పదార్థ సమవేతములగు కర్మ జాత్యాదులను పరిచ్ఛేదించుచున్నది. నిరూపాఖ్యమగు (స్వరూప రహితమగు) అభావమునకు గూడ ఔపాధికమగు సంఖ్యా సంబంధముచే 'చత్వారః అభావాః' ఇత్యాది వ్యవహారము చేయబడుచున్నది ఈ విధముగ కొన్ని స్థలములలో సంఖ్యకు స్వపరిచ్ఛేద్యముతో సంబంధము ముఖ్యము. కొన్ని యెడల గౌణము. ఈ విధముగ భేదగణనా మాత్ర లక్షణమగు సంఖ్య అనునది ఒకటి ఉన్నదనియు దానితో వ్యవహారము చేయవచ్చుననియు చెప్పిన సరిపోవును. దీనిని గూర్చిన శాస్త్రకార మతభేదములతో మనకు పనిలేదని యర్థము. ॥3॥

అవతారిక— సంఖ్య ద్రవ్య సమవేతమైనను గుణాదుల భేద వ్యవహారమునకు ఉపయోగింపవచ్చును అను విషయమున దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ పరత్వేచాపరత్వే చ భేదే తుల్యా శ్రుతిర్యథా ।
సంఖ్యా శబ్దాభిధీయత్వం భేదహేతో స్తథా గుణే ॥ 4

పరత్వేచ = పరత్వము విషయమునను, అపరత్వేచ = అపరత్వము విషయమునను, భేదే = భేదమున్నను, యథా = ఏ విధముగ, తుల్యా = సమానమగు, శ్రుతిః = శ్రవణమున్నదో, తథా = అట్లే, భేద హేతోః = ద్రవ్య భేదమునకు కారణభూతమగు సంఖ్యయే, గుణే = గుణము విషయమునందు గూడ, సంఖ్యా శబ్దాభిధీయత్వం = సంఖ్యా శబ్దముచే అభిధేయమగును.

తాత్పర్యము— ద్రవ్య గుణములకు సంబంధించిన పరత్వా పరత్వముల విషయమున భేదమున్నను ఏ విధముగ తుల్యమగు పరత్వాపరత్వముల శ్రుతి యుండునో అట్లే ద్రవ్యభేద హేతువగు సంఖ్యయే గుణము విషయమున గూడ సంఖ్యా శబ్దాభిధేయమై యుండును.

విశేషము— రెండు ద్రవ్యములు వేరు వేరు ప్రదేశములందున్నపుడు ఈ ద్రవ్యము దూరముగ (పరముగ) నున్నది. ఇది దగ్గరగ (అపరముగ) ఉన్నది అను పరత్వాపరత్వ రూపములగు గుణములు ద్రవ్య సమవేతములై భాసించుచుండును. అట్లే రూపాది గుణముల విషయమునందు గూడ ఈ పరత్వాపరత్వ బుద్ధి కలుగుచున్నది. ఈ రూపాది విషయక పరాపర బుద్ధికి ద్రవ్యవిషయక పరాపరబుద్ధులే కారణము. అనగా ద్రవ్యమగు ఘటము పరముగ నున్నదిగాన దాని రూపముగూడ పరముగ నున్నట్లు భాసించుచున్నది. అది అపరముగ నున్నచో దాని రూపమును అపరమగుచున్నది. ఈ విధముగ ద్రవ్య సమవేతములగు పరత్వాపరత్వములే గుణముల పరత్వాపరత్వములకు గూడ హేతువైనట్లు ద్రవ్యసమవేతమగు సంఖ్యయే ద్రవ్యసమవేతములగు రూపాది గుణముల సంఖ్యకు గూడ కారణమగుచున్నది. అనగా ద్రవ్యములకు సంబంధించిన సంఖ్యకంటె రూపాదిగత సంఖ్య భిన్నముకాదని యర్థము.

అవతారిక— ఒక్క సంఖ్యా పరత్వాపరత్వాదుల విషయముననే కాదు ; ఒక దానిని ఆశ్రయించుకొని యున్న అన్నింటి వ్యవహారములును ఆశ్రయమైన దాని ధర్మములను బట్టి యుండునని చెప్పుచున్నాడు.

శ్లో॥ అస్వతన్త్రే స్వతన్త్రత్వం పరధర్మో యథా గుణే ।
అభేద్యే భేద్యభావోఽపి ద్రవ్యధర్మస్తథా గుణే ॥ 5

అస్వతన్త్రే = స్వతంత్రము కాని, గుణే = గుణమునందు, పరధర్మః = గుణమునకు ఆశ్రయభూతమగు ద్రవ్యముయొక్క ధర్మమైన, స్వతన్త్రత్వం = స్వతంత్రత్వము, యథా = ఎట్లు భాసించుచున్నదో, తథా = అట్లే, అభేద్యే = సంఖ్యచే వ్యవచ్ఛేద్యము కాని, గుణే = గుణమునందు, ద్రవ్యధర్మః = ద్రవ్యముయొక్క ధర్మమగు, భేద్యభావోఽపి = వ్యవచ్ఛేద్యత్వము కూడ భాసించును

తాత్పర్యము— అస్వతంత్రమగు గుణమునందు ద్రవ్యధర్మమగు స్వాతంత్ర్యము భాసించినట్లు, అది (గుణము) సంఖ్యావ్యవచ్ఛేద్యము కాకున్నను ద్రవ్యధర్మమగు వ్యవచ్ఛేద్యత్వము భాసించును.

వివరణము— రూపాది గుణములు ఎల్లప్పుడును ద్రవ్యము నాశ్రయించి యుండుటచే నిత్య పరతంత్రములు. అట్లైనను 'పటస్యరూపమ్' (వస్త్రముయొక్క రూపము) అని స్వాతంత్ర్యము రూపమునందు వ్యపదేశింపబడుచున్నది. ఈ స్వాతంత్ర్యము వాస్తవమున రూపమునకు చెందినది కాదు ; పటరూప ద్రవ్యమునకు చెందినది. ఇచట స్వాతంత్ర్యమనగా స్వతంత్రముగ నున్నట్లు భాసించుట. ''శుక్లః పటః'' (తెల్లని వస్త్రము) అనునపుడు శుక్ల గుణము పటరూప ద్రవ్యమునకు ఉపసర్జనమైనట్లు (అనగా పటము నాశ్రయించికొని యుండి అప్రధానమైనట్లు) భాసించుచున్నది. ద్రవ్యమునుండి శుక్ల గుణమును విడదీసినట్లు ''పటస్య శుక్లః'' అని ప్రయోగించినపుడు ద్రవ్యమునకు గల స్వాతంత్ర్యము దీనియందు సంక్రమించినట్లు కనబడుచున్నది. అట్లే గుణము సంఖ్యా వ్యవచ్ఛేద్యము కాకున్నను తదాశ్రయభూతమగు ద్రవ్యము సంఖ్యా వ్యవచ్ఛేద్యమగుటచే దానినిబట్టి ఇదిగూడ వ్యవచ్ఛేద్యత్వమును పొందుచున్నది. ॥5॥

అవతారిక— ఈ విషయముననే ఇంకను విశదీకరించుచున్నాడు.

శ్లో॥ స్వబుద్ధ్యా తమపోద్ధృత్య లోకోఽప్యాగమమాశ్రితః ।
స్వధర్మాదన్యధర్మేణ వ్యాచష్టే ప్రతిపత్తయే ॥ 6

లోకోఽపి = సామాన్యజనుడు కూడా, ఆగమం = శాస్త్రమును, ఆశ్రితః = ఆశ్రయించినవాడై, స్వబుద్ధ్యా = తన బుద్ధిచేత, తం = ఆ గుణమును, అపోద్ధృత్య = ద్రవ్యమునుండి విడదీసి, స్వధర్మాత్ = గుణ ధర్మముకంటె, అన్యధర్మేణ = భిన్నమగు ద్రవ్యముయొక్క ధర్మముచే, ప్రతిపత్తయే = ఇతరునికి జ్ఞానము కలుగుటకై, వ్యాచష్టే = చెప్పుచుండును.

తాత్పర్యము— లౌకిక జనుడుకూడ ఆగమము ప్రకారము తన బుద్ధిచే గుణమును ద్రవ్యమునుండి వేరుచేసి దాని ధర్మముకంటె భిన్నమగు ద్రవ్య ధర్మమును పురస్కరించు కొని ఎదుటివానికి తెలియజెప్పు చుండును

వివరణము— ద్రవ్యముకంటె భిన్నముగ గుణము ఉన్నది. అది ద్రవ్యమునందు సమవాయ సంబంధముతో నుండును ద్రవ్యధర్మములను బట్టి గుణధర్మములు గూడ ఉండును, అని కేవలము వైశేషికాదులే కాదు; లౌకిక జనులు కూడ ద్రవ్యమునుండి గుణమును స్వబుద్ధిచే వేరుగా భావించి గుణధర్మ విలక్షణమగు ద్రవ్యధర్మమును పురస్కరించుకొని, ఇతరులకు తెలియజెప్పు చుండును. ఉదాహరణమునకు— ఒక వస్త్రమునందు అనేక రూపము లుండవచ్చును. కాని ఆ పటమును ఒక్క వస్తువుగా గ్రహించి, ఆ పటమునందున్న ఏకత్వ సంఖ్యను బట్టి గుణమునందు గూడ ఏకత్వము నారోపించి "ఈ పటమునందు ఒక చిత్ర రూపమున్నద" అని చెప్పును. పటమునంతను ఒక్క వస్తువుగ కాక పటావయవముల నన్నింటిని వేరు వేరుగ భావించినచో వాటి సంఖ్యనుబట్టి దీని నాలుగు అవయవములందును నాలుగు రూపములు ఉన్నవని చెప్పును. ఈ విధముగ ఆశ్రయ ధర్మములను బట్టి ఆశ్రిత ధర్మములను వ్యవహరించుట లోకములో కూడ నున్నది ॥6॥

అవతారిక— శబ్దము ఎల్లప్పుడును సంబంధించిన ధర్మములతో ఆచ్ఛరితమగు (ధర్మచ్ఛాయాచ్ఛాదితమగు) వస్తువునే బోధించును. ఈ నియమము ద్రవ్యము విషయమునం దైనను, గుణాదుల విషయమునందైనను సమానమే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ పరోపకారతత్త్వానాం స్వాతన్త్ర్యేణాభిధాయకః ।
శబ్దః సర్వపదార్థానాం స్వధర్మాత్ విప్రకృష్యతే ॥ 7

పరోపకారతత్త్వానాం=ఇతర ధర్మములచే ఉపకరింపబడిన స్వరూపముగల, సర్వపదార్థానాం = ద్రవ్యగుణాది సకల పదార్థములను, స్వాతంత్ర్యేణ = ధర్మసంసర్గ శూన్యమగు శుద్ధ రూపముతో, అభిధాయకః = బోధించెడు, శబ్దః = శబ్దము, స్వధర్మాత్ = వాచకత్వ రూప మగు తన ధర్మమునుండి, విప్రకృష్యతే = వేరు చేయబడుచున్నది.

తాత్పర్యము— అన్యధర్మములచే ఉపకృతములగు స్వరూపములు గల సకల పదార్థములను ధర్మ సంసర్గము లేకుండ బోధించు శబ్దము తనకుగల వాచకత్వ ధర్మమును కోల్పోవును.

వివరణము— శబ్దము పదార్థమును బోధించును. ఆ పదార్థము ద్రవ్యము కావచ్చును. గుణము కావచ్చును, మరియొకటి ఏదియైన కావచ్చును. అది ఏదియైనను ఇతర ధర్మముల ఆచ్ఛరణ (పైపూత) మున్న రూపముతోడనే శబ్దముచే బోధింపబడును. ఉదాహ రణమునకు ఘట శబ్దము ఘట మనెడు ద్రవ్యమును బోధించుచున్నది. దీనిని బోధించుచున్న పుడు ఏదియో ఒక రూపము, ఆకారము మొదలగు ధర్మవిశేషములతో కూడిన దానినే

బోధించునుగాని ఏ ధర్మముల సంపర్కములేని ద్రవ్యమును బోధింపజాలదు. అట్టి ద్రవ్యము మన బుద్ధికి విషయము కాజాలదు ; వ్యవహారమున గూడ ఉండజాలదు. ద్రవ్య విషయము నందువలె గుణాదుల విషయమునందు గూడ ఏదియో యొక ధర్మ సంబంధమున్ననే శబ్దము బోధింప గల్గును. కావున 'పటః' అన్నపుడు ఆ యా రూపాదులతో గూడిన పటము అను అర్థబోధ కలిగినట్లు ''పటస్య శుక్లః'' ఇత్యాదులలో కూడ ఏకత్వాద్యుపహిత శుక్ల గుణబోధ కలుగును ఏ శబ్దమైనను ధర్మాంతర సంబంధరహితమగు శుద్ధ పదార్థమును బోధింపవలెనని ప్రయత్నించినచో దాని వాచకత్వము దూరమగును. అనగా ఆ పదము అట్టి యర్థమును చెప్పజాలదు. ఈ విధముగ ద్రవ్యవాచకి శబ్దమైనను, గుణవాచక శబ్దమైనను, ఏ శబ్దమైనను ధర్మాంతర సహకృత పదార్థములను మాత్రమే బోధించును.

అవతారిక — అర్థము అన్యధర్మోపకారము లేనిచో భాసింపదు (బుద్ధి గోచరము కాదు) అను విషయమున దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ యథైవావిషయం జ్ఞానం న కిఞ్చిదవభాసతే ।
తథా భావోఽప్యసంసృష్టో న కశ్చిదుపలభ్యతే ॥ 8

అవిషయం = విషయములేని, జ్ఞానం = జ్ఞానము, కిఞ్చిత్ = ఏదియు, యథైవ = ఏ విధముగా, న అవభాసతే = వ్యవహారయోగ్యముగ భాసింపదో, తథా = అట్లే, అసంసృష్టః = ధర్మాంతరములతో సంసృష్టము కాని, భావః అపి = పదార్ధము కూడ, కశ్చిత్ = ఒక్కటియు, న ఉపలభ్యతే = లభించుట లేదు.

తాత్పర్యము — నిర్విషయమగు జ్ఞానమేదియు ఏ విధముగ భాసించుట లేదో అట్లే అన్యధర్మ సంపర్కములేని పదార్థమేదియును గూడ లభించుటలేదు.

వివరణము — ఘట జ్ఞానమునందు ఘటము విషయము పట జ్ఞానమునందు పటము విషయము. ఈ విధముగ జ్ఞానమునందేదైన ఒక విషయముండి తీరవలెను. విషయము లేని శుద్ధ జ్ఞానము భాసింపదు ; వ్యవహారయోగ్యము కాదు. అట్లే ధర్మాంతరముల సంసర్గము లేని పదార్థమేదియు వ్యవహారయోగ్యము కాజాలదు గాన అట్టి పదార్థమును పదము బోధింపదు. ॥8॥

అవతారిక — పరస్పర భిన్నములగు ఘటములయందు ఈ ఘటత్వమను సామాన్యము (జాతి) అభేద బుద్ధికి కారణముగనున్నది ; విశాలముఖత్వరూపమగు ఈ విశేషము ఈ ఘటములను ఇతర ఘటములనుండి భిన్నముగ కనబడునట్లు చేయుచున్నది ; ఇత్యాది విధముల లోకములో వ్యవహారము కలదు. ఇట్టి వ్యవహారములు సామాన్యాదులలో ద్రవ్య సంసర్గము లేకుండ చేయబడుచున్నవి. పరధర్మోపాధి లేని వాటికి వ్యవహారము సాధ్యము కాదు అని యన్నచో ఈ వ్యవహార మెట్లు కుదురును అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ భేదేన తు సమాఖ్యానం యల్లోకోఽప్యనువర్తతే ।
ఆగమాచ్ఛాస్త్రసదృశో వ్యవహారః స వర్ణ్యతే ॥ 9

లోకోఽపి = లోకము కూడ, భేదేన = భేదముచేత, సమాఖ్యానం = ప్రతిపాదనమును, అనువర్తతే ఇతి యత్ = అనుసరించుచున్నదనునది ఏది కలదో, సః = అది, ఆగమాత్ = వైశేషికాగమానుసారముగ, శాస్త్రసదృశః = శాస్త్రముతో సమానమగు, వ్యవహారః = వ్యవహారముగా, వర్ణ్యతే = వర్ణింపబడుచున్నది

తాత్పర్యము— లోకము కూడ సామాన్యాదులను భేదముతో ప్రతిపాదించుచున్నది. ఈ వ్యవహారము వైశేషికాగమానుసారముగ జరిగిన శాస్త్ర సదృశమగు వ్యవహారమని చెప్పబడుచున్నది.

వివరణము— సామాన్య విశేషాదిరూపములగు ఉపాధులు ఎల్లప్పుడును పరతంత్రములుగనే ఉండును కాని స్వతంత్రముగ నుండజాలవు. అయినను శాస్త్రము అపోద్ధారము చేసి (వాటిని ద్రవ్యాదులనుండి విడదీసి) స్వతంత్రరూపమున ప్రతిపాదించుచుండును. ఈ శాస్త్ర వ్యవహారమునే అనుసరించి లోకమునందు గూడ ఇట్టి వ్యవహారము కానవచ్చుచున్నది. కావున వీటి స్వాతంత్ర్యము కల్పితమే కాని వాస్తవము కాదు. ॥9॥

అవతారిక— ఈ విధముగ శాస్త్రీయ సంస్కారమును బట్టి స్వతంత్రరూపమున ప్రదర్శ్యమానములగు సామాన్యాదులందు ఉపాధుల ఆరోపము జరుగుచుండును అని చెప్పుచున్నాడు.

శ్లో॥ బుద్ధౌ స్థితేషు తేష్వేవమధ్యారోపో న దుర్లభః ।
పరధర్మస్య న హ్యత్ర సదసత్త్వం ప్రయోజకమ్ ॥ 10

ఏవం = ఈ విధముగా, బుద్ధౌ = బుద్ధియందు, స్థితేషు = ఉన్న, తేషు = ఆ సామాన్యాదులందు, పరధర్మస్య = అన్యధర్మమగు ఉపాధియొక్క, ఆరోపః = ఆరోపము, దుర్లభః = దుర్లభమైనది, న = కాదు, అత్ర = ఆరోపమునందు, సదసత్త్వం = సత్త్వము కాని అసత్త్వము కాని, ప్రయోజకం = ప్రయోజకము, నహి = కాదుకదా ?

తాత్పర్యము— ఈ విధముగ బుద్ధియందు స్వతంత్రరూపమున భిన్నముగ నున్న ఆ సామాన్యాదులందు ఇతరోపాధుల ఆరోపముచేయుట కూడ శక్యమే. ఆరోపము విషయమున సత్త్వాసత్త్వములు ప్రయోజకములు కావుకదా ?

వివరణము— సామాన్యాదులను బుద్ధిచే ద్రవ్యాదులనుండి విడదీసి, 'ఈ సామాన్యము' 'ఆ సామాన్యము' ఇత్యాది విధమున సర్వనామ నిర్దేశమునకు వీలగునట్లు చేసినపుడు పరధర్మములగు సంఖ్యాదులను గూడ వీటియందు (సామాన్యాదులందు) ఆరోపించుటకు వీలు ఏర్పడుచున్నది. సామాన్య విశేషాదులే ద్రవ్యములకు ఉపాధులై యుండుటచే వాటికి స్వాతం

్రత్యము లేదు గాన అట్టి వాటియందు లేని ఉపాధులను ఆరోపించుట ఎట్లు అని అశంకింప రాదు. ఆరోపమునకు స_త్త్వముగాని అస_త్త్వముగాని వా_స్తవముగ ఉండవలెననెడు ఆవశ్యకత లేదు. సత్ అయిన దానియందు అస_త్త్వమును ఆరోపింపవచ్చును, అసత్తైన దానియందు స_త్త్వమును ఆరోపింపవచ్చును. అందుచే సామాన్యాదులందు బుద్ధిచే స్వాతం్రత్యమును ఆరోపించి అట్టి ఆరోపిత స్వాతం్రత్యములగు సామాన్యాదులందు ఉపాధ్యారోపము గూడ చేయ వచ్చును. ॥10॥

అవతారిక— ఈ విధముగ కల్పిత స్వాతం్రత్యములగు వాటిపై ఉపాధ్యంతర సమారోపము సంభావ్యము గాన—

శ్లో॥ సామాన్యేష్వపి సామాన్యం విశేషేషు విశిష్టతా ।
సంఖ్యాసు సంఖ్యా లింగేషు లింగమేవం ్రపకల్ప్యతే ॥ 11

ఏవం = ఈ విధముగ, సామాన్యేష్వపి = సామాన్యములయందు గూడ, సామాన్యం = సామాన్యము, విశేషేషు = విశేషములయందు, విశిష్టతా = విశిష్టత్వము, సంఖ్యాసు = సంఖ్యల యందు, సంఖ్యా = సంఖ్యయు, లిఙ్గేషు = లింగములయందు, లింగం = లింగము, ్రపకల్ప్యతే = ఏర్పడును.

తాత్పర్యము— ఈ విధముగ సామాన్యములయందు సామాన్యము, విశేషముల యందు విశిష్టత్వము, సంఖ్యలయందు సంఖ్య, లింగములందు లింగము ఏర్పడును.

వివరణము— ఇట్లే బుద్ధిచే గోత్వసామాన్యము (జాతి) అశ్వత్వ సామాన్యము మొదలగు కొన్ని సామాన్యములకు భేదమును కల్పించి ఆ అన్ని సామాన్యములందును అను గతముగ నుండు మరియొక సామాన్యమును (సామాన్యత్వము మొదలగు దానిని) కల్పింప వచ్చును. ్రదవ్యములతో సంబంధించి యున్న విశేషములను బుద్ధిచే వేరుగ పరి్రగహించి, వాటిని గూడ ్రదవ్యములవలె భావించి ఆ విశేషము లన్నింటియందును అనుగతమగు విశే షత్వమనెడు జాతిని కల్పింపవచ్చును. లేదా ఒక విశేషము మరియొక విశేషముకంటె భిన్న మైనది అను జ్ఞానమునకు నిమి_త్తమగు విశేషాంతరమును గూడ విశేషమునందు కల్పింప వచ్చును. సంఖ్యలకు మరల సంఖ్యాసంబంధము నేర్పరచి శతం, శతే, శతాని ఇత్యాది ్రపయోగములు చేయవచ్చును. శబ్దముచే వాచ్యములగు స్త్రీత్వాది లింగములు ్రదవ్యమువలె భాసించుటచే మరల వాటికి లింగాంతరముతో సంబంధము ఏర్పడి 'పుమాన్' 'పౌంస్నమ్' 'పుంస్త్రా' ఇత్యాది ్రపయోగములు చేయవచ్చును. ఈ విధముగ ఔపాధిక భేద కల్పనముచే పూర్వో_క్త వ్యవహారమున విరోధము లేదు. ॥11॥

అవతారిక— ్రపాసంగిక విచారమును చేసి ్రపకృత విషయమును ముగించు చున్నాడు.

శ్లో॥ అతో ద్రవ్యాశ్రితాం సంఖ్యామాహుః సంసర్గ వాదినః ।
భేదాభేదవ్యతీతేషు భేదాభేద విధాయినీమ్ ॥ 12

అతః = ఆ కారణము వలన, సంసర్గవాదినః = సంసర్గవాదులు (ఒక ద్రవ్యమునందు అనేక ధర్మములు సమవేతములయి యుండును అనునట్టి కణాద వాదులు), భేదాభేదవ్యతీతేషు = భేదాభేదములను అతిక్రమించియున్న ద్రవ్యగుణాదులందు, భేదాభేదవిధాయినీం = భేదాభేదములను కల్పించెడు, సంఖ్యాం=సంఖ్యను, ద్రవ్యాశ్రితాం=ద్రవ్యమును ఆశ్రయించిన దానినిగా, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— అందుచే సంసర్గవాదులగు వైశేషికులు భేదాభేద రహితములగు ద్రవ్యగుణాదులందు భేదాభేదములను కల్పించు సంఖ్య ద్రవ్యము నాశ్రయించి యుండునని చెప్పుదురు.

వివరణము— సంసర్గవాదులనగా ధర్మములన్నియు ద్రవ్యముతో సంబంధించి యుండునని అంగీకరించు వైశేషికులు. వెనుక చెప్పిన విధముగ ద్రవ్యము నాశ్రయించి యున్న సంఖ్యనుబట్టియే గుణాదులందు కూడ ఏకత్వ ద్విత్వాది వ్యవహారము జరుగుటకు అవకాశమున్నది గాన సంఖ్య గుణాదులను గూడ ఆశ్రయించియుండునని అంగీకరింప బని లేదు. అందుచే భేదము కాని అభేదము కాని లేని ద్రవ్యగుణాదులందు భేదాభేద బుద్ధులను కల్పించు సంఖ్య ముఖ్యముగ ద్రవ్యమునే ఆశ్రయించి యుండునని సంసర్గవాదులు చెప్పుచున్నారు. ఏకత్వ సంఖ్య అభేద జ్ఞానమునకు కారణము, ద్విత్వాది సంఖ్య భేదబుద్ధికి కారణము. ॥12॥

అవతారిక— వాస్తవమున పదార్థములన్నియు భేదాభేద వ్యతీతములైనచో పదార్థముల కంటె భిన్నమగు సంఖ్య వాటియందు భేదాభేద వ్యవహారము నెట్లు కల్పింపగల్గును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆత్మాన్తరాణాం యేనాత్మా తద్రూప ఇవ లక్ష్యతే ।
అతద్రూపేణ సంసర్గాత్ సా నిమిత్త సరూపతా ॥ 13

ఆత్మాన్తరాణాం = ఇతర ద్రవ్యములయొక్క, ఆత్మా = స్వరూపము, అతద్రూపేణ = తద్రూపము కాని, యేన = ఏ గుణాదికముతో, సంసర్గాత్ = సంబంధమువలన, తద్రూప ఇవ = ఆ రూపము కలదివలె, లక్ష్యతే = చూడబడుచున్నదో, సా = అది, నిమిత్త సరూపతా = నిమిత్తమగు గుణముతో సారూప్యము.

తాత్పర్యము— ద్రవ్యాంతరముల స్వరూపము అట్టి రూపములేని ఏ గుణాదికముతో సంసర్గముచే తద్రూపమువలె భాసించునో, అది నిమిత్త సరూపత్వము.

వివరణము— ద్రవ్యాది పదార్థముల ప్రమాణములచే పరస్పర భిన్నములుగ

తెలియబడుచున్నవి. ఈ పదార్థములు ఆయా గుణములతో సమవాయ సంబంధముచే సంబంధించు చున్నవి. ఆ గుణాదులకును ఆ పదార్థమునకును వాస్తవమున భేదమున్నను ఆ భేదము సమవాయ సంబంధముచే తిరోహితమై పోవుచున్నది. అందుచే పదార్థముల స్వరూపము గుణాదుల స్వరూపముతో కనబడుచున్నది అనగా పదార్థములకు గుణసారూప్యము కలుగుచున్నది. ఇది కేవలము అట్లు ఆభాసించుటకు నిమిత్తభూతములగు గుణాదులతో కలిగిన సారూప్యమే (నిమిత్త సరూపతా). వాస్తవమున పదార్థములలో నొకదానితో ఒకటికి సరూపత లేదు. అనగా ధర్మాంతరోపధానముచే భేదాభేద వ్యవహారములున్నను వాస్తవమున పదార్థములకు సంకీర్ణత్వము లేదు. అవి పరస్పర వివిక్తములుగ కనబడుచునే యున్నవి అని అభిప్రాయము. ॥13॥

అవతారిక— ద్రవ్యగుణాది పదార్థము లన్నియు ఎల్లప్పుడును పరస్పర సంకీర్ణములుగనే కనబడుచున్నవి కదా? వాటికి సంకీర్ణత్వము లేకపోవుట యేమి అని ఆశంకించుకొని కార్యభేదముచే పదార్థభేదము సుస్పష్టమని చెప్పుచున్నాడు.

శ్లో॥ సంసృష్టేష్వపి నిర్భాగే భూతేష్వర్థక్రియా యథా।
సత్త్వాదిషు చ మాత్రాసు సర్వాస్వేవం ప్రతీయతే॥ 14

భూతేషు = పృథివ్యాది భూతములు, సంసృష్టేష్వపి = పరస్పరము కలసియున్నను, సత్త్వాదిషు చ = సత్త్వ రజస్తమోగుణములు సర్వభావ సంసృష్టములైనను, యథా = ఏ విధముగా, అర్థక్రియా = అర్థక్రియ, నిర్భాగే = విభక్తమగు భూతమునందే కానవచ్చునో, ఏవం = ఈ విధముగనే, సర్వాసు = సమస్తమైన, మాత్రాసు = ద్రవ్య గుణాదులందు, ప్రతీయతే = కనబడును.

తాత్పర్యము— పృథివ్యాది మహాభూతములు పరస్పర సంసృష్టములైనను, సత్త్వాదిగుణములు గూడ పరస్పర సంబంధములైనను వాటి అర్థక్రియ మాత్రము ఏ విధముగ భిన్న భిన్న రూపముల కానవచ్చునో అట్లే ద్రవ్య గుణాదుల అర్థక్రియలు గూడ భిన్న భిన్నములుగ కానవచ్చుచున్నవి

వివరణము— పృథివ్యాది మహాభూతములు ఒకదానితో నొకటి విడదీయుటకు శక్యము కాని విధమున కలిసిపోయి కనుపట్టుచుండును. అయినను వాటి అర్థక్రియలు మాత్రము ప్రత్యేకముగ వేరువేరుగ కనబడుచున్నవి. ధారణ – సంగ్రహ – పాక – వ్యూహ – అవకాశదానములు వరుసగ పృథివ్యప్తేజోవాయ్వాకాశముల కార్యములుగ గోచరించుచున్నవి. అట్లే సత్త్వరజస్తమోగుణములు ఒకదానితో ఒకటి పూర్తిగ కలిసిపోయినను వాటి కార్యములగు ప్రకాశ – ప్రవృత్తి – నియమములు వేరువేరుగ కనబడుచునే యున్నవి. ఈ విధముగనే ద్రవ్య – గుణ – కర్మ – సామాన్య – విశేషములను మాత్రలు కూడ ఒకదానితో ఒకటి కలిసిపోయి యున్నను వాటి కార్యములు మాత్రము వేరువేరుగ కనబడుచున్నవి. ఉదాహరణమునకు— ద్రవ్యము గుణాదులకు ఆశ్రయముగ నుండి అర్థక్రియాకారి యగుచున్నది. గుణములు

ద్రవ్యమునకు తమ స్వరూపమును అర్పించుచు కార్యకారులగుచున్నవి. ఈ విధముగ ద్రవ్య గుణాదులు సర్వదా సంకీర్ణములుగనే కనబడుచున్నను వాటి కార్యములు మాత్రము అసంకీర్ణ ముగ భాసించుచు వాటి భేదమును స్పష్టీకరించుచుండును. ॥14॥

అవతారిక— ఇపుడు సంఖ్యాస్వరూపమును పరీక్షించుచున్నాడు. ద్విత్వాది సంఖ్య ఏకత్వముకంటె భిన్నమైనదా అభిన్నమైనదా ? భిన్నమైనచో దాని ఉత్పత్తి ఏకత్వా పేక్షమై యుండజాలదు. అభిన్నమైనచో వాటి భేదమునకు నిమిత్తమే లేకుండ పోవును. అనగా ఆ రెండును ఒక సంఖ్యయే కావలసియుండును ; అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్విత్వాదియోని రేకత్వం భేదా స్తత్పూర్వకాయతః ।
వినా తేన న సంఖ్యానా మన్యాసామ స్తి సమ్భవః ॥ 15

యతః = ఏ కారణము వలన, భేదాః = భేదములు, తత్పూర్వకాః = ఏకత్వ పూర్వకములో, ఆ కారణమువలన, ఏకత్వం = ఏకత్వము, ద్విత్వాదియోనిః = ద్విత్వాదులకు కారణము, తేనవినా = ఏకత్వము లేకున్నచో, అన్యాసాం = ఇతరమైన, సంఖ్యానాం = సంఖ్యలకు, సంభవః = సంభవము, నాస్తి = లేదు.

తాత్పర్యము— భేదములు ఏకత్వ మూలకములు. అందుచే ఏకత్వము ద్విత్వాదు లకు కారణభూతము. ఏకత్వము లేనిచో ఇతర సంఖ్యలకు సంభవముండదు.

వివరణము— భేదము ఉండవలెనన్నచో మొదటి అభేదముండవలెను అనగా ఒక ఘటమున్నచో దానియందు అభేదముండును. మరియొక ఘటమునందు గూడ అభేద ముండును ఈ రెండింటిని ఒక్కసారి గ్రహించినచో ఈ ఘటము వేరు, ఆ ఘటము వేరు అను భేదబుద్ధి ఏర్పడును. ఈ విధముగ భేదములన్నియు అభేదపూర్వకములు, అనగా ఏకత్వ పూర్వకములు. కావున ఏకత్వము ద్విత్వాదులకు మూలకారణము. ఏకత్వములేనిచో ఇతర సంఖ్యలకు సంభవమే ఉండదు. ॥15॥

అవతారిక— ఏకత్వము ద్విత్వాదులను ఎట్లు జనింపచేయునో చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకత్వే బుద్ధిసహితే నిమిత్తం ద్విత్వజన్మని ।
ఏకత్వాభ్యాం సముత్పన్నమేవం వా తత్ప్రతీయతే ॥ 16

బుద్ధిసహితే = స్వవిషయక బుద్ధిసహితములగు (ఏకత్వములను గూర్చిన జ్ఞానముతో సహి తములగు), ఏకత్వే = (రెండు) ఏకత్వములు, ద్విత్వజన్మని = ద్విత్వముయొక్క జన్మ యందు, నిమిత్తం = నిమిత్తము, వా = లేక, ఏకత్వాభ్యాం = రెండు ఏకత్వములచే, సము త్పన్నం = పుట్టిన, తత్ = ద్విత్వము, ఏవం = బుద్ధిపూర్వకముగ, ప్రతీయతే = తోచును.

తాత్పర్యము— స్వవిషయకమగు బుద్ధితో గూడిన రెండు ఏకత్వములు ద్విత్వ జన్మకు కారణమని కొందరి యభిప్రాయము. రెండు ఏకత్వములవలన పుట్టిన ద్విత్వము బుద్ధి సహితమై భాసించును అని మరికొందరి యభిప్రాయము.

వివరణము— రెండు ద్రవ్యములందు రెండు ఏకత్వములుండును. ఇది ఒక ఏకత్వము, ఇది మరియొక ఏకత్వము అను జ్ఞానము కలిగిన పిమ్మట ఇట్టి జ్ఞానముతో కూడిన రెండు ఏకత్వములు ద్విత్వము జనించుటకు నిమిత్తమని కొందరి మతము. దాని ప్రకారము ద్విత్వమునకు ద్రవ్యద్వయము సమవాయికారణము, ఏకత్వగుణము అసమవాయి కారణము, ఇది ఒక ఏకత్వము, ఇది ఒక ఏకత్వము అనెడు బుద్ధి నిమిత్తకారణము. మరికొందరి మతము ప్రకారము రెండు ఏకత్వములు బుద్ధ్యపేక్ష లేకుండగనే ద్విత్వమును జనింపచేయును. ఈ విధముగ పుట్టిన ద్విత్వము ఏకత్వ బుద్ధిపూర్వకముగ గ్రహింపబడును అని వారు చెప్పుదురు. వీరి మతము ప్రకారము బుద్ధి ద్విత్వమునకు నిమిత్తకారణమని అంగీకరింపబడదు. ఇదియే ఈ రెండు మతములకును గల భేదము.

అవతారిక— ద్విత్వస్వరూప విషయమునందు గూడ మతభేదమున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకత్వసముదాయో వా సాపేక్షే వా పృథక్ పృథక్ ।
ఏకత్వే ద్విత్వ మిత్యేవం తయోర్ద్వివచనం భవేత్ ॥ 17

ఏకత్వసముదాయో వా = రెండు ఏకత్వముల యొక్క సముదాయముగాని, వా = లేక, సాపేక్షే = పరస్పరాపేక్షములగు, పృథక్ పృథక్ = వేరు వేరైన, ఏకత్వే = రెండు ఏకత్వములుగాని, ద్విత్వం = ద్విత్వము, ఇత్యేవం = ఈ విధముగ అంగీకరించిన పక్షమున, తయోః = ఆ ఏకత్వములకు, ద్వివచనం = ద్వివచనము, భవేత్ = అగును (కావలసివచ్చును).

తాత్పర్యము— రెండు ఏకత్వముల సముదాయముగాని, వేరువేరుగ నుండు పరస్పర సాపేక్షములగు రెండు ఏకత్వములుగాని ద్విత్వము అని చెప్పినచో ఆ ఏకత్వములు రెండింటికిని ద్వివచనము రావలసివచ్చును.

వివరణము— రెండు ఏకత్వములకంటె భిన్నమగు ద్విత్వమనునది లేదను అవ్యతిరేకపక్ష మొకటి ఉన్నది. ఈ పక్షమునందు గూడ రెండు పద్ధతులు కలవు. వృక్షముల సముదాయమే వనము మృగముల సముదాయమే యూథము. అంతియేకాని వృక్ష మృగ వ్యతిరిక్తముగ వనయూథములనునవి లేవు. అట్లే రెండు ఏకత్వముల సముదాయమే ద్విత్వము అంతియేకాని రెండు ఏకత్వములవలన క్రొత్తగ ఒక ద్విత్వమనునది పుట్టునని చెప్పుట యుక్తము కాదు. వనాదులలో అవయవ భేదమునుబట్టి భిన్నాకారావభాసము కలుగును; సంఘమును బట్టి ఏకాకారావభాసము కలుగును. దీనిచే 'వనం' అను ఏకవచనాంతమగు శబ్దముచే వృక్ష సముదాయమును బోధించినట్లు 'ద్విత్వం' అనునది ఏకత్వముల సముదాయమును

వాచకము, 'వింశతిర్గావః' (ఇరువది గోవులు) ఇత్యాదులలో సంఖ్యేయవాచకము ఈ వింశతి శబ్దము ''ద్వౌదశతౌ'' ('దశత్' అనగా పదింటి యొక్క సముదాయము) అను నర్థమున 'ద్వి' శబ్దముకంటె 'శతిచ్' ప్రత్యయమును 'ద్వి' శబ్దమునకు 'విన్' భావమును నిపతించు టచే ఏర్పడినదనియు, 'ద్వౌదశతౌ వింశతిః' (రెండు పదుల సముదాయములు వింశతి) యని దీని అర్థమనియు అంగీకరించినచో అపుడు ఈ శబ్దమునకు సంఖ్యేయమగు దానితో సామానాధికరణ్యము కుదురదు. అనగా 'దశవృక్షాః' (పదిచెట్లు) ఇత్యాదులలో దశన్ శబ్దము వృక్షములను (సంఖ్యేయములను) బోధించుచున్నది గాన ఈ సంఖ్యా సంఖ్యేయవాచకములు సమానాధికరణములుగ (ఏకపదార్థ బోధకములుగ) నున్నవి, అందుచే రెండును ప్రథమా బహువచనమున నున్నవి. పై వ్యుత్పత్తి ప్రకారము 'వింశతి' అనునది రెండు దశద్వర్గములను బోధించుచున్నది గాని సంఖ్యేయములగు గవాదులను ప్రత్యక్షముగ బోధించుటలేదు గాన, వాటితో సామానాధికరణ్యము కుదురదు. సామానాధికరణ్యము లేనిచో ''త్రయాణాం లోకానాం సమాహారః త్రిలోకీ'' ఇత్యాది విధమున సమానాధికరణము లగు త్రిశబ్ద లోకశబ్దములకు సమాసము వచ్చినట్లు వింశతి త్రింశదాది శబ్దములకును గవాది శబ్దములకును సమాసము వచ్చి 'వింశతి గవమ్' 'త్రింశత్పూపీ' ఇత్యాది రూపములు సిద్ధింపవు 'వింశతి' 'త్రింశత్' మొదలగునవి రెండు దశద్వర్గములను, మూడు దశద్వర్గములను బోధించుచున్నవిగాని గోవులు మొదలగు వాటిని బోధించుట లేదు కదా? మరియొక అనుపపత్తి యేమనగా ఈ పదములు రెండు సముదాయములను, మూడు సముదాయములను బోధించుచున్నవి గాన వీటికి ద్వివచన బహువచనములందు ప్రయోగముండవలెను గాని ఏకవచనమున ఉండరాదు. ఈ విషయములనే— ''వింశత్యాదయో దశదర్థేచేత్ సమాసవచనానుపపత్తిః'' అను వార్తికము చెప్పుచున్నది 'వింశతి' 'గో' శబ్దములకు సామానాధికరణ్యము లేకపోవుటచే సామానాధికరణ్యమును బట్టి వచ్చెడు ద్విగుసమాసము రాక 'గవాం వింశతిః గోవింశతిః' అను షష్ఠీ సమాసము మాత్రము రావచ్చును.

''సంఖ్యాయాః సంజ్ఞాసంఘ సూత్రాధ్యయనేషు'' అను సూత్రమునుండి సంఘ శబ్దము అనువర్తించుచున్నది గాన 'శతిచ్' ప్రత్యయము సంఘార్థమున చేరి ''ద్వౌదశతౌ పరిమాణమస్య సంఘస్య వింశతిః సంఘః'' అనగా— ఏ సంఘమునకు రెండు దశత్తులు (పదులు) పరిమాణమో ఆ సంఘము వింశతి, అని అర్థము చెప్పిన పక్షమున ఏకవచనము ఉపపన్నమేయైనను సమాసానుపపత్తి దోషము అట్లే ఉన్నది ఈ పక్షమున మరియొక దోషమేమనగా— 'వింశకో గో సంఘః' అను సాధు ప్రయోగమునకు బదులు 'వింశతిః గో సంఘః' అను అసాధు ప్రయోగము చేయవలసి వచ్చును వింశతిః అను దానికి ఇరువదియని అర్థమైనపుడు 'వింశతిః పరిమాణం యస్య సంఘస్య' (ఏ సంఘమునకు వింశతి పరిమాణమో అది) అను నర్థమున 'వింశతి త్రింశద్భ్యాం డ్వునన్యతరస్యామ్' అను సూత్రముచే (5-1-21) డ్వున్ ప్రత్యయము వచ్చి వింశకః అను రూపమేర్పడి 'వింశకః గోసంఘః' (వింశతి సంఘాత్మకమగు గోసంఘము) అని అర్థము చెప్పవచ్చు. అట్లుకాక 'వింశతిః' అను దానికే రెండు దశత్తులు ప్రమాణము గల సంఘము అను నర్థము చెప్పినచో అట్టి సంఘము

(వింశతి సంఘము) ప్రమాణముగా గల మరియొక సంఘమేదియు లేదుగాన పై సూత్రముచే 'డ్వున్' ప్రత్యయము వచ్చుటకు అవకాశముండదు. ఇంక ఈ డ్వున్ ప్రత్యయము సంఘ మను నర్థమునందు కాక స్వార్థమునందే వచ్చునని (వింశకః అను ప్రయోగమును సమర్థించు టకై) చెప్పవలసి యుండును కాని ఈ సూత్రము ఆర్హీయ ప్రకరణములోనున్నది గాన దానిని స్వార్థ ప్రత్యయ విధాయకమని కల్పించుట కష్ట కల్పన యగును. ఈ భావమునే "పరిమాణిని చేత్ పునః స్వార్థే ప్రత్యయ విధానమ్" అను వార్తికము ప్రతిపాదించినది. మరియు 'వింశతిః' = 'ఇరువది ద్రవ్యములు' అను నర్థము చెప్పినచో గోవులకును వింశతి పదబోధ్యములకును భేదము లేదుగాన షష్ఠి వచ్చుటకు అవకాశము లేదు. రాజు వేరు పురుషుడు వేరు అయినపుడే 'రాజ్ఞః పురుషః' అని షష్ఠి వచ్చును. అట్లే గోవులు వేరు, వింశతి వేరు అను బుద్ధి యున్నపుడే 'గవాం వింశతిః' అని షష్ఠిని ప్రయోగింపవచ్చును. లేకున్నచో 'గావః వింశతిః' అని మాత్రమే ప్రయోగముండును. ఇట్టి ప్రయోగమునందు గూడ గోశబ్ద వింశతి శబ్దములు సమానాధికరణములుగాన 'వింశతి' శబ్దమును గూడ బహువచనముగ ప్రయోగింపవలసి యుండును. ఈ విధముగ వార్తికకారుడు 'వింశతి' ఇత్యాది పదములు వ్యుత్పన్న ప్రాతిపదికములైన పక్షమున అనేక దోషము లుండునని చెప్పి 'సహస్ర' శబ్దా దులవలె వింశత్యాది శబ్దములు గూడ అవ్యుత్పన్న శబ్దములనియు, ఇవి ప్రయోగానుసార ముగ సంఖ్యావాచకములుగను సంఖ్యేయవాచకములుగను గూడ ఉండవచ్చుననియు, రూఢ శబ్దములగుటచే 'అప్' శబ్ద 'దార' శబ్దాదులవలె నియతలింగ వచనములై యుండుననియు సిద్ధాంతీకరించెను. కాని భాష్యకారుడు వ్యుత్పత్తిపక్షమునే స్వీకరించి శతిచ్ ప్రత్యయము పరిమాణియగు సంఘము అను నర్థమున విధింపబడినదని అంగీకరించినాడు. "సంఖ్యాయాః సంజ్ఞా—" ఇత్యాది సూత్రమునందలి సంఘశబ్దమునకు ప్రాణి సముదాయమని యర్థము. కాని ఇచట సంఘశబ్దము ప్రాణ్యప్రాణి సాధారణమగు సమూహమును బోధించును గాన 'గవాం వింశతిః' వలె "వృక్షాణాం వింశతిః" అని గూడ ప్రయోగింపవచ్చునని భాష్యకారుడు చెప్పెను 'శతిచ్' ప్రత్యయము సంఘార్థకమైనచో వార్తికకారుడు చేసిన— "పరిమాణిని చేత్ పునః స్వార్థే ప్రత్యయ విధానమ్" అను ఆక్షేపణమునకు భాష్యకారుడు "సంఘనసే వృత్తిః సంఘనసే వర్తిష్యతే" అని సమాధానము చెప్పెను. ఈ కారిక ఆ వాక్యమునకు వ్యాఖ్యారూపము. గోవులు మొదలగునవి సంఖ్యేయములు (లెక్కింపదగినవి). వాటి సంఘము ద్రవ్య సంఘము. రెండు దశత్తులుగ నున్న అట్టి రెండు ద్రవ్య సంఘముల సంఘము అను నర్థమున వింశతి శబ్దము నిపతింపబడినది అది సంఖ్యానములగు రెండు దశద్వర్గముల సముదాయముగాన సంఖ్యాన శబ్దమని చెప్పబడుచున్నది వింశతి శబ్దము సంఖ్యానములగు ఆ రెండు దశద్వర్గముల సముదాయమును బోధించును. వింశతి శబ్దవాచ్యమగు ఆ సంఖ్య (సంఖ్యానసంఘము) గవాది సంఘమునకు విశేషణమగును. అనగా గవాది ద్రవ్యసంఘ పరి మాణమునకు ఉపాధిగ నున్నది. ఈ విధముగ సంఖ్యాన సంఘవాచకమగు వింశతి శబ్దము కంటె పరిమాణియగు గవాది సంఘము అను నర్థమున డ్వున్ ప్రత్యయము రావచ్చును. అనగా రెండు దశత్ సంఘముల ప్రమాణము గల గోసంఘము అను నర్థము చెప్పవచ్చును

గాన డ్వున్ ప్రత్యయమును స్వార్థమున విధింపవలసిన పని ఉండదని తాత్పర్యము. "సంహననే = రెండు దశత్తుల సంఘము అను నర్థమున, వృత్తః = ప్రవర్తించిన వింశతి శబ్దము, సంహననే = గవాది ద్రవ్య సంఘ్యమునందు, వర్తిష్యతే = ప్రత్యయమును పుట్టింప గలదు" అని భాష్య వాక్యార్థము.

వాస్తవమున ద్రవ్యములకు సంబంధించిన ద్రవ్య సంఘమునకును, దశత్తుల దశత్సంఘమునకును పారమార్థికమగు భేదము లేదు. ఇది కేవలము బుద్ధి మాత్ర పరికల్పితము. బుద్ధియందు అవస్థాపితములగు అర్థములను బట్టి ప్రయుక్తములగు శబ్దములు అర్థాకారమగు బుద్ధిని కలిగించుచు వాస్తవమున భేదము లేకున్నను, సంఖ్యా సంఘము వేరు, సంఖ్యేయ సంఘము వేరు అను ప్రతీతిని కలిగించుచుండును. వింశత్యాదులను ఈ విధముగ వ్యుత్పన్న శబ్దములని అంగీకరించినను సమాసానుపపత్త్యాది దోషము యుండవు అను విషయము కైయట హేలారాజాది కృత వ్యాఖ్యలయందు స్పష్టీకరింపబడినది. 'వింశతిః' అనునది దశద్వయ సంఘము (రెండు పదుల సంఘము) అను ధర్మమును మాత్రము బోధించును. గుణవాచకము లగు శుక్లాది శబ్దములను గుణివాచకములతో సమానాధికరణములుగ ప్రయోగించి ('శుక్లః పటః' ఇత్యాది వాక్యములలో) నట్లు ఈ పదములను సంఖ్యేయ సమానాధికరణములుగ ప్రయోగించి అభేదోపచారముచే "వింశతిర్గావః", "వింశతిర్బ్రాహ్మణాః", "వింశతిః కుండాని" ఇత్యాది వాక్యములను ప్రయోగింపవచ్చును. ఈ సామానాధికరణ్యమును బట్టి 'వింశతిగవం' ఇత్యాది సమానాధికరణసమాసము రావచ్చును. వింశతి సంఖ్య ఒక సముదాయముగ గ్రహింపబడిన ద్రవ్యములతో సంబంధించును గాన దానికి సంఖ్యేయము యొక్క లింగవచనములను బట్టి మార్పు రాదు. ముందుగనే తనతో ఏ లింగ సంఖ్యలు సంబంధించినవో అవి అట్లే ఉండును. కావుననే 'వింశతిర్గావః' ఇత్యాది ప్రయోగము లుప పన్నములైనవి గుణగుణులను భిన్నముగ వివక్షచేసి ప్రయోగించు పక్షమున 'గవాం వింశతిః' ఇత్యాది విధమున ప్రయోగింపవచ్చును 'వింశతి' అనునది దశత్సంఘ రూపమైన దైనను, దానికి పరంపరయా గోవులతో సంబంధమున్నది గాన షష్ఠి రావచ్చును. ॥19॥

అవతారిక — 'ఏకవింశతిః' 'ఏకత్రింశత' ఇత్యాదులలోని 'ఏక' 'వింశతి' 'ఏక' 'త్రింశత్' అనునవి వేరువేరుగ సంఖ్యావాచకములా లేక 'ఏకవింశతిః' ఇత్యాది సముదాయ ములే సంఖ్యావాచకములా యని ప్రశ్నించుకొని 'ఏకవింశతి' మొదలగునవియే సంఖ్యా వాచకము లని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకవింశతి సంఖ్యాయాః సంఖ్యాన్తర సరూపయోః ।
ఏకస్యాం బుద్ధ్యనావృత్త్యా భాగయోరివ కల్పనా ॥ 20

ఏకస్యాం = అభిన్నమగు (అవయవ రహితమగు), ఏకవింశతి సంఖ్యాయాం = 'ఏకవింశతి' సంఖ్యయందు, బుద్ధ్యనావృత్త్యా = ప్రతి అవయవమునందును బుద్ధియొక్క ఆ వృత్తి లేదు కావున, సంఖ్యాన్తర సరూపయోః = 'ఏక' 'వింశతి' అను ఇతర సంఖ్యలతో సమానరూప

యులుగ నున్న, భాగయోరివ = భాగములవలె కన్పట్టు వానియొక్క, కల్పనా = కల్పన చేయబడుచున్నది.

తాత్పర్యము— అభిన్నమగు ఏకవింశతి సంఖ్యయందు, సంఖ్యాంతరములతో సమానరూపములగు భాగముల కల్పనయే కాని వాస్తవమున భాగములు లేవు బుద్ధి అవయవములను వేరువేరుగ గ్రహించుట లేదు కదా ?

వివరణము— 'ఏకాదశ', 'ద్వాదశ' ఇత్యాదులలో ఏకాది శబ్దములకు దశాది శబ్దములతో సమాసమని ''ఏకాదీనాం దశాదిభిర్ద్వంద్వః'' అను వార్తికమున చెప్పి, వార్తిక కారుడు, ''ఏకాదీనాం దశాదిభిర్ద్వన్ద్వ ఇతి చేత్ వింశత్యాదిషు వచన ప్రసంగః'' అను ఆక్షేప వార్తికమున, ''ఇట్లు ద్వంద్వసమాసమును చెప్పరాదు. 'ఏకాదశ' ఇత్యాదులలో ద్వంద్వ సమాసమును అంగీకరించినచో 'ఏక వింశతిః' ఇత్యాదులలో గూడ ద్వంద్వమునే అంగీకరింప వలెను. ఆ పక్షమున ఇందలి 'ఏక' 'వింశతి' శబ్దములు సంఖ్యావాచకములైనచో సమాసము ద్వివచనమునం దుండవలెను. సంఖ్యేయ వాచకమైనచో 'ఏక వింశతయః' అని బహువచనమునం దుండవలెను. 'ఏకవింశతిః' అను ఏకవచన ప్రయోగము అసాధువు కావలసి వచ్చును'' అని ఆశంకించి— ''సిద్ధం త్వధికాన్తా సంఖ్యా సమానాధికరణాధికారే అధిక లోపశ్చ'' అను వార్తికముచే ''ఏకేనాధికా వింశతిః ఏకవింశతిః'' (ఒకటి ఎక్కువగల ఇరువది) అను (ఉత్తరపదలోపి) సమాసము చెప్పకొనిన ఈ వచనదోష ముండదని సమాధానము చెప్పెను. కాని ఈ సమాసమును చెప్పినచో స్వరదోషము వచ్చునని భాష్యకారుడు ఈ పక్షము నుపేక్షించి 'ఏకశ్చ వింశతిశ్చ' అను ద్వంద్వ సమాసమునే అంగీకరించెను. దీనిని బట్టి 'ఏక వింశతిః' ఇత్యాదులలో అవయవములగు 'ఏక' 'వింశతి' శబ్దములే సంఖ్యా వాచకములుకాని సముదాయము కాదు అను ఆశంక కలుగగా దానిని ఈ కారికచే నిరాకరించు చున్నాడు. ఇచట 'ఏక' 'వింశతి' అను అవయవములు కేవలము వ్యుత్పత్తి మాత్రమునకై కల్పింపబడినవి కాని వాస్తవమున అట్టి అవయవములు లేవు. 'ఏకవింశతి' అనునది నరసింహుని వలె అవయవ భేదరహితమగు ఒక భిన్న సంఖ్యయే ఈ స్వతంత్ర సంఖ్యయే బుద్ధి గ్రాహ్యముగ నున్నది గాని ఇందలి అవయవములు బుద్ధి గ్రాహ్యములు కావు. నరసింహుడు మొత్తము ఒక్క వ్యక్తి కాని అందులో నరుడు వేరు సింహము వేరు అను భేదబుద్ధి కలుగుట లేదు కదా అన్వాఖ్యానము నిమిత్తము వీని భాగములను కల్పించి 'ఏకశ్చ వింశతిశ్చ' అని చెప్పుచున్నారు. ఈ అవయవ కల్పనము కాల్పనికము గాన ఒకరు ఒకటిని ఇరువదిని కలిపి ఏకవింశతి యనగా మరియొకరు తొమ్మిది + పంద్రెండును కలిసి ఏకవింశతి యనియు' మరియొకరు పది పదకొండు కలిసి 'ఏకవింశతి' యనియు చెప్పవచ్చును. ఇట్లు అవయవ విభాగము కాల్పనికము కావునను, 'ఏకవింశతి' అను సముదాయమే సంఖ్యావాచకము కావునను ఏకవచన ప్రయోగమున దోషము లేదు. ॥20॥

అవతారిక— 'ఏకవింశతిః' ఇత్యాది సంఖ్య సంఖ్యాద్వయారబ్ధమైనదనియే అంగీకరింపవచ్చును కదా ! ఇది అవయవ విభాగ రహితమగు మరియొక సంఖ్యయని ఏల

చెప్పవలెను అని ఆశంకించి కొన్ని శాస్త్రీయ కార్యములు అనుపపన్నములగును గాన దీనిని నిరస్తావయవమగు సంఖ్యాంతరమని అంగీకరింపవలెనని చెప్పుచున్నాడు

శ్లో॥ అసంఖ్యాసముదాయత్వాత్ సంఖ్యాకార్యం విధీయతే ।
సమూహత్వే తు తన్నస్యాత్ స్వాఙ్గాదిసముదాయవత్ ॥ 21

అసంఖ్యా సముదాయత్వాత్ = సంఖ్యల సముదాయము కాదు కావుననే, సంఖ్యాకార్యం = సంఖ్యాకార్యము, విధీయతే = విధింపబడుచున్నది, స్వాఙ్గాది సముదాయవత్ = స్వాంగాది వాచకపదముల సముదాయమువలె, సమూహత్వే = ఇదిగూడ సంఖ్యా సమూహమని చెప్పినచో, తత్ = ఆ సంఖ్యా కార్యము, నస్యాత్ = రాకపోయెడిది

తాత్పర్యము— 'ఏకవింశతి' ఇత్యాదికము సంఖ్యా సముదాయము కాదు కావుననే సంఖ్యాకార్యము విధింపబడుచున్నది. స్వాంగాది సముదాయము వలె ఇదియు సముదాయమే యైనచో ఆ సంఖ్యాకార్యము ప్రవర్తించెడిది కాదు

వివరణము— 'ఏకవింశతిః అధికా అస్మిన్ శతే' (ఇరువది ఒకటి అధికముగా గల శతము) 'ఏకత్రింశత్ అధికా అస్మిన్ శత్' అను నర్థమున 'శదన్త వింశతేశ్చ' అను సూత్రముచే 'డ' ప్రత్యయము వచ్చి 'ఏకవింశం' 'ఏకత్రింశమ్' (శతమ్) అను రూపములు సిద్ధించును. 'శత్' అనునది అంతమునందు కలదానికిని, 'వింశతి' శబ్దమునకును 'అది దీని యందు అధికముగ నున్నది' అను నర్థమున 'డ' ప్రత్యయము వచ్చును'' అని ఈ సూత్రమున కర్థము ఇచట నున్న వార్తికములను బట్టి శదంతమునకే కాక శదంతాంతమునకును, వింశత్యంతమునకును గూడ 'డ' ప్రత్యయము వచ్చును అని అర్థము చెప్పవలెను అట్లు చెప్పినచో 'గోత్రింశత్ అధికా అస్మిన్ శతే' 'గోవింశతిః అధికా అస్మిన్ శత్' అను నర్థమున 'గోత్రింశత్' 'గోవింశతి' శబ్దములు గూడ శదంతాంత - వింశత్యంతములగుటచే ఈ సూత్రముచే డ ప్రత్యయము రావలసియున్నది అచట రాకుండుటకై 'సంఖ్యాగ్రహణంచ' అను వార్తికము చెప్పబడినది. దీనినిబట్టి ఈ శదంత - వింశత్యంతములు సంఖ్యావాచకములైన గాని ఈ 'డ' ప్రత్యయము రాదు. 'గోత్రింశత్' 'గోవింశతి' పదములు సంఖ్యావాచకములు కావు గాన ఈ సూత్రమున కతి ప్రసంగము లేదు. ప్రకృతమున 'ఏకత్రింశత్' 'ఏకవింశతి' మొదలగు పదములు సంఖ్యా సముదాయరూపములని అంగీకరించినచో అవి సంఖ్యా వాచకములు కావు గాన 'శదన్త వింశతేశ్చ' అను సూత్రముచే డ ప్రత్యయము వచ్చుటకు అవకాశము ఉండదు. ఈ విధముగ సంఖ్యాకార్యములగు డ, డట్, తయప్, తమట్, మయట్ మొదలగు ప్రత్యయములు 'ఏకవింశతి' 'ఏకత్రింశత్' ఇత్యాది పదములకు గూడ రావలెనన్నచో ఇవి సంఖ్యా సముదాయాత్మక పదములని అంగీకరింపరాదు. సంఖ్యావాచకములగు అఖండ పదములని అంగీకరింపవలెను.

సంఖ్యా సముదాయములని అంగీకరించినచో సంఖ్యా కార్యములు రావనుటకు ''స్వాఙ్గాది సముదాయవత్'' అనునది ఉదాహరణముగ చూపబడినది. 'స్వాంగాచ్చోప సర్జ

నాద సంయోగోపధాత్' (4-1-54) అను సూత్రముచే ఉపసర్జనమగు స్వాంగ వాచకము కంటె వికల్పముగ 'జీష్' విధింపబడినది. 'చంద్రముఖీ - చంద్రముఖా' ఇత్యాదు లుదాహరణ ములు, 'పాదః' మొదలగునవి స్వాంగమునైనను స్వాంగ సముదాయరూపములగు 'పాణి పాద' శబ్దము స్వాంగము కాదు. అందుచే 'కల్యాణ పాణిపాదా' ఇత్యాదులలో ఈ సూత్రము ప్రవర్తింపదు. అట్లే 'ఏకత్రింశత్' మొదలగునవి సంఖ్యా సముదాయములైనచో సంఖ్యా వాచకములు కావు గాన ''శదన్త వింశతేశ్చ'' అను సూత్ర ప్రవృత్తికి అవకాశముండెడిది కాదు. 'స్వాంగాది' అను ఆదిపదముచే మరియొక ఉదాహరణము గూడ సూచింపబడినది. 'కాశీ' శబ్దము జనపదవాచకము, 'కోసల' శబ్దము గూడ జనపదవాచకము. కాని 'కాశి కోసల' అను జనపద సముదాయవాచక శబ్దము జనపదవాచకము కాదు. అందు 'తత్ర భవః' (అక్కడ నివసించువాడు) అను అర్థమున 'వృద్ధాచ్ఛః' అను సూత్రముచే (4-2-114) ఛ ప్రత్యయము వచ్చి 'కాశి కోసలీయః' అను రూపము నిష్పన్నమగును గాని ''జనపద తదవధ్యోశ్చ'' అను సూత్రముచే 'వుఞ్' రాదు అట్లే ప్రకృతమున గూడ గ్రహించ వలెను. ॥21॥

అవతారిక — 'ద్విదశాః' 'త్రిదశాః' ఇత్యాది సమాసములందలి అర్థవిశేషాదు లను తెలుపుచున్నాడు.

శ్లో॥ సంఖ్యేయాన్తర తన్త్రాసు యా సంఖ్యాసు ప్రవర్తతే।
ఆవృత్తివర్గ సంఖ్యేయా తాం సంఖ్యాం తాదృశీం విదుః ॥ 22

ఆవృత్తివర్గ సంఖ్యేయా = దశాది సంఖ్యల ఆవృత్తికాని, దశాది సంఖ్యాపరిచ్ఛేద్యమగు వర్గము గాని సంఖ్యేయముగా గల, యా = ఏద్వ్యాదిసంఖ్య, సంఖ్యేయాన్తర తంత్రాసు = ఇతర సంఖ్యేయములు ప్రధానముగా గల, సంఖ్యాసు = దశాది సంఖ్యలయందు, ప్రవర్తతే = ప్రవర్తించునో, తాం = ఆ, సంఖ్యాం = సంఖ్యను, తాదృశీం = ఆ వృత్తివర్గ సంఖ్యేయ ప్రధానమైనదానినిగా, విదుః = తెలిసికొనుచున్నారు

తాత్పర్యము— ఆ వృత్తికాని వర్గముగాని సంఖ్యేయముగా గల ఏ ద్వ్యాది సంఖ్య సంఖ్యేయాంతరములు ప్రధానముగా గల సంఖ్యల విషయమున ప్రవర్తించునో ఆ సంఖ్యను అట్టి దానినిగా చెప్పుదురు.

విశేషము— 'ద్వి' శబ్దము ''సంఖ్యయావ్యయాసన్నాదూరాధిక సంఖ్యాః సంఖ్యేయే'' (2-2-25) అను సూత్రముచే దశన్ శబ్దముతో సమసించగా సమాసాంత ప్రత్యయాదులు వచ్చి 'ద్విదశాః' అను బహువ్రీహి సమాసరూపము సిద్ధించినది. ''ద్విః దశ ద్విదశాః'' (రెండుమార్లు ఆ వృత్తములగు పది) అని విగ్రహవాక్యము. ఇచట 'దశన్' అను సంఖ్య సంఖ్యేయాంతర తంత్రము. అనగా 'ద్వి' సంఖ్యచే సంఖ్యేయములగు వాటికంటె భిన్నములగు సంఖ్యేయములు (పది వస్తువులు) ప్రధానముగా కలది. దీనితో 'ద్వి' శబ్దము సంబంధమును పొందుచున్నది (ప్రవర్తతే) అనగా సమసించుచున్నది. ఈ ద్విశబ్దమునకు

దశ సంఖ్యావృత్తి గాని, దశ సంఖ్యచే పరిచ్ఛేద్యములగు వస్తువుల వర్గముగాని సంఖ్యేయము అనగా ఈ ద్విశబ్దము 'రెండు దశ శబ్దా వృత్తులు' అను నర్థమునుగాని, దశ సంఖ్యాకములగు రెండు వర్గములు అని గాని యర్థము. ॥22॥

అవతారిక— 'ద్వి' సంఖ్య దశసంఖ్య యొక్క ఆవృత్తినిగాని, లేదా దశ సంఖ్యేయ వస్తువుల వర్గమునుగాని పరిచ్ఛేదించుచున్నది అని చెప్పబడినది. అట్లు కాక దశ సంఖ్యనుగాని, దశ సంఖ్యచే సంఖ్యేయములగు పది వస్తువులునుగాని ద్విసంఖ్య పరిచ్ఛేదించు చున్నదని ఏల చెప్పరాదు— అని ఆశంకించుకొని అందులకు అనుపపత్తిని చెప్పుచున్నాడు.

శ్లో॥ న సంఖ్యాయాం న సంఖ్యేయే ద్వాదశేత్యస్తి సమ్భవః ।
భేదాభావాన్న సంఖ్యాయాం విరోధాన్న తదాశ్రయే ॥ 23

సంఖ్యాయాం = సంఖ్య విషయమునగాని. సంఖ్యేయే = సంఖ్యేయముల విషయమునగాని, ద్వాదశ ఇతి = రెండు దశలు అని చెప్పుటకు, సమ్భవః = సంభవము, నాస్తి = లేదు, భేదాభావాత్ = భేదము లేకపోవుట వలన, సంఖ్యాయాం = సంఖ్య విషయమున సంభవము, న = లేదు, విరోధాత్ = విరోధము వలన, తదాశ్రయే = సంఖ్యేయమునందు సంభవము, న = లేదు.

తాత్పర్యము— 'ద్వాదశ' అనునపుడు ద్విశబ్దము 'దశ' సంఖ్యా శబ్దముతోగాని దశ సంఖ్యాకములగు సంఖ్యేయములతో గాని సంబంధింపజాలదు 'దశ' సంఖ్య ఒక్కటియే గాన, దానిలో భేదము లేదుగాన దానితో ద్విశబ్దాన్వయము కుదరదు 'రెండు' అను దానికిని 'పది'కిని విరోధము గాన సంఖ్యేయముతో గూడ సంబంధింపదు.

విశేషము— ద్విశబ్దము 'దశ'తో సంబంధింపవలె నన్నచో రెండు పద్ధతు లుండ వలెను అది 'దశ' అను సంఖ్యతోడనైనను అన్వయించవలెను లేదా దశన్ శబ్దార్థమగు 'పది వస్తువులు' అను దానితో నైనను అన్వయించవలెను. 'దశ' అనునది ఒక్క సంఖ్య కావున దానిని రెండు సంఖ్యలనుట అయుక్తముగాన ద్విశబ్దము దశసంఖ్యతో అన్వయించుట అనెడు మొదటి పక్షము అయుక్తము పది వస్తువులు ఎన్నటికిని రెండు కాజాలవు గాన ద్విశబ్దము దశశబ్ద సంఖ్యేయములతో అన్వయించును అనెడు రెండవ పక్షముగూడ అయుక్తము. కావున ద్విశబ్దము దశశబ్దావృత్తులతోడనో లేదా దశసంఖ్యాకములగు వస్తువుల వర్గము తోడనో అన్వయించుననెడు పూర్వకారికోక్త పక్షములే యుక్తములు ॥23॥

అవతారిక— ఈ విషయమునే ముగించుచున్నాడు.

శ్లో॥ సంఖ్యాయేతే దశద్వర్గౌ ద్విదశా ఇతి సంఖ్యయా ।
తద్రూపే వాపి సంఖ్యేయే ఆవృత్తిః పరిగణ్యతే ॥ 24

ద్విదశాః ఇతి = ద్విదశాః అనుచోట, సంఖ్యయా = ద్వి సంఖ్యచే, దశద్వర్గౌ = రెండు దశ

ద్వర్గములు (రెండు పదుల సముదాయములు), సంఖ్యాయేతే = చెప్పబడు చున్నవి, వా+అపి = లేక, తద్రూపే = దశరూపమగు, సంఖ్యేయే = సంఖ్యేయము విషయముగ ఆవృత్తిః = రెండు పర్యాయములు ఆవృత్తి, పరిగణ్యతే = ద్విశబ్దముచే లెక్కించబడు చున్నది.

తాత్పర్యము — 'ద్విదశాః' అనునపుడు 'ద్వి' సంఖ్యచే రెండు దశద్వర్గములు లెక్కింపబడుచున్నవి లేదా దశరూపమగు సంఖ్యేయమునందు ఆవృత్తి పరిగణింపబడు చున్నది

విశేషము— దశసంఖ్యా పరిచ్ఛిన్నమగు ఒక వర్గమున్నది. దానితోపాటు మరియొక వర్గమును చెప్పుటకై ద్విత్వము గ్రహింపబడుచున్నది. అనగా ద్విశబ్దము రెండు దశద్వర్గములందున్న ద్విత్వమును బోధించుచున్నది— పది వస్తువుల సముదాయములు రెండు అని చెప్పుచున్నది కావున "ద్వౌ దశతౌ ద్విదశాః" అని విగ్రహము. అనగా దశన్ శబ్దమునకు ద్విశబ్దముతో సంబంధము మరియొక విధముగ కుదురదు గాన 'దశ' అను దానికి 'దశవర్గము' అని యర్థము. వర్గమునకును, వర్గములోనున్న వాటికిని అభేదమును వివక్షచేయుటచే 'ద్విదశాః' అనుచోట ద్వివచనమునకు బదులు బహువచనము వచ్చినది. రెండవ పక్షమేమనగా— 'దశ' శబ్దమునకు 'దశవర్గము' అను నర్థము చెప్పవలసిన యావశ్యకత లేకుండగనే 'ద్వి' శబ్దము 'దశ' శబ్దావృత్తిని బోధించును 'ద్విః దశ ద్విదశాః' (రెండు పర్యాయములు పది) అని విగ్రహవాక్యము. 'ద్వి' శబ్దమునకు ఆవృత్త్యర్థమున 'సుచ్' ప్రత్యయమును చేర్చుటచే 'ద్విః' అను పదము నిష్పన్నమగును. రెండు పర్యాయములు అని యర్థము. 'ద్విదశాః' ఇత్యాది సమాస స్థలములలో సమాస వృత్తిచే 'ద్విశబ్దమే' 'ద్విః' అను దాని అర్థమును బోధించును గాన 'సుచ్'ను చేర్చవలసిన పనిలేదని "సుజభావోఽభిహితార్థత్వాత్ సమాసే" అను వార్తికమున చెప్పబడినది. ॥24॥

అవతారిక— 'సంఖ్యాయా అవయవే తయప్' (5-2-42) అను సూత్రముచే అవయవభూతమగు సంఖ్యను బోధించు ప్రథమాంత శబ్దముకంటె 'ఈ అవయవి యొక్క అవయవమగు సంఖ్య' అను నర్థమున తయప్ ప్రత్యయము విధింపబడినది. 'పంచ అవయవాః అస్య ఇతి పంచతయమ్' (దేనికి ఐదు అవయవము లున్నవో ఆ సముదాయము పంచతయము) ఇత్యాదు లుదాహరణము. ఈ సూత్రముచే 'బహవః అవయవాః అస్యాః సంఖ్యాయాః' అను నర్థమున బహుశబ్దము కంటె తయప్ ప్రత్యయము ఏల రాదు అని ఆశంకించుకొని, భాష్యమున, అది రాకుండుటకు కారణము చెప్పబడినది ఆ విషయమును వివరించుచున్నాడు.

శ్లో॥ సంఖ్యానామకసంఖ్యాస్తి సంజ్ఞేషేతి యథోచ్యతే ।
రూపం న రూపమప్యేవం సంజ్ఞా సాహి సితాదిషు ॥ 25

యథా = ఏ విధముగా, రూపం = రూపమనెడు పేరుగల, రూపం = సిత పీత నీలాదివర్ణ వ్యతిరిక్తముగా విలక్షణ కార్యస్వభావములు గల రూపము, న = లేదో, హి = ఏలయనగా,

సా = అరూపం అనునది, సితాదిషు = సితాదులయందు, సంజ్ఞా = సంజ్ఞా మాత్రమే, ఏవం = ఈ విధముగనే, సంఖ్యానామ = సంఖ్య అనెడు, సంఖ్యా = అవయవినియగు సంఖ్య, నాస్తి = ఏకత్వాది సంఖ్యలకంటె భిన్నముగ లేదు, ఏషా = ఇది, సంజ్ఞేతి = ఏకత్వాది సర్వ సంఖ్యానుగతమైన సంజ్ఞయే యని, ఉచ్యతే = చెప్పబడుచున్నది

తాత్పర్యము— సితపీతాది వర్ణములకంటె వ్యతిరిక్తముగ రూపమనెడు పేరుతో మరియొక రూపమేదియును లేదు. ఇది సితాదులందన్నిటియందును ఉన్న రూపసామాన్యమును బట్టి వచ్చిన సంజ్ఞా మాత్రమే. అట్లే ఏకత్వాది సంఖ్యా వ్యతిరిక్తముగ సంఖ్య అనెడు ఒక అవయవి లేదు. ఇది సర్వసంఖ్యానుగతమగు 'సంఖ్య' యనెడు పేరు మాత్రమే.

వివరణము— 'బహవః అవయవాః అస్యాః సంఖ్యాయాః' అను నర్థమున బహు శబ్దము కంటె తయప్ రాదు అని చెప్పుటకు భాష్యకారుడు ఈ క్రింది యుక్తులను చెప్పెను. ఈ అర్థమున తయప్ ప్రత్యయము లావలెనన్నచో 'బహు' శబ్దార్థము అవయవమనియు, ఇది అవయవముగల మరియొక సంఖ్యారూపమగు అవయవి ఉన్నదనియు చెప్పవలసి యుండును. ఇచటనున్న 'సంఖ్యా' అనునదియే అవయవి యని చెప్పుటకు వీలులేదు. ఏలయన ఈ 'సంఖ్యా' అనునది ఏకత్వాది సంఖ్యావిశేషములం దన్నిటియందును అనుగతముగ నున్న ఒక నామధేయము. అనగా ఏకత్వాదికము విశేషము, సంఖ్య సామాన్యము. సామాన్య విశేషములకు అవయవావయవిభావము ఉండదు. ఘటత్వము అవయవి, ఘటము దాని అవయవము అనెడు ప్రతీతి లేదు కదా! కొన్ని యెడల అవయవిత్వము కల్పితమైనను కార్యభేదము, రూపభేదము సమాఖ్యాభేదము, వేరువేరుగ కనబడును ఉదాహరణమునకు— వృక్షములకును వనమునకును వాస్తవమున భేదము లేదు. ఐనను వీటికి అవయవావయవి భావము కల్పితమైనది ఈ భేదమును బట్టి కార్యాదులలో భేదము కానవచ్చుచున్నది వృక్షముచేయు కార్యముకంటె వనముచేయు కార్యము వేరుగ నుండును. వాటి రూపమునందు గూడ భేదమున్నది. వాటి సమాఖ్య (పేరు) లో గూడ భేదమున్నది ప్రకృతమున సంఖ్య ఏకత్వాదులు చేయు పరిచ్ఛేదము కంటె భిన్నమగు మరియొక పరిచ్ఛేదమును దీనిని చేయుటలేదు. శుక్లాదులకంటె వ్యతిరిక్తమగు రూపమేదియు రూపమునకు లేదు అట్లే ఇచట గూడ ఏకత్వాది వ్యతిరిక్తమగు రూపమేదియు సంఖ్యకు లేదు. కావున 'సంఖ్య' అను దానిని సంజ్ఞామాత్రమే యని అంగీకరింప వలెను గాని దానికి అవయవిత్వము లేదు. ఇట్లే 'రూప' శబ్దమునకు సితపీతాది సాధారణమగు రూపము అను అర్థము చెప్పిన పక్షమున ఇది (రూపశబ్దము) సామాన్యవాచకమగును గాన అపుడు గూడ అవయవావయవిభావము లేకపోవుటచే 'బహుతయం రూపం' అని ప్రయోగింపరాదు. కాని 'రూప' శబ్దమునకు అనేక రూపసముదాయమగు చిత్రరూపమని చెప్పిన పక్షమున అపుడు ''బహవః అవయవాః యస్యతత్ చిత్రం రూపమ్'' అను నర్థమున 'బహుతయం రూపం' అని తయప్ప్రత్యయమును చేసి ప్రయోగించవచ్చును. ఈ విషయము— ''బహుతయం రూపమిత్యే తచ్చిత్రస్య రూపస్యావయవిత్వవివక్షాయాం భవతి యదా తు రూపసామాన్యం వివక్ష్యతే శుక్లాది విశేషవిషయం తదా సామాన్య విశేషయోః అవయవావయవిభావాభావాన్న భవతి'' అను కైయటమున స్పష్టము చేయబడినది.

'బహవః అవయవాః అస్యాః సంఖ్యాయాః' అను నర్థమున బహు శబ్దముకంటె (బహు శబ్ద సంఖ్యా శబ్దములకు అవయవావయవిభావ సంబంధము లేకుండుటచే) తయప్ ప్రత్యయము రాకున్నను "బహవః అవయవాః అస్యాం వింశతౌ" అను నర్థమున రావచ్చును కదా యని ఆశంకింపవచ్చును. కాని అచట గూడ అవయవావయవి భావము లేదు. బహుత్వము త్రిత్వ చతుష్ట్వాదులలో కూడ నున్నదిగాన కేవలము వింశతికి మాత్రమే అవయవము కాదు. ఇది అనేక సంఖ్యా సాధారణము. అందుచే బహుత్వమునకును వింశతికిని సామాన్య విశేష భావసంబంధమే కాని అవయవావయవి భావసంబంధము లేకపోవుటచే 'బహుతయీ వింశతిః' ఇత్యాది ప్రయోగములు కూడ సాధ్యములు కావు ॥25॥

అవతారిక— 'సంఖ్య' అనునది సామాన్య నామధేయము మాత్రమే అను విషయమును విశదీకరించుచున్నాడు.

శ్లో॥ సంఖ్యాత్వ జాతియోగాత్తు సంఖ్యా సంఖ్యేతి కథ్యతే ।
రూపత్వ జాతియోగాచ్చ రూపే రూపమితి స్మృతమ్ ॥ 26

సంఖ్యాత్వ జాతియోగాత్ + తు = సంఖ్యాత్వము అనెడు సామాన్యముతో సంబంధము వలన సంఖ్యా = సంఖ్య, సంఖ్యేతి = సంఖ్య అని, కథ్యతే = చెప్పబడుచున్నది, రూపే = రూపమునందు, రూపత్వ జాతియోగాత్ = రూపత్వ జాతితో సంబంధమువలన, రూపమితి = రూపము అని, స్మృతమ్ = చెప్పబడినది.

తాత్పర్యము— సంఖ్యాత్వ జాతితో సంబంధముండుటచే, సంఖ్య, సంఖ్యయని చెప్పబడుచున్నది. రూపత్వ జాతితో సంబంధముండుటచే, రూపము, రూపమని చెప్పబడుచున్నది. కావున అవయవావయవి భావసంబంధము లేకుండుటచే 'బహుతయీ సంఖ్యా' "బహుతయం రూపమ్,, అను ప్రయోగములు అయుక్తములని తాత్పర్యము ॥26॥

అవతారిక— 'అనభిహితే' (2-3-1) అను అధికార సూత్రమున్నది. ఇది 'కర్మణి ద్వితయా' ఇత్యాదులలోనికి (2-3-2) అనువర్తించుటచే "కర్మాదులు తిఙ్ - కృత్ - తద్ధిత - సమాసాదులచే అభిహితములు కానపుడు ద్వితీయాదులు వచ్చును" ఇత్యాద్యర్థములు లభించును 'హరిః సేవ్యతే' (హరి సేవించబడుచున్నాడు) ఇత్యాదులలో కర్మార్థక లకారముచే కర్మ అభిహితమైపోయినది గాన కర్మయగు హరి శబ్దమునకు ద్వితీయ రాలేదు. "ప్రాతిపదికార్థ" ఇత్యాది సూత్రముచే ప్రథమయే వచ్చినది అనగా 'అనభిహితే' అను అధికార సూత్రముండుటచే ఇచట ద్వితీయ రాలేదు. కాని ఇచట ఒక ఆశంక గలదు. 'ఉక్తార్థానాం అప్రయోగః'— (ఒక ప్రత్యయము బోధించవలసిన అర్థమును మరియొక ప్రత్యయము అదివరకే బోధించి యున్నచో ఇక ఈ ప్రత్యయము రాదు అని అర్థము) అను న్యాయముచే 'బహుపటుః' ఇత్యాదులలో 'బహు' అను తద్ధిత ప్రత్యయము ఒక అర్థమును బోధించియుండగా మరల అదే అర్థమును బోధించు 'కల్పప్' మొదలగు ప్రత్యయములు ఏ

విధముగ చేర్చబడవో అట్లే 'హరిః సేవ్యతే' ఇత్యాదులలో గూడ తిఙాదులచే కర్మ అభిహిత మైన పిమ్మట మరల ద్వితీయాదులకెట్లును అవకాశము ఉండదు గాన 'అనభిహితే' అను అధి కారము అనావశ్యకము కదా యని ఆశంకించుకొని దానికి సమాధానము ఇట్లు చెప్పబడినది. 'కర్మణి ద్వితీయా' ఇత్యాది సూత్రములకు ''ద్వ్యేకయోర్ద్వివచనైక వచనే'' 'బహుషు బహు వచనమ్' అను సూత్రములతో ఏకవాక్యత్వమును కల్పించి (సమన్వయించి) ''అనభిహిత మగు కర్మయందలి ఏకత్వ ద్విత్వ బహుత్వములను బోధించుటకు ద్వితీయైకవచన ద్వివచన బహువచనములు వచ్చును'' అని అర్థము చెప్పవలెను. అనభిహితాధికారము లేనిచో 'కృతః కటః' ఇత్యాదులలో క్త ప్రత్యయముచే కర్మ చెప్పబడినను ఏకత్వము చెప్పబడలేదు గాన ''ఉక్తార్థానామప్రయోగః'' అనునది ప్రవర్తింపదు గాన ద్వితీయ రావలసి వచ్చును అనభి హితాధికారముండుటచే 'అభిహితము కాని కర్మయొక్క—' ఇత్యాద్యర్థము వచ్చును గాన, ఇచట క్త ప్రత్యయముచే కర్మ అభిహితమై పోయినది గాన ద్వితీయ రాదు. ఇందులకై 'అనభిహితే' అను అధికార సూత్రము ఆవశ్యకము. దీనినంతను మనస్సులో నుంచుకొని, ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

'ఏకః' 'ద్వౌ' 'బహవః' ఇత్యాది స్థలములలో ప్రాతిపదికములచే ఏకత్వాదులు అభిహితములైనను ''ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచనమాత్రే ప్రథమా'' అను సూత్ర ముచే వచనమాత్రమునందు గూడ ప్రథమ విహితముగాన, ప్రథమ వచ్చినది. కాని పైన చూపిన విధమున అనభిహిత కర్మాదుల ఏకత్వాదులను బోధించుటకు, లేదా ఏకత్వాద్య వచ్ఛిన్న అనభిహిత కర్మత్వాదులను బోధించుటకు ద్వితీయైక వచనాదులు వచ్చునని 'కర్మణి ద్వితీయా' ఇత్యాదుల కర్థము చెప్పబడినది 'ఏకం' 'ద్వే' 'బహూని' ఇత్యాదులలో ఏక మొదలగు ప్రాతిపదికములచే ఏకత్వాదు లభిహితము లగుచున్నవి గాన ఇచట ద్వితీయైక వచనాదులు ఎట్లు వచ్చును అని ఆశంకించుకొని సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ నిమిత్తమేకమిత్యత్ర విభక్త్యా నాభిధీయతే ।
తద్వతస్తు యదేకత్వం విభక్తిస్తత్ర వర్తతే ॥ 27

ఏకం + ఇతి + అత్ర = 'ఏకం' అనుచోట, విభక్త్యా - విభక్తి ప్రత్యయముచే, నిమిత్తం = ఏకశబ్ద ప్రవృత్తి నిమిత్తము (అర్థము) అగు ఏకత్వము, నాభిధీయతే = చెప్పబడుట లేదు, తద్వతః = ప్రవృత్తి నిమిత్తభూతమగు ఏకత్వావచ్ఛిన్నమగు ప్రాతిపదికార్థము యొక్క, యత్ = ఏ, ఏకత్వం = ఏకత్వము కలదో, తత్ర = ఆ ఏకత్వ రూపార్థమున, విభక్తిః = విభక్తి ప్రత్యయము, వర్తతే = ప్రవర్తించును.

తాత్పర్యము— 'ఏకం' అనుచోట విభక్తి ప్రత్యయము ప్రాతిపదికార్థమగు ఏకత్వమును బోధించుట లేదు. మరియేమనగా— ఆ ప్రాతిపదికార్థము నందలి ఏకత్వమును బోధించుచున్నది.

వివరణము— ఇచట 'ఏక' శబ్దము ఉదాహరణార్థమై చెప్పబడినని గాన ద్వి

శబ్ద బహు శబ్దము లను గూడ గ్రహింపవలెను. ఏకః, ద్వౌ, బహవః ఇత్యాది ప్రథమా స్థలము లలో గూడ విభక్తి ప్రత్యయములు ఏక మొదలగు ప్రాతిపదికములచే ఏ ఏకత్వాదులు బోధింపబడుచున్నవో వాటిని బోధించుట లేదు. ఆ ప్రాతిపదికార్థము లందలి ఏకత్వ ద్విత్వాదులను బోధించుచున్నవి అట్లే 'ఏకం, ద్వౌ, బహూన్పశ్య' ఇత్యాది ద్వితీయాది స్థలము లలో గూడ ప్రకృత్యర్థమునందలి ఏకత్వాదులనే విభక్తి ప్రత్యయము బోధించుచున్నది గాని ప్రకృత్యర్థములగు ఏకత్వాదులను బోధించుట లేదు. అనగా 'ఏకం ఫలం అస్తి' అనునపుడు 'ఏక' అను ప్రాతిపదికము 'ఏకత్వము కలది' అను అర్థమును బోధింపగా 'సు' అను ప్రత్యయము ఏకత్వముకల దానియందలి ఏకత్వమును బోధించుచున్నది. అట్లే 'ఏకం ఫలం భక్షయతి' ఇత్యాదులలో గూడ ప్రాతిపదికార్థమునందలి ఏకత్వమును బోధించుచున్నది. ఈ విధముగ కర్మాదులందున్న ఏకత్వమును విభక్తి ప్రత్యయమే బోధించుచున్నది కాని ప్రాతిపదికము బోధించుటలేదు గాన ద్వితీయా విభక్తి రావచ్చునని భావము ॥27॥

అవతారిక— పూర్వోక్తోదాహరణములలో నీవు చెప్పినట్లు ప్రకృతి బోధ్యమగు సంఖ్య ఒకటియు ప్రత్యయ బోధ్యమగు సంఖ్య మరియొకటియు ఉన్నట్లు కానవచ్చుట లేదుకదా యని ఆశంకించుకొని చెప్పుచున్నాడు

శ్లో॥ ఏకస్య ప్రచయో దృష్టః సమూహశ్చ ద్వయోస్తథా ।
నిమిత్తవ్యతిరేకేణ సంఖ్యాన్యా భేదికా తతః ॥ 28

ఏకస్య = ఒకదానికి, ప్రచయః = వృద్ధి (అన్య సహభావముచే పెరుగుదల), దృష్టః = చూడబడినది (కనబడుచున్నది), తథా = అట్లే, ద్వయోః = రెండింటికి, సమూహశ్చ = సమూహము కూడా (చూడబడుచున్నది), తతః = ఆ కారణమువలన, భేదికా = ప్రాతిపదికార్థమును అవచ్ఛేదించునది యగు, అన్యా = మరియొక, సంఖ్యా = విభక్త్యర్థమగు సంఖ్య, నిమిత్తవ్యతిరేకేణ = ఏకశబ్దాది ప్రవృత్తి నిమిత్తము (అర్థము) కంటె భిన్నముగ, కనబడుచున్నది

తాత్పర్యము— ఒక వస్తువునకు వృద్ధియు, రెండింటికి సమూహమును కనబడుచున్నది. కావున ప్రాతిపదికార్థము కంటె భిన్నముగ, తదవచ్ఛేదకమగు విభక్త్యర్థమైన సంఖ్య వేరుగ కనబడుచున్నది

వివరణము— ఒక వస్తువును మరియొక వస్తువుతో కలిపిన యెడల దానికి వృద్ధి (ప్రచయము) కలుగుచున్నది. ద్విత్వాది సంఖ్యలు ఏర్పడుచున్నవి రెండు వస్తువులు ఒక సముదాయముగ కనబడుచున్నవి. ఇచట 'ద్వయోః' అనునది 'బహూనామ్' అను దానికి ఉపలక్షణము. అనగా రెండు మూడు వస్తువులున్నను అది ఒక సముదాయముగా కూడ కనబడుటకు వీలున్నది. కావున 'ఏకః' 'ద్వౌ' ఇత్యాదులలోని విభక్తి ప్రత్యయములచే బోధింపబడెడు సంఖ్య ప్రకృతిబోధ్యములగు సంఖ్యలయందలి విశేషమును తెలుపుచుండును. కాన ఇది తద్భిన్నముగ కనబడుచునే యున్నది. అనగా 'ఏకః' అనునపుడు 'ఏక' అను

ప్రాతిపదికము ప్రచితమని కాని అపచితమని కాని భేదములేని ఏకత్వమును మాత్రము బోధించును. దానిపై చేరిన 'సు' విభక్తి ప్రత్యయముచే బోధ్యమగు ఏకత్వ సంఖ్య ప్రాతిపదిక బోధితమగు ఏకత్వ సంఖ్య ప్రచితము కాదు (వృద్ధిపొందక ఒక్కటిగానే ఉన్నది) అని బోధించును. అట్లే 'ద్వౌ' 'త్రయః' ఇత్యాదులలోని 'ద్వి' 'త్రి' మొదలగు ప్రాతిపదికములు కేవలము ద్విత్వ త్రిత్వాదులను మాత్రమే బోధించును ఇవి సమూహాత్మకములా (ఒక సముదాయముగ నున్నవా) లేక వేరువేరుగ నున్నవా యని విశేషము తెలియదు. కాని వాటిపై చేరిన విభక్తి ప్రత్యయములచే బోధింపబడు సంఖ్య ఆ ద్విత్వాదులు సమూహాత్మకములు కాక విభక్త రూపముననే ఉన్నవి అని బోధించును. ఈ విధముగ ప్రాతిపదిక బోధ్య సంఖ్య యందలి వైశిష్ట్యమును బోధించుచు విభక్తి ప్రత్యయవాచ్య సంఖ్య వ్యతిరిక్తముగ నున్నదని యభిప్రాయము. ॥28॥

అవతారిక— సంఖ్యావాచక శబ్దములపై సంఖ్యాబోధకములగు విభక్తి ప్రత్యయములు మరల ఎట్లు వచ్చును అను ఆశంకకు భాష్యోక్తమగు మరియొక సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ తదేకమపి చైకత్వం విభక్తి శ్రవణాదృతే ।
నోచ్యతే తేన శబ్దేన విభక్త్యా తు సహోచ్యతే ॥ 29

తత్ = ఆ, ఏకమపి = ఒక్కటియే యైనను, ఏకత్వం = ఏకత్వము, విభక్తి శ్రవణాత్ + ఋతే = విభక్తి శ్రవణము లేనిచో, తేన = ఆ, శబ్దేన = 'ఏక' శబ్దముచేత, నోచ్యతే = బోధింపబడదు, తు = కాని, విభక్త్యాసహ = విభక్తి ప్రత్యయముతో కూడ కలిసి యున్నపుడు, ఉచ్యతే = బోధింపబడును.

తాత్పర్యము— ఆ ఏకత్వము ఒక్కటియే యైనను విభక్తి శ్రవణము లేనిచో అది ఆ శబ్దముచే బోధింపబడదు. విభక్తితో కలిసియున్న శబ్దముచేత మాత్రమే బోధింపబడును.

వివరణము— ''నకేవలా ప్రకృతిః ప్రయోక్తవ్యా'' (ప్రత్యయరహితమగు ప్రకృతిని ప్రయోగింపరాదు) అను నియమమును అనుసరించి 'ఏక' అను ప్రకృతిని ప్రత్యయము లేకుండ ప్రయోగించుటకు వీలులేదు. అందుచే ఏదైన ఒక విభక్తి ప్రత్యయమును చేర్చవలసి యుండును ఆ చేర్చెడు ప్రత్యయము ఏకవచన ప్రత్యయము కాక ద్వివచన ప్రత్యయమో బహువచన ప్రత్యయమో అయినచో ప్రకృత్యర్థమునకును ప్రత్యయార్థమునకును పొత్తు కుదురదు. కావున 'ఏక' అను ప్రకృతికి ఏకవచన ప్రత్యయమునే చేర్చవలెను. ఈ ఏకవచన ప్రత్యయము ప్రకృతి బోధ్యమగు ఏకత్వమునే అనువదించును ఈ విధముగ 'ఏకః' అనునపుడు ప్రకృతి ప్రత్యయములు రెండును ఒకే ఏకత్వమును బోధించును అనగా 27 వ కారికలో చెప్పినట్లు ప్రాతిపదిక బోధ్యమగు ఏకత్వము ఒకటి, ప్రత్యయ బోధ్యమగు ఏకత్వము మరియొకటి యని అంగీకరింప బనిలేదు. కాని విభక్తి ప్రత్యయము లేకున్నచో కేవల ప్రకృతి ఏకత్వమును బోధింపజాలదు.

ఈ విషయమునే నాగేశుడు ఉద్ద్యోతమున (2-3-1) ఈ విధముగ విశదీకరించెను : ఈ పదమునకు ఇది అర్థము అను రీతిని శక్తి గ్రహము వృద్ధ వ్యవహారమువలననే కలుగును. వృద్ధ వ్యవహారము విభక్త్యంతములగు పదముల విషయముననే ఉన్నది కాని విభక్తిరహిత మాత్రములగు ప్రకృతుల విషయమున లేదు. కావున విభక్తితో కూడిన ప్రకృతి విషయమున ఏర్పడిన శక్తి గ్రహము విభక్తిలేని ప్రకృతిని చూచినపుడు ఉద్బుద్ధము కాదు. ఈ విధముగ పదార్థోపస్థితి తప్పక కావలెనన్నచో విభక్తి ప్రత్యయముండి తీరవలెను. కావున ప్రకృతిచే ఏకత్వము చెప్పబడినను విభక్తి ప్రత్యయమును చేర్చవచ్చును శక్తి గ్రహము వృద్ధ వ్యవహారము వలననే కలుగును అని చెప్పుటకు ప్రమాణమేమి అని ప్రశ్నింపరాదు. లోక వ్యవహారమున ప్రయుక్తములగు పదముల సాధుత్వమును నిరూపించుటకే కదా ఈ శాస్త్రము బయలుదేరినది.

ఈ విధముగ ఈ కారిక 'ఏకః' ఇత్యాదులలో ప్రకృత్యర్థమునే విభక్తి అనువదించు చున్నది అని చెప్పినది. ఈ యుక్తియే 'ద్విః శబ్దాదుల విషయమున గూడ ప్రవర్తించును.

అవతారిక— ఈ విషయమున భాష్యకారులు మరియొక యుక్తిని గూడ చూపించెను. సంఖ్య అనునది ఎల్లప్పుడు పరప్రధానముగ ఉండును. అది స్వతంత్రముగ ఉండ జాలదు. అందుచే సంఖ్యావాచక శబ్దము 'ఏకం ఫలమ్' ఇత్యాదులందు వలె విశేష్యభూతమగు మరియొక పదమునకు విశేషణముగ ఉండును. దానికి విభక్తి ప్రత్యయము రానిచో కేవల ప్రకృతి ప్రయోగానర్హము గాన ఇది ఆ విశేష్య పదమునకు విశేషణముగ ఉండ జాలదు. అందుచే ఈ 'ఏక' శబ్దము సంఖ్యేయ పదవిశేషణమగుటకు యోగ్యము కావలెనన్నచో విభక్తి ప్రత్యయము చేర్చవలెను. ఈ విషయమునే విశదీకరించుచున్నాడు.

శ్లో॥ అన్వయవ్యతిరేకౌహి యది స్యాద్వచనాన్తరమ్ ।
స్యాతామసతి తస్మింశ్చ ప్రకృత్యర్థోన కల్ప్యతే ॥ 30

వచనాన్తరమ్ = మరియొక వచనము, స్యాద్యది = ప్రయుక్తమైనచో, అన్వయ వ్యతిరేకౌ = అన్వయ వ్యతిరేకములు, స్యాతామ్ = ఉండవచ్చును, తస్మిన్ = వచనాంతరము, అసతి చ= లేనిచో. ప్రకృత్యర్థః = ప్రకృత్యర్థము, న కల్ప్యతే = కల్పింపబడదు.

తాత్పర్యము— వచనాంతరమును ప్రయోగించినచో అన్వయ వ్యతిరేకములకు అవకాశముండెడిది. వచనాంతరము లేనపుడు ప్రకృత్యర్థము కల్పింపబడదు.

వివరణము— 'వృక్ష' అను ప్రాతిపదికమునకు 'సు' చేర్చినచో 'వృక్షః' అనియు, 'ఔ' చేర్చినచో 'వృక్షౌ' అనియు, 'జస్' చేర్చినచో 'వృక్షాః' అనియు వేరు వేరు రూపములు ఏర్పడుచున్నవి. 'వృక్షః' అనునపుడు ఒక అర్థము, 'వృక్షౌ' అనునపుడు మరియొక యర్థము, 'వృక్షాః' అనునపుడు ఇంకొక అర్థము బోధ్యమగుచున్నది. ఈ విధముగ వేరు వేరు వచనములు చేర్చినపుడు వేరు వేరు అర్థములు బోధ్యములగుటచే అన్వయ

వ్యతిరేకములను కల్పించి ఈ ప్రత్యయము చేర్చినపుడు ఈ యర్థము బోధింపబడుచున్నది ; ఇది కాక మరియొక వచన ప్రత్యయమును చేర్చినపుడు ఈ అర్థము బోధింపబడుట లేదు, మరియొక అర్థము బోధింపబడుచున్నది ; కావున ఈ ప్రత్యయమునకు ఇది యర్థము అని నిర్ణయింప వీలగుచున్నది. కాని 'ఏక' శబ్దమునకు ఎల్లప్పుడును ఏకవచన ప్రత్యయమునే చేర్చి ప్రయోగింతురు గాని మరి ఇతర వచన ప్రత్యయములను చేర్చుట లేదు. ఇట్లే 'ద్వి' శబ్దమునకు ద్వివచన ప్రత్యయమునే చేర్తురుగాని ఇతర ప్రత్యయములను చేర్పరు. ఈ విధముగ ఇతర ప్రత్యయములను చేర్చకున్నచో— ఈ ప్రత్యయమును చేర్చగా ఈ యర్థము వచ్చినది, దీనిని తీసి మరియొక ప్రత్యయమును చేర్చగా మరియొక అర్థము వచ్చినది, కావున ఇది ప్రకృత్యర్థము, ఇది ప్రత్యయార్థము అని అన్వయ వ్యతిరేకములచే నిర్ణయింప శక్యము కాదు. కావున 'ఏకః' అను ప్రకృతి ప్రత్యయసముదాయమునకే 'ఒకటి' యని యర్థము, 'ద్వౌ' అను ప్రకృతి ప్రత్యయసముదాయమునకే 'రెండు' అని యర్థము. వీటిలో ప్రత్యయార్థ వ్యతిరిక్తముగ ప్రకృత్యర్థము భాసించుట లేదు అని తాత్పర్యము

'ఏకః' ఇత్యాదులలో ప్రకృత్యర్థమునే ప్రత్యయము అనువదించుచున్నది అని పూర్వకారికలో చెప్పబడినది. ప్రకృతి ప్రత్యయసముదాయార్థమే సంఖ్యేయమునకు విశేషణముగ ప్రయోగింపబడుచున్నదని ఈ కారిక చెప్పుచున్నది. ॥30॥

అవతారిక— ఈ విషయముననే మహాభాష్యమున మరియొక ఉపపత్తి కూడ చెప్పబడినది. సంఖ్యా శబ్దములు ద్రవ్యమును, గుణమును గూడ బోధించును. ఏ ద్రవ్యము నందలి గుణమును ఈ శబ్దములు బోధించుచున్నచో ఆ ద్రవ్యములకు సంబంధించిన ఏకత్వాదులు అనుక్తములే గాన విభక్తి ప్రత్యయము రావచ్చును, అనునది ఈ ఉపపత్తి దీనిని విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ఏకత్వమేక ఇత్యత్ర శుద్ధ ద్రవ్యవిశేషణమ్ ।
సగుణస్తు ప్రకృత్యర్థో విభక్త్యర్థేన భిద్యతే ॥ 31

ఏకః ఇత్యత్ర = 'ఏకః' అనుచోట, శుద్ధ ద్రవ్యవిశేషణం = విశేషణమును చేర్చుటకు పూర్వము శుద్ధమైన ద్రవ్యమునకు విశేషణమగు, ఏకత్వం = ఏకత్వము బోధింపబడుచున్నది, సగుణః = గుణముతో కూడిన, ప్రకృత్యర్థః = ప్రకృత్యర్థము, విభక్త్యర్థేన = విభక్త్యర్థమగు ఏకత్వముచే, భిద్యతే = విశేషింపబడుచున్నది.

తాత్పర్యము— 'ఏకః' అనునపుడు ప్రాతిపదికము శుద్ధమగు ద్రవ్యమునకు విశేషణమైన ఏకత్వమును బోధించుచున్నది. ఆ గుణముతో కూడిన ప్రకృత్యర్థమునకు విభక్త్యర్థము విశేషణముగ చేరుచున్నది.

వివరణము— ప్రాతిపదికము గుణోపసర్జనమగు ద్రవ్యమును బోధించును. విభక్తి ద్రవ్యోపసర్జనమగు గుణమును బోధించును. ఉదాహరణమునకు- 'శుక్లం' అను పదమునకు

'శుక్ల వర్ణముతో కూడిన వస్త్రాదికము' అని యర్థము ఇచట శుక్లగుణము ఉపసర్జనము (అప్రధానము గను శుక్లగుణము గల ద్రవ్యము ప్రధానముగను బోధింపబడుచున్నవి. ఈ శుక్ల శబ్దమునకే 'శుక్ల స్వభావః' అను నర్థమున భావ ప్రత్యయము చేర్చి 'శౌక్ల్యం' అను రూపము నేర్పరచినపుడు భావ ప్రత్యయవాచ్యమగు గుణమున ద్రవ్యము ఉపసర్జనముగ భాసించుచున్నది. అట్లే 'ఏకః' అనునపుడు 'ఏక' అనెడు ప్రాతిపదికము శుద్ధ ద్రవ్య విశేషణ మగు ఏకత్వమును బోధించును. అనగా ఏకత్వమనెడు గుణముగల ద్రవ్యమును బోధించును విభక్త్యర్థము ప్రకృత్యర్థమును విశేషించుచు ఈ ఏకద్రవ్యము ఏకత్వ విశిష్టమే కాని గుణాన్తర విశిష్టము కాదు అని బోధించును అనగా విభక్త్యర్థమగు ఏకత్వమున ప్రకృత్యర్థమగు ఏకత్వ విశిష్టద్రవ్యము ఉపసర్జనముగ భాసించును ఈ విధముగ ఏకశబ్దాదులకు పరముగ విభక్తి ప్రత్యయములు రావచ్చునని భావము. ॥31॥

అవతారిక— ఏకాది శబ్దములు ద్రవ్యమును గుణమును గూడ బోధించునని పూర్వకారికలో చెప్పబడినది. కాని 'ఏకః' మొదలగు పదములు సంఖ్యేయములను (లెక్కింప దగిన ద్రవ్యములను) బోధించుచున్నవి. ఇవి ఏకత్వాది గుణమాత్ర బోధకములుగ కూడ నున్నవి అని చెప్పుటకు ప్రమాణమేమి అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్వ్యేకయోరితి నిర్దేశాత్ సంఖ్యామాత్రేఽపి సంభవః ।
ఏకాదీనాం ప్రసిద్ధ్యా తు సంఖ్యేయార్థత్వముచ్యతే ॥ 32

ద్వ్యేకయోః ఇతి = 'ద్వ్యేకయోః' అని, నిర్దేశాత్ = నిర్దేశించుట వలన, ఏకాదీనాం = ఏకాది శబ్దములకు, సంఖ్యామాత్రేఽపి = సంఖ్యామాత్రము నందు గూడ, సంభవః = సంభవ మున్నది, తు = కాని, ప్రసిద్ధ్యా = లౌకిక ప్రసిద్ధిచే, సంఖ్యేయార్థత్వం = సంఖ్యేయము మాత్రమే అర్థము కలిగియుండుట, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ''ద్వ్యేకయోర్ద్వివచనైక వచనే'' అని సూత్ర నిర్దేశముండుటచే ఏకాది శబ్దములు సంఖ్యామాత్రమును గూడ బోధించునని చెప్పుటకు సంభవమున్నది కాని లోకప్రసిద్ధిననుసరించి ఈ శబ్దములు సంఖ్యేయములను మాత్రమే బోధించునని చెప్పు చుందురు.

విశేషము— ''ద్వ్యేకయోర్ద్వివచనైక వచనే'' అను సూత్రమున 'ద్వ్యేకయోః' అను పదమునకు ద్విత్వ ఏకత్వములు అని అర్థము అట్లుకాక రెండు, ఒకటియైన ద్రవ్యములు (సంఖ్యేయములు) అను నర్థము చెప్పినచో 'ద్వ్యేకయోః' అని ద్వివచనము కాక 'ద్వ్యేకేషామ్' అని బహువచనమును ప్రయోగింపవలసి యుండును. దీనినిబట్టి ఏకాది సంఖ్యా-శబ్దములు సంఖ్యామాత్రమును గూడ బోధించునని తెలియుచున్నది. కాని లౌకిక ప్రసిద్ధి ననుసరించి 'ఏకః' = ఒక పదార్థము, 'ద్వౌ' = రెండు ద్రవ్యములు ఇత్యాదివిధమున సంఖ్యా శబ్దములు సంఖ్యేయవాచకములు అని చెప్పుచుందురు. ॥32॥

సంఖ్యా సముద్దేశము ముగిసినది

ఉపగ్రహ సముద్దేశము

అవతారిక— ఇపుడు ఆఖ్యాతార్థమగు ఉపగ్రహమును గూర్చి విచారింపబోవుచు ముందుగ ఉపగ్రహమనగా ఏదియో చెప్పుచున్నాడు.

శ్లో॥ య ఆత్మనేపదాద్భేదః క్వచిదర్థస్య గమ్యతే ।
అన్యతశ్చాపి లా దేశాన్మన్యన్తే తముపగ్రహమ్ ॥ 1

లాదేశాత్ = లకారమునకు ఆదేశముగా వచ్చిన, ఆత్మనేపదాత్ = ఆత్మనే పదమువలనగాని, అన్యతః + చ + అపి = మరియొక దానివలన (పరస్మై పదమువలన) గాని, క్వచిత్ = కొన్ని కొన్ని స్థలములందు, అర్థస్య = అర్థముయొక్క, యః = ఏ, భేదః = భేదము, గమ్యతే = తెలియునో, తం = దానిని, ఉపగ్రహమ్ = ఉపగ్రహమునుగా, మన్యన్తే = తలచుచున్నారు (చెప్పుచున్నారు).

తాత్పర్యము— 'లట్' మొదలగు లకారములకు ఆదేశముగా వచ్చిన ఆత్మనే పదముగాని, పరస్మై పదముగాని అర్థ విశేషమును బోధించును. దీనిని ఉపగ్రహమందురు.

వివరణము— క్రియా ఫలము కర్తకుచెందునని ఆత్మనే పదము చెప్పును. క్రియా ఫలము పరునకు చెందునని పరస్మై పదము చెప్పును. ఈ విధముగ ఆత్యనే పద పరస్మై పద గమ్యమగు అర్థ విశేషమునకు ఉపగ్రహమని ప్రాచీనాచార్యుల వ్యవహారము. అదియే ఇచట గూడ గ్రహింపబడుచున్నది. ॥1॥

అవతారిక— ఏ అర్థమునకు చెందిన విశేవమును బోధించును అను విషయమునే వివరించుచున్నాడు

శ్లో॥ క్వచిత్సాధనమేవా సౌ క్వచిత్తస్య విశేషణమ్ ।
సాధనం తత్ర కర్మాది వ్యక్తవాచో విశేషణమ్ ॥ 2

క్వచిత్ = కొన్ని స్థలములందు, సాధనమేవ = సాధనమే, అసౌ = ఈ ఉపగ్రహము, క్వచిత్ = కొన్ని స్థలములందు, తస్య = దానియొక్క, విశేవణమ్ = విశేషణము (ఉపగ్రహము), తత్ర = అందు, కర్మాది = కర్మాదికము, సాధనమ్ = సాధనము, వ్యక్తవాచః = వ్యక్త వాక్కులు, విశేషణమ్ = విశేషణము.

తాత్పర్యము— కొన్ని స్థలములలో సాధనమే ఉపగ్రహము. కొన్ని యెడల దాని విశేషణము ఉపగ్రహము. సాధనమనగా కర్మాదికము. వ్యక్తవాక్కులు దానికి (సాధనమునకు) విశేషణమగుటచే ఉపగ్రహములని చెప్పబడును

వివరణము— ఈ కారికలోని ఉత్తరార్థము పూర్వార్థ వివరణరూపము. 'పచ్యతే' (వండబడుచున్నది) 'గమ్యతే' (పొందబడుచున్నది) ఇత్యాదులలో ఆత్మనే పదము (సాధనమును) కర్మను బోధించుచున్నది గాన అది ఉపగ్రహము కర్మ మొదలగు వాటికి సాధనము అని పేరు. 'కర్మాది'లోని 'ఆది' శబ్దముచే కర్తయు, భావము కూడ గ్రహింపబడును. 'ఏధతే' ఇత్యాదులలోని ఆత్మనే పదముచేతను, 'యాతి' ఇత్యాదులలోని పరస్మై పదముచేతను కర్త బోధింపబడుచున్నది. కావున ఇచట కర్తృ రూప సాధనము ఉపగ్రహము. 'ఆస్యతే' 'శయ్యతే' ఇత్యాదులలో ఆత్మనే పదము భావరూప (క్రియామాత్ర రూప) సాధనమును బోధించును. అందుచే ఇచట భావము ఉపగ్రహము. 'క్వచిత్త స్య విశేషణమ్' (కొన్ని యెడల ఆ సాధనము యొక్క విశేషణము ఉపగ్రహము) అను దానికి ఉదాహరణముగ 'వ్యక్తవాచో విశేషణమ్' అనునది చూపబడుచున్నది. ''వ్యక్తవాచాం సముచ్చారణే'' అను సూత్రముచే అచ్చులు, హల్లులు అనెడు భేదము వ్యక్తమగు విధమున మాటలాడెడు వారు కలిసి మాటలాడు చుండుట అను అర్థమున వద ధాతువునకు ఆత్మనేపదము విధింపబడినది. 'సంప్రవదన్తే బ్రాహ్మణాః' ఇత్యాదులు ఉదాహరణము బ్రాహ్మణులందరును కలిసి మాటలాడు చున్నారని యర్థము. ఇచట ఆత్మనేపదముచే బోధ్యమగు వ్యక్త వాక్త్వము (అనగా ఇతరులకు వినబడునట్లు మాటాడుట) కర్తృ భూతసాధనములగు బ్రాహ్మణులకు విశేషణముగ భాసించుచున్నది. ఇది కూడ ఉపగ్రహమే. ॥2॥

అవతారిక— కొన్ని యెడల క్రియా విశేషణము ఉపగ్రహముగ నుండునని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియా విషయభేదేన జీవికాదిషు భిద్యతే ।
లాదేశైః స క్రియాభేదో వాక్యేష్వపి నియమ్యతే ॥ 3

జీవికాదిషు = తాను జీవించుటకయి వృత్తిగాచేయు పనులయందు (ఇతరుల కొఱకు), విషయ భేదేన = విషయ భేదముచే, క్రియా = క్రియ, భిద్యతే = భేదమును పొందుచుండును, సః = ఆ, క్రియాభేదః = క్రియా భేదము, లాదేశైః = లకారాదేశములగు పరస్మై పదాత్మనే పదములచే, (అభివ్యజ్యతే = అభివ్యక్తమగును), వాక్యేష్వపి = వాక్యములందు కూడ, నియమ్యతే = నియమితమై గమ్యమగును.

తాత్పర్యము— జీవికాదులందు విషయభేదమును (అనగా ఫలమెవరికొఱకుద్దేశింప బడినదో వారు, విషయము వారు భేదించుటచే) బట్టి క్రియ భేదించుచుండును. ఆ క్రియా భేదము లాదేశములచే అభివ్యక్తమగును. వాక్యములందు గూడ అభివ్యక్తమగును.

విశేషము— 'పచ్' ధాతువు 'వండుట' అను క్రియను బోధించును. వంటచేయు వానికి సంబంధించినంతవరకు ఈ పాక క్రియ వేరు, భుజించువానికి సంబంధించినంతవరకు ఇది వేరు. ఈ విధముగ విషయభేదమును బట్టి క్రియ భేదమును పొందుచుండును. లకారములకు ఆదేశముగ వచ్చిన పరస్మై పదాత్మనే పదములు ఈ క్రియా భేదములను వ్యక్తీకరించు

చుండును ఒకడు జీవికకై వంటలు చేయుచుండును: మరియొకడు జీవికకై యజ్ఞాదులు చేయును. ఇట్లు జీవికకై వంట, పూజ మొదలగు పనులు చేయువానికి జీతము అనెడు ఫలము లభించుచుండ వచ్చును. కాని ప్రధాన క్రియా ఫలము అతనికి చెందక ఆతని స్వామికి చెందు చున్నది వండిన ఆహారమును ఆ స్వామి తినుచున్నాడు; చేసిన యజ్ఞాదుల వలన కలుగు పుణ్యాదులు స్వామికి చెందును. క్రియలోనున్న ఇట్టి విశేషమును లకారములకు ఆదేశములుగ వచ్చిన పరస్మై పదాత్మనే పదములు బోధించును. 'పచతి' 'యజతి' అని పరస్మైపదమును ప్రయోగించినచో పాకయాగ ఫలములు ఆ పనులు చేయువానికి కాక మరియెవ్వరికో చెందునని యర్థము. 'పచతే' 'యజతే' ఇత్యాది విధమున ఆత్మనే పదమును ప్రయోగించినచో ఆ ఫలములు ఆ పనులు చేసినవానికి చెందునని యర్థము. ఈ విధముగ లాదేశములగు పరస్మై పదాత్మనే పదములచే క్రియా విశేషములు తెలియుచుండును కొన్ని స్థలములలో వాక్యము చేతనే క్రియా విశేషము స్పష్టమగుచున్నది. ఉదాహరణమునకు 'స్వం యజ్ఞం యజతే' 'స్వం యజ్ఞం యజతి' ఇత్యాది వాక్యములలో 'స్వం' (తన) అను పద ముండుటచే క్రియా ఫలము కిర్తకు చెందునని తెలియుచున్నది ఉపపదముచే (సమీపమున నున్న పదముచే) ప్రధాన ఫలము కర్తృగామియా, అన్యగామియా అను విషయము తెలియునపుడు ఏ పదమైన రావచ్చునని ''విభాషోపపదేన ప్రతీయమానే'' (1-3-77) అను సూత్రము చెప్పుచున్నది. కావున పై వాక్యములలో క్రియా ఫలము కర్తృగామియను విషయము 'స్వం' అను పదాం తరముతో గూడిన వాక్యమును ఇట్టి తెలియుచున్నది. ఈ విధముగ క్రియా భేదము లకారా దేశములగు పరస్మైపదములచేతను వాక్యములచేతను గూడ గమ్యమగునని తాత్పర్యము. ఇట్టి క్రియా విశేషము ఆత్మనే పదాది గమ్యముగాన దీనికి ఉపగ్రహమని పేరు. ॥3॥

అవతారిక— కొన్ని యెడల విషయభేదము లేకున్నను సాక్షాత్తుగ క్రియా విశే షమే ఉపగ్రహమని చెప్పుచున్నాడు

శ్లో॥ ధాత్వర్థస్తద్విశేషశ్చాప్యుక్తః క్వచిదుపగ్రహః ।
ధాత్వర్థో గన్ధనాదిః స్యాత్ వ్యతిహారో విశేషణమ్ ॥ 4

క్వచిత్ = కొన్ని స్థలములందు, ధాత్వర్థః = ధాతువు యొక్క అర్థము, తద్విశేషః + చ + అపి = దానియొక్క విశేషణము గూడ, ఉపగ్రహః = ఉపగ్రహముగా, ఉక్తః = చెప్పబడి నది, గంధనాదిః = గంధనాదికము (అనగా హింసించుట మొదలయినవి), ధాత్వర్థః = ధాత్వర్థ ముగా, స్యాత్ = అగును, వ్యతిహారః = వ్యతిహారము, విశేషణం = విశేషణము.

తాత్పర్యము— కొన్ని యెడల ధాత్వర్థము, దాని విశేషణము కూడ ఉపగ్రహ మని చెప్పబడినది. గంధనాదికము ధాత్వర్థము; వ్యతిహారము (ఒకరినుండి యింకొకరు మార్చుకొనుట) విశేషణము.

వివరణము— ఈ కారికలో ఉత్తరార్థము పూర్వార్థ వివరణ రూపము. ''గన్ధ నావక్షేపణ - సేవన - సాహసిక్య - ప్రతియత్న - ప్రకథనోపయోగేషు కృఞః'' (1-3-32)

అను సూత్రముచే గంధనాద్యర్థములందు కృఞ్ ధాతువునకు, క్రియా ఫలము కర్త్రభిప్రాయము (ఆ యా పనులను చేయువాని కొఱకే) కాకున్నను, ఆత్మనే పదము విధింపబడినది. గంధన మనగా హింసించుట. ఉదా : 'ఉత్కురుతే' = పరదోషావిష్కరణము చేయుచున్నాడు అని అర్థము. ఇట్లు చేయుట స్వయముగ బాధ కాకపోయినను బాధను కలిగించుటకు కారణమగు చున్నది గావున హింసగ పరిగణింపబడు చున్నది. ఇట్లే అవక్షేపణాద్యర్థములలో 'ఉదా కురుతే' ఇత్యాద్యుదాహరణములను చూచుకొనవలెను. ఈ ఉదాహరణములలోని గంధనము మొదలగు ధాత్వర్థము ఆత్మనే పదముచే గమ్యమగుచున్నది గాన ఈ యర్థము కూడ ఉప గ్రహ సంజ్ఞకమే

''కర్తరి కర్మ వ్యతిహారే'' అను సూత్రముచే క్రియా వినిమయము ద్యోత్యమగు నపుడు కర్త్రర్థమున ఆత్మనే పదము విధింపబడినది. 'వ్యతిలునీతే' ఇత్యాదులుదాహరణము. ఒకడు చేయవలసి యున్న లవన కర్మను మరియొకడు చేయుచున్నాడు అని అర్థము. ఇచట ఆత్మనే పదము వ్యహారమనెడు క్రియయందలి విశేషమును - అనగా క్రియా విశేషణ భూత మగు వ్యతిహారమును బోధించుచున్నది. ఈ విధముగ ఆత్మనే పద గమ్యమగుటచే క్రియా విశేషణమగు ఈ వ్యతిహారము కూడ ఉపగ్రహమే యని భావము. ॥4॥

అవతారిక—— క్రియా ఫలము కర్త్రభిప్రాయమైనపుడు, అనగా కర్తకొఱకై ఉద్దిష్ట మైనపుడు, ఆత్మనే పదము వచ్చునని చెప్పబడినది. కాని క్రియా ఫలము లన్నియును ఎట్టైన కర్తకే చెందును గాన ఇట్లు చెప్పవలసిన పనిలేదని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాప్రవృత్తౌ వాఖ్యాతా కైశ్చిత్ స్వార్థపరార్థతా ।
అసతీ వా సతీవాఽపి వివక్షిత నిబన్ధనా ॥ 5

క్రియాప్రవృత్తౌ = క్రియయందు ప్రవర్తించు విషయమున, కైశ్చిత్ = కొందరిచేత, స్వార్థ పరార్థతా = స్వార్థత్వము, పరార్థత్వము, ఆఖ్యాతా = చెప్పబడినది, అసతీ + వా = యథా ర్థము కానిదైనను, సతీవా = యథార్థమైనదైనను, వివక్షిత నిబన్ధనా = వివక్షపై ఆధార పడునది.

తాత్పర్యము—— కొందరు క్రియాప్రవృత్తి విషయమున స్వార్థత్వమును (తన = కర్తకొఱకు గాని) పరార్థత్వమును (ఇతరుల కొఱకుగాని) చెప్పియున్నారు. ఆ పరార్థత్వము యథార్థమా ఆయథార్థమా అనునది వివక్షపై ఆధారపడి యున్నది.

వివరణము—— 'సర్వ ఇమే స్వభూత్యర్థం యతన్తే' - (లోకములో ఎల్లరును తమ అభివృద్ధినిమిత్తము మాత్రమే ప్రయత్నము చేయుదురు) అని మహాభాష్యములో చెప్పినట్లు ప్రతి ఒక్కడు స్వలాభాపేక్షతోడనే ప్రవర్తించుచుండును కావున స్వార్థప్రవృత్తి పార మార్థికము (అనగా నిజమయినది) పరార్థప్రవృత్తి అనునది అసత్యము (అసతీ). అది పార మార్థికము (సతీ) అని ఎవరైన చెప్పినచో అది మాటవరుసకు చెప్పినదే కాని వాస్తవము

కాదు. పరార్థత సత్యము కాకున్నను అట్లు చెప్పవలెనను కోరికచే (వివక్షచే) చెప్పవచ్చును. అట్టి పరిస్థితులలో క్రియాఫలము పరార్థము కాన ఆత్మనే పదము రాకుండ పోవును. అట్లు కాకుండుటకై - అనగా ఫలము పరార్థమని వివక్షితమైనను వాస్తవమున అది స్వార్థమేగాన ఆత్మనే పదము వచ్చుటకై, "కర్త్రభిప్రాయమే క్రియాఫలే" అని చెప్పబడినది.

వివక్షావశమున మాత్రమే కాక, ప్రధాన ఫలమును బట్టి, ప్రవృత్తి వాస్తవముగనే స్వార్థముగగాని పరార్థముగగాని ఉండవచ్చునని మరికొందరి యభిప్రాయము ఈ అభిప్రాయ భేదమును సూచించుటకే కారికలో 'కైశ్చిత్' అను పదము ప్రయుక్తమైనది. స్వర్గము అన్నము మొదలగు ఫలములు తనకు కావలెనని అభిలషించెడు వ్యక్తి (దేవదత్తుడు) ఇతరునిచే (యజ్ఞ దత్తునిచే) యజన పచనాదికార్యములను చేయించును. అట్లు చేసినందులకు వానికి జీతము ఇచ్చును. యజనాదులు చేసిన వానికి (యజ్ఞ దత్తునకు) జీతము మాత్రమే ఫలము. యజన పచనాదుల ప్రధాన ఫలములగు స్వర్గోదనాదులు ఆ చేయించిన దేవదత్తునకు చెందును. కావున తాను ఫలము పొందుటకై ఇతరులు యాగముచేయు ఏర్పాట్లుచేయుచున్నాడు, వంట వండుటకు ఏర్పాట్లు చేయుచున్నాడు అను అర్థములందు యజ - పచ ధాతువులకు ఆత్మనే పదమును చేర్చి "దేవదత్తః యజతే ; పచతే" అని ప్రయోగింపవచ్చును. వాటికి యాగముచేయ నేర్పాట్లుచేయు చున్నాడు, వంటకు ఏర్పాట్లు చేయుచున్నాడు అని యర్థములు. యాగము చేయుచున్నాడు, వండుచున్నాడు అని అర్థములు కాదు. యాగ - పాక - ప్రధాన ఫలములు యాగ పాకకర్తకు చెందుటలేదు కదా ః అవి చేయుచున్న యజ్ఞదత్తుని విషయమున "యజ్ఞదత్తః యజతి" ఇత్యాది పరస్మై పదప్రయోగములు చేయవలెను.

అవతారిక— పైన చెప్పిన విధముగ భృతిదానాదుల ద్వారా ఇతరులచే క్రియ చేయించు నేర్పాటు చేయుట అను అర్థమును బోధించుటకై ఆత్మనే పదము వచ్చును. 'ణిచ్' ప్రత్యయము కూడ ఈ యర్థముననే వచ్చునుగాన కొందరి యభిప్రాయము ప్రకారము, ఈ రెండును తుల్య విషయకములు (సమానార్థకములు) అని చెప్పుచున్నాడు.

శ్లో॥ కేషాంచిత్ కర్త్రభిప్రాయే ణి చా సహ వికల్ప్యతే ।
ఆత్మనేపద మన్యేషాం తదర్థా ప్రకృతిర్యథా ॥ 6

యథా = ఏ విధముగ, అన్యేషాం = ఇతరులయొక్క మతమున, తదర్థా = ణిచ్ ప్రత్యయము చేర్చవలసి యున్న, ప్రకృతిః = ధాతువు, (ణిచ్‌తో కల్పింపబడునో ఆ విధముగనే), కేషాంచిత్ = కొందరి మతమున, కర్త్రభిప్రాయే = క్రియ కర్తకొరకై ఉద్దిష్టమైనపుడు, ఆత్మనేపదం = ఆత్మనే పదము, ణిచా సహ = ణిచ్ ప్రత్యయముతో కూడా, వికల్ప్యతే = వికల్పమును పొందుచున్నది.

తాత్పర్యము— కొందరి మతమున ణిచ్ చేర్చవలసిన ధాతువు ణిచ్ ప్రత్యయ ముతో ఏ విధముగ వికల్పింపబడునో అట్లే మరికొందరి మతమున ఫలము కర్తకు చేరునపుడు ఆత్మనే పదము ణిచ్‌తో గూడ వికల్పమును పొందును.

వివరణము— "స్వరితఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే" (1-3-72) అను సూత్రముచే స్వరితము ఇత్తుగ కల ధాతువుల కంటెను, ఞకారము ఇత్తుగ కల ధాతువుల కంటెను, క్రియా ఫలము కర్తకు చెందెడు పక్షమున, ఆత్మనే పదము విధింపబడినది. ఈ ధాతువుచే విహితమగు ఆత్మనే పదము సంవిధానార్థకములగు ధాతువులకు వచ్చునని కొందరి అభిప్రాయము. 'పచతే'(= పాచయతి = వండించుచున్నాడు), "యజతే"(= యాజయతి= యజ్ఞము చేయించుచున్నాడు) ఇత్యాదు లుదాహరణములు. ధాతువులు అనేకార్థకములుగాన, ధాతువే సంవిధానార్థకమై యుండ దానిని ద్యోతింపచేయుటకు ఆత్మనే పదము వచ్చునని అభిప్రాయము. ప్రకృతి సంవిధానమును బోధింపనపుడు మాత్రము ణిచ్ ప్రత్యయము వచ్చి 'పాచయతి' ఇత్యాది రూపములు ప్రయోగింపబడును.

సమస్తమగు ధాత్వర్థముయొక్క ప్రవృత్తికి అనుకూలమగు వ్యాపారమునకు సంవిధానమని పేరు. దానినే ప్రవర్తనమని కూడ అందురు. 'యజీత' ఇత్యాదులలో ఋత్విక్కులు ప్రవర్తించుటకై యజమానుడు చేయు వ్యాపారమే ధాత్వర్థము. అనగా ధాతువుచే బోధితమగు క్రియకు సంబంధించిన అన్ని అవయవములను పూర్తిచేయుటకై అనుకూలమగు వ్యాపారమునకే సంవిధానమని పేరు. అందుచే 'యజీత' అనునపుడు ఆ యా ఋత్విక్కులు తమ తమ పనులు చేయుట, మరి ఇతర క్రియలను పూర్తియైననే గాని యజధాత్వర్థము పూర్తియైనట్లు కాదు. కావున హోతను శస్త్రములు శంసనము చేయవలెనని అధ్వర్యుడు ప్రేరేపించినను ఈ ప్రేరణారూప వ్యాపారము, యజనక్రియ పూర్తియగువరకును అనువర్తించదు గాన అది సంవిధానము కాదు. యజమాన కృతప్రేరణమే మొదటినుండి తుదివరకును వ్యాపించును గాన అది సంవిధానము సామగ్రిని సమకూర్చుటయే సంవిధానమని మరికొందరి అభిప్రాయము.

పై సూత్రమునందలి "కర్త్రభిప్రాయే క్రియాఫలే" అనునది సంవిధాన లక్షణమగు క్రియా విశేషమును ఉపలక్షించును. శిష్టప్రయోగము ననుసరించి 'క్రీణీష్వ' 'వపతే' 'ధత్తే' 'చినుతే' ఇత్యాదులలో ణ్యర్థము (ప్రేరణార్థము) గమ్యమగుచున్నది. అనగా పై శబ్దములకు వరుసగ - 'కొనుము' 'ముండనము చేయుచున్నాడు' 'ధరించుచున్నాడు' 'చయనము చేయుచున్నాడు' అను నర్థములు కాక - 'కొనిపించుము' 'వపనము చేయించుకొనుచున్నాడు' 'ధరింపచేయు చున్నాడు', 'చయనము చేయించుచున్నాడు' అని అర్థములు శిష్టులచే చెప్పబడు చున్నవి.

శబ్దశక్తి ననుసరించి పరిశీలించినచో స్వరితేత్తులును, ఞిత్తులును అగు ధాతువులకు మాత్రమే సంవిధాన రూపార్థముండునుగాని ఇతర ధాతువులకు ఉండదు 'కర్త్రభిప్రాయే క్రియాఫలే' అని సూత్రించినను సంవిధాన రూపార్థము గమ్యమగునపుడు ఆత్మనేపది వచ్చును అను అర్థము వచ్చును. అట్టి సంవిధాన రూపార్థము స్వరిత ఞిత్తులకే సంభావ్యము. అందుచే మరల సూత్రమునందు 'స్వరితఞితః' అని చెప్పవలసిన పనిలేదని భాష్యకారుడు చెప్పినాడు.

మరి కొందరి మతము ప్రకారము– తన ప్రయోజనము నుద్దేశించి కార్యముచేయ నుద్యమించినపుడు ఆత్మనేపదము వచ్చుననియు, పరుల ప్రయోజనము నుద్దేశించి కార్యము చేయ నుద్దేశించినపుడు పరస్మైపదము వచ్చుననియు చెప్పుదురు ఈ స్వార్థ పరార్థతలు వివక్షాధీనములు. వివక్షాధీనములగు ఈ స్వార్థపరార్థతలు లౌకిక ప్రయోగములలో స్వరిత ఞిత్తులగు ధాతువుల విషయముననే అంగీకరింపబడునుగాని 'యా' ధాత్వాదుల విషయమున అంగీకరింపబడవు. కావున ఈ మతమును అనుసరించినను స్వరిత ఞిద్గ్రహణము అనావశ్యకము. ప్రకృతమున ఈ కారికలలో చేయబడుచున్న చర్చ యంతయు ఈ మతభేదములపై ఆధారపడి యున్నది.

ణిచ్చు ఏ అర్థమును బోధించునో ఆ అర్థమునే ఆత్మనే పదము గూడ బోధించును గాన ఆత్మనే పదము ణిచ్చుతో వికల్పమును పొందును– అనగా ణిచ్చును చేర్చి ణిజంత ధాతువును ప్రయోగించుటకు బదులు ఆత్మనే పదమును ప్రయోగింపవచ్చును అని కొందరి అభిప్రాయము దీనికి వారు ఇతరుల మతమును దృష్టాంతముగ చూపుచున్నారు (అన్యేషాం తదర్థా ప్రకృతిర్యథా). పైన చూపిన 'క్రీణీష్వ' ఇత్యాద్యుదాహరణములలో ప్రేరణార్థము ధాతువుచేతనే బోధింపబడుటచే ణిజంతధాతువునకు బదులు కేవలధాతువే ఏ విధముగ ప్రయోగింపబడుచున్నదో అట్లే ణిజంతమునకు బదులు ఆత్మనే పదమును ప్రయోగింప వచ్చును అని ఈ దృష్టాంతమును చూపుటలోని ఆశయము.

వీరి మతము ప్రకారము సంవిధానమే ణిజర్థము ; కేవల ప్రైషము (ఆజ్ఞాపించుట) కాదు. దేవదత్తుడు యజ్ఞదత్తునిచేత వంట వండించుచున్నాడు అనునపుడు దేవదత్తుడు ప్రయోజక కర్త ; యజ్ఞదత్తుడు ప్రయోజ్యకర్త. ప్రయోజ్యకర్త స్వార్థాపేక్షతో, అనగా కూలి లభించవలెననెడు అభిలాషతో పనిచేయును. ఆతడు పనిచేయుటకు తగు ఏర్పాట్లు దేవదత్తుడు చేయును. తనకు ధనము లభించుననెడు ఆశ లేనిచో ప్రయోజ్యుడు పనిచేయడు. అట్లే ప్రయోజకుడు, పనిచేయుటకు తగు నేర్పాట్లు చేయకున్నచో ఆతడాజ్ఞాపించినను ప్రయోజ్యుడు పనిచేయడు. కావున 'ప్రైష'మాత్రము ణిచ్ ప్రత్యయార్థమని చెప్ప వీలులేదు సంవిధానమే ణిజర్థము. ఆత్మనే పదము కూడ ఆ సంవిధానమునే బోధించుచున్నది గాన ఆత్మనే పదము ప్రయోగించు పక్షమున ణిచ్చును చేర్చ బనిలేదని వీరి యభిప్రాయము.

కారికలో 'కేషాంచిత్' అని దీనిని కొందరి మతమని చెప్పుటచే ఇది అంత యుక్తము కాదని సూచింపబడినది. 'హేతుమతి చ' (3-1-26) అను సూత్రము ణిచ్ ప్రత్యయమును విధించుచున్నది ''ప్రేషణము మొదలగు ప్రయోజక వ్యాపారమను అర్థమున ధాతువుకంటె ణిచ్ ప్రత్యయము వచ్చును'' అని దీని యర్థము ''కుర్వన్తం ప్రేరయతి కారయతి'' – చేయుచున్నవానిని ప్రేరేపించుచున్నాడు గాన కారయతి అని చెప్పబడు చున్నాడు) ఇత్యాదు లుదాహరణము. ఇచట ప్రేషణము ధాతువునకే అర్థమైయుండ దానిని ఈణిచ్ ప్రత్యయము ద్యోతింప చేయుచున్నదనియు, అట్లుకాక ప్రేషణాదికము ణిచ్ ప్రత్యయార్థమే యనియు, రెండు పక్షము లున్నవి. మొదటి పక్షమున ప్రేషణము కూడ ధాత్వర్థము

నందే అంతర్గతముగ నున్నదిగాన, ప్రకరణాదివశముచే అది ద్యోత్యమైనపుడు ణిచ్ ప్రయోగ మనావశ్యకమనియు, కావుననే 'క్రీణీష్వ' ఇత్యాది ప్రయోగములు ప్రేరణార్థమున శిష్టులచే అంగీకరింపబడిన వనియు చెప్పవచ్చును. అపుడు ప్రకృతియగు ధాతువు ణిచ్చుతో వైకల్పిక ముగ ప్రయుక్తము కావచ్చును. కాని ప్రేషణము ణిచ్ ప్రత్యయార్థమేయని అంగీకరించు పక్షమున ఈ వైకల్పికత్వము కుదురదు. ఇక 'క్రీణీష్వ' ఇత్యాది శిష్టప్రయోగములను అన్తర్భావిత ణిజర్థములనియో, మరి యే విధముననో సమర్థించుకొనవలసి యుండును. అదే విధముగ ఆత్మనే పదమునకు గూడ ణిచ్చుతో వైకల్పికత్వము యుక్తము కాదు. క్రియా ఫలము కర్తృగామి యని బోధించు ఆత్మనే పదము, ప్రధాన ఫలము కర్తకు చెందును అని మాత్రమే బోధింపగల్గును గాని ఇందు ప్రేషణ స్పర్శము ఏ మాత్రమును లేదు. ణ్యన్త ప్రయోగములగు 'యాజయతి' ఇత్యాదులలో ప్రయోజ్య ప్రయోజక వ్యాపారములు విభిన్న ముగ, స్పష్టముగ తెలియుచున్నట్లు 'యజతే' అనునపుడు తెలియుట లేదు. ఫలార్థియై, ఈ కర్త, స్వతంత్రుడై, ఈ యాగమును జరుపుచున్నాడు అని మాత్రమే 'యజతే' అను పద మున కర్థముగ తెలియునుగాని, ఇతరుని ప్రేరేపించుచున్నాడు, అను నర్థము ఈ పదము వలన వచ్చుట లేదు. 'యాజయతి' అనునపుడు యాగ క్రియయందు పరుని ప్రేరేపించు చున్నాడు' అను నర్థము స్పష్టముగ తెలియవచ్చు చున్నది కావున ఆత్మనే పద విషయమగు సంవిధానమనునది వేరు, ణిజర్థమగు ప్రేషణము వేరు. అందుచే వీటికి వికల్పము కుదురదు అని సూచించుటకై 'కేషాంచిత్' అను పదము ప్రయుక్తమైనది. ॥౬॥

అవతారిక— ణిచ్చునకును ఆత్మనే పదమునకును విషయసామ్యమున్నదను భ్రాంతిచే కొందరు (పై కారికలో చూపిన విధముగ) ణిచ్చుతో ఆత్మనే పదమునకు వికల్ప మును అంగీకరించిరి. వారి భ్రాంతికి కారణమును చూపుచున్నాడు

శ్లో॥ క్రీణీష్వ వపతే ధత్తే చినోతి చినుతేఽపి చ ।
ఆప్తప్రయోగా దృశ్యన్తే యేషు ణ్యర్థోఽభిధీయతే ॥ 7

యేషు = ఏ ప్రయోగములయందు, ణ్యర్థః = ణిజంతార్థము, అభిధీయతే = చెప్పబడు చున్నదో, అట్టి, 'క్రీణీష్వ' (కొనిపించుము) 'వపతే' (ముండనము చేయించుచున్నాడు) ''ధత్తే'' (ధరింపచేయు చున్నాడు) ''చినోతి'' (చయనము చేయుచున్నాడు), 'చినుతే' (చయనము చేయించుచున్నాడు) అనెడు, ఆప్త ప్రయోగాః = శిష్ట ప్రయోగములు, దృశ్యన్తే = కనుపట్టు చున్నవి.

తాత్పర్యము— ప్రేరణార్థకములగు 'క్రీణీష్వ', 'వపతే', 'ధత్తే', 'చినుతే' మొదలగు ఆప్తప్రయోగములు కానవచ్చుచున్నవి.

వివరణము— నాగమాతయగు కద్రువ వినతతో 'స్వాత్మానం క్రీణీష్వ' అని పల్కగా వినత తన పుత్రులతో ''క్రీణీత మామ్'' అని చెప్పినది ఇచట క్రయణమునకు దాస్య విమోచనము ఫలము; అది క్రయణమున కర్తయగు వినతకు చెందునని సూచించు

టకై ఆత్మనే పదము ప్రయుక్తమైనది. కాని ఇచట ప్రకరణమును బట్టి 'క్రీణీష్వ' అను దానికి 'కొనుము' అను నర్థము కాక 'కొనిపించుకొనుము' అను అర్థము చెప్పవలసి యున్నది అనగా పందెము ద్వారా నీవు నాకు దాసిగా అమ్ముడుపోయితివి ; కావున దాస్యము పోవలె నన్నచో నీ పుత్రులతో ఏమైన చేయించి కొనిపించుకొనుము అని దీని యర్థము. అప్పుడామె పుత్రులవద్దకు పోయి 'క్రీణీతమామ్' అని చెప్పినది. ఈ విధముగ ప్రకరణమును బట్టి ణిజర్థ మగు ప్రైష కనబడుటచేత ణిజాత్మనే పదములు సమాన విషయకములు (ఏకార్థ బోధకములు) అనెడు భ్రాంతి కలిగినది.

ఇట్లే 'వపతే' అను దానికి అన్యునిచే ముండనము చేయించుకొనుచున్నాడు అని యర్థము. వపన క్రియా ఫలము కర్తకు చెందినదను విషయమును తెలుపుటకై ఆత్మనే పదము ప్రయోగింపబడినది. కాని వాక్య సామర్థ్యమును బట్టి - తాను స్వయముగ ముండనము చేసికొనజాలడు గాన అన్యుని ద్వారా చేయించుకొనుచున్నాడు అను నర్థము వచ్చును. ఇచట గూడ ణిచ్ప్రత్యయాత్మనే పదములు సమానవిషయకములు అని భ్రాంతి కలుగుటకు అవకాశ మున్నది.

''తృప్తా పత్నీ రేతోఽధత్తే'' అను ప్రయోగమున్నది. 'పత్ని తృప్తిచెంది రేతస్సు ఉంచుచున్నది' అను అర్థము అసంగతముగాన సామర్థ్యవశముచే 'ధత్తే' అను దానికి 'ధాప యతి' (ఉంచునట్లు చేయుచున్నది) అను నర్థము చెప్పవలెను. ఇచట గూడ ణిజాత్మనే పద ములు సమానవిషయకములను భ్రాంతి కలుగుట కవకాశమున్నది

''సైషాత్ర యజ్ఞస్య సమృద్ధిర్యోఽగ్నిం చినుతే యశ్చినోతి యశ్చీయతే'' అను వాక్యమున్నది. ఇచట 'చినోతి' అను పరస్మై పదము 'చినుతే' అను ఆత్మనే పదరూపము రెండును ప్రయుక్తములైనవి. 'చినోతి' అను దానికి 'పరప్రేరణముచే అగ్ని చయనము చేయుచున్నాడు' అను నర్థముగాన దానిచే ప్రయోజ్యకర్త బోధింపబడుచున్నాడు 'చినోతి' అను దానిని బట్టి 'చినుతే' అనునది ప్రయోజకకర్తను అనగా చయనము చేయుటకు తగు సంవిధానము చేయువానిని, బోధించుచున్నదని చెప్పవలెను ఇచట గూడ ఆత్మనే పద ణిచ్ప్రత్యయములు సమానవిషయకములని భ్రాంతి కలుగుటకు అవకాశము కలదు. ఈ విధ ముగ పై ఉదాహరణము లన్నింటియందును ప్రేరణార్థము గమ్యమగుచున్నదన్నచో, అది ఆత్మనే పదప్రయోగము వలన కాదు, అర్థసామర్థ్య ప్రకరణాదుల వలన. కావున ణిచ్‌కు బదులుగ ఆత్మనే పదమును ప్రయోగించిన చాలుననుట యుక్తము కాదు. ణిచ్చునకు ప్రేష ణాదిక మర్థము, ఆత్మనే పదమునకు సంవిధానము అర్థము. ఈ రెండును భిన్న విషయ ములు భిన్న విషయములను బోధించువాటికి వికల్పము కుదురదుకదా. ॥7॥

అవతారిక — ఆత్మనే పదము సంవిధానమును (ఏర్పాట్లుచేయుటను) బోధించునని చెప్పబడినది. కాని పచాది ధాతువులు ప్రధానమగు విక్లిత్త్యాద్యర్థమునే (బియ్యము ఉడికి మెత్త బడుట మొదలగు అర్థమునే) బోధించుచున్నవి గాని సంవిధానమును బోధించుట లేదుకదా.

అట్టి పరిస్థితిలో సంవిధాన విశిష్ట క్రియాబోధకమగు ధాతువునకు ఆత్మనే పదము వచ్చునని చెప్పుట ఎట్లు యుక్తమగును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ సంవిధానం పచాదీనాం క్వచిదర్థః ప్రతీయతే ।
తన్నిమిత్తా యథాఽన్యాపి క్రియాధిశ్రయణాదికా ॥ 8

తన్నిమిత్తా = విక్లిత్తికి నిమిత్తమగు, అధిశ్రయణాదికా = పొయ్యిపై గిన్నె నెక్కించుట మొదలగు, అన్యాపి = మరియొక, క్రియా = క్రియ, యథా = ఎట్లో, అట్లే, క్వచిత్ = ఒక్కొక్క స్థలమునందు, సంవిధానం = సంవిధానము కూడా, పచాదీనాం = పచాది ధాతువుల, అర్థః = అర్థముగా, ప్రతీయతే = తెలియవచ్చు చున్నది.

తాత్పర్యము— విక్లిత్తికి నిమిత్తమగు అధిశ్రయణాది క్రియలు గూడ పచ్యాదుల కర్థమైనట్లు సంవిధానము కూడ వాటి (పచ్యాదుల) అర్థముగ కనబడుచున్నవి

వివరణము— ప్రయోజకుని వ్యాపారము గూడ ధాత్వర్థమేయని భాష్యకారులు చెప్పియున్నారు. ప్రయోజకుడు ఉదాసీనుడుగ నున్నను (అన్యునెవనిని ప్రేరేపింపకున్నను) సామగ్రీ పోషణము చేయుచుండుటచే సంవిధాతయనియు కారకుడనియు చెప్పబడుచున్నాడు 'పచతే' అను ఆత్మనే పదప్రయోగమున అట్టి సంవిధాన రూపవ్యాపారము బోధింపబడు చున్నది. పచధాతువునకు ప్రధానముగ తండుల విక్లిత్తి యను నర్థమేయైనను, దాని కావశ్యకము లగుటచే (పొయ్యిపై నుంచుట నీరుపోసి తడుపుట మొ॥) అధిశ్రయణోదకాసేచనాదికములు గూడ పచ్యర్థములుగ తెలియుచున్నవి. కావుననే 'పచతి దేవదత్తః' అనునపుడు 'అధిశ్రయతి' 'ఉదకమాసేచయతి' ఇత్యాద్యర్థములు గూడ బోధింపబడుటచే, అధిశ్రయణోదక సేచనాదులు ప్రయోజ్యకర్తయగు దేవదత్తుడు చేయుచున్న వ్యాపారములు అని తెలియుచున్నది అట్లే ''పచతే దేవదత్తః'' అను దానికి ''దేవదత్తుడు పాకమునకు కావలసిన సంభారముల నన్నింటిని సమకూర్చుచున్నాడు అని యర్థము. ఆతడే ఒక ప్రయోజ్యుని ప్రేరేపించుచున్నాడని చెప్పవలెనన్నచో 'ణిచ్' చేర్చి 'పాచయతి' అని ప్రయోగింపవలెను. సామగ్రిని సమకూర్చుకొనుట (సంవిధానము) ప్రేషణము కాజాలదు. సామగ్రిని సమకూర్చుచు ఎవడు ఇతరుని ప్రేరేపించునో ఆతడే ప్రయోజకుడు. సంవిధానము చేయుచున్నను పర ప్రేషణము నేయకున్నచో ఆతడు ప్రయోజకుడు కాజాలడు. ॥8॥

అవతారిక— ఆత్మనే పదము కర్త్రభిప్రాయమున విధింపబడినది. దీనినిబట్టి ధాతువునకు సంవిధానమను అర్థమున్నదని చెప్పుట ఎట్లు అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ కర్త్రభిప్రాయతా సూత్రే క్రియాభేదోపలక్షణమ్ ।
తథా-భూతా క్రియా యా హి తత్కర్తా ఫలభాగ్యతః । 9

సూత్రే = ''స్వరితఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే అను సూత్రమునందు, కర్త్రభిప్రాయతా = కర్త్రభిప్రాయత్వము, క్రియాభేదోపలక్షణమ్ = క్రియా భేదమునకు (సంవిధాన విశిష్ట

క్రియకు) ఉపలక్షణము, యతః = ఎందువలన అనగా, యా = ఏ, క్రియా = క్రియ, తథా భూతా = అట్టిదో, తత్కర్తా = దానిని చేయువాడే, ఫలభాక్ = ఫలమును పొందువాడు.

తాత్పర్యము—— సూత్రమునందలి కర్త్రభిప్రాయత్వము క్రియా భేదమునకు ఉప లక్షణము ఎందుచేతననగా అట్టి క్రియను చేయువాడే ఫలమును పొంద గల్గును

వివరణము—— క్రియా ఫలము కర్తకు చేరవలెనన్నచో ఆ క్రియకు కావలయు సంవిధానమునంతను ఆతడు చేయవలెను. ఏమియు ఏర్పాట్లుచేయని యాజకునకు స్వర్గాది ఫలము లభింపదు కదా ? కావున సూత్రమున చెప్పిన కర్త్రభిప్రాయత్వముచే, క్రియ సంవి ధాన విశిష్టముగ నుండవలెనని ఉపలక్షింపబడుచున్నది అట్టి సంవిధాన విశిష్ట క్రియను బోధించునపుడు ఆత్మనే పదము వచ్చునని చెప్పినట్లైనదని భావము. ॥9॥

అవతారిక—— ఇట్లు సంవిధాన విశిష్టక్రియను ఉపలక్షించుటలో ఉదాహరణమును చూపుచున్నాడు

శ్లో॥ యథోపలక్ష్యతే కాలస్తారకాదర్శనాదిభిః ।
తథా ఫలవిశేషేణ క్రియాభేదో నిదర్శ్యతే ॥ 10

తారకాదర్శనాదిభిః = నక్షత్ర దర్శనాదులచేత, యథా = ఏ విధముగా, కాలః = కాలము, ఉపలక్ష్యతే = ఉపలక్షితమగుచున్నదో, తథా = అట్లే, ఫలవిశేషేణ = ఫలవిశేషముచేత, అనగా ఫలమునందలి కర్తృగామిత్వ విశేషముచేత, క్రియాభేదః = క్రియాభేదము, నిదర్శ్యతే = చూపబడుచున్నది.

తాత్పర్యము—— (ఆకాశమునందలి నక్షత్రాదికమును చూచి రాత్రి వేళను పూర్వ కాలమున లెక్కకట్టుచుండు వారు) తారకాదర్శనాదులచే కాలము ఉపలక్షితమగునట్లు ఫల విశేషముచే క్రియాభేదము ఉపలక్షితమగుచున్నది.

వివరణము—— 'నక్షత్రం దృష్ట్వా వాచం విసృజేత్' అని ఒక విధమగు మౌన వ్రతమును పాటించువాని విషయమున చెప్పిన శాస్త్రము అనగా ''నక్షత్రమును చూచిన పిమ్మటనే మాటలాడవలెను'' అని దీని యర్థము. ఇచట నక్షత్ర దర్శనము సంధ్యాకాలము దాటిన పిమ్మట జరుగును గాన ''నక్షత్రం దృష్ట్వా'' అను దానికి లక్షణం 'సంధ్యాకాలము దాటిన తరువాత' అని యర్థము. అందుచేతనే ఆకాశము మేఘాచ్ఛన్నమైనపుడు నక్షత్ర దర్శనము కాకున్నను గడియారములు మొదలగు సాధనముల ద్వారా సంధ్యాత్యయ కాలమును నిర్ణయించుకొని వాగ్విసర్జనము చేయవచ్చును. అట్లే ఇక్కడ కూడ ఫలము కర్తృగామి కావలెనని చెప్పుటచే క్రియ సంవిధాన విశిష్ట క్రియ కావలెనని ఉపలక్షణచే చెప్పుకొనవలెను. 'నక్షత్రం దృష్ట్వా' అను దానికి నక్షత్ర దర్శనము విషయమున అంతగా ఆస్థలేదు ; సంధ్యా కాలాత్యయమునే ప్రధానముగ బోధించుటయందు దీని తాత్పర్యము. అట్లే ఆత్మనే పదము గూడ ఫలవిశేషమును (కర్తృగామి ఫలము అను విషయమును) కాక ప్రధానముగ సంవిధాన మాత్రమునే బోధించును. ॥10॥—

అవతారిక— భాష్యకారుడు స్వరితఞిద్గ్రహణము అనావశ్యకమని ప్రత్యాఖ్యానించెను (చూ. 6వ కారిక వ్యాఖ్యానము). దీనిని ప్రత్యాఖ్యానించినచో 'యా' మొదలగు ధాతువులకు గూడ (ఇది స్వరితేత్తులుగాని ఞిత్తులుగాని కావు) ఆత్మనే పదము రావచ్చునుకదా యని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియా విశేషవచనే సామర్థ్యముపరుధ్యతే ।
కేషాఞ్చిదన్యే తు కృతాః స్వరితేతో ఞిత స్తథా ॥ 11

క్రియావిశేష వచనే = సంవిధాన లక్షణమగు క్రియావిశేషమును బోధించు విషయమున, కేషాంచిత్ = 'యా' మొదలగు కొన్ని ధాతువులయొక్క, సామర్థ్యం = సామర్థ్యము, ఉపరుధ్యతే = అడ్డుకొనబడుచున్నది, అన్యేతు = అట్టి సామర్థ్యముగల కొన్ని ధాతువులైతే, స్వరితేతః = సరితేత్తులుగను, తథా = మరియు, ఞితః = ఞిత్తులుగను, కృతాః = చేయబడినవి.

తాత్పర్యము— యా మొదలగు కొన్ని ధాతువులకు, సంవిధాన విశిష్ట క్రియా బోధకత్వ శక్తి ఉండదు. కొన్నింటికి ఆట్టి సామర్థ్యముండును. వాటికి ఆ సామర్థ్యమున్నదని సూచించుటకై ధాతు పాఠమున వాటిని స్వరితేత్తులుగను, ఞిత్తులుగను చూపియున్నారు

వివరణము— ఆ యా ధాతువులకు ఆ యా యర్థములను బోధించు శక్తి స్వాభావికముగ నుండును దానిని ప్రసిద్ధ్యనుసారము తెలుసుకొనవలెనే గాని మన బుద్ధిచే నిర్ణయింపజాలము. శాస్త్రకారులు మాత్రము ఇట్టి శక్తులను సూచించుటకై ఇకారాద్యనుబంధములను చేసియున్నారు. ॥11॥

అవతారిక— ఐనను భాష్యకారులు స్వరిత ఞిద్గ్రహణమును ప్రత్యాఖ్యానించుట యుక్తము కాదు. ఈ సూత్రములో స్వరిత ఞిద్గ్రహణమున్నది. కావుననే ధాతుపాఠమున, ఆత్మనే పదరూపకార్యము రావలెనను ఉద్దేశ్యముతో, కొన్ని ధాతువులను స్వరిత ఞిత్తులుగా పఠించుట జరిగినది సూత్రములో స్వరిత ఞిద్గ్రహణము లేనిచో ఈ ధాతువులకు వాటిని అనుబంధములుగ చేర్చుట జరుగదు. ఇవి లేనిచో ఈ ధాతువులకు సంవిధాన విశిష్ట క్రియాభిధాన శక్తి యున్నది అని తెలిసికొనుట ఎట్లు, అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ అనుబన్ధస్తు సిద్ధేఽర్థే స్మృత్యర్థ మనుషజ్యతే ।
తుల్యార్థేష్వపి చావశ్యం న సర్వేష్వేకధర్మతా ॥ 12

సిద్ధే = ప్రసిద్ధమగు, అర్థే = విశిష్టార్థ విషయమున, స్మృత్యర్థం = స్మరణార్థమై, అనుబన్ధః + చ = అనుబంధము, (ఇత్సంజ్ఞక వర్ణము), అనుషజ్యతే = చేర్చబడుచున్నది, సర్వేషు = అన్ని ధాతువులును, తుల్యార్థేష్వపి = సమానమగు వ్యాపార రూపార్థము కలవైనను, అవశ్యం = తప్పక, ఏకధర్మతా = ఏకధర్మత్వము, (ఒకే ధర్మము కలిగియుండుట), న = లేదు.

తాత్పర్యము— ప్రసిద్ధమగు అర్థ విశేషమును స్మరింపచేయుటకై అనుబంధములను చేర్చు చుందురు ధాతువులు సమానార్థకములే యైనను అన్నియు ఏకధర్మములు గలవి కావు.

వివరణము— ధాతువులు క్రియా వాచకములు. క్రియావాచకము లగుటచే ధాతువు లన్నియు సమానాభిధేయములే యైనను, శబ్ద శక్తి విచిత్రముగ నుండునుగాన, వాటిలో కొన్ని ధాతువులు విశిష్ట క్రియా బోధకములుగ నుండును. ఉదాహరణమునకు 'యాప్రాపణే' 'నీ ప్రాపణే' అని 'యా' 'నీ' ధాతువులు రెండింటికిని ఒకే విధమగు ప్రాపణరూపార్థము నిర్దేశింపబడినది. అయినను యా ధాతువునకు (దేశాంతరమును) పొందుట అనియు, నీ ధాతువునకు (దేశాంతరమును) పొందించుట యనియు అర్థభేదము కనబడుచున్నది. అనగా నీ ధాతువునకు సంవిధాన రూపార్థము (ఒకరు దేశాంతరమునకు వెళ్ళ ఏర్పాటుచేయుట అనెడు అర్థము) కనబడుచున్నది ఇట్లే కొన్ని ఇతర ధాతువులు కూడ స్వభావముచే సంవిధానార్థమును బోధించును. ఈ వైశిష్ట్యమును స్మరింపచేయుటకే స్వరితాదులు అనుబంధములుగ చేర్చబడుచుండును. ధాతువును చూడగనే దానియందు సంవిధానార్థమున్నదని తెలిసికొన గలిగినవానికి ఈ అనుబంధములతో పనిలేదు. కాని అట్లు తెలియజాలని వానికి స్మృతి కలిగించుటకై ఇవి ఆవశ్యకములు. కావున ధాతు పాఠమున స్వరిత ఇకారాద్యనుబంధములను చేర్చుటయు, సూత్రమున స్వరిత ఞిద్గ్రహణమును, ప్రయోగజ్ఞానము లేని వానికొరకై ఆవశ్యకములు. ప్రయోగజ్ఞానము ఉన్నవానికొరకు అనావశ్యకములని భావము. ॥12॥

అవతారిక— "తుల్యార్థేష్వపి చావశ్యం న సర్వేష్వేకధర్మతా" అని చెప్పబడినది. దీనికి దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ దృశీక్ష్యోః సదృశేఽప్యర్థే నాభేదః ప్రతిపూర్వయోః ।
ణ్యర్థోపాదాయిన స్తస్మా న్నతుల్యార్థాః పచాదిభిః ॥ 13

దృశీక్ష్యోః = 'దృశ్' 'ఈక్ష్' ధాతువులయొక్క, అర్థే = అర్థము, సదృశేఽపి = సమానమే యైనను, ప్రతిపూర్వయోః = ప్రతి అనునది పూర్వమునందుగల వాటికి, అభేదః = అభేదము, న = లేదు, తస్మాత్ = ఆ కారణమువలన, ణ్యర్థోపదాయినః = ణిచ్ ప్రత్యయార్థమును స్వీకరించు ధాతువులన్నియు, పచాదిభిః = పచాది ధాతువులతో, తుల్యార్థాః = సమానమైన అర్థము కలవి, న = కాదు.

తాత్పర్యము— 'దృశ్' 'ఈక్ష్' ధాతువుల ధాతుపాఠోక్తమగు అర్థము సమానమే యైనను, ప్రతిపూర్వకములగు వాటి యర్థములు అభిన్నములు కావు. కావున ణ్యర్థమును స్వీకరించు ధాతువు లన్నియు పచాదులతో తుల్యార్థములు కాజాలవు.

వివరణము— 'పశ్యతి' 'ఈక్షతే' ఇత్యాది ప్రయోగములలో దృశ్ ఈక్ష ధాతువుల అర్థము సమానమే చూచుచున్నాడని యర్థము. అట్లైనను వీటికి 'ప్రతి' చేర్చినప్పుడు

వేరు వేరు అర్థము వచ్చుచున్నది. 'ప్రతీక్షతే' అనగా నిరీక్షించుచున్నాడనియు, 'ప్రతిపశ్యతి' అనగా ప్రతికూలముగ చూచుచున్నాడనియు అర్థములు ఇట్లే ధాతుపాఠమున సమానార్థకములగు 'రక్ష' 'పాల' ధాతువులకును 'హృ' 'నీ' ధాతువులకును ఉపసర్గ విశేషములు చేర్చినపుడు అర్థములు మారిపోవుచున్నవి. ప్రతిరక్షతి = తిరిగి రక్షించుచున్నాడు ; ప్రతిపాలయతి = నిరీక్షించుచున్నాడు. 'సంహరతి' = చంపుచున్నాడు. సంనయతి = కూర్చుచున్నాడు ఇత్యాద్యర్థభేదము లున్నవి. అట్లే అన్ని ధాతువులును ణ్యర్థమగు ప్రేషణముతో సంబంధించినంత మాత్రమున సంవిధానార్థకములగు పచాదులతో తుల్యార్థములు కాజాలవు. ణ్యర్థమగు ప్రేషణము వేరు, ప్రేషణకు గూడ హేతుభూతమగు సంవిధానమనునది వేరు (చూ. ఆరవ కారిక వ్యాఖ్యానము). ఈ సంవిధాన రూపార్థము పచాదులగు కొన్ని ధాతువులకే ఉన్నది. కావున ణిచ్ ప్రత్యయము చేర్చ వీలగు ధాతువులన్నియు పచాది తుల్యములు కాజాలవని తాత్పర్యము ॥13॥

అవతారిక— స్వరిత ఞిద్వ్యతిరిక్తములగు ధాతువులకు సంవిధాన రూపార్థముతో ఏ మాత్రము సంబంధముండదని చెప్పుటకు వీలులేదు. దానితో సంబంధమున్నను వాటికి దానిని బోధించు శక్తి లేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉమ్భ్యర్థే వర్తమానస్య కరోతేర్భిన్న ధర్మణః ।
ణ్యర్థోపాదాయితా తస్మాన్నియతాః శబ్దశక్తయః ॥ 14

ఉమ్భ్యర్థే = 'ఉంభి' ధాతువుయొక్క అర్థమునందు, వర్తమానస్య = ప్రవర్తించుచున్నదియు భిన్నధర్మణః = భిన్న స్వభావము గల, కరోతేః = 'కృఞ్' ధాతువునకు, ణ్యర్థోపాదయితా = ణ్యర్థముతో సమానమైనదగు సంవిధాన రూపార్థమును గ్రహించుట, కనబడుచున్నది, తస్మాత్ = ఆ కారణమువలన, శబ్దశక్తయః = శబ్దశక్తులు, నియతాః = నియతమగు రీతిలో నుండునవి (అని యెరుంగవలెను).

తాత్పర్యము— భిన్న స్వభావము గల కృఞ్ ధాతువు ఉంభిధాతువు యొక్క అర్థమునందు ప్రవర్తించుచు ణ్యర్థమును గ్రహించుచున్నది. అందుచే శబ్దశక్తులు నియతరూపమున నుండును

విశేషము— ణిచ్‌కు ప్రేషణము అర్థము. అది సంవిధానముకంటె భిన్నమైనది. కృఞ్ ధాతువు సంవిధాన రూపార్థమును బోధించుచున్నది గాని ప్రేషణ రూపమగు ణ్యర్థమును బోధించుట లేదు. అందుచే 'ణ్యర్థ' అను దానికి 'ణిజర్థముతో తుల్యమగు అర్థము' అని అర్థము చెప్పబడినది.

'ఉంభపూరణే' అను ధాతువున్నది. దానికి నింపుట అని యర్థము. 'ఉమ్భతి' ఇత్యాది రూపములగును. విట్టునందు 'ఆమ్' చేర్చినపుడు 'కృఞ్' ధాతువు అను ప్రయుక్తమై 'ఉమ్భాఞ్చకార' ఇత్యాది రూపములగును. ఈ ఉమ్భ ధాతువునందు గూడ సంవిధాన రూపమగు అర్థమున్నది. కాని అది స్పష్టముగ అభివ్యక్తము కాకుండుటచే, దానిని అభివ్యక్తము

చేయుటకై కృఞ్ ధాతువు అనుప్రయుక్తమైనది. ఈ కృఞ్ ధాతువు సంవిధాన రూపార్థాభిధాయకము ఇది ఉంభ్ ధాతువుతో చేరి దాని యర్థమును బోధించుచు, దానితోపాటు సంవిధానార్థమును గూడ స్పష్టీకరించుచున్నది అందుచే 'ఉమ్భాఞ్చకార' అను దానికి "అది నిండుటకు తగు ఏర్పాట్లు చేసెను" అని యర్థము వచ్చినది. ఈ సంవిధాన రూపార్థము ఉమ్భ ధాతువుతో సహజముగ లేదని చెప్పుటకు వీలులేదు సహజముగ లేకున్నచో అది కృఞ్ ధాతువును చేర్చినను బోధ్యము కాజాలదు. కావున ఉంభ్ ధాతువునకు తనలోనున్న సంవిధాన రూపార్థమును వ్యక్తీకరించు శక్తి లేదనియు, తద్వ్యక్తీకరణమునకై 'కృఞ్' ధాతువు అనుప్రయుక్తమైనదనియు అంగీకరించవలెను. 'కృఞ్' ధాతువునకు ఆ శక్తి ఉన్నది కావుననే ఇది ద్యోతకముగ పఠింపబడినది. ఈ విధముగ శబ్ద శక్తులు వేరు వేరు తీరుల నియతములై యుండును ॥14॥

అవతారిక— 'ఉమ్భాఞ్చకార' అనునపుడు అనుప్రయుక్తమగు కృఞ్ ధాతువు పరస్మైపదమునందే ఉన్నదిగాని ఆత్మనేపదమున లేదు. అట్టి పరిస్థితిలో ఇచట కృఞ్ ధాత్వర్థము సంవిధాన విశిష్టమని ఎట్లు చెప్పవీలగును అని ఆశంకించి ఈ విధముగ భాష్యకారాంగీకారమే ప్రమాణమని చెప్పుచున్నాడు.

శ్లో॥ తథాహ్యనుప్రయోగస్య కరోతే రాత్మనేపదే ।
పూర్వవద్గ్రహణం ప్రాప్తే స్వరితం సముపస్థితమ్ ॥ 15

తథా హి = అదియుక్తమే కదా, అనుప్రయోగస్య = అనుప్రయుజ్య మానమగు, కరోతేః = కృఞ్ ధాతువునకు, ఆత్మనే పదే = ఆత్మనే పదము, ప్రాప్తే = ప్రాప్తమగుచుండగా, స్వరితం = స్వరితమగు, పూర్వవద్ గ్రహణం = 'పూర్వవత్' అను పదముయొక్క గ్రహణము, సముపస్థితమ్ = అధికారముగ వచ్చినది.

తాత్పర్యము— అది యుక్తమే కదా. అనుప్రయుజ్యమానమగు కృఞ్ ధాతువునకు ఆత్మనేపదము ప్రాప్తమైయుండగా స్వరితత్వముతో కూడిన పూర్వవద్ గ్రహణము అధికారముగ వచ్చినది.

వివరణము— ఇచట పరస్మై పదమే ప్రయుక్తమైనను సంవిధాన రూపార్థమున్నట్లు భాష్యకారుని యభిప్రాయమని ఎట్లు తెలియుచున్నదనగా— "ఆమ్ప్రత్యయవత్ కృఞోఽను ప్రయోగస్య" (1-3-72) అను సూత్రముచే అనుప్రయుక్తమగు కృఞ్ ధాతువునకు కూడ, ఆమ్ ప్రత్యయమునకు ఏ ధాతువు ప్రకృతమో ఆ ధాతువునకు వలెనే ఆత్మనే పదము వచ్చునని విధింపబడినది. దీనినిబట్టి 'ఏధాం చక్రే' ఇత్యాదులలో 'ఆమ్' ప్రత్యయము 'ఏధ' ధాతువునకు చేర్చబడినది గాన దాని ప్రకృతి 'ఏధ ధాతువు. దానితో అనుప్రయుక్తమగు కృఞ్ ధాతువునకు గూడ ఆ 'ఏధ' ధాతువునకు వలెనే ఆత్మనే పదము వచ్చును. అనగా క్రియాఫలము కర్త్రభిప్రాయము కాకున్నను ఈ సూత్రముచే కృఞ్ ధాతువునకు ఆత్మనే పదమే వచ్చి 'ఏధాఞ్చక్రే' ఇత్యాది రూపములగును. కర్త్రభిప్రాయమైనచో "స్వరిత

ఞితః కర్తృభిప్రాయే క్రియాఫలే'' అను సూత్రముచే, అనుప్రయుక్తమగు కృఞ్ ధాతువునకు ఆత్మనే పదము రావలసియున్నది. కాని భాష్యకారులు ''పూర్వవత్ సనః'' అను సూత్రము నందలి 'పూర్వవత్' అను పదము స్వరితత్వయుక్తమని అంగీకరించి, (''స్వరితేనాధికారః'' అను సూత్రము ననుసరించి స్వరితత్వయుక్తమగు పదము ఉత్తర సూత్రములకోసకి అధికార ముగ అనువర్తించునుగాన), దానిని 'ఆమ్ప్రత్యయవత్' ఇత్యాది సూత్రములోనికి అనువర్తింప చేసికొని, వాక్యభేదముచే–, అనుప్రయుజ్యమానమగు కృఞ్ ధాతువునకు పూర్వమునందున్న ఏధాది ధాతువులతో సమానముగ ఆత్మనే పదమగును అను నర్థము గూడ వచ్చునని చెప్పెను. అనగా ఈ సూత్రమునందు రెండు వాక్యము లేర్పడినవి– 'కృఞ్ ధాతువునకు ఆమ్ప్ర కృతితో తుల్యముగ ఆత్మనే పదము వచ్చును' అని మొదటిది ''కృఞ్ ధాతువునకు ఆమ్‌కు పూర్వమునందు ప్రయుక్తమగు ధాతువుతో తుల్యముగ ఆత్మనే పదము వచ్చును'' అని రెండవ వాక్యము. ఈ విధముగ రెండు వాక్యములకును అర్థము సమానమే యైనది. కావున రెండవ వాక్యము నియమార్థము. 'కృఞ్ ధాతువునకు పూర్వ ధాతువుతో తుల్యముగ మాత్రమే ఆత్మనే పదము వచ్చునుగాని తద్భిన్నముగ రాదని నియమము. అనగా పూర్వధాతువుకు ఆత్మనే పదము ఉన్నచో దానికిని ఉండును, లేనిచో దానికిని రాదు అని భావము కావున 'ఉమ్భాఞ్చకార' ఇత్యాదులలో కృఞ్ ధాతువునకు, ఆమ్‌కు పూర్వమునందున్న 'ఉమ్భ' ధాతువునకు ఎట్టి ఆత్మనే పదమున్నదో అదే వచ్చును 'ఉమ్భ' ధాతువు పరస్మైపది గాన దీనికి అభావరూపమగు ఆత్మనే పదమున్నది. అనగా– ఆత్మనే పదము లేదు. కావున కృఞ్ ధాతువునకు కూడ ఆత్మనే పదము రాదు. ఈ విధముగ మొదటి వాక్యముచే 'ఏధాం చక్రే' ఇత్యాదులలో ఆమ్ప్రకృతులగు ఏధాది ధాతువులలో క్రియా ఫలము కర్తృగామి కాకున్నను అనుప్రయుక్తమగు కృఞ్ ధాతువునకు ఆత్మనే పదము వచ్చుటకు వీలు కలిగినది. రెండవ వాక్యమును బట్టి 'ఉమ్భాంచకార' ఇత్యాదులలో క్రియా ఫలము కర్తృగామి యగుటచే– అనగా క్రియ సంవిధాన విశిష్టముగాన, ఆత్మనే పదము రావలసియుండ తన్నివారణము జరిగి కృఞ్ ధాతువునకు పరస్మై పదము వచ్చినది. 'ఉమ్భాంచకార' ఇత్యాదులలో 'కృఞ్' ధాతువునకు ఆత్మనే పదము రాకుండుటకై 'పూర్వవత్ సనః' అను సూత్రము నుండి పూర్వవత్' అను పదమును అనువర్తింపచేసికొని, పైన చూపిన విధముగ, భాష్యకారులు నియమమును చేయుటను బట్టి చూడగా ఇచట ఆత్మనే పదము వచ్చెడు అవకాశమున్నట్లును, తన్నివారణమునకై ఈ యత్నమంతయు చేయబడుచున్నట్లును తెలియుచున్నది. అసలు ఉంభ్యాది ధాతువులచే బోధ్యమగు క్రియ సంవిధాన విశిష్టము కాకున్నచో, ఇచట అను ప్రయుక్తమైన కృఞ్ ధాతువునకు ఆత్మనేపదము వచ్చెడు ప్రసంగమే లేదు. దానిని నివా రింప ఈ నియమమును చేయ పనియులేదు. దీనిని పట్టి ఉంభ్యాది బోధ్యక్రియ సంవిధాన విశిష్టమని తెలియుచున్నది. ॥15॥

అవతారిక—— ణిచ్ యోగ్యమగు అర్థమును బోధించునవైనను, అన్ని ధాతువుల యును సంవిధానమును బోధించు సామర్థ్య ముండదు అను విషయ దృష్టాంత నిర్దేశ పూర్వక ముగ విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ఏకత్వేఽపి క్రియాఖ్యాతే సాధనాశ్రయ సంఖ్యయా ।
భిద్యతే న తు లిఙ్గాఖ్యో భేదస్తత్ర తదాశ్రితః ॥ 16

క్రియా = క్రియ, ఏకత్వేఽపి = ఏకత్వమున్నను (భేదరహితమైన దైనను), ఆఖ్యాతే = తిఙంతపదమునందు, సాధనాశ్రయ సంఖ్యయా=కర్తృ కర్మాది సాధనములకు ఆధారభూతము లగు ద్రవ్యములకు చెందిన సంఖ్యచే, భిద్యతే = భేదమును పొందుచున్నది, తు = కాని, తదాశ్రితః = సాధనాధారాశ్రితమగు, లింగాఖ్యః = లింగమనెడు, భేదః = భేదము, తత్ర = ఆ క్రియయందు, న = లేదు.

తాత్పర్యము— క్రియ అభిన్న స్వరూపమే యైనను, తిఙంతమునందు కర్తృ కర్మాద్యాధారభూతములగు ద్రవ్యముల సంఖ్యనుబట్టి భిన్నముగ కనబడుచున్నది. కాని వాటికి సంబంధించిన లింగము మాత్రము క్రియతో సంబంధించుట లేదు.

వివరణము— క్రియ సాధ్యావస్థలో నుండునుగాన (సాధింపదగినదై యుండును గాన) స్వతః సిద్ధముగ దానియందు భేదమేమియు ఉండదు. కాని 'పచతః' 'పచన్తి' 'పచ్యేతే' 'పచ్యన్తే' ఇత్యాది తిఙంతములలో మాత్రము ఏకపదోపాత్తములగు (పచ్ ధాతువు 'తః' 'తే' మొదలగు ప్రత్యయముల కలయికచే నేర్పడిన ఒకే పదముచే ఉపాత్తములగు) కర్తకును కర్మకును (పచతః = ఇద్దరు కర్తలు వండుచున్నారు , పచ్యేతే = కర్మభూతములగు రెండు పదార్థములు వండబడుచున్నవి ఇత్యాది విధముగ) సంబంధించి సంఖ్యతో ఈ క్రియకు గూడ పరోక్షముగ సంబంధ మేర్పడుచున్నది. అయితే సంఖ్యతో సంబంధము కలిగినట్లు ఆ కర్తృ కర్మాది సాధనములకు గల లింగములతో క్రియకు సంబంధము ఏర్పడుట లేదు అట్లు ఎందుచే ఏర్పడుట లేదు అని ప్రశ్నించుటకు అవకాశము లేదు. ఈ విధముగ శబ్దము లకు గల అర్థబోధన శక్తి స్వభావసిద్ధమేగాని యుక్తిచే నిరూపింప శక్యమైనది కాదు. ॥16॥

అవతారిక— ఈ దృష్టాంతమును ప్రకృతముతో సమన్వయించుచున్నాడు.

శ్లో॥ తస్మాదవస్థితేఽప్యర్థే కస్యచిత్ ప్రతిబధ్యతే ।
శబ్దస్య శక్తిః స త్వేష శాస్త్రేఽన్వాఖ్యాయతే విధిః ॥ 17

తస్మాత్ = ఆ కారణమువలన, అర్థే = సంవిధాన రూపార్థము, అవస్థితేఽపి = ఉన్నను, కస్యచిత్ = ఒకానొక, శబ్దస్య = 'యా' ధాతువు మొదలగు శబ్దము యొక్క, శక్తిః = ఆ అర్థమును బోధించు శక్తి, ప్రతి బధ్యతే = అడ్డుకొనబడు చున్నది, సః = అట్టి, ఏషః = ఈ, విధిః = పద్ధతి, శాస్త్రే = శాస్త్రమునందు, అన్వాఖ్యాయతే = స్పష్టీకరింపబడు చున్నది.

తాత్పర్యము— ఆ కారణము వలన, యా ధాతువు మొదలగు కొన్ని ధాతువులకు సంవిధాన రూపార్థము ఉన్నను దానిని బోధించెడు శక్తి అడ్డుకొనబడుచున్నది. ఈ పద్ధతినే శాస్త్రము విశదీకరించును.

విశేషము— పై కారికలో చెప్పిన విధమున కొన్ని శబ్దములకు వాటి స్వభావమును బట్టి కొన్ని యర్థములను మాత్రమే బోధించు శక్తి యుండును. ఇతరార్థములను బోధించు శక్తి ప్రతిహతమగును. అందుచే పచాది ధాతువులందువలె 'యా' మొదలగు ధాతువులందు గూడ సంవిధాన రూపార్థము ఇమిడియున్నను, ఆ ధాతువులకు ఆ అర్థమును బోధించు శక్తి ప్రతిహతమగుటచే అవి బోధింపజాలకున్నవి ఇది వాటి స్వభావము. వ్యాకరణము చేయునది ఎల్ల ఏమనగా— ఈ శబ్దము దాని స్వభావమును బట్టి, ఈ అర్థమును బోధింపగలదు, ఈ అర్థమును బోధింపజాలదు అని చెప్పుటయే. ఇందులకై స్వరిత ఞిత్త్వాదులు శాస్త్రమున చూపబడు చుండును ॥17॥

అవతారిక— ''స్వరితఞితః కర్త్రభిప్రాయే క్రియాఫలే'' అను సూత్రమున క్రియాఫలము కర్తకు చెందునదై ఉండునపుడు ఆత్మనే పదము వచ్చునని చెప్పుటచే 'యజన్తి యాజకాః' ''పచన్తి భక్తకరాః'' ఇత్యాదులందు, యాగఫలము యజమానునకును, పాకఫలమగు ఓదన భోజనము స్వామికిని చెందుచున్నది గాని ఆ క్రియలను చేయువారికి చెందుట లేదుగాన, యజ - పచ ధాతువులకు పరస్మై పదము వచ్చినది. కాని ఇచట గూడ యాగము చేసిన ఋత్విజులకు దక్షిణారూపమగు ఫలము, వంటవానికి కూలియు లభించుచున్నవి కదా? అందుచే క్రియా ఫలము కర్త్రభిప్రాయము గాన ఆత్మనే పదము రావలెను కదా యని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ యస్యార్థస్య ప్రసిద్ధ్యర్థ మారభ్యన్తే పచాదయః ।
తత్ ప్రధానం ఫలం తేషాం న లాభాది ప్రయోజనమ్ ॥ 18

యస్య = ఏ, అర్థస్య = ప్రయోజనము యొక్క, ప్రసిద్ధ్యర్థం = సిద్ధికొరకై, పచాదయః = పచాది క్రియలు, ఆరభ్యన్తే = ఆరంభింపబడు చున్నవో, తత్ = అదియే, ప్రధానం = ప్రధానమైన, ఫలమ్ = ఫలము, తేషాం = పాచకాదుల, లాభాది = కూలి మొదలగునది, ప్రయోజనం = ప్రయోజనము, న = కాదు.

తాత్పర్యము— ఏ ప్రయోజనము సిద్ధించుటకై పచాదులు ప్రారంభింపబడు చున్నవో అదియే ప్రధానమగు ఫలము. పాచకాదుల లాభాదికము ప్రయోజనము కాదు.

వివరణము— కర్త్రభిప్రాయ క్రియా ఫలము సంవిధానమునకు ఉపలక్షకమని చెప్పబడినది. అందుచే సంవిధాన క్రియావాచకమగు ధాతువునకు ఆత్మనే పదము వచ్చునని చెప్పినట్లైనది అందుచే సంవిధానము చేయువాడు ఏ ఫలము నుద్దేశించి ఆ ఏర్పాట్లను చేయునో అదియే ప్రధాన ఫలము. యాగముచేసి స్వర్గము సంపాదింపవలెనని అభిలషించు యజమానుడు ఇతరములగు సాధన సంపత్తితో పాటు ఋత్విక్కులను గూడ ఏర్పాటుచేసికొని వానికి దక్షిణ ఈయ వచ్చును. ప్రధానోద్దిష్టమగు స్వర్గరూప ఫలము ఆ సంవిధాన కర్తయగు యజమానునకే చెందునుగాన, దక్షిణాద్యవాంతర ఫలములు ఇతరులకు చెందినను, వాటిని బట్టి పరస్మై పదాత్మనే పదములను నిర్ణయింప వీలులేదు. పచ్యాది విషయమున

గూడ ఇష్టే. ఈ విధముగ ప్రధానముగ ఉద్దిష్టమగు ఫలము కర్తకు చెందినచో ఆత్మనే పదము, అది పరునకు చెందినచో పరస్మై పదము అని నిర్ణయింపవలెను ॥18॥

అవతారిక— సంవిధానార్థమున ఆత్మనేపదము వచ్చును అని సిద్ధాంతము అట్లైనచో 'స్వామిదాసౌ పచతః' అను ప్రయోగము ఎట్లు సాధువగును? దాసుడు సంవిధాన కర్త కాదు గాన పరస్మైపదము వచ్చినను స్వామి సంవిధాన కర్త గాన ఆత్మనే పదము రావలసియున్నది కదా? 'స్వామి దాసౌ పచతే' అని కూడ ప్రయోగించుటకు వీలు లేదు; అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ యత్రోభౌ స్వామిదాసౌ తు ప్రారభేతే సహక్రియామ్ ।
యుగపద్ధర్మభేదేన ధాతుస్తత్ర న వర్తతే ॥ 19

యత్ర = ఎచట, స్వామిదాసౌ = స్వామియు భృత్యుడు, ఉభౌ = ఇరువురును, సహక్రియాం = కలిసి క్రియను, ప్రారభేతే = ప్రారంభింతురో, తత్ర = అచట, ధర్మభేదేన = ధర్మబేద ముండుటచే, ధాతుః = ధాతువు, యుగపత్ = ఒక్కమారుగా, న వర్తతే = ప్రవర్తించదు.

తాత్పర్యము— స్వామి భృత్యు లిరువురును కలిసి ఎచట క్రియను ప్రారంభింతురో, అచట ధర్మ (వ్యాపార) భేదముండుటచే ధాతువు ఒక్క మారుగ ప్రవర్తింపదు

వివరణము— సంభారములను ఏర్పాటుచేయుట యనెడు సంవిధానమును ప్రభువు సాధించును. ప్రధాన క్రియారూపమగు వంటను భృత్యుడు సాధించెను. ఈ విధము వీరిరువురును చేయు వ్యాపారములు వేరు వేరుగ నున్నవిగాన ఒకే ధాతువు, ఒక్క సమయమున రెండు వ్యాపారములను బోధింపజాలదు అందుచే సంవిధాతను పట్టి ఆత్మనే పదమును ప్రయోగించవలెనా, దాసుని బట్టి పరస్మై పదము ప్రయోగింపవలెనా అను సంశయము నివర్తించదు. ॥19॥

అవతారిక— ధాతువు అనేకార్థము కనుక ఒకే ధాతువు ఏదియో విధముగ వ్యాపారద్వయమును బోధించునని చెప్పినను ఆత్మనేపద పరస్మైపదముల విరోధము దుష్పరిహారమని చెప్పుచున్నాడు.

శ్లో॥ యత్రప్రతివిధానార్థః పచిస్తత్రాత్మనే పదమ్ ।
పరస్మైపదమన్యత్ర సంస్కారాద్యభిధాయిని ॥ 20

యత్ర = ఎచట, పచిః = పచధాతువు, ప్రతివిధానార్థః = సంవిధానార్థకమో, తత్ర = ఆ వ్యాపారమును బోధింపవలసి యున్నపుడు, ఆత్మనే పదమ్ = ఆత్మనే పదము, సంస్కారాద్యభిధాయిని = అన్న సంస్కారము (అన్నము వండుట) మొదలగు దానిని బోధించు, అన్యత్ర = మరియొక వ్యాపారమునందు, పరస్మై పదము (వచ్చును)

తాత్పర్యము— పచధాతువు సంవిధాన రూపమగు అర్థమును బోధించునపుడు

ఆత్మనే పదము విధింపబడినది. తండుల విక్లిత్తి రూపమగు సంస్కారమును బోధించునపుడు పరస్మైపదము విధింపబడినది.

ఈ విధముగ ఒకే ధాతువు అర్థద్వయమును బోధించునని అంగీకరించినను పరస్పర విరుద్ధములగు లకారాదేశములు (పరస్మైపదాత్మనేపదములు) రావలసియుండును అది సమంజసము కాదు ॥20॥

అవతారిక— దానికి సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ సంవిధాతుశ్చ సాన్నిధ్యాత్ దాసే ధర్మోఽనుషజ్యతే ।
ప్లక్షశబ్దస్య సాన్నిధ్యాన్న్యగ్రోధే ప్లక్షతా యథా ॥ 21

ప్లక్ష శబ్దస్య = ప్లక్ష శబ్దముయొక్క, సాన్నిధ్యాత్ = సాన్నిధ్యము వలన, న్యగ్రోధే = న్యగ్రోధ వృక్షమునందు, ప్లక్షతా = ప్లక్షత్వము, యథా = ఎట్లో, అట్లే, సంవిధాతుః = సంవిధాత యొక్క, సాన్నిధ్యాత్ = సాన్నిధ్యము వలన, దాసే = దాసునియందు, ధర్మః= సంవిధాతృత్వ ధర్మము, అనుషజ్యతే = సంబంధించుచున్నది.

తాత్పర్యము— ప్లక్షశబ్ద సాన్నిధ్యముచే న్యగ్రోధ వృక్షమునందు ప్లక్షత్వము ఏ విధముగ ఆరోపింపబడుచున్నదో అట్లే సంవిధాతయొక్క సాన్నిధ్యముచే దాసునియందు గూడ సంవిధాతృత్వ రూపమగు ధర్మము ఆరోపింపబడుచున్నది.

విశేషము— 'ప్లక్షన్య గ్రోధౌ'' అనునది ద్వంద్వ సమాసము. 'సిద్ధంతు యుగపదధికరణ వచనే ద్వన్ద్వవచనాత్' అను భాష్య వార్తికానుసారముగ ఇచట 'ప్లక్ష' శబ్దము న్యగ్రోధముతో కలిసియున్న ప్లక్ష వృక్షమును, 'న్యగ్రోధ' శబ్దము ప్లక్షముతో కలిసియున్న న్యగ్రోధమును బోధించును 'యుగపదేకైకేన శబ్దేనాధికరణ మభిధేయం ద్వన్ద్వవాచ్యం సముదాయరూపం యదోచ్యతే తదా ద్వన్ద్వః' అని తెలియటము. అనగా ఇచట ప్లక్ష శబ్దమే న్యగ్రోధమును గూడ బోధించుచున్నది. ఇందులకు కారణము న్యగ్రోధమునందు ప్లక్షత్వారోపము. 'ప్రక్షరతీతి ప్లక్షః' అను వ్యుత్పత్తిచే ప్లక్షమనగా సర్వత్ర వ్యాపించునది అని యర్థము. ''న్యక్ రోహతీతి న్యగ్రోధః'' అను వ్యుత్పత్తిచే క్రిందకు మొలచునది– ఊడలు దింపునది – అని యర్థము న్యగ్రోధమునందు గూడ ప్లక్షత్వమున్నది ; ప్లక్షమునందు గూడ న్యగ్రోధత్వమున్నది అందుచే న్యగ్రోధమునందు ప్లక్షత్వారోపము, ప్లక్షమునందు న్యగ్రోధత్వారోపమును ఈ ద్వంద్వమునందున్నది. "యది తావత్ప్రక్షరతీతి వ్యుత్పత్త్యా ప్లక్షః స్యాత్, న్యగ్రోధేఽప్యేతద్భవతి. తథా యది న్యగ్రోహతీతి న్యగ్రోధః ప్లక్షేఽప్యేతద్భవతి'' (మ భా.).

అట్లే సంవిధాతృ సాన్నిధ్యముచే దాసునియందు గూడ సంవిధాతృత్వమును ఆరోపించినచో ఆత్మనే పదము వచ్చి ఆ క్రియయందు ఇరువురికిని అన్వయము కలుగుటచే "స్వామిదాసౌ పచేతే'' అని ప్రయోగింపవచ్చునని యర్థము. ॥21॥

అవతారిక— సన్నిధాన మాత్రముచే ఒక వస్తువునందు అన్యవస్తు రూపత్వము నారోపించుట ఎట్లు సంభావ్యము అని ఆశంకించి దృష్టాంత ప్రదర్శనముచే సమర్థించుచున్నాడు.

శ్లో॥ పురోడాశాభిధానం చ ధానాదిషు యథాస్థితమ్ ।
ఛత్రిణా చాభిసంబన్ధా చ్ఛత్రి శబ్దాభిధేయతా ॥ 22

ధానాదిషు = ధానాదులయందు (వేయించిన బియ్యము, పేలాలు), యథా = ఏ విధముగా, పురోడాశాభిధానం = పురోడాశమనెడు పేరు, స్థితం = ఉన్నదో, ఛత్రిణా = ఛత్రము కల వానితో, అభిసంబంధాత్ = సంబంధము వలన, ఛత్రి శబ్దాభిధేయతా = ఛత్రి శబ్దముచే బోధింపదగి యుండుట, (ఎట్లో అట్లే ఇచటను గ్రహించునది)

తాత్పర్యము— ధానాది ద్రవ్యములయందు పురోడాశమనెడు పేరు ఎట్లు ఆరోపితమైనదో, ఛత్రముకల వానితో సంబంధమువలన ఛత్రము లేనివారు గూడ ఏ విధముగ 'ఛత్రి' శబ్దముచే చెప్పబడుచున్నారో, అట్లే ఇచట గూడ గ్రహింపవలెను.

విశేషము— పురోడాశము (బియ్యపుపిండి మొదలగువాటితో తయారుచేసిన ఒక హోమ ద్రవ్యము) ఒక్కటియేయైనను "పురోడాశై ప్రచరన్తి" అను వాక్యమున బహువచనము ప్రయోగించుటచే ఆ పురోడాశముతో పాటు చెప్పిన ధానలు, కరంభము, పరివాపము, పయస్య అను వాటియందు కూడ పురోడాశత్వమును ఆరోపించి, వాటితో కలిసి పురోడాశములు ఐదు అని పూర్వమీమాంసకులచే నిర్ణయింపబడినది ధానాదులయందు పురోడాశత్వారోపమునకు తత్సాహచర్యమే కారణము పదిమంది కలిసిపోవుచున్నపుడు వారిలో ఒకరిద్దరి వద్ద మాత్రమే ఛత్రములున్నను వారి సాహచర్యముచే ఇతరులను గూడ ఛత్రవంతులుగ పరిగణించి 'ఛత్రిణోయాన్తి' (గొడుగులవాళ్ళు వెళ్ళుచున్నారు) అని చెప్పుదురు. అట్లే స్వామిసాన్నిధ్యముచే దాసునియందు గూడ సంవిధాన కర్తృత్వము నారోపించి ఆత్మనే పదమును ప్రయోగింపవచ్చునని యభిప్రాయము ॥22॥

అవతారిక— ఇచట మతాంతరము ననుసరించి పరస్మై పదమును గూడ ప్రయోగింపవచ్చునని చెప్పుచున్నాడు.

శ్లో॥ అర్థాత్ ప్రతీతమన్యోన్యం పారార్థ్యమవివక్షితమ్ ।
ఇత్యయం శేషవిషయః కైశ్చిదత్రానువర్ణ్యతే ॥ 23

అత్ర = ఇచట, అర్థాత్ = అర్థ శక్తివలన, ప్రతీతం = ప్రతీయమానమగు, అన్యోన్యం = పరస్పరము, పారార్థ్యం = పరార్థత్వము, అవివక్షితమ్ = వివక్షితము కాదు, ఇతి = ఈ కారణమువలన, అయం = ఇది, శేషవిషయః = శేషపరస్మై పదికి విషయమైనదిగా, కైశ్చిత్ = కొందరిచేత, అనువర్ణ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— ఇచట అర్థమువలన ప్రతీయమానము అగు పరస్పర హితార్థము వివక్షితము కాదు గావున ఇది శేషపరస్మైపది వచ్చుటకు తగిన స్థానము అని కొందరు వర్ణించిరి.

వివరణము— స్వామి దాసులలో ఒకడు ముఖ్యఫలమును ఉద్దేశించుచున్నాడు, రెండవవాడు ముఖ్యఫలమును ఉద్దేశించుట లేదు. అందుచే వారికిగల క్రియోపకారిత్వము విలక్షణమైనది. అట్టి వైలక్షణ్యమును వివక్షింపక "మాతా పితరౌ పుత్రం జనయతః" ఇత్యాదులందువలె సామాన్యరూపమున వీరిరువురును క్రియయందు కర్తలు అని మాత్రము చెప్పుటచే 'శేషాత్కర్తరి పరస్మై పదమ్' అను సూత్రముచే పరస్మైపదము వచ్చును. ఈ వాక్యమునందు స్వామి పదముండుటచే దానినిబట్టియే అతడు సంవిధాన కర్తయని తెలియుచున్నది. దాసపద ముండుటచే అతని క్రియాఫలము పరునకు చెందునని తెలియుచున్నది. కావున ఈ అర్థ విశేషములను ఆఖ్యాతము బోధింప పనిలేదు. అందుచే అది క్రియా సామాన్యమునే బోధించునుగాన ఇది ఆత్మనేపదనిమిత్తము కాని ధాతువగుటచే పరస్మైపదము వచ్చి 'స్వామి దాసౌ పచతః' అని ప్రయోగించ వచ్చునని కొందరి యభిప్రాయమని తాత్పర్యము. ॥23॥

అవతారిక— 'కృష్యాదిషుచానుత్పత్తిః' అను వార్తికమును వ్యాఖ్యానించుచు (సూ. 3-1-26) భాష్యకారులు "కృష్యాదిషుచానుత్పత్తి ర్వక్తవ్యా, ఏకాన్తే తూష్ణీమాసీన ఉచ్యతే పఞ్చభిర్హలైః కృషతీతి" అని వివరించియున్నారు. అచటనున్న 'పఞ్చభిర్హలైః కృషతి' అను పరస్మై పదప్రయోగమును గూర్చి ఆశంకించుచున్నాడు.

శ్లో॥ అథ ప్రతివిధాతా యో హలైః కృషతి పఞ్చభిః ।
భాష్యే నోదాహృతం కస్మాత్ ప్రాప్తం తత్రాత్మనేపదమ్ ॥ 24

అథ = మరి, యః = ఏ, ప్రతివిధాతా = ఏర్పాట్లు చేయు స్వామి, పంచభిః = ఐదు, హలైః = నాగళ్ళచే, కృషతి = దున్నుచున్నాడో, తత్ర = అచట, ప్రాప్తం = ప్రాప్తించిన, ఆత్మనేపదం = ఆత్మనేపదము, భాష్యే = భాష్యమునందు, కస్మాత్ = ఏ కారణము వలన, నోదాహృతం = ఉదాహరింప బడలేదు ?

తాత్పర్యము— ఏర్పాట్లుచేయు యజమాని ఐదు హలములచే (నాగళ్ళచే) దున్నుచున్నాడు (కృషతి) అని చెప్పు సందర్భమున ఆత్మనేపదము రావలసియుండగా భాష్యకారులు ఎందుచే అట్లు ప్రయోగింపలేదు ?

వివరణము— 'పంచభిః హలైః కృషతి' అను ప్రయోగమున్నది ఇచట ఒక వ్యక్తి ఐదు నాగిళ్ళచే దున్నుట యనునది అసంభవము. కావున ఒక ప్రభువు ఐదు నాగళ్ళచే దున్నించుచున్నాడని యర్థము. అనగా అట్లు దున్నుటకు ఏర్పాటు చేయుచున్నాడు. ఈ విధముగ ప్రతి విధానకర్తృత్వమును బోధించుచున్నది గాన ఆత్మనేపదము రావలసి

యున్నది కదా ; భాష్యకారులు అట్లు 'కృషతే' అని ప్రయోగించకుండగా 'కృషతి' యని ఏల ప్రయోగించెను అని ఆ శంక. ॥24॥

అవతారిక— పూర్వ పక్షియే పరిహారమును ఆశంకించి నిరాకరించుచున్నాడు

శ్లో॥ ప్రతీతత్వాత్ తదర్థస్య శేషత్వం యది కల్ప్యతే ।
న స్యాత్ ప్రాప్తవిభాషాసౌ స్వరితేతాం నివర్తికా ॥ 25

తదర్థస్య = ఆత్మనే పదార్థమగు సంవిధాన కర్తృత్వము, ప్రతీతత్వాత్ = ప్రతీతమగుట వలన, శేషత్వం = శేషత్వము, కల్ప్యతేయది = కల్పింపబడినట్లైతే, అసౌ = ఆ 'విభాషోప పదేన ప్రతీయమానే' (పా. 1-3-77) అనెడు విభాష, స్వరితేతాం = స్వరితేత్తులకు, నివర్తికా = ఒక పక్షమున ఆత్మనే పదమును నివర్తింపచేయు సట్టిదయిన, ప్రాప్తవిభాషా = ప్రాప్తవిభాష (పొందవలసిన వైకల్పికత్వము), నస్యాత్ = కాకపోవును.

తాత్పర్యము— ఆత్మనే పదార్థము ప్రతీతమగుటచే శేషత్వమును కల్పించినచో "విభాషోపపదేన ప్రతీయమానే" అను స్వరితేత్తులకు ఒక పక్షమున ఆత్మనేపదమును నివర్తింపచేయు ప్రాప్తవిభాష కాజాలదు.

విశేషము— భృత్యుడు ఒక్క సమయమున ఐదు నాగళ్ళతో దున్న జాలడు. కావున 'కృషతి' అను దానిలో కర్త సంవిధాతయే యని అర్థాత్ సిద్ధము. అందుచే అర్థాత్సిద్ధ మగు సంవిధాతృత్వమును బోధించుటకై ఆత్మనే పదమును ప్రయోగింప ఆవశ్యకత లేదు గాన శేషార్థమున "శేషాత్కర్తరి పరస్మై పదమ్' అను సూత్రముచే పరస్మైపదము వచ్చి నది అని పూర్వోక్తాశంకకు పరిహారము చెప్పినచో మరియొక దోషము వచ్చును. "విభాషోప పదేన ప్రతీయమానే' అని మరియొక సూత్రమున్నది. "సమీపోచ్చరితమగు పదముచే క్రియాఫలము కర్తృగామియను విషయము తెలుపబడినచో ఆత్మనేపదము వికల్పముగ వచ్చును" అని దీని యర్థము. 'స్వం యజ్ఞం యజతి యజతే వా' ఇత్యాదు లుదాహరణము ఇచట 'స్వం' అను పదముచే క్రియాఫలము కర్తృగామి యను విషయము తెలియుచున్నది గాన ఆత్మనే పదము వికల్పముగ వచ్చినది. ఈ విభాష 'ప్రాప్తవిభాష' యని భాష్యమునందు చెప్పబడినది అనగా పూర్వోక్తోదాహరణమునందు "స్వరితఞితః"— ఇత్యాది సూత్రముచే నిత్యముగ ఆత్మనేపదము రావలసియుండ ఈ సూత్రముచే వైకల్పికత్వము చెప్పబడినదని యర్థము. అందుచే ఈ ప్రాప్తవిభాష స్వరితేత్తులు మొదలగువాటి విషయమున క్రియాఫలము కర్తృగామి యైనపుడు నిత్యముగ రావలిసియున్న ఆత్మనేపదమును ఒక పక్షమున నివర్తింప చేసి పరస్మైపదము వచ్చునట్లు చేయును. పైన (ఏకదేశి) చెప్పిన విధమున సంవిధాన కర్తృత్వము ప్రమాణాంతరముచే గమ్యమగుచున్నది గాన ఆత్మనే పదము వచ్చుటకే అవ కాశము లేదన్నచో ఈ సూత్రము అప్రాప్త విభాషయని చెప్పవలసి వచ్చును. అనగా 'స్వం యజ్ఞం యజతి' ఇత్యాదులలో 'స్వ' శబ్దముచే క్రియాఫలమున కర్తృగామియని చెప్పబడినది గాన ఆత్మనేపదము వచ్చుటకు పూర్తిగ అవకాశములేని పరిస్థితులలో ఈ సూత్రము

చెప్పబడి, విధి ముఖమున ప్రవర్తించుచున్నది గాన నది అప్రాప్త విభాషయని చెప్పవలసి యుండును. ఇది భాష్యకార మతమునకు విరుద్ధము. అందుచే ప్రకృతమున 'పంచభిః హలైః కృషతి' అనునపుడు సంవిధాన కర్తృత్వము ప్రమాణాంతర గమ్యమైనను ఆత్మనేపదమే రావలసియున్నదను ఆక్షేపము సుస్థము ॥25॥

అవతారిక — ఈ విషయమున కొందరు ఈ విధముగ సమాధానము చెప్పుచున్నారు.

శ్లో॥ శుద్ధే తు సంవిధానార్థే కైశ్చిదత్రేష్యతే కృషిః ।
తద్ధర్మా యజిరిత్యేవం న స్యాత్తత్రాత్మనేపదమ్ ॥ 26

కైశ్చిత్తు = కొందరిచేతనైతే, అత్ర = ఇచట, కృషిః = కృష్‌ధాతువు, శుద్ధేః = శుద్ధమగు, సంవిధానార్థే = సంవిధాన రూపమగు అర్థమునందు, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది. ఏవం = ఈ విధముగ చెప్పినచో, యజిః = యజ్ ధాతువుకూడ, తద్ధర్మా = కృష్ ధాతువునకు ఏ సంవిధాన రూపార్థము చెప్పబడినదో ఆ అర్థమే కలది కావున, తత్ర = ఆ యజ్ ధాతువునందు, ఆత్మనేపదం = ఆత్మనేపదము, నస్యాత్ = రాకుండ పోవును.

తాత్పర్యము— కొందరు కృష్ ధాతువునకు ఇచట కేవలము సంవిధానమనెడు అర్థము మాత్రమే అని అంగీకరించినారు. అట్లు చెప్పినచో యజ్ ధాతువునకు గూడ సంవిధాన రూపార్థమునే అంగీకరించుటచే దానికి గూడ ఆత్మనేపదము రాదని చెప్పవలసి యుండును.

వివరణము— వెనుక సూచించిన విధముగ కొందరి మతము ప్రకారము ఆత్మనేపదము ణిచ్చుతో సమానవిషయకము. అనగా ణిచ్చు ఏ అర్థమున వచ్చునో ఆత్మనేపదము కూడ ఆ యర్థముననే వచ్చును. "పంచభిః హలైః కృషతి" ఇత్యాద్యుదాహరణములలో కృష్ ధాతువునకు ణిచ్ ప్రత్యయము ఎందుచే రాలేదు అని ఆశంకించుకొని "కృష్యాదిషుచానుత్పత్తిర్నానా క్రియాణాం కృష్యర్థత్వాత్" అను వార్తికముచే (3-1-26) సమాధానము చెప్పబడినది 'కృష్ ధాతువునకు నాగలితో దున్నుట అని మాత్రమే అర్థము కాదు. ఈ ధాతువు ప్రతివిధాన మనెడు అర్థమును గూడ బోధించును' అని భాష్యకారులు దీనిని వ్యాఖ్యానించిరి. కావున ఇచట విలేఖనమనెడు (దున్నుట అనెడు) ప్రయోజ్య వ్యాపారము లేదుగాన ణిచ్ ప్రత్యయము రాలేదని ఈ సమాధాన వార్తికము భావము. భాష్యకారులు చెప్పిన విధమున ఇచట కృష్ ధాతువునకు సంవిధానమని అర్థముగాన ఇచట ఆత్మనే పదము కూడ రాదు. సంవిధాన విశిష్టమగు అర్థమును బోధించు ధాతువునకు ఆత్మనే పదము వచ్చునుగాని, శుద్ధమగు సంవిధానమును బోధించు దానికి రాదు కదా? ఈ విధముగ శుద్ధ సంవిధాన బోధకత్వము ఆత్మనేపదము రాకుండుటకు కారణమని వీరి అభిప్రాయము.

ఈ అభిప్రాయము అయుక్తమని ఉత్తరార్థము చెప్పుచున్నది.

కృష్ ధాతువు శుద్ధ సంవిధానార్థకమగుటచే ఆత్మనే పదము రాదు అని సమాధానము చెప్పినచో, అదే విధముగ 'యజి' ధాతువు గూడ శుద్ధ సంవిధానార్థమును బోధించునని చెప్పవచ్చును గాన దానికి గూడ ఆత్మనే పదము రాకుండ పోవును. భాష్యకారుడు కృష్ ధాతువు విషయములో – 'నావశ్య కృషిర్విలేఖన ఏవవర్తతే; కింతర్హి; ప్రతివిధానేఽపి వర్తతే' అని చెప్పినట్లు యజధాతువు విషయమున గూడ ''నావశ్యం యజిర్హవిః ప్రక్షేపణ ఏవవర్తతే; కిం తర్హి త్యాగేఽపి'' అని చెప్పియున్నాడు. ఋత్విక్కులు హవిస్సును అగ్నిలో హోమము చేయుచుండగా యజమానుడు దూరముగ కూర్చుండి ''ఇంద్రాయేదం నమమ'' (ఇంద్రుని కొఱకిది నాది కాదు) ఇత్యాది విధమున చెప్పుచుండును. ఇదియే త్యాగము. ఈ త్యాగము సంవిధానములో చేరినది. కావున యజధాతువునకు గూడ ఆత్మనే పదము రాకుండవలెను. అందుచే వారు చెప్పిన సమాధానము అయుక్తమని తేలినది. యజ ధాతువునకు కేవల సంవిధానమే కాక, హవిః ప్రక్షేపణ విశిష్ట సంవిధానము అర్థము; అందుచే ఇచట ఆత్మనేపదము రావచ్చునని సమాధానము చెప్పినచో, కృష్ ధాతువునకు గూడ విలేఖన విశిష్ట సంవిధానము అర్థమని చెప్పవచ్చును గాన ఆత్మనేపదము రావలసియుండును. ॥26॥

అవతారిక— ఇపుడు సిద్ధాంతి, ఇచట ఆత్మనేపదము రాకుండుటకు కారణమును తెలుపుచున్నాడు.

శ్లో॥ అత్ర తూపపదేనాయమర్థభేదః ప్రతీయతే ।
ప్రాప్తే విభాషాక్రియతే తస్మాన్నాస్త్యాత్మనేపదమ్ ॥ 27

అత్రతు = ఇచటనైతే, అయం = ఈ, అర్థభేదః = అర్థభేదము, ఉపపదేన = ఉపపదము చేత, ప్రతీయతే = తెలియుచున్నది, ప్రాప్తే = ఆత్మనే పదము ప్రాప్తమగుచుండగా, విభాషా = వికల్పముగా, క్రియతే = చేయబడుచున్నది, తస్మాత్ = ఆ కారణమువలన, ఆత్మనే పదం = ఆత్మనే పదము, నాస్తి = లేదు.

తాత్పర్యము— ఇచట అర్థభేదము ఉపపదముచే బోధింపబడుచున్నది అందుచే ఆత్మనే పదము వైకల్పికము గాన ఇచట రాలేదు.

వివరణము— ప్రక్కనున్న ''పంచభిః హలైః'' అను పదములచే ఇచట సంవిధానరూపమగు అర్థవిశేషమున్నదని తెలియుచున్నది. కావున, ''విభాషోపపదేన ప్రతీయమానే'' అను సూత్రము ప్రవర్తించును. అనగా 'స్వరితఞితః'– ఇత్యాది సూత్రముచే నిత్యముగ ఆత్మనే పదము రావలసియుండ ఈ సూత్రమును బట్టి ఆత్మనే పదము వికల్పముగ వచ్చును. కావున 'కృషతి' అనునది ఆత్మనే పదము రాని పక్షమున చేసిన ప్రయోగముగాన సాధువే యని భావము. ॥27॥

ఉపగ్రహ సముద్దేశము ముగిసినది

లిఙ్గ సముద్దేశము

అవతారిక— ఇంతవరకును తిఙంతార్థ విచారణ జరిగినది. వాటిలో సంఖ్యా సాధనములు తిఙంతములకును సుబంతములకును గూడ సంబంధించునవి. క్రియా - కాల - పురుష - ఉపగ్రహములు మాత్రము కేవలము తిఙన్తములకే సంబంధించునవి. లింగము మాత్రము నామపదములకు అధికముగ నుండునది. దానినిపుడు విచారింప నున్నవాడై దర్శన భేదానుసారముగ దాని లక్షణమును తెలుపుచున్నాడు.

శ్లో॥ స్తనకేశాది సంబన్ధో విశిష్టా వా స్తనాదయః ।
తదుపవ్యఞ్జనా జాతి ర్గుణావస్థా గుణా స్తథా ॥ 1

శబ్దోపజనితోఽర్థాత్మా శబ్దసంస్కార ఇత్యపి ।
లిఙ్గానాం లిఙ్గత త్త్వజ్ఞై ర్వికల్పాః స ప్త దర్శితాః ॥ 2

స్తనకేశాది సంబన్ధః = స్తనకేశాదులతో సంబంధము అనియు, వా = లేక, విశిష్టాః = సంబంధ విశిష్టములగు, స్తనాదయః = స్తనాదులనియు, తదుపవ్యఞ్జనా = స్తనాదులు ఉప వ్యంజకములుగా గల జాతి, జాతిః = జాతియనియు, గుణావస్థాః = సత్త్వాది గుణముల అవస్థలనియు, తథా = మరియు, గుణాః = సత్త్వాది గుణములనియు, శబ్దోపజనితః = శబ్దప్రయోగ మాత్రమువలన కలిగిన, అర్థాత్మా = అర్థస్వరూపమనియు, శబ్ద సంస్కార ఇత్యపి = శబ్ద సంస్కారమనియు, లిఙ్గత త్త్వజ్ఞైః = లింగత త్త్వమును ఎరింగిన వారిచేత, లింగానాం = లింగముల విషయమున, స ప్త = ఏడు, వికల్పాః = వికల్పములు, దర్శితాః = చూపబడినవి.

తాత్పర్యము— స్తనకేశాదుల సంబంధమనియు, సంబంధించిన స్తనకేశాదు లనియు, స్తనకేశాదులచే వ్యంగ్యమగు జాతియనియు, సత్త్వాది గుణముల అవస్థలనియు, గుణములనియు, శబ్దమాత్ర బోధ్యమగు అర్థస్వరూపమనియు, శబ్ద సంస్కారమనియు, లింగత త్త్వజ్ఞులు లింగముల విషయమున ఏడు వికల్పములను చూపియున్నారు. ఇచ్చట విశిష్టాః అను పదమునకు సంబంధించిన యని యర్థము వ్రాయబడినది. ఆ విశేషమేమి ? 'ప్రసవ యోగ్యములయిన' యను విశేషము వ్యాఖ్యానములో నున్నది. పరిపుష్టములయి, స్తన్య జనన యోగ్యత గలవిగాని, కేవలము చిహ్న మాత్రములుగా పురుషునియందుండు స్తనములు కావు. ప్రచయాది సంబంధ వైశిష్ట్యమనియు భావము. ప్రచయమనగా పెరుగుట యర్థము.

వివరణము— స్త్రీ లింగము, పుంలింగము, నపుంసక లింగము అని మూడు లింగము లున్నవి. లింగము అనగా ఏమి అను విషయమున ఏడు మతభేదము లున్నవని ఈ కారిక చెప్పుచున్నది. ఒక అవయవికి స్తనములు కేశములు మొదలగు వాటితో సంయోగ

సమవాయాత్మక సంబంధము లింగమని మొదటి మతము. ఈ సంబంధములచే సంబంధించిన స్తనకేశాదులే లింగమని రెండవ మతము. ఈ మతద్వయమును— "స్తనకేశవతీ స్త్రీ స్యాల్లోమశః పురుషః స్మృతః ఉభయోరన్తరం యచ్చ తదభావే నపుంసకమ్" అను భాష్యోదాహృత కారిక సూచించుచున్నది. "స్తనకేశాదులు కలది స్త్రీ అధికముగ లోమములు కలవాడు పురుషుడు. ఈ రెండును లేనపుడు, ఏది ఈ రెండింటికిని సదృశముగ నున్నదో (ఉభయోరన్తరం) అది నపుంసకము" అని ఈ శ్లోకము యొక్క అర్థము. ఇది లౌకిక లింగము. ఇది ప్రాణుల విషయమున కొంతవరకు సరిపడినను అప్రాణులగు 'ఖట్వా' 'మాలా' 'వృక్ష' మొదలగు శబ్దముల విషయమున సమన్వితము కాదు గాన గ్రాహ్యము కాదు చేతనములలో గూడ నిత్య పుంలింగములును, భార్యాద్యర్థవాచకములును అగు దార శబ్దాదులలో ప్రవర్తించదు

లింగమనునది స్తనాదులగు వ్యంజకములచే వ్యంగ్యమగునదియు, స్త్రీత్వ పుంస్త్వ నపుంసకత్వ రూపమగునదియు నగు ఒక జాతియని మూడవ మతము. స్వత్త్వ రజస్తమో రూపములగు మూడు గుణముల ఉపచయము (వృద్ధి) అపచయము (హ్రాసము) మాధ్యస్థ్యము అనెడు అవస్థా విశేషములే పుంస్త్వాది లింగములని సాంఖ్యాదుల అభిప్రాయము. ఇది నాల్గవ మతము. ఇది భాష్యకారాభిమతమగు మతము ఉపచయాద్యవస్థా సహితములగు సత్త్వాది గుణములే లింగమని ఐదవ మతము. ఒకే వస్తువు విషయమున అర్థః (పుః లిం) వ్యక్తిః (స్త్రీ. లిం.) వస్తు (న. లిం.) అను భిన్న శబ్దములను ప్రయోగింప వచ్చును. దీనిని బట్టి వాస్తవమున లింగమనునది బాహ్య వస్తువులందు లేకున్నను ఉన్నట్లుగ శబ్దములచే బోధింపబడు చున్నదని ఆరవ మతము. తటః, తటీ, తటం ఇత్యాదులలో ఒకే అర్థమును బోధించు ఒకే శబ్దము భిన్న లింగములలో ప్రయోగింపబడు చున్నది. అందుచే లింగమనునది శబ్ద సంస్కారము మాత్రమే అని ఏడవ మతము ॥2॥

అవతారిక— ఇపుడు శబ్ద శక్తి స్వభావమును బట్టి లింగము విషయమున ఇంకను ఏడు వికల్పము లున్నవని చెప్పుచున్నాడు

**శ్లో॥ ఉపాదాన వికల్పాశ్చ లింగానాం సప్త వర్ణితాః ।
వికల్ప సన్నియోగాభ్యాం యే శబ్దేషు వ్యవస్థితాః ॥ 3**

యే = ఏవి, వికల్ప సన్నియోగాభ్యాం = వికల్ప నియమములచే, శబ్దేషు = శబ్దములయందు, వ్యవస్థితాః = ఉన్నవో, అట్టి, లింగానాం = లింగములకు సంబంధించిన, ఉపాధాన వికల్పాః + చ = ఉపాదాన భేదములు, సప్త = ఏడు, వర్ణితాః = వర్ణింపబడినవి ఉపాదానమనగా విశిష్ట శక్తులగు శబ్దములు అర్థ సంబద్ధములుగ లింగములను పరిగ్రహించుట.

తాత్పర్యము— ఏ భేదములు, వికల్ప సంనియోగములచే శబ్దములయందున్నవో అట్టి, లింగములకు సంబంధించిన, ఏడు ఉపాదాన వికల్పములు వర్ణింపబడినవి.

వివరణము— లింగములు గుణావస్థా రూపము లగుటచే అంతటను సంభావ్యములే

యైనను - అనగా అన్ని లింగములును అన్ని పదములకును సంభవించునని చెప్పుటకు అవకాశమున్నను, ఈ శబ్దము ఈ లింగమును మాత్రమే అభివ్యక్తము చేయగలదు అను నియమమును ఏర్పరచుటచే లింగ సాంకర్యము - అన్ని లింగములును అన్ని శబ్దములకును ఉండుట అనునది - ఉండదు. ఈ విధముగ, ఆ యా శబ్దములకు ఆ యా లింగములను వ్యక్తీకరించు శక్తిని బట్టి ఏడు భేదము లేర్పడును. (1) శంఖః, పద్మః, శంఖం, పద్మం ఇత్యాది పదములు కొన్ని పుంలింగ నపుంసకలింగములతో నుండును. (2) భాగధేయం, భాగధేయీ, భేషజం, భేషజీ - ఇత్యాదులు స్త్రీ నపుంసక లింగములు (3) ఇషుః, అశనిః, వత్సః - వత్సా ఇత్యాదులు స్త్రీపుంస సాధారణములు (4) తటః, తటీ, తటం ఇత్యాదులు లింగత్రయ సాధారణములు. సన్నియోగ మనగా నియమము దానిని బట్టి మూడు భేదము లేర్పడును. వృక్ష శబ్దాదులు పుంలింగమునందు మాత్రముండును. ఖట్వా శబ్దాదులు స్త్రీలింగమునందే ఉండును. దధ్యాది శబ్దము నపుంసకలింగము నందే ఉండును ఈ విధముగ శబ్దములకు గల లింగాభివ్యంజకత్వ శక్తిని బట్టి ఏడు భేదము లేర్పడును. ॥3॥

అవతారిక— ఇపుడు జాతి పక్షమును గూర్చి విచారించుచున్నాడు. 'ఖట్వా' ఇత్యాది పదముల విషయమున అవ్యాప్తముగాన "స్తనకేశవతీ స్త్రీ" ఇత్యాది లౌకిక లింగ లక్షణమును పరిత్యజించి స్త్రీత్వాదులు జాతి విశేషములని చెప్పబడినది. అది అయుక్తము కదా. గోవునందు గోత్వజాతి ఒక్కటియే ఉండునుగాని అశ్వత్వాది జాతులు ఉండవు కదా? అట్లే ఒక శబ్దమున గోత్వాది జాతులతో కలిసి స్త్రీత్వ, పుంస్త్వాది జాతులు ఎట్లుండును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ తిస్రో జాతయ ఏవైతాః కేషాంచిత్ సమవస్థితాః ।
అవిరుద్ధా విరుద్ధాభిర్గోమహిష్యాది జాతిభిః ॥ 4

కేషాంచిత్ = కొందరి మతము ప్రకారము, ఏతాః = ఈ, తిస్రః = మూడు, అవిరుద్ధాః = విరుద్ధము కాని, జాతయః = జాతులు, విరుద్ధాభిః = పరస్పర విరుద్ధములగు, గోమహిష్యాది జాతిభిః = గోత్వ మహిషత్వాది జాతులతో, సమవస్థితాః = కలిసి ఉన్నవి.

తాత్పర్యము— కొందరి మతము ప్రకారము విరుద్ధములుకాని ఈ స్త్రీత్వాది జాతులు మూడును పరస్పర విరుద్ధములగు గోత్వ మహిషత్వాది జాతులతో కలిసి యున్నది

వివరణము— స్త్రీత్వ సంవలితమగు జ్ఞానము గోవు విషయమునందైనను కలుగవచ్చును. మహిష్యాదుల విషయమునందైనను కలుగవచ్చును. కావున స్త్రీత్వాదులు సంబంధించుటకు విరోధమేదియును లేదుగాన అని అవిరుద్ధములు. ఆ యా గోవులయందు ఇది గోవు ఇది గోవు అను రీతిగ అనుస్యూతమగు గోత్వ ప్రతీతి కలుగుచుండుటచే ఆ గోత్వము ఆగో వ్యక్తుల యందున్నట్లు తెలియుచున్నది. కాని ఆ గోవులందు అశ్వత్వ ప్రతీతి కలుగుట లేదు గాన గోవునందు అశ్వత్వ జాతి ఉండ జాలదు. అందుచే గోత్వాశ్వత్వములు పరస్పర విరుద్ధములు. అవి ఒక చోట కలిసి ఉండవు. కాని స్త్రీత్వాదుల విషయ మట్టిది కాదు. గోవునందును,

మహిషి యందును గూడ స్త్రీత్వానురక్తమగు బుద్ధి కలుగుచున్నది గాన గోత్వాది జాతులతో కలిసి స్త్రీత్వ జాతి ఉండవచ్చునని అభిప్రాయము ॥4॥

అవతారిక— ఈ విషయమునే వివరించుచున్నాడు.

శ్లో॥ హస్తిన్యాం వడవాయాం చ స్త్రీతి బుద్ధేః సమన్వయః ।
అతస్తాం జాతిమిచ్ఛన్తి ద్రవ్యాది సమవాయినీమ్ ॥ 5

హస్తిన్యాం = ఆడ ఏనుగ యందును, వడవాయాం చ = ఆడ గుర్రమునందును, స్త్రీ + ఇతి = స్త్రీ అను, బుద్ధేః = బుద్ధియొక్క, సమన్వయః = సమన్వయము ఉన్నది, అతః = ఆ కారణము వలన, తాం = ఆ, జాతిం = జాతిని, ద్రవ్యాది సమవాయినీం = ద్రవ్యాదులతో సమవేతమైనదానినిగా, ఇచ్ఛన్తి = ఇచ్ఛయించుచున్నారు.

తాత్పర్యము— ఆడు ఏగుగి విషయమునను, ఆడు గుర్రము విషయమునను గూడ స్త్రీ అను బుద్ధి కలుగుచున్నది. అందుచే ఆ జాతి (స్త్రీత్వజాతి) ద్రవ్యాదులతో సమవాయ సంబంధముచే సంబంధించును అని చెప్పుచున్నారు.

వివరణము— భిన్న జాతులకు చెందిన వ్యక్తుల విషయమున గూడ ఇది స్త్రీ, ఇది పురుషుడు ఇత్యాది బుద్ధి కలుగుటకు అవకాశమున్నది. కావున హస్తిత్వవడవాత్వాది జాతులతో స్త్రీత్వ జాతికి విరోధము లేదు. ఈ విధముగ స్త్రీ పుం నపుంసకలింగ రూపమగు జాతి ద్రవ్య గుణ - కర్మ - సామాన్యాదులతో గూడ సంబంధించి యుండును.

వైయాకరణులకు శబ్దమే ప్రథమ ప్రమాణము. శబ్దము ఏ అర్థమును బోధించునో ఆ అర్థమే దాని సరియైన అర్థము. ఒక శబ్దమునుండి ఒక అర్థ ప్రతీతి కలుగునపుడు ఆ శబ్దమునకు ఆ అర్థ మున్నదా లేదా యని సందేహింప పనిలేదు. స్త్రీత్వ పుంస్త్వాది రూపములగు ఉపాధులు భిన్న జాతీయములందు గూడ అనుస్యూతముగ నున్నట్లు శబ్దములవలన స్పష్టముగ తెలియుచున్నది కాబట్టి అవి వాటితో సంబంధించునా సంబంధింపవా యను సందేహమునకు అవకాశము లేదు. కావున ద్రవ్య - గుణ - కర్మ - సామాన్యాదులకు గూడ లింగ జాతితో సంబంధమును అంగీకరింపవలెను. ఒక శబ్దము ఒక లింగ జాతితో సంబంధించినట్లుగ చెప్పబడిన అర్థమునే మరియొక శబ్దము మరియొక లింగజాతితో సంబంధించినట్లు బోధించుచున్నది. ఉదాహరణమునకు— 'ఉనికి' అను అర్థమునకు పుంస్త్వము ఉపాధిగ నున్నట్లు 'భావః' అను శబ్దము చెప్పుచున్నది. స్త్రీత్వము ఉపాధిగా నున్నట్లు 'సత్తా' అను శబ్దము బోధించుచున్నది. 'సామాన్యమ్' అను శబ్దము నపుంసక లింగము ఉపాధిగా నున్నట్లు బోధించుచున్నది. గోత్వాది జాతులకు గూడ భావ - జాతి - సామాన్య శబ్దములచే, మూడు లింగములతో సంబంధమున్నట్లు తెలియుచున్నది. ఈ విధముగ శబ్దము నెల్లపుడును ద్రవ్యము వలె కానవచ్చెడు వస్తువును బోధించుచుండును. అట్లు బోధించుటలో ఆ వస్తు ధర్మమగు లింగము ఉపాధిగ భాసించుచునే ఉండును కావుననే స్త్రీత్వం, స్త్రీతా, స్త్రీభావః ఇత్యాది స్థలములలో లింగ వాచకములకు లింగాంతర సంబంధము కనబడుచున్నది.

అవతారిక— ఈ విషయమునే ఇంకను విశదీకరించుచున్నాడు.

శ్లో॥ పరతన్త్రస్య యల్లిఙ్గమపోద్ధారే వివక్షితే ।
తత్రాసౌ శబ్ద సంస్కారః శబ్దైరేవ వ్యపాశ్రితః ॥ 6

అపోద్ధారే = అపోద్ధారము, వివక్షితే = వివక్షితమైనదగుచుండగా, పరతన్త్రస్య = పరతంత్ర మగు శబ్దము యొక్క, యత్ = ఏ, లింగం = లింగముకలదో, అసౌ = అది, శబ్దైరేవ = శబ్దములచేతనే, వ్యపాశ్రితః = ఆశ్రయింపబడిన, శబ్దసంస్కారః = శబ్దసంస్కారము.

తాత్పర్యము— అపోద్ధారము చేయదలచినపుడు, పరతంత్రమగు శబ్దమునకు సంబంధించిన లింగము శబ్దమాత్రమును ఆశ్రయించిన శబ్ద సంస్కారము మాత్రమే.

వివరణము— నామపదము పదార్థమును బోధించును. అది వృత్తిలో ఉపసర్జన మైనను ప్రక్రియా సమయమున అపోద్ధారము చేసినపుడు, (విగ్రహ వాక్యము చెప్పుటకై విడదీయునపుడు) దానికొక లింగమును చేర్చుచుందురు. లింగములేని శబ్దమును ప్రయోగించు టకు వీలులేదు గాన ఆ శబ్దమునకు ఆ లింగమును చేర్చుట జరుగుచున్నదిగాని లౌకిక ప్రయోగమున ఆ లింగము అవివక్షితము. ''కుక్కుట్యాః అండం కుక్కుటాండం'' అను సమాసమున కుక్కుటీ శబ్దమునకు పుంవద్భావమును విధించుచు చెప్పిన 'కుక్కుట్యాదీనా మణ్డాదిషు' అను వార్తికమును నిరాకరించుచు ''నవా అస్త్రీ పూర్వపద వివక్షితత్వాత్'' అను వార్తికము చెప్పబడినది (మ. భా. 6-3-42). ఇచట 'కుక్కుటీ' అను స్త్రీలింగ శబ్దము పూర్వపదముగ నున్నదని చెప్ప బనిలేదు. అందుచేత దానికి పుంవద్భావమును విధించుట అనావశ్యకము, అని దాని భావము. అసగా 'కుక్కుటాణ్డం' ఇత్యాది సమాసములందు ఉప సర్జనముగా (అప్రధానముగా నున్న) కుక్కుట శబ్దము కోడి అనెడు పదార్థమును బోధించు చున్నది. ప్రక్రియా సమయమున ఈ పదములను విడదీసి విగ్రహవాక్యము చెప్పవలసి నపుడు (కుక్కుట్యాః' అను స్త్రీలింగ శబ్దమును చెప్పనవసరము లేదు. 'కుక్కుటస్య' అని 'కుక్కుట' శబ్దమునే ఉపయోగించవచ్చును. ఇచటనున్న పుంలింగము ఏదియో యొక లింగమును చేర్చవలెను కదా అని శబ్ద సంస్కారమునకై చేర్చినదే గాని ఇందు పుంస్త్వ వివక్షగాని, స్త్రీత్వ వివక్షగాని లేదు. అందుచే దానికి పుంవద్భావమును చెప్పవలసిన ఆవశ్య కత లేదు. లౌకిక ప్రయోగమునందు మాత్రము మగ కోడికి గ్రుడ్లు ఉండవుగాన 'ఆడ కోడి గ్రుడ్డు' అను అర్థమే వచ్చును. ॥6॥

అవతారిక— స్త్రీత్వాది లింగజాతులు అన్నిటియందును ఉన్నవి అని నాల్గవ కారికలో చెప్పిన వ్యాప్తిని సమర్థించుచున్నాడు.

శ్లో॥ బుద్ధ్యా కల్పితరూపేషు లిఙ్గేష్వపి చ సమ్భవః ।
స్త్రీత్వాదీనాం వ్యవస్థా హి సాలిఙ్గైర్వ్యపదిశ్యతే ॥ 7

బుద్ధ్యా = బుద్ధిచేత, కల్పితరూపేషు = కల్పితమగు రూపముగల, లిఙ్గేష్వపి = లింగముల విషయమున గూడ, సమ్భవః = లింగముల సంభవముండును, సా = ఆ, వ్యవస్థా = నియమము, స్త్రీత్వాదీనాం = స్త్రీత్వాదులయొక్క, లిఙ్గైః = లింగోపాదులగు శబ్దములచే, వ్యపదిశ్యతే = ప్రతిపాదింపబడుచున్నది.

తాత్పర్యము— బుద్ధిచే కల్పితమగు రూపములుగల లింగములందు గూడ లింగములు చేరుటకు సంభవమున్నది. స్త్రీత్వాదుల లింగములకు ఉపాధులగు శబ్దములచే ఆ నియమము ప్రతిపాదింపబడుచున్నది.

వివరణము— స్త్రీత్వాది లింగములు ఆ యా వస్తువులకు ఉపాధులుగ చెప్పబడుచున్నవి. ఆ లింగములకు గూడ బుద్ధిచే రూపములను కల్పించుటచే లింగములు చేర్చుట జరుగును. స్త్రీత్వం, స్త్రీతా, స్త్రీభావః మొదలగు లింగాభిధాయకములగు భావ ప్రత్యయాంత శబ్దములు స్త్రీత్వాదుల లింగనియమమును బోధించును. అనగా 'స్త్రీ' అనునది స్త్రీలింగమును బోధించుచుండగా 'స్త్రీత్వం' అను 'త్వ' ప్రత్యయము ఆ స్త్రీలింగమునకు గల నపుంసకత్వ సంబంధమును, 'స్త్రీతా' అనునపుడు 'తా' అను ప్రత్యయము స్త్రీత్వయోగమును, 'స్త్రీభావః' అనునపుడు 'భావః' అనునది దాని పుంస్త్వయోగమును బోధించుచున్నవి. ఈ త్వతలాది ప్రత్యయములచే కలిగిన నపుంసకత్వ స్త్రీత్వాదులు శాబ్దములే కాని అర్థ సంబద్ధములు కావు.॥7॥

అవతారిక— అచేతన పదార్థముల లింగముల వ్యవస్థకై భాష్యకారుడు "అసత్తు మృగతృష్ణావత్" అని చెప్పియున్నాడు. దీనిని వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ యథా సలిల నిర్భాసా మృగతృష్ణాసు జాయతే ।
జలోపలబ్ధ్యనుగుణాద్ బీజాద్బుద్ధేర్జలే సతి ॥ 8

తథైవావ్యపదేశ్యేభ్యో హేతుభ్యస్తారకాదిషు ।
ముఖ్యేభ్య ఇవ లిఙ్గేభ్యో భేదా లోకే వ్యవస్థితాః ॥ 9

జలే = జలము, అసతి = లేకున్నను, జలోపలబ్ధ్యనుగుణాత్ = జలజ్ఞానమునకు అనుకూలమగు, బీజాత్ = ఉదకవాసనా లక్షణమగు బీజమువలన, మృగతృష్ణాసు = ఎండమావులయందు, యథా = ఏ విధముగా, సలిలనిర్భాసా = జలబుద్ధి, జాయతే = పుట్టుచున్నదో, తథైవ = అట్లే, అవ్యపదేశ్యేభ్యః = చెప్పశక్యము కాని, హేతుభ్యః = కారణములవలన, తారకాదిషు = తారకాదులయందు, ముఖ్యేభ్యః = ముఖ్యములగు, లిఙ్గేభ్య ఇవ = లింగములవలన వలె, లోకే = లోకమునందు, భేదాః = భేదములు, వ్యవస్థితాః = ఉన్నవి.

తాత్పర్యము— ఎండమావులలో జలము లేకున్నను జలజ్ఞానమునకు అనుగుణముగ నుండు జలవాసనారూపమగు కారణమువలన జలజ్ఞానము కలుగుచున్నది. అట్లే 'తారకా' మొదలగు పదములందు, చెప్పుటకు అలవికాని హేతువులచే, ముఖ్యములగు లింగముల వలన కలిగినట్లుగనే భేదములు లోకమున ప్రతీతి గోచరములగుచుండును.

వివరణము— ఎండమావులలో జలము లేదు. కాని దప్పికొన్న మృగాదుల మనస్సులో నున్న జలవాసనచే అచట జలమున్నట్లు కనబడుచుండును. అట్లే 'తారకా' స్త్రీ 'పుష్యః' (పుం), 'నక్షత్రం' (నపు) ఇత్యాద్యచేతన పదార్థములలో బాహ్యములగు లింగము లేవియు లేకున్నను, ప్రతి నియతములగు లింగములకు సంబంధించిన భేదములు కానవచ్చుచుండును. అనగా మృగతృష్ణికయందు లేనిజలమును ఆరోపించినట్లు తారకాదులందు గూడ లేని స్త్రీత్వాదికమును ఆరోపించి 'తారకా' ఇత్యాది స్త్రీలింగాదులు ప్రయోగింపబడుచున్నవి. ఇట్టి ఆరోపమునకు కారణమేదియో చెప్పజాలము. అది అనిర్వాచ్యము. మరుమరీచికాదులందు జలమును ఆరోపించుటకు సాదృశ్యాదులు కారణముగ నున్నవని చెప్పుటకైనను వీలున్నది. ఇచట అట్టి కారణము గూడ దురూహ్యమని యభిప్రాయము. కావుననే ఇట్టి స్థలములలో లింగారోపము గంధర్వ నగర కల్పన వంటిది ("గంధర్వ నగరం యథా" మ. భా.) అని కూడ భాష్యకారుడు చెప్పెను. (ఆకాశమునందు - తలక్రిందైన యొక నగరమున్నదనియు అది గంధర్వ విశిష్టమనియు, అదియే మేఘరూప విశేషముగ కన్పించుచున్నదనియు ఒక భ్రాంత విశ్వాసము). ॥9॥

అవతారిక— దీని తరువాత భాష్యకారుడు - 'ఆదిత్యగతివత్ సన్నా' "వస్త్రాన్తర్హితవచ్చతత్" అని కూడ వ్రాసినాడు. దీనిని వివరించుచున్నాడు.

శ్లో॥ వ్యక్తేషు వ్యక్తరూపాణాం స్తనాదీనాం తు దర్శనాత్ ।
అవ్యక్తవ్యఞ్జనా వ్యక్తేర్జాతిర్న పరికల్ప్యతే ॥ 10

వ్యక్తేషు = చేతనగతములగు లింగములయందు, వ్యక్తరూపాణాం = స్పష్టమైన రూపముగల, స్తనాదీనాం = లింగ వ్యంజకములగు స్తనాదులయొక్క, దర్శనాత్ = దర్శనమువలన, అవ్యక్తవ్యఞ్జనా = అస్పష్టములగు వ్యంజకములుగల, జాతిః = లింగజాతి, అవ్యక్తేః = స్పష్టముగ ప్రతీయము కాకుండుటచే, న పరికల్ప్యతే = కల్పింపబడదు.

తాత్పర్యము— చేతనగతములగు లింగముల విషయమున తద్వ్యంజకములగు స్తనకేశాదులు స్పష్టముగ కానవచ్చుచున్నవి. కాని ఖట్వాదులందు వ్యంజకములేవియు స్పష్టముగ కనబడకుండుటచే లింగజాతి ఉన్నదని చెప్పుటకు వీలులేదు.

వివరణము— చేతనములందు స్తనకేశాదులగు లింగ వ్యంజకములు స్పష్టముగ నున్నవిగాన అచట లింగములున్నట్లు చెప్పుటకు వీలు కలుగుచున్నది. కాని అచేతనములగు వృక్షాదులందు అట్టి వ్యంజకము లేవియు కానరాకున్నవి. అందుచే వృక్షాదులందు లింగజాతి లేదనియే చెప్పవలెను. - ఏ వస్తువైనను ఏదైన ప్రమాణముచే గ్రహింపబడినచో అది ఉన్నట్లు చెప్పుటకు అవకాశముండును. ఉదాహరణమునకు— సూర్యుని గమనము మన కంటికి కనబడకున్నను, ఒకచోట నున్న సూర్యుడు మరియొక చోట కనబడుటను బట్టి- సూర్యగమనమున్నట్లు చెప్పవచ్చును. బట్టతో కప్పిన ఒక వస్తువును దానిని తొలగించినపుడు చూడ

వీలున్నది గాన దాని స్థితిని గూడ అంగీకరింపవచ్చును. కాని వృక్షాదులందు మొదటినుండి చివరివరకును బాడితతో చెక్కినను స్తనకేశాద్యుపవ్యంజనములు కానవచ్చుట లేదు. అందుచే వృక్షాదులలో లింగజాతి వాస్తవమున లేదనియు, లేని లింగజాతియే శబ్ద శక్తిచే ప్రతీతి గోచరమగుచున్నదనియు తాత్పర్యము. ॥10॥

అవతారిక— వృక్షాదులలో వాస్తవమున లింగము లేదని పూర్వకారికలో చెప్ప బడినది. అట్లయినను వాటిలో గూడ లింగమున్నదని ఎవ్వరైన చెప్ప ప్రయత్నించినచో అది ప్రత్యక్ష విరుద్ధమని చెప్పుచున్నాడు.

శ్లో॥ అస్తిత్వం చ ప్రతిజ్ఞాయ సదాదర్శనమిచ్ఛతః ।
అత్యన్తాదర్శనే న స్యాదసత్త్వం ప్రతి నిశ్చయః ॥ 11

అస్తిత్వం = అస్తిత్వమును (ఉన్నది అని), ప్రతిజ్ఞాయ = అంగీకరించి, సదా = ఎల్లపుడును, అదర్శనం = కనబడకుండుటను, ఇచ్ఛతః = అంగీకరించువానికి, అత్యన్తాదర్శనే = అత్యంతము కనబడకున్నను, అసత్త్వం ప్రతి = అసత్త్వమును గూర్చి, నిశ్చయః = నిశ్చయము, నస్యాత్ = కలుగకుండ పోవును.

తాత్పర్యము— ఉన్నది అని అంగీకరించి, అది మాత్రము ఎన్నటికిని కనబడదు అని చెప్ప వానికి, ఒకి వస్తువు ఎప్పుడు కనబడకున్నను దాని అసత్త్వమును గూర్చి నిశ్చయ ముండ జాలదు.

విశేషము— ఖట్వా వృక్షాదులందు గూడ లింగము ఉన్నది అని అంగీకరించు వారు, అది ఏల కనబడుట లేదు అని అడుగగా వ్యంజకములు కనబడకుండుటచే అది కన బడుట లేదని చెప్పవలసి యుండును. అట్లు చెప్పుట యుక్తము కాదు. ఏదైన ఒక వస్తువు లేదు అని చెప్పగలుగుచున్నామన్నచో అందులకు కారణము ఆ వస్తువు ఎన్నడును కనబడ కుండుటయే. ఉదాహరణమునకు శశవిషాణము నెన్నడును చూడలేదు గాన అది అసలు లేదు అని నిశ్చితముగ చెప్పగలము. కాని - లింగము ఉన్నది కాని ఎన్నటికిని మాత్రము కనబడదు అనువాదమును అంగీకరించినచో, ఎన్నటికిని కనబడని ఈ శశవిషాణము గూడ లేదు అని నిశ్చయముగ చెప్ప వీలులేక పోవును. ఉన్నదికాని వ్యంజకములు కనబడకుండుటచే కన బడుట లేదు అని లింగముల విషయమున చెప్పినట్లు, ఉన్నదికాని ఇంద్రియ దౌర్బల్యముచే కనబడుట లేదు అని శశవిషాణము విషయమున గూడ చెప్పవచ్చును కదా ? కావున ప్రత్యక్ష విరోధముచే ఖట్వా వృక్షాదులందు లింగమును అంగీకరింపరాదు. ॥11॥

అవతారిక— ప్రకాశమును చూచి దానికి కారణమగు జ్యోతిస్సును ఊహించినట్లు ఖట్వాది శబ్దములలో లింగ కార్యములగు టాబాది ప్రత్యయములు వచ్చుటను చూచి, వాటి కారణమగు లింగమున్నట్లు అనుమానముచే తెలిసికొనవచ్చును అని ఆశంకించుకొని భాష్య కారుడు ''అన్యోన్య సంశ్రయంత్వేతత్'' అని సమాధానము చెప్పినాడు. దీనిని వ్యాఖ్యానించు చున్నాడు

శ్లో॥ న చాలమనుమానాయ శబ్దోఽదర్శనపూర్వకః ।
సిద్ధే హి దర్శనే కిం స్యాదనుమాన ప్రయోజనమ్ ॥ 12

అదర్శనపూర్వకః = లింగదర్శన పూర్వకము కాని, శబ్దః = శబ్దము, అనుమానాయ = అనుమానముచేయుటకు, అలం = సరిపడునది, న = కాదు, దర్శనే = దర్శనము, సిద్ధే = సిద్ధమైనచో, అనుమాన ప్రయోజనమ్ = అనుమానమునకు ప్రయోజనము, కిం = ఏది, స్యాత్ = ఉండును ?

తాత్పర్యము— లింగదర్శన పూర్వకము కాని శబ్దము అనుమానము చేయుటకు ఉపయోగింప జాలదు. దర్శనము సిద్ధమైనచో అనుమానముతో ప్రయోజనము లేదు.

వివరణము— శాస్త్రమున 'స్త్రియామ్' 'పుంసి' 'నపుంసకే' అను పదములచే, సిద్ధములగు అర్థములను అనువదించి ఆ యా కార్యములు విధింపబడుచుండును. 'స్త్రియామ్, అజాద్యతష్టాప్' అను సూత్రములచే స్త్రీలింగమున అదంతశబ్దముల కంటె టాప్ విధింప బడినది. ఈ టాప్ ప్రత్యయమును చేర్చుటకు పూర్వమే 'ఖట్వ' శబ్దమున స్త్రీలింగమున్నదని ప్రమాణాంతరముచే తెలిసియున్నచో, ఈ టాప్‌ను పట్టి స్త్రీత్వానుమానము చేయ పనిలేదు. అట్లుకాక (ప్రమాణాంతరముచే దానియందు స్త్రీలింగమున్నదని తెలియక) ఈ టాప్‌ను పట్టియే స్త్రీత్వానుమానమును చేయవలెనన్నచో అన్యోన్యాశ్రయ దోషము వచ్చును. స్త్రీత్వ మున్ననే కాని టాప్ రాదు, టాప్ వచ్చిన పిమ్మటగాని స్త్రీత్వమున్నట్లు తెలియదు. కావున లింగ కార్యమగు టాబాదిని బట్టి ఖట్వాదులందు లింగమున్నదని నిర్ణయించుట అయుక్తము. ॥12॥

అవతారిక— ఈ విధముగ లౌకిక లింగము అచేతనముల విషయమున అవ్యాప్తము గాన దాని పరిత్యజించి భాష్యకారుడు పారిభాషికమగు లింగమును అంగీకరించినాడు. దానిని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆవిర్భావస్తిరోభావః స్థితిశ్చేత్యనపాయినః ।
ధర్మా మూర్తిషు సర్వాసు లిఙ్గత్వేనానుదర్శితాః ॥ 13

సర్వాసు = సమస్తమైన, మూర్తిషు = పదార్థములయందు, ఆవిర్భావః = ఆవిర్భావము (కనబడుట), తిరోభావః = తిరోభావము (కనబడకుండ పోవుట), స్థితిశ్చ = స్థితియు, ఇతి = అని, అనపాయినః = తప్పనిసరిగ ఉండెడు, ధర్మాః = ధర్మములు, లిఙ్గత్వేన = లింగములుగా, అనుదర్శితాః = చూపబడినవి.

తాత్పర్యము— అన్ని పదార్థములయందును తప్పనిసరిగా ఉండెడు ఆవిర్భావము, తిరోభావము, స్థితి అనెడు ధర్మములు లింగములుగ చూపబడినవి.

విశేషాంశము— భాష్యకారుడు- "న శక్యం వైయాకరణైర్లౌకికం లిఙ్గమాశ్రయితుమ్. అవశ్యం కశ్చిత్ స్వకృతాన్త ఆస్థేయః" (వైయాకరణులు లౌకిక లింగమును లింగ

ముగ అంగీకరించుట కుదురదు. అందుచే తమ శాస్త్రమునకు మాత్రమే సంబంధించిన ఏదైన ఒక సిద్ధాంతమును ఆశ్రయించవలెను) అని చెప్పి- ''సంస్త్యానప్రసవౌ లిఙ్గ మాస్థేయౌ స్వకృతాన్తతః సంస్త్యానే స్త్యాయతేర్డ్రిట్ స్త్రీ సూతేః సప్ ప్రసవే పుమాన్'' అను కారికలో స్వసిద్ధాంతము ప్రకారము లింగ మనగా ఏదియో చెప్పినాడు. సంస్త్యానము స్త్రీలింగము, ప్రసవము పుంలింగము. 'స్త్యై శబ్ద సంఘాతయోః' అను ధాతువుకంటె, సంస్త్యానము అను నర్థమున 'డ్రట్' ప్రత్యయము చేయగా స్త్రీ అను రూపము నిష్పన్నమైనది. 'షూఙ్' ధాతువు కంటె 'డుమసున్' ప్రత్యయము సకారమునకు పకారాదేశము చేయగా 'పుంస్' శబ్దము నిష్పన్నమైనది అని యర్థము. 'పా' ధాతువునకే 'డుమసున్' ప్రత్యయము చేర్చుటచే 'పుంస్' శబ్దము నిష్పన్నమైనట్లు గూడ భాష్యకారాభిప్రాయమును చెప్పవచ్చునని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయము లోకములో స్త్రీ శబ్దమునకు - ''స్త్యాయతి సంహననమాపద్యతేఽస్యాంగర్భః ఇతి స్త్రీ'' అను వ్యుత్పత్తి ననుసరించి గర్భము ఎచట సంహననమును (శరీరము అను అర్థము కూడ గలదు) - సంఘటనమును పొందునో అట్టి సంస్త్యానాధారమగు ఆడుది అని యర్థము. శాస్త్రమున స్త్రీ శబ్దమునకు సంహననము అని యర్థము. సంస్త్యానము, సంహననము, ప్రతిలయము, తిరోభావము, అపచయము - ఇవన్నియు సమానార్థకములు. సత్త్వాది వికారములగు రూపాది గుణముల అపచయము - తగ్గుదల - అని యర్థము అట్లే పుంస్ శబ్దము షూ ధాతువు నుండి నిష్పన్నమైనదని అంగీకరించినచో 'సూతే ఇతి పుమాన్' అను వ్యుత్పత్తిచే ఉత్పత్తి చేయువాడు అనియు, పాధాతువునుండి నిష్పన్నమైనదని చెప్పినచో ''పాతీతి పుమాన్'' అను వ్యుత్పత్తి ననుసరించి సంతానమును పాలించువాడు గాన పుమాన్ అనియు లౌకికార్థము శాస్త్రమున 'పుమాన్' అను దానికి గుణముల ఆవిర్భావము అని యర్థము. ప్రసవము, ప్రవృత్తి, ఆవిర్భావము అనునవి సమానార్థకములు. ఈ విధముగ స్త్రీలింగ మనగా గుణ సంస్త్యానమనియు, పుంలింగమనగా గుణ ప్రసవమనియు అర్థము. ఇట్టి సంస్త్యాన ప్రసవములు అన్ని పదార్థములయందును ఉన్నవి గాన ఈ లక్షణమునకు అవ్యాప్తి లేదు. ఈ విషయమునే భాష్యకారుడు - ''సర్వాశ్చ పునర్మూర్తయ ఏవమాత్మికాః శబ్ద స్పర్శరూప రసగంధవత్యః'' అని చెప్పెను. ఈ లక్షణము అచేతన పదార్థములకు గూడ వర్తించును. ఈ దర్శనము ప్రకారము ఆకాశము గూడ సత్త్వరజస్తమోరూప గుణత్రయ వికారమగుటచే దానియందు గూడ గుణముల ఆవిర్భావతిరోభావముల ప్రతీతి కలుగుచుండును. చిద్రూపమగు ఆత్మ నిత్యమేయైనను దేహేంద్రియాదులతో సంబంధించి యుండుటచే దేహేంద్రియాదులకు సంబంధించిన గుణావిర్భావతిరోభావములు ఈ ఆత్మయందు గూడ ప్రతీయమానమగుటచే లింగ సంబంధము దానికి గూడ ఏర్పడుచున్నది. ఈ విధముగ సంస్త్యానము స్త్రీలింగమై, ప్రసవము పుంలింగమైనచో, ఉభయధర్మ సామాన్యరూపమగు స్థితి నపుంసకలింగము. పదార్థములన్నియు అనుక్షణమును పరిణామము నొందుచునే యుండును. అందుచే ప్రతి వస్తువునందును, ఆవిర్భావతిరోభావ స్థితులనెడు మూడు ధర్మములలో ఏదియో ఒకటి తప్పక ఉండి తీరును గాన 'అనపాయినః' అను విశేషణము ప్రయోగింపబడినది ॥18॥

అవతారిక— భావము లన్నియు గుణత్రయాత్మకములను విషయమును వివరించు చున్నాడు.

శ్లో॥ సర్వమూర్త్యాత్మభూతానాం శబ్దాదీనాం గుణే గుణే ।
త్రయః సత్త్వాదిధర్మాస్తే సర్వత్ర సమవస్థితాః ॥ 14

సర్వమూర్త్యాత్మభూతానాం = సమస్త వస్తువులకును ఆత్మయైన, శబ్దాదీనాం = శబ్దాదులలో, గుణే గుణే = ప్రతి గుణమునందును, త్రయః = మూడు, సత్త్వాది ధర్మాః = సత్త్వము మొదలగు ధర్మములున్నవి, తే = ఆ ధర్మములు, సర్వత్ర = అంతటను, సమవస్థితాః = ఉన్నవి.

తాత్పర్యము— సకల వస్తువులకును ఆత్మయగు శబ్దాది గుణము లన్నింటి యందును సత్త్వాది ధర్మము లున్నవి. అవి అన్ని పదార్థములందును ఉన్నవి.

విశేషాంశము— ''సర్వాశ్చ పునర్మూర్తయః ఏవమాత్మికాః శబ్దస్పర్శరూప రసగన్ధవత్యో యత్రాల్పీయాంసో గుణాస్తత్రాపరతస్త్రయః, రసగన్ధౌ న సర్వత్ర'' అని భాష్యకారుడు వస్తువులన్నియు శబ్దాది గుణాత్మకములని చెప్పియున్నాడు. ఆకాశము మొదలు పృథివి వరకును గల పదార్థములలో శబ్దాది గుణము లైదును ఒక్కొక్క గుణము చొప్పున పెరుగుచు, సముదాయ రూపమున ఉండును అనగా ఆకాశమునందు శబ్దమనెడు ఒక్క గుణము, వాయువునందు శబ్ద స్పర్శములు, అగ్నియందు శబ్ద స్పర్శరూపములు, జలము నందు శబ్ద స్పర్శరూప రసములు, పృథివియందు శబ్ద స్పర్శరూప రసగంధములును సంఘీ భావమును చెంది ఉండును. అందుచే వస్తువులన్నియు శబ్దాది గుణాత్మకములు. ద్రవ్యము వాస్తవమున గుణములకంటె భిన్నమేయైనను ఆ గుణములు ఆ ద్రవ్యముతో సమవాయ సంబంధముచే విడదీయరాని విధమున కలిసిపోవుటచే ఆ పదార్థము గుణాత్మకమని చెప్పబడు చున్నది.

పైన ఉదాహరించిన భాష్య వాక్యమునందలి మూర్తయః అను దానికి సంపిండిత స్వరూపములగు చక్షుర్గోచర పదార్థములని అర్థముగాన పృథివ్యప్తేజస్సులే అట్టి పదార్థములు. శబ్ద స్పర్శరూపము లనెడు మూడు గుణములును ఈ మూడు పదార్థములయందు తప్పక నుండును అందుచే 'తత్రాపరతస్త్రయః' అని చెప్పబడినది. అపరతః అనగా కనీసము అని అర్థము. తేజస్సునందు రసగంధములు లేవుగాన 'రసగన్ధౌ న సర్వత్ర' అని చెప్పబడినది.

శబ్దాది గుణములు సత్త్వరజస్తమోరూప గుణమయములు, అందుచే శబ్దము మొదలగు అన్ని గుణములందును సత్త్వాది గుణత్రయ ధర్మములు ఉన్నవి. వాటిలో ప్రస వము అనగా ఆవిర్భావము సత్త్వధర్మము. ప్రవృత్తి అనగా క్రియ రజోధర్మము. వరణము అనగా తిరోభావము తమోధర్మము. ఈ ధర్మములే లింగములు. ప్రకాశ వరణ రూపములగు సత్త్వ - తమోధర్మములతో అనుగతమగు, రజోధర్మమైన ప్రవృత్తి విశేషము పుంస్త్వము.

తిరోభావము స్త్రీత్వము. తమోబహులమగు సామాన్యరూపమైన ప్రవృత్తికి స్థితియని పేరు. అది నపుంసకము. ఈ లింగత్రయము అన్ని వస్తువులతోడను సంబంధింప వచ్చును.

సాంఖ్య మతానుసారము— జగత్తు అంతయు సుఖదుఃఖమోహాత్మకమగుటచే ఆ మూడింటికిని కారణ భూతములగు సత్త్వ - రజ - స్తమోగుణములు కల్పింపబడును. సత్త్వ రజస్తమోరూప త్రిగుణాత్మిక యగు మూల ప్రకృతి సర్వజగత్కారణము. ఈ ప్రకృతి మహచ్ఛబ్దవాచ్య బుద్ధిరూపమున పరిణమించును. మహత్తు అహంకార రూపమున పరిణమించును. అహంకారము గంధ - స్పర్శ - రూప - రస - గంధములనెడు పంచతన్మాత్రలుగను, పంచ జ్ఞానేంద్రియములుగను, పంచ కర్మేంద్రియములుగను మనస్సుగను పరిణతి చెందును. సత్త్వాది త్రిగుణాత్మకములగు శబ్దాది తన్మాత్రలు ఆకాశాది రూపమున పరిణామము చెందును ఆత్మ కేవల చైతన్యరూపము; పరిణామరహితము. ఈ విధముగ జగత్తులోని పదార్థములన్నియు త్రిగుణాత్మకము లగుటచే నిత్య పరిణామ శీలములు. సతత పరిణామ శీలములగు పదార్థము లన్నిటితోడను ఉపచయాపచయ స్థితిరూప లింగములు మూడును సంబంధించును. ॥14॥

అవతారిక— పూర్వ కారికలో చెప్పిన విధముగ రూపాది సముదాయాత్మకమగు వస్తువునకు ధర్మత్రయ సంబంధము ఉండవచ్చును. రూపము, రసము, శబ్దము మొదలగు గుణములకు తద్భిన్నములగు రూపాదులతో సంబంధము లేదుగాన వాటిలో ఆవిర్భావతిరోభావాదులు చెందునవేవియు ఉండవు. అట్టి పరిస్థితులలో 'రూప' మొదలగు శబ్దములకు గూడ లింగమును చేర్చి 'రూపమ్' 'రసః' 'శబ్దః' ఇత్యాది ప్రయోగములు ఎట్లు చేయబడుచున్నవి అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ రూపస్య చాత్మమాత్రాణాం శుక్లాదీనాం ప్రతిక్షణమ్ ।
కాచిత్ ప్రలీయతే కాచిత్కథఞ్చిదభివర్ధతే ॥ 15

రూపస్య = రూపము యొక్క, శుక్లాదీనాం = శుక్లము (తెలుపు) మొదలగు, ఆత్మమాత్రాణాం = అవస్థా విశేషములలో, ప్రతిక్షణం = ప్రతిక్షణమునందును, కాచిత్ = ఒకానొక అవస్థ, ప్రలీయతే = తిరోభావమును చెందును, కాచిత్ = ఒకానొక అవస్థ, కథఞ్చిత్ = ఏదియో విధముగ,- అభివర్ధతే = వృద్ధి పొందును.

తాత్పర్యము— రూపమునకు సంబంధించిన శుక్లాద్యవస్థలలో ప్రతి క్షణమునందును, ఒక-అవస్థ తిరోహితమగుచుండును, మరియొకటి ఎటులనో వృద్ధిచెందుచుండును.

వివరణము— శబ్దాది గుణములకు గూడ సత్త్వాది గుణములతో సంబంధముండునని చెప్పబడినది. కావున ఆ గుణములలో గూడ ఎల్లప్పుడును పరిణామము కలుగుచుండును. ఉదాహరణమునకు రూపమునకు సంబంధించిన శుక్లాద్యవస్థలలో కొన్ని క్రొత్తగ ఆవిర్భవించుచుండును. కొన్ని మరుగుపడుచుండును, కొన్ని ఒక విధమగు వృద్ధి చెందుచుండును. ఇట్టి

పరిణామములు ఎల్లప్పుడును జరుగుచున్నను అతిసూక్ష్మము లగుటచే స్థూల దృష్టికి కనబడవు. ఉదాహరణమునకు ఈ రోజున ఒక వర్ణముతోనున్న ఫలాదులలో మరునాడు మరియొక వర్ణము కలుగుచున్నది. ఈ మార్పు ఒక్క క్షణములో వచ్చునది కాదు. క్షణ క్షణమునను క్రమముగ వచ్చినది. దీనినిబట్టి గుణములందు కూడ ప్రతి క్షణ పరిణామమున్నదని ఊహింపబడుచున్నది. ॥15॥

అవతారిక— ఈ విషయమున భాష్యకార సమ్మతిని గూడ చూపుచున్నాడు.

శ్లో॥ క్వథితోదకవచ్చైషామనవస్థితవృత్తితా ।
అజస్రం సర్వభావానాం భాష్య ఏవోపవర్ణితా ॥ 16

ఏషాం = ఈ, సర్వభావానాం = సర్వ పదార్థములకును, అజస్రం = ఎల్లప్పుడును, క్వథితోదకవత్ = మరుగుచున్న నీటివలె, అనవస్థితవృత్తితా = నిలుకడలేకుండుట, భాష్యే + ఏవ = భాష్యమునందే, ఉపవర్ణితా = వర్ణింపబడినది

తాత్పర్యము— పదార్థము లన్నియు, మరుగుచున్న నీటివలె, క్షణకాలమైనను స్థిరముగ నుండజాలవని భాష్యమునందే వర్ణింపబడినది.

వివరణము— ఈ విధముగ అన్ని పదార్థములందును ఆవిర్భావతిరోభావములు వ్యాపకములుగ నున్నవి గాన స్త్రీ పుంసలింగ సంబంధముండునని తాత్పర్యము. ॥16॥

అవతారిక— పదార్థములన్నియు ఎల్లప్పుడును నిలకడ లేకుండ ఉండునని చెప్పినచో వాటికి స్థితి యనునది లేదుగాన, స్థితి నపుంసకలింగమని ఎట్లు చెప్పబడినది అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రవృత్తే రేకరూపత్వం సామ్యం వా స్థితిరుచ్యతే ।
ఆవిర్భావతిరోభావ ప్రవృత్త్యా వావతిష్ఠతే ॥ 17

ప్రవృత్తేః = ప్రవృత్తియొక్క, ఏకరూపత్వం = ఏకరూపత్వముగాని, సామ్యం వా = సామ్యము గాని, స్థితిరితి = స్థితియని, ఉచ్యతే = చెప్పబడుచున్నది, వా = లేక, ఆవిర్భావతిరోభావ ప్రవృత్త్యా = ఆవిర్భావతిరోభావముల నిరంతర ప్రవృత్తిచేత, అవతిష్ఠతే = స్థితి ఏర్పడుచున్నది.

తాత్పర్యము— ప్రవృత్తి యొక్క ఏకరూపత్వముగాని, సామ్యముగాని స్థితియని చెప్పబడుచున్నది. లేదా ఆవిర్భావతిరోభావముల ప్రవృత్తిచే స్థితి ఏర్పడుచున్నది.

వివరణము— స్థితి విషయమున మూడు పద్ధతులు చెప్పబడుచున్నవి. పదార్థములకు ఉపచయము, అపచయము అనెడు రెండు అవస్థ లున్నవి. క్షణ క్షణమునందును ఉపచయమే కలిగినను లేదా అపచయమే కలిగినను, ఆ ఉపచయ ప్రవాహమంతయు గాని

అపచయ ప్రవాహమంతయుగాని ఒక్కటే యని భావించుటచే అది స్థితియని చెప్పబడు చున్నది. ఇది మొదటి స్థితి పద్ధతి ప్రతి క్షణమునందును వేరు వేరగు ఉపచయాపచయముల ప్రవాహము ఏర్పడినను, అనగా ఒక క్షణమున వృద్ధిరూప పరిణామము, మరుక్షణమున అపాయరూప పరిణామము, ఈ విధముగ భిన్న ప్రవాహము లున్నను ఆ రెండు విధములగు పరిణామములందును ప్రవృత్తి యనునది మాత్రము తుల్యముగ నుండుటచే ఆ సామ్యమునకే స్థితియని పేరు. ఇది రెండవ స్థితి ప్రకారము ఆవిర్భావతిరోభావములు నిరంతరము జరుగు చున్నపుడు ఒక కల మరుగుపడిన వెనువెంటనే మరియొక కల ఆవిర్భవించుటచే తిరోధానము ప్రతీతి విషయము కాక స్థితియే గోచరించుచుండును. ఇది మూడవ ప్రకారము. ఈ విధముగ గుణములు సర్వదా పరిణామమును చెందుచున్నను అధ్యవసాయముచే స్థితి కల్పింపబడు చున్నది ॥17॥

అవతారిక— స్థితి అధ్యవసాయముచే ఏర్పడినది కాదు; వాస్తవమైనదేయని మతాంతరమును చెప్పుచున్నాడు.

శ్లో॥ గుణా ఇత్యేవ బుద్ధేర్వా నిమిత్తత్వం స్థితిర్మతా ।
స్థితేశ్చ సర్వలిఙ్గానాం సర్వనామత్వముచ్యతే ॥ 18

వా = లేక, గుణాః ఇత్యేవ = గుణములు అని, బుద్ధేః = బుద్ధికి, నిమిత్తత్వం = నిమిత్త మగుట, స్థితిః = స్థితియని, మతా = చెప్పబడినది, స్థితేః = స్థితి (నపుంసక లింగము), సర్వ లిఙ్గానాం = అన్ని లింగములకును, సర్వనామత్వం = సర్వనామము వంటిదని, ఉచ్యతే చెప్పబడుచున్నది.

తాత్పర్యము— 'గుణములు' అనెడు బుద్ధికి నిమిత్తముగా నుండుట స్థితియని చెప్పబడుచున్నది. స్థితి, అనగా నపుంసక లింగము, సర్వ లింగములకును సర్వనామము వంటిదని చెప్పబడుచున్నది.

విశేషాంశములు— సత్త్వ రజస్తమోగుణములు ప్రపంచాకారమున పరిణతము లైనను వాటి స్వభావములు మాత్రము వేరు వేరుగ కనబడుచునే యుండును. కావుననే పదార్థ ములలోని ప్రతి అంశమునందును సత్త్వాది గుణములకు చెందిన ప్రకాశము, ప్రవృత్తి, నియ మము అను ధర్మములు అనువర్తించుచునే యుండును. ఈ విధముగ గుణధర్మము లన్నియు అన్ని అవస్థలయందును అనువర్తించుచుండుటచే 'ఇవి గుణములు' అను సామాన్య ప్రతీతి కలుగుచుండును. ఇట్టి ప్రతీతికి నిమిత్తమైనది స్థితి. విశేషము లన్నియు సామాన్యమునందు అంతర్గతము లగును. అందుచే సామాన్యరూపమగు స్థితియందు ఆవిర్భావతిరోభావములు గూడ అంతర్గతము లగును కావున స్థితిరూపమగు నపుంసకలింగము స్త్రీత్వాది లింగ భేదము నకు సర్వనామము వంటిది. 'తత్' 'ఏతద్' మొదలగు సర్వనామము వస్తు మాత్రమును పరామర్శించును గాన అన్ని వస్తువుల విషయమునను అవ్యాహతముగ ప్రయోగింపబడు చుండును. అట్లే నపుంసకలింగము గూడ, విశేష వివక్ష లేనపుడు, అన్ని లింగములను గూడ

పరామర్శించును. కావుననే గుణమును గూర్చి సందేహము కలిగినపుడు 'కిం జాతమ్' (ఏది పుట్టినది) ఇత్యాది విధమున (ఆ పుట్టినది స్త్రీత్వయుక్తమైనను పుంస్త్వయుక్తమైనను) నపుంసక లింగము ప్రయోగింపబడును. అందుచే నామవాచకములకు సర్వనామమెట్లో, లింగములకు నపుంసక లింగ మట్టిది. ॥18॥

అవతారిక— ఈ విధముగ గుణావస్థ లింగమని నిర్ణయము చేయబడినది. అట్టి లింగము అన్నింటి విషయముననను ఉండవచ్చును గాన ఇచట ఈ లింగమే యని వ్యవస్థ చేయుట ఎట్లు అని ఆశంకించుకొని భాష్యకారుడు వివక్ష ననుసరించి వ్యవస్థ చేసికొనవలెను అని సమాధానము చెప్పినాడు. ఆ విషయమును విశదీకరించుచున్నాడు

శ్లో॥ స్థితేషు సర్వలిఙ్గేషు వివక్షా నియమాశ్రయః ।
కస్య చిచ్ఛబ్ద సంస్కారే వ్యాపారః క్వచిదిష్యతే ॥ 19

సర్వలింగేషు = సమస్తములగు లింగములును, స్థితేషు = ఉన్నను, వివక్షా నియమాశ్రయః = వివక్షా రూపమగు నియమమును ఆశ్రయించినదై, క్వచిత్ = ఒకానొక స్థలమునందు, శబ్ద సంస్కారే = శబ్ద సంస్కారము విషయమున, కస్యచిత్ = ఒకానొక లింగము యొక్క, వ్యాపారః - ప్రవృత్తి - ఇష్యతే = అంగీకరింప బడుచున్నది.

తాత్పర్యము— అన్ని లింగములు ఉన్నను, శబ్ద సంస్కారమును చేయవలసి యున్నపుడు, ఒక్కచోట, వివక్షను అనుసరించి, ఒక్క లింగమే ప్రవర్తించునని అంగీకరింప బడును.

విశేషాంశములు— పదార్థము లన్నియు సత్త్వ రజస్తమో వికారములగుటచే వాటి యన్నింటి యందును ఆవిర్భావతిరోభావాది రూపములగు మూడు లింగములును ప్రవర్తించుటకు అవకాశమున్నది. ఐనను, వివక్షను బట్టి ఒక శబ్దమునకు సంస్కారము చేయవలసి వచ్చినపుడు ఒక లింగము మాత్రమే ప్రవర్తించునని అంగీకరింపవలసి యున్నది. అనగా అర్థమునకు అన్ని లింగములును ఉపాధులుగ నుండుటకు వీలున్నను శక్తి ననుసరించి, ఒక శబ్దము ఏదియో ఒక నియతమగు లింగము ఉపాధిగ గల అర్థమునే బోధించును. దానిని నిర్ణయించుటకు ప్రయోగమే ఆధారము.

అవతారిక— ఈ విషయమును దృష్టాంతముతో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ సన్నిధానే నిమిత్తానాం కిఞ్చిదేవ ప్రవర్తకమ్ ।
యథా తక్షాది శబ్దానాం లిఙ్గేషు నియమస్తథా ॥ 20

నిమిత్తానాం = అనేక నిమిత్తముల, సన్నిధానే = సన్నిధానమున్నను, యథా = ఏ విధముగా, తక్షాది శబ్దానాం = 'తక్ష' మొదలగు శబ్దములకు, కిఞ్చిదేవ = ఏదియో ఒకానొక నిమిత్తమే, ప్రవర్తకం = ప్రవర్తకమో, తథా = అట్లే, లిఙ్గేషు = లింగముల విషయమున, నియమః = నియమము.

తాత్పర్యము— ఎన్నియో నిమిత్తము లున్నను, తక్షాది శబ్దములు ఏదియో ఒక నిమిత్తమును బట్టియే ప్రవర్తించినట్లు లింగములు గూడ ఒక నిమిత్తమును బట్టి నియతము లుగ నుండును.

వివరణము— వడ్రంగి తక్షణము (కఱ్ఱ చెక్కుట) ఛేదనము (కోయుట మొదలగు ఎన్నియో పనులు చేయును. అయినను తక్షణమను ఒక నిమిత్తమును బట్టి అతని విషయమున 'తక్షా' అను శబ్దము ప్రయోగింపబడుచున్నది కుమ్మరి కుండలు, మూకుళ్ళు మొదలగు అనేక వస్తువులను తయారుచేసినను అతనికి 'కుంభకారః' అనియే పేరు. అట్లే ఒక అర్థమునందు మూడు లింగములును ఉపాధులుగ నున్నను వాటిలో ఏదియో ఒక్క ఉపాధినే ఆధారముగ చేసికొని శబ్దము ఒకానొక నియతలింగమున ప్రయుక్తమగుచుండును. ॥20॥

అవతారిక — ఈ శబ్దము ఈ లింగమును ద్యోతింపచేయును అను విషయమును లోకప్రసిద్ధిని పట్టి నిర్ణయింపవలెనని "తస్యోక్తౌ లోకతోనామ" అని భాష్యమున చెప్పబడినది. ఇచట లోకమనగా ఇష్టము వచ్చిన వారిని గ్రహింపరాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ భావతత్త్వదృశః శిష్టాః శబ్దార్థేషు వ్యవస్థితమ్ ।
యద్యద్ధర్మేఽఙ్గతామేతి లిఙ్గం తత్తత్ ప్రచక్షతే ॥ 21

భావతత్త్వదృశః = వస్తువుల తత్త్వమును చూడగల్గిన, శిష్టాః = శిష్టులు, శబ్దార్థేషు = శబ్దార్థములయందు, వ్యవస్థితం = వ్యవస్థితమైయున్న, యద్యత్ = ఏ యే లింగము, ధర్మే = ధర్మమునందు, అంగతాం = అంగత్వమును, ఏతి = పొందుచున్నదో, తత్తత్ = ఆ యా లింగం = లింగమును, ప్రచక్షతే = చెప్పుచున్నారు.

తాత్పర్యము— పదార్థ తత్త్వమును చూడకలిగిన శిష్టులు శబ్దముల అర్థములకు సంబంధించిన ఏ యే లింగము ధర్మమునకు అంగముగ నుండునో దానినే ఒక శబ్దముచే ద్యోత్యమగు లింగమునుగా చెప్పుచున్నారు.

వివరణము— పదార్థముల యథార్థ స్వరూపమును కొందరు శిష్టులు మాత్రమే చూడకలుగుచున్నారు. వారు అర్థములకు సంబంధించిన ఏ లింగము ధర్మమునకు సాధనముగ నుండునని భావించుచున్నారో దానినే ఒక శబ్దమునకు లింగమునుగా అంగీకరించుచున్నారు. పదార్థములన్నియు అన్ని లింగములతోడను సంబంధించి యుండవచ్చును. కాని ఈ శబ్దము ఈ అర్థమునందు ఈ లింగమును మాత్రమే ద్యోతింపచేయును. కావున దానిని ఆ లింగమునందు ప్రయోగించిననే ధర్మమునకు, అనగా అభ్యుదయమునకు, సాధనమగును అని శిష్టులు చెప్పుచున్నారు గాన ఆ శబ్దమును ఆ లింగమునందే ప్రయోగింపవలెను. శిష్టలోక ప్రసిద్ధిని బట్టియే లింగ నిర్ణయము జరుగును గాన లింగమును శాస్త్రముతో విధింప బనిలేదని కూడ ("లిఙ్గమశిష్యం లోకాశ్రయత్వా ల్లిఙ్గస్య") భాష్యకారుడు చెప్పియున్నాడు.

అవతారిక— ఈ విషయమునే దృష్టాంతముతో సమర్థించుచున్నాడు.

శ్లో॥ స్వరభేదాద్యథా శబ్దాః సాధవో విషయాన్తరే ।
లిఙ్గ భేదాత్తథా సిద్ధాత్ సాధుత్వ మనుగమ్యతే ॥ 22

శబ్దాః = శబ్దములు, స్వరభేదాత్ = స్వర భేదమువలన, యథా = ఏ విధముగ, విషయాన్తరే = విషయ విశేషమునందు, సాధవః = సాధువులో, తథా = అట్లే, సిద్ధాత్ = శిష్ట ప్రయోగ సిద్ధమగు, లిఙ్గభేదాత్ = లింగ భేదమువలన, సాధుత్వం = సాధుత్వము, అనుగమ్యతే = వ్యవహారమున అనుసరింపబడుచున్నది

తాత్పర్యము— శబ్దములు స్వరభేదమును బట్టి ఏ విధముగ ఆ యా యర్థము లందు సాధువులో, అట్లే శిష్ట ప్రయోగసిద్ధమగు లింగభేదమును బట్టి సాధుత్వము అనుసరింప బడుచున్నది.

విశేషాంశము— సూక్ష్మరూపము లగు ఉదాత్తాది స్వరములు భేదించిన శబ్దములు వేరు వేరు అర్థములందు మాత్రమే సాధువులని చెప్పబడుచున్నవి. ఉదాహరణమునకు— ''అక్ష'' శబ్దము ఆద్యుదాత్తమైనచో పాచికకంటె భిన్నమగు 'ఇరుసు' మొదలగు అర్థమును బోధించును. అంతోదాత్తమైనచో 'పాచిక' అను నర్థమును బోధించును. అనగా 'ఇరుసు' అను నర్థమున ఆద్యుదాత్తమగు అక్ష శబ్దమే సాధువు. పాచిక అను నర్థమున అంతోదాత్త మగు అక్ష శబ్దమే సాధువు. అట్లే ఒక లింగము గల శబ్దము ఒక అర్థవిశేషమును బోధించు నపుడే సాధువు , అర్థాంతరమున అసాధువు. ఉదా— 'అర్థ' శబ్దము 'సగము భాగము' అను నర్థమునందు నపుంసకలింగము ; ఒక అంశము అను నర్థమున పుంలింగము. 'సార' శబ్దము 'న్యాయవిరుద్ధము కానిది' అను నర్థమున నపుంసకలింగము. 'నైతత్ సారమ్' ఇత్యాదు లుదాహరణము. 'చందన సారః' ఇత్యాదులలో ఉత్కర్షార్థమున పుంలింగము. ॥22॥

అవతారిక— శిష్ట ప్రసిద్ధమగు స్వరసంస్కార నియమమునే శాస్త్రము కూడ బోధించుచున్నట్లు శిష్టవ్యవహార సిద్ధమగు లింగనియమమును గూడ శాస్త్రము బోధించ వచ్చును కదా. ''లింగమశిష్యం లోకాశ్రయత్వాల్లిఙ్గస్య'' అని లింగశాసనము ఏల నిషేధింప బడినది అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రయోగో విప్రయోగశ్చ లోకే యత్రోపలభ్యతే ।
శాస్త్రమారభ్యతే తత్ర న ప్రయోగావిపర్యయే ॥ 23

యత్ర = దేని విషయమున, ప్రయోగః = సాధు ప్రయోగము, విప్రయోగశ్చ = విపరీత ప్రయోగము గూడ, లోకే = లోకమునందు, ఉపలభ్యతే = కనబడుచున్నదో, తత్ర = దాని విషయమున శాస్త్రం = శాస్త్రము, ఆరభ్యతే = ఆరంభింపబడుచున్నది, ప్రయోగావిపర్యయే = విపరీత ప్రయోగము లేనపుడు, న = శాస్త్రము ప్రారంభింపబడుట లేదు.

తాత్పర్యము— దేని విషయమున, లోకములో, సాధు ప్రయోగములును, అసాధు ప్రయోగములును గూడ ఉన్నవో దాని విషయమున శాస్త్రము చెప్పబడుచున్నది విపరీత ప్రయోగములు లేనిదాని విషయమున శాస్త్రారంభము అనావశ్యకము.

వివరణము— 'అక్షిణి మేదర్శనీయాని' 'పాదాః మే సుకుమారతరాః' ఇత్యాది వాక్యములలో బహుత్వము లేకపోయినను, విపరీతముగ బహువచనమును ప్రయోగించుట లోకములో కలదు. అందుచే తన్నివారణార్థమై ''బహుషు బహువచనమ్'' ఇత్యాది శాస్త్రారంభము చేయుట ఆవశ్యకము లోకములో విపరీత ప్రయోగము లేనివాటి విషయమున శాస్త్రము చెప్పుట ఎందులకు? కావుననే ఉపసర్గలను ధాతువునకు పూర్వము ప్రయోగింపవలెను అని విధించు ''తే ప్రాగ్ధాతోః'' అను సూత్రము (1-4-79), సమాసములో ఉపసర్జన సంజ్ఞికము పూర్వపదముగ ప్రయోగింపబడును అని బోధించు ''ఉపసర్జనం పూర్వమ్'' అను సూత్రమును, అనిష్ట ప్రయోగము లేవియు లేవుగాన అనావశ్యకములని వార్తికకారునిచే ప్రత్యాఖ్యాతములైనవి ఇట్లే లింగము విషయమునందును ప్రత్యాఖ్యానము చేయబడినది ॥23॥

అవతారిక— శబ్దములు నియతమగు వస్తుధర్మమును బోధించును శిష్ట ప్రయోగానుసారముగా, తమ శక్తినిబట్టి శబ్దములు నియతలింగము లగుచుండును అని చెప్పుటచే ప్రధానముగ లింగము వస్తు ధర్మమనియు, తద్ద్వారా తద్బోధక శబ్ద ధర్మమనియు చెప్పినట్లైనది. కావుననే ''ఏకార్థే శబ్దాన్యత్వాత్ దృష్టం లింగాన్యత్వమ్; అవయవాన్యత్వాచ్చ'' అని వార్తికము (4-1-92) చెప్పుచున్నది. అనగా అర్థము ఒక్కటే యైనను, దానికి మూడు లింగములతోడను సంబంధమున్నను, శబ్దభేదమును బట్టి లింగభేదము కానవచ్చుచున్నది ఉదాహరణమునకు ఏకార్థకబోధకములగు 'పుష్యః' 'నక్షత్రం' 'తారా' అను పదములలో శబ్ద భేదమును బట్టి, లింగ భేదము కనబడుచున్నది. శబ్ద భేదమే కాదు, శబ్దావయవములు వేరైనను, కుటీ - కుటీరః, శమీ - శమీరః, శుణ్డా - శుణ్డారః, ఇత్యాదులలో లింగభేదము కనబడుచున్నది - అని ఈ వార్తికమున కర్థము. ఇది యంతయు సత్త్వాది గుణముల అవస్థయే లింగము అను పక్షమున ఎట్లు ఉపపన్నమగును అని ఆశంకించుకొని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉపాధి భేదాదర్థేషు గుణధర్మస్య కస్యచిత్ ।
నిమిత్తభావః సాధుత్వే వివక్షా చ వ్యవస్థితా ॥ 24

అర్థేషు = వస్తువులయందు అవచ్ఛేదకముగ నున్న, కస్యచిత్ = ఒకానొక, గుణధర్మస్య = సత్త్వాది గుణ వికారములగు శబ్దాది గుణముల ధర్మమగు లింగమునకు, సాధుత్వే = శబ్ద సాధుత్వవిషయమున, ఉపాధి భేదాత్ = ఉపాధి భేదమునుబట్టి, నిమిత్త భావః = నిమిత్తత్వము ఉండును, వివక్షా = ప్రతి శబ్దముయొక్క లింగమునకు సంబంధించిన వివక్ష కూడ, వ్యవస్థితా = నియతముగ నుండును

తాత్పర్యము— వస్తువులతో సంబంధించిన గుణధర్మ రూపములగు మూడు లింగములలో ఒక లింగము మాత్రమే ఉపాధిభేదమును బట్టి శబ్ద సాధుత్వమున నిమిత్తముగ

నుండును. ఈ విధముగ వివక్షానుసారముగ శబ్దములయందు లింగ వ్యవస్థ యేర్పడు చున్నది

వివరణము— లింగము సత్త్వాది గుణత్రయ పరిణామ రూపములగు శబ్దాదుల ధర్మము. సత్త్వాదిగుణములు అతిసూక్ష్మము లగుటచే వ్యవహార యోగ్యములు కావు. వాటి పరిణామ రూపములగు రూపాదుల ఆవిర్భావతిరోభావాద్యవస్థలే లింగములని భాష్యమున చెప్పబడినది. వస్తువులలోనున్న ఈ లింగములలో ఏదియో యొక లింగమును ఆశ్రయించి శబ్దాన్వాఖ్యానము చేయబడుచుండును. వస్తువులతో సంబంధించిన మహత్త్వాద్యుపాధి భేద మును బట్టి, (చూ. కా. 25) మూడు లింగములలో ఒకదానిని మాత్రమే గ్రహించుట జరుగు చున్నది. ఈ విధముగ లింగములు సహజముగ సత్త్వాది గుణధర్మములే యైనను అవియే వస్తుగతములుగను, శబ్దగతములుగను భాసించుటలో విరోధమేదియును లేదని తాత్పర్యము. ॥24॥

అవతారిక— ఈ విషయమున నిదర్శనమును చూపుచున్నాడు

**శ్లో॥ హిమారణ్యే మహత్త్వేన యుక్తే స్త్రీత్వమవస్థితమ్ ।
హ్రస్వోపాధివిశిష్టాయాః కుట్యాః ప్రసవయోగ్యతా ॥ 25**

మహత్త్వేన = మహత్త్వముతో, యుక్తే = కూడిన, హిమారణ్యే = 'హిమ' 'అరణ్య'ముల యందు, స్త్రీత్వం = సంస్త్యానము, అవస్థితమ్ = ఉన్నది, హ్రస్వోపాధి విశిష్టాయాః = హ్రస్వరూపోపాధి విశిష్టమగు, కుట్యాః = 'కుటీ' అను దానికి, ప్రసవయోగితా = ప్రసవముతో (పుంస్త్వముతో) సంబంధము.

తాత్పర్యము— హిమ - అరణ్యములు మహత్త్వమనెడు ఉపాధితో కూడినపుడు సంస్త్యానమును (స్త్రీత్వమును) పొందుచున్నవి. కుటి, హ్రస్వత్వ రూపోపాధితో కూడినపుడు ప్రసవముతో (పుంస్త్వముతో) సంబంధించుచున్నది

వివరణము— 'హిమ' శబ్దము నపుంసక లింగమున నున్నది. కాని 'మహత్ హిమం' అను నర్థమున, మహత్త్వము ఉపాధిగ నున్నపుడు హిమము సంస్త్యానరూపమగు స్త్రీత్వమును పొందుచున్నది ఆ సంస్త్యానమును బోధించుటచే హిమ శబ్దము స్త్రీ లింగము నందు ప్రయుక్తమై 'హిమానీ' అగుచున్నది అట్లే 'అరణ్య' శబ్దము మహత్త్వోపాధి సంసర్గ ముచే సంస్త్యానమును పొందుటచే 'అరణ్యానీ' అను స్త్రీలింగ శబ్దముగ ప్రయోగింపబడు చున్నది. ''మహదరణ్యం అరణ్యానీ'' 'హిమారణ్య యోర్మహత్త్వే' అని వార్తికము. అట్లే కుటీ శబ్దము హ్రస్వత్వోపాధి సంసర్గముచే ప్రసవరూప ధర్మమును పొంది 'కుటీరః' అని, ప్రసవరూప పుంలింగమున ప్రయుక్తమగుచున్నది. 'హ్రస్వాకుటీ కుటీరః' అని యర్థము. ఈ విధముగ కొన్ని వస్తువులు మహత్త్వాద్యుపాధి భేదముచే సంస్త్యానాదులతో సంబంధించు చుండును. తద్ద్యోతకముగ శబ్దము స్త్రీ లింగాదులందు ప్రయుక్తమగును అని భావము. ॥25॥

అవతారిక— ఉపాధి భేదమాత్రముచే అదే శబ్దము లింగాంతరముతో ఎట్లు సంబంధించును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ శబ్దాన్తరాణాం భిన్నేఽర్థ ఉపాయాః ప్రతిపత్తయే ।
ఏకతామివ నిశ్చిత్య లఘ్వర్థ ముపదర్శితాః ॥ 26

ఏకతాం = హిమాది శబ్దములలో నున్న ఒక సామాన్య ధర్మమును, నిశ్చిత్యేవ = నిశ్చయించుట వల్లనే, భిన్నే అర్థే = భిన్నార్థ విషయకములగు, శబ్దాన్తరాణాం = శబ్దాన్తరముల, ప్రతిపత్తయే = జ్ఞానము కొరకు, లఘ్వర్థం = లాఘవము కొరకై, ఉపాయాః = ఉపాయములు, ప్రదర్శితాః = చూపబడినవి.

తాత్పర్యము— హిమాది శబ్దములలోనున్న సామాన్య ధర్మమును గ్రహించి, భిన్నార్థ బోధకములగు ఇతర శబ్దముల జ్ఞానము కొరకై, లాఘవము కొరకు, ఉపాయములు చూపబడుచున్నవి

వివరణము— వాస్తవమున 'హిమ' శబ్దము ఉపాధి భేదము ననుసరించి మరియొక లింగముతో సంబంధించుట యనునది లేదు. అనగా 'హిమ' శబ్దము 'హిమానీ' యని మారుట అనునది లేదు. 'హిమ' శబ్దము వేరు 'హిమానీ' శబ్దము వేరు. కాని 'హిమ' 'హిమానీ' శబ్దములలో నున్న ఏదియో ఒక (మంచు అనెడు అర్థమును బోధించుట మొదలగు) సాధారణ ధర్మమును పురస్కరించుకొని లాఘవము నిమిత్తమై 'హిమ' శబ్దమే మహత్త్వార్థమున 'హిమానీ' యగును ఇత్యాది విధమున అన్వాఖ్యానము చేయబడుచున్నది. ''యావదయం సామాన్యేన శక్నోత్యుపదేష్టుం తత్తావదయముపదిశతి'' అని భాష్యకారులు చెప్పినట్లు ఒక్కొక్క శబ్దములో నున్న ఒక్కొక్క విశేషమును పురస్కరించుకొని శబ్దముల నన్నింటిని వ్యాకరింప ప్రయత్నించినచో గౌరవము గాన, లాఘవము నిమిత్తమై, శబ్ద శాస్త్రమున సామాన్య ధర్మమును పురస్కరించుకొని అన్వాఖ్యానము చేయబడుచుండును. కావున ప్రతి నియతలింగము గల 'హిమమ్' అను శబ్దము వేరు, అట్లే ప్రతి నియత స్త్రీలింగము గల 'హిమానీ' శబ్దము వేరు. అందుచే పూర్వోక్తమగు ఆ శంకకు తావు లేదు అని భావము.

ఈ విధముగ గుణావస్థా రూపమగు లింగత్రయము అన్ని వస్తువులయందును ఉండవచ్చుననియు, కాని ఒక వస్తువును బోధించుటకై ప్రయుక్తమగు ఒక శబ్దమునకు ఆ వస్తువునకు సంబంధించిన ఒక అవస్థను (లింగమును) మాత్రమే వ్యక్తీకరించెడు శక్తి యుండుటచే ఆ శబ్దము ఆ ఒక్క లింగమునందు మాత్రమే ప్రయుక్తమగు చుండుననియు, అదే అర్థమును బోధించుటకై ప్రయుక్తమగు మరియొక శబ్దము ఆ అర్థముతో సంబంధించిన మరియొక లింగమును వ్యక్తీకరింప సమర్థమగుటచే ఆ శబ్దము ఆ లింగముతో సంబంధించుననియు చెప్పబడినది. ఈ లింగము శిష్ట వ్యవహారసిద్ధమగుటచే మరల దానిని అనుశాసింపబనిలేదని కూడ చెప్పబడినది. ॥26॥

అవతారిక— ఇపుడు సంస్త్యాన - ప్రసవాదుల విషయమున మతాంతరమును చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉత్పత్తి ప్రసవోఽన్యేషాం నాశః సంస్త్యాన మిత్యపి ।
ఆత్మరూపం తు భావానాం స్థితిరిత్యపదిశ్యతే ॥ 27

అన్యేషాం = వైశేషికాదుల మతమున, ఉత్పత్తిః = క్రొత్త అవయవములు పుట్టుట, ప్రసవ = ప్రసవమనియు, నాశః = వాటి నాశము, సంస్త్యానం ఇత్యపి = సంస్త్యానమనియు, భావానాం = పదార్థముల, ఆత్మరూపం = స్వాభావికమగు రూపము, స్థితిరితి = స్థితి యనియు, అపదిశ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— కొందరి మతము ప్రకారము ప్రసవమనగా క్రొత్త అవయవములు పుట్టుట. సంస్త్యానమనగా వాటి నాశనము. స్థితి అనగా పదార్థముల సహజ స్వభావము

వివరణము— పూర్వము సాంఖ్య దర్శనానుసారముగ సంస్త్యానాదుల స్వరూపము నిరూపింపబడినది. వైశేషిక మతము ప్రకారము వాటి స్వరూపమును చెప్పుచున్నాడు. సాంఖ్యమతము ప్రకారము అవయవములు పూర్వము తిరోభూతములై యుండి ఆవిర్భూతము లగుట (కనబడుట) ప్రసవము. అనగా ఆవిర్భావము. వైశేషికుల యభిప్రాయము ప్రకారము పూర్వము లేని అవయవములు క్రొత్తగ పుట్టుట (ఉత్పత్తి) ప్రసవము. ఉన్న అవయవములు కనబడకుండుట (తిరోభావము) సంస్త్యానమని సాంఖ్యమతము ఉన్న అవయవములు పూర్తిగ నశించుట సంస్త్యానమని వైశేషికమతము. నిత్యములైనను, అనిత్యములైనను పదార్థములకొక సహజ స్వరూపముండును. అదియే స్థితియని వైశేషిక మతము. ఈ ప్రసవ-సంస్త్యాన - స్థితులను ద్యోతింపజేయుటకై పుంస్త్రీనపుంసకములు చేరుచుండునని వీరి యభిప్రాయము. ఈ రెండు మతములందును సత్కార్యవాదా సత్కార్యవాదకృతభేదము తప్ప మిగిలిన అంశములలో భేదము లేదు. ॥27॥

అవతారిక— ఇపుడు లింగమునకు సంబంధించిన మత భేదములలో ఐదవదగు 'శబ్దోపజనితోఽర్థాత్మా' అను మతమును మరియొక విధముగ వివరించుచున్నాడు.

శ్లో॥ దృష్టం నిమిత్తం కేషాఞ్చిజ్జాత్యాదివదవస్థితమ్ ।
దృష్టవచ్ఛబ్ద సంస్కారమాత్రం తు పరికల్పితమ్ ॥ 28

కేషాంచిత్ = కొన్ని చేతన పదార్థములకు సంబంధించిన, దృష్టం=కంటికి కనబడునదియు, జాత్యాదివత్ =జాత్యాదులవలె, అవస్థితం=ఉన్నదియునగు, నిమిత్తం= స్తనకేశాది నిమిత్తము, దృష్టవత్ = చూడబడినదివలె, శబ్ద సంస్కార మాత్రం = శబ్ద సంస్కారమునకు మాత్రము ఉపయోగించునదిగ, (అచేతనములందు గూడ), పరికల్పితమ్ = కల్పింపబడినది.

తాత్పర్యము— కొన్ని చేతన పదార్థములతో ప్రతి నియతమగు స్త్రీత్వాది జాతి

వలె నున్న, ప్రత్యక్ష దృశ్యమానమగు స్తనకేశాది నిమిత్తము, అది కానరాని తారకాదులందు గూడ, దృశ్యమానమువలె, కేవలము శబ్ద సంస్కారము కొరకై కల్పింపబడు చున్నది.

వివరణము— కొన్ని చేతన పదార్థములలో స్త్రీత్వాది జాతివలె (స్త్రీత్వాది జ్ఞాన నిమిత్తమగు) స్తనకేశాద్యవయవ సముదాయము గూడ ప్రతి నియతముగ కనబడుచున్నది. అట్టి స్థలములలో స్తనాదులు స్త్రీత్వాదులను వ్యంజింప చేయుచున్నవి తారకాద్యచేతన పదార్థములలో స్తనకేశాదులు కానరాకున్నను 'నారీ' ఇత్యాది శబ్దములు ఏ విధముగ సత్త్వ (పదార్థ) బోధకములుగ నున్నవో ఇవి కూడ అట్లే పదార్థ బోధకములుగ నుండుటచే వాటి యందు లింగమును కల్పించి, ఆ లింగమును చేర్చుటద్వారా శబ్ద సంస్కారము చేసి తారకా, పుష్యః, నక్షత్రమ్, ఇత్యాది విభిన్న లింగములు ప్రయోగింపబడుచున్నవి. ఈ విధముగ చేతన పదార్థములలోని లింగము వాస్తవము, అచేతన పదార్థముల లింగము కాల్పనికము అని అభిప్రాయము ॥28॥

అవతారిక— వాస్తవమున తారకాది శబ్దములందు లింగము లేకపోయినను లింగమును ఆరోపించుటకు ఒక నిదర్శనమును చూపుచున్నాడు.

శ్లో॥ యథా ప్రసిద్ధేఽప్యేకత్వే నానాత్వాభినివేశినః ।
నానాత్వం జనయన్తీవ శబ్దా లిఙ్గేఽపి స క్రమః ॥ 29

ఏకత్వే = ఏకత్వము, ప్రసిద్ధేఽపి = ప్రసిద్ధమైనను, నానాత్వాభినివేశినః = బహువచన వృత్తులగు, శబ్దాః = శబ్దములు, యథా = ఏ విధముగా, నానాత్వం = నానాత్వ బుద్ధిని, జనయన్తీవ = కలిగించుచున్నట్లుండునో, లిఙ్గేఽపి = లింగము విషయమునందు గూడ, సః = అదియే, క్రమః = పద్ధతి.

తాత్పర్యము— ఏకత్వము ప్రసిద్ధముగ నున్నను, బహువచనమునందు ప్రయుక్తములగు శబ్దములు ఏ విధముగ అనేకత్వ బుద్ధిని కలిగించుచున్నట్లు కనబడునో, లింగము విషయమున గూడ అదియే పద్ధతి.

వివరణము— బోధ్యమగు వస్తువు ఒక్కటియే యైనను 'దారాః', (భార్య) 'ఆపః', (నీరు) 'గృహాః' (ఇల్లు) 'సికతాః' (ఇసుక) మొదలగు శబ్దములు బహువచనములో ప్రయోగింపబడుచున్నవి అట్లు బహువచనమునందు ప్రయోగించుటచే ఆ శబ్దముల బోధ్యములగు అర్థముల బహుత్వమును బోధించుచున్నట్లు కనబడుచున్నను అది అట్లు బోధించుట లేదు. అట్లే స్త్రీత్వాది లింగ విశిష్టములు గల ప్రయుక్తములగు తారకాద్యచేతన వాచక శబ్దములు స్తనకేశాద్యవయవ సంబంధమును బోధించుచున్నట్లు కనబడినను అట్లు చేయుట లేదు ॥29॥

అవతారిక— ఈ విధముగ చూడగా చివరకు, 'శబ్ద సంస్కారో లిఙ్గమ్' అను ఏడవ మతమే ప్రమాణము అన్నట్లు చెప్పుచున్నాడు.

శ్లో॥ ఇదంవేయ మయంవేతి శబ్దసంస్కార మాత్రకమ్ ।
నిమిత్తదర్శనాదర్థే కైశ్చిత్ సర్వత్ర వర్ణ్యతే ॥ 30

ఇదం వా = ఇది (నపుం), ఇయం = ఇది (స్త్రీలిం), అయం = ఇది (పుంలిం), ఇతి = ఈ విధముగ, అర్థే = వస్తుమాత్ర విషయమున, నిమిత్తదర్శనాత్ = ప్రయోగించుట అనెడు నిమిత్తము యొక్క దర్శనము వలన, కైశ్చిత్ = కొందరిచే, సర్వత్ర = అన్ని శబ్దము లందును, శబ్దసంస్కార మాత్రకమ్ = కేవలము శబ్ద సంస్కారముకొరకు మాత్రమే ఉద్దిష్ట మైనదిగా, వర్ణ్యతే = వర్ణింపబడుచున్నది.

తాత్పర్యము— ఇదం, ఇయం, అయం అను రీతిని ప్రతి వస్తువు విషయమునను ప్రయోగించుటకు వీలుండుట అనెడు నిమిత్తము కానవచ్చుటచే, లింగమనునది, అన్ని పదము లందును శబ్ద సంస్కారము కొరకు మాత్రమే ఉద్దిష్టమైనట్లు కొందరు చెప్పుచున్నారు.

వివరణము— బాహ్యనిమిత్తాపేక్ష ఏమియు లేకుండ ప్రతిపదార్థము విషయము నను 'ఇదం వస్తు' 'ఇయం వ్యక్తిః' 'అయం అర్థః' అను రీతిని మూడు లింగములలో నున్న శబ్దములను ప్రయోగించవచ్చును. ఇట్లు ప్రయోగించుటకు అవకాశముండుట అనెడు నిమిత్తము కానవచ్చుటచే, చేతనాచేతన వాచకములగు ఏ శబ్దములందైనను, లింగము కేవలము శబ్ద సంస్కారము కొరకు మాత్రమే ఉపయోగింపబడుచున్నదని కొందరు చెప్పుదురు. 'శబ్దోప జనితోఽర్థాత్మా' అను ఆరవ మతమున చేతన పదార్థవిషయమున లింగము వాస్తవముగ నున్నను అచేతన పదార్థముల విషయమున లింగము కల్పితము ; అది శబ్ద సాధుత్వము కొరకై ఉద్దిష్టమైనది. ఈ మతము ప్రకారము చేతనవాచకము నైనను, అచేతనవాచకము నైనను, అన్ని శబ్దములును గూడ కేవల శబ్ద సంస్కారముకొరకే లింగములను గ్రహించును.

'కైశ్చిత్' అని చెప్పుటచే వస్తువులలోనున్న గుణావస్థా రూపమును ఎవరు గ్రహింపజాలరో అట్టివారే ఈ మతమును అంగీకరింతురనియు, అట్టి గుణావస్థా వివేక వంతులు పూర్వోక్తమగు (గుణావస్థా రూప) లింగమునే అంగీకరింతురనియు, అదియే పరమ సిద్ధాంతమనియు సూచింపబడినది. ॥30॥

అవతారిక— బైట కనబడని లింగము శబ్ద సంస్కారమున కెట్లు నిమిత్తమగును అని ఆశంకించి చెప్పుచున్నాడు.

శ్లో॥ నావశ్యం విషయత్వేన నిమిత్తం వ్యవతిష్ఠతే ।
ఇన్ద్రియాది యథాదృష్టం భేదహేతు స్తదిష్యతే ॥ 31

నిమిత్తం = నిమిత్తము, అవశ్యం = తప్పనిసరిగా, విషయత్వేన = జ్ఞాన విషయముగా, న వ్యవ తిష్ఠతే = ఉండదు, ఇంద్రియాది = ఇంద్రియములు మొదలగునవి, యథా = ఎట్లో, అట్లే, తత్ = ఆ నిమిత్తము, అదృష్టం = చూడబడని దగుచునే, భేదహేతుః = భేద బుద్ధికి కారణ మని, ఇష్యతే = అంగీకరింపబడును.

తాత్పర్యము— నిమిత్తము తప్పక జ్ఞాన విషయము కావలెనను నియమము లేదు. ఇంద్రియాదికము వలె, నిమిత్తము కూడ బైటకు కనబడకుండగనే భేదహేతు వగునని అంగీకరింపబడును.

వివరణము— చక్షురాదీంద్రియములు ప్రత్యక్షములు కావు. అయినను వేరు వేరు విషయములు గల జ్ఞానములకు ఆ ఇంద్రియములు నిమిత్తములగుచునే ఉన్నవి. కావున ఒకదాని అవచ్ఛేదమునకు (ఒక దానిని మరియొక వస్తువునుండి వేరుగ జూపుటకు) కారణభూతమగునది తప్పక జ్ఞాన గోచరము కావలెనని నియమము లేదు. కావున లింగమునకు గూడ బాహ్యరూపమేదియు కానరాకున్నను, దానిని శబ్ద సంస్కారమనెడు కార్యమునకు కారణముగ శాస్త్రమునందు పరిగ్రహించుట యుక్తమే. ॥31॥

లిఙ్గసముద్దేశము ముగిసినది

వృత్తి సముద్దేశము

పరిచయము

"వృత్తి" అను శబ్దమునకు "ఉండుట", "జీవనోపాయము", "నడవడి", మొదలగు లోకప్రసిద్ధమైన అర్థములు కొన్ని గలవు. అవి యిచట ప్రకృతములు కావు. అట్లే శబ్దము వలన అర్థమును సంపాదించుట కుపయోగించు అభిధ, లక్షణ, వ్యంజన అను మూడు శబ్ద వృత్తులు సాహిత్యశాస్త్రమున ప్రసిద్ధములై ఉన్నవి. వానికి కూడ ఇచట సంబంధము లేదు.

వ్యాకరణశాస్త్రము చూపు ఒకానొక ప్రక్రియా విశేషమునకు వృత్తియని సంకేతము. ఇచట వృత్తి శబ్దమునకు – "తీరు" – లేక – "రీతి" – లేక – "మార్గము"– అని యర్థము చెప్పవచ్చును. వ్యాకరణ మంగీకరించిన ఒక ప్రక్రియను అవలంబించి, ఒక పదము గాని పదబంధము గాని ఒకానొక విచిత్రమైన అర్థమును బోధించు పద్ధతి వృత్తి యగును. అనగా పదమునకు ఒకానొక ప్రత్యయమును చేర్చికాని– అనేక పదములను ఒక బంధముగ కూర్చికాని, ఒక ప్రత్యేకమైనట్టియు, విపులమైనట్టి అర్థమును తెలుపుటయు, అట్లే పలు శబ్దములను పలుకవలసినచోట ఒకే శబ్దమునుచ్చరించి మిగిలిన వాని యర్థమును తెలుపుటయు, ధాతువునకుగాని పదమునకుగాని చిత్ర విచిత్రములైన ప్రత్యయములను చేర్చి వింత యర్థములను బోధించుటయును సాంకేతికమైన వృత్తి యగునని భావము.

"పరార్థాఽభిధానం వృత్తిః" అని వైయాకరణులు వృత్తి లక్షణమును చూపిరి. శబ్దములు విడివిడిగా ఉన్నపుడు తాము బోధించు అర్థములను విడిచి, సంకేత సిద్ధమైన వృత్తి అను ఒక చట్రములో బిగిసికొని, కొండొక విశిష్టార్థమును బోధించుట అని దీని తాత్పర్యము. పదసముదాయముచే చెప్పదగిన యర్థమును కుదించి తేలికగా చెప్పుటకు వీలు కలిగించుటకై ఈ వృత్తియను మార్గమేర్పడినది. ఉదాహరణము– "పీతాంబరః" (పచ్చని బట్ట గలవాడు) ఇచట "పీతమ్ – అంబరమ్ – యస్య – సః" అను పదసమూహము బోధించు భావమును సమాసమను వృత్తియొక్క బలముతో ఒకే పదము తెలుపగలుగుచున్నది. కాగా వృత్తియొక్క పరమప్రయోజనము లాఘవమేయని విస్పష్టమగును

అట్టి వృత్తి అయిదు విధములుగా విభజింపబడినది. 1. కృద్వృత్తి, 2. తద్ధిత వృత్తి, 3. సమాసవృత్తి, 4. ఏకశేషవృత్తి, 5. సనాద్యంత ధాతువృత్తి, అని వాని పేర్లు. ఉదాహరణములు—

1. కృద్వృత్తిః— కుంభకారః = కుండలు చేయువాడు. (కుంభం – కరోతి. "కర్మణ్యణ్" = పాణిని సూత్రము (3-2-1) = కర్మవాచకమును ముందుంచికొని ధాతువునకు అణ్ ప్రత్యయమును చేయనగును). ఇచట ధాతువులకు కృత్తులనెడి ప్రత్యయములు చేరుచుండును.

2. తద్ధితవృత్తి:— దాశరథిః. (దశరథస్య - అపత్యమ్ - పుమాన్ = దశరథుని పురుష సంతానము. "అతఇఞ్" - పా. సూ. (4-1-95). అకారాంతమైన షష్ఠ్యంతమునకు అపత్యార్థమున ఇఞ్ ప్రత్యయమగును). ఇచట సుబంతములకు తద్ధితములను పేరుగల వివిధములయిన ప్రత్యయములు చేరుచుండును

3. సమాసవృత్తి:— నీలోత్పలమ్ = నల్ల కలువ. (నీలమ్ - చ + తత్ - ఉత్పలమ్ + చ - "విశేషణం విశేష్యేణ బహులమ్" - పా. సూ. (2-1-57). విశేషణమైన సుబంతము విశేష్యమగు సుబంతముతో సమసించును). ఇచట పదములు ఒకదానితో వేరొకటి కలియుచుండును.

4. ఏకశేషవృత్తి:— పితరౌ = తలిదండ్రులు. (మాతాచ - పితాచ - "పితా మాత్రా" పా సూ. (1-2-70). మాతృపితృ శబ్దములను రెండింటిని కలుపదలచినపుడు. పితృశబ్దమే మిగిలి రెండిటి యర్థమును తెలుపగల్గును) ఇచట ఒకే శబ్దము మిగిలి లోపించిన శబ్దముల అర్థమును కూడ చెప్పుచుండును.

5. సనాద్యంత ధాతువృత్తి:— పుత్రీయతి = పుత్రుని కోరుచున్నాడు. (పుత్రమ్- ఆత్మనః - ఇచ్ఛతి - "సుప ఆత్మనః క్యచ్" పా. సూ. (7-4-33) తాను కోరుచున్న వస్తువును చెప్పు సుబంతమునకు క్యచ్ ప్రత్యయము వచ్చును). ఇచట సుబంతమునకు క్యచ్, క్యఙ్, మొదలగు ప్రత్యయములు చేరును పిదప అట్టి ప్రత్యయాంతము ధాతువై తిఙ్ ప్రక్రియకు అనుకూలమగును.

పై స్థలము లన్నింటియందును ఆ యా పాణినీయ సూత్రములచే పెక్కు కార్యములు ప్రవర్తించి పరిపూర్ణ రూపములు ఏర్పడుచుండును. కావున ప్రక్రియ సమగ్రముగ తెలియవలయునన్నచో పాణినీయ సూత్రముల పరిజ్ఞానముండక తప్పదు.

ఈ వృత్తు లన్నిటికిని సాధారణముగా అన్వయించు ముఖ్య లక్షణములు కొన్ని గలవు అవి యిట్లుండును—

1. ఇవన్నియు పదవిధులు (పదములకు విధింపబడు కార్యములు).

2. సమర్థములగు పదముల విషయముననే యివి ప్రవర్తించును.

3. వీనియందుండు సామర్థ్యము ఏకార్థీ భావము. అంతకుముందు ఎకార్థములు కాని శబ్దములు ప్రకృతము ఏకార్థకములగును. అనగా వృత్తికి అవయవములుగా ఏర్పడు పదములు తమ తమ వేర్వేరు అర్థములను విడిచి, ఒకే పదముగ తయారై మిశ్రమలోహము వలె స్వరూపమును ధరించి మొత్తముపై విశేషణ విశేష్యభావము గల ఒక అఖండమగు అర్థమును బోధించుచుండునని తాత్పర్యము. ఉదా : రాజపురుషః. (రాజ్ఞః పురుషః) ఇది సమాసవృత్తి. ఇచట రాజశబ్దమునకు గాని పురుషశబ్దమునకు గాని ప్రత్యేకార్థము లేదు. "రాజసంబంధము గల వ్యక్తి" అని మొత్తముపై ఒకే యర్థము సంభవించును. వృత్తిని

స్వీకరించినపుడు "సముదాయమునకే విశిష్టార్థమును బోధించు అవకాశము గలదు. అవయవములకది లేదు" అనునది సంప్రదాయము.

4. వృత్తికి అవయవములుగా ఉండు శబ్దములకు విశేషణములను చేర్చరాదు. (విశేషణములతో కూడియున్న పదములకు వృత్తి జరుగనే జరుగదు). ఉదా : రాజపురుషః ఇందలి రాజశబ్దమునకు "మహతః" "శౌర్యవతః" మొదలగు షష్ఠ్యంతములగు విశేషణములను తగిలింపకూడదు.

5. వృత్తియందు "ఏకత్వ సంఖ్యయే" భాసించును వృత్తియందలి తొలి పదము యొక్క అర్థమున రెండు, మూడు, మొదలగు సంఖ్యావిశేషములు తెలియకుండ, "ఒకటి" అను సంఖ్యయే స్ఫురించును. అదియే కావలసిన అన్ని సంఖ్యలను సూచింపుచుండును. దీనికి "అభేదైకత్వ సంఖ్య" అని పేరు తేనె, అను ఒకే పదార్థములో వివిధములగు పుష్పముల మకరందములు తమ భేదమును విడిచి ఎట్లు ఐక్యమును చెందునో, అట్లే అనేకవిధములైన సంఖ్యలిచట ఏకమైపోవును. ఉదా : కుంభకారః ఇచట కుంభశబ్దము "కుండను" అని ఏకత్వమునే తెలియజేయును. అదియే అవసరమైనపుడు అన్ని సంఖ్యలను బోధింపగలదు. (కాగా కుంభౌ, కుంభాన్, మొదలగు సంఖ్యావిశేషములు అవగతములగుచుండును). అందువలననే "కుంభం కరోతి" అను రీతిలో ఏకవచనాంతముగానే విడదీయుట జరుగుచుండును.

6. ఏకార్థమును విడమరచి బోధించుటకై వృత్తికి విగ్రహవాక్యము కల్పింపబడును. ఉదా : రాజపురుషః. ఇచట "రాజ్ఞః పురుషః" అని విగ్రహ వాక్యము. వేరుగా ప్రయోగించుట కుపయోగ్యములైన ఇట్టి విన్యాసములను లౌకిక విగ్రహములందురు. రాజన్ + ఙస్ + పురుష + సు. మొదలగు రీతిని ప్రకృతిని ప్రత్యయమును గూడ విడదీసి చూపి, ఆ యవస్థలో వృత్తి జరుగునని చెప్పుదురు. అట్టి అవస్థను "అలౌకిక విగ్రహము" అందురు. దీనికి స్వతంత్రముగా ప్రయోగముండదు.

7. శాస్త్రీయములగు కార్యములన్నియు అలౌకిక విగ్రహము యొక్క అవస్థయందే ప్రవర్తించును. ఈ యంశమును సూచించుటకు మాత్రమే అలౌకిక విగ్రహ ముపయోగించును (అది వ్యవహారయోగ్యము కాదు).

8 వృత్తి జరుగగానే అవయవముల యొక్క ప్రత్యయములన్నియు లోపించి, వెంటనే సముదాయమంతయు ఒకే ప్రాతిపదికముగా కాని కొన్నిచోట్ల ధాతువుగా కాని మారిపోవును. దానికి ఆవశ్యకమైన ప్రక్రియను మరల సంపాదించుకొనవచ్చును.

ఇంకను సూక్ష్మములైన విశేషములను "సమర్థః పదవిధిః" (2-1-1) అను సూత్రము యొక్క భాష్యమునుండి గ్రహింపనగును

సామాన్యముగా ఒక వాక్యమువలన పొందదగిన యర్థమును లాఘవముతో సంపాదించుటకు ఈ వృత్తి పద్ధతి ఏర్పడినది. ఇది సంస్కృతభాషకు మిక్కిలి సహజమైనది.

ప్రయోగ సౌకర్యమును సౌందర్యమును దీనికి గలవు. దీనిని శాస్త్రీయముగ నిర్వహించుటకు, పై కల్పన లన్నియు చూపబడినవి. సిద్ధముగనున్న విషయమును కొన్ని నియమములతో విశ్లేషించి చూపుటయే శాస్త్రము చేయుపని. అంతియకాని లేనిదానిని శాస్త్రము క్రొత్తగా తీసి కొని రాదు. ఈ యంశమును "ఉపాయాః శిక్షమాణానామ్" (సత్యమును గుర్తించుటకు శాస్త్రము ఉపాయము మాత్రమే). "సత్యం వస్తు తదాకారై ర సత్యైరవధార్యతే" (అసత్యము లగు ఉపాయములచే సత్యము తెలియబడును) మొదలగు వచనములతో భర్తృహరి పలు మారులు వెల్లడించెను.

వృత్తియొక్క సకలసంపదను సాధించుటకు "ఏకార్థీభావము" అను కల్పవృక్షము వైయాకరణులకు లభించినది. దీనివలననే వృత్తికి సంబంధించిన కల్పనలన్నియు సార్థకములు కాగలిగినవి.

ఏకార్థీభావమునకు భిన్నమైన వేరొక సామర్థ్యమున్నది. ప్రాసంగికముగ దానిని గూర్చి రెండు మాటలనుకొనవలయును. వ్యపేక్షా సామర్థ్యమని దాని పేరు. "వి = విశిష్టా+ అపేక్షా = వ్యపేక్షా". "చక్కని పొందిక" అని భావము. అనగా పదపదార్థముల కుండ వలసిన అన్యోన్యమైన అమరిక. ఈ సామర్థ్యము వాక్యమందుండును వాక్యమందలి పదము లను ఆలస్యముచేయక వరుసగ పలుకుటయు, (దీనికి ఆసత్తియని పేరు) పదార్థములు పర స్పరము కలియుటకు తగియుండుటయు, (దీనికి యోగ్యత అని పేరు) అర్థము లొకదాని నొకటి ఆశించుకొనుచు పెనవేసికొని యుండుటయును (దీనిని ఆకాంక్షయందురు) వ్యపేక్ష యొక్క ముఖ్య లక్షణములు. వ్యపేక్షను గలిగిన వాక్యము శీఘ్రముగ అభిమతమైన అర్థమును బోధింపగలుగును. ఉదా : "అద్యరామః గ్రామం గచ్ఛతి" మొదలగునవి. అట్లుగాక వాక్య మందలి కొన్ని పదములను నేడును, మిగిలిన వానిని రేపును పలికినచో అర్థము తెలియదు. (అచట ఆసత్తి యుండదు). "అగ్నినాసించతి" (నిప్పుతో తడుపుచున్నాడు). యోగ్యత లేకుండుటచే ఇట్టి వాక్యములు అర్థమును బోధింపజాలవు. అట్లే– వనమ్, గ్రామః, అశ్వః, తత్ర, పఠతి, – ఇది పదసముదాయమైనను మొత్తముపై ఎట్టి యర్థము కూడ తెలియజేయ జాలదు. (ఇట్టిచోట్ల ఆకాంక్ష సంభవింపదు).

కాగా వృత్తియందు ఏకార్థీభావమును వాక్యమందు వ్యపేక్షను శాస్త్రకారు లంగీక రించిరి. సూక్ష్మముగ పరిశీలించినచో వృత్తియందు కూడ వ్యపేక్షయొక్క మూల ధర్మములు కొన్ని ఉండక తప్పదని విశదమగును.

వృత్తియొక్క స్వరూప స్వభావములు ఒకింత తెలియుటకై ఈ పరిచయ వాక్యము లుపయోగించును.

ప్రకృత మీ "వృత్తి సముద్దేశము"న తద్ధితములు, సమాసములు మొదలగు వృత్తులకు సంబంధించిన సామాన్య విషయములు కొన్నియు, విశేష విషయములు కొన్నియు చర్చింపబడును. అందును ఏకార్థీభావము, అభేదైకత్వ సంఖ్య, లింగవచనములు సిద్ధించుట మొదలగు అంశములు అతి విపులముగ నుండును.

ఈ సముద్దేశమందలి విషయజాలమంతయు ప్రక్రియా భాగముపై అధికముగ ఆధారపడియుండుటయు, పరిశీలనములో మునిత్రయవచనముల పరామర్శము మెండుగ జరుగుచుండుటయును అనుభూతమగుచుండును. కాగా పాణినీయము యొక్క పరిచయము కొంతయైనను లేనివారి కిది సుబోధము కాదు.

(1) సమానాధికరణమైన తద్ధితవృత్తియొక్క విచారము

అవతారిక— "కుత్సితే" (5-3-74) అను సూత్రముచే "నిందింపబడినది" అను నర్థమున ప్రథమాంతమగు ప్రాతిపదికమునకు "క" అను ప్రత్యయము విధింపబడినది. అట్లే "ప్రశంసాయాం రూపప్" (5-3-66) అను సూత్రముచే "పొగడబడినది" అను నర్థమున "రూప" ప్రత్యయమును, "ద్వివచన విభజ్యోపపదే తరబీయసునౌ" (5-3-57) అను సూత్రముచే "రెండింటిలో ఒకటి మిన్న" అను నర్థమున "తరప్" "ఈయసున్" అను ప్రత్యయములు విధింపబడినవి. ఈ సందర్భములలో ప్రకృతియొక్కయు ప్రత్యయము యొక్కయు అర్థమును సమన్వయింపదగు రీతిని వివరించుచున్నాడు.

శ్లో॥ కుత్సాప్రశంసాతిశయైః సమాప్తార్థం తు యుజ్యతే ।
పదం స్వార్థాదయః సర్వే యస్మాత్ కుత్సాదిహేతవః ॥ 1

సమాప్తార్థమ్ = సంపూర్ణమైన అర్థము గల, పదమ్ + తు = పదమైతే, కుత్సా ప్రశంసాతిశయైః = నింద, ప్రశంస, గొప్పదనము (మొదలగు) అను వానితో, యుజ్యతే = సంబంధించును, యస్మాత్ = ఎందువలన, స్వార్థాదయః = స్వార్థము, మొదలగు అర్థములు, (జాతి ద్రవ్యము, లింగము, సంఖ్య, కారకము అనునవి), సర్వే = అన్నియు, కుత్సాదిహేతవః = నింద, ప్రశంసన, గొప్పదనము మొదలగు వానికి నిమిత్తములు, (భవంతి = అగునో, అందువలన - అని అన్వయము).

తాత్పర్యము— ప్రతియొక పదము కూడ జాతి, ద్రవ్యము, లింగము, సంఖ్య, కారకము అను అయిదర్థములను సంపూర్ణముగ బోధించుచుండును. అవన్నియును సందర్భమును బట్టి నింద, ప్రశంస, గొప్పదనము మొదలగు విశేష ధర్మములకు నిమిత్తములు కానచ్చును. వానిలో ఏదో యొక దానిని చెందునట్లు నిందను చెప్పదలచినపుడు పదమునకు "క" ప్రత్యయమును, ప్రశంసను చెప్పదలచినపుడు "రూపప్" ప్రత్యయమును, గొప్పదనమును సూచించునపుడు "తరప్" ప్రత్యయమును ప్రవర్తించును. ఉదా : (1) పటుకః = కుత్సితః పటుః = నిందితమగు సామర్థ్యము గలవాడు. (2) పటురూపః = ప్రశస్తః పటుః = మెచ్చదగిన సామర్థ్యము గలవాడు. (3) పటుతరః = ద్వయోః అతిశయేన పటుః = ఇరువురిలోను ఎక్కువ సామర్థ్యము గలవాడు.

వివరణము— జాతి (సకల వ్యక్తులందును గోచరించు సమానమైన ధర్మము), ద్రవ్యము (ప్రకృతమైన ఒక వ్యక్తి), లింగము (స్త్రీత్వము, పుంస్త్వము మొదలగునది),

సంఖ్య (ఒకటి, రెండు, మొదలగునది), కారకము (కర్త, కర్మ మొదలగునది), అను అయిదు కూడ శబ్దముయొక్క అర్థములనియు, శబ్దము నుచ్చరించిన వెంటనే అవి అతిశీఘ్రముగను వరుసగను ఒకదాని వెనుక మరియొకటి స్ఫురించుచుండుననియును శాస్త్ర సంప్రదాయము ఉదా : గౌః - అను పదము ఇచట గోత్వమను జాతియు, గోవు అను వ్యక్తియు, స్త్రీ - అను లింగమును, ఒకటియను సంఖ్యయు, కర్త అను కారకమున్ను ఈ పదమువలన వెంటనే తెలియును. పై అర్థములను ప్రాతిపదికార్థములని యందురు (వీనియొక్క స్వరూప స్వభావాదులను ఈ కాండము మొదటి సముద్దేశములందు గ్రంథకర్త మిక్కిలి విపులముగ వివరించి యున్నాడు).

కాగా - నిందా ప్రశంసాదులు స్వీకరించిన శబ్దముయొక్క అర్థమును బట్టియే (సామాన్యముగా జాతినిగాని వ్యక్తినిగాని) రూపొందుననియు, అట్లవి ప్రకృత్యర్థమునకు విశేషణములగుననియు, 'క, రూప' మొదలగు ప్రత్యయములు సిద్ధముగనున్న ఆ యా అర్థములను కేవలము సూచించుననియును పర్యవసించును అనగా ప్రత్యయమునకు వేరుగా అర్థము లేదనియు ప్రకృతియొక్క విశేషార్థము నది సూచించుననియు భావము. ఉదా : మనుష్యకః (నిందితుడైన మానవుడు). ఇచట జాతిగాని వ్యక్తిగాని నిందితము ఆనింద ప్రకృత్యర్థమునకు చెందినది. అందువలన ''కుత్సితః మనుష్యః'' అని వివరణమును చూపుదుము మనుష్య శబ్దమునకు ''క'' ప్రత్యయము చేరును. అది సిద్ధముగనున్న నిందను వెల్లడిచేయును. ఇట్లే ప్రశంస, మొదలగు అర్థములను రూప, మొదలగు ప్రత్యయములు విశదపరచును జాతి, ద్రవ్య, లింగాది ధర్మములలో ఏ ధర్మమునుబట్టి నిందా ప్రశంసాదులను చేయ సమకట్టుదుమో, అట్టి ధర్మముగల వస్తువును చెప్పు శబ్దమునకు, ఆ యా అర్థములను వెల్లడి చేయు 'కా'ది ప్రత్యయములగునని సారము.

విశేష విషయములు— కన్ (క), రూపప్ (రూప), తరప్ (తర) మొదలగు ప్రత్యయములు ''సమానాధికరణ తద్ధితములు'' అనబడును అనగా ఇవి ప్రవర్తించిన స్థలములలో ప్రకృతి ప్రత్యయములు రెండును ఒకే యర్థమును తెలుపుచుండును. సుబంతమునకు పరముగ తద్ధితములు ప్రవర్తించును. ''దేవదత్త + సు + క'' మొదలగు రీతిని మొదటి అవస్థను చూపుదురు. తద్ధితాంతము మరల ప్రాతిపదికమగును. (కృత్తద్ధిత సమాసాశ్చ (1-2-46). కృత్ప్రత్యయాంతములు, తద్ధితాంతములు, సమాసములును ప్రాతిపదికములగును) మధ్యనుండు సుప్ ప్రత్యయము లోపించి మొత్తముపై మరల ఆవశ్యకమగు సుప్ ప్రత్యయము వచ్చుచుండును ''దేవదత్తకః'', (నిందితుడైన దేవదత్తుడు) మొదలగు రూపములు సిద్ధించును

కొన్ని చోటులందు లింగమునుబట్టి కుత్స ఏర్పడును. ఉదా : ''ప్రాప్యగాండీవధన్వానం విద్ధి కౌరవకాన్ స్త్రియః'' (అర్జునుని ఎదుట కౌరవులు ఆడువారు). ఇచట ''కుత్సితాః కౌరవాః = కౌరవకాః'' అని కౌరవులందరి పుంస్త్వము నిందితము దానినే క ప్రత్యయము సూచించును అట్లే ''పుత్రకః శతమ్'' (ఒక కొడుకే నూరుమంది పెట్టు) మొదలగుచోట్ల

"కుత్సితః - ఏకః - పుత్రః" (నూరుమంది వలన కలుగు దుఃఖమును ఒకడే కలిగించు చున్నాడని భావము) అని సంఖ్యకూడ కుత్సకు నిమిత్తమగును. ఇట్లే ప్రశంస, ప్రకర్షము మొదలగునవి శబ్దార్థమునకు చెందుటను ఊహించునది. ॥1॥

అవతారిక— పైని చూపినట్లు చెప్పినచో "కుత్సితకః" మొదలగు ప్రయోగ ములు కుదురునా ? అని శంకించి సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ దేవదత్తాది కుత్సాయాం వర్తతే కుత్సితశ్రుతిః ।
కుత్సితస్థా తు యా కుత్సా తదర్థః కో విధీయతే ॥ 2

దేవదత్తాది కుత్సాయామ్ = దేవదత్తుడు మొదలగు వారిని నిందించునపుడు, కుత్సిత శ్రుతిః= ఏదో యొక నిమిత్తమును బట్టి నింద వినబడుట, వర్తతే = ఉండును, (తథా = అట్లు), కుత్సితస్థా = కుత్సితుని యందుండు, కుత్సా = నింద, యా + తు = ఏదైతే కలదో, తదర్థః = దాని కొరకు, కః = క ప్రత్యయము, విధీయతే = విధింపబడును.

తాత్పర్యము— "కుత్సితః దేవదత్తః" (నిందింపబడిన దేవదత్తుడు), "కుత్సితః అశ్వః" (నిందితమైన అశ్వము) మొదలగు చోట్ల ఒకానొక నిమిత్తమువలన ఆయా వస్తువు లకు చెందు నిందను తెలుపుటకు, కుత్సిత శబ్దమును ముందుగ ఉపయోగించి ఆ యర్థమును సూచించుటకై "క" ప్రత్యయమును చేర్చి, సూ. కుత్సితే (5-3-74). "దేవదత్తకః" "అశ్వకః" మొదలగు పదములను వాడుదుము. ఈ విధముగనే "కుత్సితః - కుత్సితః" అను విగ్రహమును చూపి, ఏదో యొక ప్రత్యేక ధర్మమునుబట్టి కుత్సితునకు గూడ నిందను అంటగట్టునపుడు, దానిని సూచించుటకై కుత్సిత శబ్దమునకును క ప్రత్యయమును చేర్చి "కుత్సితకః" అను రూపమును వాడుకొనవచ్చును.

వివరణము— "నిందింపబడినది" అను నర్థమును సూటిగా చెప్పు "కుత్సిత" శబ్దమునకు, మరల అదే అర్థమున "కుత్సితే" అను సూత్రముచే క ప్రత్యయము రాదగునా? అనునది యిచటి శంక. కుత్సితగతమగు కుత్సను ఏదో విధముగ మరల తెలుపుటకు క ప్రత్యయము రావచ్చునని సమాధానము.

విశేష విషయములు— శబ్దమొక అర్థమును బోధించుటకు నిదానమైన ధర్మమును ప్రవృత్తి నిమిత్తమందురు. జాతి, గుణము, క్రియ, అని ప్రవృత్తి నిమిత్తములు మూడు. ఉదా : గౌః = ప్రవృత్తినిమిత్తము "గోత్వము" అను జాతి. శుక్లః = తెలుపు అను గుణము ప్రవృత్తినిమిత్తము పాచకః = వంట, అను క్రియ ప్రవృత్తినిమిత్తము. అట్లుగాక అన్ని శబ్దముల విషయమునను జాతి యొకటే ప్రవృత్తినిమిత్తము కావచ్చునను వాదము కూడ ఉన్నది. (ఇవన్నియు ఇదివరకు చర్చింపబడిన అంశములే). అట్టి ప్రవృత్తినిమిత్తమునకు సంబంధించు నిందను తెలుపుటకు క ప్రత్యయము చేరును ఇతర శబ్దము లన్నిటికిని అది సహజము కావచ్చును. అట్లే కుత్సితత్వమను ప్రవృత్తినిమిత్తమునకును ఏదో యొక విశేష

ముచే మరల నిందను సూచింపదలచినపుడు కుత్సిత శబ్దమునకును మరల క ప్రత్యయము చేరవచ్చునని సారాంశము.

ఆ విధముగనే ''అనుకంపాయామ్'' (5-3-76) అను సూత్రముచే అనుకంపార్థమున ప్రాతిపదికమునకు క ప్రత్యయము విధింపబడినది. ''అనుకంప'' అనగా జాలి —లేక— దయ. ఉదా : అనుకంపితః - పుత్రః = పుత్రకః (జాలిగొలుపు కుమారుడు), మొదలగునవి. ఇచట కూడ మీద చూపిన యుక్తులచే అనుకంపిత, అనుశబ్దమునకును (జాలిగొలిపినవాడు) క ప్రత్యయము చేర్చి, ''అనుకంపితకః'' అను రూపమును సాధింపనగును (అనుకంపితః - అనుకంపితః - అని విగ్రహము = మిక్కిలి జాలిగొలుపు వ్యక్తి - అని యర్థము) లేదా— ''అనుకంపితః కుత్సితః'' అను విగ్రహమును చూపి కుత్సితకః, అనుచోట క ప్రత్యయము అనుకంపార్థకమనియు, (జాలిగొలుపు నిందితుడు) ''కుత్సితః - అనుకంపితః'' అను విగ్రహమును చూపి, ''అనుకంపితకః'' అనుచోట క ప్రత్యయము కుత్సార్థకమనియును (నిందితుడైన అనుకంపితుడు) సమర్థించుకొనవచ్చును. ఎట్లయినను ఒక విశేషార్థమును ఆశ్రయింపక తప్పదు ॥2॥

అవతారిక— ఇట్లే ''అతిశాయనమును'' (అతిశయము = ప్రకర్షము = గొప్పదనము) సూటిగ తెలుపు ''ప్రకృష్ట'' మొదలగు శబ్దములకు కూడ, అదే యర్థమున ''తర'' మొదలగు ప్రత్యయములు చేరవచ్చునని చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రకృష్ట ఇతి శుక్లాది ప్రకర్షస్యాఽభిధాయకః ।
ప్రకృష్టస్య ప్రకర్షే తు తరబాదిర్విధీయతే ॥ 3

ప్రకృష్టః + ఇతి = ప్రకృష్టః అను పదము, (గొప్పది = మిన్నయైనది), శుక్లాది ప్రకర్షస్య = శుక్ల, మొదలగు వాని ప్రకర్షమును, అభిధాయకః = చెప్పునదియగును, ప్రకృష్టస్య = ప్రకృష్టము యొక్క, (ఆ శబ్దము యొక్క అర్థమునకు సంబంధించిన), ప్రకర్షే + తు = ప్రకర్షమందు (ఆధిక్యము), తరబాదిః = తరప్, మొదలగు ప్రత్యయము, విధీయతే = విధింపబడును.

తాత్పర్యము— ''మిక్కిలి తెల్లనిది'' అను నర్థమును ''ప్రకృష్టః శుక్లః'' అను రీతిని ప్రకృష్ట, అను విశేషణము నుపయోగించి తెలుపవచ్చును. లేదా— శుక్ల శబ్దమునకు ప్రకర్షార్థమున ''తర'' అను ప్రత్యయమును చేర్చి ''శుక్లతర'' అను ప్రత్యయాంతముచే గూడ ఆ యర్థమును బోధింపవచ్చును. అదే విధముగ ప్రకృష్ట శబ్దమునకు కూడ ప్రకర్షార్థమున తర ప్రత్యయమును చేర్చి, ''ప్రకృష్టతరః'' అను ప్రయోగమును చేయనగును. అనగా సహజముగనున్న ప్రకర్షమునకు మరికొంత ప్రకర్షమును తరప్రత్యయము సంపాదించును.

వివరణము— ''ద్వివచన విభజ్యోపపదే తరబీయసునౌ'' (5-3-57) అనునది సూత్రము. ''ఏదైన ఒక విషయములో— ఇరువురిలో ఒకరు మిన్న'' అను నర్థమునగాని,

''ఒకరిని ప్రత్యేకముగా ఎత్తి చూపి, ఒక విషయమున వారికంటె వీరు గొప్ప'' అను నర్థమున గాని— ఏ యంశమునుబట్టి గొప్పదనమును చెప్పదలతుమో ఆ యంశమును చెప్పు సుబంతమునకు తరప్, (తర) ఈయసున్ (ఈయస్) అను ప్రత్యయములు వచ్చునని ఈ సూత్రము యొక్క అర్థము. ఈ ప్రత్యయములు అతిశయమును సూచించును. ఇచట కూడ అతిశయము —లేక— ప్రకర్షము ప్రకృత్యర్థమందే ఇమిడియుండును. ప్రత్యయమద్దానిని సూచించును. ఉదా : ''అనయోః అయమ్ అతిశయేన పటుః = పటుతరః, పటీయాన్'' ''ప్రాచ్యేభ్యః ఉదీచ్యాః బలీయాంసః''. (ప్రాచ్యులకన్న ఉదీచ్యులు మిక్కిలి బలముగలవారు) ఎట్టి విశేషమును చెప్పకపోయినను కేవలము ప్రకర్షార్థమందు కూడ ఈ ప్రత్యయములు. రావచ్చునని యిచట ఒక సిద్ధాంతమున్నది. తదనుసారము ''ప్రకృష్టః శుక్లః'' అను నర్థమున ''శుక్లతరః'' అను ప్రయోగము సాధువే. ఇట్లుండ ప్రకర్షమును సాక్షాత్తుగ చెప్పు ''ప్రకృష్ట'' శబ్దమునకు తరప్రత్యయమును చేర్పవచ్చునా ? అను శంకకు సమాధానమును ఈ కారిక చెప్పినది. ఉన్న ప్రకర్షమునకే మరికొంత ప్రకర్షమును చెప్పదలచినపుడు తర ప్రత్యయము చేరవచ్చునని ఫలించినది.

విశేష విషయములు— ప్రశంస, ప్రకర్ష, నింద, అజ్ఞాతము, అల్పము, హ్రస్వము మొదలగు అర్థములందు ఆయా సూత్రములచే రూప, తర, క, మొదలగు ప్రత్యయములు తద్ధిత ప్రకరణమున విధింపబడినవి. ఇవన్నియు స్వార్థికములు —లేక— సమానాధికరణములు. అనగా ప్రకృతియందు ఇమిడియున్న అర్థమునే యివి తెలుపును. ఇట్లుండ ఆయా అర్థములను సూటిగ చెప్పు కుత్సిత, అజ్ఞాత, మొదలగు శబ్దములకు కూడ అదే యర్థమును ఇనుమడింపజేయ సమకట్టినపుడు ఆయా ప్రత్యయములు రావచ్చునని విశదీకరించుటయే ప్రకృత చర్చయొక్క ప్రయోజనము. కుత్సితక, అను ప్రయోగము యొక్క ప్రసంగము దీనికి దారి తీసినది. కాగా ప్రశస్తరూపః, అల్పకః, హ్రస్వకః, మొదలగు ప్రయోగము లన్నియు సముచితములే యని తేలినది. ॥8॥

అవతారిక— కుత్సితక, అనుచోట కుత్సితమునకు గల వేరొక కుత్స ఎట్టిది ? అను అంశమును వివరించుచున్నాడు.

శ్లో॥ కుత్సితత్వేన కుత్స్యో వా న సమ్యగ్వాఽపి కుత్సితః ।
స్వశబ్దాభిహితే కేన విశిష్టోఽర్థః ప్రతీయతే ॥

కుత్సితత్వేన = నిందితమగుటచే, కుత్స్యః + వా = నిందకు అర్హమైనది, వా = అట్లుకాక, కుత్సితః = నిందితమగుట, న + సమ్యక్ = సముచితము కాదు— ఈ మొదలగు, విశిష్టః = వేఱుగ వక్కాణింపబడిన, అర్థః = అర్థము, స్వశబ్దాఽభిహితే = స్వశబ్దముచే చెప్పబడిన స్థలమందు (కుత్సార్థమును సూటిగ చెప్పు కుత్సిత శబ్దము విషయమున), కేన = క ప్రత్యయముచే, ప్రతీయతే = తెలియబడును.

తాత్పర్యము— ''కుత్సితకః'' మొదలగుచోట్ల, తెలియబడు నింద ''తగినదియే''

అనికాని, ''వాస్తవముగ నింద తగదు. అది ఎవరో కిట్టని వ్యక్తి మోపినది'' అని కాని ఒకానొక విశేషమును ''క'' ప్రత్యయము సూచించును. అనగా కేవలము కుత్సిత శబ్దముచే నిందా సామాన్యమును, క ప్రత్యయముచే అందలి విశేషమును తెలియజేయవచ్చును గాన క ప్రత్యయము సార్థకమగును. ఉన్న నిందకే వేరొకరీతిని నిందను కల్పించి క ప్రత్యయమును ఉపయోగించుకొనవచ్చునని సారాంశము.

అవతారిక— మీద చూపినట్లు రెండవ రకమగు నిందను చెప్పనక్కర లేదు. కుత్సిత, అను శబ్దమువలన సహజముగ తెలియు నిందనే క ప్రత్యయము బోధించునని మార్గాంతరమును చూపుచున్నాడు.

శ్లో॥ న చ సాంప్రతికీ కుత్సా భేదాఽభావాత్ ప్రతీయతే ।
పూజ్యతే కుత్సితత్వేన ప్రశస్తత్వేన కుత్స్యతే ॥ 5

భేదాఽభావాత్ = ఎట్టి భేదమును లేనందువలన, సాంప్రతికీ = ప్రస్తుతమైన, కుత్సా = నింద, న + ప్రతీయతే + చ = తెలియబడదు, కుత్సితత్వేన = నిందితమగుటచే, **పూజ్యతే** = **పూజింపబడును** (ఒక వస్తువు), ప్రశస్తత్వేన = ప్రశంసింపబడిన దగుటచే, **కుత్స్యతే** = నిందింపబడును (వేరొక వస్తువు).

తాత్పర్యము— కుత్సితము = నిందితము. అట్లు దూషింపబడిన ద్రవ్యమే ఒకప్పుడు కొందరికి పూజనీయము కావచ్చును. అట్లే పూజ్యమగు వస్తువే మరికొందరికి కుత్సితము కావచ్చును. వస్తువులకు చెందు నిందా ప్రశంసాదులు ఆపేక్షికములు— నియతములు కావు. కావుననే ''కుత్సితకః'' మొదలగుచోట్ల ప్రశంసార్థమున క ప్రత్యయమనియు (ప్రశస్తః - కుత్సితః), ''ప్రశస్తకః'' మొదలగు స్థలములందు నిందార్థమున క ప్రత్యయమనియును (కుత్సితః - ప్రశస్తః) చెప్పుట కవకాశమున్నది. కాగా అట్టి సంశయమునకు తావు లేకుండ కుత్సితకః, అనుచోట ''ప్రస్తుతము నిందయే'' అని నొక్కి చెప్పుటకు క ప్రత్యయము చేరునని చెప్పవచ్చును.

వివరణము— నిందితము, ప్రశస్తము మొదలగు పెక్కు అర్థములను బోధించుటకు క ప్రత్యయము విధింపబడినది. ఆ యా అర్థమును సూటిగ చెప్పు శబ్దములకు మరల అదే యర్థమున క ప్రత్యయము రాదగునా? తగదా?— అను శంకకు సమాధానముగ ఈ సందర్భమంతయు బయలుదేరినది. ఇచటి సమాధానము మొత్తముపై మూడు విధములుగా ఉన్నది: (1) కుత్సితమునకే వేరొక రీతిని కుత్సను తెలుపుటకు క ప్రత్యయము. (2) ప్రస్తుతమైన కుత్సనే నొక్కిచెప్పుటకు క ప్రత్యయము. (3) అర్థమును మార్చివేసి వేరొక అర్థమును చెప్పుటకు క ప్రత్యయము. ఇంతటితో సమానాధికరణ తద్ధితవిచారము ముగిసినది.

(2) సమానాధికరణ సుబ్ వృత్తి (సమాస) విచారము

అవతారిక— కుత్స, ప్రశంస మొదలగు ధర్మములవలెనే విశేషణ విశేష్యభావ మను ధర్మము కూడ, సంపూర్ణమగు పదమునకే సంబంధించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ విశేషణవిశేష్యత్వం పదయోరుపజాయతే ।
న ప్రాతిపదికార్థశ్చ తత్రైవం వ్యతిరిచ్యతే ॥ 6

విశేషణవిశేష్యత్వమ్ = విశేషణ విశేష్యభావము, పదయోః = సంపూర్ణమైన పదములకు, ఉపజాయతే = కలుగును, ఏవమ్ + చ = ఇట్లయినపుడు, తత్ర = అచట, ప్రాతిపదికార్థః = ప్రాతిపదికము యొక్క అర్థము, న + వ్యతిరిచ్యతే = మారదు

తాత్పర్యము— అన్ని విధముల పరిపూర్ణములైన పదములకే విశేషణ విశేష్య భావమను సంబంధము కలుగుచుండును. అట్టిచోట్ల ప్రాతిపదికార్థములో ఏ విధమైన మార్పును ఉండదు.

వివరణము— "వీరః + పురుషః" మొదలగు చోటులందు, జాతి, ద్రవ్య, లింగ, సంఖ్యా, కారకములనెడి ప్రాతిపదికార్థము ఆయ పదములవలన మొదట పూర్తిగా బోధ పడును. ఇచట ఎట్టి మార్పును ఉండదు. పిదప ఆ రెండు పదములకును ఒకదానితో వేరొక దానికి అన్వయమును చేసినపుడు, "ఒకటి విశేషణము - మరొకటి విశేష్యము" అను సంబంధము వాక్యార్థము రూపముగా సిద్ధించును. "వీరుడైన పురుషుడు" మొదలగు రీతిని బోధ కలుగును కాగా విశేషణ విశేష్యభావమనునది వాక్యార్థరూపమేగాని పదార్థరూపము కాదు.

విశేష విషయములు— "విశేషణం విశేష్యేణ బహులమ్" (2-1-56) అను సూత్రముచే సమాసము విధింపబడినది. విశేషణమైన సుబంతము విశేష్యమైన సుబంతముతో సమసించునని అర్థము. "వీరపురుషః" మొదలగునవి ఉదాహరణములు. (వీరః + చ + సః + పురుషః + చ). ఇట్టివానికి సమానాధికరణ సమాసములని పేరు. (సమానమ్ = ఒకటే యగు, అధికరణమ్ = ఆశ్రయః = అర్థము, యస్య + సః = సమానాధికరణః = ఒకే యర్థ మును బోధించు పదము). వీనియందు ప్రకాశించు విశేషణ విశేష్యభావమను సంబంధమును విశదీకరించుటకు ఈ ప్రసంగము బయలుదేరినది

సమానాధికరణములగు పదములను వాడినపుడు వాని యర్థము తొలుత విడివిడి గానే స్ఫురించుననియు, పిదప వాక్యముగాకాని సమాసముగాకాని ఆ పదములను బంధింప దలచినపుడు ఒకదాని యర్థము విశేష్యముగాను (ప్రధానము) వేరొక దాని యర్థము విశేష ణముగాను (అప్రధానము) భాసించుననియును నిర్ణయింపవలెను. ఇట్టి సంబంధము వాక్య దశలో కలుగునగాన అది వాక్యార్థమగును కాని పదార్థము (పదములయొక్క అర్థము) కానేరదు.

"వీరః పురుషః", "నీలమ్ ఉత్పలమ్" మొదలగు ప్రయోగములలో రెండు పదార్థములును ముఖ్యములనుట నిష్ఫలముగాన, ఒకటి ముఖ్యమనియు వేరొకటి అముఖ్య మనియును చెప్పక తప్పదు ద్రవ్యము ప్రధానమును దానియందలి గుణము అప్రధానమును సామాన్యముగా అగుచుండును. అట్లు కుదరనిచోట్ల గుణప్రధాన భావమును (ముఖ్యాఽముఖ్య భావమును) కల్పించుకొనవచ్చును.

కాగా సమానాధికరణ సమాసములలో విశేషణ విశేష్యభావము వేరుగ ప్రకాశింపు చుండును. ॥6॥

అవతారిక— సమానాధికరణములగు స్థలములలో, "ఒకటి గుణము (అప్రధానము) వేరొకటి ప్రధానము" అను విషయము ఎట్లు తెలియనగునో వివరించుచున్నాడు.

శ్లో॥ విశేష్యం స్యాదనిర్జ్ఞాతం నిర్జ్ఞాతార్థో విశేషణమ్ ।
పరార్థత్వేన శేషత్వం సర్వేషాముపకారిణామ్ ॥ 7

అనిర్జ్ఞాతమ్ = స్పష్టముగా తెలియబడనిది, విశేష్యమ్ = విశేష్యము, స్యాత్ = అగును, నిర్జ్ఞాతార్థః = స్పష్టముగా తెలిసిన అర్థముగలది, విశేషణమ్ = విశేషణము, స్యాత్ = అగును' ఉపకారిణామ్ = ఉపకారముచేయు, సర్వేషామ్ = అన్నిటికి, పరార్థత్వేన = ఇతరముల కుపయోగించుటచే, శేషత్వమ్ = అప్రధానమగుట, (భవతి = అగును).

తాత్పర్యము— ఎట్టి విశేషమును తెలియక సామాన్యముగ పేర్కొనబడు వస్తువు విశేష్యము. దానియందలి ఒకానొక విశేషమును చెప్పునది విశేషణము. విశేషణములన్నియు వస్తువునకు చెందును కావున అవి అప్రధానములగును. విశేష్యమెప్పుడును ప్రధానముగ నుండును.

వివరణము— వేరు చేయునది విశేషణము. ఉదా "నీలమ్ + ఉత్పలమ్" (నల్ల కలువ). ఇచట నీల శబ్దము, మిగిలిన కలువలనుండి ప్రస్తుతమైన కలువను వేరు చేయును. భేదకము(విడదీయునది), అవచ్ఛేదకము(కేటాయించునది), ఉపకారకము (సాయము చేయునది), శేషము (వేరుగా మిగులునది) మొదలగునవి విశేషణమునకు నామాంతరములు. వేరు చేయబడునది విశేష్యము అనగా ఎట్టి విశేషమును తెలియకుండ చూపబడిన వస్తువు ఉదా : "ఉత్పలమ్" ఈ పదము ఏ కలువనైనను తెలియజేయును. భేద్యము, అవచ్ఛేద్యము, ఉపకార్యము, శేషి మొదలగునవి విశేష్యమునకు మారు పేర్లు. విశేష్యము సూటిగా క్రియతో అన్వయించును. విశేషణములన్నియు విశేష్యమునకు సంబంధించిన వివరణములను విశదీకరించుచు విశేష్యముతోనే అన్వయించును. కాన అవి ఉపకారకములు. వానికి సూటిగా క్రియాన్వయము కుదురదు. అందుచే విశేష్యము ప్రధానము. విశేషణము అప్రధానము.

విశేష విషయములు— విశేషణములన్నియు సామాన్యముగా గుణములను తెలుపును. గుణము లెప్పుడును ఒక ద్రవ్యమును ఆశ్రయించి ఉండును. (విడిగా నుండవు),

విశేష్యము ఎల్లప్పుడును ద్రవ్యమై యుండును ద్రవ్యమునకే క్రియతో అన్వయము సహజము. గుణమున కది అసంభవము. ఉదా: ''రక్తం సరసిజమానయ'' (ఎర్రని పద్మమును తెమ్ము). ఇచట ''తెచ్చుట'' అను క్రియతో పద్మమునకే సంబంధము కుదురును ''ఎరుపు'' అను గుణమును విడిగా తెచ్చుట కుదురదు. ద్రవ్యము ద్వారా గుణమునకు క్రియాన్వయము లభించును. కాగా క్రియతో అన్వయించు ద్రవ్యమే ముఖ్యమగుటయు, దానికి తోడ్పడు గుణము అముఖ్యమగుటయుస స్వభావసిద్ధమని అనవచ్చును ॥7॥

అవతారిక— పై యంశమును వేరొక రీతిని వివరించుచున్నాడు.

శ్లో॥ విభక్తిభేదో నియమాద్గుణ గుణ్యభిధాయినోః ।
సామానాధికరణ్యస్య ప్రసిద్ధిర్ద్రవ్య శబ్దయోః ॥ 8

గుణగుణ్యభిధాయినోః = గుణమును ద్రవ్యము (గుణి)ను చెప్పు శబ్దములకు, నియమాత్ = తప్పక, విభక్తిభేదః = వేర్వేరు విభక్తియుండుట, (భవతి = అగును), ద్రవ్యశబ్దయోః = ద్రవ్యములను బోధించు రెండు శబ్దములకు, సామానాధికరణ్యస్య = సమానాధికరణ భావము యొక్క (ఒకే విభక్తిలో ఉండుట = ఒకే యర్థమును తెలుపుట) ప్రసిద్ధిః = ప్రసిద్ధి, (స్యాత్ = అగును).

తాత్పర్యము— ద్రవ్యమును వేరుగను, దానియందలి గుణమును వేరుగను, చెప్పునపుడు ద్రవ్యమును బోధించు శబ్దమునకు షష్ఠీ విభక్తియు గుణమును బోధించు శబ్దమునకు ప్రథమయు తప్పక వచ్చును. అది సహజమును శాస్త్రీయమును అగును ఉదా: ''పటస్య శుక్లః'' (బట్టయొక్క తెలుపు). అట్లుగాక రెండు శబ్దములును ద్రవ్యవాచకములే అయినచో రెండిటికిని ప్రథమయే సహజము. ఆ రెండును సమానాధికరణములగును. సామర్థ్యమును సందర్భమును బట్టి అందొకటి ప్రధానమును వేరొకటి అప్రధానమును అగుచుండును. ఉదా: ''వీరః పురుషః'' (వీరుడైన పురుషుడు).

వివరణము— ద్రవ్యమాధారము. గుణమాధేయము. కాగా ఒకప్పుడు గుణమును ముఖ్యముగను ద్రవ్యమును అముఖ్యముగను సూచింపదలచినపుడు అట్టి సంబంధము విశదమగుటకు ద్రవ్యవాచకమునకు షష్ఠియు (షష్ఠి సంబంధమును సూచించును), గుణవాచకమునకు ప్రథమయు (ముఖ్యమగు స్వార్థమును ప్రథమ సూచించును) సహజములు. ఇట్టి ప్రయోగములను వ్యధికరణములందురు. అనగా వేర్వేరు విభక్తులను కలిగిన పదములు ఏదో ఒక సంబంధమును బట్టి అన్వయమును పొంది గుణప్రధాన భావమును స్పష్టపరచుట. ఉదా: ''పటస్య శుక్లః'' ''రాజ్ఞః పురుషః'' మొదలగునవి. ఇచట విడిగా పదములను వాడవచ్చును. లేక షష్ఠీ తత్పురుష సమాసమునైనను చేయవచ్చును (పటశుక్లః, రాజపురుషః, మొదలగునవి) వ్యధికరణము లగుటయే వైయధికరణ్యము. ఇట్టి సందర్భములలో గుణప్రధాన భావము విభక్తులను బట్టియే విశదమగును. అట్లుగాక రెండు పదములును ద్రవ్యమునే బోధించునపుడు, తమ తమ సహజార్థమును తెలుపుచు ప్రథమా విభక్తియే రెండిటికిని అగును ఉదా: ''వీరః

పురుషః''. ఇట్టివి సమానాధికరణము లగును. (ఒకే విభక్తి కలిగి చివరకు గుణప్రధాన భావమును పొందుట). ఇట్టిచోట్ల రెండిటిని ముఖ్యముగ అన్వయించుట సహజము కాదుగాన, స్ఫుటముగ లేకున్నను ప్రయోగ సామర్థ్యమునుబట్టి గుణప్రధాన భావమును తుదకు అంగీకరింపక తప్పదు. అనగా వానికి విశేషణ విశేష్య సంబంధము ఏర్పడును. ("వీరుడైన పురుషుడు మొదలగు అర్థము వచ్చును). సమానాధికరణములగు పదములను గూడ విడివిడిగా వాడవచ్చును. లేక— సమాసమును చేసియైనను ప్రయోగింపవచ్చును (వీరపురుషః. మొదలగు రీతిని), అట్టి సమాసమే కర్మధారయమనబడును. ॥8॥

అవతారిక— రెండు పదములుకూడ ముఖ్యముగా ద్రవ్యమునే బోధించు సమానాధికరణ స్థలములలో, విశేషణ విశేష్యభావము సిద్ధించురీతిని మూడు కారికలతో విశదము చేయుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యేఽవిర్జ్ఞాత జాతీయే కృష్ణ శబ్దః ప్రయుజ్యతే ।
అనిర్జ్ఞాతగుణేచైవ తిలశబ్దః ప్రవర్తతే ॥ 9

అనిర్జ్ఞాత జాతీయే = స్పష్టముగ తెలియని జాతిగల, ద్రవ్యే = ఒక పదార్థమందు, కృష్ణ శబ్దః = కృష్ణ, అను శబ్దము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును, అనిర్జ్ఞాతగుణే = స్పష్టముగ తెలియని గుణముగల, ద్రవ్యే + చ + ఏవ = పదార్థమందే, తిలశబ్దః = తిల, అను శబ్దము, ప్రవర్తతే = ప్రవర్తించును.

తాత్పర్యము— "కృష్ణాః తిలాః" (నల్ల నువ్వులు - ఇచటనే సమాసమైనచో "కృష్ణతిలాః" అని యగును) అను ప్రయోగమును తీసికొని సమన్వయము చూపబడుచున్నది. ఇచట కృష్ణ శబ్దము స్వతంత్రముగ ఒక ద్రవ్యమును చెప్పవచ్చును. (ద్రవ్యమునకును గుణమునకును అభేదమును కల్పించి "నల్లకాకులు" "నల్లకోయిలలు" మొదలగు ఏదో ఒక వస్తువును బోధించుననుటకు అవకాశముండును). అయినను "ఆ వస్తువు ఏది ? ఏ జాతికి చెందినది ?" (కాకియా - కోకిలయా మొదలగు) అను సంశయము తప్పదు. అట్లే తిలశబ్దము ద్రవ్యమును సామాన్యముగ బోధింపవచ్చును. కాని గుణమును (నలుపు, తెలుపు, మొదలగునవి) చెప్పజాలదు. ఇచట కూడ గుణమును గురించి సంశయము తప్పదు. కాగా కృష్ణ శబ్దము జాతిని తిలశబ్దము గుణమును అపేక్షించుచుగాన రెండిటికిని విశేషాపేక్ష సమానమే యగును. (అందువలన రెండును ఒకదానితో వేరొకటి కలిసి సంశయములేని యర్థమును బోధింప సమకట్టును) అదియే విశేషణ విశేష్యభావము అదే సముచితము.

శ్లో॥ సామాన్యానామ సంబంధాత్తౌ విశేషే వ్యవస్థితా ।
రూపాఽభేదాద్విశేషం తమభివ్యంక్తుం న శక్నుతః ॥ 10

సామాన్యానామ్ = కేవలము ద్రవ్య సామాన్యములతు, అసంబంధాత్ = సంబంధము లేనందున

వలన, తౌ = ఆ కృష్ణ - తిల - శబ్దములు, విశేషే = ఆ యా విశేషమందు, వ్యవస్థితౌ = నియతములు, (భవతః = అగును), తమ్ = ఆ, విశేషమ్ = విశేషమును, రూపాఽభేదాత్ = స్వరూపములో భేదము లేనందువలన, అభివ్యంక్తుమ్ = విశదపరచుటకు, న + శక్నుతః = సమర్థములు కావు.

తాత్పర్యము— "కృష్ణాః - తిలాః" మొదలగుచోట్ల రెండు శబ్దములును ఎట్టి విశేషమునులేని ద్రవ్యమునే బోధించుచున్నచో వానికి పరస్పరము సంబంధము కుదురదు. (దేనికదే ముఖ్యమైన రెండు వస్తువులను కలిపి చెప్పుట ఎందులకు ? ఇట్టివి ద్వంద్వ సమాసములు కావు గదా !) కాన ఆ రెండు శబ్దములును విశేషమునే సూచించునని చెప్పవలెను (కృష్ణ శబ్దము తిలజాతి విశేషమును తిలశబ్దము కృష్ణ గుణవిశేషమును అపేక్షింపక తప్పదు). అయితే - ఆ రెండు శబ్దముల స్వరూపము ఎప్పుడును ఒకటేగాన (సామాన్యమును చెప్పినను విశేషమును చెప్పినను) ఆ యా విశేషము వెనువెంటనే విశదము కాదు.

వివరణము— కృష్ణ - తిల - శబ్దములకు ఒక సంబంధమున్నదని తెలియక పూర్వము, అభీష్టమైన విశేషార్థము వానివలన తెలియుట కష్టము అందుచే వానికొక సంబంధమును చెప్పవలెను. అదియే "విశేషణ విశేష్యభావము" అని ఫలితము.

శ్లో॥ తావేవం సన్నిపతితౌ భేదేన ప్రతిపాదనే ।
అవచ్ఛేదమివాఽఽధాయ సంశయం వ్యపకర్షతః ॥ 11

ఏవమ్ = ఇట్లు, ప్రతిపాదనే = అర్థమును బోధించుటయందు, భేదేన = భేదముతో, సన్నిపతితౌ = ఒక దగ్గర కూడిన, తౌ = ఆ రెండు శబ్దములును, అవచ్ఛేదమ్ = నిశ్చయమును, ఆధాయ + ఇవ = వహించినట్లు, సంశయమ్ = సందేహమును, వ్యపకర్షతః = పోగొట్టును.

తాత్పర్యము— "కృష్ణాః తిలాః" అని విడిగాకాని "కృష్ణతిలాః" అని సమాసముగా కాని ప్రయోగించినపుడు, ఆ రెండు శబ్దములకు గల సంబంధమొకటి తప్పక స్ఫురించి కృష్ణ శబ్దము గుణమును (నలుపు) చెప్పి విశేషణమగుననియు, తిలశబ్దము ద్రవ్యమును బోధించి విశేష్యమగుననియు నిర్ణయము కలుగును. అట్టి నిర్ణయము వానికిగల పరస్పరాపేక్ష అనెడి ధర్మమువలన ఏర్పడును. (ఇట్టి చోట్ల తిలశబ్దముతో కలియు కృష్ణశబ్దము గుణవిశేషవాచకమనియు, కృష్ణశబ్దముతో కలియు తిలశబ్దము ద్రవ్యవిశేషవాచకమనియును తెలియుచుండును).

వివరణము— ఎట్టి సంబంధమును లేని విడి విడి పదములు సరియైన అర్థమును బోధింపజాలవు. కావున సమాసముగనో వాక్యముగనో పదములను వాడినపుడు వానికొక సంబంధముండి తీరవలెను అట్టి సంబంధము అర్థమందు కలుగు సంశయములను పోగొట్టును ప్రకృతమున గుణవాచకమును (కృష్ణ) ద్రవ్యవాచకమును (తిల) కలిపి పలికినపుడు ద్రవ్యము ప్రధానమనియు, గుణము ద్రవ్యమందుండును గాన అప్రధానమనియును విశదమైపోవును.

ఇట్టి తీరునే విశేషణ విశేష్యభావమందురు. ఆ పదములకు గల సంబంధమదియే యని సారాంశము.

"వీరః పురుషః" మొదలగు చోట్ల రెండును ద్రవ్యవాచకములే అగును. అయినను అచట గూడ విశేషణ విశేష్యభావమును సందర్భానుసారము కల్పింపక తప్పదు. సమానాధికరణ సమాసము లన్నిటియందును ఈ తీరునే ఊహించునది. ॥11॥

అవతారిక— "వీరపురుషః", "కృష్ణతిలాః" మొదలగు చోట్ల పదార్థములకు ఏర్పడు విశేషణ విశేష్యభావము సామానాధికరణ్య రూపము. సామానాధికరణ్యమనగా ఎట్టిది? "సమానమ్ + అధికరణమ్ + యస్య సః = సమానాధికరణః - సమానాధికరణస్య భావః = సామానాధికరణ్యమ్" అని వ్యుత్పత్తి. అధికరణమనగా ఆశ్రయము —లేక— ఆధారము. కావున "అనేకములు ఒక స్థలమందుండుట" అని సామాన్యమగు అర్థము. ప్రకృతమున ఈ యర్థ మెట్లు సరిపోవును? "వేర్వేరు ప్రవృత్తి నిమిత్తములు గల (జాతి, గుణము మొదలగునవి) రెండు శబ్దములు ఒకే యర్థమును బోధించుట"యా? లేక— "రెండు శబ్దములకును అర్థ మొకటియే" అనియా? —లేక— "రెండర్థములకును ఆధార మొకటియే" అనియా?— మొదలగు శంకలు కలుగును. వానిని తొలగించుటకు సామానాధికరణ్యమనగా ఎట్టిదియో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యాత్మా గుణసంసర్గభేదా దాశ్రీయతే పృథక్ ।
జాతిసంబంధ భేదాచ్చ ద్వితీయ ఇవ గృహ్యతే ॥ 12

గుణ సంసర్గభేదాత్ = గుణముతోడి సంబంధమువలన ఏర్పడు భేదమువలన, ద్రవ్యాత్మా = ద్రవ్యమనెడి ఆత్మ (పదార్థము), పృథక్ = వేరుగా, ఆశ్రీయతే = స్వీకరింపబడును, జాతి సంబంధ భేదాత్ + చ = జాతియొక్క సంబంధముచే ఏర్పడు భేదమువలన, ద్వితీయః + ఇవ = రెండవదివలె, గృహ్యతే = గ్రహింపబడును.

తాత్పర్యము— ఎట్టి విశేషములును లేని చైతన్యరూపమైన ఆత్మయే ద్రవ్యము. అది ఒక్కటే ఆయినను గుణముతోడి సంబంధమువలన వేరుగను జాతితోడి సంబంధము వలన వేరొకటిగను కనిపించుచుండును.

వివరణము— "కృష్ణాః - తిలాః" మొదలగుచోట్ల రెండు శబ్దములును ఒకే వస్తువును బోధించును. ఆ వస్తువు వాస్తవముగ ఆత్మచైతన్యమే. (అదే ప్రపంచమంతకును ఆధారము) అదొకటియే అయినను గుణసంబంధముచేతను (నలుపు, తెలుపు మొదలగునది), జాతి సంబంధముచేతను (తిలత్వము, ఉత్పలత్వము మొదలగునది) రెండుగ భాసించుచుండును. ఇట్టి భేదము కేవలము జాతిగుణాదుల కల్పననుబట్టి ఏర్పడును. కాగా కృతకమైన భేదముచే కృష్ణ శబ్దము "కృష్ణగుణముగల తిలలు" అను ఒక ద్రవ్యమును, తిలశబ్దము "తిలత్వమును జాతిగల వేరొక ద్రవ్యమును" బోధించుననియు ఇట్లు రెండు ద్రవ్యములున్నట్లు అనుకొన వలయుననియును పర్యవసించును. ॥12॥

అవతారిక— పై యంశమునే సమర్థించుచున్నాడు.

శ్లో॥ నిమిత్తైరభిసంబంధా ద్యా నిమిత్త సరూపతా ।
తయైకస్యాఽపి నానాత్వం రూపాఽభేదాత్ ప్రకల్ప్యతే ॥ 13

నిమిత్తైః = గుణము, జాతి మొదలగు ప్రవృత్తి నిమిత్తములతో, అభిసంబంధాత్ = సంబంధము వలన, నిమిత్తసరూపతా = నిమిత్తముల సారూప్యము, యా = ఏది కలదో, తయా = దానిచే, ఏకస్య + అపి = ఒకటే అయిన దానికిని (ద్రవ్యమునకు), నానాత్వమ్ = అనేకత్వము, (భేదము), రూపాఽభేదాత్ = స్వరూపము యొక్క భేదము లేనందువలన, ప్రకల్ప్యతే = కల్పింపబడును.

తాత్పర్యము— ద్రవ్యమొకటే. అయినను దానియందలి గుణము, జాతి, మొదలగు ధర్మములకు గల భేదమును పురస్కరించుకొని, ద్రవ్యభేదమును కల్పించుకొనవచ్చును. ఉదా : తిలాః = నువ్వులు. ఈ పదార్థమెప్పుడును ఒకటే. కాని కృష్ణ, శుక్ల (తెల్లని) మొదలగు గుణముల భేదమువలన దీనికిని భేదము కల్పింపబడును. కాగా ''కృష్ణతిలాః'' అనుచోట కృష్ణ శబ్దము ''నల్ల నువ్వులు'' అను ఒక ద్రవ్యమును, తిల శబ్దము ''నువ్వులు'' అను వేరొక ద్రవ్యమును బోధించుటచే రెండు ద్రవ్యములున్నవని భావింపవలెను. ॥13॥

అవతారిక— మీద చూపిన విధమున భేదకల్పనచే సిద్ధించిన రెండు ద్రవ్యములును ఆధేయములే. (ఒక వస్తువును ఆశ్రయించునవి). వీని కాధారమగు మూడవ ద్రవ్యమును కూడ కల్పించుకొనవలెనని చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యావస్థా తృతీయా తు యస్యాం సంసృజ్యతే ద్వయమ్ ।
తయోరవస్థయోర్భేదాదాశ్రయత్వే నియుజ్యతే ॥ 14

ద్వయమ్ = జాతి, గుణములచే వేరుచేయబడిన ద్రవ్యద్వయము, యస్యామ్ = ఏ అవస్థయందు, సంసృజ్యతే = కలియునో, (సా = అట్టి), తృతీయా = మూడవదైన, ద్రవ్యావస్థా + తు = ద్రవ్యముయొక్క అవస్థ అయితే, తయోః = ఆ, అవస్థయోః = అవస్థలకు, భేదాత్ = భేదమువలన, ఆశ్రయత్వే = ఆధారముగా, నియుజ్యతే = కల్పింపబడును.

తాత్పర్యము— పూర్వోక్తమగు కల్పనచే సిద్ధించిన రెండు ద్రవ్యములకును ఆధారమగునట్లుగా మూడవ ద్రవ్యము నొకదానిని కూడ కల్పింపవలెను. దానిపై రెండు ద్రవ్యములును కలిసి విశ్రమించును. ఈ రీతిని సామానాధికరణ్యము సాధ్యమగును. (రెండు వేర్వేరు వస్తువులు ఒక దానియందు కూడుట). అనగా సమానాధికరణ స్థలములలో పదార్థముల సంబంధమును భావించు సమయమున మూడవ ద్రవ్యమును కూడ అంగీకరించినగాని సాంకేతికమైన సామానాధికరణ్యము సంభవింపదని ఫలించును.

వివరణము— ''కృష్ణాః - తిలాః''. ఇచట కృష్ణ శబ్ద మొక తిలద్రవ్యమును

తిలశబ్దము వేరొక తిలద్రవ్యమును బోధించును. ఈ రెండింటికిని ఆధారముగ మూడవ తిల ద్రవ్యము కలదని ఊహింపవలెను. దీనియందు పై రెండును కలిసియుండును. ఇదియే సామానాధికరణ్యము. ఇట్టి కల్పన చేయనిచో సామానాధికరణ్యము సార్థకము కాకపోవును, ॥14॥

అవతారిక— ఒకే ద్రవ్యమునకు బుద్ధి పరికల్పితమైన భేదమును చూపవచ్చునని అనుచున్నాడు.

శ్లో॥ బుద్ధ్యైకం భిద్యతే భిన్నమేకత్వంచోపగచ్ఛతి ।
బుద్ధ్యాఽవస్థా విభజ్యంతే సాహ్యర్థస్య విధాయికా ॥ 15

ఏకమ్ = ఒకటే అగు వస్తువు, బుద్ధ్యా = బుద్ధిచే, భిద్యతే = వేరుచేయబడును, భిన్నమ్ = విడివిడిగా ఉండునది, ఏకత్వమ్ = ఒకటేయగుటను, ఉపగచ్ఛతి + చ = పొందునుకూడ, అవస్థాః = అవస్థలు, బుద్ధ్యా = బుద్ధిచే, విభజ్యంతే = విడదీయబడును, సా = ఆ బుద్ధి, అర్థస్య = అర్థమును, విధాయికా + హి = సమర్పించునది గదా ।

తాత్పర్యము— ఎట్టి యర్థమునయినను ప్రకాశింపజేయు శక్తి బుద్ధికి గలదు. దాని వలననే ఒక వస్తువే ఎన్నో వస్తువులుగాను, ఎన్నో వస్తువులు ఒకే వస్తువుగాను భాసించు చుండును.

వివరణము— కాగా "కృష్ణతిలాః" మొదలగుచోట్ల సమాసము కానపుడు ఆ రెండు శబ్దములును వేర్వేరు ద్రవ్యములను బోధించుననియు, సమాసమైనపుడు ఒకే ద్రవ్య మును తెలియజేయుననియును ఈ మొదలగు విశేషాంశములు బుద్ధివైభవము యొక్క ఫలిత ములే అని తెలియవలెను. ॥15॥

అవతారిక— బుద్ధి పరికల్పితములైన భేదాఽభేదములు వార్తికకారునికి (కాత్యా యనుడు) అభిమతమే అని చెప్పుచున్నాడు

శ్లో॥ వ్యపదేశివదేకస్మిన్ బుద్ధ్యా నానార్థకల్పనా ।
తయా కల్పితభేదః సన్నర్థాత్మా వ్యపదిశ్యతే ॥ 16

ఏకస్మిన్ = ఒకే వస్తువునందు, వ్యపదేశివత్ = వేర్వేరు వ్యవహారములు కలిగినట్లుండుట, (భవతి = అగును), బుద్ధ్యా = మనసుచే, నానార్థ కల్పనా = పెక్కు అర్థములను కల్పించుట, (స్యాత్ = అగును), తయా = ఆ బుద్ధిచే, కల్పితభేదః + సన్ = ఏర్పడిన భేదములు గలదై అర్థాత్మా = అర్థస్వరూపము, వ్యపదిశ్యతే = వ్యవహరింపబడును.

తాత్పర్యము— ఒకే వస్తువు బుద్ధిశక్తిచే వేర్వేరుగ భాసింపవచ్చును. శబ్దముల వలన కలుగు అర్థజ్ఞానమంతయు బుద్ధియొక్క వికారమే లేని భేదములను కూడ కల్పించి ఒక వస్తువునే అనేకముగ బుద్ధి చూపించగలదు.

వివరణము— ముఖ్యమగు ఒక ధర్మమును బట్టి ఒక వస్తువును ఒక శబ్దముతో బోధింతుము. అది సహజమే. కాని ఒకప్పుడు అట్టి ధర్మమును కల్పించియైనను ఆ శబ్దముతో ఆ యర్థమును బోధించుట లోకసిద్ధమైన విషయము. ఉదా : ముగ్గురు కుమారులున్నపుడు వరుసగా "అయమ్ జ్యేష్ఠః" (ఇతడు పెద్దవాడు), "అయం మధ్యమః" (ఇతడు నడిమివాడు), "అయం కనిష్ఠః" (ఇతడు చివరివాడు) అను వ్యవహారము ఆ ముగ్గురికిని సూటిగ సరిపోవును. అట్లుగాక ఒకే కుమారుడున్న సందర్భములో కూడ పై వ్యవహారములు వినబడుచుండును. ("వీడే జ్యేష్ఠుడును, మధ్యముడును, కనిష్ఠుడును కూడ"– అని యనుచుందురు) ఇచట జ్యేష్ఠత్వము, మధ్యమత్వము, కనిష్ఠత్వము అను ధర్మములు ఒకే వ్యక్తియందు సంభవింపవు. అయినను బుద్ధిచే కల్పించి ఆ యా శబ్దములను వాడుచుందురు. ఈ విధముగ ఒకే వస్తువునకు వేర్వేరు ధర్మములను ఆరోపించి (అంటగట్టి) చెప్పుటయే "వ్యపదేశివద్భావము" అగును.

విశేష విషయములు— వి = విశిష్టః = ముఖ్యమైన, అపదేశః = వ్యవహారము, అస్య + అస్తి = దీనికి గలదు = వ్యపదేశీ = ముఖ్యమైన ధర్మమునుబట్టి ఒకానొక శబ్దముచే సూటిగా బోధింపబడునది. ఉదా : "జ్యేష్ఠః" పెద్దతనమను ధర్మముచే పెద్దయగు వానిని ఇది సహజముగా చెప్పును. "వ్యపదేశినా + తుల్యమ్ = వ్యపదేశివత్ = ముఖ్యమైన వ్యవహారము కలిగిన దానితో సమానము. (కల్పనవలన అట్లగుట కుదురును) "అద్యంతవదేకస్మిన్" (1-1-21) అను సూత్రమును వ్యాఖ్యానించు సందర్భమున" తత్ర వ్యపదేశివద్వచనమ్ । ఏకాచో ద్వే ప్రథమార్థమ్" అని కాత్యాయనుడు తొలుత చెప్పెను. "ఏకాచోద్వే ప్రథమస్య" (6-1-1) అను సూత్రము ధాతువునందలి తొలి ఏకాచ్చునకు (ఏకః + అచ్ + యస్య - సః = ఒక అచ్చుగల భాగము) ద్విత్వమును విధించును. ఒకే ఒక అచ్చుగా ఉన్న "ఇ" మొదలగు ధాతువులకు గూడ ఆద్విత్వము సిద్ధించుటకై వ్యపదేశివద్భావమును నొక్కి చెప్పక తప్పదని ఈ వచనముయొక్క ఆశయము పిదప "అవచనాత్ లోకవిజ్ఞానాత్ సిద్ధమ్" అను వచనముతో మీది ప్రతిపాదనమును అతడే ఖండించెను. వ్యపదేశివద్భావము లోకసిద్ధమే అనియు వేరుగ చెప్పనక్కరలేదనియును దీని భావము. దీనివలన బుద్ధి కల్పితమైన భేదము (అభేదము కూడ) కాత్యాయనునికి అభిమతమేయని విశదమగును ॥16॥

అవతారిక— భేదము లేకున్నను భేదమును కల్పించుటలో, "శిలాపుత్రకస్య శరీరమ్" (సన్నికల్లు యొక్క శరీరము) అను ఒక ఉదాహరణమును చూపుచుందురు. దానిని గురించి మాటాడుచున్నాడు.

శ్లో॥ క్రియాభేదేవ దృష్టానామశ్మాదీనాం పునః పునః ।
కించిద్దర్శన మన్యేవ దర్శనేనాపదిశ్యతే ॥ 17

క్రియాభేదేన = వ్యాపారముల భేదముచే, పునః పునః = పెక్కుసారులు, దృష్టానామ్ = చూడబడిన, అశ్మాదీనామ్ = రాయి, మొదలగువానియొక్క, కించిత్ = ఒకానొక, దర్శనమ్ = జ్ఞానము, అన్యేన = వేరొక, దర్శనేన = జ్ఞానముచే, అపదిశ్యతే = వ్యవహరింపబడును.

తాత్పర్యము— "శిలాపుత్రకస్య శరీరమ్" అని ప్రయోగము. శిలాపుత్రక మనగా సన్నికల్లు. (నూరుకొనుట కుపయోగించు రాతి పలక) అది ఎల్లప్పుడును ఒకే విధముగ నుండును. వేరుగ దాని శరీరమన్నది లేదు. దాని స్వరూపమున భేదముండదు (అవయవాదుల భేదము = అనగా శరీరమును అదియును ఒకటే). అయినను భేదమును కల్పించి "దానికి సంబంధించిన శరీరము" అని వాడుక జరుగుచుండును. ఇచట క్రియలను బట్టి భేదమును కల్పించుకొనవలెను. అనగా - నూరుకొనుట, గుండచేయుట, మొదలగు పెక్కు పనులకు ఆ రాతి పలక ఉపయోగించును గదా ః అందొక్కొక్క పనికి సంబంధించిన పలక వేరు వేరని భావించి, భేదమును కల్పించుకొని ప్రకృతమైన పనికి సంబంధించిన "రాతి పలక యొక్క శరీరమిది"— అన్న విధముగా చెప్పుకొనవలెను. ॥17॥

అవతారిక— ఈ విధముగనే "ఇ" (ఇణ్) మొదలగు ధాతువుల విషయమున గూడ, ఏకాచ్త్వమును (ఏకః + అచ్ + యస్య - సః = ఏకాచ్ = ఒక అచ్చును కలిగిన భాగము ఏకాచః - భావః = ఏకాచ్త్వమ్) కల్పించుకొనవచ్చునని అనుచున్నాడు.

శ్లో॥ ప్రయోగభేదాద్ధాతూనాం ప్రకల్ప్య బహురూపతామ్ ।
భేదాఽభేదావుపాదాయ క్వచిదేకాచ్త్వముచ్యతే ॥ 18

ప్రయోగభేదాత్ = ప్రయోగముల భేదమువలన, ధాతూనామ్ = ధాతువులకు, (ఒకే అచ్చుగా ఉన్న "ఇ" మొదలగువానికి), బహురూపతామ్ = పెక్కు రూపములను, ప్రకల్ప్య = కల్పించి, భేదాఽభేదా = భేదమును అభేదమును, ఉపాదాయ = స్వీకరించి, క్వచిత్ = కొన్ని చోట్ల, ఏకాచ్త్వమ్ = ఏకాచ్త్వము, ఉచ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— "ఇ" (గతౌ = వెళ్ళుట) అను ధాతువునకు వేర్వేరు ప్రత్యయములను కూర్చినపుడు, ఏతి, అయనమ్, ఇతః, ఏతా, మొదలగు పెక్కు రూపములగును. అవన్నియు ఇణ్ ధాతువులే అనుకొని భేదమును, ప్రకృతకార్యము విషయమున అభేదమును ఆశ్రయించినచో ధాతువునకు ఏకాచ్త్వము సిద్ధించును (అవన్నియు ఒక అచ్చుగల భాగములే)

వివరణము— "ఏకాచ్" అను పదము బహువ్రీహి (ఏకః, అచ్, యస్య - సః) అన్నపుడు "ఇ" ధాతువు ఏకాచ్చు కానేరదు. (గద్, వద్, మొదలగు ధాతువులవలె ఒక అచ్చుగల భాగ మిచట లేదు ఒకే అచ్చు మాత్ర మున్నది) కావున ప్రయోగ భేదమును బట్టి ధాతు భేదమును కల్పించి ఏకాచ్త్వమును సాధింపవలెను. (అవన్నియు "వేర్వేరు ధాతువులు" అనగానే ఒక అచ్చుగల భాగములగును) అట్లే "ఇ" అనుచోట (ఇయాయ - అను రూపమును సాధించుటకు ద్విత్వము చేయునపుడు) అభేదమును కల్పించి (అదియు ఇదియును ఒకటే అని చెప్పి) ఏకాచ్త్వమును సంపాదించుకొనవలెను. ॥18॥

అవతారిక— పై విషయముననే వేరొక తీరున సమన్వయమును చూపుచున్నాడు.

శ్లో॥ అన్వయవ్యతిరేకాభ్యామర్థవాన్ పరికల్పితః ।
ఏకోధాత్వర్థవిగమాత్ వర్ణత్వేనోపచర్యతే ॥ 19

అన్వయవ్యతిరేకాభ్యామ్ = ఉండుట లేకపోవుట, అనువానిచే, అర్థవాన్ = అర్థమును కలిగినదిగా, పరికల్పితః = కల్పింపబడిన, ఏకః = ఒకటి (అచ్చు), ధాత్వర్థవిగమాత్ = ధాతువుయొక్క అర్థము లేనందువలన, వర్ణత్వేన = వర్ణముగా, ఉపచర్యతే = చెప్పబడును.

తాత్పర్యము— "ఇ" ధాతువునకు ఆ యా ప్రత్యయములు చేరునపుడు తన యర్థము (వెళ్ళుట) అను గతముగ నుండును. ప్రత్యయములవియే అయినను ధాతువును మార్చినచో ఆ యర్థ ముండదు. ఈ అన్వయ వ్యతిరేకములచే ఏతి, అయనమ్, మొదలగు చోట్ల ఉండు ధాతువు (ఇణ్) "అర్థవత్తు" (అర్థముగలది) అనియు, "ఇయాయ" (ఇ - ధాతువునకు లిట్టు రూపము - ద్విత్వాదికార్యములు - ఇచట "ఇ" అను ఒక వర్ణమునే గ్రహింతుము) అనుచోట ఉండు "ఇ" అనునది అనర్థకమనియును కల్పించి "అర్థముగల ధాతువునకు అవయవమైన ఒకే అచ్చు "ఇ" అనునది" అని ఏకాచ్త్వమును సాధింపవచ్చును

వివరణము— ఇణ్ ధాతువునకు "తి" ప్రత్యయము (లట్టు - ప్రథమ పురుషము - ఏకవచనము) చేరినపుడు "ఏతి" (వెళ్ళుచున్నాడు) అను రూపమగును. "అన" ప్రత్యయము చేరినచో "అయనమ్" (వెళ్లుట) అను రూపమగును. ఇట్లే ఆ యా ప్రత్యయములు చేరినపుడు రూపములు మారినను "వెళ్ళు" అను ధాత్వర్థము మాత్రము మారదు. ఇది అన్వయము (ధాతువున్నపుడు దాని అర్థముండుట): ప్రత్యయములు మారకపోయినను ధాతువు మారినచో "వెళ్ళు" అను అర్థము లేకుండుట వ్యతిరేకము —లేక— వ్యభిచారము. (ఉదా : కరోతి = చేయుచున్నాడు, కరణమ్ = చేయుట, మొదలగునవి). ఈ రీతిని ఏతి, అయనమ్, మొదలగుచోట్ల సార్థకముగా ఉన్న ధాతువునకు అవయవమై నిరర్థకమైన ఒక అచ్చే (ఇ) "ఇయాయ" అనుచోట ఉన్నదని చెప్పి, దానికి ఏకాచ్త్వమును సమర్థింపనగును. (ఏకాచ్త్వమ్ = ఒకే అచ్చుగ ఉండుట) అట్లు అచట ద్విత్వమను కార్యమును సాధించుకొనవచ్చును ॥19॥

అవతారిక— ఇట్లు బౌద్ధమైన కల్పనలచే భేదమును స్వీకరించి వ్యపదేశివద్భావమును సాధించినట్లే, సామానాధికరణ్యమును గూడ సంపాదింపవచ్చునని ప్రకృతాంశమును ముగించుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యాత్మానస్త్రయస్తస్మాత్ బుద్ధౌ నానా వ్యవస్థితాః ।
ఆశ్రయాశ్రయిధర్మేణేత్యయం పూర్వేభ్య ఆగమః ॥ 20

తస్మాత్ = అందువలన, త్రయః = మూడైన, ద్రవ్యాత్మానః = ద్రవ్య స్వరూపములు, ఆశ్రయాశ్రయి ధర్మేణ = ఆధారాధేయభావముతో, నానా = వేర్వేరుగ, బుద్ధౌ = బుద్ధియందు, వ్యవస్థితాః = ఉన్నవి, ఇతి = అని, అయమ్ = ఈ, ఆగమః = సంప్రదాయము పూర్వేభ్యః = పెద్దలనుండి, (ఆగతః = వచ్చినది).

తాత్పర్యము— ''కృష్ణతిలాః'', ''వీరపురుషః'' మొదలగు సమాస స్థలములందు గాని, ''కృష్ణాః తిలాః'', ''వీరః పురుషః'' మొదలగు వ్యాసస్థలములందుగాని (అట్టి వాక్యము లందుగాని) మూడు విధములైన ద్రవ్యములుండునని మనసులో అనుకొనవలెను. గుణముతో కూడినది ఒక ద్రవ్యము (కృష్ణ, మొదలగు శబ్దములచే బోధింపబడునది). జాతితో కూడినది రెండవ ద్రవ్యము (తిలాది శబ్దములచే తెలియునది). రెండిటి సంబంధమును వహించునది మూడవ ద్రవ్యము (రెండు శబ్దములను అన్వయించునపుడు తెలియునది) ఇందు మొదటి రెండును ఆధేయములు (వేరొకదానియందు విశ్రమించునవి). మూడవది ఆధారము. ఇట్లు సామానాధికరణ్యము చక్కగ కుదురును. విడిగా ఉండు రెండు వస్తువులు వేరొక మూడవ వస్తువునందు విశ్రమించుటయే సామానాధికరణ్యము గదా ! ఈ తీరు చిరుకాలమునుండియు పెద్దలు అవలంబించినదే.

వివరణము— సామానాధికరణ్యము ఆవశ్యకమైన అన్నిచోటులందును ఈ పద్ధతినే అవలంబింపవలెను. రెండు పదములును జాతివాచకములే అయినచోట్ల కూడ, ఇదియే మార్గము (ఒకదానిని గుణవాచకముగా మార్చుకొనవలెను). అందువలననే శాస్త్రీయమగు సమానాధికరణ కార్యములన్నియు ప్రవర్తించును.

ఈ రీతిని అర్థములకు సామానాధికరణ్యము సాధింపబడెను. కాగా ''రెండు పదములును ఒకే వస్తువును బోధించినచో— వేర్వేరుగా వస్తువులు లేనందున— సామానాధికరణ్యము సాంకేతికముగ ఎట్లు కుదురును ?'' అను శంక తొలగిపోవును, అర్థములకే సామానాధికరణ్యము. అదియు పూర్తిగా బుద్ధి పరికల్పితము'' అన్నది ఇచటి సారము.

విశేష విషయములు— ఇట్టి కల్పనవలననే విశేషణ విశేష్యభావము కూడ కుదురును. అచట కూడ పూతవేయు ద్రవ్యమొకటియు (విశేషణము), పూతవేయించుకొను ద్రవ్యమొకటియును (విశేష్యము) విడిగా ఉన్నట్లు కల్పించుకొనవలెను. లేకున్న భేదప్రధానమగు విశేషణ విశేష్యభావము సిద్ధింపదు. ॥20॥

అవతారిక— ఇట్లర్థములకు సామానాధికరణ్యమును కుదిర్చి, శబ్దములకును అద్దానిని కుదుర్చుటకు ప్రయత్నించుచున్నాడు.

శ్లో॥ సామానాధికరణ్యం చ శబ్దయోః కైశ్చిదిష్యతే ।
విశేషణవిశేష్యత్వం సంజ్ఞాసంజ్ఞిత్వమేవవా ॥ 21

సామానాధికరణ్యమ్ = సామానాధికరణ్యమును, విశేషణవిశేష్యత్వమ్ = విశేషణ విశేష్య భావమును, వా = లేక, సంజ్ఞా సంజ్ఞిత్వమ్ + చ = సంజ్ఞా సంజ్ఞిభావమును, శబ్దయోః + ఏవ = శబ్దములకే, కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = కోరబడుచున్నది.

తాత్పర్యము— ''వీరః పురుషః'' మొదలగుచోట్ల సామానాధికరణ్యముగాని, విశేషణవిశేష్యభావముగాని శబ్దములకే అని కొందరి మతము. అట్లే శాస్త్రీయములగు సంజ్ఞా స్థలములలో సంజ్ఞా సంజ్ఞిభావము కూడ శబ్దములకే అని వారందురు

వివరణము— ఒకే విభక్తిగల రెండు శబ్దములు తమ ప్రవృత్తినిమిత్తములు (జాతి, గుణము మొదలైనవి) వేరైనను, మొత్తముపై ఒకే యర్థమును (ఆ యా విశేషముతో కూడిన ఒకే ద్రవ్యమును) బోధించును. ఇట్లు రెండు శబ్దములకును ఒకే అర్థమగుటయే సామానాధికరణ్యమని భావింపవలయును. (రెండు శబ్దము లొక అర్థమందు విశ్రమించుట). విశేషణ విశేష్యభావము కూడ ఇట్టిదే. అచట రెండు శబ్దములును సామాన్య విశేషభావముతో ఒకే యర్థమును తెలియజేయును. అట్లే "వృద్ధిరాదైచ్" (1-1-1) మొదలగు సంజ్ఞా సూత్రములలో, "వృద్ధిః" మొదలగు సంజ్ఞాపదములును "ఆదైచ్" మొదలగు సంజ్ఞిపదములును ఒకే యర్థమును బోధించును. కావున సంజ్ఞా సంజ్ఞిభావము కూడ శబ్దములకే అని యన వచ్చును.

విశేష విషయములు— "వృద్ధిరాదైచ్" (1-1-1) వృద్ధిః, ఆదైచ్, - ఈ రెండును ఏక విభక్తికములు "దీర్ఘములగు ఆకారమును, ఐకారమును, ఔకారమును వృద్ధి అనిపించుకొనును" అని యర్థము. ఇచట వృద్ధి శబ్దము సంజ్ఞ. ఆదైచ్చులు (సంజ్ఞచే తెలియ బడునవి). కాగా "వృద్ధి శబ్దముచే బోధింపబడునవి ఆదైచ్చులు" అను రీతిని విశేషణ విశేష్యభావమే ఇట్టిచోట్ల కూడ ఫలించును. ॥21॥

అవతారిక— అర్థములకు సామానాధికరణ్యమును వేరొక తీరున చూపుచున్నాడు.

శ్లో॥ కేషాంచిజ్జాతిగుణయో రేకార్థ సమవేతయోః ।
వృత్తిః కృష్ణతిలేష్విష్టా శబ్దే ద్రవ్యాఽభిధాయిని ॥ 22

శబ్దే = శబ్దము, ద్రవ్యాభిధాయిని = ద్రవ్యమును చెప్పగా, జాతిగుణయోః = జాతి, గుణములు రెండును, ఏకార్థసమవేతయోః = ఒకే ఆధారమందు (ద్రవ్యమందు) విశ్రమించగా, కృష్ణతిలేషు = కృష్ణతిలలందు (కృష్ణ, తిలశబ్దములకు), వృత్తిః = ఏకార్థీభావము, (రెండు శబ్దములును కలిసి ఒకే యర్థమును తెలుపుట), కేషాంచిత్ = కొందరికి, ఇష్టా = అభిమతము.

తాత్పర్యము— "కృష్ణతిలాః" మొదలగుచోట్ల ఏకార్థీభావమభిమతము. విశేషణ విశేష్యభావమున్నపుడే అది కుదురును. తిలశబ్దము తిలత్వమను జాతిగల తిలలను ద్రవ్యమును బోధించును కృష్ణశబ్దము కూడ కృష్ణత్వమను గుణము కల తిలలనే బోధించుననవలయును. ఇట్లు రెండు శబ్దములును తిలలను ఒకే యర్థమును తెలుపును. (అయినను ద్రవ్యము ముఖ్యముగను, గుణము అముఖ్యముగను తోపక తప్పదు). కాగా "తిలలు" అను ద్రవ్యమందు (ఆధారము) కృష్ణత్వమను గుణమును తిలత్వమను జాతియును (ఆధేయములు) విశ్రమించునని చెప్పి సామానాధికరణ్యమును సంపాదింపవచ్చును ॥22॥

అవతారిక— కేవలము గుణములనే బోధించు శబ్దములకు సమానాధికరణ సమాసము రాదనుచున్నాడు.

శ్లో॥ సంస్తురూపరసాదీనా మాశ్రయో నాఒభిధీయతే ।
ద్రవ్యాభిధానేన వినా తతస్తే ద్వంద్వభావినః ॥ 23

రూపరసాదీనామ్ = రూప, రస, గంధ, మొదలగు గుణవాచకముల విషయములో, ద్రవ్యాభిధానేన + వినా = ద్రవ్యమును చెప్పకుండునపుడు, ఆశ్రయః = ఆధారము, (ద్రవ్యము), సన్ + తు = ఉన్నను, న + అభిధీయతే = సూటిగ బోధింపబడదు, తతః = అందువలన, తే = ఆ శబ్దములు, ద్వంద్వభావినః = ద్వంద్వ సమాసమును పొందుటకు యోగ్యములు

తాత్పర్యము— రూపమ్, (ఆకారము), రసః (రుచి), గంధః (వాసన), మొదలగు పదములు సహజముగ గుణములనే చెప్పును. ద్రవ్యములేకుండ గుణముండదు. కావున ద్రవ్యము తప్పక స్ఫురింపవచ్చును. అయినను ఈ శబ్దములవలన సూటిగ (అభిధావ్యాపారముచే) ద్రవ్యము బోధింపబడదు. అందుచే వీనికి విశేషణ విశేష్యభావము కుదురదు. కాగా వీనికి ద్వంద్వ సమాసమునే చేయదగునుగాని సమానాధికరణ సమాసమును చేయరాదు

వివరణము— ఒకటి గుణమును వేరొకటి ద్రవ్యమును అయినపుడే విశేషణ విశేష్యభావముగాని, సామానాధికరణ్యముగాని సంభవించును. కేవలము గుణములకును కేవలము ద్రవ్యములకును అది దుర్లభము. కావున అట్టిచోట్ల శబ్దార్థములకు సమప్రాధాన్యమును సూచించు ద్వంద్వసమాసమే సముచితము ॥23॥

అవతారిక— "కృష్ణాః తిలాః" మొదలగుచోట్ల రెండు శబ్దములును ద్రవ్యమునే బోధించినను, ద్రవ్యమే ప్రధానమనియు గుణము అప్రధానమనియును విశదీకరించుచున్నాడు

శ్లో॥ ద్రవ్యాభిధాయీ కృష్ణాదిరాకాంక్షావాన్ ప్రవర్తతే ।
నిమిత్తానువిధాయిత్వాత్తత్తిలాదౌ న విద్యతే ॥ 24

ద్రవ్యాభిధాయీ = ద్రవ్యమును చెప్పు, కృష్ణాదిః = కృష్ణ మొదలగు గుణము, ఆకాంక్షావాన్ = అపేక్షగలదై, ప్రవర్తతే = ప్రవర్తించును, నిమిత్తానువిధాయిత్వాత్ = జాతియను ప్రవృత్తి నిమిత్తమును ఎప్పుడును అనుసరించునది అగుటవలన, తిలాదౌ = తిలాది ద్రవ్యమందు, తత్ = అది (అట్టి అపేక్షను కలిగియుండుట) న + విద్యతే = ఉండదు

తాత్పర్యము— "కృష్ణతిలాః" మొదలగుచోట్ల కృష్ణాదిగుణము (నలుపు మొదలగునది) ఎప్పుడును ద్రవ్యము నపేక్షించుచునే యుండును. ద్రవ్యమును విడిచి వేరుగ గుణముండుట కుదురదు కావున గుణము స్వతంత్రము కాదు. తిలాది ద్రవ్యమునకు మాత్రమట్టి అపేక్ష ఏదియు నుండదు. అందు జాతి అనునది యున్నను అది ఎల్లపుడునుండు ఆత్మవంటిది. అందుచే ద్రవ్యము స్వతంత్రము

వివరణము— ఏదైన ఒక క్రియతోడి అన్వయము ద్రవ్యమునకే సంభవించును. (ఉదా: "నీలోత్పలమానయ = నల్ల కలువను తెమ్ము". ఇచట "తెచ్చుట" అను పనికిని

''కలువ'' అను ద్రవ్యమునకును సంబంధము) ద్రవ్యము మూలముగనే గుణమునకు క్రియా న్వయ మగునుగాని సాక్షాత్తుగ కాదు. అట్లు గుణమునకు ద్రవ్యాపేక్ష నియతము. కొన్ని సందర్భములలో మాత్రము (రూపమ్, రసః, మొదలగునవి) ద్రవ్యమునుండి వేరు చేసినట్లు భావించి, గుణమునకు ప్రాధాన్యము కల్పింపబడును. అట్లే గుణమునకును ద్రవ్యమునకును అభేదమును కల్పించుటచే, గుణవాచకము ద్రవ్యమును బోధించుటయు ఒకానొకచోట ఉండ వచ్చును. అంతమాత్రమున గుణము స్వతంత్రము కాజాలదు క్రియతో సూటిగ అన్వయించు శక్తి ద్రవ్యమునకే గలదు అట్లది స్వతంత్రము. అద్దానికి గుణాపేక్ష నియతము కాదు. (గుణమున్నచో ఉండవచ్చును. లేకున్నను అన్వయమునకు బాధ ఉండదు) ద్రవ్యమందుండు జాతి అనునది సనాతనము. అది ఒకప్పుడుండి మరొకప్పుడు పోవునది కాదు. కావున ''ద్రవ్య మునకు కూడ జాత్యపేక్ష యున్నదిగదా !'' అని శంకింప నక్కరలేదు. అది గుణమునకు గల అపేక్షవంటిది కాదు. ॥24॥

అవతారిక— పై యంశమునే వివరించుచున్నాడు.

శ్లో॥ ఏవం జాతిమతి ద్రవ్యే ప్రత్యాసన్నే క్రియాం ప్రతి ।
గుణధర్మం గుణావిష్టం ద్రవ్యం భేదాయ కల్పతే ॥ 25

ఏవమ్ = ఇట్లు, జాతిమతి = జాతిగల, ద్రవ్యే = ద్రవ్యము, క్రియామ్ + ప్రతి = క్రియను గూర్చి, ప్రత్యాసన్నే = దగ్గరగా ఉండగా, గుణధర్మమ్ = అప్రధానమైన ధర్మమును గలిగి నట్టియు, గుణావిష్టమ్ = గుణముతో కూడినట్టియు, ద్రవ్యమ్ = ద్రవ్యము, భేదాయ = భేదమునకు, కల్పతే = దారి తీయును.

తాత్పర్యము— ''కృష్ణతిలాన్ ఆనయ'' = నల్లని నువ్వులను తెమ్ము'' ఇచట ''తెచ్చుట'' అనునది క్రియ దానితో సూటిగ అన్వయించునది (తేబడునది) ''నువ్వులు'' అను ద్రవ్యము (కర్మ) (దీనియందు తిలత్వమను జాతి గలదు). దానియందుండునది కృష్ణత్వ మను గుణము. (ఇదియు నువ్వులందుండునదియే గదా !) ఇట్లు జాతిగల ద్రవ్యమొకటియు గుణముగల ద్రవ్యమొకటియును ఉన్నట్లు భాసించును. వానిలో క్రియకు దగ్గర చుట్టము జాతి గల ద్రవ్యము అందుచే అది ప్రధానమై విశేష్యమగును గుణము కల ద్రవ్యము ముఖ్య ద్రవ్యము ద్వారమున క్రియకు దూరపు చుట్టమగును. కావున అది అప్రధానమై విశేషణ మగును

వివరణము— ''నీలోత్పలం పశ్యతి'' (నల్లకలువను చూచుచున్నాడు), ''మధురం ఫలమాస్వాదయతి'' (తియ్యనిపండు తినుచున్నాడు), ''సురభి కుసుమం జిఘ్రతి'' (పువ్వును వాసన చూచుచున్నాడు) మొదలగుచోట్ల రూపము, రసము, గంధము మొదలగు గుణములకు సాక్షాత్తుగ క్రియతో అన్వయమున్నట్లు గోచరించునుగాని, వాస్తవమున అచట కూడ ద్రవ్యము ద్వారముననే క్రియాన్వయమని తెలియవలెను. (ద్రవ్యము లేకుండ గుణమునకు ఉనికి కుదు రదు). కాగా గుణమునకు ఏ తీరున క్రియాన్వయమును కూర్పదలచినను అయ్యది ద్రవ్యము మూలముగనే ఉపపన్నమగును— అని ఫలించును. ॥25॥

అవతారిక— ఈ తీరున "కృష్ణతిలాః" మొదలగుచోట్ల రెండు శబ్దములును ద్రవ్యములనే బోధించును". (గుణముకల ద్రవ్యమొకటి— జాతితో కూడిన ద్రవ్యమొకటి) అన్న పక్షమున గుణప్రధాన భావమును వివరించి,— అట్లు కాకున్నను వేరొక మార్గమున కూడ గుణప్రధాన భావమును సంపాదింపవచ్చునని చూపుచున్నాడు.

శ్లో॥ గుణమాత్రాభిధాయిత్వం కేచిదిచ్ఛంతి వృత్తిషు ।
అజాశ్వాదిషు సంబంధా ద్రూఢీనామివ రూఢిభిః ॥ 26

రూఢీనామ్ = ప్రసిద్ధములైన అర్థములకు, రూఢిభిః = ప్రసిద్ధములైన అర్థములతో, సంబంధాత్ = అనువగు సంబంధము ననుసరించి, అజాశ్వాదిషు + ఇవ = "అజాశ్వః" మొదలగు చోటులందువలె, వృత్తిషు = సమాసాది వృత్తులలో, గుణమాత్రాభిధాయిత్వమ్ = కేవలము గుణముననే చెప్పుటను, కేచిత్ = కొందరు, ఇచ్ఛంతి = కోరుచున్నారు.

తాత్పర్యము— గుణమును తెలుపు శబ్దమును ద్రవ్యమును తెలుపు శబ్దమును సమాసము మొదలగు వృత్తిలో కలిసియున్నపుడు, గుణవాచకము కేవలము గుణమునే చెప్పుననియు ద్రవ్యమును బోధింపదనియును కొందరందురు. అనగా "కృష్ణతిలాః" మొదలగు చోటులందు తిలశబ్దమే ద్రవ్యమును తెలుపుననియు, కృష్ణశబ్ద మా ద్రవ్యమందలి "నలుపు" అను గుణమునే బోధించుననియు, ఇదియే విశేషణ విశేష్యభావమనియును వారి యాశయము· ఇట్టి తీరు వృత్తియొక్క సామర్థ్యమును బట్టి లభించును.

ఇందుకొక ఉదాహరణమును చూపుదురు.— "అజాశ్వః దేవదత్తః". ఇచట అజ శబ్దము మేకను అశ్వశబ్దము గుర్రమును సహజముగ బోధించును. దీనినే రూఢియందురు· (ఒక శబ్దమునకు నియతముగ ఒక అర్థమందేర్పడిన ప్రసిద్ధి). ఈ యర్థముల కిచట సంబంధము కుదురదు కావున "అజాః = పుట్టుక లేనట్టి (అయోనిజములు = దివ్యములు), అశ్వాః గుర్రములు, యస్య + సః = కలవాడు = అజాశ్వః" అని బహువ్రీహి సమాసమునుచేసి, ఆ పదమును దేవదత్తపదమునకు విశేషణముగ అన్వయింపవలెను. (అపుడు అజ శబ్దము అజత్వమను గుణమును చెప్పును) అట్లు సంబంధము ఒప్పును. ఇట్లే ప్రకృతమున కూడ రెండు శబ్దములును ద్రవ్యములనే చెప్పినచో, సంబంధము దుర్లభమగును గాన గుణవాచకము గుణమును మాత్రమే చెప్పి అప్రధానముగ నుండునని వ్యాఖ్యానింపవలెను.

వివరణము— "కృష్ణాః తిలాః" అని వాక్యముగా ప్రయోగించునపుడు, కృష్ణ శబ్దము ఆ గుణముతో కూడిన ద్రవ్యమును బోధించినను బోధింపవచ్చును. వృత్తియందు మాత్రము అది కేవలము గుణమునే తెలుపుననుటయు ఇతర గుణములనుండి ద్రవ్యమును వేరు చేయుచు విశేషణమగుననుటయును యుక్తమని ఈ పక్షముయొక్క సారము (రెండు శబ్దములును ద్రవ్యములనే తెలిపినచో వానికి సముచితమగు సంబంధము కుదురదని ఈ పక్షమువారి అభిసంధి) ॥26॥

అవతారిక— వేరొక తీరులో కూడ గుణవాచకము విశేషణమగునని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ తిలే పూర్వముపాత్తే వా తత్రైవ మతుబిష్యతే ।
న చ ధర్మః సమాసేషు గుణస్తస్మాద్విశేషణమ్ ॥ 27

వా = లేక, తిలే = తిలత్వమను జాతిగల ద్రవ్యము, పూర్వమ్ = ముందుగా, (సామాన్య రూపముతో), ఉపాత్తే = తీసికొనబడగా (బోధింపబడగా), తత్ర + ఏవ = ఆ విషయ మందే, మతుప్ = "మతుప్" అను ప్రత్యయము, (కృష్ణ శబ్దమునకు పరముగ), ఇష్యతే= కోరబడును (చేయబడును), సః = ఆ, ధర్మః + చ = సంబంధము (ద్రవ్యమునకును గుణ మునకును గల సంబంధము = ఆదారాధేయ భావము) సమాసేషు = సమాసములందు (అంతర్భవతి = ఇమిడియుండును), తస్మాత్ = అందువలన, గుణః = గుణము, విశేషణమ్ = విశేషణము, (భవతి = అగును).

తాత్పర్యము— "కృష్ణతిలాః" అనుచోట, తిల శబ్దము మొదట తిలసామాన్య మునే బోధించును. పిదప కృష్ణశబ్దముతో సమాసము జరుగగానే, ఆ కృష్ణశబ్దము "నలుపు గలవి" అను విశేషార్థమును తిలలకు సంబంధించునట్లుగా తెలియజేయును. ఇందులకై "కృష్ణః = నలుపు, ఏషామ్ = వీనికి, అస్తి = కలదు" అను నర్థమున "మతుప్" అను ప్రత్యయము చేరి వెంటనే లోపించును. కృష్ణశబ్దమే మరల మిగులును. అయినను సమాసము యొక్క శక్తిని బట్టి అదియే ఆ యర్థమునంతను చెప్పగలదు. "నలుపుగలవి నువ్వులు" అని తెలియును అనగా నలుపు, అను గుణమునకును తిలలను ద్రవ్యమునకును ఉండు సంబంధమును విశదపరచును. అట్లది అప్రధానమై విశేషణమగును (ద్రవ్యము ముఖ్యము. దానియందుండు గుణము అముఖ్యము).

వివరణము— "తదస్యాऽస్త్యస్మిన్నితి మతుప్" (5-2-94) అని సూత్రము. "తత్ = అది (ఒక వస్తువు —లేక— గుణము మొదలగునది), అస్య = దీనికి,— (లేక) అస్మిన్ = దీనియందు, అస్తి = ఉన్నది— అను నర్థమున ప్రథమాంతమైన ప్రాతిపదికము నకు "మతుప్" అను ప్రత్యయము చేరును" అని దీని యర్థము ఉదా : ధనమ్ - అస్య - అస్తి = ధనవాన్ గుణాః - అస్మిన్ - సంతి = గుణవాన్ మొదలగునవి. ఈ మతుప్ ప్రత్య యము శుక్ల, కృష్ణ, మొదలగు గుణవాచకములకు చేరునపుడు లోపించును. "గుణవచనేభ్యో లుక్" (5-2-95) సూత్రమందలి వార్తికము = గుణవాచకములకు వచ్చిన మతుప్పు లోపించునని యర్థము) అను వార్తిక మాలోపమును విధించినది కావుననే శుక్లాది శబ్దములు ఆ యా గుణములను, ఆ యా గుణములు కల ద్రవ్యములను కూడ ఒకే స్వరూపముతో తెలియజేయగలవు.

ప్రకృతమున "కృష్ణతిలాః" అనుచోట కృష్ణశబ్దము మతుబంతమన్నపుడు నలు పనెడి గుణము కలవి తిలలను ద్రవ్యమేగాని వేరొకటి కాదుగదా !

ఇట్లు సామానాధికరణ్యము యొక్కయు విశేషణ విశేష్యభావము యొక్కయును తీరుతెన్నులు ఒకటి రెండుదాహరణములతో విశదీకరింపబడినవి. ॥27॥

(3) ద్వంద్వైకశేషవృత్తి విచారము

అవతారిక — ద్వంద్వసమాసము యొక్కయు ఏకశేషవృత్తి యొక్కయు పరిశీలనమును ప్రారంభింపుచున్నాడు

శ్లో॥ అనుస్యూతేవ భేదాభ్యామేకా ప్రఖ్యోపజాయతే ।
యదా సహవివక్షాం తామాహుర్ద్వంద్వైకశేషయోః ॥ 28

ద్వంద్వైకశేషయోః = ద్వంద్వసమాసమందును, ఏకశేషవృత్తియందును. భేదాభ్యామ్ = భేదములతో, అనుస్యూతా + ఇవ = కలిసి కుట్టబడినట్లు (కలసిపోయి ఉన్నట్లు), ఏకా = ఒక, ప్రఖ్యా = జ్ఞానము, యదా = ఎప్పుడు, ఉపజాయతే = కలుగునో, తామ్ = ఆ జ్ఞానమును, సహవివక్షామ్ = సహవివక్షనుగా, (కలిపి చెప్పగోరిక), ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— "రామలక్ష్మణౌ" (రామశ్చ + లక్ష్మణశ్చ) ఇది ద్వంద్వము. "పితరౌ" (పితాచ + మాతాచ) ఇది ఏకశేషము. ఇట్టిచోట్ల సమసించు పదార్థములకు మొత్తముగా (కలిసి కట్టుగా) ఒక క్రియతోగాని ఒక గుణముతోగాని సంబంధము కలుగును. ఉదా : "రామలక్ష్మణౌపశ్య" (రామలక్ష్మణులను చూడుము). ఇచట "చూచుట" అను వ్యాపారములో రామలక్ష్మణు లిరువురును కలిసియే సమముగా అన్వయించుదురు. (ఇరువురను సమప్రధాన భావముతో ఒకేసారి చూచుట జరుగును) ఇట్లే "రామలక్ష్మణౌ శూరౌ" మొదలగు చోట్ల శౌర్యము మొదలగు గుణములు కూడ, రామలక్ష్మణులకు సమముగానే సంబంధించును ఏకశేషముయొక్క విషయము కూడ ఇట్టిదే. ఈ రీతిని అన్వయమును సంపాదించుటకే ద్వంద్వమునుకాని ఏకశేషమునుగాని చేయుదురు కాగా అనేకములగు పదార్థముల సముదాయము తమ భేదమును పరస్పరసాహచర్యమును విడువకుండగనే క్రియాగుణములతో సంబంధించుట జరుగును ఇట్లు భావించు బుద్ధినే "సహవివక్ష" అని అందురు. ఇది ద్వంద్వైకశేషములలో తప్పక ఉండును.

వివరణము— "సహ = కలిపి, వక్తుమ్ = చెప్పుటకు, ఇచ్ఛా = కోరిక = సహవివక్షా = కలిపి చెప్పగోరిక" సముదాయముగా (మొత్తముగా) తమ భేదమును విడువకుండ (విడిగా కూడ భాసింపుచు) క్రియాగుణములతోడి సంబంధమును పదార్థములకు చెప్పు అభిలాష "సహవివక్ష" అగును ఇచట సముదాయమనునది ఒకటిగా తోచుచున్నను, అవయవముల కలయికయేగాని వేరేదియు కాదు అవయవముల భేదము కూడ స్పష్టముగ తెలియుచునే యుండును. కావుననే "రామలక్ష్మణౌ" "రామలక్ష్మణ భరత శత్రుఘ్నాః" అని ద్వివచన బహువచనములు సిద్ధమగును. ఈ విధముగ భేదముతో కూడిన సముదాయము భాసించుట సమాసవృత్తియొక్క మహిమయే

విశేష విషయములు—— సహవివక్ష ఉన్నపుడే ద్వంద్వ సమాసమగును. ద్వంద్వమునకు అపవాదము ఏకశేషము. కొన్నిచోట్ల ద్వంద్వమున కనువగు స్థితియందే దానిని త్రోసివైచి ఏకశేషము ప్రవర్తించును. కాగా దీనియందును సహవివక్ష తప్పదు. ''దేనికది ముఖ్యముగా నుండియు, ఒకటికి మించిన పదార్థములు ఒండొరులు కలిసి కట్టుగా ఒక పనితో సంబంధించుట'' అన్నది సహవివక్ష యొక్క సారము.

''చార్థే ద్వంద్వః'' (2-2-29) అనునది ద్వంద్వమును విధించు సూత్రము ''చ - అను అవ్యయముయొక్క అర్థమును ఇముడ్చుకొన్న అనేకములగు ప్రథమాంతములైన సుబంతములు సమసించును. ఆ సమాసము ద్వంద్వమనబడును'' అని యర్థము. ఉదా: ''ఘటః - చ + పటః - చ = ఘటపటౌ'' మొదలగునవి. ఇతరేతరయోగము (తమతో తాము స్వతంత్రముగ కలిసిన పదార్థములు క్రియా గుణములతో సంబంధించుట), సమాహారము, (సమూహము) అను అర్థములందే ద్వంద్వము ప్రవర్తించును.

''ఏకస్య శేషః = ఏకశేషః = ఒక పదము మిగులుట = ఏకశేషమగును. ''పితామాత్రా'' (1-2-70) మొదలగునవి ఏకశేషమును విధించు సూత్రములు. ''మాతృ శబ్దముతో పితృ శబ్దమును కలిపి చెప్పినపుడు (సహవివక్ష ఉన్నపుడు) పితృ శబ్ద మొకటే మిగులును'' అని దీని యర్థము మిగిలిన పదమే లోపించిన పదము యొక్క అర్థమును కూడ చెప్పును. ఉదా: ''మాతా - చ + పితా - చ = పితరౌ.'' (తల్లిదండ్రులు) మొదలగునవి ఏకశేషమనునది వేరుగ ఒక వృత్తి. (సమాస వృత్తిలో చేరునది కాదు). ॥28॥

అవతారిక—— ''సహవివక్షయందు భేదము తప్పనిసరి అయినచో ఇతరేతర యోగమునకును గల విశేషమేమి?'' అను శంకకు సమాధానమును చూపుచున్నాడు.

శ్లో॥ ఇతరేతరయోగస్తు భిన్నసంఘాభిధాయినామ్ ।
ప్రత్యేకం చ సమూహోఽసౌ సమూహిషు సమాప్యతే ॥ 29

భిన్న సంఘాభిధాయినామ్ = వేర్వేరు సముదాయమును బోధించువాని యొక్క, (ద్వంద్వమందలి పదములయొక్క) సమూహః + తు = సముదాయమే (పదార్థముల సంఘము), ఇతరేతరయోగః = ఇతరేతరయోగము, అసౌ = ఈ సమూహము, సమూహిషు = అవయవములందు, ప్రత్యేకమ్ + చ = విడిగా ఒక్కొక అవయవమందు కూడ. సమాప్యతే = ఉంచబడును. (ఉన్నదని చెప్పబడును)

తాత్పర్యము—— సహవివక్ష అన్నది బుద్ధియొక్క ధర్మము (అనేకములతో కూడిన ఏకత్వ జ్ఞానము) వాస్తవముగ అది ఒక్కటే. అయినను దానికి ముఖ్యమైన లక్షణములు మూడున్నవి: (1) భేదము. (2) అవయవములకు ప్రాధాన్యము. (3) సమూహమునకు ప్రాముఖ్యము. అందు భేదముతో కూడిన అవయవములును, వాని సమూహమును కూడ ప్రధానమైనచో ఇతరేతరయోగ ద్వంద్వమును, భేదము భాసించినను కేవలము సమూహము మాత్రమే ముఖ్యమైనయెడల సమాహార ద్వంద్వమును అగునని చెప్పవలెను.

వివరణము— ''ఘటపటౌ'' (ఘటశ్చ + పటశ్చ). ఇది ఇతరేతరయోగ ద్వంద్వము (పరస్పరము పదార్థములు కలియుట) అనగా ఘటము, పటము, అను రెండు వస్తువులకును కలిసి కట్టుగా (విడిగాను - మొత్తముగాను) ఏదో ఒక క్రియతో (ఆనయనము = తెచ్చుట - మొదలగునది) అన్వయమును చెప్పదలతుము. ఇదియే సహవివక్ష. ఇదియొక విచిత్రమైన జ్ఞానము. ఇందు ఘటము - పటము కూడ వేరుగా తెలియుచు, రెండిటి సమూహము కూడ తెలియుచుండును అనగా అవయవముల భేదమును వాని సముదాయమును ఒకేసారి స్ఫురించుచుండును. దీనిని ''ఉద్భూతావయవ భేదము అయిన సముదాయము'' (అవయవ భేదము తెలియుచుండు సమూహము) అందురు. ఈ సముదాయమును సమాసమందలి ఘట పట శబ్దములు రెండును వేర్వేరుగా బోధించును. (ఘట శబ్దమునకు ఘట పటముల సముదాయ మర్థము. అట్లే పట శబ్దమునకును ఘట పటముల సముదాయమర్థము). స్పష్ట ప్రతిపత్తి కొరకు రెండు శబములను కూడ ప్రయోగింపవలెను. ఈ రీతిని అవయవముల భేదమును సముదాయమును కూడ ముఖ్యముగ క్రియతో అన్వయించినచో ఇతరేతర యోగమగును. అట్లుకాక అవయవభేదము స్ఫురించుచున్నను— దానిని గుర్తింపకుండ సమూహమునే ముఖ్యముగ క్రియతో అన్వయించిన యెడల సమాహారమగునని పర్యవసించును. ఉదా. ''పాణి పాదం చలతి'' = కాలుసేతుల సమూహము కదలుచున్నది.

విశేష విషయములు— సహవివక్షకు విషయమైన పదార్థములు ఇతరేతరయోగ మున రెండైనచో ద్వివచనమును, అంతకుమించినచో బహువచనమును సమాసపదమునకు చేర్పవలెను. ఉదా: ''ఘటపటౌ'', ''కట, ఘట, పటాః'' మొదలగునవి. సమాహారమున సామాన్యము గా ఏకవచనమే అగుచుండును. ఉదా: ''పాణిపాదమ్'' మొదలగునవి.

సూక్ష్మముగ పరిశీలించినచో వస్తు సముదాయమును దేనిని చూచినను అవయవ భేదమును సముదాయైక్యమును భాసించుచునే యుండును. అట్లే విడివిడిగా ఏ అవయవమును చూచినను సముదాయమంతయు అగపడుచున్నట్లును. సముదాయమునంతను చూచునపుడు విడిగా అవయవములన్నియు అగపడుచున్నట్లును స్ఫూర్తి కలుగును. కాగా సహజమైన ఈ తీరులో అవయవముల భేదమును చెప్పదలచుకొన్నచో ఇతరేతరయోగమనియు, చెప్పదలచు కొననిచో సమాహారమనియును సూత్రప్రాయముగ చెప్పవచ్చును.

ఇట్టి విశేషములన్నియు సమాస వృత్తియొక్క సామర్థ్యముచే (ఏకార్థీభావము) సిద్ధించును. అభిమతమగు అర్థము స్పష్టమగుట కొరకే ''ఘటః - చ + పటః - చ'' అని వాక్యావస్థయందు ''చ'' అను అవ్యయమును వాడుదురు. సమాసావస్థయందు చకారమును వాడనక్కరలేదు ఇదియే విశేషము. ప్రతియొక ద్వంద్వపదమును ఏకశేషమును ఇట్లే వ్యాఖ్యానించుకొనవలెను. ॥29॥

అవతారిక— ''ద్వంద్వమందు ప్రతియొక పదము కూడ అవయవ భేదముగల సముదాయమును బోధించును'' అను అంశమున దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ వ్యాపార సముదాయస్య యథాఽధిశ్రయణాదిషు।
ప్రత్యేకం జాతివద్వృత్తిః తథా ద్వంద్వపదేష్వపి॥ 30

అధిశ్రయణాదిషు = పొయ్యిమీద గిన్నె పెట్టుట, మొదలగు వానియందు, వ్యాపార సముదాయస్య = క్రియా సమూహమునకు జాతివత్ = జాతివలె, ప్రత్యేకమ్ = ప్రత్యేకముగా, వృత్తిః = ప్రవృత్తి, యథా = ఎట్లో, తథా = అట్లు, ద్వంద్వపదేషు + అపి = ద్వంద్వ సమాసము యొక్క పదములలో కూడ. (ప్రతియొక పదమును సమూహమును బోధించును).

తాత్పర్యము— "పచతి = వండుచున్నాడు". ఇచట వంట అనునది వ్యాపారము అది సమూహ రూపము. పొయ్యిపై గిన్నె పెట్టుట మొదలుకొని, గిన్నెను దింపి పొయ్యిని ఆర్పుటవరకును జరుగు ఒక వరుసగల పనుల సముదాయము అయినను ఆ పనులలో ఏ యొక పని జరుగుచున్నను "పచతి" అని వాడుదురు. అనగా ప్రతియొక అవాంతర క్రియయు క్రియా సముదాయమును తెలియజేయును. ఈ విధముగనే ద్వంద్వమందు ప్రతియొక పదము కూడ అవయవభేదముగల సముదాయమును బోధించును జాతి విషయమునను ఇదే తీరు గోచరించును వ్యక్తుల సముదాయమందు అనుగతముగ నుండును (ఒకే విధముగ నుండు) ధర్మము జాతి అది ప్రతియొక వ్యక్తియందు కూడ అనుభూతమగుచుండును ఉదా : "గోత్వము" అనున దొక జాతి (సకల గో సముదాయమందలి ఒక ధర్మము) ఇది గో సముదాయమందును "గోవు" అను ప్రతియొక వ్యక్తియందును స్ఫురించుచుండును

వివరణము— జాతియను సముదాయ ధర్మము ప్రతి వ్యక్తియందును ఉండునట్లు ద్వంద్వమందలి సమూహము అవయవ భేదముతో ప్రతియొక పదార్థమందును ఉండును. అనగా ద్వంద్వమం దున్నపుడు ఒక పదార్థము వేరొక పదార్థమును అపేక్షించుచునే యుండును. ఉదా : "రామలక్ష్మణౌ గచ్ఛతః" = రామలక్ష్మణులు వెళ్ళుచున్నారు ఇచట "కలిసియే నడక" కావున రాముడు లక్ష్మణుని లక్ష్మణుడు రాముని అపేక్షించును. లేకున్న కలయిక కుదురదు. కాగా ప్రతియొక పదార్థము కూడ ఆ యా క్రియతో అన్వయించు పదార్థ సమూహమునే బోధించునని ఫలితము. ద్వంద్వమందలి పదములు ఒక్కొక్కటియు అవయవ భేదముతోడి సమూహమును తెలియజేయుట అనగా ఇదియే. ॥30॥

అవతారిక— "వంట పూర్తియగుటకై సహకరించు చిన్న చిన్న పనుల విషయములో కూడ "పచ్" అను ధాతువు నుపయోగించుట, (పచతి) పైన చూపిన విధమున సమర్థనీయము కావచ్చును కాని "ఘట - పటౌ", "రామలక్ష్మణౌ" మొదలగు చోట్లగల ఆ యా పదములను విడిగా వాడునపుడు వానికి వేర్వేరుగ అర్థములున్నవి అవియే సమాసమున అర్థసముదాయమును (తమతో కలిసియున్న పదముల అర్థమును కూడ) ఎట్లు బోధింపగలవు?"— అను శంకకు సమాధానము చూపుచున్నాడు.

శ్లో॥ శౌండార్ధర్చ పురోడాశచ్ఛత్రిణోఽత్ర నిదర్శనమ్।
తే విష్ణుమిత్రా ఇతి చ భిన్నేషు సహచారిషు॥ 31

అత్ర = ఈ విషయములో, భిన్నేషు = వేర్వేరుగా ఉండునవి, సహచారిషు = కలిసి యున్నపుడు (తెలియు విశేషార్థమునకు). శౌండార్ధర్చ పురోడాశచ్ఛత్రిణః = శౌండైః, అర్ధర్చాః, పురోడాశాః, ఛత్రిణః అను ప్రయోగములును, తే + విష్ణుమిత్రాః + ఇతి + చ = ''వారు విష్ణు మిత్రులు'' అను ప్రయోగమును, నిదర్శనమ్ = దృష్టాంతము.

తాత్పర్యము— సాహచర్యము ననుసరించి ఒకదాని స్వరూపమును వేరొక దాని యందు ఆరోపించుటచే ఒక శబ్దము తన యర్థమునేగాక వేరొక శబ్దముయొక్క అర్థమును కూడ బోధించుట శాస్త్రములోను, సామాన్య వ్యవహారమందును ప్రసిద్ధమై యున్నది. ''సప్తమీ శౌండైః'' (2-1-40), ''అర్ధర్చాః పుంసిచ'' (2-4-31) అనునవి పాణిని యొక్క ప్రయోగములు. ఇచట ''శౌండైః'' అను బహువచనమును బట్టి శౌండ శబ్దము, తననే గాక తనతో పాటు శౌండాది గణమందున్న ధూర్త, కితవ, మొదలగు శబ్దము లన్నింటిని తెలియజేయును. అట్లే ''అర్ధర్చాః'' అను పదము అర్ధర్చాది గణములోని శబ్దము లన్నింటిని బోధించును. ''పురోడాశాః'', ఛత్రిణః'' ''విష్ణు మిత్రాః'' అనునవి లోక వ్యవహారములు ఇచట కూడ ఆ యా శబ్దములు బహువచనానుసారముగ తమ సహజార్థములనే గాక, తమతో కలిసియుండు అర్థములను కూడ చెప్పుచుండును. ఇట్లు శబ్దము లర్థములను తెలుపు తీరులు చిత్ర విచిత్రముగ నుండును కావున ద్వంద్వైక శేషములందుండు శబ్దములు అర్థ సముదాయమును బోధించుట వింత కాదు

వివరణము— ఒక పదార్థము యొక్క ధర్మమును వేరొక దానియందు ఆరోపించుటలో ముఖ్యమైన హేతువు సాహచర్యమే (కలసి మెలసి యుండుట) యగును.

(1) శౌండః (నిపుణుడు), ధూర్తః (మొండివాడు), కితవః (మోసగాడు), మొదలగునవి శౌండ శబ్దముతో ప్రారంభమగు శౌండాది గణములో ఉన్నవి. అట్టివి సహచరితములు కావున శౌండత్వమను ధర్మమును కితవాదులందును ఆరోపించి శౌండ శబ్దమునకు కితవాదులు కూడ అర్థమని చెప్పవలెను. కాగా శౌండ శబ్దమే మిగిలిన వాని నన్నింటిని గ్రహించుననియు, అందువలననే ''శౌండై'' అను బహువచనము కుదురుననియును సమన్వయమును చెప్పుదురు.

(2) ''అర్ధర్చాః'' అనునదియు ఇట్టిదే

(3) ''పురోడాశాః'' (పురః + దాశ్యతే = పురోడాశః = దేవతలకు ఈయబడు ద్రవ్యము) యజ్ఞమందు దేవతల నుద్దేశించి ఇచ్చు పిండి ముద్దకు పురోడాశమని సహజమైన వాడుక. అ యినను ''పురోడాశాః'' అను పదము బహువచనము ననుసరించి, పురోడాశముతో పాటు కలిసియుండు పెరుగన్నము, పాల విరుగు మొదలగు ద్రవ్యములను కూడ బోధించును.

(4) ''ఛత్రిణః గచ్ఛంతి'' (ఛత్రాణి - ఏషామ్ - సంతి = ఛత్రిణః = గొడుగులు కలవారు వెళ్ళుచున్నారు) వెళ్ళుచున్న వారిలో అందరకును గొడుగులు లేకున్నను ఇట్టి

ప్రయోగమును చేయుదురు సాహచర్యమును బట్టి ఛత్రము లేని వారికిని ''ఛత్రిత్వము'' (గొడుగు కలిగియుండుట) అను ధర్మము నారోపించి అందరను ఛత్రి శబ్దముతో బోధించుట జరుగును.

(5) ''విష్ణుమిత్రాః'' అనునదియు ఇట్టిదే ''విష్ణుమిత్ర'' అను పేరుగల వారధిక ముగ నుండుటచే వారితో కలిసియున్న మిగిలిన వారికి కూడ అదియే పేరగుచుండును.

పై నిదర్శనములను బట్టి– వాక్యావస్థయందు వేర్వేరుగా అర్థములను కలిగి యున్నను, ద్వంద్వైక శేషములలోని పదములు సహచరితములైన పదముల అర్థములను కూడ బోధించుట ఉపపన్నమగును.

విశేష విషయము— ''సప్తమీ శౌండైః'' (2-1-40, ''సప్తమ్యంతమైన పదము శౌండాది గణమందున్న పదములతో సమసించును'' అని యర్థము. ఉదా : అక్షేషు + శౌండః = అక్షశౌండః, మొదలగునవి. ఇది సప్తమీ తత్పురుషము. ''అర్ధర్చాః పుంసిచ'' (2-4-31). ''అర్ధర్చ'' మొదలగు గణమందలి శబ్దములకు, పుంలింగము, నపుంసక లింగము కూడ అగును'' అని యర్థము ఉదా : అర్ధర్చమ్, అర్ధర్చః, వనమ్, వనః మొద లగునవి. కొన్ని శబ్దముల లింగమును ఈ సూత్రము నిర్ణయించును. ॥31॥

అవతారిక— పై అంశమునే స్పష్టము చేయుచున్నాడు.

శ్లో॥ అర్థాంతరాభిధాయిత్వం తథార్థాంతరవర్తినామ్ ।
యాభ్యాం చైకమనేకార్థం తాభ్యామేవాపరం పదమ్ ॥ 32

అర్థాంతరవర్తినామ్ = వేరొక యర్థమందుండు పదములకు, అర్థాంతరాభిధాయిత్వమ్ = మరొక అర్థమును చెప్పగలుగుట, తథా = ఆ విధముగ (శౌండాది పదములవలె) (ఉప పద్యతే = కుదుచును), చ = మరియు, యాభ్యామ్ = ఏ రెండర్థములను బట్టి, ఏకమ్ = ఒక పదము, అనేకార్థమ్ = ఒకటిని మించిన అర్థములుగలదగునో, తాభ్యామ్ + ఏవ = ఆ రెండర్థ ములను బట్టియే, అపరమ్ = మరియొక, పదమ్ = పదము, అనేకార్థమ్ = అనేకార్థకము, (భవతి = అగును).

తాత్పర్యము— (మీది కారికకు ఇది శేషము). సహజముగ ఒక అర్థమును చెప్పు పదము (విడిగా ఉన్నపుడు). ద్వంద్వమందును ఏకశేషమందును వేరొక యర్థమును కూడ బోధించుట (వృత్తి మహిమచే), శౌండ, పురోడాశాదిపదములకు వలెనే సంభవించును.

మరియు ''ఘటపటౌ'' మొదలగుచోట్ల ఘట పదమునకు ఏ రెండర్థములను (ఘట పటములు) చెప్పుదుమో, పట పదమునకును అవియే అర్థములని తెలిసికొనవలెను. కాగా రెండు పదములును రెండర్థములను మాత్రమే బోధించినట్లగును గాన, ''ఘటపటౌ'' అని ద్వివచనము కుదురును. బహువచన మున్నచోట్ల కూడ ఈ తీరునే అవలంబించి, బహువచన మును సార్థకము చేయనగును. (ఉదా : రామ లక్ష్మణ భరత శత్రుఘ్నాః. ఇచట ఒక్కొక్క–

పదము అవయవ భేదముగల సముదాయమును చెప్పుచుండును. అనగా ప్రతియొక పదమును అందరిని బోధించును).

వివరణము— "యుగపదధికరణత్వమందు ద్వంద్వ మగునని" కాత్యాయను డొక సూచనను చేసెను. ఆ యుగపదధికరణత్వము యొక్క స్వభావమునే యింతదనుక గ్రంథకారుడు వివరించి చూపెను. కాగా యుగపదధికరణత్వమును స్థూలముగా ఇట్లు వింగడింప వచ్చును. "యుగపత్ = ఒకేసారిగ - ఒక శబ్దముతో, అధికరణత్వమ్ = చెప్పదలచిన అర్థమును కలిసి కట్టుగా చెప్పుట" అని ఈ పదముయొక్క తాత్పర్యము. ఏదో ఒక ధర్మమును నిమిత్తముగా చేసికొని పదార్థములందు పరస్పరము ఆరోపమును సంపాదించి, తమ యర్థమును భేదభావనను విడువకుండ మొత్తముపై పదార్థ సముదాయమును బోధించునట్లు కూర్పు దలపెట్టినప్పుడే పదములకు ద్వంద్వము ప్రవర్తించును. ఉదా: "ఘటపటౌ". ఈ ఒక్క పదమువలననే "ఘటపటముల సముదాయము" అని స్ఫురించును. ఇచట ఘటమందు పట ధర్మమును పటమందు ఘట ధర్మమును ఆరోపింతురు. కావున రెండు శబ్దములును ఘట పట రూపమగు అర్థమును తెలియజేయును. మొత్తముపై సముదాయము స్ఫురించినను ఘట పటముల భేదభావన తప్పక ఉండును ఇట్టి తీరునకే "సహవివక్ష" అని పేరు. "యుగపదధికరణత్వము" "సహవివక్ష" అను పదములు ఇంచుమించు సమానార్థకములు. రెండు పదార్థములను కలుపదలచినపుడే వీని యునికి.

విడిగా వాక్యములో వాడినపుడు పై విశేషము లేవియు నుండవు. కావున అచట అభిమతమగు అర్థము లభించుటకు, "చ" అను అవ్యయము నుపయోగింతురు. ఉదా: "ఘటః - చ, పటః - చ". అట్లే ఒకే పదమును వాడినను ఈ విశేషములు కలుగవు. కావలసిన విశేషాంశములన్నియు లభించుటకు సమాసమను వృత్తియే మూలము. వృత్తియందలి శబ్దములకు విచిత్రమైన శక్తు లుండును. అవియే అభీష్టమును సాధించి పెట్టును. ఇంతకన్నను వివరములను తెలియగోరువారు మహాభాష్యాది గ్రంథములను పరిశీలింపవలెను ॥32॥

అవతారిక— పై యంశమునే విశదీకరించుచున్నాడు

శ్లో॥ సముదాయాంతరత్వాచ్చ తాదృశోఽర్థో న లౌకికః ।
అన్వయవ్యతిరేకాభ్యాం శాస్త్రార్థోఽపి న దృశ్యతే ॥ 33

తాదృశః = అటువంటి, అర్థః = అర్థము, (సముదాయ రూపమైన యర్థము) సముదాయాంతరత్వాత్ + చ = చిత్రమైన వేరొక సముదాయమగుట వలన, లౌకికః = లోకప్రసిద్ధమైనది, న = కాదు, అన్వయ వ్యతిరేకాభ్యామ్ = ఉండుట - లేకుండుట అను ధర్మములను బట్టి లభించు, శాస్త్రార్థః + అపి = శాస్త్రీయమగు అర్థము కూడ, న + దృశ్యతే = (ఇచట) కనబడదు.

తాత్పర్యము— "ఘటపటౌ" మొదలగు స్థలములలో యుగపదధికరణతలేక— సహవివక్ష— అను పద్ధతివలన లభించు సముదాయరూపమైన యర్థము, (పదములు తమ

యర్థములను విడువకుండుట,— ఆరోపముచే ఒండొరులు కలిసిన యర్థములను కూడ చెప్పుట— అవయవభేదమును కలిగియుండుట— మొత్తముపై ఈ యంశములన్నియు కల పదార్థ సముదాయము తెలియుట) మిక్కిలి విలక్షణమైనది. అది లోకమందలి వాడుకలో ప్రసిద్ధమైనది కాదు. అట్లే అది అన్వయ వ్యతిరేకముల ననుసరించి (ఒక పద మున్నపు డొక యర్థము వచ్చుట - అది లేనపు డా యర్థము రాకుండుట) శాస్త్రములలో సంపాదించు అర్థమువంటిది కూడ కాదు.

వివరణము—— శబ్దములను వాని యర్థములను నిర్ణయించుటకు లోకవ్యవహారమే ప్రబలమైన సాధనము. దానినిఁబట్టి చూచినపుడు ఘటపటాది శబ్దములకు ప్రసిద్ధమైన ఒక యర్థమే యుండును. ఏదో యొక వ్యాపారముయొక్క —లేక— ధర్మముయొక్క సామ్యము ననుసరించి, బలవంతముగా ఒక శబ్దము వేరొక శబ్దముయొక్క అర్థమును చెప్పుట సామాన్యముగా పొసగదు. (ఉదా : ''ఘట్యతే - ఇతి = ఘటః'' = కూర్చబడునది కాన ఘటము ''పట్యతే - ఇతి = పటః = విస్తరింపజేయబడునది కాన పటము. ఇచట ఆ యా ధర్మములు ఘట పటములకు రెండిటికిని కొంతవరకు సమానమే. అయినను అంతమాత్రమున ఘట శబ్దమునకు పటమనియు, పట శబ్దమునకు ఘటమనియును అర్థము చెప్పకూడదు) అట్లయినచో గో శబ్ద మొకటే (గచ్ఛతి - ఇతి = నడచునది = గౌః) నడచి వెళ్ళు ప్రాణుల నన్నింటిని బోధింపవలసి వచ్చెడిని. కాగా లోకవ్యవహారమున శబ్దార్థముల కొక నియతమైన వ్యవస్థ యున్నది. కావుననే ''ఘటశ్చ పటశ్చ'' అని విడిగా వాడినపుడు తెలియు సముదాయము ఎట్టి విశేషాంశములును లేని సామాన్య సముదాయము మాత్రమే.

అన్వయ వ్యతిరేకములచే ''దీనికిది అర్థము'' అని నిర్ణయించు శాస్త్రమార్గ మొకటి యున్నది. తదనుసారము పదమందలి ప్రకృతిని ప్రత్యయమును విడదీసి, ''ప్రత్యయ మున్నపుడు తెలియు అర్థము— అది లేనపుడు తెలియదు''గాన ఆ ప్రత్యయమున కదియే అర్థమని నిశ్చయింతురు. ఉదా : ''దశరథస్య - అపత్యమ్ = దాశరథిః = దశరథుని కుమారుడు''. ఇచట ''ఇ'' అను ప్రత్యయమునకు ''సంతతి'' అని యర్థము. ఈ విధమైన తీరు కూడ ద్వంద్వ విషయమున కుదురదు. అందలి పదములకు అన్వయ వ్యతిరేకముల వలన తమ తమ అర్థమే స్థిరపడును. ఒకటి వేరొకదాని యర్థమును చెప్పుట అసంభవము కాగా ద్వంద్వైక శేషములలో ''యుగపదధికరణత'' అను క్రొత్త మార్గమువలన లభించు సముదాయరూపమైన అర్థము విలక్షణమైనదియే అని యనక తప్పదు దీని ముఖ్య లక్షణములను ఇట్లు ప్రస్తరింపనగును.

(1) ఇది ద్వందము, ఏకశేషము అను వృత్తులవలన లభించును.

(2) పదములు తమ తమ అర్థములను విడువక ప్రక్కనున్న పదముల యర్థమును కూడ తెలుపును.

(3) పదార్థముల భేదము స్ఫురించుచుండును.

(4) ఇట్టి విశిష్టమైన సముదాయము మొత్తముగా తెలియుచుండును.

అందువలన వాక్యావస్థవలన తెలియు సముదాయమువంటి సముదాయము కాదిది. మరియు పదము ప్రక్కను మరియొక పదమును (ప్రథమాంతములుగ) కూర్చునపుడే పదార్థములు సహచరితము లగునపుడే) మీది విశేషములన్నియు సిద్ధించును. ఏకశేషమందు మాత్రము ఒక పదమే మిగులును గాన అదియే లోపించిన పదముల యర్థమును కూడ చెప్పగలదు. అదియు ''యుగపదధికరణత'' యొక్క ప్రభావమే.

పై తీరున ద్వంద్వైకశేషముల వలన లభించు పదార్థములన్నియు స్వతంత్రముగ ఏదేని ఒక క్రియతోగాని గుణముతోగాని అన్వయించుచుండును అనగా అవి సమప్రాధాన్యమును కలిగియుండును. ఇదియు నొక విశేషమే. ఇతర సమాసములలో ముఖ్యమైన పదార్థ మొకటియే క్రియా గుణములతో అన్వయించును. మిగిలిన పదార్థము లద్దానికి విశేషణములుగ మారిపోవును.

అవతారిక— ఈ విధమైన ''యుగపదధికరణవచనత'' మిక్కిలి కష్టదాయకమని అనుచున్నాడు.

శ్లో॥ దుఃఖా దురుపపాదా చ తస్మాద్భాష్యేఽప్యుదాహృతా ।
యుగపద్వాచితా సా తు వ్యవహారార్థమాశ్రితా ॥ 34

తస్మాత్ = అందువలన, యుగపద్వాచితా = ఒక శబ్ద మొకేసారిగ కావలసిన విశేషార్థము లన్నిటిని చెప్పుట, దుఃఖా = మనసును కష్టపెట్టునదనియు, దురుపపాదా + చ = ప్రమాణ బద్ధముగ నిరూపింప శక్యముకానిదనియును, భాష్యే + అపి = మహాభాష్యమందు కూడ, ఉదాహృతా = చెప్పబడినది, సా + తు = అది అయితే, వ్యవహారార్థమ్ = లోకమందలి ప్రయోగములను వ్యాఖ్యానించుటకు, ఆశ్రితా = అవలంబింపబడినది.

తాత్పర్యము— ''యుగపద్వాచిత'' (యుగపదధికరణవచనత) అను పేరుగల సహవివక్షను సమగ్రముగను నిర్దుష్టముగను భావించుట మిక్కిలి కష్టమని పతంజలి తన మహాభాష్యమున స్పష్టముగ చెప్పినాడు. అయినను సమన్వయమున కుపకరించునని ప్రకృత మద్దానిని వివరించితిమి.

వివరణము— ''చార్థే ద్వంద్వః'' (2-2-29) అను సూత్రము యొక్క భాష్యములో ''సేయం యుగపదధికరణవచనతా నామ దుఃఖాచ దురుపపాదాచ'' అని పతంజలి చెప్పియున్నాడు కాత్యాయనుడు చూపిన ''యుగపదధికరణత'' యందలి సాధక బాధకములను కూలంకషముగ చర్చించిన పిదప అన్నమాట యిది. ''యుగపదధికరణవాచకత్వము'' అనునది వినుట కింపుగనే యున్నదిగాని దాని స్వరూప స్వభావములను వివరించుటయు దానిని ప్రామాణికములుగ ఒప్పించుటయు మిక్కిలి శ్రమయని దీని భావము.

కిష్టమైనను ''యుగపద్వాచకత్వము''ను అంగీకరించినచో ద్వంద్వమందలి వైచిత్ర్యముల నన్నింటిని సాధింపవచ్చునని భావించి, భర్తృహరి యింతదనుక దీనినిగురించి ముచ్చటించెను

విశేష విషయములు-- ''చార్థే ద్వంద్వః'' అను సూత్రమున ''చార్థే'' అను పదమును తీసివైచి ''యుగపదధికరణవచనే'' అని యుంచుట మంచిదని కాత్యాయనుని సూచన కాని దానిని త్రోసిపుచ్చి ''చార్థే'' అను పదమే ఉండుట సముచితమని పతంజలి యాశయము. ''చార్థమందు - అనగా - ఇతరేతర యోగము. సమాహారము అను నర్థములందు ద్వంద్వమగును'' అను సూత్రకారుని మతమే సుఖమనియు, కావలసిన విశేషములన్నియు వృత్తి సామర్థ్యమును బట్టి లభించుననియు, కాత్యాయనుని ''యుగపద్వాచిత్వము'' (సహ వివక్ష) చాల కష్టమనియును పతంజలి తీర్పు చెప్పెను

''కష్టము, సుఖము, అన్న భేదమున్నను అది కూడ ఒక మార్గమే'' అనుట, పతంజలి హృదయమని భర్తృహరి భావించెను. ॥ 34॥

అవతారిక— ''యుగపదధికరణవచనత'' (సహవివక్ష)ను స్వీకరించుటలో గల హేతువును చెప్పుచున్నాడు.

శ్లో॥ సముదాయముపక్రమ్య పదం తస్యాం ప్రయుజ్యతే ।
విభాగేన సమాఖ్యేన తతస్తద్ ద్వ్యర్థముచ్యతే ॥ 35

సముదాయమ్ = సముదాయమును, ఉపక్రమ్య = ఉద్దేశించి. పదమ్ = పదము (సమస్తమైన పదము), తస్యామ్ = ఆ యుగపదధికరణతయందు, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును, తతః = అందువలన, విభాగేన = విడదీసి, సమాఖ్యానే = వివరించుటలో, తత్ = ఆ పదము (విడి పదము), ద్వ్యర్థమ్ = రెండర్థములు గలదిగ, ఉచ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ''ఘటపటౌ'', ''కట ఘట పటాః'', మొదలగు సమాసములు ఆయా వస్తువుల సముదాయమును బోధించుటకై వాడబడును, అట్లు వాడుట లోకమున ప్రసిద్ధము. సిద్ధమైయున్న పదములను విడదీసి వానికొక సంస్కారమును చూపి అర్థమును సమన్వయించుట శాస్త్ర మర్యాద. లేని యంశమును క్రొత్తగా శాస్త్రము తెచ్చిపెట్టదు. (ఉన్న దున్నట్లు చెప్పి దానికొక యోగ్యతను కల్పించుటయే శాస్త్రము చేయుపని). కాగా సమాస మందలి పదములు సముదాయమును బోధించునుగాన వాని అవయవములుగ నున్న పదములు కూడ సమూహమునే తెలియజేయుట సమంజసము ఇట్లు ద్వంద్వమందలి పదములు, ఒక్కొక్కటియు తనతోపాటు మిగిలిన వాని యర్థములను చెప్పునుగాన, అనేకార్థములగును. ''యుగ పదధికరణవచనత'' యందలి రహస్య మిదియే.

వివరణము— ''ఘటశ్చ పటశ్చ'' అనునది వాక్యదశ. ఇచట పదములు తమ యర్థము నొకదానినే చెప్పును. చకారము కలయికను సూచించును. రెండు పదార్థములును

స్వతంత్రముగను ముఖ్యముగను ''విద్యతే'' (ఉన్నది) మొదలగు క్రియతో అన్వయించును. దీనికి భిన్నమైనది ''ఘటపటౌ'' అను సమాసదశ. ఇచట చకారమును వాడకూడదు. సమాస పదమునకు ద్వివచనము గావలయును (బహుత్వ మున్నచోట బహువచనము వచ్చును) సముదాయము తెలియవలయును. అదియును వాక్యమువలన తెలియు సముదాయము వంటిది కారాదు. అట్లయిన సముదాయ మొకటేగాన ఎల్లప్పుడును సమాసమునకు ఏకవచనమే కావలసి వచ్చును అందుచే అవయవ భేదము స్ఫురించవలెను అట్టి సముదాయములు రెండని కూడ భావింపవలెను. (ఘట పదముచే ఘట పట సముదాయము. అట్లే పట పదముచే కూడ పట ఘట సముదాయము). సహచరితముగ పద ముండవలెను లేకున్న కావలసిన స్ఫూర్తి కలు గదు. పదార్థములకు సమప్రాధాన్య ముండక తప్పదు. అప్పుడే వానికి క్రియాన్వయము సరి పోవును. ఇన్ని విధములైన విశేషములు సమాస దశవలన సహజముగ లభించును. వీనికి ఒక సంకేతమును కూర్చుటయే శాస్త్రము చేయు పని ఆ సంకేతమే ''యు॰ పదధికరణవచ నత'' – లేక – ''సహవివక్ష'' అనబడును. ఇది ద్వంద్వమందును ఏకశేషమందును ఉండును.

విశేష విషయములు— వాక్యమునకు గల అర్థమును తెలియజేయు శక్తికున్న, సమాసాదివృత్తికి గల అట్టి శక్తి సమధికమును విచిత్రమును అయి యుండును. దానివలననే విశేషాంశములన్నియు సిద్ధించును.

ద్వంద్వమునకు యోగ్యమైన స్థలమందే, దానిని బాధించి ఒకప్పుడు ఏకశేషమగు చుండును. కావున మీద చూపిన విషయములన్నియు ఏకశేషమునకు సమానములే. ఏకశేష మనునది వేరుగా ఒక వృత్తియే. ద్వంద్వమన్నది సమాసవృత్తి యొక్క ఒకానొక భేదము. ॥35॥

(4) వృత్తికిని వాక్యమునకును గల భేదమును ప్రతిపాదించుట

అవతారిక— వాక్యమునకును సమాసము మొదలగు వృత్తికిని గల భేదమును సామాన్యముగ చూపుచున్నాడు

శ్లో॥ వాక్యేఽపి నియతా ధర్మాః కేచిద్వృత్తౌ ద్వయో స్తథా ।
తే త్వభేదేన సామర్థ్యమాత్ర ఏవోపవర్ణితాః ॥ 36

కేచిత్ = కొన్ని, ధర్మాః = ధర్మములు, వాక్యే + అపి = వాక్యమందును, నియతాః = తప్పక ఉండునవియై, (సంతి = కలవు), కేచిత్ = కొన్ని ధర్మములు, వృత్తౌ = వృత్తి యందు, నియతాః = నియతములు, కేచిత్ = మరికొన్ని ధర్మములు, తథా = అట్లు, ద్వయోః = వృత్తి వాక్యములు రెండిటియందును, (సంతి = కలవు), తే + తు = ఆ ధర్మము లన్నియును, అభేదేన = భేదము లేకుండ, సామర్థ్యమాత్రే + ఏవ = సామర్థ్యమందే, ఉప వర్ణితాః = చెప్పబడినవి.

తాత్పర్యము— శబ్దము లర్థములను బోధించు తీరులు పెక్కులు గలవు. అందు

కొన్ని కేవలము వాక్యమునకే చెందును. మరికొన్ని సమాసము మొదలగు వృత్తికే చెందును. ఇంకను కొన్ని వృత్తి వాక్యములు రెండిటికిని సమానములు ''సమర్థః పదవిధిః'' (2-1-1) అను సూత్రము సామర్థ్యమును సామాన్యముగా నిర్దేశించినది. పై తీరులన్నియును ఆ సామర్థ్యము యొక్క విశేషములే

వివరణము— సముచితమగు సంబంధమును కలిగిన అర్థములను బోధించు విడి విడి పదముల సముదాయము వాక్యమగును. (ఈ గ్రంథము యొక్క రెండవ కాండము ప్రారంభమున వాక్య లక్షణము విపులముగ చర్చింపబడినది) వాక్యావస్థయందు —లేక— విడిగా ఉన్నపుడు వేరే అర్థమను బోధించు పదములు, ఒకానొక తీరులో ఒకే పదముగ మారిపోయి పెనవేసికొన్న ఒకే అర్థమును చెప్పుట వృత్తి అగును. (చూడుము : ''పరిచయము'' అను శీర్షిక). అర్థములను అందించుటలో వృత్తి వాక్యములు రెండిటికిని తమ తమ నియతమైన పద్ధతులు కొన్నియు, సామాన్యమైన పద్ధతులు మరికొన్నియు గలవు. పాణిని వాని నన్నింటిని విడమరచి చెప్పలేదు. ''సమర్థః పదవిధిః (2-1-1) అను సూత్రమున ''సమర్థ'' (సామర్థ్యమును అందగా గొనునది) అను పదముచే సామాన్యముగ సూచించి విడిచి పెట్టెను.

విశేష విషయములు— ''సమర్థః పదవిధిః'' (2-1-1) ''పదములకు సంబంధించిన కార్యము, ఆ పదములు సమర్థములైనపుడే ప్రవర్తించును'' అని యర్థము. ''పదవిధి'' అన్నను ''వృత్తి'' అన్నను సారాంశము ఒకటే. కృత్తు, తద్ధితము, సమాసము, ఏకశేషము సన్, క్యచ్, మొదలగు ప్రత్యయము లంతమందుగల ధాతువు - అను ఈ అయిదును వృత్తులు.

అర్థమును బోధించుటలో శబ్దమునకు గల శక్తి విశేషమును సామర్థ్యమందురు. ఇది వ్యపేక్ష, ఏకార్థీ భావము అని రెండు విధములు. వాక్యమందుండునది వ్యపేక్ష. ''వి = విశిష్టా = సుందరమైన + అపేక్షా = ఆకాంక్ష = వ్యపేక్షా''. ''సముచితముగ ఒండొరులను కోరుకొనుచు పదార్థములు మేళవింపును పొందుట'' వ్యపేక్షయని భావము. ఇది వాక్యమునకు నియతమైనది. ''అంతకు పూర్వము వేరుగనుండు అర్థములు ఒక మూసలో పోతపోయబడినట్లు, మొత్తముపై ఒకే యర్థముగ సిద్ధమగుట'' ఏకార్థీ భావము. ఇది వృత్తికి నియతమైనది. ఇవియే గాక వృత్తికిని వాక్యమునకును నియతముగనో, సమానముగనో చెందు ధర్మములు పెక్కులు గలవు. వాని నన్నింటిని సూచించుటకే పాణిని ''సమర్థ'' పదమును వృత్తి ప్రసంగమున ఉపయోగించెను. కాత్యాయనుడును పతంజలియు ఆ విశేషముల నన్నిటిని పూర్తిగా చూపినారు. భర్తృహరియు ఇటుపైని వానిని యథావకాశముగ చూపదలపెట్టి ముందుగా ఈ మాట లనెను. ॥౩౬॥

అవతారిక— వృత్తికిని వాక్యమునకును గల భేదములను కొన్నిటిని నొక్కి వక్కాణించుచున్నాడు

శ్లో॥ వృత్తౌ విశేషవృత్తిత్వాద్భేదే సామాన్యవాచితా ।
ఉపమాన సమాసాదౌ శ్యామాదీనాముదాహృతా ॥ 37

ఉపమానసమాసాదౌ = ఉపమానసమాసము మొదలగు సమాసములందు, శ్యామాదీనామ్ = ''శ్యామా'' మొదలగు శబ్దములకు, వృత్తౌ = వృత్తియందు, విశేషవృత్తిత్వాత్ = విశేషమం దుండుటవలన, భేదే = వాక్యమందు, సామాన్యవాచితా = సామాన్యమును బోధించుట, ఉదా హృతా = చెప్పబడినది.

తాత్పర్యము— ''శస్త్రీశ్యామా'' (చిన్న కత్తివలె నల్లనైన ఒక స్త్రీ) అనునది ఉపమానసమాసము. ఇచట ''స్త్రీ'' అనునది విశేష్యమగుటచే సమాసమందలి శ్యామా శబ్దము స్త్రీ యను విశేషార్థమును చెప్పునని తెలుసు. దీనిబట్టి ''శస్త్రీ - ఇవ - శ్యామా'' అను వాక్యావస్థయందుండు శ్యామా శబ్దము ''శ్యామత్వము'' (నలుపు) అను సామాన్య గుణమును చెప్పునని ఒప్పుకొనక తప్పదు. లేకున్న ''ఉపమానాని సామాన్యవచనైః'' (2-1-54) అను సూత్రముచే సమాసమే రాకపోయెడిని

వివరణము— ''ఉపమానాని = ఉపమానమును చెప్పు సుబంతములు (ప్రథ మాంతములు). సామాన్యవచనైః = సామాన్య ధర్మమును (ఉపమేయోపమానములకు సమాన ముగా ఉండు క్రియ -లేక- గుణము) చెప్పు సుబంతములతో (ప్రథమాంతములే) సమ సించునని సూత్రార్థము ''ఘనశ్యామః'' (ఘన ఇవ శ్యామః), ''శస్త్రీశ్యామా'' మొదలగునవి ఉదాహరణములు వీనిలో సమాస వృత్తియందుండు శ్యామాది శబ్దములు ఉపమేయములుగా ఉండు ఆ యా పదార్థ విశేషములను బోధించును (ఘన శ్యామః = రామః, - శస్త్రీశ్యామా = స్త్రీ - మొదలగు రీతిని) వాక్యావస్థలో కూడ ఆ పదములు విశేషమునే చెప్పినచో, సామాన్య వాచకములు కాకపోవును గాన సమాసమే కుదరక పోవును. అందువలన వాక్యావస్థయందున్న శ్యామాది పదములు సామాన్య వాచకములే అనుట సమంజసమని పతంజలి సూచించెను. కాగా వాక్యమందు సామాన్యమును బోధించు శబ్దములే వృత్తియందు విశేషమును బోధించుట, వృత్తికిని వాక్యమునకును గల భేదములలో ఒకటియని ఫలించును.

విశేష విషయములు— ఉపమానము = అధిక గుణములు కల వస్తువు. ఉదా : చంద్రుడు మొదలగునది. ఉపమేయము = ఉపమానము కన్న తక్కువ గుణములు కల వస్తువు ఉదా : ముఖము, మొదలగునది. సామాన్యము -లేక- సమాన ధర్మము = ఉపమా నోపమేయములకు సమానముగా ఉండు ధర్మము. ఉదా : గుండ్రముగా నుండుటయు, సంతోషమును కలిగించుటయు మొదలగునది. ఈ పదములు అలంకారశాస్త్రమున అతి ప్రసిద్ధములు. ॥37॥

అవతారిక— పై విషయముననే వేరొక ఉదాహరణమును చూపుచున్నాడు.

శ్లో॥ వృత్తిరన్యపదార్థే యా తస్యా వాక్యేష్వసంభవః ।
చార్థేద్వంద్వపదానాంచ భేదే వృత్తిర్న విద్యతే ॥ 38

అన్యపదార్థే = వేరొక పదార్థమందు యా = ఏ, వృత్తిః = ప్రవృత్తి కలదో, తస్యాః = దానికి, వాక్యేషు = వాక్యములందు, అసంభవః = సంభవము లేదు, ద్వంద్వపదానామ్ = ద్వంద్వమందలి పదములకు, భేదే = వాక్యమందు, చార్థే = చ, అనునవ్యయపు యొక్క అర్థమున, వృత్తిః + చ = ప్రవృత్తియును, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము — "పీతాంబరః" అనునది బహువ్రీహి సమాసము "పచ్చని బట్ట గలవాడు" (పీతమ్ + అంబరమ్ - యస్య - సః - అని విగ్రహము) అని విశేష్యముగ నుండు వేరొక వ్యక్తిని ఇది బోధింపగలదు. "పీతమ్ - అంబరమ్ - యస్య - సః" అని స్పష్టముగ "యస్య - సః" (ఎవనికో - ఆ వ్యక్తి) అను పదములను ప్రయోగించిననేగాని, ఈ యర్థము వాక్యమువలన సిద్ధింపదు. అట్లే "ఘటపటౌ", "పాణిపాదమ్" మొదలగు ద్వంద్వములలో ఇతరేతరయోగముకాని సమాహారముకాని సమాసపదమువలననే బోధపడును. వాక్యదశయందైతే "ఘటశ్చ పటశ్చ" అని చకారమును వాడి, ఆ యర్థమును సంపాదింప వలయును వృత్తికిని వాక్యమునకును గల భేదములలో ఇది యొకటి. ॥38॥

అవతారిక — ఇందు మరొక ఉదాహరణమును ఇచ్చుచున్నాడు

శ్లో॥ భేదే సతి నిరాదీనాం క్రాంతాద్యర్థేష్వసంభవః ।
ప్రాగ్వృత్తేర్జాతివాచిత్వం న చ గౌరఖరాదిషు ॥ 39

భేదే + సతి = వాక్యముగా ఉన్నప్పుడు, నిరాదీనామ్ = నిర్, ప్ర, మొదలగు ఉపసర్గములకు, క్రాంతాద్యర్థేషు = క్రాంతః, గతః, మొదలగు అర్థములలో, అసంభవః = సంభవము లేదు, వృత్తేః = వృత్తికి, ప్రాక్ = ముందు, గౌరఖరాదిషు = గౌరఖర, మొదలగుచోట్ల, జాతివాచిత్వమ్ + చ = జాతిని బోధించుటయు, న = లేదు.

తాత్పర్యము — "నిష్కౌశాంబిః" (నిష్క్రాంతః - కౌశాంబ్యాః = కౌశాంబి, అను నగరమును దాటినవాడు), "ప్రాచార్యః" (ప్రగతః - ఆచార్యః = గొప్ప ఉపాధ్యాయుడు) మొదలగు సమాసములలో నిర్, ప్ర, మొదలగు ఉపసర్గములే "క్రాంత", "గత" మొదలగు నర్థములను చెప్పగలవు. వాక్యమందైనచో "క్రాంత" మొదలగు పదములను తప్పక వాడినపుడే ఆ యా అర్థములు వచ్చును. లేనిచో రావు. అట్లే "గౌరఖరః" (ఒకానొక కొండ గాడిద జాతి లేక ఒక జాతి అడవి మృగము). "కృష్ణసర్పః" (ఒకానొక సర్ప జాతి), మొదలగు సమాసములలో రెండు పదములును కలిసి ఆ యా జాతిని మాత్రమే తెలియజేయును. "గౌరః ఖరః", (తెల్లని యొక గాడిద), "కృష్ణః సర్పః" (నల్లని యొక పాము) అను వాక్యములా యా రంగుగల ఒక వ్యక్తిని మాత్రమే బోధించును. అనగా సమాస దశయందేగాని వాక్యదశయందు ఆ యా విడిపదములకు జాతిని బోధించు శక్తిలేదు. ఇదియు వృత్తిని వాక్యమును వేరుచేయు చిత్రములలో ఒకటి.

వివరణము — కేవలము "నిర్", (పైకి వచ్చుట, ఎక్కువ, మొదలగునవి అర్థ

ములు). ''ప్ర'' (అధికము, మొదలగునవి యర్థములు) మొదలగునవి ద్రవ్యమును చెప్ప జాలవు సమాసవృత్తి యందవి ద్రవ్యమును చెప్పగలవు. (''నిష్ప్రాకంతః'' - మొదలగు చోట ద్రవ్యమునకే ప్రాముఖ్యము). అట్లే గౌర (తెలుపు), కృష్ణ (నలుపు), అను శబ్దములు విడిగా వాడినపుడు విశేషణములై విశేష్యమగు ఆయా వస్తువును చెప్పును. సమాసముగా ప్రయోగించినపుడు రంగుతో నిమిత్తము లేకుండ ఒక జాతిని బోధించును. ''గౌరఖర'', ''కృష్ణసర్ప'' మొదలగునవి నిత్యసమాసములు. ''గౌరశ్చాసౌ ఖరశ్చ'', ''కృష్ణశ్చాసౌ సర్పశ్చ'' అను విగ్రహ వాక్యములను సౌకర్యమునకై చూపినను అవి వాస్తవములు కావు భాషలో మొదటినుండియు అవి సమాసములుగానే వాడబడుచు ఒక ఖర జాతిని ఒక సర్ప జాతిని తెలియజేయుచున్నవి. తెలుపు రంగున్నను లేకపోయినను ఒక జాతికిచెందిన గాడిదను ''గౌరఖర'' మందురు అట్లే నలుపున్నను లేకున్నను ఒక జాతికిచెందిన పామును ''కృష్ణ సర్ప'' మందురు. కాగా ఏకార్థీభావ మనెడి వృత్తి ధర్మమువలన ఆయా విశేషార్థములు లభించును. వాక్యమందది యుండదుగాన ఆ యర్థములు రావు.

విశేష విషయములు—— ఇచట మరియొక చిత్రము కూడ ఉన్నది మీద చూపినట్లు ''గౌరఖర'', ''కృష్ణసర్ప'' మొదలగు శబ్దములు వృత్తియందు సూటిగ జాతిని బోధించును గాన, వానికి మత్వర్థ ప్రత్యయమును (''అది దీనికి గలదు'' అను నర్థమున మతుప్— అను తద్ధిత ప్రత్యయమును గాని, ఆ యర్థమే గల వేరొక తద్ధితమును గాని) సరాసరిగ తగిలింప వీలు కలుగును. ఉదా : ''గౌరఖరవత్'' - అరణ్యమ్'' (గౌరఖరాః - అస్మిన్ - సంతి = గౌరఖరజాతి కల అడవి), ''కృష్ణసర్పవాన్ - వల్మీకః'' (కృష్ణసర్పాః - అస్మిన్ - సంతి = కృష్ణసర్ప జాతిగల పుట్ట) మొదలగు ప్రయోగములు కుదురును. అట్లుగాక ఆ శబ్దములు మామూలుగ ఆయా రంగుగల వస్తువునే బోధించు కర్మధారయ సమాసములన్నచో, వానికి మత్వర్థ ప్రత్యయమును చేర్ప వీలుండదు మత్వర్థము (''అది దీనికి గలదు'' అనునది) బహువ్రీహి సమాసమును చేసినందువలననే సిద్ధించునుగాన, (గౌరాః ఖరాః - యస్మిన్ - తత్ = గౌరఖరమ్ = అరణ్యమ్, కృష్ణాః సర్పాః - యస్మిన్ - సః = కృష్ణసర్పః = వల్మీకః - అను రీతిని) లాఘవము ననుసరించి ఇచట బహువ్రీహినే చేయక తప్పదు. అందు వలననే అభిమతమైన యర్థమును బహువ్రీహి అందించగల సందర్భములలో కర్మాధారయమును స్వీకరించి దానికి మత్వర్థ ప్రత్యయమును సామాన్యముగా చేర్చరు

''భిద్యంతే - అస్మిన్ - అర్థాః = భేదః = ఇందర్థములు విడిగా ఉండును. ఈ వ్యుత్పత్తినిబట్టి భేద శబ్దమున కిచట ''వాక్యము'' అని యర్థము ॥39॥

అవతారిక—— వృత్తికిని వాక్యమునకును గల సహజమైన భేదము విషయములో వ్యాకరణ ప్రవర్తకుల సంవాదమును చూపుచున్నాడు.

శ్లో॥ క్రీడాయాం జీవికాయాం చ వాక్యేనాఽవచనాత్తథా ।
న నిత్యగ్రహణం యుక్తం కౌటిలేయ్యయజ్ విధౌయథా ॥ 40

కౌటిల్యే = "వంకర" అను నర్థమున, యఙ్విధౌ = యఙ్ ప్రత్యయమును విధించు సూత్ర మందు, యథా = ఎట్లో, తథా = అట్లు, వాక్యేన = వాక్యముచే, అవచనాత్ = వృత్తియొక్క అర్థము రానందువలన, క్రీడాయామ్ = క్రీడయందును, జీవికాయామ్ + చ = జీవికయందును, నిత్యగ్రహణమ్ = "నిత్యమ్", అను పదము, న + యుక్తమ్ = సముచితము కాదు.

తాత్పర్యము— వృత్తివలన లభించు అర్థము వాక్యమువలన లభింపదుగాన "నిత్యం కౌటిల్యే గతౌ" (3-1-23) అను యఙ్ ప్రత్యయమును విధించు సూత్రములో "నిత్యమ్" అను పద మక్కరలేదనియు, అంత మాత్రమున దోషము లేదనియును కాత్యా యనుడును పతంజలియు ప్రతిపాదించిరి. అదే హేతువుచే "నిత్యం క్రీడా జీవికయోః" (2-2-17) అను షష్ఠీ సమాసమును విధించు సూత్రమందలి నిత్యపదము కూడ ఆవశ్యకము కాదు

వివరణము— యఙ్ (య) అనునది "హల్వర్ణము మొదట గలిగి, ఒక అచ్చు గల ధాతువులకు" చేరు ప్రత్యయము. "క్రియా సమభిహారము" (ఒక పని మాటి మాటికిని జరుగుట —లేక— తీవ్రముగ జరుగుట) అన్నది దీని యర్థము. ఉదా: బోభూయతే. భూధాతు వునకు యఙ్ ప్రత్యయము చేరిన రూపము. ఈ ప్రత్యయము చేరినను వృత్తి యగును (సనాద్యంత ధాతు వృత్తి).

ఈ సందర్భములో "నిత్యం కౌటిల్యే గతౌ" (3-1-23) అను సూత్రమున్నది. "గత్యర్థకములైన (వెళ్ళు, అను అర్థము కలవి) ధాతువులకు "వంకర" అను నర్థమున (వంకరగ నడచుట) యఙ్ ప్రత్యయము నిత్యముగనగును" అను భావముతో పాణిని "నిత్యమ్" అను పదము నుపయోగించెను ఉదా: "వావ్రజ్యతే" (వ్రజ, ధాతువునకు యఙ్ వంకరగ నడచుచున్నాడని యర్థము) ఈ యర్థమున" కుటిలం వ్రజతి" అని విడిగా వాక్యమును వాడకూడదని పాణిని యాశయము కాని కాత్యాయన పతంజలులు నిత్య పదమును త్రోసి పుచ్చినారు. "కుటిలం వ్రజతి" అను వాక్యమువలన "కుటిలుని గురించి పోవు చున్నాడు" —లేక— "కుటిలమగు దారిని పట్టుచున్నాడు" అను నర్థమే ప్రసిద్ధముగ వచ్చును. "వంకరగ నడచుచున్నాడు" అను నర్థము రాదు కాగా "వావ్రజ్యతే" అను వృత్తి పదము సమర్పించు అర్థమును వాక్యము సమర్పింపజాలదు. ఇట్లు ఆ యర్థమున వాక్య ప్రయోగము నకు సంభవమే లేదు అందుచే "కౌటిల్యే గతౌ" అనియే సూత్రము నుంచి, "కౌటిల్యార్థ మందు మాత్రమే గత్యర్థకములకు యఙ్ ప్రత్యయమగున"ని వారు వ్యాఖ్యానించిరి. వృత్తి యొక్క అర్థమును వాక్యము చెప్పజాలక పోవుటయే ఇచట ముఖ్యమైన హేతువు.

ఇదే హేతువును పురస్కరించికొని "నిత్యం క్రీడా జీవికయోః" (2-2-17) అను సూత్రమున నిత్య పదమును త్రోసివేయవచ్చునని భర్తృహరి యొక్క ప్రతిపాదనము. "సమాసము మొత్తముపై ఒక ఆట —లేక— ఒక బ్రతుకుతెరువు అను నర్థము వచ్చునపుడు, షష్ఠ్యంతమగు పదము "అక" అను ప్రత్యయ మంతమందు గల పదముతో నిత్యముగ సమ

సించును" అని సూత్రార్థము. "ఉద్దాలక పుష్ప భంజికా" (ఉద్దాలక పుష్పములతో ఆడు ఒక ఆట). "దంతలేఖకః" (దంతములను బాగుచేసి పొట్టగడుపుకొనుట) అనునవి ఉదాహరణ ములు ఇచట "ఉద్దాలక పుష్పాణాం - భంజనమ్" (ఉద్దాలక పుష్పములను పాడుచేయుట), "దంతానాం - లేఖనేన - యః - జీవతి" (దంతములను బాగుచేయుటచే బ్రతుకువాడు) అను వాక్యములను వాడినచో "ఆట" "బ్రతుకుతెరువు" అను నర్థములు రానేరావు. సమాసములుగ వాడినపుడే అవి వచ్చును. అది శబ్దశక్తి యొక్క వైచిత్ర్యము. కాగా వాక్యమందు అతి ప్రసక్తి ఉండదు కావున నిత్యపద మక్కరలేదనుట ఇచటి తత్త్వము.

విశేష విషయములు— ఈ విధముగ వృత్తికిని వాక్యమునకును భేదములు పెక్కు లున్నవి ఈ ప్రకరణము వృత్తికిని నియతమైన ధర్మములనే విశదపరచును పదార్థముల సంఖ్య స్పష్టముగ తెలియుట, (రాజ్ఞః - పురుషః, రాజ్ఞోః పురుషః, రాజ్ఞామ్ - పురుషః - మొదలగు రీతిని) అప్రధానముగ నుండు పదార్థమునకు విశేషణమును చేర్చుట, (సుందరస్య- రాజ్ఞః - పురుషః - మొదలగు తీరు, చకారమును తప్పక వాడుట (ఘటశ్చ పటశ్చ - మొద లగు విధము), మొదలగు విశేషములు వాక్యమునకు నియతములు విశేషణ విశేష్యభావము మొదలగు కొన్ని ధర్మములు వృత్తి వాక్యములకు సమాసములు "సమర్థః పదవిధిః" (2-1-1) అను సూత్రముయొక్క భాష్యమున ఇవన్నియు సమగ్రముగ చూపబడినవి ॥40॥

అవతారిక— ఇట్లు వృత్తికిని వాక్యమునకును భేదము సిద్ధింపగా—

శ్లో॥ నిర్ధారణాదివిషయే వ్యపేక్షైవ యతఃస్థితా ।
సమాస ప్రతిషేధానాం తతోనాస్తి ప్రయోజనమ్ ॥ 41

నిర్ధారణాది విషయే = నిర్ధారణము మొదలగు విషయమున, వ్యపేక్షా + ఏవ = వ్యపేక్షా సామర్థ్యమే, యతః = ఎందువలన స్థితా = ఉన్నదో, తతః = అందువలన సమాస ప్రతి షేధానామ్ = సమాసమును వారించుటకు, ప్రయోజనమ్ = ఫలితము, న + అస్తి = లేదు.

తాత్పర్యము— ఏదో యొక ధర్మమునుబట్టి ఒక వ్యక్తిని సముదాయమునుండి వేరుచేయుట నిర్ధారణము. దీనిని తెలియజేయునపుడు సముదాయమును బోధించు పదమునకు షష్ఠీ విభక్తి వచ్చును. ఉదా : "గవాం కృష్ణా బహుక్షీరా" (ఆవులలో నల్ల ఆవు మిక్కిలి పాలు గలది). ఇట్టి చోట్ల వాక్యమువలననే అభిమతార్థము లభించును. "గోకృష్ణా" అని సమాసమును చేసినచో ఆ యర్థము రాదు. అది శబ్దశక్తి యొక్క స్వభావము కాగా వ్యపేక్షా సామర్థ్యమేగాని ఏకార్థీ భావ మిట్టిచోట్ల పొసగనే పొసగదు. అందువలన సమాసమునకు ప్రసక్తియే లేదుగాన, వేరుగ "ననిర్ధారణే" (2-2-10) అను సూత్రముచే సమాసమును వారింప నక్కరలేదు.

వివరణము— "యతశ్చ నిర్ధారణమ్" (2-3-41) అనునది షష్ఠిని విధించు సూత్రము "ఏ సముదాయము నుండి జాతి, గుణము, మొదలగు ఏదో యొక ధర్మమునుబట్టి

అవయవమును వేరుచేసి చూపుదుమో - ఆ సముదాయమును చెప్పు శబ్దమునకు షష్ఠియు సప్తమియు అగునని" అర్థము. "గవామ్ - గోషువా కృష్ణా బహుక్షీరా" మొదలగునవి ఉదాహరణములు. "న నిర్ధారణే" (2-2-10) అనునది షష్ఠీ సమాసమును నిషేధించు సూత్రము. "నిర్ధారణమను అర్థమందు ఉండు షష్ఠ్యంతము సమసింపదు" అని యర్థము. సమాసము చేసినయెడల ("గోకృష్ణా" మొదలగు రీతిని) నిర్ధారణమను అర్థము రానేరాదు. షష్ఠీ సమాసమును నిషేధించు సూత్రములు ఇట్టివే మరికొన్ని కూడ కలవు. ఆ యా స్థలములలో కూడ వాక్యమే సహజమగును గాన ఆ సూత్రములును నిష్ఫలములేయని ఊహింపవలెను. ॥41॥

అవతారిక—— శబ్దములకు గల శక్తి వైచిత్ర్యము స్వాభావ సిద్ధము అది ఒకరు పెట్టునదియు మరొకరు తీసివేయునదియు కాదు. ఈ యంశమును సూచించుటయే శాస్త్రము చేయు పని అని యనుచున్నాడు.

శ్లో॥ విధిభిః ప్రతిషేధైశ్చ భేదాభేద నిదర్శనమ్ ।
కృతం ద్వంద్వైకవద్భావే సంఘవృత్త్యుపదేశవత్ ॥ 42

ద్వంద్వైకవద్భావే = ద్వంద్వ సమాసమందలి ఏకవద్భావమందు, సంఘవృత్త్యుపదేశవత్ = సమాహారమును చెప్పుటను సూచించునట్లు, భేదాఽభేదనిదర్శనమ్ = భేదము యొక్కయు అభేదము యొక్కయు సూచనము, విధిభిః = సమాస విధులచేతను, ప్రతిషేధైః + చ = సమాస నిషేధములచేతను, కృతమ్ = చేయబడినది.

తాత్పర్యము—— కొన్నిచోట్ల సమాహార ద్వంద్వమునకు ఏకవద్భావమును (సముదాయమును మాత్రమే తెలుపుట) శాస్త్రము విధించినది. అది కేవలము సహజమైన యంశమును విశదీకరించుటయే గాని క్రొత్తగా తీసికొని వచ్చియుంచుట కాదు. అట్లే సమాస విధులన్నియు సహజమైన ఏకార్థీ భావమును సమాస నిషేధములన్నియు సహజమైన వ్యపేక్షను చూపించును.

వివరణము—— ముందు లక్ష్యము. పిదప లక్షణము. లక్ష్యము ననుసరించియే లక్షణము బయలుదేరును. సిద్ధముగనున్న భాషకు సహజమైన ధర్మములను ఎత్తి చూపి, వాని నొక సంప్రదాయముగా తీర్చి దిద్దుటయే వ్యాకరణ శాస్త్రముయొక్క ముఖ్య కర్తవ్యము. ఏకార్థీ భావము కొన్నిచోట్ల సహజము. అట్టిచోట్ల శాస్త్రము సమాసమును విధించును. కొన్ని చోట్ల వ్యపేక్షయే స్వభావము. అచట శాస్త్రము సమాసమును వారించును. అంతియేగాని తనంత తానుగ శాస్త్రము చేయునది ఏదియు లేదు. కాగా ఆ యా స్థలములందలి భేదమును (భేద సంబంధము = వాక్యదశ = వ్యపేక్ష) అభేదమును (అభేద సంబంధము = వృత్తిదశ = ఏకార్థీ భావము) సహజ సిద్ధములు.

విశేష విషయములు—— "భిద్యంతే - అస్మిన్ - అర్థాః = భేదః" పదార్థములు విడిగా ఉండి సంబంధమును కలుపుకొని, విశేషణ విశేష్యరూపమైన ఒక అర్థమును చెప్పుట

భేదమగును. ఇది వాక్యమందుండును దీనికే వ్యపేక్ష అని పేరు. భేదమునకు విరుద్ధమైనది అభేదము. అనగా పదార్థము లన్నియు ఒకటిగా మారి ఒకే యర్థమును చెప్పుట. ఇది వృత్తి యొక్క స్వభావము. దీనికే ఏకార్థీ భావమని పేరు.

"పాణి పాదమ్" మొదలగు ద్వంద్వములలో సమాహారమే సహజము (సమాహార మొకటే గాన ఎల్లపుడు ఏకవచనమే యగును. ఇదియే ఏకవద్భావము) "దధిపయసీ" మొద లగు చోట్ల ఇతరేతరయోగమే సహజము. ఈ విషయమునే ఆ యా సూత్రములనువదించును. ॥42॥

అవతారిక— "సామర్థ్యము గలది సమర్థము. సమర్థః పదవిధిః (2-1-1) అను సూత్రమున సమర్థ శబ్దమువలన వ్యపేక్షయు ఏకార్థీ భావమును కూడ సామాన్యముగా సూచి తములైనవి. ప్రయోగముల ననుసరించి వాని విభాగమును లక్షణములను నియమములను వ్యాఖ్యాతలు వివరించి చూపినారు" అని చెప్పుచున్నాడు.

శ్లో॥ సామర్థ్యమవిశేషోక్తమపి లోకవ్యవస్థయా ।
వృత్త్యవృత్త్యోః ప్రయోక్తృభిర్విభక్తం ప్రతిపత్తృభిః ॥ 43

అవిశేషోక్తమ్ + అపి = విశేషము లేకుండ చెప్పబడినను, సామర్థ్యమ్ = సామర్థ్యము, లోక వ్యవస్థయా = వ్యవహారము యొక్క ఏర్పాటు ననుసరించి, ప్రయోగజ్ఞైః = లక్ష్యములను తెలిసిన, ప్రతిపత్తృభిః = వ్యాఖ్యాతలచే, వృత్త్యవృత్త్యోః = వృత్తికిని వాక్యమునకును, విభక్తమ్ = వేరు చేయబడినది (పంచబడినది).

తాత్పర్యము— "సమర్థః పదవిధిః" అను సూత్రమున సమర్థ పదమునే సామ ర్థ్యమును సామాన్యముగా పాణిని నిర్దేశించెను. పిదప లోకవ్యవహారము ననుసరించి కాత్యా యనుడును పతంజలియు "వాక్యమందు వ్యపేక్ష అనియు వృత్తియందేకార్థీభావమనియును" ఉదాహరణ పూర్వకముగా సిద్ధాంతము చేసి చూపిరి.

వివరణము— "సమ్" అను ఉపసర్గమునకును "అర్థ" శబ్దమునకును సమాసము జరుగగా "సమర్థ" అను శబ్దము సిద్ధమగును ఉపసర్గము యొక్క బలమువలన అభిమత మైన భావము లభించును కాగా "సమ్ = సంబద్ధః = పరస్పరము కలిసిన, అర్థః = అర్థము" అని చెప్పినచో వ్యపేక్షయగును. "సమ్ = సంగతః = ఒకటిగా మారిన, అర్థః = అర్థము" అని యన్నచో ఏకార్థీ భావమగును. ఇట్లు సమర్థ పదమువలన రెండు విధములైన సామర్థ్యములను కూడగట్టవచ్చునని పతంజలి స్పష్టముగ చెప్పెను ప్రయోగముల ననుసరించి ఒకానొక వ్యవస్థను (కట్టుబాటు) ఏర్పాటు చేయుటకై వాక్యమందు వ్యపేక్ష అనియు వృత్తి యందేకార్థీభావమనియును అంగీకరింపక తప్పదని యుక్తి పూర్వకముగను ఉదాహరణ పూర్వకముగను అతడే విశదీకరించెను.

విశేష విషయములు— రెండు విధములైన సామర్థ్యముల యొక్క స్వరూప

స్వభావములును, వాని వాని నియతమైన ధర్మములును, సమానమైన ధర్మములును, "సమర్థః పదవిధిః" అను సూత్రము యొక్క భాష్యములో సుదీర్ఘముగ చర్చింపబడినవి. అవియే యథావకాశముగను యథాసందర్భముగను ఈ ప్రకరణమున చూపబడుచున్నవి ॥43॥

అవతారిక— "వాక్యమందు వ్యపేక్ష - వృత్తియందేకార్థీభావము" అను విభాగ మందలి యుక్తిని చూపుచున్నాడు

శ్లో॥ అర్థస్య వినివృత్తత్వాల్లుగాది న విరుధ్యతే ।
ఏకార్థీభావ ఏవాతః సమాసాఖ్యా విధీయతే ॥ 44

అర్థస్య = అర్థము, వినివృత్తత్వాత్ = పోవునుగాన, లుగాది = లుక్కు మొదలగు కార్యము, న + విరుధ్యతే = అడ్డుపడదు, అతః = ఇందువలన, ఏకార్థీభావే + ఏవ = ఏకార్థీ భావ మందే, సమాసాఖ్యా = సమాసమను వ్యవహారము. విధీయతే = విధింపబడును.

తాత్పర్యము— "సుపోధాతు ప్రాతిపదికయోః" (2-4-71) అను సూత్రము వృత్తికి అవయవములుగా ఉండు పదముల సుప్ ప్రత్యయములకు లోపము (జారిపోవుట)ను చెప్పును. ఏకార్థీభావమందు ఆ యా ప్రత్యయముల విశేషార్థము సహజముగనే పోవునుగాన అట్లు చెప్పుట సముచితమే. అందువలననే ఏకార్థీభావమందే సమాసమనుటయును సమంజసము.

వివరణము— విశేషణ విశేష్యభావముగల ఒకే ఒక అర్థము వృత్తివలన బోధ పడును. కావున అవయవములుగా ఉండు పదార్థములకు చెందిన భేదభావనయు, సంఖ్యయు తనంత తానే తొలగిపోవును. అయినపుడు వానిని సూచించుటకై వేరుగ సుప్ ప్రత్యయము లుండనక్కరలేదు సహజమగు ఈ అంశమునే సూత్రము విశదపరచెను. ఇట్టి స్థితి సమాస మునకే నప్పునుగాని వాక్యమునకు నప్పదు.

విశేష విషయములు— "సుపోధాతు ప్రాతిపదికయోః" (2-4-71). "ధాతువున కును ప్రాతిపదికమునకును అవయవములైన సుప్ ప్రత్యయములు లోపించును" అని యర్థము. ప్రాతిపదికము విషయమున ఉదాహరణము: రాజపురుషః. (రాజ్ఞః పురుషః) ఇచట "రాజన్ + ఙస్ + పురుష + సు'' అని అలౌకికమగు విగ్రహము. (ఇది ప్రయో గార్హము కాదు శాస్త్రీయ కార్యములకొరకు దీనిని చూపుదురు) ఈ అవస్థయందు సమాసము జరుగును. సమాసము మరల ప్రాతిపదికమగును. ("కృత్తద్ధిత సమాసాశ్చ" (1-4-46) = కృదంతములును, తద్ధితాంతములును, సమాసములును ప్రాతిపదికములగును.) సుప్ ప్రత్య యములకు ప్రకృత సూత్రముచే లోపము. "రాజపురుష" అని యగును. "రాజసంబంధియగు వ్యక్తి" అని మొత్తముపై యర్థము. ఇట్లు రాజ శబ్దముయొక్క అర్థము వేరుగ భాసించుటయు, అచటి సంఖ్యా విశేషమును (ఒక రాజు, ఇరువురు రాజులు, మొదలగునది) సామర్థ్యము యొక్క మహిమచే సమసిపోవును. "రాజునకు చెందు" అని ఏకత్వ సంఖ్యయే సామాన్య ముగ తెలియును. దీనిని "అభేదైకత్వ సంఖ్య" అని యందురు. ఇది వృత్తులందు భాసించును.

(దీని వివరములు ముందు చూపబడును). కృత్తు, తద్ధితము, ఏకశేషము అను వృత్తులందు కూడ ఇదియే తీరు ధాతు విషయమున ఉదాహరణము : "పుత్రీయతి" ఇచట "పుత్రమ్ - ఆత్మనః - ఇచ్ఛతి" అనునది లౌకిక విగ్రహము. "పుత్ర + అమ్" అని అలౌకికము. ఇపుడు "య" అను ప్రత్యయమగును. "పుత్ర + అమ్ + య". ఈ దశ మొత్తము ధాతు వగును. ప్రకృత సూత్రముచే "అమ్" అనునది లోపించును. (పుత్రయ) ప్రక్రియా విశేష మున "పుత్రీయతి" (పుత్రుని కోరుచున్నాడు) అని సిద్ధించును ఇది "సనాద్యంత ధాతు వృత్తి" అనబడును.

కాగా మీద సూత్రముచే సుప్ ప్రత్యయములకు లోపమును విధించినందువలన "సమాసమందేకార్థీభావమే" పాణిని యభిమతమని పర్యవసించును. ॥44॥

అవతారిక — ''సమాసమునకును వాక్యమునకును గల సామర్థ్యభేదమును పాణిని స్పష్టముగనే చెప్పెననవచ్చును'' అని కొందరందురు. వారి యాశయమును చూపుచున్నాడు.

శ్లో॥ వ్యవస్థితవిభాషా చ సామాన్యే కైశ్చిదిష్యతే ।
తథా వాక్యం వ్యపేక్షాయాం సమాసోఽన్యత్ర శిష్యతే ॥ 45

సామాన్యే = ఎట్టి విశేషమును లేని సామర్థ్యము విషయమున, వ్యవస్థిత విభాషా + చ = నియతమైన వికల్పము, కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = కోరబడుచున్నది, తథా = అట్లు, వ్యపేక్షాయామ్ = వ్యపేక్షయందు, వాక్యమ్ = వాక్యమును, అన్యత్ర = వేరొక దానియందు (ఏకార్థీభావమందు) సమాసః = సమాసమును, శిష్యతే = నియమింపబడుచున్నది.

తాత్పర్యము— ''విభాషా'' (2-1-11) అని పాణిని చెప్పిన- సమాసములకు సంబంధించిన వికల్పమునకు, ఒక నియమమును కల్పించి ''వ్యపేక్షయందు వాక్యమే'' అనియు ''ఏకార్థీభావమందు సమాసమే (వృత్తియే) సాధువు'' అనియును కొందరు చెప్పుదురు.

వివరణము— ''విభాషా'' అనగా వికల్పము. ఏవో ఒకటి రెండు తప్ప, మిగిలిన సమాసము లన్నియు వికల్పములే (సమాసమగుటయు కాకుండుటయును సాధువే) అని ఈ సూత్రము చెప్పును సమాసము లన్నింటికిని వర్తించును గాన దీనిని ''మహావిభాష'' అని యందురు. ''సమర్థః పదవిధిః'' (2-1-1) అను సూత్రము ప్రతియొక పదవిధికిని సంబం ధించును. కాగా ఇచటి సమర్థపదము వ్యపేక్షను ఏకార్థీభావమును కూడ సామాన్యముగ సూచించినను, ఈ మహావిభాషకును సూత్రమునకును సంబంధమును ఏర్పరచి వ్యపేక్షా సామర్థ్యమున్నచో వాక్యమే అనియు, ఏకార్థీభావమున్నచో సమాసమే అనియును నియమ మును చేయవచ్చును అపుడు సామర్థ్యము యొక్క పంపకమును పాణినియే చేసెననుట కవ కాశ ముండును. అనగా వెనుక చూపిన (44వ కారిక) లుగ్విధానము సమాసమందేకార్థీభావ మును జ్ఞాపనము చేయునని చెప్పనక్కరలేదని ఈ వాదమందలి సారము.

విశేష విషయములు— వికల్పమునకు ఒక విధమైన కట్టుబాటును చేయుటను

''వ్యవస్థ'' అందురు. అట్టి వ్యవస్థగల విభాష ''వ్యవస్థిత విభాష'' అగును. సమర్థ సూత్రమున రెండు విధములైన సామర్థ్యములను కలగాపులగముగ పాణిని సూచించెనన్న పక్షమున, పదవిధులన్నింటియందును ఆ రెండు సామర్థ్యములకును అవకాశమున్నదనవచ్చును. కాని వెన్వెంటనే ఉన్న ''విభాషా'' అన్న అతని మాటకు వ్యవస్థను ఏర్పరిచినచో (సామాన్యమైన ఆ సామర్థ్యము వికల్పమని తొలుత నిది సూచించునుగదా!) వాక్యమందు వ్యపేక్షయే యనియు వృత్తియందేకార్థీభావమేయనియు ఫలించును. కావున ఎట్టి చిక్కును కలుగదు.

వాక్యమునకు వ్యపేక్షయు వృత్తికి (సమాసమునకు) ఏకార్థీభావమును మిక్కిలి సహజములుగాన, వేరుగ ఎట్టి ఏర్పాటును చేయనక్కరయే లేదని భావించి కాత్యాయనుడు ''విభాషా'' అను సూత్రమును త్రోసి పుచ్చెను. ॥45॥

అవతారిక— వ్యపేక్షయందును ఏకార్థీభావమందును శబ్దములును అర్థములును ఇంచుమించు సమానములే. అయినను ఏకార్థీభావమున ఒక విశేషమున్నదని చూపుచున్నాడు

శ్లో॥ తుల్యశ్రుతిత్వాత్ తత్త్వేఽపి రాజాదీనాముపాశ్రితే ।
వృత్తౌ విశేషణాకాంక్షాగమకత్వాన్నివర్తతే ॥ 46

తుల్యశ్రుతిత్వాత్ = సమానముగ వినిపించుటవలన, రాజాదీనామ్ = రాజ, మొదలగు శబ్దములకు, తత్త్వే = అభేదము, ఉపాశ్రితే + అపి = ఆశ్రయింపబడినను, వృత్తౌ = వృత్తియందు, అగమకత్వాత్ = గమకము లేనందువలన, విశేషణాకాంక్షా = విశేషణము యొక్క అపేక్ష, నివర్తతే = నివర్తించును.

తాత్పర్యము— ''రాజ్ఞః పురుషః'', ఇది వాక్యము. ''రాజ పురుషః''. ఇది సమాసవృత్తి. రెండవ స్థలమందును శబ్దములు సమానములే. అయినను వాక్యమందలి ''రాజ్ఞః'' అను దానికి ''వీరస్య'' (శూరుడైన) మొదలగు విశేషణములను చేర్చ వీలున్నది. ''ఎట్టి రాజు?'' అను శంకను పోగొట్టుటకు అట్టి విశేషణములు పనికి వచ్చును కాని ''రాజ పురుషః'' అను సమాసమున కవయవమైన రాజ శబ్దమునకు అట్టి విశేషణములను కూర్చ వీలుండదు. అచట ''పురుష'' మొదలగు చివరి పదముయొక్క అర్థమే ముఖ్యము. తొలి పదముయొక్క అర్థము దానికి విశేషణమై దానియందే లీనమైనందున అప్రధానమై తన స్వాతంత్ర్యమును కోల్పోవును అందుచే అట్టి దానికి విశేషణముతోడి సంబంధము కుదురదు

వివరణము— వాక్యమందలి సామర్థ్యము వ్యపేక్ష. భేదము ప్రధానముగా గల పదార్థముల సంబంధము దీనియొక్క ముఖ్య ధర్మము. అనగా పదార్థములు ఒండొరులు విశేషణ విశేష్యభావముతో కలిసినను, వాని స్వతంత్రతకు లోటుండదు. అది భాసించుచునే యుండును. అట్టి స్థితియందు ఇచ్ఛానుసారము విశేషణములను కూర్పవచ్చును వృత్తియందలి సామర్థ్యమేకార్థీభావము. అభేదము ప్రధానముగా గల పదార్థముల సంబంధము దీని ధర్మము. ఇందు ఒక పదార్థమే ముఖ్యముగ నుండి దానితో సంబంధించిన మిగిలిన పదార్థములన్నియు

తమ వ్యక్తిత్వమును కోల్పోవును ఇట్టి వానిని ఉపసర్జనములందురు. వీనికి విశేషణములను కూర్చుటకు వీలు కలుగదు

విశేష విషయములు— ఒక అంశమును ''తప్పనిసరిగ'' సూచించు తీరును ''గమకము'' అందురు. (గమయతి - ఇతి = గమకమ్ = తెలియజేయునది) వాక్యమందలి పదార్థములకు ''ఎట్టిది?'' ''దేనియొక్క?'' మొదలగు శంకలను తీర్చుటకై ఆయా విశేషణముల అపేక్ష సహజము వృత్తియందలి పదార్థముల కట్టి అపేక్ష పొసగదు ప్రయోగముల వలిన కలుగు అర్థానుభవమే అందు ప్రబల ప్రమాణము ''సవిశేషణానాం వృత్తిర్న - వృత్తస్య చ విశేషణయోగో న'' (విశేషణములతో కూడిన పదములకు వృత్తి జరుగదు - వృత్తియందలి పదములకు విశేషణములు కూడవు) అని ఈ యంశమునే శాస్త్రకారులు విశదము చేసిరి. కాగా ''వీరస్య రాజ్ఞః పురుషః'' అను స్థితిలో రాజ శబ్దమునకును పురుష శబ్దమునకును సమాసము జరుగదు. అట్లే ''రాజ పురుషః'' అను దశలో రాజ శబ్దమునకు విడిగా ఎట్టి విశేషణమును కలుపకూడదు వృత్తికిని వాక్యమునకును గల ఈ విశేషము శబ్ద శక్తి యొక్క ఫలితమే ॥46॥

అవతారిక— గమక మున్నచోట మాత్రము వృత్తియందు కూడ విశేషణమును కూర్పవచ్చు ననుచున్నాడు.

శ్లో॥ సంబంధిశబ్దః సాపేక్షో నిత్యం సర్వః ప్రయుజ్యతే।
స్వార్థవత్సా వ్యపేక్షాస్య వృత్తావపి న హీయతే ॥ 47

సర్వః = ప్రతియొక, సంబంధి శబ్దః = సంబంధి శబ్దమును, సాపేక్షః = అపేక్షతో కూడినదై, నిత్యమ్ = ఎల్లపుడును, ప్రయుజ్యతే = ప్రయోగింపబడును, అస్య = దీనియొక్క, సా = ఆ, వ్యపేక్షా = వ్యపేక్ష, స్వార్థవత్ = తన అర్థమువలె, వృత్తౌ + అపి = వృత్తియందు కూడ, న + హీయతే = విడువబడదు.

తాత్పర్యము— గురు, శిష్య, పితృ, మాతృ, మొదలగు శబ్దములు సంబంధి శబ్దములు. వాక్యమందును వృత్తియందును కూడ ఇవి వేరొక శబ్దమును అపేక్షించుచునే యుండును. అందుచే వీనిని నిత్య సాపేక్షములని యందురు అందుచేతనే వృత్తియందును ఈ శబ్దములకు విశేషణముగ వేరొక శబ్దమును కూర్చుటకు వీలుండును

వివరణము — "గురుః" అనగానే "కస్య" (ఎవనియొక్క) అను ప్రశ్న ఎల్లపుడును కలుగును. దానిని పోగొట్టుటకు "దేవదత్తస్య" మొదలగు ఏదోయొక పదమును వాడక తప్పదు. ఇట్లు గురు శబ్దము సంబంధి శబ్దమగును. (అనగా ఒక పదార్థముయొక్క సంబంధమును తప్పక కలిగియుండునది) పితృ, మాతృ, మొదలగు శబ్దములు కూడ ఇట్టివే. వేరొక పదార్థముతోడి సంబంధము ఇచట సహజముగను అంతర్లీనముగను ఉండును. కావున "గురోః కులమ్ = గురుకులమ్" అని సమాసమును చేసినను, అపుడు గురు శబ్దముయొక్క అర్థము

అప్రధానమైపోయినను దానికిగల సహజమైన ఆకాంక్షను తొలగించుటకు "దేవదత్తస్య" మొదలగు ఒక పదమును వాడవచ్చును. దాని యర్థము గురు శబ్దార్థముతో సంబంధించును. ఇట్లు చేయుటలో "ఆకాంక్షను పోగొట్టుట తప్పనిసరి" అగుటయే గమకము.

విశేష విషయములు— స్వస్య + అర్థః = స్వార్థః = శబ్దమునకు సహజమైన అర్థము. దీనినే ప్రాతిపదికార్థమందురు. శబ్దమునకు ఇది ఎంత సహజమో, సంబంధి శబ్దమునకు వేరొక శబ్దమును గురించిన ఆకాంక్షయు అంత సహజము. కావున వాక్యమందువలెనే (దేవదత్తస్య గురోః కులమ్) వృత్తియందును ఆకాంక్షను పోగొట్టు శబ్దమును ప్రయోగింపక తీరదు. ఇదియు నొక శబ్దశక్తి వైచిత్ర్యమే. ॥47॥

అవతారిక— పై విషయముననే వేరొక సమన్వయమును చూపుచున్నాడు.

శ్లో॥ సముదాయేన సంబంధో యేషాం గురుకులాదినా ।
సంస్పృశ్యావయవాంస్తే చ యుజ్యంతే తద్వతా సహ ॥ 48

యేషామ్ = ఏ శబ్దములకు, (వాని యర్థములకు), గురుకులాదినా = గురుకులము మొదలగు, సముదాయేన = సముదాయముతో, సంబంధః = సంబంధము, (అస్తి = కలదో) తే + చ = అవి అయితే, అవయవాన్ = అవయవములను, సంస్పృశ్య = ముట్టుకొని, తద్వతా + సహ = అవయవితో కూడ, (సముదాయముతో) యుజ్యంతే = కూడును.

తాత్పర్యము — "గురుకులమ్ = గురువుగారి యిల్లు" ఈ మొత్తము అర్థమునకే "దేవదత్తస్య" మొదలగు శబ్దముయొక్క అర్థమును కలుపవచ్చును. అట్లు చేయునపుడు ఆ యర్థము అవయవమగు గురు శబ్దార్థముతో తొలుత కలిసి, చివరకు సముదాయార్థముతో కలియునని చెప్పవచ్చును. కాగా "దేవదత్తస్య గురుకులమ్" మొదలగుచోట్ల "దేవదత్తుని గురువు - అతని యిల్లు" అన్నట్లు భావ మేర్పడును. సంబంధి శబ్దములతో వృత్తి జరుగునపు డెల్ల ఇట్లే ఊహింపవలెను.

వివరణము— ఈ పక్షమున - వృత్తియందిమిడిపోయిన ముఖ్యము కానట్టి గుర్వాది శబ్దముల అర్థములతో దేవదత్తాది శబ్దముల అర్థముల కన్వయమని చెప్పనక్కర లేదు. ముఖ్యమైన కులాది శబ్దముల అర్థములతోనే వాని కన్వయమనియు, అది అవయవార్థములను కలియుచు, సముదాయార్థముతో జరుగుననియును చెప్పవచ్చును. కాగా "వృత్తియం దుపసర్జనమైన దానికి విశేషణమును కలుపుట" అను ఆక్షేపమున కవకాశముండదు. "దేవదత్తస్య గురుకులమ్" ఇచట ప్రధానమైనది ఇల్లు. దానితోనే దేవదత్తుని కన్వయము. అయినను సంశయమును వారించుటకై అతడు అవయవమైన గురు శబ్దార్థమును స్పృశించును. ఆ విధముగ "దేవదత్తస్య గురుః కులమ్" అను వాక్యమువలన లభించు విస్పష్టమైన అర్థమే వృత్తి వలనను లభించును. ॥48॥

అవతారిక — "వృత్తికిని వాక్యమునకును పూర్తిగ భేదమే" అని చెప్పుచున్నాడు.

శ్లో॥ అబుధాన్ ప్రత్యుపాయాశ్చ విచిత్రాః ప్రతిపత్తయే ।
శబ్దాంతరత్వాదత్యంతభేదో వాక్యసమాసయోః ॥ 49

ప్రతిపత్తయే = సత్యము తెలియుటకు, అబుధాన్ + ప్రతి = పండితులు కాని వారిని గురించి, విచిత్రాః = చిత్రములైన, ఉపాయాః = ఉపాయములు, (కల్ప్యంతే = కల్పింపబడును), శబ్దాంతరత్వాత్ = వేర్వేరు శబ్దములగుటవలన, వాక్యసమాసయోః = వాక్యమునకును సమాసమునకును, అత్యంతభేదః = పూర్తిగా భేదము, (భవతి = అగును).

తాత్పర్యము— వాక్యావస్థను చూపి (రాజ్ఞః పురుషః, మొదలగునది) అదియే ప్రక్రియావశమున సమాసముగ మారునట్లు (రాజపురుషః) చెప్పుచుందురు. అదంతయు వాస్తవము కాదు. సమాసము యొక్క తత్త్వము తెలియుటకై మందమతుల నుద్దేశించి అట్టి ఉపాయములు చూపబడుచుండును. వాస్తవమున సమాసము వేరు - వాక్యము వేరు రెండింటికిని ఎట్టి సంబంధమును లేదు.

వివరణము— ఆవు బొమ్మను గీచి "ఇది ఆవు" అని పిల్లలకు బోధింతుము. దానివలన ఆవును గురించిన కొంత జ్ఞానము వారికి కలుగును. కాని ఆవు బొమ్మ వేరు. ఆవు వేరు రెండును ఒకటి కావు. (కొన్ని పోలికలు మాత్రముండును) వాక్యమునకును సమాసమునకును గల చుట్టరిక మిట్టిదే. విగ్రహ వాక్యము చూపుటయు, సుప్ ప్రత్యయములు లోపించుననుటయు, వ్యపేక్ష తొలగి ఏకార్థీభావ మేర్పడుననుటయును - ఈ మొదలగు తీరులన్నియు కృతకములు. యథార్థములు కావు (1) పదములు విడిగా ఉండుట, (2) వ్యపేక్షా సామర్థ్యము, (3) భేదముతో కూడిన పదార్థముల సంబంధము. ఇట్టి ధర్మములు వాక్యమునకు నియతములు. (1) ఒకే పదముగ నుండుట, (2) ఏకార్థీభావము, (3) అభేదము ప్రధానమైన సంబంధము - ఇట్టివి సమాసమునకు నియతములు. మరియు వాక్యస్వరూపము వేరు. సమాస స్వరూపము వేరు. రెండిటి అర్థములును వేర్వేరు అర్థములు వేరయినపుడు శబ్దములును వేరే అనవలయును. కాగా వాక్యమునకును సమాసమునకును పూర్తిగా భేదమే.

విశేష విషయములు— ఇచట సమాస పదముచే వృత్తుల నన్నింటిని గ్రహింపనగును. "వాక్యమును ఆధారముగా చేసికొని వృత్తిని బోధించుట" కేవలము కల్పితమైన ఉపాయమేగాని సత్యకథనము కానేరదని గ్రంథకర్త యొక్క తాత్పర్యము "భాషయు భాష యొక్క ధర్మములును సహజములనియు, ఆ సత్యమును గుర్తించుటకై ఏర్పడిన అసత్యమార్గమే శాస్త్రమనియును" అతడు తరచుగ వక్కాణించుచునే యుండును.

ఒక విషయము నిచట గ్రహించునది. - "రాజ్ఞః పురుషః", మొదలగు వాక్యములును "రాజపురుషః" మొదలగు వృత్తులును వాడుకకు తగినవే. ఇష్టమైనపుడు వాక్యమునకు బదులుగ వృత్తిని వాడుకొనవచ్చును. "రాజ్ఞః పురుషః" మొదలగు దానిని లౌకికమైన

విగ్రహ వాక్యమందురు లోకమున ప్రయోగింపదగినదనియు, సత్యమైనదనియును, వృత్తి యొక్క అర్థమును విడమరచి చెప్పునదనియును భావము. ఇట్టిచోట్ల "రాజన్ + జస్ + పురుష + సు" అను ఒక దశను చూపి, ఈ దశలో వృత్తి జరుగుననియు, ప్రత్యయములు లోపించుననియును శాస్త్రము చెప్పును. ఇట్టి శాస్త్రమార్గమే కల్పితమని యిచటి తత్త్వము ॥49॥

అవతారిక— "గోరథః" అనునది ఒక సమాసము. (ఎడ్లను పూన్చిన బండి) ఇచట "గోభిః యుక్తః రథః" అను వాక్యమును వాడుదురు. అట్లయినపుడు "యుక్త" అను పదమునకు సమాసమున లోపమని చెప్పవలయునా? అని శంకించి "అక్కరలేదు" అనుచున్నాడు.

శ్లో॥ అసమాసే సమాసే చ గోరథాదిష్వదర్శనాత్ ।
యుక్తాదీనాం న శాస్త్రేణ నివృత్త్యనుగమః కృతః ॥ 50

గోరథాదిమ = "గోరథ" మొదలగు స్థలములలో, అసమాసే = వాక్యమందును, సమాసే + చ = సమాసమందును, యుక్తాదీనామ్ = "యుక్త" మొదలగు పదములు, అదర్శనాత్ = కనబడక పోవుటవలన, శాస్త్రేణ = శాస్త్రముచే, నివృత్త్యనుగమః = పోవుట, (లోపము) న + కృతః = చేయబడలేదు.

తాత్పర్యము— "గోరథః" మొదలగుచోట్ల "గవాం రథః" మొదలగునవియే వాక్యములు (గోవుల రథము) సామర్థ్యమునుబట్టి (అర్థముల పొందిక కుదురుటకు) "యుక్తః" (పూన్చబడిన) అను పదము తప్పక స్ఫురించుచుండును. సమాసమున కూడ ఇదియే తీరు. కావున ఆ పదమును వేరుగా వాడరు. కావుననే ఆ పదమునకు వ్యాకరణము లోపమును చెప్పదు.

వివరణము— లౌకికమైన విగ్రహ వాక్యము యొక్క అర్థమునే సమాసము బోధించునని సంప్రదాయము "రాజ్ఞః పురుషః" మొదలగు వాక్యములలో సిద్ధముగ నున్న ప్రత్యయముల అర్థము, "రాజపురుషః" మొదలగు సమాసములందు సహజముగ ప్రత్యయములు లేకుండగనే తెలియును గాన, ఆ ప్రత్యయములు లోపించునని శాస్త్రము చెప్పును. అది యుక్తమే. కాని "గోరథః" మొదలగు వాని స్థితి యిట్టిది కాదు. అచట "గవాం రథః" అనియే వాక్యము. ఎడ్లకును రథమునకును వేరొక సంబంధము పొసగదు కాన, "గోభిః యుక్తః" (ఎడ్లతో కూర్చబడిన) అను నర్థము అవశ్యము గమ్యమగును అందుచే "యుక్తః" అను పదమును వేరుగ వాడనక్కరలేదు. వాడని పదమునకు లోపమును కూడ చెప్పనక్కర లేదుగదా! "దధ్యోదనః" (దధ్నా - ఉపసిక్తః - ఓదనః = పెరుగుతో తడిసిన అన్నము), "గుడధానాః" (గుడేన - సంమిశ్రాః - ధానాః = బెల్లము కలిపిన అటుకులు), "దధిఘటః" (దధ్నా పూర్ణః ఘటః = పెరుగుతోనిండిన కుండ), మొదలగుచోట్ల కూడ ఇట్లే ఉపసిక్త, సంమిశ్ర, పూర్ణ, మొదలగు పదములకు లోపమును చెప్పనక్కరలేదు. వానిని వాక్యములలో ప్రయోగింపకుండగనే వాని భావములను తెలియ వీలగును. కాగా వాక్యములో కనిపించుదానికే వృత్తియందు లోపముకాని అచట కనుపింపని దానికి లోపమెందుకు? అని సారము. ॥50॥

అవతారిక— ''గోరథః'' మొదలగు చోట్ల ''గోయుక్తః రథః'' మొదలగు తీరులో వాక్యమును వాడినను ఆ రీతి వేరనియు, దానినిబట్టి యుక్త శబ్దమునకు సమాసమున లోపమని చెప్పనక్కర లేదనియును చెప్పుచున్నాడు

శ్లో॥ శబ్దాంతరత్వాద్యుక్తాది క్వచిద్వాక్యే ప్రయుజ్యతే ।
ప్రపర్ణ ప్రపలాశాదౌ గతశబ్దశ్చ వృత్తిషు ॥ 51

క్వచిత్ = ఒకానొక, వాక్యే = వాక్యమందు, శబ్దాంతరత్వాత్ = వేరొక శబ్దమగుటవలన, యుక్తాది = ''యుక్త'' మొదలయిన పదము, ప్రయుజ్యతే = వాడబడును, వృత్తిషు = వృత్తి జరిగినపుడు, ప్రపర్ణప్రపలాశాదౌ = ప్రపర్ణ - ప్రపలాశ - మొదలగుచోట్ల, గతశబ్దః + చ = ''గత'' అను శబ్దము కూడ, ప్రయుజ్యతే = వాడబడును.

తాత్పర్యము— "గోయుక్తః రథః", "దధిపూర్ణః ఘటః" మొదలగు వాక్యములను కూడ "గోరథః", "దధిఘటః" మొదలగు సమాసములకు మారుగ ఒకప్పుడు వాడవచ్చును. అయినను ఆ శబ్దములు వేరు "గోరథః", మొదలగు వానిని విశ్లేషించి చూపునట్టి సరియైన విగ్రహములు కావు అట్లే ప్రపర్ణః, ప్రపలాశః, మొదలగు వృత్తులలో "ప్రగతః పర్ణః", "ప్రపతితః పలాశః" మొదలగు రీతిని చూపబడు గత, పతిత, మొదలగు శబ్దములును వేరు శబ్దములే.

వివరణము— కల్పనయే అయినను సమాసమున కనబడు శబ్దములతోనే విగ్రహమును చూపవలెను. విగ్రహమనగా లోకవ్యవహారమున వాడుటకు వీలులేనట్టియు ప్రకృతి ప్రత్యయములను విడదీసి చూపునట్టి ఒక స్థితి. దీనిని అలౌకిక విగ్రహమందురు. ఈ స్థితి యందే సమాస శాస్త్రము ప్రవర్తించును కాగా "గోరథః" అనుచోట గో శబ్దమును రథ శబ్దమును మాత్రమే అలౌకిక విగ్రహమున వినబడుచున్నవి. (గో + ఆమ్ + రథ + సు). యుక్త శబ్దమచట లేదు. కావున దానికి లోపమును చెప్పనక్కర లేదు. "గోయుక్తః" అనునది వేరొక సమాసమగును (గోభిః + యుక్తః = తృతీయా తత్పురుషము) దీనిని విశేషణముగను, రథశబ్దమును విశేస్యముగను చేసి, "గోయుక్తః రథః" అను వాక్యమును వాడుటలో తప్పు లేదు కాని అది "గోరథ" అను సమాసమునకు సమానార్థకమైన వేరొక శబ్దమనియే లెక్కకు వచ్చును. అందుచే దానికిని దీనికిని ముడివైచి అచటి యుక్త శబ్ద మిచట లోపించెననుట సముచితము కాదు "ప్రపర్ణః" మొదలగు సమాసముల విషయమున కనబడు "గత" మొదలగు శబ్దముల ఉనికియు ఇట్టిదే. "దధ్యోదనః", "దధిఘటః" మొదలగు సమాసములలో కూడ "దధ్యుపసిక్తః ఓదనః", "దధిపూర్ణః ఘటః" మొదలగు వాక్యములు, సమానార్థకములైన వేర్వేరు శబ్దములే కాని సరియైన విగ్రహములు కావని తెలియవలెను. ॥51॥

అవతారిక— వాక్యమును వృత్తియును ఒకే యర్థమును బోధించుననియు, వానికి భేదము లేదనియును కొందరు చెప్పుదురని చూపుచున్నాడు.

శ్లో॥ విశేషణ విశేష్యత్వం కైశ్చిదేక స్తథా౽౽శ్రయః ।
ఉపాయే తత్త్వదర్శిత్వాదిష్యతే వృత్తి వాక్యయోః ॥ 52

వృత్తి వాక్యయోః = వృత్తియందును వాక్యమందును, విశేషణ విశేష్యత్వమ్ = విశేషణ విశేష్యభావమును, తథా = అట్లు, ఏకః = ఒకటే అయిన, ఆశ్రయః = ఆధారమును, ఉపాయే = ఉపాయమందు, తత్త్వదర్శిత్వాత్ = ఉపేయము యొక్క స్వరూపమును భావించుట వలన. కైశ్చిత్ = కొందరిచే, ఇష్యతే = కోరబడుచున్నది.

తాత్పర్యము— "నీలమ్ ఉత్పలమ్", "రాజ్ఞః పురుషః" మొదలగునవి వాక్యములు. "నీలోత్పలమ్", "రాజపురుషః" మొదలగునవి సమాసములు. సమాసముయొక్క తీరును వివరించుటకు "నీల + సు + ఉత్పల + సు" మొదలగు ప్రక్రియా వాక్యమును చూపుదురు. అయినను శబ్దార్థములకు చెందు విశేషణ విశేష్యభావమును సామానాధికరణ్యమును (నీలోత్పలమ్, మొదలగుచోట్ల రెండు పదములును బోధించు వస్తువు ఒకటే), వాక్యమందును సమాసమందును సమానమే కావుననే వృత్తికిని వాక్యమునకును భేదము లేదని కొందరి మతము.

వివరణము— ఈ మతముయొక్క సారమిట్లుండును : వృత్తియనునది పూర్తిగా అవయవపదములు లేనిదని చెప్పలేము అందవయవములుండును. అవి వాక్యదశలో విడిగా నుండి వృత్తిదశలో ఏకమగును. అయితే అన్వయవ్యతిరేకములతో ఆ యా అర్థములను నిశ్చయించుటకై (ఆ పదమున్నపుడే ఆ యర్థము లభించుట - లేకున్న లభింపకపోవుట) అలౌకికమైన విగ్రహవాక్య మావశ్యకమగును. "నీలమ్ ఉత్పలమ్" మొదలగు సమానాధికరణ స్థలములందును "రాజ్ఞః పురుషః" మొదలగు వ్యధికరణ స్థలములందును వాక్యమువలన కలుగు అర్థబోధయే వృత్తివలనను కలుగుచుండును. (ఒకింత భేదమున్నను ముఖ్యార్థము మాత్ర మొకటే). కావున వాక్యమే వృత్తిగ మారుననియు, వాక్యమందలి వ్యపేక్షయే వృత్తియందును ఉండుననియును చెప్పుట సముచితము. వాక్యమునకును వృత్తికిని నియతమైన ఆ యా ధర్మములను కొన్నిటిని సహజములని సమర్థింపవచ్చును. మరికొన్నిటిని స్పష్టముగానే చెప్పుకొనవచ్చును. కాగా ఏకార్థీభావమును అంగీకరింప నక్కరలేదు

విశేష విషయములు— ''పరస్పరవ్యపేక్షాం సామర్థ్యమేకే'' (సమర్థః పదవిధిః (2-1-1) అను సూత్రముయొక్క భాష్యము = వృత్తియందును వ్యపేక్షయే సామర్థ్యమని కొందరందురు) అను పూర్వపక్ష మతముయొక్క సారమిది. ఉపాయము = సాధనము ఉపేయము = సాధ్యము. ప్రకృతమున వాక్య ముపాయమనియు వృత్తి ఉపేయమనియును వర్ణింపబడినది. ఈ రెండిటికిని అభేదమను భావన అజ్ఞాన మూలకము. ॥52॥

అవతారిక— పై అపసిద్ధాంతమును ఖండించుచున్నాడు.

శ్లో॥ పదం యథైవ వృక్షాది విశిష్టేఽర్థే వ్యవస్థితమ్ ।
నీలోత్పలాద్యపి తథా భాగాభ్యాం వర్తతే వినా ॥ 53

వృక్షాది = "వృక్షః" మొదలగు, పదమ్ = పదము, విశిష్టే = ఒకటే అయిన, అర్థే = అర్థమందు, యథా = ఎట్లు, వ్యవస్థితమ్ = సిద్ధముగ ఉన్నదో, తథా = అట్లు, నీలోత్పలాది + అపి = "నీలోత్పలమ్" మొదలగునది కూడ, భాగాభ్యామ్ + వినా = భాగములు లేకుండ వర్తతే = ఉండును.

తాత్పర్యము— "వృక్షః" మొదలగు పదములలో అవయవములైన వర్ణములు లేనట్లుగానే, "నీలోత్పలమ్" మొదలగు వృత్తులలో కూడ అవయవములైన పదములు లేవు.

వివరణము— పదములు అఖండములనియు అఖండమైన యర్థమును బోధించుననియు, ప్రకృతి - ప్రత్యయము మొదలగు కల్పనలు అసత్యమనియును రెండవ కాండమున ప్రతిపాదింపబడినది. అదే తీరులో వృత్తులు కూడ అఖండములనియు, వాని కవయవములు లేవనియు విశేషణ విశేష్యభావముతో ఏకాకారమైన యర్థమును బోధించుననియును గ్రహింప వలెను. ఏకార్థీభావము, అభేదైకత్వ సంఖ్య (కావలసిన సంఖ్యను సమర్పించుచు ఎట్టి విశేషమును లేని సామాన్యరూపమగు ఒక సంఖ్య) భాసించుట, ఒకటి ముఖ్యమై మిగిలిన పదార్థములు విశేషణములగుట, మొదలగు ధర్మములన్నియు వృత్తికి సహజములు. మందమతుల కొరకు వాక్యదశను చూపి సమన్వయము చేయుదురు కాని వాక్యమునకును వృత్తికిని ఎట్టి సంబంధమును లేదు. కొద్ది పోలికను బట్టి "అదియు ఇదియు ఒకటే" అనుట కేవలము భ్రాంతి మూలకము

విశేష విషయములు— "ఏకార్థీభావః సామర్థ్యమ్ - పరిభాషా చ" (వృత్తియందలి సామర్థ్యమేకార్థీభావము - ఈ సూత్రము పరిభాష) అను సిద్ధాంతము (సమర్థః పదవిధిః - 2-1-1) ఇచట సంగ్రహింపబడినది. ॥53॥

అవతారిక— వృత్తికిని వాక్యమునకును సాదృశ్యము కూడ అన్నిచోటులందును ఉండదనుచున్నాడు.

శ్లో॥ శ్రోత్రియక్షేత్రియాదీనాం న చ వాసిష్ఠగార్గ్యవత్ ।
భేదేన ప్రత్యయో లోకే తుల్యరూపాసమన్వయాత్ ॥ 54

వాసిష్ఠగార్గ్యవత్ = వాసిష్ఠః, గార్గ్యః, అను వానివలె, శ్రోత్రియక్షేత్రియాదీనామ్ = శ్రోత్రియః, క్షేత్రియః, మొదలగు వానికి, తుల్యరూపాసమన్వయాత్ = సమానమైన రూపము కుదురనందున, భేదేన = విభాగముతో, ప్రత్యయః = అర్థము తెలియుట, లోకే = వ్యవహారమున, న + చ = లేదు (కనబడదు).

తాత్పర్యము— "వసిష్ఠస్య - అయమ్ = వాసిష్ఠః" = వసిష్ఠునికి సంబంధించినవాడు. "గర్గస్య - అపత్యమ్ = గార్గ్యః = గర్గుని సంతతి. ఇది తద్ధితవృత్తి. ఇచట వృత్తికిని వాక్యమునకును పోలిక ఉన్నది. (వసిష్ఠ, గర్గ, అను శబ్దములకు తద్ధిత ప్రత్యయము మాత్రము చేరినది) కావున ప్రకృతి ప్రత్యయ విభాగము కుదురును. కాని "శ్రోత్రియః",

''క్షేత్రియః'' అను పదములలో అట్టి పోలిక ఇసుమంతయు లేదు. శ్రోత్రియ శబ్దమునకు ''వేదమును చదువువాడు'' (ఛందః అధీతే) అని యర్థము. క్షేత్రియ శబ్దమునకు ''ఇక జన్మలో కుదురని రోగము'' (పరక్షేత్రే చికిత్స్యః = మరొక జన్మలో చికిత్స చేయదగినది) అని యర్థము. ఇదియు తద్ధిత వృత్తియే ఇచట వృత్తికి అనుగుణముగా పదములను విడదీసి (వాక్యరూపమున) సమానమైన యర్థమును చెప్పుటయే కుదురదు. కాగా వాక్యము వేరు. వృత్తి వేరు.

వివరణము— ''శ్రోత్రియశ్ఛందోఽధీతే'' (5-2-84) అను సూత్రము శ్రోత్రియ శబ్దమును సాధించును. ''క్షేత్రియచ్ పరక్షేత్రే చికిత్స్యః'' (5-2-92) అనునది క్షేత్రియ శబ్దమును సాధించును. ఆ యా యర్థములందు ప్రసిద్ధమైన ఆ యా శబ్దములను'' ఉన్నవి ఉన్నట్లుగ'' తీసికొని పాణిని సాధుత్వమును చెప్పెను. వీనిని నిపాతములందురు. ఇట్టి స్థలములలో ప్రకృతి, ప్రత్యయము, అను విభాగమే యుండదు. ఇవి ఏకార్థీభావము గల వృత్తులు. కాగా వృత్తి విషయమున వాక్యమును చూపుట కృతకము వృత్తికిని వాక్యమునకును కలదని భావింపబడు సాదృశ్యము కూడ సార్వత్రికము కాదు. ॥54॥

అవతారిక— వృత్తికిని వాక్యమునకును అర్థము కూడ కొన్నిచోట్ల సమానముగ నుండదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సప్తపర్ణాదివద్భేదో న వృత్తౌ విద్యతే క్వచిత్ ।
రూఢ్యరూఢివిభాగోఽపి క్రియతే ప్రతిపత్తయే ॥ 55

క్వచిత్ = ఒకానొక సందర్భమున, సప్తపర్ణాదివత్ = సప్తపర్ణః, మొదలగు చోటులందువలె, వృత్తౌ = వృత్తియందు, భేదః = అర్థభేదము, న + విద్యతే = ఉండదు, రూఢ్యరూఢి విభాగః + అపి = ''రూఢి - రూఢికాదు'' అను విభాగము కూడ, ప్రతిపత్తయే = తెలియుట కొరకు, క్రియతే = చేయబడును.

తాత్పర్యము— వృత్తికిని వాక్యమునకును సామాన్యముగా అర్థమందు భేదము లేకపోవచ్చును. కాని అట్టి యర్థభేదముగల స్థలములు కూడ కొన్ని యున్నవి. ''సప్తపర్ణః'' అనునది ఇందు కుదాహరణము. ఇచట వృత్తియొక్క యర్థము వేరు. (ఒక విధమైన అరటి చెట్టు) వాక్యముయొక్క అర్థము వేరు (ఏడాకులు గలది). అట్లే ''ఈ పదము రూఢము - ఇది రూఢము కాదు'' అను విభాగము కూడ ఉన్న యర్థమును విశదపరచుటకై ఏర్పడినదే.

వివరణము— ''పర్వణి పర్వణి - సప్త - పర్ణాని - అస్య - సంతి'' (సప్తపర్ణః) అని వాక్యమును చూపుదురు. ''ప్రతియొక కణుపునందును ఏడాకులు గల చెట్టు'' అను నర్థము దీనివలన వచ్చును. ''సప్తపర్ణ'' అను వృత్తివలన (బహువ్రీహి సమాసము) ''ఒక జాతి అరటి చెట్టు'' అను నర్థము లభించును. ఈ రెండిటికిని ఎట్టి పోలికయు లేదు. ఆకులున్నను ఎండిపోయినను సప్తపర్ణ శబ్దమాయర్థమును (అరటి) తప్పక బోధించును. వాక్యము బోధింప జాలదు కావుననే ''సప్తపర్ణ'' మొదలగు శబ్దములను రూఢము లందురు. అట్లని ''రాజ

పురుష'' మొదలగు వృత్తులన్నియును రూఢములు కానక్కరలేదు అవయవములుగా ఉన్న శబ్దముల అర్థము కూడ అట్టిచోట్ల స్ఫురించుచుండును. ఈ విధముగ ''రూఢము - యౌగికము'' అను వేర్పాటు కూడ సహజమైన స్థితిని గుర్తించుట కుపయోగించు ఉపాయము మాత్రమే. కాగా వృత్తి వేరు. వాక్యము వేరు.

విశేష విషయములు— అర్థమును తెలియజేయు తీరునుబట్టి శబ్దములను ఇట్లు విభజింతురు :

(1) యౌగికము— అవయవముల అర్థమును పూర్తిగా చెప్పునది. ఉదా : పాచకః (పచ్ + అక = వంటచేయువాడు) మొదలగునది.

(2) రూఢము— అవయవములున్నను వాని యర్థముతో సంబంధము లేకుండ మొత్తముపై ఒక యర్థమును చెప్పునది ఉదా : సప్తపర్ణః. ఇచట ఒకప్పుడు అవయవార్థము కుదిరినను (అరటికి ఏడాకులే ఒకప్పుడుండినను) ఈ శబ్దమును యౌగికమనరు కుశలః, ప్రవీణః, (నేర్పరి) మొదలగు శబ్దములు ఇట్టివే.

(3) యోగరూఢము— అవయవార్థమును స్వీకరించినను ఒకే యర్థమును ఎల్లపుడును చెప్పునది ఉదా : పంకజమ్. (పంకే - జాయతే = బురదయందు పుట్టునది = పద్మము మాత్రమే - మరొక వస్తువు కాదు)

ఇట్టి తీరులన్నియు భాషకు సహజములనియు ఆ యా సంకేతములు వీనిని వివరించుటకు బయలుదేరినవేగాని వాస్తవములు కావనియును గ్రంథకారుని హృదయము అట్లే ''వృత్తి - వాక్యము'' అను రెండు ప్రసిద్ధమైన మార్గములు అనాది సిద్ధములై ఉన్నవనియు, అందు వృత్తి అఖండమగు నర్థమును వాక్యము సఖండమగు నర్థమును బోధించుననియు, కొంత సామ్యమున్నంత మాత్రమున ''అవి ఒకటే'' యని భావింపరాదనియును ఈ సందర్భమున అతడు తరచుగ చెప్పుచుండును ॥55॥

అవతారిక— ఏకార్థీభావము నంగీకరించి వృత్తిని వేరుచేసినపుడు కూడ త్రిపద బహువ్రీహి సమాసమున (మూడు పదములకు జరుగు బహువ్రీహి) మొదటి రెండు పదములకును వేరొక సమాసమును చేయరాదని రెండు శ్లోకములతో చెప్పుచున్నాడు.

శ్లో॥ యా సామాన్యాశ్రయా సంజ్ఞా విశేషవిషయాచయా ।
బహులగ్రహణాన్నాస్తి ప్రవృత్తిరుభయోస్తయోః ॥ 56

శ్లో॥ సుసూక్ష్మజటకేశాదౌ సమాసోఽవయవే యది ।
స్యాత్ స్యాత్తత్రాంతరంగత్వాద్బాధకోఽవయవస్వరః ॥ 57

సుసూక్ష్మజటకేశాదౌ = ''సుసూక్ష్మజటకేశః'' మొదలగుచోట్ల, అవయవే = అవయవములగు, పదములకు, సమాసః = సమాసము (కర్మధారయము), స్యాత్ + యది = అయిన

ట్లయితే, అంతరంగత్వాత్ = లోపలిదగుటవలన, బాధకః = బాధించునట్టి, అవయవస్వరః = అవయవములకగు స్వరము, తత్ర = అచట, స్యాత్ = వచ్చెడిని.

(అందువలన) సామాన్యాశ్రయా = సామాన్యములకగు, సంజ్ఞా = సమాసము, యా = ఏది కలదో, విశేషవిషయా = విశేషములకగు, సంజ్ఞా = సమాసము, యా + చ = ఏదియు కలదో, తయోః = ఆ, ఉభయోః = రెండిటికిని, బహుల గ్రహణాత్ = ''బహులమ్'' అనుటవలన, ప్రవృత్తిః = ప్రవృత్తి, న + అస్తి = ఉండదు.

తాత్పర్యము— ''సుసూక్ష్మజటకేశః'' అనునది మూడు పదములకును సుసూక్ష్మ + జట + కేశ) ఒకేసారిగ జరిగిన బహువ్రీహి సమాసము ఇచట మొదటి రెండు పదముల కును ''సుప్‌సుపా'' (2-1-4) అను సూత్రముచే సామాన్య సమాసముగాని, ''విశేషణం విశేష్యేణ బహులమ్'' (2-1-57) అను సూత్రముచే కర్మధారయ సమాసముగాని ప్రవర్తింపదు. ఈ సూత్రమందలి ''బహులమ్'' అను పదమే అందు హేతువు. వానికి సమాసమును చేసినచో మొత్తముపై వచ్చు బహువ్రీహి స్వరమును బాధించి అవయవమైన సమాసమునకు వేరొక స్వరము రావలసి వచ్చును.

వివరణము— "సుసూక్ష్మాః - జటాః - కేశాః - యస్య - సః" (సూక్ష్మములై జడలుగట్టిన జుత్తు గలవాడు) అను విగ్రహమున మూడు పదములకును కలిపి, "అనేక మన్యపదార్థే" (2-2-24) అను సూత్రముచే బహువ్రీహి సమాసము ఒక్కుమ్మడిగ అగును. అందువలన "బహువ్రీహౌ ప్రకృత్యా పూర్వపదమ్" (6-2-1) అను సూత్రముచే తొలి పదమునకు సహజముగనున్న స్వరమే మిగులును. అది యభిమతము అట్లుగాక "ఏకార్థీ భావము కుదురును గదా!" అని భావించి మొదటి రెండు పదములకును సామాన్య సమాసమునుగాని విశేష సమాసమునుగాని ముందుగ చేసినచో, బహువ్రీహి స్వరమును త్రోసివైచి "సమాసస్య" (6-1-223) అను సూత్రముచే ఆ అవయవ సమాసముయొక్క చివరి అచ్చు ఉదాత్తము కావలసి వచ్చును. తరువాత బహువ్రీహి ప్రవర్తించినను ప్రయోజనముండదు. అందుచే అవయవములకు సమాసము జరుగరాదు ఇట్టి నిషేధమును సూత్రమందలి "బహులమ్" అను పదమువలన సాధింపనగును. ఇష్టము కానిచోట్ల సమాసమును బహుల శబ్దము వారించునని సంప్రదాయము.

విశేష విషయములు— "మధ్యనుండు పదార్థములకు ఏకార్థీభావమును చెప్పి అవాంతర సమాసమును చేయరాదా?" అను శంకకిది సమాధానము. "సుప్‌సుపా" = సుబంతము సమర్థమైన వేరొక సుబంతముతో సమసించును అని యర్థము. ఉదా : "పూర్వమ్ + భూతః = భూతపూర్వః" మొదలగునవి ఈ సమాసమునకు ప్రత్యేకముగ ఎట్టి పేరును లేదు. కాన ఇది సామాన్య సమాసము. "విశేషణం విశేష్యేణ బహులమ్" (దీని యర్థ మిది వరకే చూపబడినది). దీనిచే జరుగు సమాసమునకు కర్మధారయమని పేరు. ఇది విశేష సమాసము. "నిత్యముగ వచ్చుట", "వికల్పముగ వచ్చుట", "రాకుండుట", మొదలగు అభిమతార్థములను ఆవశ్యకత ననుసరించి బహుల పదమువలన సాధింతురు. "అనేక మన్య

పదార్థే" = "సమర్థములై ఒకటిని మించిన ప్రథమాంతములగు సుబంతములు సమసించును అట్లు సమసించు పదముల యర్థము సమాసమందు లేని వేరొక పదముయొక్క అర్థమును బోధింపవలయును" అని యర్థము ఈ సమాసమునకే "బహువ్రీహి" అని పేరు ఉదా : "పీతమ్ + అంబరమ్ - యస్య - సః = పీతాంబరః" (పచ్చని బట్టగలవాడు = విష్ణువు) మొదలగునవి.

ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము మొదలగునవి స్వరములు ఇవి అచ్చుల ధర్మములు సామాన్య వ్యవహారమున వీనిని పలుకుట పూర్తిగా నశించినది. కాని వేదభాషలో వీనిని పలుకుట తప్పనిసరి. వీనికి సంబంధించిన నియమములు కొల్లలుగా ఉన్నవి. సమాసమునకు చెందు రెండు నియమములిచట ప్రస్తుతములు "సమాసస్య" = సమాసముయొక్క చివరి అచ్చు ఉదాత్తము అని యర్థము. ఇది సామాన్యస్వరము "బహువ్రీహౌ ప్రకృత్యా పూర్వపదమ్'' అనునది బహువ్రీహికి మాత్రమే చెందునుగాన విశేషస్వరమగును ఈ రెంటిటిలో సామాన్యస్వర మంతరంగము అనగా సుఖముగను వేగముగను ప్రవర్తించునది. విశేషస్వరము బహిరంగము. కష్టముగను విలంబముగను ప్రవర్తించునది. కాగా బహిరంగమును బాధించి అంతరంగము ప్రవర్తించుట న్యాయ్యము. (బహిరంగము = ఎక్కువ నిమిత్తములు గల కార్యము అంతరంగము = తక్కువ నిమిత్తములుగల కార్యము) సమాసమయినచో - చాలును - సమాసస్వరము రావచ్చును. సమాసమును బహువ్రీహియు కూడ అయినపుడే బహువ్రీహి స్వరమగును. ఇట్లు సమాసస్వర మంతరంగమై బహువ్రీహి స్వరమును బాధించెడిని. (బహిరంగి కార్యముకన్న అంతరంగ కార్యము ప్రబలమని వైయాకరణుల సంప్రదాయము).

కాగా ప్రకృతమున మూడు పదములకును ఒకేసారిగ బహువ్రీహిని మాత్రమె చేయవలయునుగాని అవాంతర సమాసమును చేయకూడదని ఫలించినది. ॥57॥

అవతారిక— ''మీద చూపిన మూడు పదముల బహువ్రీహియందు ప్రాప్తించు అవాంతర సమాసమును ''విభాషా'' (2-1-11) అను మహాకవి కల్పముచేతనే వారింపవచ్చును. అందులకై బహుల పదమును ఆశ్రయించుట వ్యర్థము అను అభిప్రాయమును ఖండించుచున్నాడు.

శ్లో॥ సముదాయస్య వృత్తౌ చ నైకదేశో విభాష్యతే ।
భేద ఏవ విభాషాయాం నియతో విషయోయతః ॥ 58

సముదాయస్య = సమూహమునకు, వృత్తౌ + చ = వృత్తియందు, ఏకదేశః = అవయవము, న + విభాష్యతే = వికల్పింపబడదు, యతః = ఎందువలన, విభాషాయామ్ = వికల్పమందు, భేదః + ఏవ = వ్యపేక్షయే, నియతః = నియమింపబడిన, విషయః = విషయమై, (భవతి = అగుచున్నదో).

తాత్పర్యము— "విభాషా" (2-1-11) అను వికల్పమునకు వ్యపేక్షా సామర్థ్యము విషయమని వెనుక చూపబడినది (45 వ కారిక). కావున ఏకార్థీభావమున అది ప్రవర్తింపదు. పదసమూహమునకు ఏకార్థీభావమున్నచో, సమాసము రాక తప్పదు అట్లు అవయవములగు పదములకు గూడ ఏకార్థీభావమువలన ప్రాప్తించు సమాసమును బహుల గ్రహణముచేతనే వారింపవలయును.

వివరణము— ఏకార్థీభావమున వృత్తి తప్పదనియు, వ్యపేక్షయందు వాక్యము తప్పదనియును ఒక విధమైన కట్టుబాటును మాత్రమే "విభాషా" అను సూత్రము బోధించునని కొందరి మతము. ॥58॥

అవతారిక— పై విషయమునే మరొక విధమున విశదీకరించుచున్నాడు.

శ్లో॥ యతశ్చావిషయః సోఽస్యాస్తస్మాన్నాస్త్యకృతార్థతా ।
అభేదప్రక్రమేఽత్యంతం భేదానామపసారణాత్ ॥ 59

అభేదప్రక్రమే = అభేదమును స్వీకరించునపుడు, భేదానామ్ = భేదములు, అత్యంతమ్ = పూర్తిగా, అపసారణాత్ = పోవునుగాన, యతః + చ = ఎందువలన, సః = ఆ అభేదము, అస్యాః = ఈ విభాషకు, అవిషయః = విషయముకాదో, - తస్మాత్ = అందువలన, అకృతార్థతా = కృతార్థము కాకపోవుట, న + అస్తి = లేదు.

తాత్పర్యము— ఏకార్థీభావమున పదార్థముల భేదము పూర్తిగా నశించును. అపుడు వృత్తి తప్పదు. వ్యపేక్షయందు పదార్థముల భేదము పూర్తిగా ఉండును. అపుడు వాక్యము తప్పదు. ఈ వాక్యమే "విభాషా" అను దానికి విషయముకాని వృత్తి కానేరదు. కాగా వృత్తి విషయమున "విభాషా" అనునది "చరితార్థమగునా? (ప్రయోజనము గలది) కాదా?" అను ప్రసక్తియే లేదు.

వివరణము— ఈ విధముగ "విభాషా" అనునది వాక్యమునకు మాత్రమే కట్టుబడి పోయినందున (వాక్యమందే చరితార్థమయినందున) వృత్తియందు పనిచేయజాలదు. అందుచే "సుసూక్ష్మజటకేశ" మొదలగుచోట్ల మొదటి రెండు పదములకును ప్రాప్తించు సమాసమును బహుల గ్రహణముచేతనే వారింపక తీరదు. ॥59॥

అవతారిక— మూడు పదములకు జరుగు తత్పురుష సమాసములో కొన్నిచోట్ల అవయవములకు అవాంతర సమాసమును చేయవచ్చుననియును - అట్లయినను స్వరభేదముండదనియును ప్రతిపాదించుచున్నాడు.

శ్లో॥ మహాకష్టశ్రితేత్యేవం న స్యాద్భేదః పదత్రయే ।
వృత్తావవయవస్యాత్త్వం యస్మాన్న ప్రతిషిధ్యతే ॥ 60

మహాకష్టశ్రిత + ఇతి = "మహాకష్టశ్రితః" అనుచోట, ఏవమ్ = ఈ తీరులో, పదత్రయే =

మూడు పదములందు, అవయవస్య = అవయవమునకు, వృత్తౌ = సమాసమందు, ఆత్త్వమ్ ఆకారము, (ఆ - అను వర్ణము) యస్మాత్ = ఎందువలన, న + ప్రతిషిధ్యతే = వారింప బడలేదో, (తస్మాత్ = అందువలన) భేదః = స్వరభేదము, న + స్యాత్ = ఉండదు.

తాత్పర్యము— ''మహాకష్టశ్రిత'' అనుచోట మహత్ + కష్టమ్ + శ్రిత, అను మూడు పదములకును తత్పురుషము ఇచట వాస్తవముగ పదసమూహమునకే ఒకేసారి ఏకార్థీభావము. అయినను అవయవములగు మహత్, కష్ట, అను పదములకు కూడ వేరుగ ఏకార్థీభావము నంగీకరించి అవాంతరమగు కర్మధారయమును చేయవలయును. లేకున్న మహత్ శబ్దమునకు (త్ - అను చివరి వర్ణమునకు) ఆత్త్వము (ఆకారము) రాకపోవును. ''మహాకష్ట'' అను అభిమతమగు రూపము సిద్ధింపకపోవును అట్లు అవాంతర సమాసమును చేసినను మొత్తముపై స్వరభేదము మాత్రము కలుగదు. ఇదొక విశేషము.

వివరణము— ''మహత్ + కష్ట'' అను వానికి ''సన్మహత్పరమోత్తమో త్కృష్టాః పూజ్యమానైః'' (2-1-61) అను సూత్రముచే కర్మధారయమగును. ''ఆన్మహతః సమానాధికరణ జాతీయయోః'' (6-3-46) అను సూత్రముచే మహత్ శబ్దమునకు ఆకార మగును. పిదప ''మహాకష్టమ్ + శ్రిత'', అను పదములకు ''ద్వితీయాశ్రితాతీత పతితగతా త్యస్తప్రాప్తాపన్నైః'' (2-1-14) అను సూత్రముచే తత్పురుషమగును. ఇచట అవయవ సమాసమునకు ''సమాసస్య'' (6-1-223) అను సూత్రముచే రాదగు అంతోదాత్తమును, ''థాథఘఞ్క్తాజబిత్రకాణామ్'' (6-2-144) అను సూత్రము బాధించును. అయినను దీనిని బాధించి ''అహీనేద్వితీయా'' (6-2-47) అను సూత్రము ప్రవర్తించుటచే మొత్తముపై అభిమతమగు స్వరమే (అంతోదాత్తము) సిద్ధించును

విశేష విషయములు— (1) సన్మహత్పరమోత్తమోత్కృష్టాః పూజ్యమానైః'' (2-1-61) సత్, మహత్, పరమ, ఉత్తమ, ఉత్కృష్ట అను శబ్దములు, (విశేషణములు) పూజింపబడు వస్తువును చెప్పు శబ్దములతో (విశేష్యములు) సమసించును అని యర్థము. ఉదా : సద్వైద్యః, మహావైయాకరణః, మొదలగునవి

(2) ''ఆన్మహతః సమానాధికరణ జాతీయయోః'' (6-3-46) ''మహత్ శబ్దము యొక్క చివరి వర్ణమునకు ఆకార మాదేశమగును సమానాధికరణమైన (విశేష్యము) ఉత్తరపదముగాని, ''జాతీయ'' అను శబ్దముగాని పరముగ నుండవలెను అని యర్థము. ''మహాపురుషః'' మొదలగునవి ఉదాహరణములు. ప్రకృతమున (మహాకష్టశ్రిత, అనుచోట) మూడు శబ్దములకును ఒకేసారిగ వృత్తి అన్నచో కష్టశబ్ద ముత్తరపదము కానందున మహ చ్ఛబ్దమునకు ఆత్త్వము రాకపోయెడిని (సమాసముయొక్క చివరి పదము మాత్రమే ఉత్తర పదమనుట వ్యాకరణ మర్యాద) అందుచే ''మహత్ + కష్ట'' అను దశలో అవాంతర సమాస మును చేయక తప్పదు.

(3) ''ద్వితీయాశ్రితాతీత పతితగతాత్యస్త ప్రాప్తాపన్నైః'' (2-1-14). ''సమ

ర్థములగు శ్రిత, అతీత, పతిత, గత, అత్యస్త, ఆపన్న, అను వానిలో దేనితోనయినను ద్వితీయాంతము సమసించును'' అని యర్థము. ''కష్టశ్రిత, గ్రామగత'', మొదలగునవి యుదాహరణములు.

(4) సమాసస్య'' (6-1-223) దీని యర్థము 56, 57 కారికల వ్యాఖ్యలో చూప బడినది. ఇది సమాస మాత్రమునకు వర్తించు సామాన్య స్వరము.

(5) ''థాఽథఘఞ్క్తాజబిత్రకాణామ్'' (6-2-144) గతికిగాని, (ప్ర. పరా. మొదలగునది), కారకమునకుగాని (కర్మ, కరణము, మొదలగునవి), ఉపపదమునకుగాని (ముందుండు పదము) పరమై, - థ, అథ, ఘఞ్, క్త, అచ్, అప్, ఇత్ర, క - అను ప్రత్య యములలో ఏదేని చివరగల పదమున్నపుడు, దాని చివరి అచ్చు ఉదాత్తమగును (అంతో దాత్తము)'' అని యర్థము. ప్రభృథః, ఆవసథః, మొదలగునవి ఉదాహరణములు. ఈ సూత్రము విశేషముగాన ''సమాసస్య'' అను దానిని బాధించును. ''మహాకష్టశ్రిత'' అను చోట ''శ్రిత'' అనునది క్తప్రత్యయాంతము. ''మహాకష్టమ్'' అనునది కర్మకారకము. కాగా ఈ సూత్రమున కిచట ప్రాప్తి యున్నది.

(6) ''అహీనేద్వితీయా'' (6-2-47) ''ద్వితీయాంతము క్తప్రత్యయాంతముతో సమసించునపుడు, సమాసమువలన ''కూడిన - లేక- పొందిన'' అను భావము (అహీనము= విడువబడినది = కూడి యున్నది) వచ్చినచో ద్వితీయాంతము తనకు సహజమైన స్వరమునే పొందును అని యర్థము ''కష్టశ్రిత'' మొదలగునవి ఉదాహరణములు. ఇచట కష్ట శబ్ద మంతోదాత్తము. సమాసమున అదియే మిగులును. ఈ సూత్రము వేరొక విశేషముగాన ''థాఽథఘఞ్'' మొదలగు సూత్రమును బాధించును. కాగా ''మహాకష్టశ్రిత'' అనుచోట చివరకు ఈ సూత్రమే ప్రవర్తించి, ''మహాకష్ట'' అనునది అంతోదాత్తమగును. అదియే ''మహాకష్టశ్రిత'' అను మొత్తమునకును అనుసరించును. ఇట్లు ఇచట సముదాయమునకును అవయవములకును వేర్వేరుగ సమాసమును చేసినను స్వరభేదమను దోషము కలుగదని ఫలించినది. ॥60॥

అవతారిక — మూడు పదములకగు తత్పురుష సమాసములలో కొన్నిచోట్ల స్వర భేదము తప్పదనుచున్నాడు.

శ్లో॥ మహారణ్యమతీతే తు త్రిపదాద్భిద్యతే స్వరః ।
యస్మాత్తత్రాంతరంగత్వాద్బాధకోఽవయవస్వరః ॥ 61

మహారణ్యమ్ + అతితే + తు = మహారణ్యమ్ + అతీత, అనుచోట అయితే, త్రిపదాత్ = మూడు పదముల సమాసముకన్న (మహత్, అరణ్యమ్, అతీత, అను పదములకు) స్వరః= స్వరము, భిద్యతే = వేరగును, యస్మాత్ = ఎందువలన అనగా, తత్ర=అచట, అంతరంగ త్వాత్ = లోపలిదగుటవలన, అవయవస్వరః = అవయవమైన సమాసముయొక్క స్వరము, బాధకః = బాధించునదియై, (భవతి = అగును).

తాత్పర్యము— ''మహారణ్యాతీతః'' అనుచోట కూడ మూడు పదములకును ఒకేసారి సమాసమన్నచో స్వరభేదము కలుగును. ఇచట ''మహాకష్టశ్రిత'' అను చోటునందు వలె మహచ్ఛబ్దమునకు ఆత్త్వము సిద్ధించుటకై (చూడు - 60 వ కారిక) మహత్ + అరణ్య, అను శబ్దములకు ముందుగా సమాసమును చేయవలయును అపుడు ''సమాసస్య'' (6-1-223) అను సూత్రముచే ఈ అవయవ సమాసమునకు అంతోదాత్తము తప్పదు. అదియే మొత్తము సమాసమునకును సంక్రమింపవలసి వచ్చును. ''థాఽథఘఞ్'' మొదలగు సూత్రము బహిరంగమగుటచేతను (అతీత - అను శబ్దమును కూడ కలిపినగాని అద్దానికి ప్రవృత్తి యుండదు. ''సమాసస్య'' అనునది అంతరంగమగుటచేతను (రెండు శబ్దములకును సమాసము కాగానే వచ్చునది) అవయవస్వరము బాధకము కాక తప్పదు.

వివరణము— "అతీత'' శబ్దమునకు "దాటినవాడు'' అని యర్థము కావున సమాసమువలన "విడువని'' (అహీనము) అను భావము రాదు. అందుచే "అహీనే ద్వితీయా'' (6-2-47 చూ - 60 వ కారిక) అను సూత్రము "మహారణ్యాతీత'' అనుచోట ప్రవర్తింపదు. అందుచేతనే "మహాకష్టశ్రితః'', అను దానికిని "మహారణ్యాతీతః'' అను దానికిని పొత్తు కుదురదు. (స్వరములు వేరు) ॥61॥

అవతారిక— మీది యంశమునే వివరించుచున్నాడు.

శ్లో॥ సతిశిష్టబలీయస్త్వాత్ థాఽథాదిస్వరఏవ తు ।
ద్విపదే తేన యుగపత్ త్రితయం న సమస్యతే ॥ 62

ద్విపదే = రెండు పదముల సమాసము, సతి = అయినపుడు, శిష్టబలీయస్త్వాత్ = వేరుగ విధింపబడిన శాస్త్రము ప్రబలమగుటవలన, థాఽథాదిస్వరః + ఏవ + తు = "థాఽథఘఞ్'' (6-2-144) మొదలగు సూత్రముచే విధింపబడిన స్వరమే, (భవతి = అగును), తేన = అందుచే, త్రితయమ్ = మూడు పదములును, యుగపత్ = ఒకేసారిగ, న + సమస్యతే = సమసింపవు.

తాత్పర్యము— "మహారణ్యాతీత'' అనుచోట "మహత్ + అరణ్య'', అను వానికి ముందుగ సమాసముచేసి, పిదప "మహారణ్యమ్ + అతీత'' అను రెండింటికిని సమాసమును చేసినచో, తొలి సమాసమునకు ప్రాప్తించు అంతోదాత్త స్వరమును బాధించి, "థాఽథఘఞ్'' మొదలగు సూత్రముచే విధింపబడిన స్వరమే ప్రవర్తించును. అది విశేషకార్యముగాన ప్రబలమగును అందుచే ఇచట మూడు పదములకును ఒకేసారి సమాసము రాదనుటయే సమంజసము.

వివరణము— "సమాసస్య" (6-1-223) అను సూత్రముచే వచ్చు అంతోదాత్తము సామాన్యకార్యము. "థాఽథఘఞ్'' మొదలగు సూత్రముచే వచ్చు అంతోదాత్తము విశేషకార్యము. సామాన్యమును విశేషము బాధించును. కాగా మూడు పదముల సమాసమైనచో

మధ్యోదాత్తమును రెండు పదముల సమాసమైనచో అంతోదాత్తమును అగునన్నది యిచటి సారము. ఇట్టి భేదమును వారించుటకై ఇట్టి స్థలములందు రెండు పదములకే తత్పురుషమనుట న్యాయ్యము.

విశేష విషయములు— మూడు పదములు గలచోట మూడింటికిని ఒకేసారి సమాసమని చెప్పి, కొన్ని కార్యములు సిద్ధించుటకై తొలి రెండు పదములకును మరల అవాంతరముగ సమాసమనుట ఒక పద్ధతి. దీనిని త్రిపద సమాసమందురు అట్లుగాక తొలి రెండు పదములకును మొదట సమాసముచేసి, పిదప చివరి పదముతో సమాసమనుట రెండవ పద్ధతి. దీనిని ద్విపదసమాసమందురు. (మొదటి సమాసమంతయు ఒకే పదమగును. "సుప్‌సుపా" (2-1-4) (సుబంతము సమర్థమగు వేరొక సుబంతముతో సమసించును - అని యర్థము) అను సూత్రమున ఏకవచనమును ("ఒక సుబంతము" అను నర్థమును) పాటించనిచో, మూడు పదములకును ఒకేసారి సమాసము కుదురును. దానిని పాటించినచో ఎప్పుడైనను రెండు పదములకే సమాసమనుట తప్పదు.

సామాన్య వ్యవహారమున త్రిపద సమాసమన్నను, ద్విపదమన్నను భేదము కానరాదు. కాని కొన్నిచోట్ల స్వరమునందు భేదమేర్పడును. మరికొన్నిచోట్ల కొన్ని కార్యములందును భేదము కలుగును. ఈ యంశమును విశదపరచుటకే ఈ ఘట్టము బయలుదేరినది.॥62॥

అవతారిక— "మహాకష్టశ్రితః" అనుచోట, కష్టశబ్దము యొక్క అర్థము శ్రిత శబ్దముయొక్క అర్థముతోనే సంబంధించును. (కష్టమును పొందిన) అయినపుడు కష్టశబ్దమునకును మహత్ శబ్దమునకును సంబంధమెట్లు? సంబంధము లేనిచో సమాసమును, దాని మూలమున ఆత్త్వమును ఎట్లు వచ్చును? - అను శంకకు సమాధానమును చూపుచున్నాడు.

శ్లో॥ యేషా మపూజ్యమానత్వం పరార్థానుగమార్థకే ।
విశేషణవిశేష్యత్వమపి తేషాం న కల్పతే ॥ 63

పరార్థానుగమార్థకే = వేరొక శబ్దముయొక్క అర్థముతో సంబంధము కలిగినచోట, అపూజ్యమానత్వమ్ = పూజింపబడకుండుట (పూజకు యోగ్యత లేకుండుట) యేషామ్ = ఎవరికో (ఎవరి కభిమతమో), తేషామ్ = వారికి, విశేషణవిశేష్యత్వమ్ + అపి = విశేషణవిశేష్యభావము కూడ, న + కల్పతే = కుదురదు

తాత్పర్యము— కష్ట శబ్దముయొక్క అర్థము శ్రిత శబ్దముయొక్క అర్థముతో సంబంధమును కలిగినంత మాత్రముచే, కష్ట శబ్దమునకును దానికి విశేషణమగు వేరొక శబ్దమునకును సంబంధమే ఉండకూడదని అనరాదు. అట్లయినచో మూడు పదములుగలట్టియు ప్రసిద్ధమైనట్టి కొన్ని సమాసములలో తొలి రెండు పదములకును విశేషణవిశేష్యభావము కూడ కుదురక పోవును.

వివరణము— మహత్ శబ్దము పూజా వాచకము (ఇచట అధిక్యమును సూచిం

చను = అధికమైన కష్టము) కష్ట, అనునది పూజ్యమానము. దీనియందలి విశేషమును బోధించుటకు మహచ్ఛబ్దము దీనితో సంబంధించుననుటలో తప్పు లేదు. ద్రవ్యముతోపాటు దానియందలి గుణములకు కూడ క్రియతో సంబంధముండునట్లు ప్రధానమైన దానికిని దాని విశేషములకును సంబంధముండును. కావున మహచ్ఛబ్దమునకును కష్ట శబ్దమునకును సామర్థ్య ముండుటచే తొలుత సమాసము సిద్ధించును పిదప "మహాకష్టమ్ + శ్రితః" అని ద్విపద తత్పురుషమును చేయవలెను. ఇదియే సరియైన తీరు.

ఇట్లు కాదన్నచో "పంచగవధనః" (పంచ + గావః + ధనమ్ - యస్య - సః = అయిదు గోవులు ధనముగ గలవాడు) మొదలగుచోట్ల మొదటి రెండు పదములకును విశేషణ విశేష్యభావము కూడ కుదురకపోవును అట్లయిన అచట రావలసిన కార్యములు (గోశబ్దము "గవ" అని మారుట) రాకపోయెడిని.

విశేష విషయములు— "పంచగవధనః" మొదలగుచోట్ల అభీష్టము సిద్ధించుటకు తొలి రెండు పదములకును విశేషణ విశేష్యభావమును, తొలుత అవాంతర సమాసమును శాస్త్రకారు లంగీకరించిరి. అ తీరునే "మహాకష్టశ్రిత" మొదలగుచోట్ల కూడ అవలంబింపవలె నని గ్రంథకర్త యొక్క హృదయము

"సుప్ సుపా" (2-1-4) అను సూత్రమున "సుప్" (సుబంతము) "సుపా" (సుబంతముతో) అను ఏకవచనమునకు పట్టింపులేదనియును, ఎన్నియైనను సుబంతములు సమర్థములైనచో పరస్పరము సమసింపవచ్చుననియును ఒక వాదమున్నది. తదనుసారముగ "త్రిపద తత్పురుషము" మొదలగు రీతిని (మూడు పదములకును ఒకేసారి సమాసము) కొంద రంగీకరించిరి. కాని అది సిద్ధాంతము కాదు. ఈ సూత్రమున ఏకవచనమునకు పట్టింపు గలదనియును, ఎట్లు సాధించినను ఒకసారి రెండు సుబంతములకు మాత్రమే సమాసమును చెప్పవలెననియును సిద్ధాంతము కావున తత్పురుషములో మూడు లేక— నాలుగు పదము లున్నపుడు, రెండు రెండు చొప్పున అవాంతర సమాసములను చేసికొనుచు, తుదకు రెండు పదములకే సమాసమును జరుపవలెను. అందువలన మహాకష్టశ్రిత, మహారణ్యాతీత, మొద లగు చోట్ల కూడ అవాంతర సమాసమును చేసి, చివరకు ద్విపద సమాసమును చెప్పుటయే శరణ్యము. ॥63॥

అవతారిక— మరికొన్ని విశేషములను చూపుటకై వృత్తికిని వాక్యమునకును గల భేదమును మరల పరామర్శింపుచున్నాడు

శ్లో॥ విశేషః శ్రూయమాణోఽపి ప్రధానేషు గుణేషు వా ।
శబ్దాంతరత్వాద్వాక్యే తు వృత్తౌ నిత్యం న విద్యతే ॥ 64

వాక్యే = వాక్యమందు, ప్రధానేషు = ముఖ్యమైన వానియందుగాని, వా = లేక, గుణేషు = ముఖ్యము కాని వానియందుగాని, విశేషః = విశేషము, శ్రూయమాణః + అపి = వినబడు

చున్నను, వృత్తౌ + తు = వృత్తియందైతే, శబ్దాంతరత్వాత్ = వేరొక శబ్దమగుటవలన, నిత్యమ్ = ఎపుడును, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— ముఖ్యమైన పదార్థమునకుగాని ముఖ్యము కాని దానికిగాని వాక్య మందు విశేషమును చెప్పవచ్చును. అట్లు వృత్తియందెపుడును విశేషమును చెప్పకూడదు. వాక్యముకన్న వృత్తి పూర్తిగా వేరగుటయే ఇందుకు కారణము.

వివరణము— ''రాజ్ఞః పురుషః''. ఇది వాక్యము ఇచట అర్థమును భావించి నపుడు పురుషుడు ముఖ్యుడగును. రాజు ముఖ్యుడు కాడు. అయినను మనము సంకల్పించినచో ''ఋద్ధస్య'' (ఐశ్వర్యముగల), ''బలవంతః'' మొదలగు విశేషణములను రాజునకు చెప్ప వచ్చును. ఇచట ''రాజు'' అను పదార్థము విడిగా ఉన్నది. అట్లే ''చిత్రాః – గావః – అస్య – దేవదత్తాస్య'' అను వాక్యములో ముఖ్యమైన ''దేవదత్తుడు'' మొదలగు విశేషమును స్పష్టముగ చెప్పవచ్చును.

కాని ఈ తీరు వృత్తిలో కుదురదు ''రాజ పురుషః'' అను సమాసములో ఇమిడి పోయిన రాజునకు (రాజ శబ్దముయొక్క అర్థమునకు) ''బలవతః'' మొదలగు విశేషములను కలుపకూడదు. ఇచట రాజ శబ్దార్థము పురుష శబ్దముయొక్క అర్థముతో విడదీయుటకు వీలు లేకుండ కలిసిపోయినది. కాన అద్దానికి స్వాతంత్ర్యము లేదు. అట్లే ''చిత్రగుః'' మొదలగు బహువ్రీహి సమాసములో సామాన్యమైన అన్య పదార్థము (ఆ సమాసమునకు విశేష్యముగ ఉండునది) ముఖ్యమైనను, దాని విశేషమును మాత్రము ''ఇది'' అని నొక్కిచెప్పుటకు వీలు లేదు. సందర్భమునుబట్టి ఆ విశేషము మారుచుండును (రామః, హరిః, దేవదత్తః మొదలగు వారిలో ఎవరయినను ''చిత్రగుః'' కావచ్చును)

కాగా వాక్యధర్మములు వేరు. వృత్తిధర్మములు వేరు. వానికిని వీనికిని ఎట్టి పొత్తును లేదు. ॥64॥

అవతారిక— వృత్తియందు అప్రధానమైయున్న పదార్థమునకు విశేషముతో సంబంధము లేనిచో, ''కృతపూర్వీ'' (ఇదివరకే చేసినవాడు) అను తద్ధితవృత్తియందు ''చేయుట'' మొదలగు క్రియలలో ''కటమ్'' (చాపను) మొదలగునవి కర్మలుగా ఎట్లన్వ యించును ? – అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ విశేషకర్మసంబంధే నిర్భుక్తేఽపి కృతాదిభిః ।
విశేషనిరపేక్షోఽన్యః కృతశబ్దః ప్రవర్తతే ॥ 65

కృతాదిభిః = కృత, మొదలగు శబ్దములచే, విశేష కర్మసంబంధే = విశేషమైన కర్మల యొక్క సంబంధము, నిర్భుక్తే + అపి = అనుభవింపబడినను, విశేష నిరపేక్షః = విశేష ముల అపేక్షలేని, అన్యః = వేరొక, కృతశబ్దః = కృత, అను శబ్దము, ప్రవర్తతే = ప్రవ ర్తించును.

తాత్పర్యము— కృత, మొదలగు శబ్దములు వాక్యమందున్నపుడు ఆ యా కర్మ విశేషములను చెప్పగలుగును. అవియే వృత్తియందున్నచో కర్మతోడి సంబంధమును పోగొట్టుకొనును. కావున వృత్తిని వాడినపుడు కర్మను వేరుగ చూపుట తప్పదు

వివరణము— ''కృతపూర్వీ'' (ముందుగ చేసినవాడు. ''కటమ్ = చాపను'' మొదలగునది ఇచట కర్మ) అను తద్ధితవృత్తి ప్రకృతమైన ఉదాహరణము ఇచట ''కృతః = చేయబడినది - పూర్వమ్ = ముందుగ, అనేన = వీనిచే'' అనునది వాక్యము (వీనిచే ముందుగ చాప చేయబడినది - అని యర్థము). ఇచట "కృ" ధాతువునకు "క్త" (త) అను ప్రత్యయము చేరగా కృత, (చేయబడిన) అను రూపమేర్పడును క్త ప్రత్యయము కర్మ విశేషమునంతను (కట, పట, ఘట మొదలగు చెప్పదలచిన కర్మను) చెప్పివేయును కావున కర్మవాచకమునకు ద్వితీయావిభక్తి రాకుండ ప్రథమయే వచ్చును ఇటువంటి అర్థమును చెప్పు వాక్యము ఈ తీరులోనే యుండును కాని ఇదే అర్థమును చెప్పునపుడు వృత్తి వేరుగనుండును. "కృతపూర్వీ" అనునది వృత్తియొక్క రూపము. ఇచట ''కృత'' అను శబ్దము ఏ విధమైన కర్మను బోధింపక, ''చేయుట'' అను కృధాతువు యొక్క సామాన్యమైన అర్థమును మాత్రమే చెప్పును. అందుచే కర్మ విశేషమును (చాప, బట్ట మొదలగునది) ద్వితీయాంతముగ వాడక తప్పదు. కాగా "కృతపూర్వీ" (ముందుగ చేసినవాడు - అనియే అర్థము) అనగానే "కటమ్" అనియా, ''పటమ్'' అనియో ఏదోయొక కర్మను చెప్పి తీరవలెను. ఇట్టి స్థలములందు వాక్యమందలి ''కృత'' శబ్దము ''చేయబడిన'' అను నర్థమును (కర్మార్థము) వృత్తియందలి ''కృత'' శబ్దము ''చేసినవాడు'' అను నర్థమును (కర్త్రర్థము) బోధించుచున్నది అని సారాంశము. ఇదియు శబ్ద శక్తియొక్క విలాసములలో ఒకటి

విశేష విషయములు— ''కృతపూర్వ'' శబ్దమునకు ''సపూర్వాచ్చ'' (5-2-87) అను సూత్రముచే ఇన్, అను తద్ధితప్రత్యయము ప్రవర్తించును. (కృతపూర్వ + ఇన్ = కృతపూర్వీ) ''అనేన కృతమ్, అనేన భుక్తమ్'' మొదలగు అర్థమును చెప్పదలచినపుడు, ఆ యా క్త ప్రత్యయాంతము (కృత, భుక్త మొదలగునది) ముందుగనున్న ''పూర్వ'' అను శబ్దమునకును ''ఇన్'' ప్రత్యయమగునని పై సూత్రముయొక్క అర్థము. ''భుక్తపూర్వీ'' (ఓదనమ్), ''గతపూర్వీ'' (గ్రామమ్), మొదలగునవన్నియు ఇట్టివే.

వేరొక విధమున కర్మ చెప్పబడనపుడే కర్మవాచకమునకు ద్వితీయా విభక్తి యగును. (అనభిహితే - 2 - 3 - 1, కర్మణి ద్వితీయా - 2 - 3 - 2 - కర్మ చెప్పబడనపుడే ద్వితీయ అగునని యర్థము) ప్రకృతమున వాక్యావస్థయందలి కృత శబ్దము కర్మను చెప్పివేయును. వృత్తియందలి కృత శబ్దము కర్మను చెప్పజాలదు. ॥65॥

అవతారిక— పై విషయమునే వివరింపుచున్నాడు.

శ్లో॥ అకర్మకత్వే సత్యేవం క్తాంతం భావాభిధాయి తత్ ।
తతః క్రియావతా కర్త్రా యోగో భవతి కర్మణామ్ ॥ 66

ఏవమ్ = ఇట్లు, అకర్మకత్వే + సతి = కర్మ లేకపోవుట సంభవింపగా, తత్ = ఆ, క్తాంతమ్ = క్త ప్రత్యయాంతము, భావాభిధాయి = క్రియను మాత్రమే చెప్పును, తతః = అందువలన, క్రియావతా = క్రియను గలిగిన, కర్త్రా = కర్తతో, కర్మణామ్ = కర్మలకు, యోగః = సంబంధము, భవతి = అగును.

తాత్పర్యము— ''కృతపూర్వీ'' మొదలగు తద్ధిత వృత్తులందున్న కృత, మొదలగు క్త ప్రత్యయాంతము కేవలము క్రియను మాత్రమే చెప్పును. (కర్మను చెప్పదు) ఆ క్రియ గలవాడు కర్త కావున కర్తతో కర్మకు సంబంధము కుదురును. అనగా కర్మను స్పష్టముగా చెప్పవచ్చును.

వివరణము— వాక్యమందు కర్మను బోధించు క్త ప్రత్యయాంతము (కృత, భుక్త మొదలగునది), తద్ధిత వృత్తియందు ఆ యా క్రియను మాత్రమే తెలియజేయుచు, తుదకా క్రియగల కర్తను బోధించును. అట్లది అకర్మకమగును. అందుచే అచటి కర్మను వేరుగ ద్వితీయాంతమగు పదముతో (కటమ్, అన్నమ్ మొదలగునది) విశదీకరింపవలయును.

విశేష విషయములు— ఇట్టిచోట్ల ''ఇన్'' అను తద్ధితము కర్తను చెప్పును. అతడు చేయు క్రియను క్త ప్రత్యయాంతము సూచించును. ''ఏదో ఒక కర్మ ఉండును'' అను భావన కలిగినను అది ఏదో స్పష్టముగ తెలియదు ఆ కర్మను స్పష్టపరచుటకై కర్మ పదమును వాడుదుము. అనగా ''కృతపూర్వీ'' మొదలగుచోట్ల ''ముందు చేసినవాడు'' అను రీతిని కర్తయే ముఖ్యముగ బోధపడును. క్రియ అప్రధానమగును. ఆ క్రియకు చెందు కర్మను తొలుత భావనలో ఉంచికొని చివరను విడిగా పేర్కొందుము. ఇట్లు ''కటమ్'' మొదలగు శబ్దములను వాడుట కుదురును.

కర్మ ప్రసిద్ధమైనపుడు కొన్ని క్రియలలో కర్మ పదమును ఉపయోగించము. ఉదా : ''మేఘః వర్షతి'' (మేఘము వర్షించుచున్నది) ఇచట ''జలమ్'' అని వేరుగ చెప్ప నక్కర లేదు. ఇట్టి క్రియలను గూడ ''అకర్మకములు'' (ప్రసిద్ధిని బట్టి కర్మను పేర్కొన నక్కరలేనివి) అందురు. ఈ తీరు అకర్మకత్వమును ''కృతపూర్వీ'' మొదలగు స్థలములందలి క్రియలకు ఊహింపవలయును. ఇదంతయు వృత్తి మాహాత్మ్యము

అవతారిక— ''కృతపూర్వీ'' మొదలగుచోట్ల (వృత్తియందు) క్రియ కర్తతో కలిసిపోయి ఉండునుగాని వేరుగను స్వతంత్రముగను ఉండదు. అయినను అట్టి క్రియకు కర్మతో సంబంధము కుదురు రీతిని దృష్టాంతపూర్వకముగా చూపుచున్నాడు.

శ్లో॥ అవిగ్రహా గతాదిస్థా యథా గ్రామాదికర్మభిః ।
సంబధ్యతే క్రియా తద్వత్ కృతపూర్వ్యాదిషు స్థితా ॥ 67

గతాదిస్థా = ''గత'' మొదలగుచోట్ల ఉన్న, అవిగ్రహా = ఆకారములేని, క్రియా = వ్యాపారము, గ్రామాదికర్మభిః = గ్రామము మొదలగు కర్మలతో, యథా = ఎట్లు, సంబధ్యతే =

సంబంధించునో, తద్వత్ = అట్లే, కృతపూర్వ్యాదిషు = కృతపూర్వీ, మొదలగుచోట్ల, స్థితా = ఉన్న - క్రియ, సంబధ్యతే = సంబంధించును.

తాత్పర్యము— ''గ్రామం గతః'' (గ్రామమును వెళ్ళినవాడు) మొదలగు స్థలము లలో గూడ గమనము మొదలగు వ్యాపారము కర్తను ఆశ్రయించుకొనియే ఉండును. వేరుగ నుండదు. అయినను దానికి కర్మతో సంబంధము కుదురును. అట్లే ''కృతపూర్వ'' మొదలగు చోట్ల వేరుగ భాసించినట్టియు అప్రధానమై ఉండునట్టియు క్రియకును (చేయుట మొదలగు నది) కర్మ సంబంధము సంభవించును.

వివరణము— ''గ్రామం గతః'', ''గ్రామం గచ్ఛతి'' (గ్రామమును గూర్చి వెళ్ళుచున్నాడు) మొదలగునవి దృష్టాంతములు. ఇచట త, తి అను ప్రత్యయములు కర్తను చెప్పును. కాగా ఆ యా ధాతువు బోధించు క్రియ ఎల్లపుడును, ఇట్టిచోట్ల కర్తను ఆశ్రయించు కొనియే ఉండునుగాని వేరుగను స్వతంత్రముగను ఒక ఆకారముతో కనబడదు. అనగా ఆ యా క్రియ అప్రధానముగనే యుండును. అయినను అట్టి క్రియలో గ్రామము మొదలగునవి కర్మలుగా అన్వయించును. ఇదే రీతిని ''కృతపూర్వీ'' మొదలగు స్థలములలో అవలంబింప వలెను.

విశేష విషయములు— ఎట్టి ప్రత్యయమును లేని కేవల ధాతువునకు (గమ్, కృ, మొదలగునది) ప్రయోగముండదు ఉన్నను ప్రయోజనము శూన్యము కావున ప్రత్యయమును కలిపిన ''గచ్ఛతి'' మొదలగు రూపములనే వాడవలెను. అయినపుడు ప్రత్యయము యొక్క అర్థము (కర్త, కర్మ మొదలగునది) ఎల్లపుడును ముఖ్యముగ నుండి, ధాత్వర్థమైన వ్యాపా రము దానికి విశేషణమై అప్రధానమగుచుండును. కాగా కారకమును (కర్త, కర్మ మొదలగు నది) విడిచి వేరుగా క్రియ సంభవింపదు. క్రియకు ప్రాధాన్యమును చెప్పినను కారకము ద్వారముననే చెప్పి తీరవలెను. ॥67॥

అవతారిక— ''ముండయతి'' (కేశఖండనము చేయుచున్నాడు), ''సూత్రయతి'' (సూత్రములను రచించుచున్నాడు), మొదలగుచోట్ల ముండ - సూత్ర, మొదలగునవి క్రియా వాచకములు కాకపోయినను వానికి కర్మలతో సంబంధము కుదురునని చెప్పుచున్నాడు.

శ్లో॥ ముండిసూత్ర్యాదయోఽసద్భిర్భాగై రనుగతా ఇవ ।
విభక్తాః కల్పితాత్మానో ధాతవః కుట్టిచర్చివత్ ॥ 68

ముండి సూత్ర్యాదయః = ముండి, సూత్రి, మొదలగునవి, కుట్టిచర్చివత్ = కుట్టి, చర్చి, అను వానివలె, అసద్భిః = లేనట్టి, భాగైః = భాగములతో, అనుగతాః + ఇవ = కూడినవా - లన్నట్లు, విభక్తాః = వేరుచేయబడినట్టియు, కల్పితాత్మానః = కల్పింపబడిన స్వరూపముగల, ధాతవః = ధాతువులై, (భవంతి = అగును).

తాత్పర్యము— కుట్ట, చర్చ, అను ధాతువులు చురాదిగణమున పఠింపబడినవి

ఇవి అఖండములు. అసగా ఎట్టి అవయవములును లేనివి. వీని వలెనే ముండ, సూత్ర మొద లగునవియు అఖండములే. వీని విషయమున భాగములను చూపుట కేవలము కల్పనము.

వివరణము— ప్రక్రియననుబట్టి ముండ, సూత్ర మొదలగు ప్రాతిపదికములకు, ''కరోతి'' (చేయుచున్నాడు) అను నర్థమున ణిచ్ (ఇ) ప్రత్యయమును చేయగా, అవి ముండి, సూత్రి మొదలగు ధాతువులుగ మారును. పిదప తిఙ్ ప్రక్రియవలన ముండయతి, సూత్ర యతి మొదలగు రూపములగును ఈ తీరు కూడ వృత్తియే. దీనిని ''సనాద్యంత ధాతువృత్తి'' అందురు. ఇచట కూడ ''ముండం కరోతి'' మొదలగు వాక్యమును ప్రకృతి ప్రత్యయాది విభాగమును కేవలము ఉపాయమే. వాస్తవము కాదు. ''ముండయ'', ''సూత్రయ'' మొదలగు అఖండమైన ధాతు రూపములే సత్యములు అవి క్రియా వాచకములు. కేశఖండనము, సూత్ర రచనము, మొదలగునవి వీని యర్థములు కావుననే ''మాణవకుడు'' (వటువు) ''సూత్రము'' మొదలగు కర్మలతో వీనికి సహజముగనే సంబంధము కుదురును. కాగా ''మాణవకం ముండ యతి'' ''వ్యాకరణం సూత్రయతి'' మొదలగు ప్రయోగములు సహజ సిద్ధములు.

విశేష విషయములు— పాణిని తన ధాతు పాఠమున పఠించిన అఖండములగు ధాతువుల వంటివే (ముండి, మొదలగునవి) అని చెప్పుటకు, కుట్ట, చర్చ, అను దృష్టాంతము చూపబడినది. ముండి, కుట్టి, మొదలగునవి ణిచ్చును కలిపి వాడిన రూపములు. లేదా— ఇ, అను ప్రత్యయమును ధాతువునకు చేర్చి ఆ యా ధాతువును పేర్కొనుట కూడ ఒక సంప్ర దాయము. (ఉదా : గమిః = గమ్, ధాతువు). సన్, క్యచ్, మొదలగు ప్రత్యయములు పండ్రెండున్నవి. వీనిలో కొన్ని ధాతువులకు సూటిగానే చేరును మరికొన్ని ప్రాతిపదికము లకు చేరును. తుదకన్నియు ధాతువులుగ మారును. ''కోరిక'', ''సాదృశ్యము'' మొదలగు చిత్ర విచిత్రమైన యర్థములను ఈ ప్రత్యయములు బోధించును. వీనిలో ఏ ఒక ప్రత్యయ మంతమందుగల రూపమును వాడినను, దానిని సనాద్యంత ధాతువృత్తి అని యందురు. వృత్తియొక్క ధర్మములన్నియు ఇచటను సమానముగనే పాటింపబడును. ॥68॥

అవతారిక— ఇట్లే మరికొన్నిచోట్ల కూడ ప్రకృతి, ప్రత్యయము, మొదలగు విభాగమును చూపుట ఉపాయము మాత్రమే అని యనుచున్నాడు

శ్లో॥ పుత్రీయతౌ న పుత్రోఽస్తి విశేషేచ్ఛా తు తాదృశీ ।
వినైవపుత్రానుగమాత్ యా పుత్రే వ్యవతిష్ఠతే ॥ 69

పుత్రీయతౌ = ''పుత్రీయతి'' అనుచోట, పుత్రః = పుత్రశబ్దము, న + అస్తి = లేదు, పుత్రే = పుత్ర విషయకమైన, యా = ఏ, విశేషేచ్ఛా + తు = ప్రత్యేకమైన కోరిక అయితే (కలదో) తాదృశీ = అట్టి కోరిక, పుత్రానుగమాత్ = పుత్ర, అను భాగము ఉండుట, వినా + ఏవ = లేకుండగనే, వ్యవతిష్ఠతే = ఉండును.

తాత్పర్యము— ''పుత్రీయతి'' (తనకు పుత్రుని కోరుచున్నాడు) అనుచోట

''పుత్రమ్ – ఆత్మనః – ఇచ్ఛతి'' అను వాక్యమును చూపుదురు. అందుచే అవయవముగ పుత్ర శబ్ద మున్నట్లు తోచును. కాని వాస్తవముగ అచట ఎట్టి భాగమును లేదు. అది యఖండము. దానివలననే అభిమతమైన యర్థము (పుత్రుని కోరువాడు – అనునది) సూటిగ వచ్చును.

వివరణము — పుత్రీయతి, అనునదియు సనాద్యంత ధాతువృత్తియే ఇచట పుత్ర శబ్దమునకు ''క్యచ్'' (య) ప్రత్యయమనియు, అది పుత్ర విషయకమైన కోరికను తెలుపుననియును చెప్పి, ప్రక్రియను చూపుదురు. అదంతయు కల్పనమే. వృత్తియగుటచే ఏకార్థీభావము, అఖండత్వము మొదలగు ధర్మము లిచట సహజము లు. (''పుత్రీయ'' అను నదియే ఇచటి మూల రూపము) ॥69॥

అవతారిక— ''పుత్రీయతి'' అనుచోట ''మాణవకమ్'' మొదలగు వేరుగనున్న విశేషమైన కర్మతో సంబంధముండదని రెండు కారికలతో చెప్పుచున్నాడు

శ్లో॥ ప్రాణై ర్వినా యథా ధారిర్జీవతౌ ప్రాణకర్మకః ।
నచాత్ర ధారిర్న ప్రాణాః జీవతిస్తు క్రియాంతరమ్ ॥ 70

శ్లో॥ తథా వినేషి పుత్రాభ్యాం పుత్రీయాయాం క్రియాంతరమ్ ।
అన్వాఖ్యానాయ భేదాస్తు సదృశాః ప్రతిపాదకాః ॥ 71

జీవతౌ = జీవ, అను ధాతువు విషయమున, ప్రాణైః + వినా = ''ప్రాణాన్'' (ప్రాణములను) అను కర్మపద మక్కరలేకుండ, ప్రాణకర్మకః = ప్రాణములు కర్మగాగల, ధారిః = ధారి (ధారయతి) అను ధాతువు, (వర్తతే = ఉన్నది), అత్ర = ఇచట, ధారిః = ధారి, అనుధాతువు, న = లేదు, ప్రాణాః + చ = ప్రాణములును (కర్మలు) న = లేవు, జీవతిః + తు = జీవ ధాతువైతే, యథా = ఎట్లు, క్రియాంతరమ్ = వేరొక క్రియయో.

తథా = అట్లు, ఇషిపుత్రాభ్యామ్ + వినా = ''ఇష్'' ధాతువును పుత్ర శబ్దమును లేకుండ, పుత్రీయాయామ్ = ''పుత్రీయ'' అనుచోట, క్రియాంతరమ్ = వేరొక క్రియ, (అస్తి = ఉన్నది) ప్రతిపాదకాః = అర్థమును (ప్రక్రియను) చూపునటువంటివిన్ని, సదృశాః = సమానములైనటువంటి, భేదాః + తు = విభాగములైతే, అన్వాఖ్యానాయ = విడమరచి చెప్పుటకు, (ఉపయుజ్యంతే = ఉపయోగించును).

తాత్పర్యము— ''జీవ'' అను ధాతువునకు ''ప్రాణములను ధరించుట'' అని యర్థము. (జీవతి = ప్రాణాన్ ధారయతి) ఇచట ప్రాణాన్, అను కర్మపదముగాని, ధారి, అను ధాతువుగాని వాస్తవము కాదు. ''జీవ'' అను అఖండమగు ధాతువే ఆ యర్థమునంతను చెప్పగలదు.

అట్లే పుత్రీయ, అనునది అఖండమగు ఒక ధాతువు. ''తనకు పుత్రుని కోరుట'' అను వ్యాపారమునంతను ఇది బోధించును. పుత్ర శబ్దమునుగాని, (ఆత్మనః – పుత్రమ్ –

అను రీతిని కర్మగ), ఇష్, ధాతువుసుగాని (ఇచ్ఛతి) ఇచట వాడనక్కరలేదు. ఇట్టి స్థలము లలో చూపబడు విభాగములుగాని, ప్రక్రియలుగాని కేవలము సత్యమును గుర్తించుటకై బయలుదేరిన సాధనములు మాత్రమే.

వివరణము— జీవన క్రియ అనగా "ప్రాణములను ధరించుటయే". ఇచట క్రియలో కర్మ ఇమిడియున్నదిగాన ప్రసిద్ధినిబట్టి ఈ ధాతువకర్మకము ఈ విధముగనే "పుత్రీయ" అను వ్యాపారమున (తనకు పుత్రుని కోరుట) పుత్రరూపమైన కర్మ ఇమిడి యుండును. అందుచే వేరుగ కర్మను వాడనక్కరలేదని ప్రకృతమున సమన్వయము

అవతారిక— "ముండయతి" (కేశములను ఖండించుచున్నాడు) అనుచోట "మాణవకమ్" మొదలగు విశేషకర్మను (ఎత్తిచూపు కర్మ) వాడుట కుదురును కాని "పుత్రీ యతి" అనుచోట అట్లు కుదురదని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆక్షేపాచ్చ ప్రయోగేణ విషయాంతరవర్తినా ।
సదపీచ్ఛాక్యచః కర్మ వాక్యఏవ ప్రయుజ్యతే ॥ 72

విషయాంతరవర్తినా = వేరొక విషయమున ప్రవర్తించును, ప్రయోగేణ = ప్రయోగముచే, ఆక్షేపాత్ + చ = బాధవలన, ఇచ్ఛాక్యచః = ఇచ్ఛార్థమున వచ్చు క్యచ్ ప్రత్యయము యొక్క, కర్మ = కర్మ, సత్ + అపి = ఉన్నను, వాక్యే + ఏవ = వాక్యమందే, ప్రయు జ్యతే = వాడబడును. (వృత్తియందు వాడబడదు)

తాత్పర్యము— ఇచ్ఛార్థకమైన క్యచ్ ప్రత్యయమును ఆచారార్థకమైన క్యచ్ ప్రత్యయము బాధించును. కాపున "మాణవకం పుత్రీయతి" అని విశేష కర్మతో ప్రయో గింపగనే, "మాణవకుని పుత్రునివలె చూచుకొనుచున్నాడు" అను నర్థమే వచ్చునుగాని "మాణవకుని పుత్రునిగా కోరుచున్నాడు" అను అభిమతమగు అర్థము రాదు. అందుచే ఇచ్ఛా ర్థమున "పుత్రీయతి" అనునపుడు "మాణవకమ్" మొదలగు విశేషకర్మను వాడకూడదు. వాడదలచినచో వృత్తిని విడనాడి "మాణవకమ్ - పుత్రమ్ - ఇచ్ఛతి" అను వాక్యమునే ప్రయోగింపవలెను.

వివరణము— "సుప ఆత్మనః క్యచ్" (8-1-8) అను సూత్రము. "తన కోరికకు కర్మగా ఉండు వస్తువును (తాను కోరిన వస్తువును) చెప్పు సుబంతమునకు ఇచ్ఛార్థ మున క్యచ్చు (య) అగును" అని యర్థము. ఉదా: ఆత్మనః పుత్రమ్ ఇచ్ఛతి = పుత్రీ యతి. ఇది ఇచ్ఛార్థకమైన క్యచ్చు "ఉపమానాదాచారే" (8-1-10) అని వేరొక సూత్రము. "ఉపమానమైన కర్మగ ఉండు సుబంతమునకు ఆచారార్థమున క్యచ్చు అగును" అని యర్థము. ఉదా: "పుత్రమ్ - ఇవ - ఆచరతి = పుత్రీయతి. (పుత్రునివలె చూచుకొనుచున్నాడు. "శిష్యమ్" = శిష్యుని - మొదలగునది ఉపమేయమగును). ఇది విశేషముగాన సామాన్యమైన మీది ప్రత్యయమును బాధించును. కాగా "సః పుత్రీయతి" అనగా "అతడు పుత్రుని కోరు

చున్నాడు'' అను నర్థము వచ్చును. ఇచట పుత్రుడను కర్మ (సామాన్యమైనను విశేషమైనను) వృత్తిలో ఇమిడియే యున్నది అట్లుకాక ''మాణవకం పుత్రీయతి'' అని విశేషకర్మను స్పష్టముగా వాడగానే ఇచ్ఛార్థము పోయి ''మాణవకుని పుత్రునివలె భావించుచున్నాడు'' అను ఆచారార్థమే రాక తప్పదు. ఇది వృత్తి స్వభావము. అందుచే ఇచ్ఛార్థమున వృత్తిలో కర్మను వేరుగ వాడకూడదు. అట్టి యర్థమును తెలుపదలచినచో ''మాణవకం పుత్రమిచ్ఛతి'' అను వాక్యమునే ప్రయోగింపవలెను.

''ముండయతి'' మొదలగుచోట్ల ఈ చిక్కు లేదు. అచటి ప్రత్యయము క్యచ్చు కాదు (ణిచ్చు) కావున అచట కర్మపదమును వాడుకొనక తప్పదు

ఎట్టి విశేషమును లేని కర్మ సామాన్యకర్మ అగును. ''ఇట్టిది'' అని స్పష్టముగ చెప్పబడిన కర్మ విశేషకర్మ అనిపించుకొనును. ॥72॥

అవతారిక — మీద చూపిన తీరునే మరికొన్నిచోట్ల కూడ భావింపనగునని ప్రసంగవశమున చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రసిద్ధేన వృతః శబ్దో భావగర్హాభిధాయినా ।
అభ్యాసే తుల్యరూపత్వాన్న యఙంతః ప్రయుజ్యతే ॥ 73

భావగర్హాభిధాయినా = క్రియయొక్క నిందను బోధించు, ప్రసిద్ధేన = ప్రసిద్ధిచే, వృతః = కూగిన, యఙంతః = యఙ్ ప్రత్యయ మంతమందుగల, శబ్దః = శబ్దము, తుల్యరూపత్వాత్ = సమానమైన రూపము గలదగుటవలన, అభ్యాసే = క్రియా సమభిహారమున, న + ప్రయుజ్యతే = ప్రయోగింపబడదు

తాత్పర్యము— ''లోలుప్యతే'', ''సాసద్యతే'' మొదలగు రూపములు యఙంతములు. ఇవియు సనాద్యంత ధాతు వృత్తియందే చేరును. వీనివలన వ్యాపారమునకు (ధాతువు యొక్క అర్థము) చెందిన నింద మాత్రమే బోధపడును ప్రసిద్ధి ననుసరించి అట్లు జరుగును. కావున క్రియా సమభిహారమున వీనిని వాడకూడదు. అచట ''పునః పునః లుంపతి'' (మాటి మాటికి నరకుచున్నాడు) అను వాక్యమునే వాడవలెను.

వివరణము— ''ధాతో రేకాచో హలాదేః క్రియా సమభిహారే యఙ్'' (3-1-22) అనునది యఙ్ ప్రత్యయమును విధించు సూత్రము. ''హలాదియై ఒకే అచ్చుగల ధాతువునకు క్రియా సమభిహారమున యఙ్ ప్రత్యయమగును'' అని యర్థము. క్రియా సమభిహారమనగా ఒక క్రియ మాటిమాటికిని జరుగుట —లేక— తీవ్రముగా జరుగుట. ఈ సూత్రము సామాన్యము. ఉదా : బోభూయతే. (పునః పునః భవతి— ''భూ'' ధాతువునకు యఙ్ ప్రత్యయము. ధాతువునకు ద్విత్వము మొదలగు ప్రక్రియ) సనాది ప్రత్యయములలో యఙ్ కూడ చేరి యున్నది. కాన ఇదియు వృత్తియే.

''లుప, సద, చర, జప, జభ, దహ, దశ, గౄభ్యో భావగర్హాయామ్'' (3-1-24)

అనునది విశేష సూత్రము. లుప్, మొదలగు ఎనిమిది ధాతువులకును భావగర్హాయందే యఙ్ ప్రత్యయమగును అని దీని యర్థము. భావమనగా వ్యాపారము. దానిని ఏవగించుకొనుట భావ గర్హా యగును. ఉదా : లోలుప్యతే, మొదలగునవి. కాగా ఈ ధాతువులకు యఙ్ చేరునపుడు ఆ యా వ్యాపారమును ఏవగించుకొనుటయే స్ఫురించును. అట్లు స్ఫురించుటకు ఆ యా రూపము లా యర్థమున రూఢములై పోవుట కారణము. కావున అచట సామాన్యమగు క్రియా సమభిహారమును చెప్పకూడదు. అట్టి యర్థము కావలసినచో ''పునః పునః లుంపతి'' అను రీతిని వాక్యమునే ప్రయోగింపవలెను.

విశేష విషయములు— వృత్తియొక్క స్వభావమునుబట్టి కొన్ని యఙంతము లా యా విశేషార్థమున ప్రసిద్ధములై యున్నవి. ''రూప మొకటి తీరుననే యున్నదిగదా'' అని భావించి అట్టి చోటులందు సామాన్యమైన క్రియా సమభిహారమును చెప్పకూడదని సారాంశము

ఇట్లే చంక్రమ్యతే, జంగమ్యతే, మొదలగుచోట్ల ''వంకరగ నడచుచున్నాడు'' అను విశేషార్థమునే చెప్పవలెను. ''నిత్యం కౌటిల్యేగతౌ'' (2-1-28) అను సూత్రముచే అచట కౌటిల్యమను నర్థమున యఙ్విహితమైనది. (40 వ కారికలో ఈ యంశము వివరింప బడినది) అందుచే అచటకూడ క్రియా సమభిహారము కావలసినపుడు, ''కుటిలం గచ్ఛతి'' మొదలగు రీతిని వాక్యమునే వాడుకొనవలెను. ॥73॥

అవతారిక— ఇట్లు అఖండమైన సముదాయములే సత్యములు. అవయవముల కల్పన మసత్యము. అది ఉపాయము మాత్రమే. సముదాయమువలన లభించు అర్థము అవ యవముల యర్థమును ఎల్లపుడును బాధించునను తత్త్వమును ప్రకటించుచున్నాడు.

శ్లో॥ శబ్దా యథా విభజ్యంతే భాగైరివ వికల్పితైః ।
అన్వాఖ్యేయా స్తథా శాస్త్రమతిదూరే వ్యవస్థితమ్ ॥ 74

వికల్పితైః = కల్పింపబడిన, భాగైః + ఇవ = భాగములతో అన్నట్లు, శబ్దాః = శబ్దములు, యథా = ఎట్లు, విభజ్యంతే = విభజింపబడునో, తథా = అట్లు, అన్వాఖ్యేయాః = వ్యాఖ్యా నింపదగినవి, శాస్త్రమ్ = శాస్త్రము, అతిదూరే = మిక్కిలి దూరమున, వ్యవస్థితమ్ = ఉన్నది.

తాత్పర్యము— సత్యమైన అఖండత్వమును బోధించుటకు అసత్యమైన భాగ కల్పనము స్వీకరింపబడును. భాగములను చూపు శాస్త్రము ఉపాయము మాత్రమే.

వివరణము— శబ్ద మఖండమైనను దాని సాధుత్వమును తత్త్వమును అనేక విధములైన ప్రక్రియలతో శాస్త్రము చూపుచుండును. అంతమాత్రమున ఆ ప్రక్రియలు వాస్తవ ములు కావు. అవి చిత్రములవంటివి. ఆ చిత్రములు బోధించు సత్య వస్తువులవంటివి శబ్దములు.

విశేష విషయములు— ప్రక్రియలు అసత్యములు కనుకనే ఒక్కొక శబ్దమునకు ఒక్కొక రీతి ప్రక్రియను ఒక్కొకరు చూపుచుందురు అట్లు వేర్వేరు వ్యాకరణములును సిద్ధ

మైనవి. కాగా వ్యాకరణశాస్త్రము సత్యము కాదు. దాని మూలమున తెలియదగు అఖండమైన శబ్దము పరమార్థము. ॥74॥

అవతారిక— ''అవయవములు అసత్యములనుట'' అన్నిటను వర్తించునని గుర్తు చేయుచున్నాడు.

శ్లో॥ అర్థస్యానుగమం కంచిద్ దృష్ట్వైవ పరికల్పితమ్ ।
పదం వాక్యే పదే ధాతుర్ధాతౌ భాగశ్చ ముండివత్ ॥ 75

అర్థస్య = అర్థముయొక్క, కంచిత్ = ఒకానొక, అనుగమమ్ = సంబంధమును, దృష్ట్వా+ ఏవ = చూచియే, ముండివత్ = ''ముండయతి'' అనుచోటవలె, వాక్యే = వాక్యమందు, పదమ్ = పదమును, పదే = పదమున, ధాతుః = ధాతువును, ధాతౌ = ధాతువునందు, భాగః + చ = భాగమును, పరికల్పితమ్ = కల్పింపబడెను.

తాత్పర్యము— వాక్యార్థమఖండము. దానిని బోధించు వాక్యము కూడ అఖండమే అయినను అఖండమైన వానిని అట్లే మందబుద్ధులకు వ్యాఖ్యానించుట కష్టమని భావించి పదము ధాతువు, ప్రకృతి, ప్రత్యయము, వర్ణము, మొదలగు భాగములు కల్పింపబడినవి. అట్లే వాని యర్థములును కల్పింపబడినవి.

వివరణము— శబ్ద సముదాయమును విభజించుకొనుచు పోయినచో దానికి అంత మన్నది ఉండదు. పదము, ప్రకృతి, ప్రత్యయము, వర్ణము, దాని అవయవము, దాని భాగము ఈ రీతిని ఎంతవరకు పోవుటయో చెప్పలేము. ఎక్కడో ఒకచోట ''ఇది అభిన్నము'' (భాగములు లేనిది) అనుట తప్పదు. అట్లయినపుడు తొలుతనే ''వాక్య మఖండమనుట'' మంచిది. వాక్యము బోధించు అర్థమును అట్టిదియే. శబ్దార్థముల తీరు తెన్నులను సూక్ష్మముగ పరిశీలించిన వైయాకరణు లీ తత్త్వమును నిశ్చయించిరి. అయితే వ్యవహారమును అర్థము తెలియుటలో గల సామాన్య విశేషభావమును అనుసరించి సౌకర్యమునకై ''అపోద్ధారమును'' (విడదీయుట - ఎత్తి చూపుట) ఆశ్రయించి వారు విభాగములను చూపుదురు. అంతమాత్రమున అవి సత్యములని భావింపరాదు. ''ముండయతి'' అనునది విభాగము విషయమున ఉదాహరణముగ చూపబడినది. ఇట్టి విశేషములన్నియు మొదటి కాండమున విపులముగ చర్చింపబడినవి. ॥75॥

అవతారిక— కాగా వేర్వేరుగ నుండు ప్రక్రియలను సత్యములని యనుకొనరాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అవిప్రయోగః సాధుత్వే వ్యుత్పత్తిరనవస్థితా ।
ఉపాయాన్ ప్రతిపత్తౄణాం నాభిమన్యేత సత్యతః ॥ 76

సాధుత్వే = సాధుత్వమందు, అవిప్రయోగః = వివిధమైన ప్రతిపాదనము లేదు, వ్యుత్పత్తిః = వ్యుత్పత్తి, అనవస్థితా = అనిశ్చితము, ప్రతిపత్తౄణామ్ = తెలిసికొను వారికి సంబంధించిన, ఉపాయాన్ = ఉపాయములను, సత్యతః = సత్యముగా, న + అభిమన్యేత = తలపకూడదు.

తాత్పర్యము— విభాగములు లేని శబ్దమే సాధువు. దానిని ప్రతిపాదించు ప్రక్రియలు ఎన్ని యున్నను అవి ఈ సత్యమును చూపి మరలిపోవును. అవి నియతములు కావు. ఉపాయములను సత్యములని యనుకొనరాదు.

వివరణము— ఇట్టి యంశములు వెనుకటి రెండు కాండములందును పెక్కుసారులు విశదీకరింపబడినవి ప్రసంగము వచ్చినపుడెల్ల వానిని మరల మరల పరామర్శించుట గ్రంథకారుని స్వభావము. ॥76॥

అవతారిక— "ఉపాయములు అసత్యములైనపుడు వ్యుత్పత్తిగల శబ్దములును వ్యుత్పత్తిలేని శబ్దములును అన్నియు నొకటే భేదము వాస్తవము కాదు" అని చెప్పుచున్నాడు.

శ్లో॥ యథైవ డిత్థే దయతిః పాచకే పచతి స్తథా ।
దయతిశ్చ పచిశ్చైవ ద్వావప్యేతావలౌకికౌ ॥ 77

డిత్థే = డిత్థ, అను శబ్దమున, దయతిః = "దయ" అను ధాతువు, యథా = ఎట్లో, పాచకే= పాచక, అను శబ్దమున, పచతిః = పచ్, ధాతువు, తథా + ఏవ = అట్లే, (ఉన్నది) దయతిః + చ = "దయ" ధాతువును, పచిః + చ + ఏవ = పచ్ ధాతువును, ఏతౌ = ఈ, ద్వౌ + అపి = రెండును, అలౌకికౌ + ఏవ = అప్రసిద్ధములే.

తాత్పర్యము— డిత్థ, అను శబ్దమందును, పాచక, అను శబ్దమందును భావింపబడు దయ, పచ్, అను ధాతువులు రెండును కల్పితములే.

వివరణము— శబ్దములలో కొన్నిటికి వ్యుత్పత్తి (ప్రకృతి + ప్రత్యయము అను విభాగము) కలదనియు, మరికొన్నింటికది లేదనియును చెప్పుట సంప్రదాయమై యున్నది. కాని అదియు వాస్తవము కాదు. అన్నిచోట్లను సముదాయములే సాధువులు. అవి యఖండములు. అవియే లోకమున అర్థమును బోధించును.

విశేష విషయములు— ప్రవృత్తి నిమిత్తమును బట్టి (శబ్ద మా యా అర్థమును బోధించుటకు హేతువైన అంశము) శబ్దములను నాలుగు విధములు విభజించుట ఆచారము. ఉదా : (1) గౌః, మొదలగునవి జాతి ప్రవృత్తి నిమిత్తకములు. (గచ్ఛతీతి = గౌః - గోత్వమును జాతి ఇచట ప్రవృత్త నిమిత్తము). (2) శుక్లః, మొదలగునవి గుణప్రవృత్తి నిమిత్తకములు. (తెలుపు, అను గుణము ప్రవృత్తి నిమిత్తము). (3) పాచకః, మొదలగునవి క్రియా ప్రవృత్తి నిమిత్తకములు (పచతీతి = పాచకః - వంట, అను క్రియ ప్రవృత్తి నిమిత్తము). (4) డిత్థః, మొదలగునవి సంజ్ఞాప్రవృత్తి నిమిత్తకములు (డిత్థ, మొదలగు కల్పితమైన పేరే (ప్రవృత్తి నిమిత్తము) ఇట్లుకాక అన్ని శబ్దములకును జాతి యొకటే ప్రవృత్తి నిమిత్తమగునని ఒక మతమున్నది.

అట్లే కొన్ని శబ్దములకు వ్యుత్పత్తి యుండుననియు కొన్నింటికి ఉండదనియును

చెప్పుట కూడ ఒక సంప్రదాయమే. మరియు యౌగికములు, (అవయవముల అర్థము కలవి = పాచకః, మొదలగునవి), రూఢములు, (అవయవార్థము లేకుండ ప్రసిద్ధమైన అర్థమును బోధించునవి కుశలః, మొదలగునవి), యోగరూఢములు (అవయవార్థమును కలిగి ఏదోయొక అర్థమున ప్రసిద్ధములు = పంకజమ్, మొదలగునవి) అను విభాగము కూడ శాస్త్ర మర్యాదలో నున్నది.

పై రీతులన్నియును అసత్యములైన ఉపాయములు మాత్రమే. అన్ని శబ్దములును అఖండములుగనే తమ తమ యర్థములను బోధించును. సాధుత్వమును చెప్పుటకు కంకణము కట్టుకొన్న వ్యాకరణశాస్త్రము మాత్రము వీలున్నచోట వ్యుత్పత్తిని చూపును. లేనిచోట సముదాయమే సాధువనును. పట్టుదల చూపినచో అన్నిచోట్లను వ్యుత్పత్తిని చూపనగును. లేనిచో లేదు

ప్రకృతమున డిత్థ, అనునది (ఒక వ్యక్తికి కల్పితమైన పేరు) అవ్యుత్పన్నమనుటయు, పాచక, అనునది వ్యుత్పన్నమనుటయును అభ్యాసము. వాస్తవమున రెండింటి తీరును ఒకటే అని చెప్పుట గ్రంథకర్తకు అభిమతము. ॥77॥

అవతారిక — మందబుద్ధుల కుపయోగించుటకై వివిధములగు భేదములను శిష్టులు కల్పించిరని చెప్పుచున్నాడు

శ్లో॥ ప్రకృతిప్రత్యయౌ వూహ్యౌ పదాత్తాభ్యాం పదం తథా ।
అనుబంధస్వరాదిభ్యః శిష్టైః శాస్త్రం న తాన్ప్రతి ॥ 78

శిష్టైః = శిష్టులచే, పదాత్ = పదమువలన, ప్రకృతి ప్రత్యయౌ = ప్రకృతి ప్రత్యయములు, ఊహ్యౌ = ఊహింపదగినవి, తథా = అట్లు, తాభ్యామ్ = ఆ ప్రకృతి ప్రత్యయములచేతను, అనుబంధస్వరాదిభ్యః = అనుబంధములు, స్వరములు మొదలగువానిచేతను, పదమ్=పదము, (ఊహ్యమ్ = ఊహింపదగినది), తాన్ + ప్రతి = ఆశిష్టులను గురించి, శాస్త్రమ్ = వ్యాకరణ శాస్త్రము, న = లేదు

తాత్పర్యము — శబ్ద ప్రపంచమంతను కరతలామలకముగ చూచువారు శిష్టులు. (పాణిని, వరరుచి, పతంజలి మొదలగు మునులును వారివంటి శక్తి సంపన్నులును) వారు సాధు శబ్దములనే శిష్యుల కుపదేశింతురు. అఖండమగు వాక్యమునుండి పదమును వేరుచేసి, దానియందు ప్రకృతి, ప్రత్యయము మొదలగు భాగముల నూహించి వివరింతురు. అట్లే ప్రకృతులందును, ప్రత్యయములందును ఇత్సంజ్ఞక వర్ణములు మొదలగు వానిని కూడ ఊహించి చూపుదురు. ఈ ప్రక్రియ అంతయు శిష్యులకే ఉపయోగించును. శిష్టులకు వ్యాకరణము వలన ప్రయోజనము లేదు.

వివరణము— సాధు శబ్దములను ప్రయోగించుటవలన ధర్మము లభించుననియు అసాధువుల నుచ్చరించినచో అధర్మము కలుగుననియును వైయాకరణుల సిద్ధాంతము. కావున

శిష్టు లెపుడును సాధు శబ్దములనే చూపుదురు వారి ప్రయోగమే వ్యాకరణమునకు శరణ్యము. శబ్దములను సూటిగను ఉన్నదున్నట్లుగను చూపుట ఒక పద్ధతి. దీనిని నిపాతనమందురు. ఉదా . పృషోదరః, పారస్కరః, మొదలగునవి ప్రకృతులను ప్రత్యయములను విడిగా చూపి కొన్ని కార్యములను కూడ ప్రవర్తింపజేసి, శబ్దములను సిద్ధముచేయుట రెండవ పద్ధతి. ఉదా : పాచకః, భవతి, మొదలగునవి. ఇట్టి తీరులన్నియును మందబుద్ధుల కొరకే బయలు దేరినవి. శబ్ద తత్త్వవేత్తలకు వీనివలన ఉపయోగము లేదు. వారు ఎల్లపుడును అఖండములగు శబ్దార్థములనే అనుసంధానము చేయుచుందురు

విశేష విషయములు—— ఆయా ప్రకృతులకును (భృఞ్, డీఙ్, మొదలగు ధాతువులు) ప్రత్యయములకును (తృచ్, తృన్, మొదలగునవి) చివరనుండు ఞ్, ఙ్, చ్, మొదలగు వర్ణములను అనుబంధములు —లేక— ఇత్సంజ్ఞక వర్ణములని యందురు. ఇవి సిద్ధ రూపములలో వినబడవు. కాని వీనివలన ఉదాత్తాది స్వరములును మరికొన్ని విశేషకార్యములును కృత్రిమముగ లభించును. వీని నన్నింటిని కూడ శిష్టులూహింతురు. ॥78॥

అవతారిక—— కేవలము శాస్త్రమునుబట్టి ప్రాకులాడుట కూడ తగదనుచున్నాడు.

శ్లో॥ శాస్త్రదృష్టిస్తు శాస్త్రస్య ప్రాప్తిమాత్రేఽప్యనిశ్చితే।
యుజ్యతే ప్రత్యవాయేన శాస్త్రం చక్షురపశ్యతామ్ ॥ 79

శాస్త్రస్య = శాస్త్రముయొక్క, ప్రాప్తిమాత్రే + అపి = ప్రవర్తించుట అయినను, అనిశ్చితే= నిశ్చయింపబడనపుడు, శాస్త్రదృష్టిః + తు = కేవలము శాస్త్రమే ఆధారముగా గలవాడు, ప్రత్యవాయేన = పాపముతో, యుజ్యతే = కూడును, అపశ్యతామ్ = శిష్టప్రయోగమును చూడని వారికి, శాస్త్రమ్ = శాస్త్రము, చక్షుః = నేత్రమువంటిది.

తాత్పర్యము—— వ్యాకరణ శాస్త్రముయొక్క విధులను నియమములను చక్కగ తెలియకుండ శబ్దములను స్వేచ్ఛగ ప్రయోగించినచో పాపము సంభవించును. శిష్టుల ప్రయోగములను శాస్త్రమును కూడ సమన్వయించికొని శబ్దములను వాడవలెను. శిష్ట ప్రయోగముల నెరుగని వారికి శబ్ద శాస్త్రము నేత్రము వంటిది.

వివరణము—— ''బహుళము'', ''వికల్పము'', ''నిత్యము'', ''నియమము'' మొదలగు తీరులెన్నియో వ్యాకరణ కార్యములు ప్రవర్తించుటలో పాటింపబడు చుండును. వానిని బాగుగా పరిశీలింపక తొందరపడి ఒక నిర్ణయము చేసికొని, శిష్టుల ప్రయోగమునైనను అనుసరింపక స్వేచ్ఛగ శబ్దములను వాడరాదు. అట్లని కేవలము శిష్టప్రయోగమునే ఆశ్రయించుకొని శాస్త్రమును వదలుటయు మంచిది కాదు. శాస్త్రమును ప్రయోగమును కూడ సముచితముగ సమన్వయించుకొనవలెనని యిచట గ్రంథకర్త హెచ్చరించినాడు.

విశేష విషయములు—— అందువలననే ''లక్ష్య లక్షణే వ్యాకరణమ్'' అని వరరుచియు పతంజలియును సిద్ధాంతము చేసిరి. ''శిష్ట ప్రయోగము వ్యాకరణశాస్త్రము – ఈ

రెండిటి కిలయికయే వ్యాకరణమగును'' అని దీని భావము. కాగా ''శిష్టుల ప్రయోగమును, వారు రచించిన శాస్త్రమును శిష్యులకు స్వీకార్యములు'' అని ఇచటి సారము ॥79॥

అవతారిక— మందబుద్ధులకు వ్యాకరణము నేత్రమువంటిదైనను, కొన్ని సందర్భములలో అది ''నిష్ఫలమని'' త్రోసివేయబడు చుండునని చెప్పుచున్నాడు

శ్లో॥ అర్థాంతరాభిధానాచ్చ పౌర్వాపర్యం న భిద్యతే ।
రాజదంతాహితాగ్న్యాదిరాజాశ్వాదిషు సర్వథా ॥ 80

రాజదంతా ... ... శ్వాదిషు = రాజదంతః, ఆహితాగ్నిః, రాజాశ్వః, మొదలగుచోట్ల, అర్థాంతరాభిధానాత్ + చ = వేరొక యర్థమును చెప్పుటవలన, పౌర్వాపర్యమ్ = ముందు వెనుకలగుట, సర్వథా = అన్ని విధముల, న + భిద్యతే = మారదు.

తాత్పర్యము— ''రాజదంతః'' మొదలగు సమాసములలో శబ్దములను తారుమారు చేసినచో అభిమతమగు అర్థము రాదు. అందుచే వ్యవహారమున అవి ఒక నియతమైన వరుసలోనే పలుకబడుచుండును. కావున అట్టి వరుసను చెప్పుటకై శాస్త్ర మావశ్యకము కాదని చెప్పుదురు

వివరణము— (1) ''దంతానామ్ - రాజా = రాజదంతః'' ఇది షష్ఠీ తత్పురుషము. ''శ్రేష్ఠమైనదంతయు'' అని యర్థము. ఇచట ''దంతరాజః'' అని ప్రయోగించుట లోక సిద్ధము కాదు. అట్లుచ్చరించినచో ''దంతముల రాజు'' అను వేరొక యర్థము స్ఫురించెడిని.

(2) ''ఆహితః - అగ్నిః - యేన - సః = ఆహితాగ్నిః. ఇది బహువ్రీహి'' అగ్నిని సంపాదించినవాడు = దీక్షితుడు'' అని భావము. ఇచట రెండు పదములను తారుమారుగ (అగ్న్యాహితః) పలికినను అర్థమున మార్పురాదు. అట్టి ప్రయోగము కూడ లోక ప్రసిద్ధము

(3) ''రాజాశ్వః'' = ''రాజ్ఞః - అశ్వః'' = రాజుగారి గుర్రము. ఈ షష్ఠీ తత్పురుషములో శబ్దముల క్రమ మిట్లే యుండును ''అశ్వరాజః'' ఇదియు షష్ఠీ తత్పురుషమే అయినను ఇపుడు ''శ్రేష్ఠమైన అశ్వము'' అను నర్థము వచ్చును. (శబ్ద క్రమము మారినది) కాగా ఆ యా సమాసములలోని పదముల వరుస లోకమువలననే (శిష్టవ్యవహారము) నిశ్చితమై పోవును. అందుకొరకై (పదముల క్రమమును చెప్పుటకై) సూత్రములను రచింప నక్కర లేదు. రచించినను అవి నిష్ఫలములు.

విశేష విషయములు— ''ఉపసర్జనం పూర్వమ్'' (2-2-30) అను సూత్రము, ''సమాసమున ఉపసర్జనమైన పదమును ముందుగ పలుకవలెను'' అను నర్థమును చెప్పును. సమాసమును విధించు సూత్రములలో (షష్ఠీ - 2 - 2 - 8, సప్తమీ శౌండైః - 2 - 1 - 40, మొదలగువవి) ప్రథమాంతముగ ఉన్న పదమువలన గ్రహింపబడు శబ్దములకు (షష్ఠ్యంతము సప్తమంత్యము, మొదలగునవి) ఉపసర్జనమని కృత్రిమమైన పేరు. అట్టి ఉపసర్జనమునకు పూర్వ నిపాతమును (ముందు వాడుట) పై సూత్రము చెప్పినది.

''నవా - అనిష్టాఽదర్శనాత్'' (2-2-30 - సూత్రమున వార్తికము) అను వచనముచే ''ఉపసర్జనం పూర్వమ్'' అను సూత్రము భాష్యమున ప్రత్యాఖ్యాతమైనది (త్రోసివేయబడినది). సమాసములందలి శబ్దముల పౌర్వాపర్యము లోకమువలననే సిద్ధించును కావునను, సూత్రము లేకున్నను దోషములు సంభవింపవు కావునను ఈ సూత్ర మక్కరలేదని ఈ వచనము యొక్క భావము. ఇట్టి సందర్భమంతయు ఈ కారికయం దిమిడియున్నది. ॥80॥

అవతారిక— శిష్టుల వ్యవహారము వలననే అన్నియు సిద్ధించినను, శబ్దముల సాధుత్వమును విశదపరచుటకై కొన్ని కార్యములను శాస్త్రము విధింపక తప్పదని చూపుచున్నాడు.

శ్లో॥ వినైవ ప్రత్యయైర్వృత్తౌ యే భిన్నార్థాఽభిధాయినః ।
గర్గాదయో లుకా తేషాం సాధుత్వమనుగమ్యతే ॥ 81

ప్రత్యయైః = ప్రత్యయములు, వినా + ఏవ = లేకుండగనే, వృత్తౌ = వృత్తియందు (తద్ధితము, మొదలగునది), భిన్నార్థాభిధాయినః = వేరొక యర్థమును చెప్పు, యే = ఏ, గర్గాదయః = ''గర్గాః'' మొదలగు పదములు గలవో, తేషామ్ = వానికి, లుకా = ప్రత్యయము యొక్క లోపముచే, సాధుత్వమ్ = సాధు శబ్దమగుట, అనుగమ్యతే = సంపాదింపబడును.

తాత్పర్యము— తద్ధిత వృత్తిలో కొన్నిచోట్ల ప్రత్యయము లేకున్నను అభీష్టమైన యర్థము లభించును. ఉదా : ''గర్గాః'' (గర్గస్య - గోత్రాపత్యాని - పుమాంసః) ''గర్గుని సంతతియైన పురుషులు'' అని యర్థము. ఇచట అపత్యమును (సంతతి) చెప్పు ప్రత్యయమునకు లోపమును శాస్త్రము విధించినది. అది కేవలము శబ్దముయొక్క సాధుత్వము కొరకే.

వివరణము— ''గర్గుని గోత్రమైన సంతతి'' అను నర్థమున గర్గ శబ్దమునకు, ''గర్గాదిభ్యోయఞ్'' (4-1-105) (గర్గాది గణమందలి శబ్దములకు - ''అతని గోత్రాపత్యము'' - అను నర్థమున యఞ్ ప్రత్యయమగును) అను సూత్రముచే యఞ్ ప్రత్యయమగును. ''గార్గ్య'' అను రూపము సిద్ధించును ఈ ప్రత్యయమునకు బహువచనమున లోపము విధింపబడినది అందుచే ఏకవచనమందును ద్వివచనమందును గార్గ్యః, గార్గ్యౌ, అను రూపములున్నను, బహువచనమందు మాత్రము ''గర్గాః'' అను రూపమే యగును. అర్థమందు మార్పు ఉండదు. (కేవలము గర్గ శబ్దమునకు ప్రథమా బహువచనము కూడ ''గర్గాః'' అనియే యుండును. కాని దాని యర్థము వేరు. ''పెక్కు గర్గులు'' అని యర్థము.)

''న కేవలా ప్రకృతిః ప్రయోక్తవ్యానాఽపి (కేవలః) ప్రత్యయః'' అను ఒక నియమమున్నది. ''ప్రత్యయము లేని ప్రకృతినిగాని ప్రకృతి లేని ప్రత్యయమునుగాని ప్రయోగింపరాదు'' అని దీని భావము. ఈ నియమము ననుసరించి, ''గర్గాః'' అనుచోట అపత్యరూపమైన తద్ధిత ప్రత్యయము యొక్క యర్థము తెలియుచున్నను, ప్రత్యయము చేరినట్లును అది లోపించినట్లును శాస్త్రము చెప్పును. అనగా సంస్కరించి ''ఈ శబ్ద మిట్లు సాధువు'' అని ప్రకటించును.

విశేష విషయములు— (1) గర్గాః, మొదలగుచోట్ల ప్రత్యయము లేకున్నను దాని యర్థము తెలియుట ఏకార్థీభావము వలన సిద్ధించును.

(2) తండ్రియు తాతయు మరణించిన పిదప - తాతకు మనుమని నుండి ప్రారంభమగు సంతానము "గోత్రము" అగును. అయితే ఆ సంతతిని "అపత్యమ్" అనియే వ్యవహరించి ప్రత్యయములను ప్రవర్తింపచేయుదురు.

(3) "యఞఞోశ్చ" (2 4-64) అనునది యఞ్ ప్రత్యయమునకు లోపమును విధించు సూత్రము. "గోత్రాపత్యము" అను నర్థమున వచ్చిన యఞ్, అఞ్, అను ప్రత్యయములకు బహుత్వమున లోపమగును అని దీని యర్థము.

అవతారిక— "గర్గాః" మొదలగుచోట్ల కూటస్థుడైన గర్గునికిని అతని గోత్ర సంతతికిని అభేదమును అంగీకరించి అభీష్టార్థమును పొందవచ్చును గదా ! వేరుగ అపత్యార్థమున ప్రత్యయమును విధించుటయు దానికి లోపమనుటయును ఎందుకు ?— అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాత్ ప్రత్యయేన వినా యది ।
బహ్వాదయః ప్రయుజ్యేరన్నపత్యే నియమో భవేత్ ॥ 82

"సః + అయమ్ + ఇతి" = "అతడే యితడు" అని, అభిసంబంధాత్ = సంబంధమును కల్పించుట వలన, ప్రత్యయేన = ప్రత్యయము, వినా = లేకుండ, బహ్వాదయః = "బహవః" మొదలగు శబ్దములు, ప్రయుజ్యేరన్ + యది = ప్రయోగింపబడినచో, అపత్యే = అపత్యమను నర్థమున, నియమః = నియమము, భవేత్ = అగును.

తాత్పర్యము— గర్గుని గోత్రాపత్యయమునకును గర్గునికిని అభేదమును కల్పించినచో గర్గాః, అను ప్రకృతి రూపమువలననే (తద్ధిత ప్రత్యయము లేకుండ) "గర్గుని గోత్రాపత్యము" అను విశేషార్థమును కూడ రాబట్ట వచ్చును కాని అదే హేతువును పురస్కరించుకొని, ఆ శబ్దముచే "గర్గుని శిష్యులు" మొదలగు ఇతరులను గూడ బోధింప నవకాశము కలిగెడిని. అట్టి యవకాశ మేర్పడకుండ "గోత్రాపత్యము మాత్రమే" అను నియమమును బోధించుటకై తద్ధిత ప్రత్యయమును (దాని లోపమును) విధింపవలయును. బహుశబ్దము కూడ గర్గాది గణము లోనిదే ఇది ఈ శ్లోకమునం దుదాహరణముగ తీసికొనబడినది. ప్రకృతమైన చర్చనంతను దీనికిని సమన్వయించుకొనదగును.

వివరణము— (1) ఎవనియొక్క గోత్రాపత్యమును చెప్పదలతుమో అతడు కూటస్థుడగును

(2) ఏదియో ఒక సంబంధమునుబట్టి అభేదమును కల్పింప నారంభించినచో, సంతతినేగాక బంధువులు, శిష్యులు, మున్నగువారిని గూడ గర్గ శబ్దముతోనే తెలుపుట కవకాశముండును గదా ! అట్లు అవ్యవస్థ ఏర్పడును. దానిని తొలగించుటకు తద్ధిత ప్రత్యయమావశ్యకము. అది "గోత్రాపత్యము" అను నర్థమునే నొక్కి చెప్పును.

(8) ''బభ్రోః - గోత్రాపత్యాని - పుమాంసః=బాభ్రవః'' అని యగును. (బభ్రుని గోత్రమైన మగ సంతానము). బాభ్రవ్యః, బాభ్రవ్యౌ, అనునవి వీనియొక్క ఏకవచన ద్వివచనములు మిగిలిన విషయము సమానమే. (గర్గ శబ్దమునకు బదులు బభ్రుశబ్దమున్నది) ॥82॥

అవతారిక— ''గర్గాః'' మొదలగు తద్ధితవృత్తిలో ''అపత్యము'' అను నర్థము నియతముగ తెలియుటకు ప్రత్యయమును విధించి దానికి లోపమును చెప్పవలయునని మీది కారిక వివరించినది. అదే తీరులో ''ప్రష్ఠీ'' (ప్రష్ఠస్య - స్త్రీ = ప్రష్ఠుని భార్య) మొదలగుచోట్ల కూడ ''ప్రష్ఠస్య - ఇయమ్'' (ప్రష్ఠునికి సంబంధించిన స్త్రీ) అను సామాన్యార్థమున తద్ధిత ప్రత్యయమును చేసి, దానివలన నియతముగ ''భార్య'' అను నర్థమును రాబట్టి, ఆ ప్రత్యయమునకు లోపమును చెప్పవలసి యుండును. లేకున్న ''భార్య'' అను నర్థము తప్పక వచ్చుట ఎట్లు కుదురును ?— అను శంకకు బదులు చెప్పుచున్నాడు

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధే లింగోపవ్యంజనాదృతే ।
ప్రష్ఠాదిషు న జాయైవ నియమేన ప్రతీయతే ॥ 83

''సః + అయమ్ + ఇతి'' = ''అతడే యితడు'' అని - (లేక - ''అతడే ఈమె - అని) అభిసంబంధే = సంబంధమును కల్పించినపుడు, లింగోపవ్యంజనాత్ + ఋతే = లింగమును చెప్పు ప్రత్యయము లేకుండ, ప్రష్ఠాదిషు = ప్రష్ఠ, మొదలగుచోట్ల, జాయా + ఏవ = భార్యయే, నియమేన = నియమముగ, న + ప్రతీయతే = తెలియబడదు.

తాత్పర్యము— ప్రష్ఠీ, మొదలగుచోట్ల ''ఙీష్'' (ఈ) అను స్త్రీలింగమును బోధించు ప్రత్యయమున్నది అదియే ''భార్య'' అను నర్థమును నియతముగ తెలియజేయును. కావున అందుకొరకై వేరుగ తద్ధిత ప్రత్యయమును చేసి దానికి లోపమును చేయనక్కర లేదు

వివరణ— ప్రష్ఠునికిని అతని భార్యకును అభేదమును కల్పించి స్త్రీ ప్రత్యయమును చేయుదుము. అట్లు ''భార్య'' అను అభిమతమైన యర్థము వేరొక విధమున తప్పక లభించునపుడు, అదే యర్థమునకై తద్ధితమును చేయుటయు దానికి లోపమనుటయును వ్యర్థము గదా !

విశేష విషయములు— ప్రష్ఠః, అను శబ్దమునకు, ''సమర్థముగ ప్రయాణము చేయువాడు'' -లేక- ''ముందు వెళ్ళువాడు'' (నాయకుడు) అని యర్థము ఇచట ''ప్రష్ఠస్య - స్త్రీ'' (ప్రష్ఠుని భార్య) అను నర్థమున ''పుంయోగాదాఖ్యాయామ్'' (4-1-48) అను సూత్రముచే ప్రష్ఠ శబ్దమునకు ఙీష్, (ఈ) అను స్త్రీ ప్రత్యయము చేరును. ''ఒకానొక విశిష్టమైన ధర్మమును బట్టి ప్రసిద్ధముగా పురుషుని బోధించు శబ్దమునకు, ''అతని భార్య'' అను నర్థమున ఙీష్ ప్రత్యయమగు''నని పై సూత్రముయొక్క భావము. ఈ ప్రత్యయము ''భార్య'' అను నర్థమును తప్పక బోధించును. (సూత్రమందలి ''పుంయోగ'' అను శబ్దము ''భార్య'' అను సంబంధమునే సూచించునని నిర్ణయము. కావున చెల్లెలు, తల్లి, మొదలగు

నర్థములను ఈ ప్రత్యయము బోధింపదు) అందుచే ఇదే ప్రయోజనము సిద్ధించుటకై "తస్యేదమ్" (4-3-120) ("వానికి సంబంధించినది ఇది" అను సామాన్యమైన సంబంధమును తెలుపుచు, షష్ఠ్యంతమైన శబ్దమునకు అణ్, మొదలగు తద్ధితములగునని భావము) అను సూత్రము నాశ్రయించి, తద్ధితమును చేయుటయు అది "భార్య" అను నర్థమును నియమించి లోపించుననుటయును నిష్ఫలము.

కాగా "గర్గాః" మొదలగుచోట్ల తద్ధిత ప్రత్యయము అర్థమును నియమించుననియు "ప్రష్ఠీ" మొదలగుచోట్ల స్త్రీ ప్రత్యయము అర్థమును నియమించుననియును ఫలించినది.॥83॥

అవతారిక — "ప్రస్థః - వ్రీహిః" (అడ్డెడు ధాన్యము) మొదలగు ప్రయోగములున్నవి. ఇచట పరిమాణమును (కొలత - కొలత కుపయోగించు పాత్ర) చెప్పు ప్రస్థ మొదలగు మూల భూతములైన శబ్దములే ఎట్టి ప్రత్యయమును లేకుండ పరిమితమును కూడ (కొలవబడిన వస్తువును) చెప్పుట లోకసిద్ధమై యున్నది. ఇట్టి స్థలములందు కూడ "కొలవబడిన వస్తువు" అను నర్థము నియతముగ వచ్చుట కుపాయములున్నవనియును వేరుగ తద్ధిత ప్రత్యయమును చేసి దానికి లోపమును చెప్పనక్కరలేదనియును, ప్రాసంగికముగ రెండు కారికలతో విశదీకరించుచున్నాడు.

శ్లో॥ మానమేయాదిసంబంధ విశేషేఽఙ్గీకృతే తథా ।
ప్రస్థాదీనామసాధుత్వం తద్ధితేన వినాభవేత్ ॥ 84

శ్లో॥ తద్ధితోయోగభేదేన వాక్యం వా స్యాద్విభాషితమ్ ।
పరిమాణాధికే తత్ర ప్రథమా శిష్యతే పునః ॥ 85

తథా = అట్లు, మానమేయాది సంబంధవిశేషే = "కొలుచునది - కొలవబడునది" మొదలగు విశేషసంబంధము, అంగీకృతే = అంగీకరింపబడగా, తద్ధితేన = తద్ధిత ప్రత్యయము, వినా = లేకుండ, ప్రస్థాదీనామ్ = ప్రస్థ, మొదలగు శబ్దములకు, అసాధుత్వమ్ = సాధుశబ్దములు కాక పోవుట, భవేత్ = అయ్యెడిని

యోగభేదేన = సూత్రముయొక్క విభాగముచే, తద్ధితః = తద్ధిత ప్రత్యయము, స్యాత్ = అగును, వా = లేక, విభాషితమ్ = వికల్పముగ, వాక్యమ్ = వాక్యము, స్యాత్ = అగును, తత్ర = అచట, (ప్రస్థ, మొదలగు శబ్దముల విషయమున) పరిమాణాధికే = పరిమాణమను అర్థ మధికమైనపుడు, ప్రథమా = ప్రథమ విభక్తి, పునః = మరల, శిష్యతే = విధింపబడుచున్నది.

తాత్పర్యము— ప్రస్థ, అను శబ్ద మొకవిధమైన కొలత పాత్రను (అడ్డ) చెప్పును. "ప్రస్థము పరిమాణము గల ధాన్యము" అను నర్థము తప్పక రావలయునన్నచో, పరిమాణమను నర్థమున తద్ధిత ప్రత్యయమును చేసి "ప్రాస్థిక" అను శబ్దమును వాడవలెను. ఆ ప్రత్యయము లేకున్న ఆ యర్థము లభింపదు. లేక— తద్ధితము వికల్పముగాన అది రాని పక్ష

మున ''ప్రస్థః పరిమాణం అస్య ధాన్యస్య'' అని వాక్యమును ప్రయోగింపవచ్చును. లేదా— ఇంకొక తీరున్నది. పరిమాణమును ప్రత్యేకముగ తెలుపుటకై ప్రథమా విభక్తి విధింపబడి యున్నది ఆ విభక్తి వలన ఇష్టమగు పరిమాణార్థమును బోధింపవచ్చును. ఉదా : ''ప్రస్థమ్ ధాన్యమ్'' కాగా ''ప్రాస్థిక'' అను తద్ధితాంతమునుగాని, ''ప్రస్థం పరిమాణమస్య'' అను వాక్యమునుగాని, ''ప్రస్థమ్'' అను ప్రథమాంతమునుగాని, ప్రయోగించి మానమేయ సంబంధమును తెలియజేయవలయును. ఈ మూడింటిలోను ఏదో యొక తీరు నవలంబింపని యెడల అభిమతము సిద్ధింపదు.

వివరణము— కొలత పాత్రకును కొలువబడిన వస్తువునకును అభేదమును కల్పించినను, ''ప్రస్థమ్'' అను శబ్దముచే ''ప్రస్థ పరిమితం ధాన్యమ్'' (కొలవబడిన ధాన్యము) అను నర్థము నియతముగ వచ్చుట కష్టము. అభేదమును భావించినపుడు ప్రస్థమునకు దగ్గరగా ఉన్న వస్తువు కూడ ప్రస్థమే కావచ్చును గదా ! అందుచే పరిమాణరూపమైన అర్థమును తప్పక సంపాదించుటకు పై మూడు మార్గములలోను ఏదో ఒక దానిని స్వీకరింపవలెను ఏదియు కాదన్నచో ఆ యర్థమున ఆ శబ్దము అసాధువగును.

విశేష విషయములు— ''తదస్య పరిమాణమ్'' (5-1-57) అను సూత్రమును దాని తరువాతి సూత్రము నుండి (5-1-58) వేరుగ చేయుదురు. యోగభేదమనగా ఇదియే ''అది దీనికి పరిమాణము'' (దాని కొలతగల వస్తువు) అను నర్థమున ప్రథమాంతమగు పరిమాణమును చెప్పు శబ్దమునకు ''ఠఞ్'' ప్రత్యయమగును అని యర్థము. ప్రస్థ శబ్దమునకు ఈ ప్రత్యయము చేరినపుడు తద్ధిత ప్రక్రియ జరుగగా ''ప్రాస్థిక'' అను రూప మేర్పడును. ప్రత్యయము రానపుడు ''ప్రస్థం పరిమాణమస్య'' అని వాక్య ముండును.

''ప్రాతిపదికార్థ లింగ పరిమాణ వచన మాత్రే ప్రథమా'' (2-3-46) అను సూత్రము ''పరిమాణము'' అను నర్థమును ప్రత్యేకముగ బోధించుటకై ప్రథమను విధించినది. అందుచే ప్రస్థ, మొదలగు పరిమాణ వాచకములకు ఈ ప్రథమను ఉపయోగించి ''ప్రస్థము పరిమాణము గలది'' మొదలగు నర్థములను కూడ సంపాదింపవచ్చును. ఆఢక, (కుంచము) ద్రోణ, (కుంచము) మొదలగు పరిమాణవాచకముల విషయమునను ఈ తీరు నంతను ఊహించునది ॥85॥

అవతారిక— పరిమాణమును చెప్పు శబ్దమే కొండొకచో పరిమేయము (కొలువబడునది) ను కూడ బోధింపగలుగునని వివరించుచున్నాడు.

శ్లో॥ వ్యతిరిక్తస్య సాధుత్వే తదేవ చ నిదర్శనమ్ ।
యుజ్యతేఽఙ్గీకృతాధిక్యం తత్సర్వాభిర్విభక్తిభిః ॥ 86

వ్యతిరిక్తస్య = వేరుగా అధికమైన యర్థము, సాధుత్వే = సాధువగుటలో, తత్ + ఏవ + చ = ఆ ప్రథమ విభక్తిని విధించుటయే, నిదర్శనమ్ = ప్రమాణము, అంగీకృతాధిక్యమ్ =

అంగీకరింపబడిన అధికమైన యర్థముగల, తత్ = ఆ పదము, సర్వాభిః = అన్ని, విభక్తిభిః = విభక్తులతో, యుజ్యతే = కూడును (కూర్పబడును).

తాత్పర్యము— సహజముగ పరిమాణమును బోధించు ప్రస్థ, మొదలగు శబ్దములు పరిమేయమును కూడ బోధించుటలో - పరిమాణార్థమున ప్రత్యేకముగ ప్రథమ విభక్తిని విధించుటయే జ్ఞాపకమగును. అట్టి ప్రత్యేకమైన యర్థమును బోధించు పదములకే కర్మ, కరణము, మొదలగు సంబంధములను తెలియజేయు ద్వితీయ, తృతీయ, మొదలగు విభక్తులన్నియును చేరుచుండును.

వివరణము— శబ్దమును పలుకగానే ఎల్లపుడును ఏ యర్థము తప్పక స్ఫురించునో ఆ యర్థమును ప్రాతిపదికార్థమందురు. కాగా ప్రస్థ, మొదలగు శబ్దములకు ఆ యా పరిమాణములే సహజమైన యర్థములు. అట్లుండ ''ప్రాతిపదికార్థ లింగపరిమాణ వచనమాత్రే ప్రథమా'' (2-3-46) అను సూత్రము, పరిమాణమను నర్థమున మరల ప్రత్యేకముగ ప్రస్థాది శబ్దములకు ప్రథమను విధించినది అందుచే ఈ విభక్తి వ్యర్థము కాకుండ, తద్ధిత ప్రత్యయమువలెనే ''అంత పరిమాణముగల ధాన్యము'' మొదలగు అర్థమును బోధించుచుండును. పిదప ఆవశ్యకతను బట్టి అట్టి విశేషార్థమును చెప్పు శబ్దములకు ద్వితీయ, తృతీయ, మొదలగు అన్ని విభక్తులను చేర్చుకొనవచ్చును. ఉదా : ''ప్రస్థమ్ - (తండులమ్) పచతి'' = అడ్డెడు (బియ్యమును) వండుచున్నాడు ''ప్రస్థేన - క్రీణాతి'' = అడ్డెడు - బియ్యముతో - కొనుచున్నాడు - మొదలగునవి

ఇట్లు పరిమాణమును చెప్పు శబ్దములే పరిమేయమును కూడ చెప్పగలుగుట కుపాయము లున్నవని తేలినది.

విశేష విషయములు— ''కేవలము ప్రాతిపదికము యొక్క అర్థమును, అధికముగ ఉన్న లింగమును, పరిమాణమును, వచనమును మాత్రము బోధించుటకు ప్రథమ యగును'' అని ''ప్రాతిపదికార్థ'' మొదలగు సూత్రమున కర్థము. ''ద్రోణః - వ్రీహిః'' (కుంచెడు ధాన్యము) అనునది ప్రకృతమున ఉదాహరణము ఇచటి ప్రథమకు ''కుంచెడు'' అని యర్థము.

కాగా ఆ యా ప్రయోగములలో ఏదో యొక సంబంధమును బట్టి ఆ యా అర్థములకు అభేదమును కల్పించినను, నియతమైనట్టియు, ఇష్టమైనట్టియు అర్థమును సంపాదించుటకు - ప్రత్యయమును చూపుటయు —లేక— దానికి లోపమనుటయు —లేక— మరియొక తీరును చూపుటయును - మొదలగు ప్రయత్నములను చేయవలసి యుండుననుట ప్రకృత సందర్భము యొక్క సారము. ॥86॥

అవతారిక— శుక్ల, నీల, మొదలగు శబ్దము లా యా గుణములను (తెలుపు, నలుపు, మొదలగు రంగులు), ఆ గుణములు కల వస్తువులను కూడ సహజముగనే బోధించును. అయినను ''ఆ గుణము కలది'' అను నర్థమున ఆ శబ్దములకు ''మతుప్'' అను తద్ధిత

ప్రత్యయమును చేసి దానికి లోపమును చెప్పుదురు. ఆ తీరు కేవలము సాధుత్వమును సంపాదించుటకే అని చెప్పుచున్నాడు.

శ్లో॥ శుక్లాదిషు మతుబ్లోపో వ్యతిరేకస్య దర్శనాత్ ।
అసాధుత్వనివృత్త్యర్థం సాధవస్తే బిదాదివత్ ॥ 87

వ్యతిరేకస్య = భేదము (వేరొక తీరు), దర్శనాత్ = కనబడుటవలన, అసాధుత్వ నివృత్త్యర్థమ్ = సాధువులు కాకపోవుటను వారించుటకు, శుక్లాదిషు = "శుక్ల" మొదలగు శబ్దములందు మతుబ్లోపః = మతుప్ ప్రత్యయమునకు లోపము (విధీయతే = విధింపబడును), తే = ఆ శబ్దములు, బిదాదివత్ = బిదాః, గర్గాః, మొదలగు శబ్దములవలె, సాధవః = సాధువులు, (భవంతి = అగును).

తాత్పర్యము— శుక్లః = తెలుపు "శుక్లః పటః" = తెలుపుగల బట్ట ఇచట శుక్ల శబ్దమే "తెలుపు గలది" అను నర్థమును గూడ చెప్పును. అయినను "పటస్య శుక్లః" (బట్టయొక్క తెలుపు) మొదలగు ప్రయోగములు కూడ ఉన్నవి. ఇట్టిచోట్ల శుక్లాది శబ్దములు "అది గలది" అను నర్థమును బోధింపవు. కావున "శుక్లః పటః" మొదలగుచోట్ల నిస్సంశయముగ "అది గలది" అను నర్థము వచ్చుటకు "మతుప్" ప్రత్యయమును చెప్పుటయు, వెంటనే దానికి లోపమనుటయును సమంజసము ఇట్లు ఈ శబ్దములకు "గర్గాః" (గర్గుని గోత్రమైన సంతతి), "బిదాః" (బిదుని గోత్రమైన సంతతి) మొదలగు శబ్దములవలెనే సాధుత్వమును సంపాదించినట్లగును (చూ. 81 వ కారిక).

వివరణము— (1) "అది గలది" అను నర్థము రావలయునన్నచో, "మతుప్" అను తద్ధిత ముండవలయును. వెంటనే అది పోయినను - అట్టి సంస్కారమును చేసినందు వలన "ఈ శబ్దము సాధువు" అనుటకు వీలు కలుగును లేకున్న "కేవలమైన ప్రకృతిని వాడ కూడదు" అను నిషేధమున్నందున ఆ యర్థమున ఆ శబ్దము సాధువు కాకపోయెడిని.

(2) "బిదాః", మొదలగు శబ్దములు (తద్ధితము లోపించినను) తమ యర్థముతో కూడిన అపత్యార్థమును చెప్పునట్లే, శుక్లాది శబ్దము తమ యర్థముతో కూడిన "కలది" అను విశేషార్థమును గూడ ప్రత్యయము యొక్క సాహాయ్యముచే బోధింపగలుగుననియు, ఇట్టిచోట్ల "గుణమునకును గుణము గల దానికిని అభేదము నంగీకరించియే అభిమతమైన యర్థమును సంపాదింపవలెనన్న" పట్టుదల అక్కరలేదనియును సారాంశము.

(3) "తదస్యాऽస్త్యస్మిన్నితి మతుప్" (5-2-94) అను సూత్రము మతుప్పును సామాన్యముగ విధించును. "అది దీనికి గలదు - అది దీనియందు గలదు - అను నర్థములలో ప్రథమాంతమునకు మతుప్ ప్రత్యయమగును" అని దీని భావము. ఉదా : ధనవాన్, గుణవాన్, మొదలగునవి.

(4) "గుణవచనేభ్యోమతుపోలుగిష్టః" (5-2-95 సూత్రమందలి వార్తికము)

అను వార్తికము గుణవాచకములకగు మతుప్పునకు లోపమును చెప్పును శుక్ల, నీల, మొదలగు శబ్దములు గుణవాచకములు. ॥87॥

(5) వృత్తియందు విశేషణ విశేష్యభావము యొక్క ఉపపాదనము

అవతారిక — సమానాధికరణమగు వృత్తిని పరిశీలించు సందర్భములో ప్రాసంగికముగ మీది విషయములన్నియు వచ్చినవి. కాని వృత్తియందు అభేదము నంగీకరించినపుడు, విశేషణ విశేష్యభావమెట్లు కుదురునన్నది మొదట ప్రకృతమైన విషయము. దానినే కొందరి మతము ప్రకారము చూపుచున్నాడు.

శ్లో॥ విశేషణాద్విశేష్యేఽర్థే తద్భావాభ్యుచ్చయే సతి ।
పునశ్చ ప్రతిసంహారే వృత్తిమేకే ప్రచక్షతే ॥ 88

విశేష్యే = విశేష్యమైన, అర్థే = పదార్థమందు, విశేషణాత్ = విశేషణము వలన, తద్భావాభ్యుచ్చయే + సతి = ఆ విశేషణము యొక్క స్వరూప మధికము కాగా, పునః + చ = మరల ప్రతిసంహారే = కూడగట్టుట జరుగగా, వృత్తిమ్ = వృత్తిని, ఏకే = కొందరు, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్యము— వృత్తియందు జరుగు విశేషణ విశేష్యభావమును కొందరిట్లు వివరింతురు. విశేషణమైన వస్తువును విశేష్యమైన వస్తువును విడివిడిగానే బుద్ధియందు భాసించును. విశేషణము విశేష్యమందలి ఆధిక్యమును (ఒక విశేషము) మొదట చూపును చివరకు ఆ యాధిక్యము గల విశేష్యమను జ్ఞానము కలుగును.

వివరణము— ''నీలోత్పలమ్'' అనునది ఉదాహరణము. ఇది సమాసవృత్తి. ఇచట నీలమను రంగును కలువయనెడి వస్తువును తొలుత విడిగానే తెలియును నీల అను పదము ''కలువకు గల ఆ రంగు - విశేషము'' అని బోధపరచును. (మామూలు కలువకన్న ప్రకృతమైన కలువయందలి వింత) చివరకు ''నీలమురంగుతో కూడిన కలువ'' అను రీతిని విశేషణ విశేష్యభావము బుద్ధియందేర్పడును.

విశేష విషయములు— ఈ మతముయొక్క సారమిది : వృత్తియందు కేవలము అఖండార్థము (భేదము లేనిది) బోధపడుచున్నచో భేద ప్రధానమైన విశేషణ విశేష్యభావమును విశదీకరించుట మిక్కిలి కష్టమగును. మరియు శబ్దము వినిపించు వరుసలోనే అర్థము కూడ తెలియుననుట సముచితము. కాగా విశేషణము ముందుగను విశేష్యము వెనుకగను వినిపించునుగాన, వాని యర్థములను గూడ అట్లే చెప్పవలయును అదియునుగాక ఇట్టిచోట్ల ''నాగృహీత విశేషణా విశేష్యేబుద్ధిః'' అను న్యాయమొకటి ప్రవర్తించును. ''ముందుగ విశేషణమును స్వీకరింపని బుద్ధి విశేష్యమును గ్రహింపజాలదు'' అని దీని భావము. అందుచే విశేషణ విశేష్యములను విడిగానే గ్రహింపక తప్పదు. అయితే వానినట్లే వదలివేయక ఒండొరులకు ఉపకారభావమును కల్పించి (ఒకటి వేరుచేయునది - వేరొకటి వేరుచేయబడునది) తుదకు ''ఆ ధర్మముగల వస్తువు'' అని ఐక్యమును భావింతుము. ॥88॥

అవతారిక— పైది మతమును రెండు కారికలతో దూషింపుచున్నాడు.

శ్లో॥ నిమిత్తే ప్రత్యయః పూర్వో నానుప్రాప్తో నిమిత్తినా ।
నిమిత్తవతి బుద్ధేశ్చ న నిమిత్తసరూపతా ॥ 89

శ్లో॥ సంస్కారసహితాజ్ఞానాన్నోపశ్లేషః స్మృతేరపి ।
వ్యాపారే తన్నిమిత్తానాం న గ్రాహ్యం స్యాత్తథావిధమ్ ॥ 90

నిమిత్తినా = విశేష్యముచే, పూర్వః = మొదటి, ప్రత్యయః = సంబంధము, (జ్ఞానము), నిమిత్తే = విశేషణమందు, న + అనుప్రాప్తః = పొందబడదు, నిమిత్తవతి = విశేష్యమందలి, బుద్ధేః + చ = జ్ఞానమునకును, నిమిత్తసరూపతా = విశేషణముతోడి సారూప్యము, న = (భవతి) = ఉండదు

సంస్కారసహితాత్ = సంస్కారముతో కూడిన, జ్ఞానాత్ = జ్ఞానమువలన, స్మృతేః + అపి = స్మరణమునకును, ఉపశ్లేషః = పరస్పరము కలియుట, న = (భవతి) = కలుగదు, (సంభవింపదు), తన్నిమిత్తానామ్ = ఆ స్మృతికి కారణమైన వానియొక్క వ్యాపారే = పనియందు, తథావిధమ్ = అటువంటిది, గ్రాహ్యమ్ = గ్రహించుటకు వీలయిన దిగ, న + స్యాత్ = కాకపోయెడిని.

తాత్పర్యము— విశేషణమును విశేష్యమును విడిగా గ్రహించిన పక్షములో, దాని సంబంధమును దీనికిగాని దీని సంబంధమును దానికిగాని కూర్చుట కుదురకపోవును. సంస్కారము వలన కలుగు స్మరణము కూడ అనుభవము ననుసరించియే ఏర్పడునుగాన, అదియు విశేషణ విశేష్యముల సంబంధమును సంపాదింపజాలదు. తెలిసికొను వ్యక్తియొక్క భావనా బలమువలన అట్టి సంబంధము కుదురునన్నయెడల, తొలుత విశేషణమును విశేష్యమును గ్రహించుట కూడ అనావశ్యకమయ్యెడిని.

వివరణము— విశేషణమును ముందుగ తెలిసికొనుటయు పిదప విశేష్యమును తెలియుటయు అన్నది ప్రకృతము. ఇచట తార్కికముగా పరిశీలించినచో ఒకదానిని గ్రహించిన క్షణములో వేరొకటి బుద్ధియందుండదు (ఒకే సమయమున రెండును బుద్ధియందు భాసింపవు). అయినపుడు వానికి పరస్పరము విశేషణ విశేష్యభావమనెడి సంబంధము కుదురుట ఎట్లు పొసగును ?

''విడిగా గ్రహించినను విశేషణ విశేష్యములకు గల క్రమము (ముందు - వెనుక అను వరుస) ఒకటి సంస్కారరూపమున బుద్ధియందుండును. ఆ సంస్కారమువలన అట్టిదేయగు స్మరణము కలుగును. దానివలన ఒండొరుల సంబంధము కుదురును గదా !''— అని యనవచ్చును. కాని ఇదియు సరికాదు తొలుతకలిగిన ప్రత్యక్షమైన అనుభవము ననుసరించియే స్మరణము కూడ ఏర్పడునుగాన పైనచూపిన ఆక్షేపణ మట్లే మిగిలిపోవును. (అనగా ప్రత్య

క్షమునకు ప్రతిబింబమువంటిదే స్మరణము తాన విశేషణ విశేష్యములు విడిగానే ఉండి పోవునుగాని వానికొక పొత్తు కుదురదు).

ఇక ''గ్రహీతయొక్క (తెలిసికొను వ్యక్తి) భావనకు విచిత్రమైన శక్తులుండును. వాని మహిమవలన అభిమతమైన సంబంధమును కుదుర్చుకొనవచ్చును'' - అని వాదింప వచ్చును. కాని అదియు హాస్యాస్పదమేయగును. ఈ పక్షమున భావనాశక్తి వలననే అన్ని పనులను నెరవేరునుగాన, మొదట ప్రత్యక్షముగ విశేషణమును విశేష్యమును విడిగా గ్రహించుట కూడ అనావశ్యకమగును ॥90॥

అవతారిక— ''విశేషణ విశేష్యభావము భావనవలన కలుగుననుట'' కుదురదని స్పష్టము చేయుచున్నాడు.

శ్లో॥ అంతఃకరణవృత్తౌ చ వ్యర్థా బాహ్యార్థకల్పనా ।
తస్మాదనుపకారో వా గ్రాహ్యం వా న తథాస్థితమ్ ॥ 91

అంతకరణవృత్తౌ + చ = మనస్సుయొక్క వ్యాపారమందు, బాహ్యార్థకల్పనా = బయటి విషయములను అంగీకరించుట, వ్యర్థా = నిష్ఫలము, తస్మాత్ = అందువలన అనుపకారః + వా = ప్రయోజన ముండదు, వా = లేక, గ్రాహ్యమ్ = గ్రహింపపగిన వస్తువు, తథా = అట్లు (అనుకొన్నట్లు) న + స్థితమ్ = ఉండదు

తాత్పర్యము— మనోవ్యాపారము నంగీకరించిన పక్షమున బయటి వస్తువు నంగీకరింప బనియే లేదు. కావున విశేషణ విశేష్యభావము మనస్సువలన కుదురదు. కుదురునన్నచో బాహ్యములైన విశేషణము, విశేష్యము అను పదార్థములనే త్రోసివేయవచ్చును.

వివరణము— విశేషణము, విశేష్యము అనబడు పదార్థములు రెండును బాహ్యములనియు (ప్రత్యక్షములు) వానికి గల నియతమైన సంబంధము మాత్రము మానసికమనియును మీద చూపిన భేదవాదుల యొక్క తాత్పర్యము. అది సరికాదు సంబంధముకొరకై బుద్ధి వరకును వెళ్ళినపుడు దానివలననే సకలమును భావింపవచ్చును గాన, బయటి పదార్థములను వేరుగ అంగీకరించుట వ్యర్థమగును. కాగా భావనను స్వీకరించుటవలన ప్రయోజనము లేదు.

అందుచే ''విశేషణము యొక్కయు విశేష్యము యొక్కయు జ్ఞానము వేర్వేరుగ కలుగినున్న పక్షమున వానికిగల నియతమైన సంబంధము సిద్ధింపదు'' అని ఫలించును ॥91॥

అవతారిక— ఇట్లు విశేషణ విశేష్యభావము విషయమున పరుల మతమును దూషించి, తన మతమును రెండు కారికలతో వివరింపుచున్నాడు

శ్లో॥ అనుస్యూతేవ సంసృష్టైరర్థే బుద్ధిః ప్రవర్తతే ।
వ్యాఖ్యాతారో విభజ్యాఽథ తాం భేదేన ప్రచక్షతే ॥ 92

శ్లో॥ తదాత్మన్యవిభక్తే చ బుద్ధ్యంతరముపాశ్రితాః ।
విభాగమివ మన్యంతే విశేషణ విశేష్యయోః ॥ 93

సంస్పృష్టేః = విడదీయుటకు వీలులేకుండ కలిసియున్నందువలన, అనుస్యూతా + ఇవ = కట్టబడినదా అన్నట్లు, బుద్ధిః = జ్ఞానము, అర్థే = పదార్థమందు, ప్రవర్తతే = ప్రసరించును, అథ = తరువాత, వ్యాఖ్యాతారః = వివరించి చెప్పువారు, తామ్ = ఆ బుద్ధిని, విభజ్య = వేరుచేసి, భేదేన = భేదముతో, ప్రచక్షతే = చెప్పుదురు.

తదాత్మని = ఆ బుద్ధియొక్క స్వరూపము, అవిభక్తే + చ = వేరుచేయబడకుండగా, బుద్ధ్యంతరమ్=వేరొకబుద్ధిని, ఉపాశ్రితాః=అవలంబించినవారై, విశేషణ విశేష్యయోః = విశేషణ విశేష్యములకు, విభాగమ్ = భేదమును, మన్యంతే + ఇవ = భావించునట్లు కనబడుదురు

తాత్పర్యము— విశేషణ విశేష్యముల విషయమున ఎట్టి భేదమును లేని జ్ఞానమే సహజముగ వృత్తియందు కలుగును అయినను శిష్యులకు స్పష్టముగ తెలియుటకై పెద్దలు (గురువులు) భేదమును కల్పించి చూపుదురు ఆ భేదము వాస్తవము కాకపోయినను ఉన్నట్లుగ బుద్ధియందు భాసించుచుండును. ఇట్లు భాసించుట కూడ తత్త్వము తెలియుట కుపాయము మాత్రమే

వివరణము— జాతి, గుణము, క్రియ, మొదలగు ధర్మములు సహజముగను విడదీయుటకు వీలులేకుండగను ప్రతియొక పదార్థమందును ఉండును వీనికిని ఆ యా వస్తువునకును ఉన్న సంబంధమును "సమవాయ సంబంధమ"ని శాస్త్రీయముగ అందుర (వేరుచేయ శక్యముకాని సంబంధము) కావున పదార్థము విషయమున కలుగు జ్ఞానమెల్లపుడును, అభిన్నముగను ఏకాకారముగనే కలుగును. అయితే ఆ తీరు తెలియనివారికి తెలిసినవారు విడమరచి చెప్పుట ఆవశ్యకమగును అట్లు చెప్పునపుడు బుద్ధియందు భేదము భాసించును. అది కేవలము కృత్రిమము

విశేష విషయములు— (1) సజాతీయములగు సకల వస్తువులందును గోచరించు ఏకాకారమైన ధర్మము "జాతి" యగును. (ఉదా : గోత్వము, మానవత్వము, మొదలగునవి) తెలుపు, నలుపు మొదలగునవి గుణములు. నడక, వంట, మొదలగునవి క్రియలు —లేక— వ్యాపారములు. ఈ ధర్మములే సామాన్యముగ విశేషణములగుచుండును. (వేరుచేయు ధర్మము విశేషణము వేరుచేయబడు వస్తువు విశేష్యము).

(2) నీలోత్పలమును చూచునపుడు నలుపు వేరుగను కలువ వేరుగను ఉండదు. కావున "నలుపురంగు కల కలువ" (నల్లకలువ) అను అభేదజ్ఞానమే కలుగును. "ఇది విశేషణము - ఇది విశేష్యము" అని వ్యాఖ్యానించుట కేవలము బుద్ధికిచెందు ఒకానొక అవస్థ.

(3) సమవాయమనునది నిత్యమైన సంబంధము. కావున అది ఉన్నచోట విశేషణ విశేష్యభావమనగా అదియే యని భావము. సమవాయము కాని సంబంధములన్నియు (సంయో

గము, స్వస్వామిభావము, మొదలగు విడదీయుటకు వీలయిన సంబంధములు) అనిత్యములు అచట కూడ తొలుత అభేదజ్ఞానమే కలుగుననియు, పిదప భేదము కల్పింపబడుననియును ఊహింపవలెను

(4) ''నీలమ్ - ఉత్పలమ్'' అను రీతిని వేరుచేసినచో అది వాక్యదశ యగును. దీనియందు భేదము స్పష్టముగ తెలియుచుండును ''నీలోత్పలమ్'' అన్నది వృత్తిదశ. దీని యందు భేదము వాస్తవము కాదు. ఇట్లు వాక్యమునకును వృత్తికిని ధర్మభేదమున్నది.

(5) వాక్యమువలనగాని, వృత్తివలనగాని కలుగు జ్ఞానమంతయు అఖండమే యనియు, వాక్యమునకును వృత్తికిని చూపు భేదములుకూడ ఉపాయములే అనియును పరమ సిద్ధాంతము.

(6) కాగా - వృత్తియందు భేదజ్ఞానము సరియైనది కాదనియును అభేదజ్ఞానమే సముచితమనియును పర్యవసించినది. ॥93॥

అవతారిక— వృత్తినిగురించి మహాభాష్యమున చూపబడిన వేరొక మతమును వ్యాఖ్యానించుచున్నాడు

శ్లో॥ అబుధాన్ ప్రతివృత్తిం చ వర్తయంతః ప్రకల్పితామ్ ।
అహుః పరార్థవచనే త్యాగాభ్యుచ్చయ ధర్మతామ్ ॥ 94

అబుధాన్+ప్రతి = పండితులు కానివారిని గురించి, ప్రకల్పితామ్ = కల్పింపబడిన, వృత్తిమ్ = వృత్తిని, వర్తయంతః + చ = ఏర్పాటుచేయువారు, పరార్థవచనే = వేరొక శబ్దముయొక్క అర్థమును చెప్పుటలో, త్యాగాభ్యుచ్చయధర్మతామ్ = విడుచుట —లేక— అధికమగుట - అను ధర్మములు కలిగియుండుటను, అహుః = చెప్పుదురు.

తాత్పర్యము— వాక్యమే వృత్తిగా మారునని కొందరందురు. వారి మతమున వాక్యమందలి పదముల యర్థము వృత్తియందలి పదములచే మార్చబడి వేరొక రూపమును దరించి బోధపడును. అట్లు వాక్యము వృత్తిగా మారునపుడు వాక్యమందలి యర్థమును పూర్తిగా విడిచిపెట్టి, వృత్తియందలి శబ్దములు స్వతంత్రముగనే విశేషార్థమును బోధించునని వచ్చును. ఈ తీరును ''త్యాగము'' అందురు (వాక్యమందలి యర్థమును విడుచుట) లేదా— వాక్యమందలి శబ్దముల యర్థములను విడువకుండగనే ఉన్నదున్నట్లుగా స్వీకరించి, వృత్తి యందలి శబ్దములు ఒక విశేషార్థమును చెప్పునని వ్యాఖ్యానింపవచ్చును. ఈ తీరును ''అభ్యుచ్చయము'' అందురు (ఉన్న యర్థమునకే పెంపును సమకూర్చుట).

వివరణము— శబ్దములకు వృత్తి అన్నది ప్రత్యేకమైనట్టియు నిత్యమైనట్టి ఒక అవస్థ కాదనియు, వాక్యముగ (విడిగా) ఉన్నప్పటి శబ్దములనే కొంచెము మార్చుకొని అభి మతమైన విశేషార్థమును సంపాదింపవచ్చుననియును కొందరి మతము. ఈ మతమున వాక్య మునకు బదులుగ ఉపయోగించునదియే వృత్తియగును. అయితే వాక్యస్థానమున వృత్తిని

వాడుటలో రెండు పద్ధతులను అవలంబింపవచ్చును. వాక్యదశయందలి పదముల యర్థములు వృత్తిదశలో పూర్తిగా జారిపోవుననుట యొకటి దీనిని ''జహత్స్వార్థము'' (స్వార్థమును విడుచునది) అందురు. ఉన్న యర్థములు వృత్తియందు యథాతథముగ (ఉన్నవి ఉన్నట్లుగ) అనువర్తించుననుట రెండవది దీనిని ''అజహత్స్వార్థము'' (స్వార్థమును విడువనిది) అందురు.

''వాస్తవమున ఇదంతయు కల్పనమే. వాక్యమువేరు - వృత్తివేరు. రెండిటికిని ఎట్టి సంబంధమును లేదు. దేనికది సర్వస్వతంత్రము'' అన్నది సిద్ధాంతము

విశేష విషయములు— (1) ''పరార్థాభిధానం వృత్తిః'' అనునది పై మతమును ప్రతిపాదించు భాష్యవచనము ''వేరొక శబ్దముయొక్క అర్థమును చెప్పుతీరు వృత్తియగును'' అని దీని భావము. అనగా వాక్యదశలో ఒక విధమైన యర్థమును చెప్పు పదము (ముఖ్యముగా అప్రధానమైన పదము) వృత్తిదశలో వేరొక విధమైన యర్థమును బోధించుననుట. (వాక్య దశలో విడివిడి యర్థములను తెలుపు పదములు వృత్తదశలో ఒకదానితో వేరొకటి కలిసి పోయి మొత్తముపై అఖండమైన ప్రత్యేకార్థమును తెలుపుట). ఉదా : ''రాజ్ఞః పురుషః''. ఇది వాక్యదశ. ఇచట రాజ శబ్దమునకు ''రాజు'' అర్థము. ''రాజపురుషః''. ఇది వృత్తి. ఇచట రాజ శబ్దమునకు ''పురుషుడు'' (రాజ సంబంధము గలవాడు) అనియే యర్థము. పురుష శబ్దమునకును అదియే యర్థము.

ఈ మతమున వాక్యమాధారముగ వృత్త సిద్ధించునుగాన వాక్యము కారణమును వృత్త - కార్యమును అగును. కాగా కారణములైన దారములకన్న కార్యమైన బట్టయందు కొన్ని విశేషములున్నట్లే (పొడవు, వెడల్పు, ధరించుటకు వీలగుట మొదలగునవి) వాక్యముకన్న వృత్తియందు ఆవశ్యకమైన విశేషార్థములు లభించును. అట్లు లభించుట కార్యమునకుగల ప్రత్యేకమైన శక్తి —లేక— ధర్మము అనుకొనవలయును. దానికే వృత్తియని సంకేతము.

(2) జహత్స్వార్థ— ''జహాతి - పదాని - స్వార్థమ్ - యస్యామ్ సా'' = ఇచట పదములు తమ యర్థమును విడుచును - అని యర్థము. (వేరొక క్రొత్తయర్థమునే స్వీకరించును). వాక్యముయొక్క స్థానమున వృత్తి అన్నపుడు వాక్యము పూర్తిగా తొలగవలయును. ఒక దృష్టాంతమువలన ఈ యంశమును గ్రహింపనగును. ఒక గిన్నెలో నిండుగ పాలున్నవి. ఆ గిన్నెలోనే పెరుగును పోయవలెనన్నచో పాలను తీసివేయవలెను. అట్లే వాక్యము తొలగి ననే కాని యచట వృత్తియుండుట కుదురదు. అయితే ఇచట తొలగుట అనగా ఆ యవస్థ యందలి అర్థమును ''తీసికొనకుండుట'' మాత్రమేయని గ్రహింపవలెను. దీనికే ''త్యాగము'' అని పేరు.

(3) అజహత్స్వార్థ— మీది తీరున కిది వ్యతిరిక్తము (భిన్నము). ''న - జహాతి - పదాని - స్వార్థమ్ - యస్యామ్ - సా'' = ఇందు పదములు తమ అర్థములను విడువవు అని యర్థము. (ఉన్నవాని నుంచికొని ఆవశ్యకమైన క్రొత్త బంధములను కూర్చుకొనుట). బిచ్చగాడు అధికము లభించినను కూడబెట్టునేగాని, తొలి బిచ్చమును విడువడు. అట్లే వృత్తి దశమున విశేషార్థములు వచ్చినను వాని నన్వయించుకొనుచు తొలి దశయందలి యర్థములే అనుస

రించును. (ఒక విశేషము - అర్థమును విడుచుటయు విడువకుండుటయును అప్రధానమైన (ఉపసర్జనము) పదము విషయముననే చక్కగ కుదురును.) దీనిని ''అభ్యుచ్చయము''అందురు.

(4) పై రెండు పద్ధతులలోను దేని నవలంబించినను ఫలిత మొకటే. విశేషణ విశేష్యభావము గల ఒకానొక ప్రత్యేకమైన యర్థము వృత్తియందు లభించుటయే ఆ ఫలితము. మొదటి పద్ధతిలో (జహత్స్వార్థ) అట్టి యర్థము వచ్చుటకై వృత్తికి ప్రత్యేకమైన శక్తిని అంగీకరింపవలసి యుండును. రెండవదానిలో (అజహత్స్వార్థ) మొదటి దశయందు (వాక్యము) పదములకున్న శక్తియు పనికివచ్చునని చెప్పవచ్చును. ఇదియే రెండిటికిని గల భేదము.

(5) శబ్దము నిత్యమని వైయాకరణుల సిద్ధాంతము. అయినపుడు వాక్యమే వృత్తిగా మారుననుట పొసగదు వాక్యమును వృత్తియు దేనికది స్వతంత్రములు. వాని ధర్మములును సామర్థ్యములును వేరే. ఈ యంశములన్నియు వెనుక చర్చింపబడినవి. కావుననే ప్రకృతమైన కారికయందును, ''అబుధాన్ ప్రతి ...... ప్రకల్పితామ్'' అని గ్రంథకర్త వక్కాణించెను. ॥94॥

అవతారిక— వృత్తి జహత్స్వార్థమైనపుడును కానపుడును సంభవించు విశేషములను విశదము చేయుచున్నాడు.

శ్లో॥ అన్వయాద్గమ్యతే సోఽర్థః విరోధీ వా నివర్తతే ।
ద్వ్యర్థమర్థాంతరే వాఽపి తత్రాహురుపసర్జనమ్ ॥ 95

సః = ఆ, అర్థః = అర్థము, అన్వయాత్ = అన్వయమువలన, గమ్యతే = తెలియబడును, వా = లేక, విరోధీ = విరోధముగలది, (అర్థము) నివర్తతే = పోవును, తత్ర = అచట, అర్థాంతరే + వా + అపి = వేరొక యర్థమందుకూడ, ఉపసర్జనమ్ = అప్రధానమైన పదమును, ద్వ్యర్థమ్ = రెండర్థములుగల దానినిగ, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— వృత్తి జహత్స్వార్థమైనపుడు కూడ ప్రధానమైన పదముయొక్క అర్థమునకు తన విశేషార్థమును అంటించి, ఉపసర్జనమైన పదముయొక్క యర్థము మరలి పోవును. అంతియేకాని పూర్తిగా పోదు. అట్టి సంబంధమువలన విశేషార్థముతో కలిసిన ప్రధానార్థమే తెలియబడును. లేక— ప్రకృతమునకు విరుద్ధమైన తన ప్రాధాన్యమును ఉపసర్జన పదముయొక్క అర్థము పోగొట్టుకొనుననియైనను చెప్పవచ్చును. వృత్తి అజహత్స్వార్థమైనపుడు ఉపసర్జనము తన యర్థమును— దానితోపాటు ప్రధానార్థమును కూడ బోధించుగాన అది ''ద్వ్యర్థము'' అని అందురు.

వివరణము— (1) ''రాజపురుషః''— అనునది యుదాహరణము. ఇచట రాజ శబ్ద ముపసర్జనము. (అప్రధానము). పురుష శబ్దము ప్రధానము. ఉపసర్జనమైనది తన యర్థమును పూర్తిగా విడుచునన్నచో రాజ పదమును వాడుటయే అసంగతమగును. (ఎట్టి యుపయోగమును లేనపు డా పదమును చేర్చుటెందులకు?) లేక— ''పురుషుడు'' అను ముఖ్యమైన

యర్థమునే రాజపదము కూడ బోధించుచున్నయెడల— అపుడును అది వ్యర్థమేయగును. ముఖ్యార్థమును బోధించు పురుషపదము వేరుగనున్నది గదా ! అదియునుగాక ఎట్టి ఉపయోగ మును లేని రాజపదమును చేర్చినను సామర్థ్యము కుదురనందున సమాసమను పేరే అచట సంభవింపకపోయెడిని. అందువలన ఇట్టిచోట్ల ఉపసర్జనము ప్రధానమునకు కొంత ఉపకారము చేయక తప్పదనవలయును. కాగా తన యర్థమును విశేషణరూపమున ప్రధానమందు పులిమి, తన స్వరూపమును పోగొట్టుకొనుటయే ఉపకారమగును. అట్లు ఉపసర్జనము యొక్క వాసనయే ప్రధానమందు మిగులునుగాని దాని స్వరూపముండదు. జహత్స్వార్థత్వమనగా ఇదియే ఇదొక పక్షము.

(2) జహత్స్వార్థతయందును ప్రకృతమునకు విరుద్ధమైన యంశమునే ఉపసర్జన మైన పదము విడిచిపెట్టును. తన యర్థమునంతను పూర్తిగా విడువదు. ఇచట ప్రకృతమునకు విరుద్ధమైన యంశమనగా తన అర్థముయొక్క ప్రాధాన్యము. దానినే అది విడుచును. అనగా తాను ప్రధానమునకు విశేషణమై అప్రధానమై పోవును. కావుననే అట్టి రాజపదమునకు "ఋద్ధస్య" మొదలగు వేరు విశేషణములతో సంబంధము కుదురదు. విశేషణముతోడి సంబంధము ప్రధానమునకే చెల్లునుగదా ! కావున "అర్థమును విడుచుట" అనగా ప్రాధాన్య మును పోగొట్టుకొనుట మాత్రమే. ఇది మరియొక పక్షము.

(3) ఇక— అజహత్స్వార్థతయందు తన యర్థము నుంచుకొనుచు విశేషణరూప మైన వేరొక యర్థమును కూడ ఉపసర్జనము కూడగట్టుకొనునుగాన, ఆ విధముగ అది "రెండర్థములు గలది" అగునని కొందరు వ్యాఖ్యానింతురు. అయినను దానికి ప్రాధాన్యము మాత్ర ముండదనుటయే పర్యవసానము.

విశేష విషయములు— (1) పైని చూపిన జహత్స్వార్థత్వమందలి రెండు తీరుల విషయములోను లోకసిద్ధమైన రెండు దృష్టాంతములను పతంజలి చూపెను. ఒకటి:— మల్లి పువ్వుల బుట్ట బుట్టలోనుండి మల్లిపువ్వులను తీసివేసినను వాని వాసన మాత్రము బుట్టనంటి పెటుకొని యుండును. అట్లే వృత్తియందలి ఉపసర్జన పదముయొక్క యర్థము సంస్కార రూపమున ఉండును. ఇది మొదటి తీరు. రెండు:— రాజుగారి సేవకు కుదిరిన వడ్రంగి. ఇచట వడ్రంగి తన వృత్తియగు వడ్రంగము గాక, వేరొక పనిలో చేరినవాడు. కావున ఉద్యో గములో అతని వృత్తియొక్క ప్రాధాన్యము పోవును. అయినను అతనికి సహజమైన ధర్మము లన్నియు అతనిని విడువకయే ఉండును. ఇది రెండవ తీరు

కాగా జహత్స్వార్థత అనగా "పూర్తిగా తన యర్థమును విడుచుట కాదనియు, ఆవశ్యకము కాని యంశమును విడిచి ఆవశ్యకమైనదాని నుంచుకొనుట అగుననియు" ఫలించును.

(2) అజహత్స్వార్థమున కూడ ఒక దృష్టాంతమున్నది. ఒక గిన్నెనిండ ఇసుక యున్నది. అందులో నీరు పోయుదుము. అది యిసుకలో ఇంకిపోయి కలిసిపోవును. అయినను రెండు పదార్థములును అచట నున్నవి. అట్లే వృత్తియందు పదార్థములు కలిసియుండును.

అయితే వానిలో ఒకటి ముఖ్యముగను వేరొకటి విశేషణముగను అన్వయించుట వృత్తియొక్క శక్తి వైచిత్ర్యమని భావింపవలయును.

(8) ఇట్టి చర్చకు మూలమైన "పరార్థాభిధానం వృత్తిః" అను భాష్యవచనమును ఇట్లు వ్యాఖ్యానింతురు. "పరస్య + అర్థః = పరార్థః" వేరొక శబ్దముయొక్క యర్థము. "అభిధీయతే - అత్ర = అభిధానమ్" = దీనియందు చెప్పబడును. "పరార్థస్య + అభిధానమ్ = పరార్థాభిధానమ్" వేరొక శబ్దముయొక్క అర్థమును వేరొక శబ్దముతో బోధించుట దేనియందు కుదురునో అది వృత్తియగునని భావము. ఉదా : రాజపురుషః. ఇచట వాక్యావస్థలో (రాజ్ఞః పురుషః) రాజ శబ్దమునకు రాజనియు, పురుష శబ్దమునకు పురుషుడనియును విడిగామన్న యర్థములు. సమాసమందలి రెండు శబ్దములకును "రాజ సేవకుడు" అని ఒకటిగా ఏర్పడినదియే యర్థమగును. ఇట్లు పురుష శబ్దముయొక్క అర్థమును రాజ శబ్దమును, రాజ శబ్దముయొక్క అర్థమును పురుష శబ్దమును కలిసిమెలిసి బోధించు ప్రక్రియయే వృత్తి యనిపించుకొనును. వృత్తులన్నిటియందును ఇదియే తీరు నూహించుకొనవలెను

ఇచట వేరొక రీతిని కూడ అవలంబింపవచ్చును. "పరః = వేరైన, అర్థః = అర్థము = పరార్థః". "అభిధీయతే - అనేన = అభిధానమ్" = చెప్పు సాధనము. "పరార్థస్య + అభిధానమ్=పరార్థాభిధానమ్" = వాక్యావస్థలో విడిగా ఉండు పదముల అర్థములను గాక, విశేషణ విశేష్యభావముతో ఏకమైపోయిన వేరొక యర్థమును బోధించుట కుపయోగించు సమాసము మొదలగు సాధనము వృత్తియగునని భావము. ఎటు చెప్పినను సారాంశము సమానమే.

అవతారిక— మీద చూపినట్లు వృత్తియందు కూడ పదములు తమ అర్థమును - ఇంతో అంతో - నిలబెట్టుకొన్నచో, "జహత్స్వార్థత్వము" (అర్థములను విడుచుట) ఎట్లు కుదురును ?— అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉపాయమాత్రం నానాత్వం సమూహస్త్వేక ఏవ సః ।
వికల్పాభ్యుచ్చయాభ్యాం వా భేదసంసర్గకల్పనా ॥ 96

నానాత్వమ్ = అనేకత్వము (భేదము), ఉపాయమాత్రమ్ = కేవలము ఉపాయము, సః = ఆ సమూహః + తు = సముదాయమైతే, ఏకః + ఏవ = ఒక్కటే, వా = లేక, వికల్పాభ్యుచ్చయాభ్యామ్ = వికల్పము, అభ్యుచ్చయము అను వానివలన, భేదసంసర్గకల్పనా = భేదము - సంబంధము అను వాని కల్పనము (భవతి = అగును).

తాత్పర్యము— వాక్యమందువలె వృత్తియందు పదముల విభాగమును చూపుట కేవలము ఉపాయము. వాస్తవముగ వృత్తి యఖండము. సముదాయరూపము. అచట అవయవములు లేవు. అట్లే "పదార్థములకు చెందిన భేదము —లేక— సంబంధముగాని, భేద సంబంధములు రెండును గాని వృత్తియొక్క అర్థమగునని" చెప్పుటయు వాక్యము ననుసరించియే జరుగుచున్నది. వాస్తవమున వృత్తివలన లభించునది అఖండమైన యర్థమే.

వివరణము— వాక్యమే వృత్తిగా మారుననువారు వాక్యముయొక్క ధర్మములను వృత్తికిని అంటగట్టుదురు. వీరి మతమున విడివిడిగ పదములుండుట వృత్తియందు కూడ కుదురును. అయితే వాక్యమందుగల ఆ యా పదముల అర్థములయొక్క ప్రాముఖ్యము మాత్రము విడువబడును. అందుచే వృత్తి జహత్స్వార్థమగును. అట్లే భేదముకాని సంబంధము కాని —లేదా— రెండును కలిసిగాని వాక్యార్థముగ ఫలించునను తీరు కూడ వృత్తియందు కుదురుననియు వీరందురు. ఇదంతయు కల్పనమే. వృత్తిగాని అది సమర్పించు అర్థముగాని ''అఖండమ''నుట పరమార్థము.

విశేష విషయములు— ''రాజ్ఞః పురుషః'' - ఇది వాక్యము. ఇచట రాజ శబ్దము పురుషని వేరు చేయును. అనగా మామూలు పురుషుడు కాడనియు రాజుకు చెందినవాడని యును సూచించును. ఇది భేదము. అట్లుగాక రాజ శబ్దము రాజునకును పురుషునకును గల సంబంధమును మాత్రము తెలియజేయుననుట సంబంధమగును. (రాజు స్వామి. పురుషుడు స్వమ్ము —లేక— సేవకుడు. ఇరువురికిని గల సంబంధము సేవ్యసేవక భావము) ఇట్టి భేదము కాని సంసర్గముకాని వాక్యార్థముగ పర్యవసించునని యొక పక్షము. రెండును కలిసియే వాక్యార్థముగ భాసించుననుట రెండవ పక్షము.

వృత్తిని కల్పించువారు పై రెండు తీరులను వృత్తియందు కూడ చూపుదురు.॥96॥

అవతారిక— వృత్తియందు విభాగములను చూపుట ఉపాయము మాత్రమే. అందుచేతనే ఎవరి యభిరుచిని బట్టి వారు ఉపాయములను కూడ వేర్వేరుగ చూపుచుందురను చున్నాడు.

శ్లో॥ వృత్తిం వర్తయతా మేవమబుధ ప్రతిపత్తయే ।
భిన్నాః సంబోధనోపాయాః పురుషేష్వనవస్థితాః ॥ 97

ఏవమ్ = ఇట్లు, వృత్తిమ్ = వృత్తిని, వర్తయతామ్ = ప్రతిపాదించువారికి, అబుధప్రతిపత్తయే = అజ్ఞానులకు తెలియుటకై, పురుషేషు=వ్యక్తుల విషయములో, సంబోధనోపాయాః = తెలియజేయు ఉపాయములు, భిన్నాః = వేరుగను, అనవస్థితాః = అనియతములుగను, (భవంతి = ఉండును).

తాత్పర్యము— ''వృత్తియఖండమ''ను సత్యమును బోధించుటకై, అసత్యము లగు ఉపాయములను పెక్కింటిని ఆశ్రయింపవచ్చును. అవన్నియు మందబుద్ధుల కుపయోగించునవి. కావుననే ప్రతిపాదించు వారి యిష్టమునుబట్టి అవి వివిధములుగ నుండును. వాని కొక వ్యవస్థయు నుండదు.

వివరణము— వాక్యము ప్రకృతి, వృత్తి వికృతి (మూలము వాక్యము దాని వికారము వృత్తి), అనుటయు, వృత్తి జహత్స్వార్థము —లేక— అజహత్స్వార్థమనుటయును ఉపాయములే. వాస్తవముగ వాక్యమునకును వృత్తికిని ఎట్టి సంబంధమును లేదు. ॥97॥

అవతారిక— ఇట్లు వృత్తికిని వాక్యమునకును పూర్తిగా భేదమును చూపి, వృత్తి యందు సంఖ్యా విశేషము కూడ భాసింపదని ప్రకృతము విశదీకరించుచున్నాడు.

శ్లో॥ వాచికా ద్యోతికా వాఽపి సంఖ్యానాం యా విభక్తయః ।
తద్రూపేఽవయవే వృత్తౌ సంఖ్యాభేదో నివర్తతే ॥ 98

విభక్తయః = విభక్తులు, యాః = ఏవి కలవో, (తాః = అవి), సంఖ్యానామ్ = సంఖ్యలను, వాచికాః = చెప్పునవియు, వా = లేక, ద్యోతికాః + అపి = స్పష్టము చేయునవియు కూడ (భవంతి = అగును), వృత్తౌ = వృత్తియందు, తద్రూపే = వాక్యముయొక్క అవయవముతో సమానముగా కనబడు, అవయవే = అవయవమందు, సంఖ్యాభేదః=సంఖ్యయొక్క భేదము నివర్తతే = పోవును.

తాత్పర్యము— శబ్దములకు చేరు విభక్తి ప్రత్యయములు ఒకటి, రెండు మొదలగు సంఖ్యా విశేషమును తెలియజేయును. వాక్యమందలి పదముల యర్థములు వేనికవి ప్రధాన ముగ నుండును కావున అచట విభక్తులు తప్పక ఉండును కాని వృత్తియందలి పూర్వపదము వాక్యమందలి పదముతో సమానముగ కనిపించినను, ఉపసర్జనమై తన యర్థమును ప్రధాన మైన యర్థముతో కలిపివేసికొనును. అందుచే తన యర్థము వేరుగ లేనందున దానికి సంబం ధించు సంఖ్య కూడ అచట నిలువదు.

వివరణము— "రాజ్ఞః పురుషః" (ఏకవచనము = ఒక రాజుయొక్క అని యర్థము), "రాజ్ఞోః పురుషః" (ద్వివచనము), "రాజ్ఞామ్ పురుషః" (బహువచనము) అను రీతిని వాక్యమందు సంఖ్యా విశేషమును స్పష్టముగ చెప్పవచ్చును. "రాజు" అను నర్థము వేరుగ నుండుటచే దానికి చెందు సంఖ్యను చెప్పుటకై ఆయా విభక్తులను వాడక తప్పదు. వృత్తి విషయమట్లు కాదు. "రాజపురుషః" అనుచోట రాజ శబ్దమునకు స్వాతంత్ర్యము లేదు. దాని యర్థము పురుషుడను ముఖ్యమైన యర్థముతో వేరుచేయ వీలులేకుండ కలిసిపోయినది అందుచే దానియొక్క సంఖ్య వేరుగ లేదు కాన దానిని చెప్పు విభక్తి ప్రత్యయము రానేరాదు.

విశేష విషయములు— (1) జాతి, వ్యక్తి, లింగము, సంఖ్య, కారకము, అను అయిదును ప్రాతిపదికము యొక్క (శబ్దము) అర్థములేయని ఒక మతము. ఇందు సంఖ్య కూడ శబ్దమువలననే తెలియునుగాన విభక్తులు కేవలము ద్యోతకములు (అనగా ఉన్నదానిని ప్రకటించునవి) అనబడును. జాతి, వ్యక్తి, లింగము, అను మూడే ప్రాతిపదికార్థములని వేరొక మతము. ఈ మతమున సంఖ్యను విభక్తులే చెప్పును గాన అవి వాచకములగును.

(2) వృత్తియందు ఉపసర్జనమైన యర్థమునకు కావలసిన సంఖ్యను భావించు కొనుటయేగాని స్పష్టముగ ఎట్టి సంఖ్యయు నుండదు. కాగా "రాజపురుషః" మొదలగుచోట్ల సందర్భమునుబట్టియే "ఒక రాజుయొక్క" "ఇరువురు రాజులయొక్క" —లేక— "పెక్కు రాజులయొక్క" మొదలగు రీతిని సంఖ్యను భావించుకొనవలయును. అయితే వృత్తియందు

విగ్రహ వాక్యమును చూపుటయు, అచటి ప్రత్యయములకు లోపమును చెప్పుటయును శాస్త్రీయ మైన కార్యములు కొన్ని సిద్ధించుటకు మాత్రమే అని గ్రహింపవలెను. ॥98॥

అవతారిక— పై విషయముననే వేరొక మతమును చూపుచున్నాడు

శ్లో॥ అభేదైకత్వసంఖ్యా వా తత్రాన్యైవోపజాయతే ।
సంసర్గరూపం సంఖ్యానామవిభక్తం తదుచ్యతే ॥ 99

తత్ర = అచట (వృత్తియందు), అన్యా = వేరొక, అభేదైకత్వసంఖ్యా + వా = "అభేదైక త్వము" అను సంఖ్య అయినను, ఉపజాయతే = పుట్టును, తత్ = అది, సంఖ్యానామ్ = సంఖ్యలయొక్క, అవిభక్తమ్ = విభాగములు లేనిదిగను, సంసర్గరూపమ్ = సంబంధము స్వరూపముగా గలదిగను, ఉచ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— వృత్తియందు ఉపసర్జనమైన అర్థము విషయమున "అభేదైక త్వము" అను ఒక విచిత్రమైన సంఖ్య ఉండునని చెప్పవచ్చును. అది కావలసిన అన్ని సంఖ్యలను తనలో ఇమిడ్చికొనును. తాను మాత్ర మెల్లపుడును ఒకటిగనే భాసించును.

వివరణము— ఉపసర్జనమైనది కూడ ఏదో యొక వస్తువు కాక తప్పదు. అయి నపుడు అచట సంఖ్యయే లేదనుట సముచితము కాదు. అందువలన "అభేదైకత్వ సంఖ్య" నంగీకరింపవలయును. భేదములున్నను అవన్నియు సమసిపోయి ఒకటిగా అనుభవమునకు వచ్చు సంఖ్యయే అభేదైకత్వమగును. అది పైకి ఒకటిగా కనిపించినను అవశ్యకమైన సంఖ్య (ఏదియైనను) స్ఫురించుచునే యుండును. ఈ తీరు కూడ వృత్తికిగల వైచిత్ర్యములలో ఒకటి యనవచ్చును ఉదా : "రాజపురుషః". ఇచట "రాజ్ఞః పురుషః" అని రాజ శబ్దముయొక్క అర్థమున ఏకత్వమునే చూపుదుము. అందులోనే ఏకత్వము, బహుత్వము కూడ ఇమిడి యుండును.

విశేష విషయములు— "న + భేదాః - యస్మిన్ - తత్ = అభేదమ్" = భేద ములు లేనిది. "అభేదమ్ + చ + తత్ + ఏకత్వమ్ + చ" = అభేదైకత్వమ్ = భేదము లుండియు కనబడకుండ ఒకటిగా మారిన స్థితి ఇందు సంఖ్యలన్నియును కూడి యుండును గాన ఇది "సంసర్గరూపము" అగును. విభాగములు తెలియవుగాన "అవిభక్తము" కూడ అగును. ॥99॥

అవతారిక— అభేదైకత్వసంఖ్యను విశదీకరించుటకు ఒక దృష్టాంతమును చూపు చున్నాడు.

శ్లో॥ యథౌషధిరసాః సర్వే మధున్యాహితశక్తయః ।
అవిభాగేన వర్తంతే తాం సంఖ్యాం తాదృశీం విదుః ॥ 100

ఓషధిరసాః = ఓషధులయొక్క రసములు, సర్వే = అన్నియు, ఆహితశక్తయః = ఉంచ

బడిన శక్తులు గలవై, అవిభాగేన = విభాగము లేకుండ, మధుని = తేనెయందు, యథా = ఎట్లు, వర్తంతే = ఉండునో, తాదృశీమ్ = అట్టిదానినిగ, తామ్=ఆ, సంఖ్యామ్ = సంఖ్యను, విదుః = తెలియుదురు.

తాత్పర్యము— తేనె ఉన్నది. అది ఎన్నో పుష్పముల మకరందములు కలిసి ఒకటిగా మారిన ద్రవము. అది ఒకటియే అయినను ఆ యా మకరందములుగాని వాని రుచి గాని అచట బొత్తిగా లేదని చెప్పజాలము. అభేదైకత్వమను సంఖ్యయు ఇట్టిదే ఇందు ఏకత్వమే పైకి అనుభూతమగును. కాని అన్ని సంఖ్యలును అవిభక్తముగ ఇమిడియుండును.

వివరణము— అభేదైకత్వమనునది వాస్తవముగ ప్రత్యేకమైన సంఖ్య కానేరదు. అయినను కావలసిన సంఖ్యను దీనినుండియే విడదీసి తీసికొందురుగాన దీనినిగూడ "సంఖ్య" అను పదముతో వాడుదురు. కాగా ఇది సంఖ్యా సామాన్యమును సంఖ్యా విశేషమును కూడ అగును ॥100॥

అవతారిక— పై విషయముననే వేరొక తీరును చెప్పుచున్నాడు.

శ్లో॥ భేదానాం వా పరిత్యాగాత్ సంఖ్యాత్మా స తథావిధః ।
వ్యాపారాజ్జాతిభాగస్య భేదాపోహేన వర్తతే ॥ 101

వా = లేక, భేదానామ్ = భేదముల యొక్క, పరిత్యాగాత్ = విడుచుటవలన, సః = ఆ, సంఖ్యా సామాన్యము, తథావిధః = అటువంటిది (అభేదైకత్వమని చెప్పదగినది), (భవతి = అగును), జాతి భాగస్య = జాతియను అంశముయొక్క, వ్యాపారాత్ = పనివలన, భేదాపోహేన = భేదములను పోగొట్టుచు, వర్తతే = ఉండును

తాత్పర్యము— సంఖ్యా విశేషములను విడిచిపెట్టిన జాతి రూపమైన సంఖ్యయే "అభేదైకత్వ సంఖ్య" అని యైనను చెప్పవచ్చును. కావుననే అది ఏకత్వము. ద్విత్వము మొదలగు అన్ని భేదములను అడ్డివేయును.

వివరణము— "ఒకటి" అనునది మిగిలిన సంఖ్యల నన్నింటిని అడ్డు పెట్టును. అట్లే ఏ సంఖ్యను తీసికొన్నను అది మిగిలిన సంఖ్యల నన్నింటిని పోగొట్టును. ఈ తీరున విశేషములను అడ్డు పెట్టుటను "భేదాపోహ" మందురు ఇట్టి భేదాపోహముచే ఎల్ల సంఖ్యా విశేషములను పోగొట్టు సంఖ్యను "అభేదైకత్వ సంఖ్య" అనవచ్చును అనగా "గోత్వము" మొదలగు వాని వలెనే ఇదియు నొక సంఖ్యా జాతియని సారాంశము.

విశేష విషయములు— "అభేదైకత్వము" అను సంఖ్యయందు "సకల భేదములును కలిసిపోయి ఉండుటయు, విభాగములు తెలియకుండుటయును" అను తీరును మీది కారిక చూపినది. "భేదాపోహము" అను విధమున సకల భేదములకును వర్తించు సామాన్య ధర్మమును ఈ కారిక వివరించినది. సకల వ్యక్తులందును ఒకే విధముగ కనబడు- ధర్మమునే

సామాన్యమనియు జాతియనియును అందురు. ఆవశ్యకమైన సంఖ్య స్ఫురించుట ఈ పక్ష మందు కూడ సమానమే. ॥101॥

అవతారిక— గోత్వము మొదలగు జాతి ఒక్కటే అందు విశేషము లెన్నడును స్ఫురింపవు. అట్లే అభేదైకత్వము కూడ జాతి యన్నపుడు అచట విశేష సంఖ్యలు స్ఫురింప కూడదు. కాని ఆవశ్యకమైన విశేషసంఖ్య స్ఫురించునని చెప్పుచున్నారుగదా ః ఇదెట్లు కుదు రును ?— అను శంకకు రెండు కారికలతో సమాధానము చెప్పుచున్నాడు

శ్లో॥ అగృహీతవిశేషేణ యథారూపేణ రూపవాన్ ।
ప్రఖ్యాయతే న శుక్లాదిభేదరూపస్తు గృహ్యతే ॥ 102

శ్లో॥ భేదరూపసమావేశే తథా సత్యవివక్షితే ।
భాగః ప్రకాశితః కశ్చిచ్ఛాస్త్రేఽఙ్గత్వేన గృహ్యతే ॥ 103

అగృహీతవిశేషేణ = విశేషములు తెలియని, రూపేణ = రూపముచే, రూపవాన్ = రూపము గల వస్తువు, ప్రఖ్యాయతే = తెలియబడును, శుక్లాదిభేదరూపః + తు = తెలుపు మొదలగు భేదములు గలదిగ, యథా = ఎట్లు, న + గృహ్యతే = తెలియబడదో, తథా = అట్లు, భేద రూప సమావేశే = భేదముల కలయిక. అవివక్షితే + సతి = చెప్పుటకు సంకల్పింపబడనిది కాగా (వివరించుటకు ఇష్టపడనిది), ప్రకాశితః = స్ఫురించిన, కశ్చిత్ = ఒక, భాగః = విశేషము —లేక— భేదము, శాస్త్రే = వ్యాకరణమున, అంగత్వేన = నిమిత్తముగా, గృహ్యతే = తీసికొనబడును.

తాత్పర్యము— దూరమునుండి ఒక వస్తువును చూచునపుడు "అదొక ఆకారము" అన్నట్లు రూపసామాన్యమే తెలియును కాని తెలుపు, నలుపు మొదలగు విశేషములున్నను ఆ క్షణమున తెలియవు అట్లే అభేదైకత్వమందును తొలుత సంఖ్యా సామాన్యమే ఉద్దేశింప బడును సందర్భమును బట్టి ఉపసర్జనమైన అర్థమందు ఆవశ్యకమైన సంఖ్యా విశేషము ఆవిర్భవించును వృత్తిని వివరించునపుడు మాత్రము కొన్నిచోట్ల ఆ విశేషసంఖ్యను శాస్త్రము స్వీకరించును

వివరణము— "తావకీనః" అనునది తద్ధితరూపము. "తవఅయమ్" (నీకు సంబంధించినవాడు) అను నర్థమున యుష్మచ్ఛబ్దమునకు ఖఞ్ ప్రత్యయము చేరును. ఇచట "తవకమమకావేకవచనే" (4-3-3) అను సూత్రముచే "యుష్మద్" అను దానికి "తవక" అను ఆదేశము, ఏకత్వమును చెప్పునపుడే ప్రవర్తించును ఇది వృత్తి కావున అభేదైకత్వమను సామాన్య సంఖ్యయే ఉండుననృచో, సూత్రమున "ఏకవచనే" అను నిర్దేశ మెట్లు కుదురు నన్నది శంకకు బీజము. ఇట్టి సందర్భములలో వృత్తియందు కూడ కావలసిన సంఖ్య స్ఫురించుననియు, శబ్దముయొక్క సాధుత్వమును విశదపరచుటకు వ్యాకరణ మా సంఖ్యను స్వీకరించుననియును సమాధానము. ఇట్లే వృత్తులలో సంఖ్యా విశేషమును నిర్దేశించిన ఇతర స్థలములందును వ్యాఖ్యానించుకొనవలెను

విశేష విషయములు— "ఖఞ్, అణ్, అను ప్రత్యయములు పరమైనపుడు, ఏకత్వమును చెప్పు యుష్మద్, అస్మద్, అను శబ్దములకు యథాక్రమముగ తవక, మమక అను ఆదేశములగు"నని పై సూత్రముయొక్క అర్థము. తావకీనః (ఖఞ్ = ఈన), తావకః (అణ్), మామకీనః, మామకః అనునవి యుదాహరణములు. ॥103॥

అవతారిక— "అభేదైకత్వమన్నది అన్ని సంఖ్యలను చెప్పగల సంఖ్యా సామాన్యమని ఎంతగా చెప్పినను, వృత్తియం దుపసర్జనమువలన ఏదోయొక సంఖ్యావిశేషమే తెలియుచుండును. అట్లయిన కావలసిన సంఖ్యావిశేషమే అభేదైకత్వమని అనరాదా?"— అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ సంఖ్యాసామాన్యరూపేణ తదా సోంశః ప్రతీయతే ।
అర్థస్యానేకశక్తిత్వే శబ్దైర్నియతశక్తిభిః ॥ 104

అర్థస్య = అర్థము, అనేక శక్తిత్వే = వివిధమైన శక్తులుగలదైనను, నియతశక్తిభిః=నియతమైన సామర్థ్యముగల, శబ్దైః = శబ్దములచే, తదా = అప్పుడు, సః + అంశః = ఆ విశేషమైన సంఖ్య. సంఖ్యా సామాన్యరూపేణ = సంఖ్యా సామాన్యముగ, ప్రతీయతే = తెలియబడును

తాత్పర్యము— అర్థములు వివిధములుగ నుండవచ్చును వాక్యమందలి శబ్దములు వానిని పూర్తిగా చెప్పవచ్చును కాని వృత్తియందలి శబ్దముల కట్టి శక్తి యుండదు. ఆ శక్తి నియతము. అదియే వృత్తియొక్క వైచిత్ర్యము. అందుచే వృత్తియందలి ఉపసర్జనమైన శబ్దము సంఖ్యా విశేషమును కూడ సంఖ్యా సామాన్యముగనే తెలియజేయును. "విశేషము స్ఫురించుచున్నను అది సామాన్యరూపముగనే స్ఫురించుట అభేదైకత్వము యొక్క విలాసమే" అని ఫలితము. ॥104॥

అవతారిక— అభేదైకత్వమందు సంఖ్యకు పూర్తిగా అభేదమన్నచో, సంఖ్యా విశేషము తెలియగూడదు. అటుగాక భేదమన్నచో అభేదమనుట ఎట్లు పొసగును?— అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ అవ్యయానాం చ యో ధర్మః యశ్చ భేదవతాం క్రమః ।
అభిన్నవ్యపదేశార్హమంతరాలం తదేతయోః ॥ 105

అవ్యయానామ్ + చ = అవ్యయములకు, ధర్మః = స్వభావము, యః = ఏదిగలదో, భేదవతామ్ + చ = విభక్తులుగల శబ్దములకును, క్రమః = తీరు, యః = ఏదిగలదో, ఏతయోః = ఈ రెండింటికిని, అంతరాలమ్ = మధ్యనున్నటువంటి, తత్ = అది (అభేదైకత్వము), అభిన్నవ్యపదేశార్హమ్ = అభిన్నమను వ్యవహారమునకు తగినది, (భవతి = అగును).

తాత్పర్యము— అవ్యయములవలన ఎట్టి సంఖ్యయు తెలియదు. అది వాని స్వభా

వము. విభక్తులుగల శబ్దములవలన సంఖ్యావిశేషములు తెలియును. అది వాని ధర్మము. ఈ రెండు ధర్మములను మించిన విచిత్రమైన ధర్మమొకటి యున్నది అదియే అభేదైకత్వము. అది వృత్తియందలి ఉపసర్జనములైన శబ్దములవలన అవగతమగుచుండును.

వివరణము— యదా (ఎప్పుడు) తదా (అప్పుడు), మొదలగునవి అవ్యయములు ఇవి ఎట్టి సంఖ్యను బోధింపవు. రామః, కృష్ణః, మొదలైనవి శబ్దములు. ఇవి సంఖ్యావిశేషమును బోధించును. సంఖ్యకు సంబంధించిన భేదమును అభేదమును కూడ కలిసియుండుట అభేదైకత్వమందలి ఒక వైశిష్ట్యము. ఇదియే వాక్యముకన్న వృత్తివేరని స్పష్టముగ తెలియజేయును. ॥105॥

అవతారిక— ఈ యంశమున వార్తికకారుని సమ్మతిని చూపుచున్నాడు.

శ్లో॥ అలుకశ్చైకవద్భావస్తస్మిన్ సతి న శిష్యతే ।
స చ గోషుచరాదీనాం ధర్మోఽస్తి వచనాంతరే ॥ 106

తస్మిన్ = ఆ అభేదైకత్వము, సతి = ఉండగా, అలుకః + చ = అలుక్కునకును ఏకవద్భావః = ఏకవద్భావము, న + శిష్యతే = విధింపబడదు, వచనాంతరే = ఏకవచనముకాని వేరొక వచనమందు, గోషుచరాదీనామ్ = ''గోషుచర'' మొదలగుచోట్ల, సః = ఆ, ధర్మః + చ = అభేదైకత్వమను ధర్మము, అస్తి = ఉన్నది

తాత్పర్యము— ''స్తోకాన్ముక్తః'' (స్తోకాత్ = కొంచెమువలన, ముక్తః = విడువబడినవాడు). ఇది పంచమీ తత్పురుషము. ఇచట పంచమీవిభక్తి ప్రత్యయమునకు ''అలుక్కు'' (లోపము లేకుండుట) విధింపబడినది. ఈ సందర్భమున అభేదైకత్వ సంఖ్యను మనసులో ఉంచుకొనియే ''ఏకవద్భావము'' అక్కరలేదని వార్తికకారుడు చెప్పెను అట్లే ''గోషుచరః'' (ఆవు శరీరము మీద ప్రాకు ఒక విధమైన పురుగు) ''అప్సుజః'' (నీటిలో పుట్టునది) మొదలగు సమాసములలో కూడ సప్తమికి అలుక్కు వచ్చును. అచట బహువచనమున్నను బహుత్వము తెలియదు. ఏకత్వమే తెలియును. అది అభేదైకత్వమను ధర్మమే.

వివరణము— సమాసము జరుగగానే దాని యవయవములైన సుప్ ప్రత్యయములు లోపించుట సహజము. అయినను కొన్నిచోట్ల అట్లు లోపము జరుగదు. దానినే ''అలుక్కు'' అందురు. (లుక్ = లోపము, న + లుక్ = అలుక్). ''స్తోకాభ్యామ్ ముక్తః'' ''స్తోకైః ముక్తః'' అను రీతిని ద్విత్వమునుగాని బహుత్వమునుగాని వేరుగ చెప్పనక్కరలేదనియు, ''స్తోకాన్ముక్తః'' అనగానే అభేదైకత్వ సంఖ్య ఏర్పడునుగాన దానివలననే అభిమతము సిద్ధించుననియును వార్తికకారుడు భావించెను అందువలననే ఇట్టిచోట్ల ద్వివచన బహువచనములతో విగ్రహమును చూపినపుడును ''ఏకవచనమే మిగులు''నని ప్రత్యేకముగ చెప్పనక్కరలేదని నొక్కి చెప్పెను. (ఏకవద్భావమును ఖండించుట అనగా ఇదియే) అట్లే ''గోషుచరః'' మొదలగుచోట్ల బహువచనమున్నను ఏకత్వమే సహజముగ భాసించును. అదియు అభేదైకత్వమే. అచటి బహువచనము జాతిని సూచించును.

విశేష విషయములు— (1) "సుపోధాతు ప్రాతిపదికయోః" (2-4-71) అను నది సుప్పులకు లుక్కును విధించు సూత్రము. "ధాతువునకును ప్రాతిపదికమునకును అవయవములుగా ఉండు సుప్ ప్రత్యయములు లోపించును" అని యర్థము సమాసము కాగానే అది మరల ప్రాతిపదికమగును

(2) "పంచమ్యాః స్తోకాదిభ్యః" (6-3-2) అనునది పంచమికి అలుక్కును విధించు సూత్రము. "ఉత్తరపదము పరమైనపుడు "స్తోక" మొదలగు శబ్దముల పంచమికి అలుక్కు అగును" అని యర్థము. అలుక్కుతో పాటుగ ఏకవద్భావమును కూడ చెప్పవలసి యుండునని ముందుగ శంకించి, "అక్కరలేదని" యీ సందర్భమందే వార్తికకారుడు ఖండించెను

(3) "జాత్యాఖ్యాయామేకస్మిన్ బహువచన మన్యతరస్యామ్" (1-2-58) అనునది జాతిని సూచించు బహువచనమును విధించు సూత్రము. ఒక వ్యక్తినిగాక అచటి జాతిని తెలుపదలచినపుడు, బహువచనమును వికల్పముగ వాడుకొనవచ్చునని దీని భావము. ఉదా : "గావః పూజ్యాః" (గోవు సేవింపదగినది). ఇచటి బహువచనము గోత్వమను జాతిని మొత్తముగా తెలియజేయును. వ్యక్తుల బహుత్వమున కిచట ప్రసక్తి లేదు. (గౌః పూజ్యా" అను ఏకవచనము కూడ సాధువే) కాగా "గోషుచరః" మొదలగు సప్తమికి అలుక్కు ప్రవర్తించిన స్థలములలోని బహువచనము జాతివాచకనుగుటవలన అచట ఏకత్వమే స్ఫురించుచుండునని ఫలితము.

(4) ఉపసర్జనమైన పదము ఏకవచనాంతముగ నున్నను, అభిమతమైన ద్విత్వ బహుత్వములు స్ఫురింపవచ్చుననుటకు "స్తోకాన్ముక్తః" అనునదియు, బహువచనాంతముగ ఉన్నచోట గూడ ఏకత్వమే స్ఫురించుననుటకు "గోషుచరః" అనునదియు స్వీకరింపబడినవి. ఇట్టి తీరులన్నియును అభేదైకత్వము యొక్క విలాసములే యనుట పరమోద్దేశ్యము. ॥106॥

అవతారిక— ద్వివచనము మాత్రము వృత్తియందు ఎన్నడును సిద్ధింపదను ఒకి పక్షమును చూపుచున్నాడు.

**శ్లో॥ జాతౌ ద్వివచనాభావాత్తద్వృత్తిషు న విద్యతే ।
ప్రత్యాఖ్యానే తు యోగస్య ద్రవ్యే గోషుచరాదయః ॥** 107

జాతౌ = జాతియందు, ద్వివచనాభావాత్ = ద్వివచనము లేనందువలన, వృత్తిషు = వృత్తులందు, తత్ = ఆ ద్వివచనము, న + విద్యతే = ఉండదు, యోగస్య = సూత్రముయొక్క, ప్రత్యాఖ్యానే + తు = ఖండనమందైతే, గోషుచరాదయః = గోషుచర మొదలగునవి, ద్రవ్యే = వ్యక్తులందే, (భవంతి = అగును)

తాత్పర్యము— జాతివాచకముగ ద్వివచనము విధింపబడలేదు. బహువచనము విధింపబడినది. కాగా వృత్తులందు ఏకవచనమునకును బహువచనమునకును మాత్రమే సంభవమున్నదిగాని ద్వివచనమునకు లేదు. ఇది అభేదైకత్వము యొక్క ఫలమని భావింపవచ్చును.

జాతియందు బహువచనమును విధించు సూత్ర మావశ్యకము కాదని కొట్టివేయ బడినది. ఆ పక్షమున ''గోషుచరః'' మొదలగుచోట్ల బహువచనము సహజమైనదేయనియు, అది వ్యక్తుల బహుత్వము (ఆవులు) నే చెప్పుననియును అనవలయును

వివరణము— జాతిని చెప్పదలచినపుడు అది ఒకటియేగాన ఏకవచనమును, జాతిగల వ్యక్తులను (పెక్కులు) చెప్పదలచినపుడు బహువచనమును సహజముగనే సిద్ధించును గాన ''జాత్యాఖ్యాయామేకస్మిన్ బహువచనమన్యతరస్యామ్'' (1-2-58) అను సూత్రము ప్రత్యాఖ్యాతమైనది. అపుడు ''గోషుచరః'' అనుచోట బహువచనము ''పెక్కు గోవులు'' అను నర్థమునే చెప్పవచ్చును. ఏకత్వభావనయు అచట కలుగవచ్చును. అట్లే ''అప్సుజః'' (నీటియందు పుట్టునది) అనుచోట బహువచనము నీటి అణువుల బహుత్వమును సూచించును

అభేదైకత్వమందును ఏకత్వ బహుత్వముల స్ఫూర్తికే అవకాశమున్నదిగాని, ద్విత్వస్ఫూర్తి కవకాశము లేదన్నది యిచటి విశేషము. అనుభవమును ఊతగాగొని ఈ పక్షము బయలుదేరినట్లనిపించును. ॥107॥

అవతారిక— మీది పక్షము సముచితముకాదని రెండు కారికలతో చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆశ్రయాద్భేదవత్త్వాయాః సర్వభేద సమన్వయః ।
ద్రవ్యాభిధానపక్షేఽపి జాత్యాఖ్యాయాం న విద్యతే ॥ 108

శ్లో॥ సర్వద్రవ్యగతిశ్చైవమేకశేషశ్చ నోచ్యతే ।
ప్రత్యాఖ్యాతేఽన్యథా సూత్రే భిన్నద్రవ్యగతిర్భవేత్ ॥ 109

భేదవత్త్వాయాః = భేదములు కలుగుటను, ఆశ్రయాత్ = స్వీకరించుటవలన, సర్వభేద సమన్వయః = సకల భేదములయొక్కయు సంబంధము, స్యాత్ = కలిగెడిని) జాత్యాఖ్యాయామ్ = జాతిని బోధించు బహువచనమున, ద్రవ్యాభిధాన పక్షః + అపి = వ్యక్తులను బోధించుట అను పక్షము, న + విద్యతే = లేదు.

ఏవమ్ = ఇట్లు, (జాతి బహువచనమున్నపుడు), సర్వద్రవ్యగతిః + చ = అన్ని వ్యక్తులయొక్క జ్ఞానమును, (భవతి = కలుగును), ఏకశేషః + చ = ఏకశేషము కూడ, న + ఉచ్యతే = చెప్పబడదు, అన్యథా = అట్లుగాక, సూత్రే = ''జాత్యాఖ్యాయామ్'' మొదలగు సూత్రము, ప్రత్యాఖ్యాతే = తిరస్కరింపబడినచో, భిన్నద్రవ్యగతిః = వేర్వేరు వ్యక్తుల జ్ఞానము, భవేత్ = కలిగెడిని.

తాత్పర్యము— ''గోషుచరః'' మొదలగుచోట్ల బహువచనము జాతి బహువచనమనియే చెప్పవలయును. జాతి ఒకటే అయినను అభేదైకత్వము యొక్క బలమువలన ఆవశ్యకమైన అన్ని వ్యక్తులును బోధపడును. అట్లుగాక ''వ్యక్తుల భేదమును బహుత్వమును చెప్పు బహువచనమే అది'' అన్నచో అదే తీరులో ఏకత్వమును ద్విత్వమును కూడ బోధించుట

కవకాశమేర్పడును గాన, వృత్తియందు సంఖ్యా విశేషములనన్నింటిని పూర్తిగా అంగీకరించి నట్లే యగును. అపుడు ''అభేదైకత్వము'' అను భావనయే వ్యర్థమైపోవును. మరియు జాతి బహువచనము నంగీకరించినపుడే ఏకశేషమును తిరస్కరించుటయు కుదురును లేనిచో ఏక శేషమును స్వీకరించుటయు, వ్యక్తుల భేదము స్పష్టముగా ఉండుటయును తప్పనిసరి కావలసి వచ్చును. కాగా ''జాత్యాఖ్యాయామేకస్మిన్ బహువచన మన్యతరస్యామ్'' (1-2-58) అను జాతి బహువచనమును విధించు సూత్రమును ప్రత్యాఖ్యానము చేయకుండ, గోషుచర, మొద లగు చోట్ల బహువచనము జాతివాచకమనుటయే సమంజసము.

వివరణము— గోషుచర, మొదలగు వృత్తులలోని బహువచనము జాతి బహువచన మనుటయే గ్రంథకర్త కభిమతము. అపుడే అభేదైకత్వము సరసముగ నప్పును. అపుడే ''ఒక గోవు - రెండు గోవులు'' మొదలగు సంఖ్యావిశేషము స్ఫురింపకుండ, ''గోసామాన్య మున గోచరించు పురుగు'' అను ప్రసిద్ధమైన యర్థము తెలియును. అందువలననే వ్యక్తి భేదము నాశ్రయించినచో బహువచనము సహజమేయని భావించి ''జాత్యాఖ్యాయామ్'' మొద లగు సూత్రమును ప్రత్యాఖ్యానము చేయరాదు.

మరొక విశేషము— ఈ సూత్రమును స్వీకరించినచో ఏకశేషము (ఒకే శబ్దము మిగులుట) అక్కరలేదు. అనగా ఈ బహువచనమువలననే కావలసినన్ని వ్యక్తుల జ్ఞానము కూడ కలుగునుగాన వేరుగ ఏకశేషమను ప్రక్రియ ఆవశ్యకము కాదు

విశేష విషయములు— (1) గోశబ్దమున్నది. ప్రతియొక గోవును చెప్పుటకు ఒక్కొక్క గోశబ్దమును పలుకుట న్యాయ్యముగాన, ఎన్ని గోవులున్నవో అన్ని గోశబ్దము లను పలుకవలసి వచ్చును. అది చాల కష్టము. (నూరు గోవులను చెప్పుటకై నూరు గోశబ్దము లను పలుకుట వ్యవహారమున అసాధ్యము). ఈ చిక్కును తొలగించుటకు ''సరూపాణామేక శేష ఏకవిభక్తౌ'' (1-2-64) అను సూత్రముచే ఏకశేషమను ప్రక్రియ చూపబడినది. ''ఒక విభక్తి ప్రత్యయము పరమగునపుడు సమానాకారములైన శబ్దములు ఎన్ని యున్నను వానిలో ఒకటే మిగులును'' అని ఈ సూత్రముయొక్క భావము. దీనివలన గోవులు రెండయినను పెక్కులయినను, ''గావౌ, గావః'' అని ఒక గోశబ్దమే మిగులును. అదియు విభక్తియు కలిసి కావలసిన సంఖ్యను అందించును.

(2) ''జాత్యాఖ్యాయామ్'' మొదలగు సూత్రమును స్వీకరించి, జాతి బహువచ నము వలననే అభీష్టము సిద్ధించునుగాన ఏకశేష మక్కరలేదని త్రోసిపుచ్చుట జరిగినది.

(3) జాతి బహువచనమును కాదన్నచో, ఏకశేషమును స్వీకరించుటయు వ్యక్తుల భేదము తెలియుటయు తప్పనిసరియగును అపుడు ''వృత్తియందు అభేదైకత్వము'' అను అందరును అంగీకరించు సిద్ధాంతము పాడగును. కావున జాతి బహువచనమునే ఒప్పుకొని ఏకశేషమును త్రోసిపుచ్చుటయే మంచిది.

(4) గోషుచరః, అనుచోట జాతి బహువచనము కాదని, వ్యక్తులను చెప్పు బహు

వచన మన్నచో, బహుత్వమన్నది మూడునుండి ప్రారంభమగుచుగాన ''పెక్కు గోవులందు సంచరించునది'' అను నర్థము మాత్రమే లభించును. అది ఇష్టము కాదు ఒక గోవునందు రెండు గోవులందు సంచరించినను ''గోషుచరః'' అని వ్యవహరించుటయే అభీష్టము ''గోసామాన్యమున సంచరించు ఒకానొక పురుగు'' అని ఆ పదమునకు రూఢమైన యర్థము అచట వ్యక్తుల ప్రసక్తి లేనేలేదు ఈ యంశమును సాధింపవలెనన్నచో, అది జాతి బహువచనమనియు, అభేదైకత్వమచట పనిచేయుననియును అనక తప్పదు. అభేదైకత్వము యొక్క సామాన్యపరిశీలన మింతతో ముగిసినది

(6) వృత్తియందలి అభేదైకత్వ సంఖ్యయొక్క పరిశీలనము

అవతారిక— అభేదైకత్వ సంఖ్య అన్ని సంఖ్యావిశేషములను తనలో ఇమిడ్చికొనును అందుచే అది వృత్తియందు సంఖ్యాభేదమును (విశేషమును) బోధింపగలదు - అను విషయమును స్థిరపరచుటకు చర్చను ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ వృత్తౌ యోయుక్తవద్భావో వరణాదిషు శిష్యతే ।
అభేదైకత్వసంఖ్యాయాం గోదౌ తత్ర న సిధ్యతి ॥ 110

వరణాదిషు = ''వరణాః'' మొదలగుచోట్ల వృత్తౌ = వృత్తియందు, యః = ఏ, యుక్తవద్భావః = ప్రకృతివద్భావము, శిష్యతే = చెప్పబడునో, తత్ర = అచట, అభేదైకత్వ సంఖ్యాయామ్ = అభేదైకత్వ సంఖ్యయందు, గోదౌ =''గోదౌ'' అను ప్రయోగము, న + సిధ్యతి= సిద్ధింపదు

తాత్పర్యము— ''వరణాః'' మొదలగు కొన్ని తద్ధిత వృత్తులందు ప్రత్యయము లోపించును. అయినను ప్రకృతియొక్క లింగమును సంఖ్యయును అచట అనువర్తించునని (అట్లే యుండుట) చెప్పబడినది ఈ తీరును ''యుక్తవద్భావము'' అందురు వృత్తియందు అభేదైకత్వమువలన ఏకత్వమే భాసించునన్నచో, యుక్తవద్భావము ననుసరించి ''గోదౌ'' (గ్రామః) అనుచోట అభిమతమైన ద్విత్వము (రెండు సంఖ్య) సిద్ధింపకపోయెడిని

వివరణము— (1) అభేదైకత్వ సంఖ్యయనగా ''అభిన్నమైన ఏకత్వము'' (భేదములులేని ఒకటియను సంఖ్య) అను ఆశయముతో బయలుదేరిన శంక, ఇది కావలసిన సంఖ్యావిశేషములు కూడ అచట బోధపడునని ఇదివరకే చెప్పబడెను. ఆ సిద్ధాంతమును ఇటుపైని దృఢపరచుటకే ఈ చర్చ ప్రారంభమైనది

(2) ''దానికిది నివాసము'' ''దానికిది అదూరభవము'' (దగ్గరగా ఉన్నది) అను నర్థములలో షష్ఠ్యంతమగు ప్రాతిపదికమునకు ''అణ్'' ప్రత్యయమగును. (తస్య నివాసః (4-2-69), అదూరభవశ్చ (4-2-70) ఉదా ''వరణామ్ - అదూరభవః = గ్రామః, వరణా + ఆమ్ + అ'' అని అలౌకిక విగ్రహము. అణ్ ప్రత్యయమునకు లోపము. యుక్తవద్భావము వరణ నదికి దగ్గరగానున్న గ్రామమని యర్థము. సామాన్యమైన యుదాహరణముగా ఇది చూపబడినది.

(3) "జనపదే లుప్" (4-2-81) అను సూత్రము తద్ధితమునకు లోపమును విధించునది. "అదూరభవముగాని నివాసముగాని అయినది, ఒక దేశమో —లేక— ఒక గ్రామమో అయినచో తద్ధితము లోపించును" అని దీని యర్థము

(4) "లుపి యుక్తవద్వ్యక్తివచనే" (1-2-51) అను సూత్రము యుక్తవద్భావమును విధించునది. "ప్రత్యయము లోపించినపుడు ప్రకృతియొక్క లింగ సంఖ్యలే వృత్తియందును అనుసరించునని" దీని భావము. ఇచట రెండు పక్షములున్నవి : వృత్తి జరిగిన తరువాత సిద్ధముగనున్న ప్రకృతియొక్క లింగ సంఖ్యలు అనువర్తించునని ఒక పక్షము. వృత్తి జరుగకముందుండు ప్రకృతియొక్క లింగ సంఖ్యలు అనుసరించునని రెండవ పక్షము. ఇందు మొదటి పక్షము ననుసరించినచో "గోదౌ" (గ్రామః) అనుచోట ద్విత్వము సిద్ధింపదు. "గోదయోః నివాసః" (ఇరువురు గోదులకు నివాసమైన గ్రామము) అను నర్థమున తద్ధిత ప్రత్యయము వచ్చి లోపించును. వృత్తియగుటచే అభేదైకత్వ సంఖ్య ఏర్పడును పిదప యుక్తవద్భావమును చెప్పినను ఆ ఏకత్వమే లభించునుగాని ద్విత్వము (గోదౌ) లభింపదని శంక ఉదయించినది దీని సమాధానము దిగువ కారికలలో స్పష్టము కాగలదు.

విశేష విషయములు— "లుపియుక్త వద్వ్యక్తివచనే". ప్రవర్తించు ప్రత్యయమునకు ప్రకృతియైన శబ్దము యుక్తమనబడును వ్యక్తియనగా లింగము. వచనమనగా సంఖ్య. ప్రత్యయము లోపించినపుడు ప్రకృతియొక్క లింగ సంఖ్యలే మొత్తమునకు సంక్రమించునని సూత్రముయొక్క అర్థము. ఉదా. గోదౌ = గ్రామః. ఇచట విశేష్యము గ్రామమైనను తదనుసారము లింగము, సంఖ్యయు నుండవు. (గోదః, అని యుండదు). నివాసమను నర్థమున వచ్చిన తద్ధితమునకు ప్రకృతియైన "గోద" శబ్దము ననుసరించియే అవి యుండవలెను. కాగా పుంలింగమును ద్విత్వమును ఉండుట (గోదౌ) ఇచట అభీష్టము. "వృత్తియందు అభేదైకత్వమన్నచో ఇది సిద్ధించునా ?" అని శంకా స్వరూపము. ॥110॥

అవతారిక— వృత్తికి ముందుండు ప్రకృతియొక్క లింగ సంఖ్యలు అనుసరించునను రెండవ పక్షమందలి విశేషమును చూపుచున్నాడు.

శ్లో॥ ప్రాగ్వృత్తేర్యుక్తవద్భావే షష్ఠీ భేదాశ్రయా భవేత్ ।
వృత్తౌ సంఖ్యావిశేషాణాం త్యాగాద్భేదో నివర్తతే ॥ 111

వృత్తేః = వృత్తికన్న, ప్రాక్ = ముందు, యుక్తవద్భావే = యుక్తవద్భావము జరిగినచో, భేదాశ్రయా = భేదమును తెలుపు, షష్ఠీ = షష్ఠీవిభక్తి, భవేత్ = వచ్చెడిని (అయినను), వృత్తౌ = వృత్తియందు, సంఖ్యావిశేషాణామ్ = సంఖ్యలకు సంబంధించిన భేదములను, త్యాగాత్ = విడుచుటవలన, భేదః = భేదము, నివర్తతే = పోవును.

తాత్పర్యము— "యుక్తవద్భావము" (ప్రకృతియొక్క లింగ సంఖ్యలు వృత్తియందును అనుసరించుట) వృత్తికి ముందుండు వాక్యావస్థయందే ప్రవర్తించునన్నచో,

''గోదా'' (గ్రామః) అనుచోట ''గోదయోః'' అని షష్ఠికూడ రావలసివచ్చును. ''గోదయోః నివాసః'' అన్నది యచటి వాక్యావస్థగదా ః అయినపుడు ''గోదులకు చెందిన'' అను రీతిని భేదభావనము కూడ కలిగెడిని. అయినను వృత్తి జరిగిన పిదపనే యుక్తవద్భావము సిద్ధాంతము ననుసరించినచో, అభేదైకత్వము యొక్క బలమువలన సంఖ్యావిశేషము లన్నియు నివర్తించునుగాన భేదముగాని దానిని బోధించు షష్ఠీ విభక్తిగాని రాదని చెప్పవలయును

వివరణము— ''వృత్తి జరిగిన తరువాతనే యుక్తవద్భావమును చెప్పుట మంచిది. అంతకు ముందుండు వాక్యదశనుబట్టి చెప్పకూడదు '' అను సిద్ధాంతమిచట సూచింపబడినది.

విశేష *విషయములు*— (1) వృత్తికి ముందే యుక్తవద్భావమన్నను, ఆ యతిదేశముయొక్క స్వభావమువలన వచన సామాన్యమే (ఏకవచనము, ద్వివచనము మొదలగునది) అనువర్తించునుగాని దానికి సంబంధించిన విభక్తి విశేషమనువర్తింపదనియు, అందువలన షష్ఠి రాదనియును వేరొక రీతిని సమాధానము భాష్యములో ఉన్నది.

(2) ''యుక్తము'' అనగా ''ప్రత్యయముతో కూడినది'' అను అర్థము చెప్పక తప్పదు. ''యుక్తస్య + ఇవ = యుక్తవత్'' = ప్రత్యయముతో కూడిన ప్రకృతికివలె అని వివరణము లభించును. అందుచే తద్ధిత వృత్తి జరిగిన పిదపనే లింగమును సంఖ్యను అతిదేశించుట న్యాయము. ॥111॥

అవతారిక— కాగా ''వృత్తికి పిదపనే లింగమును సంఖ్యను అతిదేశించుట సముచితమ''ని అన్నపుడు, ''అభేదైకత్వము వలన ''గోదా'' అనుచోట ఏకత్వమే యుండవలయునుగాని ద్విత్వము పనికిరాదు'' అను శంక ప్రకృతము మిగిలినది. దీనికి సమాధానము చెప్పుటకై అభేదైకత్వము యొక్క స్వరూపమును మరల చూపుచున్నాడు.

శ్లో॥ విద్యమానాసు సంఖ్యాసు కేచిత్సంఖ్యాంతరం విదుః ।
అభేదాఖ్యముపగ్రాహి వృత్తౌ తచ్చోపజాయతే ॥ 112

సంఖ్యాసు = సంఖ్యలు, విద్యమానాసు = ఉండగా, ఉపగ్రాహి = స్వీకరించునటువంటిన్ని, అభేదాఖ్యమ్ = అభేదమను పేరుగల, సంఖ్యాంతరమ్=వేరొక సంఖ్యను, కేచిత్=కొందరు, విదుః = తెలియుదురు (చెప్పుదురు), తత్ + చ = అదియే, వృత్తౌ = వృత్తియందు, ఉపజాయతే = పుట్టును.

తాత్పర్యము— అన్ని విధములయిన సంఖ్యలను తీసికొని తనలో ఇమిడ్చికొని మొత్తముపై ఒకటిగా భాసించు సంఖ్యయే అభేదైకత్వమనియు వృత్తియందది స్ఫురించుననియును కొందరు చెప్పుదురు.

వివరణము— సంఖ్యాభేదములన్నియు పోవుటయే అభేదైకత్వమని కొందరు భావింతురు. వారి మతమున సంఖ్యలను స్వీకరించుట జరుగదు. ఈ యంశమువెనుక (98 వ కారిక) చూపబడినది. ॥112॥

అవతారిక— అన్ని సంఖ్యలను స్వీకరించిన అభేదైకత్వము వృత్తియందు స్ఫురించినపుడు, "గోదా" అనుచోట ద్విత్వము సిద్ధించునని చూపుచున్నాడు.

శ్లో॥ వ్యాపారం యాతిభేదాఖ్యై స్తత్ స్వైరవయవైః క్వచిత్ ।
ఆత్మాభేదానపేక్షోఽస్య క్వచిదేతి నిమిత్తతామ్ ॥ 113

క్వచిత్ = ఒకచోట, భేదాఖ్యైః = వేర్వేరుగా ఉండు, స్వైః = తన, అవయవైః = అవయవములైన సంఖ్యలతో, తత్ = ఆ అభేదైకత్వము, వ్యాపారమ్ = ఉపయోగమును, యాతి = పొందును, క్వచిత్ = ఒకానొకచోట, అస్య = ఈ అభేదైకత్వము యొక్క, ఆత్మా = స్వరూపము, భేదానపేక్షః = భేదములను ఆశించనిదై, నిమిత్తతామ్ = ఉపయోగమును ఏతి = పొందును.

తాత్పర్యము— ప్రయోగముల ననుసరించి ఆవశ్యకమైన కొన్నిచోట్ల అభేదైకత్వమందలి సంఖ్యావిశేషములు భాసించును. అనగా అట్టిచోట్ల వృత్తియున్నను మనకు కావలసిన సంఖ్యను తీసికొనవచ్చును. ఆవశ్యకము కానిచోట్ల అభేదైకత్వము మాత్రమే స్ఫురించును

వివరణము— కాగా "గోదా" అనుచోట ఈ తీరునుబట్టి అభీష్టమైన ద్విత్వమును సంపాదింపవచ్చునని సారాంశము. ॥113॥

అవతారిక— ఈ యంశమున ఉదాహరణమును చూపుచున్నాడు.

శ్లో॥ దాస్యాఃపతిరితి వ్యక్తో గోదావితి చ దృశ్యతే ।
వ్యాపారభేదః సంఖ్యాయా స్తస్మాదేవం వ్యవస్థితః ॥ 114

"దాస్యాః పతిః + ఇతి" = "దాస్యాః పతిః" అనుచోట. వ్యక్తః=ఏకత్వము నిశ్చయింపబడెను, "గోదౌ + ఇతి + చ" = "గోదా" అనుచోటను, దృశ్యతే = ద్విత్వము సహజముగ కనబడుచున్నది, తస్మాత్ = అందువలన, సంఖ్యాయాః = అభేదైకత్వ సంఖ్యయొక్క, వ్యాపారభేదః = పనిచేయుటయందలి భేదము, ఏవమ్ = ఇట్లు, వ్యవస్థితః = నిశ్చితమైయున్నది.

తాత్పర్యము— "దాస్యాః పతిః" అను సమాసవృత్తియందు ఏకత్వమును, "గోదా" అను తద్ధితవృత్తియందు ద్విత్వమును తెలియుట సహజమైన విషయము. అచట అభేదైకత్వసంఖ్య యున్నను ప్రసిద్ధినిబట్టి ఆ యా సంఖ్యావిశేషమును కూడ కొండొకచో అది సమర్పించుచుండును. అభేదైకత్వము విషయమున అట్టి ఏర్పాటును పెద్ద లంగీకరించిరి.

వివరణము— "దాస్యాః పతిః" (పనికత్తెమగడు) అనునది షష్ఠీ సమాసము. "షష్ఠ్యా ఆక్రోశే" (6-3-21) (నింద గమ్యమానమైనపుడు షష్ఠికి అలుక్కు అగును) అను సూత్రముచే షష్ఠి లోపింపకుండ మిగిలినది. మగనిని దూషించుటయే ఇచట ముఖ్యమైన భావము. దాసీగతమైన సంఖ్యాభేదము (ఒకతె, ఇరువురు, ముచ్వురు మొదలగునది) అవివక్షి

తము. అందుచే ఇచట ఏకత్వము సహజము. అట్లే "గోదౌ" (గోదయోః నివాసః గ్రామః) అనుచోట ద్విత్వము వ్యవహారబలముచే సిద్ధించినది. దానినే అభేదైకత్వము ప్రతిపాదించును. కాగా కావలసిన సంఖ్యను సమర్పించుటయే అభేదైకత్వము యొక్క ముఖ్య ధర్మమని ఫలించును.

విశేష విషయములు— అభేదైకత్వమను సాంకేతికమైన సంఖ్యకేగాక, సామాన్యమైన సంఖ్యలకును ఇట్టి విచిత్రములు గోచరించును. ఉదా: "వింశతిః - గావః" (ఇరువది ఆవులు). ఇచట ఇరువదిలో రెండు పదులున్నవి. అయినను ద్విత్వము రాకుండ ఏకత్వమే ఎల్లప్పుడును భాసించును. "ద్వౌ, త్రయః" (రెండు, మూడు) మొదలగుచోట్ల లెక్కింపబడు వస్తువుల భేదము నాశ్రయించుటవలన ఎల్లపుడును ఆ యా భేదములే తెలియుచుండును. మరియు ఒక సంఖ్యయందు వేరొక సంఖ్య ఇమిడియుండుట కూడ లోకవ్యవహారమున ప్రసిద్ధమే. ఉదా: "కతి - భవతః - పుత్రాః ?" (మీ కెందరు పుత్రులు ?) ఈ ప్రశ్న యందు ఒకటి, రెండు, మూడు మొదలగు సంఖ్యలన్నియు ఇమిడియున్నవి. అందువలననే ఈ ప్రశ్నకు "ఏకః, ద్వౌ, త్రయః" మొదలగు సమాధానములు వినబడుచుండును. ఇట్టి రీతులన్నియు సంఖ్యావిషయమున సహజములు. కావున అభేదైకత్వ సంఖ్యయందును ఒకచో ఏకత్వము భాసించుటయు, వేరొకచో సంఖ్యావిశేషము స్ఫురించుటయును విరుద్ధము కాదు.॥114

అవతారిక— అభేదైకత్వమును స్వీకరించినపుడు "ద్విపుత్రః" (ఇరువురి కుమారుడు) మొదలగుచోట్ల ద్విత్వము తెలియు రీతిని చూపుచున్నాడు.

శ్లో॥ ద్వ్యాదీనాం చ ద్విపుత్రాదౌ బాహ్యో భేదో నివర్తతే ।
విభక్తివాచ్యః స్వార్థత్వాన్నిమిత్తం త్వవతిష్ఠతే ॥ 115

ద్విపుత్రాదౌ = "ద్విపుత్రః" మొదలగుచోట, ద్వ్యాదీనామ్ = ద్వి, మొదలగు శబ్దముల యొక్క, విభక్తివాచ్యః = విభక్తివలన చెప్పబడు, బాహ్యః = వెలుపలిదైన, భేదః = భేదము, నివర్తతే = పోవును, నిమిత్తమ్ + తు = ప్రవృత్తి నిమిత్తమైతే, స్వార్థత్వాత్ = శబ్దముయొక్క అర్థమగుటవలన, అవతిష్ఠతే = మిగులును.

తాత్పర్యము— "ద్విపుత్రః". ఇచట "ద్వయోః పుత్రః" అని విగ్రహము. సమాసము జరుగగనే షష్ఠీ విభక్తివలన తెలియు సంఖ్యాభేదము (ద్వివచనమువలన బోధపడు ద్విత్వము) తొలగిపోవును "ద్వి", అను ప్రాతిపదికము యొక్క సహజమైన అర్థమగు ద్విత్వము మాత్రము మిగులును. అందువలన అభీష్టార్థము సిద్ధించును. ("ఇరువురికి చెందిన" అనుభావము).

వివరణము— అభేదైకత్వమువలన ప్రాతిపదికము యొక్క అర్థము నశింపదు గదా ! అట్లయిన "ద్వి" అను శబ్దమును వాడుటయే వ్యర్థమయ్యెడిని. కాగా ద్విశబ్దమువలన ద్విత్వము లభించుటలో అనుపపత్తి ఏదియు లేదు. ఇట్లే "త్రిపుత్రః" మొదలగు ప్రయోగములలో కూడ ఊహింపవలెను. ॥115॥

నిందాదులను బోధింపదలచినపుడు క, అను తద్ధిత ప్రత్యయముగాని స్వార్థమందు ప్రవర్తించును. అనగా ప్రాతిపదికము యొక్క అర్థమున సిద్ధముగానున్న స్త్రీత్వమును టాప్ ప్రత్యయమును, నింద మొదలగు నర్థములను క ప్రత్యయమును వెల్లడిచేయును. అంతియగాని అచట ప్రత్యయము యొక్క అర్థము వేరుగాఉండి ప్రధానమగుటయు, దానికి ఉభశబ్దము యొక్క అర్థము విశేషణమై స్వార్థమును కోల్పోయి, ''రెండిటి సముదాయము'' అను అభేదమును బోధించుటయు జరుగదు. కావున టాప్ వచ్చినపుడు ''ఉభే'' (ద్వివచనము) అనియు, క ప్రత్యయము వచ్చినపుడు ''ఉభకే'' అనియు ప్రయోగములుండును. ''ఇరువురు స్త్రీలు'' అను రీతిని భేదముగల స్వార్థమే (ఉభశబ్దము యొక్క అర్థము) వీనివలన తెలియుచుండును

వివరణము— ప్రాతిపదికమందు సిద్ధముగానున్న స్త్రీత్వమును వెల్లడి చేయుటయే స్త్రీ ప్రత్యయముల పని యనియు, అట్లే నింద మొదలగు అర్థములను ప్రకాశింపజేయుటయే స్వార్థికములగు తద్ధితముల పని యనియును సంప్రదాయము. కావున టాప్పు వచ్చినను క ప్రత్యయము వచ్చినను ఉభశబ్దము యొక్క సహజమైన యర్థము మారదు. అది భేదమునే చెప్పగలదుగాని అభేదమును చెప్పజాలదు.

అట్లుగాక స్వార్థికముకాని వేరొక ప్రత్యయమును చేసినను ఉత్తరపదము పరమైనపుడును (ఉభయతః, ఉభయపుత్రః, మొదలగు స్థలములు) ఆ యా అర్థములు ప్రధానములగును. ఏకార్థీభావము వలన వానికి విశేషణమై అప్రధానముగ నుండి అభేదమును (రెండిటి సముదాయము, అను భావమును) బోధించు శక్తి ఉభయ శబ్దమునకు మాత్రమే యున్నది. ఉభశబ్దమునకు లేదు. అందువలన అట్టిచోట్ల ఉభయశబ్దమును వాడక తప్పదు

విశేష విషయములు— ''స్త్రీ ప్రత్యయములు ద్యోతకములు'' (ఉన్న యర్థమును వెల్లడి చేయునవి) అను పక్షమున ఈ తీరు సమన్వయించును. ॥118॥

అవతారిక— ''స్త్రీ ప్రత్యయము స్త్రీత్వమునకు వాచకమే'' (స్త్రీత్వమును క్రొత్తగా ప్రత్యేకముగ బోధించును) అను మరొక పక్షమున్నది. ఇందు ఉభశబ్దము యొక్క అర్థము ప్రత్యయముయొక్క అర్థమునకు విశేషణము కావచ్చును గదా! అట్లయినపుడు ప్రయోగమెట్లుండును? - అను శంకకు సమాధానమును చూపుచున్నాడు.

శ్లో॥ స్త్రీత్వాభిధానపక్షేఽపి గుణభావవిపర్యయః ।
స్వభావాదపదార్థత్వాత్తత్ర భేదో న హీయతే ॥ 119

స్త్రీత్వాభిధానపక్షే + అపి = స్త్రీత్వమును చెప్పు పక్షమందును, గుణభావ విపర్యయః = అప్రధానమగుట సంభవింపదు, స్వభావాత్ = స్వభావము ననుసరించి, అపరార్థత్వాత్ = ప్రాధాన్యమే ఉండుటవలన, తత్ర = అచట, భేదః = భేదము, న + హీయతే = పోదు.

తాత్పర్యము— స్త్రీ ప్రత్యయము స్త్రీత్వమును చెప్పునను పక్షమందు కూడ ఉభశబ్దముయొక్క యర్థము, ప్రత్యయముయొక్క అర్థమునకు విశేషణముగ మారదు. ప్రధాన

ముగనే యుండును. అది దాని స్వభావము. అనగా "స్త్రీలు ఇరువురు" అను ముఖ్యమైన యర్థమునే ఉభశబ్దము బోధించును. అందువలననే సహజమైన భేదము నివర్తింపదు.

వివరణము— "దాశరథిః" (దశరథస్య - అపత్యమ్ - పుమాన్ = దశరథుని మగ సంతానము) మొదలగుచోట్ల ప్రత్యయముయొక్క అర్థము ముఖ్యమై ప్రకృతియొక్క అర్థము అప్రధానమగును. స్త్రీ ప్రత్యయముల విషయమున మాత్ర మట్టితీరు లేదు. ప్రత్యయము వాచకమైనను ద్యోతకమైనను స్త్రీత్వముతో కూడిన ప్రకృత్యర్థమే ముఖ్యముగ ప్రకాశించును. అది స్వభావము. అర్థమనునది ఎల్లపుడును లోకవ్యవహారమును బట్టియే సాగుచుండును. వ్యాకరణము కేవలము శబ్దముయొక్క ప్రక్రియనే చూపునుగాని, అర్థమునుగురించి ఎట్టి నిర్ణయమును చేయజాలదు. ఈ భావమునే "అర్థానాదేశనాత్" (శాస్త్ర మర్థమును నిర్దేశింపదు) అను వచనముతో పెద్దలు బోధించుచుందురు. ॥119॥

అవతారిక— కాగా ఉభశబ్ద మెల్లపుడును భేదమునే బోధించుగుగాన.

శ్లో॥ తస్మాద్ద్వివచనాట్టాపశ్చోభయోఽన్యత్ర దృశ్యతే ।
ప్రత్యయం తయపం హిత్వానాస్త్యుత్తరపదే పునః ॥ 120

తస్మాత్ = అందువలన, ద్వివచనాత్ = ద్వివచనము కన్న, టాపః + చ = టాప్ ప్రత్యయము కన్నను, అన్యత్ర = వేరైనచోట, ఉభయః = ఉభయశబ్దము, దృశ్యతే = చూడబడును, తయపమ్ = "తయప్", అను, ప్రత్యయమ్ = ప్రత్యయమును, హిత్వా = విడిచి, ఉత్తరపదే + పునః = ఉత్తరపదము పరమగునపుడు కూడ, న + అస్తి = (ఉభశబ్దము) లేదు.

తాత్పర్యము— టాప్ ప్రత్యయము, ద్వివచనము, తయప్పు (తయ, అను తద్ధితము) అను వాని విషయములోనే ఉభశబ్దమునకు ప్రసక్తి యుండును. మిగిలిన అన్నిచోటులందు సమానార్థకమైన ఉభయశబ్దమే వాడబడును. ఏకార్థీభావమునకును తన్నిమిత్తకమైన అభేదైకత్వమునకును అనువైన స్వభావము ఉభయశబ్దమునకే గలదు.

వివరణము— తయప్, అనునది మూలమైన ప్రత్యయము. "ఉభాదుదాత్తో నిత్యమ్" (5-2-44) అను సూత్రముచే "తయ" అను దానికి "అయ" అను ఆదేశము విధింపబడెను. (ఉభయ అను రూపము సిద్ధించును). సూత్రమున "ఉభాత్" అని స్పష్టముగ పేర్కొనుటవలన ఈ సందర్భము "ఉభ" శబ్దమునకేయని అనవలసివచ్చెను. ॥120॥

అవతారిక— అభేదైకత్వమును చర్చించు సందర్భములో ప్రసక్తాను ప్రసక్తముగ వచ్చిన కొన్ని విషయములు ఈ విధముగ ప్రతిపాదింపబడినవి. ఇట్లే అభేదైకత్వ సంఖ్య నంగీకరించినచో దోషములు కలుగునని దిగువ మూడు కారికలతో కొన్ని శంకలను ప్రకృతము చూపుచున్నాడు. (అందు మొదటి శంక)—

శ్లో॥ ప్రాప్తిః ప్రగృహ్యసంజ్ఞాయా న స్యాత్ ప్రత్యయలక్షణాత్।
కుమార్యగారే న హ్యస్తి సమాసో వచనాంతరే॥ 121

ప్రత్యయలక్షణాత్ = ప్రత్యయ లక్షణమువలన, ప్రగృహ్య సంజ్ఞాయాః = ప్రగృహ్య సంజ్ఞ యొక్క, ప్రాప్తిః = లాభము, న + స్యాత్ = కలుగకపోయెడిని, కుమార్యగారే = "కుమార్యగారమ్", అనుచోట, వచనాంతరే = వేరొక వచనమున, సమాసః = సమాసము, న + అస్తి + హి = లేదుగదా ః

తాత్పర్యము— "కుమార్యగారమ్" అనునది కుమారీ శబ్దముతో జరిగిన షష్ఠీ తత్పురుషము. అభేదైకత్వము నంగీకరించినపుడు, ఇచట ద్వివచనాంతముతో (కుమార్యోః + అగారమ్) సమాసమనుటయే కుదురదు. (ఏకత్వ సంఖ్య తప్పదు కావున) అట్లయినపుడు "ప్రత్యయ లక్షణమువలన ఇచట ప్రగృహ్య సంజ్ఞ వచ్చెడిని" అను వార్తికకారుని ప్రతి పాదనమే వ్యర్థము కావలయును గదా ః

వివరణము— మహాభాష్యమందలి సందర్భమిది : "ఈ దూదేద్ద్వివచనం ప్రగృహ్యమ్" (1-1-11) అని సూత్రము. "దీర్ఘములైన ఈ కారమును, ఊకారమును, ఏకారమును అంతమందుగల ద్వివచనము ప్రగృహ్యమగును" అని యర్థము. ఇదియే సిద్ధాంతము. ప్రగృహ్యమైనచో సంధికార్యము రాదు. ఉదా : "*హరీ* + ఇమే = *హరీఇమే*" మొదలగునవి

ఇచట వ్యాఖ్యావికల్పములను చూపు ఘట్టమున "ఈదాద్యంతం ద్వివచనాంతమితిచేల్లుకి ప్రతిషేధః" అని వార్తికకారుడొక యాక్షేపమును చేసెను "ఈదాద్యంతమై ద్వివచనాంతమైనది ప్రగృహ్యమగును" అని చెప్పినచో, "కుమార్యోః అగారమ్" అని ద్వివచనాంతముతో సమాసమును చేసినపుడు - కుమార్యగారమ్, అనుచోట "కుమారీ" అనునది ప్రగృహ్యము కావలసివచ్చును. (కుమారీ అగారమ్, అని అనవలసి వచ్చును). దానిని ఆపవలసి యుండును" అని వీనియొక్క భావము. కుమారీ, అనునది ఈకారాంతమగును కావున, సమాసమునకు అవయవమై లోపించిన "ఓస్" అను ద్వివచనమును ప్రత్యయ లక్షణమువలన మరల ఉన్నట్లు భావింపవచ్చును కావునను పై ఆక్షేపము సరిపోవునని సమన్వయము (ఈకారాంతమును ద్వివచనాంతమును అగుట కుదురును). కాని అభేదైకత్వమును ఆశ్రయించినచో "ద్వివచనాంతముతో సమాసము" అనుటయే కుదురనందున వార్తికకారుని యాక్షేపమే నిష్ప్రయోజనమగును.

విశేష విషయములు— "ప్రత్యయలోపే ప్రత్యయ లక్షణమ్" (1-1-62) అని సూత్రము "ప్రత్యయము లోపించినను దానివలన రాదగు కార్యము ప్రవర్తించును" అని యర్థము. దీనినే ప్రత్యయ లక్షణమందురు ॥121॥

అవతారిక— మరియు (రెండవ శంక)—

శ్లో॥ ఏకద్వయోర్యఞాదీనాం విభాషాలుఙ్ న కల్పతే।
యౌష్మాకస్తావకశ్చేతి భేదాభావాన్న సిధ్యతి॥ 122

యఞాదీనామ్ = యఞ్, మొదలగు ప్రత్యయములకు, ఏకద్వయోః = ఏకత్వమందును ద్విత్వ మందును, లుక్ = లుక్కు, విభాషా = వికల్పముగ, న + కల్పతే = కుదురదు, భేదాభా వాత్ = భేదము లేనందువలన, యౌష్మాకః = యౌష్మాక, అను రూపమును, తావకః + చ + ఇతి = తావక, అను రూపమును, న + సిధ్యతి = సిద్ధింపదు.

తాత్పర్యము— యఞ్ ప్రత్యయము మొదలగు కొన్ని తద్ధితములను ప్రవర్తింప జేసినపుడు, ఏకత్వముగాని ద్విత్వముగాని తెలియు సందర్భములలో ఆయా ప్రత్యయమునకు వికల్పముగ లోపమగునని వార్తికకారుడు చెప్పెను. అట్లే యుష్మద్ శబ్దమునకు అణ్ ప్రత్య యము పరమైనపుడు, ఏకవచనమందు "తావక" అను రూపమును, ద్విత్వ బహుత్వములందు "యౌష్మాక" అను రూపమును అగునని సూత్రకారుడు చెప్పెను వృత్తియందు అభేదైకత్వ మన్న పక్షమున సంఖ్యాభేదమే యుండదు కావున ఇరువురి మాటలును అసంగతములయ్యెడిని.

వివరణము— "యఞఞోశ్చ" (2-4-64) అని సూత్రము. "బహుత్వమును చెప్పదలచినపుడు, గోత్రార్థకములైన యఞ్, అఞ్ ప్రత్యయములు నిత్యముగ లోపించునని" దీని భావము ఉదా: గార్గ్యః. (యఞన్తము) దీనికి బహువచనము "గర్గాః" అని యుండును. (యఞ్ ప్రత్యయము లోపించెను). ఈ సందర్భమందు "గార్గ్య" శబ్దమును ముందుంచి, షష్ఠీతత్పురుష సమాసము చేయగా, ఏకవచనాంతముగ కాని ద్వివచనాంతముగ కాని విగ్రహమును చూపదలచినపుడు, యఞ్ ప్రత్యయమునకు వికల్పముగ లోపమగును" అని కాత్యాయనుడొక వచనమును చూపెను. ఉదా: "గార్గ్యస్యకులమ్ = గార్గ్యకులమ్" అనిగాని, "గర్గకులమ్" అనిగాని రూపముండవచ్చును. (యఞ్ ప్రత్యయమునకు వికల్ప ముగ లోపము). "గార్గ్యయోః కులమ్" అని చూపినను రూపములు సమానమే. కాగా అభే దైకత్వమున ఏకత్వము, ద్విత్వము మొదలగు విశేషములే సంభవింపవుగాన, పై కాత్యాయన వచనము అనుపపన్నమగును.

అట్లే "తవకమమకావేకవచనే" (4-3-3) అని సూత్రము. "అణ్ ప్రత్యయము గాని ఖఞ్ ప్రత్యయముగాని పరమగునపుడు, ఏకత్వమును చెప్పు యుష్మద్, అస్మద్, అను శబ్దములకు వరుసగ తవక, మమక, అను నాదేశములగునని" దీని భావము. తావకః, మామకః (అణ్ ప్రత్యయము) అనునవి ఉదాహరణములు. ఇదే సందర్భములో ద్విత్వ బహు త్వములను చెప్పునపుడు మాత్రము యుష్మాక, అస్మాక, అను నాదేశములగునని (యుష్మద్, అను దానికి యుష్మాక. అస్మద్, అను దానికి అస్మాక). దీనిమీది సూత్రము (తస్మిన్న ణిచ యుష్మాకాస్మాకౌ (4-3-2) బోధించునది. యౌష్మాకః (యువయోః - అయమ్, లేక- యుష్మాకమ్ - అయమ్, (అని విగ్రహము) ఆస్మాకః, అనునవి ఉదాహరణములు. అభేదైకత్వ పక్షమున సంఖ్యాభేదము లేనందున పాణిని యొక్క ఈ నిర్దేశము కూడ విరోధించెడిని.

ఇట్లు పాణిని కాత్యాయనుల వచనములకును అభేదైకత్వమను ప్రతిపాదనమున కును పొత్తు కుదురలేదని ఫలించినది. ॥122॥

అవతారిక— మరియు (మూడవ శంక)—

శ్లో॥ దృష్టో గార్గ్యతరే భేద స్తథా గర్గతరా ఇతి ।
యుష్మత్పితా త్వత్పితేతి తథాదేశౌ వ్యవస్థితౌ ॥ 123

గార్గ్యతరే = గార్గ్యతరః, అను ప్రయోగమందును, తథా = అట్లు, గర్గతరాః + ఇతి = గర్గతరాః, అను చోటను, భేదః = భేదము, దృష్టః = కనబడెను, తథా = అట్లే, యుష్మత్పితా = యుష్మత్పితా, అనుచోటను, త్వత్పితా + ఇతి = త్వత్పితా, అనుచోటను, ఆదేశౌ = ఆదేశములు, వ్యవస్థితౌ = నియతములై యున్నవి.

తాత్పర్యము— ''గార్గ్యతర'' అను రూపమందు యఞ్ ప్రత్యయము లోపింపలేదు. కావున ఏకత్వముగాని ద్విత్వముగాని తెలియుచుండును. ''గర్గతర'' అనగానే ఆ ప్రత్యయము లోపించినందున బహుత్వము తప్పక తెలియును. అట్లే ''త్వత్పితా'', అనునపుడు ఏకత్వమే బోధపడును. ''యుష్మత్పితా'' అనగానే ద్విత్వముగాని బహుత్వముగాని తప్పక స్ఫురించును. కాగా ఇట్టి సంఖ్యావిశేషములు స్ఫురించుట అభేదైకత్వమం దెట్లు కుదురును ?

వివరణము— ''యఞఞోశ్చ'' (2-4-64) అను సూత్రముచే బహుత్వమందే యఞ్ ప్రత్యయము లోపించును. అట్లే ''త్వత్పితా'' (తవ + పితా) అను సమాసమున ఏకత్వమందే యుష్మద్ శబ్దమునకు ''త్వ'' అను నాదేశము విధింపబడినది. (ప్రత్యయోత్తర పదయోశ్చ (7-2-98) ''ప్రత్యయముగాని ఉత్తరపదముగాని పరమైనపుడు ఏకత్వమును తెలుపు యుష్మద్ శబ్దమునకు ''త్వ'', అను నాదేశమును, అస్మచ్ఛబ్దమునకు ''మ'' అను నాదేశమును అగును'').
॥123॥

అవతారిక— అభేదైకత్వ సంఖ్య విషయమున బయలుదేరిన పై శంకలన్నిటికిని సమాధానమును చూపుచున్నాడు.

శ్లో॥ ఉపాధిభూతా యా సంఖ్యా ప్రకృతౌ సమవస్థితా ।
ఆదేశైః సంజ్ఞయా వాఽపి విభక్త్యా వ్యజ్యతే వినా ॥ 124

ప్రకృతౌ = ప్రాతిపదిక విషయములో, యా = ఏ, సంఖ్యా = సంఖ్య, ఉపాధిభూతా = విశేషణముగా, సమవస్థితా = సహజముగనున్నదో, (సా = ఆ సంఖ్య) విభక్త్యా + వినా = విభక్తిలేకుండగనే, ఆదేశైః = ఆదేశములచేతను, వా = లేక, సంజ్ఞయా + అపి = సంజ్ఞచేతను కూడ, వ్యజ్యతే = సూచింపబడును.

తాత్పర్యము— సంభవించు సంఖ్య లన్నింటియొక్కయు సామాన్యమైన సంబంధమే ''అభేదైకత్వ సంఖ్య'' అని ఇదివరకే చెప్పబడెను. సంఖ్యావిశేషమును సూచించు నిమిత్తమేదయిన ఉన్నచో, ఆ యా విశేషసంఖ్య వృత్తియందును స్ఫురించుచునే యుండును. లేనిచోట సర్వసామాన్యమైన ఏకత్వము భాసించును. కాగా కొన్నిచోట్ల – అనగా ''తావక'',

మొదలగుచొట్ల "తవక" మొదలగు ఆదేశములును, మరికొన్నిచోట్ల - అనగా "కుమార్యగారమ్" మొదలగుచొట్ల ప్రగృహ్యామనెడి సంజ్ఞయు ఆ యా సంఖ్యా విశేషమును తెలియ జేయును. ఎట్టి నిమిత్తమును లేని "రాజపురుషః" మొదలగు స్థలములలో సామాన్యమైన ఏకత్వమే ప్రకాశింపుచుండును.

వివరణము— సంఖ్యావిశేషము కూడ ప్రాతిపదికముయొక్క అర్థముతో పెన వేసికొనియే యుండును. అందువలన వృత్తియందు ప్రాతిపదికము ఉపసర్జనముగా ఉన్నను కొన్నిచోట్ల ఆ యా సంఖ్యాభేదము స్పష్టముగ తెలియుటయే లోకసిద్ధమైన విషయము. అట్లు తెలియుటకు తవక, యుష్మాక, మొదలగు నాదేశములు సాయపడును. ఎట్టి నిమిత్తమును లేనిచోట ఏకత్వమే తెలియును. ఇదియే అభేదైకత్వము యొక్క స్వభావము. అనగా వృత్తి యందు కూడ, ప్రయోగముల ననుసరించి - నిమిత్తమున్నచోట కావలసిన సంఖ్యా విశేష మును, లేనిచోట సామాన్య రూపముతో ఏకత్వమును భాసింపుచుండునని ఫలించును. అట్లు సిద్ధముగనున్న స్వభావమును వెల్లడించుటయే శాస్త్రము చేయుపని.

విశేష విషయములు— కాగా "యఞఞోశ్చ" (2-4-64) అను సూత్రము లుక్కును చెప్పుటయు, ఆ సూత్రమందలి వార్తికకారుని వచనములును, "తవకమమకావేక వచనే" (4-3-3) మొదలగు సూత్రము లా యా ఆదేశములను చెప్పుటయును అభేదైకత్వము యొక్క స్వరూపస్వభావములను విశదపరచునట్టివేగాని "విరోధించునవి కానేరవనునది" ఇచటి సారము. ॥124॥

అవతారిక— ఇదే తీరులో ఈ దిగువ ప్రయోగములును ఉపపన్నములగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ శౌర్పికే మాసజాతే చ పరిమాణం స్వభావతః ।
ఉపాధిభూతామాశ్రిత్య సంఖ్యాం భేదేనవర్తతే ॥ 125

శౌర్పికే = శౌర్పిక, అనుచోటను, మాసజాతే + చ = మాసజాత, అనుచోటను, ఉపాధి భూతామ్ = ప్రాతిపదికము యొక్క అర్థమునకు విశేషణమైన, సంఖ్యామ్ = సంఖ్యను, ఆశ్రిత్య = అవలంబించి, పరిమాణమ్ = పరిమాణము, స్వభావతః = సహజముగ, భేదేన = భేదముతో, వర్తతే = ఉండును.

తాత్పర్యము— "శౌర్పికమ్". ఇది తద్ధితవృత్తి. "శూర్పేణ క్రీతమ్" అని వివరణము అనగా "ఒక చేటెడు వస్తువుతో (బియ్యముకాని మరేదైనగాని) కొనబడినది" అని భావము అట్లే "మాసజాతః" అన్నది సమాసవృత్తి. "ఒక నెల వయసుగల బిడ్డ" అని యర్థము. ఈ రెండు స్థలములందును "ఒకటి" అను ఏకత్వము తప్పక భాసించును. సామాన్యమైన అభేదైకత్వము భాసింపదు. అది ప్రయోగముయొక్క స్వభావము.

వివరణము— చేట, నెల, అనునవి పరిమాణములు. "ఒక చేటెడు - ఒక నెల

వయస్సు'' అని ఏకత్వమును బోధించుటయే ఈ ప్రయోగములందలి తాత్పర్యము. అట్లుగాక సామాన్యముగ సంఖ్యను భావించినచో ''ఎన్ని చేటలైనను - ఎన్ని నెలలైనను కావచ్చును'' గాన ప్రయోగము యొక్క ఔచిత్యము పాడగును. (చెప్పదలచిన పరిమాణము విశదము కాదు). అందుచే ప్రాతిపదికమును పలుకగానే (శూర్ప, మాస) స్ఫురించు మొదటిదైన ఏకత్వ మొకటియే ఇట్టి స్థలములలో బోధపడుననుట సమంజసము

విశేష విషయములు— వృత్తులందు ద్విత్వమును, బహుత్వమును నియతముగ ప్రకాశించు ప్రయోగములు కొన్ని పై కారికలలో చూపబడినవి. ఏకత్వము తప్పక స్ఫురించు ప్రయోగములు ఇచట చూపబడినవి కాగా ''అభేదైకత్వము''ను అంగీకరించినను ఆయా చోటులందు నిమిత్తవశమున, కావలసిన సంఖ్యా విశేషము తెలియుచునే యుండును. వ్యాకరణ సంప్రదాయము లన్నింటికిని ప్రయోగముల ప్రాభవమే మూలము. ॥125॥

అవతారిక— మీది శ్లోకము యొక్క అర్థమునే వివరింపుచున్నాడు.

శ్లో॥ వయస్విని పరిచ్ఛేదః క్రీతేచాపి న గమ్యతే ।
ఇష్టో భేదాదృతే తత్ర పరిమాణమనర్థకమ్ ॥ 126

తత్ర = అచట, భేదాత్ = సంఖ్యావిశేషమును (ఏకత్వమును), ఋతే = విడిచినచో, వయస్విని = వయస్సుగల వ్యక్తియందును, క్రీతే + చ + అపి = కొనబడిన వస్తువునందును, ఇష్టః = అభిమతమైన, పరిచ్ఛేదః = నియతమైన కొలత, న + గమ్యతే = తెలియబడదు, (కాగా) పరిమాణమ్ = పరిమాణమును చెప్పు శబ్దము, అనర్థకమ్ = అర్థములేనిదగును.

తాత్పర్యము— మీది ప్రయోగములలో (శౌర్పిక, మాసజాత) ''ఒకటి'' అను విశేషసంఖ్యను స్వీకరించనియెడల, వ్యక్తియొక్క వయసునుగాని కొనబడిన వస్తువుయొక్క వెలనుగాని నొక్కి చెప్పుటకు వీలుండదు. అట్లయినపుడు శూర్ప, మాస, అను పరిమాణమును బోధించు శబ్దములను వాడుటయే వ్యర్థమగును (సంఖ్యానియమము తెలియనపుడు వాడినందు వలన వచ్చు లాభమేమి?). అందువలన ఆ స్థలములలోని పరిమాణశబ్దములు ఏకత్వమును మాత్రమే బోధించునని చెప్పక తప్పదు. ॥126॥

అవతారిక— అందువలననే—

శ్లో॥ భిన్నస్యాభేదవచనాత్ ప్రస్థాదిభ్యః శసోవిధిః ।
తద్ధర్మత్వాదభేదాత్తు ఘటాదిభ్యో న దృశ్యతే ॥ 127

భిన్నస్య = వేరుగాఉన్న వానియొక్క, అభేదవచనాత్ = అభేదమును చెప్పుటవలనను, తద్ధర్మత్వాత్ = అది వాని స్వభావమగుట వలనను, ప్రస్థాదిభ్యః = ప్రస్థ, మొదలగు పరిమాణవాచకములకు, శసః = శస్ ప్రత్యయమును, విధిః = విధించుట, (జరిగినది), అభేదాత్ + తు = భేదము లేనందువలననే, ఘటాదిభ్యః = ఘట, మొదలగు జాతివాచకములకు, న + దృశ్యతే = కనబడదు (శస్ ప్రత్యయము కనబడదు).

తాత్పర్యము— ''ప్రస్థశః'' (ప్రస్థమ్ - ప్రస్థమ్) ఇది తద్ధితవృత్తి. ప్రస్థమనగా ఒక పరిమాణము. (కొలపాత్ర = మానిక –లేక– అడ్డ అనవచ్చును). ప్రస్థ, శబ్దమునకు శస్, అను ప్రత్యయము చేరినది. ఇది ''వీప్స'' అను అర్థమున ప్రవర్తించినది. వీప్స, అనగా ''ఉన్న వ్యక్తులలో ప్రతియొక వ్యక్తికిని అనుకొన్న పనిని సంబంధింపజేయుట'' కాగా ''ప్రస్థశః - తండులాన్ - దదాతి'' అని ప్రయోగించినపుడు, ''ఒక్కొక అడ్డెడు బియ్యమును ఒక్కొకి వ్యక్తికిని ఇచ్చుచున్నాడు'' అని యర్థము వచ్చును.

పరిమాణశబ్దములు ఎల్లపుడును ఏకత్వమునే బోధించును. అది వాని స్వభావము. అనగా ప్రస్థములు వేర్వేరుగా ఎన్ని యున్నను ''ప్రస్థ'' అని పలుకగానే ''ఒక ప్రస్థమే'' అనియే తెలియును (రెండు, మూడు, మొదలగు భావనయే కలుగదు). కావున ''ప్రస్థశః'' మొదలగు ప్రయోగములలో ''ఒక్కొక అడ్డెడు'' అని ఏకత్వమే భాసించును. అభేదైకత్వ మిచట పనికిరాదు.

కాని ''ఘట'' మొదలగు శబ్దములకు ఈ విధముగ శస్ ప్రత్యయము రాదు. ఘట, పట, మొదలగునవి జాతివాచకములు. అవి నియతముగ ఏకత్వమును చెప్పజాలవు. (ఎన్నింటినైనను చెప్పగలవు). ''ఘటశః'' అని యన్నచో అభేదైకత్వము పనిచేసి, ''ఎన్ని ఘటములయినను'' అన్నట్లు - సర్వభేదములను తనలో ఇమిడ్చుకొను సామాన్యమైన సంఖ్యయే స్ఫురించును.

వివరణము— ''సంఖ్యైకవచనాచ్చ వీప్సాయామ్'' (5-3-43) అనునది శస్ ప్రత్యయమును విధించు సూత్రము. ''సంఖ్యావాచకమునకును, ఏకత్వమును బోధించు పరి మాణవాచకమునకును వీప్సయందు శస్ ప్రత్యయమగును'' అని యర్థము. ఉదా: ద్విశః. (సంఖ్య = ద్వౌ - ద్వౌ - దదాతి). ప్రస్థశః. (పరిమాణము = ప్రస్థమ్ - ప్రస్థమ్ - దదాతి).

ఇచటి సారమిది— అభేదైకత్వ సంఖ్య అన్నది సకల సంఖ్యలయొక్కయు సంబంధరూపమనియు, వృత్తులలో అది సామాన్యముగ భాసించుననియును వివరింపబడినది. అయినను శబ్ద శక్తులును, ప్రయోగస్వభావములును అతివిచిత్రములు. తదనుసారము వృత్తి యందు కూడ కొన్నిచోట్ల ఆయా సంఖ్యావిశేషములు స్ఫురించును. మరికొన్నిచోట్ల సంఖ్యా సామాన్యమే అనుభూతమగును. ''ఇది ఇట్లే'' అని నొక్కిచెప్పుట సాధ్యము కాదు. అందు వలన సూత్రమునుగాని వార్తికమునుగాని భాష్యమునుగాని - వేరొక వ్యాకరణ సంప్రదాయ మునుగాని ప్రయోగములను బట్టియే సమన్వయించుకొనవలయును. ప్రయోగమునకు శాస్త్రము లొంగవలసినదేగాని శాస్త్రమునకు ప్రయోగము లొంగుట సంభవింపదు. ఇదియే భాష యొక్కయు వ్యాకరణము యొక్కయు రహస్యము.

అభేదైకత్వము విషయమున బయలుదేరిన శంకలకు ఈ విధముగ సమాధానములు చూపబడినవి. ॥127॥

అవతారిక— ''సంఖ్యాభేదము లన్నియును తొలగుటయే అభేదైకత్వము'' అను

పక్షము కూడ ఉన్నది. ''తద్రూపేఽవయవే వృత్తౌ సంఖ్యాభేదో నివర్తతే'' (98 వ కారిక) అను వచనము ఈ పక్షమును తెలుపును. దీని నవలంబించినను విరోధములను పోగొట్టవచ్చు నని చూపుటకు ప్రారంభింపుచున్నాడు.

శ్లో॥ శ్రూయతేవచనం యత్రభావ స్తత్ర విశిష్యతే ।
నివర్తతేయద్వచనం తస్యభావో న విద్యతే ॥ 128

యత్ర = ఎచట, వచనమ్ = ఏకవచనము, ద్వివచనము, మొదలగునది, శ్రూయతే = వినబడునో, తత్ర = అచట, భావః = సంఖ్య అనెడి ధర్మము, విశిష్యతే = వేరుచేయబడును, యత్ = ఏ, వచనమ్ = వచనము, నివర్తతే = పోవునో, తస్య = దానియొక్క, భావః = సంఖ్య, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— వాక్యమందు ఏకవచనము, ద్వివచనము మొదలగు వచనములు వినబడును. కాన అవి బోధించు ఒకటి, రెండు, మొదలగు సంఖ్యలు కూడ స్పష్టముగ నుండును. వృత్తియందు వచనములు తొలగిపోవును. కావుననే ఆ యా సంఖ్యలును నివర్తించును. (ఇట్లు సంఖ్యావిశేషములు పోవుటయే అభేదైకత్వమనబడును). ॥128॥

అవతారిక— వృత్తియందు విభక్తి ప్రత్యయములు (సు - ఔ - జస్, మొదలగునవి) లేకుండుట సహజము. అయినను ప్రత్యయ లక్షణము సిద్ధించుటకై విభక్తులున్నట్లు చూపించుటయు, వానికి లుక్కును చెప్పుటయును జరుగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ కార్యం సత్త్వాశ్రయం శాస్త్రాదప్రవృత్తి రదర్శనమ్ ।
వాక్యే దృష్టంయదత్యంతమభావ స్తస్య వృత్తిషు ॥ 129

అప్రవృత్తిః = విభక్తులు పుట్టకుండుటయే, అదర్శనమ్ = ఉండవలసినది కనబడకుండుట —లేక— లోపము, (భవతి = అగును), సత్త్వాశ్రయమ్ = విభక్తి ప్రత్యయముయొక్క ఉనికిని ఆశ్రయించు, కార్యమ్ = కార్యము, శాస్త్రాత్ = శాస్త్రమువలన, (భవతి = అగును), వాక్యే = వాక్యమందు, యత్ = ఏది, దృష్టమ్ = చూపబడినదో, తస్య = దానికి, వృత్తిషు = వృత్తులందు, అత్యంతమ్ = పూర్తిగా, అభావః = లేకుండుట, (భవతి = జరుగును).

తాత్పర్యము— తమ తమ యర్థముల ఆవశ్యకత లేనందున ఆ యా విభక్తి ప్రత్యయములు వృత్తియందు పుట్టనే పుట్టవు. అయితే శాస్త్రీయములగు కొన్ని కార్యములు ప్రవర్తించుటకై, (తవక, మమక, మొదలగు ఆదేశములు ఏకవచనము పరమగునపుడు విధింపబడినవి) ప్రత్యయములు పుట్టినట్లును అవి లోపించినట్లును చూపబడును. పిదప ప్రత్యయ లక్షణము నాశ్రయించి (ప్రత్యయము లోపించినను తన్నిమిత్తమైన కార్యము వచ్చుట) ఆయా కార్యములను చేయుదురు.

వాస్తవమున వాక్యము వేరు - వృత్తి వేరు. కావున వాక్యధర్మము లేవియును

వృత్తియందుండవు. అందుచే వృత్తియందు సంఖ్యాభేదమును బోధించు విభక్తులు ఉండవను టయే సముచితము.

వివరణము— "సుపోధాతు ప్రాతిపదికయోః" (2-4-71) అను సూత్రము వృత్తియందలి సుప్ ప్రత్యయములకు లుక్కును చెప్పును. (దీని యర్థ మిదివరకు విశదీకరింపబడినది - 106, 121, శ్లోకములు) "ప్రత్యయలోపే ప్రత్యయ లక్షణమ్" (1-1-62) అను సూత్రము "ప్రత్యయము లోపించినను అది యుండగా వచ్చు కార్యము రావచ్చును" అని చెప్పును. (ఇదియు వెనుక వ్యాఖ్యాతము. 121 వ శ్లోకము).

వృత్తియందు విభక్తులు పుట్టి లోపించుట కేవలము శాస్త్రీయమైన కల్పనమనియు, అసలు విభక్తులు పుట్టకుండుటయే సహజమైన స్థితియనియును ఇచటి సారాంశము. ॥129॥

అవతారిక— వృత్తియందు సుప్ ప్రత్యయములు పుట్టవన్నచో, ఏకవచనము, ద్వివచనము, మొదలగునవి అచట లేవనియే ఫలించును. అయినపుడు ప్రత్యయలక్షణము నవలంబించినను ఆ యా కార్యము లెట్లు ప్రవర్తించును ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ సంజ్ఞావిషయభేదార్థం ప్రసక్తాదర్శనం స్మృతమ్ ।
శ్రూయమాణం తు వచనం విశిష్టముపలభ్యతే ॥ 130

సంజ్ఞావిషయభేదార్థమ్ = "లోపము" అను సంజ్ఞయొక్క విషయమును వేరుచేయుటకై, ప్రసక్తాదర్శనమ్ = ఉండవలసిన దానియొక్క అదర్శనము, స్మృతమ్ = చెప్పబడినది, శ్రూయమాణమ్ = వినబడు, వచనమ్ = తు = వచనమైతే, విశిష్టమ్ = పూర్తిగా, ఉపలభ్యతే = స్వీకరింపబడును.

తాత్పర్యము— లోపసంజ్ఞయొక్క విషయమును స్పష్టపరచుటకు "ఒకచో తప్పక ఉండవలసినది (ప్రత్యయము మొదలగునది) కనబడకుండుటయే లోపమని" లక్షణము బయలుదేరినది. అందుచే లోపమనిగాని "లుక్కు" అనిగాని అనగానే ఒకానొక ప్రత్యయ మచట ఉండక తప్పదని ఊహింపదగును కాగా వాక్యమందు విభక్తి ప్రత్యయములు (వచనములు) వినబడును వాక్యముతో సమానమైన ప్రక్రియావాక్యమొకటి వృత్తియందును కల్పింపబడును వాక్యమందువలెనే ఇచటగూడ వచనములనుసరించును. వృత్తియందు సాక్షాత్తుగ వచనములుండవు. అయినను ముందున్న ప్రక్రియావాక్యమునుబట్టి "ఉన్నట్లు" అనుమానింప వచ్చును. ఈ తీరు ననుసరించియే ప్రత్యయలక్షణమున్ను ఆ యా కార్యములు ప్రవర్తించుటయును కుదురును.

వివరణము— "అదర్శనం లోపః" (8-1-60) అన్నది లోపసంజ్ఞను వివరించిన సూత్రము. "అదర్శనము" అనగా కనబడకుండుట. తాను ఉండదగినచోట కనబడుటయు, లేనిచోట కనబడకుండుటయు ప్రతియొక దానికిని సహజమే. అందుచే అదర్శనమని

సామాన్యముగా అన్నచో అన్నింటికిని "లోప"సంజ్ఞ రావలసి వచ్చును (ఎప్పుడో ఒకప్పుడు ప్రతియొకటియు కనబడదు). ఈ దోషమును వారించుటకు "ప్రసక్తమైన దానియొక్క" - అనగా - తప్పక ఉండవలసిన దానియొక్క - అదర్శనమే లోపమని వ్యాఖ్యానించిరి.

ప్రత్యయమునకు జరిగిన లోపమును లుక్, శ్లు, లుప్, అను పదములలో ఏదో ఒక పదముతో బోధింతురు. (ప్రత్యయస్య లుక్ శ్లు లుపః (1-1-61) వృత్తియందలి సుప్ ప్రత్యయములకు లుక్కు ప్రవర్తించును.

కాగా ప్రకృతము - వృత్తియందు వచనములకు (సుప్పులకు) లుక్కు అన్నందు వలన ఆ ప్రత్యయము లచట ఉన్నట్లు అనుమానింపవలెను. వాస్తవముగ అవి యచట లేనందున, అవి యుండుటకు తగిన ఒక ప్రక్రియా వాక్యమును కల్పింపవలెను అది వృత్తికి పూర్వావస్థ. అట్టి కల్పనకు మూలము సహజమైన వాక్యము. ప్రతియొక వృత్తియందును ఇదియే తీరు.

వాక్యమందును ప్రక్రియావాక్యమందును వచనములు పూర్తిగా వినబడును. కావున అవశ్యకతను బట్టి ఆ వచనముల నాశ్రయించిన కార్యములు ఆయా చోటులందు ప్రవర్తించును. వృత్తియందుకూడ ప్రక్రియావాక్యమును బట్టి, ఆయా వచనములున్నట్లు ఊహించి కార్యములను ప్రవర్తింపజేయనగును. అందువలన "ప్రత్యయ లక్షణము" అను పద్ధతికి వృత్తియందెట్టి ఆక్షేపమును లేదు

విశేష విషయములు— సంఖ్యాభేదములన్నియు ఇమిడియున్నట్టిదియు, సకల సంఖ్యలయొక్క సంబంధరూపమైనట్టిదియును అభేదైకత్వ సంఖ్యయని మొదటి మతము. అందు వృత్తియందు ప్రవర్తించు ఆదేశాదులచే, (తావక, అనుచోట "తవక" అను ఆదేశము కావలసిన సంఖ్య తెలియుచుండునని వెనుక చూపబడినది.

ఉన్న సంఖ్యలన్నియు తొలగుటయే అభేదైకత్వమని రెండవ మతము. ఈ మతమున ఆదేశాదులచే ప్రత్యయ లక్షణమును దానివలన ప్రక్రియా వాక్యమును ఊహించి, అందున్న సంఖ్యను వృత్తియందును చెప్పవచ్చునని ఇచట విశదీకరింపబడినది. ॥130॥

అవతారిక— మీది కారిక చూపిన సమాధానములో దోషమున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అభావో వా లుకో యత్ర రూపవాన్ వా విధీయతే ।
వ్యభిచారాన్నిమిత్తస్య తత్రాసాధుః ప్రసజ్యతే ॥ 131

యత్ర = ఎచట, లుకః = లుక్కుయొక్క, అభావః + వా = లేకుండుటగాని, రూపవాన్ + వా = నియతమైన స్వరూపముగల ఆదేశముగాని, విధీయతే = విధింపబడునో, తత్ర = అచట, నిమిత్తస్య = నిమిత్తముయొక్క, వ్యభిచారాత్ = లేకుండుటవలన, అసాధుః = అసాధువైన ప్రయోగము, ప్రసజ్యతే = కావలసి వచ్చును (ప్రాప్తించెడిని).

తాత్పర్యము— సంఖ్యాభేదములు తొలగుటయే. (భేదాపోహము = భేదములు పోవుట) అభేదైకత్వమను పక్షమున, సుప్పులకు లుక్కురాని వృత్తియందును (స్తోకాన్ముక్తః) ఏకత్వమున విధింపబడిన ఆదేశములుగల వృత్తియందును (తావక, మొదలగునవి) దోషము కలుగును.

వివరణము— వాక్యదశలో ఉన్న సంఖ్యలు వృత్తిలో తొలగుటయే అభేదైకత్వమనియు, ఆవశ్యకమైనచోట ప్రక్రియా వాక్యమందలి సంఖ్యను వృత్తియందు గ్రహింప వీలగుననియును మీది కారిక విశదీకరించినది.

కాని ఇట్లు చెప్పినందువలన కొన్నిచోట్ల చిక్కులు వచ్చును. ఉదా: ''స్తోకాన్ముక్తః''. ఇచట పంచమికి ''అలుక్కు'' (లోపము రాకుండుట) విధింపబడెను. ''స్తోకాభ్యామ్ ముక్తః, స్తోకేభ్యో ముక్తః'' అను విగ్రహమున ద్వివచన బహువచనాంతములతో సమాసమే జరుగదనియు, ఆవశ్యకమైన యెడల ''స్తోకాన్ముక్తః'' అను దానివలననే ద్విత్వ బహుత్వములు బోధపడుననియును వెనుక సూచింపబడినది (106 వ కారిక). అందువలన ద్వివచనములోను బహువచనముతోను ఉండు ప్రక్రియా వాక్యములు ''స్తోకాన్ముక్తః'' అను సమాసమునకు పూర్వావస్థలు కాజాలవు. అచటనున్న వచనములను సమాసమున తీసికొని వచ్చుట కుదురదు. కాగా ద్విత్వమందును బహుత్వమందును ''స్తోకాన్ముక్తః'' అను సమాసము అసాధువు కావలసి వచ్చును.

అట్లే ''తావకః'' అను తద్ధితవృత్తియందును దోషము కలిగెడిని. ఇచట ఏకవచనమున (సుప్ ప్రత్యయము కాదు. ఒక వస్తువును = ఒక వ్యక్తిని చెప్పునది) ''తవక'' అను నాదేశము విధింపబడెను. ఇది బోధించు ఏకత్వము వృత్తియందు తొలగిపోయినచో ''తావక'' అను దానివలన అభిమతమగు నర్థము (''నీకు చెందిన'' - అనునది) లభింపక పోవును. ॥131॥

అవతారిక— అభేదైకత్వము విషయమున బయలుదేరిన రెండు మతముల యొక్కయు పరమార్థమును చూపుచున్నాడు.

శ్లో॥ భేదః సంఖ్యావిశేషో వా వ్యాఖ్యాతో వృత్తివాక్యయోః ।
సర్వత్రైవ విశేషస్తు నావశ్యం తాదృశో భవేత్ ॥ 132

భేదః = సంఖ్యాభేదముగాని, సంఖ్యావిశేషః + వా = సంఖ్యావిశేషముగాని, వృత్తివాక్యయోః = వాక్యమందును వృత్తియందును, వ్యాఖ్యాతః = చెప్పబడెను, సర్వత్ర = అంతటను, విశేషః + తు = విశేషమైతే, ఆవశ్యమ్ = తప్పక, తాదృశః + ఏవ = అట్టిదే, న + భవేత్ = కానక్కరలేదు.

తాత్పర్యము— వాక్యమందు సంఖ్యాభేదము తెలియుననియు, వృత్తియందు అది తెలియక అభేదైకత్వము తెలియుననియును విశదీకరింపబడినది. కాని వృత్తియందుకూడ

కొన్నిచోట్ల సంఖ్యాభేదము సహజముగ స్ఫురించుచుండును. అంతమాత్రమున "వృత్తి వాక్యము వంటిదే" అని భావింపకూడదు.

వివరణము— "వాక్యము వేరు - వృత్తి వేరు" అని వృత్తివాక్యముల విభిన్న ధర్మములను విశదముచేయు సందర్భమున, "అభేదైకత్వ సంఖ్య" వృత్తియొక్క ధర్మమని భాష్యకారుడు చెప్పెను. దాని తీరు తెన్నులను సామాన్యముగా నిర్దేశించెను. అయినను "తావకః" (నీవాడు) "మాసజాతః" (ఒక నెలబిడ్డ) మొదలగు వృత్తులలో కూడ సంఖ్యా విశేషము స్పష్టమగుచునే యుండును. అంతమాత్రమున "వృత్తియందును వాక్యమందును సంఖ్యావిశేషము స్ఫురించుట సమానమే" అని అనరాదు. "రాజపురుషః" మొదలగు పెక్కు వృత్తులలో సంఖ్యాభేదమెన్నడును స్ఫురింపదు గదా ః

విశేష విషయములు— అభేదైకత్వసంఖ్యకు నిర్దుష్టముగా లక్షణమును చెప్పుట మిక్కిలి కష్టము. భాషయొక్క స్వభావము ననుసరించి ప్రయోగములలో వైచిత్ర్యము లుండును. శబ్దశక్తులు విచిత్రములును అనంతములును గదా ః అందుచే అభేదైకత్వమునకు లొంగని ప్రయోగములు కొన్ని యుండవచ్చును. అంతమాత్రమున ఆ ధర్మమునే త్రోసి పుచ్చ నక్కరలేదు.

ఏ లక్షణమైనను సామాన్యధర్మమునుబట్టియే బయలుదేరును. దానికి లోబడని విశేషములు కొన్ని ఎప్పుడును ఉండును. విశేషించి భాషయొక్క ధర్మములకు లక్షణమును చెప్పుట మరియు కష్టము దేశము, కాలము, వ్యక్తి - వీనియొక్క పరిణామములచే భాష యందు ఎన్నో విచిత్రములు కనబడుచునే యుండును. కాగా ఎచటనైనను ప్రయోగములో కొద్ది వ్యభిచారము (లక్షణము కుదురకుండుట) సంభవించినను - దానినిబట్టి సామాన్య లక్షణ మును తిరస్కరింపకూడదు. ॥132॥

అవతారిక— సంఖ్యావిశేషమువలెనే లింగవిశేషము కూడ వృత్తులలో కొన్నిచోట్ల భాసింపదని చెప్పుచున్నాడు.

శ్లో॥ జాతేశ్చ భేదహేతుత్వాన్న లింగేన విశేష్యతే ।
ప్రధానం మృగదుగ్ధాదౌ గార్గీపుత్రే న స క్రమః ॥ 133

మృగదుగ్ధాదౌ = "మృగదుగ్ధమ్" మొదలగుచోట్ల, జాతేః = జాతి, భేదహేతుత్వాత్ + చ = భేదమునకు కారణమగుటవలన, ప్రధానమ్ = ముఖ్యమైనది, లింగేన = లింగముతో, న + విశేష్యతే = వేరుచేయబడదు, గార్గీపుత్రే = "గార్గీపుత్ర" అనుచోట, సః = ఆ, క్రమః = తీరు, న = లేదు.

తాత్పర్యము— "మృగదుగ్ధమ్" (లేడి పాలు). ఇచట "దుగ్ధ" శబ్దము ఉత్తర పదము. దాని యర్థమే ప్రధానము. దానిని విశేషించి చెప్పుటకై "మృగ" శబ్ద ముపయోగించును. అది జాతినిగాని (మృగత్వమను సామాన్యధర్మమును), వేరొక జాతిని వారించుటను

(మృగత్వముకన్న వేరయిన జాతి ఏదియు కాదనుభావమును) గాని, బోధించును. కావున పురుషుడు, స్త్రీ, మొదలగు లింగముయొక్క ప్రసక్తి యుండదు. "మృగస్య దుగ్ధమ్" అనియే విగ్రహమును చూపవలెను.

"గార్గీపుత్రః" మొదలగు కొన్నిచోట్ల మాత్రము అప్రధానమైన శబ్దమునకు (గార్గీ) లింగ విశేషముతో సంబంధము తప్పక ఉండును.

వివరణము— దుగ్ధమును విశేషించుటయే (వేరుచేసి చూపుట మాత్రమే) ప్రయోజనమైనపుడు పూర్వపదము కేవలము జాతివాచకముగా ఉండుటయే సముచితము. లేదా— జాత్యంతరమును వారించునదియైనను అది కావచ్చును. అయినపుడు "ఆడ, మగ" మొదలగు లింగమును నొక్కి చెప్పనక్కరలేదు. లోకవ్యవహారమట్లే యున్నది. లింగమును నొక్కి చెప్పదలచినచో "మృగ్యాః దుగ్ధమ్" అని వ్యస్తప్రయోగమునేగాని సమాసమును వాడరాదు. "కుక్కుటాండమ్" (కోడిగ్రుడ్డు) "ఛాగమాంసమ్" (మేకమాంసము) మొదలగు ప్రయోగములలో కూడ ఇదియే తీరు.

అయితే లింగమును నొక్కి చెప్పినందువలన కొన్నిచోట్ల ఉత్తరపదము యొక్క అర్థమునకు ప్రశంసయో - నిందయో —లేక— వేరొక విశేషమో తెలియుచుండును. అట్టిచోట్ల పూర్వపదార్థమునకు లింగముకూడ విశేషణమగును. ఉదా : గార్గీపుత్రః, మొదలగునవి.

కాగా "మృగదుగ్ధమ్" మొదలగుచోట్ల పూర్వపదము సామాన్యముగా జాతినే బోధించుననియు, లింగ విశేషమును బోధింపదనియును సారాంశము.

(7) "విశేషణానాం చాజాతేః" (1—2—52) అను సూత్రముయొక్క సమర్థనము

అవతారిక— వృత్తియందలి పూర్వపదము జాతిని బోధించునపుడు, సంఖ్యా భేదమువలెనే లింగభేదము కూడ సామాన్యముగా సమసిపోవును. కావుననే "విశేషణానాం చాజాతే" (1-2-52) అను సూత్రమును ఆరంభింపవలసి వచ్చినదని చెప్పుచున్నాడు.

శ్లో॥ అభేదే లింగసంఖ్యాభ్యాం యోగాచ్ఛుక్లం పటా ఇతి ।
ప్రసక్తే శాస్త్రమారబ్ధం సిద్ధయే లింగసంఖ్యయోః ॥ 134

అభేదే = భేదము లేనపుడు, లింగసంఖ్యాభ్యామ్ = లింగముతోను, సంఖ్యతోను, యోగాత్ = సంబంధమువలన, శుక్లమ్ - పటాః + ఇతి = "శుక్లమ్ - పటాః" అను ప్రయోగము, ప్రసక్తే = ప్రాప్తమగుచుండగా, లింగసంఖ్యయోః = లింగసంఖ్యల యొక్క, సిద్ధయే = సిద్ధికై, శాస్త్రమ్ = సూత్రము, ఆరబ్ధమ్ = ప్రారంభింపబడెను.

తాత్పర్యము— లింగముయొక్కయు సంఖ్యయొక్కయును భేదము తెలియనపుడు సామాన్యమైన లింగసంఖ్యల సంబంధము ననుసరించి, "శుక్లమ్ పటాః" అను రీతిని ప్రయో

గము కానున్నది. దానిని వారించి "శుక్లాః పటాః" అను అభిమతమైన ప్రయోగము సిద్ధించుటకై "విశేషణానాం చాజాతేః" అను సూత్ర మారంభింపబడెను.

వివరణము— (1) "తద్ధిత ప్రత్యయమునకు లుప్పు (లోపము) జరిగినపుడు, ఆ ప్రత్యయముచే బోధింపబడు అర్థమునకు విశేషణముగా నుండు అర్థమును చెప్పు శబ్దము విషయమున, ప్రకృతికివలెనే (ప్రత్యయముయొక్క ప్రకృతికి) లింగమును సంఖ్యయును అగును. అట్టి విశేషణము జాతివాచకమైనచో ఈ తీరు వర్తింపదు" అని పై సూత్రము యొక్క అర్థము. ఉదా : "పంచాలాః రమణీయాః". ఇచట "పంచాలానాం నివాసః" అను నర్థమున అణ్ ప్రత్యయము వచ్చుటయు అది లోపించుటయు జరిగెను. పిదప "లుపి యుక్తవద్వ్యక్తివచనే" (1-2-51 ఇది 110 వ కారికలో వివరింపబడినది) అను సూత్రము వలన యుక్తవద్భావము కలిగి "పంచాల్యాః" అని పుంలింగమును బహువచనమును సిద్ధించినవి. (లేనియెడల ప్రత్యయముయొక్క అర్థము "నివాసః" నివాసము. అది ఒకటియేకాన ఏకవచనము ఉండవలయును.) పంచాలాః, అను దానికి "రమణీయ" శబ్దము విశేషణము. కాగా ప్రకృత సూత్రముచే ఇచట కూడ ప్రత్యయ ప్రకృతియొక్క లింగసంఖ్యలే అనువర్తించినవి. (రమణీయాః) "పంచాలాః జనపదః" అన్నది ప్రత్యుదాహరణము. ఇచట జనపదశబ్దము జాతివాచకమైనందున (జనపదః = ప్రదేశము. జనపదత్వము జాతియగును) ప్రకృతియొక్క లింగసంఖ్యలు సంబంధింపవు. ఇది "విశేషణానాం చాజాతే" అను సూత్రముయొక్క వాస్తవస్వరూపము.

(2) అయితే "పంచాలాః రమణీయాః" మొదలగుచోటు లన్నింటియందును విశేషణ విశేష్యములకు సామానాధికరణ్యము (ఒకే అర్థమును బోధించుట) ఉండునుగాన, "లుపియుక్తవత్" మొదలగు సూత్రముచేతనే యుక్తవద్భావము సిద్ధించునని భావించి "విశేషణానామ్" ఇత్యాది సూత్రమును భాష్యకారుడు త్రోసిపుచ్చెను.

(3) అయినను గుణవచనముల విషయమున (శుక్ల, కృష్ణ, మొదలగునవి) అభిమతమైన లింగ సంఖ్యలను సాధించుట కీ సూత్ర ముపయోగించునని భాష్యకారుడే తుదకు సమర్థించెను. అనగా "గుణవచనానామాశ్రయతో లింగవచనాని" అను సంప్రదాయ సిద్ధమైన వచనమునకు మారుగా "విశేషణానామ్" ఇత్యాది సూత్ర ముపయోగించునని అతని యాశయము.

(4) గుణవచనము లనగా సామాన్యముగా రంగులను చెప్పు శబ్దములు. రంగులకు ఆధారమైన ద్రవ్యములు ఆశ్రయములనబడును. అట్టి ద్రవ్యములను చెప్పు శబ్దములయొక్క లింగ సంఖ్యలే గుణవాచకములకును అగునని పై వచనముయొక్క తాత్పర్యము. ఉదా : "శుక్లః పటః, శుక్లౌ పటౌ, శుక్లాః పటాః" మొదలగునవి. ఈ ప్రయోజనమును "విశేషణానామ్" ఇత్యాది సూత్రము సాధించునని భాష్యకారుడు భావించెను.

(5) గుణవచనముల విషయమున కూడ ఒక చిత్రమున్నది. అవి ఆశ్రయమైన

ద్రవ్యమును సూటిగా తెలుపజాలవు. దానిని తెలుపుటకు ''మతుప్'' అను తద్ధితమును (''అది గలది'' అను నర్థమున) గుణవచనములకు చేర్పవలెను. పిదప "గుణవచనేభ్యో మతుపోలుగిష్టః'' (గుణవచనములకు పరమైన మతుప్పు లోపించును) అను వచనముచే ప్రత్యయము లోపించును. ప్రకృత సూత్రమువలన ఆశ్రయము యొక్క లింగవచనములు సిద్ధించును.

(6) ఇట్టి పూర్వరంగము తెలిసిననేగాని ఈ కారికయొక్క ఆశయము విశదము కాదు. ఇపుడు దీనినిట్లు వివరించుకొనవచ్చును

వ్యాకరణము పదములనే పంస్కరించునను పక్షమున తొలుత శుక్ల శబ్దము కేవలము తన యర్థమునే బోధించునదియై, సామాన్యమైన నపుంసక లింగమును సామాన్యమైన ఏకత్వ సంఖ్యను పొందును. ''శుక్లమ్'' అని ఏర్పడును. పిదప వాక్యావస్థను చూపదలచి ''పటః'' అని విశేష్యమైన పదమును ప్రయోగించినను, తొలుత జరిగిన పదముయొక్క సంస్కారము తొలగిపోవుట సముచితము కానందున (అది అంతరంగము – అనగా ముందుగా జరిగినది) "శుక్లం పటః'' అని ప్రయోగము ప్రాప్తించుచున్నది. దానిని వారించి విశేష్యాను సారముగా లింగ సంఖ్యలుండునని బోధించుటకు ''విశేషణానామ్'' ఇత్యాది సూత్రము బయలుదేరెను.

విశేష విషయములు—— వాక్యావస్థను తీసికొనక పదములను మాత్రమే వేర్వేరుగా గ్రహించి. ఏ పదమున కా పదమునకే వ్యాకరణ కార్యములను చేసి విడుచుటను పద సంస్కార పక్షమందురు. ఈ పక్షమందు వేరొక పదముతో సంపర్కముండదుగాన, ప్రతి యొక పదమును తన యర్థమును మాత్రమే సామాన్యరీతిని బోధించును. లింగ విశేషము తెలియనపుడు నపుంసకమును, సంఖ్యాభేదము తెలియనపుడు ఏకత్వమును వచ్చుననుట సంప్రదాయము. అట్టి నపుంసకమును లింగ సర్వనామమనియు అట్టి ఏకత్వ సంఖ్యను సంఖ్యా సర్వనామమనియు వాడుట గలదు. ఈ సంస్కారము అంతరంగము. దీని తరువాత పదమునకు వేరొక పదముతో సంబంధమును చూపి విశేషార్థమును బోధించు వాక్యదశను ఏర్పరచినను, అంతరంగమైన పదసంస్కారము నశింపదనుట ఒక విధమైన శాస్త్రీయ భావన.

''గుణే శుక్లాదయః పుంసి గుణిలింగాస్తు తద్వతి'' (శుక్ల, మొదలగునవి గుణమును చెప్పినచో పుంలింగములు గుణముగల దానిని చెప్పినచో విశేష్య నిఘ్నములు – అనగా విశేష్యము యొక్క లింగమును పొందును) అను వచనముతో అమరసింహుడు ఇంచుమించు ఈ కారికయొక్క భావమును విశదీకరించెను. ॥134॥

అవతారిక—— సామాన్యముగా ఎట్టి విశేషణమునైనను బోధించు ''విశేషణమ్'' అను పదముచే గుణవాచకమును మాత్రమే (శుక్ల, కృష్ణ, మొదలగునది) గ్రహించుట ఎట్లు ? అను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ పరార్థం శేషభావం యో వృత్తిషు ప్రతిపద్యతే ।
గుణో విశేషణత్వేన స సూత్రే వ్యపదిశ్యతే ॥ 135

యః = ఏ, గుణః = గుణము, పరార్థమ్ = ఇతరముకొరకు, శేషభావమ్ = ఆధారపడి యుండుటను, వృత్తిషు = వృత్తులలో, ప్రతిపద్యతే = పొందునో, సః = ఆ గుణము, విశేషణత్వేన = విశేషణముగా, సూత్రే = సూత్రమందు, వ్యపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— తద్ధితవృత్తియందు తన పారతంత్ర్యమును, ద్రవ్యముయొక్క స్వాతంత్ర్యమును ఏ గుణము బోధించునో అదియే విశేషణమని గ్రహింపవలెను. "విశేషణానామ్" ఇత్యాది సూత్రమందలి విశేషణ శబ్దమునకు తాత్పర్యమిదియే.

వివరణము— ద్రవ్యమును బోధించునపుడు శుక్ల, మొదలగు గుణవాచకములకు "మతుప్" ప్రత్యయము (శుక్లః - అస్య - అస్తి = తెలుపు దీనికి గలదు = శుక్లమత్) చేరుటయు అది లోపించుటయు సహజము. అట్లు జరిగినపుడే అవి విశేష్యమైన ద్రవ్యమును బోధింపగలవు. అందువలన ఇచట విశేషణమనగా "ద్రవ్యముపై ఆధారపడు గుణము" అను భావమును తీసికొనవలెను.

విశేష విషయములు— వ్యావర్తకము, భేదకము (వేరుచేయునది) మొదలైన అర్థములను ఇచటి విశేషణ పదమునకు చెప్పకూడదు. కేవలము "పరతంత్రము" అను నర్థమునే చెప్పవలెను. కాగా "గుణమ్ + ఉక్తవాన్" = గుణమును చెప్పునది=గుణవచనము అని చెప్పి, శుక్ల, మొదలగు శబ్దమునే ఇచట విశేషణముగా గ్రహింపవలెను ॥135॥

అవతారిక— "వ్యాకరణముచేయు సంస్కారము వాక్యమునకే" అను పక్షమున వాక్యమందలి పదముల పరస్పర సంబంధమువలననే "శుక్లః - గుణః - అస్య - పటస్య" (ఈ బట్ట రంగు తెలుపు) అను రీతిని గుణవచనములకు నియతమైన లింగమును సంఖ్యయును తెలియుచుండును. అయినపుడు "విశేషణానామ్" ఇత్యాది సూత్రమెందులకు ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ శబ్దాంతరత్వాద్వాక్యేషు విశేషాద్యపి శ్రుతాః ।
వృత్తేరభిన్నరూపత్వాత్తేషు వృత్తిర్న విద్యతే ॥ 136

యద్యపి = ఆలోచింపగా, వాక్యేషు = వాక్యములందు, శబ్దాంతరత్వాత్ = వేరు శబ్దములగుట వలన, విశేషాః = ఆ యా లింగ సంఖ్యాభేదములు, శ్రుతాః = వినబడును, (తథాపి = అట్లయినను) వృత్తేః = వృత్తి, అభిన్నరూపత్వాత్ = ఏకరూపమగుటవలన, తేషు = ఆ విశేషములందు, వృత్తిః = వృత్తి, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— "వాక్యమందలి శబ్దములు వేరు. వృత్తియందలి శబ్దములు వేరు" అని ఇదివరకు పెక్కుసారులు చెప్పబడినది. కాగా - "శుక్లః - గుణః - అస్య - పటస్య"

అను వాక్యమందు లింగ సంఖ్యల విశేషములు స్పష్టముగ తెలిసినను, శుక్ల, అను గుణవచ నమునకు ''మతుప్'' అను తద్ధితమును చేసి తద్ధితవృత్తిని సంపాదింపదలచినపుడు మాత్రము ఆ విశేషములు తెలియవు. ఇట్టి చోటులందు వృత్తివిషయమున సామాన్యము (లింగ సామాన్యము - సంఖ్యాసామాన్యము) భాసించుటయే సహజము. అందుచే వృత్తియందు విశేష ములు తెలియుటకై ''విశేషణానామ్'' మొదలగు సూత్ర మావశ్యకము.

వివరణము— ఉన్నదున్నట్లుగ వాక్యమునే తీసికొని అందలి పదములకు ఆవశ్యకమైన సంస్కారములను చూపుటను వాక్యసంస్కార పక్షమందురు. ఇందు పదము లును పదార్థములును పరస్పరము కలిసియుండునుగాన ఆ యా లింగములును, సంఖ్యలును స్పష్టముగ తెలియుట కవకాశమున్నది. అయినను వృత్తి పదముల విషయము వేరు. వాక్య మునకును వృత్తికిని ఎట్టి పోలికలును లేవు. అది (వృత్తి) ఎల్లపుడును ఒకే తీరులో నుండును. వాక్యమందొక భాగముగా ఉన్నను దాని స్వభావము మారదు. అందుచే గుణవచనములకు చెందిన తద్ధితవృత్తియందు వెనుక చూపిన రీతిని సామాన్యమే స్ఫురించునుగాని విశేషములు స్ఫురింపవు. ఆ విశేషములను సాధించుటయే ''విశేషణానామ్'' అను సూత్రము చేయుపని. ॥136॥

అవతారిక— వృత్తియందు సామాన్యమే ప్రకాశించినను, అది ఏదోయొక విశే షము నాశ్రయించియే ప్రకాశించుట తప్పదు ఎట్టి విశేషమునులేని సామాన్యమన్నది ఉండదు అందుచే గుణవచనముల విషయమున సామాన్యముతోపాటు నియతమైన విశేషము కూడ తెలియుచుండుననుటయే సముచితము. దానివలన లింగసంఖ్యలు తెలియును. లేదా— ''శుక్లం పటాః'' మొదలగు ప్రయోగములలో, సమన్వయము కుదురదుగాన, అన్వయింపబోవు విశే ష్యము యొక్క లింగసంఖ్యలను వృత్తిపదము ముందుగనే ఆశించి నిరీక్షించుచుండు ననుటయు, పిదప (విశేష్యము తెలియగానే) ఆ లింగసంఖ్యలనే తాను స్వీకరించుననుటయును సమంజసము. వాస్తవమున విశేష్యముతోడి సంబంధము బహిరంగము. (అనగా తరువాత జరుగునది). అయినను సమన్వయము కుదురుటకై ఇట్లు చెప్పక తప్పదు. లేకున్నచో ముందుగలేని విశేషములను ''విశేషణానామ్'' మొదలగు సూత్రము మాత్రమెట్లు సాధింప గలదు ? - కాగా ఎట్లు చెప్పినను సూత్రము నిష్ఫలమని తోచును. అను వాదమునకు రెండు కారికలతో సమాధానము చూపుచున్నాడు.

శ్లో॥ రూపాచ్ఛబ్దసంస్కారః సామాన్యవిషయో యతః ।
తస్మాత్తదాశ్రయం లింగం వచనం చ ప్రసజ్యతే ॥ 137

శ్లో॥ సలింగంచ ససంఖ్యంచ తతో ద్రవ్యాభిధాయినా ।
సంబధ్యతే పదం తత్ర తయోర్భిన్నా శ్రుతిర్భవేత్ ॥ 138

యతః = ఎందువలన, రూపాత్ = స్వరూపమును బట్టి, శబ్దసంస్కారః = శబ్దమునకు జరుగు వ్యాకరణకార్యము, సామాన్యవిషయః = సామాన్యమే విషయముగా గలది, (భవతి=

అగునో), తస్మాత్ = అందువలన, తదాశ్రయమ్ = సామాన్యము నాశ్రయించిన, లింగమ్= లింగమును, వచనమ్ + చ = సంఖ్యయు, ప్రసజ్యతే = ప్రాప్తించును.

తతః = తరువాత, సలింగమ్ + చ = అట్టి లింగముతో కూడినట్టియు, ససంఖ్యమ్ + చ = సంఖ్యతో కూడినట్టి, పదమ్ = వృత్తిపదము, ద్రవ్యాభిధాయినా = ద్రవ్యమును చెప్పు పదముతో, సంబధ్యతే = కలియును, తత్ర = అచట, తయోః = ఆ రెండు పదములందును, భిన్నా = వేరయిన, శ్రుతిః = లింగసంఖ్యలు వినబడుట, భవేత్ = అయ్యెడిని.

తాత్పర్యము— వృత్తిపద మెల్లప్పుడును ఒకే స్వరూపముతో ఉండును. దానిని బట్టియే సంస్కారము జరుగుట సముచితము శుక్ల మొదలగు గుణవచనములకు "మతుప్" అను తద్ధిత సంస్కారమును చేయునపుడు, "శుక్లః - అస్య - అస్తి" అను రీతిని సామాన్యమే (తెలుపుగలది = ఏ వస్తువైనను - అను భావము) ఉపస్థితమగును. తదనుసారము సామాన్య నపుంసకమును సామాన్యమగు ఏకత్వమును మాత్రమే వచ్చును. తరువాత "పటః" మొదలగు ద్రవ్యవిశేషమును చెప్పు పదముతో సంబంధము కలుగును. అయినను మొదటి సంస్కారమట్లే యున్నందున, "శుక్లం పటః" అని వేర్వేరు లింగసంఖ్యలు వినబడుట కవకాశము గలదు. దానిని వారించుటకే "విశేషణానామ్" ఇత్యాది సూత్ర మావశ్యకము.

వివరణము— "శుక్లః - అస్య - అస్తి" అనునది వాస్తవముగ వాక్యము. వృత్తిని వివరించుటకు ఉపాయముగ మాత్రమే దానిని తీసికొందురు. గుణవచనముల విషయమున "శుక్ల" (శుక్లమత్ ⟶ శుక్లవత్ ⟶ మతుప్పునకు లోపము = శుక్ల) మొదలగునవియే సత్యమైన వృత్తిరూపములు. వీనిని సంస్కరించునపుడు తొలిదశలో "తెలుపు గలది" అనియే తెలియునుగాని ఆ వస్తువేదో తెలియదు. అనగా సామాన్యమే తోచునుగాని విశేషము తోచదు. పిదప "పట" మొదలగు ఆయా విశేషమును చెప్పు పదములను కలుపుట సహజమైన క్రమము. అందువలన సామాన్యదశలో ప్రవర్తించిన కార్యమును విశేషదశలో మార్చుటకు సూత్ర మావశ్యకమగునని సారాంశము. ॥138॥

అవతారిక— ద్రవ్యవాచకము యొక్క లింగసంఖ్యలు బహిరంగములైనను సూత్రముయొక్క సామర్థ్యమువలన గుణవాచకమునకు రాగలవని సమర్థింపుచున్నాడు.

శ్లో॥ భావినో బహిరంగస్య వచనాదాశ్రయస్య యే ।
లింగసంఖ్యే గుణానాం తే సూత్రేణ ప్రతిపాదితే ॥ 139

బహిరంగస్య = వెలుపల ఉన్నటువంటిన్ని, భావినః = రాబోవునటువంటిన్ని, ఆశ్రయస్య= ఆధారమైన ద్రవ్యముయొక్క, యే = ఏ, లింగసంఖ్యే = లింగమును సంఖ్యయుగలవో, తే = అవి, గుణానామ్ = గుణవాచకములకు, సూత్రేణ = సూత్రముతో, వచనాత్ = చెప్పుటవలన, ప్రతిపాదితే = సంపాదింపబడినవి.

తాత్పర్యము— ఒక పదమును సంస్కరించు క్షణమున రెండవ పదముయొక్క సంస్కారము అసంభవము (రెండును ఒకే క్షణమున జరుగవు). గుణవాచకములను సంస్కరించునపుడు గుణివాచకముల ప్రసక్తి యుండదు ఈ విధముగ గుణవాచకముల సంస్కారము అంతరంగమును (ముందు జరుగునది) గుణివాచకముల సంస్కారము బహిరంగమును (తరువాత జరుగునది) అగును. అయినను గుణవాచకములను సంస్కరించు సమయములోనే, "ఆధారమైన ద్రవ్య విశేషమొకటి యుండక తప్పదు" అను భావము కలుగుసుగాన ద్రవ్య విశేషము కూడ సిద్ధముగ ఉన్నట్లే అనిపించును. దీనికి చెందిన లింగసంఖ్యలే ముఖ్యము లగును. అవియే శుక్ల, మొదలగు గుణవాచకములకు సంబంధించును. "విశేషణానామ్" అను సూత్రమును ప్రత్యేకముగ ఆరంభించినందువలన ఈ తీరు సిద్ధించును. అనగా బహిరంగము యొక్క లింగసంఖ్యలు అంతరంగముయొక్క లింగసంఖ్యలను త్రోసివేయును.

వివరణము— వ్యాకరణ కార్యములను చేయుటకై మొదట తీసికొనబడు పదము వర్తమానమును అంతరంగమును అగును. తరువాత స్వీకరింపబడునది భావియు బహిరంగ మును అగును. గుణవాచకముల సంస్కారము అంతరంగముగను, వానితో సంబంధించు ద్రవ్యవాచకముల సంస్కారము బహిరంగముగను ఇచట భావింపబడెను. ఇది కేవలము బుద్ధిగమ్యమైన క్రమము. ॥139॥

అవతారిక— మీది కారికలో చెప్పినట్లు గుణవచనములకు చేరు తద్ధితప్రత్యయము వలన ద్రవ్యవిశేషము కూడ తెలియుట అభిమతమైనచో, "విశేషణానామ్" ఇత్యాది సూత్ర మును వేరుగ ఆరంభించుట ఎందుకు ? - అను శంకకు సమాధానము చూపుచున్నాడు.

శ్లో॥ విశేషవృత్తే రపి చ రూపాభేదాదలక్షితః ।
యస్మాద్విశేషస్తేనాత్ర భేదకార్యం న కల్పతే ॥ 140

యస్మాత్ = ఎందువలన, రూపాభేదాత్ = రూపభేదము లేనందువలన, విశేషవృత్తేః + అపి + చ = విశేషమును సూచించునట్టి వృత్తిపదము వలన కూడ, విశేషః = ద్రవ్య విశేషము, అలక్షితః = స్పష్టముగ తెలియబడదో, తేన = అట్టి విశేషముచే, భేదకార్యమ్ = లింగ సంఖ్యల భేదము, న + కల్పతే = సిద్ధింపదు.

తాత్పర్యము— "ఏదో యొక ద్రవ్యవిశేషము" అను స్ఫూర్తియే కలుగునుగాని, ఆ వస్తువేదో స్పష్టముగను నిశ్చితముగను తెలియదు. అట్టి అనిశ్చితమైన విశేషముయొక్క లింగసంఖ్యలు సామాన్యమైన గుణవాచకమునకు సంక్రమించుట సంభవింపదు. కావున లింగ సంఖ్యలు సిద్ధించుటకై వేరుగ సూత్రము నారంభింపవలెను. ॥140॥

అవతారిక— సామాన్యమన్నది (అన్ని విశేషములందును ఒకే తీరులో ఉండునని భావింపబడు ధర్మము) ఎట్టి విశేషమును ఆశ్రయింపకుండ ఉండుట అసంభవము. ఏదో ఒక విశేషమును స్వీకరించియే సామాన్యమును నిరూపింప శక్యమగును. కాగా ఆ విశేషమునకు

చెందు కార్యములు సామాన్యమునకును ప్రవర్తించుటలో ప్రతిబంధక మేమి ? – అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ విశేష ఏవ సామాన్యం విశేషాద్భిద్యతే యతః ।
అభేదో హి విశేషాణామాశ్రితో వినివర్తకః ॥ 141

యతః = ఎందువలన, విశేషాత్ = విశేషమునుండి, భిద్యతే = వేరుచేయబడునో, (తతః = అందువలన), సామాన్యమ్ = సామాన్యము, విశేషః + ఏవ = విశేషమే, (భవతి = అగును), విశేషాణామ్ = విశేషములను, వినివర్తకః = తొలగించు, అభేదః = అభేదము (విశేషముల భేదము లేకుండుట) ఆశ్రితః + హి = అవలంబింపబడెను గదా !

తాత్పర్యము— ఒండొరులను వేరుచేసికొను ఆ యా వ్యక్తులు విశేషములన బడును. వేరొక వ్యక్తిని వేరుచేసి నిశ్చితముగ చూపుటయే విశేషముయొక్క ముఖ్యలక్షణము ఈ తీరున సామాన్యము కూడ విశేషమే కావచ్చును. విశేషము లన్నింటియొక్కయు అభేదము (విశేషముల భావనము నశించుట) సామాన్యమగును. ఇదియు విశేషములన్నింటిని దగ్గరకు రానీయక వేరుచేయునుగాన ముఖ్యలక్షణము ననుసరించి విశేషమే యగునుగదా ! అందుచే సామాన్యము నాశ్రయించినపుడు విశేషములన్నియు నివర్తించును. కాగా విశేషముయొక్క కార్యములు సామాన్యమునకు రావు.

వివరణము— "నిర్విశేషం న సామాన్యమ్" (విశేషములేని సామాన్యముండదు) అను పెద్దల వచనమొకటి యున్నది. దాని ననుసరించి శంక బయలుదేరినది. కాని "సామాన్యమపి యథా విశేషః తద్వత్" (సామాన్యము కూడ ఒక విధమైన విశేషమే) అను వచనము గూడ కలదు. తదనుసారమిచట సమాధానము చూపబడినది. ॥141॥

అవతారిక— "సామాన్యము కూడ విశేషమైనచో సామాన్యముయొక్క స్వరూప స్వభావములను తెలిసికొనుట మిక్కిలి కష్టమగును" అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యద్యదాశ్రీయతే తత్తదన్యస్య వినివర్తకమ్ ।
భేదాభేదవిభాగస్తు సామాన్యే న నిరూప్యతే ॥ 142

యత్ + యత్ = ఏది ఏది, ఆశ్రీయతే = స్వీకరింపబడునో, తత్ + తత్ = అది అది, అన్యస్య = వేరొకదానికి, వినివర్తకమ్ = తొలగించునది (భవతి = అగును), భేదాభేద విభాగః + తు = భేదము, అభేదము అను విభాగమైతే, సామాన్యే = సామాన్యము విషయమున, న + నిరూప్యతే = స్పష్టముగా చెప్పబడదు.

తాత్పర్యము— ఒక శబ్దమును ప్రయోగించుట వేరొక శబ్దమును వారించుటకే (అనగా – ఆ సందర్భమున ఆ శబ్దమే యుండవలయునుగాని వేరొకటి ఉండరాదనుట).

అట్లు సామాన్యము కూడ విశేషమువలెనే ఒకప్పుడు వ్యావర్తకము కావచ్చును. అంతమాత్ర మున సామాన్యమును భేదమనిగాని అభేదమనిగాని నిర్దిష్టముగా చెప్పజాలము.

వివరణము— విశేషములందు నియతముగ కనబడుచుండునుగాన సామాన్యమును భేదమని చెప్పుట కష్టము. ఒకచో వ్యావర్తకము కూడ అగుచుండునుగాన అభేదమని చెప్పుటయు కష్టమే.

కాగా శుక్ల, మొదలగు శబ్దములకు సామాన్యమైన ముఖ్యార్థమందు సంస్కారము జరిగి, పిదప విశేషములతో సంబంధము కలిసినపుడు లింగ సంఖ్యాభేదము ప్రాప్తించుచుండగా ("శుక్లం - పటాః" - అని) దానిని వారించుటకై "విశేషణానామ్" ఇత్యాది సూత్రమావశ్యకమని ఫలించును. ॥142॥

అవతారిక— ప్రసిద్ధమైన వస్తువులకు స్పష్టమైన రూపమొకటి ఉండును. దానిని బట్టి "సామాన్యమ"ను అనుగతమైన ధర్మము నొకదానిని చెప్పుటకు వీలు పడును. కాని శబ్దములవలన తెలియు అర్థములకు సామాన్యమన్నది ఎట్లు కుదురును? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ అపోద్ధారశ్చ సామాన్యమితి తస్యోపకారిణః ।
నిమిత్తావస్థమేవాత స్తత్ స్వధర్మేణ గృహ్యతే ॥ 143

అపోద్ధారః + చ = అపోద్ధారమే, (వేరుచేయుట —లేక— విడిగా చూపుట) సామాన్యమ్ + ఇతి + అతః = సామాన్యమగుట వలన, ఉపకారిణః = సాయముచేయు, తస్య = ఆ సామాన్యము యొక్క, నిమిత్తావస్థమ్ = నిమిత్తమందు ఉనికిగల, తత్ + ఏవ = ఆ స్వరూపమే, స్వధర్మేణ = తన స్వభావముచే, గృహ్యతే = నిశ్చయింపబడును.

తాత్పర్యము— సంపూర్ణమైన యర్థమును బోధించునది వాక్యమే. అయినను స్పష్టతకొరకై పదములను వాని యర్థములను వేరుగ ఎత్తి చూపుదురు. ఈ తీరు "అపోద్ధారము" అనబడును. పదముల విషయమున సామాన్యమనగా ఇదియే. ఇది వాక్యమునకు సాయముచేయుచుండును. కాగా వేరుచేయబడు పదముయొక్క అర్థము సామాన్యరూపముగనే తెలియబడును అనగా "వాక్యార్థము పూర్తియగుటకుగాను, ఈ పదార్థమునకు వేరొక పదార్థము యొక్క ఆకాంక్ష గలదు" అను సామాన్యభావమే అవగతమగునుగాని, పదార్థము యొక్క విశేషములైన లింగ సంఖ్యలతోడి సంబంధము ఏర్పడదు.

వివరణము— పదార్థముల పరస్పర సంబంధమే వాక్యార్థము. ఆ సంబంధము నుండి పదార్థమును విడదీయుట అపోద్ధారము. ఇది జరిగినపుడు పదార్థము సామాన్యరూపముగనే భాసించును. ("ఇది ఆకాంక్షగల ఒక పదార్థము" అను తీరులోనే తెలియును). కాని పదార్థముయొక్క లింగము, సంఖ్య మొదలగు విశేషములు తెలియవు. పదార్థములకుగల సామాన్యమనగా ఇదియే. (పదార్థము = పదముయొక్క అర్థము). ॥143॥

అవతారిక— నియతస్వరూపముగల ఆయా వాక్యములందే పదములుండును గదా ! అయినపుడు వాని యర్థములును నియతములై విశేషములే యగునుగాని సామాన్యము లెట్లు కాగలవు ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ అనిర్ధారితధర్మత్వాద్భేదా ఏవ వికల్పితాః ।
నిమిత్తైర్వ్యపదిశ్యంతే సామాన్యాఖ్యా విశేషితాః ॥ 144

అనిర్ధారితధర్మత్వాత్ = నిశ్చయముకాని ధర్మములు గలవగుటవలన, భేదాః + ఏవ = భేదములే, నిమిత్తైః = ఆయా నిమిత్తములచే, వికల్పితాః = కల్పింపబడి, సామాన్యాఖ్యా విశేషితాః = సామాన్యమను పేరుగలవై, వ్యపదిశ్యంతే = వ్యవహరింపబడును.

తాత్పర్యము— పదములవలన తెలియు అర్థములు తొలుత విడివిడిగను, సామాన్యరూపముగను భాసించును. వేరొక పదముతో సంబంధము కలిగినపుడు వచ్చు విశేషార్థము లేవియు ప్రారంభమున తెలియవు. అందువలన విడిగా ఉండు ఆయా అర్థములనే సామాన్యమను పేరుతో వ్యవహరింతురు.

వివరణము— ప్రవృత్తి నిమిత్తమునుబట్టి (శబ్దమును వాడుటలో ముఖ్య హేతువైన ధర్మము - జాతి, గుణము, క్రియ). శబ్దమొక యర్థమును బోధింపవచ్చును. ఉదా : గో (గోత్వమను జాతి), శుక్ల (తెలుపు అను గుణము), పాచక (వంట అను క్రియ). అది భేదరూపమే. అయినను వాక్యమందు వేరొక పదముతో సంబంధమేర్పడినపుడు వచ్చు విశేషార్థములను విడిగా ఏ శబ్దమైనను బోధింపజాలదు. కావున సామాన్యముగ భాసింపుచున్నందున భేదములనే ''సామాన్యము''లని చెప్పుదురు. ఇదియొక విధమైన కల్పనము.

విశేష విషయములు— గో శబ్దము తన యర్థమును చెప్పి వేరొక యర్థమును వారించును కాన అది భేదమే. అయినను గోశబ్దము తొలుత ''గోసామాన్యము'' అను భావమునే కలుగజేయునుగాని, గోవిశేషములను (అనగా తెల్ల ఆవుగాని, రాముని ఆవుగాని, యజ్ఞధేనువుగాని, రక్షింపవలసిన ఆవునుగాని - ప్రకరణము తెలియక) తెలియజేయ జాలదు. ఈ తీరునుబట్టి శబ్దార్థములన్నియు ప్రారంభమున సామాన్యములనియే చెప్పబడునని యిచటి సారాంశము.

కాగా విశేషణములకు లింగము, సంఖ్య అను విశేషములు సిద్ధించుటకై ''విశేషణానామ్'' ఇత్యాది సూత్ర మావశ్యకమని ఇంతవరకు (134 నుండి 144 వ కారిక) సమర్థింపబడినది. ఈ సందర్భమంతయు సూత్రమును సమర్థించుటకై బయలుదేరిన కల్పనమే. వాస్తవమున పదములును పదార్థములును అసత్యములు. వాక్య వాక్యార్థములే పరమ సత్యమన్నది సిద్ధాంతము. ॥144॥

అవతారిక— ''విశేష్యము ననుసరించి విశేషణములకును లింగసంఖ్యలు సహజముగనే సిద్ధించును. అందుకు వేరుగ ''విశేషణానాం చాజాతేః'' (1-2-52) అను

సూత్ర మక్కరలేదు." అని భాష్యకారు డీ సూత్రమును ప్రత్యాఖ్యానము చేసెను. ఆ విషయ మును ప్రకృతము విశదము చేయుచున్నాడు.

శ్లో॥ యదా తు వ్యపదిశ్యేతే లింగసంఖ్యే స్వభావతః ।
ప్రయోగేష్వేవ సాధుత్వం వాక్యే ప్రక్రమ్యతే తదా ॥ 145

ప్రయోగేషు + ఏవ = పదములు ప్రయోగింపబడుచున్నపుడే, వాక్యే = వాక్యమందు, సాధుత్వమ్ = సాధుత్వము, యదా + తు = ఎప్పుడైతే, ప్రక్రమ్యతే = ప్రారంభింప బడునో, తదా = అపుడు, లింగసంఖ్యే = లింగమును సంఖ్యయు, స్వభావతః = స్వభావ మును బట్టి, వ్యపదిశ్యేతే = వచ్చునని చెప్పబడును.

తాత్పర్యము— వాక్యదశయందే - పదముల సాధుత్వమునకై వ్యాకరణ సంస్కా రము చేయవలయునని యొక పక్షము. అందు విశేష్యముతో సామానాధికరణ్యము (ఒకే యర్థమును చెప్పుట) సిద్ధించుటకు, అద్దాని లింగసంఖ్యలు విశేషణమునకును సహజముగనే సంక్రమించును.

వివరణము— వాక్య సంస్కారపక్షమున వాక్యములోని పదము లన్నింటికిని ఒకేసారిగ ఆవశ్యకమైన కార్యములు ప్రవర్తించును. "ఇది అంతరంగము", "ఇది బహి రంగ కార్యము" అను ప్రసక్తి యుండదు. కాగా - సామానాధికరణ్యము ననుసరించి, విశే ష్యము యొక్క లింగసంఖ్యలే విశేషణమునకును సంక్రమింపక తప్పదు. "శుక్లాః పటాః" అను రీతినే ప్రయోగములుండును. వేరుగ "విశేషణానామ్" మొదలగు సూత్ర మక్కరలేదు.

విశేష విషయములు— పద సంస్కారపక్షము వెనుక చూపబడినది. అందు గుణమునకును గుణముగల ద్రవ్యమునకును భేదము నాశ్రయించి, ఆ ద్రవ్యమును బోధించు టకై గుణవాచకమునకు "మతుప్" అను తద్ధిత ప్రత్యయమును దానికి లోపమును విధింప బడినది. అపుడు విశేష్యముయొక్క లింగసంఖ్యలు విశేషణమునకు సంక్రమించుటకు సూత్ర మావశ్యకమయ్యెను.

ప్రకృతము వాక్య సంస్కారపక్షము స్వీకరింపబడినది. ఇందు గుణమునకును గుణికిని (ద్రవ్యము) అభేదమును ("గుణమును, అది గల ద్రవ్యమును ఒకటే" అను భావన) చెప్పుదురు. అందువలన శుక్ల మొదలగు గుణవాచకములు తొలుతనే ద్రవ్యమును బోధించును గాన ద్రవ్యముయొక్క లింగసంఖ్యలే వీనికిని వచ్చును. అందువలననే ఈ పక్షమందు ద్రవ్య మును చెప్పుటకై వేరుగ తద్ధితమక్కరలేదు. లింగసంఖ్యలు సిద్ధించుటకు వేరుగ సూత్రమును అక్కర లేదు. కాగా పద సంస్కారపక్షమున గుణవాచకములకు తద్ధితవృత్తి జరుగుననియు, (భేదమున్నందున), వాక్య సంస్కార పక్షమున తద్ధితవృత్తి జరుగదనియును (అభేదముకాన) ఫలించును. ఉదా : "శుక్లః పటః" తెలుపు రంగుగల బట్ట ; తెల్లని బట్ట ; తెల్ల బట్ట. (ఇది పదసంస్కారము). "శుక్లః పటః" = తెలుపు బట్ట. (ఇది వాక్య సంస్కారము). తెలుగున తెల్లని, తెల్ల మొదలగునవి గుణవాచకములు. తెలుపుగలవి అని యర్థము తెలుపు గుణవాచ కము. ఇందు తెలుపునకును తెల్లనిది అను దానికిని అభేదము. ॥145॥

అవతారిక— గుణమునకును గుణముగల ద్రవ్యమునకును భేదము నాశ్రయించి నపుడు గుణవాచకమునకు మతుప్ ప్రత్యయమును దానికి లోపమును ఆవశ్యకమని ఇదివరకు విశదమైనది. అయినను జాతి విషయమున ఈ తీరును ఊహింపనక్కరలేదు. ''జాతి వేరు - గుణము వేరు'' అగుటయే అందుకు కారణమని ప్రతిపాదింపుచున్నాడు.

శ్లో॥ తత్ర ప్రయోగోఽనియతో గుణానామాశ్రయైః సహ ।
సామాన్యం యత్తదత్యంతం తత్రైవ సమవస్థితమ్ ॥ 146

తత్ర = అచట, గుణానామ్ = గుణములకు, ఆశ్రయైః + సహ = ఆధారములైన ద్రవ్యములతో కలిసి, ప్రయోగః = ప్రయోగము, అనియతః = నిశ్చితము కాదు, సామాన్యమ్ = సామాన్యము, యత్ = ఏది గలదో, తత్ = అది, అత్యంతమ్ = ఎల్లపుడును, తత్ర + ఏవ = అచటనే (ద్రవ్యమందే), సమవస్థితమ్ = నిశ్చితముగా ఉండునది, (భవతి = అగును).

తాత్పర్యము— తెలుపు, నలుపు, మొదలగు గుణములు ద్రవ్యమందెల్లపుడును నియతముగ నుండునవి కావు. అవి ఒకప్పుడుండును. మరొక్కప్పుడు పోవును. అందుచే వానికిని ద్రవ్యములకును భేదమునుగాని అభేదమునుగాని ఇష్టానుసారముగ చెప్పవచ్చును. ఉదా : ''పటస్య శుక్లః'' (బట్టయొక్క తెలుపు). ఇది భేదము. ''శుక్లః పటః'' (తెల్లబట్ట). ఇది అభేదము. కాని సామాన్యము —లేక— జాతి అన్నది విడదీయుటకు వీలులేకుండ, ఎల్లపుడును ద్రవ్యముతో కలిసియే యుండును. (అనగా గోత్వములేని గోవు ఉండదు అని యర్థము) ఉదా : గౌః. (గోత్వమను జాతిగల ఒక వ్యక్తి). అందువలన జాతి విషయమున అభేదమేగాని భేద మెప్పుడును పొసగదు.

వివరణము— కాగా గుణవాచకముల విషయమున భేదమును చెప్పదలచినపుడు, మతుప్ ప్రత్యయము యొక్క లోపమును లింగసంఖ్యలు సిద్ధించుటకు ''విశేషణానామ్'' ఇత్యాది సూత్రమును ఆవశ్యకమగునని ఫలించును. ॥146॥

అవతారిక— పైది కారికయొక్క అర్థమునే విశదపరచుచున్నాడు

శ్లో॥ న గోత్వం శాబలేయస్య గౌరితి వ్యపదిశ్యతే ।
శుక్లత్వం బాహులేయస్య శుక్ల ఇత్యపదిశ్యతే ॥ 147

శాబలేయస్య = శాబలేయము యొక్క, గోత్వమ్ = గోత్వమను సామాన్యము, గౌః ఇతి = గోవు అని, న + వ్యపదిశ్యతే = చెప్పబడదు, బాహులేయస్య = బాహులేయము యొక్క, శుక్లత్వమ్ = శుక్లత్వమను గుణము, శుక్లః ఇతి = ''బాహులేయము యొక్క తెలుపు'' అని, అపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ''శాబలేయః గౌః'' అని అభేదమును చూపియే గోత్వమను సామాన్యమును నిర్దేశింతురు. ''బాహులేయస్య శుక్లః'' అని భేదమును చూపియు శుక్లత్వమను గుణమును నిర్దేశింపవచ్చును. (''శుక్లః బాహులేయః'' అన్నది అభేదపక్షమున ప్రయోగము).

వివరణము— "త్వ" అనునది భావమును తెలుపు ప్రత్యయము. (ఉదా : గోః- భావః = గోత్వమ్, ఘటస్య - భావః = ఘటత్వమ్, మొదలగునవి). అది యున్నపుడే ఒక వ్యక్తికిచెందిన జాతిని స్పష్టముగ చెప్పుటకు వీలుపడును. ఉదా : గోత్వము = గోవునందలి జాతి. ఆ ప్రత్యయము లేనపుడు జాతికిని వ్యక్తికిని అభేదము నాశ్రయించియే జాతిని చూప వలెను. ఉదా : గౌః = గోత్వమను జాతిగల వ్యక్తి (ఒక ఎద్దు) ఈ పదముయొక్క విశే షణములు కూడ దీని ననుసరించియే యుండును. ఉదా : శాబలేయః గౌః. (శబలయొక్క సంతతి కాగా జాతి విషయమున అభేదము తప్పదు.

గుణము విషయమట్టిది కాదు. అచట భేదమును గూడ చూపుటకు వీలున్నది. ఉదా : బాహులేయస్య శుక్లః. అందువలననే భేదపక్షమున గుణవాచకములకు మతుప్ ప్రత్య యమును లోపమును విధింపబడినవి

"శబలాయాః అపత్యమ్ పుమాన్" అను విగ్రహమున "శాబలేయః" అను రూప మగును. (చిత్రవర్ణముగల ఆవుయొక్క దూడ) ఇట్లే "బాహులేయః" అనునది ఏర్పడును. (నల్ల ఆవుయొక్క దూడ) "గోత్వము" అను జాతిని వేరుచేసి, "గోవు" (గౌః) అని చెప్పరు. కాని గుణమును వేరుచేసి, "శుక్లము" (శుక్లః) అని చెప్పుదురు. (బాహులేయస్య శుక్లః బాహులేయము యొక్క తెలుపు). జాతికిని గుణమునకును ఇట్టి భేదము కూడ వ్యవ హారములో ఉన్నది. ॥147॥

అవతారిక— అట్లు చెప్పనిచో వచ్చు దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ వ్యతిరేకే చ సత్యేవం మతుపః శ్రవణం భవేత్ ।
లుగన్వాఖ్యాయతే తస్మాద్రసాదిభ్యశ్చనాస్తి సః ॥ 148

ఏవమ్ = ఇట్లు, వ్యతిరేకే + చ = భేదము కూడ, సతి = ఉండగా, మతుపః = మతుప్పునకు, శ్రవణమ్ = వినికిడి, భవేత్ = కావలసివచ్చును, తస్మాత్ = అందువలన, లుక్ = లుక్కు, అన్వాఖ్యాయతే = చెప్పబడును, రసాదిభ్యః + చ = రస, మొదలగు శబ్దముల విషయమున, సః = అలుక్కు, న + అస్తి = లేదు

తాత్పర్యము— గుణమునకును ద్రవ్యమునకును భేదమును వివక్షించినపుడు, "పటస్యశుక్లః" అను వ్యవహారమున్నది. అభేదమును చెప్పదలచినపుడు కూడ "శుక్లః" (పటః) అను ప్రయోగమే సిద్ధించుటకుగాను మతుప్పును దానికి లోపమును చెప్పబడినది. (లేకున్నచో "మతుప్పు" వినిపింపవలసి యుండును - శుక్లవాన్). కావుననే అచట ఆ ప్రత్య యము లేకున్నను దాని యర్థము స్ఫురించుచుండును.

అయితే రస, రూప, మొదలగు కొన్ని శబ్దములకు ఇదే అర్థములో మతుప్ ప్రత్య యము ప్రవర్తించును. కాని దానికి లుక్కు మాత్రము రాదు. ॥148॥

. శివతారిక— రస, మొదలగు శబ్దములు మతుప్ ప్రత్యయము లేనపుడు ఆశ్రయ మగు వస్తువును బోధింపజాలవని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ యతోఽయమితి సంబంధా ద్రూపాభేదేన వర్తతే ।
శుక్లాదివత్తతో లోప స్తద్రసాదౌ న విద్యతే ॥ 149

సః + అయమ్ + ఇతి = "అదే ఇది" అను, సంబంధాత్ = సంబంధమువలన, రూపాభేదేన = రూపముయొక్క అభేదముచే, యత్ = ఏది, వర్తతే = ఉన్నదో, తత్ = అది, శుక్లాదివత్ = శుక్ల, మొదలగు శబ్దములందువలె, రసాదౌ = రస, మొదలగు శబ్దములందు, న + విద్యతే = లేదు, తతః = అందువలన, లోపః = లోపము, న = లేదు.

తాత్పర్యము— "అదే యిది" అను అభేదభావనమువలన శుక్లాది శబ్దములు ద్రవ్యమును కూడ బోధించు అవకాశము ఒకప్పుడు కలదు. ఉదా : శుక్లః పటః (తెల్లబట్ట) ఈ సందర్భమందే భేదమును పాటించినపుడు అన్వయము కుదురుటకై శుక్లాది శబ్దములకు "మతుప్పు" అనియు దానికి లుక్కు అనియు చెప్పుదురు.

కాని రస, (రుచి), గంధ (వాసన), మొదలగు శబ్దములు కొన్ని యున్నవి. శుక్లాదులకు వర్తించు తీరు వీనికి వర్తింపదు. ఇవి సహజముగ తమ తమ యర్థములను మాత్రమే బోధించునుగాని, వాని కాధారములైన ద్రవ్యములను బోధింపజాలవు. ద్రవ్యములను తెలుపవలెనన్నచో, రసాది శబ్దములకు మతుప్పును తప్పక చేయవలెను. ఉదా : రసవాన్ = రుచిగల వస్తువు గంధవాన్ = వాసనగల వస్తువు. అందువలననే రసాది శబ్దములకు ప్రవర్తించు మతుప్పునకు లోపము జరుగదు.

వివరణము— శుక్ల, మొదలగు శబ్దములు మతుప్ ప్రత్యయము లేకున్నను, "అది గల వస్తువు" అను నర్థమును బోధింపగలవు. రస, గంధ, మొదలగు కొన్నింటికి మాత్ర మట్టి సామర్థ్యము లేదు. అది శబ్దశక్తి యొక్క వైచిత్ర్యము. అందువలన "అది గలది" అను భావము కావలసినపుడు రసాది శబ్దములకు మతుప్పును చేయక తప్పదు. దానికి లోపమును చేయరాదు.

విశేష విషయములు— "రసాదిభ్యశ్చ" (5-2-95) అను సూత్రము రసాదులకు మతుప్పును విధించినది. ఈ ప్రత్యయము "అది గలది" అను నర్థమున ప్రవర్తించు - ఈ ప్రకరణమందలి ఇతర ప్రత్యయములను రాకుండ అడ్డివేయును. (ఇన్, ఠక్ = ఇక, మొదలగునవి ఇతర ప్రత్యయములు. అవి రావు). ఈ యంశము నిచట తెలియవలెను. "రూపిణీ" మొదలగు ప్రయోగములలో రూపశబ్దమునకు సౌందర్య మర్థము. "కంటికి కనబడు ఆకారము" అని కాదు. కాన అచట "ఇన్" ప్రత్యయము రావచ్చును. అట్లే "రసికః" అనుచోట రస శబ్దమునకు "శృంగారము" అని యర్థముకాని "రుచి" అని కాదు. కాన "ఇక" (ఠక్) ప్రత్యయము రావచ్చును. కాగా గుణవాచకములైన రసాది శబ్దములకే మతుప్పు వచ్చుననుటయు సమంజసమే. ॥149॥

అవతారిక— ఇట్లు వాక్యసంస్కార పక్షమందు "అదే యిది" అను అభేదమును భావించుటవలన, గుణవాచకములు ఆయా గుణముగల ద్రవ్యమును కూడ బోధించునుగాన ద్రవ్యముయొక్క లింగసంఖ్యలు వానికిని సహజముగ సిద్ధించును. అందుకొరకై "విశేషణానామ్" ఇత్యాది సూత్ర మక్కరలేదు - అని యింతవరకు ప్రతిపాదింపబడెను. అయినను వాక్యసంస్కార పక్షమందు కూడ పై సూత్రముయొక్క ఉపయోగముండునని విశదీకరించుటకు ప్రయత్నించుచున్నాడు.

శ్లో॥ ఆవేశో లింగసంఖ్యాభ్యాం క్వచిన్మంచాదివత్ స్థితః ।
సోఽయమిత్యభిసంబంధే స ప్రష్ఠాదౌ న విద్యతే ॥ 150

సః + అయమ్ + ఇతి = "అదే యిది" అని, అభిసంబంధే = సంబంధమును చూపునపుడు, లింగసంఖ్యాభ్యామ్ = లింగసంఖ్యలతో, ఆవేశః = ఆవేశము (సంక్రమించుట) మంచాదివత్ = మంచ, మొదలగు శబ్దములందువలె, క్వచిత్ = ఒకానొకచోట, స్థితః = ఉన్నది, సః = ఆ ఆవేశము, ప్రష్ఠాదౌ = ప్రష్ఠ, మొదలగు శబ్దముల విషయములో, న + విద్యతే = లేదు.

తాత్పర్యము— "అదే యిది" అను అభేద సంబంధమును చెప్పిన స్థలములలో కొన్నిచోట్ల, ఆరోపింపబడు వస్తువుయొక్క లింగమును సంఖ్యయు మారకుండుటయు, మరి కొన్నిచోట్ల అవి మారుటయును ప్రయోగములలో కనబడుచున్నది. మంచ, మొదలగు శబ్దముల విషయములో లింగసంఖ్యలు మారవు. ప్రష్ఠ, మొదలగు శబ్దముల విషయములో అవి మారును.

వివరణము— మంచ, శబ్దమునకు "మంచము" అని యర్థము. అది పుంలింగము సామాన్యముగ బహువచనాంతము. అభేదమును భావించి మంచమందుండు వస్తువులనుగాని వ్యక్తులనుగాని, "మంచ" శబ్దముతోనే బోధింపవచ్చును. అయినను మంచ శబ్దము తన లింగసంఖ్యలను విడువదు. ఉదా: "మంచాన్ = యువతీః - వాసాంసి - వా - పశ్య" (మంచములైన— అనగా - మంచమందుండు యువతులనుగాని బట్టలనుగాని చూడుము). ఇచట యువతి శబ్దము స్త్రీలింగము వాసస్, శబ్దము నపుంసకము. అయినను మంచ శబ్దముయొక్క లింగసంఖ్యలలో మార్పు ఉండదు "ప్రష్ఠ" శబ్దము విషయములో ఈ తీరు లేదు. అచట ఆరోపమును పొందు వస్తువును బట్టియే లింగసంఖ్య లుండును. ప్రష్ఠః = ముందుండువాడు (పుంలింగము. ఏకవచనము). ఈ ప్రష్ఠత్వమను ధర్మమును స్త్రీయందారోపించునపుడు "ప్రష్ఠీ" అను రూపమగును. (ప్రష్ఠస్య - స్త్రీ = ప్రష్ఠయగు ప్రష్ఠుని భార్య) స్త్రీలింగమును ఆవశ్యకమగు వచనమును ప్రవర్తించును.

విశేష విషయములు— లింగముయొక్కయు సంఖ్యయొక్కయు ఆవేశ మా యా ప్రయోగములలో అతివిచిత్రముగ నుండును. ఉదా: (1) హరీతక్యః = ఫలాని. ("హరీతకి" యను ఓషధియొక్క ఫలములు) ఇచట "హరీతక్యః" అను శబ్దము ఆరోపముచే (అభేదము) పండ్లను బోధించును. అయినను హరీతకీ, అను స్త్రీలింగము మాత్ర మనువర్తిం

చెను. (2) ఖలతికమ్ = వనాని. (ఖలతికస్య - అదూరభవాని = ఖలతిక, అను పర్వతము నకు దగ్గరగానుండు అడవులు) ఇచట "ఖలతికమ్" అన్నది అభేదభావనచే వనములను చెప్పను ఏకవచనము మాత్ర మనువర్తించుటయు, నపుంసక లింగమట్లే యుండుటయును ఇచట జరిగెను. (3) "వింశతిః = బ్రాహ్మణాః" (ఇరువది = బ్రాహ్మణులు). ఇచట వింశతి, శబ్ద మారోపముచే బ్రాహ్మణులను తెలుపును. అయినను దానికి సహజమైన లింగ సంఖ్యలు రెండును (స్త్రీలింగమును ఏకవచనమును) మారకుండ అట్లే మిగిలినవి. ॥150॥

అవతారిక— పైని చూపిన యంశమును శాస్త్రముకూడ గుర్తించుచున్నదని చెప్పుచున్నాడు.

శ్లో॥ లింగం లింగపరిత్యాగే సూత్రే ప్రత్యయశాసనమ్ ।
సో౽యమిత్యభిసంబంధాత్ పుంశబ్దే స్త్ర్యభిధాయిని ॥ 151

సః + అయమ్ + ఇతి = "అదే యిది" అను, అభిసంబంధాత్ = సంబంధమువలన, పుం శబ్దే = పురుషవాచకమైన శబ్దము, స్త్ర్యభిధాయిని = స్త్రీని చెప్పునపుడు, సూత్రే = సూత్ర మందు, ప్రత్యయశాసనమ్ = ప్రత్యయమును విధించుట, లింగపరిత్యాగే = లింగమును విడుచుటలో, లింగమ్ = జ్ఞాపకము, (భవతి = అగును).

తాత్పర్యము— "పుంయోగాదాఖ్యాయామ్" (4-1-48) అను సూత్రము పుం వాచక శబ్దములకు (పురుషుని చెప్పునవి) "ఙీష్" (ఈ) అను స్త్రీ ప్రత్యయమును విధించి నది. పురుషుని తెలుపు "ప్రష్ఠ" మొదలగు శబ్దములు అభేద సంబంధముచే (ఆ యా పురుష ధర్మములను అతని భార్యయం దారోపించుటచే) స్త్రీని బోధించునపుడే ఆ ప్రత్యయము ప్రవర్తించును అనగా ప్రష్ఠాది శబ్దములు అభేద సంబంధముచే స్త్రీని బోధించునపుడు, తమ లింగమును విడిచిపెట్టును. ఇట్లు ఆరోపము ననుసరించి ఒక శబ్దము వేరొక యర్థమును తెలియజేయునపుడు లింగసంఖ్యలతో మార్పు జరుగుననుటను పై సూత్రము సమర్థించు చున్నది.

వివరణము— 88 వ కారికలో ఈ కారకయొక్క భావమంతయు విశదీకరింప బడినది. అచట సందర్భానుసారముగ ఈ చర్చ జరిగినది. ॥151॥

అవతారిక— ఇట్లు లింగసంఖ్యలు సంక్రమించుట అనియతముగ నుండుటవలన, "శుక్లాది శబ్దములకు ద్రవ్యమునకు సంబంధించిన లింగసంఖ్యలు సిద్ధింపవేమో" అను శంక అక్కరలేకుండ నిస్సంశయముగ అవి సిద్ధించుటకై "విశేషణానామ్" మొదలగు సూత్ర ముపయోగించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆశ్రయే లింగసంఖ్యాభ్యామాశ్రితం వ్యపదిశ్యతే ।
విశేషణానాం చాజాతేరితి శాస్త్రవ్యవస్థయా ॥ 152

"విశేషణానాంచాజాతేః" + ఇతి = "విశేషణానాంచాజాతేః" అను, శాస్త్రవ్యవస్థయా = సూత్రముయొక్క నియమముచే, ఆశ్రయే = ఆధారమగు ద్రవ్యమందలి, లింగసంఖ్యాభ్యామ్ = లింగసంఖ్యలతో, ఆశ్రితమ్ = ఆధేయమగు గుణము, వ్యపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ద్రవ్యమునకు చెందిన లింగసంఖ్యలు గుణమునకును సంక్రమించునని "విశేషణానామ్" ఇత్యాది సూత్రము బోధించును.

వివరణము— శబ్దశక్తి ననుసరించి లింగసంఖ్యల ఆవేశము సహజముగనే సిద్ధించినను, ఆ యంశమునే సూత్రమనువదించుచున్నదని భావింపవలయును "పుంయోగాదాఖ్యాయామ్" (4-1-48) అను సూత్రము కూడ ఇట్లు అనువాదకమేయని చెప్పవచ్చును. ॥152॥

అవతారిక— పై యంశమునే స్పష్టము చేయుచున్నాడు.

శ్లో॥ నిమిత్తానువిధాయిత్వాద్యే ధర్మాభేదహేతుషు ।
త ఆశ్రయేఽపి విద్యంత ఇతి బుద్ధిర్నివర్త్యతే ॥ 153

భేదహేతుష = భేమమునకు కారణములైన గుణములందు, యే = ఏ, ధర్మాః = ధర్మములు గలవో, తే = అవి, నిమిత్తానువిధాయిత్వాత్ = నిమిత్తమును అనుసరించుటవలన, ఆశ్రయే + అపి = ఆధారమైన ద్రవ్యమందును, విద్యంతే + ఇతి = "ఉండును" అను, బుద్ధిః = భావము, నివర్త్యతే = తొలగింపబడును.

తాత్పర్యము— గుణములయొక్క లింగసంఖ్యలే ద్రవ్యమునకును సంక్రమించునను అభిప్రాయమును "విశేషణానామ్" ఇత్యాది సూత్రము తొలగించును. కాన అది వ్యర్థము కాదు

వివరణము— ద్రవ్యమునకు భేదమును కలిగించునవి గుణములు. నిమిత్తములన్నను అవియే. నిమిత్తముగలది "నిమిత్తి". అనగా ద్రవ్యము అభేద సంబంధము నాశ్రయించి గుణవాచకము ద్రవ్యమును బోధింపవచ్చును. అట్టి సందర్భములో నిమిత్తముయొక్క ధర్మములు (లింగసంఖ్యలు) నిమిత్తికిని సంక్రమించునను భావన కలుగవచ్చును. ఆ భావన కలుగకుండ వారించుటకు ప్రకృత సూత్ర మావశ్యకమగును.

విశేష విషయములు— నిమిత్తముయొక్క ధర్మములు నిమిత్తియందును వర్తించునని ఒక సంప్రదాయము అట్లు సంక్రమించిన ప్రయోగములును కొన్ని యున్నవి ఉదా: "పంచాలాః" (జనపదః = దేశము) పంచాలులను పేరుగల రాజులకు నివాసమైన దేశము. (పంచాలానామ్ - నివాసః). అభేదముచే నివసించు రాజుల పేరుతోనే దేశము వ్యవహరింపబడినది. అట్టి వ్యవహారమునకు నిమిత్తమైన రాజుల బహుత్వము నిమిత్తియగు నివాసమునకు సంక్రమించినది. (వాస్తవముగ నివాసమైన దేశ మొకటియే గదా!) ॥153॥

అవతారిక— "పంచాలాః" మొదలగుచోట్ల నిమిత్తముయొక్క లింగసంఖ్యలు

సంక్రమించుటనే "లుపియుక్తవద్వ్యక్తివచనే" (1-2-51) అను సూత్రము సమర్థించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆఖ్యాయతే చ శాస్త్రేణ లోకరూఢా స్వభావతః ।
నిమిత్తతుల్యా గోదాదౌ ప్రవృత్తిర్లింగ సంఖ్యయోః ॥ 154

స్వభావతః = స్వభావము ననుసరించి, లోకరూఢా = వ్యవహారమందు ప్రసిద్ధమైన, గోదాదౌ = "గోదౌ" మొదలగుచోట్ల, నిమిత్తతుల్యా = నిమిత్తముతో సమానమైన, లింగసంఖ్యయోః = లింగసంఖ్యల యొక్క, ప్రవృత్తిః = ప్రవృత్తి, శాస్త్రేణ=శాస్త్రముచే ("లుపియుక్తవత్" ఇత్యాది సూత్రముచే) ఆఖ్యాయతే + చ = చెప్పబడుచున్నది.

తాత్పర్యము— "గోదౌ" (గ్రామః), "పంచాలాః" (జనపదః), మొదలగుచోట్ల నిమిత్తము ననుసరించి నిమిత్తియందు లింగసంఖ్యలు అనువర్తించుట సహజమైనదియు లోక ప్రసిద్ధమైనదియునగు విషయము అట్టిదానినే "లుపియుక్తవత్" మొదలగు సూత్ర మనువదించును.

వివరణము— లింగసంఖ్యలు ఆ యా ప్రయోగములలో సహజములైనవి. అట్లు సిద్ధముగ ఉన్నవానిని విశదము చేయుటయే శాస్త్రము చేయుపని. అంతియకాని శాస్త్రము లింగసంఖ్యలను శాసింపజాలదు. "ప్రసిద్ధమైన ప్రయోగములను శాస్త్ర మనుసరించును శాస్త్రమును ప్రయోగము అనుసరింపవు" అను తత్త్వమును సందర్భము వచ్చునపుడెల్ల గ్రంథ కర్త సూచింపుచునే యుండును.

"లుపియుక్తవత్" ఇత్యాది సూత్రము 110వ కారికలో పూర్తిగా వ్యాఖ్యానింపబడినది ॥154॥

అవతారిక— "శబ్దశక్తినే శాస్త్రమనుసరించును. కావుననే ఈ విధమైన విభాగము కూడ సిద్ధించినదని" చూపుచున్నాడు.

శ్లో॥ హరీతక్యాదిషు వ్యక్తిః సంఖ్యా ఖలతికాదిషు ।
మనుష్యలుబ్విశేషాణామభిధేయాశ్రయం ద్వయమ్ ॥ 155

హరీతక్యాదిషు = హరీతక్యః, (ఫలాని) మొదలగుచోట్ల, వ్యక్తిః = లింగమును, ఖలతికాదిషు = ఖలతికమ్, (వనాని) మొదలగు స్థలములందు, సంఖ్యా = సంఖ్యయు, మనుష్యలుబ్విశేషాణామ్ = "మనుష్యడు" అను నర్థమున వర్తించు లుబంతమైన శబ్దముయొక్క విశేషణములకు, అభిధేయాశ్రయమ్=వాచ్యమగు అర్థమునకు సంబంధించిన, ద్వయమ్=లింగసంఖ్యలు రెండును, (సిధ్యంతి = సిద్ధించును).

తాత్పర్యము— హరీతక్యః, అనుచోట స్త్రీలింగము మాత్రమే నిమిత్తముతో సమానము. బహువచనము నిమిత్తికి చెందినదే. ఖలతికమ్, అనుచోట ఏకవచనము మాత్రము

నిమి త్తముతో సమానము. నపుంసకలింగము నిమి త్తికి సంబంధించినదే. "చంచా" అనగా గడ్డిబొమ్మవంటి మనుష్యుడు. ఈ శబ్దమునకు "అభిరూప" (సుందరము), "దర్శనీయ" (చూడదగిన) మొదలగు విశేషణములను వాడినపుడు, "మనుష్య" అను విశేష్యము ననుసరించియే ఆ విశేషణములకు లింగసంఖ్యలు రెండును సంబంధించును సహజములైన ఈ అంశములనే శాస్త్రీయములైన వచనములు ప్రకటించుచున్నవి.

వివరణము— ఒక వస్తువుయొక్క ధర్మమును, దానికి సంబంధించిన వేరొక వస్తువునం దారోపించి, రెండిటిని ఒకే శబ్దముతో బోధించు సందర్భమున నిమి త్త నిమి త్తి భావమును స్వీకరింతురు ఉదా: హరీతకీ. ఇదొక ఓషధి. దీని పండ్లనుగూడ ఈ శబ్దముతోనే చెప్పవచ్చును. ఓషధికిని దాని పండ్లకును అభేదమును కల్పించినచో, అట్లు చేయుటకు వీలు కలుగును. "హరీతక్యాః - ఫలాని = హరీతక్యః". ఇచట హరీతకి నిమి త్తము. పండ్లు నిమి త్తి. "పండ్లు" అను నర్థమున ఒక తద్ధిత ప్రత్యయము వచ్చుననియు, అది లోపించుననియు అపుడు నిమి త్తము ననుసరించి లింగమును, నిమి త్తిని బట్టి వచనమును వచ్చుననియును, శాస్త్రము చెప్పును. కాగా హరీతక్యః. అని స్త్రీలింగమును బహువచనమును సిద్ధించును ఇట్లే "ఖలతికమ్" = వనాని" అను ప్రయోగము. "ఖలతిక"మనునది ఒక పర్వతము· దానికి దగ్గరగానుండు అడవులను కూడ ఈ శబ్దముతో బోధింతురు. (ఖలతికస్య - అదూరభవాని వనాని) ఇచట ఖలతికము నిమి త్తము, దానియొక్క ఏకవచనము అనువర్తించినది. నపుంసకలింగము నిమి త్తియైన వనమునకు చెందినదే.

ఇక - "చంచా" శబ్దమునకు "గడ్డిబొమ్మ" అని సహజమైన యర్థము. "ఇవే ప్రతికృతౌ" (౫-౩-౯౬) అను సూత్రముచే సాదృశ్యార్థమున ఈ శబ్దమునకు "కన్" ప్రత్యయము విధింపబడినది. పిదప "లుమ్మనుష్యే" (౫-౩-౯౮) అను సూత్ర మా ప్రత్యయమునకు లోపమును చెప్పినది. ("చంచా - ఇవ - మనుష్యః" అని మనుష్యుడు ఉపమేయమైనపుడు, కన్ ప్రత్యయము లోపించునని యర్థము) కాగా "చంచా" అనునదియే "గడ్డిబొమ్మవంటి మానవుడు" అను నర్థమును చెప్పగలుగును. ఈ దశయందు అభిరూప, దర్శనీయ, మొదలగు విశేషణములను చంచా, శబ్దమునకు ఉపయోగించినచో, "విశేషణానామ్" మొదలగు సూత్రముచే "చంచా" శబ్దముయొక్క లింగసంఖ్యలు విశేషణములకును ప్రాప్తించుచున్నవి. కాని "మనుష్యలుపి ప్రతిషేధః" (మనుష్యార్థమందు లుప్పు వచ్చినపుడు "విశేషణానామ్" అను సూత్రము ప్రవర్తింపదు) అను నిషేధమున్నందున చంచా శబ్దముచే బోధింపబడు మనుష్యుని అనుసరించియే (మనుష్య, శబ్దమును బట్టియే) లింగవచనము లుండును. "అభిరూపః చంచో" మొదలగు రీతినే ప్రయోగింపవలెను

ఇట్లు భాషకు సహజమైన అంశములనే "హరీతక్యాదిషు వ్యక్తిః", "ఖలతికాదిషు వచనమ్", "మనుష్యలుపి ప్రతిషేధః" అను కాత్యాయనుని వచనములు స్పష్టపరచినవి. అంతియేకాని ఆ వచనములనుబట్టి ఈ ప్రయోగములు బయలుదేరినవని అనుకొనరాదు.॥౧౫౫॥

అవతారిక— ''విశేషణానాంచాజాతేః'' అను సూత్రమున ''అజాతేః'' అను నిషేధమున్నందున, జాతివాచకమగు శబ్దమును వాడినపుడు మాత్రము దాని విశేషణములకు లుబంతము యొక్క లింగవచనములు సంక్రమింపవు - అని చెప్పుచున్నాడు.

**శ్లో॥ జాతిప్రయోగే జాత్యాచేత్ సంబంధముపగచ్ఛతి ।
విశేషణం తతో ధర్మాజ్జాతేస్తత్ ప్రతిపద్యతే ॥ 156**

జాతిప్రయోగే = జాతివాచకమగు శబ్దమును వాడినపుడు, విశేషణమ్ = విశేషణము, జాత్యా = జాతితో, సంబంధమ్ = సంబంధమును, ఉపగచ్ఛతి + చేత్ = పొందినట్లయితే, తతః = అపుడు, జాతేః = జాతియొక్క, ధర్మాత్ = ధర్మమునుబట్టి, తత్ = దానిని (లింగమును వచనమును) ప్రతిపద్యతే = పొందును,

తాత్పర్యము— విశేషణమును జాతివాచకముతో కలిపినపుడు, జాతివాచకము యొక్క లింగసంఖ్యలే దానికిని వచ్చును ఉదా : "పంచాలాః = జనపదః". ఇచట జనపదః, అను దానికి "రమణీయః", "సుందరనగరః" మొదలగు విశేషణములు సహజములు. జనపదశబ్దము జాతివాచకము. అది విశేష్యము. దాని ననుసరించియే విశేషణములకు లింగసంఖ్యలు ప్రవర్తించును. ॥156॥

అవతారిక— విశేషణమును లుబంతముతోనే సంబంధింప జేసినపుడు కలుగు విశేషమును చూపుచున్నాడు.

**శ్లో॥ లుబంతే సన్నిపతితం జాతేరన్యద్విశేషణమ్ ।
లుబంతస్య ప్రధానత్వాత్తద్ధర్మైర్వ్యపదిశ్యతే ॥ 157**

జాతేః = జాతికి, అన్యత్ = వేరయిన, (సంబంధింపని), లుబంతే = లుబంతమందు, సన్నిపతితమ్ = పడిన, (సంబంధించిన), విశేషణమ్ = విశేషణము, లుబంతస్య = లుబంతము, ప్రధానత్వాత్ = ముఖ్యమగుటవలన, తద్ధర్మైః = దానియొక్క ధర్మములచే (లింగ సంఖ్యలచే) వ్యపదిశ్యతే = వ్యవహరింపబడును

తాత్పర్యము— విశేషణము ఇచ్ఛానుసారముగ సంబంధింపవచ్చును. కాగా జాతివాచకమును విడిచి, లుబంతముతోనే విశేషణమును కలిపినచో, లుబంతముయొక్క లింగవచనములే విశేషణమునకును సంక్రమించును. ఉదా : "పంచాలాః - ప్రియాతిథయః, వినీతవేషాః - జనపదః." (పంచాలములు ప్రియాతిథులును, వినీత వేషములును అయిన జనపదము).

వివరణము— ఆయా అర్థములందు తద్ధితము వచ్చి, లోపించిన శబ్దములు "లుబంతము" (ఉదా : పంచాలాః, మొదలగునవి) లనబడును. లుబంతముయొక్క అర్థము ముఖ్యము. కావున తదనుసారమే విశేషణముల యొక్క లింగసంఖ్య లుండును,

విశేష విషయములు— ప్రవర్తించి లోపించిన తద్ధితమునకు ప్రకృతిగా మిగిలిన శబ్దము "లుబంతమ"ని ఫలించును. 134 వ కారిక నుండి ఇంతవరకును (157) "విశేషణా నాంచాజాతేః" (1-2-52) అను సూత్రముయొక్క విచారణము విపులముగ జరిగినది. ॥157॥

(8) లింగవచనముల అతిదేశప్రసంగమున - "అతిశాయనే తమబిష్ఠనౌ" (5-3-55) అను సూత్రముయొక్క పరిశీలనము

అవతారిక— మీది విచారణమువలన "విశేషణానామ్" మొదలగు సూత్రము, "గుణవాచకములకు ద్రవ్యమునుబట్టి లింగవచనములు సంక్రమించును" అను విషయమును విశదముచేయుట కుపయోగించునని ఫలించినది. అట్లు లింగవచనములు సంక్రమించుట ఏ యే స్థలములం దుపయోగపడునో - (లేక— జరుగునో) - అన్న అంశమును భాష్యకారుడు విపులముగ చర్చించెను ఆ యా స్థలములను అచటి చర్చలయొక్క సంగ్రహమును ప్రకృతము చూపుచున్నాడు.

శ్లో॥ నఞ్సమాస బహువ్రీహిద్వంద్వస్త్ర్యతిశయేషు యే ।
భేదా భాష్యానుసారేణ వాచ్యాస్తే లింగసంఖ్యయోః ॥ 158

నఞ్ సమాస బహువ్రీహి ద్వంద్వస్త్ర్యతిశయేషు = నఞ్సమాసము, బహువ్రీహి సమాసము, ద్వంద్వసమాసము, "స్త్రియామ్" అను సూత్రము, "అతిశాయనే తమబిష్ఠనౌ" అను సూత్రము - ఈ స్థలములలో, లింగసంఖ్యయోః = లింగవచనముల యొక్క, యే = ఏ, భేదాః = భేదములు గలవో, తే = అవి, భాష్యానుసారేణ = భాష్యము ననుసరించి, వాచ్యాః = చెప్పదగియున్నవి.

తాత్పర్యము— "గుణవచనా నామాశ్రయతో లింగవచనాని" (గుణవాచకములకు ద్రవ్యవాచకములను బట్టి లింగసంఖ్య లుండును) అను వచనమును నఞ్ సమాసము మొదలగు అయిదు స్థలములలో భాష్యకారుడు ప్రవర్తింపజేసి పరిశీలించెను. ఆ పరిశీలనము యొక్క రీతులను ప్రకృతము భావింపదగును. ॥158॥

అవతారిక— పై కారికలోని వరుసను తారుమారు చేసి, (వెనుకనుండి ఆరంభించి మొదటికి వచ్చుట) గ్రంథకర్త విషయములను విశదీకరించెను. కాగా "అతిశాయనే తమబిష్ఠనౌ" (5-3-55) అను సూత్రమును ముందుగ తీసికొని చర్చను ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ యది షష్ఠీద్వితీయాంతాన్నిష్కృష్టాత్తమ బాదయః ।
న్యక్కారిణి స్యురుత్కృష్టే ప్రకృతేః స్యాద్విలింగతా ॥ 159

నిష్కృష్టాత్ = తక్కువ అయిన వస్తువును చెప్పు, షష్ఠీద్వితీయాంతాత్ = షష్ఠ్యంతముగాని ద్వితీయాంతముగాని అయిన శబ్దమునకు, న్యక్కారిణి = తిరస్కరించు, ఉత్కృష్టే = "గొప్పదైన వస్తువు" అను నర్థమున, తమబాదయః = తమప్, మొదలగు ప్రత్యయములు, యది+

స్యుః = ప్రవర్తించినట్లయితే, ప్రకృతేః = ప్రకృతియైన శబ్దమునకు, విలింగతా = లింగము వేరగుట, స్యాత్ = సంభవించెడిని.

తాత్పర్యము— కొన్ని వస్తువులలో ఒకటి ''మిగిలిన వానికన్న మిన్న'' అని చెప్పవలసి వచ్చును. అపుడు తక్కువయైన వస్తువును చెప్పు శబ్దమునకు ''అన్నిటికన్న మిన్నయైనది'' అను నర్థమున ''తమప్'' (తమ) అను ప్రత్యయము విధింపబడినది. కొన్ని చోట్ల ''తరప్'' (తర) అను ప్రత్యయము కూడ ఈ యర్థముననే ప్రవర్తించును అట్టి సందర్భములలో ప్రకృతియొక్క లింగమును ప్రత్యయార్థముయొక్క లింగమును వేర్వేరగు ప్రమాదమున్నది.

వివరణము— "అతిశాయనే తమబిష్ఠనౌ" అని సూత్రము. ఇచట "అతిశాయన" అను శబ్దమునకు రెండర్థములను చెప్పవచ్చును ''మిన్నయగు వస్తువు'' అని ఒక యర్థము. ''మిన్నయగుటకు హేతువుగా భావింపబడు వస్తుధర్మము'' అని రెండవయర్థము. ఆ ధర్మము గుణముకాని క్రియకాని కావచ్చును. ఇట్టి అతిశాయనమను అర్థమున, తమప్, తరప్, మొదలగు ప్రత్యయములగును. ప్రకృతియైన శబ్దమును (అనగా తక్కువ అయిన వస్తువును బోధించు శబ్దము) ద్వితీయాంతముగగాని, షష్ఠ్యంతముగగాని తీసికొనవచ్చును. అది స్త్రీలింగ శబ్దమైనచో ఆ, ఈ (టాప్, ఙీష్ మొ॥) మొదలగు స్త్రీ ప్రత్యయములతో కూడినదియు, లేనిచో కేవలము ప్రాతిపదికమును అగును.

ఈ సందర్భమున అతిశాయనమన్నది ప్రత్యయముయొక్క అర్థమునకు విశేషణమని యొక పక్షమున్నది ఇందు ''వస్తువు మిన్నయగుటకు ముఖ్యకారణము దానియందలి ధర్మమే'' (గుణము —లేక— క్రియ) అను భావనవలన, ''ఆ యా ధర్మముచే గొప్పదైన ద్రవ్యము'' అను అర్థమును ''తరప్'' ప్రత్యయము బోధించును. అపుడు ప్రకృతియొక్క అర్థమును ప్రత్యయముయొక్క అర్థమును వేర్వేరగును. ఒక ధర్మముచే తక్కువయగు వస్తువును ప్రకృతి బోధించును. అదే ధర్మముచే మిన్నయగు వస్తువును ప్రత్యయము చెప్పును. కాగా ప్రకృతియైన శబ్దమునకు ఒక లింగమును ప్రత్యయార్థమైన దానికి వేరొక లింగమును ఉండు ప్రయోగములలో లింగైక్యము (ఒకే లింగముండుట) కుదురకపోవును.

దిగువ కారికయందలి ఉదాహరణములవలన ఈ యంశములు విశదము కాగలవు.

విశేష విషయములు— (1) ''అతిశేతే - ఇతి = అతిశాయనః'' = మిన్నయై మిగిలిన వస్తువులను తిరస్కరించు వస్తువు. (ఇదొక యర్థము). ''అతిశాయనః = అతిశయః'' = మిన్న అగుట. (ఇది వేరొక యర్థము). ద్రవ్యమునకుగాని జాతికిగాని గొప్పదనమన్నది తనంతతానుగ సంభవింపదు. అందుందు ధర్మమునుబట్టియే అది కుదురును. ఆ ధర్మము సామాన్యముగ గుణమేయగును కొండొకచో క్రియ అయినను కావచ్చును.

(2) ''పెక్కింటిలో ఒకటి మిన్న'' అను నర్థమున ''తమప్పు'' వచ్చుటయు, ''రెండిటిలో ఒకటి మిన్న'' అను నర్థమున ''తరప్పు'' వచ్చుటయును సాధారణమైన

అంశము. అయినను కొన్నిచోట్ల "తరప్పు" కూడ "తమప్పు" యొక్క విషయములో ప్రవర్తించుట గలదు. ఈ తీరున "తరప్పు" ప్రవర్తించిన ఉదాహరణములే దిగువ కారికలో చూపబడును.

(3) ప్రత్యయముయొక్క అర్థము అతిశాయనమన్నచో, తిరస్కరించు వస్తువును —లేదా— దానియందుండు ధర్మవిశేషమును ప్రత్యయము చెప్పును. అపుడు "తిరస్కరింపబడునది" ప్రకృతియొక్క అర్థమగును. ఉదా : "ఆఢ్యతమః - రామః". (ఆఢ్యానామతిశాయనః = ధనవంతులలో మిన్న). ఆఢ్యశబ్దము ధనవంతులందరను బోధించును. "తమ" అనునది ఆఢ్యత్వమను ధర్మముచే మిన్నయగు రాముని తెలుపును. ఈ విధముగ ప్రకృత్యర్థమును ప్రత్యయార్థమును వేరగును ఇదొక పక్షము.

(4) ఇట్లుగాక ప్రకృతియే "అతిశాయన" మను నర్థమును స్వతంత్రముగ బోధించుననియు, ప్రత్యయమదే యర్థమును కేవలము సూచించుననియును వేరొక పక్షమున్నది. ఇందు ప్రత్యయము స్వార్థికమగును. అనగా వేరుగ తన యర్థము లేకుండ ప్రకృతియొక్క అర్థమునే బోధించును. ఇపుడు అర్థములో భేదముండదు. తుదకు ఈ పక్షమే సిద్ధాంతముగ తీసికొనబడును

(5) మీది పూర్వపక్షము ననుసరించియే దిగువ కారికలో ఉదాహరణము తీయబడినవి. ॥159॥

అవతారిక— మీద చూపిన భిన్న లింగత్వమును ఉదాహరణములతో వివరింపుచున్నాడు.

శ్లో॥ కాల్యాం కాలాద్ద్వితీయాంతాత్కాలే కాల్యాస్తరబ్ భవేత్ ।
న్యక్కర్తరి తథా గార్గ్యే గర్గేభ్యః ప్రత్యయో భవేత్ ॥ 160

శ్లో॥ న్యక్కర్తృషు చ గర్గేషు గార్గ్యాత్ స్యాత్తచ్చనేష్యతే ॥ $160\frac{1}{2}$

కాల్యామ్ = అతిశయించునది "కాలి", అగునపుడు, (కాలీ శబ్దము) ద్వితీయాంతాత్ = ద్వితీయాంతమైన, కాలాత్ = కాల, శబ్దమునకును, కాలే = తిరస్కరించువాడు కాలుడయినపుడు, ("కాల" శబ్దము), కాల్యాః = కాలీ శబ్దమునకును, తరప్ = తరప్ ప్రత్యయము, భవేత్ = అయ్యెడిని, తథా = అట్లు, గార్గ్యే = గార్గ్యుడు, న్యక్కర్తరి = తిరస్కరించువాడగునపుడు, గర్గేభ్యః = బహువచనాంతరమైన గర్గ శబ్దమునకును, గర్గేషు = గర్గులు, న్యక్కర్తృషు = అతిశయించువారగు నపుడు, గార్గ్యాత్ + చ = గార్గ్య శబ్దమునకును, ప్రత్యయః = తరప్ ప్రత్యయము, స్యాత్ = ప్రవర్తించెడిని, తత్ + చ = అది, న + ఇష్యతే = అభిమతము కాదు

తాత్పర్యము— "కాలమ్ - అతిశేతే - కాలీ" (నల్లని వానిని మించు నల్లని ఆడుది) అను నర్థమున కాలశబ్దమునకు తరప్ ప్రత్యయము వచ్చి, "కాలతరా" అని కావలసి

వచ్చును. (''కాలితరా'' అనునది ఇష్టమైన రూపము. ''కాలీమ్ - అతిశేతే - కాలః'' (నల్లని దానిని అతిశయించు నల్లవాడు) అను నర్థమున కాలీ శబ్దమునకు తరప్పు వచ్చి, ''కాలితరః'' అని కావలసి వచ్చును. (''కాలతరః'' అన్నది అభిమతము). ఇట్లు లింగము వేరగుట సంభవించెడిని.

అట్లే కొన్నిచోట్ల ప్రకృత్యర్థముయొక్క సంఖ్యయు, ప్రత్యయార్థముయొక్క సంఖ్యయును వేరు కావలసి వచ్చును. ఉదా : ''గర్గాన్ - అతిశేతే - గార్గ్యః'' (గర్గులను మించు గార్గ్యుడు) అను భావమున గర్గ శబ్దమునకే ప్రత్యయము వచ్చి, ''గర్గతరః'' అను రూపమయ్యెడిని. (''గార్గ్యతరః'' అనునది ఇష్టము). ''గార్గ్యమ్ - అతిశేరతే - గర్గాః'' (గార్గ్యుని అతిశయించిన గర్గులు) అను భావమున గార్గ్య శబ్దమునకు తరప్పు వచ్చి, ''గార్గ్యతరాః'' అను రూపమయ్యెడిని. (''గర్గతరాః'' అనునది అభీష్టము). ఈ విధముగ లింగభేదమును సంఖ్యాభేదమును కూడ ప్రాప్తించుచున్నది. అది అభిమతము కాదు.

వివరణము— కాలః, అనునది పుంలింగము. కాలీ, అనునది స్త్రీలింగము. అతిశయించు వస్తువుయొక్క లింగమును, తిరస్కరింపబడు వస్తువుయొక్క లింగమును వేరుగ నున్నపుడు ప్రకృతియొక్క లింగము మారకుండ ఉండిపోవలసి వచ్చును. ప్రత్యయార్థము యొక్క లింగమే (అతిశయించు ద్రవ్యముయొక్క లింగము) మొత్తముపై వచ్చుట అభీష్టము

అట్లే గార్గ్య - అనునది ఏకవచనము. గర్గాః, అన్నది గార్గ్య శబ్దముయొక్క బహువచనము. (యఞ్ ప్రత్యయము లోపించును). పై విధముగనే యిచట కూడ వచనములు (సంఖ్య) తారుమారయిపోవును. అతిశయించు వస్తువుయొక్క సంఖ్యయే మొత్తముపై వచ్చుట అభీష్టము. కాగా అతిశాయనమన్నది ప్రత్యయార్థమునకు విశేషణమను పక్షమున ''లింగభేదమును సంఖ్యాభేదమును'' అను దోషములు ప్రాప్తించుచున్నవని ఫలించినది. ॥160॥

అవతారిక— ''అతిశాయనము'' (అతిశయించునది = మించునది) ప్రకృత్యర్థమునకే విశేషణమని చెప్పుట యుక్తము" - అనునది సిద్ధాంతము. ఇందును కొంత దోషమున్నదని చూపుచున్నాడు.

శ్లో॥ కుమార్యాః స్వార్థికే జీప్ స్యాత్ ప్రకృత్యర్థో హి నాధికః ॥ 161

స్వార్థికే = ప్రకృత్యర్థమును బోధించునపుడు, కుమార్యాః = కుమారీ శబ్దము విషయమున, జీప్ = జీప్, అను స్త్రీ ప్రత్యయము (ఈ), స్యాత్ = అయ్యెడిని, ప్రకృత్యర్థః = ప్రకృతియైన శబ్దముయొక్క అర్థము, అధికః = అధికమైనది, న + హి = కాదుగదా :

తాత్పర్యము— తరప్ ప్రత్యయము ప్రకృత్యర్థమందే ప్రవర్తించినచో "కుమారితరా" అనుచోట జీప్పు రావలసివచ్చును. (కుమారితరీ - అను రూపము ప్రాప్తించెడిని). ఈ పక్షమున ప్రకృతియొక్కయు ప్రత్యయముయొక్కయు అర్థ మొకటేయగును గదా :

వివరణము— "అతిశాయనమ"న్నది ప్రకృత్యర్థమునకే విశేషణమన్నచో, తరప్

ప్రత్యయమునకు వేరుగ నర్థమేదియు నుండదు. "ఇది మిన్నయగు వస్తువు" అను భావమును ప్రకృతియే బోధించును. ఆ భావమునే ప్రత్యయము కూడ అనువదించును. ఇట్లు ప్రకృత్యర్థమునే బోధించుటవలన ప్రత్యయము స్వార్థికమగును. అర్థములో భేదముండదు. "కాలీ - అతిశేతే = కాలితరా" (అతిశయించు కాలి = నల్లని స్త్రీ), "కాలః - అతిశేతే = కాలతరః" (మిన్నయగు కాలుడు = నల్లని వాడు) మొదలగు రీతిని అభీష్టరూపములు సిద్ధించును. పైన చూపిన లింగ సంఖ్యల భేదమను దోషము ప్రసక్తము కాదు.

కాని "కుమారితరా" మొదలగుచోట్ల వేరొక రీతిని దోషము కలిగెడిని. కుమార, కిశోర, అనునవి తొలి వయసుగల వ్యక్తిని చెప్పు శబ్దములు. స్త్రీత్వమున "వయసి ప్రథమే" (4-1-20) అను సూత్రముచే వీనికి "ఙీప్" (ఈ) ప్రత్యయమగును. (కుమారీ, కిశోరీ, అను రూపములగును). పిదప "కుమారీ - అతిశేతే" (మించు కుమారి) అను నర్థమున తరప్పు వచ్చినపుడు కూడ ఈ స్త్రీ ప్రత్యయమే ప్రవర్తించి, "కుమారితరీ" అను రూపము కావలసి వచ్చును. అది ఇష్టము కాదు.

విశేష విషయములు— (1) "వయసి ప్రథమే" - "తొలి వయసుగల స్త్రీని చెప్పు అకారాంతమగు శబ్దమునకు ఙీప్పు వచ్చును" అని యర్థము. ఉదా : కుమారీ, కిశోరీ మొదలగునవి. స్త్రీ ప్రత్యయములు కూడ కేవలము ద్యోతకములే. అనగా ప్రకృత్యర్థముగా సిద్ధమైన స్త్రీత్వమునే అవి వెల్లడించును. స్త్రీత్వమును క్రొత్తగా బోధింపవు.

(2) తరప్పు, స్వార్థికమన్నచో అర్థభేదము లేనందున, "కుమారితర" అను శబ్దమునకును ఙీప్ ప్రత్యయమే రావలసి వచ్చును. అది సాధువు కాదు. అతిశాయనమను క్రొత్త భావమును వెల్లడిచేయుచు "టాప్" (ఆ) అను స్త్రీ ప్రత్యయము వచ్చుటయే అభిమతము. ("కుమారితరా" అనునది సాధువు)

(3) తరప్పు స్వార్థికమగునపుడు ప్రథమాంతమగు ప్రాతిపదికమునకే చేరుచుండును. ఉదా : "కాలీ - అతిశేతే = కాలితరా" మొదలగునవి.

(4) "కుమారితరా" మొదలగు చోట్ల మొదటిదగు ఙీప్పు (ఈ) ప్రథమ వయస్సునకును, రెండవదగు టాప్పు (ఆ) అతిశాయనమునకును ద్యోతకమగునని సారాంశము.

(5) స్వతంత్రముగ ఒకానొక యర్థమును చెప్పునది వాచకమనియు, ఉన్న అర్థమును సూచించునది ద్యోతకమనియు వ్యవహరింపబడును. ప్రయోగముల ననుసరించియే వాచకత్వమునుగాని, ద్యోతకత్వమునుగాని నిర్ణయించుకొనవలెను. శాస్త్రీయమగు ప్రక్రియ ఈ విషయమున పనికిరాదు.

అవతారిక— ఇట్లు తరప్ ప్రత్యయము స్వార్థికమన్నను దోషముండుటచే, దానిని వారించుటకై భాష్యకారుడు చూపిన ఒక మార్గమును విశదీకరించుచున్నాడు.

**శ్లో॥ షష్ఠ్యంతాదధికే తస్మాద్గుణే స్వాశ్రయవర్తిని ।
ఉత్కృష్టసమవేతాయాం క్రియాయాం వా విధీయతే ॥** 162

తస్మాత్ = అందువలన, స్వాశ్రయవర్తిని = తనకు ఆధారమైన ద్రవ్యమందుండు, అధికే= అధికమైన గుణే = గుణమందుగాని, ఉత్కృష్టసమవేతాయామ్ = అధికమైన ద్రవ్యమందుండు, క్రియాయామ్ + వా = క్రియయందుగాని, షష్ఠ్యంతాత్ = షష్ఠ్యంతమైన ప్రాతిపదికమునకు, విధీయతే = తరప్పు విధింపబడును.

తాత్పర్యము— మిన్న యగుటకు మూలముగా తీసికొనబడునట్టియు, ద్రవ్యమందు నియతముగ నుండునట్టి గుణమునుగాని క్రియనుగాని బోధించునదిగ తరప్పు ప్రవర్తించునని చెప్పవలెను. అది షష్ఠ్యంతమగు ప్రాతిపదికమునకు చేరును. ఇట్లు చెప్పినచో దోషములేవియు రావు

వివరణము— అతిశయమును కలుగజేయునది అతిశాయనమని చెప్పినపుడు, ద్రవ్యమందుండు గుణమును తీసికొనవచ్చును. గుణమువలననే ద్రవ్యమునకుత్కర్షము ఏర్పడును గదా ! అట్లుగాక ''అతిశయమే - అనగా - మించియుండుటయే - అతిశాయన'' మన్నచో అది క్రియారూపముగాన క్రియనే ప్రకర్షహేతువుగా స్వీకరింపవచ్చును. ఈ రెండు రీతులందును ఆ యా ద్రవ్యమందలి గుణమునుగాని క్రియనుగాని వేరుగా భావించి, అదియే అతిశయమునకు హేతువని చెప్పుదుము. తరప్పు ఆ యర్థమున ప్రవర్తించి చివరకు ఆ యా గుణక్రియలకు ఆశ్రయమైన ద్రవ్యమునే బోధించును. ఉదా : ''శుక్లస్య - అతిశాయనః - గుణః = శుక్లతరః'' = తెలుపుచే మిన్నయగు తెల్లని వస్తువు (గుణము), ''శుక్లస్య - అతిశాయనమ్ = శుక్లతరః'' = తెల్లని వస్తువుయొక్క గొప్పదనము. (మించియుండుట = ఇది క్రియ). ఈ పక్షమందు ప్రకృతియొక్కయు ప్రత్యయముయొక్కయు అర్థములు వేరుగా నుండవుగాన లింగభేదముగాని, సంఖ్యాభేదముగాని ప్రసక్తము కాదు. ఆశ్రయమగు ద్రవ్యమొకటే ఆ గుణమందున తదనుసారమే లింగసంఖ్యలు ప్రవర్తించును. అట్లే ''కుమారితరా'' మొదలగుచోట్ల ప్రత్యయార్థము ముఖ్యమై (గుణముకాని క్రియకాని) ప్రకృత్యర్థము (కుమారియందలి గొప్పదనము) విశేషణమగునుగాన జీప్పు కూడ మొత్తముపై ప్రవర్తింపదు. (తరప్ ప్రత్యయాంతమునకు జీప్పు రాకుండ టాప్ ప్రత్యయమే చేరును).

కాగా గుణక్రియలను వేరుగా చూపుటవలన దోషములు కలుగవని ఫలించినది.॥162

అవతారిక— ద్రవ్యమందలి గుణమునుగాని క్రియనుగాని విడదీసినపుడు తరప్పు యొక్క అర్థము ఆ రెండింటిలో ఒకటియై ప్రధానమగును ఆశ్రయమైన ద్రవ్యము అప్రధానమగును. అయినపుడు సామానాధికరణ్యము (ఒకేచోట నుండుట=ఒకే యర్థమును తెలుపుట) ఎట్లు కుదురును ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉపాత్తం చ ప్రకృత్యర్థో ద్రవ్యమేవాశ్రయస్తయోః ।
సోఽయమిత్యభిసంబంధాదభేదేన ప్రతీయతే ॥ 163

ప్రకృత్యర్థః = ప్రాతిపదికము యొక్క అర్థముగా, ఉపాత్తమ్ = తీసికొనబడిన, ద్రవ్యమ్ +

ఏవ = ద్రవ్యమే, తయోః = ఆ గుణక్రియలకు, ఆశ్రయః = ఆధారమై, సః + అయమ్ + ఇతి = "అదేయిది" అను, అభిసంబంధాత్ = సంబంధము వలన, అభేదేన = అభేదముతో (భేదము లేకుండ), ప్రతీయతే = తెలియబడును

తాత్పర్యము— గుణక్రియలను వేరుగా భావించినను అవి తరప్ ప్రత్యయము యొక్క అర్థములని చెప్పినను, వాని కాధారమైనది ప్రకృత్యర్థమైన ద్రవ్యమే. అందువలన ఆధారమైన ద్రవ్యమునకును ఆధేయములైన గుణక్రియలకును అభేదమును కల్పించుకొని సామానాధికరణ్యమును సంపాదింపవచ్చును.

వివరణము— అతిశయమును వెల్లడించునది తరప్పు. తరబంతమైన శబ్దము కేవలము గుణమునో క్రియనో బోధించుట అసంగతమగును "శుక్లతర" మొదలగునవి ద్రవ్యమును బోధించుటయే ప్రసిద్ధము. అందుచే అభేదమును భావించి సామానాధికరణ్యమును పొందవలెను.

లింగభేదము, సంఖ్యాభేదము మొదలగు దోషములను వారించుటకు మాత్రమే గుణ క్రియలను వేరుచేయుట అను ఊహ ఏర్పడినది.

కాగా "శుక్లతర" మొదలగుచోట్ల అతిశయముగల ఆ యా ద్రవ్యమే బోధపడును కాన దాని ననుసరించియే లింగవచనములు ప్రవర్తించుచుండును. "గుణవచనముల కాశ్రయము ననుసరించి లింగవచనములగును" అను వచన మీ విధముగ ఇచట సమన్వితమగును.

విశేష విషయములు— శుక్లతర, మొదలగుచోట్ల "ప్రకృతియొక్క అర్థము ద్రవ్యము. ప్రత్యయముయొక్క అర్థము గుణక్రియలలో ఏదోయొకటి" అనునది భేదభావనము. "తుదకు ప్రకృతి ప్రత్యయముల అర్థములు రెండును ఒకటే. ద్రవ్యమును విడిచి గుణక్రియలు వేరుగా నుండవుగదా!" అనునది అభేద భావనము. ॥163॥

అవతారిక— శుక్లతర, మొదలగుచోట్ల "శుక్ల" మొదలగు శబ్దములు ఆ యా గుణముగల ద్రవ్యసామాన్యమును (ఏదయిన ఒక వస్తువు - అను నర్థమును) బోధించును. తరప్ ప్రత్యయముకూడ "అతిశయముతో కూడిన - అనగా - మిన్నయగు - ఆ యా గుణముగల ద్రవ్యసామాన్యమునే" తెలుపును. అంతియగాని ద్రవ్యవిశేషమును (నిర్దిష్టమగు ఒక వస్తువును) చెప్పజాలవు. అయినపుడు ఆశ్రితమగు గుణము ఏ విధముగను వేరుగా తెలియనందున "ద్రవ్యమును బట్టి గుణవాచకములకు లింగవచనములగును" అను వచనమును సమన్వయము చేయుట ఎట్లు? - అను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ రూపాభేదాచ్చ తద్ద్రవ్యమాకాంక్షావత్ ప్రతీయతే ।
విశేషైర్భిన్నరూపైస్తదాశ్రయైరివ యుజ్యతే ॥ 164

రూపాభేదాత్ + చ = రూపభేదము లేనందువలన, తత్ = ఆ, ద్రవ్యమ్ = ద్రవ్యము, ఆకాంక్షావత్ = ఆకాంక్షగలదిగ, ప్రతీయతే = తెలియబడును, భిన్నరూపైః = వేర్వేరు

స్వరూపములుగల, విశేషైః = ద్రవ్యవిశేషములతో, తత్ = ఆ ద్రవ్యసామాన్యము, ఆశ్రయైః + ఇవ = ఆధారములతోవలె, యుజ్యతే = కూడును.

తాత్పర్యము— శుక్లతర, మొదలగుచోట్ల తొలుత ద్రవ్యసామాన్యము బోధపడుట సహజమే. అయినను అది "పటము", "ఘటము", మొదలగు ఏదో ఒక విశేషమును అపేక్షించుచునే యుండును. (విశేషములేని సామాన్యముండదుగాన). అట్టి విశేషమును ఆశ్రయముగను, సామాన్యమును ఆశ్రితముగను భావించుకొనవలెను. ఈ విధముగ లింగవచనముల వ్యవస్థ కుదురును.

వివరణము— "శుక్లతరః" అనగానే "మిక్కిలి తెల్లనిది" అనియే తెలియును. అయినను అంతమాత్రమున భావము పూర్తికానందున, "పటః", "ఘటః", మొదలగు ఏదో ఒక విశేషమగు వస్తువును చెప్పక తప్పదు. ఆ వస్తువునే ఆశ్రయమని భావించి తదనుసారము లింగవచనములను చెప్పుకొనవలెను ఉదా : శుక్లతరః = పటః ; శుక్లతరా = నారీ ; శుక్లతరమ్ = వస్త్రమ్, మొదలగునవి. ఇట్లు లింగసంఖ్యల సమన్వయములో చిక్కిదియు కలుగదు ॥164॥

అవతారిక— కాగా—

శ్లో॥ భిన్నరూపేషుయల్లింగం విశేషేషు వ్యవస్థితమ్ ।
సంఖ్యా చ తాభ్యాం ద్రవ్యాత్మా సోఽభిన్నో వ్యపదిశ్యతే ॥ 165

భిన్నరూపేషు = వేర్వేరు స్వరూపములుగల, విశేషేషు=విశేషవస్తువులందు, యత్ = ఏ, లింగమ్ = లింగమును, సంఖ్యా + చ=వచనమును (గలవో), తాభ్యామ్ = ఆ రెండిటితోను, సః = ఆ, ద్రవ్యాత్మా=ద్రవ్యసామాన్యము, అభిన్నః = వేరుకానిదియై, వ్యపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ద్రవ్యసామాన్యము ఆశ్రితము (అధేయము) గను, ద్రవ్యవిశేషమాశ్రయముగను భాసించును. విశేషముయొక్క లింగసంఖ్యలు సామాన్యమునకు సంక్రమించును. తుదకు సామాన్యవిశేష్యములు రెండును ఒకటియే అగునుగదా ః ఇట్లు "ఆశ్రయమును బట్టి ఆశ్రితమునకు లింగవచనములగును" అను వచనమిచట సరిపోవును. ॥165॥

అవతారిక— అతిశయించునది గుణమైనపుడు అది ఆశ్రయమైన ద్రవ్యమందుండును గాన, ఆశ్రయముననుసరించి గుణవాచకమునకు సంఖ్య (వచనము) సంక్రమించుట సిద్ధించును. కాని అతిశయించునది క్రియ అగునపుడు, "మించు వస్తువు - మించబడు వస్తువు" అను రెండు వస్తువులును ఆ క్రియ కాశ్రయములని భావించినచో ఎల్లపుడును ద్వివచనము రావలసివచ్చునని భాష్యకారుడు శంకించి సమాధానమును చెప్పెను. ఆ తీరును వివరింపుచున్నాడు.

శ్లో॥ ఆశ్రయః సమవాయీ చ నిమిత్తం లింగసంఖ్యయోః ।
కర్తృస్థభావకశ్చేతిరతో భాష్య ఉదాహృతః ॥ 166

ఆశ్రయః = ఆధారమైనట్టిది, సమవాయీ + చ = విడదీయుటకు వీలులేని సంబంధము గలిగినట్టి ద్రవ్యము, లింగసంఖ్యయోః = లింగమునకును, వచనమునకును, నిమిత్తమ్=నిమిత్తము (భవతి = అగును). అతః = ఇందువలన, శేతిః = ''శీ'', అను ధాతువు, కర్తృస్థభావకః= కర్తయందుండు వ్యాపారము గలదిగ, భాష్యే = భాష్యమందు, ఉదాహృతః = చెప్పబడెను.

తాత్పర్యము— వ్యాపారము ఏ ద్రవ్యమందు నియతముగ నుండునో - ఆ ద్రవ్యమే ఆ వ్యాపారమున కాశ్రయమగును. దాని ననుసరించియే లింగవచనములను చెప్పవలెను. ప్రకృతమున ''అతిశయించుట'' (అతి + శీ ⟶ అతిశేతే = అతిశాయనః = అతిశయించునది), అను వ్యాపారము కర్తరియగు ద్రవ్యమందే యుండును. కావున దాని ననుసరించియే వచనము వచ్చునుగాని ఎల్లపుడును ద్వివచనము రాదని భాష్యకారుడు చెప్పెను.

వివరణము— ''అతి'' అనునది ఉపసర్గము. ''శీ'' అనునది ధాతువు. ఉపసర్గము యొక్క బలముచే ఈ ధాతువు సకర్మకమగునన్నచో, అతిశయించు కర్త ఒకటియు అతిశయింపబడు కర్మ ఒకటియు రెండు ద్రవ్యములుండును. ఆ రెండును క్రియ కాధారములన్నపుడు ద్వివచనము తప్పదు. కాని ''అతిశీ'' అను ధాతువు అకర్మకమని భాష్యకారుడు చెప్పెను. కావున కర్తయగు ద్రవ్యమొక్కటియే క్రియ కాధారమగును. తదనుసారముగనే ఏకవచనము సిద్ధించును. ॥166॥

అవతారిక— కర్మనుకూడ ఆశ్రయముగ భావించినచో ద్వివచనమును రావచ్చుననుచున్నాడు.

శ్లో॥ నిమిత్తమాశ్రయత్వేన గృహ్యేత యది సాధనమ్ ।
కర్మోపదిష్టయోః ప్రాప్తిస్తత్ర స్యాల్లింగసంఖ్యయోః ॥ 167

సాధనమ్ = కారకము, నిమిత్తమ్ = నిమిత్తమాత్రముగాను, ఆశ్రయత్వేన = ఆధారముగాను, గృహ్యేత + యది = స్వీకరింపబడినట్లయితే, తత్ర = అచట, కర్మోపదిష్టయోః = కర్మకు సంబంధించినట్లు చెప్పబడు, లింగసంఖ్యయోః = లింగవచనముల యొక్క, ప్రాప్తిః = రాక, స్యాత్ = అగును.

తాత్పర్యము— ''కర్తయగునది కర్మను అపేక్షించునను'' భావనవలన, కర్మనుగూడ క్రియకు ఆశ్రయముగ తీసికొన్నచో కర్మకుచెందిన లింగవచనములును రావచ్చును.

వివరణము— ''అతిశయించుట'' అను క్రియ వాస్తవముగ కర్తయందే నియతముగ నుండును అయినను ఏదో విధముగ కర్మ కూడ స్ఫురించునని భావించి, అదియు క్రియ కాశ్రయమని చెప్పినపుడు, ద్వివచనము (కర్తృ కర్మలకు రెండిటికిని చెందునట్లు) రావచ్చునని భాష్యకారుడు వ్యాఖ్యానించెను. ఉదా : ''శుక్లస్య - అతిశాయనః = శుక్లతరౌ'' మొదలగునవి.

విశేష విషయములు— క్రియ అన్నది ఎల్లపుడును కర్తయందే యుండును. కాగా

అది కర్తృసమవేతము. కర్మ సమవేతము కాదు. అయినను భావనాబలముచే కర్మనుకూడ క్రియకాశ్రయముగ చెప్పవచ్చునను ప్రౌఢవాదము ననుసరించి ఈ చర్చ జరిగినది.

ఈ కారికతో ''అతిశాయనే తమబిష్ఠనౌ'' అను సూత్రమందలి భాష్యముయొక్క పరిశీలనము ముగిసినది. ॥167॥

(9) లింగవచనముల అతిదేశ ప్రసంగమున "స్త్రియామ్" (4—1—3) అను సూత్రమందలి భాష్యపరిశీలనము

అవతారిక— 158 వ కారికలోని వరుసలో వెనుకనుండి రెండవదగు ''స్త్రియామ్'' (4-1-3) అను సూత్రముయొక్క భాష్యమును పరిశీలించుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ శాస్త్రేనిమిత్తభావేన సముదాయాదపోద్ధృతః ।
స్త్ర్యర్థస్తస్యేచ్ఛయాయోగః ప్రకృత్యా ప్రత్యయేన వా ॥ 168

స్త్ర్యర్థః = స్త్రీత్వమను ధర్మము, సముదాయాత్ = పదము మొత్తమునుండి, నిమిత్తభావేన = నిమిత్తముగా, శాస్త్రే = వ్యాకరణశాస్త్రమున, అపోద్ధృతః = వేరుచేయబడినది, తస్య = ఆ ధర్మమునకు, ప్రకృత్యా = ప్రకృతితోగాని, ప్రత్యయేన + వా = ప్రత్యయముతోగాని, ఇచ్ఛయా = ఇచ్ఛననుసరించి, యోగః = సంబంధము, (భవతి = అగును).

తాత్పర్యము— పదార్థములందుండు స్త్రీత్వమను ధర్మము సహజసిద్ధము. అది ''అజా, గౌరీ,'' మొదలగు పదములను పూర్తిగా ఉచ్చరించునపుడే తెలియుచుండును. అయినను స్పష్టతకొరకై వ్యాకరణము ప్రకృతి ప్రత్యయములను విడదీసి స్త్రీత్వమును సమన్వయము చేయును. అపుడా స్త్రీత్వము ప్రకృతియొక్క అర్థమనికాని, ప్రత్యయముయొక్క అర్థమనికాని చెప్పుకొనవచ్చును

వివరణము— ''స్త్రియామ్'' అనునది అధికారసూత్రము. కావున అది ప్రత్యయములను విధించు సూత్రములతో చేరి, స్త్రీత్వమందు టాప్ (ఆ), ఙీప్ (ఈ), మొదలగు ప్రత్యయములు ప్రాతిపదికమునకు చేరునని బోధించును. ఇచట స్త్రీత్వమను ధర్మము లోకములో ప్రసిద్ధమైన ''స్తనకేశాదులను కలిగియుండుట'' కాదు. సత్త్వము, రజస్సు, తమస్సు - అను ప్రకృతిగుణములయొక్క అపచయము- అనగా - తక్కువగానుండు స్థితి - స్త్రీత్వమని వ్యాకరణమున ఒక వ్యవస్థ ఏర్పడి ఉన్నది. దీనినే ''సంస్త్యానము'' (తిరోభావము = గుణత్రయము తగ్గియుండుట) అని సాంకేతికముగ వాడుదురు. ఈ సందర్భమున ఇటుపైని ''సంస్త్యానము'' అను పదము తరచుగ వినవచ్చుచుండును.

పదములఖండములని సిద్ధాంతము. అయినను వైశద్యమునకై ప్రకృతి ప్రత్యయములను శాస్త్రము కల్పించును. కాగా స్త్రీత్వమును తెలుపు పదములలోగూడ ప్రకృతి ప్రత్యయములను చూపుట కాల్పనికమే. అజా, గౌరీ, మొదలగుచోట్ల స్త్రీత్వమును సూచించు ప్రత్య

యము (ఆ, ఈ,) వినబడుచుండును. సరిత్, వాక్, మొదలగుచోట్ల అట్టి ప్రత్యయమే విన బడదు (అయినను అవి స్త్రీలింగములే). అందుచే స్త్రీత్వమనునది ప్రకృత్యర్థమనుటకును (సరిత్, వాక్, మొదలగు స్థలములు) ప్రత్యయార్థమనుటకును గూడ (అజా, గౌరీ, మొదలగు స్థలములు) అవకాశమున్నది. ॥168॥

అవతారిక— మీది భావమునే వివరింపుచున్నాడు.

శ్లో॥ స్త్రీశబ్దో గుణశబ్దత్వాత్తుల్యధర్మా సితాదిభిః ।
గుణమాత్రే ప్రయుజ్యేత సంస్త్యానవతి వాశ్రయే ॥ 169

గుణశబ్దత్వాత్ = గుణమును చెప్పు శబ్దమగుటవలన, స్త్రీశబ్దః = "స్త్రీ" అను శబ్దము, సితాదిభిః = సిత, శుక్ల, మొదలగువానితో, తుల్యధర్మా = సమానమైన స్వభావముగలది, గుణమాత్రే = కేవలము గుణమందు, ప్రయుజ్యేత = ప్రయోగింపబడును, వా = లేక, సంస్త్యానవతి = సంస్త్యానమను గుణముగల, ఆశ్రయే = ద్రవ్యమందు, ప్రయుజ్యేత = ప్రయోగింపబడును.

తాత్పర్యము— "స్త్రియామ్" అను సూత్రమున స్త్రీశబ్దము సంస్త్యానమను గుణమును తెలుపును. కావున అది శుక్ల, మొదలగు గుణవాచకములతో సమానమగును కావుననే కేవలము గుణము (సంస్త్యానము) ను కాని, ఆ గుణమున కాధారమైన ద్రవ్యమునుగాని స్త్రీ శబ్దము బోధింపగలదు.

వివరణము— "స్త్రీ = సంస్త్యానమ్", సమ్ = బాగుగా, స్త్యానమ్ = అణగియుండుట. అనగా "సత్త్వము, రజస్సు, తమస్సు, అను మూలగుణములుగాని, వాని పరిణామములైన శబ్దము, రూపము, మొదలగు గుణములుగాని తగ్గియుండుట" - స్త్రీత్వమగును. ఈ ధర్మమునే "సంస్త్యానమ"ను శబ్దముతో గ్రంథకర్త వ్యవహరించుచుండును.

కాగా సంస్త్యానము —లేక— స్త్రీత్వము ఒక విధమైన గుణమైనందున శుక్లాది శబ్దములవలె స్త్రీశబ్దము కూడ గుణమును గుణిని బోధించుట కవకాశము కలదు.

విశేష విషయములు— "సంస్త్యానమును స్త్రీత్వమును ఒకటే" అనుకొని "స్త్రియామ్" అను సూత్రమునకు వ్యాఖ్యానము చేయవలెను. "ప్రాతిపదికాత్" అను పదమిచట సంబంధించును. కాగా - "స్త్రియామ్ = స్త్రీత్వేగుణే, ప్రాతిపదికాత్ - ప్రత్యయః" = "ఏదో ఒక వస్తువును చెప్పు శబ్దమునకు, స్త్రీత్వమను గుణమును బోధించుచు "టాప్" మొదలగు ప్రత్యయములగును" అని యర్థము వచ్చును. ఇపుడు స్త్రీత్వము ప్రత్యయముయొక్క అర్థమగును. ("స్త్రియామ్", అను స్త్రీశబ్దము గుణమునే చెప్పును). దీనిని "ప్రత్యయార్థ పక్ష"మందురు (అనగా స్త్రీత్వము ప్రత్యయముయొక్క అర్థమని భావము).

అట్లుగాక - స్త్రీశబ్దము స్త్రీత్వముగల ద్రవ్యమునే బోధించునన్నచో సూత్రము యొక్క అర్థము రెండు విధములుగ సంభవించును. అందు మొదటిది "సమానాధికరణ

పక్షము'', ఇచట ఒక చిత్రమున్నది. దానిని ముందుగ గ్రహింపవలెను ''శుక్లత్వము'' మొదలగు గుణములను నిమిత్తముగ తీసికొని, శుక్ల, మొదలగు శబ్దము లాయా ద్రవ్యముల నన్నింటిని కూడ చెప్పగలవు ఉదా : శుక్లః = పటః = తెల్లనిబట్ట శుక్లః = ఘటః = తెల్లని కుండ (తెల్లని వస్తువేదయినను సరే). కాని స్త్రీత్వమను గుణమట్టిది కాదు. స్త్రీత్వమును నిమిత్తముగా గ్రహించి ఒక ద్రవ్యమును బోధించుట అన్నది ఒక్క ''స్త్రీ'' అను శబ్దమునకే తప్ప మిగిలిన ఏ శబ్దమునకును సంభవింపదు (స్త్రీశబ్దము స్త్రీనిమాత్రమే చెప్పగలుగును. మిగిలిన వస్తువులను చెప్పజాలదు) ఒక్క ''స్త్రీ'' శబ్దముకొరకే సూత్రమారంభించుట నిష్ఫలమగును అందుచే స్త్రీశబ్దము ద్రవ్యమును దేనినైనను బోధించుననియు, అపుడు స్త్రీత్వమను ధర్మము ఉపలక్షణము మాత్రమే అగుననియును చెప్పవలెను అనగా ''శబ్దము బోధించు ద్రవ్యమందలి స్త్రీత్వము సూచితమైనచో చాలునని'' తెలియును. అపుడు ''స్త్రియామ్= స్త్రీ సమానాధికరణాత్ = ప్రాతిపదికాత్ - ప్రత్యయః = స్త్రీ అను శబ్దముతో సమానాధికరణమైన శబ్దమునకు ప్రత్యయమగును'' అని సూత్రార్థము వచ్చును. ప్రాతిపదికార్థముగ స్త్రీత్వము లేకున్నను ''స్త్రీ'' అను భావము సూచితమైనచో ప్రత్యయము రావచ్చునని ఫలించును అట్లయినపుడు సహజముగ స్త్రీత్వమును చెప్పు శబ్దములతోపాటు - వాని యర్థముతో మాత్రమేకీభవించి - స్త్రీత్వమును చెప్పని శబ్దములకు కూడ ప్రత్యయములు రావలసివచ్చును. ఇట్టి సమానాధికరణ పక్షమందు సంభవించు దోషమునే దిగువ కారికలు విశదపరచును.

రెండవది ప్రకృత్యర్థ పక్షము. ''స్త్రీత్వమను గుణమును కలిగిన ద్రవ్యమును సూటిగ చెప్పు శబ్దమునకు ప్రత్యయములగును'' అని ఇందు సూత్రార్థము లభించును. ఇందు స్త్రీత్వము వాచ్యము కావలెను. సూచితమైనచో ప్రత్యయము రాదు. ఈ పక్షము నిర్దుష్టమని భాష్యకారుడు చెప్పెను. ఈ యంశమును గూడ రాబోవు కారికలు స్పష్టపరచును ॥169॥

అవతారిక — కాగా ''స్త్రియామ్'' (4-1-3) అను సూత్రమునకు సంభవించు వ్యాఖ్యానమును చూపుచున్నాడు

శ్లో॥ స్త్ర్యర్థః సంస్త్యానవద్ద్రవ్యం ప్రకృత్యర్థశ్చ యద్యసౌ ।
ద్రవ్యోపలక్షణార్థత్వం సంస్త్యానస్య తథాసతి ॥ 170

సంస్త్యానవత్ = సంస్త్యానము (గుణముల అపచయము) అను నిమిత్తముగల, ద్రవ్యమ్ = వస్తువు, స్త్ర్యర్థః = స్త్రీ శబ్దముయొక్క అర్థమై, అసౌ = ఇది, ప్రకృత్యర్థః + చ = ప్రకృతియొక్క అర్థముగ కూడ, యది = అయితే, తథా + సతి = అట్లయినచో, సంస్త్యానస్య = సంస్త్యానమను ధర్మము, ద్రవ్యోపలక్షణార్థత్వమ్ = ద్రవ్యమున కుపలక్షణమగుట (కేవలము సూచించు ఒక ధర్మము), (భవేత్ = అయ్యెడిని)

తాత్పర్యము — స్త్రీ, అను శబ్దమొకటి తప్ప మిగిలిన ఏ శబ్దమైనను, స్త్రీత్వమును నిమిత్తముగా తీసికొని ద్రవ్యమును బోధింపదు. కావున స్త్రీత్వమనునది ద్రవ్యమున కుపలక్షణము మాత్రమే అగును. అనగా వేరుగ ఒక ద్రవ్యమును చెప్పవలెననియును, అచటి స్త్రీత్వము సూచితమైన చాలుననియు పర్యవసించును.

వివరణము— ఇదియే సమానాధికరణ పక్షము. ఇందు ''స్త్రీ'' అను భావమును సూచింపుచు, ఒకానొక ద్రవ్యమును చెప్పు శబ్దమునకు ప్రత్యయమగును'' అని సూత్రార్థము లభించును. కాగా స్త్రీత్వము ప్రాతిపదికమునకు వాచ్యము కానక్కరలేదు ప్రాతిపదికార్థమున స్త్రీత్వమున్నట్లు సూచించిన చాలును.

విశేష విషయములు— ''స్త్రియాః భావః = స్త్రీత్వమ్'' అనగా సంస్త్యానమే. ఇది స్త్రీశబ్దము విషయముననే నిమిత్తమగును. కావుననే ''స్త్రీత్వము గలది స్త్రీమాత్రమే'' అగును. వేరొకటి కాదు ॥170॥

అవతారిక— ఇట్లు సమన్వయము చేసినపుడు కలుగు దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ సంస్త్యానేన క్వచిద్ద్రవ్యం దృష్టం యదుపలక్షితే ।
అనంగీకృతసంస్త్యానా త్తద్వృత్తేః ప్రత్యయో భవేత్ ॥ 171

క్వచిత్ = ఒకానొక, ఉపలక్షితే = సూచింపబడిన దానియందు, యత్ = ఏ, ద్రవ్యమ్ = వస్తువు, సంస్త్యానేన = సంస్త్యానమను ధర్మముతో, దృష్టమ్ = చూడబడునో, అనంగీకృత సంస్త్యానాత్ = సంస్త్యానమును స్వీకరింపని, తద్వృత్తేః = అట్టి ద్రవ్యమును బోధించు వేరొక శబ్దమునకు, ప్రత్యయః = ప్రత్యయము, భవేత్ = అయ్యెడిని.

తాత్పర్యము— స్త్రీత్వముచే (సంస్త్యానము) ఉపలక్షితమైన ద్రవ్యమును బోధించు శబ్దమొకటి యున్నపుడు, స్త్రీత్వమను ధర్మములేకున్నను - అట్టి శబ్దమునకు సమానాధికరణమైన మరియొక శబ్దమునకు కూడ టాబాదిప్రత్యయములు రావలసి వచ్చును. ॥171॥

అవతారిక— మీది కారిక చెప్పిన విషయములో ఉదాహరణమును చూపుచున్నాడు

శ్లో॥ భూతాదయః షడాఖ్యాశ్చ సంస్త్యానేనోపలక్షితే ।
బ్రాహ్మణ్యాదౌ యదా వృత్తాస్తేభ్యః స్యుః ప్రత్యయా స్తదా ॥ 172

భూతాదయః = భూతమ్, మొదలగు శబ్దములును. షడాఖ్యాః + చ = ''షట్'' అను సంజ్ఞ గల పంచన్, షట్, మొదలగు శబ్దములును, సంస్త్యానేన = సంస్త్యానముచే, ఉపలక్షితే = సూచింపబడిన, బ్రాహ్మణ్యాదౌ = బ్రాహ్మణీ, మొదలగు శబ్దములందు, యదా = ఎపుడు, వృత్తాః = ప్రవర్తించునో, తదా = అపుడు, తేభ్యః = వానికి, ప్రత్యయాః = స్త్రీప్రత్యయములు, స్యుః = అయ్యెడిని.

తాత్పర్యము— ''భూతమ్ - ఇయమ్ - బ్రాహ్మణీ'' (ఈ బ్రాహ్మణస్త్రీ భూతము = రాక్షసి) ఇచట బ్రాహ్మణస్త్రీ సంస్త్యానముచే ఉపలక్షిత అగును. ఆమెను బోధించునదియు సంస్త్యానము లేనిదియు (స్త్రీత్వమును స్వీకరించనిది = నిత్యము నపుంసకము) భూతశబ్దమగును. కాగా భూతశబ్దమునకు టాప్, అను ప్రత్యయము రావలసివచ్చును. అట్లే ''పంచ - బ్రాహ్మణ్యః'' (అయిదుగురు బ్రాహ్మణస్త్రీలు). ఇచటను ''పంచన్'' శబ్దము బ్రాహ్మణ

స్త్రీలను బోధించుటవలన దానికి జీప్, ప్రత్యయము రావలసివచ్చును (ఇవి అభిమతములు కావు ఈ దోషములను వారించుటకు వేరుగ ప్రయత్నము చేయవలసియుండును).

వివరణము — షకారాంతముగాని (షష్), నకారాంతముగాని (పంచన్, మొదలగునవి) అగు సంఖ్యావాచకమునకు ''షట్'' అని వైయాకరణుల సంకేతము. కాగా - ''స్త్రీలింగమగు శబ్దముతో సమానాధికరణమైన శబ్దమునకు ప్రత్యయములగును'' అను సమానాధికరణ పక్షమందు ఇట్టి దోషములు కలుగునని సారాంశము. ॥172॥

అవతారిక — పై కారికనే వివరింపుచున్నాడు.

శ్లో॥ తద్వంతో హి ప్రధానత్వాత్ ప్రత్యయానాం ప్రయోజకాః ।
సామానాధికరణ్యేఽపి తస్మాట్టాబాదిసంభవః ॥ 173

తద్వంతః = సంఖ్యానము గల ద్రవ్యములు, ప్రధానత్వాత్ = ముఖ్యమగుటవలన, ప్రత్యయానామ్ = ప్రత్యయములకు, ప్రయోజకాః + హి = సంపాదకములగును గదా !, తస్మాత్ = అందువలన, సామానాధికరణ్యే + అపి = సామానాధికరణ్యమందును, టాబాది సంభవః = టాప్, మొదలగు ప్రత్యయములు వచ్చుట, (భవతి = కుదురును).

తాత్పర్యము — సమానాధికరణ పక్షమున సంస్త్యానముగల పదార్థములు ముఖ్యములగును (సహజముగ స్త్రీలింగములైన శబ్దములే ప్రధానములు). అవి తమతో సమానాధికరణములగు వానికి కూడ (ముఖ్యార్థముతో అన్వయించునవి) ప్రత్యయములను సంపాదించును

వివరణము — ''స్త్రీలింగ శబ్దముతో సమానాధికరణమగు శబ్దమునకు ప్రత్యయములగును'' అని ''స్త్రియామ్'' అను సూత్రమున కర్థము చెప్పినపుడు, సమానాధికరణమై స్త్రీలింగముకాని శబ్దమునకును టాబాదులు ప్రవర్తించుట సమంజసమే గదా ! ॥173॥

అవతారిక — ఇట్లు సమానాధికరణ పక్షమందు దోషముండుటచే దానిని విడిచి, నిర్దుష్టమగు ప్రకృత్యర్థపక్షము భాష్యమున ప్రతిపాదింపబడినది ఆ పక్షమును చూపుచున్నాడు

శ్లో॥ గుణమాత్రాభిధాయిత్వం స్త్రీశబ్దే వర్ణ్యతే యదా ।
ప్రకృత్యర్థశ్చ సంస్త్యానం స్వార్థికాః ప్రత్యయా స్తదా ॥ 174

స్త్రీశబ్దే = స్త్రీ, అను శబ్దము, (స్త్రియామ్, అను సూత్రమున) గుణమాత్రాభిధాయిత్వమ్ = కేవలము గుణమును బోధించుటయు, సంస్త్యానమ్ = సంస్త్యానమను గుణము, ప్రకృత్యర్థః + చ = ప్రకృతియొక్క అర్థమనియును, యదా = ఎప్పుడు, వర్ణ్యతే = చెప్పబడునో, తదా = అప్పుడు, ప్రత్యయాః = ప్రత్యయములు, స్వార్థికాః = ప్రకృత్యర్థమందే ప్రవర్తించునవియై, (భవంతి = అగును).

తాత్పర్యము— ''స్త్రీ'' అనగా సంస్త్యానమను గుణము మాత్రమే (ఉపలక్షిత మగు ద్రవ్యము కాదు) ''స్త్రీత్వమను గుణమును బోధించు ప్రాతిపదికమునకు టాబాది ప్రత్యయములగును'' అని, ''స్త్రియామ్'' అను సూత్రమున కర్థము కాగా స్త్రీత్వమును బోధించుదానికే ప్రత్యయములగునుగాన, ప్రత్యయములకు వేరుగా అర్థము ఉండదు. ప్రకృత్యర్థమునే వెల్లడించుచు అవి స్వార్థికములగును.

వివరణము— ఇదియే ప్రకృత్యర్థ పక్షము. ఇందు స్త్రీత్వమను ధర్మమును ప్రకృతియే బోధించును. ప్రత్యయములు కేవలము ద్యోతకములుగ నుండును. ఇదియే సిద్ధాంతముగ స్వీకరింపబడినది.

విశేష విషయములు— ''స్త్రియామ్'' అను సూత్రమున ''స్త్రీశబ్దము ద్రవ్యమును బోధించున''న్నది మొదటి పక్షము ''స్త్రీశబ్దము గుణమును మాత్రమే బోధించునన్న''ది రెండవ పక్షము. ॥174॥

అవతారిక— ''ఏ ప్రాతిపదికమైనను కేవలము స్త్రీత్వమను గుణమును బోధించుట సంభవించునా?'' - అను శంకకు సమాధానమును చెప్పుచున్నాడు.

శ్లో॥ సంస్త్యానే కేవలే వృత్తిః ప్రకృతీనాం న విద్యతే ।
తదావిష్టే తతో ద్రవ్యే గృహ్యంతే సమవస్థితాః ॥ 175

కేవలే = కేవలము, సంస్త్యానే = సంస్త్యానమందు, ప్రకృతీనామ్ = ప్రకృతులుగా నుండు శబ్దములకు, వృత్తిః = ప్రవృత్తి, న + విద్యతే = ఉండదు, తతః = అందువలన, తదావిష్టే = ఆ సంస్త్యానముతో కూడిన, ద్రవ్యే = ద్రవ్యమందు, సమవస్థితాః = ఉన్నవై, గృహ్యంతే = తీసికొనబడును.

తాత్పర్యము— కేవలము స్త్రీత్వమును ఏ శబ్దమైనను బోధింపదు. కావున స్త్రీత్వముతో కూడిన ద్రవ్యమును తెలుపు శబ్దమునకే స్త్రీ ప్రత్యయములగును.

వివరణము— వ్యవహారములో సిద్ధముగానున్న శబ్దములను (అజా. గౌరీ, మొదలగు శబ్దములు. ఇచట ఆ, ఈ, మొదలగునవి స్త్రీ ప్రత్యయములని భావన) సంస్కరించుటయే శాస్త్రము చేయుపని. అట్టి శబ్దములన్నియును ఏదో ఒక వస్తువును బోధించునుగాని కేవలము స్త్రీత్వమను ధర్మమును మాత్రము చెప్పి ఊరకుండవు. కాగా ''స్త్రీత్వమను ధర్మముతో కూడిన ద్రవ్యమును చెప్పు శబ్దమునకు ప్రత్యయమగును'' అని ''స్త్రియామ్'' అను సూత్రమున కర్థము చెప్పక తప్పదు. ఈ విధముగ స్త్రీత్వము (సంస్త్యానము) ప్రకృతియొక్క-అర్థము —లేక— ప్రకృత్యర్థమునకు విశేషణమగుట కుదురును. ॥175॥

అవతారిక— స్త్రీత్వమును ప్రకృత్యర్థముగా చెప్పినపుడు, వెనుకటి (172 వ కారిక) దోషములు సంభవింపవని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఉపకారి చ సంస్త్యానం యేషు శబ్దేష్వపేక్షితమ్ ।
తేభ్యష్టాబాదయస్తచ్చ భూతాదిష్వవివక్షితమ్ ॥ 176

యేషు = ఏ, శబ్దేషు = శబ్దములందు, సంస్త్యానమ్ = స్త్రీత్వము, ఉపకారి + చ = ఉపయోగించునట్లు, అపేక్షితమ్ = కోరబడునో, తేభ్యః = ఆ శబ్దములకు, టాబాదయః = టాప్, మొదలగు ప్రత్యయములు (భవంతి = అగును), భూతాదిషు + చ = ''భూతమ్'' మొదలగు చోట్ల అయితే, తత్ = ఆ స్త్రీత్వము, అవివక్షితమ్ = వివక్షింపబడలేదు.

తాత్పర్యము— స్త్రీత్వమును స్పష్టముగ బోధించు శబ్దములకే స్త్రీ ప్రత్యయము లగును ''భూతమ్ - ఇయమ్ - బ్రాహ్మణీ'' అనుచోట ''భూత'' శబ్దము విషయమున స్త్రీత్వము వివక్షితము కాదు.

వివరణము — ఈ పక్షమందు ప్రకృత్యర్థమందు స్త్రీత్వము తప్పక ఉండవలెను. ''భూతమ్'' అనుచోట భూతశబ్దము కేవలము ''కరిన హృదయత్వమును'' బోధించునుగాని, స్త్రీత్వమును చెప్పదు. ఇచట కూడ స్త్రీత్వమును చెప్పదలచినచో ''భూతా'' అని కావచ్చును. కాని అర్థము మారిపోవును. (ఉండినది - సత్యమైనది). అట్లే పంచన్, షట్, మొదలగు సంఖ్యాశబ్దములును భేదరూపమైన సంఖ్యనే చెప్పునుగాని, స్త్రీత్వమును చెప్పవు. అందుచే వానికి స్త్రీ ప్రత్యయములు రావు. కాన వానిని వారించుటకై వేరుగ ప్రయత్న మక్కరలేదు. ॥176॥

అవతారిక— ''స్త్రీత్వము ప్రత్యయముయొక్క అర్థము'' అను పక్షమును అందలి దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ సంస్త్యానం ప్రత్యయస్యార్థః శుద్ధమాశ్రీయతే యదా ।
తదా ద్వివచనానేకప్రత్యయత్వం న సిధ్యతి ॥ 177

శుద్ధమ్ = కేవలమైన, సంస్త్యానమ్ = స్త్రీత్వము, ప్రత్యయస్య = ప్రత్యయముయొక్క, అర్థః = అర్థముగా, యదా = ఎప్పుడు, ఆశ్రీయతే = స్వీకరింపబడునో, తదా = అప్పుడు ద్వివచనానేక ప్రత్యయత్వమ్ = ద్వివచన బహువచనములును ఒకటికి మించిన ప్రత్యయములు వచ్చుటయును, న + సిధ్యతి = సిద్ధింపదు.

తాత్పర్యము— స్త్రీత్వమను గుణము మాత్రమే టాబాది ప్రత్యయముల అర్థమన్నచో ఆ స్త్రీత్వమొకటియేగాన (స్త్రీలింగ శబ్దములకు) ఏకవచనము ఒక్కటియే ఉండవలెనుగాని మిగిలిన రెండు వచనములు ఉండకూడదు అట్లే స్త్రీత్వమును బోధించుటకొక ప్రత్యయమే చాలునుగాన కొన్నిచోట్ల కనబడు అనేక స్త్రీప్రత్యయములు అసాధువులు కావలసి వచ్చును.

వివరణము— ఇది ప్రత్యయార్థ పక్షము. ఇందు స్త్రీత్వము ద్రవ్యమునకు విశేషణము కాదు సాక్షాత్తుగ ప్రత్యయమునకే అర్థమగును (ద్రవ్యము ప్రకృత్యర్థము) స్త్రీత్వమను

ధర్మమొకటే. అందుచే దానిని చెప్పుటకు ఏకవచనము చాలును కుమార్యౌ, కుమార్యః, మొదలగు ప్రయోగములు అనావశ్యకములయ్యెడిని అట్లే ''కాలితరా'' మొదలగుచోట్ల రెండు స్త్రీ ప్రత్యయములు (జీప్, టాప్) సిద్ధములు. అవి అసాధువులయ్యెడిని. (స్త్రీత్వమును చెప్పుటకు ఒక ప్రత్యయము సరిపోవునుగదా !) ఇట్టి పక్షమున దోషములు సంభవించును.॥177॥

అవతారిక— ''స్త్రీత్వము జాతి'' అని యన్నను పై దోషములు తప్పవని చెప్పుచున్నాడు

శ్లో॥ జాతిశ్చేత్ స్త్రీత్వమేవాసౌ భేదోఽన్యత్రావివక్షితః ।
తస్మాద్భిన్నైరపి ద్రవ్యైస్తదేకం సద్విశిష్యతే ॥ 178

స్త్రీత్వమ్ = స్త్రీత్వము, జాతిః + ఏవ + చేత్ = జాతియే అయినచో, అసౌ = ఈ, భేదః = భేదము, అన్యత్ర = వ్యక్తియందు, అవివక్షితః = చెప్పదలచుకున్నది కాదు, తస్మాత్ = అందువలన, భిన్నైః వేరువేరగు, ద్రవ్యైః + అపి = వ్యక్తులతోకూడ, తత్ = ఆ స్త్రీత్వము, ఏకమ్ + సత్ = ఒకటిగా ఉన్నదై, విశిష్యతే = సంబంధించును

తాత్పర్యము— స్త్రీత్వము జాతియన్నను అది ప్రత్యయార్థమగుటచే ప్రధానమగును. కావున ప్రకృత్యర్థముగా ఉండు వ్యక్తులు ఎన్ని యున్నను వానియందు మొత్తముగా ఉండు స్త్రీత్వమను ఒక ధర్మమును చెప్పుటకు ఏకవచనమే సముచితమగును.

వివరణము— ''స్త్రియామ్'' = స్త్రీత్వే = ప్రత్యయః అన్నపుడు జాతియే ప్రత్యయార్థము ప్రకృతియొక్కయు ప్రత్యయముయొక్కయు అర్థములు కలిసిపోయినను ప్రత్యయార్థము ప్రధానమగునని సంప్రదాయము. కావున మొత్తముపై స్త్రీత్వమే ముఖ్యమగును. అది ఒకటియే

జాతితో కూడిన వ్యక్తి ముఖ్యమైన సందర్భములలో గౌః, గావౌ, గావః, మొదలగు రీతిని వ్యక్తిభేదమును సూచించు వచనములుండుట సహజమే. కాని వ్యక్తుల భేదమును పాటింపక వానియందలి స్త్రీత్వమును మాత్రమే ముఖ్యముగ భావించినపుడు ఏకవచనము తప్పదు. ॥178॥

అవతారిక— ''సత్త్వాదిగుణముల అపచయము స్త్రీత్వము. అనగా, గుణముల పరిణామములైన రూపము, రసము, మొదలగు వానియొక్క ఒక విధమైన అవస్థ. (తిరోభావము = కప్పబడి యుండుట) అది స్థిరమనుటకు వీలులేదు. ప్రతియొక క్షణమునను మారుచునే యుండును. అట్టి మార్పులందలి భేదమును పురస్కరించుకొని వచనభేదమును సాధింపగూడదా ?'' – అను శంకను త్రోసివేయుచున్నాడు.

శ్లో॥ మాత్రాణాం వా తిరోభావే పరిమాణం న విద్యతే ।
కుమార్య ఇతి తేన స్యాత్ కుమార్యాం భేదసంభవాత్ ॥ 179

మాత్రాణామ్ = రూపాది గుణములయొక్క, తిరోభావే = అపచయమందు (ప్రలయము = అంతర్ధానము), పరిమాణమ్ = కొలత, న + విద్యతే + హి = లేదుగదా!, తేన=అందుచే, కుమార్యామ్ = ఒక కుమారియందు, భేదసంభవాత్ = భేదములు కుదురును గనుక, కుమార్యః + ఇతి = ''కుమార్యః'' అను బహువచనమే, స్యాత్ = ఎల్లపుడును అయ్యేడిని.

తాత్పర్యము— గుణావస్థలకు భేదములను పాటించినయెడల అవి అనంతము లగునుగాన ఎల్లపుడును స్త్రీలింగ శబ్దములు బహువచనాంతములుగనే యుండవలసి వచ్చును.

వివరణము— అవస్థ అనునది చంచలము. అది మార్పు చెందుచునే యుండును. దానికి, ఒకటి, రెండు అను కొలత కుదరదు. అందువలన దాని భేదములను స్వీకరించినచో బహువచనము మాత్రమే వచ్చును అట్లుగాక అవస్థ ఒకటే యన్నచో ''స్త్రీత్వము జాతి'' అన్నట్లే అగును. అపుడు మీది కారికలో చూపిన రీతిని ఏకవచనము మాత్రమే రావలయును. (అవస్థ ఒకటియన్నను స్త్రీత్వమొకటియన్నను ఫలితము సమానమే)

విశేష విషయములు— మీది కారిక చూపిన దోషమునే ఈ కారిక బలపరచినది కాగా స్త్రీత్వము ప్రత్యయార్థమన్నచో ఏకవచనము మాత్రమే వచ్చుట ఒక దోషము. మరియు ''ఇయం కుమారీ'' మొదలగు రీతిని సామానాధికరణ్యము కుదురదు కుమారీ శబ్దమందలి ప్రత్యయము స్త్రీత్వమను ధర్మమును బోధించునుగాన ''అస్యాః కుమారీ'' అని ప్రయోగింప వలసి వచ్చును. (అస్యగోత్వమ్, అన్నట్లుగా). అట్లే స్త్రీత్వము గుణముగాన క్రియతో సంబంధము కుదురకపోవును (ద్రవ్యమునకే క్రియా సంబంధము కుదురును) ''అలంక్రియతాం కుమారీ'' (కుమారి అలంకరింపబడు గాక) మొదలగు ప్రయోగములు సాధువులు కాకపోయెడిని.

ఇట్లు ప్రత్యయార్థమను పక్షమున దోషబహుత్వము సంభవించును ॥179॥

అవతారిక — మీద చూపిన దోషములను వారించుటకు ''గుణస్యచాశ్రయతో లింగవచన భావాత్'' అను సమాధానమును వార్తికకారుడు చూపెను. (అనగా స్త్రీత్వము గుణము కావున ఆధారమైన ద్రవ్యమునుబట్టి లింగముకాని వచనముకాని గుణవాచకమునకు సిద్ధించుటవలన - ఎట్టి దోషములును కలుగవని భావము). దానిని రెండు కారికలతో విశదము చేయుచున్నాడు

శ్లో॥ జాతిసంఖ్యా సమాహారైర్యథైవ సహచారిణి ।
ద్రవ్యే క్రియాః ప్రవర్తంత ఏకాత్మత్వేఽప్యపేక్షితే ॥ 180

శ్లో॥ మూర్తిభ్యో మూర్తిధర్మాణాం తథాభేదస్య దర్శనాత్ ।
సామానాధికరణ్యం చ క్రియాయోగశ్చ కల్పతే ॥ 181

ఏకాత్మత్వే = అభేదము, అపేక్షితే = అంగీకరింపబడగా, జాతిసంఖ్యా సమాహారైః = జాతి - సంఖ్య - సమాహారము - అను వానిచే, సహచారిణి = కలిసియుండు, ద్రవ్యే + అపి = ద్రవ్యమందు కూడ, క్రియాః=వ్యాపారములు, యథా=ఎట్లు, ప్రవర్తంతే + ఏవ=ప్రవర్తించునో,

తథా = అట్లు, మూర్తిధర్మాణామ్ = ద్రవ్యముల ధర్మములకు, మూర్తిభ్యః = ద్రవ్యములతో, అభేదస్య = అభేదమును, దర్శనాత్ = చూచుటవలన (అంగీకరించుట), సామానాధికరణ్యమ్ + చ = సామానాధికరణ్యమును, కల్పతే = సంభవించును.

తాత్పర్యము—— ద్రవ్యములును వానియందలి ధర్మములును అవినాభూతములు. రెండింటిని విడదీయుట కుదురదు. కావున ధర్మములను నిర్దేశించి చూపు కార్యములన్నియు అభేద భావనచే ద్రవ్యములకే చెందును. కాగా స్త్రీత్వము ధర్మమైనందున దానికాశ్రయమగు ద్రవ్యమునుబట్టి వచనములు సిద్ధించును. (కుమార్యౌ, కుమార్యః మొ॥) అట్లే స్త్రీప్రత్యయము ద్రవ్యమును తెలుపుటచే "ఇయం కుమారీ" మొదలగు రీతిని సామానాధికరణ్యమును, "కుమారీ అలం క్రియతామ్" మొదలగు రీతిని క్రియతోడి సంబంధమును సంభవించును.

వివరణము—— జాతి, సంఖ్య, సమాహారము (సముదాయము) అనునవి కూడ ఒక విధమగు ధర్మములే. వీనికిని ఆ యా క్రియలకును సూటిగ సంబంధము అసంభవము. అందువలన వీనిని చూపి క్రియలను చెప్పినపుడు, ఈ ధర్మములుగల వస్తువులకే ఆ యా క్రియలు సమన్వయించును. ఇట్టిచోట్ల ధర్మములకును ధర్మముగల వస్తువులకును అభేదము నంగీకరింపక తప్పదు.

ఉదా : (1) జాతి– "గౌః దుహ్యతామ్" (ఆవునుండి పాలను పిదుకుము)· గోత్వమను జాతినుండి పాలను పిదుకుట అసంభవము. ఆ జాతిగల గోవ్యక్తినుండి పిదుకుదురు·

(2) సంఖ్య– "మనుష్యశతం భోజ్యతామ్" (నూరుగురు మనుష్యులకు భోజనము పెట్టుము) "నూరు" అను సంఖ్య భోజనము చేయదు. అది గల వ్యక్తులు భోజనము చేయుదురు

(8) సమాహారము– "పంచగవమ్ ఆనీయతామ్ (అయిదు గోవుల సముదాయమును తెమ్ము) సముదాయమును వేరుగ తీసికొనివచ్చుట కుదురదు. అది గల వ్యక్తులనే తీసికొనివచ్చుట కుదురును.

ఈ రీతినే స్త్రీత్వము ప్రత్యయార్థమన్నను అది వేరుగ భాసింపనేరదు. ఆ గుణము గల ద్రవ్యముతో కూడియే భాసించును దానినిబట్టి వచనము మొదలగునవన్నియు ప్రవర్తించును. కేవలము ప్రక్రియావైచిత్ర్యమునకై ప్రత్యయార్థపక్షము ప్రత్యేకముగ చూపబడినది

అవతారిక—— ఈ సందర్భమున కొందరు ఇట్లందురు "కుమారీ" మొదలగు స్త్రీ ప్రత్యయాంతములు గుణవాచకములే. అయినను వానికి "శుక్ల" మొదలగు శబ్దములకు వలె మతుప్పును ("అది గల ద్రవ్యము" అను నర్థమును చెప్పునది) చేసి, దానికి లుక్కును (లోపమును) చెప్పినచో అవి ద్రవ్యములను బోధించుటలో చిక్కేమియు కలుగదు" అని - "ఇట్టి మతము మంచిదికాదని" చెప్పుచున్నాడు.

శ్లో॥ సామానాధికరణ్యే తు మతుబ్లోపాదపేక్షితే ।
లుక్ తద్ధితలుకీతి స్యాల్లుక్ తత్రాప్యపలక్షణమ్ ॥ 182

మతుబ్లోపాత్ = మతుప్పుయొక్క లోపమువలన, సామానాధికరణ్యే = సామానాధికరణ్యము, అపేక్షితే + తు = కోరబడినచో, ''లుక్ తద్ధితలుకి'' + ఇతి = లుక్ తద్ధితలుకి అను సూత్రముచే, లుక్ = స్త్రీ ప్రత్యయమునకు లోపము, స్యాత్ = కలిగెడిని, తత్ర + అపి = అచట కూడ (శుక్ల మొదలగు గుణవాచకముల విషయమున కూడ). లుక్ = మతుప్పుయొక్క లోపము, ఉపలక్షణమ్ = సూచన మాత్రమే.

తాత్పర్యము — "కుమారీ" మొదలగు స్త్రీ ప్రత్యయాంతములగు శబ్దములకు ద్రవ్యావాచకత్వమును సంపాదించుటకై (అట్లయిన - ''ఇయం కుమారీ'' - మొదలగు రీతిని సామానాధికరణ్యము కుదురును) మతుప్పును దాని లోపమును ఆశ్రయించినచో, "లుక్ తద్ధితలుకి" (1-2-49) అను సూత్రముచే స్త్రీ ప్రత్యయము కూడ లోపించెడిని. అది ఇష్టము కాదు. శుక్లాది శబ్దములలో కూడ మతుప్పునకు లుక్కు నామమాత్రమే. వాస్తవము కాదు.

వివరణము— "తద్ధిత ప్రత్యయమునకు లోపము జరిగినపుడు అప్రధానమైన స్త్రీ ప్రత్యయము లోపించునని" పై సూత్రముయొక్క అర్థము. "కుమారీ + మత్" అని మతుప్పును చూపినపుడు మతుప్పుయొక్క అర్థము ముఖ్యమగును. స్త్రీ ప్రత్యయము అప్రధానమగును కావున అది కూడ లోపింపవలసి వచ్చును అందుచే శుక్లాది శబ్దముల సామ్యము ఇచట పనికిరాదు. అందువలన మతుప్పు లేకుండగనే సహజముగనే స్త్రీ ప్రత్యయాంతములగు శబ్దములు స్త్రీత్వముతో కూడిన ద్రవ్యములను బోధించునని చెప్పుట (మీది రెండు కారికలును వివరించిన తీరు ననుసరించి) సమంజసము

శుక్లాది శబ్దముల విషయమున కూడ, శుక్ల, మొదలగు ప్రకృతులే ఆ యా గుణము గల వస్తువును బోధించుననియు, మతుప్పును దాని లుక్కును చూపుట సూచనామాత్రమే యనియును వెనుక (145, 146, మొ॥ కారికలు) ప్రతిపాదింపబడినది.

విశేష విషయములు— ఇట్లు స్త్రీత్వము ప్రత్యయార్థమన్నను, గుణమునకు ద్రవ్యమునకును అభేదము నాశ్రయించుటవలన ద్వివచన బహువచనములును, సామానాధికరణ్యమును సిద్ధించునని ఫలించినది. "కాలితరా" మొదలగుచోట్ల ద్రవ్యగతమైన స్త్రీత్వమును రెండు స్త్రీ ప్రత్యయములతో చెప్పుటకూడ ప్రయోగస్వభావమని గుర్తింపవలెను అదొక దోషము కాదు. ॥182॥

అవతారిక— "స్త్రీత్వము ప్రత్యయార్థము" అను పక్షమందు సామానాధికరణ్యము మొదలగు అభీష్ట విషయములను వేరొక తీరులో కూడ సాధింపవచ్చునని చెప్పుచున్నాడు

శ్లో॥ కేషాంచిత్ వ్యక్తిభేదేషు ద్రవ్యేష్వేవ విధీయతే ।
సంస్త్యానవత్సు టాబాదిరభేదేన సమన్వయాత్ ॥ 183

అభేదేన = భేదములేకుండ, సమన్వయాత్ = అన్వయించుటవలన, వ్యక్తిభేదేషు = భేదము

లను విడిచినట్టియు, సంస్త్యానవత్సు = స్త్రీత్వమను గుణము కలిగినట్టి, ద్రవ్యేషు + ఏవ = ద్రవ్యములందే, టాబాదిః = టాప్ మొదలగు ప్రత్యయము! కేషాంచిత్ = కొందరి మతమున, విధీయతే = విధింపబడును

తాత్పర్యము— స్త్రీత్వముతో కూడిన ద్రవ్యమునే స్త్రీ ప్రత్యయము బోధించును. ఆ ద్రవ్యము సామాన్యమగును. ప్రకృతి బోధించు ద్రవ్యము విశేషమగును. సామాన్యవిశేషములకు అభేదమును చెప్పవలయును. అట్లు ప్రకృతి ప్రత్యయములు రెండును కలిసి ఒకే ద్రవ్యమును తెలుపుట కుదురును. కాగా సామానాధికరణ్యము మొదలగునవి సులభమగునని కొందరందురు.

వివరణము — ఈ మతమున "స్త్రియామ్" (4-1-3) అను సూత్రమునకు "స్త్రీత్వముతో కూడిన ద్రవ్యమును చెప్పుచు ప్రత్యయమగును" అని యర్థము.

"స్త్రీత్వముతో కూడిన ద్రవ్యసామాన్యము" అని ప్రత్యయము చెప్పును. "ఆ ద్రవ్యమిది" అని ద్రవ్యవిశేషమును ప్రకృతి బోధించును. చివరకు ప్రకృతి ప్రత్యయములు రెండును కలిసి "స్త్రీత్వము గలది ఈ ద్రవ్యము" అను భావమును కలుగజేయును కాగా మొత్తముపై ద్రవ్యమే బోధపడును గాన వెనుక శంకించిన దోషములు ప్రసక్తములు కావు

అవతారిక— పై కారికయొక్క భావమునే వివరించుచున్నాడు.

శ్లో॥ సామాన్యభూతో ద్రవ్యాత్మా పరిచ్ఛిన్నపరిగ్రహః ।
క్రియాభిర్యుజ్యతే భేదైర్భాగశశ్చావతిష్ఠతే ॥ 184

సామాన్యభూతః = సామాన్యమువలె అయినను, ద్రవ్యాత్మా = ద్రవ్యముయొక్క స్వరూపము, పరిచ్ఛిన్న పరిగ్రహః = పరిమితమైన రూపముగలదై, క్రియాభిః = వ్యాపారములతో, యుజ్యతే = కూడును. భేదైః = భేదములతో, భాగశః + చ = విడివిడిగా, అవతిష్ఠతే = ఉండును.

తాత్పర్యము— ప్రకృతియొక్క అర్థము ద్రవ్యవిశేషమనియు, ప్రత్యయము యొక్క అర్థము ద్రవ్యసామాన్యమనియు చెప్పుట కల్పనము మాత్రమే. అది ప్రక్రియావస్థ. వాస్తవమున ప్రయోగములో ఎల్లపుడును స్త్రీత్వముగల ఆ యా ద్రవ్యవిశేషములే బోధపడుచుండును. కావున క్రియాయోగమును, సామానాధికరణ్యమును కుదురును

వివరణము— స్త్రీ ప్రత్యయాంతములగు శబ్దములలో (కుమారీ, అజా, మొ॥) ద్రవ్యవిశేషమును దాని భేదములును (ఏక, ద్వి, బహువచనములు) తెలియుటయే సహజము. అయినను ప్రత్యయమువలన "స్త్రీత్వ"మను ధర్మము అన్నిచోట్లను అనువర్తించుచుండును గాన అది సామాన్యమని భావింపబడును. అంతియగాని విశేషసామాన్యములు రెండును దేనికది స్వతంత్రముగా ఉండవు. "సామాన్యము కూడ విశేషరూపముతోనే ఉండునని" పర్యవసానము. ॥184॥

అవతారిక— ఇట్లు స్త్రీత్వము ప్రత్యయార్థమను పక్షమున గూడ ఆశ్రయమైన ద్రవ్యము ననుసరించి వచనములు కుదురునని ప్రతిపాదించి - ''ఇచట కూడ ఒక ఆక్షేప మున్నదని'' చూపుచున్నాడు.

శ్లో॥ శుక్లాదిష్వాశ్రయద్రవ్యం ప్రాధాన్యేనాభిధీయతే ।
స్త్రీత్వం తు ప్రత్యయార్థత్వాదభిధావిషయో యతః ॥ 185

శుక్లాదిషు = శుక్ల మొదలగు శబ్దములలో, ఆశ్రయద్రవ్యమ్ = ఆధారమైన వస్తువు, ప్రాధాన్యేన = ముఖ్యముగా, అభిధీయతే = చెప్పబడును, స్త్రీత్వమ్ + తు = స్త్రీత్వమైతే, ప్రత్యయార్థ త్వాత్ = ప్రత్యయముయొక్క అర్థమగుటవలన, యతః = ఎందువలన, అభిధావిషయః = అభిధకు గోచరమగునో (ముఖ్యమగునో - అతః = ఇందువలన దోషము కలుగును).

తాత్పర్యము— శుక్ల, మొదలగు గుణవాచకములు ద్రవ్యమునే ముఖ్యముగ చెప్పును. కావున వాని విషయములో ఆశ్రయానుసారముగ లింగవచనములు కుదురును. కాని స్త్రీత్వమన్నది ప్రత్యయార్థమన్నపుడు అదియే ముఖ్యము కావలయును గదా ! అయినపుడు అప్రధానమైన ద్రవ్యమునుబట్టి వచనములు సిద్ధించుటెట్లు ?

వివరణము— శుక్ల, మొదలగుచోట్ల "ఆ గుణముగల ద్రవ్యము" అని సహజ ముగ తెలియును. కాని స్త్రీత్వము ప్రత్యయార్థమన్నపుడు "కుమారీ" మొదలగుచోట్ల "ఒక ద్రవ్యమందలి స్త్రీత్వము" అను జ్ఞానము కలుగును. అట్లయిన అప్రధానముగా ఉండు ద్రవ్య మునుబట్టి వచనమును చెప్పుట అనుచితమగును.

"ప్రత్యయార్థః ప్రధానమ్" (ప్రకృతి ప్రత్యయములు కలిసి అర్థమును బోధించి నను, ప్రత్యయార్థము ముఖ్యము) అను సంప్రదాయమున్నది. ॥185॥

అవతారిక— మీది దోషమును వారించుచున్నాడు.

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాదాశ్రయం ప్రతిపద్యతే ।
స్త్రీత్వం స్వభావసిద్ధో వా గుణభావవిపర్యయః ॥ 186

"సః + అయమ్ + ఇతి" = "అదే యిది" అను, అభిసంబంధాత్ = సంబంధమువలన, స్త్రీత్వమ్ = స్త్రీత్వమను గుణము, ఆశ్రయమ్ = ద్రవ్యమును, ప్రతిపద్యతే = పొందును, వా = లేక, గుణభావ విపర్యయః = గుణత్వము మారిపోవుట, స్వభావసిద్ధః = శబ్దముల శక్తి ననుసరించి సహజమైనది, (భవతి = అగును).

తాత్పర్యము— "అదే యిది" అను అభేద భావనవలన స్త్రీ ప్రత్యయము ద్రవ్య మునే చెప్పును. లేక— స్త్రీ ప్రత్యయాంతములగు శబ్దములు సహజముగ ద్రవ్యమునే ముఖ్య ముగ బోధించుననియు, స్త్రీత్వమును అప్రధానముగ మార్చివేయుననియును వ్యాఖ్యానింప వచ్చును. ఎట్లయినను ద్రవ్యము ప్రధానమగునుగాన మీది ఆక్షేపము కలుగదు.

వివరణము— "స్త్రీత్వమును ద్రవ్యమును ఒకటే"యను అభేదకల్పనయొక్క ఉపాయము. గుణప్రధానభావము తారుమారగుట రెండవ ఉపాయము.

ప్రక్రియలో ప్రత్యయార్థము ముఖ్యమని చూపినను ప్రయోగములో అది అప్రధానమగును. అట్లగుట శబ్దశక్తి స్వభావము. దానిని ఏ శాస్త్రము అయినను కాదనజాలదు.

ప్రత్యయార్థము అప్రధానమగుట పెక్కుచోట్ల అనుభూతమగుచునే యుండును.

అవతారిక— స్త్రీత్వము "ప్రత్యయార్థమైన ద్రవ్యసామాన్యమ"ని చెప్పినను అది గుణమనుట కవకాశమున్నది. గుణమైనపుడు ఆశ్రయమును బట్టియే లింగవచనములను సంపాదింపవచ్చునని విశదముచేయుచున్నాడు.

శ్లో॥ సాకాంక్షత్వాద్గుణత్వేన సామాన్యం వోపదిశ్యతే ।
వ్యక్తీనామాత్మధర్మోఽసావేక ప్రఖ్యానిబంధనః ॥ 187

వా = లేక, సామాన్యమ్ = సామాన్యము, సాకాంక్షత్వాత్ = ద్రవ్యవిశేషముయొక్క అపేక్ష గలదగుట వలన, గణత్వేన = గుణముగా, ఉపదిశ్యతే = చెప్పబడును, ఏకప్రఖ్యానిబంధనః = ఒకే ఆకారముగల జ్ఞానమువలన సిద్ధించు, అసౌ = ఈ సామాన్యము, వ్యక్తీనామ్ = ద్రవ్యవిశేషముల యొక్క, ఆత్మధర్మః = స్వభావము, (భవతి = అగును).

తాత్పర్యము— స్వతంత్రముగ ఉండలేక, ఏదో ఒక ద్రవ్యమును ఆధారముగ తప్పక అపేక్షించునది గుణమనబడును. కాగా స్త్రీత్వము ప్రత్యయార్థమన్నను, ద్రవ్యసామాన్యమన్నను, అది ఒక విశేషద్రవ్యమును కోరక తప్పదు. అట్లది గుణమేయగును. అయినపుడు ద్రవ్యవిశేషము యొక్క లింగవచనములు దానికిని సంక్రమించును.

వివరణము— ప్రత్యయార్థమైన స్త్రీత్వమనునది అన్ని వ్యక్తులయందును ఏకాకారముగ అనువర్తించి భాసించుచుండును (కుమారీ - స్త్రీ, గౌరీ - స్త్రీ మొ॥) అందువలన అది వ్యక్తులందుండు ధర్మమనియు, గుణమనియును చెప్పవచ్చును. ॥187॥

అవతారిక— పై రీతిని ఏదోవిధముగ ప్రత్యయార్థమైన ద్రవ్యసామాన్యమునకు గుణత్వమును కల్పింపవచ్చును. అయినను స్త్రీత్వముగల ద్రవ్యమొకటే (అఖండమే) యగును గాన ఆశ్రయాశ్రయి భావము ("ఒకటి ఆధారము - వేరొకటి ఆధేయము" అను విభాగము) ఎట్లు కుదురును ?" అను శంకకు రెండు కారికలతో బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏవంభూతా చ సావస్థా భాగభేదపరిగ్రహే ।
కృతే బుద్ధ్యైవ భేదానామాశ్రయత్వేవ కల్పితే ॥ 188

శ్లో॥ నిష్కృష్టేష్వపి భేదేషు వ్యక్తిభేదాశ్రయే తతః ।
లింగప్రత్యవమర్శేన లింగసంఖ్యే ప్రపద్యతే ॥ 189

ఏవంభూతా = ఇట్లు సామాన్యవిశేషములతో కలిసి విచిత్రముగనున్న, సా = ఆ, అవస్థా = అవస్థ, బుద్ధ్యా + ఏవ = బుద్ధిచేతనే, భాగభేద పరిగ్రహే = ప్రకృతియొక్కయు, ప్రత్యయము యొక్కయు, వాని అర్థముల యొక్కయు విభాగమును స్వీకరించుట, కృతే = చేయబడగా, భేదానామ్ = ప్రకృత్యర్థమైన ద్రవ్యవిశేషములకు, ఆశ్రయత్వే = ఆధారమగుట, అవకల్పితే = కల్పింపబడగా.

తతః = పిమ్మట, నిష్క్రాన్తేషు + అపి = వేరుచేయబడినను, భేదేషు = విశేషములందు, లింగప్రత్యవమర్శేన = లింగమును నిరూపించు భావనచే, వ్యక్తిరూపాశ్రయే = ద్రవ్యభేదము నాశ్రయించిన, లింగసంఖ్యే = లింగమును సంఖ్యను, ప్రపద్యతే = పొందును.

తాత్పర్యము— "కుమారీ" మొదలగుచోట్ల ప్రకృతి ప్రత్యయములు కలిసి సామాన్యవిశేషములను బోధించు అవస్థ అతివిచిత్రమైనది అందు ఈ విధముగ కల్పనము చేయవలెను. ప్రకృత్యర్థము ద్రవ్యవిశేషము. ప్రత్యయార్థము ద్రవ్యసామాన్యము. ద్రవ్యవిశేషమునకు భేదములుండును (లింగభేదము, సంఖ్యాభేదము) ఆభేదములు గల ద్రవ్యము ముఖ్యమై ఆధారమగును. స్త్రీత్వము ఆధేయమగును. ఆధారముయొక్క లింగ సంఖ్యలు ఆధేయమునకు సంక్రమించును

వివరణము— "సా - అవస్థా - లింగసంఖ్యే - ప్రపద్యతే" అని మొత్తముపై సమన్వయము, "ద్రవ్యవిశేషములను, వాని భేదములను ముఖ్యముగను, ఆధారముగను స్వీకరించి, తదనుసారముగ ఆధేయమైన స్త్రీత్వమునకు లింగసంఖ్యలను అన్వయింపవలెనని" ఈ కల్పనయందలి సారము.

స్త్రీత్వమిచట నియతముగా నుండును. కాన లింగాతిదేశమనావశ్యకము. కావలసినది వచనాతిదేశము మాత్రమే. ద్వివచన బహువచనములను సాధించుటకే ఈ సందర్భమంతయు బయలుదేరినది శుక్లాది శబ్దముల విషయమున లింగవచనములు రెండును అతిదేశింపబడినవి. ఆ సాహచర్యమువలన లింగము కూడ ఇచట ప్రస్తావింపబడినది.

కొన్నిచోట్ల స్త్రీత్వమును సూచించు ప్రత్యయములు రెండు ఉండుట కూడ (కాలితరా = జీప్పు - టాప్పు) శబ్దస్వభావమని వెనుక చూపబడినది)

లింగవచనముల అతిదేశమును ప్రస్తావించిన "స్త్రియామ్" (4-1-3) అను సూత్రముయొక్క భాష్యపరిశీలన మింతతో ముగిసినది. ॥188॥

(10) లింగవచనముల అతిదేశమును ప్రస్తావించు "చార్థేద్వంద్వః"(2-2-29) అను సూత్రముయొక్క భాష్యపరిశీలనము

అవతారిక— "చ" అను అవ్యయముయొక్క అర్థమందు (ఇతరేతరయోగము —లేక— సమాహారము) ద్వంద్వసమాసము విధింపబడెను. అందువలన ఆ అవ్యయమునకు వలె సమాసమునకును లింగముకాని సంఖ్యకాని యుండదగదని శంక బయలుదేరగా, అవ్య

యమునకు లింగసంఖ్యలు లేకపోవుటయు, సమాసమునకవి యుండుటయును శబ్దస్వభావమని భాష్యకారుడు సమాధానము చూపెను. ఆ సందర్భమును వివరించుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ అంతరేణ చశబ్దస్య ప్రయోగం ద్వంద్వభావినామ్ ।
అవిశిష్టార్థవృత్తిత్వం రూపాభేదాత్ ప్రతీయతే ॥ 190

చశబ్దస్య = చ - అను అవ్యయముయొక్క, ప్రయోగమ్ = ఉచ్చరించుట, అంతరేణ = లేకుండ, ద్వంద్వభావినామ్ = ద్వంద్వసమాసమును పొందబోవు పదములకు (వాక్యదశలో ఉండు పదములకు) రూపాభేదాత్ = స్వరూపములో భేదము లేనందువలన, అవిశిష్టార్థ వృత్తిత్వమ్ = విశేషములేని తమతమ అర్థములను బోధించుట, ప్రతీయతే = తెలియబడును

తాత్పర్యము— చ, అను అవ్యయమును కలుపకుండ కేవలము ఘటః, పటః, అను రీతిని పదములను ప్రయోగించినచో, అది వాక్యమగును. అచటి శబ్దములు తమ యర్థమునే తెలుపునుగాని "చ" అనుదాని విశేషార్థము తోడి సంబంధమును తెలుపజాలవు.

వివరణము— "చ, అను అవ్యయముయొక్క అర్థమందుండు సమర్థములై అనేకములైన పదములకు ద్వంద్వమగును" అని "చార్థేద్వంద్వః" (2-2-29) అను సూత్రమున కర్థము. చ - అను దానికి సముచ్చయము, అన్వాచయము, ఇతరేతరయోగము, సమాహారము అని నాలుగర్థములున్నవి

(1) "విడివిడిగా అదియును ఇదియును" అనుట సముచ్చయము (ఈశ్వరః - గురుః - చ).

(2) "రెండిటిలో ఒకటి ముఖ్యము రెండవది అప్రధానము" అనుట అన్వాచయము. ("భిక్షామ్ - అట" - "గామ్ - చ - ఆనయ" = భిక్షకై తిరుగుము - గోవును తీసికొని రమ్ము - ఇచట భిక్షాటనము ముఖ్యము)

(3) "అదియును ఇదియును రెండును కలిసి" అనుట ఇతరేతరయోగము. (ఘటశ్చ పటశ్చ = ఘటపటౌ).

(4) "కొన్నింటి మొత్తము సముదాయము" అనుట సమాహారము. (పాణి పాదమ్ = కాలుచేతుల సముదాయము).

ఈ యర్థములలో మొదటి రెండిటియందును పదములకు సామర్థ్యము కుదురదు గాన సమాసము రాదు. అందువలన వాక్యమునే ప్రయోగింపవలెను.

వాక్యదశలో కూడ చకారమును తప్పక వాడవలెను. (ఘటః, పటః చ) లేకున్న "ఘటపటముల సముచ్చయము" అను విశేషార్థము రాదు. చకారమున్నపుడే దాని అర్థము విశేష్యముగను ముఖ్యముగను భాసించుట సంభవించును.

విశేష విషయములు— వాక్యదశను వివరించుటకే ఈ కారిక బయలుదేరినది.

ఈ సముద్దేశమందలి 28, 29, 30, కారికలలో ద్వంద్వమును గురించి విపులమైన విచారణము జరిగినది. ॥190॥

అవతారిక— పీని భావమునే విశదము చేయుచున్నాడు.

శ్లో॥ వికల్పవతి వా వృత్తిర్నివర్త్యేఽథ సముచ్చితే ।
తేషామజ్ఞాతశక్తీనాం ద్యోతకేన నియమ్యతే ॥ 191

అథ = అపుడు, అజ్ఞాతశక్తీనామ్ = తెలియని శబ్దశక్తులుగల, తేషామ్ = ఆ పదములయొక్క (వాక్యదశయందలి పదములు), నివర్త్యే = పోగొట్టదగిన, వికల్పవతి = వికల్పము గల అర్థమందు, వృత్తిః + వా = ప్రవృత్తి, ద్యోతకేన = ద్యోతకమగు దానిచే (చకారముచే), సముచ్చితే = సముచ్చితమైన అర్థమందు, నియమ్యతే = నియమింపబడును.

తాత్పర్యము— ద్వంద్వమును పొందదగిన వాక్యదశయందలి పదముల అర్థములను నియమించుటకు ద్యోతకమగు శబ్దమొకటి యుండవలెను అట్టి ద్యోతకము చకారము, అది పదార్థముల సముచ్చయమును స్పష్టపరచును. (ఘటః, పటః చ=ఘటమును పటమును) అది లేనిచో "వికల్పము" అను అర్థమైనను అట్టిచోట్ల రావలసివచ్చును (ఘటః పటః వా = ఘటముకాని పటముగాని) కాగా వికల్పమును రానీయక సముచ్చయమును తీసుకొని వచ్చుటకై చకార మావశ్యకమగును.

వివరణము— వేరొక పదముయొక్క అర్థమునే విశదముచేయుచు, అందుకొరకు విడిగా ప్రయోగింపబడు శబ్దమునుగాని ప్రత్యయమునుగాని ద్యోతకమందురు. చ, వా, మొదలగు అవ్యయములు ద్యోతకములు. వాక్యమందలి చకారము ఆ యా పదార్థముల సముచ్చయమును (కూడిక) సూచించును. అది లేనపుడు "వా" (వికల్పము) మొదలగు వేరొక ద్యోతకమైనను ఉండక తప్పదు ఏదియు లేనిచో "ఘటః పటః" అను పదముల సంబంధమే తెలియక పోయెడిని.

విశేష విషయములు— కాగా ద్వంద్వభావులగు (ద్వంద్వమున కర్హములు) పదముల వాక్యదశలో, చకారమును వాడక తప్పదని ఫలించినది. ॥191॥

అవతారిక— ద్వంద్వసమాసమందు మాత్రము చకారమును వాడనక్కరలేదని చెప్పుచున్నాడు.

శ్లో॥ వృత్తౌ విశిష్టరూపత్వాచ్ఛబ్దో వినివర్తతే ।
అర్థభేదేఽపి సారూప్యాత్ తచ్చార్థేనాపదిశ్యతే ॥ 192

విశిష్టరూపత్వాత్ = సముచ్చయముతో కూడిన పదార్థములను బోధించు స్వరూపము గలదగుట వలన, వృత్తౌ = వృత్తియందు, చశబ్దః = చకారము, వినివర్తతే = పోవును, అర్థభేదే + అపి = వృత్తియొక్కయు వాక్యముయొక్కయు అర్థములకు భేదమున్నను, సారూప్యాత్ =

సాదృశ్యమును బట్టి, తత్ = ఆ విశిష్టరూపత్వము, చార్థేన = చకారముయొక్క అర్థముతో, అపదిశ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— "ఘట పటౌ" ఇది ద్వంద్వము. ఇచట ఇతరేతరయోగము (రెండును కలిసి ఒక క్రియతో సంబంధించుట) సహజముగనే తెలియును. అది వృత్తియొక్క ధర్మము. కావున చకారము వాడనక్కరలేదు అయితే - వాక్యమునకును వృత్తికిని గల సామ్యము ననుసరించి, "చార్థే ద్వంద్వః" (చకారము యొక్క అర్థమున ద్వంద్వమగును) అనుట జరిగినది అంతమాత్రమున "ద్వంద్వము యొక్క అర్థము చార్థము" అనుకొనరాదు. చకారము లేకున్నను దాని భావమును ద్వంద్వసమాసము సహజముగ బోధించును.

వివరణము— ద్వంద్వ వృత్తియందు పదార్థముల కలయిక సహజము గాన వాని భేదము తెలియదు అందుచే భేదమును సూచించు చకారమచట అక్కరలేదు. వాక్యదశయందు పదార్థముల భేదమును సూచించుటకు, చకారముండవలయును. అయినను "ఒక క్రియతో అన్వయించుట" అను ధర్మము మాత్రము రెండు దశలందును సమానము. ఈ సామ్యమును బట్టియే "చార్థమున ద్వంద్వము"ను వ్యవహారము ఉపపన్నమగును. ॥192॥

అవతారిక— చకారము యొక్క అర్థమందు ద్వంద్వమైనచో కలుగు దోషమును చూపుచున్నాడు

శ్లో॥ చస్య చాసత్త్వభూతోర్థః సఏవాశ్రీయతే యది ।
తద్ధర్మత్వం తతో ద్వంద్వే చాదిష్వర్థకృతం హి తత్ ॥ 193

చస్య = చకారముయొక్క, అర్థః + చ = అర్థమైతే, అసత్త్వభూతః = సత్త్వముకానిది (ద్రవ్యముకానిది), సః + ఏవ = అదియే, ఆశ్రీయతే = స్వీకరింపబడునది, యది = అయితే, తతః = అపుడు, ద్వంద్వే = ద్వంద్వమందు, తద్ధర్మత్వమ్ = ద్రవ్యముకాని దాని స్వభావము, (స్యాత్ = కలిగెడిని), తత్ = ఆ ధర్మము, చాదిషు = ''చ'' - మొదలగు అవ్యయములలో, అర్థకృతమ్ + హి = అర్థమునుబట్టి ఏర్పడినది గదా :

తాత్పర్యము— ''సముచ్చయము'' మొదలగు చార్థము ద్రవ్యము కాదు. అనగా లింగమును సంఖ్యయును కలిగినది కాదు. అట్టి యర్థమునే ద్వంద్వమునకు చెప్పినచో అదియు చకారమువలెనే అన్వయము కావలసి వచ్చును అర్థమును బట్టియే చ, వా, (వికల్పము) న, (నిషేధము) మొదలగునవి అవ్యయములగుచున్నవి.

వివరణము— లింగసంఖ్యల కనువగు ద్రవ్యము సత్త్వమనియు, అట్లుకానిది అసత్త్వమనియును చెప్పబడును సముచ్చయము మొదలగు-అర్థములు ద్రవ్యములు కానేరవు. అందుచే ఆ అర్థములను చెప్పు ''చ'' మొదలగునవి అవ్యయములైనవి కాగా ద్వంద్వము యొక్క అర్థమును చార్థమును ఒకటేయన్నచో ద్వంద్వము కూడ లింగసంఖ్యలు లేని అవ్యయము కావలసి వచ్చును. ॥193॥

అవతారిక — శబ్దముల యొక్క అర్థములను శాస్త్రము చెప్పజాలదనియు, శక్తి వైచిత్ర్యము వలన అర్థము కూడ విచిత్రముగ భాసించుచుండుననియును వివరించుచున్నాడు.

శ్లో॥ చార్థః శబ్దే క్వచిద్భేదాత్ కథంచిత్ సమవస్థితః ।
దోతకాశ్చాదయస్తస్య వక్తా ద్వంద్వస్తు తద్వతామ్ ॥ 194

క్వచిత్ = ఒకానొక, శబ్దే = శబ్దమందు, చార్థః = చకారము యొక్క అర్థము, భేదాత్ = భేదము ననుసరించి, కథంచిత్ = ఏదో ఒక విధముగ, సమవస్థితః = ఉన్నది, తస్య = ఆ అర్థమునకు, చాదయః = చ, మొదలగునవి, ద్యోతకాః = సూచకములు, ద్వంద్వః + తు = ద్వంద్వమైతే, తద్వతామ్ = ఆ యర్థముగల వస్తువులకు, వక్తా = వాచకము, (భవతి = అగును).

తాత్పర్యము— సముచ్చయము అను నర్థమునే "సముచ్చయః" అను శబ్దము సూటిగ చెప్పును. అపుడా శబ్దము ద్రవ్యవాచకము వలెనే లింగసంఖ్యలను పొందును. అదే యర్థమును చకారము సూచించి వదలివేయును అందుచే అది ద్యోతకమై అవ్యయమగును కాగా ద్వంద్వము చార్థమునకు వాచకము కావున అవ్యయము కాదనియు, లింగసంఖ్యలను పొందుననియును ఫలించును

వివరణము— అర్థమును అందించుటలో శబ్దములకుగల శక్తులు అతి చిత్రములు. "సముచ్చయము" మొదలగు అర్థములను సముచ్చయః, వికల్పః, నిషేధః, మొదలగు శబ్దములు సూటిగ చెప్పి, వాచకములై ద్రవ్యవాచకముల వంటివేయగును. కాని అవే యర్థములను "చ" మొదలగునవి సూటిగ చెప్పక సూచించును. అందుచే నవి ద్యోతకములై అవ్యయములగును. ప్రకృతమున ద్వంద్వము వాచకమేగాని ద్యోతకము కాదని సారము

విశేష విషయములు— అర్థమును సూటిగ చెప్పునది వాచకము. ఉదా : సముచ్చయః = కలయిక, వికల్పః = వికల్పము (రెండిటిలో నేదో యొకటి అని తెలుపుట), ప్రక్కనుండు ఒక శబ్దముయొక్క అర్థముపై పూర్తిగ ఆధారపడి దానిని సూచించునది ద్యోతకము. ఉదా : ఘటః పటః చ (సముచ్చయము) "సః - వా - అయం - వా" (వాడు కాని వీడు కాని వికల్పము) ఒక శబ్దమును దగ్గర ఉంచుకొనక పోయినచో చ, మొదలగునవి ఎందుకును పనికిరావు, ఇట్టివి ద్యోతకములు మాత్రమే. ॥194॥

అవతారిక— మీది భావమునే విశదము చేయుచున్నాడు.

శ్లో॥ వికల్పాద్యభిధేయస్య చార్థస్యాన్యపదార్థతా ।
ద్యోతకత్వాన్న కల్పేత తస్మాత్ సదుపలక్ష్యతే ॥ 195

వికల్పాద్యభిధేయస్య = "వికల్ప", మొదలగు శబ్దములచే చెప్పబడు, అర్థస్య = వికల్పము, సముచ్చయము మొదలగు అర్థము, అన్యపదార్థతా + చ = వేరొక పదముయొక్క వాచ్యార్థ

మగుట, ద్యోతకత్వాత్ = ద్యోతకమగుట వలన, న + కల్పేత = కుదురదు, తస్మాత్ = అందువలన, సత్ = లింగసంఖ్యలతో కూడిన ద్రవ్యము, ఉపలక్ష్యతే = సూచింపబడును.

తాత్పర్యము— వికల్పః, సముచ్చయః, మొదలగు శబ్దములు వాచకములు. లింగసంఖ్యలు గల ద్రవ్యరూపమైన అర్థము నవి చెప్పును. వా, చ, మొదలగునవి ద్యోతకములు కావున అవి అవ్యయములు లింగసంఖ్యలు కుదురని అర్థమును బోధపరచుచు తుదకు అవి ద్రవ్యమును సూచించును. అర్థములో పెద్దగ భేదము లేకున్నను, కొన్ని శబ్దములు వాచకములగుటయు, మరికొన్ని ద్యోతకములగుటయును భాషయొక్క స్వభావము. కాగా ద్వంద్వము ఇతరేతర యోగము గల ద్రవ్యములకు వాచకము కాన లింగసంఖ్యల సంబంధము కుదురును.

''చార్థే ద్వంద్వః'' (2-2-29) అను సూత్రమందలి ''చార్థే'' అనునది ద్రవ్యమున కుపలక్షణమగును. అనగా చార్థము ద్వంద్వమునకు విషయమైన ద్రవ్యమేయని తేలును ॥195

అవతారిక— మీది భావమునే విశదము చేయుచున్నాడు.

శ్లో॥ తత్ర స్వాభావికం లింగం శబ్దధర్మే వ్యపేక్షితే ।
శబ్దః కశ్చిత్తమేవార్థం కథంచిత్ ప్రతిపద్యతే ॥ 196

శబ్దధర్మే = శబ్దముయొక్క ధర్మము, వ్యపేక్షితే = సిద్ధముగా నుండగా, లింగమ్=లింగము తత్ర = అచట. స్వాభావికమ్ = సహజమైనది, కశ్చిత్ = ఒకానొక, శబ్దః = శబ్దము, తమ్ = ఆ, అర్థమ్ + ఏవ = అర్థమునే, కథంచిత్ = ఏదో విధముగ, ప్రతిపద్యతే=పొందును.

తాత్పర్యము— లింగము శబ్దముయొక్క స్వభావము. లింగము వేరైనను వేర్వేరు శబ్దములు ఒకే యర్థమును బోధింపగలవు.

వివరణము— శబ్దమునకు సహజమైన లింగభేదమునుబట్టి అర్థమందలి వైచిత్ర్యము కూడ తెలియుచుండును ఉదా : కార్శ్యమ్ - (కృశస్య భావః) (నపుం.), కృశతా (కృశస్య భావః) (స్త్రీ), ''కృశించుట'' అను అర్థమొకటే రెండు లింగములు కలదిగ తెలియును. అబ్లే - జలమ్ (నపుం॥ - నీరు), ఆపః (స్త్రీ॥ లిం॥ - నీరు) - నిత్య బహువచనము), కళత్రమ్ (నపుం॥), దారాః (భార్య - పుం॥ లిం॥ - నిత్య బహువచనము) మొదలగుచోట్ల లింగవచన భేదము గూడ ఉన్నది.

కాగా వాక్యమందలి ''చ''కారము వలన సూచింపబడు అర్థమునకు లింగసంఖ్యలతో యోగము ఉండదు. ద్వంద్వసమాసము చెప్పు అదే యర్థమునకు లింగసంఖ్యలతో యోగముండును. అది శబ్ద స్వభావము.

విశేష విషయములు— సత్త్వ రజస్తమోగుణముల ఉత్కర్ష పుంలింగము. వాని అపకర్ష స్త్రీలింగము. ఆ గుణములయొక్క స్థితి మాత్రము నపుంసకము. ఇట్టి లింగము

అర్థమునకు చెందినదేయని శాస్త్రమర్యాద అర్థమందలి లింగమునే శబ్దము సహజముగ బోధించును ॥196॥

అవతారిక — శబ్ద ధర్మమునుబట్టియే అర్థముల నిర్ణయము జరుగునని ప్రాసంగిక ముగ చెప్పుచున్నాడు.

శ్లో॥ శబ్దాదర్థాః ప్రతాయంతే స భేదానాం విధాయకః ।
అనుమానం వివక్షాయాః శబ్దాదన్యన్న విద్యతే ॥ 197

అర్థాః = అర్థములు, శబ్దాత్ = శబ్దమువలన, ప్రతాయంతే = విస్తరించును, సః = ఆ శబ్దము, భేదానామ్ = అర్థభేదములను, విధాయకః = కలుగజేయునది, వివక్షాయాః = వక్తయొక్క తాత్పర్యమునకు, శబ్దాత్ = శబ్దమునకన్న, అన్యత్ = వేరైన, అనుమానమ్ = (ఊహించుటకు) ప్రబలమైన హేతువు, న + విద్యతే = లేదు

తాత్పర్యము — శబ్దమునుబట్టియే వక్తయొక్క అభిప్రాయము తెలియును. అదియే అర్థమును నిశ్చయించుటలో ప్రబలమైన సాధనము. శబ్దమువలననే అర్థభేదములును విస్తరించును

వివరణము — ఎట్టి యర్థమునకైనను శబ్దమే సంకేతము కావున దానిని బట్టియే అర్థములను వింగడించుకొందురు.

ఉదా : భార్యా = స్త్రీత్వముగల స్త్రీ
దారాః = పుంస్త్వముగల స్త్రీ
జలమ్ = ఉదక సముదాయము - నపుంసకము
ఆపః = పెక్కు నీటి అవయవములుగల నీరు - (స్త్రీత్వము, బహుత్వము)

ఇట్లు లోకవ్యవహారమున శబ్దమే అర్థనిర్ణాయకము ॥197॥

అవతారిక — ఇట్లు ద్వంద్వమున లింగసంఖ్యల సంబంధము సమర్థింపబడినది.

''ఆశ్రయమగు ద్రవ్యమునుబట్టియు ద్వంద్వమున లింగవచనములు రావచ్చునని'' వేరొక పక్షము భాష్యమందున్నది. దానిని పరిశీలించుటకు ప్రారంభించుచున్నాడు

శ్లో॥ సముచ్చితః స్యాద్ద్వంద్వార్థో గుణభూతసముచ్చయః ।
సముచ్చయోఽవాపి భవేత్ గుణభూతసముచ్చితః ॥ 198

గుణభూతసముచ్చయః = అప్రధానమైన సముచ్చయముగల, సముచ్చితః = కలయిక గల ద్రవ్యము, ద్వంద్వార్థః = ద్వంద్వముయొక్క అర్థము, స్యాత్ = అగును, వా = లేక, గుణభూతసముచ్చితః = అప్రధానమైన సముచ్చిత ద్రవ్యముగల, సముచ్చయః + అపి = సముచ్చయమైనను, (ద్వంద్వార్థః = ద్వంద్వముయొక్క అర్థము) భవేత్ = అగును.

తాత్పర్యము— ''ఘట పటౌ'' ఇది ద్వంద్వము. ''కలయిక గల ఘట పటము లను రెండు వస్తువులు'' అనిగాని, ''ఘట పటములను రెండు వస్తువుల కలయిక'' అనిగాని దీని కర్థమును చెప్పవచ్చును. మొదటి యర్థమున సముచ్చయము (కూడిక) అప్రధానమై, వస్తువులు ప్రధానమగును రెండవ యర్థమున వస్తువులు అప్రధానములై సముచ్చయము ప్రధానమగును ॥198॥

అవతారిక— అట్లయినపుడు.

శ్లో॥ సముచ్చితస్య ప్రాధాన్యే లింగసంఖ్యే స్వభావతః ।
సముచ్చయస్య ప్రాధాన్యే శాస్త్రం స్యాత్ ప్రతిపాదకమ్ ॥ 199

సముచ్చితస్య = సముచ్చితమైన ద్రవ్యముయొక్క, ప్రాధాన్యే = ప్రాధాన్యమందు, లింగ సంఖ్యే = లింగవచనములు, స్వభావతః=స్వభావమునుబట్టి (సిద్ధించును), సముచ్చయస్య = సముచ్చయము యొక్క, ప్రాధాన్యే = ప్రాధాన్యమందు, శాస్త్రమ్ = వ్యాకరణము, ప్రతిపాద కమ్ = లింగవచనములను చెప్పునది, స్యాత్ = అగును.

తాత్పర్యము— ద్వంద్వమందు ద్రవ్యములు ముఖ్యమన్నచో వాని స్వభావమును బట్టి లింగవచనములు సహజములేయగును. వేరుగ ప్రయత్నమక్కరలేదు. అట్లుగాక ద్రవ్య ముల సముచ్చయము ప్రధానమన్నచో ''విశేషణానాంచాజాతేః'' (1-2-52) అను సూత్రము వలన ఆశ్రయమగు ద్రవ్యములనుబట్టి లింగవచనములు సంక్రమించును.

వివరణము— సముచ్చయమను ధర్మముకూడ విశేషణముగ అంగీకరింపబడును. ''విశేషణానామ్'' మొదలగు సూత్రము 134 వ కారికలో వ్యాఖ్యానింపబడినది ఈ ప్రసంగ మంతయు ఆ సూత్రము ననుసరించి విస్తరించినదే. ॥199॥

అవతారిక— సముచ్చితము (ద్రవ్యములు) ముఖ్యమైనను, సూత్ర ముపయోగించు నని కొందరందురు. వారి మతమును చూపుచున్నాడు.

శ్లో॥ సముచ్చయవతోఽర్థస్య ప్రాధాన్యేప్యపరే విదుః ।
నిమిత్తానువిధాయిత్వాదసిద్ధిం లింగసంఖ్యయోః ॥ 200

సముచ్చయవతః = సముచ్చయముగల, అర్థస్య=అర్థముయొక్క, (ద్రవ్యములు), ప్రాధాన్యే + అపి = ప్రాధాన్యమందు కూడ, నిమిత్తాను విధాయిత్వాత్ = నిమిత్తమునే అనుసరించుట వలన, లింగసంఖ్యయోః = లింగవచనములయొక్క, అసిద్ధిమ్ = సిద్ధింపక పోవుటను, అపరే = కొందరు, విదుః = తెలియుదురు (భావింతురు).

తాత్పర్యము— ''ఘట పటౌ'' మొదలగుచోట్ల ద్రవ్యస్వరూపమును నిశ్చయించు టలో సముచ్చయము నిమిత్తమగును. అట్టి సముచ్చయముచే ద్రవ్యములు కప్పబడును. కావున సముచ్చయమను ధర్మమే భాసించుచున్నందున ''ద్రవ్యము ముఖ్యము'' అన్న పక్ష

మందును, ''విశేషణానామ్'' మొదలగు సూత్రముచేతనే లింగవచనములను సాధింపవలెనని కొందరందురు..

వివరణము—— ''కలయిక గల ఘట పటములు'' అని అర్థమును చెప్పినను, ''కలయిక'' అను ధర్మమందు ఆ రెండును కప్పబడినట్లై కలయికయే భావన యందుండును గాన తదనుసారము లింగవచనములుండక పోవచ్చునని వీరి తాత్పర్యము. నిమిత్తమైన ధర్మము నిమిత్తిని కప్పివేయునని వీరి సమన్వయము. ॥200॥

అవతారిక — మీది మతము సముచితముగాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సముచ్చయో నిమిత్తం చేత్ స్యాన్నిమిత్తానువర్తనమ్ ।
అన్వయవ్యతిరేకాభ్యాం చార్థో ద్వంద్వనిబంధనః ॥ 201

సముచ్చయః = సముచ్చయము, నిమిత్తమ్ + చేత్ = నిమిత్తమైతే, నిమిత్తానువర్తనమ్ = నిమిత్తము ననుసరించుట, స్యాత్ = అయ్యెడిని, అన్వయవ్యతిరేకాభ్యామ్ = అన్వయవ్యతిరేకముల వలన, ద్వంద్వనిబంధనః = ద్వంద్వమునుబట్టి తెలియదగినది, చార్థః = చకారము యొక్క అర్థము, (భవతి = అగును)

తాత్పర్యము—— ద్వంద్వము యొక్క అర్థమునకు సముచ్చయము నిమిత్తము కాదు. మీదు మిక్కిలి ద్వంద్వమునుబట్టియే చకారముయొక్క అర్థము భావింపవలయును కాగా సముచ్చయము ద్వంద్వమున నిమిత్తము కానందున మీది కారిక చూపిన మతము మంచిది కాదు.

వివరణము—— ద్వంద్వమున్నపుడు వచ్చునదియు, లేనపుడు రానిదియునగు అర్థమే ద్వంద్వముయొక్క అర్థమగును. అన్వయవ్యతిరేక భావమనగా ఇదియే. అట్టి యర్థము ''సమప్రాధాన్యముగల ద్రవ్యముల కలయిక లింగవచనములను కలిగి ఒక క్రియలో అన్వయించుట'' అగును. ఉదా: ''ఘట పటౌ ఆనయ'' (ఘట పటములను రెండిటిని కలిసి తీసుకొని రమ్ము). అట్టి యర్థమును వాక్యదశయందు చకారము సూచించును. అందువలన ద్వంద్వమునకు వాచ్యమైన యర్థమే చకారమునకు ద్యోత్యమగునని విశదముచేయుటకై ''చార్థే ద్వంద్వః'' అను సూత్రము బయలుదేరినది. అంతియకాని చార్థమైన సముచ్చయము ద్వంద్వమున నిమిత్తమని చెప్పుట దాని తాత్పర్యము కాదు. కాగా సముచ్చయము నిమిత్తమనుట కేవలము భ్రాంతి ॥201॥

అవతారిక—— ''ఇచటి తత్త్వమిది'' అని చూపుచున్నాడు

శ్లో॥ సముచ్చితనిమిత్తత్వే చార్థస్యాపగమేఽపి వా ।
స్వభావసిద్ధే ద్వంద్వస్య లింగసంఖ్యే వ్యవస్థితే ॥ 202

సముచ్చితనిమిత్తత్వే = కలిసిన ద్రవ్యములు నిమిత్తమైనపుడును, వా = లేక, చార్థస్య =

చకారముయొక్క అర్థము, అపగమే + అపి = పోయినపుడు గూడ, ద్వంద్వస్య = ద్వంద్వ మునకు, లింగసంఖ్యే = లింగవచనములు, స్వభావసిద్ధే = సహజములుగా, వ్యవస్థితే = నిశ్చయింపబడినవి.

తాత్పర్యము— కలిసిన ద్రవ్యములు ముఖ్యమైనపుడును, ద్రవ్యముల కలయిక (సముచ్చయము) నిమిత్తము కానపుడునుగూడ, ద్వంద్వమున లింగవచనములు సహజములే యగును. (ద్రవ్యముల ధర్మములుగాన అవి సహజములు). ॥202॥

అవతారిక— ''సముచ్చయమనగా పరస్పరాపేక్షగల ద్రవ్యముల కలయిక గదా! అయినపుడు ద్వంద్వమున ''చార్థము'' లేకపోవుట ఎట్లు కుదురును?'' - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ పదాంతరస్థస్యార్థస్య ద్యోతకత్వాన్న యుజ్యతే ।
నిపాతో లింగసంఖ్యాభ్యాం ద్వంద్వస్త్వర్థస్య వాచకః ॥ 203

పదాంతరస్థస్య = వేరొక పదమందుండు (వాక్యమందలి పదము), అర్థస్య = అర్థమును, ద్యోతకత్వాత్ = ద్యోతనము చేయునదగుటవలన, నిపాతః = నిపాతము (చకారము), లింగ సంఖ్యాభ్యామ్ = లింగవచనములతో, న + యుజ్యతే = కూడియుండదు, ద్వంద్వః + తు = ద్వంద్వసమాసమైతే, అర్థస్య = అర్థమునకు (''కలయిక'' అను అర్థము), వాచకః = వాచకము.

తాత్పర్యము— చకారము నిపాతము. అది వాక్యదశలో ఉండు పదార్థముల సముచ్చయమును ద్యోతన చేయును కావున దానికి లింగవచనములుండవు. ద్వంద్వము సముచ్చయమునకు వాచకము కావున దానికి లింగవచనములు సహజములు.

వివరణము— ''చార్థము పోవుట'' అనగా సమాసదశలో చకార మక్కర లేకుండ, దాని యర్థము తెలియుటయే అనగా ''ఘట పటౌ'' మొదలగు ద్వంద్వములవలననే సముచ్చయ రూపమగు అర్థము స్పష్టమైపోవును. అచట చకారమును వాడనక్కరలేదు. ''ఘటః - చ - పటః - చ'' మొదలగునది వాక్యావస్థ. కేవలము పోలికనుబట్టి ద్వంద్వమునకు అది విగ్రహముగా చూపబడును. వాస్తవమున వాక్యమునకును సమాసమునకును ఎట్టి సంబంధమును కుదురదు. (190-195, కారికలలో ఈ యంశములు ఇదివరకే నిరూపింప బడినవి). ॥203॥

అవతారిక— ''సముచ్చయమును నిమిత్తము ననుసరించుట'' అను మతమును (200 కారిక) మరల దూషింపుచున్నాడు.

శ్లో॥ నిమిత్తానువిధానే చ ద్రవ్యధర్మానపేక్షణాత్ ।
గుణప్రధానభావేన క్రియాయోగో న కల్ప్యతే ॥ 204

నిమిత్తానువిధానే + చ = సముచ్చయమను నిమిత్తముచే ద్రవ్యములు కప్పబడినపుడు, ద్రవ్య

ధర్మా సపేక్షణాత్ = ద్రవ్యముల యొక్క ధర్మముల అపేక్ష లేనందువలనను, గుణప్రధాన భావేన = సముచ్చయమను గుణము ముఖ్యమగుట చేతను, క్రియాయోగః = క్రియతోడి సంబంధము, న + కల్పతే = కుదురకపోవును.

తాత్పర్యము— ద్వంద్వమున సముచ్చయము నిమిత్తమై ద్రవ్యములను కప్పివేసి నచో, ద్రవ్యములు అప్రధానములుగను, సముచ్చయమను గుణమే ప్రధానముగను మారును. అయినపుడు ద్వంద్వమునకు క్రియాసంబంధము కుదురకపోవును. క్రియతోడి సంబంధము ద్రవ్యమునకేగాని గుణమునకు సంభవింపదు గదా! (ద్రవ్యము ఆధారము. అందలి గుణము ఆధేయము).

వివరణము— నిమిత్తాను విధానమనగా నిమిత్తమునే ముఖ్యముగ భావించి, నిమిత్తముగల ద్రవ్యములను ఉపేక్షించుట. అపుడు ద్రవ్యముయొక్క కర్తృత్వము, కర్మత్వము మొదలగు శక్తులు అణగిపోవును కారకము కానందున క్రియాయోగము కుదురదు. ॥204॥

అవతారిక— క్రియాయోగము లేనపుడు కలుగు దోషమును వివరించుచున్నాడు.

శ్లో॥ యస్య నాస్తి క్రియాయోగః స్వతంత్రోఽసౌ న విద్యతే ।
అర్థో ద్వంద్వస్య తత్ర స్యాదుపాదానమనర్థకమ్ ॥ 205

యస్య = ఏ అర్థమునకు, క్రియాయోగః = క్రియతో సంబంధము, న + అస్తి = ఉండదో, అసౌ = ఈ, అర్థః = అర్థము. స్వతంత్రః = స్వతంత్రముగా, న + విద్యతే = నిలబడదు, తత్ర = అచట, ద్వంద్వస్య = ద్వంద్వముయొక్క, ఉపాదానమ్ = స్వీకారము, అనర్థకమ్ = ప్రయోజనము లేనిదై, స్యాత్ = అయ్యెడిని.

తాత్పర్యము— క్రియతో సంబంధము లేని పదార్థము స్వతంత్రముగ నుండ జాలదు. (దానివలన అర్థప్రతీతి సంపూర్ణము కాదు) అందుచే ద్వంద్వమునకు క్రియాయోగము లేకపోయినపుడు దానిని స్వీకరించుటయు వ్యాఖ్యానించుటయును నిష్ఫలమగును ॥205॥

అవతారిక— ''నిమిత్తాను విధానము'' అను రీతి కూడ అన్ని చోటులందును ఉండదని చెప్పుచున్నాడు.

శ్లో॥ సముచ్చయవతోఽర్థస్య వాచకో నానువర్తతే ।
నిమిత్తమపి చాస్యార్థః స్వధర్మైర్యుజ్యతే తతః ॥ 206

సముచ్చయవతః = సముచ్చయముగల, అర్థస్య = అర్థమును, వాచకః + అపి = చెప్పు శబ్దము కూడ (''సముచ్చిత'' అను శబ్దము), నిమిత్తమ్ = నిమిత్తమును, న + అనువర్తతే = అనుసరించదు. తతః + చ = అందువలన, అస్య = ఈ శబ్దముయొక్క, అర్థః = అర్థము, స్వధర్మైః = తన ధర్మములతో (లింగవచనములతో), యుజ్యతే = కలియును,

తాత్పర్యము— ''సముచ్చితః'' (కలయికగలది - లేక - కలిసియున్నది) అను శబ్దమున్నది ఇది ''కలిసియున్న వస్తువు'' అను నర్థమును చెప్పును. ఇచట ''కలిసి యుండుట'' సిద్ధముగనే యుండును. ఉన్నదానిని ఈ శబ్దము బోధపరచును. అంతియకాని సముచ్చయము నిమిత్తము కాదు. అందువలన సముచ్చిత శబ్దము లింగసంఖ్యలను పొందును. ''ఘట పటౌ'' మొదలగు ద్వంద్వము కూడ ఇట్టిదే పదార్థముల కలయిక ఇచట ముందుగనే సిద్ధముగ నుండును. దానికి ద్వంద్వము వాచకమగును. అంతేకాని సముచ్చయము ద్వంద్వము నకు నిమిత్తము కాదు. కాగా ద్వంద్వమునకు లింగవచనములు సహజములు.

వివరణము— శుక్లః, మొదలగు గుణవాచకములు ''శుక్లత్వము'' మొదలగు గుణ మును నిమిత్తముగా గ్రహించి, ఆ గుణముగల ద్రవ్యమును చెప్పగలవు. (శుక్లః = తెలుపు, శుక్లః = తెల్లని వస్తువు) నిమిత్తమగుట యనగా ఇట్టిది. ఈ తీరు ''సముచ్చయ'' అను శబ్దము విషయమున కుదురదు సముచ్చయమన్నది శుక్లత్వమువంటి ధర్మము కాదు. కావున అది ద్రవ్యమును బోధించుటలో నిమిత్తము కానేకాదు. సముచ్చయము సిద్ధముగానున్నచో మాత్రము ''సముచ్చయము గల ద్రవ్యము'' అను నర్థమును ''సముచ్చిత-సముచ్చయవత్'' అను వేరే శబ్దములు తెలియజేయును.

ద్వంద్వసమాసము యొక్క తీరు కూడ ఇట్టిదే. సిద్ధముగనున్న సముచ్చయమును అది బోధించును కాని దానిని నిమిత్తముగా స్వీకరింపదు. కాగా సముచ్చితమైన ద్రవ్యములు ముఖ్యమన్నచో ద్వంద్వమునకు లింగవచనములు సహజములగును ద్రవ్యముల సముచ్చ యమే ముఖ్యమన్నచో ''విశేషణానామ్'' (1-2-52) మొదలగు సూత్రముచే ఆశ్రయగత మగు లింగవచనములు వచ్చునని చెప్పవలయును (199వ కారిక చెప్పిన భావమే తుదకు ఇచట సిద్ధాంతమైనది). ॥206॥

అవతారిక— ద్వంద్వమందలి పదార్థములు అనేకములు. అవి సమప్రాధాన్యము గలవి. అయినపుడు ఏది ఆశ్రయమగును? దేనినిబట్టి లింగవచనములను సంపాదింపవలెను? అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ బాహ్యో నాస్త్యాశ్రయో ద్వంద్వే విశేషౌ తత్ర హి శ్రుతౌ।
సముచ్చయస్తదాధారస్తద్ధర్మైర్వ్యపదిశ్యతే॥ 207

ద్వంద్వే = ద్వంద్వమందు, బాహ్యః = వెలుపలిదైన, ఆశ్రయః = ఆధారము, న + అస్తి= ఉండదు, తత్ర = అచట, విశేషౌ = ద్రవ్యవిశేషములు, శ్రుతౌ + హి = వినబడునుగదా!, తదాధారః = ఆ విశేషములే ఆశ్రయముగా గల, సముచ్చయః = సముచ్చయము, తద్ధర్మైః = వాని ధర్మములతో (లింగసంఖ్యలతో), వ్యపదిశ్యతే = వ్యవహరింపబడును.

తాత్పర్యము— ద్వంద్వమున ఆధారమైన ద్రవ్యము వేరుగా ఉండదు. కలిసి యుండు ద్రవ్యములచట స్పష్టముగనే ఉండును. అవియే సముచ్చయమున కాధారములు. వానిని బట్టియే లింగసంఖ్యలు వచ్చును.

వివరణము— గుణవాచకముల విషయములో ఆశ్రయము వేరుగా ఉండును ఉదా శుక్లః పటః. పటము ఆశ్రయము. శుక్లా నారీ శుక్లౌ ఘటౌ. కావున ఆశ్రయమునుబట్టి లింగసంఖ్యలనుట అచట సులభము. కాని ద్వంద్వమందు ఆశ్రయము వేరుగా ఉండదు కలియు ద్రవ్యములు ద్వంద్వమందే ఇమిడియుండును. (ఘట పటౌ). అందువలన సముచ్చయమున కాధారముగా వానినే తీసికొనవలయును. వాని లింగసంఖ్యలే సముచ్చయమునకు సంక్రమించుననవలెను.

విశేష విషయములు— భిన్న లింగములకు ద్వంద్వమైనపుడు పరపదముయొక్క లింగమే మొత్తముపై వచ్చునను నియమము గలదు. (ఉదా : కుక్కుటమయూర్యౌ - ఇమే (- స్త్రీ॥) మయూరీకుక్కుటౌ - ఇమౌ - పుం॥) సంఖ్యయు అవయవములగు పదార్థములను బట్టి అనుసరించును (రెండయినచో ద్వివచనము, పెక్కులయినపుడు బహువచనము).॥207

అవతారిక— ద్వంద్వమందలి పదము ప్రతియొకటియు సమసించు పదార్థముల సముదాయమునే బోధించునన్న పక్షములో లింగవచనముల సిద్ధిని చూపుచున్నాడు.

శ్లో॥ యో వావయవభేదాభ్యాం భేదవద్భ్యామివాన్వితః ।
ఏకః సమూహో ధర్మాత్ స భాగయోః ప్రతిపద్యతే ॥ 208

వా = లేక, భేదవద్భ్యామ్ + ఇవ = భేదముగలవి అన్నట్లుండు, అవయవభేదాభ్యాం = అవయవముల భేదములతో, అన్వితః = కూడిన, ఏకః = ఒకటియైన, సమూహః = సముదాయము, యః = ఏది గలదో, సః = అది, భాగయోః = ఆశ్రయములైన భాగములయొక్క ధర్మాత్ = ధర్మమువలన, ప్రతిపద్యతే = పొందును (లింగవచనములను).

తాత్పర్యము— అవయవభేదములు గల సముదాయమే ద్వంద్వమందలి పదముల కర్థమని చెప్పుదుము. ఆ సముదాయమందలి భాగము లాధారములగును. వానినిబట్టి సముదాయమునకును లింగవచనములు సిద్ధించును.

వివరణము— 28 వ కారికలో చూపబడిన ద్వంద్వపరిశీలనమును ఇచట సమన్వయించుకొనవలెను "అవయవ భేదములు గల సముదాయము ద్వంద్వమున కర్థమని" ఆ సందర్భమున విపులమైన చర్చ జరిగినది. ॥208॥

అవతారిక— "అవయవములను మించిన సముదాయమన్నది ద్వంద్వమున వేరుగ ఉండదు. అట్లయినపుడు ఆధారాధేయ భావ మెట్లు కుదురును ?" అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ఏకశ్చ ద్వ్యాత్మకోఽర్థోఽసౌ భేదాభేదసమన్వితః ।
యో భేదాశ్రితః తత్స్థే లింగసంఖ్యే ప్రపద్యతే ॥ 209

అసౌ = ఈ, అర్థః = అర్థము, ఏకః + చ = ఒకటియైనను, భేదాభేదసమన్వితః =

భేదముతోను అభేదముతోను కూడినదై, ద్వ్యాత్మకః = రెండు స్వరూపములు గలది, (భవతి = అగును), యౌ = ఏ, భేదౌ = భేదములను, ఆశ్రితః = ఆశ్రయించునో, తత్ స్థే = ఆ భేదములందుండు, లింగసంఖ్యే = లింగవచనములను, ప్రపద్యతే = పొందును.

తాత్పర్యము— ద్వంద్వమున కర్థమైన సముదాయము రెండు రకములు. అవయవ భేదములు గల దొకటి. అది లేనిది రెండవది. అందు మొదటిది అవయవములనే ఆశ్రయము ఱగ స్వీకరించును తాను ఆశ్రితమగును. కాగా అవయవముల లింగవచనములు సముదాయ మునకు సిద్ధించును.

వివరణము— వనమ్ = చెట్ల సముదాయము. యూథమ్ = జంతువుల సముదాయము. ఇట్టి చోటులందు సముదాయ మొకటియే ముఖ్యము. అవయవ భేదముండదు ఇట్టి సముదాయమే ద్వంద్వమున కర్థమన్నచో ఇతరేతర యోగ ద్వంద్వమున (ఘట పటౌ, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నాః) లింగవచనముల వ్యవస్థ కుదురక పోవును అందువలననే భావనామాత్రగమ్యమైన ఈ కల్పనమంతయు చేయబడినది.

ద్వంద్వమున లింగవచనముల అతిదేశ పరిశీలన మింతటితో ముగిసినది. ॥209॥

(11) బహువ్రీహియందు లింగవచనముల అతిదేశ పరిశీలనము

అవతారిక— బహువ్రీహి సమాసమున లింగవచనముల అతిదేశముయొక్క ఉపయోగమును పరిశీలించుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ యథా స్వశబ్దాభిహితే చైత్రార్థే న ప్రయుజ్యతే ।
చైత్రశబ్దో బహువ్రీహావప్రయోగ స్తథా భవేత్ ॥ 210

స్వశబ్దాభిహితే = తన శబ్దముచే (అదే శబ్దముచే) చెప్పబడిన, చైత్రార్థే = చైత్రరూపమైన అర్థమందు, చైత్రశబ్దః = చైత్ర, అను శబ్దము, యథా = ఎట్లు, న + ప్రయుజ్యతే = ప్రయోగింపబడదో, తథా = అట్లు, బహువ్రీహౌ = బహువ్రీహి సమాసమున, అప్రయోగః = ప్రయోగము లేకపోవుట, భవేత్ = అయ్యెడిని.

తాత్పర్యము— చైత్రుడు, అను అర్థమును చెప్పుటకు "చైత్రః" అను శబ్దమును ఒకసారి వాడిన చాలును. మరల మరల వాడనక్కరలేదు. అట్లే బహువ్రీహి సమాసమును వాడినపుడు అన్యపదార్థము తెలిసిపోవును, గాన దానిని చెప్పుటకై వేరొక శబ్దమును వాడ నెక్కర యుండక పోయెడిని.

వివరణము— బహువ్రీహియందు అన్యపదార్థము ముఖ్యము. అనగా సమసించు పదముల అర్థము విశేషణమై వేరుగా ఉండు విశేష్యముతో అన్వయించును. ఉదా: "పీతాంబరః = విష్ణుః" (పీతమ్ - అంబరమ్ - యస్య - సః = పచ్చని బట్ట గలవాడు = విష్ణువు). ఇట్టిచోట్ల సమాసమువలననే విశేష్యము తెలియనుగాన (ఆ యా విశేషణము గల వ్యక్తియను భావము తెలిసిపోవును) దానిని చెప్పు శబ్దమును వేరుగ పలుకనక్కరయుండదని సారాంశము

విశేష విషయములు— (1) సమసించు పదములను (సమాసములో ఇమిడియున్న పదములు) వర్తిపదము లందురు వాని యర్థములు వర్తి పదార్థములగును. వీనికన్న వేరైనది అన్య పదార్థము. అనగా విడిగానుండు విశేష్యముయొక్క అర్థము.

(2) ''ఉక్తార్థానామ్ అప్రయోగః'' అని సంప్రదాయము. వేరొక విధమున అర్థము తెలియునపుడు అదే యర్థముకొరకు వేరొక శబ్దమును వాడనక్కరలేదని భావము ఉదా: చైత్రః = చైత్రుడు. ఈ యర్థమునకై మరల చైత్రశబ్ద మక్కరలేదు. ''ఘటపటౌ'' = ఘట పటముల సముచ్చయము. ఇచట సముచ్చయమును చెప్పుటకు చకారమును వాడ నక్కర లేదు.

(3) అట్లే బహువ్రీహి వలన అన్యపదార్థము తెలిసిపోవునుగాన దానిని చెప్పు శబ్దమును ప్రయోగింపనక్కర లేదు.

(4) ఈ కారిక కేవలము శంకను చూపినది. ॥210॥

అవతారిక — మీది శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యథా గౌరితి శుక్లాదేరభిధానం న విద్యతే ।
ఏవం యస్యాభిసంబంధో గోభిస్తావత్ ప్రతీయతే ॥ 211

గౌః + ఇతి=గౌః, అను సామాన్యపదముచే, శుక్లాదేః=''శుక్లా - గౌః'' మొదలగు విశేషము యొక్క, అభిధానమ్ = చెప్పుట, న = విద్యతే = ఉండదో, ఏవమ్ = ఇట్లు, గోభిః = గోవులతో, యస్య = ఎవనికి, అభిసంబంధః = సంబంధమో, తావత్ = అంతమాత్రమే, ప్రతీయతే = తెలియబడును (బహువ్రీహిచే).

తాత్పర్యము— సామాన్యమును చెప్పు శబ్దము విశేషమును చెప్పజాలదు. ఉదా: గౌః = ఆవు (సామాన్యము) ఇది శుక్ల, కృష్ణ, మొదలగు విశేషములను చెప్పదు. అవి కావలసినచో ''శుక్లా'', ''కృష్ణా'' మొదలగు పదములను తప్పక వాడవలెను. అట్లే ''చిత్రగుః'' (చిత్రాః - గావః - యస్య - సః = రంగు రంగుల ఆవులుగల వ్యక్తి) అను బహువ్రీహి ''గోవులకు ప్రభువైన వ్యక్తి'' అను సామాన్యార్థమునే చెప్పి ఊరకుండును చైత్రుడు, మైత్రుడు మొదలగు వ్యక్తి విశేషములను బోధించుటకు ఆయా పదములు వేరుగా ఉండక తీరదు. కాన విశేష్యమును బోధించు పదమును బహువ్రీహికి అనుబంధముగా చేర్చవలెను.

వివరణము— ''సామాన్యాభిధానే హి విశేషానభిధానమ్'' (సామాన్యమును మాత్రము చెప్పినపుడు విశేషము తెలియదు గదా!) అను అభియుక్తుల వచనము ఇచట ప్రమాణము. ॥211॥

అవతారిక— శబ్దముయొక్క శక్తివలన కొన్ని బహువ్రీహులందు విశేషముకూడ ఇమిడి యుండును అట్టిచోట్ల విశేషమును వేరుగ చూపనక్కరలేదని వివరించుచున్నాడు.

శ్లో॥ సంబంధీ నియతో రూఢశ్చిత్రాణాం న చ విద్యతే ।
గవాం యథా వజ్రపాణిస్త్ర్యక్షో వాపి వ్యవస్థితః ॥ 212

వజ్రపాణిః = వజ్రపాణిః, అను బహువ్రీహియు, వా = లేక, త్ర్యక్షః + అపి = త్ర్యక్షః అను బహువ్రీహియును, యథా = ఎట్లు, వ్యవస్థితః = నిశ్చయింపబడినదో (తథా = అట్లు), నియతః = నిశ్చితమైన, రూఢః = ప్రసిద్ధమైన, సంబంధీ = సంబంధముగల వ్యక్తి విశేషము, చిత్రాణామ్ = చిత్రములైన, గవామ్ = గోవులకు, న + చ + విద్యతే = ఉండదు.

తాత్పర్యము — "వజ్రపాణిః" (వజ్రం - పాణౌ - యస్య - సః) ఇది ఇంద్రుని యందు రూఢము. కాన ఇచట "ఇంద్రః" అని అనుప్రయోగమును (వెనుకగా విశేష శబ్దమును పలుకుట) చేయనక్కరలేదు. అట్లే - "త్ర్యక్షః" (త్రీణి - అక్షీణి - యస్య - సః = ముక్కంటి) అనునది శివునియందు ప్రసిద్ధము ఇచట కూడ అనుప్రయోగమక్కరలేదు. కాని "చిత్రగుః" (చిత్రాః - గావః - యస్య - సః) అనునది మాత్రము "చిత్రమైన ఆవులకు స్వామి" అను సామాన్యము నే తెలియజేయును. ఆ స్వామి ప్రసిద్ధుడు కాడు. కావున ఇట్టిచోట్ల విశేషశబ్దమును (చైత్రః, మొ॥) పలుకక తప్పదు.

వివరణము — కొన్ని బహువ్రీహులు విశేషమును కూడ ప్రతిపాదించుటయు, మరికొన్ని సామాన్యమును మాత్రమే ప్రతిపాదించుటయును శబ్దశక్తి యొక్క మహిమయే (అనగా భాషా స్వభావము). ప్రకరణము మొదలగు వానివలన విశేషము తెలియునపుడు "చిత్రగుః" మొదలగుచోట్ల కూడ, అనుప్రయోగమావశ్యకము కాదు. ॥212॥

అవతారిక — వాక్యము విశేషమును గూడ చెప్పగలదు. సమాసము సామాన్యమునే బోధించునని చూపుచున్నాడు

శ్లో॥ శబ్దాంతరత్వాద్వాక్యేషు విశేషా యద్యపి శ్రుతాః ।
వృత్తిశబ్దోన్య ఏవాయం సామాన్యస్యాభిధాయకః ॥ 213

యద్యపి = పరిశీలింపగా, శబ్దాంతరత్వాత్ = వేరు శబ్దములగుట వలన, వాక్యేషు = వాక్యములందు, విశేషాః = విశేషములు, శ్రుతాః = వినబడును, సామాన్యస్య=సామాన్యమును, అభిధాయకః = బోధించు, అయమ్ = ఈ, వృత్తిశబ్దః = వృత్తిపదము (బహువ్రీహి సమాసము) అన్యః + ఏవ = వేరైనదియే.

తాత్పర్యము— "వాక్యము వేరు, వృత్తి వేరు" అని ఇదివరకు పెక్కు విధముల (ఈ సముద్దేశము యొక్క తొలి చర్చలలో) ప్రతిపాదింపబడెను. బహువ్రీహి విషయ మందును అదియే స్థితి. "చిత్రాః - గావః, అస్య - దేవదత్తస్య" అను వాక్యము విశేషమును కూడ స్వీకరింపగలదు. "చిత్రగుః" అను సమాసము మాత్రము అట్లు చేయలేదు. సామాన్యమునే బోధించి యూరకొనును.

వివరణము— కొంచెము పోలికనుబట్టి వృత్తిని వాక్యరూపమున విశ్లేషించి చూపుదురు. అంతమాత్రమున "ఆ రెండును ఒకటేయనిగాని, ఒకదానికొకటి మార్పు" అనిగాని అనుకొనగూడదు. వాక్యధర్మములను పూర్తిగా వృత్తి చెప్పజాలదు. వాక్యమందలి సంఖ్యావిశేషములను వృత్తి బోధింపజాలదు గదా ! ॥213॥

అవతారిక— అట్లయినచో కేవలము సామాన్యమునే బోధించు బహువ్రీహి వలన ప్రయోజనమేమి ? – అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ అగోరచిత్రగోశ్చైవ రూపభేదాన్నివర్తకః ।
న చిత్రగువిశేషాణాం రూపాభేదాత్తు వాచకః ॥ 214

రూపభేదాత్ = స్వరూపముయొక్క భేదమువలన, అగోః = గోవుల సంబంధము లేనివానిని, అచిత్రగోః + చ = చిత్రమైన గోవుల సంబంధము లేనివానిని కూడ, నివర్తకః + ఏవ = త్రోసివేయునదియే (భవతి = అగును), తు = కాని, రూపాభేదాత్ = స్వరూప భేదము లేనందువలన, చిత్రగువిశేషాణామ్ = చిత్రమైన గోవులుగల వ్యక్తి విశేషములను, వాచకః = చెప్పునది, న = కాదు.

తాత్పర్యము— అగుః = గోవులు లేనివాడు (న - సంతి - గావః - యస్య - సః) అచిత్రగుః = చిత్రమైన గోవులు లేనివాడు, (న + చిత్రగుః) భిన్నమైన ఈ శబ్దములు వేర్వేరు అర్థములను బోధించును. ఈ రెండు విధములైన అర్థములను అడ్డుటకు "చిత్రగుః" అను బహువ్రీహి ఉపయోగించును అది "చిత్రగోస్వామి" అను సామాన్యమునే బోధించును గాని విశేషములను బోధింప సమర్థము కాదు చైత్రః, మైత్రః, మొదలగు విశేషముల సంఖ్యాకములు. అయినను అన్నింటికిని "చిత్రగుః" అను విశేషణ మొకటియే సరిపోవును గదా !

వివరణము— అగుః, అచిత్రగుః, అను వానికి భిన్నమైన చిత్రగు, శబ్దము ఆ రెండింటిని త్రోసివేయును. అందు రూపభేదము కారణము. అట్లే విశేషము లెన్నియైనను అన్నింటిని విశేషముగా కాక సామాన్యముగా చెప్పగలది చిత్రగు శబ్దమగును. అందు శబ్దరూప మొకటే యగుట నిదానము. ఇట్లు బహువ్రీహి ఒక విధముగ విశేషమును, వేరొక విధముగ సామాన్యమును కూడ బోధించునని పర్యవసించును. ॥214॥

అవతారిక— చిత్రగుః, మొదలగు బహువ్రీహి స్థలములలో, చైత్రః, మైత్రః మొదలగు విశేష శబ్దముల అనుప్రయోగము తప్పదని పై విచారణవలన తేలినది. అట్లే తత్, ఇదమ్, మొదలగు సర్వనామములకు కూడ అనుప్రయోగమావశ్యకమే. అవియు ఒక విధముగ విశేషములేయగునని చెప్పుచున్నాడు.

శ్లో॥ యథా చిత్రగురిత్యేతత్ ప్రయుక్తే న ప్రయుజ్యతే ।
ఏవం యది స్యాత్ సామాన్యం తస్య న స్యాత్ ప్రతిశ్రుతిః ॥ 215

ప్రయుక్తే = ఒక శబ్దము ప్రయోగింపబడగా, చిత్రగుః + ఇతి = చిత్రగుః, అను, ఏతత్ = ఈ పదము, యథా = ఎట్లు, న + ప్రయుజ్యతే = ప్రయోగింపబడదో, ఏవమ్ = ఇట్లు, సామాన్యమ్ = సామాన్యమును చెప్పు, "సర్వ" మొదలగు పదము, స్యాత్ + యది = అయినట్లయితే, తస్య = దానికి, ప్రతిశ్రుతిః = (వినబడుట) అను ప్రయోగము, న + స్యాత్ = లేకుండును.

తాత్పర్యము— "చిత్రమైన గోవులకు స్వామి" అను నర్థమును చెప్పు ఒక శబ్దమున్నపుడు మరల అదే యర్థమునకై "చిత్రగుః" అను పదమును వాడనక్కర లేదు. అట్లే సర్వ, తత్, ఇదమ్, మొదలగు శబ్దముల అపేక్ష లేనియెడల వానిని ప్రయోగింపవలసిన ఆవశ్యకత యుండదు. కాని వాని అపేక్ష కొన్నిచోట్ల ఉండునుగాన ఆ శబ్దములను గూడ అనుప్రయోగము చేయవచ్చును.

వివరణము— ఒక ప్రదేశమును ఉద్దేశించి, "చిత్రగు" అందుము. అపుడా ప్రదేశమంతయు "చిత్రగువు" అగునా ? లేక కొంతయేనా ? లేక ఈ ప్రదేశమా ? ఆ ప్రదేశమా ? మొదలగు శంకల. కలుగును వానిని పోగొట్టుటకు సర్వమ్ (అంతయు), ఇదమ్ (ఇది), తత్ (అది) మొదలగు పదములను వాడక తప్పదు. కాగా అవి విశేషములను చెప్పు చైత్రః, మైత్రః, మొదలగు పదముల పంటివేయగును అందుచే సర్వనామములకు కూడ బహువ్రీహిలో అనుప్రయోగము సంభవించును. ఉదా : చిత్రగుః - సః, చిత్రగుః - అయమ్ మొదలగునవి. ॥215॥

అవతారిక— వేరొక యర్థమును అడ్డునుగాన సర్వనామము కూడ విశేషపదమే యగునని వివరించుచున్నాడు.

**శ్లో॥ సర్వాదయో విశేషాస్తు ప్రదేశానాం నివర్తకాః ।
యథా ప్రదేశాః సామాన్యప్రదేశాంతరబాధకాః ॥** 216

ప్రదేశాః = విశేషములు, యథా = ఎట్లు, సామాన్యప్రదేశాంతర బాధకాః = సామాన్యమునకును, ఇతర విశేషములకును బాధకములో, (తథా = అట్లు), ప్రదేశానామ్ = విశేషములను, నివర్తకాః = అడ్డివేయు, సర్వాదయః + తు = సర్వ, మొదలగు పదములైతే, విశేషాః = విశేషములు (భవంతి = అగును).

తాత్పర్యము— చైత్రః, అనునది విశేషము. ఇది మనుష్య సామాన్యమును, మైత్ర, మొదలగు ఇతర విశేషములనన్నింటిని తొలగించును. అట్లే, సర్వ, ఇదమ్ మొదలగు సర్వనామములు తాముకాని ఇతరములనన్నింటిని అడ్డివేయునుగాన అవియు విశేషములే యగును.

వివరణము— తన్ను తప్ప ఇతరములను తొలగించునది విశేషము. ఉదా : చైత్రః, అనగానే చైత్రుడు తప్ప మిగిలినవారందరును తొలగుదురు. దీనినే "అన్యవ్యా

వృత్తి'' అందురు ఈ రీతి సర్వనామములకును వర్తించును. సర్వమ్, తత్, ఇదమ్, మొద లగు పదములను ఉచ్చరింపగానే అది కానిదంతయు నివర్తించును.

ఇట్లు బహుప్రీహియందును ప్రయోగము సమర్థింపబడినది. ॥216॥

అవతారిక— బహుప్రీహియందు అన్యపదార్థము (విశేష్యమైన వేరొక వస్తువు) ముఖ్యమనియు, అపుడనుప్రయోగము కుదురుననియును ఇంతద.ఁక ప్రతిపాదింపబడినది ''సంబంధమే బహుప్రీహియందు ముఖ్యమని'' వేరొక పక్షమును భాష్యకారుడు చూపెను. ఆ పక్షమును ప్రతిపాదించుచున్నాడు.

శ్లో॥ విభక్త్యర్థాభిధానాద్వా షష్ఠీ నానుప్రయుజ్యతే ।
ద్రవ్యస్యానభిధానాత్తు తచ్ఛబ్దోఽనుప్రయుజ్యతే ॥ 217

వా = లేక, విభక్త్యర్థాభిధానాత్ = షష్ఠియొక్క అర్థమైన సంబంధమును చెప్పుటవలన, షష్ఠీ = షష్ఠీ విభక్తి, న + అనుప్రయుజ్యతే = వెనుకను ప్రయోగింపబడదు, ద్రవ్యస్య = ద్రవ్య మును, అనభిధానాత్ + తు = చెప్పనందువలన, తచ్ఛబ్దః = ఆ ద్రవ్యమును చెప్పు శబ్దము, అనుప్రయుజ్యతే = వెనుక ప్రయోగింపబడును.

తాత్పర్యము— బహుప్రీహియందు పదార్థము ముఖ్యముకాదు. సంబంధమే ముఖ్యము దానిని సమాసము బోధించునుగాన షష్ఠియొక్క అనుప్రయోగముండదు. పదార్థము ఏ విధముగను తెలియదు. అందుచే దానిని చెప్పు శబ్దమునకు అనుప్రయోగమావశ్యకమగును.

వివరణము— ''చిత్రగుః = చిత్రాః - గావః - యస్య'' ఇచట షష్ఠీవిభక్తియొక్క అర్థము సంబంధము - అనగా స్వస్వామి భావ సంబంధము. (స్వమ్ = సొత్తు, స్వామి = సొత్తు గలవాడు. ఇదొక సంబంధము) దీనినే ''చిత్రగు'' అను సమాసము చెప్పును. అందుచే వేరుగ షష్ఠిని వాడనక్కరలేదు. (ఉక్తార్థానామప్రయోగః = తెలిసిన యర్థమును చెప్పుటకు వేరుగ శబ్దమును వాడనక్కరలేదు). కాని ఆ సంబంధముగల ద్రవ్యము (స్వామి) బోధపడక పోవుటచే దానిని బోధించుటకు చైత్రః, మైత్రః, మొదలగు పదములను ప్రయోగింపక తప్పదు.

విశేష విషయములు— సంబంధముగల ద్రవ్యము ముఖ్యమనియు, దానిని సమా సము చెప్పుననియును వెనుకటి పక్షము. దీనిని పదార్థాభిధాన పక్షమందురు. అందు ద్రవ్య మును సమాసమే బోధించునుగాన, దానిని బోధించు పదమును వేరుగ వాడనక్కరలేదేమో - అను శంకయు, దానికి సమాధానమును చూపబడినది

ద్రవ్యమునకు గల సంబంధమే ముఖ్యమని ప్రకృత పక్షము. దీనిని విభక్త్యర్థాభి ధాన పక్షమందురు. ఇందు సంబంధమును చెప్పు షష్ఠికి అనుప్రయోగమక్కరలేక పోయినను (సంబంధము సమాసమే చెప్పునుగాన) ద్రవ్యమును చెప్పుటకు ఆ శబ్దముయొక్క అనుప్రయో గము న్యాయ్యమే యగునని ఫలించును. ॥217॥

అవతారిక— బహువ్రీహి సంబంధమునే బోధించుచున్నపుడు సామానాధికరణ్యము కుదురదని శంకించుచున్నాడు.

శ్లో॥ సామానాధికరణ్యం చేన్మతుబ్లోపాత్ ప్రకల్ప్యతే।
మతుపోఽపి తదర్థత్వాదనవస్థా ప్రసజ్యతే॥ 218

మతుబ్లోపాత్ = మతుప్పుయొక్క లోపమువలన, సామానాధికరణ్యమ్=సామానాధికరణ్యము, ప్రకల్ప్యతే + చేత్=కల్పింపబడినట్లయితే, మతుపః + అపి=మతుప్పునకును, తదర్థత్వాత్ = అదే అర్థమగుటవలన, అనవస్థా = నియమము లేకపోవుట, ప్రసజ్యతే = సంభవించెడిని.

తాత్పర్యము— బహువ్రీహికి మతుప్ ప్రత్యయమును చేసి, దానికి లోపమును చెప్పి "చిత్రగుః = చైత్రః" అను రీతిని సామానాధికరణ్యమును (రెండును ఒకే ద్రవ్యమును చెప్పుట) సంపాదింపవచ్చునన్నచో చిక్కులు ఏర్పడును. మతుప్పున కర్థము సంబంధమున్న యెడల ఎన్నిసారులు మతుప్పును చేసినను సంబంధముగల ద్రవ్యము బోధపడదు. ఇదొక అనుపపత్తి. అట్లుకాక సంబంధియగు ద్రవ్యమునే మతుప్పు బోధించునన్నచో బహువ్రీహి యును ద్రవ్యమునే బోధింపవలసి వచ్చునుగాన "సంబంధము ముఖ్యము" అను విభక్త్యర్థాభి ధాన పక్షమే కుదురదు ఇది వేరొక అనుపపత్తి.

వివరణము— చిత్రగు, అను సమాసము సంబంధమునే చెప్పునన్నయెడల, అది ద్రవ్యము కానందున లింగమును, వచనమును (చిత్రగుః - చిత్రగు, మొదలగు లింగభేదము, చిత్రగూ - చిత్రగవః, మొదలగు వచనభేదము) సిద్ధింపవు. అవి సిద్ధించుటకు బహువ్రీహికి గుణవచనముల సామ్యమును భాష్యకారుడు చెప్పెను. శుక్ల, మొదలగు గుణవాచకములకు వలె ఆశ్రయమగు ద్రవ్యమునుబట్టి లింగవచనములు బహువ్రీహియందును రావచ్చునని అతని ఆశయము. అయినను "శుక్లః పటః" మొదలగురీతిని గుణవాచకములకు సామానాధికరణ్యము కుదురునట్లు "చిత్రగుః చైత్రః" అని సామానాధికరణ్యము కుదురదను శంకను ఈ కారిక ప్రస్తావించినది.

విశేష విషయములు— (1) "గుణవచనానామాశ్రయతో లింగవచనాని" (గుణ వాచకములకు ఆశ్రయమునుబట్టి లింగవచనములగును) అను అతిదేశమునకు బహువ్రీహియం దుపయోగము ఈ పక్షమున చూపబడినది.

(2) బహువ్రీహియందు సంబంధము ప్రధానమన్నపుడు అది ద్విష్ఠము (రెండు వస్తువులకు చెందునది. సంబంధమనగానే రెండు వస్తువులుండక తీరదు) అగును. అందుచే దాని కాశ్రయము స్వమ్ము (సొత్తు), స్వామియు కూడ కావచ్చును. అయినను స్వామి ముఖ్యముకాన దానినే సహజమైన ఆశ్రయముగా స్వీకరింపవలెను. దానినిబట్టియే లింగవచనము లగును. కాగా "చిత్రగుః" మొదలగుచోట్ల చైత్రః, మొదలగు అన్యపదార్థమును బట్టియే లింగవచనములను చెప్పవలయును.

(8) అయితే - గుణవాచకమునకును, సంబంధమునకును కొంత భేదమున్నది గుణమునకును ద్రవ్యమునకును అవినాభావము గలదు. అందుచే శుక్లాది శబ్దములకు మతుప్పును చేసి, లోపమును చెప్పి, ''శుక్లః పటః'' అను రీతిని సామానాధికరణ్యమును సంపాదించుట అతి సులభము. కాని సంబంధమట్టిది కాదు. అది అనియతము వేరొక వస్తువుతో సంబంధము లేకుండ ద్రవ్యముండవచ్చును. అందును స్వస్వామి భావము మొదలగు సంబంధము వివక్షా ధీనము. అందువలన సంబంధవాచకముగా బహువ్రీహిని అంగీకరించునపుడు, మతుప్పును దాని లోపమును చెప్పినను సామానాధికరణ్యమును సంపాదించుట అతిదుర్లభమగును. ॥218॥

అవతారిక— పై విషయమునందే మరొక దోషమును చూపుచున్నారు

శ్లో॥ సంబంధస్య చ సంబంధీ సంబంధోఽన్యః ప్రసజ్యతే ।
విభక్త్యర్థప్రధానే చ క్రియాయోగో న కల్పతే ॥ 219

సంబంధస్య = సంబంధమునకు, సంబంధీ = సంబంధియగు, అన్యః = మరియొక, సంబంధః + చ = సంబంధము కూడ, ప్రసజ్యతే = ఏర్పడవలసి వచ్చును, విభక్త్యర్థప్రధానే = విభక్త్యర్థము (సంబంధము) ముఖ్యమైనపుడు, క్రియాయోగః + చ = క్రియతోడి సంబంధము కూడ, న + కల్పతే = సంభవింపదు.

తాత్పర్యము— బహువ్రీహికి మతుప్పును చేసి, రెండిటికిని సంబంధమే అర్థమన్నచో, ప్రకృత్యర్థము విశేషణమును, ప్రత్యయార్థము విశేష్యమును అగునుగాన, ''సంబంధముతో కూడిన సంబంధము'' అను (చిత్రగుః = చిత్రగోవుల సంబంధముగల సంబంధము) ప్రతీతి కలిగెడిని. మరియును సంబంధము ముఖ్యమన్నచో అది ద్రవ్యము కానందున క్రియతో అన్వయము కుదురకపోవును. (ఉదా : చిత్రగుః - ఆనీయతామ్ = చిత్రగువును తీసికొనిరమ్ము - సంబంధమును తీసికొనివచ్చుట అసంభవము) ॥219॥

అవతారిక— విభక్త్యర్థము ముఖ్యమైనను ''తతః పశ్య'' (అచటనుండి చూడుము), ''తత్రపశ్య'' (అచట చూడుము) మొదలగుచోట్ల క్రియాన్వయము కనబడుచున్నది గదా ! - అను శంక సరికాదని చెప్పుచున్నారు

శ్లో॥ విభక్త్యర్థప్రధానత్వాత్ తతస్తత్రేతి న క్రియా ।
దృశ్యాదిః కర్మకర్త్రాదినిమిత్తత్వాయ కల్పతే ॥ 220

తతః + తత్ర + ఇతి = తతః, తత్ర, అనుచోట, దృశ్యాదిః = దృశ్ మొదలగు, క్రియా= క్రియ, విభక్త్యర్థప్రధానత్వాత్ = విభక్తియొక్క అర్థము ముఖ్యమగుటవలన, కర్త్రాదినిమిత్తత్వాయ = కర్త, కర్మ మొదలగువానికి హేతువగుటకు, న + కల్పతే = సమర్థము కాదు.

తాత్పర్యము— తతః, అనుచోట పంచమ్యర్థము (అవధి) ప్రధానము. తత్ర అనుచోట సప్తమ్యర్థము (ఆధారము) ముఖ్యము. ఈ రెండును ద్రవ్యములు కావు అందు

వలన దృశ్, (చూచుట) మొదలగు క్రియలకు అవి కర్తలుగాని, కర్మలుగాని కానేరవు. అవధియైన ద్రవ్యమునకును, ఆధేయమగు ద్రవ్యమునకును మాత్రమే అచట క్రియతో అన్వయము.

వివరణము— తత్ శబ్దమునకు "తస్" ప్రత్యయము చేరుటవలన "తతః" అని యగును. పంచమీ విభక్తియొక్క అర్థమున (అవధి) ఆ ప్రత్యయము వచ్చినది. అట్లే తత్ శబ్దమునకు సప్తమ్యర్థమున (ఆధారము) త్ర, అను ప్రత్యయము చేరగా "తత్ర" అని యగును. ఇచట ఆ యా విభక్త్యర్థములు క్రియతో సంబంధింపవు అనగా అవి కర్తగా కాని కర్మగా కాని క్రియతో సంబంధించుట కుదురదు. (అవధి చూచుట, ఆధారము చూచుట అని తాత్పర్యము కాదు) అందుచే ద్రవ్యమునకే అచట క్రియాన్వయము. ("అవధిగానుండు వస్తువునుండి చూడుము, ఆధేయమగు వస్తువును చూడుము" అనియే అన్వయము).

కాగా బహువ్రీహియందు విభక్త్యర్థము (సంబంధము) ముఖ్యమన్నచో, దానికి క్రియాయోగము సంభవింపక పోవును. ॥220॥

అవతారిక— ఇట్లు విభక్త్యర్థము (సంబంధము) ముఖ్యమను పక్షమున దోషము కలుగునని చూపి, మరియొక ఆక్షేపమును కూడ చూపుచున్నాడు

శ్లో॥ అంతర్భవేచ్చ సంబంధః ప్రాధాన్యాభిహితః కథమ్ ।
స ప్రాతిపదికార్థశ్చ తథాభూతః కథం భవేత్ ॥ 221

ప్రాధాన్యాభిహితః = ముఖ్యముగా చెప్పబడిన, సంబంధః + చ = సంబంధమైతే, కథమ్ = ఎట్లు, అంతర్భవేత్ = అంతర్భవించును ? (సమాసములో ఇముడును), తథాభూతః = అట్లయిన (అంతర్భవించని), సః = అది, ప్రాతిపదికార్థః + చ = ప్రాతిపదికార్థముగా అయినను, కథమ్ = ఎట్లు, భవేత్ = అగును ?

తాత్పర్యము— సంబంధము ముఖ్యముగా భాసించినపుడు, సమాసముయొక్క అర్థములో అది అప్రధానముగ ఇమిడియుండుట కుదురదు. అట్టి సంబంధము ప్రాతిపదికార్థమనుటకును వీలులేదు.

వివరణము— చిత్రగుః - ఇది "చిత్రగోవుల సంబంధము"ను ముఖ్యముగా చెప్పును కాగా సంబంధముగల వ్యక్తిని చెప్పు పదమునకు షష్ఠీ విభక్తి వచ్చి "చిత్రగుః చైత్రస్య" మొదలగు రీతిని ప్రయోగములు సాధువులయ్యెడిని. ("చైత్రస్య గృహమ్" అను ప్రయోగమువలె "చైత్రస్య చిత్రగుః" అనునదియు సహజమగును).

"రాజపురుషః" మొదలగు షష్ఠీ సమాసములలో పురుషుడు ముఖ్యుడుగను, రాజుయొక్కయు పురుషునియొక్కయు సంబంధము అప్రధానముగను తెలియుచుండును. (రాజసంబంధము గల పురుషుడు). కావున వాని తీరు వేరు బహువ్రీహి వలన సంబంధమే ముఖ్యముగా చెప్పబడునుగాన అది సమాసమున ఇముడుట కుదురదు. అందువలననే అది ప్రాతిపదికము యొక్క అర్థమగుననుటకును వీలు లేదు.

విశేష విషయములు— సంబంధము అప్రధానముగను, సంబంధి ప్రధానముగను ఉన్నచో సంబంధము సమాసార్థమున అంతర్భవించినదనుటకు వీలున్నది. బహువ్రీహి సంబంధమును మాత్రమే వేరుచేసి ముఖ్యముగ చూపునన్నపుడు దానికి అంతర్భావము కుదురదు.

ఈ ఘట్టమున భాష్యకారుడు మాత్రము "బహువ్రీహియందు సంబంధము ముఖ్యమన్నను, సంబంధియే ముఖ్యముగ తోచునుగాన సంబంధము అంతర్భవించుననియు, అది ప్రాతిపదికార్థమగుననియు, అందువలన ప్రథమయే వచ్చునుగాని (చిత్రగుః - చైత్రః) షష్ఠి రాదనియును (చిత్రగుః చైత్రస్య)" ఒక విధమైన దోషపరిహారమును చూపెను. ఈ యంశమును భర్తృహరి స్పృశింపలేదు. ॥221॥

అవతారిక— సంబంధము ముఖ్యమైనను క్రియాన్వయము కుదురునని ప్రతిపాదింపుచున్నాడు.

శ్లో॥ అసంభవాత్తు సంబంధే సంబంధసహచారిణి ।
జాతి సంఖ్యాసమాహారకార్యాణామివ సంభవః ॥ 222

సంబంధే = సంబంధమందు, అసంభవాత్ + తు = కుదురనందువలన అయితే, సంబంధసహచారిణి = సంబంధముతో కలిసియుండు ద్రవ్యమందు, జాతి సంఖ్యాసమాహారకార్యాణామ్ + ఇవ = జాతి, సంఖ్య, సమాహారము అను వాని కార్యములకువలె, సంభవః = కుదురుట (జరుగును)

తాత్పర్యము— జాతి, సంఖ్య, సమాహారము అను వానికిని క్రియాన్వయము సహజముగ కుదురదు. అట్టిచోట్ల వానితో కూడిన ద్రవ్యముననకే క్రియాన్వయమని చెప్పుదురు. అట్లే సంబంధము విషయములో కూడ అవినాభూతమైన ద్రవ్యమునుబట్టి క్రియాన్వయమును సంపాదించుట కవకాశముండును

వివరణము— జాతి, సంఖ్య, సమాహారము అనునవి వస్తువులు కావు అందుచే వానికి సాక్షాత్తుగ క్రియాన్వయము కుదురదు ఉదా : (1) జాతి – "గామ్ - పూజయేత్" (ఆవును పూజింపవలెను) ఇచట గోసామాన్యమే ఉద్దిష్టము. అయినను దానికి క్రియతో సంబంధము కుదురదుగాన గోవ్యక్తినే తీసికొనవలయును.

(2) సంఖ్య:— "బ్రాహ్మణశతం ఆనయ" (బ్రాహ్మణుల వందను తీసికొని రమ్ము), ఇచట "వంద" అను సంఖ్యకు క్రియతో సంబంధము అసంభవము. కావున నూర్గురు బ్రాహ్మణులను తీసికొనిరావలెను

(3) సమాహారము:— "పంచవటీమ్ పశ్య" (అయిదు వటముల సమూహమును జూడుము) ఇచట కూడ వస్తువులకే క్రియాన్వయము. (ఈ యంశములు 180 వ కారికలో కూడ ప్రస్తావింపబడినవి).

వస్తువుల సంబంధము కూడ ప్రత్యేకమైన వస్తువు కాదు అయినను ఆ సంబంధము గల వస్తువులకు క్రియా సంబంధమును చెప్పుకొనవచ్చును. ॥222॥

అవతారిక— జాతి, సంఖ్య, మొదలగువానిని చెప్పినపుడు అవినాభూతమైన ద్రవ్యమే తప్పక స్ఫురించునుగాన క్రియాన్వయము ఉపపన్నమగును. కాని బహువ్రీహియందు సంబంధమే ముఖ్యమైనందువలన క్రియాయోగముగాని, సామానాధికరణ్యముగాని ఎట్లు కుదురును ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాద్విశిష్టాశ్రయవాచినామ్ ।
శుక్లాదివల్లింగసంఖ్యే శాస్త్రారంభాద్భవిష్యతః ॥ 223

సః + అయమ్ + ఇతి = "అదే ఇది" అను, అభిసంబంధాత్ = అనుసంధానమువలన, (అభేద భావన), విశిష్టాశ్రయవాదినామ్ = సంబంధముగల ద్రవ్యమును చెప్పు శబ్దముల యొక్క, లింగసంఖ్యే = లింగవచనములు, శుక్లాదివత్ = శుక్ల, మొదలగు వానికివలె, శాస్త్రారంభాత్ = సూత్రమును ఆరంభించుటవలన, భవిష్యతః = కాగలవు.

తాత్పర్యము — గుణమునకును గుణముగల ద్రవ్యమునకును అభేదమును భావించి "శుక్లః పటః" మొదలగుచోట్ల ద్రవ్యములను బట్టియే లింగవచనములను, సామానాధికరణ్యమును సంపాదింతుము అట్లే బహువ్రీహియందును సంబంధమునకును సంబంధికిని అభేదమును పాటించి సంబంధియగు ద్రవ్యమును బట్టియే లింగవచనములను, సామానాధికరణ్యమును సాధింపవచ్చును. ఉదా : చిత్రగుః చైత్రః, చిత్రగు పనమ్, మొదలగునవి.

వివరణము— సాంకేతికముగ సంబంధము ముఖ్యమని వాదించినను, చిత్రగు మొదలగు బహువ్రీహివలన సంబంధియగు ద్రవ్యము బోధపడుటయే సహజము. అది శబ్ద శక్తి స్వభావము కాబట్టి అభేదోపచారము తప్పదు. అట్లయినపుడు ద్రవ్యమునుబట్టి సామానాధికరణ్యము సులభమగును. ఇట్టి చోటులందు అభేదము ననుసరించి లింగసంఖ్యలను అతిదేశించుటయే "విశేషణానామ్" (2-1-52) మొదలగు సూత్రముయొక్క ముఖ్య ప్రయోజనము.

కాగా శుక్లాది శబ్దములు అభేదోపచారమువలన గుణివాచకములైనట్లు, బహువ్రీహియును సంబంధివాచకము కాగలవనియు అందువలన సంబంధియగు అన్యపదార్థముయొక్క లింగసంఖ్యలే సమాసమునకగుననియును ఫలించును. ॥223॥

అవతారిక — "బహువ్రీహి సంబంధమును చెప్పినచో లింగవచనములు గల పదార్థము సంపూర్ణముగా ఎట్లు తెలియును ?" అని భాష్యకారుడు ఆక్షేపించెను. పై విధముగా అభేదభావన వలన పదార్థము తెలియునన్నపుడు అట్టి యాక్షేపము సముచితమగునా ? అని శంకించి యీ సందర్భమందలి భాష్యకారుని భావమును విశదము చేయుచున్నాడు.

శ్లో॥ భేదేన తు వివక్షాయాం సామాన్యే వా వివక్షితే ।
సలింగస్య ససంఖ్యస్య పదార్థస్యాగతిర్భవేత్ ॥ 224

భేదేన = భేదముతో, వివక్షాయామ్ + తు = చెప్పదలచినపుడును, వా = లేక, సామాన్యే = సామాన్యము, వివక్షితే = చెప్పదలపబడినపుడును, సలింగస్య = లింగముతో కూడినట్టియు, ససంఖ్యస్య = వచనముతో కూడినట్టియు, పదార్థస్య = పదార్థముయొక్క, అగతిః = తెలియకపోవుట, భవేత్ = అయ్యెడిని.

తాత్పర్యము— సంబంధికి వేరుగా సంబంధము ముఖ్యమని చెప్పినను, సామాన్య రూపముగ సంబంధము ముఖ్యమని చెప్పినను లింగవచనములుగల పదార్థము తెలియక పోవును.

వివరణము — సంబంధము గలది పదార్థమగును దానిని కూడగట్టుకొనకుండ కేవలము సంబంధమునే స్వీకరించినచో ద్రవ్యముతో సామానాధికరణ్యము లేనందున దాని లింగసంఖ్యలను సంక్రమింపవు అట్లుగాక సంబంధము సామాన్యరూపమున (చిత్రగు = చిత్రగో సంబంధము అన్నిటికిని సామాన్యముగా చెందునట్లు) తెలియునన్నచో, విశేష ద్రవ్యము (సంబంధముగల నిర్దిష్టమైన ఒక పదార్థము) తెలియనందున దాని లింగసంఖ్యలును రావు. ఇట్లు పదార్థమేదియో పరిపూర్ణముగా అవగతము కాదు

విశేష విషయములు— సంబంధమును సామాన్యముగా చెప్పదలచినచో, చైత్రః, మైత్రః మొదలగు ద్రవ్యవిశేషములు స్ఫురింపవు. (చిత్రగు, అనగానే చిత్రగోవుల సంబంధము గల వస్తువు ఏదైనను - అనియే స్ఫురించును). కాన సామాన్యమును సూచించు నపుంసక లింగమే రావలసివచ్చును. కాగా అభేదభావన వలన కూడ పదార్థము విస్పష్టమగుట సంభవింపదు. ॥224॥

అవతారిక — బహుబ్రీహి సంపూర్ణమైన అన్యపదార్థమును బోధించుటను సమర్థింపు చున్నాడు.

శ్లో॥ సాధుత్వం న విభక్త్యర్థమాత్రే వృత్తస్య దృశ్యతే ।
కృత్స్నార్థవృత్తేః సాధుత్వమిత్యర్థగ్రహణం కృతమ్ ॥ 225

వృత్తస్య = వృత్తిగాఉన్న శబ్దమునకు, విభక్త్యర్థమాత్రే = కేవలము విభక్తియొక్క అర్థమందు (సంబంధము), సాధుత్వమ్ = సాధుభావము, న + దృశ్యతే = కనబడదు, కృత్స్నార్థవృత్తేః = పూర్తిగా పదార్థమును తెలుపు శబ్దమునకే, సాధుత్వమ్ + ఇతి = సాధుత్వమని తెలియజేయుటకు, అర్థగ్రహణమ్ = ''అర్థ'' అను శబ్దమును పలుకుట, కృతమ్ = చేయబడినది.

తాత్పర్యము— బహుబ్రీహి సమాసము కేవలము సంబంధమును చెప్పుట అభిమతము కాదు. విశేష్యముగ నుండు అన్యపదార్థమును స్పష్టముగ చెప్పుటయే ఇష్టము అందు కొరకే సమాసమును విధించు ''అనేక మన్యపదార్థే'' (2-2-24) అను సూత్రమున ''అర్థ'' శబ్ద ముచ్చరింపబడినది.

వివరణము— వ్యవహారములో సిద్ధముగనున్న శబ్దములనే వ్యాకరణము వ్యాఖ్యానించును సిద్ధముగనున్న బహువ్రీహి సంబంధమును మాత్రము చెప్పుట అనుభవమునకు విరుద్ధము అన్యపదార్థమును చెప్పుటయే బహువ్రీహి యొక్క స్వభావము ఈ విషయమును స్పష్టపరచుటకే విధి సూత్రమున "అన్యపదార్థే" అని అర్థశబ్దము స్వీకరింపబడినది. కాగా అన్యపదార్థమును చెప్పు చైత్రః, మైత్రః మొదలగు పదములయొక్క అనుప్రయోగమును, వాని లింగవచనములే సమాసమునకు వచ్చుటయును అప్రయత్నముగనే సిద్ధించును.

విశేష విషయములు— "అనేక మన్యపదార్థే" (2-2-24) అను నది బహువ్రీహిని విధించు సూత్రము. "వేరొక పదముయొక్క అర్థమును చెప్పు ఒకటికిమించిన పదములు సమసించుననియు, అది బహువ్రీహి యగుననియును" దీని యర్థము ఇచట పదమున కర్థము తప్పదుగాన "అన్యపదే" అని యన్నను, "అన్యపదార్థే" అను భావము లభించును. కాని అట్లనక "అన్యపదార్థే" అని అర్థశబ్దము నుచ్చరించినందువలన, పదార్థమే ముఖ్యమనియు అదియే విశేష్యమనియు, దానిని బట్టియే లింగవచనములు సమాసమునకు రావలెననియును విశదమగును. ఈ రీతిని "పదార్థాభిధాన పక్షమే" సూత్రకారుని యభీష్టమని పతంజలి వివరించెను ॥225॥

అవతారిక— పదార్థాభిధాన పక్షమున లింగవచనముల అతిదేశము వ్యర్థము విభక్త్యర్థాభిధాన పక్షమందే అది ఉపయోగించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాద్ద్రవ్యవృత్తిరయం యదా ।
సలింగస్య ససంఖ్యస్య తదా సాధుత్వముచ్యతే ॥ 226

సః + అయమ్ + ఇతి = "అదే యిది" - అను, అభిసంబంధాత్ = అనుసంధానము వలన, అయమ్ = ఈ బహువ్రీహి, యదా = ఎప్పుడు, ద్రవ్యవృత్తిః = ద్రవ్యమును బోధించునది, అగునో, తదా = అప్పుడు, సలింగస్య = లింగముతోకూడిన దానికిని, ససంఖ్యస్య = వచనముతోకూడిన దానికిని, సాధుత్వమ్ = సాధుత్వము, ఉచ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— బహువ్రీహియందు సంబంధమే ముఖ్యమై, సంబంధమునకును సంబంధియగు ద్రవ్యమునకును అభేదోపచారమన్నపుడే అట్టి ద్రవ్యమును బట్టి లింగవచనములను అతిదేశించుట సఫలమగును మీది కారికలో చూపినట్లు పదార్థమే ముఖ్యమన్నపుడు లింగవచనాతిదేశ మక్కరలేదు. అపుడవి సహజములగును. ॥226॥

అవతారిక— "బహువ్రీహి అన్యపదార్థమునే చెప్పునను" పక్షములో కొన్ని దోషములు సంభవించునని మూడు కారికలతో ఆక్షేపించుచున్నాడు.

శ్లో॥ అంతర్భూతవిభక్త్యర్థే షష్ఠీ న శ్రూయతే యథా ।
తథాఽశ్రుతిః ప్రసజ్యేత లింగసంఖ్యాభిధాయినామ్ ॥ 227

అంతర్భూతవిభక్త్యర్థే = విభక్త్యర్థము (సంబంధము) లోపల ఇమిడియున్నపుడు, షష్ఠీ = షష్ఠీవిభక్తి, యథా = ఎట్లు, న + శ్రూయతే = వినబడదో, తథా = అట్లు, లింగసంఖ్యాభిధాయినామ్ = లింగమును సంఖ్యను చెప్పు ప్రత్యయములయొక్క, అశ్రుతిః = వినబడకపోవుట, ప్రసజ్యేత = సంభవించెడిని.

తాత్పర్యము— అర్థగ్రహణము యొక్క సామర్థ్యము ననుసరించి బహువ్రీహి యందు సంపూర్ణమైన (లింగవచనములు గల) ద్రవ్యమే ముఖ్యముగా తెలియునన్నచో, షష్ఠి యొక్క అర్థమైన సంబంధము అప్రధానమై ప్రాతిపదికార్థముగనే మారునుగాన షష్ఠీ విభక్తి రాదు. అది యుక్తమే. కాని ఆ విధముగనే టాప్ మొదలగు స్త్రీ ప్రత్యయములును, సు, ఔ, జస్, మొదలగు సుప్ ప్రత్యయములును రాకపోయెడిని.

వివరణము— చిత్రగు, అను సమాసము లింగసంఖ్యలుగల "చిత్రగోవుల స్వామి" (చైత్రుడు మొదలగువాడు) అను పదార్థమును ప్రధానముగ చెప్పినపుడు షష్ఠ్యర్థమైన సంబంధము (స్వస్వామి భావము) సమాసముననే ఇమిడిపోయి అప్రధానమగును కాన షష్ఠి రాదు. ప్రథమయే వచ్చును. అట్లే లింగవచనములు కూడ సమాసముననే అంతర్భవించి నపుడు వానిని చెప్పు ప్రత్యయములును సమాసమునకు రాకపోవును.

విశేష విషయములు— (1) సంబంధమును చెప్పు విభక్తి షష్ఠి ఆ సంబంధము వేరొక విధమున తెలిసినపుడు షష్ఠి రాకుండ ప్రథమయే వచ్చును. ప్రకృతము సమాసము వలననే సంబంధము తెలిసిపోవును.

(2) లింగమును, సంఖ్యయు కూడ సమాసమువలననే తెలిసినచో వానిని చెప్పు ప్రత్యయము లక్కరలేక పోయెడిని. "ఉక్తార్థానామప్రయోగః" (చెప్పబడిన అర్థమునే చెప్పుటకై వేరుగా శబ్దములను వాడకూడదు) అని సంప్రదాయము గదా!

(3) బహువ్రీహి సంపూర్ణమైన అన్యపదార్థమును చెప్పునన్న పక్షమున, లింగ వచనములు కూడ సమాసముననే అంతర్భవించునను భావముతో ఈ శంక బయలుదేరినది.

అవతారిక— కాగా బహువ్రీహి అవ్యయముతో సమానము కావలసివచ్చునని చెప్పుచున్నాడు.

శ్లో॥ సాధర్మ్యమవ్యయేన స్యాద్బహువ్రీహేస్తథా సతి।
లింగసంఖ్యానిమిత్తస్య సంస్కారస్యాపవర్తనాత్ ॥ 228

తథా + సతి = అట్లయినచో, లింగసంఖ్యానిమిత్తస్య = లింగమును సంఖ్యను సూచించు, సంస్కారస్య = వ్యాకరణ సంస్కారముయొక్క, అపవర్తనాత్ = పోవుటవలన, బహువ్రీహేః = బహువ్రీహికి, అవ్యయేన = అవ్యయముతో, సాధర్మ్యమ్ = సాదృశ్యము, స్యాత్ = కలిగెడిని,

తాత్పర్యము— లింగవచనములను చెప్పు ప్రత్యయములు రానిచో, బహువ్రీహి లింగసంఖ్యలు లేని అవ్యయము వంటిదే కావలసి వచ్చును.

వివరణము— ''న కేవలా ప్రకృతిః ప్రయోక్తవ్యానాపి కేవలః ప్రత్యయః'' (కేవలము ప్రకృతినిగాని ప్రత్యయమునుగాని వాడకూడదు) అను నియమమున్నది. అయినను అవ్యయములకు లింగవచనములు సహజముగనే లేనందున వాని విషయములో (చ, వా, తు, మొదలగునవి) ఈ నియమము ప్రవర్తింపదు. ప్రకృతమున బహువ్రీహి కూడ ఇట్టిదే అయిపోవును. (చిత్రగు, అనియే ప్రయోగము సంభవించెడిని). ॥228॥

అవతారిక— చైత్రః, మొదలగు విశేష్యములతో సామానాధికరణ్యము కూడ వికృతముగ సంభవించెడిని అని చూపుచున్నాడు.

శ్లో॥ ప్రయుక్తేన చ సంబధాచ్చైత్రాదిశ్రవణం భవేత్ ।
వినా విభక్త్యా సంబంధో విభక్త్యా విద్యతే వినా ॥ 229

ప్రయుక్తేన = ప్రయోగింపబడిన పదముతో, సంబంధాత్ + చ = సంబంధమువలన, విభక్త్యా + వినా = విభక్తి లేకుండ, చైత్రాదిశ్రవణమ్ = చైత్ర, మొదలగు పదములు వినబడుట, భవేత్ = అగును, విభక్త్యా + వినా = విభక్తిలేకుండ, సంబంధః = సంబంధము, విద్యతే = ఉండును.

తాత్పర్యము— చిత్రగు, మొదలగు బహువ్రీహి అవ్యయముతో సమానమైనచో, దానికి విశేషమగు చైత్ర, మొదలగు పదము కూడ దానివలెనే విభక్తి లేకుండ వినబడవలసి వచ్చును. రెండును సమానార్థకములే అగునుగాన రెండింటికిని విభక్తి లేకుండుటయే సముచితమగును. అట్లయినపుడు అట్టి శబ్దములవలన సామాన్య విశేషభావము విశదము కాకపోవును. (అర్థము విశదము కాదు)

వివరణము— ''చిత్రగు - చైత్ర'' అను విభక్తి ప్రత్యయము లేని ప్రయోగములో లింగవచనము లుండవుగాన, అభిమతమగు విశేషణ విశేష్యభావము సిద్ధింపకపోయెడిని ॥229॥

అవతారిక— ఇట్లు పదార్థాభిధాన పక్షమందు కలుగు చిక్కులను వివరించి వీనికి భాష్యకారుడు చూపిన పరిహారమును వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ అభిధానేఽపి సంఖ్యాయాః సంఖ్యాత్వం న నివర్తతే ।
షష్ఠ్యర్థస్యాభిధానే తు స్యాత్ ప్రాతిపదికార్థతా ॥ 230

అభిధానే + అపి = అభిధానమందును (బహువ్రీహి సంఖ్యను చెప్పినను), సంఖ్యాయాః = సంఖ్యయొక్క, సంఖ్యాత్వమ్ = సంఖ్యయగుట, న + నివర్తతే = తొలగిపోదు, షష్ఠ్యర్థస్య = షష్ఠ్యర్థము యొక్క (సంబంధముయొక్క) అభిధానే + తు = చెప్పుటయందైతే, ప్రాతిపదికార్థతా = ప్రాతిపదికము యొక్క అర్థమగుట, స్యాత్ = అగును.

తాత్పర్యము— బహువ్రీహి వలన సంఖ్య చెప్పబడినను దాని సహజ లక్షణము తొలగదు. అనగా ఆ యా సంఖ్యను చెప్పుటకు సుప్ ప్రత్యయములు తప్పక వచ్చును. షష్ఠి యొక్క అర్థము మాత్రము (సంబంధము) అభిహితమైనందున ప్రాతిపదికార్థముగ మారును. అందువలన ప్రాతిపదికార్థమును చెప్పు ప్రథమావిభక్తి అగును.

వివరణము— ఏకశబ్దము ఏకత్వమును (ఒకటి) చెప్పును. ద్విశబ్దము ద్విత్వమును బోధించును. బహుశబ్దము బహుత్వమును ప్రతిపాదించును. అయినను అదే అర్థమును చెప్పు ప్రత్యయము ఆ యా శబ్దములకు వచ్చును ఉదా: ఏకః, ద్వౌ, బహవః, అట్లే చిత్రగు మొదలగు బహువ్రీహికి కూడ సుప్ ప్రత్యయములు రావచ్చును. బహువ్రీహి వలన సామాన్యముగా సంఖ్య తెలిసినను సంఖ్యావిశేషములు తెలియవు గదా! అందుచే కర్మత్వము, కరణత్వము మొదలగు విశేషములు కలిసిన సంఖ్యను చెప్పుటకు ద్వితీయ, తృతీయ మొదలగు విభక్తి ప్రత్యయము లగుచుండును. ఉదా: ''చిత్రగుమ్ - ఆనయ. చిత్రగునా కృతమ్'' మొదలగునవి. ఎట్టి విశేషమును లేనపుడు కేవలము ప్రకృతిని ప్రయోగింపకూడదు గాన, ప్రథమా విభక్తి (చిత్రగుః) యే వచ్చును. అవ్యయముతోడి సామ్యము బహువ్రీహికి నప్పదు. అవ్యయములకు వచ్చిన సుప్ ప్రత్యయములకు లోపమును శాస్త్రము విధించినది. బహువ్రీహి కట్లు విధింపలేదు. కాగా బహువ్రీహికి సుప్పులు వచ్చుటయు సామానాధికరణ్యము కుదురుట యును నిర్బాధము.

ఇక బహువ్రీహి షష్ఠ్యర్థమును చెప్పునన్న పక్షమున అది (సంబంధము) ప్రాతిపదికము యొక్క అర్థమే యగుటచేగాన, (సంబంధము అప్రధానమై సంబంధియే ప్రధానముగ తెలియును. చిత్రగుః = చిత్రగోవుల సంబంధము గలవాడు) షష్ఠి రాకుండ ప్రథమయే వచ్చును (సంబంధము ముఖ్యమగునపుడే షష్ఠి వచ్చుట శాస్త్రీయము).

విశేష విషయములు— వచనమును (సుప్ ప్రత్యయములు) గురించిన ఆక్షేపమునకు పరిహారమును మాత్రమే ఈ కారిక చూపినది. లింగమును గురించిన పరిహారమును ఇది స్పృశింప లేదు. అయినను భాష్యకారుడు చూపిన పరిహారమును ఇచట భావింపవలయును. ''బహువ్రీహి లింగమును బోధించినను, టాప్ మొదలగు స్త్రీ ప్రత్యయములు స్వార్థికములై ద్యోతకములుగ ప్రవర్తింపవచ్చును'' అనునది ఆ పరిహారము.

కాగా ఈ ఘట్టమందలి సారమిది :

(1) బహువ్రీహియందు పదార్థాభిధాన పక్షము ముందుగ చూపబడెను. అందు చైత్రాది శబ్దముల అను ప్రయోగమును గూర్చి పరిశీలనము జరిగినది. ఇది ఇంచుమించు పూర్వపక్షమే

(2) పిదప విభక్త్యర్థాభిధాన పక్షము వివరింపబడెను. అందు క్రియాయోగమును, లింగవచనముల అతిదేశమును చర్చింపబడినవి

(3) సంపూర్ణమైన అన్యపదార్థమునే బహువ్రీహి బోధించునని చివరగా ప్రతిపాదింపబడినది. ఇది సిద్ధాంతము. ॥230॥

అవతారిక— బహువ్రీహి విషయమున మరికొందరి మతమును చూపుచున్నాడు.

శ్లో॥ అనుప్రయోగసిద్ధ్యర్థం న విభక్త్యర్థకల్పనా ।
వస్త్వంతరముపక్షిప్తమితి కేచిత్ ప్రచక్షతే ॥ 231

విభక్త్యర్థకల్పనా = వష్ఠ్యర్థమునే (సంబంధము) బహువ్రీహి బోధించునను కల్పము, అనుప్రయోగసిద్ధ్యర్థమ్ = చైత్రాది శబ్దముల అనుప్రయోగము సిద్ధించుటకు, న = కాదు, వస్త్వంతరమ్ = వేరొక విషయము, ఉపక్షిప్తమ్ + ఇతి = ఉంచబడినదని, కేచిత్ = కొందరు, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్యము— "బహువ్రీహి అన్యపదార్థమును చెప్పునను" పక్షమున బయలు దేరిన శంకకు సమాధానముగా "విభక్త్యర్థమును చెప్పును" అను పక్ష ముదయింపలేదు. విభక్త్యర్థాభిధాన పక్షము స్వతంత్రమైన వేరొక ప్రతిపాదనమే - అని కొందరందురు.

వివరణము— పదార్థాభిధాన పక్షమున అనుప్రయోగము (చిత్రగుః - చైత్రః) కుదురనందున, దానిని కుదుర్చుటకై విభక్త్యర్థాభిధాన పక్షము బయలుదేరినదని ఇంతవరకును గ్రంథకర్త వ్యాఖ్యానించెను. అట్లుకాక విభక్త్యర్థ పక్షము వేరుగా ఒక స్వతంత్ర పక్షమే అని కొందరి భావము

విశేష విషయములు— పదార్థాభిధానము పూర్వపక్షమనియు, విభక్త్యర్థాభిధానమును, అందును సంపూర్ణ పదార్థము తెలియుటయును సిద్ధాంతమనియును భర్తృహరి యొక్క తాత్పర్యము విభక్త్యర్థాభిధానము స్వతంత్ర పక్షమనుట అతని కభిమతము కాదు. అందువలననే "కొందరందురు" అని పక్కాణించెను. ॥231॥

అవతారిక— పై రీతిని విభక్త్యర్థ పక్షము స్వతంత్రమన్నపుడు గూడ రెండు పక్షములు రావచ్చునని ప్రతిపాదించుచున్నాడు

శ్లో॥ సంబంధిభిర్విశిష్టానాం సంబంధానాం నిమిత్తతా ।
సంబంధైర్వా విశిష్టానాం తద్వతాం స్యాన్నిమిత్తతా ॥ 232

సంబంధిభిః = సంబంధముగల వానితో, విశిష్టానామ్ = కూడిన, సంబంధానామ్ = సంబంధములకు, నిమిత్తతా = నిమిత్తభావము, స్యాత్ = అగును, వా = లేక, సంబంధైః = సంబంధములతో, విశిష్టానామ్ = కూడిన, తద్వతామ్ = సంబంధముగల వస్తువులకు, నిమిత్తతా = నిమిత్తభావము, స్యాత్ = అగును.

తాత్పర్యము— శబ్దమొక అర్థమును చెప్పుటలో హేతువైన ముఖ్యధర్మము, నిమిత్తము లేక ప్రవృత్తి నిమిత్తమని యందురు. చిత్రగు, మొదలగు బహువ్రీహికి "చిత్రగోవుల సంబంధము", కాని "చిత్రగోవుల సంబంధము గల వ్యక్తి" కాని నిమిత్తము కావచ్చును.

వివరణము— చిత్రగుః = రంగు రంగుల గోవుల ప్రభువు. ఇచట చిత్రగో, అనునవి వర్తి పదములు చైత్ర, మొదలగునది అన్యపదము (వీని యర్థమును భావింతుము). వర్తి పదార్థములకును, అన్యపదార్థమునకును గల సంబంధము స్వస్వామిభావము కాగా సంబంధము కలిగినవి వర్తి పదార్థములు కూడ అగును. ''అట్టి సంబంధముగల చిత్రగోవుల సంబంధము'' బహువ్రీహికి నిమిత్తమని చెప్పవచ్చును. ఇది విభక్త్యర్థాభిధానమగును. లేక— ''చిత్రగోవుల సంబంధము గలిగిన ప్రభువు'' అని సంబంధియే నిమిత్తమనియును చెప్ప వచ్చును. ఇది పదార్థాభిధానమగును.

విశేష విషయములు— విడి విడిగా తీసికొన్నపుడు బహువ్రీహులు అనంతములు గాన, కారికలో బహువచనములు ప్రయోగింపబడినవి. ॥232॥

అవతారిక— మీది కారిక చెప్పిన విషయమునే మత్వర్థ ప్రత్యయాంతముల దృష్టాంతముతో వివరించుచున్నాడు.

శ్లో॥ కేచిత్ సంయోగినో దండాత్ విషాణాత్సమవాయినః ।
తద్వతి ప్రత్యయానాహుర్బహువ్రీహిం తథైవ చ ॥ 233

సంయోగినః = సంయోగముగల, దండాత్ = దండమునకు, (దండ శబ్దము), సమవాయినః = సమవాయముగల, విషాణాత్ = విషాణమునకు (విషాణ శబ్దమునకు), తద్వతి = అదిగల వస్తువను అర్థమున, ప్రత్యయాన్ = మతుప్ మొదలగు ప్రత్యయములను, కేచిత్ = కొందరు ఆహుః = చెప్పుదురు, తథా + ఏవ = అట్లే, బహువ్రీహిమ్ + చ = బహువ్రీహిని కూడ, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్యము— దండవాన్, దండీ (దండః అస్య అస్తి = దండముగల వ్యక్తి), విషాణీ (విషాణే అస్యసః = కొమ్ములుగల జంతువు) - అనునవి మతుప్ ప్రత్యయము కాని, ఆ అర్థమును చెప్పు వేరొక ప్రత్యయముకాని (ఇన్ మొ॥) చేరిస పదములు. ఇట్టిచోట్ల సంయోగముకాని, సమవాయముకాని సంబంధమై యుండును. ఆ సంబంధముగల దండము మొదలగునవి ప్రవృత్తి నిమిత్తములగును. అట్టి శబ్దములకు మత్వర్థ ప్రత్యయము చేరును. కాగా దండీ, మొదలగు శబ్దములవలన ''సంయోగ సంబంధముతో కూడిన దండముయొక్క సంబంధము గలవాడు'' మొదలగు రీతిని భావ మేర్పడుచుండును. ఈ విధముగనే బహువ్రీహి యందును సంబంధముగల వర్తి పదార్థము ప్రవృత్తి నిమిత్తమగును. సమాసమువలన అన్య పదార్థము తెలియును అని కొందరు వివరింతురు.

వివరణము— (1) విడదీయుటకు సహజముగ వీలుగల సంబంధము సంయో గము. ఇది ఏదైన రెండు వస్తువులకు ఏర్పడును విడదీయ వీలులేని సంబంధము సమ వాయము ఇది అవయవమునకును అవయవికిని గల సంబంధము.

(2) దండీ = దండమునకును వ్యక్తికిని సంయోగము. విషాణీ = కొమ్మునకును

జంతువునకును సమవాయము. ఇచట ప్రకృతియైన శబ్దము (దండ) సంబంధము గల వస్తువును చెప్పును. ప్రత్యయము ''అట్టి వస్తువుగల వ్యక్తిని'' చెప్పును. కాగా మొదటి సంబంధి ప్రవృత్తి నిమిత్తముగాను, రెండవ సంబంధి ప్రత్యయాంతమునకు వాచ్యముగాను ఏర్పడును.

(8) ఇదే తీరులో బహువ్రీహియందు తొలి సంబంధియగు వర్తి పదార్థము ప్రవృత్తి నిమిత్తమనియు. మలి సంబంధియగు అన్యపదార్థము సమాస వాచ్యమనియును చెప్పవచ్చును. ॥233॥

అవతారిక— పై విషయమునసనే రెండవ పక్షమును చూపుచున్నాడు.

శ్లో॥ భిన్నం సంబంధిభేదేన సంబంధమపరే విదుః ।
నిమిత్తం సవిభక్త్యర్థః సమాసేనాభిధీయతే ॥ 234

సంబంధిభేదేన = సంబంధుల భేదముచే, భిన్నమ్ = వేరైన, సంబంధమ్ = సంబంధమును, నిమిత్తమ్ = ప్రవృత్తి నిమిత్తముగా, అపరే = మరికొందరు, విదుః = తెలియుదురు, సవిభక్త్యర్థః = విభక్త్యర్థముతో కలిసిన ఆ సంబంధము, సమాసేన = బహువ్రీహిచే, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— దండీ, విషాణీ, మొదలగు మత్వర్థప్రత్యయ మంతమందుగల స్థలములలో సంబంధులు రెండుండును. (దండమును, అదిగల వ్యక్తియును సంబంధులే) కాన సంబంధములు కూడ రెండగును. (దండమునకు గల సంబంధము, వ్యక్తికి గల సంబంధము) ఈ సంబంధమే యిచట ప్రవృత్తినిమిత్తమని మరికొందరందురు. బహువ్రీహి యందును ఇట్లే సంబంధమే ప్రవృత్తినిమిత్తమగును. కాగా సంబంధమే మొత్తము సమాసమున కర్థమనియును, ''అదే యిది'' అను అభేదభావనవలన సంబంధియగు వస్తువు తెలియునని యును పర్యవసించును.

వివరణము— మీది కారిక సంబంధులను ప్రవృత్తినిమిత్తముగా చెప్పినది. ఈ కారిక సంబంధములను ప్రవృత్తినిమిత్తముగా అంగీకరించినది వివక్షాధీనముగా ఎట్లయినను చెప్పుట కవకాశమున్నందున రెండు పక్షములు బయలుదేరినవి. మత్వర్థప్రత్యయాంతముల స్వభావమును, బహువ్రీహియొక్క స్వభావమును ఒకచేయనియు, అచటకూడ బహువ్రీహి యందువలె రెండు తీరులు సంభవించుననియును చెప్పుటయే ఈ రెండు కారికల యొక్కయు ప్రయోజనము. ॥234॥

అవతారిక— కాగా బహువ్రీహియందు అన్యపదార్థము సంబంధియనియు, అదియే ముఖ్యమనియును అన్నచో అది పదార్థాభిధాన పక్షముగా లెక్కకు వచ్చును. అట్లుగాక అన్య పదార్థము సంబంధమేయనియు, అదియే ముఖ్యమనియును అన్నచో విభక్త్యర్థాభిధాన పక్ష మగును అని ఉపసంహరించుచున్నాడు.

శ్లో॥ ప్రధానమన్యార్థతయా భిన్నం స్వైరుపసర్జనైః ।
నిమిత్తమభిధేయం వా సర్వపశ్చాదపేక్ష్యతే ॥ 235

స్వైః = తన, ఉపసర్జనైః = అప్రధానములైన వానితో, భిన్నమ్ = కూడిన సంబంధము, ప్రధానమ్ = ముఖ్యమైనదై, అన్యార్థతయా = వేరొక పదార్థము కొరకగుటచే, నిమిత్తమ్ = ప్రవృత్తినిమిత్తము (భవతి = అగును), వా = లేక, అభిధేయమ్ = వాచ్యముగా, సర్వపశ్చాత్ = అన్నిటికిని వెనుక (చిట్టచివర), అపేక్ష్యతే = కోరబడును.

తాత్పర్యము— బహువ్రీహియందు సంబంధి అన్యపదార్థము పూర్తి పదార్థముల సంబంధము ప్రవృత్తినిమిత్తము ఇట్లయినచో పదార్థాభిధాన పక్షమగును అట్లుకాక సంబంధమే అన్యపదార్థము, అదియే సమాసమునకు వాచ్యార్థము అన్నచో విభక్త్యర్థాభిధాన పక్షమగును. షష్ఠీ విభక్తియొక్క అర్థమందే చిట్టచివర బహువ్రీహి సమాసము వాడుదుముగాన ఈ పక్షమే సముచితము

వివరణము— ఇచటి సారమిది. బహువ్రీహిలో అన్యపదార్థము ప్రధానము. సంబంధమును ప్రవృత్తినిమిత్తముగాను సంబంధిని సమాసార్థముగాను చెప్పినచో పదార్థాభిధానమగును సంబంధిని ప్రవృత్తినిమిత్తముగాను సంబంధమును సమాసార్థముగాను చెప్పినచో విభక్త్యర్థాభిధానమగును ఇందు అభేద భావనవలన సంబంధి పూర్తిగ తెలియును. "చిత్రాః గావః అస్య" అని షష్ఠిని చూపి ఈ యర్థమందే "చిత్రగుః" అను సమాసమును వాడుదురు గాన, షష్ఠ్యర్థమైన సంబంధమే ముఖ్యమనుట మంచిది. అయితే "అన్యపదార్థమని" నొక్కి చెప్పుటవలన చివరకు సంబంధముగల పూర్తి పదార్థమే తెలియును. భాష్యకారుడు విభక్త్యర్థాభిధానమందే మొగ్గును చూపెను. ॥235॥

అవతారిక— బహువ్రీహిని వివరించు వాక్యమునకును బహువ్రీహి సమాసమునకును భేదమును చూపుచున్నాడు.

శ్లో॥ స్వామిని వ్యతిరేకశ్చ వాక్యే యద్యపి దృశ్యతే ।
ప్రాధాన్య ఏవ తస్యేష్టో బహువ్రీహిర్వివక్షితే ॥ 236

యద్యపి = పరిశీలింపగా, స్వామిని = ప్రభువు విషయమున, వ్యతిరేకః = వేరగుట, వాక్యే = వాక్యమందు, దృశ్యతే = కనబడును (తథాపి = అట్లయినను), తస్య = అతనియొక్క, ప్రాధాన్యే = ప్రాముఖ్యము, వివక్షితే + ఏవ = చెప్పదలపబడినపుడే, బహువ్రీహిః = బహువ్రీహి సమాసము, ఇష్టః = అభిమతము.

తాత్పర్యము— "చిత్రాః గావః అస్య = చిత్రమైన గోవులు వీనికి" అను వాక్య దశయందు, స్వామియగువాడు అప్రధానముగను, స్వమ్ములయిన గోవులు ప్రధానముగను గోచరించును కాని చిత్రగుః, అను సమాసము మాత్రము స్వామినే ముఖ్యముగ చెప్పును. అట్లు స్వామియొక్క ప్రాధాన్యము లేనిచో సమాసమే ప్రవర్తింపదు.

వివరణము— వాక్యము వేరు, వృత్తి వేరు. స్వామిని అప్రధానముగ చూపుట వాక్యస్వభావము. అతనినే ప్రధానముగ చూపుట వృత్తి స్వభావము కావున వాక్యదశయందు గోవులే ముఖ్యముగాన "సంబంధము - ముఖ్యమా ? సంబంధి ముఖ్యమా ?" అను పై చర్చ యంతయు వ్యర్థమని అనుకొనరాదు. ॥236॥

అవతారిక— కాగా "ఇతనివి విచిత్రమైన గోవులు" అను వాక్యము బహువ్రీహికి సరియైనది కాదని చెప్పుచున్నాడు.

శ్లో॥ గవాం విశేషణత్వేన యదా తద్వాన్ ప్రవర్తతే ।
అస్యైతా ఇతి తత్రాఽర్థే బహువ్రీహిర్న విద్యతే ॥ 237

"అస్య = ఇతనికి, ఏతాః = ఈ గోవులు" ఇతి = అని, గవామ్ = గోవులకు, విశేషణత్వేన = విశేషణముగా, తద్వాన్ = గోవులుగల వ్యక్తి, యదా = ఎప్పుడు, ప్రవర్తతే = ప్రవర్తించునో, తత్ర = ఆ, అర్థే = అర్థమందు. బహువ్రీహిః = బహువ్రీహి సమాసము, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము— స్వామిని విశేషణముగాను, గోవులను ముఖ్యముగాను చెప్పు "ఇతనివి చిత్రమైన గోవులు" (అస్య చిత్రాః గావః) అను వాక్యము బహువ్రీహికి అనుగుణము కానే కాదు. ॥237॥

అవతారిక— "చిత్రమైన గోవుల అధిపతి" అను వాక్యము బహువ్రీహికి సరియైనదని చూపుచున్నాడు.

శ్లో॥ యదా ప్రత్యవమర్శస్తు తాసాం స్వామీ గవామితి ।
గోభిస్తదాభిసంబంధో నిమిత్తత్వాయ కల్పతే ॥ 238

"తాసామ్ = ఆ, గవామ్ = గోవులకు, స్వామీ = ప్రభువు", ఇతి = అని, ప్రత్యవమర్శః = ప్రతిపాదనము, యదా = ఎప్పుడు, (జరుగునో), తదా = అప్పుడు, గోభిః = గోవులతో, అభిసంబంధః = సంబంధము, నిమిత్తత్వాయ = నిమిత్తముగా, కల్పతే = సంభవించును.

తాత్పర్యము— "చిత్రగోవులకు అధిపతి ఇతడు" అని చెప్పదలచినపుడే గోవుల సంబంధము బహువ్రీహికి నిమిత్తమగుట కుదురును. కావున "చిత్రాః గావః యస్య సః" అనునదియే బహువ్రీహికి అనుగుణమైన వాక్యము

వివరణము— బహువ్రీహికి నిమిత్తము సంబంధమనియు, అట్టి సంబంధముగల సంబంధి సమాసమున కర్థమనియును ఫలించును. ॥238॥

అవతారిక— సంబంధము నిమిత్తమై సంబంధియగు వస్తువు సమాసముయొక్క అర్థమైనపుడు లింగవచనముల అతిదేశము సార్థకమగునని మరల విశదము చేయుచున్నాడు.

శ్లో॥ అపేక్షమాణః సంబంధం రూఢిత్వస్య నివృత్తయే ।
నిమిత్తానువిధాయిత్వాత్తద్ధర్మార్థః ప్రసజ్యతే ॥ 239

రూఢిత్వస్య = రూఢమగుట, నివృత్తయే = పోవుటకు, సంబంధమ్ = సంబంధమును, అపేక్షమాణః = కోరుచున్న, అర్థః = బహువ్రీహియొక్క అర్థము, నిమిత్తానువిధాయిత్వాత్ = నిమిత్తమును అనుసరించుటవలన, తద్ధర్మా = ఆ సంబంధముయొక్క ధర్మములు గలదై, ప్రసజ్యతే = కావలసి వచ్చును

తాత్పర్యము— "చిత్రగు" అను బహువ్రీహి రూఢము కాదు. రూఢమైనచో అవయవముల అర్థముండదు. బహువ్రీహియందవయవముల అర్థముండును. (చిత్రములైన గోవులు అను అర్థము). కాగా సంబంధము నిమిత్తమై సంబంధి సమాసవాచ్యమైనపుడు ఆ సంబంధమే చివరకు అనువర్తించునుగాన దాని ధర్మములే సమాసార్థమునకును రావలసి వచ్చును. అనగా సంబంధము ద్రవ్యము కానందున లింగవచనములుండవు అట్లే సమాసమునకును లింగవచనములు లేకపోయెడిని. అందువలన ఈ పక్షమున లింగవచనముల అతిదేశము సార్థకమగునని అభిసంధి.

వివరణము— కుశలః (నేర్పరి), ప్రవీణః (నేర్పరి) మొదలగునవి రూఢములు. అనగా అవయవార్థము లేకుండ ప్రసిద్ధమైన ఒక అర్థమును చెప్పునవి. ప్రకృతమున సంబంధమునకు అనుసంధానము లేదన్నచో బహువ్రీహి రూఢమైపోవును. అది అభిమతము కాదు కావున బహువ్రీహియందు నిమిత్తమైన సంబంధమునకు అనుసంధానము తప్పదు. సంబంధమును చివరివరకును భావించుటయే అనుసంధానమగును. ॥239॥

అవతారిక— పై విషయమునే దృష్టాంతముతో బలపరచుచున్నాడు.

శ్లో॥ నానాచిత్ర ఇతి యథా నిమిత్తమనురుధ్యతే ।
నానాభూతేఽపి వృత్తః సన్ బహువ్రీహిస్తథా భవేత్ ॥ 240

నానాభూతే = వివిధమైన వస్తువులందు, వృత్తః + సన్ + అపి = ప్రవర్తించినను (బోధించినను), నానా - చిత్రాః = వివిధమైన చిత్రవస్తువులు, ఇతి = అని, నిమిత్తమ్ = నిమిత్తము, యథా = ఎట్లు, అనురుధ్యతే = అనుసరింపబడునో, తథా = అట్లు, బహువ్రీహిః = బహువ్రీహి, భవేత్ = అయ్యెడిని.

తాత్పర్యము— నానా - అనునది అవ్యయము. "అనేకము లేక వివిధము" అనియర్థము. వైవిధ్యము అను ధర్మమిచట ప్రవృత్తినిమిత్తము. దీనికి లింగవచనములుండవు. ఈ అవ్యయముతో కలిసిన "నానాచిత్రాః" అను ప్రయోగమున్నది. ఇచట "నానా" అనునది వైవిధ్యముగల ద్రవ్యములనే బోధించును. అయినను నిమిత్తమైన వైవిధ్యమును అనుసంధానము చేయుటవలన లింగవచనములు లేకుండగనే యుండును. ఇట్లు నిమిత్తానుసంధానము వలన బహువ్రీహికిని లింగవచనము లుండకపోవును. వానిని రాబట్టుటకు అతిదేశము ఆవశ్యకము.

వివరణము— నిమిత్తమును కూడగట్టుకొనియే నిమిత్తిని భావించినపుడు శుద్ధమైన నిమిత్తి స్ఫురింపదు. కాగా ''సంబంధముగల సంబంధి'' అను భావన బహువ్రీహియందుండు నన్నపుడు, సంబంధముయొక్క ధర్మములే సంబంధికిని వచ్చుట సముచితమయ్యెడిని. వానిని వారించి సంబంధియొక్క లింగవచనములను తీసికొనివచ్చుటకు ప్రయత్నమావశ్యకమగును గదా ॥

విశేష విషయములు— బహువ్రీహియందు నిమిత్తాను విధానము చేసిన పక్షమున లింగవచనముల అతిదేశము సఫలమని ఈ రెండు కారికలును బోధించినవి ॥240॥

అవతారిక— వర్తి పదార్థములైన సంబంధులే బహువ్రీహికి నిమిత్తములనియు, అన్యపదార్థమైన ద్రవ్యము సమాసవాచ్యమనియును చెప్పిన పక్షమున లింగవచనములు సహజముగనే సిద్ధించునని చెప్పుచున్నాడు.

శ్లో॥ సంబంధిని నిమిత్తే తు ద్రవ్యధర్మో న హీయతే ।
లింగాభావో హి లింగస్య విరోధిత్వేన వర్తతే ॥ 241

సంబంధిని = సంబంధి, నిమిత్తే + తు = ప్రవృత్తినిమిత్తమైతే, ద్రవ్యధర్మః = ద్రవ్యముయొక్క ధర్మము (లింగవచనములు), న + హీయతే = పోదు, లింగాభావః = లింగము లేకుండుట, లింగస్య = లింగమునకు, విరోధిత్వేన = విరోధిగా, వర్తతే + హి = ఉండును గదా ॥

తాత్పర్యము— సంబంధులైన చిత్రగోవులే ప్రవృత్తినిమిత్తమైనపుడు అన్యపదార్థము యొక్క లింగవచనములు సహజముగనే మిగులును. అవి స్పష్టముగ నున్నపుడు వానిని కాదనుట కుదురదు.

వివరణము— చిత్రగుః - గోవులు సంబంధులు, ఇవియే ప్రవృత్తినిమిత్తము. చైత్రః, మొదలగునది అన్యపదార్థము. ఇది సమాసముయొక్క అర్థము. సంబంధులు వేరుగా ఉండి, అన్యపదార్థమును కప్పివేయకుండ దాని స్వాతంత్ర్యమును మిగుల్చును. కావున అన్యపదార్థముయొక్క లింగవచనములు అట్లే యుండును. నిమిత్తానువిధానమన్నను నిమిత్తముయొక్క (గోవులు) లింగసంఖ్యలు పనిచేయవు. ఇట్లు వాని అతిదేశ మక్కరలేదు.

విశేష విషయములు— సంబంధము నిమిత్తమైనపుడు అది అన్యపదార్థమును కప్పివేయగలదనియు, సంబంధి నిమిత్తమైనచో, అది వేరై అన్యపదార్థమును కప్పజాలదనియును ఫలితము. ॥241॥

అవతారిక— పైది విషయమునే విశదము చేయుచున్నాడు.

శ్లో॥ సంఖ్యావాన్ లింగవాంశ్చార్థోఽభిన్నధర్మా నిమిత్తతః ।
ఆసన్న ఏవ ద్రవ్యత్వాత్ తద్ధర్మైర్న విరుధ్యతే ॥ 242

సంఖ్యావాన్ = సంఖ్యను గలిగినట్టియు, లింగవాన్ + చ = లింగమును గలిగినట్టియును, అర్థః = సంబంధియగు అన్యపదార్థము, నిమిత్తతః = నిమిత్తముతో, అభిన్నధర్మా = సమాన ధర్మములు గలదై, ఆసన్నః + ఏవ = దగ్గరగానే యున్నదై, ద్రవ్యత్వాత్ = ద్రవ్యమగుట వలన, తద్ధర్మైః = దాని ధర్మములతో, న + విరుధ్యతే = విరోధింపదు.

తాత్పర్యము— వర్తి పదార్థమైన సంబంధి నిమిత్తమును, అన్యపదార్థమైన సంబంధి నిమిత్తియు అయినపుడు రెండును ద్రవ్యములేగాన సమానములేయగును. కాగా దగ్గరగా ఉన్న అన్యపదార్థము తన లింగవచనములను స్వతంత్రముగ మిగుల్చుకొనును.

వివరణము— సంబంధము నిమిత్తమైనచో దాని మూలమున సంబంధి తెలియ వలయునుగాన అన్యపదార్థము దూరమగును. సంబంధియే నిమిత్తమైనచో అన్యపదార్థము వేగముగా తెలియును. ॥242॥

అవతారిక— విపులమైన పై చర్చవలన బహువ్రీహియందు విభక్త్యర్థాభిధానము (సంబంధము) సముచితమని తేలును. కాని ఈ పక్షమందు "అదే యిది" అను అభేదమును ఆశ్రయించి సంబంధిని గ్రహింపవలయును. అయినపుడు పదార్థాభిధానము (సంబంధి) కన్న విశేషమేమి ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ విభక్త్యర్థేన చావిష్టం శుద్ధం చేతి ద్విధా స్థితమ్ ।
ద్రవ్యం శుద్ధస్య యో ధర్మః స న స్యాదన్యధర్మణః ॥ 243

విభక్త్యర్థేన = షష్ఠియొక్క అర్థముతో, ఆవిష్టమ్ + చ = కలిసినదియు, శుద్ధమ్ + చ = కలియకుండ స్వతంత్రముగా ఉండునదియు, ఇతి = అని, ద్రవ్యమ్ = ద్రవ్యము, ద్విధా = రెండు విధములుగ, స్థితమ్ = ఉన్నది, శుద్ధస్య = శుద్ధమైన ద్రవ్యమునకు, యః = ఏ, ధర్మః = ధర్మము గలదో, సః = అది, అన్యధర్మణః = వేరు ధర్మముగల ద్రవ్యమునకు (విభక్త్యర్థముతో కలిసినది), న + స్యాత్ = కాదు (రాదు).

తాత్పర్యము— షష్ఠియొక్క అర్థము సంబంధము దీనితో అభేదమును పాటించి సంబంధియగు ద్రవ్యమును బోధించినచో విభక్త్యర్థాభిధానమగును. ఇందు సంబంధము కలిసి నందున ద్రవ్యధర్మములగు లింగసంఖ్యలు లభింపవు. అందుచే వానిని వేరుగా అతిదేశింప వలెను శుద్ధమైన ద్రవ్యమునే బోధించినచో పదార్థాభిధానమగును. ఇందు ద్రవ్యమునకు లింగ వచనములు సహజములేగాన వానిని అతిదేశింప నక్కరలేదు.

వివరణము— సంబంధమును పులిమి సంబంధిని తెలియుట విభక్త్యర్థాభిధానము. సూటిగ సంబంధిని తెలియుట పదార్థాభిధానము. ఇదియే రెండింటికిని భేదము ॥243॥

అవతారిక— పై విషయమునే సంగ్రహముగా చూపుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యమాత్రస్య నిర్దేశే భేదోఽయమవివక్షితః ।
గ్రంథే పూర్వత్ర భేదస్తు ద్వితీయేఽనుప్రదర్శితః ॥ 244

పూర్వత్ర = మొదటి, గ్రంథే = గ్రంథమందు, (భాష్య సందర్భము). ద్రవ్యమాత్రస్య = కేవలము ద్రవ్యముయొక్క, నిర్దేశే = ప్రతిపాదనమందు, అయమ్ = ఈ, భేదః = విశేషము, (విభక్త్యర్థము కలియుట), అవివక్షితః = చెప్పదలప బడలేదు, ద్వితీయే + తు = రెండవ గ్రంథమందయితే, భేదః = విశేషము, అనుప్రదర్శితః = చూపబడినది.

తాత్పర్యము— బహువ్రీహిని సుదీర్ఘముగ చర్చించిన భాష్యములో తొలుత పదార్థాభిధానపక్షమును, తరువాత విభక్త్యర్థాభిధానపక్షమును చూపబడినవి.

వివరణము— శుద్ధమైన పదార్థమే (అన్యపదార్థము) బహువ్రీహియొక్క అర్థమన్నది మొదట చర్చింపబడినది. అందు విభక్త్యర్థము యొక్క ఆవేశము లేదు. సంబంధమను విభక్త్యర్థము యొక్క ఆవేశము తరువాత చూపబడినది. ఇందుకూడ చివరకు సంబంధావిష్టమైన ద్రవ్యమే ముఖ్యముగా తెలియును. కావుననే లింగవచనముల అతిదేశము (ఆశ్రయమును బట్టి లింగవచనములు వచ్చుట) కుదురును.

కాగా శుద్ధమైన ద్రవ్యము (చిత్రగుః = చిత్రగోవుల అధిపతి) బహువ్రీహికి వాచ్యమని మొదటి పక్షము షష్ఠ్యర్థము (సంబంధము = చిత్రగుః = చిత్రగోవుల సంబంధము ⟶ అభేదముచే చివరకు సంబంధముగల అధిపతి) బహువ్రీహికి వాచ్యమని రెండవ పక్షము. ఇందును విభక్త్యర్థము యొక్క ఆవేశముగల ద్రవ్యమే ముఖ్యమగును. ॥244॥

అవతారిక— విభక్త్యర్థమును చెప్పు పక్షమునగూడ ద్రవ్యమునకే ప్రాధాన్యమని సమర్థించుచున్నాడు

శ్లో॥ ద్రవ్యస్యగ్రహణం చాత్ర లింగసంఖ్యావిశేషణమ్ ।
ద్రవ్యాశ్రితత్వం హి తయో స్తతోఽన్యస్య న సిధ్యతః ॥ 245

అత్ర = ఈ పక్షమున, లింగసంఖ్యా విశేషణమ్ = లింగసంఖ్యలకు విశేషణముగా, ద్రవ్యస్య = ద్రవ్యముయొక్క, గ్రహణమ్ = స్వీకారము (భవతి = అగును), తయోః = ఆ లింగ సంఖ్యలు, ద్రవ్యాశ్రితత్వమ్ + హి = ద్రవ్యము నాశ్రయించుట ప్రసిద్ధము గదా!, తతః = ద్రవ్యముకన్న, అన్యస్య = వేరొకదానికి, న + సిధ్యతః = సిద్ధింపవు.

తాత్పర్యము — ద్రవ్యమునకే లింగసంఖ్యలు సహజములు. సంబంధము ద్రవ్యము కాదు. కావున అభేదమును భావించి సంబంధమనగా సంబంధియగు ద్రవ్యమే అని చెప్పక తప్పదు. అయినపుడు విభక్త్యర్థపక్షమున కూడ లింగసంఖ్యలు గల ద్రవ్యమే ముఖ్యముగ బహువ్రీహి యొక్క అర్థమగును.

వివరణము— పదార్థాభిధానమున ద్రవ్యప్రతీతి శాబ్దము. (అనగా శబ్దమే సూటిగ ద్రవ్యమును బోధించును). విభక్త్యర్థాభిధానమున ద్రవ్యప్రతీతి ఆర్థము. (అనగా శబ్దమువలన సంబంధము తెలిసి - పిదప అభేదమువలన ద్రవ్యము తెలియును). కాగా వేరొక పక్షమును చూపు అభినివేశముతో విభక్త్యర్థాభిధానమని చెప్పినను ఫలిత మొకటే యగును.

విశేష విషయములు— శుక్ల మొదలగు కొన్ని శబ్దములు గుణమును; గుణిని కూడ తెలుపును. ఉదా : శుక్లః = తెలుపు, శుక్లః = తెల్లని వస్తువు. కాని "పటు" అను శబ్దము మాత్రము గుణవాచకమైనను ఎల్లప్పుడును గుణిని మాత్రమే బోధించును. గుణమును బోధింపదు. ఉదా : పటుః = బలమైన వస్తువు. అట్లే "చిత్రగుః" మొదలగు బహువ్రీహి ఎల్లప్పుడును ద్రవ్యమునే ముఖ్యముగ చెప్పును. సంబంధము ప్రధానమన్నను చివర కా యర్థము తప్పదు. అది శబ్ద శక్తియొక్క సొగసు. ॥245॥

అవతారిక— పై భావమునే విశదము చేయుచున్నాడు.

శ్లో॥ సంబంధిభిన్నసంబంధపరిచ్ఛిన్నే ప్రవర్తతే ।
సమాసో ద్రవ్యసామాన్యే విశిష్టార్థానుపాతిని ॥ 246

సంబంధి భిన్నసంబంధ పరిచ్ఛిన్నే = సంబంధులతో కూడిన సంబంధము గలిగినట్టియు, విశిష్టార్థానుపాతిని = వెనుకనుండు ద్రవ్యవిశేషముగల, ద్రవ్యసామాన్యే = ద్రవ్యసామాన్యమున, సమాసః = బహువ్రీహి సమాసము, ప్రవర్తతే = ప్రవర్తించును.

తాత్పర్యము— విభక్త్యర్థ పక్షమందుకూడ వర్తి పదార్థముల సంబంధము గల పదార్థమునే బహువ్రీహి బోధించును. ఆ పదార్థము సామాన్యరూపముగనే తెలియును. విశేషమును "చైత్రః" మొదలగు విశేష్యపదములు తెలియజేయును. వానిని బట్టియే సమాసము యొక్క లింగవచనములను నిశ్చయింపవలెను.

వివరణము— అభేద భావనచే లభించు అన్యపదార్థము కూడ, సామాన్యరూపముగనే తెలియును. కాన విశేషము తెలియుటకై ఇచట కూడ అనుప్రయోగమావశ్యకమగును. కాగా అనుప్రయోగము రెండు పక్షములందును సమానమే అని ఫలించును ॥246॥

అవతారిక— అనుపాతి (వెనుక నుండునది) యగు విశేష ద్రవ్యముననుసరించి సామానాధికరణ్యము కుదురునని చెప్పుచున్నాడు.

శ్లో॥ ద్రవ్యధర్మానతిక్రాంతో భేదధర్మేష్వవస్థితః ।
భవిష్యదాశ్రయాపేక్షే లింగసంఖ్యే ప్రపద్యతే ॥ 247

ద్రవ్యధర్మానతిక్రాంతః = ద్రవ్యధర్మములను అతిక్రమించనట్టియు, భేదధర్మేషు = విశేష ద్రవ్యముల ధర్మములందు, అవస్థితః = ఆధారపడినట్టి, (సమాసః = బహువ్రీహి), భవిష్యదాశ్రయాపేక్షే = రాబోవు ద్రవ్యము నాశ్రయించిన, లింగసంఖ్యే = లింగవచనములను, ప్రపద్యతే = పొందును.

తాత్పర్యము— బహువ్రీహివలన ద్రవ్యసామాన్యమే తెలియును. విశేషము అనుప్రయుక్తమైన "చైత్ర" మొదలగు పదములవలన లభించును దాని లింగవచనములే సమాసమునకు సంక్రమించును అట్లు సామానాధికరణ్యము సంగతమగును. ఉదా : చిత్రగుః = చైత్రః, చిత్రగు = వనమ్ మొదలగునవి.

వివరణము— "విశేషణానాంచాజాతేః" (1-2-52) (ఇదివరకే పలుమార్లు వ్యాఖ్యాతము) అను సూత్రముయొక్క సామర్థ్యమువలన అనుప్రయుక్తమైన ద్రవ్యవిశేషము యొక్క లింగసంఖ్యలే బహువ్రీహికి సంక్రమించునని ఫలితము.

విశేష విషయములు— ఈ కారికతో బహువ్రీహియొక్క చర్చ ముగిసినది. ఇచటి సారాంశము లివి

(1) బహువ్రీహి అన్యపదార్థమును చెప్పును (ఇది మొదటి పక్షము).

(2) అది సంబంధమును చెప్పును చివరకు అభేదముచే సంబంధినే బోధించును. (రెండవ పక్షము).

(3) రెండవ పక్షమందు భాష్యకారునికి ప్రీతి అధికము.

(4) రెండు పక్షములందును విశేష్యము (ద్రవ్యవిశేషము) అను ప్రయుక్తమగును. దానినిబట్టియే లింగవచనములుండును.

(5) చిత్రగు, అను ఒక్క ఉదాహరణము నాశ్రయించి చర్చ అంతయు జరిగినది. అయినను బహువ్రీహికంతకును ఇది వర్తించును.

(12) నఞ్సమాసమందు లింగవచనముల అతిదేశ పరిశీలనము

అవతారిక— నఞ్ సమాసమున లింగవచనముల అతిదేశమును దాని ఉపయోగమును పరిశీలించుటకు ప్రారంభింపుచు తొలుత ఆ సమాసము విషయమున భాష్యకారుడు చూపిన మూడు పక్షములను సమర్థించుచున్నాడు.

శ్లో॥ శాస్త్రప్రవృత్తిభేదేఽపి లౌకికార్థో న భిద్యతే ।
నఞ్సమాసే యతస్తత్ర త్రయః పక్షా విచారితాః ॥ 248

శాస్త్రప్రవృత్తిభేదే + అపి = శాస్త్రము ప్రవర్తించుటలో భేదమున్నను, లౌకికార్థః = లోకములో ప్రసిద్ధమైన యర్థము, నఞ్సమాసే = నఞ్సమాసమందు, న + భిద్యతే = మారదు, యతః = కాగా, తత్ర = అచట, త్రయః = మూడు, పక్షాః = పక్షములు, విచారితాః = పరిశీలింపబడినవి.

తాత్పర్యము— "అబ్రాహ్మణః" మొదలగునది నఞ్సమాసము "బ్రాహ్మణుడు కాని వ్యక్తి" అని దీని యర్థము, ప్రసిద్ధమైయున్నది ఇదెప్పుడును మారదు. అయినను శబ్దసంస్కారమును చూపు శాస్త్రము, ప్రక్రియలో కొన్ని భేదములను చూపుచుండును. ఈ తీరుననుసరించియే ఇచట భాష్యములో మూడు పక్షములు చూపబడినవి.

వివరణము— శబ్దముయొక్క అర్థమును వ్యాకరణము చెప్పదు. అర్థమెప్పుడును లోకాధీనమే. అట్టి యర్థమునకు హాని లేకుండ శబ్దరూపమునకు చెందిన ప్రక్రియలో గౌరవ లాఘవములను చర్చించుటకై కొన్ని వాదభేదములను శాస్త్రము చూపుచుండును.

విశేష విషయములు— "నఞ్" (2-2-6) అను సూత్రము నఞ్ సమాసమును విధించును. "న" అను అవ్యయము సమర్థమైన సుబంతముతో సమసించును– అది తత్పురుషమనిపించుకొనును" అది దీని యర్థము ఉదా : న + బ్రాహ్మణః = అబ్రాహ్మణః, మొదలగునవి ఉదాహరణములు

ఈ సూత్రముయొక్క భాష్యములో మూడు పక్షములున్నవి.

(1) నఞ్ సమాసమందు తొలిపదము యొక్క అర్థము ముఖ్యమా ? (పూర్వపదార్థ ప్రాధాన్యము).

(2) లేక చివరి పదము (మలిపదము) యొక్క అర్థము ముఖ్యమా ? (ఉత్తర పదార్థ ప్రాధాన్యము)

(3) లేక బహుబ్రీహియందువలె అన్యపదార్థము ప్రధానమా ? (అన్యపదార్థ ప్రాధాన్యము).

వీనిలో ఏ పక్షమును స్వీకరించినను లోకసిద్ధమైన అర్థము మాత్రము మారదు - మారకూడదు. ఉదా : "అబ్రాహ్మణః = బ్రాహ్మణుడు కాని వ్యక్తి" అను అర్థమును మూడింటియందును సంపాదింపవలెను

1 పూర్వపదార్థ ప్రాధాన్యము:– ఇందు "న" అను దానికి నివృత్తి –లేక– అభావమర్థము. కాని నిషేధము ప్రాప్తిపూర్వకము (ప్రాప్తించునపుడే నిషేధము సార్థకము) మరియు అభావమునకు క్రియతో సంబంధము అసంభవము. కాగా "న" అను దానికి సాదృశ్యమను అర్థము ఫలించి "బ్రాహ్మణునివలె కనిపించుచు "క్షత్రియాది జాతికి చెందినవాడు" అను భావము వచ్చును.

2. ఉత్తరపదార్థ ప్రాధాన్యము:– ఇందు "న" అనునది భ్రాంతిని సూచించును. "బ్రాహ్మణుడు కాకున్నను బ్రాహ్మణుడను భ్రాంతికి విషయమైనవాడు" అను భావము కలుగును.

3. అన్యపదార్థ ప్రాధాన్యము:– ఇందు "అబ్రాహ్మణః" అనగా "బ్రాహ్మణ వ్యక్తి కాని క్షత్రియాది వ్యక్తి" అను భావము సిద్ధించును.

ఎట్లయినను సమాసము సమర్పించు భావమొకటియే. అయినను శాస్త్రప్రక్రియ యొక్క ఔచిత్యమును సమర్థముగ చూపుటకై మూడు పక్షములును ప్రతిపాదింపబడినవి.

వీనిలో చివరకు ఉత్తరపదార్థ ప్రాధాన్యమే ప్రామాణికముగ తీసికొనబడినది.

అవతారిక— నఞ్ సమాసమున "అపోద్ధారమును" అవయవములను ఎత్తి చూపుట) ఆశ్రయించి పై మూడు పక్షములును బయలుదేరినవి. వాస్తవముగ అచట అవయవములు లేవు - అని చెప్పుచున్నాడు.

శ్లో॥ శబ్దాంతరేఽపి చైకత్వమాశ్రిత్యైవ విచారణా ।
అబ్రాహ్మణాదిషు నఞః ప్రయోగో న హి విద్యతే ॥ 249

శబ్దాంతరే + అపి = వేరొక శబ్దమైనను, ఏకత్వమ్ + ఏవ = ఐక్యమునే, ఆశ్రిత్య + చ = ఆశ్రయించి, విచారణా = పరిశీలనము, (భవతి=అగును), అబ్రాహ్మణాదిషు=అబ్రాహ్మణః, మొదలగుచోట్ల. నఞః = నఞ్ఞునకు, ప్రయోగః = ప్రయోగము, న + విద్యతే + హి = లేదుగదా ।

తాత్పర్యము— "న బ్రాహ్మణః" అను వాక్యము వేరు. "అబ్రాహ్మణః" అను సమాసము వేరు అయినను ఆ రెండింటికిని అభేదమును కల్పించుటవలన సమాసమందును నఞ్ఞును చూపి అర్థవికల్పములు పరిశీలింపబడును. వాస్తవమున సమాసమఖండము. దాని యర్థమును అఖండమే

వివరణము— వాక్యమునకును వృత్తికిని గల స్వల్పసామ్యమునుబట్టి, వృత్తి యందును అవయవములును, విశేషణ విశేష్యభావము మొదలగునవియు ఉన్నట్లు ప్రక్రియను చూపుదురు. కాని వృత్తికిని వాక్యమునకుఁ ఎట్టి సంబంధమును లేదు. కాగా నఞ్ సమాసమున చూపబడిన మూడు పక్షములు కూడ వాక్యదశ ననుసరించినవేయని భావింపవలయును.॥249

అవతారిక— ఇట్లు వాక్యముతో అభేదమును భావించి నఞ్ సమాసమున మూడు పక్షములను చూపుట సరియే కావచ్చును కాని వాక్యమందలి నఞ్ఞునకు వాస్తవమైన అర్థమేమి?— అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రాక్సమాసాత్ పదార్థానాం నివృత్తిర్ద్యోత్యతే నఞా ।
స్వభావతో నివృత్తానాం రూపాభేదాదలక్షితా ॥ 250

స్వభావతః = సహజముగ, నివృత్తానామ్ = పోయిన (లేని), పదార్థానామ్=వస్తువులయొక్క, నివృత్తిః = పోవుట, రూపాభేదాత్ = స్వరూపములో భేదము లేనందువలన, అలక్షితా = చూడబడనిదై, సమాసాత్ = సమాసముకన్న, ప్రాక్ = ముందు, నఞా = నఞ్ఞుచే, ద్యోత్యతే = సూచింపబడును.

తాత్పర్యము— సహజముగనే పదార్థములులేని స్థితియందు, వాని అభావమును వాక్యమందలి నఞ్ఞు సూచించును కాని అది అభావమును సూటిగ చెప్పదు.

వివరణము— "న బ్రాహ్మణః" మొదలగు వాక్యమువలన ఆయా పదార్థము యొక్క (బ్రాహ్మణుడు మొదలయినది) నివృత్తిని —లేక— అభావమును తెలియుదుము. అభావము (లేకుండుట) తనంతతాను ఉండజాలదు. ఏదైనా ఒక వస్తువునకు సంబంధించియే అది యుండుట సహజము. ("దాని యభావము, దీని యభావము" - అని యనుటయేగాని పూర్తిగా ఒక పదార్థముగా అభావమును భావింపలేము). అయితే ఒక చిత్రము. సిద్ధముగా

నున్న పదార్థమును ''న'' అనునది పోగొట్టజాలదు. అనగా ''న'' అనగానే ఉన్నవస్తువు పోదు. అందువలన ఆ వస్తువును చెప్పు శబ్దము దానియొక్క ఉనికిని (భావము) లేకుండుటను గూడ (అభావము) సామాన్యముగ బోధించునని కల్పించుకొని, అందు అభావమును మాత్రమే నఞ్ సూచించునని యనుకొనవలెను. ఇట్లు బ్రాహ్మణ మొదలగు పదములవలననే తెలియు అభావమును వాక్యమందలి 'న' అనునది వెల్లడి చేయునగాన ద్యోతకమగునుగాని వాచకము కానేరదు.

విశేష విషయములు—— ''వృక్షః'' అను శబ్దము కేవలము చెట్టుయొక్క ఉనికిని మాత్రమే చెప్పునని అనలేము. లేకపోవుటను చెప్పుటకు కూడ ఆ శబ్దమునే వాడవలయును. అందుచే భావాభావములకు రెండింటికిని అన్వయించు అనిర్వచనీయమైన సత్తను (ఉనికి) శబ్దములు బోధించుననవలెను. (సత్త లేకున్నను ఉన్నట్లు భావించుట - దీనిని ఔపచారిక సత్త అందురు.) కాగా అభావమును కూడ శబ్దమే చెప్పును. దానినే నఞ్ వెల్లడి చేయును. 'న' అని వాడినపుడే అభావము ద్యోత్యమగునుగాన దాని ప్రయోగమావశ్యకము ।250॥

అవతారిక—— 'న' అను దానికి స్వతంత్రమైన అర్థమే లేనిచో అది ప్రధాన మెట్లగును? లేక అభావరూపమైన నఞర్థముతో కలిసిన ఉత్తరపదార్థము కూడ అభావమే యగును గాన దానికి ప్రాధాన్యమెట్లు కుదురును? ఇట్లు సమాసమందలి రెండు పదార్థముల కును సంబంధము చిక్కులలో పడినపుడు అన్యపదార్థము మాత్ర మెట్లు సిద్ధించును కాగా మూడు పక్షములు అను ప్రతిపాదనమే సంభవింపదు.

అట్లుకాక ఉత్తరపదార్థముతో అన్వయించు క్రియను నఞ్ నిషేధించునన్నచో అపుడు సమాసమే రాదు - అను భావమును విశదము చేయుచున్నాడు

శ్లో॥ బ్రాహ్మణాదిస్థయా వాక్యేష్వాఖ్యాత పదవాచ్యయా ।
క్రియయా యస్య సంబంధో వృత్తిస్తస్య న విద్యతే ॥ 251

వాక్యేషు = వాక్యములందు, బ్రాహ్మణాదిస్థయా = బ్రాహ్మణుడు మొదలగు వానియందుండు నట్టియు, ఆఖ్యాతపదవాచ్యయా = తిఙంతమైన పదమునకు వాచ్యమైన, క్రియయా = క్రియతో, సంబంధః = సంబంధము, యస్య = ఏ నఞ్‌నకు గలదో, తస్య = దానికి, వృత్తిః = సమాసము మొదలైన వృత్తి, న + విద్యతే = ఉండదు.

తాత్పర్యము—— ''న బ్రాహ్మణమ్ ఆనయ'' (బ్రాహ్మణుని తీసికొని రాకుము). ఇట్టి వాక్యములలో స్వభావమునుబట్టి 'న' అను దానికి, 'ఆనయ' మొదలగు క్రియతోనే సంబంధము కలుగును. కాన నఞ్‌నకు బ్రాహ్మణాది శబ్దములతో వృత్తి కాదు.

వివరణము—— నఞ్‌నకు క్రియాపదముతో సంబంధమున్నపుడు, ఉత్తరపదమైన బ్రాహ్మణాది శబ్దముతో సామర్థ్యముండదుగాన వృత్తి ప్రవర్తింపదు. అందుచే వృత్తిలో ''దీని యర్థము ముఖ్యమా? దాని యర్థము ముఖ్యమా?'' అను విచారణకు ఈ పక్షమున అవ కాశమే లేదు.

అట్లుకాక నఞ్ఞున కుత్తరపదముతోనే సంబంధమన్నపుడు సామర్థ్యము కుదురును గాన వృత్తి ప్రవర్తించును. కాగా అర్థముయొక్క ప్రాధాన్యమునకు చెందిన మూడు పక్షములును ఈ సందర్భమందే సముచితములగును. అయితే ''అబ్రాహ్మణః'' మొదలగు సమాసములో ''అస్తి'' (ఉన్నాడు) అను క్రియ మాత్రము ఉత్తరపదముయొక్క అర్థమందు ఇమిడియుండునని గ్రహింపవలెను. ఎట్టి పదార్థమునకైనను సత్త (ఉనికి) నియతము కావున దానిని చెప్పు క్రియాపదమును వాడినను, వాడకున్నను ఆ భావము తెలియుచునే యుండును. కాగా నఞ్ఞునకు ''అస్తి'' అను క్రియతో సంబంధము సూచితమైనను సామర్థ్యమునకు లోపముండదు

విశేష విషయములు— ''అస్తి'' (ఉన్నది) అను క్రియాపదము బోధించు సత్తాసామాన్యమును 'న' అనునది ఎల్లప్పుడును నిషేధించును. అనగా 'న' అను దానికి సత్త అను క్రియతోడి సంబంధము సహజముగాన ఈ యర్థమందు ఉత్తరపదముతో సామర్థ్యము కూడ సంభవించునని ఫలించును. ॥251॥

అవతారిక— ఇట్లు ఉత్తరపదముయొక్క అర్థమందుండు విశేషక్రియలను కూడ నఞ్ఞు నిషేధించునన్నపుడు కలుగు దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ పాచకాదిపదస్థా చేన్నఞా సంబధ్యతే క్రియా ।
తత్ర సత్తానుపాదానాత్ త్రిపక్షీ నోపపద్యతే ॥ 252

పాచకాదిపదస్థా = పాచక, మొదలగు పదముల అర్థమంమందు, క్రియా = వ్యాపారము, నఞా = నఞ్ఞుతో, సంబధ్యతే + చేత్ = కూర్చబడినచో. తత్ర = అచట, సత్తానుపాదానాత్ = సత్తను స్వీకరింపనందువలన, త్రిపక్షీ = మూడు పక్షములు, న + ఉపపద్యతే = కుదురవు.

తాత్పర్యము— ''న + పాచకః = అపాచకః'', ''న + పాఠకః = అపాఠకః'' ఇట్టిచోట్ల పాచక, పాఠక, మొదలగు ఉత్తరపదముల అర్థమందు వంట, చదువు, మొదలైన విశేష క్రియలున్నవి. వానిని ''న'' అనునది నిషేధించునన్నచో, సత్తా సామాన్యమును స్వీకరింపనందున వెనుక చూపిన మూడు పక్షములును (నఞ్ సమాసములో ఏ యర్థము ముఖ్యమని పరిశీలించునవి) కుదురక పోవును.

వివరణము— సత్త అను సామాన్యక్రియగాని, వంట చదువు మొదలగు విశేష క్రియగాని, సమాసమున ఉత్తరపదము వలననే తెలియుననియు, నఞ్ఞు ద్యోతకమై దానిని నిషేధించుననియు చెప్పినచో, నఞ్ఞు నిరర్థకమగునుగాన, అర్థప్రాధాన్యమును విచారించు వికల్పముల కవకాశముండదు. అందువలన వాక్యమందు ద్యోతకమగునని అన్నను, వృత్తియందు మాత్రము నఞ్ఞు వాచకమగునని చెప్పవలెను. అపుడు ''అసత్తా సామాన్యము'' (నాస్తి = లేదు = ఉనికి లేదు) దాని యర్థమగును. పాచకాది పదములున్నపుడు క్రియా

విశేషము యొక్క అసత్తయు (లేకుండుట) నఞర్థము కావచ్చును కాగా సమాసమున రెండు పదములకును స్వతంత్రమైన అర్థముండును గాన ప్రాధాన్యవిచారణ కుదురును.

విశేష విషయములు— సమాసమున సత్తా సామాన్యమునే నఞు స్వతంత్రముగ నిషేధించునని చెప్పవలెను. ॥252॥

అవతారిక— ఈ విధముగా సత్తతో నఞునకు సంబంధమన్నచో చిక్కు వచ్చునని చూపుచున్నాడు.

శ్లో॥ సత్తయైవాభిసంబంధో యది సర్వత్ర కల్ప్యతే ।
అసన్నితి సమాసేఽస్మిన్ సత్తాన్యా పరికల్ప్యతామ్ ॥ 253

సర్వత్ర = అన్నిచోటులందును, సత్తయా + ఏవ = సత్తాతోనే, అభిసంబంధః = సంబంధము, కల్ప్యతే + యది = కల్పింపబడినచో, "అసన్ + ఇతి" = "అసన్" అను, అస్మిన్ = ఈ, సమాసే = సమాసమందు, అన్యా = వేరొక, సత్తా = సత్త, పరికల్ప్యతామ్ = కల్పింపబడవలెను.

తాత్పర్యము— పదార్థము లన్నింటికిని సత్త (ఉనికి) తోడి సంబంధము నియతము అట్టి సత్తనే నఞ్ సమాసమందలి "న" అనునది నిషేధించునన్నచో "న + సన్= అసన్ (లేనిది)" అనుచోట ఉత్తరపదార్థమునకు చెందిన వేరొక సత్తను కల్పింపవలసి యుండును.

వివరణము— "అసన్" అను పదమువలన ఒక సత్తయొక్క అభావమే తెలియును. సత్తా సామాన్యమును నిషేధించుట నఞున కర్థమన్నచో, నఞునకు సంబంధించిన వేరొక సత్త నిచట అంగీకరింపవలసి యుండును. (అసన్ = సత్తయొక్క సత్త లేకుండుట అను భావము వచ్చెడిని). ॥253॥

అవతారిక— ఈ సందర్భముననే మరియొక దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ క్త్వాంతే చ తుమునంతే చ నఞ్సమాసే న దృశ్యతే ।
విశేషణవిశేష్యత్వం నఞా సత్తాభిధాయినా ॥ 254

క్త్వాంతే + చ = త్వా, అను ప్రత్యయ మంతమందుగల శబ్దమందును, తుమునంతే + చ = తుమ్, అను ప్రత్యయ మంతమందుగల శబ్దము విషయమునను, నఞ్సమాసే = నఞ్సమాసమున, సత్తాభిధాయినా = సత్తను చెప్పు, నఞా = నఞుతో, విశేషణవిశేష్యత్వమ్ = విశేషణ విశేష్యభావము, న + దృశ్యతే = కనబడదు.

తాత్పర్యము— "న + కృత్వా=అకృత్వా (చేయక)". ఇది క్త్వా ప్రత్యయాంతముతో నఞ్సమాసము. "న + కర్తుమ్ = అకర్తుమ్" (చేయకుండుటకు) ఇది తుమున్

ప్రత్యయాంతముతో నఞ్ సమాసము ఇట్టిచోట్ల ఆ యా విశేషక్రియలనే నఞ్ఞు నిషేధించును గాని సత్తను నిషేధింపదు. కాగా నఞ్ఞు సత్తనే సామాన్యముగా నిషేధించుననుట పొసగదు.

వివరణము— ఇచటి సారమిది :

(1) వాక్యమందలి ''న'' అనునది అభావమునకు ద్యోతకమనుట కుదురును.

(2) వృత్తియందలి ''న'' అనునది ద్యోతకము మాత్రమే అన్నచో, ఉత్తర పదార్థమే ముఖ్యమగునుగాన అర్థప్రాధాన్యమును గూర్చి వికల్పములు కుదురవు.

(3) అట్లుకాక వృత్తియందలి ''న'' అనునది సత్తను నిషేధించు వాచకమే అగునన్నచో, అసన్, అకృత్వా, మొదలగు ప్రయోగములలోని అర్థానుభవము విరోధించును.

(4) ఇట్లు నఞ్ఞు ద్యోతకమన్నను, సత్తకు వాచకమన్నను ''త్రిపక్షి'' (మూడు పక్షములు = నఞ్ సమాసముయొక్క అర్థమునుగురించి మూడు పక్షములు) ఉపపన్నము కాదు

(5) వృత్తియందలి నఞ్ఞునకు కేవలము నిషేధమే అర్థమని చెప్పినచో, ఏదో యొక విధముగ త్రిపక్షిని సమర్థింపవచ్చును. ఇందు నఞ్ఞునకు స్వతంత్రమైన అర్థముండును (నిషేధము). ''సత్త'' యను సామాన్యక్రియతోగాని. ''చేయు'' మొదలగు విశేషక్రియలతో గాని దానికి సంబంధమును చూపవచ్చును. ॥254॥

అవతారిక— పైన చూపిన దోషములు కలుగకుండుటకు ఉపాయమును చెప్పుచున్నాడు.

శ్లో॥ క్రియాయాః సాధనాధారసామాన్యే నఞ్ వ్యవస్థితః ।
తతో విశిష్టైరాధారైర్యుజ్యతే బ్రాహ్మణాదిభిః ॥ 255

క్రియాయాః = క్రియయొక్క, సాధనాధార సామాన్యే = సాధనమునకు ఆశ్రయమైన సామాన్యమందు, నఞ్ = నఞ్ఞు, వ్యవస్థితః = నిశ్చయింపబడినది, తతః = అందువలన, బ్రాహ్మణాదిభిః = బ్రాహ్మణుడు మొదలయిన, విశిష్టై = విశేషములైన, ఆధారై = ఆధారములతో, యుజ్యతే = సంబంధించును.

తాత్పర్యము— ''లేని వస్తువు'' అన్నది నఞ్ఞుయొక్క అర్థము. ఇది సామాన్యార్థము. ఉత్తరపదము ఆ వస్తువును స్పష్టపరచును ఇది విశేషమగును. కావున సామాన్యవిశేష భావ మేర్పడి, ''అబ్రాహ్మణః'' మొదలగుచోట్ల కావలసిన యర్థము సిద్ధించును.

వివరణము— ''న'' అనునది అభావమును బోధించును. భావముయొక్క నిషేధమే అభావము. భావమనగా ''ఉనికి'' ఇచట ఈ ఉనికిని లేక సత్తను క్రియగా తీసికొనవలెను. సత్తకు సాధనమైన ఆధారమనగా ''ఉండు వస్తువు'' అగును. దీనిని ''న'' అనునది సామాన్య రూపమున నిషేధించును. కాగా ''న'' అనునది ''లేని వస్తువు'' (ఏదయినను సరే) అను

నర్థమును చెప్పును. పిదప సమాసము జరిగినపుడు ఉత్తరపదార్థము విశేషమగును. నఞర్థము నకును ఉత్తరపదార్థమునకును సామాన్యవిశేష భావము కుదురును.

విశేష విషయములు— ఈ పరిష్కారము వలన చిక్కులేవియు రావు. ఇందు "న" అనునది వాచకమే యగును. కావున వివక్షాధీనముగా అర్థప్రాధాన్యమును గురించిన మూడు పక్షములును సరిపోవును. ఉదా : "అబ్రాహ్మణః = బ్రాహ్మణుడు - లేనివాడు." ఈ యర్థమున పూర్వపదార్థము యొక్క ప్రాధాన్యము. "లేని బ్రాహ్మణుడు అని చెప్పినచో ఉత్తరపదార్థ ప్రాధాన్యము. "బ్రాహ్మణత్వము లేని వ్యక్తి" అని అన్నచో అన్యపదార్థ ప్రాధాన్యము. ఇట్లే "అపాచకః" మొదలగుచోట్ల సామాన్యవిశేషభావముచే ఆయా క్రియా విశేషమునకే నిషేధము చెందును. "అకృత్వా" మొదలగుచోట్ల కూడ ఇట్లే సామాన్యవిశేష భావమును ఊహింపవలెను. ॥255॥

అవతారిక— వాక్యమందు ద్యోతకమైన నఞునకు, వృత్తియందు వాచకత్వ మెట్లు కుదురునను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ వృత్తౌ యథా గతాద్యర్థముపాదాయ నిరాదయః ।
యుజ్యంతే సాధనాధారైర్నఞ్సమాసేఽపి స క్రమః ॥ 256

నిరాదయః = నిర్ మొదలగునవి, వృత్తౌ = వృత్తియందు, గతాద్యర్థమ్ = "గత" మొద లగు అర్థమును, ఉపాదాయ = స్వీకరించి, సాధనాధారైః = కారకములైన ద్రవ్యములతో, యథా = ఎట్లు, యుజ్యంతే = కూడునో, నఞ్సమాసే + అపి = నఞ్ సమాసమందును, సః = అదియే, క్రమః = తీరు.

తాత్పర్యము— నిర్ (నిష్క్రమించుట), అతి (అతిక్రమించుట), మొదలగునవి వాక్యదశయందు అవ్యయములు. కాని "నిష్కౌశాంబిః" (నిష్క్రాంతః కౌశాంబ్యాః=కౌశాంబి యను నగరమునుండి వెడలినవాడు) అతిఖట్వః (ఖట్వామ్ - అతిక్రాంతః = మంచమును దాటినవాడు) మొదలగు సమాసములలో అవి ఆయా ద్రవ్యములనే బోధించును అట్లే నఞ్ సమాసమందలి "న" అనునది "లేని వస్తువు" అను నర్థమును సామాన్యముగ చెప్ప గలుగును

వివరణము— శబ్ద శక్తి ననుసరించి, నిష్కౌశాంబిః, మొదలగు సమాసముల లోని "నిర్" మొదలగు అవ్యయములు (సహజముగ ద్యోతకములైనను) "నిష్క్రమించిన వస్తువు"ను చెప్పునట్లు, "అబ్రాహ్మణః" మొదలగు సమాసమందలి "న" అనునది "లేని వస్తువు"ను సామాన్యరూపములో చెప్పును. అట్లు కాకున్న సామర్థ్యము కుదురనందున సమా సమే రాకపోవును. (వాక్యదశలో "న" అను దానికి "అభావము" అనియే యర్థము). ॥256

అవతారిక— నఞ్ అసత్సామాన్యమును (లేని వస్తువు - అను అర్థమును) చెప్పి నపుడు ఉత్తరపదము యొక్క అర్థమే విశేషనుగుటవలన ముఖ్యమని తెలిసిపోవును. అయి

నపుడు అర్థప్రాధాన్యము విషయమున వెనుకటి వికల్పము లెట్లు కుదురును ? - అను శంకకు బదులు చెప్పుచున్నాడు.

శ్లో॥ తత్రాసతి నఞో వృత్తేర్బ్రాహ్మణక్షత్రియాదిభిః ।
విశేషణవిశేష్యత్వం కల్ప్యతే కుబ్జఖంజవత్ ॥ 257

తత్ర = అచట, అసతి = అసత్తునందు (లేని వస్తువు), నఞః = నఞు, వృత్తేః = ప్రవర్తించుట వలన, బ్రాహ్మణక్షత్రియాదిభిః = బ్రాహ్మణ, క్షత్రియ మొదలగు పదములతో, కుబ్జఖంజవత్ = "కుబ్జఖంజ", అను సమాసమందువలె, విశేషణవిశేష్యత్వమ్ = విశేషణ విశేష్యభావము, కల్ప్యతే = కల్పింపబడును.

తాత్పర్యము— "అబ్రాహ్మణః" "అక్షత్రియః" మొదలగు నఞ్ సమాసములలో నఞు లేని వస్తువును సామాన్యమును చెప్పును. అయినను దానికిని బ్రాహ్మణాదులకును "కుబ్జ ఖంజః" అను సమాసమందువలె "ఒకటి విశేషణమనియు, వేరొకటి విశేష్యమనియును" విశేషణ విశేష్యభావమును చెప్పుకొనవలెను.

వివరణము— కుబ్జః = గూనివాడు, ఖంజః = కుంటివాడు. కుబ్జశ్చ - అసౌ - ఖంజశ్చ = కుబ్జఖంజః (గూనియు కుంటియునగు వ్యక్తి). ఇచట రెండును విశేషణములే. విశేష్యమైన వ్యక్తి వేరుగా ఉండును. అయినను ఈ రెండు పదములకును స్వేచ్ఛగా విశేషణ విశేష్యభావమును కల్పించి కర్మధారయ సమాసమును సమర్థింతురు. (కుబ్జ అన్నది విశేష్యమనియు, ఖంజ అనునది విశేషణమనియును మార్చినచో "ఖంజకుబ్జః" అనియు వాడవచ్చును) అట్లే నఞ్ సమాసములో విశేషణ విశేష్యభావమును స్వేచ్ఛగా కల్పింపవచ్చును. అపుడు అర్థముయొక్క ప్రాధాన్యము తారుమారగుచుండును. కాగా దానిని గురించిన వికల్పములు సమంజసములే అగును. ॥257॥

అవతారిక— అట్లు విశేషణ విశేష్యభావమును స్వేచ్ఛగా చెప్పినపుడు సిద్ధించు ఫలితమును చూపుచున్నాడు

శ్లో॥ కామచారే చ సత్యేవమసతః స్యాత్ ప్రధానతా ।
గుణత్వమితరేషాం చ తేషాం వా స్యాత్ ప్రధానతా ॥ 258

ఏవమ్ = ఇట్లు, కామచారే = స్వేచ్ఛ, సతి + చ = ఉండగా, అసతః = అసత్తునకు (లేని వస్తువు - అను సామాన్యమునకు), ప్రధానతా = ప్రాధాన్యము, స్యాత్ = అగును, ఇతరేషామ్ = మిగిలిన వానికి (బ్రాహ్మణ, మొదలగు విశేషములకు), గుణత్వమ్ + చ = గుణభావమును (అప్రాధాన్యము), స్యాత్ = అగును, వా = లేక, తేషామ్ = ఆ విశేషములకే, ప్రధానతా = (ప్రాధాన్యము, స్యాత్ = కలుగును (సామాన్యము అప్రధానమగును).

తాత్పర్యము— నఞ్ సమాసములో విశేషణ విశేష్యభావమును స్వేచ్ఛగ చెప్ప

వచ్చునన్నపుడు, ఒకసారి "అసత్సామాన్యము" (నఞర్థము) ముఖ్యమై, బ్రాహ్మణాది విశేషములు అప్రధానములగును. వేరొకసారి విశేషములే ప్రధానమై అసత్సామాన్యము అప్రధానమగును.

వివరణము— "అబ్రాహ్మణః" = బ్రాహ్మణుడు - లేనివాడు. (బ్రాహ్మణ పదార్థము విశేషణము, నఞర్థము విశేష్యము) ఇదొక రీతి. ఇందు పూర్వపదార్థము ముఖ్యమగును. అబ్రాహ్మణః = లేనివాడు బ్రాహ్మణుడు ఇదొక రీతి. ఇందు ఉత్తరపదార్థము ప్రధానము ఈ రెండు రీతులను అంగీకరించినపుడు "బ్రాహ్మణత్వము లేని వ్యక్తి" అను వేరొక రీతిని కూడ అంగీకరింపవచ్చును. ఇందు అన్యపదార్థము ముఖ్యమగును ఇట్లు అర్థప్రాధాన్యమును గురించి వికల్పములు బయలుదేరును.

విశేష విషయములు— కాగా వాక్యమందలి నఞు నిషేధమును మాత్రమే సూచించును. అది ద్యోతకము కావుననే అవ్యయము. (లింగవచనము లుండవు). వృత్తియందలి నఞు వాచకము. అసత్సామాన్యమును అది చెప్పును. దానికిని ఉత్తరపదమునకును విశేషణ విశేష్యభావము. అందు స్వేచ్ఛ గలదు. కావుననే "దీని యర్థము ముఖ్యమని" విచారణ చేయుట కవకాశము కలిగినది. ॥258॥

అవతారిక— ఇట్లు నఞ్ సమాసము విషయమున భాష్యము చూపిన మూడు పక్షములును సమర్థింపబడినవి. అందు ఉత్తరపదార్థము ముఖ్యమను పక్షమును ముందుగా భాష్యకారుడు సమీక్షించెను. ఆ తీరును వివరించుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ ప్రాధాన్యేనాశ్రితాః పూర్వం శ్రుతేః సామాన్యవృత్తయః ।
విశేష ఏవ ప్రక్రాంతా బ్రాహ్మణక్షత్రియాదయః ॥ 259

బ్రాహ్మణక్షత్రియాదయః = బ్రాహ్మణ, క్షత్రియ, మొదలగునవి, శ్రుతేః = వినుటవలన, సామాన్యవృత్తయః = సామాన్యమైన అర్థమందుండునవియై, విశేష + ఏవ = విశేషమైన అర్థమందే, పూర్వమ్ = ముందుగా, ప్రక్రాంతాః = ప్రారంభింపబడినవై, ప్రాధాన్యేన = ముఖ్యములుగా, ఆశ్రితాః = ఆశ్రయింపబడును.

తాత్పర్యము— అబ్రాహ్మణః - మొదలగు నఞ్ సమాసములలో బ్రాహ్మణ - మొదలగు ఉత్తరపదములు, నివృత్తితో (అభావము) కూడిన తమ, తమ అర్థములనే ముఖ్యములుగా బోధించును. 'న' అనునది వానికి విశేషణమగుచు సిద్ధముగానున్న నివృత్తిని వెల్లడి చేయును. స్వరూపము ఒకటిగానే వినిపించినను (వేరు స్థలములలో) నఞ్ సమాసమందలి చివరి పదములు అభావవిశిష్టమైన స్వార్థమును చెప్పును అనవలెను.

వివరణము— బ్రాహ్మణ శబ్ద మన్నిచోటులందును ఒకే విధముగ వినిపించును. అయినను నఞ్ సమాసమున అది "లేని బ్రాహ్మణత్వము గలవాడు" అను భావమును సమర్పించును. పిదప "న" అనునది ఆ భావమును విశదము చేయును. ఉన్న ధర్మమును నఞు పోగొట్టజాలదు. అందుచే ఇట్లు చెప్పక తప్పదు. ॥259॥

అవతారిక— కాగా విశేషణ విశేష్యభావ మేర్పడి ఉత్తరపదార్థము ముఖ్యమగునని దృష్టాంతముతో చూపుచున్నాడు.

శ్లో॥ యథా గౌరాదిభిస్తేషామవచ్ఛేదో విధీయతే।
అసతాప్యనభివ్యక్తం తాదాత్మ్యం వ్యజ్యతే తథా॥ 260

తేషామ్ = వానికి (బ్రాహ్మణ మొదలగు పదముల అర్థములకు), గౌరాదిభిః = గౌర, మొదలగు పదముల అర్థములతో, అవచ్ఛేదః = వేరుచేయుట (సంబంధము), యథా = ఎట్లు, విధీయతే = విధింపబడునో, తథా = అట్లు, అసతా + అపి = లేని వస్తువుతో కూడ, అనభివ్యక్తమ్ = విస్పష్టము కాని, తాదాత్మ్యమ్ = అభేదము, వ్యజ్యతే = సూచింపబడును.

తాత్పర్యము— "గౌరః" (తెల్లని) మొదలగు పదములు "బ్రాహ్మణ" మొదలగు పదములకు విశేషణములై "తెల్లని బ్రాహ్మణుడు" మొదలగు రీతిని మొత్తముపై ఒకే వస్తువును బోధించును అట్లే "న" అను దాని యర్థము (నివృత్తి = అభావము) కూడ విశేషణమై "లేని బ్రాహ్మణత్వము గల వ్యక్తి" అను భావమును కలిగించును. అయినను బ్రాహ్మణాది శబ్దములు తొలుతనే నఞర్థముతో కలిసియుండుటయు, నఞు చేరగానే అది విస్పష్టమగుటయును ఇచటి విశేషము. (అబ్రాహ్మణః = న + బ్రాహ్మణః - ఇచట బ్రాహ్మణ శబ్దము "అబ్రాహ్మణః" అను నర్థమును చెప్పును. దానిని "న" అనునది వెల్లడించును).

అవతారిక— ఉన్న వస్తువునకు విశేషమును చెప్పుటకై విశేషణమును చూపుట సహజము. కాని నఞు వస్తువుయొక్క అభావమును చెప్పును. దానికి విశేష్యమైన వస్తువు కూడ అభావము గలదియే (లేనిది) అగును కాగా ఉత్తరపదార్థమే లేనపుడు దానికై ఉత్తర పదమును ప్రయోగించుటయు, నఞునకును దానికిని విశేషణ విశేష్యభావమును చెప్పుటయును ఎట్లు సంభవించును ? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ యథా సత్తాభిధానాయ సన్నర్థః పరికల్ప్యతే।
తథాసత్తాభిధానాయ నిరుపాఖ్యో వికల్ప్యతే॥ 261

సత్తాభిధానాయ = ఉనికిని చెప్పుటకు, అర్థః = అర్థము (పదార్థము), సన్ = ఉన్నదని, యథా = ఎట్లు, పరికల్ప్యతే = కల్పింపబడునో, తథా = అట్లు, అసత్తాభిధానాయ = అభావమును చెప్పుటకు, నిరుపాఖ్యః = ఆకారము లేనిది = విశేషరూపము లేని వస్తువు, వికల్ప్యతే = కల్పింపబడును

తాత్పర్యము— "బ్రాహ్మణ" మొదలగు శబ్దముల అర్థములన్నియును కేవలముగ ప్రయోగించినపుడు భావమునకును అభావమునకును సామాన్యముగానే ఉపయోగించును. భావమును చెప్పదలచినపుడు "సన్ బ్రాహ్మణః" (ఉన్న బ్రాహ్మణుడు) అని విశేషణమును చూపుదుము. అట్లే అభావమును చెప్పదలచినపుడును "అసన్ బ్రాహ్మణః" (లేని బ్రాహ్మ

ణుడు) అని విశేషణమును కలుపుటలో దోషము లేదు. కాగా ''అబ్రాహ్మణః'' మొదలగు చోట్ల నఞ్ఞునకును ఉత్తరపదమునకును విశేషణ విశేష్యభావము కుదురును

వివరణము— ''వస్తువు ఉన్నదని'' చెప్పుటకు దానిని నిర్దేశించుట తప్పనిసరి అయినట్లే, ''వస్తువు లేదని'' చెప్పుటకు కూడ దానిని స్పష్టముగ చెప్పక తప్పదు. ఉదా : ''వృక్షః'', ''అస్తి'', అనుటకును, ''నాఽస్తి'' అనుటకును గూడ ఈ పదములు వాడక తీరదు. విషయమే లేనపుడు నిషేధము కుదురదుగదా! కావున ఏ పదార్థమునయినను భావాభావసాధారణముగా తొలుత వాడుదురు. పిదప సందర్భమునుబట్టి భావరూపమైన విశేషమునుగాని, అభావరూపమైన విశేషమునుగాని చూపుదురు ఇట్లు సామాన్యమైన పదార్థము యొక్క సత్తను ''ఉపచారసత్త'' అని యందురు (ఈ యంశము 250 వ కారికలో వివరింప బడినది) నఞ్ సమాసమున ఉత్తరపదము ఇట్టి సత్తనే బోధించును దీని ననుసరించి నఞ్ సమాసములో పూర్వపదము విశేషణమనియు, ఉత్తరపదము విశేష్యమనియును కల్పించుకొన వలెను.

విశేష విషయములు— శబ్దమువలన కలుగు అర్థప్రతీతి అంతయు బౌద్ధమే (బుద్ధియందు జరుగు వ్యాపారము). మనస్సు అందించిన భావమునే ఏదో విధముగ శబ్దము బయలుపరచును. మనస్సు అతివిచిత్రములైన కల్పనలను చేయును. వానికి శబ్దము లౌక ఆకారము నిచ్చును విశేషణ విశేష్యభావమంతయు అట్టి కల్పనమే. ఉదా : ''నీలోత్పలమ్'' (నల్ల కలువ) ఇచట వస్తువు ఒకటియే. (నలుపు వేరుగను, కలువ వేరుగను సృష్టిలో ఉండదు). అయినను మనస్సులో భేదమును కల్పించి ''నీల శబ్దము విశేషణమనియు, ఉత్పల శబ్దము విశేష్యమనియును'' చెప్పుదురు ఈ విధముగనే ''అబ్రాహ్మణః'' మొదలగుచోట్ల బౌద్ధమైన విశేషణ విశేష్యభావమును శబ్దము బహిరంగము చేయునని భావింపక తప్పదు

అవతారిక— మరియు ''అబ్రాహ్మణః'' మొదలగుచోట్ల ఉత్తరపదము ''తత్స దృశుడు'' (బ్రాహ్మణ సదృశుడు = బ్రాహ్మణుడుకాడు = క్షత్రియాదివ్యక్తి) అను నర్థమును అందించునని చెప్పుటకు ఉపక్రమించుచున్నాడు.

శ్లో॥ క్షత్రియాదౌ పదం కృత్వా బుద్ధిః సత్తాంతరాశ్రయా ।
జాత్యా భిన్నాం తతః సత్తాం ప్రసక్తామపకర్షతి ॥ 262

సత్తాంతరాశ్రయా = వేరొక సత్తను అవలంబించిన బుద్ధిః = బుద్ధి, క్షత్రియాదౌ = క్షత్రియుడు మొదలగు వానియందు, పదమ్ = అడుగును, కృత్వా = చేసి (పెట్టి), తతః = పిదప, జాత్యా = జాతిచే, భిన్నామ్ = వేరయిన, ప్రసక్తామ్ = ఉండుటకు సిద్ధమైన, సత్తామ్ = సత్తను, అపకర్షతి = లాగివేయును.

తాత్పర్యము— బ్రాహ్మణుడు కాని వ్యక్తియందు, భ్రాంతివలన బ్రాహ్మణ శబ్దమును ప్రయోగించు సందర్భములో, ''న'' అనునది చేరి, ''అతడు బ్రాహ్మణుడు కాని

వ్యక్తి'' అని తెలియజేయును. కాగా ''అబ్రాహ్మణః'' అను సమాసము ''బ్రాహ్మణ సదృశుడై బ్రాహ్మణుడు కాని వ్యక్తి'' అను అర్థమును తెలియజేయును

వివరణము— బ్రాహ్మణుని పోలికలుగల క్షత్రియుడొకడుండును. అతనిని చూచి 'బ్రాహ్మణః' అనుటకు మనసు తొలుత తొందరపడును. పిదప నిర్ణయముకలిగి, వెంటనే ''న''కారమును చేర్చి ''అబ్రాహ్మణః - అయమ్ - క్షత్రియః'' అని అందురు. ఈ విధముగ భ్రాంతిచే తొలుత ఉంచదలచిన జాతిని వెంటనే నఞు తీసివేయును.

విశేష విషయములు— ''ఒక వస్తువుకన్న కొంచెము వేరుగా ఉండినను ఆ వస్తువుతో సమానముగా ఉండు వస్తువునే'' ఇచటి నఞు బోధించును కావున ''అబ్రాహ్మణః'' అనునది ''బ్రాహ్మణుడు కాని మానవునే'' తెలుపునుగాని, రాయి, రప్ప మొదలగువానిని తెలుపదు. ॥262॥

అవతారిక— ''అభావః'' అను నఞ్ సమాసమును సమర్థించుచున్నాడు.

శ్లో॥ అభావ ఇతి భావస్య ప్రతిషేధే వివక్షితే।
సోపాఖ్యత్వమనాశ్రిత్య ప్రతిషేధో న కల్పతే ॥ 263

అభావః + ఇతి = ''అభావము'' అని, భావస్య = భావమునకు, ప్రతిషేధే = నిషేధము, వివక్షితే = చెప్పదలపబడినపుడు, సోపాఖ్యత్వమ్ = ఆకారము గలిగియుండుటను, అనాశ్రిత్య = స్వీకరింపనిచో, ప్రతిషేధః = నిషేధము, న + కల్పతే = కుదురదు.

తాత్పర్యము— ''న + భావః = అభావః (లేకుండుట)''. ఇచట భావమునకు (ఉనికి) ఆకారము లెదు. వాస్తవము, అది నిరాకారము అయినను నిషేధము సిద్ధించుటకై భావమునకును మనస్సులో ఒక ఆకృతిని కల్పింపవలెను. ఇచటి భావశబ్దము అభావమును బోధించుననియు దానినే 'న' అన్నది అభివ్యక్తము చేయుననియును అనుకొనవలెను.

వివరణము— నఞ్ సమాసమువలన ''తద్భిన్నమును తత్సదృశమును అగు వస్తువు'' తెలియునన్నచో, అభావః అనుచోట సమన్వయమును చెప్పుట కష్టము. భావము కానిదియు, భావముతో సదృశమైనదియునగునది అచట సంభవింపదు గదా ! అనగా అచట ''భావమునకు నిషేధమే'' తెలియునుగాని సాదృశ్యము తెలియనే తెలియదు. ఇట్టి చిక్కును తొలగించుటకు ఈ కారిక బయలుదేరినది. ॥263॥

అవతారిక— ఈ సందర్భములో (ఉత్తరపదార్థము ముఖ్యమను పక్షములో) భాష్యకారుడు వేరొక తీరును చూపెను దానిని వివరించుచున్నాడు.

శ్లో॥ అనేకధర్మవచనైః శబ్దైః సంఘాభిధాయిభిః।
ఏకదేశేషు వర్తంతే తుల్యరూపాః స్వభావతః ॥ 264

అనేక ధర్మవచనైః = వివిధములైన ధర్మములను చెప్పునట్టియు, సంఘాభిధాయిభిః = సముదాయమును బోధించునట్టి, శబ్దైః = శబ్దములతో, తుల్యరూపాః = సమానమైన రూపముగల శబ్దములు, స్వభావతః = స్వభావమునుబట్టి, ఏకదేశేషు = అవయవములందు, వర్తంతే = ప్రవర్తించును.

తాత్పర్యము— సముదాయమును బోధించు శబ్దములే అవయవములను కూడ బోధించుట ప్రసిద్ధమైయున్నది. ఉదా: తైలంభుక్తమ్=నూనె అనుభవింపబడినది, ఘృతమ్ భుక్తమ్ = నెయ్యి త్రాగబడినది. ఇచట తైల, ఘృతశబ్దములు అవయవములనే బోధించును. (తైల ఘృత సముదాయమునంతను అనుభవించుట అసంభవము గదా!) ఆవశ్యకమైనపుడు అవేశబ్దములు సముదాయమును తెలుపును. అట్లే నఞ్ సమాసములోని బ్రాహ్మణాది శబ్దములు బ్రాహ్మణుని లక్షణములను పూర్తిగ బోధింపకుండ, కొన్నింటినే బోధించుననియు, ఆ విషయమును నఞ్ స్పష్టము చేయుననియును వ్యాఖ్యానింపవచ్చును అట్లయిన ఉత్తరపదార్థము ముఖ్యమగుట సులభమగును.

వివరణము— (1) సముదాయమును చెప్పు శబ్దములును, అవయవములను మాత్రము చెప్పు శబ్దములును భిన్నములే అనవలెను. (అర్థము వేరయినచో శబ్దము కూడ వేరగుట సంప్రదాయము). అయినను వాని స్వరూపమొకటేగాన ''అవి వేరుకావ''ను భ్రాంతి సహజముగ నుండును. (పండితులు కాని వారీ విభాగమునే గ్రహింపజాలరు).

(2) తపస్సు, పాండిత్యము, వినయము మొదలగునని బ్రాహ్మణుని ధర్మములు అవి మొత్తము పదియని భావించినపుడు, అవన్నియు గల వ్యక్తిని ''బ్రాహ్మణ'' శబ్దము బోధించును. అపుడది సముదాయవాచకము. అట్లే ఏవో కొన్నియే ధర్మములుగల వ్యక్తిని బోధించుటకును బ్రాహ్మణ శబ్దమును వాడవచ్చును. అపుడది అవయవ వాచకమగును.

(3) కాగా - నఞ్ సమాసములోని బ్రాహ్మణ శబ్దము ఏకదేశ వాచకమనుకొనవలెను. అనగా కొద్ది బ్రాహ్మణ ధర్మములు గల క్షత్రియునిగురించి ''బ్రాహ్మణః'' అని వాడదలతుము. కాని మరికొన్ని ధర్మములచట ఉండవు. అందుచే ''న'' అను దానిని కలిపి ''అబ్రాహ్మణః'' అని యందుము. ''బ్రాహ్మణ ధర్మములు కొద్దిగా ఉన్న క్షత్రియుడు'' అను భావము సిద్ధించును.

(4) ఈ పక్షమున బ్రాహ్మణ శబ్దము ధర్మసముదాయ వాచకము కాదనియు, అవయవ వాచకమనియును నఞ్ స్పష్టపరచును. ఉత్తరపదము యొక్క అర్థము ముఖ్యమగును. వెనుక చూపిన రీతిని బ్రాహ్మణత్వమునకు ''ఉపచార సత్త'' (లేకున్నను ఉన్నట్లు భావించుట) ను అంగీకరింప నక్కరలేదు. కొంతవరకును బ్రాహ్మణ ధర్మములుండునుగాన, బ్రాహ్మణత్వమున్నదనియే అనుకొనవచ్చును. ॥264॥

అవతారిక— అబ్రాహ్మణః, అనుచోట ధర్మసముదాయమును చెప్పు బ్రాహ్మణ శబ్దము భ్రాంతివలన అవయవవాచకముగా ప్రయోగింపబడుననియు, కొన్ని బ్రాహ్మణ ధర్మ

ములు లేనట్లు ''న'' అనునది సూచించుననియు చెప్పినచో, బ్రాహ్మణ శబ్దమువలన కొన్ని ధర్మముల ఉనికియు, నఞ్ వలన కొన్నింటి లేమియు తెలియునుగాన పూర్వోత్తర పదార్థములకు సమన్వయ మెట్లు కుదురును ? - అను శంకను, దానికి సమాధానమును రెండు కారికలతో చూపుచున్నాడు.

శ్లో॥ యథైకదేశకరణాత్ కృత ఇత్యభిధీయతే ।
అకృతశ్చేతి సంఘాత స్తథైవాబ్రాహ్మణే క్రమః ॥ 265

ఏకదేశకరణాత్ = కొంత భాగమును పూర్తి చేసినందువలన, కృతః + ఇతి = చేయబడినదనియు, అకృతః + ఇతి + చ = చేయబడనిదనియును, సంఘాతః = సముదాయము, యథా = ఎట్లు, అభిధీయతే = చెప్పబడునో, తథా + ఏవ = అట్లే, అబ్రాహ్మణే = అబ్రాహ్మణ, అను సమాసమందు, క్రమః = తీరు, (భవతి = అగును).

తాత్పర్యము— మొత్తము పనిలో కొంతభాగమును పూర్తిచేసినపుడు ఆ పనిని ''కృతమ్'' అని అనవచ్చును. మిగిలిన భాగము పూర్తికానందున దానినే ''అకృతమ్'' అనియు పేర్కొనవచ్చును ఇచట కృత, అకృత అను శబ్దములను రెండింటిని కూడ సముదాయము నుద్దేశించియే వాడుదురు. అనగా అవయవము యొక్క ధర్మమును (పూర్తియగుట —లేక— కాకుండుట) సముదాయమందారోపింతురు. ఉదా : ''కృతః - అకృతశ్చ - పాకః'' = వంట అయినది - కాలేదు. (కొంత అయినది - కొంత కాలేదు. ఇచట వంట అన్నది సంఘాతము) ఇట్లే ''అబ్రాహ్మణః'' అనుచోట కూడ నఞును బట్టి ''కొంత బ్రాహ్మణత్వము కలదు - కొంత లేదు'' అను భావము ఫలించునని అనుకొనవలెను.

శ్లో॥ బ్రాహ్మణోఽబ్రాహ్మణ స్తస్మాదుపన్యాసాత్ ప్రసజ్యతే ।
అకృతే వా కృతాసంగాదవిశిష్టం కృతాకృతాత్ ॥ 266

తస్మాత్ = అందువలన, ఉపన్యాసాత్ = నిర్దేశించుట వలన, బ్రాహ్మణః = బ్రాహ్మణుడనియు, అబ్రాహ్మణః = అబ్రాహ్మణుడనియును, ప్రసజ్యతే = సంభవించెడిని, వా = లేక, అకృతే = అకృతమందు, కృతాసంగాత్ = కృతశబ్దమును ప్రయోగించుటవలన, కృతాకృతాత్ = ''కృతాకృతమ్'', అను సమాసముకన్న, అవిశిష్టమ్ = వేరుకాదు.

తాత్పర్యము— అట్లయినచో ''అబ్రాహ్మణః'' అను సమాసముతో ఒకే వ్యక్తిని ''బ్రాహ్మణశ్చ - అబ్రాహ్మణశ్చ'' (బ్రాహ్మణుడును బ్రాహ్మణుడు కానివాడును) అని వ్యవహరించినట్లగును కాని ఇది విరుద్ధము కానేరదు. ఒక సముదాయమును గూర్చి ''కృతాకృతః'' అని చెప్పినట్లే ఒక వ్యక్తినిగూర్చి ''బ్రాహ్మణాబ్రాహ్మణః'' అని అనవచ్చును. ఈ యర్థమునే ''అబ్రాహ్మణః'' అను సమాసము సమర్పించును. ఇట్టిచోట్ల ఏకదేశమందే సముదాయము ఆరోపింపబడును.

వివరణము— కాగా నఞ్ సమాసమున నఞర్థమునకు ఉత్తరపదార్థముతో సమన్వయము కుదురును. ఎట్టి దోషములును కలుగవు. ॥266॥

అవతారిక— ''అబ్రాహ్మణః'' అనుచోట బ్రాహ్మణ శబ్దము ముఖ్యార్థమును చెప్పదని సూచించుటకే నఞు కలిసియుండునని చెప్పుచున్నాడు.

శ్లో॥ అముఖ్యసంభవే తత్ర ముఖ్యస్య వినివృత్తయే ।
శాస్త్రాన్వాఖ్యానసమయే నఞ్ ప్రయుక్తో విశేషకః ॥ 267

తత్ర = అచట, అముఖ్యసంభవే = ముఖ్యముకాని యర్థము పొసగునపుడు, ముఖ్యస్య = ముఖ్యార్థముయొక్క, వినివృత్తయే = పోవుటకై, శాస్త్రాన్వాఖ్యానసమయే = శాస్త్రముతో సంస్కారము జరుగు సమయమునందు, విశేషకః = విశేషణముగా, నఞ్ = 'న' కారము, ప్రయుక్తః = ప్రయోగింపబడును.

తాత్పర్యము— ''అబ్రాహ్మణః'' అను సమాసమును దాని యర్థమును అఖండ ములే. అయినను సంస్కారమునుచేయు వ్యాకరణము దానిని విశ్లేషించి చూపును అపుడు నఞును వేరుచేయుట జరుగును. అది బ్రాహ్మణ శబ్దమిచట ముఖ్యార్థమును (పూర్తిగ బ్రాహ్మణుడు) బోధింపదని స్పష్టపరచును. అట్లు అది బ్రాహ్మణ శబ్దమునకు విశేషణముగా మారును. ॥267॥

అవతారిక— ''నఞ్ సమాసమున ఉత్తరపదార్థము ప్రధానము'' అను పక్ష మందు, ''అబ్రాహ్మణమానయ'' (అబ్రాహ్మణుని తీసికొని రమ్ము) అను వచనమువలన బ్రాహ్మణమాత్రుని తీసికొనివచ్చుట సంభవించెడిని - అని భాష్యకారుడొక ఆక్షేపమును చూపినాడు. అద్దాని భావమును విశదముచేయుటకు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ పదార్థానుపఘాతేన దృశ్యతే చ విశేషణమ్ ।
అథ జాతిమతోఽర్థస్య కశ్చిద్ధర్మో నివర్తితః ॥ 268

పదార్థానుపఘాతేన = పదార్థమును పాడుచేయకుండ, విశేషణమ్ = విశేషణము, దృశ్యతే = కనబడును, అథ = లేక, జాతిమతః = జాతిగల, అర్థస్య = వస్తువుయొక్క, కశ్చిత్ = ఒకానొక, ధర్మః = ధర్మము, నివర్తితః = పోగొట్టబడినది (యది = అయినచో).

తాత్పర్యము— వస్తువును పాడుచేయకుండ దానియందొక విశేషమును కూర్చుట విశేషణముయొక్క స్వభావము. నఞు అభావమును బోధించునుగాన అది విశేషణమైనచో ఉత్తరపదార్థమునకు అభావమునే తెచ్చిపెట్టును అది ఇష్టము కాదు. అందుచే సమాసమున అది వ్యర్థమనవలెను. అట్లయినచో ''బ్రాహ్మణ'' శబ్ద మొకటే ఉన్నట్లగుసుగాన, ''అబ్రాహ్మణమానయ'' అను వాక్యమువలన బ్రాహ్మణుడైన వానికి మాత్రమే (ఎవరో ఒక బ్రాహ్మణుని) ఆనయనము ప్రాప్తించెడిని. అట్లుకాక నఞు కొద్ది బ్రాహ్మణ ధర్మములను పోగొట్టు నన్నచో అపుడును చిక్కే. (ఆ చిక్కును దిగువ కారిక చూపును).

వివరణము— రాజ పురుషః, నీలోత్పలమ్, మొదలగు అన్నిచోటులందును విశేష్య

మగు వస్తువునకు లోపము లేకుండ ఒక విశేషమును దాని కంటగట్టుట విశేషణముయొక్క ధర్మము ప్రకృతము నఞు విశేషణమన్నచో దానితో కలిసిన ఉత్తరపదార్థమును పూర్తిగ పోగొట్టినట్లగును కాగా నఞు నిరర్థకమని చెప్పవలసి వచ్చును.

అట్లుకాక కొన్ని బ్రాహ్మణ ధర్మముల నివృత్తిని (మరికొన్నింటి ఉనికిని) నఞు చెప్పునన్నచో వేరొక దోషము కలిగెడిని ॥268॥

అవతారిక— ఆ దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ అవశ్యం బ్రాహ్మణే కశ్చిత్ క్వచిద్ధర్మో న విద్యతే।
విశేషావచనాత్తత్ర నఞః శ్రుతిరనర్థికా॥ 269

క్వచిత్ + బ్రాహ్మణే = ఏ బ్రాహ్మణునియందైనను, కశ్చిత్=ఒకానొక, ధర్మః=ధర్మము అవశ్యమ్ = తప్పక, న + విద్యతే = ఉండదు, తత్ర = అచట (ఆ పక్షమున), విశేషావచనాత్ = విశేషమును చెప్పనందువలన, నఞః = నఞుయొక్క, శ్రుతిః = వినబడుట, అనర్థికా = వ్యర్థము

తాత్పర్యము— సంపూర్ణముగా బ్రాహ్మణ ధర్మములుగల బ్రాహ్మణుడు సృష్టిలో ఉండడు ప్రతియొక బ్రాహ్మణునియందును, ఏదో ఒక ధర్మము లోపింపక తప్పదు. అయినపుడు బ్రాహ్మణ శబ్ద మెల్లపుడును కొన్ని గుణములను కలిగినట్టియు, కొన్నింటిని కలిగియుండనట్టియు బ్రాహ్మణునే బోధించును కాగా బ్రాహ్మణ శబ్దమునకు ముందుగా నఞును కలిపి సాధించు విశేషార్థ మేదియు ఉండనందున అది వ్యర్థమే యగును.

వివరణము— పై రీతిని నఞు చేయు పనిని బ్రాహ్మణశబ్దమే చేయునుగాన నఞు నిరర్థకము. అందుచే ''అబ్రాహ్మణ మానయ'' అను వచనమువలన ''బ్రాహ్మణ మాత్రునకే ఆనయనము ప్రాప్తించుట'' అను ఆక్షేపము అట్లే మిగిలిపోవును. ॥269॥

అవతారిక— ఈ పక్షమున మరియొక దోషమును చూపుచున్నాడు

శ్లో॥ అవిశిష్టస్య పర్యాయో నఞ్విశిష్టః ప్రసజ్యతే।
అన్వాఖ్యానాద్ధి సాధుత్వమేవంభూతే ప్రతీయతే॥ 270

నఞ్విశిష్టః = నఞుతో కలిసిన శబ్దము, అవిశిష్టస్య = నఞుతో కలియని శబ్దమునకు, పర్యాయః = మారుపదముగ, ప్రసజ్యతే = సంభవించెడిని, ఏవంభూతే = ఇట్లు సిద్ధించిన శబ్దమందు (అబ్రాహ్మణః, మొదలగునది), అన్వాఖ్యానాత్ = శాస్త్రము చెప్పుటవలన, సాధుత్వమ్ = సాధుభావము, ప్రతీయతే + హి = తెలియును గదా!

తాత్పర్యము— నఞునకును బ్రాహ్మణ శబ్దమునకును అర్థమొకటే అయినపుడు, ''బ్రాహ్మణః, అబ్రాహ్మణః'' అను రెండును పర్యాయపదములు (ఒకే యర్థమును చెప్పు

రెండు పదములు) కావలసివచ్చును. "నఞ్' (2-2-6) అను సూత్రము ప్రత్యేకముగ "అబ్రాహ్మణః" మొదలగువానికి సాధుత్వమును చెప్పినది గదా!

వివరణము— "కొన్ని బ్రాహ్మణ ధర్మములుండుటయు, కొన్ని లేకపోవుటయు" అను నర్థము, నఞ్తో కూడిన "అబ్రాహ్మణః" అను సమాసమువలనను, "బ్రాహ్మణః" అను కేవల పదమువలనను సిద్ధించుట సమానమైనపుడు రెండును "పర్యాయపదముల"నుటలో తప్పు లేదుగదా! ॥270॥

అవతారిక— మీది దోషములకు పరిహారమును చూపుచున్నాడు

శ్లో॥ పదార్థానుపఘాతేన యద్యప్యత్ర విశేషణమ్ ।
ఉపచారసతోఽర్థస్య సావస్థాద్యోత్యతే నఞా ॥ 271

అత్ర = ఇచట, యద్యపి = పరిశీలింపగా, ఉపచారసతః = కల్పితముగానుండు, అర్థస్య = అర్థమునకు, పదార్థానుపఘాతేన = పదముయొక్క అర్థమును పాడుచేయకుండ, విశేషణమ్ = విశేషణము, (భవతి = అగును), సా = ఆ, అవస్థా = స్థితి నఞా = నఞుచే ద్యోత్యతే = వెల్లడి చేయబడును.

తాత్పర్యము— "అబ్రాహ్మణః" అనుచోట బ్రాహ్మణ శబ్దమునకు "ముఖ్యమైన బ్రాహ్మణుడు కాడు" అనియే అర్థము దానిని పాడుచేయకుండగనే విశేషణ ముండవచ్చును. ఉన్న అర్థమునే నఞు ప్రకాశింపజేయును.

వివరణము— బ్రాహ్మణత్వము సంపూర్ణముగా లేకున్నను, ఉన్నట్లు భావించి బ్రాహ్మణ శబ్ద మిచట వాడబడెననియు, ఆ భావమునే నఞు విశేషణముగా నుండి స్పష్టపరచుననియును అనుకొనవలెను ॥271॥

అవతారిక— మీది భావమును సమర్థింపుచున్నాడు.

శ్లో॥ విశేష్యేషు యథాభూతః పదార్థః సమవస్థితః ।
తథాభూతే తథాభావో గమ్యతే భేదహేతుభిః ॥ 272

పదార్థః = పదార్థము, యథాభూతః = ఎట్టి స్వరూపము గలిగి, విశేష్యేషు = విశేష్యము లందు, సమవస్థితః = ఉన్నదో, తథాభూతే = ఆ విధముగ ఉన్న దానియందు, తథాభావః = అట్లుండుట, భేదహేతుభిః = భేదమునకు కారణములైన, విశేషణములచే, గమ్యతే = తెలియబడును.

తాత్పర్యము— విశేష్యమగు వస్తువు ఉన్నదున్నట్లుగనే యుండును. అందలి ఒకానొక విశేషధర్మమును మాత్రము విశేషణము ప్రకటించును. ఉదా: "నీలోత్పలమ్" (నల్ల కలువ). ఇచట కలువయందుండు "నలుపు" అను విశేషమును నీల శబ్దము ప్రకటించును. అనగా విశేషణము క్రొత్తగా ఒక అంశమును తీసికొనివచ్చి విశేష్యమందుంచ

దనియు, విశేష్యమందు సిద్ధముగా ఉన్న అంశమునే ప్రత్యేకమైన పదముతో ప్రకటించు ననియును పర్యవసించును. అట్లే ప్రకృతమున బ్రాహ్మణశబ్దము విశేష్యము. "ఆరోపింప బడిన బ్రాహ్మణత్వము గలవాడు" అని దీని యర్థము. దీనినే విశేషణమైన నఞ్ఞు విశద పరచును ॥272॥

అవతారిక— మీది చర్చవలన నఞ్ఞు విశేషణము కావచ్చుననియు, ఉత్తరపదా ర్థము యొక్క నివృత్తిని (ఆ యర్థము లేకపోవుటను) అది సూచించుననియును తేలినది. కాని "అబ్రాహ్మణః" మొదలగు సమాసములలో "బ్రాహ్మణ" మొదలగు ఉత్తరపదము యొక్క అర్థము నివర్తించుట ఎట్లు కుదురునని ఆక్షేపించుచున్నాడు.

శ్లో॥ నివృత్తేఽవయవస్తస్మిన్ పదార్థే వర్తతే కథమ్।
నానిమిత్తా హి శబ్దస్య ప్రవృత్తిరుపపద్యతే ॥ 273

నివృత్తే = పోయిన, తస్మిన్ = ఆ, పదార్థే = పదార్థమందు, అవయవః = ఏకదేశము, (ఒక భాగము), కథమ్ = ఎట్లు, వర్తతే = ఉండును? అనిమిత్తా = ప్రవృత్తి నిమిత్తములేని ప్రవృత్తిః = ప్రవృత్తి, (అర్థమందు వర్తించుట) శబ్దస్య = శబ్దమునకు, న + ఉపపద్యతే + హి = కుదురదు గదా!

తాత్పర్యము— "అబ్రాహ్మణః" అనుచోట బ్రాహ్మణ శబ్దము ఏకదేశవాచక మని (ఏదో కొంత బ్రాహ్మణత్వముగల వానిని చెప్పునది) ఇదివరకు నిశ్చయింపబడినది. ఇపుడు ఉత్తరపదము యొక్క అర్థము పూర్తిగా నివర్తించుననుచో, "బ్రాహ్మణత్వము"ను ప్రవృత్తినిమిత్తమే పోవునుగాన "బ్రాహ్మణ" అను శబ్దమునే వాడకూడని పరిస్థితి ఏర్పడును. కాగా అవయవ వాచకముగా బ్రాహ్మణ శబ్దము కుదురనపుడు, విశేషణముగా ఉన్న నఞ్ఞు మాత్ర మేమి చేయగలదు? ॥274॥

అవతారిక— అబ్రాహ్మణః, అనుచోట బ్రాహ్మణశబ్దము సహజముగనే "బ్రాహ్మ ణత్వము లేకుండుట"ను చెప్పునన్నచో, నఞ్ఞును వాడుటయే వ్యర్థమని చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆరాచ్ఛబ్దవదేకస్య విరుద్ధేఽర్థే స్వభావతః।
శబ్దస్య వృత్తిర్యద్యస్తి నఞః శ్రుతిరనర్థికా ॥ 274

ఏకస్య = ఒకటేయగు, శబ్దస్య = శబ్దమునకు, ఆరాచ్ఛబ్దవత్ = "ఆరాత్" అను శబ్దము నకు వలె, స్వభావతః = స్వభావము ననుసరించి, విరుద్ధే = విరుద్ధమైన, అర్థే = అర్థమందు, వృత్తిః = ప్రవృత్తి, అస్తి + యది = ఉన్నచో, నఞః = నఞ్ఞుయొక్క, శ్రుతిః = వినుకవి, అనర్థికా = నిష్ఫలము.

తాత్పర్యము— "ఆరాత్" అను ఒక అవ్యయమున్నది. "దూరము - దగ్గర" అను విరుద్ధములైన రెండర్థములను కూడ అదియే బోధించును. అది దాని స్వభావము. అట్లే

నఞ్ సమాసమందలి ఉత్తరపదము తన అర్థమును తన యర్థములేకుండుటను గూడ సహజముగనే చెప్పును. అందు ''అర్థాభావము''ను గ్రహింపవలెనన్నచో నఞ్ను ప్రయోగించుటయే వ్యర్థమగును.

వివరణము— అర్థముయొక్క అభావమును ఉత్తరపదమే చెప్పినచో ప్రకరణాదుల వలన అభిమతమైన తాత్పర్యము సిద్ధించునుగాన (అర్థాభావము తెలియుట) ద్యోతకముగానైనను నఞ్ను ఉచ్చరించుటవలన ప్రయోజనమేమి? (''బ్రాహ్మణ'' శబ్దమే సందర్భమును బట్టి బ్రాహ్మణుని బ్రాహ్మణుడుకాని క్షత్రియాదులను బోధింపగలుగును) ॥274॥

అవతారిక— అట్లుగాక పదార్థముయొక్క నివృత్తికి నఞ్ ద్యోతకముకాదనియు, వాచకమే అనియు అన్నచో—

శ్లో॥ అథస్వభావో వచనాదన్వాఖ్యేయత్వ మర్హతి ।
తద్వాచ్యమప్రసిద్ధత్వాన్నఞార్థో వినివర్త్యతే ॥ 275

అథ = లేక, స్వభావః = స్వభావము, వచనాత్ = వచనమువలన, అన్వాఖ్యేయత్వమ్ = చెప్పదగియుండుటను, అర్హతి = పొందినట్లయినచో, తత్ = అపుడు, అప్రసిద్ధత్వాత్ = ప్రసిద్ధము కాకపోవుట వలన, ''నఞా + నఞ్చే, అర్థః = అర్థము, వినివర్త్యతే = పోగొట్టబడును'' అని, వాచ్యమ్ = చెప్పవలసియుండును.

తాత్పర్యము— నఞ్ అభావమునకు వాచకమన్నను ఉత్తరపదము యొక్క అర్థమును అది పోగొట్టుట ప్రసిద్ధము కానందున, ''నఞ్ను పలికి ఉత్తరపదార్థమును పోగొట్టవలయును'' అని వేరుగా చెప్పవలసి వచ్చును.

వివరణము— ఇట్లు ద్యోతకమన్నను వాచకమన్నను చిక్కు ఏర్పడుచున్నదని ఫలించును. ॥275॥

అవతారిక— ''నఞ్ ద్యోతకమే అనియు ఉత్తరపదార్థము సహజముగనే పోవుననియును'' భాష్యకారుడు సిద్ధాంతమును చూపెను. దానిని వివరింపుచున్నాడు

శ్లో॥ యద్యప్యుభయవృత్తిత్వం ప్రధానం తు ప్రతీయతే ।
ప్రస్థానం గమ్యతే శుద్ధే తదర్థేఽపి న తిష్ఠతౌ ॥ 276

యద్యపి = వాస్తవముగ, ఉభయవృత్తిత్వమ్ = రెండర్థములందుండుట, (భవతి = అగును), తు = కాని, ప్రధానమ్ = ప్రసిద్ధమైన అర్థము, ప్రతీయతే = తెలియబడును, తదర్థే + అపి = ఆ యర్థము గలదైనను, శుద్ధే = కేవలముగానుండు, తిష్ఠతౌ = ''స్థా'' అను ధాతువునందు, ప్రస్థానమ్ = ప్రయాణము, న + గమ్యతే = తెలియబడదు.

తాత్పర్యము— పరస్పరము విరుద్ధములైన రెండర్థములను శబ్దములు సహజము

గనే చెప్పవచ్చును. కాని ప్రసిద్ధమైనట్టి యర్థము మాత్రమే శబ్దమువలన తెలియును. రెండవ యర్థము తెలియుటకై ద్యోతకమైన ఒక శబ్ద ముండవలెను. "స్థా" (నిలుచుండుట) అను ధాతువు "నిలుచుండుట" అను నర్థమును ముఖ్యముగా చెప్పును. అట్లే "బయలుదేరుట" అను నర్థమును గూడ అదియే చెప్పును. కాని "ప్ర" అను ఉపసర్గము ద్యోతకముగ ఉన్నపుడే (ప్రతిష్ఠతే = బయలుదేరుచున్నాడు) అది ప్రయాణమను నర్థమును బోధింపగలదు.

వివరణము— "ప్రతిష్ఠతే". ఇచట కేవలము "ప్ర" అను దానికి ప్రయాణమను అర్థము లేదు. కావున "స్థా" అను ధాతువునకే ఆ యర్థమున్నదనవలెను. అట్లే కేవలము "స్థా" ధాతువు కూడ ప్రయాణమను బోధింపజాలదు. కాగా "స్థా" ధాతువునకే ఉన్న రెండవయర్థమును (బయలుదేరుట) వెల్లడిచేయుట కుపసర్గము పనికివచ్చును

ఈ విధముగనే "అబ్రాహ్మణః" అనుచోట బ్రాహ్మణశబ్దము "బ్రాహ్మణత్వము లేకుండుట"ను సహజముగనే చెప్పును. కాని ఆ విషయము స్పష్టపడుటకు "నఞ్"ను (న) చేర్చవలెను. ఇట్లు "న"కారము ద్యోతకమే అగును.

విశేష విషయములు— చీకటిలో కనబడకున్న వస్తువులను దీపము వెల్లడిచేయును అట్లే సహజముగ శబ్దమే బోధించు పదార్థముయొక్క అభావమును నఞ్ విశదపరచును దీపమువలె అది అచట ఉండవలెను. ద్యోతకత్వమనగా ఇట్టిదియే. కాగా నఞ్ సమాసమందలి నకారము ద్యోతకమని స్థిరపడినది ॥2 6॥

అవతారిక— అప్రసిద్ధమైన అర్థమందు (అభావము) బ్రాహ్మణశబ్దమును ప్రయోగించుటయు, ద్యోతకముగా నఞ్ను కలుపుటయు ఎందుకని ఆక్షేపించుచున్నాడు

శ్లో॥ కిమర్థమతథాభూతే సతి ముఖ్యార్థసంభవే ।
భేదే బ్రాహ్మణశబ్దస్య వృత్తిరభ్యుపగమ్యతే ॥ 277

ముఖ్యార్థసంభవే + సతి = ముఖ్యమైన అర్థమునకు అవకాశమున్నపుడు, అతథాభూతే = అట్టిదికాని, భేదే = వేరయిన అర్థమందు, బ్రాహ్మణశబ్దస్య = బ్రాహ్మణశబ్దమునకు, వృత్తిః = ప్రవృత్తి, కిమర్థమ్ = ఎందుకొరకు, అభ్యుపగమ్యతే = అంగీకరింపబడును ?

తాత్పర్యము— అబ్రాహ్మణః, అనుచోట బ్రాహ్మణశబ్దము "బ్రాహ్మణుడుకాని క్షత్రియాది వ్యక్తిని" చెప్పునందురు ఆ యర్థమును "న"కారము వెల్లడి చేయునందురు. అట్టియెడల "క్షత్రియః" మొదలగు శబ్దములనే సూటిగ వాడకూడదా ? శబ్దముయొక్క ముఖ్యార్థమును పోగొట్టు ఈ కల్పనమంతయు ఎందుకు ? ॥277॥

అవతారిక— పై ఆక్షేపమునకు భాష్యకారుడు చూపిన సమాధానమును వ్యాఖ్యానించుచున్నాడు.

శ్లో॥ అయం పదార్థ ఏతస్మిన్ క్షత్రియాదౌ న విద్యతే ।
ఇతి తద్వచనః శబ్దః ప్రత్యయాయ ప్రయుజ్యతే ॥ 278

అయమ్ = ఈ, పదార్థః = పదముయొక్క అర్థము, ఏతస్మిన్ = ఈ, క్షత్రియాదౌ = క్షత్రియుడు మొదలగు వ్యక్తియందు, న + విద్యతే = లేదు, ఇతి = అని, ప్రత్యయాయ=తెలియుటకై, తద్వచనః = ఆ యర్థమునుచెప్పు, శబ్దః = శబ్దము, ప్రయుజ్యతే = వాడబడును.

తాత్పర్యము— అవివేకమువలనగాని పొరపాటుగా నిర్దేశించుటవలనగాని క్షత్రియాది వ్యక్తిని బ్రాహ్మణుడనుకొన్నపుడు. ఆ భ్రాంతిని పోగొట్టి "ఇచట బ్రాహ్మణత్వము లేదు" అని స్పష్టపరచుటకై బ్రాహ్మణశబ్దమునే వాడుటయు, అభావము వెల్లడియగుటకు నఞ్ను చేర్చుటయును జరుగును.

వివరణము— కేవలము నకారమునే వాడుటవలన ప్రయోజనము లేదు. అది ఏ పదార్థమును పోగొట్టునో తెలియదు. కావున "పోవు పదార్థమిది" అని తెలియుటకు బ్రాహ్మణాదిశబ్దమును చేర్చవలెను అట్లుగాక సూటిగా "క్షత్రియః" అన్నచో బ్రాహ్మణత్వము పోయినట్లు తెలియనే తెలియదు కాగా బ్రాహ్మణత్వమున్నదని భ్రాంతిపడినచోట్ల, "అది లేదని" స్పష్టపరచుటకై ఇట్టి ఏర్పాటు తప్పదని ఫలించును. ॥278॥

అవతారిక— బోద్ధయగువాడు (శబ్దమును విని అర్థమును తెలియువాడు) ఎల్లపుడును బుద్ధి పరికల్పితమైన అర్థమునే తెలిసికొనునని చెప్పుచున్నాడు

శ్లో॥ బుద్ధేర్విషయతాం ప్రాప్తే శబ్దాదర్థే ప్రతీయతే ।
ప్రవృత్తిర్వానివృత్తిర్వా శ్రుత్యాహ్యర్థోఽనుషజ్యతే ॥ 279

బుద్ధేః = బుద్ధికి. విషయతామ్ = విషయమగుటను, ప్రాప్తే = పొందిన, అర్థే = అర్థమందు, ప్రవృత్తి + వా = భావము (ఉనికి) కాని, నివృత్తిః + వా = అభావము (లేకుండుట) గాని, శబ్దాత్ = శబ్దమువలన, ప్రతీయతే = తెలియబడును, అర్థః = అర్థము, శ్రుత్యా = శబ్దమును వినుటచే, అనుషజ్యతే + హి = కూర్చబడును గదా ;

తాత్పర్యము— భావమునకును అభావమునకును సాధారణమైన అర్థమునే శబ్దము బుద్ధికి సమర్పించును. పిదప ఆ యర్థమునకు సముచితమైన విశేషమును వేరొక శబ్దము చెప్పును.

వివరణము— "వృక్షః". ఈ శబ్దము "చెట్టు" అను నర్థమును భావాభావములు రెండిటికిని యోగ్యమగునట్లుగా బోధించును ఇట్టి జ్ఞానము మానసికము. పిదప "సన్" (ఉన్నది) అను విశేషణము ఉనికిని, "అసన్" (లేదు) అనునది అభావమును తెలియజేయును అనగా విశేషములు తెలియుటకు ప్రత్యేక శబ్దములుండవలెను.

ప్రకృతమున బ్రాహ్మణశబ్దము బ్రాహ్మణత్వముయొక్క అభావమును కూడ చెప్పగలిగినను, ఆ యర్థము స్పష్టపడుటకు "న" అను విశేషణ మావశ్యకమగును. ॥279॥

అవతారిక— నఞ్ సమాసమున ఉత్తరపదార్థము ప్రధానమను పక్షములో,

''తద్భిన్నము తత్సదృశమునగు వస్తువు'' (ఉత్తరపదార్థమునకు భిన్నమై ఉత్తరపదార్థము తోనే సమానమగు వస్తువు) బోధపడును. కావున ''అబ్రాహ్మణః'' అనునది బ్రాహ్మణ సదృశుడగు క్షత్రియాది వ్యక్తినే బోధించునుగాని, రాయి, కర్ర, మొదలగు వానిని బోధింప దని భాష్యకారుడు చెప్పెను. ఆ యంశమును విశదముచేయుచున్నాడు

శ్లో॥ అసమ్యగుపదేశాద్వా నిమిత్తాత్ సంశయస్య వా ।
శబ్దప్రవృత్తిర్నత్వస్తి లోష్టాదిషు విపర్యయాత్ ॥ 280

అసమ్యగుపదేశాత్ + వా = పొరపాటుగా చెప్పుటవలనగాని, సంశయస్య = సంశయము యొక్క, నిమిత్తాత్ =వా= హేతువువలనగాని, శబ్దప్రవృత్తిః = శబ్దముయొక్క ప్రవృత్తి, (భవతి = అగును). విపర్యయాత్ = అట్టి నిమిత్తములేనందువలన, లోష్టాదిషు + తు = మట్టి ముక్క మొదలగు వానియందైతే, శబ్దప్రవృత్తిః = శబ్దము ప్రవర్తించుట, న + అస్తి = లేదు.

తాత్పర్యము— ఒకరు పొరపాటుగా చెప్పినందువలనగాని, సాదృశ్యముచే కలుగు సంశయమువలనగాని ఒక వస్తువును బోధించు శబ్దమును వేరొక - వస్తువును బోధించునదిగా వాడుదురు. ఉదా : బ్రాహ్మణ సదృశుడైన క్షత్రియాది వ్యక్తిని బోధించుటకై బ్రాహ్మణ శబ్దమును వాడుట. నఞ్ సమాసమున ఉత్తరపదము చెప్పు అర్థ మెల్లపుడును ఇట్టిదేయగును. కావున అబ్రాహ్మణః, అను దానివలన ''బ్రాహ్మణుడు కానట్టియు, మిగిలిన అన్ని విషయ ములలోను బ్రాహ్మణుని పోలియున్నట్టి క్షత్రియాదివ్యక్తి'' అను నర్థమే వచ్చును. లోష్టము మొదలగువానికి బ్రాహ్మణ సాదృశ్యమెన్నడును కలుగదు కాగా అవి ఈ సమాసముచే బోధ పడవు.

వివరణము— ''అది కానిదియు దానితో సమానమైనదియునగు వస్తువు'' అను నర్థమును నఞ్ సమాసమున నియతముగ చెప్పవలయును. కావుననే ''అబ్రాహ్మణమ్ - ఆనయ'' మొదలగు వాక్యములవలన, క్షత్రియాదులకే ''ఆనయనము'' మొదలగు క్రియలతో సంబంధము (వారినే తీసికొనివచ్చుట) కుదురుచున్నది. అట్టి వాక్యమును విని మట్టిముక్కను తెచ్చుట (అదియు బ్రాహ్మణ భిన్నమే గదా !) ఎన్నడును ప్రాజ్ఞవ్యవహారమున జరుగదు. కాగా సాదృశ్యము కుదురనిచోట కూడ సాదృశ్యమును కల్పించుకొని నఞ్ సమాసమున కర్థమును చెప్పచుండవలయును. ॥280॥

అవతారిక— ఉత్తరపదార్థము ముఖ్యమన్నచో మరికొన్ని ప్రయోజనములు కూడ అప్రయత్నముగ సిద్ధించునని భాష్యకారుడనెను. ఆ సందర్భమును చూపుచున్నాడు.

శ్లో॥ అనేకస్మాదస ఇతి ప్రాధాన్యే సతి సిధ్యతి ।
సాపేక్షత్వం ప్రధానానామేవం యుక్తం త్వతల్విధౌ ॥ 281

ప్రాధాన్యే = ఉత్తరపదముయొక్క అర్థము ముఖ్యమగుట, సతి = ఉన్నపుడు, అనేకస్మాత్

+ అసః + ఇతి = ''అనేకస్మాత్'' అనియు, ''అసః'' అనియు రూపము, సిధ్యతి = సిద్ధించును ఏవమ్ = ఇట్లే, త్వతల్విధౌ = త్వ, తల్, అను ప్రత్యయములను విధించునపుడు, ప్రధానానామ్ = ముఖ్యమైన వానికి, సాపేక్షత్వమ్ = వేరొకదానిని కోరుట, యుక్తమ్ = సముచితము, (భవతి = అగును).

తాత్పర్యము— ''న + ఏకః = అనేకః (ఒకటి కానిది) ⟶ ''అనేకస్మాత్'' (పంచమ్యేకవచనము). ''న + సః = అసః = (వాడు కాని వ్యక్తి). నఞ్ సమాసమున ఉత్తరపదార్థము ముఖ్యమైనపుడే ఈ రూపములు సిద్ధించును. అట్లే ''అబ్రాహ్మణత్వమ్'' (అబ్రాహ్మణస్య భావః = బ్రాహ్మణుడు కాకుండుట = ''త్వ'' ప్రత్యయము), ''అబ్రాహ్మణతా'' (అర్థమున మార్పులేదు = తల్ ప్రత్యయము) మొదలగుచోట్ల ముఖ్యమైన యర్థము సాపేక్షమగుటయు ఈ పక్షమందే కుదురును

వివరణము— ''ఏక'' శబ్దమును తచ్ఛబ్దమును సర్వనామములు నఞ్ సమాసమున ఈ శబ్దముల అర్థము ముఖ్యమైనపుడే వానికి సర్వనామకార్యములు (పంచమ్యేకవచనమున ''స్మాత్'' అని యగుట, తచ్ఛబ్దములోని తకారము సకారముగ మారుట మొదలగునవి) లభించును. అట్లుకాక వాని యర్థము అప్రధానమైనచో అట్టి సర్వనామములకు ఆయా కార్యములు రావని నిషేధమున్నందున, ''అనేకస్మాత్'' అనియు, ''అసః'' అనియు ప్రయోగించుట అసాధువు కావలసి వచ్చును.

అట్లే ''అబ్రాహ్మణత్వమ్'' మొదలగుచోట్ల ''ప్రధానము సాపేక్షము'' అని ఒక సందర్భములో భాష్యకారుడనెను. అదియును ఉత్తరపదార్థము ముఖ్యమైనపుడే కుదురును. (అబ్రాహ్మణతా, అనునదియు ఇట్టిదే).

విశేష విషయములు— అబ్రాహ్మణత్వమ్, ఇచట ''న + బ్రాహ్మణ + త్వ'' అను రీతిని ఒక్కమారుగానే రూపమును తయారుచేయుటయా ? లేక— ''న + బ్రాహ్మణః = అబ్రాహ్మణః'' అని తొలుత సమాసమునుచేసి, పిదప ''త్వ'' అను తద్ధితమును చేయుటయా ? - అను చర్చ జరిగినది. అపుడు బ్రాహ్మణ శబ్దముయొక్క అర్థము ముఖ్యమనియును, అది నఞ్యొక్క అర్థమును (అభావము) అపేక్షించునుగాన, అసమర్థమైనందున ''త్వ'' అను తద్ధితవృత్తి ముందుగా జరుగదనియును, సమాసమును చేసియే తద్ధితమును చేయవలయుననియును భాష్యకారుడు ఉపపత్తిని చూపెను. అది ఉత్తరపదార్థము ముఖ్యమైనపుడే సంభవించును గదా ! ॥281॥

అవతారిక— ''అనేకః'' అనుచోట కలిగిన లాభమును వివరింపుచున్నాడు.

శ్లో॥ ఏకస్య చ ప్రధానత్వాత్తద్విశేషణ సన్నిధౌ ।
ప్రధానధర్మావ్యావృత్తిరతో న వచనాంతరమ్ ॥ 282

ఏకస్య = ''ఏక'' అను శబ్దము, ప్రధానత్వాత్ + చ = ముఖ్యమగుటవలన, తద్విశేషణ

సన్నిధౌ = దాని విశేషణము దగ్గరగా ఉన్నపుడు, ప్రధానధర్మావ్యావృత్తిః = ముఖ్యమైన ధర్మము పోకుండుట, (భవతి = జరుగును) అతః = ఇందువలన, వచనాంతరమ్ = వేరొక వచనము, న = కాదు (రాదు).

తాత్పర్యము— "న + ఏకః = అనేకః" అనుచోట ఏకశబ్దముయొక్క అర్థమే ముఖ్యము. దానికి నఞర్థము విశేషణమగును. అయినను ముఖ్యమైన ఏకశబ్దము ననుసరించి సమాసమునకు ఏకవచనమే వచ్చును.

వివరణము— "అనేకః" అను సమాసమువలన రెండు, మూడు, మొదలగు సంఖ్య లెన్ని స్ఫురించినను, "లేని ఒకటి" అని ఏకశబ్దార్థమే ప్రధానముగ లభించునుగాన, తదనుసారము ఏకవచనమే న్యాయ్యమగునుగాని ద్వివచన బహువచనములు న్యాయ్యముకావని సారాంశము. ॥282॥

అవతారిక — అనేకః. అనుచోట ద్వివచన బహువచనములు రాకుండుటను సమర్థింపు చున్నాడు.

శ్లో॥ ప్రధానమత్ర భేద్యత్వాదేకార్థో వికృతో నఞా ।
హిత్వా స్వధర్మాన్ వర్తంతే ద్వ్యాదయోఽప్యేకతాం గతాః ॥ 283

అత్ర = ఇచట, నఞా = నఞుచే, వికృతః = మార్చబడిన, ఏకార్థః = ఏకశబ్దముయొక్క అర్థము, భేద్యత్వాత్ = విశేష్యమగుటవలన, ప్రధానమ్ = ముఖ్యమై, (భవతి = అగును) ద్వ్యాదయః + అపి = "రెండు", మొదలగునవి కూడ, స్వధర్మాన్ = తమ ధర్మములను, హిత్వా = విడిచి, ఏకతామ్ = ఏకత్వమును, గతాః = పొందినవై, వర్తంతే = ఉండును

తాత్పర్యము— నఞుతో కూడిన ఏకశబ్దము (అనేకః) విశేష్యము. అందువలన దాని యర్థమే ముఖ్యమగును. రెండు, మూడు, మొదలగు సంఖ్యలు ఒకటిగానే మారిపోయి భాసించును. కాగా రెండుగాని మూడు, మొదలయినవిగాని, "అనేకః" అను ఏకవచనముతోనే తెలియబడును. ఉదా : "అనేకః - జనః" = ఇద్దరు —లేక— పెక్కురు జనులు.

వివరణము— "అనేకః" అను సమాసము "ఆరోపితమైన ఏకత్వము గలది" అను నర్థమును సమర్పించును కాగా ఏకశబ్దమునుబట్టి ఏకవచనమే సముచితమగును. ॥283॥

అవతారిక— విరుద్ధమైన ద్విత్వమునకును బహుత్వమునకును ఏకత్వము వచ్చు టెట్లు ? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ బ్రాహ్మణత్వం యథాపన్నా నఞ్యుక్తాః క్షత్రియాదయః ।
ద్విత్వాదిషు తథైకత్వం నఞ్యోగాదుపచర్యతే ॥ 284

నఞ్యుక్తాః = నఞుతో కూడిన, క్షత్రియాదయః = క్షత్రియుడు మొదలగువారు, బ్రాహ్మణత్వమ్ = బ్రాహ్మణ భావమును, యథా = ఎట్లు, ఆపన్నాః = పొందుదురో, తథా = అట్లు,

నఞ్ యోగాత్ = నఞ్తోడి సంబంధమువలన, ద్విత్వాదిషు = ద్విత్వము మొదలగు వాని యందు, ఏకత్వమ్ = ఏకత్వము, ఉపచర్యతే = ఆరోపింపబడును

తాత్పర్యము— "అబ్రాహ్మణః", అనుచోట నఞ్తో కూడిన బ్రాహ్మణశబ్దము, క్షత్రియుడు మొదలగు వ్యక్తిని బోధించునట్లే "అనేకః" అనుచోట నఞ్తో కలసిన ఏక శబ్దము విరుద్ధమైనను ద్విత్వమునుగాని బహుత్వమునుగాని బోధించును

వివరణము— నఞ్ ' తద్భిన్నమును తత్సదృశమును" చెప్పునని యిదివరకు ప్రతిపాదింపబడినది. తదనుసారము "అనేకః" అను శబ్దము ఒకటికి వేరైన "రెండు —లేక— మూడు" అను సంఖ్యలనే బోధించును. ద్విత్వ బహుత్వములందు ఏకత్వమారోపింపబడి "ఆరోపితమైన ఏకత్వము" అను భావము కలుగునని సారాంశము. ॥284॥

అవతారిక— పై యంశమునే సమర్థింపుచున్నాడు.

శ్లో॥ ఏకత్వయోగమాసజ్య స ధర్మః ప్రతిషిధ్యతే ।
ద్వ్యాదిభ్యస్తేషు తచ్ఛబ్దో వర్తతే బ్రాహ్మణాదివత్ ॥ 285

ఏకత్వయోగమ్ = ఏకత్వముతోడి సంబంధమును, ఆసజ్య = కలిగించి, సః = ఆ, ధర్మః = ధర్మము (ఏకత్వము) ద్వ్యాదిభ్యః = ద్విత్వము మొదలగువాని నుండి, ప్రతిషిధ్యతే = నివారింపబడును, తేషు = వానియందు (ద్విత్వము మొదలగు వానియందు), తచ్ఛబ్దః = ఆ శబ్దము, బ్రాహ్మణాదివత్ = బ్రాహ్మణ మొదలగు శబ్దములవలె, వర్తతే = ప్రవర్తించును.

తాత్పర్యము— ద్విత్వము మొదలగు వానియందు భ్రాంతిచే తొలుత ఏకత్వమును భావించి, పిదప నఞ్తో ఆ ఏకత్వమును వారింతురు. కావున "అనేకః" అనుచోట నిషేధమునకు విషయముగా ఏకత్వముండి, ఏకశబ్దమే తుదకు ద్విత్వమునుగాని - బహుత్వమునుగాని తెలుపును "అబ్రాహ్మణః" అనుచోట బ్రాహ్మణ శబ్దమిట్లే క్షత్రియాది వ్యక్తినే బోధించును గదా ! ॥285॥

అవతారిక— "న" అను నిషేధమునకు విషయముగా వృత్తియందును వాక్యమందును ఏకశబ్దము ప్రధానముగానే ఉండునని చెప్పుచున్నాడు

శ్లో॥ అవిష్టసంఖ్యో వాక్యేఽసౌ యథా ద్వ్యాదౌ ప్రయుజ్యతే ।
వృత్తౌ తస్య ప్రధానత్వాత్ సా సంఖ్యా న నివర్తతే ॥ 286

అసౌ = ఈ ఏకశబ్దము, అవిష్టసంఖ్యః = ఆవేశించిన సంఖ్యగలదై, వాక్యే = వాక్యమందు, ద్వ్యాదౌ = రెండు మొదలగు అర్థమందు, యథా = ఎట్లు, ప్రయుజ్యతే = ప్రయోగింపబడునో (తథా = అట్లు) వృత్తౌ = వృత్తియందు, తస్య = దానియొక్క, ప్రధానత్వాత్ = ప్రాముఖ్యము వలన, సా = ఆ సంఖ్యా = ఏకత్వసంఖ్య. న + నివర్తతే = తొలగిపోదు.

తాత్పర్యము— "న ఏకః గచ్ఛతి" (ఒకడు వెళ్ళలేదు = ఇద్దరు ముగ్గురు వెళ్ళుచున్నారు) మొదలగు వాక్యమందు కూడ ఏకశబ్దము తన ధర్మమును విడువకనే రెండు, మూడు, మొదలగు సంఖ్యలను బోధించును. అట్లే "అనేకః" అను వృత్తియందును అది ముఖ్యమై తన యర్థమును విడువకుండ ద్విత్వాది రూపమైన సంఖ్యనే చెప్పును. ॥286॥

అవతారిక— వృత్తియందు ఏకశబ్దముయొక్క అర్థమును విడిచినచో, అభిమతమైన అర్థము సిద్ధింపదనుచున్నాడు.

శ్లో॥ ప్రతిషేధ్యో యథాభూత స్తథాభూతోఽనుషజ్యతే ।
వచనాంతరయోగే హి న సోఽర్థః ప్రతిషిధ్యతే ॥ 287

ప్రతిషేధ్యః = నిషేధింపదగినది, యథాభూతః = ఏ విధముగ నుండునో, తథాభూతః = ఆ విధముగనే నుండునదియై, అనుషజ్యతే = అనుసరింపబడును, వచనాంతరయోగే = వేరొక వచనముతోడి సంబంధమందు, సః = ఆ, అర్థః = అర్థము, న + ప్రతిషిధ్యతే + హి = నిషేధింపబడదు గదా ః

తాత్పర్యము— "అనేకః" అను సమాసమున, "ఏక" అను ఉత్తరపదము, "ఆరోపితమైన ఏకత్వమును" చెప్పును దానిని "న" అనునది నిషేధించును. అనగా "లేని ఏకత్వము" అను భావమును కలిగించును. ఇట్లు ఏకత్వమే మరల అను సంధానము చేయబడి ముఖ్యమగును. కావున ఏకవచనమే సమాసమున కగును ద్వివచనముగాని, (అనేకౌ), బహువచనముగాని (అనేకే) ఇచట ప్రవర్తించినచో "నిషేధింపబడినది ఏకత్వము" అను అభీష్టమైన అర్థము సిద్ధింపదు. ॥287॥

అవతారిక— "అనేకః" అను దానివలన ద్విత్వమునకుగాని, బహుత్వమునకుగాని ప్రతీతి కలుగుననుటను సమర్థింపుచున్నాడు.

శ్లో॥ అశుక్ల ఇతి కృష్ణాదిర్యథార్థః సంప్రతీయతే ।
సంఖ్యాంతరం తథానేక ఇత్యత్రాప్యభిధీయతే ॥ 288

అశుక్లః + ఇతి = "అశుక్లః" అను దానివలన, కృష్ణాదిః = "నలుపు" మొదలగు (రంగు), అర్థః = అర్థము, యథా = ఎట్లు, సంప్రతీయతే = తెలియబడునో, తథా = అట్లు, అనేకః + ఇతి = "అనేకః" అను, అత్ర + అపి = ఇచటగూడ, సంఖ్యాంతరమ్ = వేరొక సంఖ్య, అభిధీయతే = చెప్పబడును.

తాత్పర్యము— "అశుక్లః" అను నఞ్ సమాసమున్నది. దీనివలన "తెలుపుకాని నలుపు మొదలగు రంగు" అను నర్థము వచ్చును అట్లే "అనేకః" అను నఞ్ సమాసము వలన, "ఒకటికాని రెండు మొదలగు సంఖ్య" అను అర్థము లభించును

వివరణము— "న" అను దానిని ఉత్తరపదముతో అన్వయించి, "అది కాని

దియు, (ఉత్తరపదముయొక్క అర్థము కానిది), దానితో సజాతీయమగునదియును'' అను అర్థమును చెప్పినచో ''పర్యుదాస''మని శాస్త్రీయముగా అందురు కాగా ''అనేకః'' అనుచోట పర్యుదాసమని చెప్పవలెను. అందువలన ''ఒకటికాక - రెండు మొదలగు సంఖ్య'' అను అర్థము లభించును.

విశేష విషయములు— ఈ సందర్భమున పర్యుదాసము కాక ''ప్రసజ్య ప్రతిషేధము'' అను వేరొక పక్షమున్నది. ''ప్రసజ్య = విధించి, ప్రతిషేధః = నిషేధించుట'' అని దీని యర్థము. ఒక క్రియనుగాని, గుణమునుగాని విధించి వారించుట అని భావము. కాగా ఈ పక్షమందు నఞ్ క్రియతో అన్వయించి ఆగిపోవును. అనగా నిషేధము మాత్రమే చివరకు మిగులును. ఉదా : ''అనేకం భోజయ'' = ఒకనికి భోజనము పెట్టవద్దు.'' ఇచట ''భోజనము పెట్టుట అను క్రియతో నిషేధము సంబంధించును. అయినను ఈ పక్షమందును ఇరువురికిగాని, పెక్కుమందికిగాని భోజనము పెట్టుము'' అని ద్విత్వ బహుత్వములే చివరకు ఫలించుననుట సారాంశము. ॥288॥

అవతారిక— ''అనేకః'' అనుచోట ప్రసజ్యప్రతిషేధమందు కూడ ద్విత్వముగాని, బహుత్వముగాని తెలియునను విషయమును రెండు కారికలతో సమర్థింపుచున్నాడు.

శ్లో॥ క్రియాప్రసంగాత్ సర్వేషు కర్మస్వంగీకృతేషు చ ।
ఏకస్మిన్ ప్రతిషిద్ధేఽపి ప్రాప్తమన్యత్ ప్రతీయతే ॥ 289

శ్లో॥ క్రియాశ్రుతిశ్చ ప్రక్రాంతే ప్రసజ్యప్రతిషేధనే ।
పర్యుదాసే తు నియతం సంఖ్యేయాంతరముచ్యతే ॥ 290

క్రియాప్రసంగాత్ = క్రియయొక్క సామర్థ్యమువలన, సర్వేషు = సకలమైన, కర్మసు + చ = కర్మలును, అంగీకృతేషు = స్వీకరింపబడగా, ఏకస్మిన్ = ఒక కర్మ, ప్రతిషిద్ధే + అపి = నిషేధింపబడినను, ప్రాప్తమ్ = ప్రాప్తించిన, అన్యత్ = వేరొక కర్మ, ప్రతీయతే = తెలియబడును.

ప్రసజ్య ప్రతిషేధనే = విధించి నిషేధించుట, ప్రక్రాంతే = ప్రారంభింపబడెనపుడు క్రియాశ్రుతిః = క్రియ వినబడుట (భవతి = అగును), పర్యుదాసే + తు = పర్యుదాసమందైతే, సంఖ్యేయాంతరమ్ = లెక్కింపదగిన వేరు వస్తువు, నియతమ్ = తప్పక, ఉచ్యతే = చెప్పబడును.

తాత్పర్యము— ''అనేకం భోజయ'' మొదలగు స్థలములలో, ప్రసజ్య ప్రతిషేధమును పక్షమందు, ''భోజయ'' మొదలగు క్రియయొక్క సామర్థ్యము ననుసరించి దానికనువైన కర్మ లన్నియును తొలుత ప్రాప్తించును పిదప ''ఏకమ్'' (ఒకనిని) అను కర్మను నిషేధించుటవలన మిగిలిన ''ఇరువురిని'' ''పలువురను'' అను కర్మలు తెలియబడును.

ప్రసజ్య ప్రతిషేధమందు నఞ్ఞు క్రియతో అన్వయించునుగాన ఆ నిషేధమునకు విషయమగు కారకము (కర్మ) మాత్రమే నివారింపబడును. మిగిలిన వానికి నిషేధము లేనందున వాని కాయా క్రియతోడి సంబంధము ఏర్పడును. పర్యుదాసమందైతే సంశయమునకు తావే యుండదు. ''అనేకమ్'' అను దానివలన - ''ఒకరు కాకుండ ఇద్దరుకాని పెక్కుమందిగాని'' అను భావము సహజముగనే లభించును.

వివరణము— ''అనేకం భోజయ'' అను వచనమునకు ''ఏకమ్+న+భోజయ'' అని సమన్వయముచేసినచో ప్రసజ్య ప్రతిషేధమగును. కాగా నిషేధము ఒకనికేగాన ద్విత్వ బహుత్వములు నిషేధమునకు విషయములు కావు. ''ఏకభిన్నమ్ - ఏకసదృశమ్ - భోజయ'' (ఒకరుకాని వ్యక్తులు) అని సమన్వయము చేసినచో పర్యుదాసమగును. ఇపుడు ద్విత్వబహుత్వములు సులభముగనే సిద్ధించును

విశేష విషయములు— ''ప్రసజ్య ప్రతిషేధః స్యాత్ క్రియయా సహ యత్ర నఞ్ । పర్యుదాసః స విజ్ఞేయో యత్రోత్తరపదేన నఞ్ ॥ - అని ప్రసజ్య ప్రతిషేధమునకును పర్యుదాసమునకును సంప్రదాయ సిద్ధమైన ఒక లక్షణమున్నది. ''నఞ్ఞు క్రియతో అన్వయించునపుడు ప్రసజ్య ప్రతిషేధమును, ఉత్తరపదముతో అన్వయించునపుడు - పర్యుదాసమును అగునని'' దీని భావము. కాగా :

1. అనేకమ్ = ఏకమ్ + న = (ఇరువురు లేక పెక్కుెరు) అన్నచో ప్రసజ్య ప్రతిషేధమును,
2. అనేకమ్ = ''ఏకభిన్నమ్ - ఏకసదృశమ్'' అన్నచో (ఇరువురు లేక పెక్కుెరు) పర్యుదాసమును అగును. మొదటి పక్షమున కారకమునకు నిషేధము సూటిగా తెలియును. రెండవ పక్షమున అది చివరకును ఫలించును.

అవతారిక— ''అనేకమ్ - ఆసయ, భోజయ, శాయయ'' అను ఉదాహరణమును భాష్యకారు డీ సందర్భమున చూపెను. దాని భావము కూడ ''ప్రకృతమున కనుకూలమే'' అని చెప్పుచున్నాడు.

శ్లో॥ ధాత్వర్థః కర్మవిషయో వ్యపదిష్టః స్వసాధనైః ।
అర్థాత్ సర్వాణి కర్మాణి ప్రాగాక్షిప్యావతిష్ఠతే ॥ 291

స్వసాధనైః = తన కారకములతో, వ్యపదిష్టః = వ్యవహరింపబడినట్టియు, కర్మవిషయః = కర్మకారకమునకు చెందునట్టి, ధాత్వర్థః = ధాతువుయొక్క అర్థము, అర్థాత్ = భావము ననుసరించి, సర్వాణి = ఎల్ల, కర్మాణి = కర్మలను, . ప్రాక్ = ముందుగా, ఆక్షిప్య = ఆకర్షించి, అవతిష్ఠతే = ఉండును.

తాత్పర్యము— ఆసయ, (కూర్చుండబెట్టుము), భోజయ (తినజేయుము), శాయయ (నిద్రింపజేయుము) అను ప్రయోగములో ఆయా ధాతువుల అర్థములు పరస్పరము

భిన్నములు. అచట కర్త వేరుగను, కర్మ వేరుగను ఉండును. "అనేకమ్" అను పదమును కర్మగా చేర్చగానే, అన్ని వ్యాపారములకును ఒకే వ్యక్తి కర్మగా ఉండుట అసంభవముగాన "పెక్కురు వ్యక్తులు" అను భావము సహజముగ లభించును.

వివరణము— ఆసనము, భోజనము, శయనము అను విరుద్ధమైన క్రియలకు కర్మగా "అనేకమ్" అను పదముయొక్క అర్థము అన్వయించును. అయినను ఏకమునకు నిషేధముండుటచే పెక్కు వ్యక్తులే కర్మలని ముందుగానే తెలిసిపోవునని సారాంశము ॥291॥

అవతారిక— క్రియావిశేషమునుగాని గుణవిశేషమునుగాని నిర్దేశింపని, "అనేకః" (తిష్ఠతి) (అనేకము = ఉన్నది) అను ప్రయోగమున కూడ ద్విత్వబహుత్వములే తెలియబడునని రెండు కారికలతో చెప్పుచున్నాడు.

శ్లో॥ నిర్జ్ఞాతసాధనాధారే యత్రాఖ్యాతే ప్రయుజ్యతే ।
అనేకఇతి పశ్చాచ్చ తిష్ఠతీత్యనుషజ్యతే ॥ 292

శ్లో॥ సాధ్యత్వాత్తత్ర సిద్ధేన క్రియా ద్రవ్యేణ లక్ష్యతే ।
ప్రాగేవాంగీకృతం ద్రవ్యమతః పూర్వేణ భిద్యతే ॥ 293

నిర్జ్ఞాతసాధనాధారే = బాగుగా తెలిసిన కారకముగల, ఆఖ్యాతే = క్రియయందు, అనేకః + ఇతి = అనేకము అని, యత్ర = ఎచట, ప్రయుజ్యతే = ప్రయోగింపబడునో, పశ్చాత్ = తరువాత, తిష్ఠతి + ఇతి + చ = "తిష్ఠతి" అను పదము, అనుషజ్యతే = కలుపబడునో.

తత్ర = అచట, సిద్ధేన = సిద్ధముగానున్న, ద్రవ్యేణ = కారకమైన ద్రవ్యముచే, సాధ్యత్వాత్ = సాధింపదగినదగుట వలన, క్రియా = క్రియ, లక్ష్యతే = ఆక్షేపింపబడును, ద్రవ్యమ్ = ద్రవ్యము, ప్రాక్ + ఏవ = ముందుగానే, అంగీకృతమ్ = స్వీకరింపబడినది, అతః = ఇందువలన, పూర్వేణ = ముందుగా చూపిన తీరుకన్న, భిద్యతే = వేరగును.

తాత్పర్యము— "అనేకః" (రెండు లేక పెక్కు) అను శబ్దమును మాత్రమే ప్రయోగింతుము. ఎట్టి క్రియనుగాని, గుణమునుగాని దానికి విధింపము అయినను అనేకమయినది కారకమైన ఒకానొక వస్తువుకాక తప్పదు. దానినిబట్టి అనువగు "తిష్ఠతి" అను సామాన్యక్రియ ఆక్షేపింపబడును. అనగా సాధనమైన ద్రవ్యమే ముందుగా ఉన్నందున, అది సాధ్యమైన క్రియను లాగికొనివచ్చును. అట్లు తుదకు ద్విత్వబహుత్వములే తెలియును. క్రియ వలన కారకము నాక్షేపించుట పైన చూపబడినది. (290) దానికి విపరీతము ఈ పక్షము.

వివరణము— విశేషక్రియ లేనిచోట తిష్ఠతి, భవతి, అస్తి, మొదలగు సామాన్య క్రియలు వాడబడును. విశేషములను విధింపక, కేవలము "అనేకః" అన్నచో, ప్రసజ్య ప్రతిషేధమున "ఒకటి కాదు" అని నిషేధము మాత్రమే ఫలించి ద్విత్వబహుత్వముల ప్రతీతి కలుగదేమో అను శంక కలుగును. దానిని వారించుటకై ఇట్టి సందర్భములందు పర్యుదాస

మునే స్వీకరింపవలెననియు, అట్లు ద్విత్వాది ప్రతీతి సుకరమగుననియును భాష్యకారు డభిప్రాయపడెను. ఆ భావమును ఈ కారికలు విశదము చేసినవి.

కాగా క్రియ వినిపించినచోట దానినిబట్టి కారకమైన ద్రవ్యమున కాక్షేపము కలుగును. క్రియ వినిపింపక ద్రవ్యము మాత్రమే ఉన్నపుడు దానినిబట్టి క్రియకు ఆక్షేపము కలుగును. ఎట్లయినను నఞ్ నిషేధించు వస్తువును విడిచి మిగిలినవన్నియును క్రియాన్వయమును పొందునని ఫలించును ॥293॥

అవతారిక— క్రియను పూర్తిగా వివక్షింపని వాక్యమందు కూడ (న న ఏకమ్ ప్రియమ్, మొదలగునది) వేరొక సంఖ్యయే తెలియునని చూపుచున్నాడు.

శ్లో॥ సంఖ్యైవ ప్రతిషేధేన సంఖ్యాంతరమపేక్షతే ।
వాక్యేఽపి తేన నైకత్వమాత్రమేవ నివర్త్యతే ॥ 294

వాక్యే + అపి = వాక్యమందు కూడ, ప్రతిషేధేన = నిషేధముచే, సంఖ్యా = సంఖ్య, సంఖ్యాంతరమ్ + ఏవ = వేరొక సంఖ్యనే, అపేక్షతే = కోరును, తేన = అందుచే, ఏకత్వమాత్రమ్ + ఏవ = ఏకత్వము మాత్రమే, న + నివర్త్యతే = తొలగింపబడదు.

తాత్పర్యము— "న న ఏకం ప్రియమ్" (ఒక ప్రియము కాదు = ఎన్నో ప్రియములు), "న న ఏకం సుఖమ్" (ఒక సుఖము కాదు = ఎన్నో సుఖములు) అను వాక్యములో కూడ నఞ్ ఏకత్వమును మాత్రమే నిషేధించి ఊరకొనదు. ఆ నిషేధముచే "ఒకటిని మించిన ఎన్నో సుఖములు" అను రీతిని బహుత్వమే తెలియబడును.

వివరణము— "న న ఏకం ప్రియన్" అను వాక్యము శత్రువునుద్దేశించి సంభావించునది "శత్రువునకు ఎన్నో ప్రియములు - మనకు లేవు" అని దాని భావము. బాధను సూచించుటకై "న" అను దానికి ద్విరుక్తి వచ్చినది. ఇచట క్రియ వివక్షితము కాదు. ఇది వృత్తియు కాదు. అయినను ఏకత్వముయొక్క నిషేధమువలన బహుత్వము తెలియుచున్నది. కాగా "అనేకమ్" అను వృత్తివలన ద్విత్వబహుత్వములు లభించుటలో చిక్కేదియు ఉండదు.

విశేష విషయములు— "ఆబాధేచ" (8-1-10) అనునది ద్విరుక్తిని విధించు సూత్రము. "బాధను సూచించునపుడు పదమునకు ద్విరుక్తియగును" అని దీని భావము.

అవతారిక— ఏకత్వమును నిషేధించుటవలన తత్సదృశమైన వేరొక సంఖ్యయే తెలియుననుటను ఒక దృష్టాంతముతో సమర్థించుచున్నాడు.

శ్లో॥ స్నేహాంతరాదవచ్ఛేదస్తథాసక్తైః ప్రతీయతే ।
తైలేన భోజనే ప్రాప్తే నత్వన్యదుపసేచనమ్ ॥ 295

భోజనే = భోజనము, తైలేన = నువ్వులనూనెతో, ప్రాప్తే = సంభవించునపుడు, ఆసక్తైః =

దగ్గర సంబంధమునుబట్టి, స్నేహాంతరాత్ = వేరొక చమురువలన, అవచ్ఛేదః = విశేషము, ప్రతీయతే = తెలియబడును, అన్యత్ = మరియొక, ఉపసేచనమ్ + తు = తడుపు పదార్థమైతే, న = కాదు (తెలియబడదు).

తాత్పర్యము— "అతైలేన భోజనమ్" (నూనె కాని వస్తువుతో భోజనము) అను వాక్యము నూనెను నిషేధించినను "నూనెవంటి నెయ్యి, మొదలగు చమురుతోనే భోజనము" అను అర్థమును సమర్పించును. అంతియకాని పెరుగు, పాలు, మొదలగు ద్రవ్యములు అచట స్ఫురింపవు. అట్లగుటలో నూనె, నెయ్యి మొదలగువాని సజాతీయత్వమే కారణము. అట్లే "అనేకమ్" అని ఏకత్వమును నిషేధించినందువలన ఏకత్వమునకు సదృశములైన ద్విత్వ బహుత్వ సంఖ్యలే అవగతములగునుగాని వేరొక వస్తువేదియు అవగతము కాదు.

వివరణము— నఞ్ "తద్భిన్నమును తత్సదృశమును బోధించును" అనుట వలన, నిషేధించిన వస్తువుతో సమానమైన వస్తువే లభించునుగాని వేరొకటి లభింపదు.

ఈ విధముగ "నఞ్ సమాసము ఉత్తరపదార్థ ప్రధానము" అన్నపుడు "అనేకమ్" అను, ప్రయోగముయొక్క ఉపపత్తి ప్రతిపాదింపబడినది. (281-295 కారికలు).

అవతారిక— "నఞ్ సమాసము అన్యపదార్థ ప్రధానము" (బహువ్రీహివలె తాను విశేషణముగ నుండి విశేష్యమైన వేరొక వస్తువును చెప్పునది) అను పక్షమును పరిశీలించుట కిపుడు ప్రారంభించుచున్నాడు.

శ్లో॥ ఏకార్థే వర్తమానాభ్యామసతా బ్రాహ్మణేన చ ।
యదా జాత్యంతరం బాహ్యం క్షత్రియాద్యపదిశ్యతే ॥ 296

ఏకార్థే = ఒకే యర్థమున, వర్తమానాభ్యామ్ = ఉంటున్న, అసతా = అభావమును సామాన్యముగ చెప్పు నఞ్ చేతను, బ్రాహ్మణేన + చ = బ్రాహ్మణ పదముచేతను, బాహ్యమ్ = వెలుపలనున్న, క్షత్రియాది = క్షత్రియత్వము మొదలగు, జాత్యంతరమ్ = వేరొకజాతి, యదా = ఎపుడు, అపదిశ్యతే = చెప్పబడునో (తదా = అపుడు, నఞ్ సమాసః = నఞ్ సమాసము, అన్యపదార్థ ప్రధానః = అన్యపదార్థము ముఖ్యముగా గలదియై, భవతి=అగును).

తాత్పర్యము— "అబ్రాహ్మణః" అనుచోట "న + బ్రాహ్మణః + అస్యామ్" (బ్రాహ్మణ వ్యక్తిలేని జాతి) అను విగ్రహమును చూపి, వర్తి పదార్థములను కాక, అన్య పదార్థమునే విశేష్యముగ చెప్పినచో, నఞ్ సమాస మన్యపదార్థ ప్రధానమగును.

వివరణము— నఞ్ సామాన్యముగ అభావమును చెప్పినను, ప్రస్తుతము ప్రక్కనుండు బ్రాహ్మణ శబ్దమునుబట్టి "బ్రాహ్మణాభావము" అను విశేషార్థమును తెలియజేయును. కాగా ఆ రెండు పదములును సమానాధికరణములయి, విశేష్యమైన వేరొక అర్థమందు ఆధారపడును. ఆ యర్థము వెలుపలిదగుటవలన అన్యపదార్థమగును. ఇట్లు "అబ్రాహ్మణః" అనునది విశేషణముగ ఏర్పడినందున క్షత్రియః, వైశ్యః, మొదలగునవి దానికి

విశేష్యములుగ ఉండును. అన్యపదార్థ ప్రాధాన్యమనగా ఇదియే, (సమసించు పదముల యర్థముగాక, వేరొక పదముయొక్క అర్థము ముఖ్యమగుట). ॥296॥

అవతారిక — అన్యపదార్థము ప్రధానముగాగల మరియొక తత్పురుషమును నిదర్శనముగా చూపుచున్నాడు.

శ్లో॥ శ్యామేవ శస్త్రీ కన్యేతి యథాన్యద్వ్యపదిశ్యతే ।
అసన్ బ్రాహ్మణ ఇత్యాభ్యాం తథాన్యే క్షత్రియాదయః ॥ 297

శస్త్రీ + ఇవ + శ్యామా = ''శస్త్రీశ్యామా'' (కత్తివలె నల్లనిది), కన్యా + ఇతి = కన్యయని, యథా = ఎట్లు, అన్యత్ = వేరొక వస్తువు, వ్యపదిశ్యతే = చెప్పబడునో, తథా = అట్లు, అసన్ + బ్రాహ్మణః + ఇతి = ''అసన్ బ్రాహ్మణః'' - అను, (అబ్రాహ్మణః), ఆభ్యామ్ = ఈ రెండు పదములచే, అన్యే = ఇతరులైన, క్షత్రియాదయః = క్షత్రియుడు మొదలగు వారు, (వ్యపదిశ్యంతే = చెప్పబడుదురు).

తాత్పర్యము— ''శస్త్రీశ్యామా'' ఇదియు తత్పురుష సమాసమే. ''శస్త్రీ ఇవ శ్యామా'' అని విగ్రహము. ''కన్యా'' అనునది దీనికి విశేష్యము (శస్త్రీ శ్యామా కన్యా చిన్న కత్తివలె నల్లని కన్య). కాగా ఇచట అన్యపదార్థమే ముఖ్యముగ నుండును. ఇట్లే ''అబ్రాహ్మణః'' అను నఞ్ సమాసమువలన కూడ అన్యపదార్థములగు క్షత్రియాదులు తెలియుటలో బాధ ఉండదు.

వివరణము— ''అనేక మన్యపదార్థే'' (2-2-24) ఇది బహువ్రీహిని విధించు సూత్రము. ఇందు ''అన్యపదార్థే'' అని స్పష్టముగ ఉన్నది కావున బహువ్రిహి అన్యపదార్థ ప్రధానమగుట సమంజసమే. కాని ''నఞ్'' (2-2-6) అను నఞ్ సమాసమును విధించు సూత్రమున ''అన్యపదార్థే'' అను నిర్దేశము లేదు. అయినపుడు ''నఞ్'' సమాసము అన్య పదార్థ ప్రధానమగుట సముచితమా ?'' అను శంక కలుగును. ఈ శంకను వారించుటయే ఈ కారికయొక్క పని ''శస్త్రీశ్యామా'' మొదలగు ఉపమాన సమాసములు ''ఉపమానాని సామాన్యవచనైః'' (2-1-55) అను సూత్రముచే సాధింపబడును. అవియు తత్పురుషములే. వానిని సాధించు పై సూత్రమున కూడ, ''అన్యపదార్థే'' అను పదము లేదు. అయినను వాని వలన అన్యపదార్థమే ముఖ్యముగ తెలియుచుండును. అందువలన ''శస్త్రీశ్యామా'' అను వాని వలెనే ''అబ్రాహ్మణః'' మొదలగునవి కూడ అన్యపదార్థమును బోధించుననుటలో దోషము లేదు.

విశేష విషయములు— 1. ''అనేకమన్యపదార్థే''— అన్యపదార్థమును బోధించు ఒకటికిమించిన సమర్థములైన సుబంతములు సమసించును - అది బహువ్రీహియగును - అని యర్థము.

2. "ఉపమానాని సామాన్యవచనైః"– ఉపమానమును చెప్పు శబ్దములు సామాన్య ధర్మమును చెప్పు శబ్దములతో సమసించును - అది తత్పురుషమగును - అని యర్థము.

"నఞ్" అను సూత్రముయొక్క అర్థమిదివరకే చూపబడినది. ॥297॥

అవతారిక— పై విషయముననే వేరొక దృష్టాంతమును చూపుచున్నాడు.

శ్లో॥ అసాస్నో గౌరితి యథా గవయో వ్యపదిశ్యతే ।
జాత్యంతరం న గోరేవ సాస్నాభావః ప్రతీయతే ॥ 298

అసాస్నః = గంగడోలు లేని, గౌః = ఎద్దు ఇతి = అని, జాత్యంతరమ్ = వేరొక జాతియైన, గవయః = గవయము, యథా = ఎట్లు, వ్యపదిశ్యతే = చెప్పబడునో, గోః = ఎద్దుయొక్క, సాస్నాఽభావః + ఏవ = గంగడోలు లేకుండుట మాత్రమే, యథా = ఎట్లు, న + ప్రతీయతే = తెలియబడదో - (అట్లే "అబ్రాహ్మణః" అను దానివలన క్షత్రియాది జాతియే తెలియును)

తాత్పర్యము— గవయమన్నది ఎద్దును పోలియుండు ఒకానొక అడవి జంతువు. దానికి గంగడోలుండదు. మిగిలిన అవయవముల తీరు అంతయును ఎద్దువలెనే యుండును. ఆగవయమును బోధించుటకు "అసాస్నః గౌః" అను వాక్యమును ప్రయోగింతురు. ఇచట "అసాస్నః" అనునది గంగడోలు యొక్క అభావమును మాత్రమే బోధించి యూరకొనదు. గోవును పోలిన గవయమను జాత్యంతరమును బోధించును. అట్లే "అబ్రాహ్మణః" అనునది బ్రాహ్మణత్వము లేకుండ, మిగిలిన లక్షణములన్నియుగల క్షత్రియాది జాతిని బోధింప గలుగును.

వివరణము— సాస్న అనగా గంగడోలు. నఞు ఒక ధర్మమును నిషేధించి నపుడు, మిగిలిన ధర్మములన్నియు సమానమే అను భావము కలిగి, సదృశమైన వేరొక వస్తువు బోధపడునని ఇచటి సారాంశము. ॥298॥

అవతారిక— పై విషయముననే మరియొక నిదర్శనమును చూపుచున్నాడు.

శ్లో॥ తుల్యరూపం యథాఖ్యాతం కంటకైర్భేదహేతుభిః ।
ఖదిరం జాతిభేదేన ఖర్జూరాత్ ప్రతిపద్యతే ॥ 299

తుల్యరూపమ్ = సమానమైన రూపము గలదిగ, ఆఖ్యాతమ్ = చెప్పబడిన, ఖదిరమ్ = ఖదిర వృక్షము (చంద్రచెట్టు), భేదహేతుభిః = భేదమునకు కారణములైన, కంటకైః = ముండ్లచే, ఖర్జూరాత్ = ఖర్జూరపు చెట్టుకన్న, జాతిభేదేన = జాతిభేదముతో, యథా = ఎట్లు, ప్రతిపద్యతే = తెలియబడునో, (అట్లు అబ్రాహ్మణః అను దానివలన క్షత్రియాది జాతి తెలియ బడును.)

తాత్పర్యము— "ఖదిర ఖర్జూరౌ గౌరకాండౌ సూక్ష్మపర్ణౌ" (ఖదిరపు చెట్టును, ఖర్జూరపు చెట్టును తెల్లని కాండములును, చిన్న ఆకులను గలవి) అను వాక్యమువలన మొదట

ఖదిర ఖర్జూరముల సాదృశ్యము తెలియును. పిదప "కంటకవాన్ ఖదిరః" (ముండ్లుగలది ఖదిరము) అను వచనముచే, ఖదిరమునకు ముండ్లు ఉన్నందున అది ఖర్జూరపు చెట్టుకన్న వేరైన చెట్టు అని భేదము స్పష్టపడును. (ముండ్లు ఖదిరమును వేరు చేయును). అట్లే "అబ్రాహ్మణః" అను సమాసమువలన "బ్రాహ్మణజాతి కాదనియు, మిగిలిన లక్షణములన్నియును ఆ వ్యక్తికి సమానమే అనియును" విశదపడును అనగా "వేరొక జాతి" అని తెలియును.

అవతారిక — మీద చూపిన దృష్టాంతములకు ప్రకృతమున సమన్వయము చూపుచున్నాడు

శ్లో॥ అవిద్యమానబ్రాహ్మణ్యో యాదృశో బ్రాహ్మణో భవేత్ ।
అంగీకృతోపమానేన తథాన్యార్థో విధీయతే ॥ 300

బ్రాహ్మణః = బ్రాహ్మణుడు, అవిద్యమాన బ్రాహ్మణ్యః = బ్రాహ్మణత్వము లేనివాడై, యాదృశః = ఎట్టివాడు, భవేత్ = అగునో, తథా = అట్లు, అంగీకృతోపమానేన = స్వీకరింపబడిన ఉపమానముగల దానిచే (నఞ్ సమాసముచే) అన్యార్థః = అన్యపదార్థము, విధీయతే = విధింపబడును.

తాత్పర్యము— ఏదోయొక కారణమువలన బ్రాహ్మణత్వమును కోల్పోయిన బ్రాహ్మణుని గూర్చి "బ్రాహ్మణః" అని ప్రయోగించినపుడు, ఆ పదము "వాస్తవముగా బ్రాహ్మణ్యము లేకపోయినను బ్రాహ్మణ సాదృశ్యము గలదు" అను భావమునందించును. అట్లే "అబ్రాహ్మణః" అను నఞ్ సమాసము "బ్రాహ్మణ సదృశమైన క్షత్రియాది జాతి" అను అర్థమును సమర్పించును.

వివరణము— పై మూడు కారికలును మూడు దృష్టాంతములను ఇట్లు చూపినవి. 1. శస్త్రీశ్యామా, 2. అసాస్నో గౌః, 3. ఖదిర ఖర్జూరౌ గౌరకాండౌ - కంటకవాన్ ఖదిరః ఈ మూడు చోట్లను కూడ చివరకు సాదృశ్యమే తెలియును. మొదటి రెండు చోట్లను (1 కత్తివలె నల్లని కన్య, 2. గంగదోలు లేని ఎద్దువంటిది గవయము) సదృశమైన అన్య పదార్థమే ముఖ్యముగ ఉండును. అట్లే "అబ్రాహ్మణః" అనుచోట కూడ ఉపమానోపమేయ భావము అవగతమై "బ్రాహ్మణ సదృశమైనను బ్రాహ్మణ భిన్నమైన జాతి" అను అర్థము సిద్ధించును. కాగా అన్యపదార్థము ముఖ్యమన్నపుడు నఞ్ సమాసమున సాదృశ్యము అంతర్గతమై ఉండునని ఫలించును.

విశేష విషయములు— పదార్థములకు సంపూర్ణమైన భేదముగాని, అభేదముగాని యున్నచో సాదృశ్యమన్నది సంభవింపదు. అందుచే సాదృశ్యమనగానే భేదాభేదములు రెండును ఉండునని తెలియవలెను. కొన్ని లక్షణములనుబట్టి భేదమును మరికొన్ని లక్షణములను బట్టి అభేదమును సాదృశ్యమున్నచోట భావింపక తప్పదు. ॥300॥

అవతారిక— కొన్ని నఞ్ సమాసములలో సాదృశ్యమంతర్భవించుట అనుభూత మగునని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ అవృష్టయో యథా వర్షా నీహారాభ్రసమావృతాః ।
తద్రూపత్వాత్ స హేమంత ఇత్యభిన్నః ప్రతీయతే ॥ 301

నీహారాభ్ర సమావృతాః = మంచువంటి మేఘములతో కప్పబడిన, అవృష్టయః = వర్షములు లేని, వర్షాః = వర్షర్తువు, యథా = ఎట్లుండునో (తథా = అట్లు), తద్రూపత్వాత్ = అట్టి స్వరూపము కలిగియున్నందువలన, సః = అది, హేమంతః + ఇతి = హేమంత ఋతువని, అభిన్నః = భేదము లేనిదై, ప్రతీయతే = తెలియబడును.

తాత్పర్యము— ''అవర్షాః హేమంతః'' అని ప్రయోగము. ''హేమంత ఋతువు వర్షఋతువుతో సమానమని'' దీని యర్థము. ఇచట ''అవర్షాః'' అన్నది నఞ్ సమాసము (న + వర్షాః = అవర్షాః). ఇందలి నఞా సాదృశ్యమును బోధించును. కావున ''హేమంతము వర్షా సమానము'', అను భావము కలుగును. మంచుతో కప్పబడిన ఆకసముగల హేమంతము వర్షములు లేకుండ మేఘములతో కప్పబడిన ఆకాశముగల వర్షఋతువుతో సమానముగనున్న దని తెలుపుటకై ఇట్టి నఞ్ తత్పురుషమును వాడుట ప్రసిద్ధము.

వివరణము— ఋతువును తెలుపు వర్షా శబ్దము స్త్రీలింగము. నిత్య బహువచ నాంతము.

ఇచట, "న + వర్షాః + యస్మిన్ - సః" అను విగ్రహమును చూపి, బహు వ్రీహిని చేసినచో వర్షా శబ్దమునకు శాస్త్రీయముగ హ్రస్వము వచ్చి, "అవర్షః" అను రూపము కావలసి వచ్చును. అది యభిమతము కాదు. ''అవర్షాః'' అనునదియే పెద్దల ప్రయోగము. అయినపుడది నఞ్ తత్పురుషమే అయి, సాదృశ్యమును ఇమిడ్చికొని అన్య పదార్థమైన హేమంతమును బోధించునని వ్యాఖ్యానింపక తీరదు.

ఈ తీరున నఞ్ సమాసములు సాదృశ్యమును ఇమిడ్చికొని అన్యపదార్థ ప్రధానము లగుచుండునని కొందరందురు. ॥301॥

అవతారిక— ఈ సందర్భముననే మరికొందరిట్లందురని చెప్పుచున్నాడు.

శ్లో॥ అపరే బ్రాహ్మణాదీనాం సర్వేషాం జాతివాచినామ్ ।
ద్రవ్యస్యాన్యపదార్థత్వే నఞా యోగం ప్రచక్షతే ॥ 302

జాతివాచినామ్ = జాతిని బోధించు, బ్రాహ్మణాదీనామ్ = "బ్రాహ్మణ" మొదలగు, సర్వేషామ్ = ఎల్ల శబ్దములకును, ద్రవ్యస్య = వ్యక్తి, అన్యపదార్థత్వే = అన్యపదార్థమైనపుడు, నఞా = నఞుతో, యోగమ్ = కలయికను, అపరే = మరికొందరు, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్యము— ''బ్రాహ్మణ'' మొదలగు జాతివాచకములకే తొలుత నఞ్

సమాసమగుననియు, పిదప ఆ సమాసము క్షత్రియాది వ్యక్తినే అన్యపదార్థముగ బోధించు ననియును మరికొందరు చెప్పుదురు.

వివరణము— వ్యక్తిని చెప్పు శబ్దమునకు తొలుత నఞ్ సమాసమనియు, పిదప సమాసము జాతిని అన్యపదార్థముగ తెలుపుననియును ఇంతదనుక చెప్పబడినది. దానికి విపరీతమైనది ఈ పక్షము. రెండింటి తాత్పర్యమును ఒకటే. అయినను అన్యపదార్థము జాతి యని మొదటి పక్షము చెప్పును. అది వ్యక్తియని రెండవ పక్షమనును. మిగిలినదంతయు సమానమే. ॥302॥

అవతారిక— నఞ్ సమాసమందలి ఉత్తరపదము తొలుత జాతివాచకమై పిదప వ్యక్తిని అన్యపదార్థముగ బోధించునను పక్షమున, నఞ్ సమాసమునకును, బహువ్రీహికిని భేదము కూడ సులభముగ సిద్ధించునని చెప్పుచున్నాడు

శ్లో॥ నచైవం విషయః కశ్చిత్ బహువ్రీహిః ప్రకల్ప్యతే ।
అగురశ్వఇతి వ్యాప్తిర్నఞ్సమాసేన యస్య న ॥ 303

కశ్చిత్ = ఏ ఒక, బహువ్రీహిః + చ = బహువ్రీహియైనను, ఏవం విషయః = ఇట్టి విషయము గలదై, (జాతితో కలిసిన అన్యపదార్థమగు వ్యక్తిని చెప్పునదియై), న + ప్రకల్ప్యతే= ఉండజాలదు, యస్య = ఏ బహువ్రీహికి, నఞ్ సమాసేన = నఞ్ సమాసముచే, వ్యాప్తిః = వ్యాపించుట, న = లేదో, (సః = అట్టి), అగుః + అశ్వః + ఇతి = అగుః (అశ్వః) అను బహువ్రీహి (కల్ప్యతే = సమర్థమగును).

తాత్పర్యము— "అధిక్యము" మొదలగు మతుప్ ప్రత్యయముయొక్క అర్థమును బహువ్రీహి సమాసము బోధించుట అతిప్రసిద్ధము. ఉదా : చిత్రగుః = చిత్రమైన పెక్కు గోవులు కలవాడు. నఞ్ సమాసమువలె జాతి విశిష్టమైన వ్యక్తిని అన్యపదార్థముగ బహువ్రీహి సమర్పింపజాలదు. అట్లయినచో నఞ్ సమాసమునకును బహువ్రీహికిని భేదమే లేకుండ పోయెడిని. అది అనుభవమునకు విరుద్ధము అందువలన వ్యక్తి అన్యపదార్థముగ ఫలించినపుడు, నఞ్ సమాసమనియు, అట్లు కానపుడు (కేవలము జాతికాని, మతుబర్థముగాని) బహువ్రీహియనియును భేదమును కల్పించుకొనుట సమంజసము. అనగా నఞ్ సమాస మాక్రమించని స్థలము బహువ్రీహి కాగలదు. ఉదా : 1. అగుః - (అశ్వః) న + గౌః - అని విగ్రహము. గోత్వమను జాతితో కూడిన గోవ్యక్తి కానిది అశ్వము = "అశ్వము గోవు కాదు" అని భావము. ఇది నఞ్ సమాసము.

2. అగుః = న + గావః + యస్యసః = పెక్కు గోవులు లేనివాడు ఇది బహువ్రీహి. (అశ్వః, అను దానికి ఇచట సంబంధమక్కరలేదు).

వివరణము— నఞ్ సమాసము అన్యపదార్థ ప్రధానమన్నపుడే బహువ్రీహితో సాంకర్యమున కవకాశము కలుగును. దానిని వారించుటకు ఏదో ఒక యుక్తిని చూపవలసి

యుండును. జాతి విశిష్టమగు వ్యక్తిని నఞ్ సమాసము బోధించునని సమన్వయము చేయుటయే అట్టి యుక్తి యగును. ॥303॥

అవతారిక— నఞ్ సమాసము అన్యపదార్థ ప్రధానమన్నచో దోషము సంభవించునని భాష్యమున నన్నది. ఆ దోషమును వివరించుచున్నాడు

శ్లో॥ ద్వంద్వైకదేశినోరుక్తా పరవల్లింగతా యతః ।
అవర్షాసు తతోఽసిద్ధిరిష్టయోర్లింగసంఖ్యయోః ॥ 304

పరవల్లింగతా = ప్రక్కనుండు పదముయొక్క లింగము సమాసమునకు వచ్చుట, ద్వంద్వైకదేశినోః = ద్వంద్వమునకును, ఏకదేశి సమాసమైన తత్పురుషమునకును మాత్రమే, యతః= ఎందువలన, ఉక్తా = చెప్పబడెనో, తతః = అందువలన, అవర్షాసు = ' అవర్షాః'' అను నఞ్ సమాసమున, ఇష్టయోః = అభిమతములైన, లింగసంఖ్యయోః = లింగముయొక్కయు, వచనముయొక్కయు, అసిద్ధిః = సిద్ధింపకపోవుట (స్యాత్ = కలిగెడిని).

తాత్పర్యము— నఞ్ సమాసమన్యపదార్థ ప్రధానమన్నచో ''అవర్షాః హేమంతః'' అనుచోట, అన్యపదార్థమును చెప్పు హేమంత శబ్దము ననుసరించి నఞ్ సమాసమునకు లింగవచనములు రావలసియుండును. (అవర్షః - హేమంతః) కాని అది అభిమతము కాదు. ''అవర్షాః'' అని స్త్రీలింగముగను, నిత్య బహువచనముగను ఉండుటయే అభిమతము.

అయితే ''పరవల్లింగం ద్వంద్వ తత్పురుషయోః'' (2-4-26) అను సూత్రము ద్వంద్వమునకును తత్పురుషమునకును పరపదముయొక్క లింగమును అతిదేశించినది. దీని ననుసరించి నఞ్ సమాసము కూడ తత్పురుషమే కాన ''అవర్షా'' అనుచోట దోషము కలుగదని (పరపదమైన వర్షా శబ్దమును బట్టియే లింగవచనములు సిద్ధించును) వాదింపవచ్చును. కాని ఆ పరపదముయొక్క లింగము వచ్చుట - తత్పురుషములో ''ఒక్క ఏకదేశి సమాసమునకు మాత్రమే'' (ఉదా : అర్ధపిప్పలీ) అని నియమము చేయబడినది. నఞ్ సమాసము ఏకదేశి సమాసము కాదు గదా ! కావున పై వాదము నిలువదు. కాగా దోషము కలుగక తప్పదు.

వివరణము— ''పరవల్లింగం ద్వంద్వ తత్పురుషయోః'' - ''దంద్వసమాసమునకును, తత్పురుష సమాసమునకును, చివరనుండు పదముయొక్క లింగము సంక్రమించును'' అని యర్థము.

ఉదా : *1.* మయూరీ+చ+కుక్కుటః+చ = మయూరీ కుక్కుటౌ (ద్వంద్వము) కుక్కుట శబ్దము ననుసరించి సమాసమునకు పుంలింగము.

2. అర్ధమ్ + పిప్పల్యాః = అర్ధపిప్పలీ (ఏకదేశి సమాసము - తత్పురుషము). పిప్పలీ శబ్దము ననుసరించి సమాసమునకు స్త్రీలింగము.

కాగా నఞ్ సమాసము అన్యపదార్థ ప్రధానమన్నచో "అవర్షాః - హేమంతః" అనుచోట దోషము తప్పదని తేలినది కావుననే ఆ పక్షము మంచిది కాదనియును ఫలించును. ॥804॥

అవతారిక— "నఞ్ సమాసమున పూర్వపదముయొక్క అర్థము (న = అభావము) ప్రధానము", అను పక్షమును పరిశీలించుటకు ఇపుడు ప్రారంభింపుచున్నాడు

శ్లో॥ విశేషణం బ్రాహ్మణాది క్రియాసంబంధినోఽసతః ।
యదా విషయభిన్నం తత్తదాసత్త్వం ప్రతీయతే ॥ 305

క్రియ సంబంధినః = క్రియతో సంబంధముగల అసతః = "లేనిది" అను నర్థమునకు (అభావము), బ్రాహ్మణాది = బ్రాహ్మణ మొదలగు శబ్దము, విశేషణమ్ = విశేషణమై, తత్ = అది, విషయభిన్నమ్ = విషయముచే వేరైనది, యదా = ఎపుడు (భవతి = అగునో), తదా = అపుడు, అసత్త్వామ్ = అభావము (లేకుండుట) ప్రతీయతే = తెలియబడును.

తాత్పర్యము— "అబ్రాహ్మణః" మొదలగుచోట్ల, నఞర్థమైన అభావము ముఖ్యము. అందు బ్రాహ్మణ మొదలగు శబ్దముల అర్థము విశేషణమై అప్రధానముగ నుండును. కావున "బ్రాహ్మణాభావము" మొదలగు అర్థము లభించును ఇట్టి అభావమే పిదప సముచితమైన క్రియతో అన్వయించును. (అబ్రాహ్మణః అస్తి = బ్రాహ్మణాభావము గలదు). ఈ తీరు ననుసరించినపుడు నఞ్ సమాసము పూర్వపదార్థ ప్రధానమగును. ॥305॥

అవతారిక— అసత్తునకును క్రియా సంబంధము కుదురునని నిరూపించుచున్నాడు.

శ్లో॥ బ్రాహ్మణత్వేనచాఽసత్త్వాదుచ్యతేఽసత్తదన్యథా ।
అసదిత్యపి సత్త్వేన సతః సత్తా నివర్త్యతే ॥ 306

బ్రాహ్మణత్వేన = బ్రాహ్మణ్యముచే, అసత్త్వాత్ + చ = లేకపోవుటవలన, తత్ = ఆ, అసత్ = లేనిది, అన్యథా = వేరొక రీతిలో, ఉచ్యతే = చెప్పబడును, అసత్ + ఇతి + అపి = "అసత్" అనుచోట కూడ, సత్త్వేన = సత్త్వముచే (ఉనికి), సతః = ఉన్నదానియొక్క సత్తా = ఉనికి, నివర్త్యతే = తొలగింపబడును.

తాత్పర్యము— "అబ్రాహ్మణః (బ్రాహ్మణ్యము లేనివాడు - అనగా ఇతరుల ధర్మమున్నది గదా ?)" అనునది "బ్రాహ్మణ్యము లేకున్నను క్షత్రియాదుల ధర్మమున్నది" అను భావమునే తుదకు కలుగజేయును. అనగా "సిద్ధముగనున్న ధర్మము బ్రాహ్మణ్యరూపముతో లేదు" అని మార్చి చెప్పినట్లగును. కావున (చివరకు ఉనికియే తెలియును) క్రియాన్వయము కుదురును. అట్లే "అసన్" అను నఞ్ సమాసమును కూడ కుదుర్చుకొనవచ్చును. ఏ విధముగను సత్త్వమును (ఉనికిని) భావింపని అభావమన్నది సంభవింపదు. (అభావము, అనునది ఒకదాని యునికిని తప్పక అపేక్షించును) అట్లు భావనాసిద్ధమైన సత్త్వమునే నఞా

తొలగించును. కాగా "అసన్" అను దానివలన "సత్త్వాభావము" అను నర్థము, పూర్వ పదార్థము ముఖ్యమను పక్షములో లభించును. ॥306॥

అవతారిక— పూర్వపదార్థము ముఖ్యమన్నపుడు, "సమాసము అవ్యయము కావలసి వచ్చునని" భాష్యకారు డొక శంకను లేవదీసెను దానిని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ సామాన్యద్రవ్యవృత్తిత్వాన్నిమిత్తానువిధాయినః ।
అయోగో లింగసంఖ్యాభ్యాం స్యాద్వా సామాన్యధర్మతా ॥ 307

నిమిత్తానువిధాయినః = ప్రవృత్తి నిమిత్తముగలది, సామాన్య ద్రవ్యవృత్తిత్వాత్ = ద్రవ్య సామాన్యమును చెప్పుటవలన, లింగసంఖ్యాభ్యామ్ = లింగవచనములతో, అయోగః = సంబంధము లేకుండుట, స్యాత్ = కలిగెడిని, వా = లేక, సామాన్యధర్మతా = సామాన్య ధర్మమగుట (స్యాత్ = కలిగెడిని)

తాత్పర్యము— నఞ్ సమాసము పూర్వపదార్థ ప్రధానమన్న పక్షములో నఞర్థ మైన అభావము సామాన్యరూపమున ముఖ్యమగును గదా ! ఉత్తరపదార్థ మచట విశేషణమై విశేష్యమును చెప్పుచు తన సహజ ధర్మములైన లింగవచనములను పోగొట్టుకొనును. నఞర్థ మునకు లింగవచనములు లేకుండుట సముచితమే (అభావము ద్రవ్యము కాదు). కాగా ముఖ్య మైన నఞర్థము ననుసరించి సమాసమంతయు అవ్యయము కావలసి వచ్చును. ఇదొక చిక్కు. లేక— సమాసము అభా సామాన్యమును బోధించుటవలన నపుంసక లింగమును ఏకవచన మును మాత్రమే (అబ్రాహ్మణమ్) రావలసి వచ్చును. ఇది వేరొక చిక్కు

వివరణము— న = అభావము. ఇది అవ్యయము "అబ్రాహ్మణః" = బ్రాహ్మణా భావము. ఇదియు అవ్యయము కావలెను. ॥307॥

అవతారిక— పై కారిక చూపిన దోషమునకు భాష్యకారుడే పరిహారమును చూపెను. దానిని వివరించుచున్నాడు.

శ్లో॥ ప్రాగసత్త్వాభిధాయిత్వం సమాసే ద్రవ్యవాచితా ।
నిమిత్తానువిధానం చ న సర్వత్ర స్వభావతః ॥ 308

ప్రాక్ = ముందు, (సమాసమునకు ముందు), అసత్త్వాభిధాయిత్వమ్ = ద్రవ్యము కాని ధర్మమును చెప్పుటయు, సమాసే = సమాసమందు, ద్రవ్యవాచితా = ద్రవ్యమును బోధించు టయు, (భవతి = అగును), నిమిత్తానువిధానమ్ + చ = నిమిత్తము ననుసరించుటయు, స్వభావతః = స్వభావమునుబట్టి, సర్వత్ర = అన్నిచోటులందును, న = ఉండదు.

తాత్పర్యము— సమాసమునకు ముందు నఞ్ద్రవ్యమును బోధింపదు. "అభావ సామాన్యము"ను బోధించును. కావున అపుడది యవ్యయమగును. సమాసమందలి నఞా

ద్రవ్యమును చెప్పును. అది దాని స్వభావము. కావున సమాసమునకు లింగవచనములు సిద్ధించును. ప్రవృత్తి నిమిత్తము ననుసరించుట అన్నిచోటులందును ఉండదు.

వివరణము— శబ్దము లాయా నియతమైన యర్థములను బోధించుట అనాది సిద్ధము. దాని నెవరును మార్పజాలరు. వాక్యమందలి నఞు కేవలము నిషేధమును చెప్పును. సమాసమందలి నఞు నిషేధింపబడు ద్రవ్యమును బోధించును. అది సహజమగు స్వభావము. వృత్తియొక్కయు, వాక్యముయొక్కయు ధర్మములు వేరని పెక్కుసారులు ప్రతిపాదింపబడినది. ॥308॥

అవతారిక— పై విషయమునే సమర్థింపుచున్నాడు.

శ్లో॥ నిమిత్తానువిధానే చ క్రియాయోగో న కల్పతే ।
తథాచావ్యపదేశ్యత్వాదుపాదానమనర్థకమ్ ॥ 309

నిమిత్తానువిధానే + చ = ప్రవృత్తి నిమిత్తము ననుసరించిన యెడల, క్రియాయోగః = క్రియతోడి సంబంధము, న + కల్పతే = సంభవింపదు, తథా + చ = అట్లయిన, అవ్యపదేశ్యత్వాత్ = చెప్ప నావశ్యకత లేనందున, ఉపాదానమ్ = శబ్దమును స్వీకరించుట, అనర్థకమ్ = నిష్ఫలము.

తాత్పర్యము— ప్రవృత్తి నిమిత్తమైన అభావ సామాన్యమే సమాసమువలన తెలియునన్నచో, క్రియాసంబంధము కుదురదు. "అబ్రాహ్మణ మానయ", "అబ్రాహ్మణం పశ్య" మొదలగుచోట్ల "బ్రాహ్మణాభావము" సామాన్యముగ తెలియునపుడు, అట్టి దానికి "తీసికొనివచ్చుట" "చూచుట" మొదలగు క్రియలతో సమన్వయమెట్లు సరిపోవును ? అట్లయినపుడు సాధింపదగిన యర్థము బొత్తిగా లేనందున నఞ్ సమాసమే వ్యర్థమైపోవును. కాని వ్యవహారమున నఞ్ సమాసమునకు క్రియాయోగము ప్రసిద్ధముగనున్నది. అందువలన అది ద్రవ్యవాచకమే యనియు, లింగవచనములు దానికుండుననియును ప్రయోగములనుబట్టి నిర్ణయింపక తప్పదు. ॥309॥

అవతారిక— నఞ్ సమాసమునకు లింగవచనములు వేరొక తీరులో కూడ సిద్ధించునని భాష్యకారుడనెను. ఆ తీరును విశదము చేయుచున్నాడు.

శ్లో॥ అసత్సామాన్యవృత్తిర్వా విశేషైః క్షత్త్రియాదిభిః ।
ప్రయుక్తైరాశ్రయైర్భిన్నో యాతి తల్లింగసంఖ్యతామ్ ॥ 310

వా = లేక, అసత్సామాన్యవృత్తిః = అభావమును సామాన్యముగ చెప్పునదియై, ప్రయుక్తైః ప్రయోగింపబడిన, ఆశ్రయైః = ఆధారములైనటువంటివిన్ని, క్షత్త్రియాదిభిః = క్షత్త్రియుడు మొదలగు, విశేషములతో, భిన్నః = వేరైనదియై, తల్లింగ సంఖ్యతామ్ = ఆ విశేషముల యొక్క లింగవచనములు కలిగియుండుటను, యాతి = పొందును.

తాత్పర్యము— నఞ్ సమాసము ఉత్తరపదముయొక్క అర్థముతో కూడిన అభావమును సామాన్యముగ చెప్పినను, అట్టి అభావమునకు సంబంధించిన విశేషములు తెలియుటకై క్షత్రియాదులను అనసంధానము చేయక తప్పదు. (అబ్రాహ్మణః = క్షత్రియః, వైశ్యః శూద్రః మొ॥) అట్టివాని ననుసరించి సమాసమునకు లింగవచనములు సంక్రమించును.

వివరణము— "గుణవచనానామాశ్రయతో లింగవచనాని" (ఆధారమైనట్టి ద్రవ్యమునుబట్టి గుణవాచకములకు లింగవచనములు వచ్చును) అను వచనమువలన నఞ్ సమాసమునకు లింగవచనములు సిద్ధించునని అభిసంధి ఈ వచనము ననుసరించియే పెక్కు స్థలములలో లింగవచనములు సాధింపబడినవి.

విశేష విషయములు— "బ్రాహ్మణుడు కాడు" అని సామాన్యముగ చెప్పగానే "తత్సదృశమైన క్షత్రియాది వ్యక్తి" అను విశేషము స్ఫురించును. అదియే ప్రకృతమున ఆశ్రయమగును. దానిని బోధించు శబ్దమునుబట్టి సమాసమునకు లింగవచనము లుండును.

నఞ్ సమాసమునకు ద్రవ్యవాచకత్వము స్వాభావికమని మీది కారిక చెప్పినది అట్లుగాక లింగవచనములే స్వాభావికములని ఈ కారిక వివరించినది. కాగా యుక్తి వేరుగ కన్పించినను, ఫలితమొక్కటే. ॥310॥

అవతారిక— ఏదోయొక విశేషములేని సామాన్యమన్నది అసంభవము. కావున సామాన్యమున విశేషమంతర్భవించియే యుండును. కాగా నఞ్ సమాసమున విశేషమును ప్రయోగించుట ఎట్లు పొసగును ? - అను శంకకు సమాధానము చెప్పుచున్నాడు.

శ్లో॥ ప్రాగాశ్రయో హి భేదాయ ప్రధానేఽభ్యంతరీకృతః ।
పునః ప్రత్యవమర్శేన విభక్త ఇవ దృశ్యతే ॥ 311

ప్రాక్ = ముందుగా, ప్రధానే = ముఖ్యమైన సామాన్యమందు, అభ్యంతరీకృతః = ఇముడ్చబడిన, ఆశ్రయః = ఆధారమైన విశేషము, భేదాయ = భేదముకొరకు, పునః = మరల, ప్రత్యవమర్శేన = అనుసంధానముచే, విభక్తః + ఇవ = విడదీయబడినది వలె, దృశ్యతే + హి = కనబడును గదా !

తాత్పర్యము— సామాన్యమున విశేషమంతర్భవించుట సహజమే. కాని ఆ విశేషమును విశదము చేయకున్నచో చెప్పదలచిన భావము పూర్తిగాదు. అందువలన ఇమిడియున్న విశేషమును విడదీసి చూపవలెను. అట్లు చేసినపుడు ఆ విశేషమే ఆశ్రయమగును. దానినిబట్టి లింగవచనములు సిద్ధించును.

ఉదా : "అబ్రాహ్మణః" - అన్నంతమాత్రమున లాభము లేదు. క్షత్రియః, అనియో, వైశ్యః, అనియో చెప్పి స్పష్టపరుపవలెను. కాగా మీది కారిక చూపిన యుక్తిలో అనుపపత్తి ఏదియు లేదు, ॥311॥

అవతారిక— పై యంశమునే సమర్థింపుచున్నాడు.

శ్లో॥ సమాసే శ్రూయతే స్వార్థో యేన తద్వాం స్తదాశ్రయః ।
ద్రవ్యం తు లింగసంఖ్యావదసతాభ్యంతరీకృతమ్ ॥ 312

యేన = ఏ, అసతా = అభావ సామాన్యముచే, తద్వాన్ = అది గలదియు, తదాశ్రయః = దాని కాధారమైనదియు, లింగసంఖ్యావత్ = లింగవచనములు గల, ద్రవ్యమ్ + తు = ద్రవ్య మైతే, అభ్యంతరీకృతమ్ = ఇముడ్చబడినదో (సః = అ), స్వార్థః = స్వార్థము (సమాసము యొక్క అర్థము), సమాసే = సమాసమున, శ్రూయతే = వినబడును.

తాత్పర్యము— లింగవచనములు గల ద్రవ్యవిశేషము సమాసార్థమందే ఇమిడి యుండును సమాసము బోధించు అభావ సామాన్యమున కదియే ఆశ్రయమగును. కాగా నఞ్ సమాసమున ఆశ్రయమునుబట్టి లింగవచనములు సిద్ధించును.

వివరణము— ఆశ్రయమునుబట్టి లింగవచనములగుట స్వాభావికము. ఆ ధర్మ మును వ్యాఖ్యానించుటలో ఇట్టి యుక్తులన్నియును ఉపయోగించును. ॥312॥

అవతారిక— నఞ్ సమాసమున క్షత్రియాదులు స్వపదార్థముగా తెలియు రీతిని విశదము చేయుచున్నాడు.

శ్లో॥ ఏకార్థవిషయౌ శబ్దౌ తస్మిన్నన్యార్థవర్తినౌ ।
అసతైవ తు భేదానాం సర్వేషాముపసంగ్రహః ॥ 313

అన్యార్థవర్తినౌ = వేర్వేరు అర్థములందుండు, శబ్దౌ = శబ్దములు రెండును (నఞు + ఉత్తర పదము), తస్మిన్ = ఆ సమాసమందు, ఏకార్థవిషయౌ = ఒకే యర్థమును చెప్పునవియగును సర్వేషామ్ = సకలములైన, భేదానామ్ + తు = భేదములకైతే, అసతా + ఏవ = అభావము చేతనే, ఉపసంగ్రహః = కూడగట్టుట, (భవతి = అగును).

తాత్పర్యము— సమాసావస్థకు ముందు (వాక్యమందు) నఞు నివృత్తికి ద్యోత కము. ఉత్తరపదమగు బ్రాహ్మణ శబ్దము నివృత్తితో కూడిన బ్రాహ్మణరూపమైన యర్థమును చెప్పును. ఇట్లా శబ్దములు భిన్నార్థములు. సమాసమున మాత్రము ఉత్తర పదార్థముతో కలిసిన అభావమను ఒకే యర్థము బోధపడును. అనగా నఞు అభావమునకు వాచకమేయగును. ఆ అభావమందే "క్షత్రియః" మొదలగు విశేషములన్నియు ఇమిడి పోవును.

వివరణము— వాక్యమందు బ్రాహ్మణాది శబ్దము అభావమునకు వాచకము. నఞు ద్యోతకము. సమాసమందు నఞు అభావమునకు వాచకము. బ్రాహ్మణ శబ్దము ద్యోతకము. అభావమందు క్షత్రియాది భేదములన్నియు ఇమిడియుండును. ఇట్లు నఞర్థము ముఖ్యమగుట వలనను, అందే విశేషములన్నియు నుండుటవలనను, క్షత్రియాదులు సమాసార్థమగుటయు, పూర్వపదార్థము ముఖ్యమగుటయును సిద్ధించును. ॥313॥

అవతారిక— అన్యపదార్థము ముఖ్యమగునప్పటి తీరును వివరింపుచున్నాడు.

శ్లో॥ తే క్షత్రియాదిభిర్వాచ్యా వాచ్యా వా సర్వనామభిః ।
యాంతీవాన్యపదార్థత్వం నఞో రూపావికల్పనాత్ ॥ 314

క్షత్రియాదిభిః = క్షత్రియ మొదలగు శబ్దములచే, వాచ్యాః = చెప్పదగిన, వా = లేక, సర్వనామభిః = సర్వనామ శబ్దములచే, వాచ్యాః = చెప్పదగిన, తే = అవి (ఆ యా విశేషములు) నఞః = నఞ్ యొక్క, రూపావికల్పనాత్ = స్వరూపమును ఎరుగనందువలన, అన్యపదార్థత్వమ్ = అన్యపదార్థమగుటను, యాంతి + ఇవ = పొందునట్లగును.

తాత్పర్యము— వాస్తవమున అబ్రాహ్మణః, అనునదియే శబ్ద శక్తి ననుసరించి క్షత్రియాది విశేషములను బోధింపగలుగును. మరల క్షత్రియః మొదలగు విశేషపదములను వాడనక్కర లేదు. అయినను నఞ్‌న కిట్టి సామర్థ్యమున్నదని గుర్తింపనందున, విశేషములు స్పష్టపడుటకై, ఒకప్పుడు "క్షత్రియః" మొదలగు శబ్దములనుగాని "సః", "అయమ్" మొదలగు సర్వనామములనుగాని ప్రక్కను పలుకుట జరుగుచుండును. (అబ్రాహ్మణః = క్షత్రియః —లేక— అబ్రాహ్మణః - సః, మొదలగు రీతి) దాని ననుసరించి అవి అన్యపదార్థములనియు, వానిని బోధించు సమాసమన్యపదార్థ ప్రధానమనియును అనుకొందురు. ఇదియొక విధమైన భ్రాంతి.

వివరణము— నఞ్ కేవలము నిషేధమును, బ్రాహ్మణ శబ్దము "బ్రాహ్మణుడు" అను నర్థమును చెప్పునని భావించినందున, "బ్రాహ్మణుడు కాని క్షత్రియుడు మొదలగు వ్యక్తి" అన్యపదార్థమగునను భ్రాంతి కలుగును. కాని విశేషములను కూడగట్టుకొన్న నఞర్థమే ముఖ్యమన్నపుడు, విశేషములకై వేరుగా ప్రయత్న మక్కరలేదు. అవి స్వార్థములేయగును కాని అన్యపదార్థములు కావు. కాగా విశేషములను చెప్పు శబ్దములను వాడనక్కరలేదు ॥314॥

అవతారిక— నఞ్ సమాసము పూర్వపదార్థ ప్రధానమన్న పక్షమందలి దోషమును చూపుచున్నాడు.

శ్లో॥ విశేషస్యాప్రయోగే తు లింగసంఖ్యే న సిధ్యతః ।
అవర్షాదిషు దోషశ్చ హేమంతోఽన్యాశ్రయో యతః ॥ 315

విశేషస్య = విశేషమునకు, అప్రయోగే + తు = ప్రయోగము లేనపుడు, లింగసంఖ్యే = లింగవచనములు, న + సిధ్యతః = సిద్ధింపవు, అవర్షాదిషు = "అవర్షాః - హేమంతః", మొదలగువానియందు దోషః + చ = దోషము కూడ (భవేత్ = కలిగెడిని), యతః = ఎందువలన అన్యాశ్రయః = వేరుగానున్న ఆశ్రయము, హేమంతః = హేమంతము (భవతి = అగును).

తాత్పర్యము—పూర్వపదార్థము ముఖ్యమన్నపుడు, విశేషమునుచెప్పు "క్షత్రియః"

మొదలగు శబ్దమును వాడనక్కర లేదందురు. అట్లయినచో సమాసము సామాన్యవాచకమే అయినట్లగునుగాన, సామాన్యమైన నపుంసకలింగమును, ఏకవచనమును మాత్రమే రావలసి వచ్చును. (విశేషపదమును వాడినపుడు దానినిబట్టి సమాసమునకు లింగవచనములు సిద్ధించును గాన ఈ బాధక ముండదు).

అట్లే "అవర్షాః హేమంతః" అనుచోట హేమంతము ఆశ్రయముగా పేర్కొనబడుటచే, దాని ననుసరించి "అవర్షః" అను ప్రయోగమే సాధువు కావలసి వచ్చును. (వర్షా శబ్దమునకు హ్రస్వమును, పుంలింగమును రావలసి వచ్చును).

వివరణము— కాగా నఞ్ సమాసమున పూర్వపదార్థము ప్రధానమన్నచో దోషములు సంభవించుచున్నందున "ఉత్తర పదార్థము ముఖ్యము" అన్న పక్షమే మంచిదని ఫలించును. ఇదియే సిద్ధాంతము కూడ. అయినను "గుణవచనములకు ఆశ్రయమునుబట్టి లింగవచనములగును", అను వచనముయొక్క ఉపయోగము, పూర్వపదార్థము ముఖ్యమను పక్షమందు సంభవించునని విశదముచేయుటకై ఆ పక్షము కూడ చూపబడినది.

విశేష విషయములు— ఇట్లు, 159 వ కారిక మొదలుకొని ఈ కారికవరకును, మహాభాష్యము ననుసరించి ద్వంద్వసమాసము మొదలగు ఆయా ప్రదేశములలోని లింగ వచనముల అతిదేశమును దాని ప్రయోజనమును అతివిపులముగ చర్చింపబడినది. (159 వ కారికలోని విషయముల వరుసమాత్రము మారి చివరినుండి మొదటికి వచ్చినది). ॥315॥

అవతారిక— శబ్దముల కర్థము జాతియా? వ్యక్తియా? అని శాస్త్రములందు విచారణచేయబడినది. వ్యాకరణశాస్త్రమునను, "సరూపాణా మేకశేష ఏకవిభక్తౌ" (1-2-64) అను పాణిని సూత్ర మహాభాష్యమున నీ విషయము విమర్శింపబడినది. ఆ సూత్ర మేకశేష విధాయకము. రాముడును లక్ష్మణుడును అని చెప్పదలచినపుడు 'రామలక్ష్మణౌ' అందుము. అటులనే ఇద్దరు రాములు అని చెప్పదలంచినపుడు "రామరామౌ" అని యనవలసియున్నది. కాని 'రామౌ' అని ఒక రామశబ్దమునే ప్రయోగింతుము. ఒక వ్యక్తిని బోధించుట కొక శబ్దము. అనేక వ్యక్తులను బోధించుట కనేక శబ్దములను ప్రయోగింపవలెనుగదా యను శంకకు సమాధానముగా నవతరించిన దా సూత్రము.

సమానరూపములగు ననేకశబ్దముల నుపయోగింపవలసి యున్నపుడందొక్కటియే మిగిలి, లోపించిన శబ్దముల అర్థమునుగూడ, ఆ మిగిలిన శబ్దమే బోధించును అని ఆ సూత్రము తెలియచేయుచున్నది. కనుక, 'రామౌ' అని, "రామాః" అనియు నొక రామ శబ్దమే ఇద్దరు ముగ్గురను బోధింపదలచినపుడును ప్రయోగింపబడుచున్నది.

ఈ ఏకశేషవిధాయక సూత్రమును, పతంజలిమహర్షి, తన మహాభాష్యమునందు, ఇది అనావశ్యకమని త్రోసిపుచ్చినాడు. వాజప్యాయనుడని వేరొకముని. ఆతని మతమున శబ్దములకు జాతియే అర్థము. గోశబ్దమునకు గోత్వము అని అర్థము. ఘటము అనగా ఘటత్వము అని యర్థము. జాతి అనునది ఒక పదార్థము. అది ప్రత్యక్షాది ప్రమాణములచేత

సాధింపబడినది. కావున 'గావౌ' అనిన, అట నుచ్చరింపబడిన, ఒక గోశబ్దమే, ఆ జాతిని బోధింపజాలును. అట్లే, 'ఘటాః' = ఘటములు అనినపుడును ఒక ఘటశబ్దమే ఆ జాతి నంతను బోధించుచున్నది. కనుక ఏకశేషవిధాన మక్కఱలేదని భాష్యకారుని తాత్పర్యము.

ఇపుడొక శంక. జాతికి లింగమును సంఖ్యయును లేవుగదా ః పుం, స్త్రీ, నపుంసక లింగ సంబంధమును ఏకవచనాదివచన సంబంధమును శబ్దముల కెట్లు కలుగును ? అని, దీనికి సమాధానము, "లింగవచన సిద్ధిర్గుణస్యానిత్యత్వాత్" అను వార్తికముచే చెప్పబడినది. గుణములనగా, పుంస్త్వ స్త్రీత్వాదులును, ఏకత్వ ద్విత్వాది సంఖ్యలును, వానితో జాతికి 'ఏకార్థసమవాయము' అను సంబంధము కలదు. అనగా వ్యక్తులందు జాతియును, గుణము లును 'సమవాయము' అను సంబంధముతో నుండును. జాతినే వైయాకరణులు ఆకృతి అనియు వ్యవహరింతురు. అది సకల పదార్థగతము కాని అది నియతములయిన లింగ సంఖ్యలుగల శబ్దములచేతనే బోధింపబడుచుండును. ఒకానొక జాతి, స్త్రీలింగ శబ్దముచేతను, వేరొకటి పుంలింగ శబ్దముచేతను, అట్లే, ఏకత్వాది సంఖ్యలుగల శబ్దములచేతను తెలియచేయ బడుచుండును. అయ్యది వివక్షాధీనము. అనగా వక్త ఇష్టముచొప్పున జరుగునదియని గుణ వివక్షానిత్యత్వాత్' అను వార్తికము సూచించుచున్నది.

జాతికి లింగవచన సిద్ధి గుణవచన శబ్దములయిన, శుక్లాది శబ్దములకువలె సంభ వింపవచ్చునని పక్షాంతరమును "గుణవచనవద్వా" అను వార్తికము చెప్పుచున్నది. శుక్ల శబ్దము, తెలుపు అను, గుణమును చెప్పును. గుణములకు లింగములేదు వచనములేదు. కాని ఆ గుణముగల ద్రవ్యము వస్త్రము. దానికి అవి యున్నవి. కనుక శుక్ల శబ్దము నపుంసకము ఆ శుక్ల గుణముగలది శాటి అయిన నది స్త్రీలింగముగాన 'శుక్లాశాటీ' అందురు. పటమయిన, 'శుక్లః పటః' అందురు. ఆ విధముగనే జాతి శబ్దములును ఆ జాతి కాశ్రయములగు వాని లింగవచనములను బొందునని ఈ కారిక చెప్పుచున్నది.

శ్లో॥ ఆకృతిస్సర్వశబ్దానాం యదా వాచ్యా ప్రతీయతే ।
ఏకత్వా దేకశబ్దత్వం న్యాయ్యం తస్యాంచ వర్ణ్యతే ॥ 316

సర్వశబ్దానామ్ = అన్ని శబ్దములకును, ఆకృతిః = జాతి, యదా = ఎపుడు, వాచ్యా = శక్యార్థముగా, ప్రతీయతే = తెలియబడుచుండునో, తదా, తస్యామ్ = అపుడు, ఆ జాతి యందలి, ఏకత్వాత్ = ఏకత్వమువలన = అది ఒక్కటే అగుటవలన, ఏకశబ్దత్వమ్ = ఒకే శబ్దముచే నది బోధింపబడుట, న్యాయ్యమ్ = న్యాయయుతమైనదిగా = సోపపత్తికముగా, వర్ణ్యతే = వర్ణింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు—— జాతి అనునది ఒకటియే శబ్దమున కర్థము. కావున దానిని బోధించుటకు ఒక శబ్దమే చాలును. కాగా ఏకశేషవిధానముతో బనిలేదు. అర్థభేద ముండినగదా శబ్దమునకు భేదముండదగును ? అర్థము జాతియే. అది ఒక పదార్థమే ఆయె, మనసుముందు శబ్దమును వినినతోడనే స్ఫురించునది సామాన్యమే. సామాన్యమనినను జాతియే.

''జాతిర్జాతంచ సామాన్యమ్''. అవి మూడును పర్యాయములు. ప్రతినియతమగు విశేషము శబ్దమువలన స్ఫురింపదు. సామాన్యమే స్ఫురించును. అదియే శబ్దార్థము ॥316॥

అవతారిక— సకల శబ్దాభిదేయ అగు ఈ జాతి 'అవిష్టలింగ' అనిరి. అనగా దీనిచే లింగ మావేశింపబడియుండునని యర్థము. పుంస్త్వ స్త్రీత్వాది లింగములు మూడును అన్ని పదార్థములందును నుండును అయినను, కొన్ని శబ్దములు, కొన్ని లింగములను మాత్రమే వ్యక్తము చేయును. కాబట్టి ఆ యా శబ్దముల ననుసరించి, జాతి 'నియతలింగ' అగును. ఆ విషయ మీ కారికలో చెప్పబడుచున్నది.

శ్లో॥ అవిష్టలింగతా తస్యాం స్యాద్గ్రామ్య పశుసంఘవత్ ।
ద్రవ్యభేదేపిచైకత్వా త్తత్రైకవచనం భవేత్ ॥ 317

తస్యాం = ఆ జాతియందు, గ్రామ్య పశుసంఘవత్ = గ్రామీణ పశువుల సంఘములను బోధించువానికి వలె, అవిష్టలింగతా = నియతమగు లింగమును గలిగియుండుట, స్యాత్ = సంభవించును, ద్రవ్యభేదే సత్యపి = ద్రవ్యముల కనేకత్వమున్నను, తత్ర = ఆ జాతి యందు, ఏకత్వాత్ = ఏకత్వము = అభేదము ఉండుటవలన, ఏకవచనం, భవేత్ = ఏకవచన ప్రత్యయము, సిద్ధించును.

తాత్పర్య వివరణములు— ఏకశేష ప్రకరణమునందు, ''గ్రామ్య పశుసంఘేష్వ తరుణేషు స్త్రీ'' (1-2-73) అను నొక సూత్రము ఏకశేషవిధాయకము గలదు. ''పుమాన్ స్త్రియా'' (1-2-67) అను సూత్రము. స్త్రీపురుష వ్యక్తులను కలిపి చెప్పదలంచినపుడు, ఆసహోక్తిలో, పురుషుని బోధించు శబ్దమే శేషించి స్త్రీనిగూడ బోధించును అని చెప్పుచున్నది ఆ సూత్రమున కిది అపవాదము. 'ఆరణ్యకములు కాని పశువుల స్త్రీపురుష సంఘములను జెప్పదలంచినపుడు, ఆసహోక్తిలో పుంవాచకము శేషింపదు. 'స్త్రీవాచకమే శేషించును' అని దీని యర్థము ''గావః ఇమాః'' అని యుదాహరణము 'గావశ్చ గావశ్చ' - అని విగ్రహము. శేషించినది స్త్రీలింగ గోశబ్దము. పుంలింగము గాదు. ఆ విషయమును స్పష్టపరచుటకు 'ఇమాః' అని స్త్రీలింగ విశేషణము చూపబడినది. 'గావః అను, నీ ఏకశేష వృత్తి అగు పదమునకు 'ఎద్దులును, ఆవులును' - అని యర్థము.

ఈ సూత్రమును గూడ భాష్యకర్త ప్రత్యాఖ్యానము చేసివేసెను. జాతివాచక శబ్దములకు లింగనియమము స్వభావసిద్ధము. అది ఆయా శబ్దముల అభిధాశక్తి నాశ్రయించి యుండును. కనుకనే బ్రాహ్మణశబ్దము, పుం స్త్రీలింగ మాత్రయుక్తము. వృక్ష శబ్దము కేవల పుంలింగమే. శబ్దముల కర్థము జాతి. అర్థమనగా శక్తిచే సిద్ధమగుచున్న అర్థమనుట. వ్యక్తులు అనుమాన ప్రమాణ గమ్యములు. అవి భిన్నభిన్నములయినను జాతినిబట్టిన సంఖ్య ఏకత్వమే గనుక ఏకవచనము. కాని, ''సంపన్నః వ్రీహిః'' (ధాన్యము సమృద్ధముగ పండినవి) అని చెప్పదలంచినపుడు, ''సంపన్నాః వ్రీహయః'' - అని బహువచనాంత శబ్దప్రయోగము గూడ లోకసిద్ధమగుట వలన, అది సిద్ధించుటకై, ''జాత్యాఖ్యాయామేకస్మిన్ బహువచన

మన్యతరస్యామ్'' (1-2-59) అను సూత్ర మారంభింపబడినది. జాతిని చెప్పదలంచి నపుడు, ఒకే పదార్థమది అయినను, పర్యాయముగ బహుపదార్థములవలె నగునని ఆ సూత్ర మునకు భావము. ॥317॥

అవతారిక — జాతికి లింగభేదముండుననిన, అవిష్టలింగత చెప్పబడినదిగదా ; అది యెట్లు కుదురును ? అవిష్టలింగత అనగా నియతముగ నొకే లింగము కలిగియుండుట గదా ! - అనిన—

శ్లో॥ ఆశ్రయాణాం హి లింగైస్సానియతైరేవయుజ్యతే ।
తథా చ యుక్తవద్భావే ప్రతిషేధోనిరర్థకః ॥ 318

నియతైః ఏవ = నియమము కలవియేఅగు, ఆశ్రయాణాం = జాతికాశ్రయములయిన వ్యక్తుల యొక్క, లింగైః = పుంస్త్వాది లింగములతో, సా, యుజ్యతే = ఆ జాతి, సంబద్ధమై యుండును, తథా చ = కాబట్టియే, యుక్తవద్భావే = లింగవచనములకు చెప్పబడిన యుక్త వదతిదేశమున, ప్రతిషేధః = 'అజాతేః' - అను నిషేధము, నిరర్థకః = ప్రయోజనము లేనిది.

తాత్పర్య వివరణములు— పుంస్త్వాది లింగములు, ఏకత్వాది సంఖ్యలు, అపు గుణములతో పాటు, వ్యక్తులయందు జాతియును సమవాయమను సంబంధముచే సంబద్ధమై యుండును. ''లుపియుక్తవత్ వ్యక్తివచనే'' (1-2-51) అని యొక సూత్రము. ఉదాహర ణము 'పంచాలాః' - అనునది. పంచాలదేశీయుల నివాసమయిన జనపదమని యర్థము. ఈ అర్థమునందు ఒక తద్ధిత ప్రత్యయమును విధించి, దానికి, 'జనపదే లుప్' (4-2-81) అను సూత్రముచేత నా ప్రత్యయమునకు లుప్పు = లోపము చెప్పబడినది. కాగా ప్రత్యయ ముండదు. ప్రకృతి మాత్రమే యుండును. ప్రకృతికి పంచాలదేశ మర్థము ప్రత్యయమునకు 'వారి నివాసము' - అని యర్థము. దేశవాచకమగు పంచాల శబ్దము బహువచనాంతము. ప్రత్యయమునకు లుప్పు = ప్రత్యయలోపము ఆ పదముచే విధింపబడినపుడు, లుబంతమునకు లింగవచనములు, ప్రకృతి లింగవచనములే యుండునను పై అతిదేశమువలన, 'పంచాలాః' అని బహువచనాంతమే సాధుశబ్ద రూపము.

ఇక, 'పంచాలాః జనపదః' = పంచాలదేశము వారి నివాసము - జనపదము, అని ప్రయోగించినపుడు, 'పంచాలాః' - అను దానికి జనపదము విశేషణము. విశేషణ పద మేల బహువచనాంతము ప్రయోగింపబడలేదు ? అనిన, జాతివాచకములు కాని విశేషణము లకే వ్యక్తివచనములు వచ్చునని, ''విశేషణానాం చాజాతేః'' (1-2-52) అను సూత్రము చెప్పుచున్నది. జనపద శబ్దము జాతివాచి కావున బహువచనము లేదు. రమణీయ శబ్దము విశేషణమగుననుకొనుడు. అపుడది జాతిశబ్దము కాదుగాన 'పంచాలాః రమణీయాః' - అనియే ప్రయోగము.

ప్రకృతమున - జాతిశబ్దములు తమ తమ శక్తివిశేషముచేత, ఆయా నియత

లింగములనే గ్రహించునుగాని, ప్రకృతి లింగవచనములను పొందనే పొందవు కావున "అజాతేః" అను ప్రతిషేధ మనావశ్యకమని తాత్పర్యము.

వృక్షః, పాదపః, తరుః శింశపా, పనసమ్ – ఈ శబ్దములు వృక్షజాతి వాచకములు. అందు వృక్ష, పాదప, తరు, అనునవి వృక్షత్వ జాత్యాశ్రయముల పుంలింగమునే కలిగియుండును. శింశపా – స్త్రీలింగము. పనసమ్ – నపుంసకము. కొన్ని శబ్దములు ద్విలింగములు. కొన్ని త్రిలింగములు. అది వాని వాని శబ్దశక్తి భేదమునుబట్టి యుండును. అవిష్ట లింగత అన నిదియే. ॥318॥

అవతారిక— గుణవచన శబ్దములగు శుక్లాదులందువలె, జాతి, స్వాశ్రయగత లింగమును గ్రహించునంటిరి గదా ! అపుడు జాతికి, తనదిగా నెట్టి లింగసంబంధమునులేదని యర్థము. అది ద్రవ్యధర్మముగదా ! అని ప్రశ్న. సత్యమే. లింగసంబంధము శబ్దసంస్కార మాత్రమే. కనుకనే నియత పుంలింగమైన పాదపశబ్దమునకు, 'పాదపః శింశపా' అనియు, 'పాదపః పనసమ్' అనియు నిట్లు భిన్నలింగ శబ్దములతో సామానాధికరణ్య మగపడుచున్నది.

సకల పదార్థములకును, సత్వరజస్తమోగుణముల, ఉపచయము, అపచయము, స్థితి – అను మూడు ప్రవృత్తులును, నియతముగ నుండును. అవియే క్రమముగ శాస్త్రీయము లగు పుం, స్త్రీ, నపుంసక లింగములు. శాస్త్రీయ లింగమునుబట్టియే జాతికి అవిష్టలింగత. ఈ విషయము నీ కారిక వ్యాఖ్యానించును.

శ్లో॥ సర్వత్రావిష్టలింగత్వం లోకలింగపరిగ్రహే ।
విరోధిత్వాత్ ప్రసజ్యేత నాశ్రితం తచ్చలౌకికమ్ ॥ 319

లోకలింగ పరిగ్రహే = లోకవ్యవహారమున రూఢమైన లింగమును గ్రహించిన, అవిష్టలింగత్వం = నియతలింగత్వము, సర్వత్ర, ప్రసజ్యేత = సకలార్థములందును, ప్రాప్తించును, తత్ = అందువలన, విరోధిత్వాత్ = విరుద్ధమగుటవలన = విరోధమువలన, లౌకికం = లోకప్రసిద్ధమగు లింగము, న ఆశ్రితమ్ = ఆశ్రయింపబడలేదు.

తాత్పర్య వివరణములు— స్తనకేశములు కలిగియుండుట, లోకమునందు, స్త్రీత్వము లోమవత్త్వము పుంలింగము. ఈ లింగము నాశ్రయించినచో స్తనకేశ సంబంధము గల స్త్రీ, స్త్రీలింగ శబ్దములచేతనే బోధింపబడవలసి యుండును. పుంలింగమైన దారశబ్దము చేతనుగాని, నపుంసకలింగమగు కళత్రశబ్దముచేతగాని భార్య అను నర్థము చెప్పబడకపోవలసి వచ్చును. అశ్వమును వాహనశబ్దము చెప్పకపోవును. అది నపుంసకముగదా !

అందువలన, వైయాకరణులు, లింగవిషయమున నొక స్వీయ సిద్ధాంతమును ఏర్పరచుకొనవలసి యుండును—

"తస్మాత్ న వైయాకరణైః శక్యం లౌకికం లింగమాస్థాతుమ్ ।
అవశ్యం కశ్చిత్ స్వకృతాంత ఆస్థేయః ॥" ఇతి అని భాష్యము

లింగము అర్థమందుండును. శబ్దమునందుగాదు. ఏ పదార్థమునైనను, మనము, 'అయం పదార్థః' 'ఇయం వ్యక్తిః' 'ఇదం వస్తు' - అని, పుంలింగ పదార్థపదముచేతను, స్త్రీలింగ వ్యక్తిపదముచేతను, నపుంసక లింగవస్తు పదముచేతను వ్యవహరించుచున్నాము. (ఘట పదార్థమందుము. ఘటవ్యక్తి, ఘటమను వస్తువు అని అనుచుందుము). కనుక సకల పదార్థములకును లింగత్రయ సంబంధము సిద్ధించుటకు వైయాకరణులు తామొక పారిభాషిక లింగమును తప్పక ఆశ్రయింపవలెనని భావము. ॥319॥

అవతారిక— లౌకిక లింగమున కంతట సంభవమును లేదు.

శ్లో॥ సామాన్య మాకృతిర్భావోజాతిరిత్యత్ర లౌకికమ్।
లింగం న సంభవత్యేవ తేనాన్యత్ పరిగృహ్యతే ॥ 320

సామాన్యమ్ = సామాన్యము = జాతి, ఆకృతిః = ఆకృతి = అవయవముల సన్నివేశము = జాతి, భావః = సామాన్యము = జాతి, జాతిః = సామాన్యము = జాతియే, ఇతి అత్ర = అను నీ నాలుగు పదముల అర్థమందును, లౌకికం లింగం = లోకప్రసిద్ధమయిన స్తనకేశ వత్త్వము, లోమవత్త్వమును, నసంభవత్యేవ = సంభవింపనే సంభవింపదు, తేన అన్యత్ = అందుచేత, వేఱొక శాస్త్రీయలింగము, పరిగృహ్యతే = గ్రహింపఁబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ఈ నాలుగు పదములకును జాతియే అర్థము. అందు భావశబ్దము పుంలింగము జాతి ఆకృతి శబ్దములు స్త్రీలింగములు. సామాన్య శబ్దము నపుంసకము. ఇట్లు భిన్న భిన్న లింగములు గల శబ్దములు, ఒకే పదార్థమును, 'జాతి' అను దానిని చెప్పుచున్నవి. స్తనకేశవత్త్వముగాని, లోమవత్త్వముగాని ఆ పదార్థమునకు సంభవింపదు. అపుడా శబ్దములకు ఏ లింగమును లేకపోవలసి వచ్చును. అందువలన శాస్త్రీయ లింగాశ్రయణ మావశ్యకమని తాత్పర్యము.

కేశమనగా భగము, లోమ అనగా పురుషగుహ్యము. అని వ్యాఖ్యాతలు. ''స్తన కేశవతీ స్త్రీస్యాల్లోమశః పురుషః స్మృతః''. ॥320॥

అవతారిక— 'లోకనిరూఢముగాని, కేవల స్వసిద్ధాంత సిద్ధమైన, ఆలింగ మేది? అని మహాభాష్యమున ప్రశ్నించి, ''సంస్త్యాన ప్రసవౌలింగమ్'' అని సమాధానము చెప్ప బడినది - ఆ గ్రంథ వ్యాఖ్యానరూప మీ కారిక

శ్లో॥ ప్రవృత్తిరితి సామాన్యం లక్షణం తస్యకథ్యతే।
ఆవిర్భావస్తిరోభావః స్థితిశ్చేత్యథభిద్యతే ॥ 321

ప్రవృత్తిః ఇతి = పరిణామము, అని, తస్య = ఆ శాస్త్రీయలింగమునకు, సామాన్యం లక్షణం = సామాన్య లక్షణము, కథ్యతే = చెప్పబడుచున్నది, అథ, తత్ = తరువాత, అది, ఆవిర్భావః = ఉపచయము = వృద్ధి, తిరోభావః = అపచయము = తగ్గుదల, స్థితిః చ = సమత్వమున్ను, ఇతి = అని, భిద్యతే = భేదమును పొందుచున్నది.

తాత్పర్య వివరణములు— మహాభాష్యమున "సంస్త్యానప్రసవౌ లింగమ్" అని వార్తికము. అది లింగలక్షణ బోధకము. స్త్రీ అను శబ్దము, స్త్యై ష్ట్యై = శబ్ద సంఘాతయోః అను ధాతువునుండి ఏర్పడినది.

స్త్యాయతి అస్యాంగర్భః ఇతి స్త్రీ - అని విగ్రహము. ఈ వ్యక్తియందు, గర్భము అనగా శుక్రము, శోణితముతో సంహతమగుచున్నది = కలియుచున్నది కావున ఈ వ్యక్తి స్త్రీ అనబడును.

'సూతే ఇతి ప్రసవః' అనగా పురుషుడు. సూతే అనగా శుక్రంత్యజతి = శుక్రమును విడుచువాడు కాగా ప్రసవః అనబడును.

ఇది లోకప్రసిద్ధమగు నర్థము. ఇక శాస్త్రమునందు, సంస్త్యాన ప్రసవ శబ్దములు రెండును భావార్థకములు. స్త్రీ = స్త్యానము = అపచయము = హ్రాసము = తగ్గుదల. ప్రసవః = పుమాన్ = పుంస్త్వము = ప్రవృత్తి = వృద్ధి

దేనియొక్క ఉపచయాపచయములు ? = వృద్ధిహ్రాసములు ? అనగా - శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము. అను, గుణముల వృద్ధిహ్రాసములు.

శబ్ద స్పర్శాదులు, సత్వరజస్తమోగుణముల పరిణామరూపములు సకల పదార్థములును, పైన చెప్పిన సంస్త్యాన ప్రసవములు కలవియే. అవి సతతము మారుచునే యుండును. ఏదియు నిలుకడగ నుండదు. పెరుగదగినంత పెరుగును. లేదా తరుగును. అందు, రజోగుణమునకు, ప్రవృత్తి అననది ధర్మము. అయ్యది ప్రధానమైయున్నపుడు ప్రాదుర్భావమును, తమస్సు ప్రధానమైనపుడు తిరోభావమును అనబడును. ఆ మూడు గుణములును సమపాళ్లలో నుండుట 'స్థితి' అందురు. అది నపుంసకము = స్త్రీపుంస నిషేధరూపము. స్త్రీ కాదు. పురుషుడును గాదు. ''నస్త్రీ, నపుమాన్'' = నపుంసకమ్. కనుకనే నపుంసక లింగమునకు వేరుగ లక్షణమును జెప్పలేదు.

ఉపచయాపచయావస్థలందును, స్థితి అనునది ఉండునుగాన, నపుంసకమును 'లింగ సర్వనామ' అనిరి. నామలలో, సర్వనామ అనునట్లు లింగములలో సర్వనామ. ఇవి సకల పదార్థ సాధారణములయినచో, లింగవ్యవస్థ ఎట్లు ? అని శంకించి, 'వివక్షాతః' అని సమాధానము చెప్పిరి. వక్త తలంపునుబట్టి అని భావము. ఉపచయ వివక్షలో - పుంలింగము. అపచయమును వివక్షించిన. స్త్రీలింగము. దేనిని వివక్షింపకున్న, నపుంసకము. అని వ్యవస్థ. ॥321॥

అవతారిక— ఈ లింగము సకల పదార్థములను వ్యాపించియుండునని మహాభాష్యమున చెప్పిన విషయమును వివరించునది ''ప్రవృత్తిమంతః'' - అను నీ కారిక.

శ్లో॥ ప్రవృత్తిమంతః సర్వేర్థాః తిసృభిశ్చ ప్రవృత్తిభిః ।
సతతం న వియుజ్యన్తే వాచశ్చైవాత్ర సంభవః ॥ 322

తిస్పృభిః=ఆవిర్భావము, తిరోభావము, స్థితి అను మూడు, ప్రవృత్తిభిః=ప్రవృత్తులతోడను, సర్వే = అన్ని, అర్థాః = పదార్థములును, సతతం = ఎల్లపుడును, నవియుజ్యన్తే = వియుక్తములు కావు, ప్రవృత్తిమంతశ్చ = నిత్యము ప్రవృత్తికలవియే యగుచుండును, అత్ర ఏవ= ఇట్టి పదార్థములందే, వాచః = శబ్దమునకు, సంభవః = అవకాశము=విషయభావము. (బోధ్యమయిన విషయము).

తాత్పర్య వివరణములు—

"ప్రవృత్తిః ఖల్వపినిత్యా । న హి కశ్చిత్ స్వస్మిన్నాత్మని
ముహూర్తమప్యవతిష్ఠతే । వర్ధతే యావ దనేన వర్ధితవ్యమ్" ॥

అపాయేన వా యుజ్యతే అని మహాభాష్యము. ప్రవృత్తి అనగా పరిణామము = మారుచుండుట, అది నిత్యము. ఏ పదార్థమును, మారకుండగ క్షణకాలము కూడ నుండదు. పెరిగినంత పెరుగును. తరిగినంత తరుగుచుండును. కావున వానికి ప్రతిక్షణమును అవస్థాంతరమును బొందుట స్వభావము. పరిణామములేనిచో అవస్థల మార్పుండదు గదా. "సర్వాశ్చ పునర్మూర్తయ ఏవమాత్మికాః సంస్త్యాన ప్రసవగుణాః అని భాష్యము. సకలమూర్తులును = వస్తువులును, ఉపచయాపచయములు కలిగియే ఉండును. ఇటువంటి సతత పరిణామి పదార్థములే శబ్దములకు విషయము. పరిణామరహితమై శుద్ధముగ నుండు వస్తుతత్త్వమేదియు వాగ్విషయము కాదు.

అది ఆకారము కలదియై యున్ననే శబ్దము దానిని బోధించును. కనుక ఈ లింగ సంబంధము సర్వశబ్దములకును, శబ్దశక్త్యనురోధముగ సంగతమే యగును. ॥822॥

అవతారిక— పకృతితత్త్వము సత్వరజస్తమోగుణమయము. అందు రజోగుణము దానికి సతత ప్రవృత్తిని కలిగించును. ఆ ప్రకృతియొక్క- వికారములే - మార్పులే - మార్పురూపములే, మనకు భోగయోగ్యముగనున్న వస్తుజాతము. ఆ వస్తువులును సతత పరిణాములే. కాని భోక్తయగు పురుషుడు, భోగ్యవస్తువులకంటె విలక్షణుడు. ఈతడు చేతనుడు. అవి అచేతనములు. ఈతడు నిర్గుణుడు. కావుననే పరిణామము లేనివాడు.

అయినను, నియతలింగములయిన, ఆత్మ, చితి, చైతన్యము. అను పుం, స్త్రీ నపుంసక లింగశబ్దములచేత చెప్పబడుచున్నాడే అది యెట్లు ? శుద్ధము పరిణామ రహితమును అగు వస్తువు వాగ్విషయము కాదంటిరిగదా ! అను శంకకు సమాధానపరముగా ఈ కారిక రచింపబడినది.

శ్లో॥ యశ్చాప్రవృత్తి ధర్మాఖ్యః చితిరూపేణ గృహ్యతే ।
అనుయాతీవబో౽న్యేషాం ప్రవృత్తిర్విష్వగాశ్రయః ॥ 323

అప్రవృత్తిధర్మా = పరిణామము అను ధర్మములేని, యః అర్థః = ఏ వస్తువు = అనగా పురుషుడు, చితిరూపేణ = కేవల చైతన్యరూపముగా, గృహ్యతే = యోగులచే గ్రహింపబడు

చున్నాడో, విష్వగాశ్రయః సః = సకల పదార్థములయందునున్న, ఆ పురుషుడు, అన్యేషాం ప్రవృత్తీః = ఇతరములగు భోగ్యవస్తువుల పరిణామములను, అనుయాతీవ = అనుభవించు నట్లుగపడును.

తాత్పర్య వివరణములు— అంతఃకరణమను నర్థమునందు చైతన్యముయొక్క ఛాయ సంక్రమించును. అందువలన దానికి భోగ్యత ఏర్పడును. కావున, వ్యవహార దశలో చైతన్యమనునది స్వతః పరిణామరహితము అయినను, భోగ్యము అను, భావముచేత శబలితమై రంజితమయియే గ్రహింపబడును. అది జ్ఞానమునకు విషయము కానిచో = అందనిచో, దానిని శబ్దము బోధించుట అనునదియే సంభవింపదు. కావున ఆచైతన్యము, భోగ్యవస్తువుల పరిణామ విశేషములనుబట్టి లింగసహితము నగును. ఆ యా వస్తువుల ఆకారముతో అంతఃకరణ వృత్తులు, చైతన్యమునందు ప్రతిబింబించునని భావము. (ఇట కారికలో 'విష్వగాశ్రయః' అనియే పాఠము. బహువచనాంత పాఠ మపపాఠము). ॥323॥

అవతారిక— ఈ విషయము నింకను వివరించునదియే ఈ కారిక.

శ్లో॥ తేనాస్య చితిరూపంచ చితికాలశ్చభిద్యతే ।
తస్య స్వరూపభేదస్తు న కశ్చిదపి విద్యతే ॥ 324

తేన = ఆ భోగ్య వస్తుజాతముచేత, అస్య = ఈ భోక్తయొక్క, చితిరూపంచ = చైతన్య స్వరూపమును, చితికాలః చ = చైతన్య కాలమును, భిద్యతే = వేరుగా గ్రహింపబడును, తస్య = ఆ భోక్తయొక్క, స్వరూపభేదః తు = స్వరూపమున భేదము మాత్రము, కశ్చిదపి, న విద్యతే = ఏదియును లేదు

తాత్పర్య వివరణములు— 'జ్ఞానము' అనునది ఒక్కటియే. కాని ఆ జ్ఞానమునకు విషయములయిన ఘట పటములనుబట్టి, ఘట జ్ఞానమనియు, పట జ్ఞానమనియు, భేదమును వ్యవహరింతుము.

ఆ విధముగను, చైతన్యమనునది ఒక్కటియే. అది అవిచ్ఛిన్నముగ నుండునది. దానికి దేశకాలభేదముగాని స్వరూపభేదముగాని లేదు. భోగ్యములు భిన్న భిన్నములగుటవలన వాని భేదములనుబట్టి దానికి భేదవ్యవహారము. కాగా పురుషుడు వేరు, చితిక్రియ వేరును గావు. భేదము కల్పనయే. ॥324॥

అవతారిక— పరమార్థమగు చైతన్యరూపము వ్యవహారమునకు గోచరము కాదు. అను విషయము నీ కారిక బోధించుచున్నది.

శ్లో॥ అచేతనేషు సంక్రాంతం చైతన్యమివదృశ్యతే ।
ప్రతిబింబకధర్మేణ యత్తచ్ఛబ్ద నిబంధనమ్ ॥ 325

యత్, చైతన్యం = ఏ చైతన్యము, ప్రతిబింబకధర్మేణ = ప్రతిబింబ న్యాయముచేత, అచేత

నేషు = జడపదార్థములందు, సంక్రాంతమివ = సంక్రమించినట్లు, దృశ్యతే = కనబడునో, తత్ = అది, వాచః = శబ్దవ్యవహారమునకు, నిబంధనమ్ = విషయమగునది.

తాత్పర్య వివరణములు— మనము మన ముఖము నద్దమునందు చూచుకొను చున్నాము. అది అద్దమున లేదు. దర్పణముయొక్క స్వచ్ఛతవలన అందది లగ్నమైనట్లు కనబడుచున్నది.

ఆ విధముగనే, అచేతనములయిన అంతఃకరణాదులందు చైతన్యము సంక్రమించి నట్లు భాసించును. మరియు, భోగ్యములయిన వస్తువుల పరిణామముల ననుసరించి తానును లింగసంబంధమును బొందును. నిర్వికారము, స్వయంప్రకాశము, పరిణామ శూన్యమునగు చితిశక్తి వ్యవహారగోచరము కాదు. ॥325॥

అవతారిక— ఈ విధముగ లింగసంబంధ మవర్జనీయముగాన నది లేని అవస్థయే ఉండదని ఈ కారిక చెప్పుచున్నది.

శ్లో॥ అవస్థా తాదృశీనాస్తి యాలింగేన నయుజ్యతే ।
క్వచిత్తు శబ్దసంస్కారో లింగస్యానాశ్రయేసతి ॥ 326

యా = ఏ అవస్థ, లింగేన = పుంస్త్వాది లింగముతో, నయుజ్యతే = కూడియుండదో, తాదృశీ = అటువంటి, అవస్థా, నాస్తి = అవస్థ = స్థితి, లేనేలేదు, కింతు = కాని, క్వచిత్, లింగస్య = కొన్ని స్థలములందు, లింగమునకు, అనాశ్రయేసతి = అవివక్ష కలిగినపుడు, తత్ = ఆ లింగము, శబ్దసంస్కారః భవతి=శబ్దమునకు సంస్కారము మాత్రమే అగును

తాత్పర్య వివరణములు— భోక్తం భోగ్యము అని రెండే పదార్థముల అవస్థలు. ఆ రెండవస్థలయందును లింగసంబంధము ప్రతిపదార్థమునకును నుండును. ఉపచయము, అపచయము, స్థితి అను నివి సకల పదార్థ సాధారణములుగాన జాతికిని లింగయోగముండు నని, అది బాధితముగాదని తాత్పర్యము. కొన్ని స్థలములందు అది వివక్షింపబడును. అపుడు దానిని బోధించు ప్రత్యయము సంస్కారమాత్రార్థము. ప్రత్యయములేని కేవల ప్రకృతి ప్రయోగార్హము కాదుగదా. ॥326॥

అవతారిక— "లింగవిరహితావస్థయే సంభవింపదని చెప్పి దానిని విశదీకరించు నది ఈ కారిక.

శ్లో॥ కృత్తద్ధితాభిధేయానాం భావానాం న విరుధ్యతే ।
శాస్త్రే లింగం గుణావస్థా తథాదాకృతిరిష్యతే ॥ 327

శాస్త్రే = శాస్త్రమునందు పరిభాషింపబడియున్న, గుణావస్థా = సత్త్వాదిగుణముల అవస్థ అను, లింగం = లింగమనునది, కృత్, తద్ధిత అభిధేయానాం = కృదంతతద్ధితాంతములం దా

ప్రత్యయములచేత చెప్పదగిన, భావానాం = భావములకు, న విరుధ్యతే = విరుద్ధము కాదు, తథా చ, ఆకృతిః = కాబట్టి లింగజాతి యొకటి, ఇష్యతే = అంగీకరింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— రూపము, రసము మున్నగు గుణములు, సత్త్వరజస్తమస్సుల పరిణామ రూపములు. వాని, ఆవిర్భావము, తిరోభావము, స్థితి, అను నవస్థలు లింగములు.

పాకః - పక్తిః - పచనమ్ - ఈ మూడు పదములును, 'వంట' అను, భావమును చెప్పును. భావమనగా భావన = ఉత్పాదన = క్రియ. ఆ క్రియ అనునది ఒక్కటియే అయినను, అవస్థలభేదమునుబట్టి వేరయి, వేరు వేరు లింగములుగల శబ్దములచే చెప్పబడుచున్నవి. పై మూడు శబ్దములును, ఘఞ్, క్తిన్, ల్యుట్ అను ప్రత్యయములు భావార్థకములు అంతమందు గలవి. అవి క్రమముగా, పుంస్త్రీ నపుంసకలింగములు.

గరిమా, (పుం) గురుతా (స్త్రీ) గురుత్వమ్ (న) ఇవి తద్ధితాంతములు. ప్రత్యయములు బావార్థకములు. వీనిచే చెప్పబడు భావములును అట్టివే. గుణావస్థ అను లింగము, కృత్తద్ధితాభిధేయములగు భావములకు విరుద్ధము కాదు అందువలన, ప్రవృత్తిత్వమను లింగ జాతి యొకటి కలదనుట. ॥327॥

అవతారిక— ఇక, ఈ గుణావస్థ అను లింగమునకు, ఆకృతి పక్షమునందును, వ్యక్తి పక్షమునను, భేదము లేదు అని నిరూపించుచున్నారు

శ్లో॥ లింగంప్రతి నభేదో౽స్తి ద్రవ్యపక్షేఽపి కశ్చన ।
తస్మాత్ సప్తవికల్పా యే సైవాత్రావిష్టలింగతా ॥ 328

లింగంప్రతి = లింగము విషయమున, ద్రవ్యపక్షేపి = ద్రవ్యము పదార్థము అను పక్షమునందును, కశ్చన భేదః = ఏదియు, భేదము, న అస్తి = లేదు, తస్మాత్=అందువలన, యే సప్తవికల్పాః = ఏ, ఏడు వికల్పములు చెప్పబడినవో, సైవ అత్ర = అవి కలిగియుండుటయే, ఇచట, ఆవిష్టలింగతా = నియతలింగత అగును.

తాత్పర్య వివరణములు— శబ్దములు తమ తమ శక్తిని పురస్కరించుకొని, జాతినిగాని వ్యక్తినిగాని, నియతమగు లింగముకల దానిని ప్రతిపాదించును. కాఁగా పక్షద్వయమునను, లింగవిషయమున నెట్టి భేదమును లేదు. 'జాతి ఆవిష్టలింగ' - అని చెప్పబడియున్నది. అనగా ఒక లింగమే కలది అని యర్థము కాదు. లింగసముద్దేశమునందు, "ఉపాదాన వికల్పాశ్చ లింగానాం సప్తదర్శితాః" అని చెప్పబడిన, సప్తవికల్పముల ప్రకారము, నియతలింగోపాదానమే ఆవిష్టలింగత, లింగమనునది శబ్ద బోధ్యమగు వస్తువుయొక్క ధర్మము వస్తుమాత్ర ధర్మమ్ కాదు అనగా శబ్ద ప్రతిపాద్యముకాని, దాని ధర్మము కాదు. ॥328॥

అవతారిక— ద్రవ్య పక్షమునకు జాతి పక్షముతో సామ్యము లింగవిషయమున నిట్లు సమర్థించి, వచన విషయమునను దానిని సమర్థించుచున్నారు.

శ్లో॥ వచనేనియమః శాస్త్రాత్ ద్రవ్యస్య అభ్యుపగమ్యతే ।
యత స్తదాకృతౌ శాస్త్రమన్యథైవ సమర్థ్యతే ॥ 329

ద్రవ్యస్య = వ్యక్తికి, వచనే = ఏక, ద్వి, బహువచనముల విషయమున, నియమః = నియతత్వము, యతః = ఏ, శాస్త్రాత్ = శాస్త్రమువలన, అభ్యుపగమ్యతే = అంగీకరింపబడుచున్నదో, తత్, శాస్త్రం = ఆ శాస్త్రము, ఆకృతౌ = జాతి పదార్థము - అను పక్షమునందును అన్యథైవ = వేఱొక రీతిగనే, సమర్థ్యతే = సమర్థింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ద్రవ్యమునందు, ఏకత్వ ద్విత్వబహుత్వ సంఖ్యలుండును. కాని, ప్రయోగములం దచ్చటచ్చట వ్యత్యాసమును అగపడుచున్నది. ఎట్లనగా— 'పంచాలాః' = పంచాలదేశీయుల నివాసమగు జనపదము. 'గోదౌ' = అది యొక గ్రామము. అని ప్రయోగములున్నవి. జనపద మొక్కటియే అయినను, దానిని బోధించు శబ్దము బహువచనాంతముగ నున్నది. గ్రామ మొక్కటియే. 'గోదౌ' అనునది ద్వివచనాంతము. ఈ రీతి వ్యత్యాసము ఇతర శబ్దముల విషయమునను, ప్రాప్తించునేమో యని, దానిని వారించుటకు, "బహుషు - బహువచనం" (1-4-21) అను మున్నగు, వచన నియామక శాస్త్రము లావశ్యకములైనవి ఆకృతి పదార్థము. అను పక్షమునందు, ఆ శాస్త్రముల కిట్లు అర్థము చెప్పవలసి యుండును. ఎట్లనగా— "ఒక వ్యక్తియందు గల జాతి వివక్షితమైనపు డేకవచనము. ద్వి, బహువ్యక్తుల జాతివివక్షలో, ద్వివచన బహువచనములు - అని యీ రీతిగ నర్థ వర్ణనముచేసి జాతికి గూడ వచనోపకారమును సమర్థింపవలెనని భావము. ॥329॥

అవతారిక— ఆ సమర్థన ప్రకారమే ఈ కారికచే వివరింపబడుచున్నది

శ్లో॥ వర్తతే యోబహుష్వర్థో భేదే తస్యవివక్షితే ।
స్వాశ్రయైః వ్యపదిష్టస్య శాస్త్రేవచన ముచ్యతే ॥ 330

యః అర్థః = ఏ, అర్థము = జాతి, బహుషు, వర్తతే = అనేక వ్యక్తులందుండునో, తస్య, భేదే, వివక్షితే = దానికి, అనేకత్వమును చెప్పదలంచినపుడు, శాస్త్రే = "బహుషు బహువచనమ్" - మున్నగు శాస్త్రమునందు, స్వాశ్రయైః = జాతికి ఆశ్రయములగు వ్యక్తులచేత, వ్యపదిష్టస్య = వ్యవహరింపబడిన దానికి, వచనం ఉచ్యతే = ఏకవచనాదికము; విధింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— జాతి అను పదార్థ మొకటి, అనేకములగు వ్యక్తులందు సమవాయమను సంబంధముచే సంబద్ధమై యుండును. కాగా దానికి, ఆశ్రయభేదము వలన భేదమును కల్పించి, ఏకత్వ, ద్విత్వ, బహుత్వ సంఖ్యలచే పరిచ్ఛేదింపబడిన వ్యక్తుల యందుండు జాతిని బోధించుచు, ఆయా వచనములను, "ద్వ్యేకయోః - ద్వివచనైకవచనే"

(1-4-22) "బహుషు బహువచనమ్" (1-4-21) మున్నగు శాస్త్రములు విధించును అని భావము.

ద్రవ్యవాది, ద్రవ్యగత సంఖ్యా వివక్షలో వచనములు విధింపబడునని చెప్పును. జాతివాది, ఏకత్వ ద్విత్వబహుత్వ సంఖ్యలుగల వ్యక్తులయందలి జాతిని వివక్షించిన ఆ యా వచనములగును. అంతే భేదము అని భావము. ॥330॥

అవతారిక — ఈ ప్రకారముగా ఆశ్రయభేదముచే జాతికిని భేదమును ఆపాదించిన జాతి వ్యక్తి పక్షములకు భేదమే లేకపోవునే?

శ్లో॥ యదాత్వాశ్రయ భేదేన భేదఏవ ప్రతీయతే ।
ఆకృతేర్ద్రవ్యపక్షేణ తదా భేదో న విద్యతే॥ 331

యదాతు, ఆకృతేః = ఎప్పుడైతే జాతికి, ఆశ్రయభేదేన = ఆశ్రయములగు వ్యక్తుల భేదమును బట్టి, భేదఏవ ప్రతీయతే = అనేకత్వమే, ప్రతీతమగునో, తదాద్రవ్యపక్షేణ = అపుడు, వ్యక్తిపక్షముతో, భేదః న విద్యతే = భేదముండదు.

తాత్పర్య వివరణములు— ఆశ్రయభేదముచే జాతి కూడ భిన్నమైన, వచన భేదము స్వాభావికమే యగును శాస్త్రవిధేయము కాదు. అనేక శబ్దప్రయోగ వారణమునకై ఏకశేష విధానమును, అపుడు తప్పదు. 'ఆకృతి ఒకటియే' - అను వాదమును నిలువదు. అని భావము. ॥331॥

అవతారిక — అందువలన పూర్వోక్తమైన, ఏకశేష సూత్ర ప్రత్యాఖ్యానమే యుక్తమని ఉపపాదింపబడుచున్నది.

శ్లో॥ అభేదేత్వేకశబ్దత్వాత్ శాస్త్రాచ్చవచనే సతి ।
ఏకశేషో న వక్తవ్యః వచనానాంచ సంభవః ॥ 332

అభేదేతు = జాతికి భేదము లేనపుడైతే, శాస్త్రాత్ = శాస్త్రమువలన = 'బహుషు బహువచనమ్' మున్నగు, వచనేసతి చ = ఏకవచనాదికము సిద్ధించినపుడును, ఏకశబ్దత్వాత్ = ఒకే శబ్ద మనేకములకు బోధకమగునుగాన, ఏకశేషః న వక్తవ్యః = ఏకశేష సూత్రము రచింపబడ నక్కర్లేదు, వచనానాం = ఏకవచన, ద్వివచన బహువచనములకు, సంభవశ్చభవతి = అవ కాశమును కలుగును.

తాత్పర్య వివరణములు— తాత్పర్యము స్పష్టముగాన వివరణ మపేక్షితము గాదు. ॥332॥

అవతారిక — ఇట నొక శంక కలిగిన కలుగవచ్చును. ఎట్లనగా—

శ్లో॥ ననుచానభిధేయత్వే ద్రవ్యస్య తదుపాశ్రయః ।
ఆకృతేరుపకారోయం ద్రవ్యాభావాన్న కల్పతే ॥ 333

నను = ఓయీ, ద్రవ్యస్య = ద్రవ్యము = వ్యక్తి. అనభిధేయత్వే = శబ్ద శక్తిచే బోధింపబడ నపుడు, తదపాశ్రయః = ఆ వ్యక్తికి సంబంధించిన, ఆకృతేః అయం ఉపకారః = జాతికి, ఈ ఉపకారము = లింగాది సంబంధము, ద్రవ్యాభావాత్ = వ్యక్తివాచ్యము కానందువలన, న కల్పతే = సిద్ధింపదే ? అని.

తాత్పర్య వివరణములు— శబ్దమునకు, జాతి, అభిధ వలన సిద్ధించిన అర్థము అనిన, అపుడు, ద్రవ్యము = వ్యక్తి. అభిధేయము కాదు. తన్నిమిత్త సంస్కారమగు లింగ సంఖ్యా సిద్ధి, జాతికిమట్టు కెట్లు కలుగును ? ద్రవ్యము వస్తువుగా నున్నంతమాత్రము చాలదు అది అభిధేయము కావలెనుగదా అని ప్రశ్న ॥333॥

అవతారిక— పై శంక కీ క్రింది కారికలో పరిహారము గలదు.

శ్లో॥ వ్యపదేశోఽభిధేయేన న శాస్త్రే కశ్చిదాశ్రితః ।
ద్రవ్యం నామపదార్థో యో న చ స ప్రతిషిధ్యతే ॥ 334

శాస్త్రే = "బహుషు" ఇత్యాది వచన విధాయక శాస్త్రమందు, అభిధేయేన = అభిధకు విషయ మగు ఆశ్రయముచేతనే, వ్యపదేశః = శబ్దసంస్కారము కలుగవలెనను నియమము, కశ్చిత్ న ఆశ్రితః = ఏదియు, ఆశ్రయింపబడి యుండలేదు, కించ, ద్రవ్యంనామ = మరియు, ద్రవ్యమనునది, యః పదార్థః = ఏ పదార్థము గలదో, సః న, ప్రతిషిధ్యతే = అది, 'లేదు' అని చెప్పబడలేదు.

తాత్పర్య వివరణములు— ఏక, ద్వి, బహువచన విధాయక శాస్త్రములందు, 'ఆశ్రయముల ఆ యా సంఖ్యలందు ఆ యా వచనములు వచ్చును' - అని మాత్రమే చెప్పబడి యున్నదిగాని, ఆ ఆశ్రయములు, అభిధేయములు అనగా శబ్ద శక్తిచే బోధింపబడినవి కావలె నని చెప్పలేదు. అందువలన భిన్న భిన్న వ్యక్తులందుండు జాతికి వచనముల భేదము లభించ వచ్చును. జాతి పదార్థమను వానికి, ద్రవ్య మిక లేనేలేదని తాత్పర్యము గాదు. అట్లే ద్రవ్యము పదార్థమను వారికిని, ఆకృతి యనునది లేకనే పోదు. - "నహ్యాకృతి పదార్థకస్య ద్రవ్యం న పదార్థః । ద్రవ్యపదార్థ కస్యవా ఆకృతిర్న పదార్థ" - అని సరూప సూత్ర భాష్యము. ॥334॥

అవతారిక— తరువాతి మహాభాష్య గ్రంథము "కస్యచిత్తు కించిత్ప్రధాన భూతమ్ । కించిద్గుణ భూతమ్" - అనున దీ కారికలో వికృతము.

శ్లో॥ గుణభావోఽభిధేయత్వం ప్రతిద్రవ్యస్య నాశ్రితః ।
ఉపకారీగుణః శేషః పదార్థ ఇతికల్పనా ॥ 335

ద్రవ్యస్య = వ్యక్తికి, గుణభావః = అప్రధానత, అభిధేయత్వం ప్రతి = శబ్దవాచ్యతను బట్టి, న ఆశ్రితః = ఆశ్రయింపబడలేదు, ఉపకారీ = ప్రధానమైన కుపకరించేది, పదార్థః=పదార్థము

శేషః = ప్రధానముకొఅక్కైనది గాన, గుణః = గుణము = అప్రధానము, ఇతి=అని, కల్పనా = కల్పన చేయబడుచున్నది.

తాత్పర్య వివరణములు— 'ద్రవ్యము గుణము' అనిన, అదియు శబ్దవాచ్యమై అప్రధానమని యర్థము కాదు. శబ్ద శక్యము కాకున్నను, జాతికి ఉపకరించుచున్నదిగాన గుణము = శేషము అందురు. శేషమనగా నిట ప్రధానోపకారకము. ఆ ఉపకారమేమనిన, వాహము = బండి లాగుట. దోహము = పాలిచ్చుట - మున్నగునవి, గోత్వమను జాతికి సంభవింపవుగాన, గోవ్యక్తి తాను ద్వారముగా నుండి, వానిని జాతికి సంబంధింపజేయుట. ఆ విధముగనే ద్రవ్యగత లింగసంఖ్యలు జాతికి లభించుట ఉపకారము. ॥335॥

అవతారిక— జాతి వ్యక్తివాదు లిద్దరిలో ఒకరికొకటి ప్రధానమయినపుడు వేఱొకటి గుణభూతమగునని మాత్రమే చెప్పబడినది కాని, ''ద్రవ్య మప్రధానమగుట, అదియు నభిధేయమైనపుడేయని కాదు'' అని ఇట్లు స్పష్టముగ నెచ్చటను మహాభాష్యమున వ్యాఖ్యానింపబడలేదే ? అనిన—

శ్లో॥ ద్రవ్యే న గుణభావోఽ_స్తివినాద్రవ్యాభిధాయితామ్ ।
ఆకృతౌ వా ప్రధానత్వమతఏవం సమర్థ్యతే ॥ 336

అద్రవ్యాభిధాయితాంవినా = ద్రవ్యాభిధానా భావము లేనపుడు, ద్రవ్యే, గుణభావః = ద్రవ్యమునం దప్రధానత్వముగాని, ఆకృతౌ, ప్రధానత్వం వా = జాతియందు ప్రధానత్వముగాని, న అస్తి = ఉండబోదు, అతః, ఏవం సమర్థ్యతే = అందువలన నీ విధముగా వ్యాఖ్యానింపబడు చున్నది.

తాత్పర్య వివరణములు— అద్రవ్యాభిదాయిత అనగా ద్రవ్యము శబ్దవాచ్యము కాకుండుట. అది లేనపుడు = అనగా అది శబ్దముచే చెప్పబడినదైనపుడు. అట్టి యెడ దాని కభిధానమే కలదుగాన అప్రాధాన్యముండదు. జాతికి ప్రాధాన్యమును రాదు. అపుడు ద్రవ్యమునకు జాతి అవచ్ఛేదకముగ నుండును. ద్రవ్యమే ముఖ్యము. జాతి అప్రధానమైనను దానికి, ప్రధానమగు ద్రవ్యముయొక్క సంఖ్య అనువర్తించును అనిన, వచనభేదమును ప్రాప్తమగును. అపుడు జాతి యనునది ఒక్కటియేగాన ఏకశేష విధానముతో బనిలేదని దానిని ప్రత్యాఖ్యానము చేయుట కుదురదు. ద్రవ్యము శబ్దవాచ్యము కానపుడు, అది శబ్దవాచ్యమగు జాతికి విశేషణమై తన లింగసంఖ్యలను దానికి లభింపజేయును. ఆ విధముగ నది ఉపకారి. అందువలన - 'గుణము'. అభిధేయమైనందున గుణము కాలేదు. ॥336॥

Note— అద్రవ్యాభిధాయితామ్ అనునదియే సమంజసమైన పాఠము, అక్లిష్టమును.

అవతారిక— జాతి వ్యక్తులు రెండును అభిధేయములయినను వానికి ప్రాధాన్యాప్రాధాన్యముల నిట్లు సమర్థింపనగుననుచున్నారు.

శ్లో॥ కైశ్చిద్గుణ ప్రధానత్వం నామాఖ్యాతపదిష్యతే ।
నవృత్తివత్పరార్థస్య గుణభావస్తు వర్ణ్యతే ॥ 337

గుణప్రధానత్వం = జాతి వ్యక్తులకు, అప్రధానతా ప్రధానతలు, నామాఖ్యాతవత్ = కారక పదమునందును, క్రియాపదము నందునువలె, కైశ్చిత్ ఇష్యతే = కొందరిచేత గ్రహింపబడు చున్నవి, పరార్థస్య = ఉపసర్జన పదార్థమునకు, వృత్తివత్ = సమాస వృత్తియందువలె, గుణభావస్తు = అప్రధానత్వము మాత్రము, న వర్ణ్యతే = చెప్పబడలేదు.

తాత్పర్య వివరణములు— 'పాచకః' - అనునది నామపదము. అందు 'పచ్' ధాతువు. అక అనునది ప్రత్యయము. ధాతువునకు – వండుట – అను క్రియ అర్థము. అక ప్రత్యయమునకు, ఆ క్రియను చేయువా డర్థము. వండుట అను క్రియ ఇట సిద్ధము. సాధింప వలసినది గాదు. కర్త ఆ క్రియను అంతకు పూర్వమే చేసియున్నవాడు. లేదా చేయుచున్నాడు గావచ్చును. చేయనున్నను నుండవచ్చును. అతడు పాచకుడు అని వ్యవహరింపబడును. అచట కర్తకు ప్రాధాన్యము. క్రియకు గుణభావము = అప్రధానత

ఇక 'పచతి' అను పదమును జూతము. అది తిఙన్తము. ఇందు ధాత్వర్థమగు క్రియ, ప్రధానము. కర్త అప్రధానము ఇట క్రియ సాధ్యము. కర్త అప్రధానుడే అయినను, ధాత్వర్థమగు వ్యాపారమునకు ఆశ్రయ భూతుడుగా గోచరించుచునే యుండును. మొత్తము వాక్యార్థమునందే వాని కప్రాధాన్యము. అందువలన 'దేవదత్తః పచతి' = దేవదత్తుడు వంట చేయుచున్నాడు అనినపుడు, దేవదత్తుడు అను విశేషణముయొక్క సంబంధము కర్తకు కలదు. అప్రధానుడుగదా యని ప్రతీతియే లేదనిన, విశేషణ సంబంధమును పొసగదు.

కర్తయందు ద్విత్వ బహుత్వాది సంఖ్య లుండును. వానితో క్రియకు ఆ కర్త ఉపకరించును. కావుననే, క్రియ ఒక్కటియే అయినను పచతః, పచన్తి - మున్నగు ద్వివచన బహువచనాంతములును గలవు.

ఈ విధముగనే, జాతి ద్రవ్యములు రెండును, ఏ పక్షమునందైనను, వివక్షాను సారము ప్రధానా ప్రధానార్థములగును. జాతి కుపకరించుటకై ద్రవ్యముపాత్తమైన, ఆకృతి విశేష్యమై ప్రధానమగును. ఇక వ్యక్తికి అవచ్ఛేదకముగ = విశేషణముగ, ఆకృతి గ్రహింప బడిన నపుడది అప్రధానము. వ్యక్తి ప్రధానము.

సమాసాది వృత్తులందలి గుణప్రధాన భావమిట్టిది గాదు. 'రాజపురుషః' అను సమాసములో, పురుషుడు. ప్రధానుడు, రాజు అప్రధానుడు. రాజపదార్థమునకు పురుష పదార్థముతో సంభేదమేగాని పృథగ్గ్రహణము లేదు. కనుక రాజశబ్దార్థమున కచట విశేషణము సంబంధము, దేవదత్త విశేషణ సంబంధము ప్రత్యయార్థమగు కర్తకు 'దేవదత్తః పచతి' అను స్థలమున నున్నట్లు, సంభవింపదు.

'రాజమాతంగః' = రాజుగారి ఏనుగు. ఆ రాజు, అత్యధికైశ్వర్య సంపన్ను

డండము అపుడా విశేషణమును తెలియచేయుటకు 'ఋద్ధస్య' అను విశేషణమును జేర్చి 'ఋద్ధస్య రాజమాతంగః' అని ప్రయోగింపజనదు. ఋద్ధస్య = 'ఐశ్వర్యవంతుడైన'.

'పాచకః' అను నామపదమందును, పచతి అను క్రియాపదమునందును, క్రియా కారకములు రెండును సాధ్యసాధనములుగా ప్రతీతి విషయములగుచునే యుండును. అందు సాధనమగు కారకము సాధ్యమగు క్రియ కుపకారకము. అందుచేత అప్రధానము. దేనికొరకు ప్రవృత్తియంతయు ఇచట జరుగుచున్నదో అట్టి సాధ్యమగు క్రియ ప్రధానము. ఇది ఆఖ్యాత పదమునందలి చర్య.

ఇక నామపదమునందో? అచట కారకశక్తి ప్రవృత్తి నిమిత్తము. ఆ శక్తికి ఆశ్రయమైన కర్త 'పాచకః' మున్నగు పదములలో ప్రధానుడు. క్రియ అప్రధానాభిధేయము. కాబట్టి సమాస స్థలమునందువలె కాక నామాఖ్యాత పదములందువలె గుణప్రధానత్వము సుస్థము. ॥337॥

అవతారిక— 'ఆకృతి ఒకటియే' దాని చెప్పు శబ్దమును ఒకటియే యగును. కావున ఏకశేషతో పనిలేదు. అంటిరే? అది యెట్లు. ఆ పక్షమునను ద్రవ్యము వాచ్యమను చున్నారు అపుడు వచనభేదమువలె శబ్దభేదము తప్పదుగదా అనిన—

శ్లో॥ గుణభూతస్య నానాత్వా దాకృతేరేక శబ్దతా ।
సిద్ధోవచనభేదశ్చ ద్రవ్యభేద సమన్వయాత్ ॥ 338

గుణభూతస్య = అప్రధానమైన ద్రవ్యము, *నానాత్వాత్* = అనేక మగుటవలన, ఆకృతేః = జాతికి, ఏకశబ్దతా సిధ్యతి = ఒకే శబ్దముచే బోధ్యమగుట సిద్ధించును, ద్రవ్యభేద సమన్వయాత్ = వ్యక్తుల అనేకత్వ సంబంధమువలన, వచనభేదశ్చ = ఏకవచనాది భేదమును, సిద్ధః భవతి = సిద్ధమే యగును.

తాత్పర్య వివరణములు— ఆకృతి, శబ్దముల కర్థమను వారికి ద్రవ్య మప్రధానము. దాని అనేకత్వమువలన శబ్దముల కనేకత్వము రాదు. ప్రధానముగ శబ్దార్థము జాతియే కావున దానినిబట్టి ఏకత్వమే కలుగును. ఇక ద్రవ్యమును అభిధేయమే *గదా*. దానిని బురస్కరించుకొని, అవిరుద్ధమగు వచనభేదమును సంభవమే. ॥338॥

అవతారిక— ఈ విషయము నీ కారికయు వివరించుచున్నది.

శ్లో॥ సాధనం గుణభావేన క్రియాయా భేదకం యథా ।
ఆఖ్యాతేష్వేకశబ్దాయా జాతేర్ద్రవ్యం తథోచ్యతే ॥ 339

ఆఖ్యాతేషు = తిఙన్త క్రియాపదములందు, సాధనం = నామపదము = కారకపదము, గుణభావేన = తన అప్రధానత్వముచేత, క్రియాయాః = ప్రధానమైన క్రియకు, యథాభేదకం = ఏ ప్రకారముగా విశేషకమగుచున్నదో, తథా ద్రవ్యం = ఆ విధముగనే, అప్రధానమైన

ద్రవ్యమును, ఏకశబ్దాయాః = ఏకశబ్ద వాచ్యమగు ఆకృతికి, జాతేః భేదకం ఉచ్యతే = జాతికి విశేషకముగా చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు—— పచతి, పచతః, పచంతి, మున్నగునవి ఆఖ్యాతములు. దీనిలో ధాత్వర్థమగు క్రియ ప్రధానము. అప్రధానమగు కర్తనుబట్టి వచనభేదము కలిగినది. ఆ విధముగనే, శబ్దవాచ్యమగు జాతి ప్రధానమైనను, ఆ శబ్దముచేతనే అభిహితమై సన్నిహితమై యున్న ద్రవ్యము, ప్రధానా విరుద్ధమగు తన ధర్మము నుపకారకముగా ఉపస్థాపింపవచ్చును. అట్లు చేయనిచో ఆ గుణమునకు గుణత్వమే నిలువదు. గుణమనగా ప్రధానమున కుపకరించు నదియే. నామపదములును ఆఖ్యాతపదములును ఒక వాక్యమునందున్నపుడు నామపదములు క్రియాపదములకు చేయు నుపకారము అదియే. కావున నది నిదర్శనముగా జూపబడినది.

'రాజపురుషః' మున్నగునవి సమాసవృత్తులు. అందు అప్రధానమైనది తన సంఖ్యా భేదమునుబట్టి ప్రధానమునకు వచనభేదమును గల్పింపదు కనుక, 'నవృత్తివత్' అనుట

కారకముల సంఖ్యాభేదముచేత, తిఙన్తపదములకు వచనభేదము సిద్ధించును కావుననే తిఙన్తముల కేకశేషవృత్తి లేదని, "న వై తిఙన్తాన్యేకశేషారంభం ప్రయోజయన్తి" అని మహాభాష్యమున చెప్పిరి. ॥౩౩౯॥

అవతారిక—— శబ్దములు జాతితో గూడిన వ్యక్తులనే బోధించును. అయినను నందు ప్రధానమైనది జాతి గనుక, ఆ విశిష్టవాదమును, జాతివాదమే యగును. అపుడు జాతికి లింగ సంఖ్యలు లేవుగదా ః లింగవచన సంబంధ మెట్లుపపన్నమగును ? అని శంకించి, ఆశ్రయ ధర్మములు ఆశ్రితములకు లభింపవచ్చును. అని - "లింగవచన సిద్ధిర్గుణ వివక్షా నిత్యత్వాత్" అను వార్తికముచే మహాభాష్యమున సమాధానము చెప్పబడినది.

తరువాత "గుణవచనపద్వా అను వార్తికమును వ్యాఖ్యానించుచు, శుక్లాది శబ్దములకు వలె లింగవచన సిద్ధి ఉపపన్నమగుననియు, కావున జాతియే శబ్దమున కర్థమను పక్షమును చక్కగ నుపపాదింపవచ్చుననియు నీ కారికలు బోధించును.

శ్లో॥ ఏకత్వే తుల్యరూపత్వా చ్ఛబ్దానాం ప్రతిపాదనే ।
నిమిత్తాత్ తద్వతోఽర్థస్య విశిష్టగ్రహణే సతి ॥ 340

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాదాశ్రయై రాకృతేఃసహ ।
ప్రవృత్తౌ భిన్నశబ్దాయాం లింగసంఖ్యే ప్రసిధ్యతః ॥ 341

ఏకత్వే = జాతి వ్యక్తుల కభేదమను పక్షమునందు, శబ్దానాం = శబ్దములు, ప్రతిపాదనే = అర్థబోధనమునందు, తుల్యరూపత్వాత్ = సమానరూపములగుట వలన, నిమిత్తాత్ = కారణమును బట్టి, తద్వతః అర్థస్య = జాతిమత్తగు అర్థమునకును = వ్యక్తికిని, విశిష్ట గ్రహణేసతి = అభేద ప్రతీతి కలుగగా.

ఆకృతేః = జాతికి, ఆశ్రయైః సహ = వ్యక్తులతో గూడ, సోయం = అదియే ఇది, ఇతి అభిసంబంధాత్ = అను అభేదగ్రహణము వలన, భిన్న శబ్దాయాం = జాతి వ్యక్తులకు వేరు వేరు బోధకములు గల, ప్రవృత్తౌ = శబ్దముల అర్థప్రవృత్తి పక్షమునందు, లింగ సంఖ్యే = లింగములును, వచనములును, ప్రసిద్ధ్యతః = సిద్ధించుచున్నవి.

తాత్పర్య వివరణములు— పూర్వ ముపపాదింపబడిన పక్షమునందు, ఒకే శబ్దము జాతి వ్యక్తులను రెండింటిని, గుణప్రధాన భావముచే బోధించునని చెప్పబడినది. ఇపుడు జాతి వ్యక్తుల కభేదారోపమువలన రెండును చెప్పబడునని ప్రతిపాదించుచున్నారు. జాతి శబ్దములు స్వార్థమును ప్రతిపాదించినపుడు, ఆ జాతి అను నిమిత్తమునే, దాని కాశ్రయమగు ద్రవ్యము నం దాశ్రయించి = అనగా ఆరోపించి బోధించుటవలన వాని కభేదము సిద్ధించును. కాగా నిమిత్తమగు జాతితో పాటుగా నిమిత్తియగు వ్యక్తియు నభిహితమగుటవలన శుక్ల కృష్ణాది గుణవచన శబ్దములకువలె లింగసంఖ్యలు వచ్చును.

అర్థములందు శబ్దములు ప్రవర్తించును. ఆ ప్రవృత్తి ఏకశబ్ద అనియు, భిన్నశబ్ద అనియు, రెండు విధములు. జాతిని, ఆ జాతిగల వ్యక్తిని ఒకే శబ్దము బోధించిన, అపుడు ఆ శబ్దప్రవృత్తి, ఏకశబ్ద. శబ్ద మొక్క జాతినే ప్రతిపాదించినది, భిన్నశబ్ద ప్రవృత్తి. అందును జాతి ద్రవ్యములకు, అభేద ప్రతీతియే లోకసిద్ధము. అది యెట్లనగా - గోశబ్దమునకు గోత్వము అను జాతి అర్థమయినపుడును 'అయంగౌః' = ఇది గోవు అనియే అందురుగాని, దీని గోత్వము అని యర్థమిచ్చుటకు 'అస్యగౌః' అని అనరు కావున అభేదోపచారమువలన ఆశ్రయముయొక్క లింగవచనములు గూడ సిద్ధించును. ఒక పక్షమునందు, గుణప్రధాన భావముచే ఉభయ బోధనము వేరొక పక్షమున అభేదోపచారముచే తద్బోధనము. అంతియ. ॥840, 841॥

అవతారిక— ఇట్లు జాతివాచక శబ్దములు అభేదారోపముచే వ్యక్తిని బోధించుట ముఖ్యమేగాని గౌణము గాదు. జాతి సంబంధము లేని వ్యక్తులు విశేష వ్యవహారమునకు గోచరములే కావు అని చెప్పుచున్నారు.

శ్లో॥ ప్రాక్చజాత్యభిసంబంధాత్ సర్వనామాభిధేయతా ।
వస్తూపలక్షణం సత్వే ప్రయుజ్యన్తే త్యదాదయః ॥ 842

జాత్యభిసంబంధాత్ = వ్యక్తులకు జాతి సంబంధము కలుగుటకంటె, ప్రాక్, సర్వనామాభిధేయతా = ముందు, సర్వనామపదములచే చెప్పదగుటయే ఉండును, సత్వే = ద్రవ్యమునందు, వస్తూపలక్షణం = వస్తు సామాన్య మాత్ర బోధకముగా, త్యదాదయః = సర్వనామ శబ్దములు (త్యద్ మొదలయినవి), ప్రయుజ్యన్తే = ప్రయోగింపబడుచుండును.

తాత్పర్య వివరణములు— వ్యక్తులయందు జాతి ఆరోపింపబడునని చెప్పబడినది. అంతకుపూర్వము ద్రవ్యములకు రూపనిశ్చయమే కలుగదు. ఆ అవస్థలో, ఏ శబ్దమయినను, దాని అర్థమును, ''ఇదియొక వస్తువు'' అని సామాన్యరూపముగనే బోధించునుగాని, 'ఇది

గోవు' 'ఇది అశ్వము' అని విశేషాకారముగ బోధింపదు. అపుడా పదార్థములు, సః=అది, అయం = ఇది అని సర్వనామ శబ్దములచేత మాత్రమే చెప్పదగినవిగా నుండును.

సర్వనామములు వస్తూప లక్షణములు మాత్రమే. ఉపలక్షించుట అనగా సామాన్యాకారముగ బోధించుట మాత్రమే. కాబట్టి, విశేషాకార జ్ఞానమునకై జాతి సంబంధము వ్యక్తికి ఆవశ్యకమని భావనము. ॥342॥

అవతారిక— ఇచట మతాంతరమును గలదు. ఎట్లనగా—

శ్లో॥ పాకౌ, పాకా ఇతియథాభేదకః కైశ్చిదాశ్రయః ।
ఇష్యతే చానుపాదానో ధర్మోఽసౌగుణవాచినామ్ ॥ 343

పాకౌ, పాకాః, ఇతి = రెండు వంటలు, చాల వంటలు అని, యథా, అనుపాదానః = ఏ విధముగా, శబ్దముచే బోధింపబగని, ధర్మః, ఆశ్రయః = ధర్మమయిన, క్రియాశ్రయము, భేదకః, కైశ్చిత్ = భేదమును బోధించునదిగా, కొందరిచే, ఇష్యతే, తథా = అంగీకరింపబడుచున్నదో, ఆ విధముగా, గుణవాచినామ్ = గుణవచన శబ్దములగు, శుక్ల మున్నగువానికి, అసౌ, అనుపాదానః = ఈః, శబ్దోపాదానములేని, ఆశ్రయః భేదకః ఇష్యతే = గుణముల ఆధారము, వచన భేదసాధకమని సమ్మతము.

తాత్పర్య వివరణములు— పాకశబ్దము క్రియాధర్మమును చెప్పు శబ్దము అది క్రియాశ్రయమును చెప్పదు. అయినను లోకమునందు, రెండు వంటలు, మూడు వంటలు - అని ఇట్లు వ్యవహారము కలదు పాక క్రియ ఒకటియే కాని వరి బియ్యమువంట ఒకటి యవధాన్యముల బియ్యపు పాక మొకటి. గోధుమ బియ్యపు వంట బెల్లమువంట - ఈ విధముగ వండబడు వాని భేదమునుబట్టి ఆ వ్యవహారములు వచ్చినవి.

ఆ విధముగనే గుణవాచకములగు శుక్లాది శబ్దములందును ఆశ్రయములకును, ఆశ్రితములకును గల, "అదియే ఇది" అను సంబంధమువలన ఆశ్రయిము ఆశ్రితమగు గుణమునకు భేదమును బోధించును. కావున గుణవాచకములందువలె జాతివాచకములందును, శబ్ద బోధ్యముగాని ద్రవ్యము వచనముల భేదమును = అనేక వచనములను కల్పించునని కొందరందురు. కాని ఇది యుక్తముగా దోచదు.

పాకౌ, పాకాః అనుచోట ద్వివచన బహువచనములు క్రియకును దాని ఆశ్రయమునకును అభేదారోపమువలన వచ్చినవి కావు. క్రియాభేద కృతములే. అచట భేదము స్వగతమే ఆశ్రయముననున్న దాని కారోపమువలన రాలేవు. ఆశ్రయములకు భేదమున్నచోట, ఆశ్రితమునకు ఏకవచనాంతత్వమే యగపడుచున్నది చూడుడు. "గుడతిల తండుల ఓదనానాంపాకః" = బెల్లము, నువ్వులు, బియ్యము, అన్నము - వీని వంట, అని అర్థము. గుడాదు లాశ్రయములు. పాకము ఆశ్రితము. పాకక్రియ లనేకములయినను నట బహువచనము లేదు.

శుక్లాది శబ్దముల విషయమున, గుణములకును, అవి కలవానికిని, అభేదోపచారము

ఉపచారమనగా ఆరోపము. కనుక నవియే, జాతి శబ్దములకు దృష్టాంతముగ, "గుణవచన వద్వా" అను వార్తికమును వ్యాఖ్యానించిన సందర్భములో, మహాభాష్యమున జూపబడినవి. క్రియావాచకములు దృష్టాంతములు కావనుట. ॥343॥

అవతారిక— పై విషయము నీ కారిక స్పష్టపరచుచున్నది.

శ్లో॥ ఆశ్రయస్యానుపాదానే కేవలం లభతే యది ।
ఆధార ధర్మాన్ సామాన్యం పురస్తాత్తద్విచారితమ్ ॥ 344

సామాన్యం = జాతి, ఆశ్రయస్య = ఆధారమగు వ్యక్తియొక్క, అనుపాదానే = గ్రహణము లేనపుడు, కేవలం = శుద్ధమగు సామాన్యముగనే, ఆధార ధర్మాన్ = తన ఆశ్రయముల ధర్మములను, లభతేయది=పొందును అనిన, తత్పురస్తాత్ విచారితమ్=అపదము ముందట గ్రంథమున, విమర్శింపబడినది.

తాత్పర్య వివరణములు— 'జాతివాచకములయిన శబ్దములు, ఆధారరహితమైన శుద్ధ జాతిని మాత్రమే బోధించును. అయినను ఆధారముల యొక్క లింగములను వచనములను బొందును' - అను విషయము ద్రవ్యవాదికి సమాధానముగ ఆకృతివాది చెప్పిన, - "లింగవచన సిద్ధిర్గుణస్యా నిత్యత్వాత్" అను వార్తిక వ్యాఖ్యాన ప్రసంగమున, మహాభాష్యమున వివరింపబడినది. ప్రకృత గ్రంథమునందును, "ననుచానభిధేయత్వే" - అను 333 వ కారికచే ప్రశ్నించి, "వ్యపదేశోభిదేయేన" - అను 334 వ కారికలో సమాధానము చెప్పబడినది.

"జాతి వ్యక్తులు రెండును ప్రధానాప్రధాన భావముచే శబ్ద వాచ్యములే" - అను పక్షాంతరమును, - "కైశ్చిద్గుణ ప్రధానత్వం - అను 337 వ కారికచే ఉపపాదింపబడినది

ప్రకృత కారికయందు, జాతి మాత్రమే శబ్ద శక్యమనియు, అభేదారోపమువలన శబ్దము వ్యక్తులను బోధించునుగాన, ఆశ్రయ ధర్మములయిన లింగ సంఖ్యలు దానికి సిద్ధించును అనియు స్పష్టపరుపబడినది. ॥344॥

అవతారిక— జాతికిని జాతిమంతమగు వ్యక్తికిని అభేద మెట్లు పొసగును? అని శంకించి, "సామాన్యే వృత్తస్య విశేషే వృత్తిరుపజాయతే" = జాతి శబ్దము ముందు సామాన్యమును బోధించును. తరువాత విశేషమునందు వర్తించును" అని మహాభాష్యమున సమాధానము చెప్పబడినది ఆ విషయము నుపపాదించున దీ కారిక.

శ్లో॥ జాతౌ పూర్వం ప్రవృత్తానాం శబ్దానాం జాతివాచినామ్ ।
అశబ్దవాచ్యాత్ సంబంధాత్ వ్యక్తిరప్యుపజాయతే ॥ 345

జాతౌ = జాతియందు, పూర్వం = ముందుగా, ప్రవృత్తానాం = ప్రవర్తించిన, జాతివాచినాం = జాతివాచకములగు, శబ్దానాం = శబ్దములకు, అశబ్దవాచ్యాత్ = శబ్ద ప్రతిపాద్యముగాని,

సంబంధాత్ = సంబంధమువలన, వ్యక్తిః అపి = ఆశ్రయ ప్రతీతి కూడ, ఉపజాయతే = కలుగును.

తాత్పర్య వివరణములు— జాతి నిమిత్తము. వ్యక్తి నిమిత్తి శబ్దము నిమిత్తిని నిమిత్త పురస్సరముగనే బోధించును. కాగా ముందు జాతిని బోధించుననుట. ఆశ్రయము లేకుండ జాతికి ఉనికి సంభవింపదు. కావున, శబ్దము బోధింపకున్నను, జాతి కాశ్రయమై యుండుట అను సంబంధమునే ముందు పెట్టుకొని వ్యక్తియు ప్రతీతి విషయమగును.

''అధికరణగతిః సామాన్యాత్'' – అని సరూప సూత్రమున భాష్యవార్తికము వాజ ప్యాయనుడను మహర్షి జాతివాది. వ్యాడి మహర్షి వ్యక్తివాది.

''గౌరనుబాధ్యో అజోగ్నిషోమీయః'' అనునది పూర్వ మీమాంసలో విచారింప బడిన ఒక విధి వాక్యము. విధికి చోదన అని పర్యాయపదము ''అగ్ని, సోముడు అను సీ ఇద్దఱు దేవతలజంట, దేవతగాగల ఛాగ పశువున కనుబంధము చేయవలెను'' అని ఆ విధి కర్థము అనుబంధమనగా ఆరంభణా లంభనములు. అందు ఆరంభణము మేకను కొనుట. ఆలంభనమనగా దానిని మంత్రపూర్వకముగా తాకుట అని వ్యాఖ్యాతలు.

ఈ చోదనా వాక్యమునందలి అజపదమునకు, అజత్వము అను జాతి అర్థమయిన, ఆరంభణాది క్రియలకు జాతియందు సంభవముండదు. కనుక వ్యక్తియే శబ్దమున కర్థము కావలెనని వ్యక్తివాదులు. వారికి సమాధానముగ పై భాష్యవార్తిక మవతరించినది

జాతియే పదార్థమయినను, దానితో పాటుగా నుండునది అగుటవలన, జాతికి విధింపబడిన కార్యములు దాని కాధారమగు వ్యక్తియందు ప్రవర్తించునని జాతివాదుల తాత్పర్యమని ఆ వార్తికము తెలియచేయుచున్నది.

హోమము చేయుటకు, అగ్ని కావలెనుగదా దానికై ''అగ్నిరానీయతామ్'' అని ఆదేశింతురు. అగ్నిని తేవలెను అని యర్థము. ఏదేని పాత్రము లేకుండగ అగ్నిని తెచ్చుట వీలు పడదు. 'ఒక పళ్లెముతో అగ్నిని తేవలెనని' చెప్పలేదు అవిహితమయినను పాత్రమం దుపయోగింపబడుచున్నది గదా ! ఆ విధముగనే, అభిధేయము కాకున్నను వ్యక్తి, బోధలో విషయమగును అని జాతివాదుల తాత్పర్యము. ॥845॥

అవతారిక— శబ్దములు, వాని అర్థములను అభిద అను వ్యాపారముచే బోధించును. ఆ వ్యాపారము, తాను బోధింపవలసిన అర్థమును ఒక్కసారిగనే బోధించును. కొంత భాగమును బోధించి, కొంత తడవాగి మరల వ్యాపారించుట = అను విరమ్య వ్యాపారము దానికి లేదు. కాని గ్రహీతలు మాత్రము, సంసృష్టములగు అర్థములను, తాము విభజించుకొని ఒక క్రమముగనే గ్రహింతురు. ఆ అభిప్రాయముతో, మహాభాష్యమున, ''సామాన్యే వృత్తస్య విశేషే వృత్తిరుపజాయతే'' – క్రమము చెప్పబడినది. ఈ కారిక ఆ విషయమును వివరించునది.

శ్లో॥ సోఽయమిత్యభిసంబంధాజ్జాతి ధర్మోపచర్యతే ।
ద్రవ్యం తదాశ్రయో భేదో జాతేశ్చాభ్యుపగమ్యతే ॥ 346

'సః అయం' ఇతి = 'అది ఇది' అను, అభిసంబంధాత్ = అభేద సంబంధమువలన, జాతి ధర్మ = జాతియొక్క ధర్మము కలదిగా, ద్రవ్యం = ద్రవ్యము = వ్యక్తి, ఉపచర్యతే = వ్యవహరింపబడుచున్నది, జాతేః = జాతికి, తదాశ్రయః = ఆ ద్రవ్య మాశ్రయముగా గల, భేదశ్చ = సంఖ్యాభేదము గూడ, అభ్యుపగమ్యతే = స్వీకరింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— అభేదభావన వలన, వ్యక్తి, జాతియొక్క ధర్మము వంటి ధర్మములను గలిగియుండును. అభిధా వ్యాపారము దానిని బోధించును. ఇట్లు జాతితో ఐక్యమును బొందిన వ్యక్తియొక్క సంఖ్యాభేదము. జాతికిని లభ్యమగునని భావము. ॥346॥

అవతారిక— పై విషయమునకు మంచ శబ్దమును నిదర్శనముగా జూడుడు.

శ్లో॥ మంచశబ్దో యథాధేయం మంచేష్వేవ వ్యవస్థితః ।
తత్త్వేనాహ తథాజాతిశబ్దో ద్రవ్యేషు వర్తతే ॥ 347

మంచేషు ఏవ = మంచలయందే, వ్యవస్థితః = బోధకముగా స్థిరీకృతమైన, మంచశబ్దః = 'మంచ' అను శబ్దము, యథా = ఏ విధముగ, ఆధేయం = మంచయందున్న వ్యక్తిని, తత్త్వేన = మంచగా, ఆహ, తథా = చెప్పునో, ఆ విధముగ, జాతిశబ్దః = జాతినే చెప్పు శబ్దము, ద్రవ్యేషు = వ్యక్తులయందు, వర్తతే = వర్తించును.

తాత్పర్య వివరణములు— చేలలోను, తోటలలోనున్న, పక్షులను దోలుటకు, మంచలను ఎత్తుగా కట్టుకొని, వానిమీద కూర్చొని మనుష్యులు బిగ్గరగా నరచుచుందురు. వానిని విని జనులు, 'అవిగో మంచ లరచుచున్నవి' - అందురు. మంచలు ఆధారములు. వాని యందుండు వారు ఆధేయులు. ఇట మంచ శబ్దము, ఆధారవాచి, అరచుట అను క్రియ దానికి సంభవింపదు. కాన నది ఆధేయులగు మంచస్థులను బోధించును. ఆ విధముగనే 'గామానయ' = గోవును తీసికొని రమ్మ అనుచోట, గోశబ్దము, గోత్వముతో కూడిన వ్యక్తిని చెప్పును. ॥347॥

అవతారిక— అట్లైన, 'జాతియే పదార్థము' అనుట ఎట్లు ? - అనిన—

శ్లో॥ తత్రజాతి పదార్థత్వం తథైవాభ్యుపగమ్యతే ।
జాతి రుత్సృష్ట సంఖ్యాతు ద్రవ్యాత్మన్యనుషజ్యతే ॥ 348

తత్ర = అందు, జాతిపదార్థత్వం = జాతిపదార్థమనుట, తథాఏవ = మంచశబ్దము వలెనే, అభ్యుపగమ్యతే = గ్రహింపబడును, జాతిస్తు = జాతియు, ఉత్సృష్ట సంఖ్యా = విడిచిన సంఖ్య కలదియై, ద్రవ్యాత్మని = ద్రవ్య స్వరూపమునందు, అనుషజ్యతే = ఆరోపింపబడును.

తాత్పర్య వివరణములు— 'మంచ అరచుచున్నవి' - అను వాక్యమునందు, మంచ శబ్దము, ఆధేయ భూతులగు మంచస్థులను బోధించునది అయియున్నను, దానిని ఆధారవాచకమే అందురు. ఆ విధముగనే జాతి శబ్దములు, జాత్యాశ్రయములగు ద్రవ్యములను బోధించినను, జాతి వాచకములే" అని ద్రవ్యమును బోధించునవి అనుట, ఉపచరిత వ్యవహారము. అనగా ఆరోపితమనుట. అది ముఖ్యవహారము కాదు. జాత్యభిధానమే ముఖ్యము.

అట్లైన, జాతి ఒక్కటియే గదా ! జాతివాచకములకు ద్వివచన బహువచనము లెట్లుపపన్నములగును ? ఏకత్వసంఖ్య గల జాతిని బోధించు శబ్దములు, ఏకవచనాంతములుగ మాత్రమే యుండదగును గదా ! అని మరల ప్రశ్న కలుగును. సమాధానమేమనిన,— సంఖ్యా సంస్పర్శములేని జాతి మాత్రమునకే, ద్రవ్యములం దధ్యాసము. ఏకత్వ సంఖ్యా విశిష్టమునకు గాదు. కావున, ఆశ్రయగత లింగసంఖ్యల సంబంధము, జాతికి సిద్ధించునని తాత్పర్యము. ॥348॥

అవతారిక— జాతిబోధక శబ్దములకు గూడ లింగవచనము లుపపన్నములగునని నిరూపింపబడినది వానికి శుక్లాది గుణశబ్దములు దృష్టాంతముగా నీయబడినవి. 'శుక్లః' అను శబ్దము తెలుపుగలదియను నర్థమును చెప్పినపుడందు 'మతుప్' - అను ప్రత్యయము వచ్చి లోపించినది అనిగాని లేదా గుణమునకును గుణికిని అభేదమేయనిగాని చెప్పవలసి యుండును.

జాతి శబ్దములును అభేదోపచారముచేతనే జాతిమంతములను బోధించును. ఇట్లు, బోధనోపాయ విషయమున భేదమున్నను, తద్వత్తు బోధించు జాతి గుణశబ్దములు రెండింటికిని దుల్యమే. అందువలన గుణశబ్దములు జాతి శబ్దములకు దృష్టాంతముగ జూపబడినవి. ఈ విషయ మీ కారికలో నిరూపింపబడుచున్నది.

శ్లో॥ అస్యేదమితి వా యత్ర సోఽయమిత్యపి వా శ్రుతిః ।
వర్తతే పరధర్మేణ తదన్యదభిధీయతే ॥ 349

'అస్య ఇదం' ఇతివా = 'దీనికి సంబంధించినది ఇది' అని గాని, 'సోఽయం' ఇతివా = 'అది ఇది' అనిగాని, శ్రుతిఃయత్ర వర్తతే = శబ్దప్రయోగ మెచ్చట నుండునో అచట, తత్ = ఆ శబ్ద వ్యవహారము గల, అన్యత్ = నిమిత్తి = నిమిత్తముగలది, పరధర్మేణ అభిధీయతే = నిమిత్తారోపముచే, అట్లు చెప్పబడును.

తాత్పర్య వివరణములు— శబ్దములే యుపాయముచే అర్థాంతరమును బోధించినను, నిమిత్తరూపము నారోపించి, నిమిత్తిని బోధించుట తుల్యము. కాగా శుక్లాది శబ్దములు ద్రవ్యమును చెప్పినను గుణ శబ్దములే యనబడును. గవాది శబ్దములును ద్రవ్యమును బోధించినను జాతి శబ్దములని వ్యవహరింపబడ వచ్చును. ॥349॥

అవతారిక— అది యెట్లనగా జూడుడు.

శ్లో॥ యత్రప్రధానం న తస్యాస్తి స్వరూపమవిరూపణాత్ ।
గుణస్య చాత్మనా ద్రవ్యం తద్భావేనోపలక్ష్యతే ॥ 350

యత్ ప్రధానం = ఏది, ముఖ్యమైనదో, తస్య స్వరూపం = దాని, స్వరూపము, అనిరూపణాత్ న అస్తి = నిరూపకము = విశేషణము లేనందున, లేదు, ద్రవ్యం చ = ద్రవ్యమును, గుణస్య ఆత్మనా = విశేషణముయొక్క, స్వరూపముచే, తద్భావేన, ఉపలక్ష్యతే = గుణాత్మకముగ, చూడబడుచుండును.

తాత్పర్య వివరణములు— క్రియా సంబంధమునకు అర్హమైన ద్రవ్యమేది అయినను, ఉపాధి విరహితమగు రూపముతో వ్యవహారమున నుండదు. ఉపాధి అనగా విశేషణము. నిరూపణమనగా ఉపాధియొక్క రూపముతో పూత పెట్టబడియుండుట. ఉపాధి రూపాచ్ఛురణ మన నదియే. శుక్ల గుణముగల ద్రవ్యముగాని, జాతి విశిష్ట వ్యక్తిగాని, ఆ, శుక్లగుణము, జాతి, అను నుపాధుల రూపముతో గూడి తాము విశేషణ రూపములే యనునట్లగపడును నిమిత్తి, నిమిత్తముతో సారూప్యము నందినదా యనునట్లు భాసించును. ॥350॥

అవతారిక— అట్లైనను జాతికి ప్రాధాన్యము నశించుననుకొనరాదు.

శ్లో॥ గుణస్య భేదకాలేతు ప్రాధాన్యముపజాయతే ।
సంసర్గ శ్రుతిరర్థేషు సాక్షాదేవ న వర్తతే ॥ 351

గుణస్య = గుణమును, భేదకాలేతు = వేఱొక దానినుండి విడబరచి ప్రధానముగ చెప్పిన, ప్రాధాన్యం, ఉపజాయతే = అపుడు ప్రాధాన్యము దానికి కలుగును, సంసర్గ శ్రుతిః = సంసర్గము ప్రవృత్తి నిమిత్తముగా గల శబ్దము, అర్థేషు = అర్థములందు, సాక్షాదేవ న వర్తతే = ఉపాధిని విడిచి వేరుగా వర్తింపదు.

తాత్పర్య వివరణములు— ద్రవ్యము ప్రధానముగ వివక్షింపబడినపుడు, జాతి ఉపాధి. గుణము ప్రధానవాచ్యమైన, గుణజాతి ఉపాధి. జాతియే ప్రధానముగ నభిమతమయిన శబ్దస్వరూప ముపాధి. శబ్దములేవస్తువును బోధించినను, ఏదియో ధర్మాంతరము యొక్క సంసర్గము నుపాధిగా గల దానినే బోధించునుగాని శుద్ధ వస్తువును బోధించవు. కనుక ఉపాధిని విడిచి సాక్షాదర్థమునందు, ఏ శబ్దమును వర్తింపదు. ॥351॥

అవతారిక— ద్రవ్యపదార్థ వాదమునను, జాతియను నుపాధితో గూడియే అది వాచ్యమగును గదా. అపుడు జాతి పదార్థతయే ప్రాప్తించినది. ఇక జాతి పదార్థవాదమునను, జాతి ద్రవ్యముల కభేదమున్నను జాతియే పదార్థమని సిద్ధించును. ఇక వేరుగ ద్రవ్యపదార్థ వాదమనునది ఎట్లు సంభవము ?

శ్లో॥ జాతౌ వృత్తోయదా ద్రవ్యే సశబ్దోవర్తతే పునః ।
జాతేరేవపదార్థత్వం న తదాభ్యుపగమ్యతే ॥ 352

శబ్దః = ఒక శబ్దము, జాతౌవృత్తః = జాతియందు వర్తించినదై, పునః సః = మరల, అది, ద్రవ్యే, యదా, వర్తతే = ద్రవ్యమునందు, వర్తించిన, తదా = అపుడు, ఇక, జాతేరేవ

పదార్థత్వ = జాతికే పదార్థతయనుట = జాతియే పదమున కర్థమనుట, న అభ్యుపగమ్యతే = గ్రహింపబడదు = అంగీకరింపబడదు.

తాత్పర్య వివరణములు— శబ్దములు 'అభిధ' అను వ్యాపారముచే ముందు జాతిని బోధించి, అంతతో నాగక మరల ద్రవ్యమును గూడ బోధించునపుడు, కేవలము జాతియే బోధితమనుట అంగీకరణీయము గాదు. ద్రవ్యమును బోధింపబడినది గదా ! కనుక ఆ వాదమును సిద్ధించును. ॥352॥

అవతారిక— శబ్దము లొక యర్థము నొక వ్యాపారముచే బోధించి, అంతతో నాగక మరల నర్థాంతరబోధకు వ్యాపారించుననుట శాస్త్రీయము గాదు. కాగా నొక శబ్దమునకే జాతివాచకత్వమును ద్రవ్యవచనత్వము నెట్లు సంభవించును ? అపుడవి భిన్న భిన్న శబ్దములే కావలెను గదా అనిన—

శ్లో॥ ప్రవృత్తానాం పునర్వృత్తిరేకత్వేనోపవర్ణ్యతే ।
ప్రతిపత్తేరుపాయేషు న తత్త్వమనుగమ్యతే ॥ 353

ప్రవృత్తానాం = ఒక యర్థమునందు ప్రవర్తించిన శబ్దములకు, పునః, వృత్తిః = మరల అర్థాంతరమున బ్రవర్తించుట, ఏకత్వేన = అభిన్నముగనే = ఏకప్రవృత్తిగనే, ఉపవర్ణ్యతే= చెప్పబడుచున్నది, ప్రతిపత్తేః = బోధనమునకు, ఉపాయేషు = సాధనముగా గ్రహింపబడు వాని విషయమున, తత్త్వం, న అనుగమ్యతే = యాథార్థ్యము, పాటింపబడదు.

తాత్పర్య వివరణములు— సత్యమే. ఆ శబ్దములు భిన్న భిన్నములే కావలెను. కాని వాని సాదృశ్యమునుబట్టి అభేదమును వానికి అధ్యవసించి (ఆరోపించి) ఏకత్వమే వ్యవహరింపబడు చున్నది. అది ప్రతిపాదనమునం దుపాయము మాత్రమే. శబ్దములు జాత్యాదులతో సంసృష్టములగు వానిని మొత్తముగనే బోధించును. వానికి ఒక యర్థమును బోధించి, విరమించిన, మరల వ్యాపారించుట శాస్త్రానుమతము గాదు. క్రమబోధ లేనేలేదు. ప్రతిపత్తి సౌకర్యమునకై క్రమము కల్పితము. అంతియే. ఉపేయమును దెలిసికొనుటకై యవలంబింపబడు నుపాయములు వ్యవస్థితములుగా నుండవు అవి సత్యములును గావు. ॥353॥

అవతారిక— జాతియు వ్యక్తియును భయములును శబ్దములచే నభిహితములయినను, వాని ప్రాధాన్యమును అప్రాధాన్యమునుబట్టి మత భేదముచే, 'జాతి పదార్థత' 'ద్రవ్య పదార్థత' అను వాదములు సిద్ధించును, అని యిందు చెప్పబడుచున్నది.

శ్లో॥ అపృథక్ శబ్దవాచ్యస్య జాతిరాశ్రీయతేయదా ।
ద్రవ్యస్య సతిసంస్పర్శే తదాజాతి పదార్థతా ॥ 354

అపృథక్ శబ్ద వాచ్యస్య = వేరు శబ్దముచే గాక యొకే శబ్దముచే చెప్పబడిన ద్రవ్యమునకు, జాతిః, యదా, ఆశ్రీయతే = జాతి, ఎపుడు, ప్రధానముగ ఆశ్రయింపబడునో, తదా =

అపుడు, ద్రవ్యస్య = ఆ ద్రవ్యమునకు, సంస్పర్శే 'సత్యపి' = శబ్దముచే బోధనము ఉన్న ప్పటికి, జాతి పదార్థతా = 'జాతి పదార్థము' అను పక్షమే సిద్ధము.

తాత్పర్య వివరణములు— జాతియు, వ్యక్తియు నొక శబ్దముచేతనే బోధింపబడి నను కార్యప్రవృత్తి విషయమున, జాతికే ప్రాధాన్యమును వివక్షించిన, ద్రవ్య సంబంధ మా జాతికి లేకపోదు. అయినను జాతి యచట పదార్థమనుటయే యుక్తము. ద్రవ్య సంస్పర్శ మెందుకనగా, ఆధార భేదముచే ఆధేయమగు జాతికి భేదమును సూచించుటకు మాత్రమే కనుకనే ఈ ప్రయోగములలో నొకచో బహువచనోపపత్తి. లేనిచో జాతినిబట్టి ఏకవచనమే ప్రాప్తము. ''బ్రాహ్మణాః శుశ్రూషితవ్యాః । = బ్రాహ్మణజాతి సేవింపదగినది. ఇచ్చటను ఏకవచనము మాత్రమే ప్రాప్తము. ''యోఽయం పానీయం పిబతి స గౌః పదా న స్ప్రష్టవ్యః'' = నీరు త్రాగుచున్న గోజాతీయ మేదియు కాలితో తాకబడరాదు. ''గౌరనుబంధ్యః'' = గోజాతీయము ఆలంభనీయము అని ఇట్లు శబ్దముచే ద్రవ్య సంస్పర్శమున్నను జాతిపదార్థ పక్షమే పర్యవసించును. అపుడును ఏకవచన బహువచనాంత శబ్దప్రయోగము లుపపన్న ములు. ॥354॥

అవతారిక— ఇక ద్రవ్యపదార్థ పక్ష మెపుడు సిద్ధించుననిన—

శ్లో॥ ద్రవ్యస్య సతి సంస్పర్శే ద్రవ్యమాశ్రీయతే యదా ।
వాచ్యం తేనైవ శబ్దేన తదా ద్రవ్యపదార్థతా ॥ 355

శబ్దేనతేనైవ = ఆ జాతి బోధకశబ్దముచేతనే, ద్రవ్యస్య = ద్రవ్యమునకు, సంస్పర్శే సతి = అభిధేయముగ సంబంధము కలిగినపుడు, యదా = ఎపుడు, ద్రవ్యం వాచ్యం = ద్రవ్యము, ఆశ్రీయతే = కార్యార్థమై ప్రధానముగ నాశ్రయింపబడునో, తదా, ద్రవ్యపదార్థతా=అపుడు, ద్రవ్యపదార్థ పక్షము సిద్ధించును.

తాత్పర్య వివరణము— జాతి బోధక శబ్దమే ద్రవ్యమును గూడ బోధించినను, అభిధేయమగు ఆ ద్రవ్యము కార్యవిశేషమునందు ప్రధానముగ గ్రహింపబడి, జాతి దానికి విశేషణముగ మాత్రమే ఉపయుక్తమయినపుడు ''ద్రవ్యము పదార్థము'' అను పక్షము ఏర్పడును ఎట్లనగా - ''బ్రాహ్మణ మిమం భోజయ'' అను వాక్యమును జూడుడు. 'ఈ బ్రాహ్మణున కన్నము పెట్టుడు' అనిన నట బ్రాహ్మణ శబ్దము, ఈ బ్రాహ్మణున కనుటవలన జాతిని బోధింపదు. వ్యక్తినే బోధించును. కనుక నిట ద్రవ్యపదార్థ పక్ష మాశ్రితము. ప్రాధాన్యాప్రాధాన్యములనుబట్టి పక్షములకు వ్యవస్థయని భావము.

సరూప సూత్ర భాష్యమున నీ సందర్భమునందున్న గ్రంథము గమనీయము— ''కస్యచిత్తు కిం చిత్ప్రధానమ్'' కించిద్గుణ భూతమ్. న హి ఆకృతి పదార్థకస్య ద్రవ్యం న పదార్థః । ద్రవ్య పదార్థ కస్య వా ఆకృతిర్న పదార్థః । ఉభయోరుభయం పదార్థః । ఆకృతి పదార్థకస్య ఆకృతిః ప్రధానభూతా । ద్రవ్యం గుణభూతమ్ । ద్రవ్యపదార్థకస్య ద్రవ్యం ప్రధానభూతమ్ । ఆకృతిర్గుణ భూతా ॥'' - ఇవి యచటి పంక్తులు.

"పదములకు ఆకృతి 'అర్థము' - అను వానికి ద్రవ్యమిక లేనేలేదని యర్థము కాదు. ద్రవ్యపదార్థి వాదికిని, ఆకృతి పదార్థము కానేకాదని తాత్పర్యము గాదు. ఉభయుల కును నుభయమును పదార్థమే. అయిన నొకని కొక్కటి ప్రధానమయిన, రెండవది అప్ర ధానము. ఆకృతివాది కాకృతి ప్రధానమయిన ద్రవ్యమప్రధానము. ద్రవ్యవాదికి ద్రవ్యము ప్రధానమయిన, ఆకృతి గుణమగును. అంతియ— ॥355॥

అవతారిక— వేదమున పూర్వకాండము కర్మలను బోధించును. విధి వాక్యము లకు చోదనావాక్యములని వ్యవహారము. 'చోదన, విధి' - ఇవి పర్యాయపదములు. ఆ చోద నలు జాతిపరములు కొన్ని, వ్యక్తిపరములు కొన్ని. "గౌరనుబంధ్యోఽజో గ్నీషోమీయః" అని యొక చోదన. అది జాతి పరము. గోజాతికి ఆలంభనమును చేయుట అసంభవి. గోపదము జాతివాచకమయినను, తాత్పర్యదృష్టిలో ద్రవ్యమే అచటను శబ్దార్థమని వ్యాడి మున్నగు మహర్షుల మతము.

శ్లో॥ అపృథక్ శబ్దవాచ్యాపి భేదమాత్రే ప్రవర్తతే ।
యదా సంబంధవజ్జాతిః సాపిద్రవ్యపదార్థతా ॥ 356

జాతిః = ఆకృతి, అపృథక్ శబ్దవాచ్యా అపి = ఒకే శబ్దముచే జెప్పబడినను, యదా=ఎపుడు, సంబంధవత్ = సమాసార్థమగు సంబంధమువలె, భేదమాత్రే = తన ఆశ్రయమును వేరు జేయుటలో మాత్రమే, ప్రవర్తతే = వర్తించునో, తదాపి, సా = అపుడును, ఆస్థితి, ద్రవ్య పదార్థతా = ద్రవ్యము పదార్థముగా గలిగియుండుట అగును.

తాత్పర్య వివరణములు— జాతియు, వ్యక్తియు, ఏకశబ్దోపాత్తములే అయినను, ఆలంభనము మున్నగు కార్యములు అనుభవించు యోగ్యత జాతికి సంభవింపదు. అపుడు జాతిని ఆదరింపక వ్యక్తినే స్వీకరించువారు వ్యాడిమహర్షి మున్నగువారు. "చోదనాసు చ తస్యారంభాత్" అని యీ సందర్భమున వ్యక్తికి పదార్థతను సాధించు వార్తికము. చోద నాసు = ప్రవర్తక వాక్యములలో, తస్య = ద్రవ్యమునకు, ఆరంభాత్ = ఆరంభము చేయ బడుట వలన - అని యర్థము ఆరంభణమనగా క్రయము లేదా బంధనము ఈ క్రియయు, ప్రోక్షణ విశసనాది క్రియలును ద్రవ్యమునందే చేయబడుచున్నవి. కావున ద్రవ్యమే శబ్ద వాచ్యమని వారి తాత్పర్యము. ఇక జాతి కుపయోగమేమనిన, వ్యక్తి, జాత్యవచ్ఛిన్నమేగాని గుణాద్యవచ్ఛిన్నము గాదని తెలుపుటయే.

రాజపురుషః అనునది షష్ఠీ సమాసము. తత్పురుష, అది ఉత్తరపదార్థ ప్రధానము రాజపురుషుల సంబంధమగు 'స్వస్వామి భావసంబంధమును షష్ఠ్యర్థమే. కావున నదియు సమాసవాచ్యమే అయినను ప్రధానము గాదు. ఆ సంబంధము, ఆ పురుషుడు రాజు సంబం ధియే గాని ఇతర సంబంధి గాదు అని తెలియచేయుటకే ఉపయుక్తము. ఆ విధముగనే యీ వాదమున గోత్వాది జాతులును అవచ్ఛేదక మాత్రములే. వ్యక్తులకే ప్రాధాన్యము అని భావము. ॥356॥

అవతారిక— 'శుద్ధ జాతివాదము', 'శుద్ధ వ్యక్తివాదము' అనియు రెండు పక్షములు గలవు. కేవల జాతియే శబ్దవాచ్యము అనునది మొదటివారి వాదము. శుద్ధ ద్రవ్యము శబ్దవాచ్యమని ద్రవ్యపదార్థ పక్షము. ఆ పక్ష ద్వయ మీ కారికలో ప్రసంగింపబడును.

శ్లో॥ అత్యంతభిన్నయోరేవ జాతిద్రవ్యాభిధాయినోః ।
అవాచ్యస్యోపకారిత్వ ఆశ్రితేతూభయార్థతా ॥ 357

అత్యంతభిన్నయోః ఏవ = మిక్కిలి వేరు వేరే అయియున్న, జాతి ద్రవ్యాభిధాయినోః = జాతివాచక, వ్యక్తివాచక శబ్దములలో, అవాచ్యస్య = శబ్దవాచ్యముగాని రెండవదానికి, ఉపకారిత్వే = వాచ్యమయిన దాని కుపకారము, ఆశ్రితే తు = ఆశ్రయింపబడిన యెడల, ఉభయార్థతా = జాతి పదార్థతయు, ద్రవ్య పదార్థతయు, సిధ్యతి = సిద్ధించినది.

తాత్పర్య వివరణములు— కేవలము జాతిని మాత్రము చెప్పు శబ్దము వేరు. ఆ విధముగనే వ్యక్తిమాత్ర వాచక శబ్దమును వేరే. ఆ భిన్న భిన్న శబ్దములందు, జాతివాచకము, జాతిని చెప్పినపుడు, వ్యక్తి, చెప్పబడకపోయినను, తన లింగవచనాదులను జాతికి కల్పించి యుపకరించును.

అటులనే, వ్యక్తి వాచ్యమయినపుడు, జాతి, తాను వాచ్యముకాకున్నను, వ్యక్తులకు విశేషణముగ నుపకరించును. కావున శుద్ధ జాతి, శుద్ధ వ్యక్తి పక్షములు పాణినికి సమ్మతములుగా మహాభాష్యమున చివర నుపపాదింపబడినవి. విషయ భేదముచే లక్ష్యానుసారముగ జాతి వ్యక్తి పక్షము లాశ్రయింపబడినవి. "జాత్యాఖ్యాయా మేకస్మిన్ బహువచన మన్యతరస్యామ్" (1-2-58) అను సూత్రము, వ్రీహి జాతి సంపన్నమను నర్థమున సంపన్నా ; వ్రీహయః అను ప్రయోగము ననుసరించి, రచింపబడినది దీనివలన జాతిపక్ష మాతనికి సమ్మతమని తెలియును.

అది యొక్కటియే సమ్మతమయిన, సరూపములగు పదములకు సహవివక్షలో ఏ వచనము జాతియొక్క ఏకత్వమువలననే సిద్ధించునుగాన, "సరూపాణామేకశేష ఏకవిభక్తౌ" (1-2-64) అను సూత్రమును రచింప బనిలేదు. కాగా పక్షద్వయమును నాతనికి సమ్మతమే యనుట నిర్వివాదము. ॥357॥

అవతారిక— ఇటుల ప్రసంగరీత్యా మతభేదమును ప్రదర్శించి, ప్రకృతి విషయము నీ కారికతో ముగించుచున్నారు.

శ్లో॥ ఆశ్రితే త్వాశ్రయ కృతం భేద మభ్యుపగచ్ఛతా ।
పునశ్చాప్యేకశబ్దత్వం జాతిశబ్దేఽనువర్ణితమ్ ॥ 358

ఆశ్రయకృతం = జాతికి ఆశ్రయమగు వ్యక్తినిబట్టిన, భేదః = సంఖ్యాభేదమును, ఆశ్రితే = వ్యక్తి విశేషము నాశ్రయించిన జాతియందు. అభ్యుపగచ్ఛతా = అంగీకరించుచున్న భాష్యకారునిచేత, ఏకశబ్దత్వం = అనేకార్థ బోధయందుగూడ శబ్దమొక్కటియే యుండుట, జాతిశబ్దే

= జాతిపదార్థ వాదమునందు, పునః అపిచ = మరలగూడ, అనువర్ణితమ్ భవతి = ఉప పాదితమగుచున్నది.

తాత్పర్య వివరణములు— జాతి, వ్యక్తుల నాశ్రయించియుండును. జాతియొక్కటి వ్యక్తు లనేకములు. శబ్దము జాతిని బోధించినపుడు, ఆ సన్నిహితమగు ఆశ్రయమునుబట్టి, శబ్ద సంస్కారమున కావశ్యకమగు లింగవచనముల భేదము జాతి శబ్దమునకును గలుగునని భాష్యకారు డంగీకరించియున్నాడు.

''లింగవచన సిద్ధిర్గుణ వివక్షానిత్యత్వాత్'' - అని సరూప సూత్రమున వార్తికము గుణములనగా, స్త్రీపుం నపుంసక లింగములును ఏకత్వ ద్విత్వబహుత్వములును. వాని వివక్ష నియతము గాదు కాబట్టి జాతికి లింగవచనములు సిద్ధించునని చెప్పి, ద్రవ్యపదార్థ వాదికి వచనములు, స్వాభావికములుగాక బహుషు బహువచనమ్ - అను మున్నగు వచనములచేతనే ప్రతిపాద్యములయిన, జాతివాదినైన నాకును నష్టే యగును, 'పచతి' పచతః 'పచంతి' అని, క్రియా ప్రధానములయినను తిఙన్తములకు వచనభేదము కారకములవలన గలిగినట్లు, ఆకృతి ప్రధానమైనను ద్రవ్యసంఖ్యనుబట్టి వచనభేద ముపపాద్యము అని చెప్పెను. కనుక ఏకశేష విధాన మనావశ్యకమని ముగింపు. ప్రధానముగ జాతి శబ్దముచే చెప్పబడును. అది యొక్కటియే కనుక దానిని చెప్పు శబ్దమును నేకమే ప్రాప్తమని భావము

ఏకవచనాదులు శాస్త్రప్రతిపాద్యములేగాని స్వాభావికములు గావు. 'గోదౌ' అవి ద్వివచనాంత శబ్దము ఒక గ్రామమునకు వాచకము. 'పంచాలాః' అని బహువచనాంత మొక దేశమునకు వాచకముగనున్నది. వచనములు స్వాభావికములయిన నట్లుండదుగదా. ద్రవ్య పదార్థవాదికయినను వచన నియమ మావశ్యకమయినట్లు, ఆకృతివాదికిని అది అపరిహార ణీయము. వృత్తి విచార ప్రసంగ సంగతమయిన లింగవచన సిద్ధి విచారమింతతో ముగిసినది, ॥358॥

అవతారిక— ఉపమాన సమాసవిచార మిక జేయబడును. ఉపమాన సమాస మనగా, ''ఉపమానాని సామాన్యవచనైః'' అను, (2-1-54) సూత్రముచే విధింపబడిన సమాసము. ఉపమానవాచకములగు సుబంతములు సాధారణ ధర్మ విశిష్టములను జెప్పు సుబంతములతో సమసించునని యా సూత్రమున కర్థము. అందుపమానమన నేమియో తెలుపుటకు, ముందుగ, మానమననేమి ? అని తెలిసికొనుటకై, భాష్యమున, ''మానం హి నామ అనిర్జ్ఞాత జ్ఞానార్థ ముపాదీయతే, అనిర్జ్ఞాతం జ్ఞాస్యామీతి'' అని చెప్పబడినది. దాని నీ కారిక విశదీకరించును.

శ్లో॥ అనిర్జ్ఞాతస్య నిర్జ్ఞానం యేన తన్మానముచ్యతే ।
ప్రస్థాది కేన మేయాత్మా సాకల్యేనావధార్యతే ॥ 359

యేన = దేనిచేత, అనిర్జ్ఞాతస్య = 'ఇది ఇంత' అని స్పష్టముగ తెలియబడని వస్తువునకు, నిర్జ్ఞానం భవతి = విశేష పరిజ్ఞానము కలుగునో, తత్, మానం, ఉచ్యతే = అది, మానము,

అని చెప్పబడుచున్నది, ప్రస్థాదికేన = 'మానిక' మున్నగు కొలపాత్రచేత, మేయాత్మా = కొలవవలసిన పదార్థ ప్రమాణము, సాకల్యేన, అవధార్యతే = సంపూర్ణముగ 'ఇంత' అని నిశ్చయింపబడును.

తాత్పర్య వివరణము— మానమనగా నిది యింత అని పరిచ్ఛేదించునది. అర్ధ, తత్వ, కుంచము, మరకము మున్నగు కొలపాత్ర. ఈ మాన శబ్దమునకు ఉత్, పరి, ప్ర. అను నుపసర్గలను జేర్చి, ఉన్మానము, పరిమాణము – ప్రమాణము – అనియు వ్యవహరింతురు. వానికి అర్థభేదమును గలదు. ఉన్మానమనగా తూకము తులము, పలము, వీసె – మున్నగునది. పరిమాణములు, కుంచము మున్నగునవి. మూర, జాన, గజము – మున్నగునవి ప్రమాణములు ఈ విధముగ సాకల్యముగ పరిచ్ఛేదించునది మానమగును ॥౩౫౯॥

అవతారిక— పైన జెప్పినవన్నియు పరిచ్ఛేద్య వస్తువును, నిక్కచ్చిగ ఇది యింత, అని పరిచ్ఛేదించునవి. ఇక ఉపమానమననేమియో చెప్పుచున్నారు.

శ్లో॥ అనిర్జ్ఞాతం ప్రసిద్ధేన యేనతద్ధర్మ గమ్యతే ।
సాకల్యేనా పరిజ్ఞానా దుపమానం త దుచ్యతే ॥ 360

అనిర్జ్ఞాతం = 'ఇది ఇట్లు' అని తెలియబడనిది, ప్రసిద్ధేన, యేన = ఆ విధముగ తెలియబడిన, దేనిచేత, తద్ధర్మ = ఆ, ప్రసిద్ధమైన దాని ధర్మము కలదిగా, గమ్యతే, తత్ = తెలియబడుచున్నదో, అది, సాకల్యేన = సమగ్రముగ, అపరిజ్ఞానాత్ = తెలియచేయనందున, తత్, ఉపమానం = 'ఉపమానము' = దగ్గరగ తెలియచేయును, ఇతి ఉచ్యతే = అని, చెప్పబడుచున్నది

తాత్పర్య వివరణములు— గవయము – అని అడవులలో నుండు ఒక మృగము. అది ఆరణ్యులకే తెలియునది. అది ఎట్లుండును? అని అడిగిన, గోవువలె నుండునని, యందురు. నగరములందును, గ్రామములందును నుండు వారికి గోవు ప్రసిద్ధము. దాని సాదృశ్యమును బట్టి, దాని ధర్మములు కలదిగా గవయము నిరూపింపబడుచున్నది. కావున గోవు గవయమునకు ఉపమానము. అనగా ఇంచుమించుగ పరిచ్ఛేదకము మాత్రమే. కుంచము మానికవలె సమగ్ర పరిచ్ఛేదకము గాదు. 'ఉప' అనునది 'హీనము' అను నర్థమునకును ద్యోతకము. ఉపమానమనునది, ఉపమేయ వస్తువును, స్వసదృశముగ మాత్రమే బోధించును గాని విశేషరూపముగ బోధింపదు. కనుక అది మానము గాదు.

కనుకనే, ఉపమానమను తార్కికుల ప్రమాణము విషయమున, వివాదమును గలదు. అట ఆప్తవాక్యమే ప్రమాణము సాదృశ్యకథనముపాయమాత్రమే యని వారి తాత్పర్యము. 'ఉపమీయతే అనేన ఇతి ఉపమానమ్' అనుకరణ వ్యుత్పత్తిచే సాదృశ్యజ్ఞానముపమానము. ఆ జ్ఞానముచేత, సాక్షాత్తుగా ఉపమేయము పరిచ్ఛేదింపబడును. గోవు ఉపమానమనుట పరంపరనుబట్టి, సాదృశ్యజ్ఞానమే గవయ పరిచ్ఛేదకము ఆ శబ్దమునకును దాని యర్థమునకును గల సంబంధమును తెలిసికొనుటయే, ఫలము అందురు. ॥౩౬౦॥

అవతారిక— ఇక నీ కారికలో సామాన్యవచనము లననేమియో చెప్పుదురు.

**శ్లో॥ ద్వయోస్సమానో యో ధర్మ ఉపమానోపమేయయోః ।
సమాస ఉపమానానాం శబ్దైస్తదభిధాయిభిః ॥** 361

ఉపమానోపమేయయోః = ఉపమానము, ఉపమేయము అను, ద్వయోః = రెండింటికిని, సమానః, యః, ధర్మః = సమానమయిన, ఏ, ధర్మముకలదో, తదభిధాయిభిః శబ్దైః = దానిని చెప్పు శబ్దములతో, ఉపమానానాం సమాసః = ఉపమాన వాచకములకు సమాసము వచ్చును.

తాత్పర్య వివరణములు— సాదృశ్యము అను ధర్మమునుబట్టి రెండు వస్తువుల కుపమానోపమేయ భావమును చెప్పుదురు. ఆ ధర్మమే సామాన్యము. రెండింటికిని సమాన మయి యుండుట. ఆ సామాన్యమును ముందుగ బోధించి, తరువాత తద్విశిష్టమును బోధించు నవి సామాన్య వచనములు. వానితో ఉపమానవాచకములకు సమాసము వచ్చునని సూత్రా ర్థము. ఉదాహరణములు— ఘనశ్యామః - శస్త్రీశ్యామా - అనునవి. మేఘమువలె నల్లనివాడు దేవదత్తుడు. చురకత్తివలె నల్లనైనది, దేవదత్త - అని యర్థము. ఈ సమాసమున కుపమాన పూర్వపద కర్మధారయమని వ్యవహారము. ॥361॥

అవతారిక— ఆర్యా ! శ్యామత్వమను, గుణము, మేఘగతమయినది వేరు. దేవ దత్తునియందుండునది వేరునుగదా ! అది సామాన్య ధర్మమెట్లగును ? అనిన—

**శ్లో॥ ఆధారభేదాత్ భేదో యః శ్యామత్వే సో వివక్షితః ।
గుణోఽసావాశ్రితైకత్వో భిన్నాధారః ప్రతీయతే ॥** 362

శ్యామత్వే = నలుపు అను, గుణమునందు, ఆధారభేదాత్ = ఆశ్రయ భేదమువలన, యః భేదః సః = ఉన్నయే భేదముగలదో అది, అవివక్షితః = వివక్షింపబడదు, అనగా లెక్కలోనికి రాదు, అసౌ గుణః = ఈ, శ్యామత్వగుణము, భిన్నాధారః = వేరు వేరు ఆశ్రయములు కల దైనను, ఆశ్రితైకత్వః = ఆశ్రయింపబడిన, ఏకత్వము కలదై = ఏకముగా గృహీతమయి, ప్రతీయతే = ప్రతీయమానమగును.

తాత్పర్య వివరణములు— సామాన్యవాచక శబ్దములతో సమాసము విధింపబడి నది గదా ఆశ్రయభేదమువలన గుణమునకు భేదమును గ్రహించిన ఉపమానోపమేయములకు సాధారణమైన ధర్మమే సంభవింపదు. అందువలన, సామాన్యవచన శబ్దము సార్థకమగుటకు, ఆశ్రయభేదమున్నను ధర్మమునకు ఏకత్వమే గ్రహింపవలెను. ఆధారములకు భేదమున్నను, గుణమునకు, ఉభయాన్వయము గల రూపముండును. అందువలన అభేదము లేకున్నను అభిన్నమను జ్ఞానము సంభవము. ॥362॥

అవతారిక — అభేదమే వివక్షితమును గాదు. ఇక నేమనిన–

శ్లో॥ గుణయోర్నియతో భేదః గుణజాతే స్తథైకతా ।
ఏకత్వేఽత్యంతభేదే వా నోపమానస్య సంభవః ॥ 363

గుణయోః = ఉపమానోపమేయముల గుణములకు, భేదః, నియతః = అనేకత్వము, నియతము కాని, తథా = ఆ విధముగనే, గుణజాతేః = ఆ గుణములందలి జాతికి, ఏకతా, నియతా = అభేదమును నిశ్చితము, ఏకత్వే=వానికి ఐక్యమే అనినగాని, అత్యంతభేదే వా=అంతయు భేదమే యనిన గాని, ఉపమానస్య = ఉపమించుట యను వ్యాపారమునకు, సంభవః న భవతి = సంభవము ఉండబోదు.

తాత్పర్య వివరణములు— 'రెండు వస్తువులు తుల్యములు' అనిన, అవి వేరు వేరు వస్తువులయి తీరును. ఉపమానోపమేయ భావమున కపుడే సంభవము. గోవువంటిది గవయము' అందుపుగాని, 'గోవు వంటిది గోవు' అనము. అట్లని, ఆ రెండు వస్తువులకును, సమానధర్మమేదియును లేకుండగ పూర్తిగ భేదమే యున్నను, పనికిరాదు. ఉభయత్ర అన్వయించు రూప మావశ్యకము. ''మట్టిగడ్డ హిమవత్పర్వతము వంటిది'' అని ఎవరును అనరు. భేదాభేదములు రెండును నుండవలెను. శ్యామగుణములు వేరయినను వానియందుండు శ్యామత్వ జాతి ఏకమేగాన నది సామాన్యమగును, అని భావము. ॥363॥

అవతారిక — ఉపమానోపమేయముల కత్యంతము భేదమున్నపుడు హిమవంతమునకును లోష్టమునకువలె ఔపమ్యమున చెప్పుట యుక్తము గాదు. అది సత్యమే. వానికి సర్వధా అభేదమున్నపుడును నది సంభవింపదందురే? అది ఏల? గుణసామ్యమును బుచ్చుకొని సంభవింపవచ్చును గదా? అనిన–

శ్లో॥ జాతిమాత్ర వ్యపేక్షాయాముపమార్థో న కశ్చన ।
శ్యామత్వమేకం గుణయోరుభయోరపి వర్తతే ॥ 364

జాతిమాత్ర వివక్షాయాం = ఆశ్రయముల భేదమును గణింపక జాతిని మాత్రమే తీసికొనిన, ఉపమార్థః=ఉపమించుట అనునది, కశ్చన, న=ఏదియు, కుదురదు, ఉభయోరపి గుణయోః = రెండు శ్యామ గుణములందును, శ్యామత్వం = శ్యామత్వమను జాతి, ఏకం వర్తతే = ఒకటే, గుణజాతి యుండును.

తాత్పర్య వివరణములు— ఉపమానము, సాదృశ్యమును బురస్కరించుకొని ఉపమేయమును పరిచ్ఛేదించును గదా. అపుడా మాటయే యుండదు. 'శస్త్రీ శ్యామా' అనుచో శస్త్రియందలి నలుపునకును, దేవదత్త నలుపునకును, శ్యామత్వము సామాన్యము' అని అంత మాత్రమే యర్థమగును. అంతియకాని, 'శస్త్రివలె దేవదత్త నల్లగా నున్నది' అనెడు భావమే కలుగదు. ॥364॥

అవతారిక— ఈ కారికయు నీ విషయమునే విపులముగ జెప్పుచున్నది.

శ్లో॥ యేనైవ హేతునా శ్యామా శస్త్రీ తత్ర ప్రవర్తతే ।
స హేతుర్దేవదత్తాయాః ప్రత్యయేన విశిష్యతే ॥ 365

యేన, హేతునా, ఏవ = ఏ, కారణముచేతనే, శస్త్రీ, శ్యామా, తత్ర, ప్రవర్తతే = చురకత్తి, నలుపుకలది యగుటవలన నుపమేయమునందు వర్తించునో, సః హేతుః = ఆ హేతువు, దేవదత్తాయాః = దేవదత్తయొక్క, ప్రత్యయేన, విశిష్యతే = ప్రతీతిచేత, విశేషింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— నలుపు - అను, గుణము చురకత్తియందు, సమవేతమయి, అనగా సమవాయమను సంబంధమును గలిగి - ఉన్నది. అందువలన నది నల్లనిది అని గ్రహించుచున్నాము. దేవదత్త అనునామె కూడ ఆ గుణముచేతనే నల్లనిదని భావించుచున్నాము. ఆ గుణము తుల్యముగ రెండింటిని నంటియుండుట కారణము. అనగా నేమి తెలుచున్నది ? కత్తి నలుపు దేవదత్తయు నలుపు అనియే తెలుచున్నది. ఆ గుణమునుబట్టి వానికి సాదృశ్యము కలదని గోచరము కాదు. ॥365॥

అవతారిక— అందువలన నేమి గ్రహింపవలెననగా—

శ్లో॥ ఆశ్రయాత్ యో గుణే భేదో జాతేర్యా చ విశిష్టతా ।
తాభ్యాముభాభ్యాం ద్రవ్యాత్మా సవ్యాపారః ప్రతీయతే ॥ 366

గుణే = నలుపు మున్నగు గుణమునందు, ఆశ్రయాత్ = దాని కాధారమగు వస్తువువలన, యః, భేదః = ఏ, భేదము కలదో, జాతేఃయాఅవిశిష్టతా చ=దానియందలి శ్యామత్వ జాతికి, అభేదమేది కలదో, తాభ్యాం ఉభాభ్యాం = ఆ భేదాభేదములు రెండింటిచేతను, ద్రవ్యాత్మా = ద్రవ్యముయొక్క స్వభావము, సవ్యాపారః = ఉపమించుట అను వ్యాపారము కలదిగా, ప్రతీయతే = తెలియబడుచున్నది.

తాత్పర్య వివరణములు— శస్త్రీయందును, దేవదత్తయందును నుండు నలుపులు, భిన్నములే. కాని వానియందు శ్యామత్వమను గుణజాతి ఒక్కటియే. ఈ ఆధారభేద నిమిత్తకమయిన, భేదమును, అన్వయిరూప హేతుకమైన ఏకత్వమును కారణములుగా, ఉపమించుట అను ద్రవ్యస్వభావము, పనిచేసి, ఉపమేయమును పరిచ్ఛేదించును అని భావము. ॥366॥

అవతారిక— ఓయీ ! భేదమును అభేదమును పరస్పర విరుద్ధములు గదా. అవి రెండును గలసి, ఉపమితి వ్యాపారమునందు ప్రవర్తించుట యెట్లు కుదురును ? అనిన—

శ్లో॥ సోఽయమేకత్వనానాత్వే వ్యవహారః సమాశ్రితః ।
భేదాభేదవిమర్శేన వ్యతికీర్ణేన వర్తతే ॥ 367

ఏకత్వనానాత్వే = అభేదమును, భేదమును, ఆశ్రితః=ఆశ్రయించియున్న, సోఽయం = ఆ,

ఈ సుప్రసిద్ధమయి యున్న, వ్యవహారః = సాదృశ్య వ్యవహారము, వ్యతికీర్ణేన = సంకీర్ణ మయున, భేదాభేద విమర్శేన = భేదమును, అభేదమును అనునది మూలముగ, వర్తతే = బుద్ధి గోచరమయి యుండును

తాత్పర్య వివరణములు— రెండు వస్తువులకు పూర్తిగ అభేదమే ఉండిన, 'సోఽయం'=అదియే యిది - అనుకొందుము. వానికి భేదమే పూర్తిగనుండిన, 'అది కాదిది. ఇది వేరు' - అని వ్యవహరింతురు. భేదాభేదములు రెండును గలసినపుడే, 'తత్సదృశమిది' అను బుద్ధి కలుగును అందు విరోధమేమున్నది ? ఈ తృతీయకాండమునందే జాతి సముద్దేశ మున,

''సకృత్ప్రవృత్తా వేకత్వం, ఆవృత్తౌ సదృశాత్మతామ్ ।
భిన్నాత్మికానాం వ్యక్తీనాం భేదాపోహాత్ప్రపద్యతే ॥''

అను 98 వ కారికలో, సామాన్యబుద్ధి, సమూహబుద్ధి, సదృశబుద్ధి, అను బుద్ధిత్రయవిషయము వివరింపబడినది. ॥367॥

అవతారిక— అన్వయముఖముగా నుపపాదించిన విషయమునే దార్ఢ్యమునకై వ్యతి రేక ముఖమున గూడ నుపపాదించుచున్నారు

శ్లో॥ శ్యామేత్యే వాభిధీయేత జాతిమాత్రే వివక్షితే ।
శస్త్ర్యాదీనాముపాదానే తత్ర నాస్తి ప్రయోజనమ్ ॥ 368

జాతిమాత్రే = జాతి యొకటియే, వివక్షితే సతి = చెప్పదలంపబడిన, శ్యామా ఇత్యేవ = ''శ్యామా దేవదత్తా'' = దేవదత్త నల్లగనున్నది అనియే, అభిధీయేత = చెప్పబడి యుండ దగును, శస్త్రీ ఆదీనాం = ఉపమానములగు చురకత్తి మున్నగువానిని, ఉపాదానే = గ్రహిం చుటలో, తత్ర = అచట, ప్రయోజనం = ప్రయోజనము, నాస్తి = ఉండదు.

తాత్పర్య వివరణములు— దేవదత్త అను నీమె శ్యామత్వజాత్యనుగతమగు శ్యామ గుణము కలది' అని మాత్రమే వివక్షితమైన, ''ఇయం దేవదత్తా శ్యామా'' = ఈ దేవదత్త నల్లగా నున్నది' - అని మాత్రమే అనదగి యున్నది. నల్లనిది అని తెలియచేయుటకు, శ్యామ గుణసంబంధమును తెలియజేయు శ్యామ పదము కలదు గదా. ఇక శస్త్రీ అను పదప్రయోగ మెందులకు ? ఆ నలుపు నందలి అతిశయమును చెప్పదలంపనపుడు శస్త్రీ మున్నగు ఉప మాన పదములను వాక్యమున చేర్చి 'శస్త్రీ శ్యామా' అనుట నిష్ప్రయోజనము. ॥368॥

అవతారిక— ఓయీ ! ఉపమానోపమేయ భావము, భేద ఘటితమును, అభేద ఘటితమును ననిన, అతి ప్రసంగము కలుగును. ఆశ్రయములగు ద్రవ్యములన్నిటియందును నుండు శ్యామ గుణమొక్కటియే కానిమ్ము. కాని ఆశ్రయముల వేరుపాటును బట్టి అదియు వేరు వేరు కావచ్చునుగదా ! ఇక శ్యామత్వమను గుణజాతి ఒక్కటియేగాన నభేదమును సంభ వము. అపుడు దేవదత్తకు, శస్త్రియే యేల ఉపమానమనవలెను ? వేరొకటియు నా గుణము

గలది కావచ్చును - అని శంకింపవచ్చును. కాని ఉపమావిషయములగు గుణములకు స్వలక్షణ విశేషముండును. స్వలక్షణమనగా స్వనియతము, విలక్షణము కానిది.

శ్లో॥ అశబ్దవాచ్యో యో భేదః శ్యామమాత్రే న వర్తతే।
శ్యామేషు కేషుచిద్వృత్తిర్యస్య సోఽత్రవ్యపేక్ష్యతే ॥ 369

అశబ్దవాచ్యః యః భేదః = అచటనున్న శబ్దముచే చెప్పబడని ఏ భేదము, శ్యామమాత్రే న వర్తతే = సకల శ్యామములందును నుండదో, యస్యకేషుచిత్ = కాని దేనికి ఏ కొన్ని, శ్యామేషు వృత్తిః = శ్యామములందే ఉనికి యుండునో సః = అది, అత్ర = ఈ ఉపమితి క్రియయందు, వ్యపేక్ష్యతే = వ్యాపారముగలదిగా నపేక్షింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— శ్యామ గుణమున కాశ్రయము లనేకములందును. వానికి సూక్ష్మభేదములును నుండవచ్చును. కాని వానికి వాచకమగు పదముచట ప్రయోగింపబడి యుండదు. కాని వాచ్యమగు గుణవిశేషముండును. సకల శ్యామ గుణములందును నది అనుస్యూతమై యుండక, కొన్నిచోట్ల మాత్రమే యుండును. అది ఈ ఉపమానోపమేయముల సంబంధమును దెలియచేయుట అను వ్యాపారము కలది.

'శస్త్రీ శ్యామా' అను నీ వృత్తిపదమువలననే ఉపమానోపమేయముల శ్యామ గుణము అనన్యము, ఇతరత్ర సంభవింపనిది అని ప్రతీతమగుచున్నది. కాగా, శ్యామగుణము ఆధారముల భేదమువలన భిన్నముగా దోచినను, ఒకానొక స్వాలక్షణ్యముచే, ప్రతినియతత్వముచేత, భేదరూపమునను అభేదరూపమునను ఔపమ్యమును ఉపమానోపమేయములకు స్థాపించునని భావము. ॥369॥

అవతారిక— ఉపమితి వ్యాపారమున, గుణజాతికయినను నంతకును సంబంధముండదు అని నిరూపించుచున్నారు.

శ్లో॥ శ్యామేషు కేషుచిత్ కించిత్ కించిత్ సర్వత్ర వర్తతే।
సామాన్యం కశ్చిదేకస్మిన్ శ్యామే భేదో వ్యవస్థితః ॥ 370

కేషుచిత్ = కొన్ని జాతులందు, అనగా, శ్యామేషు = శ్యామత్వ గుణజాతులందు కించిత్ కించిత్ = కొంత కొంత, సామాన్యం = తక్కువచోట్లనుండు సామాన్యము = జాతి, సర్వత్ర = సర్వ గుణములందును, వర్తతే = ఉండును, ఏకస్మిన్ = ఒకానొక, శ్యామే = శ్యామ గుణమునందు, కశ్చిత్ = ఒకానొక, భేదః = విశేషము, వ్యవస్థితః = స్థిరమై నిలుచును.

తాత్పర్య వివరణములు— సామాన్యమనగా జాతి. అది రెండు విధములు 1. పరసామాన్యము, 2. అపరసామాన్యము. పరసామాన్యమునకు మహాసామాన్యమనియు వ్యవహారము. ఇపుడు - ద్రవ్యములు తొమ్మిది, గుణములు ఇరువదినాలుగు, కర్మలు అయిదు. అని వైశేషికుల పదార్థవిభాగము గదా ! ద్రవ్యములందుండు జాతి ద్రవ్యత్వము గుణములం

దుండునది గుణత్వజాతి, కర్మలందుండునది కర్మత్వజాతి. మూడింటి మొత్తమునందుండునది 'సత్త' అను సామాన్యము. ఈ సత్త, మహాసామాన్యము లేదా పరసామాన్యము. తక్కినవి అపరసామాన్యములు.

ఆ విధముగనే కొన్ని శ్యామ గుణములందుండు శ్యామత్వము అపరసామాన్య మగును. అదియే ఉపమితి క్రియలో పనిచేయునది అన్ని శ్యామములందును నుండు శ్యామత్వ మను మహాసామాన్య ముపమకు నిమిత్తముగాదు. ఒకానొక ప్రతినియత శ్యామ గుణమునందు ఒక విశేషముండవచ్చును. అదియే ఉపమకు నిమిత్తము. ఉపమానగతమగు నుత్కర్షను తెలియచేయునది అదియే. ఉత్కృష్టగుణము గలదిగదా ఉపమానమగునది.

చంద్రునితో కన్యావదనముక్ బోల్చుదురు. చంద్రుని యుత్కర్షను తెలియచేయు నది కాంతి విశేషము. అది ఉపమకు నిమిత్తము ఎచ్చటనైనను, ఉపమానమున కతిశయ మును గలుగజేయు విశేషమే ఉపమానాంగము. సామాన్యము కాదు - అని తాత్పర్యము. ఈ విషయ ముక్తపూర్వము. ॥370॥

అవతారిక — గుణసామాన్యము తప్ప వేరొక జాతి కలదనుటకు ప్రమాణ మేమనిన—

శ్లో॥ తథా హి సతిసౌరభ్యే భేదోజాత్యుత్పలాదిషు ।
గంధానాం సతిభేదే తు సాదృశ్యముపలభ్యతే ॥ 371

తథా హి = అది యెట్లనిన జూడడు, జాత్యుత్పలాదిషు = జాజి, కలువ మున్నగువానియందు, సౌరభ్యే సతి = సువాసన యున్నపుడు, గంధానాం = ఆ పరిమళములకు, భేదః = విశేషము అవధార్యతే = నిశ్చయింపబడును, భేదే = వానికి భేదము, సతితు = ఉండినపుడు మట్టుకు, సాదృశ్యం = సారూప్యము, ఉపలభ్యతే = పొందబడుచున్నది.

తాత్పర్య వివరణములు — జాజిపూవులు, కలువపూవులు మున్నగు పూవులకు, గంధములు కలవుగదా. ఆ గంధములందు గంధత్వము అను మహాసామాన్యముండును. అది గాక, 'చక్కని సువాసన' అను సౌరభ్య గుణవిశేషమును ఉండును. ఆ గంధముల భేదము, దానినిబట్టి నిర్ధారింపవచ్చును. కలువలుగాని, నిశారాణిగాని పరిమళించినపుడు, చీకటిలోనైనను, ఆ సౌరభ్యమునుబట్టి, ఇది ఫలాని పూవు గంధమని చెప్పగలుగుచున్నాము. కాగా సౌరభ్య మనునది అపరసామాన్యమనుట.

ఇట్లు వాని వాని సౌరభ్యమునుబట్టి ఆ యా గంధములకు విశేషమున్నను, గొన్ని టికి సాదృశ్యమును గలదు.

'నఖము' అని యొక గంధద్రవ్యము. శైలేయము = అనగా, రాతిపువ్వు. ఇట్టి వాని గంధములకును అవాంతర భేదములు లేకపోలేదు. అయినను ఏదియో ఒక స్వభావమును బట్టి వానికి సాదృశ్యము వ్యవహరింపబడుచుండును. పద్మగంధి ముఖం, కింజల్కగంధి,

మాలతీగంధి - ఇత్యాది వ్యవహారములందు, అపరసామాన్య కృతభేదమున్నను సదృశవ్యవహారము ప్రసిద్ధము. గంధ గుణమున కవాంతరజాతి భేదమున్నట్లు, రూపమునకును నది సంభవమే. కావున శ్యామాది రూపములందును అపరసామాన్యముండుట న్యాయ్యము అని తాత్పర్యము. ॥871॥

అవతారిక— సరి. ఈ గుణములకు ప్రతినియతత్వము = ప్రత్యేకత దేనివలన కలుగును ? అనిన—

శ్లో॥ గుణానామాశ్రయాద్భేదః స్వతోవాప్యనుగమ్యతే ।
అనిర్దేశ్యాత్ విశేషాద్వా సంకరాద్వా గుణాంతరైః ॥ 372

గుణానామ్ = శ్యామాది గుణములకు, భేదః = భేదము, ఆశ్రయాత్ వా = వాని వాని ఆధారమును బట్టిగాని, స్వతః అపి వా = స్వరూపమును బట్టియేగాని, అనిర్దేశ్యాత్ విశేషాత్ వా = 'ఫలానా' అని చెప్పుటకు వీలులేని విశేషమువలనగాని, గుణాంతరైః = మరికొన్ని బయట గుణములతో, సంకరాత్ వా = సంకరము = కలిసిపోవుటవలనగాని, అనుగమ్యతే = అవగతముగ గ్రహింపబడుచుండును

తాత్పర్య వివరణములు— కొన్ని కొన్ని గుణములకు, వాని కాశ్రయములగు ద్రవ్యమువలన విశేషమేర్పడును. కలువలు నలుపు వేరు. తమాల పుష్పముల నలుపు వేరు. కాని స్వభావ సామ్యమువలన వాని కుపమానోపమేయ భావము ప్రవర్తించును. ''—రోలంబ, గరల, వ్యాల, తమాల, శ్యామలంనభః—'' అనగా, ఆకాశము - తుమ్మెద, విషము, త్రాచు పాము, చీకటి చెట్టు - దీనివలె నల్లగనున్నది అని యర్థము. అచట, తుమ్మెద మున్నగువాని నలుపు ఆశ్రయభేదముచే వేరు వేరు గదా !

కొన్ని గుణములకు ఆశ్రయ మొక జాతిదియే యయినను, స్వరూపముననే భేదముండును ధూసరత్వము = గోధుమరంగు, అట్టిది.

కొన్నిటికి భేదము కాల పరిణామమువలన కలుగునది. కల్లు, సారాయి మున్నగు వాని రసగంధ వైచిత్రి దాని కుదాహరణము.

ద్రవ్యాంతరముల గుణములు కలియుటవలన కొన్ని గుణములకు భేదమేర్పడును. మామిడిపండ్ల కావులో ఆసవమునుంచిన, ఆ పండ్లవాసన ఆసవమునకు వచ్చును. మాలతీ పువ్వులు, మందారపూవులు వేసిన, నూనెకును గంధ గుణభేదము కలుగును.

ఈ విధముగ గుణములు వేరు వేరయినను, ఒకానొక ప్రత్యాసత్తిచే హానియందపరసామాన్యమనునది యుండవచ్చును ఆ సాదృశ్యమును బురస్కరించుకొని సామాన్య వచనముతో నుపమానవచనమునకు సమాసము సిద్ధించునని భావము. ॥872॥

అవతారిక— గుణముల సామ్యము మాత్రమే ఉపమించుటకు హేతువు కాదు.

ఉపమానము, ఉపమేయమగు దానికంటె గుణోత్కర్ష కలదిగ నుండదగును. అపుడే ఉపమానోపమెయ భావము ఘటించును

శ్లో॥ ఉపమానం ప్రసిద్ధత్వాత్ సర్వత్ర వ్యతిరిచ్యతే ।
ఉపమేయత్వ మాధిక్యే సామ్యే వా ననివర్తతే ॥ 373

ఉపమానం = ఉపమానము, ప్రసిద్ధత్వాత్ = ప్రసిద్ధివలన, సర్వత్ర = అంతటను, వ్యతిరిచ్యతే = అధికమై యుండును, ఉపమేయత్వం = ఉపమేయ భావమైతే, అధిక్యే వా = ఉత్కర్ష యున్నపుడును, సామ్యేసతి వా = సమత్వమే యున్నపుడుగాని, న నివర్తతే = తొలగదు.

తాత్పర్య వివరణములు— ఉపమానమనునది, ఉపమేయమగు దానికంటె నెపుడును అధిక గుణముకలది అయియే యుండవలెను. వ్యతిరేకమనగా నిచట ఆధిక్యము

ఉపమేయము మట్టుకు, అధిక గుణమైనను, తుల్య గుణమైనను గావచ్చును. ఉపమానమునకు ఆ, ఆధిక్యము స్వతః సిద్ధమయి ఉండవచ్చును, లేదా ప్రసిద్ధినిబట్టి కల్పింపబడవచ్చును. ప్రసిద్ధతయే ఆ గుణోత్కర్ష. కనుకనే, స్త్రీ ముఖము, న్యూనగుణమైనను, శృంగార రస పరిపోషణమునకై చంద్రబింబమున కుపమానముగా కవులు నిర్దేశించుచుందురు.

ప్రేయసీ ముఖము కాముకుని దృష్టిలో ఉత్కృష్టగుణము కలది.

''ఈర్ష్యావశేన కలుషత్వ ముపాగతస్య దూరాన్ముఖస్య తవసుందరి ! సామ్యమేత్య। చేతః ప్రహర్షభరపూరిత. పూర్ణదేహః స్వాంగేష్వపి ప్రసభమద్యనమాతిచంద్రః'' – అను వాక్యమును జూడుడు.

ఓ సుందరీ ! నీ ముఖము, ఈర్ష్యచేత కలుషితమై యున్నపుడది కళంకము గల తన కుపమానమై యుండుటను గమనించి, చంద్రుడు, మనస్సునందలి ప్రహర్షముచే దేహమంతయు నుప్పొంగి ఇపుడు తన అవయవములందు తాను ఇముడక బాధనొందుచున్నాడు అని యర్థము. ఇట వస్తుతః కామినీ ముఖమునకు ఉత్కృష్టగుణత లేదు. కాముక దృష్టిలో నది ప్రసిద్ధము.

కారికలో – సర్వత్ర అనుచున్నారు. అనగా వస్తుతః గుణోత్కర్ష కలదియే ఉపమానము కానక్కరలేదు. న్యూనగుణము కూడ ప్రసిద్ధిననుసరించి యుపమానము కావచ్చునని భావము. ఏ విధముగనైనను నధిక గుణముగా రూపింపబడవలెను. ఉపమేయమునం దా నియమ మక్కరలేదు. ॥373॥

అవతారిక— ఇక నిపు డుపమానమునకు వేరు విధముగ లక్షణమును చెప్పదలంచి, మాన లక్షణమును జెప్పిన భాష్యగ్రంథమును ప్రకారాంతరముగ వ్యాఖ్యానించుచున్నారు.

శ్లో॥ అన్యైస్తు మానం జాత్యాది భేద్యస్యార్థస్య వర్ణ్యతే ।
అనిర్జ్ఞాతస్వరూపో హి జ్ఞేయోర్థస్తేన మీయతే ॥ 374

మానం, నామ = మానమనగా, భేద్యస్య = విశేషింపవలసియున్న, అర్థస్య = ద్రవ్యమునకు, జాత్యాది=జాతి మున్నగునది యగును, ఇతి తు = అనియేమో, అన్యైర్వర్ణ్యతే = ఇతరులచే రక్షింపబడుచున్నది, అనిర్జ్ఞాతస్వరూపః = తెలియబడని స్వరూపముగల, జ్ఞేయః, అర్థః = తెలియవలసిన పదార్థము, తేన = మీయతే హి = దానిచేత, కొలపబడుచున్నది గదా.

తాత్పర్య వివరణములు— మేయము=ఇదమిత్థమని నిరూపింపదగినది. మానము = ఆ విధముగ నిరూపించునది. ఈ మానమేయములనే, పరిచ్ఛేదకము, పరిచ్ఛేద్యము అందురు. లేదా అవచ్ఛేదకము, అవచ్ఛేద్యము అందురు. భేదకము భేద్యము అనునవియు నివ్వియే. విశేషణము విశేష్యము - అనుట.

ద్రవ్యము భేద్యము. దానికి, జాతిగుణ క్రియలు భేదకములు. ఏదియేని ఒక ఉపాధితో గూడినగాని బుద్ధి నారోపింపదు. 'ఇది ఇట్లు' అని తెలియబడని దానిని తెలియబరచునవి గాన జాతి, గుణ, క్రియలు మానపదార్థములగునని వారి భావము. ॥374॥

అవతారిక— ఇక నుపమానమన నేమియనగా జెప్పుచున్నారు.

శ్లో॥ మితస్తు స్వేన మానేన ప్రసిద్ధో యో గుణాశ్రయః ।
ఆశ్రయాంతరమానాయ స్వధర్మేణ ప్రవర్తతే ॥ 375

శ్లో॥ రూపాంతరేణ సంస్పర్శో రూపాంతరవతాం సతామ్ ।
భిన్నేన యస్య భేద్యానాముపమానం తదుచ్యతే ॥ 376

ఈ రెండు కారికలకును నన్వయము ఒక్కటిగనే జేసి వ్యాఖ్యానింపబడుచున్నది.

స్వేన = ఆత్మీయమైన, మానేన = జాతి మున్నగు మానముచేత, మితః = పరిచ్ఛేదింపబడినదై, యః గుణాశ్రయః = గుణముల కాధారమయిన యే ద్రవ్యము, ప్రసిద్ధః, సః = ప్రసిద్ధముగ తెలియబడుచున్నదో, అది, ఆశ్రయాంతరమానాయ = ఇతరములగు నాశ్రయములను పరిచ్ఛేదించుటకు, యదా స్వధర్మేణ ప్రవర్తతే = తనయందున్న గుణమును బట్టి ప్రవర్తించునో, తదా, యస్య = అపుడు, ఏ పరిచ్ఛేదకము యొక్క, భిన్నేన, రూపాంతరేణ = వేరయిన ఆ రూపవిశేషముచే, రూపాంతరవతాం సతాం = తాము రూపాంతరము గలవి యగుచున్న, భేద్యానాం = పరిచ్ఛేద్యములకు = విశేష్యములకు, సంస్పర్శః భవతి = పరిచ్ఛేదము కలుగునో, తత్, ఉపమానం ఉచ్యతే = అది ఉపమానమని చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు — ఇక ఉపమానమనగా దగ్గరగా మానము. సమగ్ర పరిచ్ఛేదకము కాదనుట. ద్రవ్యమునందు జాతిగుణ క్రియలుండును. వానిచేత పరిచ్ఛిన్నము కావుననే ద్రవ్యము ప్రసిద్ధమయినది.

అనగా, ఉత్కృష్టమయిన గుణముగలది, వేరొక అప్రసిద్ధగుణము కల దానిని తెలియచేయుటకు ప్రవర్తించును వాని రూపములు భిన్న భిన్నములు. కాని ఉభయానుగత మగు (అన్వయి) ధర్మమొకటి యుండును. అదియే సాదృశ్యము అత్యంతము భిన్నము లయిన వానికి సంబంధముపపన్నము కాదుగాన, అన్వయి ధర్మమగు ఈ సాదృశ్యము ముందుకువచ్చి వానిని పరిచ్ఛేదించును. సాదృశ్యమాత్రమును బుచ్చుకొని పరిచ్ఛేదకమేగాన ఉపమానమేగాని సమగ్రమానము గానేరదు

'శస్త్రీ శ్యామా' అను నుపమాన సమాసములో, శస్త్రీ దేవదత్తలకు సామాన్య ధర్మమగు శ్యామత్వము, వాని ఉపమానోపమానోపమేయ భావమునకు నిత్తము అని తాత్పర్యము ॥375, 376॥

అవతారిక— ఇక "ఈ నలుపు ఈ నలుపుతో సమానము" - అనునపుడు ఉప మానోపమేయభావ మెట్లనిన జెప్పుచున్నారు.

శ్లో॥ ధర్మః సమానః శ్యామాదిరుపమానోపమేయయోః ।
ఆశ్రీయమాణ ప్రాధాన్యోధర్మేణాన్యేనభిద్యతే ॥ 377

ఉపమానోపమేయయోః = ఉపమానమునకును ఉపమేయమునకును, సమానః, శ్యామాదిః, ధర్మః = సమానధర్మమగు నలుపు మున్నగునది, ఆశ్రీయమాణ ప్రాధాన్యః = ఆశ్రయింప బడిన ప్రాధాన్యము కలది, (యదా, భవతి, తదా, సః)=అయినపుడు అది, అన్యేన ధర్మేణ = వేరొక సాధారణ ధర్మముచే, భిద్యతే = విశేషింపబడును.

తాత్పర్య వివరణములు— ఉపమానోపమేయ భావమునకు వ్యవస్థాపకమగు శ్యామగుణము, తా నుపకారకత్వమును విడచి, ప్రధానముగ నుపమేయమే అయిన, అపుడది ద్రవ్యమువంటిదే యగునుగాన దానికి వేరొక స్వగతధర్మముచే పరిచ్ఛేద్యత కలుగును — ఇంకొక ధర్మము దానిని పరిచ్ఛేదింపవలసి యుండును. అపుడా ఇతరధర్మ ముపమానోప మేయ భావమునకు మూలము. ॥377॥

అవతారిక— ఆ ధర్మమేది యగును ? అనిన—

శ్లో॥ శస్త్రీకుమార్యోః సదృశః శ్యామ ఇత్యేవమాశ్రితే ।
వ్యపదేశ్యమనేనేతి నిమిత్తం గుణయోః స్థితమ్ ॥ 377

శస్త్రీకుమార్యోః = 'చురకత్తికిని, కుమారికిని', శ్యామః సదృశః = నలుపు సమానము, ఇతి, ఏవం = అని ఇట్లు, ఆశ్రితే సతి = వ్యవహరింపబడినపుడు, గుణయోః స్థితం = అపుడా గుణములందున్న, నిమిత్తం = సాధారణ కారణము, అనేన, ఇతి, వ్యపదేశ్యమ్ = 'ఫలానా' దానిచేత అని నిరూపింపదగి యుండును.

తాత్పర్య వివరణములు— ఆ శ్యామగుణముల సామాన్యధర్మము దీప్తి=ప్రకాశ

మగును. దీప్తినిబట్టి ఈ నలుపు ఈ నలుపుతో సమానము అని చెప్పదగును. వేరొక ధర్మము ధర్మాంతరముల ఔపమ్యమునకు మూలమనుట. కాని యిట్లుపపాదించిన, అనవస్థ యేర్పడునని బ్రహ్మకాండమున 69 వ కారికచే నిరూపింపబడినది ॥378॥

అవతారిక— ఉపమానోపమేయభావము భేదాధీనము, ఉపమానమును ఉపమేయమును భిన్న భిన్నములుగ వివక్షింపబడినపుడే అది శబ్ద ప్రతిపాద్యమగును - అది యెట్లనిన జూడుడు.

శ్లో॥ యదా నిమిత్తైస్తద్వన్తో గచ్ఛన్తీవ తదాత్మతామ్ ।
భేదాశ్రయం తదాఖ్యానముపమానోపమేయయోః ॥ 379

నిమిత్తైః = ఔపమ్య నిమిత్తములయిన గుణములతో, తద్వంతః = ఆ నిమిత్తములుగల, ఉపమానోపమేయములు, తదాత్మతాం = అభేదమును = ఏకాత్మతను, గచ్ఛంతి, ఇవ = పొందుచున్నవా ? అనునట్లు, యదాభవన్తి = అయినపుడు, తదా = అట్టి సందర్భమున, ఉపమానోపమేయయోః = ఉపమానమునకును ఉపమేయమునకును, ఆఖ్యానం = వేరు వేరుగా వ్యవహారము, భేదాశ్రయం భవతి = వాని భేదమును పురస్కరించుకొనినదగును.

తాత్పర్య వివరణములు— నిమిత్తములనగా నొకదానితో వేరొకదానిని బోల్చుటకు కారణములయిన నలుపు మున్నగు గుణములు. వానినిబట్టి చూచిన నుపమానోపమేయములు ఒకే వస్తువా యనునట్లు భాసించును. కాని వాని స్వరూపమునుబట్టి అవి వేరువేరే. వానికి గల సంబంధమును చెప్పు విభక్తి ప్రత్యయమేదియు నచట లేదు. అందుకొరకు, ఇవ = వలె మున్నగు ద్యోతకములు ప్రయోగింపబడుచుండును. కావున ఇవాది శబ్దములచే ప్రతిపాదింపబడుట వలన ఉపమానోపమేయభావము 'శాబ్దము' అగును.

శస్త్రీ ఇవ శ్యామా॥ గౌరివ గవయః॥ శైలాః ఇవ వలాహకాః॥ మున్నగునవి ఉదాహరణములు. ఇటువంటి అభేద నిర్దేశము గల స్థలములందు, సామాన్యధర్మమునకు తద్విశిష్టముతో గల సంబంధమును దెలుపు షష్ఠ్యాదివిభక్తి లేనందున, వానికి సమన్వయము పొసగుటకు 'ఇవ' మున్నగునవి ప్రయోగింపబడును.

కాబట్టి అచట ఉపమపరిపూర్ణము అని ఆలంకారికులందురు. ఉపమానము, ఉపమేయము, సాధారణ ధర్మవాచకము. ఉపమానోపమేయ భావద్యోతకములగు ఇవాది పదముల ప్రయోగమును నున్నందున, పూర్ణత యని తాత్పర్యము. ॥379॥

అవతారిక— ఉపమానోపమేయముల కుండు పోలికలనుబట్టి వానికి అభేదమునే ఆరోపించిన, అపుడుపమానోపమేయభావము గర్భీకృతమై యుండును గాని వాచ్యము గాదు. ఎట్లన—

శ్లో॥ తత్త్వాసంగవివక్షాయాం యేషు భేదో వివర్తతే ।
లుప్తోపమాని తాన్యాహుః తద్ధర్మేణ సమాశ్రయాత్ ॥ 380

యేషు = ఏ ఉపమానములందు, తత్కాసంగవివక్షయాం = అభేదారోపమును వివక్షించినపుడు భేదః నివర్తతే = భేదము తొలగిపోవునో, తాని = ఆ ఉపమానములు, తద్ధర్మేణ = ఆ సమాన ధర్మముచేత=గర్భీకృత ధర్మముచేత, సమాశ్రయాత్ =పరిగ్రహింపబడి యుండుట వలన, లుప్తోపమాని, ఆహుః = 'లుప్తోమలీ యుపమానములు' అనిరి.

తాత్పర్య వివరణములు — ఉపమానోపమేయముల కభేద మారోపింపబడినపుడిక భేదము లేదు గాన, నుపమానోపమేయభావము గూడ తిరోహితమగును ఎట్లనగా జూడుడు. ''గౌర్వాహీకః'' అందురు. వాహీకుడు ఎద్దు. ''సింహో మాణవకః'' ఈ పిల్లవాడు సింహము అందురు సింహముకాని వానిని సింహమనుట. ఎద్దుకాని వానిని ఎద్దు అనుట, ఉపపన్నము గాదు. దాని యుపపత్తికై, కార్యమునుబట్టి కారణ మూహింపబడునుగాన, వారియందు గోవు చేయు పనులును, సింహము చేయు పనులును నుండుట చూచి, సమానధర్మము నంతర్భావింప జేసి 'సింహతుల్యుడు' 'గోతుల్యుడు' - అను నర్థమున, ఉపవాచకమగు ఇవ శబ్దము లేకుండ గనే 'ఎద్దు వాహీకుడు' 'సింహము మాణవకుడు' అనియే యనుచున్నారు. ॥380॥

అవతారిక— ఒక వస్తువును, 'ఇది ఇట్టిది' = ఇదం ఇత్థమ్ అని సమగ్రముగా పరిచ్ఛేదించునది మానమనబడును - అని చెప్పి, ''తత్సమీపే యత్ = న అత్యన్తాయ మిమీతే తత్ ఉపమానమ్'' అని మహాభాష్యమున జెప్పబడినది ''అన్యైస్తుమానం జాత్యాది'' అను కారికార్థమును జూడుడు. ఆ భాష్య తాత్పర్యమిందు విశదీకరింపబడుచున్నది

శ్లో॥ శస్త్ర్యాం ప్రసిద్ధం శ్యామత్వం మానం సా తేన మీయతే ।
అన్యా శ్యామా తు తద్రూపా తేనాత్యంతం న మీయతే । 381

శస్త్ర్యాం=చురకత్తియందు, ప్రసిద్ధం శ్యామత్వం=పరిచ్ఛేదకముగా, ప్రసిద్ధమయిన, నలుపు, మానం, భవతి = మానమగును, సా, తేన, మీయతే = ఆ కత్తి, ఆ నలుపు గుణముచే, సమగ్రముగ పరిచ్ఛేదింపబడుచున్నది, అన్యా, శ్యామా =ఇతరమైన, ఆ నలుపురూపుగలయామె తద్రూపా, తు = ఆ కత్తిరూపమువంటి రూపముగలది మాత్రమే, తేన, అత్యంతం = ఆ నలుపుచే, సమగ్రముగ నది, న మీయతే = పరిచ్ఛేదింపబడుట లేదు.

తాత్పర్య వివరణములు— కత్తియు నలుపే - దేవదత్త యను నామెయు నలుపే దేవదత్త నలుపు ప్రసిద్ధముగాదు. ప్రసిద్ధమగు శస్త్రీగత శ్యామత్వముచేత, 'ఈ దేవదత్తయు నల్లనిది' - అని పరిచ్ఛేదింపబడుచున్నది. ఈ విధముగా శ్యామత్వము శస్త్రికిని దేవదత్తకును సామాన్యధర్మమే అయినను, హీనమగు మానమేకాని సమగ్రమానము గాదు. కావున నది ఉపమానము'' - అని భావము ॥381॥

అవతారిక— ఈ కారికయు, పూర్వ కారికకు వివరణరూపమే—

శ్లో॥ శస్త్రీం శ్యేనగుణేనాతో మిమానా మాశ్రయాంతరమ్ ।
అసమాప్తగుణం సిద్ధేరుపమానం ప్రచక్షతే ॥ 382

అతః = ఈ, సిద్ధేః = పరిపూర్ణ గుణసిద్ధివలన, స్వేన, గుణేన = ఆత్మీయమగు గుణముచేత, ఆశ్రయాంతరం = ఆ గుణమున కాశ్రయమగు వేరొక వ్యక్తిని, మిమానాం శస్త్రీం = కొలచు చున్న = పరిచ్ఛేదించుచున్న కత్తిని, అసమాప్తగుణం = గుణ సమగ్రతలేని, ఉపమానం = అసంపూర్ణ మానముగా, ప్రచక్షతే = చెప్పుచుందురు.

తాత్పర్యము— తాత్పర్యము స్పష్టముగాన వివరణ మపేక్షితముగాదు. ॥382॥

అవతారిక— రెండు విధములుగ ఉపమానోపమేయములను వ్యాఖ్యానించి, సామాన్యవచనత్వము విచారింపబడుచున్నది. సాధారణ ధర్మవాచక శబ్దము, ఆ ధర్మము సాధారణమైనను, తాను దానిని ఉపమానగతముగగాని ఉపమేయగతముగగాని చెప్పగలదు. యుగపత్ = ఒకే పర్యాయమున ఉభయగతముగ చెప్పజాలదు గదా అపుడు దానికి సామాన్యవచనత్వ మెట్లు? అని శంక కలుగగా, సమాధానము చెప్పబడుచున్నది.

శ్లో॥ ఉపమేయేస్థితో ధర్మః శ్రుతోఽన్యత్రానుమీయతే ।
శ్రుతోఽథవోపమానస్థ ఉపమేయేఽనుమీయతే ॥ 383

ఉపమేయే, శ్రుతః సన్ = ఉపమేయమువద్ద వినబడుచున్నదై, స్థితః ధర్మః = ఉన్న సాధారణ ధర్మము, అన్యత్ర, అనుమీయతే = ఉపమానమువద్దను ఊహింపబడును, అథవా = లేదా, ఉపమానస్థ, శ్రుతః = ఉపమానమునందున్నదిగా వినబడినది, ఉపమేయే, అనుమీయతే = ఉపమేయమునం దూహింపబడును.

తాత్పర్య వివరణములు— ఒకసారియే ఉపమానోపమేయోభయగతముగ సాధారణ ధర్మాభిధానము సంభవింపదు. "శస్త్రీ శ్యామా దేవదత్తా" అని చెప్పినపుడు శ్యామత్వ మను ధర్మము ఉపమానగతముగా చెప్పబడిన, శస్త్రీ శబ్ద సమీపమునగదా శ్యామా శబ్దము శ్రుతము. దానికి ఉపమేయయగు దేవదత్తయం దన్వయమనుమేయము.

ఉపమేయమున నది వినబడిన, ఉపమానమునందును దానికి సంబంధము అనుమానముచే కల్పనీయము. ॥383॥

అవతారిక— ఉపమేయ సమీపమున సాధారణ ధర్మవాచక శ్రవణమునకు నిదర్శనము.

శ్లో॥ అధీయతే బ్రాహ్మణవత్ క్షత్త్రియా ఇతిదృశ్యతే ।
ఉపమేయస్య భిన్నత్వాత్ వచనం క్షత్రియాశ్రయమ్ ॥ 384

"అధీయతే బ్రాహ్మణవత్ క్షత్రియాః" = రాజులు బ్రాహ్మణులవలె నధ్యయనము చేయుచున్నారు, ఇతి, దృశ్యతే = అనివాక్య విన్యాసమగపడుచున్నది, ఉపమేయస్య, భిన్నత్వాత్ = ఉపమేయములగు రాజు లనేకులగుటవలన, వచనం, క్షత్రియాశ్రయమ్ = బహువచనము క్షత్రియులను బట్టినది.

తాత్పర్య వివరణములు— ఈ వాక్యమునందు, 'క్షత్రియాః' అని బహువచనము వినబడుచున్నది '[బ్రాహ్మణవత్' అను ఉపమానపదమునందది స్పష్టముగ లేదు. కాని ఉప మేయులగు క్షత్రియులనేకులుగ బహువచనముచే చెప్పబడినారు. అధీయతే = చదువుచున్నారు అను క్రియాపదమును బహువచనాంతము. అధ్యయనము సాధారణ ధర్మము. దానికి ఉప మాన భూతులగు బ్రాహ్మణులతోడను సంబంధము ప్రతీతమగుచున్నది. ఉపమానగతముగ వినబడిన ధర్మమునకు ఉపమేయమున సమన్వయము ఉపమానముయొక్క ఉపమేయోపకారి త్వము వలననే తెలియుచున్నది. కావున దానికి వేరుగా నిదర్శనమును జూపబనిలేదు ॥384॥

అవతారిక— ఆ సాధారణ ధర్మముభయగతముగా వచింపబడకున్నను, దాని సామాన్యవచనత్వమునకు అనుపపత్తి లేదు.

శ్లో॥ సాధారణం బ్రువన్ ధర్మం క్వచిదేవ వ్యవస్థితమ్ ।
సామాన్యవచనః శబ్ద ఇతి సూత్రే అపదిశ్యతే ॥ 385

క్వచిత్ ఏవ = ఉపమానోపమేయములలో నొకదానియందే, వ్యవస్థితం = సంబద్ధమైయున్న, సాధారణం ధర్మం = సామాన్య ధర్మమును, బ్రువన్ అపి = బ్రువన్ = చెప్పుచున్నదైనను, శబ్దః, సామాన్యవచనః = ఆ శబ్దము, సామాన్య ధర్మవిశిష్ట వాచకము, ఇతి, సూత్రే, అప దిశ్యతే = అని, 'ఉపమానాని' అను సూత్రమున జెప్పబడినది.

తాత్పర్య వివరణములు— ఆ ధర్మము, ఉపమానగతముగను, ఉపమేయగతము గను గూడ శబ్దతః చెప్పబడనక్కరలేదు. ఎట్లు నిర్దేశింపబడినను అది సామాన్య ధర్మమే. తద్వాచకమును సామాన్యవచనమగును. శ్యామత్వము వాస్తవరూపముచే సాధారణమే. ఒకచోట నున్నదిగ చెప్పబడినను రెండవస్థలమున నది అనుమానముచే సాధారణమగుట కెట్టి ప్రతిబంధ కమును లేదు. ॥385॥

అవతారిక— సామాన్యవచనమయిన శ్యామశబ్దము గుణగత శ్యామత్వజాతిని చెప్పినపుడును సామాన్యవచనమే. ద్రవ్యగతమగు గుణమును జెప్పినపుడును సామాన్యవచ నమే యగుననుచున్నారు.

శ్లో॥ నాభేదేన న భేదేన గుణో ద్విష్ఠోఽభిధీయతే ।
భిన్నయోర్ధర్మయోరేకః శ్రూయతేఽన్యః ప్రతీయతే ॥ 386

ద్విష్ఠః, గుణః = ఉపమానోపమేయములు రెంటియందుండు గుణము, అభేదేన = ఒక్కటి గాను, న అభిధీయతే = శబ్దముచే చెప్పబడదు, భేదేన చ = వేరు వేరయినదిగాను, న అభి ధీయతే = చెప్పబడదు, భిన్నయోః, ధర్మయోః = వేరు వేరయిన రెండు ధర్మములలో, ఏకః, శ్రూయతే = ఒకటి, శబ్దముచే చెప్పబడును, అన్యః ప్రతీయతే = ఇంకొకటి అనుమా నింపబడును.

'నలుపు' అను, గుణము, ఉపమానోపమేయములు రెండింటియందును నున్నది. కాని అది ఒకటియే అని శబ్దము చెప్పదు, అది వానిలో నేదియో యొకదానికే సంబంధించిన శబ్దము అయి యుండునుగదా. పోనిమ్ము అభిన్నముగ చెప్పబడకున్నను సహజమగు ఇతర వ్యావృత్తిరూపముచే చెప్పబడునుగదా అనిన నట్లును గాదు. అపుడు సామాన్యవచనమది యనుటయే పొసగదు. కాగా అది ఒకచో శ్రుతమయినను, ఇంకొకచోటను నన్వయించి ఉభయగతమనబడును. అపుడే గదా అది సామాన్యవచనమగునది ? అని భావము. ॥386॥

అవతారిక— "మానం హి నామ అనిర్జ్ఞాత జ్ఞాపనార్థముపాదీయతే । తత్సమీపే యత్ నాత్యంతాయమిమీతే తదుపమానమ్" - అని మహాభాష్యము 'ప్రస్థో వ్రీహిః' అందురు. మానెడువడ్లు, అని యర్థము. అచట మానిక, మానము. పరిచ్ఛేద్యమగు వ్రీహియందు పరిచ్ఛేదకమగు మానికయొక్క రూపము నారోపించిచేయు వ్యవహారమది. "ప్రస్థోఽస్య పరిమాణం" 'ఈ ధ్యానము పరిమాణము మానిక' - అనియు వ్యవహారముండును. అది భేదవ్యవహారము. వడ్లు వేరు, మానిక వేరు అని ఆ వ్యవహారము సూచించును.

ఇక ఉపమానమనునది, ఉపమేయమును, భేదాభేదములు రెంటిని మనమున నిడికొనియే పరిచ్ఛేదించును. కనుకనే దానిని 'న అత్యంతాయ మిమీతే' అనిరి. అనగా, సకలాంశములచేతను పరిచ్ఛేదింపదు అనుట. ముఖము చంద్రునితో తుల్యమను వ్యవహారమునను భేదాభేదములు రెండును గోచరములు గదా ! ఈ భాష్యగ్రంథము నీ కారిక వ్యాఖ్యానించుచున్నది.

శ్లో॥ నాత్యంతాయ మిమీతేయత్ సామాన్యే సమవస్థితమ్ ।
సాదృశ్యాదుపమేయార్థః సమీపే పరికల్ప్యతే ॥ 387

సామాన్యే = సాధారణ ధర్మమునందు, సమవస్థితం సత్ = ఉంటున్నదగుచు, యత్, అత్యంతాయ = ఏది, సకలాంశములచేతను, న మిమీతే = పరిచ్ఛేదింపదో = విశేషింపదో, తత్ ఉపమానమ్ = అది, ఉపమానము అనబడును, ఉపమేయార్థః = ఉపమేయ పదార్థ పరిచ్ఛేదకమయిన, సాదృశ్యం = సామ్యము, సమీపే, పరికల్ప్యతే = సమీపమునందే. కల్పింపబడును.

తాత్పర్య వివరణములు— సమీపే, మానం = ఉపమానమ్. సమీపమున ననగా ఉపమేయమునకు సమీపముననుండునది. దేవదత్తకు శస్త్రి పరిచ్ఛేదకముగదా ! అది దేనిని బట్టి ? శ్యామ గుణసాదృశ్యమునుబట్టి. దేవదత్తరూపము సంస్థానము. స్త్రీత్వమనుట. ఆ రూపముచేత గూడ శస్త్రి ఆమెను విశేషించుటలేదు. అందువలన సమీపమానమే గాని సమగ్ర మానము కాదు. అనగా పోలిక సుమారుగా నుండునుగాని ఎల్ల విధములను గాదని భావము. ॥387॥

అవతారిక— ఆ మహాభాష్య గ్రంథమునకు వ్యాఖ్యానాంతర మిందు జూపబడుచున్నది.

శ్లో॥ మానం ప్రతి సమీపం వా సా దృశ్యేన ప్రతీయతే ।
పరిచ్ఛేదాద్ధి సాదృశ్యమిహ మానోపమానయోః ॥ 388

వా = అథవా = లేదా, మానం ప్రతి = కొలుచుట = పరిచ్ఛేదించుటను గూర్చి, సమీపం = దగ్గర అయినది, సాదృశ్యేన, ప్రతీయతే = సాదృశ్యముచేత, ప్రతీయమానమగును, ఇహ = ప్రకృతమున, మాన ఉపమానయోః = మానమగు దానికిని, ఉపమానమగు దానికిని, పరిచ్ఛేదాత్ = కొలచుట = స్వరూపమును నిర్ధారించుట అను ధర్మముపలస, సాదృశ్యం అస్తిహి= సామ్యము కలదుగదా ।

తాత్పర్య వివరణములు— 'తత్సమీపే' అనుచోట తచ్ఛబ్దము ప్రధానమగు ఉపమేయమును బరామర్శించుననియు, ఉపమేయమునకు దగ్గర దగ్గరగా పరిచ్ఛేదకమేగాని సమగ్రముగ గాదుగాన ఉపమానమగుననియు నింతకు బూర్వ ముపపాదింపబడినది ఇక నీ కారికలో— తత్పదము, ప్రధానమగు మానమునే పరామర్శించుననుచున్నారు. మేయమునకు మానము పరిచ్ఛేదకమయినందున అప్రధానమనినను, స్వరూప లక్షణములో నది ప్రధానమే యగును. కావున తచ్ఛబ్దమును దానినే పరామర్శించును. మాన సామీప్య ముపమానమున కెట్టిదనిన, సమాన ధర్మసంబంధమే అది. మానమును, అనగా ప్రస్థము మున్నగునదియు వస్తువును పరిచ్ఛేదించును. ఉపమానమును, ఉపమేయమును పరిచ్ఛేదించునుగాన వానికి సామ్యము కలదు. అందు, మానమత్యంత పరిచ్ఛేదకము ఉపమానము సమీప పరిచ్ఛేదకము. అదియే భేదము. పరిచ్ఛేదమనునది రెండింటికిని సమానమే. ॥388॥

అవతారిక— "ఉపమానాని సామాన్యవచనైః" (2-1-54) అను సూత్రముతో మహాభాష్యమున - "ఉపమానానీత్యుచ్యతే కాని పునరుపమానాని ? కిం యదే వోపమానం తదే వోపమేయమ్ ? ఆహోస్విదన్య దుపమానమన్యదుపమేయమ్ ? అను గ్రంథము కలదు. అదియే, ఉపమానలక్షణ ప్రస్తావమునకు కారణము. ఉపమానములనుచున్నారే అవి యేవి ? ఉపమానము ఉపమేయమా ? అవి రెండును వేరు వేరా ? అను గ్రంథమునకు వ్యాఖ్యారూప మీ కారిక—

శ్లో॥ ఏకజాతి వ్యపేక్షాయాం తదేవేత్యవసీయతే ।
భేదస్యైవ వ్యపేక్షాయామన్య దేవేతిగమ్యతే ॥ 389

ఏకజాతి వ్యపేక్షాయాం = ఒకే గణజాతిని వివక్షించినపుడు, తదేవ ఇతి, అవసీయతే = అదియే అని, నిర్ధారితమగును, భేదస్య ఏవ = భేదమునకే, వ్యపేక్షాయాం = వివక్ష చేసినపుడు, అన్యదేవ = అది వేరే, ఇతి, గమ్యతే = అని గ్రహింపబడును.

తాత్పర్య వివరణములు— అర్థప్రతీతి ననుసరించియే శబ్దవ్యవహారము వర్తించును. ఉపమానోపమేయములందు సాధారణమైయుండు గుణజాతిని గ్రహించి, వ్యక్తి భేదమును గమనింపనిచో, ఉపమానమే ఉపమేయమని వ్యవహరింపవలసి వచ్చును అటులగాక

వ్యక్తికృతమయిన, వాని స్వీయ స్వరూపభేదము ననుసంధించిన. అవి భిన్న భిన్నములే అని తోచును కావున ఉపమానము వేరు ఉపమేయము వేరు అనియే తేలును. ఉపమకు ప్రయోజక మయినది, వాని, అత్యంతభేదమా ? అత్యంతాభేదమా ? అని శంకాభిప్రాయము. ॥389॥

అవతారిక— ఆర్యా ! ఉపమానోపమేయములు భిన్నములా ? అను శంకకై అవకాశము లేదే. ఉపమింపబడునది ఉపమేయము ఉపమించుటకు సాధనమైనది ఉపమానము. మొదటిది కర్మసాధనము = కర్మ ప్రత్యయాంతము రెండవది కరణసాధనము. కరణకారకము తృతీయాంతము. ఇటుల వానికి భేదము ప్రకటముగ నగపడుచునే యున్నదిగదా ! ఇక సంశయమునకు తావేది ? అను శంకను అంగీకరించుచు నీ కారిక, శంకకు తావులేదని వివ రించుచున్నది.

శ్లో॥ కర్మత్వం కరణత్వం చ భేదేనైవాశ్రితం యతః ।
అత్యన్తైకత్వవిషయా న్న స్యాత్తేనాత్ర సంశయః ॥ 390

కర్మత్వం = ఉపమించుటలో కర్మ అగుట, కరణత్వం చ = కరణమగుటయు, భేదేన ఏవ వేరు వేరుగనే, యతః ఆశ్రితమ్ = ఏ కారణముచే ఆశ్రితమో, తేన అత్ర = ఆ కారణముచే, నిచట, అత్యంతైకత్వ విషయాత్ = వాని ఐక్యము విషయమువల్ల, సంశయః నస్యాత్ = సందేహము కలుగదు.

తాత్పర్య వివరణములు— ఉపమేయ శబ్దమునందు 'యత్' ప్రత్యయము, ఉప మింపబడునది = ఉపమించుటయను క్రియయందు కర్మను జెప్పును. ఉపమానమనగా, ఉప మీయతే అనేన = ఉపమానం అను విగ్రహముచే కరణార్థమున ల్యుట్ప్రత్యయాంతమయి, ఉపమాకరణమగును. కావున వాని వాస్తవభేదము స్పష్టమే ఆయె. కాగా ఏకత్వ సంశయమే కలుగదు.

కాని భిన్నములయిన వానికి గూడ సామాన్యధర్మమను నుపాధిని పుచ్చుకొని ఏకత్వమును వ్యవహరించుటయు గలదు. ఆ ఔపాధికమగు ఏకత్వము సంశయమునకు గారణ మైన, కావచ్చును అని తాత్పర్యము. ॥390॥

అవతారిక — వాస్తవముగ వేరు వేరయిన వానికి గూడ, ఉపాధుల మూలముగ అభేదము కల్పింపబడిన వ్యవహారములు గలవాయనిన—

శ్లో॥ భేదేన తుల్యరూపత్వాత్ శాలీంస్తావితి దృశ్యతే ।
జాత్యభేదాత్ స ఏ వాయమితిభిన్నోఽభిధీయతే ॥ 391

భేదే అపి = పదార్థములకు భేదమున్నప్పటికిని, తుల్య రూపత్వాత్ = రూపసామ్యముండుట వలన, 'తాన్ శాలీన్' ఇతి = ఆ వరి ధాన్యమునే, తినుచున్నాము అనుట, దృశ్యతే = లోక మున నగపడుచున్నది, భిన్నః = వేరయినది గూడ వ్యక్తి, జాత్యభేదాత్ = దానియందుండు

జాతి ఒకటియే యగుటవలన, 'స ఏవ అయం' = 'అదియే ఇది', ఇతి అభిధీయతే = అని చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— "తానేవ శాలీన్ భుంజ్మహే యే మధురాయాం దృష్టాః = మధురలో మనము చూచిన వరి ధాన్యమునే తినుచున్నాము' - అని యందురు. కాని, ఇవి అవి కావు. తత్సరూపములు. ఆ జాతివే. రూపసామ్యముండుటవలన నభేదము నారోపించు చున్నాము.

ఈ విధముగనే, సాదృశ్యముండుటవలననేగాక, జాతి ఒకటియే అగుటవలనను వ్యక్తుల కభేదమును వ్యవహరించుచున్నారు మాధరుడు, కౌండిన్యుడు, గార్గ్యుడు, గౌతముడు అను నలుగురు వ్యక్తులు. వారియందుగల బ్రాహ్మణత్వ మొకటియే జాతి. అందువలన వారిని బ్రాహ్మణులు అనుచున్నాము. ఎచ్చట ? "చత్వారో బ్రాహ్మణా ఉదకుంభానాహరేయుః" (నలుగురు బ్రాహ్మణులు నీటికుండను తీసికొనివత్తురు గాక) అను శ్రౌతవాక్యమునందు. అనగా వారికి జాతినిబట్టి ఐక్యము వ్యక్తులనుబట్టి భేదము. ఆ విధముగనే ఉపమానోపమేయ వ్యక్తులు వేరయినను, ధర్మసామ్యమువలననో లేక ఏకజాతి సంబంధమువలననో, అభేదము గోచరించుననుట. ॥391॥

అవతారిక— "భేదస్యైవ వివక్షయా మన్యదేవేతి కథ్యతే" అని వెనుక చెప్ప బడిన, ఉపమానోపమేయముల భేద పక్షమునందును, సంశయము యుక్తమే యనుచున్నారు.

శ్లో॥ కథం హ్యవయవోఽన్యస్య స్యాదన్య ఇతి చోచ్యతే ।
అత్యంతభేదే నానాత్వం యత్ర తత్త్వం న విద్యతే ॥ 392

అన్యస్య = వేరొక దానికి, అన్యః = వేరొకటి, అవయవః కథంస్యాత్ ? = అవయవ మెట్ల గును ? ఇతిచ, ఉచ్యతే = అనియు, భాష్యమున ప్రశ్నింపబడుచున్నది, యత్రతత్త్వం = ఏ భేదమున్నపుడు, అభేదము, నవిద్యతే, తత్ర = ఇకనుండదో, ఆ, అత్యంతభేదే = సంపూర్ణ మగు వేరుపాటున్నపుడు, నానాత్వం భవతి = అనేకత్వమే ఉండును.

తాత్పర్య వివరణములు— "హలన్తాచ్చ" (1-2-10) అని యొక పాణిని సూత్రము ఇక్కునకు అవయవమయిన హల్లుకంటె బరమగు 'ఝల్' ప్రత్యాహార వర్ణము ఆదినిగల సన్ప్రత్యయము 'కిత్తు' అగును అని దాని కర్థము. ఆ సూత్రమున మహాభాష్యము నందు ఈ గ్రంథము గలదు. "అయుక్తోఽయం నిర్దేశః, కథం హి ఇకోనామహల్ అంతః స్యాత్ అన్యస్యాన్యః ?" అని. వర్ణము లొకదానికొకటి అవయవములు కావుగదా. అట్టియెడ, హల్లు ఇక్కునకు అంతావయవమగుట ఎట్లు ? అని శంకాభిప్రాయము. అనగా, అత్యంత భిన్నములకు, అభేద మే విధముగను గుదురదనిగదా శంకించువాని యభిప్రాయము. ప్రకృత విషయమున, ఉపమానోపమేయములకు, జాతినిబట్టిగాని, రూపసాదృశ్యమునుబట్టిగాని అభే దము నుపపాదించినను, వాని కత్యంత భేదమే వాస్తవికము. కావున సంశయ ముపపన్నమే. ॥392॥

అవతారిక— అవయవములకును, అవయవికిని, అభేదము వివక్షవలన సంభవించిన సంభవింపవచ్చును. వర్ణముల కవయవావయవిభావము లేదుగదా. కావున వాని కభేద వివక్షకు సంభవమే లేదనుచున్నారు.

శ్లో॥ అభేదస్య వివక్షమామేకత్వం సంఘసంఘినోః ।
సంఘినోర్నత్వభేదో ఽస్తి తథాన్యత్వముదాహృతమ్ ॥ 393

సంఘసంఘినోః = అవయవికిని, అవయవములకును, అభేదస్య వివక్షాయాం = ఏకత్వమును వివక్షించినపుడు, ఏకత్వం భవతి = ఐక్యము వ్యవహరింపబడును, సంఘినోః తు = అవయవములకు మట్టుకు, అభేదః న అస్తి = అభేదము లేదు, తథా చ = కాబట్టి, అన్యత్వం ఉదాహృతమ్ = భేదము ఉదాహరింపబడినది.

తాత్పర్య వివరణములు— అవయవములకును అవయవికిని సంబంధము సమవాయము దానినిబట్టి వాని కభేదమును చెప్పదలంచుటయు గలదు. వనమనగా వృక్షముల సంఘము. కాని, 'వనము వృక్షములు' 'బ్రాహ్మణులు' సంఘము అని వాని నొకటిగ వ్యవహరించుటయు లేకపోలేదు. ఇక వనవృక్షములకును, బ్రాహ్మణ సంఘములకును భేదమును పాటించి, వృక్షముల వనము = చెట్లతోట, అవియు బ్రాహ్మణుల గుంపు అను వ్యవహారమును గలదు. కావున వానికి భేదమును అభేదమును సంభవించును. ఇక అవయవములకు ఒకదానితో నింకొకదానికి భేదమేగాని అభేదము లేదు. శింశపపలాశములు రెండు చెట్లు. వనావయవములు. శింశపలాశములు = ఇరుగుడు చెట్టును, మోదుగ చెట్టును పరస్పరము అభిన్నములుగ వ్యవహరింపబడవు. ఇక నుపమానోపమేయములకు కర్మకరణ ప్రత్యయములను బట్టి భేదమును, అభేదము నాశ్రయించి ఏకత్వ సంశయమును ఉపపన్నములు. ॥393॥

అవతారిక— తరువాత, మహాభాష్యమున, ''కిం చ భోః'' అని ఆరంభించి, 'యదియదేవోపమానం తదేవోపమేయం కథహోపమార్థో గౌరివ గౌః ?' అథాప్యన్యదుపమానమన్యదుపమేయం కథహోపమార్థో గౌరివాశ్వఇతి'' అని శంకింపబడినది. '— ఏమండీ : ఉపమానమును నుపమేయమును నొకేవస్తువయిన నచట ఉపమించుటయను వ్యాపారమున కర్థమేమి ? 'గోవువంటిది గోవు' అనుట నిష్ప్రయోజనము గదా : ఇక అవి అత్యంతము భిన్నములయియున్నను, 'గోవువంటిది అశ్వము' అందురనుకొనుడు. అపుడును ఆ ఉపమానోపమేయభావమున కర్థము లేదు అని ఆ శంకకర్థము. ఆ గ్రంథమునకు వ్యాఖ్యాన మీ కారికలు.

శ్లో॥ తత్రాభిన్నవ్యపేక్షాయాముపమార్థో న విద్యతే ।
యో హి గౌరితి విజ్ఞానేహేతుః సో ఽస్తిగవాంతరే ॥ 394

శ్లో॥ వ్యావృత్తానాం విశేషాణాం వ్యాపారేతు వివక్షితే ।
న కశ్చిదుపకారో ఽస్తిబుద్ధేః బుద్ధ్యంతరం ప్రతి ॥ 395

తత్ర = అందు, అభిన్నవ్యపేక్షాయాం = ఉభయగతమయిన, ఏకధర్మమును తీసికొని నపుడు, ఉపమార్థః న విద్యతే = 'ఉపమించుట' అను పని కర్థముండదు, యః హేతుః = ఏ కారణము, 'గౌః' ఇతి విజ్ఞానే = 'గోవు' - అను జ్ఞానములో నుండునో, స గవాంతరే అస్తి = అదియే హేతువు రెండవదానిని 'గోవు' అనుకొనుటలోను నుండును.

వ్యావృత్తానాం = అత్యంతమును వేరు వేరయిన, విశేషాణాం = వాని, భేదములకు, వ్యాపారే = వ్యాపారమయిన ఉపమించుట అను క్రియలో, వివక్షితే సతి తు = వివక్షింప బడినచో, బుద్ధేః = ఒక వస్తువుయొక్క జ్ఞానమునకు, బుద్ధ్యంతరం ప్రతి = వస్త్వంతర జ్ఞానమును గూర్చి, కశ్చిత్ = ఏదియు, ఉపకారః = ఉపయోగము, న అస్తి = ఉండబోదు.

తాత్పర్య వివరణములు— ఒకదానికి గల ప్రసిద్ధమయిన ధర్మమును బుచ్చుకొని అప్రసిద్ధమయిన దానిని దెలియజేయుట, ఉపమించుట అను క్రియకు ప్రయోజనము. ఉపమానమునందును నుపమేయమునందును గూడ గల ఏకధర్మమునే దానికి హేతువుగా స్వీకరించినచో, ఆ ఉపమితి క్రియకు ఫలము శూన్యము. గోవువంటిది గోవు అనుటకేమి ప్రయోజనముండును? తెలియనిదానిని తెలియజేయుట అందేదియు లేదుగదా?

ఆ విధముగనే సర్వాత్మనా భిన్నములయిన గవాశ్వముల కుపమానోపమేయ భావవర్ణనమును నిష్ప్రయోజనము గోవుకును, అశ్వమునకును, ఉభయాన్వితమగు ధర్మము ఏదియు లేదుగదా? అని భావము. ॥394, 395॥

అవతారిక— "ఏవం తర్హి యత్ర కించిత్ సామాన్యం కశ్చిచ్చవిశేషః తత్రోపమానోపమేయభావః" = "ఇటులైన, ఏ పదార్థములయందు సామాన్యధర్మ మేదియో యొకటి ఉండి, కొంత వానికి భేదముగూడ నున్నపు డుపమానోపమేయభావము సంభవించునని శంకను తొలగించు భాష్య వాక్యమును వ్యాఖ్యానించునదీ కారిక.

శ్లో॥ కించిద్యత్రాస్తి సామాన్యం యది భేదాశ్చ కేచన ॥ 396

యత్ర = ఏ పదార్థద్వయమునందు, కించిత్ సామాన్యం = కొంత సమాన ధర్మము, అస్తి యది = ఉండియున్నచో నున్న, భేదాశ్చ కేచన = భేదములుగూడ కొన్ని, సన్తి యది చ = ఉండియున్నను, తత్ర = అట్టి స్థలమున, ఉపమానోపమేయభావః = ఉపమాన ఉపమేయ సంబంధ ముండును.

తాత్పర్య వివరణములు— 'తత్ర' 'ఉపమానోపమేయభావః' - అను పదముల కధ్యాహారముచే సమన్వయము. భావము స్పష్టము. ॥396॥

అవతారిక— అందువలన, రెండును గోవులే అయినను, వానికి సామాన్యమును కొంత భేదమును బుచ్చుకొని ఉపమానోపమేయ భావము సంభవింపవచ్చును.

శ్లో॥ గోత్వం గోష్వస్తిసామాన్యం భేదాశ్చ శబలాదయః ॥ 396

గోత్వం = (గోవులు ఆ రెండింటియందును గూడ), గోషయత్ = గోవులన్నిటియందు నుండునే సామాన్యముగలదో, తత్ సామాన్యం అస్తి = ఆ సామాన్యమగు గోత్వము గలదు శబలాదయః = శబల, బహుల, మున్నగునవయిన, భేదాశ్చసన్తి = గోభేదములును గలవు.

తాత్పర్య వివరణములు— శబల గోవుదూడ శాబలేయము. బహుల గోవుదూడ బాహులేయము. వాని కుపమానోపమేయ భావమున వివక్షించినపుడు 'శాబలేయము వంటిది బాహులేయము' అనుట కలదు. గోత్వము సామాన్యజాతి. శాబలేయత్వ బాహులేయత్వములు అవాంతర జాతులు. అవి భిన్నములు. అయినను, ఏకార్థ కారిత్వము = రెండును నొకే పనికి. ఉపయోగించుట అను దానినిబట్టి ఉపమానోపమేయభావ ముపపన్నమని భావము. ॥396॥

అవతారిక— లేదా, 'సకల పదార్థములందును, సామాన్యమును, విశేషమునుగూడ నుండును. కావున నుపమానత్వోపమేయత్వము ససంభవమనిన, అతిప్రసంగము కలుగును. మేరు పర్వతమువంటిది, ఆవగింజ - గోవువంటిది గోవు అనియు ననవలసివచ్చును - అనునా క్షేపము కారికార్థభాగమున కర్థము. దానికి ప్రతి సమాధాన మీ కారికలో నిబంధింపబడినది.

శ్లో॥ సామాన్యం శ్యామతాద్యేవ తద్ధిసాధారణం ద్వయోః ।
తదేవ సిద్ధ్యసిద్ధిభ్యాం భేద ఇత్యపదిశ్యతే ॥ 397

సామాన్యం = సామాన్యమనగా, శ్యామతాది ఏవ = శ్యామత్వము మున్నగు గుణమే, తత్, ద్వయోః, సాధారణం హి = అది, రెంటికిని, సాధారణము గదా, తత్, ఏవ = అదియే, సిద్ధి, అసిద్ధిభ్యామ్ = ప్రసిద్ధి, అప్రసిద్ధి అను వానినిబట్టి, భేదః ఇతి, అపదిశ్యతే = 'విశేషము' అని చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— సామాన్యమనగా, మహాసామాన్యము అను గుణజాతి కాదు. శ్యామత్వమను, గుణమే అది ఉపమానమునకును, ఉపమేయమునకును సాధారణము గదా. అది వ్యావర్త్యకమును నగుటవలన విశేషమనియు జెప్పబడును. ఈ ప్రకరణమునసనే, మహాభాష్యమున పై గ్రంథ మీ యంశమును నిరూపించును.

"న చావశ్యం స ఏవసామాన్యవచనః యోబహూనాం సామాన్యమాహ ।
ద్వయోరపి యః సామాన్యమాహసోఽపిసామాన్యవచనః ॥"

ఇతి, అనగా, అనేకములం దనుగతమగునది సామాన్యమందురు. అనేకములనగా రెండును గావచ్చును. అధికములును గావచ్చును. కాగా రెండు వస్తువులందుగల సామాన్యమును జెప్పునది గూడ సామాన్యవచనమే. నలుపు అనే గుణము, ఉపమానము, ఉపమేయము అను రెండు వస్తువులందును నుండునది. ఇట నదియే వివక్షితము. అది - సాదృశ్యము. జాతి కాదు. ఇక భేదము, ప్రసిద్ధిని అప్రసిద్ధినిబట్టి యుండును. ఆ సాదృశ్యము ఉపమానమందు ప్రసిద్ధమైనట్లు ఉపమేయమున ప్రసిద్ధము గాదు.

కావున సజాతీయములతును సంస్థానము = అనగా అవయవముల సన్నివేశము

మున్నగువాని సాదృశ్యమునుబట్టి, ఉపమానోపమేయభావ ముండవచ్చును. కనుకనే శాబలేయ బాహులేయముల కయ్యది వెనుక జూపబడినది. శబలీ, ధవలా, కృష్ణా, కపిలా - మున్నగు నవి, గోవులలో వాని వర్ణమును బురస్కరించిన భేదములు. బహులా, అనునదియు గోభేదమే వాని మహాసామాన్యము గోత్వమే అయినను, అవాంతర జాతి భేదమునుబట్టి ఉపమానోప మేయభావము ప్రసిద్ధము. ॥397॥

అవతారిక — శ్యామతాదులకు, ప్రసిద్ధ్య ప్రసిద్ధులనుబట్టి మాత్రమే కాదు. కాని, పూర్ణత్వము, అపూర్ణత - వీనినిబట్టి గూడ భేదము సంభవమను మతాంతరమును జెప్పబడు చున్నది.

శ్లో॥ శ్యామత్వమేవసామాన్య మన్యేషాముభయోఃస్థితమ్ ।
సంపూర్ణత్వాత్ తదన్యత్వాత్ విశేషఇతికథ్యతే ॥ 398

అన్యేషాం = ఇతరుల మతమునందు, ఉభయోః = ఉపమానోపమేయములందు, స్థితం సామాన్యం = ఉన్న, సాధారణ ధర్మమగు, శ్యామత్వమేవం = శ్యామత్వమే, సంపూర్ణత్వాత్ = ఒకచో సంపూర్ణమగుటవలనను, తదన్యత్వాత్ చ = వేరొకచో, అసంపూర్ణమగుటను, విశేష ఇతి కథ్యతే = విశేషము అని చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— నలుపు అను, గుణము శస్త్రియందును, దేవదత్తయం దును గలదు. కాని శస్త్రి నలుపు వేరు, దేవదత్తది వేరు. సూక్ష్మతవలన ఆ భేదము తోచదు. కావున నది సామాన్యమనిరి. అది ఉపమానమునందు నిండుగనుండును. ఉపమేయమునందు మాత్రము కొన్ని యంశములలో కొఱవడియుండును. ఈ భేదమువలన నది విశేషము అనియు నందురు. ఈ విధముగ, భిన్నముగను, అభిన్నముగను గూడ నిర్ధారితమైన సామాన్యమే సాదృశ్యము. ॥398॥

అవతారిక— లేదా ఈ విధముగను జెప్పవచ్చును. ఉపమించుట అను పనిలో భిన్న జాతికిని అభిన్న జాతికిని గూడ వ్యాపారముండును అని.

శ్లో॥ ఆకృతౌ వాపి సామాన్యే క్వచిదేవ వ్యవస్థితాః ।
శ్యామాదయోఽవసీయంతే విశేషాస్తఇహాశ్రితాః ॥ 399

వా = అథవా = లేదా, ఆకృతౌ, సామాన్యే అపి = జాతి, సామాన్యమే అయినను, క్వచిదేవ వ్యవస్థితాః = ఏదియో యొక ఆశ్రయమునందే, యేశ్యామాదయః = నియతములయిన, ఏ శ్యామత్వాదులు, అవసీయన్తే = జాతికి భేదకములుగా నిశ్చయింపబడుచున్నవో, తే, ఇహ = అవి, ఇచ్చట, ఆశ్రితాః = ఉపమితి క్రియలో నాశ్రయింపబడినవి.

తాత్పర్య వివరణములు— జాతితోబాటుగా, కొన్ని సూక్ష్మములయిన విశేషములు కొన్ని కొన్ని వ్యక్తులందుండును. అవి జాతిభేదమునకు హేతువులు. ఆ విశేషములతో గూడిన

జాతి, వ్యక్తులందు, సమవాయమను సంబంధముచే సంబంధించియుండి, ఉపమానోపమేయ భావమునకు గారణమగును.

శస్త్రీయందును, దేవదత్తయందును, శ్యామ గుణములున్నవి. వానియందు గుణత్వ జాతి ఉండును. దాని కాశ్రయములయినవానిలో కొన్నిటియందు దీప్తి = కాంతివిశేషము మున్నగు ధర్మములుండుటచే, ఆ శ్యామత అనురజ్యమానమై ఆశ్రయములకు భేదమును కల్పించి, అవి సదృశములు అను జ్ఞానమును మనకు గలిగించును.

రెండు గోవులందు గూడ నేదియో విశేషముండవచ్చును గదా ః 'గౌరివ గౌః' = గోవువంటిది గోవు - అనవచ్చునా యనిన, ఆ విశేషము వాని జాతికి భేదకముగా స్ఫురింపదు. కాగా నట్టి ప్రయోగముల కుపపత్తి యగపడదు. శస్త్రీశ్యామా దేవదత్తా, శాబలేయ ఇవ బాహులేయః' - అను ప్రయోగములందు, ఆ గుణముల ఆశ్రయములకు భేదముండుటవలన విశేషావధారణమున కవకాశము గలదు. ॥399॥

అవతారిక — ఈ విధముగ భాష్యగ్రంథమును వ్యాఖ్యానించి పిండితార్థమును జెప్పుచున్నారు.

శ్లో॥ జాతేరభేదే భేదే వా సాదృశ్యం తత్ప్రచక్షతే ।
కశ్చిత్కదాచిదర్థాత్మా తథాభూతోఽపదిశ్యతే ॥ 400

జాతేః, అభేదే = జాతికి, ఐక్యము చెప్పబడినపుడుగాని, భేదే వా = 'భేదము' అని చెప్పినపుడు గాని, (యత్ సామాన్యం ఉక్తం) = సామాన్య ధర్మమొకటి కలదని ఏది చెప్పబడినదో, తత్, సాదృశ్యం ప్రచక్షతే = దానిని సాదృశ్యమందురు, కశ్చిత్ = ఒకానొక, అర్థాత్మా = ఉపమేయము, కదాచిత్ = ఒకానొకప్పుడు, తథాభూతః = అట్టిదిగా = సదృశముగా అపదిశ్యతే = (ఆసాదృశ్యమును బట్టి) చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ఈ రెండు వస్తువులును సదృశములు అను జ్ఞానమెచట గలుగునో, అచటనే ఉపమానోపమేయభావ ముండును. ప్రమేయత్వము, జ్ఞేయత్వము - మున్నగునవి సకల వస్తువులందును నుండు ధర్మములయినను నవి సాదృశ్యములు కావు. కావున, ఆ ధర్మములను బుచ్చుకొని ఇవి ఉపమానోపమేయములనుట చెల్లదు. ఈ కారికలో ''జాతేరభేదే'' అను నంశము, 'ఆకృతౌవాపి సామాన్యే' - అను కారికలో చెప్పబడిన యర్థమున కనువాదము. ''భేదేవా'' - అను నంశము ''సామాన్యం శ్యామతాద్యేవ'' ఇత్యాది కారికోక్తార్థానువాదము అని గ్రహింపదగును. ॥400॥

అవతారిక— 'ఇవి సదృశములు' అను ప్రత్యయమునకు విరుద్ధమయిన ప్రత్యయమును, సదృశప్రత్యయ విషయ నిర్ధారణమునకై ఉదాహరించుచున్నారు.

శ్లో॥ యత్రార్థే ప్రత్యయాభేదో నకదాచిద్వికల్ప్యతే ।
అవిద్యమాన భేదత్వాత్ స ఏకఇతిగమ్యతే ॥ 401

యత్ర అర్థే = ఏ వస్తువునందు, ప్రత్యయాభేదః = ప్రతీతికి అభేదము, కదాచిదపి = ఎపుడును, న వికల్పతే = మారదో, సః = అది - ఆ పదార్థము, అవిద్యమాన భేదత్వాత్ = భేదమనునది లేనిదగుటవలన, ఏకః, ఇతి, గమ్యతే = 'ఇది అభిన్నము' అని తెలియబడును.

తాత్పర్య వివరణములు— ఒక వస్తువు మనకొక రీతిలో గోచరించును. ఆ గోచరించుటనే ప్రత్యయమందురు. ప్రతీతి ప్రత్యయపదము లేకార్థములు. ఏ ఆకారములో ఆ ప్రతీతి కలుగుచున్నదో ఆ ఆకారముయొక్క అభేదము = ఏకత్వము, ఇక మారకూడదు. మరల భేద ప్రత్యయముతో వికల్పితము గారాదు అపుడా వస్తువు, దాని అవస్థలలో భేదమున్నను, ఆ భేదము వ్యవహారములో భాసింపదు గాన, లేనిదానివంటిదే అగుటచేత, ఇది ఏకమే అభిన్నమే = ఒక్కటియే - అను ప్రతీతిలో విషయమగును. ఇది సదృశ ప్రత్యయమునకు ప్రత్యనీకము. ॥401॥

అవతారిక— ప్రత్యయము, ప్రతీతి, సంవిత్, జ్ఞానము, ప్రతిభానము - వీనికన్నిటికిని అర్థమొకటియే. అభిన్న ప్రత్యయమన నేమియో గత కారిక వివరించినది. 'ప్రత్యభిజ్ఞ' అను ప్రత్యయము నీ కారిక ఉదాహరించుచున్నది.

శ్లో॥ యోఽర్థ ఆశ్రితనానాత్వః స ఏవేత్యపదిశ్యతే ।
వ్యాపారం జాతిభాగస్య తత్రాపి ప్రతిజానతే ॥ 402

ఆశ్రితనానాత్వః = ఆశ్రయింపబడిన భేదముగల, యః అర్థః = ఏ పదార్థము = వస్తువు, సః ఏవ - ఇతి = 'అదియే' అని, అపదిశ్యతే = వ్యవహరింపబడునో, తత్రాపి = ఆ వ్యవహారమునందు గూడ, జాతిభాగస్య = జాత్యంశమునకు, వ్యాపారం = వ్యాపారమును = పనిగలిగియుండుటను, ప్రతిజానతే = చెప్పుచున్నారు.

తాత్పర్య వివరణములు— ఒక వస్తువునకు భేదము ప్రసిద్ధముగ నుండును. అనగా ఆ వస్తువులు భిన్నములేగాని ఏకము గాదు. కాని అది 'సోయమ్' = అదియే యిది అని అందురు. అట్లనుకొనుటలో పనిచేయునది, జాతి విశిష్ట వ్యక్తియొక్క 'జాతి' అను భాగమగును. అనగా జాతి వ్యక్తితో ఏకాత్మతను బొందునుగాన అందు జాతి యొక భాగము వ్యక్తి వేరొక అంశము ననుట. వ్యక్తితో నేకాత్మత నొంది జాతి ప్రత్యభిజ్ఞ అను ప్రత్యయమునకు ప్రయోజకము. సదృశ ప్రత్యయమున నది పని చేయదు.

కొన్నిచోట్ల వస్తువులకు సాదృశ్యముండుటవలన తత్త్వము అభేద మారోపింపబడును. అపుడును అదియే యిది అనుకొనుట భ్రాంతి. ఛేదింపబడిన తరువాత మరల పుట్టిన కేశములను అవియే యివి అనుకొనుట వంటిదే. అది జాతియొక్క ఏకత్వమువలన అపాదింపబడినది అని తాత్పర్యము. ॥402॥

అవతారిక— వస్తువునందు భేదసంబంధముగాని అభేదముగాని, జ్ఞానమునకు అనగా సంవిత్తునకు సంబంధించినదే. ఎట్లనగా—

శ్లో॥ జాతిభాగాశ్రయా ప్రఖ్యా తత్రాభిన్నా ప్రవర్తతే।
వ్యక్తిభాగాశ్రయా బుద్ధిస్తత్ర భేదేన జాయతే॥ 403

తత్ర = అందు, జాతిభాగాశ్రయా = జాత్యంశము నిమిత్తముగా గలది యయిన, ప్రఖ్యా = బుద్ధి = సంవిత్తు, అభిన్నా ప్రవర్తతే = 'అదియే' అని ప్రవర్తించును = కలుగును, వ్యక్తిభాగాశ్రయా = వ్యక్త్యంశ మూలకమయిన = వ్యక్తి అను అంశమువలన, బుద్ధిస్తు = బుద్ధి అయితే, భేదేన జాయతే = 'అది వేరు ఇది వేరు' అని కలుగును.

తాత్పర్య వివరణములు— ఒకే జాతికి చెందిన పదార్థము = వస్తువు 'గౌరేవాయమ్' ఇది గోవే అని పరామర్శింపబడును. ఎందువలన? గోత్వము అను జాతి భాగము కలదు గనుక. ఇది అభేద రూపమయిన సంవిత్తు. ఇక భేదముచే ఉపలక్షితమయిన సంవిత్తు ఆ గోవు. ఈ గోవు అని కలుగుచుండినది వ్యక్తులు ఆశ్రయముగా గలది. కాగా సంవిత్తుకే అనగా బుద్ధికే భేదసంబంధమును, అభేదముతో సంబంధమును కలుగుచుండునని యట ॥403॥

అవతారిక— ఈ కారికలలో సదృశ ప్రత్యయమునకు లక్షణము చెప్పబడుచున్నది.

శ్లో॥ అన్యత్రవర్తమానం సత్ భేదాభేద సమన్వితమ్।
నిమిత్తం పునరన్యత్ర నానాత్వేనేవ గృహ్యతే॥ 404

శ్లో॥ ఆధారేషు పదన్యాసం కృత్వోపైతి తదాశ్రయమ్।
ససాదృశ్యస్య విషయ ఇత్యన్యైరపదిశ్యతే॥ 405

నిమిత్తం = సదృశ ప్రత్యయమునకు కారణమైన శ్యామత్వజాతి, అన్యత్ర వర్తమానమ్ సత్ = వేరొక ఆశ్రయమునందు, ముందు వర్తించి, పునః అన్యత్ర = మరల, ఆశ్రయాంతమునందు, నానాత్వేన ఇవ = భేదముచే ననినట్లు = భిన్నమైనదా యనునట్లు, గృహ్యతే = పరిచ్ఛేదింపబడుచుండును.

'తత్' = ఆ సదృశ ప్రత్యయ నిమిత్తము, భేదాభేద సమన్వితం = సామాన్యవిశేషరూపములు గలదై, ఆధారేషు = తన ఆశ్రయములందు = గుణములందనుట, పదన్యాసంకృత్వా = కాలూని, అనగా సదృశములివి యని ఎరిగించి, తదాశ్రయం = ఆ గుణమునకాధారమైన ద్రవ్యమును, ఉపైతి = అపుడు పొందును, సః, సాదృశ్యస్య = ఆ గుణాశ్రయము, సాదృశ్యమునకు, విషయః ఇతి = విషయము, అని, అన్యైః అపదిశ్యతే = ఇతరులచే వ్యవహరింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— 'శస్త్రీశ్యామా' అనునది ప్రకృతోదాహరణము. అట, దేవదత్త అను నామె యొక చురకత్తితో సదృశురాలు అను ప్రత్యయము కలుగుచున్నది. దానికి కారణము శ్యామత్వము అను, గుణగతజాతి. అయ్యది శస్త్రీ గుణమైన నలుపునందు

ఉంటూ, దేవదత్తాగత గుణమునందును నుంటున్నది. కాబట్టి ఆశ్రయముల భేదముచేత భిన్న మైనదా యిది అనునట్లు తోచును. ఈ విధముగ భేదాభేదములు రెండిటితో గూడి, ఆ నిమి త్తము, తన ఆశ్రయములయిన గుణములందు దృఢముగ కాలూని, ఆ నలుపులు రెండును సదృశములు అను ప్రతీతిని కలిగించి, అపుడు వాని కాశ్రయములయిన ద్రవ్యములను బొందును. ఆ గుణజాతియగు శ్యామత్వమునకును, గుణాశ్రయ ద్రవ్యములకును సంబంధము, సమవేత సమవాయము. అనగా, దేవదత్తయందు నలుపు అను గుణము సమవేతము = సమ వాయమను సంబంధముచే సంబద్ధము. ఆ నలుపునందు నలుపుతనము = శ్యామత్వమను గుణ గత జాతియొక్క సమవాయమున్నది ఇచట ఆ నలుపు. అను, గుణమునకు ఆశ్రయమైన ద్రవ్యము అనగా శత్త్రియు దేవదత్తయు సదృశ ప్రతీతి విషయములు. సాదృశ్యము, జాతి కాదు. జాతి అభిన్నము. ఏకము. ఇది భేదాభేదములు రెండును గలదియై ఉపమానోపమేయ భావమునకు నిమిత్తమగుచున్నది.

ఈ కారికలో ''అన్యైరపదిశ్యతే'' – అని యున్నది. వెనుక, ఆశ్రయమునందు భేదాభేద ప్రతీతి. ఉపమానోపమేయభావ హేతువని చెప్పబడినది. ఇచ్చట నిమిత్తము భేదాభేద సమన్వితమైనపుడు, ద్రవ్యమునందు సామాన్య విశేషావభాసము కలుగుననియు, అట్టి నిమి త్తము, ఉపమితి ప్రతీతి హేతువనియు చెప్పబడినది. ॥404, 405॥

అవతారిక— తరువాతి భాష్యగ్రంథము - ''కామం తర్హి ఏతేనైవహేతునా యస్య గవయోనిర్జ్ఞాతః, గౌరనిర్జ్ఞాతః, తత్కర్తవ్యం స్యాత్, 'గవయ ఇవ గౌః' ఇతి బాఢం కర్తవ్యమ్'' అని.

ఏమయా ! నిర్జ్ఞాతమయినది ఉపమానమును, నిర్జ్ఞాతము కానిది=అప్రసిద్ధము ఉపమేయమును, అనిన గవయము ప్రసిద్ధమయి, గోవు ప్రసిద్ధముగాని వానికి, 'గవయము వంటిది గోవు' అనియు, ఉపమానోపమేయ విన్యాసము చేయవలసియుండునే ? అని శంకించి 'ఓ ! అవశ్యము చేయవచ్చును. అజ్ఞాతజ్ఞాపనమేకదా కర్తవ్యము' – అని చెప్పి, ఉపమానోప మేయముల అవ్యవస్థ అంగీకరింపబడినది. ఆ విషయము సనిదర్శనముగ వ్యుత్పాదింపబడు చున్న దీ కారికలో—

శ్లో॥ పరాపేక్షే యథాభావే కారణాఖ్యా ప్రవర్తతే ।
తథాన్యాధిగమాపేక్షముపమానం ప్రచక్షతే ॥ 406

కారణాఖ్యా = 'ఇది దీనికి కారణము' – అని కారణమనుమాట, యథా = ఏ ప్రకారముగా, పరాపేక్షే = ఇతరాపేక్ష గల, భావే = పదార్థమునందు, ప్రవర్తతే = ప్రవర్తించుచు, లోక మున నున్నదో, తథా = ఆ ప్రకారముగ, ఉపమానం = ఉపమానమును, అన్యాధిగమాపేక్షం = ఇంకొక భావముయొక్క అపేక్షకల దానినిగా, ప్రచక్షతే = చెప్పుదురు.

తాత్పర్య వివరణములు— ఒకానొకదానిని కారణమనుట – కార్యమునుబట్టి

యుండును. కార్యతా నిరూపితము కారణత అందురు అయినను కార్యకారణములకు సంకరము లేదు. కార్యము, ఆ కారణమునకు కార్యమే. దానికింకకారణము గాదు. ఆ విధముగనే, ఉప మేయతా నిరూపిత ముపమానత్వము. ఉపమానముగా ప్రసిద్ధ ముపమానమే. అది ఉప మేయము గాదు ప్రసిద్ధికిని అప్రసిద్ధికిని సంకరము లేదు. ప్రసిద్ధము ప్రసిద్ధమే. అప్రసిద్ధ మప్రసిద్ధమే. కనుక నుపమానోపమేయభావ విపర్యాస ప్రసంగము లేదు ఉపమానముపమే యాపేక్షమయినను నది ప్రసిద్ధిని పురస్కరించుకొని ఉపమానమే. ॥406॥

అవతారిక — వేరొక నిదర్శనము గూడ ఇందు, జూపబడుచున్నది.

శ్లో॥ గురుశిష్య, పితాపుత్ర, క్రియాకాలాదయో యథా ।
వ్యవహారా స్తథౌపమ్య మప్యపేక్షానిబంధనమ్ ॥ 407

గురుశిష్య = గురువు, శిష్యుడు, పితాపుత్ర = తండ్రి, కొడుకు, క్రియాకాల = క్రియ, కాలము ఆదయః = మొదలగు, వ్యవహారాః యథా = వ్యవహారము నెట్లో, తథా, ఔపమ్యమపి = ఆ విధముగనే, ఔపమ్యము గూడ, అపేక్షా నిబంధనమ్ = అన్యాపేక్ష నిమిత్తముగా గలది.

తాత్పర్య వివరణములు — లోకవ్యవహారమునందు ఒకనిని 'గురువు' అనిన నాతడెవరికి గురువు ? తన శిష్యులకుగదా. అనగా గురువను వ్యవహారము శిష్యుని దృష్టిచేత గదా. అది శిష్యాపేక్షా నిమిత్తకము. అందును స్వశిష్యాపేక్షమే. ఇంకొక గురువునుబట్టి కాదు. ఆ విధముగనే శిష్యుడు, తన శిష్యునకు శిష్యుడు గాదు పిత, పుత్రునకు. ఇంకొకని పితను గాదు. పుత్రుడు - తన తండ్రికి, తన పుత్రునకు గాదు. క్రియ, దేనికి ? తన కారకమునకు. అనగా తన్ను నిర్వర్తించు సాధనమునకు. క్రియాంతరమునకు గాదు. క్రియ అనునది సాధ్యం. అనగా సాధింపవలసినది సాధించునది కారకము = సాధనము. ఒకానొకటి సాధనమగుట, తనచేత సాధింపబడు దాని దృష్టిలో గదా. ఇది వాని స్వభావము - క్రియా సముద్దేశములో "తత్ర యం ప్రతి సాధ్యత్వమసిద్ధా తం ప్రతిక్రియా । సిద్ధా తు యస్మిన్ సాధ్యత్వం స తమేవ పునఃప్రతి" - అని క్రియాస్వరూపము శోధింపబడినది.

ఇక కాలమనగా - ప్రసిద్ధమగు నొక పరిమాణము గల క్రియ. అది వేరొక క్రియకు పరిచ్ఛేదకము. ఇట్లు పైన జెప్పినవన్నియు ఆపేక్షికములగు వ్యవహారములు. మొద లగునవి అనుటవలన, విశేష్యవిశేషణ భావవ్యవహారమును ఆపేక్షికమే.

ప్రకృతమేమి ? అన, ఔపమ్యమును అట్టిదే. కాని వాని ప్రసిద్ధిని అపేక్షించి — పట్టి ఉండుననుట. గవయము వనేచరున కుపమానము నాగరకుని దృష్టిలో ఉపమేయము. కావున సంకరములేదని భావము. ॥407॥

అవతారిక — "ఉపమానాని సామాన్యవచనైః" (2-1-54) అను ప్రకృత సూత్రార్థ విచార ప్రస్తావమున, తరువాతి గ్రంథము.

"కింపునరిహోదాహరణమ్" = ఈ సూత్రమున కుదాహరణమేమి ? "శస్త్రీ శ్యామా" = శస్త్రీ శ్యామా అనునది. "ఈ శ్యామా శబ్దము దేనిని బోధించును ? = "క్వపు నరయం శ్యామా శబ్దోవర్తతే ? "శస్త్ర్యామిత్యాహ" = శస్త్రిని బోధించును. "కేనేదానీం దేవ దత్తా అభిధీయతే ?" = దేవదత్తను బోధించునది యేది ? 'సమాసేన' = సమాసము మొత్తముచే నది బోధింపబడును అని యున్నది. ఆ గ్రంథార్థానువాద రూప మీ కారిక.

శ్లో॥ శ్యామత్వముపమానే చేద్వృత్తౌ వృత్తం ప్రయుజ్యతే ।
ఉపమేయం సమాసేన బాహ్యం తత్రాభిధీయతే ॥ 408

వృత్తౌ = 'శస్త్రీశ్యామా' - అను సమాస వృత్తియందు, శ్యామత్వం = శ్యామా శబ్దార్థమయిన నలుపు గుణము, ఉపమానే = ఉపమానమయిన, చురకత్తియందు, వృత్తం ప్రయుజ్యతే చేత్ = బోధకమైనదిగా, ప్రయోగింపబడినచో, తత్ర బాహ్యం = అపుడా సమాసమున, బహిర్భూత, ఉపమేయం = ఉపమేయ అయిన దేవదత్త అను నామె, సమాసేన అభిధీయతే = మొత్తము సమాసముచే చెప్పబడును.

తాత్పర్య వివరణము లు— తాత్పర్యము స్పష్టము. కారికలో చేత్ అనుటవలన పక్షాంతరమును గలదని సూచింపబడుచున్నది. వర్తి పదములు = అనగా సమాసమందున్న, 'శస్త్రీ, శ్యామా' అను రెండు పదములును, ఉపమానమునే బోధించిన. ఇక ఉపమేయయగు దేవదత్త, మొత్తము సమాసమున కర్థము కావలెనని తేలినది. అపుడీ సమాసము, అన్యపదార్థ ప్రధాన సమాసము అనవలసి యుండును. దేవదత్త అన్యపదార్థము గదా ! కాని, తత్పురుష అన్యపదార్థ ప్రధానమగునా ? అది ఉత్తరపదార్థ ప్రధానము కావలెనుగదా ? అని ప్రశ్నింప వచ్చును. సమాధానమేమన— 'నఞ్' (2-2-6) అను సూత్రములో, నఞ్సమాసము, పూర్వ పదార్థ ప్రధానమా ? ఉత్తరపదార్థ ప్రధానమా ? అన్యపదార్థ ప్రధానమా ? అని పక్షత్రయము విచారింపబడినది. కావున, ఆ నియమము లేదనుట. ఈ సమాసమున నే పదము యొక్క అర్థము ప్రధానమనుమాట, లోకప్రసిద్ధినిబట్టి చెప్పినదేగాని, నైయత్య సూచకము గాదు. కాగా శ్యామా శబ్దము శస్త్రీ శబ్దమునకు సమానాధికరణముగా ప్రయోగింపబడినను ఉపమేయ ప్రతీతి కలుగుచున్నందున నిది అన్యపదార్థ ప్రధాన సమాసము అని స్పష్టమయినది.

ఇక నిట రెండు శంకలు కలుగును - 'శస్త్రీ శ్యామా' అను తత్పురుష సమాసము వలన అన్యపదార్థ ప్రతీతి కలుగుచున్నట్లు, 'పీతాంబరః' - మున్నగు బహుత్రీహి సమాసము లందును గలుగవచ్చును గదా ? ఆ సూత్రమున, అనగా = "అనేక మన్యపదార్థే" అను సూత్రమునందు, 'అన్యపదార్థే' అను పదమెందులకు ? అని యొక శంక.

బహుత్రీహి సమాసం సంజ్ఞచే తత్పురుషకు అనగా నీ సమానాధికరణ సమాసమునకు బాధ ప్రాప్తింపదా ? అని రెండవది.

మొదటి శంకకు సమాధానము— ప్రయోగానురోధముగ సర్వప్రత్యాఖ్యానము

యుక్తము గాదు. అన్యపదార్థము బహిరంగమును స్వపదార్థ మంతరంగమునుగదా. కనుక, స్వపదార్థ ప్రాధాన్యమున బహుబ్రీహిని వాదించుటకు "అన్యపదార్థే" అనునది ఆవశ్యకము.

ఇక రెండవ శంకకు సమాధానము— బహుబ్రీహి సమాసము, "శేషోబహుబ్రీహిః" (2-2-28) అని శేషాధికారమున విధింపబడినది. సమానాధికరణ సమానమయిన ఉపమాన సమాసము శేషము గాదు. కావున దానిచే దీనికి బాధ ప్రాప్తింపదు. బహుబ్రీహి అయిన, గుణవచనమగు శ్యామా శబ్దము విశేషణమగుటవలన పూర్వనిపాతము ప్రాప్తమై అది 'శ్యామా శస్త్రీ' - అని కావలసివచ్చును. స్వరములో భేదము మాత్రము లేదు లెండు. ఉపమాన పూర్వ పద సమాసమయినను, బహుబ్రీహి అయినను, పూర్వపద ప్రకృతి స్వరమే ప్రవర్తించును గదా.

బహుబ్రీహి సమాసమైనచో ఔపమ్య ప్రతీతి కలుగదుగాన నది గాదని యనుట పొసగదు. షష్ఠ్యర్థమగు సంబంధ సామాన్యమునందు బహుబ్రీహి యగును. సామాన్యమేమో విశేష నిష్ఠమే ఆయె ఆ విశేషము, ఉపమానోపమేయ భావమే యగును. వేరొకటి కుదురదు గదా : కనుక, శేషవచనమువలన నిది బహుబ్రీహికి విషయము కాదు.

ఆ సూత్రమున శేషపదము చివరకు ప్రత్యాఖ్యాతమయిననదనినను, వచన సామర్థ్యము వలన నిది తత్పురుషమే యగును.

"ప్రాక్కడారాదేకాసంజ్ఞా" "ప్రాక్కడారాత్పరంకార్యమ్"

అని రెండు విధములుగ "ఆ కడారాదేకాసంజ్ఞా" (1-4-1) అను సూత్రమున భాష్యము నందు పఠింపబడినది. ఏ పాఠమునందైనను విశేషవిధియగు "ఉపమానాని సామాన్యవచనైః" అను నిది బహుబ్రీహికి బాధకమే యగునని నిర్ణయింపబడినది

కారికలో 'వృత్తౌ' అని యున్నది. శ్యామా శబ్దము వృత్తిలో ఒక పర్యాయమే ఉచ్చరింపబడినందున, దేవదత్త సమాసవాచ్యమే కావలెను. వాక్యమునందైన, 'యథాశస్త్రీ శ్యామా తథా దేవదత్తా' అని యర్థమగుటచే, శ్యామా శబ్దమునకు ఉపమానోపమేయములు రెండింటితోడను సంబంధము సిద్ధింపవచ్చును అని భావము. ॥408॥

అవతారిక— "యద్యేవం శస్త్రీశ్యామో దేవదత్తః" "ఇతి న సిద్ధ్యతి" అని భాష్యము. శ్యామా శబ్ద ముపమానమును బోధించునపుడు గుణవాచకములకు ఆశ్రయమును బట్టి లింగవచనములు వర్తించునుగాన, స్త్రీ లింగమగు శ్యామా శబ్దముతోడనే సమాసమగును. ఉపమేయమగు వ్యక్తి పురుషుడు అయినను, శస్త్రీశ్యామా దేవదత్తః అనియే యగునుగాని 'శస్త్రీశ్యామః' అని పుంలింగరూపము సిద్ధింపకపోవునని ఆక్షేపాశయము ఆ గ్రంథమునకు వివరణరూప మీ కారిక.

శ్లో॥ టాబన్త ఏవ చైత్రాదౌ శ్యామశబ్ద స్తథా భవేత్ ।
సూత్రే చ ప్రథమాభావాన్న శ్యామాద్యుపసర్జనమ్ ॥ 409

తదా = ఉపమేయము సమాసవాచ్యమయిన పక్షమున, చైత్రాదౌ = చైత్రుడు మున్నగు పురుషులందును, టాబన్త ఏవ = 'టాప్' ప్రత్యయాంతమగునదియే, శ్యామాశబ్దః భవేత్ = 'శస్త్రీశ్యామా' (చైత్రః) అని యగును, సూత్రే = 'ఉపమానాని' అను సూత్రమునందు, ప్రథమాభావాత్ చ = 'సామాన్యవచనాని' అని ప్రథమానిర్దేశము లేనందున, శ్యామాది = శ్యామాది శబ్దార్థము, ఉపసర్జనం = ఉపసర్జనము, న భవతి=కాదు (కాగా "గోస్త్రియోః" అని హ్రస్వము రాదు).

తాత్పర్య వివరణములు— శ్యామా శబ్దము ఉపమేయమును బోధింపదనిరి. అపుడు శస్త్రివలె చైత్రుడు నల్లనివాడు అని చెప్పదలచినను, 'శస్త్రీశ్యామా చైత్రః' - అనియే కావలసి యుండును. సమాస విధాయక శాస్త్రమునందు, ప్రథమా విభక్త్యంతపదముచే నిర్దేశింపబడినది ఉపసర్జనమను సంజ్ఞకలది యగును. అనియును, ఉపసర్జనమైన స్త్రీప్రత్యయాంతమునకు హ్రస్వము వచ్చును' - అనియు శాస్త్రములు కలవు. కాని సామాన్యవచన మిట సూత్రమునందు తృతీయా నిర్దిష్టముగాని ప్రథమా నిర్దిష్టము గాదాయె. అందువలన హ్రస్వప్రాప్తి లేదని తాత్పర్యము. ॥409॥

అవతారిక— తదనన్తర భాష్యగ్రంథమున - "ఉపసర్జన హ్రస్వత్వమత్ర భవిష్యతి" - అని ఆక్షేప సమాధానము చెప్పబడినది. సూత్రమునందు సామాన్యవచన శబ్దము ప్రథమా నిర్దిష్టము కాకున్నను, "ఏకవిభక్తిచా పూర్వనిపాతే" (1-2-44) అను సూత్రముచే ఉపసర్జన సంజ్ఞ శ్యామా శబ్దమునకు సిద్ధింపవచ్చును. ఎట్లన, విగ్రహవాక్యము నందు నియతముగ నొకే విభక్తి కలదియు నుపసర్జన సంజ్ఞ కలదియగునని ఆ సూత్రమున కర్థము. శ్యామా శబ్దము, విగ్రహవాక్యములో నెపుడును ప్రథమాంతమేగదా. లేదా ఉప సర్జన సంజ్ఞ అన్వర్థసంజ్ఞ. అనగా లోకవిదితమయిన సంజ్ఞ, లోకములో అప్రధానమైనదాని నుపసర్జనమందురు. ఉపమేయము ప్రధానము. అది సమాసార్థము. వర్తిపదార్థ ముప సర్జనము = అప్రధానము. ఉపసర్జన పద మన్వర్థమను నాశయముచేతనే, పైన భాష్యము నందు "యదితర్హి ఉపసర్జనాన్యపి ఏవం జాతీయకానిభవన్తి", 'తిత్తిరికల్మాషీ' 'కుంభ కపాలలోహినీ' - అను శబ్దములందు ఈ అను స్త్రీ ప్రత్యయము రాకుండును. అది అనుప సర్జన ప్రాతిపదికమైననే ప్రవర్తించును. "అనుపసర్జన లక్షణః ఈకారః నప్రాప్నోతి" అని ఆక్షేపింపబడినది. ఆ గ్రంథ వ్యాఖ్యానరూపమగునదియే ఈ కారిక.

శ్లో॥ అథచైకవిభక్తిత్వాత్ గుణత్వాద్వోపసర్జనమ్ ।
నైవతిత్తిరి కల్మాష్యామిష్టః స్త్రీప్రత్యయోభవేత్ ॥ 410

అథ చ = ఇక, ఏక విభక్తిత్వాత్ = విగ్రహమున, నియతవిభక్తి అగుటవలనగాని, గుణ త్వాత్ వా = అప్రధానత్వము వలనగాని, ఉపసర్జనం భవతి = సమాస ఘటక పద ముప సర్జనమగుననిన, (తథాపి) = అప్పటికిని, తిత్తిరి కల్మాష్యామ్ = 'తిత్తిరి కల్మాషీ' - అను రూపమునందు, ఇష్టః స్త్రీ ప్రత్యయః = సమ్మతమైన స్త్రీ ప్రత్యయము, న భవేత్ =సిద్ధింపక పోవును.

తాత్పర్య వివరణములు—— 'శస్త్రీ శ్యామా' - అను నీ సమాసమున, బాహ్య పదార్థమయిన దేవదత్త అను నామె ప్రధానము. 'శస్త్రీ ఇవ శ్యామా' అను విగ్రహవాక్య ములో 'శ్యామా' అను పదము నియతముగ ప్రథమాంతమే. అది మారబోదు. మొత్తము సమాసపదమున కనేక విభక్త్యన్తముగ మార్పు కలుగవచ్చును. గాన నది నియత విభక్తి కము కాదు. ఇట్లు హ్రస్వ మచట సిద్ధించినను, 'తిత్తిరి కల్మాషీ' అను స్థలమున, ఏదియో స్త్రీ ప్రత్యయము = అనగా టాప్పు లభించినను, కావలసిన ఈ అనునది లభింపదు.

తిత్తిరి కల్మాషీ అనగా తీతువు పిట్టవలె నానావర్ణములు గల స్త్రీ వ్యక్తి. 'కుంభ కపాలలోహినీ' అనగా కుండ పెంకువలె నెఱ్ఱగనుండు స్త్రీ వ్యక్తి. అందు తిత్తిరి శబ్దము పుంలింగము కుంభకపాల శబ్దము నపుంసకము. సమాస ప్రవృత్తికి పూర్వము కల్మాష లోహిత శబ్దములు స్త్రీ ప్రత్యయాంతములు కావు. సమాసము వచ్చిన తరువాత ఉపసర్జన ములు ఇట ప్రవర్తింపవలసిన స్త్రీ ప్రత్యయములను విధించు శాస్త్రములలో 'అనుపసర్జ నాత్' అనునది అధికారప్రాప్తమయి యున్నది. ఉక్తరీతిగ నవి ఉపసర్జనము లగుటచేత, 'తిత్తిరి కల్మాషి' అనుచోట, 'అన్యతోజీష్' (4-1-40) అని జీష్ప్రత్యయముగాని, కుంభ కపాలలోహినీ అనుచోట ''వర్ణాదనుదాత్తాత్తోపధాత్తోనః'' - అని (4-1-31) జీప్పుగాని ఇష్ట మయినవి ప్రాప్తింపవు అని భావము.

''ఏకవిభక్తి చా పూర్వనిపాతే'' (1-2-44) అను సూత్రముచేతను ప్రథమా నిర్దిష్టం సమాస ఉపసర్జనం'' (1-2-43) అను సూత్రముచేతను విధింపబడిన ఉపసర్జన సంజ్ఞ కృత్రిమము. లోకప్రసిద్ధమయిన అప్రధానమను నర్థము అకృత్రిమము. శాస్త్రమునందు లక్ష్యానురోధముగ కృత్రిమమును -అకృత్రిమమును గూడ గ్రహింపవచ్చును, ''ఉభయగతి రిహ భవతి'' - అని చెప్పబడియున్నది.

లౌకికార్థమును ఆశ్రయించిన, శాస్త్ర మా సంజ్ఞను విధించుట వ్యర్థముగాదా ? అని తోచవచ్చును ప్రధానమైన దానికి గూడ పూర్వనిపాతము - పురుష వ్యాఘ్రః అర్థపిప్పలీ' - ఇత్యాదులం దావశ్యకమగుటచేత నది సిద్ధించుటకై ప్రథమా నిర్దిష్ట మిత్యాది శాస్త్రీయ సంజ్ఞా విధానమును ఆవశ్యకమే.

''రాజ్ఞః గోః క్షీరమ్'' - అను వాక్యమును చూడుడు = 'రాజుగారియొక్క ఆవు యొక్క పాలు' రాజ్ఞః అనునదియు, గోః అనునదియు గూడ నుపసర్జనములే, అయినను లౌకికమయిన ఉపసర్జనత్వము నాశ్రయించి రాజ పదమునకే పూర్వనిపాతము. ఈ విధ ముగ ఉపసర్జనత్వము, శాస్త్రీయమును లౌకికమును గూడ గ్రహించి తత్తత్కార్యనిర్వాహము శాస్త్ర సిద్ధము. కావున నీ రీతిగా శస్త్రీ శ్యామో దేవదత్తః అనుచోట హ్రస్వము సిద్ధించినను, దోషాన్తరము లుండుటవలన లౌకికోపసర్జనత్వము గ్రాహ్యము కాదను నభిప్రాయముతో, ''యదిపునరేవం జాతీయకాన్యప్యుపసర్జనాని భవన్తి'' అని అరుచి సూచింపబడినది. కాగా ''టాబన్తఏవ చైత్రాదౌ శ్యామాశబ్ద స్తదాభవేత్'' - అను నాపత్తి నిలిచినది. ॥410॥

అవతారిక — ఉపసర్జత్వము నొప్పుకొని, స్త్రీ ప్రత్యయ విషయమున దోషము కలుగుననిరి. దానికి సమాధానమును శంకించి, దోషాంతరము ప్రసక్తమగునుగాన నది కుదుర దని నిరాకరించుచున్నారు.

శ్లో॥ సతి శిష్టబలీయస్త్వాత్ బాహ్యే జీషి చ సత్యపి ।
ఉపమానస్వరో న స్యాత్ తస్మాత్ స్త్ర్యన్తః సమస్యతే ॥ 411

చ = అపిచ = మఱియు, బాహ్యేజీషి = బయటదైన, జీప్రత్యయము, సత్యపి = సిద్ధించి నప్పటికిని, సతి శిష్టబలీయస్త్వాత్ = ఒక కార్యముండగా విధింపబడిన రెండవ కార్యము బలవత్తరమగుటవలన, ఉపమానస్వరః = ఉపమాన పూర్వపద ప్రకృతి స్వరము, న స్యాత్ =సిద్ధింపక పోవును, తస్మాత్ =అందువలన, స్త్ర్యన్తః సమస్యతే=స్త్రీ ప్రత్యయాంత కల్మాషీ శబ్దమే సమసించును.

తాత్పర్య వివరణములు— 'వర్ణాదనుదాత్తాత్', 'అన్యతోజీష్' అను సూత్రములం దనువర్తించిన, 'అనుపసర్జనాత్' అనునది తదంతమునకు విశేషణముగాని సూత్రగృహీతము నకు గాదు. అపుడు కల్మాషలోహిత శబ్దము లుపసర్జనములయినను, తదంతము లుపసర్జన ములు కావు గాన, సమాసానంతరము జీషాదులు సిద్ధించుట సంభవమే. తిత్తిరికల్మాషీ అను సమాసమున, జీప్రత్యయ స్వరమైన అంతోదాత్తము 'సతిశిష్టము' గాన ప్రబలమై ఉపమాన పూర్వపద స్వరమును బాధించును.

ఒక స్వరము ముందు ప్రవర్తించి, అది యుండగా తరువాత విధింపబడిన వేరొక స్వరము సతిశిష్ట స్వరమనబడును. అది బలీయము. కావున నట ఉపమాన స్వర మిష్టమైనది అయినను సిద్ధింపకుండును. ఈ విధముగ స్వరదోషము కలదుగాన, సమాసముచేయుటకు ముందే స్త్రీ ప్రత్యయమును ప్రవర్తింపజేసి, తదంతమగు 'కల్మాషీ' అను సామాన్యవచన ముతో ఉపమానమునకు సమాసమును జేసిన, అపుడు ఉపమానస్వరమే సతిశిష్టమగును. అదియే బలవత్తరముగాన ప్రవర్తించును

సామాన్యవచనములగు 'శ్యామా' మున్నగునవి, ఉపమేయములందు వర్తింపక ఉపమానమును బోధించునవైన పుం నపుంసకములయిన తిత్తిరి, కుంభకపాల శబ్దములతో సమానాధికరణములగును. స్త్రీ ప్రత్యయమును సిద్ధించును అని భావము. ॥411॥

అవతారిక — మరియును—

శ్లో॥ గుణేన చోపమానస్థే సాపేక్షత్వం న ప్రకల్పతే ।
ప్రధానస్య తదా న స్యాత్వ్యాఘ్రాదౌ లింగదర్శనమ్ ॥ 412

గుణే, వ్యాఘ్రాదౌ ఉపమానస్థే = శౌర్యము మున్నగు గుణము ఉపమానములయిన వ్యాఘ్రాదు లందున్నయెడల, ప్రధానస్య = ప్రధానుడగు పురుషునకు, సాపేక్షత్వం = సామాన్య ధర్మ

వాచకాపేక్ష, న ప్రకల్పతే = సిద్ధింపదు, తదా = అపుడు, లింగదర్శనం = సామాన్యాప్రయోగే అనునది జ్ఞాపకమగుట, న స్యాత్ = సంభవింపకపోవును.

తాత్పర్య వివరణములు— ''ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే'' (2-1-56) అను సూత్రముచేత, ఉపమేయములకు, 'వ్యాఘ్ర' మున్నగు కొన్ని ఉపమాన వాచకములతో సమానాధికరణ తత్పురుషము విధింపబడినది. ''పురుషవ్యాఘ్రః'' - మున్నగునవి ఉదాహరణములు. పురుషుడు శూరత్వములో పులివంటివాడు అని యర్థము. సామాన్య ధర్మము శూరత్వము.

కాని, 'పురుషోవ్యాఘ్ర ఇవశూరః' అని విగ్రహమును చెప్పి, సామాన్య ధర్మవాచకమగు శూర శబ్దమును ప్రయోగించిన, ''పురుషవ్యాఘ్రః శూరః'' అని సమాసపదము సమ్మతము గాదు. అందులకై సామాన్యాప్రయోగే అను పదము సూత్రమున గ్రహింపబడినది. ఇపుడొక విమర్శ కర్తవ్యము.

సామాన్య ధర్మవాచకమును ప్రయోగించినపుడు, పురుషపదము తదపేక్షమగును గదా ? సాపేక్షమయినది అసమర్థమువంటిదని చెప్పిరిగదా ! అసమర్థమునకు సమాసము రానేరాదయ్యె. ఇక సామాన్యాప్రయోగే అను పదమెందులకు ? అని—

ఈ విధముగా పర్యాలోచించిన, అదివ్యర్థమే. ఇట్లు వ్యర్థమయినది, ఒక అపూర్వార్థమును జ్ఞాపనముచేసి సార్థకము కావలెను. లింగమనగా జ్ఞాపకము. ఆ అపూర్వార్థము అను జ్ఞాప్యాంశమిచట నేమి ? అనిన - 'ప్రధానమైనది సాపేక్షమైనను, సమాసము రావచ్చును' అనునది.

కాగా సామాన్యాప్రయోగే అనున నదిపుడు సఫలము. ఈ సామాన్యగుణము, ఉపమానగతమా ? ఉపమేయగతమా ? ఉపమానగతమైన ప్రధానమునకు సాపేక్షత్వము లేదు. 'సామాన్యాప్రయోగే' అనునదపుడు వ్యర్థము, కాదు. కాగా లింగము కానేరదు. అది ఉపమేయగతమయిన, ప్రధాన ముపమేయముగాన అపుడు జ్ఞాపకత్వము సుస్థమగునని భావము ॥412॥

అవతారిక— అందువలన 'శస్త్రీశ్యామో దేవదత్తః' అను స్థలమున, అప్రధానత్వ రూపమగు ఉపసర్జనత్వమును ఆశ్రయించి, హ్రస్వమును సమర్థించుట ఉపపన్నము గాదు. కనుక ఆ పక్షము హేయము అని ఉపసంహార మీ కారికలో నిబంధింపబడినది.

శ్లో॥ తస్మాత్ సతి గుణత్వేఽపి ప్రాధాన్యం విగ్రహాంతరే ।
నైవం జాతీయకం శాస్త్రే సంభవత్యుపసర్జనమ్ ॥ 413

తస్మాత్ = అందువలన, గుణత్వే సత్యపి = (శ్యామ గుణమునకు) అప్రాధాన్యమున్నను, విగ్రహాంతరే = వేరొక విధమయిన విగ్రహవాక్యమునందు, ప్రాధాన్యం అస్తి = ప్రధానత్వముండవచ్చును, ఏవం జాతీయకం = ఈ ప్రకారమైన, ఉపసర్జనం = అప్రాధాన్యము, శాస్త్రే న సంభవతి = శాస్త్రమునందు సంభవింపదు.

తాత్పర్య వివరణములు— శ్యామ గుణము ఉపమానగతము అయిన అది ఉప మేయమునకు విశేషణమగును. కావున అప్రధానము. కాని, "శస్త్రీ ఇవ దేవదత్తా శ్యామా" అని ఇట్లు, ఆ శ్యామ గుణము నుపమేయమునందున్న దానినిగా చెప్పినపుడది ప్రధానమే అగును.

ఉపమానవృత్తి శ్యామ గుణమను పక్షమునందైనను, ప్రక్రియా వాక్యములో అప్రధానముగ దోచినను, సమాస ముపమేయమును బోధించుటచేత వస్తుతః అది ప్రధానమే శాస్త్రము లోకసిద్ధమైన అర్థమునే అనువదించును. కాబట్టి వాస్తవ రూపములో ప్రధానమే అయిన ఉపసర్జనత్వము శాస్త్రమునందును ఉపపన్నము గాదు. కనుకనే మహాభాష్యమునందు "ఈ జాతి ఉపసర్జనములు గూడ సంభవించిన" – అని చెప్పి ఈ పక్షమందు అరుచి ప్రద ర్శింపబడినది. ॥418॥

అవతారిక— ఈ విధముగ గుణవచనము ఉపమానమును బోధించుటలో అనుప పత్తి నిర్ధారణమునుచేసి – "ఏవం తర్హి శస్త్ర్యామేవ శస్త్రీ శబ్దోవర్తతే । దేవదత్తాయాం శ్యామా శబ్దః" అని స్థిరీకృతము = శస్త్రీ శబ్దమునకు చురకత్తి అర్థము. శ్యామా శబ్దమునకు, దేవ దత్త అర్థము. కనుక, వెనుక చెప్పిన దోషము లేవియు నుండబోవు అని భావము. శ్యామా శబ్దమున కిట్లు ఉపమేయ వృత్తిత్వము స్థిరపరచియు, తదుపరి వేరొక అనుపపత్తి ఉద్భా వింపబడినది. ఎట్లనగా—

"ఏవమపి గుణోఽనిర్దిష్టో భవతి ।
బహవశ్చ శస్త్ర్యాం గుణాః ।
సూక్ష్మా మృదుతరీ" ఇతి

"అయినను గుణము నిర్దేశింపబడ లేదుగదా. శస్త్రీగతమగు గుణమును శ్యామా శబ్దము తెలియచేయదాయె. అపుడు, అనియతమగు గుణాంతరమును దేనినో పుచ్చుకొని సాదృశ్య మును జెప్పవలసి యుండును. కత్తియందు చాల గుణములుండును. తీక్ష్ణత ఉండును. సూక్ష్మత పృధుత్వము – ఇట్లెన్నియేని గుణము లుండవచ్చును గదా. శ్యామా శబ్ద ముపమేయమగు దేవ దత్తను చెప్పునుగాన స్త్రీలింగము సిద్ధించినది. తత్పురుష సమాసమున నుండదగిన, ఉత్తర పదార్థ ప్రాధాన్యమును నిర్వహింపబడినదగును. కాని పై దోషము, అనగా ఉపమానగతమగు గుణము నియతమైన ఉపమానోపమేయ భావహేతువు నిర్దిష్టము కాలేదనునది పరిహరింపబడ లేదు అని భాష్యాశయము.

తదుపరి, "అనిర్దిశ్యమానస్యాపి గుణస్య భవతిలోకే సంప్రత్యయః" అను పరి హార భాష్య మీ కారికచే వివరింపబడుచున్నది.

శ్లో॥ ఉపమేయాత్మ విశ్యామోవర్తమానోఽభిధీయతే ।
ఉపమానేష్వనిర్దిష్టః సామర్థ్యాత్ సంప్రతీయతే ॥ 414

ఉపమేయాత్మని = ఉపమేయ పదార్థమునందు, వర్తమానః శ్యామః = ఉంటున్న నలుపు అను

ధర్మము, అభిధీయతే = శబ్దముచే స్పష్టముగ వచింపబడును, ఉపమానేషు = ఉపమాన పదములందు, అనిర్దిష్టః = నిర్దేశింపబడనిది = శాబ్దము కానిది, సామర్థ్యాత్ సంప్రతీయతే = సామర్థ్య గమ్యమగును.

తాత్పర్య వివరణములు— శ్యామాది శబ్దములు, దేవదత్తాదులందున్న సాధారణ ధర్మమును, శబ్ద శక్తిచే బోధించును. ఆ అభిధావ్యాపారమునకు ఒక్క పర్యాయమే ప్రవృత్తి. అంతతో నది ఉపక్షీణమగును. కాని, ఉపమానమునందు ఈ శ్యామత్వముగాక వేరొక ధర్మమును అచట శబ్ద సన్నివేశమేదియు దెలియజేయలేదు. అందువలన సన్నిహితము, ఆకాంక్షితము, శ్రుతమును అగునది శ్యామగుణమే కావున తత్సంబంధమే న్యాయ్యమగునని భావము. ॥414॥

అవతారిక— "నిర్దేశింపబడని గుణమైనను లోకమునందు ప్రతీయమానమగుచుండును" - అని చెప్పి దృష్టాంతముగా నీయబడినది,

"తద్యథా చంద్రముఖీ దేవదత్తేతి ।
బహవశ్చ చంద్రేగుణాః ।
యాదాసౌ ప్రియదర్శనతా సాగమ్యతే"

అను గ్రంథము. దాని నీ కారిక వ్యాఖ్యానించుచున్నది

శ్లో॥ ద్రవ్యమాత్రేఽపి నిర్దిష్టే చంద్రవక్త్రేఽనుగమ్యతే ।
విశిష్టఏవ చంద్రస్థో గుణోనోపప్లవాదయః ॥ 415

చంద్రవక్త్రే = 'చంద్రముఖీ' అను పదమునందు, ద్రవ్యమాత్రే = ఉపమానమగు ద్రవ్యము మాత్రమే, నిర్దిష్టే అపి = నిర్దేశింపబడి యున్నను, చంద్రస్థ = చంద్రునియందుండు, విశిష్టః గుణః ఏవ = ప్రసిద్ధమయిన, ధర్మమే, అనుగమ్యతే = సాధారణ ధర్మముగా గ్రహింపబడును, ఉపప్లవాదయః = కళంకిము మున్నగునవి, న అనుగమ్యంతే = గ్రహింపబడవు.

తాత్పర్య వివరణములు— 'చంద్రునివంటి ముఖముగలది ఈమె' అందురు. చంద్రుడు ముఖమున కుపమానము. సాధారణ ధర్మవాచకము లేదు. అయినను ప్రసిద్ధినిబట్టి ఉపమానోపమేయభావ హేతువుగా, ఆహ్లాదకత్వము మున్నగు సాధారణ ధర్మమునే గ్రహింతురు. ఇతర ధర్మములు పెక్కులున్నను అవి గ్రహింపబడవు. ఉపప్లవమనగా కళంకము= చంద్రునిలోని మచ్చ అని కొందరందురు. మున్నగునవి యనగా వృద్ధిక్షయములు.

మరికొందరు, ఉపప్లవమనగా వృద్ధిక్షయములు. సతతగతి శీలమును. ఆదిపదమునకు శశలాంఛనము మున్నగునవి అర్థములు అనిరి.

ఎప్పుడు సాధారణధర్మము అసలు నిర్దిష్టమేకాకున్నను ప్రసిద్ధివలన నుభయత్ర అన్వయించినదో, అపుడు ఒకచో శ్రుతమైనది రెండవచోట = ఉపమేయమునందు ప్రతీతమగుననుటకు అభ్యంతరమేమి ? అని భావము. ॥415॥

అవతారిక— సాధారణ ధర్మవాచకము, ఉపమేయ సమీపమున నుచ్చరింపబడి నను సామర్థ్యమువలన నుపమానమునందును వర్తించునను పక్షము విచారించి నిర్ణయింపబడి నది. కాని ఇది అంతయు కల్పితమగు ప్రక్రియావాక్యమునందే. పరమార్థ దృష్టిలో 'శస్త్రీ శ్యామా' అను పదము అఖండము. విశిష్టమే విశిష్టోపమేయార్థమును జెప్పును.

శ్లో॥ భేదవాసనయైతచ్చ సమాసేప్యుపవర్ణ్యతే ।
విశిష్టగుణభిన్నే ఒర్థే పదమన్యత్ ప్రయుజ్యతే ॥ 416

ఏతచ్చ = సామాన్యవచనమున కీ ఉభయవృత్తిత్వము, భేదవాసనయా = ప్రక్రియావాక్యము నందలి భేదవాసనవలన, సమాసే అపి = సమాసపదమునందు గూడ, ఉపవర్ణ్యతే = వర్ణింప బడుచున్నది, అన్యత్ పదం = విగ్రహగతముకంటె వేరగు అఖండపదము, విశిష్టగుణభిన్నే = ఉపమానమను ఆశ్రయభేదముచే భిన్నమైన గుణముగల, అర్థే, ప్రయుజ్యతే = ఉపమే యమునందు, ప్రయోగింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— సామాన్యవచనము, ఉపమానమునకు సంబంధించిన దయినపుడు "శస్త్రీ ఇవ శ్యామా దేవదత్తా" అని విగ్రహవాక్యము అది ఉపమేయవృత్తి అయిన, 'శస్త్రీ ఇవ దేవదత్తా శ్యామా' అని వాక్యముండును. ఈ విధముగ భిన్న భిన్న ప్రక్రియా వాక్యములందు, 'శ్యామా' అనునది, ఉభయ సంబంధిగా అనుభవ విషయమగుట వలన, ఆ వాసననుబట్టి, వృత్తిపదము గూడ వాక్య సమానార్థకముగా నుండదగునని తలంచి, దాని కుభయసంబంధమును జెప్పుదురు.

కాని సమాసపదము నిరంశము. ప్రక్రియా వాక్యము, సమాసపదముల అన్వాఖ్యా నమునకై కల్పించిన కల్పన. ఆ కల్పన అతిప్రసంగము నాపాదింపరాదు. సామాన్య వచన మున కుపమేయ సంబంధమున్ననే, 'శస్త్రీ శ్యామః' అను పుంలింగ సమాసమున కుపపత్తి. 'తిత్తిరి కల్మాషీ' అనుచో స్త్రీప్రత్యయ సిద్ధియు నపుడే.

కాని ఈ పక్షమునందును చోద్యము = శంక లేకపోలేదు.

"ఏవమపి సమానాధికరణేనేతి వర్తతే।
వ్యధికరణానాం సమాసో న ప్రాప్నోతి।
కిం హి వచనాన్న భవతి"

అని అచట భాష్యము. శస్త్రీపద ముపమానమును, శ్యామాపద ముపమేయమును బోధించి నపుడు, వానికి సామానాధికరణ్య మెట్లు? ఏకార్థ బోధకత్వముగదా సామానాధికరణ్యము? ఈ సూత్రము సమానాధికరణాధికారములోనిది గదా?

దానికి పరిహారముగా, – "ఏమి? వచన సామర్థ్యమువలన సమాసము సిద్ధింపదా? అనిరి. ప్రకరణము సమానాధికరణ ప్రకరణమైనను, వచనము అనగా "ఉపమానాని" అను సూత్రము ప్రబలముగాన దానిని బాధించునని తాత్పర్యము. వచనము శ్రుతి. శ్రుతి, లింగ,

వాక్యప్రకరణ, స్థాన సమాఖ్యలను ప్రమాణములలో పూర్వ పూర్వ ప్రమాణమునకంటె నుత్తరోత్తరము దుర్బలము. ॥416॥

అవతారిక— "కిం హి వచనాన్న భవతి" అను భాష్యమునకు, వచనము అకృతార్థము కాన ప్రకరణమును బాధించునని భావమనిరి. కాని సామాన్యవచన ముపమానపరమైనపుడు, సూత్రము ప్రవర్తించునే, ప్రకరణ బాధయు నుండదుగదా అనిన, అఖండ పదము విశిష్టార్థబోధకము. అన్వాఖ్యానముకొరకై వాక్యకల్పన చేసినను, శాస్త్ర ప్రక్రియకు భంజకముగ, అపోద్ధారమును చేయరాదు. మరియును, సామాన్యవచన ముపమానమునకు సంబంధించినను, శస్త్రీ శ్యామా పదములు రెండును, ఉపమేయ విశేషణములగుటచే అప్రధానములు, సాపేక్షములును అగును అపుడు సామర్థ్యము లేకుండుటవలన సమాసము రాకపోవును.

ఉపమేయ వృత్తి అయినచో, శస్త్రీ శ్యామా పదార్థములకు ఉపమానోపమేయ సంబంధముండునుగాన అసామర్థ్యముండదు. అపుడు వ్యధికరణములయినను, ఆ పదములకు వచనము = అనగా సమాసవిధాయకము వృత్తిని విధించును.

ఈ విధముగ గమకత్వమువలన సమాసము సిద్ధించినను, 'మృగీవచపలా = మృగచపలా' - అను స్థలమున సమానాధికరణ ముత్తరపదమయినపుడు రాదగిన పుంవద్భావము సిద్ధింపకపోవును అని దోష మాశంకింపబడినది

"యద్యపితావద్వచనాత్ సమాసః స్యాత్ ।
ఇహతుఖలు మృగీవచపలామృగచపలా ।
సమానాధికరణ లక్షణః పుంవద్భావః న ప్రాపోన్నతి"

అని. ఇది తద్వివరణమైన కారిక.

శ్లో॥ యదిభిన్నాధికరణో వచనాదనుగమ్యతే ।
మృగీవచపలేత్యత్ర పుంవద్భావో న సిద్ధ్యతి ॥ 417

భిన్నాధికరణః = వ్యధికరణమైన సమాసముగూడ, వచనాత్ = సమాసవిధాయక వచన బలమువలన, అనుగమ్యతే యది = అంగీకరింపబడుననిన, 'మృగీవచపలా' = 'మృగీఇవ చపలా' అను విగ్రహముగల, ఇత్యత్ర = 'మృగచపలా' అను సమాసమునందు, పుంవద్భావః = సమానాధికరణము పరమైనపుడు రాదగిన, న సిద్ధ్యతి = పుంవద్భావము సిద్ధింపదు

తాత్పర్య వివరణములు— తాత్పర్యము స్పష్టముగాన వివరణ మపేక్షితము గాదు. ॥417॥

అవతారిక— పూర్వోత్తరపదములు సమానాధికరణములయినపుడు, పూర్వపదమగు స్త్రీవాచకమునకు పుంవద్భావము వచ్చును. ఉదాహరణము - మహతీచ సానవమీచ = మహానవమీ. మృగచపలా అనుచోట నది సిద్ధింపదు. ఏలయన, మృగీశబ్ద ముపమానమును,

చపలాశబ్ద ముపమేయమును బోధించిన, ఆ పదములు సమానాధికరణము లెట్లగును? అని శంక - ఈ శంకకు పరిహారమిట మహాభాష్యమున జెప్పలేదుగాని, ప్రదేశాంతరమున గలదు. అయ్యది ఒక పక్షమున చెల్లునది. ఎట్లనగా—

శ్లో॥ అస్త్రీపూర్వపదత్వాత్తు పుంవద్భావో భవిష్యతి ।
యథైవ మృగదుగ్ధాదౌ న చేత్ స్త్ర్యర్థో వివక్ష్యతే ॥ 418

అస్త్రీపూర్వపదత్వాత్ తు = స్త్రీలింగముకానిది పూర్వపదమగుటవలన, మృగదుగ్ధాదౌ యథా ఏవ = 'మృగదుగ్ధం' మున్నగు సమాసములం దెటులనో, తథా స్త్ర్యర్థః = అటుల, స్త్రీరూపమగు అర్థము, న వివక్ష్యతే చేత్ = ప్రత్యేకముగ వివక్షింపబడనిచో, పుంవద్భావః = పుంవద్భావము = పుంవాచక మాదేశమగుట, భవిష్యతి = సిద్ధింపగలదు.

తాత్పర్య వివరణములు— ''మృగక్షీరమును దెమ్ము'' అందురు. అపుడు ఇంకొక జాతిక్షీరము తేవలదు అని తాత్పర్యము. అది జాత్యంతర నివృత్తిపరమైన చోదన. మృగక్షీరమనిన మృగిక్షీరమే. క్షీరములుండునది మృగికేగదా. మృగ్యాః క్షీరం = మృగక్షీరం - అని విగ్రహముచెప్పి, పూర్వపదమునకు పుంవద్భావమును, ''కుక్కుట్యాదీనామండాదిషు'' అని వార్తికకారుడు విధించియున్నాడు. కాని పూర్వపదమచట స్త్రీవాచకము కానేకాదు కనుక పుంవద్భావముతో బనిలేదని - ''నవా అస్త్రీపూర్వపద వివక్షితత్వాత్'' - అని, విధాయక వార్తికము ఖండింపబడినది.

'మృగచపలా' అను స్థలమున, మృగజాతి చాపలమే వివక్షితము. మృగ ఇవ చపలా అనియే విగ్రహము. స్త్రీత్వము వివక్షితము కాదు అని భావము.

అట్లు కాదు స్త్రీచాపలమును స్త్రీచాపలముతోనే పోల్చవలెను అని విశేషాభిప్రాయమైన, పుంవద్భావ మావశ్యకమే యగును. కావున నిది పాక్షిక సమాధానము. ॥418॥

అవతారిక— అనంతరము, ''ఏవం తర్హి తస్యామేవోభయం వర్తతే'' = అటులైన, ఆ దేవదత్తయందే శస్త్రీపదమును, శ్యామా పదమును గూడ వర్తించును' - అని నిర్దోష పక్షముపపాదితము.

శ్లో॥ శస్త్రీవ శస్త్రీశ్యామేతి దేవదత్తైవ కథ్యతే ।
తస్యామేవోభయం తస్మాదుచ్యతే శాస్త్రవిగ్రహే ॥ 419

శస్త్రీ ఇవశస్త్రీ ఇతి=చురకత్తివంటిదిగాన శస్త్రీఅనియు, శ్యామా ఇతి=నల్లగానున్నదిగానశ్యామ అనియు, దేవదత్తా ఏవ = 'దేవదత్త' అను నామెయే, కథ్యతే=చెప్పబడుచున్నది, తస్మాత్, శాస్త్రవిగ్రహే=అందువలన, శాస్త్రీయవాక్యమునందు, తస్యామేవ=ఆమెయందే, ఉభయం ఇతి ఉచ్యతే = ఉపమాన, గుణవచన పదములు రెండును వర్తించునని చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— సామాన్య ధర్మవాచకమైన శ్యామాది శబ్దము ఉప

మానమును బోధించినపుడు, ఉపమేయ బోధకము సమాసపదము మొత్తము. ఇయ్యది సమాసపదమునకు సంబంధించినంతవరకు. ఇక విగ్రహవాక్యమునందు వర్తిపదములే = అనగా సమాస ఘటకపదములే ఉపమేయమును చెప్పునవి కావలెను. దేవదత్తకును శస్త్రికిని సాదృశ్యమునుబట్టి అభేదము ఆరోపింపబడునుగాన నది దేవదత్తను బోధించును. శ్యామా పదమును ఉపమేయమునే బోధించునుగదా. కావున, సామానాధికరణ్యము కుదురును. పుంవద్భావమును సిద్ధించును. ప్రకరణమునకును బాధలేదు. శస్త్రీ శబ్దము 'దేవదత్త'ను బోధించుట ఉపమాన సంబంధమును తన కడుపులోనుంచుకొనియే.

శబ్దము, పరార్థమున ప్రయోగింపబడుచున్నదనిన, ఇవార్థమున కంతర్భావము తప్పదు. 'సింహోమాణవకః' 'పిల్లవాడు సింహమండీ' - అనిన సింహమువంటివాడని యర్థము. ఇదంతయు ప్రక్రియావాక్య విషయము. వాక్యావస్థలో సామానాధికరణ్యమును సమర్థించుటకు చెప్పబడినది.

ఇక లోకప్రత్యయమగు సమాసపదమునం దంశములు లేవుగాన నీ యుపన్యాస మనావశ్యకము. పదములందు వర్ణములను విభజించుట అసత్యమైనట్లు వాక్యమునందు అనగా నిచ్చట సమాసపదమునందు, అవయవవిభాగము లేనేలేదు. శస్త్రీ శబ్దముగాని దాని యర్థము గాని ఉండినగదా ఆరోపితార్థమని చెప్పుట కవకాశము? అని భావము. ॥419॥

అవతారిక — ఈ పక్షమే భాష్యమున సిద్ధాంతపక్షముగా స్థాపింపబడినది.

"ఏతచ్చాత్రయుక్తం యత్తస్యామేవోభయంవర్తేత।
ఇతరథాబహ్వపేక్ష్యం స్యాత్"

అని అచట భాష్యము. ఆ విషయ మీ కారికలో వ్యాఖ్యానింపబడుచున్నది.

శ్లో॥ పుంవద్భావస్య సిద్ధ్యర్థం పక్షే స్త్రీప్రత్యయస్య చ।
బహ్వపేక్ష్య మత స్తస్యాముభయ ప్రతిపాదనమ్ ॥ 420

పుంవద్భావస్య=పుంవదతిదేశమునకును, పక్షే స్త్రీప్రత్యయస్య చ=వికల్పముగ స్త్రీప్రత్యయ మగు ఙీషునకును, సిద్ధ్యర్థమ్ = సిద్ధికొరకై, బహు, అపేక్ష్యమ్ = అధిక మనేకము, కావలసి యుండును, అతః, తస్యాం = అందువలన, ఆ ఉపమేయమునందు, ఉభయ ప్రతిపాదనమ్= ఉపమానవచన ఉపమేయవచనముల కుపపాదనము కర్తవ్యము.

తాత్పర్య వివరణములు— శ్యామా శబ్దమున కుపమేయ మర్థమను పక్షమునందు, శస్త్రీ శబ్దముతో సామానాధికరణ్యము సిద్ధింపదు. కాగా సమాసము రాదు. వచన బలమువలన నది సిద్ధించినను, మృగచపలా అను స్థలమున పుంవద్భావసిద్ధికొరకు, అస్త్రీ పూర్వపద వివక్షా నియమము, వెనుక చెప్పినది కావలసి వచ్చును. మృగక్షీరా మున్నగు ప్రయోగములందువలె, మృగచపలా అనుచో గూడ సామాన్య వివక్షయేగాని, మృగస్త్రీవివక్ష లేదనియు జెప్పవలసి యుండును. ఇదంతయు అపేక్ష్యము కావలసివచ్చును దానివలన నర్థమును గ్రహించుట సులభము గాదు.

శ్యామా శబ్దము గూడ ఉపమానమగు శస్త్రినే చెప్పుననిన, 'శస్త్రీ శ్యామో దేవదత్తః' అనుచోట, ''గోస్త్రియోరుపసర్జనస్య'' – అని హ్రస్వము సిద్ధించునుగాని, 'తిత్తిరి కల్మాషీ' – అనుచో జీష్ప్రత్యయము లభింపదు. అందుకై – 'కల్మాష శబ్దముగాదిట వర్ణ వాచకము. తిత్తిరి కల్మాష' అను సముదాయము తద్వాచకము, అని చెప్పవలసి యుండును.

లేదా – 'అప్రధానత్వమను లౌకికోపసర్జనము గ్రహింపబడదు గాన కల్మాష శబ్దము ప్రధానమే. తదంత విధిచేత జీషు సిద్ధించును – అని చెప్పవలెను. అపుడు స్వరవిషయమున దోషము.

ఈ విధముగ నీ రెండు పక్షములందును బహ్వర్థాపేక్ష కలదు. కావున శస్త్రీ శబ్దమును శ్యామా శబ్దమును గూడ ఉపమేయ అగు దేవదత్తనే చెప్పుననుట యుక్తము. కాగా, పైన ప్రతిపాదించిన విషయములనన్నిటిని పరిశీలింపగా, 'శస్త్రీశ్యామా' – అను నుపమాన సమాసమువలన కలుగు శాబ్ద జ్ఞాన మిట్లుండును.

ఎట్లు ? – 'ఉపమేయమును పరిచ్ఛిదించు, శ్యామయగు శస్త్రియు, పరిచ్ఛేదింపబడు శ్యామయగు దేవదత్తయు, అభిన్నములు' – శాబ్దజ్ఞానమనినను శాబ్దబోధయనినను నొక్కటియే.

శస్త్రీ సాదృశ్యమువలన దేవదత్తకు తదభేదమని భావము. ॥420॥

అవతారిక— తదుపరి భాష్యగ్రంథము – ''యదితావదేవం విగ్రహః కరిష్యతే'', 'శస్త్రీవ శ్యామా దేవదత్తేతి', శస్త్ర్యాం శ్యామేత్యేతదపేక్ష్యం స్యాత్ । అథాప్యేవం విగ్రహః కరిష్యతే, ''యథా శస్త్రీ శ్యామా తద్వదియం దేవదత్తేతి, ఏవమపి దేవదత్తాయాం శ్యామా ఇత్యేతదపేక్ష్యం స్యాత్'' – అని యున్నది.

''శస్త్రీ ఇవ శ్యామా దేవదత్తా'' అని విగ్రహవాక్యమును వర్ణించిన, దేవదత్త నల్లనిదని యర్థమైనను, శస్త్రి నలుపని సిద్ధింపలేదు. కనుక శ్యామా అను పదమును అచ్చట కూడ అపేక్షింపవలసి యుండును. 'యథా శస్త్రీ శ్యామా తథా దేవదత్తా' – అని విగ్రహించిన, దేవదత్త నల్లనిదని తెలుపుటకు శ్యామాపదము నచ్చట అపేక్షింపవలసియుండును – అని ఈ విధముగ బహ్వపేక్ష వర్ణింపబడినది. సమాసమునకు పూర్వ ముపమేయమును బోధించు కల్మాష శబ్దమునకు, ఇష్టస్త్రీప్రత్యయము సిద్ధింపవచ్చును. ఉపమేయలింగమును సిద్ధించును. కావున బహ్వపేక్ష యీ విధముగ వ్యాఖ్యానింపబడిన దీ కారికలో.

శ్లో॥ శ్యామాశస్త్రీ యథా శ్యామాశస్త్రీ కల్పేతిచోచ్యతే ।
తత్రోపమానేతరయోః శ్యామేత్యేతదపేక్ష్యతే ॥ 421

శ్యామా శస్త్రీ యథా = చురకత్తివలె నల్లనైనది = శస్త్రీవ శ్యామా, శ్యామా శస్త్రీకల్పా = నల్లని చురకత్తివంటిది = శ్యామా శస్త్రీవ, ఇతి చ ఉచ్యతే = అనియు విగ్రహము చెప్పబడుచున్నది. తత్ర = అందు = ఆ విగ్రహ వాక్యములలో, ఉపమానేతరయోః = ఉపమానమునందును, ఉపమేయమునందును, శ్యామా ఇతి ఏతత్ అపేక్ష్యతే = 'నల్లని' అను నీ సామాన్య ధర్మసంబంధము కోరబడును.

తాత్పర్య వివరణములు— 'చరకత్తివలె నల్లనిది దేవదత్త' అని విగ్రహము చెప్పినపుడు, శ్యామా శబ్దము దేవదత్తనే చెప్పును. శస్త్రీ శబ్దము కత్తిని మాత్రమే చెప్పును. వాని ఔపమ్యనిమిత్తము నలుపేగాని వేరొకరంగు కాదు అని తెలుపుటకు శ్యామాపద సంబంధాపేక్ష తప్పదు. ఆ పద మొకచోట శ్రుతమైన రెండవచోట ననుమానింపబడవలెను. అట్లు కానిచో ఉపమానోపమేయభావమే కుదురదు. శస్త్రీశబ్దము శస్త్రిని బోధించినట్లు శ్యామా శబ్దమును శస్త్రినే చెప్పిన, దేవదత్తకు శ్యామ గుణసంబంధ మపేక్షితమగును. ఇదియే బహ్వపేక్ష యని కొందరి మతము. ॥421॥

అవతారిక— ఏమండీ ! 'బహ్వపేక్ష్యం స్యాత్' అని తరచుగా ననుచున్నారే. బహ్వపేక్ష యేమున్నది ? లోకప్రసిద్ధమగు నర్థమున కనుగుణముగ విగ్రహవాక్యమును కల్పించవలెను. కావున, ఉపమానమునందును నుపమేయమునందును గూడ శ్యామాపద సంబంధ మావశ్యకము. వాక్యమున నట్లే ప్రయోగింపబడుచున్నది. లేదా ప్రయోగింపవలెను. ఇక సమాసవృత్తిలో, రెండవ శ్యామా శబ్ద మంతర్భూతమయి యుండునుగాన దానికి ప్రయోగమక్కరలేదు. కాబట్టి బహ్వపేక్ష ఏమిగలదు ? అనిన చెప్పుచున్నారు.

శ్లో॥ అథశ్యామేవ శస్త్రీయం శ్యామేత్యేవం ప్రయుజ్యతే ।
శస్త్రీయథేయం శ్యామేతి తావదేవ ప్రతీయతే ॥ 422

అథ = ఇక, శ్యామాశస్త్రీ ఇవ ఇయం శ్యామా = నల్లని చరకత్తివలె ఈ దేవదత్త నల్లనిది, ఇతి ఏవం ప్రయుజ్యతే యది = అని ఇట్ల ప్రయోగించినను, 'శస్త్రీ ఇవ ఇయం శ్యామా' = కత్తివలె నీమె నల్లనిది, ఇతి ప్రయోగే యావత్ =అను ప్రయోగమునం దెంతయర్థమో, తావత్ ఏవ = అంత యర్థమే. ప్రతీయతే = ప్రతీయమానమగుచున్నది.

తాత్పర్య వివరణములు— 'నల్లని కత్తివలె ఈ దేవదత్త నల్లనిది' - అని ఇట్లు, ఉపమేయముతోడను ఉపమానముతోడను గూడ 'నల్లని' అను పదములు ప్రయోగించినపుడును, 'కత్తివలె నీమె నల్లనిది' - అని ఒక పర్యాయమె శ్యామ శబ్దమును ప్రయోగించినపుడు ఎంత యర్థము తోచునో అంతయే యర్థమగును. ॥422॥

అవతారిక— ఎందువల్లననగా—

శ్లో॥ ఉపలక్షణమాత్రార్థా గుణస్యాస్య యది శ్రుతిః ।
పృథక్ ద్వయోః శ్రుతోఽప్యేష నేష్టస్యార్థస్య వాచకః ॥ 423

అస్య, గుణస్య శ్రుతిః = ఈ గుణవాచక శబ్ద శ్రవణము, ఉపలక్షణమాత్రార్థా యది భవతి= ఉపలక్షించుటకొరకు మాత్రమే అయిన, తదా = అపుడు, ఏషః పృథక్ = ఈ గుణశబ్దము, వేరుగా, ద్వయోః శ్రుతః అపి = ఉపమానోపమేయములందు వినబడినను, ఇష్టస్య అర్థస్య= కావలసిన, అర్థమునకు, వాచకః న భవతి = బోధకము, కాదు.

తాత్పర్య వివరణములు— గుణవాచక శబ్దమును ప్రయోగించుట ఎందులకు? అది వస్తువును విశేషించుటకా? లేక ఉపలక్షించుటకు మాత్రమేనా? ఉపలక్షణ మాత్రార్థమైన, దాని నుభయత్ర ప్రయోగించినను, అభీష్టమయిన ఔపమ్య ప్రతిపాదనము జరుగదు. ఏలయన— శ్యామగుణోపలక్షితమైన చురకత్తి, గుణాంతరముచే ఉపలక్షింపబడిన దేవదత్తను గూడ పరిచ్ఛేదింపవచ్చును అని యర్థమగును. అపుడు రెండుసార్లు ప్రయోగించినను ఔపమ్యము సాదృశ్యమువలననని యవగతము కాదు. ॥423॥

అవతారిక— సామాన్య ధర్మవాచకమును ప్రయోగించుట, ఉపమేయముయొక్క రూపవిశేషమును, 'ఇదమిద్ధమ'ని బోధించుటకేగాని ఉపలక్షించుటకు మాత్రము గాదు అనిన, అపుడు—

శ్లో॥ ఉపమేయం తు యద్వాచ్యం తస్యచేత్ ప్రతిపాదనే ।
సవ్యాపారాగుణాస్తత్ర సర్వస్యోక్తిః సకృత్ శ్రుతౌ ॥ 424

ఉపమేయం = పోల్పవలసినది = పరిచ్ఛేద్యము అగు, యత్ వాచ్యం = ఏ అభిధేయము కలదో, తస్య ప్రతిపాదనేతు=దాని, స్వరూపజ్ఞాపనమునందైతే, గుణాః సవ్యాపారాః చేత్= శ్యామ మున్నగు గుణవాచకములు పనిచేసినచో, తత్ర, సకృత్, శ్రుతౌ = అచట, గుణమున కొక పర్యాయమే శ్రవణమున్నను, సర్వస్య, ఉక్తిః భవతి = అంతకును, ఉపమానమునకును గుణ ప్రతిపాదనము సిద్ధించును.

తాత్పర్య వివరణములు— ఉపమానోపమేయములకు సాదృశ్యమునుబట్టి సంబంధమును నియమించుటకు గదా గుణవాచకమును గ్రహించుట. అది వానిలో దేని సమీపమున నుచ్చరింపబడినను, సామర్థ్యమువలన, సర్వత్ర ఆ గుణసంబంధమును బోధించవలెను. కనుక బహ్వాపేక్ష. కాబట్టి, ఉపమానపదమును, గుణవచనమును, ఉపమేయమునే బోధించునను పక్షము భాష్యమున సిద్ధాంతితము. ॥424॥

అవతారిక— ప్రకృత సందర్భమున మహాభాష్యమునందు, ఆక్షేప సమాధాన కార్తికములు రెండు గలవు. అందు—

''ఉపమానసమాసే గుణవచనస్య విశేషభాక్త్వాత్, - సామాన్యవచనా ప్రసిద్ధిః'' అనునది ఆక్షేప వార్తికము.

''ఉపమానాని సామాన్యవచనైః'' అను సూత్రముచే విధింపబడిన సమాస ముపమాన సమాసము. శస్త్రీశ్యామా మున్నగునది. ఇందు గుణవచనము శ్యామా శబ్దము. అది శస్త్రీ శబ్దముతో సంబంధించియున్నదిగాన విశేషవచనమగునుగాని సామాన్యవచన మెట్లగును? అని ఆక్షేపము. శస్త్రీగతమగు శ్యామత్వమును బోధించునది, ఆశ్రయాంతరగత గుణమును బోధింపజాలదు. కాగా సామాన్యవచనము కాదని భావము. ఈ విషయమును ప్రతిపాదించునది ఈ కారిక.

ఆశ్రయభేదముచే భిన్నమగుటవలన, ఉపమితి క్రియ కుపయోగింపబడదు' అని వెనుక చెప్పబడినది.

కాని అది తన ఆధారముల సూక్ష్మవిశేషముల ప్రతిఫలనముచేత, అవాంతర వ్యాప్యజాతి రూపమై ఉపమితి క్రియ కుపకరించును. "రూపాత్, సామాన్యవాచిత్వమ్" అని కారికలో నున్నది. అనగా ఉపమానోపమేయము లందలి గుణములకు రూపములో సాదృశ్య ముండుటవలన వాని నొక్కటిగా దీసికొని ఔపమ్య ప్రత్యాయనమును చేయుటచేత శ్యామాది శబ్దము సామాన్యవచనమగుట. గుణమును జెప్పు శబ్దము, అభేదారోపమువలన ద్రవ్యబోధక మును అగును. అందువలననే కారికలో "ద్రవ్యయోః" అనుట.

"ఇక ప్రాక్ వృత్తేః" - అను కారికా భాగ వివరణము - అన్ని శబ్దములును, వేరొక శబ్దముతో సంబంధించినపుడు విశేషవచనములే. అందువలన 'సామాన్యవచనైః' అను పదమునకు, అభిసంబంధమునకు బూర్వము సామాన్యవచన మర్థమని భాష్యము. అభిసంబంధ మనగా సమాసము. అభిముఖములై, అనగా పరస్పర మిశ్రితములయి పదార్థము లిందు సంబద్ధములై యుండునుగాన నిది అభిసంబంధము. ఇక నందు పదార్థ విభాగముండదుగదా. సమాసమునకు ముందు విగ్రహవాక్యమునగల సామాన్య బోధకతనుబట్టి సామాన్యవచన మనుట. వృత్తి, సంసృష్టార్థము. వాక్యము, అసంసృష్టార్థము. ఇట్లు విభిన్నములయినను రూప సామాన్యమువలన వాక్యధర్మములచేత, వృత్తిపదము అన్వాఖ్యానము చేయబడుచున్నది.

శ్యామాది పదములు సమాసమునం దుపమేయ సంబద్ధములు. కాని వాక్యమునం దట్టి అవరోధము లేదు. కనుక సామాన్యవచనములు. లేదా, భూతపూర్వగతిచే సామాన్య వచనములు. సామాన్యమును ఇపుడు కాకున్న, పూర్వము చెప్పియున్నదియు సామాన్యవచన మనుట. శస్త్రీ శబ్దమును అంతియే. అది వృత్తిలో, ఉపమేయబోధకము. భూత పూర్వగతిచేత నుపమానివాచి ఈ విధముగ సామాన్యవచనత్వము ఉపపన్నము ॥426, 427॥

అవతారిక— "ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్య ప్రయోగే" (2-1-56) - అను సూత్రము, ఉపమేయవాచకమునకు ఉపమానవాచకములగు 'వ్యాఘ్ర', 'సింహ', 'సోమ' - మున్నగువానితో సమాసము ప్రవర్తించుననియు, సాధారణ ధర్మవాచక శబ్దమున కా వాక్యమునందు ప్రయోగమున్నయెడల ప్రవర్తింపదనియు విధించుచున్నది. ఉదాహరణ ములు, పురుషవ్యాఘ్రః, 'పురుష సింహః' 'నృసోమః' - మున్నగునవి. "పురుషః వ్యాఘ్ర ఇవశూరః" అను వాక్యమునందు పురుషవ్యాఘ్ర శబ్దములకు సమాసము కలుగదు. సామాన్య ధర్మమగు శౌర్యమును జెప్పు శూరపదమందు ప్రయుక్తముగదా.

ఈ సూత్రము సమానాధికరణాధికారమునందు విధింపబడినది. సమసించు పూర్వో త్తర పదములు ఏకాధికరణములు కావతెను. అందొకటి ఉపమానవాచకమును వేరొకటి ఉప మేయ బోధకమును అయినపుడు వ్యధికరణములగును గాన సమాసమునకు, పురుషో వ్యాఘ్ర ఇవ శ్యూర్ధః అనుచో ప్రాప్తియే లేదే అని ప్రశ్న. అట్లైన పురుషవ్యాఘ్రః అను నుదాహరణ

మున నెట్లు సమాసము ప్రవర్తించినది ? అనియు ప్రతి ప్రశ్న కలుగును. ఈ విషయమును యథాభాష్యముగ విచారించిన కారికలు అయిదు. అందు మొదటిది—

శ్లో॥ వ్యాఘ్రశబ్దోయథాశౌర్యాత్ పురుషార్థేఽవతిష్ఠతే ।
తదాధికరణాభేదాత్ సమాసస్యాస్తి సంభవః ॥ 428

వ్యాఘ్రశబ్దః=వ్యాఘ్ర అను శబ్దము, శౌర్యాత్ = శూరత్వమను సాధారణ ధర్మమును తనలో నుంచుకొని, పురుషార్థే = అభేదారోపమువలన ఉపమేయమునందు, యదా = ఎపుడు, అవతిష్ఠతే = ఉండునో, తదా = అపుడు, అధికరణాభేదాత్ = అభిధేయభేదము లేనందున, సమాసస్య = సమానాధికరణాధికార విహిత సమాసమునకు, సంభవః అస్తి = సంభవముండును

తాత్పర్య వివరణములు— వ్యాఘ్రమునకును పురుషునకు సమానమగు ధర్మము శూరత్వము. దానిని బుచ్చుకొని ఆ ఉపమానోపమేయముల కభేదము. కావున సామానాధికరణ్యమునకు లోపము లేదు. సమాసము, ప్రవర్తించును ॥428॥

అవతారిక— సమాన ధర్మవాచకమును వాక్యమున ప్రయోగించిన యెడల—

శ్లో॥ శూరశబ్దప్రయోగే తు వ్యాఘ్రశబ్దో మృగే స్థితః ।
భిన్నేఽధికరణే వృత్తేస్తత్ర నైవాస్తి సంభవః ॥ 429

శూరశబ్ద ప్రయోగేతు = 'శూరః' అను శబ్ద మా వాక్యమున ప్రయోగించిన, వ్యాఘ్ర శబ్దః = అపుడు 'వ్యాఘ్రః' - అను శబ్దము, మృగే = 'మృగజాతీయము' అను స్వార్థమునందే, స్థితః భవతి = వర్తించునదగును, పురుషుని బోధింపదు, భిన్నే అధికరణే = ఉపమేయము కంటె భిన్నమయిన దానియందు, వృత్తేః = వర్తించుటవలన, తత్ర = అచ్చట, సంభవః = సమాసము కలుగుట కవకాశము, న, ఏవ, అస్తి = ఉండనే ఉండదు.

తాత్పర్య వివరణములు— ఉపమేయమునందలి సామాన్యధర్మమగు శౌర్యమును స్వశబ్దమే అనగా 'శూరః' అను శబ్దమే చెప్పుచున్నది ఇక వ్యాఘ్ర శబ్దము 'పులి' అను మృగజాతీయార్థమునే బోధించును ఉపమేయమును బోధింపదు. ఆ వాక్యమునందలి 'ఇవ' అనునది పురుషునకును వ్యాఘ్రమునకు గల ఉపమానోపమేయత్వమను భేద సంబంధమునే ద్యోతన చేయునుగాని యభేదమును చెప్పదు. కాగా సామానాధికరణ్యమే వానికి లేదాయె. సమానాధికరణ ప్రకరణమునందు విహితమయిన సమాసమునకు ప్రాప్తియే లేదు. ఇట్లుండగా నిక 'సామాన్యాప్రయోగే' - అను ప్రతిషేధ మెందులకు ? అని భావము. ॥429॥

అవతారిక— ఈ కారిక ప్రతిషేధావశ్యకతను సమర్థించుచున్నది.

శ్లో॥ సామానాధికరణ్యేఽపి గుణభేదస్య సంభవాత్ ।
ప్రయోగశ్శూరశబ్దస్య సమాసేఽప్యనుషజ్యతే ॥ 430

సామానాధికరణ్యే సత్యపి = సామాన్యధర్మము నంతర్భవింపచేసికొని వ్యాఘ్ర శబ్దము పురుషుని చెప్పినపుడును, గుణభేదస్య = గుణమునకు భేదము, సంభవాత్ = సంభవింపవచ్చును గాన, శూరశబ్దస్య = 'శూరః' అను శబ్దమునకు, ప్రయోగః = ప్రయోగము, సమాసే అపి = సమాసమునందు గూడ, అనుషజ్యతే = ప్రసక్తమగుచున్నది.

తాత్పర్య వివరణములు— ఆ సమాన ధర్మము శూరత్వమే అని నియతముగ నిరూపించుటకు శూర శబ్ద ప్రయోగ మావశ్యకమే యగును. ఉపమానోపమేయములకు సామానాధికరణ్యము నుపపాదించుటకు అభేదాధ్యారోపము కావలెను. దానికి హేతువు సమానధర్మమగు నొక నియతగుణముండవలసి యున్నది. అంతర్భూతమగు గుణము శూరత్వమేయని చెప్పుటకు వీలులేదు. అది హింస్రత్వము కావచ్చును, లేదా బలవత్త్వము కానగును. ఇట్లు వ్యాఘ్రమునందు గుణభేదము సంభవముగాన నియమమునకై శూర శబ్దమును ప్రయోగింతురు. అపుడును ప్రాప్తమగుచున్న సమాసమును వాదించుటకు ప్రతిషేధ మావశ్యకమనుట ॥430॥

అవతారిక— ఓయీ ! 'సింహః' 'వ్యాఘ్రః' మున్నగు శబ్దములు పూజను దెలియజేయునవి 'శ్వా', 'కాకః' - మున్నగునవి గర్హను దెలుపునవియని యందురు గదా ! 'పురుషవ్యాఘ్రః' అనినను, 'పురుషసింహః' - అనినను నట పూజాద్యోతకమగు గుణము శౌర్యమే అగును. వేరొకటి కానేకాదు. అట్టి యెడల అనియతగుణమునకు ప్రసంగమే లేదే - అనిన—

శ్లో॥ పూజోపాధిశ్చ యో దృష్టః కుత్సనోపాధయశ్చ యే ॥
తేషాం భిన్ననిమిత్తత్వాన్నియమార్థా పునః శ్రుతిః ॥ 431

యః = ఏ, పురుష, వ్యాఘ్ర మొదలగు, పూజోపాధిః = పూజకు ద్యోతకమయిన శబ్దము, దృష్టః = వాక్యమున జూడబడునో అదియు, యేచ = ఏవియు, కుత్సనోపాధయః చ = నిందకు స్ఫోరకములయిన శబ్దములు, దృష్టాః = చూపబడుచున్నవియో, తేషాం = అపి, భిన్ననిమిత్తత్వాత్ = వేరు వేరు కారణముగలవియగునుగాన, పునః శ్రుతిః = శూర మున్నగు శబ్దముల ప్రయోగము, నియమార్థా భవతి = నియమమునకై ఆవశ్యకమగును.

తాత్పర్య వివరణములు— పూజను ప్రతిపాదించునవిగా ఏ గుణములు ఉపమానమున నంతర్భూతములయి యుండునందురో ఆ గుణములు, ప్రకరణభేదముచే భిన్న భిన్నములయి యుండునుగాన నియతముగ గ్రహింపబడవు. అందువలన గుణవాచకమునకు ప్రయోగము తప్పదు. ఎట్లనిన జూడుడు. 'అభిమనాయతే' 'సుమనాయతే' 'దుర్మనాయతే' - అని క్యఙ్ ప్రత్యయాంత ధాతురూపములు కలవుగదా. అట, 'మనాయ'-అనునది క్యఙంతధాతువు 'సు, దుర్, అభి' - అనునవి ఉపసర్గ సమానాకారములయిన పూర్వపదములు. వాని యర్థముల నంతర్భవింపజేసికొనియే ప్రత్యయము ప్రవర్తించినది. అయినను విశేషాభివ్యక్తికొరకు వాని ప్రయోగ మనివార్యము.

'పురుషకాకః' - అను సమాసము నిందా ప్రతిపాదనపరము. నిందకు కారణములు, వానికిగల అశుచిభక్షణము, స్థిరముగ నొకచోట నుండకుండుట మున్నగునవి యనేకము లుండును. కావున నియతగుణ ప్రతిపాదనమునకు సామాన్య ధర్మవాచకమునకు ప్రయోగము తప్పనిది. కనుక నిషేధ మావశ్యకము. కాని అపు డుపమేయము సాపేక్షమగును గాన సమాసము ప్రాప్తింపదే. నిషేధ మెందులకు ? అనిన నది యపుడు జ్ఞాపకార్థము. ॥481॥

అవతారిక— వైయధికరణ్యమువలన = సమానాధికరణత్వము లేనందున సామాన్య ధర్మవాచక ప్రయోగమునందు సమాసప్రాప్తి లేదనినను, సాపేక్షత్వమువలన నది ప్రాప్తింపదనినను, 'సామాన్యాప్రయోగే' అనునది వ్యర్థమయి జ్ఞాపకమగుననుచున్నారు.

శ్లో॥ అసంభవేఽపి వా వృత్తేః స్యాదేతల్లింగ దర్శనమ్ ।
అచ్వేరితి యథాలింగమభావేఽపి భృశాదిషు ॥ 432

వృత్తేః = సమాసవృత్తికి, అసంభవేఽపివా = సంభవములేకున్నను, ఏతత్ = ఈ ''సామాన్య ప్రయోగే'' అనునది, లింగదర్శనమ్ = జ్ఞాపక ప్రదర్శనము, స్యాత్ = అగును, యథా = ఎట్లు, అభావేఽపి = చ్విప్రత్యయాంతమున క్యఙ్ప్రత్యయప్రాప్తి లేకున్నను, భృశాదిషు = భృశ - మున్నగువాని విషయమున, అచ్వేరితి = సూత్రమునందలి 'అచ్వేః' - అను పదము, లింగమ్ భవతి = అభూత తద్భావమునకు జ్ఞాపకమగునో అట్లు.

తాత్పర్య వివరణములు— అన్యాపేక్షగలది అసమర్థము, అంతియ కాదు వ్యధికరణమయినదియు నసమర్థమే అట్టి అసామర్థ్యమున్నపుడు సమాసము ప్రవర్తింపదు. అయినను సామానాధికరణ్యము నూహించి, సమాస వారణమునకై చేయబడిన సామాన్యాప్రయోగే అనునది వ్యర్థము. కనుక నది జ్ఞాపకము.

ఏ విషయమునకు జ్ఞాపకమనిన— 'ప్రధానము సాపేక్షమయినను, అసమర్థము కాదు' - అను విషయమున కది జ్ఞాపకము. ప్రధానమయినది స్వతంత్రమయినది గనుక దానికి అనేక విశేషణముల యపేక్ష ఉండవచ్చును. అప్రధానమట్లు కాదు. అదియొక దానితో సంబద్ధమయినపుడిక వేరొకదానితో సంబంధింపదు. అట్లు సంబంధించినది అప్రధానమే కాదు ప్రధానమయినది తన కుపకారకములగు నెన్నింటితోనయినను నొక్కసారిగ సంబంధింపవచ్చును. అయ్యది దాని ప్రాధాన్యమునకు పోషకమే యగును. కావున న్యాయసిద్ధమగు నర్థమునకే ఇది జ్ఞాపకమని యర్థము. ఈ విధమగు జ్ఞాపకమునకు నిదర్శనము గలదు. ''భృశాదిభ్యో భువ్యచ్వేర్లోపశ్చహలః'' (3-1-12) అను సూత్రమొకటి గలదు. అది భృశ మున్నగు శబ్దములకంటె పరముగా, 'భవతి' అను నర్థమున క్యఙ్ప్రత్యయమును విధించుచున్నది. 'భృశాయతే' అని యుదాహరణము. భృశాదులు చ్విప్రత్యయాంతములయినపు డది రాకుండుటకు 'అచ్వేః' - అను నిషేధ మందు గలదు. చ్విప్రత్యయాంతమయిన, 'భవతి' అను నర్థ ముక్తమే యగును గాన నిక ప్రత్యయప్రాప్తియే లేదుగదా. కాని సంభావననుబట్టి ఆ నిషేధము చేయబడినది. అది చ్విప్రత్యయార్థమయిన, అభూతతద్భావముననే క్యఙ్ వచ్చునని జ్ఞాపకము చేయును. అనగా 'అభృశః' భృశః భవతి.

"తేనతుల్యం క్రియాచేద్వతిః" అను సూత్రమున విచారము

అవతారిక—ఉపమాన ప్రసంగవశమున ప్రసక్తమగు విచారాంతరము చేయబడును.

శ్లో॥ వత్యన్తావయవే వాక్యే యదౌపమ్యం ప్రతీయతే ।
తత్ప్రత్యయవిధౌ సూత్రే నిర్దేశోఽయం విచార్యతే ॥ 433

వత్యన్తావయవే = వతి ప్రత్యయాంత శబ్ద మవయవముగాగల, వాక్యే = "బ్రాహ్మణవదధీతే" మున్నగు వాక్యమునందు, యత్ = ఏ, ఔపమ్యం = ఉపమానోపమేయభావ సంబంధము, ప్రతీయతే = అవగతమగుచున్నదో, తత్ప్రత్యయవిధౌ = ఆ ఔప్యమునకు ప్రతిపాదకమగు ప్రత్యయమును విధించిన, సూత్రే = "తేన తుల్యం" ఇత్యాది (5-1-115) సూత్రమునగల, అయం = "తేనతుల్యం క్రియాచేత్" - అనునీ, నిర్దేశః = వాక్యవిన్యాసము, విచార్యతే = పరీక్షింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— 'బ్రాహ్మణునివలె నధ్యయనము చేయుచున్నాడు' 'క్షత్రియునివలె యుద్ధమును చేయుచున్నాడు'. 'వైశ్యునివలె సంపాదన చేయుచున్నాడు' = "బ్రాహ్మణవత్ అధీతే" "క్షత్రియవత్ యుధ్యతే" "వైశ్యవత్ ఆర్జయతి" - ఈ వాక్యములందు వత్యంతపదములు అవయవములు. ఇందు, ఉపమానోపమేయ భావము గోచరమగుచున్నవి. బ్రాహ్మణునివలె క్షత్రియు డధ్యయనము చేయుచున్నాడనిన. అధ్యయనమట సమాన ధర్మము అది ఉపమేయవాచకమునకు సన్నిహితముగ, వినబడుచున్నది. కాని యది అర్థతః ఉపమానగతమును నగును. ఔపమ్యమునకు ప్రతిపాదకమగునది తత్ అను 'వతి' ప్రత్యయము. దానిని విధించిన సూత్రము "తేనతుల్యం క్రియాచేద్వతిః" (5-1-115) అను సూత్రము. సూత్రమునందలి 'క్రియా' అనునది, ప్రకృత్యర్థమునకు విశేషణముగా నిర్దేశింపబడినదా ? ప్రత్యయార్థమా ? అని విచారము. అందేది న్యాయ్యము ? ఎట్లయిన లక్ష్యవ్యవస్థలో భేదము లేకుండును ? అను విషయమును నిర్ణయింపవలెనుగాన నీ విచారము ప్రసక్తము. అచట భాష్య మిట్లున్నది. "ఇదమయుక్తం వర్తతే । కిమత్రాయుక్తమ్ ? యత్ తృతీయాసమర్థం క్రియా చేత్సా భవతీత్యుచ్యతే । కథం చ తృతీయాసమర్థం నామ క్రియా స్యాత్" - అని. "క్రియా" అనునది తృతీయా సమర్థమునకు విశేషణమని యంగీకరించి చేసిన యా క్షేపమిది. భాష్యకారుని యాశయమేమి ? అని విచారము. ॥433॥

అవతారిక— ఆక్షేప తాత్పర్య మీ కారికలో వివరింపబడుచున్నది.

శ్లో॥ క్రియేత్యుపాధిః ప్రాథమ్యాత్ ప్రకృత్యర్థస్య యద్యపి ।
న ప్రాతిపదికం తత్ర క్రియావాచ్యుపపద్యతే ॥ 434

క్రియాఇత్యుపాధిః = సూత్రమునందలి "క్రియా" అను విశేషణము, యద్యపి = ఆలోచింపగా, ప్రాథమ్యాత్ = మొదట నుండుటవలన, ప్రకృత్యర్థస్య = వతి ప్రత్యయ ప్రకృతియగు 'బ్రాహ్మణ' మున్నగుదానికి, భవతి = సంబంధించదగియున్నది, పరంతు = కాని,

తత్ర = అచ్చట, ప్రాతిపదికం = ప్రాతిపదికము, క్రియావాచి = క్రియను జెప్పునదియగుట, న ఉపపద్యతే = ఉపపన్నముగాదు.

తాత్పర్య వివరణములు— 'తృతీయాసమర్థము క్రియ అయినచో' అనుచున్నారు. కాని ఇది అయుక్తము. అది క్రియ ఎట్లగును? అనిగదా యాక్షేపము. 'సమర్థః పద విధిః (2-1-1) అను సూత్ర ప్రకారము పదసంబంధి విధులన్నియు సమర్థాశ్రితములై యుండ వలె. వతిప్రత్యయ విధియు నట్టిది. సామర్థ్యమనగా ప్రకృత్యర్థమునకు ప్రత్యయార్థ వ్యపేక్ష. ప్రకృత్యర్థ ముపమానము. ప్రత్యయార్థ ముపమేయము. 'తేన' అనుటచే ప్రకృతివాచకము కంటె బరముగానున్న తృతీయ సమర్థ విభక్తి. తృతీయా సమర్థమనగా 'బ్రాహ్మణేన' మున్నగునది. 'తేన' అనునది సూత్రమున ముందుగా నుండుటవలనను. క్రమమును దప్పింప పనిలేదు గావునను, దానికే క్రియా అనునది విశేషణమగునని, స్థాన ప్రమాణమువలన నిర్ణేయ మగుచున్నది. అపుడు, తృతీయా సమర్థము క్రియ యయినచో నని చెప్పబడకున్నను నది న్యాయప్రాప్తమగుటచే చెప్పినట్లే. అందువలన, 'ఉచ్యతే' అని భాష్యములో చెప్పబడినది.

తృతీయావిభక్తి, ద్రవ్యవాచియగు ప్రాతిపదికముకంటె విధింపబడును. అది క్రియావాచి గాదు. సాధింపబడునది క్రియ. అయ్యది తిఙంతపద గోచరమగునది. కావున అసంభవమువలన తృతీయా సమర్థమునకు 'క్రియా' అనునది సంబంధింపదని తాత్పర్యము. తృతీయాంతమగు సమర్థ విభక్త్యంతము తృతీయా సమర్థము.

ప్రకృతమైన యర్థమును బోధించుటకు తగిన తృతీయావిభక్తి అంతమందు గలిగిన పదము తృతీయాసమర్థము విగ్రహవాక్యమున 'బ్రాహ్మణేనతుల్యమ్' అని యున్నది. ఇందు 'బ్రాహ్మణేన' అనునది తృతీయా సమర్థము. ॥434॥

అవతారిక— పోనిండు. విశేషణముగా జెప్పబడుట వ్యర్థము కాకుండుటకు తద్బలమువలన, తృతీయాసమర్థము క్రియావాచియగునందుమా యనిన—

శ్లో॥ సత్త్వవృత్తస్య శేషే వా తృతీయా సాధనేఽపివా ।
తిఙా మ సత్త్వవాచిత్వాదుభయం తన్నవిద్యతే ॥ 435

సత్త్వవృత్తస్య = ద్రవ్యమునందు వర్తించిన ప్రాతిపదికమునకు, శేషేవా = శేషసంబంధము నందుగాని, సాధనేఽపివా = క్రియాకారక సంబంధమునందుగాని, తృతీయాభవతి = తృతీయా విభక్తి ప్రత్యయము వచ్చును, తిఙామ్ = తిఙంతములు, అసత్త్వవాచిత్వాత్ = ద్రవ్యమును బోధించునవి కావుగాన, ఉభయం తత్ = శేషసంబద్ధ నిమిత్త విభక్తిగాని సాధన విభక్తిగాని, న విద్యతే = ఉండదు.

తాత్పర్య వివరణములు— సత్త్వమనగా ద్రవ్యము. 'సీదన్తి అస్మిన్ జాతిగుణ క్రియాః' అని వ్యుత్పత్తి. జాతికిని, గుణములకును, క్రియలకును ఆశ్రయమయినది అని యర్థము. అసత్త్వము, విభక్త్యర్థమునకు జేయు నుపకారమునుబట్టి దానికి వాచకమగు విభక్తి

నాశ్రయించును. ఉపకారమనగా నది క్రియాకారక సంబంధమును. తన్మూలకమగు శేష సంబంధమును గూడ నగును. ఎట్లనగా = అధ్యయనేన వసతి = చదువు కారణముగా నుంటున్నాడు. 'దధ్నా జడః' = పెరుగుత్రాగుట మూలముగ మందుడు. 'తపసా కృశః'=తపస్సు చేత కృశించియున్నాడు. ''ధనేన కులమ్'' = ధన నిమిత్తముగా నేర్పడిన కులము. ఈ స్థలములందు హేతు హేతుమద్భావము శేష సంబంధము. ''దాత్రేణ లునాతి'' = కొడవలితో గోయుచున్నాడు. 'పరశునా ఛినత్తి' = గొడ్డలితో నఱకుచున్నాడు - మున్నగుచోట్ల క్రియా కారక సంబంధమే తృతీయార్థము. ఈ రెండు సంబంధములును క్రియావాచకములగు తిఙంతములకు సంభవింపవు. క్రియకు సాధ్యమగుట స్వభావము. ద్రవ్యమునకు సిద్ధత స్వభావము. కాగా క్రియావాచులు తృతీయా సమర్థములు కావు.

అయిన నొక ప్రశ్న గలదు. అసత్త్వవాచకమునకు కరణార్థమున తృతీయ ''కరణేచస్తో కాల్పకృచ్ఛ్రకతిపయస్యాసత్త్వవచనస్య'' (2-3-33) అను సూత్రముచే, 'స్తోకేనముక్తః' మున్నగుచోట విధింపబడినదిగదా. కాగా ద్రవ్యభిన్నమయినదియు కరణము కావచ్చునే యనిన నట నది అల్పత్వరూప ధర్మమాత్రవచనము. ధర్మము ద్రవ్యమువంటిదే. క్రియ సాధ్యముగాని సిద్ధముగాదు. ॥435॥

అవతారిక— 'పాకః', 'యాగః' - మున్నగు భావఘఞంతములగు క్రియావాచకములు తృతీయా సమర్థములు కానగుననిన—

శ్లో॥ పాకాదయ స్తృతీయాన్తాః సత్త్వధర్మ సమన్వయాత్ ।
న క్రియేత్యపదిశ్య న్తే కృత్వోఽర్థ ప్రత్యయే యథా ॥ 436

తృతీయాన్తాః = తృతీయావిభక్త్యంతములగు, పాకాదయః='పాక' మున్నగునవి, సత్త్వధర్మ సమన్వయాత్ = ద్రవ్య ధర్మమగు సిద్ధత్వము కలవగుటవలన, క్రియా ఇతి = క్రియా వచనములని, కృత్వోఽర్థ ప్రత్యయే యథా = 'కృత్వసుచ్' మున్నగు ప్రత్యయముల విషయమునందువలె, న అపదిశ్యన్తే = వ్యవహరింపబడవు.

తాత్పర్య వివరణములు— సిద్ధావస్థలోనున్న ధాత్వర్థమును జెప్పునవి 'ఘఞ్' మున్నగునవి. క్రియ=సాధ్యావస్థలో నుండు ధాత్వర్థము. కనుక ఘఞంతాదులు క్రియాభిధాయులని వ్యవహరింపబడవు. కనుకనే వానికి లింగసంఖ్య లున్నవి. కృదంతములచే అభిహితమయిన భావము ద్రవ్యమువలె భాసించునందురు = ''కృదభిహితో భావో ద్రవ్యవత్ ప్రకాశతే'' సిద్ధతగూడ క్రియాధర్మమే. అందువలన 'ద్రవ్యమువలె' ననుట. అది సాధ్యముగాదు గనుక క్రియ కాకున్నను, భూతపూర్వ క్రియా సంబంధమువలన 'తద్ధర్మమ'ను వ్యవహారము మాత్రమే. అందువలననే ఘఞాద్యంతములగు పాకః మున్నగు శబ్దములతో నన్వయించు కృత్వసుజాద్యంత శబ్దములకు ప్రయోగములుండవు. 'పంచకృత్వః పచతి' అనునట్లు 'పంచ కృత్వః పాకః' అను ప్రయోగ ముపపన్నము గాదు. ''సంఖ్యాయాః క్రియాభ్యావృత్తి గణనే కృత్వసుచ్'' (5-4-17) అని సూత్రము. క్రియకు అభ్యావృత్తియనగా మరల మరల

ప్రవృత్తి. అది సాధ్యమగు క్రియకే సంభవించును. ఘఞాది ప్రత్యయాంతములతో నన్వయించు కృత్వసుజాది ప్రత్యయాంత శబ్దముల ప్రయోగములు లేనందున. 'పాకః'-మున్నగునవి క్రియావచనములు కావని నిశ్చితమయినట్లే. అంతటను వానికి క్రియావాచితా వ్యవహారము లేకుండుట న్యాయప్రాప్తము ॥436॥

అవతారిక— 'తుమున్' అను ప్రత్యయము స్వార్థమునందు విధింపబడినది. స్వార్థమనగా ధాత్వర్థము = క్రియ. తుమున్నంతము కృదంతముగాన ప్రాతిపదికము. క్రియావాచి. కనుకనే ''పంచకృత్వః గన్తుమ్'' అని తద్యోగమున 'కృత్వసుచ్' ప్రత్యయ మగపడుచున్నది. ఆ విధముగనే 'ద్విః భుక్త్వా' = రెండు పర్యాయములు భుజించి - మున్నగు ప్రయోగములందును కృత్వోర్థ ప్రత్యయ మగుపడుటవలన క్త్వా ప్రత్యయాదులును సాధ్య క్రియా వచనములు గలవుగదా యనిన—

శ్లో॥ యేచావ్యయ కృతః కేచిత్ క్రియాధర్మ సమన్వితాః ।
తేషామసత్త్వవాచిత్వం తిఙన్తైర్న విశిష్యతే ॥ 437

యే చ = ఏయవి, కేచిత్ = కొన్ని, అవ్యయకృతః = అవ్యయసంజ్ఞా ప్రయోజక కృదంతములు, క్రియాధర్మ సమన్వితాః = క్రియాధర్మమగు సాధ్యత్వముతో గూడినవి, సన్తి = కలవో, తేషాం = వానికి, అసత్త్వవాచిత్వం = ద్రవ్యార్థవాచులు కాకుండుట, తిఙన్తైః = తిఙంత శబ్దములతో, న విశిష్యతే = భేదింపదు, (అనగా తత్తుల్యమే యనుట).

తాత్పర్య వివరణములు— తుమున్నంతములు, క్త్వాంతములును అవ్యయములు. కావున వాని నవ్యయకృత్తులందురు. అవి సాధ్యస్వభావ క్రియాధర్మములు కలవి. ఆఖ్యాత తుల్యములే. తిఙంత పదములకు తృతీయా ప్రత్యయములు లేనట్లు వానికిని నవి యుండవు. కావున నవి తృతీయా సమర్థములు కావు. ప్రాతిపదికార్థమున ప్రథమా విభక్తి ప్రత్యయములు వానికిని రావచ్చును. ॥437॥

అవతారిక— పోనిండు. కృత్యప్రత్యయ వాచ్యమగు క్రియ క్రియాంతరమునకు సాధనమగును. కావున 'శయితవ్య' మున్నగునవి, తృతీయాంతములు సంభవించవచ్చునుగదా యనిన—

శ్లో॥ కృత్వసుజ్విషయా యాపి శయితవ్యాదిషు క్రియా ।
ఉపమానోపమేయత్వం తత్రాత్యన్తమసంభవి ॥ 438

యా అపి = ఏ యదియు, కృత్వ సుజ్విషయా = కృత్వ సుజంతము లన్వయించు, శయితవ్యాదిషు = 'శయితవ్య' మున్నగువాని యందలి, క్రియా = క్రియ గలదో, తత్ర = అందు, ఉపమానోపమేయత్వం = ఉపమానోపమేయ భావము, అత్యంతం = ఎంతమాత్రమును, అసంభవి = సంభవింపనిది.

తాత్పర్య వివరణములు— ''పంచకృత్వః శయితవ్యమ్'' = అయిదుసార్లు శయనింపదగి యుండుట - అని యనుట గలదు. అందువలన శయితవ్యాదులందు క్రియ సాధ్య స్వభావమే. కాని ఆ విషయమున నుపమానోపమేయ భావమునకు సంభవము లేదు ''శయితవ్యేన తుల్యః దేవదత్తః'' = నిద్రింపదగుటతో దేవదత్తుడు సమానుడు - అని యిట్లు వ్యవహారములు లేవుగదా. కాబట్టి శయితవ్యవంటి క్రియావాచి తృతీయాంతములు వతిప్రత్యయమునకు ప్రకృతులనుట సమ్మతము గాదు.

ఇచట ధాతువే సాధ్యావస్థలోని క్రియను దెలియజేయునది గదా. తదతిరిక్తమగు ప్రత్యయవాచ్య క్రియ యింక నేది గలదు ? ''తయోరేవ కృత్యక్తఖలర్థాః'' (3-4-70) అను సూత్రముచే భావకర్మార్థములందే కృత్య ప్రత్యయములు విహితములు గదా కావున నిట భావమనగా ధాతువాచ్యమగు భావనయే. అదియే క్రియ యనియు వ్యవహరింపబడును గదా యని శంక కలుగును - దానికిట్లు సమాధానము.

కృదంత స్థలములందు, ధాతువు, వర్తమానమయిన భావ్యత్వముగల క్రియను బోధింపదు. అనగా ప్రస్తుతము జరుగుచున్న దానిగా జెప్పదు. వేరొక యవస్థలో జరిగిన దానినే చెప్పును. ఆ క్రియ, తత్సాధనమైన కారకమునకు అవచ్ఛేదకము. కారకము ప్రత్యయార్థము. తత్సంబంధమువలన క్రియకు భావ్యత వ్యజ్యమానము - 'పచతి దేవదత్తః' = 'దేవదత్తుడు వంట చేయుచున్నాడు ; అందుము ఇట లకారార్థము కర్త వాని సంబంధమువలన ధాత్వర్థమగు వర్తమాన పచిక్రియ భావ్యము అట్లే 'పాచకః' అను కృదంత స్థలములందును గమనీయము. 'ఆస్యతే దేవదత్తేన' = దేవదత్తుడు ఉండుట. ఇట లకారార్థము భావన. తత్సంబంధము వలన ధాత్వర్థమునకును భావ్యత. కాగా, ప్రకృతి వాచ్యమగు భావము వేరు. లకార వాచ్యము వేరు. కృత్య ప్రత్యయాంతములందును, క్త్వాప్రత్యయాంతములందును, ప్రత్యయార్థమగు భావము వేరు. అది బాహ్యము. ॥438॥

అవతారిక— ఉపమానోపమేయ భావము, 'శయితవ్య' మున్నగు కృత్య ప్రత్యయాంత వాచ్య క్రియతో నత్యంతమసంభావితమంటిరే ? ఎందువలన—

> శ్లో॥ న కేవలౌ ద్రవ్యగుణౌ తద్వాన్వాప్యుపమీయతే ।
> శయితవ్యాదిభిస్తేషు నోపమార్థోఽస్తికశ్చన ॥ 439

శయితవ్యాదిభిః = 'శయితవ్య' మున్నగు పదములకు వాచ్యములగు క్రియలతో, కేవలౌద్రవ్యగుణౌ = కేవల ద్రవ్యముగాని కేవల గుణముగాని, తద్వాన్ వా అపి = లేదా ద్రవ్యవత్తుగాని గుణవత్తుగాని, న ఉపమీయతే = పోల్చబడదు; తేషు = వానిలో, ఉపమార్థః=సాదృశ్య నిమిత్తమైన అన్వయి ధర్మము, కశ్చన = ఏదియు, న అస్తి = లేదు.

తాత్పర్య వివరణములు— 'శయితవ్యమ్' - అనగా శయన క్రియ. తత్తుల్యుడు దేవదత్తుడు అని వివక్షించి, ''శయతవ్యేన తుల్యో దేవదత్తః'' అని ఎవరును ప్రయోగింపరు.

ద్రవ్యమునకును క్రియకును నుపమానోపమేయ భావము అసంభవి. అటులనే 'శయితవ్యేన తుల్యం స్థౌల్యమ్' అని గుణమును క్రియతో పోల్పము. ద్రవ్యమున కాశ్రయమగునదియు క్రియతో బోల్పబడదు. 'శయితవ్య తుల్యము దేవదత్తుని స్వత్వము' - అను వ్యవహారమున లేదు. 'శయితవ్య తుల్యుడు స్థూలుడు' - అని గుణికిని క్రియకును నౌపమ్యము ఎచ్చటను లేదు. సాదృశ్య హేతువగు ధర్మము లేకుండుటయే కారణము. ప్రసిద్ధమయిన గుణమో క్రియయో ఉపమానోపమేయ భావమునకు నిమిత్తము, చంద్రునకును ముఖమునకునువలె నేదేని యుండవలెను గదా. పై వ్యవహారములలో నట్టి ప్రసిద్ధి లేదు ॥439॥

అవతారిక— క్రియకును ద్రవ్యగుణములకును సమానధర్మము లేకపోలేదు. కాని అది వాక్యమునందు ప్రయోగింపబడదు. అందువలన నుపమానోపమేయభావ ప్రతీతి కలుగ లేదు, అని యందురేని అది యుక్తము గాదు. ఔపమ్యమున కుపపత్తియే లేదుగదా.

శ్లో॥ ఉపమానోపమేయత్వే ద్రవ్యేచానుక్త ధర్మిణి ।
నిమిత్తత్వేన గమ్యన్తే రూఢయోగాః క్రియాగుణాః ॥ 440

అనుక్త ధర్మిణి = అభిహితము కాని సదృశ ధర్మముగల, ద్రవ్యే చ = ద్రవ్యమునందును, ఉపమానోపమేయత్వే = ఉపమానోపమేయ భావమునందు, రూఢయోగాః = నిరూఢమయిన సంబంధము గల, క్రియాగుణాః = క్రియలును గుణ్యములును, నిమిత్తత్వేన = ఉపమానోపమేయ భావమునకు నిమిత్తముగా, గమ్యన్తే = ప్రతీయమానము లగును.

తాత్పర్య వివరణములు— సాదృశ్య ప్రయోజకమగు ధర్మము, వాక్యమున చెప్పబడకపోయినను, ప్రసిద్ధివలన, పదార్థమునం దేకదేశములా ఇవి యనునట్లు అవినా భూతములయి క్రియానిమిత్తకములును గుణనిమిత్తకములునునగు సంబంధము లుపమానోపమేయములకు ప్రతీతములగును. ముఖము చంద్రుని బోలియున్నదనిన, కాంతిమంతమని చెప్పనక్కఱలేదు. ఆ ఉపమానోపమేయభావము ప్రసిద్ధము. ''శయితవ్యముతో తుల్యము'' అనిన నట్లేదియు ప్రతీయమానమగుట లేదు. ఎందువలన? ఆ ఔపమ్యమనుపపన్నము గనుక. అనుట. ॥440॥

అవతారిక — పోనిండు. క్రియతో క్రియావత్తు పోల్పబడనగునే యనిన—

శ్లో॥ హోతవ్య సదృశో హోతేత్యత్రా ప్యర్థోన విద్యతే ।
విరోధాత్ క్రియయాతస్మాత్ క్రియావాన్నోపమీయతే ॥ 441

హోతవ్య సదృశః హోతా = హోమ క్రియాతుల్యుడు హోత, ఇత్యత్రాపి = అనుచో గూడ, అర్థః = ఉపమా ప్రయోజనము, న విద్యతే = లేదు, కుతః? = ఎందువలన ననగా, విరోధాత్ = విరోధముండుట వలన, తస్మాత్ = ఆ హేతువులన, క్రియయా = క్రియతో, క్రియావాన్ = ఆ క్రియ కాశ్రయ భూతమగునది, న ఉపమీయతే = పోల్పబడదు.

తాత్పర్య వివరణములు— "శయితవ్యేన తుల్యః శాయకః = పండుకొనుటతో దుల్యుడు పండుకొనువాడు.

"హోతవ్యేన తుల్యః హోతా" = హోమసమానుడు హోత - అని యిట్లు కృత్య ప్రత్యయాంత క్రియావాచకముతో క్రియాశ్రయుని బోల్చుట యుక్తము గాదు. క్రియకు స్వభావము సాధనీయత = చేయదగిన పనియై యుండుట. క్రియావంతము సిద్ధ స్వభావము ఇట్లు పరస్పర విరుద్ధములగుటవలన వానికి సమాన ధర్మయోగము సంభవింపదు. అత్యంత భిన్నములగు క్రియా ద్రవ్యములకు ఔపమ్యము నుపపాదించుట ప్రయోజన విరహితము.॥441

అవతారిక— అట్లయిన రెండు క్రియల కుపమానోపమేయభావ ముండునాయనిన—

శ్లో॥ క్రియా సమానజాతీయా తద్భావాన్నోపమీయతే ।
జాతిభేదేఽపి పాకేనభిన్నాః పాకాదయః క్రియాః ॥ 442

సమాన జాతీయా క్రియా = సమానమగు జాతికి చెందిన క్రియ, తద్భావాత్ = తత్త్వము వలన = ఐక్యమువలన ననుట. న ఉపమీయతే = ఒకదానితో నొకటి ఉపమింపబడదు, జాతిభేదే సత్యపి = జాతిభేద మున్నపుడును, భిన్నాః = భిన్న భిన్నములగు, పాకాదయః = పాకక్రియ మున్నగు, క్రియాః = క్రియలు, పాకేన = పాక క్రియతో నొక పాకక్రియగా, న ఉపమీయన్తే = ఉపమింపబడవు

తాత్పర్య వివరణములు— ఒకేజాతికిచెందిన క్రియ లయినచో నందొకటి వేరొక దాని కుపమానము గాదు. అపుడు వానికి ఐక్యమే అయె. ఔపమ్యమునకు భేదమును నభేద మును నావశ్యకములు. "శయితవ్యేన తుల్యం శయితవ్యమ్" = పండుకొనదగుటతో తుల్యము పండుకొనదగుట - అధ్యేతవ్యేన తుల్య మధ్యేతవ్యమ్" = అధ్యయన క్రియతో సమానమైనది అధ్యయన క్రియ - అని యిట్లౌపమ్యము నుపపాదించుట కేమి యర్థము? అత్యంతాభేద మున్నపుడు, 'గోవువంటిది గోవు' అని యనరుగదా! భాష్యకారుడు - 'యది యదేవోపమానం తదేవోపమేయం క ఇహ ఉపమార్థో గౌరివ గారితి' - అని చెప్పినది ఈ అభిప్రాయముతోడనే. భిన్నములైన పదార్థములయినను నేకజాతీయములగుట వలన, జాతిభేద నిమిత్తకమయిన ఉపమానోపమేయభావము వానికి ఘటింపదని భావము.

ఆ విధముగనే అత్యంతభేదముగల పదార్థములకును నయ్యది నిష్ప్రయోజనము. "వక్తవ్యేన తుల్యం పఠితవ్యమ్" = చెప్పబడుట, చదువబడుట తుల్యములు - అని వ్యవహ రింపరు. సమానధర్మమున కట సంభవముండదు. "అథాన్యదుపమాన మన్యదుపమేయం క ఇవోపమార్థో గౌరివాశ్వ ఇతి" - అని భాష్యము. ఉపమానోపమేయము లత్యంతభిన్నములయిన గోవువంటి దశ్వమనుటలో నర్థమేమి? "ఉపమానోపమేయత్వం తత్రాత్యంత మసంభవి" - అని 438 వ కారికలో చెప్పబడినది.

ఒక క్రియతో ద్రవ్యగుణాదులకు, వానియందుగల సత్త్వము. జ్ఞేయత్వము,

మున్నగు ధర్మములను బుచ్చుకొని సాదృశ్యముండునుగాన ఔపమ్యము సంభవింపవచ్చును గదా యనవచ్చును. కాని ఆ ధర్మములు సర్వార్థ సాధారణములు. కావున నవి యుపమా నిమిత్తములు కాజాలవు. సత్త్వమనగా వస్తుత్వము. జ్ఞేయత్వమనగా జ్ఞానములో విషయమగుట సకల వస్తువులందును నా ధర్మము లుండును అవి సాదృశ్యమును వచించుటకు ప్రయోజక ములు కావు" - అని పూర్వపక్ష భాష్య తాత్పర్యము. ॥442॥

అవతారిక— 'శయితవ్యమ్' మున్నగు పదములందలి సజాతీయ క్రియలకు ఎట్లో భేదమును గల్పించి ఉపమానోపమేయభావము నుపపాదించుటయు గలదు. ఎట్లన-

శ్లో॥ ఆధారభేదాద్భిన్నానా ముపమానస్య సంభవః ।
అధ్యేతవ్యేన విప్రాణాం తుల్య మధ్యయనం విశామ్ ॥ 443

ఆధారభేదాత్ = ఆశ్రయమగు ద్రవ్యముయొక్క భేదమువలన. భిన్నాయాం = భేదముగలది యగు సజాతీయ క్రియ విషయమున, ఉపమానస్య = ఉపమానోపమేయ భావమునకు, సంభవః భవతి = సంభవము కలుగును - (ఎట్లనగా), విప్రాణామ్ = బ్రాహ్మణుల, అధ్యే తవ్యేన = అధ్యయసముతో, విశామ్ = వైశ్యుల, అధ్యయనం = అధ్యయనము, తుల్యమ్ = సమానము (అని చెప్పవచ్చును).

తాత్పర్య వివరణములు— క్రియలు సమాన జాతీయములయినను, వాని కాశ్రయ ములు వేరు వేరయినపుడు వానినిబట్టి భేదమును, జాతి అనుగతమై యుండుటచే సామ్యమును నుండును కావున భేదాభేదములున్నప్పుడు సంభవించు ఉపమానోపమేయభావ ముపపాద్యము ఎట్లనగా - "బ్రాహ్మణానామధ్యేతవ్యేన సదృశమిదం క్షత్రియాదీనా మధ్యయనమ్" = 'బ్రాహ్మణుల యధ్యయనముతో నీ క్షత్రియాదుల యధ్యయనము తుల్యము' 'రాజ్ఞః శయిత వ్యేన తుల్యం దేవదత్తస్య శయితవ్యమ్' 'రాజుగారి శయనముతో దేవదత్తుని శయన క్రియ సమానము' - ఇత్యాది ప్రయోగములు దృష్టములు. అధ్యయన శయన క్రియలకు, బ్రాహ్మ ణులు, క్షత్రియులు అను నాశ్రయములవలనను, రాజు, దేవదత్తుడును అను ఆశ్రయముల భేదమువలన భేద ముపపాదితము. కావున నుపమానోపమేయభావము సంగతము. ॥443॥

అవతారిక— ఓయీ ! భేద ప్రతిపత్తికొరకు, క్రియావాచక శబ్దము, ఆశ్రయము నపేక్షించుచున్నదని తేలినదిగదా ! అపుడది సాపేక్షమగుటచే అసమర్థమగును. అసమర్థమైన తద్ధితవృత్తి ప్రాప్తింపదేయనిన-

శ్లో॥ అర్థాత్ ప్రకరణాద్వాపి యత్రాపేక్ష్యం ప్రతీయతే ।
సామర్థ్యాదనపేక్షస్య తస్య వృత్తిః ప్రసజ్యతే ॥ 444

యత్ర = ఏ విషయమునందు, అర్థాత్ = సామర్థ్యమువలన గాని, ప్రకరణాద్వా అపి = ప్రకరణమువలన నయినగాని, అపేక్ష్యమ్ = అపేక్షింపవలసినది, ప్రతీయతే = ప్రతీతి

గోచరమగునో, తత్ర = ఆ విషయమునందు, అనపేక్షస్య = సాపేక్షముగాని, సామర్థ్యాత్ = దానికి, వృత్తిః = ఏకార్థీభావమను సామర్థ్యమువలన గలుగు తద్ధిత వృత్తి, ప్రసజ్యతే = ప్రసక్తమేయగును.

తాత్పర్య వివరణములు—— ''అధ్యేతవ్యేన సదృశమధ్యేతవ్యమ్'' అనియే చెప్పినను, ఆ అధ్యయనమున కాశ్రయభూతులగు బ్రాహ్మణ క్షత్రియాదులకు సామర్థ్యమువలన ప్రతీతి కలుగును. లేదా ప్రకరణమువలన నది సిద్ధింపవచ్చును. అపుడు సాపేక్షత వేరుగాన తద్ధితవృత్తియగు వతిప్రత్యయాంత ప్రయోగము సంభవించును.

మరియు - 'బ్రాహ్మణానాం' అనియు, 'క్షత్రియాణాం' - అనియు వ్యస్తపదములుగా గాక 'బ్రాహ్మణాధ్యేతవ్యేన తుల్యం క్షత్రియాధ్యేతవ్యమ్' - ''రాజశయితవ్య సదృశమ్, దేవదత్త శయితవ్యమ్'' అని సమాసముచేసి ప్రయోగించిన, ఏకార్థీభావమువలన నిక సాపేక్షత యుండదు. ఆ విధముగనే - ''స్థాతవ్యేన తుల్యం గమనం, మందత్వాత్'' = మందముగ నుండుటవలన నీ నడక నిలుకడతో తుల్యముగ నున్నది. ''నృత్తేన తుల్యం గమనం బహువికారత్వాత్'' = చాల వికారములు గలదై యుండుటవలన నడక నాట్యమువలె నున్నది - అను వ్యవహారములలో, భిన్న జాతీయములగు స్థాన గమన క్రియలకును, నృత్త గమన క్రియలకును నుపమానోపమేయభావ మగపడుచున్నది.

కృత్ప్రత్యయములచే అభిహితమయిన భావము ద్రవ్యమువలె భాసించునని చెప్పబడినది. అంతియకాదు. అది క్రియవలెగూడ భాసించును. ''తుమున్ణ్వులౌ క్రియాయాం క్రియార్థాయామ్'' (3-3-10) అని సూత్రము. ఒక క్రియ కింకొక క్రియ ప్రయోజనమయి, తద్వాచక క్రియాపదము సమీపమున నుచ్చరింపబడినపుడు తుమున్, ణ్వుల్ అను ప్రత్యయములు భవిష్యదర్థమున, ధాతువునకు బరముగానగునని యర్థము. కృష్ణం ద్రష్టుం యాతి. 'కృష్ణం దర్శకోయాతి' - అని యుదాహరణములు. 'భోక్తుం పాకః' = భుజించుటకు పాకము అనియు, 'భోక్తుం పచతి' - అని తిఙంత ముపపదముగ నున్నప్పుడువలె, తుమున్ ప్రత్యయ ప్రయోగము కలదు. అట్లే 'బోద్ధుం పాఠః', 'కారకస్య గతిః' అనియు ప్రయోగములు దృష్టములు. ఇట 'పాకః పాఠః గతిః' - అను కృద్వృత్తులచే అభిహితమయిన భావము క్రియవలె భాసించిననే, వానికి ఉపపత్తి.

ఇట క్రియకు వాచకములు, ధాతు భాగమును, ప్రత్యయభాగమును గూడ నగుచున్నవి గదా. కాగా ధాతువాచ్య క్రియ నాశ్రయించియే తుమునాదులు ప్రవర్తించుననరాదా యనిన నట్లన గాదు. క్రియార్థమయిన క్రియ అనగా భోజనార్థమయిన పాక క్రియ గదా. ఆ పాకము, సిద్ధమయినదే భోజనార్థమగును కావున ప్రత్యయవాచ్య క్రియయే తుమునాదులన్వయించుటకు యోగ్యము.

అటులైన, ''భోక్తుం పాకః'' అనునట్లు, ''పంచకృత్వః పాకః'' - అయిదు పర్యాయములుగా పాకము - అని యిట్లు ఏల ప్రయోగింపరాదు? అనిన - క్రియయొక్క

అభ్యావృత్తి గణనమున 'కృత్వ సుచ్' ప్రత్యయము విధింపబడినదిగదా. అభ్యావృత్తి యనగా మరల మరల ప్రవృత్తి. అయ్యది కర్తవ్యమాపమగు క్రియలేగాని సిద్ధమయిన దానికి సంభవింపదు. అందు తిఙన్తశబ్దము ప్రయోగింపబడిన, క్రియ కర్తవ్యరూపమని దెలియనుగాన నా ప్రత్యయము సంభవించినను నవిలేనిచో రాదు "పంచకృత్వః పాకో భవతి" అనుడు. అది న్యాయ్యమగు ప్రయోగమగును. భవతి అను తిఙంతమచట సాధ్యస్వభావమగు క్రియను బోధించునుగాన దానికి అభ్యావృత్తి సంభవము

సరి. 'ఓదనస్య పాకః' అనుచో సమన్వయమెట్లు? ప్రత్యయార్థమగు సిద్ధతకు సాధనమగు ఓదనముతో సంబంధ ముపపన్నము గాదుగదా? సాధ్యస్వభావమగు క్రియ అయిననే దానికి కారక సంబంధము కలుగును. అనిన - సత్యమే యనుకొనుడు. కాని ప్రత్యయార్థమునకు అచట అప్రధానమయిన ధాత్వర్థము ద్వారా కారకసంబంధ ముపపాద్యము. అభ్యావృత్తితో సంబంధమును గూడ నా విధముగ నేల యుపపాదింప రాదందురేమో? వినుడు. ప్రధానమయి దానికి ఇతరార్థములతో సంబంధము, స్వస్వభావమునకు విరుద్ధమయిన ధర్మము ద్వారమున గలుగదు. ఘఞర్థమగు క్రియయొక్క సిద్ధతకు అభ్యావృత్తి విరుద్ధమయినది. సిద్ధమయిన, మరల మరల ప్రవృత్తి యెట్లు కలుగును? సాధనములతో = కారకములతో సంబంధము అప్రధాన ద్వారమున, విరోధము లేనందున గలుగవచ్చును అని తాత్పర్యము. ॥444॥

అవతారిక— ఈ విధముగ ఘఞ్ మున్నగు కృదంతముల సంబంధ మున్నపుడును క్రియాశ్రయములగు తుమున్ప్రత్యయాది కార్యములు అగపడుచుండుటవలన తద్వాచ్య క్రియ తృతీయాంత పదవాచ్యము ఉపమానముగా సంభవించును. "తైల పాకవత్ ఘృత పాకః = నూనె వంట వంటిది నేతివంట - అను నీ మున్నగు ప్రయోగములును వతిప్రత్యయాంతములు గలవు. తైల పాక ఘృతపాక పదములు సమస్త పదములుగాన సాపేక్షత్వము లేదు. సామర్థ్యము నిర్బాధము. కృదభిహితమగు భావమునకు ద్రవ్యావాచకమునకువలె లింగ సంఖ్యా సంబంధమును నుపపన్నమే యనుచున్నారు.

శ్లో॥ తైలపాకేన తుల్యే చ ఘృతపాకే వివక్షితే।
క్రియావదపి కార్యాణాం దర్శనాత్ప్రత్యయో భవేత్ ॥ 445

తైలపాకేన = నూనెవంటతో, తుల్యే = సమానమైనదిగా, ఘృతపాకే = నేతివంట, వివక్షితే చ = వివక్షితమైనపుడును, క్రియావత్ = ద్రవ్యమువలెనే గాక క్రియవలె గూడ ఘఞంతమున, కార్యాణాం = తుమున్ మున్నగు కార్యములు, దర్శనాదపి = అగపడుటవలనను, ప్రత్యయః వతి ప్రత్యయము, భవేత్ = వచ్చును.

తాత్పర్య వివరణములు— తాత్పర్యము సుగమము. ॥445॥

అవతారిక— ఘఞాద్యంతభావ ప్రత్యయాంతము లుపపదములై యున్నపుడు

తుమున్, ణ్వుల్, మున్నగు కార్యములు క్రియాయోగమునందువలె ప్రవర్తించునను విషయము నకు వార్తికమతమును సంవాదకము.

శ్లో॥ అతిజ్గ్రహణమేవం తు సమాసస్య నివర్తకమ్ ।
గమనం కారకస్యేతి ణ్వుల్యన్యస్మిన్న సంభవేత్ ॥ 446

ఏవమ్ = ఈ ప్రకారము, 'కారకస్య గమనమ్' = 'కారకస్య' 'గమనమ్', ఇతి = అను పద ములకు, సమాసస్య = ఉపపద సమాసమునకు, నివర్తకం = ప్రతిషేధకము, అతిజ్ గ్రహణం భవతి = "ఉపపదమతిఙ్" (2-2-19) అను సూత్రమునందలి అతిఙ్ అనునది యగు, తత్ = అది, అన్యస్మిన్, ణ్వులి = వేరొక ణ్వుల్ప్రత్యయమైన, న సంభవేత్ = సంభవింపదు.

తాత్పర్య వివరణము— 'ఉపపదమతిఙ్' (2-2-19) అను సూత్రము ఉపపద మునకు సమాసమును విధించునది. ఉపపదమనగా ప్రత్యయవిధాయక సూత్రములందు సప్త మ్యంత పదముచే చెప్పబడినది "కుంభకారః" అను సమాస ముదాహరణము. 'కర్మణ్యణ్' అను సూత్రము అణ్ప్రత్యయ విధాయకము. అందు సప్తమ్యంతపదము 'కర్మణి' అనునది ఆ కర్మను బోధించుపదము కుంభపదము. దానికి 'కార' అను కృదంతముతో సమాసము. 'అతిఙ్' అనునది సమాస నిషేధకము. తిఙన్త ముపపద సమాస ఘటకము కారాదని తాత్ప ర్యము. 'కారకః వ్రజతి' - అను వాక్యమున కారకః అను పదము ణ్వుల్ప్రత్యయాంతము. "తుమున్ ణ్వులౌ క్రియాయాం క్రియార్థాయామ్" (3-3-10) అను సూత్రము తద్విధాయ కము. కరణ మొక క్రియ. గమన మొక క్రియ. చేయబోవువాడై వెళ్ళుచున్నాడని యర్థము. గమనమునకు ప్రయోజనము కరణము. క్రియార్థక క్రియ అనగా కరణార్థక గతి క్రియ. తద్వాచకమగు 'వ్రజతి' అనునది ఉపపదమై యుండుటచే కారకః అనుచో భవిష్యదర్థమున ణ్వుల్ప్రత్యయము. ఇట తిఙంతమునకు సమాస ప్రసక్తియే లేదు. సమాస విధాయకమునందు 'సుప్ సుపా' - అని అధికారప్రాప్తము. అందువలన 'అతిఙ్' - అనునది వ్యర్థమని శంకించి వార్తికకారుడు - "ఉపపదమతిఙితి తదర్థ ప్రతిషేధః" - అని సమాధానము వార్తికమును బోధించెను తదర్థ ప్రతిషేధమన తిఙర్థ సుబన్తముతో సమాస నిషేధమునకనుట. 'అతిఙ్' అనునది అర్థప్రధాన నిర్దేశము క్రియార్థమునకు సమాసము రాదనుట. 'ఉపపదమ క్రియా'- అని వివక్షితార్థ ప్రతిపాదకమగు సూత్రన్యాస ముచితమను తాత్పర్యముతో 'క్రియాప్రతి షేధోవా' - అని వార్తికాంతర పాఠమును గలదు.

క్రియా ప్రధానమగు సుబన్త ముపపదమగునపుడు దానికి ప్రాప్తించు సమాసము నకు ప్రతిషేధమనుట 'కారకస్య గతిః' 'కారకస్య గమనమ్' 'కారకస్య వ్రజ్యా' - ఇత్యాది స్థలములందు క్రియా ప్రధాన సుబన్తములగు నుపపదములు, 'గతిః గమనమ్ వ్రజ్యా' మున్నగునవి. 'గతిః' మున్నగునవి యుపపదములయినపుడు, ణ్వుల్ప్రత్యయ తుమున్ ప్రత్య యాదులు ప్రవర్తింపనియెడల సమాస ప్రతిషేధమునకు ప్రయోజనమేమగును ?

పోనిండు. ణ్వుల్ తృచౌ అను సూత్రముచే ణ్వుల్ప్రత్యయము విధింపబడినపుడా ణ్వులంతముతో క్రియావచనమునకు సమాస ప్రతిషేధమున కది సార్థకమందురా? కాదు. అపుడుపపదము లేదుగదా. కనుక ''కారకస్య గతిః'' - ఇత్యాదులందు 'గతిః' మున్నగునవి యుపపదములు సుబంతములు నగుటచేత ప్రాప్తించు నుపపద సమాస ప్రతిషేధమునకే అతిజ్ఞ్పదము ఆ ప్రతిషేధము ఘఞ్ మున్నగు ప్రత్యయములంతమున గల ఉపపదము లందును, క్రియా కార్యములగు 'తుమున్', 'ణ్వుల్' - మున్నగునవి వచ్చునని జ్ఞాపన చేయు నని గ్రహింపదగియున్నది.

అతిజ్ఞ్పదము, సిద్ధస్వభావమగు నర్థమునకు క్రియాత్వమును జ్ఞాపన చేయునని యనరాదు. వస్తు స్వభావ విపర్యాసమును ఏవియు జ్ఞాపన చేయజాలవు. ॥446॥

అవతారిక— ''తేనతుల్యం క్రియాచేద్వతిః'' - అను సూత్రమున 'క్రియాచేత్' అనునది వతిప్రత్యయ ప్రకృతికి విశేషణము కావచ్చునని నిర్ణయింపబడినది. 'సమర్థ తృతీయాంతమగు' బ్రాహ్మణేన మున్నగునది క్రియ యెట్లగును? అని శంకించి, క్రియావాచకము లగు తృతీయాంతములు 'శయితవ్యేన' 'పాకేన' మున్నగునవి సంభవించును 'శయితవ్యవత్' 'పాకవత్' మున్నగు 'వత్యంతములు' ససంభవములని ఇంతవర కుపపాదింపబడినది. ఇట్లుప పత్తి యున్నను 'కథం చ తృతీయాసమర్థం నామక్రియాస్యాత్' - అను నాక్షేపమునకు, ''సర్వఏతే గుణశబ్దాః సముదాయేషువర్తన్తే। సముదాయేషు వృత్తాః శబ్దాః అవయవేష్వపి వర్తన్తే'' = బ్రాహ్మణ, క్షత్త్రియ, వైశ్య 'శూద్ర' - అను నీ శబ్దములన్నియు సముదాయ బోధకములు. సముదాయమనగా గుణముల సమూహము. 'చాంద్రాయణాది తపస్సును, వేద వేదాంగాది పరిజ్ఞానమును, బ్రాహ్మణుడుగా జన్మించుటయును బ్రాహ్మణుడను వ్యవహారము నకు గారణములు. తపస్సును, పాండిత్యమును లేనివాడు జాతి బ్రాహ్మణుడే యగును పరి పూర్ణ బ్రాహ్మణుడు గాడు. అటులనే గౌరవర్ణము కలిగి యుండుట, ఆచార శౌచము, కపిల వర్ణ కేశత్వము మున్నగునవియు బ్రాహ్మణత్వ వ్యంజకములుగా పురాకల్పమున నుండెడివి. ఈ విధముగా గుణ సముదాయమును జెప్పు శబ్దము లొకప్పుడు అవయవమాత్రమును బోధించుటయు కలదు. తూర్పు పంచాలము, ఉత్తర పంచాలము అందురు. అట సముదాయ బోధకమయిన పంచాల శబ్దము పూర్వోత్తర శబ్దముల ప్రయోగమువలన నవయవ మాత్ర బోధకమగుచున్నది తైలమున గొంత భాగమే భుక్తమైనను 'తైలం భుక్తం' 'ఘృతం భుక్తం' మున్నగు వ్యవహారములును గలవు. కావున బ్రాహ్మణ వదధీతే' అను స్థలమునను బ్రాహ్మణ శబ్ద ముపమేయగత క్రియ = అధ్యయనము మాత్రమును జెప్పును. కావున నుప పత్తి లేదు' - అని యిట్లు మార్గాంతరము నాశ్రయించి సమాధానము మహాభాష్యమున జెప్ప వలసి వచ్చినది? - అని యాశంకించి చెప్పుచున్నారు.

శ్లో॥ సర్వస్య పరిహారార్థం సముదాయత్వ మాశ్రితమ్।
శుద్ధాయాః సంభవాన్నస్యాత్ క్రియాయా బ్రాహ్మణాదిషు॥ 447

సముదాయత్వం=గుణసముదాయమగుట, సర్వస్య పరిహారార్థం=సర్వసాధారణ పరిహారము కొరకు, ఆశ్రితమ్ = ఆశ్రయింపబడినది, అన్యథా = అట్లు కానిచో, శుద్ధాయాః = కేవలమగు క్రియాయాః = క్రియకు, సంభవాత్ = సంభవము కలదుగాన, బ్రాహ్మణాదిషు='బ్రాహ్మణవత్' ఇత్యాదులందు, న స్యాత్ = వతిప్రత్యయము రాకపోవును.

తాత్పర్య వివరణములు— 'హోతవ్యేన తుల్యం' - ఇత్యాది వ్యవహారములందు క్రియావాచియగు తృతీయా సమర్థము సంభవించుననుకొనుడు అయినను 'సర్వఏతే శబ్దా గుణసముదాయే వర్తన్తే' - అని సముదాయ రూపత్వము నాశ్రయించుట, సర్వసాధారణమగు పరిహారమొక్కటియే చెప్పదగునని. కానిచో, శయితవ్యాది పదబోధ్యమగు సముదాయ రూపముగాని శుద్ధక్రియ, ప్రత్యయ ప్రవృత్తిగా సంభవించుచున్నది గాన బ్రాహ్మణాది శబ్ద విషయమున వతిప్రత్యయము రాకుండెడిది. బ్రాహ్మణ శబ్దము లక్షణా వృత్తిచేత క్రియావాచి యగు ననవలెను. 'హోతవ్య' 'పాక' మున్నగునవి ముఖ్యవృత్తిచేతనే క్రియావాచులు గదా. ముఖ్యము సంభవించినపుడు గౌణము నేల పరిగ్రహింపవలెను ? అను ప్రశ్న కలుగును. ఇపుడుమట్టుకు సర్వపరిహారమెట్లు ? సముదాయ ఏకదేశములను గల్పించి క్రియావచనములు బ్రాహ్మణాది శబ్దములగుననిన నయ్యది గౌణ పరిగ్రహమేయగును గదా యనిన, వ్యాప్తి న్యాయమువలన గౌణ ముఖ్యోభయ గ్రహణమని తాత్పర్యము. గౌణ ముఖ్య న్యాయమున కిది తావుగాదు. సాదృశ్య సంబంధముచే గుణారోపమువలన గౌణములయిన వానికి గ్రహణము లేదనియే ఆ న్యాయము బోధించును.

లేదా క్రియకు తృతీయాసమర్థత సంభవింపనే సంభవింపదను నాశయముతో సముదాయ రూపత నాశ్రయించి సమాధానము భాష్యమున చెప్పబడినదనియు ననవచ్చును. కాని యిది కారికా సమ్మతమగు వ్యాఖ్యగా దోపదుగాని యుత్తర కారికలో నా విషయము స్ఫురించును ॥447॥

అవతారిక— అది యెట్లన—

శ్లో॥ ఉపమానవివక్షాయాం స్వధర్మశ్చ నివర్తతే ।
క్రియాయా, న శ్రుతాద్యస్మాదుపమానం సమాప్యతే ॥ 448

క్రియాయాః = హోతవ్య, పాక మున్నగు పదముల క్రియకు, ఉపమాన వివక్షాయామ్ = ఉపమానత్వమును వివక్షించినపుడు, స్వధర్మశ్చ = వాని స్వధర్మమగు అద్రవ్య స్వభావము గూడ, నివర్తతే = మరలిపోవును, యస్మాత్ = ఎందువలననగా, శ్రుతాత్ = వినబడిన = శబ్దోపాత్తమయిన యుపమాన మాత్రమున, ఉపమానం = ఉపమానత్వము, న సమాప్యతే = పరిపూర్ణము గాదు.

తాత్పర్య వివరణములు— కృత్తులచే అభిహితములయిన క్రియలు ద్రవ్యముల వంటివే. క్రియకు స్వభావము సాధ్యమగుట = ద్రవ్యము కాకుండుట. ఒకానొకటి యుపమాన

ముగ వచింపబడిన నంతతో దాని కయ్యది పరిపూర్ణము గదు ఉపమానోపమేయము లందుభయత్ర అన్వయించు ధర్మము గూడ నుండవలెను. ॥448॥

అవతారిక— కానిండు. అయిననేమి? అన్వయిధర్మ మపేక్షితమయిన మాత్ర మున నుపమానముయొక్క స్వభావము పోవునా? అనిన—

శ్లో॥ తృతీయోప్యాశ్రితో భేదో ధర్మః సాధారణో ద్వయోః ।
వ్యాపారవాన్ న కృత్స్నస్య సామ్యం కృత్స్నే న విద్యతే ॥ 449

తృతీయః అపి = మూడవ దొకటి కూడ, ఆశ్రితః = ఉపమానోపమేయములచే నపేక్షింప బడిన, భేదః = విశేష రూపమయిన, ద్వయోః = ఆ రెండింటికిని, సాధారణః = సమానమగు ధర్మః = ధర్మము, వ్యాపారవాన్ = పనిచేయునది (అపేక్షితము), కృత్స్నస్య = సకలమున కును, కృత్స్నేన = సకలముతో, సామ్యం = సామ్యము, న విద్యతే = ఉండదు.

తాత్పర్య వివరణములు— ఉపమానోపమేయములకు, పరస్పర-వ్యావృత్తమయిన సాధారణ ధర్మ మొకటి. అవి ఉపమానోపమేయములని తెలియచేయునది, ఉదాసీనమయినది గాక సవ్యాపారమయినది, కావలసియున్నది. అది క్రియ ఉపమానమయినపుడు, దాని సాధ్య స్వభావమును బోగొట్టును. ఉపమానముపమేయమునకు పరిచ్ఛేదకము. అది ద్రవ్యమయిన తద్గత ధర్మమువలన, నుపమేయమును పరిచ్ఛేదించుటకు సిద్ధత గలిగి యుండును. క్రియ, స్వస్వభావమగు సాధ్యతారూపముననున్న, ఉపమేయ పరిచ్ఛేదకము గాజాలదు. తాను నిష్పన్నము గానపుడు ఇతరమున కుపకారమెట్లగును? తైల పాకము మున్నగునది ద్రవ్య మగును. 'ఇదమ్', తత్ = ఇది, అది - అని సర్వనామ శబ్దములచే బరామర్శింపబడునది ద్రవ్యము గదా. హోతవ్యాది క్రియోపమానములు గూడ 'సౌష్ఠవము' అను సమాన ధర్మము గలవియయినను, ద్రవ్యములే. కావున తృతీయాంతములయినను క్రియావాచులు గావు ఏ పదార్థమయినను నది ద్రవ్యమా? గుణమా? క్రియయా? అని నిర్ణయించుటకు, ప్రకృత శబ్దము దాని నెట్లుగా జెప్పుచున్నది? అని చూడవలెను. 'ధ్వని' అను పదార్థము, 'ధ్వనతి ఘంటా' = ఘంట మ్రోగుచున్నది - అని చెప్పినపుడు, తిఙన్త శబ్దవాచ్యమగుటచే సాధ్య స్వభావమగు క్రియ. ఆ ధ్వని ఘంటయొక్క ధ్వని. దానికి వేరొకటి కారణము గాదు అని తెలియజేయుటకు "ఘంటాయాః ధ్వనిః" అని వచించిన నది యపుడు నిష్పన్నరూపమగు గుణము అదియే 'ధ్వనిత్వమ్' - అని భావప్రత్యయాంత వాచ్యమయినపుడు ద్రవ్యభావము నొందిన ప్రాతికార్థము. ఆ విధముగనే "ధ్వనతి శబ్దః" = శబ్దము ధ్వనించుచున్నది - అని యనిన నపుడు ధ్వనియే కర్త. అది వ్యక్తవర్ణ మగునది. సిద్ధరూపము. 'ధ్వనతి' - అను శబ్దమునకు అవ్యక్తమగు సాధ్యావస్థ శబ్ద మర్థము.

అందువలన క్రియాపదములయినను హోతవ్యాదులు అయిన వానివలన సాధ్యస్వ భావమగు క్రియ ప్రతీయమానముగాదు. అది ద్రవ్యమేగాన సుబంతము క్రియావాచి యుండదు. ఆఖ్యాతములే అట్టివి. నామములు ఆఖ్యాతములు అను భేదమునకు మూలము సిద్ధసాధ్యార్థ భేదమే గదా!

సకల పదార్థములకు సర్వధర్మ సామ్యముండిన, భేదమే లేదు గాన నుపమానోప మేయభావ ప్రయోజకమగు సాదృశ్యమునకు సంభవమే కలుగదు కావున సమానధర్మ మావశ్యకము. 'దానికంటె భిన్నమై దాని ధర్మములు కొన్ని సమానమయినవి గల్గి యుండుట చూచియే, దాని పోలిక దీనికి అందురు. ॥449॥

అవతారిక — సిద్ధరూపమగు ద్రవ్యము సాధారణ ధర్మమును ఉపమానత్వ సిద్ధి కొరక పేక్షించిన నపేక్షించుగాక. సాధ్యస్వభావ యగు క్రియ గూడ నుపమానమయినపుడు సాధారణ ధర్మవ్యాపార మెందులకు ? అనిన—

శ్లో॥ ద్రవ్యే వాఽపి క్రియాయాం వా నిమిత్తా త్తత్ ప్రకల్పతే ।
క్రియాణాం విద్యమానత్వాత్ వృత్తి ర్న స్యాత్ గవాదిషు ॥ 450

తత్ = ఆ సామ్యము, ద్రవ్యేవా = ద్రవ్య ముపమాన యిపుడుగాని, క్రియాయాం వాపి = క్రియ ఉపమానమయినపుడుగాని, నిమిత్తాత్ = సామ్య నిమిత్తమయిన సాధారణ ధర్మము వలననే, ప్రకల్పతే = సిద్ధించుచున్నది, క్రియాణాం = శుద్ధములగు క్రియలు, విద్యమాన త్వాత్ = ఉండుటవలన, గవాదిషు = 'గో' శబ్దము 'బ్రాహ్మణ' శబ్దము మున్నగువాని విషయ మున, వృత్తిః = తద్ధితవృత్తియగు వతిప్రత్యయము, న స్యాత్ = రాకపోవును.

తాత్పర్య వివరణములు— ఉపమానమన నుపమేయమునకు పరిచ్ఛేదకము గదా ద్రవ్య ముపమానమయిన నది యుపమేయమును పరిచ్ఛేదించుటకు సాధారణ ధర్మము నపే క్షించక తీరదు. క్రియ ఉపమానమయినను నంతియ. అపుడది ద్రవ్యతుల్యమే యగును. క్రియాత్వమిక దానికి గలుగదు.

సాధనములు పనిచేయు అవస్థను దెలియజేయునదియు ప్రధానముగ గ్రహింపబడి నదియు క్రియ యగును. ఆ క్రియ వేరొక ధర్మమున కాశ్రయమై దానికిక సాధనముల వ్యాపారముతో పని లేనపుడు ద్రవ్యమే అగును. అపుడది క్రియ గాదు. నిమిత్తముల యపేక్ష లేకయే ఉపమానమయినపుడు, శుద్ధములయిన క్రియల కుపమానత్వము, పాకాది పదవాచ్యము లకు సంభవించును గాన, గౌణ క్రియాబోధకములగు 'బ్రాహ్మణ' 'గో' మున్నగువానికి వతి ప్రత్యయ మెందులకు వచ్చును ? బ్రాహ్మణ శబ్దము లక్షణచే బ్రాహ్మణాధ్యయన క్రియా వాచకము గదా ? కాగా, 'గోవత్' 'బ్రాహ్మణవత్' మున్నగు ప్రయోగములు లేకుండును. ॥450॥

అవతారిక— ఇక శుద్ధములగు క్రియ లుపమానములుగా సంభవింపనపుడు గౌణాశ్రయణము సంభవమగును.

శ్లో॥ అభావాత్ కేవలాయాస్తు తద్వానర్థః ప్రతీయతే ।
ప్రధానాసంభవే యుక్తా లక్షణార్థా క్రియా శ్రుతిః ॥ 451

కేవలాయాః = సమానధర్మ నిమిత్తాపేక్షలేని శుద్ధ క్రియ, అభావాత్ తు = లేకపోవుటవలన

మట్టుకు, తద్వాన్ = ఆ క్రియాశ్రయమగు, అర్థః = పదార్థము, ప్రతీయతే = ఉపమానముగా ప్రతీతమగును, ప్రధానాసంభవే = ముఖ్యము సంభవింపనపుడు, లక్షణార్థా = లాక్షణికమగు నర్థమున గల, క్రియా శ్రుతిః = క్రియావాచక శబ్ద శ్రుతి, యుక్తా, భవతి = యుక్తమగును.

తాత్పర్య వివరణములు— 'తేనతుల్యమ్' అను సూత్రమునందు మొదట తేన అను పదము పఠింపబడినది. అది ప్రకృత్యర్థ బోధకము 'క్రియా' అను పదము, క్రమమును దప్పించుటలో ప్రయోజనము లేదుగాన దానికే విశేషణమగును. క్రియాతౌల్యమునందు 'వతి' ప్రత్యయమగునని యపుడర్థము. పైని జెప్పిన రీతిగ శుద్ధమగు క్రియ కుపమానత్వము సంభవింపదుగాన ముఖ్యార్థమును వదలి గౌణార్థమును గ్రహింపవలసి యుండును. క్రియ తన ఆశ్రయమును వీడి యుండదు గావున, బ్రాహ్మణవత్ అనుచోట బ్రాహ్మణ పదమునకు బ్రాహ్మణాధ్యయన క్రియ యర్థమని లక్షణాసిద్ధము కాగా తృతీయా సమర్థము క్రియావిష్ట ద్రవ్యము సంభవించును. అట్లే శయితవ్యాదులును లాక్షణికములు అని భావము. శుద్ధమనగా ముఖ్యము. గౌణము కానిది. ॥451॥

అవతారిక— అధ్యేతవ్యాది పదవాచ్యములగు క్రియలును నుపమానములయిన వానికి బ్రాహ్మణాది శబ్దములతో సర్వథా సామ్యమే సిద్ధించును.

శ్లో॥ క్రియాంతరేషు సాపేక్షాః క్రియాశబ్దాః క్రియాన్తరే ।
ఉపకారాయ గృహ్యన్తే యథైవ బ్రాహ్మణాదయః ॥ 452

క్రియాన్తరే = వేరొక క్రియయందు, ఉపకారాయ = ఉపకరించుటకు = పరిచ్ఛేదించుటకనుట క్రియాశబ్దాః = 'బ్రాహ్మణాధ్యేతవ్య' మున్నగు క్రియాశబ్దములు, బ్రాహ్మణాదయః = 'బ్రాహ్మణవత్' ఇత్యాదులందు బ్రాహ్మణ మున్నగునవి, యథైవ = ఏ ప్రకారముగనున్నవో, తథా = ఆ ప్రకారము, క్రియాన్తరేషు = ఔపమ్యహేతువులగు సౌష్ఠవము మున్నగువాని యందు, సాపేక్షాః = ఆకాంక్షను గలవిగ, గృహ్యన్తే = గ్రహింపబడుచున్నవి.

తాత్పర్య వివరణములు— క్షత్రియాధ్యయనమున కుపమానము జెప్పి యుపకరించుటకు ఉపమానవాచకములగు 'బ్రాహ్మణాధ్యేతవ్య మున్నగునవి అధ్యయన క్రియకంటె వేరగు సౌష్ఠవాది క్రియా సాపేక్షములయి ప్రయోగింపబడుచున్నవి. 'బ్రాహ్మణవత్ అధీతే క్షత్రియః' - అని చెప్పినపుడు, బ్రాహ్మణ క్షత్రియుల సాదృశ్యమునకు హేతువయిన అధ్యయన క్రియనుబట్టి బ్రాహ్మణ శబ్దము క్షత్రియ పరిచ్ఛేదకమయినట్లు, 'బ్రాహ్మణాధ్యేతవ్యవత్ క్షత్రియాధ్యయనమ్' - అని చెప్పినపుడు అధ్యయనముల సాదృశ్యమునకు హేతువు వాని సౌష్ఠవము. కాగా ద్రవ్యవాచకము లుపమానములయినట్లే క్రియావాచకములును నుపమానములయి వతి ప్రత్యయమును బొందును' - అని భావము. ॥452॥

అవతారిక— కాని యొక ప్రశ్న కలదు. క్రియగూడ నుపమానమయినపుడు ధర్మాంతరము కావలసి వచ్చినయెడల, అనవస్థ గాదా ? ఆ ధర్మముల కుపమానోపమేయ

భావము బోధ్యమయినపుడు వేరొక ధర్మము, వాని కింకొక ధర్మము అపేక్షితము కావలదా యని యాశంకించి, దానికి నిదర్శనమును జూపి, ఆ అనవస్థ తప్పదు యనుచున్నారు.

శ్లో॥ యథాప్రకర్షస్సర్వత్ర నిమిత్తాంతరహేతుకః ।
ద్రవ్యవత్ గుణశబ్దేఽపి స నిమిత్తమపేక్షతే ॥ 453

యథా = ఏ ప్రకారము, ప్రకర్షః = అతిశయము, నిమిత్తాంతరహేతుకః = వేరొక కారణము వలన గలిగినదిగా, సర్వత్ర భవతి = అంతట నుండునో, తథా = ఆ ప్రకారము, సః = ఆ ప్రకర్షము, ద్రవ్యవత్ = ద్రవ్యవాచకమునందు వలెనే, గుణశబ్దేఽపి = గుణవాచకమునందును, నిమిత్తమ్ = వేరొక నిమిత్తమును, అపేక్షతే = అపేక్షించును.

తాత్పర్య వివరణములు— "న వై ద్రవ్యస్య స్వతః ప్రకర్షాపకర్షౌ స్తః" - అందురు పెద్దలు. ద్రవ్యమునకు అతిశయముగాని అపకర్షముగాని స్వాభావికముగా నుండదు. అవి దానికి ఆ ద్రవ్య సంసర్గము గల ధర్మాంతరము మూలమున గలుగును. 'శుక్లతరః పటః' = 'ఈ వస్త్రము ఎక్కువ తెల్లగానున్నది' అనిన, ఇంకొక దానికంటె ఈ వస్త్రమున కతిశయము, ఆ వస్త్రమున సమవేతమగు శుక్ల గుణమువలన వచ్చినది. ఆ విధముగనే 'శుక్ల తరమస్య రూపమ్' = దీని తెలుపు దాని తెలుపుకంటె నతిశయితము = అనినపుడు శుక్ల గుణమున కచ్చట అతిశయము వివక్షితము. ద్రవ్యమునకు గాదు. కాని యా శుక్లగుణమపుడు 'ద్రవ్యాయమాణము' అనగా ద్రవ్యమువంటిదే యగుచున్నది. అది గుణవాచక శబ్దముచే జెప్పబడుచు, భాస్వరత్వము మున్నగు స్వగతమగు వేరొక ధర్మమును ప్రకర్షహేతువు నపేక్షించుచున్నది. ॥453॥

అవతారిక— వేరొక నిదర్శనమును గూడ దీనికి జూపుచున్నారు.

శ్లో॥ యో య ఉచ్చార్యతే శబ్దః స స్వరూపనిబన్ధనః ।
యథా తథోపమానేషు వ్యపేక్షా న నివర్తతే ॥ 454

యః యః = ఏయే, శబ్దః = శబ్దము, ఉచ్చార్యతే = ఉచ్చారణ విషయమగునో, సః సః = ఆ యా శబ్దమెల్ల, స్వరూపనిబన్ధనః = తన రూపమే నిమిత్తముగ గలదియై, యథా భవతి = వర్తించుచున్నది యెట్లో, తథా = ఆ ప్రకారముగనే, ఉపమానేషు = ఉపమానముల విషయమునను, వ్యపేక్షా = నిమిత్తమగు సాధారణ ధర్మముయొక్క అపేక్ష, న నివర్తతే = తొలగదు.

తాత్పర్య వివరణములు— అగ్నిమనోదాత్తమ ధీష్వ" - అని వేదమున నున్నది. అగ్నిని అంతోదాత్తముగ నుచ్చరించుట యసంభవము. అగ్ని యన నిప్పు. దాని కుచ్చారణ క్రియ కుదురదు. "అగ్నేర్ఢక్" - అని పాణిని సూత్రము. అచ్చట గూడ నిప్పుగడ్డకు పరముగా 'ఢక్' అను ప్రత్యయమును విధించుట వీలుగాదు. కావున ఇచ్చట 'అగ్ని' అను మాటయే అర్థముగాని వస్తువుగాదు అని చెప్పబడినది. శబ్దము, తాలువు మొదలయిన అవయవ

ముల యందు సమకూర్పబడి యొక క్రమములో నుచ్చరింపబడి యర్థమునకు వాచకమగు చున్నది. అయ్యది నిరుపాధికమయిన, వాచకము గానేరదు. కావున నది స్వరూపమునే విశేషణముగ నాశ్రయించును. ఆ విధముగ స్వరూప రూపితమగు నభిధేయమును బోధించును. అపుడు ప్రయోగస్థమగు వాచ్యమే దాని స్వరూపము. ఈ విషయము బ్రహ్మకాండమున నిరూపితము. ఆ ప్రయోగస్థమగు వాచ్యమైన శబ్దము గూడ నుచ్చారణ సాధనావయవములచే నుచ్చరింపబడినపుడు, దానికిని, ఉపసంహృత క్రమమయి ప్రయోగస్థమగు నింకొక వాచ్యము నిమిత్తముగ కల్పింపబడును. కావున నెల్ల శబ్దముల విషయముననను, నిమిత్తము, నిమిత్తవత్తు, అభిధేయము = వాచ్యము - అను నీ మూడును నుండక తీరదు.

'అగ్ని' - మున్నగు శబ్దములకు ప్రవృత్తి నిమిత్తమయిన స్వరూపము, ఉచ్చారణ విషయమయినపుడు, వేరొక ప్రవృత్తి నిమిత్త మావశ్యకమగును. నిమిత్త విరహితమయినది వాచకము కాదనుట సార్వత్రికమను విషయము కారికయందు, 'యోయః' - అను వీప్సచే సూచితము.

ఈ విధముగ, ప్రకర్షము బోధనీయమయినపుడు, ధర్మాంతరమును సంభవించినంత దనుక నిమిత్తముగ గల్పించినట్లును, స్వరూప మభిధేయమై తాను మరల నభిధాయకమయినపుడు స్వరూపాంతరము నిమిత్తమయినట్లును, ఔపమ్య విషయమున గూడ నిమిత్త కల్పన మవర్జనీయముగాన, ఉపమానము - ఉపమేయము - వాని సాధారణ ధర్మము - అను నీ మూడును అపరిహార్యములు.

"బ్రాహ్మణవత్ క్షత్రియోధీతే" అనుచో అధ్యయనము సాధారణ ధర్మము ఆ అధ్యయన ముపమానమయిన, "బ్రాహ్మణాధ్యయన తుల్యం క్షత్రియాధ్యయనమ్" అను వచో విన్యాసమున, సౌష్ఠవము సాధారణ ధర్మము. ఆ సౌష్ఠవ ముపమానముగ వివక్షితమయిననపుడు తద్గతమగు పరినిష్పత్తి = పరిపూర్తి సాధారణ ధర్మమగును. చివరకు శబ్ద వ్యాపారమెచ్చట నిలుచునో అచ్చట కల్పన పర్యవసితమగును. కావున నీ యనవస్థ మూలక్షయకారిణి కాదుగాన దోషము గాదని తాత్పర్యము. ॥454॥

అవతారిక — శుద్ధమగు క్రియ 'తేన' - అనుచో జెప్పబడిన తృతీయా విభక్త్యర్థాన్వయ యోగ్యమగునది=తృతీయా సమర్థము సంభవింపదను, భాష్యగ్రంథమును సమర్థించి, అచటనే యున్న - "ఇదమయుక్తం వర్తతే, కిమత్రాయుక్తమ్" - అను గ్రంథము నుపపాదించుచున్నారు.

శ్లో॥ క్రియావృత్తేస్తృతీయాస్తస్యైవం చా సంభవే సతి ।
ప్రసిద్ధన్యాయకరణో భాష్యేయుణిరుదాహృతః ॥ 455

ఏవంచ = మరియు నీ ప్రకారము, క్రియావృత్తేః = క్రియను బోధించు, తృతీయాస్తస్య = తృతీయా విభక్త్యంతమునకు, అసంభవే సతి = సంభవము లేకపోగా, అందువలననే, భాష్యే

= మహాభాష్యమున, ప్రసిద్ధి న్యాయకరణః = ప్రసిద్ధమగు 'న్యాయేన' అనునది కరణముగా గల, యుజిః = యుజిర్ యోగే అను ధాతువు, ఉదాహృతః = ప్రయోగింపబడినది.

తాత్పర్య వివరణములు— "ఇదమయుక్తం వర్తతే" - అని భాష్యము. ఈ వాక్యార్థము యుక్తము కానిదిగా నున్నది అని యర్థము యుక్తమనగా కూడియున్నది. దేనితో గూడినది? అని ప్రశ్న కలిగినపుడు, యోగమునకు కరణమయినది చెప్పబడవలెను. అది చెప్పబడలేదు. ఎందువలన? అనగా నది ప్రసిద్ధముగాబట్టి. న్యాయముతో గూడినది అనుట. న్యాయయుతము కానిది అయుక్తము క్రియా స్వరూప సామర్థ్యమునుబట్టి యవగత మగు కారకము స్వశబ్దముచే గ్రహింపబడ నక్కరలేదు. ఎట్లన - 'ఈత దర్శుడయినవాడు' అందురు. దేనికి? అనిన సత్కారమునకు అని వేరుగ జెప్పనక్కరలేదు. 'వర్షించుచున్నది' అందురు, ఏది? దేనిని? అను ప్రశ్నలకు సమాధానము 'మేఘము', 'జలమును' అని సామర్థ్య గమ్యము దానిని పృథక్కుగా వచింప నక్కరలేదు కనుక 'న్యాయముతో' అను కరణ వాచకము ప్రసిద్ధమగుటచే నిర్దేశింపబడలేదు. ॥455॥

అవతారిక— కొందరు, ఇచట 'న్యాయముతో', అను, కరణము ధాత్వర్థమున నంతర్భూతము గాన వచింపబడలేదు అందురు. కాని యది సమంజసమైన సమాధానము గాదు ఏలయన—

శ్లో॥ అంతర్భూతే తు కరణే ప్రయోగో న పునర్భవేత్ ।
న్యాయేనాయుక్త మిత్యత్ర జీవతౌ ప్రాణకర్మవత్ ॥ 456

కరణే = 'న్యాయేన' అను, కరణము, అంతర్భూతేతు = యుజధాత్వర్థమున నంతర్భూతమని నచో, అత్ర = ప్రకృత విషయమున, జీవితౌ = జీవధాతువునందు అంతర్భూతమైన, ప్రాణ కర్మవత్ = 'ప్రాణాన్' - అను కర్మకువలె, "న్యాయేన అయుక్తమ్" ఇతి = 'న్యాయముతో గూడినది కాదు' అని, పునః = మరల 'న్యాయముతో' అని కరణవాచకమునకు, ప్రయోగః = ప్రయోగము, నభవేత్ = ఉండకపోయెడిది.

తాత్పర్య వివరణములు— 'జీవతి' - అను పదమునకు ప్రాణములను ధరించి యున్నాడు అని యర్థము. 'ప్రాణములను' అను కర్మ 'జీవప్రాణధారణే' అని ధాత్వర్థము ననే జేరియున్నది. కావున 'ప్రాణాన్ జీవతి' - అని ప్రయోగింపరు. 'అస్తి' = అనిన తనను ధరించియున్నాడు అని యర్థము అస = భువి భవనమనగా ఆత్మధారణము. ఆత్మయను కర్మ ధాత్వర్థముననే అంతర్భూతము. కనుకనే 'ఆత్మానమస్తి' అని ప్రయోగింపరు. ఆ విధముగ నిట కరణరూపకారకము ధాత్వర్థ సంగృహీతమనివ నిక దానికి వేరుగ ప్రయోగమే లేకపోవును. కాని ప్రయోగ మగపడుచున్నది. 'న్యాయెన అయుక్తమ్' అనియు, ఉపపత్త్యా అయుక్తమ్' అనియును వ్యవహరింతురు. కనుక కరణ వాచకము ప్రయోగింపబడకుండుటకు ప్రసిద్ధియే కారణము గాని ధాత్వర్థాంతర్భావము గాదు. ॥456॥

అవతారిక— "అయుక్తం" - అను శబ్దము నన్వాఖ్యానము చేయుటకు, అందు ప్రకృతి కర్థము యుజిక్రియ యనియు దానికి, కరణము 'న్యాయము' అనియు నిట్లు చెప్పుట అన్వాఖ్యాన సమయ పరిపాలనమునకు మాత్రమే. పరమార్థమును విచారించిన నీ పదమందవ యవ విభాగమే లేదు. కావున యుజిక్రియయు లేదు. తత్కరణమును లేదు. చూడుడు—

శ్లో॥ శాస్త్రాభ్యాసాయ భేదోఽయమయుక్తమితి వర్ణ్యతే ।
అశోభనమసంబద్ధమితి రూఢిర్వ్యవస్థితా ॥ 457

'అయుక్తమ్' ఇతి='అయుక్తమ్' - అను పదమునందు, శాస్త్రాభ్యాసాయ=వ్యుత్పత్తి సమయ పాలనమునకు, అయం = ఈ, భేదః = క్రియ, కరణము - అను భేదము, వర్ణ్యతే = వర్ణింప బడుచున్నది (కాని), అశోభనమ్ = 'శోభనమైనది గాదు', అసంబద్ధమ్ = 'సంబద్ధముగా లేనిది', ఇతి = అని ఇట్లు, రూఢి = రూఢ్యర్థమే, వ్యవస్థితా = వ్యవస్థితమై యున్నది.

తాత్పర్య వివరణములు— శబ్దముల నన్వాఖ్యానము చేసినపుడు, అర్థానుగుణ ముగ నందు క్రియాకారకములను గల్పించుట వ్యుత్పత్తి పరిపాటి. అందులకై యుజిక్రియ ఆ శబ్దమునందుటచే దానికి కరణమేమి? అను విచారము. ప్రసిద్ధముగాన 'న్యాయము' కరణము గావచ్చును, కాగా న్యాయముతో సంబద్ధముగాలేనిది అని యర్థము అని భాష్యకర్త తాత్పర్యముగా వర్ణించిరి. కాని లౌకికులందు అవయవభేదమును గమనింపక అయుక్తమనగా 'అశోభనము' - 'అసంబద్ధము' - 'అన్యాయ్యము' - 'అశ్లిష్టము' - అను రూఢ్యర్థమునే గ్రహింతురు. అందువలననే భాష్యకారుడు, 'ఇదం న్యాయేనా యుక్తమ్' - అని వచింపలేదు. అందు యుజిక్రియ యేదియు లేదనియే యాతని తాత్పర్యముగానోపును.

అవతారిక— వతిప్రత్యయ విధాయక సూత్రమున 'క్రియా' అనునది - ప్రకృత్యర్థమునకు విశేషణమయిన, క్రియావాచులగు తృతీయాంతములు ఆ ప్రత్యయమునకు ప్రకృతులు కావలెను. అట్టివి లేనేలేవు కనుక నా పక్షము గ్రాహ్యము గాదని నిరూపించి, ఆ పక్షమునకు అసలు సంభవమే లేదని ఈ కారికలో జెప్పుచున్నారు.

శ్లో॥ వివిభక్తిః ప్రకృత్యర్థం ప్రత్యుపాధిః కథంభవేత్ ।
విభక్తిపరిణామే చ ప్రకల్ప్యం విషయాన్తరమ్ । 458

వివిభక్తిః = విరుద్ధ విభక్త్యంతమగు క్రియా అనునది, ప్రకృత్యర్థం ప్రతి = 'తేన' అను తృతీయాసమర్థ ప్రకృత్యర్థమునకు, ఉపాధిః = సమానాధికరణ విశేషణము, కథం భవేత్ = ఎట్లగును? విభక్తి పరిణామే చ=క్రియా అనునది తృతీయాంతముగా మార్చబడుననిన, విషయాంతరం=ప్రథమాంతమునకు చరితార్థతగల వేరొక స్థలము, ప్రకల్ప్యమ్=కల్పింపవలసి యుండును.

తాత్పర్య వివరణములు— 'తేన' అనునది తృతీయాంతము. క్రియా అనునది ప్రథమాంతము. అది తేన అను దానికి విశేషణము = అనగా ఉపాధి ఎట్లగును? ఉపాధి

యనగా, సమానాధికరణ విశేషణము. ''అర్థవిశేష ఉపాధిః తదన్తవాచ్యస్సమాన శబ్దోయః'' అని ''ప్రత్యయః'' (3-1-1) అను సూత్ర భాష్యమునందుకై యట గ్రంథమున నుపాధి లక్షణము చెప్పబడియున్నది. 'దృతిహరిః పశుః' అను స్థలమున, ''హరతేర్దృతి నాథయోః పశౌ'' - అసూత్రముచే 'ఇన్' అను ప్రత్యయము విధింపబడినది. అట 'పశౌ' అనునది 'ఉపాధి'. ''దాణ్డాక్రీడా''= దీనిలో దణ్డము ప్రహరణము గాన నీ క్రీడ దాణ్డ యనబడును. ''సాస్య దేవతా'' (4-2-24) 'ఆమె దీనికి దేవత' అను నర్థమున అణాదులు వచ్చును అని యర్థము 'ప్రాజాపత్యః' ఉదాహరణము. ప్రజాపతి దేవతగా గల క్రతువు' అని యర్థము. పై సూత్రములలో పశు, క్రీడా, దేవతాది శబ్దము లుపాధులు - ఇక విశేషణములనునవి అవచ్ఛేదకములు మాత్రమే. అవి వ్యధికరణములయినను గావచ్చును. ''గార్గికయా శ్లాఘతే'' - అను ప్రయోగమును జూతము - గార్గిక అనగా గర్గగోత్రా పత్యమగుట. తన్మూలమున పొగడుకొనుచున్నాడు అని యర్థము ''గోత్రచరణాత్ శ్లాఘాత్యాకార తదవేతేషు'' (5-1-134) అను సూత్రముచే భావకర్మార్థములందు 'వుఞ్' అను ప్రత్యయము విహితము. అందు శ్లాఘా పదము విశేషణము. సూత్రార్థమునకు సిద్ధాంత కౌముది చూడనగును.

పోనిమ్ము. సమన్వయము కుదురదుగాన, 'క్రియయా' అని విభక్తి విపరిణామమును గల్పింతుము అనిన, నీ సూత్రమునందలి ప్రథమాంతమున కెచ్చట చారితార్థ్యము? అది లేనపుడు విపరిణామమెట్లు? లేనిచో ప్రథమాంతపదము వ్యర్థమే కావలెనుగదా? పరిణామ మనగా నూహవంటిది. ప్రకృతియాగమునందొక విభక్త్యంతముగా శ్రుతమైన దానికి వికృతి యాగములందు విభక్త్యంతర విపరిణామమే గదా ఊహ. ॥458॥

అవతారిక— పై విషయ మీ కింది రెండు కారికలందును నుపపాదింపబడినది.

శ్లో॥ విభక్త్యన్తరయోగో హి యస్యతద్విషయాన్తరే ।
విభక్త్యన్తర సంబన్ధః సామర్థ్యాదనుమీయతే ॥ 459

శ్లో॥ సారూప్యాత్తు తదేవేదమితి తత్రోపచర్యతే ।
శబ్దాన్తరే విభక్త్యా తు యుక్తం శాస్త్రే తదశ్రుతమ్ ॥ 460

తథా హి = అది యెట్లనగా, యస్య = ఏ శబ్దమునకు, విభక్త్యన్తర యోగః = ఒకానొక విభక్తి సంబంధము, విషయాన్తరే = వేరొక విషయమునందు, (చరితార్థః) = కృతార్థమగునో తస్య = దానికి, సామర్థ్యాత్ = సమన్వయానుపపత్తి వలన, విభక్త్యన్తర సంబంధః = వేరొక విభక్తి యోగము, అనుమీయతే = కల్పింపబడెను, సారూప్యాత్ తు = సారూప్య ముండుటవలన నైతే, తదేవ ఇదమితి = అదియే యిది అని, తత్ర=ఆ మార్పుబడిన శబ్దము విషయమున, ఉపచర్యతే = అభేద వ్యవహారము చేయబడుచున్నది, శాస్త్రే = సూత్రమునందు అశ్రుతమ్ తు = వినబడని పదమైనదిమట్టుకు, శబ్దాన్తరే = వేరొక శబ్దమునందు, విభక్త్యా = వేరొక విభక్తితో, యుక్తమ్ = కూడుకొనినది, భవతి = అగుచున్నది.

తాత్పర్య వివరణములు— సూత్రమునందు ఒక విభక్తితో నుచ్చరింపబడిన శబ్దము, ఆ విభక్త్యర్థ సంబంధము గల యొక వాక్యార్థమునం దుపకారకము కావలెను. లేనిచో ఆ విభక్తితో నా పదము నుచ్చరించుట నిరర్థకమే యగును. "భూవాదయో ధాతవః" (1-3-1) అను సూత్రమున, ధాతవః అను పదము ప్రథమా విభక్త్యంతముగ నుచ్చరింపబడి యున్నది. క్రియావాచకములగు భ్వాది గణపఠితములు ధాతుసంజ్ఞ కలవి యగును - అను వాక్యార్థమున నది ఉపయోగముగలదియై కృతార్థమైనది. దానికే "అనుదాత్తఙిత ఆత్మనే పదమ్" (2-3-12) అను సూత్రమునందు స్వరితత్వమువలన ననువర్తించి ఆ 'ధాతవః' అను పదము పంచమ్యంతముగ మార్చునందును. ప్రథమాంత ధాతు పదమున కట సమన్వయము కుదురదుగదా. ఆ సూత్ర మాత్మనే పద ప్రత్యయ విధాయకము. అందు ప్రకృతి ధాతువు. ధాతువుకంటె బరముగాననను నర్థముకల ప్రత్యయమందు గావలెను. సామర్థ్యమువలన విభక్త్యంతర సంబంధానుమానమన నిదియే.

ఇక శబ్దార్థ సంబంధములు నిత్యములని వైయాకరణుల సిద్ధాంతము. కనుక సూత్ర గృహీతమయిన శబ్దమునకుగాని దాని యర్థమునకుగాని మార్పు యుక్తము గాదు. కనుక శబ్దాంతరమే యోగ్యమయిన విభక్తితో గూడినది సూత్రమున నుచ్చారితము కాకున్నను నుత్ప్రేక్షింపబడవలసి యుండును. ఆ శబ్దము వేరు. ఇది వేరు. సారూప్యమువలన, అనగా విభక్తి వేరయినను ప్రకృత్యంశము తుల్యముగ నుండుటచేత నదియే యిది యనుకొనుట, క్షీరము దధిగ మారినదను వ్యవహారమునందును క్షీర ధర్మములు గొన్ని దధియం దగపడుటయే నిమిత్తము. ప్రత్యభిజ్ఞానమునకును నదియే కారణము. కావున 'క్రియాచేత్' అను ప్రథమాంతమునకు ప్రకృత్యర్థ విశేషణత్వము అను పక్షము సంభవరహితము. ॥459, 460॥

అవతారిక— కాగా సూత్రమునందు 'తేన' అను పదమువలన తృతీయాంతము, వతిప్రత్యయమునకు ప్రకృతియని తెలియుచున్నదిగాన దానినిబట్టి క్రియా అనునది 'క్రియయా' అనియే నిర్దేశింపబడి యుండవలెను. క్రియా అను పదమునందలి ప్రథమను బుచ్చుకొని 'తేన' అను ప్రధానమునకు విపరిణామము కలుగదు. అను విషయ మీ కారికయందు జెప్పబడినది.

శ్లో॥ ప్రకృతిశ్చేత్ తృతీయాన్తా తేనేత్యస్మాత్ ప్రతీయతే ।
క్రియేతి ప్రథమాన్తా సా కథం భవితుమర్హతి ॥ 461

తేన ఇత్యస్మాత్ = సూత్రమునందలి తేన అను పదమువలన, ప్రకృతిః = వతి ప్రత్యయమునకు ప్రకృతి, తృతీయాన్తా = తృతీయా విభక్తి ప్రత్యయాంతముగా, ప్రతీయతే చేత్ = ప్రతీయమానమగుచున్నదనిన, సా = ఆ ప్రకృతి, క్రియా ఇతి = 'క్రియా' అని, ప్రథమాంతా = ప్రథమా విభక్త్యంతము, భవితుమ్=అగుటకు, కథం అర్హతి=ఎట్లు అర్హమగును?

తాత్పర్య వివరణములు— విభక్తి విపరిణామము సంభవింపనపుడు వివిభక్తికములకు సంబంధము పొసగదు. ఈ విషయ ముపపాదిత పూర్వము. వివిభక్తికములనగా, విరుద్ధములైన విభక్తులుగల పదములు. ॥461॥

అవతారిక— ఒకప్పుడు విభక్తి విపరిణామమును జేసినను 'తేన' అను దానితో 'క్రియయా' - అను పదమున కన్వయము సంభవింపదు

శ్లో॥ క్రియయేతి తృతీయా చ ప్రయోగే కస్య కల్ప్యతామ్।
తేనేత్యస్య హి సంబంధః సూత్రస్థేన న విద్యతే॥ 462

కస్య = ఏ పదముయొక్క, ప్రయోగే చ = విశేష్య ప్రయోగమున, క్రియయా ఇతి = 'క్రియయా' అని, తృతీయా = తృతీయాంత విశేషణము, కల్ప్యతామ్ = కల్పింపబడవలెను? సూత్రస్థేన = సూత్రమునందున్న 'క్రియా' అను దానితో. తేన ఇత్యస్య = 'తేన' అను దానికి, సంబంధః = సంబంధము, న హి విద్యతే? = లేదుగదా?

తాత్పర్య వివరణములు— 'తేన' అనునది పుంలింగము. 'క్రియయా' అనునది స్త్రీలింగమాయె. ఇక తుల్యమ్ అను దాని కుపాధియనిన నపుడు ప్రకృతి విశేషణము గాదు. ॥462॥

అవతారిక— సూత్రమున క్రియా అను పదమునకు సంబంధము నీ విధముగా నాక్షేపించి సమర్థింపమన్నారు.

శ్లో॥ సోపస్కారేషు సూత్రేషు వాక్యే శేషః సమర్థ్యతే।
తేన యత్తత్ తృతీయాన్తం క్రియా చేత్ సేతి గమ్యతే॥ 463

సోపస్కారేషు = అధ్యాహారములతో గూడిన, సూత్రేషు=సూత్రములందు, వాక్యే=వాక్యమునందు, శేషః = మిగిలియున్నది = ఆవశ్యకమగునది, సమర్థ్యతేః = సమర్థింపబడును = కల్పింపబడును, తేన = అందువలన, యత్ తత్ తృతీయాంతమ్ = ''తృతీయాంతమది యేది గలదో, సా క్రియా చేత్ = అది క్రియ యగుచో, ఇతి గమ్యతే = అని గమ్యమగును.

తాత్పర్య వివరణములు— సూత్రములందు వాక్యములు సామాన్యముగి అధ్యాహార సాపేక్షములయి యుండును. లక్ష్యముల కనుగుణముగ లక్షణములు రచింపబడును. కావున ఆ యా లక్ష్యముల భేదము ననుసరించి క్రియా పదముల నధ్యాహరించుకొనవలసి యుండును.

ప్రకృత సూత్రమున 'చేత్' అను శబ్దము గలదు. దానివలన పదముల సంబంధమున భేద మవగతమగుచున్నది. కాగా, తృతీయా సమర్థమగునది క్రియ యగుచో, దానితో సమానమయినది అను నర్థమున వతి ప్రత్యయమగునని సూత్రార్థ ముపపన్నము. సూత్రమునందే విభక్తి విపరిణామము చేయవలెనను నిర్బంధములేదు. వ్యాఖ్యానరూపమగు తత్సమన్వయ వాక్యమునందును విభక్తి విపరిణామమును జేయవచ్చును. 'తేన' అను తృతీయా నిర్దేశము వలన ప్రకృతి తృతీయాంతము గావలెనని తెలియుచున్నది.

ఆ ప్రకృతికి ఉపాధితో సంబంధమును గలదని 'చేత్' అనునది తెలియచేయును.

కావున ఉపాధివాచకము ప్రథమాంతము గాన ఉపాధేయమగు 'తేన' అనునదియు సమన్వయ వాక్యమునందు ప్రథమాంతముగా పరిణతమగును. ''ఇకోగుణవృద్ధీ'' (1-1-3) అను సూత్రమును జూడుడు. 'ఎక్కడ', 'గుణము వచ్చును' అని గుణమును, 'వృద్ధి వచ్చును' అని వృద్ధియు విధింపబడునో అచ్చట 'ఇకః'అను షష్ఠ్యంతపద ముపస్థితమగును అని సమన్వయ వాక్యమున నధ్యాహారముచే వాక్యార్థము సమర్థితము. ప్రకృత సూత్రమున నట్లే కర్తవ్యము. ॥463॥

అవతారిక— ఉపాధి అన నేనియో చెప్పబడినది. ప్రకృత సూత్రమున 'క్రియా' అనునది ఉపాధియనియు దానికి ఉపాధిమత్తగు 'తేన' అను దానితో, వాక్యాధ్యాహారముచే సమన్వయమనియు నిరూపింపబడినది. ఆ ఉపాధి వాక్యమునందు ప్రయుక్తమయినను గావచ్చును. లేదా ప్రతీయమానమును గావచ్చునని ప్రతిపాదింపబడుచున్నది.

శ్లో॥ ఉపాధేః కస్యచిద్వాక్యే ప్రయోగ ఉపలభ్యతే ।
ప్రతీయమాన ధర్మాన్యో న కదాచిత్ప్రయుజ్యతే ॥ 464

కస్యచిత్ ఉపాధేః=ఒకానొక విశేషణమునకు, వాక్యే=విగ్రహ వాక్యమునందు, ప్రయోగః = ప్రయోగము, ఉపలభ్యతే = కనబడుచుండును అన్యః = వేరొక ఉపాధి, ప్రతీయమాన ధర్మా = ప్రతీయమానమగు ధర్మము గలదియై, కదాచిత్ = ఎప్పుడును, న ప్రయుజ్యతే = ప్రయోగింపబడదు.

తాత్పర్య వివరణములు— ఉపాధి రెండు విధములు. ప్రయుజ్యమానమును ప్రతీయమానమును. ''తదస్యామ్ ప్రహరణమితి క్రీడాయాంణః'' (4-2-57) అని యొక సూత్రము. ఈ క్రీడలో దండము ప్రహరణముగాని నిది 'దాణ్డ' యనబడును. ఇందు ముష్టి ప్రహరణముగాన నీ క్రీడ 'మౌష్ట' యగును. 'దాండా' 'మౌష్టా' అను స్త్రీలింగ రూపములు పైని జెప్పబడిన యర్థమునందు లోకమున ప్రయోగములలో గలవు. వాని సాధుత్వ బోధనమున కీ సూత్రము రచింపబడినది. ఇందు 'తత్' అనునది ప్రయోగములందున్న దండ, ముష్టి, హస్త మున్నగువాని కనుకరణము ప్రయోగవాక్యమున 'దండః' అను దానికి 'ప్రహరణం' అనునది సమానాధికరణ విశేషణముగా నుపాత్తము. ఇది ప్రయుజ్యమానమగు నుపాధి. ప్రయోగమునందు వినబడని యుపాధికి సూత్రములందును కరణమును ఉండబోదు. ప్రకృత సూత్రమున క్రియ యను నుపాధి యట్టిది 'బ్రాహ్మణేన తుల్యమధీతే క్షత్రియః' అనుచో నధ్యయనమను క్రియ సాక్షాత్తు, బ్రాహ్మణగతముగా జెప్పబడలేదు. అది సామర్థ్యమువలన గమ్యము మాత్రమే. ఆ క్రియకు సూత్రమున ప్రథమాంతముగా నిర్దేశము చేయబడినను సమన్వయ ముపపన్నముగాన దోషము లేదు. ॥464॥

అవతారిక— అందు ప్రతీయమానమగు నుపాధి కుదాహరణము.

శ్లో॥ నీల ముత్పలమిత్యత్ర న విశేష్యే న భేదకే ।
కశ్చిత్తద్ధర్మవచనో వాక్యే శబ్దః ప్రయుజ్యతే ॥ 465

నీల ముత్పల మిత్యత్రవాక్యే = 'నీలం చ తదుత్పలంచ' అను వాక్యమునందు, విశేష్యే = విశేష్యమునందుగాని, భేదకే = విశేషణమునందుగాని, తద్ధర్మ వచనః = విశేషణ విశేష్య భావమును జెప్పు పదము, కశ్చిత్ శబ్దః = ఏ శబ్దమును, న ప్రయుజ్యతే = ప్రయోగింప బడుట లేదు.

తాత్పర్య వివరణములు— నీలోత్పలముల విశేషణ విశేష్యభావము సామానాధి కరణ్యమువలననే గమ్యము. కావున దానిని జెప్పునట్టి శబ్దమేదియును, "నీలమనునది విశేష ణము, ఉత్పలమనునది విశేష్యము" - అని ఈ రీతిగా ప్రయోగింపబడదు. సూత్రమునందే విశేషణము, విశేష్యము అను పదములు, "విశేషణం విశేష్యేణ బహులమ్" అని ప్రయుక్త ములు. ప్రతీయమానమగు నుపాధి గల వాక్యమున కిది నిదర్శనము. ॥465॥

అవతారిక— అందువలన—

శ్లో॥ అత్యంతానుగమాత్తత్ర న సూత్రే న చ విగ్రహే ।
విభక్తిపరిణామేన కించిదస్తి ప్రయోజనమ్ ॥ 466

అత్యన్తానుగమాత్ = విశేషణ విశేష్యభావము అత్యంతము ననుగతమై, తత్ర = అచ్చట నుండుటవలన, విభక్తి పరిణామేన = విభక్తిని మార్చుటతో, సూత్రే = సూత్రమునందు, కించిత్ ప్రయోజనం=ఏమియు ప్రయోజనము, నాస్తి = లేదు. విగ్రహే చ నాస్తి=విగ్రహ వాక్యమునను ప్రయోజనము లేదు.

తాత్పర్య వివరణములు— "నీలంచ తత్ ఉత్పలంచ" అను వాక్యమునందు 'ఉత్పలం విశేష్యమ్' అనిగాని, సూత్రమునందు 'విశేష్యేణ' అను తృతీయాంతమును 'విశేష్యం' అని ప్రథమాంతముగ గాని మార్చ బనిలేదు. సామానాధికరణ్యము వలన ఆ సంబంధము తెలియుచున్నది గదా ! వాక్యమున 'విశేష్యం' అను పదము ప్రయోగింపబడిన యెడల దాని కనుకరణమైన, సూత్రస్థమగు 'విశేష్యేణ' అనునది గూడ ప్రథమాంతముగ మార్చబడి యుండెడిది. కనుక నిటువంటి స్థలములందు విభక్తి విపరిణామమునకు ప్రసక్తియే లేదు అని భావము. ॥466॥

అవతారిక— దీని నుదాహరణముగా దీసికొని ప్రకృత సూత్రమునను విభక్తి విపరిణామ మక్కరలేదనుచున్నారు.

శ్లో॥ తృతీయాన్తం క్రియేత్యేతత్ విగ్రహే న ప్రయుజ్యతే ।
యథా దండః ప్రహరణం క్రీడాయామితి దృశ్యతే ॥ 467

'దాండా' - అను తద్ధితాంతమునకు విగ్రహ వాక్యమున "దండః ప్రహరణం అస్యాం క్రీడాయాం" - అని యథా = ఏ ప్రకారము, దృశ్యతే = కనబడుచున్నదో, తథా = ఆ విధ ముగా, తృతీయాంతం = తృతీయాంతమగు, 'క్రియా' ఇత్యేతత్ = 'క్రియయా' - అనునది,

విగ్రహే = 'బ్రాహ్మణవత్' అను దాని విగ్రహమునందు, న ప్రయుజ్యతే = ప్రయోగింప బడలేదు.

తాత్పర్య వివరణములు— ఆ, క్రీడలో దండము ప్రహరించుట = కొట్టుటయను క్రియకు సాధకతమము. అది అందు కరణమని, దండః అస్యాం అని మాత్రమే విగ్రహ వాక్యమయినచో, తెలియబోదు. కనుక 'ప్రహరణమ్' అనునదియు ప్రయోగింపబడుచున్నది అది ఉపాధి. దానికి, 'ప్రహరణ క్రియకు సాధకమయినది' అని చెప్పు స్వశబ్దమగు 'ప్రహరణం' అను పదము నుపయోగించి తెలియజేయుట ఆవశ్యకమయినది

''బ్రాహ్మణేన తుల్యం క్షత్రియః అధీతే'' అను విగ్రహ వాక్యమునందు, 'అధ్యయన క్రియచేత' అని తెలుపుటకు 'క్రియయా' అను పదము నుపయోగించుట లేదు. ఉపమేయమగు 'క్షత్రియః' అను పదమునకు సమీపమున నుచ్చరింపబడిన అధీతే అను దానికి సామర్థ్యమువలన నుపమానమునందును సమన్వయము సిద్ధించును. అట్లు గాకున్న నుపమానోపమేయ భావమే ప్రతీతము గాదుగదా ! కాగా వాక్యమున 'క్రియయా' అను దానికి ప్రయోగము లేనపుడిక సూత్రమున విభక్తి పరిణామ మెందులకు ? అని తాత్పర్యము.॥467॥

అవతారిక— అంతర్భూతమగు ధర్మముగల ఉపాధికి నీలోత్పలమనునది యుదాహరణమనిరి. కాని అట "నీలం విశేషణం ఉత్పలం విశేష్యమ్" అనియు విగ్రహ వాక్య ప్రయోగము గలదేయనిన, నిర్వివాదోదాహరణమును జెప్పుచున్నారు.

శ్లో॥ ఘవిధౌ ఘశ్చ సంజ్ఞాయామితి సూత్ర ఉదాహృతమ్ ।
ఉపాదానం ప్రయోగేషు తస్యాత్యంతం న విద్యతే ॥ 468

ఘవిధౌ = "పుంసి సంజ్ఞాయాః" అను ఘప్రత్యయవిధిలో, ఘశ్చ సంజ్ఞాయామ్ = సంజ్ఞయందు ఘ ప్రత్యయమగును, ఇతి = అని, సూత్రే = ఆ సూత్రమునందు (3-3-118), ఉదాహృతమ్ = చెప్పబడియున్నది, తస్య = ఆ 'సంజ్ఞాయామ్' అను ఉపాధికి, ప్రయోగేషు = విగ్రహ వాక్యములందు, ఉపాదానం = ప్రయోగము = ఉచ్చారణమనుట, అత్యంతమ్ = ఎంతమాత్రమును, న విద్యతే = లేదు.

తాత్పర్య వివరణములు— "పుంసి సంజ్ఞాయాం ఘః ప్రాయేణ" అని సూత్రము (3-3-118). ఇది 'ఘ' అను ప్రత్యయమును సంజ్ఞ అయినపుడు విధించుచున్నది. తదంతములు పుంలింగములయి యుండును. 'దంతచ్ఛదః' 'ఆకరః' మున్నగు సంజ్ఞావాచకము లుదాహరణములు. 'దన్తాః ఛాద్యన్తే అనేన' - 'ఆకుర్వన్తి అస్మిన్నిత్యాకరః' అని విగ్రహ వాక్యములు. అట ఉపాధియగు సంజ్ఞాపదమునకు విగ్రహములందు ప్రయోగము లేదు ఎందువలన ? ప్రకృతి ప్రత్యయ సముదాయము సంజ్ఞ యగుటచే సంజ్ఞారూపమగు నుపాధి అందంతర్గతమయియే యున్నది. ఆ విధముగనే ప్రకృత సూత్రమునందును క్రియ అను నుపాధి అంతర్భూతమగుటచే 'క్రియయా తుల్యం' అని చెప్పలేదు. ॥468॥

అవతారిక— ఇక, సూత్రమునందు 'తేన' - అని నిర్దేశింపబడిన తృతీయా సమర్థము ప్రధానము గాన, దాని ననుసరించి 'క్రియా' అనునది గూడ తృతీయాంతము గావలె నందురేమో ?

శ్లో॥ యైరప్రయుక్తైః సంస్కారః ప్రధానేషు ప్రతీయతే ।
తే భేదేపి విభక్తీనాం నిర్దిశ్యన్త ఉపాధయః ॥ 469

అప్రయుక్తైః = విగ్రహ వాక్యమునందు ప్రయోగింపబడని, యైః = ఏ ఉపాధులచేతను, ప్రధానేషు = ప్రధానములగు వాని విషయమున, సంస్కారః=అతిశయమును గలుగచేయుట, ప్రతీయతే = కనబడుచుండునో, తే ఉపాధయః = ఆ విశేషణములు, విభక్తీనామ్ = వాని విభక్తులకు, భేదే సత్యపి = భేదమున్నను నిర్దిశ్యన్తే = వ్యవచ్ఛేదకములగుచునే యుండును.

తాత్పర్య వివరణములు— క్రియ యను నుపాధి విగ్రహవాక్యమున ప్రయోగము లేకున్నను ప్రధానమును సంస్కరించుచునే యున్నది. సంస్కారమనగా దానిని విశేషించుట. అయ్యది ప్రథమాంతముగా నున్నను, తృతీయాంతముతో దానికి సంబంధము కలుగును. క్రియా గ్రహణమున కదియే ప్రయోజనము గదా 'క్రియయా' అని మార్చినపుడైన సామానాధికరణ్యము సిద్ధింపదాయె ఏలయన నవి భిన్నలింగములు గదా. కావున నా యుపాధి యెట్లు నిర్దేశింపబడినను, అప్రధానములు ప్రధానమును సంస్కరించుటకే యేర్పడినవి గాన తత్కృత వ్యవచ్ఛేదము సిద్ధించును. ॥469॥

అవతారిక— ఇంతవరకు, ప్రకృత్యర్థ విశేషణ పక్షమున, క్రియావచనమునకు తృతీయాంతత్వము సంభవింపదని నిరూపింపబడినది. ఇక, "సర్వ ఏతే శబ్దాః గుణ సముదాయేషు వర్తన్తే" - అను భాష్యగ్రంథము వివరింపబడును

శ్లో॥ సముదాయేషు వర్తన్తే భావానాం సహచారిణామ్ ।
శబ్దాస్తత్త్వ వివక్షాయాం సముచ్చయ వికల్పయోః ॥ 470

శబ్దాః = 'బ్రాహ్మణ' మున్నగు శబ్దములు, సహచారిణామ్ = తమతో గలసియుండు, భావానామ్ = ధర్మముల యొక్క, సముదాయేషు = సమూహములందు, వర్తన్తే = వర్తించును, తత్ తు = అవర్తించుటయును, సముచ్చయ వికల్పయోః=సముచ్చయ వికల్పముల యొక్క అవివక్షాయాం భవతి = వివక్ష చేయనపుడే సంభవించును.

తాత్పర్య వివరణములు— తెల్లగానుండుట, పరిశుద్ధమగు నాచారము, తలవెండ్రుకలు పసుపురంగుగ నుండుట - మున్నగునవి బ్రాహ్మణ జాతీయుల నియతధర్మములు వాని సముదాయము నా శబ్దములు బోధించును. ఆ ధర్మములకు ఒకప్పుడు నియత సహచారము లేకున్నను బ్రాహ్మణత్వ జాతి సహచారము తప్పదు అదియును, 'ఇదియా ? అదియా' - అను వికల్పముగాని, ఇదియును నదియును నను సముచ్చయముగాని లేనపుడే, సంభవించును ॥470॥

అవతారిక— గుణ సముదాయమును బోధించు శబ్దములలో, ఆ గుణములకు వికల్పము గలిగిన నది సముదాయార్థమునకు విరుద్ధముగాన, నా వికల్పము లేకుండ నిమ్మ. సముచ్చయమనగా నొక్కసారిగనే యనేకార్థములను బోధించుటగదా. అది సముదాయమునకు విరుద్ధముగాదే యనిన—

శ్లో॥ సముచ్చయస్తు క్రియతే యేషు ప్రత్యర్థవృత్తిషు।
భేదాధిష్ఠానయా యోగస్తేషాం భవతి సంఖ్యయా ॥ 471

ప్రత్యర్థ వృత్తిషు = ప్రత్యేకముగ సముదాయావయవ బోధకములగు, యేషు తు = ఏ శబ్దములందు, సముచ్చయః = అవయవ సముచ్చయ బోధనము, క్రియతే = చేయబడునో, తేషాం = ఆ శబ్దములకు, భేదాధిష్ఠానయా = అవయవభేదము ఆశ్రయముగా గల. సంఖ్యయా = సంఖ్యావాచక వచనముతో, యోగః భవతి = సంబంధము కలుగును.

తాత్పర్య వివరణములు— సముదాయ బోధక శబ్దములు అవయవములను గూడ బోధించినపుడు సముదాయము సముచ్చయరూపముగ వాచ్యమగును. అవయవములన్నియు సమానమగు కక్ష్య గలవి. కాని అనేకత్వము, ప్రకటము. అవి యన్నియు ప్రధానములే. కినుక వాని బహుత్వమును పురస్కరించుకొని బహువచనము ప్రవర్తించును. ఎట్లనగా - 'వనము' 'వృక్షములు' అను పదములను జూడుడు. వనమనగా వృక్షముల సముదాయము. కాని అవయవములను ప్రధానముగ బోధింపదలంచిన, 'వృక్షాః' అని బహువచనమే ప్రయోగింపబడుచున్నది సముదాయమును బోధింపదలంచిన 'వనము' అని సముదాయ గతైకత్వ బోధకమగు నేకవచనమే ప్రయుక్తము. ఆ విధముగనే ప్రకృతమునను, బ్రాహ్మణ శబ్దము సముదాయార్థకమయినపుడు, ప్రత్యర్థ వృత్తి కానేరదుగాన, అనగా పృథగవయవములను బోధింపదు గాన సముచ్చయ మట సంభవింపదు. కావున సముచ్చయము సముదాయ విరోధియే యగును. ॥471॥

అవతారిక— ఓయీ! మాత్రా కలాపము = అనగా అవయవముల సమూహము, సమాన కక్ష్యముగ నభిహితము కానపుడు, జాతి విశిష్ట ద్రవ్యము శబ్దములచే బోధింపబడు నను పక్షమునకును దీనికిని భేదమేమి? అనిన—

శ్లో॥ సర్వైర్విశిష్టాస్తైరర్థైర్జన్యన్తే సహచారిభిః।
బుద్ధయ ప్రతిపత్తమాణాం శబ్దార్థాంస్తానతో విదుః ॥ 472

సహచారిభిః తైః = కూడనుండు ఆ, సర్వైః అర్థైః = సకలార్థముల తోడను, విశిష్టాః = కూడిన, బుద్ధయః = బుద్ధులు = జ్ఞానములు, ప్రతిపత్తిమాణాం = శ్రోతలకు, జన్యన్తే = కలిగింపబడును, అతః = అందువలన, తాన్ = వానిని, శబ్దార్థాన్ = శబ్దముల కర్థములనుగా విదుః = తెలిసికొనుచుందురు.

తాత్పర్య వివరణములు— జాతియో, గుణమో క్రియయో ద్రవ్యముతో గలసియే యుండును. వానిచే రూపితములయి జాత్యాది విశిష్టమగు నర్థము గ్రహింపచేయు బుద్ధులు శ్రోతల కా శబ్దముల ప్రయోగములందు గలిగింపబడుచుండును. బుద్ధ్యనుసారముగ నిరూపిత మయిన యర్థమునే శబ్దములు బోధించును. కనుక గుణసముదాయమే ప్రతీతి గోచరమగు శబ్దార్థము. ద్రవ్యము అర్థక్రియాకారి. అనగా పనికి ఉపయోగపడునది. కనుక జాతిగుణ క్రియాది ధర్మములతో సంసృష్టమయియే శక్తికి విషయమగును = బోధ్యమగుననుట. అదియు నొక్కటియే గనుక ఏకవచనమే. ఇక ద్రవ్యాభిధాన పక్షముననో, ద్రవ్య మొక్కటియే జాత్యావిష్టమయి వాచ్యమగును. గుణమును క్రియయును సామర్థ్యమువలన నవగతము లగును. క్రియా గుణములు లేని ద్రవ్య ముండదుగదా? కావున ఆ పక్షమున క్రియా గుణము లకు అభిధానము లేదు. ఈ పక్షమున నన్నియు వాచ్యములే = అభిధాన విషయములే.॥472॥

అవతారిక—పైన నుపపాదింపబడిన విషయమునే యీ కారిక వివరించుచున్నది.

శ్లో॥ సంసృష్టాః ప్రత్యయేష్వర్థాః సర్వ ఏవోపకారిణః ।
తేషాం ప్రత్యయరూపేణ సర్వేషాం శబ్దవాచ్యతా ॥ 473

సర్వే ఏవ అర్థాః = సమస్త పదార్థములును, ప్రత్యయేషు = బుద్ధులయందు, సంసృష్టాః = సంసర్గము గలవియై, ఉపకారిణః = చోద్యములు, భవన్తి = అగుచున్నవి, తేషాం = వానికి, సర్వేషాం = అన్నింటికిని, ప్రత్యయ రూపేణ = బుద్ధిరూపముననే, శబ్దవాచ్యతా = శబ్ది వాచ్యత గూడ, భవతి = కలుగుచున్నది.

తాత్పర్య వివరణములు— వక్త శబ్దముల నుచ్చరించిన వెంటనే శ్రోతల బుద్ధుల యందు పదార్థాకారముపారూఢమగును. ఆ ఆకారమును ముందు బోధించి, తరువాత దానితో బాహ్య వస్తువున కభేదమును గ్రహించిన వెనుక శబ్దములు దానిని బోధించును. మాత్రా కలాపరూపమగు సకలార్థములును, బుద్ధియందు ఏర్పడిన ఆకారము ననుసరించియే వాచ్యము లగుచుండును బుద్ధి గోచరములగు జాతిగుణ క్రియా ద్రవ్యములను నర్థములు, సంసర్గమును ప్రత్యయములందే = బుద్ధులయందే పొందునుగాన తద్వాచక శబ్దములను సముదాయాభిధాయి శబ్దము లందురు. బాహ్య పదార్థములు అంశరహితములు. బుద్ధి పరికల్పిత పదార్థములందే భాగ విభాగము నిశ్చితమగును. అందును బాహ్య పదార్థములవలె ప్రధానా ప్రధాన భావమును బట్టియే బుద్ధియందును వానికి భానము కలుగును గాన జాతిగుణ క్రియలతో సంసృష్టమగు ద్రవ్యమే ప్రధానముగ వాచ్యమగును. అందువలననే ఆ శబ్దము లేకార్థములని యందురు.॥473

అవతారిక— శబ్దములు, గుణసముదాయ వాచకములని యనవలసిన పని యేమి గలదు? అవి ద్రవ్యమాత్ర వాచకములే యనరాదాయనిన—

శ్లో॥ కేవలానాం తు భావానాం న రూపమవధార్యతే ।
అనిరూపిత రూపేషు తేషు శబ్దో న వర్తతే ॥ 474

కేవలానాం = ఉపాధి సంసర్గము = విశేషణ సంబంధములేని, భావానాం తు = ద్రవ్యములకు మాత్రము, రూపం = స్వరూపము, న అవధార్యతే = నిరూపింపబడదు, అనిరూపిత రూపేషు = రూప నిరూపణము లేని, తేషు = ఆ ద్రవ్యముల యందు, శబ్దః = శబ్దము, న వర్తతే = బోధకముగా నుండదు.

తాత్పర్య వివరణములు— ఏదియేని యొక ధర్మముతో గూడి నిరూపిత స్వరూపము లయిన పదార్థములే శబ్దబోధ్యములగును. ఉపాధిరహితమగు ద్రవ్యమాత్రము నిరూపణ గోచరము గాదు. 'ఇది ఈ ప్రకారమయినది' అని తెలిసికొనుటయే గదా నిరూపణము కావున నిరవచ్ఛిన్నమగు ద్రవ్యము భాసింపనే భాసింపదు. జాతియో, గుణమో, క్రియయో అవచ్ఛేదకములుగా నుండియే తీరవలెను. కావున విశేషణ విశిష్టమే, గుణసముదాయ వాచకత్వ సిద్ధాంతమున, శబ్దవాచ్యము సముదాయ వృత్తులు పంచాలాది శబ్దములు 'పూర్వ పంచాలము' అనినపుడు ఆ పూర్వ = తూర్పు అను విశేషణము వలన, అవయవబోధకమగుచున్నది.॥474

అవతారిక— అట్లయిన సముదాయమును బోధించు శబ్దము, సముదాయ రూపమగు నర్థమును వదలిపెట్టి, అవయవమును బోధించునట్లగునుగదా ? అపుడు శబ్దార్థ సంబంధమునకు అనిత్యత్వము వాటిల్లదా ? అనిన—

శ్లో॥ పూర్వశబ్ద ప్రయోగాచ్చ సమూహాన్ననివర్తతే ।
వర్తతే అవయవేనాపి, నోపాత్తం త్యజతి క్వచిత్ ॥ 475

పూర్వశబ్ద ప్రయోగాత్ = 'పూర్వే' - అను శబ్దముండుటవలన, సమూహాత్ = సముదాయము నుండి, న నివర్తతే = పంచాల శబ్దము మరలదు, అవయవే అపిచ = అవయవ రూపమగు నర్థమున గూడ, న వర్తతే = అపూర్వముగ వర్తింపదు, ఉపాత్తం = గృహీతమయిన నిరూఢార్థమును, క్వచిత్ = ఎచ్చటను, న త్యజతి = విడిచిపెట్టదు.

తాత్పర్య వివరణములు— 'పూర్వే పంచాలాః' = తూర్పు పంచాలము, అనుచోట పంచాల శబ్దము మొత్తము పంచాల దేశమునంతను జెప్పునది. అందు 'తూర్పు' అను నవయవ వాచకమున్నను, నది సముదాయార్థము నుండి తొలగదు. ఎందువలన ననగా, శబ్దార్థ సంబంధము నిత్యము గదా. అపూర్వముగ నిచట నది అవయవ వాచకమును గాదు. నిరూఢమగు నర్థమును వదలిపెట్టుట, అపూర్వార్థమును పరిగ్రహించుటయు నెచ్చటను శబ్దముల విషయమున సమ్మతము గాదు. ॥475॥

అవతారిక— అట్లయిన సమన్వయము కుదురదే ? అవయవ వాచకమగు పూర్వ శబ్దమునకు సముదాయ వాచకమగు పంచాల శబ్దముతో సమన్వయము పొసగుటకు సముదాయ బోధకము గూడ నవయవమును బోధించుననరాదా యనిన—

శ్లో॥ సముదాయాభిధాయీ చ యది భేదం విశేషయేత్ ।
తత్రాతుల్య విభక్తిత్వం పూర్వకాయాదివద్భవేత్ ॥ 476

సముదాయాభిధాయీ చ = సముదాయవాచక శబ్దము గూడ, భేదం = అవయవమును, విశేష యేద్యది = వ్యచ్ఛేదించిన యెడల = వేరు పరచినచో, తత్ర = అచట = పూర్వే పంచాలాః అనుచోట, పూర్వకాయాదివత్ = 'పూర్వకాయః' అనుచోట వలె, అతుల్య విభక్తిత్వమ్ = విషమ విభక్తిని గలిగియుండుట, భవేత్ = ప్రాప్తించును.

తాత్పర్య వివరణములు—— పంచాల దేశమంతయు నొక్కటియే. దానినే పంచాలము శబ్దము చెప్పును. అది అఖండము. సఖండమైనచో అఖండమును జెప్పుటకు పూర్వశబ్ద ప్రయోగ మావశ్యకమయ్యెడిది. కాని అట్లు వ్యవచ్ఛేద్యము లేకయున్నను ప్రయోగింపబడిన పూర్వశబ్దము పంచాల దేశమున నవయవ భేదమును గల్పించినచో నపుడు పంచాల దేశము యొక్క తూర్పుభాగ మిదియని యర్థమగును. 'పూర్వః కాయస్య' = శరీరము యొక్క పూర్వ భాగము - అనునట్లు, 'పూర్వః పంచాలానామ్' అని ప్రథమాంత షష్ఠ్యంత పదములుగ ప్రయోగించవలసి వచ్చును. సామానాధికరణ్యము కుదురదు. సామానాధికరణ్యమునకు భంగము లేకుండగ నవయవార్థబోధనము యుక్తము గాదు. సంబంధము నిత్యమాయె - అని తాత్పర్యము. ॥476॥

అవతారిక——ఇక, ఈ పంచాల శబ్దము అవయవబోధకమును నగునను విషయము సమర్థింపబడుచున్నది.

శ్లో॥ సమూహే చ ప్రదేశే చ పంచాలా ఇతి దృశ్యతే ।
తథా విశేషణం సర్వఇత్యేతదుపపద్యతే ॥ 477

పంచాలాః ఇతి = 'పంచాలాః' అను పదము, సమూహేచ, ప్రదేశేచ = సముదాయమునందును, అవయవమునందును, దృశ్యతే = ప్రయోగములం దగపడుచున్నది, తథా = కనుకనే, 'సర్వే' ఇత్యేతత్ = 'సర్వే' అను నీ, విశేషణం = విశేషణము, ఉపపద్యతే = ఉపపన్న మగుచున్నది

తాత్పర్య వివరణములు—— పంచాల శబ్దము ముఖ్యవృత్తియగు శక్తి చేతనే సముదాయమును అవయవమును అనగా ఆ దేశమున గొంతభాగమును గూడ బోధించును. 'పంచాల దేశీయులకు నివాసమయిన జనపదమ'ను వ్యుత్పత్త్యర్థమును బట్టియు అర్థ ద్వయమునకును ఉపపత్తి కలదు. జనపదమంతయు నివాసమయినట్లు తదేకదేశమును నివాసస్థాన మగును గదా ! ఇయ్యది వనశబ్దమువంటి అవయవివాచి, వనమున బ్రవేశింపుమనిన వృక్షసమూహమున బ్రవేశించుట ఏకదేశమున ప్రవేశించుటయే. నివాసాధికరణత్వమను నిమిత్తమును బట్టి యీ శబ్దము ప్రవర్తించుచున్నది ఆ నిమిత్తము సముదాయావయవములకు తుల్యము. 'పంచాల దేశమునందు ప్రవేశించినాడు' 'ఆ దేశమును జూడుడు' - ఈ మున్నగు వ్యవహారములందు ఏకదేశ ద్వారముననే గదా ఆ యా పనులు జరుగునది.

వ్యుత్పత్తివాదమును విడిచి స్వాభావిక వాదమును బట్టినను = అనగా పంచాల శబ్దము రూఢి శక్తిచేత నర్థబోధకమేగాని అవయవశక్తిచే గాదన్నను, అనేకార్థక శబ్దములవలె

నిదియు సముదాయైక దేశములను బోధించుననుట యొప్పును. కనుకనే, 'పంచాల దేశము లబ్ధము' - 'పంచాలము కొట్టబడినది' - ఇత్యాది వ్యవహారములలో, దేశమంతయు లబ్ధమా? ఏకదేశము మాత్రమా? యను సందేహమును వారించుటకు "సర్వే పంచాలా లబ్ధాః" - అని సర్వశబ్దము విశేషణముగా నుపయోగింపబడుచున్నది. దానివలనను నీ శబ్ద ముభయవాచక మని సిద్ధము. కావున నిట్లు సముదాయ శబ్దములు ప్రసిద్ధములయినవి ముఖ్యవృత్తిచేతనే ఉభయ బోధకములుగ నగపడుచున్నవి ॥477॥

అవతారిక— ఇందు భాష్యకారుని సంవాదమును గలదనుచున్నారు.

శ్లో॥ తథార్ధపిప్పలీత్యత్ర జాత్యంతరనివృత్తయే ।
అర్థం చ పిప్పలీచేతిఖండే శబ్దః ప్రయుజ్యతే ॥ 478

తథా=ఆ ప్రకారముగనే (అందువలననే), అర్ధపిప్పలీ ఇత్యత్ర='అర్ధపిప్పలీ' అను సమాసమున, జాత్యంతర నివృత్తయే = ఈ సగము వేరొక జాతిదిగాదని చెప్పుటకు, అర్థం చ పిప్పలీ చ ఇతి = "అర్థం చ తత్ పిప్పలీ చ" - అని, ఖండే = అర్థ ఖండ భాగమునందు, శబ్దః = పిప్పలీ శబ్దము విశేష్యముగా, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ఏకదేశి సమాసమని తత్పురుష సమాసభేదము ఒకటి కలదు. 'అర్ధపిప్పలీ' 'పూర్వకాయః' మన్నగునవి యుదాహరణములు. 'అర్థం పిప్పల్యాః' 'పూర్వం కాయస్య' అని విగ్రహవాక్యము. ఈ సగము ముక్క, పిప్పలి కట్టెది. వేరు దానిది గాదు అని జాత్యంతర నివృత్తికై పిప్పలీ శబ్ద ప్రయోగము. ఇందు 'అర్థం' అనునది ప్రధానము, అది నపుంసకము. సమాసలింగము స్త్రీలింగము గానున్నది. అందుకొరకు "పరవల్లింగ ద్వంద్వ తత్పురుషయోః" అని పరపదలింగము సమాసమున కతిదేశింపబడినది

ఈ ఏకదేశి సమాసమును భాష్యకారుడు ప్రత్యాఖ్యానము చేసినాడు. 'అర్థం చ తత్ పిప్పలీ చ' అను విగ్రహము గల సమానాధికరణ సమాసమే కావచ్చునని తాత్పర్యము. తత్పురుష ఉత్తరపదార్థ ప్రధానముగాన పిప్పలీ శబ్ద స్త్రీలింగము సమాసమునకు సిద్ధించును. పరపద లింగాతిదేశ మక్కరలేదని యభిప్రాయము. ఒకదాని యందలి భాగము ఏకదేశము. ఆ యర్థముగ పదముతో గూడినది ఏకదేశి సమాసము. ఏకదేశి సమాసమునందు, అర్థము పిప్పలిచే విశేషింపబడుచున్నది. సమానాధికరణ సమాసమునందు జాత్యంతరము గాదని తెలియజేయుటకే, 'అర్థం' అను దానికి పిప్పలి విశేష్యమగుచున్నది. కాగా రెండు సమాసములకును ఫలాంశమున నభేదమే కలదు గాన నేకదేశి సమాసము ప్రత్యాఖ్యాతము. జాతి ప్రవృత్తి నిమిత్తకమయిన పిప్పలీ శబ్దము వ్యక్తియందు, దాని ప్రచయాపచయములతో నిమిత్తము లేకయే వర్తించును. అట్లు కానిచో 'అర్థం చ పిప్పలీ చ' అను సామానాధికరణ్యము కుదురదుగదా యని భావము. ॥478॥

పింపబడిన అభేదము, ప్రదేశే అపి = అవయవవాచక శబ్దమందు గూడ, ఉపలభ్యతే = కన బడు చున్నది.

తాత్పర్య వివరణములు— సముదాయ వాచకమయినను, అవయవ వాచకమయి నను, ఆ శబ్దమునకు రూపము తుల్యముగ నుండుటవలన సముదాయబోధకముగ నిశ్చితమయి నదే అవయవ బోధకమును నందురుగాని, అవి భిన్న భిన్న శబ్దములే. ఆ శబ్దమే సముదాయ రూపార్థము నుండి తొలగి అవయవ రూపార్థమును బోధించుచున్నదని తాత్పర్యము గాదు. శబ్దార్థ సంబంధము నిత్యము గదా. ॥488॥

అవతారిక— "తేనతుల్యం క్రియాచేద్వతిః" (5-1-115) సూత్రమునందు మహాభాష్యమున - "ఈ సూత్ర వాక్యార్థ మయుక్తముగ నున్నది తృతీయా సమర్థమయినది క్రియ యయినచో వతి ప్రత్యయము వచ్చుననుచున్నారు. తృతీయా సమర్థము క్రియ ఎట్లగును?" అని యాక్షేపించి, "బ్రాహ్మణః క్షత్రియః వైశ్యః శూద్రః" - అను నీ శబ్దము లన్నియు గుణసముదాయమును జెప్పు శబ్దములు. తపస్సు, వేద వేదాంగాధ్యయనము జన్మ - ఇవి బ్రాహ్మణుడనిపించుకొనుటకు నిమిత్తములు. గౌరత్వము, శౌచము పింగళ వర్ణము, కపిలరంగు తల వెంద్రుకలు - అను నివియు బ్రాహ్మణ శబ్దార్థమున నంతర్భూత ములు. సముదాయమును బోధించు శబ్దములు అవయవములను గూడ బోధించును. ఎట్లనగా 'పూర్వ పంచాలము' 'ఉత్తర పంచాలము' అందురు. తైలము భుజింపబడినది ఘృతము త్రాగబడినది అందురు. అట్లే 'శుక్ల, నీలః, కృష్ణః' - అను శబ్దములును నట్టివే. అట్లే ఈ బ్రాహ్మణ శబ్దము గూడ సముదాయబోధకమై అవయవములను గూడ బోధించును" - అని సమాధానము చెప్పబడినది.

అందు 'పూర్వే పంచాలాః' అను నిదర్శన మింతవరకును వ్యాఖ్యానింపబడినది. ఇక 'తైలం భుక్తం' 'ఘృతం భుక్తమ్' - అను నుదాహరణ గ్రంథము వాఖ్యానింపబడును.

శ్లో॥ సంస్కారాదుపఘాతాద్వావృత్తోఽక్త పరిమాణకే ।
తైలాదౌ జాతిశబ్దోఽత్ర సామర్థ్యాదవసీయతే ॥ 484

సంస్కారాత్ = ఔషధ సంస్కారము వలన గాని, ఉపఘాతాత్ వా = కుక్కలు, కాకులు ఎంగిలి పరచినందున గాని, అక్త పరిమాణకే = పరిచ్ఛిన్నమగు = ఇంతయును, కొలతగల, తైలాదౌ వృత్తః = నూనె, నెయ్యి మున్నగువానియందు వర్తించినదిగా, జాతి శబ్దః = జాతి ప్రవృత్తి నిమిత్తకమగు నీ శబ్దము, అత్ర = 'తైలం భుక్తమ్' అను నుదాహరణమున, సామర్థ్యాత్ = ప్రకరణ బలమువలన, అవసీయతే = నిర్ణయింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— తైల ఘృత శబ్దములు అవయవావయవి సాధారణ జాతి శబ్దములు. అవి సముదాయవృత్తములై అవయవబోధకములు గావు గదా. అవి యుదా హరణము లెట్లగును? 'స్ఫోటసిద్ధి' యను గ్రంథమునందు "నేక్షితా జాతి శబ్దానాం సముదా యానుపాతితా । జాతి మాచక్షతే తే హి వ్యక్తిర్జాతి సమాశ్రయా" అని చెప్పబడినది. జాతి

ప్రవృత్తి నిమిత్తక శబ్దములు జాతినే బోధించును. జాత్యాశ్రయమగుటచే వ్యక్తియందు గార్య ములు ప్రవర్తించును అయ్యవి సముదాయవాచకములగుట ఎచ్చటను జూడబడదు - అని యర్థము.

పై ఆక్షేపమునకు ప్రతి సమాధాన మీ కారికయం దభిహితము 'తైలం భుక్తమ్' అను నుదాహరణమున తైల మనగా, ఒకానొక రోగమును శాంతింపజేయుటకు, ఔషధముచే సంస్కరింపబడినది. ఘృతమనునదియు నట్టిదియే వివక్షితము. అయ్యది, పదహారు పలములు లేదా ముప్పదిరెండు పలములు - అని ఇట్లు పరిచ్ఛేదింపబడినది గ్రాహ్యము. అదియే అక్త పరిమాణమనుట. అక్త అనగా 'పరిచ్ఛిన్నమగు' - అని యర్థము. లేదా శ్వకాకాదులచే నుచ్ఛి ష్టము గావింపబడి పరిత్యాజ్యమగునదియైనను గొంత పరిమాణము కలది అయి యుండును.

అందు ప్రతిదినమును గొంత భాగమును మాత్రమే భుక్తమయినను తైలము భుక్త మనుచున్నారు. కుక్క నూనెను గొంత మాత్రమునే త్రాగివేసినను నట్లందురు. అవయవమునం దిట్లు సముదాయారోపముచే వ్యవహారమున కిది యుదాహరణము. ॥484॥

అవతారిక— ఇది భాష్యకారుని ఆశయమని యెట్లు తెలియుననిన—

శ్లో॥ న జాతిగుణశబ్దేషు మూర్తిభేదోఽవివక్షితః ।
తే జాతిగుణ సంబంధ భేదమాత్ర నిబంధనాః ॥ 485

జాతిగుణ శబ్దేషు = జాతిగుణములు ప్రవృత్తి నిమిత్తములుగాగల శబ్దములందు, మూర్తిభేదః = ద్రవ్యపరిమాణ భేదము, న వివక్షితః = వివక్షింపబడదు, తే = ఆ జాతిగుణ నిమిత్తక శబ్దములు, జాతిగుణ సంబంధ భేదమాత్ర నిబంధనాః = జాతి సంబంధమును, గుణ సంబంధ మును అను విశేష మొక్కటియే నిమిత్తముగా గలవి.

తాత్పర్య వివరణములు— ఈ వ్యక్తి ఆ జాతిగాని గుణముగాని కలదియా? కాదా? యని మాత్రమే ఆ శబ్దములు గమనించునుగాని, వ్యక్తియొక్క మూర్తిభేదమును = పరిమాణ భేదమును జూడకయే ఆ వ్యక్తి నా శబ్దములు బోధించును. పరిమాణ శబ్దములగు కుంచము, మానిక మున్నగునవి యట్లు గాదు. అవి అందు గొంతభాగము తగ్గినయెడల ప్రవర్తింపవు. కాగా సంస్కారము ఉపఘాతము గల ద్రవ్యమును యథాక్రమముగ బోధించు తైల ఘృత శబ్దము లిట భాష్యకారునకు వివక్షితము అని గ్రహింపవలసి యున్నది. ॥485॥

అవతారిక— ఇక శుక్లః, నీలః, కృష్ణః - అను నుదాహరణములు వివరింప బడును.

శ్లో॥ కృష్ణాది వ్యపదేశశ్చ సర్వావయవ వృత్తిభిః ।
గుణైస్తే ప్యేకదేశస్థాః పటాదీనాం విశేషకాః ॥ 486

సర్వావయవవృత్తిభిః = సకలావయవములందు నుండు, గుణైః = నలుపు, ఎరుపు, మున్నగు

గుణములచే, కృష్ణాదివ్యపదేశః = నల్లనిది, మొదలగు వ్యవహారము, భవతి = కలుగును, తే = అవి, ఏకదేశస్థాః అపి = కొన్ని అవయవములందున్నను, పటాదీనాం = పటము మున్నగు విశేష్యములకు, విశేషకాః భవన్తి = విశేషణములగును.

తాత్పర్యము వివరణములు— గుణ ప్రవృత్తి నిమిత్తక శబ్దములు అవయవావయవి విభాగము లేకయే వర్తించునని యుపపాదింపబడినది. కాని లోకమున సమస్తావయవములను వ్యాపించి గుణ మున్ననే అట్టి వ్యవహారమగపడును. నల్లనిబట్ట, తెల్లనిబట్ట - అని, బట్టయంతయు నలుపుగాని తెలుపుగాని అయిననే అందురు. కాబట్టి ముఖ్యవృత్తిచేత నవి సముదాయ శబ్దములే. ఇక నొక వస్త్రమున గొన్ని దారములు మాత్రమే నల్లనివయి మిగిలినంతయు తెల్లనిదయినపుడు గూడ, సముదాయారోపము వలన కృష్ణాది వ్యవహారములగపడుచున్నవి. వస్త్రమున నొక భాగము = కొద్ది భాగము మాత్రమే మలిన హస్తములతో తాకబడి నల్లబడినపుడు కోపముతో, అట్లా మలినపరచిన వానిని, తెల్లని బట్టను నలుపు చేసివేసితి వేమయా ః అని యనుట కలదు. ॥486॥

అవతారిక— ఇట ప్రకారాంతరమును గలదు

శ్లో॥ పటావయవవృత్తాస్తు యదా తత్ర పటాదయః ।
తదా తైలాదివత్తేషాం జాతి శబ్దత్వ ముచ్యతే ॥ 487

తత్ర = 'శుక్లః పటః' - అనుచోట, యదాతు = ఎపుడైతే, పటాదయః = 'పట' - మున్నగునవి, పటావయవవృత్తాః = పటావయమును బోధించునవి, భవన్తి = అగునో, తదా = అపుడు, తేషాం = వానికి, తైలాదివత్ = 'తైల' - మున్నగు శబ్దములకువలె, జాతి శబ్దత్వమ్ = జాతి శబ్దములగుటయే, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ''పటః కృష్ణః'' = వస్త్రము నల్లనిది, అని వ్యవహారము కలదు. అచట ఏకదేశమే నల్లనిది. అయినను నట్టి వ్యవహారమును రెండు విధములుగ నుపపాదింపవచ్చును. సమస్తావయవ కృష్ణత్వమున కచట అవయవమునం దధ్యారోపమువలననా వ్యవహారమని ఇదివర కుపపాదింపబడినది.

ఇక పట శబ్దమునకు పటైకదేశ మర్థమనినపుడు, సమీపముననున్న కృష్ణ శబ్దము ముఖ్యార్థకమేయగును. సముదాయవాచకమగు పటశబ్ద మిపు డవయవవాచక మగుచున్నదిగాన ప్రకృతమున నుదాహరణమగును. తైల ఘృత శబ్దములవలె పట శబ్దము గూడ జాతి ప్రవృత్తి నిమిత్తకమే. అవి సంస్కారమువలననో ఉపఘాతమువలననో అతిశయ విశేషము గల పరిచ్ఛిన్న పరిమాణ ద్రవ్యమును బోధించినట్లు, సమస్తావయవ సమాహారరూపమగు మొత్తము పటమును బోధించుచు 'ఇదియును పటమే ద్రవ్యాంతరము గాదు' అని చెప్పుటకు అవయవమును గూడ బోధించును. ఈ విధముగనే 'ఘృతం భుక్తమ్' - అను వాక్యమున ఘృత శబ్దము ముఖ్యార్థకము. భుక్త శబ్దము మట్టుకు, సముదాయమునందు అవయవరూపము

నారోపించుటచే ప్రవృత్తము. భుక్త శబ్దము క్రియా శబ్దమయినను జాతి శబ్దములవలెనును, గుణ శబ్దములవలెనును పరిమితమగు భుజి క్రియను బోధించు అక్త పరిమాణ శబ్దము కానోపును.

ఔషధ సంస్కృతమయిన తైలము భుక్తమా కాదా యను సంశయము గలిగి నపుడు, భుక్తమేయని తెలియజేయుటకు 'తైలము భుక్తము' అనినపుడు సముదాయమునకును అవయవమునకును భేదము వివక్షితము గాదు గాన, సముదాయ శబ్దమగు భుక్త శబ్ద మవయవ మును బోధించుట యుక్తమే.

ఏతావతా పర్యవసితమయిన పరమార్థము ఇది – పటము ప్రధానముగా భావింప బడిన, శుక్ల శబ్ద మవయవబోధకము. శుక్లావయవము ప్రధానముగా దలంపబడిన, పట శబ్ద మపు డవయవ బోధకము. 'ఇది పంచాలమే దేశాంతరము గాదు' అని బోధింపదలంచి, 'పూర్వ పంచాలము' – అనిన నపుడు పంచాల శబ్దము ముఖ్యవృత్తి చేతనే అవయవమును జెప్పును. అర్థ పిప్పలీ అనుచోట పిప్పలీ శబ్దమును, తైలం భుక్తమనుచోట తైల శబ్దమును, అన్య నిషేధముకొరకు ప్రయుక్తములుగాన, ఏకదేశమును గూడ ముఖ్యవృత్తి చేతనే బోధించును. ఘృత శబ్దమును నీ విధముగనే అన్యవ్యావృత్తిపరమై ప్రయుక్తమయినపుడు, అవయవమును గూడ ముఖ్యవృత్తి చేతనే బోధించును. ॥487॥

అవతారిక— కాగా నీ విషయము నిట్లు ముగింపవచ్చును.

శ్లో॥ నివృత్త్యర్థా శ్రుతిర్యేషాం భేదస్తేష్వనపేక్షితః ।
ప్రదేశే సముదాయే వా గుణోఽన్యేషాం నివర్తకః ॥ 488

యేషాం శ్రుతిః = ఏ శబ్దముల ప్రయోగము, నివృత్త్యర్థా = ఇతరములను నివర్తించుటకు దలంపబడునో, తేషు = ఆ శబ్దములందు, భేదః = అవయవమా అవయవియాయను భేదము, అనపేక్షితః = గమనింప నక్కరలేనిది, ప్రదేశే = అవయవమునందు = ఏకదేశమునగాని, సముదాయేవా = మొత్తమునందుగాని, వర్తమానః గుణః = బోధకముగా నుండు గుణవాచక శబ్దము, అన్యేషాం = ఇతరములకు, నివర్తకః భవతి = తొలగించునది కాగలదు.

తాత్పర్య వివరణములు— అవయవ మాత్రబోధకము కానిండు, సముదాయ వాచకము గానిండు, అన్యనివృత్తికొరకు ప్రయోగింపబడిన గుణ శబ్దము, 'కృష్ణ' 'శుక్ల' - మున్నగునది, ఆభేదమును బాటింపకయే అన్యవ్యవచ్ఛేదమును జేయును. అట శబ్ద ప్రవృత్తి ముఖ్యమేయని తాత్పర్యము. ॥488॥

అవతారిక— "ఏవమయం సముదాయే బ్రాహ్మణశబ్దః ప్రవృత్తోఽవయవేఽపి వర్తతే" – అని దార్ష్టాంతిక భాష్యము. ఇది దృష్టాంతోపపాదనమునకు తరువాతి గ్రంథము దానిని వ్యాఖ్యానించుచున్నారు.

శ్లో॥ బ్రాహ్మణాధ్యయనే తత్రవర్తతే బ్రాహ్మణ శ్రుతిః ।
సాదృశ్యం తత్రదృష్టం హి క్షత్రియాధ్యయనాదిభిః ॥ 489

తత్ర='బ్రాహ్మణ వదధీతే క్షత్రియః' - అను వాక్యమునందు, బ్రాహ్మణ శ్రుతిః=బ్రాహ్మణ పదము, బ్రాహ్మణాధ్యయనే = బ్రాహ్మణుని అధ్యయన క్రియయందు, వర్తతే=ఉండును= దానిని బోధించుననుట, క్షత్రియాధ్యయనాదిభిః = క్షత్రియుని యధ్యయనము మున్నగు వానితో, సాదృశ్యమ్ = ఔపమ్యము, తత్ర = ఆ బ్రాహ్మణుని అధ్యయన క్రియయందు, దృష్టం హి = కనబడుచున్నది గదా.

తాత్పర్య వివరణములు— కొందరిట్లు చెప్పుదురు- "బ్రాహ్మణవదధీతే క్షత్రియః" అను వాక్యమునం దుపమేయవాచకమగు క్షత్రియ శబ్దమునకు సమీపమున, 'అధీతే' అని అధ్యయనవాచక శబ్దము వినబడుచున్నది. అందువలన బ్రాహ్మణ క్షత్రియుల సామ్యము అధ్యయన మూలకమని తెలియుచున్నది బ్రాహ్మణ శబ్దము, తపస్సు, పాండిత్యము, వేదాధ్యయనము మున్నగు గుణముల సముదాయమును బోధించునది అందధ్యయన మను నవయవమును మాత్రమే లక్షణచే నిట తెలియచేయుచున్నది. కనుక, అధ్యయన క్రియావాచియగు తృతీయాసమర్థ విభక్త్యంతమునకు బరముగ వతి ప్రత్యయమగునని యర్థము" - ఇది కొందరి మతము. ॥489॥

అవతారిక— ఈ మత ముపపత్తి గలది గాదు-

శ్లో॥ బ్రాహ్మణాధ్యయనే వృత్తిర్యదిస్యాద్ బ్రాహ్మణ శ్రుతేః ।
వక్తవ్యం కేన ధర్మేణ తుల్యత్వం క్రియయోరితి ॥ 490

బ్రాహ్మణ శ్రుతేః=బ్రాహ్మణ పదమునకు, బ్రాహ్మణాధ్యయనే=బ్రాహ్మణుని అధ్యయనము అను నర్థమున, వృత్తిః = వర్తించుట = బోధనమనుట, యదిస్యాత్ = కలిగినయెడల, క్రియయోః=ఆ రెండు అధ్యయన క్రియలకును, కేన ధర్మేణ=ఏ ధర్మముచేత, తుల్యత్వం ఇతి = సామ్యమని, వక్తవ్యమ్ = చెప్పవలసి యుండును

తాత్పర్య వివరణములు— బ్రాహ్మణ శబ్దమునకు అధ్యయనమే అర్థమయిన ఆ అధ్యయన క్రియల కుపమానోపమేయభావమని యవగతమగును గాని అధ్యేతలగు బ్రాహ్మణ క్షత్రియులకని సిద్ధింపదు. కాని ఔపమ్యమునకు నిమిత్తమయిన ధర్మము సౌష్ఠవము = సుష్ఠుత్వమని చెప్పవలసియుండును. ఆ సుష్ఠుత్వమునకు స్థానమయిన అధ్యయన మిపుడు సర్వనామ పరామర్శయోగ్యమయిన ద్రవ్యమువంటిదే అయి యిక దానికి క్రియాత్వముండదు. కాగా క్రియావాచి తృతీయా సమర్థమనుట పొసగదు. కావున నిది యుపపన్నము గాదు.॥490

అవతారిక— కావున నిట్లు చెప్పుట యుక్తము-

శ్లో॥ అధ్యేతరి యదా వృత్తిరుచ్యతే బ్రాహ్మణశ్రుతేః ।
నిమిత్తత్వం తదోపైతి క్రియైవాధ్యేతరి స్థితా ॥ 491

బ్రాహ్మణ శ్రుతేః=బ్రాహ్మణ శబ్దమునకు, అధ్యేతరి=అధ్యయన క్రియావిశిష్టుడగు బ్రాహ్మణునియందు, వృత్తిః = శక్తి, యదా ఉచ్యతే = చెప్పబడిన యెడల, తదా = అపుడు, అధ్యేతరి = అధ్యేతయగు నాతనియందు, స్థితా = ఉన్న, క్రియైవ = ఆ అధ్యయన క్రియయే, నిమిత్తత్వం = ఔపమ్యమునకు నిమిత్త భావమును, ఉపైతి = పొందును.

తాత్పర్య వివరణములు— శుద్ధ క్రియావాచియగు తృతీయము వతిప్రత్యయమునకు ప్రకృతిగా సంభవింపదు. కనుక క్రియావిశిష్ట ద్రవ్యవాచకము గ్రహింపబడును. బ్రాహ్మణ శబ్దము గుణసముదాయవాచకమని చెప్పబడినది. ఆ గుణములలో నొకటియగు అధ్యయన క్రియావ్యాపారమును ప్రధానముగా గలిగిన తృతీయాంత బ్రాహ్మణ శబ్దమునకు బరముగా వతిప్రత్యయము విధింపబడును. శబ్ద ప్రతిపాదితమగు అధ్యయనమే బ్రాహ్మణ క్షత్రియుల ఉపమానోపమేయభావమునకు నిమిత్త మవుడగును. సౌష్ఠవాది ధర్మాంతరములతో బనిలేదు. ॥491॥

అవతారిక— కొందరిట్లందురని చెప్పబడిన ఆ కొందరి మతమునందు వేరొక దోషమును గలదు. ఎట్లనిన—

శ్లో॥ సింహశబ్దేన సంబంధే శౌర్యమాత్రాభిధాయినా ।
చైత్రాత్ షష్ఠీ ప్రసజ్యేత యోగే శౌర్యాదిభిర్యథా ॥ 492

శౌర్యమాత్రాభిధాయినా = శూరత్వమను, గుణమును చెప్పు, సింహశబ్దేన = సింహ శబ్దముతో సంబంధే సతి = సంబంధము కలిగినపుడు, శౌర్యాదిభిః = శౌర్యపదము మున్నగు వానితో, యోగే యదా = సంబంధమున్నపుడు వలె, చైత్రాత్ = చైత్ర శబ్దముకంటె బరముగా, షష్ఠీ = షష్ఠీ విభక్తి, ప్రసజ్యేత = రావలసియుండును.

తాత్పర్య వివరణములు— 'బ్రాహ్మణవత్' అను స్థలమున బ్రాహ్మణ పదమునకు వాని యధ్యయనము మాత్రమే యర్థమయిన యెడల, ఆ విధముగనే, "చైత్రస్య సింహః" అను వాక్యమున సింహ శబ్దమునకు శూరత్వము మాత్ర మర్థముచెప్పి 'చైత్రుని శౌర్యము' అనుచోట చైత్రుని అనుషష్ఠికివలె నిచటను షష్ఠికి సాధుత్వమును గ్రహింపవలసి వచ్చును.

ఇక మా మతముననో - 'సింహ శబ్దము శౌర్యముగలది'యను నర్థమునందు వర్తించును గాన చైత్రః సింహః' అని సామానాధికరణ్య ముపపన్నమగును. ॥492॥

అవతారిక— ఏకీయుల మతమున అనగా "ఇతి ఏకే" అని చెప్పబడిన కొందరు అను వారి మతమున దోషాంతరమును గలదు.

శ్లో॥ బ్రాహ్మణాయేవ దాతవ్యం వైశ్యాయేత్యేవమాదిషు ।
సంప్రదానాదియోగశ్చ క్రియామాత్రే న కల్పతే ॥ 493

బ్రాహ్మణాయ ఇవ వైశ్యాయ దాతవ్యమ్ = బ్రాహ్మణు నుద్దేశించినట్లు వైశ్యు నుద్దేశించి దానము చేయవలెను, ఇత్యాదిషు = ఈ మున్నగు వాక్యములలో, క్రియా మాత్రే = కేవల క్రియయందు, సంప్రదానాది యోగశ్చ = ఉద్దేశ్యత్వము మున్నగు దాని సంబంధమును, న కల్పతే = ఘటింపదు.

తాత్పర్య వివరణములు— వతి ప్రత్యయ విషయమున బ్రాహ్మణ శబ్దమునకు అధ్యయన క్రియ మాత్రమే అర్థమయిన, 'బ్రాహ్మణవత్ వైశ్యాయదాతవ్యమ్' అను వాక్యమున సంప్రదాన సంబంధము క్రియా మాత్రమునకు సంబంధింపక పోవును. బ్రాహ్మణుని యధ్యయనమున కిచ్చుట సనంభవము గాదుగదా. అటులనే 'బ్రాహ్మణవత్ వైశ్యాదధ్యేతవ్యమ్' అను స్థలమున, అధ్యయనమున కపాదానత్వమును, 'బ్రాహ్మణవత్ వైశ్యే వర్తితవ్యమ్' - అనుచో అధ్యయునమునకు అధికరణత్వమును సంభవరహితములు. మా మతమున నైన, అధ్యయన క్రియావిశిష్టు డర్థముగాన నా ప్రయోగములన్నియు నుపపన్నములగును. ॥493॥

అవతారిక— మరియును ఆ 'కొందరు' అను వారి మతము భాష్యవిరుద్ధము.

శ్లో॥ క్రియామాత్రాభిధాయిత్వాదవ్యయేషు వతేర్నచ ।
పాఠః కదాచిత్కర్తవ్య స్తుల్యౌ పక్షావుభౌ యతః ॥ 494

వతేః = వతి ప్రత్యయము, క్రియామాత్రాభిధాయిత్వాత్ = క్రియను మాత్రమే జెప్పునది యగుటవలన, అవ్య యేషు = అవ్యయములలో, పాఠః = దానికి పాఠము, కదాచిత్ = ఎపుడును, న కర్తవ్యః = చేయనక్కర లేనిది, యతః = ఎందువలననగా, ఉభౌ పక్షౌ = రెండు పక్షములును, తుల్యౌ భవతః = సమానములే గాబట్టి.

తాత్పర్య వివరణములు— తేనతుల్యమను సూత్రమున 'క్రియా' అనునది ప్రకృత్యర్థ విశేషణమని యొక పక్షము. ప్రత్యయార్థమునకు విశేషణమని వేరొక పక్షము. అందు ప్రత్యయార్థ విశేషణమను పక్షమున నిట్లు లాఘవము కలదని భాష్యకారుడు చెప్పెను. "అపి చావ్యయేషువతేః పాఠోనకర్తవ్యో భవతి । క్రియాయామయం భవన్‌లింగ సంఖ్యాభ్యాం న యోక్ష్యతే'' అని. అవ్యయములలో వతి ప్రత్యయమును బఠింపనక్కరలేదు. ఇది క్రియను బోధించినపుడు లింగ సంఖ్యాయోగము కలది గాదుగదా' అని యర్థము.

ప్రకృత్యర్థమునకు క్రియ విశేషణమను పక్షముననైనను ఉపమాన శబ్దములు క్రియను మాత్రమే బోధించునవయిన క్రియకు తుల్యమైనది క్రియయే యగునుగాన నదియే వతి ప్రత్యయార్థమగును. అది సత్వరూపము కాదుగాన వతి ప్రత్యయాంతమునకు, లింగ సంఖ్య లుండనే యుండవు. అపుడు, స్వరాదులలో సత్త్వవచనముల నడుమ అవ్యయ సంజ్ఞకై వతి ప్రత్యయమును బఠించుట ఈ ప్రకృత్యర్థ విశేషణ పక్షమునను నక్కరలేదు. అట్టియెడ, ప్రత్యయార్థ విశేషణ పక్షమున కొక యుత్కర్షను గల్పించుచు, ఆ పక్షముననే అవ్యయములలో వతి ప్రత్యయమున పాఠ మనావశ్యకమగునను లాఘవమును భాష్యకర్త విశేషించి చెప్పవలెను ః

బ్రాహ్మణాది శబ్దములు క్రియను మాత్రమే చెప్పిన, క్రియయే ప్రత్యయార్థ ముభయపక్షములందును నగును. రెండు పక్షములును దుల్యములే.

ఇక మా పక్షమున క్రియావిశిష్టుడు బ్రాహ్మణ శబ్దార్థము గాన నుపమేయము గూడ క్రియావిశిష్టమే యగుట న్యాయ్యము. క్రియావిశిష్ట ద్రవ్యము సత్త్వము. లింగ సంఖ్యా యోగ్యము. కావున తద్వారణమునకై అవ్యయములందు పాఠము కర్తవ్యమగును. ప్రత్య యార్థమునకు క్రియ విశేషణమయిన నవ్యయములందు వతికి పాఠ మక్కరలేదని భాష్య తాత్పర్యము. ॥494॥

అవతారిక— కాబట్టి ఆ కొందరి మతము నిర్దోషముగాదని నిరూపించి స్వమతము నీ కారికలో వివరించుచున్నారు.

శ్లో॥ జహాతి జాతిం ద్రవ్యం వా తస్మాన్నావయవేస్థితః ।
క్రియాయాస్తు శ్రుతిర్యస్మాత్తద్వత్యర్థేఽవతిష్ఠతే ॥ 495

తస్మాత్ = అందువలన, అవయవే = ఏకదేశమునందు, స్థితః = ఉన్న శబ్దము, జాతిం = జాతినిగాని, ద్రవ్యం వా = ద్రవ్యమున అనగా వ్యక్తినిగాని, నజహాతి = విడిచిపెట్టదు, యస్మాత్ తు = ఏ కారణమువలన, క్రియాయాః = 'క్రియా' అను పదమునకు, శ్రుతిః = సూత్రమునందు శ్రవణము కలదో, తస్మాత్ = అందువలన, తద్వతి = ఆ క్రియగల, అర్థే = పదార్థమునందు = క్రియావిశిష్టము నందును, వర్తతే = నిలుకడగ నుండును.

తాత్పర్య వివరణములు— బ్రాహ్మణ శబ్దము క్రియను మాత్రమే బోధించుననిన దోషములుండుటచేత నది ఏకదేశ వాచకమయినను, ప్రవృత్తి నిమిత్తమయిన జాతిని విడు వదు. ఏకదేశవాచకముగాక సముదాయవాచకమే యగునపుడును జాతియే ప్రవృత్తి నిమి త్తము. ఆ విధముగనే అవయవబోధక మగునపుడును ద్రవ్యము వాచ్యము కాకపోదు.

'తేనతుల్యం' - అను సూత్రమునందు క్రియ ప్రకృత్యర్థమున కుపాధిగా నిర్దేశింప బడుటచే, బ్రాహ్మణ శబ్దము అధ్యయన క్రియావిశిష్ట ద్రవ్యమును బోధించునది గ్రాహ్యము. ద్రవ్య సహచారులగు నితర ధర్మములు విడిచిపెట్టబడినను ద్రవ్యము విడువబడదు ॥495॥

అవతారిక— ముఖ్య క్రియాభిధాయి తృతీయాంతమేదియు సంభవింపదు గనుక క్రియా భిన్నవాచులు తృతీయా సమర్థములు కావలెను. అందు ద్రవ్యవాచులును గుణవాచకము లును ప్రకృతులు కాకుండుటకు సూత్రమున 'క్రియా' అను పదము గ్రహింపబడినది. అయ్యది దాని ముఖ్యార్థమునకు సంభవము లేనందున క్రియావత్తును లక్షణచే బోధించునని యుపపా దించు చున్నారు.

శ్లో॥ అక్రియాణాం నివృత్త్యర్థాయ తశ్చాత్రక్రియా శ్రుతిః ।
క్రియోపలక్షితే తస్మాత్ క్రియాశబ్దః ప్రతీయతే ॥ 496

యతః చ = మరియు నే కార్యమువలన, అత్ర=ఇచ్చట అనగా తేనతుల్యమను సూత్రమున, క్రియాశ్రుతిః = 'క్రియా' అను పదము, అక్రియాణాం = క్రియగాని వానియొక్క, నివృత్త్యర్థా = తొలగింపుకొరకేర్పడిదో, తస్మాత్ = ఆ కార్యమువలన, క్రియాశబ్దః = ఆ 'క్రియ' అను శబ్దము, క్రియోపలక్షితే = లక్షణచే క్రియావిశిష్టమును బోధించునదిగా, ప్రతీయతే = ఊహింపబడుచున్నది.

తాత్పర్యము— అవతారికా గ్రంథమునందే స్పష్టీకృతము. ॥496॥

అవతారిక— క్రియావాచకములగునవి తృతీయా సమర్థములు సంభవింపనందు రేమి ? 'హోతవ్య' మున్నగునవి యట్టివి కలవుగదా యనిన—

శ్లో॥ హోతవ్యాదిషుయస్మాచ్చ క్రియాన్యా బ్రాహ్మణాదివత్ ।
అపేక్షణీయా శుద్ధేర్థే తస్మాత్ వృత్తిః న కస్యచిత్ ॥ 497

కిం చ = మరియు, యస్మాత్ = ఏ కారణమువలన, హోతవ్యాదిషు = హోతవ్యవత్ - మున్నగు స్థలములందు, బ్రాహ్మణాదివత్ = బ్రాహ్మణవత్ = మొదలగు చోట్లవలె, అన్యా క్రియా = వేరొక క్రియ, అపేక్షణీయా అస్తి = సాధారణ ధర్మముగ నపేక్షింపదగినదై యున్నదో, తస్మాత్ = ఆ హేతువువలన, శుద్ధే అర్థే = కేవల క్రియారూపమగు నర్థమునందు, కస్యచిత్ = ఏ పదమునకును, వృత్తిః = ప్రవృత్తి, న అస్తి = లేదు.

తాత్పర్య వివరణములు— ''బ్రాహ్మణవత్ అధీతే క్షత్రియః''-అను వాక్యమున నుపమానోపమేయ భావమునకు నిమిత్తముగ అధ్యయనము సాధారణ ధర్మమయినట్లు ''బ్రాహ్మణహోతవ్యేన తుల్యం క్షత్రియహోతవ్యమ్'' అను స్థలమునందు వేరొక క్రియా సాధారణ ధర్మముగ అపేక్షణీయమగుచున్నది. లేనిచో సమన్వయము కుదురదు. అపుడు సత్త్వవాచకములగు బ్రాహ్మణాది శబ్దముల వంటివే హోతవ్యాది శబ్దములును నగును. కాగా అందలి క్రియా శుద్ధమగు కేవల క్రియ కానేరదు. ఈ విధముగ, ముఖ్యార్థము సంభవింపదు గాన, సూత్రమునందలి 'క్రియా' అనునది లక్షణావృత్తిచే క్రియావత్తును బోధించుట న్యాయ్యమే. ॥497॥

అవతారిక— ఉపమేయగత క్రియయే ఉపమానమునందును సాధారణ ధర్మముగ నాశ్రయింపబడు నంటిరి. అపుడు బ్రాహ్మణ శబ్ద మవయవబోధకమని కల్పింపవలసిన పనియేమి ? సముదాయబోధకమే అయినను సముదాయస్థమగు క్రియను ఆకాంక్షింపవచ్చును గదా యనిన—

శ్లో॥ సర్వం వాప్యేకదేశో వా యస్మిన్నాశ్రీయతే క్వచిత్ ।
విశేషవృత్తిం తం సర్వమాహుర్భేదే వ్యవస్థితమ్ ॥ 498

క్వచిత్ యస్మిన్ = ఎచ్చటనైనను ఏ పదమునందైనను, సర్వం వా అపి = సముదాయ

మంతయు గూడిగాని, ఏకదేశః వా = లేదా అవయవ మాత్రముగాని, ఆశ్రీయతే = ఆశ్రయింప బడునో, తం సర్వం = ఆ పదము నంతను, భేదే = విశేషమునందు, వ్యవస్థితం = బోధకమైయున్న దానిని, విశేష వృత్తిం = విశిష్టార్థ వాచకమునుగా, ఆహుః = చెప్పుదురు.

తాత్పర్య వివరణములు— అవయవమాత్రబోధక శబ్దమును సముదాయవాచక శబ్దమును గూడ విశిష్టార్థమును బోధించు శబ్దమే అందురు. ఏ శబ్దమైనను విశేషపరమే యగుట కారణము. విశేషమనగా ఇతర నివర్తకము గదా అవయవమును బోధించినపుడు సముదాయమును నివర్తించును గాన నది విశేషపరము. సముదాయమున బ్రయోగించిన, అవయము వ్యావర్తింపడును గాన నపుడు నవి విశేషపరమే. అవయవమొకటి వేరొకటి యవయవమును నివర్తింపజేసినపుడు విశేషమని వ్యవహరింపబడును. అట్లే సముదాయ మవయవ వ్యావర్తకమయినపుడును విశేషపరమగును. సముదాయమాత్రమును బోధించినను అవయవమాత్రమును బోధించినను, సమస్త భేదములచే రూపితమగు నర్థమునే నిరూపించును శబ్దములకు గుణసముదాయ పర్వత మిట్లు సమర్థితము.

పర్యవసాన మేమనగా గుణసముదాయమును బోధించినపుడు ఆ సముదాయమే ప్రధానము. అవయవముల భేదము తెలియని మొత్తమే అపుడు అభిధేయము. వికల్పముగా గాని సముచ్చయము గాని అవయవముల ప్రతీతియే యుండబోదు. వృక్షమున్నదనుకొనుడు. అది, మొదలు, కాండము కొమ్మలు మొదలగు అవయవముల సముదాయము కాని ఆ శబ్దము వాని మొత్తమునే బోధించును గాన నేకవచనాంతముగనే ప్రయోగింపబడుచున్నది. కాగా సముదాయము చెప్పబడినపుడు తదంతర్గతముగ నవయవము వాచ్యమయినను దాని నిష్కృష్ట రూపముతో వాచ్యము కాలేదు గాన, దానివలన నుపకారము లభింపదు. సముదాయము నుండి ఆపోద్ధారము చేయబడిన అవయవము బ్రాహ్మణ శబ్దమున కర్థమనవలెను. అనగా వ్యాపార విశిష్టమగు ద్రవ్యము = వ్యక్తి, అనుట. వ్యాపారమే క్రియ. కనుక క్రియా ముఖమున నుపమానోపమేయములకు సాదృశ్యమపు డుపపన్నమగును. ॥498॥

అవతారిక— శబ్దము లవయవములను బోధించినను సముదాయమును బోధించినను విశేషవచనములే యగునెడల నిక సామాన్యవచనత్వ మనగా నేమగును? అనిన—

శ్లో॥ సముచ్చయో వికల్పో వా ప్రకారాః సర్వ ఏవవా ।
విశేషా ఇతి వర్ణ్యంతే సామాన్యం వా వికల్పితమ్ ॥ 499

సముచ్చయః వా = అవయవముల సముచ్చయముగాని, వికల్పః వా = వాని వికల్పము = ఇదియే అదియోగాని, సర్వే ప్రకారాః ఏవవా = లేదా ఆ ఈ ప్రకారములన్నియుగాని, అవి కల్పితం = ప్రధానముగ వాచ్యమయిన, సామాన్యం వా = సామాన్యమయిననుగాని, విశేషాః ఇతి = విశేషములేయని, వర్ణ్యన్తే = చెప్పబడుచున్నవి.

తాత్పర్య వివరణములు— వేరు వేరు రూపములుగల అనేకములగు నర్థములు

సమకక్ష్యముగ నభిహితములయినపుడది సముచ్చయము. అవి పర్యాయముగ జెప్పబడిన, వికల్పమగును. ప్రకారములనగా ద్రవ్యము ప్రధానముగా నుండి, దానికి విశేషణములుగా నున్న ధర్మములు.

కాగా, సమప్రాధాన్యం, పర్యాయము, గుణప్రధాన భావము— ఈ మూడు ప్రకారములు సంభవములు. అవి మూడును విశేషములే యనబడును. విశేషమనగా నితర వ్యావర్తకము గదా. వీనిలో నొకటి అభిధావిషయమయినపుడు రెండవది నివర్తితమచుగుండును. ఇక వికల్పరహితమగు సామాన్య మభిహితమయినపు డా సామాన్యమును విశేషమేయగును. ఎందువలన ననగా, విశేషము లనేకములు సామాన్య రూపముచే నుపరక్తములయి చెప్పబడినపుడు, వాని వాని ప్రతినియత విశేషమున వ్యావర్తించునుగదా. "సామాన్య మపియథా విశేష స్తద్వత్" - అని మహాభాష్యమున కిదియే భావము. విశేషములన్నియు నేక సామాన్యానువిద్ధములయియే క్రియతో నన్వయించును.

అవతారిక— ఉపమితి క్రియలో అనగా నుపమానోపమేయ భావవర్ణనములో, గుణమునకును, క్రియకును నుపయోగము గలదుగదా. అపుడు బ్రాహ్మణాది శబ్దములు సముదాయ వచనములయిన వాని యుపకార మెట్లు కలుగును - అనిన.

శ్లో॥ న హి బ్రాహ్మణ ఇత్యత్ర భేదః కశ్చిదపాశ్రితః ।
అపాకృతో వా తేనాయం సముదాయే వ్యవస్థితః ॥ 500

బ్రాహ్మణః ఇత్యత్ర = 'బ్రాహ్మణః' అనునపుడు, కశ్చిత్ భేదః = ఏ విశేషమును, న అపాశ్రితః హి = ఆశ్రయింపబడలేదు గదా, అపాకృతః వా భవతి = ఇంకొక విశేషము నివారింపబడను లేదు, తేన, అయం = అందువలన నీ బ్రాహ్మణ శబ్దము, సముదాయే వ్యవస్థితః = సముదాయవాచకముగనే నిశ్చితము.

తాత్పర్య వివరణములు— ఒక నియతభేదము ప్రతిపాదింపబడినచో నింకొకటి నివారితమగును అపుడు సముదాయ వచనత్వము లేకపోవును. ఇచట నట్లు ఒక విశేషమును పరిగ్రహించి వేరొక దానిని త్యజించుట లేదాయె. కనుక సముదాయ వచనత్వమునకు భంగమేమి ? బ్రాహ్మణ శబ్దము ప్రకరణముతో బనిలేకయే సమూహమునే చెప్పుచున్నది. కావున క్రియయును, గుణములును శబ్దార్థములయి ఉపమితి క్రియ కుపకారములు అగును. ॥500॥

అవతారిక— అచట సముదాయవాచకమున కవయవబోధకత్వము యత్నసాధ్యము

శ్లో॥ క్రియాత్వాశ్రీయతేయస్మిన్ న భేదోధ్యవసీయతే ।
తథాన్యథా సర్వథా చేత్యప్రయోగే న విద్యతే ॥ 501

యస్మిన్ = ఏ ఉపమితి వ్యాపారమునందు, క్రియాతు = క్రియ అయితే, ఆశ్రీయతే = ఆశ్ర

యింపబడుచున్నదో, సః భేదః = అచ్చట ఆ, క్రియ అను విశేషము, అధ్యవసీయతే = శబ్దవాచ్యముగా నిశ్చయింపబడును, అప్రయోగే = (ఎందువలనన) శబ్దాంతరము ప్రయోగింపబడనపుడు, తథా = ఆ విధముగ, సః = ఆ నియతమగు ప్రకారము, అన్యథా = వేరొకటిగ గాని, సర్వథా చ ఇతి = సర్వముగ గాని, న విద్యతే = సంభవింపదు.

తాత్పర్య వివరణములు— ఉపమించుటయను క్రియలో, అధ్యయనాది క్రియ సాధారణ ధర్మముగ నపేక్షింపబడినపుడు, సముదాయ వృత్తమగు బ్రాహ్మణ శబ్దమునకు, ఆ క్రియయే వాచ్యముగా నిశ్చయింపబడును. "బ్రాహ్మణవదధీతే క్షత్రియః" అను వాక్యము నందు అధ్యయనము సాధారణ ధర్మముగ నాశ్రయింపబడినది. కావున బ్రాహ్మణ పదమునకు 'అధీతే' - అను పదముయొక్క సన్నిధానమువలన. బ్రాహ్మణాధ్యయన క్రియ యర్థము. శబ్దాంతరము ప్రయోగింపబడనిచో, నది వేరొకటి గాని, సర్వధర్మములు గాని సామాన్య ధర్మములగుట సంభవింపదు. అపుడు శబ్దాంతరము ప్రయుక్తమా కాదా యని యాలోచింపకయే, ప్రసిద్ధ స్వార్థమగు, గుణ సముదాయమును ఆ శబ్దము బోధించును కావున సముదాయ శబ్దమున కవయవబోధకత్వ ముపమావిషయమున, యత్నసాధ్యము. ॥501॥

అవతారిక— ఆ యత్నమునే చెప్పుచున్నారు—

శ్లో॥ ఉపమానే క్రియావృత్తిముపమేయే క్రియా శ్రుతిః ।
ప్రత్యాయయన్తీ భేదస్యకరోతీవ పదార్థతామ్ ॥ 502

ఉపమేయే క్రియాశ్రుతిః = క్షత్రియపదము దగ్గర, అధీతే అను పదము నుచ్చరించుట, ఉపమానే క్రియావృత్తిం = బ్రాహ్మణ పదమునందు క్రియావాచకత్వమును, ప్రత్యాయయన్తీ = తెలియచేయుచున్నదై, భేదస్య = అవయవమునకు = క్రియ కనుట, పదార్థతాం = ఉపమాన పదమున కర్థమగుటను, కరోతీవ = కల్పించునదివలె నుండును.

తాత్పర్య వివరణములు— బ్రాహ్మణశబ్ద ముపవాచకము. క్షత్రియశబ్ద ముపమేయ బోధకము. 'అధీతే' అను క్రియాపదము, ఉపమేయ సమీపమున వినబడుచున్నది. దానివలన ఉపమానము గూడ క్రియాబోధకమని సూచించుచున్నది ఉపమానోపమేయ భావము సాధారణ ధర్మప్రయుక్తముగాన, నుభయత్ర క్రియయే సాధారణము గావలెను. కావున బ్రాహ్మణ శబ్దము తదేకదేశమగు తత్క్రియను బోధించునని నిశ్చితమగుచున్నది. ఉపమేయగతమగు క్రియాపద ముపమానగత క్రియను జెప్పదు. కాని దానివలన నుపమాన పదమును క్రియావాచకమని నిశ్చయింపవలసి యుండునుగాన, 'కరోతీవ' - అని ఇవ శబ్దము ప్రయోగింపబడినది. ॥502॥

అవతారిక— క్రియల కుపమానోపమేయభావము తలంపబడినపుడును, శుద్ధ క్రియ కది సంభవింపదు గాన వ్యాపార విశిష్ట ద్రవ్యవాచకమగు తృతీయా సమర్థముకంటె పరముగనే 'వతి' ప్రత్యయమగునను చున్నారు.

శ్లో॥ వ్యాపారేణేవ సాదృశ్యే వ్యాపారస్య వివక్షితే ।
క్రియావద్వచనాచ్ఛబ్దాత్ ప్రత్యయ ప్రతిపాద్యతే ॥ 503

వ్యాపారస్య = క్రియకు, వ్యాపారేణ ఏవ = క్రియతోడనే, సాదృశ్యే = సామ్యము, వివక్షితే సతి = చెప్పదలంచినపుడు, క్రియావద్వచనాత్ = క్రియావిశిష్ట ద్రవ్యవాచకమగు, శబ్దాత్ = శబ్దమునకు బరముగ, ప్రత్యయః ప్రతిపాద్యతే = ప్రత్యయము విధింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ''బ్రాహ్మణాధ్యయనే న తుల్యం క్షత్రియాధ్యయనమ్'' = 'బ్రాహ్మణుని అధ్యయన క్రియతో క్షత్రియుని యధ్యయన క్రియ తుల్యము' అని చెప్పదలంచినపుడు సుష్ఠుత్వమను సాధారణ ధర్మమున కాశ్రయమయిన 'అధ్యయనము అను క్రియ ద్రవ్యమువంటిదే ప్రాతిపదికార్థము. కనుక ఇపుడును, సూత్రమునందలి 'క్రియా' అను పద ముపలక్షణము గాన తద్విశిష్ట ద్రవ్యవాచకమునకు బరముగనే వతి ప్రత్యయ మగును. ॥503॥

అవతారిక— ద్రవ్యవాచకమునకు బరముగ వతి ప్రత్యయము ప్రవర్తించినను అది క్రియ ప్రధానముగా గలదియే యగును. అసత్త్వభూతమగు భావమే క్రియ. అసత్వభూతత్వమనగా లింగసంఖ్యల యన్వయమునకు యోగ్యత లేకుండుట. కనుక వతి ప్రత్యయాంత మట్టిదియే యగును గదా యిక దానికి అవ్యయత్వము కొరకు స్వరాదులందు పాఠ మెందులకు ? అని ప్రశ్న కలుగుననిన చెప్పుచున్నారు.

శ్లో॥ క్రియావతోఽపిసాదృశ్యే వక్తుమిష్టే క్రియావతా ।
అధ్యేతా బ్రాహ్మణ ఇవప్రత్యయో న నివర్తతే ॥ 504

క్రియావతః = క్రియావిశిష్టమునకు, క్రియావతా = క్రియావిశిష్టముతో, సాదృశ్యే = సామ్యము, వక్తుమిష్టే అపి = వివక్షితమయినపుడును, అధ్యేతా బ్రాహ్మణఇవ = 'బ్రాహ్మణునివలె జరుపువాడు' అను నర్థమందు, ప్రత్యయే = 'బ్రాహ్మణవత్ అధ్యేతా క్షత్రియః' అని, న నివర్తతే = వతి ప్రత్యయము తప్పదు

తాత్పర్య వివరణములు— ''బ్రాహ్మణవదధీతే క్షత్రియః'' అను ప్రయోగ మిష్టము. '''బ్రాహ్మణవదధ్యేతా క్షత్రియః'' అనునది అనిష్టప్రయోగము. బ్రాహ్మణ క్షత్రియుల సాదృశ్యమధ్యయన క్రియాద్వారకము గనుక నిపుడా ప్రయోగమునందును వతి ప్రత్యయము ప్రాప్తమగుచున్నది. వతి ప్రత్యయాంతము ద్రవ్యము ప్రధానముగా గలది కావున సత్త్వవచనము లింగసంఖ్యలు కలది కావలసియుండును. అందువలన స్వరాదులందు పాఠమును గల్పించి అవ్యయత్వము విధింపబడుచున్నది. ॥504॥

అవతారిక— క్రియావంతముల కుపమానోపమేయభావము క్రియాద్వారకమే అయినపుడు వతి ప్రత్యయమేల రారాదు ? అనిష్ట మెట్లగుననిన—

శ్లో॥ అధీతేతుల్య ఇత్యేవం పుంలింగేన విశేషణమ్ ।
క్రియావతి, క్రియాయాం తు తుల్యశబ్దే నపుంసకమ్ ॥ 505

క్రియావతి = క్రియావిశిష్టమునందు, 'అధీతేతుల్యః' = బ్రాహ్మణతుల్యుడై, ఇత్యేవం = అని ఇట్లు, పుంలింగేన = పుంలింగ తుల్య శబ్దముచే, విశేషణం భవతి = విశేషించుట కలదు, క్రియాయాం తు = క్రియయందైన, తుల్యశబ్దే = తుల్య శబ్దమునందు, నపుంసకం = నపుం సకమను, లింగం = లింగము, భవతి = (అగపడుచు) ఉన్నది

తాత్పర్య వివరణములు—క్రియావంతములగు సాదృశ్యమును ప్రతిపాదింప దలంచి విధింపబడిన వతి ప్రత్యయము సత్త్వ (ద్రవ్యరూపముగాన నచట తుల్య శబ్దము, - "బ్రాహ్మణే న తుల్యః అధీతే క్షత్రియః" అని యిట్లు పుంలింగముగ విగ్రహవాక్యమున బ్రయోగింపబడుచున్నది. అపుడు సామ్యము క్రియా నిమిత్తమేయని అనగా అధ్యయన మూలకమేయని నియతముగ ప్రతీతము గాదు. ధర్మాంతరముచే బ్రాహ్మణ క్షత్రియులకు సామ్యము అనియు చెప్పనగును. కావున వతి ప్రత్యయము రాదు సూత్రముచే, క్రియచే సాదృశ్యము ప్రతిపాద్యమయినపుడే అది విధింపబడినది. కావున తుల్య శబ్దము వాక్యమున క్రియను బోధించునుగాన, నది అసత్వభూతమగుటవలన, దానికి బరముగ లింగ సర్వనామ మగు నపుంసకలింగ ప్రత్యయమే వచ్చును. అపుడు "బ్రాహ్మణే న తుల్యమధీతే క్షత్రియః" అనుటవలన వారికి సామ్యము అధ్యయన క్రియాకృతమేయని నియతముగ దెలియవచ్చును. ఆ విగ్రహమున వతి ప్రత్యయమును వచ్చును. ఈ పక్షమునందు, క్రియావిశేషణము సత్త్వ భూతమయినను విశేష్యమగు క్రియయొక్క ధర్మమగు అసత్త్వ స్వభావతయును వర్తించును గాన లింగవిశేషమేదియు లేనేలేదు. కాన వతి ప్రత్యయమునకు అవ్యయములందు పాఠ మనావశ్యకమని భావము. ॥505॥

అవతారిక— 'తేనతుల్య'మిత్యాది సూత్రమునందు 'క్రియా' అను పదము ప్రకృ త్యర్థమునకు విశేషణమని నిర్ణయించి, ఆ పక్షమున నిట్లు దోష ముద్భావింపబడినది. "యది తర్హి తృతీయా సమర్థం విశేష్యతే ప్రత్యయార్థో అవిశేషితో భవతి. తత్రకోదోషః ? తృతీయా సమర్థాత్ క్రియావాచినో గుణతుల్యత్వేపి ప్రత్యయః ప్రాప్నోతి - పుత్రేణ సహతుల్యః స్థూలః పుత్రేణ సహతుల్యః పింగళః ।" - అని = క్రియ తృతీయా సమర్థమున కర్థమయినపుడు' తుల్యమయినది' అను ప్రత్యయార్థమునకు క్రియనుబట్టి కాక, గుణమునుబట్టి సామ్యమున్నపు డును వతి ప్రత్యయము, 'పుత్రవత్ పితాః స్థూలః' అనియు, పుత్రవత్ పితాపింగళః అని యును నుండవలసి వచ్చునని భాష్యమున నాక్షేపింపబడినది. అది యెట్లుపపన్నమగును ? పుత్రశబ్దము క్రియావాచి కాదుగదా యని శంక.

శ్లో॥ ప్రకృత్యర్థే విశిష్టేఽపి ప్రత్యయార్థా విశేషణాత్ ।
పుత్రేణతుల్యః కపిల ఇతివృత్తిః ప్రసజ్యతే ॥ 506

ప్రకృత్యర్థే = వతి ప్రత్యయ ప్రకృతి యర్థము, విశిష్టే సత్యపి = 'క్రియా' అను పదముచే విశేషింపబడినను, ప్రత్యయార్థా విశేషణాత్ = ప్రత్యయముయొక్క అర్థము విశేషింపబడ నందున, 'పుత్రేణతుల్యః కపిలః' ఇతి = అను నీ విగ్రహము వివక్షితమయినపుడు, వృత్తిః, ప్రసజ్యతే = "పుత్రవత్ కపిలః" = అని తద్ధిత ప్రత్యయము రావలసి వచ్చుచున్నది.

తాత్పర్య వివరణములు— సూత్రమున నొక్కటియే క్రియాశబ్దము కలదు. అది ప్రకృత్యర్థమునకు విశేషణమనిన, అంతతో నది చరితార్థముగాన నిక ప్రత్యయార్థమగు తుల్యత్వము నది విశేషింపజాలదు. కపిలత్వము గుణము. క్రియ కాదు. ఆ గుణమునుబట్టి పితకుతౌల్యము వివక్షితమయినపుడును తద్ధితవృత్తియగు వతి ప్రత్యయము రావలసివచ్చునని ఆక్షేప భాష్య తాత్పర్యము. ॥506॥

అవతారిక— 'పుత్రశబ్దము క్రియావాచి కాదుగదా. ఆ యాక్షేప మెట్లుపపన్న మగును' అను శంకకు సమాధానముగా క్రియావాచిత్వ మిట్లు సమర్థితము.

శ్లో॥ యాః పుత్రే రూఢసంబంధాః క్రియాః లోకే వివక్షితాః ।
తాభిః క్రియావతః పుత్రాత్ గుణతుల్యే వతిర్భవేత్ ॥ 507

పుత్రే = పుత్ర శబ్దయొక్క అర్థమునందు, యాః = ఏ, రూఢసంబంధాః = నిరూఢమగు సంబంధముగల, క్రియాః = క్రియలు, లోకే = లోకమునందు, వివక్షితాః = వివక్షింపబడు చుండునో, తాభిః = వానిచే, క్రియావతః = క్రియా విశిష్టార్థ వాచకమగు, పుత్రాత్ = పుత్ర శబ్దముకంటె బరముగ, గుణతుల్యే = గుణముచే సామ్యమున్నపుడును, వతిః భవేత్ = వతి ప్రత్యయము రావలసి యుండును.

తాత్పర్య వివరణములు— తండ్రి యాజ్ఞను పాలించుట, వేద వేదాంగాధ్యయనము చేసియుండుట సంతానమును గలిగియుండుట, సదాచారమును పాలించుచుండుట – ఈ క్రియలు గలవాడు పుత్రుడందురు. అవి లేనివాడు పుత్రుడే కాడని లోకమున వ్యవహరించుట కలదు. నియోగకరణము, మున్నగు పైన చెప్పిన క్రియలు పుత్ర శబ్దార్థమున నంతర్భూత ములు. కనుక నిదియు సముదాయవచనము. అందున్న క్రియలనుబట్టి క్రియావచనమగును. కావున వతిప్రత్యయాపత్తి కలదు, అని భావము. ॥507॥

అవతారిక— "పున్నామ్నో నరకాద్యస్మాత్త్రాయతే పుత్త్ర ఇత్యతః" – అని మను స్మృతి. 'పుత్' అను నరకమున తండ్రిని బడకుండ రక్షించువాడు గాన పుత్త్రుడగును అని యర్థము. పుత్ర శబ్దమునకు ప్రవృత్తి నిమిత్తమగు ముఖ్య క్రియ 'పవనము' అనగా రక్షణ మనుట. దానిని గ్రహింపక సహచారులుగా నుండు 'నిదేశ స్థానము' – అనగా తండ్రి యాజ్ఞ యందుండుట మున్నగు క్రియల నెందుకు పరిగ్రహింపవలెను ? అనిన సమాధానమును జెప్పు చున్నారు.

శ్లో॥ అంతర్భూతం నిమిత్తం చ రూఢిశబ్దేషు యద్యపి ।
క్రియాస్తు సహచారిణ్యో రూఢాః సన్తి పదార్థవత్ ॥ 508

రూఢి శబ్దేషు = రూఢి శక్తిచే బోధకములగు వానియందు, నిమిత్తం చ = ప్రవృత్తి నిమిత్తమగు క్రియ గూడ, యద్యపి అంతర్భూతమ్ = చేరియే యుండుననుకొనుడు, తథాపి = అయినను, సహచారిణ్యః క్రియాస్తు = ఆ ప్రవృత్తి నిమిత్తముతో బాటుగ నుండు క్రియలును, పదార్థవత్ = పదవాచ్యమగు ద్రవ్యమువలె, రూఢాః సన్తి = ప్రసిద్ధములయినవి కలవు.

తాత్పర్య వివరణములు— రూఢి శబ్దములను, అందుండు అవయవముల యర్థమునకు పొందుబాటు లేకున్నను, వ్యుత్పాదనమునకు మాత్ర మా అవయవార్థమును గ్రహించి వ్యుత్పాదింతురు అంతియేగాని అవయవార్థమునకు అందు అనుగతి ఎంతమాత్రము నుండదు పుత్ర శబ్దమునందుగూడ, పవనక్రియ అంతరంగమయినను, దానికి, అర్థక్రియాకారిత్వము లేదు. కావున ప్రసిద్ధములగు నితరక్రియలే శబ్దార్థముగా నట గ్రహింపబడును. నిదేశ స్థానము మున్నగు క్రియ లట్టివి. క్రియాపదము ప్రకృత్యర్థమునకు విశేషణమయినపుడు క్రియావత్తును లక్షణచే బోధించునుగాన బ్రాహ్మణాది శబ్దములకు వతిప్రత్యయము సమర్థనీయ మగును. కాని ప్రత్యయార్థమును క్రియయే కావలెనని సిద్ధింపలేదు కాన గుణతౌల్యమున్నపుడును తదాపత్తి అనివార్యమని భావము ॥508॥

అవతారిక— అట్లైన ప్రత్యయార్థమునకే విశేషణమగుగాక యనుచున్నారు.

శ్లో॥ క్రమంతు యదిబాధిత్వా ప్రత్యయార్థ విశేషణమ్ ।
ప్రధానానుగ్రహాత్ సామ్యాత్ విభక్తేశ్చావతిష్ఠతే ॥ 509

కిం తు = కాని (క్రియా అనునది), ప్రధానానుగ్రహాత్ = ప్రధానమగు ప్రత్యయార్థమునకు విశేషణమగును గావునను, విభక్తేః సామ్యాత్ చ = ప్రథమావిభక్తి సామ్యముండుటవలనను, క్రమం బాధిత్వా = స్థానమను క్రమమును, ఆదరింపక, ప్రత్యయార్థ విశేషణం = ప్రత్యయార్థమునకు విశేషణముగా, అవతిష్ఠతే యది = "తుల్యం యత్ సాక్రియా" అని నిలచిన యెడల.

తాత్పర్య వివరణములు— 'తేనతుల్య మిత్యాది సూత్రములో' 'తేన' - అనునది మొదటి పదము. అన్వయ బోధక ప్రమాణములలో స్థానమనునది యొకటి. స్థానమనగా క్రమము. ఆ ప్రమాణమువలన 'క్రియా' అను పదము 'తేన' అను ప్రకృత్యర్థ బోధక తృతీయా సమర్థమునకు విశేషణముగాదగియున్నది. కాని ఆ ప్రమాణమును బాధించి, అనగా అది గాదని, 'తుల్యమ్' అను పదమునకు విశేషణము కావలెను. ప్రకృత్యర్థ ప్రత్యయార్థములలో ప్రకృత్యర్థముకంటె ప్రత్యయార్థము ప్రధానము గదా. మరియు, 'తుల్యం', 'క్రియా' - అను పదములు రెండును సమాన విభక్త్యంతములు. కావున విభక్తి సామ్యము ప్రకటముగ శబ్దబోధ్యము. క్రమము శబ్దబోధ్యము గాదు. సామానాధికరణ్యము సంబంధము.

ఇట్లుండ, అధ్యాహారముచేసి 'యత్ తృతీయా సమర్థం సా క్రియాచేత్' - అని ఇట్లన్వయమును కల్పించుట యుక్తముగాదని తాత్పర్యము. ॥509॥

అవతారిక— కాని అధ్యాహార కల్పనావశ్యకత ప్రత్యయార్థమునకు క్రియ విశేషణమను పక్షమునను తప్పదనుచున్నారు

శ్లో॥ ప్రకృతేరవిశిష్టత్వాత్ క్రియాతుల్యే ప్రసజ్యతే ।
పుత్రాదౌ గుణశబ్దేభ్యః పూర్వోక్తస్య విపర్యయే ॥ 510

ప్రకృతేః = వతిప్రత్యయ ప్రకృతి, అవిశిష్టత్వాత్ = 'క్రియా' అను దానిచే విశేషింపబడ నందున, గుణశబ్దేభ్యః = గుణవాచకములగు స్థూలమున్నగు శబ్దములకంటె, క్రియాతుల్యే = క్రియచే సమానుడగు, పుత్రాదౌ వాచ్యే = పుత్రుడు మున్నగు వ్యక్తి అర్థమయినపుడు, పూర్వోక్తస్య విపర్యయే = "పుత్రేణతుల్యః స్థూలః" అను నుదాహరణమునకు విరుద్ధముగ, ప్రసజ్యతే = "స్థూలేన తుల్యః పుత్రః" - అని ప్రయోగము ప్రసక్తమగుచున్నది.

తాత్పర్య వివరణములు— 'క్రియా' - అనునది యొక్కటియే ప్రకృత్యర్థమునకును ప్రత్యయార్థమునకును గూడ విశేషణమగుట సంభవముగాదు గాన ప్రత్యయార్థ విశేషణ పక్షమున, ప్రకృతి విశేషింపబడదు. అపుడు ప్రకృతి క్రియావాచకము కావలెనను నిర్బంధము లేదు. 'స్థూలమయిన తండ్రితో పుత్రుడు, అజ్ఞావర్తిత్వము మున్నగు క్రియచే తుల్యుడు' అను నర్థమును వివక్షించినపుడు, ప్రకృత్యర్థ విశేషణ పక్షమునందలి యుదాహరణమునకు విరుద్ధముగ "స్థూలవత్ పుత్రః" - అను ప్రయోగము ప్రసక్తము ఈ విషయము మహాభాష్యమున నిట్లుపపాదింపబడినది— "ఏవమపి తృతీయా సమర్థమవిశేషితం భవతి । తత్రకో దోషః । తృతీయా సమర్థాద క్రియావాచినః క్రియాతుల్యేపి ప్రత్యయః ప్రాప్నోతి"— అని. ॥510॥

అవతారిక— క్రియావాచికాని తృతీయా సమర్థముకంటె పరముగా క్రియాతౌల్య మున్నపుడు ప్రత్యయము రావలసియుండునని మాత్రమే మహాభాష్యమున జెప్పబడినది ఉదాహరణము చూపబడలేదు. ఉదాహరణ మూహ్యమని ప్రతీపమునందు గలదు. కావున "స్థూలేన తుల్యోయాతి" అనునది = అనగా నచట 'స్థూలవద్యాతి' అనునది యుదాహరణ మని చెప్పవలెను. అపుడు 'యాతి' అను నాఖ్యాతమువలన, క్రియావిశిష్టమగు నుపమేయము ప్రతీతమగుట కవకాశముండును అని కొందరందురు. కాని అదియు సరిపడదు. ఎందువల ననగా—

శ్లో॥ స్థూలేనతుల్యోయాతీతి బహిరంగా క్రియాశ్రుతిః ।
అనిమిత్తం వతేస్తుల్యం యాతీత్యత్రేష్యతేవతిః ॥ 511

'స్థూలేనతుల్యః యాతి' ఇతి = 'స్థూలునితో తుల్యుడై నడచుచున్నాడు', బహిరంగా, క్రియా శ్రుతిః = అనిన, క్రియాపద శ్రవణము బహిరంగము, వతేః = కావున వతిప్రత్యయమునకది,

అనిమిత్తమ్ = నిమిత్తము కానేరదు, 'తుల్యం యాతి' = 'స్థూలునితో తుల్యముగా పోవు చున్నారు' ఇతి అత్ర = అనుచో నపుడా ప్రయోగమున, వతిః = వతిప్రత్యయము, ఇష్యతే = సమ్మతమగును

తాత్పర్య వివరణములు— 'స్థూలేనతుల్యః యాతి' అని యొక వాక్యము - 'స్థూలేన తుల్యం యాతి' అని వేరొక వాక్యము. అందు మొదటి వాక్యమున తుల్య శబ్దము పుంలింగముగా నుపయోగింపబడియున్నది. కావున, ధర్మాంతరమునుబట్టి స్థూలునితో తుల్యుడైన దేవదత్తుడు వెళ్ళుచున్నాడు అనియే అపుడర్థమగును. నియతముగ క్రియా తౌల్యము స్ఫురింపదు. 'స్థూలేన' 'తుల్యః' - అను రెండు పదములకును పరస్పరాన్వయమును చేయు సమయమున వతిప్రత్యయమునకు నిమిత్తమగు క్రియ ఏదియు సన్నిహితముగ లేదు. స్థూల శబ్దము గుణవాచకము. తుల్య శబ్దము పుంలింగమగుటచే క్రియా విషయము కాదాయె. ఇక వానికి సంబంధము నిష్పన్నమయిన వెనుక, 'యాతి' అను పదమువలన క్రియ ప్రతీత మయినను నది బహిరంగమగుటవలన నుపమానోపమేయ సంబంధమునకు నిమిత్తము కాదు. కాగా, "స్థూలేన తుల్యః యాతి" అనునది గూడ "స్థూలేన తుల్యః పుత్రః" అను దాని వంటిదే.

"స్థూలేన తుల్యం యాతి" అనిన, 'యాతి' అను క్రియావాచకమునకు, నపుంసక మగు క్రియా విశేషణముతో సామానాధికరణ్యము. అపుడు క్రియ, అద్రవ్య స్వభావముగాన దాని విశేషణము నపుంసకమయి యుండుట ఉపపన్నము. నియమముగ క్రియనుబట్టియే ఉపమానోపమేయములకు సామ్యమనియు దెలియవచ్చును. వతిప్రత్యయమును నచట సమ్మతమే యగును. ఈ ప్రయోగమును పరికింపుడు—

"స్థూలవద్యాతి మన్దాయమానపదవిన్యాసశ్చవితోదర కలశః" - లావుగల మనుష్యుడు మెల్లగ నడుగులువేయుచు, పొట్ట కదలించుకొనుచు పోవునట్లు దేవదత్తుడును పోవు చున్నాడు అని యర్థము స్పష్టము. 'బ్రాహ్మణవదధీతే క్షత్రియః' - అను స్థలమునందువలెనే శబ్దవాచ్యమగు క్రియ ఉపమానోపమేయ భావనిమిత్తమగును. ॥511॥

అవతారిక— ఏతావతా, ప్రకృత్యర్థ ప్రత్యయార్థ పక్షములు రెండింటియందును దోషము తుల్యమేయని యంగీకరించి, మహాభాష్యమున నీ విధముగ సమాధాన మభిహితము.

"నైషదోషః । యత్తత్తుల్యం క్రియా చేత్సా భవతీత్యుచ్యతే । తులయా చ సమ్మితం తుల్యమ్ । యది చ తృతీయాసమర్థమపి క్రియా ప్రత్యయార్థోఽపి క్రియాతతస్తుల్యం భవతి" - అని.

'తుల్యమనగా - తులయా సమ్మితమ్' = త్రాసుతో సమముగా జేయబడినది యర్థము. తృతీయా సమర్థమును, ప్రత్యయార్థమును గూడ క్రియయే అయినపుడే గదా తులాసమ్మితత్వము అని భావము. తద్వివరణ మీ కారిక—

శ్లో॥ ద్వయం విశేష్యతే తేన యదేకత్ర విశేషణమ్ ।
తుల్య శబ్దోహితం ధర్మముభయస్థ మపేక్షతే ॥ 512

యత్ = ఏది, ఏకత్ర = ఒకదానియందు, విశేషణం = విశేషణమో, తేన = దానిచేత, ద్వయం = రెండవది గూడ, విశేష్యతే = విశేషింపబడును, తుల్యశబ్దః = 'తుల్యం' అను శబ్దము, తం = ఆ, ధర్మం = ధర్మమును = క్రియను, ఉభయస్థం = రెండింటియందు నున్నదానినే, అపేక్షతే హి = అపేక్షించును గదా.

తాత్పర్య వివరణములు— 'తేనతుల్య మిత్యాది సూత్రమునందు, 'క్రియా' అను పదము ఒకచోట నుచ్చారితమై విశేషణముగ నున్నది దానిచేత ప్రకృతి ప్రత్యయార్థములు రెండును విశేషింపబడును. ఒక పద ముభయవిశేషణ మెట్లగునందురా ? తుల్య శబ్దమే ఆ క్రియయను ధర్మమునుభయగతమునుగా బోధించుచున్నది కావున నది యొకచో నుచ్చారిత మయినను సామర్థ్యమువలననుభయవిశేషణమయి యుండును - అట్లయిననే తుల్య శబ్దార్థమున కుపపత్తి ॥512॥

అవతారిక— ఆ విషయమే ప్రతిపాదించునది యీ కారిక—

శ్లో॥ ఏకస్సమానో ధర్మశ్చేదుపమానోపమేయయోః ।
తులయా సంమితం తుల్యమితి తత్రోపపద్యతే ॥ 513

ఉపమానోపమేయయోః = ఉపమానమునకు నుపమేయమునకును, ఏకః సమానః ధర్మః చేత్ = సమాన ధర్మ మొక్కటియే యగుచో, తత్ర = అట్టియెడ, తులయాసమ్మితం తుల్యం ఇతి = 'త్రాసుతో సమపరుపబడినది' - అను మాట, ఉపపద్యతే = ఉపపన్నమగును.

తాత్పర్య వివరణములు— తుల్య శబ్దమునకు సదృశమయినది అను నర్థము రూఢ్యర్థము. అందు త్రాసును లేదు. సమపరచుటయు లేదు. కాని పదవ్యుత్పాదనమున కట్లు శాస్త్రమున రచింపబడినది. తరాజుతో రెండు వస్తువులను దూచి సమపరచినట్లు సమాన ధర్మ సంబంధమును బట్టి ఉపమానమునకును నుపమేయమునకును సమత్వము ప్రతిపాదింపబడును. కావున సమాన ధర్మవాచక మెచ్చటనున్నను రెండింటితోడను దాని కన్వయము తప్పదు. అదియే తులాసమ్మితత్వము కనుక క్రియ ప్రకృత్యర్థ విశేషణమయినచో, ప్రత్యయార్థమును, నదియే కాక తీరదని భావము. ॥513॥

అవతారిక— 'క్రియాచేత్' అనునది ప్రత్యయార్థమునకు విశేషణమయినను, తుల్య శబ్దసామర్థ్యమువలన ప్రకృత్యర్థమును క్రియయే యగునుగాన నే పక్షమునను దోషము లేదు. ఆ క్రియారూపమగు సమానధర్మమును వాక్యమున సన్నిహితమయినదే కావలెను - అని ప్రతిపాదింపబడుచున్నది.

శ్లో॥ సూత్రేశ్రుతశ్చ ద్విష్ఠోఽసావభేదేన ప్రతీయతే ।
న చ సామాన్యశబ్దత్వాదశ్రుతా గమ్యతే క్రియా ॥ 514

అసౌ = ఈ క్రియయను ధర్మము, సూత్రే = తేనతుల్యమను సూత్రమునందు, శ్రుతః చ = "క్రియాచేత్" అని నిర్దేశింపబడినది, అభేదేన = సామ్యతా బలమువలన అభిన్నముగ, ద్విష్ఠః ప్రతీయతే = ఉభయగతమై, ప్రతీతి విషయమగును, సామాన్య శబ్దత్వాత్ = పుత్ర శబ్దము సామాన్య శబ్దమగుట వలన, అశ్రుతా క్రియా చ = నిర్దేశింపబడని క్రియ యేదియు, న గమ్యతే = గ్రహింపబడదు.

తాత్పర్య వివరణములు— ఈ క్రియయను ధర్మము సూత్రమున నుపమేయోపమానములలో నొకదానికి సంబంధించినదిగా మాత్రమే నిర్దిష్టమయినను నుభయగతమే కావలెను కాబట్టి "పుత్రేణతుల్యః స్థూలః" - అనిగాని, "స్థూలేనతుల్యః పుత్రః" - అనిగాని ప్రయోగించినపుడు వతిప్రత్యయము ప్రవర్తింపదు. పుత్ర శబ్దము సామాన్యవాచకము. క్రియావిశిష్టుని, తదవిశిష్టుని గూడ నది బోధించును. కావున నచట సాదృశ్యము క్రియాకృతమే యగునని నియతముగ జెప్పుటకు వీలు కనబడదు. సముదాయబోధక శబ్దములు క్రియావత్తగు నవయవమును బోధింపవలెననిన నది యత్నసాధ్యమని చెప్పబడియున్నది అని తాత్పర్యము. ॥514॥

అవతారిక— ఏమయ్యా ! ప్రిత్రాజ్ఞావర్తిత్వము మున్నగు క్రియలు నిరూఢముగ సంబద్ధములయి పుత్రశబ్దార్థమున నంతర్గతములయి యుండునని ప్రతిపాదింపబడినది గదా ? పుత్రశబ్దమువలన నవి యేల ప్రతీయమానములు గావు ? అనిన జెప్పుచున్నారు.

శ్లో॥ అశ్రుతాశ్చప్రతీయంతే నిదేశస్థాయితాదయః ।
యే ధర్మా నియతా స్తేషాం పుత్రాదిషు నవిద్యతే ॥ 515

అశ్రుతాశ్చ = వినబడనివైనను = నిర్దేశింపబడనివయినను, నియతాః = నియతిగలిగినవైన (తప్పనివైన), నిదేశస్థాయితాదయః = తండ్రిమాటయందు నిలచుట మున్నగు, యేధర్మాః = ఏ ధర్మములు, ప్రతీయన్తే = సామాన్యముగ తెలియబడునో, తేషాం = ఆ సామాన్య ధర్మములకు సంబంధించిన, పుత్రాదిషు = పుత్రుడు మున్నగు నర్థములు వాచ్యములయినపుడు, న విద్యతే = వతిప్రత్యయమను తద్ధితవృత్తి ఉండదు.

తాత్పర్య వివరణములు — పుత్ర శబ్దముయొక్క అర్థముతో నిరూఢమగు సంబంధముగల, ప్రసిద్ధములగు క్రియలు కొన్ని సామాన్యముగ, వానికి వాచకమగు శబ్దమచట ప్రయోగింపబడకున్నను, ప్రతీతి గోచరములగుచుండును. అయినను నా ధర్మములు అనేకములు అందు నియతమగు వాచకమేదియు క్రియకు లేదు. అందువలన నదియే ఉపమాహేతువని యెట్లు చెప్పగలము. కావున నట్టి సామాన్యధర్మములు గలవిగా పుత్ర శబ్దముచే పుత్రాద్యర్థములు వాచ్యములయినను వతిప్రత్యయము రాదు.

"పుత్రవదయం మాణవకః" = ఈ బాలుడు గురువునకు కుమారునివంటివాడు అనుట గలదు. అట వతిప్రత్యయము ప్రవర్తించినది. దాని బలమువలన యోగ్యమగు క్రియ నధ్యాహారము చేయవలెను. కుమారునివంటివాడుగా జూచుకొనదగినవాడు అని దర్శన క్రియ కధ్యాహారము. "స్థానివదాదేశః" అని పాణిని. అచటను 'వర్తతే' అను క్రియాపదమున కధ్యాహారము ఆదేశము స్థానివలె వర్తించుననుట, యానక్రియా తౌల్యమున్నపుడు, 'స్థూల వద్యాతి' అను, తద్ధితవృత్తియు నుపపన్నము ॥515॥

అవతారిక— పై యర్థమును నిగమనరూపమున బోధించుచున్నారు.

శ్లో॥ అనాశ్రితక్రియ_స్తస్మాన్నతుల్యో_స్తి క్రియావతా ।
క్రియాయాః శ్రవణే సాఽపి క్రియావత్తా ప్రతీయతే ॥ 516

తస్మాత్ = అందువలన, అనాశ్రిత క్రియః = క్రియాశ్రయము లేనిది, క్రియావతా = వేరొక క్రియావిశిష్టముతో, తుల్యః=తుల్యమైనది, న అస్తి = లేదు క్రియాయాః = క్రియావాచకము నకు, శ్రవణే = ప్రయోమున్నపుడు, సా = ఆ, క్రియావత్తాపి = క్రియావైశిష్ట్యము గూడ, ప్రతీయతే = ప్రతీతికి గోచరమగును

తాత్పర్య వివరణములు— క్రియాపదము ప్రయోగింపబడనపుడు, ఉపమానోప మేయములకు సాధారణమగు క్రియారూప ధర్మము తెలియబడదుగాన నట్టి స్థలములందు వతి ప్రత్యయము ప్రవర్తింపదు. అసాధారణమగు క్రియయొక్క నిర్దేశము లేని పదార్థమునకు వేరొక క్రియా విశిష్టముతో సాదృశ్యము సంభవింపదు. ఈ విషయము కారిక పూర్వార్థముచే బోధితము. క్రియా శ్రుతియున్న "బ్రాహ్మణ వదధీతే క్షత్రియః" - మున్నగు స్థలములందు, ఉపమేయగతముగ క్రియ నిర్దేశింపబడినను ఆ క్రియా సంబంధ ముపమానమందును గమ్య మగును. కావుననే పక్షమునందును దోషము లేదు. ॥516॥

అవతారిక— అయినను ప్రత్యయార్థమునకు 'క్రియా' అనునది విశేషణమను పక్షమునే భాష్యమున సిద్ధాంతీకరించిరి. ఆ భాష్యమును వినుడు— "కిం పునరత్రజ్యాయః ? ప్రత్యయార్థ విశేషణమేవజ్యాయః । కుత ఏతత్ । ఏవం హి కృత్వా ఆచార్యేణ సూత్రం పఠితమ్ వతినా సామానాధికరణ్యం కృతమ్ । అపిచావ్యయేషువతేః పాఠః నకర్తవ్యోభవతి । క్రియాయామయం భవన్‌లింగసంఖ్యాభ్యాం న యోక్ష్యతే" - ఈ రెండు పక్షములలోనేది శ్రేష్ఠము ? ప్రత్యయార్థమునకు విశేషణమను పక్షమే. ఏల ? పాణిన్యాచార్యుని సూత్రపాఠ మా విధముగనే యున్నది. 'తేన' 'క్రియా' అను పదములు విభిన్న విభక్తికములు 'తుల్యం' 'క్రియా' అనునవి సమాన విభక్తికములు మరియు 'క్రియా' అను పదమునకు, వతిప్రత్య యముతోనే సామానాధికరణ్యమును వ్యాఖ్యానింపవచ్చును. వతిప్రత్యయము వచ్చును. అది క్రియావాచి, అని యర్థము.

అదియునుగాక ప్రత్యయార్థ విశేషణ పక్షమున లాఘవమును గలదు. అపుడు

క్రియ, సాధ్యమాన స్వభావమగు అసత్వభూతము సంభవించును అది వాచ్యమగునపుడు విధీయమానమగు వతిప్రత్యయము గణపాఠమున లేకున్నను అవ్యయసంజ్ఞను బొందును లింగసంఖ్యా సంబంధముండదు గదా? అని భాష్య తాత్పర్యము— ఏతద్వ్యాఖ్యాన రూపమే యీ కారిక— రెండు పక్షములందును దోషము పరిహరింపబడినది గాన రెండును ప్రశస్యములే కాని ప్రత్యయార్థ విశేషణ పక్షమున వతిప్రత్యయ మసత్త్వభూతక్రియను దెలియజేయును గాన ఆ లింగమును అసంఖ్యమును అగును అవ్యయత్వము స్వతస్సిద్ధము కావున స్వరాది పాఠముతో బనిలేదు. అది యిందు లాఘవము

శ్లో॥ ద్వయోః ప్రతివిధానాచ్చ జ్యాయస్త్వమభిధీయతే ।
నిత్యాసత్వాభిధాయిత్వాత్ ప్రత్యయార్థ విశేషణే ॥ 517

ద్వయోః = రెండు పక్షములందును, ప్రతివిధానాత్ = దోషము వారింపబడుటవలనను, ప్రత్యయార్థ విశేషణే = ప్రత్యయార్థమునకు విశేషణమను పక్షమున, నిత్యాసత్త్వాభిధాయిత్వాత్ చ = వతిప్రత్యయము నియమముగ అసత్వ భూతక్రియను జెప్పుటవలనను, జ్యాయస్త్వం = ప్రశస్యతరత్వము, అభిధీయతే = చెప్పబడుచున్నది

తాత్పర్యమవతారికా గ్రంథముచే గతార్థము. ॥517॥

అవతారిక— ఏమయా, ఈ పక్షమునందైనను, వతిప్రత్యయమునకు క్రియా విశిష్టము గదా అర్థము క్రియ అసత్త్వభూతమయినను తద్విశిష్టము ద్రవ్యరూపమేగాన లింగ సంఖ్యా సంబంధమును వత్యంతమునకు వారించుటకై స్వరాది గణపాఠ మావశ్యకమే యగునే? అనిన—

శ్లో॥ అసత్త్వభూతోవ్యాపారః కేవలః ప్రత్యయే యతః ।
విద్యతే లక్షణార్థత్వం నాస్తి తేన క్రియాశ్రుతేః ॥ 518

ప్రత్యయే = ప్రత్యయ విషయమున, యతః = ఏ కారణమువలన, అసత్వభూతః = ద్రవ్య స్వభావము కాని, వ్యాపారః = క్రియా రూపమగునది, కేవలః = ద్రవ్యరహితము, విద్యతే = ఉంటున్నదో, తేన = ఆ కారణముచేత, క్రియాశ్రుతేః = 'క్రియా' - అను పదమునకు, లక్షణార్థత్వం = లాక్షణికార్థము = విశిష్టము, నాస్తి = లేదు.

తాత్పర్య వివరణములు— ప్రత్యయార్థ విశేషణ పక్షమున, కేవల క్రియ, అనగా ద్రవ్యరహితమగు అసత్త్వ భూతవ్యాపారము సంభవము కాన క్రియా శబ్దమునకు లాక్షణికార్థమగు క్రియావత్తును గ్రహింపనక్కరలేదు. ముఖ్యార్థమునకు సంభవము లేనపుడు గదా లక్షణకు ప్రసంగము. కాగా వతిప్రత్యయమపుడు, క్రియామాత్రమును బోధించునుగాన **అవ్యయత్వము సిద్ధమే.** స్వరాది పాఠముతో బనిలేదు. ॥518॥

అవతారిక— ప్రకృత్యర్థ విశేషణ పక్షమున శుద్ధక్రియ ఉపమానముగ సంభ

వింప నపుడు క్రియా విశిష్టము గ్రహింపబడుననిరి. ఆ విధముగనే ఈ పక్షమునను ప్రత్యయ వాచ్య క్రియకు క్రియతోనే తౌల్యముగాన శుద్ధక్రియ సంభవింపనపుడు తద్విశిష్టమున కంటెనే వతిప్రత్యయము ప్రాప్తము గదా. ఇక పక్షములకు భేదమేమి ? అనిన—

శ్లో॥ క్రియావతస్తు గ్రహణాత్ ప్రకృత్యర్థ విశేషణే ।
క్రియామాత్రేణ తుల్యత్వే సిద్ధాసత్త్వాభిధాయితా ॥ 519

శ్లో॥ యదాక్రియానిమిత్తం తు సాదృశ్యం స్యాత్ క్రియావతోః ।
క్రియావతోఽభిధేయత్వాత్ తదాద్రవ్యాభిధాయితా ॥ 520

ప్రకృత్యర్థ విశేషణే = 'క్రియా' అనునది ప్రకృత్యర్థమునకు విశేషణమను పక్షమున, క్రియా వతః = క్రియావిశిష్టము (ప్రకృత్యర్థముగ), గ్రహణాత్ = గ్రహింపబడుటవలన, క్రియా మాత్రేణ = క్రియచేతనే, తుల్యత్వే తు = సామ్యము వివక్షితమయిన, అసత్వాభిధాయితా = అసత్త్వ భూతక్రియాభిధానము, సిద్ధా భవతి = సిద్ధించినదగును, యదా తు = ఎపుడైతే, క్రియావతోః = క్రియావిశిష్టములకు, సాదృశ్యం = సామ్యము, క్రియానిమిత్తం స్యాత్ = క్రియామూలకమగునో, తదా = అపుడు, క్రియావతః = క్రియావిశిష్టము, అభిధేయత్వాత్ = చెప్పదగినదగును గనుక అపుడు, ద్రవ్యాభిధాయితా భవేత్ = ద్రవ్యవాచిత్వము సిద్ధించును.

తాత్పర్య వివరణములు—— క్రియ ఉపమేయమయిన నది ద్రవ్యభిన్నమయిన, సాధ్యతా స్వభావమగు నర్థమే గనుక, వతిప్రత్యయాంతమునకు అవ్యయత్వము సిద్ధించును.

క్రియ ప్రత్యయార్థము గాదు. క్రియావిశిష్టము ప్రత్యయమున కర్థమను పక్షమున, ఆ క్రియావంతములగు నుపమానోపమేయములకు సాదృశ్యము క్రియానిమిత్తకమే యగును. ఆ క్రియ వేరొక క్రియకు, సౌష్ఠవము మున్నగు సమాన ధర్మమును బుచ్చుకొని యుపమాన మయిన నదియే ప్రత్యయార్థ విశేషణత యనబడును. క్రియావిశిష్ట ముపమేయమయినపుడు, వ్యాపారానువిద్ధమగు క్రియావత్తుకే ప్రాధాన్యము. ఆ వ్యాపారము సత్త్వభూతము గాదు గాన అవ్యయత్వము దానికి సిద్ధమే యగును తిఙన్తపదవాచ్యము గదా ఉపమేయమగును ? ఆఖ్యాతమసత్త్వభూతార్థ ప్రధానమే ఆయె ॥519, 520॥

అవతారిక—— క్రియావిశిష్టమగు ద్రవ్య ముపమేయమయినపుడు, వ్యాపారాను విద్ధమగు ద్రవ్యమునకాని లేక వ్యాపారోపలక్షితమగు ద్రవ్యమునగాని దాని కా ప్రాధాన్యమని విచారింపవలసి యుండును మొదటి పక్షమున వత్యన్త మసత్వభూతమగును గాన అవ్య యత్వము సిద్ధించునని చెప్పబడినది. క్రియచేత నుపలక్షితమగు ద్రవ్యమునకు ప్రాధాన్య మయిన, ప్రకృతి వాచ్యమును క్రియావిశిష్ట ద్రవ్యమే. ప్రత్యయార్థమును నదియే యగును. అపుడు సత్వభూతార్థవాచియగును గాన నవ్యయత్వము సిద్ధింపదు. కావున స్వరాదిపాఠము వత్యంతమున కావశ్యకమగునని చెప్పుచున్నారు.

శ్లో॥ అవ్యయేషువతేః పాఠః కార్య స్తత్ర స్వరాదివత్ ।
బ్రాహ్మణేన సమోఽధ్యేతేత్యత్ర చ ప్రత్యయో భవేత్ ॥ 521

తత్ర = వత్యంతము ద్రవ్యమయినపుడు, వతేః = వతిప్రత్యయమునకు, అవ్యయేషు = అవ్యయములలో, స్వరాదివత్ = స్వర్ మున్నగువానికి వలె, పాఠః = గణపాఠము, కార్యః = చేయవలసినదై యుండును, బ్రాహ్మణేన సమః అధ్యేతా = ఈ వాక్యమునందు, ఇత్యత్ర చ = ఈ విగ్రహ వాక్యమున గూడ, ప్రత్యయః = వతిప్రత్యయము, భవేత్ = రావలసి యుండును

తాత్పర్య వివరములు— స్వర్, అంతర్, - మున్నగునవియు నిపాతలును అవ్యయములు. అందు స్వరాదులు ద్రవ్యవచనములు. ''స్వః రోహావః = స్వర్గము నెక్కుచున్నాము. ''స్వర్యాతః'' = స్వర్గమును బొందినాడు, మొదలగు ప్రయోగములు కలవు. అందు స్వర అను దానికి కర్మత్వ మగపడుచున్నది. అది సత్వభూతమయిననే ఘటించును 'చ' 'వా' మున్నగునవి అసత్త్వ భూతములు. స్వరాదులను చాదులలోనే చేర్చి 'నిపాతములవ్యయములు' అని సూత్రమును పాణిని రచింపకుండుట కిదియే కారణము. స్వరాదులలో వత్యంతమును బరించి, పాఠసామర్థ్యమువలన నవ్యయత్వమును సంపాదింపవలెను. వ్యాపారానువిద్ధకర్తృ ప్రాధాన్య పక్షమున, అవ్యయపద మన్వర్థమగుటచేతనే అవ్యయత్వము సిద్ధించును. 'అవ్యయమ్' అను పదమునకు 'నవ్యేతి' అని విగ్రహము. లింగసంఖ్యలులేని దవ్యయమని ఫలితార్థము. సూత్రకారునకును, గణమున పఠింపబడని వాని కవ్యయత్వ సిద్ధి కొఱకు అన్వర్థత్వమే ఆశ్రయణీయము. వార్తికకారుడును 'అలింగాసంఖ్య మవ్యయమ్' అనియే అవ్యయ లక్షణమును జెప్పెను మునిత్రయ మతమునను ప్రత్యయార్థ విశేషణ పక్షమున, పాఠము = అనగా గణపాఠ మక్కఱలేకయే వత్యంతమున కవ్యయ సంజ్ఞ సిద్ధించును. ఇదియే ఈ పక్షమునకు గల ఉత్కర్షము

తేనతుల్యం క్రియాచేద్వతిః (5-1-115) అను నీ సూత్రమునకు తరువాత, ''తత్రతస్యేవ'' (5-1-116), ''తదర్హమ్'' (5-1-117) అను రెండు సూత్రములును వతిప్రత్యయ విధాయకములే. ఆ వతిప్రత్యయాంతములకును గణపాఠముతో బనిలేకయే అవ్యయత్వము సిద్ధించును.

'బ్రాహ్మణేన తుల్యః అధ్యేతా' - అను నభిప్రాయముతో, 'బ్రాహ్మణవత్ అధ్యేతా' - అను ప్రయోగమనిష్టము. దానికి ప్రసంగము కారికోత్తరార్థమున ఆపాదింపబడినది. ఈ విషయము 528 కారికలో విస్తృతముగ నిరూపింపబడినది. ॥521॥

అవతారిక— ''ఏవంచైవ హి కృత్వా ఆచార్యేణ సూత్రం పఠితమ్ । వతినా సామానాధికరణ్యం కృతమ్'' - అని మహాభాష్యమున జెప్పబడిన ఆ వతిసామానాధికరణ్య మీ కారికలో వివరింపబడుచున్నది.

శ్లో॥ సామానాధికరణ్యం చ వత్యర్థేనాపదిశ్యతే ।
తుల్యమిత్యన్యథా కల్ప్యో వాక్యశేషో శ్రుతో భవేత్ ॥ 522

సామానాధికరణ్యం చ = భాష్యోక్తమయిన వతిసామానాధికరణ్యమును, 'తుల్యమ్' ఇతి = 'తుల్యమ'ని సూత్రమున గల తుల్య శబ్దముతో, వత్యర్థేన = అనగా వతితోగాక వత్యర్థమగు తుల్యశబ్దముతో, అపదిశ్యతే = వివక్షింపబడుచున్నది, అన్యథా = అట్లు కానిచో, అశ్రుతః = అధ్యాహారము చేయబడినదై, వాక్యశేషః = యత్తత్ తృతీయాసమర్థం సా క్రియాచేత్' అని శేషపూరణము, కల్ప్యఃభవేత్ = కల్పింపవలసి యుండును.

తాత్పర్య వివరణములు— భాష్యమునందు 'వతిసామానాధికరణ్యం కృతమ్' అనగా వతిప్రత్యయముతో క్రియాశబ్దమునకు సమానాధికరణ నిర్దేశమని యర్థము గాదు. వతిప్రత్యయ మా సూత్రముచే విధింపబడుచున్నది. అంతకు పూర్వము సిద్ధముగాదు. సిద్ధ పూర్వమునకే ఇతర వ్యావృత్తికొరకు విశేషణ సంబంధము కలుగజేయబడును. 'క్రియ అయిన వతిప్రత్యయము వచ్చును' అను మాట కర్థము లేదు. దానికి క్రియారూపతగాని తద్భిన్నరూపముగాని లేదు గదా. అందువలన విశేషణ మర్థవిరహితము.

కావున వత్యర్థవాచకమగు తుల్యశబ్దముతో క్రియా అను దానికి సామానాధికరణ్య మని భాష్య తాత్పర్యము తుల్యశబ్దార్థము క్రియయును అక్రియయును సంభవముగాన విశేష ముపపన్నమగును ఇపుడు సామానాధికరణ్యము శబ్ద ప్రతిపాదితమే అశ్రుత కల్పనతో పని లేదు. 'క్రియా' అనునది ప్రకృత్యర్థమునకు విశేషణమను పక్షమున, 'తేన' 'క్రియా' అను పదములు విరుద్ధ విభక్తికము లగుటచేత, ''యత్ తత్ తృతీయాసమర్థం క్రియాచేత్ సా భవతి'' అని వాక్యశేషమునధ్యాహరించి సమన్వయమును గల్పింపవలసి యుండును. అది గౌరవదోష పరాహతము ॥522॥

అవతారిక— ఈ పక్షమున అధ్యేత ఉపమేయుడయినపుడు ప్రాప్తమగు అనిష్ట ప్రత్యయమును వారితమగును— ఎట్లనగా

శ్లో॥ క్రియావతోశ్చ సాదృశ్యే ప్రత్యయార్థవిశేషణే ।
అధ్యేత్రా సదృశోఽధ్యేతేత్యత్ర నాస్తి వతే ర్విధిః ॥ 523

ప్రత్యయార్థ విశేషణే = ప్రత్యయార్థమునకు క్రియా అనునది విశేషణమను పక్షమున, క్రియావతోః = క్రియా విశిష్టములకు సామ్యము వివక్షింపబడినను, సాదృశ్యే చ = సామ్యవివక్ష యందైనను, అధ్యేత్రా సదృశః అధ్యేతా = అను నీ ప్రయోగమునందు, ఇత్యత్ర = అధ్య యనము చేయువానితో నట్టివాడు సమానుడు అను నర్థమున, వతేః విధిః నాస్తి = వతి ప్రత్యయమునకు విధానము లేదు.

తాత్పర్య వివరణములు— ఈ పక్షమున, 'తుల్యమయినది క్రియ అయినచో' అని క్రియయే విశేషింపబడుట వలన, క్రియచే అవిష్టుడగు కర్తయందే ప్రత్యయము

ప్రవర్తించును అనగా క్రియకే ప్రాధాన్యము వివక్షితము. ద్రవ్యమునకు గాదు. కనుకనే క్రియా ప్రధానమగు ఆఖ్యాతముతో నిర్దేశము, 'బ్రాహ్మణేన తుల్యం అధీతే' అని = బ్రాహ్మణునితో సమానముగా చదువుచున్నాడు అనియే అగపడు చున్నది. వెనుక అపక్ష మున క్రియావత్తగు ప్రత్యయార్థముతో, అటువంటి ప్రత్యయార్థముననే సామ్యము. ఉపమా హేతువగు క్రియ అప్రధానమగుట వలన ద్రవ్యము ప్రధానమయినపుడు అనిష్టమయిన ప్రత్యయము రావలసి వచ్చును.

'పుత్రేణతుల్యః స్థూలః' అను స్థలమున, 'తత్రతస్యేవ' అను పై సూత్రముచేత కూడ వతిప్రత్యయము రాదు. ''మధురావత్ స్రుఘ్నేప్రాసాదః'' 'చైత్రవత్ మైత్రస్యగావః' అను స్థలములందు సప్తమ్యన్త షష్ఠ్యంతములకంటె పరముగనే ఆ సూత్రము వతిప్రత్యయ మును విధించును.

'పుత్రవత్ స్థూలః వర్తతే' అని వర్తన క్రియాకృతమగు నుపమానోపమేయ భావమునందు, వతిప్రత్యయము సాధువే యగును. కావున వత్యంతమున కవ్యయములలో పారప్రసంగమును లేదు. అనిష్ట స్థలమున వతిప్రత్యయాపత్తియును లేదు అందువలన ప్రత్యయార్థ విశేషణ పక్షమే ప్రశస్యతరమని సిద్ధాంతము. ॥523॥

అవతారిక — ఈ వృత్తి సముద్దేశమునందు 433 వ కారిక నుండి 523 వ కారిక వరకును 91 కారికలలో, అతివిపులముగ, సూ॥ ''తేనతుల్యం క్రియాచేద్వతిః'' (5-1-115) అను సూత్రవిషయము ఉపమానోపమేయ భావ విచార ప్రసంగ స్సంగతమయినది విచారింప బడినది. ఇక తదనంతర సూత్రమగు ''తత్రతస్యేవ'' (5-1-116) అను సూత్రముచే విహితమయిన ఇవార్థవిషయ వతిప్రత్యయ విషయము, 550 వరకును గల 27 కారికలలో విమర్శింపబడును.

''తత్రతస్యేవ'' అని సూత్రము. 'అచ్చటవలె' 'దానికివలె' అను నర్థములందు వతిప్రత్యయము, సప్తమీరూప సమర్థ విభక్త్యంతము కంటెను, 'షష్ఠీరూప సమర్థ విభక్త్యం తము కంటెను బరము గావచ్చును' అని సూత్రార్థము. ''మధురావత్ పాటలీపుత్రే ప్రాసాదాః'' = మధురాపట్టణము నందువలె నుండునవి పాటలిపుత్ర నగరమునందలి మేడలు. 'చైత్రస్యేవ మైత్రస్యగావః = చైత్రవత్ మైత్రస్యగావః = చైత్రునివివలె మైత్రుని గోవులు - అని యుదాహరణము.

ప్రకృత సూత్రమున మహాభాష్యమున నిట్లాక్షేపింపబడినది. ''తేనతుల్యం క్రియా చేద్వతిః'' అను పూర్వసూత్రము వలననే. పై లక్ష్యములందును వతిప్రత్యయము సిద్ధించు గదా? ఈ సూత్ర మెందుకు రచింపవలె'' అని. కాని పూర్వసూత్రములచేత నెట్లు సిద్ధిం చును? అది తృతీయా సమర్థమునకు ప్రత్యయ విధాయకము. ఇది, షష్ఠీ సమర్థమునకును సప్తమీ సమర్థమునకును వతివిధాయకము గదా అని ప్రశ్న కలుగుచున్నది. కావున నీ కారి కలో పూర్వపక్షాభిప్రాయమును వ్యాఖ్యానించుచున్నారు

శ్లో॥ తుల్యార్థైరితి యా తస్యాస్తృతీయాయా న భిద్యతే ।
అర్థో భేదేఽపి సర్వాభిరితరాభిర్విభక్తిభిః ॥ 524

తుల్యార్థైః ఇతి = 'తుల్యార్థైః' అను సూత్రముచే, యా తృతీయా = ఏ తృతీయ కలదో, తస్యాః తృతీయాయాః = దానియొక్క, అర్థః = అర్థము, భేదే = వ్యాపార భేదము, సత్యపి = ఉన్నప్పటికిని, ఇతరాభిః = ఇతరములయిన, సర్వాభిః = అన్ని, విభక్తిభిః = విభక్తుల చేతను, అభిహితాత్ = చెప్పబడిన, అర్థాత్ = అర్థముకంటె, న భిద్యతే = వేరుకాదు

తాత్పర్య వివరణములు—''తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాన్యతరస్యామ్'' (2-3-72) అను సూత్రము, 'సమానమయిన' అను నర్థముగల 'సదృశః' సమఃతుల్యః - మున్నగువానితో సంబంధమున్నపు డుపమానవాచక శబ్దమునకు తృతీయా షష్ఠీవిభక్తి ప్రత్యయములు వచ్చునని చెప్పుచున్నది

''కృష్ణేనతుల్యః'' అనియు కృష్ణస్య తుల్యః అనియు ప్రయోగము లుదాహరణములు. అతృతీయార్థమునకును, ఇవశబ్దయోగమున నగపడు సకల విభక్తుల యర్థమునకు భేదము లేదు. శబ్దభేదము మాత్రమే యుండును. వతిప్రత్యయము వచ్చినపు డా విభక్తి లోపించును. సదృశార్థప్రతీతి సమానమే. విగ్రహ వాక్యముననే భేదము. అందువలన పూర్వ సూత్రముచేతనే వతిప్రత్యయము ఇవార్థ విషయమునను సిద్ధింపవచ్చునని పూర్వపక్ష తాత్పర్యము. ॥524॥

అవతారిక— ఇవ శబ్దప్రయోగమున సకల విభక్తులకును, తుల్య శబ్దయోగమున తృతీయా విభక్తికిని అర్థమున భేదములేదని ప్రయోగముఖమున నీ కారికలలో జూడబడుచున్నది.

శ్లో॥ భోజ్యతే బ్రాహ్మణ ఇవతుల్యం భుక్తం ద్విజాతినా ।
పశ్యతి బ్రాహ్మణ మివతుల్యం విప్రేణపశ్యతి ॥ 525

శ్లో॥ బ్రాహ్మణేనేవ విజ్ఞాతం తుల్యం జ్ఞాతం ద్విజాతినా ।
దీయతాం బ్రాహ్మణాయేవ తుల్యం విప్రేణదీయతామ్ ॥ 526

శ్లో॥ బ్రాహ్మణాదివ వైశ్యాత్త్వమధీష్వాధ్యయనం బహు ।
ఇత్యేవమాదిభిర్భేద స్తృతీయాయా నకశ్చన ॥ 527

తాత్పర్య వివరణములు— తుల్యార్థయోగమున విహితమగు తృతీయా శేష విభక్తి. అనగా ఉపపద విభక్తి. ఇవార్థయోగమున దృశ్యమానములగు విభక్తులు. కారక విభక్తులు. శేషసంబంధమునకు గూడ అనగా కారక క్రియా సంబంధముకంటె వ్యతిరిక్తమగు పదాంతరయోగమున వచ్చు సంబంధము గూడ క్రియాకారక భావ మూలకమే. కర్మ కరణాదులు స్వస్వరూపముతో వివక్షింపబడక, సంబంధ సామాన్యరూపమున వివక్షింపబడుటయే

శేషముగ వివక్షించుట యనబడును. కావున వస్త్వర్థమునకు భేదము లేదుగాన పూర్వ సూత్రముచే సిద్ధింపవచ్చునని తాత్పర్యము ప్రథమాది విభక్తి క్రమమున నుదాహరణములు చూడుడు

బ్రాహ్మణః ఇవభోజ్యతే క్షత్రియః ।
బ్రాహ్మణేన తుల్యం భోజ్యతే క్షత్రియః ॥

బ్రాహ్మణమివపశ్యతి క్షత్రియమ్ ।
విప్రేణతుల్యం పశ్యతి క్షత్రియమ్ ॥

బ్రాహ్మణేనేవ విజ్ఞాతం క్షత్రియేణ ।
ద్విజాతినాతుల్యం విజ్ఞాతం క్షత్రియేణ ॥

బ్రాహ్మణాయేవ దీయతామ్ క్షత్రియాయ ।
విప్రేణతుల్యం దీయతామ్ క్షత్రియాయ ॥

బ్రాహ్మణాదివ త్వం బహు అధ్యయనమధీష్వ క్షత్రియాత్ ।
విప్రేణతుల్యం వైశ్యాత్త్వ మధీష్వాధ్యయనం బహు ॥

బ్రాహ్మణస్యేవ వైశ్యస్య ధనమేతదుపస్థితమ్ ।
విప్రేణతుల్యం వైశ్యస్య ధనమేతదుపస్థితమ్ ॥

బ్రాహ్మణే ఇవగుణాః బహవః స్థితాః క్షత్రియే ।
విప్రేణతుల్యం తిష్ఠన్తి క్షత్రియే బహవోగుణాః ॥
॥525, 526, 527॥

అవతారిక—— ఇచట నొక ప్రశ్న కలుగును——

శ్లో॥ తుల్యం మథురయాధీయే మాత్రా తుల్యం స్మరామితామ్ ।
మథురాయాశ్చ మాతుశ్చ కథం సాదృశ్య కల్పనా ॥ 528

మథురయాతుల్య మధీయే = 'మథురతో సమానముగ జదువుచున్నాను', మాత్రా తుల్యం తాం స్మరామి = 'తల్లితో తుల్యముగ నామెను తలంతును', మథురాయాః చ=(అను విగ్రహ వాక్యములందు) మథురకును, మాతుః చ = తల్లికిని (అధ్యయన స్మరణములతో), కథం సాదృశ్య కల్పనా = సామ్యమును గల్పించుట యెట్లు ఘటించును ?

తాత్పర్య వివరణములు—— 'మథురాయామివ పాటలీపుత్రే అధీయే అహమ్' = మథురలోవలె పాటలి పుత్రములో నేను జదువుకొనుచున్నాను. అను నర్థమునందు 'మథురావ దధీయే' అనియు, ''మాతురివ దేవదత్తాయాః స్మరామి'' = తల్లినివలె దేవదత్తను స్మరింతును - అను నర్థమునందు, మాతృవత్ దేవదత్తాం స్మరామి, - అనియు వతిప్రత్యయము అభీష్టము. అయ్యది పూర్వసూత్రముచే ప్రవర్తించిన నపుడు ''మథురయాతుల్య మధీతే''

అనియు, 'మాత్రాతుల్యం స్మరామి' అనియు, విగ్రహవాక్యము లుండదగినవి అధ్యయనము నకు మథురతోడను, స్మరణమునకు మాతతోడను సాదృశ్యమును చెప్పినట్లగును. అది యుప పన్నము గాదు స్మరణ విషయము మాత. అధ్యయనమునకు అధికరణము మథుర. అధ్యయన స్మరణ క్రియలతో తుల్యమగు క్రియ యేదియును మథురామాతలందును లేనందున, మాతృ శబ్దమునకు మాతృ స్మరణమునందును, మథురా శబ్దమునకు మథురాధికరణకు అధ్యయనము నందును లక్షణ నాశ్రయింపవలెను. ఆ రెండధ్యయనములకును, స్మరణములకును ఆశ్రయ భేదముచే భేదమును గల్పించి, వానికి సాదృశ్యమును కల్పింపవలసి యుండును. కాని, కర్త యధ్యయనమునకును, మథురాధికరణకు అధ్యయనమునకును, కర్త స్మరణమునకును కర్మ యగు మాత స్మరణమునకును సాదృశ్యము అసంభవము ॥528॥

అవతారిక— కాగా, వెనుక సూత్రముచే నిచట వతిప్రత్యయ మెట్లు ? అనిన—

శ్లో॥ మథురావిషయః పాఠః స్మరణం మాతృకర్మకమ్ ।
మథురామాతృ శబ్దాభ్యామభేదేనాభిధీయతే ॥ 529

మధురావిషయః పాఠః = మధురానగరమునందలి అధ్యయనమును, మాతృకర్మకం స్మరణమ్ చ = మాతకర్మగాగల స్మరణమును, మధురా మాతృశబ్దాభ్యామ్ = యథాక్రమముగ, మధురాశబ్దము, మాతృశబ్దములచేత, అభేదేన = అభేదముగ = ఒక్కటిగ, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— మధురయా తుల్యమధీయే అనగా 'మధుర'తో తుల్యముగ నేను చదువుచున్నాను అని యర్థము. అధ్యయన క్రియ ఉపమేయమునకు = అనగా తనకు సంబంధించినదిగా శ్రుతమగుచున్నది. కావున నది ఆ క్రియ నుపమానమున గూడ నున్నట్లు తెలియజేయును. ఔపమ్యము సమాన ధర్మ సంబంధ మూలకము గదా. కనుక 'మధురతో' అనగా మధురయందలి అధ్యయనముతోనని యర్థము. మధుర, అధ్య యనమునకు ఆధారము. అధ్యయనము. ఆధేయము. ఆధారాధేయముల కభేదమును మనమున నిడికొని అట్టి ప్రయోగము చేయబడినది. ఆ విధముగనే స్మరణమునకు విషయము మాత. విషయిస్మరణము. విషయమునకును విషయికిని అభేదమను నభిప్రాయముతో నా ప్రయోగము అనగా మాత్రాతుల్యం స్మరామి అను ప్రయోగము. మధుర యందలి అధ్యయనముతో పాటలి పుత్రమునందలి యధ్యయనమును, దేవదత్తా స్మరణము, మాతృ విషయక స్మరణ ముతో తుల్యమనియు నర్థము. కారికలో 'స్మరణం మాతృకర్మకం' అని, అది మాతృ సంబంధియయినను, తత్కర్మకమనుట, ఆ సంబంధము వాస్తవముగ కర్మత్వరూపమే అగుట వలననని యెఱుంగునది. "అధీగర్థదయేశాం కర్మణి" (2-3-52) అను సూత్రముచేత, కర్మశేషముగా వివక్షితమయినపుడు షష్ఠి ప్రతిపద విహితము. ఆ ప్రతిపద విధానమునకు ఫలము, 'మాతుః స్మరణమ్' అనుచో షష్ఠీ తత్పురుష సమాసము లేకుండుట. ॥529॥

అవతారిక — వెనుక, సముదాయ శబ్దము లవయవబోధకములును నగునని యుపపాదింపబడినది. అట్లే ప్రకృతమున మధురాశబ్దము సముదాయ వచనమయినను, నిచ్చట తదవయవమగు, అనగా నేకదేశమగు గృహములందు వర్తించునని నిదర్శన పూర్వకముగ నుపపాదింపబడుచున్నది.

శ్లో॥ ఉష్ట్రావయవతుల్యేషు ముఖేషూష్ట్రశ్రుతిర్యథా ।
వర్తతే గృహతుల్యే చ ప్రాసాదే మధురాశ్రుతిః ॥ 530

ఉష్ట్రశ్రుతిః = "ఉష్ట్రముఖః" అను స్థలమున ఉష్ట్రపదము, ఉష్ట్రావయవ తుల్యేషు = ఒంటె అవయవములతో తుల్యములయిన, ముఖేషు = ముఖములందు, యథావర్తతే = ఏ ప్రకారముగా వర్తించుచున్నదో, తథా = ఆ ప్రకారముగా, మధురశ్రుతిః చ = మధురాపదమును (మధురావత్ అనుచోట), గృహతుల్యే = మధురయందలి గృహములతో తుల్యమయిన, ప్రాసాదే వర్తతే = పాటలీపుత్రమునందలి ప్రాసాదములందు వర్తించును

తాత్పర్య వివరణములు— 'ఉష్ట్రముఖః' అని యొక సమాసము. దీనిని ఉపమాన పూర్వపద బహువ్రీహియందురు. ఉష్ట్రః ముఖం యస్యసః = ఒంటె ముఖము దేనికో అది అనివృత్పత్తి. ఉష్ట్రముఖ మివముఖం యస్యసః అని విగ్రహమును జెప్పి, ఉపమాన భూతమగు పూర్వపదమునం దుత్తరపదమునకు లోపమును వార్తికకారుడు చెప్పియుండెను. కాని భాష్యకారుడు ఆ వార్తికమును ప్రత్యాఖ్యానము చేసెను కనుక ఉష్ట్రము ముఖముగా గలది యనియే విగ్రహము. ఒంటె, ముఖమగుట యసంభవము. కావున ఉష్ట్ర శబ్దమునకు, దాని అవయమగు ముఖమునందు లక్షణ. అపుడైనను, ఉష్ట్రము యొక్క ముఖము వేరొక దానికి ముఖమగుటయు నుపపన్నము గాదు గాన, ఇవార్థము నంతర్భవింపజేసి సంబంధమును గల్పింపవలెను.

ఆ విధముగనే మధురాపట్టణైకదేశములగు గృహములను మధురా శబ్దము బోధించుటచే, పాటలీపుత్రమునందలి గృహములు మధురా గృహతుల్యములని యర్థమగును. కాగా, ఇవార్థక వతిప్రత్యయమునకును, తుల్యార్థక వతిప్రత్యయము చేతనే సంగ్రహమని భావము. ॥530॥

అవతారిక— లేదా, ద్రవ్యవాచక శబ్దమునకు క్రియయందు లక్షణ ఉపచారము, అనవలదు. ద్రవ్యములకే సామ్యమందుము. ఆ సామ్యము క్రియాద్వారక మగును' - అని నిదర్శన పురస్సరముగ నుపపాదించుచున్నారు

శ్లో॥ యథాధ్యయనయో స్సామ్యమధ్యేత్రోరపదిశ్యతే ।
తథాక్రియా గతైర్ధర్మై రుచ్యన్తే సాధనాశ్రయాః ॥ 531

అధ్యయనయోః = రెండు అధ్యయన క్రియలకు గల, సామ్యం = సాదృశ్యము, అధ్యేత్రోః = అధ్యయనము చేయువారల యందు, యథా = ఏ ప్రకారము, అపదిశ్యతే = ఆరోపింప

బడుచున్నదో, క్రియాగతైః ధర్మైః = అధ్యయన స్మరణ క్రియలందుగల ధర్మములచే, సాధనాశ్రయాః తథా = తదాశ్రయములగు కారకము లా విధముగా, ఉచ్యన్తే = చెప్పబడు చున్నవి.

తాత్పర్య వివరణములు— బ్రాహ్మణునివలె క్షత్రియుడు చదువుచున్నాడనిన సామ్యము వారి చదువులకనట కాని ఆ క్రియా కర్తలకు తుల్యత్వము అధ్యయన ద్వారమున వ్యవస్థాపితమగుచున్నది. ఆ విధముగనే 'మధురావదధీతే' 'మాతృవత్ స్మరతి' అను వాక్యములందు, అధ్యయన స్మరణములను క్రియల ధర్మములగు సాదృశ్యములను బుచ్చుకొని కారకములగు మధురాదులు చెప్పబడుచున్నవి. ఆ క్రియల ద్వారమున, వాని కర్మకును అధి కరణమునకును, అనగా మాతకును, మధురకును, దేవదత్తా పాటలిపుత్రములకును నుపమా నోపమేయ భావము క్రియా ద్వారక సంబంధము కర్తకు మాత్రమేగాని కారకాన్తరములకు లేదనుట యుక్తము గాదు గదా. సకల కారకములతోడను క్రియకు అవినాభావము కలదు. కావున 'మధురావత్' - మాతృవత్ అను స్థలములందును పూర్వసూత్రము చేతనే వతిప్రత్య యము స్థిరమని భావము ॥531॥

అవతారిక—కాని ఒక విశేషము కలదనవచ్చును. క్రియ అను ఉపాధితో గూడిన సాదృశ్యమున, పూర్వసూత్రముచే వతిప్రత్యయము విధింపబడుచున్నది. అనగా క్రియ, వతి ప్రత్యయార్థమునందే అంతర్భూతమయి యున్నదగుటవలన క్రియావాచకమునకు ప్రయోగ మక్కరలేదు. ఈ సూత్రముచేత వతిప్రత్యయము సామాన్యముగ సాదృశ్య మాత్రముననే విహితము. కాబట్టి ఆ భేదము కలదుగదాయని ఆశంకించి చెప్పుచున్నారు.

శ్లో॥ ఇవార్థే యచ్చ వచనం పూర్వసూత్రే చ యో విధిః ।
క్రియాశబ్దశ్రుతౌ భేదో న కశ్చిద్విద్యతే తయోః ॥ 532

ఇవార్థే చ = ఇవార్థమగు సాదృశ్యమునందు ప్రత్యయమును విధించిన, యద్వచనం అస్తి = ఏ ''తత్రతస్యేవ'' అను సూత్రము కలదో, పూర్వసూత్రే = వెనుకటి సూత్రమునందలి, యః విధిశ్చ అస్తి = ఏ వతిప్రత్యయవిధి గలదో, తయోః = ఆ రెండింటికిని, క్రియాశబ్ద శ్రుతౌ = క్రియాపద ప్రయోగ విషయమున, కశ్చిత్ భేదః = ఏ భేదమును, న విద్యతే = లేదు

తాత్పర్య వివరణములు— క్రియాపదము ప్రయుక్తమయినపుడు తేనతుల్యం క్రియాచేద్వతిః'' అను పూర్వసూత్రముచేత, ''తత్రతస్యేవ'' అను నీ సూత్రముయొక్క విషయము గూడ వ్యాప్తమగును. కనుక నీ సూత్రమును రచింపనక్కరలేదు. పూర్వ సూత్రో దాహరణ విషయమున క్రియాపద ప్రయోగము లేకుండగ నుండదుగదా. ॥532॥

అవతారిక— ఎందువలననగా—

శ్లో॥ యద్యప్యుపాధిరన్యత్రనియతో న ప్రయుజ్యతే ।
రూపాభేదాత్త్వనిర్జ్ఞాతా క్రియాత్ర శ్రూయతేపునః ॥ 533

యద్యపి = ఆలోచించిన, అన్యత్ర = ఇతర స్థలములందు, నియతః = తప్పనిదై, ఉపాధిః = విశేషణము, న ప్రయుజ్యతే = ప్రయోగింపబడలేదు, అత్రపునః = ఇచ్చటమట్టుకు, రూపాభేదాత్ = రూపమున భేద మగపడనందున, అనిర్జ్ఞాతా = తెలియబడని, క్రియాతు = క్రియా పదము మట్టుకు, శ్రూయతే = వినబడుచుండును.

తాత్పర్య వివరణములు— ''హరతేః దృతినాథయోః పశౌ'' (3-2-25) అను సూత్రము, దృతినాథ శబ్దములు సమీపోచ్చారితములయి యున్నపుడు, 'హృ' ధాతువునకు, పశువు కర్త్రర్థమయిన, 'ఇన్' అను ప్రత్యయమును విధించుచున్నది. 'దృతిహరిః' 'నాథహరిః' – అని యుదాహరణములు. 'దృతిం హరతి' 'నాథం హరతి' – అని విగ్రహవాక్యములు. అట పశువు అను నొక విశిష్ట ద్రవ్య ముపాధి. అది ప్రత్యయముచేతనే తెలియజేయబడుచున్నది. కావున, 'పశుః' అని విగ్రహమున నుచ్చరింపదు. పశువను కర్త బోధ్యమయిననే ఆ ప్రత్యయమగుటచే నిక నా యంశమున సందేహము కలుగదు. వతిప్రత్యయ విషయమున నట్లుగాదు. 'క్రియాచేత్' అను దానిచే సామాన్యముగ క్రియ ఉపాధిగా వచింపబడినది గాని క్రియావిశేషము వచింపబడలేదు. క్రియావిశేష మవగతము కావలెననిన విగ్రహవాక్యమునందు, 'అధీతే' అనియు 'స్మరతి' అనియు తద్విశేష బోధకము నుచ్చరించి తీరవలెను. 'బ్రాహ్మణవత్' ఇత్యాది వృత్తిపదమువలన క్రియా సామాన్య ప్రతీతి గలిగెనను అధ్యయనాది రూప తద్విశేష క్రియా ప్రతీతి కలుగదని భావము. దృతి అనగా తోలు సంచి. జలపూరితమైన యీ సంచిని మోయునది పశువైన 'దృతహరిః' అనబడును. మనుష్యుడైనచో 'దృతహరః' అనబడును. నాథ శబ్దమునకు 'ముకుద్రాడు' అర్థము. అది కలపశువు 'నాథహరిః' అనబడును. ముకుద్రాడు గల వ్యక్తి పశువుకాక మనుష్యుడైనచో (అనగా బానిస) 'నాథహరః' అనబడును. ॥533॥

అవతారిక— ఈ యంశము నిదర్శన పూర్వకముగా సాధింపబడుచున్నది.

శ్లో॥ యథావ్యుత్పరయః పుచ్ఛా క్యజన్తే సుదురాదయః ।
సత్యతి ప్రత్యయార్థత్వే భేదాభావాదుదాహృతాః ॥ 534

యథా = ఏ ప్రకారముగా, పుచ్ఛా = 'పుచ్ఛయతి' అను ణిజన్త ధాతువునందు, వ్యుత్పరయః = వి, ఉత్, పరి – అనునవియు, క్యజన్తే = క్యజ్ప్రత్యయాంతమునందు, సుదురాదయశ్చ = సు, దుర్, మున్నగునవియు, ప్రత్యయార్థత్వే సత్యపి = వాని యర్థము ప్రత్యయబోధ్యమయినను, భేదాభావాత్ = రూపమునందు భేదము లేనందువలన, ఉదాహృతాః = ఉచ్చరింపబడి యున్నవో, తథా అత్ర = ఆ ప్రకారమే వత్యంతవిషయమున గూడ క్రియాపద ముదాహార్యమ్ = క్రియా బోధకమగు అధీయతే మున్నగునది ఉచ్చరింపవలసి యున్నది.

తాత్పర్య వివరణములు— ''పుచ్ఛభాండ చీవరాణ్ణిఙ్'' (3-1-20) అని సూత్రము. ఈ మూడు ప్రాతిపదికముల కంటెను బరముగా 'ణిఙ్' అను ప్రత్యయమగునని యర్థము. ఆ ణిఙ్ ప్రత్యయము సనాది గణ పఠితము. కావున తదంతము ధాతువగును.

'ఉత్పుచ్ఛయతే' – విపుచ్ఛయతే. పరిపుచ్ఛయతే అని యుదాహరణములు. పుచ్ఛముదస్యతి, పుచ్ఛం వ్యస్యతి, పుచ్ఛం పర్యస్యతి గౌః – అని విగ్రహ వాక్యములు. గోవు తన తోకను పైకి విసరుచున్నది. లేదా వివిధముగ జిమ్ముచున్నది. లేదా అంతటను = చుట్టును విసరు చున్నది యని అర్థము. "పుచ్ఛాదుదసనే వ్యసనే పర్యసనేచ" – అని వార్తికము. ఇట జిఙ్ప్రత్యయమే, ఉదసన వ్యసన పర్యసనములను సామాన్యముగ జెప్పును. అయినను విశేషాభి వ్యక్తికై, వి, ఉత్, పరి, – అను నుపసర్గలు ప్రయోగింపబడుచున్నవి

ఆ విధముగనే "భృశాదిభ్యో భువ్యచ్వేర్లోపశ్చ హలః" (3–1–12) అను సూత్రము, భృశాది గణమున పఠింపబడిన శబ్దములకంటె బరముగా 'అభృశః భృశః భవతి' = నక్షత్రము కానిది నక్షత్ర మగుచున్నది – అను నర్థమున, 'భృశాయతే' మున్నగు రూపముల సాధుత్వము కొరకు 'క్యఙ్' అను ప్రత్యయమును విధించినది.

ఈ గణమునందు కొన్ని ప్రకృతులు ఉపసర్గ సహితములు పఠింపబడి యున్నవి. అవి అభిమనస్, సుమనస్, దుర్మనస్, మున్నగునవి. అచ్చట ఉపసర్గార్థము ప్రకృత్యర్థమునకు విశేషణమని యొక పక్షమును, ప్రత్యయార్థ విశేషణమని వేరొక పక్షమును ఉపపాదింపబడినవి. అందు ప్రత్యయార్థ విశేషణ పక్షమే సిద్ధాంతితము. ఆ పక్షమున ప్రత్యయముచేతనే ఉపసర్గార్థము సంగృహీతమయినను, ఉపసర్గరహిత రూపమునందు భేదము లేనందున అది విశేషార్థము నభివ్యక్తము చేయజాలదని, 'అభిమనాయతే' సుమనాయతే, దుర్మనాయతే – అను ఉపసర్గ విశిష్టరూపము లంగీకృతములు.

ఆ విధముగనే క్రియా మాత్రమున వతి విధింపబడుటచే దానివలన క్రియావిశేష ప్రతీతి కలుగదు. అందువలన క్రియాపద ప్రయోగము న్యాయ్యము. కావున క్రియాశబ్ద ప్రయోగ విషయమున భేదము లేదు. కాగా పూర్వసూత్రముచేతనే సిద్ధమని తేలినది. ॥534॥

అవతారిక— పూర్వపక్ష భాష్యాశయ మీ కారికలో నిట్లు నిగమనము చేయబడినది

శ్లో॥ ఏవం చ సతిపూర్వేణసిద్ధోఽత్రాపివతేర్విధిః ।
నియమే వా భిధానే వా భిద్యతే న క్రియాశ్రుతిః ॥ 535

ఏవం చ సతి = ఇట్లు పర్యవసింపగా, అత్రాపి = "తత్రతస్యేవ" అను సూత్రమునందు గూడ, వతేః విధిః = వతిప్రత్యయ విధానము, పూర్వేణ = వెనుక సూత్రమగు "తేనతుల్యం" మను దాని చేతనే, సిద్ధః = సిద్ధించినది, నియమే వా = నియమవిధి అయినపుడును, అభిదానే వా = అపూర్వవిధి అయినను, క్రియాశ్రుతి = క్రియావాచక పదప్రయోగము, న భిద్యతే = మారదు.

తాత్పర్య వివరణములు— వతిప్రత్యయాంత ఘటితవాక్యమునందు క్రియావాచక పదప్రయోగమేపక్షమునను తప్పనిదే. పూర్వసూత్రముచే వతిప్రత్యయము విధింపబడినపుడు ఏదియో యొక క్రియ ఆ ప్రత్యయముచేత చెప్పబడినను, క్రియావిశేషాభి వ్యక్తికై క్రియాపదప్రయోగము అపేక్షితము. అది విశేషాంతరమును నివర్తించుటకుగాక నియమముగాను

"తత్రతస్యేవ" (5-1-116) అను నీ సూత్రము, ఇవార్థమగు సాదృశ్యము నందు, క్రియా సంబంధము లేకున్నను వతిప్రత్యయమును విధించుచున్నది. క్రియా ప్రత్యాయనమునకు క్రియా పదప్రయోగ మపూర్వముగ కర్తవ్యము. కాగా క్రియా పదప్రయోగ మెట్లైనను అపరిహార్యము గనుక మరల నీ సూత్రముచే తద్విధాన మనర్థకమని భావము. ॥535॥

అవతారిక— తరువాత "అక్రియార్థోఽయ మారంభః" - ఆరంభమనగా సూత్ర రచనము. ఈ "తత్రతస్యేవ" అను సూత్రము క్రియా నిమిత్తమగు తౌల్యము లేనపుడు, ద్రవ్య నిమిత్తకముగాని గుణ నిమిత్తకముగాని అగు సాదృశ్య మున్నపుడు వతిప్రత్యయ సిద్ధి కొరకే చేయబడినదని వ్యాఖ్యానించుచున్నారు.

శ్లో॥ ఇవే ద్రవ్యాదివిషయః ప్రత్యయః పునరుచ్యతే ।
క్రియాణామేవ సాదృశ్యే పూర్వసూత్రే విధీయతే ॥ 536

ఇవే = ఇవార్థమునందు, ద్రవ్యాది విషయః = ద్రవ్య గుణ విషయమైన, ప్రత్యయః = వతి ప్రత్యయము, పునః ఉచ్యతే = మరల విధింపబడుచున్నది, క్రియాణాం = క్రియలకు, సాదృశ్యే ఏవ = సామ్యమున్నపుడే, పూర్వసూత్రే = వెనుకటి సూత్రమునందు, విధీయతే = వతి ప్రత్యయము విధింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— పూర్వసూత్రము క్రియానిమిత్త సామ్యమున 'వతి' విధాయకము. ఆ సూత్రమున 'క్రియాచేత్' అను విశేషణము గలదు. అందువలననే "గవా తుల్యః గవయః' = గవయమను మృగము ఎద్దును బోలినది, అను నర్థమునందు, 'గోవత్ గవయః' - అను ప్రయోగము సాధువు గాదు.

ప్రకృత సూత్రము ద్రవ్య కృతసాదృశ్యమునందును గుణ కృతసాదృశ్యమునను వతి విధాయకము కనుక భేదము లేకపోలేదు. ॥536॥

అవతారిక— ఉదాహరణములను పరికింపుడు.

శ్లో॥ మధురాయామివగృహాః బ్రాహ్మణస్యేవ పాండురాః ।
ఇత్యత్ర ద్రవ్యగుణయోః పూర్వేణ న వతిర్భవేత్ ॥ 537

"మధురాయామివ గృహాః" = 'మధురలోవలె పాటలిపుత్రమున నిండ్లున్నవి', బ్రాహ్మణస్య ఇవ పాండురాః = 'బ్రాహ్మణునకువలె క్షత్రియునకును దంతములు స్వచ్ఛములు' ఇత్యత్ర = అను నీ ప్రయోగములందు, ద్రవ్య గుణయోః = ద్రవ్యములను గృహములకును, దంతముల తెలుపులకును, పూర్వేణ = (సామ్యము వివక్షితమైనపుడు) వెనుక సూత్రముచే, వతిః న భవేత్ = వతి ప్రత్యయము రాదు, సాదృశ్య మిట క్రియా మూలకము గాదు గదా.

తాత్పర్య వివరణములు— తాత్పర్యము స్పష్టముగాన వివరణ మపేక్షితము గాదు. ॥537॥

అవతారిక— ఇట నొక యాక్షేపము.

శ్లో॥ అరంభస్యా క్రియార్థత్వే నార్థో యోగేన విద్యతే ।
ఋతే క్రియాయా గ్రహణాత్ పూర్వయోగేన సిధ్యతి ॥ 538

ఆరంభస్య = "తత్రతస్యేవ" అను సూత్రమును చేయుట, అక్రియార్థత్వే = క్రియాభిన్నములకు తౌల్యమున్నప్పటికైన, యోగేన = ఈ సూత్రముతో, అర్థః న విద్యతే = ప్రయోజనము లేదు, క్రియాయాః = "క్రియాచేత్" - అను విశేషణమునకు, గ్రహణాత్ ఋతే = గ్రహణము, సూత్రమున, లేకుండ జేసినచో, పూర్వయోగేన = (అపుడు) వెనకటి సూత్రము చేతనే, సిధ్యతి = వతి ప్రత్యయము సిద్ధించును.

తాత్పర్య వివరణములు— వెనుక చెప్పినట్లు ఈ సూత్రము ద్రవ్యగుణములకు సాదృశ్యమున్నపుడు వతిప్రత్యయము ప్రవర్తించుట కుద్దేశింపబడిన పూర్వ సూత్రమున 'క్రియా' అను పదమును దొలగించిన యెడల ఆ ప్రయోజనము సిద్ధించును. 'తేనతుల్యం వతిః' అను నదియే ద్రవ్యగుణ క్రియావిషయ సాదృశ్యము లందెల్ల వతిప్రత్యయమును విధింపవచ్చును. ఈ సూత్ర మపుడు వ్యర్థమేయగును. ॥538॥

అవతారిక— ఏమండీ! పాటలిపుత్రములోని గృహములు మధురతో దుల్యములు కావే? మధురలోని గృహములతో నవి సమానములు యజ్ఞదత్తుని దంతములు దేవదత్తుని దంతములతో తుల్యములుగాని దేవదత్తునితో గాదు. కావున తేనతుల్యమను పూర్వ సూత్రముచే నెట్లు సిద్ధించును? కాగా షష్ఠీ సప్తమీ సమర్థ ప్రాతిపదికము కంటె ఇరముగ వతివిధానమున కీ సూత్ర మావశ్యకమే గదా యని శంకించిన నందులకు సమాధానము.

శ్లో॥ మధురావయవే వృత్తిర్వ్యాఖ్యాతా మధురాశ్రుతేః ।
బ్రాహ్మణావయవాన్ దంతాన్ వక్ష్యతి బ్రాహ్మణశ్రుతిః ॥ 539

మధురాశ్రుతేః = మధురా శబ్దమునకు, మధురావయవే = మధురావయవములగు గృహములందు, వృత్తిః వ్యాఖ్యాతాః = ప్రవృత్తి (తద్బోధకత్వము) చెప్పబడియున్నది, బ్రాహ్మణశ్రుతిః = బ్రాహ్మణస్యేవ అనుచో బ్రాహ్మణ పదము, బ్రాహ్మణావయవాన్ = బ్రాహ్మణుని అవయవములయిన, దన్తాన్ వక్ష్యతి = దంతములను బోధించును.

తాత్పర్య వివరణములు— 'ఉష్ట్రముఖః' అను స్థలమున ఉష్ట్ర పదమునకు ఉష్ట్రావయవమగు ముఖమర్థమని చెప్పినట్లు 'మధురయా' అను పదమునకు మధురావయవ గృహములతో నని యర్థమనియు, "బ్రాహ్మణస్యేవ దన్తాః క్షత్రియస్య' అను స్థలమున, బ్రాహ్మణ పదమునకు తదవయవములయిన అనియు నర్థమని పూర్వమే నిర్ణీతమయి యున్నది. గృహములను దంతములు నుపమేయములగుటచే వానినే ఆ పదములు బోధించును. ॥539॥

అవతారిక— ఈ కారికలో అర్హవిషయ వతివిధానము నిరూపింపబడుచున్నది.

శ్లో॥ నకాచిదివయోగే తు బాహ్యాత్ సంబంధినోవినా ।
షష్ఠీ విధీయతే తత్ర పూర్వేణ ప్రత్యయో భవేత్ ॥ 540

ఇవయోగేతు = 'ఇవ' అను శబ్దముతో సంబంధమున్నపుడు, బాహ్యాత్ = బయటిదగు, సంబంధినః వినా = సంబంధినిబట్టి వచ్చునది తప్ప, కాచిత్ షష్ఠీ = షష్ఠీ విభక్తి ఏదియు, న విధీయతే = విధింపబడలేదు (ప్రథమయే వచ్చును), తత్ర = అట్టి ప్రథమాంత ముపమాన మయినపుడును, పూర్వేణ = 'తేనతుల్యమను సూత్రముచే' ప్రత్యయః భవేత్ = 'గౌరివ గవయః'' అను స్థలమునను రావలసి వచ్చును.

తాత్పర్య వివరణములు— పూర్వ సూత్రమున క్రియా అను పదమును దీసి వేసిన అపుడు 'గౌరివ గవయః' అను స్థలమున క్రియానిమిత్త సాదృశ్యము వివక్షితము కాకున్నను వతిప్రత్యయము రావలసి వచ్చును. తుల్య శబ్దయోగమునందు తృతీయా షష్ఠీ విభక్తులు విధింపబడినట్లు, ఇవ శబ్దముతో సంబంధమున్నపుడే షష్ఠీ విభక్తియు విహితము గాదు. బయటి సంబంధి యేదియేని ప్రయుక్తమయినపుడు తత్సంబంధమున శేషషష్ఠి వచ్చును. ఇవ శబ్దార్థమునకు సామానాధికరణ్య సంబంధముచేత సమన్వయమేగాని వైయధికరణ్యాన్వయ ముండదు. కావున వ్యతిరేక విభక్తియగు షష్ఠికి ప్రసక్తి లేదు. కావున తద్యోగమున ప్రథమా విభక్తికి మాత్రమే ప్రాప్తి. కాగా ''గౌరివ గవయః'' అను నపుడును వతిప్రత్యయము రావలసి వచ్చును. తద్వారణమునకు ఈ సూత్రమును రచింపవలెనని భావము. ॥540॥

అవతారిక— సూత్రమున 'తేన' - అని కలదు గదా. దానివలన, వతిప్రత్యయము నకు ప్రకృతి తృతీయా సమర్థము కావలెను. ప్రథమా సమర్థముకంటె పరముగా రాదగిన ప్రసక్తి యేమి ? అనిన చెప్పుచున్నాడు.

శ్లో॥ ఆధిక్యం తుల్య శబ్దేన సంబంధ ఉపజాయతే ।
షష్ఠీ తృతీయే తత్రస్తస్తుల్య శబ్దోహి వాచకః ॥ 541

తుల్య శబ్దేన సంబంధే = తుల్య అను శబ్దముతో సంబంధమున్నపుడు, ఆధిక్యం = వ్యతి రేకము, ఉపజాయతే = ఉద్భవించును, తత్ర = అచ్చట = తుల్య శబ్దయోగము గల ప్రయోగములందు, షష్ఠీ తృతీయేస్తః = షష్ఠీ విభక్తియు తృతీయయు, తుల్యార్థ సూత్రముచే వచ్చును, తుల్య శబ్దః = తుల్య శబ్దము, వాచకః హి = వాచకము గదా, ద్యోతకముగాదనుట

తాత్పర్య వివరణములు— తుల్య శబ్దము స్వతంత్రముగ నర్థమును బోధింప గలది. సత్త్వభూతమగు నర్థమును బోధించును. తద్యోగమున తౌల్య ప్రతియోగియగు నుప మానమునకు వ్యతిరేకము సంభవము. కావున వ్యధికరణ విభక్తులగు షష్ఠియు, తృతీయయు ''తుల్యార్థైరతులోపమాభ్యాం తృతీయాన్యతరస్యామ్'' (2-3-72) అను సూత్రముచే ప్రవ ర్తించును.

ఇవ శబ్దమట్టిది గాదు. అది సాదృశ్యమునకు ద్యోతకము మాత్రమే. తదర్థ ముప మానమున సమానాధికరణ విశేషణము అందువలన తద్యోగమున ప్రథమయేగాని వ్యతిరేకి విభక్తికి ప్రసంగము లేదు. ॥541॥

అవతారిక— తుల్య శబ్దముతో సమానమయిన యర్థముగల ఇవ శబ్దము ప్రయో గింపబడినపుడు—

శ్లో॥ ఇవశబ్ద ప్రయోగేతు బాహ్యాత్ సంబంధినోవినా ।
నాధిక్య ముపమానేఽస్తి ద్యోతకః సంప్రయుజ్యతే । 542

ఇవ శబ్ద ప్రయోగేతు = ఇవ శబ్దము వాక్యమున ప్రయోగించినపుడైతే, బాహ్యాత్ = బహిర్ భూతమగు, సంబంధినః వినా = సంబంధిని బట్టి తప్ప, ఉపమానే = ఉపమానమునందు, ఆధిక్యం = ఆధిక్యము = వ్యతిరేకమనుట, న అస్తి = ఉండదు, ద్యోతకః = ఇవ అనునది ద్యోతకముగా, సంప్రయుజ్యతే = ప్రయోగింపబడును.

తాత్పర్య వివరణములు— ఇవ శబ్దము, సాదృశ్యమునకు ద్యోతకము ద్యోతక మనగా తనతో సహోచ్చారితమగు పదమునందలి అర్థబోధకత్వ శక్తి నుద్బోధించునది. సమ భివ్యాహృత పద గత విశేషార్థమును ప్రకాశింపచేయుటయే దాని కృత్యము. తాను ప్రకాశింప జేయు నర్థము తనది కాదు. పరపదమునకు సంబంధించినదియే కనుక ద్యోతకమగు ఇవ శబ్దము ఉపమానమునందు వ్యతిరేకమును బోధింపలేదు

కనుక ఇవ శబ్దము సాదృశ్యమును ఉపదర్శించినపుడు వ్యతిరేక విభక్తికి ప్రసం గము లేదు. అపుడు వెనుక సూత్రమున 'క్రియా' అను పదము తీసివేసిన, దానిచేత వతి ప్రత్యయము రావలసి వచ్చును దానిని వారించుటకు అందు 'క్రియాచేత్' అనునది ఆవశ్య కము కనుక 'తత్రతస్యేవ' అను దాని యారంభము క్రియా భిన్న నిమిత్తక సాదృశ్య మున్నపుడు వచ్చుట కనుట యుక్తమే. ఈ సూత్రముచే, ''గౌరివ గవయః'' అను స్థలమున ప్రథమాంతముకంటె పరముగ వతిప్రత్యయాపత్తియు లేదు. షష్ఠీ సప్తముల కంటెనే అని నియమము గలదు గదా యని భావము. ॥542॥

అవతారిక— ''పితృ వదధీతే పుత్రః'' = తండ్రివలె కుమారుడు చదువు చున్నాడు. అనునది ''తేనతుల్యం క్రియాచేద్వతిః'' - అను సూత్రముచే విధింపబడిన వతి ప్రత్యయమున కుదాహరణము. పిత ఉపమానము. పుత్రు డుపమేయము. అధ్యయన క్రియ సాధారణ ధర్మము. పితాపుత్రుల సాదృశ్యమును ప్రదర్శించునది, విగ్రహ వాక్యమునందలి తుల్య శబ్దము. ''పిత్రాతుల్యం = పితృవత్'' - అని విగ్రహము.

అప తుల్యార్థయోగమున తృతీయ. ఇవ శబ్దమును విగ్రహ వాక్యమున ప్రయో గించి సాదృశ్య ప్రదర్శనము చేయుట కుదురదు. 'మధురావత్ పాటలిపుత్రే ప్రాసాదాః' 'చైత్రవదస్య దత్తస్య దన్తాః' అను స్థలములందు దంత ప్రాసాదాది బాహ్యపదార్థ సంబంధ

ముచే వచ్చినవి షష్ఠీ సప్తములు. అచట ఇవార్థమునందు "తత్ర తస్యేవ" అను సూత్ర ముచే వతిప్రత్యయము. సాదృశ్య ప్రదర్శనము విగ్రహ వాక్యమున 'మధురాయాం ఇవ' అనియు, 'దేవదత్తస్య ఇవ' – అనియు 'ఇవ' శబ్దముచే చేయబడునది. అచట ప్రకృత్యర్థము నకు ఇవార్థముతో బాహ్య సంబంధమును బట్టి సమన్వయము.

తుల్య శబ్దముచే సాదృశ్యముపదర్శింపబడినపుడు ఇవార్థముతో అన్వయము లేదు గాన ఇవ శబ్దమునకు ప్రయోగము లేదు గదా, గౌరివ గవయః' అనుచోట వతిప్రత్యయా పాదన మెట్లు ? అని ఆశంకించి, ఇవ నిమిత్తకమగు వ్యతిరేకమునకును, తుల్య నిమిత్తక వ్యతిరేకమునకును భేదము గలదని ప్రదర్శించి, పూర్వ సూత్రమున క్రియాపదము లేనపుడు, దానిచేత తుల్య నిమిత్తక వ్యతిరేకమునందు విధింపబడిన వతి ప్రత్యయము, తుల్య శబ్దముచే సాదృశ్యముపదర్శింపబడినపుడును అతిప్రసక్తమగునని చెప్పుచున్నారు.

శ్లో॥ ఇవే యోవ్యతిరేకోఽత్ర స ప్రాసాదాది హేతుకః ।
తుల్యే తద్విషయాపేక్ష మాధిక్య ముపజాయతే ॥ 543

అత్ర = ఈ "తత్రతస్యేవ" అను సూత్రోదాహరణ విషయమున, ఇవే = ఇవ శబ్ద ప్రయో గమునందు, యః వ్యతిరేకః = షష్ఠీ సప్తములకు నిమిత్తమయిన ఏ భేదము గలదో (విభక్త భేదము), సః ప్రాసాదాదిహేతుకః = అది 'ప్రాసాదాః "దన్తాః" అను పదములవలన గలిగి నది, తుల్యే = వెనుక సూత్రముచే తుల్యార్థమున విహితమయిన వతి విషయమున, తద్విష యాపేక్షం = తుల్యా శబ్దార్థ నిమిత్తకమగు, ఆధిక్యం ఉపజాయతే = వ్యతిరేకము ఏర్పడును.

తాత్పర్యవివరణములు— 'మధురాయామివ' 'దేవదత్తస్యేవ' - అని ఇవ శబ్దము ప్రయోగింపబడినపుడు, షష్ఠీ సప్తమీ విభక్తులవలన, భేద ముపమేయమునకు అగపడుచున్నది. దానికి నిమిత్తము ఇవార్థము గాదు దంత ప్రాసాదాది పదసంబంధము. కావున వతిప్రత్య యార్థమగు సాదృశ్యముచే గలిగెడు వ్యతిరేక మిచ్చట సంభవింపదు. కాగ బాహ్య సంబంధు లగు ప్రాసాద దంతములే షష్ఠీ సప్తములకు నిమిత్తములు. తదంతములకంటె వతిప్రత్యయము అని స్పష్టము పూర్వ సూత్రముచే తుల్యార్థమున వతి వచ్చినపుడు, బాహ్య పదార్థ సంబంధ ముతో నిమిత్తము లేదు. తుల్యార్థ నిమిత్తకమే వ్యతిరేకము. దానినిబట్టి తృతీయాంతము వతి ప్రకృతి. ఇట్లు తుల్యార్థక వతి ప్రత్యయమునకును ఇవార్థ వతి ప్రత్యయమునకును విషయ భేదము కలదు. ॥543॥

అవతారిక— కాగా తుల్య శబ్దార్థ నిమిత్తకమగు భేదమున నతిప్రసంగము నుదాహరించుచున్నారు.

శ్లో॥ గవయేన సమోఽనడ్వానితి వృత్తిస్తదా భవేత్ ।
నత్వస్తి గౌరివేత్యత్ర వ్యతిరేక ఇవాశ్రయః ॥ 544

"గవయేన సమః అనడ్వాన్" = 'గవయమృగముతో ఎద్దు తుల్యము', ఇతి తదా = అను

నపుడు, క్రియా గ్రహణము లేనియెడల, వృత్తిః భవేత్ = వతి ప్రత్యయము రావలసివచ్చును, "గౌరివ" ఇత్యత్ర తు = 'గౌరివ గవయః' = గోవువంటిది గవయమను నపుడు, ఇవాశ్రయః = ఇవార్థ మాశ్రయముగా గల, వ్యతిరేకః = వ్యతిరేకము, న అస్తి = లేదు

తాత్పర్య వివరణము:— గవయమును, గోవును ద్రవ్యములే సాదృశ్యము వానికే వివక్షితము. విగ్రహము 'గవయేన తుల్యః' అనియే. పూర్వ సూత్రమున క్రియా అను పదము లేనిచో, ఆ సూత్రముచేత నిచ్చట గూడ వతి ప్రత్యయము రావలసి వచ్చును. సాదృశ్యము తుల్యార్థ నిమిత్తకమే గదా. అందువలన పూర్వ సూత్రమునందు క్రియా గ్రహణము తప్పదు. ద్రవ్యములకును గుణములకును సాదృశ్య మున్నపుడు వతి ప్రత్యయము సిద్ధించుటకు రెండవ సూత్ర మావశ్యకము కాని దానిచేత నిట వతి ప్రాప్తింపదు. అది బాహ్య సంబంధులను బట్టి ప్రవర్తించునది. ఇచట బాహ్య సంబంధి ప్రసక్తి 'మధురాయామివ' అను చోటవలె లేదు గదా.

ఇక 'గౌరివ గవయః' అను స్థలమునను రెండవ సూత్రముచే వతిప్రత్యయము ప్రాప్తింపదు. ఇవార్థ నిమిత్తకమయిన వ్యతిరేక విభక్తి లేదు. ప్రథమయే గలదు గదా. రెండవ సూత్రము ప్రథమా సమర్థమునకు వతి ప్రత్యయమును విధింపదాయె. 'గౌరివ గవయస్య సంస్థానమ్' = అని అందుమనుకొనుడు. అపుడు 'సంస్థానమ్' అను బాహ్య సంబంధ్యపేక్షమగు షష్ఠి, వ్యతిరేక విభక్తి కలదుగాన వతి ప్రత్యయము వచ్చును. 'గోవద్గవయస్య సంస్థానమ్' అని వత్యన్త ఘటిత వ్యవహార ముపపన్నమగును. ॥544॥

అవతారిక — సూత్ర ద్వయారంభ మిట్లు సమర్థితము. ఇక నా సూత్రద్వయమునకు విషయ విభాగము ప్రదర్శింపబడుచున్నది

శ్లో॥ ఉపమేయేన సంబంధాత్ ప్రాక్ ప్రాసాదాది హేతుకే ।
వ్యతిరేకే వతేర్భావో న తుల్యార్థత్వహేతుకే ॥ 545

ఉపమేయేన = ఉపమేయముతో, సంబంధాత్ ప్రాక్ = సంబంధమునకు ముందు, ప్రాసాదాది హేతుకే = ప్రాసాదాదుల వలన గలిగిన, వ్యతిరేకే = వ్యతిరేకమునందు, వతేః = వతి ప్రత్యయము యొక్క, భావః = ప్రవృత్తి కలుగును, తుల్యార్థత్వ హేతుకే = తుల్యార్థ నిమిత్తక వ్యతిరేకమున, న భవతి = కలుగదు

తాత్పర్య వివరణములు— "మధురాయాం ఇవ ప్రాసాదాః పాటలిపుత్రే" లేదా, మధురాయాః ఇవ ప్రాకారాః పాటలిపుత్రస్య" అను వాక్య ప్రయోగములలో, ఉపమేయ సంబంధమునకు ముందే ప్రాసాదాది పదములతో సంబంధ ముపమానమునకు కలుగజేయబడిన, వ్యతిరేక విభక్తులు షష్ఠీ సప్తమి లుత్పన్నములగును. తరువాత ఇవార్థయోగమును, ఉపమేయ సంబంధమును కలుగును. అపుడు రెండవ సూత్రముచే వతి ప్రత్యయము. పూర్వ [illegible] విషయమున తుల్యా[illegible] ప్రయుక్తము తృతీయ. [illegible] విషయ విభాగ

మున్నను, ధర్మాంతరముచే సాదృశ్యము వివక్షితమయినపుడు, ''బ్రాహ్మణేన తుల్యః క్షత్రియః'' అనుచో వతి ప్రత్యయమును వారించుటకు క్రియాగ్రహణ మవశ్య కర్తవ్యము. కాగా రెండవ 'వతి' విధాయకము, అక్రియార్థమను విషయము సమర్థితము. ॥545॥

అవతారిక— తేనతుల్యమను సూత్రమున, 'తేన' అని తృతీయ సమర్థ విభక్తి నిర్దేశింపబడినది. అనంతర సూత్రమగు ''తత్ర తస్యేవ'' అను దానిలో, 'తత్ర' 'తస్య' అని సప్తమీ విభక్తులు సమర్థ విభక్తులుగా చెప్పబడినవి. ప్రకృత విభక్తియగు తృతీయను విడిచి, వేరు విభక్తులు షష్ఠీ సప్తమ లెందుకు వతి ప్రకృతులుగా గ్రహింపబడినవి? అను శంకకు పరిహారముగ ''న కాచి దివశబ్దేన యోగే తృతీయా విధీయతే'' అని మహాభాష్యము. దాని వ్యాఖ్యాన రూప మీ కారిక—

శ్లో॥ ఇవశబ్దేన సంబంధే న తృతీయా విధీయతే ।
ప్రకృతాం తామతస్త్యక్త్వా విభక్త్యంతర మాశ్రితమ్ ॥ 546

ఇవ శబ్దేన, సంబంధే = ఇవ శబ్దముతో యోగమునందు, తృతీయా న విధీయతే = తృతీయా విభక్తి విధింపబడలేదు. అతః ప్రకృతాం = అందువలన పూర్వ సూత్రమున ప్రస్తుతమైనను, తాం త్యక్త్వా = ఆ తృతీయను విడచి, విభక్త్యన్తరం, ఆశ్రితమ్ = షష్ఠీ సప్తమీ రూపము లగు నితర విభక్తులు గ్రహింపబడినవి.

తాత్పర్య వివరణములు— ''తుల్యార్థైః'' అను సూత్రముచేత, ఇవ శబ్ద సంబంధ మున్నపుడు తృతీయ ప్రవర్తింపదు. ఇవ శబ్దము ద్యోతకమేగాని తుల్యార్థకము గాదు 'తత్ర తస్యేవ' అను సూత్రమున, 'తత్ర, తస్య' అను పదములను దొలగించి, 'తేన' అను పదమునను వర్తించి, తృతీయార్థముచే సకల విభక్త్యర్థములును వ్యాప్తములుగాన, షష్ఠీ, సప్తమ్యర్థక విభక్త్యంతమగు నుపమాన వాచకముకంటె వతి ప్రత్యయము సిద్ధించునుగాన, సప్తమీ నిర్దేశము వ్యర్థమయి, 'శేష విషయమున' అనగా క్రియా సంబంధము లేనపుడు సప్తమి వచ్చునని జ్ఞాపనము చేసినను తృతీయా జ్ఞాపన మిష్టము గాదు. ఇవ శబ్దము ప్రయోగింపబడినపుడు, కారక విభక్తియేగాని శేషవిభక్తి యుండదు. తుల్యార్థయోగమునందు వచ్చిన తృతీయ సర్వ విభక్త్యర్థ వ్యాపకమయినట్లు, కారక విభక్తియగు తృతీయచే, సకల విభక్త్యర్థములను వ్యాప్తములు గావు. ఈ విషయము సదృష్టాంతముగ నిరూపిత పూర్వము.

కావున సంభవము లేనందున ప్రకృత తృతీయను వదిలిపెట్టి షష్ఠీ సప్తములు నిర్దేశింపబడినవి. 'మధురాయామివ' – బ్రాహ్మణస్యేవ – అని ఇవ శబ్దముచే వతి ప్రత్యయార్థము చూపబడినది. ఆ సప్తమీ షష్ఠీ విభక్తుల యర్థముతో తుల్య శబ్దమునకు సమన్వయము కుదురదు గదా. కాగా, అంతరంగ సంబంధమున, 'తేనతుల్య'మను వతి విధియు, బహిరంగ సంబంధమునందు, 'తత్ర తస్యేవ' అను వతి ప్రత్యయవిధియు ప్రవర్తించునని వివేకము.

తరువాతి మహాభాష్య గ్రంథము - ''నను చ సప్తమ్యపి న విధీయతే। ఏవం తర్హి

సిద్ధే సతి యత్ ఇవ శబ్దయోగే సప్తమీం శాస్తి తత్ జ్ఞాపయత్యాచార్యః భవతి ఇవ శబ్దేనయోగే సప్తమీ ఇతి। కి మేతస్య జ్ఞాపనే ప్రయోజనమ్? దేవేష్వివ నామ. బ్రాహ్మణేష్వివనామ' "ఇత్యేష ప్రయోగ ఉపపన్నో భవతి" అర్థము— ఇవ శబ్దయోగమున తృతీయ యేదియు విధింపబడలేదని అందువేమి? సప్తమియు విధింపబడలేదు గదా. జ్ఞాపకమువలన శేష విషయమున సప్తమి సిద్ధించుననిన తృతీయయు సిద్ధింపనగునే?— అనిన తృతీయానువృత్తి చేతనే సిద్ధించుచుండగా ఇవ శబ్ద యోగమునందు సప్తమీ సమర్థముకంటె బరముగ వతి ప్రత్యయ శాసనమువలన పాణిన్యాచార్యుడు ఇవ శబ్ద యోగమున సప్తమి వచ్చునని జ్ఞాపన చేయుచున్నాడు. ఈ జ్ఞాపనమునకు ప్రయోజనమేమనిన,— దేవేష్వివనామ = దేవతలకువలె పేరు. 'బ్రాహ్మణులకువలె పేరు' అని షష్ఠ్యర్థమున సప్తమీ ప్రయోగములు సిద్ధించుట— శేష విషయమున తృతీయ లేనట్లే సప్తమియు లేదుగాన నీ జ్ఞాపనమువలననే సప్తమి వచ్చిన తృతీయయు వచ్చును. కాగా తృతీయానువృత్తిచేతనే తృతీయాంతముకంటె బరముగా వతి సిద్ధించుచుండ, తత్ర అను సప్తమీ నిర్దేశము, ఇవ శబ్ద యోగమున శేషవిషయమునందు సప్తమియే వచ్చును. తృతీయ సమ్మతము గాదు అని భాష్య తాత్పర్యము. ॥546॥

అవతారిక—— ప్రకృతవిషయ మింకను విపులముగ నీ కారికలో వివరింపబడును.

శ్లో॥ సప్తమ్యపి న తత్రాస్తి జ్ఞాపకార్థా తు సాకృతా।
ఇష్టా సా శేషవిషయే నియతాసు విభక్తిషు ॥ 547

తత్ర సప్తమీ అపి నాస్తి = వతి ప్రత్యయవిధిలో సప్తమి కూడ లేదు, సాజ్ఞాపకార్థాతు = అది జ్ఞాపకమగుట కొరకు మట్టుకు, కృతా = ఉచ్చరింపబడినది, నియతాసు = నియతమగు తమ తమ విషయము గల, విభక్తిషు = విభక్తుల విషయమున, శేషవిషయే = కారకములు వివక్షింప బడనపుడు, సా ఇష్టా = ఆ సప్తమి, సమ్మతము.

తాత్పర్య వివరణములు—— బాహ్య పదార్థాన్వయ మూలకమగు వ్యతిరేకమును షష్ఠియే బోధించునుగాన, నీ విషయమున తృతీయ యుండనట్లే సప్తమియు సంభవింపదు. కాన సూత్రమున తత్ర అను సప్తమ్యంత పద గ్రహణమును అనావశ్యకము. ఒక ప్రశ్న ఉద్బుద్ధము కావచ్చును. ఎట్లనగా— షష్ఠ్యంతముకంటె బరముగా వతి ప్రత్యయము విధింపబడి నపుడు సప్తమ్యర్థమునకు సంగ్రహ మెట్లు కలుగును? అపుడు "మధురావత్ పాటలి పుత్రే ప్రాకారాః" అను స్థలమునందు 'మధురాయాః ఇవ' - అని విగ్రహము. ఉపమాన విభక్తి షష్ఠి, ఉపమేయ విభక్తి సప్తమి. షష్ఠ్యర్థము శేషము = కారక వ్యతిరిక్త సంబంధము. సప్త మ్యర్థము ఆధారము. అది అధికరణ కారకము. అనగా ఏకకాలముననే అచట, శేషవివక్షయు, కారకవివక్షయు చేయబడుచున్నదనుట గదా. అవి పరస్పర విరుద్ధములు గదా. అది యెట్లు పొసగును? ఇది ప్రశ్న. సమాధాన మేమనగా— షష్ఠీ సమర్థమునకంటె బరముగ వతి ప్రత్యయము వచ్చినను, వృత్తి పదమునందు విభక్తి యేదియు వినబడలేదు. ఉపమానోప మేయభావము మాత్రమే తెలియవచ్చు చున్నది. సామాన్యమునందు విశేష మంతర్భూతమయి

యుండును గాన ఉపమేయమగు పాటలిపుత్రము అధికరణ సప్తమ్యంతము కావచ్చును. దానిని బట్టి ఉపమానమును అధికరణ విషయమని అవసితమగును. ఉపమేయము ననుసరించి యుపమానమున విశేషావధారమునకు హేతువు, ప్రకృతి కర్థమగు ఉపమానము ప్రత్యయార్థమగు నుపమేయమునందు విశేషణమగుటయు, నుపమేయము ప్రధానమగుటయును నగును. కనుకనే పెద్దలు ''ఉపమానమునందలి సంశయ ముపమేయము వలన దొలగును'' - ''ఉపమానే యః సంశయః స ఉపమేయాత్ వ్యావర్తతే'' – అందురు.

ఇంకొక ప్రశ్న. ''తత్ర తస్యేవ'' అను సూత్రమున, వతి ప్రత్యయ ప్రకృతులు సప్తమ్యంతములుగను షష్ఠ్యంతములుగను నిర్దిష్టములు. అచట షష్ఠ్యర్థముచే సప్తమ్యర్థము వ్యాప్తముగాన నది వ్యర్థమయి జ్ఞాపకమనుచున్నారు గదా. తుల్య యుక్తిచే ''తదస్యాస్త్యస్మిన్నితి మతుప్'' (5-2-94) అను సూత్రమున, 'అస్య', 'అస్మిన్' - అని షష్ఠీ సప్తములు రెండును 'మతుప్' ప్రత్యయ ప్రకృతులుగా నిర్దేశింప బనిలేదే. షష్ఠీ సమర్థముకంటె బరముగా విధించినను సప్తమ్యర్థ మవగతమగును గదా ? అని ప్రశ్న.

సమాధానము— ఈ రెండును తుల్యములు కావు. మతుప్ ప్రత్యయమునకు 'షష్ఠీ సప్తముల యర్థము ప్రధానముగ వాచ్యము ''వృక్షవాన్ పర్వతః'' = 'అందు వృక్షములు గల పర్వతము' - అని పర్వతమున కాధారత్వము స్పష్టముగ ప్రతీతము. కావున నది సప్తమిచే వేరుగ నిర్దేశింపవలసినదే వతి ప్రత్యయ విషయమున నట్లుగాదు. అచట ప్రకృత్యర్థ ముపసర్జనము. అనగా అప్రధానము. వత్యంతమువలన ఔప్యమాత్రము ప్రతీతము. షష్ఠి ఆ ఔపమ్యమునకు మధురా సంబంధమును తెలియచేయును. అదియే సప్తమ్యర్థమును గూడ నంతర్భవింప జేసికొనును గాన వ్యర్థమయి జ్ఞాపకమగును. ఆ జ్ఞాప్యాంశ మేమనగా— ''స్వస్వవిషయములందు నియతములగు విభక్తులు పరస్పర విషయములందు ప్రవేశించుట ఉపపన్నముగాదు గాన, షష్ఠీ విషయమున శేషార్థమునందు సప్తమి వచ్చును' అనునది జ్ఞాప్యము. బాహ్య సంబంధి సంబంధమును పురస్కరించుకొని షష్ఠి ప్రవర్తించినట్లే సప్తమియు వర్తించునని భావము. ॥547॥

అవతారిక— సప్తమీతర విభక్తులు కూడ తమ విషయములందే ప్రవర్తింపవలసినవి ఇవయోగమునందు గూడ సంకీర్ణములుగ ప్రవర్తించునని జ్ఞాప్యము కాదు అనుచున్నారు.

శ్లో॥ యది తు వ్యతిరేకేణ విషయేఽస్మిన్ విభక్తయః ।
ప్రవర్తేరం స్తృతీయైవ వ్యభిచారం ప్రదర్శయేత్ ॥ 548

అస్మిన్ విషయే = ఈ ఇవార్థము విషయమున, విభక్తయః = అన్ని విభక్తులును, వ్యతిరేకేణ = స్వస్వవిషయముల నతిక్రమించుటచే, యదితు ప్రవర్తేరన్ = ప్రవర్తించిన యెడల, తదా తృతీయైవ = అపుడు, ప్రస్తుత విభక్తియగు తృతీయయే, వ్యభిచారం = ఆ యా విభక్తులు తమ విషయమున నతిక్రమించుటను, ప్రదర్శయేత్ = జ్ఞాపన చేయును.

తాత్పర్య వివరణములు— ఇవార్థ విషయమున సకల విభక్తులును సంకీర్ణములై ప్రవర్తించునని జ్ఞాపనము చేయుట ఇష్టమయిన, ప్రకృత తృతీయయే ఆ అతిక్రమమును జ్ఞాపన చేయవచ్చునుగాన విభక్త్యంతరము నాశ్రయించుట వ్యర్థము. తృతీయేతర విభక్తిని గ్రహించుటచే, శేషవిషయమున నొక్క సప్తమియే ప్రవర్తించును. ఇతర విభక్తులు ప్రవర్తింపవు అని విశేషజ్ఞాపన మిష్టమని తెలియుచున్నది. కావున 'దేవైరివనామ' - మున్నగు ప్రయోగములు సాధువులు కావు అని తాత్పర్యము. ॥548॥

అవతారిక— "ఏవం తర్హి సిద్ధే" ఇత్యాదిగా పూర్వోక్తమయిన భాష్య గ్రంథము యొక్క భావమును వివరించునది "వ్యభిచారే తథా" అను నీ కారిక.

శ్లో॥ వ్యభిచారే తథా సిద్ధే సప్తమీ గ్రహణాత్ వినా ।
సప్తమ్యే వోచ్యతే సర్వా న సన్త్యన్యా విభక్తయః ॥ 549

తథా = ఆ ప్రకారముగా, అనగా తృతీయానువృత్తిచే, వ్యభిచారే = సంకరము, సిద్ధే సతి= నిశ్చితము కాగా, సప్తమీ గ్రహణాత్ = తత్ర అను సప్తమ్యంత పరము లేకున్నను, యత్ సప్తమ్యేవ ఉచ్యతే = సప్తమియే చెప్పబడుట యనునది, అన్యాః = ఇతరములయిన, సర్వా విభక్తయః = సకల విభక్తులును, న సన్తి = ఇవార్థ విషయమున నుండబోవని తెలియ చేయును.

తాత్పర్య వివరణములు— 'తేన' అను తృతీయాంతపదమునను పఠించి, ఈ జ్ఞాపకమువలననే తృతీయ ననుమానించి, ఆ తృతీయాంతముకంటె ఐరముగా వతి ప్రత్యయము సిద్ధించినను చేయబడిన 'తత్ర' అను సప్తమీ నిర్దేశము, శేషవిషయమున ఇవార్థ యోగమునందు సప్తమియే వచ్చుననియు నితర విభక్తులు రావనియు నను నియత విషయమునకు జ్ఞాపకమగునని భావము. ॥549॥

అవతారిక— అట్లయిన నొక 'తత్ర' అను సప్తమి మాత్రమే గ్రహింపబడ రాదా ? అది జ్ఞాపకమును గావచ్చును. షష్ఠ్యంతముకంటె బరముగా వతి ప్రత్యయము విధింపబడినపుడు, 'మధురావత్' - అను వత్యంతము నర్థమే సప్తమ్యంతము వతికి ప్రకృతియయి నపుడును స్ఫురించును. విషయత్వము గదా సప్తమ్యర్థము. అది షష్ఠ్యర్థమును గూడ సంగ్రహింప గలదు గదాయని యాశంకించి చెప్పుచున్నారు.

శ్లో॥ అత్యంతమత్ర విషయే సప్తమ్యా జ్ఞాపకార్థయా ।
బాధితా వినివర్తేత షష్ఠీ సా గృహ్యతే పునః ॥ 550

అత్ర విషయే = ఈ ఇవార్థ విషయమున, జ్ఞాపకార్థయా = జ్ఞాపకము కొరకయిన, సప్తమ్యా = సప్తమిచేత, అత్యంతం = మిక్కిలి = పూర్తిగ ననుట, బాధితా = బాధింపబడినదై, షష్ఠీ = షష్ఠీ విభక్త్యంతము, వినివర్తేత = వతి ప్రత్యయమునకు ప్రకృతిగా తొలగును, సా పునః = (అందువలన) ఆ షష్ఠి మరల, గృహ్యతే = గ్రహింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ఇవార్థ విషయమున సప్తమికి సంభవము లేదు. అయినను, 'తత్ర' అని సూత్రమున సప్తమి నిర్దేశింపబడినది. కావున నా నిర్దేశము. ఇవార్థ విషయమున తన యునికి నిత్యమని జ్ఞాపన చేయును. కాగా నిక షష్ఠి లేకనే పోవును. అందువలన నదియు నుండునని తెలియచేయుటకు 'తస్య' అని షష్ఠీ విభక్త్యంతమును గ్రహింపబడినది.

ఇచట నొక శంక— షష్ఠ్యంతమగు 'తస్య' అను పదమును సూత్రమున గ్రహింపక, 'తత్ర' అను పదమును మాత్రమే నిర్దేశింపబడిన ఆ సప్తమి బాహ్యమగు అధేయ సంబంధ నిమిత్తకమగు అధికరణ సప్తమియే యగును. అధికరణ విహిత సప్తమ్యంతమున కంటె వతి విధానమునకు సప్రయోజనమయినపుడు విశేషవిషయ జ్ఞాపనార్థ మెట్లగును? 'తస్య' అను షష్ఠ్యంతము సూత్రమున నుచ్చరింపబడిన నది శేషార్థకమగుటచే దాని సాహచర్యమువలన 'తత్ర' అనునది గూడ, శేషవిషయక సప్తమియని తెలియును. కాగా షష్ఠీ నిర్దేశమే లేనియెడల సప్తమికి జ్ఞాపకత్వమెట్లు? అది షష్ఠిని బాధించుటయు నెట్లు?

పై శంక కిది సమాధానము— సత్యమే యనుకొనుడు. కాని, షష్ఠీ, సప్తములలో నేదియో యొకటి మాత్రము నిర్దిష్టమయినను, నయ్యది రెండవదాని యర్థము నంతర్భవింప జేసికొనునుగాన నుభయోపాదానము వ్యర్థమయి జ్ఞాపనార్థమగును. అందు సప్తమి విషయములో షష్ఠి భాష్యకారునకు సమ్మతము కాదు. కావున సప్తమియే జ్ఞాపకార్థమని భాష్యమున చెప్పబడినది. ఇక వతి ప్రత్యయము షష్ఠ్యంత ప్రకృతికి గూడ వచ్చుట ఇష్టము కాబట్టి, స్వవిషయమున షష్ఠిని వర్తింపదు. ఈ అనివృత్తియే అబాధ – అనగా దానికి బాధ లేకుండ యనబడును.

వేరొక శంక— ప్రకృత జ్ఞాపకమువలననే, ఈ సప్తమి శేషవిషయమనిన, "మధురాయామివ పాటలిపుత్రే ప్రాకారాః" = 'మధురలోవలె పాటలిపుత్రమునందు ప్రాకారములు' – అనుచో, అధికరణ సప్తమ్యంతము కంటె బరముగా వతి ప్రత్యయము సిద్ధింపదు. ఇది ఇవార్థమున శేషసప్తమిగాన అనుప్రయోగమునందు, 'పాటలిపుత్రే' అని సప్తమి, ఆధారాధేయ భావము వివక్షింపబడినపుడు తప్ప సిద్ధింపకపోవును. ఇవ శబ్ద మున్నపుడుగదా శేష విషయ సప్తమి జ్ఞాపితము. అనుప్రయోగమగు పాటలిపుత్ర శబ్దమువద్ద ఇవ అను శబ్దము లేదుగదా.

అందువలన "మధురాయామివ పాటలిపుత్రస్య ప్రాకారాః" అని పాటలిపుత్ర శబ్దమునకు షష్ఠియే రావలసియున్నది

ఈ శంకకు సమానాధానము = "ఆక్షేపము సమంజసమే. అందుకొరకు 'తత్ర' అను సూత్రమున కావృత్తిచేయబడును. లేదా అది తంత్ర నిర్దేశమని యయినను జెప్పవచ్చును సకృదుచ్చరితమయినను ననేకార్థ బోధకమగుట తంత్రమనబడదు. అందొక దానిచే అధికరణ సప్తమ్యంతమునకు వతి ప్రత్యయమును విధించి, రెండవదానిచే శేషవిషయమున సప్తమి జ్ఞాపితమగునని భాష్యకారుని యాశయమును" కైయటోపాధ్యాయులు వివరించిరి.

మరికొందరిట్లును తదాశయ పర్ణనమును జేయుచున్నారు. "షష్ఠీ సంబంధ సామాన్య వివక్షలో విధింపబడినది. సప్తమ్యర్థమగు ఆధారాధేయ భావము గూడ నొక సంబంధమే. అదియు సంబంధ సామాన్యాంతర్గతమే. కావున అను ప్రయోగము సప్తమ్యంత మయినను వతి ప్రత్యయము షష్ఠ్యంతముకంటె పరముగనే ప్రవర్తించును. 'శేషవివక్షలో, ఇవ శబ్దయోగమున్నపుడు సప్తమి యుండును' – అనియే జ్ఞాప్యాంశముగాని, 'ఆధారాదేయ భావ వివక్షలో సప్తమ్యర్థమున వతి ప్రత్యయము రానేరాదు' అని తన్నివారణమే జ్ఞాపకము చేయబడదు గదా – అని భావము. ॥550॥

అవతారిక— తుల్యార్థమున వతి యొకటి, ఇవార్థమున వతి యొకటి. ఆ రెండును విచారింపబడినవి. ఇక అర్హార్థవతి విచారము క్రమప్రాప్తము. "తదర్హమ్" (5 1-117) అను సూత్రము తద్విధాయకము – అచట, ఆక్షేపభాష్యమిట్లు గలదు. "కిమర్థమిదముచ్యతే। న। తేన తుల్యం క్రియాచే ద్వతిరిత్యేవ సిద్ధమ్" – అని. ఈ సూత్రముతో పనియేమి ? తేన తుల్యమ్ అను సూత్రముచేతనే వతి సిద్ధింపవచ్చును గదా ? అని ఆక్షేప తాత్పర్యము. ప్రకృత కారిక ఆక్షేప వ్యాఖ్యాన రూపము.

శ్లో॥ పూర్వాభ్యామేవ యోగాభ్యాం విగ్రహాంతరకల్పనాత్ ।
అర్హార్థేఽపి వతిః సిద్ధః సత్వేకేన నిదర్శ్యతే ॥ 551

పూర్వాభ్యామ్ = వెనుకటి, యోగాభ్యామ్ ఏవ = రెండు సూత్రములచేతనే, విగ్రహాంతర కల్పనాత్ = మరియొక రీతి విగ్రహ వాక్యకల్పనము వలన, అర్హార్థేపి = "తదర్హతి" అను నర్థమునందును, వతిః సిద్ధః = వతి ప్రత్యయము, సిద్ధించినది, సః ఏకేన తు = ఆ వతి ప్రత్యయము, ఒక సూత్రముచేత మట్టుకు, నిదర్శ్యతే = ఉపలక్షింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— "తదర్హతి" అను సూత్రమునందు పూర్వ సూత్రమునుండి 'క్రియా' అను పదమనువర్తించును. ద్వితీయా సమర్థ విభక్త్యంతముకంటె పరముగా, క్రియారూపమగు అర్హణకర్తను బోధించుచు వతి ప్రత్యయమగును అని సూత్రార్థము. "రాజవత్ వృత్తమ్" అని యుదాహరణము. 'రాజాన మర్హతి' అని విగ్రహము. వృత్తమనగా వర్తనము. అది క్రియ.

'రాజవత్' అను వత్యంతమునకు, "రాజ్ఞా తుల్యం వర్తతే" – అని విగ్రహ వాక్యమును చెప్పినను నీ యర్థమే ప్రతీతమగును. కనుక తృతీయాంతముకంటె 'తేనతుల్య'మను సూత్రముచేతనే వతి ప్రత్యయము సిద్ధింపవచ్చును.

'రాజవత్ ధైర్యమ్' 'రాజవత్ వేషః', 'బ్రాహ్మణవత్ ఉపశమః' = రాజువంటి ధైర్యము. రాజువంటి వేషము బ్రాహ్మణునివలె శాంతి – అను స్థలములందు అర్హతి కర్తృక్రియ కానందున తేనతుల్యమను సూత్రముచే సిద్ధింపకున్నను, 'తత్ర తస్యేవ' – అని సిద్ధింపవచ్చును. 'రాజ్ఞః ఇవధైర్యమ్' అని విగ్రహభేదము మాత్రమేగాని వస్తుభేదము లేదు. కనుక పూర్వ సూత్రములచేతనె సిద్ధింపవచ్చును.

అట్లయిన, మహాభాష్యమున, 'తేనతుల్య మిత్యేవ సిద్ధమ్' అని ఒక సూత్రము చేతనే సిద్ధి చెప్పబడినదే యనిన, నది ఉపలక్షణమని గ్రహింపదగును. అయ్యది ఉదాహరణ ప్రదర్శన మాత్రము. పూర్వ సూత్రములచే సిద్ధించుననియే హృదయము. ॥551॥

అవతారిక— తేనతుల్యమను సూత్రముచేత నెట్లు సిద్ధియనగా—

శ్లో॥ తేన తుల్యమితి ప్రాప్తేః క్రియోపాధిః ప్రసిధ్యతి ।
రాజవద్వర్తతే రాజేత్యత్ర భేదే వివక్షితే ॥ 552

క్రియోపాధిః వతిః = క్రియ (ఉపాధి =) విశేషణముగాగల వతి, రాజవత్ రాజా ఇత్యత్ర = 'రాజువంటివాడు రాజు' అనునపుడు, భేదే వివక్షితే సతి = ఒకే వ్యక్తికిని భేదమును వివక్షింపగా, 'తేనతుల్యమ్' ఇతి = ''తేనతుల్యం క్రియాచేద్వతిః'' అను సూత్రముచే, ప్రాప్తేః ప్రసిధ్యతి = ప్రాప్తించుటవలన, సిద్ధించును.

తాత్పర్య వివరణములు— 'తేనతుల్యం క్రియాచేద్వతిః' - అను వతి ప్రత్యయమునకు క్రియ ఉపాధి. అనగా నది ప్రత్యయార్థమగు నుపమేయమునకు అవచ్ఛేదకము. కాగా అర్థ ద్వారమున ప్రత్యయమునకు విశేషణము.

'తదర్హం' - అను ప్రకృత సూత్రోదాహరణము, 'రాజవత్ వృత్తమ్' - అను మున్నగునది. 'రాజానమర్హతి' - అని విగ్రహము రాజునకు యోగ్యమైన వర్తనము అని యర్థము. ఆ అర్థము 'రాజుతో తుల్యమైనది' = ''రాజ్ఞాతుల్యం వృత్తమస్య'' అని విగ్రహించి నను లభించును. ఇట్లు విగ్రహభేదముచేత ఆ సూత్రము నుదాహరణములు ఈ సూత్రము చేతను ప్రకృత సూత్రోదాహరణములా సూత్రముచేతను గతార్థములు కావచ్చును.

సరి. ''రాజవద్వర్తతే బ్రాహ్మణః'' అనిన, నుపమానము రాజును, నుపమేయము బ్రాహ్మణుడును, గాన దానిచే సిద్ధింపవచ్చు ననుకొనుడు, 'రాజవద్వర్తతే రాజా' = రాజు రాజువలె వర్తించుచున్నాడు' అనునపుడెట్లు ? తనకు తనతో నుపమానము అసంభవముగదా యనిన భేదమును వివక్షించినపుడు, అట్టి స్థలముననను వతి ప్రత్యయము సిద్ధింపవచ్చును. అని భావము. ॥552॥

అవతారిక— అది యెట్లన—

శ్లో॥ రాజత్వేన ప్రసిద్ధా యే పృథుప్రభృతయో నృపాః ।
యుధిష్ఠిరాన్తాస్తేఽన్యేషా ముపమానం మహీక్షితామ్ ॥ 553

రాజత్వేన ప్రసిద్ధాః = రాజులుగా ప్రసిద్ధులయిన, పృథు ప్రభృతయః = పృథు చక్రవర్తి మున్నగు, యుధిష్ఠిరాంతాః నృపాః = యుధిష్ఠిరుని వరకునుగల రాజులు, యే సన్తి తే = ఎవ్వారుండిరో వారు, అన్యేషామ్ = ఇతరులగు, మహీక్షితామ్ = రాజులకు, ఉపమానమ్ = ఉపమాన భూతులగుదురు.

తాత్పర్య వివరణములు— పృథువు, భరతుడు, యయాతి, దిలీపుడు మొదలగు ధర్మ తనయుని వరకునుగల, విశుద్ధ చరిత్రులును, నిండైన రాజవృత్తముతో నొప్పువారును నగు మొదటి కల్పముల రాజులు, ఈ కాలపు ఒక రాజునకు, రాజోచిత వృత్తము పరిపూర్ణముగ లేనివానికి ఉపమానముగా జెప్పబడినపుడు, 'రాజవదయం వర్తతే' = ప్రసిద్ధుడగు మహారాజును బోలి ఈతని వృత్తమున్నది, అందురు. ఈతని సమాచార మొకప్పుడు రాజుకు విరుద్ధమైనదిగా గూడ నుండవచ్చును. కాని యట్టి సంభావన లేదని ప్రశంసించుటకు, 'రాజవద్వృత్తమస్య' అందురు. ఇట్టి వ్యవహారము లుండుటవలన నీ విధముగ భేదమును వివక్షించి ఉపమానోపమేయ భావమును గల్పింపనగునని భావము. ॥553॥

అవతారిక— ఓయీ ! ఉపమేయుడగు రాజు గూడ ప్రజాపాలనమును జేయువాడైన నిక ఉపమానోపమేయ భావ ప్రయోజకమగు భేదమేమి గలదు ? అది లేనిచో సాదృశ్యమే లేదాయె ? అపుడే రాజునకు ప్రసిద్ధుడగు మహారాజుపమాన మెట్లగును ? అనిన.

శ్లో॥ సిద్ధ్యసిద్ధికృతో భేద ఉపమానోపమేయయోః ।
సర్వత్రైవయతో సిద్ధం ప్రసిద్ధేనోపమీయతే ॥ 534

ఉపమానోపమేయయోః=ఉపమానమునకును, ఉపమేయమునకును, భేదః=భేదము, సర్వత్ర ఏవ = అంతటను, సిద్ధిః అసిద్ధికృతః = ప్రసిద్ధి, అప్రసిద్ధి - వీనినిబట్టి యుండునది, యతః = ఎందువలననగా, అసిద్ధం = అప్రసిద్ధమయిన వస్తువు, ప్రసిద్ధేన ఉపమీయతే = ప్రసిద్ధమైన దానితో బోల్పబడును.

తాత్పర్య వివరణములు— పరిపూర్ణ గుణ సంపత్తిగల వ్యక్తి ప్రసిద్ధ వ్యక్తి యగును. తద్విరుద్ధ వ్యక్తికి ప్రసిద్ధి కలుగదు. అప్రసిద్ధమునకు ప్రసిద్ధ ముపమానముగా నిర్దేశింపబడును. సర్వాత్మనా భేదమే యున్నపుడుగాని అభేదమే యున్నపుడుగాని ఉపమానోపమేయ భావ ప్రసంగమే యుండబోదని నిరూపింపబడి యున్నది. బ్రాహ్మణునివలె క్షత్రియు డధ్యయనము చేయుచున్నాడనిన నచట కరణ సౌష్ఠవాదులుండుట వలన బ్రాహ్మణాధ్యయనము ప్రసిద్ధము, అప్రసిద్ధమగు క్షత్రియాధ్యయనమున కుపమానము. చతురుదధి పర్యంత పృథివీపాలకుడగు భరతుడు ప్రసిద్ధుడు, పరిపూర్ణ రాజత్వము కలవాడు. అట్టి రాజు, పృథివ్యేక దేశమాత్ర పాలకుడును, కోశదండాది సాధనముల గొరత గలవాడును నగు నీనాటి రాజున కుపమానము ఆతనిని "రాజవద్వృత్తమస్య" = ఈతని వర్తనము ప్రసిద్ధ రాజతుల్యమని ప్రశంసింతురు. ఆ విధముగనే "బ్రాహ్మణవదయం వర్తతే బ్రాహ్మణః" = ఈ బ్రాహ్మణుడు బ్రాహ్మణునివంటివాడు" అని, ప్రసిద్ధులగు వసిష్ఠాదులతో బోల్పబడుచుండును. కనుక, 'తేనతుల్యం క్రియాచేత్తను సూత్రముచే సిద్ధినిర్బాధము. ॥554॥

అవతారిక— "తత్ర తస్యేవ" అను సూత్రముచే నెచ్చట వతి ప్రత్యయము విధించునవనిన జెప్పుచున్నాడు.

శ్లో॥ రాజవద్రూపమస్యేతి రాజన్యేవ వివక్షితే ।
అక్రియార్థేన యోగేన ద్వితీయేన భవిష్యతి ॥ 555

'రాజవత్ రూపమస్య' = 'ఈతని రూపము రాజువంటిది', ఇతి, రాజనిఏవ = అని రాజే ఉపమానముగ, వివక్షితేసతి = వివక్షింపబడినపుడు, అక్రియార్థేన = క్రియాతౌల్యము లేనపుడు ప్రవర్తించుట కేర్పడిన, ద్వితీయేన = రెండవ, యోగేన = సూత్రమగు "తత్ర తస్యేవ" - అను దానిచే, భవిష్యతి = వతి ప్రత్యయము సిద్ధించును.

తాత్పర్య వివరణములు— "రాజవత్ అస్యరూపం, ధైర్యం, ఉపశమః"— అని యందురు = ఈ రాజు రూపమును, ధైర్యమును, ప్రశాంతియు, భరతాది రాజులను బోలినది' అని యర్థము. అచ్చట గుణములచే తౌల్యము. క్రియచే గాదు. అచ్చట రెండవ సూత్రము ప్రవర్తించును.

'తదర్హ'మను నీ సూత్రమున్నపుడును, అర్హతి కర్తృ క్రియ అయిననే, ఆ సూత్రముచే వతి ప్రత్యయము వచ్చునుగాని గుణ తౌల్యమున్నపుడు రాదుగాన నచట పూర్వ సూత్రము చేతనే వతి ప్రత్యయమును సాధింపవలెను' అని భావము. ॥555॥

అవతారిక— తరువాత సూత్రారంభ సమర్థన గ్రంథ మిట్లు గలదు. "నసిధ్యతి. తృతీయా సమర్థాత్, తత్ర యదా అన్యేన కర్తవ్యాం క్రియామన్యః కరోతి తదా ప్రత్యయ ఉత్పాద్యతే ఇహ పునర్ద్వితీయా సమర్థాదాత్మార్హాయాం క్రియాయాం అర్హతి కర్తరి నిశ్చిత బలాధానే ప్రత్యయ ఉత్పాద్యతే" = "తేనతుల్యమను పూర్వ సూత్రముచే నిట వతి ప్రత్యయము సిద్ధింపదు. తృతీయా సమర్థముకంటె నట, వేరొకడు చేయదగిన పని నింకొకడు చేసినపుడు ప్రత్యయము విధింపబడినది. ఇట నట్లుగాదు. ద్వితీయా సమర్థ మిచ్చట ప్రకృతి. ద్వితీయాంత వాచ్యమగు నర్థమున కర్హమగు క్రియారూపమయిన, అర్హధాత్వర్థ కర్తకు నిశ్చిత విషయమునకు బలము కూర్చుటకు స్థైర్యోత్పాదనము వివక్షితమయినపుడు వతి ప్రత్యయము విహితమగుచున్నది. యీ సూత్రమువలన" - అని భాష్యార్థము. ఆ విషయ మీ కారికలో వ్యాఖ్యానింపబడుచున్నది.

శ్లో॥ ఉపమానా వివక్షాయాం నియమార్థోయముచ్యతే ।
ధర్మోఽర్హతి క్రియాకర్తా తదర్థం వచనం పునః ॥ 556

ఉపమానా వివక్షాయాం = ఉపమానోపమేయ భావమును వివక్షింపనపుడు, అయం అర్హతి క్రియా కర్తా = ఈ అర్హణ కర్తయగు, ధర్మః = ధర్మము, నియమార్థః ఉచ్యతే = నియమము కొరకు చెప్పబడుచున్నది, తదర్థం = అందుకొరకే, పునః వచనమ్ = మరల చెప్పుట.

తాత్పర్య వివరణములు— రాజ శబ్దము రాజ సామాన్య వాచకమయినపుడు, భేదము వివక్షింపబడదు భేదము లేనిచో నుపమానోపమేయ భావ ముండదు. అవధారణము మాత్రము "రాజవదస్య వృత్తం" అనుచో వివక్షితము. ఈ వృత్త మీతనిది, రాజునకే తగి

ఋమున్నది. ఇతరుల కర్హము గాదు అని యర్థము. నియమ మనగా అవధారణము. ఈతని యాచారము క్షత్రియాచారమే యని నిశ్చితమయినను, ఇతరాచార మెంత మాత్రమును గాదు' అని స్థిరపరచుటకే, 'రాజవదిదం వృత్తం వర్తతే' యనుట. ఈ ఆచారము రాజునకే తగినది యని యర్థము అవధారిత పూర్వమయిన విషయమును మరల జెప్పుటకు ప్రయోజనము స్థైర్యాపాదనము అని భావము. ॥556॥

అవతారిక— పృథు భరత యయాతి దిలీపాది ప్రసిద్ధ రాజులలో నొకని నుద్దేశించి ''రాజవద్వర్తతేయమ్'' = 'ఇతడు రాజువలె నున్నాడు' - అని యందురనుకొనుడు. అపుడును ఉపమానోపమేయ భావము వివక్షితము గాదు. చూడుడు—

శ్లో॥ కృతహస్తవదిత్యేతత్ ప్రసిద్ధేష్వేవ దృశ్యతే ।
రాజత్వేన ప్రసిద్ధే చ రాజ్ఞి రాజవదిత్యపి ॥ 557

కృతహస్తవత్ = కృతహస్తునివలె = నేర్పరివలె, ఇత్యేతత్ =అను నీ మాట, ప్రసిద్ధేష్వేవ= ప్రసిద్ధ పురుషుల విషయముననే, దృశ్యతే = ఆగపడుచున్నది రాజవత్ = రాజువలె, ఇత్యేతదపి చ = అను నీ మాటయు, రాజత్వేన = రాజుగా, ప్రసిద్ధే రాజ్ఞి దృశ్యతే = ప్రసిద్ధుడగు రాజునందే కనబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ''చిచ్ఛేద కృతహస్తవత్'' = కృతహస్తుని మాదిరిగ ఛేదించినాడు అని యందురు కృతః = అభ్యాసమువలన నివేశితమయిన, హస్తః = చేయి, యస్యసః = కలవాడు', అని యర్థము. చేయి నలిగినవాడు. skilled hand, అర్జునాదుల లోని వాడు'. ఆతని నుద్దేశించియే ఇట్లందురు వేరొక కృతహస్తునితో నీతనికి పోలిక గాదచట చెప్పదలంచినది. ఈతడే కృతహస్తుడు. తనవంటి వానికి తగిన ఛేదనమును చేసినాడనియే వివక్షితము. కృతహస్త మర్హతి కృతహస్తవత్ = ఈతని కృత్యము కృతహస్తునికి యోగ్యమైనది అన్యునకు యోగ్యము గాదని భావము. ఔపమ్యమేమియు నుద్దిష్టము గాదు. జ్ఞాతాంశమునే మరల చెప్పుటకు ప్రయోజనము అవధారణము. అనగా నీతడు కృతహస్తుడే. ఈతడే కృతహస్తుడు' అని బోధించుట.

పాండురాజు ప్రసిద్ధుడగు రాజే కదా. ''పాండోర్విదుర ! సర్వాణి ప్రేతకార్యాణి కారయ రాజవద్రాజసింహస్య'' అనుచో, విదురా, పాండురాజు రాజసింహుడు. ఆతనికి ప్రేత కార్యములను రాజునకువలె జరిపింపుము' అని విదురునకు చేసిన యుపదేశములో, 'రాజునకే అర్హములయిన ప్రేత కృత్యములను చేయుము' అను నభిప్రాయము వ్యక్తము అచట నింకొకని యుపమానము పాండురాజునకు చెప్పుట వివక్షితము గాదు. ॥557॥

అవతారిక— కాబట్టి యీ సూత్రమునకు విషయమిది యని నిరూపించుచున్నారు.

శ్లో॥ అరాజ్ఞి యేషాం ధర్మాణాం దృష్టోత్యంత మసంభవః ।
తేరాజని నియమ్యన్తే త్యజ్యన్తే వ్యభిచారిణః ॥ 558

యేషాం ధర్మాణాం = ఏ ధర్మములకు (రాజునందు గలవానికి), అరాజ్ఞి = రాజు కానివాని యందు, అత్యంతమసంభవః = సర్వథా సంభవము లేకపోవుట, దృష్టః=కనబడుచున్నదో, తే, రాజని, నిగమ్యన్తే = ఆ ధర్మములు రాజునందు నిర్ధారింపబడు చున్నవి, వ్యభిచారిణః = తద్విరుద్ధ ధర్మములు, త్యజ్యన్తే = విడువబడుచున్నవి.

తాత్పర్య వివరణములు— కొన్ని ధర్మములు నియతముగ క్షత్రియునందే యుండునవి. వానికట స్థైర్యమును తెలియజేయుటకు, మరల మరల నవి వచింపబడుటయు గలదు. అదియే బలాధానము. దానికి ఫలము నియమము. అనగా నియమ ఫలమయిన అన్య నివృత్తిని బోధించుట. ఈ ధర్మములు రాజుకే యోగ్యములు. ఇవియే 'రాజార్హములు' అని రెండు విధముల నియమనమును ఫలితమగును. కారికలో, తద్విరుద్ధములు త్యజింపబడుననుట కిదియే యాశయము.

ఆత్మార్థాయాం క్రియాయాం అర్హతి కర్తరి నిశ్చిత బలాదానే'' అని భాష్యమున గలదు ఆత్మయనగా ద్వితీయా సమర్థమునకు ప్రకృతి. 'రాజవత్' అనుచోట రాజ పదార్థము క్రియ అనగా అర్హణ కర్త యొక్క వ్యాపారమగు వర్తనము అది రాజార్హము. రాజేతరుల కర్హము గాదు. ఇట్టి అర్థవివక్షలో నీ సూత్రముచే వతి ప్రత్యయమగును.

''రాజవద్రూపమ్, రాజవద్ధైర్యమ్'' అనుచో, ''తత్ర తస్యేవ'' అను సూత్రము చేతనే వతి ప్రత్యయము: అట రూపపదార్థమును ధైర్యపదార్థమును క్రియలు కావు పర్యవసిత మేమనగా భేదము వివక్షితమగు నెడల పూర్వసూత్రము చేతను, అభేద వివక్షయం దుపమా నోపమేయ భావము సంభవింపదు గాన ప్రకృత సూత్రముచేతను వతి ప్రత్యయ విధానము' అని— ॥558॥

అవతారిక— ''తదర్హమను సూత్రములోనికి 'క్రియా' అను పదమును వర్తించుట వలన, రాజానమర్హత్యేతత్ వాసః = ఈ వస్త్రము రాజునకు యోగ్యమయినది. 'బ్రాహ్మణ మర్హత్యేష కమండలుః' అనుచోట్ల క్రియ కర్త గాదు గాన 'వతి' రాదనుచున్నారు

శ్లో॥ అర్హతేశ్చ క్రియాకర్త్రీ యా తస్యాం వతిరిష్యతే ।
రాజానమర్హతి చ్ఛత్రమితి నత్వేవ మాదిషు ॥ 559

అర్హతేః = అర్హ ధాతువుయొక్క, కర్త్రీ = వ్యాపారాశ్రయమగు, యాక్రియా = క్రియ యేది గలదో, తస్యాం = ఆ క్రియయందు, వతిః ఇష్యతే = వతి ప్రత్యయము ప్రవర్తించుట ఇష్టము ''రాజానమర్హతి ఛత్రమ్'' = గొడుగు రాజున కర్హమైనది యను నర్థమున, ఇతి ఏవం ఆదిషు తు = అట్టి ప్రయోగములందు ''రాజవత్ ఛత్రమ్'', న ఇష్యతే = అని ప్రయోగిం చుట సమ్మతము గాదు.

తాత్పర్య వివరణములు— 'తదర్హమ్' అని సూత్రము. 'అర్హమ్' అను పదము. 'అర్హతీత్యర్హమ్' - అను విగ్రహముచే 'పచాద్యజన్తము. అర్హణకర్తయని అర్థము. అది

వృత్తము వర్తనము. సూత్రమునందు ఆ కర్త క్రియయే కావలెనని లేదు. కాని క్రియా అను పదము పూర్వసూత్రము నుండి యనువర్తించునని భావము. కాగా ఛత్రము క్రియకాదు గాన రాజవత్ ఛత్రమను ప్రయోగము సాధువు కానేరదు' అని తాత్పర్యము. ॥559॥

అవతారిక— రాజవత్ ఛత్రమ్ = రాజాన మర్హతి, బ్రాహ్మణవత్ కమండలుః = బ్రాహ్మణమర్హతి, ఇత్యాదులందు వతి ప్రత్యయ మేల యసాధువు కావలెను. వానిని గూడ సాధించునట్లు ఆ సూత్రము నర్థము చేయవచ్చునుగదా యనిన జెప్పుచున్నారు.

శ్లో॥ ప్రయుక్తానాం హి శబ్దానాం శాస్త్రేణానుగమః సతామ్ ।
ఛత్రాద్యర్థే తు వచనే ప్రత్యాఖ్యానం న సంభవేత్ ॥ 560

ప్రయుక్తానాం = శిష్ట వ్యవహారమునందు ప్రయుక్తములై, సతాం శబ్దానాం = విద్యమానము లగు శబ్దములకు, శాస్త్రేణ = శాస్త్రముచేత, అనుగమః క్రియతే హి = అన్వాఖ్యానము చేయ బడును గదా, వచనే = 'తదర్హమ్' అను సూత్రము, ఛత్రాద్యర్థే సతి తు = ఛత్రము మున్నగునది అర్హణ కర్త యయినపుడును వచ్చుటకైన, ప్రత్యాఖ్యానం = ఆ సూత్రమును ప్రత్యాఖ్యానము చేయుట, న సంభవేత్ = సంభవింపదు

తాత్పర్య వివరణములు— శబ్దములును, అర్థములును వాని సంబంధమును నిత్యములు అవి కార్యములు గావు. ఆ స్థితిలోనే శాస్త్ర మవతరించినది. ఆ శాస్త్రము శబ్దము లను ఉత్పాదింపదు ప్రయోగములందు ప్రయుక్తములగు వానికి ప్రకృతి ప్రత్యయ విభాగ పురస్సరముగ నన్వాఖ్యాన మాత్రమునే దాని కృత్యము అన్వాఖ్యాన మనగా సాధువులివి యని ప్రతిపాదించుట. ఈ విషయము నిర్ణీతచరము. 'రాజవచ్ఛత్రమ్', 'బ్రాహ్మణవత్ కమండలుః' మున్నగునవి, ఉపమానోపమేయ భావ తాత్పర్యముతోగాని అర్హమను నర్థమున గాని లోకమున నెచ్చటను బ్రయోగింపబడి యుండలేదు. కావున అసాధువులు. అసాధు శబ్దా న్వాఖ్యాన మనుపపన్నము.

మరియు, తేనతుల్యమను సూత్రముచే సిద్ధి నాశ్రయించి 'తదర్హ'మను నీ సూత్రము ప్రత్యాఖ్యానము చేయబడియున్నది. రాజవచ్ఛత్ర మిత్యాదులందు వతి ప్రత్యయ సాధనమున కావశ్యకమగు నెడల ప్రత్యాఖ్యానము సంభవింపదు. క్రియోపాధికమగు తుల్య త్వమునందే 'తేనతుల్య'మను సూత్రముచే వతి ప్రత్యయము విహితము. ఛత్రాదులు కర్త లయినపుడు ఆ సూత్రము ప్రవర్తింపదు గాన నట వతి ప్రత్యయ సాధనమునకు తదర్హమను సూత్ర మావశ్యకము కావలసి వచ్చును. దాని ప్రత్యాఖ్యానము నంగీకరించి, 'రాజవద్వృత్తమ్' అను ప్రయోగ మన్యసాధిత మగుటచే, ఛత్రము కర్త అయినపుడు వతి ప్రత్యయాభావమును భాష్యకారుడు సమ్మతించెనని స్పష్టము. సూత్రారంభ ప్రత్యాఖ్యానములు తుల్య ఫలములు కావలెను. కానిచో ప్రత్యాఖ్యానమే ఘటింపదు. దానివలన సూత్రారంభ పక్షమునందును క్రియయే అర్హణ కర్త్రి యని అవశ్యవక్తవ్యము. ॥560॥

అవతారిక— మహాభాష్యమున నీ సూత్రారంభము సమర్థింపబడి యున్నది గాని ప్రత్యాఖ్యానము చేయబడలేదే ? 'ఈ సూత్రము, ఛత్రాద్యర్థ మావశ్యకమయిన యెడల ప్రత్యాఖ్యానము సంభవింపక పోయెడిదని'యే ప్రమాణమునుబట్టి చెప్పుదురు ? అనిన –

శ్లో॥ తదర్హమితి నారబ్ధం సూత్రం వ్యాకరణాంతరే ।
సంభవత్యుపమాత్రాపి భేదస్య పరికల్పనాత్ ॥ 561

''తదర్హమ్'' ఇతి సూత్రం = తదర్హమను నీ సూత్రము, వ్యాకరణాంతరే = పాణినీయేతర వ్యాకరణములందు, న ఆరబ్ధమ్ = ఆరంభింపబడి యుండలేదు, భేదస్య = భేదమును, పరికల్పనాత్ = కల్పించుట వలన, అత్రాపి = వస్తు భేదములేని విషయమునను, ఉపమా సంభవతి = ఉపమానోపమేయ భావము సంభవించును.

తాత్పర్య వివరణములు— ఆపిశల వ్యాకరణమునందును, కాశకృత్స్న వ్యాకరణము నందును నీ సూత్రము పఠింపబడలేదు. దానివలన నీ సూత్రము ప్రత్యాఖ్యాతమని గ్రహింపబడుచున్నది. భాష్యకారుడు శాస్త్రాంతరముల వలన సిద్ధాంతిత మయిన విషయమును తన వచనముగా నాదేశించుచుండును. వారి మతము నాతడు ప్రతిషేధింపలేదు. దానివలన ''అప్రతిషిద్ధమనుమతం భవతి'' = 'వాచా నిషేధింపబడనిది అంగీకరింపబడినట్లే అగును'— అను న్యాయముచే నాతనికి ప్రత్యాఖ్యానము సమ్మతమేయని గ్రహింపదగును. ఈ సూత్రమును బఠింపని వైయాకరణాంతరుల యాశయమేమయి యుండునని పరిశీలింప, రెండు పదార్థములకు స్వతః భేదము లేకున్నను, దానిని గల్పించి వాని కుపమానోపమేయ భావము నుపపాదింపదగునని తెలుచున్నది. కాగా నీ సూత్రోదాహరణములను, పూర్వ సూత్రముచేతనే వతి ప్రత్యయమును జేసి సాధింపవచ్చునని భావము ॥561॥

అవతారిక— భేద పరికల్పనము నెట్లు చేయవలెననిన–

శ్లో॥ ఏకస్యకార్య నిర్జ్ఞానాత్ సిద్ధస్య విషయాంతరే ।
తద్ధర్మత్వ వివక్షాయాం బుద్ధ్యాభేదః ప్రకల్ప్యతే ॥ 562

ఏకస్య = ఒకే పదార్థమునకు, విషయాంతరే = వేరొక విషయమున, కార్యనిర్జ్ఞానాత్ = పనిచేయుట తెలియుటవలన, సిద్ధస్య = (సమర్థముగ) ప్రసిద్ధమునకు, తద్ధర్మత్వ వివక్షాయామ్ = ఆ కార్యమును నిర్వర్తించుట వివక్షితమయినపుడు, బుద్ధ్యా = బుద్ధి పరికల్పనచే, భేదః = అనేకత్వము, ప్రకల్ప్యతే = భావింపబడుచుండును.

తాత్పర్య వివరణములు— ''చిచ్ఛేద కృతహస్తవత్'' = 'నీవు కృతహస్తునివలె రణమునందు శత్రువుల శిరస్సులను ఛేదించితివి , అని 'యర్థము.

కృతహస్తుడనగా అభ్యాస పాటవము కలవాడని భావము. అర్జునుడే కృతహస్తుడు. అతని కుపమానమయిన వేరొక కృతహస్తుడు లేడు. కావున నిట, 'కృతహస్తునకు నగునట్లు'

అను నర్థమున తదర్హమను సూత్రముచే వతి ప్రత్యయము విహితము. ఉపమానోపమేయ భావము వివక్షితము గాదు - అని "కృతహస్త వదత్యేతత్" - అను కారికలో నుపపాదింప బడినది.

ఇందు కృతహస్తుడగు వీరు డొక్కడే అయినను, ఆతని పనులు, విషయాంతరమునను, కాలాంతరమునను ప్రసిద్ధములగుట వలన ఆతని శక్తిని ప్రకృత విషయమున నుగ్గడించుటకై వానికి భేదమును గల్పించి ఉపమానోపమేయ భావము నుపపాదింపవచ్చును. తదర్హామను సూత్రముతో బనిలేదు' అని ప్రతిపాదింపబడుచున్నది.

"నీవు, వెనుకటి యుద్ధములలో, హస్తలాఘవముచే శత్రువులను ద్రుంచినట్లు ఈ రణమునందును, ఛేదించితివి" - అని తాత్పర్యము.

ఆ విధముగనే "రాజవత్ పాండోః ప్రేతకార్యాణి కారయ" అను స్థలమునను, పాండురాజుకు దగునట్లని యర్థము వివక్షితము గాదు. "ప్రాచీనులగు రాజులకు ప్రేతకార్యము లను జరిపినట్లు పాండురాజునకును నిర్వర్తింపుమని యర్థము. కావున 'తేనతుల్య'మను సూత్రముచేతనే వతి ప్రత్యయము సిద్ధింపవచ్చునని భావము. ॥562॥

అవతారిక— ఈ విధముగ భేదపరికల్పన మావశ్యకము. లేనిచో సూత్రారంభము వలన వతి ప్రత్యయము సిద్ధించినను, ఇవ శబ్ద ప్రయోగము లభింపదు. "రాజేవాయం రాజా యుధ్యతే" "వైయాకరణ ఇవాయం వైయాకరణో బ్రూతే" - మున్నగు ఇవ ఘటిత ప్రయోగములును ననేకములు గలవు - అని చెప్పుచున్నారు.

శ్లో॥ సూత్రారంభాన్న చైతస్మాదివ శబ్దస్య విద్యతే ।
ప్రయోగః సోఽపిచైతస్య విషయే విద్యతే వతేః ॥ 563

[redacted]ప్మాత్ సూత్రారంభాత్ = (తదర్హామ్) అను ఈ సూత్రమును రచించుటవలన, వతేః [redacted]యోగః విద్యతే = వతి ప్రత్యయమునకు ప్రయోగము లభించును, ఇవ శబ్దస్య తు న = ఇవ శబ్దమునకు ప్రయోగము ఘటింపదు, ఏతస్య విషయే = ఈ విషయమునందు, సోఽపి చ విద్యతే = ఇవ శబ్ద ప్రయోగము లోకమున గలదు

తాత్పర్య వివరణములు— కాబట్టి భేదపరికల్పన మవర్జనీయమని తాత్పర్యము. ॥563॥

అవతారిక— ఇట్లు భేదపరికల్పనముచే ఇవ శబ్దము ప్రయుక్తమయిన వైదిక మంత్రములును గలవని చెప్పుచున్నారు.

శ్లో॥ దస్యుహేన్ద్ర ఇవేత్యేతదైన్ద్రే మంత్రే ప్రయుజ్యతే ।
అన్యత్ర దృష్టకర్మేన్ద్రో యథేత్యస్మిన్ వివక్షితే ॥ 564

"దస్యుహా ఇంద్ర ఇవ" = "ఇంద్రునివలె దొంగలను జంపువాడవు", ఇతి, ఏతదైంద్రే మంత్రే అను, ఈ, ఇంద్రుడు దేవతగాగల మంత్రమున, అన్యత్ర = వేరొక స్థలమునందు

దృష్టికర్మా = చూడబడిన దస్యుహనన వ్యాపారముగం, ఇంద్రః యథా = ఇంద్రుడువలె, ఇతి అస్మిన్ = అను నీ యర్థము, వివక్షితే సతి = వివక్షింపబడినపుడు, ప్రయుజ్యతే = ఇవ శబ్దము ప్రయోగింపబడియున్నది.

తాత్పర్య వివరణములు— "ఇంద్ర ఇవ హి ఉపస్తూయసే। ఇంద్ర ఇవ దస్యుహా భవ। క్షేత్రాణి సృజ" - అని యొక మంత్రము కలదు. అది ఇంద్రదేవతాకము. అనగా నందు స్తోత్రము చేయబడు దేవత ఇంద్రుడు. "ఇంద్రునివలె స్తుతింపబడుచున్నావు। ఇంద్రునివలె నీవు దొంగలను జంపువాడవగుము. సస్య క్షేత్రములను సృష్టింపుము" అని అర్థము. ఇందు సంబోధింపబడిన వ్యక్తి ఇంద్రుడే. వేరొక వ్యక్తి గాదు. ఇంద్రుడే ఇంద్రునితో బోల్చబడినాడు. నానాత్వము నారోపించి, ఒక ఇంద్రునకే భేద కల్పనచే ఉపమానోపమేయ భావమును నిర్వహింపవలెను. స్థలాంతరమున, నింద్రుడవయిన నీవు తస్కరహనన వ్యాపారము గలవాడయినట్లు ఇచ్చట గూడ నగుమని, విషయాంతరమున దృష్టనుయిన కార్యమును బట్టి భేదము పరికల్పించి చెప్పబడినది. ॥564॥

అవతారిక— ఈ విషయమున లౌకికోదాహరణమును గూడ జూపుచున్నారు

శ్లో॥ పూర్వామవస్థా మాశ్రిత్య యావస్థా వ్యపదిశ్యతే।
సదృశ స్త్వం తవైవేతి తత్రైవమభిధీయతే॥ 565

పూర్వాం అవస్థాం ఆశ్రిత్య = వెనుకటి అవస్థనుబట్టి, యా అవస్థా వ్యపదిశ్యతే = ఏ అవస్థ పోల్చబడునో, తత్ర = అచ్చట, త్వం, తవైవ సదృశః = నీవు నీకే సాటి, ఇతి, ఏవం, అభిధీయతే = అని, ఇట్లు చెప్పబడుచుండును.

తాత్పర్య వివరణములు— అవస్థల భేదమునుబట్టి, పదార్థములకు భేదమును గల్పించి పోలికను చెప్పుటను జూతము. ఒక వ్యక్తి తన యౌవనావస్థలో చక్కని ఆకర్షకత గలవాడై యుండెనను కొందము. కాని వార్ధకావస్థలో గూడ ఆ వ్యక్తి అట్టి యాకర్షణ గలవాడైన నీకు నీవే సాటి అయ్యా అందుము. అచట వ్యక్తి ఒక్కడే. అవస్థలు వేరు వేరు. ఆ అవస్థల భేదమును బురస్కరించుకొని వ్యక్తికి భేదము నాశ్రయించి 'నీతో తుల్యుడవు నీవు'- అని ఒకే వ్యక్తి ఉపమింపబడుచున్నాడు గదా. ॥565॥

అవతారిక— కాబట్టి సంక్షిప్తాంశ మేమనిన-

శ్లో॥ ప్రసిద్ధభేదం యత్రాన్య దుపమానం న విద్యతే।
ఉపమేయస్య తత్రాత్మా స్వబుద్ధ్యా ప్రతిభజ్యతే॥ 566

యత్ర = ఎచ్చట, ప్రసిద్ధభేదం = సుప్రసిద్ధమయిన భేదము గల, అన్యత్ ఉపమానం = వేరొక ఉపమానము, న విద్యతే = ఉండదో, తత్ర = అచ్చట, ఉపమేయస్య ఆత్మా = ఉపమేయము యొక్క స్వరూపము, స్వబుద్ధ్యా, ప్రవిభజ్యతే = మన బుద్ధిచే విభజింపబడు చుండును.

తాత్పర్య వివరణములు— 'రామరావణుల యుద్ధమునకు అదియే సాటి' అనునట్లు, అనన్వయాలంకార ప్రక్రియలో నొకే పదార్థమున కుపమానోపమేయ భావము ప్రతీతము ఆ విధముగనే వాస్తవముగ భేదము లేకున్నను, నీ కింకొకడు సమానుడుండుట అసంభవము. కనుక నీవు నీకే సదృశుడవు, అని యిట్లొక వ్యక్తినే స్తుతించుట కలదు. అచట భేదము బుద్ధి పరికల్పితమే కావలెను. కనుక కాల్పనిక భేదము. ఇవ శబ్ద ప్రయోగమువలన, "రాజేవత్వం రాజా" = 'రాజువలె నీవు రాజువు' - అను స్థలమున అవధారితమగుట నిశ్చితము కాగా పూర్వ సూత్రముచే వతి ప్రత్యయ సిద్ధివలన నీ సూత్రము ప్రత్యాఖ్యాతము. ॥566॥

అవతారిక— ఒక ప్రశ్న కలుగవచ్చును. బుద్ధి పరికల్పితమయిన భేదమును బురస్కరించుకొని ఉపమానోపమేయ భావోపపాదనము గౌణము గదా. శాస్త్రీయ కార్యములు ముఖ్యార్థముననే ప్రవర్తించును గాని గౌణార్థమున ప్రవర్తింపవు. అట్టి యెడ నిట వతి ప్రత్యయ మెట్లు? అని—

శ్లో॥ యోఽపిస్వాభావికో భేదః సోఽపి బుద్ధి నిబంధనః ।
తేనాస్మిన్ విషయే భిన్న మభిన్నం వా నవిద్యతే ॥ 567

స్వాభావికః = స్వభావ సిద్ధమయిన = వాస్తవిక మయిన, యః భేదః = ఏ భేదము పదార్థములకు గలదో, సః అపి = అదియును, బుద్ధి నిబన్ధనః = బుద్ధి వృత్తమయినదే తేన = అందుచేత, అస్మిన్ విషయే = ఈ శబ్ద వ్యవహార విషయమున, భిన్నం అభిన్నం వా = భిన్నమనునది గాని, ఏకమే యనునది గాని, న విద్యతే = వస్తు గతిచే లేనేలేదు.

తాత్పర్య వివరణము— భేదము వాస్తవికమయినను, అది మనకు బుద్ధ్యారూఢమయిననే 'ఇవి భిన్నములు' అను వ్యవహారమును కలుగజేయును. కాగా భేదాభేద వ్యవహారములకు బుద్ధియే నిదానము. ఏకమయినను భిన్నముగ భావింపబడవచ్చును. భిన్నమయినను నది యేకముగనే తలంపబడును. 'మధురలోని ఆ వరి ధాన్యముసే ఇపుడు తినుచున్నాము' అనుట కలదు గదా. ఉపమానోపమేయ భావ విషయమునను బుద్ధి పరికల్పిత భేదా భేదములే కారణమని యింతకు బూర్వము నిరూపితము. ॥567॥

అవతారిక— ఈ విషయమున భాష్యకారుని సంవాదమును జూపుచున్నారు.

శ్లో॥ అంగదీ కుండలీచేతి దర్శయన్ భేదహేతుభిః ।
చైత్రమీదృశమిత్యాహ బుద్ధ్యవస్థా పరిగ్రహాత్ ॥ 568

అంగదీ = బాహుపురులు కలవాడు, కుండలీ చ = కుండలములు గలవాడును, ఇతి = అని, భేద హేతుభిః = భేద కారణములచేత, దర్శయన్ = కనబరచుచు, బుద్ధ్యవస్థా పరిగ్రహాత్ బుద్ధియందు స్ఫురించు అవస్థను గ్రహించుటవలన, చైత్రమ్ = చైత్రుని, ఈదృశమ్ = ఇటువంటి వానిని, ఇతి ఆహ = అని చెప్పెను.

తాత్పర్య వివరణములు— ''ఉపదేశేజనునాసిక ఇత్'' (1-3-2) అను సూత్రమునందు ఉపదేశమునకును, ఉద్దేశమునకును లక్షణమును చెప్పుచు, ''గుణైః ప్రాపణ ముద్దేశః'' అని భాష్యకారుడు చెప్పి, ఉదాహరణముగా, ''అంగదీ, కుండలీ, వ్యూఢోరస్కః, తామ్రాయతాక్షః, వృత్తబాహుః, ఈదృశో దేవదత్తః'' అని నిర్దేశించెను. ఉపదేశమనగా ప్రత్యక్షాఖ్యానము. ఉద్దేశమనగా గుణములచే గుణాశ్రయమును బోధించుట దేవదత్తుని ఉద్దేశించుటకు, అంగదములు, కుండలములును గలవాడు. విశాలమయిన వక్షః స్థలము గలవాడు. ఎఱ్ఱని విశాలములయిన కన్నులు గలవాడు. వర్తులములయిన బాహువులు గలవాడు'– 'ఇటువంటి వాడు దేవదత్తుడు' అని యర్థము. అంగదిత్వము మున్నగునవి గుణములు. దేవదత్తున కవచ్ఛేదకములు. దేవదత్తుని అంగదవత్త్వాది గుణావచ్ఛిన్నునిగ బోధించుచు, 'ఈదృశుడు'= వీనితో తుల్యుడు, అని యనెను. అట నితరునితో దేవదత్తునకు తౌల్యము వివక్షితము గాదు ఆ ధర్మములతో నపుడు మన బుద్ధిలో పరిస్ఫురించు వానితో సదృశుడనియే భావము. అనగా బుద్ధి యందలి ప్రతిబింబముతో బాహ్య పదార్థమునకు సారూప్యము కలదనుట. కాగా ఉపమానోపమేయ భావము బుద్ధియందు భేదారోపముచే ఉపపన్నమగునని నిరూపితమగుచున్నది. ॥568॥

అవతారిక— దీనికి ఫలమేమన–

శ్లో॥ ఏతైః శబ్దైః యథాభూతః ప్రత్యయాత్మోపజాయతే ।
తత్ప్రత్యయానుకారేణ విషయోప్యుపపద్యతే ॥ 569

యథాభూతః = ఎటువంటి పదార్థముగ భాసించు, ప్రత్యయాత్మా = జ్ఞాన విశేషము, ఏతైః శబ్దైః = ఈ శబ్దములచేత, ఉపజాయతే = ఉద్భవించునో, తత్ప్రత్యయానుకారేణ = ఆ జ్ఞానాకార సాదృశ్యము చేత, విషయః అపి ఉపపద్యతే = బాహ్యమగు విషయము గూడ అవబుద్ధమగును.

తాత్పర్య *వివరణములు*— బాహ్య పదార్థము జ్ఞానాకారమేయని వ్యవహర్తల అధ్యవసాయము. అంగదిత్వము, కుండలవత్త్వము మున్నగు ధర్మములచే ఆచ్ఛురితమైన యొక ఆకారము బుద్ధియందు భాసించును. నీవు ఏ బాహ్య వస్తువును జూచినపు డా యాకృతి నీ బుద్ధియందు పడునో ఆ పదార్థమే దేవదత్తుడని వ్యవహరింపబడువాడు. దృశ్యమునకును బుద్ధి పరికల్పితము (వికల్పము) నకు అభేదాధ్యవసాయముచే సకల వ్యవహార సిద్ధియని భావము. ॥569॥

అవతారిక— కాబట్టి కల్పితమగు భేదమే ఎల్లయెడల నుపయోగించునది.

శ్లో॥ బుద్ధ్యవస్థా విభాగేన భేదకార్యం ప్రతీయతే ।
జన్యాస్త ఇవశబ్దానామర్థా స్సర్వే వివక్షయా ॥ 570

భేద ప్రయుక్త కార్యం = భేద నిబంధనమగు శాస్త్రీయ కార్యము, బుద్ధ్యవస్థా విభాగేన =

బుద్ధియొక్క అవస్థల భేదమును బట్టి, ప్రతీయతే = గోచరమగుచుండును, శబ్దానాం = శబ్దముల యొక్క, సర్వే అర్థాః = అర్థము లన్నియు, వివక్షయా = శబ్ద ప్రయోక్తల ఇచ్ఛచేత, జన్యన్తే ఇవ = పుట్టింపబడుచున్నవా యనునట్లు తోచును.

తాత్పర్య వివరణములు— ''వివక్షాతః కారకాణి భవన్తి'' = కర్తృ కర్మాది కారకములు నియతములు కావు. అవి వివక్షాధీనములై వర్తించును. శాస్త్రమునందు వ్యపదేశివద్భావమను నతిదేశ మొకటి కలదు. ఏకాచ్చునకు ద్విత్వము చెప్పబడినది. ఏకాచ్చనగా నొకయచ్చు గలది, పచ్, యజ్, మున్నగునది. 'ఇ' అను ధాతువు అజ్మాత్రమే కాని ఏకాచ్కము గాదు. అటద్విత్వ మెట్లు రావలెను ? అనిన, అజ్మాత్రమునే తద్విశిష్టముగ భావింపవలెననిరి. అదియే వ్యపదేశివద్భావము. అది వివక్షా నిబంధనమనుట తెల్లము గదా. పదార్థములకు బాహ్య సత్తా అసత్తలను జూడకయే, ఇచ్ఛచే వానిని భావించి శబ్ద సంస్కారము చేయబడును. కంసవధ వృత్తాంతమును జెప్పువానిని 'కంసంఘాతయతి' అందురు. కంసుని జంపించుచున్నాడని యర్థము శబ్దముపలన ప్రతీతము. ఈ విధముగనే బలిబంధ వృత్తాంతమును జెప్పువానిని 'బలిం బంధయతి' అందురు. బలిని బంధింపజేయు చున్నాడని శబ్దార్థము. కంసుడు, బలిచక్రవర్తియు చిరాతీతులు గదా. వారిపుడు లేకున్నను, మన బుద్ధిలో వారిని సన్నిధాపితులను జేసికొని, 'చంపువాడు చంపించువాడు' అను ప్రయోజ్య ప్రయోజక వ్యవస్థ నేర్పరచుకొని, అట్టి ప్రయోగములను జేయుచున్నాము. ॥570॥

అవతారిక— అందువలన శబ్ద ప్రతిపాద్యమగు నర్థము వస్త్వర్థము కానక్కరలేదు.

శ్లో॥ తథా విధేఽపి బాహ్యార్థే భిద్యన్తే యత్ర బుద్ధయః ।
న తత్ర కశ్చిత్ సాదృశ్యం సదపి ప్రతిపద్యతే ॥ 571

తథావిధే = అటువంటి అనగా వ్యక్త్యంతర భిన్నమయిన, బాహ్యే అర్థే అపి = బాహ్య పదార్థము నందు గూడ, యత్ర బుద్ధయః = ఎచట బుద్ధులు, భిద్యన్తే = భేదించునో, తత్ర = అచట, సత్ అపి సాదృశ్యం = విద్యమానమయిన సాదృశ్యమును గూడ, కశ్చిత్ న ప్రతిపద్యతే = ఎవడును గ్రహింపడు.

తాత్పర్య వివరణములు— ఉపమానమును ఉపమేయమును బుద్ధియందే గాక బయట గూడ (పృథక్సత్త గలవయినను), వేరయిన వయినను ఆ భేదము ప్రయోక్త మనస్సులో పడనంతవరకు వానికి సాదృశ్య మున్నప్పటికి దానిని నెవడును గమనింపడు. 'అదియే యిది' అను నేకాకార పరామర్శయే యట నుండును.

ఒక వ్యక్తిని దూరమున జూతుమనుకొనుడు. లేదా ఆ ప్రదేశమున వెలుతురు తక్కువగ నుండుననుడు. అపుడు విశేష నిశ్చయములేక వెనుక మనము చూచిన ఆ వ్యక్తి ఆకారమును అనుసంధించి 'వాడే వీడు' అనుకొందుము. సమీపముననే యున్నను, వెలుతు

రచ్చుట చక్కగ నున్నను మొదట చూచిన వెంటనే పూర్వ వాసన ఉద్బుద్ధమై వాడే వీడని యనుకొందుము కనుక భేదము వాస్తవికమయినను, బుద్ధి గోచరము కానంతవరకు నది అకించిత్కరము గవయము పోలిక దొరకనంతవఱకు ఎదుటి దానిని గోవనియే భావింతుము గదా. ॥571॥

అవతారిక— అత్యంతము వ్యావృత్తమయిన పదార్థమయినను బుద్ధిలో భేదమును గ్రహింపనపు డభేద ప్రత్యయమే కలుగును.

శ్లో॥ అత్యంతం విషయే భిన్నే యావత్ ప్రఖ్యా న భిద్యతే ।
న తావత్ ప్రత్యభిజ్ఞానం కస్యచిద్వినివర్తతే ॥ 572

అత్యంతం = సంపూర్ణముగ, భిన్నే విషయే = వేరయిన విషయమునందును, ప్రఖ్యా = అభేద నిశ్చయము, యావత్ న భిద్యతే = మారనంతవరకు = ఎంతవరకు మారదో, తావత్ అంతవరకు, ప్రత్యభిజ్ఞానం = 'అదియే యిది', అను జ్ఞానము, కస్యచిత్ = ఎవ్వనికిని, న వినివర్తతే = తొలగిపోదు.

తాత్పర్య వివరణములు— వ్యక్తులు సర్వాత్మనా భిన్న భిన్నములయినను, అవి అట్లు భిన్నములు అను జ్ఞానము మనకు కలుగనిచో, రెండు వ్యక్తులయందును అన్వయము గల రూపము అనగా ధర్మము వ్యాపించియుండుట చేత అభేద నిశ్చయమే కలుగును. భేద జ్ఞానము కలుగనంతవరకు, ప్రత్యభిజ్ఞానమును (అదియే యిది యనుట) అనువర్తించునని భావము. ॥572॥

అవతారిక— కనుక ఉపపాదించిన రీతిగ, పదార్థముల భేదాభేద వ్యవహారము నకు వానికి బాహ్యరూపము కలదా? లేదా? అను విచారముతో పనిలేదు. బుద్ధియందు ప్రతిభాసించు భేదాకారమును బుచ్చుకొని యొకే పదార్థమున కుపమానోపమేయ భావము సంభవము. "రాజవదస్య వృత్తమ్" "ఈతని వృత్తము రాజును బోలినది." - ఇత్యాది ప్రయోగములందు పూర్వ సూత్రము చేతనే వతి ప్రత్యయము సిద్ధింపవచ్చును గాన, 'తద ర్హమ్" అను సూత్రము, అపండితులకు తెలియపరచుట కగును. కాన తదారంభము సమర్థ నీయ మనుచున్నారు.

శ్లో॥ అయమేవతు సూత్రేణ భేదోభేదేన దర్శితః ।
ప్రసిద్ధమపిదుర్ జ్ఞానమబుధః ప్రతిపద్యతే ॥ 573

అయమేవ = ఈ బుద్ధ్యవస్థను బట్టిన, భేదః తు = భేదమ్మే, సూత్రేణ = సూత్రముచేత, భేదేన = వాస్తవ భేదముకంటె వేరయిన భేద మిదియని, 'దర్శితః' = చూపింపబడినది, ప్రసిద్ధమపి = ప్రసిద్ధమైనదియే అయియును, దుర్ జ్ఞానం = దుర్బోధమగు దానిని, అబుధః = మందబుద్ధియగు వాడు, ప్రతిపద్యతే = తెలిసికొనును.

తాత్పర్య వివరణములు— బుద్ధియందుండు భేద వ్యవహారమే సూత్రముచే, వ్యుత్పాదింపబడినది. వాస్తవ భేదముకంటె ఈ భేదము వేరయినది. కనుక నిది సూత్రమున రచించుటచే వేరయినదని సూచింపబడినది. అందరును నిట్టి వివేక జ్ఞానము కలవారుందరు శాస్త్రము సూక్ష్మ బుద్ధులకును మంద బుద్ధులకును గూడ ఉపయోగపడవలెను పూర్వ సూత్రముచే సిద్ధింపదీవిషయమున వతి ప్రత్యయము' అనుకొను మందమతుల కొరకు 'రాజాన మర్హతి' అని విగ్రహాంతరము ప్రదర్శింపబడినది ॥573॥

అవతారిక — ఒకే వ్యక్తి ఉపమానుపమేయము నగుట సంభవములేని విషయము కావున దుర్జ్ఞానము. కనుక బుధులు కానివారికొరకే 'తదర్హ'మను సూత్ర మారంభణీయము అని పై కారికలో చెప్పబడినది. కాని అది సంభవమే. సూత్ర మావశ్యకము కాదని చెప్పుచున్నారు

శ్లో॥ వైయాకరణ వద్బ్రూతే న వైయాకరణః సదా ।
వైయాకరణవత్ బ్రూష్వేత్యతః సోఽప్యభిధీయతే ॥ 574

వైయాకరణః = వ్యాకరణ శాస్త్రాధ్యయనము చేసినవాడయినను, సదా=ఎల్లపుడును, వైయాకరణవత్ = వైయాకరణునివలె, న బ్రూతే = ప్రసంగము చేయడు, అతః = అందువలన, సః అపి = ఆతడు కూడ, వైయాకరణవత్ బ్రూష్వ = ''వ్యాకరణము చదువుకొనినవాని వలె మాట్లాడుము'', ఇతి అభిధీయతే = అని యుద్బోధింపబడుచుండును.

తాత్పర్య వివరణములు— ఒక వ్యక్తి బాగుగ వ్యాకరణమును జదివిన వాడే. కాని సంస్కార విహీనుని వలె గ్రామ్యములగు సంభాషణములను చేయుచుండును అట్టి వానిని ఉద్దేశించి, సాధు శబ్ద ప్రయోగ కుశలులు అయిన వైయాకరణుల వలె ప్రసంగింపుమయ్యా ! అపశబ్ద భాషణమును చేయబోకుము'' అని వైయాకరణుని వైయాకరణునితో నుపమించుట లోకమున ప్రసిద్ధము ॥574॥

అవతారిక— మరియు నట్లే—

శ్లో॥ కేచిత్పుమాంసో భాషన్తే స్త్రీ వత్పుంవచ్చయోషితః ।
వ్యభిచారే స్వధర్మోఽపి పునస్తే నోపదిశ్యతే ॥ 575

కేచిత్ పుమాంసః = కొందరు పురుషులును, స్త్రీవత్ భాషన్తే = స్త్రీలవలె ప్రసంగింతురు, యోషితః చ పుంవత్ = స్త్రీలును పురుషులవలె మాట్లాడుదురు, తేన = ఇట్లుండుటచేత, వ్యభిచారే సతి = స్వధర్మమున కతిక్రమము గలిగినపుడు, స్వధర్మః అపి = ఆ, తన కర్తవ్యము గూడ, పునః = మరల, ఉపదిశ్యతే = ఉపదేశింపబడు చుండును.

తాత్పర్య వివరణములు— స్త్రీ పురుషులు తమ తమ ధర్మముల నతిక్రమించి, విరుద్ధముగ ప్రసంగించుటయు లోకమున గలదు. అపుడు స్వధర్మము నెరింగి యితరులు

వారి నుద్బోధించుటయు ప్రసిద్ధము. స్త్రీలవలె పేలవముగ భాషించు పురుషులను జూచి మీ రిట్లు అప్రగల్భముగ సదస్సులలో ప్రసంగించిన, మిమ్ములను స్త్రీలనుగా భావించి పరిహ సింతురు. కావున పురుషులకు దగునట్లు భాషింపుడు' అని వారి నుద్బోధింతురు.

స్త్రీ యొకతె, అతిప్రగల్భముగ, పురుషోచిత రీతిని మాట్లాడిన నామె నుద్దేశించి, స్వధర్మము నెరింగిన స్త్రీ మరియొకామె, "ఆడువానివలె మాట్లాడుము. సిగ్గు స్త్రీధర్మము. లజ్జావతులగు స్త్రీలను బోలిన ప్రసంగమును జేయుము. స్త్రీల హద్దును మీరుట యుక్తము గాదు', అని యెరింగించుటయు గలదు.

ఒక వీరుడు, యుద్ధరంగమున పిరికిపందగ వర్తించినపుడు, 'పురుషోచితముగ యుద్ధము చేయుము' అందురు. ఇట్లు తమ తమ కృత్యములను మరచి, విపరీతముగ వర్తించు వారికి, తమ యాచారమును ఔపమ్యముచే నుద్బోధించుచుందురు. కాబట్టి ఒకే వ్యక్తికి ఉప మానోపమేయ భావము దుర్బోధము గాదు. ॥575॥

అవతారిక— "తవైవ సదృశస్త్వమ్" = నీకు నీవే తుల్యుడవు - అనియొక వ్యక్తిని పూర్వావస్థను బట్టి అవస్థాంతరములో బోల్చుట గలదని వచింపబడినది. దాని తాత్పర్య మేమనగా—

శ్లో॥ సదృశస్త్వం తవైవేతి లోకే యదభిధీయతే ।
ఉపమానాంతరం తత్ర ప్రసక్తం వినివర్తతే ॥ 576

"తవ ఏవ త్వం సదృశః" = "నీకే నీవు సమానుడవు", ఇతి, లోకే = అని, లోకమున, యత్ = ఏ మాట, అభిధీయతే = చెప్పబడుచున్నదో, తత్ర = అచ్చట = ఆ వ్యవహారమున ప్రసక్తం = (అట్లు చెప్పనిచో) ప్రసక్తమగు, ఉపమానాంతరం = వేరొక యుపమానము, వినివర్తతే = తొలగుననుట.

తాత్పర్య వివరణములు— పై వ్యవహారము స్తుతిపరము. అనన్వయాలంకార చ్ఛాయలో నున్నది. నీవు సర్వోపమాన ధర్మములను నతిక్రమించిన వాడవు. నీకు వేరొకటి యుపమానము గాదు' అని చెప్పుటయే తాత్పర్య విషయమని వ్యాఖ్యానింపబడినది. కాబట్టి మన బుద్ధియందు భేదమును గల్పించి ఉపమానోపమేయ భావమును నిర్వహింప వచ్చును గాన నీ సూత్రము నారంభింప బనిలేదు. కనుకనే ఆపిశలులుగాని కాశకృత్స్నులు గాని తమ తమ వ్యాకరణములలో నిట్టి సూత్రమును రచింపలేదు ఈ వ్యాకరణమునను ఈ సూత్రోదాహర ణములను, ఉపమానోపమేయ భావమును వివక్షించి నిర్వహింపవచ్చును గాన నీ సూత్ర మక్కరలేదు. ॥576॥

అవతారిక— ఉపమానోపమేయ భావమును చెప్పదలంచుకొనక అన్వితను ప్రతిపాదింప దలంచిన నీ సూత్ర మావశ్యకమగునను చున్నారు.

శ్లో॥ యుక్తమౌపయికం రాజ్ఞ ఇత్యర్థస్య నిదర్శనే ।
ఉపమానా వివక్షాయాం తదర్హమితి పఠ్యతే ॥ 577

రాజ్ఞః యుక్తం ఔపయికం చ = రాజు కిది తగినది రాజ్యపాలనమున కుపాయమైనదియు, ఇతి అర్థస్య నిదర్శనే = అను నర్థమును జూపదలంచినపుడు, ఉపమానా వివక్షాయామ్ = ఉపమానోపమేయ భావము వివక్షితము కానపుడు, తదర్హమితి పఠ్యతే = 'తదర్హ'మను నీ సూత్రము పఠింపబడినది

తాత్పర్య వివరణములు— 'ఈ వృత్త మీతనికే యర్హము. ఇతరులకు దగినది గాదు' - అని నిశ్చిత పూర్వమగు విషయమునే దృఢపరచుటకు కోరి, వచించినపుడు, "రాజాన మర్హతి' అనియే విగ్రహ వాక్యము. అపు డుపమానోపమేయ భావము వివక్షితము గాదు. కనుక 'రాజ్ఞా తుల్యం' = రాజవత్ - అని విగ్రహము కాదు. అందువలన "తేనతుల్య"మను సూత్రముచే సిద్ధింపదు. పృధక్సూత్ర మావశ్యకమే. ఉపమానోపమేయ భావ వివక్షచే, గతార్థమగునని, పూర్వ వైయాకరణుల యాశయము. పరమతము మనకు విరుద్ధము గానపుడు దానిని ప్రతిషేధింప నక్కరలేదు.

కాని అర్హతను తెలియజేయదలంచిన, ఆవశ్యకమే. ఇతర వ్యాకరణములందు ఈ సూత్రమును రచింపకుండుట దోషమే. అయ్యది అవ్యాప్తియే.

అందువలననే భాష్యకారుడు, ప్రయోజనములను స్థిరపఱచి ముగించెనే గాని సూత్రమును ప్రత్యాఖ్యానము చేయలేదు. కనుక "వైయాకరణ వద్బ్రూహి" అనునపుడును యోగ్యతను ప్రతిపాదింప దలంచిన ఈ సూత్రము చేతనే వతి ప్రత్యయము. ॥577॥

అవతారిక— తుల్యార్థక వతి ప్రత్యయము ఇవార్థ వతి ప్రత్యయము. అర్హార్థ వతి ప్రత్యయము - అని మూడర్థములందు వతి ప్రత్యయము, "తేనతుల్యం క్రియాచేద్వతిః" (5-1-115), "తత్ర తస్యేవ" (5-1-116), "తదర్హమ్" (5-1-117) అను మూడు సూత్రములచే విధింపబడినది. తరువాతి సూత్రము, "ఉపసర్గాచ్ఛందసి ధాత్వర్థే" (5-1-118) అనునది. అదియు వతి విధాయకమే. ఆ వతి ప్రత్యయాంత రూపములు వేదమునందే కాన వచ్చు చున్నవి. ఆ వతి ప్రత్యయము. స్వార్థవతి (ఉపమానార్థము కానిది) ప్రత్యయము. క్రమ ప్రాప్తమగు తద్విచారము చేయబడును.

శ్లో॥ ప్రసక్తాను ప్రసక్తస్తు వతిశేషోఽభిధీయతే ।
ఉపమానాభిసంబంధా దస్మిన్ వతిరుదాహృతః ॥ 578

అస్మిన్ = ఈ వృత్తి పద విచారమునందు, వతిః = వతి ప్రత్యయము, ఉపమానాభిసంబంధాత్ = ఉపమాన సమాస ప్రసంగమున ఆ సంబంధము వలన, ఉదాహృతః = ఉదాహరింప బడినది, వతి శేషస్తు = దానికి శేషమయి ఉపమానార్థక వతిప్రత్యయము, ప్రసక్తాను ప్రసక్తః

= ఉపమానార్థక వతి ననుసరించి క్రమ ప్రాప్తమయి, అభిధీయతే = విధింపబడి విచారింప బడుచున్నది.

తాత్పర్య వివరణములు— వృత్తి సముద్దేశమునందు వృత్త పదముల విచారము ప్రధాన ప్రస్తావ విషయము. అందుపమాన సమాసమును విచారించి ఉపమానోపమేయ భావ సంబంధమున విధింపబడిన వతిప్రత్యయ ముపన్యసింపబడినది అయ్యది అనుషంగమువలన ప్రసక్తము. ఆ విచారమునకు దరువాత క్రమప్రాప్తమయినది ఉపమానార్థకము. కాని వతి ప్రత్యయము యొక్క విచారము. ఇది పై దాని వలన ప్రసక్తము. వతి శేషమనగా శేషించిన వతి ప్రత్యయము. అయ్యది ''ఉపసర్గాచ్ఛందసి ధాత్వర్థే'' (5-1-118) అను సూత్రముచే విధింపబడినది.

వేదమునందు ఉపసర్గ కంటె బరముగా ధాత్వర్థ విశిష్ట సాధనము నా యుప సర్గము బోధించినపుడు స్వార్థమున వతి ప్రత్యయమగునని యర్థము. ''యదుద్వతః నివతః'' అను మంత్ర భాగమున ''ఉద్వతః'' 'నివతః' - అనునవి యుదాహరణములు. ఉద్వత్ నివత్ శబ్దముల ద్వితీయా బహువచనాంతములు. మెట్ట ప్రదేశములను, పల్లపు దేశములను' అని యర్థము. ఆ సూత్రమున భాష్య గ్రంథము, రాబోవు కారికలో విచారింపబడును. ॥578॥

అవతారిక— అట, ''అర్థ గ్రహణం కిమర్థమ్। న। 'ఉపసర్గాచ్ఛన్దసి ధాతౌ' ఇత్యేవోచ్యేత'' - అని అర్థ పద ప్రయోజనము ప్రశ్నింపబడినది. 'ధాత్వర్థే' అనుచో అర్థ పద మెందులకు? అక్కరలేదు. 'ఉపసర్గాచ్ఛందసి ధాతౌ' అనిన జాలును అని యర్థము. ఆ ప్రశ్నాభిప్రాయ మీ కారికలో వ్యాఖ్యానించుచున్నారు.

శ్లో॥ ప్రధాన కల్పనాభావే గుణశబ్దస్య దర్శనాత్ ।
ఉపసర్గాద్వతౌ సిద్ధా ధాతౌ ధాత్వర్థ కల్పనా ॥ 579

ప్రధాన కల్పనా భావే = శబ్దముల ముఖ్యార్థములకు గ్రహణము సంభవింపనపుడు, గుణ శబ్దస్య దర్శనాత్ = ఆ శబ్దమును గుణశబ్దమునుగా కల్పించుట అగపడుటవలన, ఉపసర్గా ద్వతౌ = ఉపసర్గ కంటె వతి ప్రత్యయమును విధించిన సూత్రమున, ధాతౌ = ధాతు పదము నందు, ధాత్వర్థ కల్పనా = 'ధాత్వర్థము నందు' అని గౌణార్థమును కల్పించుట, సిద్ధా భవతి = సిద్ధించును.

తాత్పర్య వివరణములు— ధాతువనగా, భూ, వా, మున్నగునది. అది ఆ శబ్దము నకు ముఖ్యార్థము 'ధాతౌ' అనిన, ధాతువునందు వతి ప్రత్యయము వచ్చునని యర్థమగును ధాతువనగా శబ్ద రూపము. అది ప్రత్యయార్థము కానేరదు. అందువలన, సూత్రమునం దర్థ పదము లేకున్నను, సామర్థ్యము వలన ధాతు పదము లక్షణావృత్తిచే ధాత్వర్థ పరమగును. అర్థము శబ్దమునకు సహచారి గదా. కనుక అర్థ గ్రహణము ప్రయోజన రహితమని భావము. కనుకనే, ఆ భావమునే వివరించు భాష్యము ''శబ్దే కార్యస్యా సంభవాదర్థే కార్యం విజ్ఞాస్యతే'' అని యచట గలదు. ॥579॥

అవతారిక— అర్థపదము సూత్రమునందు లేకున్నను, శబ్ద-సహచరితమగుననుట వలన అర్థము ప్రతిపన్నమగునని గదా ఫలితము ? ధాతువునకు సంబంధించిన శబ్ద ధర్మము లును తత్సహచరితములు ఇతరములు సంభవించును గదా. అట్టి యెడ అర్థమే గ్రహింప బడుట యెట్లు ? అని ప్రశ్న కలుగ వచ్చును. దానికి సమాధాన మీ కారిక—

శ్లో॥ స్వం రూపమితి చైతస్మిన్నర్థస్యాపి పరిగ్రహః ।
రూపవత్ జ్ఞాపిత స్తస్మాత్ ఆసన్నార్థో గ్రహీష్యతే ॥ 580

స్వం రూపమితి చైతస్మిన్ = ''స్వం రూపం శబ్దస్యా శబ్ద సంజ్ఞా'' అను సూత్రమున, రూపవత్ అర్థస్యాపి = రూపమునకువలె అర్థమునకు గూడ, పరిగ్రహః = గ్రహణము, జ్ఞాపితః = జ్ఞాపన చేయబడినది, తస్మాత్ = అందువలన, ఆసన్నః అర్థః = రూపమువంటి ప్రత్యాసన్నతరమగు అర్థము, గ్రహీష్యతే = గ్రహింపబడును.

తాత్పర్య వివరణములు— స్వం రూప సూత్రమున, 'స్వం శబ్దస్య' అని మాత్రమే చెప్పినను శబ్దమునకు స్వీయము రూపమేయగును గాన, మరల రూపపద మనావశ్యకమయి, రూపమువలెనే అర్థము గూడ బోధ్యమగునని జ్ఞాపన చేయునని చెప్పబడినది. అందువల్ల శబ్దమునకు సంబంధించిన ఇతరములకంటె దాని వాచ్యార్థమే సన్నిహిత తరము గాన నదియే గ్రహింపబడును' అని తాత్పర్యము. ॥580॥

అవతారిక— పయి ప్రశ్నకు సమాధాన భాష్యము— ''ఇదం తర్హి ప్రయోజ నమ్ । ఉత్తర పదలోపో యథా విజ్ఞాయేత । ధాతుకృతోఽర్థో ధాత్వర్థః । కః పునర్ధాతు కృతోర్థః । సాధన మితి'' = 'అర్థ పదము ఉత్తర పదలోప సమాససిద్ధి కొరకు, ఎట్లు ? ధాతుకృతమగు నర్థము ధాత్వర్థము. ఏయది ధాతువుచే కలుగచేయబడిన యర్థము ? సాధ నము, అనగా కారకము. ఇది సమాధానము. ఆ గ్రంథ మీ కారికలో వ్యాఖ్యానింపబడుచున్నది.

శ్లో॥ ధాత్వర్థేనోప జనితం సాధనత్వేన సాధనమ్ ।
ధాతునా కృతమిత్యేవమస్మిన్ సూత్రే ప్రతీయతే ॥ 581

అస్మిన్ సూత్రే = ఈ ఉపసర్గాత్ ఛందసి ధాత్వర్థే అను సూత్రమునందు, సాధనత్వేన = క్రియా సాధనముగా, ధాత్వర్థేన = క్రియచేత, ఉపజనితం = కలిగింపబడిన, సాధనం = కారకము, ధాతునా కృతమ్ = 'ధాతువుచేత నిది చేయబడినది' అని, ఇత్యేవం = అని యిట్లు, ప్రతీయతే = భావింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ధాతు శబ్దమున కిచ్చట లక్షణచే ధాత్వర్థమని యర్థము కాగా ధాతు కృతమనగా, ధాత్వర్థమగు క్రియచేత చేయబడినది = ప్రాదుర్భావిత మయినది యని యర్థము. అదియే సాధనము = కారకము. ఇట నొక శంక కలుగును. కారకము సిద్ధ రూపము గదా సాధ్య స్వరూపమగు క్రియచే నది యెట్లు కల్పితమగును ? అని. కాని క్రియ కారక స్వరూపమును నిష్పాదింపదు. కర్మ కరణాది సాధనముల సాధనత్వము క్రియాపేక్షము

క్రియయే గదా సాధనములను బ్రవర్తింప జేయునది. కాగా క్రియచే సాధనము, స్వరూపతః గాక కారకముగా నిష్పాదింపబడుచున్నది గాన నది ధాత్వర్థ కృతమగు నర్థము కానోపును. ఈ విషయము సాధన సముద్దేశమునందు "ప్రవృత్తి రేవ ప్రథమం" అను కారికచే నిర్ణీత పూర్వము. ॥581॥

అవతారిక— సమాధాన భాష్యమున, "ఉత్తర పదలోపో యథా విజ్ఞాయేత" అని చెప్పబడినది గదా ! ఆ ఉత్తర పదలోప మన నేమి ? ఉత్తర పదలోపమును సూత్ర కారుడు చెప్పియుండలేదే యనిన—

శ్లో॥ యశ్శబ్దశ్చరితార్థత్వా దత్యంతం న ప్రయుజ్యతే ।
విషయేఽదర్శనా త్తత్ర లోప స్తస్యాభిధీయతే ॥ 582

యః శబ్దః = ఏ శబ్దము, చరితార్థత్వాత్ = కృతకృత్యమగుట వలన, అత్యంతంన ప్రయుజ్యతే = ప్రయోగింపనే పడదో, తస్య = ఆ శబ్దమునకు, విషయే అదర్శనాత్ = ప్రసంగ విషయమున నగపడక పోవుటవలన, లోపః అభిధీయతే = లోపము కలిగినదని చెప్పబడును

తాత్పర్య వివరణములు— శబ్దములు అర్థబోధనమునకై ప్రయోగింపబడును. కావున అర్థమున్నపుడు ఎన్ని సూత్రకార వార్తికకార వచనము లున్నను వానిచేత శబ్దముల ప్రయోగము వారింపబడదు. కాని ఇంకొక దానివలన నా యర్థము తెలియబడుటచే దాని అదర్శనము లోపమని వ్యవహరింపబడును. లోపసంజ్ఞా శాస్త్రమునకును నదియే యర్థము. కాబట్టి ధాత్వర్థః అనుచోట ధాతు కృతః అర్థః = ధాత్వర్థః అని విగ్రహమును, కృత శబ్దమునకు లోపమును నని తాత్పర్యము గాదు. 'ధాతుశ్చాసౌ అర్థశ్చ' అనియే విగ్రహవాక్యము. ధాతు శబ్దమునకు క్రియ అర్థము. తత్కృతమయిన యర్థము ఉపచారమువలన నదియే యగును. మయూర వ్యంసకాది సూత్రముచే సమానాధికరణ సమాసమే, ధాతు కృతమయిన యర్థమని పర్యవసి తార్థము. లేదా ధాతుః అర్థః యస్య తత్ అని బహుశ్రీహి వివక్షితమన వచ్చును. ధాత్వర్థమగు క్రియ ప్రయోజనముగా గలదియని యర్థమగును. క్రియ సాధ్యము గాన సాధనకు గల కారకమునకు ప్రయోజనమగును. అట్టి సాధనమునందు వర్తమానమగు నుపసర్గ కంటె బరముగా వతి ప్రత్యయము వచ్చునని సూత్రార్థము నిష్పన్నమగును. అది స్వార్థమున బ్రవర్తించును. ॥582॥

అవతారిక— ఈ విధముగ అర్థపద సామర్థ్యము వలన సాధనమునందును నర్థము లభించుటవలన, సాధన బోధకమగు వతి ప్రత్యయాంతము లింగ సంఖ్యలు కలది యగును. "సాధనేయం భవన్ లింగసంఖ్యాభ్యాం యోక్ష్యతే" – అని అర్థపద ప్రయోజనము వర్ణితము. 'అది శక్తిరూపము గదా, కారక శక్తియు, క్రియవలె అసత్త్వభూతమే ఆయె. సాధనమునకు లింగ సంఖ్యా సంబంధ మెట్లు ? అను శంకకు సమాధానమును చెప్పుచున్నారు.

శ్లో॥ క్రియాయాం సాధనే ద్రవ్యే ప్రాదయో యే వ్యవస్థితాః ।
తేభ్యః సత్త్వాభిధాయిభ్యః వతిః స్వార్థే విధీయతే ॥ 583

క్రియాయాం = క్రియలో, సాధనే, ద్రవ్యే = సాధనమయిన, ద్రవ్యమునందు, యే ప్రాదయః = ఏ. ప్ర, పరా, - మున్నగు నుపసర్గలు, వ్యవస్థితాః = వాచకములుగా ప్రవృత్తములయి యున్నవో, సత్త్వాభిధాయిభ్యః = ద్రవ్యమును జెప్పు, తేభ్యః = ఆ, ప్ర పరా - మున్నగువాని కంటె బరముగ, స్వార్థే = స్వార్థమునందు, వతిః విధీయతే = వతి ప్రత్యయము విధింపబడు చున్నది.

తాత్పర్య వివరణములు— సాధన మనగా నిచట సాధన శక్తికి ఆశ్రయమగు ద్రవ్యము అని భావము. కారక శక్తికిని తదాశ్రయమగు ద్రవ్యమునకును అభేదము భావింప బడును. ప్రాది ఉపసర్గలు క్రియాసాధనములచే ఆకర్షింపబడిన ద్రవ్యములకు వాచకములు. వానికంటె బరముగ స్వార్థమున నీ వతిప్రత్యయము వచ్చును. కాగా నిపుడిది సత్త్వరూపమగు ద్రవ్యమును బోధించును. అందువలన లింగ సంఖ్యల సంబంధ ముపపన్నమగునని తాత్ప ర్యము. ॥583॥

అవతారిక— ప్రాదులు క్రియా విశేషములను ద్యోతనచేయును అనియే నిశ్చితమై యున్నది గాని, వానికి ద్రవ్యమును బోధించు సామర్థ్యమున్నట్లు లేదే? అని ఆశంకించి చెప్పుచున్నారు.

శ్లో॥ ప్రత్యయేన వినా ప్రాదిస్తత్రార్థే న ప్రయుజ్యతే ।
భేదేన తు సమాఖ్యానే విభాగః పరికల్పితః ॥ 584

ప్రత్యయేన వినా = ప్రత్యయము లేకుండగ, ప్రాదిః = ఉద్, ని, మున్నగు ప్రాది, తత్ర అర్థే = ఉద్గతములు, నిగతములు - అను నా యర్థమునందు, న, ప్రయుజ్యతే = ప్రయోగింప బడదు, భేదేన, సమాఖ్యానే తు = ప్రకృతి ప్రత్యయ విభాగము చేసి అన్వాఖ్యానమునందు, విభాగః పరికల్పితః = విభాగము కల్పింపబడినదే గాని అది అఖండమే.

తాత్పర్య వివరణములు— 'విగ్రహ వాక్యమునందు నియతములగు ధర్మములు కొన్ని వృత్తిపదమునందు భాసించునవి గొన్ని, వృత్తి వాక్యములు రెండింటను భాసించునవి మరికొన్ని - అని యిట్లు శబ్ద శక్తిని గూర్చిన నియమము గలదు. "—వాక్యేఽపినియతా ధర్మాః కేచి ద్వృత్తౌ ద్వయో స్తథా" - అని ఈ సముద్దేశమున 33వ కారికలో ఆ విషయ ముపపాదితము. కావున, విగ్రహ వాక్యమునందు ప్రయుక్తములయిన ప్రాదులకు ద్రవ్యమును బోధించు శక్తి లేదు. కాని ఏకార్థీభావ సామర్థ్యమునందు వృత్తి విషయమున ఆ శక్తి వానికి కలుగును. ఉద్వతః నివతః అనునవి అఖండ శబ్దములు.

ప్రకృతి ప్రత్యయ విభాగము చేసి అన్వాఖ్యానము చేసినపుడు, అందు ప్రకృతి భాగమునకు క్రియా సాధన ముపసర్జనముగా గల ద్రవ్య మర్థమనియు, అదియే ప్రత్యయ భాగమునకును నర్థము, వేరర్థము లేదనియు దెలియును.

శబ్దముల యన్వాఖ్యానము లోకసిద్ధమగు నర్థమును బట్టియే గదా. ఉపసర్గలకు వృత్తి విషయమున నిది స్వభావమని, సూత్రమునందలి యర్థపదము బోధించును. అది లేనిచో, శబ్దమునందు కార్యము సంభవింపదు గాన క్రియ ప్రతీతమయినను, అది, సాధన శక్తిని, తనతో అవినాభూతమై యుండుటవలన బోధించినను, దానితో అభిన్నమయిన ద్రవ్యమును బోధింపదు. అర్థపదమువలన ద్రవ్యము యొక్క ప్రతీతి సంభవించును. అదియే తత్ఫలము. ॥584॥

అవతారిక — సాధన శబ్దమునకు కారక శక్తి మాత్రమే అర్థమయిన, అపుడు—

శ్లో॥ అనంగీకృత సత్త్వం తు యదిగృహ్యేత సాధనమ్ ।
విభక్తిభిర్నయోగః స్యాత్ యథైవ తసిలాదిషు ॥ 585

అనంగీకృత సత్త్వం=ఆశ్రయమయిన ద్రవ్యము గ్రహింపబడనిదై, సాధనం యది గృహ్యేత = సాధన శక్తి మాత్రమే గ్రహింపబడినచో, తసిలాదిషు యథైవ = తసిల్ ప్రత్యయాంత త్రల్ ప్రత్యయాంతముల వలె, విభక్తిభిః = సకల విభక్తులతోడను, యోగః నస్యాత్ = సంబంధము లేకపోయెడిది.

తాత్పర్య వివరణములు— 'తతః' అనునది తసిలంతము. 'తత్ర' అనునది త్రలంతము. ఇవి పంచమీ సప్తమీ విభక్త్యర్థ ప్రధానములయిన అవ్యయములు. అసర్వ విభక్తి తద్ధితాంతములు. సకల విభక్తి సంబంధము వానికి ఉండదు. ఏకవచన మొక్కటియే యుండును. 'ఉద్వత్' 'నివత్' - అను నీ వత్యంతములు గూడ ద్రవ్య ప్రధానములు కానిచో లింగ సంఖ్యలు లేకపోవును. బహువచనాంత ప్రయోగిమ నుపపన్నమగును.

సూత్రమునందలి అర్థగ్రహణ బలమున, సాధన మప్రధానమయి ద్రవ్యము ప్రధానముగ వాచ్యమగును. సత్త్వవచనత లభించును. కర్మకరణాది సంబంధమున సర్వవిభక్తి యోగము కలుగును. బహువచన ముపపన్నమగును. అర్థ మొక్కటియే అయినను, తద్వాచక శబ్దములు భిన్న భిన్నములయినపుడు లింగ భేదము విరుద్ధము గాదు—ఏకార్థే శబ్దాన్యత్వాత్ దృష్టం లింగాన్యత్వమ్. ॥585॥

అవతారిక — అయినను, స్వరాది గణమునందు వతిప్రత్యయము పఠింపబడుట వలన అవ్యయత్వము ప్రాప్తించుచున్నదే యనిన చెప్పుచున్నారు.

శ్లో॥ పాఠాద్యైరవిభక్తిత్వం వత్యన్తేష్వనుగమ్యతే ।
తేషా ముద్వత ఇత్యత్ర వక్తవ్యా స విభక్తితా ॥ 586

యైః = ఎవరిచేత, వత్యంతేషు = వతి ప్రత్యయాంతములందు, పాఠాత్ = స్వరాది పాఠము వలన, అవిభక్తిత్వం = విభక్తి రాహిత్యము, అనుగమ్యతే = అంగీకరింప బడునో, తేషాం = వారికి = వారి మతమున, ఉద్వతః ఇత్యత్ర = 'ఉద్వతః' - అనుచోట, సవిభక్తితా = విభక్తి యోగము, వక్తవ్యా = అపూర్వముగ చెప్పవలసినదగును.

తాత్పర్య వివరణములు— లోకమునందు ప్రయోగములలో విభక్తి విరహితము లుగ నగపడు వానికి అవ్యయ సంజ్ఞ చెప్పబడుచున్నవి. స్వరాదులందు వతి ప్రత్యయమును బఠించుటవలన అవ్యయ సంజ్ఞ కలిగిన, తదంతములు విభక్తి రహితములు కావలెను. ''అవ్యయాదాప్ సుపః'' (2-4-82) అను సూత్రముచే విభక్తి ప్రత్యయమునకు లుక్కు రావలెను. అందుకని సవిభక్తికతను ప్రతిపాదింపవలసి యుండును. ''ఉపసర్గాచ్ఛందసి ధాత్వర్థే'' అను ప్రకృత సూత్రమునందలి అర్థపదము వలన అవ్యయత్వము ప్రాప్తింపదు. ఇట వతి ప్రత్యయముచే ద్రవ్యము బోధింపబడుచున్నది గాన నిది సత్వవచనము. కావున నవ్యయ సంజ్ఞ ప్రవర్తింపదు. స్వరాది గణపాఠము వలన నవ్యయ సంజ్ఞ 'తేనతుల్యమి'త్యాది సూత్ర విహిత వతి ప్రత్యయాంతములకే యని భావము. ॥586॥

అవతారిక— ఇంతవరకును వతి ప్రత్యయ పరీక్ష చేయబడినది. ఆ ప్రసంగమున, విషయాంతరమును మహాభాష్యమున విచారింపబడిన దాని నుపపాదించుచున్నారు. వార్తిక కారుడు, ''స్త్రీ పుంసాభ్యాం వత్యుప సంఖ్యానం'' అని యొక వార్తికమును బఠించెను. 'స్త్రీ, పుం శబ్దములకంటె బరముగా, వతి ప్రత్యయనమునకు, తుల్యార్థమున, ఉపసంఖ్యానము కర్తవ్యము' - అని యా వార్తికమున కర్థము. 'తేనతుల్య మిత్యాది సూత్రములచే నేల సిద్ధింపదు ? అనగా, ''స్త్రీ పుంసాభ్యాం నఞ్ స్నఞౌ భవనాత్'' (4-1-87) అను సూత్రముచే, భవనమను నర్థమునకు బూర్వము ఆ యా సూత్రములందు నిర్దేశింపబడిన అర్థములందు, స్త్రీ శబ్దమునకు 'నఞ్' అను ప్రత్యయమును, పుమ్ శబ్దమునకు స్నఞ్ అను ప్రత్యయమును విధింపబడినవి. అపత్యాద్యర్థములందు సామాన్యవిహితములగు నుత్సర్గ ప్రత్యయములను బాధించి ఆ శబ్దముల కా ప్రత్యయములు వచ్చునట్లు, వత్యర్థమునందును, వతి ప్రత్యయమును బాధించి నఞ్ స్నఞ్ ప్రత్యయములు రావలసియున్నవి. అపుడు స్త్రీవత్, పుంవత్ అను రూపములు సిద్ధింపక పోవును. అందువలన నా శబ్దములకంటె బరముగ వతి ప్రత్యయ ముపసంఖ్యేయ మగును. 'వత్యుప సంఖ్యానమ్' అను వార్తికాంశమున, 'వతి' అను పదమునకు 'వతి ప్రత్యయార్థమున' అని యర్థము. ఉపసంఖ్యానం అనగా, నఞ్ స్నఞ్ ప్రత్యయములకు వచనముచే విధానము అని యర్థము. 'కర్తవ్యమ్' అయధ్యాహారము. లేదా 'వతి' = వతి ప్రత్యయము విధీయమానమయినపుడు, స్త్రీ పుం శబ్దములకు గూడ నది విధేయము అని యర్థము. అపుడు 'వతి' అనునది సతిసప్తమి యనుట.

ఈ వార్తికము మహాభాష్యమున ప్రత్యాఖ్యానము చేయబడినది. ''ఆచార్య ప్రవృత్తిః జ్ఞాపయతి, న వత్యర్థే నఞ్ స్నఞౌ భవతః । యదయం స్త్రియాః పుం వదితి నిర్దేశం కరోతి । ఏవ మపి స్త్రీవదితి న సిధ్యతి. యోగాపేక్షం జ్ఞాపకమ్'' - అని అచట భాష్య గ్రంథము.— 'ఉపసంఖ్యాన మక్కర లేదు. ''స్త్రియాః పుంవత్'' అను సూత్రమున 'పాణిని పుంవత్' అని వతి ప్రత్యయమును చేసియే, 'పుంసా తుల్యామ్' అను నర్థమును తెలియజేసెను. ఆ నిర్దేశము వలన, వతి ప్రత్యయార్థమున నఞ్ స్నఞ్ ప్రత్యయములు ప్రవర్తింపవు అని

పాణిని జ్ఞాపన చేసెనని భావము. అందువలన 'స్త్రీవత్' అను రూపమును సిద్ధించును - ఆ విషయ మెల్ల ఈ క్రింది మూడు కారికలందు వ్యాఖ్యానింపబడినది.

శ్లో॥ వత్యర్థం నావగాహేతే పుంవదిత్యస్య దర్శనాత్ ।
నఞ్ స్నఞా వపవాదస్య బాధకం తన్నిపాతనమ్ ॥ 587

శ్లో॥ ఏతముత్క్రామతో నూనం వత్యర్థం నఞ్ స్నఞా వితి ।
తయోః ప్రవృత్తా వుత్సర్గో బాధనాన్నోపపద్యతే ॥ 588

శ్లో॥ నఞ్ స్నఞా విహితౌ యేన స యోగో నావగాహతే ।
వతి ప్రకరణం తద్ధి లింగమేవం సమర్థ్యతే ॥ 589

'పుంవత్' ఇత్యస్య = "పుంవత్" అను సూత్ర నిర్దేశము, దర్శనాత్ = కనబడుట వలన, నఞ్ స్నఞౌ = నఞ్, స్నఞ్ - అను ప్రత్యయములు, వత్యర్థం = వతి ప్రత్యయార్థమగు తుల్యార్థమును, న అవగాహేతే = ప్రవేశింపవు = తమకు విషయమును జేసికొనవు, తత్ నిపాతనమ్ = ఆ 'పుంవత్' అను నిపాతము, అపవాదస్య బాధకమ్ = అపవాదయగు 'స్నఞ్' విధాయకమునకు బాధకమగును.

నూనం = నిశ్చితముగ, నఞ్ స్నఞౌ = నఞ్ స్నఞ్ ప్రత్యయములు, ఏతం వత్యర్థం = ఈ వతి ప్రత్యయార్థమును, ఉత్క్రామతః ఇతి = దాటి, వదిలిపెట్టి పోవును అది నిశ్చితమనుట, తయోః ప్రవృత్తౌ = అట్లుగాక అవియే ప్రవర్తించిన బాధనాత్ = అవి వతి ప్రత్యయమును బాధించును గాన, ఉత్సర్గః = బాధ్య శాస్త్రమునకు ప్రవృత్తి, న, ఉపపద్యతే = ఉపపన్నము కాదు.

యేన = ఏ సూత్రము చేత, నఞ్ స్నఞౌ = నఞ్, స్నఞ్ - అను ప్రత్యయములు, విహితౌ = విధింపబడినవో, సః యోగః = ఆ సూత్రము, వతి ప్రకరణం = వతి ప్రత్యయ ప్రకరణమును, న అవగాహతే = స్పృశింపదు, ఏవం హి = అని యీ విధముగ, తత్ లింగం = ఆ 'పుంవత్' అను జ్ఞాపకము, సమర్థ్యతే = సమర్థింపబడును.

తాత్పర్య వివరణములు— "—స్త్రియాః పుంవత్ భాషిత పుంస్కాత్ అనూఙ్ సమానాధికరణే - స్త్రియామపూరణీ ప్రియాదిషు" - (6-3-34) అని సూత్రము. అందు, 'పుంవత్' అని నిర్దేశింపబడినది. నిర్దేశమనగా ఉచ్చారణము. ఆ నిర్దేశము వలన, వత్యర్థ విషయము నుండి నఞ్ స్నఞ్ ప్రత్యయములు తప్పింపబడినవని తెలియుచున్నది. వత్యర్థము నందు గూడ నివి ప్రవర్తించిన, వతి ప్రత్యయమున కపవాదములగును గాన నిక వతి ప్రత్యయము వినబడకయే పోవును. కాని, ఆ సూత్ర నిర్దేశమున వతి ప్రత్యయము వినబడుట వలన, ఆ ప్రత్యయముల కిది విషయము కాదని జ్ఞాపితము.

పోనిండు నిర్దేశమువలన వతి ప్రత్యయమును, యథాప్రాప్తములగు నా ప్రత్యయములును గూడ రావచ్చు ననరాదా యనిన, ఆ నిపాతనము వానికి బాధకమే యగునని, చెప్పబడినది. ''బాధకం తన్నిపాతనమ్'. ॥587॥

నిపాతలును అపవాదల వంటివే. కనుక వతి ప్రత్యయమే వాని కపవాదమగును. అవియే అపవాదములయిన, ప్రబల శత్రువు లున్నపుడు, దుర్బలమగు ఈ ఉత్సర్గ మెట్లు నిలువగలదు ? నిలిచినదనిన, నవి దీని జోలికి, రావను నిశ్చయము కలదనుట. అపవాద శాస్త్రము, తాను ప్రవర్తించుచు, స్వవిషయమున సామాన్య శాస్త్రము ప్రాప్తింపదని సూచించి నట్లే. నిపాతనము గూడ యథా ప్రాప్తములగు ప్రత్యయములను ఇట బాధించును. సర్వాధి సూత్ర భాష్యమునందు ''నిపాతన మప్యేవం జాతీయక మేవ. బాధకాన్యేవ నిపాతనాని'' అని వ్యవస్థాపితము. కావున వత్యర్థమున = పురుషునివలె యను నర్థమందు 'పౌంస్నమ్' అను రూపము సాధువు కాదు. ॥588॥

ఈ 'పుంవత్' అను నిర్దేశమను లింగము = అనగా అనుమానము = అనగా జ్ఞాపకము, ''స్త్రీ పుంసాభ్యాం నఞ్ స్నఞౌ - భవనాత్'' (4-1-87) అను సూత్రము, వతి ప్రత్యయార్థ విషయము నాక్రమింపదు అని జ్ఞాపనము చేయును. అందు కారికలో వతి ప్రకరణము నని చెప్పియున్నది. అనగా ''తేనతుల్యం క్రియాచేద్వతిః'' (5-1-115), ''తత్ర తస్యేవ'' (5-1-116), ''తదర్హమ్'' (5-1-117) అను మూడు సూత్రముల విషయమును ఆక్రమింపదని భావము

కనుక యోగాపేక్షం జ్ఞాపకమ్'' అను భాష్యకారుని వచనమునకు, 'యోగా న పేక్షత ఇతి = యోగాపేక్షమ్' = మూడు సూత్రములకును సంబంధించునది యనియు నర్థముగా నోపును.

ప్రదీప గ్రంథమునందు, 'స్త్రీ పుంసాభ్యాం' - అను యోగము వత్యర్థమునందు ప్రవర్తింపదను నర్థమునకు, 'పుంవత్' అనునది జ్ఞాపకము. కావున స్త్రీ శబ్ద విషయమున, నఞ్ ప్రత్యయమును గూడ నిది బాధించును. కాగా స్త్రీవలె నను నర్థమున, 'స్త్రీవత్' అను రూపమే సాధువుగాని 'స్త్రైణమ్' అను ప్రయోగము సాధువు గాదు. 'పుంవత్' అని సూత్రమున నుచ్చరింపబడుట వలన నది 'స్నఞ్' ప్రత్యయ విషయము మాత్రమే యనుకొనరాదు. అని వ్యాఖ్యానింపబడినది. ॥589॥

అవతారిక— ఉపమాన సమాస విచారము ప్రధాన ప్రస్తుతము. ఆ ప్రసంగమున ప్రాప్తమయినది వతి ప్రత్యయ విచారము. ఈ ఉపమాన విచార సందర్భములో పరీక్షింప వలసిన విషయాంతరమును గలదు. అది యేదియన— అనేకములగు నుపమేయముల కుపకారకముగ నొకే యొక ఉపమానముపాత్తమయిన వాక్యమునందు, ఉపమేయములనేకము లగుటచే, ఉపమానములను గూడ నన్నింటిని గల్పింప వలయునా ? లేక, ఒకే యుపమాన ముపకరించునా ? అని సంశయము కలుగును. ఆ విషయము పరీక్షింపబడును.

శ్లో॥ అభేదే నోపమానస్య భిన్నార్థోపనిపాతితా ।
ఊహ _స్తదోపమానానా మంగవన్నోపలభ్యతే ॥ 590

ఉపమానస్య = ఉపమానమునకు, భిన్నార్థోప నిపాతితా = వేరు వేరు ఉపమేయముల కుపక రించుట యనునది, అభేదే న భవతి = అభేదము చేతనే = తన కనేకత్వము లేకుండగనే, సంభవించును, తథా = ఆ విధముగనే, అంగవత్ = శరీరావయవములకు వలె, ఉపమానానాం = ఉపమానములకు గూడ, ఊహః = ఊహ = అనగా వచన భేదకల్పన, న ఉపలభ్యతే = అగపడ లేదు.

తాత్పర్య వివరణములు— ప్రధానములును, (గుణములును = అనగా) అప్రధాన ములును నని రెండు విధములుగ పదార్థము లుండును. అందు గుణములు ప్రధానమున కుపక రించుటకై ప్రయోగింపబడును. ఆ ఉపకారమున కనుగుణముగ గుణములు తమ్ము సవరించు కొనును. అది న్యాయము. ఉపమాన మొక్కటియే నిర్దేశింపబడినను నది యనేకోపమేయముల కుపకరించుటకు సమర్థమయినచో నది మారనక్కర లేదు. అనగా తాను ననేకోపమానము లుగా కాబనిలేదు.

యాగములు ప్రకృతి యాగములు, వికృతి యాగములు నని రెండు విధములు. సకలాంగోపదేశములు కలవి ప్రకృతి యాగములు. వికృతి యాగమున 'ఊహ'చే గొన్ని యంగములు ప్రకృతి యాగముల నుండి సంపాదనీయము లగును. శబ్దముల లింగవచన భేదము గూడ వికృతులలో కల్పింపబడవలసి యుండును. కాని ఉపమాన పదము లుపమేయ ములను బట్టి వచన భేదమును గల్పించుకొనుట సమ్మతము గాదు. శరీరావయవ వాచకముల కును జాతివాచకముల పేళ్ళకును, ఉపమాన శబ్దములకును, ఇంద్రియ వాచకములకును 'ఊహ' యుండదని ఊహ సంప్రదాయజ్ఞుల ఆమ్నాయము, ''అంగాని, జాతినామాని, ఉపమా ఇంద్రియాణి చ, ఏతాని నోహం గచ్ఛన్తి'' అని చెప్పుచున్నది.

అంగములకు 'ఊహ' లేదనుటకు వైదికోదాహరణము—

''యత్పశుర్మాయుమకృతో రోవాపద్భి -
రాహతాగ్నిర్మా తస్మాదే న సః ప్రమోచయతు''

అని మంత్రము - ఇదియే—

''యత్పశుర్మాయుమకృతో రోవాపద్భి రాహతే ।
అగ్నిర్మాతస్మా దేనసో విశ్వాన్ ముంచత్వం హసః ॥''

అని ముద్రితమయిన తైత్తిరీయ సంహితా గ్రంథమున నగపడుచున్నది.

ప్రకృతి యాగమున నొక్క పశువునకే ఉపాలంభము. కనుక అది ఏకపశుకము. వికృతి యాగములు ద్విబహుపశుకములు.

రెండు పశువులు గల వికృతియాగమున, పశు శబ్దము 'పశూ' అని ద్వివచనాంతముగ నూహింపబడినదే గాని 'ఉరః' అను అంగవాచకము 'ఉరసీ' అని మార్పబడలేదు. అంగి భేదమువలననే అంగముల సంఖ్యాభేదము సిద్ధించునని తాత్పర్యము. బహుపశుకమగు వికృతి యాగమునందును, 'పశవః' అని మారినను, 'ఉరాంసి' అని అంగవాచకమునకు మార్పు లేదు—

ఇది అంగ నామముల కూహ లేదనుట కుదాహరణము. ఇట్లే ఉపమానవాచకముల కును నది లేదు. చూడుడు—

మం॥ "కశ్యపేవాంసా అచ్ఛిద్రే శ్రోణీ కవషోరూస్రేకవర్ణే"

అని మంత్రము ఇందు, కశ్యప, కవష, స్రేక అను నివి మూడును ఉపమాన వాచకములు. కశ్యపమనగా కచ్ఛపము = తాబేలు కవష మనగా నొక జాతి చేప. స్రేక మనగా కరవీరము = గన్నేరు. అట ఉపమేయముల లింగ సంఖ్యలను బట్టి ఉపమానములకు మార్పు లేదు. ॥590॥

అవతారిక— ఉపమానముల కుపమేయములను బట్టి లింగవచన భేదము ఉండబోదను విషయమున నింకొక వైదిక సంవాదమును జూడుడు.

శ్లో॥ గవేధుకే చరౌ దృష్టా గోవికర్త్రాక్షవాపయోః ।
పశూరుద్ర ఇవహ్యేతా విత్యేకవచన శ్రుతిః ॥ 591

గవేధుకే = తృణములలో నొక జాతిచే సంస్కరింపబడిన, చరౌ = చరుయాగమునందు, గోవికర్త్రాక్షవాపయోః = గోవికర్తుడు, అక్షవాపుడు అను వారికి, "పశూరుద్ర ఇవహ్యేతా" = అను నీ మంత్రభాగమునందు, రుద్ర ఇతి ఏకవచన శ్రుతిః దృష్టా = 'రుద్రః' అని ఏక వచనాంతమె ఉపమానముగ నగపడుచున్నది.

తాత్పర్య వివరణములు— మం॥ "రుద్ర ఇవైతౌ గోవికర్త్రాక్షవాపౌ పశూ అభిమన్యేతే" అను మంత్రము వేదమున గలదు. గవేధుక మనగా నొక జాతి గడ్డి. దానితో సంస్కరింపబడిన హవిస్సు గల యొక చరుద్రవ్యక యాగము. అందు, గోవికర్తుడు, అక్షవాపుడు అని ఇద్దరు, యజ్ఞ పశుచ్ఛేదకులు. గోవును ఛేదించువాడు గాన, గోవికర్తుడు, అక్షము లనగా తాండ్రచెట్టు గింజలు. వానిని భూమిలో చల్లువాడు అక్షవాపుడు. వారికి రుద్రు డుపమానముగా చెప్పబడినాడు. కాబట్టి మంత్ర దృష్టమయిన యీ ఏకవచనాంతోపమాన శబ్దము వలన, ఉపమానము, ఏకవచనాంతముగనే అనేకోపమేయముల కుపస్కారక మగునని తెలియుచున్నది. ॥591॥

అవతారిక— ఉపమేయము లనేకములయినపు డుపమానములును ననేకము లయిన—

శ్లో॥ ఉపమానస్య భేదాచ్చ బహుషు స్యాదణో విధిః ।
కాశ్యపా ఇతి లోపస్స్యాత్తథా ప్రతికృతిష్వపి ॥ 592

ఉపమానస్య = ఉపమానమునకు, భేదాత్ = అనేకత్వమువలన, బహుషు = బహ్వర్థమునందు, అణః విధిశ్చస్యాత్ = 'అణ్' అను ప్రత్యయ విధానమయ్యెడిది, తథా = ఆ విధముగా, ప్రతి కృతిష్వపి = ప్రతికృతులు ఒక వ్యక్తికి బొమ్మలు, ఫోటోలు, విగ్రహములు అర్థమయి నపుడును, కాశ్యపాః ఇతి = 'కాశ్యపాః' అను రూపమునందు, లోపః స్యాత్ = అణ్ ప్రత్యయమునకు లోపము వచ్చెడిది.

తాత్పర్య వివరణములు— "యఞఞోశ్చ" (2-4-64) అని యొక సూత్రము. 'గర్గ' మున్నగు ప్రాతిపదికములకు, 'గర్గుని సంతానము' అను నర్థమున 'యఞ్' అను ప్రత్యయము విహితము. అట్లే, 'బిద' - మున్నగువానికి 'అఞ్' ప్రత్యయము విధింపబడినది. 'గార్గ్య' బైద మొదలగునవి తదంతములు. ప్రవరాధ్యాయమున ప్రసిద్ధములయిన గోత్రములను బోధించు పదములు. గార్ద్య గోత్రమువారు బైద గోత్రమువారు అందరు గదా. అగర్గబిదాపత్యము లనేకములను జెప్పదలంచినపుడు 'గార్గ్యుడు' - అనునట్లు. గార్గ్యులు అనరు. గర్గులు అందురు. అట్లే బిదులందురు. అనగా బహుత్వమున, ఆ ప్రత్యయములు రెండును లోపించునని ఈ సూత్రము తెలియజేయును.

'యఞఞోశ్చ' అను సూత్రములోనికి పూర్వ సూత్రము నుండి 'బహుషు' అను పద మనువర్తించును. ఆ ప్రత్యయములు బహుత్వమును తెలియచేసినపుడు వానికి లుక్కగునని యర్థమా ? లేక తదంతముల బహుత్వముననా ? అని ప్రశ్నించి, మొదటి పక్షమున, ఒక గార్గ్యుని అపత్యములు, అని వివక్షించినపుడును, ఇద్దరు గార్గ్యుల సంతానములను చెప్పదలంచినవుడును లుక్కు రాకపోవును. ఎందువలననగా నచట గార్గ్యస్య, అపత్యాని, గార్గ్యయోః అపత్యాని' అనుచున్నారు గదా. యఙ్ప్రత్యయ మచట ఏకవచనాంత ద్వివచనాంతముల కంటె బరముగ నుత్పన్నము గదా' అని యాక్షేపించిరి. తదుపరి - 'పోనిండు. యఞంతముల బహత్వమున లుక్కు వచ్చునందము' - అని సవరించి బదులు చెప్పబడినది. దాని పైనను మరల నాక్షేపము గలదు.

'అట్లనుటకు వీలు లేదు. అపుడు 'కాశ్యపాః' అనుచోట అణ్ ప్రత్యయమునకు లుక్కు రావలసి వచ్చును. అది వచ్చినచో 'కశ్యపాః' అనియే యగును. 'కాశ్యపాః' అనుటయే సమ్మతము - అని ప్రత్యాక్షేపము చేయబడినది.

'కాశ్యపాః' అన నేమి యర్థమో చూతము. కశ్యప మహర్షి అపత్య మొకడు కాశ్యపు డనబడును. అకాశ్యప శబ్దము, అణ్ ప్రత్యయాంతము. "కాశ్యపునివంటి ప్రతికృతులు" - అను నర్థమున 'కాశ్యపాః' (కాశ్యపులు) అని యగును. పతికృతు లనగా బొమ్మలను కొందము. అపుడు, "ఇవే ప్రతికృతౌ" (5-3-96) అను సూత్రముచేత 'కన్' అను ప్రత్యయము ప్రతికృతి బోధకము వచ్చి, "జీవికార్థే చాపణ్యే" (5-3-99) అను

సూత్రముచే, లుప్త మగును. కాగా కాశ్యపుని ప్రతికృతులు (బొమ్మలో, ఫోటోలో) అను నర్థమున 'కాశ్యపాః' అని యేర్పడినది.

ఇచట మొదట అణంతమగు 'కాశ్యపః' అనునది ఒక అపత్యమునే తెలియజేయునది. కన్ప్రత్యయమునకు 'లుప్పు' వచ్చి లోపించిన తరువాత, అణంతము బహు ప్రతికృతులను చెప్పుచున్నది. కనుక రెండవ పక్షమున అణ్ ప్రత్యయమునకు 'లుక్కు' రావలసియుండును. "కశ్యపాః" అనవలసి యుండును. 'కాశ్యపాః' అను రూపమే సమ్మతము, అని "తద్రాజస్య బహుషు తేనైవాస్త్రియామ్" (2-4-62) అను సూత్రములో మహాభాష్యమున విమర్శింపబడినది.

ప్రకృతమునకు వచ్చుము— "అణో యః బహుషు తస్య లుక్" - 'బహ్వర్థ బోధకము అణ్ ప్రత్యయమయినపుడు దానికి లుక్కగును' - అని యొక వ్యాఖ్యానము. "అణన్తం యద్బహుషు, తదవయవస్య అణః లుక్" అని మరియొక వ్యాఖ్యానము. ఇట మహాభాష్యమున మొదటి పక్షమే స్థాపితము. ఉపమేయముల భేదమువలన ఉపమానములు గూడ భేదించుననిన, ఉపమేయములగు ప్రతికృతులు, అనేకములు గాన, ఉపమానమయిన కాశ్యపులును ననేకులయిన, అణ్ ప్రత్యయ మచట బహ్వర్థ బోధకమగును. అపుడు మొదటి వ్యాఖ్యానమనను, లుక్కు రావలసియుండును. అది భాష్య విరుద్ధము. ప్రతికృతు లర్థమయినపుడు 'కశ్యపాః' అని అనిష్టరూపము ప్రసక్తమగును. అందువలన ఉపమేయములకు భేదమున్నను ఉపమానములు భేదింపవని సిద్ధాంతము. ॥592॥

అవతారిక— 'కాశ్యపః ఇవ ప్రతికృతయః' = కశ్యపుని అపత్యమువంటివి ప్రతికృతులు - అను స్థలమున 'కన్' ప్రత్యయమునకు 'లుప్పు' వచ్చిన తరువాత, లుబంతమునకు లింగవచనములు కన్ప్రత్యయ ప్రకృతికివలెనె ఉండునని చెప్పబడుటచే, 'కాశ్యపః' అని ఏకవచనాంతమే ప్రయోగార్హము గదా ? 'కాశ్యపాః' అని యెట్లగును ?— అను ప్రశ్నయును, దానికి సమాధానమును ఈ కారిక పూర్వోత్తరార్థములచే ప్రతిపాదింపబడినవి. చూడుడు—

శ్లో॥ ఏవం తు యుక్తవద్భావా దత్రైకవచనం భవేత్ ।

ఏవం తు = ఉపమేయములు భిన్నములైనను నుపమాన మేకవచనాంతమే అయిన, యుక్తవద్భావాత్ = యుక్తవద్భావము వలన, అత్ర = 'కాశ్యపాః' (కాశ్యపుని ప్రతికృతులు) అను చోట, ఏకవచనం భవేత్ = 'కాశ్యపః' అని ఏకవచనము ప్రాప్తించుచున్నది.

తాత్పర్య వివరణములు— "లుపియుక్తవద్వ్యక్తివచనే" (1-2-51) అని అతిదేశ సూత్రము. లుప్పు వచ్చినపుడు లుబంతమునకు లింగవచనములు ప్రత్యయార్థయుక్తమగు ప్రకృత్యర్థమును బట్టి ప్రవర్తించునని యర్థము.

కాశ్యపుని వంటి పతికృతులు' అను నర్థమున, ప్రతికృతులు అనేకములయినను, ఈ అతిదేశ సూత్రముచే ఏకవచనమే రావలసియున్నదని యాక్షేపము.

అవతారిక— ఈ యాక్షేపమునకు పరిహార మిట్లు ప్రేక్షితము—

శ్లో॥ లుమ్మనుష్యే తథోక్తం స్యాల్లింగస్యైకస్యసిద్ధయే ॥ 593

లుమ్మనుష్యే = 'లింగసిద్ధ్యర్థం లుమ్మనుష్యే" అను వార్తికమునందు, లింగస్య ఏకస్య = ఒక్క లింగము మాత్రమునకే, సిద్ధయే = సిద్ధికై, తథా = 'లింగవచన సిద్ధ్యర్థమనక, లింగ సిద్ధ్యర్థం' అని, ఉక్తం = చెప్పబడినదయి, స్యాత్ = ఉండును.

తాత్పర్య వివరణములు— లుపి యుక్తవత్ అను నతిదేశ సూత్రముచేత ప్రకృతి లింగాతిదేశమే అపేక్షితము. వచనము అభిధేయముల వచనమే ప్రవర్తించును. 'చంచవంటి మనుష్యుడు' = చంచా ఇవ మనుష్యః, = చంచా అని యగును. చంచా శబ్దము స్త్రీ లింగము. గడ్డిబొమ్మ అని యర్థము ప్రత్యయార్థము మనుష్యుడు. వచనము ప్రత్యయార్థానురోధి, లింగము మాత్రము ప్రకృతి లింగము—

'చంచామనుష్యాః' చంచే మనుష్యౌ. చంచాః మనుష్యాః - అని ఇట్లు మనుష్య సంఖ్యను బట్టియే వచనములు. లింగము మాత్రము స్త్రీ లింగమే। ఆ విధముగనే 'కాశ్యపాః' (కాశ్యప ఇవ ప్రతికృతయః) అను స్థలమునను, అతిదేశము వలన పుంలింగము మాత్రమే. వచనము ప్రతికృతుల బహువచనమే సాధువగునని భావము. ॥593॥

అవతారిక— కాశ్యపుని ప్రతికృతులు, అను నర్థమున యుక్తవద్భావము వలన 'కాశ్యపః' - అని ఏకవచన మెందులకు రాదు? లింగ సిద్ధ్యర్థమను వార్తికమున కేవల లింగ గ్రహణమున్నను, సూత్రమున వ్యక్తి వచనములు రెండును నతిదేశింపబడినవి గదా. 'మనుష్య లుపి ప్రతిషేధః' - అను వార్తిక ప్రామాణ్యము వలన, లుబంతము అమనుష్య వాచకమయి నపుడు అతిదేశ ప్రాప్తమగు ఏకవచనము తప్పదు గదా' అని ఆశంకించి వేరొక పరిహార మును జెప్పుచున్నారు.

శ్లో॥ ఉపమేయేషు భిన్నేషు కించిదేకం ప్రవర్తతే।
ప్రత్యయస్య విధౌ తత్ర నిత్యం యుక్తవదిష్యతే ॥ 594

భిన్నేషు ఉపమేయేషు = ఉపమేయము లనేకములయినపుడు, కించిత్ ఏకం = ఏదియో యొక ప్రత్యయస్య నిమిత్తం = కన్ప్రత్యయ నిమిత్తము = అనగా ఉపమానమే, ప్రవర్తతే = పరి చ్ఛేదకముగా వర్తించును, తత్ర నిత్యం = అట్టియెడ నియతముగ, యుక్తవత్ ఇష్యతే = యుక్తవద్భావము సమ్మతము.

తాత్పర్య వివరణములు— ప్రతికృతులు, నానా వాని నుపమించు = పరిచ్ఛేదించు ఉపమాన మొక్కటియే. ఇట్టి స్థితి యున్నపుడు, అనగా ఉపమించుట అను వ్యాపారమున నొక యుపమానము అనేకోపమేయములందు నడిపించిన, 'లుపి యుక్తవత్' అను అతిదేశము నియతముగ ప్రవర్తించి, ఏకవచనమే ప్రాప్తించును. అది యిష్టమే అగుటచే, అనిష్టాపత్తి యేదియు లేదు. ॥594॥

అవతారిక — ఇక నుపమాన ముపమేయముల ననేకములను సంస్కరించుటకు దానును భిన్న భిన్నమై వ్యాపరించినపుడు 'కాశ్యపాః' అను బహువచనాంత రూపము సిద్ధమే—

శ్లో॥ యదా ప్రత్యుపమేయం తు తదేకైకమవస్థితమ్ ।
తదా బాహ్యార్థ భేదేన తద్ధితాంతం ప్రచీయతే ॥ 595

యదా తు = ఎపుడైతే, ప్రత్యుపమేయం = ఒక్కొక ఉపమేయముగా, తత్ ఏకైకం = ఆ ఉపమాన మొక్కొకటి, అవస్థితమ్ భవతి = వ్యాపారముగలిగి యుండునో, తదా = అపుడు, బాహ్యార్థ భేదేన = బయట అర్థముల భేదముచే, తద్ధితాంతం = కన్ లుబంతము, ప్రచీయతే = ప్రచయమును = అనేకత్వమును బొందును.

తాత్పర్య వివరణములు— కాశ్యపునివంటి ప్రతికృతి యొకటి అయినచో దానిని, 'కాశ్యపః' అందుము. రెండవదియు నంతియే, మూడవదియు నంతియే. అనేక ప్రతికృతులను అనేకోపమానములు పరిచ్ఛేదించిన వనుట. అచట ప్రతికృతిబోధకమగు కన్ ప్రత్యయము లోపించిన శబ్దరూపము లనేకములకు "కాశ్యపశ్చ, కాశ్యపశ్చ, కాశ్యపశ్చ = కాశ్యపాః', అని సరూపైక శేషము. ఈ ఏకశేష వృత్తియగు 'కాశ్యపాః' అను శబ్దమునందు "లుపి యుక్తవత్ వ్యక్తివచనే" (1-2-51) అను లింగవచనాతిదేశము ప్రవర్తింపదు. మొదటనే అది ప్రవర్తించి యున్నది గదా.

"కాశ్యపః ఇవ అయం ప్రతికృతి సమూహః" అని వివక్షించి మొదటనే 'కన్' ప్రత్యయమును బ్రవర్తింపచేసిన యెడల నపుడు యుక్తవదతిదేశమునకు వ్యాపారముండును. అపుడు ప్రకృత్యర్థమునకు సంఖ్యా భేదముండును. అది యుక్తవదతిదేశమునకు గారణ మగును. ఇపుడు ప్రతికృతుల కనేకత్వము. అది బాహ్యపదార్థముల భేదమువలన గలిగినది. అది అతిదేశముచే దొలగునది కాదని భావము. కాగా ఉపమేయ సంఖ్య ననుసరించి ఉపమాన ములు భిన్నములయినపుడు 'కాశ్యపాః' అను తద్ధితాంతమునకు ప్రచయము సమ్మతమే.॥595॥

అవతారిక — ఏమండీ ! ఏకశేష శబ్దము గూడ లుబద్ధకమే గదా. అదియే ప్రచీయమాన మాయె. యుక్తవద్భావ మేల రాదు ? అని యాశంకించి నిదర్శనమును జూపు చున్నారు.

శ్లో॥ యథా సమూహ ప్రచయే ద్విగూనాం భిన్న సంఖ్యతా ।
పంచపూల్యాదిషు, తథా లుబంత ప్రచయే భవేత్ ॥ 596

పంచపూలీ ఆదిషు = 'పంచపూలీ' మున్నగు వానిలో, సమూహప్రచయే, సతి = కాని సమూ హమునకు అనేకత్వమున్నపుడు, యథా ద్విగూనాం = ఏ ప్రకారముగా, ద్విగుసమానము లగు, భిన్న సంఖ్యతా, భవతి = బహుత్వ సంఖ్య, కలుగునో, తథా లుబన్త ప్రచయే భవేత్ = ఆ విధముగనే లుబన్తముల కనేకత్వమునందు భిన్న సంఖ్య కలుగును.

తాత్పర్య వివరణములు— నిదర్శనము ద్విగుసమాసము. పంచానాం పూలానాం సమాహారః = పంచపూలీ. లేదా పంచపూలాః సమాహృతా పంచపూలీ. 'అయిదు గడ్డికట్టల మొత్తము' అని యర్థము. ''ద్విగురేక వచనమ్'' (2-4-1) అను సూత్రము, ద్విగువు, అర్థ మనేక మయినను, అది ఏకము వంటిదిగనే వ్యవహరింపబడునని, ఏకవద్భావమును విధించు చున్నది. కనుక గడ్డికట్ట లయిదయినను, 'పంచపూలీ' అని ద్విగుసమాసము, తదోద్బోధక మేకవచనాంతమే లోకమున ప్రయోగింపబడుచున్నది.

'అటువంటి అయిదేసి కట్టలు మూడు' అని చెప్పదలంచినపుడు, 'పంచపూల్యః' అని చెప్పవలెను. అది ఏకశేష వృత్తి. పంచపూలీ చ పంచపూలీ చ, పంచపూలీ చ = పంచపూల్యః అని విగ్రహ వాక్యము.

ఈ ఏకశేష పదమునం దేకవద్భావ మేల మరల రాదు ? అని మహాభాష్యమున, నాశంకించి, ''ఏకశేష ప్రతిషేధాచ్చ'' అని వాక్యకారుడు వార్తికమును రచించెను. ఏకశేష విషయమున నేకవద్భావమునకు ప్రతిషేధము చెప్పవలెనని యర్థము. దీనికి సమాధాన వార్తి కము - ''నవాన్యస్యానేకత్వాత్'' అనునది. ''ప్రతిషేధము చెప్పనక్కర లేదు. ఏకవద్భావ విధాయక సూత్రము, మొదటి ద్విగుసమాసార్థమునకు ఏకవద్భావమును విధించినది. తరువాత ఏకశేషానంతరము, ద్విగ్వర్థముల సముదాయము ద్విగ్వర్థము కాదు. దానికే గదా ఏకవద్భా వము ! ఒకపుడదియు ద్విగ్వర్థమయినను, బహిరంగము. ప్రాథమ కల్పిత ద్విగ్వర్థము అంత రంగము. అంతరంగమయిన ద్విగ్వర్థమున నేకవద్భావము చరితార్థముగాన నిట ప్రవర్తిం పదు - అని సమాధాన తాత్పర్యము.

ఆ విధముగనే లుబంతము మాత్రము వలన ప్రతీయమానమే లుబర్థము. ఏకశేషా నంతర మది శబ్దాంతరమగును. కావున యుక్తవద్భావ మిచట ప్రవర్తింపదు. మరియు ప్రాథమ కల్పిత లుబర్థ మంతరంగము ఏకశేషానంతర లుబర్థము బహిరంగమును గదా ! అని భావము. ॥596॥

అవతారిక— ''దృష్టాంతమునకును దార్ష్టాంతికమునకును వైషమ్యము కలదు. ద్విగుదృష్టాంతము లుబంతమునకు నప్పదు'' అని యీ కారికయందు ప్రతిపాదించుచున్నారు.

శ్లో॥ ప్రచయే భిద్యమానే తు సంఖ్యాపూలేషు భిద్యతే ।
అర్థభేదో లుబంతేషు నైవం కశ్చన దృశ్యతే ॥ 597

ప్రచయే భిద్యమానే తు = ప్రచయము = బహుత్వము, భేదించినపుడు, పూలేషు సంఖ్యా భిద్యతే = గడ్డి కట్టలయందు, సంఖ్య భేదించును, ఏవం లుబంతేషు = కాని ఆ విధముగ, లుబంతములందు, కశ్చన అర్థభేదః = అర్థభేద మేదియు, న దృశ్యతే = అగపడుట లేదు.

తాత్పర్య వివరణములు— పంచపూలీ = అయిదు గడ్డి కట్టలు. పంచపూల్యః = పదునైదు గడ్డి కట్టలు. పంచపూల్యౌ = పది గడ్డి కట్టలు. ఈ విధముగ, ద్విగుసమాసమున

కును, ఏకశేషకును అర్థమున నెంతయో భేదము గలదు. ఒకచో పంచసంఖ్య, అనగా ద్విగువు నందు అవచ్ఛేదకము. ఏకశేష పదములందు, దశ సంఖ్యా పంచ సంఖ్యలు వేరు వేరుగా అవచ్ఛేదకములు. అందువలన, ద్విత్వ, బహుత్వములకు ప్రచయము భేదించినపుడు, ద్విగ్వర్థ మగు సంఖ్యకంటె వేరుసంఖ్య అగపడుచున్నది. కావున నది ద్విగువు నర్థము కాదు కాబట్టి మహాభాష్యమున, "నవాన్యస్యానేకత్వాత్" అని చెప్పబడిన పరిహారము యుక్తమే. కాని, లుబంతమున నా విధమగు నర్థభేద మేమియు నగపడదు. ఉపమానములకు ప్రత్యేకముగ నాయా బహూపమేయములతో సంబంధము గలిగి, తరువాత ప్రచయమును వివక్షించినపుడు ఏకశేష రాగా, ఏ యర్థము బోధ్యమగుచున్నదో, అదియే యర్థము, ఒకే ఉపమానమునకు, అనేకోపమేయముల సంబంధము కలిగినపుడు, మొదటనే బహువచనము ప్రవర్తించినపుడును ప్రతీతమగుచున్నది. అందువలన అర్థములో భేదము లేనందున ప్రకృతమున ప్రచయార్థ మును లుబర్థమే కాబట్టి వచనాతిదేశము కలుగవలసినదే.

ఒక ప్రశ్న— అర్థభేదము లేదందువేమి? స్పష్టముగ నున్నదే? ఎట్లనగా— ప్రతి కృతులకు ప్రత్యేకముగ నుపమానముతో సంబంధమును గల్పించినపుడు, ఏకశేష ప్రవర్తించి బహువచనాంతముగ 'కాశ్యపాః' అని ప్రయోగించిన, నొక్కొక ప్రతికృతికిని కాశ్యపుడు ఉపమానమని తెలియవచ్చుచున్నది. అట్లుగాక ఒకే ఉపమానమునకు బహూపమేయములతో సంబంధమునందు ప్రతికృతుల సమూహమునకు ఒకే కాశ్యపుడు ఉపమానమని యర్థమగును. ప్రతికృతుల పరిచ్ఛేదము సమానమే అయినను, భేద మిట్లు స్పష్టము గదా!

అనిన, సత్యమే. ఈ ప్రశ్న లేకపోలేదు ఈ భేదము లేదనుట కవకాశము లేదను కొనుడు. కాని, ప్రచయమునందును, అనగా ఏకశేష యందును, లుబంతము యొక్క అర్థము లేకపోదు.

లుబంతమున కర్థము ప్రతికృతి. అదియే ప్రచయమునందు బహుత్వమును బొందు నది. అది వేరుగాదు మరియు, ప్రచయమును వివక్షించినపుడే యుక్తవద్భావమునకు కృత్య ముండును. 'కాశ్యపునివంటి వాడు కాశ్యపుడు' అందుమనుకొనుడు. అచ్చట యుక్తవద్భావ మున కేమి పని గలదు? అచట ప్రకృత్యర్థమును కశ్యపాపత్యమే. కప్రత్యయార్థమును కశ్యపుని అపత్యమే.

అదియును గాక, కాశ్యప ఇవ ప్రతికృతయః = 'కాశ్యపుని వంటివి బొమ్మలు', అందుమనుకొనుడు. అచట 'ప్రతికృతయః' అనునది ఏకశేష యగుటవలన, వానికి బహుత్వ నిశ్చయము కలుగును.

కావున బహిరంగమగు నర్థము సంభవించినపుడే అతిదేశము ప్రవర్తింపవలసి యుండును. కాగా 'కాశ్యపాః' అను బహువచనాంత రూపమునకు సిద్ధిని మరియొక ప్రకార ముగా జెప్పవలసి యుండును. ఏకశేష చేతనైనను నది సిద్ధించుననుట కుదురదు. ॥597॥

అవతారిక — ఆ ప్రకారమే యీ కారికలో జెప్పబడుచున్నది.

శ్లో॥ యేషూపమేయవచనః శబ్దోన్యో న ప్రయుజ్యతే ।
ఉపమానస్య తత్రాన్యైః సంఖ్యాయా భేద ఇష్యతే । 598

యేషు = ఏ లుబంత శబ్దములందు, ఉపమేయ వచనః = ఉపమేయ వాచకమగు, అన్యః శబ్దః = వేరొక శబ్దము, న ప్రయుజ్యతే = ప్రయోగింపబడదో, తత్ర ఉపమానస్య = అచ్చట ఉపమానము యొక్క, సంఖ్యాయాః = సంఖ్యకు, భేదః = భేదము, అన్యైః ఇష్యతే = ఇతరులచే అంగీకరింపబడు చున్నది.

తాత్పర్య వివరణములు— కొన్ని 'కన్' లుబంత శబ్ద ప్రయోగములలో, పరిచ్ఛేద్యము లయిన ప్రతికృతులను జెప్పు వేరొక శబ్ద ముండదు. కన్ లుబంతము మాత్రమే యుండును. అట్టి స్థలములందు ఉపమాన వాచకమునకు సంఖ్యాభేద మిష్టమే ఉపమేయ వాచకము వాక్యమునందు ప్రయుక్తమయిన దానివలననే బహుత్వ సంఖ్య తెలియును. ఏకోపమానమే ఉపమేయము లనేకముల కుపకారకమగును. ఎట్లన— చూడుడు.

''కాశ్యప ఇవ దేవదత్త యజ్ఞదత్త విష్ణు మిత్రా ఇమాః ప్రతికృతయః'' = దేవదత్తుడు, యజ్ఞదత్తుడు, విష్ణు మిత్రుడు – అను నీ ప్రతిమలు, కశ్యపుని అపత్యము వంటి వారు అను నీ ప్రయోగమున నుపమానము కాశ్యపు డొకడే ః

ఉపమేయ వాచకమును ప్రయోగింపక 'కాశ్యపః' అనిన, నట ఈ కాశ్యపు డొక ప్రతికృతికే ఉపమానమా ? లేక అనేక ప్రతికృతులకా ? అను సందేహము కలుగును. అనేకోపమేయములకు కాశ్యపు డుపమానమైనను యుక్తవద్భావము వలన కాశ్యప శబ్దము ఏకవచనాంతము గావచ్చును.

అను నీ ప్రతిమలు (అనగా దేవదత్త యజ్ఞదత్త విష్ణు మిత్రులు అను పేర్లు గల వారివి) కాశ్యప ఇవ, కాశ్యపుడు వంటివే అనగా కాశ్యపుని ప్రతిమ వంటివే. ఇచ్చట ఉపమానోపమేయ భావము ప్రతిమలకే గాని పురుషులకు గాదు (సంస్కృతము వాడుకకు తెనుగు వాడుకకు ఒక భేదము కలదు. ప్రతిమకును, దానికి మూలమయిన పురుషునకును గూడ వాచకమయి కాశ్యపః అనియే యుండును. ప్రతిమయైనప్పుడు కాశ్యప (ము) అనియు (అమహత్తు గావున) పురుషుడయినచో కాశ్యపుడు అనియు వ్రాయక తప్పదు. ఇచ్చట కాశ్యప శబ్దము కశ్యపుని అపత్యము అను యౌగికార్థమును సూచించుచున్నది. కశ్యపుని పుత్రులు అనేకు లుండవచ్చును. వానిలోనే యొక్కరి ప్రతిమ యయినను అను అర్థము చెప్పినచో కుదురదు. ఎవడో ఒక్కడే కాశ్యపుడు అను వానియొక్క ప్రతిమయని యర్థము చెప్పవలెను

అందువలన, అనేకోపమేయములన నీ యుపమానము పరిచ్ఛేదించుటకు, ఉపక్రమమునందే ఉపమానమయిన కాశ్యపునకు ఆత్మభేద కల్పన మావశ్యకము. కాగా 'కాశ్యపాః ప్రతికృతయః' అనునది సిద్ధించును. ''ఇతరులచే సంఖ్యకు భేదమంగీకరింపబడు చున్నది'' అని కారికయందు చెప్పుటచే మతాంతరమును గలదని వ్యక్తము ॥598॥

అవతారిక— ఈ విషయమున నిదర్శనము జూపబడుచున్నది.

శ్లో॥ యథా గుడతిలాదీనాం ప్రయోగా దేకసంఖ్యతా ।
పాకాదేర ప్రయోగే తు భిన్నసంఖ్యాభిధీయతే ॥ 599

యథా, పాకాదేః = ఏ ప్రకారముగా, గుడతిలాదీనాం ప్రయోగే = గుడ, తిల, మున్నగు శబ్దముల ప్రయోగమునందు, ఏకసంఖ్యతా భవతి = ఏకవచనము కలుగుచున్నదో, అప్రయోగే తు = అవి ప్రయోగింపబడ నపుడు, భిన్న సంఖ్యా = వేరు సంఖ్య, అభిధీయతే = చెప్పబడుచున్నది.

తాత్పర్య వివరణములు— ''గుడ తిలతండులానాం పాకః'' - ''తామ్రః పలాశేషు బభూవ రాగః'' అని రెండు ప్రయోగములు. ''బెల్లము, నువ్వులు, బియ్యము - వీని వంట''. ''మోదుగు పూవునందు, రాగిరంగు ఏర్పడినది'' అని పై వాక్యముల కర్థమట.

అందు, 'పాకః' 'రాగః' అని ఏకవచనాంత శబ్దమే యున్నది. వస్తుతః వాని వాని పాకములు వేరు వేరు. పాక్య వస్తువులు అనగా వండవలసిన బెల్లము, నువ్వులు, బియ్యమును అనేకములగుట వలన, వాని వంటయొక్క నానాత్వ మవగతమగుచుండుటచే, ఏకవచనమున కుపపత్తి. అట్లుగాక, 'పాకః' 'రాగః' అని మాత్రమే ప్రయోగించిన, పాక్య వస్తువుల భేదమును దెలుపు పదమును, రాగాశ్రయ వస్తువుల భేదమును దెలుపు పదమును ప్రయోగింపకుండిన, ఈ పాకము ఒక పాక్య ద్రవ్యమునకు సంబంధించినదా ? లేక అనేక గతమా ? ఈ రాగమున కాధారము ఏకమా ? అనేకమా ? అని సందేహము కలుగును. అట్టియెడ నిశ్చయ ప్రతిపత్తి కొరకు 'పాకౌ' అనియు, పాకాః అనియు, అట్లే రాగౌ అనియు, రాగాః అనియు అనేక సంఖ్యా ప్రయోగ మగపడుచున్నది. ॥599॥

అవతారిక— ఆ దృష్టాంత మీ కారికలో దార్ష్టాంతికమునందు సమన్వయ పరుపబడుచున్నది.

శ్లో॥ యః సంబంధిగతో భేదః స ప్రయోగే ప్రతీయతే ।
సంబంధినామతో భేద ఉపమేయేన గమ్యతే ॥ 600

యః భేదః = ఏ భేదము, సంబంధిగతః = సంబంధి నాశ్రయించినదై యుండునో, సః = అది, ప్రయోగే = ఆ సంబంధివాచక శబ్ద ముపయుక్తమయినపుడు, ప్రతీయతే = అవగతమగును, అతః = అందువలన, సంబంధినాం భేదః = సంబంధుల భేదము, ఉపమేయేన గమ్యతే = ఉపమేయముచే తెలియబడును.

తాత్పర్య వివరణములు— పాకమను పదార్థము స్వతః భేదములేనిది. కాని సంబంధిని బట్టి భేదించును. అనగా గుడాలను బట్టి వేరగును. సంబంధివాచక ప్రయోగము లేనపుడు పాకగత విశేషము తెలియరానట్లే ప్రతికృతి వాచక ప్రయోగము లేనపుడు భేదము

జ్ఞాతము కానేరదు. ఉపమాన భేదమపుడు తప్పదు. కాగా ప్రత్యేకోపమానమే ఉపమేయ భేదమును దెలియచేయవలసి యుండును. ॥600॥

అవతారిక— ఈ విషయ మీ కారికయందిట్లు నిగమనము చేయబడినది.

శ్లో॥ తస్మాత్, సామాన్య శబ్దత్వ ప్రసంగ వినివృత్తయే ।
ఉపమేయగతో భేద ఉపమానేషు దృశ్యతే ॥ 601

తస్మాత్ = అందువలన, సామాన్య శబ్దత్వ ప్రసంగ వినివృత్తయే = ఉపమానశబ్దము సామాన్య శబ్దము కొరకుండుటకు, ఉపమేయగతః భేదః = ఉపమేయముల యందలి భేదము, ఉపమానేషు దృశ్యతే = ఉపమానములందు అగపడును.

తాత్పర్య వివరణములు— 'కాశ్యపః' - అని ఉపమానమును మాత్రము ప్రయోగించిన, కశ్యపుని గోత్రాపత్యము = (గోత్రమనగా మనుమలు) అని యర్థమగును. 'కశ్యపాపత్యము వంటి ప్రతికృతి' - అను నర్థము నియతముగ ప్రతీతము గాదు. ఉపమాన సంబంధము = ఉపమానోపమేయ భావము స్ఫురించినను, ఈ ఉపమాన మనేకోపమేయములకా ఏకోపమేయమున కేనా ? అను సందేహమువలన నిది సామాన్య శబ్దమని యనవలసి యుండును. అది సమ్మతము గాదు. అందువలన ఉపమేయముల బహుత్వము తెలియవచ్చుటకు, ఉపమానమును భిన్న భిన్నమగు చుండును ఉపమేయము ప్రధానము. ఉపమానము గుణము. ప్రధానమునుబట్టి, అప్రధానములావృత్తములగుటయే శాస్త్ర సమ్మతము. ॥601॥

అవతారిక— "యేషూపమేయవచనః" = అను 598 వ కారికలో ఉపమాన సంఖ్యాభేదము ఇతరులకు సమ్మతమని చెప్పబడియున్నది. అచట ఇతరుల కనుటచేత మతాంతరమును గలదని సూచితము. అయ్యదిందు వివరింపబడుచున్నది.

శ్లో॥ ఉపమానం సమస్తానామభిన్నం శ్రూయతే క్వచిత్ ।
భిన్నానాముపమేయానా మేకైకం వోపమీయతే ॥ 602

సమస్తానాం = ఉపమేయముల కన్నిటికి, అభిన్నం = ఒక్కటియే, ఉపమానం=ఉపమానము క్వచిత్ శ్రూయతే = కొన్నిచోట్ల వినబడును, అథవా = లేదా, భిన్నానాం = వేరువేరయిన. ఉపమేయానాం = ఉపమేయములలో, ఏకైకం = ఒక్కొక్కటియు, ఉపమీయతే = ఉపమింపబడును.

తాత్పర్య వివరణములు— అనేకములగు ననేకోపమేయముల మొత్తమునకు ఒక ఉపమానమును ప్రయోగించుటయు గలదు. వేరొకపుడు నానోపమానములకు ప్రత్యేకముగ నుపమితి క్రియయు నగపడుచున్నది. అనగా ననేకోపమాన పదముల ప్రయోగమును గలదు. ఇది మత భేదము. ॥602॥

అవతారిక— అందు సమస్తోపమేయముల మొత్తమున కొకటే ఉపమానము ప్రయోగింపబడిన నిదర్శన మిందు జూపబడినది.

శ్లో॥ యథా గరుడ ఇత్యేతత్ వ్యూహాపేక్షం ప్రయుజ్యతే ।
ఏకేన యత్ర సాదృశ్యం వైనతేయేన హస్తినామ్ ॥ 603

ఏకేన వైనతేయేన = ఒక గురుడినితో, హస్తినాం = అనేకములగు నేనుగులకు, యత్ర సాదృశ్యం = ఎచ్చట, సామ్యముండునో, తత్ర యథా = అచ్చట, ఏ విధముగా, గరుడః ఇత్యేతత్ = 'గరుడః' అను పదము, వ్యూహాపేక్షం = వ్యూహాపేక్షముగా = వాని రచనా విశేషమును బట్టి, ప్రయుజ్యతే = ప్రయోగింపబడు చున్నదో,

తాత్పర్య వివరణములు— కొన్ని ఏనుగులను ఒక వ్యూహముగ నిలిపినపుడు, అది గరుడ పక్షిని బోలి యుండుటచే, ''గరుడ ఇవ ఇమే హస్తినః'' = ఈ ఏనుగులు (గుంపు) గరుడినివలె నున్నవి - అని యందురు వ్యూహమనగా రచనా విశేషము. ఆ విధ ముగ, అశ్వ రచనను, మొసలితో నుపమించినపుడు, 'మకర ఇవేమే వాజినః' అనుటయు గలదు. యజ్ఞవేది ఇటుకలు డేగవలె పేర్చబడినపుడు, ''శ్యేన ఇవ ఇమాః ఇష్టకాః'' అని ప్రయోగము. వాని వాని వ్యూహములే గరుడ, మకర శ్యేనములతో బోల్చబడునవి. కనుక, 'గరుడః ఇవ, మకరః ఇవ, శ్యేనః ఇవ' అని ఏకవచనాంతములే ప్రయోగింపబడుచున్నవి. మకరాదుల పోలిక వ్యూహములకుగాని, గజ, వాజి ఇష్టకలకు గాదు.

కావున సంబంధుల భేదమును బుచ్చుకొని యుపమానములకు భేదము ప్రసక్తము కాదు. ''గరుడాః ఇవ హస్తినః, మకరా ఇవ వాజినః'', అని యీ తీరుగ బహువచనము ప్రయుక్తమయిన, అపుడు ప్రత్యేకముగ హస్తులకును అశ్వములకును ఉపమేయత్వము గమ్య మగును. శీఘ్ర జవత్వము సమాన ధర్మమపుడగును. వ్యూహ ముపమేయము గాదు. ॥603॥

అవతారిక— ఆ విధముగనే యచట—

శ్లో॥ ఏకస్యాఽపి ప్రతీయేత భిన్నా ప్రతికృతిః సహ ।
కాశ్యపస్యేతి తేనాయం ప్రత్యేకమవతిష్ఠతే ॥ 604

ఏకస్య అపి = ఒకడే అయినను, కాశ్యపస్య = కశ్యపుని అపత్యమయిన యొకానొక వ్యక్తికి సహ = తుల్యమయిన, భిన్నా ప్రతికృతిః = వేరు వేరు ప్రతికృతి, ప్రతీయేత ఇతి = గమ్య మానము కావలసి వచ్చును గాన, తేన, అయం = ఆ హేతువు వలన ఈ ఉపమేయము, ప్రత్యేకం అవతిష్ఠతే = భిన్న భిన్నముగ నుండును.

తాత్పర్య వివరణములు— కాశ్యపః ఇవ ఇమాః ప్రతికృతయః = కాశ్యపః = ఈ బొమ్మలు కాశ్యపుని బోలినవిగాన కాశ్యపుడు అనబడును - అను ఈ వాక్యమునందు ఉపమానవాచకము, ఏకవచనాంతముగా ప్రయోగింపబడి యున్నది. అనేకములగు ప్రతి

కృతులు, కాశ్యపునకు, సంనివేశాదియగు ఏదియో ఒక ధర్మమును బట్టి తుల్యములని దీని వలన దెలియబడును గరుడునకు, ఏనుగులు, వ్యూహరూపముచే దుల్యములగుట యట్లేగదా ! అంతియగాని ఉపమానము ప్రత్యేకముగ నుపమేయములను పరిచ్ఛేదించుట గమ్యము గాదు.

కారికయందలి 'సహ' అనునది తుల్యార్థకము. తద్యోగమున ('తుల్యార్థై' రతులోపమాభ్యాం (2-3-72) అను సూత్రముచే కాశ్యపస్య అనుచోట షష్ఠియని గ్రహింప వలెను.

అందువలన ప్రత్యేకముగ నుపమేయములగు ప్రతికృతుల కుపమాన సంబంధము వ్యక్తమగుటకై కాశ్యప శబ్దము ప్రత్యేకముగ నుపమేయములతో సంబంధించును.

పై రెండు మతములకును గల భేదము నిట్లు గ్రహింపనగును. వెనుకటి మతమున ఉపమేయ శబ్దము ప్రయోగింపబడనపుడు, ఆ ఉపమేయముల యనేకత్వము తెలియుటకు, ఉపమానము, తాను భిన్న భిన్నమగును. అది ఉపమేయార్థమగుటచే పరార్థము గదా !

ఇక నీ మతమున - ఉపమేయవాచక శబ్దమునకు వాక్యమునందు ప్రయోగమున్నపుడు, ఉపమానము వేరు వేరుగా నా యుపమేయములను సంస్కరించుట దృష్టముగాన, నొక యుపమేయమున కొక్కొక యుపమాన ముండవలెనని తెలియజేయుటకు, ఉపక్రమమున నందే, ఉపమానము అనేకత్వమును పరిగ్రహించునని తాత్పర్యము. ॥604॥

అవతారిక — ఇక నొక యుపమానము సముదితములయిన అనేకోపమేయముల మపమించుటకు, ప్రసిద్ధతరమగు వేరొక నిదర్శనమును నిందు జూపుచున్నారు.

శ్లో॥ మేఘా శైల ఇవేత్యుక్తే సమస్తానాం ప్రతీయతే ।
సాదృశ్యం గిరిణైకేన ప్రత్యేకం తేన భిద్యతే ॥ 605

మేఘాః శైలః ఇవ = 'శైలమువలె మేఘములన్నవి' ఇతి ఉక్తే సతి = అని చెప్పబడినపుడు, ఏకేన, గిరిణా = ఒక శైలముతో, సమస్తానాం = అన్ని మేఘముల మొత్తమునకును, సాదృశ్యం ప్రతీయతే = సామ్యము తెలియనగుచున్నది, తేన = అందుచేత, ప్రత్యేకం భిద్యతే = వేరు వేరుగ నుపమానపదము మారును.

తాత్పర్య వివరణములు— "శైలః ఇవ అమీ వలాహకాః మహా పరిమాణాః నానావిధ రాగవిచ్ఛురితానేక సంస్థాన శిఖరత్వాత్" అని యొక వాక్యము. "కొండవలె ఈ మేఘములు పెద్ద పరిమాణము గలవి. ఏలయన, వేరు వేరు రంగులచే రంజితములైన శిఖరములు గలవిగ నున్నవి కాబట్టి" - అని యర్థము

ఇట నొక కొండతో మేఘములకు పోలిక చెప్పదలంపబడినది. అందువలన మేఘముల మొత్తమునకే పర్వత తౌల్యము. వేరు వేరు మేఘములకు గాదు. ఒక్కొక మేఘమును పర్వతమువంటిది కాదు గదా. అనేక వర్ణములు గల అనేక సన్నివేశముల శిఖరము లుండుట

యను పర్వత సాధారణ ధర్మము, మేఘముల మొత్తమునకే గాని, ఒక్కొక మేఘమునకు సంభవించునది గాదు. కాగా, ఏకవచనాంతమగు ఉపమానము అనేకోపమేయ సముదాయమునకు సంభవము గాని, ప్రత్యేకముగ గాదు గాన, ఉపమేయవాచక శబ్దమునకు ప్రయోగ మున్నపుడు, ఉపమాన ప్రతి సంబంధియగు నుపమేయము సముదితము ఒక్కటి యుండదు గాబట్టి, సంబంధి భేదము నిశ్చితము గాదు. 'గుడతిలతండులానాం పాకః' అను స్థలమునందు వలె ఉపమాన నిశ్చయమును గలుగదు. కావున ప్రతికృతు లొకొక్క దానికి ఉపమాన సంబంధము తెలియ పరచుటకు, కశ్యపాపత్యమను నుపమానమును ముందే వేరు వేరగును కాగా వివక్షితమయిన అర్థము లభించుటకు 'కాశ్యపాః' అను బహువచనాంత ప్రయోగ మీ విధముగ వ్యవస్థాపితము.

ఏమండీ ? ఉపక్రమముననే, భేదము అంగీకరింపబడి నందున బిదాది పాఠము వలన వచ్చు అఞ్ ప్రత్యయము అనేకాపత్యములను నర్థమున నుత్పన్నము కావలెను. అపుడు "యఞఞోశ్చ" (2-4-64) అను సూత్రముచే బహుత్వమున రాదగిన లుక్కు ఇచ్చట గూడ ప్రాప్తించును గదా ? అనిన, అట్లు కాదు. అఞ్ ప్రత్యయము ఏకత్వరూపార్థమునందే ప్రవర్తించును గదా. దానివలన యుక్తవదతి దేశముచే ఏకవచనము రావలసి యుండునని, ఏకశేషచే బహువచనము సమర్థింపబడినది. అనగా, యుక్తవద్భావ ప్రాప్తమయిన వచనము, వివక్షితార్థ లాభమునకై బాధింపబడునని భావము.

"హరీతక్యాదిషు వ్యక్తిః" - అని యొక వార్తికము కలదు. హరీతక్యాః ఫలాని= హరీతక్యః = కరకచెట్టు కాయలు. లుప్పు వచ్చినపుడు యుక్తవద్భావముచేత లింగవచనములు రెండును ప్రకృతి సంబంధులు ప్రాప్తించుచుండ లింగము మాత్రమే ప్రవర్తించును. వచనము అభిధేయ వచనమే వచ్చునను నియమము నా వార్తికము బోధించుచున్నది. పైన నుపపాదించిన న్యాయమే అందును గర్భీకృతము.

అఞ్ ప్రత్యయము బహ్వర్థబోధక మయినపుడు లుక్కగు ననియు, అఞంతము బహ్వర్థమును బోధించినపుడు లుక్కగుననియు రెండర్థములు భాష్యమున నుపపాదింపబడినవి. అందు రెండవ పక్షము నందును నిచట లుక్ప్రసంగము లేదని ప్రతిపాదితము. ఏలయన— "యఞఞోశ్చ' (2-4-64) అను నీ సూత్రములోనికి "యస్కాదిభ్యోగోత్రే" (2-4-63) అను సూత్రములో నుండి 'గోత్రే' అను పద మనువర్తించును. గోత్రమనగా అపత్యము. ప్రవరాధ్యాయోక్తమగు గోత్రము కాదు. 'అఞన్తం యత్ బహుషు గోత్రం' = అఞంతము బహ్వపత్య బోధకమైనపుడు లుక్కు అగునని యర్థము. ప్రతికృతుల బహుత్వ మిచట ఆ గోత్ర బహుత్వము గాదు కావున నిట లుక్ప్రసంగము లేదు.

"బైదస్య అపత్యాని = బిదాః । బైదయోరపత్యానిబిదాః" అను స్థలములందును, అఞంతము గోత్ర బహుత్వమును బోధించును. అందువలన నీ సూత్రముచేతనే లుక్కు సిద్ధించును. "ఏకవచన ద్వివచనాంతస్య ప్రవృత్తౌ బహుషు లోపో యూని" అను వార్తిక మక్కర

లేదు అని భాష్యమున సిద్ధాంతము చేయబడి యున్నది. గోత్రమనగా అపత్యము గనుక యువాపత్యమును గోత్రమే యగును అని భావము. ॥605॥

ప్రకరణసంగతి— ఉపమానసమాసప్రసంగము ముగిసిన తరువాత, ప్రసంగ సంగతిని బట్టి తుల్యార్థాది వతి ప్రత్యయము విచారింపబడినది. ఉపమాన విచార సందర్భమున విచారణీయమయిన, బహూపమేయములకు ఏకోపమానము చేయు ఉపకార ప్రకారము, 590 కారిక నుండి 605 వ కారిక వరకును గల 16 కారికలచే విచారింపబడినది.

ఇక నా ఉపమాన ప్రసంగ ప్రసంజితమగు ఛ ప్రత్యయ విధి విచారము ఈ 606 వ కారిక నుండి చేయబడును.

అవతారిక— ''సమాసాచ్చ తద్విషయాత్'' (5-3-106) అను యొక సూత్రము ఇది ఛ ప్రత్యయ విధాయకము. ప్రకృతి, సమాసము. 'కాకతాలీయమ్', 'అజాకృపాణీయమ్' మున్నగునవి యుదాహరణములు. ప్రకృత సూత్ర మహాభాష్యమున, నీ సూత్రార్థ పరిశీలన మీ క్రింది విధముగ నడచినది.

'తదిత్యనేన కిం ప్రతినిర్దిశ్యతే ?' అని మొదటి ప్రశ్న. 'తద్విషయాత్ సమాసాదపి ఛ ప్రత్యయో భవతి' అని గదా సూత్రార్థము. 'తద్విషయాత్' అనుచోట సర్వనామమగు తత్పదము దేనిని పరామర్శించును ? ఇవార్థమునా ? లేక ఛ ప్రత్యయమునా ? సర్వనామములు ప్రధానమయిన దానిని పరామర్శించుట న్యాయప్రాప్తము. సమాసము ప్రత్యయమునకు పకృతి గాన, అప్రధానము. ఇవార్థమును ఛ ప్రత్యయ విధిలో గుణ భూతము. వేరొకటి పరామర్శనీయ మగపడదు. కాగా నది దేనిని పరామర్శింపవలెను ? అని ప్రశ్నాశయము.

ఛ ప్రత్యయము విధేయము గాన ప్రధానము. అందువలన దానిని పరామర్శించుట యుక్తము అను నాశయముతో ''ఛః ప్రతినిర్దిశ్యతే'' అని సమాధానము.

కావచ్చును. కాని అర్థము పొసగదు. ఛ ప్రత్యయము విషయముగా గల సమాసము కంటె యని యర్థము గదా ? శబ్దము శబ్దమునకు విషయ మెట్లగును ? శబ్దమున కర్థము విషయమగును. అది అనుకరణమయినచో, శబ్దమునకు శబ్దము విషయమగునను కొనుడు. కాని సమాసము 'ఛః' అను దానికి అనుకరణము గాదు గదా.

ఇక విషయ శబ్దమున కర్థము, అనన్య భావము. అనగా ఛ విషయమనగా, ఛ ప్రత్యయ విషయము గానిచోట నుండనిదని యర్థము. కావున, సమాసము ఛ విషయము కావచ్చునందురా ? అది అయుక్తము - అనుచున్నారు.

శ్లో॥ ఛాపేక్ష తద్విషయతా విధేయత్వాన్న గమ్యతే ।
కాకతాలీయ మిత్యత్ర ప్రసిద్ధం హ్యవలక్షణమ్ ॥ 606

ఛాపేక్షా = ఛ ప్రత్యయముపై నాధారపడిన, తద్విషయతా = సమాసమునకు ఛ ప్రత్యయ

విషయత్వము, విధేయత్వాత్ = ఆ ఛ ప్రత్యయ మిచటనే విధింపబడుట వలన, న గమ్యతే= గ్రహింపబడదు, కాకతాలీయమ్ ఇతి అత్ర='కాకతాలీయమ్' అను స్థలమునందు, ఉపలక్షణం = ఈ సూత్రముచేతనే సమాస విధానము, ప్రసిద్ధం హి = ప్రసిద్ధము గదా.

తాత్పర్య వివరణములు— ఛ' ప్రత్యయము వచ్చినపుడు తప్ప వేరొకచోట నుండని సమాసము కంటె బరముగా ఛ ప్రత్యయము ప్రవర్తించును, అను నీ రీతిగ, ఛ ప్రత్యయాపేక్షమయిన ఛ విషయత్వము, కాకతాలీయం అను పదవ్యుత్పాదనము నందు కుదురుపడదు. ఎందువలన ననగా - ఒక దానివలన తెలియబడినది తా నింకొక దానికి జ్ఞాపక మగును. ఛ ప్రత్యయము, ఇదం ప్రథమముగ నీ సూత్రముచేతనే విధింపబడుచున్నదాయె. అంతకు మునుపు తెలియని విశేషణము ఛ ప్రత్యయమునకు ప్రకృతిగా సమాసమును విశే షించును ? ఆ ప్రత్యయము వేరొక సూత్రముచే నిధింపబడి యుండినదై సిద్ధముగానున్నచో నపుడు, సమాసమునకు ఛ ప్రత్యయ నైయత్యమును నిర్ణయించి తద్విధానమునకు, ఛ ప్రత్యయ విషయతను నిమిత్తముగా జెప్పుట యుక్తమయ్యెడిది. సూత్రాంతర మేదియు దానిని విధించి యుండలేదు. ఈ సూత్రమే దానికి ఉత్పత్తి వాక్యమాయె అనువాద మనునది సిద్ధ పూర్వమునకు గదా.

ఛ విషయమనగా, భావికాలమున ఛ ప్రత్యయమునకు విషయమయిన సమాసము కంటె బరముగా ఛ ప్రత్యయము వచ్చునని బోధించుటయే మాకు వివక్షితమనిన, ఆ మాట కర్థము లేదు. అపుడిట్లర్థము కావలెను. "ఏ సమాసముకంటె ఛ ప్రత్యయము భావిలో విధింప బడునో, ఆ సమాసము ఛ విషయమయిన, దానికి బరముగ ఛ ప్రత్యయమగును" అని. అపుడీ విశేషణము వలన ప్రకృతి అయిన సమాసమునకు గలిగిన విశేషమేమి ? దానికి ఛ విషయత్వము లేకుండ నుండదు. ఇక నా విశేషణము దేనిని వ్యావర్తించును ? కావున నది యర్థములేని విశేషణమగును - అని తాత్పర్యము. ॥606॥

అవతారిక— ఓయీ ! భావి అవస్థనుబట్టి, విశేషణమునకు ప్రయోజన ముండును. ఎట్లనగా— 'సమాసము ఛ విషయమైనపుడు' అని విశేషించుట వలన, ఛ ప్రత్యయము వచ్చి నపుడే గాని అది లేనపుడు ఈ సమాసమునకు ప్రయోగ ముండదని చెప్పినట్లగును గదా. అన్యత్ర అభావము గదా విషయ శబ్దమున కర్థము ! అని శంకింపగా జెప్పుచున్నారు.

శ్లో॥ రాజాశ్వాదిశ్చ విషయః స్యాదన్యో వేత్య నిశ్చితమ్ ।
తేన ఛస్య విధానాత్ ప్రాక్ వ్యపదేశో న విద్యతే ॥ 607

రాజాశ్వాదిః చ='రాజాశ్వ' మున్నగు సమాసమును, విషయః స్యాత్=ఛ విషయమగునా ?, అన్యోవా ఇతి = లేక, వేరొక సమాసము ఛ విషయమగునా ? అనిశ్చితమ్ = అని నిశ్చ యింపబడ లేదు, తేన = అందువలన, ఛస్య విధానాత్ ప్రాక్ = ఛ ప్రత్యయ విధానమునకు ముందు, వ్యపదేశః = ఛ ప్రత్యయ విషయమను వ్యవహారము, న విద్యతే = ఉండదు.

తాత్పర్య వివరణములు— ''సమాసాచ్చ తద్విషయాత్'' (5-3-106) అను సూత్రమునందు, తద్విషయాత్ అనుటవలన ఛ ప్రత్యయము రాదగునే సమాసమయినను, ఛ ప్రత్యయమునకు ప్రకృతి యగునని సూత్రకారునకు వివక్షితమా ? లేక, ఛ విషయమయిన సమాసము ప్రకరణ విశేషమునందలిదే గ్రాహ్యమా ? అను విషయము నిశ్చితము కాలేదు. ఆ విషయము నిశ్చితమయి యుండిన, ఆ సమాసమునకు సాధుత్వము, ఛ విషయముగా జ్ఞాపితమయ్యేడిది. ఆ సమాసము ఛ ప్రత్యయమునకు ప్రకృతి గనుకనే ఛ విషయము. మరి యొక రీతిగా గాదు. అట్టియెడ నన్ని సమాసములును ప్రకృతులు గావచ్చును. అపుడు ఆ సమాసము లన్నియు, ఛ ప్రత్యయ విషయములు కానపుడు అసాధువులని తేలును. అది సమ్మతము గాదు గదా. శాస్త్ర రచనము అనిష్టము నాపాదించుటకు గాదు గదా !

అట్లయిన, తత్ అను పదము దేనిని పరామర్శించునందురు ? అనిన, ఛ ప్రత్యయ విధానమునకు బూర్వము, నియతమగు సమాస మేదియు సిద్ధమయి ఛ ప్రత్యయమునకు విషయమయినది లేదు గాన 'ఛ విషయాత్' అను విశేషణము వ్యర్థము. అయుక్తమును. ప్రత్యయము పూర్వసిద్ధమయిన, కార్యాంతర విషయమున, అనగా చ ప్రత్యయ విధానము గాక మరియొక కార్యమున, ఆ విశేషణము ప్రకృతిరూపమును విశేషించుట యుచితమగును. ''షష్ఠ్యతసర్థ ప్రత్యయేన'' (2-3-30) అను సూత్రమును జూడుడు. 'అతసుచ్' అను ప్రత్యయము యొక్క అర్థమున విహితములయిన ప్రత్యయములతో యోగమున, షష్ఠీ విభక్తి ప్రత్యయ మగునని యర్థము. అతసర్థ ప్రత్యయములు సూత్రాంతరములచే విహితములు, పూర్వసిద్ధములు. ప్రకృతమున నట్లు కాదు గదా.

కాగా 'తద్విషయాత్' అనుచో తత్పదము ప్రధానమగు ఛ ప్రత్యయమును బరామర్శించుట సంభవింపదు. ఇక ఛ ప్రత్యయ విధానములో నిమిత్తమయిన ఇవార్థమును, అప్రధానమయినను, పరామర్శించును. ఇవార్థమును, ప్రస్తుతమయి సన్నిహితమే గదా.

''కథం పునః సమాసోనామ ఛ విషయః స్యాత్'' - అని శంకించి.

''ఏవం తర్హి ఇవార్థః'' అని సమాధానము. మహాభాష్యమున గలదు.

తదుపరి, ''యది తర్హి సమాసోఽపీవార్థే, ప్రత్యయోఽపి, సమాసేనోక్తత్వాత్ ప్రత్యయో న ప్రాప్నోతి'' - అని యాక్షేపము. సమాసమును, ఇవార్థకమే అయి, ప్రత్యయమును, నదియే యగుచో, సమాసమా ఇవార్థ సాదృశ్యమును చెప్పినది గాన నిక ప్రత్యయము ప్రాప్తింపదే ? ''ఉక్తార్థానామప్రయోగః'' అని గదా యభియుక్త వచనము. ఏ శబ్దముల యర్థము శబ్దాంతరములచే జెప్పబడునో ఆ శబ్దములకు ప్రయోగము కలుగదు గదా ! అని యాక్షేప తాత్పర్యము.

వచన సామర్థ్యమువలన, అనగా ఛ ప్రత్యయ విధానము వ్యర్థము కాకుండుటకు, వచ్చుననిన, 'శస్త్రీవ శ్యామా = శస్త్రీ శ్యామా' మున్నగు ఇవార్థ సమాసముల కంటె భిరముగ గూడ ఛ ప్రత్యయాపత్తి.

అందువలన, "ఏవం తర్హి ద్వావివార్థౌ । కథమ్ ? కాకాగమనమివ తాలపతన మివ కాకతాలమ్ । కాకతాల మివ కాకతాలీయమ్ ॥ అట్లయిన నపుడు ఇవార్థములు రెండగును. అనగా నది రెండు విధములుగ వ్యాపరించును. అందొక వ్యాపారముచే సమాసమును, నింకొక వ్యాపారముచే ప్రత్యయార్థమును సంస్కరించును. ఇవార్థ విషయమగు సమాసమునకు ఇవాక మున, ఛ ప్రత్యయమగునని యర్థము. 'కాకతాలమ్' అనగా 'కాకి రాక తాటిపండుపడుట వంటిది' అని యొక ఉపమార్థము. 'కాకతాల మివ = కాకతాలీయమ్' = కాకి వచ్చుట తాటి పండు పడుట వంటిది, దేవదత్తుని రాకయు, దొంగవానిని జంపుటయును అని రెండవ ఉప మార్థము. ఈ ఇవార్థ భేదమునకు మూలము సర్వనామము. దానిని పరామర్శించుటయే యని భావము. ॥607॥

అవతారిక— ఆ ఇవార్థములు రెండును నీ కారికలో వివరింపబడుచున్నవి

శ్లో॥ ద్వయోరివార్థయోరర్థ నిమిత్తత్వం ప్రతీయతే ।
ఏకేనావయవో యుక్తః ప్రత్యయోఽన్యేన యుజ్యతే ॥ 608

ద్వయోః ఇవార్థయోః = రెండు ఇవ శబ్దార్థములకు, అర్థ నిమిత్తత్వం = సమాస, ప్రత్యయ ముల అర్థమునకు కారణత్వము, ప్రతీయతే = గమ్యమగుచున్నది, ఏకేన = ఒక ఇవార్థము చేత, అవయవః = సమాసైక దేశమగు పదము, యుక్తః = సంబద్ధము, అన్యేన = ఇంకొక దానిచే, ప్రత్యయః = ఛ ప్రత్యయము, యుజ్యతే = సంబంధింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— కాకతాలీయమ్, అజాకృపాణీయమ్ మున్నగునవి ప్రకృత సూత్రోదాహరణములు. కాకి తాటిచెట్టు క్రిందకు వచ్చుట, వెంటనే ఆ సమయము ననే తాటిపండు పడి ఆ కాకి చనిపోవుటవలె దేవదత్తుడు బయటకు వచ్చుట, వెనువెంటనే చోరుడు పట్టుకొని వానిని జంపుట వంటిది యీ సంఘటనము. అనగా ననుకొనకుండగ దటస్థించినది అని 'కాకతాలీయ మిదమ్' అను వాక్యమున కర్థము.

మేక ఆ చోటకు వచ్చుట, పైనుండి ఆ సమయముననే కత్తిమీద పడుట, దాని వలన నా మేక చనిపోవుట వంటిది దేవదత్తుడు చోరునిచే చంపబడుట. దానివంటి దీ సంఘ టన మని, అజాకృపాణీయమను, ఛ ప్రత్యయాంతమున కర్థము.

రెండుపమానములలో నొకటి సమాసావయవము లయిన పూర్వోత్తర పదములకు సంబంధించినది. దానిని దెలియజేయునది సమాసము. కనుక నది ఇవార్థ విషయము. లేదా అవయవమనిన సమాసమే యనవచ్చును. అది తద్ధితాంతమునందు ప్రకృతి గావున నవయ వము. అది అవయవ ద్వారముగా నివార్థముతో సంబంధించును. సాక్షాత్తుగా గాదు. రెండవ ఇవార్థ సంబంధము ఛ ప్రత్యయమునకు.

'శస్త్రీ శ్యామా' అను నుపమాన మిటువంటిది గాదు. అచట కత్తికి శ్యామ గుణము పూర్వ సిద్ధము. శ్యామ గుణ విశిష్ట శస్త్రితో దేవదత్త యను స్త్రీ ఉపమింపబడుచున్నది.

అచట దేవదత్త యను నుపమేయముతో నింకొకటి ఉపమింపబడుట లేదు గాన నివార్థ మొక్కటియే. ॥608॥

అవతారిక— అందు సమాస వాచ్యమగు నివార్థ మీ కారికలో చెప్పబడుచున్నది

శ్లో॥ చైత్రస్య తత్రాగమనం కాకస్యాగమనం యథా ।
దస్యోరభినిపాతస్తు తాలస్యపతనం యథా ॥ 609

తత్ర, చైత్రస్య ఆగమనం = అచటికి చైత్రుని రాక, కాకస్య ఆగమనం యథా = కాకి రాక వంటిది, దస్యోః అభినిపాతం తు = దొంగయొక్క చైత్రుని పైని బడుట, తాలస్య పతనం యథా = తాటిపండు కాకిమీద పడుట వంటిది.

తాత్పర్య వివరణములు— కాకతాలీయమను స్థలమున, కాకి రాక ఉపమానమును, చైత్రుని రాక ఉపమేయమును తాలపతన ముపమానమును, దస్యు = చోరసమాగమ ముపమేయమును నగుచున్నవి. రెండు పనులయందును. అతర్కితోపనతత్వము = అనుకొనకుండ దటస్థపడుట, సమానధర్మము. ఇది సమాసవాచ్యమగు నివార్థము. ॥609॥

అవతారిక— ఇక ప్రత్యయవాచ్యమగు నివార్థ మీ కారికలో నభిహితము.

శ్లో॥ సంనిపాతే తయోర్యాన్యా క్రియా తత్రోపజాయతే ।
వధాదిరుపమేయే ఒర్థే తయా ఛవిధి రిష్యతే ॥ 610

తత్ర = అచట, తయోః సంనిపాతే = కాకము యొక్కయు, తాటిపండు యొక్కయు కలయికలో, యా, అన్యా, వధాదిః క్రియా = ఏ, ఇంకొక, వధ, మున్నగు, క్రియ, ఉపజాయతే = కలుగుచున్నదో, తయా, ఉపమేయే అర్థే = ఆ క్రియచే, పోల్పదగిన, అర్థమునందు, ఛవిధిః ఇష్యతే = ఛ ప్రత్యయ విధానము సమ్మతమగుచున్నది.

తాత్పర్య వివరణములు— కాకి రాక, తాటిపండు పడుట, అను చర్యలు కలసినపుడు, ఆ కలయిక వలన, కాకి చనిపోవుటయో, అవయవములు విరుగుటయో, తలకాయ పగులుటయో, ఏదియో క్రియ పుట్టును. దానితో బోల్పదగినది, చైత్రుని, వధాంగభంగాదిక ముపమేయము. వాని ఉపమానోపమేయ భావ సంబంధమే రెండవ ఇవార్థము. దానిని బోధించుచు, ఛ ప్రత్యయమును సూత్రము విధించుచున్నదని భావము. ॥610॥

అవతారిక— మరియు, కాకి రాక, చైత్రుని రాక కుపమానము. కాగా కాకాగమన మప్రధానము. తాలఫల పతనము, దస్యుని రాక కుపమానము గాన నదియు నప్రధానము. ప్రధానా ప్రధానములగు కాకతాల శబ్దార్థములకు పరస్పర సంబంధము లేదు. కాగా నవి అసమర్థములు. అసమర్థములయిన సమాన మెట్లు? ఇక, 'ఈ చ ప్రత్యయ విధియే సమాసమునకును జ్ఞాపకమగును' అనిన నపుడును 'సుప్సుపా' అను సూత్రముచేతనే సమాసమని భాష్య

మున సూచింపబడి యున్నది. కావున అసమర్థములకు సమాసము దుర్లభమే। సమాస మెట్లో సిద్ధించినను, పూర్వోత్తర పదార్థములు పరస్పర సమన్వయము లేనపుడు, సముదాయార్థమును బోధింప జాలవు. అపుడు, ప్రకృత్యర్థమేయది ప్రత్యయార్థమునకు విశేషకము కావలెను? అని యాశంకించి, సమాధాన మిందు చెప్పబడినది.

శ్లో॥ క్రియాయాం సమవేతాయాం ద్రవ్యశబ్దోఽవతిష్ఠతే ।
పాతాగమనయోః కాకతాలశబ్దౌ తథా స్థితౌ ॥ 611

ద్రవ్యశబ్దః = ద్రవ్యమును బోధించు శబ్దము సమవేతాయాం = ఆ ద్రవ్యమును, సమవాయ సంబంధముచే నాశ్రయించిన, క్రియాయాం = క్రియయందు, అవతిష్ఠతే = ఉండును = బోధించుచుండు ననుట, తథా = ఆ ప్రకారముగా, కాకతాల శబ్దౌ = కాక శబ్దమును, తాల శబ్దమును, పాతాగమనయోః = వచ్చుట, పడుట, అను క్రియలందు యథాక్రమముగా, స్థితౌ = ఉన్నవి.

తాత్పర్య వివరణములు— ద్రవ్యములు సిద్ధములు. క్రియలు సాధ్యములు. 'దధ్యోదనః', గుడధానాః మున్నగు సమాసములలో, పూర్వోత్తర పదార్థములు రెండును ద్రవ్యములే. వానికి పరస్పర సంబంధము సంభవింపదు కాని అసమర్థములకు సమాసము రాదు గదా. కావున సమాసోపపత్తికై ద్రవ్యగతములయిన, ఉపసేకము, మిశ్రణము అను క్రియలను దధి గుడ శబ్దములు బోధించును దధిచేత నుపసిక్తమగు నోదనము, గుడ మిశ్రితము లగు పేలాలు అని యర్థమని చెప్పుదురు.

ఆ ప్రకారముగనే కాక శబ్దము స్వగత వ్యాపారమును, తాల శబ్దము, స్వసమవేత క్రియను బోధించును. కాకాగమన తాలపతన క్రియలకు పరస్పరాభి సంబంధము. ద్రవ్య వాచక శబ్దములు వృత్తి విషయమున, క్రియాబోధకములుగా నుండు, ''బ్రాహ్మణవదధీతే'' ఇత్యాదులలో నగపడుచున్నది. అచట బ్రాహ్మణ శబ్దమునకు, బ్రాహ్మణాధ్యయన క్రియ గదా అర్థము కాకాగమన, తాలఫల పతనము లొకదానికొకటి యుపమానములు. కాకి రాక, అనుకొనకుండ జరిగినట్లు, తాటిపండు పడుటయు ననుకొనకుండ ప్రాప్తించినది. తాల పతన మతర్కితోపనతము (= ఊహింపబడకయే ప్రాప్తించినది) అయినట్లు. కాకాగమన మును జరిగినది. ఈ విధముగ పరస్పరోపమానోపమేయ భావముచే పూర్వోత్తర పదార్థములు సమన్వితము లగును. కాగా వానికి ప్రత్యయార్థ విశేషణత్వ ముపపన్నమే. కాకాగమనము, తాలఫల పతనము. దీనికి సమన్వయము కుదిరినది గాన, వానితో, దేవదత్తుని, లేదా చైత్రుని రాకకును, దొంగవచ్చి పైబడుటకును పోలిక సిద్ధించినది. ఆ యర్థమును బోధించునది సమాసము. కాకవధతో ఉపమేయమయినది దేవదత్త వధ. దానిని బోధించునది 'ఛ' ప్రత్యయము. ॥611॥

అవతారిక— అర్యా! ప్రారంభముననే, అతర్కితోపనతమయిన తాలకృత కాక వధతో, చోరకృతమయిన దేవదత్త వధ నుపమింపవచ్చును గదా! కాకాగమన తాలపతనము

లకు పరస్పరోపమానముతో బనియేమి ? కాక పదమునకు గౌణవృత్తి నాశ్రయించి, కాకా గమన పరత్వమును, తాలశబ్దమునకు తత్పతన పరత్వమును జెప్పుట కుపయోగమేమి ? అని శంకించి చెప్పుచున్నారు.

శ్లో॥ యదన్వాఖ్యాయకం వాక్యం తదేవం పరికల్ప్యతే ।
ప్రయోగవాక్యం యల్లోకే తదేవం న ప్రయుజ్యతే ॥ 612

అన్వాఖ్యాయకం = వృత్తియొక్క అర్థమును దెలియచేయు, యత్ వాక్యం = ఏ వాక్యముండునో, తత్ ఏవం పరికల్ప్యతే = అది ఇట్లు కల్పింపబడును, లోకే ప్రయోగవాక్యం = లౌకిక ప్రయోగమున వాక్యము, యత్, తత్ = ఏది గలదో అది, ఏవం న ప్రయుజ్యతే = ఈ విధముగ ప్రయోగింపబడదు.

తాత్పర్య వివరణములు— 'కాకతాలీయమ్' 'అజాకృపాణీయమ్'-అని లోకమున వ్యవహరింపబడు పదములు గలవు. ఆ పదముల నన్వాఖ్యానము చేయుట శాస్త్రకారుని కృత్యము. శబ్దముల అన్వాఖ్యానము = ప్రకృతి ప్రత్యయ విభాగమును బురస్కరించుకొని అర్థమును చేయుట. ప్రక్రియా వాక్యమునందలి పదములకు అర్థ సమన్వయము అన్వాఖ్యాన మార్గమున సిద్ధించును. ప్రక్రియా వాక్యము = లౌకిక విగ్రహ వాక్యము. ఆ అన్వాఖ్యానమున కుపాయముగా కల్పింపబడుచుండును.

కాకాగమన మివ తాలపతనమ్. తాలపతన మివ కాకాగమనం = కాకి రాక వంటిది తాటిపండు పడుట తాటిపండు పడుటవంటిది కాకి రాక - అని యిట్లు ఆ రెండు క్రియలను నొకదానితో నింకొకదానిని బోల్చి ప్రక్రియలో అన్వాఖ్యానమున కుపాయ భూతమగు నీ వాక్యము కల్పన మాత్రమే. దీనికి లోకమున ప్రయోగముండదు.

ప్రక్రియావాక్యము నిట్లు కల్పింపకుండిన, తాల కర్తృకమగు వధతోడనే కాకికి సంబంధము గృహీతమయ్యేడిది, తాలకాకములకు సంబంధమే గ్రహింపబడదు. 'కాకతాలమ్' అని ప్రయోగమునం దుండబోదు. దానికి ఛ ప్రత్యయమునకు ప్రకృతిగా మాత్రమే ప్రయోగము. సమన్వయానుసారముగ వాక్య పరికల్పనము కర్తవ్యముగదా యని తాత్పర్యము.॥612

అవతారిక— ఏతావతా ఫలిత మేమనగా—

శ్లో॥ యయోరతర్కితా ప్రాప్తిర్దృశ్యతే కాకతాలవత్ ।
తయోః సమాసప్రకృతే ర్వృత్తిరభ్యుపగమ్యతే ॥ 613

కాకతాలవత్ = కాకికిని తాటిపండునకును వలె నున్న, యయోః = ఏ దేవదత్తునకును, దొంగకును వలెను, అతర్కితా = ముందుగ నూహింపబడని, ప్రాప్తిః దృశ్యతే = సమాగమము = కలయిక, కనబడుచున్నదో, తయోః = ఆ రెండింటి సమాగమము ఇవార్థమయినపుడు, సమాస ప్రకృతేః = సమాసమనెడు ఛ ప్రత్యయ ప్రకృతివలన, వృత్తిః = ఛ ప్రత్యయోత్పత్తి యను, వృత్తి, అభ్యుపగమ్యతే = గ్రహింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— అతర్కితములయిన ఉపస్థితములు కాకతాలములు. వానికి కాకవధ నిమిత్తముగా సంబంధము దస్యు దేవదత్తుల ఉపస్థితియు దస్యువుచే (చోరు నిచే) దేవదత్తుని వధయు నంతియే. ఆ విధముగ సంబంధము గల యా రెండింటి సమాగమ మును ఇవ శబ్దమున కర్థమయినపుడు సమాసమను ప్రకృతి యేర్పడుచున్నది. దానినుండి ఛ ప్రత్యయమునకు ప్రవృత్తి యని చెప్పబడినది.

కనుక నీ విధముగ కాకతాలముల సంబంధ విశిష్ట ముపమానము. ఉపమేయము వధాదికము. ఛ ప్రత్యయ ముపమేయమును బోధించును. కాకతాల అను ప్రకృతి, నియత ముగ ఛ ప్రత్యయ విషయమే. ఛ ప్రత్యయము లేనపుడు దాని ప్రయోగము సాధువు కాదు. ఈ విషయము భాష్యమున విస్తరముగ ప్రదర్శింపబడినది. ॥613॥

అవతారిక— ''వృత్తిరభ్యుప గమ్యతే'' = ఛ ప్రత్యయ ప్రవృత్తి స్వీకరింపబడు చున్నది అని వెనుకటి కారికలో చెప్పబడినది. ఏ యర్థమున ? అనగా—

శ్లో॥ కాకస్యతాలేన యథావధోయన్య తు దస్యునా ।
తత్ర చిత్రీకృతేఽన్యస్మి న్నుపమేయే ఛ ఇష్యతే ॥ 614

కాకస్య తాలేన = కాకికి తాటిపండు చేతను, యస్యతు, దస్యునా = ఏ దేవదత్తునకో దొంగ చేత నున్ను, యథా వధః = ఏ ప్రకారముగ, వధ జరిగినదో, తథా త త్రచిత్రీకృతే = ఆ ప్రకారముగా, ఆశ్చర్య భూతముగా జరిగిన, అన్యస్మిన్నుపమేయే = వేరొక చర్యయందు, ఛః ఇష్యతే = ఛ ప్రత్యయము సమ్మతమగుచున్నది.

తాతర్య వివరణములు— సమాసార్థమగు ఉపమ, కాకతాల సమాగమ తుల్య మగు దస్యు దేవదత్తుల సమాగమము. అది ఒక ఇవార్థము. ప్రత్యయార్థోపమ, ''అన్యస్మిన్ ఉపమేయే'' అని చెప్పబడినది. తాటిపండు పడుట దానంతట నది జరిగినది దేవదత్తుని రాకయు నంతియ. కాకి యదృచ్ఛగా నచ్చటికి వచ్చి, పైనబడిన ఆ పండుచే చనిపోయినది, అట్లే దొంగచే దేవదత్తుడు హతుడు ఇది ఆశ్చర్యజనకమైన విషయము. ఇట్లే అద్భుతరూప మయిన ఉపమేయమునందు ఛ ప్రత్యయము వచ్చును. కాకతాలముల సమాగమము మూల ముగ కలిగిన క్రియతో పోల్చబడిన క్రియాంతరమునందు ఛ ప్రత్యయమని ఫలితము అట్లాశ్చర్య భూతమయిన చర్య కాకతాలీయ మనబడును అని తాత్పర్య పర్యవసానము.॥614॥

అవతారిక— ఉపమాన ప్రసంగవశమున, ఇవార్థక ఛ ప్రత్యయ విధి విచారము చేయబడినది. దాని వంటిదే అగు, కన్ప్రత్యయ విధి ఇక విచారింపబడు చున్నది.

శ్లో॥ చంచత్ప్రకారశ్చంచత్కో బృహత్క ఇతిచాపరే ।
మణిమండూక ఖద్యోతాన్ సాదృశ్యేన ప్రచక్షతే ॥ 615

మణిః, మండూక, ఖద్యోతాన్ = మణిని, కప్పను, మిణుగురు పురుగును, చంచత్ప్రకారః =

చంచత్కః ఇతి = చలించుచున్న దానివలె నున్నదిగాన చంచత్కమనియు, బృహత్ప్రకారః బృహత్కః ఇతి చ = పెద్దదివలె నున్నదిగాన బృహత్కమనియు. సాదృశ్యేన = సాదృశ్యము చేత, అపరే ప్రచక్షతే = కొందరు చెప్పుదురు.

తాత్పర్య వివరణములు— "స్థూలాదిభ్యః ప్రకారవచనేకన్" (5-4-3) అని యొక సూత్రము. స్థూల మున్నగు శబ్దములకు బరముగ సాదృశ్యమునకు ద్యోతకమగు 'కన్' అను ప్రత్యయము వచ్చునని సూత్రార్థము. సూత్రమున ప్రకార శబ్దమునకు సాదృశ్యము అర్థమయినను సాదృశ్య విశిష్టము నది బోధించును. జాతీయర్ ప్రత్యయమున కపవాదము గదా. అచట మహాభాష్యమున నొక వార్తికము పఠింపబడియున్నది. "చంచద్బృహతో రుపసంఖ్యానమ్" అని యా వార్తికము. 'చంచత్' 'బృహత్' - అను శబ్దములకు గూడ స్థూలాది గణమున పాఠమును చేయవలెనని భావము. చంచత్సదృశః = చంచత్కః ॥ బృహత్సదృశః బృహత్కః ॥ ఈ పేరు దేనికి? అనిన, మణి, మండూక ఖద్యోతములకు, అని పూర్వాచార్యుల తలంపు. ॥615॥

అవతారిక— మణ్యాదుల సాదృశ్య మెట్టిది? అనిన, చెప్పుచున్నారు.

శ్లో॥ తత్రోన్మేష నిమేషాభ్యాం ఖద్యోత ఉపమీయతే।
శ్వాసప్రబంధై ర్మండూకః స్పందమాన ప్రభో మణిః॥ 616

తత్ర = అందు, ఉన్మేషనిమేషాభ్యాం = తన కాంతి, మెరయుట, ఆరిపోవుటలచేత, ఖద్యోతః ఉపమీయతే = మిణుగురు పురుగు చలించుచున్న వస్తువుతో పోల్చబడుచున్నది, శ్వాస ప్రబంధైః = ఉచ్ఛ్వాస నిశ్వాసలచే, కదలుచున్న దానితో, మండూకః ఉపమీయతే = కప్ప పోల్చబడుచున్నది, స్పందమాన ప్రభః = తన ప్రభ కదలునదయి = కదలుచున్న ప్రభ గలదై, మణిః ఉపమీయతే = మణి, కదలుచున్న మణితో పోల్చబడుచున్నది.

తాత్పర్య వివరణములు— మిణుగురు పురుగు కదలకుండగనే యొకచోట నుండి మెరయుచుండును. ఆ ప్రభావ్యాప్తిని బట్టి దానిని కదలుచున్న పదార్థముగా మనము భావించి చంచన్నివ = చంచత్కః = కదలుచున్న దానివలె నున్నదిగాన చంచత్కము అనుచున్నాము

కప్ప, అవిచ్ఛిన్నముగ నెగపీల్పులు పీల్చుచుండును. దానిచేత తన శరీరముబ్బును కాని తాను చరింపలేదు. ఆశ్వాసల అను వృత్తిచేత మనము దానిని కదలుచున్న పదార్థముతో బోల్చి ఇది 'చంచత్కము' అందుము.

మణి, యొక్క ప్రభలు దేదీప్యమానములయి రశ్మి చక్రవాల మేర్పడును. దానిని జూచి, ఆ మణి కదలకయున్నను, చలించుచున్నట్లు తలంచి, చలించు వస్తువుతో పోల్తుము. చంచత్కోఽయం మణిః అని యందుము. ॥616॥

అవతారిక— 'బృహత్కః' అను స్థలమున, క న్ప్రత్యయార్థమయిన ప్రకారమేమిః అన—

శ్లో॥ ప్రవికాసి ప్రభోఽల్పోఽపి మహాన్ య ఉపలభ్యతే ।
బృహత్క ఇతి తత్రైష మణౌ శబ్దః ప్రయుజ్యతే ॥ 617

యః = ఏ మణి, ప్రవికాసి ప్రభః = అంతటను వ్యాపించిన ప్రభాజాలము గలది, అల్పోఽపి= తాను చిన్నదయినను, మహాన్ ఉపలభ్యతే = పెద్దదిగా నగపడునో, తత్ర మణౌ = ఆ మణి యందు, 'బృహత్కః' ఇతి, ఏషః శబ్దః = 'బృహత్కమిది' అను శబ్దము, ప్రయుజ్యతే = ఉపయోగింపబడుచున్నది.

తాత్పర్య వివరములు— మణి చిన్నదే. దాని ప్రభా సందోహము సర్వతోవ్యాపి. కనుక పెద్దదిగా గనబడుచున్నది అపుడు, 'ఈ మణిబృహత్కము' అని కన్ప్రత్యయాంత శబ్దముచే వ్యవహరింతురు. బృహద్వస్తు సదృశము గాన బృహత్కము. ॥617॥

అవతారిక— ఇక ప్రసంగ సంగతిచే, మత భేదము ననుసరించి ప్రకారమన నేమియో విచారింపబడును.

శ్లో॥ సాదృశ్యమేవ సర్వత్ర ప్రకారః కైశ్చి దిష్యతే ।
భేదేఽపి తు ప్రకారాఖ్యా కైశ్చిదభ్యుగమ్యతే ॥ 618

సర్వత్ర = శబ్ద శాస్త్రమునందెల్ల, సాదృశ్యం ఏవ = 'సాదృశ్యము' అను నర్థమునందే, ప్రకారః = ప్రకార శబ్దము (వర్తించునదిగా), కైశ్చిత్ ఇష్యతే = కొందరిచే నంగీకరింపబడు చున్నది, భేదే అపి = 'భేదము' అను నర్థమునందును, ప్రకారాఖ్యా = 'ప్రకారము' అను శబ్దము (వర్తించుట), కైశ్చిత్, అభ్యుపగమ్యతే = కొందరిచే స్వీకరింపబడుచున్నది.

తాత్పర్య వివరణములు— "ప్రకారవచనే థాల్" (5-3-23), 'ప్రకారేగుణ వచనస్య" (8-1-12).

"స్థూలాదిభ్యః ప్రకారవచనే కన్" (5-4-3), ఈ మొదలగు పాణిని సూత్రము లందెల్ల సాదృశ్యమే ప్రకారశబ్దమున కర్థము.

"యథా తథా" = 'యేన ప్రకారేణ', 'తేన ప్రకారేణ' అని విగ్రహములు. 'యత్తుల్యం తత్తుల్యమ్' అని తుల్యత్వమే అచట ద్యోతము.

"ప్రకారే గుణవచనస్య" (8-1-12) అను సూత్రమున కుదాహరణము, 'పటు పటుః' అనునది, అది ద్విర్వచన విధాయకము. పటు సదృశుడు సమర్థునకు గొలదిగా తరిగిన శ్లాఘ్యు = ఇంచుమించు గట్టివాడు అని యర్థము. అచట సాదృశ్యము, తద్విశిష్టునికి విశేషణ ముగా ద్యోతన చేయబడుచున్నది. స్థూలకః = అనగా స్థూల సదృశుడు అని యర్థముగాన నచటను సాదృశ్య విశిష్ట దర్థము. పటుజాతీయః అను స్థలమున నదియే యర్థము.

ఈ సూత్రములందెల్ల ప్రకారశబ్దమునకు భేద మర్థమని కొందరి మతము. 'యథా' 'తథా' అను చోటను భేదమే వాచ్యము. భేదము గలవాడే సమానుడు. భేదమే సాదృశ్య హేతువు గదా. పటు పటుః = ద్విత్వమున కుదాహరణము స్థూలకః = కనంతము. అచటను భేదమే వాచ్యము. అనగా భేదమును, సాదృశ్యమును గూడ అంతటను ప్రతీతము లగును. అందొకటి వాచ్యమగును రెండవది సామర్థ్యము వలన గమ్యము. 'పటు ప్రకారః దేవదత్తః'- అనిన, సాదృశ్యమే ప్రకారము. ''పటుర్దేవదత్తః'' అని అభేదముగ వచించినపుడును సాదృశ్యమే గమ్యము. ఇచట భేదము గమ్యము గాదు. ''బ్రాహ్మణ ప్రకారాః మాఠరాదయః'' అను ప్రయోగమున, మాఠరుడు మున్నగువారు బ్రాహ్మణులలో భేదమేయని యర్థమగుచున్నది గాన సాదృశ్యమున కచట సంభవము లేదు. ॥618॥

అవతారిక— ఇట విమర్శింపదగిన విషయములు రెండు గలవు. ప్రకారమనగా సాదృశ్యము కానిండు, లేదాభేదము కానిండు, లేదా ఉభయమునయిన నగు గాక. ప్రకార వచనే జాతీయర్' (5-3-69) అని యొక సూత్రము. ''ప్రకారవచనే థాల్'' (5-3-23), అని మరియొక సూత్రము. జాతీయర్ ప్రత్యయము సకల ప్రాతిపదికములకును బరముగా వచ్చును. ఇక థాల్ ప్రత్యయము, కిమ్, సర్వనామ, బహు శబ్దములకు బరముగ మాత్రమే విహితము. కనుక నిది జాతీయర్ ప్రత్యయమునకు బాధకము కావలెను. అపుడు ''కిం జాతీయః'' అను ప్రయోగ మెట్లు సిద్ధించును? అనునది యొక ప్రశ్న. ఆ విధముగనే ''తథా జాతీయః'' అను ప్రయోగమున కేమి యుపపత్తి గలదు? అచట థాల్ ప్రత్యయమే ప్రకారమును బోధించుచున్నది గదా, మరల జాతీయర్ ప్రత్యయమునకు బ్రసంగమేమి? అని రెండవ విమర్శ విషయము. దీనికి సమాధాన మీ కారిక—

శ్లో॥ ప్రకారవచనః కశ్చిత్ ప్రకారవతి సంస్థితః ।
ప్రకారమాత్రే వర్తిత్వా కశ్చిత్ తద్ వ్యతివర్తతే ॥ 619

కశ్చిత్ ప్రకారవచనః = ఒకానొక ప్రకార వాచకము, ప్రకారవతి, సంస్థితః = ప్రకార విశిష్టమునందుండును, కశ్చిత్ = ఒకానొకటి, ప్రకారమాత్రే, వర్తిత్వా = ప్రకారమునందే యుండి తత్, వ్యతివర్తతే = దాని నతిక్రమించి తద్విశిష్టమును బోధించును.

తాత్పర్య వివరణములు— ఒకానొక ప్రకార వచన మనగా, 'జాతీయర్' ప్రత్యయమును, కన్ ప్రత్యయమును, ద్విర్వచనమును నగును. వీనికి అప్రధానమగు ప్రకారమును బోధించుట స్వభావము. ప్రకారవత్తే ప్రధానముగ జెప్పబడునది. థాల్ ప్రత్యయము అట్టిది గాదు. అది ప్రకారమునే బోధించును. ప్రకార విశిష్ట బోధకము గాదు. కాని యొక విశేష మున్నది. అది యేమనిన, ముందు, ప్రకారమును బోధించి, తరువాత ప్రకార విశిష్టమును, జాతీయర్ ప్రత్యయ సహితమై బోధించును. థాల్ప్రత్యయాంతమునకు, శుక్లాది శబ్దములవలె విశిష్ట బోధకత్వము లేదు. కాబట్టి విషయిభేదముండుటవలన, థాల్, జాతీయర్ ప్రత్యయములకు బాధ్య బాధక భావ ముండబోదు.

'తథా జాతీయః' అను ప్రయోగమును నుపపన్నమే యగును. 'యథా దేవదత్త స్తథా యజ్ఞదత్తః' అను ప్రయోగమున-దేవదత్తు డే ప్రకారము కలవాడో యజ్ఞదత్తు డన నా ప్రకారము కలవాడే అని యర్థమగుటచే థాల్ప్రత్యయము ప్రకార విశిష్టమును బోధించుచున్న దని తలంచుట కవకాశమున్నది గాని థాలంతము ప్రకార విశిష్టబోధకము గాదు. ఆ వాక్యము క్రియతో పరిసమాప్తి నొందవలెను గదా. కనుక, 'వర్తతే' అనియో, 'దృశ్యతే' - అనియో అధ్యాహారము కర్తవ్యము. ఆవర్తన క్రియలోగాని దర్శన క్రియలోగాని, ఈ ప్రకారము కరణముగా నన్వయించును. ఏ ప్రకారము సాధనముగా దేవదత్తు డుండెనో, లేదా కనబడు చుండెనో, ఆ ప్రకారముచేతనే యజ్ఞదత్తుని దర్శనమని యర్థము, లేదా యాతని వర్తన మట్టి దని భావము.

అందువలననే, క్రియతో సంబంధించిన ప్రకారమను కరణము ప్రకారవత్తును బోధింపదు. అట్లు బోధించిన, దేవదత్తస్య అని షష్ఠి ప్రాప్తమగును. దేవదత్తుని ప్రకారముతో గూడినవాడు యజ్ఞదత్తుడని యర్థము. ॥619॥

అవతారిక— తదుపరి వేరొక ప్రశ్న ఉదయించుచున్నది. థాల్ప్రత్యయార్థమగు ప్రకారము సాదృశ్యమే అయిన యెడల, పాణిని, "అవ్యయం విభక్తి" - ఇత్యాది సూత్రముచే యథార్థమునందును, సాదృశ్యార్థమునందును వర్తమానమయిన అవ్యయము సుబంతముతో సమసించునని చెప్పబడినదే. యథా శబ్దార్థములు నాలుగింటిలో సాదృశ్యమున్నది గదా. మరల 'సాదృశ్య సంపత్తి' అని చివర సాదృశ్య పదమును నుచ్చరించి, సాదృశ్యమున వర్తమానమయిన అవ్యయమును సమసించునని ఎందుకు చెప్పవలసి వచ్చినది? అను నీ ప్రశ్నకు సమాధాన మీ క్రింది రెండు కారికలును.

శ్లో॥ సాదృశ్య గ్రహణం సూత్రే సదృశస్యోప లక్షణమ్ ।
తుల్యయోరవ్యయీభావే సహశబ్దోభిధాయకః ॥ 620

శ్లో॥ వీప్సా సాదృశ్య యోర్వృత్తిర్యా యథార్థాభిధాయినః ।
సచాయమవ్యయీభావే భేదోభేదేన దర్శితః ॥ 621

సూత్రే = అవ్యయం విభక్తి సమీప సమృద్ధి వ్యృద్ధ్యర్థాభావాత్యయాసమ్ప్రతి శబ్ద ప్రాదు ర్భావ పశ్చాద్యథాను పూర్వ యౌగపద్య సాదృశ్య సంపత్తిసాకల్యాంత వచనేషు (2-1-6) సూత్రమునందు, సాదృశ్య గ్రహణమ్ = సాదృశ్య పదమును గ్రహించుట, సదృశస్య ఉపలక్షణమ్ = సాదృశ్యము గల ధర్మికి లక్షణచే బోధకము, తుల్యయోః = సదృశ పదార్థములు రెండింటికి, అవ్యయీభావే = అవ్యయీభావమునందు, సహశబ్దః అభిధాయకః = 'సహ' అను శబ్దము, వాచకము, యథార్థాభిధాయినః='యథార్థ' పదార్థములలోని యర్థమును చెప్పు అవ్యయమునకు, యా = ఏ వృత్తి గలదో అది, వీప్సా సాదృశ్యయోః వృత్తిః = వీప్సయందును, సాదృశ్యమునందును వృత్తి, సచ అయంభేదః = ఆ ఈ భేదము గూడ, అవ్యయీభావే = అవ్యయీభావ విధాయకమునందు, భేదేన దర్శితః = వేరుగ చూపబడినది.

తాత్పర్య వివరణములు—— అవ్యయ మిత్యాది సూత్రము (2-1-6) యథార్థము నందు వర్తమానమయిన అవ్యయమునకును, సాదృశ్యమునందు వర్తమానమయిన అవ్యయ మునకును, సుబంతముతో సమాసమును విధించుచున్నది. అందు సాదృశ్యమున వర్తమాన మనగా లక్షణచే సదృశమగు ధర్మిని బోధించునట్టి అని యర్థము. ధర్మము స్వాశ్రయమగు ధర్మి నుపలక్షింపగలదు.

ఉదాహరణము—— ససఖి = సదృశః సఖ్యా, అని విగ్రహము. ఇద్దరుమిత్రులు సాదృశులు, తద్వాచకము 'సహ' అను శబ్దము దానికి సమాసమున 'స' అను నాదేశము. ప్రాచీనులయిన వృత్తికారు లిచ్చిన యుదాహరణ మిది సదృశార్థాభిదాయి అవ్యయమునకే సూత్రమునంటలి సాదృశః పదముచే గ్రహణము. "అవ్యయీభావశ్చ" (1-1-41) సూత్ర ముచే సత్యభూతమగు నర్థము నా పదము బోధించినను అవ్యయసంజ్ఞ.

ఇక, 'యథా' అను, సూత్రస్థ పదార్థమగు సాదృశ్యము ధర్మమేగాని ధర్మిగాదు. 'సహరి' అనునది దాని కుదాహరణము. హరి యొక్క సాదృశ్యము అని యర్థము. ఆ యథా శబ్దమునకు యోగ్యతయు, వీప్సయు గూడ నర్థము. కావున తద్వాచకములును సమసించును 'అనురూపం' 'ప్రత్యర్థ' అని యుదాహరణములు. అర్థ సామాన్యము అనగా సకలార్థము లను క్రియచే వ్యాపింపబడుట అచట 'ప్రతి' అను దానిచే ప్రకాశింపజేయబడును. ప్రకార మనగా సామాన్యమునకు భేదకమగు విశేషమని చెప్పబడినది. సకల పదార్థములకును క్రియతో సంబంధమను వీప్సా సామాన్యమునకు భేదకమగు విశేషము యథార్థము. ఇక ప్రకృతము - యథా శబ్దార్థమగు నది ధర్మమాత్రము. సాదృశ్య శబ్దార్థము తుల్యమైనది యను నర్థము గల ధర్మి. పృథక్ గ్రహణమువలన భేద మభిమతమని తెలియుచున్నది.
॥620, 621॥

అవతారిక—— వెనుకటి కారికలలో అవ్యయ మిత్యాది సూత్రమునందలి సాదృశ్య పదము ధర్మి పదమనియు, యథా శబ్దార్థములలోని సాదృశ్య శబ్దము ధర్మపరమనియు నుప పాదింపబడినది. రెండు స్థలములందును ధర్మపరమేయనియు గుణగవ సాదృశ్యబోధకము యథార్థ సాదృశ్యమును ద్రవ్యగత ధర్మవాచకము సూత్రస్థ సాదృశ్యపదమును నని యీ కారికలో ప్రకారాంతరమును జెప్పుచున్నారు.

శ్లో॥ సాదృశ్యం యోగ్యతా కైశ్చిదనావభ్యుపగమ్యతే ।
యత్తు మూర్తిగతం సామ్యం తత్ సహేనాభిధీయతే ॥ 622

అనౌ = 'అను' - అను శబ్దము విషయమున, యోగ్యతా, సాదృశ్యం = దానిచే ద్యోతమగు యోగ్యత యను సాదృశ్యము, కైశ్చిత్, అభ్యుపగమ్యతే = యథార్థములలోనిదిగా కొందరిచే నంగీకరింపబడుచున్నది, యత్, తు = ఏ యది కలదో, మూర్తిగతం, సామ్యం = ద్రవ్య గతమయున సాదృశ్యము, తత్, సహేన, అభిధీయతే = అది, 'సహ' అను నవ్యయముచే చెప్పబడును.

తాత్పర్య వివరణములు— "అనురూపం సురూపో వహతి" అని యొక ప్రయోగము (తన) రూపముతో తుల్యముగ, శోభాతిశయమునకు హేతువయిన హార కటకాద్యాభరణము నొక సురూపుడు ధరించియున్నాడు" అని యర్థము ఇట నాతని గుణమగు రూపము యొక్క సాదృశ్యము యథార్థమగు యోగ్యత. రూపమునకు యోగ్యముగ = అనుగుణముగా తత్సదృశమగు హారాదికమును ధరించుచున్నవాడు. ఇక 'ససఖి' అనుచోట, వస్తు నిష్ఠమయిన అవయవ సంనివేశాదుల వలన గలిగిన సామ్యము. సహశబ్దముచే జెప్పబడును. కాబట్టి 'ససఖి' అను నవ్యయీభావమునకు 'సాదృశ్యం సఖ్యా' అని విగ్రహము. సదృశః సఖ్యా (సఖుని పోలినవాడు) అని కాదు. సూత్రస్థ సాదృశ్య శబ్దముచే ద్రవ్యగత సాదృశ్యమును, యథా శబ్దముచే, యోగ్యతయను గుణగత సాదృశ్యమును గ్రహింపబడును కనుక నా రెండు సమాసములును భిన్న విషయములు. ఇదియే ప్రకారాంతరము.

ఇక యోగ్యత వేరు, సాదృశ్యము వేరు, వీప్స వేరు, ఆ మూడును 'యథా' యొక్క అర్థములు, అనిన నపుడు, 'అనురూపమ్' అను స్థలమున రూపమునకు శోభ నిచ్చునది యేది యోగ్యమో అది అనురూపమని యర్థము అపుడు వెనుక చెప్పిన ధర్మధర్మి భేదమే, పృథక్ సాదృశ్య గ్రహణమునకు హేతువగును. ॥622॥

అవతారిక— ప్రకారపదము గల సూత్రము లన్నింటిలో ప్రకారమనగా సాదృశ్యమే అని చెప్పబడినది కాని అది అవ్యాపకము. ఎందువలన ననగా, 'కమండలునా ఛాత్రమజానాత్' = కమండలువుచే శిష్యుడని తెలిసికొనెను - అనుచోట కమండలు శబ్దమునకు బరమైన తృతీయ, "ఇత్థం భూతలక్షణే" (2 3-21) అను సూత్రముచే విధింపబడినది. ఇత్థం భూతుడన నొక ప్రకారమును బొంది యున్నవాడు. లక్షణమనగా లక్షకము = జ్ఞాపకము. ఛాత్రత్వమను ప్రకారము గల వానికి జ్ఞాపకము కమండలువు. 'ఇత్థమ్' అను పదమున, 'థము' అని తద్ధిత ప్రత్యయము. తద్విధాయకము 'ఇదమస్థముః' (5-3-24) అనునది. "ప్రకారవచనే థాల్" (5-3-23) అను పూర్వ సూత్రమునుండి 'ప్రకారవచనే' అను పదమిం దనువర్తించును. ఇత్థం భూతః = ఇమం ప్రకారం ప్రాప్తః, కథం భూతః = కం ప్రకారం ప్రాప్తః - అని యర్థము. ప్రకృతమేమన— ఇచ్చట ప్రకారము సాదృశ్యము గాదే. అంతటను ప్రకారమనగా సాదృశ్యమే యనుట యెట్లు? అనగా—

శ్లో॥ ఇత్థంభావేఽపి సాదృశ్యం బుద్ధ్యవస్థానిబన్ధనమ్ ।
గ్రహణే భేదమాత్రస్య తత్రాన్యైవాభిధీయతే ॥ 623

బుద్ధ్యవస్థానిబన్ధనమ్ = బుద్ధియొక్క అవస్థ నిమిత్తముగా గల, సాదృశ్యం = సారూప్యము, ఇత్థంభావే, గ్రహణే అపి = ఇత్థం భావమను ప్రత్యయమునందును, భేదమాత్రస్య, అస్తి = భేదలేశమునకు, ఉండును, తత్ర అన్యా ఏవ = అచ్చట, భేదమాత్రమే, వేరొకటియే, అభిధీయతే = చెప్పబడుచున్నది.

(ఈ కారిక తృప్తికరముగ సమన్వితము కాలేదు.)

తాత్పర్య వివరణములు— 'ఇట్టివాడు' దేవదత్తుడు అనగా, భుజకీర్తులు, కుండలములు గలవాడు' - అని ముందు బుద్ధిలో సారూప్యము నేర్పరచుకొని యుందుము.

ఇత్థం భావప్రతీతియందు గూడ, బాహ్య వస్తువుయొక్క ఉపరాగము వలన స్వల్ప భేదము భాసించినను యథార్థముగ భేదము లేదు. బాహ్యమగు వస్తువు, బౌద్ధమగు పదార్థము యొక్క అనుకారమే కావున నది దానికి ప్రకారము. కనుక సాదృశ్యము ప్రకారము గావచ్చును.

ఈ విధముగనే "పంచధా భుంక్తే" "త్రేధా అధీతే" మున్నగు ప్రయోగములందు 'పంచధా' 'త్రేధా' అనుచో ధాప్రత్యయార్థమగు ప్రకారమును సాదృశ్యమే. బుద్ధిలో పరికల్పితమయిన భేదముతో సదృశమగు క్రియా విశేషమే అచట నిర్వర్తింపబడునది గదా. సంఖ్యావచనము కంటె బరముగా విధార్థమున ధాప్రత్యయము విహితము. విధార్థమనగా ప్రకారము = పృథగ్భావము = భేదమని పర్యవసానము. ॥623॥

అవతారిక— ఉపపాదితార్థము శాస్త్ర ప్రమాణోపబృంహితమైన యెడ శోభావహమగునను నాశయముతో చిరోపాసిత సద్వృద్ధుడును, ప్రమాణ పరతంత్రుడు నగు భర్తృహరి, సాదృశ్యమే సర్వత్ర ప్రకార శబ్దార్థమను నంశమున భాష్యకార మతమును సంవాదకమునుగా నిందు ప్రతిపాదించి ముగించుచున్నాడు.

శ్లో॥ గౌర్వాహీక ఇతి ద్విత్వే సాదృశ్య ప్రత్యుదాహృతమ్ ।
శుక్లాదౌ సతి నిష్పన్నేవాహీకో న ద్విరుచ్యతే ॥ 624

ద్విత్వే = ద్విర్వచన విధాయక సూత్రమున, గుణవచన పదమునకు, గౌర్వాహీకః ఇతి = 'గోవు వాహీకుడు' అని, సాదృశ్యం = సాదృశ్యమే, అనగా సాదృశ్య ప్రతీతి గలదియే, ప్రత్యుదాహృతమ్ = ప్రత్యుదాహరణముగా నీయబడినది, నిష్పన్నే = ప్రసిద్ధ గుణవాచకమగు, శుక్లాదౌ సతి = శుక్ల, కృష్ణ, మున్నగు గుణవచన మున్నపుడు, వాహీకః = వాహీకుని బోధించు గోశబ్దము, ద్విః న ఉచ్యతే = రెండు పర్యాయము లుచ్చరింపబడదు, ద్విత్వమును బొందదనుట.

తాత్పర్య వివరణములు— "ప్రకారే గుణవచనస్య" (8-1-12) అని అష్టమాధ్యాయమున పదద్విత్వ విధాయక సూత్రము. 'ప్రకారము' ద్యోతమయినపుడు గుణవాచక శబ్దమునకు ద్విర్వచనము వచ్చును అని యర్థము. 'శుక్ల శుక్లం రూపమ్' 'శుక్ల శుక్లః పటః'- ఉదాహరణములు. అట, మహాభాష్యమున, "గుణవచనస్యేతి కిమర్థమ్ ? అగ్నిర్మాణవకః । గౌర్వాహీకః" అని గుణవచన పదకృత్యము విచారింపబడి యున్నది. ప్రకార బోధకము లన్నియు గుణవచనములే యగును. కావున 'అగ్నిః మాణవకః' 'గౌః వాహీకః' - అను స్థలములందు అగ్నిశబ్దమునకును గోశబ్దమునకును గూడ ద్విర్వచనము రావలసి యుండునని యర్థము. గోవు యొక్క సాదృశ్యముండుట వలన వాహీకుని 'గోవు' అందురు. అగ్ని

సాదృశ్యము వలన మాణవు డగ్ని. కనుక ప్రకారమనగా సాదృశ్యమే. ప్రకారమున అగ్ని శబ్దము వర్తమానము గాన గుణవచన పదము లేవిచో ద్విత్వము రావలసి వచ్చును. కాగా 'గుణ వచనస్య' అను దానికి ప్రత్యుదాహరణము.

ప్రకారమనగా, సామాన్యమునకు భేదకమగు విశేషమయిన, గోత్వము, అగ్నిత్వ ములకు భేదకమయిన విశేషమున నీ శబ్దములు వర్తమానములు కావు గదా. అపుడు గుణ వచన పదమున కివి ప్రత్యుదాహరణము కాజాలవు కావున నెచ్చటనైన ప్రకారమనగా సాదృశ్యమే అని సూచితము.

శుక్ల మున్నగునవియే గుణవచనములు. అవి గుణమునందును, గుణ విశిష్టము నందును వర్తించును. గుణముక్తవాన్ = గుణవచనః = గుణమును చెప్పియున్న శబ్దమనుట. గోశబ్దము వాహీకునే బోధించునది అది గుణమును బోధించియున్న శబ్దము కాదు. పూర్వ మది జాతి బోధకము గదా.

''ప్రకృత్యర్థ విశేషణత్వాత్ సిద్ధమ్'' – అని వార్తికము, ప్రకృతి యనగా ద్విత్వ మునకు కారణమయినది. స్థాని యనుట. దాని యర్థమును 'గుణవచనస్య' – అనునది విశేషించును. ప్రకారార్థమును గాదు విశేషించునది. అట్లయిన ప్రకారమునందు వర్తమానము లన్నియు గుణవచనములే యగును. గోశబ్దము ద్రవ్యమును చెప్పునదయినను, సాదృశ్యమును బట్టి ప్రవర్తించుచున్నది గాన వాహీకుని బోధించినను గుణవచనమే యగును. కావున ఆ విశేషణ మునకు వ్యావర్త్య మ్ముండదు.

అందువలన గుణమును బోధించినదిగా నంతకు మునుపు బాగుగ దెలియబడిన శబ్దమునకు సాదృశ్యము ద్యోతనీయమయినపుడు, ద్విత్వము వచ్చునని యర్థము. కావున నతి ప్రసంగము ప్రాప్తింపదు.

'శుక్ల శుక్లః పటః' – అను నుదాహరణమున, శుక్ల శబ్దము, శుక్ల గుణము అప్రధానము. తద్విశిష్టము ప్రధానము అయిన దానిని చెప్పునది. 'గుణోపసర్జన ద్రవ్యవాచి' అనుట. 'శుక్ల శుక్లం రూపమ్' – అనుచోట, శుక్ల గుణమాత్రవాచి. 'పటు పటుః' అనునది గుణవిశిష్టవాచికి ఉదాహరణము.

పదార్థ సంసర్గము వాక్యార్థము. వాక్యార్థమునుండి పదార్థమును వేరుపరచి, పద విభాగ పూర్వకముగ నది సమీక్షింపబడినది గాన అర్థంద్వారా పదవిచారము సమగ్రముగ నీ గ్రంథమునందీ సముద్దేశమున జేయబడి పరిసమాప్తమయినది. శుభం భూయాత్. ॥624॥

గౌర్వాహీక ఇత్యాది చివరి కారిక, 'నద్విరుచ్యతే ఇతి' అని ముగింపబడినది. ఇతి అను శబ్దము సమాప్తి సూచకము.

ఇతి వ్యాఖ్యానం గ్రంథమ్ము 'ఇతి శుభమ్' – అని ముగింపబడినది ప్రకీర్ణక ప్రకాశ మని వ్యాఖ్య పేరు. హేలా రాజుచే రచింపబడినది. అతని తండ్రి భూతిరాజు. ఆ వ్యాఖ్యాన

మున పదునాలుగవ సముద్దేశము, వృత్తి సముద్దేశమనబడునది ముగిసినది. మూడవకాండ మయిన పదకాండమును సమాప్తము.

వ్యాఖ్యాకర్త అగు హేలారాజు స్వయముగా చేసికొనిన, స్వపరిచయ రూప శ్లోకముల భావము

1. కాశ్మీర దేశమున, ముక్తాపీడుడు అను నొక ప్రసిద్ధుడగు మహారాజుండెను. ఆతని మంత్రి లక్షణుడు అను నాతడు. ఉదార చరితుడయిన ఆ మంత్రి వంశమునందు 'భూతిరాజు' అను నాయన కుమారుడు హేలారాజు ఈ 'ప్రకాశము' అను వ్యాఖ్యను ప్రకాశింప జేసెను.

2. సూర్య చంద్రాదులు లోకమున చీకటిని తొలగింతురు. కాని, కొన్నిచోట్ల ఆ పని చేయుటకు దీపము కూడ అవసరము కాకుండ పోదు. బుద్ధిశాలులగు వారి భావములు నవనవోన్మేష రుచిరములగునవి కప్పిపుచ్చి యుంచబడవు.

3. మూడవ వాగవస్థ = అనగా స్ఫోటాత్మక శబ్దము స్వప్రకాశమగు స్వరూప ముతో విశ్వజనులకును హితకరమై ఒప్పుచున్నది. అది ఈ గ్రంథమువలన సుప్రతిష్ఠితమగు గాక.

4. శ్రీకాంతుడగు హరి మూడు లోకములను మూడడుగులతో నాక్రమించినట్లు ఈ సమస్త విద్యా శ్రీకాంతుడగు హరి త్రైలోక్యము నాక్రమించుటకు మూడు కాండములను మూడడుగులుగా రచించెను.

5. జగదాచార్యుడగు ఈ హరి యొక్క సూక్తి లక్ష్ములు మహాభాష్యమను నబ్ధియం దుద్భవించిన అమృత ఛటలచేత (అమృతము యొక్క బిందములచేతను కాంతులచేతను) అచ్ఛురితములయిన విగ్రహములతో సర్వోత్కర్షతో వర్తించు చున్నవి.

శ్రీ

పదముల పట్టిక

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
		అ	
1.	అకథిత(ము)	VII - 70, 71	చెప్పబడనిది. = అపాదానము, సంప్రదానము మొదలగు విశేషములను చెప్పదలపక, సామాన్యముగ చూపబడు కర్మ. దీనినే "అప్రధానకర్మ" యని అందురు. ఉదా :- "గాందోగ్ధిపయః" ఇచట "గామ్" అనునది "అకథితకర్మ" (వాస్తవముగ అది అపాదానము కావలెను.)
2.	అకర్మకైర్యోగే కర్మ	VII - 67	అకర్మకములగు క్రియలను వాడినపుడు, కాలము, దేశము, మొదలగునవి కర్మలగునని సంప్రదాయము. ఉదా :- "మాసమ్ ఆస్తే" (ఇచ్చట "వ్యాప్య" అనునది అధ్యాహారము. అది అంతర్భూతమైన క్రియను తెలుపును. దానినిబట్టి మాసము కర్మయగునని భావము).
3.	అకర్మికా క్రియా	VII - 88	ప్రసిద్ధిని బట్టి కర్మతెలియు చోటకర్మ పదమును వాడక, చూపబడు క్రియ ఉదా:- "మేఘః వర్షతి" (జలమ్.)
4.	అతీతాఖ్యా శక్తిః	IX - 51	"వర్తమానము" అను భావమును అర్థగించు (కాలగతమైన) ఒక శక్తి. దానిని "భూతము" అందురు.
5.	అతుల్యవిభక్తి	XIV - 478	వేర్వేరు విభక్తులు గల పదముల తగు సమాసము. ఉదా :- "పూర్వః కాయస్య"
6.	అధ్యారోప(ము)	XI - 10	ఒక దాని ధర్మమును వేరొక దానియందు

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			ఆరోపించుట = అర్థధర్మమందు శబ్దధర్మ మును కల్పించి, రెండును ఒకటేయని భావించుట. (శబ్దము-అది బోధించు అర్థమును ఒకటేయను భావన)
7.	అనవస్థా	XIV - 220	అంతము లేకపోవుట. (ముగింపులేని ఆవృత్తి) ఇదొక దోషము
8.	అనుప్రయోగ(ము)	XIV - 233	ఒక శబ్దము వెంట వేరొకదానిని పలుకుట. ఉదా:- ఏధాంచక్రే. ఏధాంబభూవ, ఏధామాస, మొదలగునవి కొన్ని ధాతువుల లిట్టు రూపములలో ఇది కనబడును.
9.	అనుప్రవృత్తి	I - 14	ఒక ధర్మము అన్ని వ్యక్తులందును సమానముగ అన్వయించుట. ఉదా :- గోత్వము అన్ని గోవులందును (పూర్తిగ) అన్వయించును.
10.	అంతకరణ తత్త్వ(ము)	VII - 41	మనోధర్మము. = భావన, ఆలోచించుట. ఉదా :- (మనసులోని రూపమే బయట ఉన్నట్లు తోచునను తత్త్వము).
11.	అన్వాఖ్యేయత్వ(ము)	XIV - 277	వ్యాకరణసంస్కారము
12.	అపాదాన(ము)	VII - 136	విడదీయుట, లేక వేరుచేయుటలో "స్థిరముగ ఉండునది" అని భావింపబడు వస్తువు ఇదొ కారకము. పంచమిని వాడి దీనిని బోధింతురు.
13.	అపాయ(ము)	VII - 4	విడదీయుట, వేరుచేయుట,
14.	అపోహ	I - 98	తొలగించుట. ఉదా :- "భేదాపోహ" = భేదమును తొలగించుట
15.	అభివ్యక్తి	I - 26	స్పష్టపడుట, స్వరూపము తెలియుట

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
16.	అభ్యుచ్చయ(ము)	XIV - 90, 96, 98	పెరుగుట, అధికమగుట, (శబ్దములు చేరుట వలన కలుగు అర్థముల ఆధిక్యము)
17.	అర్థక్రియా	XI - 14	సృష్టియందలి ప్రతియొక వస్తువునకును గల ఉపయోగము (ప్రయోజనము).
17.	అర్థజాతి	I - 6, 8, 11	విడి విడి వస్తువులందు గల సమానధర్మము. (అవస్తువులను బోధించు శబ్దముల జాతి, దీనియందారోపితమగును.) ఉదా :- గోత్వము, మొ॥.
19.	అవచ్ఛేద(ము)	XIV - 11, 297	ప్రత్యేకించుట, నొక్కిచెప్పుట, నిశ్చితమైన జ్ఞానము. (విశేషణము).
20.	అవయవస్వర(ము)	XIV - 57, 61	ఒక సమాసమునకు అవయవమైన పదమునకు గాని, సమాసమునకు గాని ప్రవర్తించు ఉదాత్తాది స్వరము.
21.	అవ్యపవర్గ(ము)	III - 8	వేర్పాటు లేకుండ పూర్తిగా కలసిపోవుట.
22.	అవ్యయ(ము)	XIV - 105	మార్పులేని శబ్దము. (లింగము, విభక్తి వచనమును లేనిది. ఉదా :- చ, వ, హ, మొదలగునది).
28.	అవ్యయీభావ(ము)	VII - 165	అవ్యయముతో జరుగు సమాసము

ఆ

24.	ఆకృతి	I - 19	ఒక జాతికి చెందిన అన్ని వ్యక్తులందును ఒకేవిధముగ కనబడు ఆకారము (అవయవముల అమరిక లేక పొందిక) సామాన్యము, జాతి. అను భావనలకిది ఉపయోగించును.
25.	ఆఖ్యాతపద(ము)	IX - 99	క్రియాపదము (తిఙంతమగుశబ్దము)
26.	ఆత్మతత్త్వ(ము)	I - 21, IX - 89	సారభూతమైనది. (అంతకును మూలము). నిత్యమైన తత్త్వము.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
27.	ఆధారశక్తి	VII - 151	వస్తువులకు అధారముగా నుండు సామర్థ్యము ఉధా :- ఆకాశము. దీనికి అన్ని వస్తువులకును ఆధారముకాగల శక్తి ఉన్నది
28	ఆరాచ్ఛబ్ద	XIV - 276	"ఆరాత్" అను శబ్దము. ("దూరము" "దగ్గర") అను రెండర్థములను కూడ. ఇది బోధించును.
29.	ఆలంభన(ము)	I - 84	యజ్ఞమందు పశువును వధించుట.
30	ఆవిర్భావ(ము)	VIII - 26, XIII - 17, XIV - 323	అభివ్యక్తి, కనపడుట, స్పష్టమగుట.
31.	ఆవిష్టలింగతా	XIV - 319, 330	ఏదో ఒక లింగమును (పుమ్, స్త్రీ, నపుంసక) నియతముగ స్వీకరించుట = నియత లింగత్వము.
32.	ఆవిష్టసంఖ్య	XIV - 288	ఒకేసంఖ్యను నియతముగ చెప్పునది. ఉదా :- ఏక, ద్వి, త్రి, మొదలగునది.
33.	ఆశంసా	IX - 105	శోభనమైన కోరిక.

ఇ

34.	ఇంద్రశత్రు(వు)	X - 5	"ఇంద్రుని చంపునది" - లేక - "ఇంద్రునిచే చంపబడునది". స్వరము యొక్క మార్పును బట్టి రెండర్థములు వచ్చును.

ఉ

35.	ఉత్తమ	X - 1	{ మిప్, వస్, మస్, ఇట్, వహి, మహి, } ఉత్తమ పురుషము, దీనివిభక్తులు
36.	ఉద్వత్(త్తు)	XIV - 589	ఎత్తైనది. ఎత్తైన మార్గము.
37.	ఉన్మీలన(ము)	IX - 56	ఒక వస్తువు అగుపడుట, ఆవిర్భవించుట.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
38.	ఉపకార(ము)	VII - 13 XIV - 149	ఒక శబ్దముయొక్క అర్థము, తనతో కలిసిన వేరొక శబ్దముయొక్క అర్థమునకు చేయు సాయము.
39	ఉపగ్రహ(ము)	XII - 1, 4	ఆత్మనేపదము, పరస్మై పదము, అను వాని వలన తెలియదగు అర్థముయొక్క భేదము (క్రియకు చెందు విశేషము).
40.	ఉపగ్రాహి(న్)	XIV - 114	అంగీకరించుటకు హేతువు.
41.	ఉపచార(ము)	VIII - 13	ఒక పదమును గౌణార్థమున వాడుట.
42.	ఉపచారసత్(తు)	XIV - 273	గౌణమైన అర్థము. (లాక్షణికమైనది)
43.	ఉపప్లవ(ము)	(1) III 57 (2) XIV 417	భ్రాంతి, అసత్యమైన జ్ఞానము చంద్రగ్రహణము
44.	ఉపమాన(ము)	XIV - 362, 363,365,375	పోలికను చెప్పుటలో అధికగుణములు గల వస్తువు (చంద్రుడు, మొ॥).
45.	ఉపమేయ(ము)	XIV - 604, 605	పోలికను చెప్పుటలో అల్పగుణములు గం వస్తువు. (ముఖము, మొ॥).
46.	ఉపలక్షణ(ము)	XIV - 184, 425, 609	సూచకము, జ్ఞాపకము, చిహ్నము,(ఒక నిర్దిష్ట మైన అర్థమును సూచించుట కుపయోగించు పదము).
47.	ఉపవ్యంజన	XIV - 85	ఒక యంశమును సూచించు చిహ్నము.
48.	ఉపశ్లేష(ము)	VII - 149	ఆధారమునకు ఆధేయముతోగల సంబంధము. (సంయోగము).
49.	ఉపసర్జన(ము)	XIV - 97, 415	విశేషణమై అప్రధానముగనుండు పదము- లేక - అర్థము.
50.	ఉపాదాన(ము)	XIII - 3	ప్రత్యేకమైన శక్తులను బట్టి, ఒక శబ్దము యొక్క అర్థమును నిశ్చయించుట.
51.	ఉపాశ్రయ(ము)	III - 58	ఆసరా, ఆశ్రయము. (ఆధారము).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
52	ఉభయార్థతా	XIV - 359	ఒక శబ్దముచేతనే జాతిని వ్యక్తిని కూడ బోధించు తీరు.
		ఊ	
53	ఊహ్య(ము)	XIV - 80	సముదాయమునుండి వేరుచేయదగినది.
		ఏ	
54.	ఏకవద్భావ(ము)	XIV - 108	పెక్కులు ఒకటిగా అగుట. (బహువచన ముండవలసిన చోట, ఏకవచనముండుట ఉదా :- ప్రభువనమ్॥ మొ॥).
55.	ఏకార్థీభావ(ము)	XIV - 44	విడిగా ఉండుఅర్థములు ఒకటిగా పెనవేసి కొనుట. (శబ్దములకుండు సామర్థ్యము.) ఇది సమాసాది వృత్తులందుండును.
		ఔ	
56.	ఔపయిక(ము)	XIV - 580	ఉపాయముగా ఉండుట (సాధనమగుట.)
		క	
57.	కరణకారక(ము)	VII - 90,100	క్రియసిద్ధించుటలో మిక్కిలి ప్రధానమైన సాధనము. (తృతీయ విభక్తితో దీనిని బోధింతురు).
58.	కర్తృతా కర్తృత్వ(ము)	VII - 19, 28	ఒక క్రియకు కర్తయగుట.
59.	కర్తృస్థభావక(ము)	XIV - 168	కర్తయందే జరుగు (చూడదగు). వ్యాపార మును చెప్పు ధాతువు. ఉదా :- శీ = నిద్రించు, స్మృ = స్మరించు, మొదలగునవి.
60.	కర్త్రధికార(ము)	VII - 101, 128	కర్తనుగురించి చర్చించు భాగము. (ఒక శాస్త్రమున).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
61,	కర్త్రభిప్రాయతా	XII - 9	కర్తకు చెందునట్లగుట.
62.	కర్మస్థభావక(ము)	VII - 65	కర్మయందు గమనింపదగిన (జరుగు) వ్యాపారమును చెప్పు ధాతువు. ఉదా :- ''బాలమాసయతి (బాలుని కూర్చుండ బెట్టు చున్నాడు).
63.	కర్మోపదిష్ట(ము)	XIV - 169	కర్మతోసమానమైన (కర్మకుచెందు, కర్మకు ఆవశ్యకమైన).
64.	కలా	IX - 57, 68	అంశము, భాగము, (కాలముయొక్క ఒక భాగము. కాలశక్తి యొక్క అంశమైనశక్తి)
65.	కాకతాలీయ(ము)	XIV - 609	''కాకి వ్రాలుట పండు పడుట''వలె అనుకొన కుండ, ఆకస్మికముగ జరిగిన ఒక సంఘటన.
66.	కారక(ము)	VII - 18	క్రియను పుట్టించునది. - లేక - క్రియతో అన్వయించునది కర్త, కర్మ, కరణము, సంప్రదానము, అపాదానము, అధికరణము అని ఆరు విధములు.
67	కారకసప్తక(ము)	VII - 44	''శేషము'' (సంబంధము) అనుదానితో కలిసిన కర్త, కర్మ, మొదలగు ఆరుకారక ములను ''కారక సప్తకము'' అనబడును.
68.	కాల(ము)	IX - 1, 2, 3, 8, 9	(1) ''కాలశక్తి'' అనెడి ఒక మహాశక్తి సృష్టి కారణములలో ప్రముఖమైనది. శబ్ద బ్రహ్మమునకు తరువాతిది. (2) II. 314, 316 సమయము. (సామాన్య ముగకాలము) శబ్దముయొక్క అర్థమును నిశ్చ యించుటకుపయోగించునది. ''ద్వారమ్'' అనగానే శీత కాల ము లో ''పి ధే హి'' (మూయుము) అని తాత్పర్యము. వేసవిలో ''ఉద్ఘాటయ'' తెరువుము అని తాత్పర్యము. అట్లు కాలము సంశయమును-పోగొట్టుటకుపక రించును.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
69.	కాలసముద్దేశ(ము)	IX - 1, 114	అన్ని వస్తువుల అభివ్యక్తికిని కారణమైన కాలశక్తిని నిరూపించు ఒకభాగము. ఈ కాండమున తొమ్మిదవది).
70.	కుత్సా	I - 41	నింద. తక్కువగా భావించుట. శబ్దమునకు "కన్" (క) అను ప్రత్యయమును చేర్చి ఈ యర్థమును సూచింతురు. ఆ ప్రత్యయము స్వార్థికము. అనగా శబ్దమునకు గల కుత్సార్థమునే అది స్పష్టము చేయును.
71.	కుత్సితశ్రుతి	XJV - 2	"కుత్సితే" అను సూత్రము. (పా. 5.8.74) ఇది" "నింద" అను అర్థమున "కన్" ప్రత్యయమును విధించును.
72.	కృత్	XIV - 829	ధాతువునకు చేరు తృచ్, ణ్వుల్, మొదలగు ప్రత్యయము. దీనివలన కర్తా, కారకము మొదలగు శబ్దములు సిద్ధించును. (కృదతిఙ్. పా. 8. 1. 98)
78,	కృతహస్త(స్తుడు)	XIV - 560	సిద్ధహస్తుడు (చేయితిరిగినవాడు) ప్రవీణుడు "అర్జునుడు" అనునర్థమున ఈ శబ్దమును తరుచు వాడుదురు.
74.	క్రియా	VII - 1,4, 10,15,18, 21,24 X - 2	వ్యాపారము, పని, (చిన్న చిన్న అవాంతర వ్యాపారముల సముదాయము.) కలుగు ఫలితముచే ఊహింపదగిన చేత.
75.	క్రియాశ్రుతి	I - 85 XIV - 499, 50,5514,521	ఒక పని చేయుటలో వేదముయొక్క సమ్మతి. వేదము విధించుట).
76.	క్రియాసముదేశ	VIII - 1-64	క్రియను విశదీకరించు భాగము. (ఈ కాండమున ఎనిమిదవది).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
		ఖ	
77.	ఖదిర(ము)	I - 3 XIV - 301	చంద్రచెట్టు. దీని కర్రతో యాగము లందు యూప స్తంభమును తయారు చేయుదురు.
78.	ఖర్జూర(ము)	XIV - 301	ఖర్జూరపు చెట్టు ఖర్పర, ఖర్జర, అనునవి మారు రూపములు.
		గ	
79.	గుణసముద్దేశ	V - 1, 9	ద్రవ్యమందలి గుణములను చర్చించు భాగము (ఈ కాండమున ఆయిదవది).
80.	గుణాశ్రయా(శక్తి)	VII - 81	అప్రధానమైన శబ్దమునకు గల సామర్థ్యము.
81.	గ్రహ(ము)	I - 58,61,70, 85	యజ్ఞమందు సోమరసమును త్రాగుటకై ఉపయోగించు పాత్ర. (యాగ ప్రక్రియలో ఈ పదమును వాడుచుందురు).
		చ	
82.	చార్థ	XIV - 196, 197	"చ" అను అవ్యయముయొక్క అర్థము. (సముచ్చయము, ఇతరేతరయోగము మొదలగునవి).
83.	చితి	XIV - 325 326	జ్ఞానము.
84.	చైతన్య	X - 2,3 XIV - 327	జ్ఞానము. తెలిసికొనుట).
		ఛ	
85.	ఛత్రిన్	XII - 22	గొడుగుగలవాడు, పెక్కుమంది గొడుగులు విప్పుకొని నడచుచున్నపుడు, వారిలో ఒకరిద్దరికి గొడుగులు లేకున్నను "ఛత్రిణో యాంతి" అని వ్యవహరింతురు. దీనినే "ఛత్రిన్యాయము" అని అందురు.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
86.	ఛాగ(ము)	I - 78, 80	మేక. (సోమయాగములో వధింపబడునది).

జ

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
87.	జన్మన్	I - 39, VIII - 29	పుట్టుక, ఉనికి స్పష్టపడుట.
88.	జరా	IX - 24	ముసలితనము. క్షీణించుట (కాలశక్తి వలన వస్తువులందు కలుగు శిథిలావస్థ)
89.	జాతి	I - 2, 3, 6, 8	(1) సకల వ్యక్తులందును ఒకే విధముగ కనపడు ఒకానొక ధర్మము. ఉదా :- గోత్వము (గంగడోలు, మూపురము, తోక. మొదలగు వానిని కలిగియుండుట). భావనా గమ్యమగు ఆకార సామ్యము. (2) I. 2. ఒక వాక్యమున గల పదముల సముదాయము అందించు సామాన్యార్థము. (జాతిస్ఫోట). (3) XIII. 4. లింగము (ప్రాణులను వేరు చేయు చిహ్నము = స్త్రీ, పుమాన్ నపుంసకమ్)
90.	జాతిపదార్థతా	XIV - 356	''జాతియే శబ్దముల అర్థము'' అనువాదము (''వాజప్యాయనుడు'' అను ప్రాచీనవైయాకరణుడు తొలుత ఈ వాదమును లేవదీసెను).
91.	జాతిసముద్దేశ(ము)	I - 1. 106	జాతిని విశదీకరించు భాగము. (ఈ కాండమున మొదటి విభాగము).

త

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
92.	తద్ధిత	XIV - 86, 89, 329	అపత్యము, హితము, భావము, మొదలగు అర్థములలో సుబంతమునకు (శబ్దమునకు) చేరు ప్రత్యయము. ఉదా :- ''దశరథస్య

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			అపత్యమ్ = దాశరథిః (ఇచట "ఇ" అను నది తద్ధితము).
93	తిరోభావ(ము)	VIII - 26 IX - 11 XIII - 17 XIV - 323	గుణములు (ధర్మములు) కనపడకుండ అణగి యుండుట "ఆవిర్భావము" నకు వ్యతిరేక మైన స్థితి.
94.	త్రిపక్షీ	XIV - 254	నఞ్ సమాసమందు (నఞును గురించి) ఏర్పడిన మూడు పక్షములు. 1. పూర్వపదార్థము ముఖ్యము, 2. ఉత్తరపదార్థము ముఖ్యము, 3. అన్యపదార్థము ముఖ్యము.అనునవి.
95.	త్ర్యక్ష	XIV - 214	శివునికి పేరు, (ముక్కంటి).
		ద	
96.	దండిన్	I - 93	కర్రను. చేపట్టువాడు. "సంన్యాసి" అను నర్థమున వాడుదురు.
97.	దిక్	VI - 3	తూర్పు పడమర, మొదలగు వ్యవహారము నకు కారణముగా భావింపబడు ఒక శక్తి దీని వలననే ఆయా ప్రదేశములను గుర్తించుట జరుగును.
98.	దిక్సముద్దేశ(ము)	VI - 1, 28	దిక్కును గురించి చర్చించు భాగము (ఈ కాండమున ఆరవ విభాగము)
99.	ద్రవ్య(ము)	II - 1	(1) సృష్టియందలి ప్రతియొక వస్తువు నందును సారరూపముగా ఉండు తత్త్వము. (ఉదా :- బంగారు వస్తువులందు బంగారము). పరమార్థమున మాత్రము ఆత్మ ఒక్కటే ద్రవ్యము. దానినే వేర్వేరు పదములతో బోధింతురు. (2) IV. 3. విడిగానుండు వస్తువు. (వ్యక్తి) దీనియందు గుణములగపడును. ఇదమ్,

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			తత్, మొదలగు సర్వనామ శబ్దములను ద్రవ్యమును నిర్దేశించుటకై వాడుదురు.
100.	ద్రవ్యపక్ష(ము)	XIV - 333	శబ్దము బోధించు అర్థము "వ్యక్తి"యే గాని "జాతి" కాదు - అనుపక్షము దీనిని తొలుత "వ్యాడి" అను ప్రాచీనవైయాకరణుడు స్థాపించెను.
101.	ద్రవ్యపదార్థతా	XIV - 357 358	"వ్యక్తి" యే శబ్దముయొక్క అర్థమను పక్షము. (ద్రవ్య పక్షము).
102.	ద్రవ్యసముద్దేశ(ము)	II - 1, 18	ద్రవ్యమును గురించి చర్చించు భాగము ఈ కాండమున రెండవ విభాగము. ఇందు ద్రవ్యము యొక్క పరమ తత్త్వము నిరూపింపబడినది. (ద్రవ్యమందలి నిత్యమగు అంశము). "భూయో ద్రవ్యసముద్దేశము" అను నాలుగవ భాగములో ద్రవ్యము యొక్క వ్యావహారిక తత్త్వము నిరూపింపబడినది. (ద్రవ్యమందలి అనిత్యమగు అంశము).
103.	ద్రవ్యాభిదానపక్ష	XIV - 110	శబ్దము యొక్క అర్థము "ద్రవ్యమే" అను పక్షము. (ద్రవ్య పక్షము).

ధ

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
104.	ధ్రౌవ్య(ము)	VII - 138, 139	"నిశ్చలము" అనుభావము. (కదలకుండు"). అను భావన కదలుచున్నను, కదలకపోయినను, ఒక వస్తువును నిశ్చలముగా భావించి "అవధి" అనవచ్చును. అందువలన అది అపాదానము అగును.
105.	ధ్వని	VIII - 2	గంట మొదలగు వాని చప్పుడు. (పౌర్వాపర్యమును వివక్షింపని చప్పుడు).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
		న	
106.	నఞ్ సమాస(ము)	XIV - 250 - 254	నఞు పూర్వపదముగా గల సమాసము.
107.	నపుంసకలింగ(ము)	XIII - 1 హేలారాజు	సంస్త్యానము, తిరోభావము, అనునవి స్త్రీ లింగమునకు పర్యాయములు. ప్రసవము ఆవిర్భావము, అనునవి పుంలింగమునకు పర్యాయములు. రెండు లింగముల యొక్కయు లక్షణములు గలది నపుంసకము. దీనిని "లింగ సర్వనామము" అనియు వైయాకరణులు వ్యవహరింతురు. (సత్త్వ. రజస్తమోగుణములను బట్టి శాస్త్రమున లింగ వ్యవస్థ ఏర్పడినది).
108.	నాడికా	II - 5	లోపల గుల్లగానుండు ఒక గొట్టము. దీనితో చూచినపుడు వస్తువు మిక్కిలి స్ఫుటముగా కనిపించును. (దృష్టియొక్క పరిధి నిమితమగును గాన).
109.	నాలికా	IX - 70	ఒక గొట్టముతో (కుండలోగాని) నీరు-(లేక-ఇసుకను) నింపి, అడుగున చిన్న రంధ్రము చేసి, దానిద్వారా ఆపదార్థము చుక్క-చుక్కగా పూర్తిగా క్రిందపడుటకు పట్టు కాలము. (కాలము కొలుచుట కొకసాధనము.)
110.	నాస్తితా	I - 88	మూలకారణములో లీనమగుట. మూలకారణమగు శక్తిలో అణగియున్నపుడు, వస్తువులు లేనట్లు తోచును. దానినే "వినాశ" మని అనుచుందురు. (వాస్తవముగా వినాశమనునది లేదు.)
111.	నిపాతన(ము)	XIV - 590	వ్యాకరణ సంస్కారమును చూపక, ఉన్నదున్నట్లుగనే ఒక శబ్దము సాధువని చెప్పుట. ఉదా :- పృషోదరః, సింహః, మొదలగునివి.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
112.	నిమిత్తానువిధాన(ము)	XIV – 310, 311	నిమిత్తము ననుసరించి లింగసంఖ్యలను చెప్పుట. (విశేష్యము ననుసరించి విశేషణము నకు లింగ సంఖ్యలనుచెప్పుట).
113.	నిమీలన(ము)	IX – 56	మూసికొని పోవుట, కనపడకపోవుట. (ఉన్మీలనమునకు వ్యతిరేకము).
114.	నిరుపాఖ్యా	XIV – 268	సత్త (ఉనికి) ఎట్టి విశేషములును లేనిస్థితి.
115.	నిర్ధారణ	XIV – 41 VII – 147	మొత్తము వస్తువులనుండి ఒకదానిని గాని, కొన్నిటినిగాని వేరు చేసి ఎంచుట. (చూపుట) (ఉదా :- గవాం కృష్ణా బహు క్షీరా).
116.	నిర్వర్త్య కర్మ	1 – 27 VII–45 47, 49, 54, 79	ఒక ఆకృతిగలదిగ (పుట్టుక, రూపము) చేయబడు కర్మ. (క్రియకుఫలము). ఉదా :- కుంభకారః. ఇచట కుంభ నిర్వర్త్య కర్మ అగును.
117.	న్యగ్భావ(ము)	VII – 95, 123	కనబడకపోవుట, ఒక దానియందాధారపడి యుండుట.
118.	న్యగ్భావనా	VII – 59	అర్థమును పూర్వస్థితికి ఉపకరించుట.
119.	న్యాయ(ము)	I – 66 XIV – 457	ఉదాహరణము. లక్ష్యము. దృష్టాంతము. ప్రసిద్ధమైన లోకోక్తి.

ప

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
120.	పరవల్లింగ(ము)	XIV – 306	ద్వంద్వము, తత్పురుషము, అను సమాసము లలో చివరి పదము ననుసరించి సమాసము లకు లింగమేర్పడుట.
121.	పరస్మైపద(ము)	XII – 20	వేరొకని కొరకైన (తనకుకాదు) స్థానము. తిప్, తస్, ఝి. మొదలగు మొదటి తొమ్మిది తిఙ్ ప్రత్యయములకును ''పరస్మైపదము'' అని వ్యాకరణ శాస్త్రమున సంకేతము. ఈ ప్రత్యయములు ''క్రియాఫలము కర్తకు కాక వేరొకనికి చెందును'' అని సూచించును.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
122.	పరికల్ప(ము)	III – 65	ఊహ, వికల్పము, ఊహాగమ్యమైన రూపము.
123.	పశుశ్రుతి	I – 33	"యాగమందు జంతువును వధింపవలెనను వేదము చెప్పిన విధి. ఉదా :– "పశునా యజేత" మొదలగునది.
124.	పుంవద్భావ(ము)	VI – 10 XIV – 419, 420, 422	స్త్రీలింగశబ్దము పుంలింగశబ్దముగా మారుట. సమాసము మొదలగు వృత్తులలో కొన్నిచోట్ల ఇట్లు జరుగును
125.	పురుష(ము)	X – 2,3,70	వాక్యమందలి క్రియా పదమునగల తిఙ్ ప్రత్యయముచే బోధింపబడు వ్యక్తి, (1 ప్రథమపురుషము = వాడు, అతడు, అది. 2 మధ్యమపురుషము = నీవు. 3 ఉత్తమ పురుషము = నేను).
126.	పురుషసముద్దేశ(ము)	X – 1,9	పురుషమును చర్చించు భాగము. ఈ కాండ మున పదవ విభాగము)
127.	ప్రఖ్యా	XIV – 28, 405, 575	జ్ఞానము. భావన
128.	ప్రతికృతి	XIV – 595, 607	బొమ్మ, ప్రతిమ, విగ్రహము.
129.	ప్రతిజ్ఞా	III – 27	కర్తవ్యమును నిర్దేశించు వాక్యము. ప్రతి పాదనము.
130.	ప్రతిపదమ్(షష్ఠీ)	VII – 159	ఆయా సందర్భములలో ప్రత్యేకముగ విధింప బడిన షష్ఠి. (పా. సూ :– "అధిగర్థదయేశాం కర్మణి." మొదలగునది),
131.	ప్రతిబంధ(ము)	IX – 11	ఫలితము సిద్ధించుటలో ఏర్పడు అడ్డు. కాల శక్తివలన ఏర్పడు అడ్డంకి).
132.	ప్రతిసంహార(ము)	XIV – 90	విశేషమును బోధించిన వెంటనే, అవిశేష మును తెలుపు ప్రత్యయమునుతీసి వేయుట.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			ఉదా :- శుక్ల = తెలుపుగలది. ఇచ్చట "మతుప్" అను ప్రత్యయము, "కలది" అను విశేషమును బోధించి తప్పుకొన్నది. (కేవలము "తెలుపు" అను అర్థము కూడ శుక్ల శబ్దమునకు గలదు).
183.	ప్రత్యక్తా	X – 1	శరీరమునందుగల ఆత్మ. "నేను" భావనకు మూలము. దీనినే ఉత్తమ పురుషము బోధించును. (అహం కరోమి).
184.	ప్రథమపురుష(ము)	XIV – 600	తిప్, తస్, ఝి, త, ఆతామ్, ఝ, అను తిఙ్ ప్రత్యయములు. (వాడు, అది, అను కర్తను బోధించును).
185.	ప్రదేశ(ము)	I – 18 XIV – 218	భాగము, విభాగము.
186.	ప్రధానవిషయా	VII – 82	ముఖ్యక్రియను ఆశ్రయించునది.
187.	ప్రమాణ(ము)	I – 4	గాయపరచుట, చంపుట.
188.	ప్రయోగవాక్య(ము)	XIV – 615	వ్యవహారమున వాడుటకు తగిన వాక్యము (వ్యాకరణ సంస్కారమునకై చూపు ప్రక్రియా వాక్యము ప్రయోగ యోగ్యము కాదు).
189.	ప్రవృత్తి	XIV – 324	ద్రవ్యమందలి గుణముల మార్పు, లేక కదలిక (ఆవిర్భావము, తిరోభావము, స్థితి – అని మూడు విధములు).
140.	ప్రష్ఠ	XIV – 85, 152	నాయకుడు. నాయకత్వము సామాన్యముగా పురుషులకే చెల్లును. కాగా ఈ శబ్దమును పుంలింగముగనే వాడుదురు. అయినను "ప్రష్ఠుని భార్య" అను అర్థమున మాత్రము "ప్రష్ఠీ" అని స్త్రీలింగముగ వాడవచ్చును.
141.	ప్రసక్తాదర్శన(ము)	XIV – 182	ఉండవలసినది కనపడకుండుట. దీనినే శాస్త్రమున "లోపము" అందురు).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
142.	ప్రసవ(ము)	VI - 10, XIII - 27	పుట్టించు శక్తి. పుంస్త్వము).
143.	ప్రహాణ(ము)	IX - 11	నశించుటకు యోగ్యమగుట.
144.	ప్రాతిపదికార్థ(ము)	I - 34	శబ్దముయొక్క అర్థము = జాతి, జాతినే "సత్త" అనియు అందురు. అన్ని శబ్దములకును సత్తయే తొలి అర్థమనియు, ధాతువులకు కూడ క్రియా సామాన్య రూపమైన సత్తయే ప్రాథమికమైన అర్థమనియును వైయాకరణుల తాత్పర్యము.
145.	ప్రాధాన్య(ము)	I - 69	ఇతరముల కన్న ముఖ్యమగుట.
146.	ప్రాప్య(కర్మ)	VII - 51	క్రియ వలన ఎట్టి మార్పును కనబడని కర్మ. ఉదా :- ఆదిత్యం పశ్యతి.

బ

147.	బహిరంగ(ము)	XIV - 141	బయటనుండు అవయవములు (నిమిత్తములు) బయటనుండునది, దూరముగా నుండునది, విలంబముగా అగునది.
148.	బాహులేయ	III - 75 XIV - 149	(1) గోవుయొక్క సంతతి. ("బహులాయాః అపత్యమ్"). "శాబలేయ" అను పదమువలె ఈ పదము కూడ సాధువే. ఇదున్నదని ఆ పదమును, అదున్నదని ఈ పదమును విడువనక్కర లేదు, [(2). శాబలేయ, బాహులేయ, అను వ్యక్తులు ఇద్దరుందురు. వారిలో ఒకరి ఉనికి కాని అభావము కాని, మరొకరి భావమునకుగాని అభావమునకుగాని నిమిత్తము కానేరదు].
149	బుద్ధ్యనుసంహార	IX - 57	మానసికమైన స్వరూపము సంకల్పము, మనస్సు కలుగజేయు వాస్తవముకాని వ్యవస్థ.

వరుస సంఖ్య	పదము	సముద్దేశసంఖ్య కారిక సంఖ్య	అర్థము
150.	బుద్ధ్యవస్థా	XIV - 571, 578	మనస్సు యొక్క స్థితి. భావనము.
151.	బృహత్క	XIV - 618 620	చిన్నదైనను తన కాంతివలన పెద్దదిగ అగపడు ఒక వజ్రము.
152.	బ్రాహ్మణశ్రుతి	XIV - 492, 493,494,542	"బ్రాహ్మణునితో సమానమైన క్రియ - లేక - ఒక వస్తువు" అను నర్థమున బోధించు వాక్యము. "(బ్రాహ్మణవత్ అధీతే" మొదలగునది).
		భ	
153.	భావ(ము)	VIII-12,17, 24,26,59,60, 66	వ్యాపారము, క్రియ, ఒకపని, (కారకముల తోడి సంబంధమును చూపకుండ, కేవలము ధాతువును వాడి నిరూపించు క్రియ). క్రియ, భావము, అను పదములను పర్యాయములుగ వాడుదురు. అయినను చిన్న భేదమున్నది. పూర్తి అయిన క్రియను భావమనియు, జరుగుచుండు పనిని క్రియ యనియును భావించుట సంప్రదాయము.
154.	భాషితపుంస్క(ము)	VI - 10	పుంస్త్వమును చెప్పునది. వేరొకలింగమును కూడ గట్టుకొని పుంలింగమగు శబ్దము. (ఒకే లింగము గలది కాదు).
155.	భూత(ము)	IX - 38,79, 85,91,101	జరిగిపోయినది. (కాలమునుబట్టి ఏర్పడు వ్యవహారము).
156.	భూయోద్రవ్య సముద్దేశ(ము)	IV - 1, 8	ద్రవ్యమును గురించి చర్చించు ఇంకొక భాగము, ఈకాండమందలి నాల్గవ విభాగము.)
		మ	
157.	మధురాశ్రుతి	XIV - 542	మధురాపట్టణమును గురించి ప్రయోగించిన ఒక వాక్యము. (ఉదా :- మధురాయామివ పాటలిపుత్రే జనాః).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
158.	మధ్యమ	X - 1, 4	మధ్యమపురుషము. (సిప్, థస్,థ,- థాస్, ఆథామ్, ధ్వమ్, అను ప్రత్యయములు).
159.	మాన(ము)	XIV - 390	కొలుచుటకు సాధనము, కొలత.

య

160.	యుక్తవద్భావ(ము)	XIV - 112, 113, 320	లుప్, అను పదమును వాడి తద్ధితప్రత్యయమునకు లోపము చెప్పినపుడు, ప్రకృతి యొక్క లింగవచనములే అనువర్తించుట (ప్రకృతికి యొక్క లింగము, వచనమును మారకుండ అనుసరించును. ఉదా :- అంగానాం నివాసః జనపదః = అంగాః, కురూణామ్ = కురవః, వంగానామ్ = వంగాః,మొ॥ "లుపి యుక్తవద్వ్యక్తివచనే" పా. సూ. 1-2-51.) ఇచట "కురు" శబ్దము పుంలింగము బహువచనము ఆ శబ్దమునకు వచ్చిన తద్ధితప్రత్యయమునకు లోపము వచ్చినను ఆ పుంలింగమును, బహువచనమును నిలిచినవి
161.	యుగపద్వాచితా	XIV - 34	ద్వంద్వ సమాస మందలి పదముల అర్థములను - ఉన్నవానిలో ఏదో ఒక పదమే చెప్పుట. ఉదా :- రామలక్ష్మణౌ. ఇచ్చట రామ శబ్దము గాని, లక్ష్మణ శబ్దము గాని "రామ లక్ష్మణులు" అనునర్థమును తెలుపగలుగుట.
161.	(A) యోగ(ము)	II - 3	శబ్దమునకును అర్థమునకును ఉండు సహజమైన సంబంధము. (అభేదము, తత్త్వము. తద్భావము, అను పదములతో దీనిని బోధింతురు.

ర

162.	రూఢయోగ	XIV - 442	ప్రసిద్ధిని బట్టి ప్రత్యయముగ చెప్పనక్కర

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			లేకుండగనే తెలిసిపోవు గుణము. క్రియ, మొదలగునవి. ఉదా :- ''చంద్రవత్ ముఖమ్'' అనగానే కాంతినిగలిగి యుండుట, ఆహ్లాదమును కలిగించుట, మొదలగు గుణములు తెలిసి పోవును.
		ల	
163.	లక్షణా	I - 50	ఒక అర్థమును సూచించు శక్తి. (శబ్దమునకు గల శక్తి).
164.	లింగ(ము)	XIII - 2, 3	చిహ్నము, (పుమ్, స్త్రీ, నపుంసక, అని మూడు విధములు ఇవి శబ్దములకు చెందునవి).
165.	లింగసముద్దేశ(ము)	XIII - 1, 31	లింగమును చర్చించు భాగము. ఈ కాండమందలి పదమూడవ విభాగము).
166.	లుప్తోపమ	XIV - 382	సాదృశ్యమును చెప్పు ''ఇవ'' మొదలగు శబ్దములను వాడకుండగనే, సాదృశ్యమును బోధించు ప్రయోగములు. ఉదా : ''సింహః మాణవకః,'' ''గౌః వాహీకః'' మొదలగునవి.
167.	లోప(ము)	XIV - 585	కనబడ కుండట, విడుచుట, వినబడకుండుట, పలుకకుండుట, లేకపోవుట.
		వ	
168.	వజ్రపాణి	XIV - 214	ఇంద్రుడు ప్రసిద్ధిని బట్టి ఈ యర్థము తెలిసిపోవును. ''వజ్రము చేతి యందు గల వాడు'' అను యౌగికార్థము ఆవశ్యకముకాదని భావము
169.	వర్తమాన(ము)	IX - 38,50, 55,90,101, 108	ప్రస్తుతమైన కాలము.''క్రియ జరుగుచున్నది'' అను అంశమును తెలుపుట లట్, అను లకారము దీనిని సూచించును).

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
170.	వాక్య(ము)	III - 1:76	సంశయము కలుగునపుడు శబ్దము యొక్క అర్థమును నిర్ణయించుటకై ప్రమాణముగ తీసి కొనబడు ఒక వాక్యము. మీమాంసకుల సంప్రదాయమున, ఇది శ్రుతి, లింగము, అను ప్రమాణములకన్న, దుర్బలమైనది.
171.	వాక్యశేష(ము)	XIV - 525	వాక్యము యొక్క అర్థము సంపూర్ణమగుటకై సాయము చేయు ఒక పదము - లేక వాక్యము. (దీనిని అధ్యాహారము చేయుదురు).
172.	వికార్య(కర్మ)	VII - 48,49 79	జరుగు పని వలన ఒకానొక వికారమును (మార్పు) పొందు కర్మ. ఉదా :- తండులాని పచతి" ఇందు తండులములు అనగా బియ్యము మార్పును పొందును,
173.	విభక్తి	XI - 27,29, 31	వేరు చేయుట, విభజించుట, విభజించునది, సుప్ ప్రత్యయములకును తిఙ్ ప్రత్యయ ములకును విభక్తి అని సంజ్ఞ.
174.	విభక్తిపరిణామ(ము)	XIV - 468.	సముచితమైన అర్థమును పొందుటకై ఉన్న విభక్తిని వేరొకవిభక్తిగా మార్చుకొనుట.
175.	విభక్తిభేద(ము)	XIV - 8	విభక్తి ప్రత్యయముల భేదము (వేర్వేరు విభక్తులుండుట).
176.	విభక్త్యర్థ(ము)	VII- 164, 165 XIV - 219, 221,222,227 288	విభక్తియొక్క అర్థము ఒక పదము యొక్క అర్థమునకు వేరొక పదము యొక్క అర్థము తోగల సంబంధవిశేషమును విభక్తి ప్రత్య యమే బోధించును.
177.	వివిభక్తి	XIV - 460	వేరు విభక్తిగలది.
178.	విశేషణ(ము)	XIV - 7	ఒక వస్తువునందు గల ధర్మమును వేరు చేసి బోధించుపదము. (వస్తువుయొక్క ఒకానొక ధర్మము). భేదకము, అవచ్ఛేదకము, అను నవి దీని పర్యాయములు,

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
179.	విశేష్య(ము)	XIV - 7	ముఖ్యమైన వస్తువును, చెప్పు పదము. (ధర్మ ముగల వస్తువు) భేద్యము, అవచ్ఛేద్యము. అనునవి దీని పర్యాయపదములు.
180.	వృత్తిసముద్దేశ(ము)	XIV 1,627	సమాసము మొదలగు వృత్తులను చర్చించు భాగము. (ఈ కాండమందలి పదునాలుగవ విభాగము).
181.	వ్యపేక్షా	XIV - 41,45 47	వాక్యమందలి పదములకుండు సామర్థ్యము. (పదముల అర్థములు సముచితముగ కలియు తీరు).
182.	వ్యవస్థితవిభాషా	XIV - 45	వికల్పమైన కార్యమును నియమించుట. (వికల్పమైనను ఒకానొకచో నిత్యముగనే ప్రవర్తించునని నిశ్చయించుట).
183.	వ్యాపార(ము)	IX - 10	పని, క్రియ, (ధాతువు చెప్పు అర్థము).
184.	వ్యావృత్తి	I - 19	ఒక విషయమును పేర్కొనుట వలన. తక్కిన వానినన్నింటిని తొలగించుట. ఉదా :- గౌః, అనగానే ఆ పదమువలన, గో భిన్నమైన వన్నియు తొలగిపోవును).

శ

185.	శక్తి	VII - 2	(1) ప్రపంచమందలి వివిధమైన వస్తువుల కుండు సామర్థ్యము. దానివలన అవి ఆయా ప్రయోజనములను సాధింపుచు, తమ తమ ఉనికిని సార్థకము చేసికొనును. ఉదా : కుండ. ఇది నీటిని తీసికొనివచ్చును. అట్టిశక్తి దానికి కలదు. (తుదకు ఆ శక్తియే కుండ యని భావించుట తత్త్వము).
		VII - 28,31, 34,35	(2) క్రియను కలిగించు శక్తి. దీనినే "కారక శక్తి" అని యందురు. ఇది కర్త, కర్మ, మొదలగు రీతిని ఆరు విధములు.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
186.	శబ్దసంస్కార(ము)	XIV - 189	సాధుత్వమును సంపాదించుటకై శబ్దమునకు జరుగు వ్యాకరణ సంస్కారము.

ష

187.	షడవస్థా	I - 86	సత్త (ఉనికి) అనునది ప్రపంచమందలి ప్రధానమైన వ్యాపారము. దానియొక్క భాగములుగా భావింపబడు వ్యాపారములు ఆరుగా చూపబడును. (పుట్టుట, పెరుగుట, మారుట, మొదలగునవి). వీనిని "షడవస్థ" అందురు. ఇది సృష్టి అంతకును సామాన్యము.

స

188.	సంఖ్యా	XI - 1,2,3 XIV - 100, 101, 102	అన్ని వస్తువులందును ఉండు ఒక గుణము. సుప్ ప్రత్యయములును, తిఙ్ ప్రత్యయములును, దీనిని బోధించును.
189.	సంఖ్యాన (శబ్ద,)	XI - 19	వస్తువుల సమూహమును మొత్తముగా బోధించు సంఖ్యావాచకము. ఉదా :- వింశతి, త్రింశత్, మొదలగునవి.
190.	సంఖ్యాసముద్దేశ(ము)	XI - 1,32	సంఖ్యను చర్చించు భాగము. (ఈ కాండమందలి పదకొండవ విభాగము).
191.	సంఖ్యేయ(ము)	XI - 19, 22, 23, 24	లెక్కింపబడు వస్తువు.
192.	సంపద్యమాన(ము)	VII - 115	ఏర్పడునది, మార్పుచెంది పుట్టునది, (మారునది, సిద్ధించునది).
193.	సంప్రదాన(ము)	VII - 129,130	(దానమును స్వీకరించువాడు. ఒక క్రియచే ఉద్దేశింపబడు వ్యక్తి.
194.	సంబంధ(ము)	III-11,17,18 VII - 156	పదములకు గాని, అర్థములకు గాని ఉండు సహజమైన సంబంధము. "సామాన్యసంబంధ

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			మనియు క్రియాకారక సంబంధమనియు. దీనిని రెండు విధములుగా చూపుదురు.
195.	సంబంధసముద్దేశ(ము)	III - 1, 88	సంబంధమును చర్చించు భాగము. ఈ కాండమందలి మూడవ విభాగము.
196.	సంబోధన(ము)	VII - 168, XIV - 99 X - 4, 5	పిలుపు, హెచ్చరిక, (ఒక పనిలో ఉపయోగించుకొనుటకు, ఒక వ్యక్తిని తనవైపు త్రిప్పుకొనుట).
197.	సంమార్గ(ము)	I - 69,70	కడుగుట, శుద్ధిచేయుట. యజ్ఞమందలి పాత్రలను శుద్ధిచేయుట).
198.	సంమూర్ఛిత(ము)	VII - 118	లోపల నుండునది, అణగియుండి తనఉనికిని హేతువుగా కొనసాగించునది).
199.	సంవిధాన(ము)	XII - 8	వ్యాపారమునకు (క్రియకు) ఆవశ్యకమైన అన్ని హంగులను సిద్ధము చేయుట.
200	సంస్త్యాన(ము)	XIII - 27 XIV - 171, 172	గుణములు లేక- భాగములు శిథిలమగుట, అసమర్థములగుట, కప్పబడుట, పని చేయక పోవుట. ("స్త్రీత్వము" అనునర్థములో దీనిని వాడుదురు).
201.	సకర్మక(ము)	III - 47	కర్మ సంభవించు (కలుగునట్టి) ధాతువు.
202.	సతిశిష్టబలీయస్త్వ(ము)	VI - 413 XIV - 62	ఒక పదమందలి స్వరములలో చివర వచ్చిన స్వరము ప్రబలమగుట. ఈ పదమును వైయాకరణులు తరచుగ వాడుదురు).
203.	సత్తా	III-46,48,51 VIII - 28 IX - 112	పరమ సత్యము. విశ్వమంతకును మూలమగు తత్త్వము.
204.	సత్త్వ(ము)	I - 85	వస్తువుయొక్క సహజస్థితి. (మార్పు లేని అవస్థ) ద్రవ్యము యొక్క సహజమగు స్వభావము. (ఒక విధముగ ఇది సత్తయే.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
			ధీనిననుసరించియే ద్రవ్యమును "సత్త్వ" మందురు.
205.	సమాఖ్యా	VI - 7	పేరు, పేర్కొనుట. (వస్తువుయొక్క స్వభావముతో ఎట్టి సంబంధమును లేకుండ పెట్టిన నామధేయము).
206.	సమూహప్రచయ (ము)	XIV - 599	వస్తువుల సముదాయమును అంతను "ఒకటిగా" భావించుట.
207.	సర్వనామ(ము)	XIII - 18	అన్నింటికిని అన్వయించు శబ్దము. తద్, ఏతద్, ఇదమ్, మొదలగు సర్వనామములు).
208.	సాదృశ్య(ము)	XIV - 402, 428	సమానమైన ధర్మములను బట్టి రెండువస్తువులకు గల సామ్యము, (పోలిక).
209.	సాధనసముద్దేశ (ము)	VII - 1,167	కారకములను చర్చించు భాగము. (ఈ కాండమున ఏడవ విభాగము).
210.	సామానాధికరణ్య (ము)	XIV - 8,21, 175,188,	ఒకే చోటనుండుట. (విశేషణ విశేష్యములు రెండును కలిసి, ఒకే యర్థమునుచెప్పుట).
211.	సామాన్యవచన(ము)	XIV - 387, 427	సామాన్యముగా చెప్పుట· అట్లుచెప్పు శబ్దము).
212.	సోపస్కార(ము)	XIV - 465	ప్రయోజనము కలిగియుండునది. ఉపయోగించునది).
213.	స్థితి	VIII - 27, XIII - 18, 27 XIV - 332	(1) కదలకుండుట, ఉనికి. (2) సత్త్వరజస్తమో గుణములు సమముగా నుండుట (నపుంసకము)·
214.	స్ఫటిక(ము)	III - 40	స్ఫటికము. (సచ్ఛమైన ఒక మణి).

హ

215.	హాయన(ము)	IX - 29	సంవత్సరము.

వరుస సంఖ్య	పదము	సముద్దేశ సంఖ్య కారిక సంఖ్య	అర్థము
216.	హేతు(వు)	VII - 24,25, 26	(1) క్రియను ప్రేరించునది. (ప్రోత్సహించునది).
		VII - 27	(2) క్రియ యొక్క ప్రయోజనము.